sampath_Ebooks

"నహి జ్ఞానేన సదృశం పవిత్ర మిహ విద్యతే"

# ఆంధ్ర విజ్ఞాన సర్వస్వము

R 026

## ద్వితీయ సంపుటము

పునర్ముద్రణము

'అన్' నుండి 'అశ్విని' వఱకు

ముఖ్యసంపాదకుఁడు:

కొమర్రాజు వేంకట లక్ష్మణరావు, ఎమ్. ఏ.

TELUGU BHASHA SAMITI,
Room No. 27.
UNIVERSITY BUILDINGS.
TRIPLICANE P.O. MADRAS-5

ఆంధ్రపత్రికా ముద్రాలయము,

చెన్నపురి

sampath_Ebooks

ప్రకాశకులు :
కా. నాగేశ్వరరావు,
ఆంధ్ర విజ్ఞాన సర్వస్వ కార్యాలయము
ముద్రితము :
ఆంధ్రపత్రికా ముద్రాలయము,
నెం. ౨ రు, తంబుసెట్టివీథి, చెన్నపురి.
౧౯౩౪.

[ సర్వస్వామ్యసంకలితము ]

sampath_Ebooks

# ద్వితీయసంపుటమునకు విలేఖకులు

| | | |
|---|---|---|
| ఆ. ల. | శ్రీ ఆచంట లక్ష్మీపతిగారు, బి. ఏ., ఎమ్. బి. అండ్ సి. ఎమ్., భిషగ్రత్న. ... | ... అపస్మారము |
| క. మా. | శ్రీ కనుపర్తి మార్కండేయశర్మగారు ... | ... అశ్వమేధము |
| కా. నా. | శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావుగారు ... | ... అనాహతము<br>అనుభవసారము<br>అపరోక్షానుభూతి<br>అల్లమప్రభువు |
| కొం. జ. | శ్రీ కొంపెల్ల జనార్దనరావుగారు ... | ... అప్పారావు, గురజాడ<br>అప్పారావు, బసవరాజు |
| కో. రా. వేం. కృ. | శ్రీ రాజా కొచ్చెర్లకోట రామచంద్ర వేంకట కృష్ణరావుగారు, బి. ఏ. ... | ... అమరకము |
| కో. వేం. ల. | శ్రీ కొమర్రాజు వేంకటలక్ష్మణరావుగారు, ఎమ్. ఏ. ... | ... అనంతామాత్యుఁడు<br>అనపోతారెడ్డి<br>అనవేమారెడ్డి<br>అనాగరకసంఘము<br>అనుమానము<br>అనేకవర్ణసమీకరణము<br>అన్నయ్య, తెనాలి<br>అప్పకవి<br>అబ్బయామాత్యుఁడు<br>అభావము<br>అభిజ్ఞానశాకుంతలము<br>అభినయము<br>అర్థశాస్త్రములు<br>అలంకారములు<br>అల్లోపనిషత్తు<br>అవతారములు<br>అవధానము<br>అశోకవర్ధనుఁడు |
| ం. దూ. | శ్రీ గం. దూర్వాసశాస్త్రిగారు ... | ... అన్నభేది<br>అపస్మారము<br>అభ్రకము<br>అమ్లపిత్తము<br>అయస్కాంతము |
| . వేం. రా. | శ్రీ గొబ్బూరి వేంకటానందరాఘవరావుగారు, బి. ఏ. ... | ... అనూరాధ<br>అపభరణి<br>[illegible] |

sampath_Ebooks




శ్రీ గోటేటి జోగిరాజుగారు, ... ...అవాప
అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్. అనుము
అరఁటి
అరఁటికుటుంబము

శ్రీ చివుకుల వేంకటరమణశాస్త్రిగారు ... ...అయనము

శ్రీ టి. ఆర్. చింతామణిగారు, ... ...అప్పయదీక్షితులు
ఎమ్. ఏ., పిహెచ్. డి.,
సంస్కృతభాషా ప్రధానోపన్యాసకులు,
మద్రాసు విశ్వవిద్యాలయము.

౯. శ్రీ టి. యన్. రామచంద్రన్‌గారు, ... ...అమరావతీస్తూపము
ఎమ్. ఏ. అయ్యనార్
ఆర్క్యాలజికల్ అసిస్టెంట్,
గవర్నమెంటు మ్యూజియము, మద్రాసు.

శ్రీ బులుసు వేంకటరమణయ్యగారు ... ...అభిధేయము
అభిషేకనాటకము

శ్రీ భావరాజు వేంకటకృష్ణరావుగారు, ... ...అమ్మరాజవిజయాదిత్యుఁడు
బి. ఏ., బి. ఎల్. అమ్మరాజవిష్ణువర్ధనుఁడు

శ్రీ మానవల్లి రామకృష్ణకవిగారు, ఎమ్. ఏ. ... ...అభినయము

౦. శ్రీ మామిడిపూడి వేంకటరంగయ్యగారు, ... ...అరాజకత
ఎమ్. ఏ. అర్థశాస్త్రము
రీడర్, డిపార్టుమెంట్ ఆఫ్ హిస్టరీ,
పొలిటిక్స్ అండ్ ఎకనమిక్స్.

మహోపాధ్యాయ, ఆంధ్రకళాప్రపూర్ణ,
శ్రీ వేదము వేంకటరాయశాస్త్రిగారు ... ...అనిరుద్ధచరిత్రము

శ్రీ కల్యాణానందభారతీస్వామివారు ... ...అనుభూతిప్రకాశిక

sampath_Ebooks

# విజ్ఞప్తము

విజ్ఞాన మానందము. విజ్ఞానము పురుషార్థము. విజ్ఞానము పరమార్థము. విజ్ఞానము పరబ్రహ్మము. విజ్ఞాన తరంగములు విశ్వవిలాసములు. శాస్త్రజ్ఞులు, కవులు, గాయకులు, శిల్పులు, మంత్రులు, యోధులు, మతాధిపతులు, త్యాగులు, కార్మికులు మొదలగు విజ్ఞానోపాసకులు దేశకాలపాత్రావరణాతీతమైన విజ్ఞానారాధనమును మానవధర్మాభ్యుదయమునకుఁ జేయుచున్న విధమును విజ్ఞానోదంత మనంతముఖములను విశదము చేయుచున్నది.

ఆంధ్రవిజ్ఞానసర్వస్వమును నీ మహాకార్యమును యథాశక్తిని నిర్వహించుట కుపక్రమించిన విధము మొదటిసంపుటమునందలి ప్రస్తావనయందు విశదీకరింపఁబడినది. రెండవసంపుటమునం దీచర్విత చర్వణ మనవసరము. రెండవ సంపుటమును ప్రకటించుటయందుఁ గలిగిన కాలవిలంబనము వర్తమాన దేశ పరిస్థితులం దనివార్యము. బహుజన సాహాయ్యమునను, విశేష సాధనసంపద వలనను సాధ్యమైన ప్రచురణమునందు కాలవిలంబనము సహజము. రెండవ సంపుటమునకు వ్యాసములనువ్రాసి ప్రచురణమును సాధ్యముచేసిన వ్యాసలేఖకులకు వందనములు. మాకుఁగావలసిన ఛాయాచిత్రములనొసంగి ద్వితీయ సంపుటమునందు ముద్రించుట కనుమతించిన ( మద్రాసు గవర్నమెంటు మ్యూజియము, సూపరింటెండెంటుగారికిని, కోటగిరి ఆర్కియొలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, సదర్న సర్కిల్ సూపరింటెండెంటుగారికిని, కలకత్తా ఇండియన్ మ్యూజియము సూపరింటెండెంటు ( ఆర్కియొలాజికల్ సెక్షను ) గారికిని, హైదరాబాదు హెచ్. ఇ. హెచ్. ది నైజామ్స్ గవర్నమెంటు ఆర్కియొలాజికల్ డిపార్టుమెంటు డైరెక్టరుగారికిని సంపాదకులు కృతజ్ఞులు. పునర్ముద్రణము నందు నూతనాంశములు చేర్పఁబడి ద్వితీయసంపుటము అన్-అశ్విని వఱకును పర్యాప్తమగుచున్నది. భగవంతుఁడును, ఆంధ్ర మహాజనులును నీప్రయత్నము సార్థకమగుట కనుగ్రహింతురుగాత!

భావ సం. మాఘశుద్ధ<br>౧౪, శనివారము

కా. నాగేశ్వరరావు.

sampath_Ebooks

We have great pleasure in expressing our grateful thanks to the following, who so kindly acceeded to our request and granted us permission to reproduce some of their photos in this volume:

i. The superintendent, Government Museum, Madras;

ii. The director of the Archaeological department of H. E. H. the Nizam's dominions, Hyderabad;

iii. The Superintendent, Archaeological survey of indial Southern Circle, Kotagiri;

iv. The Superintendent, Indian Museum (Archaeologica, section), Calcutta.

**అన్** — అన్ అనునది దక్షిణబర్మాయందలి క్యాక్ ప్యూ జిల్లాయందలి యొకపట్టణప్రాంతమునకు పేరు. దీనిపై శాల్యము ౨,౪౬౧ చతురపుమైళ్లు. జనసంఖ్య ౨౭,౪౬౩. అడవిభాగము విశేషము, వ్యవసాయము తక్కువ. రాబడి రూ. ౩౧,౦౦౦ లు. ముఖ్యపట్టణము అన్ అనునది. అక్కడ ౪౨౬ గురు జనులు గలరు.

**అనంగ** — భారతవర్షీయనది (భార, భీష్మ, అ. ౯).

**అనంగజీవన** — ఇది యొకభాణము. వాసంతికా వసంతశేఖరుల యన్యోన్యానురాగమును, వారిసమావేశము నిందు వర్ణింపఁబడినవి. ఆత్రేయసగోత్రుఁడగు వరదగురువు అనువతఁడు దీనిని రచించెను. విశ్వగుణాదర్శమును వ్రాసిన వేంకటాచార్యుని కితఁడు పినతండ్రి. ఇతని యితరగ్రంథములు: కారికాదర్పణము, కృష్ణాభ్యుదయము.

**అనంగదేవుఁడు** — చేదిదేశపు రాజు. హైహయ వంశమునందు జననమందెను. తండ్రిపేరు అర్జునుఁడు. రాష్ట్రకూట నృపాలుఁడు ఇంద్రుఁడీ యనంగదేవుని కూఁతును పెండ్లియాడెను.

**అనంగపాలుఁడు** — ఢిల్లీరాజు. తువర వంశమునందుఁ జివరివాఁడు. ఈతనికాలముననే యీతనిరాజధానికి 'ఢిల్లీ' యని పేరు గలిగెను. ఇతనికి పుత్రసంతానము లేదు. ఇద్దఱు కొమార్తె లుండిరి. అందు కమలాదేవి యనునామెను అజమీరురాజయిన సోమేశ్వరున కిచ్చెను. ఈమెకుమారుఁడే తరువాత ఢిల్లీశ్వరుఁడైన పృథ్వీరాజు. రెండవ కొమార్తె యగువిమలాదేవిని కనోజ్ రాజైన విజయపాలున కిచ్చిరి. ఈమెయే జయచంద్రునితల్లి. అనంగపాలుఁడు ముసలివాఁడై బదరికాశ్రమమునకుఁ బోవునపుడు తన ఢిల్లీ రాజ్యమును దౌహిత్రుఁడగు పృథ్వీరాజున కిచ్చెను.

**అనంగబ్రహ్మవిద్యావిలాసము** — ఇది యొక భాణము. శృంగారరసప్రధాన మయినది. రచయిత వాధూల వరదార్యుఁడు.

**అనంగభాగి** — ఒక బ్రహ్మర్షి.

**అనంగవిజయము** — శృంగారరసప్రధాన మగు శ్లోకనాటకము. దీనిని రచియించినవాఁడు శివరామకృష్ణుఁ డను నతఁడు. నారాయణుఁ డనునతఁ డీశివరామకృష్ణునితండ్రి.

**అనంగాధరి** — ఉభయవక్రసంపూర్ణరాగము. ౩౯-వ మేళకర్తయగు ఝలవరాళిరాగజన్యము. ఆరోహణము: స రి గ రి మ ప ని ధ ని స; అవరోహణము: స ని ప ధ మ గ మ రి స యని సంచారముకలది.

**అనంగుఁడు** — ౧. శివునిచే భస్మముచేయఁబడిన తరువాత గల కునకు వచ్చినపేరు (చూడుఁడు: మన్మథుఁడు).

౨. రామసేనయందలి యొకవానరుఁడు.

**అనంత** — ౧. ఈపేరుగల సంస్కృతకవు లెందఱో కలరు. వారిలో నీక్రిందివారు ముఖ్యులు: (౧) ఉదయభాను కావ్యకర్త; (౨) కారకచక్ర రచయిత; (౩) చిదంబరాష్టకకారుఁడు; (౪) యోగామృతార్థచంద్రిక యను పాతంజలయోగసూత్రభాష్యమును రచియించినవాఁడు; (౫) వాక్యమంజరీరచయిత; (౬) విధ్యపరాధ ప్రాయశ్చిత్తప్రయోగరచయిత; (౭) వాజసనేయసంహితకు 'శుక్లదళభాష్యము'ను వ్రాసినవాఁడు; (౮) సాహిత్యకల్పవల్లి యను నలంకారగ్రంథమును గూర్చినవాఁడు; (౯) భీముని కుమారుఁడు, నైగేయార్చికానుక్రమమును వ్రాసినవాఁడు; (౧౦) మంత్రి-మండల కుమారుఁడు; ౧౪౫౮-వ సంవత్సరమున కామసమూహ మహాప్రబంధము అను కామశాస్త్రమును రచియించినవాఁడు.

౨. వక్రషాడవ – ఔడవరాగము. పదునేడవ మేళకర్తరాగమగు సూర్యకాంతిరాగజన్యము. ఆరోహణావరోహణములందు – రి స మ ప ధ ని స; స ప మ గ రి స యని సంచారము కలది.

**అనంతకవి (చిత్రకవి)** — ఇతఁడు పెమ్మసాని చినతిమ్మానాయని కాశ్రితుఁడు. పదునేడవ శతాబ్ది మొదటియర్ధమున నున్నవాఁడు. ఆఱువేలనియోగి బ్రాహ్మణుఁడు. చిత్రకవి పెద్దనార్యుని పుత్త్రుఁడు. భారద్వాజసగోత్రుఁడు. ఇందుమతీపరిణయ మను ప్రబంధమును రచించెను. హరిశ్చంద్రనలోపాఖ్యానమునకును, విష్ణుచిత్తీయమునకును టీక వ్రాసినవాఁడు. ఆంజనేయోపాసకుఁడు.

**అనంతగిరి** — ౧. తూర్పుగోదావరి ఏజెన్సీజిల్లా, యెల్లవరంతాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౧౦౦ (౧౯౩౧).

౨. గంజాంజిల్లా పర్లాకిమిడి తాలూకాలోని జమీందారీగ్రామము. జనసంఖ్య ౧౩౧ (౧౯౩౧).

౩. గంజాంజిల్లా పర్లాకిమిడి తాలూకా జమీందారీగ్రామము. జనసంఖ్య ౨౦ (౧౯౩౧).

౪. గంజాంజిల్లా పర్లాకిమిడి తాలూకా జమీందారీగ్రామము. జనసంఖ్య ౧౪౩ (౧౯౩౧).

౫. గంజాంజిల్లా టెక్కలితాలూకాలోని ఈనాంగ్రామము. ఇచ్చటి జనసంఖ్య ౫౩౫ (౧౯౩౧).

**అనంతచ్ఛందస్సు** — (చూడుఁడు: అనంతామాత్యుఁడు).

**అనంతజిత్తు** — ఇరువదినలుగురు జినులలోఁ బదునాలుగవవాఁడు. ఇతఁడు వర్ధమానావసర్పిణినుండి యావిర్భవించెను. ఇతని

sampath_Ebooks

త్రిపతిపండితుఁడు). అనంతపాలదండనాథుని శాసనములు క్రీ. శ. ౧౧౦౦ మొదలుకొని ౧౧౨౩ సంవత్సరములవఱకుఁ గాన్పించుచున్నవి.

**అనంతపురము** — ౧. మైసూరురాజ్యమునందలి యొకపల్లె. షిమోగాజిల్లాలోని సాగర్ తాలూకాలోనిది. షిమోగాకు ౨౯ మైళ్లమీఁద నుండును. అంధాసురుఁ డన్న రాజుచే నెనిమిదవ శతాబ్దియం దీగ్రామము కట్టింపఁబడియె. పదునొకండవశతాబ్దియం దిది చాళుక్యుల యధీనమునం దుండెను. ఇది 'సహస్రవిషయము'(మండలము)లోనిది. ౧౦౪౨ లో నిది ౧౨౦౦ బ్రాహ్మణుల కగ్రహారముగ నీయఁబడెను. ౧౦౭౯ లో నిది రాజధానిగఁ జెప్పఁబడెను. పదునేడవ శతాబ్దియందు, కేలడిరాజయిన వేంకటప్పనాయకుఁ డీగ్రామమునందు శివాచారమఠమును స్థాపించెను. చంపకసరసు అనుచెఱువు త్రవ్వించెను. గ్రామముపేరు 'ఆనందపుర' మని మార్చెను. అదియే తరువాత ననంతపురముగ మాఱెను. హైదరు, టిప్పూలు ఈగ్రామముపై పెక్కుసార్లు దాడివెడలిరి. ౧౮౩౦లోని తిరుగఁబాటుకాలమున నీ గ్రామము దోపిడికి లోనయ్యెను.

౨. అనంతపురము జిల్లాకు ముఖ్యపట్టణము. ఇది చెన్నపట్టణమునకు వాయవ్యమూలగ ౨౧౬ మైళ్లమీఁద నున్నది. ఇది చెన్నపురి దక్షిణమహారాష్ట్రపు ఇనుపదారి యొక్క గుంతకల్లు - బెంగుళూరుశాఖమీఁద నొకస్టేషన్.

ఈ గ్రామమును చిక్కప్పఒడయర్ అనునతఁడు కట్టించె నని చెప్పుదురు. ఈతఁడు విజయనగరరాజయిన ప్రథమబుక్కరాయలకు మంత్రిగ నుండెను. ఈ ఒడయర్ ఒక పెద్దచెఱువు కట్టించి, దానికి రెండు అలుగులనుండి ఎక్కువైననీరు పోవుటకు రెండు కత్వాలును, వానికి సమీపమున రెండు గ్రామములును కట్టించెను. అందొక గ్రామమునకు రాజుపేరిట బుక్కరాయసముద్రము అని పేరు పెట్టి, రెండవదానికిఁ దనభార్యయైన అనంతమ్మపేరిట అనంతసాగర మని పేరు పెట్టెను. ఆపేరే అనంతపుర మని మాఱెను.

౧౮౦౦ లో దత్తమండలములు కంపెనీవారి క్రిందికి రాఁగా, ఆ ప్రదేశమునంతకును మన్రో అనువానిని కలెక్టరుగా నియమించిరి. అతఁడు అనంతపురమునందే తనకచ్చేరి యేర్పఱుచుకొనెను. ౧౮౨౨ లో కలెక్టరుకచ్చేరీ బళ్లారికిఁ దీసికొనిపోయిరి. ౧౮౨౩ లో మరల ఆ కచ్చేరి అనంతపురమునకు వచ్చెను. ౧౮౪౦ లో కలెక్టరు కచ్చేరిని బళ్లారికి మార్చి, అనంతపురములో సబ్‌కలెక్టరు ఉండఁజొచ్చెను. ౧౮౬౯ లో ఈకచ్చేరికూడ గుత్తికిఁ బోయెను. ౧౮౮౨ లో అనంతపురము స్వతంత్రముగ జిల్లా ఆయెను. అప్పుడిచ్చటికి మరల కలెక్టరు కచ్చేరి వచ్చెను.

ఇచ్చట జిల్లాకలెక్టరు, పోలీసు సూపరింటెండెంటు, ఫారెస్టు ఆఫీసరు, లోకల్ ఫండ్ ఇంజనీరు, అనంతపురం డివిజనును పాలించు హెడ్‌క్వార్టరు డిప్యూటీకలెక్టరు, అనంతపురంతాలూకా తహసీలుదారువారల కార్యస్థానము లుండును. ఇచ్చట డి. పి. డబ్ల్యు అసిస్టెంటు ఇంజనీరు, సాల్టు - ఆబ్కారి - కస్టమ్సు శాఖ ఇన్‌స్పెక్టరు, సబ్‌రిజిస్ట్రారు, ఎష్యూరెన్సుల జిల్లారిజిస్ట్రారు, జిల్లా విద్యాధికారి, ఇంకమ్‌టాక్సు ఆఫీసరు, జిల్లా ఆరోగ్యాధికారి (హెల్త్ ఆఫీసరు), పోలీసు డిప్యూటీసూపరింటెండెంటు, సహకారపరపతి సంఘముల (కోఆపరేటివ్ సొసయిటీలు). అసిస్టెంటు రిజిస్ట్రారు కూడ నుందురు. జిల్లాకోర్టు, సెషన్సుకోర్టుకూడఁ గలవు. ఇవి యన్నియు కాక గవర్నమెంటు ఫస్టుగ్రేడు కళాశాల, పోలీసు రిక్రూయిట్లస్కూలు - వీనితో దీనికి ప్రాముఖ్యము మఱియు హెచ్చినది. జనసంఖ్య ౧౫,౦౯౯. ఈగ్రామమున చెప్పఁదగిన విశేషము 'రాబర్ట్‌సన్ స్క్వేరు' అను చౌకము. అనంతపురమున కలెక్టరుపనిచేసి ౧౮౩౨ న అచ్చటనే మరణమునొందిన రాబర్ట్‌సన్ అనువానిపేర ఈ చౌకము నిర్మిత మయినది. రాబర్ట్‌సన్ బ్రతికియున్నప్పుడే ఈ చౌకము నేర్పఱిచి, నడుమ నున్న కోట, కందకము పూడ్పించి, నడుమ మండపమును గట్టించి, చుట్టు తనచేతితో చెట్లు నాఁటెను. వీనిలో దాదాపుగ అన్నియు నశించిపోయినవి. నడి కెదురుగ నున్న విశాలమైన పెద్దచౌక మిప్పుడు దానిచుట్టుపట్లఁ గల పాఠశాలలందలి విద్యార్థులకు క్రీడారంగముగ నుపయోగపడుచున్నది. 'రాబర్ట్‌సన్ స్క్వేరు' చుట్టు నున్న కట్టడములలో గవర్నమెంటు ఆస్పత్రి, ఉపాధ్యాయులకు ఉపాధ్యాయినులకు బోధనాభ్యసన కళాశాలలు (Training Schools), బాలబాలికలకు ఉన్నతపాఠశాలలు చెప్పఁదగినవి. ఈచౌకమున ఉత్తరమున ప్రాఁతకోట యుండెను. దాని బురుజుల విశేషములును, కందకపు పల్లములును ఇప్పటికిని గానవచ్చును. ప్రాఁతకోట యున్న ప్రదేశమున నిప్పుడు 'జూబిలీ పార్కు' అను పారోద్యాన మున్నది. వారమువారము జరుగుసంత యిచ్చట జరుగును. అనంతపురము పరిశుద్ధముగను, చక్కఁగను ఉండును.

౩. అనంతపురంజిల్లా గుత్తి తాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౧,౪౧౩ (౧౯౩౧).

౪. అనంతపురంజిల్లా మడకశిరతాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౪౯౩ (౧౯౩౧).

౫. చిత్తూరుజిల్లా మదనపల్లి తాలూకాయందలి ఈనాంగ్రామము. జనసంఖ్య ౬౦ (౧౯౩౧).

౬. కడపజిల్లా జమ్మలమడుగు తాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౫౩౫ (౧౯౩౧).

౭. కడపజిల్లా ప్రొద్దటూరు తాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౧,౯౫ (౧౯౩౧).

—(రాళ్ల) అనంతపురంజిల్లా కల్యాణదుర్గంతాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౬౧౮ (౧౯౩౧).

— (లక్కిరెడ్డిపల్లి) కడప జిల్లా రాయచోటితాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౯౭౫ (౧౯౩౧). ఫిబ్రవరిమాసమున జరగు గంగజాతరకు జను లనేకులు వచ్చెదరు.

# అనంతపురముజిల్లా

**అనంతపురము జిల్లా** — ఇది చెన్నరాజధానియందలి యొక తెలుఁగుజిల్లా. ఇప్పుడు రాయలసీమ (పూర్వపుదత్తమండలములు) అనఁబడు జిల్లాలలో నిది దక్షిణపుది. పూర్వము బళ్లారిజిల్లాలోనే అనంతపురముకూడ కలసియుండెను. బళ్లారినుండి దీనిని ౧౮౮౨ లో వేఱుచేసిరి. దీని కుత్తరమున బళ్లారి, కర్నూలుజిల్లాలును, తూర్పున కడపజిల్లాయును, దక్షిణమున మైసూరురాజ్యమును చిత్తూరుజిల్లాలును, పడుమట మైసూరురాజ్యమును బళ్లారిజిల్లాయును గలవు. ఇందు పూర్వము అనంతపురము, ధర్మవరము, గుత్తి, హిందూపురము, కల్యాణదుర్గము, మడకశిర, పెనుకొండ, తాడిపత్రి అను నెనిమిదితాలూకాలే యుండెను కాని ౧౯౧౦-వ సంవత్సరమున నూతనముగ చిత్తూరుజిల్లా యేర్పడినప్పుడు కదిరితాలూకా నిందుఁ గలుపుటవలన నిప్పుడు తొమ్మిదితాలూకా లయినవి.

## భూస్వభావము

అనంతపురముజిల్లా సమప్రదేశముకలది కాదు; ఉన్నతప్రదేశము. ఇది మైసూరుపీఠభూమి చివరిభాగము. దక్షిణమువైపు ఉన్నతముగను, పోనుపోను ఉత్తరమువైపు పల్లముగను నుండును. దక్షిణపువైపుప్రదేశము ౨,౨౦౦ ల అడుగులయెత్తున నున్నది. బళ్లారికిని గుత్తికిని నడుమ నున్న రేఁగటినేల యెత్తు ౧,౧౮౨ అడుగులు; తూర్పుభాగమున తాడిపత్రియొద్ద ౯౦౦ అడుగులు.

భూస్వభావమునుబట్టి యీజిల్లాను ఉత్తర, దక్షిణ మధ్యవిభాగము లని మూఁడు విభాగములు చేయవచ్చును. గుత్తి, తాడిపత్రి తాలూకాలు కలసినది ఉత్తరవిభాగము. ఇందు ప్రత్తిపంట కనువయిన రేఁగటిభూమి చాల ఎక్కువ. అనంతపురము, కల్యాణదుర్గము, ధర్మవరము, పెనుకొండతాలూకాలు మధ్యవిభాగములోనివి. కదిరికూడ ఇందే చేరును. ఇందలిది గొడ్డుభూమి: తాతియెఱ్ఱనేల. చెట్టుచేమ పెరుఁగదు. కదిరియం దంతట చెట్టుచేమ పెరుఁగనిగుట్టలు కలవు. హిందూపురము మడకశిరతాలూకాలు కలసి దక్షిణవిభాగమనవచ్చును. ఇది మధ్యవిభాగమంత పాడుది కాదు. ఇందలి యెఱ్ఱనేల నడిమివిభాగమునందలిదానికంటె మంచిది. హిందూపురము, మడకశిరతాలూకాలలో నీటివసతి యెక్కువ. ఇందు కొబ్బరి, పోఁక తోఁటలు కలవు. ఈతోఁటలవలన మడకశిర ఈజిల్లా కంతకు ఆరామమన్న పేరు గడించినది కాని చాలసంవత్సరములనీటివఱపువలన పోఁక, కొబ్బరితోఁటలు చెడి దాని కాపేరు పోవుచున్నది.

## కొండలు : కనుమలు

ఈజిల్లాలో మిక్కిలి ఎత్తయినకొండలు లేవు. ఉన్న వెల్ల గుట్టలు. ఈజిల్లాయందు మిక్కిలి యెత్తయినది — మల్లప్పకొండ. ఇది పెనుకొండతాలూకా బుక్కపట్టణమున కుత్తరముగ నాలుగుమైళ్ల దూరమున నున్నది. దీనియెత్తు ౩,౦౯౨ అడుగులు; పెనుకొండ కొండ - దీనియెత్తు ౩,౦౯౧ అడుగులు. కందుర్పిదుర్గము: ఎత్తు ౨,౯౯౬ అడుగులు. మడకశిరకొండ ౨,౯౩౮ అడుగులయెత్తు. కదిరితాలూకాయందలి ఈశ్వరమలయు: ఎత్తు, ౩,౧౭౯ అడుగులు. ఇవి సముద్రపుమట్టమునకంటె ౧,౫౦౦ లు మొదలు ౨,౦౦౦ ల అడుగులయెత్తున నున్నప్రదేశమున నున్నవి. జిల్లాయందలి రైదుస్థలములందుమాత్ర మీగుట్టలు పంక్తులు తీర్చియున్నవి. ఈరైదును ఉత్తరదక్షిణములఁ బోవును. వీనిలో ముచ్చుకోటకొండ లనునవి తాడిపత్రితాలూకాకును గుత్తి అనంతపురముతాలూకాలకును మధ్యగ వ్యాపించినవి. వీనిపొడవు ౩౫ మైళ్లు: చాలచోట్ల వీనివెడల్పు ఏడు మైళ్లు. నాగసముద్రముకొండ లనునవి గుత్తితాలూకాకు మధ్యగఁ బోవును. వీనిపొడవు ౫౦ మైళ్లు: కాని యీవరుస చాలచోట్ల తెగిపోయినది. పైని చెప్పిన అయిదింటిలో ముఖ్యమైనది మల్లప్పకొండలచాలు. ఇది పెనుకొండతాలూకా తూర్పుభాగము నాక్రమించినది. ఇది ధర్మవరమునొద్ద నారంభమయి జిల్లా దాఁటి మైసూరురాజ్యములోనికిని, కడపజిల్లాలోనికినిగూడ వ్యాపించినది. పెనుకొండతాలూకాయందలి మఱియొకకొండలచాలు పెనుకొండకొండలు. ఇది ధర్మవరమునకు దక్షిణమున ఆరంభమయి పెనుకొండ, హిందూపురంతాలూకాలగుండ మైసూరురాజ్యములోనికి దక్షిణముగ ౪౦ మైళ్లదూరము వ్యాపించియున్నవి. పెనుకొండకొండదగ్గఱ ఒక్కచోటమాత్ర మీవరుస తెగిపోయినది. మడకశిరకొండలు ఆతాలూకాయందు తూర్పుపడమరలుగ వ్యాపించి దానిని ఉత్తరదక్షిణవిభాగములుగ వేఱుచేయుచున్నవి. తాడిపత్రితాలూకాతూర్పుభాగమున కర్నూలు - ఎఱ్ఱకొండలు వ్యాపించినవి. ఇవికాక విడివిడికొండలు పెక్కులు కలవు. ఇట్టివానిలో గుత్తికొండ, అనంతపురంగుత్తి తాలూకాలనడుమనున్న గంపమల్లకొండ పేరొక్కనఁదగినవి. కల్యాణదుర్గము, ధర్మవరముతాలూకాలలోఁ జిన్నకనుమ లయిదారు కలవు. కదిరితాలూకాయందలి దోర్నాలకనుమ, బొంతలపల్లికనుమ, తుమ్మలమల మున్నగు భయంకరములయిన కనుమలు కలవు.

## నదులు

ఈజిల్లాలోఁ బ్రవహించునదులలో పెన్న ముఖ్యమయినది. ఇది మైసూరురాజ్యమునందుఁ బుట్టి, హిందూపురం తాలూకా దక్షిణమున ఈజిల్లాయందుఁ బ్రవేశించును. అచ్చటనుండి నూటిగ నుత్తరము దిక్కు ౬౦ మైళ్లు ప్రవహించి, ఉడిపి (పెన్నహోబలము) యొద్ద, చక్రన తూర్పునకుఁ దిరిగి రమారమి ౫౦ మైళ్లు ప్రవహించి వంగనూరుగ్రామమునకు నుత్తరమున నొకమైలుదూరమున కడపజిల్లాలోఁ బ్రవేశించును. ఈజిల్లాయందలి తొమ్మిదితాలూకాలలో నిది యేడుతాలూకాలగుండ ౧౩౦-౧౪౦ మైళ్లప్రదేశమునఁ బ్రవహించును. పామిడిగ్రామమునకు దక్షిణముగాఁ బాఱెడు ఈనదికి నడుమ నొక శివాలయము - గోపురశోభితముగఁ గట్టఁబడినది.

చిత్రావతి — ఇది పెన్నకు నుపనది. మైసూరురాజ్యమునఁ బుట్టి ఆగ్నేయదిక్కున ఈజిల్లాలోఁ బ్రవేశించి, హిందూపురము, పెను

sampath_Ebooks

కొండ, ధర్మవరము, తాడిపత్రి తాలూకాలలోనుండి ౧౨ మైళ్లు ప్రవహించి కడపజిల్లాలోఁ బ్రవేశించును.

పైనుడివినవి కాక పెన్నేటి కుపనదులయిన జయమంగలి, కుముదవతులు, హగ్గరిలోఁ గలయుస్వర్ణముఖి, కదిరితాలూకాయందలి మద్దిలేరు, పాపఘ్ని అను చిన్నయేళ్లు కలవు. వ్యవసాయమున కుపకరించు జలాధారములుగ నివి యంత యుపయోగకరము లైనవి కావు. సంవత్సరమంతటిలో చిత్రావతి, పెన్న నదులలో పరిమిత దినములమాత్రమే నీ రుండును. ఈకారణమున సంవత్సరమునఁ జాలభాగము పైరు లుండవు.

## గనులు

గుత్తితాలూకా వజ్రకరూరుగ్రామసమీపమున భూమిపై భాగముననే యెప్పుడైనను వజ్రములు దొరకుచుండును. అవి యెచ్చటి నుండి పుట్టునో తెలియలేదు. ధర్మవరముతాలూకా రామగిరిగ్రామము దగ్గఱ నున్న కొండలలో బంగారుగని యొకటి తొమ్మిదేండ్ల క్రిందట మూరిసను అను పాశ్చాత్యుఁడు కనిపట్టినాఁడు కాని యది లాభప్రద మయినదికాదు. 'నార్తు అనంతపూర్ గోల్డ్ మైన్సు కంపెనీ' అను పేర నొకసంఘము ౧౯౦౭ లో నేర్పడి ౧౯౨౫ వఱకు గుత్తి తాలూకా, రామపురముగ్రామప్రాంతమున బంగారుకొఱకు పనిచేసినది. కాని ౧౯౨౮ లో ఆకంపెనీ దివాలా తీసినది.

ఇండ్ల కుపయోగపడురాళ్లు అచ్చటచ్చట దొరకును. తాడిపత్రి తాలూకాయందలి రాయలచెఱువునొద్ద బలపపురాయి దొరకును. వానితో పాత్రలు చేయుదురు.

## అడవి

౧౯౩౯-వ సంవత్సరము, జనవరి మొదటితేదినాఁటి కనంతపురంజిల్లాయందుఁగల యడవివిస్తీర్ణము 'తాలూకావారి'గా నీక్రిందఁ జూపఁబడినది:

| తాలూకా | చ. మైళ్ల యడవి | మొత్తమువిస్తీర్ణమున నూటికి |
|---|---|---|
| గుత్తి | ౫౯ | ౮ - వ వంతు |
| తాడిపత్రి | ౮౫ | ౧౨ ,, ,, |
| అనంతపురం | ౮౪ | ౭ ,, ,, |
| ధర్మవరం | ౪౨ | ౬ ,, ,, |
| కల్యాణదుర్గం | ౪౫ | ౬ ,, ,, |
| పెనుకొండ | ౧౨౦ | ౧౭ ,, ,, |
| హిందూపురం | ౪౦ | ౯ ,, ,, |
| మడకశిర | ౩౪ | ౭ ,, ,, |
| కదిరి | ౨౧౬ | ౧౯ ,, ,, |
| జిల్లామొత్తము | ౮౦౫ | ౧౨ ,, ,, |

బళ్లారి, కడపజిల్లాలయందలి పడుమటితాలూకాలలోవలెనే యిచ్చటి యరణ్యములలోఁగూడ పెద్దచెట్లు పెరుఁగవు. జిల్లాయందలి యుత్తర, మధ్యమవిభాగములందు దక్షిణవిభాగమునందు కంటె అడవి తక్కువ. దక్షిణవిభాగము హైదరాబాదుపీఠభూమి కాన యందుచేత దేశము ఎత్తు ఎక్కువ. అదియునుగాక అచ్చటి కొండలు జిల్లాయందలి యుత్తరభాగములం దున్నవానికంటె సారవంత మయినవి. అనంతపురం, తాడిపత్రి తాలూకాలయందును న్న ముచ్చుకోటకొండలలో యేపిచెట్లు విశేషముగ పెరుఁగును. ఈయడవియందుఁ బెరుఁగుయేపి హిందూదేశమునం దంతట దొరకు కలపలో మిక్కిలి గట్టిది; మిక్కిలి బరువయినది. జిల్లాయంతటిలో వెలువెలురకములచెట్లు, పెరుఁగుదల విశేషముగఁ గల యడవి దక్షిణ విభాగమున, అందు ముఖ్యముగ కొత్తకోట, అమగొండపాళెయం ప్రాంతములఁ గలదు. ఈ కొత్తకోట, అమగొండపాళెయం రిజర్వు అడవులు జిల్లాయంతటిలో బాగుగ వృద్ధిలోనికి రాఁగలవు. మంచిగంధపుచెట్లను ౧౯౦౪ లో ఈజిల్లాకుఁ దీసికొనివచ్చినాఁటిరి. ఇవి క్రమముగ వృద్ధిపొందుచున్నవి. యేపి (ముఖ్యముగా నిది కొత్తకోటరిజర్వు అడవిలోను), టేకు, బిల్లుమ్రాను విశేషముగఁ గలదు: ఈ మండలమునందలి టేకు అంత యెత్తుగఁ బెరుఁగదు. గిడసబారి యుండును. ఇవికాక కొండలమీఁద చాలచోట్ల వెదురు పెరుఁగును.

అడవులను రక్షింపవలసిన ప్రాముఖ్యమును రైతులు గుర్తించిరని తెలిసికొన్నపిదప గవర్నమెంటువారు ౧౯౧౫ న కొన్నికొన్ని జిల్లాలలో సామాన్యరకమయినయడవిని ఎట్లు చక్కఁబెట్టెదరో చూతమని పంచాయతులవశము కావించిరి. ఒక్కొక్కగ్రామమునకో, మొత్తముమీఁద కొన్నికొన్ని గ్రామములకు కలిపియో పంచాయతు లేర్పాటు చేసిరి. చాలపంచాయతు లటవీవ్యవహారములను సరిగా చక్కఁబెట్టుచున్న వని గవర్నమెంటువారికి సంతృప్తి కలిగినది. గవర్నమెంటువా రీపంచాయతీపద్ధతిని ౧౯౨౬ న ఈజిల్లాకు వర్తింపఁజేసినారు. ఈజిల్లాయందలి చాలరిజర్వు అడవులు పంచాయతులవశమునకు వచ్చినవి. ౧౯౨౭-వ సంవత్సరమున పంచాయతులవశమున నుండినవి, అటవీశాఖవారియధికారమున నుండినవి ఈక్రిందిరీతిని గలవు:

| తాలూకా | అడవి విస్తీర్ణము చ. మైళ్లు | పంచాయతుల వశమునమున్న అడవి చ. మైళ్లు | అటవీశాఖ వారియధికారమున నున్న యడవి చ. మైళ్లు |
|---|---|---|---|
| గుత్తి | ౫౮ | ౫౮ | ,, |
| తాడిపత్రి | ౮౪ | ౮౪ | ,, |
| అనంతపురం | ౮౪ | ౮౪ | ,, |
| ధర్మవరం | ౪౪ | ౨౯ | ౧౫ |
| కల్యాణదుర్గం | ౪౫ | ౪౫ | ,, |
| పెనుకొండ | ౧౨౦ | ౪౬ | ౮౪ |
| హిందూపురం | ౪౧ | ౨౭ | ౧౨ |
| మడకశిర | ౩౪ | ౩౪ | ,, |
| కదిరి | ౨౧౬ | ౫౭ | ౧౫౭ |
| మొత్తము | ౮౦౪ | ౪౪౫ | ౨౫౯ |

sampath_Ebooks

# అనంతపురము జిల్లా

గ్రామోద్యోగులు, అప్పటి ప్రజలయొక్క కలదిన అయిదేం డ్లలో జరిగిన వర్గముల సంఖ్య లెక్కవేసి దానిబట్టి ఎంత శిస్తు చెల్లింపబడిన దనునిర్ణయముతో గవర్నమెంటువా రిచ్చిన పంచాయతుల కార్యమండిరి. ఇంకను మరికొన్ని వరకులు ఉన్న అవి యేమి నన, ఎదవుకునన్న పశువుల 'సాంతవారి'లను నమా చారిచ్చి చర్చలు చేయుచుండెను. అట్టిపథకలలో వారియాజమా న్యమిమిత్తము పంచాయతీ లెక్కలను ప్రవేశపెట్టిరి. ఇరువుల కును మిగిలినలాభమును మందుగా గ్రామమునందలి యడవిని పెంపొం దించుట కుపయోగింపబడెను. అటుతరువాత నింకను సామ్యమైన పంచాయతీగ్రామములలో ప్రయోజనకరమైన కార్యములు నిర్వహించుటకు వానికి వచ్చింపబడెను. అగ్నికలనగాని మరియే ఇతరకార్యములవలనగాని అడవిపెంపునకు భంగము కలుగకుండ శోధింపబడెను. అడవిసరిహద్దుచిహ్నములు సరిగా కాపాడబడెను. తొలకరివానలు పడినరెండుమాసములవరకు అడవులలో పశువులను మేతకు వదలగూడదు. ఎన్నిపశువులను మేతకు వదలవచ్చునో, ఎన్నిచెట్లను కొట్టవచ్చునో ఈమొదలయినవి గవర్నమెంటువారి షరతుల ననుసరించి పంచాయతీవారు నిర్ణయించుదురు.

పైని చూపినపట్టిక ననుసరించి ౧౯౩౭ న ౧౧౪ అటవీపంచాయతుల క్రింద ౮౮౫ చ. మైళ్ల యడవి యుండెను. ఈయడవికి పంచాయతులనుండి గవర్నమెంటువారికి మొత్తముమీద రు. ౧౧,౪౯౯ ల శిస్తు చెల్లినది. ఈపంచాయతులు సరిగ పని చేయు చున్నది లేనిది మొదట ఫారెస్టుపంచాయతీఆఫీసరు కనుగొనుచుండెను; గాని ౧౯౩౭-వ జనవరి ౧-వ తేదీ లగాయతు ఈయధికారము జిల్లారివిన్యూవర్గమువారికి వశపఱుపఁబడినది. ఈ పంచాయతులపనిని కనుగొనుట కిరువురు డిప్యూటీతహసీలుదారులు నియమితులైరి. ఒకరు అనంతపురమునను మఱియొకరు పెనుకొండయందు నుందురు.

## వర్షపాతము: శీతోష్ణస్థితి

జిల్లాయందలి పంటపైరులు ప్రధానముగ వర్షాధారములు. ఒక్క బళ్లారిజిల్లాను మినహాయించినయెడల చెన్నరాజధానియందలి యితరజిల్లాయందుకంటెను వర్షపాత మీజిల్లాయందు చాల తక్కువ. అనంతపురము జూన్, జూలై, ఆగష్టు, సెప్టెంబరు మాసములలో తొలకరివానలు, అక్టోబరు, నవంబరు, డిసెంబరుమాస ములయందలి తూర్పువానలు కురియుప్రదేశమున నున్నది కాని ఏవానలును దక్కఁగఁ గురియవు. సాధారణముగ ఈజిల్లాయందు ఆగష్టు, సెప్టెంబరు, అక్టోబరుమాసములలో వాన లెక్కువగఁ గురి యును. కడచినయేబదియేండ్లకాలమున ఈజిల్లాయందు గురిసినవాన లెక్కవేసి చూడఁగా సగటున సంవత్సరమునకు ౨౨ అంగుళములపై బడిన దని తెలిసినది. జిల్లాతాలూకాలలో పెనుకొండతాలూకా యందు వర్షమధికము; కదిరితాలూకాయందు దల్పము. హిందూపురము, అనంతపురము, ధర్మవరము తాలూకాలు, గుత్తి, మడకశిరతాలూకాలయందు జిల్లామొత్తముమీఁద సగటునఁబడినవర్షము కంటె నెక్కువ; కల్యాణదుర్గము, కదిరితాలూకాలయందు జిల్లాసగటునఁ బడినదానికంటెఁ దక్కువవర్షము కురిసినది. అది యటుండ నీవర్షపాతము జిల్లాయందంతట సమముగ నుండక యొకచోట నెక్కువగాను, ఒకచోట తక్కువగాను ఉండును. వర్షములు సరిగాఁ గురియక కఱవు కాటకములు తఱచు సంభవించుచుండును.

అర్ధ్రతయందును, తాపపరిమాణమునను ఈజిల్లా బళ్లారివలె నుండును. మార్చి, ఏప్రిల్, మే మాసములు మంచి యెండకాలము. చెన్నరాజధానియందలి యితరజిల్లాలయందుకంటె నిచ్చట ఎండ లధికము. ఋతుపవనప్రవేశముతో జూన్‌మాసమునుండి ఎండలు తగ్గును. అప్పు డిచ్చటికాలమానస్థితి యితరజిల్లాలలోకంటె ఎక్కువ బాగుగ నుండును. జిల్లాయందలి యుత్తరపుపైభాగముకంటె దక్షిణపుపైభాగ మెక్కువ చల్లఁగ నుండును.

## చెఱువులు

ఈజిల్లాలో ౧౬౨ చెఱువులు కలవు. వానిలో ముఖ్యమైనట్టి అనంతపురముచెఱువు, ధర్మవరముచెఱువు, సింగనమలచెఱువు అనునవి ముఖ్య మయినవి. మొదటిరెండును చిత్రావతీనదికి నడ్డకట్టవేసి నిర్మింపఁ బడుటచేత వానికి నీటివసతి విశేషముగ నుండును. మిగిలినచెఱువు లన్నియు వర్షములు బాగుగ నున్న నిండును; లేనిచో లేదు. సగటున కొన్నిసంవత్సరములకు లెక్కవేసి చూడఁగా ఉన్నచెఱువు లన్నిటిలో ఎనిమిదివంతులలో నొకవంతు నిండుననని, రెండువంతుల చెఱువు లలో నీరు యుండ దని, అయిదువంతులు అసంపూర్తిగ నిండు నని తేలినది. ఈచెఱువులక్రింద జరుగువ్యవసాయము చాలవఱకు మెట్ట.

రు ౫,౦౦౦ ల శిస్తుకు పైన వచ్చు ఆయకట్టుపరిమితిగల చెఱువు లీక్రిందిపట్టికయందుఁ జూపఁబడినవి.

| చెఱువు | ఆయకట్టు | శిస్తు |
|---|---|---|
| అనంతపురముతాలూకా | | |
| అనంతపురం చెఱువు | ౨,౧౪౯ | ౧౩,౬౦౩ |
| సింగనమలచెఱువు | ౨,౮౮౨ | ౧౮,౪౯౧ |
| ధర్మవరముతాలూకా | | |
| ధర్మవరము చెఱువు | ౧,౪౮౪ | ౧౫,౩౬౯ |
| గుత్తితాలూకా | | |
| గుత్తిచెఱువు | ౬౫౯ | ౪,౫౩౦ |
| యొంటిమెరాజుచెఱువు | ౯౦ | ౬,౩౦౧ |
| హిందూపురంతాలూకా | | |
| పరిగిచెఱువు | ౨,౬౮౩ | ౧౮,౯౩ |
| కల్యాణదుర్గంతాలూకా | | |
| కంబాము చెఱువు | ౯౦౪ | ౫,౮౬౯ |

sampath_Ebooks

# అనంతపురము జిల్లా

| | | |
|---|---|---|
| **మడకశిర తాలూకా** | | |
| మొరుబాగలు చెఱువు | ౧,౧౩౩ | ౬,౧౪౩ |
| అమరాపురం చెఱువు | ౯౩౧ | ౬,౨౯౦ |
| అగళి చెఱువు | ౮౮౪ | ౫,౯౮౧ |
| **పెనుకొండ తాలూకా** | | |
| బుక్కపట్టణం చెఱువు | ౩,౩౯౪ | ౨౩,౬౪౩ |

## వృత్తులు : పరిశ్రమలు

రాయలసీమయందలి యితరజిల్లాలలోవలెనే ఈ జిల్లాయందు కూడ ప్రజలకు ప్రధానజీవనాధారము వ్యవసాయము. ఈవృత్తికి తోడు పశువులమందలను గొఱ్ఱెలమందలను పెంచుటకూడఁ గలదు. కుమ్మరము, కమ్మరము, వడ్రంగము మొదలయిన చేతిపను లటుండ ప్రధానమయిన పరిశ్రమ నేఁత. వేసవికాలమున వ్యవసాయపుఁ బని లేనియు మండునిదినములలో ముఖ్యముగ గుత్తి, తాడిపత్రి తాలూకాల యందలి కాఁపులు, మహమ్మదీయులు, దూదేకులవాండ్రు, మాల, మాదిగలు నేఁత నేయుదురు. దాదాపుగ ప్రతిగ్రామమునను రాట్నములు కలవు. కాని వ్యవసాయపు పనితొందరలు లేనికాలముననే వానికి పని కలుగును. దుప్పటులు, సాధారణముగ రైతులు కట్టుకొను ముతక బట్టలు, స్త్రీలు కట్టుకొను రంగుచీరలు ఎక్కువగ ఈజిల్లాయందు నేయుదురు. రవికలకు తలపాగలకు పనికివచ్చు బట్టకూడ కొంత తయారగును. ఉరవకొండ, తాడిపత్రి, ధర్మవరములు ఈ నేఁత పరిశ్రమసాగు ప్రధానస్థలములు. ప్రధానముగ దేవాంగులు, తొగట వారు, సాలీలు నేఁత నేయుదురు. అచ్చటచ్చట మహమ్మదీయులును, మాలవాండ్రునుకూడ నేఁతనేయుట కలదు. నేఁత కుపయోగించు దారము కొంచెమించుమించుగ నంతయు యంత్రముమీఁద తయారయినదే. పట్టుబట్టలు, చీరలు ముఖ్యముగ ధర్మవరమున నేయుదురు. నేఁతపరిశ్రమ ఉరవకొండయందు పూర్వముకంటె చాల తగ్గినది. ఇచ్చట తయారగు నీలిరంగుబట్టలు కాఫీతోఁటలలోఁ బనిచేయు కూలీలకు మల్నాటి కెగుమతి యగును. పామిడి చౌలూరుగ్రామము లందును, కొంతవఱకు పెనుకొండ, గుట్టూరుగ్రామములందును చేతితో బట్టల కద్దకము వేయుదురు. లంబాడిస్త్రీల కుపయోగపడు చీటీబట్టలును, బర్మా, పినాంగు, సింగపూరు, దక్షిణహిందూదేశము, బొంబాయి బజారులలో చెల్లుబడియగు చీటీబట్టలునుమాత్రమే యిచ్చట తయారగుచున్నవి. కలంకారియద్దకము నశించినది. ముఖ్యముగ కల్యాణదుర్గము తాలూకాయందును, గుత్తి అనంతపురము తాలూకాల లోని కొన్ని భాగములయందును కంబళ్లు నేయుదురు. ఈజిల్లాయంతలో తవగల్లు, బెళుగుప్పగ్రామములయందు తయారగు కంబళ్లు ప్రశస్తమైనవి. ఇక్కడ తయారగుకంబళ్లు బళ్లారి కెగుమతి యగును. ఈజిల్లాయం దింకను గాజాలు తయారుచేయుగ్రామము పెనుకొండ కెనిమిదిమైళ్ల దూరమున నున్న గుట్టూరు. క్షారమయ మయిన మట్టితో నీగాజాలు చేయుదురు. ఈకారణమున దీనికి గాజాలగుట్టూ రని పేరుండెడిది. ఒకప్పు డిచ్చట గాజాలు తయారుచేయువా రేడువందల వఱకు నుండిరి. ఇప్పు డీపరిశ్రమ క్షీణించినది. ధర్మవరమునకు పదునైదుమైళ్లదూరమున నున్న న్యామద్దలగ్రామమున నొకప్పుడు ముతక కాగితము తయారు చేయువారు. ఇప్పు డీపరిశ్రమయు క్షీణించినది. హిందూపురముతాలూకా చిలుమత్తూరుగ్రామమున నూలుతోను, పట్టుతోను పటకాలును, కొడికొండగ్రామమున కఱ్ఱదువ్వెనలును తయారగుచున్నవి. తిమ్మనచెర్ల, గుంతకల్లు, తాడిపత్రిగ్రామము లందు ప్రత్తి యేకి మూటలు కట్టు ప్రత్తి ఫ్యాక్టరీలు చాలకాలమునకుండి యున్నవి. వీనిలో ఆవిరితో పనిచేయఁబడును.

## వర్తకము : ఎగుమతి, దిగుమతులు


ప్రత్తి, ఉలవలు, ఆహారపదార్థములు, దుప్పటులు, చీరలు, తంగేటిచెక్క ఇచ్చటి ముఖ్యమయిన యెగుమతులు. ఉప్పు, కిరసనాయిలు, పరదేశపునూలు, పరదేశపుబట్టలు, పశువులు ముఖ్యమయిన దిగుమతులు. ఈజిల్లాయం దుత్తరమునకు తాడిపత్రియు, దక్షిణమునకు హిందూపురమును ప్రధానవర్తకస్థానములు. ఎగుమతి చేయుటకును, జిల్లాయందు దొరకుసరకు ప్రోగుచేయుటకును, దిగుమతి యయినసరకును స్థానికముగ పంచుటకును వారము వారము జరుగు సంతలు తోడ్పడును. ఈసంతలు లోకలుబోర్డువారియధీనమునం దుండును. ఇట్టివానిలో ముఖ్యమయినవి తాడిపత్రి, యాడికి, ఉరవకొండ, పెనుకొండలందు జరగును.

## బాటలు

ఈజిల్లాయందు బండిబాటలు, రోడ్లు చాల కలవు. రోడ్లు వెనుకటికంటె చాల చక్కఁబడినవి. ౬,౪౪౧ చదరపుమైళ్లవైశాల్యము కల యీజిల్లాయందు ౧,౦౪౦ మైళ్ల రోడ్డు కలదు. ఈజిల్లాయందలిరోడ్లను నాలుగుతరగతులుగ విభాగించిరి. ట్రంకురోడ్లు; రెండవతరగతిరోడ్లు; మూఁడవతరగతిరోడ్లు, జిల్లాబోర్డురోడ్లు కాక ఇతరములయినరోడ్లు. ట్రంకురోడ్డులు రెండు కలవు. అం దొకటి చెన్నపురినుండి బొంబాయికిని, రెండవది కర్నూలునుండి బెంగుళూరికిని పోవుచున్నది. ఈరెంటిని సరియైనస్థితియం దుంచుట కగు వ్యయము నంతయు గవర్నమెంటువారు భరింతురు. ఇవి మోటారు బండ్లు పోవుటకు తగినస్థితియం దున్నవి. రెండవతరగతిరోడ్లుకూడ ప్రయాణార్హమయినవే. వీనిని సరియైనస్థితియం దుంచుట కగు వ్యయమున సగము గవర్నమెంటువారును, సగము జిల్లాబోర్డువారును భరింతురు. మూఁడవతరగతిరోడ్లను జిల్లాబోర్డువారును, నాలుగవతరగతిరోడ్లను తాలూకాబోర్డువారును సుస్థితియం దుంచి కాపాడెదరు. వీనిని మరమ్మతుచేసి చక్కనిస్థితియం దుంచుటకు తగినంతధనము లేకపోవుటచేత ఈమూఁడు, నాలుగుతరగతులరోడ్లు అంత బాగుగ లేవు. కాని వీనిలో అనంతపురము – కల్యాణదుర్గమువంటి రోడ్లు కొన్ని ఇప్పుడు మోటారుబండ్లు పోవుటకుకూడ తగినస్థితియం దున్నవి.

sampath_Ebooks

# అనంతపురముజిల్లా



sampath_Ebooks

sampath_Ebooks

# అనంతపురముజిల్లా

## రైలుమార్గములు

అనంతపురముజిల్లాపశ్చిమభాగమున ఒకచోటనుండి మఱియొకచోటికి పోవుటకు రోడ్లే యాధారము; కాని జిల్లాయుత్తర, మధ్యమభాగములందు రైలుసౌకర్యముకూడ కలదు. ఈజిల్లాయందు మూఁడు రైలుమార్గములు కలవు. ఈరెండును జిల్లావాయువ్యదిశయం దున్న గుంతకల్లునొద్ద సంధించును. గుంతకల్లునుండి బళ్లారికిని, బొంబాయి రాజధానిదక్షిణభాగమునకును, నిజామురాష్ట్రమునకును, బొంబాయికిని, బెజవాడకును బోవునితరమార్గములు కలవు. ఈజిల్లాయుత్తరభాగముగుండ పోవురైలుమార్గము చెన్నపట్టణమునుండి 'వాడి'కిఁ బోవు చెన్నపురియినుపదారి. ఇది చెన్నపట్టణమునుండి వచ్చి ఈశాన్యపు దిక్కుగా నీజిల్లాలోఁ బ్రవేశించి తాడిపత్రి, గుత్తిగ్రామముల మీఁదుగ గుంతకల్లుజంక్షను చేరును. ఈజిల్లామధ్యభాగమునుండి పోవురైలుమార్గము దక్షిణమహారాష్ట్రపు ఇనుపదారిశాఖ. ఇది గుంతకల్లునుండి దక్షిణముగ పోయి, అనంతపురము, ధర్మవరము, పెనుకొండ, హిందూపురములమీఁదుగ మైసూరుసంస్థానమునందలి బెంగుళూరికి పోవును. ఈరైలుమార్గమును చెన్నపురి, దక్షిణమహారాష్ట్రపు-ఇనుపదారియొక్కశాఖ ఈజిల్లాయం దాగ్నేయదిశగఁ బ్రవేశించి తనకల్లు, కదిరిగ్రామములమీఁదుగ వచ్చి ధర్మవరమునొద్దఁ గలియును. ఈజిల్లాయందుఁ బోవు పైనుడివిన మూఁడురైలుమార్గములును చెన్నపురి, దక్షిణమహారాష్ట్రపురైల్వేకంపెనీవారివి.

## పరిపాలనము

ఈజిల్లాయందు మొదట నేడుతాలూకా లుండెడివి. ధర్మవరముతాలూకాను రెండువిభాగములు చేయుటవలనను, ౧౯౧౦ లో కడపజిల్లాయందలి కదిరితాలూకాను క్రొత్తగా నిందు చేర్చుటవలనను ఇప్పు డిందు తొమ్మిదితాలూకాలు కలవు. ఇవి నాలుగు సబ్‌డివిజనులుగా నేర్పఱుపఁబడినవి; ఎట్లన గుత్తి, తాడిపత్రితాలూకాలు గుత్తి సబ్‌డివిజను; అనంతపురము, కల్యాణదుర్గముతాలూకాలు అనంతపురముసబ్‌డివిజను; ధర్మవరము, కదిరితాలూకాలు ధర్మవరము సబ్‌డివిజను; పెనుకొండ, హిందూపురము, మడకశిరతాలూకాలు పెనుకొండసబ్‌డివిజను.

కలెక్టరు జిల్లాయధికారి. అనంతపురము ముఖ్యపట్టణము. ఈడివిజను 'ఇండియన్ సివిల్ సర్వీసు' ఉద్యోగిది. పెనుకొండకు సబ్‌కలెక్టరు అధికారి. మిగిలిన డివిజనులకు డిప్యూటీకలెక్టరు లుందురు.

౧౯౩౦-వ సంవత్సరమువఱకు సివిలువ్యాజ్యములు పరిష్కరించుటకయి గుత్తిలోను, పెనుకొండలోను మునసబుకోర్టు లుండెడివి. ఈజిల్లాకు వేఱుగ జిల్లాకోర్టు ఉండెడిదికాదు. గుత్తిమునసబుకోర్టుమీఁద కర్నూలుజిల్లాకోర్టునకును, పెనుకొండమునసబుకోర్టుమీఁద బళ్లారి జిల్లాకోర్టునకును అప్పీళ్లు ఉండెడివి. 'సెషన్సుకేసులు' బళ్లారి 'సెషన్సుకోర్టు' ఎదుట విచారింపఁబడెడివి. ౧౯౩౦-వ సంవత్సరమున అనంతపురమునందు 'జిల్లాకోర్టు' ను, 'సెషన్సుకోర్టు' ను కూడ పెట్టినారు. ఈకారణమున ఇపుడు సివిలువ్యాజ్యముల విషయమునను, సెషన్సుకేసులవిషయమునను ఈజిల్లా యితరజిల్లాలమీఁద నాధారపడవలసినయావశ్యకము తప్పినది.

ఇతరజిల్లాలలోకంటె ఈజిల్లాలో వ్యాజ్యములు చాల తక్కువ. అనంతపురముసెషన్సుకోర్టులో జిల్లామొత్తముమీఁద వచ్చిన 'సెషన్సుకేసు' లన్నియు విచారణ యగును. ఈకేసులవిషయమున రాజధానిలెక్కలను పరిశీలించినయెడల రాయలసీమయందలి జిల్లాలన్నిటిలోకంటె నిచ్చట నివి తక్కువ యని తేలుచున్నది. గ్రామమేజస్ట్రేటుకోర్టులు, గ్రామపంచాయతీకోర్టులు, అనంతపురము ధర్మవరము హిందూపురము తాడిపత్రి గుత్తి గుంతకల్లు కదిరి - బెంచిమేజస్ట్రేటుకోర్టులు, ఉరవకొండ, తనకల్లు, యాడికి డిప్యూటీతహసీలుదారు - మేజస్ట్రేటుకోర్టులు — వీనియందు క్రిమినలుకేసులు విచారణ యగుచుండును. 'డివిజనలు ఆఫీసరు'లకు, 'జిల్లామేజస్ట్రేటు'కు పూరా అధికారములు కలవు.

దొంగఒడ్డెలు, వాయల్పాడు లేక నవాబుపేటకొరచలు, దొంగదాసరులు, దొంగ - ఎఱుకలు, దొంగ - ఊరుకొరచలు, సుకాలీలు, మడకశిరతాలూకాయందలి దొమ్మరులు, పెద్దబోయలు—వీరందఱకు నేరములు చేయుజాతులవారికి వర్తించుచట్ట మనువర్తింపఁబడెను. ఈకారణమున, జిల్లాలెక్కలను జూచినచో నేరములు తగ్గినట్లు తెలియవచ్చుచున్నది. నేరములు చేయుజాతులవారిలో కొరచలు మిగుల నపాయకారులు. తరువాత వచ్చువారు సుకాలీలు. వీరిపిదప చెప్పవలసినవారు పెద్దబోయలు. ఈజిల్లాయందు విశేషముగ నున్నకక్షుల(పార్టీల)వలన ఇటీవలఁ గలిగిన చాలహత్యలకు వీరె బాధ్యులు. ఉరవకొండఫిర్కాలో వీ రెక్కువ. తాడిపత్రి, గుత్తితాలూకాలలో సామాన్యముగ హత్య లెక్కువ. పెనుకొండ గుత్తితాలూకాలయందు బందిపోటులు, దోపిడులు విశేషము.

పోలీసుజిల్లాసూపరింటెండెంటు అనంతపురమునం దుండును. గుత్తితాలూకాసహితమయిన గుత్తిసర్కిలు ప్రత్యేక మీతనిపెత్తనముక్రింద నుండును. ఇతనిక్రింది - ఇద్దఱు 'అసిస్టెంటు'లలో నొకఁడు పెనుకొండయం దుండి ధర్మవరముతాలూకాతోఁగూడ నీజిల్లాదక్షిణార్ధభాగమును, వేఱొకఁడు అనంతపురమునం దుండి గుత్తిమినహాగా ఉత్తరార్ధభాగమును కనిపెట్టుచుండును. స్థానికముగ నున్న పోలీసువారికి తోడు, బందిపోటుదొంగలు తఱచు వచ్చుచుండుకనుమలదగ్గఱ తలారుల నేర్పాటు చేసిరి. ఈనడుమ వీరిని చాలమందిని తగ్గించిరి. పోలీసుకార్యస్థానమును, పోలీసు 'మూలబలము' (Reserve) ను అనంతపురమునఁ గలవు. 'సెంట్రల్ పోలీసు రిక్రూయిట్ స్కూలు' అనుపేర పోలీసుపనికి క్రొత్తగఁ జేరవచ్చువారిని తరిబీతు చేయుట కొకపాఠశాలను అనంతపురమున ౧౯౧౪-వ సంవత్సరమున నేర్పాటు చేసినారు. జిల్లాసూపరింటెండెంటునకు

sampath_Ebooks

# అనంతపురము జిల్లా

౧౮౩౩, ౧౮౫౪, ౧౮౬౬, ౧౮౭౬-౭౭, ౧౮౯౨, ౧౮౯౬ సంవత్సరములలో ఈజిల్లాయందు క్షామము సంభవించినది. గవర్నమెంటువారు రిలీఫ్‌కఱవుకాలమున నేవేవో పనులు తలపెట్టి క్షామబాధితులకు పనులు కల్పించి కొంతవఱకు క్షామబాధ నివారణ చేయుచున్నారు. ౧౯౨౧-౨౨, ౧౯౨౪ సంవత్సరములందు జిల్లాయంతటను గాకపోయిన కొన్ని తాలూకాలయందయినను క్షామము సంభవించినది. ౧౯౨౧-౨౨-వ సంవత్సరపుకఱవు ముఖ్యముగ గుత్తికిఁ దగిలినది. ౧౯౨౪-వ సంవత్సరపుకఱవు జిల్లాయందు సగభాగమునకు పైఁగ తగిలిన దని చెప్పవచ్చును.

## భూమిశిస్తు

విజయనగరాధీశులు పరిపాలించుచుండినకాలమున ఈజిల్లాయందలి వ్యవసాయపుభూములకు నెట్టిశిస్తు లుండెనో, భూము లెట్లు అమరక మగుచుండెనో తెలిసికొనుటకు నాధారములు లేవు. అప్పుడు, పండినపంటలో రైతులు సంగోరుపాలు శిస్తుక్రింద చెల్లించు చుండిరని చెప్పుదురు. గోలకొండనవాబుల ప్రభుత్వమున 'కామిలు' పద్ధతి ననుసరించి భూమిశిస్తు వసూలు చేయుచుండిరి. ఈపద్ధతి ననుసరించియూడ సంగోరుపాలుధాన్యము ప్రభుత్వమువారికి పోవును. ఇది జమీన్‌దారుల, పాళెగాండ్ర ద్వారమున వసూ లగుచుండెను. మహారాష్ట్రులవశమున నుండినభాగమునందలిభూముల కేపద్ధతి ననుసరించి శిస్తు కట్టుచుండిరో తెలియదు. హైదరల్లీ శిస్తులు శాశ్వతముగ నిర్ణయము చేసెను; ఈనాములు మొదలయినవి జప్తు చేసి శిస్తు హెచ్చింపఁ బ్రయత్నించెను. కాని శిస్తులు క్రమముగ వసూలు చేసికొనఁగలిగినవాఁడు కాఁడు. ౧౮౦౦ లో నీప్రాంతము నైజాము నకు వశపడినప్పుడు ౧౮౦౨-౦౩ సంవత్సరమున గొప్పకఱవు వచ్చి భూమివలని రాబడి తగ్గి శిస్తులును తగ్గిపోయినవి.

ఈ జిల్లా కంపెనీవారికి స్వాధీనపడినతరువాత భూములు అమరకము చేయుపద్ధతి మాఱినది. జమీన్‌దారులద్వారా శిస్తులు వసూలు చేయుటకు మాఱుగా, రైతులతో స్వయముగా దొరతనమువారు కాల్లు కుదుర్చుకొని, శిస్తు తామే వసూలు చేయఁజొచ్చిరి. ఈ అమరకపుపద్ధతిని 'రైతువారిపద్ధతి' యనియెదరు. ఇది మేజర్ మన్రో చేసిన యేర్పాటు. గ్రామమునసబుకరణములకు నిందువలనఁ బూర్వ మున్న లాభము తగ్గినందున వారివలన శిస్తువసూలుకుఁ గొంతభంగము మొదటఁ గలిగెను. కాని తరువాత వారును క్రమముగఁ బని చేయఁదొడఁగిరి. ౧౮౦౧-౧౮౦౭ సంవత్సరములలో భూములను కొల్పించి, భూములను వర్గవారిగ విభజించి, మన్రో తరముల నిర్ణయించెను. తరువాత కుంపిణీగవర్నమెంటువారు రైతువారిపద్ధతిని తీసివేసి, మొదట మూఁడేండ్లకు, తరువాత పదేండ్లకు గ్రామాదులు ఇజారాపద్ధతిమీఁద నిచ్చిరి. అందువలన లాభము కలిగినదికాదు. కావున ఇజారాపద్ధతి మానివేసి ౧౮౨౧ లో మరల రైతువారిపద్ధతిని ప్రారంభించిరి.

మన్రోచే నిర్ణయింపఁబడినరేట్లు ఎక్కువ యనియు, వానిని తగ్గింపవలసిన దనియు ౧౮౨౦ లో దొరతనమువారిని కోరిరి. కాని ౧౮౫౯ వఱకు ఆరేట్లు తగ్గింపఁబడినవికావు. అట్లు తగ్గింపఁబడిన రేట్లుకూడ ఎక్కువ యని ౧౮౫౯ లో వాని నింకను తగ్గించిరి. ఇట్లు రేట్లు తగ్గినతరువాత జిల్లా కొంచెము బాగుపడఁజొచ్చెను. కాని ౧౮౭౬-౭౮ సంవత్సరముల కఱవు వచ్చి జిల్లానంతను మాడ్చి రైతులను దీనులనుగా చేసెను. మరల ౧౮౯౪ లో సర్వే ప్రారంభమై ౧౮౯౬ లోఁ బూర్తి గావించిన అమరకము ౧౮౯౦ లో ప్రారంభమై ౧౮౯౬ లో ముగిసెను. కడపనుండి విడఁదీసి క్రొత్తగా ఈజిల్లాయందుఁ గలిపిన కదిరితాలూకాకుఁ ౧౩౨౩-వ ఫసలీ (౧౯౧౩ - ౧౪) లోను, గుత్తి, తాడిపత్రి తాలూకాలకు ౧౩౩౩-వ ఫసలీ (౧౯౨౩ - ౨౪) లోను, కల్యాణదుర్గము తాలూకాయందలి ౨౧ గ్రామములకు ౧౩౩౪-వ ఫసలీ (౧౯౨౪-౨౫) లోను, మిగిలిన గ్రామములకును, అనంతపురము, ధర్మవరము, పెనుకొండ, హిందూపురము, మడకశిరతాలూకాలకును ౧౯౨౬ - ౨౭ సంవత్సరములలోను క్రొత్త అమరకము (Resettlement) జరగినది. ఈక్రొత్త అమరకము ననుసరించి కదిరితాలూకాపల్లపుభూమికేటు ఎక్కువ రు. ౯ లు; తక్కువ రు. ౨ లు; మెట్టభూమి ఎక్కువరేటు రు. ౨ లు, తక్కువ నాలుగణాలు; గుత్తి, తాడిపత్రి, కల్యాణదుర్గము ఇరువదియొక్క గ్రామములకు పల్లపుభూమి ఎక్కువరేటు రు. ౧౦-౨-౦ లు, తక్కువరేటు రు. ౧-౨-౦ లు; మెరక ఎక్కువరేటు రు ౨-౮-౦ లు, తక్కువరేటు రెండణాలు; ౧౯౨౬-౨౭ న జరగిన అమరకము ననుసరించి జిల్లాయందు శేషించినభాగమున పల్లపుభూమి ఎక్కువరేటు రు. ౯-౯-౦ లు; తక్కువరేటు రు. ౧-౨-౦ లు. మెరక ఎక్కువరేటు రు. ౨ లు; తక్కువ రెండణాలు. ఈజిల్లాయందు జమీన్‌దారీలు లేవు. ఈనాంగ్రామములు ౧౦౮ కలవు. ఈజిల్లామొత్తముమీఁద వచ్చుభూమిశిస్తు ౧౩౪౦-వ ఫసలీకి రు. ౧౮,౦౫,౦౬౭ లు.

## స్థానిక స్వపరిపాలనము

ఈజిల్లాయందలి అనంతపురము, తాడిపత్రి, హిందూపురములు మునిసిపాలిటీలు. ఈజిల్లాకు జిల్లాబోర్డును, డివిజను కొక్కటిచొప్పున అనంతపురము, గుత్తి, ధర్మవరము, పెనుకొండలకు నాలుగింటికి నాలుగు తాలూకాబోర్డులును గలవు. పదుమూఁడు యూనియను లున్నవి. స్థానిక స్వపరిపాలనము వీనివశమున నున్నది.

## చరిత్ర

ఈజిల్లాలో మిక్కిలి పురాతనకాలమునాఁటి వని చెప్పఁదగు బూదితో చుట్టు నమర్పఁబడిన దిబ్బలు విశేషముగ కలవు. కల్యాణదుర్గము తాలూకాయందలి ముదిగల్లు, దేవతులబెట్ట, అనంతపురము తాలూకాయందలి మాల్యవంతము, హిందూపురము తాలూకాయందలి కొండాపురము, పూలేరు గ్రామములయొద్ద నిట్టివి పెక్కులు కలవు.

గుహాలలోఁ గాఁపురముండెడు మిక్కిలి పురాతనకాలపువారిచేత గుట్టలలో తొలవఁబడినబావులుకూడ గుత్తితాలూకాయం దనేకములు కలవు. కొండలలో మొదట లోయలుచేసి ప్రక్కభాగములను నునుపు

sampath_Ebooks



# అనంతపురము జిల్లా

వలయు నన్న యుద్దేశముతో గుంపులుగుంపులుగ జనము ్రండి వాని నటుగఁదీయుచుండి రని యూహించుటకుఁ దగిన ్రనము లున్నవి. ఇ వన్నియుఁ జరిత్రకాలమునకుఁ బూర్వపు తులు. అప్పటి జను లెవరో కనుఁగొనుటకు సాధనములు లేవు. యాయుధము లన్నియు శిలామయములు. వీరు శిలాయుగము ని చెప్పఁదగును.

ఈకాలమునకుఁ దరువాత చరిత్రకాలమువఱకు నీ ప్రదేశమును ంచిన చరిత్ర మేమియుఁ దెలియదు. క్రీస్తునకు పూర్వము ఁడవశతాబ్ది నీప్రాంత మంతయు అశోకవర్ధనసామ్రాజ్యమునఁ జేరి ండె ననుటకు గుత్తి కేడెనిమిదిమైళ్ల దూరమునఁ గల యెఱ్ఱగుడి ుమున నిటీవలఁ గనుఁగొనఁబడిన అశోకుని 'శిలాలిపులే' తార్కా ు. అశోకునికాలమునాఁటినుండియు గుత్తి కీకారణమున ప్రాధా ు కల దని యూహింపనగును.

మౌర్యచక్రవర్తి యగు అశోకునియనంతర మాఱువందల ంవత్సరములవఱకు నీమండలచారిత్ర మజ్ఞాతయుగముగ నున్నది.

ఈకాలమున పశ్చిమగాంగులు, నలులు, బాదామిచాళుక్యులు, ంఁగువోళులు ఈమండలము నంతయు గాకున్న నందలి వేఱువేఱు ్రాంతములను బరిపాలించిన ట్లూహింప నవకాశము కలదు. వీరిలో ళుక్యులయొక్కయు, చోళులయొక్కయు శిలాశాసనములు గొన్ని ా మండలమునఁ గానవచ్చినవి. ఈచాళుక్యులకు సామంతులుగ ాణవంశజులు ప్రాచీనకాలమున తురమరవిషయ మనుపేరఁ బరఁగిన త్తి తాలూకాను పాలించిరి. హిందూపురముతాలూకా వీరి ్రధమావాసస్థలముగ నుండియుండు ననుటకు తరువాతిబాణవంశ లు తమ శాసనములందు తాము 'పరివిపురాధీశ్వరుల' మని చెప్పు నుటయే తార్కాణము. పరివిపుర మనునది హిందూపురము ాలూకాయందలి యిప్పటి పరిగిగ్రామముగ గుర్తించియున్నారు. రువాతికాలమున గుడిమల్లము, కాళహస్తి, చిత్తూరుప్రాంతములను ాలించిన బాణులకును, బాదామిచాళుక్యసామంతులయిన బాణుల ను ఎట్టి సంబంధము కలదియు నింతవఱకుఁ దెలియరాదు.

బాదామిచాళుక్యరాజ్య మంతరించినపిదప మరల హిందూపుర ్రాంతము పశ్చిమగాంగుల వశమయినది. వీరికి నొలంబులను పల్లవ ంశజులు మొదట సామంతులుగ నుండి పిదప స్వాతంత్ర్యమును ంపాదించి క్రీస్తుశక మెనిమిది, తొమ్మిది శతాబ్దులందు కల్యాణ ుర్గము, మడకశిర, హిందూపురప్రాంతముల నేలిరి. నొలంబవాడి యనఁ బ్రసిద్ధమయిన నొలంబరాజ్యమునఁ గల ముఖ్యపట్టణములలో ుడకశిరతాలూకాయందలి హేమావతి యొకటి. తరువాత మరల ్చిమగాంగులు విజృంభించి నొలంబులను జయించి తమ యధికా ము నీ మండలముపయి వర్తింపఁజేసినను శీఘ్రకాలముననే వారు ాల్యఖేటపు రాష్ట్రకూటులకు సామంతు లయిరి.

పిదప రాష్ట్రకూటరాజ్యసౌధమును గూలఁద్రోసి చాళుక్య సామ్రాజ్యమును నిర్మించిన పశ్చిమచాళుక్యులకును, కాంచీపురపల్లవ రాజ్యమును జయించి రాజ్యమును విస్తరింపఁజేసికొనుచుండిన చోళుల కును పెక్కు సంగ్రామములు జరగి యీమండల మొకప్పుడు చోళుల కును, మఱియొకప్పుడు పశ్చిమచాళుక్యులకును వశమగుచువచ్చినది. పశ్చిమచాళుక్యాధికార మీ మండలముపయి రమారమి క్రీస్తుశకము పదునొకండవశతాబ్ది కడవఱకు సాగిన దనవచ్చును.

ఈకాలమున ఉత్తరమున దేవగిరియాదవులును, దక్షిణమున, మొదట పశ్చిమచాళుక్యులకు సామంతులయి, వారి యధికారము క్షీణించుచుండినకాలమున ప్రాముఖ్యము వహించి స్వతంత్రు లయి రాజ్యమును పెంపొందించుకొనుచుండిన ద్వారసముద్రపు హొయి సలులును ప్రబలులయి యీ మండలము నొకప్పు డొకరును, మఱి యొకప్పు డొకరు నధీనపఱుచుకొని పాలించిరి. క్రీస్తుశకము పదునాలుగవశతాబ్ది యారంభమున దక్కనుదేశముపయి మహమ్మదీ యులు జరపిన దండయాత్రలవలన దేవగిరియాదవరాజ్యము మణఁగిపో యినవెనుకఁగూడ, క్రీస్తుశకము ౧౩౪౦ వఱకు నీ మండలముదక్షిణ భాగము, అనఁగా హిందూపురము మడకశిరప్రాంతములు హొయిసల బల్లాళుల పరిపాలనముక్రిందనే యుండెను.

పదునాలుగవశతాబ్ది మధ్యముననుండి యీ మండలము విజయ నగరసామ్రాజ్యమున నంతర్భాగ మయ్యెను. పెనుకొండ, గుత్తిదుర్గ ములు విజయనగరాధీశులకాలమున శత్రుదుస్సాధము లన్న ఖ్యాతిఁ బడసినవి. క్రీ. శ. ౧౫౬౫ న జరగిన 'రక్కసతగిడి' యుద్ధమున విజయనగరచక్రవర్తియయిన సదాశివరాయల ప్రతినిధి అళియరామ రాయలు వధింపఁబడి, విజయనగరసైన్యములు పరాజయము నొందిన పిదప అళియరామరాయల సోదరుఁ డయిన తిరుమలరాయలు విజయ నగరమును విడిచిపెట్టి సదాశివరాయలను వెంటనిడికొని పెనుకొండ కరిగి దానిని రాజధానిఁ గావించెను. ఇచ్చట నెన్నియోమాఱులు విజయ నగరాధిపతులు పెనుకొండపయి నెత్తివచ్చిన తురుష్కుల నోడించిరి. బలహీనులయిన విజయనగరమురాజులు తరువాతఁ గొంతకాలమునకుఁ దమరాజధానిని పెనుగొండనుండి చంద్రగిరికి మార్చిరి. గుత్తియుఁ గాల క్రమమున తురుష్కుల యధీన మయ్యెను. వారియొద్దనుండి మురారి రావను మహారాష్ట్రవీరుఁడు గుత్తిని వశపఱుచుకొనెను. ఈ కాలమునందు దేశమంతయు నరాజకమై, యొక్కరాజు లేక, యెవరి కెంతభాగము చిక్కిన వా రంతభాగమునకు నధిపతు లగుచు, పెక్కు పాళెగాండ్రు దేశము నేలుచుండిరి. ఏలుచుండి రనుటకంటె దోఁచు కొనుచుండి రనుట మేలు. ఇట్టివారిలో అనంతపురము హండేవారు ప్రముఖులుగ నుండిరి. ఈ పాళెగాండ్రు బలయుతులయినప్పుడు స్వతంత్రు లయి వీలు కానప్పుడు పైవారికి లోఁబడి మెలఁగుచుండిరి. హైదరల్లీ ప్రబలుఁడైనపుడు ఈ భాగమును సులభముగ స్వాధీనపఱుచు కొనెను. ఒక్క గుత్తిదుర్గము మాత్రము చాలకాలము వశముకాలేదు. అది చివరకు కోటలోఁ ద్రాగుటకు నీరు లేనందున ౧౭౭౫లో వశమయ్యెను.

sampath_Ebooks



మహారాష్ట్రులు, నైజాము, ఇంగ్లీషువారు కలసి ౧౭౯౨ లో టిప్పు సుల్తాను నోడించినపుడు, ఇప్పటి అనంతపురముజిల్లా యొక్క ఈశాన్యభాగమైన యిప్పటి తాడిపత్రి, తాడిమఱ్ఱి తాలూకాలు నైజామున కీయఁబడెను. టిప్పు చనిపోయిన తరువాత ౧౭౯౯ లో అతని రాజ్యమును ఇంగ్లీషు, నైజాము మొదలగువారు పంచుకొనునపుడు ఈజిల్లాయొక్క మిగిలినభాగ మంతయు నైజామునకుఁ బోయెను. ఈ రెండు తహానామాల (treaties) ననుసరించి నైజామునకు వచ్చిన రాజ్య మంతయు, నతఁడు ౧౮౦౦ లో నింగ్లీషువారికి దత్తము చేసెను. అవియే దత్తమండలములు (Ceded Districts). దత్తమండలప్రదేశమున కిప్పుడు రాయలసీమ యని పేరు. నైజాముసంరక్షణ నిమిత్తమై యింగ్లీషువా రుంచవలసిన సైన్యముకర్చుక్రింద ఈమండలములు శాశ్వతముగ నింగ్లీషువారి కీయఁబడెను. అప్పు డనంతపురముగూడ బ్రిటిషుప్రభుత్వమునఁ జేరెను.

మొదట దత్తమండలముల కన్నిటికి నొక్కఁడె కలెక్టరుండెను. మొదటికలెక్టరు మేజర్ మన్రో (ఇతఁడే తరువాత సర్ పదవిని బొందెను). తరువాత దత్తమండలములు రెండుజిల్లాలుగ విభజింపఁబడెను. అందు బళ్లారిజిల్లాలో నిప్పటి యనంతపుర ముండెను. బళ్లారిజిల్లా పెద్దది అయినందున ౧౮౮౨లో దానిని రెండు జిల్లాలుగ విభజించి, ఒకదానికి బళ్లారి అనియు, రెండవదానికి అనంతపుర మనియు పేర్లు పెట్టిరి. కదిరితాలూకా యిదివరకు కడపజిల్లాలోనిది — ఇందుఁ జేర్పఁబడినది.

ఈజిల్లాలో చరిత్రప్రసిద్ధములయిన పురాతనదుర్గములు గుత్తి, పెనుకొండ కోటలు. తాడిపత్రిలో పెన్నయొడ్డున నున్న దేవాలయము, లేపాక్షి, హేమావతిదేవాలయములు రమణీయశిల్పశోభితములు.

నిడుగల్లుకూడ చరిత్రప్రసిద్ధమయిన స్థలము. ఈ నిడుగల్లు రాజ్యమును పదునొకండు, పండ్రెండు, పదుమూఁడు శతాబ్దులందు తెలుఁగు చోళవంశజులు పాలించిరి. వారి రాజధాని యిప్పటి హేమావతిగ పిలువఁబడిన పెంజేఱు: హెంజే అనియు దీనికి నామాంతరము గలదు. ఈ దేశమండలమును ఏలుచుకొన్న ప్రధానరాజవంశముల క్రిందు సామంతులుగను, వారి యధికారము క్షీణించుచుండినకాలమున స్వతంత్రులుగను రాజ్య మేలుచువచ్చిరి. పదునేడవశతాబ్దియందు రాజ్యము విజయనగరపు ఆరవీటివారికి సామంతులుగ హరతినాయకులు పాలించిరి. టిప్పుసుల్తా నీప్రాంతమును జయించి తనరాజ్యమునఁ జేర్చుకొనువఱకు వీ రధికారము నెఱపుచునే యుండిరి.

క్రీస్తుశక మేడవశతాబ్దినాఁటి తెలుఁగుశాసనములు కొన్ని యీ మండలమునందలి గుత్తితాలూకాయందుఁ గానవచ్చినవి. తెలుఁగున నున్న మొదటిశాసనములలో నివి కొన్ని. వీనిలో మొట్టమొదటఁ దగినది బాదామి చాళుక్యప్రభువయిన మొదటి విక్రమాదిత్యుని యేడవ పరిపాలనవర్షము (క్రీ. శ. ౬౬౨) నాఁటిది.

**అనంతపురము తాలూకా** — అనంతపురముజిల్లాయందలి యొక తాలూకా. ఉత్తరమున గుత్తితాలూకాకును, తూర్పున తాడిపత్రితాలూకాకును, దక్షిణమున ధర్మవరముతాలూకాకును, పడమట కల్యాణదుర్గముతాలూకాకును నడుమ నున్నది. దీని విస్తీర్ణము ౯౨౬ చ. మైళ్లు. జనసంఖ్య ౧,౧౬,౯౫౭ (౧౯౩౧). ఈ తాలూకాయందు ౧౧౪ గ్రామములు కలవు. అనంతపుర మొక్కటే ఈతాలూకాయందలి పట్టణము. ఇందలి మెట్ట, పల్లము కలసి ౧౩౩౫-వ ఫసలీ (౧౯౨౫-౧౯౨౬) లో ౨,౦౦,౦౬౫ యెకరములు: మొత్తము శిస్తు రు ౧,౧౫,౭౮౭ లు.

ఈ తాలూకా మిట్టపల్లములు గల ప్రదేశము. భూమి రాతిపఱ యయినందున ఫలవంతము కాదు. అందుచేత పచ్చని చెట్లు తక్కువగఁ గానవచ్చును. ఉత్తరమున నచ్చటచ్చట నల్లరేగడభూమి కొద్దిగఁ గలదు. ఈ తాలూకా కుత్తరమున పెన్నయు, తూర్పున చిత్రావతియుఁ గలవు. కాని వీనివలన తాలూకా కేమియు ప్రయోజనము లేదు. పల్లపువ్యవసాయమున కంతకును వర్షమే ప్రధానాధారము.


మొదట విజయనగరాధీశులక్రిందఁ బాళెగాండ్రుగ నుండిన హండేవంశజులు ఈప్రాంతమునఁ బ్రసిద్ధు లయిన నాయకులు. విజయనగరరాజులప్రభ తగ్గినపిదప హండే మలకప్పనాయఁడు గోలకొండ నవాబునకు సామంతుఁడయి అనంతపురమునకుఁ జుట్టుపట్టుల నుండు ప్రాంతమును జాగీరుగ సంపాదించెను. ౧౮౦౦ లలో నింగ్లీషువారికి వశపడువఱకు అనంతపురమును ముఖ్యపట్టణముగ చేసికొని యీ వంశమువారే యెవరికో యొకరికి లోఁబడి ఈ ప్రాంతము నేలుచుండిరి. ఈకారణమున అనంతపురముతాలూకాకు ముఖ్యపట్టణ మయిన అనంతపురమునకు ‘హండే అనంతపుర’ మని ప్రసిద్ధి కలిగినది (చూడుఁడు: హండేవంశము).

అనంతపురసమీపమున నున్న చెఱువును క్రీ. శ. ౧౩౬౪-న విజయనగరరాజుల మంత్రియయిన చిక్కప్పఒడయ రనునతఁడు కట్టించెను.

**అనంతఫందీ** — ఒకమహారాష్ట్రకవి. ఇతఁడు శా. శ. ౧౬౬౬ లో జన్మించి ౧౮౧౯ లోఁ గీర్తిశేషుఁ డయ్యెను. నగరప్రాంతమునందలి సంగమనేర్ గ్రామనివాసి. మొదట నితఁడు శృంగారాతిరేకముగల ‘లావణీ’ లనఁబడు వృత్తములలోఁ బద్యములఁ జెప్పుచు మగపిల్లలను వెంటఁ దీసికొని వారి నాడించుచు జీవనము చేయుచుండెను. కాని యొకసారి అహల్యాబాయి సంగమనేరునకు వెళ్లినప్పు డామె యీతనిని బిలిపించి బ్రాహ్మణున కిది తగ దని చెప్పఁగా నామార్గము విడిచి యితఁడు భక్తిపరమైన కవిత్వముఁ జెప్పుచు హరికథలు చెప్పఁదొడఁగెను. ఇతనిచే రచింపఁబడినచాటువులు పెక్కులు గలవు. కావ్యములలోమాత్రము మాధవగ్రంథ మనునది యొక్కటున్నది. ఇందు రెండవమాధవరావుపేష్వా మేడమీఁదనుండి దూఁకినప్పటినుండి రెండవబాజీరావు రాజ్యాభిషేకము

sampath_Ebooks

# అనంతపురము తాలూకా



sampath_Ebooks

sampath_Ebooks

బడుకు వర్ణింపఁబడినది. కవికి జరగిన యథార్థస్థితి, ఉత్తర వ్రాసి, తెలిపి కొండపబాసీరావు ఈచరిత్ర వ్రాయించెను. శ్రీపత్‌ఫందీ యను నామాంతరముగల సవాయిఫందీ యను కుఁ డుండెను. అతఁడును కవియే.

**అనంతభట్లఖండ్రిక** — నెల్లూరిజిల్లా కోవూరు తాలూకాయందలి ఈనాం గ్రామము. జనసంఖ్య ౫ (౧౯౩౧).

**అనంతభట్టు** — ఇతఁడు శివాజీగురు వైన రామదాస మికి సమకాలికుఁడు. సాధుపురుషుఁడు. రామదాసస్వామియొక్క కాయతనములో నొక్కఁడు.

**అనంతభూపాలుఁడు** తుపాకుల — ౧. ఇతనితండ్రి ష్ణభూపాలుఁడు; తల్లి భాగమాంబ. 'వచనరచనా నైచక్కణ్యుఁ' ఁడు. భగవద్గీతలు, విష్ణుపురాణము, రామాయణము, భారతము నమున వ్రాసినాఁడు. రామాయణమున సుందరకాండ ముక్కటి త్రమే (౫ ఆశ్వాసములు) లభించినది. భారతమున సభా, ష్ణపర్వములుమాత్రము లభించినవి.

మట్ల — ౨. విజయనగర మ్రాజ్యపువైభవము తఱిఁగినపిదప పదునాఱవశతాబ్దియంతమున నామమాత్రు లయినరాయలయొక్క భూములయందు సర్వస్వతంత్రముగనో, కొంత స్వతంత్రముగనో అచ్చటచ్చట రాజ్యభారము నిర్వహించినవానిలో నీమట్లవంశ మొక్కటియై కన్పించుచున్నది. మట్ల కడపజిల్లా రాయచోటితాలూకాలో నున్నది. మట్లప్రభువులు విజయనగరాధీశులకు సామంతు లయిన స్వల్పసంస్థానాధపతులు. మట్ల వారిలో నొక్కఁడగు వరదరాజు శ్రీ కృష్ణదేవరాయలయల్లుఁడు. మట్లవంశమువా రాంధ్రచోడులుగఁ గన్పట్టుచున్నారు. వీరు సూర్య వంశజులు. వీరి మూలపురుషుఁడు తిమ్మప్రభుఁడు. చాటుపద్యములను బట్టియు, కకుత్‌స్థవిజయ-అభిషిక్తరాఘవములనుబట్టియు చూడ మట్ల వంశోద్భవులు విద్యాప్రియులును, రణప్రియులు నయి కన్పట్టుచున్నారు. అందు అనంతభూపాలుఁడు పెనుకొండకడ మల్కబలముల సాధించినట్లును, గుఱ్ఱముకొండను స్వాధీనపఱుచుకొనినట్లును, సిద్ధవటదుర్గము నాక్రమించుకొనినట్లును, రాయలచే 'సురువాయి' బిరుద మందినట్లును తెలియవచ్చుచున్నది. యుద్ధవీరుఁడుగను, కావ్యకర్తగను బ్రఖ్యాతిఁ గాంచిన ఈ యనంతభూపాలుఁడు ఎల్లనగారమణునకును, రంగమాంబకును బుత్రుఁడు; తిరుమలతోళస్వాచార్యుల శిష్యుఁడు. పదునాఱవశతాబ్ది యుత్తరార్ధమునను, పదునేడవశతాబ్ది యాదిని నుండినవాఁడు. ఇతఁడు కకుత్‌స్థవిజయ మను గ్రంథమును రచించెను.

**అనంతమడుగు** — నెల్లూరుజిల్లా రాపూరుతాలూకాయందలి ఈనాం గ్రామము. జనసంఖ్య ౬౮౫ (౧౯౩౧).

**అనంతయ** — 'విష్ణుమాయానాటకప్రబంధము' అను ఐదాశ్వాసముల గ్రంథమును రచించినకవి. భారద్వాజసగోత్రుఁడు, అయ్యలామాత్యుఁ డితనితండ్రి.

**అనంతయజ్వ, రేవూరి** — ఇతఁ డొక తెలుఁగు కవి. ఆపస్తంబసూత్రుఁడు. కౌండిన్యసగోత్రుఁడు. వైదికబ్రాహ్మణుఁడు. బాలకవి బిరుదాంకితుఁడు. మహాపండితుఁ డగు బాలకవి అనంతార్యునకు పౌత్రుఁడు. కాళహస్తికవి యితని తండ్రి. అనంతయజ్వ ౧౭-వ శతాబ్ది తుదిభాగపువాఁ డని తెలియుచున్నది. తిరుచనాపల్లికి సమీపమున నున్న 'తురైయూరు' ఇతని నివాసస్థాన మని కొందఱి యూహ. ఇతఁడు రచించిన గ్రంథములు రెండు. శ్రీముష్ణమాహాత్మ్యము, శివరహస్యఖండము. ఇందు మొదటిదానిలో నైదాశ్వాసములును, రెండవదానిలో ౭ ఆశ్వాసములును గలవు. శ్రీముష్ణమాహాత్మ్యము వెంగుళము కృష్ణభూపాలునకును, రెండవది తీర్థపుర (తురైయూరు) నందీశ్వరునకును అంకితమొనర్పఁబడినవి. కవిత్వము ప్రౌఢము, మనోహరము.

**అనంతయ్యగారిపల్లి** — కడపజిల్లా రాజంపేట తాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౨,౦౬౯ (౧౯౩౧).

**అనంతరాజపురం** — ౧. చిత్తూరుజిల్లా తిరుత్తని తాలూకాయందలి జమీన్‌దారీగ్రామము. జనసంఖ్య ౩౦౦ (౧౯౩౧).

౨. కడపజిల్లా బద్వేలు తాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౧,౮౫౫ (౧౯౩౧).

**అనంతరాజుపేట** — కడపజిల్లా రాజంపేటతాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౪,౩౨౬ (౧౯౩౧).

**అనంతరామకవి** — ఒక సంస్కృతకవి. 'స్వానుభూతి' యను పేర నొక నాటకము రచించెను.

**అనంతవరం** — ౧. గుంటూరుజిల్లా తెనాలి తాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౨,౬౯౩ (౧౯౩౧).

౨. గుంటూరుజిల్లా బాపట్లతాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౧,౪౬౨ (౧౯౩౧).

౩. నెల్లూరిజిల్లాకోవూరుతాలూకాయందలి ఈనాం గ్రామము. జనసంఖ్య ౪౭౬ (౧౯౩౧).

౪. గుంటూరుజిల్లా నర్సారావుపేట తాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౨,౮౮౦ (౧౯౩౧).

౫. గుంటూరుజిల్లా ఒంగోలు తాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౧,౧౭౧ (౧౯౩౧).

౬. గుంటూరుజిల్లా సత్తెనపల్లి తాలూకాయందలి ఈనాం గ్రామము. జనసంఖ్య ౯౦౮ (౧౯౩౧)

sampath_Ebooks

అనంతశయనము వర్తకమునకు ప్రఖ్యాతి చెందినది కాదు. అది చిన్న రేవుస్థలము. అచ్చటికి వచ్చిపోవు పడవలు స్వల్పము. అవియైనను తీరసమీపమునకు రాజాలవు. సముద్రమున దూరముగా నిల్వవలయును.

**అనంతసముద్రం** — కడపజిల్లా రాజంపేటతాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౧,౩౬౮ (౧౯౩౧).

**అనంతసముద్రం చిన్నమాంబాపురం** — కడపజిల్లా రాజంపేటతాలూకాయందలి ఈనాం గ్రామము. జనసంఖ్య ౨౦౦ (౧౯౩౧).

**అనంతసాగరము** — ౧. నెల్లూరుజిల్లా ఆత్మకూరు తాలూకాయందలి యొక గ్రామము. ఇక్కడఁగల ఒకమసీదును, గొప్ప తటాకమును దర్శనీయములు. ఈ చెఱువునకు అనంతసాగర మని పేరు. దీనింబట్టియే గ్రామనామము. దీనిపై నుండు శిలాశాసనమునుబట్టి దీనిని శ్రీకృష్ణదేవమహారాయలకాలమున క్రీ. శ. ౧౫౨౨ లో 'రాయసం కొండమరసు' అనువతఁడు తనతల్లిదండ్రులయిన తిమ్మరసు, నాయమ్మల జ్ఞాపకార్థము ఈ చెఱువును త్రవ్వించినట్లు తెలియుచున్నది. జనసంఖ్య ౩,౨౪౬ (౧౯౩౧).

౨. నెల్లూరుజిల్లా కందుకూరు తాలూకాయందలి ఈనాం గ్రామము. జనసంఖ్య ౩౫౨ (౧౯౩౧).

**అనంతసుత (విట్ఠల్)** — ౧. ఈకవి సుమారు డెబ్బదినాలుగు సంవత్సరములకు పూర్వ ముండినవాఁడు. ఈతని పూర్వుఁడు (? తండ్రి) హంగానదియొడ్డునఁ గల పింపళ్ గ్రామమున నుండెడివాఁడు. ఆకారణమున నీతనికి పింపళ్ గ్రామమునకును రా... గ్రామములకు పౌరోహిత్యము, కరిణీకముకూడ గలవు. ఈతని... పేరు రాధాబాయి. ఈమె మరణానంతర మనంతుఁడు సన్న్యసించె. ఈతని 'దత్తప్రబోధ' యను గ్రంథ మొక్కటియే సుప్రసిద్ధముగ నున్నది. ఇందలి ముప్పదియేడధ్యాయములు శివ, నారద, పద్మపురాణముల నాధారముగాఁ గొని దత్తాత్రేయునికథను వర్ణించును. మిగిలిన యిరువదినాలుగధ్యాయములందును దత్తాత్రేయసంప్రదాయము విపులముగను, మనోహరముగను వర్ణింపఁబడినది.

౨. సంతకవికావ్యసూచీకారుఁ డొకయనంతవిట్ఠలుని సూచించినాఁడు. ఆతఁడు (౧) వస్త్రహరణము (౨) గజగౌరీవ్రతము (౩) సుధన్వాఖ్యానము (?) (౪) ...టకావధ (౫) గరుడహనుమద్గర్వభంగ అను గ్రంథములను రచియించెను.

**అనంతాచార్యుఁడు** — ౧. ప్రసిద్ధుఁడగు భాష్యకారుఁడు. లక్ష్మీధరుని కుమారుఁడు. వేదార్థదీపిక యను పేరను యజుర్వేదభాష్యమును, వేదార్థచంద్ర మను పేరను మీమాంసా గ్రంథమును రచించెను.

౨. సువిఖ్యాతుఁ డగు నొక దార్శనికుఁడు. సంస్కృతభాషలో నితఁడు రచించిన యీ క్రింది గ్రంథములు దొరకినవి. అభిన్ననిమిత్తవాద, ఆకాశాధికరణవాద, ఓంకారవాద, జ్ఞానార్థవాద, శరీరవాద, శాస్త్రీయమతసమర్థన, సమాసవాదాదులు చిన్నచిన్న గ్రంథములు; న్యాయభాస్కరము, విధిసుధాకరము, సిద్ధాంతసిద్ధాంజనములు వేదాంత గ్రంథములు.

౩. వైదికనిఘంటువు టీక, జటాపటలము, శతకోటి ఖండనము, స్వరూపసంబంధరూపము అను న్యాయగ్రంథములు వ్రాసినవాఁడు.

**అనంతానందగిర్యాచార్యుఁడు** — ఇతఁడు శంకరవిజయ మను సంస్కృత గ్రంథమును రచించిన కవి. ఇందు శ్రీ శంకరాచార్యుఁ డవతరించుట మొదలుగా బ్రహ్మైక్యముఁ జెందుట వఱకుఁ గల యాతని చరిత్ర ౮౨ చిన్నచిన్న ప్రకరణములుగ రచింపఁబడినది. నడుమనడుమ సంపద్భావసారముగాఁ గొన్ని శ్లోకములును కలవు. కాని గ్రంథము మొత్తముమీఁద గద్యాత్మకము.

**అనంతానందుఁడు** — వైష్ణవమతమును స్థాపించిన రామానందుని పండ్రెండుగురు శిష్యులలో నొకఁడు.

**అనంతాపురము** — ౧. చిత్తూరుజిల్లా చిత్తూరుతాలూకాయందలి జమీన్దారీ గ్రామము. జనసంఖ్య ౪౦౨ (౧౯౩౧).

౨. చిత్తూరుజిల్లా కాళహస్తి తాలూకాయందలి ఈనాం గ్రామము. జనసంఖ్య ౧౫౩ (౧౯౩౧). రాచెఱువని దీనికి నామాంతరము.

౩. నెల్లూరుజిల్లా కావలితాలూకాయందలి జమీన్దారీ గ్రామము. జనసంఖ్య ౮౦౫ (౧౯౩౧).

**అనంతామాత్యుఁడు** — అనంతఛ్ఛంద మని తెలుఁగునఁ బేరుగన్న ఛందోగ్రంథమునకుఁ గర్త. ఈగ్రంథముగాక యీతఁడు భోజరాజీయ మనుకావ్యమును, రసాభరణ మనఁబడు సాహిత్యశాస్త్రమును రచించెను.

ఈ కవి తనవంశమును భోజరాజీయమునందు సవిస్తరముగ వర్ణించినాఁడు.

ఈకవి యార్వేలసంతతివాఁడు. ఈతనిముత్తాతయగు బయ్యన్న తిక్కనసోమయాజితో సమకాలికుఁడు. సోమయాజి యీతనిని మెచ్చి 'భవ్యభారతి' యన్న బిరు దిచ్చెను. వైష్ణవులు వీరికి గురువులుగ నుండిరి. ఈ కవికి గోవిందచక్రవర్తి గురువు. కవితల్లియైన మల్లమాంబిక గొప్పవారియింటి యాఁడుఁబడుచువలెఁ గానవచ్చెడిని. ఆమెతండ్రి యొక దండనాయకుఁ డని కవియే వ్రాసినాఁడు. కవి తండ్రి తిక్కన భూవసతియు, సదుద్యోగమును గలిగి సుఖజీవనము

యుండెను. వీరిది కౌండిన్యసగోత్రము. వీ రార్గురన్నదమ్ములైనం వి చమత్కారముగ నీక్రిందిపద్యమున నిట్లు చెప్పెను.:—

ఈయార్వుర నొక్కొక్కఁడు
వేయిండ్లకు మొదలు గాఁగ వెలయుదు రని కా
దే యాఱువేల పేరిటి
రీయన్వయమునకు నేవ్య మెఱఁగిన పెద్దల్. [౧. ౪౯.]

ఆఱువేలనియోగులను సూచించిన యుల్లేఖము గల వాక్య మిదియే వాఙ్మయమునందు మొదటిది. తెలుఁగు బ్రాహ్మణులలో ఆఱువేల వారమి తిక్కనకాలమునాఁటికే యేర్పడియుండె నని యిందు దెలియుచున్నది. పై సంగతు లన్నియు భోజరాజీయమందలి రీతి ననుసరించి వ్రాయఁబడినవి.

ఇఁక నీతనినివాసస్థాన మెద్ది యని మనము విచారింపవలసి న్నది. ఇందునుగూర్చి భోజరాజీయమందలి యీ క్రిందిపద్యము కాధారము:—

. విలసితంబగు కృష్ణవేణ మలాపహా
రిణి భీమరథి నా ధరిత్రియందుఁ
బవరు నదీత్రయాంతర్వేది యనుపావ
నక్షేత్రమున శోభనముల కెల్ల
ధర నివాసం బగు పెరుమగూరిపురంబు
నందు విద్వజ్జనానంద మైన
జీవనస్థితిచేతఁ జెన్నొందు వంశక
ర్తృత్వసంపత్తిఁ బ్రభుత్వ మొంది
నెమ్మి ప్రత్యక్షపరమపద మ్మనంగ
నొప్పు శ్రీకాకుళంబున కొడెయఁ డైన
యంధ్రవల్లభహరిసేవ[1] నలరుచుండుఁ
బెక్కుభంగుల మమ్మడి తిక్కవిభుఁడు!

ఈ పద్యమునుబట్టి చూడ నీకవియొక్కతండ్రి కృష్ణవేణ, భీమరథి, మలాపహా యనఁబడునదులు కలసినయంతర్వేదిలో నుండె —అట్టిస్థల మాతని స్వస్థాన మని—తెలియుచున్నది. అట్టిస్థల మెద్ది? కృష్ణవేణ యనఁగ కృష్ణ, భీమరథి యనఁగ భీమ, మలాపహా యనఁగ మలప్రభ అనునదు లనుట స్పష్టము. కృష్ణానదియు, మలప్రభా నదియు నైజామురాజ్యమునకుఁ బశ్చిమపుసరిహద్దునొద్ద బొంబాయి రాజధానిలోఁ గలసినవి. ఇది యిప్పుడు కన్నడదేశము. కృష్ణయు భీమయు నైజామురాష్ట్రమునందు రాయచూర్ పట్టణమునకుఁ బశ్చిమమునఁ బదాఱుమైళ్లమీఁదఁ గలసినవి. ఇది తెలుఁగుదేశ మని చెప్ప వచ్చును. కావున నీకవినివాసస్థలము నైజామురాజ్యమునం దుండె నని మన మూహింపవచ్చును. శ్రీకాకుళపు-ఆంధ్ర విష్ణువు (దేవుఁడు) వీరికిఁ గులదైవము కావచ్చును.

ఈకవి 'రసార్ణవము'నందుఁ దనకాల మిట్లు వ్రాసికొన్నాఁడు:

శా. జా నొందన్ శకవర్షముల్ బుధశరజ్వాలేందులై యొప్పు న
వ్యానందాబ్దమునందు మాఘమునఁ గృష్ణైకాదశీ భౌమ యు
క్తానామామృతవేళ నీకృతి యనంతాఖ్యుండు సమ్యగ్రస
శ్రీ నిండన్ ధ్రువపట్టణాధిపున కిచ్చెన్ భక్తిపూర్వంబుగన్.

శా. శ. ౧౨౫౬ ఆనందనామసంవత్సర మాఘ బహుళ ౧౧ మంగళవార మనఁగా క్రీ. శ. ౧౩౩౫ జనవరి ౨౫-వ తేదీ యగును. కావున నీకవి పదునాలవశతాబ్దిమధ్యమునం దున్నవాఁ డని నిశ్చ యింపవచ్చును.

ఈ కవిచే రచింపఁబడిన మూఁడుగ్రంథములును దేవాంకిత ములు గనుక నింతకంటె విశేషము లేవియు మన మీకవినిగుఱించి తెలిసికొనుటకు వీలు లేదు. ఇఁక నేతద్రచిత గ్రంథములనుగుఱించి విచారింతము.

భోజరాజీయము రచించినతరువాత ఛందస్సు రచించినట్లు ఛందస్సుయొక్క నాల్గవయాశ్వాసమునందుఁ గవి భోజరాజీయమును జేర్కొనుటవలనఁ దెలియుచున్నది. భోజరాజీయ మేడాశ్వాసములు గల మంచి ప్రబంధము. అహోబలనృసింహస్వామి కంకితము. ఇందు భోజరాజునుగూర్చిన వింతయైన కథలు పెక్కు కలవు. ఈకావ్య మును ౧౮౭౪-లో శ్రీ వీరేశలింగముగారు ముద్రించినారు. వారు దాని పీఠికలో నీప్రబంధమునుగుఱించి యిట్లు వ్రాసినారు:—

'ఈతనికవిత్వము సలక్షణ మయి యనర్గళధార గలదియై మనోహరముగ నుండును. కవిత్వమాత్రమే కాక భోజరాజీయము నందలి కథలును మిక్కిలి యింపుగా నుండును. కవిత్రయమువారి ప్రయోగములకంటె భిన్నము లైన ప్రయోగము లీభోజరాజీయము నందుఁ గొన్ని కానవచ్చుచున్నను మొత్తముమీఁద నిందలికవిత్వము నిర్దుష్ట మయి శ్లాఘ్యముగ నున్నది.'

ఈ కవికిఁ దిక్కనసోమయాజిని అనుకరింపవలె నన్న యభి లాష మెండుగ నున్న ట్లీకావ్యమువలనఁ గానవచ్చుచున్నది. ఒక్క యుదాహరణ మిచ్చెదము. నిర్వచనోత్తరరామాయణమునందుఁ దిక్కన తాను కావ్యము వ్రాయుట కిట్లు కారణము వ్రాసెను.

1. 'ఆంధ్రవల్లభహరిసేవ నలరుచుండు' ననఁగా నీతఁ డాంధ్రరాయనియొద్ద నుద్యోగిగా నుండెనని కొంద ఱర్థముచేసికొనిరి. కాని యది పొరపాటు. 'ఆంధ్రవల్లభహరి' యనఁగా నాంధ్రవిష్ణువు; శ్రీకాకుళములోనిదేవుఁడు. అతని సేవచేయుట యనఁగా నతనిని భక్తితో భజించుట. గ్రామమునం దేదేవుఁ డుండునో ఆదేవుని తద్గ్రామాధిపతిగాఁ జెప్పుట భక్తులయాచారముగా నున్నది. ఇట్లే యీకవియొక్క 'రసార్ణవ'మందలి 'శ్రీ నిండన్ ధ్రువపట్టణాధిపున కిచ్చెన్ భక్తిపూర్వంబుగన్' అన్న చరణముఁ జూచి కొంద ఱీ గ్రంథమును ధ్రువపట్టణపురాజున కిచ్చె నని భ్రమ పడుచున్నారు. అచ్చటను ధ్రువపట్టణాధిపుఁ డనఁగా ధ్రువపట్టణపుదేవుఁ డని యర్థము. ఈకవి తనగ్రంథ మేదియు నరాంకితము చేయలేదు.

sampath_Ebooks

రాజ్యమునకు వచ్చెను. ఈతనితరువాత రాజ్యమేలిన అనవేమారెడ్డి ఈతనితమ్ముఁడు; కొమరగిరిరెడ్డి ఈతని కుమారుఁడు. రాజమహేంద్రవరమునఁ బ్రభుత్వము చేసిన కాటయవేమారెడ్డి యీతనికి నల్లుఁడు, మేనల్లుఁడు. శాసనములనుబట్టి చూడఁగా ఈతఁడు ౧౩౫౦ మొదలు ౧౩౬౧ వఱకుఁ బన్నెండుసంవత్సరములు రాజ్యము చేసినట్లు కానవచ్చుచున్నది[1].

ప్రోలయవేమని హరివంశమును కృతినొందుటకు నీతఁడు పెద్దవాఁడై సైన్యాధిపతిగ నుండెనని హరివంశమందలి యీ క్రిందిపద్యమువలనఁ గానవచ్చుచున్నది:—

శా. వేమక్ష్మాధిపుహస్తి పుత్త్రుఁడు పయోవిక్రాంత యానవ్యాజతే
జోమార్తాండుఁడు కీర్తనీయగుణస్తోముండు గాలం జేమియుక్
రామన్యాత్ర్రికి లొంగ్గుగాక సరియై రాజిల్లె రాజాన్వీకం
డాముప్యాయనాఁ డేఁడుఁ బోతయ వనూసాన్ద్రయరుం డిప్తుహిన్.

ఈ యనపోతారెడ్డి కృష్ణానదియొడ్డున అమరావతీసమీపమునందు 'కేసరా'జనువానితోఁ బోరాడి యాతనిని ఓడించినట్లును, అతని యాస్థానమందు వెన్నెలకంటివారు కవు లుండినట్లును, వారిచే నతఁడు కృపు లందినట్లును వెన్నెలకంటి సూరన్నచే రచింపఁబడిన విష్ణుపురాణమునందలి యీ క్రిందిపద్యమువలనఁ దెలియుచున్నది:—

ఉ. ఈ నిఖిలంబు మెచ్చ నమరేశ్వరదేవుఁడు చూడఁ గృష్ణవే
ణీనది సాక్షిగా ననికి నిల్చిన రావుసుఁ గేసభూవిభుం
గానకుఁ దోలి వెన్నడిచి కాచిన వేమయయన్నపోతభూ
జానికి సత్ప్రబంధము లొసంగిన వెన్నెలకంటివారిలోన్.

ఈతనియొద్ద వేమన అనువాఁడు మంత్రిగ నున్నట్టు అమరావతిలోని యొకశాసనమువలనఁ దెలియుచున్నది. ఈ మంత్రితండ్రి పేరు మల్లినాయఁడు. ఈతఁడు ధాన్యవాటి (ధరణికోట, అమరావతి) లోని అమరేశ్వరుని మరలఁ బ్రతిష్ఠించెను. ఇది ౧౩౬౧ లోనిశాసనము[2].

ఈతనిరాజ్యకాలమందు దేశాంతరములనుండియు, ద్వీపాంతరములనుండియు వర్తకు లీతనిరాజ్యమునకు వచ్చుచున్నట్లును, ఎగుమతి దిగుమతివ్యాపార మెక్కువగ జరుగుచున్నట్లును కానవచ్చుచున్నది. బాపట్లతాలూకాలో మోటుపల్లి యను రేవుగ్రామము కలదు. అది కాకతీయులకాలమునుండియు సముద్రవర్తకమునకుఁ బేరొందినరేవు[3]. అచ్చట వీరభద్రస్వామిదేవాలయపు మండపమందలి యొకస్తంభము మీఁద అనపోతారెడ్డిశాసన మొకటి శా. శ. ౧౨౮౦ (క్రీ. శ. ౧౩౫౮) లో వేయించినది కలదు[4]. అది సంస్కృతము, తెలుఁగు, అఱవము అను మూఁడు భాషలలో నున్నది. అఱవవర్తకులు పెక్కుమంది అఱవదేశమునుండియు, సింహళమునుండియు వచ్చుచుండుటచేత శాసనము అఱవభాషయందుఁగూడ వ్రాయఁబడిన దని తోఁచుచున్నది. అంతకుఁ బూర్వము వర్తకులకుఁ గల యిబ్బందులను ఈ రాజు తొలఁగించి వర్తకము అప్రతిబద్ధముగ జరుగునట్లు చేసెను. మోటుపల్లిలోఁ గాపురముండు పరదేశీయులగు వర్తకులు నానాదేశములతోను, ద్వీపములతోను వర్తకముచేయుచుండువారు అనేకు లుండిరి. ఈరాజునకుఁ బూర్వము ఇట్టివర్తకులకు నిష్టము వచ్చినప్పుడు మోటుపల్లికి వచ్చుటకును, ఇష్టము వచ్చినప్పుడు అచ్చటినుండి వెడలుటకును వీలు లేకయుండెను. అధికారులసెలవు పుచ్చుకొని గాని ఆగ్రామమునకు వారు వచ్చుటకు, అచ్చటినుండి వెడలుటకు వీలు లేదు. ఈ వర్తకులు అప్పుడప్పుడు పెక్కు మొత్తము చెల్లింపవలసియుండెను. ఈ యిబ్బందులను తీసివేసి అనపోతారెడ్డి యీ ద్వీపాంతరవ్యాపారులకు స్వాతంత్ర్యము నొసఁగెను. ప్రత్తిగఁ గాపురము వచ్చువారికి నుండుటకు నివేశనస్థలములను, వ్యవసాయమునకు భూమియు నిచ్చుచుండెను. ఈశాసనానుసారముగ వర్తకులు తమవీలు ననుసరించి రావచ్చును, పోవచ్చును. తనకు నిష్టమున్నవారికి నిష్టమున్నంతధరకు సరకుల నమ్మవచ్చును. సరకులు మఱియొకద్వీపమునకుఁ గొంపోవచ్చును. ఎవనిసరకులను దొరతనమువారయుద్యోగస్థులు పడవేసి పెట్టుఁగూడదు. ఇట్లు ఈరాజు పదునాల్గవశతాబ్దియందు నొకవిధమైన అప్రతిబద్ధవ్యాపారతత్త్వమును (Principle of Free - trade) స్థాపించె నని చెప్పవచ్చును. అధికారులు వర్తకులను బాధపెట్టి సుంకము ఎక్కువ తీసికొనకుండ సుంకము తీసికొనవలసిన రీతి యేర్పఱచెను. ఇంతకంటె నెక్కుడు తీసికొనఁగూడ దనియు శాసింపఁబడియున్నది. ఇట్లు ఆకాలమందు తెలుఁగుదేశము వారు ద్వీపాంతరములతో నవ్యాహతముగ వర్తకము చేయుచుండిరనియు, ఇతరదేశములనుండి వచ్చు వర్తకులకుఁగూడ నన్యాయము జరగఁగూడ దని తగిన నియమములను అప్పటిరాజులు చేయుచుండిరనియు స్పష్టముగఁ దెలియుచున్నది. ఈశాసనము రాజునాజ్ఞచే నాతని అమాత్యుఁడైన సోమమంత్రీశ్వరునిచే వేయఁబడెను.

1. కొండవీటిరెడ్ల ప్రభుత్వకాల మింకను నిశ్చయముగ నిర్ణయము కాలేదు; రెండుమూఁడు సంవత్సరములు హెచ్చుతగ్గుగ తేలిన దనవచ్చును. ఇంకను క్రొత్తక్రొత్తశాసనములు వెలువడినకొలఁదియు ఈ హెచ్చుతగ్గులు సరికాఁగలవు.

2. L. R., Vol. 38. p. 28 and Ep. Coll., no. 258 of 1897.

3. Ep. Coll., no. 600 of 1909.

4. Ep. Coll., nos. 601 and 602 of 1909

ఇందు ౬౦౧ అఱవశాసనము, ౬౦౨ తెలుఁగుశాసనము. తెలుఁగు శాసనమునకంటె నఱవశాసనమునందు సుంకముల వివర మధికముఁ గలదు. మోటుపల్లిలోని అఱవశాసనము, తెలుఁగుశాసనముల నకళ్లు పంపినందులకు దొరతనమువారిశాసనశోధనశాఖకు నధ్యక్షు లగు బ్రహ్మశ్రీ రావుసాహేబు హెచ్. కృష్ణశాస్త్రిగారికి కృతజ్ఞుఁడను.—కూ. సం.

సమాచార సంఖ్య 18078
తేది 25.10.65
sampath Ebooks

అనపోతారెడ్డికి దొడ్డాంబిక యను తోఁబుట్టు వుండెను. ఆమెను కాటయరెడ్డి కిచ్చిరి. వారిరువురికిఁ బుట్టినవాఁడు కాటయవేమన. ఈతనికే అనపోతారెడ్డి తనకూఁతురైన మల్లాంబిక నిచ్చెను[1]. ఇతనికిఁ గుమారగిరిరెడ్డి యను కుమారుఁ డుండెను.

'అనపోతానాయని తమ్ముఁడైన మాదానాయఁడు దన్నాల కోటయొద్ద ననవేమారెడ్డి బంధువైన యనపోతారెడ్డితో యుద్ధము చేసి యతనిఁ బలిమి జయమును బొందెను' అని వెలుగోటివారిచరిత్రలో నున్నది కాని దీనికి నచ్చట నేమియు నాధారము చూపఁబడలేదు.

సంస్కృతశాసనములందును, తెలుఁగుశాసనములందును ఈతని పేరు అనవోత, అన్నపోత, అంనవోత అని వచ్చునే కాని 'అనపోత' అని ఉండదు.

(కో. వేం. ల.)

**అనబాప్టిస్టులు** — క్రైస్తవులతెగలలో అనబాప్టిస్టులనువా రొకరు. చిన్నతనముననే పరిశుద్ధస్నానము (Baptism) నిచ్చుపద్ధతిని వీ రొప్పుకొనరు. అందుచేత తమసిద్ధాంతముల నంగీకరించి తమలో చేరఁదలఁచువారికి చిన్నతనమున పరిశుద్ధస్నానము నొందిన క్రైస్తవులైనను సరే, మరల సంస్కారము గావించుచుండిరి. ఈసిద్ధాంతమును మొదట ప్రచారములోనికిఁ దెచ్చినవాఁడు నికొలస్ స్టార్చ్ అనునతఁడు. తరువాత క్రైస్తవులకును, వీరికిని ఎన్నియో వాదోపవాదములు, పోరాటములు జరిగినవి. నేఁడు అనబాప్టిస్టులను పేరే యెచటను వినరాదు. బాప్టిస్టు లనఁబడువా రిప్పటికిని కలరు. కాని వీరికి అనబాప్టిస్టులతో నెట్టిసంబంధమును లేదు. రెండవసారి సంస్కారము చేయుపద్ధతిని వీ రొప్పుకొనరు.

**అనమనపూఁడి** — కృష్ణాజిల్లా గుడివాడతాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౬౨౧ (౧౯౩౧).

**అనమనమూరు** — గుంటూరుజిల్లా ఒంగోలుతాలూకాయందలి ఈనాంగ్రామము. జనసంఖ్య ౧,౦౪౯ (౧౯౩౧).

**అనమసముద్రము** — నెల్లూరుజిల్లా ఆత్మకూరుతాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౧,౩౯౯ (౧౯౩౧).

**అనమసముద్రముపేట** — నెల్లూరుజిల్లా ఆత్మకూరుతాలూకాలోని యొకపల్లె. జనసంఖ్య ౧,౦౨౦ (౧౯౩౧). ఇచ్చట ఖాజా రహీముతుల్లా సాహెబ్ అనువానిచే ౧౬౦ సంవత్సరములకు మున్ను కట్టింపఁబడిన సుప్రసిద్ధమగు మసీదు కలదు. ఈమసీదునకు ౮ గ్రామముల ఈనాము కలదు. ఇచ్చట జూలైమాసమున పెద్ద ఉరుసు (ఉత్సవము) జరుగును.

**అనమిత్రుఁడు** — ౧. (సూ. వం.) నిఘ్నునిపుత్రుఁడు.

౨. (చం. వం.) యదుకులోత్పన్నుఁడైన వృష్ణియొక్క యిద్దఱుపుత్రులలో రెండవవాఁడు. నిఘ్న, శిని, వృష్ణి యనువా రతనిపుత్రులు.

**అనరణ్యుఁడు** — ౧. (సూ. వం.) ఇక్ష్వాకువంశజుఁడగు పురుకుత్సునిమనుమఁడు. త్రసదస్యుని రెండవకుమారుఁడు. ఇతనికి హర్యశ్వుఁడు, బృహదశ్వుఁడు అను ఇద్దఱు పుత్రులు కలరు. ఇతఁడు అయోధ్యలో రాజ్యము చేయుచుండఁగా లంకాధిపతియైన రావణుఁడు దిగ్విజయార్థమై వచ్చి యాతనిని ఓడించెను. యుద్ధమునందుఁ గూలి యాతఁడు ప్రాణములు విడుచుచు 'నావంశమునందు జన్మించినవాని చేతనే నీవును, నీవంశమును నాశముఁ జెందుదురుగాక' మని శాపమొసఁగెను (వా. రా., ఉత్తర., స. ౧౯).

౨. (సూ. వం.) ఇక్ష్వాకుకులోత్పన్నుఁడైన ఋతుపర్ణునిపౌత్రుఁడగు సర్వకాముని (సర్వకర్ముని) యిద్దఱుపుత్రులలోఁ బెద్దవాఁడు. ఇతని కొడుకు నిఘ్నుఁడు.

**అనర్కచతుర్దశి** — కార్తికశుద్ధచతుర్దశి అనర్కచతుర్దశి యనఁబడును. ఈనాఁడు హనుమంతుని జన్మదినము. రామభక్తులెందఱో యీనాఁడు మహోత్సవము లొనర్తురు.

**అనర్ఘరాఘవము** — మురారి యను కవిచే రచింపఁబడిన సంస్కృతనాటకము. సంస్కృతవాఙ్మయమునందు కాళిదాస, భవభూతులకుఁ గల గౌరవము ఈకవికి లేకపోయినను, ఈతఁడు రెండవతరగతికవులలో నొకఁడుగఁ బరిగణింపఁబడు నని చెప్పవచ్చును. ఇతనిది మౌద్గల్యగోత్రము. భట్టశ్రీవర్ధమానుఁ డనుమహాకవి యీతనితండ్రి, తంతుమతి ఈయనతల్లి. ఈసంగతు లీతని నాటకమునందలి ప్రస్తావనలోఁ జెప్పఁబడియున్నవి[2]. ఈతనిది ఏదేశమో తెలియదు. కాని కావ్యమాలలో నీ నాటకమును అచ్చువేసినవారు 'దీనికి కాశ్మీరమునందు నెక్కుడు ప్రచారము కల' దని వ్రాసినారు. అందుచే నీకవి యాదేశమువాఁడేమో యని కొందఱనుకొనిరి. కాని నాకుఁ జూడ నీకవి యాంధ్రదేశమువాఁడేమో యని సంశయము తోఁచుచున్నది. ఎందు కనఁగా, ఈనాటకమునందు ఏడవయంకములో, శ్రీరామాదులు రావణసంహారానంతరము పుష్పకవిమాన మెక్కి అయోధ్యకు వెళ్లుచుండఁగా క్రిందఁ గానవచ్చిన కొన్నిదేశములను, పట్టణములను, క్షేత్రములను వర్ణించునట్టిసందర్భమునఁ గవి ఆంధ్రదేశమందలి భీమేశ్వరుని నిట్లు వర్ణించియున్నాఁడు :—

1. Epigraphia Indica, Vol. IV, p. 328.
2. 'అస్తి మౌద్గల్యగోత్రసంభవస్య మహాకవే ర్భట్ట శ్రీ వర్ధమానతనూజన్మన స్తన్తుమతీనన్దనస్య మురారేః కృతి రభినవ మనర్ఘరాఘవం నామ నాటకమ్.'

sampath_Ebooks

విభీషణః :— (దక్షిణతో దర్శయన్) దేవ, ప్రణమ్యతామయ మస్మద్విషయాలఙ్కారః సప్తగోదావరీహారకలాపైకనాయకో భగవాన్భీమేశ్వరః.

[ అర్థము : విభీషణుఁడు :— (దక్షిణమువైపు చూపి) దేవా! అంధ్రదేశలక్ష్మికిఁ గల యేడుగోదావరు లనుహారసమూహములకు నొక్క నాయకమణి యను శోభగకరుండు నైన భీమేశ్వరునకుఁ బ్రణామము చేయుఁడీ ].

దీనితరువాత, నీవిభీషణునిమాట నొకపద్యమును, శ్రీరాముని నోట రెండుపద్యములును భీమేశ్వరునిస్తుతిపరములు కలవు. వానితో మనకుఁ బనిలేదు. కాని పైని యీయఁబడిన 'అస్మద్విషయము', 'సప్తగోదావరి', 'భీమేశ్వరుఁడు' అనుపదములును, హిందూదేశము నందు విశేషఖ్యాతిలేని భీమేశ్వరక్షేత్రమును (దాక్షారామము) వర్ణించుటయుఁ జూచి నీకవి యాంధ్రుఁ డనియు, ఆదేశమందలి యభిమానముచేత ననుప్రాసద్యోతకముగా భీమేశ్వరునకు శ్రీరామునిచే నంజలము పెట్టించె ననియు నూహింపఁదగియున్నది.

కాని యీ ప్రకరణమునందే భీమేశ్వరునకుఁ బూర్వము మహారాష్ట్రాంతర్గత మైన విదర్భలోనికుండినపురమును, తరువాత ద్రవిడదేశమందలి కాంచీనగరమును వర్ణించియున్నాఁడు. కావున 'యీకవి ఆయాదేశములందుఁ జనినవాఁడై చెప్పవలసియుండును' అని కొందఱు తలంచుచున్నను. కాని అట్లనుట సరికాదు. కుండిన పురము, కాంచీనగరము భరతఖండఖ్యాతిగల పట్టణములు. కవి యెచ్చటివాఁ డైనను ఆపట్టణనామములను ఎఱిఁగియుండును. దాక్షారామము అట్టి భరతఖండఖ్యాతిగల క్షేత్రము కాదు. దానికి తెలుఁగు దేశమందుమాత్రము ఖ్యాతి గలదు. ఆఖ్యాతికిని రెండువందల యేండ్లకంటె నెక్కుడు వ్యాప్తి లేదు. తెలుఁగువాఁ డైనఁ గాని సాధారణముగ నీ క్షేత్రమును ఎఱిఁగియుండఁడు. ఒకవేళ నవరి యెఱిఁగినను కాంచీపట్టణమందలి యేకామ్రనాథునితో సమానముగ నీభీమేశ్వరుని నాటకమునందుఁ జేర్ప నగు నని యాతని కేల బుద్ధి పుట్టును?

ఈ కవికాలము నిశ్చయముగఁ దెలియదు. కొందఱు నీతఁడు తొమ్మిదవశతాబ్దికిఁ బూర్వుఁ డనిరి[1]. కొందఱు ఈతఁడు అర్వాచీనుఁ డని తలంచుచున్నారు.

'అనర్ఘరాఘవ' మను నాటకమునందు రామాయణీయకథ సంక్షేపముగఁ గలదు. అనర్ఘ మనఁగా అమూల్యము, పూజ్యము, దుర్లభము. పూజ్యుఁ డైన రాఘవునికథ కలది గనుక అనర్ఘరాఘవ మయ్యె. విశ్వామిత్రుఁడు వచ్చి రామునిఁ దీసికొనిపోవు కథాప్రసంగము మొదలు శ్రీరామునిపట్టాభిషేకమువఱకుఁ గల శ్రీరామకథ యేడంకములలో ఈనాటకమునందు వర్ణింపఁబడినది. కథ పెద్దదియు, నాటకము చిన్నదియు నగుటచే, పెక్కు కథావిశేషములు రంగము మీఁదఁ జూపుటకు వీలులేక, విష్కంభకాదులలోఁ బాత్రలచేఁ జెప్పింపఁబడినవి. ప్రథమాంకమునందు విశ్వామిత్రుఁడు దశరథుని యొద్దకు వచ్చుట, రామలక్ష్మణులను గొనిపోవుట, ద్వితీయాంకమునందు రామలక్ష్మణులు విశ్వామిత్రయజ్ఞమును రక్షించి రాక్షసులను శిక్షించుట, తృతీయాంకమునందు రాముఁడు శివధనుస్సును ద్రుంచుట, చతుర్థాంకమునందు పరశురామునిసత్త్వము హరించుట, పంచమాంకమునందు వాలివధ, సుగ్రీవాభిషేకము, షష్ఠాంకమునందు రావణవధ, సప్తమాంకమునందు శ్రీరామాదులు పుష్పకవిమానము నెక్కి అయోధ్యకు వెళ్లుచు క్రిందఁ గానవచ్చు పట్టణాదుల వర్ణించుట, పట్టాభిషేకమును వర్ణింపఁబడినవి. ఇందు రామవనవాసాదులు, సీతాపహరణము మొదలయిన రామాయణీయముఖ్యప్రసంగములసంవిధానకము ఈప్రకారము మార్పఁబడినది :—

సీరధ్వజజనకునియింటఁ బెరుఁగుచున్న అయోనిజయగు సీతను తన కిమ్మని యడుగుటకు రావణుఁడు తనపురోహితుఁడైన శౌష్కలుని జనకునియొద్దకుఁ బంపును. అతఁడు విఫలమనోరథుఁ డగును. అంత సీతను హరించుట యెట్లన్న యాలోచన రావణునిమాతామహుఁడును, మంత్రియు నగు మాల్యవంతునకుఁ గలిగి, రాముని మిథిలలోఁ గాని, అయోధ్యలోఁ గాని ఓడించి సీతను దెచ్చుట యసంభవము గాన సీతారాము లరణ్యమునకు వచ్చినప్పుడు అచ్చట రాముని మోసపుచ్చి సీతను అపహరింపవచ్చు నని యతఁడు నిశ్చయించెను.

ఇంతకుఁ బూర్వమే సుగ్రీవునిసాహాయ్యార్థము శ్రీరాముని నరణ్యమునకు రప్పించుటకుఁ గాను సంపాతి శబరిని పంపె నని యాతఁడు వినియుండెను. శబరి వెళ్లి కైకదాసి యగు మంథరశరీరమునఁ బ్రవేశించి దానిచే కైకయికి దుర్బోధ చేయించెను. అందు మీఁద రాము నరణ్యమున కంపుఁ డనియు, భరతునికి రాజ్యము గట్టుఁ డనియు కైక దశరథుని వరము లడిగెను. ఇట్లు సీతారామలక్ష్మణు లరణ్యమునకు వెళ్లుట సంభవించినది.

ఈనాటకమున ప్రథమాంకమునందలి దశరథ,విశ్వామిత్రసంభాషణంబును, చతుర్థాంకమునందలి శ్రీరామ, పరశురామ సంవాదంబును, సప్తమాంకమందలి నానాదేశాదివర్ణనలును రమ్యముగ నున్నవి. ఈ నాటకమును కీర్తిశేషులయిన అకుండి వ్యాసమూర్తిశాస్త్రిలుగా రాంధ్రీకరించియున్నారు.

**అనర్వుఁడు** — వృత్రాసురుని సేవకులలో నొక్కఁడు.

**అనల** — ౧. రోహిణియొక్క యిద్దఱు కన్యలలో రెండవది. ఈమెకు శుకి యను కన్య కలదు.

౨. మాల్యవంతుఁడను రాక్షసునకు సుందరియను భార్యయందుఁ బుట్టిన కన్నియ. విశ్వావసురాక్షసునిభార్య. కూఁతురు కుంభీనసి (వా. రా., ఉత్తర., స. ౬౧).

1. కావ్యమాల, అనర్ఘరాఘవమ్, ౧-వ పుటక్రింది టిప్పణి చూడుఁడు.

sampath_Ebooks

**అనలుఁడు** — ౧. ఒకవసువు. ఇతనికిఁ గుమాళ్లు కుమార, శాఖ, విశాఖ, నైగమేయు లని నలుగురు. ఈ మన్వంతరమునం దితఁడు ఆగ్నేయదిక్కునకు నధిపతి.

౨. రాక్షసుఁడు. మాలి కొడుకు. విభీషణుని నలుగురుమంత్రులలో నొక్కఁడు.

౩. కుశుని వంశజుఁ డగు నిమగ్నునికొడుకు కొడుకు.

**అనలులు** — దేవతాభేదము. వీరు నలువదితొమ్మండ్రుగురు. వారిలో మొదటివాఁడు అభిమానుఁడు. వీనికి పావక, పవమాన, శుచు లను ముగ్గురు కొడుకులు. వారి కొడుకులు నలువదియైదుగురు.

**అనవద్య** — కశ్యపునకును, ప్రాధకును బుట్టినయప్సరసలలో నొక్కతె.

**అనవలోభనము** — ద్విజులకు విధింపఁబడిన షోడశకర్మలలో నిది యొకటి. గర్భిణిగా నున్న స్త్రీ పొందవలసినసంస్కార మిది. గర్భముఁ దాల్చినతరువాత మూఁడవనెలలో నీసంస్కారము జరుపఁబడును (స అనవలుప్యతే గర్భః అనేన). ఈసంస్కారమునకు ముఖ్యాంగము: శక్యగంధ మనునొకమూలికరసమును గర్భిణి యగు స్త్రీభర్త యామె నాసికముక్కులోఁ బోయుట. ఈసంసేవనమువలన గర్భపాతము మున్నగునాపద లేవియు జరుగ వని మనవారినమ్మకము.

**అనవేమారెడ్డి** — కొండవీటిలోఁ బ్రభుత్వము చేసిన రెడ్డిరాజులలో మూఁడవవాఁడు. ప్రోలయరెడ్డియొక్క రెండవ కుమారుఁడు; అనపోతారెడ్డికిఁ దమ్ముఁడు. ఈతనికి అనవేమ, అన్నవేమ అను రెండు పేళ్లును కలవు. శాసనములనుబట్టి చూడఁగా నీతఁడు అనపోతారెడ్డితరువాత రాజ్యమునకు వచ్చి క్రీ. శ. ౧౩౬౪ మొదలు ౧౩౮౬ వఱకును రాజ్యము చేసినట్లు కానవచ్చుచున్నది. ఈతఁడే రాజధానిని కొండవీటికి మార్చినట్లు కనఁబడుచున్నది. ఈతనితండ్రి యైన ప్రోలయవేమనకు 'అన్నమవేముఁ' డన్న పే రున్నందునను, ఈవంశమునందుఁ బెక్కురు 'వేమన' లున్నందునను పెక్కురు చరిత్రకారులు ఈతండ్రికుమారులలో విభేదము చేయలేకయు, నితర 'వేమన' లకును వీరికిని భేదము చేయలేకయు నొకరిని మఱియొకరినిగాఁ దలఁచి కాల, పురుషవిపర్యాసములఁ జేసిరి.

మొట్టమొదట కొండవీటిలో రాజ్యము చేసిన రెడ్డి అన్నమప్రోలయలకుఁ గుమారుఁ డైన వేమారెడ్డి. ఇతఁ డన్నమకుమారుఁ డైనందున హరివంశము మొదటిపద్యమునందే యీతనిని ఎఱ్ఱాప్రెగడ 'అన్నమవేముఁ' డనియెను. ఇంతేకాని యీతఁడు అనవేముఁడు కాఁడు. ఇతనిని గుర్తుకొఱకు సాధారణముగ ప్రోలయవేముఁ డందురు. అనపోత, అనవేము లని ఈతని కిద్దఱు కుమారులు. వీరు క్రమముగ కొండవీటిరాజ్యమును పాలించిరి.

ఎఱ్ఱాప్రెగడ హరివంశము వ్రాసి ప్రోలయవేమారెడ్డి కంకితము చేసినకాలమందు అనవేమారెడ్డి పుట్టినట్లు కనఁబడదు; లేదా మిక్కిలి పసివాఁడుగ నైనను ఉండవలెను. ఎందుకన, ఎఱ్ఱాప్రెగడ ప్రోలయవేముని పెద్దకుమారుఁ డైన అనపోతని వర్ణించి, అనవేముని పేరొక్కనక, యీతనిపెత్తండ్రి కుమారుఁ డైన కోమటిని వర్ణించి యున్నాఁడు.

ఆంధ్రనైషధమును కృతి నొందిన మామిడి సింగన్నకుఁ దండ్రి యైన మామిడిపెద్దన్న అనవేమారెడ్డికి మంత్రిగ నున్నట్లు ఆంధ్రనైషధమునందలి ఈక్రిందిపద్యమువలనఁ దెలియుచున్నది.

మ. అనతారాతివసుంధరారమణసప్తాంగాపహారక్రియా
ఘనసంరంభవిజృంభమాణపటుదోఃఖడ్గద్వితీయాగ్రజుం
డనవేమాధిపరాజ్యభారభరణవ్యాపారసంశీలనా
ప్రధానమంత్రీశుఁడు మామిడన్న సుగుణుం డైశ్వర్యరూఢిం జెప్పఁగాన్.

అనవేమారెడ్డిపేరు తెలుఁగుదేశమునందు విశేషముగ, నితర రెడ్డిరాజులకంటెను నెక్కుడుగఁ గీర్తింపఁబడెను. ఈతనిరాజ్యము ఉత్తరమున సింహాచలమువఱకును, దక్షిణమున కంచివఱకును, తూర్పున సముద్రమువఱకును, పశ్చిమమున శ్రీశైలమువఱకును వ్యాపించినట్లు కానవచ్చును. గోదావరిజిల్లాయందలి కోనసీమలోనిపల్లెపురములో నీతనిశాసన మొకటి కలదు[1]. అది శా. శ. ౧౨౯౬ (క్రీ. శ. ౧౩౭౪) లోనిది. తనచెల్లె లైన వేమసానియొక్క పుణ్యార్థమై యీతఁడు బ్రాహ్మణునకు నగ్రహార మిచ్చెను. గోదావరిజిల్లా అమలాపురంతాలూకాలోని వానపల్లిలో అనవేమునిమఱియొకశాసనము దొరకినది[2]. అది శా. శ. ౧౩౦౦ (క్రీ. శ. ౧౩౭౮ - ౭౯) లోనిది. అనవేముఁడిమ్మడీంద్రుఁ డను మంత్రివరునకు నగ్రహార మిచ్చెను. ఈయిమ్మడీంద్రుఁ డప్పటికాలమున రాజకీయవ్యవహారములలో నారితేరినవాఁడుగఁ గన్పట్టుచున్నాఁడు. 'రాజులకు హితోపదేశము చేయుటయందు మిత్రుఁడు' అని యీతఁడు పొగడ్తఁగనియె. శ్రీశైలముమీఁద అనవేముని శిలాశాసన మొకటి కలదు[3]. దానినిబట్టి చూడ నతఁడు శ్రీశైలమునందు 'వీరశిరోమండపము' తన పినతండ్రి యైన అన్నయరెడ్డి గౌరవమునకై కట్టించినట్టును, రాజమహేంద్రాదిస్థలదుర్గముల ననేకములఁ బట్టుకొన్నట్టును, ఈతనిది పెల్లిచేరి గోత్ర మైనట్టును తెలియుచున్నది. ఈశాసనము శా. శ. ౧౨౯౯ (క్రీ. శ. ౧౩౭౭ - ౭౮) లోనిది. ఈశాసనము వ్రాసినవాఁడు బాల

---

1. Epigraphia Indica, Vol. III, p. 286.
2. Ibid, Vol. III, p. 59. ఇది ౧౩౭౦ లోని శాసన మని శంకర బాలకృష్ణ దీక్షితులవారి యభిప్రాయము.
3. Epigraphical Reports, 1914—15, p. 115.

sampath_Ebooks

సరస్వతి. ఈతఁడు తూర్పుసముద్రమున కంతకును ప్రభు వైనట్టు కూడ నిందు వ్రాయఁబడినది. ఇందువలన నితనికాలమందు సముద్ర పర్యంతము నెంతయు నుండె నని మన మూహింపవచ్చును. ఈతని శాసనములలో 'వసంతరాయ', 'కస్తురికాసహాయ', 'జగనొబ్బగండ' మొదలయిన బిరుదులు ఈతని కున్నట్లు వ్రాయఁబడినది.

ఏ శాసనమువలనఁ గాని, ఏ గ్రంథమువలనఁ గాని యీతనికిఁ బుత్రుఁ డున్నట్టు కానరాదు. కాని శ్రీనాథుఁ డీతనికి నొకపాత్రి (పుత్త్రిసమానురాలు) యున్నట్టును, ఆమెను అల్లాడరెడ్డి (కాశీఖండము కృతి నొందిన వీరభద్రారెడ్డియొక్క తండ్రి) పెండ్లాడినట్టును కాశీఖండమందలి యీక్రిందిపద్యములోఁ జెప్పియున్నాఁడు.

మ. అనవేమక్షితిపాలపౌత్రి యగు వేమాంబామహాదేవికిన్
ఘనుఁ డయ్యల్లడభూమిపాలునకు సంగ్రామస్థలీగాండివుల్
తనయుల్ వేమవిభుండు వీరవసుధాధ్యక్షుండు నౌ ద్దప్రభుం
డును నన్నయ్యయు బాహువిక్రమకళాటోపప్రతాపోద్ధతుల్.

దీనినిబట్టి మాత్రమె అనవేమారెడ్డికి నొకకుమారుఁ డుండె ననియు, ఆ కుమారుని కొకబిడ్డ యుండె ననియు మన మూహింపవలెను. కాని యీపద్యమందలి 'పౌత్రి' పదము 'పొరపాటు, దౌహిత్రుఁ డని కవితాత్పర్యము' అని చెప్పుచు నందులకు శ్రీచిలుకూరి వీరభద్రరావుగారు లిట్లు వ్రాసియున్నారు: 'ఈ పైపద్యమందలి పౌత్రి యనుశబ్దమునకు దౌహిత్రి (పుత్త్రికా పుత్రి) యని యర్థము గ్రహింపవలయును. అల్లాడ దొడ్డభూపాలున కంకితము గావింపఁబడిన శివలీలావిలాసమునఁ గొమ్మనామాత్యకవి యల్లాడరెడ్డి నిట్లు వర్ణించెను.

మ. భరితశ్రీనిధి యన్నహీరమణుఁ డొప్పన్ జోళభక్తిక్షితీ
శ్వరసూనుం డగు భీమలింగమనుజేశశ్రేష్ఠసత్పుత్రి భా
స్వరకారుణ్యపశాజనావనవిధాసంధాత్రి వేమాంబికన్
వరియించెం బతిభక్తి గౌరవధృఢన్యాపారనిత్యాంబికన్.

'మఱియుం గోరుమిల్లిశాసనమున (౧౪౩౪)

శచీవ శక్రస్య శివేవ శంభోః
పద్మేవ సా పద్మవిలోచనస్య,
వేమాంబికా చోళకులేందుభీమ
భూపాత్మజా భూస్మహీశాస్య జాయా.[1]

'అని భక్తీశ్వరచోళనృపాలుపుత్త్రుండగు భీమపాలునిపుత్త్రి యగు వేమాంబికను వివాహముఁ జేసికొనిన యని చెప్పఁబడియుండుటచేత భీమరాజు అనవేమక్షితినాథునియల్లుఁ డని యర్థము చేసికొనక తప్పదు[2].

అనవేమారెడ్డికాలములో శ్రీనాథుఁ డున్నట్లును, ఒకసారి యాతనిసభకుఁ బోయి యీక్రిందిపద్యముతో నాతనిఁ బొగడినట్లును పరంపరాగత మైనవదంతి కలదు.

అనవేమమహీపాల! స్వస్త్యస్తు తవ బాహవే,
ఆహవే రిపుకోదండచండిమాంశుసౌరాహవే.

[అర్థము:— ఓ అనవేమభూపా! యుద్ధమునందు శత్రువుల కోదండములనెడు చంద్రమండలములకు రాహు వైనట్టి నీబాహువునకు శుభమగుఁగాక].

శ్రీనాథుఁడు కుమారగిరికాలమునందు నున్నట్టు హరవిలాసము వలన స్పష్టము. అనవేమారెడ్డితరువాతనే కుమారగిరి రాజ్యమునకు వచ్చినందున శ్రీనాథుఁడు అనవేముని కాలమునందు నుండినను నుండవచ్చును. కాని యున్నట్టు నిదర్శనము లేవియు లేవు[3]. ఎట్లన పెద్దకోమటి యీతనితండ్రికాలమందు నున్నవాఁడు; శ్రీనాథుఁ డీతని కుమారుని (అన్నకుమారుని) కాలమువాఁడు. కావున ఈకవివరుల నిద్దఱిని ఈతఁడు చూచి గౌరవించిన గౌరవించియుండవచ్చును. అయినను హరివంశము వ్రాయుకాలమునకు నితఁడు పుట్టనేలేదు గనుక నాతనిప్రభుత్వకాలమునకు నెట్టిన బ్రతికి యుండకపోవచ్చును; శ్రీనాథుఁడు చిన్నవాఁడుగ నుండవచ్చును. కావున నెట్టివ శ్రీనాథుఁడు పుట్టిన గిట్టిన సంవత్సరములు స్పష్టముగఁ దెలియునంతకు నిదమిత్థ మని చెప్పనేరము.

ఈతనితరువాత నెంతయో కాలమునకుఁ బుట్టిన వెన్నెలకంటి సూరనకవి విష్ణుపురాణమున నీతనిగుఱించి యీక్రిందిపద్యము వ్రాయుట చూడఁ దెనుఁగుదేశమందు నితనిఖ్యాతి కొన్నివందలయేండ్లవఱకు నెక్కుడుగా నున్నట్లు మన మూహింపవలసియున్నది.

---

1. పై శ్లోకము అల్లాడ దొడ్డారెడ్డిశాసనమందుఁగూడ నున్నది (Epigraphia Indica, Vol. V, p. 58).

2. ఆంధ్రులచరిత్రము, 3-వ భాగము, ౨౬౩-వ పుట. శివలీలావిలాస మింకను అచ్చుపడలేదు. దాని జీర్ణమైనప్రతి యొకటి శ్రీ మానవల్లి రామకృష్ణకవిగారియొద్ద వీరభద్రరావుగారు చూచినారఁట. గోరుమిల్లిశాసన మెచ్చటను ప్రకటింపఁబడలేదు. ప్రాచ్యలిఖితపుస్తకభాండాగారమునందు ౧౫-౬-౨౬ గుర్తుగల సంపుటమునందు ౩౧౫-వ పుటలో నున్నది. దీనినే 'Elliot's collection' అని అందురు. దీనినే దొరతనమువారిశాసనాధ్యక్షులు వేమవరముశాసనము (Vemavaram Plates) అని వ్రాసియున్నారు—Epigraphical Reports, 1900. paras 63 & 64.

3. ఆంధ్ర నైషధము నంకితమందిన మామిడి సింగన్న అనవేమారెడ్డిమంత్రి యని శ్రీయుత జయంతి రామయ్యగారు వ్రాసియున్నారు. (Epi. Indica, Vol. XI, p. 315, foot-note). కాని యిది పొరపాటు. నైషధము చివరనున్న వచనమునుబట్టి మామిడిసింగన్న పెదకోమటివేమునియొక్క మంత్రి యనుట స్పష్టము.

sampath_Ebooks

క. తనబ్రదుకు భూమిసురులకుఁ
దనబిరుదులు పంటవంశధరణీశులకున్
దనదయము భూమిప్రజలకు
దనవేమన యిచ్చెఁ గీర్తినధికుం డనుచున్. (౧-వ ఆ).

(కొ. వేం. ల.)

**అనసభద్ర** — విశాఖపట్టణముజిల్లా పాలకొండతాలూకాయందలి ఈనాంగ్రామము. జనసంఖ్య ౨౨౮ (౧౯౩౧).

**అనసూయ** — కర్దమఋషికి దేవహూతియందుఁ బుట్టిన తొమ్మిదిమందికన్యలలో నొక్కతె. అత్రిఋషికిఁ బత్ని. ఈమె విఖ్యాతపతివ్రత, మహాతపస్విని. ఒకసారి పదివర్షాత్మకమైన యనావృష్టి కల్గి కఠినమైన కఱవు రాఁగా నీమె తనతపోబలంబుచే కందమూలఫలంబులను, ఉదకంబును నిర్మించి పెక్కుప్రాణులను రక్షించెను. మాండవ్యఋషిని శూలము నిమిత్తము పెక్కించిన నొక పతివ్రత చీఁకటిలో నాశూలమునఁ దాఁక నాఋషి బాధను సహింపక 'తెల్లవాఱఁగనే నీవు విధవ వగుదు' వని శపించెను. అట్లయిన నెప్పటికిని తెల్లవాఱకయే యుండుఁగాక యని యాపతివ్రత ప్రతిశాపం బిచ్చె. ఇట్లు సూర్యోదయములేమిచేఁ జరాచరసృష్టికిఁ గీడు మూఁడ దేవత లంపఁగ నాపతివ్రతాతిలకముయొక్క స్నేహితురాలగు అనసూయయొద్దకుఁ బోయి శత దినము లామె తనసామర్థ్యంబుచే సూర్యోదయమగుచుండునట్లును, తనస్నేహితురాలికి వైధవ్యంబు రాకుండునట్లును జేసెను. ఈశబ్దమునకు 'అనుసూయ' అను రూపాంతరముగూడఁ గలదు (వా. రా. అ, స. ౧౧౭).

వనవాసకాలమున సీతారామలక్ష్మణులు అత్రిమహర్షి యాశ్రమమునకుఁ బోయిరి. అపుడు అనసూయ సీతను మిక్కిలి ప్రేమతో నాదరించి, స్త్రీధర్మము లనేకముల నుపదేశించి, సౌమాంగల్యమునకు లోపము రాకుండునట్లు అంగరాగమాల్యవస్త్రభూషణముల నిచ్చెను.

**అనసూయుఁడు** — ఒక బ్రహ్మర్షి.

**అనస్టేషియస్** — ౧. (క్రీ. శ. ౪౩౦-౫౧౮) ఒక రోమనుచక్రవర్తి. ఇతఁడు మొదట 'జీనో' రాజ్యము చేయునపు డాతనికొలువులో నొకయుద్యోగిగ నుండెను. అతఁడు మరణించిన పిదప నాతనిభార్య యగు అరియడినుసాహాయ్యమున అనస్టేషియసు చక్రవర్తి యయ్యెను. పిదప అరియడిను ఆతనిఁ బెండ్లి చేసికొనియె.

ఇతఁడు ప్రజానురంజకుఁడై పాలనముచేసెను. కాని, పారసీకులతోడియుద్ధమువలనను, హూణులు స్లావులు అనువారివలనను దేశక్షేమమున కప్పుడప్పుడు భంగము కలుగుచువచ్చెను. ఈరాజు క్రీ. శ. ౫౧౮ లో మరణించెను.

౨. ఇతఁ డొక రోమనుచక్రవర్తి. మొదట నాతఁడు 'ఫిలిప్పికస్' అనుచక్రవర్తికిఁ బ్రధానిగ నుండెను కాని, ప్రజలే క్రీ. శ. ౭౧౩ లో ఫిలిప్పికసును రాజ్యభ్రష్టునిగాఁ జేసి అనస్టేషియసును చక్రవర్తిగ నెన్నుకొనిరి. ఇతఁడు సేనల నిర్మించి, ఎక్కువ కట్టుఁబాటులో నుంచెను. ఆప్సికియారాష్ట్రనావికు లీతని నిబంధనలు సైఁపలేక తిరుగఁబడి 'థియడోసియస్' (౭౧౫) అనువానిని చక్రవర్తిగ నెన్నుకొనిరి. రాజధానియైన కాన్‌స్టాంటినోపిలును థియడోసియసు ముట్టడించి అనస్టేషియసును రాజ్యమునుండి తొలిగించెను. క్రీ. శ. ౭౧౬లో 'థెసలోనిక'కుఁ బోయి సన్యాసి యయ్యె. కాని ౭౨౧ లో, థియడోసియసుతరువాత రాజ్యమునకు వచ్చిన 'లియో'పై తిరుగఁబడెను. కాని తుద కాతనిచే హతుఁ డయ్యెను.

౩. ఈ పేరుగలవారు నలుగురు రోమునగరమున 'పోపు' అధికారమును వహించిరి. 'పోపు' అనఁగా క్రైస్తవుల జగద్గురువు. మొదటివాఁడు క్రీ. శ. ౩౯౯ మొదలు ౪౦౧ వఱకును, రెండవవాఁడు ౪౯౬ మొదలు ౪౯౮ వఱకును, మూఁడవవాఁడు ౯౧౧ మొదలు ౯౧౩ వఱకును, నాల్గవవాఁడు ౧౧౫౩ మొదలు ౧౧౫౪ వఱకును 'పోపు' సింహాసనమును అధిష్ఠించిరి.

**అనాంబట్టు** — చిత్తూరుజిల్లా పుత్తూరుతాలూకాయందలి జమీందారీగ్రామము. జనసంఖ్య ౭౫ (౧౯౩౧).

**అనాకోడేరు** — పశ్చిమగోదావరిజిల్లా భీమవరము తాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౭౭౬ (౧౯౩౧).

**అనాగతవంశము** — మైత్రేయుఁడను భవిష్యద్బుద్ధునిగూర్చి తెలుపు ౧౪౨ పద్యములపాలీకావ్యము. గంధవంశము ననుసరించి చూడఁగా నీ కావ్యమును రచియించినయతఁడు కశ్యపుఁడనియు, 'శాసనవంశదీపము' ననుసరించి, యతఁడు చోళదేశీయుఁడగు కవి యనియు తెలియుచున్నది. అతఁ డెప్పు డున్నది కాని, అతఁడు రచియించిన గ్రంథము లేవైన నున్నది లేనిది కాని మనకుఁ దెలియదు. 'ఉపతిస్స' నామాంచితుఁ డొకఁడు దీనికి వ్యాఖ్య వ్రాసెను.

**అనాగరకసంఘము** — మానవజాతి యీ భూమిపైఁ బుట్టి యెన్నియుగము లయినదో యెవ్వరును జెప్పలేరు. ఇప్పుడు కొన్నికొన్ని దేశములలోని జనులు నాగరకతఁ జెందినవారై పట్టణములు, మేడలు, విద్యలు, కళలు, గ్రంథములు కలవారై శోభించుచున్నారు. కాని యీ నాగరకత యంతయు మానవజాతికిఁ గ్రమక్రమముగ లభించినదే కాని యొక్కసారి వచ్చినది కాదు. మొదట మానవసంఘమునకును, ఇతర పశుసంఘమునకును అంతగ భేదముండియుండదు. ఆదిమ మానవులు నగ్నులుగను, గుహలలోఁ గాని, పొదలలోఁ గాని నివసించువారుగను, పచ్చికందమూలాదులను పచ్చిమాంసమును తినువారుగను ఉండియుందురు. అట్టివారు క్రమక్రమముగ నిప్పుడు మన మున్న నాగరకస్థితికి వచ్చుటకు నెన్నిలక్షలసంవత్సరములు పట్టినవో, ఏయే మెట్లు ఎక్కుచు వా రింతవఱకు వచ్చిరో నిశ్చయ

sampath_Ebooks

ముగఁ జెప్పఁజాలము గాని, యిప్పు డీభూమిమీఁద నింకను అనాగరకులుగా నున్న ఆరణ్యకజాతులయొక్క యాచారవ్యవహారములనుబట్టి కొంతవఱకు మనము నాగరకజనుల పూర్వవృత్తాంతమును ఊహింపవచ్చును.

అనాగరకజాతు లిప్పుడు ప్రపంచమునందుఁ బెక్కులు కలవు. వారిలోఁ గొందఱు ఇచ్చటఁ జేర్కొనఁబడుచున్నారు:- మనయాంధ్రదేశమందు కోయలు, చెంచులు, ఎఱుకలవాండ్రు, దాసరులు, లంబా హిందూదేశమందలి యుత్తర ప్రాంతములందలి యరణ్యములందును పర్వతములందును సంచరించు గోండు, ఖోండు (కోదు), సవర, జాంగు, నాగ మొదలైనవారు, అండమానునందలి యాదిమనివాసులు, సింహళమందలివేడ్డలు, ఆఫ్రికాఖండమందలి నుహానివాసులు, ఆక్క లనఁబడువారు, ఉత్తర-అమెరికాఖండమందలి కొలారెడోలు, దక్షిణ-అమెరికాలోని బ్రెజిల్‌వాసులు, గ్రీన్లాండులోని ఎస్కిమోలు అనువారు, బోర్నియోలోని డైకులు, ఆస్ట్రేలియాఖండమందలి యాదిమనివాసులు. వీరు గాక యచ్చటచ్చట చిడిద్వీపములలోను, ఖండాంతరములందలి యరణ్యాదికములలోను పెక్కుమంది అనాగరకజనులు గలరు. వీ రందఱును ఒక్కతరగతివారు కారు. ఒకరు తోళ్లుకట్టుకొనువారుగ నున్న మఱియొకరు ఆకులు కట్టుకొనువారుగను, మఱొకవారు బట్ట విడిచి తిరుగువారుగను ఉందురు. ఒక్కొకరియందు నాగరకతాభావ మొక్కొకవిధముగఁ గానవచ్చుచుండును. నాగరకతగల సంఘమువారికిని, అనాగరకజనుల సంఘమునకును గల ముఖ్యభేదము లెవ్వియో వానిలోఁ గొన్నింటి నిచ్చట సంగ్రహముగ వ్రాయుదును.

ఆహారము:— మానవునకు దినమును తప్పక కావలయునది యాహారము. ఇందునుగూర్చి యొకానొకసంఘముయొక్క యాచారమును మన మెఱింగితిమేని యా సంఘ మెంత నాగరకస్థితిలో నున్నది మనము చెప్పఁగలము. మొట్టమొదట మానవుఁడు పశువులవలెనే, అరణ్యమందుఁ దమంతటఁ బుట్టుశాకాదులను భక్షించియుండవలెను. గడ్డి మొదలైనవానికంటె పండ్లు, కందమూలములు మానవశరీరమునకు నెక్కువ పోషకములు గనుక వానిని చెట్లమీఁదినుండి కోసికొనియు, భూమిలోనుండి త్రవ్వియుఁ దీసికొనియుండును. దీనికి 'పశుదశ' యని పేరు పెట్టవచ్చును. ఈదశలోనే యదృచ్ఛగా దొరకిన పశువులమాంసమును తినుచుండవచ్చును. మిక్కిలి నికృష్టమైన యీదశకంటెఁ గొంచెము పైకి వచ్చినవారు వేఁటాడి మృగములఁ జంపి భక్షింతురు. దీనిని మనము 'మృగయాదశ' యందము. పూర్వపుదశకంటె నిందుఁ గొంచెము నాగరకత కావలయును. వేఁటాడుటకు విల్లు, అంబు మొదలైన సాధనము లుండవలయును. ఈ సాధనములఁ జేయుట నేర్చుకొనినపిదపఁ గాని మానవునకు 'మృగయాదశ' రానేరదు. కందమూలాదు లేమి, మాంస మేమి మొదట పచ్చిగనే భక్షింపఁబడును. ఎందు కనఁగా మానవజాతికి నిప్పు శైశవావస్థయందు లభించినదికాదు. కొంచెము నాగరకత హెచ్చినతరువాతఁగాని నిప్పును బుట్టించునుపాయములు వారు కనుఁగొనలేకపోయిరి. నిప్పు వశమైన తరువాతఁగూడ భక్ష్యపదార్థములను అందుఁ గాల్చి తినుచువచ్చిరి. వంటకములఁ జేయుపద్ధతి కొంచెము హెచ్చుతగ్గుగ అనాగరకస్థితి వదలినతరువాతనే మానవునకుఁ దెలిసిన దని చెప్పవచ్చును. కందమూలముల నేమి, మాంసము నేమి కొంచెము హెచ్చుతగ్గుగ ననాగరకు లందఱును పచ్చిగనో, కొంచెము కాల్చియో భక్షింతురు. పక్వము చేయువిద్య వా రంతగ నెఱుంగ రని చెప్పినఁ జెప్పవచ్చును. ఈ 'దశ' తరువాతఁ గొంతకాలమునకు 'గోపాలదశ' మానవజాతికిఁ బ్రాప్తించును. కందమూలఫలములు గాని, వేఁటవలన వచ్చెడి మాంసము గాని తమకు వలయునంతయు వలసినప్పుడు దొరకకపోవచ్చును. వానిని ఎక్కువగ సంగ్రహముచేసి యుంచుటకు వీలు లేదు. కావున మానవుఁ డరణ్యమునందలి కొన్ని పశువులను, అనఁగా మేఁకలు, ఆవులు, గేదెలు మొదలైనవానిని వశపఱుచుకొని పెంపఁ బ్రారంభించెను. ఇందువలన నాతనికిఁ గావలయునపుడు గావలసినంత మాంసాహారము దొరకుటయే కాక, వానిపాలు పెరుఁగు మొదలైన రుచికర పదార్థములుగూడ తినుటకు దొరకును. ఇట్లు గోపాలదశకు వచ్చినవారు కొంత నాగరకు లని చెప్పవలెను. ఇట్టిస్థితికి వచ్చినజాతు లిప్పటికిని ఈభూమిమీఁదఁ బెక్కులు కలవు. మనదేశమందలి కోయ, చెంచు జాతులవా రింకను గోపాలకదశను వహింపలే దనియే చెప్పవలెను. అస్సాముదేశమునకుఁ దూర్పున పర్వతప్రాంతమందు మిషిజాతివారు కలరు. వారు ఆవులు, ఎద్దు మొదలైనవాని నెక్కువగాఁ బెంచెదరు. అవి అరణ్యములో స్వేచ్ఛగాఁ దిరుగుచుండును. వీరు వీనితో వ్యవసాయము చేయరు. పండుగదినమున నొకదానిఁ జంపి తిందురు. భార్యలను కొనుటకై వీనిని ధనముగ నుపయోగించెదరు. గోపాలకదశను పొంది దానివలన మిక్కిలి లాభము సంపాదించినవారు లంబాడీలు. వీరు ఎద్దు మొదలైనపశువులను విశేషముగఁ బెంచి వాహనములుగ నుపయోగింతురు; భక్ష్యమునకు నుపయోగింపరు. గోపాలదశకుఁ దరువాతిది 'కృషకదశ', అనఁగా వ్యవసాయము చేసి ధాన్యము పండించునట్టిస్థితి. భూమిలో నొకవిత్తు వేసి నూఱువిత్తులు పుట్టించునట్టివిద్య మానవుఁడు సాధించినవిద్యలలో గొప్పది. ఆదిమదశలో మానవుఁడు తాను తిరుగుచుండుస్థలములలో స్వాభావికముగఁ బెరుఁగు గడ్డిధాన్యములే కోసికొని తినుచుండవలెను. తరువాతఁ గొన్నివిత్తులు నేలమీఁదఁ బడి వర్షాకాల మవి చెట్లయి ఫలించుటఁ జూచి, మానవుఁడు మొదట భూమిమీఁద విత్తులు చల్లి వచ్చినపంటను అనుభవించుచుండెను. భూమి దున్నుట గాని, పాటు చేయుట గాని యెఱుఁగఁడు. కోయలు మొదలైనయరణ్యజాతులవారు భూమిని ఎక్కువగా దున్నకయే విత్తనములు చల్లి వచ్చినపంటను అనుభవింతురు. క్రమముగఁ బశువులచే దున్నించుట మొదలైన వ్యవసాయపద్ధతులను నేర్చి నాగరకతాభివృద్ధిఁ జేసికొనిరి.

నరమాంసభక్షణము:— కొందఱ అనాగరకజాతులవారు నరమాంసమును తినియెదరు. ఇట్లు మనుష్యమాంసమును తినుమానవజాతులు మిక్కిలి తక్కువయైనను పూర్వ ముండెను, ఇప్పుడును ఉన్నవి.

sampath_Ebooks


నరమాంసాశనులైన రాక్షసులు మనపురాణాదికములలో వర్ణింపఁబడి యున్నారు. ఆ వ్రాఁత యిట్టియారణ్యక, అనాగరకజనులనుగుఱించియే వ్రాయఁబడియుండును. అట్టిజాతు లిప్పుడు నశించియుండును. మిక్కిలి పురాతనకాలమందు ఫ్రాన్సుదేశమందును నిట్టిజను లుండినటకు నిదర్శనము లున్నవి. కాస్పియన్ సముద్రమునకు నీశాన్యమున దీవులలోఁ దిరుగుచున్న సిథియన్, మాసగేటియను జను లిట్టివారని హిరోడోటస్ మొదలయిన పురాతనలేఖకుల వ్రాఁతలవలనఁ దెలియుచున్నది. ప్రస్తుతకాలమందును ఆఫ్రికాఖండముయొక్క పశ్చిమ, మధ్యమభాగములందును, న్యూగినీ, ఫిజీ, ఆస్ట్రేలియా, న్యూజీలండు, పాలినీషియన్ దీవులు, సుమత్రా, దక్షిణ-అమెరికా మొదలయిన దేశములందును మాంసభక్షకజాతులు చాలఁ గలవు. వీరిలోఁ గొందఱు క్రమక్రమముగ నీ రాక్షసాచారమును విడుచుచున్నారు. కాని సుమత్రాలోని బట్టా లనువారును, ఈస్టుఇండియన్ దీవులలోని వారును, దక్షిణ-అమెరికాలోని పూర్వనివాసులును ఈ పురాతనాచారమును విడువలేదు. ఈ మాంసభక్షకులు సాధారణముగ శత్రువులను జంపి భక్షింతురు; తమసంఘమువారిని తినరు. హిందూదేశమునందు మనుష్యభక్షకులైన యనాగరకు లున్నట్టు కానరారు. అఘోరపంథమువారు శవములను భక్షించుచుండిరి. కాని యది మతసిద్ధాంతమునుబట్టి వచ్చినభక్షణ కాని యనాగరకతవలన వచ్చినది కాదు.

దుస్తులు:— సిగ్గువలనఁ గాపాడుకొనుటకు శరీరమునకు దుస్తులు కావలెను. కాని 'సిగ్గు' అను మనోవికారము మానవజాతికిఁ గొంత నాగరకత వచ్చినతరువాత నుద్భవించినది. మొదట శరీరమును చలివలనఁ గాపాడుకొనుటకు దానిని దేనితోనైనఁ గప్పవలసివచ్చెను. అందుచే నెండ లధికముగ నుండుచోట నారణ్యకజనులు నగ్నులుగ నుండుటయు, చలి యెక్కువగ నున్నచోట వారు దుస్తులను ధరించుటయు తటస్థించును. కేవలము నగ్నావస్థయం దుండుజాతులుకూడఁ గలవా యని నూఱురూపాయలను మించినదుస్తుల ధరించుమనమ మను కొనవచ్చును. కాని వస్త్రవిహీనులుగ నుండు అనాగరకులు భూమిమీఁద నిప్పుడును పెక్కురు కలరు. అరణ్యమధ్యమున నుండు కోయవాండ్రు నగ్నులుగ నుండుదురు. ఎవరినైనఁ జూడవచ్చునప్పుడు ఆకులు చుట్టుకొని వత్తురు. ఫ్యూజీదేశజులు, ఆస్ట్రేలియాదేశజులు సాధారణముగ నేమియుఁ గట్టుకొనకయే తిరుగుచుందురు. చలిపుట్టినప్పుడుమాత్ర మేమైనను చుట్టుకొందురు. ఇప్పుడు నాగరకజనుల సంపర్కమువలనఁ గొన్నిజాతులవారు వస్త్రధారణము నేర్చినను బట్టవిడిచి తిరుగునాచారము వారిలోఁ బూర్తిగఁ బోలేదు. ఆఫ్రికాఖండములో భూమధ్యరేఖాప్రాంతమునం( Equatorial Africa ) దున్న అషీరు( Ashiras ) లను జనులలోను, అమెరికాయొక్క మధ్యభాగమునందున్న చయ్‌మలు ( Chaymas ) అనువారిలోను వివాహమైనస్త్రీలు వస్త్రధారణము చేసినను, అవివాహితలగు కన్యలు చీర కట్టఁగూడ దన్ననియమము కలదు! చలి యెక్కువగ నుండి దుస్తులు ధరించువారు పశువులచర్మములను వస్త్రములుగ ధరించెదరు. ఇంగ్లండుదేశమునం దుండినయాదిమవాసులు మృగములతోళ్లే కట్టుకొనుచుండిరి. మనపూర్వపురుషులుకూడ ( అనాగరకులు గాకపోయినను ) మృగాజినములు ధరించుచుండినట్లు మనము చదువుచున్నాము. చెట్లబెరడులుగూడ కట్టుకొను అనాగరకులు కలరు. నూలువస్త్రములు నాగరకతాదశలో వెలసినవి గాని అనాగరకదశలోనివి కావు. బట్టలనేత వచ్చుటకుఁ బూర్వము వ్యవసాయము, ప్రత్తి నేయుట, దారము వడుకుట మొదలయినకళ లన్నియు వచ్చియుండవలెను.

అలంకరణము:— మోటుజాతులయొక్క మోటుతనమును, నాగరకజాతులయొక్క నాగరకతయు అలంకారములవలనఁ గొంత తెలియును. నగ్నస్థితిలో నున్నప్పుడు శరీరమునకు రంగు వేసికొని దాని చక్కఁదనమును హెచ్చింపవలయు నన్నకోర్కె పుట్టుట సహజము. కావున పెక్కురనాగరకజనులు శరీరమునకు రంగు వేసికొనియెదరు. ఆఫ్రికా, అమెరికాఖండములందలి ఆదిమనివాసులైన ఆరణ్యకజాతులవారు తమశరీరమును వేలువేలుచిత్తరువులతో నలంకరించుకొనియెదరు. కొందఱు శరీరముయొక్క యొక భాగమందును, మఱియొకరు ఇంకొకభాగమందును, ఇంకొకజాతివారు శరీర మంతయు నెఱ్ఱని, పచ్చని రంగులచిత్తరువుల రాచుకొందురు. ఈచిత్తరువులు చెట్లు, తీగలు, చెక్కడములు, గళ్లు, మృగములు మొదలైనవిగ నుండును. ఇది చిత్రవిద్యయొక్క ప్రథమావస్థ యని చెప్పవచ్చును. కొన్నిదేశములలో శరీరమున పచ్చలు పొడిపించుకొని సింగారించుకొనియెదరు. మనదేశమునందును పచ్చలు పొడిపించుకొనునాచారము కలదు. ఈపని సాధారణముగ ఎఱుకలవాండ్రు చేయుదురు. మెలనీషియా, పాలినీషియా, న్యూజీలండు మొదలయినదేశాంతరములందలి మోటువారు చేతులనిండను, కాళ్లనిండను, ముఖమంతయు, శరీరమంతయుఁ బచ్చలు పొడిపించుకొందురు! బట్టలు కట్టునాచారము హెచ్చినకొలఁదియు శరీరమునకు రంగు వేసికొనుట, పచ్చలు పొడిపించుకొనుట యన్నయాచారము తగ్గును.

శరీరమున కలంకారము తగిలించుకొనుటకు శరీరమునందుఁ జిల్లులు చేయుట అనాగరకజనులయొక్క పెద్దవిశేషము. చెవులకు, ముక్కునకు చిల్లులు చేయుట సహజమేకదా! కొందఱు క్రిందిపెదవికిఁ జిల్లి చేసి, దానిని క్రమముగఁ బెంచి, నోటితో సమానమైనంతది చేసి దానికి నగలు పెట్టుదురు. బ్రెజిల్, దక్షిణ-అమెరికా, మధ్య-ఆఫ్రికాలందలి మోటుజాతులలో నీయాచార మున్నది. అచ్చట పిల్లలకు తల్లులు, మనము మనపిల్లలకు చెవులు కుట్టించినట్లు, పెదవి కుట్టించి క్రమముగఁ బెంచెదరు! కొందఱు బుగ్గలోఁ జిల్లి చేసికొని నగ ధరించెదరఁట!!

వీరినగలును మిక్కిలి మోటుగ నుండును. కొందఱు చక్కఁదనమునకై యీఁకెలు ధరించెదరు. ఆఁడువాండ్రు ధరించునగలు ఎముకలతోను, సముద్రమునందలి ప్రాణులకవచములతోను చేయఁబడి

sampath_Ebooks

యుండును. మనదేశమునందు లంబాడీస్త్రీలు ధరించునట్టినగలు మనము చూచుచున్నాము. ఇంకను అనాగరకజనులలో నింతకంటె నగలు మోటుగ నుండు నని తెలిసికొనవలయును.

వివాహము:— మానవులు పశుదశయం దున్నకాలమునఁ గొంత వఱకు స్త్రీ పురుషసంబంధములు కూడ పశువులవలెనే యే నియమము లేక స్వేచ్ఛగా జరిగియుండును. కాని యంత పశుదశయం దున్నజాతు లిప్పుడు కానరావు. కొంతకాలమునకుఁ గొన్ని నియమము లేర్పడినవి. మొదటినుండియు స్త్రీలను పురుషులు దాసీలుగ, తమ యుపయోగమునకై పుట్టినసొత్తువలె చూచుచున్నందున, కొందఱు పురుషులకుఁ గొందఱు స్త్రీలకు నియతసంబంధము కలిగెను. ఇదియే వివాహవిధి. ఇది అనేకవిధములుగ నున్నది. ఒకస్త్రీకి నొకపురుషుఁ డన్ననియమము మొదటినుండియు నున్నది కాదు. ఒక్కపురుషునకుఁ బెక్కుస్త్రీలును, ఒక్కస్త్రీకిఁ బెక్కురు మగలును, ఉండునాచారములు అనేకానాగరకజనులలో నున్నవి. బహుపతిత్వము (Polyandry) నాగరకజాతులవారమైన మనకు నెంతి యసహ్యకరముగ నున్నను భూలోకమునం దీయాచార మనాదిసిద్ధముగ నున్నజాతులు కలవు. సింహళమునందును, టిబెత్తునందును, నీలగిరిపర్వతమునందును ఈయాచారముగల జాతు లున్నవి. ఇట్టియాచార మున్నచోట సాధారణముగ నొక్కస్త్రీకి నున్న పెక్కురుమగ లన్నదమ్ములుగ నుందురు, అనఁగా పంచపాండవులవలె నన్నదమ్ము లందఱును ఒక్కస్త్రీకి పెనిమిట్లుగ నుందురు. నీలగిరిపర్వతములోని 'తోడా' లను మోటుజాతివా రున్నారు. అన్నదమ్ములలో నొక్కఁడు వివాహ మాడినస్త్రీ యందఱుతోడఁబుట్టినవారికిని పెండ్లా మగును. ఒక పెండ్లాముగలవా రందఱును సాధారణముగ అన్నదమ్ము లైనను ఒకప్పుడు వా రొక్కకుటుంబములోనివారుగను, అరుదుగ భిన్న కుటుంబములోనివారుగనుగూడ నుందురు. ఇట్టిస్త్రీకిఁ బుట్టినపిల్లలకుఁ దండ్రి యెవఁ డని నిశ్చయముగఁ దెలియుటకై యాస్త్రీ గర్భముతో నున్నప్పుడు ఏడవనెలలో నొకయుత్సవము చేసెదరు. అప్పుడు దానిమగలలో నొక్కఁడు దానిచేతికి నొకచిన్నవిల్లును, అంబును ఇచ్చును. అట్లిచ్చినవాఁ డప్పుడు పుట్టుశిశువునకుఁ దండ్రి. మగ లందఱు నన్నదమ్ము లైనప్పుడు పెద్దన్నయే సాధారణముగ విల్లు నంబు నిచ్చును.

ఎఱుకలవాండ్రలోఁ గూడ నొకవిధమైన బహుపతిత్వము కలదు. ఎఱుకలసానిమగఁడు దొంగతనము చేసి కైదునకుఁ బోయిన యెడల నాకాలమం దది మఱియొకనితోఁ గాఁపుర ముండవచ్చును. తిరిగి మగఁడు రాఁగానే యది వానిఁ జేరును.

కొన్నిజాతులలో వివాహము చేసికొనినస్త్రీ పెనిమిటిసెలవు లేక యన్యపురుషునిం బొందుట తప్పుగా నెంచినను, భర్తయనుజ్ఞ వడసి యట్లు చేయుట గాని, అవివాహితస్త్రీలు తమ కిచ్చవచ్చినట్లు ప్రవర్తించుట గాని తప్పుగా నెంచరు. న్యూజీలండులోను, ఉత్తర-ఆరాకానులోను, ఉత్తర-అమెరికా, మధ్య-అమెరికాల యం దుండు మోటుజాతులవారు కన్య స్వేచ్ఛగాఁ దిరుగుట తప్పుగా నెంచరు. అట్లు అవివాహిత యైనకన్య యెవరితోను సంబంధము లేకుండ నుండెనేని యది రూపసి కాదని బ్రెజిల్‌దేశజు లనుకొనియెదరు. మలేసియాదేశమందలిజనులు తమయింటికి వచ్చినచుట్టముల యొద్దకుఁ దమభార్యలఁ బంపుదురు.

మోటుజాతులలోఁ గొందఱు తమతెగవారిని వివాహ మాడుదురు. కొందఱు వేఱుతెగవారిని గాని వివాహ మాడరు. మొదట వేఱుతెగలనుండి కూఁతువారిని ఎత్తుకొనివచ్చి బలవంతముగ వివాహ మాడుచుండిరి. దీనినే మనవారు రాక్షసవివాహ మనిరి. ఇట్టియాచార మింకను అనాగరకజనులలోఁ బెక్కుచోట్ల నున్నది. ఈ తెగవారు ఆ తెగవారితోనే సంబంధబాంధవ్యము చేసికొనవచ్చు నని యున్నచోట నీతెగలోని యాతరముపురుషు లందఱికి ఆతెగలోని యా తరమునందలిస్త్రీ లందఱును పెండ్లాలుగ నుందురు; అనఁగా ఈ తెగలోని యిష్టము వచ్చినమగవాఁడు ఆ తెగలోని యిష్టము వచ్చినంత మంది స్త్రీలను పెండ్లి చేసికొనవచ్చును. ఇట్టియాచార మాస్ట్రేలియా జనులలో నున్నది. సుమత్రాద్వీపమునందుఁ గొంతకాలముక్రిందట జగర్, అంబెల్ అనక్, సెమసడో అను మూఁడువిధములయిన వివాహము లుండెను. మొదటిదానిలో పురుషుఁడు స్త్రీని కొనును, రెండవదానిలో స్త్రీ పురుషుని గొనును, మూఁడవదానిలో స్త్రీ పురుషు లిద్దఱును సమానహక్కు కలవారై యుందురు. మొదటి వివాహపద్ధతి మనదేశమునందును కలదు గాన దానిని వర్ణింపనక్కఱ లేదు. రెండవదానిలో పిల్లతండ్రి అల్లుని కొనితెచ్చును. వాఁ డప్పటినుండియు భార్యకుటుంబమువాఁడే యగును. వానిసంపాదన యంతయు వానిమామగారికే చెందును. వాఁడు మామగారికుటుంబమువాఁ డగును. ఇది యొకవిధమైన యిల్లఁటము. భార్యాభర్తల కిద్దఱికిని సమానమైనహక్కుగల వివాహమందు ఇద్దఱిసంపాదనయు, అప్పులును ఇద్దఱికి సమానముగ వచ్చును. భార్యాభర్త లిద్దఱును విడిపోవలయు నన్న సొత్తును సమానముగఁ బంచుకొందురు. ఇట్లు అనాగరకజాతులలో వివాహపద్ధతులు పెక్కులు గలవు. ఇవన్నియు, శరీరసౌఖ్యముకొఱకుఁ జేసికొన్నవివాహములే కాని యిందు సాత్త్విక ప్రేమ యనునది కానరాదు. స్త్రీని సాధారణముగ దాసిగ, పనికత్తెగ, భోగస్త్రీగఁ జూచెదరు. కావున నాగరకవివాహములకును, అనాగరకవివాహములకును సాత్త్వికప్రేమ యనునదియే భేదము.

నివాసస్థలములు:— చెట్టునీడ, పొదలచాటు మొదట నారణ్యకులకు నివాసస్థానములు. గుహలే వానికిఁ బెద్దగృహములు. మొదట మానవుఁడు గృహనిర్మాణ మెఱుఁగఁడు. రెండుమండలు పెట్టుకొని పొదలచాటునను, గుహలలోను కాఁపురముండు నికృష్టజాతులవా రిప్పటికిని పెక్కురు కలరు. ఈ స్థితినుండి లంబాడీగుడిసెలవఱకు వచ్చుటకు మానవజాతి కెన్నియో యుగములు పట్టియుండును. వడ్రంగమువిద్య సాధ్య మగువఱకు మానవు లారణ్యక

sampath_Ebooks

# అనాగరక సంఘము











ఆఫ్రికా దేశమందలి అనాగరకజాతులవారు

sampath_Ebooks

# అనాగరకసంఘము



౨





౩



౪

దక్షిణ అమెరికాయందలి అనాగరకజాతులవారు ( పటములు ౧, ౨, ౩ )

ఆఫ్రికాదేశపు అనాగరకజాతిస్త్రీ ( పటము ౪ )

sampath_Ebooks

స్థితిలోనుండి యీవలికి వచ్చిరి. ఇండ్లు అనుటకు వీలు లేనట్టి మిక్కిలి చిన్నవియైన కప్పులను నిర్మించుకొని కాంపురముండు మోటు జాతులవారు మనదేశమునం దింకను ఉన్నారు. ఎఱుకలవాండ్రు, తోడా జాతివాండ్రు గుడిసెలను జూచినంగాని వారి దారిద్ర్యావస్థ బోధపడదు. ఇండ్లే కట్టుకొనుటకు చేతం గానప్పుడు పట్టణాదులనాగరకజాతివారి కుండనేర వని వేఱుగం జెప్ప నక్కఱలేదు. మిక్కిలి యనాగరకావస్థలో నున్న వారందఱకు లోక్కకోటను పట్టుమని పదిరోజు లుండరు. ఎచ్చట వారికి భోజనపదార్థములు దొరకుచుండునో యచ్చటికిం బోయి కొన్నిదినము లుండి మఱియొకచోటికిం బోవుచుందురు. కావున శాశ్వతమైనపల్లె నిర్మించుకొనవలసినయావశ్యకము వాండ్రకు లేదు. కొమ్ముగిగూడెములు, ఎఱుకలగూడెములు తెలుంగుదేశమువారికిం దెలిసినవిగదా. ఈ గూడెము లొకప్పుడొక గ్రామమువెలుపలను, మఱియొకప్పుడింకొక గ్రామమువెలుపలను, గానవచ్చుచుండును.

కల దని తలంచును. ఇట్లు చేయగాం గానవచ్చువానికిని, గొప్పగు గానవచ్చువానికిని ప్రతిగ నొక్కొక దేవత పుట్టును. మానవుండు తనయందున్న గుణములన్నియు ఈ దేవతలందారోపించును. ఆదేవతలను సంతోషపెట్టవలెను, వానికి మాంసము పెట్టవలెను, కల్లు పోయవలెను. పోంగాంబోంగా నివియే ముత్యాలమ్మ పోలేరమ్మలుగాను, జాతరలుగను మాఱినవి. ఇట్లు మొదట చెడుదేవతలు పుట్టెదరు. తరువాత మంచిదేవతలు పుట్టెదరు. వీరు వారు కలసి యధికమైన తోడనే వీ రందఱు నుండుటకు నొకతావు కావలసివచ్చును. అదియే తరువాత స్వర్గమగును. ఈలాగు మిక్కిలి స్వల్పమునుండి మతకల్పనలు ప్రవృద్ధమగుచుండును. ఏకేశ్వరకల్పన యెన్నియోయుగముల తరువాతం గాని పుట్టదు. అనాగరకసంఘమువారు సాధారణముగ దేవత లని గుట్టలను చెట్లను మృగములను పూజించుచుందురు. ప్రయోగములు మొదలయినవానిని నమ్ముదురు. మానవులు పులులుగను, వేఱు మృగములుగను మంత్రబలమునలన మాఱుదు రని తలంతురు.

మతము :— మతముగూడం గ్రమముగ నభివృద్ధియైనదియే. అనాగరకజనులకును, నాగరకజనులకును దుస్తులను గుఱించి యెంత భేదముండునో మతమును గుఱించియు నంత భేదముండును. మిక్కిలి పశుపక్షులలో నున్న కొన్ని జాతులవారికి మతకల్పనలే లే వని కొందఱు వ్రాసియున్నారు. కాని యందును గుఱించి గ్రంథకారులు భిన్నాభిప్రాయులైయున్నారు. పశుపక్షులను విడిచి కొంచెము పైకి వచ్చినవారిలో, రూపము లేని కొన్నిక్షుద్రదేవతలు తమకుం గీడు చేయు ననియు, వానిని సంతోషపెట్టి యాకీడును తప్పించుకొనవలయు ననియు, చచ్చిపోయిన తమపూర్వులు దయ్యములై తిరుగుచుండెద రనియుం గల్పనలు కల వని మనకుం గానవచ్చుచున్నది. తనకు సంభవించెడియాపద లన్నియు స్వాభావికముగ వచ్చుట లేద నియు, ఏదో దేవతయొక్క ప్రభావమువలన వచ్చుచున్న వనియు అరణ్యకుం డనుకొనును. అందులకై జ్వరమున కొకదేవత, దగ్గున కొకదేవత యున్న వని కల్పించుకొనును. అట్లే వృక్షమున కొక దేవత, గుట్ట కొకదేవత, వాన కొకదేవత, ఉఱుముున కొకదేవత





అడవిజాతులవారు

బుద్ధి వికాసము :— ఇప్పుడు భూమిమీంద నున్న యనాగరక జాతులు కొన్ని బుద్ధివిషయమై మిక్కిలి నీచావస్థలో నున్న వని చెప్పవలసియున్నది. వీరి బుద్ధివైభవము వీరిభాషవలననే తెలియంగలదు. కంటికిం గానవచ్చెడి పెక్కుపదార్థములకుం బేళ్లున్నను, కనులకుం గానరాని జాతివాచక, భావవాచకపదములకుం గొందఱి భాషలయందుం బేళ్లే లేవు. మఱేభాషలలో ఎఱ్ఱ, నల్ల మొదలయిన రంగులకుం బదము లున్నవి కాని 'రంగు'నకుం బదము లేదు. టాస్మేనియన్ భాషలో వేఱువేఱుచెట్లకుం బేళ్లు గలవు గాని 'చెట్టు'నకుం బేరు లేదు. 'మృదుత్వము, కాఠిన్యము, వేడిమి, చల్లందనము' మొదలయినయర్థములపదములు లేవు. ఏ జాతివా రెన్నియంకెలవఱకు లెక్కపెట్టంగలరో తెలిసికొన్న వారియనాగరకతయొక్క మానము మనకుం దెలియంగలదు. ఎస్కిమోలు అనువారు పదికంటె నెక్కువగ లెక్కపెట్టలేరు. క్రాఫర్డు అనుశోధకుండు ఆస్ట్రేలియాదేశమందలి ముప్పదిమోటుజాతులవారిభాషలను శోధించి, అం దెవరికిని 'నాలుగు' కంటె నెక్కువ లెక్కపెట్టుట చేతంగా దని చెప్పినాండు.

sampath_Ebooks

కేప్ యార్క్ అనువారు రెంటికంటె నెక్కుడులెక్కల నెఱుఁగరు. మూఁడు ననవలసివచ్చినప్పుడు 'రెండునొకటి', నాలుగు అనవలసివచ్చినప్పుడు 'రెండు రెండు' అని యందురు! కావున నిట్టివారిబుద్ధి యింకను వికాసముఁ జెందక బాల్యావస్థయం దున్న దని చెప్పవలెను.

మానవులు భాషయొక్కయు, లెక్కించునంకెలయొక్కయు స్థితి యిట్లుండఁ, నిఁక నీజాతులవారిలో వ్రాత లే పనియు, గ్రంథములు లే పనియును వేఱుగఁ జెప్పవలెనా? వ్రాత లేకపోయినను, కొంచెము అధికులగు అనాగరకజాతులవారు తమయుద్దేశమును చిత్రములద్వారమునఁ గొంతవఱకుఁ దెల్పెదరు.

కుటుంబము:— స్త్రీ పురుష సాంగత్యమువలనఁ గుటుంబ మేర్పడును. పూర్వము కుటుంబములు స్త్రీ ప్రధానములు. పిదప క్రమముగఁ బురుషప్రధానము లయ్యెను. స్త్రీప్రధానకుటుంబము లనఁగా నాకుటుంబములోనివా రొకానొక స్త్రీకిని, యామెకును గల బంధుత్వము వలనఁ గలసియుందురు. వారసత్వము మొదలైన వన్నియు స్త్రీ ననుసరించి వచ్చును. మానవుల యాదిమదశలోను, వివాహబంధనములు దృఢము కానప్పుడు సంతానముయొక్క తండ్రి యెవఁ డయినది నిశ్చయముగాఁ దెలియదు. తల్లిమాత్రము తెలియును. కావునఁ బిల్లలను పోషించుభారము తల్లిమీఁదను, ఆమెబంధువులమీఁదను పడును. మలె ద్వీపకల్పదేశమందలివారు మిక్కిలి కనిష్ఠావస్థలో నున్నారు. ఒకపురుషుఁడు, ఒకస్త్రీ యవసరమునకుఁ బోయి పొదలలోఁ గాపురముందురు. పిల్లలు పుట్టినతరువాత పిల్లలు కొంచెము పెద్దవారగువఱకును వారు కలసి యొకచెట్టుక్రింద నుందురు. చెట్టునకు ఒకవిధమైన ఉయ్యాల గ్రేలాడఁగట్టి పిల్లలను దానిలో నుంచెదరు. రాత్రి పులులు మొదలైనవి రాకుండ నిప్పు ముట్టించి యుంచెదరు. పిల్లలు కొంచెము పెద్దవారైనతరువాతను తండ్రి యిష్టమువచ్చినచోటికిఁ బోవును. తల్లి పిల్లలను పెంచును. అండమాను, ఆస్ట్రేలియాదీవుల లోను ఇట్లే పిల్లలను తల్లి, మేనమామ పెంచుదురు. ఉత్తర-అమెరికాయందును ఇట్టియాచారమే కలదు. హిందూదేశమందలి నాయరుజాతివారిలోను స్త్రీప్రధానమైన కుటుంబపద్ధతియే అమలులో నున్నది. అచ్చటికుమారునకు తండ్రి యింటిపేరు రాదు. తండ్రి సొత్తు రాదు. మేనమామయింటిపేరు వచ్చును. మేనమామసొత్తు వచ్చును. ఇట్టికుటుంబమును తార్వడ్ అందురు.

వివాహబంధనములు దృఢమై జాతులలో పురుషప్రధానకుటుంబము లేర్పడినవి. వీనిలోఁ బురుషునిబట్టి కుటుంబ మేర్పడును, దాయభాగము వచ్చును. ఇట్టివియే మనకుటుంబములు.

సంఘము:— సంఘ మనఁగాఁ గొన్ని కుటుంబములు స్వసంరక్షణార్థమై కలసియుండుట. మిక్కిలి ప్రారంభావస్థయందు నేకుటుంబమునకు నాకుటుంబమే విడివిడిగా నుండి స్వేచ్ఛాచారముం జేయును. సింహళమునందలివెడ్డా లనంబడుజాతివా రెవరికి వారు వేఱువేఱుగ నుందురు. అమెరికాఖండమందలి 'టాస్మేనియనులు' అనుజాతివారిలోని వేలువేలుకుటుంబములు యుద్ధసమయమునఁ గలసి యొకనాయకుని నేర్పఱుచుకొని వానియాజ్ఞలో నున్నను, ఆపని యైనతోడనే యేకుటుంబమున కా కుటుంబము స్వతంత్రమైపోవును. కాని మఱియొకజాతివారు ప్రక్కను జేరి శత్రువులుగా నున్నప్పుడు స్వసంరక్షణార్థమై యీచిన్నకుటుంబము లన్నియుఁ జేరి యొక సంఘము కావలసియుండును. ఇట్లు కూడి యొక్కని నధిపతిగ నేర్పఱుచుకొని వాని యాజ్ఞలో మెలఁగుదురు. ఇట్లు సంఘముగా నేర్పడువారు సాధారణముగ నొక్కతెగవారై యుందురు. ఇట్టిసంఘములోఁ బెద్దపెద్దకుటుంబము లుండును. ఆ కుటుంబముల కధిపతి తండ్రి. అతని కుమారులు, మనుమలు మొదలయినవా రందఱును అతనియాజ్ఞలో నుండవలయును. ఆ కుటుంబమునకు నాతఁ డొకవిధమైన రాజు.

అనాగరకస్థితిలో నుండువారుకూడ తమస్వాతంత్ర్యమును కాపాడుకొని పరులస్వాతంత్ర్యమునకు భంగము రాకుండఁ బ్రవర్తింపఁగల రనుటకు పురాతనసమయములోని దేశములనివసించిన కొన్ని మోటుజాతులు నిదర్శనము. వీరిలో నిప్పటికిని ఒకరాజు గాని, ప్రభుత్వము గాని గానరాదు. అందఱును సమానముగనే యుందురు. వీరిసంఘములు చిన్నచిన్నవి. కొన్ని ముప్పదికుటుంబములకంటె నెక్కువ యుండవు. ఒక్కొక్కసంఘమున నొక్కొక్క ముసలివాఁడు నేతగా నుండును. అతఁడు సలహా చెప్పువాఁడేగాను, తగవులు వచ్చినప్పుడు తీర్పువాఁడుగను ఉండువాఁడేకాని యధికారిగ నుండఁడు. ఇతనికిఁ గొంత జీత మిచ్చెదరు. ఇతఁడు పురాతనాచారము నుల్లంఘింపఁడు. 'మా కధికారులు లేరు. మా కధికారులతోఁ బని లేదు' అని పురాతనులు అందురు. పరులను బాధపెట్టి వారిమీఁద నధికారము చేయవలయు నన్న ప్రవృత్తి వీరికి లేదు. ఇతరులస్వాతంత్ర్యమునకు వీ రెన్నఁడును భంగము కలిగింపరు. ఆరణ్యకావస్థ దగ్గఱకొలఁదియు మానవజాతికి తమకంటెఁ దక్కువజాతులవారిని వశపఱుచుకొని, తమ బానిసలుగ నుంచుకొని, వారిని కష్టపెట్టి తాము సుఖపడవలయు నన్న యిచ్ఛ పుట్టును.

ఈసంఘములు మొదట నొక్కచోట స్థిరముగ నుండునవి కావు. తమ కాహారము, పశువులకు మేఁత యెచ్చట దొరకునో యచ్చటికిఁ బోవుచుండెను. మనదేశమందలి లంబాడీలును, అప్పుడప్పుడు నుప్పుము లెక్క తిరుగుచు, చిన్నకత్తులు మొదలైన వమ్ముచుఁ దెనుఁగుదేశమునకు వచ్చుచుండెడి లంబాడీలవంటి మూఁకలును ఇటువంటివే. కొంతకాలము గడచినతరువాత నిట్టి జాతులు సంచారమును మాని యొకానొక ప్రదేశమున శాశ్వతముగ వసతిచేయును. అప్పుడా దేశమునకు నాజనులపేరు వచ్చును. కాళింగులు, ఆంధ్రులు, ద్రావిడులు మొదలయినజనులు మొదట పుట్టిరి. వారు సంచారము చేయుచుఁ జేయుచు నిలిచిపోయినదేశములకు కళింగదేశము, ఆంధ్రదేశము, ద్రవిడదేశము అని పేళ్లు వచ్చెను. సంస్కృతమునందు దేశములకు జనులనామములే వాడెదరు. ఆభావములో మద్రకులు అనఁగా మద్రదేశము, కళింగులు అనఁగా కళింగదేశము,

అంగ్రస్రులు అనఁగా ఆంగ్రశేశము అని యర్థము. ఈవిధముగ నరణ్యముసందుఁ దిగుసువారిలోనుండి గొప్పసంఘములును, గ్రామములును, పట్టణములును, దేశములును పుట్టుచున్నవి.

[కో. వేం. ల.]

**అనాగ్సగోరస్** — (క్రీ. పూ. ౫౦౦-౪౨౮) గ్రీకు తత్త్వవేత్త. ఇతఁడు ఆసియా మైనరులోని క్లజోమీనియను పట్టణమందు క్రీ. పూ. ౫౦౦ సంవత్సర ప్రాంతమున జన్మించెను. ౪౬౪-౪౬౧ ప్రాంతమున నితఁడు గ్రీసుదేశపు రాజధాని యగు ఏథెన్సుపట్టణమునకుఁ బోయి, ముప్పదిసంవత్సరములవఱకును అచ్చటనే యుండి తన విద్యామహిమచే మిక్కిలి కీర్తి వడసెను. పెరికలీస్, యురిపైడీస్ అనువండితులు ఇతనిశిష్యులు. సాక్రటీస్ కూడ నితనిశిష్యుఁడని కొందఱియభిప్రాయము. జ్యోతిశ్శాస్త్రమందును, గణితశాస్త్రమందును ఇతఁడు మిక్కిలి విఖ్యాతి చెందుటయే కాక తత్త్వవిచారశీలుఁ డనియు, సదాచారసంపన్నుఁ డనియు మిగులఁ బూజ్యతఁ వడసెను. నాస్తికులో నున్న మతిసుల నపహాసించె నన్న యపరాధము మోపి యీతనిపై నొకయభియోగము తెచ్చిరి. కాని యితని శిష్యుఁడైన పెరికల్సుయొక్క వక్తృత్వమహిమచే నితఁడు నిర్దోషుఁ డని విడువఁబడెను. ఏథెన్సులో నుండుట మంచిది కాదని యీతఁడు క్రీ. పూ. ౪౩౪-౪౩౩ ప్రాంతమున ల్యాంప్సాకసునకుఁ బోయెను. అచ్చటనే యితఁడు క్రీ. పూ. ౪౨౮ ప్రాంతమునఁ గీర్తిశేషుఁ డయ్యెను.

ఇతనిసిద్ధాంతానుసారముగాఁ బ్రపంచమందలి భూతసంఖ్య నాలుగు గాని, అయిదుగాని కాదు. అది యసంఖ్యము. నాలుగైదుభూతములలోనుండి యసంఖ్యవస్తుజాల ముత్పన్నమైన దనుట యసంగతము. ఇవన్నియు ననాదు లనవచ్చును. మొదట నివన్నియు నొకదానితో నొకటి కలసి వేఱువేఱుగ వర్తించుటకు వీలు లేకుండఁగ నుండెను. కాని గతి (Motion) రూపమైన చైతన్యమందుఁ బ్రవేశించి, వీని నన్నిటిని విడఁదీసి సృష్టియొక్క యభివృద్ధికిఁ గారణ మయ్యెను. ఏ వస్తువును నశింపదు. 'చావు' అనఁగా ఒకచోట నంతవఱకుఁ గూడియున్న వస్తువులు వేఱగుట. పుట్టుక యనఁగా నంతవఱకు వేఱుగ నున్న వస్తువులు కలయుట.

**అనాగ్జిమండర్** — గ్రీకుతత్త్వవేత్తలలో నితఁడు రెండవవాఁడు. క్రీ. పూ. ౬౧౧ సంవత్సర ప్రాంతమున నితఁడు పుట్టెను. క్రీ. పూ. ౫౪౭ ప్రాంతమునఁ జనిపోయెను. ఇతని మతమునకు 'అయోనియన్ తత్త్వజ్ఞానపంథ' యని పేరు. సువిఖ్యాతతత్త్వవేత్త యగు గ్రీకు థేలీస్ అభిప్రాయముల నితఁడు కొంతవఱ కనుసరించెను. కాని యతనిసిద్ధాంతములకు నితనిసిద్ధాంతములకు చాల భేదము కలదు.

థేలీస్ సిద్ధాంతముల ననుసరించి జల మొక్కటియే, యీసృష్టి కంతకును మూలతత్త్వము.

అనాగ్జిమండర్ దీని నొప్పుకొనఁడు. పృథివి, అగ్ని, జలము-ఈ మూఁటిలో నేదియు మూలతత్త్వము కాఁజాల దనియు, నీ మూఁటికి నతీతమైయున్న సర్వవ్యాపి యగు 'అనంతము' అనునదియే యీ మూలతత్త్వ మనియు నీతని సిద్ధాంతము. 'పృథివి, జలము, అగ్ని - ఇవి యన్నియు నశ్వరము లగు పదార్థములే. మూలతత్త్వము నాశరహితము. అజరహితము. అట్లగుటచే నీమూఁటిలో నేదియు మూలతత్త్వ మైయుండుటకు నవకాశము లేదు. ఏది నాశరహితమో, ఏది యగమ్యమో, ఏది స్వయంభూతమో యది అనంతము. ఆయనంతమే మూలతత్త్వము. దాని వలనననే, ఆ యనంతమునకుఁ గల చాలకశక్తి (Directive Power) వలననే యీ సృష్టికార్యమంతయు జరుగుచున్నది' అని యతనివాదము.

ఐరోపాఖండమున వ్యాప్తమయియున్న పరిణామవిషయక మగు సిద్ధాంతమునకు అనాగ్జిమండర్ సిద్ధాంతమే యాధార మని కొందఱి యభిప్రాయము.

జగదుత్పత్తివిషయమున మొదట నక్షత్రములు, తరువాత పృథివి, పిమ్మట సముద్రము, అటుపైని తక్కిన ప్రాణికోటియు సృజింపఁబడిన దని యితని యభిప్రాయము. ప్రాణికోటిలో ముందు మానవులు తరువాత మిగిలినవియు నఁట!

భూమి నుండ్రముగా నున్న దనియే యితని యభిప్రాయము.

**అనాతవరం** — తూర్పుగోదావరిజిల్లా అమలాపురము తాలూకాయందలి జమీన్‌దారీగ్రామము. జనసంఖ్య ౩,౦౮౭ (౧౯౩౧).

**అనాథపిండదుఁడు** — శాక్యబుద్ధునికి సమకాలికుఁడైన యొకకోమటి. శ్రావస్తిపట్టణ మితనినివాసస్థానము. ఇతనిఅసలు పేరు సుదత్తుఁడు. సుదత్తుఁడు మిగుల ధనవంతుఁడు, ఉదారుఁడు. నిరుపేదలైనవారికి, దిక్కుమాలినవారికి నితఁడు చూపినయౌదార్యమును బట్టి అనాథపిండదుఁ డనుపేరు వచ్చినది. బుద్ధదేవుఁడు రాజగృహమున నుండినకాలముననే యతనిని శ్రావస్తికిఁ గొనిరావలయు నని సుదత్తుఁ డెక్కుడుగఁ బ్రయత్నించెను. ఆకాలమున శ్రావస్తినగరమున సన్న్యాసు లుండుటకనుకూలమును ప్రశాంతమైన చోటేదియు లేకుండెను. బుద్ధుని యాజ్ఞపై సుదత్తుఁ డీలోటుఁ దీర్చివేయవలయు నని ప్రయత్నించెను. కాని యప్పటి శ్రావస్తిరాజు ప్రసేనజిత్తు అనాథపిండదుఁడు నిర్మింపఁ బోవు నుద్యానవనమునకు వలయుస్థలమును సులభముగ నిచ్చుట కంగీకరింపలేదు. ఎంతస్థలము కావలయునో యంతను గప్పఁగల బంగారము తన కీయవలయు నని యతఁడు కోరెను. సుదత్తుఁడు దానికి వెనుదీయలేదు. తుదకు రాజు అనాథపిండదునికి బుద్ధునిపైఁ గల భక్తి కచ్చెరువంది స్థలము నుచితముగ నొసంగివైచెను. తరువాత నందు దివ్యమగు తోఁట సిద్ధమయ్యెను. ఇతనిగృహమునఁ బ్రతిదినము ౫౦౦ మంది భ్రాతలు భోజనము చేయుచుండిరి. ప్రసేనజిత్తు

sampath_Ebooks



ఏర్పఱిచిన మఱియొక క్షేత్ర ముండెను. ఆ క్షేత్రమునందుఁగూడ నట్టి యేర్పాటులే యుండెను. రాజక్షేత్రమునం దియ్యఁబడునట్టి యాహారము విలువగలదిగను, మిక్కృష్ట మైనదిగను నుండినను భ్రాతలాహారమునుమాత్రము నైకొని దాని నారగించుటకు నాయకపింపకుని గృహమునకుఁ గాని, విశాఖునియింటికిఁ గాని పోవుచుండిరి. ఈసమాచారము మొదట కోసలునకుఁ దెలియదు. ఒకదినమున రాజు భోజనకాలమున నుపాహారద్రవ్యము నొకదానిం గొనివచ్చి సేవకున కొసంగి దానిని భోజనశాలలోని భ్రాతల కిచ్చి రమ్మని యంపఁగా నతఁడు పోయి వెంటనే మరలి వచ్చి భోజనశాలలో నెవ్వరును లే రని వచించెను. రాజు వారలంగూర్చి ప్రశ్నింప నాతిమిత్రులగృహములకుఁ బోయి రని దగ్గఱ నున్నవారు వచించిరి. అంత ప్రసేనజిత్తు భోజనానంతరమున వేశికునికడ కేఁగి యన్నిటిని మించిన యాహారమేది యని యడుగఁగా మిత్రగూపియాహారమే సర్వశ్రేష్ఠ మనియు, నట్టిమిత్రుఁ డెట్టి యాహార మిచ్చినను నది దివ్యభోజనమే యనియుఁ బ్రత్యుత్తర మిచ్చెను.

**అనాధృష్యుఁడు** — ధృతరాష్ట్రుని నూర్గురు పుత్రులలో నొకఁడు.

**అనామిక** — చిటికెన వ్రేలికి ప్రక్క నున్న వ్రేలు. ఒకప్పుడు శివుడు ఈ వ్రేలితోనే బ్రహ్మదేవుని శిరస్సు ఖండించెను. అందుచే నిది యపవిత్ర మైపోయెను. కావుననే యజ్ఞాదికార్యములలో దీనిని బవిత్ర మొనర్చుటకై దర్భలపవిత్రమును దీనికిఁ బెట్టుదురు. ఈవ్రేలిపేరైన నెత్తరాదు. అందులకే యనామిక యని దీనికి పేరు.

**అనాయువు** — మాఱుపేరు అనుగ. తండ్రి దక్షప్రజాపతి. మగఁడు కశ్యపుఁడు.

**అనార్కలి** — ఒక యువతి. అనార్కలి యనుపేరెన్నియో కథలలో నుదాహరింపఁబడుచుండును. జహాంగీరు అనురాగమునకుఁ బాత్రమైన యొకకాంత యని కొందఱి యభిప్రాయము. అనార్కలి యనుపేరుగల యొకయంతకత్తె రంజిత్ సింగున కుంపుడుకత్తెగ నుండిన దనియు, నామెపైఁగల యనురాగమునకు స్థిరచిహ్నముగ నతఁడు లాహోరునగరమున ఆమె పేర నొకవీథిఁ గట్టించె ననియు మఱియొకకథ ప్రచారమున నున్నది. అనార్కలి యను పేరుగల వీథి మాత్రము నేఁటికిని లాహోరునగరమునఁ గలదు.

**అనార్యులు** — ఆర్యులు కానివారు. హిమాలయమునకును, వింధ్యపర్వతమునకును నడుమ నున్నప్రదేశ మార్యావర్త మనియు, నందుండువా రార్యు లనియు, తదితరు లనార్యు లనియుఁ జెప్పఁబడుచుండెను. హిందూదేశమునందు నార్యులరాకకు పూర్వముండు మూలనివాసులను ఆర్యులు అనార్యు లనుచుండిరి. ఇటీవల పారసీక, పాశ్చాత్యు లనేకులును ఆర్యశాఖవారె యనియు సిద్ధాంతీకరింపఁబడినది. కనుక, ఈ యార్యశాఖలోఁ జేరనివారిని ఇప్పటి పాశ్చాత్యులు అనార్యు లనియెదరు.

**అనావల్** — ఇది గుజరాతుదేశమున నివసించు బ్రాహ్మణులతెగలలో నొకదానికి పేరు. వీరికి దేసాయీ లనియు, మస్తాను లనియు మఱి రెండుపేర్లు కలవు. దక్షిణగుజరాతుదేశపు టాదిమనివాసులు వీరు బరోడారాజ్యమునందలి నవసరీజిల్లాయందుఁ గల అనావల్ అను గ్రామముపేరునుబట్టి వీరి కీపేరు వచ్చినది.

ఈ యనావలులనుగూర్చి యొకచిన్నకథ కలదు: రావణసంహారమైపోయినతరువాత శ్రీరాముఁడయోధ్యకు మరలి వచ్చుచు దారిలో అగస్త్యాశ్రమమునకుఁ బోవలయు నని వింధ్యపర్వతప్రాంతమున దిగెను. ఆయన అచ్చట రావణవధచేఁ గలిగినపాపమును బోఁగొట్టుకొనుటకై ప్రాయశ్చిత్త మొనరించుకొనఁదలఁచెను. కాని యచ్చట బ్రాహ్మణు లెవ్వరును లేరు. అందఱు భిల్లులే. అందుచే హిమాలయప్రాంతమునుండి బ్రాహ్మణులను రప్పించెను. వారు రాముఁ డిచ్చిన దక్షిణ గొనకపోవుటచే వైశ్యధర్మ మనుష్ఠించుచు నుందురుగాక యని వారి నతఁడు శపించెను. ఆ బ్రాహ్మణులసంతతివారే యనావలులు.

* ఇది మఱి యొకచిన్నమార్పుతోఁగూడ ఒకొక్కచో వ్యాప్తిలో నున్నది: వింధ్యపర్వతప్రాంతమున బ్రాహ్మణు లెవ్వరును లేకుంటచే శ్రీరాముఁ డచ్చటిభిల్లులనే పవిత్రులుగఁ జేసె ననియు, అయినను వారికి సంపూర్ణముగ బ్రాహ్మణత్వ మబ్బకపోయిన దనియు నీమార్పు.

బరోడాలోని నవసరీప్రాంతమున వీరు విశేషముగఁ గలరు. మొత్తముమీఁద బరోడాలో వీరిజనసంఖ్య ౯,౫౧౬. వీరిలో దేసాయీలు, భథేలులు అను రెండుతెగలవా రున్నారు. దేసాయీలు ఉత్తములు. ఈ రెండుతెగలవారికిని చుట్టరికము కలియదు.


**అనాస** (Pine apple — Ananas sativa) — ఇది యేకదళబీజకములలోఁ జేరిన యొకఫలజాతి. 'బ్రొమిలియేసి' కుటుంబమునందలిది.

అనాస మొక్క కుఱుచప్రకాండము గలిగి సుమారు ౨-౪ అడుగుల యెత్తెదుగును. కాయ పుట్టినవెనుక నీప్రకాండము నిడివిగ సాగి యాకాయను ఆకులమధ్యమునుండి పైకిఁ దేల్చును. మొక్క మొదటినుండియు, ప్రకాండమునందునుగూడ పిల్కలు బయలుదేరును. అనాసమొక్కవేళ్లు సామాన్యముగ ౬-౮ అం. కంటె లోఁతునకుఁ గాని ౧-౧౫ అడుగులకంటె దూరముగఁ గాని వ్యాపింపవు. ఆకులు ౧౫-౨ అం. వెడల్పు గలిగి ౨-౫ అడుగులపొడవుండును. నారగలిగి కొంచెము దళముగ నుండును. వానియంచులను వాఁడియైన ముండ్లుండును. కొనగూడ ముల్లుదేరి యుండును. ఆకు లించుక పసిమితోఁ గాని, ఎఱుపుతోఁ గాని చేరినయాకుపచ్చవర్ణము గలిగియుండును. పూవులు చిన్నవి. అవి గుండ్రముగఁగాని, సమగోళాకృతిగఁ గాని యుండు నొక కృత్రిమఫలమునకు పైభాగమున నుండు 'కండ్ల'లో నమరి యుండును. కండ్లపై రెప్పలవంటి దళము లుండును. పుష్పములు మిథునములు; పుష్పకోశము త్రిదళవలయము. ఆకర కేవలయవాన

sampath_Ebooks

పైదు పత్రము లుండును. ఇవి యొకవిధమగు నీలవర్ణము గలిగి యుండును. కింజల్కములు ఆఱు. అండాశయముపై కీలము మూఁడుగఁ జీలి యుండును. గింజలు చిన్నవిగను, బల్లపఱుపుగను నుండును గాని తఱచు తప్పలుగ నుండును. కృత్రిమఫలము బాగుగ నెదిగినపుడు ౬-౧౨ అం. నిడివియు, ౪-౬ అంగుళములలావును గలిగియుండును. పండినపిమ్మట పసుపురంగు గలిగియుండును. దీనిపైని పిల్కవంటి తల యొకటి యుండును. తఱచు దీనిచుట్టును, కాయనెత్తిపైనను, కాయ క్రిందనుకూడ అనేకములగు చిన్నచిన్న పిల్కలు బయలుదేరును.

అనాసకు అమెరికాఖండపు ఉష్ణభాగములు (బహుశః బ్రెజిల్ దేశము) ఆదిస్థాన మయియుండు నని యెంచఁబడుచున్నది. అమెరికాఖండము కనుఁగొనఁబడినపిమ్మటనే యీమనోహరమగు ఫలజాతి యితరఖండవాసులకు లభ్య మయ్యెను. ౧౫౧౩-వ సంవత్సరమున గాన్‌సలి హార్నాండెజ్ (Goncate Hernandej) అనునాతఁడు ప్రప్రథమమున నీమొక్కల నైరోపాఖండమునకును, పిమ్మట నచట నుండి ౧౫౯౪-వ సంవత్సరమున పోర్చుగీసువారు హిందూదేశమున కును దెచ్చి రని తెలియుచున్నది. హిందూదేశమునుండి యిది చీనా మొదలగు ప్రాచ్యదేశములకు వ్యాపించెను.



అనాస మొక్క

ఇపు డిది అనేకోష్ణదేశములందు సాగు చేయఁబడుచున్నది. హవాయిదీవులందును, మలయాద్వీపకల్పమునను విస్తారముగఁ బెంపఁబడి యచటనుండి తాజాపండ్లును, నిల్వచేసిన మురబ్బాయును మిగతచోట్ల కెగుమతి యగుచున్నవి. హిందూదేశమునం దీపండ్లు వంగదేశమునను, బర్మాలోను, అస్సామునందును విరివిగ పైరుచేయఁబడుచున్నవి. చెన్న పురిరాజధానిలో పశ్చిమకనుమల పడమటిసముద్రతీరమున హెచ్చు. ఆంధ్రదేశమున సింహాచలముపైనను, పాలకొల్లుప్రాంతములందును కొంతవఱకు పండింపఁబడుచున్నవి.

తెలుఁగుజిల్లాలలో విస్తారముగఁ బెంపఁబడుచున్న 'దేశవాళీ' రకము ఆకులందు విస్తారము ముండ్లు గలిగి చిన్నకాయలను గాచును; కాని మేలయినదియు, బాగుగఁ గాచునదియు నై యున్నది. ఇది గాక సిలన్, ఢక్కా, సిల్వర్ రకము లాయాప్రాంతములందు ప్రసిద్ధి వహించియున్నవి. ఇటీవల క్వీన్, కెయన్ని, మ్యూ మొదలగురకము లితర దేశములనుండి తేఁబడి అచ్చటచ్చట సాగుచేయఁబడుచున్నవి. కడపటి రెండురకములును ఆకులం దంతగా ముండ్లు లేక పెద్దకాయలను గాచును. సింహళమున నొకప్పు డొకమ్యూరకపు కాయ ౨౪ పౌనులు తూఁగెనఁట. కాని యీరకములు దేశవాళీరకములంత మేలయినవి గావు. నాటినతోటనుండి ౩, ౪ సంవత్సరముల కొకసారి తీసి క్రొత్తతోట నాటు చుండవలెను; లేనిచో క్షీణించును.

అనాస ఉష్ణమండలవాసియయినను కంచిన్యూనోష్ణదేశము లందుఁగూడ పైరగును. ఇది సగటుఉష్ణత 'ఫారిన్‌హీట్' ౬౨° లు మొదలు 'ఫా' ౯౦° లవఱకుఁ గలప్రదేశములందు జయప్రదముగ సాగుచేయఁబడుచున్నది. ౧౦౦౦ - ౨౦౦౦ అడుగులఉన్నతముగల ప్రదేశములు దీని కనుకూలములు. కాని సముద్రపుమట్టమునుండి ౫౦౦౦ అడుగులవఱకు ఉన్నతముగల ప్రదేశములందుసైతము ఇది పెంపఁబడుచున్నది. వర్షపాతమునఁగూడ నిది చాల హెచ్చుతగ్గుల నోర్చును. ౨౫ అం. మొదలు ౧౦౦ అం. వఱకును గురియుప్రదేశ ములం దిది పైరగుచున్నది.

అనాసతోఁటలను నాఁటుటకు ఆగస్టు, సెప్టెంబరు నెల లనుకూల ములు. అప్పటికి కాపు ముగియును గావున నపుడే తోఁటలలో ననవ సరములగు పిల్కలను దీసి మరల నాఁట వీలగును. పిల్కలు ముందు లభించుచో జూన్, జూలై నెలలలోఁగూడ నాఁటవచ్చును.

అనాస పలువిధములగు నేలలలో పైరగును. నీరు సులభముగ వడియుటయే అనాసకుఁ దగిననేలలముఖ్యలక్షణము. కావున నిందుకు ఇసుకగరువులును, గరుములును తఱచు ఎన్నఁబడుచుండును. సేంద్రి యపదార్థము హెచ్చుగ నుండుటచే క్రొత్తగ నడవి నఱకి సాగునకుఁ దెచ్చిననేల లీతోఁటలకుఁ బ్రశస్తములు. జిగురునేలలో కాయలు పెద్ద విగ ఎదిగినను రుచిమంతములుగ నుండవు. ఏమాత్రము చౌటికొడినేల లైనను దీనికి పనికిరాదు.

అనాసతోఁటలను ఎండలు తీవ్రముగ లేనిచోట్ల ప్రత్యేకముగ నాఁటుట మంచిది. ఎండలు మిక్కుటముగ నుండుచోట్ల నీతోఁటలలో నచ్చటచ్చటను, చుట్టును అరఁటిమొక్కలను నాఁటుట మంచిది. సింహా చలమున నీతోఁటలలో పనస, మామిడి, జీడిమామిడి మొదలగువాని నాఁటి, యవి కాచునప్పటికి అనఁగా ౧౦ సంవత్సరములయినపిమ్మట అనాసతోఁటను దీసివేయుదురు. సమప్రదేశములందుఁగూడ సపోటా, మామిడి మొదలగు తోఁటలను బెంపఁదలఁచుప్రదేశములలో వానితోపా

టనాస మొక్కలనుగూడ నాటి యవి కాపు పట్టుసరికి అనఁగా ౫-౬ సంవత్సరములలో అనాసమొక్కలను దీసివేయవచ్చును. అనాస మొక్కలు కొంత నీడ నోర్చుటచే వీనిని ముదిమామచెట్లచుట్టును, బత్తాయి, నారింజ మున్నగుతోఁటలలోను నాటుటగూడఁ గలదు. కాని యిట్లు నీడను పెరిఁగినకాయ లంతరుచిగా నుండవు.

సింహాచలమున నడవిని నఱికి, కంపను కాల్చి, నేలను త్రవ్వి, మోళ్లను రాళ్లను దీసి, యారాళ్లను ౧-౧½ గజములదూరమున వరుస లుగఁ జేర్చుటచే నేల నంతరములుగ నేర్పడి, వానిపై పిల్లలను నాటుదురు. సమప్రదేశములందు నేలను బాగుగ దున్ని సత్తువ చేసి ౮ అంగుళల లోతుకాల్వను (౧-౧½ అడుగు వెడల్పు, ౯-౧౨ అం. లోతు) త్రవ్వి వానిమధ్యస్థలములపై నామంటిని పఱచి యామెడలపై నాలుగడుగులదూరముగల వరుసలలో ౧½ - ౨ అడుగుల కొక్కొక్క పిల్లను నాటవలయును.

అనాసపిల్లలు నాలుగువిధములు:—

౧. నేలపిల్లలు:— ఇవి మొక్కలమొదట నేలలోనుండి పుట్టును. సన్నని నిడివియాకులు గలిగియుండును. వయసును బట్టియు పోషణనుబట్టియు నాటినసంవత్సరమే కాని, మఱుసటిసంవత్సరమునఁ గాని కాచును.


౨. కాడపిల్లలు:— ఇవి కాయలను గాచినకాఁడలపై నాకు సందులలో బయలుదేరును. వీనియాకులు కుఱుచగను, కొంచెము వెడల్పుగను నుండును. ఇవిగూడ పైవానివలెనే నాటిన తొలిసంవత్సరమునఁ గాని, మఱుసటిసంవత్సరమునఁ గాని కాచును.

౩. తలలు:— ఇవి కాయనెత్తిమీఁద బయలుదేరును. ఇవి సామాన్యముగ నాటినపిమ్మట రెండవ సంవత్సరమునఁ గాని, మూఁడవ సంవత్సరమునఁగాని కాచవు.

౪. కాయపిల్లలు:— ఇవి కాయనెత్తిమీఁద నుండుతలను గాని, కాయకు క్రిందఁ గాని చుట్టును అనేకముగ బయలుదేరు చిన్న పిల్లలు. ఇవి నాటినవెనుక కాచుట కధమము ౩ సంవత్సరములు పట్టును.

నాటుటకు కాడపిల్లలు ప్రశస్తముగ నెంచఁబడుచున్నవి. కాని యవి తోఁటలలో కాపునకు వదలఁబడుటచే దొరకుట కష్టము. కావున సామాన్యముగ నేలపిల్లలే నాటవలసియుండును. తలలను, కాయపిల్లలను మొదట నొకనారుమడిలో నాటి యొకటి రెండు సంవత్సరములు పెరిఁగినపిమ్మట నాటఁదగును.

పిల్లలను నాటునపుడు వానియడుగుననుండు కొన్ని యాకులను దీసివేసి సుమా రొకయంగుళముపొడువున ప్రకాండమును బయలుపఱుపవలెను. ఈప్రకాండమునకు మన్ను అంటిననే కాని వేళ్లు పుట్టవు. నేలపిల్లలనుండి ప్రాఁతవేళ్లను దీసివేయుట మంచిది. పిల్లలను ౨-౩ అంగుళములకంటె హెచ్చులోఁతున నాటఁగూడదు. సింహాచలమున సామాన్యముగ నెకరమునకు సుమారు ౮౦౦౦ పిల్లలను నాటుదురు. సమప్రదేశములందు ౪ అడుగులదూరముగల వరుసలలో ౧½ అడుగులదూరమున నాటుచో సుమారు ౭ వేల పిల్లలును, ౨ అడుగులదూరమున నాటుచో ౫౦౦౦ పిల్లలును పట్టును.



అనాస పొద

అనాసతోఁటలు వర్షాకాలమున నాటఁబడుటచే నాటినప్పుడొకసారి నీరు పోసినఁ జాలును. సింహాచలమున నదియు చేయఁబడుటలేదు. తోఁటలలో నాటినవెనుక నొకసారి కలుపు తీయుట తప్ప నాసంవత్సరమున మఱేపనియుఁ జేయఁబడుటలేదు. తరువాతి సంవత్సరములందేఁటేఁట కాయలకోఁత ముగిసినపిమ్మట నేల నొకసారి త్రవ్వి తుప్పలను దీసివేయుదురు. వర్షములన నెచ్చటనైన నంతరములు చెడినచో నవి బాగుచేయఁబడును. ౩ సంవత్సరము లయినపిమ్మట పిల్లలు హెచ్చుగ బయలుదేఱుచో వానిని దీసివేయుదురు. సమప్రదేశములందు పిల్లలను నాటినవెనుక తోఁటలలో నవసరమైనప్పుడెల్ల (అధమము రెండుసార్లయినను) గొప్పు త్రవ్వి కలుపు తీయవలెను. తోఁట కాపునకు వచ్చినపిమ్మట పదును తగినంత లేనిచో నీరు కట్ట నారంభింపవలెను. వేసవిలో నిట్లు ౪-౮ తడు లవసరము కావచ్చును. ఎండ తీవ్రముగఁ గాసి,కాయలు డాగుపడు నని తోఁచినచో వానికి అరఁటిచొప్పగు చుట్టి కాపాడవలెను. మఱుసటిసంవత్సరమునుండి ప్రతియేఁడును, కాయలకోఁత పూర్తి యయినపిమ్మట తోఁటలో పైపైని పారలతో త్రవ్వి కలుపుతీసి యెరువు వేయవలెను. వేసవిలో పైని చెప్పినట్లు నీరు కట్టవలెను.

అనాసతోఁటలకు బూడిదతోఁగూడిన పశువులపెంట అనుకూలము. ఎకరమునకు ఏఁటేఁట ౩౦-౫౦ బండ్లు వేయవలెను. దానికిఁ దోడు కొంత తైలపిష్టముగాని, అమ్మోనియాగంధకితముగాని వేయుట చాలచోట్ల లాభకరముగ నుండును. మొక్క ౧-కి ౨-౩ ఔన్సుల తైలపిష్టము (వేరుసెనగ లేక ఆముదపుపిండి) గాని ½-౧ ఔన్సు అమ్మోనియాగంధకితము గాని వేయవచ్చును. దీనిని పశువులపెంటతో

sampath_Ebooks


పాటుగాని, వర్షాకాలము ముగియులోపల రెండవసారి గొప్పు త్రవ్వుటకు ముందుగాని వేయఁదగును. అనాసమొక్కలవేళ్లు దూరముగ వ్యాపింపకపోవుటచే ఎరువును మొక్కలచుట్టును ఒక అడుగుదూరమువఱకు పఱచి పైపైని గొప్పుత్రవ్వవలెను. ఈవిషయమున హవాయిద్వీపము నందుఁ గలిగిన యనుభవమును బట్టి ప్రతివేయిమొక్కలకును ౧౧ పౌనుల నత్రజనియు, ౨౨ పౌనుల పోటాషును, ౯ పౌనుల స్ఫురత్పంచామ్లజనిదమును ఎరువులరూపమున వేయుట యుక్తమని తేలెను.[1]

అనాసకాయలు బాగుగ ముదిరి పసిమిరంగు వచ్చినపిమ్మట కోయఁదగును. తోటలోనే బాగుగ పండఁబారినకాయలు రుచిమంతముగ నుండును. కాయ కోసినవెనుక ౨-౩ రోజులలో మెత్తఁబడి పరిమళము రావలెను. కాని యిట్టిస్థితిలోఁ గోసినకాయలు ఎగుమతికిఁ గాని, వ్యాపారమునకుఁ గాని పనికిరావు. సామాన్యముగ కాయలు కోసినవెనుక ౮-౧౦ దినములవఱకు నిల్వయుండునటువంటివి కోయఁబడు చుండును. ఇంతకంటెను ముందుగఁ గోసినకాయలు పూర్తిగా రుచిహీనములుగ నుండును.

సింహళములోని తోటలలో సామాన్యముగ తొలిసంవత్సరమున 3 వేల కాయలును, తరువాతి ౫ సంవత్సరములలో నేటేట ౬౦౦౦ కాయలును, పిమ్మట నాల్గుసంవత్సరములకు సంవత్సరమునకు సగటున 3 వేల కాయలచొప్పునను మొత్తమువిూఁద ౧౦ సంవత్సరములకు ౪౫ వేల కాయలు దిగుబడి యగు నని అంచనా వేయఁబడెను. కాయలధర ౧౦౦-కి రు. ౬ ల చొప్పున సుమారు రు. ౨౮౦౦ లు వచ్చును. నేలను సిద్ధముచేసి నాటుటకు సుమారు రు. ౪౦౦ లును, పిమ్మట ౧౦ సంవత్సరములలోఁ జేయవలసిన పనులకు మఱి రు. ౩౦౦ లును వ్యయమగును. నికరపులాభము సుమారు రు. ౨౦౦౦ అనఁగా సంవత్సరమునకు రు. ౨౦౦ లుండును.

అనాసతోఁటల కీటకముల చీడలవలనఁ గాని, తెగుళ్లవలనఁగాని బాధ తక్కువ. కాని పండ్లను నక్కలు, పందులు మొదలగు జంతువులు కొట్టకుండఁ జూడవలసియుండును.

అనాసపండు ఇంచుక పులుపుతోఁగూడిన తీపి గలిగి ఆకర్షకవంతమగు పరిమళము గలిగియుండును. ఇం దితరఫలజాతులలోకంటె హెచ్చుఖనిజద్రవ్యము లుండును. ఏ. బి. విటమినులు తక్కువ. విటమినుపరిమాణము మధ్యమము. అనాసపండురసము రక్తమును శుభ్రపఱచును. తాజాపండ్లరసము పంచదారతో కలిపి పుచ్చుకొనుచో నిస్త్రాణను పోఁగొట్టును. విస్తారముగఁ బుచ్చుకొనుచో నతిమూత్రవ్యాధికిఁ గారణ మగునందురు.

తాజాపండ్లే కాక పంచదారపాకమున డబ్బాలలో నిల్వచేసిన పండ్లుకూడ చాల విరివిగ నుపయోగింపఁబడుచున్నవి. అనాసమురబ్బా డబ్బాలు సామాన్యముగ నీదేశమునఁగూడ ఫలాహారశాలలలో విక్రయింపఁబడుచుండును. అనాసపండ్లరసముగూడ నిల్వచేసి విక్రయింపఁబడు చున్నది. ఈపండ్లనుండి లేహ్యము (Jam), హల్వా (Jelly) మొదలగునవిగూడ తయారుచేయఁబడుచున్నవి.

అనాస-ఆకులనుండి నారను దీయవచ్చును. నూటికి ౨-౨౫ వంతున దిగుబడియగును. ఈనార మృదువుగను, గట్టిగను నుండును. ఇందు నిగనిగలాడుచు నునుపుగ నుండు కొంతభాగమును నూలుతోను, పట్టుతోను కలిపి బట్టలనేత కుపయోగింపవచ్చును. తక్కినది త్రాళ్లు మొదలగుపనుల కుపయోగించును. తడిసినను త్వరలోఁ జీకిపోకుండుటచే దీనిని గొంటలు పల్లెంతాండ్రు గాలపుత్రాళ్ల కుపయోగింతురు. ఒకప్పుడీనార వంగదేశమునుండియు, పడమటితీరమునుండియు నెగుమతి యగుచుండెనట. కాని నూలువస్త్రముల పోటీచే నీవ్యాపార మిప్పుడంతరించెను.

[గో. ప్ర.]

**అనాహడ్గడతహసీల్ (లేక బర్నాలా)** — ఇది పాటియాలసంస్థానమునందలి అనాహడ్గడనిజామతులోని ఒక తాలూకా. ఈతాలూకావైశాల్యము ౩౪౬ చదరపుమైళ్లు. ఇందలి జనసంఖ్య ౧,౦౫,౯౮౯. ఇందు అనాహడ్గడము (జనసంఖ్య ౬,౯౦౫) హాడియాయా (౫,౪౧౪), ధానెరు (౬,౬౧౦) అను గ్రామములును, ౭౬ పల్లెలును గలవు. ఈతాలూకా ౧,౮౦,౦౦౦ రూపాయలు చెల్లుచున్నది.

**అనాహడ్గడనిజామత్** — సంగ్రూరునందున్న పాటియాలసంస్థానమునందలి ఒకజిల్లా. దీనివైశాల్యము ౧,౮౩౬ చదరపుమైళ్లు. ఇందలిజనసంఖ్య ౩,౬౬,౩౬౬. ఇందు గోవిందగడము, ధానెరు, బర్నాలా, హాడియాయా అను నాలుగుగ్రామములును, ౪౫౪ పల్లెలు నున్నవి. ఈజిల్లాకు బర్నాలా, లేక అనాహడ్గడ మను నది ముఖ్యపట్టణము. ఈజిల్లా ౬,౨౦,౦౦౦ రూపాయలు చెల్లుచున్నది.

**అనాహతము** — ఆకాశము సకలబ్రహ్మాండములకును నాధారము. శబ్దమాకాశమునకు వ్యక్తగుణము. విశ్వమునకు ఆకాశము వలెను, శబ్దమును విశ్వమున కాధారము. శబ్దము అనాహతము, ఆహతము అని ద్వివిధము.

'అనాహతం తు యచ్ఛబ్దం తస్య శబ్దస్య యత్పరమ్,
తత్పరం విందతే యస్తు స యోగీ ఛిన్నసంశయః'

—ధ్యానబిందూపనిషత్తు.

అనాహతశబ్దమునకంటె పరమగు (శ్రేష్ఠమగు) నాదబ్రహ్మమును బొందినయతడే సంశయరహితుఁడైన యోగి.

1, Hawaii Pineapple Colonial Station Bulletion No. 2 of 1925,

 sampath_Ebooks

'అనాహత మతిక్రమ్య విశుద్ధే ప్రాణా న్నిరుధ్యాఽఽజ్ఞామనుధ్యాయన్ బ్రహ్మరంధ్రం ధ్యాయన్ త్రిమాత్రోఽహ మిత్యేవం సర్వదా ధ్యాయన్ పశ్యత్యనాకారశ్చ భవతి'

—హంసోపనిషత్తు.

అనాహతచక్రము నతిక్రమించి విశుద్ధచక్రమునందు ప్రాణముల నిరోధించి ఆజ్ఞాచక్రము ద్వారా బ్రహ్మరంధ్రమునుచేర్చి జ్ఞానపరుఁడై ఓంకారము నేనని సర్వదా ధ్యానించు పురుషుఁడు పరమును వీక్షించి యనాకారుఁడగును.

విశ్వమయమైన మూలనాదము ఆహత మనఁబడు శబ్దబిందువుల యొక్కఁ, లేక శబ్దపరమాణువులయొక్క సంయోగమువలనను ధ్వనులును, వర్ణములును గలుగుచున్నవి. బిందువులసంయోగము ఆకాశతత్త్వమునందు శబ్దస్వరూపముననను, అగ్నితత్త్వమునందు రేఖామండలరూపముననను, వాయుతత్త్వమునందు స్పర్శరూపముననను, జలతత్త్వమునందు రసరూపముననను, పృథ్వీతత్త్వమునందు గంధరూపముననను గ్రాహ్యము లగుచున్నవి.

శ్లో. శబ్దో ధ్వనిశ్చ వర్ణాశ్చ మృదంగాదిభవో ధ్వనిః,
కంఠసంయోగజన్మానో వర్ణాస్తాః కాదయో మతాః.

మృదంగాదులు గలుగఁజేయు శబ్దములు ధ్వనులు. కంఠాదిసంయోగములవలనను గలిగెడి శబ్దములు వర్ణములు. వైదికమతపరిణామమునందు పురుషసూక్తమువలె శ్రీసూక్తము పురుషార్థమునకు సాధనముగను సనాతనహిందూవిజ్ఞానము నిర్ణయించుచున్నది. వేదములందు ఆదికాలమునందు దేవారాధనము సామాన్యముగ పురుషపరముగ నున్నవిధమును ఋక్కులు, మంత్రములును విశదము చేయుచున్నవి.

'దేవో వరుణః ప్రజాపతిః'
'జ్ఞాత్వా దేవం ముచ్యతే సర్వపాశైః'
'యో దేవో అగ్నౌ, యో దేవో అప్సు.........
తస్మై దేవాయ నమోనమః'
'విశ్వ మాదౌ స దేవః'
"బ్రహ్మా దేవానాం ప్రథమః సంబభూవ'
'భర్గో దేవస్య ధీమహి'


ఇత్యాదిఋక్కులు, బ్రహ్మసూత్రములు, ఉపనిషత్తులు, భగవద్గీతాదులును సామాన్యముగ జగత్కారణమును విశ్వేశ్వరుఁడైన దేవునిగ నిరూపించుచున్నవి. మహానారాయణము, త్రిబిందు, నాదబిందు, యోగశిఖ, హంస మొదలగు నుపనిషత్తులు జగత్కారణమును విశ్వేశ్వరియైన దేవినిగ నిరూపించుచున్నవి. ఇతరార్యజాతుల మతములును జగత్కారణమును పురుషునిగ నిరూపించుచున్న విధమును వారిమతసిద్ధాంతములు, దేవారాధనవిధానములు, సంప్రదాయాచారములు వ్యక్తము చేయుచున్నవి. సెమెటికుజాతుల మతములును జగత్కారణమును పురుషునిగ నిరూపించుచున్నవి. పింగళజాతులమతమును జగత్కారణమును పురుషునిగ నిరూపించుచున్నది. యూదు, క్రైస్తవ, మహమ్మదీయమతములు దేవుఁడు, తండ్రి, అల్లా మొదలగు పురుషనామములను జగత్కారణముగ సంబోధించుచున్నవి. వేదాంతము జగత్కారణమును నిర్గుణమైన పరబ్రహ్మముగ నిరూపించుచున్నది.

వైదికమతవికాసమునందు కాలక్రమమున జగత్తునకు పురుషుఁడును, శక్తియును కారణములుగ నిరూపింపఁబడినవి. దేవభాగవతమునవలె దేవీభాగవతమును, పురుషసూక్తమువలె శ్రీసూక్తమును, వైదికమతసంప్రదాయారాధనాచారములందు పరిపాటియైనవి. ఆదికాలమునందు మతానుష్ఠానమునకు వేదములు ప్రమాణము లైనట్లులు కాలక్రమమునను ఆగమములును వైదికమతాచారములందు ప్రమాణములైనవి. శివకేశవాదులపూజలవలె కాళీ, లక్ష్మీ, సరస్వతీ, గాయత్ర్యాది దేవీపూజలును వైదికమతమునకు పరిపాటియైనవి. దేవీపూజలందు శక్తిపూజ ప్రధానస్థానమును హిందూపూజాకల్పవిధానమునందు నాక్రమించినవిధము జిజ్ఞాసువులకు పరిశోధనార్హముగ నున్నది. శాక్తేయము ఆర్యేతరమతసంప్రదాయ మని సాధించుటకు సనాతనవైదికమతపరిశోధనము నిదర్శనములను సమకూర్చుచున్నది. శక్తిపరమైన ఆగమములును, లలితాసహస్రనామాదిస్తోత్రములును నీవిషయమును పరిస్ఫుటము చేయుచున్నవి.

యజుర్వేదీయపురుషసూక్తమునందు 'సహస్రశీర్షా పురుషస్సహస్రాక్షస్సహస్రపాత్, స భూమిం విశ్వతో వృత్వా అత్యతిష్ఠద్దశాంగులమ్. పురుష ఏవేదగ్ం సర్వమ్, యద్భూతం యచ్చ భవ్యమ్' అనియును, నారాయణసూక్తమునందు 'సహస్రశీర్షం దేవం, విశ్వాక్షం, విశ్వశంభువం, విశ్వం నారాయణం దేవ మక్షరం పరమం పదమ్.........స బ్రహ్మా స శివస్సహరి స్సేంద్ర స్సోఽక్షరః పరమస్స్వరాట్' అని వర్ణింపఁబడిన జగత్కారణము శ్రీసూక్తమునందు 'ఈశ్వరీగ్ం సర్వభూతానాం త్వా మిహోపహ్వయే శ్రియమ్' అని దేవీపరముగ వర్ణింపఁబడినది. శ్రీవిద్యాపరమైన ఆగమములందును, స్తోత్రములందును దేవీవర్ణనలు ఆర్యేతరసంప్రదాయములను స్ఫురింపఁజేయుచున్నవి. లలితాసహస్రనామావళియందుఁ గల మలయాచలనివాసిని, వింధ్యాచలనివాసిని, మాతంగకన్య మొదలగు నామముల భావార్థములు శాక్తేయమునకు ఆర్యేతరసంప్రదాయమును నిరూపించుచున్నవి. వర్తమానకాలమునను దేవీపూజాపరమైన ఆగమముల వ్యాపనాభ్యాసములును, దేవీపూజయును విశేషముగ వంగదేశమునందును, మళయాల ద్రవిడాంధ్రదేశములందును వ్యాపకము గలిగియుండుట ఆర్యేతరసంప్రదాయమునకు నిదర్శనము. ఆర్యసంప్రదాయాగతమైన పురుషదైవారాధనము ఆర్యేతరసంప్రదాయాగతమైన దేవీదేవతారాధనముతో సమ్మేళనమును పొందినవిధమును హిందూమతపరిణామము విశదము చేయుచున్నది. హిందూమతోద్ధరణము జేసిన ఆదిశంకరస్వాములకృతమైన శివానందలహరివలె సౌందర్యలహరీస్తోత్రము హిందూమతవ్యాపనమునందు కాలక్రమమున నిగమాగమములకు కలిగినసంయోగమును విశదము చేయుచున్నది.

sampath_Ebooks

# అనాహతము



ప్రాణ ప్రవాహములు

sampath_Ebooks

sampath_Ebooks


# అనాహతము

ఆదికాలమునందు బాహ్యదేవతారాధనములతో నారంభమైన వైదికమంత్రములు కాలక్రమమున ఆత్మారాధనమునందు సమన్వయము పొందినవిధమును వేదాంతశాస్త్రము విశదము చేయుచున్నది. సృష్టివికాసమునకు సాధనభూతమైన బాహ్యశక్తిని ఆత్మగతము చేసికొనుటకు ఆగమాంగములైన మంత్ర, యంత్ర, తంత్ర శాస్త్రములు శ్రీవిద్యారూపమున వికాసమును పొందినవి. బ్రహ్మాండభరితమైన చిచ్ఛక్తి పరమాణువునందును, పరబ్రహ్మమునందును వ్యాపించియున్న విధమును సాధనరూపమున సాక్ష్యము చేయుటకు శ్రీవిద్యోపాసనము సోపానక్రమతవికాసమునందు వ్యాప్తి గాంచినది. సర్వవ్యాపకమైన చిచ్ఛక్తి బ్రహ్మాండమునందువలె పిండాండమునందును గలదు. మహాశక్తి విక్షేపావరణరూపములందు జగత్తుగ పరిణమించుచున్నది. త్రిపురసుందరి, మహాకాళీశక్తిరూపిణి యైన శివశక్తి ఇచ్ఛాజ్ఞానక్రియాశక్తులమూలమున శక్తిత్రయరూపమైన జగత్ప్రపంచమునను నిలయముచున్నది. బ్రహ్మాండమునందు మాయాశక్తివలె పిండాండమునందు మనస్సు త్రిగుణాత్మకమై విక్షేపావరణములందు జగత్తును కల్పించుచున్నది. అనాహతశబ్దరూపమైన జగత్తు అనాహతశబ్దరూపమైన శక్తిమూలమున నిర్మించుట ఆగమశాస్త్రములకు ప్రయోజనము. చిచ్ఛక్తి త్రిగుణాత్రయమై నాదబిందుకళారూపమున కారణసూక్ష్మస్థూలరూపప్రపంచముగ పరిణమించుచున్నది. సచ్చిదానందపరమైన శివతత్త్వమువలన శక్తితత్త్వము గలుగుచున్నది. శక్తితత్త్వమునుండి సదాశివతత్త్వమైన నాదమును, నాదమునుండి ఈశ్వరతత్త్వమైన బిందువును కలుగుచున్నవి. ఈ పరాబిందువునుండి మహాశక్తియును, మహాశక్తినుండి త్రిపురస్వరూపమైన విశ్వమును గలుగుచున్నవి. త్రిబిందుస్వరూపమైన ప్రపంచము పరా, సూక్ష్మ, స్థూల, రూపముల గోచరం బగుచున్నది. శివశక్తుల సంయోగము నాదరూపమున మహాయోగమై సృష్టి గలుగుచున్నది. కారణబిందువు మూలప్రకృతిరూపమున నిర్గుణముగను, సగుణప్రకృతిస్వరూపమునందు త్రిగుణాత్మకముగను గోచరమగుచున్నది. ఇచ్ఛాక్రియాజ్ఞానశక్తులు, సత్త్వరజస్తమోగుణములు మూలశక్తిగుణవిభాగములు. జ్ఞానేచ్ఛాక్రియాశక్తులు, సూర్యచంద్రాగ్నులు, రుద్రబ్రహ్మవిష్ణులు, రౌద్రజ్యేష్ఠావామాదేవిమూర్తులు బిందునాదకళాశక్తుల పరిణామములు.

బిందువులయుత్పత్తి :— సర్వవ్యాపకమైన చిచ్ఛక్తి విస్ఫూర్తిరూపమున బిందురూపమును దాల్చుచున్నది. శివశక్తి విస్ఫూర్తిప్రకాశము బిందువునకు నాదరూపపరిణామమును గలిగించుచున్నది. శివశక్తిస్వరూపమైన బిందువు శక్తిశివసంజాతమైన నాదము మహాయోగరూపమున కళాసంభవ మగుచున్నది. బిందునాదకళారూపమైన మూలప్రకృతి కామకళారూపమున, ప్రపంచరూపమున పరిణమించుచున్నది. పంచవింశతితత్త్వమయమైన ప్రపంచము శక్తిమయమై శక్తియోగసాధనమున పురుషార్థసిద్ధికి సాధనభూతముగ నున్నది. మహత్తు, మనోబుద్ధిచిత్తాహంకారములు, పంచభూతములు (పృథివ్యప్తేజోవాయ్వాకాశములు), పంచతన్మాత్రలు, కర్మేంద్రియములు (వాక్పాణిపాదపాయూపస్థములు), జ్ఞానేంద్రియములు (శ్రోత్రత్వక్చక్షుర్జిహ్వాఘ్రాణేంద్రియములు) — ౨౫ తత్త్వములు.

శక్తి - శబ్దము :— అవ్యక్తమైన శక్తికి ప్రథమవ్యక్తరూపము నాదము. నాదము శబ్దస్వరూపమున బ్రహ్మాండావృతమై బ్రహ్మాండమును శబ్దాధానమునను గ్రాహ్యము చేయుచున్నది. విశ్వకారణమును గ్రహించుటకు శబ్దము మూలాధారము. వేదములందు శబ్దబ్రహ్మము విశ్వమునకు మూలాధారముగ ప్రతిపాదింపబడినది. ఋగ్వేదమునందు శబ్దబ్రహ్మమంత్రమునందు "చత్వారి శృంగా త్రయోఽస్య పాదాః........" అను మంత్రార్థము శక్తిసంజాతమైన శబ్దప్రభావమును విశదము చేయుచున్నది. పరబ్రహ్మవాచ్యమును, ఉపనిషత్సారమును, సకలమంత్రార్థప్రదమును నైన ఓంకారప్రభావమును, నాదము శబ్దార్థభావరూపములను ప్రపంచపరిణామమును పొందిన విధమును వ్యక్తము చేయుచున్నది. శబ్దము ప్రథమావస్థయందు భావదశయందు (౧) పరారూపమునను, భావము సూక్ష్మదశయందు (౨) పశ్యంతీరూపమునను, భావము శబ్దరూపమున (౩) మధ్యమారూపమును వాగ్రూపమును, (౪) వైఖరీరూపమును దాల్చుచున్నది. భావము ఇచ్ఛాశక్తి, క్రియాశక్తి, జ్ఞానశక్తులసంయోగమువలన శబ్దార్థమయమైన ప్రపంచార్థమును గ్రాహ్యము చేయుచున్నది. సకల శబ్దార్థములకును స్థూలరూపమున మూలాధారమైన అక్షరామ్నాయము ప్రపంచార్థమును గ్రహించుటకును, పురుషార్థమును సాధించుటకును సాధనభూతముగ నున్నది. సకలశాస్త్రములు, సకలతంత్రములు, సకలమంత్రములు, సకలకళలు, సకలయోగములు, సకలవేదములు, భావశబ్దార్థపరిణామమైన పురుషార్థసాధనమునకు వినియోగపడుచున్నవి. వైదికవిజ్ఞానపరిణామమునందు మంత్రతంత్రయోగశాస్త్రములు పురుషార్థసిద్ధికి వినియోగపడినవిధము జిజ్ఞాసువులకు విచారయోగ్యముగ నున్నది.

శబ్దము :— శబ్దము అర్థముగను, అర్థము ప్రత్యయముగను, ప్రత్యయము స్పందనముగను ప్రపంచపరిణామమును బొందుచున్నది. సమష్టియం దేకమైన దశాదేశములు వ్యష్టియందు భిన్నములుగాఁ గనుపడినను నేకముగ నున్నవి. అవ్యక్తనాదము సువ్యక్తనాదరూపమును దాల్పఁగల విధమును అక్షరామ్నాయము తెలుపుచున్నది. అక్షరామ్నాయము సకలశబ్దార్థములను సువ్యక్తము చేయఁగలవిధమునకు సంస్కృతాక్షరామ్నాయము నిదర్శనముగ నున్నది. సంస్కృతభాషయం దక్షరామ్నాయము అకారముతో నారంభమై హకారముతో నంత మొందుచున్నది. అకారమునుండి హకారమువఱకును గల అక్షరములు శబ్దములను, పదములను, ప్రత్యయములను, పదార్థములను సమకూర్చుచున్నవి. అహమ్ శబ్దము ఆద్యంతవర్ణమాలాంతర్గతమైన సకల ప్రపంచమును నిరూపించుటకు సాధనముగ నున్నది. ఆదివర్ణమైన అకారమునకును, అంత్యవర్ణమైన హకారమునకును నడుమఁ గల వర్ణసముదాయము విద్యలకును, మంత్రములకును కళలకును మూలాధారమై సకల పదార్థములకు చిహ్నముగ నున్నది.

sampath_Ebooks

అహమ్ శబ్దము పరా పశ్యంతీ మధ్యమా వైఖరీరూపమైన సకల ప్రపంచమును వ్యక్తము చేయునట్లు హింమావిజ్ఞానము మంత్రతంత్ర శాస్త్రరూపమున నిరూపించుచున్నది.

అకారము శివస్వరూపము, నిర్గుణము; హకారము శక్తిస్వరూపము, సగుణము. నిర్గుణ సగుణస్వరూపమును శివశక్తిస్వరూపమును నైన అహమ్‌కారము కామకళాస్వరూపమున జగద్రూపముగ పరిణమించుచున్నది. మహత్తత్త్వము, చంద్రసూర్యాగ్ని బిందురూపమై వెలయుచున్నది. త్రిగుణాత్మకము లైన చంద్రసూర్య వహ్ని బీజములు ప్రకాశ విమర్శ మిశ్రబిందువులై పురుషప్రకృతి సంయోగరూపమైన హంసఃరూపమును దాల్చుచున్నవి. హంసః వర్ణములు కామకళాత్మకమైన త్రికోణరూపమునందు వ్యక్తము లగుచున్నవి. కామకళారూపమైన త్రికోణశీర్షమునందు హకారమును, పీఠకోణములందు సకారవిసర్గలును ప్రతిపాదితములు. శబ్దబ్రహ్మము త్రిగుణాత్మకమై వ్యక్తోప్త యోనిపీఠాకృతిని ఇచ్ఛాక్రియా జ్ఞాన శక్తులను వ్యక్తము చేయుచున్నది.

బిందుసంజాతిమైన త్రికోణరేఖలు (అ, క, థ) వర్ణరూపమున వ్యక్తమైన (౪౮) నలువదియెనిమిదివర్ణములచే నిర్మిత మగుచున్నవి. అకారము మొదలు పదునారు వర్ణములు (అచ్చులు) ఒకరేఖయును, కకారము మొదలుకొని తకారమువఱకు నొకరేఖయును, థకారమునుండి హకారము వఱకు నూఁడవరేఖయును త్రికోణరేఖలు. పరాశక్తియైన బిందువు నాదబిందుకళారూపమునను, సూర్యచంద్రాగ్నిరూపమునను హంసఃయోగమున పురుషప్రకృతిసంయోగమున ప్రపంచరూపమున వ్యవహరింపఁబడుచున్నది. బ్రహ్మాండభాసురమైన అక్షరామ్నాయము పిండాండమునందును శక్తిరూపమున జీవపరిణామమునందు వినియోగ పడుచున్నది. బ్రహ్మాండావృతములైన సప్తలోకములు, సప్తస్వరములు, సప్తచ్ఛాయలు పిండాండమునందు సప్తకమలరూపమున జీవయాత్రకు వినియోగపడుచున్నవి.

చరాచరప్రపంచ మంతయును చైతన్యశక్తిమూలమున జీవయాత్ర చేయుచున్నది. జీవజాలములు శక్తిని స్వాధీనముచేసికొనుటకు చేయుచున్నప్రయత్నములను ప్రపంచపరిణామము విశదము చేయుచున్నది. వర్తమానకాలమునందు ప్రకృతిశాస్త్రజ్ఞులు వ్యక్తముచేసిన సిద్ధాంతములును, నిర్ణాణములును నీపరిణామములనే నిర్ణయించుచున్నవి. జీవశాస్త్రము, భౌతికశాస్త్రము, రసాయనశాస్త్రము, జ్యోతిశ్శాస్త్రము, గణితశాస్త్రము, వేదాంతశాస్త్రము, యంత్రశాస్త్రము మొదలగు శాస్త్రములు చేసిననిర్ధారణలు ప్రాచీనవైదికవిజ్ఞాననిర్ణయములను సమర్థించుచున్నవి. వర్తమానభౌతికశాస్త్రసిద్ధాంతములు, నిర్మాణవిమర్శనములు ప్రాచీనాధ్యాత్మికసిద్ధాంతమార్గములను సమర్థింపఁగలవిధమును పరిశోధనలు విశదము చేయుచున్నవి. ఆదికాలమున భయభ్రాంతులకు మూలములైన ప్రకృతిశక్తులు కాలక్రమమున వశవర్తినులై మానవధర్మాభ్యుదయమునకు వినియోగపడుచున్నవి.

అఖండమైనశక్తి ఖండరూపములందు సూక్ష్మాతిసూక్ష్మరూపమునను, బాహ్యాభ్యంతరములం దేకప్రతిబద్ధమైనపుడు ప్రపంచస్థితికిని, అప్రతిబద్ధ మగునపుడు విలయమునకును సాధనభూతముగ నున్నది. నాదబిందువులు రేఖాకారమునను సూక్ష్మరూపమునను ప్రపంచీకరణమును జేయుచున్న విధమును చిచ్ఛక్తి విశదము చేయుచున్నది. శ్రీచక్రము షట్చక్రనిరూపణమును నాదము రూపరేఖావిలాసమున వ్యక్తముగాఁగల విధమును నిరూపించుచున్నవి. చిచ్ఛక్తినుండి ఆకాశము, ఆకాశమునుండి వాయువు, వాయువునుండి అగ్ని, అగ్నినుండి జలము, జలమునుండి పృథ్వి, పృథ్వినుండి చరాచరప్రపంచము కలుగుచున్నది. చిచ్ఛక్తి పృథ్వీతత్త్వమునందు ఆకాశతత్త్వమునందువలె వ్యక్త మగుచున్నను జీవజాలములకు పృథ్వీతత్త్వముగోచరించినట్లు ఆకాశతత్త్వము గోచరము గాకున్నది. సర్వవ్యాపకమైన చిచ్ఛక్తిని అనుభవవేద్యము చేయుటయే సకలయోగములకును సకలశాస్త్రములకును, మంత్రములకును తంత్రములకును, కావ్యములకును కళలకును ప్రయోజనము.

శ్లో. శ్రుతివిప్రతిపన్నా తే యదా స్థాస్యతి నిశ్చలా,
సమాధా వచలా బుద్ధి స్తదా యోగ మవాప్స్యసి.

అవ్యక్తమైన చిచ్ఛక్తిని సువ్యక్తమైన ఉపాధిరూపములయందు గ్రహించుట పురుషార్థమునకు ప్రయోజనము. అవ్యక్తమైన చిచ్ఛక్తి నాదరూపమున సుప్రతిష్ఠితముగ విశ్వస్థితికి ఆధారభూతము. విశ్వవ్యాప్తమైన నాదము కళారూపమున విశ్వస్థితికి వినియోగపడుచున్నవిధము ‘రేడియో’ శక్తి విశదము చేయుచున్నది. కళారూపమైన ‘రేడియో’ శక్తి శబ్దరూపమునను, శబ్దము అక్షరరూపమునను, అక్షరము పదరూపమునను, పదము అర్థరూపమునను పరిణామమును బొందినవిధము బ్రహ్మాండమువందువలె పిండాండమునందును గ్రాహ్య మగుచున్నది. హింమావిజ్ఞాన ప్రతిపాదితమైన మంత్ర తంత్ర యోగశాస్త్రములు పిండాండమునందు శ్రీవిద్యారూపమున నీపరమార్థమును సాధించుటకు వినియోగపడుచున్నవి.

ప్రపంచపరిణామమునందు మానవదేహము బ్రహ్మాండాంతర్గతమైన పిండాండమునకు లక్ష్యముగ నున్నది. విశ్వవ్యాప్తమైన రేడియోశక్తిని యంత్రసాధనమున శబ్దరూపమున ప్రత్యక్షము చేయఁగలవిధమున బ్రహ్మాండవ్యాప్తమైన చైతన్యశక్తిని మంత్ర రూపమున దేహమునందు ప్రత్యక్షము చేయుట మంత్రశాస్త్రమునకు ప్రయోజనము. మంత్రశాస్త్రము బీజాక్షరరూపమున చైతన్య శక్తి నావాహనము చేయుచున్నది. అక్షరమునందు మంత్రబీజాక్షరములు ప్రపంచసాధనములైన ఇచ్ఛాజ్ఞానక్రియాశక్తులకు సంచలనము గలుగఁజేయుచు సాధకులసంకల్పముల కావరణవిక్షేపశక్తులఁ గలుగఁజేయుచున్నవి. మంత్రబీజాక్షరములు బీజ, శక్తి, కీలక రూపమున సంకల్పితదేవతావాహనమును సాధకుని దేహమునందుఁ జేయుచు బ్రహ్మాండశక్తులను పిండాండమునందు ప్రజ్వలింపఁజేయుచున్నవి. మంత్రశాస్త్రమునందు పురుషవిద్య, శ్రీవిద్య, కామవిద్య,

sampath_Ebooks

ఘోరవిద్యాదుల ఉపాసన సాధ్యము. పురుషార్థమునందు ప్రధానమైన మోక్షమునకు సాధనభూతము కాని మంత్రోపాసనము ఇతర యోగవిద్యాభ్యాసమువలెనే పరిత్యాజ్యము. పురుషార్థమునకు సాధనములైన అర్థకామములును ధర్మావిరుద్ధములు గాకుండుట మంత్రోపాసనమునకును యోగవిద్యాభ్యాసమునకువలెనే పరమార్థము. మంత్రశాస్త్రమునందు ధర్మయుక్తమైన అర్థకామసిద్ధికి కామేశ్వరీ రాజరాజేశ్వరీ త్రిపురసుందరీ దేవీపరమైన శ్రీవిద్యోపాసన సాధనముగ నిగమాగమములు నిరూపించుచున్నవి. శ్రీవిద్యోపాసనాంతర్గతమైన కుండలినీ యోగము మంత్రసిద్ధికిని అష్టసిద్ధులకును మోక్షమునకును సాధనము గాఁగలవిధమును షట్చక్రనిరూపణము విశదము చేయుచున్నది.


కుండలినీయోగము:— 'పరా వాఙ్మూలచక్రస్థా పశ్యంతీ నాభిసంస్థితా, హృదిస్థా మధ్యమా జ్ఞేయా వైఖరీ కంఠదేశగా'. చైతన్యశక్తి బ్రహ్మాండాంతర్గతమైన పిండాండమునకు ఆవాహన గాఁగలవిధమును కుండలినీయోగము విశదము చేయుచున్నది. చైతన్యశక్తి హంసః రూపమున ఉచ్ఛ్వాస, నిశ్శ్వాసములను గలుగఁజేయుచు పిండాండములందు శివశక్తుల సంయోగమును గలుగఁజేయుచున్నది. బ్రహ్మాండమునందు మాయాశక్తివలెనే పిండాండమునందు మనశ్శక్తిని స్వాధీనము చేయఁగలవిధమును కుండలినీ యోగము విశదము చేయుచున్నది. బ్రహ్మాండమునందు నాద బిందు కళా పరిణామములైన వర్ణమాలాక్షరములు దేహమునందును వర్ణమాలాక్షరశక్తులరూపమున నంతర్భూతములై యున్నవి. బ్రహ్మాండాంతర్గతములైన భూలోకము, భువర్లోకము, సువర్లోకము, మహర్లోకము, జనలోకము, తపోలోకము, సత్యలోకము పరమైన శక్తులు పిండాండమునందు దేహమునందును అక్షరరూపమున నంతర్గతములై సప్తకములరూపమున ప్రతిష్ఠితములై యున్నవి. రేడియోశక్తి తంతిముఖమున పరిస్ఫుట మగువిధమున, కుండలినీశక్తి కుండలినీప్రబోధమున పరిస్ఫుట మగువిధమును కుండలినీయోగము బోధించుచున్నది.

మానవుఁడు దేహము కాకను దేహాధిష్ఠితమైన దేహి. మానవశరీరము విచిత్రనిర్మాణము. జీవశాస్త్రము, జంతుశాస్త్రము, శారీరకశాస్త్రము, భౌతికశాస్త్రము, రసాయనశాస్త్రము, జీవవికాసమునకు దేహాంగవికాసము వినియోగపడిన విధమును విశదము చేయుచున్నవి. చైతన్యశక్తి భౌతికస్వరూపములందు స్వయంప్రకాశమును, స్వయంవ్యక్తిత్వమును బడయఁగల విధమునకు మానవ దేహాంగములు ప్రమాణములు. స్థూల సూక్ష్మ కారణదేహములందు స్థాపితమైన చిచ్ఛక్తి స్వయంప్రకాశమానమైనను త్రిపురావరణబద్ధమై అప్రత్యక్షముగ నున్నది. మానవ దేహములందును, సకల పిండాండములందును బ్రహ్మాండమునందువలె చిచ్ఛక్తి పూర్ణవ్యాపకమును గలిగియున్నది. పిండాండములందు పూర్ణవ్యాపకమును గలిగినను అప్రత్యక్షముగ నున్న చిచ్ఛక్తిని స్వాధీనము చేసికొనుట శ్రీవిద్యకును, తదంగమైన కుండలినీయోగమునకును ప్రయోజనము.

కుండలినీశక్తి:— బ్రహ్మదండి దేహమునందు బ్రహ్మరంధ్రము మొదలు ముడ్డిపూస (Coccyx) వఱకును వ్యాపించియున్నది. సుషుమ్నా నాడి బ్రహ్మదండినడుమగ బిసతంతురూపమున వ్యాపించియున్నది. ఇడాపింగళా నాడులు, చంద్రసూర్యనాడులు మూలాధారస్థానమునుండి వెడలుచు భ్రూమధ్యస్థానమునందు సుషుమ్నా నాడితో సంయోగమును పొందుచున్నవి. సుషుమ్నా నాడి శుద్ధచిచ్ఛక్తికిని, ఇడాపింగళలు చంద్రసూర్యశక్తులకును చిహ్నములు. ఇడ సుషుమ్నకు ఎడమభాగమునందును పింగళ కుడిభాగమునందును మూలాధారస్థానమునుండి బయలుదేఱి చక్రస్థానములందు సుషుమ్నను కలసికొనుచు ఆజ్ఞాస్థానమునందు సుషుమ్నతో సంయోగమును పొందుచున్నవి. ఇడాపింగళా నాడులు సుషుమ్నా నాడికి ఎడమ కుడివైపులనుండి ప్రదక్షిణము చేయుచు చక్రస్థానములందు కలసికొనుచున్నవి. ఈకూటస్థానములు, చక్రస్థానములు గ్రంథిస్థానములు. స్థూలదేహమునందు గ్రంథిస్థానములందు దేహమునందు వ్యాపకమైయున్న ఇడాపింగళల సంయోగస్థానములు శక్తిస్థానములై బ్రహ్మాండమునందలి శక్తుల నాకర్షించుచున్నవి. బాహ్యాభ్యంతరశక్తులు చక్రస్థానములందు యోగయుక్తములై పంచప్రాణవాహినులను దేహమునందు ప్రసరింపఁజేయుచు జీవయాత్రకు వినియోగపడుచున్నవి. ఇడాపింగళా నాడులు మూలాధారమునుండి ఆజ్ఞాస్థానమువఱకును చక్రభ్రమణమువిధమునను (Spiral) సుషుమ్నకు ప్రదక్షిణము చేయుచు చక్రస్థానములందు కలసికొనుచు నారోహణావరోహణములను చేయుచు ప్రాణప్రవాహమును క్షేత్రమునందు ప్రవహింపఁజేయుచున్నవి. నాగబంధమువిధమున ఇడా, పింగళా, సుషుమ్నా నాడులు సామాన్యముగ ప్రకృతిసిద్ధముగను స్వయముగను ప్రాణప్రవాహమును ప్రవహింపఁజేయుచున్నను, యోగధారణను ప్రాణప్రవాహమును స్వాధీనము చేసికొని దేహద్వారములందును, దేహగ్రంథులందును ౭౨,౦౦౦ నాడులందును ప్రాణశక్తులను యోగిసంకల్పానురూపముగ ప్రవహింపఁజేయుచున్నది. సకలపదార్థములందును పూర్ణచైతన్య మేకముఖమున వ్యాపకమైయున్నను భూతపంచీకరణమునందు స్థూలస్వరూపములం దాకాశతత్త్వము క్షీణించుటయును, పృథ్వీతత్త్వము ప్రబలుటయును సంభవించుచున్నది. పంచభూతములును ననులోమవిలోమమార్గమున ప్రపంచీకరణమును బడయుచున్న విధమును భూతములయుత్పత్తిస్థితిలయములును పంచీకరణమార్గమును తెలుపుచున్నవి. సృష్టిపరిణామమునం దాకాశపరమాణువు పృథ్వీపరమాణువుగ పరిణమించుచు క్షేత్రజ్ఞున కనంతములైన క్షేత్రములు కల్పింపఁబడుచున్నవి. ఆకాశపరమాణువునందు పరిపూర్ణముగ వ్యాప్తమైయున్న చైతన్యశక్తి పృథ్వీపరమాణువునందు విక్షేపావరణములందు స్తంభించి ప్రక్షిప్త మగుచున్నది. పృథ్వీజలతేజోవాయుతత్త్వములం దంతర్గతమై యున్న చైతన్యశక్తిని ప్రజ్వలింపఁజేసి పరమార్థమును బడయుటయే ఇతరయోగములకువలె కుండలినీయోగమునకును పరమార్థము. చంద్రసూర్యనాడులు చక్రభ్రమణవిధమున గ్రంథిస్థానములందు

sampath_Ebooks


# అనాహతము




చిత్రము ౧

కలసికొనుచున్న విధమును ౧-వ చిత్రపటమునందలి మూడు చిత్రములు తెలుపుచున్నవి. విషయవ్యామోహము బాహ్యసాధనములమీద నాత్మశక్తులను లగ్నము చేయుచు నాత్మవికాసమును దుర్లభము చేయుచున్నది.

కుండలినీశక్తి — సప్తకమలములు:— ౧. మూలాధారము. ౨. స్వాధిష్ఠానము, ౩. మణిపూరకము, ౪. అనాహతము, ౫. విశుద్ధము, ౬. ఆజ్ఞాస్థానము, ౭. సహస్రారము — సప్తకమలములు. ఆగమశాస్త్రము లీసప్తకమలములను విశేషముగ వర్ణించుచున్నవి. సనకుడు, సనందనుడు, సనత్కుమారుడు, వసిష్ఠుడు, శంకరుడు, అప్పయదీక్షితులు మొదలగు నాగమశాస్త్రజ్ఞులు కుండలినీయోగమును సాధించిరి. ఆగమములకు సన్నిహితసంబంధముగల మంత్రయంత్రతంత్రశాస్త్రములును నీయోగమునకు ప్రాముఖ్యము నొసంగుచున్నవి. ఆగమశాస్త్రములకు ప్రధానమైన శ్రీవిద్యకు కుండలినీయోగము హృదయముగ నున్నది.





చిత్రము, 3 : స్వాధిష్ఠానము
లింగస్థానము : అప్తత్త్వము



౧ 2


చిత్రము, ౨ : మూలాధారము
గుదస్థానము : పృథ్వీతత్త్వము





3 4

చిత్రము, ౪ : మణిపూరకము
నాభిస్థానము : తేజస్తత్త్వము


sampath_Ebooks





చిత్రము, ౫: అనాహతము
హృదయస్థానము: వాయుతత్త్వము




చిత్రము, ౭: ఆజ్ఞాచక్రము
భ్రూమధ్యస్థానము: మనస్తత్త్వము





చిత్రము, ౬: విశుద్ధము
కంఠస్థానము: ఆకాశతత్త్వము



చిత్రము, ౮: సహస్రారము
శిరస్సు: ఆత్మస్థానము

sampath_Ebooks



శ్రీ చక్రము

శ్లో. చతుర్భి శ్శ్రీకణ్ఠై శ్శివయువతిభిః పఞ్చభి రపి
ప్రభిన్నాభిశ్శంభో ర్నవభిరపి మూలప్రకృతిభిః,
చతుశ్చత్వారింశ ద్వసుదళకళా శ్రత్రివలయ
త్రిరేఖాభిస్సార్ధం తవ శరణకోణాః పరిణతాః.

-సౌందర్యలహరి.

తా. తల్లీ! నలువురు రుద్రులచేతను, శివునికంటె వేఱయిన యేవురు శివశక్తులచేతను, తొమ్మిది మూలప్రకృతులచేతను, అష్టదళ, షోడశదళ, త్రివలయరేఖలచేతను నీకు నిలయ మయిన శ్రీచక్రము నలువదినాలు గంచులు గలది. శ్రీచక్రము త్రికోణాష్టకోణ దశకోణద్వయ చతుర్దశకోణము లనియెడు నయిదు శక్తిచక్రముల చేతను, బిందువు, అష్టదళము, షోడశదళము, చతురశ్రము అను నాలుగు శివచక్రములతోడను గూడి నవచక్రాత్మక మయి శివశక్త్యుభయరూపముగా వెలయుచుండును.

శ్లో. సమున్మీలత్సంవిత్కమలమకరన్దైకరసికం
భజే హంసద్వన్ద్వం కిమపి మహతాం మానసచరమ్,
యదాలాపా దష్టాదశ గుణితవిద్యా పరిణతి
ర్యదాదత్తే దోషా ద్గుణ మఖిలమద్భ్యః పయ ఇవ.

—సౌందర్యలహరి.

తా. తల్లీ! ఏమిథునము పలికినపలుకు లన్నియు నష్టాదశ విద్యలుగా మాఱుచున్నవో, ఏజంట దోషములనుండి గుణమును నీటినుండి పాలనువలె గ్రహించునో, వికసించినజ్ఞాన మనెడి కమల మందలి మకరందమును గ్రోలి మైమఱచి యున్న యోగుల హృదయమను మానససరస్సున నున్న యనిర్వాచ్యమహిమగల శివశివాత్మక మనెడు హంసమిథునమును నే సేవింతును.

మానవ శరీరమునం దూర్ధ్వకాయము ప్రాణ ప్రవాహమున కాధారభూతముగ నున్నది. బ్రహ్మాండమయందలి సుషుమ్నానాడి ప్రాణరక్షణమునకును ప్రాణపోషణమునకును మూలాధారముగనున్నది. శరీరమునందలి గ్రంథి మర్మస్థానములందు ప్రాణప్రవాహము యథో చితముగ జరుగునపు డాయురారోగ్యములు సహజ మార్గమున నడచుచుండును. నరములశక్తియును నాడులశక్తియును ప్రాణప్రవాహము మీఁద నాధారపడియున్నది. ప్రాణప్రవాహమున కభ్యంతరము గలుగునపు డభ్యంతరములనుతొలఁగించుటకు యోగము సాధనముగా నున్నది. పై పటమునందలి కమలస్థానములును, మర్మస్థానములును సాధకులకు ప్రాణప్రవాహమును జేయుట కభ్యాసముచేయుట కుపకరింపఁగలవు.

బ్రహ్మాండమునందు పరిపూర్ణమును నేకమునునైన చిచ్ఛక్తి క్షేత్రమునందు (పిండాండమునందు) ఖండమును భిన్నమునునైన చిచ్ఛక్తి పూర్ణప్రయోజనములను సమకూర్చుటకు పూర్ణత్వమును బొందవలసియున్నది. మహాశక్తి ఉపాసకులకు వారి సంకల్పమునకును, నుపాసనమునకును ననురూపమైన ఫలమును గలుగఁజేయుచున్నది. భగవద్గీతయును నీయర్థమునే బోధించుచున్నది.


శ్లో. యే యథా మాం ప్రపద్యంతే తాం స్తథైవ భజామ్యహమ్,
మమ వర్త్మానువర్తంతే మనుష్యాః పార్థ! సర్వశః.

పురుషార్థము :— హిందూమత ధర్మసిద్ధాంతములకు ధర్మార్థ కామ మోక్షరూపములైన చతుర్విధ పురుషార్థములందును మోక్షము పరమార్థము. ఇతర యోగములవలె కుండలినీయోగపరమైన లయ యోగమును నీ పరమార్థమునకు వినియోగపడుచున్నది. సృష్టి పరిణామమునందు చిచ్ఛక్తి ఆకాశతత్త్వమునుండి వాయుతత్త్వమునందును, వాయుతత్త్వమునుండి అగ్నితత్త్వమునందును, అగ్నితత్త్వమునుండి అప్తత్త్వమునందును, అప్తత్త్వమునుండి పృథ్వీతత్త్వమునందును నధోమార్గమునను వైఖరీరూపమునను వికారమును బొందుచున్నది. అధోగతిని సవికారముగ నున్న చిచ్ఛక్తికి ఊర్ధ్వగతిని నిర్వికారత్వమును సమకూర్చుట యోగము. లయయోగము పృథివ్యప్తేజోవాయుతత్త్వములను క్రమముగ ఆకాశతత్త్వమునందు లయము చేయుచు చిచ్ఛక్తిని ప్రజ్వలింపఁజేయుచున్నది. పృథ్వీతత్త్వమునందు పరిమితమై ప్రక్షిప్తముగ నున్న చిచ్ఛక్తి ఆకాశతత్త్వయోగమువలన నపరిమిత మగుచున్నది. చిచ్ఛక్తి ఊర్ధ్వగమనమునందు మూఁతపడియున్న ద్వారములను తెఱచుచు శక్తిప్రవాహమున కాటంకములను తొలఁగించుచున్నది. తేజస్సు కట్టెలమంటయందును, మట్టినూనెదీపమునందును, విద్యుత్తునందును, రేడియమునందును ప్రకాశమానమైయున్నను జడపదార్థములందుకంటె నిర్మల స్వచ్ఛ పదార్థములందు (Transparent) విశుద్ధముగను, వ్యాప్తముగను,

sampath_Ebooks

# అనాహతము

ప్రబలముగను, సుందరముగను గోచరమగుచున్నది. ఊదాకిరణములు, రేడియముకిరణములు కాంతిప్రభావమును విశదము చేయుచున్నవి. రేడియోయంత్రములు విశ్వవ్యాపకమైన నాదప్రభావమును తెలుపుచున్నవి. దూరశ్రవణ, దూరదర్శనయంత్రములు నాదకాంతుల సర్వవ్యాపకత్వమును వెల్లడిచేయుచున్నవి. మానవదేహాంతస్థములైన సప్తకమలస్థానములును విశ్వవ్యాప్తములైన శక్తిస్థానములుగ నున్నవి. ఆస్థానములందు సహస్రారస్థానము — సకలప్రపంచమునకును నాలయము—వర్ణనాతీతము. సహస్రారప్రభావము శబ్దగ్రహణ, రూపగ్రహణ, దూరదర్శన, దూరశ్రవణ, నాదశ్రవణదర్శన యంత్రాదుల కతీతమైన సూక్ష్మాతిసూక్ష్మమైన శక్త్యాలయము. ఆత్మనాదానుసంధానము వైఖరీ, మధ్యమా, పశ్యన్తీశక్తులకు మూలమైన పరాశక్తిని సహస్రారమునందు సాక్షాత్కారము చేయుచు బ్రహ్మానందమును గలుగఁజేయుచున్నది.



౭. బ్రహ్మరంధ్రస్థానము. ౬. ఆజ్ఞాచక్రస్థానము. ౫. విశుద్ధచక్రస్థానము. ౪. అనాహతచక్రస్థానము. ౩. మణిపూరక చక్రస్థానము. ౨. స్వాధిష్ఠాన చక్రస్థానము. ౧. మూలాధార చక్రస్థానము. క. వస్తిగ్రంథి. ద. బ్రహ్మదండి చివరభాగము. చ. మహాప్రాచీర. ట. హృదయగ్రంథి. త. శ్వాసకోశ గ్రంథి. ప. కంఠగ్రంథి. గ. భ్రూమధ్యస్థానము. జ. సుషుమ్న. డ. బ్రహ్మదండి.

విద్యుచ్ఛక్తియంత్రాలయము శక్తిభరితమైయున్న తంతులతో నియతరీతిని ననుసంధానము గలుగునపుడే విద్యుచ్ఛక్తి వ్యాపించి నియతకార్యములు నిర్వర్తింపఁబడుచున్నవి. విశ్వవ్యాపకమైన చిచ్ఛక్తి నాత్మానుసంధానము చేయుటవలన సర్వత్ర వ్యాపించి పురుషార్థము సిద్ధించుచున్నది. బ్రాహ్మీస్థితి బ్రహ్మానందప్రముఖము నను చిచ్ఛక్తి నాత్మానుసంధానము చేయుచున్నది. పురుషార్థసిద్ధి కర్థకామములు సామాన్యముగ ప్రతిబంధకములుగ నున్నవి. పురుషార్థమునం దర్థకామారాధనము సాధకుని లక్ష్యము నాత్మేతరమునందు లగ్నముచేయుచు పతనమునకు మూల మగుచున్నది. ధర్మావిరుద్ధమైన యర్థకామారాధనము ప్రకృతిసిద్ధమై పురుషార్థసిద్ధికి ప్రతిబంధము గాదు. ధర్మవిరుద్ధమైన యర్థకామారాధనము ప్రకృతివిరుద్ధమై పురుషార్థసిద్ధికి ప్రతిబంధకముగ నున్నది. మానవులకు పురుషార్థసిద్ధి కఖండమైన యభ్యంతరసాధనము సిద్ధముగ నున్నను వారిలక్ష్యము ఖండములైన బాహ్యసాధనములందు లగ్నమగుట ధర్మానుసంధానము దుర్లభ మగుచున్నది. కుండలినీయోగమును బాహ్యాచారసాధనములందు లగ్నమైనపుడు వామాచారములు సంభవించుచున్నవి. సమయాచారులైన కుండలినీయోగోపాసకులు త్రిపురసుందరి నాత్మానుసంధానము చేయుచు మూలాధారమునందు కుమారిని, అనాహతమునందు యోషిని, సహస్రారమునందు పతివ్రతను నావాహనము చేయుచు శుద్ధసచ్చిద్యోగసంజాతమైన బ్రహ్మానందమును బొందుచున్నారు. కౌలాచారులైన శాక్తేయులు, కాపాలికులు వామాచారులై రూపానుసంధానమునందు స్థూలప్రపంచమునం దజ్ఞానసంజాతమైన విషయానందము ననుభవించుచు కుండలినీయోగమునకు ఫలములైన కామాకీ బైందవశక్తుల కపార్థములను గల్పించి రాక్షసకర్మముల నాచరించుచున్నారు. సహస్రారచక్రమునందు శివతత్త్వముగ విలసిల్లుచున్న బైందవశక్తికిని, మద్యమునకును సంబంధము సంగల్పించుట రహస్యసాధనలు గలుగఁజేసెడి పరమానర్థములకు నిదర్శనము. కన్యాపూజయును, నితరవామాచారములును ఆచారపిశాచముల దుష్పరిపాకములు. సప్తకమలముల సామాన్యవివరములను నీవ్యాసము నందుఁగల పటములు కోష్ఠము తెలుపుచున్నవి.


| నామము | స్థానము | తత్త్వము | తత్త్వ కాంతులు | దళములు | వర్ణములు | జ్ఞానేంద్రియములు | రంగు | మండలాకారము |
|---|---|---|---|---|---|---|---|---|
| ౭. సహస్రారము | శిరస్సు | ఆత్మ | అనంతము | ౧౦౦౦ | ౧౦౦౦ | | | |
| ౬. ఆజ్ఞాచక్రము | భ్రూమధ్యము | మనస్సు | ౬౪ | ౨ | హం, క్షం | చిత్తము మనస్సు | | బిందువు |
| ౫. విశుద్ధము | కంఠము | ఆకాశము | ౭౨ | ౧౬ | అచ్చులు (౧౬) | వికసనము శ్రవణము శ్రోత్రము | తెలుపు | చక్రము |
| ౪. అనాహతము | హృదయము | వాయువు | ౫౪ | ౧౨ | క, ఖ, గ, ఘ, ఙ, చ, ఛ, జ, ఝ, ఞ, ట, ఠ | సంచలనము స్పర్శము త్వక్కు | శ్యామము | షట్కోణము |
| ౩. మణిపూరకము | నాభి | అగ్ని | ౫౨ | ౧౦ | డ, ఢ, ణ, త, థ, ద, ధ, న, ప, ఫ | వ్యాపనము రూపము చక్షువు | ఎరుపు | త్రికోణము |
| ౨. స్వాధిష్ఠానము | లింగస్థానము | అప్పు | ౬౨ | ౬ | బ, భ, మ, య, ర, ల | సంకోచనము రుచి జిహ్వ | తెలుపు | అర్ధచంద్రము |
| ౧. మూలాధారము | గుదస్థానము | భూమి | ౫౬ | ౪ | వ, శ, ష, స | సంయోగము గంధము ఘ్రాణేంద్రియము | పసుపు | చతుష్కోణము |

మూలాధారాది కమలములకు సంబంధించిన విశేషాంశము లాయావిషయశీర్షికలందు ప్రచురింపఁబడును. సామాన్య విషయ గ్రహణము కలుగుటకై సప్తకమలముల చిత్రములును నిందు ప్రచురింపఁబడినవి. అనాహతచక్రస్వరూప స్వభావములు నిచట సవిస్తరముగఁ దెలుపఁబడినవి. కుండలినీయోగచిత్రపటమును (౯-వ చిత్రము), అనాహతచక్రపటమును (౧౦-వ చిత్రము) సప్తకమలములను ఆగమశాస్త్రానుసారముగ వివరించుచున్నవి.

అనాహతము :— హృదయస్థానము. బన్ధూకపుష్పకాంతివలె ప్రకాశమానము ; క, ఖ, గ, ఘ, ఙ; చ, ఛ, జ, ఝ, ఞ; ట, ఠ అనెడి ద్వాదశవర్ణయుక్తమైన ద్వాదశదళయుక్తము; షట్కోణాకారము, వాయుమండలము, ధూమాభముగల కర్ణికాయుతము ; కర్ణికోపరిభాగమున సూర్యమండలయుతము ; కర్ణికామధ్యమున విద్యుత్కోటినిభ భాసమాన త్రికోణము. దాని యూర్ధ్వమున కృష్ణసారాధిరూఢమును, ధూమ్రధూసరాభమును, చతుర్భుజమును, అంకుశహస్తమును నైన వాయుబీజము; దాని(క్రోడమున)సమీపమున ద్విభుజుఁడును, వరాభయకరుఁడును, త్రినేత్రుఁడును, హంసవర్ణుఁడైన ఈశ్వరుఁడు. ఈకర్ణికయందు రక్తపద్మముమీఁదను పీతవర్ణయును, చతుర్భుజయును, పాశకపాలవరాభయకరయును, పీతవస్త్రయును, సర్వాలంకరణాన్వితయును, సుధార్ద్రహృదయయును, కఙ్కాలమాలాధరయును నైన కాకినీశక్తియు; మధ్యత్రికోణమునందు అర్ధచంద్రబిందురూపమస్తకుఁడును, స్వర్ణవర్ణుఁడును, కామోద్గమోల్లసితుఁడును నైన బాణలింగశివుఁడు; దాని క్రిందను స్థిరతరదీపకలికాకార హంసరూపియైన జీవాత్మయు, ఈకర్ణిక క్రిందను రక్తవర్ణమును, ఊర్ధ్వముఖమును గల అష్టదళపద్మమును; ఇయ్యది కల్పవృక్షరత్నవేదీచంద్రాతపపతాకాద్యలంకృతమైన మానసపూజాస్థానము. కమలస్థానములందు ఆత్మ మూలాధారమునను పరమాత్మస్వరూపమును పొందఁగల విధమును అనాహతపూజావిధానముదాహరింపఁబడినది.

sampath_Ebooks

# అనాహతము



షట్చక్రములు

sampath_Ebooks

sampath Ebooks

# అనాహతము

| బీజము వాహనము | దేవత వాహనము | ధాతు శక్తి | లింగ యోని | ఇతర తత్త్వ సంయోగము | గ్రంథులు | లోకములు | గుణము | అధిష్ఠాన శక్తి |
|---|---|---|---|---|---|---|---|---|
| | | | | | | సత్యలోకము | సత్త్వము | చంద్రుడు |
| ఓమ్ | శంభువు | హాకిని | ఇతర త్రికోణము | మహత్తు మూలప్రకృతి హిరణ్యగర్భుడు | రుద్రగ్రంథి | తపోలోకము | సత్త్వము | చంద్రుడు |
| హం; శ్వేతగజము | సదాశివుడు | శాకిని | త్రికోణము | శబ్దతన్మాత్ర శ్రోత్రేంద్రియము వాగింద్రియము | | జనలోకము | రజస్సు | రవి |
| యం; కృష్ణమృగము | ఈశుడు | కాకిని | బాణ త్రికోణము | స్పర్శతన్మాత్ర త్వగింద్రియము గుహ్యకర్మేంద్రియము | విష్ణుగ్రంథి | మహాలోకము | రజస్సు | రవి |
| రం; మేషము | వృషభవాహన రుద్రుడు | లాకిని | త్రికోణము | రూపతన్మాత్ర చక్షురింద్రియము గుదకర్మేంద్రియము | | స్వర్లోకము | తమస్సు | అగ్ని |
| వం; మకరము | గరుడవాహన విష్ణువు | రాకిణి | లింగ త్రికోణము | రసతన్మాత్ర జిహ్వేంద్రియము హస్తకర్మేంద్రియము | బ్రహ్మగ్రంథి | భువర్లోకము | తమస్సు | అగ్ని |
| లం; ఐరావతము | హంసవాహన బ్రహ్మ | డాకిని | స్వయంభువు త్రికోణము | గంధతన్మాత్ర ఘ్రాణేంద్రియము పాదకర్మేంద్రియము | | భూలోకము | తమస్సు | అగ్ని |

సుషుమ్నానాడీమార్గేణ అనాహతచక్రస్థిత పార్వతీసహిత శివాయై నమః. అనాహతస్య శబ్దస్య తస్య శబ్దస్య యో ధ్వనిః, ధ్వనే రంతర్గతం జ్యోతి ర్జ్యోతిరంతర్గతం మనః, తన్మనో విలయం యాతి తద్విష్ణోః పరమం పదమ్. కం నమః- హంసశ్శివస్సోహం హంసః. ఖం నమః- హంసశ్శివస్సోహం హంసః. గం నమః- హంసశ్శివస్సోహం హంసః. ఘం నమః- హంసశ్శివస్సోహం హంసః. ఙం నమః- హంస శ్శివస్సోహం హంసః. చం నమః- హంసశ్శివ స్సోహం హంసః. ఛం నమః - హంసశ్శివస్సోహం హంసః. జం నమః- హంసశ్శివస్సోహం హంసః. ఝం నమః - హంసశ్శివస్సోహం హంసః. ఞం నమః - హంసశ్శివస్సోహం హంసః. టం నమః-హంసశ్శివస్సోహం హంసః. ఠం నమః- హంసశ్శివస్సోహం హంసః. ద్వాదశదళసహిత అనాహత చక్రస్థిత పార్వతీసహిత శివాయై నమః.

అనాహతచక్రము సప్తకమలములందును మధ్యస్థానమునం దుండుటవలన కుండలినీశక్తి ప్రబోధమునకు విశేషోపయోగముగ నున్నది. అనాహతమునకు క్రిందను మూలాధార, స్వాధిష్ఠాన, మణిపూరక చక్రములును, పైని విశుద్ధ, ఆజ్ఞ, సహస్రారచక్రము లును గలవు. హృదయస్థానము జీవాత్మస్థానము. జీవాత్మప్రాణశక్తులను భూలోకవిషయవాసనలకు వినియోగించునదియును, సత్యలోకారోహణమునకు వినియోగించునదియును అనాహతశక్తి నిర్ణయింపగలదు. అనాహతమునకువలె నితరచక్రములకును దళములు వర్ణములు గల్పింపబడినవి. పటము ౯ యందును శ్లోకమునందు వివరములు చూడవలెను.

sampath_Ebooks

కును పరమార్థము. సకలసాధనములును నీపరమార్థమునకు వినియోగపడు చున్నవి. శక్తి సృష్టిపరిణామమునందు క్షేత్రసూత్రముల కనురూపముగ పరిమితవికాసములను బొందుచున్నది. ఆకాశతత్త్వమునం దనంతకాంతులను గలిగియున్న పరాశక్తి సహస్రారమునందును సూత్రరేఖాకాంతులను, పృథ్వీతత్త్వమునందు పరిమితములైన రేఖాకాంతులను గలిగి పరిమితమైన శక్తిని గలిగియున్నది. పరిమితమైన శక్తిని స్వతస్సిద్ధముగను ప్రకృష్టముగ నున్న యపరిమితమైన శక్తిగ పరిణమింపజేయుటయే సకలయోగ సాధనములకును ప్రయోజనము. ఊర్ధ్వముఖములై వికసితములైన శక్తులు సృష్టిపరిణామమునం దధోముఖములై ముకుళితములై యున్న విధమును కుండలినీశక్తి వివరించుచున్నది. అధోముఖములును ముకుళితములును నైన శక్తికమలస్థానము లూర్ధ్వముఖములును వికసితములును నగునట్టు ననంతమైన శక్తి సర్వవ్యాపకత్వము గలిగి సకలాభీష్టములను నిచ్చుచున్నది. పృథ్వ్యప్తేజోవాయ్వాకాశ తన్మాత్రలందతర్లయమును బొందునట్టి దైవమైన కుండలినీశక్తి ఆకాశతత్త్వస్థానమైన సహస్రారమునందును, పృథ్వీతత్త్వస్థానమైన మూలాధారస్థానమునందును సముజ్జ్వలనము గలిగి యుండి, పృథ్వీబీజమైన లంకారము నాకాశబీజమైన ఓంకారమునందు లయమును బొందును. వ్యాపకమైన పరాత్పర సహస్రారోపరిస్థమైన అనంతగమనమును బట్టి ఆత్మజ్ఞానపరమైన ఊర్ధ్వగమనమును చేయుచున్నది. సూక్ష్మమైన ఆకాశతన్మాత్ర సర్వగతమై యితర భూతములను లయము చేయగల విధమున స్థూలమైన పృథ్వియు స్థూల భూత తన్మాత్రలు సర్వగతమైన ఆకాశతన్మాత్రను లయము చేయ జాలవు. నాదస్వరూపమైన ఓంకారము సప్తకమలసంస్థానమైన చిచ్ఛక్తిని విశ్వవ్యాప్తమైన చిచ్ఛక్తిని నేకత్రితయందు మేళగించి ఆత్మజ్ఞానమును సమకూర్చుచున్నది. సకలమంత్రములకును, తంత్రములకును, శాస్త్రములకును, యోగములకును మూలమైన ఓంకారము కుండలినీయోగసిద్ధికి సాధనభూతముగ నున్నది.

శ్లో. యదా భూతపృథగ్భావ మేకస్థ మనుపశ్యతి,
తత ఏవచ విస్తారం బ్రహ్మ సంపద్యతే తదా.

పృథగ్భావమున బాహ్యాభ్యంతరములందు వ్యాప్తమైయున్న పరాశక్తిని నేకరూపమునఁ గనుగొనినప్పుడు బ్రహ్మసంపద ప్రాప్త మగుచున్నది. సకలయోగములకును పరమార్థ మాత్మజ్ఞానము. ఆత్మజ్ఞానమునకు సకలజనులకును ప్రత్యేకయోగములు సాధనములుగ నున్నను సకలజనులకును సులభసాధ్యమైన రాజయోగము సమాదర ణీయముగ నున్నది. సమస్త విజ్ఞానమునందును నఖండ పాండిత్యానుభ వములను గలిగిన శ్రీ శంకరాచార్య లపరోక్షానుభూతియందు తెలిపిన ఆత్మజ్ఞానానుభవభావము ప్రాజ్ఞులకు సమాదరణీయము.

ఒక కాలమునందు వ్యాస, శంకరాదుల యాదరణమును బడసిన కుండలినీయోగము వర్తమానకాలమునం దపార్థములకును, దుర్ణయ ములకును పాలైనది. ధీమంతు లీ యోగ రహస్యములను, గుణదోష ములను వర్తమానపరిస్థితుల కనురూపముగ పరిశీలించి నిర్ణయించుట విజ్ఞానసంరక్షణవ్యాపనములకు ప్రయోజనకరము.

**ప్రమాణగ్రంథములు :—** వ్యాసరచనయందు శ్రీవిద్య, ఆర్థరు ఆవిలనుగారి కుండలినీశక్తి, లెడ్ బీటరుగారి చక్రములు, కాళీచరణవ్యాఖ్యానసహిత షట్చక్రనిరూపణము, సౌందర్యలహరి ఆనందలహరి మొదలగు గ్రంథములును నందలి పదములును వారి యాదరమున నుపయోగింపఁబడినవి.

( శా. నా. )

**అనింగ్యము** — ఇది నూఱుశ్లోకముల చిన్న పుస్తకము. తైత్తిరీయసంహితలోఁ గొన్ని వైదికపదములు 'పదపాఠము' నందు విడిపోవునవిగఁ గన్పట్టును. అట్లు కాన్పించుటయేకాని నిజముగ నట్లు విడఁదీయుటకు వీలు లేని వవి. అట్టిపదము లన్నియు నీ 'అనింగ్యము' నం దుదాహరింపఁబడియున్నవి. ఈగ్రంథము వ్రాసినయతఁడు దేవ మాని కుమారుఁడు శ్రీవత్సాంకుఁడు.

**అనికేవల్లి** — ౧. నెల్లూరు జిల్లా, నెల్లూరు తాలూకా యందలి గ్రామము. జనసంఖ్య ౧,౮౭౬ (౧౯౩౧).

౨. నెల్లూరుజిల్లా, కనిగిరితాలూకాయందలి జమీందారీగ్రామము. జనసంఖ్య ౪౩౬ (౧౯౩౧).

**అనిగండ్లపాడు** — కృష్ణాజిల్లా, నందిగామతాలూకా యందలి గ్రామము. జనసంఖ్య ౨,౬౫౪ (౧౯౩౧).

**అనిగానిదొడ్డి** — అనంతపురముజిల్లా, గుత్తితాలూకా యందలి గ్రామము. జనసంఖ్య ౨౯౫ (౧౯౩౧).

**అనిగేరు** — తూర్పుగోదావరి, ఏజన్సీజిల్లా, యెల్లవరం తాలూకాయందలి జమీందారీగ్రామము. జనసంఖ్య ౯౪ (౧౯౩౧). రు. ౮౦ లు క్విట్రెంటు చెల్లించునట్టి ఆఱుగ్రామములముఠాకు నిది ముఖ్యస్థలము. ఈ ముఠాదారు పూర్వపు జగదంగీమన్సబుదారు వంశ జుఁడు. ౧౮౫౬ లో జగదంగీమన్సబుదారు తిరుగఁబడి మన్సబును పోఁగొట్టుకొనెను. అతనికుమారుఁడు గంపపితూరీసమయమున తన యావచ్ఛక్తిని బ్రిటీషుగవర్నమెంటువారికి సాయము చేయుటయందు వినియోగించినందున అతని రాజభక్తికి మెచ్చి ప్రభుత్వమువారు కీ ముఠాను దచ్చర్తివారినుండి తీసి ఈతని కిచ్చిరి.

**అనిజిగేరి** — బళ్లారిజిల్లా, హర్పణహళ్లి తాలూకాయం దలి గ్రామము. జనసంఖ్య ౧,౬౦౭ (౧౯౩౧).

**అనితల్లి** — కాటయవేమారెడ్డికిఁ గూఁతురు. కాశీఖండ మును కృతినందిన వీరభద్రారెడ్డికి భార్య. ఈమెతల్లి పేరు దొడ్డాంబిక. ఈమెతండ్రి యైన కాటయవేమారెడ్డి కొండవీటి యనపోతారెడ్డికి (౧౩౫౩ - ౧౩౬౪) అల్లుఁడు, మేనల్లుఁడును. కుమారగిరిరెడ్డికిఁ (౧౩౮౦ - ౧౪౦౦) చెల్లెలి పెనిమిటి, మంత్రి. కుమారగిరి కాటయ

వేమునకు రాజమహేంద్రవరము రాజ్య మిచ్చెను. కాటయవేముని తరువాత నాతనిపుత్త్రుఁ డైన కుమారగిరి రాజమహేంద్రవరమునకు రాజయ్యెను. అతనితరువాత నాతనిచెల్లెలైన అనితల్లిని, ఆమెమామగా రైన అల్లాడరెడ్డి శత్త్రురాజులను ఓడించి రాజ్యముపైఁ గూర్చుండఁ బెట్టెను. ఈ మెమామగా రైన అల్లాడరెడ్డియు, బావగా రైన వేమారెడ్డియు, భర్త యైన వీరభద్రారెడ్డియు ఈమెకుఁగాను రాజమహేంద్రవరరాజ్యము చేయుచున్నట్టు గానవచ్చుచున్నది. ఈమె శా. శ. ౧౩౪౫ (క్రీ. శ. ౧౪౨౩) నం నొకబ్రాహ్మణునకుఁ గలువచేఱు గ్రామము దాన మిచ్చుచు నొకతామ్రశాసనము వ్రాయించెను. దాని వలనఁ బెసంగతులు వెల్లడి యగుచున్నవి. దానము తీసికొనిన బ్రాహ్మణుఁడు కాళనాథభట్టుకుమారుఁ డైన పరశురామాచార్యుఁడు. ఇతఁడు వైద్యశాస్త్రమునందు మిక్కిలి ప్రవీణుఁడు. ఈమ ఆసంవత్సరమునసే దేవబ్రాహ్మణుల యగ్రహారములమీఁది పన్ను తీసివేసిన దని యీశాసనమునందె వ్రాయఁబడియున్నది. శ్రీనాథుఁడు కాశీఖండమునందు ఈ అనితల్లిని ఇట్లు వర్ణించియున్నాఁడు:—

ము. మనుమార్గ్యుం డగు కాటయప్రభుని సేమిష్మాత్మజాధీశునం
దనఁ బాణిగ్రహణంబు చేసి ప్రియ మొందన్ వీరభద్రేశ్వరుం
డనితల్లి న్వనితామతల్లి నుదయాస్త్రాద్రింద్రసీమావనీ
ఘన సామ్రాజ్య సమర్థ సుప్రథిత సాంగ్రదింగిరాదేవతన్.

ఈపేరునకు 'అనతల్లి', 'అన్నతల్లి' యనుమాఱురూపములు కలవు.

**అనిపినకట్టె** — బళ్లారిజిల్లా, హాస్పేటతాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౩౩౩ (౧౯౩౧).

**అనిమల** — కడపజిల్లా, కమలాపురంతాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౩,౧౬౩ (౧౯౩౧).

**అనిమిగానిపల్లి** — చిత్తూరుజిల్లా, కుప్పంతాలూకాయందలి ఈనాంగ్రామము. జనసంఖ్య ౪౨౧ (౧౯౩౧)

**అనియంకభీమదేవుఁడు** — ౧. కళింగమును పాలించిన గంగవంశపు రాజు. ఇతఁడు కామార్ణవుని కుమారుఁడు; గుండమదేవుని తండ్రి. ఈ పేరు వహించిన గంగరాజులలో నితఁడు మొదటివాఁడు. ఇతనిని గుఱించి మన కేమియుఁ దెలియదు.

౨. ఇతఁడు కళింగదేశాధిపతియు, గంగవంశజుఁడు నయిన అనంతవర్మచోడగంగదేవునికి చంద్రలేఖవలనఁ గలిగిన యిరువురు తనయులలో రెండవవాఁడు. ఈపేరు ధరించిన గంగవంశజులలో నితఁడు రెండవవాఁడు. అన్న యగు రెండవ రాజరాజుననంతర మితఁడు సింహాసన మెక్కెను. భువనేశ్వరమునందలి కృత్తివాస ఆలయము శాసనముల ననుసరించి యీతఁడు క్రీ. శ. ౧౧౯౦ యందు రాజ్యమునకు వచ్చియుండు నని మన్మోహన్‌చక్రవర్తిగారు నిర్ధారణచేసిరి. ఇతని సోదరుఁడగు రెండవరాజరాజుశాసనములు క్రీ. శ. ౧౧౯౨ వఱకుఁగూడఁ గానవచ్చుచుండుటవలన ఇతఁడు తనయన్నతోపాటు రాజ్యమును రెండేండ్లు కలసి పాలించిన ట్లూహింపవలసియున్నది. ఇతఁడు త్రికళింగేశ్వరబిరుదాంచితుఁడు. శాసనములం దీతనికి అనంగభీమదేవుఁ డనియు నామాంతరము కలదు. ఈతఁడు పరిపాలించుచుండినకాలమున రెండవరాజరాజదేవునిబావమఱఁది స్వప్నేశ్వరదేవుఁడు భువనేశ్వరమున రమ్యమయిన మేఘేశ్వరాలయమును గట్టించెను. అనియంకభీమదేవుప్రధాని గోవిందుఁడు. ఇతఁడు కాలాంతరమున చాటేశ్వరమున నొకయాలయమును గట్టించెను. మన్మోహన్‌చక్రవర్తిగారి పరిగణనము ననుసరించి యితఁడు క్రీ.శ.౧౧౯౮వఱకు రాజ్యమేలెను.

౩. కళింగమును బరిపాలించిన గంగవంశపురాజులలో నొకఁడు. రెండవ అనియంకభీముని పౌత్త్రుఁడు; మూఁడవ రాజరాజునకును మంకుణదేవికిని జనియించినవాఁడు. ఇతఁడు ముప్పదినాలుగుసంవత్సరములు రాజ్య మేలినట్లు గాంగశాసనములు తెలుపుచున్నవి. వీని నంకవర్షములుగ పరిగణించి మన్మోహన్ చక్రవర్తిగారు రీరాజు శకవర్షము ౧౧౩౩ నుండి ౧౧౬౦ వఱకు పరిపాలించినట్లు నిర్ణయించిరి. ఈతని తండ్రియగు మూఁడవ రాజరాజుకాలముననుండియే కళింగోత్కలములపయి మహమ్మదీయుల దండయాత్ర లారంభమయినవి. ఈతనికాలమున నుత్కలముపయి దండెత్తివచ్చినవాఁడు బంగాళము నేలుచుండిన నాలుగవ సుల్తాను ఘియాజుద్దీన్ ఇవాజ్. ఈదండయాత్రయందు మహమ్మదీయులు జయించి రనియు, హిందువులు పరాజయము నొందిరనియు మహమ్మదీయ చరిత్రకారులు వ్రాసిరి కాని యది విశ్వసనీయముగఁ గన్పట్టదు. ఏల యన అనంగభీమదేవుని శాసనములవలన అతని ప్రధాని యయిన విష్ణు వనునతఁడు యవనుల నోడించినట్లు తెలియుచున్నది. మన పూర్వులు మహమ్మదీయులను యవను లనియుఁ జెప్పుచు వచ్చినందున వీరు బంగాళదేశపు మహమ్మదీయులయి యుండు రని చరిత్రకారులు నిర్ధారణ చేసియున్నారు.

అనియంకభీమదేవుఁ డుత్తరమున మహమ్మదీయులతోఁ బోరాడుచుండినకాలమున ఓరుఁగంటి కాకతీయులు కాకతి గణపతిదేవుని నాయకత్వమునఁ దమరాజ్యమును ప్రాక్సముద్రతీరమువఱకును విస్తరింపఁజేసికొనుచుండిన సందర్భమున, వేంగీమండలమును జయించి, గోదావరి నుత్తరించి, కళింగముపయి దాడి వెడలిరి. కాకతిరాజ్యసమర్థుఁ డని బిరుదందిన రేచర్ల రుద్రరెడ్డి సామంతుఁడు రాజనాయకుఁడు కళింగదండయాత్రను నడపిన శూరాగ్రేసరుఁడు. కాకతి గణపతిదేవుని శాసనములు సయితమాతఁడు కళింగమును జయించినట్లు వాకొనుచున్నవి. కాని కేవల మిది తాత్కాలిక సైనికవిజయముగనే కాన్పించును; ఏల యన, అనతికాలముననే అనియంకభీముని దండాగ్రేసరవల్లభుఁడును, ఖడ్గసింహుని అగ్రపుత్త్రుఁడును అగు 'శ్రీమజ్జైస్ప్రాజకుఁడు' వేంగీమండలమును జయించినట్లు దాక్షారామ శాసనములు తెలుపుచున్నవి.

sampath_Ebooks

అనియంకభీమునిరాజ్యము దక్షిణమున గోదావరివఱకును వ్యాపించినది. బంగాళము మహమ్మదీయుల లక్ష్మణావతిరాజ్య ముత్తరపుసరిహద్దు. కవపటి గాంగభూపతులలో నితఁడు మిగులఁ బరాక్రమవంతుడు. అనంతవర్మచోడగంగు నిర్మింప నారంభించిన జగన్నాథాలయము నితఁడు పూర్తిచేయించె నని, భూములను గొలిపించె నని 'మాదలాపంజి' వలనఁ దెలియుచున్నది.

**అనిరుద్ధచరిత్రము** — అయిదాశ్వాసముల స్వతంత్ర కావ్యము; ౮-వ తరగతిలోనిది. కవి: కనుపర్తి అబ్బయామాత్యుఁడు. కౌండిన్యసగోత్రుఁడు, ఆపస్తంబసూత్రుఁడు. తండ్రి రాయనమంత్రి, తల్లి నరసమాంబ, అన్న యోగానందుఁడు. కృతిపతి: మంగళగిరి లక్ష్మీనృసింహస్వామి.

కథాలేశము: కుండినపురాధీశ్వరుఁడైన భీష్మకుని పౌత్రుఁడు రుక్మి అనువాఁడు తనకూఁతును రుక్మలోచనను అనిరుద్ధున కిచ్చెను. శోణపురాధీశ్వరుఁడు బాణాసురుఁడు శంకరుని నృత్యమున మురజము వాయించి మెప్పించి పార్వతీపరమేశ్వరులు తనతలవాకిట కావలి యుండునట్లు పరమశివుని వరముఁ బడసెను. బాణునికొమార్తె ఉష స్వప్నములో అనిరుద్ధుని కలయును. ఆమెచెలి, మంత్రికుంభాండుని కూఁతురు చిత్రలేఖ యనుకన్య, తన చిత్రకళానైపుణ్యమున యౌవనవంతులైన యందగాండ్ర నెల్ల చిత్తరువులందు వ్రాసి, అందు ఉష గుర్తించినవానిని అనిరుద్ధుని తన దివ్యశక్తులచేఁ గోయి తెచ్చి ఉషకు సంఘటించును. ఉష గర్భము దాల్చును. అనిరుద్ధుఁడు ఉషాంతఃపురమున నున్న దెలిసికొని బాణుఁడు వాని నాకట్టె. ఈవార్త విని కృష్ణుఁడు వచ్చెను. బాణునితోడను శివునితోడను కృష్ణుఁడు సమర మొనర్చెను. బాణుని శరణాగతి. ఉషానిరుద్ధుల కల్యాణము. ఇందలి ప్రధానరసము శృంగారము.

కవనప్రశంస: కవనము మధురము. చమత్కారమైన పద్యములు గలవు. హిందూస్థానీపదప్రయోగ మీకవికి ప్రియము. లక్షణము మధ్యమము.

ఉదాహరణములు కొన్ని:—

| | |
|---|---|
| అఖండయతి | ౧.౮౫, ౧౦౬ |
| 'నిలింపదంపతీ, సలలితపంచబాణరస సంజనితోరు పరిశ్రమంబులై' | ౪౧ |
| కోసము (కోలకు అనుటకు) | ౧౧౧ |
| ధ థ ప్రాస - | |
| మనుచరిత్రములోని 'సహసానఖంపచ' అనుపద్యమునకు అనుకరణము—'అధికప్రయత్న...' | ౧౧౫ |
| కొద్ది (కొలఁది అనుటకు) | ౨.౨౧, ౩.౧౬ |

అలంకారశాస్త్రమందు అప్రయుక్త మని చెప్పఁబడిన 'గల్ల' శబ్ద మిందు ప్రయుక్తము. ప్రాచీనకవులు భవభూత్యాదులు నీశబ్దమును ప్రయోగించినారు:—

| | |
|---|---|
| గల్ల | ౨౩, ౬౩, ౬౮ |
| ఇంపుగాగమము | ౩౦ |
| ఈఁగంగల | ౧౩౪ |
| ర, ఱ ప్రాస | ౧౮౨ |

ఈపద్యమునఁ జెక్కులు హిందూస్థానీ శబ్దములు:—

| | |
|---|---|
| జతనంబుతోఁ దేఁటి | ౨.౧౯ |
| నాస్తి - యతి | ౩.౨౯ |
| సస్థాన (స్థా) | ౩౪ |
| ఇంచుకకు పత్యమురామి | ౭౧ |
| ఇంపుగాగమము | ౯.౨ |

ఈ క్రిందివి అందమైనపద్యములు:—

| | |
|---|---|
| 'విచికిలగంధియుగ...' | ౧.౯౯ |
| 'కళలు వెలుంగువేడ్కలు....' | ౨.౯౪ |

అల్పసంతోషిరంజకములు:—

| | |
|---|---|
| 'ఘనసారమును సారఘనమును' | ౨.౨౬ |

(వే. వేం. శా.)

**అనిరుద్ధుఁడు** — ౧. కల్పాదియందు బ్రహ్మను పుట్టించుటకై నారాయణుఁ డెత్తిన యవతారము.

౨. (చం. వం.) యాదవకులజుఁడు. శ్రీ కృష్ణుని కుమారుఁడైన ప్రద్యుమ్నునకును, రుక్మికూఁతురైన రుక్మవతికిని కుమారుఁడు. ఇతఁడు నాగాయుతబలుఁడు, మహారథుఁడు. రుక్మిరాజపౌత్రి యైన రోచన యీతనిభార్య. ఈ వివాహకాలమందు ఘోరమైన పోరు జరగెను. ఈమెవలన నితనికి వజ్రుఁ డను పుత్రుఁడు పుట్టెను (భాగ, ౧౦. ౯౦). బాణాసురునికన్య ఉష యనునామె యీతని ద్వితీయభార్య. ఈమెనుగురించి యాదవులకును బాణాసురునకును పోరు జరగెను.

**అనిర్దేశ్యము** — యజ్ఞసంబంధి యైన యొక అగ్ని పేరు.

**అనిలమధ్య** — ఔడవ సంపూర్ణరాగము. ౫౩ - వ మేళకర్తయగు గమనశ్రమరాగజన్యము. ఆరోహణము: స రి మ ప ధ స; అవరోహణము: స ని ధ ప మ గ రి స యని సంచారము కలది.

**అనిలుఁడు** — ౧. అష్టవసువులలో నొకఁడు. ఈ మన్వంతరమునందు వాయవ్యదిక్కునకు నధిపతి. ఈ శబ్దమునకు అనీలుఁ డను రూపముగూడఁ గలదు.

౨. శ్రీ కృష్ణునకు మిత్రవిందవలనఁ గలిగిన పుత్రులలో నొకఁడు.

sampath_Ebooks

**అనివారితాచార్యుఁడు**— ఇతనికి గుణదుఁడనియుఁ బేరు కలదు. ఇతఁడు బాదామిని బాలించిన పశ్చిమచాళుక్యరాజులలో నొకఁడగు ద్వితీయవిక్రమాదిత్యునికాలమున నుండిన విఖ్యాతుఁడగు శిల్పి. ఇతఁడు విజాపురముజిల్లాలోని పట్టదకల్లులో లోకేశ్వర విరూపాక్షదేవాలయమును నిర్మించెను. ఈదేవాలయనిర్మాణమునఁ జూపినపనితనమునకుఁ బ్రసన్నుఁడై విక్రమాదిత్యుఁడితనికి సమ్మానపట్టమును, త్రిభువనాచార్యుఁ డనుబిరుదము నొసంగి సత్కరించెను.

**అనీకుఁడు** — (చం. వం) యాదవుఁడు, వసుదేవుని తమ్ముఁడు.

**అనీకెర** — చిత్తూరుజిల్లా, కుప్పంతాలూకాయందలి జమీన్‌దారీగ్రామము. జనసంఖ్య ౧౪౧ (౧౯౩౧).

**అనీహుఁడు** — (సూ. వం) శ్రీరామునివంశమునందుఁ బుట్టిన దేవానీకునిపుత్రుఁడు. నామాంతరము అహీనకుఁడు. పుత్రులు పారియాత్రుఁడు, సహస్రాశ్వుఁడు.

**అనుంపల్లి** — అనంతపురంజిల్లా, గుత్తితాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౨౭౭ (౧౯౩౧).

**అనుకంపనుఁడు** — ఒక రాక్షసుఁడు. ఖరదూషణాదుల వధయు, శూర్పణఖ యవమానమును రావణునకుఁ దెలిపి సీతాపహరణమునకుఁ బ్రేరేపించినవాఁడితఁడు.

**అనుకరణము** — ఒకరిని చూచి నేర్చుకొనుట యనుకరణ మనఁబడును. అనుకరణము ముఖ్యముగ రెండువిధములు. శబ్దానుకరణము, వ్యాపారానుకరణము. శబ్దానుకరణ మనఁగా నొకరు పలికినట్లు పలుకుట. వ్యాపారానుకరణ మనిన నొకరు చేసినట్లు చేయుట. అనుకరణము మరల స్వాభావిక మనియు, బుద్ధిపూర్వకమనియు రెండువిధములు. పిల్లవాఁడు తల్లిదండ్రులమాటలను మరలఁ జెప్పఁబోవుట స్వాభావికానుకరణము. ఇట్టిది చిలుక గోరింకలవంటి పక్షులకుఁగూడఁ గొంతవఱకుఁ గలదు. సంగీతమునందు గురువులవారి ధ్వనివలె ధ్వని చేయ యత్నించుట బుద్ధిపూర్వకము. శబ్దానుకరణమునందును, వ్యాపారానుకరణమునందును మానవజాతికి స్వాభావిక ప్రవృత్తి కలదు. నాలుగవనెలనుండి శిశువునకు అనుకరణప్రవృత్తి కలుగు నని డార్విన్ అను శాస్త్రజ్ఞుఁడు వ్రాసినాఁడు. ఈ స్వాభావికప్రవృత్తియే మానవునకు సకలవిద్యలు నేర్చుకొనుటకు మొదట పురికొల్పునది. పిల్లవానికిఁ జదువుచెప్పువారీ స్వాభావికమైన అనుకరణ ప్రవృత్తిని చక్కఁగ నెఱిఁగి, దానిని క్రమముగ నుపయోగించినయెడల పిల్లవానికి శీఘ్రముగను, పరిశుద్ధముగను భాషయు విద్యలును పట్టుపడును. పరిశుద్ధమైన యుచ్చారణ చేయలేనిగురువుల యొద్ద నేర్చుకొనినపిల్లలయుచ్చారణములు మరల పరిశుద్ధములుగఁ జేయుట యెంతకష్టమో యందఱకును విదితమే. సంగీతవిద్యయందును, వక్తృత్వకళయందును శబ్దానుకరణప్రవృత్తి యెక్కువగ నుపయోగపడును. కొంద ఱితరపురుషులమాటలను, పశుపక్ష్యాదికముల ధ్వనులను కూడ ననుకరించెదరు. వ్యాపారానుకరణప్రవృత్తి భరతశాస్త్రాభ్యాసమునకు మూలాధారము. నాటకమునందు రసపోషణ చేయుటకై రెండువిధములయిన అనుకరణములును గావలయును. పాత్రోచితమైన భాషయు, నటనయు నుండవలయును. గ్రంథాదులందు వచ్చు జాతీయము లన్నియు ననుకరణము లే. వ్యాపారప్రవృత్తియే మానవునిస్వభావమును, ఆచరణను నిశ్చయపఱచును. మంచి సహవాసము గలవారు మంచివారగుటయు, చెడ్డసహవాసము గలవారు చెడ్డవారగుటయు సర్వసాధారణము. పైని రెండువిధములయిన యనుకరణములు చెప్పినప్పటికి నన్యవిధములు లేకపోలేదు. స్వరూపానుకరణమే చిత్రవిద్య. ఆకుపటమును జూచి నిజమైన ఆకనియు, మానవునిపటముఁ జూచి నిజమైన మానవుఁడనియు భ్రమ గలుగునట్లు చేయుటయే చిత్రకారుని యుద్దేశము.

అనుకరణప్రియత మానవులయందే కాక పక్ష్యాదులకుఁ గూడ నుండును. చిలుక మొదలైనవి మనము చెప్పినమాటలు మరలఁ జెప్పును. కోఁతులు మానవకృత్యముల ననుకరించును. కొన్ని పురుగులు శత్రువులనుండి తప్పించుకొనుటకై, తా ముండుగడ్డియొక్క రంగును గాని, మఱి బలవంతములైనపురుగులరూపమును గాని అనుకరించును.

**అనుకులపాలెం** — తూర్పుగోదావరిజిల్లా, యెల్లవరంతాలూకాయందలి జమీన్‌దారీగ్రామము. జనసంఖ్య ౨౦౬ (౧౯౩౧).

**అనుకూరు** — విశాఖపట్టణముజిల్లా, వీరవల్లితాలూకాయందలి ఈనాంగ్రామము. జనసంఖ్య ౧౯౩.

**అనుక్రమణికలు** — అనఁగా విషయసూచికలు. ముఖ్యముగ పదములయొక్క విషయసూచికలకు అనుక్రమణికా నామము చెల్లుచున్నది. సంస్కృతభాషలో అనుక్రమణిక లనఁగా వేదానుక్రమణిక లనియే యర్థము. సంహితాభాగములందు క్రొత్త మంత్రములు చేరకుండఁగను, ఉండినవి లోపింపకుండఁగను ఉండు నిమిత్తము అనుక్రమణిక లేర్పడినవి. వానిలో మంత్రమందలి ప్రథమ శబ్దము ఋషి దేవత ఛందస్సు మొదలగువానిపేళ్లు, మంత్రసంఖ్య చెప్పఁబడును.

వేదములయొక్క వేఱువేఱుశాఖలకు వేఱువేఱు అనుక్రమణిక లేర్పఱుపఁబడినవి. సాయణాచార్యునికాలమునందుఁ బెక్కు అనుక్రమణిక లున్నట్లు కానవచ్చుచున్నది. అప్పు డున్నయనుక్రమణిక లిప్పుడు లోపించినవి. ఋగ్వేదమునకు ౭ అనుక్రమణికలు గలవు. అందు నైదు శౌనకప్రణీతములు, ఒకటి కాత్యాయనరచితము. మిగిలినదానికి కర్త యెవఁడో తెలియదు.

sampath_Ebooks

బృహద్దేవతానుక్రమణి అనునవి శౌనకరచితము. అందు యాస్కుఁడు పేర్కొనఁబడినందున నది యాస్కునితరువాత వ్రాయఁబడె నని యూహింపవచ్చును. యజుర్వేదమునకు మూఁడు అనుక్రమణులు కలవు: ఆత్రేయశాఖ కొకటి, మాధ్యందినశాఖ కొకటి.

ఆత్రేయానుక్రమణిలోఁ జూడ మొదట దానిని వైశంపాయనుఁడు యాస్కునకును, యాస్కుఁడు తిత్తిరిఋషికిని, తిత్తిరి ఉఖునకును చెప్పినట్లున్నది. సామవేదమునకు రెండు అనుక్రమణికలు గలవు. మొదటిది నైగేయానామృష్యార్షేయము, రెండవది నైగేయానామృక్సుదైవతము. శేషోక్తమైన యనుక్రమణి యొకటి గలదు. అది మిక్కిలి పురాతనమైనది గా దని పండితులయభిప్రాయము. అథర్వవేదమునకుఁ గేవల మొకయనుక్రమణి గలదు. దానికి బృహత్సర్వానుక్రమణి యని పేరు.

**అనుగీత** — వేదాంతవిషయకమైన గ్రంథము. భారతమునందు నశ్వమేధపర్వమున నున్నది. ఇందు ౩౬ అధ్యాయములు కలవు. అర్జునుఁడు భగవద్గీతలోని బోధ మఱచితిని, మరలఁ జెప్పుమని కోరఁగా శ్రీకృష్ణుఁడు చెప్పెను. బ్రహ్మగీతయు నిందే యిమిడియున్నది.

**అనుగులంకి** — కృష్ణజిల్లా, తిరువూరుతాలూకాయందలి జమీన్దారీగ్రామము. జనసంఖ్య ౪౬౭ (౧౯౩౧).

**అనుగొండ** — కర్నూలుజిల్లా, కర్నూలుతాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౧,౨౫౪ (౧౯౩౧).

**అనుఘంట** — వక్రషాడవసంపూర్ణరాగము. ౪౭ - వ మేళకర్తయగు సువర్ణాంగిరాగజన్యము. ఆరోహణము: స రి మ గ రి ధ ని స; అవరోహణము: స ని ధ ప మ గ రి స యని సంచారము కలది.

**అనుఁడు** — ౧. (చం. వం) నహుషపుత్రుఁడైన యయాతిరాజునకు శర్మిష్ఠవలనఁ బుట్టిన ముగ్గురుపుత్రులలోఁ బెద్దవాఁడు. యదువువలెనే యితఁడును తండ్రియొక్క ముసలితనముఁ దీసికొనుటకు నొప్పుకొననందున ముఖ్యరాజ్యాధికారముఁ బోఁగొట్టుకొని యుత్తరదిక్కున నుండు మ్లేచ్ఛులకు నధిపతి యయ్యెను (మత్స్య. అ. ౩౪). పుత్రులు సభానర, చక్షు, పరోక్షులు.

౨. (చం. వం) యదుపుత్రక్రోష్టయొక్క జ్యామఘవంశాంతర్గతమైన క్రథకులమందలి కురువంశరాజు పుత్రుఁడు. కుమారుఁడు పురుహోత్రుఁడు.

౩. (చం. వం) యాదవుల క్రథవంశాంతర్గతమైన అంధకకులమునందలి కపోతరోముఁ డనురాజునకుఁ బుత్రుఁడు. ఈతని పుత్రుఁడు అంధకుఁడు.

**అనుతంగ** — విశాఘపట్టణముజిల్లా, జయపురముతాలూకాయందలి జమీన్దారీ గ్రామము. జనసంఖ్య ౬౩౬.

**అనుపదేవుఁడు** — ౧. (చం. వం) యాదవుఁడు, దేవకునికొడుకు.

౨. (చం. వం) యాదవుఁడు; అక్రూరుని రెండవకొడుకు.

**అనుపల్లవి** — కర్ణాటకగానమున కీర్తనాదులయందు ద్వితీయభాగము. పల్లవి ననుసరించి యుండి దానికి సమప్రాసము గల్గినదిగ నుండును.

**అనుపల్లి** — ౧. చిత్తూరుజిల్లా, చిత్తూరుతాలూకాయందలి జమీన్దారీగ్రామము. జనసంఖ్య ౩౫౪ (౧౯౩౧).

౨. చిత్తూరుజిల్లా, పుత్తూరుతాలూకాయందలి జమీన్దారీగ్రామము. జనసంఖ్య ౭౭౭ (౧౯౩౧)

**అనుపల్లిపాడు** — నెల్లూరుజిల్లా, నెల్లూరుతాలూకాయందలి ఈనాంగ్రామము. జనసంఖ్య ౨౯ (౧౯౩౧).

**అనుపాతకము** — బ్రహ్మహత్యాదులకు సమానమైన వేదనిందాదిజన్యపాపవిశేషము. యజ్ఞ మొనరించుపురుషుఁడు క్షత్రియుఁడు, వైశ్యుఁడు, రజస్వల, గర్భిణి, అత్రిగోత్రీకుఁడు, అవిజ్ఞాతుఁడు, శరణాగతుఁడు మున్నగువారిని జంపుట, గర్భపాతము గావించుట మొదలగునవి బ్రహ్మహత్యాసమానము లని విష్ణువు వక్కాణించియున్నాఁడు. ఇది ముప్పదియైదుప్రకారములు. ఔన్నత్యమునందు మిథ్యాకథనము: ఇది రెండువిధములు; ఒకటి తనకే చెందునది; రెండవ దితరులకు చెందునది. రాజుయొక్క పైశున్యము. తండ్రి మిథ్యాదిదోషకథనము ఈమూఁడు బ్రహ్మహత్యాసమానదోషములు. వేదత్యాగము—అనఁగాఁ జదివినవేదమును మఱచుట, వేదనింద. కూటసాక్ష్యము—ఇది రెండువిధములు— తెలిసినదానిని దెలియ దని చెప్పుట, తెలియనిదానిని తెలియునని చెప్పుట. మిత్రవధ—అనఁగా బ్రాహ్మణాతిరిక్తమిత్రవధ, తెలిసియుఁ జంటాలాదుల గర్హితాన్నమును భక్షించుట, జ్ఞానపూర్వకముగ ఛత్రకాదులభక్షణము. ఈ ఆఱుప్రకారములగు పాపములు సురాపానతుల్యములు.

నిక్షేపహరణము, నరహరణము, అశ్వహరణము, రజతహరణము, భూమిహరణము, వజ్రహరణము, మణిహరణము నీయేడు సువర్ణస్తేయసమానములు.

సపిండస్త్రీగమనము, కుమారీగమనము, అంత్యజాగమనము, మిత్రస్త్రీగమనము, ఔరసేతరపుత్రస్త్రీగమనము, పుత్రునియసవర్ణస్త్రీగమనము నీయాఱు విమాతృకాగమనతుల్యములు. మాతృష్వస్తృగమనము, పితృష్వస్తృగమనము, శ్వశ్రూగమనము, మాతులానీగమ

sampath_Ebooks

నము, శిష్యస్త్రీగమనము, భగినీగమనము, ఆచార్యభార్యాగమనము, శరణాగతాగమనము, రాజ్ఞీగమనము, ప్రవ్రజితాగమనము, ధాత్రీగమనము, సాధ్వీగమనము, ఉత్తమవర్ణాంగనాగమనము - ఈ పదుమూఁడు గురుస్త్రీగమనసమానములు. ఈ ముప్పదియైదు ప్రకారములగు పాపములు మహాపాతకానుపాతకము లనబడును.

**అనుపావృత్తము** — భారతవర్షీయదేశము (భార., భీష్మ. ౯, ౯).

**అనుపూరు** — కర్నూలు జిల్లా, నంద్యాల తాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౬౧౩ (౧౯౩౧).

**అనుబ్రాహ్మణములు** — బ్రాహ్మణసదృశగ్రంథములు. సామవేదపరిశిష్టములకును, యాజ్ఞవల్క్యాదిమునిరచిత బ్రాహ్మణసదృశగ్రంథములకును అనుబ్రాహ్మణము లని పేరు.

**అనుభవసారము** — పాల్కురికి సోమనారాధ్యుఁడు కృతికర్త; గోడగి త్రిపురారి కృతిపతి; ౨౩౮ పద్యములు గల పద్యకావ్యము. సోమనాథుఁడు కాకతీయ రాజ్యమునందలి పాలకురికియందు జననము నొంది కర్ణాటకదేశమునందలి కలికె యను గ్రామమున సిద్ధిని బొందినట్లు నిర్ణయింపఁబడుచున్నది. పాలకురికియందు సోమనాథలింగమును, దేవాలయము నేఁటికిని కలవు. సమాధులపైని లింగప్రతిష్ఠాపనము చేసి, యారాధించెడి ఆచారము నేఁటికిని హిందూమతమునందే కాక ఇతరమతములందును గలదు. సోమనాథుఁడారాధ్యబ్రాహ్మణుఁడు. అతనితల్లి శ్రియాదేవి, తండ్రి విష్ణురామిదేవుఁడు, విద్యాగురువు కట్టకూరి పోతిదేవుఁడు, కవితాగురువు కరస్థలి విశ్వేశుఁడు అని బసవపురాణమునందును, తండ్రి బసవేశుఁడు, గురువు లింగార్యుఁడు అని పండితారాధ్య చరిత్రయందును, సోమనాథుఁడు వ్రాసెను. అనుభవసారమునందు ఇట్లు గలదు:—

"క. భృంగిరిటిగోత్రుఁడను గురు
లింగతనూజుండ శివకులీనుఁడ దుర్వాశ్వ
సంగవివర్జితచరితుఁడ,
జంగమలింగ ప్రసాదసత్పాత్రుండన్."

దీనివలన కొందఱు సోమనాథుఁడు జంగమకులజుఁడని నిర్ణయించిరి. కాని, అనుభవసారమందు 'వేదోక్త నియోధిని పురాణరహస్య నియుక్తిని' అనియును, పండితారాధ్యచరిత్రయందు 'చతుర్వేదపారగుఁడను' అనియును వ్రాయుటయును, సోమనాథభాష్యమందు గాయత్రీమంత్రప్రకరణమును చేర్చుటయును, చతుర్వేదసారసూక్తులను వ్రాయుటయును, సంబంధబాంధవ్యములును బ్రాహ్మణకులసంభవమును సూచించుచున్నవి. 'పాలకురికి పతితుఁడు' అను ధూర్త విప్రనిందయే బ్రాహ్మణకులజననమునకు నిదర్శనము. సోమనాథుఁ డారాధ్యబ్రాహ్మణకులమున పుట్టినను, కాలక్రమమున బసవేశ్వరభక్తుఁ డై కులగోత్రాభిమానమును వదలి, బసవకులమును బసవగోత్రమును స్వీకరించి ప్రమథగణపరమైన భృంగిరిటి గోత్రమును స్వీకరించియుండును. సోమనాథుఁడు ౧౧౬౦ నుండి ౧౨౩౦ వఱకును జీవించియుండును.

సోమనాథ విరచితము లైన కృతు లనేకములు గలవు. బసవపురాణము, పండితారాధ్యచరిత్రము, అనుభవసారము, చతుర్వేదసారసూక్తులు, చెన్నమల్లు సీసములు, వృషాధిపశతకము తెలుఁగు గ్రంథములు; సోమనాథభాష్యము, బసవపంచగద్య, శ్రీరుద్రభాష్యము, నమస్కారగద్యము, అక్షరాంకగద్యము, ప్రపంచకప్రకారగద్యము, అష్టకము, పంచకము, ఉదాహరణయుగ్మము సంస్కృతగ్రంథములు; బసవరగడ, గంగోత్పత్తిరగడ, శ్రీ బసవాఖ్యరగడ, శ్రీసద్గురురగడ కన్నడగ్రంథములు.

సోమనాథుఁడు సంస్కృతాంధ్రకర్ణాటకభాషలందును వేదవేదాంగములందును మతసంప్రదాయాచారములందును మహాపండితుఁడు. ఆంధ్రకావ్యరచనమందును ప్రజాసామాన్యమునకు మతరహస్యములను వెల్లడిచేయుటయందును గల యభీష్టమును బసవేశ్వర పండితారాధ్యచరిత్రలును అనుభవసారమును వెల్లడి చేయుచున్నవి. సోమనాథుని కవిత్వము జానుతెనుఁగున ద్విపదపద్యములందు విరచితమై జనసామాన్యమున కుపయోగపడఁగలవిధమును బసవపురాణము, పండితారాధ్యచరిత్రము, అనుభవసారము మొదలగునవి తెలుపుచున్నవి. నన్నయకును, తిక్కనకును నడుమకాలమందు వర్ధిల్లిన సోమనాథుఁ డాంధ్రవాఙ్మయమునకును, విజ్ఞానమునకును, మతసాంఘికాచారసంస్కరణ సంరక్షణములకును చేసిన మహోపకారము నతని గ్రంథములు విశదము చేయుచున్నవి.

శ్రీ శంకరాచార్యవిరచితమైన అపరోక్షానుభూతి ఆచార్యస్వాములవారి అద్వైతానుభవమును వివరించుచున్నట్లు, సోమనాథవిరచితమైన అనుభవసారము వీరశైవమతసారమును వివరించుచున్నది. శ్రీ శంకరాచార్యులు జైనబౌద్ధమతములను ఖండించి వైదికమతోద్ధరణ మొనర్చినను ప్రజాసామాన్యమునందు వర్ణాశ్రమధర్మకర్మపరమైన వైదికమతవ్యాపనము దుస్తరమైనది. బసవేశ్వరుఁడు ప్రజాసామాన్యమునందు మానవధర్మపరమైన దైవభక్తిని వ్యాపింపఁజేయుటకై శైవదీక్షాపరమైన వీరశైవమతవ్యాపనమునకు పూనుకొనెను; వైదికమతానుష్ఠానమునకు దురారాధ్యమైన కర్మమార్గమునకు బదులు సులభమైన భక్తిమార్గము నవలంబించెను. బసవేశ్వరుఁడు స్వయముగ బ్రాహ్మణకర్మములను విడిచి శివదీక్షను స్వీకరించెను. బసవేశ్వరుఁ డవలంబించిన మార్గమును సోమనాథుఁడు విస్తరింపఁజేసినవిధమును అతని గ్రంథములు విశదముచేయుచున్నవి. అనుభవసారమందలి యీ పద్యములు అతని సంకల్పమును తెలుపుచున్నవి.

క. అనుభవసారం బనఁగా
మనసిజహరు శుద్ధభక్తిమార్గము వేదో

sampath_Ebooks

త్రినయనాక్షిం బరాణరసా
స్వనియుక్తిని విన్నవింతు నని గని ట్లనినన్.

క. అర్థార్థము వ్యవసాయము
అర్థము జంగమపీఠార్థ మనియును నర్థ
వ్యర్థము నర్థక్తియు ము
వ్యర్థం బగు గాని వలయు వ్యవసాయ మిలన్.

క. చేయుము శివభక్తిపరులకు
న్యాయార్జిత మైనయట్టి యర్థకానికి న
న్యాయార్జిత మగు నావలు
చేయుచు నతిగాఢ భక్తినిధి త్రిపురారీ.

క. అనుపమగురులింగ జంగము
ప్రసాదభక్తస్థలములు బరిపూర్ణం బై
యొనరగు లనతార్థ్యము నీ
కనయార నిష్టదాయి యగుచు త్రిపురారీ.

జైన బౌద్ధమతములు నిరాలము చేసిన వైదికమతాచారములను శ్రీ శంకరస్వామి ఉద్ధరించినను ప్రజాహృదయమునందు వైదిక కర్మానుష్ఠానము వ్యాపకమును గాంచుట దుర్లభమైనది. వైదికమతపరిణామమైన శైవభక్తిని జనసామాన్యమునకు గుర్తింపజేయుటకు భక్తిమార్గము శరణమైనది. బసవేశ్వరుడు, రామానుజులు శైవవైష్ణవ మతముల నాలమున భక్తిమార్గమును వ్యాపింపజేసి హిందూ మతమును పునరుద్ధరించి పండ్రెండు శతాబ్దములందు దక్షిణదేశమునందు దుద్ధరించిరి. అనుభవసారమునందు బసవేశ్వరభక్తుడైన సోమనాథుడు వీరశైవ సిద్ధాంతములను నిరూపము చేసెను. అనుభవ మనగా శివానుభవము.

ఆదియుగమునందు కర్మపరమైన వైదికమతము తదనంతరము జ్ఞానపరమును భక్తిపరమునునై పరివర్తనమును పొందినది. భక్తిపరమైన వైదికమతపరిణామమునకు శైవమతపరిణామము లక్ష్యముగ నున్నది.

శైవము:— వైదికమంత్రోపస్థితుడైన రుద్రుడు వేదాంతమునందు శివస్వరూపపరిణామమును పొందుచు సర్వవ్యాపకుడై 'శివోఽహం' తత్త్వమును వ్యక్తము చేయుచున్నాడు. శివుడు యజ్ఞపురుషుడు. శివుడు సగుణనిర్గుణపరబ్రహ్మము. శివుడు హిమాచలమునందు గౌరీశంకరుడు, రామేశ్వరమునందు రామలింగేశ్వరుడు, కాశ్మీరమునందు మహాదేవుడు, మధురయందు సుందరేశ్వరుడు, చిదంబరమునందు నటరాజేశ్వరుడు, సౌరాష్ట్రమునందు సోమనాథుడు, శ్రీశైలమునందు మల్లికార్జునుడు, కాశియందు విశ్వేశ్వరుడు. దేశావృతములైన శివాలయములు శైవమతవ్యాపనమును తెలుపుచున్నవి. శైవులు లింగరూపమున శివలింగమును పూజించుచు శివోత్కర్షను జేయుచున్నారు. అగర్వశిఖయందలి 'ఈశ్వర శ్శివ ఏవ చ...శివ ఏకో ధ్యేయః శివఙ్కరః', స్కందోపనిషత్తునందలి 'జీవ శ్శివ శ్శివో జీవ స్స జీవః కేవల శ్శివః' మొదలగు వాక్యములు శివోత్కర్షను దెలుపుచున్నవి. శైవులు శివాలయములందును, గృహములందును, స్వాంగములందును లింగములను ప్రతిష్ఠించి పూజింతురు. అద్వైతమతస్థాపకులు శ్రీశంకరస్వాములు పీఠమునందు లింగార్చనను చేయుట కుపక్రమించిరి.

శివలింగము:— అవ్యక్తము నిర్గుణము, నిరాకారము, నిరహంకారము, నిరవద్యము. అవ్యక్తమును అనంతములైన నామరూపభావములను విశ్వమంతయును సంభావించుచు ప్రకాశించును వ్యక్తము చేయుచున్నది. అవ్యక్తము లింగమునకు స్థూలరూపములను విశ్వవ్యాపమై వెలయుచున్నది. ఆకాశలింగము, వాయులింగము, తేజోలింగము అబ్లింగము, పృథ్వీలింగము, అవ్యక్తమునకు వ్యక్తస్వరూపములు. వ్యక్తమైన లింగస్వరూపములందు జ్యోతిర్లింగము, సగుణనిర్గుణరూపములను గలిగి పూజాపాత్రమైనది. లింగము మహాత్మ్యకపు బీజమన్నము. శైవాగమములు మహిమాన్వితమంత్రరూపసరళంగ నిరూపించుచున్న లింగమాహాత్మ్యపంచగ్రాహ్యములందును గోచరించు బడుచున్నది.

లింగధారణము:— శివలింగమును గంట గట్టి సదాకలకాలము వారును పూజించుచున్నారు. బ్రాహ్మణులు మొదలగువారందును, సకలవర్ణములవారును ఆలయములందును శివలింగమును బూజించుచున్నారు. లింగధారులు లింగమును స్వాంగములందు ధరించుచు లింగధారి బ్రాహ్మణులు జంగములు వీరశైవులు మొదలగువారగుచున్నారు. లింగధారణము బాహ్యార్థమును అంతరార్థమును గలిగి వీరశైవమున కపూర్వమైన ప్రతిష్ఠను గలుగజేసినది.

సీ. లింగార్చనక్రియాసంగతి శృంగారరసమును సన్నుతిరసము నొప్ప
ననయంబు జంగమార్చనజేయు శాంతరసము ఛాయానకరసమునొప్ప
సంసారసంపదల్ విర్జించు హాస్యరసమును బీభత్సరసము నొప్ప
దుష్టేంద్రియంబులదుఃఖించు రౌద్రరసమునుసవీరరసమునొప్ప
నెల్ల శివరాశిరోపిలను గారుణ్య
రసము దోప భక్తి రమణం బరగు
నవరసైకరసికు నవివేకపూరుంగు
భక్తు డొక్కడుండె ప్రస్తుతింప.

వీరశైవము:— వీరశైవము కర్మపరమైన వైదికమతమును, జైన బౌద్ధమతములను ప్రతిఘటించుచు యేర్పడిన వైదికమతము. వీరశైవమునకు ప్రధానదీక్ష లింగధారణము. లింగధారణమునకు గళము, కరము, ఫాలము, కంఠము, శిరస్సు, వక్షస్థలము ముఖ్యస్థానములు. లింగధారు లందఱును జాతిమతకులభేదములు లేని శివభక్తులు. బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు, పంచములు మొదలగు నన్నివర్ణములవారును వీరశైవులై కులభేదములను నిరసించినవిధమును వీరశైవమతచరిత్రమును, సిద్ధాంతములును విశదము చేయుచున్నవి. కర్మమార్గమును నిరసించుచున్నవిధమును వీరశైవ

sampath_Ebooks

సిద్ధాంతములు విశదముచేయుచున్నవి. అనుభవసార మీవిషయమును సంగ్రహముగఁ దెలుపుచున్నది.

చ. అవిరళలింగపూజయు నిరంతరసద్గురుభక్తియుక్తియుఁ
సవినయజంగమార్చనయు సత్యము శౌచము సచ్చరిత్రయుఁ
దవిలి ప్రసాదసేవయును దా నొసఁగూర్చ ప్రవర్తనాబలం
బవుఁ దయాప్తభక్తి గుణాకర శ్రీకర సోమశేఖరా.

క. భూతియు రుద్రాక్షలు స
త్యాతిత బహువేషధరణ లని తోఁచు నొసం
ప్రీతిగ భక్తునకును బ్ర
ఖ్యాతిగ సద్భక్తి యొసఁగు గాక మహాత్మా.

వీరశైవమునకు ఆచార్యమనంగుపదేశము అంతరంగమునందును లింగధారణము విజముగ నున్నది. వైదికమతమునందలి దేవతార్చనము, వేదాంతమునందలి తత్త్వార్థము, జైనబౌద్ధమతములందలి సంఘారాధనము, వైష్ణవమతములందలి దాస్యభావము వీరశైవభక్తియందు సంయోగమును పొందినవి. వీరశైవులు జాతికులగోత్రభేదములు లేక జంగమలింగములకు శరణాగతు లగుదురు.

క. ఈకుల మాకుల మనక ని
రాకులమతి వారిఁగాంచి లోఁ యుక్త భక్తా
నీకము శివుఁ డని తలఁచినఁ
జేకొనఁడే సంభృతార్థ మహాత్మా.

క. శివగణ్యులు శివజన్ములు
శివగోత్రులు శివకులజులు శివవిజ్ఞానుల్
శివశాసనధరులగుచు నెపుడం
గు వేఱుకులములను నెంతురె త్రిపురారీ.

లింగస్వరూపుఁడైన సాధకుఁడు శివలింగస్వరూపులైన జంగమభక్తుల తీర్థప్రసాదములను గైకొని త్రిగుణకలుషమునకుఁ బాత్రుఁడై ప్రకృతి మమకారాహంకారకల్పితములైన భేదాదరణములను విడిచి గురులింగైక్యమును బొందుచున్నాఁడు. సకలమతములకును లక్ష్యము జంగమసేవ. జంగములైన ప్రాణులకు సుఖమును గలుగఁజేయుటయే ఈశ్వరపూజాఫలమని మతములన్నియును బోధించుచున్నవి. లింగధారులైన జంగమభక్తులను జాతిమతభేదములను విసర్జించి పూజించి మానవసోదరత్వమును స్థాపింపఁగలవిధమును అనుభవసారము బోధించుచున్నది.

సీ. సహజసజ్జనశివాచారనిర్భరనియుక్తి జంగమభక్తి భక్తిపదము
అంగసంగేతరలింగైకనిష్ఠాపరత్వంబు మాహేశ్వరస్థలంబు
సతతబాహ్యాంతరార్పితలింగవికసనాస్వాదనసుఖము ప్రసాదిసెలవు
స్వప్రాణలింగ లింగప్రాణమగునది (?) లీనాంతరము ప్రాణలింగిలీల
అనుభవలింగ పరవశానోన్మ్యగర్భవి
స్ఫురణనిత్యసత్య శరణపదము

తా ననంగలేని తత్త్వంబు లింగైక్య
మివియు షట్స్థలంబు లీశ్వరాంశ.

ఉ. జంగమభక్తి లింగపరిచర్యల మీఱి యుత్తమంబు త
జ్జంగమలింగపూజ లని సామ్యము సల్పుట మధ్యమంబు మఱి
జంగమలింగపూజ యెడ సల్పక లింగముఁ గొల్చుచున్కి యా
స్యంగఁ గనిష్ఠ మాట శరణప్రతిపత్తియె ముఖ్య మెమ్మెయిన్.

శివసూత్ర:— శివక్షేత్రమందు వ్యక్తావ్యక్తములను సన్ప్రతిష్ఠ సమకూర్చుటకు భగవద్భక్తి పరమసాధనముగ నున్నది. శివసూత్రము దేహసూత్రముగఁ [illegible] వైదికమతసారమ్ము అనంతముఖముల నిర్దేశించుచున్నవి. దేహధారులకు అవ్యక్తమును గ్రహించుట దుర్లభము. అవ్యక్తము వ్యక్తముద్వారా గ్రాహ్యమగుచున్నది. శివసూత్రము విషయసూత్రముగఁ జేయక శివసూత్రముగఁ జేయుటకు జ్ఞానేంద్రియకర్మేంద్రియములు మనోబుద్ధిచిత్తాహంకారములు నుడి లింగజంగమార్చనలందు భక్తిపరవశములు కావలయును. శివసూత్రము దేహసూత్రము గాక శివసూత్రము చేయవలసినవిధమును అనుభవసారము తెలుపుచున్నది. శివసూత్రము వైశ్యసూత్రము చేయుటకు బాహ్యలింగధారణమును, అంతర్లింగధారణమును ఉపయోగపడఁ గలవిధమును వీరశైవాగమములు బోధించుచున్నవి. ఈపరమార్థమునే అనుభవసారమునందు సోమనాథుఁడు విశదముచేసెను.

సీ. పుట్టియుఁబుట్టక పుట్టు మహత్త్వంబు కలిగియుఁగలుగక కలుగుసుఖము
[illegible] చూచియుఁ జూడక చూడు వివేకంబు చేసియుఁ జేయక చేయు [illegible]
ముట్టియుముట్టక ముట్టుమంజుల [illegible] పొందియుఁ బొందక పొందు సుఖము
తలఁచియుఁ దలఁచక తలఁచు మహత్త్వంబు [illegible]
ఆజ్ఞలేనినీడ అలలేనికట్టం [బులు]
రెంటిలేనివెలుఁగు నిండియున్న
ఆదియుఁబొరయు లేని యానందనీరధి
తెలియు శరణు సెలవు తరమె పొగడ.

క. తెలియుటయె యెఱుక కోర్కులు
పొలియుటయే సుఖము సుకృతము నిదియె గతి వా
పులదుటయె పరమపదము బాయక
తలఁచుటయె సమాధి పరమతత్త్వం బనఘా.

క. నిర్భయులకు నిష్క్రియులకు
దౌర్భాగ్యదైన్యములకు వృథావాదులకున్
దుర్భావకులకు దాసపు
సర్భవ సుఖరాశి గలదె నారయ పుత్రా.

సాధనసాధ్యము:— జీవుఁడు శివసూత్రమందు శివస్వరూపమును బొందుటయే జీవసూత్రప్రయోజనము. 'అహం బ్రహ్మాస్మి', 'తత్త్వమసి', 'శివోఽహమ్', 'సర్వం ఖల్విదం బ్రహ్మ' ఇత్యాది మహావాక్యార్థములను వీరశైవము జీవసూత్రమందు సాధకము చేయుచున్నది. లింగధారణము జంగములందు ద్వైతభావమును

పోఁగొట్టి అద్వైతభావమును వ్యక్తముచేయుచున్నది. విశ్వ మంతయును శివుఁడు జీవము ప్రకృతి, ఆత్మ జీవము దేహము, గురువు లింగము జంగమము, భావలింగము ప్రాణలింగము ఇష్టలింగము, లింగశరీరము సూక్ష్మశరీరము స్థూలశరీరము, నాదము బిందువు కళ మొదలగు త్రిపుటీరూపమున గోచరమగుచున్నది. సాధకుఁడు చిన్మయదీక్షితుఁడై లింగధారణను బొంది పంచభూతములను పంచేంద్రియములను అంతఃకరణచతుష్టయమును వేధించి సాధ్యమును జేరుటకు వీరశైవ ప్రతిపాదితములైన సాధనములను అనుభవసారము విశదముచేయుచున్నది. వీరశైవము పంచాక్షరి 'నమశ్శివాయ ఓమ్' మూలమునను మూలాధార స్వాధిష్ఠాన మణిపూరక అనాహత విశుద్ధ ఆజ్ఞాచక్ర స్థానములందు భక్తమాహేశ్వర ప్రసాది ప్రాణలింగి శరణ ఐక్యస్థలములందు ఆచారగురుశివచరసత్యప్రసాద మహాలింగములను సాక్షాత్కారము చేసి పదార్థైక్యమయమయిన సాయుజ్యమును గలుగఁజేయఁగలవిధమును విశదము చేయుచున్నది. ఆసాధనమును సోమనాథుఁ డనుభవసారమునందు సంక్షేపముగ విశదముచేసినవిధము గ్రంథావలోకనము వెల్లడిచేయుచున్నది.

(రా. స.)

**అనుభూతిప్రకాశిక** — ఈగ్రంథము సకలామ్నాయ శిరోమణులగు విద్యారణ్యమునీశ్వరునిచే విరచితము. బ్రహ్మజిజ్ఞాసువులకు నుపనిషజ్జ్ఞానము నిస్సందేహముగ గలుగుటకై యీగ్రంథ ముపదేశింపఁబడినది.

వేదచతుష్టయాంతర్గతంబులగు ఐతరేయ తైత్తిరీయ ఛాందోగ్య ముండకోపనిషత్తాత్పర్యంబుల నధ్యాయాష్టకంబుచేఁ గ్రమంబున నిరూపించి పిమ్మటఁ బదునాఁ డధ్యాయంబులచే వేదచతుష్టయాంతర్గతంబగు నుపనిషద్ద్వాదశకతాత్పర్యంబును వ్యక్తీకరించె. ఈ విషయము విద్యారణ్యులచే ననుభూతిప్రకాశిక యొక్క యెనిమిదవ యధ్యాయమునందలి మొదటి రెండు శ్లోకములచే వివరింపఁబడియున్నది:

"ఐతరేయే తైత్తిరీయే ఛాందోగ్యే ఽథర్వణేచ యత్,
తత్త్వం చతుర్వేదవిద్యాప్రకాశే తత్సమీరితమ్.
అనుభూతిప్రకాశేఽథ కౌషీతక్యాదినామసు,
చతుర్వేదాంగశాఖాసు యత్తత్త్వం త దుదీర్యతే."

ఇట్లు లీగ్రంథ మిరువది యధ్యాయంబులం గల్గి మృదుమధుర శైలితో నొప్పు రెండువేల యెనిమిదివందలకైై యనుష్టుప్పు శ్లోకములతో నతిశయిల్లుచున్నయది. ఇరువది యధ్యాయంబులచేఁ జతుర్వేదాంతర్గతం బగు నిరువది ప్రకరణంబుల తాత్పర్యము వివరింపఁబడుచున్నను బ్రతియధ్యాయమును సంక్షేపంబుగనో విపులంబుగనో యద్వైతతత్త్వమునే ప్రతిపాదించుచున్నయది. ప్రకరణవైచిత్ర్యమును శిష్యవైచిత్ర్యము ననుసరించి యున్నది గాని తత్త్వవైచిత్ర్యమువలన నెంతమాత్రమును గలుగలేదు. నాలుగువేదములందలి యిరువది ప్రకరణంబులు నత్యంతభిన్నంబులుగా నుండినను బర్యవసానము నద్వైతతత్త్వమునే ప్రతిపాదింపుచుండుటచే నిరువది యధ్యాయంబులును పర్యవసానంబున నొకటేయంశం బగు నద్వైతతత్త్వమును బ్రకటింపుచు సర్వోపనిషత్సామరస్యంబును, సకలవేద సామరస్యంబును వేదవిదంబుల సిద్ధాంతీకరింపుచున్నయవి.

మొదటి యధ్యాయంబున నైతరేయ ద్వితీయారణ్యకంబును, రెండవయధ్యాయంబునఁ దైత్తిరీయాంతర్గతం బగు బ్రహ్మవల్లియు, మూఁడు నాలు గైదవ యధ్యాయంబులచేఁ గ్రమంబుగ ఛాందోగ్యంబునందలి యుద్దాలక సనత్కుమార ప్రజాపతియుపదేశంబులును, ఆఱేడవ యధ్యాయంబులచే ముండకమునందలి యాంగిరసపిప్పలాదోపదేశంబులును, ఎనిమిది తొమ్మిదవయధ్యాయంబులచే ఋగ్వేద కౌషీతకిశాఖయందలి యింద్రాజాతశత్రూపదేశంబులును, పదియవయధ్యాయంబున మైత్రాయణ్యుపనిషత్తునందలి శాకాయన్యుపదేశంబును, పదునొకండవయధ్యాయంబున కఠవల్లియందలి యమోపదేశంబును, పండ్రెండవ యధ్యాయంబున శ్వేతాశ్వతరోపనిషత్తును, పదుమూఁడవ యధ్యాయము మొదలు పదునెనిమిదవ యధ్యాయముపఱకునుంగల యాఱధ్యాయంబులయందును గ్రమంబుగ బృహదారణ్యకాంతర్గతంబులగు మూఁడవ యధ్యాయ నాల్గుబ్రాహ్మణంబు, నాలవయధ్యాయమునందలి యజాతశత్రుబాలాకి సంవాదము, యాజ్ఞవల్క్యమైత్రేయీసంవాదము, అశ్వలోపదేశంబగు మధువిద్యయును, ఐదవయధ్యాయంబునందలి యాజ్ఞవల్క్యాశ్వలాదుల వాదకథయు, నాలవ యధ్యాయమందలి యాజ్ఞవల్క్యజనకసంవాదంబును, పందొమ్మిదవయధ్యాయంబున సామవేద తలవకారశాఖయును, ఇరువదియవయధ్యాయంబున నాథర్వణోత్తరతాపినియును బహుస్పష్టముగా వివరింపఁబడి యవ్వానితాత్పర్యము సుస్పష్టముగను విపులముగను, నిస్సంశయంబుగను నిరంకుశంబుగను సిద్ధాంతీకరింపఁబడినది.

(శ్రీ. క. భా.)

**అనుభూతిస్వరూపాచార్యుఁడు** — సారస్వత వ్యాకరణమును రచించినయతఁ డని వాడుక. ఇతనినిగూర్చిన యొక కథ గలదు. రాజసభ మధ్యమున నీతఁ డొకనాఁడు అపశబ్దప్రయోగము చేయ దానికి నాధారము చూపు మన నింటికిఁబోయి సరస్వతి నారాధించెను. ఆమె ప్రసన్నురాలై యొకవ్యాకరణము నిచ్చెను.

ఈతఁడు సారస్వతవ్యాకరణము వ్రాయలే దనియు, దానిమీఁద 'ప్రక్రియ' మాత్రము వ్రాసె ననియు, నీతఁడు క్రీ. శ. ౧౨౫౦ కిఁ దరువాతను, ౧౪౫౦కిఁ బూర్వమునను ఉండె ననియుఁ దజ్జ్ఞుల యభిప్రాయము.

**అనుమంచిపల్లి** — కృష్ణాజిల్లా, నందిగామతాలూకా యందలి గ్రామము. జనసంఖ్య ౭౧౫ (౧౯౩౧).

**అనుమతి** — ౧. అంగిరస ఋషికిని, కర్దమకన్య శ్రద్ధకును బుట్టిన నల్గురు కన్యలలోఁ జిన్నది.

౨. ద్వాదశాదిత్యులలో ధాత యనువాని భార్య.

౩. శాల్మలీద్వీపమునందలి యొకమహానది.

౪. ఒక బ్రహ్మర్షి.

**అనుమనపల్లి** — కర్నూలుజిల్లా, కంభంతాలూకా యందలి గ్రామము. జనసంఖ్య ౨,౦౦౫ (౧౯౩౧).

**అనుమర్లపూఁడి** — గుంటూరుజిల్లా, గుంటూరుతాలూకాయందలి ఈనాం గ్రామము. జనసంఖ్య ౮౫౧ (౧౯౩౧).

**అనుమర్తి** — తూర్పుగోదావరిజిల్లా, పెద్దాపురంతాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౧౬ (౧౯౩౧).

**అనుమానము** — మన నైయాయికులచే నంగీకరింపఁబడిన నాలుగు ప్రమాణములలో నిది రెండవది. ప్రత్యక్షము, అనుమానము, ఉపమానము, శబ్దము అనునవి నాలుగు ప్రమాణములు. ప్రమ యనఁగా యథార్థానుభవము, నిజమైన జ్ఞానము. ప్రమకుఁ గారణము ప్రమాణము; అనఁగా నేసాధనంబులవలన మనకు యథార్థజ్ఞానము కలుగునో, వానికిఁ బ్రమాణము లని పేరు. అనుమాన మనునది సాధనము. అందువలనఁ గలుగుజ్ఞానము 'అనుమితి' యందురు.

హిందూ తర్కశాస్త్రము ననుసరించి

అనుమానస్వభావము :— మనము దూరమందున్న యొకానొక పర్వతముమీఁద పొగ లేవఁగాఁ జూచి యా పర్వతమునందు నగ్ని కల దని యూహించుచున్నాము. ఇట్టి జ్ఞానమునకు 'అనుమితి' యని పేరు. ఇందుఁ బర్వతమునకుఁ 'బక్ష' మనియు, ధూమమునకు 'హేతువు' లేక 'లింగ' మనియు, అగ్నికి 'సాధ్య' మనియు సంజ్ఞలు. ఇందుఁ బ్రత్యక్షమైన ధూమముచే నప్రత్యక్షమైన యగ్ని సాధింపఁబడినది. కావుననే వాత్స్యాయనుఁడు 'ప్రత్యక్షముచే నప్రత్యక్షవస్తువుయొక్క సంబంధమును సాధించుట అనుమానము' అని తన వార్తికములోఁ జెప్పియున్నాఁడు[1].

ఇచ్చటియనుమానమునకు 'హేతువు' (లేక లింగము) అనఁబడు ధూమము కారణమైనను, ధూమమునకును అగ్నికిని గల సంబంధముయొక్క జ్ఞానమే ముఖ్యకారణ మని చెప్పవలసియున్నది. ఎచ్చటెచ్చట ధూమ ముండునో యచ్చటచ్చట నగ్ని యుండు నన్న జ్ఞాన మేది గలదో యది యనుమానమునకు హేతువు. ఈజ్ఞానమునకే వ్యాప్తిజ్ఞాన మని పేరు. ధూమమునకును, అగ్నికిని గల సంబంధమునకు వ్యాప్తి యని పేరు.

వ్యాప్తి :— పైని చెప్పినదానిని బట్టిచూడఁగా 'వ్యాప్తి' యనునది అనుమాన ప్రకరణమునందు ముఖ్యమైన విషయ మని చదువరులకుఁ దోఁచియుండును. కావున అందునుగూర్చి కొంచెము విశదముగ వివరింతము.

ధూమ మున్నచోట నెల్ల నగ్ని యుండునా యుండదా యని యెవనికి సంశయము కలదో వానికి ధూమజ్ఞానముచేత నగ్నిజ్ఞానము కలుగనేరదు. అట్లు సంశయము లేక ధూమాగ్నులకుఁ గల సంబంధము నిశ్చయముగాఁ దెలిసినవానికి ధూమజ్ఞానముచే నగ్నిజ్ఞానము తప్పక కలుగును. అందువలన వ్యాప్తినిశ్చయమే యనుమితికిఁ గారణ మని మనము చెప్పవచ్చును. ఈ వ్యాప్తిజ్ఞానము సాహచర్యజ్ఞానముచేఁ గలుగుచున్నది. కావుననే 'నియతసాహచర్యమే వ్యాప్తి' యని చెప్పఁబడినది. వంటయింటిలోను, ఇతరస్థలములందును మరల మరల ధూమాగ్నుల సాహచర్యముం జూచుటచేత ధూమము వ్యాప్య మనియు, అగ్ని వ్యాపక మనియు జ్ఞానము కలుగుచున్నది; అనఁగా వ్యాపక మెప్పుడును వ్యాప్యమునకంటె నెక్కువ ప్రదేశ మాక్రమించుకొని యుండును. ధూమ మున్నచోట నెల్ల నగ్ని యుండును, కాని అగ్ని యున్నచోట నెల్ల ధూమ ముండదు. అందువలన నగ్నియున్న ప్రదేశము లెక్కువ; ధూమ మున్న ప్రదేశములు తక్కువ. కావున ధూమము వ్యాప్యము, అగ్ని వ్యాపకము. ఇదియే మఱియొకవిధముగఁ జెప్పవచ్చును. వ్యాప్తిసహితమైనది వ్యాప్య మనఁబడును. వ్యాప్తినిరూపకము వ్యాపక మనఁబడును. అగ్ని లేనిది ధూమ ముండదు. కాని ధూమము లేనిది అగ్ని యుండును. ఎఱ్ఱగాఁ గాలిన యినుపకడ్డీయందు నగ్ని కలదు. కాని ధూమము లేదు. కావున ధూమము (వ్యాప్యము) నందు, అగ్ని (వ్యాపకము) యొక్క వ్యాప్తి యున్నది. కాని అగ్నియందు ధూమముయొక్క వ్యాప్తి లేదు. ఒకప్పుడు వ్యాప్యవ్యాపకములకు సమానవ్యాప్తి యుండవచ్చును. అగ్నికి మాఱుగా 'పచ్చికట్టెలయగ్ని' అనునది వ్యాపక మనుకొందము. అప్పుడు 'పచ్చికట్టెలయగ్ని' యున్నచోట నెల్ల ధూమ ముండుటయు, ధూమ మున్నచోట నెల్లఁ బచ్చికట్టెల నిప్పుండుటయు సిద్ధించినందున, ఈ రెండును ఒకదాని కొకటి వ్యాపకము, వ్యాప్యము అని చెప్పవచ్చును.

అవినాభావరూపసంబంధము వ్యాప్తి యని మఱియొకలక్షణము కలదు. ఏది లేక యేది యుండదో దానికి రెండవదానితో అవినాభావసంబంధ ముండు నని చెప్పెదరు. అగ్ని లేక ధూమ ముండదు. కావున అగ్నియొక్కయవినాభావసంబంధము ధూమమునం దున్నది. అగ్నియందు ధూమముయొక్క యవినాభావసంబంధము లేదు. అగ్ని లేని ధూమ ముండదు గాని ధూమము లేని యగ్ని యుండవచ్చును. ధూమ ముండినఁగాని యగ్ని యుండ దన్న నియమము లేదు. కావున అగ్ని వ్యాపక మనియు, ధూమము వ్యాప్య మనియుఁ దెలిసికొనవలెను.

1. 'ప్రత్యక్షేణాప్రత్యక్షస్య సంబంధస్య ప్రతిపత్తిః' (చూడుఁడు : గౌతమసూత్రము ౧,౧,౩ మీఁది వాత్స్యాయనవృత్తి).

sampath_Ebooks

sampath_Ebooks

వ్యాప్తిజ్ఞాన మెట్లు కలిగెనని:— అగ్నికిని, ధూమమునకును గల యీవ్యాప్తిజ్ఞానము జనులకు నెట్లు కలుగును? పైని చెప్పినట్లు సూచించినట్లు నిత్యానుభవమే దీనికి ముఖ్యకారణము. వంటయింటిలో, యజ్ఞశాలలో, మఱియితరస్థలములలోను పొగ యున్నచోట నెల్ల నగ్నిని చూచినందున ఈ జ్ఞానము కల్గును. కాని తొంబదితొమ్మిది సారులు చూచినను నూఱవసారి అట్లే జరుగు నని యెట్లు? అందుకు అవ్యభిచారజ్ఞానము ఉండవలయును. నియమమునకు భంగము కలుగుట వ్యభిచార మనిపించుకొనును. పెక్కు సారులు ధూమమున్నచోట్ల నగ్ని కనిపించియు నొక్కచో నగ్ని లేనియెడల నది వ్యభిచార మగును. కావున నట్టి వ్యభిచారాభావము వ్యాప్తినిశ్చయమునకు సహకారి యగును. ఇట్లు వ్యాప్తిజ్ఞానమునకు సాహచర్యజ్ఞానము, వ్యభిచారజ్ఞానరాహిత్యము ఆవశ్యకములు.

ఉపాధి:— వ్యాప్తి యొక్క వైశాల్యమును సంకుచితము చేయు దానిని ఉపాధి యందురు. అగ్ని యున్నచోట్లనెల్ల ధూమ ముండును అన్నవాక్యము నిజమైనది కాదు. అందలి 'యగ్ని' యనుపదమునకు ఆర్ద్రేంధనసంయోగము (పచ్చికట్టెలసూతికి) అన్నమాట తగిలించినయెడల నది సరియగును. ఈ 'ఆర్ద్రేంధనసంయోగ' మనునది 'ఉపాధి' యనఁబడు. 'ఉప సమీపవర్తిని ఆదధాతి సంక్రామయతి స్వీయం ధర్మం' ఇత్యుపాధి: అని ఉదయనాచార్యులు చెప్పియున్నారు. తనయొద్ద నున్నవస్తువునకుఁ దనవర్ణ మిచ్చునది యుపాధి. ఎఱ్ఱపుష్పము తనసమీపమున గున్న స్ఫటికమునకుఁ దనవర్ణ మిచ్చును. అట్లే యాకారహీన మైన యాకాశమునకు ఘటము తన యాకారము నొసఁగుచున్నది. ఇట్లే యగ్నివలన ధూమమును పుట్టించు నుపాధి 'ఆర్ద్రేంధనసంయోగము' అనఁగాఁ బచ్చికట్టెలు నిప్పును తగిలియుండుట. కావున నదము నుపాధి యుండుటచే నెచ్చటెచ్చట నగ్ని యుండునో యచ్చటచ్చట ధూమ ముండు నన్న వ్యాప్తికి వ్యభిచారము సంభవించినది. ఎండికట్టెలు గల యగ్ని యున్నప్పుడు పొగ యుండదు. కాలినయినుపగుండులో నున్న యగ్నికిఁగూడ ధూమ ముండదు. కావున నగ్నికి ధూమమునకు నవినాభావసంబంధము కలుగవలె నన్న 'అగ్ని' యనుపదమునకు 'తడికట్టెలుగల' యన్న విశేషణము చేర్పవలెను. ఇదియే యుపాధి. ఈ ఆర్ద్రేంధనసంయోగము అగ్నికి వ్యాపకము కాదు. ధూమమునకు వ్యాపకము; అనఁగా నుపాధి ధూమముకంటె నెక్కువ వ్యాప్తి కలదియు, అగ్నికంటెఁ దక్కువవ్యాప్తి కలదియు నయియున్నది. ధూమవ్యాప్తికిని, అగ్నివ్యాప్తికిని గల భేదమును ఉపాధి సూచించును. 'పర్వతముమీఁద ధూమ మున్నది, అగ్ని యుండుటచే' నన్నసిద్ధాంతము చెప్పిన తోడనే 'ఆర్ద్రేంధనసంయోగ' మను ఉపాధి యడ్డము వచ్చి యా సిద్ధాంత మపసిద్ధాంత మని చెప్పును.

**అనుమానవిభాగములు:**— గౌతమాచార్యులవా రనుమానము మూఁడువిధము లని చెప్పియున్నారు (న్యాయసూత్రము ౧.౧.౫):— (౧) పూర్వవత్, (౨) శేషవత్, (౩) సామాన్యతోదృష్టములు. 'పూర్వవ దనుమాన' మనఁగా కారణముఁ జూచి కార్యము నూహించుట. దీనినే 'కారణలింగక' మనవచ్చును. కారణమే లింగముగాఁ (హేతువుగా) గలది యని యర్థము. ఇందుల కుదాహరణము మేఘములఁ జూచి వర్షము కురియు నని యూహించుట. 'శేషవదనుమాన' మనఁగా కార్యమును జూచి కారణము నూహించుట. ఇది కార్యలింగకము. ఇందుఁ గార్యమే లింగము (హేతువు). నదికి వరద వచ్చుట చూచి వర్షము కురిసె నని యూహించుట యిందులకు నుదాహరణము. పై రెండువిధముల యనుమానములు గాని యనుమానమునకు 'సామాన్యతోదృష్టానుమాన' మని పేరు; అనఁగా గారణమునుబట్టి కార్యము గాని, కార్యమును బట్టి కారణము గాని కాక యనుమానము లందు ఊహింపఁబడని యనుమానము లన్నియు సామాన్యతోదృష్టము లని చెప్పవలసి యున్నది. రెండువస్తువులకు నియతసాహచర్య ముండుట యెఱుఁగనందున, నొకవస్తువును జూచి రెండవదానిని ఊహించుట సామాన్యతోదృష్ట మని యందురు. పృథ్వీత్వమును జూచి గంధవత్త్వమును ఊహించుట, గోవును జూచి అది పశువని ఊహ చేయుట ఇందుల కుదాహరణములు.

అనుమానము స్వార్థానుమాన మనియు, పరార్థానుమాన మనియు రెండువిధములుగా మరల విభజింపఁబడినది. స్వార్థానుమానములవలన మానవుఁడు తనయందలి సంశయమును బాపుకొనును. ఇది జ్ఞానాత్మకము. పరార్థానుమానములవలన మానవుఁడు పరుల సంశయమును పోఁగొట్టును. ఇది శబ్దాత్మకము. కావున స్వార్థానుమానము మొదటిది. పరార్థానుమానము రెండవది. తనమనస్సునకు సంశయనివృత్తి కలిగినఁగాని యితరులకు సమాధానము చెప్పుట యెట్లు?

స్వార్థానుమానక్రమ మెట్లనఁ, నొకానొకఁడు పర్వతము మీఁద ధూమమును చూచును. తరువాత నెచ్చట ధూమ ముండునో యచ్చట నగ్ని యుండు నన్న వ్యాప్తిని స్మరించును. పిదప ఈవ్యాప్తిస్మరణమును తనకుఁ బ్రత్యక్షముగఁ దెలిసిన పక్షధర్మతాజ్ఞానముతోఁ (అనఁగాఁ బర్వతము ధూమవంత మన్న జ్ఞానముతోఁ) గలుపఁగా, పర్వతము అగ్నివ్యాప్యమగు ధూమమును గలది యను జ్ఞానము కలుగుచున్నది. ఈ జ్ఞానమునకే శాస్త్రమునందు పరామర్శ మనియు, లింగపరామర్శ మనియుఁ బేర్లు. దీనినే తృతీయ లింగ పరామర్శ మందురు. ఎందుకనఁగా ఈ లింగ (హేతు - ధూమ) జ్ఞానము మూఁడుసారు లయినఁగాని పరామర్శము పూర్తి కాదు. మొదట మహానసాదులయందు ధూమాగ్నుల సాహచర్యముఁ జూచుట, రెండవసారి పర్వతముమీఁద ధూమమును జూచుట, మూఁడవసారి వ్యాప్తిజ్ఞానస్మరణము ననుసరించి యీధూమ మగ్నివ్యాప్య మన్న జ్ఞానము గలుగుట. ఇట్లు లింగ(హేతు)జ్ఞానము మూఁడువిధములఁ గలిగినఁ గాని పరామర్శము కలుగదు. ఈ పరామర్శమే స్వార్థానుమితి యని కొందఱియభిప్రాయము. కొందఱిమతమున హేతుజ్ఞానమునకే అనుమాన మని పేరు. వ్యాప్తియొక్క స్మృతియే యను మా

sampath_Ebooks

మని కొందఱి మతము. కొందఱు పరామర్శమును కరణ మందురు. కొందఱు వ్యాపార మందురు. ఇట్లు నైయాయికులు భిన్నాభిప్రాయు లైనను, అందఱును పరామర్శమును ఒప్పుకొనియున్నారు. పరామర్శము లేక యనుమితి కలుగనేరదని యందఱి మతము.

పరార్థానుమాన మితరుల సంశయములఁ బోఁగొట్టుటకు నుపయోగపడును. ఇది పంచావయవాత్మకము.

పంచావయవములు :— పంచావయవాత్మక మైన పరార్థానుమానమునకు ‘న్యాయ’ మని పేరు. దీనినిబట్టియే గౌతమ శాస్త్రమున కంతకును న్యాయశాస్త్ర మని పేరు వచ్చెను. స్వార్థానుమానమందు మనమనస్సులో దానికిఁ గలుగునట్టి పరామర్శాత్మక జ్ఞానము (పర్వత మగ్నిమంత మన్న జ్ఞానము) కొన్ని వాక్యములచేఁ బరుల మనమునందుఁ బుట్టునట్లు చేయుట ‘న్యాయ’ మనిపించుకొనును. పర్వతము అగ్నిమంత మని పరులను ఒప్పించుటకు ఈ క్రింది న్యాయవాక్యములను ఉపయోగించెదరు :—

౧. పర్వతము అగ్నిమంతము (ప్రతిజ్ఞ)
౨. ధూమవత్త్వముచే (హేతువు)
౩. ఏదియేది ధూమవంతమో యదియది అగ్నిమంతము, వంటయింటిలోనువలె (ఉదాహరణము)
౪. అట్లే యిది (ఉపనయము)
౫. కావున పర్వతమగ్నిమంతము (నిగమనము)

ఇందు మొదటిది ‘ప్రతిజ్ఞ’. ఇందు దేని విషయము ప్రతిపాదింపఁబడు నని యిది తెల్పును. కర్త తాను స్థాపింపఁబోవుచున్న సిద్ధాంతమును ఇందుమూలకముగా ముందు చెప్పును. మొదటిదిగా నైన ప్రతిజ్ఞతో చివరది యగు ‘నిగమనము’ సరిపోవలెను. అట్లు కానియెడల నది ప్రతిజ్ఞాభంగ మనిపించుకొనును. రెండవది ‘హేతువు.’ ఈ వాక్యమునందు లింగము చెప్పఁబడెను. లింగము హేతువు అనునవి సమానార్థకము లయినను వానియందుఁ గొంచెము అర్థభేదము కలదు. లింగ మనఁగా గుర్తు. ఇచ్చట హేతువు అనుపదమును సాధారణముగా లింగప్రతిపాదకవాక్య మన్న యర్థమునందు నుపయోగించెదరు. మూఁడవది యుదాహరణము. ఇందు లింగమునకును (ధూమమునకును), సాధ్యమునకును (అగ్నికిని) గల సంబంధము (వ్యాప్యవ్యాపకభావము) తెల్పి వ్యాప్తిజ్ఞానము కలుగఁజేయును. ఇంతియకాక వ్యాప్తిజ్ఞానమునకుఁ గారణమైన యనేకోదాహరణములలోనుండి యొక్కదానిఁ జెప్పి వ్యాప్తిజ్ఞానమును దృఢపఱుచును. నాల్గవది ‘ఉపనయము.’ మూఁడవవాక్యమందలి వ్యాప్తి యిచ్చటఁగూడఁ జెల్లు నని యిది తెల్పును. అయిదవది నిగమనము. పై నాలుగువాక్యముల నొక్కచోటఁ జేర్చి తీసిన సారాంశమే నిగమనవాక్యము. ఈ పంచావయవాత్మకమైన అనుమానమునకు నిది ఫలితము.

చక్కఁగ విచారించి చూడఁగా నీ న్యాయవాక్యములలో మూఁడే ముఖ్యమైనవి యని తెలియఁగలదు. ‘ప్రతిజ్ఞ’, ‘నిగమనము’ లొక్కటియే కావున నాలుగు వాక్యములే మిగిలినవి. వానిలోను ‘ఉపనయ’ మను నాల్గవ వాక్యము విశేషోపయోగకరము కాదు కావున మిగిలినవి మూఁడువాక్యములే.

నైయాయికులు పంచావయవములను అంగీకరించినను మీమాంసకులు ప్రతిజ్ఞాహేతూదాహరణము లను మూఁడు అవయవములనే యొప్పుకొనిరి. వేదాంతులు మొదటి మూఁడవయవములు గాని, చివర మూఁడవయవములు గాని చాలు ననిరి[1]. బౌద్ధులు ఉదాహరణోపనయముల నంగీకరించిరి. పాశ్చాత్యన్యాయశాస్త్రమునందును న్యాయమునకు నవయవములు మూఁడే.


లింగము :— అనుమానమునకు ముఖ్యాధారమైన లింగమును గుఱించి చెప్పవలసియున్నది. లింగమునే హేతు వనియు నందు రని యిదివఱకే చెప్పఁబడినది. లింగము మూఁడువిధము లైనది: (౧) అన్వయవ్యతిరేకి, (౨) కేవలాన్వయి, (౩) కేవల వ్యతిరేకి. అన్వయవ్యాప్తియు, వ్యతిరేకవ్యాప్తియుఁ గలది అన్వయవ్యతిరేకి. హేతువునకు(ధూమమునకు)ను, సాధ్యమునకును (అగ్నికిని) గల వ్యాప్తి అన్వయవ్యాప్తి. వాని అభావములకుఁ గలవ్యాప్తి వ్యతిరేకవ్యాప్తి. ధూమ మున్నచోట నెల్ల నగ్ని యుండును, వంటయింటిలోవలె ననునది అన్వయవ్యాప్తికిని, ఎచ్చట నగ్ని లేదో యచ్చట ధూమము లేదు, కొలనులోవలె నన్నది వ్యతిరేకవ్యాప్తికిని ఉదాహరణములు. ఇందలి రెండవయుదాహరణములో అగ్న్యభావమునకును, ధూమాభావమునకును వ్యాప్తి కలదు. అన్వయవ్యాప్తియందలి వ్యాప్యవ్యాపకములు వ్యతిరేకవ్యాప్తియందు మాఱి వ్యాపకవ్యాప్యము లగును. అన్వయవ్యాప్తిలో ధూమము వ్యాప్యము, అగ్ని వ్యాపకము. వ్యతిరేకవ్యాప్తిలో అగ్న్యభావము వ్యాప్యము, ధూమాభావము వ్యాపకము. ఇది ప్రక్కపుటయందలి పటమువలన స్పష్టపడఁగలదు.

ఆపటమున అ ఆ ఇ ఈ యను పెద్ద చతుష్కోణము అగ్నికంటె నధికవ్యాప్తిగల ద్రవ్య మనుకొనుఁడు. అంతకంటెఁ జిన్నది ఆ క చ ట యను చతుష్కోణము అగ్నిని సూచించు ప్రదేశ మనుకొనుఁడు. అన్నిటికంటెఁ జిన్నది యగు అ గ జ డ యను చతుష్కోణము ధూమవ్యాప్తిని సూచించును. మహానస యజ్ఞశాలాదు లందులోనివి. ధూమ మున్నచోట నెల్ల నగ్ని యుండుటచే ఈ చతుష్కోణమునందుఁ గూడ అగ్నివ్యాప్తి యున్నదనియే యెంచవలెను. కావున ఆ క చ ట యను చతుష్కోణమునుండి అ గ జ డ చతుష్కోణ

1. ‘అవయవాశ్చ త్రయ ఏవ ప్రతిజ్ఞాహేతూదాహరణరూపా ఉదాహరణోపనయనిగమనరూపా వా న తు పంచ, అవయవత్రయేణైవ వ్యాప్తిపక్షధర్మతయో రుపదర్శనసంభవేనాధికావయవద్వయస్య వ్యర్థత్వాత్.’ (వేదాంతపరిభాష, కలకత్తాకూర్పు, పుట. ౧౫)

sampath_Ebooks

మును తీయఁగా మిగిలిన క జ ట యను గోముఖప్రదేశము (Gnomon) ధూమము లేనట్టియు, అగ్ని యున్నట్టియు, తత్స్థాయిస్థలములను జూపును. అగ్నియున్నచోట నెల్ల ధూమ ముండు నన్న వ్యాప్తిని చెడఁగొట్టు ఆర్ద్రేంధనసంయోగ మను నుపాధి యీ క జ ట యను ప్రదేశమువలననే సూచిత మగును. ఆ ఈ ఇ అను గోముఖప్రదేశము ధూమాభావము అగ్న్యభావము కలిసియుండు స్థలమును సూచించును. ఇది విపక్షదృష్టాంతప్రదేశము; ఎచ్చట




అగ్న్యభావమో అచ్చట ధూమాభావము అన్న వ్యతిరేకవ్యాప్తిని బోధించును. పై పటమునందు, నగ్ని ప్రదేశ మను చతుష్కోణము (ఆక చట) ధూమప్రదేశ మను చతుష్కోణము (అ గ జ డ) కంటెఁ బెద్దది గాన అగ్ని వ్యాపక మనియు, ధూమము వ్యాప్య మనియు, ధూమాభావసూచకమైన ఆ జ ఇ అను ప్రదేశము 'అగ్న్యభావ' సూచకమైన ఆ ఈ ఇ అను ప్రదేశముకంటె పెద్దది గనుక ధూమాభావము వ్యాపక మనియు, అగ్న్యభావము వ్యాప్య మనియు స్పష్టపడఁగలదు. కావున నెచ్చటెచ్చట నగ్న్యభావమో అచ్చటచ్చట ధూమాభావము గలదువలె, నన్నది వ్యతిరేకవ్యాప్తికి నుదాహరణము. ఇట్లు ధూమ మున్నచోట నగ్ని యుండును. ఇందుల కుదాహరణము మహానసము. అగ్న్యభావ మున్నచోట ధూమాభావ ముండును అని అన్వయ వ్యతిరేకములచేఁ జెప్పునది 'అన్వయవ్యతిరేకి లింగము' (హేతువు). కేవలాన్వయి లింగమునందు భావరూపోదాహరణమే యుండును గాని వ్యతిరేకోదాహరణ ముండదు. ఉదాహరణము: ఘటము అభిధేయము (పేరొందఁ దగినది) ప్రమేయత్వ మున్నందున, పటమువలె. ఇందు లింగము (హేతువు) ప్రమేయత్వము. ప్రమేయత్వ మెచ్చటెచ్చట నుండునో అచ్చటచ్చట నభిధేయత్వ ముండును. ఇందుకు దృష్టాంతము పటము. ఇందు ప్రమేయత్వ మున్నది, అభిధేయత్వ మున్నది. కాని దీనికి వ్యతిరేకోదాహరణ ముండదు. ఎందుల కనగా నట్టి వ్యతిరేకవాక్యము 'ఎచ్చటెచ్చట అభిధేయత్వ ముండదో యచ్చటచ్చట ప్రమేయత్వ ముండదు' అనునది కావలెను. కాని యన్ని పదార్థములకును అభిధేయత్వమును, ప్రమేయత్వమును సామాన్యమై యుండున నిట్టివాక్యమున కర్థము లేదు. ఇందలి సాధ్యమైన 'యభిధేయత్వము' సర్వపదార్థసామాన్యమై యున్నది. దానికి అత్యంతాభావము లేదు. 'కేవలవ్యతిరేకి లింగము' నందు వ్యతిరేకదృష్టాంతమే యుండును గాని అన్వయదృష్టాంత ముండదు. ఎట్లన, పృథివి యితర ద్రవ్యములకంటె వేఱు, గంధవత్త్వ ముండుటచే; ఇతర ద్రవ్యములకంటె వేఱు కానిది యేది గంధవంతము కాదు, జలమువలె; ఇది (యనఁగా భూమి) యిట్టిది (గంధవంతము కానిది) కాదు. కావునఁ బృథ్వి యితర ద్రవ్యములకంటె వేఱు. ఇచ్చట నేది గంధవంతమో యది యితర ద్రవ్యములకంటె వేఱైనది యని యన్వయోదాహరణము చెప్పుటకు వీలు లేదు. ఎందు కనఁగా గంధవత్త్వము పృథివియందుఁ దప్ప నితరత్ర లేదు. ఇందు పక్షమునకు (పృథ్వికి), సాధ్యమునకు (ఇతర ద్రవ్యములకంటె వే ఱగుటకు) భేదము లేదు; అనఁగా సమానవ్యాప్తి కలదు. వ్యతిరేకదృష్టాంతములు పెక్కులు గలవు.

పైని వర్ణింపఁబడిన మూఁడులింగములలో 'అన్వయవ్యతిరేకి' యనఁబడు లింగమే ముఖ్యమైన దనియు, నిత్యవ్యవహారమునందు నుపయోగపడునది యనియు 'కేవలాన్వయి', 'కేవల వ్యతిరేకి' యనునవి యంతగా వాడుకలోనివి కావనియు చదువరులు తెలిసికొనఁగలరు. మీమాంసకులును, వేదాంతులును వ్యతిరేకానుమానమును ఒప్పుకొనరు. వారు 'అర్థాపత్తి' యను అయిదవ ప్రమాణమును ఒప్పుకొని వ్యతిరేకానుమానమును పాటింపరైరి.

పక్షము, సపక్షము, విపక్షము:— పర్వతము అగ్నిమంత మన్న వాక్యమందు అగ్ని 'సాధ్య' మనియు, పర్వతము 'పక్ష' మనియుఁ జదువరు లెఱుంగుదురు. దేనియందు సాధ్య మున్నది లేనిది సంశయముగా నుండి చర్చింపఁబడుచున్నదో యది 'పక్ష' మనఁబడును. సాధ్యము (సాధింపవలసిన అగ్ని) ఇదివఱకే దేనియం దున్నదని నిశ్చయముగఁ దెలియునో యది 'సపక్షము'. మహానసము (వంటయిల్లు) ఇందుకు దృష్టాంతము. దేనియందు 'సాధ్యము' లేదని మనకు నిశ్చయముగాఁ దెలియునో యది విపక్షము. కొలను ఇందుల కుదాహరణము. ఇందు సాధ్యమైన అగ్ని లేదని మన మెఱుఁగుదుము.

సద్ధేతువు:— హేతువు వాదమునం దుపయోగపడవలయునన్న, నది యీ క్రింది యైదునియమములకును లోఁబడి యుండవలయును. అప్పు డది సద్ధేతు వనిపించుకొనును. లేనియెడల హేత్వాభాసములకుఁ గారణ మగును. హేతువు (లింగము) (౧) పక్షమునందు నుండవలెను. (౨) సపక్షమం దుండవలెను. (౩) విపక్షమునం దుండఁగూడదు. (౪) అబాధిత విషయముగ నుండవలయును; అనఁగా దీనినిమించిన హేతువుచే నిది ఖండితము కాఁగూడదు. (౫) అసత్ప్రతిపక్షముగ నుండవలెను; అనఁగా సాధ్యాభావమును స్థాపించెడు సమానబలముగల హేతువు ఉండఁగూడదు.

అన్వయవ్యతిరేకి లింగమునందు నీ యైదు నియమములును పాటింపఁబడును. కేవలాన్వయి, కేవలవ్యతిరేకములయందు వాని స్వభావ

sampath_Ebooks

మునుబట్టి యొక్కొక్కనియమము తగ్గును. న్యాయబిందు వను గ్రంథము నందు మొదటి మూఁడు నియమములే యంగీకరింపఁబడినవి.

హేత్వాభాసములు :— హేత్వాభాసము లనఁగా దుష్ట హేతువు లని యర్థము. వాగవివాదములు చేయునప్పుడు వాది ప్రతివాదు లొకరి నొకరు మోసపుచ్చుటకై యసత్యము లైన హేతువులను గల్పించి నిజ మైనహేతువులవలెనే యుపయోగించెదరు. అట్టి హేతుదోషములను ఎఱిఁగియున్నఁ గాని ప్రతివాదియొక్క వాద దౌర్బల్యమును కనుఁగొనుటకు వీలు లేదు. మన వాదమందును ఇట్టి దోషములు రాకుండుటకు హేత్వాభాసజ్ఞాన మావశ్యకము. హేత్వాభాసము లైదు : ౧. సవ్యభిచారము, ౨. విరుద్ధము, ౩. సత్ ప్రతిపక్షము, ౪. అసిద్ధము, ౫. బాధితము.

సవ్యభిచారము :— దీనికే ముక్తావలీకారుఁడు అనైకాంతిక మన్నాఁడు. ఈ హేత్వాభాసము మూఁడు విధములు : సాధారణము, అసాధారణము, అనుపసంహారి. సాధారణ సవ్యభిచార మనఁబడు హేత్వాభాసమందు హేతువు సపక్షదృష్టాంతమందును, విపక్ష దృష్టాంతమందును కానుపించును. సపక్షమం దుండుట క్రమమే కాని విపక్షమందును ఉండుటవలన ఈ దోషము సంభవించినది; అనఁగా హేతువు సాధ్యమందును, సాధ్యాభావమందును ఉండును. ఇందుకు నుదాహరణము : పర్వతము ధూమవంతము అగ్నివలన, అనెడి అనుమానము హేత్వాభాసము. ఎందుకు? ఇందలి హేతువు (లింగము) అగ్ని. ఇది మహానసాదులవంటి ధూమ మున్నచోట్లను, అయోగోలకము వంటి ధూమాభావ మున్నచోట్లను కానుపించును; అనఁగా ధూమ మున్నచోటను అగ్ని యుండును, ధూమము లేనిచోటను అగ్ని యుండును. కావున నిది తప్పు. అసాధారణ మనుదోషము నందు హేతువు సపక్షమునందును కానరాదు, విపక్షమునందును గానరాదు. విపక్షమునందుఁ గానరాకపోవుట క్రమమే కాని సపక్షమందును లేకపోవుటవలన ఈ దోషము సంభవించును. ఉదాహరణము : శబ్దము నిత్యము, శబ్దత్వమువలన. ఇందు 'శబ్దత్వ'ము హేతువు. 'శబ్దత్వ'ము శబ్దమాత్రవృత్తి యైనందున నిత్యములందు లేదు, అనిత్యములయందు లేదు, కావున ఈ అనుమానము తప్పు; సాధ్య ముండుచోట నుండనట్టి హేతువు అసాధారణ మని దీని లక్షణము. ఇతఁడు నిత్యుఁడు, మనుష్యత్వమువలన. ఇది తప్పు; నిత్యత్వ ముండు చోట మనుష్యత్వ ముండదు గనుక. అనుపసంహారిదోషమునందు అన్వయ దృష్టాంత ముండదు. వ్యతిరేకదృష్టాంత ముండదు. ఇందుచే నిట అన్వయవ్యాప్తిజ్ఞాన ముండదు, వ్యతిరేకవ్యాప్తిజ్ఞాన ముండదు. ఉదాహరణము : సర్వము అనిత్యము, ప్రమేయత్వమువలన. ఇందలి పక్షము 'సర్వము' అనునది. అందు జ్ఞానవిషయమైన సమస్తప్రపంచ మిమిడియున్నందున సపక్షముగఁ గాని, విపక్షముగఁ గాని మఱియొక దృష్టాంతము కల్పించుటయెట్లు? ఇందు సాధ్యముయొక్క యత్యంతాభావము అప్రసిద్ధము.

విరుద్ధము :— సాధ్యాభావవ్యాప్త మైన హేతువునకు విరుద్ధ మని పేరు. ఉదాహరణము : శబ్దము నిత్యము, కృతకత్వమువలన. ఇందు కృతకత్వము (చేయఁబడుట) హేతువు. కాని యిది నిత్యత్వముయొక్క యభావమైన అనిత్యత్వముచే వ్యాప్తము. కృతకత్వము అనిత్యత్వమునకు హేతువు గాని నిత్యత్వమునకుఁ గాదు. ఇట్లిది ప్రతిజ్ఞకంటె విరుద్ధమైనది గాన దీనికి విరుద్ధ మని పేరు వచ్చెను. చెఱువు నిప్పు గలది జలమువలన, అనునది యిందు కింకొక యుదాహరణము.

సత్ ప్రతిపక్షము :— సాధ్యాభావమును సాధించునట్టి వేఱు హేతు వెం దుండునో దానికి సత్ ప్రతిపక్ష మని పేరు. ఉదాహరణము: శబ్దము నిత్యము శ్రావణత్వమువలన (వినఁబడుగుణ ముండుటవలన), శబ్దత్వమువలె. శబ్దము అనిత్యము కార్యత్వమువలన, ఘటమువలె. ఇందు సాధ్యము నిత్యత్వము. దాని యభావ మనిత్యత్వము. నిత్యత్వమును సాధించుట కొక హేతువును, తదభావమును (అనిత్యత్వమును) సాధించుటకు మఱియొక హేతువును చెప్పఁబడియుండుటచేత నిది సత్ ప్రతిపక్ష మనఁబడు హేత్వాభాసము.

అసిద్ధము :— ఇది నాల్గవ హేత్వాభాసము. ఇది మూఁడు విధములు : ఆశ్రయాసిద్ధము, స్వరూపాసిద్ధము, వ్యాప్యత్వాసిద్ధము. ఉదాహరణము : గగనారవిందము సువాసన గలది, అరవిందత్వము వలన, సరోజారవిందమువలె, అనునది ఆశ్రయాసిద్ధమునకు నుదాహరణము. ఇందు గగనారవిందము (ఆకాశకమలము) ఆశ్రయము (పక్షము). ఇది యెచ్చటను లేదు. ఇచ్చట పక్షతావచ్ఛేదకధర్మము గగనీయత్వముగాని అరవిందత్వము గాదు. ఇట్లసంభవమైన వస్తువును పక్షముగాఁ గైకొన్నందున ఈ యనుమానము తప్పు. కాంచనమయ పర్వతము అగ్నిమంతము, ధూమమువలన అన్నదియు నిందుకు నింకొక యుదాహరణము. పక్షతావచ్ఛేదకధర్మము (ఇచ్చట కాంచనమయత్వము) పక్షమునందు లేకపోవుటయే యీ దోషలక్షణము. స్వరూపాసిద్ధ మను హేత్వాభాసమునందు హేతువు పక్షమునం దుండదు. ఉదాహరణము : కొలను అగ్నిమంతము, ధూమమువలన. ఇందు ధూమము హేతువు. కొలను పక్షము. కొలనిలో ధూమ ముండదు. కావున హేతువు తప్పు. కుందేలు ఆవు, కొమ్ము లున్నందున, ఘటము పృథ్వి, పటత్వమువలన అనునట్టి యుదాహరణము లిట్టివియే. ఉపాధి సహిత మైన హేతువును ఉపాధి లేకుండఁగఁ జెప్పుట వ్యాప్యత్వాసిద్ధదోషము. ఉదాహరణము : పర్వతము ధూమవంతము, అగ్నిమంత మగుటచే నన్నచోట 'ఆర్ద్రేంధనసంయోగాగ్ని'మంత మగుటచే నని యుండవలెను. అట్లు ఆర్ద్రేంధనసంయోగమును చెప్పినవాఁడు కాఁడు కావున దోషము. ఇంకొక యుదాహరణము. పర్వతము అగ్నిమంతము, కాంచనమయధూమమువలన. ఇది హేత్వాభాసము. ఎందు కన హేతువు ఉపాధిసహితము. ధూమము అగ్నివ్యాప్యమే; కాని కాంచనమయధూమము మాత్రము అగ్నివ్యాప్యము కాదు. 'కాంచనమయత్వ' మను నుపాధిచే నది వేఱయ్యె. ఈ హేత్వాభాసములో సాధ్యాప్రసిద్ధి, సాధనాప్రసిద్ధి - ఇత్యాదిభేదము లనేకములు కలవు.

sampath_Ebooks

బాధితము :— ఏ హేతువుయొక్క సాధ్యాభావము వేఱు బలవత్తర మైన ప్రమాణముచే నిశ్చిత మైనదో యది బాధిత హేత్వాభాసము. అగ్ని చల్లగ నుండును, ద్రవత్వమువలన అనుచో అనుష్ణత్వము (చల్లదనము) సాధ్యము. దాని యభావము ఉష్ణత్వము; దానిని స్పర్శముచేఁ బ్రత్యక్షముగ మన మెఱుఁగుదుము. కావున నగ్ని చల్లనిది యన్నమాటకు బాధ కలిగెను. పక్షమునందు నుండవలసినసాధ్యముయొక్క యభావము మొదలయినవి బాధిత మనఁబడు నని ముక్తావలీకారునిమతము.

ప్రకరణసమము :— పైని హేత్వాభాసములు నవీనమతానుసారముగ న్యాయసిద్ధాంత ముక్తావలీకారుని ననుసరించి యీయఁబడినవి. గౌతమసూత్రానుసారము హేత్వాభాసములు నిగ్రహస్థానములలోనివియే యని వర్ణింపఁబడినవి. అచ్చట హేత్వాభాసములు అయిదు చెప్పఁబడినవి: (౧) సవ్యభిచార, (౨) విరుద్ధ, (3) ప్రకరణసమ, (౪) సాధ్యసమ, (౫) అతీతకాలము లనఁబడునవి. సవ్యభిచార విరుద్ధములనుగుఱించి యిదివఱకుఁ జెప్పియున్నాము. ఏ సిద్ధాంతమును సాధింపవలయునో దానినే హేతువుగఁ దీసికొనుట ప్రకరణసమదోషము.

శబ్దము అనిత్యము (ప్రతిజ్ఞ)
నిత్యత్వము లేదు గనుక (హేతువు)

'అనిత్య' మనఁగా 'నిత్యత్వము లేనిది'; కావున నిందు నొక్కమాటనే భిన్నరూపముగఁ జెప్పఁబడియున్నది. దీనినే పాశ్చాత్యనైయాయికులు 'పెటిషియో ప్రిన్సిపిఅయ్' (Petitio principii) అందురు.

సాధ్యసమము :— సాధ్యమునకై యీయఁబడిన హేతువు గూడ సందేహాస్పదముగా (ఋజువు కావలసినదిగా) నున్నయెడల సాధ్యసమదోషము వచ్చును.

నీడ యొక ద్రవ్యము (ప్రతిజ్ఞ)
దానికి చలన మున్నది గనుక (హేతువు)

ఇచ్చట నీడ యొక ద్రవ్య మన్నమాట యెట్లు సిద్ధాంతము కావలయునో యట్లే మొదట నీడకు చలన మున్న దనియు సిద్ధాంతము కావలెను. నీడకు చలన మున్న దన్నమాట అందఱును ఒప్పుకొనునది కాదు. నీడ యనఁగా ప్రకాశాభావము. ఏ ద్రవ్యము అడ్డము వచ్చి ప్రకాశమును అడ్డగించునో యా ద్రవ్యముయొక్క చలనమే నీడయొక్క చలనముగ కొందఱిచే భ్రమింపఁబడును.

కాలాతీతము :— కాలమును లెక్కలోనికిఁ దీసికొనక చెప్పఁబడు హేతువు కాలాతీత హేత్వాభాస మనఁబడును.

శబ్దము నిత్యము (ప్రతిజ్ఞ)
సంయోగజము గనుక రంగువలె (హేతువు)

ఇందు నీయఁబడిన హేతువు కాలాతీతము. ఘటదీపసంయోగము వలన ఘటముయొక్క రంగు మనకుఁ గానవచ్చుచున్నది. కాని, ఆరంగు అంతకుఁ (ఘటదీపసంయోగమునకుఁ) బూర్వ ముండెను. తర్వాతఁగూడ నుండును. అట్లే ఢక్కకు (నగారాకు) దండమునకు సంయోగము గలిగినప్పుడు ధ్వని పుట్టుచున్నది. కావున నది పై యుదాహరణము ననుసరించి అంతకుఁబూర్వ ముండె ననియు, తర్వాత నుండు ననియు, కావున నిత్య మనియుఁ జెప్పవలెను అని వాదియొక్క తాత్పర్యము. కాని యిది కాలాతీత హేత్వాభాసము. ఎందు కన, ఈ రెండుసంయోగములును వేఱువేఱు. దీపఘటసంయోగకాలముననే రంగుజ్ఞానము జనించును. కాని ఢక్కాదండసంయోగకాలముననే శబ్దము పుట్టదు. సంయోగ మైన పిదప క్షణమునం బుట్టును. కావున రంగునకు, శబ్దమునకు సంయోగజననమందుఁ బోలిక లేదు.

దీనితరువాత ఛల మను దోషమును చెప్పినారు. అ దెట్లనిన:

ఛలము :— అర్థాంతరము కల్పించుకొని వాదమును అడ్డగించుట ఛల మనిపించుకొనును. ఇది మూఁడు విధములు. ఒక పదమునకు రెండర్థము లున్నప్పుడు వక్తయొక్క యుద్దేశమునకు భిన్నమైన యర్థమును గ్రహించుట వాక్ఛలము. 'ఈ పిల్లవాఁడు నవకంబళుఁడు' అన్నవాక్యమునందు 'నవకంబళుఁడు' అనఁగా క్రొత్తకంబళి కలవాఁ డని వక్తయొక్క యుద్దేశము. ప్రతివాది ఆ పదమునకు తొమ్మిదికంబళ్లు కలవాఁ డని యర్థము చేసిన నది వాక్ఛలమగును. విశేషవ్యక్తి నిగుఱించి చెప్పఁబడినయర్థమును జాతినిగుఱించి చెప్పినట్లుగా భావించి యర్థము చేయుట సామాన్య చ్ఛలము 'ఈ బ్రాహ్మణుఁడు విద్వాంసుఁడు' అని యొక బ్రాహ్మణుని గుఱించి చెప్పఁగా, బ్రాహ్మణత్వముయొక్క యవచ్ఛేదకధర్మము విద్వత్తే యని చెప్పినట్లుగ నర్థము గ్రహించి, విద్వాంసులు కాని బ్రాహ్మణులు లేరా? విద్వాంసులైన అబ్రాహ్మణులు లేరా? యని వాదించుట సామాన్యచ్ఛలమునకు నుదాహరణము. పదమునకు శక్యార్థము గ్రహింపక లక్ష్యార్థము వివక్షిత మైనపుడు దానివాచ్యార్థమును గాని, వాచ్యార్థము వివక్షిత మైనప్పుడు లక్ష్యార్థమును గాని గ్రహించుట ఉపచారచ్ఛల మనఁబడును. 'మంచము లఱచుచున్నవి', అనఁగా మంచములమీఁదిజను లఱచుచున్నారు అని, 'పాగాలు పోవుచున్నవి', అనఁగా పాగా పెట్టుకొన్నవారు పోవుచున్నారని యర్థము. ఇట్లర్థము చేయక మంచములే అఱచుచున్న వనియు, పాగాలే నడచుచున్న వనియు నర్థము చేసినయెడల నీదోషము పట్టును.

నిగ్రహస్థానములు ౨౨ :— వాదవివాదమునందు మన నైయాయికులు నిగ్రహస్థానములను కొన్నిటిని చెప్పియున్నారు. నిగ్రహస్థానము లనఁగా ప్రతివాదివాదమునందు నక్రమము చేయఁ బ్రారంభించినప్పుడు, దానిని జూపి వానికి నగౌరవము కలుగఁజేసి వాదములోనాతఁ డోడె నని వాదమును నిల్పివేయుట. ఇట్టి నిగ్రహస్థానము లిరువదిరెండు చెప్పఁబడియున్నవి. అవి కొద్దికొద్దిగా వర్ణింపఁబడును.

sampath_Ebooks

౧. ప్రతిజ్ఞాహాని :— సాధింపవలసిన సిద్ధాంతము ప్రతిజ్ఞ. దానిని సాధింపలేక ప్రతివాదియొక్క సిద్ధాంతమును అంగీకరించుట ప్రతిజ్ఞాహాని. ఒకఁడు మొదట ఈక్రిందివిధముగ తర్కించును.

శబ్దము అనిత్యము
అది ఇంద్రియగోచరము గనుక, ఏది ఇంద్రియగోచరమో
యది అనిత్యము, ఘటమువలె
శబ్దము ఇంద్రియగోచరము
కావున శబ్దము అనిత్యము

ప్రతివాది వచ్చి ఘటత్వాది 'జాతి' ఇంద్రియగోచర మైనను నిత్యము. అట్లే శబ్దము ఇంద్రియగోచర మైనను నిత్య మేల కాఁగూడదు అని ఖండింపఁగా బదులు చెప్పలేక యిట్లనును.

ఏది ఇంద్రియగోచరమో యది నిత్యము ఘటమువలె
శబ్ద మింద్రియగోచరము
కావున శబ్దము నిత్యము

ఇట్లు తన స్వదృష్టాంత మైన ఘటమునందు అన్యదృష్టాంత మైన ఘటత్వముయొక్క లక్షణ మొప్పుకొని స్వసిద్ధాంతమును వదలు కొన్నందున నిది ప్రతిజ్ఞాహాని.

ఇట్లు పక్షము, హేతువు, సాధ్యము – ఈ మూఁటిలో దేనిని వదలినను ప్రతిజ్ఞాహాని కావచ్చును.

శబ్దము అనిత్యము
కృతకత్వము (చేయఁబడుట) వలన

అనినతోడనే, ప్రతిపక్షి, శబ్దమునందు కృతకత్వము లేదని యాక్షేపింపఁగా "పోనిండు. 'సూర్యు' మే పక్ష మనుకొనుఁడు" అన్నచో నీదోషము ప్రాప్తించును. ఇట్లే హేతుసాధ్యములను విడుచుటనుగుఱించి యోచించునది.

౨. ప్రతిజ్ఞాంతరము :— తాను సాధింపవలసిన సిద్ధాంతము నకు నడ్డు రాఁగా అందు మార్పుచేయుట ప్రతిజ్ఞాంతరము.

పర్వతము అగ్ని గలది
సువాసనగల నల్లని ధూమ ముండుటచే

ఇందు హేతువు (ధూమము) యొక్క (సువాసన గల నల్లని యను) విశేషణము వ్యర్థ మని ఆక్షేపింపఁగా

పర్వతము కృష్ణచందనయుత మైన యగ్ని కలది
సువాసన గల నల్లని ధూమ ముండుటచే

అని చెప్పఁగా నీదోషము వచ్చెను. మొదట ప్రతిజ్ఞ 'పర్వత మగ్నిగలది' అనునది, ఇప్పుడు ఋజువు చేసినది 'పర్వతము కృష్ణ చందనయుత మైన అగ్నికలది' యని. ఇట్లు ప్రతిజ్ఞ మాఱుటచే నిది ప్రతిజ్ఞాంతరము.

౩. ప్రతిజ్ఞావిరోధము :— ప్రతిజ్ఞకును, హేతువునకును విరోధ మున్నప్పుడు ప్రతిజ్ఞావిరోధ మగును. ఉదాహరణము :

ద్రవ్యము గుణముకంటె వేఱుపదార్థము,
రూపాదికంటె వేఱు కాదు గాన.

ఈ యుదాహరణమునందు, రూపాదికములు గుణములే కావున, వానికంటె ద్రవ్యము వేఱుకాదని చెప్పుట ప్రతిజ్ఞకు సాధకము కాదు.

౪. ప్రతిజ్ఞాసన్న్యాసము:— తన ప్రతిజ్ఞకు నడ్డు రాఁగా నది తన ప్రతిజ్ఞ కాదనుట. శబ్దము అనిత్య మని ఋజువు చేయలేకపోయి నపుడు 'ఎవఁ డన్నాఁడయా శబ్ద మనిత్య మని?' అని తప్పించు కొనుట ప్రతిజ్ఞాసన్న్యాసము.

౫. హేత్వంతరము:— అవిశేష హేతువునకు నడ్డు కలుగఁగా విశేష హేతువును ప్రతిపాదించుట.

శబ్ద మనిత్యము
ఇంద్రియగోచరము గనుక

ఇందుమీఁద "కేవలము ఇంద్రియగోచరత్వమువలననే యే పదార్థమును అనిత్యము కాఁజాలదు. 'సామాన్య' మనుపదార్థ మింద్రియగోచర మైనను నిత్యమే." అని యాక్షేపము రాఁగా, 'ఇంద్రియగోచరము గనుక' అను హేతువునకు 'సామాన్యత్వముగల ఇంద్రియగోచరత్వము' అని అర్థము చెప్పిన ఈదోషము సిద్ధించును.

౬. అర్థాంతరము:— మూలవిషయమును విడిచి యన్యవిషయ ప్రసంగముఁ దెచ్చుట యర్థాంతరము.

శబ్దము నిత్యము
అస్పర్శత్వమువలన

అని చెప్పఁగా దీనికిఁ బూర్వపక్షము వచ్చి హేతువు సరియైనది కాదని యాక్షేపింపఁగా, దానికి సమాధానము చెప్పుటకు మాఱుగా "హేతుపదము 'హిని' ధాతువునకు 'తుని' ప్రత్యయము తగిలి యైనకృదంతపదము, పద మనఁగా సుప్తిఙంతము" అని సంబంధము లేనిమాటలు చెప్పఁదొడఁగుట.

౭. నిరర్థకము:— అర్థము లేనివర్ణక్రమమును వాదమునందు నుపయోగించిన ఈ దోష మగును.

శబ్దము నిత్యము
కచటతపత్వమువలన

౮. అవిజ్ఞాతార్థము:— అర్థముకాని వాక్యమును వాదమునందు నుపయోగించుట. వాదములో గెలువలేక కొందఱు అర్థము లేనిపదమును, భిన్నార్థపదములను, అర్థము కానట్లు త్వరగాఁ గాని, మెల్లఁగాఁ గాని యుచ్చరించెదరు. అట్టి సమయమున, ఆమాటలు మూఁడుసారులు ఉచ్చరించినను, సభవారికిని ప్రతివాదికిని అర్థము కానియెడల నవి నిగ్రహస్థానము లగును.

sampath_Ebooks

౯. అపార్థకములు:— అన్వయదోషమువలన ఒకశబ్దమునకును మఱియొకశబ్దమునకును సంబంధము లేకుండ నుచ్చరింపఁబడువాక్య మిట్టిది. వాదములో జయింపలేక యొకానొకఁడిట్లు హేతువును చెప్పును:—

‘పది దానిమ్మపండ్లు, ఆఱు అప్పచ్చులు, భిక్షాపాత్ర’ ఇత్యాది అసంబంధవాక్యము.

౧౦. అప్రాప్తకాలము:— అవయవవిపర్యాసమువలనఁ గలిగెడివచనము అప్రాప్తకాలము. న్యాయమునకు నైదు అవయవము లున్నవని చెప్పియున్నాము. వానిక్రమము ప్రతిజ్ఞ, హేతువు, ఉదాహరణము, ఉపనయము, నిగమనము. ఈ క్రమము తప్పి మొదటఁ జెప్పవలసినది తరువాత, తరువాతఁ జెప్పవలసినది మొదటఁ జెప్పుటవలన ఈదోషము కలుగును.

౧౧. న్యూనము:— న్యాయముయొక్క అయిదు అవయవములలోఁ గొన్ని లోపించెనేని ఈదోషము పట్టును.

౧౨. అధికము:— పెక్కు హేతువులు గాని, పెక్కు ఉదాహరణములు గాని ఉన్నయెడల ఈదోష మగును. ఉదాహరణము:

పర్వతము అగ్నిమంతము
ధూమ మున్నది గనుక
వెలుగు రున్నది గనుక
కొలిమివలె

౧౩. పునరుక్తము:— చెప్పినది మరలఁ జెప్పుట.

౧౪. అననుభాషణము:— వాది సభవారు వినుచుండఁగఁ దన ప్రశ్న మూఁడుసారులు చెప్పినను ప్రతివాది బదులు చెప్పని యెడల నది అననుభాషణనిగ్రహస్థాన మనఁబడును.

౧౫. అజ్ఞానము:— మనము చెప్పినదానిని ప్రతివాది అర్థము చేసికొనలేకపోయిన నది యజ్ఞాన మనెడు నిగ్రహస్థాన మగును. సభవారియెదుట మూఁడుసారులు చెప్పఁగాఁగూడ ప్రతివాది యర్థము చేసికొనఁడేని యాతఁ డోడిపోయినటులే యెంచవలెను.

౧౬. అప్రతిభ:— బదులు చెప్పలేకపోవుట.

౧౭. విక్షేపము:— వేఱుకార్య మున్నది, మరల వచ్చెదనని తప్పించుకొని పోవుట విక్షేపము.

౧౮. అనుజ్ఞ:— తనవాదమందు నొకదోష మున్న దని యొప్పుకొనుచుఁ బ్రతివాదివాదమందుఁగూడ నాదోషమును ఆరోపించుట అనుజ్ఞ యనిపించుకొనును. ‘నీవు దొంగవు’ అని ప్రతివాది ఆక్షేపించినయెడల, ‘నేను దొంగను కాను’ అని ఋజువుచేసికొనుటకు మాఱుగ, ‘నీవుకూడ దొంగవే’ యనుట యీదోషమున కుదాహరణము.

౧౯. పర్యనుయోజ్యోపేక్షణము:— నిగ్రహింపఁదగిన ప్రసంగము వచ్చినప్పుడు వాదమునందు నిగ్రహింపక యూరకుండుట యీదోషము.

౨౦. నిరనుయోజ్యానుయోగము:— నిగ్రహస్థానము కాని దానిని నిగ్రహించుట నిరనుయోజ్యానుయోగము.

౨౧. అపసిద్ధాంతము:— మొదట నొకసిద్ధాంతమును అంగీకరించి పిమ్మట దానిని వదలి మార్చుకొనుట. ఒక ప్రతివాది సాంఖ్యుఁడుగా వాదించినఁ జివరవఱకును సాంఖ్యుఁడుగనే వాదింపవలెను; నడుమ బౌద్ధుఁడుగ మాఱిపోవుటకు వీలు లేదు.

౨౨. హేత్వాభాసములు:— ఇదివఱకే వర్ణింపఁబడినవి.

జాతులు:— నిగ్రహస్థానములు గాక గౌతమాచార్యుఁడు ‘జాతులు’ అని కొన్ని చెప్పియున్నాఁడు[1]. జాతి యనఁగా సిద్ధాంతమును పడఁగొట్టుటకై ప్రతివాది చేయునట్టిపూర్వపక్షము. ఇది దృష్టాంతముయొక్క, సాధర్మ్య, వైధర్మ్యములనుబట్టి యుండును. ఇట్టి జాతు లిరువదినాలుగు చెప్పఁబడినవి. వాని నన్నిటిని గ్రంథవిస్తరభీతిచే నిచ్చట వివరించుట లేదు. ఉదాహరణార్థమై యొకటిరెంటినిఁ జూపుదును.

సాధర్మ్య సమజాతి:— ఉదాహరణముయొక్క సాధర్మ్యమునుబట్టి సిద్ధాంతము చెప్పఁబడినప్పుడు, మఱియొక యుదాహరణముయొక్క సాధర్మ్యమునుబట్టి పూర్వపక్షము చేయుట ‘సాధర్మ్య సమము’ అనిపించుకొనును. ఎట్లన:

శబ్దము అనిత్యము
కృతకత్వమువలన (చేయఁబడినందున)
ఘటమువలె

అనుసిద్ధాంతమునకుఁ బూర్వపక్ష మీక్రిందివిధమునఁ జేసిన యెడల నది సాధర్మ్యసమజాతి.

శబ్దము నిత్యము
రూపము లేనందున
ఆకాశమువలె

ఘటమునకును శబ్దమునకునుగల కృతకత్వము (చేయఁబడుట) అను సమానధర్మము ననుసరించి సిద్ధాంతము చేయఁబడినది. ఆకాశమునకు శబ్దమునకుఁగల ‘రూపములేమి’ యను సమానధర్మము ననుసరించి పూర్వపక్షము చేయఁబడినది. సిద్ధాంతపూర్వపక్షములు సమానము లని సిద్ధాంతమును ఖండించుటయే యీపూర్వపక్షముయొక్క యుద్దేశము. కాని రెండవయుదాహరణమునందలి సాధర్మ్యము సరియైనది కాదు. ఇందు ‘రూపములేమి’ నిత్యత్వమునకు హేతువుగ నీయఁబడినది. కాని రూపములేనిపదార్థము లన్నియు నిత్యములు కావు. బుద్ధిచిత్తా

[1] చూడుఁడు. గౌతమసూత్రములు, ౫-వ అధ్యాయము, ౧-వ ఆహ్నికము.

sampath_Ebooks

హంకారాదికములు రూపరహితము లయినను నిత్యములు కావు. కావున ఈ ఉదాహరణము తప్పు.

వైధర్మ్య సమజాతి :— ఉదాహరణముయొక్క వైధర్మ్యమునుబట్టి సిద్ధాంతము చెప్పఁబడినప్పుడు, మఱియొక యుదాహరణముయొక్క వైధర్మ్యమునుబట్టి పూర్వపక్షము చేయుట వైధర్మ్యసమ మనిపించుకొనును. ఉదాహరణము :

శబ్దము అనిత్యము
కృతకత్వమువలన
అనిత్యము కాని దెల్లను కృతకము కాదు
ఆకాశమువలె

అను సిద్ధాంతమునకుఁ బూర్వపక్షము :—

శబ్దము నిత్యము
రూపములేమిచే
నిత్యము కాని దెవియు రూపము లేనిది కాదు
ఘటమువలె

పూర్వపక్షసిద్ధాంతములు రెండును ఇట్లు ఉదాహరణమునకును, సాధ్యమునకును గల వైధర్మ్యమును అనుసరించి యున్నవి గాన నిది వైధర్మ్యసమము. ఇట్లే యితరజాతుల దెలుపఁగవలసినది.

(కో. వేం. ల.)

**పాశ్చాత్య తర్కశాస్త్రము ననుసరించి**

పాశ్చాత్యులు అనుమానమును ఇన్‌ఫరన్స్ (Inference) లేక రీజనింగ్ (Reasoning) అనియెదరు. అనుమానమే పాశ్చాత్య తర్కశాస్త్రమునందలి ప్రధాన విషయము. ప్రత్యక్షాదిప్రమాణము లందు విచారింపఁబడవు. అవి యితరశాస్త్రములవిషయము లని వారి తాత్పర్యము.

పాశ్చాత్యనైయాయికుల యభిప్రాయప్రకారము అనుమానము రెండువిధములు : (౧) వ్యాప్తిసాధకానుమానము (Deductive Reasoning), (౨) వ్యాప్తిసాధ్యానుమానము (Inductive Reasoning). వ్యాప్తిసాధకానుమానమునందు వ్యాప్తి సాధకముగా నుండి సిద్ధాంతమును సాధించును. సిద్ధాంతసాధనకు వ్యాప్తియే సాధకము, హేతువు.

ఎచ్చటెచ్చట ధూమము కలదో అచ్చటచ్చట అగ్నియుండును
ఈ పర్వతమున ధూమ మున్నది
కావున ఈ పర్వతమున అగ్నియున్నది

పైని ఉదాహరింపఁబడినది వ్యాప్తిసాధకానుమానము. మొదటి వాక్యమునందలి వ్యాప్తియే యీ అనుమానమునకు సాధకము, ముఖ్యహేతువు. ఇందు నధికవ్యాప్తిగల వాక్యమునుండి యల్పవ్యాప్తిగల సిద్ధాంతము సాధింపఁబడినది. ఇందుకు మఱియొక యుదాహరణము :

మానవు లందఱు మరణ మొందెదరు
దేవదత్తుఁడు మానవుఁడు
కావున దేవదత్తుఁడు మరణ మొందును

ఇందు మొదటిదైన వ్యాప్తివాక్యముయొక్క వైశాల్యము మిక్కిలి పెద్దది. అందు మానవు లందఱినిగుఱించియుఁ జెప్పఁబడియున్నది. మూఁడవదియైన సిద్ధాంతవాక్యముయొక్క వైశాల్యము చిన్నది. అందు నొక దేవదత్తునిగుఱించియే చెప్పఁబడియున్నది. దేవదత్తుఁడు 'మానవు లందఱి'లో నిమిడియున్నాఁడు. కావున నిట్టి యనుమానమునం దెప్పుడును సిద్ధాంతవాక్యము ముఖ్యహేతువాక్యముకంటెఁ దక్కువ వ్యాప్తి కలదిగ నుండును.

వ్యాప్తిసాధ్యానుమానము (Inductive Reasoning) నందు వ్యాప్తియే సాధ్యముగ, ననఁగా సాధింపవలసిన విషయముగ నుండును. వంటయింటిలో ధూమ మున్నప్పు డెల్లను అగ్ని యుండుట మనము చూచుచున్నాము. అట్లే నీళ్లుప్రోయ్యియొద్దను, కమ్మరిదుకాణమందును, కమసలిదుకాణమునందును ధూమ మున్నప్పు డెల్లను అగ్ని యుండుట కానవచ్చుచున్నది. ఇట్లు అనేకస్థలములందును ధూమమునకును అగ్నికిని గలసంబంధమును చూచినందున, ఎచ్చటెచ్చట ధూమము కలదో అచ్చటచ్చట నగ్ని యుండును అనువ్యాప్తిజ్ఞానము కలుగుచున్నది. ఇదియే వ్యాప్తిసాధ్యానుమానము. ఇందు సాధింపఁబడిన సిద్ధాంతముయొక్క వ్యాప్తి, హేతువాక్యములవ్యాప్తికంటెను మించినదిగా నుండును. హేతువాక్యము లన్నియు సిద్ధాంతవాక్యములలో నిమిడి యుండును.

ఇట్లు వ్యాప్తిసాధకానుమానమునందు నధికవ్యాప్తిగల హేతువునుబట్టి యల్పవ్యాప్తిగల సిద్ధాంతములను సాధించెదము. వ్యాప్తిసాధ్యానుమానమునందు నల్పవ్యాప్తిగల హేతువులనుబట్టి యధికవ్యాప్తి గల్గినట్టియు, నాహేతువుల కన్నింటికిని సామాన్య మైనట్టియు సిద్ధాంతమును సాధించెదము. ఇదియే యీ రెంటికిని గల భేదము.

వ్యాప్తిసాధకానుమానము (Deductive reasoning) :— ఈ యనుమానము మననైయాయికుల యనుమానమువంటిదే. మన యనుమానమందలి సిద్ధాంతమునకు 'నిగమనము' అని పేరు. కావునఁ గొందఱు దీనికి 'నిగమనానుమాన' మని పేరు పెట్టిరి.

ఈ యనుమానము త్రివాక్యాత్మక మైయుండును. పదములు కలసి వాక్యము లగును. కావున అనుమానమును వివరించుటకుఁ బూర్వము పాశ్చాత్యతర్కశాస్త్రసిద్ధాంతానుసారముగా పదములనుగుఱించి, వాక్యములనుగుఱించి కొంత చెప్పవలసియుండును.

పదములు (Terms) :— ఈ శాస్త్రమునందు మనకు నామపదముల (విశేష్యముల) తోడనే పని యుండును. ఇతర పదములతో నంతగాఁ బనియుండదు. నామపదములతో సంబంధముగల యితరపదములను నామపదాంతర్గతములుగ నెంచి వాడుదురు. పదములను నైయాయికులు పెక్కుతెఱంగుల విభజించిరి.

sampath_Ebooks

కాని వాని యన్నింటితో మనకుఁ బ్రయోజనంబు లేదు. రూపమును బట్టి పదములు భావపదము లనియు ( Positive Terms ), అభావ పదము ( Negative Terms ) లనియు రెండు తెగలుగా విభజింపఁ బడినవి. భావపదము ఒకానొకగుణము ( ధర్మము ) కల దని సూచించును. అభావపదము ఒకానొకగుణము ( ధర్మము ) లే దని తెల్పును. సజీవము, మానవము, మర్యాద, సద్గుణము, సౌందర్యము మొదలగు నవి భావపదములు అజీవము, అమానవము, అమర్యాద, అసద్గుణము, అసౌందర్యము అనునవి అభావపదములు. ప్రతి భావపదమునకును ముందు 'అ' కారము నుంచిన నది అభావపద మగును. 'జలము' భావపదము, 'అజలము' అభావ పదము. 'అజలము' అనఁగా జలము కాని దంతయు నని యర్థము. 'స్త్రీలింగము' భావపదము, 'అస్త్రీలింగము' అభావపదము. 'అస్త్రీలింగ' మనఁగా పుల్లింగము, నపుంసకలింగము నని యర్థము.

ఈ యభావపదముయొక్క విశేషము ఒకటి కలదు. ఒకపదమును, దాని యభావపదమును కలిపినయెడల నీపదము లేజాతికి సంబంధించినవిగా యా జాతి యంతయు నీ రెండుపదములలోనే యిమిడియుండును. ఈరెంటిలో నిముడక మిగిలిపోయిన దేవియు నాజాతియం దుండవు. మనము సృష్టివిషయమున మాటాడుకొనుచు 'జలము' అని యొక పదార్థమును విడఁదీసినయెడల, 'అజలము' అనుపదముచే జలము తప్ప సృష్టియందుఁగల పదార్థము లన్నియు సూచింపఁబడును. ఆహారపదార్థములనుగుఱించి మాటాడుకొనుచు 'జలము'ను విడఁదీసినయెడల 'అజల'పదము నీళ్లు తప్ప మిగిలిన యాహారపదార్థముల నన్నిటిని బోధించును. పంచభూతములను గుఱించి చర్చించునెడ అజలము లనఁగా పృథ్వి, తేజస్సు, వాయువు, ఆకాశము అని యర్థ మగును. కావున పదము, దానియభావము కలసి వాదవిషయక్షేత్రము నంతను వ్యాపించును.

జాతివాచకపదములవిషయమున నొక విశేషము జ్ఞాపక ముంచుకొనవలయును. మనుష్యుఁడు, చెట్టు, గుట్ట, గోవు మొదలయినవి జాతివాచకశబ్దములు. ఈ పదముల నుచ్చరించునప్పుడు రెండువిధము లయిన యర్థములు స్ఫురించును. ఒకటి సంఖ్యార్థబోధకము (Denotative), మఱియొకటి ధర్మార్థ (గుణార్థ) బోధకము ( Connotative ). మానవుఁడు అనినతోడనే లోకమందలిమానవు లందఱు నని యర్థ మగును. గోవు, పశువు అనినతోడనే లోకమునందుఁ గల గోవు లన్నియుఁ, బశువు లన్నియు నని యర్థ మగుచున్నది. ఇదియే సంఖ్యాబోధకార్థము. అట్లే 'మానవుఁడు' అనినతోడనే మానవునిగుణధర్మములు, ఏగుణధర్మములవలన మనము మనుష్యుని ఇతరపదార్థములనుండి వేఱుచేసి గుర్తింపఁగలమో యవన్నియు స్ఫురించును. గోవు అనినతోడనే చతుష్పదత్వము, ద్విశృంగత్వము మొదలయిన ధర్మములు జ్ఞాపకమునకు వచ్చును. ఇది ధర్మార్థబోధకము. దీనినే మనవారు అవచ్ఛేదక మనియెదరు.

ఇట్లు జాతివాచక శబ్దములకు సంఖ్యార్థము, ధర్మార్థము అని రెండర్థములు కలవు. ఈ రెంటికిని గల సంబంధ మెట్టిది? సంఖ్య హెచ్చిన ధర్మము తగ్గును. ధర్మము హెచ్చిన సంఖ్య తగ్గును. మనుష్యుఁడు, స్త్రీ, హిందూస్త్రీ అను మూఁడుపదములు తీసికొందము. స్త్రీపదముచే మనుష్యత్వస్త్రీత్వము లను రెండుధర్మములు సూచింపఁబడుచున్నవి; కొంతసంఖ్యయు సూచింపఁబడుచున్నది. ఇందలి ధర్మములకు హిందూత్వ మను ధర్మమును కల్పుఁడు. మనుష్యత్వ, స్త్రీత్వ, హిందూత్వము లను ధర్మములు కలసిన 'హిందూస్త్రీ' యను జాతివాచకపద మగును. ఇట్లు స్త్రీపదముకంటె 'హిందూస్త్రీ' పదమునందు నొకధర్మము హెచ్చినది. కాని సంఖ్య తగ్గినది. స్త్రీల సంఖ్యకంటె హిందూస్త్రీలసంఖ్య తక్కువ గదా? అట్లే స్త్రీపదము నందుఁ గల స్త్రీత్వ, మనుష్యత్వధర్మములలోనుండి స్త్రీత్వధర్మమును తగ్గించుదము. మనుష్యత్వధర్మము మిగులును. ఆ ధర్మము గలవారు మనుష్యులు. ఇట్లు ధర్మము తగ్గినది. కాని సంఖ్య హెచ్చినది. స్త్రీలకంటె మనుష్యుల (స్త్రీలును పురుషులును గలసిన మానవకోటి) సంఖ్య హెచ్చును గదా.

మూఁడు సూత్రములు :— తర్కశాస్త్ర సంబంధమైన యీ క్రింది మూఁడు సూత్రములును పరంపరగా వచ్చుచున్నవి. తర్కశాస్త్రము నభ్యసించువారు ఈ సూత్రములను చక్కఁగ నెఱుఁగవలయును. అవి యెవ్వి యనఁగా :—

(౧) రాముఁడు రాముఁడే (A is A). ఈ సూత్రమునకు ఏకార్థకసూత్ర మని పేరు ( Law of Identity ). ఇది యెట్టి సూత్ర మని చదువరులు వింతపడనక్కఱలేదు. వాదములో నుపయోగింపఁబడిన పదము అంతటను ఏకార్థమునందే యుపయోగింపవలెను. ఒకచోట పదమును ఒకయర్థమునందును, మఱియొకచోట వేఱర్థమునందును వాడఁగూడదు. పదమునకు నిశ్చిత మైనయర్థ ముండవలయును. వాదిసౌకర్యార్థము అర్థమును మార్చుచుండఁగూడదు. వాదము ప్రారంభ మగునపుడు రాముఁ డనఁగా దాశరథిరాముఁ డన్న యర్థమేని, వాదమునం దంతటను ఆ యర్థమే యుండవలయును గాని, ఒకప్పుడు దాశరథిరాముఁ డనియు, మఱియొకప్పుడు పరశురాముఁ డనియు వేఱొకప్పుడు బలరాముఁ డనియు నర్థమును త్రిప్పఁగూడదు. అట్లు చేసినయెడల హేత్వాభాసమునకుఁ గారణ మగును.

తర్కశాస్త్రముయొక్క ప్రథమసూత్రమును చక్కఁగ గమనింపకపోవుటచేతనే లోకమునందు నన్ని మతములును మతవాదములును ఉద్భవించినవి. విష్ణువు సకలదేవతలకంటె శ్రేష్ఠుఁడు అని వాదమునకుఁ బ్రారంభించునపుడు 'విష్ణు' శబ్దమునకు గరుడవాహనుఁడు, నాలుగుచేతులు గలవాఁడు, శంఖచక్రములు గలవాఁడు అని యర్థము చెప్పెదరు. కాని పోఁగాఁబోఁగా 'విష్ణు' శబ్దముయొక్క యీయర్థము మాఱి దానికి నిరాకారసర్వవ్యాపి యగు సృష్టికి నాదికారణ మన్న యర్థము కల్పింపఁబడును. ఇట్లు వాదిప్రతివాదులు వాదాంతర్గతమైన

sampath_Ebooks

శబ్దముల యర్థమును మార్చుచుండుటవలన నెన్నఁడును తెగనట్టి వాద ములు కలుగుచున్నవి.

(౨) రాముఁడు మానవుఁడు, రాముఁడు మానవుఁడు కాఁడు, అన్నవి పరస్పర విరుద్ధసిద్ధాంతములు. ఈ రెండును సత్యములు కాఁజాలవు. ఒకటి సత్యమేని రెండవది అసత్యమైయుండవలయును. రాముఁడు మానవుఁడు అన్నమాట సత్యమేని రాముఁడు మానవుఁడు కాఁడు అన్నమాట అసత్యము. అట్లే రాముఁడు మానవుఁడు కాఁడు అన్నమాట సత్యమేని రాముఁడు మానవుఁడు అన్నమాట అసత్యము. ఈ సూత్రమునకు పరస్పరవైరుధ్యవిషయకసూత్రము (Law of Contradiction) అని పేరు.

(3) పైని చూపఁబడిన పరస్పర విరుద్ధవాక్యములు రెండును అసత్యములు కాఁజాలవు; అనఁగా ఈ రెండును అసత్యములై యుండెడి మాట సత్యమగుటకు వీలు లేదు. ఈ రెంటిలో నొకటి సత్యమై తీరవలయును. రెండవది యసత్యమైతీరవలయును. ఈసూత్రమునకు తృతీయపక్షాభావము (Law of excluded middle) అని పేరు.

వాక్యములు : వాక్యభేదములు (Propositions and their kinds):— ఒకక్రియతో నన్వయించు పదసముదాయమునకు వ్యాకరణశాస్త్రమునందు వాక్యమని పేరు. న్యాయశాస్త్రమునందును వాక్యమున కీలక్షణమే చెల్లును. కాని వ్యాకరణశాస్త్రమునందలి యన్నివాక్యములతో నిచ్చటఁ బని యుండదు. ప్రార్థనార్థకముల తోడను, ఆశీరాద్యర్థకములతోడను ఈ శాస్త్రమునకుఁ బని లేదు. స్వార్థకములుమాత్ర మీ శాస్త్రవిషయములు. వానియందర్థమును వర్తమానార్థకములే యుపయోగింపఁబడును. ఇతరవాక్యములను స్వార్థక వర్తమానార్థకములుగా మార్చి యీ శాస్త్రమునందు నుప యోగించుకొనవచ్చును.

ఈ శాస్త్రమునందు నుపయోగింపఁబడు వాక్యములు మూఁడువిధ ములు: నిశ్చయాత్మకములు (Categorical), సాపేక్షకములు (Hypothetical), వైకల్పికములు (Disjunctive or Alter_native). మానవు లందఱును చచ్చువారు, కొన్నిపుస్తకములు మంచివి కావు, చింతకాయ పుల్లనిది - అనునవి నిశ్చయాత్మకవాక్య ములు. వీనియందు కర్తనుగుఱించి చెప్పఁబడువిషయములు అగును కాదు అని నిశ్చయముగను, స్పష్టముగను, ఖచితముగను చెప్పఁబడి యుండును. వర్షము రానియెడల నాటక మాడఁబడును, పథ్యము చేసినయెడల మందు గుణ మిచ్చును అనునవి సాపేక్షవాక్యములు. ఇందు కర్తనుగుఱించి చెప్పఁబడినయంశము, మఱియొకవిషయమును ఆశ్రయించియుండును. నాటక మెప్పు డాడఁబడును? వర్షము రాని యెడల. కావున వర్షము రాకయుండుట నాటక మాడఁబడుటకుఁ బూర్వావస్థ (condition prior). అతఁడు తోఁటలోనైన నుండును, లేక యింటనైన నుండును అనునది వైకల్పికవాక్యము. ఇందు నిద మిత్థ మని యుండదు. అనేకపక్షములకు వీలుండును. ఈ వాక్యము

లన్నియు న్యాయశాస్త్రమునందు వాడఁబడినను, ఈ శాస్త్రసిద్ధాంత ములు బోధచేయుటకు నిశ్చయవాక్యములే చాల వీలుగ నుండును. కావున నిశ్చయవాక్యములనుగుఱించియే శాస్త్రసిద్ధాంతములఁ జెప్పఁ జాలును. ఆసిద్ధాంతములనే యితరవాక్యములకును అన్వయింపఁ చేయవచ్చును.

నిశ్చయవాక్యవిభజన (Analysis of the Categorical Propositions):— సాధారణముగా వాక్యములందు రెండు నామ పదములును (విశేష్యములును), క్రియాపదమును నుండును. నామ పదములు రెంటిలో నొకదానికి కర్తృపద మనియు (Subject), రెండవదానికి విధేయపద మనియు (Predicate), ఈ రెంటిని కలుపు నది కనుక క్రియాపదమునకు 'సంయోజకపదము' (Copula) అనియుఁ బేళ్లు. సంయోజకపద మెప్పుడును అనుధాతువుయొక్క వేఱువేఱురూపములుగా నుండును. 'దేవదత్తుఁడు విద్యార్థి యగును' అనువాక్యమునందు 'దేవదత్తుఁడు' కర్తృపదము, 'విద్యార్థి' విధేయపదము; 'అగును' సంయోజకపదము. 'మనుష్యులు మరణ శీలురు అగుదురు' అనువాక్యమునందు, 'మనుష్యులు' కర్తృపదము, 'మరణశీలురు' విధేయపదము, 'అగుదురు' సంయోజకపదము. 'మామిడిపండు పథ్యకారి కాదు' అను వాక్యమునందు 'మామిడి పండు' కర్తృపదము, 'పథ్యకారి' విధేయపదము, 'కాదు' సంయోజకపదము. కర్తృపదమునకును, విధేయపదమునకును గల సంబంధమును సంయోజకపదము తెలుపును. ఈ సంబంధము భావరూపముగ నుండవచ్చును, అభావరూపముగ నుండవచ్చును. అగు నన్నపుడు భావరూపము. కాదు అన్నపుడు అభావరూపము. తెలుఁగుభాషలో సాధారణముగ భావరూపమైన సంయోజక పదము (క్రియాపదము) అధ్యాహృతముగ నుండును; అనఁగా లోపించి యుండును. 'దేవదత్తుఁడు విద్యార్థి' యని యందుమే కాని, 'దేవ దత్తుడు విద్యార్థి అగును' అని చెప్పము. 'మనుష్యులు మరణ శీలురు' అని అందుమే కాని, 'మరణశీలురు అగుదురు' లేక 'అయియున్నారు' అని యనుట లేదు. కావున నిట్టియెడల సంయో జకపదము లే దని భ్రమపడరాదు. అధ్యాహృతముగ నున్న దనియే యెంచవలెను.

ఇట్లు తర్కశాస్త్రమం దుపయోగింపఁబడవలసినవాక్యము త్రిపదాత్మకముగ నుండు ననియు, ఆ మూఁడుపదములలో రెండు నామపదములుగను, ఒకటి క్రియాపదరూపకమైన సంయోజకపదము గను, నామపదములు రెంటిలో నొకటి కర్తృపదముగను, రెండవది విధేయపదముగను ఉండవలయు ననియు చదువరులు చక్కఁగ గ్రహించియుందురు. మనము సామాన్యముగా వాడుకొనువాక్యము లన్నియు నిట్టిరూపమును కలిగియుండవు. అయిన మన మట్టివాక్యము లను ఈరూపములకు సుకరముగ మార్చుకొనవచ్చును. 'సూర్యుఁడు ప్రకాశించును' అను సామాన్యవాక్యమును 'సూర్యుఁడు ప్రకాశవం తుఁడు' లేక, 'సూర్యుఁడు ప్రకాశించువాఁడు' లేక, 'సూర్యుఁడు

sampath_Ebooks

ప్రకాశమానద్రవ్యము' అని మార్చినయెడల, అర్థభేదము లేకుండ కర్తృవిధేయసంయోజకపదములు గల నైయాయికవాక్యము సిద్ధించుచున్నది. 'రాముఁడు రావణునిఁ జంపెను' అనువాక్యమును, 'రాముఁడు రావణసంహర్త' అని మార్చవచ్చును; లేదా 'రాముఁడు రావణుని జంపినవాఁడు' అని యనవచ్చును. ఇందు 'రాముఁడు' కర్తృపదము, 'రావణుని జంపినవాఁడు' విధేయపదసమూహము. అధ్యాహృత మైన 'అగును' అను క్రియ సంయోజకపదము. ఇట్లే యితరవాక్యములను బుద్ధికుశలతచేతను మార్చుకొనవలయును.

వాక్యములవ్యాప్తి[1] (The quantity of propositions):— పాశ్చాత్యనైయాయికులు వాక్యములను పలుతెఱంగుల విభజించియున్నారు. అందు మన ప్రస్తుతప్రయోజనమునకు రెండు విధములైన విభాగములుమాత్ర మావశ్యకములు.

కర్తృపదముయొక్క వ్యాప్తినిబట్టి వాక్యములు సర్వదేశీయములు (Universal) అనియు, ఏకదేశీయములు (Particular) అనియు ద్వివిధములు. ఏవాక్యమునందు కర్తృపదమునకు సంపూర్ణవ్యాప్తి కలిగియుండునో, అనఁగా కర్తృపదముచే సూచింపఁబడిన ప్రతిపదార్థమునకును విధేయపదముతో సంబంధము కలిగియుండునో యావాక్యమును సర్వదేశీయవాక్య మందురు. కర్తృపదమునకును, విధేయపదమునకును గలసంబంధము భావరూపముగ నుండవచ్చును; అభావరూపముగ నుండవచ్చును.

ఎచ్చటెచ్చట ధూమ ముండునో అచ్చటచ్చట నగ్నియుండును, మానవు లందఱును మరణశీలురు, 'య ద్దృశ్యం తన్నశ్యం' (కనఁబడునది యంతయు నాశవంతము), ఏకీటకమును సస్తనము కాదు, ఎచ్చటెచ్చట జల ముండునో యచ్చటచ్చట నగ్ని యుండదు — అనినవాక్యములన్నియు సార్వదేశికములు. ఇందలి ప్రతివాక్యమునందును కర్తృపద మంతయు వ్యాప్తిఁ జెందియున్నది. కర్తృపదముచే సూచితమైన ప్రతిపదార్థమును, విధేయపదార్థముతో సంబంధము కలిగియున్నది. చివర రెండువాక్యములందు కర్తృవిధేయపదములకుఁ గల సంబంధము అభావరూపమైనది. కావున, నావాక్యములందలి కర్తృపదమునకుఁ గలవ్యాప్తి అభావరూప మయినది. మిగిలిన వాక్యములోని వ్యాప్తి భావరూపము గలది.

కర్తృపదమునకు అన్ని, అందఱు మొదలైన సర్వనామములను జేర్చినందువలన సర్వదేశీయత్వము ప్రాప్తించుచున్న దని చదువరు లూహించియేయుందురు. ప్రతి మొదలైన యితరపదములును ఉపయోగింపవచ్చును. 'అందఱు' అనుపదము కొన్నియెడల విపరీతార్థము నీయవచ్చును.

అందఱు మనుష్యులు పండితులు గారు అనువాక్యము సర్వదేశీయము గాదు. ఈవాక్యమునకు మనుష్యు లందఱును అపండితు లని యర్థము కాదు; కొందఱు మనుష్యులు అపండితు లని యర్థము. కావున 'అందఱు' పదముఁ జూచినంతమాత్రమున భ్రమపడి సర్వదేశీయ వాక్య మని తలంపరాదు. వాక్యముయొక్క తాత్పర్యమును గమనించి చూడవలయును. కొన్నియెడల అందఱు, ప్రతి మొదలైన పదములు లేకయే సర్వదేశీయవాక్యము సిద్ధింపవచ్చును. శరీరములు నాశవంతములు, లేక, శరీరము నాశవంతము అన్నచో శరీరములన్నియు నాశవంతము లనియు, పక్షికి రెక్క లున్న వన్నచో, నన్నిపక్షులకును రెక్క లున్న వనియు నర్థము.

కర్తృపదముయొక్క ఏకదేశమునకు, ననఁగా కొంతభాగమునకుమాత్రము విధేయపదముతో సంబంధము కలిగియున్నట్లు ఏ వాక్యమునందు వర్ణింపఁబడియుండునో యా వాక్యమునకు ఏకదేశీయ వాక్యము (Particular proposition) అని పేరు. ఇందు కర్తృపదమునకుఁ బూర్ణవ్యాప్తి లేదు, ఏకదేశవ్యాప్తిమాత్రము గలదు. అగ్నియున్న కొన్నిచోట్ల ధూమ ముండును, కొందఱు మానవులు బుద్ధిమంతులు, కొన్నివృక్షములకు పువ్వు లుండును, కొందఱు స్త్రీలు గ్రంథములను వ్రాసిరి, అగ్ని యున్న కొన్నిచోట్ల పొగ యుండదు— అనునవి ఏకదేశీయవాక్యములు. కొందఱు అనుపదముచే నీవాక్యములకు ఏకదేశీయత్వము ప్రాప్తించినది. చాల, ఎక్కువ, తక్కువ, మిక్కిలి మొదలైన పదములచేతఁగూడ నీయర్థమే సిద్ధించును. పెక్కు జనులు విద్య నెఱుఁగరు అను వాక్యముకూడ నేకదేశీయవాక్యమే. అనిశ్చయమే ఏకదేశీయత్వమునకుఁ గారణము. కర్తృపదాంతర్గతములైన పదార్థములలో నెన్నిటికి విధేయపదముతో సంబంధము కలదో ఈ వాక్యమువలన స్పష్టముగ తెలియదు. కర్తృపదమునందు నూఱు పదార్థము లిమిడియున్న వనుకొనుఁడు. వానిలో నొక ద్రవ్యమునకు మాత్రము విధేయపదముతో సంబంధము కలిగియుండి తొంబదితొమ్మిదిపదార్థములతో సంబంధము లేకున్నను, లేక, తొంబదితొమ్మిది పదార్థములతో సంబంధము కలిగియుండి ఒక ద్రవ్యముతో మాత్రము సంబంధము లేకున్నను నది ఏకదేశీయసంబంధమే యనఁబడును. ఇంకొకవిశేషము గలదు. ఇట్టి యనిశ్చయస్థితిలో ఒకప్పుడు నూఱుపదార్థములుకూడ విధేయాంతర్గతంబులై యుండనోపు. కాని యది యనిశ్చితమైనందున మనకుఁ దెలియదు. నూటికి నూఱు పదార్థములు విధేయపదాంతర్గతంబులై యున్న వని నిశ్చయజ్ఞానము కలిగినప్పుడా వాక్యము సర్వదేశీయమే యగును. అట్టి నిశ్చయజ్ఞానము లేక, నూటికి నూఱుండిన నుండవచ్చును, లేకపోయిన

1. 'వ్యాప్తి' పదము మన న్యాయశాస్త్రమునందు వాడినయర్థమునందే యిచ్చట వాడినను, ఆశాస్త్రమందలి యర్థమునకును, ఈ శాస్త్రమందలి యర్థమునకును కొంచెము ఛాయాభేదము (Shades of meaning) కలదు. ఇచ్చటను, అచ్చటను వ్యాప్య మనఁగా వ్యాప్తి కలదియే కాని మన శాస్త్రమునందు వ్యాపకముయొక్క వ్యాప్తి వ్యాప్యమునం దున్న దని చెప్పుదురు. పాశ్చాత్యన్యాయశాస్త్రమునందు వ్యాప్యమునకు పూర్తిగ వ్యాప్తి గల దనియు, వ్యాపకమునకుఁ బూర్తిగ వ్యాప్తి లే దనియుఁ జెప్పెదరు.

sampath_Ebooks

లేకపోవచ్చును అన్న అనిశ్చయజ్ఞాన మున్నంతవఱకు నావాక్య మేకదేశీయమే యగును.

వాక్యములస్వరూపము (The Quality of propositions):– వాక్యముయొక్క రూపమునుబట్టి మరల వాక్యములను భావరూపములు ( Affirmative ) అనియు, అభావరూపములు ( Negative ) అనియు రెండువిధములుగా నైయాయికులు విభజించిరి. భావరూప వాక్యమునందు విధేయపద సంబంధమైన గుణధర్మములు కర్తృపదమునకు నారోపింపఁబడును. ఇందుమూలకముగ కర్తృ, విధేయపదములు కలుపఁబడి వానికి నైక్యభావము (అనఁగా సామానాధికరణ్యము) సాధింపఁబడును. అభావరూపవాక్యమునందు విధేయపదసంబంధమైన గుణధర్మములు కర్తృపదమునకు నిషేధింపఁబడును. ఇందుమూలకముగా విధేయపదమును కర్తృపదమును విడఁదీయఁబడును. మానవులందఱును మరణశీలురు, ఎక్కడెక్కడ ధూమమో యక్కడక్కడ నగ్ని ఉండును అనునవి భావవాక్యములు. ఇందలి మొదటి వాక్యమునందు మరణశీలురకుఁ గల మరణ మనుధర్మము మానవులకు విధింపఁబడినది. మరణశీలురవర్గము మానవవర్గముకంటె పెద్దది. వృక్షములు, క్రిములు, కీటకములు మొదలైన వన్నియు మరణశీలములు. వాని సామాన్యధర్మము మరణము. ఆధర్మము మానవజాతికి ఈ వాక్యమునందు విధింపఁబడినది. కొందఱు జనులు కోపముగలవారు– అనునది భావవాక్యము. ఇందు విధేయపదమైన 'కోపముగలవారి' యొక్క ధర్మము కోపము; కర్తృపదమైన కొందఱుజనులకు ఈ కోపము ఈ వాక్యమునందు విధింపఁబడినది.

'మనుజులు దేవతలు కారు' అనునది అభావవాక్యము. ఇందు విధేయపదము దేవతలు. వారిధర్మము దేవత్వము. ఈ వాక్యమునంబట్టి దేవత్వము కర్తృపదమైన మనుష్యులకు నిషేధింపఁబడినది. 'కొన్ని జంతువులు జలచరములు కావు' అనువాక్యమునందు, జలచరత్వధర్మము కొన్ని జంతువులకు నిషేధింపఁబడినది. కావున నది అభావవాక్యము. అభావవాక్యము సాధారణముగా తెలుఁగునందు అగుధాతువుయొక్క వ్యతిరేకరూపములచే సూచింపఁబడును.

వాక్యములకు నామకరణము :— ఇట్లు నైయాయికులచే వాక్యములు కర్తృపదవ్యాప్తి ననుసరించి సర్వదేశీయము, ఏకదేశీయము అని రెండువిధములుగను, వాక్యరూపమును బట్టి భావాభావము లని రెండు విధములుగను మొత్తముమీఁద నాల్గువిధములుగ విభజింపఁబడినవి. ఈ నాల్గును, వానియుదాహరణములును, వానికిఁ బాశ్చాత్యులు పెట్టినగుర్తులును, తెలుఁగుగుర్తులును ఈ క్రిందఁ జూపఁబడినవి.

| పేరు | ఉదాహరణము | ఇంగ్లీషు గుర్తు | తెలుఁగు గుర్తు |
|---|---|---|---|
| ౧. సర్వదేశీయభావ వాక్యము | ౧. అన్ని శరీరములు నాశవంతములు | A | య |
| ౨. సర్వదేశీయ అభావ వాక్యము | ౨. శరీరము లెవ్వియు శాశ్వతములు కావు | E | ర |
| ౩. ఏకదేశీయభావ వాక్యము | ౩. కొన్ని శరీరములు స్థూలములు | I | ల |
| ౪. ఏకదేశీయఅభావ వాక్యము | ౪. కొన్ని శరీరములు స్థూలములుకావు[1] | O | వ |

తర్కశాస్త్ర మంతయు నీ నాలుగువాక్యములచర్చతో నిండియుండును. కనుక, తర్కశాస్త్రము నభ్యసించువారు మొదట నీ వాక్యముల పేర్లును, ఉదాహరణములును, ఈ వాక్యములస్వభావములను చక్కఁగ తెలిసికొనవలయును. అటు తెలిసికొనఁగాని తర్కశాస్త్రము చక్కఁగ బోధపడఁజాలదు. ఈ నాలుగువాక్యముల పొడుగుపేర్లు తేపతేప నుచ్చరించుట కష్టము గనుక పాశ్చాత్యులు వీనికి క్రమముగ ఏ (A), ఈ (E), ఐ (I), ఓ (O) వాక్యము లని పేర్లు పెట్టిరి. మేము వీనికి య, ర, ల, వ వాక్యము లని నామకరణము చేసితిమి. య వాక్య మనిన సర్వదేశీయభావవాక్య మనియు, ర వాక్య మనిన సర్వదేశీయ అభావవాక్య మనియు, ల వాక్య మనిన ఏకదేశీయభావవాక్య మనియు, వ వాక్య మనిన ఏకదేశీయ అభావవాక్య మనియు తెలియవలెను. ఇఁకముందు, సాధారణముగా నీ గుర్తులే యుపయోగింపఁబడును. కావున చదువరు లీ గుర్తులను జ్ఞాపక ముంచుకొనవలెను.

ప్రతివాక్యమందును కర్తృపదమును విధేయపదమును ఉండును గనుక, వానికి గుర్తుగా క్రమముగ 'క్రా' 'వీ'[2] యనునక్షరములు

1. మనదేశపు నైయాయికుల సంప్రదాయానుసారముగా నీవాక్యములకు నుదాహరణము లీయవలయు నన్న ఈ క్రిందివిధిగ నీయవచ్చును: (౧) ఎక్కడెక్కడ ధూమ ముండునో అక్కడక్కడ నగ్ని యుండును. ఇది య (A) వాక్యము. (౨) ఎక్కడెక్కడ జల ముండునో అక్కడక్కడ నగ్ని యుండదు. ఇది ర (E) వాక్యము. (3) అగ్నియున్న కొన్నిచోట్ల ధూమ ముండును. ఇది ల (I) వాక్యము. (౪) అగ్నియున్న కొన్నిచోట్ల ధూమ ముండదు. ఇది వ (O) వాక్యము.


2. కర్తృపదమునకు 'క' అనియు, విధేయపదమునకు 'వి' అనియు హ్రస్వములుగ పేర్లు పెట్టుటకు మాఱుగా 'క్రా', 'వీ' అని దీర్ఘములుగ గుర్తులు పెట్టుటకుఁ గారణము దీర్ఘాక్షరములకు ప్రత్యయాదులు పెట్టి యుచ్చరించుటకు వీలుగ నుండుటయే. 'క' కు అనుటకంటె 'క్రా' కు అనుట సుకరము.

పెట్టుకొనినయెడల ఈ నాలుగు వాక్యములకును ఈ క్రింది నాలుగు ఉదాహరణము లేర్పడుచున్నవి.


| వాక్యము | ఉదాహరణము |
|---|---|
| య | అన్ని 'కా' లు 'ప్లి' |
| ఏ | ఏ 'కా' యు 'ప్లి' కాదు |
| ఇ | కొన్ని 'కా' లు 'ప్లి' |
| ఓ | కొన్ని 'కా' లు 'ప్లి' కావు |

వాక్యమునందు పదములకుఁ గల వ్యాప్తి (The distribution of terms in a proposition):— పైని నాలుగువిధములగు వాక్యములు వర్ణింపఁబడినవి. ప్రతివాక్యమునందును కర్తృపదమును, విధేయపదమును ఉండు ననియుఁ జెప్పఁబడినది. ఈ పదములలో నేయేపదములకు నేయేవాక్యమునందు వ్యాప్తి కలదో, యేయేవాక్యమునందు వ్యాప్తి లేదో మనము చక్కఁగఁ గనుఁగొనవలెను. ఏలన, అనుమానవ్యాపారమంతయు (The process of inference) ఈ వ్యాప్తి ననుసరించియే యుండును. ఒకానొకపదముచే నిర్దేశింపఁబడుజాతియందు (వర్గమునందు, in A class) నిమిడియున్న పదార్థముల నన్నిటినిగూర్చియు నా వాక్యమునందుఁ జెప్పఁబడియుండినచో నా పదమునకు వ్యాప్తి గలదందుము. ఒకానొకపదముచే బోధింపఁబడు జాతియందుఁ గల కొన్ని పదార్థములను గూర్చిమాత్రము వాక్యమునందుఁ జెప్పఁబడియున్నయెడలను, లేక అన్ని పదార్థములనుగూర్చి స్పష్టముగఁ జెప్పఁబడకయుండినయెడలను ఆపదమునకు వ్యాప్తి లేదందురు; వ్యాప్తి భావరూపముగ నుండవచ్చును; అభావరూపముగ నుండవచ్చును. వ్యాప్తిశబ్దము యొక్క ఈ యర్థమును మనస్సునందుఁ జక్కఁగ నుంచుకొని మన మిఁక నాలుగువిధము లైన వాక్యములను వేఱువేఱుగఁ బరీక్షింతము.

'య' వాక్యమునందు, అనఁగా సర్వదేశీయ భావవాక్యమునందు కర్తృపదమునకుమాత్రము వ్యాప్తి గలదు; విధేయపదమునకు వ్యాప్తి లేదు. 'అన్ని 'కా'లు 'ప్లి' యన్న వాక్యము వలన 'కా' లన్నియు 'ప్లి' లలో నిమిడియున్న వని యర్థము స్పష్టపడుచున్నది. కాని 'ప్లి' లన్నిటినిగూర్చి మనకు నేమియు స్పష్టముగ బోధపడుటలేదు. కొన్ని 'ప్లి' లు మాత్రము 'కా' లలో నిమిడియున్నట్లు మన మూహింపవచ్చును. కాని మిగిలిన 'ప్లి' లు 'కా' లలో నిమిడియున్నవో, మఱి వేనిలో నిమిడియున్నవో చెప్పఁజాలము. ఒకప్పుడు 'ప్లి' లన్నియు 'కా' లలో నిమిడియుండవచ్చును; ఒకప్పు డిమిడియుండక పోవచ్చును. 'ధూమ మున్నచోట నెల్ల నగ్ని యుండును' అనునది 'య' వాక్యము. ఇందు ధూమమునకు వ్యాప్తి గలదు; అగ్నికి వ్యాప్తి లేదు. ధూమ మున్నచోట నెల్ల అగ్ని యుండునేకాని, అగ్ని యున్నచోట నెల్ల ధూమ ముండదు. ఇట్లు కర్తృపదమునకు వ్యాప్తి గలదు; విధేయపదమునకు లేదు. ధూమ మున్నచోట నెల్ల పచ్చికట్టెల నిప్పుండును అనునది 'య' వాక్యమే. ఇందు ధూమము కర్తృపదము. పచ్చికట్టెలనిప్పు విధేయపదము. ఈ వాక్యమునందు రెండుపదములకును వ్యాప్తి గలదు. ఇట్లు 'య' వాక్యమునందు విధేయపదమునకు ఒకప్పుడు వ్యాప్తి యుండును; ఒకప్పుడు వ్యాప్తి యుండదు; కర్తృపదమునకుమాత్ర మెల్లప్పుడును వ్యాప్తి గలదు. ఈ సంగతియే ఈ క్రింది వృత్తములచే బోధింపవచ్చును.




౧-వ-వృత్తము



౨-వ వృత్తము

ఒకటవవృత్తమునందు 'కా', 'ప్లి' లు పూర్తిగ నేకీభవించియున్నవి. ఇది 'ధూమ మున్నచోట నెల్ల పచ్చికట్టెల నిప్పుండును' అన్నవాక్యమునకు నుదాహరణము. రెండవవృత్తమునందు 'కా' యంతయు 'ప్లి' లలో నొక భాగముగా నిమిడియున్నది. మిగిలిన 'ప్లి' యంతయు 'కా' కు వెలుపల నున్నది. ఆ వెలుపలనున్న 'ప్లి' ని గూర్చి మన మేమియు నెఱుఁగము. ఇది 'ధూమ మున్నచోట నెల్ల నగ్ని యుండును' అన్నవాక్యమునకు నుదాహరణము.


'ఏ' వాక్యమునందు, అనఁగా సర్వదేశీయ అభావవాక్యమునందు కర్తృపదమునకును, విధేయపదమునకును వ్యాప్తి గలదు. 'ఏ 'కా' యును 'ప్లి' కాదు' అను వాక్యమునందు 'కా' లన్నియు 'ప్లి' లనుండి వేఱుచేయఁబడినవి. 'ప్లి' లన్నియు 'కా'లనుండి వేఱుచేయఁబడినవి. ఇట్లు రెంటికిని అభావరూపవ్యాప్తి సిద్ధించెను. 'పక్షులు సస్తనములు కావు' అన్నవాక్యమునందు, ఏపక్షియు సస్తనము కాదని స్ఫురించుటయేకాక, ఏసస్తనప్రాణియు పక్షి కాదన్న యర్థముకూడ స్ఫురించుచున్నది. అట్లు గాక, కొన్ని సస్తనప్రాణులు పక్షు లయినయెడల నేపక్షియు సస్తనము కాకుండుట సంభవింపనేరదు. 'మనుష్యు లెవ్వరును దేవతలు కారు' అనఁగానే దేవత లెవ్వరును మనుష్యులు కా రని యర్థము స్ఫురించును. కావున, పై వాక్యమునందు 'మనుష్య' (కర్తృ) పదమునకును, 'దేవత' (విధేయ) పదమునకును వ్యాప్తి కల దని యర్థము. ఈ యర్థమునే ఈ క్రింది రెండు వృత్తములవలనఁ జూపవచ్చును.




sampath_Ebooks

వేఱువేఱుగ నున్న యీ రెండువృత్తములవలన 'కా' యంతయు 'పీ' కి వెలుపల నున్న దనియు, 'పీ' యంతయు 'కా' కు వెలుపల నున్న దనియు అర్థము స్ఫురించుచున్నది.

'ఐ' వాక్యమునందు, అనఁగా ఏకదేశీయభావవాక్యమునందు కర్తృపదమునకుఁ గాని, విధేయపదమునకుఁ గాని వ్యాప్తి లేదు. 'కొన్ని 'కా'లు 'పీ' యను వాక్యమునందు 'కా'కు వ్యాప్తి లేదనుట స్పష్టము. 'పీ' లన్నియు కొన్ని 'కా' లలో నిమిడియున్నట్టు గాని, కొన్ని 'పీ' లే కొన్ని 'కా'లలో నిమిడియున్నట్టుగాని యర్థము స్పష్టముగా లేనందున 'పీ'కిఁ గూడ వ్యాప్తి లేదనుట స్పష్టము. 'కొన్ని పక్షులు చక్కనివి' అనువాక్యము ఈ క్రింది మొదటి వృత్తమునందు వివరింపఁబడినది. 'కొందఱు మానవులు హిందువులు' అను వాక్యము రెండవవృత్తమునందు వివరింపఁబడినది.






౧-వ వృత్తము




౨-వ వృత్తము

'ఒ' వాక్యమునందు, అనఁగా ఏకదేశీయ అభావవాక్యమునందు కర్తృపదమునకు వ్యాప్తి లేదు; విధేయపదమునకు వ్యాప్తి కలదు. 'కొన్ని 'కా' లు 'పీ' కావు'. ఇచ్చట 'కా' కు వ్యాప్తిలేకపోవుట స్పష్టము. 'పీ'లన్నియు చెప్పఁబడిన కొన్ని 'కా'లకు వెలుపలనున్నవని యీవాక్యమున కర్థము చేయవలయును. అట్లు చేయక కొన్ని 'పీ' లు మాత్రము కొన్ని 'కా' లకు వెలుపల నున్న వనియు, మఱికొన్ని 'పీ'లు కొన్ని 'కా' లతో నేకీభవించిన వనియు నర్థము చేసినయెడల, యీవాక్యముయొక్క తాత్పర్యము మాఱిపోవును. 'కొందఱు మానవులు తెలివిగలవారు కారు', అనఁగా 'తెలివిగలవారు' అను వర్గ మంతయు వాక్యమందుఁ జెప్పఁబడిన కొందఱు మానవులకు వెలిగా నున్న దని యర్థ మగును. కావున ఈ వాక్యమునందు కర్తృపదమునకు వ్యాప్తి లేదు; విధేయపదమునకు వ్యాప్తి కలదు. ఈ యర్థము ఈ క్రింది వృత్తములవలన స్పష్టపడఁగలదు.




ఇట్లు తేలినతాత్పర్య మేమన: సర్వదేశీయవాక్యములందు కర్తృపదమునకు వ్యాప్తి గలదు; ఏకదేశీయవాక్యమునందు కర్తృపదమునకు వ్యాప్తి లేదు; భావవాక్యమునందు విధేయపదమునకు వ్యాప్తి లేదు; అభావవాక్యమునందు విధేయపదమునకు వ్యాప్తికలదు.

వాక్యములకుఁ గల విరోధము (Opposition of propositions):— సమానకర్తృపదమును, సమానవిధేయపదమును గల ఎ, ఇ, ఐ, ఒ లను నాలుగు వాక్యములకును గల పరస్పరసంబంధమునకుఁ బాశ్చాత్యతార్కికులు వాక్యవిరోధ మని పేరు పెట్టిరి. వాక్యములకుఁ గల యీ సంబంధమును తెలిసికొనుటవలన, ఒక వాక్యము (ఎ) సత్య మగునేని, లేక యసత్య మగునేని, ఆ కర్తృపదమును, ఆవిధేయపదమును గల యితర (ఇ, ఐ, ఒ) వాక్యములు సత్యము లగునా లేక అసత్యము లగునా యన్న జ్ఞానము కలుగును.

| | |
|---|---|
| మానవు లందఱును మరణాధీనులు | (ఎ) |
| మానవు లెవ్వరును మరణాధీనులు కారు | (ఇ) |
| కొందఱు మానవులు మరణాధీనులు | (ఐ) |
| కొందఱు మానవులు మరణాధీనులు కారు | (ఒ) |

ఇవి నాలుగును, ఏకకర్తృపదమును, ఏకవిధేయపదమును గల వాక్యములు. వీనిలో నన్నియు సత్యములుగఁ గాని, అన్నియు అసత్యములుగఁ గాని యుండుటకు వీలు లేదుగదా! 'మానవు లందఱును మరణాధీనులు' (ఎ) అను వాక్యము సత్యమేని, 'మానవు లెవ్వరును మరణాధీనులు కారు' (ఇ) అనువాక్యమును, 'కొందఱు మానవులు మరణాధీనులు కారు' (ఒ) అను వాక్యమును అసత్యము లై తీరవలయును.

వాక్యములకు నాలుగువిధము లయిన వైరము కల దని తార్కికులయభిప్రాయము. అవి యెవ్వి యనిన :—

౧. పరస్పరవైరము (Contradiction):— వాక్యవైరములలో నిది ప్రబల మైనది. దీనిని ప్రబల వైర మనవచ్చును. ఇట్టి పరస్పర వైరము ఎ, ఒ వాక్యములకును, ఇ, ఐ వాక్యములకును గలదు; అనఁగా ఎ సత్యమేని, ఒ అసత్యము. ఎ అసత్యమేని ఒ సత్యము. ఇట్లే ఒ సత్యమేని ఎ అసత్యము. ఒ అసత్యమేని ఎ సత్యము. ఇట్లే ఇ, ఐ వాక్యములనుగూర్చి యెఱుంగునది; అనఁగా పరస్పరవైరముగల రెండువాక్యములును సత్యములు కానేరవు. అట్లే రెండును అసత్యములు కానేరవు. ఒకటి సత్యము, రెండవది అసత్యము అయితీరవలయును.


౨. వైరము (Contrariety):— ఇది సాధారణ వైరము. ఎ, ఇ వాక్యముల కిట్టి వైరము కలదు. ఎ వాక్యము సత్యమేని, ఇ వాక్యము అసత్యము. ఇ సత్యమేని ఎ అసత్యము; అనఁగా రెండును సత్యములు కాఁజాలవు. కాని రెండును అసత్యములు కావచ్చును. మానవు లందఱును

sampath_Ebooks

పండితులు (య); మానవు లెవ్వరును పండితులు కారు (ర) అను నీ రెండువాక్యములును అసత్యములే. వీనిలో నొకటి సత్యమేని రెండవది యసత్య మై తీఱవలయును. కాని యొకటి యసత్యమేని రెండవది సత్య మైతీఱవలయును అన్న నియమము లేదు.

3. కించిద్వైరము (Sub-Contrariety) :— ల, వ వాక్యములకుఁ గల వైరమున కీ పేరు పెట్టఁబడినది. కించిద్వైరము గల వాక్యములు రెండును సత్యములు కావచ్చును. కాని రెండును అసత్యములు కాఁజాలవు ఒకటి అసత్యమేని రెండవది సత్య మై తీఱవలయును. 'కొందఱు మానవులు పండితులు' (ల), 'కొందఱు మానవులు పండితులు కారు' (వ) అను రెండు వాక్యములును సత్యములు కావచ్చును. కాని యిందు నొకటి యసత్య మయినయెడల, రెండవది సత్య మయితీఱవలయును. రెండును అసత్యము లగుటకు వీలు లేదు.

ఆశ్రాసవైరము (Sub-alternation) :— ఇది పేరునకు మాత్రము వైరము; నిజమయిన వైరము కాదు. య, ల లకును, ర, వ లకును ఇట్టి సంబంధము కలదు. య సత్యమేని ల సత్యము; కాని ల సత్యమేని య సత్యమో కాదో చెప్పుటకు వీలు లేదు. ఇట్లే ర, వ లను గుఱించియు తెలియవలెను. య, ర, ల, వ వాక్యములకుఁ గల పైని చూపఁబడిన నాలుగువిధములయిన వైరము లీ క్రింది చతుర్భుజమలన స్పష్టపడఁగలవు.




పైని వివరింపఁబడినవైరములస్వభావమును చక్కఁగాఁ బరిశీలించితి మేని, ఒకవాక్యముయొక్క సత్యత్వాసత్యత్వములఁబట్టి యితర వాక్యములయొక్క సత్యత్వాసత్యత్వములు ప్రక్క నీయఁబడిన పట్టికయందలిరీతిగా నూహింపవచ్చు నని తేటపడఁగలదు.

| సత్యము | య | ర | ల | వ |
|---|---|---|---|---|
| య సత్య మగునేని | సత్యము | అసత్యము | సత్యము | అసత్యము |
| ర సత్య మగునేని | అసత్యము | సత్యము | అసత్యము | సత్యము |
| ల సత్య మగునేని | సంశయా స్పదము | అసత్యము | సత్యము | సంశయా స్పదము |
| వ సత్య మగునేని | అసత్యము | సంశయా స్పదము | సంశయా స్పదము | సత్యము |

| అసత్యము | య | ర | ల | వ |
|---|---|---|---|---|
| య అసత్య మేని | అసత్యము | సంశయా స్పదము | సంశయా స్పదము | సత్యము |
| ర అసత్య మేని | సంశయా స్పదము | అసత్యము | సత్యము | సంశయా స్పదము |
| ల అసత్య మేని | అసత్యము | సత్యము | అసత్యము | సత్యము |
| వ అసత్య మేని | సత్యము | అసత్యము | సత్యము | అసత్యము |

వాక్యవిపర్యయము: సాక్షాదనుమానము (Immediate Inference) :— మూలార్థము చెడకుండ నొకవిధమైన వాక్యమును మఱియొకవిధమయిన వాక్యముగా మార్చుట వాక్యవిపర్యయ మనఁబడును. దీనినే ప్రాచీననైయాయికులు సాక్షాదనుమాన మనిరి. కాని నిజముగాఁ జూచినయెడల నిది యనుమానము కానేకాదు. ఇందు వలన పూర్వము తెలిసినదానికంటె నూతనజ్ఞాన మేమియుఁ గలుగ దని అర్వాచీన నైయాయికులయభిప్రాయము. వాక్యములను మూలార్థము చెడకుండ మార్చు ముఖ్యపద్ధతులు రెండు: ౧. పదపరివర్తనము, ౨. రూపపరివర్తనము.

౧. పదపరివర్తనము (Conversion) :— మూలవాక్యము నందలికర్తృపదమును విధేయపదముగను, విధేయపదమును కర్తృపదముగను మార్చి మూలవాక్యమునందలి యర్థమును చెడఁగొట్టకుండ నూతనవాక్యమును సాధించుట పదపరివర్తన మనఁబడును. 'మానవు లెవ్వరును దేవతలు కారు' అను (ర)వాక్యములోని కర్తృపదమును విధేయపదముగను, విధేయపదమును కర్తృపదముగను మార్చి, 'దేవత

లెవ్వరును మానవులు కారు' (ర) అను క్రొత్తవాక్యమును సాధింపవచ్చును. కాని వాక్యము లన్నియు నింతసులభముగా పదపరివర్తనమును బొందవు. 'మానవు లందఱును సచేతనప్రాణులు' (ర) అన్న వాక్యమునందలి పదములను పరివర్తించినయెడల 'సచేతనప్రాణు లందఱును మానవులు' అను విపరీతార్థము నిచ్చువాక్యము సిద్ధించుచున్నది. ఇందులకుఁ గారణ మేమి? మొదటివాక్యమునందు విధేయపదమునకు వ్యాప్తి లేదు; నూతనవాక్యమునందా పదము కర్తృపద మై వ్యాప్తిఁ జెందినది. కావున నిట్టివిపరీతార్థము నిచ్చెను. పదపరివర్తనమును జేయునెడ నీ క్రిందిసూత్రములను గమనింపవలయును.

౧. మూలవాక్యముయొక్కయు, సాధితవాక్యముయొక్కయు రూప మొకటిగా నుండవలెను. మూలవాక్యము భావరూప మనునేని సాధితవాక్యము గూడ భావరూపముగనే యుండవలయును. మూల వాక్య మభావరూపముగ నుండునేని సాధితవాక్యము గూడ నభావ రూపముగనే యుండవలయును.

౨. మూలవాక్యమునందు వ్యాప్తిని జెందనిపదము సాధితవాక్యమునందు వ్యాప్తిని జెందఁగూడదు.

ఈ సూత్రముల ననుసరించి పదపరివర్తనము చేసితిమేని,
య వాక్యమునుండి ఇ వాక్యమును,
ర వాక్యమునుండి ర వాక్యమును,
ఇ వాక్యమునుండి ఇ వాక్యమును

సాధింపఁగలము. న వాక్యమునుండి యే వాక్యమును సాధించుటకు వీలు లేదు.

౨. రూపపరివర్తనము (Obversion):— మూలవాక్యము భావరూప మేని దానిని అభావరూపముగ మార్చుటయు, అభావ రూప మేని భావరూపముగ మార్చుటయు రూపపరివర్తన మనిపించుకొనును. ఈమార్పులు చేయునప్పుడు మూలవాక్యముయొక్క యర్థము చెడకుండ నుండవలయును. 'రాముఁడు సత్యసంధుఁడు' అను వాక్యమునకు రూపపరివర్తనము కల్పింపవలయును. ఈ వాక్యమునందు 'అగును' అను భావరూపకసంయోజకపద మొకటి (Copula) అధ్యాహృతముగ నున్న దని చదువరు లెఱిఁగియేయున్నారు. ఈ భావరూపక సంయోజకపదమును అభావరూపముగ మార్చవలెను. అట్లే విధేయపద మైన 'సత్యసంధుఁడు' అనుదానిని 'అసత్యసంధుఁ' డన్న యభావరూపముగ మార్చవలయును. ఇట్లు 'రాముఁడు సత్యసంధుఁడు' అనుభావరూపవాక్యమునకు సమానార్థకముగా రూపపరివర్తనమువలన 'రాముఁడు అసత్యసంధుఁడు కాఁడు' అను అభావరూపవాక్యము సిద్ధించుచున్నది. రూపపరివర్తనము చేయునప్పుడు ఈ క్రిందిసూత్రములను గమనింపవలయును.

౧. సంయోజకపదమును భావరూపముగా నున్నయెడల అభావరూపముగను, అభావరూపముగా నున్నయెడల భావరూపముగను మార్చవలెను.

౨. విధేయపదమును భావరూపముగా నున్నయెడల అభావరూపముగను, అభావరూపముగ నున్నయెడల భావరూపముగాను మార్చవలయును.

౩. ఈ మార్పు చేయునప్పుడు పదపరివర్తనము చేయనక్కఱ లేదు. మూలవాక్యములోని కర్త సాధితవాక్యములోని కర్తగనే యుండును. అట్లే విధేయపదముగూడ విధేయపదముగ నుండును.

పై సూత్రముల ననుసరించి వాక్యముల రూపపరివర్తనము కల్పించినయెడల సాధింపఁబడువాక్యము లీ క్రిందఁ జూపఁబడినవి.

మూలవాక్యము

(య) మనుష్యు లందఱును మరణశీలురు
(ర) మనుష్యు లెవ్వరును సర్వజ్ఞులు కారు
(ఇ) కొందఱు మనుష్యులు పండితులు
(న) కొందఱు మనుష్యులు నమ్మఁదగినవారు కారు

సాధితవాక్యము

(ర) మనుష్యు లెవ్వరును అమరణశీలురు కారు
(య) మనుష్యు లందఱును అసర్వజ్ఞులు
(న) కొందఱు మనుష్యులు అపండితులు కారు
(ఇ) కొందఱు మనుష్యులు నమ్మఁదగినవారు అనుదురు

వాక్యవిపర్యయముయొక్క పైని వివరింపఁబడిన రెండుమార్గములను నైయాయికు లనేకవిధముల కలిపి పదరూపపరివర్తనము (Obversion of the Converse), అనఁగా మొదట నొక వాక్యమునకు పదపరివర్తనముఁ గావించి, పిదప నాసాధితవాక్యమునకు రూపపరివర్తనము కావించుట, రూపపదపరివర్తనము (Contraposition or conversion of the obverse) మొదలయిన వాక్యవిపర్యయపద్ధతు లనేకములు నిర్మించుకొనిరి. అవన్నియు గ్రంథవిస్తరభీతిచే నిచ్చట సవిస్తరముగా వర్ణింపఁబడవు.

న్యాయము (త్రిపాది) Syllogism:— మన న్యాయశాస్త్రమునందలి న్యాయమునకు నైదు అవయవములు కల వని చదువరులు చూచియున్నారు. పాశ్చాత్యానుమానము త్ర్యవయవాత్మకము.

మానవు లందఱును మరణశీలురు
దేవదత్తుఁడు మానవుఁడు
కావున దేవదత్తుఁడు మరణశీలుఁడు

పాశ్చాత్యానుమాన మిట్లు మూఁడుపాదములుగా సాధింపఁబడును. కావున, ఈ న్యాయమునకు త్రిపాది (Syllogism)

sampath_Ebooks

sampath_Ebooks

యని పేరు పెట్టుదము. ప్రతిత్రిపాదియందును మూఁడువాక్యము లుండును. అందు మొదటిరెంటికిని స్వీకృత (Premises) వాక్యము లని పేరు. మన నైయాయికుల సంప్రదాయానుసారము వీనిని హేతువాక్యము లనవచ్చును[1]. మూఁడవ వాక్యమునకు సిద్ధాంతవాక్య మని పేరు. మన న్యాయశాస్త్రమునందు దీనిని 'నిగమన' మనియెదరు. చివరదానికి మొదటిరెండును హేతువాక్యములు. సిద్ధాంతమున కవి హేతువులు. మూఁడవది ఆ రెండువాక్యముల కలిమిచే వచ్చినసిద్ధాంతవాక్యము. మొదటిరెండు స్వీకృతవాక్యములు: అనఁగా హేతువాక్యములు, సత్యములా అసత్యములా యన్న విషయముతో న్యాయశాస్త్రమునకుఁ బని లేదు. మొదటిరెండు వాక్యములును సత్యము లయినయెడల మూఁడవవాక్యము తప్పక సత్య మనిమాత్రము న్యాయశాస్త్రము చెప్పును.

త్రిపాదిలోనిపదములు :— త్రిపాదియందు మూఁడువాక్యము లుండును. ప్రతివాక్యమునందును రెండుపదము లుండును. కావున, మొత్తముమీఁద నాఱుపదము లుండవలెను. పైని చూపఁబడిన త్రిపాదియొక్క యుదాహరణమున, ఒకటవ వాక్యమునందు 'మానవులు', 'మరణశీలురు' అనునవియు, రెండవవాక్యమునందు 'దేవదత్తుఁడు', 'మానవుఁడు' అనునవియు, మూఁడవవాక్యమునందు 'దేవదత్తుఁడు', 'మరణశీలుఁడు' అనునవియుఁ గలసి యాఱుపదము లయ్యెను. కాని వీనిలో నొక్కొక్కపదము రెండుసారులు వచ్చినది. కావున త్రిపాదియందలిపదములు మూఁడే. మన న్యాయశాస్త్రమునందు చెప్పఁబడు ధూమాగ్ని సంబంధమయిన యుదాహరణముఁ దీసికొందము.

ధూమవంతము లన్నియు నగ్నిమంతములు
పర్వతము ధూమవంతము
కావున పర్వతము అగ్నిమంతము

ఇందు మూఁడుపదములు కలవు. ధూమవంతము, అగ్నిమంతము, పర్వతము. పై మూఁడువాక్యములలో మొదటిరెండును హేతువులు (హేతువాక్యములు), మూఁడవది సిద్ధాంతము (సిద్ధాంతవాక్యము). సిద్ధాంతవాక్యమందలి కర్తృపదమైన పర్వతమునకు గౌణపదము (Minor term - పక్షము) అనియు, విధేయపదమైన 'అగ్నిమంతము' అనుదానికి ముఖ్యపదము (Major term - సాధ్యము) అనియు పేళ్లు. హేతువాక్యములు రెండింటిలోను కానవచ్చెడి 'ధూమవంత' మను పద మొకటి కలదు. దానిని మధ్యవర్తిపదము (Middle term - లింగము) అనియెదరు. ఏ హేతువాక్యమునందు ముఖ్యపదము (సాధ్యము) ఉండునో అది ముఖ్యహేతువాక్యము (Major premise - ఉదాహరణము); ఏ హేతువాక్యమునందు గౌణపదము (పక్షము) ఉండునో అది గౌణహేతువాక్యము (Minor premise - హేతువాక్యము).

రెండు హేతువాక్యములవలన నొక సిద్ధాంతవాక్యము (నిగమనము లేక ప్రతిజ్ఞ) సాధించుట త్రిపాదియొక్కపని యైయున్నది. య, ర, ల, వ లని వాక్యములు నాలుగుదెఱఁగులు; వానిలో ఏ రెండువాక్యములను హేతువాక్యములుగాఁ దీసికొన్నను సిద్ధాంతవాక్యము వచ్చునా ? రాఁజాలదు. చూడుఁడు.

అన్ని 'క్షా'లు 'ప్రీ' (య)
ఏ 'చా'యు 'మూ' కాదు (ర)

ఈ హేతువాక్యమువలన, ఎట్టిసత్యసిద్ధాంతమును సాధింపనలవికాదు. కావున సత్యసిద్ధాంతమును సాధించుటకు త్రిపాదియందలి వాక్యములును పదములును ఎన్ని యుండవలయునో, ఎట్లుండవలయునో, వానిలో వానికి నుండవలసినసంబంధ మెట్టిదో తెలియఁజేయుసూత్రములు కొన్ని గలవు. వాని నీక్రింద నుదాహరించి చర్చించెదము.

సూత్రములు :— ౧. ప్రతిత్రిపాదిలోను మూఁడేపదము లుండవలెను. మూఁటికంటె నెక్కువ గాని తక్కువ గాని పదము లుండఁగూడదు. ఇందలియొక్కొక్కపదమును ఒక్కొక్కయర్థమునందే వాడవలయును. ఈ మూఁడుపదములకును ముఖ్యపద మనియు, గౌణపద మనియు, మధ్యవర్తిపద మనియు పేళ్లు. ఒక్కొకపద మొక్కొకయర్థమునందే వాడక, ఒకసారి యొకయర్థమునందును, మఱియొకసారి మఱియొకయర్థమునందును వాడినయెడల పదముల సంఖ్య మూఁటికంటె మించిపోవును. అనుమాన మనఁగా రెండు పదములను మూఁడవపదముతోఁ బోల్చి చూచి యీ రెండు పదములసంబంధమును నిశ్చయించుట; గనుక త్రిపాదియందు మూఁడే పదము లుండవలయును.

౨. ప్రతి త్రిపాదియందును మూఁడేవాక్యము లుండవలయును. మూఁటికంటె నెక్కువగాని తక్కువగాని వాక్యము లుండఁగూడదు. ఈ వాక్యములకు ముఖ్యహేతు వనియు, గౌణహేతు వనియు, సిద్ధాంత మనియు నామములు.

౩. మధ్యవర్తి(హేతు)పదము రెండు హేతువాక్యములందును ఉండి ఒకహేతువాక్యమందయినను వ్యాప్తిఁ జెందియుండవలయును.

ఇది ముఖ్యమయినసూత్రము. మధ్యవర్తిపదము (లింగము) ఒకహేతువాక్యమందయినను వ్యాప్తిఁ జెందనియెడల దానితో ముఖ్య, గౌణపదములను పోల్చుటకు వీలులేదు. మధ్యవర్తిపదము యొక్కయొకభాగమునకు ముఖ్యపదముతో సంబంధ ముండవచ్చును; మధ్యవర్తిపదముయొక్క రెండవభాగముతో గౌణపదమునకు సంబంధ ముండవచ్చును. ఇట్లు ముఖ్యపదమునందు ఏకదేశాంతర్వర్తియు, గౌణపదమునం దన్యదేశాంతర్వర్తియు నగు మధ్యవర్తి

1. హిందూన్యాయశాస్త్రానుసారము మొదటివాక్యము ఉదాహరణవాక్యము, రెండవది హేతువాక్యము అగును.


sampath_Ebooks



పదము ముఖ్య, గౌణపదములకు సంబంధము కూర్పనేరదు. ఇది యుదాహరణమువలన స్పష్టమగును.

రాజు లందఱును మానవులు (ముఖ్యహేతువు)[1]
ప్రజ లందఱును మానవులు (గౌణహేతువు)
కావున ప్రజ లందఱును రాజులు (సిద్ధాంతము)

ఈ త్రిపాదియందలిసిద్ధాంత మపసిద్ధాంతము; సరియయినది కాదు. ఈ పొరపాటునకుఁ గారణ మేమి? 'మానవులు' అను మధ్యవర్తిపదమునకు వ్యాప్తి లేకపోవుటయే దీనికి హేతువు. ఈ పదము రెండు హేతువాక్యములందును (య) వాక్యమందలి విధేయ పద మయినందున దీనికి వ్యాప్తి లేకపోయెను. ఈ క్రింది చతుష్కోణమును జూడుఁడు.




పెద్దచతుష్కోణము 'మానవులు' అనుకొందము. అందులోని యొక చిన్న చతుష్కోణము రాజులు. మఱియొక చిన్న చతుష్కోణము ప్రజలు; ఈ చిన్నచతుష్కోణములు పెద్ద చతుష్కోణము యొక్క ఏకదేశాంతర్గతము లయినను ఒకదానితో మఱియొకదానికి సంబంధము లేక విడివిడిగా నున్నవి.

౪. ఒక్కహేతువాక్యమం దయినను వ్యాప్తి లేనిపదము సిద్ధాంతమునందు వ్యాప్తిఁ జెందఁగూడదు.

మంచిప్రజ లందఱును రాజభక్తులు (ముఖ్యహేతువు)
మంచిప్రజ లందఱును తెలివిగలవారు (గౌణహేతువు)
కావున తెలివిగలవా రందఱును రాజభక్తులు (సిద్ధాంతము)

ఇది అపసిద్ధాంతము. ఏల? గౌణహేతువాక్యమునందలి 'తెలివి గలవారు' అను పదములకు (య) వాక్యమందలి విధేయపద మగుటచే) వ్యాప్తి లేదు. సిద్ధాంతమునందు నది య వాక్యముయొక్క కర్తృపద మగుటచే దానికి వ్యాప్తి గలిగినది. కావున నిది యపసిద్ధాంత మయినది. పై హేతువులనుబట్టి 'కొందఱు తెలివిగల వారు రాజభక్తులు' అని సిద్ధాంతము చేసిన నది సరియైనసిద్ధాంత మగును.

౫. రెండుహేతువాక్యములును అభావరూపము లయినయెడల వానినుండి ఏ సిద్ధాంతమును సాధింప నలవికాదు.

పక్షులు చేఁపలు కావు
చేఁపలు పురుగులు కావు

ఈ హేతువాక్యముల ననుసరించి మనము పక్షులనుగుఱించి కాని, పురుగులనుగుఱించి కాని యెట్టి సిద్ధాంతమును సాధించుటకును వీలు లేదు.

౬. ఒక హేతువాక్యము అభావరూప మయ్యెనేని సిద్ధాంతముకూడ అభావరూపముగ నుండును.

౭. హేతువాక్యములు రెండును ఏకదేశీయము లయినయెడల నే సిద్ధాంతమును సాధింపనలవిగాదు; అనఁగా హేతువాక్యములలో నొక్కటియైనను సర్వదేశీయముగా నుండవలయును.

౮. హేతువాక్యములలో నొక్కటి ఏకదేశీయముగ నుండె నేని సిద్ధాంతముకూడ నేకదేశీయవాక్యముగ నుండును.

పై సూత్రములనుబట్టి ఎట్టిత్రిపాదులు సుసిద్ధాంతముల నిచ్చునో, యెట్టివి యీయవో మనము నిశ్చయింపవచ్చును. య, ర, ల, వ లను నాలుగువాక్యములలోనుండి రెండురెండువాక్యములు విడఁదీసి హేతుద్వయముగ నమర్చి, ఏయేహేతుద్వయము సుసిద్ధాంతముల నీయఁగలవో, యేదియేది యీయలేదో కనుఁగొందము. య, ర, ల, వ వాక్యములను రెండురెండుగా నమర్చిన యెడల పదునాఱుసంపు లగుచున్నవి.

| | | | |
|---|---|---|---|
| య య | ర య | ల య | వ య |
| య ర | ర ర | ల ర | వ ర |
| య ల | ర ల | ల ల | వ ల |
| య వ | ర వ | ల వ | వ వ |

పైని ఈయఁబడిన యైదవసూత్రము ననుసరించి రెండు హేతువాక్యములును అభావరూపములే యైనయెడల సుసిద్ధాంతము నీయఁజాలవు. కావున పైజతలలోనుండి, ర ర, ర వ, వ ర, వ వ అను నాలుగుజతలు మనకు అనుపయోగములు. అట్లే హేతువాక్యములు రెండును, ఏకదేశీయము లైనయెడల సిద్ధాంతము నీయఁజాల వన్న యేడవసూత్రము ననుసరించి ల ల, ల వ, వ ల అను

1. ముఖ్యహేతువునకు ఉదాహరణవాక్యము లేక వ్యాప్తివాక్య మనియు, గౌణహేతువునకు హేతువాక్య మనియు, లేక ఉపనయ వాక్య మనియు, సిద్ధాంతమునకు నిగమనవాక్య మనియు, లేక ప్రతిజ్ఞ యనియు పేరు పెట్టిన యెడల మన నైయాయికులకు బాగుగ నర్థ మయ్యెడి నని తోఁచుచున్నది.

మూఁడుజతలుఁగూడ మనకు పనికిరావు. నాలుగవసూత్రము ననుసరించి ల ర జతయు పనికిమాలినదే. ఇట్లెనిమిదిజతలు పోఁగా ఎనిమిది జతలు మిగిలినవి.

(౧) య య (౫) ర య (౯) ల య (౮) వ య

(౨) య ర ... ... ...

(౩) య ల (౬) ర ల ... ...

(౪) య వ ... ... ...

ఇఁక నీ యెనిమిదిజతలనుగుఱించి విచారింపవలయును.

శ్రేణులు (Figures):— హేతువాక్యములలోని మధ్యపదముయొక్క స్థలమునుబట్టి త్రిపాదులు నాలుగుశ్రేణులుగా విభజింపఁబడినవి. మధ్యవర్తిపదము (లింగము) ముఖ్యహేతువాక్యమునందు కర్తృపదముగను, గౌణహేతువాక్యమునందు విధేయపదముగను ఉండిన నది ప్రథమశ్రేణి.

మానవు లందఱును మరణ మొందువారు (ముఖ్యహేతువు)
దేవదత్తుఁడు మానవుఁడు (గౌణహేతువు)

పై హేతుద్వయమునందు, మానవపదము మధ్యవర్తిపదము (లింగము). ఇది ముఖ్యహేతువునందు కర్తగను, గౌణహేతువునందు విధేయముగను ఉన్నది.

ద్వితీయశ్రేణి :— మధ్యవర్తిపదము (లింగము) హేతుద్వయమునందును విధేయపదముగానే యుండెనేని అది ద్వితీయశ్రేణి యగును.

సత్కార్యము లన్నియు భూమదాస్పదములు (ముఖ్యహేతువు)
కొన్నికార్యములు భూమదాస్పదములు కావు (గౌణహేతువు)

ఇందు 'భూమదాస్పదములు' మధ్యవర్తిపదము; హేతుద్వయమునందును విధేయపదముగ నున్నది.

తృతీయశ్రేణి:— మధ్యవర్తిపదము (లింగము) హేతుద్వయమునందును కర్తృపదముగ నుండెనేని అది తృతీయశ్రేణి యగును.

తిమింగిలము లన్నియు సస్తనములు (ముఖ్యహేతువు)
తిమింగిలము లన్నియు జలచరములు (గౌణహేతువు)

చతుర్థశ్రేణి :— మధ్యవర్తిపదము (లింగము) ముఖ్యహేతువునందు విధేయపదముగను, గౌణహేతువునందు కర్తృపదముగను ఉండెనేని చతుర్థశ్రేణి యనఁబడును.

తిమింగిలము లన్నియు సస్తనములు (ముఖ్యహేతువు)
సస్తనము లన్నియు వంశాస్తిమంతములు (గౌణహేతువు)

ముఖ్యపదమునకు వీ యనియు, గౌణపదమునకు కా యనియు, మధ్యవర్తిపదమునకు మా యనియు గుర్తులు పెట్టితిమేని ఈ నాలుగుశ్రేణుల నిట్లు చూపవచ్చును.

| వాక్యము | ప్రథమ శ్రేణి | ద్వితీయ శ్రేణి | తృతీయ శ్రేణి | చతుర్థ శ్రేణి |
|---|---|---|---|---|
| ముఖ్యహేతువు | మా — వీ | వీ — మా | మా — వీ | వీ — మా |
| గౌణహేతువు | కా — మా | కా — మా | మా — కా | మా — కా |
| సిద్ధాంతము | కా — వీ | కా — వీ | కా — వీ | కా — వీ |

అనుమానమునకుఁ బనికివచ్చు నని మనము పైని ఏరిపెట్టి యున్న ఎనిమిదిజతలను ఈ నాల్గుశ్రేణులలోను బెట్టి, ఏదియేది యక్కఱకు వచ్చునో చూతము.

ప్రథమశ్రేణి ౧. ఒకటవజత—'య య'

య — అన్ని మా లు వీ (ముఖ్యహేతువు)
య — అన్ని కా లు మా (గౌణహేతువు)

ఈ రెండువాక్యములవ్యాప్తిని జూచిన నీ క్రింది రెండుసిద్ధాంతము లేర్పడుచున్నవి.

అన్ని కా లు వీ
కొన్ని కా లు వీ

రెండవ సిద్ధాంతము అనఁగా 'కొన్ని 'కా' లు 'వీ' అను దానిని బలహీనసిద్ధాంత మందురు. అది మొదటి సిద్ధాంతములో నవఁగా 'అన్ని 'కా' లు 'వీ' యన్నదానిలో నిమిడియున్నవి. కావున 'అన్ని 'కా' లు 'వీ' యన్న సిద్ధాంతమే మనకు ముఖ్యము. ఎక్కువ బలము గల సిద్ధాంతమును సాధించుటకు వీలున్నప్పుడు తక్కువ బలము గల సిద్ధాంతముతో సంతృప్తిఁ జెందియూరకుండఁగూడదు. ఇట్లు 'య య య' అన్న త్రిపాది సిద్ధించినది. 'య య య' త్రిపాది యనఁగా నే త్రిపాదియందు ముఖ్యహేతువు 'య' వాక్యముగను, గౌణహేతువు 'య' వాక్యముగను, సిద్ధాంతము 'య' వాక్యముగను ఉండునో అట్టిది యని యర్థము.

౨. రెండవజత—'య ర'

య — అన్ని 'మా' లు 'వీ' (ముఖ్యహేతువు)
ర — ఏ 'కా' యు 'మా' కాదు (గౌణహేతువు)

ఈ హేతుద్వయమువలన నెట్టి సుసిద్ధాంతమును సాధించుటకును వీలు లేదు. ఎందు కనఁగా ఒక్కహేతువు అభావరూపము గనుక సిద్ధాంతమును అభావరూపముగనే యుండవలయును గదా. అట్టి వాక్యములు రెండు.

ఏ 'కా' యు 'వీ' కాదు

కొన్ని 'కా' లు 'వీ' కావు

ఈ రెండింటిలోను 'వీ' విధేయపదం బగుటచే దానికి వ్యాప్తి గలదు. ముఖ్యహేతువాక్యమునందు ఈపదమునకు వ్యాప్తి లేదు. కావున సిద్ధాంతము లపసిద్ధాంతము లని యర్థము.

౩ — మూఁడవజత 'య ల'

య - అన్ని 'మా' లు 'వీ' (ముఖ్యహేతువు)

ల - కొన్ని 'కా' లు 'మా' (గౌణహేతువు)

కావున కొన్ని 'కా' లు 'వీ'. ఇది క్రమమయిన సిద్ధాంతము నిచ్చును. కావున 'య ల ల' అనునది మన కక్కఱకు వచ్చు త్రిపాది.

౪ — నాలుగవజత 'య వ'

య - అన్ని 'మా' లు 'వీ' (ముఖ్యహేతువు)

వ - కొన్ని 'కా' లు 'మా' కావు (గౌణహేతువు)

రెండవజతవలెనే యీ జతవలనఁగూడ సుసిద్ధాంతప్రాప్తి కాఁజాలదు. రెండవజతవిషయ మయిన కారణము లిచ్చటను వర్తించును.

౫ — అయిదవజత 'ర య'

ర - ఏ 'మా' యు 'వీ' కాదు (ముఖ్యహేతువు)

య - అన్ని 'కా' లు 'మా' (ముఖ్యహేతువు)

ర - కావున ఏ 'కా' యు 'వీ' కాదు (సిద్ధాంతము)

వ - లేక కొన్ని 'కా' లు 'వీ' కావు (సిద్ధాంతము)

రెండవసిద్ధాంతము బలహీనసిద్ధాంతము. ఈ సిద్ధాంతము మొదటి సిద్ధాంతమునం దిమిడియున్నది. కావున మొదటి సిద్ధాంతమునే గ్రహింపవలయును. ఇట్లీ శ్రేణిలోఁ బనికివచ్చెడి మూఁడవ త్రిపాది 'ర య ర'

౬ — ఆఱవ జత 'ర ల'

ర - ఏ 'మా' యు 'వీ' కాదు (ముఖ్యహేతువు)

ల - కొన్ని 'కా' లు 'మా' (గౌణహేతువు)

వ - కొన్ని 'కా' లు 'వీ' కావు (సిద్ధాంతము)

ఇది యీ శ్రేణిలోఁ బనికివచ్చెడి నాలుగవత్రిపాది 'ర ల వ'

౭ — ఏడవజత 'ల య'

ల - కొన్ని 'మా' లు 'వీ' (ముఖ్యహేతువు)

య - అన్ని 'కా' లు 'మా' (గౌణహేతువు)

ఇందలి మధ్యవర్తిపదమునకు వ్యాప్తి లేమిచే నిం దుండి సుసిద్ధాంత మేమియు వెడలనేరదు.

౮ — ఎనిమిదవజత 'వ య'

వ - కొన్ని 'మా' లు 'వీ' కావు (ముఖ్యహేతువు)

య - అన్ని 'కా' లు 'మా' (గౌణహేతువు)

పైకారణముచేతనే యిందుండి సుసిద్ధాంతము వెడలనేరదు.

ఇట్లు మొదటిశ్రేణిలోఁ బనికివచ్చెడి త్రిపాదులు నాలుగు. పనికివచ్చెడి త్రిపాదులకు నైయాయికులు సుతర్కములు (సున్యాయములు - Valid moods) అని పేరు పెట్టిరి.

ప్రథమశ్రేణిలోని సుతర్కములు

య య య, ర య ర, య ల ల, ర ల వ.

మిగిలిన మూఁడు శ్రేణులలోను బెట్టి ఈ యెనిమిదిజతలను పైవిధమున విమర్శించి చూడఁగా, నీ క్రింది సుతర్కములు తేలుచున్నవి :—

రెండవశ్రేణి

ర య ర, య ర ర, ర ల వ, య వ వ.

మూఁడవశ్రేణి

య య ల, ల య ల, య ల ల, ర య వ, వ య వ, ర ల వ.

నాలుగవశ్రేణి

య య ల, య ర ర, ల య ల, ర య వ, ర ల వ.

పైని వర్ణింపఁబడిన నాలుగుశ్రేణులలో మొదటిశ్రేణి సత్యనిర్ణయమునకు నుత్తమ మైన దని దానికి పరిపూర్ణశ్రేణి యన్న పేరు వచ్చెను. ఇతరశ్రేణులలోనితర్కములను (న్యాయములను) తార్కికులు వాక్యవిపర్యయము ననుసరించి మొదటిశ్రేణిలోని తర్కముగా మార్చి వాని యోగ్యతను కనుఁగొనియెదరు.

మొదటిశ్రేణిలోని 'య య య' అను తర్కము నిత్యవ్యవహారమునందును, శాస్త్రశోధనయందును మిక్కిలి యుపయోగకరము. వ్యాకరణనియమములఁబట్టి యొకానొకపదము తప్పొయొప్పొ యని కనుఁగొనునప్పుడును, వైద్యులు ఒకానొకరోగమును దాని లక్షణమునుబట్టి నిర్ణయించునప్పుడును, న్యాయసభలలో వాదవిషయము చట్టమునకు లోఁబడినదా కాదా యని వాదించునపుడును, రేఖాగణితమునం దొకసిద్ధాంతమునుబట్టి మఱియొక సిద్ధాంతమును సాధించునపుడును జను లీతర్కమునే యుపయోగించుకొందురు.

హేత్వాభాసములు :— తర్కములోఁ దాను పొరపాటుపడకుండుటయు, నెదుటివాఁడు చేయు పొరపాటులను కనుఁగొనుటయు న్యాయశాస్త్రము నేర్చుకొనినందులకుఁ బరమప్రయోజనము. కావున

sampath_Ebooks

మన న్యాయశాస్త్రమునందువలెనె పాశ్చాత్యన్యాయశాస్త్రమునందును హేత్వాభాసములను వివరించెదరు. హేత్వాభాస మనఁగా తప్పువాద మన్నమాట. పాశ్చాత్యశాస్త్రానుసారము హేత్వాభాసములు (Fallacies) రెండువిధములు: తర్కహేత్వాభాసములు (Logical fallacies), వస్తుహేత్వాభాసములు (Material fallacies). తర్కహేత్వాభాసములను చర్చించుటప్పుడు అందలి వాక్యముల స్వరూపజ్ఞానము చాలును. అందుఁ జర్చింపఁబడిన విషయముయొక్క జ్ఞానముతోఁ బనిలేదు. వస్తుహేత్వాభాసములఁ గనుఁగొనుటకు విషయజ్ఞాన మావశ్యకము. తర్కహేత్వాభాసములు మరల రెండువిధములు: కేవల తర్కహేత్వాభాసములు (Purely logical), అర్ధతర్కహేత్వాభాసములు (Semi logical). కేవల తర్కహేత్వాభాసములు నాలుగు.

౧. పదచతుష్టయ హేత్వాభాసము (Fallacy of four terms):— త్రిపాది (Syllogism) యందు నాలుగుపదములున్న నీ హేత్వాభాసము కలుగును. త్రిపాదియందు పక్ష (Minor), సాధ్య (Major), లింగము (Middle)లను మూఁడుపదములే (Terms) ఉండవలెను. అంతకంటె నెక్కు వుండఁగూడ దను నియమ మిదివఱకుఁ జెప్పఁబడినది. దానికి భంగము కలిగినందున ఈ హేత్వాభాసము తటస్థించును. ఉదాహరణము:

ధూమ మున్నచోట అగ్ని యుండును
పర్వతముమీఁద నరణ్య మున్నది
కావున, పర్వతముమీఁద నగ్ని గలదు

అనునది హేత్వాభాసము. ఏల? ఇందు నాలుగుపదములు వచ్చినవి. 'ధూమము', 'అగ్ని', 'పర్వతము', 'అరణ్యము' గనుక.

౨. అవ్యాప్యహేత్వాభాసము (Fallacy of undistributed middle):— త్రిపాదియందలి హేతుపదము (Middle term) నకు పూర్తియైనవ్యాప్తి ఒక్కవాక్యమునందైనను ఉండవలెనని చెప్పియున్నాము. అట్లు వ్యాప్తిలేని హేతువును తర్కమునందు నుపయోగించినయెడల ఈ హేత్వాభాస మగును. ఉదాహరణము:

వైష్ణవు లందఱును హిందువులు
శైవు లందఱును హిందులు
కావున, వైష్ణవు లందఱును శైవులు

ఇది హేత్వాభాసము, ఎందులకు? ఇందలి హేతుపదము 'హిందువులు'. అది మొదటి రెండు హేతువాక్యములలోను సర్వదేశీయవాక్యముల విధేయముగ నుండుటచే దానికి వ్యాప్తి లేదు. ఇట్లు వ్యాప్తి లేని మధ్యపదము (హేతుపదము) ఉపయోగింపఁబడుటచే తర్కము తప్పినది. వాదవివాదములందు ఈ హేత్వాభాసము విశేషముగ వచ్చుచుండును.

౩. అక్రమవ్యాప్తి హేత్వాభాసము (Fallacy Illicit process of the major or minor term):— 'పక్షము' (Minor term)నకుఁ గాని, సాధ్యము (Major term)నకుఁ గాని, హేతువాక్యములలో వ్యాప్తి లేనప్పుడు సిద్ధాంతవాక్యమునందు వ్యాప్తి కల్పించుటవలన ఈ దోషము సంభవించును. ఉదాహరణము:

| | |
|---|---|
| రాజు లందఱును మానవులు | (ముఖ్యహేతువు) |
| ప్రజలు రాజులు కారు | (గౌణహేతువు) |
| కావున ప్రజలు మానవులు కారు | (సిద్ధాంతము) |

ఈ త్రిపాదియందు 'మానవులు' అనునది సాధ్యము. సిద్ధాంతవాక్యమునందు దీనికి వ్యాప్తి యున్నది. కాని ముఖ్యహేతువాక్యమునందు దీనికి వ్యాప్తి లేదు. కావున నిది తప్పుసిద్ధాంతము. మానవవర్గము మిక్కిలి పెద్దది. అందు నొకవైపు రాజవర్గమును, మఱియొకవైపు ప్రజావర్గమును ఒకరిని ఒకరు తగులక యుండవచ్చును. కావున నిద్దఱును మానవులే.

౪. అభావహేత్వాభాసము (Fallacy of negative premises):— హేతువులలో నొక్కటి యభావవాక్య మయినచో సిద్ధాంతముకూడ నభావవాక్యముగనే యుండును. రెండు హేతువాక్యములును అభావరూపముగ నున్న సిద్ధాంత మేదియు తేలనేరదు అని యిదివఱకుఁ జెప్పియున్నాము. ఈ నియమములను ఉల్లంఘించిన యెడల ఈదోషము వచ్చును. ఉదాహరణము:

హిందువులు క్రైస్తవులు కారు
మహమ్మదీయులు క్రైస్తవులు కారు
కావున హిందువులు మహమ్మదీయులు

ఇందలి హేత్వాభాసము స్పష్టము. రెండుహేతువాక్యములు అభావరూపము లయినందున దానివలన హిందువులకును మహమ్మదీయులకును గల సంబంధము బోధపడనేరదు.

అర్ధతర్కహేత్వాభాసములు ఆఱువిధములు:—

౧. పదార్థసంశయహేత్వాభాసము (Fallacy of equivocation):— ఒకపదము నానార్థములందు నుపయోగించినందున ఈ దోషము సంభవించును. ఒకపదము రెండర్థములందుఁ దర్కమునఁ గానవచ్చిన నది రెండుపదము లనియే యర్థము. ఇట్టిది పదచతుష్టయహేత్వాభాసముయొక్క రూపాంతరము. ఉదాహరణము:

మనుష్యుని జంపినవాఁడు దండనార్హుఁడు
ఉరిశిక్షవిధించిన న్యాయాధీశుఁడు మనుష్యుని జంపినవాఁడు
కావున, ఉరిశిక్షవిధించిన న్యాయాధీశుఁడు దండనార్హుఁడు

ఈతర్కమునందు 'మనుష్యుని జంపినవాఁడు' అనుపదము మొదటివాక్యమునందు నొకయర్థమందును, రెండవవాక్యమునందు మఱియొకయర్థమునందును వాడఁబడినది. మొదటివాక్యమునందు దానికి 'అన్యాయముగను అధికారము లేకుండగను మనుష్యుని జంపినవాఁడు'

sampath_Ebooks

అని యర్థము. రెండవ వాక్యమునందు అట్టియర్థము లేదు. ఇట్లు రెండర్థములు హేతువునకుఁ గలుగవచ్చును. సాధ్యమునకుఁ గలుగ వచ్చును. సాధారణముగ ఈ హేత్వాభాసము మతసంబంధమైన చర్చలలోను, కోర్టు తగాదాలలోను వచ్చుచుండును.

౨. వాక్యార్థసంశయ హేత్వాభాసము (Fallacy of amphibology):— అన్వయమునందు సంశయము గలవాక్యము త్రిపాదియందు నుండెనేని యీదోషము సంభవించును. ఒకానొక వాక్యమునందు కర్తృపద మేద్ది, విధాయకపద మేద్ది యని సంశయము కలుగునట్టుగ వాక్య ముండఁగూడదు.

౩. సంయోగహేత్వాభాసము (Fallacy of composition):— పదాంతర్గతములైన యొక్కొక్క వ్యక్తినిగూర్చి మొదటఁ జెప్పి, మరల నాసిద్ధాంతమా వ్యక్తుల కన్నిటికిని గలిపి చెప్పుటవలన ఈ దోషము ప్రాప్తించును. 'ఈ యింటివాసము లన్నియుఁ బది యడుగులపొడవుగలవి' యన్న వాక్యమునకు సాధారణముగ, 'ఈ యింటిలోని ప్రతివాసము పదియడుగుల పొడవుగలది' యని యర్థము. మొదట నీయర్థమునందా వాక్య ముచ్చరించి, పిదప 'ఈ యింటిలోని వాసము లన్నియుఁ గలిసి పదియడుగులపొడవు' యని యర్థము చేసిన యెడలఁ దప్పుసిద్ధాంతము తప్పిపోవును.

౪. విభాగహేత్వాభాసము (Fallacy of Division):— సంయోగహేత్వాభాసమునకు నిది తలక్రిందు. మొదట నొకానొక పదమునకు నంతటి యన్నివ్యక్తులసమూహ మని యర్థము చెప్పి పిదప నాపద మొక్కొక్కవ్యక్తికి సంబంధించిన దని యర్థము చేయుటవలన నీదోషము సంభవించును.

౫. కాకుహేత్వాభాసము (Fallcy of accent):— మాటలాడువారి యుచ్చారణభేదమునుబట్టి వాక్యమునకు అర్థము ప్రాప్తించును. అట్లొకప్పుడొక యర్థము, మఱియొకప్పుడు మఱియొక యర్థము చేసినయెడల ఈ దోషము సంభవించును. 'పెద్దలతోడ నబద్ధ మాడఁగూడదు' అన్న వాక్యమునందలి 'పెద్దలతోడ' అనుపద మును ఒత్తి యుచ్చరించినయెడల దానికి 'పెద్దలు కానివారితో నబద్ధ మాడవచ్చు' నని తాత్పర్యము కావచ్చును.

౬. ఆలంకారిక హేత్వాభాసములు (Fallacies of figure of speech):— కావ్యాదులయందు నతిశయోక్త్యాదులకుఁ జెప్పఁబడు హేతువులలో ననేకములు హేత్వాభాసములు.

వస్తుహేత్వాభాసములు (Material fallacies) ఏడు విధములు:—

(౧) ఉపాధిసహిత హేత్వాభాసము (The fallacy of accident).

(౨) ఉపాధిరహితహేత్వాభాసము (The Converse fallacy of accident).

ఈ రెండు హేత్వాభాసములును సంబంధము కలవిగాన కలిపి చెప్పఁబడును. మొదటిదానిలో సామాన్య నియమమునుండి విశేష నియమము సంబంధము లేనియుపాధితోఁగూడ సాధింపఁబడును. రెండవదానిలో దానికి వ్యతిరేకముగ వ్యాపారము జరగును.

ఉదాహరణము:

నిన్న తెచ్చిన వస్తువు లన్నియు నేఁడు తిన్నావు
నిన్న పచ్చికూరలు తెచ్చినావు
కావున నేఁడు పచ్చికూరలు తిన్నావు

ఈ యుదాహరణమునందు 'పచ్చి' యను నుపాధి నిమిత్త మాత్రము. దానితో తర్కమునకు సంబంధము లేదు. హేతువాక్య ములోని 'తెచ్చినవస్తువు లన్నియు' అనుటలో 'పచ్చివి' యన్న యర్థము లేదు.

ప్రతిమానవుఁడును తనమతమును అభివృద్ధి చేయవలెను
మాజిస్ట్రేటు మానవుఁడు
కావున మాజిస్ట్రేటు తన యధికారము నుపయోగపఱచి తన
  మతమును అభివృద్ధి చేయవలెను

అనునది హేత్వాభాసము. మాజిస్ట్రేటు మనుష్యుఁడైనను న్యాయము చేయుటకు నొకయధికారము ఉపాధిగాఁ గలవాఁడు. ఆ యుపాధిసహితుని ఉపాధిరహితునిగా నెంచఁగూడదు.

అన్యుని కత్తితోఁ గోసినవానిని శిక్షింపవలెను
డాక్టరు అన్యుని కత్తితోఁ గోయును
కావున డాక్టరును శిక్షింపవలెను

అనునదియు నిట్టి హేత్వాభాసమే.

౩. అసంబద్ధహేత్వాభాసము (Irrelevent conclusion):— ప్రతిజ్ఞతో (తాను ఋజువు చేయఁబోవుదానితో) సంబంధము లేని హేతువులను చెప్పుటవలన నీ దోషము సంభవించును. ఇట్టి దోషము పెద్దపెద్ద వాదవివాదములలో, వాదిప్రతివాదులు దీర్ఘకాలము వాదించి, తుదకు తాము దేనినిగూర్చి వాదించుచున్నారో దానిని మఱచియో, తప్పించియో, మఱియొకదానిని ప్రతిపాదించునపుడు సంభవించును. బలములేని దావాలో వాదించుప్లీడర్లకు నిది యాధారము. 'మంచికేసు కానియెడల నెదుటిప్లీడరును తిట్టు' అని యింగ్లీషులో సామెత కలదు. అది దీని కుదాహరణము. వాదములో గెలువలేక ప్రతిపక్షుని, వానితండ్రిని తిట్టుట యీ హేత్వాభాసముయొక్క యుదాహరణమే.

౪. అన్యోన్యాశ్రయ హేత్వాభాసము (Petitio Principii):— ఋజువు చేయవలసినసిద్ధాంతమునే హేతువుగా గ్రహించుట. మొదటిదానికి రెండవది హేతువుగఁ జెప్పి, మరల రెండవ దానికి మొదటిది హేతువుగఁ జెప్పినను ఈదోష మగును. 'ఆత్మ శాశ్వతము, వినాశము లేని దగుటచే' అన్నది యిందుల కుదారణము.

sampath_Ebooks

Ratiocination—తర్కము, అనుమానము
Sorites—న్యాయావలి
Sub-altern—అభాసవైరి
Sub-alternation—అభాసవైరము
Sub-contrariety—కించిద్వైరము
Subject—కర్తృపదము
Syllogism—న్యాయము, త్రిపాది, తర్కము, అనుమానవాక్యము, త్ర్యవయవి
Term—పదము
Universal proposition—సార్వదేశిక, సర్వవ్యాపి, సర్వగత, సార్వలౌకిక (వాక్యము)

**అనుము** (Dolichos Lablab) — చిక్కుడుకుటుంబములోఁ జేరిన యొకజాతిమొక్క; ఫలవర్గములోనిది. మొదటఁ గొంతవఱకు నిటారుగ నెదిగి పిమ్మట తీగగ సాగును. ఆకులు చిక్కుడాకులవలెనే 3 ఉపదళములు గలిగియుండును. కాయలును గొంచె మించుమించుగ చిక్కుడుకాయలనే పోలియుండును.

అనుము ఇండియాదేశమందంతటను సాగు చేయఁబడుచున్నది. పెక్కుచోట్ల వన్యస్థితియందును గానవచ్చుచున్నది. హిమాలయములపై నేడువేలయడుగుల ఎత్తువఱకు నిది పెరుగుచున్నది. ఇండియాదేశమే యీ మొక్కకు ఆదిస్థానమని యూహింపఁబడుచున్నది. మూఁడువేల సంవత్సరములకుఁ బూర్వమే జనులు దీని నెఱిఁగి సాగు చేయుచుండినట్లు చరిత్రకారు లూహించుచున్నారు. ఇండియానుండియే యిది చీనా, ఈజిప్టు, పెర్షియా మొదలగుదేశములను వ్యాపించియుండును.

ఇండియాదేశమున దీనిసాగు మధ్యము, పశ్చిమ, దక్షిణభాగములందు మెండు. ఉత్తరహిందూస్థానమునఁ దక్కువ. చెన్నపురి రాజధానిలో బళ్లారి, కడప, కోయంబత్తూరు, సేలము, దక్షిణార్కాడు, తంజావూరు జిల్లాలీ సస్యము సాగుచేయఁబడు ప్రదేశములలో ముఖ్యములు.

అనుములోఁ బెక్కురకములు గలవు. గింజలవర్ణమునుబట్టి వీనిని తెలుపు, ఎఱుపు, నలుపు తరగతులుగ విభాగింపవచ్చును. బొంబాయి రాజధానిలోను, కొన్ని యితర ప్రదేశములందును తోఁటపైరుగ సాగుచేయఁబడు రకములును, మెట్టసస్యముగ సాగుచేయఁబడు రకములును వేర్వేఱుగ పరిగణింపఁబడుచున్నవి.

అనుము తొలకరిలో చోడి, కంది, ఆముదములు మొదలగు సస్యములలోఁ గలిపి సాగు చేయుట వాడుక. సెప్టెంబరు, అక్టోబరు నెలలలో పునాసపంట కోఁతలకు పిమ్మట దీనిని సాగుచేయుటయుఁ గలదు. డిసెంబరునెలలలో వరి కోసినపిమ్మట జనవరినెలలో దీనిని సాగు చేయుదురు.

అనుమునకు బంకగరుములును, గరుములును అనుకూలములు. నేలను 3, ౪ చాళ్లు దున్ని నాఁగటిచాలులో విత్తులను అడుగున కొకటిచొప్పున వేసి కప్పవలెను. ప్రత్యేకముగఁ జల్లునెడల ఎకరమునకు ౧౬-౨౦ సేర్ల విత్తులు పట్టును. ౫, ౬ నెలలలో పంట పూర్తియగును. సామాన్యముగ ౪౦-౬౦ కుంచముల యనుములును అరబండి బొత్తును అగును.

అనుపచేని కొకవిధమగు పేను తెగులు పట్టుచుండును. గొంగళిపురుగులును ఒక్కొక్కప్పుడు నష్టమును గలిగించుచుండును. ఇతర పయిరసస్యములకు వలెనే దీనికిని పూఁతకాలమున మబ్బులును, తేమగాలియుఁ బ్రతికూలము. అనుములు మనుష్యులకును, పశువులకునుగూడ ఆహారముగ నుపయోగించును. పొతాళించిన యనుములు చాలచోట్ల అంగళ్ళలో విక్రయింపఁబడుచుండును. పచ్చికాయలలోని గింజలు కూరలలో నుపయోగింతురు. అనుపనుగ్గు పశువులకు మంచిదాణా. అనుపబొత్తు పశువులకుఁ బ్రియము.

అనుముల యొక్కయు, అనుపబొత్తుయొక్కయు పృథక్కరణ మీక్రింద వివరింపఁబడును.

| | అనుములు | అనుపబొత్తు |
|---|---|---|
| తేమ | ౯.౫౯ | ౯.౯౨ |
| ఆల్బుమినములు | ౨౧.౩౫ | ౧౩.౩౮ |
| కార్బోజనితములు | ౫౨.౨౩ | ౪౩.౦౩ |
| చమురు | ౧.౨౫ | ౩.౮౨ |
| నారపదార్థము | ౬.౫౮ | ౧౬.౧౮ |
| బూడిద | ౪.౦౧ | ౧౩.౪౭ |

అనుము పశువుల మేఁతకొఱకుఁ బ్రత్యేకముగఁ బెంచఁదగిన సస్యములలో నొకటి. పచ్చిమేఁతవునకును దీనిరొట్ట ప్రశస్తము. ఇందు నూటికి ౦.౮౫ పాలు నత్రజనియు, ౦.౧౬ పాలు స్ఫురత్వంచామ్లజనిదమును, ౦.౫౬ పాలు పొటాషును గలవని లెక్కవేయఁబడెను.

అనుములు నలుగఁగొట్టి నీటిలో నానవేసినయెడల నొక్కొక్కప్పుడు ఉదజనయానికామ్లము (Hydrocyanic acid) అను విషద్రవ్యము జనించు నని డాక్టరు విదరుగారు కనుఁగొనిరి.

(గో. జో.)

**అనుమునిలంక** — పశ్చిమగోదావరిజిల్లా, తాడేపల్లిగూడెంతాలూకాయందలి జమీన్దారీగ్రామము. జనసంఖ్య ౧,౪౦౯ (౧౯౩౧).

**అనుములుకొండ** — నెల్లూరుజిల్లా, కనిగిరితాలూకాయందలి జమీన్దారీగ్రామము. జనసంఖ్య ౨౦ (౧౯౩౧).

**అనుయసంగీతవిలాసము** — భావభట్టకృతమగు సంగీతశాస్త్రగ్రంథము : సంస్కృతము.

sampath_Ebooks



**అనుయాయి** — ధృతరాష్ట్రుని నూర్గురు పుత్రులలో నొక్కఁడు.

**అనురాజి** (అనుజారీ) — లెబానన్ దేశమునందలి యనాగరకజాతి. వీ రించుమించుగ ౨౦,౦౦౦ మంది యున్నారు. వీరిలో నొకశాఖవారిని శంసీ లందురు. వీరు 'శంస్'ను (శంస్ అనఁగా సూర్యుఁడు) బూజింతురు. దీనినిబట్టి వీరు ఈరాన్ దేశమునందలి మాగధర్మమునుండి సూర్యోపాసనము గ్రహించిరని తెలియుచున్నది. ఉత్తరమున తర్తోసావఱకు వ్యాపించియున్న సముద్రతీరమునమాత్రమే వీరు నివసించుచుందురు. దీనికి తూర్పుప్రక్కన అనుజారికొండ యున్నది. దీనినుండియే వీరికి అనుజారీ లను పేరు వచ్చినది. 'అనురాజీ' యనుపదము 'అనుజారీ'కి అపభ్రంశమే యైయుండవచ్చును. ఖెల్వాయీ, శంసాయీ, మేఖలాబాయీ యని వీరికి మఱి మూఁడు పేర్లు కలవు.

అనురాజీలకు రాజు లేఁడు. సేనాపతులకు సైత మెవ్వరికిని లోఁబడి యుండలేరు. తమలో పరస్పరవిరోధములు వచ్చినఁ దామే వాటిని పరిష్కరించుకొందురు.

**అనురుద్ధుఁడు** — పాళీభాషలో గ్రంథములు రచియించిన బౌద్ధపండితుఁడు. ఇతఁడు కాంచీపురమున జన్మించి తన జీవితములో ప్రాథమికభాగమును బౌద్ధభిక్షువుగ నచ్చటనే గడపెనని 'సద్ధమ్మసంగహము', 'పరమత్థవినిచ్ఛయము' అను గ్రంథములవలనఁ దెలియుచున్నది. క్రమక్రమముగ నితఁడు 'సంఘ' నాయకుఁ డయ్యెను. అటుతరువాత బౌద్ధమతవ్యాపనమునకై తిరునెల్వేలి, తంజావూరులకు పోయి యచ్చటఁ గొంతకాల ముండెను. అటుపిమ్మట నితఁడు సింహళమునకుఁ బోయి అచ్చటి 'ఉత్తరమూల సంఘారామము' నందలి స్థవిరులలో నొక్కఁడుగఁ జేరెను. అనురుద్ధశతక మను గ్రంథ మీతనిని 'ఉపస్థవిరు'నిగఁ బేర్కొనుచున్నది కాని 'సద్ధమ్మసంగహము' నందును, మఱియితర గ్రంథములందును ఇతఁడు 'థేరుఁ' ('స్థవిరుఁ') డనియే పేర్కొనఁబడియున్నాఁడు.

ఈతఁడు పాళీభాషలో 'అభిధమ్మత్థసంగహము', 'పరమత్థవినిచ్ఛయము', 'నామరూపపరిచ్ఛేదము' అను గ్రంథములను రచియించెను. బౌద్ధమతమునకు సంబంధించిన 'అనురుద్ధశతకము' అను సంస్కృతగ్రంథముకూడ ఈతఁడు రచియించినదే యని చెప్పుదురు. వీనిలో 'అభిధమ్మత్థసంగహము'ను లండను 'పాలీ టెక్స్టు సొసయిటీ' వారును, శతకమును కలకత్తా 'బుద్ధిస్టిక్ టెక్స్టు సొసయిటీ' వారును ప్రకటించియున్నారు.

ఉత్తరమూలసంఘారామము క్రీస్తుశకము పదునొకండవ శతాబ్దికడపటిభాగమున నేర్పడిన దగుటచే ఆసంఘారామమునకు సంబంధించిన అనురుద్ధుఁడుకూడ క్రీస్తుశకము పదునొకండవ శతాబ్దితరువాత జీవించియుండు నని యూహింపఁదగును.

**అనుల** — ౧. సింహళదేశపు రాజైన మహానాగుని భార్య. మహానాగుఁ డశోకచక్రవర్తికి సమకాలీనుఁ డని చెప్పెదరు. సింహళమున బౌద్ధధర్మమును వ్యాపింపఁజేయుటకు నీమె పాటుపడెను. ఈమెకు బౌద్ధమతజ్ఞాన మధికముగ నుండెను. ఈమె ఆఁడుబిడ్డ పేరు సంఘమిత్ర. ఈమెకు బౌద్ధమతమునందుఁ గల విశేషజ్ఞానమును బట్టి సంఘమిత్ర యీమెను 'ఆచార్య' యని పిలుచుచుండెను.

౨. సింహళపతియైన చోరనాగరాజు భార్య. దురాచరణము కలది. తన పతి యగు చోరనాగుని, పుత్రుఁ డగు తిష్యుని, నలుగురు ఉపపతులను విషము పెట్టి చంపెను. ఈమె రాజ్యము చేయుచుండఁగ నీమె మఱఁది కుమారుఁ డైన కాలకంతిష్యుఁ డనువాఁడు తిరుగఁబడి యీమెను చంపి రాజయ్యెను (క్రీ. పూ. ౪౧).

**అనులు** — వేదకాలమందు పరుష్ణీ నదీతటమున నున్న జనులకుఁ బేరు.

**అనులోమము** (అనులోమ వివాహము) — ఎక్కువజాతిపురుషులు తక్కువజాతిస్త్రీలను వివాహమాడిన నది అనులోమవివాహ మనిపించుకొనును. బ్రాహ్మణుఁడు క్షత్రియ వైశ్య శూద్రస్త్రీలను, క్షత్రియుఁడు వైశ్య శూద్రస్త్రీలను, వైశ్యుఁడు శూద్రస్త్రీని వివాహమాడిన 'అనులోమవివాహ' మగును. దీనికి విరోధశబ్దము 'ప్రతిలోమవివాహ' మనునది. తక్కువజాతిపురుషులు ఎక్కువజాతిస్త్రీలను పెండ్లి చేసికొనుట ప్రతిలోమము. హిందూధర్మశాస్త్రమతమున ప్రతిలోమవివాహములు ఎల్లప్పుడును గర్హితములు. అనులోమవివాహములు పూర్వయుగములయందుఁ జెల్లినవి. కాని కలియుగమునందు నవియు నిషిద్ధములే. ఇప్పటి దినములలో నున్న ఆచారముప్రకారమును, కోర్టువారిచే నొప్పుకొనఁబడిన 'హిందూ లా' ప్రకారమును అనులోమ, ప్రతిలోమ వివాహము లన్నియు నిషిద్ధములే. ఆచారము ననుసరించి యేజాతివా రాజాతిలోనే వివాహము చేసికొనవలెను. అట్లు చేసికొనక మఱియొకజాతితో సంబంధము కలుపఁజేసికొన్నయెడల నా వివాహము చెల్లదు; అనఁగా వ్యవహారము కోర్టునకు వచ్చినప్పుడు, కోర్టువా రట్టివివాహితస్త్రీని దాసిగను, దానిసంతతిని దాసీపుత్రులుగను భావించెదరు.

ఇట్లు సామాన్యముగ అనులోమ, ప్రతిలోమవివాహము లిప్పుడు లేకపోయినను, ఒకవిధమైన యనులోమపద్ధతి యిప్పటికిని హిందూదేశమునం దున్నది. బంగాళదేశమునందు బ్రాహ్మణులలో కులీనులు, శ్రోత్రియులు మొదలయిన భేదములు కలవు. వారిలో కులీనులు అందఱికంటె నెక్కువవార మని చెప్పుకొనియెదరు. వీరు తమకంటెఁ దక్కువవారగు బ్రాహ్మణులయింటి ఆఁడుపిల్లలను చేసికొందురు. తమ ఆఁడుపిల్లలను వారి కీయరు. అట్లే మనదేశమందు మధ్వులు, లింగధారు లయిన ఆరాధ్యులు, తా మితరబ్రాహ్మణులకంటె నెక్కువవార మని కాఁబోలు, స్మార్తబ్రాహ్మణులయింటి యాఁడుపడుచులను వివాహమాడెదరు. కాని తమ యాఁడుపడుచులను స్మార్తుల కీయరు. కావున

sampath_Ebooks

నిది వారివారిస్వాతిశయభావములవలన నేర్పడిన యొకవిధమైన అనులోమవివాహవిధానము !

వేఱువేఱుజాతులవారిలో నిచ్చి పుచ్చుకొనుట నిషిద్ధమైనను, ఒక్కజాతిలోనే పెక్కుశాఖ లున్నచో, సాధారణముగ నేశాఖవా రాశాఖలోనే సంబంధములు చేసికొన్నను, ఆవశ్యకతనుబట్టి యొకశాఖవారు మఱియొక శాఖవారితో సంబంధబాంధవ్యము చేసికొను నాచారము హిందూదేశమునందుఁ గలదు. బ్రాహ్మణులలో ఋగ్వేదులకు యజుర్వేదులకు సంబంధము లవిచ్ఛిన్నముగ నీమండలములందు (ఆంధ్రదేశమునందుఁగూడ) జరుగుచున్నవి. వెలనాటివారికి తెలగాణ్యులకుఁగూడ పెక్కుచోట్ల ఆక్షేపణము లేకుండ వివాహము లగుచున్నవి. మహారాష్ట్రబ్రాహ్మణులకును ఆంధ్రవైదిక బ్రాహ్మణులకును చాందా నాగపురమువైపున బంధుత్వము కలియుచున్నది. సప్తగోదావర్యంతర్గతమైన ముంగొండ అగ్రహారమునుండి వెడలిపోయిన వేగినాటి యాంధ్రబ్రాహ్మణుల పెక్కుకుటుంబములు కాశియందును, మధ్యపరగణాలలో బ్రహ్మణీ యను గ్రామమునందును నివసించియున్నారు. వీరందఱును మహారాష్ట్రులతో సంబంధము చేసికొనుచు, కాలక్రమ మాంధ్రము మఱచి, మహారాష్ట్రవేషభాషలతో సంచరించుచున్నారు. కాశిలో విద్వత్సింహమని ఖ్యాతిఁగాంచి నాలుగుకాలము క్రిందనే కీర్తిశేషులైన మహామహోపాధ్యాయ గంగాధరశాస్త్రిగా రిట్టి యాంధ్రులే. మనదేశమునం దాఱువేలనియోగులకు, పాకనాటినియోగులకు, మధ్వులకు, గోలకొండవ్యాపారులకు, ఆరాధ్యులకు నప్పుడప్పుడు, అప్పుడప్పుడు బాంధవ్యము కలియుచునేయున్నది. నియోగివైదికుల కంతగాఁ గలియుట లేదు; గాని, అట్టి సంబంధములును బొత్తిగా లేవని చెప్పుటకు వీలు లేదు. అట్లే రాజులు, వెలమలు, కమ్మలు, రెడ్లు, తెలగాలు మొదలయిన జాతులలోని యుపశాఖలలో నప్పుడప్పుడు వివాహములు జరుగుచునేయున్నవి. కావున నుపశాఖలలో వివాహములు జరుగుటకు నాచారముయొక్క యభ్యంతర మేమియు లేదు; ధర్మశాస్త్రముయొక్క యభ్యంతర మెన్నఁడును లేదు.1 ఆయా యుపశాఖలవారికిఁ గల స్వాతిశయభావమే యిందులకు విఘ్నకారి. ఒక కేసులో క్రైస్తవమతమునుండి హిందువుగా మాఱిన శూద్రస్త్రీని ఒక శూద్రుఁడు పెండ్లిచేసికొనఁగా నది క్రమమైన వివాహ మని కోర్టువారు తీర్మానించిరి.2

## అనులోమజాతులు :

మన్వాది స్మృతికారులు వేఱువేఱు జాతుల స్త్రీపురుషుల కనులోమపద్ధతిప్రకారమును, ప్రతిలోమ పద్ధతిప్రకారమును కలిగిన సంతానము ఏజాతివా రగుదురో తెలియుటకై జాబితా లిచ్చినారు. కాని అందఱి జాబితా లొకవిధముగ లేవు. ముఖ్యముగ మనుస్మృతి ననుసరించి యొక అనులోమ, విలోమజాతులపట్టిక యీ క్రింద నీయఁబడుచున్నది. ఇందునుగూర్చి యింకను తెలిసికొనఁగోరువారు మనుస్మృతి ౧౦-వ అధ్యాయము చూడవలెను.

అనులోమజాతులు :

| | | |
|---|---|---|
| బ్రాహ్మణ | క్షత్రియ | మూర్ధాభిషిక్త |
| ,, | వైశ్య | అంబష్ఠ |
| ,, | శూద్ర | నిషాద (వీనిని పారశవుఁ డనికూడ నందురు) |
| క్షత్రియ | వైశ్య | మాహిష్య |
| క్షత్రియ | శూద్ర | ఉగ్ర |
| వైశ్య | శూద్ర | కరణ |

ప్రతిలోమజాతులు :

| | | |
|---|---|---|
| క్షత్రియ | బ్రాహ్మణ | సూత |
| వైశ్య | బ్రాహ్మణ | వైదేహ |
| శూద్ర | బ్రాహ్మణ | చండాల |
| వైశ్య | క్షత్రియ | మాగధ |
| శూద్ర | క్షత్రియ | క్షత్త |
| శూద్ర | వైశ్య | ఆయోగవ |

మిశ్రజాతులు :

| | | |
|---|---|---|
| బ్రాహ్మణ | ఉగ్ర | ఆవృత |
| ,, | ఆయోగవ | ధిగ్వణ |
| నిషాద | శూద్ర | పుక్కస |
| శూద్ర | నిషాద | కుక్కుటక |
| క్షత్త | ఉగ్ర | శ్వపాక |
| విదేహక | అంబష్ఠ | వేణ |
| దస్యు | ఆయోగవ | సైరంధ్ర |
| వైదేహ | ,, | మైత్రేయక |
| నిషాద | ఆయోగవ | మార్గవ,దాస,కైవర్త |
| ,, | వైదేహ | కారావర |
| వైదేహ | కారావర | అంధ్ర |
| వైదేహ | నిషాద | మేద |
| చండాల | వైదేహ | పాండుసోపాక |
| నిషాద | ,, | అహిండిక |
| చండాల | పుక్కస | సోపాక |
| ,, | నిషాద | అంత్యావసాయి |

1. Pandaiya Telaver. v. Puli Telaver, 1. Mad. 478.
Ramamani Ammal, v. Kulanthai, 14. Moo. I. A. 349
2. Muthuswami Mudaliar, v. Masilamani, I. L. R. 33. Mad. 342.

అనులోమవివాహమువలనఁ గలిగిన సంతతికి నొక విశేషమైన హక్కు గలదు. బ్రాహ్మణునకును, శూద్రస్త్రీకిని పుట్టినవాఁడు ఏడు తరములలో బ్రాహ్మణుఁ డగును అని మనువు ౧౦-వ అధ్యాయము నందు చెప్పియున్నాఁడు[1]; అనఁగా బ్రాహ్మణునకు శూద్రకుఁ బుట్టిన స్త్రీ మరల బ్రాహ్మణునే వివాహ మాడి, కూఁతుఁ గనును. ఆకూఁతురు గూడ మరల బ్రాహ్మణునే పెండ్లియాడి సంతానము వడయును. ఇట్లేడుతరములవఱకును జరిగినయెడల నేడవతరమునందుఁ బుట్టువాఁడు బ్రాహ్మణుఁ డగును. ఇట్లే బ్రాహ్మణునకు వైశ్యస్త్రీయందుఁ బుట్టువాఁడు అంబష్ఠుడు. వీఁడు అయిదుతరములలో బ్రాహ్మణుఁ డగును. ఇట్లు శూద్రుఁడు బ్రాహ్మణుఁ డగును, బ్రాహ్మణుఁడు శూద్రత్వమును చెందును. ఇట్లే క్షత్రియునకు వైశ్యునకును బుట్టినవారిని గుఱించి యూహింపఁగునది[2].

**అనువత్సరము** — జ్యోతిశ్శాస్త్రమునుబట్టి యైదు వత్సరములతోఁ గూడిన యుగములో నాల్గవవత్సరము అనువత్సర మనఁబడును. సావన, సౌర, చాంద్ర, నక్షత్ర మానముల ననుసరించి వత్సరము లేర్పడును. ఈ సమన్వయముచే నైదువత్సరముల యుగ మొకటి యేర్పడుచున్నది. వీనిలో మొదటిది సంవత్సరము; రెండవది పరివత్సరము; మూఁడవది ఇద్వత్సరము; నాల్గవది అనువత్సరము; ఐదవది యుగవత్సరము. అనువత్సరమున ధాన్యదానము చేసిన గొప్ప పుణ్యము లభించునఁట!

**అనువాదము** — నైయాయికులు వేదవాక్యములను మూఁడువిధములుగ విభజించిరి. విధివాక్యము, అర్థవాదవాక్యము, అనువాద వాక్యములు ('విధ్యర్థవాదానువాద వచనవినియోగాత్'– గౌతమ, ౨. ౧. ౬౩). విధి యనఁగా విధాయక మని ('విధిర్విధాయకః' ౨. ౧. ౬౪) గౌతమాచార్యులవారు న్యాయసూత్రము నందుఁ జెప్పినారు. ఇట్లు చేయవలసినది యని యాజ్ఞాపించునది విధి. 'స్వారాజ్యకామో వాజపేయేన యజేత' (స్వర్గమును గోరువాఁడు వాజపేయయజ్ఞమును జేయవలసినది) అనునది విధివాక్యము. ఒకానొకకార్యమును స్తుతించి, లేక నిందించి, భయము కలిగించి, పూర్వచరిత వర్ణించి బోధించునట్టివాక్యము అర్థవాదవాక్య మనఁబడును[3]. 'పాపకారీ పాపో భవతి' (పాపము చేయువాఁడు పాపుఁడైపోవును) అనునది అర్థవాదము. ఇందు నాజ్ఞ స్పష్టముగా నుండదు. విధివాక్యముచేఁ జెప్పఁబడినదానిని మరలఁ జెప్పుట అనువాద మనఁబడును[4]. అనువాదము రెండువిధములు: శబ్దానువాదము, అర్థానువాదము. ఇదివఱకుఁ జెప్పఁబడినమాటల మరలఁ జెప్పుట శబ్దానువాదము. ఇదివఱకుఁ దెలిసినవిషయమునే మరల నన్యపదములతోఁ జెప్పుట అర్థానువాదము. 'అనువాదే చరణానామ్' (౨. ౪. ౩) అను పాణినీయసూత్రమునకు టీక వ్రాయుచుఁ గాశికాకారుఁడు 'ప్రమాణాంతరావగతస్యార్థస్య శబ్దేన సంకీర్తనమాత్ర మనువాదః' అని వ్రాసియున్నాఁడు. వేఱుప్రమాణముచే సిద్ధించినయర్థమును (సంగతిని) శబ్దముచేఁ జెప్పుటమాత్రము అనువాద మనఁబడును. 'అగ్నిర్హిమస్య భేషజమ్' (అగ్ని చలికి మందు) అనునది యనువాదము. ఏల? ప్రత్యక్షప్రమాణముచే నీసంగతి మన మెఱుఁగుదుము. ఆజ్ఞానమును ఈవాక్య మనువదించినది.

అనువాదము మరల మూఁడువిధములు. భూతార్థానువాదము, స్తుత్యర్థానువాదము, గుణానువాదము. 'స దేవ సౌమ్యేద మగ్ర ఆసీత్' (ఓ సౌమ్య ! మొదట సత్తే ఉండెను) అనునది మొదటిదాని కుదాహరణము. 'వాయుర్వై క్షేపిష్ఠా దేవతా' (వాయువు క్షేపిష్ఠయైన దేవతసుమా) యన్నది స్తుత్యర్థానువాదము. 'దధ్నా జుహోతి' (పెరుఁగుతో హోమము చేయుచున్నాఁడు) అనునది గుణానువాదము.

వేదమును నమ్మని బౌద్ధాదిపూర్వపక్షులు వేదమునందు నుండు అనువాదవాక్యములు పిష్టపేషణన్యాయమునఁ బునరుక్తములు గనుక వేదమునకు గౌరవహాని కలుగుచున్నది యని యాక్షేపించిరి. అందులకు గౌతమాచార్యులవారు "అనువాదములు పునరుక్తములు కావు. అవే శబ్దములు మరల వచ్చినను వానికి నర్థభేద ముండును. వ్యవహారమునందు మొదట 'గచ్ఛ' (పో) అని మరల 'గచ్ఛ, గచ్ఛ' (పో, పో) అని దానినే అనువదించినప్పటికిని రెండవతడవ నుచ్చరించిన 'గచ్ఛ గచ్ఛ' పదములకు శీఘ్రముగా పొమ్మని యర్థ మగుచున్నది. అట్లే వైదికము లగు అనువాదములకును విధివాక్యములకంటె భిన్నార్థ ముండును. కావున నవి పునరుక్తములు కావు" అని గౌతముఁడు చెప్పియున్నాఁడు.

---

1. శూద్రాయాం బ్రాహ్మణా జ్జాతః శ్రేయసా చేత్ ప్రజాయతే, అశ్రేయాన్ శ్రేయసీం జాతిం గచ్ఛత్యా సప్తమా ద్యుగాత్. ౬౪.
శూద్రో బ్రాహ్మణతా మేతి బ్రాహ్మణశ్చైతి శూద్రతామ్, క్షత్రియా జ్జాత మేవం తు విద్యా ద్వైశ్యా త్తథైవచ. ౬౫.
అర్థము: శూద్రస్త్రీకి బ్రాహ్మణునివలనఁ బుట్టిన స్త్రీ బ్రాహ్మణునకే మరల సంతతి కన్నయెడల నేడవతరమున నాసంతతి శ్రేష్ఠమైన జాతిని బొందును (౬౪).

2. ఇంకను విశద మగుటకై చూడుఁడు, మాండలికసంపాదిత యాజ్ఞవల్క్యస్మృతి, పుట. ౧౪౩.

3. 'స్తుతి ర్నిందా పరకృతిః పురాకల్ప' ఇతి (అర్థవాదః)—గౌతమ, ౨. ౧. ౬౫.

4. 'విధివిహితస్యానువచన మనువాదః'– గౌత, ౨. ౧. ౬౬.

5. 'శీఘ్రతరగమనోపదేశవదభ్యాసా న్నావిశేషః'— గౌ. ౨. ౧. ౬౭.

sampath_Ebooks

దీనిమీఁద వాత్స్యాయనుఁ డిట్లు భాష్యము వ్రాసినాఁడు. "విహితమైన యర్థమును మరల నేల చెప్పవలె నన్న అధికారార్థము (చెప్పఁబోవు విషయ మిది యని తెలియుటకు), విహిత మైనదానిని నిందించుటకుఁగాని, స్తుతించుటకుఁగాని, విధిశేషముగఁ గాని చెప్పఁబడును. విహితార్థమునకుఁ దరువాత వచ్చినదియూష ననువాద మగును...లోకమునందును అనువాదము కలదు. 'వండు వండు' అని చెప్పుట కలదు. అంగులకుఁ ద్వరగ వండు మని కాని, దయచేసి వండు మని కాని (అధ్యేషణ), తప్పక వండు మని కాని (అవధారణ) అర్థ మగుచున్నది[1]".

పైని వర్ణింపఁబడిన మూఁడువిధము లైన వాక్యములలో విధి వాక్యములే ప్రమాణములు గాని మిగిలిన రెండువిధము లైన వాక్యములును ప్రమాణములు కా వని కొందఱు పూర్వపక్షము చేసెదరు.

**అనువిందుఁడు** — ౧. విందుని తమ్ముఁడు. వసుదేవుని తోఁబుట్టు వగు రాజాధిదేవికిని, ఆమె పెనిమిటి యవంతిరాజు జయసేనునకును పుట్టినవాఁడు. శ్రీకృష్ణునకు మేనత్తకుమారుఁడు. భారతయుద్ధమునందు దుర్యోధనపక్షమునఁ బోరాడి అర్జునునిచేఁ జచ్చెను.

౨. కేకయరాజుయొక్క ఇద్దఱు పుత్రులలో నొకఁడు. వీని అన్న విందుఁడు. భారతయుద్ధమునందుఁ బాండవపక్షపాతియై యుండె.

౩. ధృతరాష్ట్రుని నూర్గురు పుత్రులలో నొకఁడు.

**అనువు** — ౧. యయాతికుమారుఁడు, శర్మిష్ఠకు జన్మించినవాఁడు. తండ్రిముసలితనము దా గైకొనుటకు అనువు ఒప్పుకొనలేదు. ఈకారణమున నతనిరాజ్యాధికారము పోయెను. తరువాత నతఁడు మ్లేచ్ఛరాజ్యమున కధిపతి యయ్యెను. ఇతనికుమారులు చక్షు, పరోక్ష, సభానరులు.

౨. క్రథవంశమునకుఁ జెందిన కపోతరోమని కుమారుఁడు. అనువుకుమారుఁడు అంధకుఁడు.

**అనువైణేయము** — అయోధ్యాప్రాంతమునందలి యొక పురాతనప్రదేశము. దీనిలో మణేయ మను పట్టణ మొకటి యుండెను. బుద్ధదేవుఁ డిచటనే అనోమానదిని దాఁటి తనవెంట వచ్చిన సేవకుల వీడ్కొనె ననియు, నిచ్చటనే యాయన సన్న్యాసము గైకొనె ననియుఁ గొందఱియభిప్రాయము. ఈప్రదేశము వైణేయ నదికి దగ్గఱ నుండుటచే ననువైణేయ మనుపేరు వచ్చిన దని కొందఱును, వేణువులతో (వెదుళ్లతో) నిండియుండున దగుటచే ననువైణేయ మనుపే రొందిన దని కొందఱును దలఁచుచున్నారు.

**అనుసాల్వుఁడు** — సౌభపతి యైన సాల్వుని తమ్ముఁడు. సాల్వునిఁ గృష్ణుఁడు చంపఁగా నితఁడు కృష్ణుని నెట్లయినను జంప నిశ్చయించెను. ధర్మజుఁ డశ్వమేధముఁ జేయుసమయమునఁ గృష్ణుఁడు కుటుంబసహితముగ హస్తినాపురమునకు రాఁగా నితఁడు సేనాసమేతుఁడై వచ్చి హస్తినాపురపార్శ్వమున దాఁగియుండెను. ఒకనాఁడు కృష్ణుఁడును, పాండవులును అశ్వమును పరీక్షించుచున్న వా రని విని యాతఁ డచ్చటికి నెవ్వరికిని దెలియకుండ వచ్చి క్షణములో నశ్వమును దీసికొని పాఱిపోయెను. భీముఁడు సైన్యముతో వానిని దఱిమికొని చనియె. ప్రద్యుమ్నుఁడు, వృషకేతుఁడును వానిని బట్టి తెచ్చెద మని ప్రతిజ్ఞఁ జేసి పోయిరి. ప్రద్యుమ్నుఁ డోడెను. వృషకేతుఁ డనుసాల్వుని నోడించి, బంధించి కృష్ణునొద్దకుఁ దెచ్చెను. వాఁడు కృష్ణునకు శరణు చొచ్చి, అశ్వమేధమునకు సాయము చేయుటకు నంగీకరించి స్వనగరమునకుఁ బోయెను (జైమినీ యాశ్వమేధము., అ. ౧౨-౧౪).

**అనుష్ణ** — భారతవర్షీయ నది (భార, భీష్మ, అ. ౯).

**అనుహ్లాదుఁడు** — హిరణ్యకశిపునకు కయాధూ యను భార్యయందుఁ బుట్టిన నల్గురుపుత్రులలో నొకఁడు. ఇతని భార్య సూర్మి. బాష్కలుఁడు, మహిషుఁడు అనువారు పుత్రులు.

**అనూదరుఁడు** — ధృతరాష్ట్రుని నూర్గురు పుత్రులలో నొకఁడు.

**అనూపగడము** — రాజపుతానాలోని బికానీరుసంస్థానమందలి యొకపట్టణము. ఇందు సంస్థానాధీశ్వరుఁ డగు అనూపసింగుపేర ౧౬౭౮-వ సంవత్సరములోఁ గట్టఁబడినకోట గలదు. ఇది బికానీరు పట్టణమునకు ౮౨ మైళ్లదూరములో నున్నది. డెబ్బదియైదు గ్రామముల కిది ముఖ్యపట్టణము. ఇందలి జనసంఖ్య ౧,౦౧౩. అచ్చటిజనులు ముఖ్యముగా 'రాట్' జాతివారు. ఈ ప్రాంతమున నీరు తక్కువగా నున్నను కోఁతగడ్డి చక్కఁగఁ బెరుఁగును. సోడా ఉప్పు తయారు చేయుటకు కావలసిన 'సజ్జ, లానా' అనుచెట్లిచ్చట విశేషముగాఁ బెరుఁగును.

**అనూపదేశము** — భారతవర్షీయదేశము. దీనిరాజధాని మాహిష్మతి. ఇచ్చట సహస్రకరార్జునుఁడు రాజ్యము చేయుచుండెను. పాండవులకాలమున నిచ్చట నీలరాజు రాజ్యము చేయుచుండెను. ఇతఁడు భారతయుద్ధమునందు పాండవులకై పోరాడి చచ్చెను.

**అనూపసింగు** — ౧. (౧౬౪౦-౧౬౬౦) అమరసింగు కుమారుఁడు. ఇతఁడు సింహాసన మెక్కినప్పటికి ౬ ఏండ్ల వయసువాఁడు. ౧౬౫౦-వ సంవత్సరమున ఓర్చ్ఛారాజగు పహార్‌సింగు ఇతనిని

1. "కిమర్థం పునర్విహిత మనూద్యతే? అధికారార్థమ్. విహిత మధికృత్య స్తుతిర్బోధ్యతే, నిందా వా, విధిశేషో వాఽభిధీయతే, విహితానంతరార్థోఽపి చానువాదో భవతి...లోకేఽపి చానువాదః, పచతు పచతు భవా నిత్యభ్యాసః, క్షిప్రం పచ్యతా మితి వా, అంగ! పచ్యతా మిత్యధ్యేషణార్థమ్, పచ్యతా మేవేతి వాఽవధారణార్థమ్"

sampath_Ebooks

రాజ్యమునుండి పాఱఁద్రోలెను. అటుపై నితఁడు అడవులలో సంచరించుచు దాఁగికొనుచు, ౧౬౫౮-వ సంవత్సరమున షాజహానుచక్రవర్తి నాశ్రయించెను. చక్రవర్తి యితనిని మాళవదేశమునందలి అనూపపురమున కధికారిగ నియమించి గౌరవించెను.

౨. మధ్యభారతదేశములోని ఝాబువా (Jhabua) సంస్థానమునకు రాజగు కుషాల్‌సింగుకుమారుఁడు. చిన్నతనముననే రాజ్యమును రక్షించుటలో నితఁడు తండ్రికి విశేషముగఁ దోడుపడి తనరాజ్యపుబడికి మంచిపేరొందెను. ౧౭౩౩-౧౭౪౪ సంవత్సరములలో ఇతఁడు రాజ్యమేలెను. ౧౭౪౪-వ సంవత్సరమున నితనిని ఎవరో కుమారునితోఁ గాల్చి చంపివేసిరి. హైదరాబాదువారు ఈపనిఁ జేయించెనని చెప్పుకొందురు.

**అనూపషహర్ తాలూకా** — యునైటెడ్ ప్రావిన్సెస్సులోని 'బులంద్‌షహార్' అను జిల్లాలో గంగయొడ్డున నున్న యొకతాలూకా. ఇందు 'అనూపషహార్, అహార్, డబాయి' అను మూఁడుపరగణాలు గలవు. దీనివిస్తీర్ణము ౪౫౪ చదరపుమైళ్లు. ఈ తాలూకాలో ౩౭౭ పల్లెలును, ౪ పట్టణములును గలవు. దీనిమధ్యనుండి ఉత్తరదక్షిణముగ 'ఛోయియానది' పాఱుచున్నది.

ఈ తాలూకాలో జహాంగీరాబాద్, దబాయి, అనూపషహార్ అనునవి పెద్దపట్టణములు. రెవెన్యూఆదాయము రు. ౪,౯౯,౦౦౦ లు. సెస్సులు రు. ౮౦,౦౦౦ లు.

**అనూపషహర్** (పట్టణము) — ఈ అనూపషహార్ తాలూకాకు ముఖ్యపట్టణము. బులంద్‌షహార్‌పట్టణమున కిరువదిమైళ్ల దూరమున నున్నది. జనసంఖ్య ౮,౬౦౧. ఇది చరిత్రసంబంధమున ప్రాముఖ్యమును చెందిన పట్టణము. జహాఁగీరు ప్రభుత్వకాలమున బర్‌గూజర్ రాజయిన 'అనూప్‌రాయి' అనునతఁడు తనపేరిట నీపట్టణమును నిర్మించెను. ఢిల్లీనుండి రోహిల్‌ఖండము వెళ్లువారిచ్చటనే గంగానదిని దాఁటవలయును. కావున నట్టిరేవును స్వాధీనమునం దుంచుకొనవలయునన్న ప్రభుత్వమువారికి పదునెనిమిదవ శతాబ్ది నీపట్టణము ముఖ్యమైయుండెను.

మహారాష్ట్రులకు పరమశత్రు వయిన అహమ్మదుషా దురాణి యనువాఁడు ౧౭౫౭-వ సంవత్సరమునం దీ పట్టణమును స్కంధావారము (Contonment) గా నేర్పఱచెను. తురుష్క లందఱును చేకమై పానిపట్టుక్షేత్రమున ౧౭౬౧ లో మహారాష్ట్రుల నోడించిరి. ఆ యుద్ధప్రయత్నము లెల్ల నీపట్టణముననే చేయఁబడెను. మహారాష్ట్రులు రోహిల్‌ఖండముమీఁదికి దాడి వెడలఁగా వారిని నెదిరించు నిమిత్తమై ఔధ్‌నవాబుతోఁ గూడి బ్రిటిష్‌వారు ౧౭౭౩-వ సంవత్సరమున నీ పట్టణమును దమసైన్యములకు నివాసస్థానముగా నేర్పఱచిరి. అప్పటినుండి ౧౮౦౬ వఱకును బ్రిటిషుసైన్యము లచ్చటనే యుండెను. అవల నవి మీరటునకు మార్చఁబడినవి. ౧౮౫౭-వ సంవత్సరపు సిపాయీల తిరుగఁబాటుకాలమునందు రోహిల్‌ఖండునందలి సిపాయీలు రేవును దాటకుండ 'జాటు'వా రడ్డపడిరి. పూర్వము గంగానదిమీఁద జరగు వ్యాపారమునకు నీపట్టణము ఉత్తరపరిమితిగా నుండెను. ఈస్టుఇండియాకంపెనీవా రిచ్చట నొకగిడ్డంగిని స్థాపించియుండిరి. ఇప్పుడు వర్తక మంతగా సాగుటలేదు. శక్కర, కలప, వెదురు వ్యాపారము మాత్రము విరివిగా సాగుచున్నది. స్వల్పముగా చుట్టుపట్లగ్రామములకుఁ గావలసిన బట్టలు, సాలువలు, జోళ్లు మొదలగునవి ఇచ్చట తయారుచేయఁబడుచున్నవి.


**అనూబిస్** (Anubis) — పూర్వకాలపు ఈజిప్తుదేశీయుల దేవతలలో నొకఁడు. ఆదేశపు శిల్పములనుబట్టి యీదేవత నక్కయాకారము గలిగియుండునట్లు తెలియుచున్నది. ఈలోకమున మరణించినవారి పాపపుణ్యములు నిర్ణయించుటయు, వారి యాత్మలను పైలోకమునకుఁ గొంపోవుటయు నితనిపనియఁట!

**అనూరాధ** — మన యిరువదియేడు నక్షత్రములలో నొక నక్షత్రము. విశాఖ తరువాతిది. విశాఖవఱకు నక్షత్రములు ఉత్తరాకాశమున నగపడును. విశాఖనుండి దక్షిణాకాశమునకు మరలును. ఇక్కడ నీ నక్షత్రవీథి శాఖాంతరములఁబట్టె దక్షిణమునకు మరలి, అటుపై యామ్యదిశనే వ్యాపించుటచేత నీ నక్షత్ర మాశాఖాభేదసూచకముగా వి-శాఖ యయ్యె నని బెంట్లే (Bentley) దొరగా రూహించిరి. వేదకాలములో విశాఖకు రాధ యను పే రుండెను. 'రాధో విశాఖే' అని అథర్వవేదము (౧౯. ౭) లో స్పష్టముగా కలదు. రాధ తరువాతినక్షత్రము అనూరాధ. అనూరాధ నక్షత్రములోని చుక్కలు:— వృశ్చికరాశిలోని బీటా, డెల్టా, పై, రో నుగ్గులు గల వని పాశ్చాత్యులు. ఛత్రాకారనక్షత్రము లని వరరుచి ప్రముఖులు; అనగా గొడుగువంటి యాకారము గల చుక్కలని వర్ణించినారు. ఈ చుక్కలు వృశ్చికరాశిలో పైభాగమందు, అనఁగా తేలునకు మీఁదిడెక్క లని చెప్పఁదగినచోట నున్నవి.

అనూరాధకు అధిదేవత మిత్రుఁడు. దీని తరువాత జ్యేష్ఠకు అధిదేవత ఇంద్రుఁడు. ఋగ్వేదకాలమునాఁటి ఆర్యులకు వర్షాధిదేవతయైన ఇంద్రుఁడు చాల ముఖ్యమైన దైవము. సూర్యాస్తమయము కాఁగానే ఇంద్రదర్శనము — అనఁగా జ్యేష్ఠనక్షత్రము ఉదయించుటయు, ఇంద్రునకు ప్రతిస్పర్ధియైన మృగశిరరూపి వృత్రుఁడు చచ్చుట — అనఁగా అస్తమించుటయు వర్షాగమనసూచకములు. ఈ శుభస్థితి చేకూరుటకు ముందుగా అనూరాధ ఉదయించుటయు, ఆ పిమ్మట జ్యేష్ఠ ఉదయించుటయు జరగును; కావున అనూరాధ ఉదయ మైనవెంటనే వర్ష లాభము కలుగు నను సూచన. శుభకారకుఁ డగు స్నేహితుని రాకవలె అనూరాధయుదయము సంతోషదాయకము. కావుననే అనూరాధకు మిత్రుఁడు అధిదేవత యని వేదము తెల్పుచున్నది. ఈ మిత్రునకు వృషభరాశి ప్రతిస్పర్ధి, అనఁగా మిత్రుఁ డుదయించుసరికి వృషభరాశి అస్తమించును, అనఁగా చచ్చును. కాఁబట్టి మిత్రుఁడు వృషభమును సంహరించు

మన్నాఁడని చెప్పఁబడినది. విషువద్బిందువు (Equinox) ప్రథమములో నున్నప్పుడు సంవత్సరము ప్రథమములో నారంభ మయ్యెడిది,






ఇందు వృశ్చికరాశిలోని అనూరాధ, జ్యేష్ఠ నక్షత్రములును, సమీపనక్షత్రములును పాశ్చాత్యసిద్ధాంతుల గుఱుతులతో చూపఁబడినవి.

అనూరాధ - ఛత్రాకారత్రయమ్ — గొడుగువంటిఆకారముగల మూఁడు చుక్కలని మనవారు చెప్పుదురు. ఇందు బీటా, డెల్టా, పై గుర్తు గల మూఁడుచుక్కలును అనూరాధ యగును. డెల్టా-సిగ్మాల మధ్యరేఖ గొడుగుకామ యగును.

జ్యేష్ఠగూడ గొడుగు ఆకారముగల మూఁడుచుక్కలందురు. టౌ, సిగ్మా, మధ్య పెద్ద నక్షత్రము-మూఁడును కలసి జ్యేష్ఠ యగును. ఆక్రింద డి గుర్తుగల చుక్క గొడుగుకామ యగును.

ఇందు బీటా గుర్తుగల చుక్క గౌతముఁ డనియు, సిగ్మా గుర్తు గల చుక్క జైమిని యనియు కేత్కారుపండితుఁడు తన జ్యోతిర్గణితము నందలి నక్షత్రపటమునఁ జూపెను.

అనఁగా సంవత్సరారంభమున ప్రథమము అస్తమించెడిది. ఈ ఖగోళ సత్యము ననుసరించి, ఆకాలములో సంవత్సరారంభమునాఁడు దేవాలయములో గొప్ప యుత్సవము జరుగుచుండెను. ఒక యోధవీరుఁడు మిత్రదేవునివేషమును దాల్చి ఆయుత్సవములో నొక గొప్ప ప్రథమును ఈఁటెతో పొడిచి చంపెడివాఁడు. ఈ యాచారము బహుశతాబ్దాలకాలము ఈజిప్టు, గ్రీసు, రోము, అస్సీరియా, బాబిలోనియా మొదలగు దేశములలో వ్యాపించియుండెను. ఇట్టి ప్రథమవధను సూచించుచిత్రములు, నాణెములు మొదలగునవి వందలకొలఁది దొరకినవి. ఇంకను దొరకుచున్నవి. ఆ కాలపువారు రసేశులు మిత్రదేవునినామమును ధరించెడివారు.

(గో. వేం. రా.)

**అనూరాధపురము** — సింహళద్వీపమందలి యొక పురాతనపట్టణము, బౌద్ధక్షేత్రము. పూర్వ మిది మహావైభవ మనుభవించిన పట్టణ మైనను. ప్రస్తుతము విధ్వంసమై జీర్ణస్థితియం దున్నది. మొత్తముమీఁద ౧,౪౦౦ సంవత్సరములవఱకును సింహళమునకు ముఖ్యపట్టణముగ నుండెను.

'గౌతమబుద్ధుఁడు నిర్వాణము నందిన సంవత్సరముననే విజయుసేనుఁ డనునతఁ డార్యావర్తమునుండి బయలుదేఱి సింహళమునకు వెళ్లి యచ్చట రా జయ్యెను' అని సింహళచరిత్రమును దెలుపు మహావంశమువలనఁ దెలియుచున్నది. ఈతఁడే యా దేశమునందు బౌద్ధమతమును వ్యాపింపఁజేసెను.


ఇతని కనూరాధుఁ డను తమ్ముఁడును గలఁడు. అతఁడు క్రీ. పూ. ౬-వ శతాబ్దిని 'అనూరాధపురమును' ప్రతిష్ఠించెను. ఇది మొదట నొక చిన్నపల్లె. క్రీ. పూ. ౪౩౭ ప్రాంతమున పాండుకాభయుఁ డనురాజు సింహళము నేలుచుండెను. అతఁ డనూరాధపట్టణమును పెంచి పెక్కుమేడలను, ఉద్యానవనములను నిర్మించి, మహాపట్టణముగ మార్చి, తనరాజధానిం జేసికొనియెను గావున నిది అధమపక్షమున రెండువేల నాలుగువందల సంవత్సరముల పురాతనపట్టణము. దీని చుట్టుకొలత మువ్వదిరెండు క్రోశములు.

ఈ రాజు జయవాపి యను గొప్పతటాకమును నిర్మించెను. దానినే రాజుపేర అభయవాపి యనియుఁ జెప్పుచుండిరి. ఈ తటాకమిప్పటికిని గొంతవఱకుఁ గానవచ్చును. ఇప్పుడు గానవచ్చుదాని కొలత రెండుమైళ్లు. దీనియొద్దనసే రాజు నూతనపట్టణమును గట్టించెను. దీనికి నాలుగుసివార్లును, సమాధిస్థలమును, వేఁటవాండ్రు మొదలగువారికి వేఱుపల్లెయు, దేవాలయములును, జైనులు, ఆజీవికులు మొదలగు మతమతాంతరులకునై మఠములును వేఱువేఱుగ నిర్మించెను. పట్టణమున కుత్తరమునఁ గామినీతటాకము త్రవ్వించెను. ఇప్పుడును దానిని విలాకాతటాక మందురు.


ఈ పట్టణముయొక్క వైభవమును, శోభను, కీర్తిని పెంపుచేసిన యతఁడు తిస్సరాజు. ఈతఁడు క్రీ. పూ. ౩-వ శతాబ్దిమధ్యమున నుండెను. కావున నితఁ డశోకమహారాజుతో సమకాలికుఁడు. ఈ

sampath_Ebooks

# అనూరాధపురము



రువన్వెలిసయా డగోబా



జేతవనారాము డగోబా



ఇసురుమునియా దేవళము

sampath_Ebooks

# అనూరాధపురము



తిస్స వేవ జలాశయము



పవిత్రమయిన లోవమహాపయపునాది



అనూరాధపురము, బోధివృక్షము

sampath_Ebooks

యిద్దఱు రాజు లొకరి నొక రెన్నఁడును జూచుకొనకపోయినను, మిక్కిలి స్నేహముగలవారై బౌద్ధమతాభివృద్ధిఁ జేసిరి. తిష్యుఁడు బౌద్ధమతము నవలంబించి బౌద్ధులకు వంద్య మగు బోధివృక్షమును ఈ గ్రామమునందుఁ బాతించి దానిచుట్టును మహావిహారమును నిర్మించెను. గయయందలి వటవృక్షముయొక్క కొమ్మ నొకదానిని అశోకుఁడు తిష్యునకుఁ బంపెనఁట. దానినే యాతఁడు బోధివృక్షముగఁ బాతించెను. ఇట్లు రమారమి ౨,౩౦౦ వత్సరములక్రిందటఁ బాతఁబడిన వృక్ష మిప్పటికిని జీవించియున్నది. ఈ వృక్ష మిచ్చటఁ బాతఁబడినప్పటినుండియు నా స్థలము బౌద్ధులకు పుణ్యక్షేత్ర మయ్యెను.

ఈ బోధివృక్షముయొక్క పీఠస్థానమునకు మహావిహార మని పేరు. ఈవిహారమునందు రెండు మహాభవనములు కలవు. అవి మిక్కిలి మనోహరములుగ కట్టఁబడినవి. ఈ వృక్షమును జూచుటకై దూరదేశములనుండి బౌద్ధులు వచ్చుచుండిరి. క్రీ. శ. ౩౯౯ లో 'ఫాహియాన్' అను చీనాపరివ్రాజకుఁ డీవృక్షమును సందర్శించెను. ఈ వృక్షముక్రింద నైదుగురు బుద్ధులు సిద్ధించి రని యాదేశపువారు చెప్పెదరు.

ఈ మహావిహారమునకుఁ గొంతదూరమున స్తూపాకార మైన యొకచైత్యము గలదు. ఇందు బుద్ధదేవునియస్థులు సమాధిఁ గావింపఁబడిన వని చెప్పెదరు. ఈ చైత్యమును క్రీ. పూ. ౩౦౭-వ సంవత్సరమున దేవప్రియతిష్యుఁ డనురాజు నిర్మించెను. ఈరాజుపై బుద్ధదేవునకు నెక్కుడు కృప యుండుటచే బుద్ధదేవుని కుడిపైపు అస్థి వచ్చి ఈ రాజు మకుటముపై నిల్చెనఁట! అతఁడు దానిని భక్తిపూర్వకముగ స్వీకరించి దానిపై నీచైత్యమును నిర్మించెనఁట! ఇట్లే ఇచ్చట మఱికొన్ని పురాతననిర్మాణములు గలవు.

ఈ రాజే పట్టణమునందుఁ బది క్రొత్తమందిరములను బౌద్ధమతాభివృద్ధికై కట్టించి పట్టణముశోభను హెచ్చించెను. ఇవన్నియు నిప్పుడు జీర్ణము లైపోయినను, ఆ మందిరమునందలి కొన్ని శిలాభాగములుమాత్రమే తమ పూర్వవైభవమును వెల్లడిచేయుచున్నవి. బౌద్ధకాలపుశిల్పకళాకౌశలమును జూపునట్టి ముఖ్యస్థలములలో నిది యొకటి. ఇచ్చట థూపారామము, మునివిహారము అను కట్టడము లింకను గానవచ్చును. రాజకీయోద్యోగమునుండి సన్న్యసించినవారుండుటకై మునివిహారము నిర్మింపఁబడెను.

తిస్సరాజుమరణానంతరమున కొలఁదికాలమునకే తమిళులు (అఱవవారు) ఈ పట్టణమును స్వాధీనపఱుచుకొనిరి. కాని యొక శతాబ్దియనంతరము, వారియొద్దనుండి దుష్టగామిని అభయుఁ డనునతఁ డీ పట్టణమును స్వాధీనపఱుచుకొనెను. ఇతఁడే పట్టణమున నూతన మందిరముల నిర్మించెను. అందు కంచురాజమందిర మన్నది మిక్కిలి విఖ్యాతి వడసెను. ఇయ్యది సమచతుష్కోణాకార మైన యరుఁగు మీఁద వేయిరాతిస్తంభములు నిలిపి వానిపైఁ గట్టఁబడినది. ఈ చతుష్కోణముయొక్క యొక్కొక్కభుజము ౧౫౦ అడుగులు పొడవుండెను. ఈ స్తంభముల నిప్పటికిని చూడవచ్చును. ఈ స్తంభముల మీఁద చతుష్కోణాకారముగఁ గ్రిందిదానికంటెఁ బైది చిన్నదిగ నుండునట్లు తొమ్మిది యంతస్తుల మేడ గట్టఁబడెను! ఈ మేడ క్రిందనుండి పైవఱకు ౧౫౦ అడుగు లెత్తుండెను. ఈ భవన మంతయుఁ గొయ్యతోఁ జేయఁబడెను. చివరయంతస్తుమీఁదను గంచుతోఁ జేయఁబడినపెంకులు కప్పఁబడియుండెను. దీని కంతకును ముప్పదికోట్లు రూపాయలు వ్యయ మయ్యె నని మహావంశమునందుఁ జెప్పఁబడినది (౨౭)!

ఈ రాజే వేయికోట్లరూపాయలు వెచ్చించి 'హేమావతి' (బంగారముతోఁ జేయఁబడిన) 'దాగోబ'(స్తూపము)ను, మందిరమును నిర్మించెనఁట. కాని యిది యీ రాజుకాలమునఁ బూర్తి కాలేదు. ఈ బంగారు 'దాగోబ', దానిరచన, శోభ మొదలయినవానిని విపులముగ మహావంశ మను కావ్యమునందు నైదు సర్గములలో (౨౭-౩౨) వర్ణించియున్నాఁడు.

క్రీ. పూ. ౧౦౯ లో తమిళులు మరల నీ పట్టణమును పట్టుకొనిరి. క్రీ. పూ. ౮౯-వ సంవత్సరమునందు సింహళదేశజుఁ డైన 'వత్తగామిని' అనునతఁడు ఈపట్టణమును తమిళులయొద్దనుండి తీసికొనెను. ఈతఁడు స్వవిజయసూచకముగ 'అభయగిరిదాగోబ'ను కట్టించెను.

తరువాతికాలమునను రాజులును, మంత్రులును, ఇతర శ్రీమంతులును ఈపట్టణమునందు గొప్పగొప్ప మందిరములను కట్టించిరి. క్రీ. శ. ౪-వ శతాబ్దియందుఁ గట్టబడిన జేతవనాశ్రమము అనునది యింకను కొంత మంచిస్థితియం దున్నది.

విద్యాపీఠము:— అయిదవ శతాబ్ది ప్రారంభమునందు ఫాహియాను అను చీనాపరివ్రాజకుఁ డిచ్చట విద్యాభ్యాసమునకై రెండు సంవత్సరములు (౪౧౧-౪౧౨) ఉండెను. అతనికాలమం దిచ్చట గొప్పవిద్యాపీఠ మొకటి కలదు. ఉత్తరదేశమందు 'నాలంద' విద్యాపీఠమునకు నెట్టి ఖ్యాతి కలదో యట్టిఖ్యాతియే దక్షిణమున 'అనూరాధపుర' విద్యాపీఠమున కుండెను. సామాన్యజనులకై ధర్మశాస్త్రము, జ్యోతిషము, నీటిపాఱుదల (చెఱువులు నిర్మించుట, కాలువలు త్రవ్వుట మొదలైన విద్య), కవిత్వము, సాహిత్యము అను విషయములు నేర్పుచుండిరి. భిక్షువులకు (సన్న్యాసులు) పాలీభాషలోని బౌద్ధవేదములును, వానిమీఁది దేశభాషాభాష్యములును గురుశిష్యపరంపరగ బోధింపఁబడుచుండెను. పాలీభాషయు, వ్యాకరణమును వారి మతసంబంధియైన యోగశాస్త్రము, నీతిశాస్త్రము, తత్త్వశాస్త్రము, మీమాంసాశాస్త్రము భిక్షువులు నేర్చుకొనువిషయములలో ముఖ్యమైనవి.

ఇట్లు ఘనతఁ జెందిన విద్యాపీఠమునకు నానాదేశములనుండి విద్యార్థులు వచ్చుచుండిరి. గయనుండి బుద్ధఘోషుఁ డనునతఁడు వెళ్లి మతసంబంధమైన తత్త్వములను నేర్చుకొని వచ్చెను.

నీటియేర్పాటు:— బుద్ధఘోషుఁడు వచ్చి యుండినకాలమున, ఈపట్టణమునకు నీటియిబ్బంది లేకుండఁజేయుటకై ధాతుసేనుఁ డను రాజు క్రీ. శ. ౪౫౦ లో పట్టణమునకు నేఁబదిమైళ్లమీఁద 'కాలవాపి' యను నొక గొప్ప తటాకమును నిర్మించెను. ౧౪ మైళ్లు పొడువు గల దానికట్ట యిప్పటికిని ఆ యరణ్యప్రాంతమునఁ గానవచ్చును. అప్పుడు దాని చుట్టుకొలత ౫౦ మైళ్ళట! అందుండి పట్టణమునకు వచ్చిన కాల్వ లిప్పటికిని కొన్ని మంచిస్థితియం దున్నవి. మానవులచే నిర్మింపఁ బడిన తటాకములలో నాకాలమందు నింతకంటెఁ బెద్దది లేదని చెప్పవచ్చును. ఇదియే అనూరాధపురమున జరిగిన గొప్ప వైభవకార్యము. ఇఁకమీఁద నీపట్టణవైభవము తగ్గఁజొచ్చెను.

ఆటుతరువాత రాజ్యమునకై పెక్కువంశములవారు పోరాడుచు, నొకప్పుడు వీరును, మఱియొకప్పుడు వారును విజయు లగుచు వచ్చిరి. ఓడినవారు తమిళులసాయముఁ దీసికొనుచుండినందునఁ గ్రమముగఁ దమిళు లా దేశమునఁ బ్రవేశించి దానిని వోముకొనఁజొచ్చిరి. క్రీ. శ. ౭౧౧ లో నీ పట్టణము విడిచి, పులస్తిపుర మనుదానిని సింహళమునకు రాజధానిని జేసిరి. ౧౧-వ శతాబ్దియందు దీనిని రాజధానిఁ జేయఁ బ్రయత్నము జరిగెను గాని అది సఫలమైనది కాదు. క్రీ. శ. ౧,౩౦౦ ల ప్రాంతమున నిది పూర్తిగఁ బాడుపడి పోయినట్లు కానవచ్చుచున్నది. చుట్టుపట్టుల ౫౦ మైళ్లవఱకు నగర్యము పెరిఁగినది. ఇప్పుడు బోధివృక్షముచుట్టు నున్న బౌద్ధభిక్షువుల రెండు మూఁడు గుడిసెలు తప్ప మఱేయిల్లును లేదు.

ఇటీవల నీప్రాంతములనుండి రోడ్లు, రైలు పడినందున నిప్పటిఁ గొందఱు దొరతనమువారి యుద్యోగులు బంగళాలు కట్టుకొని వాసముచేయుచున్నారు. శిథిలమైన కట్టడములను దొరతనమువారు ఇంకను చెడిపోకుండ రక్షణ చేయుచున్నారు.

**అనూరు** — తూర్పుగోదావరిజిల్లా, పెద్దాపురంతాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౧,౬౫౪ (౧౯౩౧).

**అనూరుఁడు** — సూర్యునిసారథి. తొడలు లేనివాఁడగుటచే నితని కీపేరు వచ్చినది (మాడుఁడు, అరుణుఁడు)

## అనేకవర్ణసమీకరణము

— భాస్కరాచార్యులవారు బీజగణితమునందు దేనికి అనేకవర్ణ సమీకరణ మని పేరు పెట్టిరో దానిని పాశ్చాత్యబీజగణితశాస్త్రమునందు 'సైమల్టేనియస్ ఈక్వేషన్' (Simultaneous equation) అందురు. దీనికి సమకాలిక సమీకరణ మని యర్థము. ఏకవర్ణసమీకరణమునందుఁ దెలియనివర్ణ మొక్కటియే యుండును. అనేకవర్ణసమీకరణమునందుఁ దెలియనివర్ణములు పెక్కు లుండును. వాని వెలలు మనము కనుఁగొనవలయును.

౧-వ ఉదాహరణము :—

రెండుసంఖ్యలు కలవు. వానిలోఁ జిన్నసంఖ్యను పెద్దసంఖ్యలోఁ గలిపిన ౫౪ వచ్చును; చిన్నసంఖ్యను పెద్దదానిలోనుండి తీసివేసిన ౧౨ వచ్చును. ఆ సంఖ్య లెవ్వి?

న్యాసము :— తెలిసికొనవలసిన సంఖ్యలలో పెద్దది క అనియు, చిన్నది చ అనియు అనుకొందము. కావున ఈ క్రిందిసమీకరణము[1] లేర్పడుచున్నవి:—

$$క + చ = ౫౪ \qquad (౧)$$

$$క - చ = ౧౨ \qquad (౨)$$

ఈ రెండుసమీకరణములను కలిపినయెడల ఈ క్రిందిరీతిగా క యొక్క వెల తెలియుచున్నది:—

$$౨ క = ౬౬ \qquad (౩)$$

$$\therefore క = ౩౩$$

ఇట్లు మనకు క యొక్క వెల, యనఁగాఁ బెద్దసంఖ్యవెల తెలిసినది. ఈవెల క కు బదులుగా ౧-వ సమీకరణమునందుఁ గాని, రెండవసమీకరణమందుఁ గాని ఉంచిన చ యొక్కవెల తేలఁగలదు.

$$క + చ = ౫౪ \quad (క = ౩౩)$$

$$\therefore ౩౩ + చ = ౫౪$$

$$\therefore చ = ౫౪ - ౩౩ = ౨౧$$

ఇది మిక్కిలి సుకరమైన సమీకరణము. అన్నిసమీకరణములు నింతసుకరముగ విప్పఁబడవు. ఈ క్రిందిసమీకరణముఁ జూడుఁడు.

౨-వ ఉదాహరణము :—

$$౫ చ = ౨౩ - ౨ క$$

$$\therefore చ = \frac{౨౩ - ౨ క}{౫} \qquad (౧)$$

ఈసమీకరణమందు క యొక్కవెల మాఱినకొలఁదియు చ వెల మాఱుచుండును. క = ౧ అయినయెడల

$$చ = \frac{౨౩ - ౨}{౫} = \frac{౨౧}{౫}$$

క = – ౨ అయినయెడల

$$చ = \frac{౨౩ + ౪}{౫} = \frac{౨౭}{౫}$$

ఇట్లే క వెల మాఱినకొలఁదియు చ వెల మాఱును. కాని యీ క్రింది సజాతీయమైన యింకొకసమీకరణము,

$$౩ క + ౪ చ = ౨౪$$

మనకుఁ జిక్కినని దానినిబట్టి మన మీక్రిందిసమీకరణమును ఏర్పాటు చేసికొనవచ్చును.

---

1. ఈసమీకరణములను చదువువిధము: ౧-వ సమీకరణము: క, అధికము, చ - సమానము ౫౪; ౨-వ సమీకరణము: క, హీనము, చ - సమానము ౧౨.

sampath_Ebooks



$$చ = \frac{౨౪ - ౩ క}{౪} \qquad (౨)$$

౧-వ సమీకరణమునకును, ఈ ౨-వ సమీకరణమునకును సరిపోవునట్టి విలువలు క, చ లకు మనము తెలిసికొనవలెను. ౧-వ సమీకరణమందుఁ జూపఁబడిన చ యొక్క విలువయు, ౨-వ సమీకరణమందుఁ జూపఁబడిన చ యొక్క విలువయు నొకదానితో నొకటి సమానము లైయుండవలెను.

$$\therefore \frac{౨౩ - ౨ క}{౫} = \frac{౨౪ - ౩ క}{౪}$$

గుణించుటచే, $౯౨ — ౮ క = ౧౨౦ — ౧౫ క$

$\therefore ౭ క = ౨౮$

$\therefore క = ౪$

క యొక్క యీవిలువ ౧-వ సమీకరణమునందు ఉంచఁగా నిట్లు వచ్చును:—

$$చ = \frac{౨౩ - ౨ క}{౫} = \frac{౨౩ - ౮}{౫} = \frac{౧౫}{౫} = ౩$$

$\therefore క = ౪$

$చ = ౩$

క కు ౪, చ కు ౩ విలువ యున్న నీవిలువలే పై రెండుసమీకరణములను నిజ మగును. వేరియేవిలువలు కావు.

అనేకవర్ణసమీకరణములను విచ్ఛేదింపవలెనన్న, కొన్ని యుక్తులచే నితరవర్ణములను తొలఁగఁదీసి ( Eliminate ) ఒక్కవర్ణముమాత్రము నిలుచునట్లు చేసికొనవలెను. అప్పు డది యేకవర్ణసమీకరణ మగును. దానిచే నొక్కవర్ణముయొక్క విలువ కనుఁగొనవచ్చును. పిదప నితర వర్ణములవిలువ తెలియుట సులభము.

౩-వ ఉదాహరణము :—

ఈ క్రింది సమీకరణములను విచ్ఛేదించుము :—

$$౩ క + ౭ చ = ౨౭ \qquad (౧)$$
$$౫ క + ౨ చ = ౧౬ \qquad (౨)$$

ఈ సమీకరణములలోనుండి క అను వర్ణమును తొలఁగింప యత్నించెదము. అది యెట్లు? ౧-వ సమీకరణమును ౫ తోను, ౨-వ సమీకరణమును ౩ తోను హెచ్చించినచో నీక్రిందిసమీకరణములు వచ్చును :—

$$౧౫ \quad + ౩౫ చ = ౧౩౫ \qquad (౩)$$
$$౧౫ క + ౬ చ = ౪౮ \qquad (౪)$$

ఈ రెండుసమీకరణములందును క వర్ణములు సమానము (౧౫ క) అయినవి. కావున ౪-వ సమీకరణమును ౩-వ సమీకరణమునుండి తీసివేసినచో నిట్లు వచ్చును :—

$౨౯ చ = ౮౭$

$$\therefore చ = \frac{౮౭}{౨౯} = ౩$$

ఈ వచ్చిన చ యొక్క విలువ ౧-వ సమీకరణమునందు భర్తీ చేసినచో క విలువ రాఁగలదు :—

$౩ క + ౭ చ = ౨౭$

$\therefore ౩ క + ౨౧ = ౨౭$

$\therefore ౩ క = ౬$

$\therefore క = ౨$

ఇట్లు ఈలెక్కయొక్క యుత్తరము క = ౨, చ = ౩.

రెండు అజ్ఞాతవర్ణములలో నొకదానివిలువ తెలిసినతరువాత, రెండవదానివిలువ కనుఁగొనుటకై రెండుసమీకరణములలో దేనిని తీసికొని అందు తెలిసిన వర్ణమువిలువ భర్తీ చేసినను రెండవ వర్ణమువిలువ తెలియును. ఒకానొకసమీకరణమునే తీసికొనవలె నని లేదు. పై లెక్కలో మనము ౧-వ సమీకరణమును దీసికొని దానిలో చ విలువ భర్తీ చేసితిమి. అట్లు చేయక ౨-వ సమీకరణమును దీసికొని యందు చ విలువ భర్తీ చేసినను క విలువ వచ్చియుండును :—

$౫ క + ౨ చ = ౧౬$

$\therefore ౫ క + ౬ = ౧౬$

$\therefore ౫ క = ౧౦$

$\therefore క = ౨$

౪-వ ఉదాహరణము :—

ఈ క్రిందిసమీకరణములను విచ్ఛేదించుము :—

$$౭ క + ౨ చ = ౪౭ \qquad (౧)$$
$$౫ క — ౪ చ = ౧ \qquad (౨)$$

ఈ లెక్కలో చ ను తొలఁగించుట సుకరము. ౧-వ సమీకరణమును ౨ చే హెచ్చించిన ఈక్రిందిసమీకరణ మేర్పడును :—

$$౧౪ క + ౪ చ = ౯౪ \qquad (౩)$$

ఇందులో ౨-వ సమీకరణమును కలిపిన చ యెగిరిపోయి, యీ క్రిందివిధమున క విలువ వచ్చును :—

$౧౯ క = ౯౫$

$$\therefore క = \frac{౯౫}{౧౯} = ౫$$

ఇచ్చట ౨-వ సమీకరణమందలి-౪ చ ఋణము (— ఋణచిహ్నాంకితము); ౩-వ సమీకరణమందలి ౪ చ ధనము (Positive) కావున ఈ రెంటిని కలుపు మంటిమి. ఈ రెంటిని కలిపిన సంకలనము సున్నయై చ వర్ణ మెగిరిపోవును. ఈ రెండుసమీకరణముల లోను '౪ చ' అను వర్ణము ధనముగఁ గాని, ఋణముగఁ గాని

sampath_Ebooks



ఉన్నయెడల నది యెగిరిపోవుటకు నా సమీకరణములలో నొకదాని నుండి మఱియొకదానిని తీసివేయవలయును.

౫-వ ఉదాహరణము :—

ఈ క్రిందిసమీకరణములను విచ్ఛేదుము :—

$౨ క = ౫ చ + ౧$ (౧)

$౨౪ — ౭ క = ౩ చ$ (౨)

౧-వ సమీకరణమువలన క వెల యిట్లు వచ్చుచున్నది.

$క = \frac{౫ చ + ౧}{౨}$ (౩)

ఇట్లు వచ్చిన క యొక్క వెల ౩-వ సమీకరణమునందు మనము భర్తీ చేసినయెడల క లోపించును.

$౨౪ - \frac{౭}{౨}(౫ చ + ౧) = ౩ చ$

$\therefore ౪౮ - ౩౫ చ - ౭ = ౬ చ$

$\therefore ౪౧ = ౪౧ చ$

$\therefore చ = ౧$

ఇట్లు వచ్చిన చ వెల ౧-వ సమీకరణమందు భర్తీ చేసిన యెడల క వెల రాఁగలదు :—

$౨ క = ౫ చ + ౧$

$\therefore ౨ క = ౫ + ౧ = ౬$

$\therefore క = ౩$

పైని చెప్పినమార్గములను బుద్ధిసూక్ష్మతతో అవసరముకొలఁది ఉపయోగించినచో ననేకవర్ణసమీకరణబీజములను (తెలియనివర్ణముల వెలలను) కనుఁగొనవచ్చును. ఒక్కొకసమయమందు గణితసంబంధ మైనజ్ఞానమును చక్కఁగ నుపయోగించినయెడల లెక్క సులభముగ వచ్చును.

౬-వ ఉదాహరణము :—

ఈ క్రిందిసమీకరణమును విచ్ఛేదుము :—

$౨౮ క - ౨౩ చ = ౨౨$ (౧)

$౬౩ క - ౫౫ చ = ౧౭$ (౨)

ఇందుండి క ను తీసివేయవలయును. మనకు నొకమోటుపద్ధతి తెలియును. ౧-వ సమీకరణమునందలి క యొక్క గుణకసంఖ్య (Coefficient) ౨౮, ౨-వ సమీకరణమునందలి క గుణకసంఖ్య ౬౩; కావున ౧-వ సమీకరణమును ౬౩ చేతను, ౨-వ సమీకరణమును ౨౮ చేతను హెచ్చించినచో సమానగుణకములు గల క వర్ణము రెండు సమీకరణములలోను ఏర్పడును :—

$౧౭౬౪ క - ౧౪౪౯ చ = ౧౩౮౬$ (౩)

$౧౭౬౪ క - ౧౫౪౦ చ = ౪౭౬$ (౪)

౩-వ సమీకరణమునుండి ౪-వ సమీకరణమును తీసివేసినచో క వర్ణము లోపించి యిట్లు వచ్చును :—

$౯౧ చ = ౯౧౦$

$\therefore చ = \frac{౯౧౦}{౯౧} = ౧౦$

ఇట్లు లెక్క వచ్చినను అంకెలు పెద్దపెద్దవిగా పెరిగి లెక్క చేయుటకుఁ గొంచెము ఇబ్బంది కల్గినది. అట్లు గాక ౧-వ సమీకరణమందలి క వర్ణగుణకము ౨౮, ౨-వ సమీకరణమందలి క వర్ణగుణక సంఖ్య ౬౩; ఈ రెంటికిని అపవర్త్యము, లేక కనిష్ఠసామాన్యగుణి జము (L. C. M.) ౨౫౨. ఈ సంఖ్యను ౨౮ తో భాగించినచో ౯ వచ్చును. ౬౩ తో భాగించినచో ౪ వచ్చును. కావున ౧-వ సమీకరణమును ౯ తోను, ౨-వ సమీకరణమును ౪ తోను హెచ్చవేసిన యెడల నీక్రింది సమీకరణములు వచ్చును :—

$౨౫౨ క - ౨౦౭ చ = ౧౯౮$ (౫)

$౨౫౨ క - ౨౨౦ చ = ౬౮$ (౬)

౫-వ సమీకరణమునుండి ౬-వ సమీకరణమును తీసివేయఁగా నిట్లు వచ్చును :—

$౧౩ చ = ౧౩౦$

$\therefore చ = ౧౦$

దీనిని పట్టి క వెల కనుఁగొనవచ్చును.

౭-వ ఉదాహరణము :

ఈక్రిందిసమీకరణములను విచ్ఛేదుము :—

$\frac{౮}{క} - \frac{౯}{చ} = ౧$ (౧)

$\frac{౧౦}{క} + \frac{౬}{చ} = ౭$ (౨)

న్యాసము :— ౧-వ సమీకరణమును ౨ చేతను, ౨-వ సమీకరణమును ౩ చేతను హెచ్చించినచో

$\frac{౧౬}{క} - \frac{౧౮}{చ} = ౨$ (౩)

$\frac{౩౦}{క} + \frac{౧౮}{చ} = ౨౧$ (౪)

(౩), (౪)- ఈ రెంటిని కల్పఁగా

$\frac{౪౬}{క} = ౨౩$

$\therefore ౪౬ = ౨౩ క$

$\therefore క = ౨$

౧-వ సమీకరణమునందు క విలువ భర్తీ చేయఁగా వచ్చునది చ = ౩.

sampath_Ebooks

భిన్నాంకములు వచ్చినప్పుడు దానికిఁ దగురీతి లెక్కను మార్చి సమీకరణములను విచ్చవలెను.

రెండు అజ్ఞాతవర్ణములవెల కనుఁగొనుటకు రెండు సమీకరణము లుండవలయు నని యిదివఱకుఁ జదువరులు చూచియున్నారు. మూఁడు అజ్ఞాతవర్ణములను కనుఁగొనుటకై మూఁడు సమీకరణములు కావలెను. మూఁడువర్ణములసమీకరణములను విచ్చునప్పుడు, మొదట మూఁడింటిలో రెండుసమీకరణములను దీసికొని, వానిలోనుండి యొక వర్ణమును తొలఁగింపవలయును. తరువాత మూఁడింటిలోనుండి మఱి రెండు సమీకరణములం దీసికొని వానినుండి యీ వర్ణమునే తొలఁగింపవలయును. ఇట్లు రెండు అజ్ఞాతవర్ణములు గల రెండు సమీకరణము లేర్పడును. వానిని పైని చెప్పినరీతిగా విచ్చి, ఆరెండువర్ణముల వెలలు కనుఁగొనవలెను. పిదప మూలసమస్యలోని యొక సమీకరణములో ఈరెండువర్ణములవెలలను భర్తీ చేసి మూఁడవవర్ణముయొక్క వెల కనుఁగొనవలెను.

౮-వ ఉదాహరణము :—

ఈ క్రిందిసమీకరణములను విచ్చుఁడు :—

౭ క + ౫ చ - ౭ ట = ౮[1] (౧)

౪ క + ౨ చ - ౩ ట = ౦ (౨)

౫ క — ౪ చ + ౪ ట = ౩౫ (౩)

న్యాసము :— ఇందుండి మొదట క ను విడఁదీయుదము.

(౨) ను ౫ తో హెచ్చింపఁగా వచ్చినది

౨౦ క + ౧౦ చ — ౧౫ ట = ౦ (౪)

(౧) ని ౨ తో హెచ్చింపఁగా వచ్చినది

౧౪ క + ౧౦ చ - ౧౪ ట = - ౧౬ (౫)

(౪) లోనుండి (౫) తీసివేయఁగా వచ్చినది

౬ క - ట = ౧౬ (౬)

(౨) ను ౨ తో హెచ్చవేయఁగా వచ్చినది

౮ క + ౪ చ - ౬ ట = ౦ (౭)

(౩), (౭) కలుపఁగా వచ్చినది

౧౩ క - ౨ ట = ౩౫ (౮)

(౬) ను ౨ తో హెచ్చవేయఁగా వచ్చినది

౧౨ క - ౨ ట = ౩౨ (౯)

(౮) లోనుండి (౯) తీసివేయఁగా

క = ౩

(౪) లో క వెల భర్తీ చేయఁగా వచ్చినది

ట = ౨

(౨) లో క ట ల వెలలు భర్తీ చేయఁగా వచ్చినది

చ = ౩

ఇఁకఁ గొన్ని లౌకికోపయుక్తము లైన యుదాహరణము లిచ్చి యీప్రకరణమును ముగించెదము.

౯-వ ఉదాహరణము :—

ఒక గొల్లవాఁడు పశువులను గొనుటకు సంతకుఁ బోయెను. అచ్చట ౪ గొఱ్ఱెలకు, ౭ ఆవులకు రు. ౧౩౧-౦-౦ లును, ౫ గొఱ్ఱెలకు, ౩ ఆవులకు రు. ౬౬-౦-౦ లును ఖరీదు చెప్పిరి. ఒక్క ఆవు ఖరీ దెంత? ఒక గొఱ్ఱె ఖరీ దెంత?

న్యాసము :— ఒక్కొక్కగొఱ్ఱెఖరీదు క రూపాయ లను కొందము. ఒక్కొక్క ఆవుఖరీదు చ రూపాయ లనుకొందము. లెక్కనుబట్టి యీ క్రిందిసమీకరణము లేర్పడుచున్నవి :—

౪ క + ౭ చ = ౧౩౧ (౧)

౫ క + ౩ చ = ౬౬ (౨)

(౧) టిని ౫ తోను, (౨) ను ౪ తోను హెచ్చవేయుఁడు :—

౨౦ క + ౩౫ చ = ౬౫౫ (౩)

౨౦ క + ౧౨ చ = ౨౬౪ (౪)

(౩) లోనుండి (౪) తీసివేయఁగా

౨౩ చ = ౩౯౧

∴ చ = ౧౭ రూపాయలు

చ యొక్క యీవెలను (౨) లో భర్తీ చేయఁగా

౫ క + ౫౧ = ౬౬

∴ ౫ క = ౬౬ - ౫౧ = ౧౫

∴ క = ౩ రూపాయలు

కావున ఉత్తరము :— ఒక్కొక్కగొఱ్ఱెవెల రు. ౩-౦-౦, ఒక్కొక్క ఆవువెల రు. ౧౭-౦-౦.

౧౦-వ ఉదాహరణము :—

ఇద్దఱు స్నేహితులు కలరు. వారిలో నొకఁడు రెండవవానితో ననును :— 'మిత్రమా! నీవు నాకు నూఱురూపాయ లిచ్చితివేని, నీయొద్ద మిగిలినధనముకంటె నాయొద్ద రెట్టింపుధన ముండును.' అందుపై రెండవవాఁడు మొదటివానితో, 'నీవు నాకు పదిరూపాయ లిచ్చితివేని నీయొద్ద నిలిచియుండుధనముకంటె నాయొద్ద నాలురెట్లు ధన ముండును' అని అనెను. మొదటివానియొద్ద నెంతధన మున్నది? రెండవవానియొద్ద నెంతధన మున్నది? (భాస్కరాచార్యులు)[2]

1. ఋణసంఖ్యలను చదువునప్పుడు ఋణము ౮, ఋణము క అని చదువవలెను.

2. భాస్కరాచార్యులవారీ యుదాహరణమును ఏకవర్ణసమీకరణప్రకరణమునందును, అనేకవర్ణసమీకరణప్రకరణమందును ఇచ్చియున్నారు. కాని మన మిచ్చట అనేకవర్ణసమీకరణము గలదిగనే ఈలెక్క చేయుదము.

sampath_Ebooks

న్యాసము :— మొదటివానియొద్ద క సంఖ్యరూపాయలును, రెండవవానియొద్ద చ సంఖ్యరూపాయలును మొదట ఉన్న వను కొందుము. ఇఁక రెండవవాఁడు మొదటివానికి ౧౦౦ రూపాయ లిచ్చివేసినచో మొదటివానియొద్ద (క + ౧౦౦) రూపాయలును, రెండవవానియొద్ద (చ - ౧౦౦) రూపాయలును ఉండును. కావున లెక్కయొక్క మొదటిభాగము ననుసరించి, అనఁగా మొదటివాఁడు చెప్పినమాట ననుసరించి యీ క్రిందిసమీకరణ మేర్పడుచున్నది.

క + ౧౦౦ = ౨ (చ - ౧౦౦) = ౨ చ - ౨౦౦ (౧)

మొదటివాఁడు రెండవవానికి పదిరూపాయ లిచ్చినయెడల మొదటివానియొద్ద (క - ౧౦) రూపాయ లుండును. రెండవవాని యొద్ద (చ + ౧౦) రూపాయ లుండును. కావున రెండవవాఁడు చెప్పినమాట ననుసరించి యీక్రిందిసమీకరణ మేర్పడుచున్నది :—

చ + ౧౦ = ౬ (క - ౧౦) = ౬ క - ౬౦ (౨)

(౧), (౨) సమీకరణములయొక్క రెండుపక్షములను (Sides) అనుకూలముగా మార్చఁగా నీక్రింది రెండుసమీకరణము లేర్పడుచున్నవి.

౨ చ - క = ౩౦౦ (౩)

౬ క - చ = ౭౦ (౪)

ఇందు (౪) ను ౨ తో హెచ్చవేయుఁడు :—

౧౨ క - ౨ చ = ౧౪౦ (౫)

(౩), (౫) సమీకరణములను కలుపఁగా

౧౧ క = ౪౪౦

∴ క = ౪౦ రూపాయలు

క యొక్కవెల (౩) లో భర్తీ చేయఁగా చ వెల వచ్చును:—

౨ చ - ౪౦ = ౩౦౦

∴ ౨ చ = ౩౪౦

∴ చ = ౧౭౦ రూపాయలు

ఉత్తరము :- మొదటివానియొద్ద రు. ౪౦-౦-౦ లును, రెండవ వానియొద్ద రు. ౧౭౦-౦-౦ లును ఉండెను.

(కో. వేం. ల.)

**అనేనుఁడు** — ౧. ఇక్ష్వాకురాజు ప్రపౌత్రుఁడు. వికుక్షిరాజు పౌత్రుఁడు. కకుత్థ్సరాజుపుత్రుఁడు. వీనికి సుయోధ నుఁడు, కాకుత్స్థుఁడు అను నామాంతరములు గలవు. వీనికొమారుపేరు పృథావు.

౨. సోమవంశము. పురూరవుని పౌత్రుఁడు. ఆయురాజుయొక్క అయిదుగురుకొడుకులలో కనిష్ఠుఁడు వీని మాఱుపేరు శుద్ధుఁడు.

అనోంగోపురో — గంజాంజిల్లా, బురంపురము తాలూకా బొడొకిమిడీ జమీందారీలోని గ్రామము. జనసంఖ్య ౫౦౪ (౧౯౩౧).

అనోమా — ఒక చిన్ననది. ఇది కపిలవస్తునగరమునకు తూర్పువైపున బయలుదేఱి గోరఖ్పురమునకు దగ్గఱ రాప్తీనదిలోఁ గలసినది. నేఁడిది చాలభాగము నిర్జలముగ నున్నది. అనోమానదిగట్టు ననే బోధిసత్త్వుఁడు సన్న్యాసము గ్రహించెనఁట! ఈకారణమున దీనికిఁ బ్రసిద్ధి కలిగినది.

అనౌపమ్య — బాణాసురునిభార్య.

అన్నంగి — గుంటూరుజిల్లా, ఒంగోలుతాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౧,౧౭౮ (౧౯౩౧).

అన్నంపల్లి — ౧. నెల్లూరుజిల్లా, ఉదయగిరితాలూకా యందలి ఈనాంగ్రామము. జనసంఖ్య ౭౨ (౧౯౩౧).

౨. తూర్పుగోదావరిజిల్లా, అమలాపురం తాలూకాయందలి జమీందారీగ్రామము. జనసంఖ్య ౧,౬౦౫ (౧౯౩౧).

అన్నంపాలెం — తూర్పుగోదావరి, ఏజెన్సీ జిల్లా, యెల్లవరంతాలూకాయందలి జమీందారీ గ్రామము. జనసంఖ్య ౬౩ (౧౯౩౧).

అన్నంపేఁట — విశాఖపట్టణముజిల్లా, పాలకొండ తాలూకాయందలి ఈనాంగ్రామము. జనసంఖ్య ౨౨౮ (౧౯౩౧).

అన్నంబాక — నెల్లూరుజిల్లా, గూడూరుతాలూకా యందలి ఈనాంగ్రామము. జనసంఖ్య ౩౪౩ (౧౯౩౧).

**అన్నంభట్టు** — సుప్రసిద్ధుఁడైన యాంధ్రనైయా యికుఁడు. హిందూదేశమునందు నంతటను న్యాయశాస్త్ర మభ్య సింపఁగోరువా రీతనితర్కసంగ్రహమును మొదట నభ్యసించెదరు. ఇతఁడు న్యాయ మీమాంసా వేదాంత వ్యాకరణము లనువిషయముల పైని గ్రంథములను వ్రాసెను :—

(౧) న్యాయగ్రంథములు :—

౧. తర్కసంగ్రహః, ౨. తర్కసంగ్రహదీపికా, ౩. తర్కభాషాతత్త్వబోధినీ, ౪. ఆలోకసిద్ధాంజనమ్ (ఇది జయదేవుని 'ఆలోక' మను తత్త్వచింతామణిటీకకుఁ డీక), ౫. సుబుద్ధిమనోహరమ్ (ఇది రఘునాథశిరోమణియొక్క దీధితిమీఁది టీక).

(౨) మీమాంసాగ్రంథములు :—

౧. రాణకోజ్జీవనీ (సుధాసారః సోమనాథునిరాణకముపై టీక), ౨. తంత్రవార్తికటీకా.

sampath_Ebooks



( ౩ ) వేదాంతగ్రంథములు :—

౧. మితాక్షరా. ( బ్రహ్మసూత్రములపై వృత్తి ), ౨. తత్త్వ వివేచనమ్.

( ౪ ) వ్యాకరణగ్రంథములు :—

౧. వ్యాకరణమితాక్షరా, ౨. భాష్యప్రదీపోద్ద్యోతనమ్ ( కైయటుని ప్రదీపముమీఁదిటీక ).

పైగ్రంథములపట్టికవలననే యీతనికిఁ గల సకలవిద్యాపాండిత్యాతిశయము వెల్లడి కాఁగలదు. ఇదివఱకు నీతనితర్కసంగ్రహ, దీపికలుమాత్రము సకలజనవిదితములు. కొన్నిసంవత్సరములకుఁ గ్రిందట వ్యాకరణమితాక్షరను కాశీ సంస్కృతగ్రంథమాల ( Benares Sanskrit series ) లో శ్రీభట్టనాథస్వామివా రచ్చువేయించినారు. మిగిలినగ్రంథములయొక్క వ్రాఁతప్రతులు లిపివల సంపాదించి చెన్నపురిదొరతనమువారు తమ ప్రాచ్యలిఖితపుస్తకభాండాగారమునం దుంచినారు.

ఈతనిగ్రంథములలోని యుపోద్ఘాతములును, పరంపరాగత లోకవార్తలును చూడఁగా నీతనిది గొప్పపండితవంశ మని తోఁచుచున్నది. ఈతనిముత్తాత లోకనాథభట్టు, ద్వాదశాహయాజుఁ డన్న బిరుదము గలవాఁడు, మంత్రభాష్యమును, కృష్ణాభ్యుదయ మను కావ్యమును రచించెను. తాత మల్లుభట్టు; అగ్నిహోత్రభట్ట న్నబిరుదాంకితము కలవాఁడు; ఆలోకస్ఫూర్తి యన్న న్యాయగ్రంథమును, తత్త్వవివేచన మన్న వేదాంతగ్రంథమును, మహాభాష్యటీక యను వ్యాకరణగ్రంథమును రచించెను. తండ్రి తిరుమలభట్టు, సర్వతోముఖయాజబిరుదాంకితుఁడు. సంధ్యావందనభాష్యమును రచించెను. వీరికి మూలపురుషుఁడు రాఘవసోమయాజి. అన్నంభట్టునకు మహామహోపాధ్యాయబిరుదును, అద్వైతవిద్యాచార్యుఁ డన్నబిరుదును ఉండెను. ఈతనికి అన్న యుండె నని 'అత్రాస్మదగ్రజచరణాః' అన్న ఆలోకసిద్ధాంజనవాక్యమువలనఁ దెలియుచున్నది.

అన్నంభట్టు గుంటూరుమండలమందలి గరికపాడునివాసి యనియు, కొండవీటిలోని పాఠశాలలోఁ బండ్రెండేండ్లు చదువుకొనె ననియు, తరువాత తాను ఒకపాఠశాల స్థాపించి విద్యార్థులకుఁ దర్కశాస్త్రము నేర్పుచుండె ననియు, తన కున్నదానితో సంతుష్టిఁ జెంది యున్నఁడును, ఎచ్చటికిని వెళ్లి యేరాజును ఆశ్రయింపలే దనియు, ౫౫ సంవత్సరములు వయస్సు వచ్చినతరువాత శ్రీశైలమునకుఁ బోయె ననియు, తర్కమునందు మొదట సంగ్రహము, తరువాత దీపిక, పిదప ముక్తావలి, చివర గదాధరి చెప్పు సంప్రదాయము నితఁడే యేర్పఱిచె ననియు, ఈతఁడు శా. శ. ౧౫-వ శతాబ్దిలో నున్నవాఁ డనియు అర్వాచీనలేఖకుఁడు వ్రాసియున్నాఁడు. ఇందుల కాతఁ డేమియు నాధార మీయకపోయినను అన్నంభట్టు క్రీ. శ. ౧౪౦౦ - ౧౫౦౦ లకు నడుమకాలమున నున్నవాఁ డని మనకు సాధారణముగ నూహింపవచ్చును. ఇతఁడు ప్రక్రియాకౌముదీకారునకుఁ దరువాతివాఁడు, సిద్ధాంతకౌముదీకారునకుఁ బూర్వపువాఁడు.

'కాశీగమనమాత్రేణ నాన్నంభట్టాయతే ద్విజః'. కాశీకిఁ బోయినంతమాత్రమున బ్రాహ్మణుఁడు అన్నంభట్టు కాఁడు అన్న వచనమును ఉదాహరించి కొంద ఱీతఁడు కాశీకిఁ బోయి యచ్చటఁ బండితుల గెలిచి బిరుదావళులఁ బొందె నని చెప్పుదురు.

**అన్నంరాజుపేట** — విశాఖపట్టణముజిల్లా, శృంగవరపుకోట తాలూకాయందలి ఈనాంగ్రామము. జనసంఖ్య ౨,౫౫౭ (౧౯౩౧).

**అన్నంరాజువలస** —విశాఖపట్టణముజిల్లా, సాలూరు తాలూకాయందలి జమీాందారీగ్రామము. జనసంఖ్య ౩౧౨.

**అన్నదానపట్టి** — ఇది సేలంజిల్లా, సేలంతాలూకాలోని యొకచిన్నజమీాందారీ, దొరతనమువారికిఁ జెల్లింపవలసిన పేష్కషు రు. ౩,౬౯౦ లు. ఈ ముఠాముఖ్యస్థలము అన్నదానపట్టి యనుపల్లె. ఇది సేలమునకు పశ్చిమమున క్రోసెఁడుదూరమున నుండును. ఇందు ౬౩ ఇండ్లును, ౩౦౬ గురు జనులును కలరు.

**అన్నదేవచోళుఁడు** — భక్తిశ్వరుఁ డను నామాంతరము గల కామరాజుయొక్క కుమారుఁడు. ఈతనితల్లి అన్నమాంబ. అన్నదేవునిభార్య యిరుగాంబిక. ఈమె సూర్యవంశజుఁ డైన పిన్నుండి అనువానికిఁ దోఁడబుట్టినది. వీ రిద్దఱికిని వీరభద్రుఁడు కొడుకు. అన్నదేవుఁడు మహమ్మదీయులతోఁ గలసి కర్ణాటరాజుసైన్యములను ఓడించెను. జగ్గవాగు మొదలైన స్థలముల నాక్రమించెను. ఈతఁడు అత్తిలియొద్ద దక్షిణదేశపురాజులతో యుద్ధముచేసి, తన్ను శరణుఁ జొచ్చిన పదివేలమందిని గాపాడెను. తనస్నేహితుని రక్షింప నీతఁడు గోదావరీతీరమున కాఁకరపర్తియొద్ద తనబావమఱఁది యైన పిన్నుండిసాయమున కన్నడరాజును సైన్యములను చంపెను. తన్ను శరణు చొచ్చిన కాటయవేమునికుటుంబమును యశఃకాముఁడై రక్షించెను. ముమ్మిడిప్రోలవర మీతనిరాజధాని. ఇతఁడు బ్రాహ్మణులకు బంగారపుకొమ్ములతో వేలకొలఁదిగోవులను దానముచేసెను. క్రీ. శ. ౧౪౦౪న దాక్షారామభీమేశుని గుడిమీఁద సువర్ణఖచితము చేసి వృషభములును, సువర్ణకలశమును బెట్టించెను. గంగ (గోదావరి) యొద్దున పిన్నసానిసంగమునొద్దనున్న ఉత్తమగండ చోడాన్నదేవవరము నుగ్రామమును బ్రాహ్మణులకు దానముచేసెను. ఈతని శాసనములు దాక్షారామము, క్షీరారామము, త్రిపురాంతకము, పోలవరములందుఁ గానవచ్చుచున్నవి. వీని ననుసరించి యితఁడు రాజమహేంద్రవర ప్రాంతమును క్రీ. శ. ౧౩౮౯ మొదలు ౧౪౧౩ వఱకును పాలించి నట్లు నిశ్చయ మగుచున్నది.

sampath_Ebooks

**అన్నపూర్ణ** — పార్వతీదేవియొక్క యొకరూపము. ప్రపంచమునకు నాహార మొసంగుదేవత. అన్నపూర్ణాదేవియొక్క యాలయము కాశిలోఁ గలదు. ఈమె కాశికి నధిపతియైన విశ్వేశ్వరుని భార్య. ఆదిభిక్షు వైనశివునకు భిక్ష పెట్టుటకునై యీమె యీ రూపమును ధరించె నందురు. అన్నపూర్ణవిగ్రహమునకు నొకచేతిలో పళ్లెమును గరిఁటెయు నుండును. ఈమెవర్ణము రక్తము (ఎఱుపు). చైత్రశుద్ధ అష్టమి ఈమెపూజాదినము. పూర్వపురోమకులుగూడ 'అన్న పెరెనా' యను నొకదేవతను పూజించుచుండిరి. అది యన్న మిచ్చుదేవతయె. ఆమెపూజయు చైత్రమాసముననే చేయుదురు (విశ్వకోశము).

**అన్నప్పశాస్త్రిపల్లి** — కడపజిల్లా, ప్రొద్దుటూరు తాలూకాయందలి ఈనాంగ్రామము. జనసంఖ్య ౩౯౨ (౧౯౩౧).

**అన్నప్రాశనము** — బాలకున కాఱవ, యెనిమిదవ నెలలోఁగాని, బాలికకు ఐదవ, యేడవ నెలలోఁ గాని కావింపఁబడు ప్రథమాన్నభక్షణసంస్కారము. తండ్రి మంచిలగ్నమందు సుస్నాతుఁడై వృద్ధిశ్రాద్ధానంతరము శుచినామకాగ్నిని స్థాపించి విరూపాక్షజపాంతము కుశండిక యనుపేరుగల అగ్నిసంస్కారకార్యము నాచరింపవలయును. అంత ప్రకృతకర్మారంభమున ప్రాదేశప్రమాణములైన నేతిలో ముంచినసమిధలను వహ్నియందు హోమముం జేసి నిర్వర్తితమహావ్యాహృతిహవనుఁడై మంత్రోచ్చారణపూర్వకముగ నేతితో పంచాహుతిహోమముం జేసి పిమ్మటఁ బంచప్రాణహోమము, మహావ్యాహృతిహోమముల సలిపి ప్రాదేశప్రమాణములై ఘృతాక్తములగు సమిధలను మరల నగ్నిలో హవన మొనరించి ప్రకృతకర్మమును సమాప్తము చేయవలయును. అటుతరువాత నుదీచ్యమైన శాట్యాయనహోమము మొదలుకొని వామదేవ్యగానాంతముగాఁగల కర్మ మొనరించి మంత్రపూర్వకముగఁ గుమారుని నోటిలో నన్నము నిడవలయును. పిదపఁ బురోహితునకు దక్షిణ నొసంగవలయును. ఈకార్యము బాలున కాఱవనెలలోనే చేయుటుచితము. శూన్యతిథులు మొదలైనవానిని వదలి శుక్లపక్షశుభతిథులం దీ సంస్కారముం జేయవలయు నని మార్కండేయమునందు లిఖింపఁబడి యున్నది. తండ్రి సుభూషితుఁడగు పుత్రుని నొడిలోఁ గూర్చుండఁబెట్టికొని దేవతాసమక్షమున కాంచనపాత్రముతో నన్నము దినిపించి యనంతరము తేనె, నెయ్యి, బంగారము కలసిన పాయసము నారగింపఁజేయవలయును. ఈప్రకార మన్నప్రాశనముం జేయించిన పిదపఁ గుమారకుని దల్లియొడిలోఁ గూర్చుండఁబెట్టి దేవతాసాన్నిధ్యమున నెదురుగ సకలశిల్పకళాపదార్థముల, శస్త్రాస్త్రముల నలంకరించి వానిమధ్య బాలకుని వదలవలయును. శిశువు స్వయముగ నేపదార్థమును గ్రహించునో తత్సంబంధమైనదియే యతనివృత్తి యగు నందురు.

**అన్నభేది** — 'ఫెర్రస్ సల్ఫేటు' (Ferrous sulphate) అని రాసాయనికశాస్త్రీయనామము. 'గ్రీన్ విట్రియల్', 'కాపిరాస్' (Green vitriol, copperas) అనునవి ఆంగ్లమున అన్నభేదికి వ్యావహారిక నామములు.

రాసాయనికశాస్త్ర విషయములు

ఇనుము, గంధకము, ప్రాణవాయువు — వీనికూడికవలన అన్నభేది యేర్పడుచున్నది. పరమాణుసంయోగసిద్ధాంతము ననుసరించి అన్నభేదిలో ఒకపరమాణువు ఇనుము, ఒకపరమాణువు గంధకము, నాలుగు పరమాణువులు ప్రాణవాయువును గలవు. క్రొత్తగా తయారుచేసిన అన్నభేది జలమిశ్రితమగుటచేత లేఁతపచ్చరంగు గలిగి నున్నని పలకలుగల స్ఫటికములవలె నిగనిగలాడుచుండును. గాలిలో ఆరఁబెట్టినప్పుడు కొంతజలము విడిపోయి తెల్లఁబడి క్రమముగా గోధుమవర్ణమునకు మాఱును.

తయారుచేయువిధము :— ఇనుపతీగను గంధకద్రావకములో (Sulphuric acid) కరఁగించినప్పు డన్నభేది యేర్పడును. ఒక తులము ఇనుపతీగ, ఒకతులము గంధకద్రావకము, ఎనిమిదితులముల వాననీరు కలిపి వెచ్చఁబెట్టినప్పుడు ఇనుము కరఁగిపోవును. దీనిని దిగఁగాఁచి మూఁత పెట్టి చల్లార్చినయెడల అన్నభేది నిగనిగలాడెడి పలకలతో అడుగునకు దిగును. వర్తకసరళిలో అన్నభేదిని రెండుమూఁడు విధముల తయారుచేయుదురు. పనికిరాని యినుపముక్కలను (ఇనుము రద్దు) గంధకద్రావకములో కరఁగించి వడఁబోసి మఱఁగఁబెట్టి చల్లారనిచ్చినయెడల అన్నభేదిముక్కలు క్రిందికి దిగును. పటిక (Alum), మయూరతుత్థము (Copper sulphate) వర్తకసరళిలో తయారుచేయుటలో అన్నభేది యొక 'ఉపపదార్థము' గ (By-product) ఏర్పడును. పటిక తయారుచేసెడిరాళ్లలో 'పైరైట్' (Pyrite) అను ఇనుము, గంధకముగల పదార్థము మిశ్రితమైయుండును. దీని నుండి అన్నభేది తయారగును. ఇట్లే మయూరతుత్థమును చేయునప్పుడు కొంత యన్నభేదికూడ తయారగుచున్నది.

పైరైటురాళ్లను మాఁడిచినప్పుడు వాటిలోనున్న గంధకము చాలవఱకు ఎగిరిపోవును. అట్లు మాడ్చి రాళ్లను తడిపి గాలిలో నుంచినయెడల క్రమముగ కొంత అన్నభేది యేర్పడును. అప్పుడు దానిని నీటిలో కరఁగించి వడఁబోసి మఱఁగఁబెట్టినయెడల అన్నభేది పలుకుల క్రిందికి దిగును.

గుణములు:— అన్నభేది యించుక నీలిరంగుతో మిశ్రితమైన ఆకుపచ్చనివర్ణము గలపదార్థము. ౧౦౦ పాళ్లు అన్నభేదిలో సుమారు ౨౧ పాళ్లు ఇనుము, ౧౧ పాళ్లు గంధకము, ౨౩ పాళ్లు ప్రాణవాయువు, ౪౫ పాళ్లు నీరు మిళితమైయుండును. దీనికి ప్రాణవాయువునం దత్యంతప్రేమ. అందుచేత గాలిపాటినప్పుడు ప్రాణవాయువుతో సంయోగమును పొంది రంగు మాఱును. అన్నభేది నీటిలో సులభముగ కరఁగెడివస్తువు. నీటిలో కరఁగిన అన్నభేదిని

sampath_Ebooks



గాలిలో నుంచినయెడల కొంతసేపటికి గాలిలోనున్న ప్రాణవాయువుతోఁ గలసి కొంచెము పసుపువర్ణముగల పదార్థము అడుగున తేట్టు తేరును. నీటిలో కరఁగియున్న బంగారపుద్రవ్యములనుండి స్వచ్ఛమైన బంగారమును విడఁదీయుశక్తి అన్నభేదికిఁ గలదు.

అన్నభేదిని మాడ్చినప్పుడు మొట్టమొదట దానిలో నిమిడియున్న నీరు ఎగిరిపోయి తెల్లఁబడును. తరువాత గంధకపుసంబంధమైన ఘాటగుపొగలు వెడలివచ్చును. ఎఱ్ఱనిపొడి నిలిచియుండును. దీనిని లోహభస్మ మనవచ్చును (Ferric Oxide). దీనినే స్వర్ణకారులు మెఱుఁగుపెట్టుట కుపయోగించెదరు.

ఉపయోగములు :— అన్నభేది యనేకపరిశ్రమలలోను, వైద్యమునందును ఉపయోగించెడివస్తువు. కొన్నిజాతులమొక్కల యొక్కవేళ్లు ఊరుటకుఁగాను నీటిలో కొంచెము అన్నభేది కలుపుదురు.

పరిశ్రమలు :— పరిశ్రమలలో ముఖ్యముగ బట్టలయద్దకము నందు విశేషించి నీలిరంగునేయుటకును, కలంకారీ అద్దకములోను (Calico-printing) అన్నభేది విశేషముగ వాడెదరు. కరక కాయనీటితోఁ గలిపి సిరాచేయుదురు. తోళ్లను శుభ్రపఱచుటకును నల్లరంగులు, గంధకద్రావకము, మెఱుఁగుపొడి (Rouge) తయారు చేయుటకును అన్నభేది ముఖ్యపదార్థము.

## వైద్యవిషయములు :

౧. పాశ్చాత్యశాస్త్రము ననుసరించి :— గుణములు : వైద్యులు ఇనుమును ఏయేవ్యాధుల చికిత్సల కుపయోగింతురో ఆవ్యాధులయందు అన్నభేదిని సాధారణముగ నుపయోగింపవచ్చును. రక్తపుష్టి లేనివారికి రక్తస్రావమును నిలుపుటకును ఇది సహకారి యగును. కాని యినుముతో మిశ్రమమై తయారగుకొన్నిపదార్థములు సులభముగ జీర్ణ మగునవిగను, మఱికొన్ని యట్లు గాక జీర్ణకోశమునకు నానాఁటికి శ్రమ కలిగించునవిగను ఉన్నవి. కాఁబట్టి, వైద్యుఁడు రోగియొక్క బలమునుబట్టియు, వ్యాధిబలమునుబట్టియు అన్నభేదిని గాని, ఇనుముతో మిశ్రమమైన ఇతరపదార్థములను గాని ఉపయోగింపవచ్చును. ఇనుముగల మందును సేవించునప్పుడు మలబద్ధక మధికమై మలము నల్లనగును. కొందఱకు తలనొప్పి, కడుపునొప్పి, అజీర్ణము మొదలగు గుణము లినుమును సేవించుటచే కలుగును. అన్నభేది మోతాదు :— ౧ మొదలు ౫ గురివిందగింజలయెత్తు, గ్రుక్కెఁడు నీళ్లతో చేర్చి ఇయ్యవచ్చును. కాల్చి పొడిచేసి మాత్ర గట్టికూడ నియ్యవచ్చును. తక్కినవివరములకు 'ఇనుము' అను శీర్షికక్రిందఁ జూడనగును.

౨. దుర్మాంసము పెరిగి వచ్చుపుండ్లపై అన్నభేది రాచినయెడల కోఁతగుణము గలదు. నీళ్లలోఁ గలిపి పుండును గడిగినయెడల కోఁతగుణ మంతగా నుండదు. మొండిపుండ్లు శీఘ్రముగ మానును.

౩. అన్నభేదియందు సూక్ష్మజీవులను నశింపఁజేయుగుణము గలదు. ఒకపాలు అన్నభేదిని ఆఱుపాళ్లు నీళ్లతోఁ జేర్చి జలదారులను, పాయిఖానాలను కడుగవచ్చును. ఒకమానవుఁడు విసర్జించుమలమును శుద్ధి చేయుటకు రమారమి రెండుతులముల అన్నభేది పట్టును. కలరా మొదలగు వ్యాధులు గలదినములలో ఇతరపదార్థములు లేనిచో అన్నభేదిని సూక్ష్మజీవులనాశనార్థమై ఉపయోగింపవచ్చును.

౪. పసువులకుఁగూడ రక్తపుష్టికొఱకును, నెత్తురువిరేచనములకును, రక్తప్రవాహమును ఆఁపుటకును ఇయ్యవచ్చును. పసువుల పుండ్లకు మంచిమందు; కాని అధికముగ నుపయోగించినచో కోఁత కోయును. కొబ్బరినూనెతో చేర్చి వాడవచ్చును. గుఱ్ఱమునకు ౩౦ మొదలు ౬౧ గురివిందగింజలమోతాదును, పసువులకు సగమును, మేఁకలకు గొఱ్ఱెలకు నాల్గవవంతును, కుక్కలకు ౧ మొదలు ౧౦ గురివిందగింజల యెత్తువఱకును లోపలికి వాడవచ్చును.

ఇతరోపయోగములు :— ౧. కరకకాయనీళ్లతో చేర్చి సిరా చేయుటకు అన్నభేది ఉపయోగించును.

౨. నెరసినవెండ్రుకలకు రంగు వేసికొనుటకు మఱికొన్ని పదార్థములతో దీనిని గలిపి ఉపయోగింతురు.

౩. కప్పు మొదలగు పండ్లపొడులలో వాడుదురు. చిగుళ్లలో నెత్తురు తగ్గించును కాని నల్లనిరంగు నిచ్చును.

౪. రంగులు వేయుటలో అన్నభేది ఉపయోగింతురు.

౨. (ఆయుర్వేదము ననుసరించి) :— ఉపరసము, ఖనిజము : దీనిని సంస్కృతభాషలో కాసీస మందురు. రసరత్నసముచ్చయమునందును, తదితరము లగు రసతంత్రములయందును నీయన్నభేదిని ఉపరసములలో చేర్చుటచేతను రసవార్తికాచార్యులందఱును దీనిని ఖనిజముగా వ్యవహరించినటులు దెలియుచున్నది. అయినను పూర్వు లీయన్నభేదిని ఇనుముతోఁగూడిన మిశ్రద్రవ్యము (Compound)గా పరిగణించి రనుట కాధారము లేవియు లే వని ఉదయచంద్రదత్తుగారు తమ 'హిందూ మెటీరియా మెడికా' యను గ్రంథమందు వక్కాణించియున్నారు. ఖనిజముగా పరిగణించిన ఈకాసీసమును కొందఱు గ్రంథకర్తలు తమతమ గ్రంథములయందు వాలుకాకాసీస మనియు, పుష్పకాసీస మనియు రెండువిధములు గలదానినిగా పేర్కొనిరి. మఱికొందఱు ధాతుకాసీస మనియు, పుష్పకాసీస మనియు విభజించిరి. రసతంత్రములయందెన్నటఁ జూచినను రెండువిధము లగు కాసీసములనే చెప్పియుండుటచే నిందు వాలుకాకాసీసమునకు ధాతుకాసీస మను నామాంతర ముండియుండవచ్చు నని తోఁచుచున్నది. వైద్యవిశారదు లందఱును దీనినే అన్నభేది యనుపేరున వ్యవహరించి చికిత్సలయందు తఱచుగ నుపయోగించుచున్నారు. దరదము (ఇంగిలీకము), సస్యకము (మైలతుత్తము) మొదలగునవి ఇప్పుడు రసాయనసమ్మేళనముచే తయారు చేయఁబడి, ఇంగ్లండు, హాలెండు మొదలగుదేశములనుండి మన కగు

sampath_Ebooks

మతి చేయఁబడు ద్రవ్యములనుగుఱించి ప్రాచీనరసతంత్రజ్ఞులు వాని యుత్పత్తివిధానమును, అవి దొరకు ప్రదేశములను చక్కఁగ నిర్దేశించుటచేతను, మట్టి యిసుక మొదలగు మలినపదార్థములతోఁ గూడి యుండును గనుకచే శుద్ధిచేయక యుపయోగింపరా దని విధించుటచేతను తాంత్రికమహాయుగమునం దీయన్నభేదిగూడ గనులయందు దొరకుచుండెడి దేమో యని యూహింపనగును.

కాసీసస్వరూపము:—ఉదయచంద్రదత్తుగారు తమ 'హిందూ మెటీరియా మెడికా' యందు ధాతుకాసీసము ఆకుపచ్చనిరంగు గలది గను, పుష్పకాసీసము కొంచెము పసుపురంగు గలదిగను ఉండు నని చెప్పియున్నారు. ఇందులకు నిదర్శనముగ,

శ్లో. 'కాసీసం ధాతుకాసీసం పాంసుకాసీస మిత్యపి,
తదేవ కించి త్పీతం తు పుష్పకాసీస ముచ్యతే"

అను శ్లోకమువలన ఆయుర్వేదప్రకాశ మను గ్రంథములో శ్రీమదుపాధ్యాయమాధవులు పుష్పకాసీసము కొంచెము పచ్చనివర్ణముతోఁ గూడియుండు నని నిరూపించియున్నారు. ఇప్పు డీకాలమందుఁగూడ ఈరెండువిధము లయినవర్ణములు గల అన్నభేదిని జూచుచున్నాము. ఈరెంటిలో పుష్పకాసీసము మిగుల శ్రేష్ఠ మయిన దని వాగ్భటాచార్యులు మొదలగు నాయుర్వేద శాస్త్రజ్ఞులు 'పుష్పాదికాసీస మతి ప్రశస్తం' ఇత్యాదివాక్యములచే సూచించియున్నవారు. ఇందు వాలుకాకాసీసము క్షారవిశిష్ట మనియు, అమ్లరసవిశిష్ట మనియు, పుష్పకాసీసము కషాయామ్లరసవిశిష్ట మనియు, వీర్యమునందు రెండును ఉష్ణవీర్యవిశిష్టములే యనియుఁగూడ వర్ణించిరి. మఱియు అన్నభేది శ్విత్రము (బొల్లి), నేత్రరోగము, శ్లేష్మరోగము, వాతరోగము, అజీర్ణము, అర్శోరోగము, క్షయరోగము, పాండువు, ప్లీహరోగము, గుల్మరోగము, మూత్రకృచ్ఛ్రము - వీనిని బోకడమును. వ్రణముమ శుద్ధిపఱిచి మాన్పును. 'విషఘ్నమ్' అని చెప్పుటచే కృత్రిమవిషమునకు విఱుగుడుగా నుపయోగించు నని తోఁచుచున్నది. 'ముఖకేశరంజనకరమ్', 'పటరంజనకం పరమ్' అని రసప్రకాశసుధాకరమందు అన్నభేదియొక్క గుణకథనము గానఁబడుచుండుటచే దీనిలేపనక్రియచే ముఖమునకు కాంతియు, కేశములకు కృష్ణవర్ణమును గలుగు నని తోఁచుచున్నది. ఇది వస్త్రములకు రంగు వేయుట కుపయోగపడునట్లుగూడ తోఁచుచున్నది. అయితే దీని స్వతంత్రోపయోగమెచ్చటను జెప్పియుండినట్లు తోఁచదు. ఇతరద్రవ్యములతో సమ్మేళనముం జేసి యుపయోగింపనగును.

శుద్ధి:— దీనిని శుద్ధిచేయక యుపయోగింపరాదు. అట్లుపయోగించిన ఛర్ది పుట్టుటఁ జూచుచునేయున్నారము. శోధనావిధానము లనేకు లనేకరీతులుగాఁ జెప్పియున్నను సర్వసాధారణముగా '**శ్లో.** భృంగరాజరసే స్విన్నం నిర్మలం హి ప్రజాయతే' అను శాస్త్రమర్యాద నతిక్రమింపక దీనిని వైద్యావతంసు లందఱును శుద్ధిచేసియే వాడుచున్నారు; అనఁగా గుంటగలగరయొక్క పసరులో దీనిని డోలాయంత్రమున వండినచో (స్వేదనచేసినచో) శుద్ధి యగును. మఱికొందఱు గుంటగలగరరసములో ౪-౫ పర్యాయములు ఖల్వమున నూటి యుపయోగించుటయుఁ గలదు. దీనికి మారణవిధాన మెచ్చటను గ్రంథస్థము కానరాదు. కాని వ్యవహారమునందు లఘుపుటంబు లిడి దీనిని సిందూరింపఁజేసి వాడుట కలదు. ఇట్లు లఘుపుటములచే తయారుచేయఁబడిన అన్నభేదిసిందూరము శుద్ధిచేయఁబడిన అన్నభేదికంటె దోషరహితమును, గుణాధిక్యముగలదిగను నగుచున్నది. శుద్ధిచేసినయన్నభేదిని నిమ్మకాయరసము, వేపచెక్కరసము, కుక్కపొగాకురసము - వీనిలో దేనిచే నయినను చక్కఁగ నూటి బిళ్లలుగాఁ జేసి, నీడలో నెండించి ఆబిళ్లలను మూఁకుటిలోఁ బోసి పైని మఱియొకమూఁకుడు మూసి సంధిబంధనము చేసి ద్రవ్యపరిమాణము ననుసరించి ౫౦ మొదలు ౧౦౦ వఱకు పిడకలతో పుటం బిడ వలయును.

కాసీససిందూరము:— అనంతరము సాంగశీతలమునఁ దీసి చూచినచో నంపలియున్న భేది ఎఱ్ఱగ సిందూరించి కుంకుమవలె నగును. అద్దానిని సర్వరోగములయందు నుపయోగింపనగును. ఆంధ్రదేశీయులగు వైద్యవరు లంపె ఱీతిగనే కాసీససిందూరమును తయారు చేయుచుందురు. మఱియు దాక్షిణాత్యవైద్యులు కొందఱు కాసీసమునకు సమముగ సురాక్షారమును (Nitre) కలిపి పైని జెప్పిన రసములలో నేయైన నొకదానితో నూటి పుట మిడుటయుఁ గలదు. ఈవిధముగా తయారుచేసినసిందూరము ఎక్కువ గుణవంత మని వారియాశయము. కాసీససిందూరము గాని, శుద్ధకాసీసము గాని ప్రధానముగాఁ ల యోగములు కొన్నిమాత్రమిం దుదాహరింపఁబడును.

౧. శ్లో. కాసీసం భస్మ కాంతస్య చోభయం సమభాగికమ్,
వరావిడంగసంయుక్తం ఘృతక్షౌద్రప్లుతం ప్రగే.
భక్షితం హంతి వేగేన పాండు యక్ష్మాణ మేవచ,
ప్లీహం గుల్మం గుదే శూలం మూత్రకృచ్ఛ్రాణ్యశేషతః.
—ఇతి రసప్రకాశసుధాకరే.

అర్థము. అన్నభేది, కాంతభస్మము, సైంధవలవణము, వాయువిడంగములు — వీనిని సమభాగములుగ చూర్ణించి నేయి తేనె — వీనియందుఁ గలిపి సేవించినచో, పాండువు, క్షయ, ప్లీహము, గుల్మము మొదలగు రోగములు శాంతించును. అగ్నిదీప్తి కలుగును.

౨. కాసీసం రోచనాతుల్యం హరితాలం రసాంజనమ్,
అమ్లపిష్టః ప్రలేపోఽయం వృషకచ్ఛ్వహిపూతనోః.
—ఇతిచక్రదత్తః.

అర్థము. అన్నభేది, గోరోచనము, తాళకము, రసాంజనము— వీనిని కాంజికముతో నూటి లేపనము చేసినచో వృషకచ్ఛువు, అహిపూతము మొదలగు చర్మరోగములు శాంతించును.

3. సువర్ణపుష్పకాసీసం విడంగాని మనశ్శిలా,
రోచనా సైంధవం చైవ లేపనా చ్ఛ్విత్రనాశనమ్.
—ఇతి శార్ఙ్గధరసంహితాయామ్.

అర్థము. పసపుజాజి, అన్నభేది, వాయువిడంగములు, మణిశిల, గోరోచనము, సైంధవలవణము — వీనిని సమానముగ గ్రహించి నూఱి లేపనముం జేసినచో శ్విత్ర మనుకుష్ఠువు నశించును.

౪. కాసీసం దధినామచ హిక్కాఘ్నాఘ్నమధు సంయుతాః.

—ఇతి చక్రదత్తః.

అర్థము. అన్నభేదిని వెలగగుజ్జును సమముగ కలిపి తేనెతో సేవించినచో ఎక్కిళ్లు శాంతించును.

ఇట్లు కాసీసము ప్రధానముగాఁగల యోగము లనేకములు గ్రంథస్థములు గానఁబడుచున్నవి.

( గం. దూ. )

**అన్నమదేవుఁడు** — ఓరుఁగంటి రెండవ ప్రతాపరుద్రునితమ్ముఁడు. ప్రతాపరుద్రునితండ్రి పేరు మహాదేవుఁడు, తల్లి పేరు ఉమ్మక్క. కావున నితనితల్లిదండ్రులును వారే యని మన మెంచవలసియుండును. ఉమ్మక్క రుద్రమదేవికూఁతురు. ప్రతాపరుద్రుఁడు దిగ్విజయయాత్ర వెడలి పండ్రెండుసంవత్సరములు తిరుగుచుండె ననియు, ఆకాలమున నితఁడు ఓరుఁగంటిలోఁ బరిపాలనము చేసె ననియు, తురుష్కులు రాజ్యముమీఁదికి దండెత్తి వచ్చినప్పు డీతఁడు సైన్యాధీశుఁడుగ నుండి వారి ననేకపర్యాయము లోడించె ననియు, చివరకుఁ బ్రతాపరుద్రుఁడు పట్టుపడినకాలమున నితఁడే రాజ్యము చేసె ననియు, ప్రతాపరుద్రుఁడు చెఱనుండి వెడలివచ్చిన తరువాత తాను రాజ్యము చేయనొల్లక యాతనికిఁ బట్టము గట్టె ననియు, ప్రతాపరుద్రుఁడు పరలోకగతుఁ డైనతరువాత నితఁడు ఈశాన్యభాగంబునకై వింధ్యప్రాంతమువైపు వెడలిపోయె ననియు 'ఏకశిలానగరవృత్తాంతము'[1] నందు వ్రాయఁబడినది. ప్రతాపరుద్రుఁడు చెఱలో నుండుకాలమున నీతఁడు ప్రభుత్వము చేయుచుండఁగా విద్యానాథకవికృత ప్రతాపరుద్రీయము పూర్తి అయిన దఁట! అప్పుడు కవి ప్రతాపరుద్రునియొద్దకుఁ బోఁగా నాతఁడు తనయుంగర మిచ్చి యాతనిని తనతమ్మునియొద్దకుఁ బంపెనఁట! అన్నమదేవుఁ డాతనికి గొప్పబహుమాన మిచ్చుటయేకాక ఓరుఁగంటిలో గొప్పపాఠశాలఁ బెట్టించి విద్యానాథుని దానికి నాచార్యునిఁ జేసెనఁట! ఈసమాచారము 'కవిచరిత్ర' యను మహారాష్ట్రగ్రంథము నందుఁ గల దని అర్వాచీనకోశకారుఁడు వ్రాసినాఁడు.[2] ఈఅన్నమదేవుఁడు ఓరుఁగంటినుండి వెడలిపోయి బస్తరురాజ్యమును స్థాపించెను. బస్తరుసంస్థానము నైజామువంటి స్వతంత్రప్రభుత్వము. ఇది మధ్యపరగణాలలో నున్నది. దీనికి తూర్పున మనరాజధానిలోని జయపురముజమీన్‌దారీయు, దక్షిణమున గోదావరిజిల్లాలోనిభద్రాచలముతాలూకాయును అంటుకొనియున్నవి. అచ్చటిరాజు లీయన్నమదేవుని తమమూలపురుషునిగాఁ జెప్పుకొనియెదరు.[3] అన్నమదేవుఁడు ఓరుఁగంటినుండి బయలుదేఱినప్పు డాతనికులదేవతయైనమాణిక్యదేవి యాతని కొకఖడ్గ మిచ్చెనఁట! అది యిప్పటివఱకును ఆరాజులయొద్ద నున్నదఁట.[4] ఇతఁడు వచ్చునప్పు డాతనివెంట నొకబంటు నీళ్లు తెచ్చువాఁడు వచ్చెనఁట. వానివంశజు లిప్పుడు బస్తరుసంస్థానమున ఫుట్‌కేల్ జమీన్‌దారీకి నధిపతులుగ నున్నారు.[5] బస్తరుసంస్థానమందు కోసాయా లను జాతివారు కలరు. వారిపూర్వులు ఓరుఁగంటినుండి యన్నమదేవునితో వచ్చినారఁట.[6] అన్నమదేవుఁడు విక్రమసంవత్ ౧౪౧౫-వ సంవత్సరమున, నఁగా క్రీ. శ. ౧౩౫౮ లోఁ గాలముచేసెనఁట. బస్తరు ఓరుఁగంటికి మిక్కిలిదూరముగా లేదు. ఈశాన్యమునందు రమారమి రెండువందలమైళ్లదూరమున నుండును.

ఇప్పటిబస్తరురాజులు ప్రతాపరుద్రునితమ్ముఁ డైన అన్నమదేవునిసంతతివా రని చూపుటకు నాసంస్థానమందలి దంతేశ్వరీదేవాలయములో నొకశాసనము కలదు. అది బస్తరురాజులపూర్వుఁ డైన దిక్పాలదేవునిచే వ్రాయింపఁబడినది. అందలిసంవత్సరము విక్రమశకము ౧౭౬౦, అనఁగా క్రీ. శ. ౧౭౦౩. దిక్పాలదేవుఁ డన్నమదేవునుండి పదియవపురుషుఁడు. అన్నమదేవునికుమారుఁడు హమీరదేవుఁడు.[8] కాని శాసనమును ప్రకటించిన శ్రీయుత హీరాలాలుగారిందు రెండు అసందర్భములఁ జూపినారు. ఒకదానికి వారే సమాధానము చెప్పినారు. రెండవదానికిఁ జెప్పలేదు. మొదటి యసందర్భము: ఈశాసనమునందు అన్నమదేవుఁడు చంద్రవంశజుఁ

1. ఇది వ్రాఁతప్రతి. ఇటీవలివారిచే (బహుశః మెకంజీ గుమాస్తాచే) వ్రాయఁబడినది. చెన్నపురి, ఓరియంటల్ మ్యానుస్క్రిప్టు లైబ్రరీలో నున్నది.

2. 'అర్వాచీనకోశ' మనునది చరిత్రాత్మకకోశము. మరాటీభాషలో నున్నది. కర్త రఘునాథభాస్కరగోడ్‌బోలె. ఇం దున్నయంశము లన్నియు కావలి వెంకటరామస్వామిగారు ౧౮౨౯ లో కలకత్తాలోఁ బ్రకటించిన 'Dekkan Poets' అను గ్రంథమునందుఁ గూడఁ గలవు.

3. Imperial Gazetteer of India, Bastur.

4. Central Provinces Gazetteers. Chhattisgarh Feudatory States, p. 36

5. Ibid, p. 51.

6. Chhattisgarh, Feudatory States, 46.

7. Ibid, 67.

8. Epi. Indica., vol. IX, p. 165.

sampath_Ebooks

డుగాఁ జెప్పఁబడినాఁడు. కాని గణపతిదేవుని ఏకామ్రనాథశాసనమునందు[1] కాకతీయులు సూర్యవంశజు లని చెప్పియున్నది. కాని యిది యొకయసందర్భము కాదు. ప్రతాపరుద్రుఁడు మొదట కాకతీయవంశజుఁడు కాఁడు. దత్తతవలన కాకతీయుఁ డయ్యెను. మొదట ప్రతాపరుద్రుఁడును, అన్నమదేవుఁడును చంద్రవంశమునందుఁ బుట్టియుందురు. దత్తత పోయినందున ప్రతాపరుద్రుఁడు సూర్యవంశ్యుం డై యుండవచ్చును. అదియుఁగాక చంద్రసూర్యవంశములు మూలమునం దెట్లు పుట్టినను, ఇటీవలిరాజులనుగుఱించి యవి కవికల్పనలే యని చెప్పవలెను. ఎవరికి నిష్టము వచ్చినట్లు వారు తమవంశము సూర్యవంశ మనియు, చంద్రవంశ మనియు వ్రాయుచువచ్చిరి.

రెండవయసందర్భము: అన్నమదేవుఁడు ౧౩౨౩ లో నున్నవాఁడు. ఇది ప్రతాపరుద్రునిఁ జెఱపట్టుకొనిపోయినకాలము. అన్నమదేవునివంశమందలి పదియవపురుషుఁడు పైశాసనము వేయించినవాఁడు ౧౨౦౩ లో నుండెను; అనఁగా ౧౨౦ సంవత్సరములలో ౧౦ తరములు గడచిన వని అనుకొనవలెను. తరమొకటింటికి సమారమి ౧౨ సంవత్సరములు పడినవి. కాని సాధారణముగ తరమొకటింటికి ౩౦ ఏండ్లకంటె నెక్కువకాలము లెక్కవేయుటకు వీలు లేదు. కావున ప్రతాపరుద్రునితరువాత సమారమి నూఱేండ్లకు మఱియొకప్రతాపరుద్రుఁడు ఉండవచ్చు ననియు, అతఁడు యుద్ధమునందు దురుష్కులచేఁ జచ్చియుండవచ్చు ననియు శ్రీయుత హీరాలాలుగారు వ్రాసిరి. కాని తరమునకు నలువది సంవత్సరము లంతగా నెక్కువకాలము కాదని మా తాత్పర్యము.

**అన్నమయ్య, యథావాక్కుల** — ఈతఁ డొక యాంధ్రకవి; వీరశైవుఁడు, ఆత్రేయసగోత్రుఁడు. యజుశ్శాఖాధ్యాయి. గోదావరీతీరవాసి. ఒకప్పు డీకవి శ్రీశైలయాత్రకు వెడలి తిరిగివచ్చుచు పల్నాడుతాలూకా జెట్టిపాలెముదగ్గఱ కృష్ణాతీరమునందలి విశ్వామిత్రాశ్రమ మనఁబడు సత్రశాల యను పుణ్యస్థలమున శ్రీమల్లికేశ్వరస్వామిని సేవించుచుఁ గొంతకాల ముండి అచ్చటనె సర్వేశ్వరశతక మను పేర భక్తిరసప్రధాన మయిన యొకశతకమును రచించెను. ఈకవి తా నీశతకమును శాకాబ్దములు ౧౧౬౪ న రచియించినట్టు లందే చెప్పుకొనియుండుటచేత నీతఁడు క్రీస్తుశకము పదమూఁడవ శతాబ్ది నడిమిభాగమున నుండె నని నిశ్చయ మగుచున్నది.

ఈతని సంతతివా రితనికిఁ గొంతకాలమునకుఁ బిదప పల్నాటిసీమకు వచ్చి యచ్చటనే కరిణీకములు సంపాదించి పల్నాటిసీమవాస్తవ్యు లయిరి. ఈకవిసంతతివారిలో నొకఁడు సోమరాజనామమును వహించి ప్రఖ్యాతి చెందుటచేత, యథావాక్కులవా రను పేరు పోయి, అతనిపేర నీవంశమునకు సోమరాజువా రను పేరు కలిగినది (చూడుఁడు: సర్వేశ్వరశతకము, పీఠిక).

**అన్నము** — చూడుఁడు, ఆహారము.

**అన్నమేడు** — నెల్లూరుజిల్లా, పోలూరుతాలూకాయందలి జమీన్దారీగ్రామము. జనసంఖ్య ౧,౪౦౭ (౧౯౩౧).

**అన్నయరెడ్డి** — ఓరుఁగంటి రెండవప్రతాపరుద్రుని కాలమునందు సామంతరాజుగ నిప్పటి కృష్ణామండలములోని మునగాలజమీన్దారీప్రదేశమును పాలించుచున్న రెడ్డిరాజు. మునగాల జమీన్దార్ల పూర్వుఁ డైయుండును. మునగాలజమీన్దారీలోని తాడువాయగ్రామమందు శిథిలమైన మల్లిఖార్జునదేవాలయములో నీరాజుచే వేయింపఁబడిన శిలాశాసనములు రెండు కలవు. ఒకటి క్రీ. శ. ౧౩౦౦ లోనిది; రెండవది క్రీ. శ. ౧౩౦౬ లోనిది.[2] ప్రతాపరుద్రుఁడు రాజ్యము చేయుచుండఁగనే — కాకతీయరాజ్యవైభవము పట్టపగలింటిసూర్యునిపగిది వెలుఁగుచుండఁగనే — రెడ్లు రాజ్యము లేలుచున్నట్టు చెప్పెడి పురాతనశాసన మిదియే. రెడ్ల ప్రభుత్వమును సూచించునట్టిశాసన మింతకంటెఁ బూర్వపుది లేదు.

**అన్నయ్య (తెనాలి)** — ఈ కవి సుదక్షిణాపరిణయ మను నాంధ్రకావ్యమును రచించెను. ఈకవియింటిపేరు తెనాలివా రనియు, నీతనితండ్రిపేరు రామయ యనియు నీతనికావ్యమందలి కృత్యాదిపద్యములవలనఁ దేటపడుచున్నది.

కవివంశము:— విఖ్యాతిఁ జెందినవాఁడును, పాండురంగమాహాత్మ్యమును రచించినవాఁడు నగు తెనాలిరామకృష్ణునకు నీతఁడు తమ్ముఁడు. ఈసంగతి యీతనియన్నమనుమఁ డగు తెనాలిరామభద్రకవిచే రచింపఁబడిన ఇందుమతీకల్యాణ[3] మనెడుకావ్యమందలి యీ క్రిందిపద్యములవలన స్పష్టపడఁగలదు:—

ఉ. మామకనవ్యకావ్యము సమంచితమాధురి సాధురీతిగా
యామకృతప్రబంధరచనాయతపాకచతుర్విధైకవా
ర్తామహితోజ్జ్వలాఢ్యకవితాఘనతామహు మత్పితామహున్
రామయరామకృష్ణకవిరాజుఁ దలంచి నుతించి మ్రొక్కెదన్.

గీ. తదనుసంభవమణిని సుదక్షిణాప
రిణయముఖకావ్యరచనాధురీణు సంద్ర
కవికదంబములోనఁ బ్రఖ్యాతిఁ గన్న
యన్నపకవీంద్రు ధీసాంద్రు నభినుతింతు.

1. Indian Antiquary; vol. XXI, p. 200.

2. Sewell's Antiquities; Vol. I, p. 46. Kistna District Manual.

3. ఈకావ్య మచ్చుపడలేదు. శ్రీయుత మానవల్లి రామకృష్ణకవిగారియొద్ద నున్నది. వీరు వ్రాయించినప్రతి యొకటి మా కిచ్చినారు, కృతజ్ఞులము. కావ్య మంతగా నెక్కువ యోగ్యతకలది కాదు.

sampath_Ebooks

కవిస్తుతిలో నిట్లు వ్రాసి, కృతిపతి తన్నుఁగూర్చి యిట్లు చెప్పినట్లు లీ కవి వ్రాసియున్నాఁడు :—

సీ. ప్రౌఢి మీ పెదతాత పాండురంగాది స
 త్కృతులు సేసెను రామకృష్ణసుకవి
అనుఁజుఁ డన్నప్ప మీపినతాత రచియించెఁ
 బరఁగ సుదక్షిణాపరిణయంబు
మీతాత శ్రీగిరి చాటుకీవిఖ్యాతి
 శ్రీశైలమాహాత్మ్యకృతి యొనర్చెఁ
గడిమి మీతండ్రి యుమ్మడిరామకృష్ణాఖ్యుఁ
 డవఁ గీర్తి గనె సంస్కృతాంధ్రములను
దొరు లనిపించె మీయన్న వీరరాఘ
వాఖ్యకవి సర్వకవితామహత్త్వమునను
నిన్ననూచానసంతాను నెన్నఁ దరమె
ప్రాజ్ఞహృదయాబ్జరవి రామభద్రసుకవి!

పై పద్యములనుబట్టి చూడ తెనాలిరామపండితునకు రామకృష్ణుఁడు, శ్రీగిరి, అన్నప్ప (అన్నయ) అను ముగ్గురు పుత్రులుండి రనియు, వారు ముగ్గురును కవు లనియు, వారిలో మొదటివాఁడు పాండురంగమాహాత్మ్యాదికృతులును, రెండవవాఁడు శ్రీశైలమాహాత్మ్యమును, మూఁడవవాఁడు సుదక్షిణాపరిణయమును రచించెననియును తెలియుచున్నది. రామకృష్ణునితండ్రిపేరు 'రామయ' యైనట్లుపాండురంగమాహాత్మ్యములోని 'రామయరామకృష్ణ' యను ప్రయోగమువలన స్పష్టము.

తెనాలి రామకృష్ణుఁడు ప్రథమశాఖానియోగి, యనఁగా శుక్లయజుర్వేదీయయాజ్ఞవల్క్యశాఖవాఁ డనియు, కౌండిన్యగోత్రుఁ డనియు 'లక్ష్మమ్మ' కుమారుఁ డనియుఁ, బాండురంగమాహాత్మ్యశీమండలికృత్యాదిపద్యములవలనఁ దెలియుచున్నది. కావున నాతని తమ్ముఁ డైన అన్నయ్యకుఁగూడ నావిశేషములు చెల్లు నని మన మెంచుకొనవచ్చును. కాని యిద్దఱుగురువులును (మంత్రగురువులు) వేఱువేఱు. రామకృష్ణుఁడు తనగురువు నిట్లు వర్ణించినాఁడు:—

క. వాక్కాంతాశ్రయభట్టరు
 చిక్కాచార్యుల మహాత్ము శ్రీగురుమూర్తిన్
నిక్కపుభక్తి భజించెద
నిక్కవ్యకళాకలాప మీడేరుటకున్. —పాండు. ౧.

అన్నయ్య తనగురువునుగుఱించి యిట్లు చెప్పియున్నాఁడు:-

క. కందాళభావనార్యుల
 నందను శ్రీరంగగురుని నతబుధరక్షా
మందారంబు నుతింతును
మందారమరందబిందుమధురారభటిన్. [౧. ౮.

ఇ ట్లీకవికి మతసంబంధ మైన గురువు వైష్ణవుఁ డయినను, తన్ను గుఱించి యీతఁడు 'హరపదాంభోజసాముఖ్యుఁడ' ననియు (౧. ౧౪), ఆశ్వాసాంతగద్యమునందు 'సహజశైవాచారసంపన్న శ్రీమదన్నయనామధేయ' యనియు వ్రాసికొనుటయు వింతగ నున్నది. ఈతనికి మతవిషయమై శ్రీరంగాచార్యుఁడు గురువుగ నున్నను విద్యావిషయమై పాలగుమ్మి భీముఁ డనునతఁడు గురువుగ నున్నట్టు మన మీక్రిందిపద్యమువలన నూహింపవచ్చును.

గీ. నన్నపార్యాదులను బుద్ధి సన్నుతించి
 పాలగుమ్మి భీమగురుని సద్భక్తిఁ గొలుతు. [౧. ౯.

కవికాలనిర్ణయము :— ఈ కవి రామకృష్ణుతమ్ముఁ డగుటచే నాతనికాలమే యీతనికాలము. కాని రామకృష్ణునికాలము నిశ్చయముగ నింకను తేలలేదు. కనుక నీతనికాలము స్వతంత్రముగ నిర్ణయింపఁ బ్రయత్నించెదము. ఈ ప్రయత్నము రామకృష్ణకవికాలనిర్ణయమునకుఁ గూడ సహకారి కావచ్చును.

ఈ కావ్యము (సుదక్షిణాపరిణయము) పులిజాలసోమామాత్యునకు నంకితము చేయఁబడినది. ఈ యమాత్యశేఖరుఁడు కోనేటిరామరాజు అనురాజునొద్ద మంత్రిగా నుండెను. ఈరామరాజును, కృష్ణదేవరాయలయల్లుఁ డైన అళియరామరాజును నేకవంశమువారు. ఆర్వీటి బుక్కరాజుకుమారుఁ డైన రామరాజిద్దఱకును మూలపురుషుఁడు. కోనేటిరామరాజు అళియరామరాజునకు వరుసకు మనుమఁడు. వీ రిద్దఱకును గల సంబంధ మీక్రిందివంశవృక్షమువలనఁ దెలియఁగలదు[1].

ఆర్వీటి బుక్కరాజు
 |
రామరాజు
 |
- తిమ్మరాజు
 - పినకొండరాజు = కోనమ్మ
 - తిమ్మరాజు = వెంగళాంబ
 - కోనేటి రామరాజు
- కొండరాజు
- శ్రీరంగరాజు
 - అళియరామరాజు

ఈతఁడు వరుసకు మనుమఁ డైనను అళియరామరాజుయొక్క చివరదశయం దున్నట్టు కానవచ్చుచున్నది. అళియరామరాజు మిక్కిలి

1. ఈవంశవృక్షము వసుచరిత్రమును, సుదక్షిణాపరిణయమును అనుసరించి వ్రాయఁబడినది. మొదటిదానియందు శ్రీరంగరాజు వంశము వర్ణింపఁబడినది; రెండవదానియందు తిమ్మరాజువంశము వర్ణింపఁబడినది. ఈవంశవృక్షమునందు మనకు వలసినంతవఱకే పేర్లీయఁబడినవి. తక్కినవి విడిచిపెట్టఁబడినవి. శ్రీరంగరాజునకు నైదుగురు కొడుకులు గలరు. వారిలోఁ బ్రస్తుతవిషయమునకు నావశ్యక మని యొక్క అళియరామరాజుపేరు నుదాహరించి మిగిలినపేర్లు విడిచిపెట్టితిమి.

sampath_Ebooks

వృద్ధుఁడై హానుఁడైనందున నాతనికి మనుమలు పుట్టియుండుట యొకయాశ్చర్యము కాదు. మనుమఁడైన యీ కోనేటి రామరాజు అళియరామరాజునొద్దనుండి కొంతరాజ్యమును బడసినట్లు సుదక్షిణా పరిణయమందలి యీక్రిందిపద్యమువలనఁ గాన్పించుచున్నది:—

మ. స్మరజిద్విక్రమధాముఁడాయళియరామక్ష్మావరోత్తంసుచే
గురుసామ్రాజ్యధురంధరత్వమునుఁ డాకోనేటి రామాధిప
స్థిరసైన్యాధిపుఁడబ్బమంత్రి వరియించెన్ యజ్ఞమాంబన్ మనో
హరభాగ్యోన్నతిఁ గంకిపాటిపురవేదామాత్యపుత్రీమణిన్. [౧-౪౭.

రామరాజు ౧౫౬౫ లో తాళికోటయుద్ధమునందు వీరమరణము నొందుట సుప్రసిద్ధమే. కావున నాతనిచే రాజ్యమును బొందిన కోనేటిరామరా జప్పటికిఁ జిన్నవాఁ డని అనుకొనినను ఆతనిమంత్రికి నంకిత మిచ్చినకావ్యము ౧౫౮౦ కంటెఁ దరువాతికాలమున వ్రాయఁబడిరయె నని తలంచుటకు వీలు లేదు. మేము చూపినపైప్రమాణముఁ జూపకపోయినను, ఉభయరామరాజులసంబంధమునుబట్టియు, మఱికొన్నిప్రమాణములనుబట్టియు శ్రీవీరేశలింగముగారు[1] ఈ కవికాలము ౧౫౮౦-వ ప్రాంత మనియు, శ్రీరామకృష్ణకవిగారు[2] ౧౫౬౫ అనియు వ్రాసియున్నారు. కావున నీకవియేమి, యితనియన్నయైన రామకృష్ణుఁడేమి క్రీ. శ. పదునాఱవశతాబ్దియొక్క మూఁడవ నాల్గవపాదములలోనివా రనుట స్పష్టము. నిశ్చయముగ నీయేటనే పుట్టి ఈయేటఁ గీర్తిశేషులైరని చెప్పుటకు వీలు లేదు.

సుదక్షిణాపరిణయము ౧౫౬౭-వ సంవత్సరముతరువాతను, ౧౫౭౭-వ సంవత్సరమునకుఁ బూర్వమున రచింపఁబడె ననుటకు నొకనిదర్శన మిందుఁ గానవచ్చుచున్నది. ద్వితీయాశ్వాసమునందు శివుఁడు తపస్సుచేయుచున్న రాజుకడకు, మాయాబ్రాహ్మణువేషము వేసికొని వచ్చి తననివాసస్థలము చెప్పుటలో నిట్లు చెప్పెను:—

క. పెనుగొండ నిలుతుఁ దలుచుగ
మన పెనసి ధనాఢ్యుఁ డొకఁడు మముఁ గూడుక రాఁ
జనవున సకలజనంబులుఁ
బని సేయఁగఁ గొదవ లేనిబలఁగముతోడన్. [౨-౨౯.

ఈ పద్యమునందు 'పెనుగొండ' శబ్దముపై శ్లేష గల దనుట స్పష్టము. పెద్దకొండమీఁద నని యొకయర్థము, పెనుగొండపట్టణమున నని రెండవయర్థము. కవి యిట్లు పెనుగొండశబ్దమును ఉపయోగించుటకు నప్పుడు పెనుగొండ గొప్పపట్టణముగను, రాజధానిగను ఉండవలెను. లేనిచో శ్లేషసారస్యము కానుపించదు. పెనుగొండకు తిరుమలరాయలు ౧౫౬౭ లో తనరాజధానిని మార్చెను. అప్పటి ౧౫౭౭ వఱకు నుండి యప్పటినుండి యాయేట చంద్రగిరికి రాజధానిని మార్చెను.[3]

కావున ఈ కాలములోనే యీ కావ్యమును కవి రచించియుండవచ్చు నని మన మూహించుటకు వీలు కలదు. పై పద్యమునందలి 'ధనాఢ్యుఁడు' అనుపదము శ్లేషచేఁ గుబేరునకును, తిరుమలరాయలకును చెల్లు ననికూడఁ దోఁచెడిని.

కృతిపతి:— ఈ కృతి నంకితము పొందినవాఁడు పులిజాల రామయామాత్యకుమారుఁడైన పులిజాల సోమయామాత్యుఁడు (౧. ౧). కవి యీతనివంశమును, ఈతనియేలికయైన కోనేటి రామరాజువంశమును సవిస్తరముగ వర్ణించియున్నాఁడు. కృతిపతియు, నాతనితమ్ముఁ డగు అబ్బన్నయుఁ దప్ప నీవంశమునం దితరు లెవరును రాజులయొద్ద గొప్పయుద్యోగములలో నున్నట్లు కానరాదు. వీరిది కాశ్యపగోత్రము. సోమయ్యకు నేడవపురుషుఁడు మల్లయ్య. ఆతని నాల్గవకొడుకు పోచన్న, ఆతనిపెద్దకొడుకు నాగన్న, ఆతనికడసారి మూఁడవకొడుకు పోచన్న, ఆతనిపెద్దకుమారుఁడు దుగ్గయ్య. దుగ్గయ్య కిద్దఱు కొడుకులు; రామయ్య, వీరయ్య. రామయ్యభార్య తిమ్మాంబ. ఈదంపతులకుఁ జెద్దకుమారుఁడు సుదక్షిణాపరిణయకృతిపతియైన సోమయామాత్యుఁడు. ఆతనికి ఎల్లయ, అబ్బన, కోటయ, దుగ్గయ లను తమ్ము లుండిరి. వీరిలో అబ్బన యనునతఁడు కోనేటి రామరాజునొద్ద సైన్యాధిపుఁడుగ నుండెను. సోమయామాత్యునిభార్య వైకుంఠమ్మ. కొడుకు వెంకటయ్య. ఇంతకంటె వీరినిగుఱించి మనకు నధిక మేమియుఁ దెలియదు.

నివాసస్థలము:— గ్రంథకర్తనివాసస్థలము గాని, కృతిపతినివాసస్థలము గాని నిశ్చయముగఁ దెలియుటలేదు. గ్రంథకర్త కృతిపతినిగుఱించి వ్రాయుచు 'మహాహట్టబాదాలిపట్టణశ్రీకిరీటం బగు కొలువుకూటంబునఁ'[4] గూర్చుండి తన్ను పిలిపించినట్లు వ్రాసియున్నాఁడు (౧. ౧౨); కాని యీబాదాలి యెక్కడ నున్నదో తెలియదు. 'బాగాలి' యను గ్రామ మొకటి బళ్లారిజిల్లా హరపనహళ్లితాలుకాలోఁ గలదు. కోనేటిరామరాజు మొదలయినవారు దత్తమండలములలోనే చిన్నజమీన్దారులుగ నుండి రని తోఁచుచున్నది. అయినను ఇది యింకను శోధింపవలసినవిషయము.

---

1. ఆంధ్రకవులచరిత్రము, ౨-వ భాగము.

2. తెనాలి అన్నయ్య. ఆంధ్రపత్రిక - సంవత్సరాదిసంచిక ౧౯౧౮, ౯౯ పుట.

3. Brigg's Ferishta; vol. 3, p. 141.

4. రాజమహేంద్రవరమునందు చింతామణిముద్రాక్షరశాలాధికారులచే ౧౯౦౬ లోఁ బ్రకటింపఁబడిన సుదక్షిణాపరిణయముయొక్క రెండవకూర్పు మేము ఉపయోగించినాము. మాకుఁ బ్రత్యంతరము దొరకలేదు, కావున 'బాదాలి' యనుపాఠము సరియైనది కాదని నిశ్చయముగఁ జెప్పుటకు వీలు లేదు.

sampath Ebooks

సుదక్షిణాపరిణయకావ్యము :— సుదక్షిణాపరిణయ మయిదాశ్వాసములకావ్యము. ఇందు రమారమి నూట మిద్దివందలపద్యములు కలవు. ఇందు సూర్యవంశపురాజయిన దిలీపుని కథ కలదు. కాళిదాసుడుకూడ తన రఘువంశకావ్యమును ఈరాజుచరిత్రము తోడనే ప్రారంభించెను. కాని యితడు సుదక్షిణను వివాహ మాడి కొంతకాలము ప్రభుత్వము చేసినతరువాత జరగినవృత్తాంతము రఘువంశమునందు చెప్పబడెను. ఈకావ్యమునందు వివాహమునకు బూర్వము జరగినవృత్తాంతము వర్ణింపబడినది. దిలీపునకు నిందు ముతికిని జరిగినవివాహముతో నీకావ్యము ముగియును. ఈ కావ్యమందలి కథ సంగ్రహముగ నీక్రింద నిచ్చుచున్నారము :—

అంశుమంతుడను నొకడు అయోధ్యాపురంబు నేలుచుండెను. అతడు మాళవరాజుసుతయగు భానుమతిని పరిణయ మాడెను. వారికి కొన్నాళ్లకును సంతానము కలుగదయ్యెను. అంత నంశుమంతుడు రాజ్యమును మంత్రి కొప్పగించి, భార్యను వెంటగొని, మేరుపర్వతమున కేగి శివునిగూర్చి ఘోరతప మాచరింప సాగెను. అతడు చేయుతపమున కింద్రాదులు వెఱచి శివునికడ కేగి, అతని తపోనివారణము లొనరుప మని వేడుకొనిరి. శివుడును వల్లె యని వారి నంపి 'అర్థార్థికల్పశాఖి' యను నిజభక్తుని జూడర మ్మని పార్వతిని బిల్చెను. 'రాజులు దుష్టచిత్తులు. వారికి భావశుద్ధి యుండ' దని యామె పలుక 'నీ సందేహమును దీర్చెదను, నాతో ర' మ్మని శివుడా మెను దోడ్కొనిపోయెను. అట నంశుమంతుడు భోజనముం జేయదలచి అతిథికొఱ కెదురు చూచుచుండెను. ఇంతలో నచ్చటికి ముసలిబ్రాహ్మణదంపతులవేషములతో పార్వతీపరమేశ్వరులు వచ్చి, తమకు సంతానము లేనందున వగచుచుండ నొకసిద్ధుడు దమ్ము కనికరించి మేరుప్రాంతమున దప మొనరించుచున్న అంశుమంతుని భార్యాసహితముగా కాళికాదేవికి బలి యిచ్చిన నామె ప్రసాదించు నని చెప్పె ననియు, వా రున్నచెలవుము జూప వేడెద మనియు బల్కిరి. అప్పు డా రాజదంపతులు తమ్ము దెల్పుకొని బ్రహ్మోర్పణతత్పరులై కపటవేషధారులను వెంబడింప సమకట్టిరి. అది చూచి శివుడు సాక్షాత్కరించి, నిజభక్తునికి పుత్రవర మొసంగి, పాశుపతాస్త్రమును సమంత్రకముగ ననుగ్రహించి చనియె. కొన్నాళ్లకు భానుమతీదేవి యొకశుభలగ్నమున నొకసుతునిం గాంచెను. అప్పు డాకాశవాణి వానికి దిలీపు డని నామకరణముం జేసెను. దిలీపుడు దినదినప్రవర్ధమానుడై యౌవనవంతుడు కాగా, అంశుమంతు డతనికి బట్టము గట్టి తపము జేయ వనమున కరిగెను.

వనధర విద్యున్మాలిక లను విద్యాధరదంపతులకు గంధగజు డను పుత్రుడు జనించెను. ఒకనా డతడు కొందఱప్సరసల వెంట నిడుకొని విశ్వామిత్రునితపోవనమునం బ్రవేశించి, అందు స్వేచ్ఛమై విహరించి సీధుపానముం జేయుచుండెను. అది చూచి విశ్వామిత్రుడు మహోగ్రుడై రాక్షసుడవు గమ్మని యావిద్యాధరునికి శాప మొసంగెను. అంతట నతడు రాక్షసాకృతి వహించి మాయావతి యనుపురమును నిర్మించి రత్నచూడాభిధానుడై పరగుచు, నన్నిలోకములను జయించి యింద్రునిరాజధాని యైన అమరావతిపై దండువెడలెను. మొదట నతడింద్రు నోడించి జయలక్ష్మీకరగ్రహణ మొనర్ప నెంచెను గాని, జయంతుడు విజృంభించినందున నప్పటికి ముట్టడి చాలించి, నిజపురమున కేగక బ్రహ్మనుగూర్చి జలధరాశ్రమమున దపము జేయబోయెను.

దిలీపుడు వైభవముతో రాజ్యము నేలుచుండెను. ఒకనా డతడు కొల్వు దీర్చి యుండ ధూమకు డను బోయవేటకాడు వచ్చి సింహ మొకటి దేశము నంతయు బాధుచేయుచున్న దనియు, దాని నెట్లయిన సంహరింపవలయు ననియు వేడుకొనెను. దిలీపు డంత వేటవెడలి, సింహమును వేటాడి బాణ మేయ నది యదృశ్యమై స్త్రీరూపముం జెంది యిట్లని తనకథను దెల్పెను: "నేను హారిణి యను అప్సరసను. ఒకనా డింద్రుడు నన్ను బిలిచి వీతహవ్యముని తపము జెఱుపబంచెను. నేనును వల్లె యని యెంత ప్రయత్నించినను, ఆముని నిశ్చలుడై యుండె. అంత నే నాతనికంతము గిరి 'సింహము గిర నిదిగో చూడు' మని పల్క నతడు కోపించి నన్ను సింహమూర్తినై సంచరింపు మని శపించెను. నే నతనిని వేడుకొన నతడు కరుణించి 'దిలీపునివలన నీకు ముక్తి కలుగగల'దని చెప్పెను. అంతకుముం దొకనాడు నారదు డింద్రునికడకు వచ్చి 'రత్నచూడు డనురాక్షసుడు బ్రహ్మవలన దా నెవ్వరిచే మృతి నొందునో, వానితల వేయివ్రక్కలగునట్లు వరముంబొందె' నని చెప్పెను. అప్పు డింద్రుడు బ్రహ్మను ప్రశ్నింప నత డొకానొకకన్యను పరిణయ మాడు దిలీపు డతనిని సంహరింప గల డని పల్కెను. ఆలతాంగి ఎవ్వనిపుత్రికయో వినబడరాదయ్యె." ఇట్లు చెప్పి యాయప్సరస యదృశ్యమయ్యెను.

అప్పుడు దిలీపుని వెదకికొనుచు నిజసైన్యములు వచ్చిచేరెను. దిలీపుడు జరిగినసంగతి తనమంత్రి యగుసుదర్శనునికి దెల్పి యాకన్యనుగూర్చి యెఱుగుదువే యని యడుగ నత డిట్లు చెప్పసాగెను: "నే నొకనా డుద్యానవనమున విహరించుచుండ నొకడేగచే దఱుమబడుచున్న చక్రవాకి వచ్చి నాశరణు వేడెను. అంతట నేను చక్రవాకి కభయహస్త మిచ్చి, డేగను భస్మ మొనర్చితిని. డేగ రాక్షసాకారమున బడెను. చక్రవాకియు స్త్రీ యయ్యె. అప్పు డాశ్చర్యచకితుడనై తద్వృత్తాంత మడుగ నాస్త్రీ యిట్లని చెప్పెను: 'నేను సాధ్యలోకాధిపతి యగు చంద్రపాలునికూతురను. నాతండ్రికిని, మగధరాజగు సురథునికిని జాల స్నేహము. ఇట్లుండ రత్నచూడుడు మగధరాజుపై దండెత్తి చంపకావతిని ముట్టడింప, నత డా రాక్షసుని ప్రతాపాగ్నికి తాళలేక తొలగిచని, శాండిల్యముని యొద్ద కరిగి రత్నచూడుని సంహరింపజాలు పుత్రు నిమ్మని వేడెను. అంత నమ్మునియుపదేశానుసారమున సురథుడు గంగాతీరమున

sampath_Ebooks

యజ్ఞము జేయ అగ్ని ప్రత్యక్షమై యొకకన్యను ప్రసాదించి, సుదక్షిణ యని నామకరణముం జేసి యదృశ్యుఁడయ్యె. కొన్నివత్సరముల కాబాలికకు యౌవనము ప్రాప్తించె. ఈసంగతిని కలహభోజనుఁ డగు నారదుఁడు రత్నచూడునకుఁ దెల్పనతఁడు చంపకావతిపై మరల దండెత్తి 'నీకొమార్తె నిచ్చుటొండె, నీరాజధాని దహన మగుటొండె' యని సందేశ మంపెను. అంతటఁ నతఁడు చేయున దేమియును లేక విష్ణుదేవుని బ్రార్థింప నతఁడా పురమును చీమ చిటుకు మనకుండ బ్రహ్మనివసించుశైలమునకుఁ జేర్చెను. రాక్షసుఁ డీమోసము గ్రహించి నిజపురంబున కేఁగి సురఘునినెలవు కనుఁగొన చారులఁ బంచె. నే నొకనాఁడు సురఘునిసౌధమున కేఁగుచుండ రక్షితెతనుఁ డనురాక్షసుఁడు నన్ను బల్మిమైఁ బట్టరా నేను నక్రినైతిని, అంత నతఁడును శ్యేన మయ్యె'. ఇట్లు చెప్పి యాస్త్రీ స్వర్గలోకమున కరిగె." ఇవ్విధమున సుదక్షిణనుగూర్చి తెలిసికొని దిలీపుఁడు మన్మథానలతప్తుఁ డయ్యెను. అప్పుడు రౌద్రవదనుఁ డను రాక్షసమంత్రి వినువీథి నేఁగుచు 'హా! సుదక్షిణా!' యని విరహార్తింగుందుచున్న రాజును గాంచి 'అతఁడే సుదక్షిణను వరించుదిలీపుగా గ్రహించి, వానిని, సుదర్శనుని తనవిమానమున నిడుకొని యేఁగుచుండెను. ఈసన్నఁజలిసి దిలీపుఁడు రాక్షసుని వధించి పుష్పకము నెక్కి కొంతద వ్వేఁగ నచ్చట నొకయుద్యానవనము గాన్పింపదిగిరి. అప్పుడు వనదేవత వారికి ప్రత్యక్షమై, సుదక్షిణ యచ్చటనే విరహబాధ నొందుచున్న దని తెలుపఁగా వారు సఖీజనపరివృతయైనసుదక్షిణను డాసిరి. అట్లు సుదక్షిణాదిలీపు లన్యోన్య సందర్శన భాగ్య మనుభవించుచుండ నొకపులి లేడిపిల్లను జఱుముకొని వచ్చినందున స్త్రీ లందఱును తలయొకదారిని పాఱిరి.

సుదక్షిణాకరగ్రహణ మొనరింపకపూర్వము రత్నచూడునిదునుమ నెంచి, దిలీపుఁడు నిజపురమున కేఁగి సైన్యముల సమకూర్చుకొని మందరశైలముమీఁదికి దాడివెడలి, మాయావతిని ముట్టడించెను. అంతఁ దుములయుద్ధము ప్రారంభమయ్యెను. అందు దిలీపుఁడు రత్నచూడుని పాశుపతాస్త్రమున సంహరించి, అతనితనువును బడబాగ్నిమధ్యమున వైచెను. తరువాత నొకశుభలగ్నమున సుదక్షిణాదిలీపులకు మహావైభవముతో వివాహమహోత్సవము జరగెను.

కావ్యవిశేషములు:— ఈ కావ్యముపేరు సుదక్షిణాపరిణయము, అయినను సుదక్షిణకథ చివర రెండాశ్వాసములలోమాత్రము వచ్చును. మొదటి మూఁడాశ్వాసములందును దిలీపునికథయే వర్ణింపఁబడినది. ఈకావ్యము రసముగలకావ్యములలో నొక్కటి యని చెప్పవచ్చును. మహాకావ్య మని కాని, లోకోత్తర మైన దని కాని చెప్పుటకు వీలు లేకపోయినను ఇందలి 'కవిత్వము సలక్షణమై మధురమై కర్ణరసాయనముగా నున్నది' యని శ్రీవీరేశలింగముగారి యభిప్రాయముతో నేకీభవించుచున్నాము. పాశ్చాత్యసాహిత్యవిమర్శనశాస్త్రనుసారము చూచితిమేని, ఇందు నేపాత్రయొక్కయు స్వభావోన్మీలనము కానరాదు. నాయకుఁడు దిలీపుఁడు, నాయిక సుదక్షిణ, ప్రతినాయకుఁడు రత్నచూడాసురుఁడు. వీరితరువాతఁ జెప్పఁదగినవారు దిలీపునితండ్రి అంశుమంతుఁడు, సుదక్షిణతండ్రి సురఘుఁడు. వీరిలో నాయిక మనకు విరహావేదనకాలమందు నొక్కసారి, మఱియు వివాహసమయమున నొక్కసారిమాత్రము కొలఁదికాలము కానవచ్చును (౫-వ ఆశ్వాసము). అప్పుడైనను ఒక్కమాటకూడ మాటలాడదు. కావున నామె దిలీపునికొఱకు విరహతాపము పడునట్టియొక చక్కనిస్త్రీ యన్నమాట తప్ప నామెనుగుఱించి మన మామెమాటలవలనఁ గాని, చర్యలవలనఁ గాని యేమియును నెఱుఁగఁజాలము. ఇఁక నాయకుఁడుమాత్రము మనకుఁ బెక్కుసారులు కానవచ్చును. ఎన్నిసారులు కానిపించినను యుద్ధము చేయఁగలవాఁడు, వేఁటాడఁగలవాఁడు, స్త్రీని మోహింపఁగలవాఁడుగఁ గానవచ్చును. మొట్టమొదట నింద్రుఁడు పరాజితుఁడై తనయొద్దకు రాఁగా నాతనిసాయమునకుఁ బోవ యత్నించుటయు, సింహముబారిఁ బడ్డనారికిఁ దొలఁగించుటకు వేఁటకుఁ బోవుటయు నాయకునియొక్క పరోపకారచింతను కొంతవఱకు సూచించుచున్నవి. కాని యిది శృంగారప్రబంధ మని కాఁబోలు కవి యీ మనోభావమును పూర్తిగఁ జిత్రించుటకు యత్నము చేయలేదు. ప్రతినాయకుఁడైన రత్నచూడునిచర్యలు నాయకునిచర్యకంటె బాగుగ వర్ణింపఁబడినవి. ఇతఁ డింద్రునిపట్టణముమీఁదికి, సురఘునిచంపకావతిమీఁదికి దండెత్తి పోయినప్రకరణములు చక్కఁగానే వర్ణింపఁబడినవి కాని భారత, భాగవతములలో హిరణ్యకశిపుఁడు మొదలయిన దానవు లమరావతిమీఁదికిఁ బోయినప్పుడు చేయఁబడినవర్ణనములకు సరిరావు. నాయకునితలిదండ్రులయిన భానుమతీఅంశుమంతులస్వభావోన్మీలనము చక్కఁగఁ జేయఁబడినది. వారు కపటవేషధారులైన శివపార్వతులకై తమదేహములను సమర్పించుటకు సిద్ధపడినప్రసంగవర్ణనముఁ జూచిన వారిసచ్చారిత్రమంతయు నొక్కసారి వెల్లడి కాఁగలదు. పాత్రయొక్క స్వభావావిష్కారమునకు నొక్కచిన్నప్రసంగము చాలును. పెక్కుపద్యములక్కఱలేదు. అంశుమంతుఁడు దిలీపునకు రాజ్యము గట్టి యరణ్యమునకుఁ బోవునప్పుడు కుమారునకుఁ బ్రజలను చక్కఁగఁ జూడు మని చేసినబోధవలన అతనిస్వభావము వెల్లడి యగుచున్నది. ఇట్లీకావ్యమునందుఁ దమగుణములచేఁ జదువరులగౌరవమునకుఁ బాత్రమై 'ఆహా! మంచివారం' డ్రనిపించుకొనుపాత్రలు అంశుమంతుఁడు, భానుమతియు నను వా రిద్దఱే. చదువరులకు నితరులయెడ సగౌరవము కలుగు నని కాదు; ఇతరుల విషయమై యౌదాసీన్యభావము కలుగును.

ఈకవి జాతీయములగు సామెతలను అచ్చటచ్చటఁ బద్యములందిమిడ్చి కావ్యమునకు శోభ తెచ్చెను. అందులకుఁ గొన్నియుదాహరణములు:—

'పేదతెవు లింక నంగడిఁ బెట్టకున్నఁ దీఱదు' (౨-౫౧)

'మూడంబోయెడుతీవ కాళ్లఁ దవిలెన్' (౨-౬౪)

'ఆడంబోయెడుపుణ్యతీర్థ మెదు రైనట్లు' (౨-౬౪)

sampath_Ebooks



'మృడునకు మ్రొక్కఁగఁ బోయిన గుడి మీఁదఁ బడినయట్లు' (౨-౭౦)

'కానఁ గాచినవెన్నల గాద బ్రతుకు' (౨-౭౫)

'కతకుఁ గాళ్లు ముంతకుఁ జెవులు గల్పించినట్లు' (౪-౨౫)

'కుంటేటికోడమకుఁ గొమ్ము చూపునట్లు' (౪-౨౫)

అచ్చటచ్చటఁ గొన్ని విడివర్ణనలు ఔచిత్యముఁ గల్గియున్నవి. ద్వితీయాశ్వాసమందలి మాయాబ్రాహ్మణఁ - బ్రాహ్మణీ (శివ, పార్వతుల) చర్యలు, తృతీయాశ్వాసమునందలి బోయవేటగానివర్ణనయు, మాటలును పఠనీయములు.

ఈకవి తనకంటెఁ బూర్వకవులయొక్కయు, తనకాలమువారియొక్కయు కావ్యములను జూచి వారికావ్యములలోని సీసపద్యముల మాదిరి, కొన్ని సీసపద్యములను రచించినట్లు కానవచ్చుచున్నది. ఈక్రిందికొన్ని యుదాహరణములను జూడుఁడు:—

సీ. ఆర్యసన్నుతమహోగ్రైగ్యనిర్జితపంచ
బాణుచే రక్షితబాణుచేత [౧-౨.

సీ. అపరంజి బలుగట్టు యతిమనంబులనట్టు
విల్లుగా నిల్లుగా వెలయునతని [౨-౧౧౬.

సీ. పైశున్యరసవసాఖ్యర్ణవుల్ కర్ణముల్
మాననివాసంబు మానసంబు. [౨-౭.

సీ. వైమోర్యరుచి మించువన్నెలు కన్నులు
తపనీయవిస్ఫూర్తిఁ దొలుఁ జెవులు [౩-౧౫౬.

సీ. అది సుధాకరబింబ మానొకో కాదొకో
కాదు చక్కని నెమ్మొగంబు గాని [౪-౧౧౩.

(కొ. వేం. ల.)

**అన్నలూరు** — కడపజిల్లా, ప్రొద్దుటూరుతాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౧,౩౧౦ (౧౯౩౧).

**అన్నవరం** — ౧. గుంటూరుజిల్లా, తెనాలితాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౧,౮౩౬ (౧౯౩౧).

౨. పశ్చిమగోదావరిజిల్లా, భీమవరముతాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౬౬౭ (౧౯౩౧).

౩. కృష్ణజిల్లా, దివితాలూకాయందలి జమీన్‌దారీ గ్రామము. జనసంఖ్య ౩౬౬ (౧౯౩౧).

౪. గుంటూరుజిల్లా, బాపట్లతాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౧,౪౬౨ (౧౯౩౧).

౫. నెల్లూరుజిల్లా, పొదిలితాలూకాయందలి జమీన్‌దారీగ్రామము. జనసంఖ్య ౩౨౩ (౧౯౩౧).

౬. కర్నూలుజిల్లా, కోయిలకుంట్లతాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౪౩౨ (౧౯౩౧).

౭. గుంటూరుజిల్లా, నర్సారావుపేటతాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౨,౦౦౮ (౧౯౩౧).

౮. నెల్లూరుజిల్లా, కావలితాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౧,౭౪౯ (౧౯౩౧).

౯. నెల్లూరుజిల్లా, దర్శితాలూకాయందలి జమీన్‌దారీగ్రామము. జనసంఖ్య ౯౮ (౧౯౩౧).

౧౦. కృష్ణజిల్లా, నందిగామ తాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౫౨౯ (౧౯౩౧).

౧౧. కృష్ణజిల్లా, నూజవీడుతాలూకాయందలి జమీన్‌దారీగ్రామము. జనసంఖ్య ౧౦౦౯ (౧౯౩౧).

౧౨. తూర్పుగోదావరిజిల్లా, పెద్దాపురంతాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౮౪౨ (౧౯౩౧).

౧౩. తూర్పుగోదావరి, ఏజెన్సీ జిల్లా, భద్రాచలంతాలూకాయందలి జమీన్‌దారీగ్రామము. జనసంఖ్య ౨౮౦ (౧౯౩౧).

౧౪. విశాఖపట్టణముజిల్లా, భీమునిపట్టణముతాలూకాయందలి జమీన్‌దారీగ్రామము. జనసంఖ్య ౧,౧౬౨ (౧౯౩౧).

౧౫. విశాఖపట్టణముజిల్లా, గొల్గొండతాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౯౭౪ (౧౯౩౧).

౧౬. విశాఖపట్టణముజిల్లా, పాలకొండతాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౪౫౦ (౧౯౩౧).

౧౭. విశాఖపట్టణముజిల్లా, వీరఘట్టంతాలూకాయందలి జమీన్‌దారీ గ్రామము. జనసంఖ్య ౩౩౦.

**అన్నవరప్పాడు** — గుంటూరుజిల్లా, నర్సారావుపేటతాలూకాయందలి ఈనాంగ్రామము. జనసంఖ్య ౫౨౩ (౧౯౩౧).

**అన్నవరముఅగ్రహారము** — విశాఖపట్టణముజిల్లా, బొబ్బిలితాలూకాయందలి ఈనాంగ్రామము. జనసంఖ్య ౬౬౨ (౧౯౩౧).

**అన్నసముద్రం** — కర్నూలుజిల్లా, మార్కాపురంతాలూకాయందలి ఈనాంగ్రామము. జనసంఖ్య ౧,౪౧౧ (౧౯౩౧).

**అన్నా** — ఆసియాఖండమందలి తుర్కీదేశములోనియొకపట్టణము. ఇది బాగ్దాద్ సరిహద్దులో 'యూఫ్రిటీస్' నదియొడ్డుననున్నది. దీనియెదుట ఫలవంతములైన సుక్షేత్రములుగల చిన్నచిన్న

sampath_Ebooks



ద్వీపములు కలవు. ఇది యొడారినడుమ నున్న పట్టణ మగుటచే బాట సారులు విరమించుటకై మిక్కిలి యుపయోగకరముగ నుండును. పూర్వకాల మందలి నాల్గుదుర్గములవుత్తరి చటం గలవు.

**అన్నా ఐవనోవ్నా** — (౧౬౯౩ - ౧౭౪౦) రష్యా దేశమునకుం జక్రవర్తిని, ఐదవ ఐవన్ అను రాజునకుం గూంతురు, పీటర్ ది గ్రేట్ అనువానికి సవతిచెల్లెలు. ౧౭౩౦ లో రెండవ పీటర్ చనిపోంగా నీమె రాజ్యమునకు వచ్చెను. ఈమె స్వేచ్ఛగ నిరంకుశముగ ప్రభుత్వము చేసెను. బిరన్ అనువాం డీమెకృపకుం బాత్రుం డయ్యెను. వాని కీమె మంత్రిత్వ మొసంగినందున వాండు ప్రజలను మిక్కిలి పీడించెను.

**అన్నాకోమ్నేనా** — (౧౦౮౩ - ౧౧౪౮) బైజంటు యిన్ దేశపురాజపుత్రి. ఈమె విదుషీచరిత్రగ్రంథమును వ్రాసెను. పండితులకు నాశ్రయ మిచ్చెను. ప్రథమ అలెగ్జియస్ (Alexius I) అను రాజునకుం గూంతురు. ఈమెభర్తపేరు నిసెఫోరస్ బ్రయన్ని యస్ (Nicephorus Bryennius). తండ్రిమరణసమయమునందు నీమె యాతనిరాజ్యము తనభర్త కిమ్మని వేండెను. కాని యాతం డందుల కొప్పుకొనలేదు. తరువాత నీమె తమ్ముండు రాజయ్యెను. అతనిని జంప నీమె కుట్ర పన్నెను. కుట్ర వెల్లడియైనందున నీమెయు, నీమెభర్తయు గ్రీసుదేశమునకుం బాఱిపోయిరి. తరువాత నీమె తన కాల మంతయు విద్యావ్యాసంగమునందే కడపెను. ఈమె 'అలెగ్జి యాడ్' అను కావ్యమును రచించెను. అందు తనతండ్రిచరిత్రమును వర్ణించెను.

అన్నాజీదత్తు — శివాజీయొక్క విశ్వాసపాత్రులగు సేనానాయకులలో నొకండు. ఇతండు మిగుల శౌర్యశాలియై యనేక యుద్ధములందు శివాజీకిం దోడుపడియుండెను. క్రీ. శ. ౧౬౬౦-వ సంవత్సరమున పేష్వా, నీలోపంతుసోనదేవులకు సహాయుండై యితండు మొగలాయీలను మహారాష్ట్రమునుండి వెడలనడంచెను. అఫ్జల్ ఖానుమరణానంతరము మహారాష్ట్రులు విజాపురరాజ్యప్రదేశముల ననేకముల వశము గావించుకొనసాగిరి. వానిలో కొల్హాపుర సమీపమందలి పన్హాలాదుర్గము నన్నాజీయే వశము చేసికొనెను. మఱియొకసమయమున నితండు హుబ్లీ నగరమును జయించి యచటి వస్త్రాగారముల స్వాధీనము గావించికొనెను. శివాజీ దక్షిణదండ యాత్రలకుం బోవునపు డతనిచే నియోజితుండై యన్నాజీ సరిహద్దు దేశములం బాలించియుండెను. ఔరంగజేబువలన నిమంత్రితుండై ఢిల్లీకిం బోవునవసరమున శివాజీ యన్నాజీయాధిపత్యముగల యొక సంఘమునకుం దనరాజ్యము నొప్పగించిపోయెను. ఇతండు శివాజీ రాజ్యాభిషేకసమయమున ఛత్రధారణ మొనరించెను. శివాజీమరణా నంతర మితండు సంభాజీకి విరుద్ధముగం బనిచేసియుండుటవలన నతండు జయించి సింహాసన మెక్కినతోడనే యన్నాజీని చంపించెను.

అన్నాపురము — గంజాంజిల్లా, టెక్కలి తాలూకా లోని జమీందారీగ్రామము. ఇచటి జనసంఖ్య ౧౨౭ (౧౯౩౧).

అన్నారెడ్డిపాలెం — నెల్లూరుజిల్లా, కోవూరుతాలూ కాయందలి గ్రామము జనసంఖ్య ౧,౪౯౩ (౧౯౩౧).

**అన్నిగిరి** — బొంబాయి కోస్తాలోని ధార్వాడ్ జిల్లాలో నున్న నవల్గుంద్‌లోని యొక గ్రామము. ధార్వాడ్ నుండి గదగ్ మీందుగా బళ్లారికి వెళ్లురస్తామీంద నున్నది. ఈగ్రామమునకు దక్షిణమహారాష్ట్ర-యినుపదారియొక్క స్టేషను కలదు. ఇచ్చట కాయ ధాన్యము, ప్రత్తియొక్క వ్యాపారము విశేషముగా కలదు. ఇక్కడ ప్రతివారమును సంత జరుగును. ఈగ్రామముయొక్క విశేష మేమనంగా, ఇచ్చట నమృతేశ్వరునిదేవాలయ మొకటి గలదు. దీనిని జఖనాచార్యులు కట్టించె నందురు. ఇది ౭౬ స్తంభములమీంద నిలిచి యున్నది. ౧౧౫౭ మొదలు ౧౨౦౮ సంవత్సరముల నడుమ లిఖించిన శాసనములు దేవాలయమున నున్నవి. ౧౧౬౧-వ సంవత్సరమున బిజ్జలుం డను కలచురియోధుండు పడమటిచాళుక్యుల నోడించి, అన్నిగిరిని ముఖ్యపట్టణముగా చేసికొనెను. ఆంగ్లేయప్రభుత్వము యొక్క ఆదియందు నీపట్టణము నిపానిప్రభువుజాగీరులో నొకటిగా నుండెను. అటుపిమ్మట ౧౮౩౯-వ సంవత్సరమున బ్రిటీషువారిక్రిందికి వచ్చెను. ఈ పట్టణమందు నాలుగుపాఠశాలలు గలవు. అందులో నొకటి బాలికలకుంగాను నియమింపబడినది.

అన్నుపురము — ౧. గంజాంజిల్లా, పర్లాకిమిడి తహ శీల్‌లోని జమీందారీగ్రామము. జనసంఖ్య ౩౯౭ (౧౯౩౧).

౨. గంజాంజిల్లా, పర్లాకిమిడి తాలూ కాయందలి ఈనాంగ్రామము. ఇచటి జనసంఖ్య ౧౯ (౧౯౩౧).

అన్నూరు — చిత్తూరుజిల్లా, పుత్తూరుతాలూకాయందలి జమీందారీగ్రామము. జనసంఖ్య ౧,౫౧౨ (౧౯౩౧).

అన్నూరుకస్బా — చిత్తూరుజిల్లా, పుత్తూరుతాలూకా యందలి జమీందారీగ్రామము. జనసంఖ్య ౯౩ (౧౯౩౧).

అన్నెబోయినిపల్లి — నెల్లూరుజిల్లా, కందుకూరుతాలూ కాయందలి జమీందారీగ్రామము. జనసంఖ్య ౫౦౭ (౧౯౩౧).

అన్నెరావుపేట — కృష్ణజిల్లా, నూజవీడుతాలూకా యందలి ఈనాంగ్రామము. జనసంఖ్య ౩౮౬ (౧౯౩౧).

అన్యతఃప్లక్షము — కురుక్షేత్రమునందలి యొక సరోవరము (శతపథబ్రాహ్మణము., ౧౧. ౫. ౧. ౪).

**అన్యథానుపపత్తి** — మీమాంసకులమతమున నొక ప్రమాణము. ఇది అర్థాపత్త్యంతర్గతము. బలిసినభద్రయ్య పగలు

sampath_Ebooks

భుజింపఁడు. అట్లనినతోఁడనే రాత్రి భోజనము చేయు నని యూహించుట అన్యథానుపపత్తి. బలియుటకు వేఱుకారణము లేనందున రాత్రి భోజనము చేయు నని యూహింపవలసియున్నది. ఈ బలుపు మఱొకవిధముగా సాధించుటకు వీలు లేదు. కావున దీనిని అన్యథానుపపత్తి యందురు కాని నైయాయికులు దీనిని స్వతంత్ర ప్రమాణముగ నొప్పుకొనరు. ఇదియు నర్థాపత్తియు ననుమాన ప్రమాణాంతర్గతములే యని వారిభావము.

**అన్యథాసిద్ధము** — ఇది న్యాయశాస్త్రవిషయక పదము. కారణము కాని దానిని, దానికి నిజమైనకారణముతోఁ గల సంబంధమునుబట్టి, కారణముగ నెంచినయెడల నది యన్యథాసిద్ధ మనఁబడును. కార్యమునకు నియతపూర్వ మయ్యును కారణము కానిదానిని అన్యథాసిద్ధ మందురు. ‘కార్యకారణములకు సంబంధ మెట్టిది? కారణ మెల్లప్పుడును కార్యమునకు నియతపూర్వవర్తిగ నుండవలయును’ అనునియమమునకు సరియైన యర్థము తెలియక కొందఱు నియతపూర్వవర్తు లయిన యన్నిపదార్థములను కారణములుగ నెంచెదరు. అవి అన్యథాసిద్ధములే కాని కారణములు కావు. ఘటమునకు కుమ్మరివాఁడు కారణము. ఎందులకు? నియతపూర్వవర్తి గనుక. అట్లే కుమ్మరివానితండ్రి గూడ నియతపూర్వవర్తియే. కావున వానితండ్రి, వానితండ్రితండ్రి — యిట్లందఱును ఘటమునకు కారణము లని చెప్పఁగూడదు. మన్ను లేనిది కుండ కానేరదు గనుక మన్ను కుండకుఁ గారణము. కాని గాడిద లేనిచో కుమ్మరి యామన్నును వానియొద్దకుఁ దేఁజాలఁడు గనుక వానిగాడిదయుఁ గుమ్మరి కుండకుఁ గారణ మని చెప్పవచ్చునా? కూడదు. గాడిద అన్యథాసిద్ధము. ఇట్లు కారణలక్షణము చెప్పునప్పుడు నియతపూర్వవర్తిత్వ మనఁగా లఘు నియతపూర్వవర్తిత్వ మని యర్థము చేసికొనవలయును; అనఁగా దేనికొఱకు దేనికొఱకే యెంత యుండిన కార్యము సిద్ధించునో యంతియే కారణమని యనవలయును. నియతపూర్వవర్తి యొక్క లఘుత్వము మూఁడు విధములు; శరీరకృతము, ఉపస్థితికృతము, సంబంధకృతము.

అన్యథాసిద్ధము లైదువిధములు :—

౧. కారణవృత్తి, లేక కారణతావచ్ఛేదకరూపధర్మము: కుమ్మరివానిదండము ఘటమునకుఁ గారణమే కాని తద్ధర్మమైన దండత్వము కారణము కాదు, అన్యథాసిద్ధము.

౨. కారణగుణము: దండము కారణమే కాని దండము యొక్క రూపము రంగు మొదలగునితరగుణములు కారణములు కావు. కావున కారణగుణము లన్యథాసిద్ధములు.

౩. వేఱుకార్యమునకుఁ బూర్వవర్తి (కారణము) అని తెలిసినదానిని, ప్రస్తుతకార్యమునకుఁ బూర్వవర్తిగాఁ జెప్పినయెడల నది అన్యథాసిద్ధ మగును. ఆకాశము శబ్దమునకుఁ గారణ మని తెలిసియు నాకాశమును ఘటమునకుఁ బూర్వవర్తిగ నెంచినయెడల నాకాశము అన్యథాసిద్ధ మగునేకాని కారణము కానేరదు.

౪. కారణముయొక్క కారణత్వము నపేక్షించుట. కుండకు కుమ్మరి కారణము; కుమ్మరివానికి వానితండ్రి కారణము. కావున కుమ్మరివానియొక్క తండ్రి కారణముయొక్క కారణము. అందుచే నన్యథాసిద్ధము.

౫. ఘటమునకు కుమ్మరివానిగాడిద కారణము కాదు. అన్యథాసిద్ధము.

ఇందును గుఱించి ‘కారణము’ అను శబ్దముక్రింద వివరముగాఁ జర్చింపఁబడును.

**అన్యాక్రాంతము** — ఇది ఆస్తిని ప్రత్యేకించుటకుఁ గాని, నిడఁదీయుటకుఁ గాని పేరు. వ్యవహారమున ఆస్తిని బుద్ధిపూర్వకముగ నితరులకు విక్రయించినను, తనఖాపెట్టినను అన్యాక్రాంతము చేయుట యందురు. ఆస్తి వారసత్వమురూపమునఁ జెందునప్పు డది యన్యాక్రాంతము కానేరదు.

**అన్లోరో బాటియా** — గంజాంజిల్లా, బరహంపురము తాలూకాకు చెందిన గ్రామము. జనసంఖ్య ౨౩౯ (౧౯౩౧).

**అన్వరి** — ఒకగొప్ప పారసీకకవి. ఖురాసాన్ దేశజుఁడు. సుల్తాన్ సంజర్ సల్జూకి అనురాజునాస్థానకవి. ఇతఁడు జ్యోతిషమునుగూడ బాగుగ నెఱిఁగియుండెను. ఇతఁడు బాల్ఖ్‌లో క్రీ. శ. ౧౨౦౦-ల సంవత్సరమున మృతుఁ డయ్యెను. ఇతని పద్యము లన్నియు ‘దీవాన్ అన్వరి’ యను గ్రంథమునందు సంగ్రహింపఁబడినవి.

**అన్వరుద్దీనుఖాను** — కర్ణాటకనవాబు లనఁబడు వారికి మూలపురుషుఁడు. ఇతఁడు ఔరంగజేబు కొలువునందు ప్రసిద్ధివహించిన అన్వరుఖాన్ అనునతని జ్యేష్ఠపుత్రుఁడు. ఇతఁడు మొదట ఢిల్లీచక్రవర్తి వలన కోరాజహానాబాద్ ప్రాంతమునకు సుబేదారుగా నేర్పఱుపఁబడెను. కాని యచ్చటఁ దిన్నగా బని చేయలేక యితఁడు చెప్పకుండ అహమదాబాదునకుఁ బాఱిపోయెను. నైజామ్ ఉల్ ముల్క్ (ఇప్పటి నిజామునిమూలపురుషుని) యొక్క తండ్రియైన గాజీ ఉద్దీన్‌ఖాన్ ఈతనికి మరలనొక గొప్ప యుద్యోగ మిచ్చెను. ఇతఁడు క్రీ. శ. ౧౭౨౪ న దక్కను నందు నవాబు ఆసఫ్‌జా నైజాముల్‌ముల్క్‌ను గలసికొనెను. నైజాము హైదరాబాదుప్రాంతదేశమున శేఁగిన అల్లరుల నణఁచి రాజ్యమును క్రమపద్ధతిని బెట్టుచుండినకాల మది. ఈతరుణమున ఏలూరు, రాజమహేంద్రవరముసర్కారులయందలి జమీన్‌దారులు ప్రభుత్వమున కెదురుతిరిగి విప్లవము గలిగించుచుండుటచేత ఆసర్కారులయం దల్లరుల నణఁచి శాంతి నెలకొల్పుటకు నైజాము అన్వరుద్దీనుఖానును ఆసర్కారులకు ప్రభువుగ నియమించెను. ఇతఁడు ౧౭౨౫

sampath_Ebooks

మొదలు ౧౭౪౧ వఱకు నీసర్కారులను పాలించెను. ఈసర్కారుల యందలి విప్లవము నణఁచుటలో నితనికి ౧౭౩౨-౧౭౩౯ సంవత్సరములందు రాజమహేంద్రవరమునకు ప్రభువుగనుండి, యిప్పటికిని స్థానికగాథలందు హాటీహాల్సేన అనునామమునఁ బరఁగు రుస్తుంఖాను సహాయుఁడుగ నుండెను. అన్వరుద్దీన్‌ఖానుపరిపాలనము తీవ్రత కును, కాఠిన్యమునకును పేరుకెక్కినది. రుస్తుంఖానుకుమారుఁడగు నూరుద్దీను తనతండ్రిని జంపి, రాజమహేంద్రవరముసర్కారునకుఁ దానే యధికారియై నిజాముప్రభుత్వమును ధిక్కరించినపుడు అన్వరుద్దీన్ అతనిని సంహరించి యాసర్కారును దనయధీనమునకుఁ దెచ్చుకొనెను. ఆసఫ్‌జా తిరుగఁబాటుల నణఁచి శాంతిని నెలకొల్పుటకు ౧౭౪౩-౧౭౪౪ న కర్ణాటకముపయి దండెత్తి వెళ్లినపుడు అతఁడు అన్వరుద్దీన్‌ఖానుశక్తిసామర్థ్యములను, రాజభక్తిని గుర్తించి హైదరాబాదుసుబా నాతని కొప్పగించి తద్వ్యవహారభారము నాతనిపయి మోపెను. ఆకాలమున నవాబు అన్వరుద్దీన్ వ్యవసాయాభివృద్ధికిఁ జాలఁ బనిచేసెను.

కర్ణాటకమునందలి యల్లరుల నణఁచి ఆసఫ్‌జా ఆర్కాటు సుబాకు ఖోజా అబ్దుల్లాఖానును నవాబుగ నియమించెను; కాని నియామకము జరగిన కొలఁదికాలమునకే అతఁడు చనిపోవుటచేత ఆపదవికి ౧౭౪౪ లో అన్వరుద్దీనుఖాను నియమితుఁడయ్యెను. క్రీ. శ. ౧౭౪౮ లో ఆసఫ్‌జా కాలధర్మము నొందినపిదప సింహాసనమునకయి ముజఫరుజంగు పితూరీ లేఁపెను. అతఁడు చందాసాహెబు ప్రోత్సాహమున అన్వరుద్దీనుఖానుపయి దండెత్తివచ్చెను. ఉభయ బలములకు ఆంబూరునొద్ద క్రీ. శ. ౧౭౪౯ లో యుద్ధము జరగెను. ఆయుద్ధమున నితఁడు డెబ్బదియేఁడుసంవత్సరములవయసున వీరమరణము నొందెను. మొదట నీతనికళేబరమును ఆర్కాటుజుమామసీదులో సమాధిచేసిరి; కాని యటుపిదప దానిని హైదరాబాదునకుఁ గొనిపోయి మక్కీ్ ష్ షా వలీఉల్లా మసీదుప్రక్క స్థాపితముచేసిరి. ఈతనిపరిపాలనము కడు జనకంటకమయిన దని పేరువడినది. ఈ యన్వరుద్దీనుఖానుకుటుంబమునకు సంబంధించిన చరిత్రమును 'అన్వరు–నామా' యనుపేర మీర్ ఇస్మాయిల్ ఖాన్ అబ్జది యను కవి పారసీ భాషలో రచించెను.

**అన్వష్టకము** — అష్టకముయొక్క తరువాతితిథి అన్వష్టకము. అది గౌణచాంద్ర పౌష మాఘ ఫాల్గున ఆశ్వినమాసములయందలి కృష్ణపక్షనవమి యగును. ఆదినమున నాహితాగ్నులు మాతృకశ్రాద్ధమును జేయవలయును. పితృ, పితామహ, ప్రపితామహులభార్యలగు మువ్వురుమాతలనిమిత్తము ద్విజుల భుజింపఁజేయవలయు ననియు, అది కేవలము మాతలకొఱకే కావున మాతృశ్రాద్ధమను పేరఁ బరఁగుననియు దీనిని సాగ్నికుఁడే కావింపవలయు ననియు శంఖస్మృతి వచించుచున్నది. అష్టకములందువలె నన్వష్టకములందుఁ గూడ నగ్నియందు హవనముం జేసి పూర్వమువలెనే మాతృపితామహప్రపితామహ్యాదులనిమిత్తము బ్రాహ్మణులభోజనముం జేయింపవలయు నని విష్ణుస్మృతియందు లిఖింపఁబడియున్నది. ఇచ్చట హోమము చేయవలయు ననిమాత్రమే వ్రాసినచో నగ్నియందుఁ జేయవలె ననునర్థము రానేవచ్చును. ఇటు లుండ నగ్నియందు హోమము గావింపవలయు నని వ్రాయఁబడియుండుటవలన నగ్నియందే చేయవలయును గాని విధానేతరప్రాప్త మగు విప్రనిహస్తమునందుఁ జేయ వలనుపడదు. ప్రకృతిభూత మైన శ్రాద్ధమందలి యాధారాంతరమునకు వికృతిభూతశ్రాద్ధమందలి విశేషవిహితాధారమువలన బాధ కలుగును. శరమయుబర్హి వలన కుశమయుబర్హి బాధింపఁబడుచున్నది. లౌకికాగ్నిలోఁగూడ హోమముం జేయుట గూడదు. పితృసంబంధిహోమమునకు లౌకికాగ్నియందు విధానము లే దని మనువచనము. ఇటులే శ్రాద్ధచింతామణిలోఁగూడ వ్రాయఁబడియున్నది.

**అన్వాధి** — ఒకఁడొకవస్తువును వేఱొకనిచెంగటఁ గుదువబెట్టినచో నారెండవవాఁడు మఱియొకనికడ కేఁగి యతనితో నీ వీవస్తువును ఫలానివానికి సమర్పింపు మని చెప్పుచు నతనికిఁ గుదువ యిచ్చినయెడల నది అన్వాధి యనఁబడు నని వివాదార్ణవసేతువునందు లిఖింపఁబడియున్నది. వచనమూలకముగ నీ వీవస్తువు నముకమనుజునకియ్యవలసిన దని నుడువుచుఁ గుదువ యుంచినచో నది అన్వాధి యని హలాయుధుఁడు.

**అన్వాధేయము** — స్త్రీధనము; వివాహానంతరము బంధువులవలనఁగాని భర్తకులమువారివలనఁగాని స్త్రీకి లభించుధనము.

"వివాహాత్పరతో యత్తు లబ్ధం భర్తృకులాత్ స్త్రియాః,
అన్వాధేయం త దుక్తం తు లబ్ధం బంధుకులా త్తథా."

అని కాత్యాయనుఁడు వచించియున్నాఁడు.

**అన్హాల్ట్** — జర్మనీదేశమునందలి ఒకచిన్నస్వతంత్రరాజ్యము. ౧౯౧౮-వ సంవత్సరమునకు పూర్వము ఇది జర్మనీసామ్రాజ్యములో నొకభాగముగ నుండినది. కాని ఆయేఁటనే జర్మనీదేశమున సంఘటించిన విప్లవమునకు తరువాత అన్‌హాల్ట్‌ప్రభుత్వము ప్రజాస్వామికముగ (Republican Government) మాఱినది. దీనివైశాల్యము ౮౮౮ చ. మైళ్లు; జనసంఖ్య 3,3౧,౨౫౮. పరిశ్రమలు కొన్ని అభివృద్ధిలో నున్నను ఇందలిప్రజలకు వ్యవసాయమే ముఖ్యవృత్తి.

**అన్హిల్వాడ** — ఈ రాజ్యము ప్రస్తుతము బొంబాయి రాజధానిసరిహద్దులోఁ జేరిన గుజరాత్‌రాష్ట్రమునం దుండెను. క్రీ. శ. ౭౪౬-౬౫ సంవత్సరప్రాంతమున చావడరాజపుత్రులలో నొకఁడగు వనరాజు దీనిని స్థాపించెను. అతఁడు ౬౦ వఱకును పాలించి చనిపోయెను. అతనిపిమ్మట అతనివంశమువారలు ఎనమండ్రు పాలించిరి. ఆఖరు అతఁడు ౯౬౧ లో చనిపోయెను. పిమ్మట చాళుక్యవంశజుఁడగు మూలరాజు (౯౪౧-౯౯౬) అను నీతఁడీరాజ్యమునకు ప్రభువై, రాజ్యమును కాఠేవాడ్, కచ్, దక్షిణగుజరాత్ దేశములలోనికి వ్యాపింపఁజేసి ప్రసిద్ధిఁ గాంచెను. ఈతనిచే

sampath_Ebooks

స్థాపితమైన వంశమునకు 'సోలంకి' వంశ మని పేరు. ఈతనిసంతతి వార లిక్కడ రెండుశతాబ్దులవఱకును పాలించిరి. వీరు శైవమతస్థు లగుటచే సోమనాథపట్టణమందలి సోమనాథునియాలయమునుగూర్చి చాల శ్రద్ధ తీసికొనియెడివారలు. అప్పటిప్రభు వగు మొదటిభీముని ఓడించి ౧౦౨౬ లో మహమ్మాదుగజనీ దేవాలయమును పడఁగొట్టి ద్రవ్యమును కొల్లగొనెను. గజనీ వెల్లినతరువాత ఈగుడి భీమునిచే మరలఁ గట్టఁబడెను. ఈతనిసంతతివారు ౧౧౪౩ వఱకు నీదేశమును పాలించిరి. అటుతర్వాత మూలరాజుయొక్క జ్ఞాతు లీదేశమునకు ప్రభువులై ఒకశతాబ్దివఱకును పాలించిరి. వీరు కాఠేవాడ్, మాళ్వాలకు కూడ నధికారులై యుండుటయేకాక ౧౧౬౦ లో కొంకణదేశముపై దండయాత్ర నడపిరి. ౧౨౪౨ న ఈ మూలరాజువంశ మంతరించినపిమ్మట ధోల్కాదేశస్థు లగు 'వాఘేలులు' అను నొక తెగవారీ ప్రాంతము నేలిరి. పిదప ౧౨౯౭ లో అల్లాఉద్దీను ఖిల్జీ తఱిమివైచెను.

అపభరణి — భరణీనక్షత్రమునకు అపభరణి యని నామాంతర మున్నట్లు కనఁబడుచున్నది. తైత్తిరీయసంహితలో భరణి యనుపేరే కనఁబడుచున్నను, తైత్తిరీయబ్రాహ్మణములో 'యమస్యాపభరణీః అపకర్షంతిః' అని యున్నది. కృత్తికతో సంవత్సరమారంభ మైనపుడు భరణి ఆఖరు నక్షత్రము అయియుండెడిది. ఆఖరునక్షత్ర మగుటచేత భరణికి యముఁ డధిదేవత యని చెప్పఁబడినది. వివరములకు తిలకు లోకమాన్యుని (Orion) గ్రంథము నందలి ౪౨-౪౩ పుటలు చూడనగును.

(గో. వేం. రా.)

అపరతంగణము — తంగణదేశమును అంటియున్న భారతవర్షీయదేశము (భార., భీష్మ, అ. ౯).

అపరతాలము — తాలదేశము నంటియున్న భారతవర్షీయదేశము. కేకయదేశమునుండి అయోధ్యకుఁ బోయినదూతల మొదట నీదేశము తగులును (వా. రా., అయో., స. ౬౮).

అపరదక్షిణకుంతిరాష్ట్రము — ఇంద్రప్రస్థమునకు దక్షిణమునం దున్న కుంతిరాష్ట్రమును తగిలియున్న దేశము (భార., భీష్మ, అ. ౯).

అపరదక్షిణనిషాదము — ఇంద్రప్రస్థమునకు దక్షిణమునం దున్న మ్లేచ్ఛరాజులదేశమునకు దక్షిణమునందును, పుష్పాదు లను లోకులదేశమున కుత్తరమునందును ఈ దేశ ముండెను (భార., సభా, అ. ౩౧).

అపరదక్షిణపాండ్యదేశము — పాండ్యదేశమును తగిలియున్న దేశము. పాండవులకాలమున నిది ద్రవిడదేశమునకు దక్షిణమునం దుండెను (భార., సభా, అ. ౩౧).

అపరదక్షిణమత్స్యము — ఇంద్రప్రస్థమునకు దక్షిణమున మత్స్యదేశమును తగిలియున్న దేశము (భార., సభా, అ. ౩౧).

అపరదక్షిణసేకము — ఇంద్రప్రస్థమునకు దక్షిణంబున నున్న యొక దేశము (భార., సభా, అ. ౩౧).

అపరనంద — హిమాలయముమీఁది యొకతీర్థము.

**అపరపూర్వవిదేహము** — ఇంద్రప్రస్థమునకుఁ దూర్పున నున్న రెండువిదేహదేశములలో నొక్కటి. గండకదేశమునకుఁ దూర్పున నున్నది యొకవిదేహము. ఇది రెండవది. ఈరాజ్యమున నే జనకవంశజులు రాజ్యము చేయుచుండి రని కొందఱయభిప్రాయమైయున్నది. అట్లయిన శ్రీరామునికాలమున సీతాదేవితండ్రియైన జనకుఁడును, పాండవులకాలమున బహులాశ్వుఁ డను జనకుఁడును రాజ్యము చేయుచుండి రని చెప్పవలసియున్నది (భా. ప్రా. కో.).

అపరపూర్వసుహ్మము — భారతవర్షీయ దేశవిశేషము (భార., భీష్మ, అ. ౯).

అపరబల్లవదేశము — భారతవర్షీయ దేశవిశేషము (భార., భీష్మ, అ. ౯).

అపరాంతదేశము — భారతవర్షీయ మైన యొక దేశము (భార., భీష్మ, అ. ౯).

అపరాజిత — శాకద్వీపములోని యొకనది.

అపరాజితపృచ్ఛ — భువనదేవవిరచిత మయిన యొకశిల్పశాస్త్రము. హేమాద్రి తన 'దానచింతామణి' యందు 'పరిశేషఖండము'న దీని నుదాహరించినాఁడు.

అపరాజితవాస్తుశాస్త్రము — విశ్వకర్మకృత మని చెప్పఁబడు నొకశిల్పశాస్త్రము.

అపరాజితుఁడు — ౧. ఏకాదశరుద్రులలో నొక్కఁడు.

౨. శ్రీకృష్ణునకును లక్షణకును పుట్టినకుమారుఁడు.

౩. ధృతరాష్ట్రుని నూర్గురుపుత్రులలో నొక్కఁడు.

**అపరార్కుఁడు** — విజ్ఞానేశ్వరునికాలముననో, దానికిఁ గొంచెము తరువాతనో శిలాహారరాజు-అపరార్కుఁడు (అపరాదిత్యుఁడు) అనువాఁడు ౧౧౩౪-౧౧౫౦ సంవత్సరములనడిమి కాలమున యాజ్ఞవల్క్యస్మృతి కొక పెద్దభాష్యము రచించెను.

sampath_Ebooks

అతఁడు కొంకణదేశమందలి 'పురి' యనుచోట రాజ్య మేలుచుండు వాఁడు. ఈభాష్యము మితాక్షరివలె నంతగఁ బేరెక్కినది కాకపోయి నను స్మృతిచంద్రిక, చతుర్వర్గచింతామణి, మదనపారిజాతము మున్నగు ప్రధానస్మృతిగ్రంథములలో నుదాహరింపఁబడియున్నది. భాష్యగ్రంథ మైనను ఇది 'యాజ్ఞవల్క్యధర్మశాస్త్రనిబంధము' అని ప్రసిద్ధిఁ గాంచెను. అపరార్కుఁడు తన గ్రంథమున నెందును విజ్ఞానేశ్వరునిమితాక్షరి నుదాహరింపలేదు. అంతియకాక రెంటియందును వ్రాయఁబడినవాక్యములు కొన్ని సమానములుగ నుండుటనుబట్టి, యీ యిరువురును ఏదియో యొక ప్రాచీనగ్రంథమునుండి సాహాయ్యమును బొందియుందు రని యూహింపవలసియున్నది. శిలాహారరాజ-అపరార్కుఁడు జీమూతవాహనునివంశమువాఁడ నని చెప్పుకొన్నాఁడు. కొందఱు పైజీమూతవాహనుఁడును, దాయభాగరచయిత యగుజీమూతవాహనుఁడును ఒక్కఁడే యని తలంచుచున్నారు. కాని నిజముగ వా రిద్దఱును పూర్తిగ భిన్నవ్యక్తులు: భిన్నజాతీయులు, భిన్నదేశీయులు, భిన్నకాలములవారు. శిలాహారరాజవంశపుపూర్వపురుషులు క్షత్రియులు. కొంకణదేశమువారు. దాయభాగరచయిత యైనజీమూతవాహనుఁడు గౌడదేశవాసి యగు రాఢీయబ్రాహ్మణుఁడు. పారిభద్ర (పారియాల) గ్రామవాసి.

అపరోక్షానుభూతి — ఇది శ్రీ శంకరాచార్యవిరచితమైన ౧౨౮ శ్లోకముల వేదాంతగ్రంథము. శంకరుల జన్మస్థానము కేరళమునందుఁ గల కాలటి. శంకరుఁడు నంబూద్రిబ్రాహ్మణవంశజుఁడు; తండ్రి శివగురువు; తల్లి ఆర్యాంబ. శంకరుని కాలనిర్ణయమునందు క్రీ. పూ. ౫౦౯ నుండి క్రీస్తు ౭౮౮ వఱకును నున్నటులు ప్రాచ్య, పాశ్చాత్యపండితులందు భేదాభిప్రాయములు గలవు. బౌద్ధమతవిధ్వంసకుఁడును, మతోద్ధారకుఁడును నైన శంకరుఁడు బౌద్ధమతవ్యాపకులైన అశోక, బుద్ధఘోష, నాగార్జునాదుల కనంతరమునందు నివసించినటులు విశ్వసింపఁబడియున్నది. క్రీస్తుశకానంతరము కొన్నిశతాబ్దముల యనంతరము నివసించియుండును. శంకరులు ౩౨ ఏండ్లుమాత్రము జీవించినటులు ప్రతీతిగలదు.

అద్వైతమతస్థాపనాచార్యులైన శంకరాచార్యుల నపరశంకరులుగను స్మార్త హిందూ బ్రాహ్మణులు పూజించుదురు. శంకరస్వాములు హిందూమతోద్ధరణముచేసిన మహానుభావుఁడు. ప్రపంచమునం దవతరించిన మతాచార్యులలో, బుద్ధివైభవమునందును, పాండిత్యమునందును, హేతువాదమునందును శంకరాచార్యుల ప్రతిభ నిరుపమానము. ప్రస్థానత్రయమునకు వ్రాసిన భాష్యములు, వేద వేదాంగశాస్త్రపురాణేతిహాసములందు, శంకరుల పాండిత్యమును విశదము చేయుచున్నవి.

ఈశాది దశోపనిషద్భాష్యములు, శ్వేతాశ్వతరోపనిషద్భాష్యము, నృసింహపూర్వోత్తరతాపిన్యుపనిషద్భాష్యము, బ్రహ్మసూత్ర శారీరకమీమాంసాభాష్యము, భగవద్గీతాభాష్యము, సనత్సుజాతీయభాష్యము, లలితాత్రిశతిభాష్యము, ఆపస్తంబీయాధ్యాత్మపటలభాష్యము, విష్ణుసహస్రనామభాష్యము, వివేకచూడామణి, సర్వవేదాంత సిద్ధాంత సారసంగ్రహము, ఉపదేశసాహస్రి, దక్షిణామూర్తిస్తోత్రము, పంచీకరణము, మనీషాపంచకము, భజగోవిందము, స్వాత్మనిరూపణము, ఆనందలహరి, సౌందర్యలహరి, శివానందలహరి, శివ భుజంగస్తోత్రము, అపరోక్షానుభూతి, ప్రపంచసారము, మహావాక్యదర్పణము, శతశ్లోకి, ప్రబోధసుధాకరము, వేదాంతసారము, వేదాంతడిండిమము, వాక్యవృత్తి, ఆత్మబోధము, ఆత్మానాత్మ వివేకము, హరిమీడేస్తుతి, విజ్ఞాననౌక, జీవన్ముక్తానందలహరి, ప్రశ్నోత్తరరత్నమాల, పంచీకరణము, పంచదశీవ్యాఖ్యానము, (బ్రహ్మవిద్యావిలాసము), సిద్ధాంతబిందువు (దశశ్లోకి), గాయత్రీభాష్యము, అద్వైతానుభూతి, కౌపీనపంచకము, సాధనపంచకము, నిర్గుణమానసపూజ, భగవన్మానసపూజ, శివాపరాధక్షమాపణస్తోత్రము, త్రిపురసుందరీస్తోత్రము, ఆత్మపూజ, ఆర్తత్రాణ నారాయణాష్టాదశకస్తోత్రము మొదలయిన శంకరాచార్యకృత గ్రంథము లించుమించుగాఁ బెద్దవి, చిన్నవి నూటయేఁబదివఱకును గలవు. భజగోవింద శివానందలహరీ మనీషాపంచకాది శ్లోకము లాచార్యస్వాముల ప్రతిభకును, అద్వైతసిద్ధికిని నిదర్శనములు.

శ్రీ శంకరాచార్యులు కాంచీపురమునందు "ఓమ్ తత్సత్" నిర్దేశమైన ఇంద్రసరస్వత్యాచార్యనామమున యోగలింగమును, కామకోటిపీఠమును, శృంగేరియందు "అహం బ్రహ్మాస్మి" నిర్దేశమైన భారతీమాంతాచార్యనామమున భోగలింగమును, శారదాపీఠమును, బదరికాశ్రమమునందు "అయమాత్మా బ్రహ్మ" నిర్దేశమైన గిరిస్వామినామమున ముక్తిలింగమును, పూర్ణగిరిపీఠమును, ద్వారకయందు "తత్త్వమసి" నిర్దేశమైన ఆశ్రామిస్వామినామమునను కలికపీఠమును, జగన్నాథమునందు "ప్రజ్ఞానం బ్రహ్మ" నిర్దేశమైన అరణ్యస్వామినామమున విమలపీఠమును స్థాపించి మహావాక్యార్థములను నామరూపములను సువ్యక్తము చేసినటులు ప్రతీతి కలదు. శంకరాచార్యులు దేశవ్యాప్తమైన నిగమాగమోక్తాచారపరమైన పూర్వమీమాంసను ఉత్తరమీమాంసారూపమునను జ్ఞానపరముచేసి వేదాంతమున కపూర్వమైన పురుషార్థమును సమకూర్చినవిధమును శంకరాచార్యుల సిద్ధాంతములు బోధించుచున్నవి.

అపరోక్షానుభూతియందు శంకరప్రతిపాదితమైన అధ్యాసపాధ్యమైన వేదాంతసారము గలదు. పరమార్థపరిజ్ఞానమునకు జిజ్ఞాస పరమసాధనముగ నున్నది. నే నెవఁడను? ప్రపంచ మెటులు కలిగినది? దానికి కర్త యెవరు? ఉపాదానకారణ మేది? అను ప్రశ్నలు విచారమునఁబడును.

కోఽహం కథ మిదం జాతం కోవా కర్తాఽస్య విద్యతే,
ఉపాదానం కిమస్తీహ విచారః సోఽయ మీదృశః. ౧౨

'అహం' దేహేంద్రియాదులు, భూతాదులు కావను బుద్ధిజ్ఞానమువలనఁ గలుగుచున్నది. తదనంతరము 'అహం' నిత్యమైన

sampath Ebooks

యాత్మయని నిశ్చయింపఁబడుచున్నది. 'నేను' ఏకమును, సూక్ష్మమును, జ్ఞాతయును, సాక్షియును, సత్తయును, అవ్యయమును నైన ఆత్మ కాని దేహము కాదు.

అహమేకోఽపి సూక్ష్మం చ జ్ఞాతా సాక్షీ సదావ్యయః,
తదహం నాత్ర సన్దేహో విచారః సోఽయ మీదృశః. ౧౬

ఈయధ్యాసమువలనను 'అహం' నిత్యమైన బ్రహ్మపదార్థముగ నేర్పడుచున్నది.

"నేను" శమమును, శాంతమును, సచ్చిదానందలక్షణమును గలది. నేను నిర్మలుఁడను, నిశ్చలుఁడను, అనంతుఁడను, శుద్ధుఁడను, అజరుఁడను, అమరుఁడను నైన బ్రహ్మమును. అసద్రూపమైన దేహము నేను కాను. బుధులు దీనినే జ్ఞాన మందురు.

బ్రహ్మైవాహం శమ శ్శాన్తః సచ్చిదానన్దలక్షణః,
నాహం దేహో హ్యసద్రూపో జ్ఞాన మిత్యుచ్యతే బుధైః. ౨౪
నిర్మలో నిశ్చలోఽనన్తః శుద్ధోఽహ మజరోఽమరః,
నాహం దేహో హ్యసద్రూపో జ్ఞాన మిత్యుచ్యతే బుధైః. ౨౫

స్థావరజంగమాత్మకమైన ప్రపంచమున కంతకును ఆత్మధ్యాస గలిగినపుడు దేహాధ్యాస పోయి బ్రహ్మాధ్యాస గలుగుచున్నది.

స్వర్ణవికారములైన వస్తువులందు నామరూపము లనిత్యములును స్వర్ణత్వము నిత్యమును నైనటులు, బ్రహ్మత్వమునుండి కలిగినవాటికి బ్రహ్మత్వము నిత్యము.

సువర్ణా జ్జాయమానస్య సువర్ణత్వం చ శాశ్వతమ్,
బ్రహ్మణో జాయమానస్య బ్రహ్మత్వం చ తథా భవేత్. ౫౧

బాహ్యసాధనములయిన సకలస్మృతులను విడిచి బ్రహ్మత్వమును బొందుటకు పూర్ణయోగాభ్యాస మవసరము.

భావవృత్తి భావములను, అభావవృత్తి అభావములను కలుగఁజేయువటులు బ్రహ్మవృత్తి పూర్ణయోగపరమైన బ్రహ్మత్వమునకు సాధనము.

భావవృత్త్యా హి భావత్వం శూన్యవృత్త్యా హి శూన్యతా,
బ్రహ్మవృత్త్యా హి పూర్ణత్వం తథా పూర్ణత్వ మభ్యసేత్. ౧౨౯

నిద్రనుండి మేలుకొనిన తరువాతను కలలు లేనటులు, బ్రహ్మజ్ఞానము కలిగినతరువాత నీ దేహేంద్రియాదు లసత్తగుటవలన ప్రారబ్ధము లేదు.

తత్త్వజ్ఞానోదయా దూర్ధ్వం ప్రారబ్ధం నైవ విద్యతే,
దేహాదీనా మసత్త్వాత్తు యథా స్వప్నో విబోధతః. ౯౧

దీనియందు ౯౧ నుండి ౧౪౨ శ్లోకములందు ౧. యమము, ౨. నియమము, ౩. త్యాగము, ౪. మౌనము, ౫. దేశము, ౬. కాలము, ౭. ఆసనము, ౮. మూలబంధము, ౯. దేహసమత్వము, ౧౦. దృష్టిస్థితి, ౧౧. ప్రాణాయామము, ౧౨. ప్రత్యాహారము, ౧౩. ధారణము, ౧౪. ఆత్మధ్యానము, ౧౫. సమాధి అని ౧౫ యోగాంగములును బాహ్యాంగములు గాక అభ్యంతరసాధనములు గావలసిన విధము వ్యక్తము చేయఁబడినది. త్యాగలక్షణము పరమార్థమును తెలుపుచున్నది.

త్యాగః ప్రపఞ్చరూపస్య చిదాత్మత్వావలోకనాత్,
త్యాగో హి మహతాంపూజ్యః సద్యో మోక్షమయో యతః. ౧౦౬

ప్రపంచరూపమును విడిచి సర్వత్ర ఆత్మావలోకనము త్యాగము. అనుసంధానకాలమునందే మోక్షమయ మగుటచే త్యాగము మోక్షమున కుత్తమసాధనము.

ఈ యంగములతోఁగూడిన రాజయోగము పూర్ణయోగము, మోక్షసాధనము. కర్మపరమును బాహ్యసాధనమునైన హఠయోగాభ్యాసము ప్రారబ్ధమునకు మూలము.

ఏభి రఙ్గైః సమాయుక్తో రాజయోగ ఉదాహృతః,
కిఞ్చిత్పక్వకషాయాణాం హఠయోగేన సంయుతః. ౧౪౩

బౌద్ధమతవ్యాపనము సంకుచితమైన కర్మకాండను శిథిలము చేసినది. విశ్వావృతమైన కర్మము ధర్మస్వరూపమును దాల్చినది. కర్మము, ధర్మము బుద్ధియోగమునందు శరణుపొందినవి. పరిమితమును సాపేక్షమును నైన బుద్ధియోగము, బుద్ధధర్మమును నిరపేక్షమైన ఆత్మధర్మాభ్యాసమునకు నిరర్థకము చేసినది. మఠములు, సంఘారామములు, విహారములు, ధర్మమును బాహ్యసాధనములందు లగ్నముచేసినవి. శంకరాచార్యులు సాపేక్షములైన కర్మయోగమును, సన్న్యాసయోగమును, బుద్ధియోగమును నిరపేక్షమైన ఆత్మయోగమునందు వేదాంతరూపమునను సమన్వయముచేసి సనాతనమైన వైదికమతము నుద్ధరించి ఆచార్యపదము నధిష్ఠించెను.

అపరోక్షానుభూతి శంకరప్రతిపాదితమైన అద్వైత వేదాంతసారము నభ్యాససాధనమునను, తర్కవితర్కములతోను నిమిత్తము లేకుండ సుగమము చేయుచున్నది.

**అపరోత్తరకులిందము** — ఉత్తరదేశమునందు రెండు కులిందదేశములు కలవు. అందిది రెండవది. ఇది కాలకూట, సుమండలదేశములకు నడుమ నుండెను (భార., సభా, అ. ౨౬).

**అపరోత్తరోలూకము** — మోదాపురమున కుత్తరదిక్కున నున్న భారతవర్షీయదేశము. ఇంద్రప్రస్థమున కుత్తరమున ఉలూకదేశములు రెండు కలవు. అందిది రెండవది (భార., సభా అ. ౨౭).

**అపర్ణ** — సతీదేవి దక్షయజ్ఞమున దగ్ధయై హిమాలయుని యింటఁ బుట్టి శివునికొఱకుఁ గొన్ని దినంబులు పర్ణంబులు భక్షించి తపస్సు చేసి పిదప నాపర్ణంబులం దినుటకూడ విడిచి తపం బొనర్చి

sampath_Ebooks

సఫలమనోరథ యయ్యెను. పర్ణభక్షణముకూడ విడిచినందున నాపెకు నీపేరు వచ్చెను.

**అపర్ణి** — ఒక బ్రహ్మర్షి.

**అపలేచియన్ పర్వతములు** — ఉత్తర-అమెరికాదేశమందలి పర్వతమాలిక. ఇది యాదేశమునకుఁ దూర్పున నుండును. ఇది ౧,౩౦౦ మైళ్లు పొడవుగ నున్నది. ఎత్తుశిఖరములు రమారమి ౨,౦౦౦ అడుగులయెత్తున నుండును. దీని కనేక శాఖలును, శిఖరములును కలవు. ఈ పర్వతములందు నేలబొగ్గు, మట్టినూనె విశేషముగ దొరకును.

**అపవుఁడు** — ఒకముని. కార్తవీర్యార్జునుఁ డితని యాశ్రమవనమును సూర్యుని కాహుతిగా నొసంగెను. ఈకోపమున నపవుఁడు కార్తవీర్యుని వేయిచేతులును బరశురామునిచే ఖండింపఁబడునట్లు శపించెను.

**అపస్మారము** — దీనిని వాడుకలో కొందఱు 'కాకివస్తు' లని చెప్పెదరు. అపస్మారములో ననేకవిధములు గలవు. కొందఱికిది చాలతీవ్రముగా వచ్చును. హఠాత్తుగ స్మృతి తప్పి కాళ్లుచేతులు విలవిల కొట్టుకొని నోటివెంట నురుగపడును. మఱికొందఱు స్మృతి తప్పీ తప్పనిస్థితిలో కొన్ని నిముసములుండి కాళ్లుచేతులు కొట్టుకొనకయే తెలివితెచ్చుకొందురు. ఒకానొకఁడు తాను చేయుపని క్షణమాత్రము నిలిపి ప్రపంచజ్ఞానమంతను మఱచి, అంతలోనే తనపనిని తాను చూచుకొనును. జ్వరాది ఇతర వ్యాధులతో సంబంధము లేక ఇతరవిధముల నారోగ్యముగ నున్న మానవున కకస్మాత్తుగ క్షణమాత్రమో, అధికకాలమో స్మృతి తప్పి ప్రపంచజ్ఞానము బొత్తిగ లేకుండఁ గఁజేయు వ్యాధికి అపస్మార మని పేరు. కాళ్లుచేతులు కొట్టుకొనినను లేకపోయినను సరే.

వ్యాప్తి:— ఈవ్యాధి ప్రజలలో నెంతమంది కున్నదో సరిగా లెక్కించి చెప్పుట కింతవఱ కాధారము లేవియు లేవు గాని సామాన్యముగా నన్ని దేశములందును కూడ జనసంఖ్యలో వేయింటికి ఒకనికీ వ్యాధి యున్నదని చెప్పవచ్చును. కొన్ని దేశములలో నింతకంటె హెచ్చుగ నుండవచ్చును. వంశపారంపర్యముగ కుటుంబములలో లేనిదే ఈవ్యాధి సంతతికి వ్యాపింపదని చెప్పుటకు నిదర్శనములు లేవు. కాని ఉన్మాదము త్రాగుడు గల కుటుంబములలో నీవ్యాధి గలవారలు ఎక్కువగా నున్నారని చెప్పవచ్చును. చిన్నతనములో బిడ్డలకు వచ్చు మూర్ఛ (చంటిబిడ్డ గుణము)కును, అపస్మారమునకును కొంత సంబంధము కానవచ్చుచున్నది. అపస్మారపు తల్లుల బిడ్డలను ౫౮ మందిని గుఱించి శోధనచేయఁగా నందు ౩౬ గురికి చిన్నతనములో చంటిబిడ్డ గుణము చూపి చనిపోయి రనియు, మిగిలిన ౨౧ మందిలో ౭ గురికి అపస్మారవ్యాధి యేర్పడిన దనియు తెలియుచున్నది.

వయస్సునుబట్టి చూడఁగా అపస్మారము ౧౦ మొదలు ౨౦ సంవత్సరములలోపు వయస్సులలో హెచ్చుగాఁ గానవచ్చుచున్నది. అందు ౧౩ మొదలు ౧౭ వఱకు మిక్కిలి తఱచుగ నీవ్యాధి అంకురించుచున్నట్లు నిదర్శనములు కలవు. ఒకకుటుంబములో ఈవ్యాధి వంశపారంపర్యముగ నున్న కొలఁది చిన్నవయస్సునందు అంకురించు నని కొందఱియభిప్రాయము. కొందఱికు చిన్నతనమునందు చంటిబిడ్డవ్యాధి అప్పుడప్పుడు వచ్చుచు కొంతకాలమునకు అదే అపస్మారముగ పరిణమించును.

### ఆంగ్లేయ వైద్యశాస్త్రము ననుసరించి

కారణము:— అపస్మారమునకు మనోవ్యాకులత, భయము మొదలగునవి కారణము లని యనేకులు సంబంధము కల్పించుటకు ప్రయత్నించిరి. కాని యిట్టి సంబంధము నూటికి ౩౦ మందిలో కంటె నెక్కువవారిలో కనఁబడదు. నెత్తిమీఁద తగిలిన దెబ్బవలన పుఱ్ఱెయెముక లోపలికి వంగి దాని ఒత్తుడువలన అపస్మారము వచ్చునని కొందఱి యభిప్రాయము కాని యొకానొకచో నట్లున్నను సాధారణ వ్యాప్తి కిది కారణము కా దని చెప్పవచ్చును. అట్టివారికి శరీరమందలి యొకభాగమందే ఈడ్పు సాధారణముగాఁ గన్పట్టును. ముష్టిమైథున (Masturbation) మను దురాచారమువలన అపస్మారము జనించు నని కొందఱును, అపస్మారరోగుల కిది యొకలక్షణమే కాని అపస్మారమునకు కారణము కా దని కొందఱును చెప్పుచున్నారు.

త్రాగుఁబోతులలో వయస్సు చెల్లినపిమ్మట అపస్మారము హెచ్చుగ కానవచ్చుచున్నది కాని యపస్మారమునకు త్రాగుడు కారణ మని నిర్ణయించుటకు వీలులేదు. పైని చెప్పినట్లు త్రాగుడునకును, ఉన్మాదమునకును, అపస్మారమునకును నరములసంబంధ మేదో కలదు.

లక్షణములనుబట్టి అపస్మారమును మూఁడుతరగతులుగ విభజింపనగును: ౧. ఈడ్పుతోఁగూడిన పెద్దమూర్ఛ; ౨. ఈడ్పులేని చిన్నమూర్ఛ; ౩. ఈడ్పుతోఁగూడిన చిన్నమూర్ఛ.

లక్షణములు:— అపస్మారలక్షణములలో కొన్ని వ్యాధి పైకి కనఁబడకపూర్వము కొన్ని గంటలలో లేక దినములలో రోగియందు కన్పట్టును. మఱికొన్ని లక్షణములు వ్యాధి బయటికిఁ దెలియకపూర్వము కొద్దినిమిషములకో క్షణములకో ముందుగ కన్పట్టును. ఇట్టి లక్షణములను వ్యాధియొక్క పూర్వరూప మని చెప్పనగును.

అపస్మారపు రోగితో నివసించువారలు రోగికి ఎప్పుడు మూర్ఛ వచ్చునో సాధారణముగా చెప్పఁగలరు. కొందఱు వ్యాధి బయల్పడకపూర్వము కొంతకాలము రుసరుస లాడుచు చీటికిమాటికి కోపపడుచుందురు. కొందఱు విచారగ్రస్తులుగ నుండి పనితోఁచక ఇటునటు తిరుగుచుందురు. మఱికొందఱు ఎన్నఁడునులేని చుఱుకుతనము గలిగియుందురు. కొందఱు విచిత్రమైన భ్రమలు చెందుదురు. కొందఱికు మూర్ఛ రాకపూర్వము ఆఁకలి తగ్గును. తలనొప్పి, తలతిరుగుట మొదలగు గుణములు కన్పట్టును.

sampath_Ebooks



పైని చెప్పినవి గాక మూర్ఛరాకముందు ఒకానొకరోగికి ఒక్కొక్కరీతిని సూచనలు గన్పించును. ఒకఁడు ముందునకు పరుగెత్తిపడును. ఒకఁడు వెనుకవెనుకనే పరుగెత్తి పడును. మఱియొకఁడు గుండ్రముగ చుట్టుచుట్టు తిరిగి పడును. మూర్ఛ రాకపూర్వ మొకానొక రోగి యేదో పని యున్నట్టుగా మంచమునుండి క్రిందకు వంగి చూచి గభీలున పడిపోవుచుండె నని యొక వైద్యుఁడు వ్రాసియున్నాఁడు. కొందఱకు ఒకచెయ్యి లాగినట్లును, తిమ్మిర పట్టినట్లును మూర్ఛ రాకముందు సూచన గాన్పించును. కొందఱకు కడుపునొప్పి యగుచున్నను, లేదా తల త్రిప్పును. ఇట్లే ఒక్కొక్కరోగికి ఒక్కొక్కవిధమైన సూచన యుండును. కొందఱ కేవిధమైన సూచనయు లేకయే అకస్మాత్తుగ పడిపోవుదురు.

మూర్ఛ :— నిజమైన మూర్ఛలో మూఁడవస్థలను వైద్యులు వర్ణించియున్నారు: ౧. మూర్ఛ. ఇందు శరీరమునందలి కండ లన్నియును ఒక్కపెట్టున బిగఁబట్టి స్మృతి తప్పి రోగి పడిపోవును. ఈయీడ్పు ఒకప్రక్కను రెండవప్రక్కకంటె బలముగ నుండవచ్చును. అప్పుడు తల కన్నులు ఒకప్రక్కకు తిరిగిపోవును. శరీరమంతయు కొయ్యవలె నయి నడుము విల్లువంపుగా వంగియు మొగ్గ వేసిన ట్లగును. ఎదురురొమ్ము కండ లన్నియు బిగిసికొనిపోవుటచే విచిత్రముగ మూలిగినట్లు రోగి ఒక పెద్దకేక వేయును మొదట ముఖము తెల్లఁబడి వెంటనే రొంపు పెక్కి అంతలో నల్లఁబాఱు కంటిలోని పాపలు పెద్ద వగును. నాడి సన్నగిల్లును. ఈపైని చెప్పిన మొదటి యవస్థ యంతయు నరనిముసములో ముగియును. పిమ్మట రెండవయవస్థ వెంటనే ప్రారంభ మగును. ఇపుడు కండ లన్నియుఁ దీవ్రముగా గిజగిజ కొట్టుకొనును. నాలుక పండ్లమధ్యనుండి బయలు పడును. ఒకానొకప్పుడు నాలుక తెగి రక్తమువచ్చును. మలమూత్రముల విసర్జన మగును. కనుగ్రుడ్లు గిరగిర తిరుగును. ఊపిరి క్రమము దప్పి ఆడును. ముఖము నల్లఁబాఱును. మెడయందలి నెత్తుటికాలువ లుబ్బిపోవును. తీవ్రమైన మూర్ఛలో రోగి ఊపిరాడక చనిపోవునేమో యని భయము కలుగును. కాని అంతలోనే ఈయవస్థ మాఱి మూఁడవ యవస్థ ప్రారంభ మగును. రోగి కొంచెము తెలివి వచ్చునట్లు కాలో చేయియో త్రిప్పుకొనును. నిట్టూర్పు విడుచును. ఒకానొకఁడు తిరిగి వెంటనే నిద్రపోవును. మఱియొకఁడు పిచ్చిపట్టినట్లు కేకవేయును. ఇంకొకఁడు ప్రక్కనున్నవారితో జగడమాడును, కొట్టును, పరుగెత్తిపోవును. కాని కొంతసేపటికి నిద్రపోవును.

౧. మొదటియవస్థ అరనిముసము లోపుగను, రెండవయవస్థ ఒకటి రెండు నిముసములును, మూఁడవయవస్థ అయిదు మొదలు పదిదినములవఱకుమగూడ సామాన్యముగ నుండవచ్చును. మూర్ఛ విడిచినతరువాత పట్టు నిద్ర ఒకటి రెండుగంట లుండును. ఒకానొకప్పుడు రోగి దినమంతయు నిద్రమత్తులో పడియుండును. మొదటి యవస్థయందు సన్నగిలిన నాడి రెండవయవస్థయందు దృఢమై వేగముగలది యగును. కొందఱకు మూర్ఛ విడిచినపిమ్మట తీవ్రమైన తలనొప్పి వచ్చును. మూర్ఛలో నుండఁగా శరీరమువేఁడిమి ఒకటి రెండు డిగ్రీలు హెచ్చవచ్చును. వెంటవెంటనే మూర్ఛ విడిచివిడిచి వచ్చుచున్న యెడల అధికజ్వరము రావచ్చును. కొందఱకు ప్రతిసారియు వాంతి కావచ్చును. అట్టివారలకు గొంతుకలో నేదైన పదార్థము లడ్డుపడి ప్రాణాపాయము గలుగవచ్చును.

౨. ఈడ్పులేని చిన్నమూర్ఛ. ఇది ఒకక్షణము మొదలు లయిదు క్షణములవఱకు నుండు నని చెప్పవచ్చును. ఇది వచ్చినపుడు రోగి ముఖము ఇతరులకు విచిత్రముగ కన్పింపవచ్చును. రోగి తా నేదియో మఱచిపోయినట్లు మాటాడుచున్నవాఁ డట్లే అకస్మాత్తుగ నిలుపును. ముఖము తెల్లఁబాఱును, కంటిపాపలు పెద్ద వగును. క్షణములో నంతయు మాఱి యథాస్థితికి వచ్చును. రోగి నడచుచున్నయెడల కాళ్లు కొంచెము తడఁబడును; లేదా ఒకప్రక్కకు వంగును. కాని క్రింద పడఁడు. చేతిలోని వస్తువును జాఱవిడువఁడు. ఈచిన్నమూర్ఛ రాకపూర్వము రోగి కేమియు సూచనలు తెలియవు. తరువాతఁగూడ బుద్ధిమాంద్య ముండదు.

౩. ఈడ్పుతోఁ గూడిన చిన్నమూర్ఛ. ఇందు శరీరమునం దేదోభాగము బిఱ్ఱుగ బిగిసికొనును; లేదా పట్టుకొనును. క్షణమాత్రము స్మృతి తప్పును. క్షణమాత్రము కనుగ్రుడ్లు తల యొక ప్రక్కకుఁ దిరుగును. ఈమూర్ఛ వచ్చినపుడు ఒక్కొక్కసారి క్షణమాత్రమున్నను ఒకదినములో ననేకపర్యాయములుగా వచ్చును. నిద్రలో వచ్చినపుడు బిడ్డలు పడక తడుపుదురు.

నిదానము :— అపస్మారమును గుర్తించుట సాధారణముగా కష్టము కాదు. కాని రోగిని చూడక ఇతరులు చెప్పువన్ననుబట్టి వ్యాధి తెలిసికొనవలె ననిన కొంచెము కష్టమే. ఈక్రింది మూఁడు ప్రశ్నలకును జవాబు తెలిసికొనినయెడల కొంతవఱకు సహకారి యగును.

౧. రోగి అకస్మాత్తుగ స్మృతి తెలియక పడెనా ?

౨. రోగి నాలుక కఱచుకొనెనా ?

౩. మూత్రము పడకలో తెలియకుండ పోసికొనెనా ?

ఈమూఁటికి 'అవు' నని జవాబు చెప్పినయెడల అపస్మారమని నిదానము చెప్పవచ్చును. కాని 'లేదు' అని జవాబు చెప్పినయెడల వ్యాధి అపస్మారము కాదని నిశ్చయింప వీలులేదు. ఏల యన చిన్నమూర్ఛలలో పైనిచెప్పిన మూఁడుప్రశ్నలకును వ్యతిరేకపు జవాబు వచ్చినను ఒకానొకప్పుడు రావచ్చును. కాని వ్యాధి యపస్మారము కావచ్చును కాఁబట్టి అట్టిచో నితరవిషయములను గమనించి అపస్మార నిదానమును గ్రహింపవలెను. అపస్మారమునందును, హిస్టీరియా అను మూర్ఛ (దయ్యము)యందును ఈక్రిందివిషయములను గమనింపనగును.

అపస్మారము

౧. రోగి తననాలుక కఱచుకొనును.

sampath_Ebooks

౨. రోగియొక్క కాళ్లుచేతులు తమంతట అవి వెనుకకు ముందునకు ఈడ్పుచేత కొట్టుకొనును.

౩. అపస్మారమునందు ఈడ్పు కొన్ని నిమిషములకంటె నెక్కువకాల ముండదు.

౪. అపస్మారపురోగి మూర్ఛ తీరినతరువాత సామాన్యముగా నిద్రపోవును.

హిస్టీరియా

౧. రోగి తననాలుక కఱచుకొనదు. పట్టుకొని నిర్బంధించువారిని రోగి కఱచి విడిపించుకొనఁ బ్రయత్నింపవచ్చును. నాలుక గాక తన శరీరమునం దితరభాగములను తాను కఱచుకొనవచ్చును.

౨. రోగి తన ఇచ్ఛవచ్చినట్లు కాళ్లుచేతులు విదలించికొట్టుచు ప్రక్క నున్నవారలను తన్ని కొట్టి జగడమాడఁ బ్రయత్నించును.

౩. కొద్దినిమిషములు మొదలు చాలసేపటివఱకు హిస్టీరియా సంబంధమైనమూర్ఛ యుండవచ్చును.

౪. హిస్టీరియారోగికి నిద్ర సామాన్యముగా పట్టక మనస్సు చెదరిపోయి యుండును.

సాధ్యాసాధ్య లక్షణములు :— మూర్ఛవలన మరణము మిక్కిలి అరుదు. ఊపిరాడక ప్రాణము పోవునట్లు కనుపింపవచ్చును కాని సామాన్యముగా అంతలోనే వ్యాధి తగ్గి రోగికి తెలివివచ్చును. నిప్పులోఁగాని నీటిలోఁగాని పడుటవలన రోగికి ప్రాణభయము కలుగవచ్చును. రాతిమీఁదపడి పుఱ్ఱెఎముక పగిలి అపాయము కలుగవచ్చును. ఒకరోగికి నిద్రపోవునపుడు మూర్ఛ వచ్చి తలక్రిందుగాఁ దిరిగి గుడ్డలలోనికి ముక్కు అణఁచుకొనిపోయినయెడల ఊపి రాడక రోగి ప్రాణములను విడువవచ్చును. కాని వ్యాధివల్లనే ప్రాణములు పోఁగొట్టికొనినవా రరుదు.

అపస్మారము కుదురునా? :— చాలకాలమువఱకును మూర్ఛరాకుండఁగను, వచ్చునప్పుడు తక్కువగ వచ్చునట్లును, ఒక్కొక్క మూర్ఛకు మధ్య చాలకాలము పట్టునట్లును చేయవచ్చును గాని ఇంతటితో వ్యాధి కుదిరినదని చెప్పుటకు వీలు లేదు. స్థలము మార్చుటవలనను, వృత్తి మార్చుటవలనను గుణము గలుగవచ్చును. సంపూర్ణముగ కుదిరిన రోగులును గలరు. అపస్మారపురోగులకు కొందఱకు కొంతకాలమునకు బుద్ధిబలము తగ్గిపోవును. కొందఱకు పిచ్చియెత్తును. పగటియందు వచ్చుమూర్ఛ నిద్రలో వచ్చు మూర్ఛకంటె చికిత్సలకు సులభముగ లొంగును. చిన్నమూర్ఛకంటె పెద్దమూర్ఛ చికిత్సకు లొంగును.

చికిత్స: — పొటాసియము బ్రోమైడ్ అనునం దీవ్యాధికి చాల నుపయోగకరము. పదిమొదలు ఇరువది గ్రెయినులవఱకు దినమునకు మూఁడుసారులు భోజన మైనతరువాత నొకగంటకు నీళ్లతో నీయవచ్చును. నలువది మొదలు అఱువది గ్రెయినుల మోతాదు నిద్రలో మాత్రము వివర్శించువారల కిచ్చిన గుణము కావచ్చును.

సోడియం, పొటాషియం, అమోనియం — ఈమూఁడు బ్రోమైడులును సమభాగములుగఁ గలిపి యిచ్చినను ఇయ్యవచ్చును. మూర్ఛ ఫలానిసమయమున నిశ్చయముగా వచ్చునని తెలిసినప్పుడు ఒకమోతాదు బ్రోమైడు ఇచ్చినయెడల మూర్ఛ నిలిచిపోవచ్చును. అధికముగ బ్రోమైడు నిచ్చినయెడల బుద్ధిమాంద్యము గలిగి కాళ్లుచేతులు చల్లఁబడి చొంగ నోటివెంటఁ గారవచ్చును. మాట నెమ్మదిగ వచ్చును. తల్లులకు బ్రోమైడు ఇచ్చుటవలన పాలు త్రాగుబిడ్డలకు అపాయము కావచ్చును. మిక్కిలి గుణము కనిపించు రోగులకుఁగూడ బ్రోమైడును ఆఖరు మూర్ఛతరువాత రెండు సంవత్సరములవఱకును నిలుపఁగూడదు. అటు పిమ్మటఁగూడ వారమున కొకటి రెండుమోతాదుల నిచ్చుచు క్రమముగ నిలుపవలయును. గుండెలలో వ్యాధి గలవారలకు బ్రోమైడుకు తోడుగ డిజిటాలిస్ (Digitalis)ను, నెత్తురులేనివారికి ఇనుమును, బలహీనులకు కాడ్ లివర్ ఆయిలును చేర్చి యియ్యవచ్చును. వెలిగారము ౧౦ మొదలు ౨౦ గ్రెయినులమోతాదు బ్రోమైడుతో చేర్చి కాని ప్రత్యేకముగఁ గాని దినమునకు మూఁడుసార్లు ఇచ్చిన గుణము కలదని ఒకానొకరు వ్రాయుచున్నారు. ఇవి గాక వందలకొలఁది మందులను ఇచ్చి చూచియున్నారు కాని నిజమైన గుణము కానరాలేదు. ల్యూమినాల్, సల్ఫోనాల్ మొదలగు నిద్రాకరము లగు ఔషధముల నుపయోగించుచున్నారు కాని తాత్కాలికగుణమేకాని ముత్తముమీఁద నుపయోగము లేదని తోఁచుచున్నది. వీని యుపయోగమువలన బుద్ధిమాంద్య మధికమయి కొందఱు బ్రదికియుండియు నిష్ప్రయోజకులగుచున్నారు.

## ఆయుర్వేద శాస్త్రము ననుసరించి

సంప్రాప్తి:— స్మృతి నశించునుగాన అపస్మార మనఁబడును. చింత, శోకము, భయము మొదలగువానిచే శారీర మానస దోషములు ప్రకోపించి హృదయమును సంజ్ఞా వాహి స్రోతస్సులను జెంది స్మృతిని నశింపఁజేయును.

సామాన్య లక్షణములు :— ఇది జనించినతోడనే రోగికి చీఁకటిలో ప్రవేశించినటు లుండును, నేత్రములయందు వైవర్ణ్యము, హస్తపాదములను విదలించుట — ఇవి గలిగి మోహమును జెంది జ్ఞానశూన్యుఁడై పండ్లను కటకట కొఱుకుచు నురుగును గ్రక్కుచు భూమిం బడును. దోషవేగము శమించినతోడనే పూర్వమువలె స్వభావమును జెందును. కొంతకాలము గడచినపిదప మరల నిటులే మూర్ఛావికారములను జెందును.

పూర్వ రూపములు :— హృదయమునందు కంపము, హృదయము శూన్యముగ నుండునటులు దోఁచుట, చెమట, చింతనొందుట, చిత్తభ్రమ, ఇంద్రియమోహము, నిద్రానాశము — ఇవి అపస్మారరోగములకు పూర్వరూపములు.

చతుర్విధాపస్మారములు, తల్లక్షణములు :— అపస్మారము వాతజము, పిత్తజము, శ్లేష్మజము, సన్నిపాతజము అని నాలుగు విధము

లుగ నుండును. అందు వణఁకుట, పండ్లుకొఱుకుట, నోటియందు నురుగు కారుట, నిట్టూర్పులు విడుచుట, క్రూరముగ నల్లగ అరుణముగ నుండు రూపములు కంటికి కగపడుట — ఈ లక్షణములు వాతజాపస్మారమునందు జనించును. నురుగు, అంగములు, ముఖము, నేత్రములు — ఇవి పసుపువర్ణముగ నుండుట, పచ్చగ ఎఱ్ఱగ నుండు రూపములు కంటికి కగపడుట, మిక్కిలి దప్పి గలుగుట, ప్రపంచము అగ్నిజ్వాలలచే వ్యాప్తమగునట్లు గాంచుట — ఇవి పిత్తజాపస్మారమునందు జనించును. నురుగు, శరీరము, ముఖము, నేత్రములు — ఇవి తెల్లగనుండుట, శరీరము చల్లగ నుండుట, వెంట్రుకలు నిక్కఁబొడిచి యుండుట, శరీరము బరువుగ నుండుట, తెలుపు వర్ణముతోఁ గూడిన రూపములు కంటికి కగపడుట — ఈ లక్షణములు కఫజాపస్మారమునందుఁ గలుగును. ఇందు శ్లైష్మికముయొక్క వేగము చిరకాలమునకు నివర్తించును. సన్నిపాతజమునందు వాతజాద్యపస్మారములకుఁ జెప్పియుండు లక్షణము లన్నియు కలిగియుండును.

సాధ్యాసాధ్యములు :— సన్నిపాతజాపస్మారము, క్షీణబలము గలవానికి జనించిన ఏకదోషజాపస్మారము, చిరకాలమునుండి బాధించుచుండిన యపస్మారము — ఇవి అసాధ్యములు; చికిత్సలయందు వర్జింపఁ దగినవి.

వ్యాధిప్రకోపకాలములు :— వ్యాధికి కారణములగు ప్రకుపిత దోషములు సర్వదా శరీరము ననుసరించియే యుండినను వ్యాధివేగములను ( Epileptic fits ) అప్పుడప్పుడు చూపుచుండును; అనఁగా వాతికము ౧౨ రోజులకును, పైత్తికము ౧౫ రోజులకును, శ్లైష్మికము మాసమునకును కనఁబడుచుండును. ఇది సామాన్యవిధి. దోషతారతమ్యము ననుసరించి యొకప్పుడీనియమితకాలమునకు లోపలను రావచ్చును, అతిక్రమించియు రావచ్చును ( మాధవనిదానము, అపస్మార ప్రకరణము ).

అపస్మారచికిత్సావిధానము: — ౧. పైని చెప్పిన చొప్పున నపస్మారరోగస్వరూపములను గుర్తెఱిఁగి దోషములచే నావరింపఁబడియుండు బుద్ధి హృదయము మనస్సు స్రోతస్సులు — వీనిని తీక్ష్ణములగు నుండు వమనవిరేచనాదికర్మములచే శుద్ధపఱుపవలయును. వాతజాపస్మారము వస్తికర్మములచేతను, పిత్తజాపస్మారము విరేచనములచేతను, శ్లేష్మజాపస్మారము వమనంబులచేతను చికిత్సింపవలయును. అనంతరము పేయాదిగంజులను భుజింపఁజేసి అపస్మారరోగము శమించుటకై యీదిగువ నుదాహరించు ఘృతపానాదుల నొసంగవలయును.

౨. పంచగవ్యఘృతము : ఆవుపేఁడ రసము, పాలు, పెరుఁగు, మూత్రము, నెయ్యి - వీనిని సమభాగములుగఁ జేర్చి ఘృతపాకవిధి ప్రకారము పక్వముచేయవలయును. దీని సేవనమువలన అపస్మారము, జ్వరము, ఉన్మాదము, కామిల హరించును.

౩. బ్రాహ్మీఘృతము : సరస్వతి ఆకు రసమునకు సమముగ ప్రాఁతనేతిని కలిపి వస, చెంగల్వకోష్టు, శంఖపుష్పి - వీనిచూర్ణమును జేర్చి పాకముచేసి సేవించినచో అపస్మారము తప్పక శాంతించును (౧-౨-౩, చరక., చి. స్థా., అ. ౧౫ ).

౪. క్షీరము : కాశగడ్డి, నేలగుమ్ముడు, చెఱకు, కుశగడ్డి — వీనిని సమభాగములుగఁ జేర్చి పాదావశేషముగ కషాయము కాఁచి వడియఁగట్టి అందు నావుపాలను జేర్చి చక్కఁగ కాఁచి పానముచేయించిన అపస్మారము హరించును.

౫. కూష్మాండఘృతము : కూష్మాండఘృతము ౮ ప్రస్థములు ఆవునెయ్యి ౧ ప్రస్థము చేర్చి యష్టిమధుకకల్కమును కలిపి విధిప్రకారము పక్వముఁ జేసి యిప్పించిన అపస్మారము శీఘ్రముగ హరించును. ప్రశస్తమయిన బుద్ధి, వాక్కు, స్వరము కలుగును.

౬. నస్యము : కపిలవర్ణముగల ఆవుయొక్క పిత్తముచే నస్యము చేయించిన రోగికి మిగుల హితము కలుగును. కుక్క, నక్క, పిల్లి, సింహము, ఉడుము, ముంగిస, సర్పము, ఎద్దు, ఆవు, ఎలుగుబంటి — వీని పిత్తములను నస్యములకుఁగాని, నువ్వులనూనెలో వేసి కాఁచి అభ్యంగమునకుఁ గాని ఉపయోగింపనగును.

౭. నువ్వులనూనె వెల్లుల్లి గాని, ఆవుపాలతోడ పిల్లిపీచరను గాని, తేనెతో మండూకబ్రహ్మీరసమును గాని, చెంగల్వకోష్టు రసమును గాని, వసను గాని ప్రతిదినము నపస్మారరోగి కిప్పించవలయును (౪, ౫, ౬, ౭, అష్టాంగహృదయము, ఉత్తరస్థానము, అ. ౭ ).

౮. శ్లో. నిర్గుండీ భవ వన్దాక చూర్ణనస్యోపయోగతః,
ఉపైతి సహసా నాశ మపస్మారో నసంశయః.

—యోగతరంగిణి.

బదనికయోగము : వావిలచెట్టుమీఁద బయలుదేఱిన బదనికను దెచ్చి చూర్ణముచేసి నస్యకర్మమం దుపయోగించిన అపస్మారము నిస్సంశయముగ శాంతించును.

౯. గొఱ్ఱెమూత్రము, గోమూత్రము, గోమయరసము — వీనిని ఆవనూనెకు నాలుగురెట్లు చేర్చి తైలము కాఁచి అభ్యంజనము చేసినచో అపస్మారము నివర్తించును ( బృందమాధవము ).

౧౦. కల్యాణకరచూర్ణము : పంచకోలములు, మిరియాలు, త్రిఫలములు, బిడాలవణము, సైంధవలవణము, పిప్పళ్లు, వాయువిడంగములు, ఓమము, దనియాలు, జీరకము - వీనిని చూర్ణముచేసి వేఁడినీటితో పుచ్చుకొనిన అపస్మారము తప్పక శాంతించును ( యోగరత్నాకరము ).

మఱియు చరకాదులలో చెప్పఁబడిన మహాపంచగవ్యఘృతము గూడ అపస్మారమును నాశనముచేయుట స్వానుభవము.

రోగి రక్షణావశ్యకము :— అపస్మారరోగము గలవానిని నిప్పు నీళ్లు మొదలగు వానివలన ముప్పు కలుగనియ్యక జాగరూకతతోడ సదా రక్షింపుచుండ వలయును. పైని వివరించిన చికిత్సలచే రోగము శమించి మనోవికారరహితుఁడుగ నుండురోగితోడ ‘ నీవు

sampath_Ebooks

పూర్వము నిందనీయకృత్యంబులను జేసినా' వని చెప్పక ప్రియమును, మనోహరములును అగు విషయంబులం జెప్పి వాని మనస్సున కుత్సాహమును కలుగజేయవలెను.

(గం. దూ.)

గత పదిసంవత్సరముల యీలోపల అపస్మారముయొక్క నిదానమునందుఁ గాని, చికిత్సయందుఁ గాని విస్తారము జ్ఞానాభివృద్ధి కలుగలేదు. ఇది యెంతయు శోచనీయము. చరక, సుశ్రుతాదులచెప్పిన ములలో నెట్లో అనేకప్రకారము ఈకాలమునఁగూడ ఈవ్యాధికి ఇది మిత్థ మని చెప్పఁదగిన చికిత్సను నిశ్చయింపఁజాలకున్నాము. కాని సామాన్యముగ అనేకులకు శీర్షసంబంధమయిన దోషములు లేకుండఁ జేయుటచేత అపస్మారము మాన మగుచున్నది. నా యనుభవమున భృంగామలకాది తైలములచేత స్నానములు, నస్యములు ఉపయోగకరములుగా నున్నవి. లోపలి కిచ్చుమందులలో మండటిరకము చెంగల్వకోష్టు ఇత్యాదిమార్గములు గుణము నిచ్చుచున్నవి. ఒక్కొకటి పది గుంజలయెత్తు మోతాదు చేర్చికాని, విడివిడిగాఁ గాని, పదిగుంజలయెత్తు అతిమధురముమార్గములోఁ గాని యిచ్చుటచేత కొంతకాలమునకు మూర్ఛలక్షణములు తగ్గుచున్నవి. అనుపానముగా కూష్మాండస్వరసము గాని, ఆవునేయి చక్కెరగాని ఉపయోగింపవచ్చును. పై నుదాహరించిన పడియోగములను, నస్య, అభ్యంగములకు పిత్తమూప్రయోగములను గూర్చి హెచ్చుగ శోధన చేయఁబడియున్నది. ఇవి యన్నియు ఒక్కొకరోగికి చిరకాలము వాడి చూడఁబడినవి. ముత్తమువీఁద ఆంగ్లేయౌషధములకంటె దేశీయౌషధములును, దేశీయపద్ధతుల ననుసరించి పిత్తశమన మగు పథ్యములును ఎక్కువ యుపయోగకరములని చెప్పవచ్చును.

'శతశ్లోకి' యను గ్రంథమునందు అపస్మారమునకు క్రింది యోగములు చెప్పఁబడినవి.

అవుపాలుఁగా గుజ్జు మేనుఁగు మందిన
 పిల్లి యురుము నక్క చేదుచేత
నస్యఁబు చేయించి నయమైన పెల్లుల్లి
 త్రికటు కానుగవిత్తు త్రిఫలమునను
నస్యంబు చేయించి నయస్నాన మొనరించి
 వల్లారయాకును చల్లగడ్డ
గోపాంగనా తెల్లగొంపనవుగాచారు
 పంచగవ్యము గుమడిపండుతోడ
పానంబు చేయించి పక్షిరెక్కలు తెచ్చి
 అగ్నిచేతను ధూప మమరఁజేసి
ఇన్నివిధములు చేయ నెక్కుడౌనా యప
 స్మార రోగ ముడిగి చను రమేశ1!

(ఆ. ల.)

అపస్స్యాషుఁడు — ఒక బ్రహ్మర్షి.

అపాండువు — ఒక బ్రహ్మర్షి.

అపాంతరతముఁడు — ఒక బ్రహ్మర్షి.

అపాంప్రదము — భారతవర్షీయ తీర్థము.

అపామియా — ౧. పడమటి ఆసియాయందలి ఓరాంటెస్ నదియొడ్డునఁ గల పట్టణము. సెల్యూకస్ నికేటర్ భార్య యగు అపామా పేర నీనగరమున కీపేరు వచ్చెను. తరువాత క్రీ. శ. ౭-వ శతాబ్దిలో నిది శత్రువులచేతఁబడి నాశనము గావింపఁబడెను. అటుపై నరబ్బులు దీనిని మరల నిర్మించి ఫామియా యని పేరిడిరి. 'క్రూసేడ్' యుద్ధములనాఁటికి నీనగరము ఔన్నత్యము వహించియుండెను.

౨. ఆసియామైనరునందలి ఫ్రిజియలో నిది యొకపురాతననగరము. దీనిని కట్టించినవాఁడు ఆంటియోకస్ సోటర్. అతనితల్లి పేరు అపామా యగుటచే నాతఁడా మె పేర నీనగరమునకు అపామియా యని పేరిడెను. క్రీస్తుశకము 3-వ శతాబ్ది నుండియు నీనగరము చాల ప్రసిద్ధి గాంచి చాలకాలము ఆసియామైనరునందలి గొప్పపట్టణములలో నొకటి యైయుండెను.

**అపినైనపర్వతములు** — ఇటలీదేశమునందు నుత్తరమునుండి దక్షిణమువఱకును, అచ్చటనుండి పశ్చిమమున సిసిలీవఱకును గొలుసువలె పొడుగుగఁ బ్రసరించియున్న యొకపర్వతపంక్తి. ఇది యూరోపుఖండమందలి గొప్పపర్వతములలో నొక్కటి. దీనిపొడవు రమారమి ౭౫౦ మైళ్లు. ఇటలీలో నున్న యీపర్వత భాగము యొక్క యెత్తు శిఖరము 'మాంటెకోర్నో' అనునది ౧౦,౦౦౦ అడుగులయెత్తున నున్నది. సిసిలీలో ఎట్నా (Etna) అను శిఖరము గలదు. అది ౧౧,౦౦౦ అడుగులయెత్తున నున్నది. ఇదియు, నేపిల్సునొద్దనున్న వెసూవియస్ అనునదియు గొప్ప యగ్నిపర్వతములు. మిక్కిలి యెత్తుమీఁద నీపర్వతము వృక్షవిహీనముగను, గరుకుగను ఉండును. కొంచె మెత్తుతక్కువ ప్రదేశము వనములతో నిండియుండును. ఈపర్వతములమీఁద ఖనిజము లంతగ లేవు. కాని గృహములకుఁ బనికివచ్చు చలువరాళ్లు మాత్రము విశేషముగ నున్నవి.

అపిశలి — ప్రాచీనసంస్కృతవ్యాకరణశాస్త్రకారుఁడు, మిగులఁ బ్రసిద్ధుఁడు, పాణినికిఁ బూర్వుఁడు.

అపిశలిశిక్ష — వైదికశబ్దోచ్చారణములను గూర్చి తెలుపు గ్రంథము. ఇందు అచ్చు లేవో, హల్లు లేవో, అవి యెట్లేర్పడినవో ప్రత్యేక ప్రత్యేకముగ నిర్దేశింపఁబడినవి. అపిశలిపండితుని యభిప్రాయము ననుసరించి వానివ్యుత్పత్తులును వివరింపఁబడియున్నవి.

1. పద్యమంతయు తప్పులతడికగ నున్నది. ఉన్నదున్నయట్లు ప్రకటించినాము.

sampath_Ebooks

**అపూరిమక్** — పెరూదేశమునందలి యొక ప్రదేశము. అచ్చటి ఆండీస్ పర్వతములయందు పుట్టిన అపూరిమక్ అనునదినిబట్టి దాని కీపేరు వచ్చినది. వైశాల్యము ౬,౩౬౭ చ. మైళ్లు. జనసంఖ్య ౧,౬౩,౫౮౬.

**అపూలియా** — ఇటలీదేశములో నొకప్రదేశము. దీని వైశాల్యము ౭,౩౬౭ చ. మైళ్లు. జనసంఖ్య ౨౨,౩౬,౭౮౧.

**అపెల్లిస్** — సుప్రసిద్ధుడగు నొక గ్రీసుదేశపు చిత్రకారుడు. ఇతడు క్రీ. పూ. నాల్గవశతాబ్దిలోనివాడు. అపెల్లిస్ మేసిడోనియాకు వెళ్లినప్పుడు అలెగ్జాండరుచక్రవర్తితో బాగుగ పరిచయము సంపాదించుకొనెను. వీనస్ (రతీదేవి) తడిసి ముద్దయైన తనశిరోజములనుండి నీటిని పిండివేయుచు సముద్రములో నుండి బయటికి వచ్చుచున్నట్లుగ రచించినచిత్రము ఇతనిచిత్రములలో నెల్ల శ్రేష్ఠమైనది. క్రీ. పూ. నాల్గవశతాబ్దిచివరిదినములలోనే అపెల్లిస్ మరణించెను.

**అపోలో** — ఇతడు గ్రీకుదేవత. ఒలింపియన్ దేవగణములందు ప్రధానస్థానము నాక్రమించినవారిలో నితడు నొకడు. రాజకీయ, సాంఘిక, నైతిక, ధార్మికము లను గుణధర్మములు చెక్కింటి నితడు గలిగియుండెను. అందువలన వానియధిష్ఠానదేవతాపదములును, అనేకనామధేయములును లభించెను. స్పెనర్ నామక పండితుడు గ్రీకుభాషయందలి తఱిమివేయుట యనునర్థముగల ధాతువునుండి అపోలోశబ్దము పుట్టియుండవచ్చు నని యూహించెను. శాస్త్రరను శేతోకవిద్వాంసుడు సూర్యపర మగు నర్థమును దీసెను. ఈయర్థము సర్వసమ్మత మగు నంగీకారమును బడసియుండలేదు. కాని యనేకపురాణములలో నితడు సూర్యదేవతయొక్క సంబంధమును దెలుపు 'ఫోబస్ అపోలో' యను పేరను వ్యవహరింపబడియుండెను.

ఇతడు స్వర్గాధిపతి యగు జ్యూస్‌కు లేటోయందు జన్మించిన కుమారుడు. జ్యూస్ సోదరియు, నతనిపట్టపురాణియు నగు జూనో (హీరో) కామెపై నసూయ జనింప ఆమె యిటు నటు పరిభ్రమించుచు తొమ్మిది దినములపర్యంత మత్యంతకష్టము ననుభవించి తుదకు తోడేలురూపమును దాల్చి మఱికొన్ని తోడేళ్లసాయముతో డెలోస్ అనుద్వీపమును జేరి యచట సింథస్‌శిఖరమునకు దిగువగ నున్న యొకతాటితోపులో నిరువురు కవలపిల్లలను గనెను. ఈయిద్దఱు బిడ్డలను నించుక వ్యవధానముతో వేఱువేఱుప్రదేశములందు ప్రసవించె నని కొందఱయభిప్రాయము. ఆయిద్దఱిలో నొకశిశువుపేరు అపోలో, రెండవది ఆర్టిమిస్ నామక డయానాకన్య. ఈమె పాతివ్రత్యాధిదేవత. అపోలో జన్మానంతరమునగూడ లేటోకు జూనోబాధ తప్పినది కాదు. అందువలన నితడు థెమిస్ అను వేఱొకదేవతవలన బోషింపబడెను. థెమిస్ కూడ జ్యూస్‌యొక్క భార్యలలో నొకతె; న్యాయధర్మముల కధిదేవత యైయుండెను. మొట్టమొదట నీథెమిస్‌యొక్క యధీనమందే డెల్ఫిలోని దేవవాణి యుండె ననియు, దానినామెయే తరువాత అపోలోకు ప్రసాదించె ననియు కొన్నిగాథలు వర్ణించుచున్నవి. థెమిస్‌యొక్క పరిపోషణ మందుచు అపోలో అమృతము నోటికి దగిలినవెంటనే శైశవమునుండి యొక్కపెట్టున యౌవనావస్థను బొందెను. అపోలోజన్మమునకు బూర్వము డెలోస్ ద్వీప మస్థిరమై, సస్యవిహీనమై, ఊషరక్షేత్రసంయుతమై, జనవాసాయోగ్యమైన స్థానముగ నుండి యతడు పుట్టినతోడనే సుస్థిరమును, జనవాసార్హమును, సస్యపరిపూర్ణమును నైనదిగ మాఱెను. మాసమునందలి సప్తమదినమున నితడవతరించెను. దీనిని బురస్కరించుకొని యాసప్తమదినమునందును, మాసమునందలి ఇరువదవనాడును, పూర్ణిమ, అమావాస్యలందును ఇతనిపేర నుత్సవములు జరుపబడుచుండును. మఱియు కర్నియా, డఫ్నెఫోరియా, డెలియా, హైసింథియా, ప్యానెప్సియా, పిథియా, థర్గేలియా మొదలగు పండుగలుకూడ నితనిపేరను గావింపబడుచున్నవి.



అపోలో

ఇతడు దేవవాణి, వ్యాధిపీడానివారణము, యుద్ధము, ప్రకృతి, వనస్పతులు, చరాచరములు, సంగీతగానకళాదులు, కృషి మున్నగువాని కధిదేవత. ఇన్నిభిన్నవిషయముల కధిదేవత యగుటవలననే ఇతని కనేకనామధేయములును గలిగినవి.

sampath_Ebooks



హోమరుగ్రంథమునం దితనికి ఆపాదింపఁబడినధర్మములలో దేవవాణి యధిపతిత్వ మొకటి. ఇతఁడు జన్మించిన యైదవనాఁడె పైథన్ నామకసర్పమును వధించి భవిష్యద్వాణి కధిపతి యయ్యెను. కాని నీతిగాథల ననుసరించి యీసర్పము భూతపిశాచాదులలోఁ జేరినది కాదు. తనతల్లి యగు లేటోను హింసించె ననియో లేక భవిష్యద్వాణిని పైథన్ స్వయముగఁ బ్రకటించుచుండె ననియో ఇతఁడు దానిని జంపి దానిభవిష్యత్కథనాధిపత్యమును తాను స్వయముగ గ్రహించెను. ఇందువలన నితనికి పాపము కలుగఁ దన్నివారణార్థము పరిభ్రమణము సలిపి టెంపె యను లోయయందు లారెల్ వృక్షములతోఁటలోఁ గూరుచుండి ౯ సంవత్సరముల పర్యంతము తపస్సును గావించి యాపాపమునుండి విముక్తుఁడయ్యెను. ఈ ప్రకారము తపము నొనరించి పాపవిముక్తుఁ డగుటవలన నితరులను గూడ పాపహారులను జేయుశక్తి లభించెను. దేవవాణుల నితఁడు స్వయముగఁ గాక జ్యూస్ పేరను బ్రకటించుచుండెను. కాని యితని భావములను సాధారణముగ నందఱును గ్రహింపఁజాలకుండిరి. వాగ్రూపముననే భవిష్యత్తులను జెప్పుచుండెడివాఁడు కాని పక్షులఁ బాఱిపోవుట, నివేదితపదార్థములు మండుట, బల్యన్నము, దేవధనుస్సు, కలలు మున్నగువానివలనఁ గలుగుసంకేతములనుండియు దేవతాభిప్రాయము కనుఁగొనఁబడుచుండెడిది. కాలాంతరమున నితఁడు తన కభీష్టులైన కస్సాండ్రా, హెలెనస్, మెలంపస్, ఎపిమెనిడెస్ లోనగు మర్త్యులకును భవిష్యద్వాణిని వచింపఁగలుగుశక్తిని ప్రసాదించెను. మహామారి (ప్లేగ్) మొదలగు రోగముల వినాశము గావించువాఁ డగుటంజేసి యితనికి స్మింథియస్ అను పేరు గలిగెను. స్మింథియస్ అనఁగా మూషకధ్వంసి. ఇదికాక మఱికొన్ని రోగముల నివారించువాఁ డగుటవలన అయిట్రోమెంటిస్, కౌలియోస్ అను పేరులు గూడ నితనికి లభించెను.

యుద్ధాధిదేవత యగుకారణమున ఎలేలియస్ (యుద్ధఘోషణకర్త), అర్గురోటోక్సోస్ (రజతధనుర్ధారి), హెకటెబోలోస్ (దూరమునమండి గుఱికొట్టునతఁడు), క్రైసావ్రోస్ (స్వర్ణఖడ్గధారి), బొడ్రోమియోస్ (సహాయకుఁడు) లోనగు బిరుదములు ప్రాప్తమయ్యెను. పాషాణములమీఁదను జెక్కఁబడిన ఇతనివిగ్రహములు కొన్ని సమస్తయుద్ధోపకరణములతో సుసజ్జితమై యున్నట్లు నిర్మింపఁబడియున్నవి. ఇందువలన కొందఱితనిని సంహారదేవత యనియుఁ దలఁచిరి.

ప్రకృతివనస్పతుల యధిదేవత యగుటచే మహారణ్యములు, వనములు, ఆరామములు, పర్వతగుహలు, లోయలు నీతనినిరీక్షణమందే యుండెను. వృక్షములలో ముఖ్యముగ లారెల్, బేనామకవృక్షము లితని కత్యంతపవిత్రములు. బేచెట్టుయొక్క ఆకులు బలిపూజావిధానములందును, ఒలింపియన్ వ్యాయామప్రపందెములందు కిరీటముగఁ దాల్చుటకును నుపయోగపడుచుండును. లారెల్ వృక్షపత్రములను నిందులకే యుపయోగించును. తాటిచెట్టుక్రింద నితఁడు జన్మించినందున నదియు నితనికి పవిత్ర మయ్యెను.

పశ్వాదులసంరక్షణ మితనికర్తవ్యములలో నొకటి. స్వయముగను నితఁడు పశువుల మేపియుండెను. పశు, పక్షి, సరీసృపాదులలో సింహము, తోఁడేలు, హంసము, డేగ, కాకి, గృధ్రము, సర్పము మొదలగునవి ఇతనికి పవిత్రములు.

మానవపాలకుఁ డగుటవలన నితఁడు కౌరోట్రోఫోస్ (బాలకపోషకుఁడు) అను బిరుదమును గాంచెను.

సంగీతగానకళాదివిద్యాపరిపోషకుఁడై దేవతలు గావించుకొను నుత్సవములందు లైర్ నామకవీణావిశేషమును వాయించుచుండెడివాఁడు. క్లియో (ఇతిహాసము), యూటెర్పె (శృంగారకావ్యము), థాలియా (సుఖాంతనాటకము), మెల్పోమెన్ (దుఃఖాంతనాటకము), టెర్ప్సికోర్ (నృత్యగానములు), ఎరాటో (ప్రేమగీతము), పాలిమ్నియా (ఉన్నతమంత్రము), ఉరానియా (జ్యోతిషము), కల్లియోప్ (ఐతిహాసికకావ్యము) అను పేరులం బరఁగు తొమ్మండ్రు కళావమూర్తు లితనికి సేవకము సేయువారుగ నుండిరి. వీరందఱితోఁ గూడి ఇతఁడు హెలికన్ పర్వతశిఖరములందును, పెర్నాసస్ మహీధరాగ్రములందును విహారము గావించుచు, కాస్టేలియన్ నామకనిర్ఝరిణీజలములఁ గ్రోలుచు సకలకళారసధారాసంపాతములచే లోకుల నానందింపఁజేయుచుండును.

కృషి సస్యాదుల కధిదేవత యగుటవలన అపోలో సిటాల్కాస్ (ధాన్యరక్షకుఁడు), ఎరిథిబియస్ (ఈతిపరిహర్త), సస్పరియస్ (అన్నదేవత), హెర్సోస్ (తుషారదాత), నోమియోస్ (పసులదేవత) మొదలగు బిరుదములను గాంచియుండెను. మఱియుఁ గృషికర్త యగునప్పు డితఁడు సంవత్సరాయనగమనాగమనములతోడను, ఋతువులతోడను సంబంధము కలిగి కాలనియామకుఁడై యొప్పారుచుండును. ఇందువలన నితనికి హోరోమెడన్ (ఋతుపాలకుఁడు) అను పేరు కలిగెను.

క్రేటన్ లోని తనయుపాసకుల నితఁడు డెల్ఫి తీరములకుఁ గొంపోయెను. ఆకారణమున నితనికి సాముద్రికదేవత్వముగూడ లభించినది. ఇపిబెటారియస్ (నౌకారోహి), ఎపాబెటారియస్ (నౌకావరోహి), నసియోటాస్ (ద్వీపవాసి), యూర్యాలిస్ (విశాలసాగరదేవత) మొదలగు పేరు లితనికి సముద్రదేవత యైనందుననే కలిగినవి. లోకపాలకుఁడై గ్రామాదుల సృజించుటవలన పాట్రూస్ అను పేరును, రాజమార్గములకు, వీధులకు నధిదేవత యగుహేతువున అగూయియోస్, ప్రొస్టేటెరియోస్ అనునామధేయములును గలిగెను. ఇతని శిలావిగ్రహములు, స్తంభములు గృహముల యెదుట స్థాపింపఁబడియుండుటను జూడవచ్చును. అట్లు చేయుటవలన కీడును, అనిష్టమును బాఱఁదోలి మంచినిమాత్రమే లోపలఁ బ్రవేశింపఁజేయు నని గృహయజమానులవిశ్వాసము.

sampath_Ebooks

ఇతనియుత్సవావసరములయందు వ్యాయామసంబంధము లైన పోటీలు జరుగుచుండును. అపోలో స్వయముగ వ్యాయామకుశలుఁడు. ఇతఁడు ఒలింపియన్ పందెములలోఁ బాల్గొని పరుగెత్తుటయందు హెర్మెస్‌ను జయించినట్లును, కుస్తీయందు ఏరెసును గెలిచినట్లును గాథలు కలవు.

ఇన్ని ప్రకారము లగు గుణధర్మములు గలిగి, యిన్ని విషయము లకు అధిదేవత్వమును బొందియుండినప్పటికి నితఁ డొనరించిన కొన్ని క్రూరకార్యములు అద్వితీయము లే కాదు, అమానుషికములకంటెను నీచాతి నీచము లై యున్న వని చెప్పవచ్చును. గానమునందుఁ దనతోఁ బోటీ పెట్టుకొనె ననుకారణమున మార్స్యాస్‌చర్మమును బ్రతికియుండఁ గనే ఒలిపించివైచెను. మఱియు నియోబే యనుస్త్రీకి ౭ గురు కొడుకులును, ౭ గురు కూఁతులు నుండిరి. ఒకసందర్భమున నీమె తన కున్నంత సంతానము లేటోకు లే దని పరిహాసము సల్పెనఁట! అందుమీఁద నితఁడు మహోగ్రుఁడై తనచెల్లెలగు ఆర్టిమిస్‌ను చేదోడుగఁ గైకొని నియోబేయొక్క ౧౪ గురు బాలికాబాలకులను నొక్కపెట్టునఁ దుద ముట్టించెను. ఇందులకు భిన్నముగ ననుగ్రహమును జూపినతావులును గలవు. హయసింథ్ నామక బాలకునిపై నితని కత్యంత మగు ప్రేమ యుండెను. వీ రిద్దఱు నొకదినమున నాడుకొనుచుండ ఘటనావశమున నా బాలకుఁ డితనిచే మృతి నొందెను. అంత నితఁ డతనిస్మరణార్థము అతనిరక్తమునుండి నీలపుష్పముల సృజించెను. ఈ పుష్పము లిప్పటి కిని నతనిపేరను హయసింథ్ పూవు లని పిలువఁబడుచున్నవి.

వెండియు నితఁడు తాను ప్రేమించిన డాఫ్నె నామకకన్యను లారెల్ వృక్షముగ మార్చి నిరంతరము పచ్చగ నుండులాగునఁ జేసె ననియు, కోరోనిస్ తనప్రియురాలిపై నబద్ధము చెప్పినకాకిని శ్వేత వర్ణమునుండి నల్లనివర్ణమునకు మార్చె ననియు గాథలు కలవు.

అపోలోయొక్క యుపాసనమును రోమనులు గ్రీకువారినుండి కైకొనిరి. టార్క్వినియస్ సూపర్‌బస్ కాలమున డెల్ఫియన్ దేవవాణిని సంప్రతించినట్లు కొన్ని యాధారములు గలవు. క్రీ. పూ. ౪౭౦ సంవత్సరప్రాంతములందు కలవుకాటకము లుత్పన్నము కాఁగా నచట అపోలోనిమిత్త మొకదేవాలయము నిర్మింపఁబడెను. క్రీ. పూ. ౨౧౨-వ సంవత్సరమున రెండవప్యూనిక్ యుద్ధావసరమునాఁటివి అపోలోనుగుఱించిన వృత్తాంతములు గొన్ని కలవు. అగస్టస్‌రాజ్య కాలమున నితనియుపాసనము రోమునందు సుస్థిరముగ నెలకొనిపోవ నితఁ డచటి దేవతాప్రముఖులలో నొకఁ డయ్యెను. ఆక్టియంయుద్ధా నంతరము అగస్టస్ అపోలోమందిరమును దిరుగఁ గట్టించి యుద్ధవిజ యమున దొరకినద్రవ్యములోఁ గొంతభాగమును వినియోగించి అపోలోనిమిత్తము పాంచవార్షికోత్సవముల నేర్పాటు చేసెను.

పాశ్చాత్యదేశములందు ప్రాచీనకాలపు కళాప్రపంచమునఁ దక్కినదేవత లందఱికంటె నెక్కుడుగఁ గన్పించునది ఈయపోలో దేవతయే. యూరోపుఖండమున పారిస్ మున్నగు కొన్నిస్థలములం దితనివిగ్రహములు కలవు. రోడ్స్‌ద్వీపము అపోలో కత్యంతపవిత్ర మైనది. కారణ మే మనఁగా దేవత లందఱు భూమిని దమలోఁ దామ పంచుకొనుచుండ అపోలో అచట లేకుండుట సంభవించెను. అందు వలన నితనివంతున కేమియు దొరకినదికాదు. రోడ్స్‌ద్వీప మప్పుడు సముద్రమున మునిఁగియుండెను. ఆద్వీపము ముందు నీటిపైకి వచ్చు నని తెలిసియున్నవాఁ డగుటచే నితఁడు దానిని దన కొసఁగు మని జ్యూస్‌ను బ్రార్థింప నతఁడు మంచి దని సమ్మతించెను. అది మొదలు కొని రోడ్స్‌ద్వీప మితనికిఁ బవిత్రావాస మయ్యెను. ఈద్వీపము జ్వాలాముఖీపర్వతముల కాకరము. బృహదాకృతి నొప్పు అపోలో విగ్రహ మొకటి ఇచట నుండెను. పరిమాణ మం దది నూఱడుగుల ఎత్తు గలిగి ప్రపంచమందలి ఏడు అద్భుతములలో నిదియు నొకటి యైయుండెను. కాని యీబ్రహ్మాండమైన విగ్రహము భూకంపము వలన ధ్వంసముకాఁగా నామమాత్రావశిష్ట మైపోయెను. ప్రస్తుతము దొరకువానిలో రోమునగరమందలి వెటికన్ మ్యూజియములోని అపోలో బెల్వీడర్ విగ్రహము మిగులఁ బ్రశస్త మైనది. క్రీ. శ. ౧౪౭౫-వ సంవత్సరమున ఆంటియమ్ శిథిలావశేషములలో దొరకిన ఈవిగ్రహమును వెటికన్ చిత్రవస్తుప్రదర్శనశాలాసంస్థాపకుఁ డగు పోపు రెండవజూలియస్ గొనియుండెను. ఇది క్రీ. పూ. 3-వ శతాబ్దియందలి యొకవిగ్రహపునక లనియు, ప్రాయశః నీరోకాలము నాఁటి దై యుండవచ్చు ననియు నూహింపఁబడినది.

**అపోలోనియస్** —(పెర్గస్) ౧. ఇతఁడు క్రీ. పూ. మూఁడవ శతాబ్దియం దున్న గొప్ప రేఖాగణితశాస్త్రవేత్త (‘The Great geometer’). నాల్గవ, అయిదవ టాలెమీరాజుల రాజ్య కాలమున నీతఁడు అలెగ్జాండ్రియా పట్టణమునందు యూక్లిడ్ శిష్యులపాఠశాలలో మొదట శిష్యుఁడుగను, తరువాత గురువు గను ఉండెను. ఇతఁడు వ్రాసిన గ్రంథములలో మ్యాగ్నమ్ ఆపస్ (Magnum Opus) అనునది ముఖ్య మైనది. ఇందు దీర్ఘవృత్తము లను (Conic Sections) గుఱించిన ౪౦౦ ల సిద్ధాంతములు కలవు. ఇందుఁ బెక్కు లాతఁడు క్రొత్తగఁ గనిపట్టినవి యున్నవి.

అపోలోనియస్ —(ర్హోడి అస్) ౨. గొప్పకవి, పండితుఁడు. అర్గొనాటికా (Argonautica) యను మహాకావ్యము నకుఁ గర్త. ఇది మన మహాభారతమువలె క్షాత్రవీర్యమును వర్ణించు నట్టిది. దీనిభావ, వర్ణనాకౌశలము మిక్కిలి యుచ్చతరమైనవి. వర్జిల్ మొదలయినమహాకవులకుఁ గూడ నిది మార్గదర్శక మైన దందురు. ఈతఁడు మొదట ర్హోడ్సులో సాహిత్యాచార్యుఁడు (Rhetorician) గా నుండి తరువాత అలెగ్జాండ్రియాలో పుస్తకభాండాగారాధ్య క్షుఁడు (Librarian) గా నుండెను. ఇతనికాలము రమారమి క్రీ. పూ. ౨౪౦ మొదలు ౧౮౦ వఱకు, అనఁగా నితఁ డిప్పటికి రెండువేల నూటయేఁబది సంవత్సరముల క్రిందట నుండెను.

sampath_Ebooks



**అపొలోనియస్** — (మొలన్) 3. గ్రీకు (యవన) సాహిత్యవేత్త (Rhetorician). క్రీ. పూ. ౧-వ శతాబ్దియందు ఉన్నవాఁడు. సిసిరోకు సాహిత్యము నేర్పెను (క్రీ. పూ. ౭౭).

**అపొలోనియస్** — (ట్యానిఅస్) 4. పైథాగొరస్ సంప్రదాయమునందలి తత్త్వవేత్త. ఇతని కాలము రమారమి క్రీ. పూ. ౪-వ సంవత్సరము మొదలుకొని క్రీ. శ. ౯౭-వ సంవత్సరమువఱకు. ఈతఁడు ఆసియామైనరు, పార్థియా, హిందూదేశము మొదలయిన దూరదూరదేశములు తిరిగి వచ్చెను. హిందూదేశమునందు బ్రాహ్మణులతో తత్త్వమును గుఱించి సంభాషించె నని క్రీ. శ. ౨౦౦ లో నితనిచరిత్రము వ్రాసిన ఫిలాస్ట్రేటస్ (Philostratus) వ్రాసియున్నాఁడు. ఇతఁడు పెక్కుదైవిక చిత్రంబులను, అమానుష కృత్యంబులను చేసి చూపెనఁట.

**అపోస్తలచర్చి** — అపోస్తలులసమయమం దుండిన ప్రార్థనాలయము. వారియొక్క ఇచ్ఛానుసారముగ నిది నిర్మింపఁబడియుండెను. మఱియు రోమునగరము, అలెగ్జాండ్రియా, జెరూసెలం, అంటియోక్ పట్టణములం దున్న చర్చిలకును నిదే నామధేయము ప్రఖ్యాత మయ్యెను. అపోస్తలచర్చి తమ దని రోమనుకాథలిక్కులును, తమ దని ఎపిస్కోపలులును తగవు లాడుచుందురు.

**అపోస్తలపారంపర్యము** — బిషప్పులు, పురోహితులు, డీకనులు అనునీ మువ్వురు గలసినది యపోస్తలసంస్థ యనఁబడును. విన్యుక్తసంస్కారములతో వీర లేర్పాటు చేయఁబడుచుందురు. ప్రథమమందలి అపోస్తలులు మొదలుకొని నేఁటివఱకును వీరలసంస్థ అవిచ్ఛిన్నముగ వచ్చుచున్నది. దీనికే అపోస్తలపారంపర్యమని పేరు. ఎపిస్కోపల్‌చర్చివారి కిట్టి సంస్కారములవిషయమై యంతగ పట్టింపు లేకపోయినను, కాథలిక్కులును, కొందఱు ఇంగ్లీషుచర్చివారును వీనివిషయమున గట్టిశ్రద్ధను బూనుచుందురు.

**అపోస్తలపితరులు** — అపోస్తలులతో సమకాలికులైన లేఖకులు. క్లెమెంట్, బర్నబస్, హెర్మస్, ఇగ్నేషియస్, పాలికార్ప్ అనువార లయిదుగురు అపోస్తలపితరు లని పేరువడసిరి.

**అపోస్తలభ్రాతలు** — మధ్యయుగమునందు పోపు లమితద్రవ్యవంతులై రాజాధిరాజభోగము లందుచుండ వారియందుఁ బ్రవేశించిన దురాచారములను రూపుమాపి సంఘమును, గురువులను మంచిమార్గములోనికిఁ గొనిరావలయు నని కొందఱు ప్రయత్నములఁ బలిపియుండిరి. వారే యపోస్తలభ్రాతలు. ఆదిమ-అపోస్తలుల-ఆచారవ్యవహారముల నవలంబించుటచే వీరల కీపేరు గలిగెను. వీరిలోఁ గట్టకడపటిదియు, మిగులఁ బ్రఖ్యాతిఁ గాంచినదియు నగు సంప్రదాయము క్రీ. శ. ౧౨౬౦-వ సంవత్సరమున పర్మానివాసి యగు జెరార్డ్ సెగరల్లీ యనువానిచే స్థాపింపఁబడెను. వీరు రిక్తపాదములతో, భిక్షాటనమున నుదరపోషణముం జేసికొనుచు, ధార్మికగీతములఁ బాడుకొనుచు ఇటలీ, స్విట్జర్లాండ్ ఫ్రాన్స్ దేశములలోఁ బర్యటనముం జేసి యుపదేశింపసాగిరి. ఆబాలగోపాలము సౌఖ్య మనుభవింపఁగల స్వర్గతుల్యమగు రాజ్యము రానున్న దనియు, దివ్యమైన కాలము సమీపించుచున్న దనియు లోకులకు బోధించుచు, పోపు పదవిని, అందలిదురాచారములను, కేవలము భోగవిలాసములకు స్థానములుగ మాఱినచర్చిలను జాల కఠినముగ నిందింప మొదలిడిరి. ధనధాన్యసంపత్తుల సమకూర్చుట మాని అనికేతనులు, అవివాహితులునై సాంసారికపదార్థవిముఖు లైన విరాగులభంగి వీరు జీవనము గడపుచుండిరి. కాని పోపునకును, వారియనుయాయులకును వీరిబోధనములు కంటకము లయ్యెను. క్రీ. శ. ౧౨౮౬-వ సంవత్సరమున పోప్ నాల్గవ హానోరియస్ ఈప్రచారము నాఁపివేయుటకు ఉత్తరువు నొసంగెను. ౧౩౦౦ ల సంవత్సరమున పోపుసంప్రదాయు లీసెగరల్లీని బట్టికొని మతద్రోహి యనుదోషమారోపించి యతనిని గాల్చివైచిరి. ఇతని మరణానంతరము ఈసంప్రదాయులకు మిలన్‌నగర నివాసియు, గొప్ప విద్వాంసుఁడు నగు డోల్సినో యనునతఁడు నాయకుఁ డయ్యెను. అది మొదలుకొని యీసంప్రదాయులు స్వరక్షణార్థము దుర్గములందు నివసింప మొదలిడిరి. క్రీ. శ. ౧౩౦౭-వ సంవత్సరమున రెనేరియస్ అను బిషప్‌యొక్క సేనలు మిలన్‌చుట్టుప్రక్కల నున్న దేశమును ధ్వంసము చేసి వెర్సెల్లీయందలి జెబెల్లీదుర్గమును ముట్టడించి, యపోస్తలసోదరుల నందఱను బట్టికొని, వారినాయకుఁడగు డోల్సినోను గాల్చివైచిరి. ఆనంతర మీసంప్రదాయము క్రమముగా క్షీణించి పోయినట్లు తోఁచుచున్నది.

**అపోస్తలమతము** — క్రైస్తవమతమునకుఁ జెందిన యొకసిద్ధాంతము. ఆదిమ-అపోస్తలులు దీనిని గావించి రని పూర్వకాలమున నందఱును నమ్ముచువచ్చిరి. కాని యిటీవల నీసిద్ధాంతము నాలుగవశతాబ్దియం దేర్పడియుండె నని నిశ్చయింపఁబడినది.

**అపోస్తలరాజులు** — పోపువలన హంగేరీదేశపు రాజునకు ఒసఁగఁబడినబిరుదము. క్రీ. శ ౧౦౦౧-వ సంవత్సరమున పోపు రెండవసిల్వెస్టర్ హంగేరియారాజగు సెంట్ స్టీఫెనుకు ఈబిరుదము నొసఁగెను. ఇతఁడు తనరాజ్యములోని అన్యధర్మములవారి నందఱను క్రైస్తవమతమునఁ గలుపుటకుఁగాను ప్రబలప్రయత్నములను గావించియుండెను. అటుతరువాత క్రీ. శ. ౧౭౫౮-వ సంవత్సరమున పోప్ ౧౩-వ క్లెమెంట్ మేరియాథెరిస్సాచక్రవర్తినికిని, ఆమె వంశీయులకును నీబిరుదమును బ్రసాదించెను. క్రీ. శ. ౧౯౧౮ వఱకును హంగేరియారాజులు దీనిని ధరించుచువచ్చిరి.

**అపోస్తలసంస్థలు (నియమములు)** — క్రైస్తవధర్మవిషయమున లిఖింపఁబడిన విధివివరణములు. ఇవి ౮ భాగములుగ విభజింపఁబడియున్నవి. అంతిమభాగము అపోస్తలుల ౮౫ నియమములతోఁ బూర్తి యగును. ఇవి యపోస్తలులచే రచింపఁబడినవిగాను క్లెమెంటుచే చర్చికి నొసంగఁబడిన వని పూర్వ మందఱును తలఁచుచుండి

sampath_Ebooks

యుండిరి. కాని మొదటినుండియు నీయునిమిది భాగములు వేర్వే ఱనియే తలఁపఁబడుచువచ్చెను. వీనిలో ౮౫ నియమము లెక్కుడు ప్రమాణ భూతములు. వ్హిస్టన్ అనునతఁడు వీనిని క్రైస్తవధర్మమునకు ప్రమాణము లనియు, బైబిల్ తరువాత వీనిని మించిన ప్రామాణికగ్రంథ మేదియు లే దనియు వక్కాణించియుండెను. కాని యివి అపోస్తలులు రచించినవి కాక తరువాత వచ్చినవారు వ్రాసిన వనియు ననేకులు దలఁచియుండిరి. అట్లు వ్రాసినవారిలో ఆర్చిబిషప్ ఉషనర్ అనునతఁడు ముఖ్యుఁడు. ఇతఁడు వీనిని ఆధునిక విమర్శకునిభంగి పరిశీలించి యందలివిషయములను వ్రాఁతయందలిశైలిని సరిపోల్చి చూచి యవి యపోస్తలరచితములు కా వనియు, ఇగ్నేషియన్ లేఖలను బోలియున్న వనియు తీర్మానముం జేసెను. అటుతరువాత సిరియావాస్తవ్యుఁ డొకఁడు వీనిని క్రీ. శ. నాల్గవశతాబ్దియంతమున రచించి యుండవచ్చు నని నిశ్చయింపఁబడెను. చర్చికిఁ జెందిన ఆర్చిబిషప్పులు, బిషప్పులు, ప్రెస్బిటరులు, డీకనులు మున్నగువారు గమనించి యవలంబింపవలసినవిధులు, నీతులు, నియమము లిందు వ్రాయఁబడియున్నవి. మఱియు చర్చియందు జరుపవలసిన సంస్కారములు, మర్యాదలు మున్నగువానింగూర్చియు నిందు నియమములు కలవు.

**అపోస్తలాధికారము** — రోమునందలి పోపులకును, బిషప్పులకును ఉండెడి అధికారము. దీనిని సెంటుపీటరునుండి నేఁటివఱకు వచ్చుచుండిన పోపు లందఱును గలిగియుండిరి.

**అపోస్తలులు** — ఆరంభకాలమునఁ దన నూతనధర్మమును దేశదేశాంతరములందు ప్రచారము సేయునిమిత్తము ఏసుక్రీస్తు ౧౨ గురు మనుష్యుల నేర్పఱచుకొనియుండెను. పంపఁబడినవారని అపోస్తలశబ్దార్థము. కావున మతప్రచారార్థము పంపఁబడిన ఈ ౧౨ గురకు అపోస్తలు లను పేరు కలిగెను. అసలు అపోస్తలులు ఈ ౧౨ గురే. మొదట తాను గావించు నుపదేశముల నాలకించి యనంతరము వానిని జనులకు బోధించుటకుఁగాను క్రీస్తు వీరల నేర్పఱచికొనెను. సైమన్‌పీటర్, అతనిసోదరుఁడు ఆంద్రూ, జెబిడీ యొక్క కుమారు లగు జేమ్సు జాన్ లనువారు, ఫిలిప్, బర్తొలోమ్యూ, థామస్, మాథ్యూఅల్ఫేయస్ పుత్రుఁ డగు జేమ్సు, అతని సోదరుఁడు లెబ్బియస్ — వీరిద్దఱు జూడాస్, జూడె యనియుఁ బిలువఁబడుచుండిరి — సైమన్ కనానైట్, జూడాస్ ఇస్కారియట్ అని మొత్తము ౧౨ గురు ఆదిమ అపోస్తలులు. తరువాత వీరికిఁ దోడుగ మఱికొందఱు నియమింపఁబడిరి. జూడాస్ ఇస్కారియట్‌కు బదులుగ మథియాస్ అనునతఁడు చేర్పఁబడెను. అనంతరము సెంట్ పాల్ అనునతఁడు నియమితుఁ డయ్యెను. పాల్ వెనువెంటఁ బోయిన బర్నబాస్ అనునతనికిని అపోస్తలబిరుదము లభించెను. ఇందువలన ఆరంభకాలమునందును, తరువాతను క్రీస్తుమతప్రచారార్థము వెడలినవా రందఱు నిదేపేరను బిలువఁబడుచువచ్చి రని తెలియుచున్నది. గాల్ దేశమునఁ బ్రచారము సల్పిన సెంట్ డెన్నిస్ అచటి అపోస్తలుఁ డయ్యెను. ఇదేవిధమున సెంట్ బోనిఫేస్ జర్మనీదేశపు అపోస్తలుఁడు. సెంట్ అగస్టైన్ ఇంగ్లాండుదేశపు అపోస్తలుఁడు. ఫ్రాన్సిస్ జేవియర్ 'ఇండీసు'ల యపోస్తలుఁడు. అడాల్బర్ట్ ప్రష్యాదేశపు అపోస్తలుఁడు. ఏసుక్రీస్తు జీవించియున్నతరుణమందే వీ రతని యుపదేశములందు విశ్వాసము గోలుపోవుచువచ్చిరి. అది యన్నియు నటు లుండ క్రీస్తు సిలువమీఁద దారుణమైన యాతన లందుసమయమున వీ రతనియెడల సహానుభూతినైనఁ గనుపఱుప సాహసింపకపోయిరి. క్రీస్తుమరణానంతర మతని దివ్యాత్మ పెంటికోస్ట్ అనునుత్సవదినమున జనుల కందఱకును దర్శన మిచ్చెను. అప్పుడీ యపోస్తలులు క్రీస్తుయొక్క ఆత్మసందర్శనముచేత నైనను తాము గోల్పోయిన ధైర్యమును బడసి, యతనినియోగముల నుచితరీతి నిర్వర్తింపఁగలుగుదు మను గొప్పయాసతో నాయాత్మను దర్శించిరి. ఏసుక్రీస్తు సెంట్ పీటరును మొదటి అపోస్తలునిగ నేర్పఱచియుండెను. అతనినుండి నేఁటివఱకును పోపు మతగురుపారంపర్యము అవిచ్ఛిన్నముగ వచ్చుచున్నది. ఈహేతువున ధార్మికవిషయములందుఁ దనకు మించిన యధికార మితరుల కుండరా దని పోపు వాదించుచుండును.

అపోహాయుఁడు — ఒకబ్రహ్మర్షి.

**అప్పకవి** — ప్రసిద్ధుఁ డగు నాంధ్రలక్షణవేత్త. అప్పకవీయ మను లక్షణగ్రంథమునకుఁ గర్త. ఆంధ్రపండితులలో నప్పకవీయమున కసమానగౌరవము కలదు. ఇందుండి ప్రమాణము చూపినయెడల నిప్పటి తెలుఁగుపండితులలో నూటికిఁ దొంబదిమంది మాఱాడక శిరసావహింతురు. ఆంధ్రమునందుఁ గవిత్వము చెప్పువారికిఁ గావలసిన విషయము లన్నియు నిందు సవిస్తరముగఁ జెప్పఁబడియున్నందున నింతకుఁబూర్వ మున్న ఛందశ్శాస్త్రము లన్నియు వెనుకఁబడి దీని కింత యాధిక్యము కలిగినది. ఈకవి తనగ్రంథమును గుఱించి యీ క్రిందివిధముగఁ జెప్పినమాటలు చాలభాగము నిజమనియే యొప్పుకొనవలసియున్నది:—

వ.....లక్షణగ్రంథములు లక్షోపలక్షలు గల వందు,

క. ఒకదానికంటె మఱి వే
 ఱొకటి విశేషంబుఁ జెప్పుచుండుకతమునన్
 సకలగ్రంథములును జను
 లక తెలియునె లక్షణప్రపంచం బెల్లన్. [౧. ౧౧౧

క. ఇది చదివినపిమ్మట మఱి
 యొదియేనియుఁ జదువ బుద్ధి యేలా పొడమున్ ?
 బదపడి గ్రంథము లన్నియు
 వెదకివెదకి సార మెల్ల వివరింపంగన్. [౧. ౧౧౨

కాలము:—తమకాలమును నివాసస్థానమును స్పష్టముగ వ్రాసికొనినతెలుఁగుకవులు తక్కువ. అట్లు స్పష్టముగ వ్రాసినవారిలో అప్పకవి యొకఁడు. శా. శ. ౧౫౭౮ మన్మథనామసంవత్సర శ్రావణ బహుళ ౮ (క్రీ. శ. ౧౬౫౬ ఆగస్టు ౩) దినమున దేవుఁడు కలలోనికి

వచ్చి గ్రంథము వ్రాయు మని చెప్పెను [ఆ, ౧. ౩౩). ఏకమీఁ గురువారమునాఁడు (ఆగస్టు, ౮) కవి గ్రంథము వ్రాయ ప్రారంభించెను (౧౯౭). ఇట్లప్పకవీయము వ్రాయఁబడి యిప్పటికి ౨౭౭ సంవత్సరము లయినది.

నివాసస్థలము :—ఈతఁడు తన గ్రంథమును కామెపల్లి గోపాలస్వామివారి కంకితము చేసినాఁడు. కవియు నా గ్రామమునందె నివాసముగ నుండినట్లు కానవచ్చుచున్నది (౧. ౩౮, ౩౫). కామెపల్లి యిప్పుడు గుంటూరుజిల్లాయందలి పల్నాడు తాలూకాలో నున్నది. అప్పకవికాలమున నది తంగెడుసీమలోనిది. ఇప్పుడు తంగెడు అను గ్రామము కామెపల్లికిఁ బశ్చిమమున పల్నాడుతాలూకాలో నున్నది. ఈ కామెపల్లి అనునది అప్ప డగ్రహారము. వట్టెము పెద్దనార్యునకు సాయప వేంకటపతి యిచ్చెను (౧. ౯౯,౧౦౦).

వంశము :— ఈకవిది భారద్వాజసగోత్రము, ఆపస్తంబ సూత్రము. ఈతఁడు వైదికుఁడు. ఇంటిపేరు కాకునూరివారు. ఈ వంశమువారిది మొదట కాకునూరు-అగ్రహారము. అది సరికొండసీమలో నుండెను. వీరి మూలపురుషుఁడు సోమయ్య (౧. ౩౧). ఈతఁ డప్పకవితాతకుఁ దాత. ఈతఁడు చిన్నతనముననే కాశికిఁ బోయి బ్రహ్మేంద్రులయొద్ద శాస్త్రములు చదివి గొప్పపండితుఁడై (౧. ౬౩), మధురాపట్టణమునకుఁ బోయి యచ్చటిపండితులను వాదములలో గెలిచి (౧. ౬౨), కాకునూరు-అగ్రహారమును, నిడుదపల్లి, బొద్దికేపల్లి, నిడురళ్ళపురి అను గ్రామములలో మాన్యక్షేత్రములను సంపాదించెను. ఈతఁడు 'అభినవమాతసద్గ్రామము'లోఁ గాఁపురముండెను (౧. ౬౩). అభినవమాతసద్గ్రామ మనఁగాఁ గ్రొత్త మామిడిపల్లె. మామిళ్లపల్లె యొకటి బాపట్లతాలూకాలో నున్నది. మామిళ్లపల్లి(అగ్రహారము) యొకటి నూజవీడు తాలూకాలో నున్నది. కాకునూ రీతఁడు సంపాదించినాఁ డని యప్పకవి వ్రాసినను ఈతని తండ్రిపేరు చెప్పుటలో 'కాకునూరి తిమ్మన' యని చెప్పుట వలన (౧. ౬౩) వీరికి సోమయ్యకుఁ బూర్వమే కాకునూరివా రన్న గృహనామ ముండినట్లు గానవచ్చుచున్నది. ఈసోమయ్యకు గంగమాంబయందు అమరేశ్వరుఁడు, కొండలయ్య, రంగప్ప, లక్ష్మణుఁడు అను నల్గురు కుమారులు పుట్టిరి. వీరిలో రంగప్ప మనకవియొక్క ముత్తాత. ఈయనభార్య కన్నమ్మ. వీ రిద్దఱకును తిరుమలభట్టు, గంగన్న, పెద్ద సోమయ్య, చిన్నసోమయ్య అను పుత్రులు పుట్టిరి. పెదసోమయ్య మనకవికిఁ దాత (౧. ౬౬). ఇతఁడు క్రతువులు చేసెను. రొంపిచెర్లలో పెద్దనూయి త్రవ్వించెను. రొంపిచెర్ల నరసారావుపేటదరి నున్నది. గుడిపాటిలో వినుకొండమార్గమందు గొప్పతోఁట వేయించెను. సత్తెనపల్లితాలూకాలో గుడిపూఁడి యనుపల్లె యున్నది. అదియే యిది కాఁబోలు. వట్టెము పోతనార్యునికొమార్తె యైన కృష్ణమ్మ యీయనభార్య. పెద్దిభట్టు బావమఱఁది. వట్టెమువారు కామెపల్లి అగ్రహారికులు. ఇట్లు వీ రప్పకవి తండ్రికి మాతామహులు. అప్పకవి స్పష్టముగఁ జెప్పకపోయినను అప్పకవికిని వీరు మాతామహు లయినట్టు కానవచ్చుచున్నది. ఈయనకు వెంగన్న, కన్నభట్టు, గంగయ్య అను కుమారులును, తిమ్మక్క, రంగమ్మ, లింగమ్మ, గోపమ్మ యను కూఁతులును కలిగిరి (౧. ౭౦). వారిలోఁ బెద్దవాఁ డయిన వెంగన్న మనకవికిఁ దండ్రి. పల్నాటిలో నీతఁడు గొప్పపండితుఁ డని ఖ్యాతిం జెందెను.

తే. పల్లెనాటను నూటతొంబదియు నాల్గు
గ్రామముల నీడు గానక కాకునూరి
వెంగనార్యుఁడు వేదవేదాంగములను
బ్రస్తుతికి నెక్కె మాటబ్రహ్మ యనఁగ. [౧. ౭౨.

ఈ వెంగనార్యునకు కేశమ్మవలన అప్పకవి, సోమనార్యుఁడు వేంకటపతి, కృష్ణభట్టు, లక్ష్మణుఁడు అను నైదుగురు పుత్రులు పుట్టిరి.

విద్యాధికములు :— కాకునూరివారిది మొదట కాకునూరును, పిదప క్రొత్తమామిళ్లపల్లెయు నయినను అప్పకవి కామెపల్లికి వచ్చి నివసించుట యెట్లు తటస్థించెను ? కామెపల్లి యీతనిమేనమామల స్థలముగఁ గానవచ్చుచున్నది. తన తల్లివైపువారు ప్రబంధకర్త లనియు, తనకుఁ గల వచ్చినసమాచారము తాను వారికి మఱునాఁడు చెప్పఁగా వారు కావ్యము చేయు మని ప్రోత్సాహపఱిచి రనియు కవియే చెప్పియున్నాఁడు.

'మదీయస్వప్నవిధం బంతయుఁ దేటపడ నెఱింగించిన వాక్ర్ణించి సకలజనంబులు నానందంబుఁ బొంది రందుఁ గొందఱు మాతృసంబంధు లగు మదీయ బంధువులుగూడఁ 'గులసింధుసౌగంధిక బంధులును, కృతప్రబంధులును, నీతియుగంధరులును, గావున నా కిట్లనిరి' [౧. ౬౬].

అప్పకవి మేనమామలయింటిలోనే పెరిఁగి విద్యావంతుఁడయ్యె ననికూడ లోకవార్త వినవచ్చుచున్నది. కావున నీతనికుటుంబము మేనమామలఁబట్టియే కామెపల్లికి వచ్చె నని మనము నిశ్చయింపవచ్చును.

అప్పకవికి స్వరయుక్తముగ యజుర్వేదము నేర్పినవాఁడు మూర్తి సర్వన్న, శబ్దశాస్త్రము చెప్పినవాఁడు కాండూరి గిరిదేశికుఁడు, సిద్ధాంతములు తెలిపినవాఁడు సూరభట్టు, లక్షణవేత్తను చేసినవాఁడు మంచికంటి యోబనకవీంద్రుఁడు, స్మార్తకర్మ మెఱింగించినవాఁడు కొలచల మల్లసింగనార్యుఁడు, ఆగమముల నుపదేశించినవాఁడు రాజయోగి; వీరు విద్యాగురువులు (౧. ౩౧). వీ రన్యథా తెలుఁగువాఙ్మయమునందుఁ బ్రసిద్ధి చెందినవారు కానందున మనకు వీరినిగుఱించి విశేష మేమియుఁ దెలియదు. అప్పకవికి లక్షణము నేర్పిన మంచికంటి యోబనకవి యీగురువులలో మనకు ముఖ్యుఁడు. అతనిబోధఫలమే యప్పకవీయము. విద్యాభ్యాస మైనతరువాత నీతఁడు కొంతకాలమువఱకును శ్రీశైలముమీఁద నున్నట్లు ఈ క్రింది పద్యమువలనఁ దెలియుచున్నది.

క. శ్రీగిరిని నిలిచి నీవును
భోగివిభూషణునిపట్టపుఁగవీంద్రుఁడ వై [౧. ౮౪.

ఈతనిచే రచింపఁబడిన గ్రంథములు :— ఆపస్తంబషట్కర్మ నిబంధనము, కాలబాలార్ణవసంహిత యను గ్రంథమునకు శ్లోకరూపమైన సంగ్రహము అను రెండుగ్రంథము లప్పకవి సంస్కృతమున రచించినట్లు కానవచ్చుచున్నది. అప్పకవీయము గాక తెలుఁగున అనంతవ్రతకథ, శ్రీశైలమల్లికార్జునునిమీఁద శ్లేషనిందాస్తుతిగర్భిత సీసపద్యశతకము, కవికల్పక మనులక్షణగ్రంథము, స్త్రీలకు ధర్మద్విపద, అంబికావాద మను యక్షగానము అనుగ్రంథము లీకవి రచించినట్లు అప్పకవీయములోన కవి చెప్పుకొనియున్నాఁడు (౧. ౮౫). ఇం దొక్కటియు నిప్పుడు కానరాదు. సూర్యునియెదుట నక్షత్రములవలె అప్పకవీయముముందర నవి యన్నియు లోపించి యుండును. ఇట్లే నన్నయ తిక్కనకృతములయిన చిన్నపొత్తంబులు లోపించినవి. ఇఁక మిగిలినది అప్పకవీయము.

అప్పకవీయము :— ఇప్పుడు దొరకునంతవఱ కప్పకవీయ మైదాశ్వాసముల గ్రంథము. ఎనిమిదాశ్వాసముల గ్రంథము రచింపవలె నని కవి మొదట సంకల్పించెను (౧. ౯౬). ఏకారణముచేతనో అయిదాశ్వాసములుమాత్రము వ్రాసెను. ఇది పేరునకు నన్నయ భట్టీయ మనఁబడు ఆంధ్రశబ్దచింతామణికి టీక యైనను, నిజముగ స్వతంత్రగ్రంథ మనియే చెప్పవలసియున్నది. అప్పకవి ఛందోవ్యాకరణములనుగుఱించి ఆంధ్రమున గొప్పగ్రంథము వ్రాయఁదలఁచి, గౌరవార్థమును, లోకులు ప్రమాణముగ నంగీకరింపుటకును దీనిని నన్నయ భట్టీయమునకు టీకగ వ్రాసెను. ఆంధ్రశబ్దచింతామణి యంతకుఁ బూర్వము అప్పకవి కన్నదియు విన్నదియుఁ గాదు (౧. ౯౦). 'తెలుఁగున ఘనకావ్యం బొకటి' చేయవలయు నని సంకల్పము చేసి కవి యొకనాఁడు (శా. శ. ౧౫౭౮, శ్రావణ బ. ౮ నాఁడు) నిద్రపోఁగా (౧. ౩౪) కలలో శ్రీమహావిష్ణువు కాన్పించి (౧. ౩౬) 'నన్నయభట్టుచే రచింపఁబడిన వ్యాకరణ మొకటి యున్నది. అందు నెనుబదిరెం డార్యలు కలవు (౧. ౫౨). దానిని అసూయచే భీమకవి గోదావరిలోఁ గలిపెను (౧. ౪౪). రాజనరేంద్రునికుమారుఁ డైన సారంగధరుఁడు దానిని పాఠము చేసియుండెను. అతఁడు సిద్ధుఁడై యిన్నాళ్లు జీవించియుండి మొన్నటి కీలకనామసంవత్సరమున (క్రీ. శ. ౧౬౫౮) ఆగ్రంథమును బాలసరస్వతుల కిచ్చెను. అతఁడు దానికి తెలుఁగుటీక వ్రాసెను. అది నీకు దొరకఁగలదు, నీవు దానికిఁ దెనుఁగు చేయుము' (౧. ౪౦) అని చెప్పెను. అప్పకవి మేల్కొని యాశ్చర్యమును జెందుచుండఁగ, మతంగపర్వతప్రాంతపు విప్రుఁ డొకఁడు నవమినాఁడు వచ్చి, ఆంధ్రశబ్దచింతామణిగ్రంథమును, బాలసరస్వతీటీకను ఆతని కిచ్చెను (౧. ౬౫). అంత నప్పకవి దశమీ గురువారమునాఁడు గ్రంథము వ్రాయుటకుఁ బ్రారంభించెను! (౧. ౯౭).

పైని చెప్పినకథలను మనము నమ్మినను నమ్మకపోయినను, ఆంధ్రశబ్దచింతామణి యంతకుఁబూర్వ మెన్నఁడును అప్పకవి విని కని యుండనిది యనియు, పూర్వలక్షణగ్రంథము లెన్నియో శోధించిన యప్పకవియే దీనిని అంతకుఁబూర్వ మెఱుంగనందున నిది నూతనమే యైయుండవచ్చు ననియు నూహింపవచ్చును.

ఆంధ్రశబ్దచింతామణి యను గ్రంథము భారతము రచించిన నన్నయచే రచింపఁబడినదా లేదా యన్నవిషయము శ్రీయుత వీరేశలింగముగా రాంధ్రకవులచరిత్రములో విపులముగఁ జర్చించినారు.

ఆంధ్రశబ్దచింతామణియొక్క నిజ మైనకర్త యెవ్వఁ డైనను, అప్పకవి యది నన్నయభట్టారకరచిత మని నమ్మి, దాని నాధారముగఁ బెట్టుకొని అప్పకవీయమును రచించెను. బ్రహ్మసూత్రములమీఁద భాష్యములు వ్రాయునప్పుడు శ్రీ శంకర, రామానుజాదు లైన యాచార్యులు, పదియక్షరములు గల సూత్రముపై నాలుపుటలు భాష్యము వ్రాసినట్లు ఆంధ్రశబ్దచింతామణి సూత్రమును పేరునకు నాధారముగ గ్రహించి అప్పకవి తన కిష్టమువచ్చినట్లు వ్రాయుచుఁ బోయెను. అప్పకవిచేఁ దలఁగింపఁబడిన మూలగ్రంథమందలి ఆర్యావృత్తము లేఁబది. వానివివరము :—

| ఆశ్వాసము | ఆంధ్రశబ్దచింతామణిలోని ఆర్యావృత్తములసంఖ్య | అప్పకవీయములోని తెలుఁగుపద్యములసంఖ్య |
|---|---|---|
| ౧ | ౬ | ౨౩౭ |
| ౨ | ౨౦ | ౪౩౭ |
| ౩ | ౧ | ౩౯౮ |
| ౪ | ౫ | ౪౪౦ |
| ౫ | ౧౮ | ౧౯౩ |
| | ౫౦ | ౧౭౦౫ |

ఇట్లు ౫౦ ఆర్యావృత్తములకు ౧,౭౦౫ పద్యము లైనవి. ఆర్యావృత్తము చిన్నది. మన కందమునంతది. అందు నొకభేదమే కందము. కావున ౫౦ ఆర్య లనఁగా ౫౦ కందములతో సమాన మని మన మనుకొనవచ్చును. ఇఁక తెలుఁగుభాగమున శార్దూలాదివృత్తములును, సీసము మొదలగు విశాలాంధ్రపద్యములును, పుటలకొలంది నిండియున్న గద్యములును కలవు. కావున మూలమునకును, భాషాంతరమునకును ఏవిధమైన పోలికయు లేదు. మూఁడవయాశ్వాసములోని

'ఆద్యో వళి ర్ద్వితీయో వర్ణః ప్రాసోఽత్ర పాదపాదేషు,
స్వస్వచరణేషు పూర్వః ప్రాస స్సర్వేషు చైక ఏవ స్యాత్.[1]

---

1. ప్రతిపాదమునందును మొదటియక్షరము యతి, రెండవయక్షరము ప్రాసము, యతి చరణచరణమునకును వేఱువేఱు, ప్రాసాక్షరము నాలుగుచరణములకును ఒక్కటియే.

sampath_Ebooks

ఈ యొక్క యార్యను ఆధారము చేసికొని యతిప్రాసములకు సంబంధించిన నియమము లన్నియుఁ జెప్పుచు ౩౯౭ పద్యములు వ్రాసియున్నాఁడు. కావున అప్పకవీయ మాంధ్రశబ్దచింతామణికి భాషాంతర మని కాని రూపాంతర మని కాని తలఁపఁగూడదు. స్వతంత్రగ్రంథ మనియే చెప్పవలసియున్నది.

అప్పకవీయము స్వతంత్రగ్రంథ మని తెలిసికొని దానిని జూచి మొదలుపెట్టిన నెట్టివారికిని దానివిషయమై గౌరవము కలుగక మానదు. ఈ గ్రంథమునందు లక్ష్యలక్షణములను సంగ్రహించుటకు గ్రంథకర్త మిక్కిలి పాటుపడినాఁ డని తప్పక చెప్పవలసియున్నది. కవి చెప్పుకొనినట్లు 'వెతకివెతకి సార మెల్ల వివరించినాఁ' డనుటకు సందేహము లేదు. ఈతనికాలమునకుఁ బూర్వము పుట్టినలక్షణ గ్రంథము లన్నియు నీతఁడు శోధించెను. లక్ష్యములకై పెక్కుకావ్యములను గాలించెను. ఇతఁ డిచ్చినలక్ష్యము లన్నియుఁ గ్రొత్తవి కావనియుఁ, బూర్వలాక్షణికు లిచ్చిన పెక్కులక్ష్యముల నాయాగ్రంథములలోనుండి యుదాహరించె ననుటయు స్పష్టమే యైనను, అట్టి యప్పు తీసికొనినలక్ష్యములు గాక స్వతంత్రముగఁ దాను శోధించిన లక్ష్యములుగూడఁ బెక్కు లిచ్చియున్నాఁడు. ఆంధ్రలక్ష్యలక్షణ గ్రంథములు గాక సంస్కృతఛందశ్శాస్త్రగ్రంథములను, కొంత వఱకు సంస్కృతప్రాకృతవ్యాకరణగ్రంథములను శోధించి వానిలోఁ గావలసినవిషయముల నీగ్రంథమునందుఁ జేర్చియున్నాఁడు. గణిత శాస్త్రమందలి కఠినమైన అంకయోగవ్యవహారములనుగూడ (Permutations and Combinations) ఛందశ్శాస్త్రమునకు సంబంధించి నంతవఱకు సంగ్రహించియున్నాఁడు. విశేషముగఁ జతుర్థాశ్వాసమును జూడుఁడు.

అప్పకవీయ మైదాశ్వాసములు కలది యని యిదివఱకే చెప్పియున్నాము. ప్రథమాశ్వాసమునకు భాషాపరిచ్ఛేద మనియు, ద్వితీయాశ్వాసంబునకు వర్ణపరిచ్ఛేద మనియు, తృతీయాశ్వాసంబునకు వళిప్రాసపరిచ్ఛేద మనియు, చతుర్థాశ్వాసమునకు పద్యపరిచ్ఛేద మనియు, పంచమాశ్వాసమునకు సంధిపరిచ్ఛేద మనియు నామాంతరములు. తత్సమ, దేశ్య, క్రియాపరిచ్ఛేదంబు లనఁబడు మూఁడుపరిచ్ఛేదంబు లింకను వ్రాసెద నని కవి మొదట (౧. ౬౯) ప్రతిజ్ఞ చేసినను గాని యేకారణముచేతనో యవి యెచ్చటను గానరావు. వానిని వ్రాయకమునుపే కవికి నవసానకాలము ప్రాప్తించె నని తలఁపవలసియున్నది. తత్సమ, దేశ్య ప్రకరణము లప్పకవి వ్రాసియుండినయెడల నవి యాంధ్రభాషాచరిత్రమునకు మిక్కిలి యుపయోగకరములై యుండు ననుటకు సందేహము లేదు. ఇఁక నొక్కొక్క యాశ్వాసమునందలి కొన్నికొన్ని విశేషములఁ జూపెదము.

ప్రథమాశ్వాసము :— ప్రథమాశ్వాసమునందుఁ గవి సంస్కృతాద్యష్టభాషలనుగుఱించియు, కావ్యభేదంబులనుగుఱించియు, రస భావ నాయికానాయకులనుగుఱించియు, ఆంధ్రభాషాభేదములను గుఱించియు విపులముగ వ్రాసియున్నాఁడు. ఇందలి శబ్దార్థలక్షణాలంకారసీసమాలిక, శబ్దార్థదోషసీసమాలిక, భావసీసమాలిక, శృంగారరస సీసమాలిక, అష్టరససీసమాలిక, నాయకనిర్ణయసీసమాలిక లనునట్టి మాలికలు కవియొక్క యసామాన్యసాహిత్యజ్ఞానమును వెల్లడి చేయుచున్నవి. నూతనముగా నీవిషయము నభ్యసించువారికి పాఠము చేయుటకు వీలుగ నుండుటకై యివి సీసమాలికలుగ వ్రాయఁబడినవి. ఇది వఱకు షడ్భాష లనియే వాడుక. వీనికి సంస్కృతము, ఆంధ్రము కలిపి యప్పకవి అష్టభాష లని యనెను. ఈ విభాగములో నప్పకవి, తనకాలమునందు వాడుకలో నున్న యట్టి హిందీ, బంగాలీ, కన్నడము, అఱవము మొదలయిన అన్యదేశభాషలను తా విచ్చినవాఁడు కాఁడు. కన్నడవ్యాకరణము వ్రాయువారు అష్టభాషలలోనుండి ఆంధ్రమును తొలఁగించి, దానిస్థానమందు కన్నడమును ఉంచుకొనవలయుననియు, అఱవమువా రఱవము నుంచుకొనవలయు ననియు అప్పకవితాత్పర్యము కాఁబోలును. నాటకములలో నేయేభాష యేయేవారికి నుపయోగింపవలసినది చూపుటకు నప్పకవి యీక్రిందిపద్యము వ్రాసియున్నాఁడు.

సీ. క్షపణ శైవాదిక కర్మహీనులకును
        భామాజనులకును ప్రాకృతంబు
    క్షితి వైశ్య శూద్ర ప్రభృతి మధ్యమాధమ
        జాతుల కెల్లను శౌరసేని
    ధీవర లుబ్ధకాది వినీచజాతుల
        మానవులకు నెల్ల మగధభాష
    మొగిఁ బిశాచాసుర ముఖ్యుల కెల్లఁ బై
        శాచికానామభాషాద్వయంబు
గీ. పతిత చండాల యవనాది పరమనీచ
    జాతినరుల కపభ్రంశ, మీతెలుంగు
    సీమవారికి నాంధ్రంబుఁ జెప్పవలయుఁ
    గావ్యనాటకముల గోపికాభుజంగ!    [౧.౧౯౬.

ఈ పద్యమునుగూర్చి కొంత ఆలోచింపవలసియున్నది. సంస్కృతనాటకములలో భిన్నభిన్నపాత్రలకు భిన్నభిన్నభాషలు వాడుచుండెదరు. రాజు మాటలాడుభాష యొకటి, రాణి మాటలాడునది మఱియొకటి, రాజాస్నేహితుఁ డగు విదూషకుఁడు మాటలాడునది యింకొకటి. ఆ నియమముల ననుసరించి యప్పకవి యీపద్యమును వ్రాసెను. తెలుఁగువాఁ డగుటచే అందు 'ఆంధ్ర' మొకటి యెక్కువగాఁ గలిపెను. కాని యిందలినియమము లాంధ్రకావ్యములకుఁ గాని, ఆంధ్రనాటకములకుఁ గాని యెట్లు పనికివచ్చును? తెలుఁగులో నాటకములు వ్రాయుచు నాయకునకు సంస్కృతము, నాయికకుఁ బ్రాకృతము, వైశ్యునకు శౌరసేని, తెలుఁగువానికిఁ దెలుఁగు భాష వాడుట పొసఁగునా? పొసఁగదు. అప్పకవికాలమునందు, వీథినాటకములు తప్ప నాంధ్రమునందు కావ్యము లనఁదగు నాటకములు లేవు. వీథినాటకములభాష గ్రామ్యము. తెలుఁగులో నాటకములు వ్రాయునప్పుడు వేఱువేఱుజాతులకును, వేఱువేఱువృత్తు లకును

sampath_Ebooks



లించువారికిని ఏయేభాష యుపయోగింపవలయునో యది స్పష్టముగ వ్రాయక, సంస్కృతనాటకములకుఁ గాని, తెలుఁగునాటకములకుఁ గాని ఉపయోగము లేని యీపద్యమును వ్రాయుట వింతగ నున్నది.

నాటకాదులలోనిభాషలనుగూర్చి స్పష్టముగఁ జెప్పకపోయినను, మ్లేచ్ఛభాషాపదములను, అన్యదేశభాషాపదములను జాతీయములను వలయునప్పుడు కావ్యములలో నుపయోగింపవచ్చు నని చెప్పి యప్పకవి పెద్దన తిమ్మన ధూర్జటికవులపద్యముల నుదాహరించినాఁడు :—

దేశభాషాగ్రంథములు సంస్కృతగ్రంథములవలెనే నాలుగు పురుషార్థముల నిచ్చు నని యీ కవి వ్రాసిన యీ క్రిందిపద్యము భాషాభిమానులు గమనింపఁ దగినది :

'క. ఆయా దేశమువారికి
నాయా దేశంబుభాష నమరిన కావ్యం
బాయతపురుషార్థంబులఁ
బాయక సమకూర్చు దేవభాషయుఁబోలెన్.' [౧. ౧౬౭.

ఈకవికి శూద్రకవులయం దసూయ యుండెను. ఈతనియభిప్రాయప్రకారము బ్రాహ్మణులు తప్ప నితరులు పద్యములు చెప్పఁ గూడదు!

అప్పకవీయమువంటి లక్షణగ్రంథమునకు వసుచరిత్రము, హరిశ్చంద్రనలోపాఖ్యానములవంటి కావ్యరత్నములలోనుండి యసంఖ్యము లైనలక్ష్యములు దొరకియుండును. కాని యప్పకవి కీ శూద్రకవులయెడనుండు నసూయయే యీ కావ్యములనుండి యాతని లక్ష్యము తీయకుండఁ జేసినది.[1] ఇంత పెద్దలక్షణగ్రంథమునందు రామరాజభూషణునికావ్యములనుండి లక్ష్యములు లేకపోవుట యొకగొప్పవింతయే. ఇంతియకాదు. కవి మొదట కవిస్తుతి చేయునప్పుడు రామరాజభూషణుని స్తుతింపకపోఁగా నతనిముత్తకమును తన్నినాఁడన్న అయ్యలరాజు రామభద్రకవిని,

'రామరాజవిభూషణరత్నఖచిత
చారుముత్తకలాపాదిహారివాక్య
గౌరవము పెక్కుభంగుల గణనచేసి.' [౧. ౨౬.

అనుపదములతో స్తుతించి రామరాజభూషణుని నగౌరవపఱిచినాఁడు.

విష్ణుచిత్తీయ మనుకావ్యము కృష్ణదేవరాయలచే వ్రాయఁబడలేదనియు, దానిని పెద్దనయే వ్రాసె ననియుఁ దనభావమును అప్పకవి యీ క్రిందిగద్యపద్యములచేఁ జూపినాఁడు :—

'వ. అది యెట్లనినఁ గనియె ననవలసినభూతార్థక్రియాపదైకవచనంబునందు వర్ణలోపము చేసి కనెనఁట యని గ్రామ్యపదముగా నాగమశాసనులు ప్రయోగించిరి గాన నది సాధకము చేసికొని యాంధ్రకవితాపితామహుఁడు కొనియె ననుటకుఁ గొనె నని చెప్పె నవి యెవ్వియనిన—

ఆదిపర్వమున[2],
'క. జనకన్యకయఁట! నేనఁట!
వనమున గాంధర్వమున వివాహంబఁట! నం
దనుఁ గనెనఁట! మఱచితినఁట!
వినఁగూడదె యిట్టిభంగివిపరీతోక్తుల్'.

విష్ణుచిత్తీయమునందు,
'ఉ. పూని ముకుందునాజ్ఞఁ గను
బొమ్మనె కాంచి యుదంచభాంచితముల్
వానను మీఁదఁ బోవ నను
వందగొనెఁ దన్నన నగ్రనిశ్చల
త్వానచలత్వనిష్ఠ లెస
మస్తజగంబుల జాడ్యచేతనల్
గా నతి కెక్కు సైన్యపతి
కాంచనవేత్రము నాశ్రయించెదన్'.

ద్వితీయాశ్వాసము :— రెండవయాశ్వాసమునం దక్షరముల యుచ్చారణమునుగూర్చియు, స్వరూపమును గూర్చియు విపులముగ వ్రాయఁబడినది. లనుచ్చారణకును, శుద్ధలేఖనమునకును గావలసిన నియమము లిందు శ్రద్ధతో నీయఁబడినవి. ఆంధ్రలేఖకులు తఱచుగాఁ జేయునట్టి ప్రమాదముల నన్నిటిని శ్రద్ధతోఁ గనిపట్టి వాని నన్నింటిని దిద్దియున్నాఁడు. సాధారణలేఖకులు వట్రువలు వ్రాయవలసినచోట కొమ్ము క్రావడులును, కొమ్ము క్రావడులు వ్రాయవలసినచోట వట్రువసుడులును వ్రాయుచుండుటఁ గని యప్పకవి యివి వట్రువలు, ఇవి కొమ్ముక్రావలు అని తెలుపుటకు రెండుసీసములను ఇచ్చినాఁడు. ఇట్లే పెక్కుతప్పులను సవరించినాఁడు. 'శుద్ధాంధ్రలిపులు, వీనికి లేఖనక్రమము' అనుశీర్షిక క్రింద అచ్చులరూపములను,

1. తృతీయాశ్వాసమునం దొకపద్యము (౨౩౭) వసుచరిత్రమునందుండి యీయఁబడినది. కాని యది అప్పకవి స్వయముగ నుదాహరించినది కాదు. 'లక్షణవిలాసమువారు తెలియక కొన్ని యుదాహరణంబులు వ్రాసినారు. అవియును వివరించెద' నని యుపోద్ఘాతము వ్రాసి లక్షణవిలాసమువారు పద్దతిప్పను దిద్దియున్నాఁడు. కావున నప్పకవి రామరాజభూషణునిగ్రంథమునుండి లక్ష్యము తీయలే దనియే చెప్పవలసియున్నది.

2. ఈపద్య మిప్పటిభారతమునం దాదిపర్వమునఁ గానరాదు. పిల్లలమఱ్ఱి పినవీరభద్రరచిత మైన 'శకుంతలాపరిణయము' అనఁబడు కావ్యమునందు నాల్గవయాశ్వాసమున నున్నది.

హల్లులరూపంబులను, స్వరసంకేతములను విడివిడిగా వ్రాసి చూపినాఁడు. కాని లేఖకుల కప్పకవి వ్రాసినయక్షరములయాకారములు తెలియ నందున ఈరూపము లొక్కొక్కప్రతిలో నొక్కొక్కవిధముగ నున్నవి. అప్పకవి యెట్లు వ్రాసెనో కనుఁగొనుట కప్పకవినాఁటి ప్రతి గాని, తరువాతఁ గొలఁదిదినములకు వ్రాయఁబడిన ప్రతి గాని దొరక వలెను. అప్పుడు గాని అప్పకవియిచ్చినలిపి యిట్టిది యని తెలియరాదు. ఈ ప్రకరణమునందు రేఫఱకారసంబంధ మైన సీసమాలికలును, పట్టిక లును మిక్కిలి పెద్దవి. అవి కవియొక్క శోధనకును పరిశ్రమమునకును గొప్పసూచకములు. ఈతనికిఁ బూర్వులైన తాళ్లపాక చిన్నయ్య మొదలయినవారు రేఫఱకారములజాబితా లిచ్చినను నింకను శోధించి ఇతఁడు క్రొత్తవి చేర్చెను.

అప్పకవి రేఫఱకారములనుగుఱించి మిక్కిలి పట్టుదలగల వాఁడు. యతిస్థానమందుఁ గాని, ప్రాసస్థానమందుఁ గాని మఱచి యైనను రేఫ ఱకారములకు మైత్రి చేయఁగూడ దని యీతని యభి ప్రాయము (౨. ౨౭౯–౨౮౯). రేఫ ఱకారములపట్టిక యేర్పఱుచు టలో నప్పకవి యేమార్గము నవలంబించెనో స్పష్టముగ వ్రాయలేదు. కాని యొకానొకతెలుఁగుశబ్దమందలి 'ర' అను అక్షరము రేఫమా ఱకారమా యని సంశయము వచ్చినప్పు డది రేఫ మని కాని ఱకార మని కాని నిశ్చయించుటకు నిచ్చినలక్ష్యములవలన మనము కొంత వఱకు నూహింపవచ్చును. తాను ప్రమాణముగఁ దీసికొనఁదలఁచు కొన్న గ్రంథములలో సంస్కృతపదములందలిరేఫముతోఁ ప్రాస యందుఁ గాని, యతియందుఁ గాని మైత్రిం జెందిన 'ర' అను అక్ష రము రేఫము అని మొదట రేఫముల నేఱుకొనెను. మిగిలినవానిని ఱకారము లనెను. సంస్కృతపదాంతర్గత మైన 'ర' కారముతో నెన్నఁడును (తాను శోధించిన) గ్రంథములలో మైత్రిఁ బొందని వన్నియు ఱకారము లనెను. ఒకప్పుడు రేఫముతోను, మఱియొకప్పుడు ఱకారముతోను (పైని చెప్పినరీతిని విడఁదీసిన రేఫఱకారములతో నని యర్థము) మైత్రిఁ జెందినవానికి నుభయరూపము లున్న వనెను. ఇట్లు రేఫ ఱకారనిర్ణయము చేసి మరల రేఫ ఱకారములకుఁ బూర్వ కవులు మైత్రి యొప్పరే యని చెప్పుట అన్యోన్యాశ్రయదోషా భాసము కాదా? అది యట్లుండె. ఈరెండువర్ణములకును పూర్వ మొకప్పుడు భిన్నోచ్చారణ ముండినను లేకపోయినను అప్పకవి కాలమునాఁటికే యది లోపించి యీరెండువర్ణములకును ఒక్కటియే యుచ్చారణ ముండె ననుట స్పష్టము. అప్పకవి వీనిని విభజించుటకు నింతకష్టపడుటయే యిందులకు సాక్ష్యము. సమానోచ్చారణముగల యీయక్షరములకు మైత్రి యుండవచ్చును; అనఁగా ప్రాసస్థలము లలో నిది రేఫ మని కాని, ఇది ఱకార మని కాని ఆలోచింప నక్కఱలే దని కవిజనాశ్రయాదిగ్రంథకారులయభిప్రాయ మైనం గున దానిని ఖండించుట కప్పకవి కింత పరిశ్రమ చేయవలసివచ్చినది!

అక్షరస్వరూపనిర్ణయ మైనతరువాత నీయాశ్వాసమందు నాగ మాదుల ననుసరించి, అక్షరబీజములు, వానిలింగములు, వానిని బూజ చేయువిధము మొద లయినవిషయములు చెప్పఁబడినవి. చివర సారస్వ తౌషధము లని రెండు మూఁడు మందులు చెప్పఁబడినవి. అందులో నొకమందు తినిన 'సూక్తులు ఘటించు', రెండవమందు తినిన 'గడియ కొకపద్యశతకంబు నుడువు' సామర్థ్యము కలుగును. మూఁడవ మందు తినిన 'వానినాలుకను గాఁపురం బుండు నలువచెలువ' (౪౭౯ - ౩౧)

తృతీయాశ్వాసము :— మూఁడవయాశ్వాసము యతిప్రాసము లకు సంబంధించినది. ఈ ప్రకరణమునందును అప్పకవి పూర్వలక్ష్యము లను ఎక్కువగఁ బరిశోధించి, పూర్వలక్షణవేత్తలకంటె నెక్కువపని చేసియున్నాఁడు. ఛందకవి పదియతులు చెప్పినాఁడు. అనంతా మాత్యుఁ డిరువది చెప్పెను. అటుమీఁదఁ గొందఱు కవులు యతుల నిరువదియేడువిభాగములుగఁ జేసిరి. అప్పకవి నలువదియొక్క విధము లైనయతులను చెప్పెను (౬, ౮)! ఇట్లు యతులసంఖ్య పెరిఁగిన దనఁగాఁ క్రొత్తయతులు తెచ్చిపెట్టఁబడిన వని కాదు. పూర్వకవులచేఁ జేయఁబడినపెద్దవిభాగములలోఁ బరకవు లింకను సూక్ష్మ మైనవిభేద ములను కనిపట్టి రని యర్థము. సంస్కృతసాహిత్యశాస్త్రమునందు నిట్లే యలంకారములసంఖ్య దినదినప్రవర్ధమాన మైనది. అప్పకవిచేఁ జెప్పఁబడిన ౪౧ యతులలో స్వరయతులు ౬, వ్యంజనయతులు ౨౧, ఉభయయతులు ౧౨, ప్రాసయతి ౧ అప్పకవి చెప్పినప్రాసములు పదునేనువిధంబులు.

చతుర్థాశ్వాసము :— నాలుగవ యాశ్వాసమునందు ఛందం బులలక్షణములు వివరింపఁబడినవి. చిత్రబంధగర్భకవిత్వమునుగుఱిం చియుఁ గొంత యిందుఁ జెప్పఁబడియున్నది. పద్యముల నల్లువా రీభాగమును మిక్కిలిగ వల్లించుచుందురు. ఈ యాశ్వాసమునందు గద్యమునుగుఱించి యొకవిశేషము కలదు. అప్పకవి యిందు రెండు విధము లయిన గద్యములను (వచనములను) వ్రాసియున్నాఁడు. ఒకటి సాధారణ మైనగద్యము, మనగ్రంథాదులలో వాడఁబడునది. రెండవది వ్యావహారభాషలో వ్రాయఁబడినగద్యము. కవి మొదటిరకము గద్యమునకు క్రిందియుదాహరణ మిచ్చినాఁడు :—

"శ్రీవిలాసినీవక్షోరుహాహ్వయగిరిదుర్గసర్వాధ్యక్ష, పద్మజాండా నేకభరణదక్ష, పక్షిజానాతృధాతృప్రముఖవిశాలనేతృప్రముఖనిఖిల బర్హిర్ముఖప్రస్తూయమానశుభశీల, * * * * వాసవరత్నాభ, వారిజనాభ, నాగారిస్యందన, నందగోపనందన, కరుణాలవాల, కాంచనచేల, భుజగేంద్రశయన, ఆర్తరక్షణపరాయణ, గోవింద, ముకుంద నమస్తే నమస్తే నమస్తే."

ఇఁక రెండవవిధ మైన గద్యమున కీ క్రింది యుదాహరణము నిచ్చెను.

"లే. వృత్తసంఖ్యాప్రత్యయ మనఁగాను ఇన్నవఛందమునందు నెన్ని సమవృత్తములు పుట్టినవి అని అడిగితేను సరి జెప్పేదివిధము, వారు యెన్నవఛందమున కడిగితేను అన్నిగురువులు అడ్డవరుసగాను

వ్రాసి వాటి క్రిందను ఒకటి మొదలుగాను యినుమడించుచు లెక్కలు వరుసవెంబడిన్ని కడకు వెడలాను వ్రాసి కూడలెక్కలు యినుమడించి తేను యెన్ని ఆయెను అన్ని సమవృత్తములు అఖండమునందు బుట్టినవి అని చెప్పెటిది.1" [౧౩౫.

ఈ కెంపవలిక మైన గద్యము లేఖక ప్రమాదమున నిట్లు వ్రాయఁబడిన దనుకొనుటకు వీలు లేదు. ఎందుల కనఁగా నిట్టిటీక లన్నియు నొక్కవిధముగ నుండుటయు, నితరవచనము లన్నియు సలక్షణముగ నుండుటయు నొక్కప్రతిలోనే కానవచ్చుచున్నది. లేఖకప్రమాదమైనచో నన్నివచనములయందు నొక్కదోషమే కానిపింపవలయును గదా! అట్లు కానిపింపమి కావున నిది ప్రమాదజనితము కాదనియు, బుద్ధిపూర్వకమే యనియుఁ దోఁచుచున్నది.

పంచమాశ్వాసము:— అయిదవయాశ్వాసమునందు సంధివిషయ మీయఁబడినది. కవి చతుర్థాశ్వాసముతో ఛందోవిషయమును బూర్తి చేసి పంచమాశ్వాసమునుండి వ్యాకరణవిషయమును బ్రారంభించినాఁడు. ఇందుఁ గలిగెను ద్రుతప్రకృతికములను గనుఁగొనుటకై యీయఁబడిన పద్యములు విద్యార్థులకు నెంతయు నుపయోగకరములు.

సంస్కృతమునందు 'శకంధ్వాది' గణమునకుఁ బరరూపము చెప్పఁబడినది. అదియే తెలుఁగులోనిసంధికిఁ బాల మని యప్పకవి యొక్క యభిప్రాయముగఁ గానవచ్చుచున్నది. అతఁ డిట్లు వ్రాసియున్నాఁడు:—

'క. అరయ శకంధ్వాదిషు చేఁ
పరరూపము వాచ్య మనుచుఁ బ్రక్రియఁ గనె
వరరుచివాక్యముకలిమిని
పరరూపమె వికృతిఁ గానఁబడు స్వరసంధిన్.' [౫. ౩౭.

ఇతరవ్యాకరణములమతమున ప్రథమపురుషైకారసంధి వైకల్పిక మైనను, ఆంధ్రశబ్దచింతామణిలోని 'నిత్య మనుత్తమపురుష క్రియా స్వితః' అనుసూత్రమునుబట్టి, ప్రథమమధ్యమపురుషముల యికారమునకుఁగూడ సంధి నిత్య మని చెప్పుచు నప్పకవి శ్రీనాథుని యంతటి ప్రామాణికకవినిగూడ నిట్లాక్షేపించియున్నాఁడు:—

'క. విరచించెను శ్రీనాథుఁడు[2]
ధరణిని శృంగారనైషధంబునఁ 'గూర్పుం
డిరి యొండొరు' లని కానక
పరపురుషక్రియలఁ బ్రకృతిభావము కలదే?' [౫. ౬౪.

సంధిపరిచ్ఛేదమునం దాంధ్రశబ్దచింతామణిలో నప్పకవి పాఠానుసారము 'సుమ్నాత్తో హ ల్యాదేర్వాణాచ్యామతాత్' అను సూత్రము కలదు. కాని అహోబలునిపాఠమునందును, ఇటీవల నచ్చుపడిన బాలసరస్వతులపాఠమునందును నీపాఠము కానరాదు.

ఆంధ్రశబ్దచింతామణియందు 'సర్వత్రాజ్వత్ కార్యం జ్ఞేయం యస్య ద్రుతప్రకృతికేభ్యః' అని యొకసూత్రము కలదు. 'ద్రుతమునకుఁ బరముగ వచ్చినయకారమునకు నంతటను అచ్చునలెఁ గార్య మని యెఱుఁగునది'

అని దీని కర్థము. దీనినిబట్టి చూడఁగా నీసూత్రకారునిమతమున తెలుఁగుమాటలకు మొదట యకార మున్న దనియు, అది ద్రుతప్రకృతికములకుఁ బరముగా వచ్చినప్పుడు సంధికార్యములో దానిని అచ్చుగ (అనఁగా 'య' వచ్చిన 'అ' గ, 'యి' వచ్చిన 'ఇ' గ ఇత్యాది) నెంచవలయు ననియు స్పష్టముగఁ దేలుచున్నది. కాని యీమత మప్పకవికి నిష్టము లేనందున నాతఁ డీసూత్రము నిట్లు తెనిఁగించియున్నాఁడు:—

ఉ. 'అరయ వైకృతోక్తులఁ బదాదులయందు యకార ముండ దా
తీరునఁ బల్కువ్రాయి గణుతింపఁగ నచ్చగు దానిఁదాపలన్
శ్రీరజనాథ! నాంతములు నిల్చిన నచ్చుటఁ బ్రాణసంధి చె
న్నారు నితంబు వైశ్యవసుధాధిపు సేపడఁగించె నేఁ డనన్.'
[౫. ౪౦.

(కొ. వేం. ల.)

అప్పనపల్లి — ౧. తూర్పుగోదావరిజిల్లా, రాజోలు తాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౨,౭౮౧ (౧౯౩౧).

౨. చిత్తూరుజిల్లా, పుంగనూరుతాలూకాయందలి జమీందారీగ్రామము. జనసంఖ్య ౯౫౩ (౧౯౩౧).

1. ఇది ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారమునందలి ౧౩-౩-౨ అన్నసుర్తుగల గ్రంథమునుండి యున్నది యున్నట్లు ఎత్తి వ్రాయఁబడినది. ఇటీవల అప్పకవీయము అచ్చువేసినవారు పై వచనమును సలక్షణముగ దిద్దియే యచ్చువేసినారు. కావున ఈవచనము యొక్క మూలస్వరూపము చూడవలయు నన్న మిక్కిలి పురాతనములైన లిఖితప్రతులు, తాటాకుగ్రంథములును మాడవలయును. తాటాకు ప్రతు లన్నింటిలోను ఈటీక లన్నియు గ్రామ్యభాషలోనే వ్రాయఁబడినట్లు కానవచ్చుచున్నది. ఆంధ్రసాహిత్యపరిషత్తువారి సంగ్రహమందలి తాటాకుగ్రంథ మొకటియు, మ. రా. శ్రీ గిడుగు రామమూర్తిగారియొద్ద నున్నది యొకటియుఁ జూచితిని. దానిలో 'టీక' అనఁబడిన వచనము లన్నియు గ్రామ్యములుగను, ఇతరవచనములు సలక్షణములుగను నున్నవి. తా మింకను పెక్కుప్రతులను జూచితి మనియు, నన్నిటిలో నిట్లే యున్న దనియు శ్రీ రామమూర్తిగారు చెప్పినారు.

2. బలభిద్వహ్ని పరేతరాజవరుణుల్ పర్యుత్సుకత్వంబు సం, ధిలఁ గూర్చుండిరి యొండొరుం గదిసి యర్థిం దత్ప్రదేశంబున న్నల నాళీకమృణాళనాళలతికానవ్యప్రణాళీమిళ, ల్లలనాలాపకథాసుధానుభవలీలాలోలచేతస్కులై. [నైషధము, ౩. ౭౭

**అప్పనరామునిలంక** — తూర్పుగోదావరిజిల్లా, రాజోలుతాలూకాయందలి గ్రామము. జనసంఖ్య, ౧,౭౮౮ (౧౯౩౧).

**అప్పన్నదొరపాలెం** — విశాఖపట్టణముజిల్లా, గొల్గొండతాలూకాయందలి జమీందారీగ్రామము. జనసంఖ్య ౧౬౫ (౧౯౩౧).

**అప్పన్నదొరవలస** — విశాఖపట్టణముజిల్లా, పార్వతీపురముతాలూకాయందలి జమీందారీగ్రామము. జనసంఖ్య ౬౭౮ (౧౯౩౧).


**అప్పన్నవలస** — విశాఖపట్టణముజిల్లా, శ్రీపురుపల్లి తాలూకాయందలి జమీందారీగ్రామము. జనసంఖ్య ౯౬.

**అప్పమాంబాపురం** — నెల్లూరుజిల్లా, కనిగిరితాలూకాయందలి జమీందారీగ్రామము. జనసంఖ్య ౧౯౯.

**అప్పమ్మపాలెం** — విశాఖపట్టణముజిల్లా, వీరవల్లి తాలూకాయందలి జమీందారీగ్రామము. జనసంఖ్య ౨౭౦ (౧౯౩౧).

**అప్పయదీక్షితులు** — దక్షిణదేశమున నిరువదికాలమున వెలసిన సంస్కృతపండితులకెల్ల శిరోవతంసము. సుప్రసిద్ధకవియు, భాషాపోషకుడు నగు శ్రీకృష్ణదేవరాయల యాస్థానమునందలి పేరున కెక్కిన యెనమండ్రు పండితులలో నొకఁడయిన వక్షస్థలాచార్యనితనూభవుఁ డగు రంగరాజాధ్వరికుమారుఁడు; ఉత్తరార్కాటుజిల్లాయందలి అడయపలమునివాసి. వక్షస్థలాచార్యునికి ఆచార్యదీక్షితుఁ డని నామాంతరము కలదు. ఈయాచార్యదీక్షితులు రాయలగౌరవాదరములను బొందినవాఁడు. ప్రతీతి ననుసరించి, రంగరాజాధ్వరికి చాలకాలమువఱకును సంతానభాగ్యము లేకపోయెను. తుదకతనికి శివునివరప్రసాదమున నొకశిశువు కలిగెను. ఈతఁడే అచిరకాలమున పేరు ప్రఖ్యాతులు గాంచిన అప్పయదీక్షితులు. అప్పయదీక్షితుల బాల్యకాలపుగాథ లనేకములు కలవు. వీనిలో చాలభాగము శ్రీకంచి కామకోటిపీఠాధిపతుల ప్రాపున ప్రచురింపఁబడు 'ఆర్యధర్మ' మను పత్రికయందు ప్రకటింపఁబడినవి.

కాలనిర్ణయము :— అప్పయదీక్షితుల జననకాలము మనకు స్పష్టముగఁ దెలియదు. కాని యాతఁడున్న కాలమును కొంచె మించుమించుగ సరిగనే నిర్ణయింపవచ్చును. ఇటీవల కొన్ని సంవత్సరముల క్రిందట అప్పయదీక్షితవంశజుఁ డగు శివానందయోగి స్వవంశమునఁ బరంపరాగతముగ వచ్చుగాథలను సంకలితము చేసి వానిసాయమున రచియించిన 'దీక్షితచారిత్రము'న అప్పయదీక్షితులకాలమును నిర్ణయించియున్నాఁడు. ఆయన కయినను అప్పయదీక్షితుల సరియైన జన్మకాలము లభింపలేదు. అందువలన నష్టజాతకపద్ధతి నాధారము చేసికొని ఆయన అప్పయదీక్షితులజాతకము వేసెను; తద్విధమున ఆయన క్రీ. శ. ౧౫౫౩ అప్పయదీక్షితుల జననకాలముగ నిర్ణయిం




చెను. ఇట చూపినది ఆయనవేసిన ప్రకారము అప్పయదీక్షితులజాతకమే. ఇంతవఱ కిదియే దీక్షితుల సరియైన జన్మకాల మని పండితుల భావన. అప్పయదీక్షితుల సోదరపౌత్రుఁడయిన నీలకంఠదీక్షితులు తన 'శివలీలార్ణవము'నందు 'ద్వాసప్తతిం ప్రాప్య సమాః' అనుశ్లోకమునం దప్పయదీక్షితులు డెబ్బదిరెండుసంవత్సరములు జీవించినట్లు తెలిపియున్నాఁడు. చిదంబరమున నున్నకాలమున తానింకఁ గొంతకాలమునకు మరణించు ననఁగ అప్పయదీక్షితులే 'వయాంసి మమ సప్తతేరుపరి నైవ భోగే స్పృహా' అని చెప్పినట్లు ప్రతీతి. పూర్వోక్తవిషయముల యాధారమున దీక్షితులు క్రీ. శ. ౧౫౫౪ - ౧౬౨౬ లకు నడుమ నుండినట్లు పండితులు విశ్వసించుచున్నారు. కాని యిది సరియైనది కాదని తోఁచుచున్నది.

అప్పయదీక్షితులు తాను రచియించిన 'యాదవాభ్యుదయవ్యాఖ్యానము' నవతారికయందు చినతిమ్మనృపతి తన కాశ్రయుఁడుగ తెలిపినాఁడు. ఈచినతిమ్మభూపాలుఁడు క్రీ. శ. ౧౫౪౨ - ౧౫౫౦ ల నడుమ దక్షిణదేశమునకు ప్రతినిధిపాలకుఁడుగ నుండెను. వేలూరి చినబొమ్మనాయకుఁడు దీక్షితుల నాదరించిన మఱియొక ప్రభువు. ఈతని ప్రోత్సాహముననే దీక్షితులు 'శివార్కమణిదీపిక'ను రచియించెను. క్రీ. శ. ౧౫౮౦ ప్రాంతమున చినబొమ్మనాయకుఁడు వేలూరునందు ప్రముఖుఁడుగ నుండెను. క్రీ. శ. ౧౫౮౫ న రాజ్యమునకు వచ్చిన వేంకటపతిదేవరాయల ప్రాపకమున దీక్షితులు 'విధిరసాయన', 'కువలయానందము'లను రచియించెను. 'కల్పతరుపరిమళము'ను దీక్షితులు రచియించినకాలమున ఆయనకోరికమీఁద, ఆయనకు పుణ్యముగ చినబొమ్మనాయకుఁడు అడయపలమునందు కాలకంఠేశ్వరాలయమును గట్టించెను. అప్పయదీక్షితులవివాహమునకు పాండ్యరాజగు మధుర చంద్రశేఖరుఁడు (౧౫౪౨ ప్రాంతము) కారకుఁ డనియు ప్రతీతి. అదికాక, పరిమళమును రచియించుటకు తంజావూరినాయక ప్రభువుల సుప్రసిద్ధప్రధాని యయిన గోవిందదీక్షితులు కారకుఁ డని చెప్పుదురు. పరిమళము అప్పయదీక్షితుల కడపటి గ్రంథము. ౧౬౦౫ నకుఁ బిదప గోవిందదీక్షితులు జీవించియుండలేదు. అడయపలముశాసనమున నుదాహరింపఁబడినరీతిని, అప్పయదీక్షితులు ౧౫౮౨ నకుఁ బూర్వ మాగ్రంథమును రచియించెను. మఱియొక్కవిషయము. రసగంగాధర కర్తయయిన జగన్నాథపండితుఁడు షాజహానుపాదుషా (క్రీ. శ. ౧౬౨౮ - ౧౬౫౮) కాశ్రితుఁడు. జగన్నాథపండితునితండ్రి పేరుభట్టు ఖండదేవుల యొద్ద మీమాంసాశాస్త్రము నభ్యసించెను. ఖండదేవుఁడు తన 'కౌస్తుభము'న అప్పయదీక్షితులు శ్రేష్ఠులయిన మీమాంసకులలో నొకఁ డని వచించినాఁడు. ఈవిషయముల నన్నిటిని గమనించి చూచినచో

sampath_Ebooks



దీక్షితుల జీవితకాల మని చెప్పఁబడు ౧౫౫౪-౧౬౨౬ సరియయినది కా దని సిద్ధాంత మగుచున్నది. ఒకచాటుశ్లోకమునందలి 'విక్రమే భూతలం ప్రాప్య విజయే స్వర్గ మాయయౌ' అనుదానియర్థమును పూర్వోక్తవిషయములతో సమన్వయించి చూచినయెడల, అప్పయదీక్షితులు క్రీ. శ. ౧౫౨౦ (విక్రమ)లో పుట్టియుండునని, ౧౫౯౨ (విజయ)లో గతించియుండు నని యూహింపఁబడుచున్నది.

జీవితము :— అప్పయదీక్షితుల చిన్ననాఁటి వృత్తాంతములు విశ్వాసపాత్రము లయినవి తెలియరావు. ఇంకను చిన్నవాఁడుగ నుండఁగనే దీక్షితుల పేరు ప్రతిష్ఠ లెల్లకడల వ్యాపించినవి. ఈ కారణమున మహాపండితుఁడు సత్యమంగలము రత్నఖేట శ్రీనివాసదీక్షితులు అప్పయదీక్షితులకుఁ దన కూఁతురు మంగళనాయకి నిచ్చి వివాహము చేసెను. దీక్షితుల కామెయందు తనయు లనేకులు కలిగిరి; కాని కొడుకులలో నొక్కఁడును తండ్రియంతటివాఁడు కాలే దని ప్రతీతి. అంతియకాక వారిలో వా రెల్లప్పుడు నేదోవిషయమునఁ గలహించువారు. అప్పయదీక్షితులు తనకడపటిదశలో తనయాస్తిలోఁ గొంత భాగమును సోదరపౌత్రుఁ డయిన నీలకంఠదీక్షితుల కియ్యఁదలఁచి నపుడు కొడుకు లంగీకరింపరై రని, అంతట దీక్షితులు కుపితుఁడై కొడుకుల సంతతిని మూర్ఖులు కావలె నని శపించె నని చెప్పుదురు. దీక్షితులయాస్తి ఆయనకొడుకులకే చెందినను, ఆయన యాశిస్సులు మాత్రము నీలకంఠునకే చెందినట్లు కన్పట్టును. తనజీవితావసానకాలమును అప్పయదీక్షితులు చిదంబరమునఁ గడపి తుదకచ్చటనే కాలధర్మము నొందెను. ఆయన అచ్చటనుండిన తన కడపటిదినములలో నీక్రిందిశ్లోకమును జెప్పె నని వాడుక :

'చిదంబర మిదం పురం ప్రథిత మేవ పుణ్యస్థలం,
వయాంసి మమ సప్తతే రుపరి నైవ భోగే స్పృహా.'

దీక్షితకృతగ్రంథములు :— అప్పయదీక్షితులు శతాధికగ్రంథకర్త యని, సంస్కృతసాహిత్యమున న్యాయ, మత, వాఙ్మయములకు సంబంధించిన గ్రంథము లతఁడు రచియించినవన్నియుఁ గలసి ౧౦౪ కల వని చెప్పుదురు. తత్కృతగ్రంథము లేవన :—

అద్వైత వేదాంతము :— ౧. పరిమళము. అమలానందుని కల్పతరువు మీఁది వ్యాఖ్యానము; ౨. సిద్ధాంతలేశసంగ్రహము — స్వతంత్రగ్రంథము; ౩. న్యాయరక్షామణి — శంకరభాష్యము నాధారపఱుచుకొని రచియించిన స్వతంత్రగ్రంథము; మొదటిపరిచ్ఛేదమునకుమాత్రమే దొరకినది;

శైవ వేదాంతము :— ౪. శివార్కమణిదీపిక. శ్రీకంఠభాష్యము మీఁది వ్యాఖ్యానము; ౫. శిఖరిణీమాల; ౬. శిఖరిణీమాలావ్యాఖ్య; ౭. ఆనందలహరి; ౮. ఆనందలహరీవ్యాఖ్య; ౯. శివాద్వైతనిర్ణయము;

శైవగ్రంథములు :— ౧౦. భస్మవాదావళి; ౧౧. శివార్చనాచంద్రిక; ౧౨. శివార్చనాచంద్రికావ్యాఖ్య; ౧౩. శివధ్యానపద్ధతి; ౧౪. శివపూజావిధి; ౧౫. వీరశైవము;

విశిష్టాద్వైతము :— ౧౬ న్యాయమంజరి; ౧౭. నయమయూఖమాలిక;

ద్వైతము :— ౧౮. న్యాయముక్తావళి; ౧౯. న్యాయముక్తావళీవ్యాఖ్య;

విశిష్టాద్వైతఖండనము :— ౨౦. రామానుజశృంగభంగము;

ద్వైతమత ఖండనము :— ౨౧. మధ్వతంత్రముఖమర్దనము; ౨౨. మధ్వతంత్రముఖమర్దనవ్యాఖ్య;

మీమాంస :— ౨౩. విధిరసాయనము; ౨౪. విధిరసాయనవ్యాఖ్య; ౨౫. ఉపక్రమ పరాక్రమము; ౨౬. నక్షత్రవాదావళి; ౨౭. చిత్రపటము; ౨౮. మయూఖావళి; ౨౯. అధికరణకుంచిక;

అలంకారము :— ౩౦. కువలయానందము; ౩౧. లక్షణావళి; ౩౨. చిత్రమీమాంస; ౩౩. వృత్తివార్త్తికము; ౩౪. వృత్తివార్త్తికవ్యాఖ్య;

వ్యాకరణము :— ౩౫. నక్షత్రవాదావళి;

నిఘంటువు :— ౩౬. నామమాల; ౩౭. నామమాలావ్యాఖ్య; ౩౮. శబ్దప్రకాశము;

కావ్యము :— ౩౯. యాదవాభ్యుదయవ్యాఖ్య; ౪౦. పాదుకాసహస్రవ్యాఖ్య; ౪౧. రామాయణ తాత్పర్యసంగ్రహము; ౪౨. రామాయణతాత్పర్య సంగ్రహవ్యాఖ్య; ౪౩. భారతతాత్పర్యసంగ్రహము; ౪౪. భారతతాత్పర్య సంగ్రహవ్యాఖ్య; ౪౫. హరివంశసారచరితవ్యాఖ్య; ౪౬. దశకుమారచరితసంగ్రహము; ౪౭. హంససందేశవ్యాఖ్య;

స్తోత్రములు :— ౪౮. బ్రహ్మతర్కస్తవము; ౪౯. బ్రహ్మతర్కస్తవవ్యాఖ్య; ౫౦. వరదరాజస్తవము; ౫౧. వరదరాజస్తవవ్యాఖ్య; ౫౨. పంచరత్నస్తవము; ౫౩. పంచరత్నస్తవవ్యాఖ్య; ౫౪. ఆదిత్యస్తవరత్నము; ౫౫. ఆదిత్యస్తవరత్నవ్యాఖ్య; ౫౬. చంద్రకలాస్తుతి; ౫౭. చంద్రకలాస్తుతివ్యాఖ్య; ౫౮. గంగాధరాష్టకము; ౫౯. భక్తిశతకము; ౬౦. హరిహరస్తుతి; ౬౧. కృష్ణధ్యానపద్ధతి; ౬౨. అపీతకుచాంబాస్తవము; ౬౩. శివమహిమకారిక; ౬౪. నిగ్రహాష్టకము; ౬౫. ఆత్మార్పణస్తుతి; ౬౬. మానసోల్లాసము; ౬౭. శివకర్ణామృతము; ౬౮. శివకర్ణామృతవ్యాఖ్య;

ఇతరగ్రంథములు :— ౬౯. రత్నత్రయపరీక్ష; ౭౦. రత్నత్రయపరీక్షావ్యాఖ్య; ౭౧. తర్కవిలాసము; ౭౨. వాసుదేవతత్త్వము.

దీక్షితవిరచితము లగు నితరగ్రంథములనామములు మనకుఁ దెలియవు.

పూర్వోదాహృతము లయిన గ్రంథముల ననుసరించి చూడఁగా హిందూతత్త్వశాస్త్రమునందును, సంస్కృతవాఙ్మయమునందును అప్పయదీక్షితు లెట్టిస్థానము నలంకరించినది మనము నిశ్చయింప వీలగు చున్నది. శివోత్కృష్ట సేయుచు, శైవధర్మము నుగ్గడించుచు అప్పయదీక్షితు లనేకగ్రంథములు రచియించియున్నను, అతఁడు సమర్థించిన తత్త్వమును, అతని తత్త్వలక్ష్యమును శ్రీశంకరభగవత్పాదులచేతఁ బ్రతిపాదితమైన శుద్ధాద్వైతమే. ఇతఁడు రచియించిన గ్రంథములలోని కెల్లఁ గడు శ్రేష్ఠ మయినది పరిమళము. శ్రీశాంకరబ్రహ్మసూత్రభాష్యమునకు వాచస్పతిమిశ్రుఁడు రచియించిన వ్యాఖ్యానము భామతిమీఁదను అమలానందుఁడు వ్రాసిన కల్పతరు వను వ్యాఖ్యకు ఈపరిమళము టీక. సంస్కృతమునందలి పెక్కు టీకా, వ్యాఖ్యాన గ్రంథములవలెనే పరిమళమును స్వతంత్రగ్రంథము. ఇందు వాచస్పతి ప్రతిపాదించి విపులీకరించిన శంకరాద్వైతమునే అప్పయదీక్షితులు తన యావచ్ఛక్తిని వినియోగించి సమర్థించెను. పదునెనిమిదవ శతాబ్దిని విలసిల్లిన గౌడవేదాంతులలో నొకఁ డను బ్రహ్మానందసరస్వతి ఇటీవలికాలమున వెలసిన యద్వైతులలో నగ్రగణ్యుఁడు. ఇతఁడే అద్వైతవేదాంతమునకు మూలస్తంభాయమాను లయిన యైదుగురలో అప్పయదీక్షితుఁ డొకఁ డని తన సిద్ధాంతబిందుటీకయందు పేర్కొనినాఁడు.

వేదాంతశాస్త్రమునఁ దనకుఁ గల యసమాన పాండితీవిశేషమును స్పష్టీకరించుటకయి అప్పయదీక్షితులు ద్వైత, విశిష్టాద్వైతములనుగూర్చికూడ గ్రంథములు వ్రాసెను. ఈ రెండుసంప్రదాయములమీఁద నతని కెంతమాత్రము నాదర, గౌరవములు లే వనుటకు వానిని ఖండించుచు వ్రాసిన మధ్వతంత్రముఖమర్దన, రామానుజశృంగభంగనామక గ్రంథములే నిదర్శనము. ద్వైత, విశిష్టాద్వైతముల మీఁద నీతఁడు రచియించిన గ్రంథములను ద్వైతులును, విశిష్టాద్వైతులునుగూడ ప్రమాణగ్రంథములుగ నంగీకరింతురు. అట్లే తన్మతములమీఁది ఖండనములుకూడ ఇంతవఱకు అద్వైతసృష్టిలోఁ జేయఁబడిన విమర్శనములలో నుత్తమ మయినవి. అప్పయదీక్షితుల మతము కడుస్పష్టమే. అతనిది భామతిప్రస్థానమునందు వివరింపఁబడిన శంకరాద్వైతము. మొత్తముమీఁద నితనికి శివునియెడలఁ గొంత పక్షపాత ముండినప్పటికిని శ్రీశంకరభగవత్పాదులకువలెనే యితనికిని శివ, కేశవుల యెడల సమానభక్తిగౌరవప్రపత్తులు కలవు. ఇతఁడు మతమునందు శైవుఁ డయినప్పటికిని తన దేవుని భూషించి యితరుని దూషించు మతస్థులతెగలోఁ జేరినవాఁడు కాఁడు. 'శైవా వయం నఖలు తత్ర విచారణీయమ్' అని స్పష్టముగఁ జెప్పుచువచ్చినను అతఁడు శివ, కేశవులు పరమాత్మభిన్నరూపములే కాని వేఱు కా డని నిస్సంశయముగ ఘోషించియున్నాఁడు. వరదరాజస్తవ మతని విష్ణుభక్తికిని, హరిహరస్తుతి శివ, కేశవులయెడల నతనికిఁ గల సమాన భక్తిగౌరవప్రపత్తులకును తార్కాణములు. కాని యతఁడు శివపారమ్యమునుగుఱించివలె విష్ణుపారమ్యమునుగుఱించి గ్రంథ మేదియు రచింపలే దనిమాత్రము గమనింపఁదగినది.

రామానుజభాష్యమునకువలెనే శ్రీకంఠభాష్యమునకుఁగూడ సమానగౌరవస్థానము కల్పింపవలె నను తలంపుతో అప్పయదీక్షితులు శివార్కమణిదీపికారచనమునకుఁ బూనుకొనె నని ప్రతీతి. రామానుజభాష్యమునకు సుదర్శనమిశ్రుని శ్రుతప్రకాశిక ముఖ్యభాష్యమన్న గౌరవము గడించినది కాని యప్పయదీక్షితులకాలమువఱకును పండితబృందమున శ్రీకంఠభాష్యమునకు రామానుజభాష్యమున కున్న గౌరవము లేదు. ఈకొఱత పోఁగొట్టుటకయి యతఁడు శివార్కమణిదీపిక రచియించె నని చెప్పుదురు. అప్పయదీక్షితులు శివార్కమణిదీపికయందు శివుఁడే ప్రధానదైవముగ, శ్రీకంఠుని అద్వైతసిద్ధాంతమును బ్రపంచించెను. ఈగ్రంథమున మత, వేదాంతములు రెంటికిని చక్కని మేళనము కుదిరినది ; మతతత్త్వ మింగు చక్కఁగ పరిణతి మయినది.

సంస్కృతసాహిత్య చారిత్రమునందు అప్పయదీక్షితులతో సరిపోల్పఁదగినవారు చాల కొలఁదిమంది కలరు. మహాకవియు, భావితాత్ముఁడు నగు అప్పయదీక్షితులు కాలముదాటుపోటుల కాఁగి నిలువఁగల భక్తిగీతము లనేకములు రచియించెను. వరదరాజస్తుతి, శివకర్ణామృతము, భక్తిరసప్రధానము లయిన యితరశ్లోకములు చాల ప్రశస్తము లయిన రచనలు. అతఁడు మహాకావ్య మేదియు రచింపలేదు ; కాని యాదవాభ్యుదయ, హరివంశసారచరితములవంటి కొన్ని ముఖ్యము లయిన మహాకావ్యములకు వ్యాఖ్యానములు వ్రాసెను. ఇంతవఱకు ప్రకటితముకాని నిఘంటువు నామమాలనే కాక, ఇతఁ డమరకోశముమీఁద నొకవ్యాఖ్యానమునుకూడ రచియించినట్లు చెప్పుదురు. సాహిత్యవిమర్శగ్రంథము లయిన కువలయానంద, వృత్తివార్తిక, చిత్రమీమాంసా, లక్షణావళుల ననుసరించి యాతఁ డొక గొప్పసాహిత్య విమర్శకుఁ డని చెప్పఁదగును. అతఁడు సాహిత్యకర్తగనే కాక, సాహిత్యవిమర్శకుఁడుగకూడ పేరున కెక్కినవాఁడు.

(టి. ఆర్. చిం.)

అప్పయ్యరాజుపేట — కడపజిల్లా, రాజంపేట తాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౮౭౯ (౧౯౩౧).

అప్పరాజుచెఱువు — అనంతపురంజిల్లా, ధర్మవరం తాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౧,౧౩౩ (౧౯౩౧).

అప్పరాజుపల్లి — కడపజిల్లా, కడపతాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౨౮౮ (౧౯౩౧).

**అప్పరు** — ౭-వ శతాబ్దియందు సుప్రసిద్ధుఁడగు అఱవకవి. జన్మమున బ్రాహ్మణుఁడు. ఇతని అసలుపేరు మరుళ్ నీకియర్. చిన్నతనముననే యితని తల్లిదండ్రులు మరణించిరి. నాఁటనుండియు

sampath_Ebooks

నితఁడు తనయక్కగారగు తిలకవతియార్ సంరక్షణమునఁ బెరుఁగుచుఁ బెద్దవాఁ డయ్యెను. పెద్దయైనతరువాత నతఁడు ఏకారణముననో జైన మతము నవలంబించి జైనగురువై యుత్తరహిందూస్థానమునకుఁ బోయి పాటలీపుత్రనగరమున నివసించుచు, తనకుటుంబమునుగూర్చిన యాలోచనయే లేక కొంతకాలము గడపెనఁట! జైనమతము నవలంబించిన పిదప నితనిపేరు ధర్మసేనుఁడు. అటుపై నొకసారి ఎన్నిమందులకును లొంగని కడుపునొప్పిచే బాధపడి శైవమంత్రములవలన విముక్తిఁగానక తనసోదరి జ్ఞప్తికి రాఁగా నామెకై వర్తమానమంపెను. కాని యామె జైనునిమొగముం జూడ ననియు, జైనునియింట నడుగు పెట్ట ననియు సమాధాన మంపెను. వెంటనే మరుల్ నీకియరు తనజైనవేషమును దీసివైచి పోయి సోదరిపాదములపైని వ్రాలెను. శైవమంత్రములను జపించిన వెంటనే యతనిరోగ మంతరించిపోయినది. నాఁటనుండియు నతఁడు పరమశైవుఁడై నిరంతరముగ శైవమతప్రచారమునకే తన జీవితము గడపుచుండెను.

ఇట్లు దేశాటన మొనరించుచు నొకపరి పాండ్యరాజ్యమునకు రాజధాని యగు మధురకుఁ బోయి యచ్చటి జైనపక్షపాతి యగు పాండ్యరాజును తనవాదబలమున శైవునిగఁ జేసెను. ఆసందర్భముననే యతనికి 'అప్పరు' అను బిరుదనామము వచ్చినది (అప్పరు అనఁగా అరవమున తండ్రి యని యర్థము). నాఁటనుండియు అప్పరునామమే ప్రసిద్ధమైపోయినది. ఇతఁడు శివభక్తులలో నొక్కఁడయి వాగీశస్వామి యనియు, తిరునావుకరసు అనియుఁ బ్రసిద్ధుఁ డయ్యెను.

అప్పరు ఏయేక్షేత్రములను దర్శింప నేఁగెనో యందెల్ల నాయాదేవతలపైని చక్కనిస్తోత్రములను రచించుచుఁ బోవుచుండువాఁడు. ఇతనికృతులు అరవదేశమునఁ బూర్తిగ వ్యాపించిపోయినవి. ఆనాఁటి దక్షిణదేశమునందలి యాస్తిక్యవాదమునఁగల సార మంతయు నితనికృతులలో నిమిడియున్నది.

అప్పలఅగ్రహారం — విశాఖపట్టణముజిల్లా, పాలకొండతాలూకాయందలి ఈనాంగ్రామము. జనసంఖ్య ౮౭౭ (౧౯౩౧).

అప్పలనాయఁడుపేఁట — గంజాముజిల్లా, పర్లాకిమిడితాలూకాయందలి జమీన్దారీగ్రామము. జనసంఖ్య ౧౦౦ (౧౯౩౧).

అప్పలనట్నాయకునిపేఁట — విశాఖపట్టణముజిల్లా, పాలకొండతాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౮౧౫ (౧౯౩౧).

అప్పలమ్మపేఁట — విశాఖపట్టణముజిల్లా, బొబ్బిలితాలూకాయందలి జమీన్దారీగ్రామము. జనసంఖ్య ౩౩౦ (౧౯౩౧).

అప్పలరపిపురం — విశాఖపట్టణముజిల్లా, వీరఘట్టముతాలూకాయందలి జమీన్దారీగ్రామము. జనసంఖ్య ౧,౫౮౭ (౧౯౩౧).

అప్పలరాజుగూడెం — పశ్చిమగోదావరిజిల్లా, చింతలపూఁడితాలూకాయందలి ఈనాంగ్రామము. జనసంఖ్య ౮౨౫ (౧౯౩౧).

అప్పలరాజుపేఁట — తూర్పుగోదావరి (ఏజెన్సీ) జిల్లా, యెల్లవరంతాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౬౩.

అప్పలాచార్యుఁడు శేషభట్టరు — ఒకకవి. ఆపస్తంబసూత్రుఁడు. కౌండిన్యసగోత్రుఁడు; తండ్రి నృసింహార్యుఁడు. ఈకవి రామకృష్ణవిలాసము అను నైదాశ్వాసముల గ్రంథము రచించెను. ఇది భద్రాద్రిరామునికంకితము. శైలి మంచిది.

అప్పలాపురం — కర్నూలుజిల్లా, బంగనపల్లిసంస్థానమునందలి గ్రామము. జనసంఖ్య ౭౨౭ (౧౯౩౧).

అప్పసముద్రం — నెల్లూరుజిల్లా, ఉదయగిరితాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౧,౬౮౩ (౧౯౩౧).

అప్పాజీపేఁట — అనంతపురంజిల్లా, గుత్తితాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౧౯౭ (౧౯౩౧).

అప్పాదేశాయినిపణకర్ — మహారాష్ట్రప్రభువులలో నొకఁడు. నిపాణియొక్క పాలకుఁడు.

అప్పాధ్వరి — క్రీస్తుశకము పదునేడవశతాబ్దియందుండిన గొప్ప పండితుఁడు: కవి. ఇతఁడు తంజావూరుజిల్లాయందలి మాయవరముగ్రామముదగ్గఱ నున్న కిల్లియూరునివాసి; శ్రీవత్సగోత్రుఁడు. ఉదయమూర్తి యీతని యాచార్యుఁడు; ఆలత్తూరు గ్రామవాసి యయిన పిల్లశాస్త్రి యితని ప్రాచార్యుఁడు. ఇతఁడు రచియించిన 'ఆచారనవనీతము' నందలి శ్లోకము ననుసరించి తంజావూరు మహారాష్ట్రప్రభు వయిన షాహజీ యితని నాదరించినట్లు తెలియుచున్నది. కుంభఘోణముదగ్గఱ స్వామిమలయందు క్రీ. శ. ౧౬౭౬-న షాహజీ ప్రధానియయిన త్ర్యంబకరాయమఖి యొనరించిన మహామఖమునకు అప్పాధ్వరి విచ్చేసినపుడు షాహజీ చాల సంతోషించి యాతనిని రాజసభాభవనమున మహాభారతము పారాయణము చేయుటకు తంజావూరియందు మూఁడుమాసములు నిలిపివేసెను. అప్పాధ్వరి రచియించిన గ్రంథములలోఁ బేరెన్నికఁ గన్నది ధర్మశాస్త్రగ్రంథమయిన ఆచారనవనీతము. ఇతఁడు తనకుమారునితోఁ గూడ పదునెనిమిదేండ్లు కష్టపడి మిక్కిలి పరిశ్రమ చేసి దానిని రచియించెను. అది ౧౫,౦౦౦ ల గ్రంథముల యంత గ్రంథము. షాహజీ కోరిక ననుసరించి యితఁడు తాను వ్రాసినట్లు ఆ గ్రంథముననే తెలిపినాఁడు. మదనభూషణభాణము, గౌరీమాయూరమాహాత్మ్యచంపువు అనునవి యీతఁడు రచియించిన యితర గ్రంథములు. ఇవి చంపూభాణవాఙ్మయములందు పేరుపడ్డ గ్రంథములతోఁ దులఁదూఁగఁగలవి.

sampath_Ebooks

**అప్పాపురం** — ౧. గుంటూరుజిల్లా, బాపట్లతాలూకా యందలి గ్రామము. జనసంఖ్య ౧,౩౧౨ (౧౯౩౧).

౨. కృష్ణాజిల్లా, కైకలూరుతాలూకా యందలి గ్రామము. జనసంఖ్య ౨౨౪ (౧౯౩౧).

౩. విశాఖపట్టణముజిల్లా, చీపురుపల్లి తాలూకాయందలి ఈనాం గ్రామము. జనసంఖ్య ౫౮౬ (౧౯౩౧).

౪. విశాఖపట్టణముజిల్లా, పాలకొండ తాలూకాయందలి ఈనాం గ్రామము. జనసంఖ్య ౮౬౫ (౧౯౩౧).

**అప్పాబలవంత్** — మహారాష్ట్ర సేనానాయకులలో నొకఁడు. మొదట మాధవరావు మైసూరునందలి హైదరాలీ నెదిరించుటకు మహారాష్ట్ర రాజ్యమువారిచే నియోగింపఁబడెను. కాని మాధవరావునకు దేహారోగ్యము తప్పినందున నప్పాబలవంతు తత్కార్యార్థము పంపఁబడెను. త్ర్యంబకరావు పేఠే యితనికి సహాయకుఁడుగ నుండెను. బాజీరావు కారణమున నితని కొకపర్యాయము నానాఫడ్నవీసుతో పాటు కారాగారమునకుఁ బోవలసివచ్చినది. ఇతఁడు పేష్వాద్వితీయ మాధవరావునకుమాత్రము విశ్వాసపాత్రుఁడుగ నుండెను.

**అప్పారావు గురజాడ** (క్రీ. శ. ౧౮౫౫ - ౧౯౧౫) — తెలుఁగు 'నవ్యకవుల'లో మొట్టమొదటివాఁడు. క్రీ.శ. ౧౮౫౫-వ



గురజాడ అప్పారావు

సంవత్సరమున విశాఖపట్నముజిల్లా, ఎలమంచిలితాలూకాయందలి రాయవరము గ్రామమున జన్మించెను. ఈతనితండ్రి పేరు వేంకటరామదాసు. తల్లి గొడవర్తివారి యాఁడుపడుచు; పేరు కౌసల్య. వీరు నియోగి బ్రాహ్మణులు. అప్పారావు కొంతవఱకు చీపురుపల్లియందు విద్యాభ్యాసము గావించి పిమ్మట విజయనగరకళాశాలయందు పట్టభద్రుఁడై విజయనగర ప్రభువగు ఆనందగజపతిమహారాజుకొలువున ప్రాచీన లిపిశోధకుఁడుగ ప్రవేశించి భారతదేశభాషల ఆనుషంగికపరిశీలనము చేయుచు ముఖ్యముగ తెలుఁగుభాషను బాగుగ తరిచెను.

క్రీ. శ. ౧౮౯౨ సంవత్సరము ప్రాంతముల మహారాజు విశాఖపట్నముజిల్లాయందు అమూఁడు సంవత్సరములలో జరిగినకన్యాశుల్కవివాహముల లెక్కలు తీయింపఁగా, ఒకవేయి ముప్పదినాలుగు తేలెను. అది ప్రేరణగా, సంఘసంస్కార ప్రియుఁడగు అప్పారావు 'కన్యాశుల్కము' అను సాంఘికనాటకమును వాడుకభాషయందు రచించెను. వాడుకభాషకు సాహిత్యప్రతిష్ఠ అర్హ మను భావోజ్జృంభణమునకు అప్పారావు తొలుతగ సాహిత్యప్రయోగనిర్వహణమీనాటకమునఁ గావించె ననుటకు పాత్రోచితగ్రామ్యభాషాప్రయోగమత మష్టుపడి ఈనాటకమును తానే స్వీకరింపఁ జూచెను కాని, యాతని ఆశయము లంతమాత్రమున లొంగుటలేదు. సామాజికులకు గ్రాంథికభాషకంటె వాడుకభాష సులభార్థ మనుమాటయేఁ గాక, అసలు తెలుఁగున నాటకోచిత మైనది వాడుకభాషయే యనియు, అది గ్రంథరచనకు వినియోగించుట కీవి కా దనుకొనుట— భాషాశాస్త్రము వచ్చి భాషారూపముల ప్రయోజ్యతయు, విలువయు నిరూపించుటకు వేఱుగ మంచిప్రమాణములునిలిపిన యీకాలమున,— శుష్కవైయాకరణుల అతిదైన్యమునకు వదలవలయు ననియు, గ్రంథప్రయోజ్య మగుభాషను వ్యవహారమందుండు భాషకు సాధ్యమయినంత దగ్గఱకు తెచ్చుట సత్యతావహ మనియు మంచి అభినివేశముతో కవి ఇందు వాడుకభాష ప్రయోగించి సంఘసంస్కారముతోపాటు భాషాసంస్కారముగూడ సూచించినాఁడు. సంఘవృత్తమును చాల మనోజ్ఞముగను, మర్మజ్ఞముగను నిరూపించునదై దురాచారముల నపహాస్యతకు తెచ్చుచు రచనాచమత్కారమున మిగుల సంపన్నమైన దగుటచే ఈనాటకము దేశమున నెంతయు ప్రశంసకును, ఆదరమునకును పాత్రమై ౧౮౯౭-వ సంవత్సరమున ముద్రణప్రకాశనము కాంచినది. దీనిప్రకటనమునకు పూర్వమే కందుకూరి వీరేశలింగముపంతుల 'బ్రాహ్మవివాహ' మను రూపకము ప్రకటితమై యుండెను కాని, అది కేవలము ప్రహసనప్రాయ మగుటచేతను, 'కన్యాశుల్కము'న అల్లికపడ్డవస్తువు, హాస్యరసపోషణము, పాత్రపరిణతి మున్నగు ఘనతరాంశములు ప్రవర్తిల్లి దీనికి నాటకత్వము చేకూర్చియుండుటచేతనుఁ గాని, రచనమున 'బ్రాహ్మవివాహము'న కంటె నిది పూర్వతరమై, రంగము చవిచూచియుండిన దగుటచేఁ గాని 'కన్యాశుల్కము' తెలుఁగున మొదటిసాంఘికనాటకముగా నెన్నికఁ గన్నది. ఇది మొదటి ముద్రణమునకంటెను తరువాతి ముద్రణములందు పెక్కుమార్పులు పొందుచు వచ్చి సుమారు రెండింతలకు పెరిఁగినది. మొదటి గ్రంథమునకంటె నిశ్చయముగ తరువాతిసంస్కరణము సంపన్నతర మైనది.

గిరీశము, మధురవాణి మున్నగు పాత్రము లీసంస్కరణము పడయకుండిన, నింతటి అమరత్వమును, ప్రత్యక్షత్వమును బడసియుండవు; నాటకమును నాటకరచనానైపుణికిఁ గాని, హాస్యరససంసిద్ధికిఁ గాని నేఁటి యున్నతప్రశంసను కట్టుకొని యుండదు. కాని వస్తు విం చుక యిమిడిక తప్పిన దనుట వాస్తవము.

పిదప అప్పారావు రాగతాళబద్ధములగు గేయములు కొన్ని చక్కని వాడుక తెలుఁగు శైలిని రచించి 'నీలగిరిపాటలు' లను పేరుతో సంపుటముగా ప్రకటించెను. ౧౯౧౦, ౧౯౧౧ సంవత్సరముల ఆంధ్రపత్రిక మొదటి రెండు సంవత్సరాదిసంచికలయందు 'బిల్హణీయ' మను రూపకము రెం డంకములు ప్రకటించెను. రాజసభావృత్తస్వరూపమును పృథక్పాత్రవిస్ఫోటన మాలంబముగ ఆవిష్కరించుచు, ఇట్టి కథావస్తువునుసహా హాస్యరసముద్వారా పరామర్శించుట యీతనియొక్క విశిష్టతను చాటును. పత్రికలంగు 'మాట - మంతి' అను శీర్షికతో హాస్యమయము లగు వ్యాసములు కూడ అప్పారావు రచించుచుండెడివాఁడు.

అప్పారావు ఆంగ్లమునఁగూడ కవన మల్లువాఁడు. ఒకసారి అతఁడు కొన్ని ఆంగ్లపద్యములు తనవి ఒకపత్రికకు పంపఁగా తత్సంపాదకుఁడు అప్పారావును మాతృభాషయందు కవనము సెప్ప ప్రోత్సహించుచు వ్రాసెను. 'నాభాష యనఁగా నేది' యను ప్రశ్నకు వ్యాకరణకృతక మైనది కాక 'నేను మాటాడుభాష నాభాష' యనియే అతని కంతరాత్మ వలన లభించినయుత్తరము గద్యముననే కాక దేశిఛందమునఁగూడ వాడుకభాష, నుడికారము మెఱయునది, ప్రయోగించుట అతనికి సమ్మతమై తోఁచెను.

ఒకసారి మనోహరమగు స్త్రీలప్రాఁతపాట ఒకటి ఆతనిచెవిని బడి మనసున క్రొత్తసంగీతములు తిరుగఁగా, తెలుఁగున నొక క్రొత్త ఛందము నడపింపవలె నని ఆతనికి సంకల్ప ముదయించెను. క్రీ. శ. ౧౯౧౦-వ సంవత్సరమున బరంపురమున నానావర్ణ సహపఙ్క్తి భోజనము జరగినది; ఇందు అప్పారావును బాల్గొనెను. ఆసంవత్సరమే తోఁకచుక్క (Hally's Comet) పొడిచినది. ఒకవిచిత్రమైన భావమథనమున అప్పారావురసికచిత్తముననుండి ఒక క్రొత్తకవితా వేశము రూపుకట్టినది:

'గుత్తునా ముత్యాలసరములు,
కూర్చుకొని తేటైనమాటల,
కొత్తపాతల మేలుకలయిక
క్రొమ్మెఱుంగులు చిమ్మఁగా'

అని మొట్టమొదటి ముత్యాలసరముకావ్యము అతని ఆశయములు నిరూపించుచు నడచినది.

'మెచ్చ నంటూ వీవు; నీ విక,
మెచ్చకుంటే మించిపోయెను:
కొయ్యబొమ్మలె మెచ్చుకళ్లకు
కోమలులసొ రెక్కనా?'

అన్న రెండవపద్యము ఆ 'జీవద్భాష' ప్రతిష్ఠను వ్యాఖ్యానించినది. ఆతనిమొదటికావ్యము సంస్కారపఙ్క్తిభోజనము, ధూమకేతుదర్శనము మున్నగు సంఘటనములు హృద్యమగు గృహ్యకథయందు సంస్కారాశయములకు భిత్తిక పట్టి క్రొత్త, ప్రాఁతభావముల అన్యోన్య ప్రవృత్తి పదను చూపినది. ఈతఁడు ముత్యాలసరమున 'లవణరాజు కల', 'కన్యక' మున్నగు మనోహరములగు కథనకావ్యములును, ఒకటిరెండు 'వ్యక్తి' కావ్యములును రచించెను. వేఱు గేయచ్ఛందములుగూడ పట్టి 'పూర్ణమ్మ' అను ఆఁడుపిల్లలపాట మున్నగునవి కడుమంజులముగ రచించెను. వీరేశలింగముపంతులుఁ వీలగుచోట నెల్ల ఒకధర్మవిధిగా సంఘసంస్కారభావములు పాత్రములనోట యత్నతః పలికింపఁగా, ఈతనికావ్యముల పాత్రములుఁ ఒక సహజభావోద్రేకముతో, ఈతనివలెనే, కావ్యౌచిత్యము కుంటువడక మెఱుఁగుదేఱునట్లు సంస్కారాశయములు వెలిపుచ్చును.

క్రీ. శ. ౧౯౧౩-వ సంవత్సరమున అప్పారావు విజయనగర సంస్థానపు టుద్యోగముననుండి విరతి పొందెను. ఆయేఁడే ప్రభుత్వమువా రాతనిని మద్రాసువిశ్వవిద్యాలయము సెనేటునందు శాశ్వత సభ్యునిఁగా నియమించిరి. ఇంటర్మీడియేటు ఆంధ్రవ్యాసరచనా సంఘమువారు వేదము వేంకటరాయశాస్త్రిని, కొమఱ్ఱాజు లక్ష్మణ రావును, అప్పారావును కలిపి తెలుఁగున ప్రాచీనార్వాచీనప్రయోగముల నేఱుపఱిచి చూపుటకై ఒక ఉపసంఘముగా నేర్పఱిచిరి. అందు వేంకటరాయశాస్త్రియుఁ, లక్ష్మణరావును సమ్మతపడి సిద్ధపఱిచిన పట్టికపై అప్పారావు తాను జోడించిన అసమ్మతివిజ్ఞప్తియందు నాఁటికే రావుసాహెబు గిడుగు రామమూర్తిపంతుల అమేయమగు దీక్షావ్యవసాయముల ఫలముగ దేశమున ఉద్యమము కట్టుచున్న 'వాడుకభాష'కు చాల సమర్థమగు సమర్థన మిచ్చెను. తుదిదినముల నీతఁడు 'కొండుభట్టీయ' మని యొక సాంఘికనాటకము రచించెను. అది నేఁటికిని ప్రకటితము కాలేదు. ఈతనివి రెండు చిన్నకథలుకూడ కలవు. అవియు ఆతనిసంఘసంస్కారప్రియతను హాస్యరసము త్రోవలనే కళామయముగ వెల్లడించుచున్నవి. అప్పారావు ౧౯౧౫-వ సంవత్సరమున విజయనగరమున కాలధర్మము నొందెను.

అప్పారావు నడవడికను చాల రసికతకు, ఔదార్యమునకు పేరుపడినవాఁడు. సమాజమున తన ప్రతిభచేతను, మంచితనముచేతను, చమత్కారకలిత మగు సంభాషణముచేతను చాల చిత్తాకర్షణము చేయువాఁడు. ఎంత హాస్యప్రియుఁడో అంత గంభీరుఁడు; ధీరుఁడు. తనకష్టస్థితులుసహా మిత్రులకైన తెలుపువాఁడు కాఁడు. ప్రభువు నెడనైన ఇచ్చకము లాడునలవాటు లేక గౌరవముగ మెలఁగువాఁడు. జీవితము నున్నతలక్ష్యముగఁ బట్టుచు సంఘదురాచారములను ఖండించి తన అమితమగు భావస్వాతంత్ర్యము ప్రకటించుకొనియు,

sampath_Ebooks

తనవిశాలమైనయాకాంక్షల కెంతో వెనుకఁబడియుండు సంఘవృత్తమును సహనముతో చూచెడివాఁడు. కనుకనే సంఘవృత్తి మీతనిచే సాహిత్యమున కెత్తఁబడ్డపుడు హాస్యరస మంతహృద్యముగ వెలసినది. ఈతని హాస్యరచన మైనను ప్రహసనోచితముగ నొక్కలక్ష్యభావమునకు పరాధీనమై నడవక, నాటకోచితముగ నడచును. పెక్కులగు పాత్రముల స్వాధీనములగు వ్యక్తివృత్తులసాగుదలయందు ఇతివృత్తము వ్యంజన గాంచుచుండును. సంభాషణమందలి చమత్కారమును, వస్తువునందలి చాకచక్యమును చూపునుత్కృష్టతకు తోడు, ఈతని హాస్యము మాధ్యమునుకాఁదను గాక చాతుర్యమునుకాఁదను ఒత్తిడి చూపును. పాత్రముల వ్యక్తిత్వములు పట్టఁగల యీతని అనతిక్రాంతమగు 'నాటకీయభావన' యీతని నాటకములందేమి, కథలయందేమి, కావ్యములందేమి నిరంతరముగ ఎఱిఁగి ప్రయుక్తమైనది. కవితావీథిని చూచిన, అప్పారావుప్రతిభ భావనాజగత్తున చైత్రయాత్రలు సలిపినది లేదు కాని, మనోజ్ఞమై రసము చిందు హృదయోద్ధతమైనది యీతనికవిత. పురాణములు చెప్పుటకై కాక, యీతఁడు కావ్యమును, పాశ్చాత్యుల 'లిరిక' ఫక్కి చేకొని, జీవితవాణిగా పలికించినాఁడు. తనజీవితాశయములు నెత్తిపై దేవతలవలె మోసుకవచ్చి కావ్యవీథిని దింపక, కావ్యసంకల్పమువేఁడిని కరఁగఁబోయి వచ్చినమట్టునకు కరఁగఁబోసినాఁడు. మఱి యీతని గ్రంథములు చాలకొలఁదిగ నున్నవి కాని, యీతనిసాహిత్యప్రవృత్తి యంతయు విశిష్టమై, ప్రతిభాసంపన్నమై, నవ్యతరమై ప్రాముఖ్యగర్భమయినది. ఈతని నవ్యత యేర్పడిన చరిత్రము తడవుగెడ ప్రత్యక్షసంస్కారము పాశ్చాత్యభావసంపర్కమున సిద్ధమయినట్టిదని యీతనికావ్యములే తెల్లమొనర్చును. కాని అది తనదేశకాలముల స్థితిగతుల కుచితమయి అత్తెడి 'కొత్తపాతల మేలుకలయిక' చూచిన ఈతని ప్రతిభా, సంకల్పములు ఈతని ప్రాముఖ్యమును నిర్వహించుచు నేఁటి ఆంధ్రకవితా నవయుగమునకు ఈతనిని సమ్మతముగ శకకర్తను చేసినవి.

(కొం. జ.)

**అప్పారావు బసవరాజు** (క్రీ. ౧౮౯౪-౧౯౩౩) — తెలుఁగుకవి, విమర్శకుఁడు; క్రీ. శ. ౧౮౯౪ - వ సంవత్సరమున జన్మించెను; ఆఱువేలనియోగి బ్రాహ్మణుఁడు; పిచ్చయ్యగారి కుమారుఁడు. వీరిది కృష్ణామండలము. చిన్నతనమున బెజవాడయందు ఆంగ్ల విద్యాభ్యాసము కావించునపుడే సంస్కృతాంధ్ర సాహిత్యముల నధ్యయనము సేయుచు కవనోత్సుకత చూపుచుండెడివాఁడు. పిదప చెన్నపురి రాజధానీకళాశాలయందు ప్రవేశించినవెనుక నాతఁడు ఆంగ్ల కవిత్వము నెంతయు మెచ్చుచు నట్టికవిత తెలుఁగున వికసింపవలె నని మనసుపడుచుండ, గురజాడ అప్పారావునవ్యకవిత ప్రకటితమై యీతని నాకర్షించెను. గురజాడ అప్పారావున కితఁడు మొట్టమొదటి అనుయాయులలోనివాఁడై తన క్రొత్తరచనములు 'సెలయేటిగాన' మను పేర సంపుటముగ ప్రకటించెను (౧౯౧౫). కావ్యసత్త్వ మంతగా లేకయుండి గురజాడ అప్పారావు ననుసరించిన క్రొత్తఁదనముమాత్రమే తన విశిష్టలక్షణముగా చూపుకొనఁగలది. దేశమునందలి అనేక పత్రికలకాతఁడు కావ్యములు, విమర్శములు వ్రాయుచు ప్రసిద్ధివడసెను. తన చక్కనిసంగీతజ్ఞానమున కనువుగ నీతఁ డనేకగేయములు రచించి తెలుఁగున గేయరచనము ప్రచలితము చేసెను. అందు కొన్ని చాల రంజకత యొప్పినవి. అమితముగ నితని స్వాతంత్ర్యప్రియత సాహిత్యమునను సువ్యక్తమై కావ్యమాధుర్యనియతులు దాఁటిన వట్టి ఉద్రేక ప్రకటనముగ కూడ నవతరించెను. కవిత్వమునందుకంటె విమర్శమున నీతఁ డెక్కువ వన్నెమీఱెను. కాని, కవిగా కావలెనని యీతఁడు కన్నకొనిన చిత్తోద్వేగ పక్షపాతాదులు ఈతనియందు విమర్శకుని గొలుగు స్థ్యమును కుంటువఱిచినస్థితి 'యెంకిపాటల గాలిదుమారము' ప్రశంసయుత్కృష్టవిమర్శములే వెల్లడిచేసినవి. కొంతకాల మీతఁడు కాశీనాథుని నాగేశ్వరరావుపంతుల దినపత్రిక యగు 'ఆంధ్రపత్రిక' యందును, మాసపత్రిక యగు 'భారతి' యందును సంపాదకవర్గముల కార్యనిర్వహణము కావించెను. నాగేశ్వరరావుపంతుల నియోగమున నాతఁడు 'అరేబియన్ నైట్స్' అను గ్రంథము కొంత వఱకు (గద్యముగ) తెలిఁగించెను; అది అప్రకటితము. కొమఱ్ఱాజు లక్ష్మణరావుతో 'కళ సృష్టియా, అనుకరణమా?' అను విషయమున నీతఁడు పత్రికాముఖమునఁ గావించిన వాదమును, ఈతని తుదిదినముల ప్రకటితమైన 'ఆంధ్రకవిత్వచరిత్రము' అను కావ్యమీమాంసా గ్రంథమును, తక్కినవిమర్శములతోపాటు, ఈతని సాహిత్యతత్త్వజ్ఞతను తెలుపును. ఇట్టి కుద్రగ్రంథము అతఁ డెన్నఁడో రచించి ప్రకాశకులకు అమ్మియుండినట్టిది, సంస్కృతసాహిత్యపరామర్శాదికము చాలమిచే దొరలిన దోషములతో, ఆతని వ్యుత్పన్నతరదశయందు ప్రకటితమై ఆతనిమనస్సును కలఁచినది.

జీవితమున అనేకకష్టముల కగ్గమై సహజమగు హృదయమార్దవమునను, ఉద్వేగశీలమునను కలఁతపడి పిచ్చియెక్కి, అప్పారావు కేవల మనస్సంతాపముచే మరణించెను (జూన్, ౧౯౩౩).

(కొం. జ.)

**అప్పారావుపల్లి** — కడపజిల్లా, కమలాపురంతాలూకాయందలి ఈనాంగ్రామము. జనసంఖ్య ౨౯౭ (౧౯౩౧).

**అప్పారావుపేట** — పశ్చిమగోదావరిజిల్లా, తాడేపల్లిగూడెంతాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౨,౯౬౩ (౧౯౩౧).

**అప్పావాజపేయి** — నీతికుసుమావళిగ్రంథమును రచించిన యతడు.

**అప్పాశాస్త్రి** — ఒక ప్రసిద్ధ పండితుడు. ఇతడు సంస్కృతభాషయందు అప్పాశాస్త్రీనాదార్థ మను పేరుగల న్యాయగ్రంథమును రచించెను. మఱియు నితనిచే రచింపఁబడినవి లవలీపరిణయము, సారస్వతాదర్శము అను రెండునాటకములుగూడ కలవు.

sampath_Ebooks



**అప్పాసాహెబ్‌భోంస్లా** (నాగపూరు) — నాగపూరురాజు. రెండవ రఘోజీరాజునకు వెంకాజీ యను పినతండ్రి కలఁడు. అతనికి సేనాధురంధరుఁ డన్నబిరుదును, చాందా, ఛత్తీస్‌గఢప్రాంతముల జాగీరును ఉండెను. అతనికుమారుఁడే అప్పాసాహెబు.[1] ఇతనికి ముధోజీ యన్నపే రుండెను. కాని వ్యవహారమందుమాత్రము అప్పాసాహె బన్నపేరే కలదు. ఇతఁడు చాందాలోఁ బుట్టి కొన్ని సంవత్సరములవఱకు నచ్చటనే పెరిఁగినట్టు కానవచ్చుచున్నది. ౧౮౧౧ లో నీతనితండ్రి చనిపోఁగా నితనికి సేనాధురంధరత్వమును జాగీరును ప్రాప్తించెను. రెండవ రఘోజీ ౧౮౧౬ లో మరణము నొందెను. అతనికుమారుఁ డైన పర్‌సోజీ రా జయ్యెను. కాని యాతఁడు పిచ్చివాఁ డగుటచే రాజప్రతినిధి (Regent) కావలసివచ్చెను. రాజతల్లియైన బాకాబాయికిని, రాజ్యమున కనంతరవారసత్వము గల అప్పాసాహెబునకును ఈ ప్రతినిధిత్వమునుగుఱించి పేచీపడెను. తుదకు రాజ్యమందలిసరదారులయను మతివలనను, ఇంగ్లీషురెసిడెంటు సాయమువలనను అప్పాసాహెబే రాజప్రతినిధి యయ్యెను. ఈతఁడు ప్రతినిధిగా నున్నకాలమం దింగ్లీషువారికిని ఈతనికిని సంధి జరిగెను. ‘ఇంగ్లీషువారు పర్‌సోజీకి సాయము చేయుటకై ఆఱు కాల్బలముల పటాలములును, కొంత గుఱ్ఱపుసైన్యమును, తోపుఖానాయును ఉంచునట్లును, దానికి బదులుగ పర్‌సోజీ ఇంగ్లీషువారికి నేడులక్షల యేఁబదివేలరూపాయలు ప్రతియేఁట నిచ్చుటయేకాక ౨,౦౦౦ కాల్బలమును, ౨,౦౦౦ అశ్వసైన్యమును ఉంచవలెను.’ ౧౮౧౭ లో అప్పాసాహెబు తన జాగీరైన చాందాకుఁ బోయెను. అతఁడు వెళ్లిన కొలఁది దినములకే పర్‌సోజీ చచ్చెను. అప్పాసాహెబే పర్‌సోజీని చంపించె నని కొంద ఱింగ్లీషుచరిత్రకారులు వ్రాసిరి. కాని యందుల కాధారమేమియు లేదు. పర్‌సోజీ తరువాత నప్పాసాహెబు రా జయ్యెను.

ఈతఁడు రాజ్యారూఢుఁ డైనప్పటినుండియు నీతనికి నింగ్లీషువారియెడఁ గల గౌరవము తగ్గఁజొచ్చెను. ఇంగ్లీషువారికిఁ బ్రతికూలురగు పూనాపేష్వాతోడను, గ్వాలియర్ సింధియాతోడను రహస్యముగఁ గలసి యింగ్లీషువారిమీఁదికి యుద్ధప్రయత్నములు చేయసాగెను. మహారాష్ట్రసైన్యముల కన్నిటికి నప్పాసాహెబును సేనాధిపతిఁ జేసి పూనాపేష్వా బాజీరావు సన్నదులను, దుస్తులను నాగపురమునకుఁ బంపెను. అంతకుఁబూర్వమే యింగ్లీషువారికిని బాజీరావునకును యుద్ధము ప్రారంభమైనందున, నాసన్నదును దుస్తులును గ్రహింపవలదని బ్రిటిషుప్రెసిడెంటు ఎంతచెప్పినను వినక అప్పాసాహెబు ౨౪-వ నవంబరు ౧౮౧౭-వ దినమునఁ బెద్ద సభ చేసి పూనానుండి వచ్చిన యధికారమును వహించెను. ౨౬-వ తేదీని రెసిడెన్సీలోని యింగ్లీషువారిసైన్యమునకును, అప్పాసాహెబు సైన్యమునకును యుద్ధము ప్రారంభమాయెను.

రెసిడెన్సీ యనఁగా నింగ్లీషురెసిడెంటు ఉండుస్థలము. ఇది నాగపూరుపట్టణమునకుఁ బశ్చిమమున మూఁడుమైళ్లమీఁద నున్నది. దానికిఁ గొన్ని గజములు తూర్పున సీతాబర్డి[2] గుట్ట కలదు. ఇందు రెండు శిఖరములు కలవు. ఒకటి యెత్తుగను, మఱియొకటి దానికంటెఁ దక్కువ యెత్తుగను, ఈరెండు శిఖరములకును నడిమిభాగము ఈరెంటికంటెను ఎత్తు తక్కువదిగను నుండును. ఈ గుట్ట మొదట నెవ్వరి యధీనమందును లేదు. ‘ఈగుట్టను స్వాధీనము చేసికొని, దానిమీఁద నుండి రెసిడెన్సీకి గుఱిపెట్టవలయు’ నని అప్పాసాహె బాలోచించెను. కాని యీ సంగతి మొదటనే తెలిసికొని యప్పటి రెసిడెంటగు జంకిన్సు గుట్టను స్వాధీనపఱుచుకొనెను. పైగుట్టమీఁద ౧౦౦ భటులును, క్రిందిగుట్టమీఁద ౩౦౦ భటులును ఒక ఫిరంగియు నుంచఁబడెను. రెసిడెన్సీ కాపువలకు గుఱ్ఱపుదళము లుండెను. ఇంగ్లీషువారు గుట్టను పట్టుకొనుట కొంచె మాలస్యమైయున్నయెడల నప్పాసాహెబుసైనికులగు నరబ్బీవా రాగుట్టను స్వాధీనపఱుచుకొని యుందురు. గుట్టకు కొంచెముమారమున వారు యజమానునియాజ్ఞకై యెదురుచూచుచుండిరి.

౨౬-వ తేదీ సాయంకాలము ౬ గంటల కరబ్బీసైనికులు సీతాబర్డిగుట్టను పట్టుకొనవలయు నని దానిమీఁదికి వచ్చిరి. తెల్లవాఱుజామున రెండుగంటలవఱకు నెన్నియోపర్యాయము లరబ్బీవా రింగ్లీషువారిమీఁదికి నొత్తుకొనివచ్చిరి. ౨౭-వ తేదీ యుదయమువఱకును గొండక్రింద ౧౮,౦౦౦ సైన్యమును, ౩౬ ఫిరంగులును వచ్చిచేరెను. గుట్టమీఁదివారు తమరక్షణనిమిత్తము చుట్టును ధాన్యపుబస్తాలు పేర్చి చిన్నయడ్డగోడను నిర్మించుకొనిరి. తొమ్మిదిగంట లగుసరికి నరబ్బీసైనికులు చిన్నగుట్టను స్వాధీనపఱుచుకొని యందున్న ఫిరంగితో పైగుట్టమీఁదికిఁ గాల్పఁజొచ్చిరి. ఇంగ్లీషుసైనికులు పెక్కుమంది హతులైరి. కాని మధ్యాహ్నమువఱకు నాగుట్ట మరల నింగ్లీషువారి యధీనమాయెను. అరబ్బీసైన్యమును ఫిరంగులును గుట్టయొద్దనుండి వెడలిపోయెను.

ఇట్లు పరాభూతుఁ డైన యప్పాసాహెబు తనయాజ్ఞ లేకయే స్వతంత్రించి యరబ్బీవారు పోరాడిరని రెసిడెంటునకు కబురంపెను. వీరికిని వారికిని రాయబారములు జరుగుచుఁ గొంతకాలము గడచెను. డిసెంబరు ౧౬-వ తేదీని అప్పాసాహె బింగ్లీషువారియధీనుఁ డయ్యెను. కాని యాతనిసైనికులుమాత్రము వశు లయినవారు కారు. ఆసైనికులతో నాగనదికిని మక్కార్దరాచెఱువునకును నడుమ నింగ్లీషువారికి యుద్ధము తటస్థమాయెను. అందు మరాటీవారు పరాజితులైరి.

---

1. ఈ శబ్దమునకు మరాటీలో ‘అప్పా’, ‘ఆపా’ అని రెండురూపములును గలవు. ఈ శబ్దము తెలుఁగు కన్నడములలోని ‘అప్ప’ (అయ్య) శబ్దమే కాని వేఱు కాదు.

2. దీనినే యింగ్లీషులో సితాబల్డి (Sitabaldi) అని వ్రాయుదురు.

sampath_Ebooks



కాని అప్పాసాహెబుసేనలో నున్న అరబ్బీసైనికులును, హింధూస్థానీ సైనికులును అప్పాసాహెబు చెప్పినను 'నాగపురపట్టణము నింగ్లీషు వారి యధీనము చేయ' మని డిసెంబరు ౩౦-వ తేదీవఱకు నాపట్టణమును వశమందుంచుకొనిరి. పిదప వారికి ముట్టవలసిన జీతమంతయుఁ దీసికొని యింకను గొంత బహుమతి వడసి, సురక్షితముగఁ దమ శస్త్రాస్త్రములతోఁ బోవుట కధికారమును బొంది వారు నాగపూరు పట్టణమును విడిచి వెళ్లిరి. అచ్చటినుండి హైదరాబాదునవాబు నొద్దకుఁ బోయి యాతనికొలువులోఁ జేరిరి.

ఇచ్చట నప్పాసాహెబును జనేవరి ౯-వ తేదీవఱకును రెసిడెన్సీలో నుంచి యాతనిచే నీక్రిందిప్రకార ముప్పందలలు చేయించుకొని యింటికిఁ బోనిచ్చిరి.—

'నర్మదానదికి నుత్తరమందున్న రాజ్య మంతయు, దక్షిణమందలి కొన్ని ప్రదేశములును వర్హాడ్ (దీనినే యింగ్లీషులో బీరార్ అందురు), గావిల్ గఢము, శిర్ గుజా, జష్పురము అను సంస్థానముల పైఁ దనకుఁ గల హక్కును అప్పాసాహెబు ఇంగ్లీషువారి కీయవలయును. ఇంగ్లీషువారు తననిమిత్తమై యుంచునట్టి 'సబ్ సిడీ' సైన్యమునకును కంటింజెంటుసైన్యమునకునై యీపైని జెప్పిన ప్రాంతములు ప్రతిఫలముగ నీయవలెను. రెసిడెంటుసలహా ననుసరించియు, బ్రిటిష్ గవర్నమెంటువారివమ్మకమునకుఁ బాత్రు లయిన మంత్రుల యనుమతి ననుసరించియు అప్పాసాహెబు రాజ్యము చేయవలయును. ఆతఁడు నాగపురరాజభవనమునం దింగ్లీషుసైనికుల సంరక్షణములో నుండవలయును. పైని చెప్పఁబడిన ప్రాంతము లన్నియు నింగ్లీషువారి యధీనమగువఱకును వారికి 'సబ్ సిడీ'క్రింద రావలసిన మామూలు సైకము ముట్టుచుండవలెను. ఇంగ్లీషువారు తనరాజ్యమందలి యే కోటను కోరినను వెంటనే యది వారి యధీనము చేయవలయును. ఆజ్ఞవిననట్టి పురుషుని నింగ్లీషువారికి వెంటనే పట్టియీయవలయును. సీతాబల్డి రెండు గుట్టలును, బాజార్లును, దానికి సమీపమునందలి భూమి వలయునంతయును బ్రిటిషుగవర్నమెంటువారి కిచ్చివేయవలయును. వారి కావశ్యక మని తోఁచిన పనులు, యుద్ధమున కక్కఱకువచ్చునవి వా రాగుట్టమీఁదఁ జేయుటకు వారికి (ఇంగ్లీషువారికి) స్వాతంత్ర్యము కలదు."[1]

అప్పాసాహె బిట్లు మరల రాజ్యమును పొందియు నింగ్లీషువారిమీఁది వైరమును మానఁడయ్యెను. ఇంగ్లీషువారి కిచ్చెద నన్న ప్రదేశములు వారికి స్వాధీనము గాకుండ యత్నించెను. బాజీరావును దాంగామీఁదికి నెత్తిరమ్మని చెప్పి తానుగూడ నచ్చటికిఁ బోవఁ దలంచెను. అందుచే రెసిడెంటు ఆతనిని పట్టుకొని, తగిన సిబ్బంది నిచ్చి ప్రయాగకోటలో నుంచుటకై పంపెను. కాని త్రోవలో నతఁడు తప్పించుకొని మహాదేవపర్వతములమీఁదికిఁ బోయెను. పెండారీ నాయకుఁ డగు చిత్తూతోఁ గొన్ని దినములు కలసియుండెను. అచ్చట నుండి ఆసిర్ గఢమునకుఁ బోయెను. మరల నచ్చటినుండి పంజాబు దేశమునకుఁ బోయి రణజిత్ సింగునొద్ద నుండి యచ్చటనే మరణము నొందెను.

**అప్పాసాహెబ్ భోసలా (సతారా)** — సతారా రాజులలోఁ జివరవాఁడు. ఇతనికి శహాజీ యన్న పేరు కలదు. అప్పాసాహెబ్ అనునది గౌరవనామము, వ్యవహారనామము. శివాజీ పెద్దకుమారుఁ డైన సంభాజీయొక్క సంతతివారు సతారాలో రాజ్యము చేయుచుండిరి. క్రీ. శ. ౧౮౩౯ లో 'ప్రతాపసింగ్ నారాయణ' యనురాజును సింహాసనభ్రష్టునిఁ జేసి, యాతని మూఁడవ తమ్ముఁడైన అప్పాసాహెబును ఇంగ్లీషువారు రాజ్యముమీఁదఁ గూర్చుండఁబెట్టిరి. ఆతఁడు రాజ్యమునకు వచ్చినతోడనే స్త్రీలు సహగమనము చేయుట ఆఁపివేసెను. రెండులక్షల రూపాయలు వెచ్చించి సతారాకు నీటివసతి నేర్పఱిచెను. రెండు లక్షలు పెట్టి వేణా కృష్ణానగులకు వంతెనలు కట్టించెను. నూతనరాజభవన మొకటి నిర్మించెను. అది యిప్పుడు న్యాయస్థానముగ నుపయోగింపఁబడుచున్నది. ఇతఁ డింగ్లీషువారియెడ మిక్కిలి విశ్వాసముతోఁ బ్రవర్తించెను. ఆతఁడు ౧౮౪౮-వ సంవత్సరము, ఏప్రిల్ నెల ౫-వ తేదీని మృతినొందెను. మరణమునకుఁ బూర్వము బలవంతరావు భోసలా యను కుఱ్ఱవానిని పెంచుకొనెను. వానికి వెంకాజీ యని పేరు పెట్టెను. కాని యింగ్లీషువా రాదత్తతను ఒప్పుకొనక సతారా రాజ్యము తమ యధీనము చేసికొనిరి.

**అప్పాశాస్త్రి** — ఒకకవి. లవలీపరిణయము, సారస్వతాదర్శము అను రెండునాటకములను రచించెను. ఈనాటకములే కాక యితఁడు రచించినవి 'అప్పాశాస్త్రివాదార్థః', 'చిల్లరవాదాః' అను మఱిరెండు గ్రంథములుకూడ నున్నట్లు తెలియుచున్నది.

**అప్పికట్ల** — ౧. గుంటూరుజిల్లా, బాపట్లతాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౧,౬౩౨ (౧౯౩౧).

౨. కృష్ణజిల్లా, గుడివాడతాలూకాయందలి జమీన్ దారీగ్రామము. జనసంఖ్య ౭౯౬ (౧౯౩౧).

**అప్పికొండ** — విశాఖపట్టణముజిల్లా, విశాఖపట్టణము తాలూకాయందలి జమీన్ దారీగ్రామము. జనసంఖ్య ౯౬౬ (౧౯౩౧).

**అప్పిలేపల్లి** — అనంతపురముజిల్లా, కల్యాణదుర్గము తాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౨,౧౨౦ (౧౯౩౧).

**అప్పకొండయ్యఖండ్రిక** — చిత్తూరుజిల్లా, తిరుత్తనితాలూకాయందలి జమీన్ దారీగ్రామము. జనసంఖ్య ౫౬.

1. Atchinson's Treaties, Vol. ii. pp. 109-110.

**అప్పేచెర్ల** — అనంతపురముజిల్లా, గుత్తితాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౨,౧౮౮ (౧౯౩౧).

**అప్రతిరథుడు** — ౧. ఋగ్వేదమునందలి యొక సూక్తమును (౧౦. ౧౦౩) రచించిన ఋషి (ఐతరేయబ్రాహ్మణము, ౮. ౧౦).

౨. (సూ. వం.) ఇక్ష్వాకువంశోత్పన్నుఁడైన కువలయాశ్వరాజునకు నామాంతరము (భా., నవ, అ. ౨౧౯).

౩. (చం. వం.) యయాతి పుత్రుఁడైన పురురాజు వంశజుఁడు. ఇతను అంతిభారుని ముగ్గురుపుత్రులలోఁ జిన్నవాఁడు. పుత్త్రుఁడు కణ్వుఁడు.

**అప్సరసలు** — స్వర్గమందలి భోగస్త్రీలు. నాట్యకర్మము వీరివృత్తి. అగ్నిపురాణమందు వీరు ముఖ్యముగఁ బండ్రెండుగురని చెప్పఁబడినది; ఊర్వశి, మేనక, రంభ, మిత్రకేశి, అలంబుస, విశ్వాచి, ఘృతాచి, పంచచూడ, తిలోత్తమ, భానుమతి, అబల, రమ్య (గణభేదాధ్యాయము). మహాభారతమునందు వేఱుజాబితా యీయఁబడినది: అలంబుస, మిత్రకేశి, విద్యుత్పర్ణ, తిలోత్తమ, అరుణ, రక్షిత, రంభ, మనోరమ, కేశిని, సుబాహు, సురత, సురస, సుప్రియ, అతిబాహు (మహాభా., ఆది). వీరందఱును దేవదానవుల వలెనే కశ్యపప్రజాపతిసంతతివారనియుఁ జెప్పఁబడినది. అప్సరసలు పదునాలుగుకులములవారనియు, అందొకటి బ్రహ్మదేవునిమనస్సుననుండియు, రెండవది వేదములనుండియు, మూఁడవది అగ్నినుండియు, నాల్గవది గాలినుండియు, అయిదవది అమృతముననుండియు, ఆఱవది జలముననుండియు, ఏడవది సూర్యకిరణములనుండియు, ఎనిమిదవది చంద్రకిరణములనుండియు, తొమ్మిదవది మేఘమునుండియు, పదవది మెఱుపుననుండియు, పదునొకండవది మృత్యువునుండియు, పండ్రెండవది మన్మథునినుండియు, పదుమూఁడవ పదునాలుగవ కులములు దక్షప్రజాపతి కూఁతు లయిన ముని, అరిష్ట యనువారికి గంధర్వులవలన నుండియు పుట్టెను అని కాదంబరిలోఁ జెప్పఁబడియున్నది (వాచస్పత్యము).

**అప్సరోయుగము** — భారతవర్షీయ తీర్థము.

**అఫ్గాన్‌తుర్కిస్తానము** — ఇది అఫ్గానిస్తానపు అమీరు నధీనమునందు నున్న తుర్కిస్తానములోని భాగము. అఫ్గాన్ తుర్కిస్తాన మన్న పేరు ఇంగ్లీషువారు వాడునదే కాని యాదేశమునందు వాడుకలో లేదు. ఆదేశమువారు తమదేశమును తుర్కిస్తానమే అనియెదరు. ఇది అఫ్గానిస్తానమునకు మిక్కిలి ఉత్తరమునను మధ్య ఆసియా కంటుకొనియు నున్నది. దీని కుత్తరమున రష్యారాజ్యము గలదు. పూర్వము బదక్షాన్, వాఖాన్, కటఘాన్ అనునవి యిందులోనివిగానే యుండెను. కాని యిటీవల నా మూఁటిని ప్రత్యేకముగా విడఁదీసి ఒకపరగణా నిర్మింపఁబడినది. ఇందలి కొంత భాగము పర్వతమయముగను, మిగిలినది మైదానములు కలదిగను నున్నది. దీనివిస్తీర్ణము ౫౪,౦౦౦ చేలచదరపుమైళ్లు. జనసంఖ్య ౭,౫౦,౦౦౦. ఇందలి 'బాల్క్' అను ప్రదేశమును పూర్వము బాక్ట్రియానా యని యనుచుండిరి. జరత్కృష్ణుఁడు (Zoroaster) తన మతమును మొదట నచ్చటనే బోధించె నని చెప్పుదురు. ఈ బాక్ట్రియానా మిక్కిలి పురాతనకాలమందు 'అకిమినియన్' సామ్రాజ్యములో (Achaemenian Empire) నిమిడియుండెను. క్రీ.పూ. ౨౫౦లో డియోడోటస్ అనువాఁడు, అచ్చట 'సెల్యూకస్' డే రాజునకు ప్రతినిధిగా నుండి స్వతంత్రుఁ డయ్యెను. ఇతఁడు గ్రీకో-బాక్ట్రియన్ వంశమునకు మూలపురుషుఁ డని చెప్పవచ్చును. తరువాత క్రీ. పూ. ౧౨౮ ప్రాంతమున పార్థియనులు, శ్వేతహూణులు, కుషాణులు మొదలయినవారిచే నీవంశ మంతరించెను. తరువాత బౌద్ధయుగము వచ్చెను. ఇచ్చట బౌద్ధమతప్రచారము విశేషముగా నుండినట్లు ఇప్పటికిని గనుపడువిగ్రహాదులవలన స్పష్టపడుచున్నది. అప్పు డుండిన నవవిహార మనుపేరుగలది ఇప్పటికిని అచ్చట నొకటి గలదు.

ఛంగీస్‌ఖానునిదాడికి లోఁబడి పాడై యీప్రదేశము మిక్కిలి దీనావస్థం జెందెను. ఇది కొంతకాలము ఢిల్లీశ్వరులయధీనమం దుండి తరువాత యుజ్‌బేగ్ వంశీయులచే నాక్రమింపఁబడియెను. ౧౮-వ శతాబ్దియం దిది అహ్మద్‌ఖాను రాజ్యములోఁ జేరియుండెను. తరువాత నాతనికుమారుఁడైన తైమూరుకాలమున విడిపోయెను. ౧౯-వ శతాబ్ది ప్రారంభమున నిది బొఖారా రాజ్యమునకుఁ జేరియుండెను. దోస్తు మహమ్మద్ కాలమున అఫ్గానులు ౧౮౫౦ లో బాల్క్ తస్కురన్ అను ప్రాంతములను, ౧౮౫౫ లో, అక్చా మొదలయిన అయిదు పశ్చిమ ప్రాంతములను, ౧౮౫౯ లో కుండుస్ ప్రాంతములను స్వాధీనపఱుచుకొనిరి. ఇందులోఁ గొంతభాగమునుగుఱించి తగాదా లుండెను. కాని ౧౮౭౩-లో ఇంగ్లీషువారును, రష్యావారును గలసి ఒక పంచాయతీ చేర్పఱచిరి. ఆ పంచాయితీదారు లాప్రాంతములను అఫ్గానుల కొసంగిరి. అబ్దుర్‌రహిమాన్‌ఖాను కాలమున నీప్రాంత మఫ్గాన్‌వారికి పూర్తిగ లోఁబడెను.

**అఫ్గానిస్తానము** — భూమండలముయొక్క పూర్వార్ధగోళమందలి యాసియాఖండదేశములలో నొకటి. ఇది హిందూదేశమునకు వాయవ్యదిశయం దున్నది. బెలూచిస్తానము, కాఫిర్‌స్థానములనుగూడఁ గలిపినచో మొత్త మీ దేశముయొక్క వైశాల్యము ౨,౭౦,౦౦౦ చదరపుమైళ్లు. ఇందలిజనసంఖ్య ఎనుబదిలక్షలు.

సరిహద్దులు - భౌతికలక్షణములు :— ఈదేశమున కుత్తరమున రషియన్‌తుర్కిస్తానమును, తూర్పున కాశ్మీరము, పెషావరు ఇలాకాలును, దక్షిణమున బలూచిస్తానమును, పడమట పర్షియాదేశమును గలవు. ఈదేశ మీశాన్యకోణముననుండి నైరృతిదిశకు అండాకృతిని




రమారమి ౬౦౦ మైళ్లు వ్యాపించియున్నది. వాయవ్యపుదిక్కునుండి ఆగ్నేయమునకు దీనివెడల్పు సుమారు ౩౫౦ మైళ్లు.

క్రీ. శ. ౧౮౭-౭౧-వ సంవత్సరమున జరగిన అఫ్గాని - బ్రిటిష్ సంధి ననుసరించి ప్రస్తుత మీదేశపుసీమారేఖ పరిగణింపఁబడుచున్నది. తదనుసారముగ దీని యుత్తరసీమారేఖ పడమట జుల్‌ఫకీర్ నామకపట్టణమునుండి యారంభమై పూర్వాభిముఖముగ పరోపమిసస్ పర్వతమాలికలకు సమానాంతరముగ కుష్కానదివఱకును బోయి దానిని దాఁటినపిదప పూర్వోత్తరాభిముఖమై మరుచక్ అను పేరుగల అఫ్గాన్‌దుర్గసమీపమున ముర్ఘబ్ నది నుత్తరించి చూల్ ప్రాంతపు కొండలనుండ అతేలీ - టర్కోమన్ ఎడారిమధ్యముగా ఆక్సస్ నదిని చేరును. ఇచటనుండి పామీరుపీఠభూములయందలి విక్టోరియాసరస్సు పర్యంతము ఆక్సస్‌నదియే యీదేశము నుత్తరసీమారేఖ. అనంతర మీరేఖ మఱికొంతదూర ముత్తరముగాఁ బోయి చీనా సామ్రాజ్యపు సరిహద్దును దాఁటి యచటనుండి నైరృతిముఖమై కాశ్మీరమునకుఁ బ్రక్కగ హిందూకుశపర్వతములమీఁదుగ కాఫిర్‌స్థానమునఁ బ్రవేశించును. అచటి దురా కనుమనుండ, చిత్రాల్ నది వెంటవెంట వచ్చి కునార్ నదికిని కైబరుకనుమకును బశ్చిమముగ వజీరుస్థానముగుండ దక్షిణాభిముఖమై దోమండీ యనుచోట నీ రేఖ గోమల్‌నదిని దాఁటును. ఇచటనుండి యిది పరిషియాసరిహద్దువఱకును బలూచిస్తానపు - ఎల్లగాఁ బరఁగును. గోమల్‌నదిని దాఁటిన తరువాత నిది నైరృతి దిక్కుగ

sampath_Ebooks

కోజాక్ పర్వతములగుండ చమను నగరముమీఁదుగ మష్కిప్రాంతము నుండి హెల్మండ్ ఎడారిని దాఁటి సైస్థానమునకు దక్షిణమునఁ బర్షియాదేశపు సరిహద్దుతోఁ గలయును. అచటనుండి ఇది ఉత్తరాభిముఖమై పర్షియారాజ్యపు తూరుపు టెల్లగ హారిరూడ్ అను నదివఱకు నవ్యవస్థితమార్గమునఁ బోవును. అక్కడనుండి జుల్ ఫకీర్ వఱకును హారిరూడ్ నదియే అఫ్ గాని-పర్షియన్ సీమారేఖ.

పర్వతములు, నదులు : — ఈదేశ మంతయు నొక విశాలపీఠభూమి. పర్వతమయము. సముద్రపు నీటిమట్టమునకంటె నిది ౨,౦౦౦ లు మొదలు ౪,౦౦౦ల యడుగుల ఎత్తువఱకును గలదు. ఏడువేల యడుగుల ఉన్నతప్రదేశములును గలవు; అనఁగా బందరు, కాకినాడ మున్నగు రేవుపట్టణములం దుండువారికంటె నొక మైలు ఎత్తుగలప్రదేశములందు నిచటిజను లుందురు. ఇచటి పర్వతశిఖరములు ౨౪,౦౦౦ ల యడుగులయెత్తువఱకు నున్నవి. హిందూకుశపర్వతములును, వాని శాఖోపశాఖలును దేశమం దంతటను వ్యాపించియున్నవి. ఈ పర్వతశాఖ లన్నియు హిమాలయోన్నతభూముల వాయవ్యభాగములే కావచ్చును. ఈశాఖ లన్నియు దక్షిణ, వాయవ్యాభిముఖములుగ తాలవృంతాకృతిని బ్రసరించి క్రమముగఁ దగ్గిపోవుచు తుదకు పర్షియాసరిహద్దులం దున్న ఎడారులందును, హామూనులందును లోపించి పోవును. ఈ దేశపు నైరృతికోణమున అఫ్ గాని - పర్షియన్ సరిహద్దులదగ్గఱ సముద్రతటమునకు ౧,౬౦౦ అడుగుల యెత్తున విశాలమగు పల్లపుప్రదేశము కలదు. సముద్రగాములు కానినదు లన్నియు నీ పల్లమునకే చేరుచుండును. ఇట్టిపల్లములే హామూను లని పిలువఁబడుచున్నవి. కోహిబాబాకొండలు హిందూకుశములకు పశ్చిమముగ వ్యాపించి యక్ వలంగ్ అనుచోట మూఁడుపాయలుగఁ జీలిపోయినవి. వీనికిఁ బడమట హారిరూడ్ నదికి దక్షిణముగ సఫేద్ కోహాకొండలును, వాని కుత్తరమున బండిబాబాకొండలును, వాని కించుక ఈశాన్యముగ బంద్-ఇ-తుర్కిస్తాన్ కొండలును గలవు. పామీరు పీఠభూమియందలి కొంతభాగ మీదేశమునకుఁ జెందినది కలదు. జలాలాబాదున కాగ్నేయముగ నున్నకొండలును సఫేద్ కోహ లనియే పిలువఁబడుచున్నవి. ఇతిహాసప్రసిద్ధ మగు కైబర్ కనుమ ఈ కొండలలోనిదే.

దేశమందలి ఈ నానాపర్వతశ్రేణులవలన నేర్పడిన లోయ లన్నియు నదులు, వాఁగులుగఁ బరిణమించియున్నవి. కాని వాని యన్నింటిలో ముఖ్యమైనవి నాలుగైదుమాత్రమే. పామీరు పీఠభూమిలోఁ బుట్టిన ఆక్సస్ నదియు, దాని యుపనదులును ఈదేశపు ఉత్తరభాగమును జాలవఱకుఁ దడుపుచున్నవి. ముర్ఘబ్, హారిరూడ్ నదులు కొంతదూరము ప్రవహించి యిసుకలో మాయమైపోవును. కాని నిజమున కివి ఆక్సస్ యొక్క ఉపనదులే. గడ్డమంచుచే నిండుకొనియుండు పర్వతకందరములనుండియు, హిమానీనదముల( Glaciers )నుండియు, కరఁగిన మంచునీరు ఆక్సస్ నదిని జేరుచుండును. ఇది బొఖారాదేశముగుండఁ బ్రవహించి ఏరల్ సముద్రమునఁగలయును. హెల్మండ్ నదియు, దానియుపనదులును,. దానిశాఖలును నైరృతిభాగమున వ్యాపించియున్నవి. కాబూలునది అదేపేరు గల రాజధానీపట్టణమునకుఁ బశ్చిమముగ ౪౦ మైళ్లదూరమునఁ బుట్టి తూర్పుగఁ బ్రవహించుచు పోయి అటక్-కైరాబాదులదగ్గఱ సింధునదములోఁ గలయును. వేదప్రసిద్ధ మగు కూభానది ఇదియే. గోమల్ నదియు, దాని యుపనదులును ఈదేశపు ఆగ్నేయభాగమును నీటిపసతి కలదానినిగఁ జేయును. ఇదియు సింధునదముయొక్క ఉపనదియే.

తటాకములు :— ప్రాకృతికసరోవరము లీదేశమునఁ జాలఁ గలవు. కాని ముఖ్యమైనవి రెండుమూఁడే. గజినీనగరమున కిఱువది మైళ్లదూరమున అబ్-ఇ-ఇస్తాదానామక సరస్సు కలదు. దీని పొడవు ౧౭ మైళ్లు, వెడల్పు ౧౫ మైళ్లు, కాని లోఁతు ౧౨ అడుగులకు మించి లేదు. గజినీపట్టణమునకు దగ్గఱగనే ఒక సరోవరము కలదు. దీనిపేరు అన్వార్ సరస్సు. మూఁడవది మీఁద వచించిన విక్టోరియా సరస్సు. అచటివారు దీని నేమందురో తెలియదు. కాని, ఆంగ్లేయులు దీని కీ పేరు పెట్టిరి. ఇది సముద్రతటమునకు ౧౩,౭౦౦ ల యడుగుల యెత్తున నున్నది. దీని పొడువు పదిమైళ్లు, వెడల్పు మైలున్నరమాత్రమే

పురాతత్త్వము :— కాబూల్ నది ప్రవహించు లోయ లన్నియు బౌద్ధకాలమునాఁటి వస్తుజాలముల కునికిపట్లు. కాబూలున కుత్తరముగ నున్న బామియానామకనగరమున రాతివిగ్రహము లనేకములు గలవు. ఉత్తరమందలి తాష్కూర్ఘన్ పట్టణమునుండి కాబూలునకు వచ్చు మార్గమున నున్న హైబక్ అను నగరమునందుఁ బురాతన బౌద్ధావశేషము లనేకములు గన్పట్టుచున్నవి. కోహిడామన్ అనుప్రదేశమందు వినష్టప్రాచీనస్థానములను సూచించు మంటిదిబ్బ లపరిమితముగఁ గలవు. వీనిలో బైగ్రాం అనునది యొక పెద్ద తిన్నె. ఈదిబ్బలను ద్రవ్వించుటవలన ఆకాలపు నాణెము లమితముగ దొరకుచున్నవి. జలాలాబాదు సమీపమందును, కాబూలుదగ్గఱను, చుట్టుప్రక్కల నున్నకొండలమీఁదను స్తూపములు గన్పించుచున్నవి. టర్నాక్ నది ప్రవహించులోయయందు మట్టిలో కూరుకొనిపోయిన నగరచిహ్నములు గానవచ్చుచున్నవి. ఇదేచోట ప్రాచీనకాలపు అరోక్కసియా యుండియుండవచ్చు నని పురాతత్త్వవిదు లనుమానించియున్నారు. హెల్మండ్ నదీతీరమందలి గిరిష్కనగరమునఁ బూర్వకాలపుభవనముల గుర్తులు కలవు. ఇవన్నియుఁ బురాతనపు దాంగ్రియానాకుఁ జెందినవని యూహించిరి. కంధహారము(గాంధారము)నందలి యొకమసీదులో పాషాణభిక్షాపాత్ర మొకటి కలదు. ౫-వ శతాబ్దియందు పెషావరులో నుండిన శాక్యమునియొక్క భిక్షాపాత్ర మిదియే యని నిశ్చయింపఁబడెను. ఇట్లు గ్రీకు - బాక్ట్రియాపరిపాలనావశేషములు, బౌద్ధుల ప్రాచీనకాలపువసతులుమాత్రమే కాదు-లెక్కకు మిగిలియున్నవి. ఈ రెండు యుగములకును బూర్వ మిచట హిందువు లుండి రని యూహించుటకుఁ దగిన చిహ్నములు, మఠములు లోనగునవిగూడ నీదేశమునఁ గలవు. లండీకోటల్ సమీపమందున్న పర్వతపులోయలలో భగ్నావశిష్టము లైన మహాదుర్గములు కలవు. ఇవి యేకాలము

sampath_Ebooks

నాఁటివో తెలియదు. ప్రస్తుత మివియన్నియు కాఫిర్ కోటలని పిలువఁబడుచున్నవి. కాని మహమ్మదీయయుగమునాఁటి కట్టడము లంతగాఁ గానరావు. గజనీ మిక్కిలి పురాతననగరము. అనేక సంవత్సరముల పర్యంత మిది మహమ్మదునకును, నతని సంతతివారికిని రాజధానిగ నుండెను. కాని ఇచటఁ జెప్పఁదగిన కట్టడ మేదియు లేదు. ప్రాచీనకాలపు నాణెములు దేశమం దన్నిదిక్కులఁ గలవు. వీనిని త్రవ్వి తీయుటకధికారమును ఫ్రెంచివారియొక్కటి పడసియున్నారు.

ఖనిజములు:—ఖనిజసంపదయందుఁ జెప్పఁదగిన దేశములలో నిదియు నొకటియని చెప్పవచ్చును. కంధహారమునకు మూఁడుమైళ్లదూరమునను, నాగాఫ్ నకు త్తరముగనున్న కొండలయందును, ఇస్తలిఫ్ నందును, బాడమక్ ప్రక్కనేవాఁగులందును బంగారము కలదు. హజారాజత్, పంజషీర్ లోయలందు వెండిగనులున్నవి. కుర్రం, గోమల్ నామకనదుల మధ్యనున్న పెష్మాలీ ఇలాకాయందును, జబల్-అస్-సిరాజ్, పంజషీర్, హిందూకుశములందును ఇనుము దొరకును. బామియానుకుఁ బోవు కనుమలన్నియు లోహమయములే. మఱియు నిదేప్రాంతమున కొన్ని మైళ్ళపొడవున ముడి ఇనుము గలకొండల పంక్తి యొకటి వ్యాపించి యున్నది. కుర్ద్-కాబూల్ సమీపమునను, కరక్కాచా పర్వతములందును, సైఘన్ కమర్డ్ లమధ్య నున్న సురఖబ్ లోయలందును, ఆ నదియొక్క ఎడమవైపున నున్న ఇష్పిష్టాయందును, కుందుజ్ నకు ౫౦ మైళ్లుదక్షిణమున నరీన్ నందును, అఫ్గాన్ తుర్కిస్థానమందలి కరాకోహ పర్వతములకుత్తరముగ నున్న ఫహిల్ నందును, దానికిఁ బడమరగ నున్న షివలంగ్ నందును, ఘోర్బంద్ లోయలందును రాతిబొగ్గు కావలసినంత దొరకును. కాబూలునగరమునకు ౫ మైళ్లు దక్షిణముగను, ౨౪ మైళ్లు నైరృతిదిశ నున్న ఖనేఖోనాయనందును తామ్రపుగనులు కలవు. ఇవి కాక దేశమం దింకను పలుతావుల రాగి లభించును. దానివిషయమై ఇంకను గట్టి ప్రయత్నములు కాని సలుపఁబడుటలేదు. కుర్రంజిల్లా ఉత్తరబంగాష్ నందును, షిన్వారీలదేశమందును, సఫేద్ కోహ పర్వతములందును, కకరదేశమునందును, హజారాజాత్, ఫరింజాల్, ఘోర్బంద్ కనుమలలోని లోలింజ్ మున్నగు స్థానములందును సీసము విస్తారముగఁ గలదు. హీరాత్ నందలి సీసపుగనులు త్రవ్వఁబడుటయే లేదు. కాబూలునగరమునకు ౩౨ మైళ్లు, వాయవ్యముగ నున్న అర్ఘండబ్ ప్రాంతమున అంజనమిశ్రితమైన సీసపుగనులు కలవు. కాని, ప్రస్తుత ముపయోగింపఁబడు సీస మంతయు హజారాజాత్ నుండి కొనిరాఁబడుచున్నది. అచట నిది భూమిని త్రవ్వవలసిన యవసరము లేకయే లభించును. ఫరింజాలునందలి గని అతి ప్రాచీనకాలమునుండియుఁ బనిచేయఁబడుచున్నది. కంధహారమునకు ౩౦ మైళ్ల దూరమున షాహమక్సూద్ నామక పర్వతశ్రేణియందు అంజనము లభించును. బడక్షానమునందును, ఫైజాబాద్, జలాలాబాద్ మార్గమధ్యమున ఫిర్ గామ్ ప్రదేశమునకు దక్షిణమునను కెంపులు దొరకును. కంధహారము, హీరాత్, అఫ్గాన్ తుర్కిస్థానములందును, కామ్రన్ లోని దస్త్-ఇ-నఫేద్ సమీపమునందును నొకవిధమగు సుద్దసున్నపురాయి దొరకును. గంధకపుగనులు హీరాత్ ప్రాంతమున నున్నవి. కాని ప్రస్తుత ముపయోగమునిమిత్త మీపదార్థము హజారాజత్ దేశమునుండియు, సైస్థానములోని ఫర్రా ప్రీనామక ప్రదేశమునుండియుఁ గొనిరాఁబడుచున్నది. సూరేకార మెక్కుడఁబట్టిన నక్కుడ దొరకును. దేశమం దన్నిదిక్కులను పాలరాయి కలదు. కటఘునమునందును, కుందుజ్ సమీపమునను రాతియుప్పు లభించును. అఫ్గాని తుర్కిస్థానమంతయుఁ బలకరాతిమయము. కెంపులు మున్నగు విలువగలరాలు ఉత్తరమార్గమున రష్యాకుఁ బోవుచుండును.

కాలమానము:— ఈదేశపుమైదానములందు వేసవికాలమునందెండ లతితీవ్రముగను, శీతకాలమునందుఁ జలి యపరిమితముగను నుండును. కాబూల్, గజనీప్రాంతములందు శీతకాలమున మూఁడు నెలలపర్యంతము మంచు కురియుచుండును. ఆసమయములం దెవరికిని బాజారులలోఁ దిరుగుటకు వీలుండదు. కావునఁబట్టి జనులు నిప్పులతో నింపిన కుంపట్లను దగ్గఱఁ బెట్టుకొని దినములు గడుపుచుందురు.

చలికాలమున కంతకును సరిపోవు ఆహారసామగ్రులు ముందుగనే సేకరింపఁబడియుండును. కావున వీరికి తఱచుగ వెలుపలికిఁ బోవలసినయవసర ముండదు. ఇంటికప్పులు, బాజారులు, బయళ్లు, వీథులు, పొలములు మొదలగున వన్నియు స్వచ్ఛస్ఫటికమువంటి హిమముతో నిండి సూర్యకాంతులవలనఁ దళతళ లీనుచుఁ గనుల కానందమునఁగూర్చుచుండును. వృక్షము లన్నియు నీ హిమపాతము మూలమునఁ బర్ణవిహీనములై యెండిపోయినవానివలెఁ గన్పించును. అగ్నిస్పర్శము లేక యొక్కొక్కసమయమున చేతివ్రేళ్లుసైత మాడవు. ఆ సమయమున తాపమాపకము ( Thermometer ) నందలి పాదరసము సున్నకుఁ 'గ్రింద ౧౫ ' అంశములు దిగియుండును. గజనీనగర మనేకపర్యాయములు మంచు తుపానులచే ధ్వంసమైపోయినట్లు గాథలు కలవు. ఇఁక నెండకాలమున నెండలును పెద్దలఁ దలపించుచుండును. అందును కంధహార ప్రాంతమునందలి వేఁడిమి భరింప నలవి కానిది. సుడిగాడ్పులు, గాలిదుమారములు విజృంభించి మట్టమధ్యాహ్నమునసైనఁ జీఁకట్లు క్రమ్మునట్లు చేయును. కంధహారు-ఇలాకాయందుఁ జలికాలమున మంచు మిక్కుటముగ పడదు. హీరాత్ ప్రాంతములందును ఒకవిధమగు గాలి వీచుచుండుటచేత వేసవిని ఎండ లంతయెక్కువగ నుండవు; చలికాలమున మంచును ఎక్కువ పడదు. ఈదేశమందలి వాతావరణము శుష్కము. ఆంధ్రదేశమున నెండకాలమునఁ దొలకరివానలు గురియునట్లు ఈదేశమునఁ గురియవు. మేఘాక్రాంతము గాని నిర్మలాకాశము, ప్రకాశవంత మగు సూర్యకాంతి, స్వచ్ఛచంద్రికాపూర్ణము లైన నిశాసమయములు ఈ దేశమున ఆనంద మొనగూర్చుచుండును. కాబూలునందు సగటున సంవత్సరమునకు ౧౧ అంగుళములవాన కురియును. మొత్తమునీఁద సంవత్సరమునందు ౯ నెలలు బాగుగ నెండ కాయుచుండును.

జనులు - జాతులు, మతములు - భాషలు:— ఈ దేశమందలి జనులలో ననేకజాతులు కలవు. వానిలో అఫ్గన్ జాతి ప్రధాన

sampath_Ebooks


మైనది. ఈజాతివలననే దేశమునకు అఫ్‌గానిస్తాన మను పేరు కలిగినది. అబ్దాలీలు లేక దురానీలు, గిల్జాయీలు, పఠానులు నను మూఁడు జాతులవారును అఫ్‌గాను లనియే పిలువఁబడుచుందురు. లోడీలు, సులేమాన్‌ఖేలులు, కైగోతీలు, నాజిరులు, పోవిందా తెగలు, గండాపూరులు, బబరులు, పౌవ్వనులు మొదలగువా రందఱును గిల్జాయీలకుఁ జెందినవారు. రుహ్ అనఁగా పర్వతము. కావున పర్వతములందు నివసించువారు రోహిలా లనఁబడిరి. మోహమందులు, వజీరులు, షిన్వారీలు లోనగు తెగలవా రందఱును రోహిలాలే యగుదురు. మొత్తమున వీ రందఱును పఠాను లనియు పిలువఁబడుచుందురు. మీఁద వచించిన అఫ్‌గాన్‌జాతులు గాక వారితో సంబంధము లేనివి మఱియు ననేకజాతులు కలవు. హజారాలు, ఛర్ ఐమకులు, యూజ్‌బేగులు, తాజికులు, కాఫిరులు, ఖూగియానులు, మాలికులు, [illegible]క్కలు, మంగోలులు, జార్దనులు, అంక్షేవీలు, తర్కాలు, బటకులు అను పేరుల పెక్కు తెగలు కలవు. వీరును విదేశీయులచే అఫ్‌గాను లనియే వ్యవహరింపఁబడుచుందురు. కాని పష్తో యను భాషను మాటాడు పష్తోయూ ప్రాంతపు అఫ్‌గానులకును, హిందూస్థానపు సరిహద్దుల సమీపమున నుండు పఠాన్ - అఫ్‌గానులకును చాల భేదము కలదు. దురానీలు తాము బెనీ ఇస్రాయేల్ సంతతివారమని చెప్పికొందురు. కాని పష్టుభాషను మాటాడు పఖ్తూన్ (పఠాన్)ల నుండి వీరు తమ్ము వేఱుగ భావించుకొనరు. ఈ పలు తెగలవారి నందఱు నేకీభవింపఁజేయునది భాషయే. వీ రందఱును పఖ్తూన్‌వలీ యను గ్రంథమును ప్రమాణముగ గ్రహింతురు. ఇది హీబ్రూ ధర్మగ్రంథమును బోలియుండును. అది యటు లుండ పఖ్తూన్‌వలీగ్రంథము మహమ్మదీయ నీతినియమానుసారము పరిష్కృతమయ్యె, నిందు వివరింపఁబడిన యాచార, వ్యవహారాదులు రాజపుత్రుల రీతులం బోలియున్నవి.

మొత్తమున అఫ్‌గానుల నందఱను దేశసంచారు (Nomads) లనియు, స్థిరవాసు లనియు రెండువిధములుగ విభాగింపవచ్చును. సంచారులు పశుపరివారముల వెంటఁబెట్టుకొని ఎల్లప్పుడును దేశాటనము సలుపుచు జీవయాత్ర గడపుచుందురు. సంచారవ్యాపారమునకుఁ బ్రసిద్ధికెక్కినవారు గిల్జాయీలు. ఒక్కొక్కతఱి వీరు ఆస్ట్రేలియాఖండమునకు సైతముఁ బోయి ఒంటెలవ్యాపారము చేయుచుందురు. స్థిరవాసులు (Settlers) పల్లెలఁ బట్టణములందు వసించి కృష్యాదివృత్తులద్వారా జీవించుచుందురు. తాజికులు పర్షియాదేశీయులు. వీరీ దేశమున తొమ్మిదిలక్షలవఱకును గలరు. కృషి వీరి ప్రధానవృత్తి. సేనయందును వీ రెక్కువగఁ గలరు. హజారాలు మొగల్ వంశీకులు. ఛర్ అయిమకులు హీరాత్ పరిసరములందు నివసించుచుందురు. వీరు లక్షయేనుబదివేలవఱకుఁ గలరు. యూజ్‌బేగులు సుమారు మూఁడులక్షలవఱకుఁ గలరు. సాధారణముగ వీరు ఉత్తరమందలి అఫ్‌గాన్‌తుర్కిస్తానమున వసించుచుందురు. నాదిర్‌షాహ కాలమున నీ దేశమున కేతెంచి యతనిమరణానంతర మిచటనే నిలిచిపోయినవారేఁబదివేలవఱకుఁ గలరు. వీరు కిజిల్‌బాషు లను పేరఁ బరఁగుచుందురు. వైద్యక, లేఖక, వర్తకవృత్తుల నవలంబించి వీరు జీవనము సేయుచుందురు. ౩,౫౦౦ ల హిందువులును ఈదేశమునఁ గలరు. ఇతరుల కెవరికి నియ్యనవసరము లేని తలపన్ను హిందువులనుండి వసూలు చేయఁబడుచుండును. హిందువులు పరతంత్రు లగుటయే దీనికి హేతువు. కాఫిరస్థానమందలి జను లందఱు నిటీవలనే ముసల్మాన్ మతమును గైకొని రని తెలియుచున్నది.

అఫ్‌గానులు మంచి బలముకలవారు. శరీరము పుష్టమై యుక్కువలె దృఢముగ నుండును. హిందూదేశమున వీరిం బోలినవారు ఒక్క పంజాబువాసులే. తెలుఁగుదేశమునందలి మువ్వురతో నొక్క పఠాను సరి కాఁగలఁడు. అకృతియందును వీరు మంచి సుందరులు. దేహవర్ణము మెఱుపు పసుపు గలసిన ట్లుండును. వర్ణవిషయమున వీరికి సరివచ్చువారు కాశ్మీరవాసులు. కపాలపరిమాణమందు పఠానులకును దక్షిణ అఫ్‌గానులకును భేదము కలదు. అఫ్‌గానుల కపాలపరిమాణము రాజపుత్రులవానిం బోలియుండును. స్త్రీలును సకలవిధములఁ బురుషులకుఁ దగినవారు; సౌందర్యవతులు.

ఈ దేశవాసు లందఱును మహమ్మదీయులు. క్రీ. శ. ౭-వ శతాబ్దియందు వీరు ముసల్మాన్ దీక్షను గ్రహించిరి. వీరిలో సున్నీ తెగకుఁ జెందినవా రెక్కువ. హజారా లోనగు కొన్ని తెగలవారు షియాసంప్రదాయులు. ముల్లాలు వీ రందఱకును ధర్మగురువులు. కంధహారపు ఇలాకాయందు ధర్మాంధు లను దురానీ - అఫ్‌గానులు కొందఱు కలరు. వీరికి ఘాజీ లని పేరు; అనఁగా వీరు ముసల్మాన్ మతమును దప్ప తక్కిన ధర్మముల నన్నింటిని ధ్వంసముగావింపఁ బ్రతినపట్టినవారు.

ఈదేశపుభాష పష్టు. అఫ్‌గానులు కానివా రందఱును పారసీ భాషను మాటాడుదురు. మహమ్మదీయుల కీ భాషయెడల నభిమాన మెక్కువ. అందువలన దేశభాష కాకపోయినను దీని కెక్కువ ప్రచారము కలదు. రాజకీయవ్యవహారము లన్నియు నీభాషయందే జరగుచుండును. హిందూకుశపర్వతముల కెగువను తుర్కీభాష వాడుకయం దున్నది. బదఖ్షానమునందు పారసీభేద మను వేఱొకభాషను వాడుచుందురు. వాఙ్మయ మెక్కువ పారసీభాషయందు కలదు. ధార్మిక, వైద్యక, నైతిక గ్రంథము లనేకము లిందుఁ గానవచ్చుచున్నవి. యూసఫ్‌జాయీల నాయకుఁ డను షేక్‌మాలీ యను నతఁడు తాను గావించిన స్వాత్ దేశవిజయమును గ్రంథరూపముగా లిఖించెను. ఇది ఇచటి వాఙ్మయమున మిక్కిలి ప్రాచీన గ్రంథము. క్రీ. శ. ౧౪౯౪-వ సంవత్సరమున కాజూఖాన్ అనునతఁడు పష్టుభాషయందు వేఱొక దేశవిజయమును గ్రంథరూపమున లిఖించెను. బయజిద్ అన్సరీ యనునతనిచే, అక్బరు రాజ్యము సేయు కాలమునఁ గొన్ని గ్రంథములు లిఖింపఁబడియుండెను. ఇతఁ డొక ధార్మికసంస్కర్త. ఇతనికి పీరీ రోషన్ (Saint of Light) అను బిరుదముగూడ నుండియుండెను. అబ్దుల్ రహీంఖాన్ అనునతఁడు

sampath_Ebooks



౧౭-వ శతాబ్దియందు ప్రఖ్యాతి కెక్కియుండెను. ఔరంగజేబు కాలమున ఖుషాల్ ఖాన్ అను మఱియొక లేఖకుఁ డుండెను. ఇతఁడు యుద్ధములందుఁగూడఁ బాల్గొనుచుండెడివాఁడు. ఇతనివంశమున మఱికొందఱు కవులు జనించియుండిరి. అహమద్ షాహయు మంచి పే రందిన కవి. అఫ్గాని - వాఙ్మయమునందు వీరకథాగానములు పెక్కులు కలవు.

కళా కౌశలములు, కృషి, వాణిజ్యాదులు :— పట్టునకు, పట్టువస్త్రములకు నీదేశము మిగులఁ బ్రసిద్ధి కెక్కినది. అఫ్గానితుర్కిస్తానమునందును, ఆక్సస్‌నదీప్రాంతములందును పట్టు విస్తారముగ నుత్పన్న మగును. కాబూల్, హీరాత్ కంధహారములందును బట్టునకుఁ గొదవలేదు. నూలుగుడ్డలు, రంగుదినుసులు, ఇనుపసామానులు విదేశములనుండి - ముఖ్యముగ హిందూదేశమునుండి - ఇచటికి వచ్చుచుండును. కలప, ఎండినపండ్లు, ఆహారపదార్థములు, ఇంగువ, మదారు, పచారీదినుసులు, ఉన్ని, పట్టు, తోళ్లు, పసువులు — ఈ దేశమునుండి హిందూస్థానమునకుఁ బోవుచుండును. హీరాత్ ప్రాంతముల మంచి తివాచీలు తయారగును. గొఱ్ఱెతోళ్లను పదునుచేసి మెత్తఁబఱచి తయారుచేయు ‘పోస్తీను’ లను అంగీల కీ దేశము పే రెక్కినది. ఒంటెలు, గొఱ్ఱెలు, కొండమేఁకలు మున్నగువాని రోమములతో నేయఁబడు మృదువులగు వస్త్రము లీదేశమునందలి ముఖ్యవిశేషము. ఈ వస్త్రములు చాల విలువ గలిగియుండును. కంధహారమున నెత్తుని తళుకురాలపూసలతో హారములు నిర్మింపఁబడుచుండును. ఉత్తరమార్గములద్వారా రష్యాదేశమున కిచటనుండి యాహారపదార్థములు, పసువులు పోవుటయు, నచటనుండి ఉన్ని ప్రత్తి ఈ దేశమునకు వచ్చుటయుఁ గలదు.

పర్వతమయ దేశ మైనప్పటికిని అఫ్గానులు పరిశ్రమపూర్వకముగ సంవత్సరమునకు రెండుపంటలఁ బండింతురు. మిక్కిలి యెత్తయిన నేలలందుమాత్రము పంట ఒక్కపర్యాయమే పండును. గోదుమలు, యవలు, కాయధాన్యములు, వడ్లు, జొన్న, మొక్కజొన్న, పొగాకు, ముల్లంగి, ఆముదాలు మొదలయిన వన్నియు నుత్తమరీతిని ఫలించును. గోదుమ లిచటి ముఖ్యాహారము. కుంకుమపువ్వును బండించి ఇచటివారు విదేశముల కగుమతి చేయుచుందురు. రుచికరములు, పుష్టికరములు నగు ననేకజాతుల ఫలముల కీ దేశము జన్మభూమి. యూరోపు, హిందూస్థానములందుఁ బండు ఉత్తమజాతి ఫలము లన్నియు నిచటఁ బండును. ద్రాక్ష లపరిమితము. నలువది వేర్వేఱురకముల ద్రాక్ష లిచటఁ గలవు. కంధహారమునకుఁ జుట్టుప్రక్కల నున్న పల్లెలందీ ద్రాక్షతోఁటలు లెక్కకు మిక్కిలిగఁ గలవు. మఱియు కిస్‌మిస్, అంజూరములు మిక్కుటముగ ఫలించును. ఆడూ, ఖుర్బానియా, ప్లమ్, ఆలుబుఖారా, కర్బూజా, తర్బూజా, నాశ్పాతీ, సేవ్, బగ్గు, గోషా మొదలగు పేర్లతో నుత్తరభారతమున వ్యవహరింపఁబడు ఫలములు పుష్కలముగఁ బండును. అఫ్గాను లనేకులు ఈఫలములను, వీని రసముతోఁ జేసిన రొట్టెలను దిని యుందురు. ఎక్కువగ నీరు కావలసిన పైరులకు కాలువలద్వారా నీటిని గట్టుదురు. ఇందులకుఁగాను భూమ్యుపరిభాగమునుండియు, నేల యడుగునుండియు, కాలువలు నిర్మింపఁబడియున్నవి. భూమియం దూరునట్టిజలము కాలువలద్వారా కలిపి యంతకంటెఁ బల్లపుప్రదేశములకుఁ బ్రవహించులాగునఁ జేయఁబడుచుండును. ఈ నేలయడుగుకాలువల నిచటివారు ‘కరేజ’ లని పిలుచుచుందురు.

పర్వతమయ మగుటచే మార్గము లీదేశమున నంత యెక్కువగ లేవు. వ్యాపారాదుల కనుకూలించు మంచిరోడ్లు కొలఁదిమాత్రముగనే యున్నవి. హిందూదేశమునకు మూఁడు, పారసీకమున కొకటి, దేశమధ్యమందే రాకపోకలనిమిత్తము నిర్మింపఁబడినవి మూఁడు - మొత్తమున వ్యాపారమునకుఁ బనికివచ్చునవి ఏడురోడ్లుమాత్రమే. హిందూస్థానమున కేతెంచు మార్గములలో నొకటి కాబూలునుండి యారంభమై జలాలాబాదుమీఁదుగ పెషావరు దగ్గఱకు వచ్చును. రెండవది గజినీనుండి బయలుదేఱి కంధహారముమీఁదుగ క్వెట్టాపట్టణముం జేరును; అచ్చోటనుండి హిందూదేశమునకు వచ్చును. కంధహారమునుండియు గజినీనగరమునుండియు వెడలి రెండు భిన్నమార్గము లొకచోటఁ గలసి యొకపెద్దరోడ్డుగఁ బరిణమించి యది గోమల్ కనుమగుండా హిందూస్థానమునఁ బ్రవేశించును. వీనియన్నింటిలో పెషావర్, క్వెట్టామార్గము లత్యుత్తమమైనవి. క్వెట్టామార్గమున బండ్లు నిరుపద్రవముగఁ బ్రయాణము సేయవచ్చును. సరకులను సాధారణముగ గుఱ్ఱపుతట్లమీఁదను, ఒంటెలమీఁదను మోయించికొని పోవుచుందురు.

వెండియు నీ దేశమున నెల్లప్పుడును సంచారము సేయుచు వ్యాపార మొనరించువారు కలరు. వీరు ‘పొవిందా’ లని పిలువఁబడుచుందురు. వీరు వందలకొలఁదిగ గుమి కూడి గుఱ్ఱములమీఁదను, ఒంటెలమీఁదను సరకుల నైచికొని దొంగల యుపద్రవమునుండి కాపాడుకొనునిమిత్త మాయుధపాణులై హిందూస్థానము, బొఖారా, ఖురాసాన్ లోనగు దేశములకుఁ బోయి వ్యాపారములఁ గావింపుచుందురు. శీతకాల మారంభమగుటతోడనే వీరు గోమల్ కనుమదారిని హిందూస్థానమున కేతెంచి పంజాబునందలి మైదానములలో కుటుంబములను, పసువులను దిగఁబెట్టి దగ్గఱ నున్న ఆయుధములను బ్రిటిష్‌వారి పరమున నుంచి తమ సరకులను రైలుద్వారా ఏబొంబయి, కలకత్తాలకో లేక, ఏకరాచీ నాగపూరులకో కొనిపోవుదురు. ఆప్రదేశములందు వీరు తమ వస్తువుల విక్రయించి యచటఁ దమ దేశమున నవసరములగు సామానులఁ గొని వసంతర్తువు వచ్చుసరికి స్వదేశమునఁ జేరుదురు. ఉత్తరదేశీయులు వీరిని రోహిలా లనియు, అఫ్గాను లనియుఁ బిలుచుచుందురు. మిక్కిలి దూర మనుతలంపున వీరు దక్షిణప్రాంతములకు పూర్వము వచ్చెడివారు కాదు. కాని రైళ్ల సౌకర్యముల మూలమున నిప్పుడిప్పుడు మద్రాసుప్రాంతములకును వచ్చుచున్నట్లు తోఁచుచున్నది.

రాజ్యపరిపాలనము, రక్షణవ్యవస్థ :— ప్రాచీనకాలమం దిచట నిరంకుశపరిపాలన ముండెను. కాని ప్రస్తుత మిచటి పరిపాలనా

sampath_Ebooks



ప్రణాలియం దనేకపరివర్తనములు జరగినవి, జరగుచున్నవి. ఈ మార్పుల కన్నింటికిని ముఖ్యకారణము వెనుక రాజుగ నుండిన అమానుల్లాఖానుయొక్క ఉదారహృదయము. ఇతఁడు తన నిరంకుశాధికారమును వదలుకొని దానిని జాలవఱకు అఫ్గాన్ జాతీయసంఘముపరము గావించెను. రాజ్యాధిపత్యమున నొక 'క్యాబినెట్టు' పథయు, రాజ్యపు 'ఎసెంబ్లీ'యుఁ గలవు. ౧౯౨౬-వ సంవత్సరమునం దితఁడు, అదివఱకుండిన అమీర్ అను పేరును మార్చుకొని రాజశబ్దమును ధరించెను. విదేశవ్యవహారములు, అభ్యంతరవ్యవహారములు, విద్య, వాణిజ్యము, న్యాయము, సుంకము, యుద్ధము మున్నగువానికి ఒక్కొక్క రాజ్యాంగశాఖ నేర్పఱిచి, దాని నొక్కొక్క యధికారియధీనమున నుంచెను. ఈశాఖ లన్నింటిమీఁదను రాజు వాని పాలకుఁడై కార్యముల స్వయముగఁ జేయుచుండును.

ప్రస్తుతకాలమున నీదేశ మంతయు ౫ పెద్ద ఇలాకాలుగను, ౪ చిన్న ప్రాంతములుగను విభజింపఁబడియున్నది. కాబూల్, కంధహార్, హీరాత్, మజారీశరీఫ్, కటఘన్, బదక్షాన్ అనునవి పెద్ద ఇలాకాలు. జలాలాబాద్, ఖోస్ట్, ఫరా, మైమెనా లనునవి చిన్న ప్రాంతములు. ఇవన్నియు మీఁద వచించిన రాజ్యవిభాగములకులోనై, ప్రాంతాధికారుల(Governors)చేఁ బాలింపఁబడుచుండును. ఖురాన్‌గ్రంథనియమానుసారముగా న్యాయాన్యాయములవిషయమున తీర్పులు చెప్పఁబడుచుండును. అందునిమిత్తము సామాన్య-ఉన్నత న్యాయస్థానములు ప్రతిజిల్లాయందును, అత్యున్నతన్యాయస్థానము రాజధానీనగరమందును గలవు.

సైనికశిక్షణ మిచట అనివార్యము. ఇతర జాతీయసమూహములు పెక్కులు కలవు. కాని ఇవన్నియు సైనికవర్గముక్రిందనే గణింపఁబడుచుండును. యుద్ధపుసామానుల, సాధనముల నిర్మించుటకొఱకు కాబూలునం దనేక కర్మాగారము లున్నవి. అందు ప్రధాన కర్మాగారమున దినమునకు ౨౦,౦౦౦ ల తోటాలును, ౧౫ తుపాకులును, వారమునకు రెండు ఫిరంగులును తయారు చేయఁబడుచుండును. పడమట హీరాత్‌నగరమందును, ఉత్తరమున బలఖ్‌సమీపమందున్న దెహాదాలీయొద్దను ఉత్తమసేనాప్రబంధముగల దుర్గములు కలవు. ఈ కడపటి దుర్గపు నిర్మాణమునకు ౧౨ సంవత్సరములు పట్టెను. ఇది ఆక్సస్‌నదిద్వారా అఫ్గాన్‌తుర్కిస్తానమున కేఁగు మార్గములన్నింటిని గాచును. దీని బురుజులపై క్రుప్‌హచీకిస్, నార్డన్ ఫెల్డ్, మాక్సిమమ్ అను పేరుల నొప్పు శీఘ్రశతఘ్ను లుంపఁబడియున్నవి. సైన్యవిషయమునఁ బూర్వము పటాలము లుంచుపద్ధతి కాక, మన్‌సబ్‌దారీ పద్ధతి యుండెడిది. యుద్ధము తటస్థించినయెడల నియమానుసారముండవలసిన సైనికుల సమకూర్చి యొప్పగింపవలయు ననుషరతుమీఁద రాజ్యమండలి ప్రధానపురుషు లందఱకును వారివారి యోగ్యతలనుబట్టి భూములును, సంస్థానములు నొసఁగఁబడుచుండెను. ఆసర్దారులు నటులే చేయుచుండిరి. కాని ఇట్టి విధానమువలన సైనికులపై అసలు అఫ్గాన్ ప్రభువునకు తగిన స్వాతంత్ర్యాధికారము లుండెడివి కావు. అనేకపర్యాయములు యుద్ధకాలమున సైనికులు తాము నిరంతరము సంబంధమును గలిగియుండు సర్దారుల యాజ్ఞలకు లోనై సాహాయ్యపడ వచ్చినవానిని వదలి యతని శత్రుపక్షమునఁ బోయి కలయుచువచ్చిరి. ఈకారణమున అమీర్ దోస్తుమహమ్మద్ ౧౮౫౮-వ సంవత్సరమున వేతనము లొసంగుపద్ధతిమీఁదను సైనికుల నొనగూర్చి పటాలముల నేర్పాటు గావించెను. మొదటను ౧౬ కాల్బలపుఁ బటాలములును, ౩ అశ్వదళములును, ౮౦ ఫిరంగులును ఏర్పడెను. ఒక్కొక్క పటాలమునందు ౮౦౦ ల సైనికు లుండిరి. షేక్ అలీఖాన్ అను పాలకుఁడు బ్రిటిష్‌వారింబోలె తన సైనికులకు కవాతు మొదలగువానిని నేర్పి ౧౮౬౮-వ ప్రాంతమున సేన నభివృద్ధి సేయఁ బ్రయత్నించెను. అనంతరము అఫ్గాన్‌దేశము నేలిన అబ్దుర్‌రహిమాన్‌ఖాను సంపూర్ణముగ నింగ్లీషుపద్ధతి నవలంబించి తన సేనను యూరోపియన్ పటాలముల యోగ్యతకుఁ గొనివచ్చెను. ప్రస్తుతము అమలునం దున్న సైనికవిధానము లన్నియు అబ్దుర్‌రహిమానుసమయమందే యావిర్భవించె నని చెప్పవచ్చును. క్రీ. శ. ౧౮౯౬-వ సంవత్సరమునఁ గావింపఁబడిన నియమముల ననుసరించి ౧౬ మొదలుకొని ౪౦ సంవత్సరముల ఈడునఱకును గల పురుషు లందఱు నెనిమిదింట నొకని చొప్పున సైనికశిక్షణ మందవలసియుండెను. ౧౯౧౪ నందు మఱికొన్ని సైనికనియమములు కావింపఁబడినవి. తదనుసారము సేనయందుఁ జేరునతఁడు బ్రతికి యున్నంతవఱకును పని సేయవలయును. కాని మూఁడు సంవత్సరములు కడచినతరువాత సైనికుఁడు తనకు బదులుగ వేఱొకని నుంచి తాను వీడిపోవచ్చును. సేన కంతకును రాజు నిరంకుశాధికారి, అతనితరువాత ప్రధానసేనాపతి. కాబూల్, జలాలాబాద్, ఖోస్ట్, గజినీ, ముకుర్, కంధహార్, ఫరక్, హీరాత్, మైమెనా, మజారీషరీఫ్, ఫైజాబాద్ నామకనగరములందు సైనికకేంద్రములు కలవు. మొత్తపు సైనికసంఖ్య సుమారు ౧౨,౦౦,౦౦౦ లుండవచ్చును. కాబూలు, హీరాతులందు సైనికపరిషత్తు (Military academy) లున్నవి. కాబూల్, అస్టలిఫ్, జలాలాబాదులందు సైనికకళాశాలలు కలవు. ప్రస్తుతము వాయుయానములను సేకరించుటకుఁగూడఁ బ్రయత్నములు జరగుచున్నవి.

దేశ మంతయు పర్వతమయ మగుటచే విమానముల యభివృద్ధి వలన సామాన్యపు రాకపోకలకును సౌకర్యములు కలుగవచ్చును. విమానములనిమిత్తము రషియావారితో నుత్తరప్రత్యుత్తరములు జరగుచున్నటులు తెలియుచున్నది.

దేశచరిత్రము :— ఇప్పుడు అఫ్గానిస్థాన మనఁబడు దేశము పూర్వకాలమున నొక్కదేశముగ లేదు. వేఱువేఱు భాగములకు వేఱువేఱుపేర్లు కలవు. అవి వేఱువేఱురాజులక్రింద నుండుటయు సంభవించెను. మిక్కిలి పూర్వకాలమున ననఁగా ౨,౨౦౦ యేండ్లకుఁ బూర్వమిప్పుడు కాబూల్ అనఁబడుదేశమునకు పరోపనిసద (Paropanisadae) అనియు, హీరాత్ ప్రాంతమునకు ఏరియా (Aria-హరిరూడ్) అనియు, కంధహార్ ప్రాంతమునకు అరోకొసియా

sampath_Ebooks

(Archosia) అనియుఁ బేర్లుండెను. మక్రాన్ అను ప్రాంతమునకు గెడ్రోషియా (Gedrosia) అనియు, బాల్ఖ్ అనుదానికి బాక్ట్రియా (Bactria) అనియుఁ బేర్లుండెను. ఈభాగము లన్నియు పారసీకరాజుల క్రింద నుండెను. క్రీ. పూ. ౩౨౯ - ౨౭ లో నీదేశముల నన్నిటిని మహావీరుఁడైన అలెగ్జాండరు[1] జయించెను. ఇతఁడు క్రీ. పూ. ౩౨౩ లో మృతుఁడు కాఁగా నాతని రాజ్యములోని తూర్పుభాగ మాతని సేనాని యైన సెల్యూకస్ నికేటర్ అనువానికిఁ జెందెను. ఆతనిరాజ్యములోనే అఫ్గానిస్థానమందలి పైరాజ్యములు కలవు. క్రీ. పూ. ౩౦౩ లో నీతనిని ఓడించి (బాల్ఖ్ రాజ్యము తప్ప) యీ రాజ్యము లన్నియు మగధదేశపు మౌర్యచక్రవర్తి యైన చంద్రగుప్తుఁడు స్వాధీనపఱచుకొనెను.[2] కొన్నిదినములకు నీరాజ్యములు మగధరాజులచేతినుండి జాఱిపోయెను.

ఈ దేశములో పార్థియను లనువారు కొంతభాగమును, శకవంశమువారు కొంతభాగమును క్రీ. పూ ౧౩౦ ప్రాంతమున ఆక్రమించిరి. గ్రీకువారిప్రభుత్వము బాక్ట్రియాలోఁ గొంతవఱకుండెను. రెండు శతాబ్దులతరువాత యూచీ అనువారు మధ్య ఆసియానుండి వచ్చి గ్రీకువారిని పార్థియనులను వెడలఁగొట్టిరి. వీరినే కుషాణవంశమువా రని చెప్పుదురు. వీరిలో కనిష్కుఁ డనువాఁడు మిక్కిలి గొప్పరాజు (౭౮ - ౧౨౩). ఈతనిరాజ్యము హిందూదేశమందు గంగవఱకును, కాశ్మీరము, పెషావర్, కాబూల్, ఆక్సస్ నదీప్రాంతము మొదలయినప్రదేశము లన్నియు వ్యాపించియుండెను. ఈతఁడు బౌద్ధమతాభిమాని. ఈ వంశమువారు ౫-వ శతాబ్దివఱకు నీదేశముపై రాజ్యము చేసిరి. ఆ శతాబ్దియందు వారు తెల్లనివా రైన హూణులచే నోడింపఁబడిరి. కాని వీరిప్రభ పూర్తిగ నేడవశతాబ్దివఱకును బోలేదు. వీరినే షాహిరాజు లందురు. వీరికాలములో నీదేశమున బౌద్ధమతము వ్యాపించియుండెను. ఇప్పటికిని బౌద్ధమతచిహ్నము లాదేశమునందుఁ గానవచ్చును. ఈ షాహివంశము చివరపురుషుఁడు తోరమానుఁ డనువాఁడు దుర్మార్గుఁ డైనందున నాతనిని చంపి యాతని మంత్రి యగు కల్లారుఁ డనువాఁడు క్రీ. శ. ౮౫౦-వ సంవత్సరప్రాంతమున రాజయ్యెను. వీఁడు బ్రాహ్మణుఁ డని కొందఱు చరకలు వ్రాసినారు. కాని క్షత్రియుఁ డైయుండు నని యితరుల యూహ. ఈవంశమువారు క్రీ. శ. ౧,౦౦౦ వఱకును గాబూలులో రాజ్యము చేసినట్లు కానవచ్చుచున్నది. ఈ వంశమువారు 'మిక్కిలి రాజ్యవిస్తారము గలవా రయ్యును ఉత్తమసద్గుణమండితులుగను, ఆడినమాట తప్పనివారుగను, తమకంటెఁ దక్కువవారిని దయతోఁ జూచువారుగను నుండిరి' అని యొకమహమ్మదీయచరిత్రకారుఁడే వ్రాసియున్నాఁడు.[3]

కాబూలును జయింపవలె నని మహమ్మదీయులు చేసినప్రథమప్రయత్నములు సిద్ధింపవయ్యెను. అరబ్బీవారు ౯-వ శతాబ్దియంతమువఱకును పశ్చిమమువైపు అఫ్గానిస్థానమును జయించి మహమ్మదీయమతమును స్థాపించిరి. హీరాత్ మహమ్మదీయమతసంబంధమైన యొక ముఖ్యపట్టణ మయ్యెను. తొమ్మిదవశతాబ్దియందుఁ గొంతకాలమువఱకును హీరాతులోను, బాల్ఖులోను పారసీకు లయిన సఫావిదులు రాజ్యము చేసిరి. వారితరువాత సామానీదు లనువారు వచ్చిరి. వారిని పాఱఁదోలి గజ్నీలోని తుర్కీవంశమువారు రాజు లయిరి. వీరిలో గొప్పవాఁడు హిందూదేశముమీఁదికిఁ బదునేడు సారులు దండెత్తివచ్చిన మహమూద్ అను మూర్తిభంజకుఁడు (౯౯౮ - ౧౦౩౦). ఈతఁడు గజనీలో గొప్పవిద్యాపీఠమును స్థాపించెను. గొప్పగొప్ప పండితులకు నాశ్రయ మిచ్చెను. తనరాజధానిని బహుసౌధములతో నలంకరించెను. ఈవంశమువారిని వెడలఁగొట్టి అఫ్గాను రాజ్యమును ఆక్రమించుకొనినది ఘోర్ వంశము. ఈవంశమునందుఁ జేరొందినవాఁడు షహాబుద్దీన్ ఘోరీ (౧౧౭౩ - ౧౨౦౬). ఈతఁడు ఢిల్లీశ్వరుఁడైన పృథ్వీరాజును ఓడించి హిందూదేశమందు తురుష్కులసామ్రాజ్యమును స్థాపించెను. ఇతనిప్రతినిధులే స్వతంత్రులై బానిసవంశజు లనఁబడు ఢిల్లీశ్వరు లైరి. వీరు అఫ్గానిస్థానముతో సంబంధము లేకుండ స్వతంత్రు లైరి. కొంతకాల మీ అఫ్గాన్ రాజ్యము ఖ్వారిజ మన్న పేరుతో కొలఁదికాలము విలసిల్లినసామ్రాజ్యమునఁ జేరెను. తరువాత చంగీజుఖానను బందిపోటుమూఁక నీదేశము నాక్రమించుకొనెను. ఇందలిచాలభాగము మఱియొక బందిపోటు నాయకుఁడగు తైమూరు వచ్చి యాక్రమించుకొనువఱకును (౧౩౯౮) వారియధీనమందే యుండెను. ఇతనితరువాత నీతనిగొప్పరాజ్యము తునకలుతునక లైపోయెను. కాని హీరాత్, బాల్ఖ్, గజనీ, కాబూల్, కంధహార్ ప్రదేశములలో నీతనివంశజులే రాజ్యము చేయుచుండిరి. ఇతనివంశజుఁడే బాబరు. ఈతఁడు బదక్షానము (బదక్షాన్), కాబూల్, కంధహారుప్రాంతములకుఁ బ్రభువుగ నుండెను. అతఁడు ౧౫౨౬ లో ఢిల్లీలో రాజ్యము చేయుచున్న ఇబ్రాహీం లోడీ సుల్తానును ఓడించి హిందూదేశములో మొగలసామ్రాజ్యమును స్థాపించెను. ఈమొగలులకు హిందూరాజ్యము వచ్చినతరువాత చిన్నదియగు అఫ్గానురాజ్యము పులగముమీఁదిపప్పువలె నయ్యెను. అక్బరుప్రభుత్వకాలమునందు తిరుగఁబడిన అఫ్గానుదేశజులను గెలుచుటకై అక్బరు తనసేనానులగు రాజా బీర్బల్, రాజా తోడర్మల్, రాజా మానసింగ్ అను హిందూసరదారులను వానిమీఁదికిం బంపెను. రాజా బీర్బల్ యుద్ధమునందు మడిసెను. ఔరంగజేబు కాలమందు మార్వాడదేశపురాజగు యశవంతసింహుఁడు రాజకార్యమునిమిత్తమై కాబూలున కంపఁబడెను. అతఁ డచ్చటనే మరణము నందెను. కొన్ని

1. ఈశబ్దమునకు పారసీభాషలో సికందర్ అనియు, సంస్కృతభాషలో అలకసుందరుఁ డనియు రూపాంతరములు కానవచ్చుచున్నవి.
2. V. A. Smith's Early History of India, 3rd edition, p. 119.
3. Elliot's History of India, as told by its own historians, Vol. II, pp. 12 and 40.

sampath_Ebooks

సంవత్సరములతరువాత బదఖ్షానమును ఉజ్బెక్కు లాక్రమించు కొనిరి. కంధహారును పారసీకరాజు లయిన సఫావిదులు తీసికొనిరి. గజినీ, కాబూలులుమాత్రము మొగలులకు దక్కినవి. ౧౭౩౭ లో నాదిర్‌శాహు యనువాఁడు అఫ్గానిస్థానములోని రాజ్యముల నన్నిటిని నాక్రమించి ౧౭౩౯ లో ఢిల్లీని దోచుకొనెను. ఇట్లెన్నియో శతాబ్దులు పారతంత్ర్యము ననుభవించి యీదేశము నాదిర్‌శాహ మృతినొందఁగనే (౧౭౪౭ న) స్వతంత్ర మయ్యెను. దీనికి స్వాతంత్ర్యమును, జాతీయతను ఇచ్చినవాఁడు అహమద్‌శాహ అబ్దాలీ.

నాదిర్‌శాహ తనసైన్యములో అఫ్గానులను కొందఱను చేర్చుకొనెను. అట్లు చేరినవారిలో అహమద్‌శాహ అబ్దాలీ యొకఁడు. నాదిర్‌శాహ మరణ మందఁగనే ౧౭౪౭ లో కంధహార్‌పట్టణమందు అఫ్గాన్‌నాయకు లందఱును గలసి యీతనిని రాజుగ నెన్నుకొనిరి. ఇతఁడు 'దుర్-ఇ-దురాన్' (ఈయుగమునకు ముత్యము) అను బిరుదమును ధరించెను. తనజాతివారికి (అబ్దాలీల కందఱికి) దురానీ లన్న బిరుదు నొసంగెను. ఈదురానీవంశమే ఇప్పటివఱకును రాజ్యము చేయుచున్నది. అబ్దాలీ ప్రభుత్వమునకు వచ్చినప్పటినుండియే అఫ్గానిస్థానమునకు స్వతంత్రరాజ్య మన్న పేరుప్రతిష్ఠలు వచ్చినవి. అంతకుఁ బూర్వ మిది యీదేశమువారికి నాదేశమువారికిని లోఁబడి స్వతంత్రనామము లేకయుండెను. పానిపట్టుయుద్ధరంగముమీఁద మరాటావారిని నోడించినవాఁ డీయహమ్మదుశాహ అబ్దాలీయే. ఇతఁడు మిక్కిలి శూరుఁడై తనరాజ్యమును చాలవఱకు వ్యాపింపఁజేసెను. ఈతనిమరణకాలమునకు అఫ్గానిస్థాన మంతయు నతనియధీన మగుటయేకాక, ఉత్తరమున తుర్కిస్థానము, దక్షిణమున సింధు బలూచిస్థానములు, తూర్పున కాశ్మీరము, పశ్చిమమున ఖురాసాన్ దేశపురాజులు ఈతనిసార్వభౌమత్వము నొప్పుకొనిరి. ఇతఁడు ౧౭౭౩ లోఁ గాలధర్మము నొందెను.

ఈతనికుమారుఁడగు తైమూరు రాజధానిని కంధహారునుండి కాబూలునకు మార్చెను. ఈతఁ డిరువదియేండ్లు రాజ్యముచేసి ౧౭౯౩ లోఁ జచ్చిపోయెను. ఈతనిప్రభుత్వకాలములో సింధుదేశము వీరి యధీనమునుండి తప్పెను. బాల్ఖ్, అఫ్గాన్‌తుర్కిస్థానముయొక్క యితరభాగములు చాలవఱకు స్వతంత్రము లయ్యెను. ఖురాసాన్, కాశ్మీరములలో తిరుగఁబాటునకు బీజారోపణము చేయఁబడెను. తైమూరునకు నిరువదిమంది పుత్రు లుండిరి. ఆరాజ్యమునుగురించి వారిలో వారికిఁ బెక్కుతగాదాలు కలిగెను. జమాన్ అనువాఁడు అమీ రయ్యెను (౧౭౯౩). ఈతనికాలములో పంజాబు వీరిచేతి నుండి జాఱిపోయెను. ౧౭౯౯ లో నీతనిసహోదరుఁడైన మహమూదు అనువాఁడు రాజ్యము నాక్రమించుకొనెను. ౧౮౦౩ లోఁ గొన్ని కుట్రలు జరిగి రాజ్య మీతనిసోదరుఁడైన శాహషుజా ఉల్‌ముల్క్ అన్నవానియధీన మయ్యెను. మహమూదు రాజ్యభ్రష్టుఁ డయ్యెను. నెపోలియన్ పారసీకదేశపురాజుతోఁ జేయుచున్న స్నేహమువలన బ్రిటిషురాజ్యమునకు నష్టము రాకుండ జాగ్రత్తపడుటకై ౧౮౦౯ లో ఇండియాగవర్నమెంటువారు మౌంటు స్టు అర్ట్ ఎలిఫిన్‌స్టన్ అనువానిని శాహషుజాయొద్దకు దూతగాఁ బంపిరి. కాని యింతలో రాజ్యభ్రష్టుఁడైన మహమూదు శాహషుజాను ఓడించి మరల రాజయినందున (౧౮౦౯) ఈదూత వెళ్లినప్రయోజనము సఫలము కాలేదు. మరల రాజయినమహమూదు తొమ్మిదిసంవత్సరములు రాజ్యము చేసెను. ఈతనికాలమందు నీతనిమంత్రియైన ఫతేఖాన్ అనువాఁడు (బరక్‌జాయ్‌వంశజుఁడు) సర్వాధికారిగ నుండెను. కాని మహమూదు ౧౮౧౮ లో నీమంత్రికనులు దీయించెను. అందువలన మంత్రియొక్క తమ్ముఁడైన మహమ్మద్‌అజీమ్ అనువాఁడును, అతని సవతితమ్ముఁడైన దోస్తుమహమ్మద్ అనువాఁడును రాజుపైఁ దిరుగఁబడి ౧౮౧౮ లో నాతని రాజ్యభ్రష్టునిఁ జేసిరి.

తరువాతఁ గొంతకాలమువఱకు నిశ్చితుఁడైనరాజు ఏర్పడలేదు. మహమ్మద్ అజీమ్ కాబూలును స్వాధీనపఱచుకొనెను. కాని యితర ప్రాంతములగవర్నరు లాతనియాజ్ఞకు లోఁబడరయిరి. హిరాత్ స్వతంత్ర మాయెను. అఫ్గాన్‌తుర్కిస్థానమును, బదఖ్షానమును చీలిపోయినవి. పంజాబుసింహ మైన రణజిత్‌సింగు కాశ్మీరము, ముల్తాన్, డెరాగాజిఖాన్, అటక్ అనుదేశములను, ప్రాంతములను స్వాధీనపఱచుకొనెను. నౌషహరయొద్ద ౧౮౨౩ లో అఫ్గానులను పూర్తిగఁ బరిభవించి పెషావరుగూడ లాగుకొనెను. మహమ్మదుఖాన్ ౧౮౨౩ లో మృతుఁడయ్యెను. అంత వారి (బారక్‌జాయ్) యన్నదమ్ములలో రాజ్యమునకై కలహములు ముదిరి ౧౮౨౬ లో దోస్తుమహమ్మద్ కాబూల్, గజినీప్రదేశములను స్వాధీనపఱచుకొనెను. జలాలాబాదు కూడ త్వరలోనే యతనికి వశమయ్యెను. ౧౮౩౪లో శాహషుజా మరల రాజ్యము సంపాదించుటకు యత్నము చేయఁగా నాతనిని ఓడించి దోస్తుమహమ్మద్ 'అమీర్' అన్న పదవిని ధరించెను. శాహషుజా యింగ్లీషువారియొద్దకు వచ్చి హిందూదేశమునందు దాఁగియుండెను.

మొదటి అఫ్గాన్‌యుద్ధము (౧౮౩౮ - ౪౨):—౧౮౩౭ లో పారసీకరాజు హిరాతును ముట్టడించెను. రష్యావారికి, నమీరునకును స్నేహ మధికము గాఁజొచ్చెను. ఈ కారణములచేత నిండియాదొరతనమువారి కాందోళనము గలిగి వారు అఫ్గానిస్థానమునకు బర్నెస్ అనురాయబారిని పంపిరి. కాని అమీర్ వీరికి ననుకూలముగఁ జెప్పకపోవుటయేకాక యప్పుడు వీరికి స్నేహితుఁడుగా నున్న రణజితుసింగు మీఁదికిఁ దాను యుద్ధమునకుఁ బోయెద ననియుఁ, దనకు సాయము చేయవలసిన దనియుఁ గోరెను. అంత నిండియాగవర్నమెంటువారు అఫ్గానిస్థానముమీఁదికి దండువెడలి దోస్తుమహమ్మదును రాజ్యభ్రష్టునిఁ జేసి తమయాశ్రయమునం దున్న శాహషుజాను రాజ్యముపైఁ గూర్చుండఁబెట్ట నిశ్చయించిరి. రణజితుసింగుకూడ సాయము చేయ నొప్పుకొనెను. కాని యంతగా సాయము చేసినవాఁడు కాఁడు.

ఉత్తరసింధుదేశమునందు ౧౮౩౮ లో అఫ్గాన్‌దండయాత్రనిమిత్తము ౨౧,౦౦౦ సైన్యము సిద్ధము చేయఁబడెను. సర్ జాన్ కీన్

sampath_Ebooks

అనువాఁడు వారికి సేనాధిపతిగ నుండెను. ఈసైన్యము బోలనుకను మలోనుండి వెళ్లి ౧౮౩౯-వ సంవత్సరమునందలి ఏప్రిల్ నెలలో కంధహారు నాక్రమించి, యచ్చట శాహషుజాకు పట్టము కట్టెను. జూలైలో గజినీ వశమయ్యెను. దోస్తుమహమ్మదు పాఱిపోఁగా ౭-వ ఆగష్టుదినమున శాహషుజా రాజధానిలోఁ బ్రవేశించెను. ౧౮౪౦-వ సంవత్సరమున దోస్తుమహమ్మదింగ్లీషువారియధీనుఁడయ్యెను. అతనిని ఇండియాకుఁ బంపిరి. అందఱును యుద్ధము సంపూర్ణదిగ్విజయముతోఁ బూర్తియైన దని సంతసించిరి. శాహషుజాకు సాయముగ కాబూలులో ౭,౦౦౦ ఇంగ్లీషుసైన్యమును మ్యాక్‌నాటన్ అనువాని యాధిపత్యముక్రింద నునిచి, బర్‌నిస్ అనువానిని ఇంగ్లీషువారితరపున రాయబారిగ నియమించి సర్ జాన్ కీన్ వెడలిపోయెను. కాని మొదటి నుండియు కాబూల్ ప్రజ లీక్రొత్తప్రభుత్వముమీఁదఁ గోపము గలవారుగనే యుండిరి. ౧౮౪౧-వ నవంబరులో ప్రజలు తిరుగఁబడి కాబూలులో బర్‌నిసును, ఇతరాంగ్లేయాధికారులను నఱికివైచిరి. దోస్తుమహమ్మదు కుమారుఁడైన అక్బరుఖాను తిరుగఁబాటువారందఱకును నాయకుఁడు. సంధివిషయమున మాటలాడుటకుఁ బోయినప్పుడాతఁడు తనచేతితో సర్ విలియం మ్యాగ్‌నాటనును పొడిచివైచెను. ఇట్లే ఇంగ్లీషుసైన్యమునకు వచ్చుటఁ జెక్కు ఆపదలు సంభవించెను. ౭,౦౦౦ లలో ౩,౧౦౦మంది యిట్లు హతులైరి. ౪,౧౦౦ మందిమాత్రము మిగిలిరి. వీరును శత్రుమధ్యమున నుండుట యసంభవ మయ్యెను. ౧౮౪౨-వ సంవత్సరము జనవరి ౬-వ తేదీని ఇంగ్లీషుసైన్యమంతయు కాబూలును విడిచి వెళ్లునట్లును, త్రోవలో వారికి కాబూలువారేవిధమైన యిబ్బందియూ కలుగఁజేయకుండునట్లును ఖరారునామా వ్రాసికొని, ఇంగ్లీషుసైన్యము కాబూలునుండి బయలుదేఱెను. ఇట్లీసైన్యము హిందూదేశమునకు వచ్చుటకు బయలుదేఱినప్పుడు ౪,౧౦౦ సైనికు లుండుటయేకాక, ౧౨,౦౦౦ మంది సేవకులుగూడ నుండిరి. చలి విస్తారముగ నుండెను. అఫ్‌గానులు వీరికి త్రోవలో మిక్కిలి బాధ కలిగించిరి. వారిచేత నేమి, చలిచేత నేమి యీసైనికులందఱును నశిసిరి. కొందఱు చెఱఁబెట్టఁబడిరి. డాక్టరు బ్రైడన్ అనువాఁ డొకఁడుమాత్రము మిక్కిలి దైన్యస్థితితో ఇంగ్లీషువారిపటాల మున్న జలాలాబాదునకుఁ జేరెను. గజనీలో నున్నసైన్యము గూడఁ గాబూలువారివశ మయ్యెను. కంధహార్, జలాలాబాద్ - ఈ రెండుమాత్ర మింగ్లీషువారి యధీనమునం దుండెను.

ఇట్లు బ్రిటిషుసైన్యమునకు అఫ్‌గానిస్థానమునందుఁ గల్గిన ఘోరమైన యాపత్తునకు బదులు తీర్చుకొనవలయు నని, ౧౮౪౨-వ సంవత్సరపు ఏప్రిల్ నెలలో నిండియానుండి జనరల్ పొలాక్ యొక్క యాధిపత్యముక్రింద ఖైబర్ కనుమగుండ గొప్పసైన్యము పంపఁబడెను. అతఁడు సెప్టంబరులో కాబూలు నాక్రమించి అచ్చటి దుర్గమును నశిమిబాజారును పడఁగొట్టి, ఖైదీలుగ నున్న కొందఱు బ్రిటిషుసైనికులను విశపఱుచుకొని డిసెంబరునెలలో హిందూదేశమునకుఁ దిరిగివచ్చెను. ఇతరులచేఁ దీసికొనిరాఁబడి, బలవంతముగఁ దమకు రాజుగఁ జేయఁబడిన శాహషుజాను అఫ్‌గాను లెన్నఁడును ప్రేమింపలేదు. ౧౮౪౨-వ సంవత్సరము ఏప్రిల్ నెలలో నాతఁడు చంపఁబడెను. హిందూదేశమునం దున్న దోస్తుమహమ్మదును విడిచివైచిరి. అతఁడు మరల కాబూలునకు రా జయ్యెను.

సిక్కువారికిని, ఇంగ్లీషువారికిని జరగిన రెండవయుద్ధపుకాలమునందు నీతఁడు సిక్కువారిలోఁ గలసి అటక్ తీసికొనెను. ఇంగ్లీషువారితనిసైన్యములను ౧౮౪౯ ఫిబ్రేవరిలో గుజరాత్ యుద్ధములో సిక్కువారితోఁగూడ నోడించిరి. దోస్తుమహమ్మదు ౧౮౫౦ లో బాల్ఖ్ ప్రాంతమును స్వాధీనపఱుచుకొనెను. ౧౮౫౫ లో కంధహారును గెలిచెను. ఆసంవత్సరమునందే యాతనికిని, ఇంగ్లీషువారికిని స్నేహము కుదిరెను. ౧౮౫౬ లో హిరాత్‌ను పారసీకులు తీసికొనిరి. ౧౮౫౭ లో పంజాబుదేశపుచీఫ్ కమీషనరును, దోస్తుమహమ్మదును పెషావరులోఁ గలసికొని సంధి చేసికొనిరి. ఇంగ్లీషువా రమీరునకుఁ బారసీకము నెదురించుటకై కొంత సైన్యధనమును (Subsidy), ఆయుధములును ఈయ నొప్పుకొనిరి. తరువాత హిందూదేశచరిత్రమునందుఁ బ్రఖ్యాతిమైనసిపాయీల తిరుగఁబాటు హిందూదేశమందు సంభవించినది. ఆకాలమం దమీ రింగ్లీషువారికి స్నేహితుఁడుగనే యుండెను ౧౮౬౩ లో దోస్తుమహమ్మదు హిరాత్‌ను ముట్టడించి పట్టుకొనెను. అచ్చటనే యాతఁడు ౧౩ దినములకు మృతుఁడయ్యెను.

ఈతనికుమారుఁడు షేర్ అలీఖాను రా జయ్యెను. ఈతఁడు రాజ్యముకొఱకుఁ జెక్కుజనులతోఁ బోరాడవలసినవాఁడాయెను. కాని ౧౮౬౮ లో కాబూలురాజ్యముమీఁద స్థిరుఁడయ్యెను. ఇతఁ డింగ్లీషువారితో స్నేహము కలిగియుండెను. ఇంగ్లీషువా రాతనికి బాకీయున్నధనము పండ్రెండులక్షలరూపాయలును, ఫిరంగులును, ఆయుధములును బహుమతిచేసిరి. అప్పుడప్పుడు ధనసాహాయ్యమునుగూడఁ జేయుచుండిరి.

**రెండవ అఫ్‌గాన్ యుద్ధము (౧౮౭౮-౮౦):**— ఇట్లుండఁ గొన్నిదినముల కాతఁడు రషియావారి కనుకూలుఁడుగను, ఇంగ్లీషువారికిఁ బ్రతికూలుఁడుగను మాఱెను. క్రీ. శ. ౧౮౭౮ లో నాతఁడు రష్యావారిరాయబారులు కాబూలునకు రాఁగా వారిని గౌరవించెను. ఈసమాచారము తెలిసి ఇంగ్లీషుప్రభుత్వమువారు తమరాయబారిని పంపెద మనఁగా నొప్పుకొనలేదు. అందుమీఁద నిండియాదొరతనమువారు అఫ్‌గానిస్తాన్ అమీరుతో యుద్ధమునకుఁ గడంగిరి. దీనికే రెండవ అఫ్‌గాన్‌యుద్ధ మని పేరు.

ఇంగ్లీషుసైన్యములు ఖైబరుత్రోవను, కుఱ్ఱంకనుమ నాక్రమించెను. ౧౮౭౯ జనేవరిలో కంధహారు నాక్రమించిరి. అమీరు కాబూలునుండి పాఱిపోయి ఫిబ్రవరినెలలోఁ జచ్చెను. తరువాత నాలునెలలవఱకును, అఫ్‌గానుమూఁకలతోఁ జిల్లరయుద్ధములు జరగుచుండెను. ఇంకను పైకిఁ బోయినయెడలఁ దిరిగి వచ్చుట కష్టమేమో యని తమకు ననుకూలుఁడైన అమీరును రాజ్యముమీఁదఁ గూర్చుండఁ

కొట్టి తిరిగివచ్చుటకు నెదురు చూచుచుండిరి. ఇంతలో షేర్ అల్లీ కుమారుఁడైన యాకూబ్ ఖాను తాను అమీరు నైతి ననియు, సంధి చేసికొనఁగోరెద ననియు నింగ్లీషువారికి వర్తమాన మంపెను. ౧౮౭౯ మే నెలలో గండమక్ నొద్ద నిద్దఱకును సంధి జరగెను. ఈ సంధి ప్రకారము సరిహద్దుమీఁద నున్న కొన్ని కనుమలపై నధికారమును, కుర్రం, పిషీన్, సిబీ తావులును, ఖైబర్ మిచ్ని కనుమలమీఁది స్వత్వమును ఇండియా ప్రభుత్వమువారి కీయఁబడెను. బ్రిటిషు రెసిడెంటు కాబూలులో నుండుటకు నొప్పుకొనెను. ఇంగ్లీషువారిసలహా లేనిది యితర రాజులతో రాజకీయ వ్యవహారములు నడుప నని సమ్మతించెను. ఇందుకు బదులుగ నింగ్లీషువారు అమీర్ మీఁదికిఁ బరరాజులు రాకుండఁ గాపాడెద మని యొప్పుకొనిరి (౧౮౭౯- మే). మేజర్ సర్ లూయి కవగ్నరీ యనువానిని కాబూలులో రెసిడెంటుగా నేర్పఱిచిరి. కాబూలునుండి సైన్యము వెడలిపోయెను. అంతయు మనకు ననుకూలముగ జరగె నని సంతసించిరి. కాని అఫ్గానులు మోసము చేసి సెప్టెంబరు నెలలో రెసిడెంటును అతనిసిబ్బందిని చంపివైచిరి.

ఈ సమాచారము తెలియఁగనే హిందూదేశమునుండి జనరల్ (తరువాత లార్డు) రాబర్ట్సును పెద్దసైన్యముతోఁ బంపిరి. అతఁడు అఫ్గాన్ సైన్యమును ఓడించి ౧౮౭౯ అక్టోబరులో కాబూలును స్వాధీనపఱచుకొనెను. యాకూబ్ ఖాను ప్రభుత్వము వదలుకొని, యింగ్లీషువారియధీనుఁడై హిందూదేశమునందు వారివలన నుపకారవేతనమును పొందుచు నుండసాగెను. ౧౮౭౯-౮౦ సంవత్సరపుఁజలికాలమునందు కాబూలుదేశమందున్న యింగ్లీషు సైన్యమునకు మరల విపత్తు సంభవించునేమో యన్నభయము కలిగెను. అఫ్గానుసరదారులు తిరుగఁబడిరి. ఎట్టకేలకు వారి నింగ్లీషుసైన్యము లోఁగించెను.

కాబూలు, కంధహారు ప్రాంతములను విడఁదీసి యింగ్లీషువారు కాబూలునకు అబ్దుర్ రహిమాన్ ఖాన్ అనువానిని, కంధహారునకు షేర్ అల్లీ ఖాన్ అనువానిని ప్రభువులుగా నొప్పుకొనిరి (౧౮౮౦, జూలై, మే). అబ్దుర్ రహిమాను దోస్తుమహమ్మదునకు మనుమఁడు, షేర్ అలీకి తమ్మునికుమారుఁడు. కంధహారురాజయిన షేర్ అల్లీ చేతఁగాక రాజ్యము వదలుకొని హిందూదేశమునందు ప్రభుత్వమువారిచ్చు పెన్షను పుచ్చుకొనుచుండెను. ౧౮౮౧ లో నింగ్లీషు సైన్యములు అఫ్గానిస్తానమును విడిచి హిందూదేశమునకుఁ బోయెను.

అబ్దుర్ రహిమాన్ ఖాను (౧౮౮౦ - ౧౯౦౧) :— ఈతఁడిరువదియొక్క సంవత్సరములు రాజ్యము చేసెను. ఇండియా ప్రభుత్వము వారితో మైత్రి కలిగియుండెను. ఈతని ప్రభుత్వకాలములో అఫ్గానిస్తానమునకు నంతకును బూర్వ మెన్నఁడును లేనియేకచ్ఛత్రాధిపత్యము, శాశ్వత సైన్యము ( Standing Army ), ఇతరరాజ్యములతో సమానముగ నుండు రాజ్య మన్నగౌరవము కలిగినది. ఇంతకుఁబూర్వము సరదారులును, ప్రాంతాధిపులును తమయిష్టము వచ్చినయెడల అమీర్ ఆజ్ఞ వినుటయు, లేనియెడల వినకపోవుటయు సంభవించుచుండెను. ఈతఁడు తనప్రచండవిక్రమముచే నాపద్ధతు లన్నియు మాన్పి వారందఱును తనయాజ్ఞలో మెలఁగునట్లు చేసెను. ఈతని కాలములోనే రషియాకు అఫ్గానిస్తానమునకుఁగల పొలిమేరలును, పారసీకదేశమునకు నీదేశమునకుఁ గల పొలిమేరలును గొలవఁబడి సిసలు చేయఁబడినవి. ఈతనికి నిండియాగవర్నమెంటువారు సరిహద్దుసంరక్షణనిమిత్తము మొదట పండ్రెండులక్షలరూపాయ లిచ్చుచుండిరి. ౧౮౯౩ లో నీమొత్తము పదునెనిమిదిలక్షలు చేయఁబడినది. ౧౮౯౬ లో కాఫిరిస్తాన్ అనుదేశముపై అమీరుయొక్క సార్వభౌమత్వము స్థిరపడెను. ఈతఁ డన్నివ్యవహారములలోను తనస్వాతంత్ర్యమునకు భంగము రాకుండ మిగుల జాగ్రత్తతోఁ గాపాడుచుండెను. ఏసలహాలు వినినను తనరాజ్యములో పరదేశీయులు రైళ్లు టెలిగ్రాములు వేయుట మన్న వినినవాఁడు కాఁడు.

హబీబుల్లా ( ౧౯౦౧ - ౧౯౧౯ ) :— అబ్దుర్ రహిమాన్ ఖాను మృతినొందఁగా నాతనికుమారుఁడు హబీబుల్లాఖాను అమీ రయ్యెను. ఈతఁడు కొంతవఱకుతండ్రిమార్గమునే యవలంబించెను. ఈతఁడు ప్రభుత్వమునకు వచ్చినతరువాత క్రొత్తషరతులతో రాజీ చేసికొనవలయు నని యిండియాగవర్నమెంటువారు ౧౯౦౫ లో మిస్టర్ ( ఇప్పుడు సర్ ) లూయీడేను పంపిరి. కాని హబీబుల్లా క్రొత్తషరతు లొప్పలేదు. అదివఱకు నాతనితండ్రికాలమున నున్న షరతులనే యొప్పుకొనుచు సంధి చేసెను. ఈ ప్రసంగముననే యాతనికి 'హిజ్ మెజెస్టి' అన్న బిరుద మీయఁబడినది. ౧౯౦౭ లో నీతఁడు హిందూదేశమును చూచుటకు వచ్చెను. అప్పు డీతఁడు ఇండియాదొరతనమువారిచే మిక్కిలి గౌరవింపఁబడెను.

ఇతఁడు తన పూర్వపరిపాలకులకాలమున లేనినవనాగరకతా చిహ్నములను జాలవఱకుఁ దనదేశమునఁ బ్రవేశపెట్టెను. మోటార్లు, టెలిఫోనులు, వార్తాపత్రికలు, జలవిద్యుద్యంత్రములు మున్నగువానిని రాజ్యమం దంతట నెలకొల్ప పూర్వాచారపరాయణు లందఱును వీనియెడల నసమ్మతినే ప్రకటించుచువచ్చిరి. కాలాంతరమున అమానుల్లాసమయమున నతిభయంకరముగఁ జెలరేఁగిన విద్రోహమున కిది యారంభ మని చెప్పవచ్చును.

యూరోపునందు జర్మనీయుద్ధ మారంభ మైనవెంటనే హబీబుల్లాఖా నెవరిపక్షము గాని వహింపక తాటస్థ్య మూనియుండెను. తుర్కీదేశము యుద్ధమునఁ బ్రవేశించినవెంటనే ఆంగ్లేయులయెడల ద్వేష మూనియున్న అఫ్గాను లందఱును తుర్కీఖలీఫా ననుసరింపవలసిన దని ఇతనిని ప్రోత్సహించియుండిరి. కాని ఇతఁడు వారి మాటలను పాటింపక యుద్ధమునుండి దూరముగనే యుండెను. తమపక్ష మూనియుండినందున బ్రిటిష్‌వారును నితనిని యథోచితరీతిని సత్కరింపవలె నని యభిప్రాయము గలిగియుండిరి. కాని క్రీ. శ. ౧౯౧౯-వ సంవత్సరమున నితఁ డాకస్మికముగ హత్య గావింపఁబ[డెను.]
ఇతనిమరణానంతర మితని సోదరుఁడగు నాజరుల్లాఖా[న్]

sampath_Ebooks



పదమును దాల్చి సింహాసన మెక్కి యాఱుదినములుమాత్రము రాజ్యము చేయఁగలిగెను. అంతలో హబీబుల్లాయొక్క మూఁడవ కుమారుఁ డగు అమానుల్లాఖాను పినతండ్రిని దొలఁగించి రాజ్య కోశములను స్వవశము చేసికొనెను.

అమానుల్లాఖాను (౧౯౧౯ - ౧౯౨౯):— రాజ్యమండలి ప్రధానులు, అమీరులు, సామంత ప్రభువులు ఇతనిని స్వీకరించిరి. ఇతఁడు రాజ్యమునకు వచ్చినవెంటనే ఆంగ్లేయులతో విరోధ మూనియున్నవా రందఱు నితనిని యుద్ధమునకుఁ బ్రోత్సాహ మొసర్చ స్వపర బలాబలముల నితఁడు బాగుగ గుర్తెఱిఁగి యుండియు లోకుల సంతృప్తికొఱకు ౧౯౧౯-వ సంవత్సరమున ఆంగ్లేయులతో యుద్ధఘోషణము సలిపెను. కాని ఆంగ్లేయులు జర్మనీయుద్ధమువలనఁ గలిగిన ఆయాసమునుండి ఇంకను కోలుకొనకపూర్వమే ఇతఁ డీ ఘోషణము సలుపుట చూడ దొరకిన యవకాశమును పోఁగొట్టుకొనక సాధ్య మగునంతవఱకు దానిని వినియోగించుకొనుటకొఱకే ఇట్లు చేసె నని తలంపవచ్చును. ఈ సమాచారము దెలిసినవెంటనే ఇండియావాయవ్యపు సరిహద్దులలోని బ్రిటిష్ సేనలు సంసిద్ధములై యడను వేచియుండి అఫ్‌గానులు వారిసీమను దాఁటి వచ్చినతోడనే వారిమీఁదఁ బడి నొండించి అఫ్‌గానులసీమయందుఁ బ్రవేశించి డక్కానామకస్థానమును వశపఱుచుకొనెను. కాబూలునగరముమీఁదికి వాయువిమానములు సైతము పంపఁబడినవి. కాని యుద్ధ మింకను దారుణావస్థను బ్రాపింపకపూర్వమే రెండు పక్షములవారును సంధి గావించుకొనిరి. తదనుసారము ఇండియా దొరతనమువారినుండి ముట్టుచున్న ౬౦ లక్షలరూపాయల సహాయకభృతి అఫ్‌గానిస్థానమునకు లోపించిపోయెను. కాని ఆంగ్లేయుల దాస్యమునుండి విడివడి యాదేశము సంపూర్ణస్వాతంత్ర్యదేశములం దొకటి యగుట కవకాశము లభించెను. అదివఱకు కాంగ్లేయుల యనుమతి లేకుండ విదేశములతో రాయబారముల నడపుకొనుట కధికారము అమీరునకు లేకుండెడిది. ౧౯౨౧-వ సంవత్సరమున జరిగిన సంధిషరతుల ప్రకారము ఎవరిరాజ్యకార్యముల వారు ఇతరులజోక్యము లేకుండ చేసికొనుట కవకాశములు లభించెను. అఫ్‌గానులు వారికిఁ గావలసిన యుద్ధసామగ్రుల నన్నిటిని పన్ను చెల్లింపవలసిన యవసరము లేకయే హిందూస్థానమార్గమునఁ దెప్పించుకొనుట కధికారములను బొందిరి. పెండియు అఫ్‌గాన్‌దేశమునుండి హిందూదేశమునకు వచ్చు సరకులమీఁదఁ గల ప్రతిబంధకము లన్నియుఁ దొలఁగింపఁబడినవి.

అమానుల్లాఖాను దేశహితైషి, స్వాతంత్ర్యాభిలాషి, చాల వఱకు సమయానుకూల ప్రవర్తనుఁడు. సాధ్య మగునంత శీఘ్రకాలమున స్వదేశమును పాశ్చాత్యసభ్యదేశములలో నొకదానిగఁ జేయవలయు నని యితని హార్దికాభిమతము. అట్టియుద్దేశముతో నితఁడు రాజ్యభారమును వహించినది మొదలుకొని ముఖ్యముగ యుద్ధానంతరమున జరగిన ఆంగ్లో-అఫ్‌గాన్ సంధికాలము మొదలుకొని స్వదేశమునందు వివిధప్రకారము లగు సంస్కారములను గావింప మొదలిడెను.

ఈ దేశమునందు మతగురువు లగు ముల్లాలు ఖురాను గ్రంథ నియమముల ననుసరించి బాలురచే విద్యాభ్యాసము చేయించుచు వచ్చిరి. పాశ్చాత్యదేశములం దవలంబింపఁబడుచున్న ఆధునికవిద్యాశిక్షణపద్ధతు లెవ్వియు నిచట లేకుండెను. అమానుల్లాఖా నొక్కపెట్టున పురాతనరీతు లన్నింటిని దొలఁగించి సర్వసామాన్యముగ నందఱకును విద్య లభించులాగున పాశ్చాత్య విశ్వవిద్యాలయ పద్ధతుల ప్రకారము పాఠశాలలను, కళాశాలలను స్థాపింపఁజేసెను. యోగ్యు లగు ఫ్రెంచిశాస్త్రవేత్త లీ విద్యాలయముల నుత్తమరీతి నడపుచువచ్చిరి. ఈ విద్యాలయములయం దారితేఱిన అఫ్‌గాన్‌యువకులు ఉన్నతవిద్యానుభవములకై విదేశముల కేఁగునిమిత్తము ఇతఁడు సకలసౌకర్యము లొనగూడునులాగునఁ జేసెను. ఈ విద్యావిషయకపరివర్తనములవలన పూర్వకాలపుముల్లాలకు స్వప్రవృత్తిభంగము వాటిల్లుటవలన నపరిమిత మగు క్రోధము జనింప వీ రందఱు నమానుల్లాఖానునకుఁ బ్రతిపక్షులైరి. విద్యావిషయమున నట్లుండ నితఁడు (అమానుల్లాఖాను) కృషిసంబంధు లగు సంస్కారముల మూలమున వ్యవసాయదారుల స్థితిగతులను జక్కనగునట్లు గావించెను. మఱియు కాబూలునగరమును బునర్నిర్మాణము చేయించి దానికిఁ దగిలియుండులాగుననే వేఱొకపట్టణమును గట్టించి దానిని నిజావాసముగ నేర్పఱుచుకొనెను. సైనికశిక్షణ మనివార్య మొనర్చి తత్ప్రబంధమునకుఁగాను గొప్పగొప్ప సైనికకళాశాలల (Military Colleges) స్థాపించెను. నేర్పరు లగు తుర్కీదేశపు సర్దారులు (Officers) యుద్ధశిక్షణమొసంగుటకు నియోగింపఁబడిరి. సైనికశిక్షణము జర్మనీ, తుర్కీపద్ధతుల ననుసరించి నడపులాగున నియమింపఁబడెను. విదేశవ్యాపారము నభివృద్ధి నొందించునిమిత్తము వ్యాపారిక సంఘముల నేర్పాటు చేయించెను. దేశమున నాలుగుదిక్కులందును రైలుబాటల నిర్మించుటకై గుత్తదీసికొనుటకు విదేశీయులు కొంద ఱభిలషించియుండిరి కాని దానివలన కలుగులాభము పరదేశములవారికిఁబోవుండులాగున నితఁ డట్టి కంట్రాక్టుల నెవరికిఁ గాని యొసఁగియుండ లేదు. స్వదేశీయు లగు ఇంజనీరులద్వారా ఈ కార్యమును జేయింపవలయు నని ఇతనికోరిక యైయుండెను. ఇదేవిధమున దేశమందలి గనుల పనులనుగూడఁ దీసికొనవలయు నని విదేశీయులు ప్రయత్నించియుండిరి కాని ఇతఁ డందులకును సమ్మతింపఁడయ్యెను.

నేఁటివఱకు నందిన యభివృద్ధులతోపాటు టెలిగ్రాఫ్, రేడియో, సినీమా మున్నగువాని నితఁడు స్వదేశమున నెలకొల్పెను. కాబూలునందు వితంత్రీకార్యాలయమును బెట్టించెను. దీనికిని పెషావరునందలి వితంత్రీస్థానమునకును సంబంధము కలదు. ప్రతిసంవత్సరమును మీఁద వచించిన సహాయకపుఁ బన్నును ఇండియా దొరతనమువారినుండి కైకొనుచుండిన కారణమున స్వతంత్రించి ఇతఁ డేకార్యమును చేయుటకును సమర్థుఁడు కాకయుండెను. అందుచే సమయమును గనిపట్టి ఆంగ్లదాసత్వమునుండి ఇతఁడు విముక్తిని బొందెను. అఫ్‌గానిస్తానపు స్వాతంత్ర్యదినమహోత్సవము నితఁడు ప్రతిసంవ

sampath_Ebooks



త్సగము నతివైభవముతో నెఱవేర్చుచుండుటయేకాక ఆదేదినమున నీ యుత్సవములను జరిగించునట్లు లండన్, మాస్కో, పారిస్, బెర్లిన్, రోమ్, అంగోరా, టెహరిన్ మొదలగు రాజధానీనగరములం దుండు అఫ్గానిమంత్రులకును ఉత్తరువులను బంపుచుండెడివాఁడు. ఆదిన మున నితఁడు మహావైభవముతో సేనాసమేతముగ నగరవీథులందు నూరేఁగి, యనంతర మచటి ప్రఖ్యాత మగు మసీదునందలి వేది నధిరోహించి జనులకు హితోపదేశములను గావింపుచుండెను. ప్రపంచ మందలి ముఖ్యజాతులపక్షమున నియుక్తులై వచ్చిన రాయబారుల కార్యాలయము లన్నియు నిచటఁ గలవు. వారిలో రష్యనురాయబారియెడల నితని కెక్కుడు పక్షపాత మని చెప్పుదురు. నూతనముగ విమానముల యభివృద్ధినిమిత్త మొక శాఖను స్థాపించి దాని నితఁడు రషియనుల యధికారమునం దుంచెను. తక్కిన మహమ్మదీయ రాజ్యములందువలె ఈ దేశమందును స్త్రీలు అంతఃపురములనుండి వెలుపలికి వచ్చుటకు వలను లేక అనారోగ్యంపశ్యలై యుండ నితఁడు వారికి స్వేచ్ఛాదాన మొసంగెను. పురుషులవలె నిష్టమువచ్చిన స్థలములఁ దిరుగుటకును, మేలిముసుఁగుల వీడి మనసునకు వచ్చిన దుస్తుల ధరించుటకును స్త్రీలవిషయమున నుత్తరువు లిచ్చుటయేకాక బాలురకుఁ బోలె బాలికలకుఁగూడ నున్నతవిద్యాలయముల నేర్పాటు చేయించెను. ఇతని తండ్రి యగు హబీబుల్లాయొక్క యంతఃపురమున నతనిభార్యలు, ఉంపుడుకత్తెలు రెండువందలకు పైగా సౌందర్యవతు లుండిరి. అమానుల్లాఖాను వారి నందఱను వదలిపెట్టించి ఇష్టమువచ్చినవారిఁ బునర్వివాహముం జేసికొన నాజ్ఞ నొసంగెను. ఒక పురుషుఁడు ఒకభార్యకంటె నెక్కువ గట్టుకొనినచో నట్టివాఁడు రాజకీయోద్యోగమున కనర్హుఁడుగాఁ దలంపఁబడు నని శాసించెను.

ఈప్రకార మితఁడు గావింపఁగడఁగిన సంస్కారములమూలమున కేవలము పదిసంవత్సరములలోపలనే దేశ మంతయు నున్నతస్థితి నొంది ఆసియాఖండమున కంతకును మార్గదర్శక మైయుండెడిది కాని ఈ ఖండమువారి దౌర్భాగ్యమే యనవచ్చును, పరిస్థితులు వేఱొండు మార్గము నవలంబించినవి.

అమానుల్లాఖాను, ఇతరులకుమాత్ర మున్నతమార్గములను గల్పించి తా నూరకుండలేదు. తన విద్యానుభవములనుగూడ పెంపొందించుకొనుటకుఁగాను ఇటీవల, ననఁగా ౧౯౨౭-వ సంవత్సరముచివరను స్వదేశమును వీడి భార్యాద్వితీయుఁడై విదేశపర్యటనమునకు బయలుదేఱెను. ఈజిప్టు, ఇటలీ, ఫ్రాన్సు, ఇంగ్లండు, జర్మనీ, పోలెండు, రష్యా, టర్కీ, పర్షియా దేశములను క్రమముగ సందర్శించి తన విజ్ఞానము నభివృద్ధి నొందించికొనెను. ఇట్టివిధ మగు విదేశభ్రమణ మింతపర్యంత మాసియాఖండమునందలి యే స్వతంత్రపరిపాలకుఁడును గావించియుండలేదు. ఇతఁడు పోయినచోటునం దంతయు నితనికిఁ గల్పనాతీతము లగు సమ్మానములు జరగినవి. అందు ఫ్రాన్సు, బ్రిటన్ దేశములు రెండును ఒకదాని నొకటి మించులాగున సమ్మానింపవలె నని ప్రయత్నించియుండెను.

యూరోపియా భ్రమణమువలన నితని కమిత మగు లాభము కలిగె ననుటయందు సందియము లేదు. టర్కీ మొదలగు రాజ్యములందలి ఉత్తమ పరిపాలనాప్రణాళికలఁగాంచుటవలన స్వదేశమునుగూడ నవి త్వరితకాలమున నున్నతస్థితికిఁ దీసికొనిరావలయు నను ఇతని యుత్కటాభిలాష మితి మీఱిపోయెను.

కావున ౯, ౧౦ నెలలకాలము విదేశపర్యటన మొనరించి ౧౯౨౮-వ సంవత్సరము సెప్టెంబరు నెలలో స్వదేశమునకు మరలి వచ్చినతోడనే ఇతఁడు తాను పూర్వ మారంభించిన సంస్కారముల నన్నింటిని వెనుకటికంటెఁ బదిమడుంగు లెక్కువ తీవ్రముగ నలుపసాగెను. పురుషు లందఱును యూరోపియనులవలె దుస్తుల ధరింపవలయు ననియు, స్త్రీ లెంతమాత్రము ఘోషాపద్ధతులఁ బూనఁగూడ దనియు శాసించెను. తగినంత విద్యాప్రచారము లేకపోవుటచే నాగరకతయం దెంతయో వెనుకఁబడిపడియుండిన దేశవాసు లనేకు లిందులకు విరోధు లగుట సంభవింప నితని యుత్కృష్టప్రయత్నము లన్నియు విషమునం బడిన పాలవలె విషముగనే పరిణమించినవి. అందువలన దేశమునం దంతటను విద్రోహాగ్ని చెలరేఁగి జాజ్వల్యమానముగ వెలిఁగెను. ఈ తిరుగఁబాటు ౧౯౨౮-వ సంవత్సరమున షిన్వారీల విద్రోహముతో నారంభమై క్రమముగ దేశమంతట నల్లికొని ౧౯౨౯-వ సంవత్సరము, అక్టోబరుమాసమున శాంతి నొందెను.

అఫ్గాన్ దేశమందలి జనసమూహము నంతయు మూఁడుభాగములుగ చేయవచ్చును: ౧. ముల్లాలు లేక పీరులు. వీరు మతగురువులు. ధార్మికవిషయములందు వీరికి పలుకుబడి యెక్కువ. ౨. సేనావిభాగమునకుఁ జెందిన ప్రజావర్గము. 3. మిగిలిన నానావిధజన సముదాయము. ఒక్కపర్యాయముగ నీ మూఁడు తరగతుల జనులకును అసంతుష్టిని కలిగించు విషయములు ఘటిల్లుటచేతనే ఈ తిరుగఁబాటు సంభవించె నని చెప్పవచ్చును.

విద్యావిధానములందు మార్పులను జేయుటవలన ముల్లాలజీవనోపాయముల కపాయము గలిగె నని మీఁద వ్రాయఁబడినది. అదికాక నవీనశిక్షితు లందఱును మతగురువు లగు ముల్లాల ధార్మికోపదేశములను జెడచెవినిఁ బెట్టసాఁగిరి. హబీబుల్లాకాలమునుండియు నీముల్లాల కండ ఱకు నొకవిధ మగు పెన్షను ముట్టుచుండెను. అమానుల్లాఖాను వాని నన్నింటిని రద్దు చేయించెను. బోల్షివిక్ ప్రచారమువలన రషియన్ తుర్కిస్తానములోని ముల్లాలు స్వవృత్తులఁ బోఁగొట్టుకొని అఫ్గానిస్తానమునఁ బ్రవేశించి జీవనోపాధులఁ గల్పించుకొనుచువచ్చిరి. అమానుల్లాఖాను యూరోపుభ్రమణమునుండి తిరిగివచ్చినతోడనే రషియన్ తుర్కీనుండి వచ్చిన ముల్లాల నాశ్రయ మియ్యరా దని యుత్తరువు చేయించెను. ఉపర్యుక్తహేతువులవలన ముల్లాలును, వారియెడల సహానుభూతి కల పూర్వాచారపరాయణులును మిక్కిలి కుపితులై సమయము దొరకినయెడల పగ దీర్చికొన వేచియుండిరి. సైనికశిక్షణము నిర్బంధము గావింపఁబడె నని మీఁద వ్రాయఁబడినది. సైనికు లెప్పుడైన ముల్లాలయొక్కయు, పీరులయొక్కయు

sampath_Ebooks



ఆజ్ఞల నిర్వహింపవలసివచ్చునెడల సర్కారువారి యనుమతిని పొంద వలసియుండెను. ఇదియు ముల్లాలకు కోపకారణమే యయ్యెను. సైనికులను తరిఫీదుచేయునిమిత్తము తుర్కీదేశమునుండి ఆఫీసరులను బిలిపించి వారిని సేవయందలి ప్రధానోద్యోగములందు నిలిపి దేశీయులను వారిక్రిందఁ బనిసేయులాగునఁ గావించెను. ఈ కారణములవలన సేనాసంబంధు లగు వారిలో నసంతృప్తియు, నలజడియు జనించినవి. ఆర్థికవిషయములం దించుక శైథిల్యమేర్పడ నూతనము లగు పన్నులు కొన్ని కల్పింపఁబడినవి. పరిపాలనకార్యమందలి ముదుసలు లగు వారి కందఱకును విశ్రాంతి నొసఁగి వారి స్థానములం దితఁడు యూరోపు మున్నగు విదేశములలో విద్య నభ్యసించి వచ్చిన యువకుల నేర్పాటు గావించెను. పైని వచించిన వేర్వేఱుకారణములవలనను, స్త్రీలకు యూరోపువనితలకుం బోలె స్వేచ్ఛాస్వాతంత్ర్యములను బ్రసాదించుటవలనను విద్యాగంధము లేని అఫ్ గాన్ ప్రజాసామాన్యమంతయు సంక్షుభిత మైయుండెను. దీనికిఁ దోడుగ దేశమందలి వివిధజాతుల వారును పరస్పరవైమనస్యములనుఁ బూనియుండిరి. ఇదికాక సున్నీ, షియా పంథల ముసల్మానులు కలహమునకుఁ గాలు దువ్వుకొనుచుండిరి. దేశ మంతయు లోలోపల నిట్లు సంచలితావస్థయం దుండుటచేత నే దేశహితమున కని యమానుల్లాఖాను సలుపఁదొడఁగిన సంస్కారము లన్నియు విపరీతములుగఁ బరిణమించి తుద కితనిని రాజ్యభ్రష్టునిఁ గావించినవి.

ఉన్నటు లుండి ౧౯౨౮-వ సంవత్సరమున నవంబరునెలలో జలాలాబాదు ప్రాంతమందలి షిన్వారీ తెగవారు తిరుగఁబడి సర్కారు కార్యాలయములు లోనగువానిం దగులఁబెట్టిరి. అమానుల్లాఖాను ప్రభుత్వమును, సైనికులును చేయఁగడఁగిన ప్రయత్నముల ఫలమున నీ విద్రోహ మొకప్పుడు శాంతించుచు, మరల మరలఁ జెలరేఁగుచు డిసెంబరు ౧౨-వ తారీఖునాఁటికను జారీ యైయుండెను. ఇదేసమయమున నీ విద్రోహవాయువులు పూర్వవర్ణితము లైన యసంతుష్టిప్రదేశములందు ప్రసరించి పని చేయసాగినవి. మీఁద వచించిన కారణములవలన విముఖత్వ మూనియుండిన జాతులవా రందఱును కాబూలునగరమునకుఁ దూర్పునను, దక్షిణమునను జెలరేఁగి యమానుల్లాఖాను ప్రభుత్వముపైఁ దిరుగఁబాటు గావింప ప్రోత్సహించుకొనువారును, పరస్పరము కలహించుకొనువారునై దేశ మంతయు కల్లోలము గావింపసాగిరి. చక్కెర, కాగితముల కర్మాగారముల నిమిత్తము విదేశములనుండి బృహదాకారముగల యంత్రము లీ దేశమునకు వచ్చెను. ద్వేషపూరితు లగు మతగురువులు, పీరులు గలసి ఖురాన్ షరీఫ్ ఆజ్ఞానుసారము శవములను భూమియందుఁ బాతిపెట్టుట మాని యీయంత్రములందుఁ బడవైచి తగులఁబెట్టించెద రని అమాయికులు, మూఢులు, విద్యావిహీనులు నగు జనులకు బోధించి వారి నందఱి నమానుల్లాపైఁ గత్తిగట్టఁ బ్రోత్సహించిరి.

ఇట్లు దేశ మంతయు సంక్షుభిత మగుచున్నతరుణమున బచ్చాసాకో యనుపేరుగల బందిపోటుదొంగలనాయకుఁ డొకఁడు రాజద్రోహులై ప్రభుత్వమున కెదురుతిరుగ నుద్యుక్తులూరుచుండిన అఫ్ గానుల నందఱను ప్రోవుచేసికొని యమానుల్లాఖానునకు ప్రతినాయకత్వమును వహించెను. ఇతఁ డుత్తరసీమలయందలి కల్కాన్ ఇలాకాయందలి థకున్నామక గ్రామవాసి యగు నొక గొఱ్ఱెలకాపరి కొడుకనియు, మొదటినుండియు నీచవృత్తుల కలవాటుపడి, తుదకు దొంగలకు సర్దారయ్యె ననియు ననేకుల యభిప్రాయము. ఇతఁడు ఘనమును, పవిత్రవంతము నగునొక సయ్యదువంశ సంజాతుఁ డని మతి కొందఱు దలపోసియుండిరి. కాని యనంతరకాలమున నితఁ డగపఱిచిన క్షుద్రవర్తన మితఁ డట్టి సద్వంశజాతుఁ డనుటకు సందియము కలుగఁజేయుచున్నది. మహమ్మదీయమతమును నాశనము చేయఁ బుట్టిన కాఫిర్ అని అమానుల్లాఖానును నిందించుచు, తా నా ధర్మమును బునరుద్ధరింప జనించిన పైగంబరను అని డంబములను గొట్టుకొనుచు ముల్లాల నందఱను దన పక్షమున కాకర్షింపఁ గలిగెను. ఇతఁడు విప్లవకారుల నందఱను వేనవేలుగఁ గూర్చుకొని కాబూలును జయింపవలె నని తిన్నగఁ దన్నగరాభిముఖుఁడై నడవసాగెను. నిజమున కితఁడు నిరక్షరకుక్షి, మూర్ఖుఁడు, అవినీతిపరుఁడు అని ఇతఁడు కాబూలుపట్టణమునఁ జేసిన యత్యాచారములు, హింసలు ప్రబల సాక్ష్యములు. కాని విపరీతవర్తనాన్విత యగు రాజ్యలక్ష్మి ఒక్క సంవత్సర మంతయు నితనినే వరించియుండెను. దేశమందలి యిట్టి పరిస్థితులను గమనించి యమానుల్లాఖాను తాను గావించిన సంస్కారములను గొన్నింటిని రద్దు చేయించెను. కాని యప్పటికే పరిస్థితులు మితిమీఱిపోయినందున నతనిప్రయత్నము లేమియు సాగవయ్యెను. అంతే ౧౯౨౯-వ సంవత్సరము జనవరి మాసమున రాజ్యసింహాసనమును తనసోదరుఁ డగు ఇనాయతుల్లాఖానుపరము చేసి అమానుల్లాఖాను కంధహారమునకు వెడలిపోయెను. గాంధార ప్రాంతీయు లితనిపక్షమును వహించి బచ్చాతో యుద్ధ మొనరింప సంసిద్ధులైరి. కొలఁదిదినములకే ఇనాయతుల్లాఖానుసైతము కాబూలును విడనాడి కంధహారముఁ జేరవలసినవాఁ డయ్యెను. ఇంతలో బచ్చాసాకో తనమూఁకలతో కాబూలుపట్టణమును జయింపఁగల్గెను. రాజధాని తనవశ మైనది మొదలుకొని హబీబుల్లా ఖాను అనుపేరు పెట్టుకొని బచ్చా రాజ్యపాలనము గావింప మొదలిడెను. ఇతని ప్రభుత్వమునుగూర్చి వేఱుగ వర్ణించు టనవసరము. అమానుల్లా ప్రభుత్వప్రణాళిని దిన్నగఁ దలక్రిందులు గావించె నని చెప్పినఁ జాలును. అట కంధహారమునందమానుల్లాఖాను కొంత సేనను సమకూర్చుకొని బచ్చాను వెడలఁగొట్టుటకుఁగాను గజినీపట్టణమునకుఁ బోయి యచట మకాము గావించియుండెను. ఇదేసమయమునఁ బూర్వము అమానుల్లాక్రింద సర్వసేనాధిపతిగఁ బనిచేసి, కొంతకాలము ఫ్రాన్సులో అఫ్ గాన్ మంత్రిగ నుండి యనంతరము దేహారోగ్యము తప్పుటచే నప్పటికి పారిస్ నగరమున విశ్రాంతిని గైకొనుచుండిన నాదిర్ ఖాన్ అనునతఁడు తనదేశమునందలి విద్రోహమును గూర్చి వినినతోడనే తన ముగ్గురు సోదరులతో హిందూదేశమునకు వచ్చి హైందవ శుభేచ్ఛా సద్భావపూర్వకముగ

sampath_Ebooks

స్వదేశము నుద్ధరింప సమకట్టెను. ఇతఁడు పెషావరుమీఁదుగ ఖోస్ట్ ప్రాంతముఁ జేరి సేనాసన్నాహముల నందు గావింప దొరఁకొనెను. తక్కిన ముగ్గురు సోదరులును వేఱువేఱుదిక్కులకుఁ బోయి సేనల సమకూర్ప మొదలిడిరి. అనేకస్థానములందు వీరి కపజయములును, అవమానములును గల్గెను. కాని ధైర్యోత్సాహముల వీడక నాదిర్ ఖాను తూర్పుదిక్కునుండి రాజధానికి నభిముఖుఁడై ముందునకే సాగిపోవుచుండెను. ఇక్కడిసమాచారము లిట్లుండ నట గజనీయొద్ద నున్న అమానుల్లాఖానుసేనలం దంతఃకలహములు జనించెను. వేర్వేఱు తెగలవారు పరస్పరము పోరాడసాగిరి. అమానుల్లాఖానునకు వీరిని సమాధానపఱుచుటయే దుర్ఘట మయ్యెను. ఇట్టిసేనతో శత్రువులపై జయము గాంచుట అసంభవ మనియో లేక తనయునికియే ఈ కలహముల కన్నింటికిని గారణ మని తలంచియో ఇతఁ డాకస్మికముగ రణరంగమును విడనాడి, కంధహారమును తన సోదరుఁడగు అలీ అహమద్ జాన్ అనునతనిపరము చేసి స్వపరివారసమేతముగ మే నెలలో చమనుస్టేషనునొద్ద రైలు నందికొని క్వెట్టా, ఢిల్లీ నగరముల మీఁదుగా బొంబయి చేరి యచటనుండి ఇటలీకి వెడలిపోయెను. ఇనాయతుల్లాఖాన్ మున్నగు మఱికొందఱు పర్షియాదేశమునకు వెడలిపోయిరి.

నాదిర్ ఖాను (౧౯౨౯) — ఇట నాదిర్ ఖాను దేశమున రక్తపాతము లేకుండ బచ్చాసాకోను రాజ్యమునుండి తొలఁగింపఁ బ్రయత్నము లొనరించెను. కాని ఇతని మనోరథము సిద్ధింపదయ్యెను. నాదిర్ ఖాను శాంతికిని, సమాధానమునకును బ్రయత్నించుచుండ, బచ్చాసాకో ఇతని తలను ఖండింపఁబనిచి దానిని దెచ్చినవానికి మంచి బహుమాన మియ్యఁబడు నని ఘోషణము కావించెను. అంత యుద్ధము దక్క వేఱొండుమార్గము లేనందున నాదిర్ ఖానును, అతని సోదరులును దాము ప్రోవుచేయఁగలిగినన్ని సేనలను గూర్చికొని కాబూలుమీఁదికి తలకొకమార్గమునఁ బోఁదొడఁగిరి. ఇదే తరుణమునందు మాస్కో నగరమున అఫ్గాన్ మంత్రిగ నుండిన గులాం నబీఖాన్ అనునతఁడు తనకు దగ్గఱగ నున్న అఫ్గాన్ తుర్కిస్తానముం జేరి యచట రాజపక్షావలంబు లగు హజారాజాతివారిని సమకూర్చుకొని యుత్తరమునుండి కాబూలును ముట్టడించుటకు రాఁదొడఁగెను.

ఈప్రకారము నాలుగుప్రక్కలనుండియు ఆక్రమణప్రయత్నములు జరుగుచుండినను ఒకరివార్త మఱియొకరికిఁ దెలియకుండెను. నాలుగువైపులనుండియు నుపక్రమించి బచ్చాను బట్టికొనవలయు ననియే నాదిర్ ఖానుయొక్క అభిప్రాయము. బచ్చాపక్షము నవలంబించినవారు క్రమక్రమముగ నాదిర్ ఖాను ప్రక్కకు మరలిరాసాగిరి. చిన్నచిన్న పోరాటములు సలిపియు, నుపదేశముల నొసంగియు, సభల నొనరించియు నితఁ డనేకజాతులను మరలఁ దనపక్షమునకు రాఁబట్టుకొనెను. ఇటులే నాదిర్ ఖానుసోదరులును ప్రయాణముల సలుపుచు కాబూలును సమీపించిరి. చివరకు అక్టోబరు ౮-వ తారీఖున నాదిర్ ఖానుసోదరులలో నొకఁ డగు షావలీఖాను కాబూలును ముట్టడించి లోఁబఱచికొనెను. అంత బచ్చాసాకో కొన్నిదినములపర్యంతము కాబూలునందలి ఆర్క్ నామకదుర్గమున బందీకృతునివలె నుండి తుదకు ఆకోటకుఁ గన్నము వైచి దానిద్వారా పాఱిపోవుటకై ప్రయత్నించెను. కాని విఫలుఁడై శత్రువులచేతఁ జిక్కువడెను. నాదిర్ ఖానున కితనిని జంపించు నుద్దేశ మున్నదో లేదో తెలియదు. బచ్చా యనుచరసమేతముగఁ బట్టువడి నాదిర్ ఖానునధీనమున నుండ నొకనాఁ డొకవిందు జరగెను. అందు బచ్చాసైతము ఆహ్వానింపఁబడి నాదిర్ ఖానుచే సమ్మానితుఁ డయ్యెను. ఆతరుణమున బచ్చా సలిపియుండిన క్రూరాత్యాచారముల మూలమున నత్యంతరోషావేశులై సమయమునకు వేచియుండిన అఫ్గాన్ వజీరు లతనిని, అతని యనుచరులను బంధించి కొనిపోయి ఆర్క్ దుర్గముయొక్క అగడ్తలో కొన్నిదినములక్రిందటనే అలీమహమ్మద్ జాను ఏప్రదేశమున బచ్చా-ఆజ్ఞల ప్రకారము వధింపఁబడెనో అదే ప్రదేశమున బచ్చాప్రభృతులను బడనెచి తుపాకులతోఁ గాల్చి చంపి యావల నాకళేబరములను కాబూలు నగరవీథులందు వ్రేలాడఁగట్టించిరి. ఈప్రకార మీ నవమాసమంత్రపు సిరి నందిన బచ్చా ఎంతత్వరితముగ విజృంభణ మందెనో యంతత్వరితముగ పతనమును బొందెను. నాదిర్ ఖాను మొట్టమొదటనుండియు జనులయొన్నిక ననుసరించి అఫ్గాన్ దేశపు పాలకుని నియమింపవలయు నని అభిప్రాయము గలిగియున్నందున నట్టి సమావేశమునకై ప్రయత్నింపసాగెను.

అనంతరము అఫ్గాన్ జాతీయసమితి (National Assembly)వారును, వివిధజాతుల ప్రతినిధులును సమావేశమై నాదిర్ ఖానునే సింహాసన మధిష్ఠింప వేఁడుకొనిరి. ఇతఁ డందుల కిష్టము లేకపోయినను, ప్రజలకోర్కెను దిరస్కరింపఁజాలక రాజ్యభారమును వహించెను. తరువాత నితఁడు నిండుదర్బారునందు ప్రజల కుపదేశము నొసంగుచు ప్రసంగవశమున అమానుల్లారాజ్యకాలము అఫ్గాని-ఇతిహాసమున స్వర్ణాక్షరములతో లిఖింపఁబడు ననియు, అతఁడు గావించిన నీతి నియమాదులను, రాజ్యప్రణాళిని అనుసరించియే ముందును రాజ్యము కావింపఁబడు ననియు వాగ్దానము సలిపెను. అటుపిమ్మట కోహిడమన్ మున్నగు కొన్ని ఇలాకాలనుండి విద్రోహవార్తలు రాసాగినవి. కాని నాదిర్ ఖాను వాని నన్నింటిని జయపూర్వకముగ నడఁచివైచెను. అంతట యూరోపులోని ప్రభుత్వములును, ఇండియాదొరతనమువారును నాదిర్ఖానును అంగీకరించి తమతమ రాయబారులను అఫ్గాన్ దర్బారునకుఁ బంపిరి. నాదిర్ ఖాను అప్రమత్తుఁడై స్వదేశముయొక్క భాగ్యోదయమునకై సకల విధములఁ బ్రయత్నముల సలుపుచున్నట్లు వార్తాపత్రికలవలనఁ దెలియుచున్నది.

**అఫ్జలుద్దీకామీర్** — సూరతునవాబులలో నొకఁడు. క్రీ. ౧౯-వ శతాబ్దియం దితఁడు ఇరువదియొక్కయేండ్లు రాజ్యమేలెను.

**అఫ్జలుద్దౌలానవాబు** — హైదరాబాదు నిజాములలో నొకఁడు. నసీరుద్దౌలా కుమారుఁడు. క్రీ. శ. ౧౮౫౭-వ సంవత్సరమున సింహాసన మెక్కెను. క్రీ. శ. ౧౮౬౯-వ సంవత్సరమున నితఁడు మరణించెను.

**అఫ్జల్‌ఖాన్** — ౧. అక్బరుచక్రవర్తికిఁ బ్రాణప్రియమంత్రియైన అబుల్‌ఫజల్ అనువానికుమారుఁడు. జహాంగీరు రాజ్యకాలమున క్రీ. శ. ౧౬౧౦ లో నీతఁడు బీహారుదేశమునకు సుబేదారుగ, ననఁగా గవర్నరుగ నుండెను. క్రీ. శ. ౧౬౧౩ లో ఆగ్రాపట్టణమున మృతుఁ డయ్యెను.

౨. షీరాజ్ దేశజుఁడు. మొదట నితనిపేరు ముల్లాషుక్ర్ ఉల్లా. తండ్రిపేరు అబ్దుల్‌హక్. జహాంగీరు చక్రవర్తి యీతనికి అమీర్ పదవి నిచ్చెను. ౧౬౨౮ లో నీతనికి విజారత్ ఇకుల్ అనువధికారమీయఁబడెను. ౧౬౩౮ లో ౭,౦౦౦ల పదాతులకును, ౪,౦౦౦ల గుఱ్ఱములకును మన్సబుదారాయెను. డెబ్బదియేండ్లు బ్రతికి ౧౬౩౯ లో ఆగ్రాపట్టణమున మరణము నొందెను. ఈతఁడు కవిత్వము చెప్పువాఁడు. అల్లామి యన్నది కవిత్వసంబంధమైన యీతనినామము.

౩. విజాపురపు నవాబులయొద్ద నుండిన యొకసరదారు. ఇతఁడు మహమ్మదు ఆదిల్‌శాహయొక్క దాసీపుత్త్రుఁ డని కొందఱు వ్రాసియున్నారు.[1] వాఈ యనుప్రాంతమునకు నితఁడు సుబేదారుగ ౧౬౪౪ మొదలు ౧౬౫౯ వఱకు నుండెను. శివాజీతండ్రియైన శహాజీకిని వీనికిని వైరము కలదు. శహాజీ పెద్దకుమారుఁడును శివాజీకి నన్నయు నగు సంభాజీ కర్ణాటకయుద్ధములో కనకగిరిని పట్టుకొనుటకై పోరాడుచున్నప్పుడు అఫ్జుల్‌ఖానునిమోసమువలన నాతఁడు చంపఁబడెను. ఈతఁడు విజాపురపునవాబునొద్ద శివాజీని బట్టి తెచ్చెద నని ప్రతిజ్ఞ చేసి ౧౬౫౯ సెప్టెంబరునెలలో బయలుదేఱెను. అప్పుడు శివాజీ రాయగడముమీఁద నుండెను. అఫ్జుల్‌ఖాను పూనామీఁదికి రాకుండఁ దగినయేర్పాట్లు చేసి యాతఁడు ప్రతాపగడదుర్గముమీఁదికిఁ బోయెను. శివాజీ ప్రతాపగడముమీఁద నున్నాఁ డని విని అటు వెళ్లవలె నని అఫ్జుల్‌ఖాను పంఢరపురము, తుళజాపురము, మాణకేశ్వరము, కరకముబోనే, శంభుమహాదేవము, మలవడి, రహిమతపురము అను గ్రామములమీఁదుగ వాఈపట్టణముం జేరెను. పంఢరపురములోనివిఠలదేవుని, తుళజాపురమున భవానీదేవిని విధ్వంసము చేసెను. ఇందుచే హిందువులకు నాతనిపై మిక్కిలి కోపము వచ్చెను. వాయిూఁ జేరి యాతఁ డాగ్రామము నకుఁ గులకరణి (కరణము) అయిన కృష్ణాజీభాస్కరుఁ డనువానిని శివాజీయొద్దకుఁ బంపెను. శివాజీయుఁ దనగుమాస్తాయైన పంథాజీగోపీనాథుని ఖానునియొద్దకుఁ బంపెను. తాను భయపడితి ననియు, విజాపురపునవాబునొద్దకు వచ్చెద ననియు శివాజీ ఖానునకు వర్తమాన మంపెను. ప్రతాపగడముక్రిందను అఫ్జుల్‌ఖానును, శివాజీయు మొదటను గలసికొనునట్లు ఏర్పాటు జరగెను. అందుకై యొకమండపము కట్టఁబడెను. శివాజీ ఆనఖశిఖము కవచమును దొడుగుకొని తానాజీని వెంటఁ దీసికొని వచ్చెను. ఖానును ఒక్కబంటుతోడనే పల్లకి నెక్కి వచ్చెను. ఇద్దఱును మొట్టమొదట కౌఁగిలించికొనినప్పుడు ఖాను శివాజీని తనయెడమచంకలో నొత్తిపట్టి కత్తిపోటు వేయఁబోఁగా శివాజీ తనచేతనున్న పులిగోళ్లతో ఖానుపొట్టలో గ్రుచ్చెను. అంత మోసము మోస మని ఖాను అఱచి శివాజీనెత్తిమీఁదఁ గత్తిదెబ్బ వేసెను. కాని శిరస్త్రాణ మున్నందున నాదెబ్బ వ్యర్థమయ్యెను. ఇంతలో శివాజీ తనకత్తితో ఖానునిభుజముపై దెబ్బతీసి పొట్టఁజీలుఁజీల్చెను. అంత ఖాను గతప్రాణుఁడై నేలఁ బడియె. ఖానుని సేనకు గును పల్లకిలో వేసికొని బోయీలు తీసికొనిపోవఁజొచ్చిరి. కాని శివాజీసైనికులు బోయీలను జంపి ఖానుతల ద్రుంచి కోటమీఁదికిఁ దీసికొనిపోయిరి.

౪. ఒకపారసీకకవి. ఇతని పూర్తియైననామము మీర్‌మహమ్మద్ అఫ్జుల్. ఈతఁడు ఢిల్లీచక్రవర్తియైన మహమ్మద్‌షాహకాలమం దుండెను. క్రీ. శ. ౧౭౩౯ లో మృతుఁ డయ్యెను.

**అఫ్జుల్‌గడము** — యునైటెడ్ ప్రావిన్సెస్ (ప్రయాగరాజధానిలోని) బిజ్నూరుజిల్లా, నాగీనాతాలూకాలోని యొకగ్రామము. జనసంఖ్య ౬,౪౬౪. ఇచ్చట నొకకోటను పదునెనిమిదవశతాబ్దిమధ్యకాలమున అఫ్జుల్‌ఖాను అనువాఁడు కట్టించెను. ౧౮౫౭ లో తిరుగఁబాటుకాలమున ఈకోట పడఁగొట్టఁబడెను. ఇచ్చట మంచి నేఁతబట్టలు దొరకును.

**అఫ్సర్** — బీహారులోని గయాజిల్లా, నవడదివిజన్‌లోనియొకపల్లె. దీనిజనసంఖ్య ౧,౦౨౨. ఇది చిన్నపల్లెయైనను పూర్వచరిత్రనుగుఱించి దీనికి ఖ్యాతి వచ్చెను. ఇచ్చట గుప్తరాజులు రాజ్యము చేసిననాఁటి వరాహవిగ్రహ మొకటి దొరకెను. దీనిమీఁద నద్భుతమైన పనితనము చూపఁబడినది. చూచుటకు చాల సొగసుగ నున్నది. ఉత్తరగుప్తరాజులవంశమును వర్ణించు శాసన మొకటి యిచ్చట దొరకినది. ఇచ్చటఁ బాడిపోయిన పూర్వకాలపు దేవాలయ మొకటి కలదు. దీనియొక్క చెక్కడముపని బీహారుదేశమునందలి యితరదేవాలయములమీఁదిపనికంటె నెంతయో దర్శనీయముగ నున్నది.

---

1. మరాఠీ రియాసత్, (మరాటిభాష), రెండవకూర్పు ౩౪౨ పుట.
2. Inscriptions of the Early Gupta Kings and their successors by J. F. Fleet.

sampath_Ebooks

**అఫ్రీదీలు** — పఠానులందలి ఒకశాఖీయులు. మిగుల బలశాలులు. కోహట్, పెషావరు లోయలును, తిరాపీఠభూములును గల సఫేద్‌కోహపర్వతములయొక్క తూర్పువైపునందలి శాఖలన్నియు వీరినివాసభూములు. వీరిప్రదేశములకు ఉత్తరముగ కైబర్ కనుమ వ్యాపించియున్నది. తిరాపీఠభూమి సముద్రతలమునమండి సుమారు ౬, ౭ వేల అడుగుల ఎత్తు కలిగియుండును. దీనివైశాల్యము ౬ లేక ౭ వందల చదరపుమైళ్లు. ఇందు మైదాన్, రజ్‌గుల్ వరన్, బరా, మస్తురా అనుపేరులుకలవి జననివాసయోగ్యములైనవి అయిదు లోయలు కలవు. వీనిలో మైదాన్, మస్తురానామకకందరములు ౬,౦౦౦ల అడుగులకంటె నెత్తయి మిగుల మనోజ్ఞము లైయుండును. ఇంత ఎత్తును, దుర్గమమును, అరణ్యమయమును నగుపీఠభూమి యయిన కారణముననే ఇతరులదండయాత్రలకు లోనుగాకుండెను. అఫ్రీదీ ప్రాంతములకు నాలుగుప్రక్కలను పెషావరుజిల్లా వ్యాపించియున్నది. ఉత్తరమున మోహమండులు, పడమట షిన్వారీలు, దక్షిణమందలి బరా, బజర్‌కనుమలందు ఓరక్‌జాయిలు, బంగషు లను జాతులు వాసము చేయుచున్నవి.



అఫ్రీదీ

అఫ్రీదీలయుత్పత్తినిగుఱించి నిజమైన విషయము లేవియును తెలియవు. ఇస్రాయేల్ వంశజాల మని వీరు చెప్పుకొనుచుందురు. వీరి రూపరేఖలు సెమిటిక్ జాతికిఁ జెందిన యూదులవలెనే యుండును. హెరొడొటస్ వీరిని అపరితయి (Aparytai) లని పేర్కొని యుండెను. ౨,౦౦౦ ల క్రిందటివల వీరినిగుఱించిన వృత్తాంతవిశేషము లేమియు దొరకవు. కాని ౧౬-వ శతాబ్దిప్రాంతమున వీరు తిరా ప్రదేశము నాక్రమించుకొనిరి. కొంతకాలమున కాచుట్టుప్రక్కల నుండు మఱికొన్నిజాతులవారు వీరి నోడించి యాప్రాంతమునందలి కొన్నిభాగములను వశపఱుచుకొనిరి. జహాంగీరుకాలమున ఓరక్‌జాయిల జయించి వారినుండి తమప్రాంతము లన్నింటిని బడయఁగల్గిరి. అక్బరుకాలమున వీరు నింద్యమగు రోషానిరూనామక మతము నవలంబింప నది అడఁచివేయఁబడెను.

కూకీఖేల్, మలిక్‌దీన్‌ఖేల్, కంబర్‌ఖేల్, కమర్‌ఖేల్, జక్కాఖేల్, సిపహ్, అకాఖేల్, ఆడంఖేల్ అని అఫ్రీదీలలో నెనిమిది అంతర్భాగములు కలవు. ఆడంఖేలులు కోహట్‌లోయయందును దానిచుట్టుప్రక్కలను నివసించుచుందురు. సాధారణముగా వీరు స్వస్థానములను వదలరు. తక్కిన తెగలవారు కైబర్‌కనుమయందును, పెషావరుచుట్టుప్రక్కలను నివసించుచు నెండకాలమున తిరాపీఠభూమియందలి శీతలప్రదేశములకు వెడలిపోవుచుందురు. వీరు మిగుల స్వాతంత్ర్య స్వభావమును గలిగియుందురు. ఒకరియధీనమున నుండుటకు సమ్మతింపరు. వీరికి నామమాత్రమున కొకసర్దారు ఉండును గాని రాజకీయ విషయము లేమైన వచ్చినచో ఎవరిమతము వారిదే. వీరియందేదైన వివాదము సంభవించినయెడల దానిని దీర్చుటకు సర్దారునకును శక్యము గాదు. ఈకారణమున దోపిడిగాండ్రను వీరినుండి పట్టుకొనుటకే వలనుకాదు. వీరిచేత నియమముల నవలంబింపఁజేయుటకు వీలు లేదు. దేహఘటనమునందు వీరు మంచి ఒడ్డుపొడుగును గలిగియుందురు. దృఢగాత్రులు; విశాలముఖులు, ఉన్నతనాసులు, విశుద్ధమగు శరీరచ్ఛాయను గలిగియుందురు. స్వదేశపుపర్వతములందు యుద్ధమొనరింప నిపుణులు. కాని అన్యప్రాంతముల కేఁగినచో సాధారణముగా రోగముపాలగుచుందురు. కపటమునకు స్వార్థమునకుఁ బుట్టినిండ్లు-ఒకరిని విశ్వసింపరు. క్రూరులు. కాని నమ్మకమిచ్చినయెడల నొకరిని రక్షించుటకు స్వకీయప్రాణములనైన వదలుదురు. బ్రిటిష్‌సేనలందు నౌకరులుగఁ గుదిరి వారిని మెప్పించినవారనేకులు కలరు. హిందూస్తానపుసీమలనుండి వీరు నివసించు ఇలాకాకు సుమారు ౪౦ మైళ్లుండును. అత్యున్నతములు, దురారోహములునైన హేతువున ఫిరంగులు మున్నగువానితో వీరిస్థానములకుఁ బోయి పోరాడుట కష్టము. ఈకారణమున నితరులవలనిభయము లేశమైనను లేక నిరంకుశులై వర్తింపుచు ఉండియుండి బ్రిటిష్‌ఇలాకామీఁదఁబడి దోచుకొనుచుందురు. ధనాఢ్యులగు ప్రజలను దొంగతనముగఁ దమప్రదేశములకుఁ గొంపోయి చంపెద మని బెదరించి వారినుండి పుష్కలముగ ద్రవ్యమును లాగి విడిచిపుచ్చుచుందురు. ఒకొక్కప్పర్యాయము సింధునదిలోని నౌకలమీఁదఁ బడి దోచికొనిపోవుచుందురు. లోయ లన్నియు వీరియధీనమం దుండుటచే వానిమార్గమున నెట్టియపాయము కాని కలుగకుండ

sampath_Ebooks

ప్రయాణములను గావించుకొనునిమిత్తము ప్రాచీనకాలమునుండి ఈ ప్రాంతముల నేలినరాజులు వీరికి కొంత సహాయకవేతనముల నిచ్చి తమ వశమున నుంచికొనుచువచ్చిరి. గజనీరాజులు, మొగలులు, దురానీలు, సిక్కులు మొదలగు ప్రభుత్వము చేసినవారందఱును సహాయకవేతనము లొసంగుచువచ్చిరి. కాని సభ్యత, సౌజన్యము లనునవి వీరియందు నితాంత మభావము లగుటచే వీ రెవరితోడను సద్భావమున వర్తించి యుండలేదు. వీరిలో చురూత్ ఖాన్ అనునతఁడు మిగుల ప్రసిద్ధి కెక్కియుండెను. శాహషూజా ఇతనికొమార్తెలయం దొకతెను పెండ్లాడియుండినందున నతఁడు భారతవర్షమునుండి పరుగిడిపోయి నప్పుడు, చురూత్ ఖాన్ గృహమందు దాఁగియుండెను.

అక్బరురాజ్యకాలమున వీ రందఱును మహమ్మదీయవ్యతిరిక్తమైన మతము నవలంబించియుండిరి కాని కాలక్రమమున నది యడఁచివేయఁ బడినది. పిదప వీ రందఱును మొగల్ సేనలోఁ జేరినందున సహాయక వేతనముతోపాటు ఖైబరుకనుమయొక్క రక్షణార్థము వినియోగింపఁ బడిరి. కాని నాదిర్ షా దండెత్తివచ్చినప్పు డతని నెదిరింపఁజాలక పోయిరి. అహమద్ షా అబ్దాలీ, సిక్కులు రాజ్య మొనరించుకాలమున నా లోయలనుండి రాకపోకల సలుపువారిపదార్థములమీఁదను పన్నులను గట్టి వచ్చినమట్టునకు ద్రవ్యమును రాఁబట్టుకొనుచువచ్చిరి. ఇంగ్లీషువారు రాయిలాకాను లోఁబఱుచుకొన్నతరుణమున అఫ్రీదీలు తమ నివాసప్రదేశమునుగూడ ఆంగ్లేయరాజ్యములోఁ గలిపికొనుఁ డని వారిని వేఁడుకొనిరఁట! కాని వీరు వారిస్వాతంత్ర్యమును గౌరవింప వలెనను నుద్దేశముతో నాప్రదేశమును స్వీకొనరైరి. మఱియు పూర్వ పరిపాలకులపద్ధతి ననుసరించి ఖైబరులోయను గాపాడుటకొఱకు ఆంగ్లేయులు వీరికి సహాయకభృతి నేర్పాటు చేసిరి. కాని వీరి యంతఃకలహములమూలమున నాప్రదేశ మెప్పుడును ఉపద్రవకరమే యైయుండెను.

అఫ్రీదీలయందలి వివిధశాఖలవారితో వేఱువేఱుసమయము లందు బ్రిటిష్‌వారికిఁ బోరాడవలసినయవసరము కలుగుచున్నది. ఎట్లనఁగా :—

౧. కోహటులోయయందలి అఫ్రీదీలమీఁదను క్రీ. శ. ౧౮౫౦-వ సంవత్సరమున సర్ కాలిన్ కాంప్‌బెల్ ఒకదండయాత్ర గావించెను. పెషావర్, కోహటుజిల్లాలను బ్రిటిష్‌వారు వశము చేసి కొన్నసమయమున వీరికిని ఆదంఖేలులకును సంబంధము కలిగెను. అంతకుఁబూర్వ మాయిలాకాలను బాలించిన ప్రభువులనీతి ననుసరించి బ్రిటిష్‌వారును ఆదంఖేలులకు వారిలోయను కాపాడునిమిత్తము ద్రవ్యసాహాయ్యము చేయుటకు ఒప్పుకొనిరి. అట్లే జరగుచువచ్చెను. కాని ౧౮౫౦-వ సంవత్సరమున వేయిమంది అఫ్రీదీలు గుమిగూడి రోడ్లు వేయువారిమీఁదఁ బడి ౧౨ గురినిజంపి ఆర్గురను గాయపఱిచిరి. రోడ్లద్వారా బ్రిటిష్‌సేనలు మొదలగునవి వారినివాసస్థానములకు శీఘ్రముగను, సులభముగను చేరుటకు సదుపాయము లేర్పడును కావున వీనిని వేయుట వారి కభిమతము కాకుండెను. అప్పుడు కాంప్‌బెల్ ౩,౨౦౦ మందిసైనికులతోఁ బోయి వారినందఱను శిక్షించి యాతగవు దీర్చెను.

౨. బోరీగ్రామాదులందు నివసించుచున్న జవాకీ-అఫ్రీదీలమీఁద క్రీ. శ. ౧౮౫౩-వ సంవత్సరమున నొకదండయాత్ర జరగెను. వెనుక కోహట్‌లోయయందలి అఫ్రీదీలు తిరుగఁబడినసమయమున జవాకీలు తమమార్గమును వాడుకొనుట కిచ్చిరి. కాని తుదకు వీరు వారి కంటె దుష్టులుగఁ బరిణమించిరి. అందుచే క్రీ. శ. ౧౮౫౩-వ సంవత్సరమున ౧౭౦౦ ల మందిసైనికులు గల యొక బ్రిటిషుసేన వీరిమీఁద దండెత్తి వీరికేంద్రస్థానమగు బోరీని నాశనము గావించెను. జవాకీలు ఆదంఖేలులలోనియొక శాఖకుఁ జెందినవారు. వీరు కోహాట్‌లోయకును సింధునదికిని మధ్యఁగల దేశమున నివసించుచుందురు.

౩. క్రీ. శ. ౧౮౫౫-వ సంవత్సరమున కల్నల్ క్రెయిగ్ నాయకత్వమున అకాఖేల్ - అఫ్రీదీలపై మూఁడవదండయాత్ర జరగెను. కోహట్‌లోయయందలి అఫ్రీదీలకు దొరకినరీతిని తమకును అల పన్నులు దొరకుటకే పని ౧౮౫౪-వ సంవత్సరము మొదలుకొని పెషావరుసరిహద్దులపైఁ బడి కొల్లగొనుచు బ్రిటిష్‌సేనానివేశము నొకదానిని ముట్టడించిరి. ౧౫౦౦ ల మందిసైనికులు గల బ్రిటిష్‌సైన్యము వీరి ఇలాకామీఁదఁ బడి ధ్వంసము చేసి మహాఘోరముగ శిక్షించెను. దానితో వీరు లోఁబడి జరిమానానుగూడఁ జెల్లించిరి.

౪. క్రీ. శ. ౧౮౭౭-వ సంవత్సరమున కల్నల్ మోకట్ట యొక్క యాజమాన్యమున జవాకీలమీఁద రెండవపర్యాయము దండయాత్ర జరగెను. కోహటులోయయొక్క కాపుదలకుఁగాను వారి కొసఁగఁబడుచుండిన మాసికమును దగ్గించవలసినదిగా నాసంవత్సరమున నిండియాప్రభుత్వమువారు ప్రతిపాదనము గావించిరి. ఆకారణమున వీరు కోపావిష్టులై టెలిగ్రాఫ్‌తీగల నన్నింటిని ద్రెంపి పాఱవైచి బ్రిటిష్ ఇలాకాలోనికి దండెత్తివచ్చిరి. ౧౫౦౦ల మందిగల బ్రిటిష్ సైన్యమొకటి మీఁద వచ్చిన కల్నల్ క్రింద మూఁడుభాగములై మూఁడుప్రక్కలనుండి వీరిదేశముమీఁదఁ బడి దండనరూపమున వీరి కమితమగు నష్టమును గలిగించెను.

౫. ౧౮౭౭ - ౧౮౭౮ లందు జవాకీఖేలులపై మూఁడవదండయాత్ర జరగెను. బ్రిగేడియర్ జనరల్ కెయిస్ అనునతఁడు ఈదండయాత్రను నడపించెను. వెనుకటిదండయాత్రవలనఁ గలిగిన శిక్షణము తగినంత కఠినముగ నుండనికారణమున జవాకీలపరిస్థితులందు ఏమియు మార్పులు కలుగకపోవుటచే వారు వెనుకటిమాదిరిగనే బ్రిటిష్‌ఇలాకాపైఁ బడి దోపిడుల సలుపసాగిరి. అందుచేత వెనుకటికంటె బలమైన ౭,౪౦౦ ల సైనికులుగల గొప్పసైన్యము మూఁడుభాగములై వీరిగ్రామములమీఁదను బడి ముఖ్యమైనవాని నన్నింటిని నేలపాలు గావించి కొంతకాలము, అనఁగా వీరు సర్కారువారిమరతుల నంగీక

రించువఱకు నచటనే యుండెను. అటుపిమ్మట నేఁటివఱకును కోహటు లోయయందు మరల నెప్పుడుగాని యల్లరులు జరగియుండలేదు.

౬. క్రీ. శ. ౧౮౭౮-వ సంవత్సరమున బజర్ లోయయందలి అఫ్రీదీలమీఁద బ్రిగేడియర్ జనరల్ మైట్లర్ అనునతఁ డొకదండయాత్రను గావించెను. రెండవ అఫ్ఘాన్ యుద్ధసమయమున జక్కాఖేలులు బ్రిటిష్వారి నడ్డగించి వీరి బాహ్యనివేశనములను ముట్టడించిరి. ౨,౫౦౦ ల మంది సైనికులతో మైట్లర్ వీరి ఇలాకాయందుఁ బ్రవేశింపఁ దడఁబడును లోఁబడిపోయిరి.

౭. ౧౮౭౯-వ సంవత్సరమున బజర్ లోయలోని జక్కాఖేలులపై రెండవదండయాత్ర జరిగెను. లెఫ్టినెంట్ జనరల్ మాడ్ అనునతఁడు దీని నాయకుఁడు. మొదటిదండయాత్ర ముగిసినపిదప అఫ్ఘాన్ యుద్ధ మింకను జరుగుచుండఁగనే ఖైబర్ లోయలోని జక్కాఖేలులు బ్రిటిష్వారి పురోగమనము నాటంకపఱుపసాగిరి. అందుచే ౩,౭౫౦ మందిగల బ్రిటిష్ సేన వీరి దేశముమీఁదఁ బడి కొంత నష్టము కలిగించినపిదప వీరు లోఁబడిరి. అది మొదలుకొని క్లోహాట్ లోయయందువలె ఖైబరు లోయయందును ౧౮౯౭-౯ సంవత్సరమున జరిగిన తిరుగఁబాటువఱకును శాంతముగనే యుండెను.

౮. క్రీ. శ. ౧౮౯౭-౯౮ లందు తిరాయుద్ధము జరిగియుండెను. పశ్చిమోత్తరసీమాంత ప్రాంతములందు ఆంగ్లేయులు స్థిరపడుచున్నకొలఁదియు వందలకొలఁది అఫ్రీదీలు బ్రిటిష్ సైన్యమందుఁ జేరఁగా వారిని ఖైబర్ మున్నగులోయలందు సేనానివేశనముల నేర్పఱిచియుండిరి. ఈవిధానమున అఫ్రీదీసైనికులకో పేటములైన సేనాస్థానము లనేకము లేర్పడెను. వివాదము జక్కాఖేలులతో నారంభమై క్రమముగ నన్నిజాతులలోను వ్యాపించెను. ఓరక్జాయిలుగూడఁ గలసిరి. తిరాయందలి లోయలలోనివా రందఱును సుమారు ౪౦,౦౦౦ల మందిని ప్రోవుచేయుటకు సమర్థులైయుండిరి. వీరు ఆకస్మికముగ ఖైబరులోని సేనాస్థానములపైఁ బడి పెషావరుసమీపమందలి సమన పర్వతాగ్రముమీఁది దుర్గములను ముట్టడించిరి. అంతట సర్ విలియమ్ లాక్హార్ట్ సేనానాయకత్వమున బ్రిటిష్, దేశీయసైనికులు సుమారు ౩౪,౦౦౦ల మందిగల సైన్యము అనేకసంఘములుగఁ జీలి ఈప్రదేశపు లోయలలో నానాముఖములఁ బ్రవేశించి పెక్కుచోట్ల నఫ్రీదీల నోడించి వశవర్తులగునట్లు గావించెను. ఈయుద్ధమున హిందూదేశమునందలి దేశీయరాజులును బ్రిటిష్వారికిఁ దోడ్పడి తమకుఁగల రాజభక్తిని వెల్లడించియుండిరి.

౯. జక్కాఖేలులు మఱియొకపర్యాయము తిరుగఁబడుటచే ౧౯౦౮-వ సంవత్సరమున సర్ జేమ్స్ విల్కాక్స్ ఆధిపత్యమున మఱియొకదండయాత్ర అవసరమయ్యెను. ఇది శీఘ్రముగనే సమాప్తమయ్యెను కాని వెంటనే మోహమందుజాతివారి విద్రోహము జనింప వేఱొకపోరాట మవసర మయ్యెను (దీనివిషయమున అఫ్ఘానిస్తాన మనువ్యాసమును జూడుఁడు).

**అఫ్రొడైట్** — గ్రీకు పురాణములందు ప్రేమ సౌందర్యముల కధిష్ఠానపదము వహించిన దేవత. రోమనులందీమె వీనస్ అను పేరు గలిగియుండెను. హిందూపురాణములందలి లక్ష్మి యీమెతో సరిపోల్చుటకు కొంతవఱకుఁ దగియున్నది. ఎట్లనఁగా, మన్మథుని లక్షణములు గల 'క్యూపిడ్' యీమె కుమారుఁడు. లక్ష్మికి జన్మస్థానమైన సముద్రము అఫ్రొడైటునకుఁగూడ జన్మస్థానము. లక్ష్మీచంద్రులకు బాంధవ్యమున్నట్లు అఫ్రొడైటు చంద్రులకు బంధుత్వమే కాక వీరిరువురు నభిన్నులుగఁ దలంపఁబడిరి.



అఫ్రొడైట్

ఈ దేవత పూర్వదేశములనుండి కొనిరాఁబడిన దనియు, అసలు సెమిటిక్ జాతులవారే యీమెను కల్పించి రనియు పాశ్చాత్యుల యభిప్రాయము. సెమిటిక్కులలోని భిన్నభిన్న సంప్రదాయములవారు పూజించు దేవతాలక్షణము లీమెయందును గలవు. ఒక్క హీబ్రూలు తప్ప తక్కిన సెమిటిక్ జాతులవా రందఱును ఒక ఉత్కృష్టస్త్రీదేవతను భిన్నభిన్న నామధేయములతోఁ బూజించుచువచ్చిరి. అస్సీరియనులు ఇష్టర్ నామక దేవతను, ఫొయినీషియనులు అష్టోరత్ లేక అష్టార్టె యనుదేవతను, సిరియనులు అటర్గాటిస్ డెర్కెటో యనుదేవతను, బాబిలోనియనులు బెలేలికట్

sampath_Ebooks

మిలిట్టా దేవతను, అరబ్బులు ఇలాత్ లేక అల్ ఇలాత్ నామకదేవతను ఆరాధించుచుండిరి. చంద్రునివలన ప్రకృతియందును, తద్గత ప్రాణికోటియందును కొన్ని భౌతిక పరివర్తనములు గలుగుచుండును. అట్టిమార్పు లీ దేవతల మాహాత్మ్యమువలన కలుగు నని వారివారి యనుయాయులనమ్మక మగుటంజేసి వీరందఱును చంద్రదేవత లనియే భావింపఁబడిరి. కాని సెమిటిక్కులలో చంద్రుఁడు పురుషదేవత. వీరు స్త్రీదేవత లగుటంజేసి ఈ పోలిక తగి యుండలేదు. కాని అష్టార్తె చంద్రులు అభిన్నులుగఁ దలంపఁబడినట్లు కొన్ని యాధారములుకలవు.

అఫ్రొడైటు పూర్వదేశీయ సంపర్కమున వచ్చిన దయ్యు గ్రీకుదేశమునఁ బ్రవేశించిన స్వల్పకాలమునకే యచటి ఒలింపియన్ దేవగణములతో సమానమగు స్థానము నాక్రమించెను.

చరాచరములను ఫలవంతములుగఁ జేయుట ఈ దేవతయొక్క ముఖ్యధర్మము. కావుననే స్త్రీదేవతగ గణింపఁబడినది. కాని కాలక్రమమున ఫొయినీషియనుల సంబంధము గల స్థానములందు — ముఖ్యముగా కారింథ్ నగరమందును, ఎరిక్స్ పర్వతశిఖరమందును — ఈమె పూజనము ఘృణాస్పదము లగు దురాచారముల క్రిందను బరిణమించెను. సృష్టియందలి క్రియాక్రియాత్మకము లగు గుణధర్మముల సమ్మేళనమును సూచించు స్త్రీపురుషమిశ్రితమైన దేవతావిశేష మొకటి కల్పింపఁబడినది. సైప్రస్‌లోని గడ్డముగల అఫ్రొడైట్ విగ్రహ మిట్టిదే.

ప్రాచీనకాలమున నీ దేవతాపూజనము ఫొయినీషియనులద్వారా సైప్రెస్, సైథేరా, క్రేట్‌ద్వీపములందుఁ బ్రవేశించి యచటనుండి క్రమముగా సమగ్ర గ్రీసుదేశమందును, ఇటలీ, సిసిలీ ప్రాంతములందును వ్యాపించెను. ఈమెకు సైప్రెస్, సైథీరియా, పఫియా, అమథుసియా, ఇడలియా యని మఱికొన్ని పేరులు గలవు. వీనిలో కడపటి మూఁడు పేరులును సైప్రెస్‌లోని కొన్ని స్థలములద్వారా వచ్చినవి. కారింథ్ పట్టణమున నీమెకుఁ గావింపఁబడుపూజనములన్నియు పూర్వదేశములనుండియే గ్రహింపఁబడెను. ఎరిక్స్ పర్వతాగ్రమున సలుపఁబడుపూజనము క్రమముగా కార్తేజ్, రోమ్, లాటియమ్‌లందు వ్యాపించిపోయెను.

చరాచరాత్మకమైన సృష్టియందు అఫ్రొడైట్ ఫలప్రదాయిని యగుదేవత యని యిదివఱకే వ్రాయఁబడినది. భూచర, జలచర, వాయుచరములమీఁదనే కాక దేవతలమీఁదసైతము ఈమె యధికారమూనియుండెను.

ఆగామదేవతారూపమున నీమె సస్యసంవర్ధకము లైన మైదానములందును, వసంతవాసరములందును బూజింపఁబడుచుండెడిది. ఇట్టివే యగు గుణధర్మములతో క్రేటునందు పుష్పదేవత యను పేరను బిలువఁబడుచుండెను. ఏథెన్స్, సామోస్ లోనగు ప్రదేశములందును ఈమెకు యథోచితసత్కారములు దొరకుచుండెను. అదోనిస్, అట్టిస్ లనువారితోపాటు నిర్వర్తింపఁబడు క్రియాకలాపములం దీమె వనస్పతిదేవతాస్థానమును గైకొనుచుండెను. జంతుకోటియం దీమె కామోద్రేకమును పుట్టించుదేవత. మానవుల విషయమున జన్మ, వివాహ, గార్హస్థ్యములకుఁ జెందినదేవత. అట్టి తరుణమున నీమెకు జెనిటెల్లిస్ (జన్మదాత్రి), నింఫియా (వివాహదేవత), కారొట్రొఫొస్ (బాలవర్ధని) మున్నగు బిరుదములు లభించును. గ్రీకుల మతానుసారము స్త్రీపురుషులపవిత్రసంబంధమును గాపాడు దేవత. కాని యొక్కొక్కతఱి దుర్మోహాధిదేవతయై స్త్రీపురుషులందు ప్రబల మైన సంగమవాంఛను జనింపఁజేయుచుండును. తనకుఁ బ్రియులైనవారి కీమె అత్యంతసౌందర్యము నొసంగఁగలదు. ఇట్టి వరదానము స్త్రీలకు హానికరముగఁగూడఁ బరిణమించెను.

మఱియొకసమయమునందు ప్రియాప్రియులను జూచ్చు ముఖ్యవర్తినిధర్మమును దాల్చుచుండును. ఇందువలన నీమె సౌందర్యాధిదేవత యయ్యెను. సౌందర్యమునకు ప్రమాణభూత మగు నీమెవిగ్రహము స్పార్టాయొద్దఁ గలదు. కాని వేశ్యాధిదేవతగ నీమెకుఁ గావింపఁబడు పూజనము కడునిందనీయముగ నుండును. అశ్లీల మైన యీ యారాధనమును వలసవచ్చిన ఫొయినీషియనులే ప్రవేశపెట్టి రని పాశ్చాత్యులవిశ్వాసము. ఒక్క కారింథ్ పట్టణమునందే తల్లక్షణాన్విత యగుదేవతకు కల్పింపఁబడినదేవదాసీజనము వెయ్యిమందికంటెను హెచ్చుగ నుండిరి. ధనాఢ్యు లగు కారింథియనులు తమ యధీనమున నుండు దాసీనికరములలో నందఱికంటెను మించిన సౌందర్యవతులను దైవకైంకర్యార్థ మర్పణముచేయుట గౌరవమని భావింపుచు వచ్చిరి.

ఈమె యురేనస్‌యొక్క విచ్ఛిన్నావయవముచుట్టును జేరిన ఫేనమువలననుండి జనించె నని హెసోడ్ వ్రాసియుండెను. ఇదియే ఈమెకు సముద్రముతోఁ గల సంబంధము. ఇదికాక ఈమెకు సాగరసంబంధమును తెలియఁజేయు మఱికొన్ని బిరుదములు గలవు. మఱియు నావికాగణము లీమెను గౌరవదృష్టితోఁ జూచుచుండురు. సముద్రతీరమున నిర్మింపఁబడిన అరియాడ్‌నీ - అఫ్రొడైట్ సమాధియు, అదోనిస్ గాథయు నీమెకుఁ గల సముద్రసంబంధమును బలపఱుచుచున్నవి.

అస్సీరియనుల - ఇష్టదేవతవలెనే అఫ్రొడైటునకు పాతాళలోకసంబంధమును గలదు. ఎట్లనఁగా, అదోనిస్ అనువాఁ డీమె ప్రేమించినవారిలో నొకఁడు. ఇతఁ డత్యంతసుందరుఁ డగుటంజేసి ఈమె స్వర్గమును సైతము విడనాడి ఇతని వెనువెంటనే భూలోకారణ్యములందు సంచరింపసాగెను. అడవులం దుపద్రవకరము లైన హింస్రకజంతువులను వేఁటాడుటవలన నతని కెక్కడ ముప్పు కలుగునో యను భయమున నీమె యట్టి కార్యములనుండి యతనిని దూరముగ నుంచుచుండెను. కాని యతఁ డీ ప్రేమపాశముల కనభిజ్ఞుఁ డగుటచే నీమె నుండి తప్పించికొనిపోయి వేఁటాడఁగడఁగి ఘటనావశమున నొక భల్లూకముతోఁ దలపడి దానిచే హతుఁ డయ్యెను. అంత నీమె కావించిన విలాపమువలన మనసు కరఁగి పాతాళాధిపతి యీమె నోదార్చి ఆఱునెలలు అదోనిస్ భూమిపై నుండులాగునను, మఱియాఱు

నెలలు పాతాళమున నుండునట్లుగ వర మిచ్చిపోయెను. ఇది యిట్లుండ అడోనిస్ పెర్సెఫోన్ దగ్గఱ నాలుగునెలలును, అఫ్రొడైటు నొద్ద నాలుగు నెలలును, అతని యిచ్ఛానుసారము నాలుగునెలలును ఉండునట్లు వరమును బడసె నని వేఱొకగాథ కలదు. ప్రతిసంవత్సరము ఋతువుల గమనాగమనములవలన పృథివిపైఁ గలుగు మార్పులిట్లు అలంకారయుక్తమైన భావముతో వ్రాయఁబడిన వని తోఁచుచున్నది. పాతాళసంబంధమును సూచించునట్టి ఈమెవిగ్రహ మొకటి డెల్ఫియందు కలదు. మృతులైనవారి నుద్దేశించి ఒసంగఁబడు పదార్థములను గ్రహించునిమిత్తము నా కీ దేవత సమ్ముఖమునందే యావాహనింపఁబడుచుచుండిరి.

అత్యంత ప్రాచీనకాలమున గ్రీకు లీమెను యుద్ధదేవతగఁగూడఁ బూజించియుండిరి. ఇది కేవలము పూర్వదేశముల నంటికొనియున్న గ్రీసుయొక్క సీమాప్రాంతములందుమాత్రమే కాదు; పూర్వదేశములకు దూరముగ నుండు స్పార్టా మున్నగు ప్రదేశములందుఁగూడ నిట్టిపూజనములు జరుగుచుండెను. ఇట్టి యుద్ధవిషయకగుణధర్మములవలన నీమెకు ఏరియా యను నామధేయముకూడఁ గలిగెను. ఈమె శిరస్త్రాణ భాగములను దాల్చి యుండినట్లు కొన్ని యాధారములు గలవు. యుద్ధదేవుఁడగు ఏరెస్ ఈమెప్రియులలో నొకఁడు. అస్త్రశస్త్రసజ్జితమైన ఈమెవిగ్రహముగూడ నొకటి థీబ్సునందుండెను. ఈమెయందలి గుణధర్మములకుఁ బ్రత్యామ్నాయముగ పావురములు, డింబోతు, బాతు, హంసము, తాఁబేలు మొదలగు పశుపక్షులును, గులాబీ, నిమ్మ మొదలగు వృక్షములును పటములందు చిత్రింపఁబడియున్నవి.

అఫ్రొడైటు సౌందర్యాధిదేవతయై తన కెవ్వరుగాని సాటి లేరని తలఁచుచుండిన సమయమున సైచె (Psyche) నామకకన్య ఈమెకంటె సుందరి యని నుతింపఁబడెను. జను లందఱు నీమెతీర్థములకు వచ్చుట మాని సైచెయొద్దకుఁ బోవఁగడఁగిరి. అంత నీమె కుపితయై సైచెమీఁద పుష్పబాణములఁ గురిపించి యామె నీచునైనను వరించునట్లుగఁ జేయు మని తన కుమారుఁ డగు 'క్యూపిడు'న కాజ్ఞనిచ్చెను. అతఁడును తల్లిపంతము నెఱవేర్పవలయు నని పట్టుదలతోడనే పోయెను. కాని యాకన్యను జూచుటతోడనే తన్నుఁదానే మఱచి, యామెను నీచుని వరించునట్లు చేయుటను మాఱుగఁ దానే యామెను ప్రేమించి యామెతో దినములు గడపసాగెను. ఈ వార్త అఫ్రొడైటుకోపాగ్నికి నుద్దీపన మయ్యెను. అంత నామె వారిద్దఱను విడఁదీసి సైచెను నానాబాధలు పెట్టుచు అమానుషము లగు కార్యముల నామెచే చేయింపసాగెను. అట్టి సమయమున క్యూపిడ్ జ్యూపిటరుయొద్దకుఁ బరుగెత్తుకొనిపోయి తనసమాచారము నంతయు వినిపించి మొఱపెట్టుకొనఁగా నతఁడును గనికరించి వీరి మువ్వురకును గూడ సమాధానము చేసి పంపెను.

మిక్కిలి పురాతనము లగు చిత్రములందు అఫ్రొడైటు వస్త్రాన్వితయై యొక్కొక్కపర్యాయము గూర్చుండియున్నటులును, వేఱొకపర్యాయము నిలువఁబడియున్నట్లును చిత్రింపఁబడియుండెను. తరువాత దిగంబరముగా సముద్రమునుండి లేచుచున్నట్లును, స్నానాంతరావస్థయం దున్నట్లును ఈమెమూర్తి చిత్రింపఁబడినది. ఆటుతరువాత దేవతాభావ మంతయుఁ బోవ, చిత్రకారు లీమెను కోలమొగముతో ఆకర్షణీయసౌందర్యముతో, తరళనేత్రములతో, నవ్వుమోముతో మంచి చక్కని యందగత్తెగఁ బ్రకటించిరి. ఈమెయొక్క ప్రాచీనకాలపుచిత్రములందు ప్రాక్సిటేల్సు అనునతఁడు వ్రాసినవి ప్రశస్తమైనవి. ఇది స్నిడస్‌యొద్దనుండెను. ప్రస్తుతము గనుపించువానిలో లూవ్రెభవనమందలి మెలోస్‌యొక్క అఫ్రొడైటు విగ్రహము గణింపఁదగినది. ఆద్వీపముమీఁద నిది ౧౮౨౦-వ సంవత్సరమున నొకనాటకశాలాసంబంధమైన శిథిలావశేషములలో దొరకెను. రోమ్, ఫ్లారెన్సులందును ఈమెవిగ్రహములు కలవు. వాటికన్, నేపిల్సులలోని ఈమెవిగ్రహములు మహామోహోద్రేకకరములు.

**అబట్** — అయిరోపాఖండమునందలి ఒకరకపు మతగురువులకు 'అబట్' అని పేరు. ఈ అబట్‌యొక్క అధికారమున నొకమఠము ఉండును. ఇది మొట్టమొదట సిరియాదేశములో ప్రచారమున నుండి తరువాత నైరోపాఖండమం దంతట వ్యాపించినది. ఈ అబట్‌ను నియమించునధికారము రాజునకును ప్రధానమతగురు వగు 'పోపు'నకును గలదు. పూర్వకాలమున నీపదవికి మంచిగౌరవ ముండెడిది. కాని యీకాలమున నది సాధారణ మయిపోయినది. ఈపదవిని స్వీకరించువాని కొకయధికారదండముగూడ నొసంగఁబడెడిది.

**అబట్, లీమన్** — అమెరికాదేశమునందలి ఒక ధర్మోపదేశకుఁడు (మతప్రచారకుఁడు). ౧౮౩౫-వ సంవత్సరమున నితఁడు జన్మించెను. న్యాయశాస్త్రమునందు మంచిపండితుఁడైయుండెడివాఁడు. లీమన్ గొప్పలేఖకుఁడుగూడ. ది క్రిస్టియన్ యూనియన్, ది ఔట్‌లుక్ మొదలగు కొన్నియో పత్రికల కితఁడు సంపాదకుఁడుగ నుండెను.

ఇతనివ్రాఁత లన్నిటిలోను తత్త్వపరిశీలనము ప్రధానస్థానమాక్రమించుకొనియుండెడిది. ఇతఁడు వ్రాసినగ్రంథములలో ముఖ్యమయినవి రెండు: ౧౮౯౬-వ సంవత్సరమున రచించిన 'క్రైస్తవమతము', 'సాంఘికసమస్యలు' (Christianity and Social Problems); ౧౯౦౧ సంవత్సరములో రచించిన 'మానవుని హక్కులు' (The Rights of man).

**అబర్‌క్రోంబి, సర్ జాన్** (౧౭౭౨ - ౧౮౧౭) — ఈతఁడు సర్ రాల్ఫ్ క్రోంబి యనునతనితనయుఁడు. ౧౭౭౨ లో జన్మించి ౧౭౮౬ లో సైనికోద్యోగములో చేరెను. కొంతకాల మీతఁడు ఫ్లాండర్సులోను, పశ్చిమ ఇండియాదీవులలోను పని చేసి తన తండ్రికి ఈజిప్టుదేశములో నున్నపుడు మిలిటరీసెక్రటరీగ నుండెను. ౧౮౦౩ లో నెపోలియను ఈతనిని చెఱసాలలో నుంచి ౧౮౧౪ లో

విడుదలచేసెను. ౧౮౦౯ లో బొంబాయి చేరి అక్కడ ముఖ్య సైన్యాధిపతి అయెను. ఆమఱుసటిసంవత్సరము మారిషస్ ద్వీపము లను స్వాధీనపఱుచుకొనుటకు వెడలినదండయాత్ర కీతఁడు నాయ కుఁడు. తరువాత నీతఁడు చెన్నపురికి వచ్చి యచ్చట సైన్యాధిపతి యనుట తటస్థించెను. ౧౮౧౩ - ౧౮౧౪ సంవత్సరములందుమ నీరాజ ధానికి గవర్నరుపని ఖాళీ వచ్చుటచే గవర్నమెంటువా రీతనిని ఆపనిని జూచుటకు నియోగించిరి. ఈతనికి ౧౮౧౨ లో లెఫ్టినెంటు జనరలు, ౧౮౧౪ లో కె. సి. బి., ౧౮౧౫ లో జి. సి. బి. యను బిరుదు లీయఁబడెను. ౧౮౧౭ లో నీతఁడు మరణించెను.

## అబర్‌క్రోంబి, సర్ రాబర్ట్ (౧౭౪౦-౧౮౨౭) —

ఈతఁడు సర్ రాల్ఫు క్రోంబి యనునతనితమ్ముఁడు. ఈతఁడు ౧౭౫౮ లో సైన్యమున ప్రవేశించి అమెరికాదేశములో ౧౭౬౩ వఱకును సైనికుఁడుగ నుండెను. తిరిగి ౧౭౭౬ మొదలు ౧౭౮౩ వఱకును యార్కుటవ్ను అనునగరమును స్వాధీనపఱుచుకొనుపర్యంతము అక్కడ యుద్ధము చేయుచుండెడివాఁడు.

తరువాత నీతఁడు ౧౭౮౮ లో ఇండియాకు వచ్చి ఆమఱు సటిసంవత్సరమే బొంబాయిరాజధానికి గవర్నరుగను ముఖ్యసైన్యాధి పతిగను నియమింపఁబడెను. ౧౭౯౦ లో మేజరుజనరలు అయ్యెను. మలబారుప్రాంతములందు కొన్నికార్యముల నెఱవేర్చి ౧౭౯౨ లో శ్రీరంగపట్టణమునొద్ద టిప్పుసుల్తాను నోడించుటకై చేయఁబడిన ప్రయత్నములో కారన్వాలీసున కీతఁడు చాల సాయ మునర్చెను.

౧౭౯౩ లో కారన్వాలీసు హిందూదేశమునుండి వెడలిపోవు టచే నీతఁ డీదేశమునకు ముఖ్యసైన్యాధికారి అయ్యెను. ఆకాలము ననే ౧౭౯౭ పర్యంతము సుప్రీముకౌన్సిలులో సభ్యుఁడుగాఁగూడ నుండెను. ౧౭౯౪ లో రోహిల్‌ఖండునందలి బాటినా యనుచోట రోహిలాల నోడించెను.

**అబర్డీన్** — ఉత్తర స్కాట్లండుదేశమునందలి ముఖ్య మగు రేవుపట్టణము. అబర్డీన్‌షైరునకు రాజధాని. జనసంఖ్య ౧,౫౮,౯౬౩ (౧౯౨౧). జనసంఖ్యనుబట్టియు, పరిశ్రమలను బట్టియు, భాగ్యమునుబట్టియు చూచినచో స్కాట్లండుదేశమునందలి పట్టణములలో నిది నాలుగవదిగ పరిగణింపఁబడుచున్నది. ఇది ఉత్తరసముద్రపు అఖాతముమీఁద నున్నది; ఉత్తరముననుండి దక్షిణమునకు వ్యాపించియున్నది. ఇది గొప్ప నౌకాశ్రయస్థానము. చేపలవ్యాపారమునకు ప్రధానస్థానము. ఈనగరము వైశాల్యము ౬,౩౧౯ యోకరములు.

ఇది పండ్రెండవ శతాబ్దియందుండి క్రమక్రమముగ వృద్ధినంది నది. ఉత్తమహర్మ్యము లన్నియు తెల్ల చలువరాతితో నిర్మింపఁబడి యుండుటచేత నీ పట్టణమునకు 'చలువరాతి ప్రోల'ను అర్థమునిచ్చు నామ మొకటి కలదు. వాన వెలిసినపిమ్మట స్వచ్ఛధవళిమచే నీ పుర వరము మెఱయుటంబట్టి సముద్రముననుండి చూచిన నది రజతపురంబై యుండుననియు వర్ణింపఁబడియున్నది. ఇచ్చటనుండి పనితనంపుచలువ రాతి వస్తువులు నానాదేశముల కెగుమతి యగుచున్నవి.

ఇచట నొక గొప్ప విశ్వవిద్యాలయము కలదు. ఇందు ౧౯౧౩-వ సంవత్సరమున 'రోవెట్ ఇన్‌స్టిట్యూట్' అనుపేర జంతుపుష్టికా హారమునుగూర్చి పరిశోధన సలుపుట కొకసంస్థ యేర్పాటుచేయఁ బడినది. 'కార్నెగీ ట్రస్టు'వా రిందునిమిత్తము భవననిర్మాణమున కౌదార్యముతో ధనసాహాయ్యము చేసియున్నారు. అబర్డీన్, సెంట్ ఆండ్రూస్, ఎడింబరో, గ్లాస్గోవిశ్వవిద్యాలయములు నాలుగును గలసి పార్లమెంటుసభకు ముగ్గురు సభ్యులను బంపుచుండును.

ఇచట కట్టడములు మొదలగువానినిమిత్తము రాతిని త్రవ్వి తీయుదురు. ఇది యిచ్చట చాలకాలమునుండి వర్ధిల్లుచున్న పరిశ్రమ. ఈరాయి నానాదేశములకు నెగుమతియగుచున్నది. ఇదికాక, ఉన్ని, నార, ప్రత్తి, కాగితము, రసాయనపదార్థములు, సబ్బు, క్రొవ్వు వత్తులు, దువ్వెనలు, లోహ్యములు మొదలయినవి ఇచటి యితరపరి శ్రమలు.

## అబర్డీన్, జార్జిహ్యామిల్టన్‌గార్డన్ (౧౭౮౪ - ౧౮౬౦) —

ఈ పేరుగల అర్లునసర్దారులలో నీతఁడు నాల్గవ వాఁడు. స్కాట్లాండురాజధాని యగు ఎడింబరోపట్టణమున జన్మించెను. రాజకార్యనిపుణుఁడు. ౧౮౧౩లో ఆస్ట్రియాలో నింగ్లండుతరఫున రాయబారిగా నుండెను. టోప్లిట్జుసంధిపత్రము మీఁద నింగ్లీషువారితరఫున సంతకము చేసెను. వెల్లింగ్‌టన్ ముఖ్యమంత్రిగా నుండినపుడు ౧౮౨౮-౩౦ వఱకు నీతఁడు విదేశాంగ మంత్రిగ (Foreign Secretary) నుండెను; ౧౮౩౪-౩౫ లో ఉపనివేశయుద్ధకార్యదర్శిగ (Colonial and war Secretary) నుండెను. పీల్ ముఖ్యమంత్రిగ నున్నపుడుగూడ నితఁడు పెక్కు రాజకీయోద్యోగములను నిర్వహించెను. ౧౮౫౨ లో ముఖ్యమంత్రి యయ్యెను. ఈతనికాలములో క్రిమియన్‌యుద్ధము జరిగెను. ఇది రష్యావారికిని, తుర్కీవారికిని జరిగిన యుద్ధము. ఇందు బ్రిటీషు వారును, ఫ్రెంచివారును తుర్కీవారికి మిక్కిలి సాయము చేసిరి. ఈ యుద్ధమునందు క్రమముగా వ్యవహారములు జరుపలే దని ఈతని ప్రతిపక్షు లొకప్రతిపాదనమును తెచ్చి 'బహుమతము'ను బొంది నందువలన నీతఁడు ముఖ్యమంత్రిత్వమును వదలుకొనెను (౧౮౫౫). ఇతఁడు గ్రంథకర్త. గ్రీకువారిశిల్పకళలోని 'సౌందర్యతత్త్వము' అను గ్రంథమును రచించెను.

**అబలాసచ్చరిత్రరత్నమాల** — చూడుఁడు, అచ్చమాంబ.

**అబాఖాన్** — పారసీకదేశపురాజు, మొగల్ లేక తార్తర్ శాఖవాఁడు. చంగిజ్‌ఖాన్‌వంశజుఁడు. ఇతనితండ్రి హులా

భూఖాను. తండ్రి తరువాత నితఁడు క్రీ. శ. ౧౭౭౯ లో రాజ్యమునకు వచ్చెను. శుక్రవారము జాక్ ఖాని రాజ్యాభిషిక్తుఁ డయ్యెను. ఇతఁడు ధైర్యశాలి, తెలివిగలవాఁడు, ప్రజలయెడ దయగలవాఁడు, న్యాయశీలుఁడు. కౌమారదశయందు క్రైస్తవుల కితనివలన కొంత బాధ కలిగెను. మైకల్ పెలియోలోగస్ అను కాన్‌స్టాంటి నోపిల్ చక్రవర్తియొక్క కూఁతు నితఁడు వివాహమాడెను. ఆమెను మొదట నీతనితండ్రి వివాహమాడ నిశ్చయించి పిలిపించెను. కాని యామె వచ్చులోపల నాతఁడు మృతినొందినందున అబాఖాను వివాహమాడెను. ఇతఁడు పదునేడు సంవత్సరములు రాజ్యము చేసి క్రీ. శ. ౧౭౮౫ ఏప్రిలు ౧-వ తేదీని మరణము నందెను.

**అబాజిత్, ఫర్మిక్** (౧౬౭౯ - ౧౭౬౭) — ఇతఁడు ఫ్రాన్సు దేశమునందలి యొక ప్రసిద్ధకవి. ఇతని తండ్రి ప్రొటెస్టెంటుమతస్థుఁడు. ఇతఁడు తల్లిదండ్రుల ప్రొటెస్టెంటుమతస్థులు. రెండేండ్లవాఁడగునప్పుడే తండ్రి చనిపోయినందున నధికారు లీతనిని రోమన్ కాథలిక్కుమతమును బోధింపనెంచుటకు చేయఁగా తల్లి యాతని జెనీవానగరమునకు పారిపోవునట్లు చేసెను. ఇతఁడును, ఇతనితమ్ముఁడును జెనీవాపట్టణములో మూఁడు రెండుసంవత్సరములు నాఁగియుండిరి. ఆ సమయము నంతకాలము చెఱసాలయందే యుండి తప్పించుకొనివచ్చి కొడుకులను గలసికొనియెను. ఇతఁడు చక్కఁగాఁ జదువుకొని అనేక భాషలయందును పదార్థ విజ్ఞానశాస్త్రమునందును, మతగ్రంథములయందును ప్రావీణ్యమును సంపాదించి న్యూటన్, వాల్టేయిర్, రూసో మొదలగు విద్యాధికుల మెప్పును గాంచెను. ఇతఁడు విశేషముగ దేశసంచారము గావించి ప్రఖ్యాతుఁ డయ్యెను. బైబిలులోని నానావిధములైన నవలను గ్రంథభాష లోనికి తర్జుమా చేసెను. మఱియు ననేక గ్రంథములను రచించెను.

**అబానో, పిట్రోడీ** (౧౨౫౦ - ౧౩౧౬) — ఇటలీ దేశములోని పాద్వాపట్టణమున జనించి ప్రసిద్ధిగాంచిన యొక వైద్యుఁడును, తత్త్వశాస్త్రవేత్తయు నైయుండెను. ఇతఁడు గ్రీకుభాష నేర్చుకొనుటకై పారిసునగరమునకుఁ బోయి విద్యాభ్యాసము చేసి వైద్యశాస్త్రమునందును తత్త్వశాస్త్రమునందును డాక్టరుపట్టమును బొందెను. ఇతఁడు స్వస్థానమును చేరినతరువాత గొప్పవైద్యుఁ డని ప్రఖ్యాతి కలుగుటచేత చికిత్స చేయించుకొనుటకై యనేకరోగులు రాఁబోవుచుండిరి. అందుచేత నధికధనము నార్జింపఁగోరి యొక్కువధన మీయఁగల రోగులనే చేరఁదీయుచువచ్చెను. ఇదియునుగాక జ్యోతిష్యము నందును జోక్యము కలిగించుకొన్నాఁ డను కారణముచేత కాఁబోలు నితఁడు స్పర్శవేదిమణి కలిగియున్నాఁ డనియు, మంత్రవిద్యాప్రభావముచేత తా నితరుల కిచ్చుటకు చెల్లించియుండినసొమ్ము నంతయు మరల రాఁబట్టుకొని ధనాగారము నించుచున్నాఁ డనియు నభియోగములు తేఁబడినవి. మతనియమభంగములను గూర్చి కాథలిక్ మతగురువులు చేయు విమర్శనసభకు రెండుమాఱులు రప్పింపఁబడియెను. మొదటిసారి నిర్దోషుఁ డని విడిచిపెట్టఁబడియెను, కాని రెండవసారి విచారణ ముగింపునకు రాకపూర్వమే మృతినొందెను. అటుపిమ్మట మతగురువులు దోషి యని తీరుమానించి పాతిపెట్టఁబడిన వాని శవమును పైకిఁ దీసి తగులఁబెట్టవలసిన దని యుత్తరువు చేసిరి గాని యింతలో నతనిమిత్రుఁ డొకఁడు దానిని రహస్యముగా తొలఁగించి వైచెను. అయినను మతగురుసభవారు బహిరంగ ముగా వాని మరణశిక్షను బ్రకటించి అబానోవంటియాకారము గల బొమ్మను జేయించి దాని నగ్నిదేవున కర్పణము చేసిరి. ఇతఁడు వైద్యశాస్త్రమునందును, తత్త్వశాస్త్రమునందును అనేక గ్రంథములను రచియించెను.

**అబాకోర్టు, చార్లెస్ గ్జేవియర్ జోసెఫ్** (౧౭౫౮ - ౧౭౯౨)— ఇతఁడు ఫ్రాన్సుదేశపు రాజయిన పదునాఱవ లూయీకి సహాయుఁడుగ నుండెను. ప్రెంచివారు రాజుపైని తిరుగఁబడి దేశమును కల్లోలపఱచినపుడు ౧౭౯౨-వ సంవత్సరమున యుద్ధమంత్రిగ నియమింపఁబడియెను. వార్సెల్సునగరమున జనసమూహముచేఁ జంపఁబడియెను.

**అబాబక్రు** — తైమూరు వంశమున, క్రీస్తుశకము పదునైదవ శతాబ్దిమంతమున జన్మించినవాఁడు. ఇతఁడు కపటమున నేమి బలాత్కారమున నేమి మొదట యార్కండును, ఖోటాను ప్రదేశములను స్వాధీనము చేసికొని యనంతరము కాష్ఘరునుండి యూనుసుఖానుని వెడలఁగొట్టి యాదేశమునుగూడ హరించెను. ఇతఁ డత్యంత క్రూరుఁడును నిరంకుశాధికారి. ఈ హేతువుచేత శౌర్యపరాక్రమునకులయ్యాలాన నింత దేశమునుజయించియు దానిని చాలకాల మనుభవింపక త్వరలోనే కోలుపోయెను. యుద్ధమునందు దొరకినవారికి దీనికు మృత్యువు, అంగవిచ్ఛేదము, యాతన లోనగుశిక్షలే కాని వేఱొకమార్గము లేకుండెను. క్రూరత్వము, సంశయమునకు లోనై యవర్ణనీయము లగు దౌర్జన్యములనొనరించుచు నీఁడుమిక్కిలి యట్టికార్యములు న్యాయానుసారము లని ప్రకల్పములు గొట్టుచుండును. క్రమక్రమముగఁ దన యొద్దనుండు ముఖ్యమంత్రుల నంపఁజ నఱికించెను. తుదకు సయ్యాద్ ఖానను సర్దారొకఁడు నిలువఁబడి యీజనకంటకుని కాష్ఘరునుండి పాఱఁదోల నితఁడు ఖోటానునకుఁ బోయెను. మరల నక్కడనుండి వెడలఁగొట్టఁబడి టిబెట్టునకుఁ బోయెను. కాని యచటఁగూడ నుండఁజాలక చివరకు సయ్యాద్ ఖానున కధీనుఁడై యొకచోట నివసించుచుండ నితనిపూర్వపరిచారకు లీతనిని దీర్ఘనిద్రం బుచ్చిరి.

**అబిచ్, విల్ హెల్మ్ హెర్మాన్** (౧౮౦౬ - ౧౮౮౬)— భూగర్భ శాస్త్రజ్ఞుఁడు. జర్మనీదేశమునకు రాజధాని యగు బెర్లిన్‌నగరమున జనించెను. డోర్పట్ అను ప్రదేశమున ఖనిజశాస్త్రమునందు పండితోపాధ్యాయుఁడుగ నుండెను (౧౮౪౨). కాకసస్, రష్యారాష్ట్రములోని ఆర్మీనియా, ఉత్తరపారసీకము, దాఘేస్థానము మొదలగు దేశములకుఁ బోయి భూములను త్రవ్వించి భూగర్భశాస్త్రమునుగూర్చి గ్రంథములను రచియించెను.

**అబిపోనులు** — దక్షిణ-అమెరికాలో నివసించు ఇండియనులలో ఒకతెగవారు. ఇది యొకమోటుజాతి. ౧౭-వ శతాబ్దిలో వీరిజనసంఖ్య యించుమించుగ నైదువేలవఱ కుండెడిదట! కాని యిప్పు డది తగ్గిపోయినదట! అబిపోను లనుపేరుమాత్రమే నిలిచి యున్నదట. మార్టిన్ డోబ్రిఝోపర్ అనునాయన చాలకాలము వీరినడుమ జీవితము గడపినవాఁడు, వీరియాచారవ్యవహారములనుగూర్చి వ్రాసియున్నాఁడు.

ప్రపంచమునఁగల తక్కినయనాగరకజాతులవా రందఱవలె వీరును అమాయికులు, దృఢశరీరులు. వేఁటయే వీరిముఖ్యవృత్తి. మద్య మాంసములు వీరియాహారము. అడవులలో దొరకుపూవులు మున్నగు వానితో దేహమును విశేషముగ నలంకరించుకొందురు.

వీరిలో బాల్యవివాహము లుండెడివికావు. పురుషులకు ౩౦ యేండ్లు వచ్చినతరువాతను, స్త్రీకి ౨౦ యేండ్లు పైఁబడినతరువాతను పెండ్లి చేయుట వీరియాచారము. ఎక్కువసంతానము గలిగియుండుట వీరి కిష్టము కాదు. అందుచే ఒక్కొక్కయాఁడుది ఇరువురుబిడ్డలను మాత్రము మిగుల్చుకొని తక్కినవారిని జంపివేయును. మఱియు, ఆఁడుబిడ్డ లైనచో, వివాహకాలమున ద్రవ్యలాభ ముండు నన్నయాశతో ఆఁడుశిశువులనే యెక్కువగ మిగుల్చుకొందురఁట!.

చనిపోయినవారికుండెకాయను పైకిఁ దీసి దానిని కుక్కలకు వేయుట అబిపోనులలో నాచారము. 'అహారైగిచీ' అనునొక క్షుద్రదేవతను వీ రారాధింతురు. తోఁకచుక్కయన్నను, గ్రహణమన్నను వీరికి మిక్కిలి భయము.

**అబిమెలెచ్** — (౧) ఇతఁడు గెరారుదేశపురాజు. అబ్రహాము పారపుచ్చినందున 'సారా' అను నామెను దెచ్చి యంతఃపురమునం దుంచెను. కాని స్వప్నములో దేవుఁడు ప్రత్యక్షమై హెచ్చరిక చేసినందున సారాను మరల నామెభర్తవశము చేసె నను కథ కలదు. ఇట్టి కథయే ఇసాక్, రిబెకాలనుగూర్చికూడ వినంబడుచున్నది (జెనిసిస్., ౨౬). శచిమైట్ జాతిస్త్రీ యొక్కతెయు, గిడియోన్ యొక్కకుమారుఁడును 'అబిమెలెచ్'ను రాజుగాఁ గైకొమఁడని ప్రోద్బలము చేయఁగా నితఁడు జోతమ్ అనువానిని దక్క తన సవతిసోదరుల డెబ్బదిమందిని చంపించెను. తుదకు శచిమైట్లు వానిపైని తిరుగఁబడిరి. 'తీబెజ్'ను తార్కొనునప్పు డొకస్త్రీవలన తిరుగటిరాయిచే తల బ్రద్దలుగొట్టఁబడియెను. కాని స్త్రీచేత చంపఁబడియెనన్న యవమానమునకుఁ బాల్పడకుండఁ దన కవచమును మోయుచున్న వానిని తన్నుఁ జంపు మని యాజ్ఞ చేసెను.

**అబిల్ క్లార్కు** (౧౭౮౦ - ౧౮౨౬)— మెకార్టనను ప్రభువు చైనాదేశమునకు వెడలినపు డీ అబిల్ క్లార్కునుగూడ తన వెంటఁ దీసికొనిపోయెను. ఈతఁడు గొప్పవైద్యుఁడు. మెకార్టనే తరువాత అంహరస్టుప్రభువునకు కూడ నీతఁడు వైద్యుఁడుగ నుండెను. ఈతఁడు ౧౮౨౬ లో చనిపోయెను.


**అబిషాయ్** — డేవిడ్డురాజునకు మేనయల్లుడు. ఇతఁడు ధైర్యసాహసములు గలిగి రాజునెడల విశ్వాసమును చూపుచు వాతని వెంబడించినవాఁడు. సాలుస్కంధావారముపై నర్ధరాత్రమున నడపించిన దండయాత్రలో రాజునకు తోడ్పడియెను. డేవిడ్డు సింహాసన మెక్కినతరువాత ననేకయుద్ధములలో ప్రవేశము గొనుటయేకాక ముఖ్యసేనాధిపతులలో నొక్కఁ డయ్యెను.

**అబిసీనియా** — ఆఫ్రికాఖండమున ఈశాన్యమందలి యొక స్వతంత్రరాజ్యము. హబషాక్ అని దీని యాదిమనామము. ఎథియోపియా యని గ్రీకులు పిలుచుచుండిరి. ౫ - ౧౫ ఉ. రేఖాంశములు, ౩౫ - ౪౨ పూర్వ-అక్షాంశములం దీదేశము వ్యాపించియున్నది. ఉత్తరమున ఎరిత్రియా, తూర్పున ఫ్రెంచ్, ఇటాలియన్, బ్రిటిష్ జాతులకుఁ జెందిన సోమాలీలాండ్, దక్షిణమున ఉగెండా, కెన్యాదేశములును, పడమట ఆంగ్లో - ఈజిప్షన్ సూడానులు దీని సరిహద్దులు. సముద్రతీర మంతయు సభ్యజాతులయధీనమం దుండుటచే అబిసీనియనులు సాగరికోద్యమములనుండి వంచితు లైయున్నా రని చెప్పవచ్చును. ఉత్తరమున నీదేశపువెడల్పు ౨౫౦ మైళ్లుమాత్రమే కాని ౯-వ యక్షాంశమువెంట దీనివెడల్పు ౯౦౦ ల మైళ్లు. దీని వైశాల్యము ౩,౫౦,౦౦౦ ల చదరపుమైళ్లు. జనసంఖ్య సుమారు ౮౦,౦౦,౦౦౦ లు. రాజధాని అడ్డిస్ అబాబా.

భౌతికలక్షణములు, పర్వతములు, నదులు, సరస్సులు :— అబిసీనియాదేశము సమతలము లగు గొప్ప మైదానములు కలది కాదు. మిక్కిలి మిట్టపల్లములు కలది. ఇట్టియాకృతి కలుగుటకుఁ గారణము భూగర్భమున ననేకయుగము లాదిగఁ బనిసేయుచుండు అగ్నియొక్క ప్రభావ మనియే చెప్పుదురు. సముద్రపుమట్టమునకు ౮,౦౦౦లు మొదలు ౧౦,౦౦౦ ల అడుగులవఱకు నెత్తుగల పర్వతములు, పీఠభూములు నీదేశము నాక్రమించియున్నవి. వీనికిఁదోడు అగాధములగు లోయలును గలవు. ౧,౫౦౦౦ ల అడుగులయెత్తు గలిగి అగ్నిపర్వతశృంగముల కెనవచ్చు కూటము లీపర్వతముల నలంకరించుచున్నవి. ఈపర్వతపంక్తు లన్నియు నేదియో యొకక్రమము ననుసరించి కాక, ప్రకృతివైపరీత్యమును బ్రకటించుచు వంకరటింకరలై యడ్డదిడ్డముగ దేశమంతట వ్యాపించియున్నవి. అందు 'తనా' సరోవరమున కుత్తరమున సెమెన్ పర్వతపంక్తి వ్యాపించియున్నది. దాజన్ అనునది యీపర్వతశ్రేణియందలి యున్నతశిఖరము. దీనియెత్తు, ౧౫,౧౬౦ అడుగులు. గొజ్జాంప్రాంతమున తకాజీ, అబాయీనదులమధ్య చోక నామకపర్వతములు కలవు. వీనియందు ౧౩ వేలయడుగుల యెత్తయిన శిఖరము లున్నవి. హవాస్నదికి దక్షిణదిగ్భాగమున చిల్లాలో, గుగా పర్వతములును, వీనికిఁ దూర్పుగ అహమార్ కొండలును బ్రసరించియున్నవి. ఈశ్రేణులపూర్వభాగము హారారాకొండ లనియుఁ బిలువఁ

sampath_Ebooks






బడుచుండును. చిల్లాలో పర్వతములకు దక్షిణముగ గల్లాప్రాంతమున ఉర్గోమాకొండలు, గిల్లెట్ కొండలును గలవు.

ఇట్టిపర్వతమయ ప్రదేశముగుటవలనను, నపరిమితముగ వర్షములు కురియుటవలనను నిందు నదులకు కొదవలేదు. మారెబ్ నది ఈదేశమున నత్యంతము నుత్తరభాగమందుపడమటగఁ బ్రవహించి అత్ బరానదిలోఁ గలయును. ఈ అత్బరానదియొక్క అబిసీనియాలోనిభాగము తకాజే యనుపేరను బరఁగుచున్నది. అవై లేక నీలనైల్ నదియు, దానియుప నదులును పశ్చిమోత్తరముగఁ బాఱి నైల్ నదిలోఁ గలయుచున్నవి. తూర్పుగఁ బ్రవహించువానిలోఁ బెద్దది హవాష్ నది. ఇది ౫౦౦ల మైళ్లదూరము పాఱి తరువాత నిసుకయెడారియం దంతర్ధాన మైపోవును. వెబీ, షిబేలీ, జూబా యనునవి సోమాలీలాండులోని ముఖ్యనదులు. ఇవి కాక ఉన్నతభూములనుండి లోయలలోనికి దుముకు సెలయేళ్లపరిమితముగ నున్నవి. ఇవి వర్షాకాలమున మాత్రము ప్రవహించుచు బురదనేలలందును, నెడారులందును గనుపడకుండఁబోవును. షోవాప్రాంతపుదక్షిణమున నారంభమై యబిసీనియాయొక్క దక్షిణ-పశ్చిమపుకోణమున సరిహద్దుమీఁద నున్న రడల్ఫ్ తటాకముపర్యంతము కొన్నిసరోవరములు వ్యాపించియున్నవి. వీనిలోఁ గొన్ని మంచినీళ్లసరస్సులు కలవు. కాలువలద్వారా కొన్ని కలసియు, మఱికొన్ని వేఱువేఱుగను నున్నవి. వీనిలో మొట్టమొదటిది జ్వాయిూసరస్సు. దీనికి దక్షిణముగ హోరా, అబ్బట, లంగానా లను సరోవరములు కలవు. అబ్బటసరోవరము కాలువద్వారా జ్వాయితోఁ గలసియున్నది. అబ్బట, లంగానాలకును సంబంధము గలదు. ఈ

మూఁడుసరస్సులు గల్లాప్రాంతమందలి అరుసినామక భాగమున నున్నవి. వీనికి దక్షిణముగా షాలా, అవుసా లనఁబడు తటాకములును, వీని యందున అబయ, చమో లను జలాశయములును, అంతమున స్టీఫెన్ సరసియు, సరిహద్దుమీఁద రుడాల్ఫసరోవరమును గలవు. ఉత్తరమున అమ్హారా ప్రాంతమున టనానామకతటాక మున్నది.

కాలమానము :— మిట్టపల్లములుకల పర్వతమయదేశ మగుటం జేసి యిచ్చట శీతోష్ణమానస్థితియు ననేకవిధములుగఁ గనట్టు చున్నది. సోమాలీలాండ్, డనకిల్ ప్రాంతములందలి పల్లపుప్రదేశములు మిక్కిలి వేఁడిమి కలిగి కాలవశముకు ఎడారులంబోలి యుండును. సోబత్ నదియొక్క అన్నోభాగము జలప్రాయమై ఉపాధిక్యమున మన్యజ్వరముల నుత్పాదించుచుండును. ఇట్టిభాగములను వదలినచోఁ దక్కిన అబిసీనియా దేశమం దంతటను, గల్లాప్రాంతపుపర్వతప్రదేశము లందును కాలమాన మారోగ్యకరముగ నుండును. ఈదేశము భూమధ్యరేఖకు సమీపముగ నుండినప్పటికిని పర్వతశిఖరములతో నిండియుండుటవలన నిచటికాలమానము సౌఖ్యదాయక మైయున్నది. సామాన్యముగ నాలుగువేలయడుగుల క్రిందిభాగ ముండియు వేఁడిమితోఁ గూడి, మలేరియాజ్వరముల కాటపట్టయి యుండును. ఇచటి మధ్యమతాపపరిమాణము ౬౦-౭౦ అంశములు. ఇచట బగా, కిరెంత్ అను ఋతువులు రెండే. ఇందు మొదటిది అక్టోబరు మొదలు జూన్ మాసమువఱకును, రెండవది జూన్ మొదలు సెప్టెంబర్ ఆఖరువఱకును నుండును. మార్చిమాసమున నించుక వర్షము కురియును. అబిసీనియాయందలివర్షము ఆఫ్రికాఖండమున నత్యంతము ముఖ్య మైనది; ఎట్లనఁగా నైలునదీప్రాంతముల నివసించువారి యైశ్వర్యమునకు వర్షములే కారణము.

వనస్పతులు, పశువులు :— నిమ్నోన్నతపర్వతమయప్రదేశ మగుటంజేసి యిచటి వనస్పతులందును నానావిధభేదము లగపడు చున్నవి. శీతోష్ణముల హెచ్చుతగ్గుల ననుసరించి సమతలము లను పల్లములు మొదలుకొని కొండశిఖరములవఱకును పెరుఁగునట్టివృక్షజాతు లనేకము లిచటఁ గలవు. ఈదేశపు-ఉత్తరప్రాంతములందు లోయలు, నిమ్నప్రదేశములు గాఢము లగు నరణ్యములతో నిండి యుండ, ఉచ్చభూభాగము లక్కడక్కడ గుబ్బలు, పొదలు తప్ప సామాన్యముగ వృక్షశూన్యము లై యుండును. లోయలనడుమ నుండునట్టులు, తిప్పలు మొదలగునవి వృక్షములతోను, లతాగుల్మములతోను దట్టముగ నిండియుండును. కాని బయల్లయందలి కొండలు వృక్షవిహీనములు గనే యుండును. దక్షిణప్రాంతములం దిట్టి స్థితి కానరాదు. ఇచటి లోయలు, నిమ్నప్రదేశములు, ఉన్నతస్థానములు, కొండలు లోనగున వన్నియు ఘనములైన యరణ్యములతో నిండియున్నవి. మఱియు దక్షిణారణ్యములు మిగుల వెలగల ప్రశస్తమైన కలపకు ఆకరములు. కాఫాప్రాంతపుకాఫీ అత్యుత్తమ మైనది. ఈగింజల కిదియే జన్మస్థానము. ఇక్కడనుండియే యివి ప్రపంచమం దంతటఁ జెలరేఁగి విశ్వవ్యాపకత్వమును బొందినవి. అది ఈకాఫాదేశమున జన్మించుటంజేసియే కాఫీ యను అన్వర్థక నామమును బడసినది. పర్వతప్రదేశములలోని యనేకభాగములందు కస్సోనామకవృక్షము లనేకములు గలవు. ఇవి ౩౦, ౪౦ అడుగులయెత్తు గలిగి నిలువున వ్రేలాడుచుండు పుష్పనిర్ఝరాలతో మహాసుందరముగ నుండును. సాధారణముగా దేశమం దన్నిభాగములందు ముఖ్యముగ షోవాప్రాంతమున 'కురారినా' నామకసాలవృక్షములు కలవు. వీనినుండి సుగంధద్రవ్యముగఁ బనికివచ్చును. సమస్తవిధము లైన ధాన్యములు, కాయగూరలు మిక్కుటముగఁ బండును. కర్పూరము, అత్తిపత్తి, ఆలివ్, రావి, రేగు, పొన్నచెట్లు [illegible] నున్నవి. జనుము, నిమ్మచెట్లు పలురకములు కలవు. అరటి, అంజూరము, నారింజ, నిమ్మ, దానిమ్మ, [illegible], అనాస, యింకను ననేకప్రకారము లగు ఫలములు గలవు. ద్రాక్షలు, కలివిపండ్లు మిక్కుటముగను. ప్రత్తి, నీలి, చెఱకు సమృద్ధిగఁ బైరగును. ఉన్నతభూములందు గోధుమలు, జొన్నలు, పొగాకు, మొక్కజొన్న, బార్లీ, ఓట్లు పుష్కలముగ ఫలించును. పల్లపు ఉష్ణప్రదేశములందు చింతలు, ముష్టులు పర్యాప్తముగ వృద్ధిఁ బొందును.

పల్లపుమైదానములుగల భూభాగములందు ముఖ్యముగ సోబత్ నదీప్రవాహముకొంపలలోయలు ఏనుఁగులకును, ఖడ్గమృగములకును ఉనికిపట్లు. నదులు నాలవఱకు మొసళ్లతోడను, నీటిఏనుఁగులతోడను నిండియున్నవి. [illegible] జలసర్పము లెక్కువగఁ గలవు. చిఱుతపులులు రెండుప్రకారములు: మచ్చలుగలవి, నల్లనివి. సింహముల నివాసస్థానము సోమాలీలాండ్ వనభూమి. ఈదేశపుసివంగు లతి భయంకరములు. తోఁడేళ్లు, అడవికుక్కలు, నక్కలు అపరిమితము. ఎలుఁగు లిచటఁ గానరావు. పశ్చిమప్రాంతములందు జిరాఫీ లెక్కువ. ఉత్తరమందలి నాలకొండలు, పెద్దభూములు జీబ్రాలకును, అడవిగాడిదలకు నాకరములు. లేళ్లు దుప్పులు అగణితములు. వీనిలో అయిదారు భేదములు కన్పడుచున్నవి. 'న్యాలా' యను పేర నొప్పు మిక్కిలియందమైన మృగ మొకటి కలదు. పునుఁగుపిల్లులు పల్లపుచోట్ల దృగ్గోచరము లగుచుండును. కాని వీనిముఖ్యనివాసము గల్లాప్రాంతము. ఉడుతలు, కుందేళ్లు, కోఁతులు అతివిస్తారము. కోఁతులలో ననేకజాతులఁ గాననగును. మైదానములనుండి ౧౦,౦౦౦ అడుగులయెత్తువఱకును గల ప్రదేశములం దీకోఁతులు వాసముం జేయు చుండును.

పక్షులలో మిగుల సుందరమైనది నిప్పుకోడి. ఇవికాక ఈఁకలకుఁ బనికివచ్చుపక్షులు, చిలుక, కొంగ, నల్లపక్షి మున్నగునవియుఁ గలవు. డేగలు, గ్రద్దలు, గరుడుఁ డాదిగాఁగల మాంసాహారిపక్షులును, కౌఁజులు, తిత్తిరులు, అడవిబాతులు, అడవికోళ్లు, పావురాలు నత్యంతముగఁ గలవు. పాము లంత యెక్కువగ లేవు కాని యున్నవి మాత్రము విషసంయుతములు. తేనె యిచటినివాసుల ముఖ్యాహారములలో నొకటి. మిడుతలు తండోపతండములుగఁ గలవు. సీతాకోకచిలుకలలో నొకవెయ్యిభేదములు కలవు.

sampath_Ebooks

కృషి, వ్యాపారమునార్గములు :— ఈదేశమందలి నేల మిక్కిలి సారవంత మైనది. వ్యవసాయము విస్తారముగఁ జేయఁబడుచుండును. కొన్ని ప్రాంతములందు రెండుకార్లును, మఱికొన్నిచోట్ల సంవత్సరమునకు మూఁడుకార్లును బండుచుండును. మొక్కజొన్నలు, బార్లీ, రై, టేఫ్ (ధాన్యవిశేషము), బఠానీలు, ప్రత్తి, చెఱకు ఎక్కువగఁ బండింపఁబడుచుండును. 'ఎకుస్సా' యను వేఱొకవిధమగు ధాన్యము కలదు. దీనితో నల్లనిరొట్టెలు తయారగుచుండును. పలురకముల నారింజలు, పేరు సెనగలు బాగుగ ఫలించును. హరర్ ప్రాంతమున కత్ అనునొక మూలిక దొరకును. ౧౫,౦౦౦ అడుగులయెత్తుగల ప్రదేశములందుఁగూడ బార్లీ, ఓట్, బీనులును అక్కడక్కడ గోధుమలు నిత్యము పైరగును.

ఉన్నతభూములయందు మేకలుగొఱ్ఱెలను, నిమ్నభూములందు జూన్ మాసమందును సాగుచేసి విత్తనము వేయుచుందురు. గడ్డి యపరిమితము. కావున పశుపాలనమునకిది మిక్కిలి యుపయుక్తమైన ప్రదేశము. కోట్లకొలఁది గోవులమంద లిచటఁ గలవు. మేఁకలు, గొఱ్ఱెలు అసంఖ్యాకములు. ఇచట నున్న నిమ్నగొఱ్ఱెలు చాల తక్కువ. గుఱ్ఱములు మంచి బలముకలవి. కొండ లెక్కుటయందు చులుకనైనవి కంచరగాడిదలు. ఇవి ౧౫౦ మొదలు ౨౦౦ ల పౌనుల వఱకుఁగల బరువును మోయుచుండును.

గల్లాప్రాంతవాసులు వ్యవసాయమునకుఁ దోడు బంగారము దీయు వ్యాపారముగూడ సలుపుచుందురు. వాలెగాజిల్లాయందు ప్లాటినమ్‌ధాతువు దొరకును. ఇనుము, నల్లబొగ్గు, పెట్లుప్పు, గంధకము, రాగి, వెండి, రాతియుప్పు లోనగుపదార్థము లెక్కువగఁ గలవు.

ప్రతిసంవత్సరము మిసుమారు ౨౫,౦౦,౦౦౦ ల పౌనులవ్యాపారము జరుగుచుండును. వ్యాపారమున కావశ్యకము లగు మంచిమార్గము లిచట లేవు. ఫ్రెంచ్‌సోమాలీలాండ్‌నందలి జిబూటిపట్టణమునుండి రాజధాని యగు అడ్డిస్‌అబాబావఱకు ౭౮౦ మైళ్లదూరముగల రైలుమార్గ మొకటి తప్ప వేఱొండుమార్గ మేదియు వ్యాపారమున కనువైనది లేదు. గుఱ్ఱములు, ఒంటెలు, కంచరగాడిదలద్వారా దేశమునఁ దక్కినచోట్ల వ్యాపారము జరుగుచుండును. రాజధానినుండి తక్కిన పెద్దపెద్దపట్టణములకు టెలిగ్రాఫ్‌సంబంధము కలదు. టెలిఫోన్‌సంబంధముగూడఁ గలదు కాని నగరము వెలుపల నుచితప్రబంధము లేకుండుటచే వార్తలు సరియగువిధమున నడచుట లేదు. గల్లబట్, గొరైగ్స్, గంబేలాపట్టణములదారిని ఆంగ్లో - ఈజిప్షన్ - సూడాన్‌దేశముతో వ్యాపారము జరుగుచుండును. వేఱొకవ్యాపారమార్గము ఎరిత్రియాగుండ మస్సావానగరమువఱకును బోవును. మఱియొకదారి హరార్ మీఁదుగ బ్రిటిష్‌సోమాలీలాండ్‌లోని బెర్బెరాపట్టణమువఱకును బోవును. కాఫీ, తోళ్లు ముఖ్యమైన యెగుమతులు. ఇవి గాక బంగారము, పునుఁగు, దంతము, మైనము, జిగురు మొదలగునవియు నెగుమతి యగుచుండును. ఉప్పు, ఇనుపసామానులు, నానావిధవస్త్రములు దిగుమతి యగుచుండును. రాజ్యాదాయము 'కస్టము'లద్వారాను, భూమిపన్నులమూలమునను ప్రోవగుచుండును. రాష్ట్రాధికారు లగు గవర్నరులు అవైతనికులు. అందువలన నిచటియాదాయము నిలుకడగ నుండదు. ఉత్పత్తియగు సమస్తపదార్థములమీఁదను పన్ను విధింపఁబడియున్నది.

జనులు, మతములు :— అబిసీనియాయం దనేకజాతులు గలవు. అన్నింటిలో దక్షిణ-అరేబియానుండి వచ్చిన సెమిటిక్కులు ప్రముఖులు. రెండుభాషల నిచటివారు వాడుచుందురు. అందు అమ్హారిక్ రాజకీయభాష. ఎథియోపియన్ అనునామాంతరముగల గీజుభాష కూడ ఎక్కువప్రచారమం దున్నది. ఇచటి రాజమతము క్రైస్తవమతము. నాల్గవశతాబ్దియందు ఈజిప్టుదేశమునుండి కులపతి యగు అథానసియస్ వలనఁ బంపఁబడిన ఫ్రూమెంటస్ అనునతఁడు మొట్టమొదట నీదేశమువారికి క్రైస్తవమతదీక్ష నొసంగెను. కాని యిప్పటిది యొకవిచిత్రమగు క్రైస్తవమతముగఁ బరిణమించినది. ప్రస్తుతము వీరు రోమనుకాథలిక్కులు గారు; ప్రొటెస్టెంట్ తెగలోఁ జేరరు. కాప్టిక్‌చర్చికిఁ జెందినవారుగ నుందురు. మఱియు వీరిమతమును 'మానొఫైసైట్'మత మందురు. తరువాత యూదులును నిచట నెక్కువగఁ గలరు. అఫార్, సోమాలీలాండ్, గల్లాప్రాంతములలో ముసల్మాను లెక్కువ. ఇచటి క్రైస్తవులు, సాధువులు; స్వర్గదేవతలను నెక్కువగఁ బూజించుచుందురు. కాని విగ్రహారాధన మచట లేనే లేదు.

వీరిలో నుపవాసములు చేయునాచారము కలదు. ఆయుపవాసము లతికఠినములు, అత్యంతదీర్ఘములు నైయుండును. జెరూసలేం నగరమునకు యాత్రపోవుటవలన పాపనాశనమగుననియు పాపస్వీకరణమున ముక్తి గలుగుననియు వీరిదృఢవిశ్వాసము. ఇందుమూలమున వీరిలోఁ బురోహితులపని బాగుగ నున్నది.

దేశవిభాగము :— చక్రవర్తిచే స్వయముగఁ బాలింపఁబడు భాగము గాక షోవా, కాఫా, గల్లా, మధ్యసోమాలీ యను సామంతరాజ్యములును గలవు. పరిపాలనార్థ మిది పూర్వము టైగ్రె, అమ్హారా, గోజాం, షోవా లని నాలుగుమహామండలములుగ విభజింపఁబడియుండెను. కాని యిప్పటివిభజనము వేఱు. ఇప్పుడు పెద్దవి, చిన్నవి కలసి ౨౦ ప్రాంతములు. వానిలో గోజాం, ఉత్తరటైగ్రే, దక్షిణటైగ్రే, బజెందిర్, హరర్, సలలే, వాగ్, జిమ్మా, లస్టా అనుపేరుగలవి ప్రధానమైనవి.

దేశచరిత్రము :— అనాదిగ నీదేశము నిరంకుశులగు రాజులచేఁ బరిపాలింపఁబడుచువచ్చెను. ప్రాచీనకాలమున దీనికిని, ఈజిప్టుదేశమునకును నెక్కువసంబంధ ముండెను. కావున నీరెండురాజ్యములు సభ్యతావిషయమునఁ బరస్పరపోషకములుగ నుండెను. టాలెమీలకాలమునందు గ్రీకులయధినివేశము లీదేశమున నెలకొల్పఁబడియుండెను. క్రైస్తవమత మీదేశమునఁ బ్రవేశించినయారంభకాలమునందు క్రైస్తవాచార్యులపలుకుబడి రాజునొద్ద చెల్లుచుండెను. కాలెబ్ అనురాజు

sampath_Ebooks

తనమతస్థులగు క్రైస్తవులను పీడించుచుండిన ఈమెన్ దేశపురాజుపై దండువిడలి యరేబియాయందుఁ బ్రవేశించి యతనిని పరాజితుని గావించి యాదేశభాగము నాక్రమించుకొనెను. ఇదియే అరేబియా దేశమున నుత్తమకాలము. ఎథియోపియనులు అరేబియాలోని సారవంతమగు భాగమును వశపఱచుకొని విస్తారమైన వ్యాపారము నడపుచు హిందూదేశము, సింహళమువఱకుఁగూడఁ బ్రయాణముల సలుపుచుండిరి. మహమ్మదీయ లేడవశతాబ్దియందు విజృంభించుటచే అబిసీనియాబల మడఁగిపోయెను. తమమతమునకు శత్రువులైన తురుష్కులయొత్తిడివలన అబిసీనియాంతర్భాగమునఁ జేరి వీరు ౧౫-వ శతాబ్ది-అంతమువఱకును శిష్టప్రపంచమున కగోచరులై యుండిరి.

ఆఫ్రికాఖండముయొక్క ఈశాన్యభాగమున నేదో యొక క్రైస్తవజాతి కలదని బహుకాలముగ గాలికబురుగ వినుచుండిన పోర్చుగీసుమతాచార్యులు ౧౪౯౦-వ సంవత్సరమున అబిసీనియాను గనుఁగొనిరి. వీరికి నిగస్టునిగస్ (ఇది అబిసీనియా రాజబిరుదము; రాజరాజని యర్థము) నకును స్నేహము కుదిరెను. క్రీ. శ. ౧౫౨౮ మొదలుకొని ౧౫౪౦ వఱకును మహమ్మద్ గ్రాన్ అను పేరుగల తురుష్కమహాయోధునకును, అబిసీనియాచక్రవర్తికిని జరగినపోరాటమందు పోర్చుగీసులు నిగసునకుఁ దోడుపడిరి. హిందూదేశమునుండి కూడ సేనలు వచ్చియుండెను.

మహమ్మద్ గ్రాన్ గుండుదెబ్బచే మరణించుటవలన నిగసునకు సంపూర్ణజయము గలిగెను. తరువాత నితనికిని, పోర్చుగీసుల బిషప్ అగు బర్ముడాసునకును వాదవివాదము లుప్పతిల్ల తత్కారణమున క్రైస్తవాచార్యుఁ డాదేశమును విడలిపోయెను. క్రీ. శ. ౧౬౯౮-వ సంవత్సరమువఱకును గొందఱు యూరోపియనులు అబిసీనియాకుఁ బోయి రాజును కలసికొనుచువచ్చిరి కాని యటుపిమ్మట నొకశతాబ్ది పర్యంత మచటి కెవరును బోయియుండలేదు.

క్రీ. శ. ౧౬-వ శతాబ్దిమధ్యకాలమునుండి యాదేశమునకు దక్షిణముగ వసించుచుండిన గాలా లనుజాతివారు మెల్లఁగ లోపలఁ బ్రవేశించి దేశము నాక్రమించుకొనిరి. ౧౮-వ శతాబ్ది-అంతమునఁ జక్రవర్తి వారిచేతులలోఁ జిక్కెను. తరువాతను చక్రవర్తిబలము క్రమముగ తగ్గుచుఁబోయి తుదకు సంపూర్ణముగ నష్టమయ్యెను. అదే కాలమున నొక సామంతుఁడు బలవంతుఁడై యతనిమంత్రి యను పేరు పెట్టికొని రాజ్య మేలియుండెను. ఈప్రకారము ౧౮౫౫-వ సంవత్సరమువఱకు ననేకులు రాజులైరి. ఆసమయమున లిజ్ కాసా యను నతఁడు మూఁడవ థియొడర్ అనుబిరుదములోఁ జక్రవర్తిపదమును బొందెను.

ఇతఁడు అబిసీనియాయొక్క పడమటిభాగమందలి కారా మండలమున ౧౮౧౮-వ సంవత్సరమున జన్మించెను. ఇతనిపినతండ్రి యగు డంబియా, కారా, షెల్గానామకమండలములకు గవర్నరుగ నుండెను. అతనిమరణానంతరము లిజ్ కాసా కారామండలమునకు మాత్రము పాలకుఁడుగ నియమింపఁబడెను. దీనితోఁ దృప్తి నొందక ఇతఁ డనేకప్రయత్నముల సలిపి తుదకు ౧౮౫౫ లో చక్రవర్తి పదము నందెను. అపరిమితమగు రాజ్యకాంక్షచే నితఁడు తననాశన మార్గమును దానే నిర్మించుకొనెను. మొట్టమొదట నితనికిని, ఆంగ్లేయులకును మైత్రి యుండెడిది. కాని ౧౮౬౩-వ సంవత్సరమున నితఁడు బ్రిటిష్‌చక్రవర్తినికి వ్రాసి యంపినయుత్తరమునకు జవాబే రానందున సహజకోపుఁ డగునితఁడు బద్ధవైర మూనెను. ఎన్నిప్రయత్నము లొనరించినను ఈవైరము పోయినదికాదు. ౧౮౬౩-వ సంవత్సరమున నితనికిని బ్రిటిషువారికిని పోరాటము లారంభమయ్యెను. థియొడర్ చాలకాలము ప్రతిఘటించి పోరి విఫలమనోరథుఁడై తుదకుఁ బాఱిపోవ యత్నించియుఁ గార్యము గానక ఆత్మహత్య చేసికొనెను. ఇతనిరాజధాని యగు మాగ్డలానగర మాంగ్లేయులవశ మయ్యెను. ఈయుద్ధమునఁ దమకు సాయ మొనరించిన టిగ్రీపాలకుఁడగు కాస్సె యనునతనిని వీరు జోహన్నస్ గా జమశేర నాదేశమునకుఁ జక్రవర్తిగ నొనరించిరి. అటుపిమ్మట ఆంగ్లేయు లీదేశమును విడిపోయిరి. జోహన్నస్ ౧౮౮౯-వ సంవత్సరమునం దొకయుద్ధమున మరణించెను. యూరోపునందలి సభ్యులును, శక్తిమంతులు నగు ఫ్రెంచ్, జర్మన్, ఇటాలియన్, పోర్చుగీస్, బ్రిటిష్‌జాతులవారు ఆఫ్రికా ఖండమున వ్యాపారమున కని కొంతభాగమును జయించి కొంతభాగమును తమతమయధీనము గావించికొనిరి. అందు అబిసీనియా ఇటాలియనులపాలఁ బడెను. వారిసాయమున షోవారాస్ (ప్రభువు) అగు మెనెలిక్కు అనునతఁడు అబిసీనియాచక్రవర్తి యయ్యెను. ఈ దేశము ఇటాలియనులకు లోఁబడిన దనుపేరే కాని నిజమున కెప్పుడును వారికి చెందియుండలేదు. ౧౮౯౬-వ సంవత్సరమున ఇటాలియనులఁ గూడ చెదరించి మెనెలిక్కు సర్వస్వాతంత్ర్యము వడసెను. ఇతఁడు ౧౮౯౭-వ సంవత్సరమున నాంగ్లేయులతో మైత్రి కలిగియుండునట్లు సంధి గావించుకొనెను. ౧౯౦౭, ౧౯౦౮ సంవత్సరములలో అబిసీనియా, ఎరిత్రియా, సూడాను దేశములసరిహద్దులను బరిష్కరించుకొనుసంఘులు జరగెను.

ఈదేశపుప్రభుత్వము నిరంకుశము. అయినను ౧౯౦౭ లో నవంబరుమాసమున చక్రవర్తి అబిసీనియా కొకలసనుగు సాంకుశ ప్రభుత్వము నొసంగెను. చక్రవర్తి యందఱిపై నధికారి. అతనికి సాయము చేయుటకు ఒకసభ యుండును. సామంతరాజ్యములలోని రాజులును, మహామండలములలోనిపాలకులును నిందు సభాసదులుగ నుందురు. యూరోపునందలి మంత్రిమండలములవంటి మండలముల నైతము నితఁడు స్థాపనము గావించెను. ఇతనియొద్ద నెల్లప్పుడును ౧,౫౦,౦౦౦ ల సేన నిలువ యుండెడిది. అందలిసైనికు లందఱును యూరోపియన్ సైనికులపద్ధతిని యుద్ధవ్యూహముల రచింప సమర్థులై ఆధునికశస్త్రాస్త్రములం గలిగియుండిరి. ౧౯౦౭-వ సంవత్సరమునఁ బురుషు లందఱును దప్పక విద్య నభ్యసింపవలయు నని యొకచట్ట మేర్పడెను. ఈదేశ మిదివఱలో నాగరకతయందు వెనుకఁజిక్కి

యున్నను ప్రస్తుతము జాతీయభావ ముదయించుటవలన త్వరితముగ నభివృద్ధిఁ బొందు ననుటకు సందియము లేదు.

వేఱువేఱుగ నున్నసామంతరాజుల నందఱ నేకీభవింపఁజేసి యొట్లో రాజ్యము నడపుచువచ్చిన మెనెలిక్ చక్రవర్తి ౧౯౧౩-వ సంవత్సరమున మరణమందెను. ఇతఁడు మరణించినవెంటనే దేశమం దల్లకడల నుత్పాతము లుప్పతిల్లెను. ఇతఁడు బ్రదికియుండినకాలమున ౧౯౦౯-వ సంవత్సరమునందే తనపౌత్రుఁడగు లేజుయాసును ఉత్తరాధికారిగను, రాస్ తెసమ్మా యనునతనిని రీజంటుగను నియమించెను. కాని రీజంటునకును, ప్రజలలోఁ గొందఱు నాయకులకును, చక్రవర్తినికిని మధ్య మనోమాలిన్య ముండుటచే వీరు రాజ్య మొనరించుట పొసఁగియే యుండలేదు. ఇట్లు లుండ ౧౯౧౦-వ సంవత్సరమున చక్రవర్తిని ఏకాంతవాసమున కేఁగెను. ఆమఱుసటిసంవత్సరమున తెసమ్మా మరణించెను. అంత లేజుయాసు ప్రభుత్వాధికారమును దన చేతిలోనికిఁ దీసికొనెను గాని యితనిపట్టాభిషేకముమాత్రము జరగి యుండలేదు. ఇతనిరాజ్యగ్రహణానంతరము దేశమున కల్లోలము లధికముకాఁగా మఱింత దుఃస్థితికి వచ్చెను. క్రౌర్యపూరితమైన యితని నిరంకుశపరిపాలనమును, ఇతని దుష్ప్రవర్తనమును, వీనియన్నింటిని మించిన యితనిమహమ్మదీయమతపక్షపాతమును దేశవాసులను మిక్కిలి కోపపూరితులను జేసెను. చిట్టచివరకు సోమాలీలాండునందలి మహమ్మద్ ముల్లా యనువానిపక్షమూని మహమ్మదీయరాష్ట్రములగణరాజ్యము నొకదానిని కల్పింపవలయు నని యితఁడు ప్రయత్నింపఁబూన, చుట్టుప్రక్కల నున్న యూరోపియన్ జాతులకుఁగూడ నసహ్యము జనించెను. అంత ౧౯౧౬-వ సంవత్సరమున అబిసీనియాచర్చికి ముఖ్యుఁడగు అబూనా ఇతనిని జాతినుండి బహిష్కరించెను. అంతట రాజ్యమందలి ప్రముఖులును, గొప్పప్రాంతములరాసులును ఇతని సింహాసనభ్రష్టుని గావించి మెనెలిక్ చక్రవర్తిపుత్రిక యగు జౌదియాను చక్రవర్తినిగను, రాస్ టఫారీని సామ్రాజ్యమునకు రీజంటుగను నేర్పాటు చేసిరి. మఱియు నీటఫారీ రాసుల కందఱకు రాజుగను, రాజ్యసింహాసనమునకు హక్కుదారుగను బ్రకటింపఁబడెను. ఇందులకుఁ గారణ మితఁడు రాజకుటుంబమునకుఁ జెందినవాఁ డగుటయే కాక ఇతని భార్యయు నీరాజవంశములోనిదే. ఇట్లు లేజుయాసును పదభ్రష్టుని గావించి నూతనరాజ్యప్రబంధకర్తల నేర్పఱుచుటవలన దేశమం దనేకోపద్రవము లుప్పతిల్ల వానిపరిణామముగ భయంకరయుద్ధములు జరగెను. లేజుయాసుయొక్క తండ్రి రాస్ మైకేల్ అనునతఁడు గల్లా ప్రాంతమున నొకగొప్పసైన్యమును సమకూర్చి కుమారునకుఁ దోడ్పడ యత్నించెను. కాని ౧౯౧౬ నందు సాగల్లెయొద్ద జరగినయుద్ధమందు వేలకొలఁది సైనికులు హతులు కాఁగా నితఁడు సంపూర్ణపరాజయము నందుటయే కాక తుదకు శత్రువులచే ఖైదిగఁ బట్టుబడెను. లేజుయాసు పాఱిపోయి మొట్టమొదట కొన్నాళ్లు దనకలిప్రాంతమునఁ దిరిగి పిమ్మట టైగ్రయిలాకాయందుఁ బరిభ్రమించుచు కుట్రలఁ బన్నుటచే ౧౯౨౧-వ సంవత్సరమునఁ బట్టుకొనఁబడెను. నవీనపాలకులకు ౧౯౧౭ నందు రాజ్యపట్టాభిషేకోత్సవములు జరగినవి కాని వీరిపదవులు సదా అపాయకరములై యుండెను. గొప్పగొప్పరాసు లందఱును సగము స్వాతంత్ర్యమును బొందిరి. లేజుయాసు పట్టుకొనఁబడునంతపర్యంతము అతనిపక్షమువా రందఱును నూతనప్రభుత్వమువారి నెదిరించుచునే యుండిరి. కాని రీజంటు టఫారీ కష్టముల సహించి తనబుద్ధికుశలతవలన దేశము నంతను నొకకేంద్రప్రభుత్వముక్రిందికిఁ దీసికొనిరాఁగలిగెను. స్వదేశమున స్తిమితము నెలకొనినపిదప లండన్, పారిస్, రోమునగరములకు రాయబారుల నంపెను. ఈరాజ్యవిప్లవకాలమున నిజమునకు రాస్ టఫారీకిఁ దోడ్పడినది జిబూటీనుండి రాజధానివఱకు నిర్మింపఁబడినరైలుమార్గ మనియే చెప్పవచ్చును. ఈమార్గనిర్మాణము వలన బయటిసమాచార మితనికిఁ దెలియుటకును, ఇతనివృత్తాంతము బయటివారలకుఁ దెలియుటకును మంచిసౌకర్యములు గలిగెను.

టఫారీయొక్క భార్య రాస్ మైకేలుయొక్క పౌత్రి. ఈమెయం దితని కిద్దఱుకుమారులు, ముగ్గురు కుమారికలు జనించిరి. కావున నితనియనంతరము రాజ్యపుహక్కుదారులకై పోరాటములు కలుగవలసినయవసరము లేకపోయెను.

అనంతరము టఫారియొక్క స్థితి బాగుగ పాదుకొనిపోయెను. ౧౯౨౨-వ సంవత్సరమున ఏడెన్ నగరమును జూచునిమిత్త మితనికిఁ గొలఁదికాలమువఱకు రాజధానిని వదలియుండవలసివచ్చెను. ౧౯౨౪-వ సంవత్సరమున నితఁడు ౨౦ మంది యితరరాసులతోఁగూడి ౫ నెలల వఱకుఁ బర్యటన మొనరించి, యూరోపునందలి ముఖ్యనగరముల సందర్శించివచ్చెను. ఈరెండుసందర్భములందుఁగూడ రాజధానీనగరమునఁ గాని, రాజ్యమున మఱియే ప్రాంతమందైనఁగాని యుపద్రవము లేమియు సంభవించియుండకపోవుటవలన నితనిస్థానము స్థిర మయ్యె నని తలఁపవచ్చును. యూరోపుదర్శనానంతరము టఫారీ తనదేశమున నున్న తికరములకు మార్గములఁ బెక్కింటిని ప్రవేశపెట్టఁగలిగెను. రాజధానియందొక విశ్వవిద్యాలయమును స్థాపించి యూరోపియన్ శిక్షకుల నందు నియోగించెను. ఈపాశ్చాత్యసంపర్కమువలన దేశము క్రమక్రమముగా నభివృద్ధిలోనికి వచ్చుచున్నది.

ఈయబిసీనియాదేశమును చుట్టుముట్టి ఇటలీ, ఫ్రాన్స్, గ్రేట్ బ్రిటన్ వారలు రాజ్యముల స్థాపించుకొనియున్నారు. వీరుముగ్గురలో బ్రిటిష్‌వారికి నీదేశముతో నెక్కుడుసంబంధము; ఎందుచేత ననఁగా బ్రిటిష్‌రాజ్యపుసరిహద్దు రెండువేలమైళ్లమారముగల యబిసీనియాదేశమును చుట్టియున్నది. అందువలన నీరెండుజాతులవారిమధ్య నెక్కువ సంధులు జరగియున్నవి. ౧౮౯౭-వ సంవత్సరమున అబిసీనియా, ఈజిప్టులకుఁగల తగవుల పరిష్కారమునిమిత్తము, అబిసీనియాయందు బానిసవ్యాపారము దొలఁగించువిషయమునను సంధి జరగెను. ఇట్లే వ్యాపారము మరల సరిహద్దులపరిష్కరణము, ఆయుధములఁ దెప్పించుకొనువిషయముల ౧౮౯౯ నందును, నీలనైల్, టనాసరోవరముల నీరు వాడుకొనుటనుగూర్చి ౧౯౦౨-వ సంవత్సరమునందును, మరల

సరిహద్దులవిషయమున ౧౯౦౪ సందునను, మరల దిసుమతులమీఁద సుంకము మున్నగువానివిషయమున ౧౯౧౯-వ సంవత్సరమునను సంధులు జరగియుండెను. ౧౯౧౪ న అమెరికాతో వ్యాపారవిషయకసంధి జరగెను. ౧౯౨౮ న ఇటలీ, ఫ్రాన్సుదేశములు తూర్పు దిక్కున సరిహద్దులవిషయమున సంధి చేసికొనెను. ౧౯౨౭, ౧౯౩౦ లందు హాలెండ్, జాపాను దేశములు క్రమముగా వ్యాపారిక, మైత్రి సంధులఁ జేసికొనెను.

టఫారీయొక్క ప్రయత్నమువలన నిప్పుడీదేశము 'లీగ్ ఆఫ్ నేషన్స్' నందు స్థానము వహించియున్నది. ౧౯౨౩-వ సంవత్సరమున రీజెంటునకును, చక్రవర్తిని యగు జౌదిటూరాణికిని మనస్పర్ధలు కలిగెను. అంతే రాజ్యములోని ప్రముఖులయాదేశానుసారము టఫారీ తన్నే రాజుగఁ బ్రకటించుకొనెను.

**అబుతాలిబ్ కలిం** — ప్రసిద్ధుఁడగు నొక ఈరాన్ దేశపుకవి. మొదట జహాంగీరుచక్రవర్తి కాలములో నితఁడు హిందూదేశమునకు వచ్చెను. తరువాత తనదేశమునకు మరలిపోయి షాజహానుపాదుషాకాలమున మరల ఢిల్లీకి వచ్చెను. షాజహా నితనికి గొప్పబిరుద మొసఁగి ధనాదికముతో విశేషముగ సన్మానించెను. 'జఫర్‌నామా-ఇ-షాజహాన్' అనుపేర నితఁ డొకగ్రంథమును రచించెను.

**అబుల్ అలా ఉల్ మా ఆరీ** (౯౭౩-౧౦౫౭) — సిరియాదేశమున జన్మించిన ఒకగొప్ప అరబ్బీకవి. ఇతఁడు పసితనముననే తండ్రిని గోల్పోయెను. ఇది యౌవనాలుగేండ్లకే స్ఫోటకముగూడ సంభవించినది. అయినను మిగుల పట్టుదలతో నితఁడు అలెప్పో, అంటియోక్, ట్రిపోలీ మున్నగు పట్టణములకుఁ బోయి నచ్చటిపండితులకడ చదువుకొని గొప్పపాండిత్యము గడించెను. అటుపై బాగ్దాదు పట్టణమునకు పోయి యచటఁ దనపాండిత్యమువలన గొప్పపేరు సంపాదించెను.

**అబుల్ కాసిమ్** — కామ్రాన్ మీర్జాకుమారుఁడు, హుమాయూన్‌చక్రవర్తితమ్ముఁడు. క్రీ. శ. ౧౫౬౫-వ సంవత్సరమున అక్బరుచక్రవర్తి యితనిని గ్వాలియరుకోటలో ఖైదుచేసెను. తుదకు చంపించివైచెను.

**అబుల్ ఘాజీ బహాదర్** (౧౬౦౫-౧౬౬౩) — ఇతఁడు ఖైవాప్రభుత్వమును కుమారునకు నొప్పగించి చెంగిస్‌ఖాను యొక్క వంశచరిత్రమును వ్రాసెను. అయ్యది జర్మన్, ఫ్రెంచి భాషలలోనికి తరువాత తర్జుమా చేయఁబడినది.

**అబుల్‌ఫజల్, షేక్** — అక్బరుచక్రవర్తికిఁ బ్రాణస్నేహితుఁడు, మంత్రి, చరిత్రలేఖకుఁడు. ఇతఁడు 'షేక్ ముబారక్' అను సంఘసంస్కర్తయొక్క కుమారుఁడు. ఈతఁడు ౧౫౫౧-వ సంవత్సరము, జనవరి ౧౪-వ తారీఖున ఆగ్రా పట్టణమందు జన్మించెను. అప్పుడు 'ఇస్లాంషా' రాజ్యము చేయుచుండెను. అబుల్ ఫైజీ అను కవి యీతని యన్న. ముబారక్ మహమ్మదీయమతమునందు పిచ్చినమ్మకము గలవాఁడు కాఁడు. అందుచే నితరమహమ్మదీయులవలన నాతని కపాయము కల్గునట్లుండినందున నాతఁడు తన పుత్రులను ఆగ్రాలోనే విడిచి పారిపోయెను. అన్నదమ్ము లయిన అబుల్ ఫైజీ, ఫజల్ ఇద్దఱును తండ్రిమతానుసారముగనే పారసీక-అరబ్బీభాషల నభ్యసించిరి. పదునైదుసంవత్సరములు వచ్చునప్పటికే యీతఁ డెన్ని విద్యలనో సాధించి గొప్పపండితుఁ డనిపించుకొనెను. ఆతనిగుఱించి యాకాలమున నొక కథ కలదు. 'ఇస్ఫహాని' అను నొక పూర్వకవిచే రచింపఁబడిన గ్రంథ మొకటి కొరకెనఁట! అందలిపుటలన్నియు చినిఁగియుండెను. అతఁ డా సగభాగమును దనప్రజ్ఞచేఁ బూరించెను. తరువాత సంపూర్తిప్రతి యొకటి దొరకెను. దీనికి దానికిని శబ్దభేదము కొంతయున్నను మొత్తముమీఁద గ్రంథములోని భావము పోకుండ అబుల్ ఫజల్ దానిని పూరించె నని స్పష్టపడెను. చిత్రము



అబుల్ ఫజల్

ఈతఁడు మొదట నేకాంతవాసమునం దుండి కొందఱు శిష్యులకుఁ దన విద్య నేర్పుచుండెను. కాని ౧౫౭౪ లో నీతనికి ఈతని యన్నవలన అక్బరుచక్రవర్తితో స్నేహము గలిగి దినదినాభివృద్ధిని చెందెను. అప్పటికే యీతఁడు మహమ్మదీయులమతగ్రంథమైన 'ఖురాన్' మీఁద వ్యాఖ్య వ్రాసియుండెను. ఈతఁ డితరమహమ్మదీయులవలెఁ గాక అన్ని మతములయందును సమభావము గలవాఁడు. అన్ని మతములందును సత్య మున్న దనియు, ఒకమతముకంటె నింకొకమత మెక్కు డని చెప్పుటకు వీలు లే దనియు నీతని యభి

ప్రాయము. ఇతఁ డేకేశ్వరమతవాది; ఆకాలమందలి 'రామమోహన రాయ్' అనిదగు చెప్పవలెను. ఇతఁడు తన యభిప్రాయముల నన్నింటిని అక్బరునకు చెప్పి యాతనిని తన ప్రజలలో నన్ని మతములవారిని సమత్వముతోఁ జూచునట్లు చేసెను. అక్బరు అన్ని మతములవారిని పిలిపించి మతసభలను జరపె నని మన మెఱుఁగుదుము. ఆ సభల కితఁడే కారకుఁడు. అందుచే నీతనిని మతావేశులగు మహమ్మదీయులు హింసించుచును, నాస్తికుఁ డనియు నిందించిరి. ౧౫౭౨ లో ఈతనికి రెండువేల మాన్సబ్దారీ యియ్యఁబడెను. ఈతఁ డెల్లప్పుడును అక్బరుతోఁ గూడ తిరుగుచుండెను. ఈతని తండ్రియైన షేక్ ముబారక్ ౧౫౯౩ లోను, అన్నయైన ఫైజీ ౧౫౯౫ లోను కీర్తిశేషు లయిరి. ౧౫౯౮ లో నీతఁడు సైన్యాధిపతిగ దక్షిణమున కంపఁబడెను. అప్పుడు రాజపుత్రుఁడైన మురాద్, సైన్యాధిపతి యైన ఖాన్ ఖానన్ గాంచిరి. వారి యజాగ్రత్తవలనఁ గలిగిన లోపముల నన్నింటిని సవరించి గోదావరీనదీతీరమున శిబిరము నిలిపి నాసిక తప్ప మిగిలిన ప్రాంతము లన్నియు సాధించి తన బంధువైన ఖాన్ ఖానాను రాజు బహదూర్ ఖాను పంపినలంచములను త్రిప్పికొట్టి చాంద్ బీబీతో నాటకాల మైన సంధి చేసికొని యక్బరును ఖాన్ గామునొద్దఁ గలసికొనెను. అంతి నక్బరు రీతిని వాలుకవేలమాన్సబ్దారు గావించెను. అసీర్‌గఢము ముట్టడియందును నీతఁడు తన శౌర్యమును జూపెను (౧౬౦౨). దక్షిణదేశమునందలి వ్యవహారములను జక్కఁబెట్టుటకై చక్రవర్తి యీతనిని మరలఁ బంపెను. అతఁ డప్పుడు మిక్కిలి సొగసుగాఁ జూపి బాల్ నావురనును స్వాధీనపరచుకొని 'మన్నా' యను వానిని బోలెకొలిపెను. అతఁడు తిరిగి ఢిల్లీకి వచ్చుచుండఁగా రాజపుత్రుఁ డయిన సలీము (తరువాతి జహాంగీరు చక్రవర్తి) ప్రేరణవలన గ్రామనివాసములోని 'ఉర్చా' రాజయిన బర్సింగుదేవుని మోసముచే నీతనిఁ ద్రోవలోఁ జంపెను (౧౨ ఆగష్టు ౧౬౦౨). అతని తల అలహాబాదులో నున్న రాజపుత్రునికిఁ బంపెను. ఈ సమాచారము దెలిసి అక్బరు మిగుల దుఃఖించి రెండుదినములవఱకును పిల్లవానివలె నేడ్చుచు నిద్రాహారములు లేకయుండెను.

అబుల్ ఫజల్ ఆకాలమునాఁటి గొప్ప సద్గ్రంథకర్త. అతనికీర్తి హిందూదేశమునందు చంద్రార్కముగ నుండుట కాతని యున్నతోద్యోగము కారణము గాదు. అతనిచే రచియింపఁబడిన 'అక్బరు నామా', 'అయినీ అక్బరీ' అను చరిత్రగ్రంథరాజములే యందులకుఁ గారణములు. మొదటదానిలో అక్బరుచక్రవర్తియొక్క చరిత్రము సవిస్తరముగను, సుమనోహరముగను రాజ్యాభిషేక మైనతరువాత నలువదియేడుసంవత్సరములవఱకు, అనఁగా అబుల్ ఫజల్ మరణించినసంవత్సరమువఱకును వ్రాయఁబడియున్నది. రెండవదానిలో, అప్పటిరాజ్యవిధానమును, రాజ్యవిస్తారవివరమును, దేశమందలి యితర విశేషము లన్నియును వివరముగా వర్ణింపఁబడినవి. ఆకాలమందలి దేశచరిత్రమున కితనిగ్రంథములే ముఖ్యాధారములు. ఇతఁడు పంచతంత్రగ్రంథమునుగూడ పారసీకములోనికి భాషాంతరీకరించెను.



'మక్తుబాతి అల్లామి' అను నొక గ్రంథ మీతనిది గలదు. ఇందు నతనిచే గొప్పగొప్పవారికి వ్రాయఁబడిన యుత్తరములు సంగ్రహింపఁబడినవి.

మొత్తముమీఁద నితఁ డొక యద్వితీయపురుషుఁడు. సత్యసంధుఁడు, సర్వసముఁడు. అక్బరుయొక్క ఉత్తమోత్తమపరిపాలనమునకుఁ బ్రేరకుఁడు, కారకుఁడు.

**అబుల్ ఫరాజ్, మార్ గ్రిగరీజాన్ అబుల్ ఫరాజ్** (౧౨౨౬–౮౬) — ఈతఁడు హీబ్రూకుమారుఁ డని యర్థమిచ్చు 'ఎభ్రయా' యని సిరియనువారిచేఁ బిలువఁబడుచుండెను. కాని సామాన్యముగా సర్వత్ర ల్యాటిన్ నామమైన 'బార్ హీబ్రయస్' అనియే వ్యవహరింపఁబడుచుండెను. ఇతఁడు ఆర్మీనియాలోని మలాటీ యను పట్టణమున జనించెను. గ్రీకు, అరబ్బీ, సిరియాభాషల నభ్యసించినతరువాతఁ దత్త్వశాస్త్రము, వైద్యశాస్త్రము, దైవవిషయక శాస్త్రము నేర్చుకొనుటయందుఁ గృషి చేసెను. అంటియోక్ అను ప్రదేశమున విద్యాభ్యాసమును జేయుట ముగించి అచ్చటిమఠములోనే వైరాగ్యజీవనమును బ్రారంభించెను. ఇతఁ డనేకస్థలములయందు మతగురువు(బిషప్పు)గ నుండెను. సిరియాదేశమునందు జనించిన పండితప్రముఖులలోను, కవివరులలోను నితఁ డొక్కఁడు. ఇతని గ్రంథములలోఁ బ్రపంచచరిత్ర మనియెడిగ్రంథము ప్రధానమైనది.

**అబుల్ ఫేడా** (౧౨౭౩–౧౩౩౧) — డెమాస్కస్ పట్టణమునందు జనించెను. మతమునకై దండయాత్ర చేసిన క్రైస్తవ సైనికులతోను, మంగోలియావారితోను జరగినయుద్ధములయందు బాహుశక్తి చూపియు, కలముశక్తి చూపియు పేరు తెచ్చుకొనియెను. ఇతఁడు హామాదేశమునకు సుల్తానుగ నుండెను గాని యీజిప్టుమామెలూక్ సుల్తానునకు సామంతుఁడుగ నుండెను. ఇతఁడు చరిత్రమును, భూగోళమునుగూర్చి గ్రంథములను వ్రాసెను.

**అబుల్ ఫైజీ** (౧౫౪౭–౧౫౯౫) — ఈతని తండ్రి పేరు షేక్ ముబారక్. అక్బరుచక్రవర్తియొక్క ముఖ్యమంత్రి యగు అబుల్ ఫజల్ అనునతఁడు ఈ ఫైజీయొక్క తమ్ముఁడు. వీరిద్దఱను అక్బరు చాల గౌరవించి గొప్పపదవులందు నియమించెను. చక్రవర్తి యాస్థానపండితుఁ డగు ఘిజాలీ చనిపోయినపుడు (౧౫౭౨) ఆపదవి ఫైజీకి లభించుటయే కాక యాతనికి 'కవిచక్రవర్తి' యనుబిరుదు కూడ నొసంగఁబడెను.

అబుల్ ఫైజీ అసాధారణప్రజ్ఞ గలవాఁడు. చరిత్ర, తత్త్వశాస్త్రము, వైద్యము, వ్యాసరచన, ఉత్తరములు వ్రాయుట – ఈపనులయం దీతనికి సమాను లెవ్వరును లేరు. 'నిజామీ' యను గొప్ప పండితుఁడు రచించిన 'కంసా' అనుకావ్యమువలె నుండువానిని వ్రాయుటకై ప్రయత్నించి ఐదు గొప్పపద్యకావ్యముల నీతఁడును రచించి ప్రసిద్ధి కెక్కెను. అక్బరుకోరికపై రామాయణమును, మహా

భారతములోని రెండుపర్వములను,పారసీక భాషలోనికి తర్జుమా చేసెను. నలదమయంతులకథ వ్రాసి దానికి 'నల్ దమన్' అనుపేరు నిడెను. సంస్కృతవాఙ్మయమును, హిందూజ్ఞానశాస్త్రములను జాల కృషి చేసి చదువ ప్రయత్నించినమహమ్మదీయులలో మొదటివాఁడ ఫైజీయే. ఈతఁడు భాస్కరాచార్యవిరచితము లగు బీజగణితమును, లీలావతీగణితమును, పారసీకభాష కనువదించెను. ఈతఁడు పారసీక భాషలోనికి సంస్కృతకావ్యములను, వేదాంతశాస్త్రములను పరివర్తనము సేయుటయే కాక తనంతట తాను కొన్నిపుస్తకములను వ్రాసెను. అబుల్ ఫైజీ వ్రాసినగ్రంథములలో మిగుల గొప్పది ఖురాను అను మహమ్మదీయమతగ్రంథముపై వ్రాసినవ్యాఖ్యానము. దీనిని రచించుట కీతఁడు చాల శ్రమపడెను. తనభాషలో ఇరువదియెనిమిది యక్షరము లుండఁగ చుక్కలు లేని పదునాఁడక్షరములనుమాత్రమే ప్రయోగించి పుస్తకమును బూర్తి గావించెను. ఇట్టిగ్రంథమునే మఱియొకదాని నితఁడు రచించెను. ఈతఁ డరబ్బీభాషలోఁగూడ గొప్ప విద్వాంసుఁడు. ఈతఁడు సుమారు ౧౦౧ పుస్తకములను రచించెను. కొంతకాల మీతఁడు రాజతనయుల కుపాధ్యాయుఁడుగ నుండుటయే కాక రాజకీయవిషయములలోఁ జాల జోక్యము కలిగియున్నటులు కానవచ్చుచున్నది. ఈతఁడు కొంతకాలము రాయబారిగ నుండి అక్బరుమన్ననకుఁ బాత్రుఁ డయ్యెను. ఈసంగతి నీతఁడు 'బదౌనీ' యను చరిత్రకారునికి వ్రాసినలేఖలవలనఁ గనఁబడుచున్నది. ఈతఁడు బాల్యమునుండియు నుబ్బసమునకు లోనై దానివలననే మృతి నొందెను.

**అబుల్ మాలీషా** — ఈతఁడు అక్బరునొద్ద నొకస్వల్పోద్యోగము చేసి, అతనితోఁ గలహించి, కాబూలుదేశమునకుఁ బాఱి పోయెను. అక్కడ 'మీర్జా మహమ్మదు హాకీము' అను అక్బరుసోదరుఁడే ఈతనిని కరుణించి తనయొద్ద గొప్ప ఉద్యోగమున నియమించెను. అంతియె కాక తనసోదరి యగు మెహరున్నిసాబేగమ్ అను నామె నీతని కిచ్చి పెండ్లి చేసెను. కాని ఈతఁడు అక్కడఁగూడ తన దుర్వృత్తి మానలేదు. ఏవిధముననైనను కాబూలురాజ్యము తాను సంపాదించుటకై ౧౫౮౫ లో హాకీముతల్లియు, తనయత్తగారును నగు నామెను చంపించెను. ఆమెభర్త పేరునకుమాత్రమె రాజు గాని ఈమెయే సర్వకార్యములను జూచుచుండెడిది. అట్టియసాధారణప్రజ్ఞ గలిగినయామెను జంపి, బాలుఁ డగు నామెతనయునకు తాను రక్షకుఁడ నని ప్రవర్తింపఁజొచ్చెను. అప్పటికిని ఆతనియుద్దేశ మాబాలుని వధించి వారసులు లేకుండఁ జేయుటయే. అప్పుడు తాను తప్పక రాజు కాఁగల ననుకొనెను గాని ఈతఁడు తలఁచినటులు జరగలేదు. ౧౫౮౫ లోనే బదక్షాన్ దేశమునకు యువరాజగు మిర్జా సులైమాన్ అనునతఁ డీతని యుద్ధమున నోడించి, వధించి, ఆరాజ్యమును తనదేశమునకుఁ జేర్చుకొనెను. కాని అతఁడును కాబూలును రెండుసంవత్సరములుమాత్రమే పాలించెను.

ఈతనికి షబదీ యను కవిత్వసంబంధమైన బిరుదుపేరు కలదు. ఈతఁడు ప్రసిద్ధి వడసినవిద్వాంసుఁడు.

**అబుల్ హసన్** — ఈతఁడు జహాంగీరుచక్రవర్తికి ప్రధానమంత్రి. రాణి యగు నూర్జహాను ఈతనిసోదరి. ఈతనికి ముగ్గురు కొమార్తెలును, నలుగురు తనయులును కలిగిరి. మొదటి కూఁతు రగు ముమ్‌తాజ్ మహల్ జహాంగీరుకుమారుఁ డగు షాజహానున కిచ్చి వివాహము చేయఁబడెను. ఈతనికుమారులు కడు ప్రసిద్ధిగొన్నవారలు. ఆలంగీరుచక్రవర్తికి ఈ హాసన్ మతవిషయక గురువుగా నుండెడివాఁడు. ఈతఁడు ౧౬౪౧-సంవత్సరమున లాహోరులోఁ జనిపోయెను.

**అబుల్ హాసన్ కుతుబ్ షాహ** (౧౬.౭౨ - ౧౬౮౭) — ఇతఁడు గోలకొండలోఁ బ్రభుత్వముచేసిన కుతుబ్ షాహి వంశములోని చివరనవాబు. అబ్దుల్లా కుతుబ్ షాహ అను ఆఱవ నవాబున కితఁడు మేనల్లుఁడు. అతనికూఁతుమగూడ వివాహ మాడి యాతనితరువాత గోలకొండరాజ్యమునకు నవాబయ్యెను. ఇతని కవిత్వసంబంధమైననామము తానాశాహ. ఇతనినే మనవారు తానీషా



సుల్తాన్ అబుల్ హాసన్ తానీషా

యందురు. ఇతనియొద్దను అక్కన్న మాదన్న లను వారలు మంత్రులుగ నుండిరి. శివాజీ దక్షిణమును జయింపఁబోవుసమయమున హాసన్‌తో సంధిచేసికొనిపోయెను. అందువలన వైరమూని విజాపురము

sampath_Ebooks

నవా బగు అబ్దుల్ కరీం డిలేర్ ఖానుతో గలసి గోలకొండపై దండెత్తెను. కాని మంత్రులసాహాయ్యముచే తానీషా శత్రువుల జయింపఁ గలిగెను. అందుచే నీమంత్రుల నెటులయిన నాశనము నొందింపవలెనని పట్టుపట్టిన వైరులతోడ్పాటుతో ఔరంగజేబు గోలకొండకు ఏడు నెలలు ముట్టడివేసి ౧౬౮౭లో ఈరాజ్యమును జయించి తానీషాను చెఱఁబట్టి (౨౨-వ సెప్టెంబరు) దౌలతాబాదుదుర్గమున చెఱసాలలో నుంచెను. ఇతఁ డాదుర్గముమీఁదనే ౧౭౦౪-వ ప్రాంతమున మృతుఁ డయ్యెను. ఇతఁడు దక్షిణదేశపుహిందూస్తానీభాషలో రసవంత మైన కావ్యములను జెప్పెను.

అబూ అబ్దిల్లాహ అహమద్ ఇబ్న హంబాల్ — ఇతఁడు సున్నీముసల్మానులలోని నాలుగవ సనాతన సంప్రదాయముయొక్క స్థాపనాచార్యుఁడు. క్రీ. శ. ౭౮౦-వ సంవత్సరమున బాగ్దాదునగరమందు జన్మించెను. ఇతఁడు యాజీద్ ఇబ్న హారూన్, యాహ్యా ఇబ్న సౌదు లనువారియొద్ద విద్యాభ్యాస మొనరించెను. క్రీ. శ. ౮౧౧-వ సంవత్సరమున అశాఫీ యను విద్వాంసుఁ డొకఁ డేతెంచి బాగ్దాదునం దుపదేశము లొసంగుచుండ నితఁ డాయనవ్యాఖ్యానముల నాలకించుచుఁ గాలక్రమమున లౌకిక పారమార్థికవిద్యలం దత్యంతనైపుణ్యమును గాంచెను. మహమ్మదుయొక్క నీతివాక్యములు లక్షకంటె నెక్కుడుగ నితనికిఁ గంఠస్థములై యుండెను. ఇంతలో ఖురాను అనాది యని కొందఱును, సాదియని కొందఱును వాదింప నితఁ డనాది యనువారిలోనివాఁ డగుటచేతను, దత్కాలపుఖలీఫా రెండవపక్షమువాఁ డగుటచేతను నితనిం జెఱసాల యందుఁ బెట్టించెను. కాని యీఖలీఫాయనంతరము సింహాసన మెక్కిన ఖలీఫా యుదారస్వభావుఁ డగుటవలనఁ బరమతసహన మను నీతి నుపదేశించి తనతండ్రి కారాగారమునఁ బెట్టించినవారి నందఱను విడిపించెను. అప్పు డీహంబాలునిగూడ విడుదల చేయుటయే కాక ఖలీఫా తనదర్బారులోనికిఁ బిలిపించి మిగుల సన్మానపూర్వకముగ వెయ్యిమొహిరీలను గానుకగ నర్పింప నితఁడు వాని నంగీకరింపఁ డయ్యెను. పిదప నితఁడు ఇమాముపదము నొంది సంసారమునుండి విరక్తుఁడై యేకాంతమునఁ గాలము గడపుచు ౭౭ సంవత్సరముల ప్రాయమున కాలధర్మ మందెను. ఇతనియంతిమసంస్కారావసరమున ౮ లక్షలపురుషులు, ౬౦ వేలస్త్రీలును నితనివిమానమువెంటఁ బోయిరి. ఇతనిమరణమును గాంచి తత్ప్రభావమున ౨౦ వేలమంది యూదులు, క్రైస్తవులు మహమ్మదీయమతము నవలంబించినట్లు చెప్పుదురు. ఇతని తరువాత నితనియనుయాయులు నూఱుసంవత్సరములపర్యంతము బలశాలులై యుండిరి కాని పిదపఁ గ్రమక్రమముగ క్షీణించిపోయిరి. ఇప్పుడు వీరలు అరాబియాదేశములో నచటనచటఁ గానవచ్చుచున్నారు. ఇతనిగ్రంథములలో ముఖ్యమైనది ముసనద్ అనునది యొకటి. ౭,౫౦,౦౦౦ సంప్రదాయములలోనుండి యేర్పఱిచి వ్రాసిన ౩౦,౦౦౦ సంప్రదాయములవిషయము లిందుఁ గలవు. ఇంద్రియములలోఁబఱుచికొనువిషయమునఁగూడ నితఁ డొకగ్రంథమును వ్రాసియున్నాఁడు. ఇస్మాయిల్ అల్ బుఖారీ, ముస్లిం ఇబ్న దావూద్, అనువార లితనిశిష్యులే. ప్రస్తుతము వాహిబీ లనువారు హంబాలుని యుపదేశములను గొంతవఱకు ననుసరింతు రని చెప్పుదురు.

అబూ అబ్దిల్లాహ మలిక్ ఇబ్న అనాస్ — సున్నీమహమ్మదీయులలో వేఱొక సంప్రదాయమునకు జన్మదాత. క్రీ. శ. ౭౧౬-వ సంవత్సరమునం దితఁడు మదీనానగరమున జన్మించి మహమ్మదుయొక్క ప్రత్యక్షానుయాయి యగు సాహల్ ఇబ్న సద్ చేయునుపదేశములను గ్రహించెను. ఇతఁడును బ్రఖ్యాతి నొందిన విద్వాంసుఁడు. కొన్నికొన్నివిషయములలో మతభేదము లుండినప్పటికి నితఁ డిమాం అబూ హనీఫాతో మైత్రిగలిగి యతనితోఁ బ్రసంగములను జేయుచుండెడివాఁడు. ఖలీఫా హారూన్-అల్-రషీదు మదీనా దర్శనార్థ మేఁగినసమయమున నీయనను గూడ సందర్శించి తనకును, దన కుమారులకు నుపదేశ మొనరింపుఁ డని వేఁడుకొన నితఁడు వారిదగ్గఱకుఁ బోవొల్లనందున ఖలీఫా తనకొడుకుల నీయనకడ కంపెను. సంప్రదాయపుతగాదాలలో నితనితీర్మానమున కెదురాడువారు లేరు. అంతిమదినములలో నితఁడు వారమునకు మూఁడుదినములుమాత్రమే భోజనమును చేయుచు మతగ్రంథావలోకనముతోడను, ఈశ్వర ధ్యానముతోడను కాలము గడపియుండెను. ౮౯ సంవత్సరముల ప్రాయమున నితఁడు దేహము విడనాడెను. ఉత్తరాఫ్రికా, బార్బరీ యిలాకాలలో నితనివాక్యములు ప్రమాణములుగ గ్రహింపఁబడుచున్నవి. ఇతనితరువాత సున్నీలలో మఱియొకతెగను స్థాపించిన అస్శఫీ యితనిశిష్యుఁడే. ఇతఁడు రచించిన ముఖ్యగ్రంథము మువత్తా. ఇదియే యీయనయనుయాయులకుఁ బ్రమాణగ్రంథము.

అబూ అలీ కలందర్ — ఒక గొప్పముసల్మానుసాధువు. ఇతఁ డెన్నియో యద్భుతములఁ జేసి చూపుచుండువాఁడు. ఈరాక్ దేశ మితనిజన్మస్థానము. కాని హిందూదేశమునందలి పానిపట్టునగరమున నెల్లప్పుడును నివసించుచుండెను. క్రీ. శ. ౧౩౨౪-వ సంవత్సరమున పానిపట్టునగరముననే తుద కితఁడు మరణించెను. అబూఅలీ కలందర్ సమాధి చాలఁ బవిత్రముగ భావించి నేఁటికిని ఎందఱో ముసల్మానులు దానిని బూజింపఁబోవుచుందురు.

**అబూకిర్** — ఈజిప్టుదేశముయొక్క ఉత్తరతటమున అలెగ్జాండ్రియానగరమునకు నీశాన్యముగ ౧౩ మైళ్లమీఁదఁగల యొకచేపుపల్లె. దీని నానుకొని ఈజిప్షను - రోమక - గ్రీకు - పురాతన శిథిలస్థానము లనేకములు గలవు. ఈపల్లియప్రక్కనుండు అఖాతముచే నిది సుప్రసిద్ధము. అందు ఫ్రాన్సుదేశమునందలి విప్లవవిగ్రహకాలమున ఫ్రెంచివారి నావికాసైన్యములకును, నాయకరత్నములలో నొక్కఁడగు నెల్సనుచే నడుపఁబడిన ఆంగ్లేయనావికాసైన్యములకును బోరయ్యె. ఆంగ్లేయులు విజయు లయిరి. ఆయుద్ధమును నైలుయుద్ధ

మని వ్యవహరించుట కలదు. అబూకిర్ ప్రాంతముల నాసమయమున మఱి రెండుయుద్ధములు జరగెను.

**అబూతలిబ్** — మహమ్మదుయొక్క పినతండ్రి. ఇతడు మహమ్మదు యొక్క సంరక్షకుడుగా కొంతకాలముండెను. ఇతడు వలీజనకుడు. ముసల్మానుమతము నితడు స్వీకరించియుండలేదు. కాని ౪౦ సంవత్సరములపర్యంతము మహమ్మదునకు విశ్వాసపాత్రుడుగ నుండి యతని గాపాడెను. మహమ్మదీయమత ప్రారంభమునకు మూడుసంవత్సరములు ముందుగనే యితడు కాలధర్మము నందెను.

**అబూతలిబ్ ఖాన్, మిర్జా** — ఈతడు తుర్క్ వాడు. ౧౭౫౨ లో లక్నోనగరమున జన్మించెను. నవాబ్ అసఫుద్దౌలా యనునతనియొద్ద ౧౭౭౫ లో ఉద్యోగమునకు ప్రవేశించెను. కొంతకాలముతరువాత నాపనిని వదలుకొని గోరఖ్ పూరుపురగొల్ల్ ర్యాద్దను కొలువునకు జేరెను. తరువాత నీతడు కొంతకాలము లక్నో నగరమునకు రెసిడెంటుగ నున్న మిడిల్ టన్ అను ఆంగ్లేయునియొద్దను ప్రవేశించెను. అప్పు డీతడు రాజా బల్వదారుసింగు అనునతని జయించుటలో, ఇంగ్లీషువారికి చాల సాయము చేసెను.

ఈతనికి కొన్ని యిక్కట్టులు తటస్థించుటచే ౧౭౯౯ లో ఇంగ్లండునకు ప్రయాణమయ్యెను. లండనునగరమున, ఈతడు 'పారసీకయువరాజు' అనుబిరుదముతో సంచరించి చాలగౌరవింపబడెను. ఆతడక్కడ నున్న కాలములోను, ఐరోపాలో సంచారము గావించిన యితరప్రదేశములలోను తాను చూచి గమనించి తెలిసికొనినవిషయములను ఒకపుస్తకమున వ్రాసియుంచుకొని, తిరిగి ఇండియాకు వచ్చినతరువాత ౧౮౦౩ లో కృష్ణపటేచి ప్రకటించెను. వానిని లండనునగరవాస్తవ్యుడగు చార్లెసు స్టీవార్టు ౧౮౧౦ లో ఇంగ్లీషుభాషలోనికి భాషాంతరీకరించెను. ఈతడు ౧౮౦౬ ప్రాంతమున చనిపోయెను.

**అబూదావూద్** — ఇతనియసలుపేరు సులైమాన్ ఇబ్న్ అల్ అశాస్ అల్ సిజిస్తానీ. క్రీ. శ. ౮౧౭-వ సంవత్సరములో బసరానగరమున జన్మించెను. సున్నీసంప్రదాయములవిషయమున నితడు చాలు మంచిగ్రంథముల సంగ్రహించియున్నాడు. వానిలో వైదులక్షలసంప్రదాయములనుండి యేతీన ౪,౦౦౮ సంప్రదాయములంగూర్చిన వివరములు కలవు. ఇతనిమరణకాలము క్రీ. శ. ౮౮౯.

**అబూబకర్ (౫౭౩-౬౩౪)** — ఇతడు గజ సంవత్సరానంతరము రెండున్నరయేండ్లకు, అనగా క్రీ. శ. ౫౭౩ లో మక్కానగరమునందు ఖురైషుజాతికి జెందిన 'బానితాయమ్' వంశమందు జననమందెను. అబూబకర్ తండ్రిపేరు ఓథ్మన్; కాని యతడు అబూ కుహాఫా యని ప్రఖ్యాతి కెక్కియుండెను. ఇత యసలుపేరు అబ్దుల్లా. అబూబకర్ (ఒంటెపిల్లలతండ్రి) అను పేరు ఏకారణమున నితనికి వచ్చినదియు దెలియదు. క్రీ. శ. ౫౭౦-వ సంవత్సరములో ఈ యెమనుఇలాకాయొక్క అబిసీనియన్ గవర్నరగు అబ్రాహా ఏనుగులసైన్యముతో మక్కాను ముట్టడించినదియగుటవలన నావర్షమునకు గజసంవత్సరమని పేరు వచ్చినది. పైగంబరునోట నుండి వెలువడిన ప్రతివాక్యమును సత్యమని యుపాధి చేయుచుండెడివాడగుట నితనికి అస్ సిద్దీక్ అను పేరు గలిగినది. మహమ్మదు పంపిన యూతిదవారిలో నితనిపాలుస్సైన ... యొక్క తిరుగు కన్య గావున నితనికి కన్యతండ్రి యను పేరు కలిగెను. ముదయు నితనికి 'అతీక్' (ముక్తుడు) అను పేరు నుండెను. నరకాగ్నినుండి ముక్తుడైనందున నో, లేక సుందరాకృతి గలిగియుండుటవలననో యితని ముక్తుడనుపేరు వచ్చిన దని యూహింపబడినది. ఆకాలమున మక్కానుబరిపాలించుచుండిన పదివంశములలోని యొకవంశమునకు ... అబూబకర్ వంశ మొకటి ... (పేరుములలో) ... కథకాలము ... యుండెను. ఇతనికాలమందితడే ... నిర్ణయించుచుండెడివాడు.

మహమ్మదీయమతము నవలంబించుటకు పూర్వ మితనిజీవిత చారిత్రము మంతగా దెలియదు. కాని యప్పటికే కొన్ని ఘటనలవలన నితడు విగ్రహములను బూజించుటయందు విముఖుడుగ నుండెనని తెలియుచున్నది. ఒకనాడితనితండ్రి యితని దేవతావిగ్రహము చెంతకు గొనిపోయి దానికి నమస్కారము గావింపుమనియు, నది ప్రార్థనీయమైనదనియు పలికెను. అప్పుడితడు వినుకొనక తండ్రియాజ్ఞను బాలించెను. కొంతసేపటికితనిజనకుడచట నుండి వెడలిపోవుటచే నితడా విగ్రహమును సమీపించి తన కాకలిగ నుండినందున నాహారము నొసగుమనియు, ధరించుటకు వస్త్రముల నిమ్మనియు వేడి ప్రతివచనము గానక శిలనొక దానిని చేతబూని ప్రార్థనము సహాయము వగునుచేని కాచుకొమ్మని నుడువ వంశములకును ప్రతివిధానమేమియు సగపడనందున జేతిలోనిరాతిని దాని ముఖముపై గొట్టనది నేలగూలెనట. ఇట్టియభిప్రాయములు గలిగియుండినవాడగుటవలననే మహమ్మదు నూతనమతావిష్కారమును జేయ నితడు వెంటనే యతనియనుయాయియై తనసర్వస్వమును నాధర్మమునకై ధారపోసెను.

ఇతడు పొడుగుపాటి పలుచని శరీరమును, స్నిగ్ధములైన నేత్రములును, నెత్తయిన నుదురును గలిగి సుందరరూపమున నొప్పుచుండెడివాడు. మొట్టమొదట నితడు వస్త్రములవ్యాపారమును జేయుచు నందువలన నమితమైన దానధర్మము లొనరించుచు బేరు ప్రతిష్ఠలను గాంచెను. ఇస్లాము నవలంబించినపిదప నెందఱో దాసుల – ముసల్మానుమతమును స్వీకరించుటచే నన్యమతస్థులక్రింద బాధపడుచున్న వారల – దాసత్వమునుండి ముక్తుల గావించెను. ఒకపుడు వైరులవలనిభయ మెక్కుడుకాగా 'థౌర్' అనుపేరుగల గుహలో దాగికొనియుండ నితనికిని, నితనిగురు వగు మహమ్మదునకును పాలను

sampath_Ebooks



సమకూర్చిన 'అమీరుల్ బిల్ షోహాయుం' అనునతఁ డట్లు విశిపింపఁ బడినవారిలో నొకఁడు. నూతనమతావలంబనమునకుఁ బూర్వ మితఁడు తన సంపత్తిని బాలమట్టున కొనసాగించి ధర్మప్రచారమునిమిత్తమే వినియోగించి యుండెను. ఇతనికి దురవస్థవచ్చినపుడు ప్రథమమున నలుబదివేలదర్హములు గలిగియుండిన యితనిదగ్గఱ మక్కానుండి మదీనాకుఁ బారిపోవుసమయమునఁ గేవలము ౫,౦౦౦ల దిర్హములుమాత్ర ముండెనట! ఇతనిపితరుఁడును సుజీవించి యుండెను. ప్రసిద్ధమైనగాథ గలదు. దాన మొసగుటలో నితనిని మించవలయు నని ఓమరు కల్లప్పుడును దలఁచుచుండెనఁట. ఒకసమయమున ధర్మకార్యముకొఱకు యథాశక్తి ద్రవ్యము నొసంగఁ డని మహమ్మదు అనువారి నడిగి ఆదుగఁ గలిగినవారు తోఁచినట్లుగనె ధనము నిచ్చిరి. ఓమరు తనయాస్తిలో సగము పైగంబరుకు శేషముగా నిచ్చి యీతఁడే యప్పుడంటె అబూబకరును మించెది నని సంతసించుచుండెను. అనంతరము జరిగిన ఇష్టాగోష్ఠియందు, అందఱితో పాటు అబూబకరునుగూడ నింటియందు కేమి నిలువ చేసికొంటి వని పైగంబ రడిగెను. ఇతఁ డల్లాను, పైగంబరును దేవారికై నిలువచేసి కొంటి నని వచింప నది విని ఓమరు లజ్జాక్రాంతుఁ డయ్యెనఁట.

అస్సిద్దికు యొక్క సదాచార్యనిష్ఠ లత్యంత ప్రశంసనీయము లై నవి. మహమ్మ దొకనాఁడు శిష్యసభ్యుల నవలోకించి,

'మీలో నెవరైన నీదినమున మపవాసవ్రత మాచరించితిరా?'

'మీలో నెవరైన నీదినమున బీదల కన్న మిడితిరా?'

'మీలో నెవరైన నీదినమున రోగులను సేవించితిరా?'

అని మూఁడుమాఱు లడుగగా మూఁడుపర్యాయములును 'నే' నని అబూబకరే ప్రత్యుత్తర మొసంగ పైగంబరానందభరితుఁడై యాతనికిఁ దప్పకుండ స్వర్గము లభించు నని నుడివెనఁట!.

ఇతని నిరాడంబరత్వము, దరిద్రరోగిపరిచర్యనుగూర్చిన గాథలు మఱికొన్ని గలవు. మదీనాపొలిమేరలను నొక మారుమూలప్రదేశ మందుఁ గన్నులు లేని బీదముదుసలిస్త్రీ యొకతె నివసించుచుండెను. ఆదినములలో అబూబకరు ఖలీఫాగా నుండి ముసల్మానుప్రజలను పాలించుచుండెను. ఓమరున కాముదుసలివార్త తెలియ నతఁడు స్వయముగఁ బోయి యామెకుఁ గావలసినయవసరముల సమకూర్చి వచ్చుచుండెడి వాఁడు. కొన్నిదినములైనతరువాత నా దనకంటె ముందుగ నెవరో వచ్చి యామెను విచారించి పోవుచుండినటు లతనికిఁ బొడకట్టినది. అంత మఱునాఁడు ఓమ రావార్తను దెలిసికొనవలె నను నభిప్రాయముతోఁ బ్రతిదినమునకంటెను ముందుగ నచటి కేఁగ నచటి కప్పటికే ఖలీఫా వచ్చియుండెను. అప్పు డతనికిఁ గలిగిన విస్మయమునకు మేర లేకుండెను.

సిరియాదేశముపై దండెత్తి పోవుసమయమున సేనానాయకుఁ డగు ఓసామా గుఱ్ఱము నెక్కి నడచుచుండ నతనితో నాయుద్ధసంబంధమైన విషయముల ముచ్చటించుచు ఖలీఫా పాదచారియై యతని ప్రక్కను నడచిపోవుచుండెను. అప్పుడు సేనానాయకునకు సిగ్గయి గుఱ్ఱమువనుండి దిగఁబోవ ఖలీఫా యతనిని వారించి తాను భగవంతుని మార్గముపై నడచుచుండినందునఁ దప్పేమియు లే దని యతనిని సమాధానపఱచెను. ఇంత యేందుకు? బాలికలు మేఁకలపాలు దీయ నప్పుడు ఖలీఫా సామాన్యమానవునివలె వారికిఁ దోడుపడుచుండెడి వాఁడు.

ఇతఁడు మంచివిద్వాంసుఁడు. తనకాలములోఁ బ్రసిద్ధికెక్కిన వక్తలలో నొకఁడు. ఖురా నంతయు నితనికిఁ గంఠస్థముగ వచ్చి యుండుటచే మహమ్మ దనేకపర్యాయములు అబూబకరును ఇమాంగా నియమింపవలయు నని ప్రయత్నము చేసెను.

అదిగాక ఆకాలమున నరేబియాదేశములో నివసించుచువచ్చిన జాతులయొక్కయు, వంశములయొక్కయు నితివృత్తములను అబూబకరు బాగుగ నెఱిఁగియుండెను. స్వప్నములోఁ గనుపడినవిషయములను విశదీకరించుటయం దితనితోఁ దులఁదూఁగువారు మహమ్మదు తక్క వేఱొకరు లేకుండిరి. ఒకనాఁ డితనికూఁతురగు అయేషాకు ముగ్గురు చంద్రులు తనయింటిలో దిగినట్లు స్వప్నము రాఁగా నామె దానిని దండ్రి కెఱిఁగించెను. అతఁ డది విని యామెయింటిలో మువ్వురు ప్రఖ్యాతపురుషులు పాతిపెట్టఁబడుదు రని వచించెను. ఇతఁడు చెప్పి నది కాలాంతరమున నిజముగనే తేలినది. ఎట్లనఁగా మహమ్మద్, అబూబకరు, ఓమరు - వీరు మువ్వురు నామెయింటియందే భూస్థాపనము గావింపఁబడిరి.

కొంతకాలమునకు మహమ్మదుసాహెబున కొకస్వప్నము కలిగెను. అందులోఁ దాను, అబూబకరు ఇరువురు నొకనిచ్చెనమీఁదుగ నొకరి కంటె నొకరు ముందుగఁ బై కేఁగవలయు నని ప్రయత్నించి తుదకుఁ దానే ౨౻ అడుగులవ్యత్యాసముతో మొదట పై కేఁగెను. ఈవార్త నతని కెఱిఁగింపఁగా నతఁ డొ నని తనకంటె ౨౻ సంవత్సరములు ముందుగఁ బైగంబరు పరలోకమున కేఁగు నని వక్కాణించెనఁట! తరువాత నటులే జరిగినది.

తాను నమ్మిన ధర్మప్రచారమునిమిత్త మితఁడు తనసర్వస్వమును వెచ్చించి దారిద్ర్యమును స్వీకరించెను. ఖలీఫాపదము నందియు నితఁడు ముతకపిండిని దినుచు, ముతకవస్త్రముల ధరించుచుఁ దన కాలము నంతయుఁ గడపెను. పైగంబరుమరణానంతరము ముసల్మానుల కంతఱకు నాయకుఁడుగ నెన్నుకొనఁబడినతరువాత మఱుసటిదినమున నితఁడు తినయింటికిఁ గావలసినవస్తువులను దెచ్చికొనుటకై యథాపూర్వము మార్కెట్టునకుఁ బోవుచుండ మార్గమధ్యమున ఓమరు తటస్థపడి యితనిని వెనుకకు మరల్చి కోశాధ్యక్షునియొద్దకుఁ గొనిపోయి యతనికి, నతనికుటుంబమునకును గావలసినవానివిషయమునఁ గట్టుదిట్టములను జేయించెను. బ్రతికి యున్నంతకాల మిట్లు సామాన్యజీవనము గడపి యవసానకాలమునఁ దనయొద్ద మిగిలియుండువస్తువుల నన్నింటిని ఓమరునకుఁ బంపవలసినదిగఁ దనకూఁతున కాజ్ఞాపించెను.

sampath_Ebooks

పరాధర్మములయెడల నింత భయము గలిగి యింతటి శాంతవిత్తుఁడై యుండియు నితఁడు ధైర్యసాహసములందుఁ గొఱఁతపడియుండలేదు. మతప్రచారము సేయఁగడఁగిన మొదటిరోజులలో పైగంబరున కనేకులు ప్రబలశత్రువు లుండిరి. అబూబకరు తన ప్రాణములకు తెగించియు నతని రక్షించుచుండెడివాఁడు.

బద్రుయుద్ధములో నితఁడు మహమ్మదునకు ఛాయగ నుండి కొరైషులయాక్రమణమునుండి కాపాడెను. మక్కాయందు రాజవిద్రోహము లెక్కుడుగ నుండ మదీనాపైతము తగినస్థితిలో లేనిసమయమున విదేశములను సిరియాపై దండయాత్రకుఁ బంపెను. మహమ్మదు మరణానంతరము మక్కావాసు లించుక ధర్మవిముఖు లగునట్లు గన్పింప వారితో సంధి గావించుకొందమని ఓమరుసలహా నీయ నితఁ డందులకు సమ్మతింపక ధైర్య మవలంబించియే తనకార్యమును సాధించుకొని విముఖు లైనవారి నందఱను మరల మార్గములోనికిఁ దెచ్చెను. ఇంకను నితనిధైర్యసాహసముల వెలిఁబఱుచుట కితనికాలమున జరగిన యనేక జయాసమేతములైన యుద్ధములే కారణము.

మహమ్మదుమతము నవలంబింపకపూర్వమే యితని కిద్దఱు భార్య లుండిరి. వారిలో నొకతె కాతిలా. ఈమెజనకుని పేరు అబ్దుల్ ఉజ్జా. ఈమెవలన నితనికి అబ్దుల్లా యనుకొడుకును, అసమా యను కూఁతురును గలిగిరి. రెండవభార్య అమీరుయొక్క కూఁతురు రుమాన్. ఈమెవలన అబ్దుల్ రహమాన్ అనుకొడుకును, అయేషా యనుకూఁతురును జనించిరి. ఇస్లాముమతమును స్వీకరించినతరువాత మదీనాలో మఱియిద్దఱు భార్యలను పెండ్లాడెను. ఖారిజా అన్సారీకూఁతు రగు హబీబా. ఈమెవలన 'ఉమ్మకుల్తుమ్' అనుకుమారుఁడు పుట్టెను. అమీసుకూఁతు రగు అసామా యితనినాల్గవభార్య. ఈమెయం దితనికి మహమ్మ దనుకుమారుఁడు గలిగెను. కాతిలా తప్పఁ దక్కినవారందఱు నితనిమరణానంతరమునఁగూడ జీవించియుండిరి.

**అబూబకర్ తుఘ్లక్** — తుఘులక్‌వంశీయుఁడైన ఫిరోజ్‌షాచక్రవర్తిమనుమఁడు. జఫరుఖాను అనునతనికుమారుఁడు. క్రీ. శ. ౧౩౮౯-వ సంవత్సరములో ఘియాసుద్దీన్ తుఘులక్ వధింపఁబడినతరువాత నితఁడు ఢిల్లీచక్రవర్తి యయ్యెను. పదునెనిమిదినెలలకాలమే యితనిపరిపాలనము సాగినది. అటుపై నితనిపినతండ్రి యైన మహమ్మదు తాను చక్రవర్తి యైనట్లు చాటించి కాంగ్‌డాలోని నాగర్‌కోటనుండి సైన్యమును దీసికొని ఢిల్లీ దెసకుఁ బయనమయ్యెను. తుదకు మహమ్మదే జయించెను. అబూబకర్ మేవాడదేశమునకుఁ బాఱిపోయెను. కాని పట్టువడి మీరటులో ఖైదీగా నుంపఁబడెను. తుద కాయవస్థలోనే మరణించెను.

**అబూలహాబ్** — అబూముత్తలిబ్ యొక్క కుమారులలో నొకఁడు. మహమ్మదుయొక్క పితృవ్యుఁడు. ఇతఁడు మహమ్మదునకు బద్ధవైరి. ఇతఁ డతని నవీనమతము స్థాపితముకాకుండుటకై తనయావచ్ఛక్తిని వినియోగించెను. ఇతనియసలుపేరు అబ్దుల్ ఉజ్జా. కాని యగ్నిజనకుఁ డనునర్థ మిచ్చునీపేరు నితనికి మహమ్మదే ప్రదానము చేసియుండెను. పైగంబ రొకపర్యాయము తనదైవసందేశమును వినిపించుటకై బంధుగుల నందఱను బిలిపించి వారల కుపదేశముం జేయుచుండ నబూలహాబ్ మహమ్మదుని దిట్టి రాతితోఁ గొట్టఁబోయెనఁట. దానిపై నితనిని శపించుచు నుడివినమహమ్మదువాక్యములు ఖురానులో నుదాహరింపఁబడియున్నవి. బద్రునందు జరిగినయుద్ధములోఁ దనవారికిఁ గలిగినయపజయమువలన ఖిన్నుఁడై లహాబ్ మరణించెను. ఖురానునందుఁ బేర్కొనఁబడిన మహమ్మదుదేహసంబంధులలో నితఁ డొకఁడు.

**అబూసింబేర్** — ఆఫ్రికాదేశమునందలి నైలునదీతీరమున న్యూబియాదేశమునందుఁగల ఒకదేవాలయము. ఇందుఁగల సూర్యునివిగ్రహము ౬౫ అడుగులయెత్తు గలిగియుండును.

**అబూహానీఫా** — సుప్రసిద్ధుఁడైన సున్నీఇమాము. వారిలో హానీఫాసంప్రదాయమున కాదికర్త. ఇతని తండ్రిపేరు సాబీతు. జన్మస్థానము కూఫానగరము. ఇతఁ డానగరమునఁ బట్టు వ్యాపారముం జేయుచుండెడివాఁడు. ఇతనిపితామహుఁడు కాబూలునివాసి యని వాడుక. హానీఫా సున్నీముసల్మానులకుఁ బ్రమాణభూతుఁడైన భవిష్యద్వక్త. తురుష్కస్తానము, తార్తారము, హిందూస్తానములోనగు దేశములలో నితనిసిద్ధాంతములు ప్రమాణములుగఁ దీసికొనఁబడుచున్నవి. ఇమాం అబూయూసఫ్, ఇమాం మహమ్మద్ అనువారలితనిశిష్యులు. తర్కమం దితనికి నెక్కుడగు సామర్థ్య ముండెను. దారుస్తంభమును సువర్ణస్తంభ మని దాని నటులే బుజువు చేయువాఁడఁట!.

**అబెల్** — ఖురాను, బైబిలుసిద్ధాంతముల ననుసరించి సృష్టియందలి ప్రథమపూరుషుఁడైన ఆదాముయొక్క పెద్దకుమారుఁడు. ఆదాముయొక్క రెండవకొడుకు కైను. వీరిద్దఱు నొక్కొక్క చెల్లెలితోపాటు కవలపిల్లలుగ జన్మించిరి. ఈడు వచ్చినతరువాతను కైనుచెల్లెలితోడ నబెలును, అబెల్‌చెల్లెలితోడఁ గైనును వివాహమాడులాగున నాదాము సంబంధముల నేర్పాటు గావించెను. కాని యీయేర్పాటు కైనునకు రుచింపకపోయెను. తనచెల్లె లెక్కుడు సుందరి యగుటవలన నామెను దానె పెండ్లి యాడఁదలఁచెను. ఆదాము వీరితగవు దీర్చునిమిత్తము దేవునకు బలి యియ్యవలె ననియు, నెవరిబలిని దేవుఁడు స్వీకరించిన వాఁడు కైనుచెల్లెలిని పెండ్లియాడవలయు ననియు నిర్ధారణము చేయ నిరువురును దేవునకు బలి నొసంగ నియ్యకొనిరి. అబెలు బలసినగొఱ్ఱెపోతు నొకదాని నిచ్చెను. కైను ధాన్యపురాశి నొసంగెను. దేవుఁ డగ్నిరూపమున సాక్షాత్కరించి గొఱ్ఱెపోతును గ్రహించెను. కాని ధాన్యము నంటఁడయ్యెను. ఈలాగున కైను విఫలమనోరథుఁడై యబెలుమీఁద ద్వేషము వహించెను. కాని తండ్రిసముఖమున నతని కేవిధమైన యపకారము చేయుటకు నితని కవకాశము దొరకదయ్యెను. అనంతరము ఆదాము తీర్థ

యాత్రకై చనియుండ నితఁ డన్నను దునుముట్టించి యాకళేబరము నేమిచేయుటకును దోఁచక విచారించుచుండెను. ఇంతలో దైవప్రేరితముగ నొక కాకి మఱియొక చచ్చినకాకిని ముక్కునఁ గఱచికొని వచ్చి కైను చూచుచుండఁ దనచంచువుతో భూమిని త్రవ్వి యందాచచ్చినదానిని వైచి మంటితోఁ గప్పెను. దానిని గ్రహించి కైను గూడ నేలను త్రవ్వి యన్నశవము నందు వైచి మంటితోఁ గప్పివైచెను.

**అబెలార్డు, పేరె** (౧౦౭౯ - ౧౧౪౨) — ఇతఁడు వేదాంతి, తత్త్వశాస్త్రజ్ఞానము గలవాఁడు. నాంటిసునగరమునకు సమీపమునం దున్న పాలేట్ గ్రామంబున జన్మించినందున డాక్టరు పలాటినస్ అను బిరుదమును గాంచెను. తత్త్వశాస్త్రీయమైన నామవాదమునకును (Nominolism), వాస్తవికవాదమునకును (Realism) చర్చ ముమ్మరముగా జరిగినకాలమునం దితఁడు జీవించియుండెను. ఇతఁడు రోసలీనాకడను, అతనికి ప్రతిపక్షవాదియు, చాంపోనగరవాసియు నైన ఉల్లియమ్‌కడను తత్త్వశాస్త్రము నభ్యసించెను. ఇతనికి ముప్పదియాఱుసంవత్సరములు వయస్సు వచ్చునప్పటికి యూరోపుఖండమున నొక మహాబోధకుఁ డని విశేషప్రఖ్యాతి వహించెను. అందువలన 'నోటర్ డేమ్' (Notre Dame) అను ప్రదేశమున నతనిచే స్థాపింపఁబడిన పాఠశాలకు నానాదేశములనుండి విద్యార్థులు వచ్చి విద్యాభ్యాసము చేయుచుండిరి. ఇతఁ డన్నివిధములయిన చర్చలను విడిచిపెట్టి సర్వసామాన్యముగా నంతటను వ్యాపించియున్న పిడివాదిపద్ధతిని (Dogmatism) తిరస్కరించి గుణాగుణములను దెలుపునట్టి విమర్శనీయమైన పద్ధతిని (Critical) తనబోధయందు నవలంబించెను. ఇతనినిగూర్చి యొక చిత్రమైనకథ లోకములో వ్యాపించియున్నది. అయ్యది హెలాయిసీ యను నామె అబెలార్డును మోహించుటనుగూర్చినది.

ఈమె 'నోటర్‌డేము'లో మతాచార్యుఁడుగ నున్న ఫుల్‌బర్టు యొక్క మేనగోడలు. ఈమతాచార్యుఁడు తనసంరక్షణలో నున్న మేనకోడలిని అబెలార్డు మోసపుచ్చె నని నమ్మి ఆయనమీఁద మాననష్టమును గల్పించునట్టి దోషము నారోపించెను. తరువాత అబెలార్డు సెయింట్ డెనిస్ అను ప్రదేశమున సన్న్యాసిగ నుండెను. అర్గంటూయిల్ అను ప్రదేశమున హెలాయిసీ సన్న్యాసినిగ నుండెను. ఇతఁడు భ్రష్టమతమును (పాషండమతమును) బోధించుచున్నాఁడను కారణముచేత సాయిస్సోన్సులో (Soissons) నుండు న్యాయసభవా రితనికి కారావాసశిక్ష విధించిరి. ఆశిక్ష ననుభవించినపిమ్మట నాతఁడు విశ్రాంతి గోరి పరాక్లీటు(ఋష్యాశ్రమము)నకుఁ బోయెను. అక్కడ కనేకవిద్యార్థులు పోయి వానిచుట్టును జేరియుండిరి. ఇతఁడు బ్రిటానిలో నొక మఠమునకు నధిపతి యయ్యెను. చివర కతనిని పాషండమతమువాఁ డని దూషించిరి. ౧౧౪౨ లో నాతఁడు మృతుఁ డయ్యెను. క్రైస్తవమతమును గుఱించి యాతఁ డనేక గ్రంథములు వ్రాసెను.

**అబే** — యూరపుఖండమునందలి మఠాధ్యక్షురాలికి అబే యని పేరు. ఇట్టిమఠములలో స్త్రీలుమాత్రమే యుందురు. ఈపదవికి నియమింపఁబడువారు ౪౦ యేండ్లవయసుగలవారైన నైయుండవలయును. లేకున్న నేమఠముపై నీయధికార మొసగఁబడుచున్నదో దానిలో ౮ సంవత్సరముల సంబంధము గలిగినవారైన నైయుండవలయును. మొత్తముమీఁద మఠములో నుండువారికే యొకరి కీపదవి యొసంగఁబడుచుండును. దానిలోనివా రెల్ల నామె యాజ్ఞల ననుసరింపవలసినదే. జర్మనీదేశములో నీపదవి కెక్కువగౌరవము కలదు. రాజకన్యలుగూడ నప్పుడప్పుడు మఠాధ్యక్ష లగుచుండుట కలదు.

**అబోరుకొండలు** — అస్సామున నుత్తరపుసరిహద్దులలో నున్న యొకకొండలవరుస. హిమాలయపర్వతముల నొకశాఖయే యిది. ఈకొండలలో నివసించు ప్రజలు అనాగరకులు. వీరికి అబోరులని పేరు.

**అబోరులు** — అస్సాముదేశమునకు నుత్తరపు సరిహద్దుమీఁద హిమాలయముయొక్క యొకభాగమునకు అబోరుగుట్టలని పేరు. ఈ గుట్టలకుఁ దూర్పున దిబాంగ్ నదియు, పశ్చిమమున సియోంనదియుఁ గలవు. ఈ గుట్టలమీఁదను అబోరు[1] లను అడవిజాతివారు కాఁపుర ముందురు. అబోరు లనఁగా 'అజితు' లని యర్థము, అనఁగా వీరు స్వతంత్రులు, ఒకరికి లోఁబడువారు కారు. ఎటులనను, ఇతరులకు నలవి కాని పర్వతారణ్యప్రదేశమునం దుండుటచే నితరరాజుల కెవరికిని వశులు గాక స్వతంత్రముగ నుందురు. కావున వీరికీ పేరు వచ్చెను. అస్సామీలచే వీరికీ పేరు పెట్టఁబడినది. వీరు తిబెత్తు, బర్మాదేశములవారిలోనుండి పుట్టినట్లు తోఁచుచున్నది. వీరిలోఁ జాలమంది బ్రిటిషు సరిహద్దునకు వెలుపల తిబెత్తుసరిహద్దులోనే యున్నారు. అబోరులలోఁ గొన్నిశాఖలు గలవు. దిబంగ్ నదియొద్దున నున్నవాండ్రు తాము 'పాదము' వార మని చెప్పుకొనియెదరు. 'మెంబు' అనునది వీరిపల్లెలలోఁ బెద్దది. వీరిలో గ్రామమున నొకపెద్దనాయకుఁ డున్నను, జను లందఱును గూడి గ్రామవ్యవహారములను జేసికొనియెదరు. ప్రతిగ్రామ మొక చిన్న ప్రజాప్రభుత్వమనియే చెప్పవలెను. గ్రామములోనిజను లందఱును సమానులు. చిన్నవ్యవహారము గాని, పెద్దవ్యవహారము గాని అందఱును కలసి విచారించి చేయవలెను. ఇట్లందఱు ననుదినము కలయుటకు నొకయిల్లు కట్టఁబడును. దీనిని మొరాంగ్ అనియెదరు. ఇది రమారమి రెండువందలయడుగులు పొడు గుండును. తప్పు చేసినవారికి శిక్షలు వీరే విధించెదరు. గ్రామమందలి బ్రహ్మచారు లందఱును, బానిసలును రాత్రి పురమందిరమునందుఁ బండుకొందురు. గ్రామమునకు నగ్నిభయము గాని, మఱియేభయము గాని సంభవింపఁగానే వీరు మొదటఁ బఱుగెత్తి

1. అబోరు లనఁగా తెలియనివారు, ఎవరినిగుఱించి మనకు నెక్కువగాఁ దెలియదో యట్టివా రని మఱియొక యర్థము గలదు.

sampath_Ebooks

సాయము చేయుదురు. వీరియిండ్లు చిన్నవిగ, గుడిసెలుగ నుండును. ఒక కుటుంబ ముండుటకుఁ జాలును. బ్రహ్మచారులు, బ్రహ్మచారిణులు వివాహము కాఁగానే వేఱు ఇల్లు కట్టుకొని కాఁపురము చేయుదురు.

అబోరులు పొట్టివారుగను భీకరులుగను నుందురు. వీరు గోపిడికిఁ బ్రఖ్యాతిఁ జెందినవారగుటచే వీరి చుట్టుపట్టుల నున్న యే జాతివారును చేరరు. వీరు, ఇంగ్లీషు ప్రభుత్వములోని ప్రజలకు బాధ కలిగించుచున్నందున నప్పుడప్పుడు ప్రభుత్వమువారికి వారిమీఁదికి దండు పంపవలసివచ్చెను. ఇట్టి దండులు ౧౮౫౯ లోను, ౧౮౬౮ లోను బంపిరి. ౧౮౭౧ లో అబోరులు బ్రిటిషు ప్రజలను జంపఁగా బ్రహ్మపుత్రానదియుత్తరపు ప్రాంతమున నచ్చటచ్చట ఠాణాల నేర్పఱుచుటకుఁ బ్రయత్నములు జరిగెను. అంతట వారింగ్లీషువారితో రాజీపడిరి. వారికి ఇంగ్లీషు ప్రభుత్వమువారు ప్రతిసంవత్సరమును కొన్ని యినుపహారలు, ఉప్పు, నల్లమందు, మఱియు నితరవస్తువు లిచ్చునట్లును, వారింగ్లీషు రాజ్యమువారి జోలికి రాకుండునట్లును నొడంబడికలు జరిగెను. ఈ యేర్పాటు కొంతవఱకు జరిగెను కాని ౧౮౮౦ లోను, ౧౮౮౩ లోను వీరు బ్రిటిషు ప్రజలను జంపినందున వారిని శిక్షించుటకు నొకసైన్యమును బంపవలసివచ్చెను. వారిని ఈవైపునకు రాకుండఁ జేయుటకును కొంత సైన్యము ౧౯౦౦ వఱకు నుంచఁబడెను. ఇప్పుడు వారు బ్రిటిషురాజ్యమునకు బాధ కలిగించుటలేదు.

**అబౌట్**, ఎడ్మండ్ ఫ్రాంకోయిస్ వలెంటిన్ (౧౮౨౮ - ౧౮౮౫) — ఫ్రాన్సుదేశమునందు జన్మించిన యొకకవి. నాటకములను వ్రాసి ప్రసిద్ధిగాంచెను. కల్పనాకథలు వ్రాయుట యందును, పత్రికావిలేఖనమునందును కాలమును వినియోగించెను. ఫ్రెంచివారికి జర్మనీవారికిని యుద్ధము జరిగినప్పుడు మేక్మహోన్ సైన్యముతో సాయిర్ (Soir) పత్రికాప్రతినిధిగఁ బోయియుండెను. ౧౮౭౫-వ సంవత్సరమునుండి సీక్లీ (Siecle) పత్రికకు సంపాదకుఁడుగ నుండెను. అకాడెమీలో సభ్యుఁడుగా నెన్నికొనఁబడెను. కాని స్వాగత మిచ్చుటకుఁ బూర్వమె పారిసునగరమున స్వర్గస్థుఁడయ్యెను. ఇతనిచే రచింపఁబడిననవల లనేకము లింగ్లీషునకు భాషాంతరీకరింపఁబడినవి.

**అబ్జద్** — కర్ణాటకదేశపు నవాబగు ఉమ్‌డత్-ఉల్-ఉమ్రా కాలపుకవి. మీర్ మహమ్మద్ ఇస్మాయిల్ ఖాన్ అను మఱియొకపేరితనికిఁ గలదు. ఉమ్రావింద్రి యను అన్వర్ ఖాన్ చరిత్ర వ్రాసి, యితఁడు నవాబుచే విశేషముగ సన్మానింపఁబడెను. అన్వర్ నామా యని యీ గ్రంథము పేరు.

తరువాత నితఁడు హిందూదేశమునం దాంగ్లేయులకును, ఫ్రెంచి వారికిని జరిగినయుద్ధములనుగూర్చి మఱియొక గ్రంథము వ్రాసెను దీనిపేరు 'షరిక్-ఉమ్-షూ అరా'.

**అబ్దల్** — ఒకబిచ్చగాండ్ర తెగ. పంజాబులోని కాంగ్రో, హోషియార్పూరు, బిలాసపూరు, చంబా, మండీ, సుకేత్ అను ప్రదేశములలో వీరు తిరుగుచుందురు. పాటలు పాడుచు బిచ్చ మెత్తుకొని జీవించుటయే వీరిముఖ్యమయినవృత్తి. రాజపుత్రులయిండ్లలో శుభకార్యములు జరుగునప్పుడును, అంత్యక్రియలు జరుగుసమయముల యందును అబ్దలులు పోయి పాటలు పాడుదురు. ఈ పేరుగల ముసల్మానుఫకీరుల తెగయు నొకటి కలదు. ఐనను వారికిని, వీరికిని సంబంధమేమియు లేదు. హిందూస్తానమున నీయబ్దలుల జనసంఖ్య ౫,౧౮౯.

**అబ్దాలులు** — ౧. మహమ్మదీయుల సిద్ధాంతానుసార మప్రత్యక్షులై సర్వత్ర భ్రమణ మొనరించుచుండు నొకవిధమును వ్యక్తులు. దేవుఁడు వీరిమూలముననే సృష్టికార్యము నడుపుచుండును. వీరు ౭౦ మంది పురుషులు. వారిలో ౪౦ మంది సిరియాదేశమందును, ౩౦ మంది తక్కినప్రదేశములందును దిరుగుచుందురు. ఒకఁడు మరణించిన మఱియొకఁ డాస్థలమును బూరించుచుండును. అబ్దాలులు సిరియా నుండి వెడలివచ్చినాఁడే వారియంతిమదినము (ప్రళయదినము) మని ముసల్మానులనమ్మకము. వీరి నెవ్వరును గుర్తింపఁజాలరు. వీర లెక్కడ నుందురనియు, వీర లెవ్వరైనదియు దేవునకుఁ దక్క నితరుల కెవ్వరికిని దెలియదు.

౨. వంగదేశమున నివసించు మహమ్మదీయులలో నొకతెగవారు. సంతలలో పాగాడుపాడి, చిలుముగొట్టములు అమ్ముకొనుటయే వీరివృత్తి. వీరివివాహపద్ధతి విలక్షణ మయినది. కన్యకు బాగుగ వయసు వచ్చినతరువాతనే పెండ్లి చేయుదురు. వధువు ఇంటిలోపలను, వరుఁడు బయటను గూరుచుండియుందురు. పెండ్లిచూఁడ పోవుచుఁడు వచ్చి యిరువురతోడను 'నీకు పెండ్లి యైనది' అని చెప్పును. అంతటితో పెండ్లితంతును ముగియును. ముల్లాలను బిలుచుట కాని, మఱియేయితరమత విధుల ననుష్ఠించుట కాని యుండదు.

**అబ్దుర్ రజాక్** — ౧ ఇతఁడు క్రీ. శ. ౧౪౪౨-వ సంవత్సరములో సమరఖండము, పర్షియాదేశములనుండి దక్షిణహిందూస్తానమున కేతెంచిన రాయబారి. పర్షియాసముద్రతీరమందలి ఆర్మూజు నుండి బయలుదేఱి అరేబియాలోని మస్కటులోఁ గొన్ని దినములు నిలిచి యనంతరము కాలికట్టు చేరి యక్కడనుండి విజయనగరమున కేతెంచెను. ఇతడు వ్రాసిన వృత్తాంతముంబట్టి విజయనగరసామ్రాజ్య మాదినములలో నెంతటి యౌన్నత్యమునం దుండెనో మన మూహింపవచ్చును. దాని ననుసరించి కృష్ణానది మొదలుకొని కన్యాకుమారి పర్యంతము విజయనగరరాజ్యము వ్యాపించియుండినట్లు దెలియుచున్నది. కాలికట్టు జామొరిను స్వతంత్రుఁడయ్యు విజయనగరరాజులకు వెఱచుచుండువాఁడు. ఇతని గణనానుసార మప్పుడాసామ్రాజ్యమున పదునొకండులక్షల సైన్య ముండెను. విజయనగరమునుగూర్చి

sampath_Ebooks

దాని నితఁ డదృష్టపూర్వమైన నగర మనియు, నచటిజనులు సువర్ణాలంకారములతో నిండియుండి రనియు వ్రాసియున్నాఁడు.

౨. ఇతఁడు గోలకొండ నేలిన అబుల్ హాసన్ కుతుబ్‌షా కొలువున నుండిన యోధవతంసము. ఔరంగజేబు గోలకొండరాజ్యమును నాశనము గావింప నేతెంచి యనేకదినముల పర్యంతము దుర్గమును ముట్టడించియుండెను. బయటనుండి యాహార పదార్థము లేవియు లోనికి రా వలను గలుగకపోవుటచేత లోపలి వారును, కలవుకాటకములవలన బయటివారును నానాప్రకారము లను బాధలకు లోనైరి. దుర్గమును లోఁబఱచుకొనుట కౌరంగజేబు సలిపిన ప్రయత్నము లన్నియు వ్యర్థము లైనవి. అంత నితఁడు భేదోపాయంబున శత్రువులను జయింప నిశ్చయించి లంచము లొసంగి గొప్పగొప్పసామంతులను దనపక్షమునకు లాగికొనెను. ప్రముఖులందఱును విశ్వాసహీనులై కష్టసమయమునఁ దమనాయకుని విడనాడి ఔరంగజేబునొద్దఁ జేరిరి. కాని వారిలో నొకఁ డగు అబ్దుర్‌రజాకు తనస్వామిని వదలియుండలేదు. దుర్గద్వారములు తెఱవఁబడినతోడనే యీవీరకేసరి యాపాదమస్తకము శరీరమున గాయములై నెత్తురు గారుచుండినను వెనుదీయక పోరాడుచుఁ దుదకు విధిలేక శత్రువులవశమునఁ జిక్కెను. కాలాంతరమున నితనిగాయము లన్నియు నయమైనవి. ఔరంగజేబు రజాకుయొక్క స్వామిభక్తికి నతనిధైర్యమునకును బ్రసన్నుఁడై తనకొలువులో నుండు మని కోరెను. ఇతఁ డందుల కియ్యకొనక మక్కాయాత్రకుఁ బోవ నిశ్చయించుకొనెను. ఇందుల కౌరంగజేబు మొదట కాక పోయినను చివరకైన సమ్మతించెను. తరువాత రజాకు మక్కాయందే కాలముగడపెను.

**అబ్దుర్ రహీమ్ మీర్జా** — ఇతఁడు బైరాముఖానిని కుమారుఁడు. అక్బరునకు మిగుల విశ్వాసపాత్రుఁడై యతనిసేనానాయకులలో నొకఁడై ప్రఖ్యాతి నొందెను. అక్బరు గుజరాతును జయించి యచటఁ దనసుబేదారును నియోగించి యాగ్రాకు వెడలిపోయెను. అక్బరు వెడలినతోడనే మహమ్మద్‌హుసేన్‌మిర్జా, శాహమిర్జా లను వారలు తమసైన్యములతో గుజరాతుపై దండెత్తి యచటిసుబేదారును బాఱఁదోలిరి. ఈమిర్జాలు తామర్లేనువంశీకులు. హుమాయూను దాను గోలుపోయిన ఢిల్లీరాజ్యమును జయించుకొన మరల హిందూస్థానమునకు వచ్చినపుడు వీ రతనితో వచ్చి యితనికి సాహాయ్య మొనరించియుండిరి. ఇందువలన వీరికి రాజసభలో మిగుల సమ్మానము జరగుచుండెడిది. వీరి కంతమాత్రమున సంతుష్టి కలుగలేదు. తరువాత ఢిల్లీ వదలి రోహీలఖండమునఁ బ్రవేశించి యక్కడనుండి యక్బరును సాధింపసాగిరి. కొంతకాలమునకు రోహీలఖండమునఁగూడఁ దమ కోరిక చేకూరనందున నాదేశమును వదలి గుజరాతు చేరిరి. అక్బరు వీరిని బాఱఁదోలి గుజరాతులోఁ దనసుబేదారును నియోగించి పోయెను. కాని యక్బరు వెడలిపోయినతోడనే వీరు మరల సైన్యములను గూర్చికొని గుజరాతుపైఁ బడిరి. అక్బరు వెంటనే రహీంమిర్జాయాధిపత్యమున సైన్యమును బంపఁగా నతఁ డేతెంచి రాజద్రోహులను మొదలంట నాశనముచేసి గుజరాతునుండి మరల నెవిధ మైనభయము లేకుండఁజేసెను.

**అబ్దుల్ అజీజ్** — ౧. ఒకముసల్మానుకవి. భామినీసుల్తానగు రెండవ అహమ్మద్‌షా కాలమువాఁడు. గుల్బర్గాయందలి 'మద్రుద్దీన్ మహమ్మద్ హుసైనీగేసూ' అనునతనిచరిత్రమును 'తారిఖ్-ఇ-హుసైనీ' అనునొక గ్రంథముగ రచించి దానిని సుల్తానున కంకిత మొనర్చెను.

౨. ఔరంగజేబు సేనాపతులలో, జాగీరుదారులలో నొకఁడు. కవికూడను. 'సకీనాం' అనుగ్రంథము నొకదానిని రచించెను.

3. ఇతఁడు (౧౮౮౦ - ౧౯౪౮) మొరాకోదేశపుసుల్తాను. యూరోపియనుల ఆచారవ్యవహారములందును, వారి రాజ్యపాలనపద్ధతులయందును ఇతని కెక్కువనమ్మకము. అందుచే యూరోపియను ఉద్యోగులను నియమించి రాజ్యమును బాగుపఱుపవలయు నని నిశ్చయించుకొని దానికై చాల ధనము వ్యయపఱచెను. కాని యేమియు ఫలితము లేకపోయినది. తనప్రజల నందఱను యూరోపియనులజీవితపద్ధతుల నవలంబింపుఁడని నిర్బంధింపఁజొచ్చెను. తుదకు ప్రజలు విసిగి యతనిని సింహాసనభ్రష్టు నొనర్చి యతని తమ్ముని రాజుగాఁ జేసికొనిరి (౧౯౦౭). తరువాత మరల రాజ్యము సంపాదింపవలయు నని అబ్దుల్ అజీజు కొంతవఱకు ప్రయత్నించెను. కాని లాభము లేకపోయినది. అటుపై మరణించువఱకు, పెన్షను దీసికొనుచు టాంజీరునగరముననే యుండి యతఁడు జీవితమును వెడలఁబుచ్చెను.

౪. ౧౯-వ శతాబ్దినాఁటి ఒకమహమ్మదీయపండితుఁడు. ఢిల్లీ యితనినివాసస్థానము. చాలగ్రంథముల రచించెను. కురానునకు పార్సీభాషలో టీక వ్రాసెను. ౧౮౭౪వ సంవత్సరమున నితఁడు మరణించెను.

౫. అక్బరుచక్రవర్తికాలమునాఁటి ఒకపండితుఁడు.

౬. ఇతఁడు (౧౮౩౦ - ౧౮౭౬) ౧౮౬౧-వ సంవత్సరములో తన సోదరుఁడైన అబ్దుల్ మజీదునకుపిమ్మట తుర్కీకి సుల్తానయ్యెను. ౧౮౬౫-వ సంవత్సరములో కాన్‌స్టాంటినోపిల్ నగరమున కలరా మున్నగు వ్యాధులు వ్యాపించుటచేతను, క్రీటు, హెర్జిగోవినా మొదలగు ప్రదేశములందు అల్లరులు రేఁగుటచేతను ౧౮౭౬-వ సంవత్సరములో బల్గేరియనులు ఘోరహత్యలను గావించుటచేతను ఈయనప్రభుత్వము శోభింపదయ్యెను. ౧౮౭౬-వ సంవత్సరము మేనెలలో సింహాసనమునుండి తొలఁగింపఁబడి మఱి వారముదినములలో ఆత్మహత్యవలననో, ఇతరులు చంపించుటచేతనో ఇతఁడు మరణము నొందెను.

**అబ్దుల్ అజీజు, ఇబ్న్ సౌద్** — అరాబియా దేశము నందలి నెజ్డ్ ప్రాంతపు సుల్తాను; అబ్దుల్ రహిమాన్ పుత్రుడు. క్రీ. శ. ౧౮౮౦ లో నితడు రియాదానగరమున జననమందెను. ఇతనిపితామహునిమరణానంతరమున రాజ్యమున నంతఃకలహములు జనింప బహిష్కృతుడై యీ కుటుంబము కువైటు లనుస్థానములలో నితనికి కొంతకాలము నివసింపవలసివచ్చెను. కాని కువైటు పాలించుచుండిన షేక్ ముబారక్ ఇబ్న్ సుబాహా యీరాచకుటుంబమువారి ననుగ్రహము సహించి వీరల కెట్టికష్టములును గలుగకుండునట్లు సన్మానించుటయే కాక ఇబ్న్ సౌదునకు రాజనీతివిషయమున మంచియుపదేశముల నొసంగి యితని నందు నిపుణుని గావించెను. ఈమధ్యకాలములో 'ఇబ్న్ రషీదు' అను మరియొకవీరుడు నెజ్డ్ ప్రాంతమును నైకొని సౌదున కతనితోఁ గలహింపవలసివచ్చినది. ఇదిగాక తురుష్కులతోఁగూడ నితనికి నిరంతరము పోరాడవలసివచ్చెను. ఈకారణములవలన నితఁ డింగ్లీషువారిని మంచిచేసికొనియే యుండెను. అంతఁ గొంచె మనుకూల మగుసమయము దొరకినతోడనే క్రీ. శ. ౧౯౦౦ లో నితఁడు ౨౦౦ మంది యోధులను వెంటఁగొని తాను గోలుపోయిన యిలాకా నాక్రమింప యత్నించెను. కేవలము ౧౫ మంది యోధులనే వెంట నిడికొని రాత్రికాలమున నాకస్మికముగ రియాదాను ముట్టడింప నెదిరింపు వారలు లేనందున నానగరము సులభముగ నితనియధీన మయ్యెను. నెజ్డ్ స్వాధీన మైనతరువాత నితఁడు తనస్థితిని జక్కఁజేసికొనుటకుఁ గొంతకాలము గడపెను. ఇతనియిలాకాలోని వాహీబీ లందఱు నాకాలమున స్థిరముగ నివాస మొనరింప నగరములు గాని గృహములు గాని లేక దేశద్రిమ్మరులుగ నుండిరి. పెద్దపెద్దగుంపులుగ దేశమం దన్ని కడలఁ గ్రుమ్మరుటయే వీరలజీవనోపాయము. ఈదేశద్రిమ్మరుల నందఱ నాయాప్రదేశములలో నిలిపి స్థిరజీవనులను గావించి వారిలో జాతిభావము నాటుటయే యితనిముఖ్యసంకల్పము. తదర్థము ముందుగ వీరలకు ద్రవ్య మొసంగియు, ననేకప్రదేశములలో మసీదులను గట్టించియుఁ గ్రమముగ వీరిసంచారస్వభావమును మాన్పెను. సౌదుయొక్క యీజాతినిర్మాణప్రయత్నములవలన ౫౦ కేంద్రము లేర్పడినవి. వాహీబీ లించుక యోగ్యత సంపాదించినతోడనే వారలకు శస్త్రాస్త్రము లొసంగి సైన్యములోఁ జేర్చి వారిని యోధులను గావించెను. ఈప్రకారముగఁ దయారైన సైన్యమును వెంటఁగొని యితఁ డాకస్మికముగ పర్షియాసముద్రతీరమండలి హాసా ప్రాంతమును ముట్టడించి హుఫూఫ్, కతీఫ్, ఓకేరు లను నగరములను స్వాధీనము చేసికొనెను. ఈకాలమున నరేబియాలోని యనేకప్రాంతములు తురుష్కులకుఁ జెంది యుండెను. కాని తురుష్కవారు మహాసంగ్రామమున మునిఁగియుండుటచే వారిస్థానము లన్నియు నితరులపా లయినవి. ముఖ్యముగ ఇబ్న్ సౌదు దొరకినయవకాశమును జేతనుండి పోనియ్యలేదు. అనంతర మితఁడు జాబాల్ షామా రను ఉత్తరప్రాంతమును జయింపఁ బలుమాఱు యత్నించెను గాని కోరిక సఫలము కాలేదు. క్రీ. శ. ౧౯౧౮-వ సంవత్సరమున నితఁడు మరల నాంగ్లేయులతో సంధి గావించుకొనెను. ఇదేసమయమున హెజాజ్ ప్రాంతపాలకుఁ డగు హుసేన్ ఇబ్న్ అలీయను వేఱొక వీరుఁడుగూడ నింగ్లీషువారితో మంచిగ నుండి తనస్థితిని కట్టుదిట్టపఱుచుకొనుచుండె నితని కది సరిపడలేదు. ఏకనాయకత్వమే అరాబియాకు లాభకారి. బహునాయకత్వము కాదు. ఆంగ్లేయులుమాత్రము బహునాయకత్వ మపేక్షించిరి. అందువలన వారికి లాభము. ఖుర్మానగర ప్రాంతములోని జనులు హెజాజ్ పాలకుని తిరస్కరించి శరీఫ్ ఖాలిద్ ఇబ్న్ లువాయి యను నతనిని దమకు నాయకునిగ నేర్పఱుచుకొని ఇబ్న్ సౌదును దోడ్పడ నడిగిరి. ఇతనిసాహాయ్యమువలన హుసేను తిరుగఁబాటు చేసినవారి నోడింపఁజాలక ఆంగ్లేయులతో మొఱపెట్టుకొనెను. ఆంగ్లేయులు మధ్యస్థులై హుసేనున కనుకూల మైనట్లు దీర్పుచెప్పి ఖుర్మానగర ప్రాంతము నతని కొసఁగు మనియు, నితనికి విరుద్ధముగ నేమియు నాచరింపవల దనియుఁ, గా దని యట్లు చేసినచో మము కోపముప్తి గలుగు ననియు నిబ్బనుక బెదరించిరి. కాని సౌదునాత్రి మానియమములను లక్ష్యముచేసినట్లు కాన్పింపదు. ఖుర్మా ప్రజలు మరలఁ దిరుగఁబాటు చేయ వారి నడఁచుటకై హుసేన్ తనకొడుకు నామీరుడు అబ్దుల్లానాయకత్వమునఁ గొంతసైన్య మిచ్చి పంప ఇబ్న్ సౌదు ఆంగ్లేయులహెచ్చరికను గణింపక తనసేనను బంపి హెజాజ్ దేశమును మరింత బాధపెట్టుచు నోడించి మక్కానగరసమీపమందలి తాయిఫ్ పట్టణమునుగూడ భయకంపితము చేసెను. కాని యచటనుండి ముందుకుఁ బోవక, లోనియుద్దేశము జాబాల్ షామారును జయింపవలె నని యనుటచే నితఁడు తాయిఫ్ పట్టణముతో సంతృప్తుఁడై మరల స్వనగరుపై వెడలిపోయెను. ఈపర్యాయమును త్వరగ స్వాధీనము కాలేదు. కాని నిరంతరప్రయత్నము లొనరించి తుద కాదేశమును జయించెను. అక్కడిప్రముఖులు ఇబ్న్ మితాబ్, మహమ్మద్ ఇబ్న్ తలాల్ లు సౌదుయొక్క యాధిపత్యము నొప్పికొనిరి. తరువాత క్రీ. శ ౧౯౨౪-వ సంవత్సరమున హెజాజ్ మీఁద దండెత్తి హద్దాయుద్ధమున హెజాజ్ సేనాని నోడించి మక్కామీఁది కేఁగి క్రీ. శ. ౧౯౨౫ న దానినిగూడ హరించెను. క్రీ. శ. ౧౯౨౬-వ సంవత్సరమున నితఁ డరాబియాపాలకుఁ డైనట్లు ముఖ్యరాజ్యములచే స్వీకరింపఁబడెను. ఇతఁ డత్యంతస్త్రీలోలుపుఁడు. ఇతనికి ౧౨౫ మంది భార్యలు.

**అబ్దుల్ కరీమ్** (౧౭౮౭ - ౧౮౩౦) — ౧. మధ్య ఆసియా బొఖారానగరమున నుండిన చరిత్రకారుఁడు. ఇతఁడు అఫ్ గానిస్తానము, తురుష్కస్తానముల దేశచరిత్రములను వ్రాసెను. వీనికి భాషాంతరీకరణములుగూడఁ గలవు.

౨. సింధుదేశనివాసి. ౧౫ - వ శతాబ్దియందలివాఁడు; 'తారీఖ్-ఇ-మహమూద్ షాహీ' అనుపేరను భామినీసుల్తా నగు రెండవమహమ్మద్ యొక్క చరిత్రము వ్రాసెను.

sampath_Ebooks

౩. ౧౯-వ శతాబ్దియందలి ఒక మహమ్మదీయపండితుఁడు. 'తారీఖ్-ఇ-అహమ్మద్', 'ముహారబ్-ఇ-కాబుల్-ఓ-కంధహార్', 'తారీఖ్-ఇ-పంజాబ్-తుహాఫతన్ లిల్ అహ్‌బాబ్' (ఈ మూఁడవది సిక్కు యుద్ధమునకు సంబంధించిన గ్రంథము) అనునవి యితఁడు రచించిన గ్రంథములలోఁ బ్రధానమయినవి.

౪. నాదిర్ షా ఆస్థానమున నుండిన యొక పండితుఁడు. 'బయాన్-ఇ-వాకి' యను పేర నితఁడు నాదిర్ షా చరిత్రమును రచించెను.

౫. అఫ్గాన్ దేశనివాసి. ఖాజహాన్ లోడీయను గ్రామమునకుఁ బాలుఁడై కాలము గడిపెను. అతఁడు చనిపోయినపిమ్మట విజాపురరాజ్యమునఁ జేరి తత్కాలమునఁ బాలకుఁడైన ఆదిల్ షాహాచేత మిరాజ్, దక్షిణమహారాష్ట్రదేశము, కొంకణము మున్నగు ప్రాంతములకు రాజప్రతినిధిగ నేర్పఱుపఁబడెను. అంతకుఁబూర్వము పశ్చిమభాగమునకు రాజప్రతినిధిగ నుండినకాలమున పన్హాలామీఁద దండెత్తిపోవ విజాపురపుదొరతనమువా రితని కాజ్ఞ నొసఁగిరి. ఆమనుసార మితఁడు పన్హాలాను ముట్టడించెను. ఆ సమయమున శివాజీచే నితని నెదిరింపఁ బంపఁబడిన ప్రతాపరావుగూజరు పన్హాలాచుట్టుప్రక్కల నున్న యిలాకాను ధ్వంసము గావింప కరీము వివశుఁడై మిక్కిలి కొంతసైన్యముసంగ్రహార్థము విజాపురమునకుఁ బోయెను. అబ్దుల్ కరీమును జంపకుండ వదలినందులకు శివాజీ ప్రతాపరావుమీఁద నత్యంతకుపితుఁడు కాఁగా నితఁడును మిగుల రోషమూని దొరకినమట్టునకు సైన్యమును వెంటఁగొని ఔరంగాబాదు ఇలాకాలను నాశనము చేయుచు బీరారు సరిహద్దులపర్యంతము పోఁగి యా చుట్టుప్రక్కలనుగూడ విధ్వంసముఁ జేసెను. ఇంతలో అబ్దుల్ కరీము విజాపురమునుండి సైన్యమును బోగుచేసికొని పన్హాలా ప్రవేశించునప్పటికిఁ బ్రతాపరావుగూడ మరలివచ్చెను. ఇతఁడు మొదట శివాజీవలన మాట పడియుండినందున ముందువెనుక లరయక మహమ్మదీయులమధ్యఁ బ్రవేశించి భీకరముగఁ బోరి యుద్ధరంగమందే వీరగతిని బొందెను. ఈ సంగతి తెలిసినతోడనే మహారాష్ట్రులు పరుగిడఁజొచ్చిరి. కాని యింతలో హసాజీమోహితే యను వేఱొక మహారాష్ట్రవీరుఁడు ౫,౦౦౦ ల సైన్యముతో వచ్చి పరుగిడుచున్న తనవారలను బురికొల్పి యుద్ధ మొనరింప అబ్దుల్ కరీము మరల విజాపురమున కేఁగవలసినవాఁ డయ్యెను. ఆదిల్ శాహామరణానంతరమే యితఁడు మిరాజ్, కొంకణము మొదలగు దేశములకు రాజప్రతినిధి యయ్యెను. ఖావజ్ ఖాన్ అను పేరుగల అబిసీనియానివాసి రాజపోషకుఁడుగ నియమింపఁబడియెను. ఖావజ్ ఖాను తన స్థానమును దృఢపఱుచుకొనదలంచి దక్షిణమందలి మొగలాయి రాజప్రతినిధి యగు బహదూరుఖానుతో రాయబారములు సలిపి యతని రెండవ కుమారునకుఁ దనకూఁతు నిచ్చి పెండ్లిచేయుటయే కాక గతించిన ఆదిల్ షాహాకూఁతురు పాదుషాబీబీని చక్రవర్తికొడుకులలో నొకని కిచ్చి వివాహ మొనరించెద నని వాగ్దానముఁ జేసెను. ఈలాగున వీరిరువురకును సంబంధబాంధవ్యములు దృఢము లగుటఁ బరికించి కరీము ద్వేషగ్రస్తుఁ డయ్యెను. ఈర్ష్యాగ్రస్తుఁ డగు కరీ మొకదినమున విశ్వాస మొసఁగి ఖావజ్ ఖానుని రావించి మాటలాడుచు నాకస్మికముగ నతనిని గడతేర్చెను. ఈసమాచారము బహదూరుఖానునకుఁ దెలిసినవెంటనే యతఁడును మిగుల రోష మూని కరీముపై నెత్తివచ్చెను గాని దిలేర్ ఖాను మాధ్యస్థ్యము వహించి యతఁడును అఫ్గానుదేశవాసి యగుటవలనఁ గరీమున కేమియు నష్టము రాకుండునట్లు వా రిద్దఱకును సంధి గావించెను. అనంతరము కొంతకాలమునకు బహదూరుఖాను, శివాజీ, గోలకొండనాయకుఁడగు అబుల్ హసేను వీరు ముగ్గురు నెదిరింప దిలేర్ ఖాను, కరీము - వీ రిద్దఱును గలసి గోలకొండను ముట్టడించిరి. కాని లాభము కలుగ దయ్యెను. ఈ సమయమందే కరీము రోగగ్రస్తుఁడై క్రమముగ వృద్ధికాఁగా నెన్ని ప్రయత్నము లొనరించినను విఫలము లగుటవలన మరణించెను.

## అబ్దుల్ కాఫ్ ఖాన్ — సావనూరునవాబువంశకుఁడు.

క్రీ. శ. ౧౬౮౬-వ సంవత్సరమున విజాపురము క్షీణించినతరువాత నంతవఱకును వారికొలువులో నున్న యితఁడు మొగలాయిచక్రవర్తి కొలువులోఁ బ్రవేశించెను. ఇతనికి దిలేర్ ఖాన్ బహదూర్, దిలేర్ జంగను బిరుదములు లభించుటయే కాక బాంకీపురము, అజమునగరము, తోరగల్లులోని ౨౨ మహాలులయిలాకా దొరకినవి. మొట్టమొదట నితఁడు బాంకీపురమును రాజధానిగఁ జేసికొనెను. కాని ఒస్మరసహాల్లీ యను గ్రామమునొద్దఁ బ్రాకృతికసృష్ట్యతిమనోహరముగ నుండుట యవలోకించి యక్కడ నొకనగరమును గట్టించెను. ఆనగరము శ్రావణమాసమున స్థాపింపఁబడుటవలన శ్రావణూ రని పేరు గాంచి క్రమముగ సావనూరుగ మారెను.

## అబ్దుల్ ఖాదర్, అమీర్ (౧౮౦౭-౧౮౮౩)—

౧. అల్జీరియా దేశములోని యొక దేశభక్తుఁడు. ఇతఁడు ఫ్రెంచివారితో మతయుద్ధమును జేయుటకై తన దేశీయులను బురికొల్పుచు ౧౮౩౩-వ సంవత్సరములో ఓరాన్‌వద్ద యుద్ధము మొదలుపెట్టెను. ఇతఁడు ఫ్రెంచివారితో సంధి చేసికొన్నతరువాత అమీరుగ నొప్పుకొనఁబడియెను (౧౮౩౪); కాని వెంటనే మరల యుద్ధము ప్రారంభము కాఁగా అబ్దుల్ ఖాదరు మొరాకోదేశమునకుఁ బాఱిపోయెను (౧౮౪౩). ఇతఁడు ౧౮౪౭-లో డీ లా మొరిసీరె యను ఫ్రెంచిసేనానాయకునకు వశుఁడై టూలోనునకు పంపఁబడియెను. ౧౮౫౨-వ సంవత్సరమున లూయీ నెపోలియనుచే విడిచిపెట్టఁబడుటయే కాక ౧౮౬౦-వ సంవత్సరమున లక్షఫ్రాంకుల నుపకారవేతనముగఁ బడసి తుట్టతుదకు డెమాస్కసు పట్టణమున నివసించుచుండి తత్త్వశాస్త్రమునుగూర్చి కొన్నిగ్రంథములను విరచించెను.

౨. అబ్దుల్ ఖాదర్ అల్ గీలానీ అని యితని పూర్ణమైనపేరు (౧౦౭౮-౧౧౬౬). ఇతఁడు పారసీక

sampath_Ebooks

దేశములో గిలాన్‌పరగణాలో జన్మించిన యొక మహమ్మదీయసాధువు. ఇతఁడు బాగ్దాద్‌పట్టణమున మరణము నొందెను. ఇతఁడు మహమ్మదీయ న్యాయశాస్త్రమునుగూర్చియు, గూఢ మైన భగవద్ధర్మమునుగూర్చియు గ్రంథములను వ్రాసెను.

గిలానీ ప్రత్యేకముగ నొకమతమును స్థాపించెను. దీనికి 'ఖాదిరీయ' మత మని పేరు. ట్రిపోలీ, అల్జీరియా, మొరాకో ప్రాంతముల నీమతమువారు పెక్కు రున్నారు. దీనిలో మరల నెన్నియో యంతశ్శాఖలు కలవు. ఖాదిరీయమతము నవలంబించు వారు, ఎన్నియోశాఖలవారు హిందూదేశమునఁగూడ నున్నారు. ఈఖాదిరీయమతమునుండి పుట్టి పెరిఁగినవానిలో అక్బరీయమత మొకటి. మనదేశమునఁగల ఖాదిరీయులలో నీయక్బరీయు లొకరు.

౩. గుజరాతులోని ఘియాజుద్దీన్ నవాబుకుమారుఁడు. ఘియాజుద్దీను సింహాసన మెక్కిననాఁడు అబ్దుల్ ఖాదరునకు యౌవరాజ్యము నొసంగి నసీరుద్దీన్ అను బిరుదము నిచ్చెను. అబ్దుల్ ఖాదరు దుర్మార్గుఁడై తండ్రికి విస మిచ్చి చంపి క్రీ. శ. ౧౫౦౦ సంవత్సరమున 'మాండూ' లో సింహాసన మెక్కెను. అటుపైని త్రాగుడు, వ్యభిచారము మున్నగు వ్యసనములలో మునిఁగి యితఁడు తన జీవితము నంతను వానికే యర్పించుకొనెను. భోగవిలాసములయం దితనికిఁ గలయాసక్తిచే సుందరము లగు భవనములను గట్టించుటయం దితనికి మక్కువ యుండెడిది. ఈ కారణమున నందందుఁ గొన్ని యందము గల భవనముల నితఁడు కట్టించెను.

౪. లక్నోనివాసి యగు నొక ముసల్మానుపండితుఁడు. ౧౮-వ శతాబ్దివాఁడు. రషీదుద్దీను రచించిన 'జమీ-ఉత్-తవారిఖ్' అను గ్రంథమునందలి 'పతంజలి' యనఁ బడుభాగమును పర్షియన్ భాషలోనికి భాషాంతరీకరించెను. ఉత్తర హిందూస్థానమునందలి గొప్పగొప్ప గ్రంథములలో నిది యొకటి. ప్రత్యేకముగ ప్రాచీనరాజుల చరిత్రలును, శాక్యమునిచరిత్రయు నిందుఁ గలవు. అబ్దుల్ ఖాదరునకుఁ బలుశాస్త్రములఁ బాండిత్యము కలదు.

**అబ్దుల్ ఖాదర్ బదౌని, షేక్** — ఇతఁడు అక్బరు కాలమునాఁటి అరబ్బీపారసీపండితుఁడు; సంస్కృతమునుగూడఁ జక్కఁగ నెఱిఁగియుండెను; తండ్రి ములుక్ షా. ఇతఁడు సంస్కృతమున నుండి రామాయణమును, మహాభారతములో రెండు పర్వములను పార్సీభాషలోనికి భాషాంతరీకరించెను. అరబ్బీభాషలోని పెక్కు గ్రంథములను పారసీలోనికి భాషాంతరీకరించెను. కాశ్మీరదేశచరిత్రము నుగూడ సంగ్రహముగ వ్రాసెను. ఇతఁడు 'బదౌ' అన్న గ్రామమున (౧౫౯౬) మృతి నందెను. ఇతని కవిత్వసంబంధమైనపేరు 'ఖాదిరి.'

**అబ్దుల్ ఖేర్ ఖాన్ (షేర్ ఖాన్)** — సావనూరు నవాబు. అబ్దుల్ హకీంఖానునిదత్తపుత్రుఁడు. హకీంఖాను టిప్పునకు వెఱచి తనరాజధానిని వదలి మహారాష్ట్రులరాజధానిలో జీవనము చేయసాగెను. ఇతని కిద్దఱు ఔరసపుత్రులు. వారిలో జ్యేష్ఠకుమారుఁడు శ్రీరంగపట్టణమున కేఁగి మరల రాలేదు. అందువలన హకీం ఖాను తన రెండవకుమారుని హుసేన్ మియాను పునహాయందలి తన పెన్షనునకు హక్కుదారుఁగఁ జేసి దత్తపుత్రుని షేర్ ఖానుని సావనూరికిఁ బంపెను. శ్రీరంగపట్టణమును స్వాధీనము చేసికొని జనరల్ వెలస్లీ యామార్గమున వచ్చుచు సావనూరను షేర్ ఖానునికుటుంబము మిగుల దీనదశలోనుండుట యవలోకించి సంవత్సరమునకు ౭౫,౦౦౦ల రూప్యము లాదాయము రాఁగల ౨౮ గ్రామముల నితనియధీనము గావించెను. ఇతనిసంతతివార లిప్పటికి నీయిలాకాల ననుభవించు చున్నారు.

**అబ్దుల్ జలిల్** — ౧౭, ౧౮ శతాబ్దములనాఁటి ఒక గొప్పమహమ్మదీయపండితుఁడు, కవి, రాజ్యతంత్రజ్ఞుఁడు. అయోధ్యరాష్ట్రములోని బిల్‌గ్రాం ఇతనియూరు. ౧౬౯౯-వ సంవత్సరమున నితఁడు ఔరంగజేబుకొలువులోఁ జేరెను. అతనియాస్థానమునఁ గొంతకాలము పనిచేసి, తరువాత పాదుషాయాజ్ఞ ననుసరించి సింధు దేశమునకుఁ బోయెను. తరువాత మరల నావశ్యకములైన రాజ్యవ్యవహారములఁ జక్కఁబఱచుటకై యతఁడు ఢిల్లీకి రప్పింపఁబడెను. ఢిల్లీలో వ్యవహార మంతయు ముగిసినతరువాత అబ్దుల్ జలిలు కార్యనిర్వహణమునఁ జూపినసామర్థ్యమునకై పాదుషా చాల సంతసించి, యతనిని గొప్పసమ్మాన మొనర్చి సింధుదేశమునకు రాజప్రతినిధిగ నియమించెను.

**అబ్దుల్ మజీద్** (౧౮౨౩ - ౧౮౬౧) — ౧. ఇతఁడు తుర్కిసుల్తాను. తనతండ్రియైన రెండవ మహమ్మదునకు పిమ్మట సింహాసన మెక్కెను (౧౮౩౯). ౧౮౪౧ లో ఈజిప్టు మహమ్మద్ అలీతో సంధి చేసికొనియెను. ఇతఁడు ౧౮౩౯-వ సంవత్సరములో తన తండ్రివలెనే మతభేదము లేకుండ తన ప్రభుత్వములోఁ జేరిన యెల్ల ప్రజలయొక్క సొత్తును మనుష్యునియొక్క హక్కులను కాపాడు నట్టిసంస్కరణములను గావించెను. ౧౮౫౩-వ సంవత్సరములో రష్యావారు కోరెడు హక్కుల నుల్లంఘించెను. అందువలన క్రిమియాయుద్ధము జరగుట సంభవించెను. ఇతఁడు తన రాజ్యములోఁ బెక్కువిధములయిన సంస్కారములను జేసెను.

౨. షాజహానుకాలమునాఁటి పారసీకపండితుఁడు. 'షాజహాన్ - నామా' యను పేర నాచక్రవర్తి చరిత్రమును వ్రాసెను.

**అబ్దుల్ మలిక్** — ఒమ్మియాద్ ఖలీఫాలలో నొకఁడు. గొప్పరాజనీతికుశలుఁడు. ఖలీఫాయధీనమం దున్నను భిన్నభిన్నదేశములలో భిన్నభిన్నముగ నుండిన మహమ్మదీయరాజ్యాంగము నొక్క ప్రకారమైనదానిగ నొనరించి దృఢముచేసెను. ఇతనికి హాదీతులని పిలువఁబడు ముసల్మానుల సంప్రదాయములవిషయములలో మంచి

sampath_Ebooks


జ్ఞానము గలదు. హజ్జా యనువేఱొక రాజనీతిజ్ఞుని సాహాయ్యముగూడ నితనికి దొరకినది. అతనితోడ్పాటువలన ముసల్మానురాజ్యము నితఁ డమితబలిష్ఠ మైనదానిగఁ జేసెను. వేర్వేఱు దేశములలో వివిధభాషలతో భిన్నులగు రాజ్యాధికారులమూలమున జరపఁబడుచువచ్చిన రాజకార్యముల నన్నింటి నరబ్బీయధికారులయధీనము చేసి యరబ్బీభాషనే రాజభాష గావించెను. మఱియు నాణెములలోఁ బరివర్తనము సలిపియుఁ, బత్రప్రేషణాలయములనిర్మాణముం జేసియు ననేకవిధముల లోకోపకారము నొనరించెను. ఇతనికాలమున మహమ్మదీయస్త్రీలపరిస్థితి యిప్పటివలెఁ గాక మంచిస్థితిలో నుండియుండెను. స్త్రీలు స్వేచ్ఛగలిగి తమ కపరాధ మొనరించుభర్తల వినీతులఁ జేయునధికారము గలిగియుండిరి.

**అబ్దుల్ మాలిక్** — అండలూసియారాజధాని యగు సేహ్వాలునగరమున జన్మించిన విఖ్యాతుఁ డగు నొకవైద్యుఁడు. ఇతని తాతతండ్రు లిరువురును గొప్పవైద్యులు. ౧౧-వశతాబ్ది తుదిరోజులలో నితఁడు పుట్టెను. అబ్దుల్ మాలిక్ ౧౩౫ ఏండ్లకాలము జీవించెనని చెప్పుదురు. యూరోపియను లితనిని అవెంజూర్ అని పిలుతురు. ఇతఁ డెన్నియో వైద్యగ్రంథములను వ్రాసెను. వానిలో నెల్ల ముఖ్య మయినది 'తయస్సూర్ ఫిల్ ముదావాత్ వత్ తద్బీర్' అనునది. ఇది హీబ్రూ, ల్యాటిన్ భాషలలోని కనువదింపఁబడినది. ల్యాటిన్ అనువాద మిప్పటికి చాల ముద్రణములఁ బొందినది.

**అబ్దుల్ మోమిన్** — కాస్పియన్ సముద్రమునకుఁ దూర్పుగ నున్న తుర్కిస్తానమందు నివాసము చేయు 'ఉజ్ బేగు'లను సున్నీముసల్మానుల నాయకుఁడు.

**అబ్దుల్ రషీద్ మిర్** — ఢిల్లీచక్రవర్తి యగు షాజహానుకాలమందలి పారసీకపండితుఁడు. ఇతఁడు పారసీకకోశమును, అరబ్బీకోశమును వ్రాసెను. 'ఫరహాంగ్-ఇ-రషీది' అను పారసీకకోశమును బంగాళమునందలి ఏషియాటిక్ సొసైటీవారు అచ్చొత్తించిరి.

**అబ్దుల్ రహిమాన్** — ౧. అరేబియా దేశములోని యొక సరదారు. ఇతఁడు టౌలౌజుఅను ప్రదేశమున యుద్ధము చేసెను. (౭౨౧). ఇతఁడు ౭౩౨-వ సంవత్సరమున ఆక్విటెయినిమీఁదికి దండయాత్ర వెడలి బోర్డోనగరమును కొల్లగొట్టి బర్గండివఱకును దేశమును ధ్వంసము చేయుచుఁ బోయెను. ౭౩౨-వ సంవత్సరమున ఫ్రెంచివారి సేనాపతియైన చార్లెసు మార్టెల్ అనువానితో నేడురోజులు యుద్ధము చేసి మరణము నొందెను.

౨. కార్డోవా పరిపాలనము చేసిన ఒమ్మియాద్ వంశస్థాపకుఁ డైన యితఁడు (౭౩౧ - ౭౮౮) డెమాస్కసునగరమున జన్మించెను. ఇతఁడు టెరినిసువఱకును ఐబీరి యనుద్వీపకల్పమును జయించుచు నిరంతరము యుద్ధము చేయుటయందే జీవితమును గడపెను.

౩. ఇతఁడు (౭౮౮ - ౮౫౨) కార్డోవాను పరిపాలించిన ఒమ్మియాద్ వంశస్థులలో నాలుగవ వాఁడు. మొదటి అల్ హాకీముయొక్క కుమారుఁడును, అతనికి పిమ్మట సింహాసన మెక్కినవాఁడు నైయుండెను (౮౨౨). ఇతని ప్రభుత్వము రాజ్యములో జరిగినయల్లరులవలనను, ఫ్రెంచివారితోను, బాగ్దాదునగరపు ఖలీఫాతోను జరిగినయుద్ధములవలనను సంక్షోభమును బొందెను.

౪. స్పెయినుదేశమును బరిపాలించిన ఒమ్మియాద్ వంశస్థులలో నితఁడు (౯౧౨ - ౯౬౧) ఎనిమిదవవాఁడు. ఇతఁడు ౯౧౮-వ సంవత్సరములో క్రైస్తవ రాజకుమారులు మలియోన్, నవారె ప్రభువులును నగు మూఁడవ అల్ఫాంజో సాంచోలతో యుద్ధము చేసి వారల నోడించెను. ౯౩౯-వ సంవత్సరమున లియోన్ ప్రభు వైన రెండవ రామిరోతో యుద్ధము చేసి యోడిపోయెను. కాని రామిరో మరణానంతరము సింహాసనభ్రష్టుఁ డైన మొదటి సాంచో ప్రభువును సింహాసన మెక్కించుటకై సాహాయ్యము చేసెను. స్పెయినుదేశములో మహమ్మదీయులకు నైకమత్యమును గలిగించుటకై విశేషముగాఁ బ్రయత్నము చేసెను. ఒమ్మియాద్ వంశమునందు నీతఁడు మిక్కిలి గొప్పవాఁడు.

౫. పెషావరు నగరవాసి యగునొకకవి. ఇతనికీర్తి లోకవిఖ్యాతము. మిగుల సరసము, నుత్సాహపూరితము నగు నితనికవిత్వము రసపక్షపాతులగు పండితులకును, రణరంగమున విహరించుయోధులకును సమానాదరపాత్ర మై యొప్పుచుండును. పెషావరుదగ్గఱ నితనిజన్మస్థానమగు హజార్ ఖాన్ గ్రామమునకుఁ బోవుదారిలో నితనిసమాధి నిర్మింపఁబడియున్నది.

**అబ్దుల్ రహిమాన్ ఖాన్** (౧౮౩౦-౧౯౦౧) — ఇతఁడు అఫ్గానిస్తానమునకు అమీరుగ నుండెను. తన ప్రభుత్వమును బలపఱచుటకును సరిహద్దులను స్థిరపఱచుటకును, జనులసాంఘికస్థితుల నభివృద్ధిపఱచుటకును అనల్పమైన కృషిచేసెను. ఇతనితరువాత నితని కుమారుఁడు హబీబుల్లాఖాను అమీరయ్యెను (చూడుఁడు, అఫ్గానిస్తానము).

**అబ్దుల్ లతీఫ్ అల్ బాగ్దాది** (౧౧౬౨-౧౨౩౧) — ఇతఁడు బాగ్దాదునగరమున జన్మించిన యొకమహమ్మదీయ పండితుఁడు. ఇతఁడు తత్త్వశాస్త్రమును, వైద్యశాస్త్రమును పఠించి కైరో, డెమాస్కసు నగరములలో బోధించెను. ఇతఁడు ఈజిప్టుదేశ చరిత్రమును రచింపఁగా నయ్యది లాటిన్, ఫ్రెంచ్, యింగ్లీషు భాషలలోనికి భాషాంతరీకరింపఁబడియెను.

**అబ్దుల్ సమద్ ఖాన్** — ఇతనితండ్రి సమర్కండ్ దేశస్థుడు. ఇతఁడు ఆగ్రాలోఁ బుట్టెను. ఔరంగజేబుకాలమందు, ఈతనికి ౬౦౦ మన్సబ్దారీయు, తరువాత ౧,౫౦౦ మన్సబ్దారీయు,

sampath_Ebooks

ఖాన్ అనుపదవియుఁ బ్రాప్తించెను. జహాంగీర్ కాలమం దితఁడు ౨,౦౦౦ మన్సబ్దా రయ్యెను. ఆలీజంగ్ అను పదవిని బడసెను. ఫరుక్ సియార్ కాలమున నీతఁడు లాహోరునకు గవర్న రయ్యెను. సిక్కుల నోడించి వారిగురువైన బాందా అనువానిని చెఱఁబెట్టెను. మహమ్మద్ షా కాలమున నితఁడు ముల్తానునకు రా జయ్యెను. 'సంసాం-ఉ-ద్దౌలా' అను బిరుదమును వహించెను. ఇతఁడు ౧౭౩౯ లో నాదర్ షాహ దాడికాలములో మృతుఁ డయ్యెను. ఇతని కుమారుఁడు జకిరియా ఖాను లాహోరునకు సుబేదారుగా నుండెను. ఇతని తండ్రి పేరు ఖ్వాజా అబ్దుల్ కరీమ్.

అబ్దుల్ హక్, షేక్ (౧౫౫౧-౧౬౪౨) — గొప్ప మహమ్మదీయవిద్వాంసుఁడు. చరిత్రము, మతము, సూఫీ సిద్ధాంతములు, యాత్రలు మొదలైన విషయములపై నూఱుకంటె నెక్కుడు గ్రంథములు వ్రాసినవాఁడు. ఇతనిగోరీ ఢిల్లీపట్టణమందుఁ గలదు. ఇతనిని భగవద్భక్తునిగాఁ బూజించెదరు. తండ్రి పేరు సైఫీ ఉద్దీన్ షేఖ్ నూరు ఉల్లల్.

**అబ్దుల్ హకీంఖాన్.** —ఇతఁడు సావనూరునవాబు. ఇతనిజనకునిపేరు మజీద్ ఖాను. మజీద్ ఖానుయొక్క పూర్వు లందఱును నిజామునకు లోఁబడియుండి శాంతిపూర్వకముగ రాజ్య మేలుచు వచ్చిరి. కాని మజీద్ ఖాను నిజాముఫర్మానా పొందకయే సింహాసన మెక్కినకారణమున వా రిద్దఱకును విరోధము గలిగెను. తనదేశమునఁ గొంతభాగ మిచ్చి మహారాష్ట్రులతో మైత్రి చేసికొని యితఁడు నిజాము నెదిరించెను. ఈవైరమే యితనికొడుకగు హకీంఖానునకుఁ గూడ సంక్రమించెను. హకీంఖాను రాజ్యమున కేతెంచినతోడనే యితని కన్నివైపుల శత్రువులతోఁ బోరాడవలసివచ్చెను. నిజాము నెదిరించునిమిత్తము తనదేశమందలి కొంతభాగమును మహారాష్ట్రుల కిచ్చి వారితో సంధి గావించుకొనెను. మహారాష్ట్రులసాయముననే యితఁడు హైదరాలీనిగూడ నొకపర్యాయ మెదిరించి పాఱఁదోలెను. యుద్ధానంతరము మహారాష్ట్రులు వెడలిపోయినతోడనే హైదరు మరల నితనిదేశముమీఁద దండెత్తి దక్షిణప్రాంతముల జయించెను. కాని యీసందర్భమున వీ రిద్దఱకును పరస్పరసంబంధబాంధవ్యములు చేకూర మైత్రి కలిగినది. ఈమైత్రి హైదరు జీవించియుండినంత కాలము స్థిరముగనే యుండెను కాని యతనిమరణానంతరము టిప్పుతో మరల యథాపూర్వ మయ్యెను. అంత నితఁడు సావనూరు వదలి పునహానగరమునకుఁ జేరి మహారాష్ట్రు లొసంగు ౧౦,౦౦౦ ల మాసికవృత్తివలన జీవనము గడపుచు క్రీ. శ. ౧౭౯౫-వ సంవత్సరములోఁ గాలధర్మము నందెను.

**అబ్దుల్ హమీద్** — ౧. ఇతఁడు (౧౭౨౫-౧౭౮౯) తుర్కీసుల్తాను; మూఁడవ అహమ్మదు కుమారుఁడు. నాల్గవ అహమ్మదు అను పేరుతో తన సోదరుఁడైన ముస్తఫాకు పిమ్మట తుర్కీసింహాసన మలంకరించి సుల్తా నయ్యెను. ఇతని ప్రభుత్వకాలములో రష్యనులకును తురుష్కులకును యుద్ధములు జరగి రష్యనులకు జయము లభించెను.

౨. ఇతఁడు (౧౮౪౨-౧౯౧౮) అబ్దుల్ మజీదునకు పుత్త్రుఁడు. తన సోదరుఁడును, వెఱ్ఱివాఁడును నగు మురాదునకు పిమ్మట తుర్కీసింహాసన మధిష్ఠించి సుల్తానై ౧౯౦౯-వ సంవత్సరములో సింహాసనమునుండి తొలఁగింపఁబడియెను. ఈతని ప్రభుత్వకాలములో జరగిన ముఖ్యవిషయములు : సర్వియాతో యుద్ధము (౧౮౭౬), రష్యాతో యుద్ధము (౧౮౭౭-౭౮), ఆర్మీనియాలో ఘోరకృత్యములు జరగుట, గ్లాడ్ స్టన్ ప్రభువుచే ఘాతుకు లని దూషింపఁబడుట, క్రీటులో అల్లరులు, గ్రీసుతో యుద్ధము (౧౮౯౭), ౧౯౦౮-వ సంవత్సరములో తురుష్కరాష్ట్రములో రాజకీయసంస్కారములకై తరుణతురుష్కులు ప్రభుత్వము నెదుర్కొనుట, ౧౯౦౯-వ సంవత్సరములో దేశీయమహాజనసభ యేర్పడి సుల్తాను దుష్పరిపాలనము చేయుచున్నందున ఖలీఫాపదవిని వహించుటకుఁ దగిన హక్కును గోల్పోయెనని చెప్పి యతనిని సింహాసనమునుండి తొలఁగించి యీతని సోదరుని ఐదవమహమ్మదను పేరుతో సుల్తానుగా చాటుటయును సంభవించెను.

అబ్దుల్లా — మతప్రవర్తకుఁడైన మహమ్మదుయొక్క తండ్రి. అబ్దుల్ ముతాలబ్ అనువానికుమారుఁడు. ఇతఁడు మిక్కిలి చక్కనివాఁడు. ఇతఁడు ఒంటెలకాపరి. ఇతనిభార్య పే రమీనా. ఈదంపతులకు చిరకాలమునకు మహమ్మదు కలిగెను. మహమ్మదు శిశువుగ నుండఁగనే ఇతఁడు మరణించెను. ఇతని మరణకాలము క్రీ. శ. ౫౭౧ ప్రాంతము.

**అబ్దుల్లా కుతుబ్ శాహ** (౧౬౧౪-౧౬౭౨) — గోలకొండలోఁ బ్రభుత్వము చేసిన కుతుబ్ శాహ వంశములోని ఆఱవ నవాబు; ఇతఁడు మహమ్మద్ కుతుబ్ శాహకు తరువాత రాజ్యమునకు వచ్చెను. మీర్ జుమ్లా అనువానినిగుఱించి యీతనికిని, ఢిల్లీశ్వరుఁడైన షాజహానునకును వైరము వచ్చెను. అంత ఢిల్లీశ్వరుని కుమారుఁడైన ఔరంగజేబు గోలకొండమీఁదికి యుద్ధమునకుఁ బోయి దానిని వశపఱచుకొనెను. అప్పుడు కుతుబ్ శాహ కోటిరూపాయ లిచ్చి సంధి చేసికొనెను. ఈతఁడు ౧౬౭౨ లో మృతి నొందెను. ఇతనికి పుత్రసంతానము లేదు. ముగ్గురు కూఁతులు. వారిలో రెండవకొమార్తెను ఔరంగజేబుపెద్దకొడుకున కిచ్చి వివాహము చేసి తన మరణానంతరము గోలకొండరాజ్య మతనికే ఇచ్చులాగున నియమము చేసికొనెను. కాని అబ్దుల్లా మరణించుటకు పూర్వమే అల్లుఁడు పరలోకగతుఁ డయ్యెను. కొడుకు చనిపోయినను ఈమరతును ఆధారముగా చేసి

sampath_Ebooks



కాని ఔరంగజేబు అబ్దుల్లాతరువాతను సింహాసన మెక్కిన యతని మూఁడవ యల్లుఁడగు అబుల్ హసనుమీఁద దండెత్తివచ్చి యతని నాశ



అబ్దుల్లా కుతుబ్ శాహ

నము గావించెను. అబ్దుల్లాయొక్క సమాధిదగ్గఱ నిప్పటికిని ప్రతి సంవత్సర మొకపర్యాయము బీదలకు అన్నము పెట్టెదరు.

**అబ్దుల్లాఖాన్** — ఛంగిస్‌ఖానునివంశజుఁ డైన సికందర్‌ఖానునికుమారుఁడు. ఇతఁడు 'ఉజ్ బేగ్' లనువారికి నాయకుఁడు. తండ్రితోఁ బోరాడెను. తండ్రి చనిపోయినతరువాత ౧౫౮౨-లో సమర్‌కండ్, బొఖారా రాజ్యములకు నధిపతి యయ్యెను. ౧౫౮౫-లో ఖురాసాన్‌మీఁదికి దండెత్తిపోయి హీరాత్ పట్టణమునకు తొమ్మిది నెలలు ముట్టడి వేసి దానిని వశపఱుచుకొనెను. అచ్చట నధికారిగా నున్న అలీ కులీఖానుని ఇతరులతోఁగూడ నఱికి వైచెను. ఇతఁడు పారసీకపురాజగు శాహ అబాస్‌తోడను, ఢిల్లీచక్రవర్తి యైన అక్బరుతోడను సమకాలికుఁడు. ఇతఁడు ౧౫ సంవత్సరములు రాజ్యము చేసి ౧౫౯౭-లో మరణము నొందెను.

**అబ్దుల్ ఖాన్ ఉజ్ బేగ్** — ఈతఁడు అక్బరుకాలములో ప్రఖ్యాతి గాంచిన ఉద్యోగి. చక్రవర్తి ఈతనిని మాల్వాదేశమునకు పాలకునిగ నొనర్చెను (౧౫౬౭). ఈతఁడు అక్బరు పై తిరుగఁబాటు చేయుటచేత ఓడింపఁబడి దేశమును విడిచి పరారి ఆయెను.

**అబ్దుల్లాఖాన్ సయ్యద్** — ఇతనికి కుత్‌బ్-ఉల్-ముల్క అను పదవి కలదు. ఇతఁడు ఢిల్లీచక్రవర్తి అయిన బహదూర్‌షా కాలమున (౧౭౦౭-౧౭౧౨) అలహాబాదునకు గవర్నరుగ నియమింపఁబడెను. ఇతనితమ్ముఁ డైన సయ్యద్ హుసేన్ అల్లీఖాను బీహారునకు గవర్నరుగ నుండెను. ఈ సోదరులు మతకర్త యైన 'మహమ్మదు' వంశమువారఁట! ఫరుక్‌సియర్ (౧౭౧౩-౧౭౧౯) అను ఢిల్లీచక్రవర్తి వీరి సాహాయ్యముననే సింహాసనాసీనుఁ డయ్యెను. అబ్దుల్లాఖా నాతనికి ముఖ్యమంత్రి యయ్యెను. అతని తమ్ముఁడు 'అమీర్-ఉల్-ఉమ్రా' అను గొప్పపదవిని (సేనాధిపత్యమును) బొందెను. 'అందుచే నీ సయ్యదుసోదరు లిద్దఱును సర్వాధికారము కలవారై ఫాదుషానుగూడ లక్ష్యము చేయరైరి. వారిని నాశము చేయవలె నని ఫాదుషా యత్నించెను కాని అతనియుపాయము లన్నియు నాతనికే చెఱుపు చేసెను......వారిబాధ తప్పించుకొనుటకై వారిలో నొక్కఁడగు హుసేన్ అల్లీ యనువానిని దక్షిణదేశమునకు సుబేదారుగాఁ బంపెను. కాని వాఁ డచ్చట మరాటావారితో స్నేహము చేసి వారిసైన్యములను, బాలాజీవిశ్వనాథుఁ డను పేష్వాను వెంటఁ దీసికొని ఢిల్లీపట్టణముమీఁదికిఁ బోయి తనయధికారమును మరల స్థాపించెను (౧౭౧౭). ఇట్లు మరలఁ బూర్ణాధికారము కలవారై యాయన్నదమ్ములు ౧౭౧౯ లో ఫరుక్‌సియరును జంపించి యాఱునెలలలో నిద్దఱు రాజపుత్రుల సింహాసనస్థులఁ జేసిరి. కాని వా రేకారణము వలననో మృతులయిరి. తుదకు వీరు 'మహమ్మద్‌షా' అనువానిని ఫాదుషాను చేసిరి. కావున నీ సయ్యదుసోదరులకు 'రాజనిర్మాతలు' (King makers) అని పేరు వచ్చెను.'[1]

మహమ్మదుషా రాజయినతరువాత నతని ప్రేరణవలన ౧౭౨౦ లో హుసేన్ అల్లీఖాను చంపఁబడెను. అబ్దుల్లాఖాను తిరుగఁబడఁగా నాతని నోడించి చెఱఁబెట్టిరి. అతఁ డచ్చటనే ౧౭౨౩-లో మృతుఁడయ్యెను

**అబ్దుల్లా ఎల్ తెయషియస్ సయ్యద్** (౧౮౩౦-౯౯) — ఇతనిని ఖలీఫా యందురు. మహమ్మదు అహమ్మదునకు పిమ్మట మహదీపదవి నహించెను (౧౮౮౫). ఇతఁడు బగ్గరతెగలోనివాఁడు. ౧౮౮౯-వ సంవత్సరమున అబిసీనియా చక్రవర్తి యగు జాను నోడించెను గాని ౧౮౯౩-వ సంవత్సరమున అగరుడోట్ అను ప్రదేశమున ఇటాలియనులచే తఱుమఁబడియెను. ౧౮౯౮-వ సంవత్సరమున కిచనరు ప్రభువుచేతను, తరువాత ఓమ్ డెబ్రికాట్ అను ప్రదేశమున సర్ ఆర్ విన్‌గేటుచేతను ఓడింపఁబడి యాయుద్ధములోనే మరణము నొందెను.

**అబ్బయామాత్యుఁడు** — ఈతఁడు తెనుఁగున అనిరుద్ధచరిత్రము, కవిరాజమనోరంజనము అను రెండుకావ్యములను

1. మహమ్మదీయ మహాయుగము, రెండవకూర్పు, ౧౮౧.

sampath_Ebooks

రచించెను[1]. ఈరెండవకావ్యమునకుఁ బురూరవశ్చరిత్రము అని నామాంతరము కలదు. ఈ రెండుకావ్యములందును కవి తన వంశమును వర్ణించియున్నాఁడు. ఈతనిది కౌండిన్యసగోత్రము, ఆపస్తంబ సూత్రము. వీ రారువేలనియోగులు. కవికి నాలవతరము పూర్వుఁడు బసవనమంత్రి. ఈతఁడు కొండవీటిరాజులయొద్ద మంత్రిగనుండెను[2]. ఈతని పెద్దకుమారుఁ డైన ముమ్మనమంత్రిసంతతివాఁడు మనకవి. ముమ్మనకుమారుఁడు నిమ్మయ్య, మనుమఁ డబ్బయ్య. ఈతఁడు కొండవీటినాయకులచే మన్నన వడసెను[3]. ఈతఁడు మనకవికి తాత. అబ్బయ్యకుమారుఁడు రాయన్న. ఈతనిధర్మపత్ని నరసమ్మ. వీ రిద్దఱకును యోగానందుఁడును, మనకవి యైన అబ్బయామాత్యుఁడును పుట్టిరి.

దేశము :— ఈ కవి గుంటూరుమండలనివాసిగాఁ గాన్పించుచున్నాఁడు. వీరు కనుపర్తి గ్రామనివాసు లగుటచే వీరికిఁ గనుపర్తివా రన్న యింటిపేరు వచ్చెను. కనుపర్తి, బుక్కపురి గ్రామముల కరణీకము వీరిది యైనట్లు ఈ క్రిందిపద్యములవలనఁ దెలియుచున్నది.

క. ఆమంత్రిమణి ప్రకాశ స
భోమణి కనుపర్తి, బుక్కపురి ముఖ్యబహు
గ్రామసాస్వామ్యమభవ
గ్రామణి బుధనుతుల సుతులఁ గాంచె నలువురన్.
[క., ౧, ౨౯.

మంగళగిరి నృసింహస్వామి కవికి నిష్టదేవత. కనుపర్తి గ్రామము ఒంగోలు తాలూకాలోను, బుక్కపురి ఆత్మకూరుతాలూకా (నెల్లూరుజిల్లా) లోను, మంగళగిరి గుంటూరుతాలూకాలోను ఉన్నవి. కావునఁ గవి పూర్వపు నెల్లూరుజిల్లాలోను, ఇప్పటి నెల్లూరుజిల్లాలోను నివసించియుండె నని చెప్పవచ్చును. నర్సారావుపేటతాలూకాలో కనుపర్రు గ్రామ మున్నది. దానికిఁ గరణములు కనుపర్తివారు. వీ రీ కవియొక్క వంశజు లని తెలియుచున్నది.

కాలము :— ఈ కవికాలమునుగుఱించి శ్రీవీరేశలింగముగా రిట్లు వ్రాసియున్నారు : 'అబ్బయామాత్యుఁడు పదునెనిమిదవశతాబ్దిమధ్యమున నుండినవాఁడు. ఇతఁడు ౧౭౭౦-వ సంవత్సరము ప్రాంతము వఱకును జీవించియుండవచ్చును.' ఇది యూహ. ఈయూహకు వారు హేతువుల నిచ్చియుండలేదు. ఈతనిగ్రంథములు రెండును దేవునకు నంకితములు చేయఁబడినందున నీ కవికాలమును నిశ్చయించుటకు నా కావ్యములలో దృఢమైనయాధారము లేవియుఁ గానరావు. అయినను ఉన్నవానినిబట్టి కొంత యత్నింతము.

ఈకవిచే వ్రాయఁబడిన కవిరాజమనోరంజనము (పురూరవశ్చరిత్రము) వసుచరిత్రము ననుసరించి వ్రాయఁబడినది. అందలి పద్యములకుఁ బ్రతిబింబము లనఁదగు వీలు గల పెక్కుపద్యము లిందుఁ గలవు. దీనికి మనవారు పిల్లవసుచరిత్ర మని పేరు పెట్టియున్నారు. కావున అబ్బయామాత్యుఁడు వసుచరిత్రకారునికి తరువాతివాఁడు, అనఁగాఁ బదునాఱవశతాబ్దికిఁ దరువాతివాఁ డని మనము నిశ్చయింపవచ్చును.

అనిరుద్ధ చరిత్రమునందు, ఈ క్రింది సీసపద్యపాదము కాన్పించుచున్నది :—

పెంపుమీఱుచు సంత పేష్వాహజారున
నుండి చెలావణి నొందరు దెలుప

ఇందలి 'పేష్వా' పదము కాలనిర్ణయమునకుఁ గొంత [3-౧౯] సహకారి. 'పేష్వా' శబ్దమునకుఁ బ్రధానుఁ డని సామాన్యార్థ మున్నను, పూనా పేష్వాలకు నది విశేషబిరుదము. మొదటి పేష్వా యైన బాలాజీబాజీరావుకాలమువఱకును పూనా పేష్వాల ఖ్యాతి దక్షిణదేశమునందుఁ బ్రసరించిన దని చెప్పుటకు వీలు లేదు. ఈతఁడు క్రీ. శ. ౧౭౪౦ లో పేష్వాయై, ౧౮౧౮ లో మ్లానుఁ డయ్యెను. కావున నీకవి పదునెనిమిదవ శతాబ్దిమధ్యమునం దుండె నని వీరేశలింగముగారు చేసిన యూహ సరియైనదిగాఁ గాన్పించుచున్నది.

అనిరుద్ధచరిత్రము :— ఈతనిచే రచింపఁబడిన గ్రంథములలో అనిరుద్ధచరిత్రము మొదట వ్రాయఁబడినది. ఇం దైదాశ్వాసములు కలవు. పద్యసంఖ్య ౬౯. శ్రీకృష్ణుని మనుమఁ డైన యనిరుద్ధునకును, బాణాసురుని కూఁతు రైన ఉషాకన్యకును జరగిన వివాహకథ ముఖ్యముగ నిందు వర్ణింపఁబడినది. ఉషాకల్యాణముకథ సంస్కృత భాగవతమునందును (౧౦-వ స్కంధము), హరివంశమునందును (అ. ౧౧౬-౧౨౮) కలదు. ఈ రెండుకథలును మొత్తముమీఁద నొక్కటియైనను వీనికిఁ గొంచెము భేద మున్నది. సంస్కృత భాగవతము ననుసరించి బమ్మెర పోతరాజు ఆంధ్రభాగవతముయొక్క దశమస్కంధములో నీకథ వ్రాసెను; హరివంశము ననుసరించి ఎఱ్ఱాప్రగడ తనచే రచింపఁబడిన హరివంశమునందలి యుత్తరభాగమున సప్తమాష్టమాశ్వాసములందును, నాచనసోముఁడు తన యుత్తర హరివంశమునఁ బంచమాశ్వాసమునందును వ్రాసియున్నారు. కైపమాయన యనుకవి ఉషాకల్యాణ మను కావ్య మొకటి యైదాశ్వాసములు కలది రచించినాఁడు.

1. అనిరుద్ధచరిత్రము చెన్నపట్టణమునందు వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండు సన్సువారిచేతను (౧౯౧౧), కవిరాజమనోరంజనము రాజమహేంద్రవరమునందు శ్రీ చింతామణి ముద్రాక్షరశాలాధికారులచేతను (౧౯౧౩) ప్రకటింపఁబడినవి. ఇవి నే నుపయోగించిన ప్రతులు.

2. కవిరాజమనోరంజనము., ౧. ౨౯.

3. అనిరుద్ధచరిత్రము., ౧. ౧౯.

# అబ్బయామాత్యుఁడు



కథాసంగ్రహము :— అబ్బయామాత్యుఁడు శ్రీమద్భాగవతమందలి కథ ననుసరించి యీ యనిరుద్ధచరిత్రమును వ్రాసెను. వర్ణనములు మొదలైనవి తప్ప మూలకథలో నేమాత్రము మార్పులను ఈకవి చేసియుండలేదు. అనిరుద్ధచరిత్ర మని పేరు పెట్టినందునఁ గవి మొదటియాశ్వాసమునందు, అనిరుద్ధునకును రుక్మియొక్క పౌత్రియైన రుక్మలోచనకును జరగిన వివాహమును వర్ణించినాఁడు. రెండవయాశ్వాసమునందు బాణాసురుఁడు శివునివలన వరంబును బడయుటయు, ఉష స్వప్నముఁ గాంచుటయు, చిత్రరేఖ యఖిలరాజవరుల పటముల వ్రాసి యుషకుఁ జూప నామె అనిరుద్ధుని గుర్తించుటయు ననుకథాభాగము కలదు. ఉషయొక్క విరహతాపమును, చిత్రరేఖ వెళ్లి యెవరికిని తెలియకుండ ద్వారకనుండి యనిరుద్ధునిఁ దీసికొని వచ్చుటయు, ఉషానిరుద్ధుల సమాగమంబును, బాణుఁ డనిరుద్ధునిఁ జెఱఁబెట్టుటయు తృతీయాశ్వాసమున వర్ణితములు. చతుర్థాశ్వాసమునందు యాదవులకును బాణునకును జరగినయుద్ధము వర్ణింపఁబడినది. అయిదవయాశ్వాసమునందు బాణుఁ డోడుటయు కృష్ణుఁడు వానిని గరుణించుటయు, ఉషానిరుద్ధుల వివాహమును, దంపతులతో యాదవులు ద్వారకకుఁ బోవుటయు, అనిరుద్ధునకు వజ్రుఁ డను పుత్త్రుఁడు పుట్టుటయు, నాతఁడు రాజసూయాదియజ్ఞములను జేయుటయు, ప్రజారంజకంబుగ రాజ్యంబు నేలుటయు నను కథ కలదు.

కవిజనమనోరంజనము, శతాంకవ్యమునకు నాధారము :— ఇది అబ్బయామాత్యునిచే రచింపఁబడిన రెండవకావ్యము. ఇందు దైదాశ్వాసములును, ౧౧౬౦ పద్యములును కలవు. చంద్రుఁడు బృహస్పతియొద్దఁ జదువుకొని తారను లేవఁదీసినదిమొదలు, పురూరవుఁడు ఊర్వశినిగూడి సంతానము వడయువఱకును గల కథ ఇందు వర్ణితము.

ఊర్వశీపురూరవులకథ మొదట ఋగ్వేదమునందుఁ గలదు (౧౦-౯౫). బృహద్దేవతయందును (౭.౧౪౦-౧౪౭), శతపథబ్రాహ్మణమునందును (౫.౧-౨), విష్ణుపురాణమునందును (౪-౬), దేవీభాగవతమందును (౧-౧౩), హరివంశమునందును (౧౦-౨౬), మత్స్యపురాణమునందును (౨౪), కథాసరిత్సాగరమునందును (3.౪-30) ఈకథ కలదు.

ఈ కథ యంతయు శ్రీమద్భాగవతమునందుఁ జక్కఁగ వర్ణింపఁబడినది. సంస్కృతభాగవతమున నవమస్కంధమందలి ౧-వ అధ్యాయమునందు నిలాకన్యచరిత్రమును, ౧౪-వ అధ్యాయమునందు చంద్రతారలచరిత్రయు, ఊర్వశీపురూరవులచరిత్రయుఁ గలవు. ఇవియుఁ గాక బ్రహ్మపురాణము, పద్మపురాణము, స్కాందపురాణము (కాశీఖండము) మొదలయిన పురాణములలోఁ జంద్రవంశవర్ణనము వచ్చినచోట నెల్ల సంగ్రహముగనో, విస్తరముగనో యీకథ వర్ణింపఁబడినది. విక్రమోర్వశీయ మను నాటకమునందుఁ గాళిదాసుఁ డీ కథాభాగమునే మిగుల మనోహరముగఁ జిత్రించియున్నాఁడు. పురూరవునకే విక్రముఁ డని నామాంతరము. తెనుఁగున బమ్మెరపోతరాజు భాగవతమునందు ౯-వ స్కంధమున ఈకథాభాగ మంతయుఁ జక్కఁగ భాషాంతరీకరించియున్నాఁడు. ఈస్కంధమునందు రెండు తావులఁ గల యీ కథను తీసికొని యబ్బయామాత్యుఁడు పురూరవశ్చరిత్రమును రచించినట్లు కానవచ్చుచున్నది. కాళిదాసునినాటకమును ఈకవి చూచినట్టు లేదు. భాగవతములోని కథను ఈకవి మార్పలేదు. ఊర్వశీపటమును వ్రాయించి పురూరవునియొద్దకుఁ బంపుట యనునది (ఆ. ౫, ౧౯-౩౪) కవి క్రొత్తగఁ గల్పించినది. కావ్యము వర్ణనలతోఁ బెంపఁబడినది.

కథాభాగము :— ప్రతిష్ఠానపురమునందుఁ బురూరవసుఁడు రాజ్యము చేయుచుండఁగా నొకదినమున నారదుఁడు వచ్చి, రాజధర్మములను, వేదాంతమును రాజునకు బోధించి యింద్రలోకమునకుఁ బోయెను. అచ్చట నింద్రుఁ డడుగఁగాఁ బురూరవుని చరిత్ర చెప్పఁదొడఁగెను (ఆ. ౧). చంద్రుఁడు బృహస్పతియింట విద్యాభ్యాసము చేసి గురుభార్యయైన తారను లేవఁదీసి బుధుఁ డను కుమారునిఁ గాంచెను.[1] వైవస్వతమనువు పుత్త్రునకై యజ్ఞము చేసెను. కాని యాతని భార్య పుత్త్రిక కావలయు నని కోరినందున ఇల యనుకన్యక పుట్టెను. తండ్రికిఁ గన్యయందు నిష్టము లేనందున గురు వను వసిష్ఠుఁడు నారాయణుని వేఁడి ఇలాకన్యను సుద్యుమ్నుఁ డను పురుషునిఁగ మార్పించెను. సుద్యుమ్నుఁ డొకనాఁడు వేఁటకుఁబోయి కుమారవనముఁ బ్రవేశింప మరల నిలాకన్యగ మాఱి బుధునితోఁ బొందుచేసి పురూరవునిఁ గనియె. అంత శివుని యనుగ్రహంబున ఇల యొక నెల పురుషుఁడుగను, ఒక నెల స్త్రీగను ఉండునట్లు వరము వడసి పుత్త్రునితో తన రాజధానికిఁ బోయి (ఆ. ౨.) కొన్నాళ్లు రాజ్యము చేసి, పురూరవునకుఁ బట్టము కట్టి యరణ్యమునకుఁ బోయెను. పురూరవుఁడు దిగ్విజయయాత్ర వెడలి యన్ని దేశముల జయించెను. నారదుఁడిట్లు పురూరవుని వర్ణింపఁగా విని ఊర్వశి యను నప్సర యాతనియందు బద్ధానురాగ యయ్యెను. విరహతాప మధిక మయ్యెను (ఆ. 3.). అప్పుడే మిత్త్రావరుణఋషుల ఘోరమైన తపస్సును భంగము చేయుటకై యింద్రుఁ డూర్వశిని భూలోకమునకుఁ బంపెను. ఆమె వారితపస్సునకు విఘ్నము కావింపఁగా 'నీవు భూలోకమందు నుండెదవు. స్వర్గమునకుఁ బో' అని శాప మిచ్చిరి. పురూరవుఁడు గంగకు వెళ్లి మాఘస్నానము చేసెను. విష్ణువు ప్రత్యక్షమై దివ్యస్త్రీలాభము కలుగు నని వర మిచ్చెను (ఆ. ౪). ఇట వింధ్యపర్వతమునందు పురూరవునిసమాగమం బెట్లు గలుగు నని యోజించి యూర్వశి తనపటమును వ్రాయించి రాజునకు నందునట్లు చేసెను. ఆ పటమును జూచి రాజు ఊర్వశియెడల ననురాగము గలవాఁ డగును.

1. చంద్రతారలప్రేమతో సంబంధించినకథ శ్రీనాథుని కాశీఖండము (౪-వ ఆశ్వాసము)నందును, శేషము వేంకటపతి శశాంకవిజయ మునందును వర్ణింపఁబడినది.

sampath_Ebooks



ఇంతలో చారులు వచ్చి వింధ్యప్రాంతమున నెవ్వరో స్త్రీ లున్నారని చెప్పుదురు. పురూరవుఁడు వారివెంటఁ బోయి యూర్వశిం గలసికొని, రాజధానికిఁ దీసికొనివచ్చును. తాను పెంచిన పొట్టేళ్లను పిల్లలవలె రక్షింపవలె ననియుఁ, దనకు నెన్నఁడును వివస్త్రుఁడుగఁ గాన్పింపఁగూడ దనియు నూర్వశి పురూరవుని నొప్పించును. వారు పెక్కుదినంబులు కేళీవిలాసములఁ గడపుచుండిరి. ఒక్కనాఁ డింద్రుఁడు ఊర్వశిని నెట్లయినను దెమ్మని గంధర్వులను బంపెను. వారు వచ్చి ఊర్వశీ పురూరవులు సురతశ్రమతోఁ బరున్న సమయమున పొట్టేళ్లను బాధించిరి. అవి యఱవఁగా నూర్వశి తొందరచేయ పురూరవుఁడు తొందరపాటుతో వస్త్రము లేకుండఁగనే లేచి గంధర్వుల నిర్జించి పొట్టేళ్లను రక్షించెను. కాని నగ్నుఁడుగాఁ గాన్పించినందున ప్రతిజ్ఞాభంగ మని యూర్వశి వెడలిపోయెను. అంత రాజు మిగుల శోకింప ఊర్వశి మరలఁ గానిపించి గర్భవతినై, మరల వచ్చెద నని వెళ్లి ఆయు వను కుమారునిఁ గనియె. సంవత్సరమునకు వచ్చి రాజునకుఁ గాన్పించి 'గంధర్వుల యాజ్ఞ లేనిది నేను నీకడ నుండరాదు' అని చెప్పఁగా నాతఁడు గంధర్వులను వేఁడెను. వారు ఊర్వశిని బోలి యున్న యగ్నిస్థాలి యను స్త్రీ నిచ్చి వెళ్లిరి. ఆమెయే యూర్వశి యని కొన్నినాళ్లు గడపి పిదప మోసమును దెలిసికొని యామెను విడిచి రాజధానికిఁ బోయెను. చివరకు త్రేతాయుగమునందు నా యగ్నిస్థాలితో త్రేతాగ్నులను త్రేర్చి, అనేకయాగములను చేయఁగా నింద్రాదు లతనికిఁ బ్రసన్నులై యూర్వశి నిచ్చిరి. వారు సుఖంబున నుండి పెక్కుపుత్త్రులఁ గని చంద్రవంశాభివృద్ధిం జేసిరి (అ. ౫).

కావ్యముల యోగ్యత :— అబ్బయామాత్యుఁడు ప్రౌఢకవి. పద్యములు సాధారణముగ శబ్దాలంకారభూయిష్ఠములుగను, సంస్కృత పద సమాసజటిలములుగను ఉండును. వసుచరిత్రకారుని ననుసరింప వలయు నని పాటుపడినవారిలో నితఁడు ప్రముఖుఁ డని చెప్పవలెను. అనిరుద్ధచరిత్రమునందేమి, కవిరాజమనోరంజనమునందేమి వసుచరిత్రలోని పద్యములవంటిపద్యములు పెక్కులు గుప్పించినాఁడు. మొదట వ్రాసిన యనిరుద్ధచరిత్రమునకంటె దరువాత వ్రాసిన కవిరాజమనోరంజన మెక్కుడు ప్రౌఢముగ నుండును. కావున దీనికి మన వారు 'పిల్లవసుచరిత్ర' మని పేరు పెట్టిరి. ముఖ్యముగ నింపలి వర్ణనాత్మకములైన సీసపద్యము లెన్నియో శైలియందును అర్థమునందును వసుచరిత్రమునందలి సీసపద్యములను బోలియున్నవి. అనిరుద్ధచరిత్రమునందును ఇట్టి సీసపద్యములు కొన్ని కలవు. కాని వసుచరిత్రముయొక్క యోగ్యత యీ గ్రంథముల కెన్నఁటికిని రాఁజాలదు. మూలమందలిపద్యములకును ఇందలియనుసృతులకును పురుషునకు, నాతని పటమునకును గల భేద మున్న దని చెప్పవచ్చును. మూలము మూలమే. యనుసృతి యనుసృతియే. ఉదాహరణమునకై... ఒకటి అనిరుద్ధచరిత్రమునమండియు, రెండవది పురూరవశ్చరిత్రమునమండియు, నిట్లు రెండుపద్యముల నిచ్చుచున్నాము :—

సీ. కొమ్మవాతెరతోడఁ గుణమ్ముఁ గైకొన వచ్చి
    కఠినవిద్రుమము చేకట్లఁబడియెఁ
గోమలియధరంబుతో మొన ల్పచరించి
    యరుచిబింబఫలమ్ము లవిసిపడియె
మృగనేత్ర పెదవితో సొగసుఁ బూనఁ గడంగి
    కెంపు నీరసముఁ జెక్కించుకొనియె
సతిమోవితో రసస్థితులు చూపి సుగంధ
    వికలబంధూక మూరకయె విరిసె
తే. డాయుపగడంబునకుఁ బగడంబు బింబ
మునకు బింబంబు మెఱయుకెంపునకుఁ గెంపు
బంధుజీవంబునకుఁ దాన బంధుజీవ
మౌర! యాకుంజరదనరదాంశుకంబు! [ వసు, ౨-౪౫.

సీ. కట్టడివగను జేకట్లకు లోనయ్యె
    విరసభావంబులై విద్రుమములు
ప్రత్యహంబును గళాభంగ మయ్యెను దామ
    సప్రకాశతమ నక్షత్రగణము
పగలు మించుట విదేశగతంబు లయ్యె రా
    జీవమానమున రథాంగకులము
కాక దెబ్బక తుది లోఁకువై పలుమాఱుఁ
    బ్రహరణంబులఁ జెందెఁ బసిఁడికమ్మి
రమణియధర నఖ స్తనాంగములతోడి
ప్రాతిపక్షికమున నివి భంగపడియె
వట్టియార్వేరమున బలవంతుతోడి
పాటికిఁ జెనఁగ బెల్ల నిష్ఫలము గాదె. [ అని., ౧-౮౯.

సీ. తరుణారుణకబళనోద్ధతిఁ జూపె నెవ్వాఁడు
    రుచులచే ఫలమోహరుచులచేత
నకలంకరామముద్రికఁ బూనె నెవ్వాఁడు
    శయముచే హృత్పుష్కశయముచేత
మున్నీరు పల్వలంబుగ దాఁటె నెవ్వాఁడు
    జవముచే గుణగణార్జవముచేత
నక్షశిక్షాప్రౌఢి నలరారె నెవ్వాఁడు
    గణముచే నియమధారణముచేత
తే. ధరణి నెవ్వాఁడు దానవద్విరదదళన
విహృతిఁ దనకేసరికిశోరవృత్తిఁ దెలిపె
నతని మక్కువ్యథవ్యావాగమృతఘటన
మంజులస్వాంతు హనుమంతు మదిఁ దలంతు. [ వసు., ౧-౮.

సీ. వాసుదేవఖ్యాతి వర్తిల్లె నెవ్వాఁడు
    భవముచే మూర్తిభవముచేత
నఘువిఖండనలీల నమరారె నెవ్వాఁడు
    శక్తిచేఁ జరణాంబుశక్తిచేతఁ

sampath_Ebooks

గాళింది గదిసి వేడ్కలు సల్పె నెవ్వాఁడు
రతులచే వనకేళిరతులచేత
గీతామృతవ్యాప్తిఁ గీల్కొల్పె నెవ్వాఁడు
నయముచేఁ దత్త్వనిర్ణయముచేతఁ
దెలిపె నెవ్వాఁడు కంసనూంసలమతంగ
భూహనవధాటిచేఁ బనపురుషసింహ
మూర్తివిస్ఫూర్తి యసమానకీర్తి యతఁడు
సంప్రాతార్తార్తి యాభీరచక్రవర్తి. [కవి., ౧-౪౨.

మూలముతోఁ బోల్చక విడిగఁ జూచినయెడల నితనిరెండు కావ్యములును కొంత యోగ్యత కలవి యని చెప్పవలెను. పూర్వకవులలో లేని క్రొత్తకల్పన లేమియు లేకపోయినను వర్ణనములు వచ్చినచోటఁ గవి విస్తరముగను కొంత సరసముగను వర్ణించును. అనిరుద్ధచరిత్రయందు ద్వారకాపురమును ఇరువదిరెండు పద్యములతోను (ఆ. ౧, ౫౩-౭౩), పురూరవశ్చరిత్రమునందు ప్రతిష్ఠానపురమును ముప్పదిమూఁడు పద్యములతోను (ఆ. ౧, ౫౩-౮౫) వర్ణించియున్నాఁడు. చిత్రలేఖ యందలిపటములను వ్రాసి నానిని వర్ణించుటలోఁ గవి ముప్పదిపద్యములు వ్రాసియున్నాఁడు (అని., ఆ. ౨, ౧౦౦-౧౩౦). అప్సరస్త్రీల యుద్యానవిహారము వర్ణించుటకు నలుపదిపద్యములు పట్టినవి (కవి., ఆ. ౪, ౬౬-౧౦౫). ఇట్లే వేలువేలు ఋతువులును, ప్రసంగములును వివరముగ వర్ణింపఁబడినవి.

ఎఱ్ఱాప్రెగడచే వ్రాయఁబడినహరివంశమందలి యుషాకథతోఁ గాని, నాచనసోముని ఇందుమతీపాఖ్యానముతోఁ గాని ఈ కవి యొక్క యనిరుద్ధచరిత్రమును పోల్చుటకు వీలు లేదు. ఎఱ్ఱాప్రెగడ కవిత్వము మిక్కిలి ప్రౌఢముగ లేకపోయినను సులభశైలిచేతను సహజశబ్దప్రవాహముచేతను, స్వాభావిక వర్ణనములచేతను హృదయాహ్లాదకరముగ నుండును. నాచనసోముని ప్రౌఢరచనాచమత్కారమును, అసమాన మగునర్థగౌరవ రసభావప్రదర్శనమును వేఱుగఁ జెప్పనక్కఱలేదు. బమ్మెరపోతరాజు కథనే భాగవతమున సంగ్రహముగ వ్రాసినాఁడు. వ్రాసినంతవఱకుఁ గథ రసము లొలుకుచున్నది. దానితోను అనిరుద్ధచరిత్రము సరిపోలదు. కావున నీ కథానకము మీఁదనే కవిత్వము చెప్పినమహాకవుల కావ్యముకంటె నీతనికవిత్వము తగ్గియుండునే కాని మించియుండదు. అంతమాత్రమున నీతనికవిత్వము మిక్కిలి నీరస మని చెప్పుటకు వీలు లేదు. ముఖ్యముగ రసికజనమనోరంజనము మహాకావ్యములలోఁ జేర్పఁదగిన దనియే చెప్పవలెను. వర్ణనములలోఁ గవి పూర్వకవులశబ్దార్థానుకరణము చాలభాగము చేసినను తన సొంతకల్పనలుగూడ నచ్చటచ్చటఁ జేర్చినాఁడు.

సంస్కృతపాండిత్యము :— ఈకవి సంస్కృతమును జక్కఁగ నభ్యసించిన ట్లతనికావ్యములే చెప్పుచున్నవి. ఈతఁడు నైషధాదికావ్యములను జదివినట్లు మనము కొన్ని దృష్టాంతములవలన నూహింపవచ్చును. శ్రీహర్షకృతనైషధమునందు నీ క్రిందిపద్యము కలదు:—

అయం దరిద్రో భవితేతి వైధసీం
లిపిం లలాటేఽర్థిజనస్య జాగ్రతీమ్,
మృషాం న చక్రేఽల్పితకల్పపాదపో
విధాయ దారిద్ర్యదరిద్రతాం నళః.[1] [౧. ౧౫.

దీనిం జూచి యబ్బయామాత్యుఁడు కవిరాజమనోరంజనమునందు నీ క్రిందిపద్యము వ్రాసియున్నాఁడు :—

మ. అయ ముర్ధి జన యంచు యాచకలలాటాంతస్థలిన్ బ్రహ్మని
ర్ణయతన్ వ్రాయ వహించునట్టిలిపియర్థంబుల్ విశేషాన్వయ
క్రియగా నర్థ మవారిగా నొసఁగి యర్థిం జేయు వాగీశు వ్రాఁ
తయు నాత్మీయవితీర్ణియు న్నిజముగా ధాత్రీశు నే ర్పట్టినో ?
[౧. ౯౭.

ఈతనికావ్యమునందు సంస్కృతపదములే యెక్కుడైనను కవి యచ్చటచ్చట శుద్ధాంధ్రపదములతోఁ గవిత్వము చెప్పియున్నాఁడు. ఉదాహరణము.—

సీ. పంటముత్తయిదువు గంటలమొలనూలు
పడమటిదొర యేలు నిడుదప్రోలు
మీఁదిమెలంతసామికిఁ జుట్టుకొల్లారు
రతనంపు సరకుతోరపు బిడారు
నేల్పుపాతరకత్తె బిడ్డనిచోరుబొక్క
కుండపుట్టునడోగి గొన్నకుక్క
కేడేఁటిసిరి కుబ్బరించుమ్రోఁతలప్రోవు
తిపసిరోసపుమంట దాఁచుతావు
బల్లిదపుఁ బోటియిల్లాండ్రయల్లిబిల్లి
మేర దప్పక నిలిచిన నీరువెల్లి
నిట్టనేరెడుదిబ్బకుఁ జుట్టువారు
తీరు చెన్నారు మున్నీరు తేఱవఁ గాంచి.
[కవి., ౪. ౬౭.

ఈకవి ప్రసంగానుసారముగ హిందూస్థానీపదములను జమత్కారముగ నుపయోగించియున్నాఁడు.

సీ. జతనంబుతోఁ దేటి సంచిణీహాసముఖి
స్నీదుముదారుగా నిగిడి నడువఁ
గలువలదొరచల్లగాలి వజీరులు
పూని రాస్తాను చపాను గొలువఁ

1. చ. ఇతఁడు దరిద్రుఁ డౌ ననుచు నేర్పడ నర్థిలలాటపట్టికన్, శతధృతి వ్రాసినట్టిలిపిజాల మనర్థము గానియట్లుగా
వితరణఖేలనావిభవ విభ్రమనిర్జితకల్పభూరుహుం, డతఁడు దరిద్రతాగుణమునందు దరిద్రుని జేయు నాతనిన్. [౧. ౫౭.

తెంపు మీఱువసంతసేవవాహాజూరున
 నుంచి చెలావణిపహానరు దెలుప
సెమ్మెఁ గోవెలనికానీదారుగములు క
 ర్నాచీప మారము ల్నాదు నేయ
సరణికావాలురంగు ఝుళ్ళాప్రుటములు
రహిగ నటియించుచిలుక హిరాకి సెక్కి
కెంజిగురుపైపు కేల నంకించుకొనుచు
మదనుపాదుశహా వండు గదలె నపుడు.

[అని., ఆ. ౩, ౧౯.

ఒక విశేషము :— తెలుఁగుకవులలో నీతఁడు అభ్యంతరరతిని విచ్చలవిడిగ వర్ణించియున్నాఁడు. అభ్యంతరరతి యనఁగా స్త్రీపురుషుల సంభోగవర్ణనము. పెద్దనాది ప్రబంధకవు లిట్టివర్ణనములు కావ్యములో నెక్కడనో యొకటిరెండుపద్యములతోఁ జెప్పి దాఁటించుకొనిపోయినారు. కాని యీకవి యిట్టివర్ణన మొక్కచోట మన్నఁ జాలదని కాఁబోలును తనకావ్యములోఁ బెక్కుచోట్లఁ జొప్పించినాఁడు. అనిరుద్ధచరిత్రమునందు నాలుగుసారులును, కవిరాజమనోరంజనమందు నైదుసారులును ఇట్టివర్ణనములు కలవు! యుక్తాలోచన వివాహమప్పు డొకసారి, ఉషకు స్వప్నము పడ్డప్పు డొక్కసారి, ఆమె సఖులతోఁ జెప్పుకొనునప్పు డొక్కసారి, నిజముగాఁ బతిని కలసినప్పు డొక్కసారి — యిట్లు వీలయినచోట నెల్ల మన్మథరతిని వర్ణించినాఁడు. నాయికానాయకులయొకదినమురతి వర్ణించి, తృప్తి నొందక ‘మఱియొక్కనాఁడు’ (౩. ౯౯) అని ఉపోద్ఘాతము చెప్పి తిరిగి యాక్రియను పదిపద్యములతోఁ జెప్పెను. ఇట్లే కవిరాజమనోరంజనంబునందు బుధునకు నిలాకన్యకకును, పురూరవసునకు నూర్వశికిని జరగిన సమాగమంబు వన్నెచిన్నెలతోఁ బెక్కుచోట్లఁ జిత్రించెను! ఇంతియకాదు. ఒకచోట ‘సామాన్యరతి’యు (అని. ఆ. ౩, ౭౫-౮౩), ఒకచోట ‘సమరతి’యు (కవి., ఆ. ౨, ౧౭౨-౧౭౪), ఒకచోట ‘ఉపరిరతి’యు (కవి., ఆ. ౫, ౨౪౩-౨౪౪), ఒకచోట ‘గర్భిణీరతిజనిత సౌఖ్యము’ను (అని., ఆ. ౩, ౧౦౨), ఒకచోట ‘ప్రసవితానంతరద్వితీయసమాగమాధిక్యసుఖము’ను (కవి., ఆ. ౨, ౧౯౧), ఒకచోట ‘సురతనాట్యసుఖము’ను (కవి., ఆ. ౪, ౧౩౯) – ఇట్లు విచ్చలవిడిగ సురతవర్ణనములు గుప్పివేసినాఁడు!

ఇట్లీకవి రతివర్ణనము హెచ్చుగఁ జేసినను సంస్కృతభూయిష్ఠముగఁ జెప్పియున్నాఁడు. అందువలన సామాన్యజనుల కాపద్యములు సాధారణముగ నర్థము కావు. అర్థమైనను కాకపోయినను ఇట్టివర్ణనములను ఇంతవిశేషముగఁ జేయుట కావ్యముయొక్క మర్యాదకు లోపమనియే చెప్పవలెను. ఇచ్చట నీవర్ణనములు ‘నీతి నతిక్రమించుచున్నవా? చట్టములకు లోఁబడునా?’ యన్న ప్రశ్నములను మేము విచారించుటలేదు. పూర్వకవియుఁ, బనగుంభనము కలవాఁడును అగుటచే నాభియము మనకవి కుండ దనుకొందము. కాని యిట్టివర్ణనములు కావ్యముయొక్క రసమాధుర్యమునకును, కల్పనాగాంభీర్యమునకును, భావసౌందర్యమునకును (Aesthetic beauty) తప్పక భంగము గలిగించు ననుటకు సందేహము లేదు. నాయికానాయకులను ఒక్కచోటికిఁ దెచ్చి యొక్కగదిలో విడిచినట్లు వర్ణించి యంతతో వర్ణనము చాలించి మిగిలినభాగము చదువరుల యూహకు వదలినఁ జాలదా? సచ్చిగఁ జెప్పినదానికంటెఁ ధ్వనిపూర్వకముగఁ దోఁచునట్లు చేయుట ప్రతిభావిశేషము కాదా?

ఈకవి భగవద్భక్తుఁడుగాఁ గానవచ్చుచున్నాఁడు. తన రెండు కావ్యములను నరాంకితము చేయక దేవాంకితము చేయుటయే కాక యిట్లు చెప్పుకొనియున్నాఁడు:

క. భగవంతుని సద్గుణములు
 పొగడువివేకంబె తమ కపూర్వైశ్వర్యం
 బగుట నరస్తుతి సేయరు
 జగతిన్ సత్కవులు తుచ్ఛసంపదకొఱకై. [అని., ౧-౧౭.

క. ధాతలకు ధాత భువన
 త్రాతలకున్ ద్రాత శౌరి దక్కఁగఁ దక్కన్
 దాతలదాత న్వేఁడిచి యి
 లాతలనేతల నుతింపఁ జాలాపునె మేలా? [కవి., ౧-౧౫.

ఇట్టి భగవద్భక్తుఁడుగూడ సురతవర్ణనములో నింత శ్రద్ధ వహించుట మిక్కిలి యాశ్చర్యముగ నున్నది!

(కో. వేం. ల.)

అబ్బాటి (౧౫౧౨ - ౭౧). — నికోలోడేల్ అబ్బాటి యని యితని పూర్ణమైనపేరు. ఇతఁడు ఇటలీదేశములోని మెదీనా నగరమున జన్మించి కోరెజ్జియోకడ విద్యాభ్యాసము చేసి ప్రసిద్ధికి వచ్చి చిత్రకారుఁ డయ్యెను. ఫాంటెనీ బ్లోమందిరము నలంకరించుట యందు ప్రైమాటిస్సియో యనువానికిఁ దోడ్పడియెను. ఇతఁడు అపోస్తలు లయిన పీటరు, పాలు అనువారిచిత్తరువులను చిత్రించెను.

**అబ్బాడీ** — ౧. ఈతని పూర్ణమైన పేరు ఆంటోయినీ థామ్సన్ డి అబ్బాడీ (౧౮౧౦ - ౯౭). ఇతఁ డొక ఫ్రెంచిపండితుఁడును, పరిశోధకుఁడునై యుండెను. ఇతఁడు డబ్లిన్ నగరమున జన్మించినవాఁ డయినను ఫ్రాన్సుదేశమునందే విద్య నభ్యసించెను.

౧౮౩౫-వ సంవత్సరమున ప్రకృతిశాస్త్రపరిషత్సభవా రొక పనిమీఁద నితనిని బ్రెజీలునకుఁ బంపిరి. ౧౮౩౭ మొదలుకొని ౧౮౪౮ వఱకు నబిసీనియాదేశమును బరిశోధించుపనిలో నుండెను. ఇతఁడు తరువాత ప్రకృతిశాస్త్రపరిషత్సభలో సభ్యుఁడుగ నియమింపఁబడెను. ఇతఁడు కల్వెన్ ప్రభువుతోఁగూడ ఆరగో పతకమును బహుమానము నొందెను. సాలునకు ౪,౦౦౦ ల ఫ్రాంకు లాదాయము వచ్చెడి అబ్బాడీ యను జమీ, ఏఁబదిసంవత్సరములలో ౫,౦౦,౦౦౦ ల నక్షత్రములఁ జూచి వారు ప్రకటించుపద్ధతిమీఁద, ప్రకృతిశాస్త్రపరిషత్తునకు

sampath_Ebooks

మరణశాసనముద్వారా వెల్లడించెను. ఇతఁడు ౧౮౯౦-వ సంవత్సరము వఱకును భూగోళ, ఖగోళశాస్త్రసంబంధము లయిన పెక్కు గ్రంథములను రచించెను.

౨. జేమ్సు అబ్బాడీ యని ఇతని పూర్ణమైన పేరు. ఇతఁడు ౧౬౫౭-వ సంవత్సర ప్రాంతమున బేరాన్ మండలమున నేయను గ్రామంబున జన్మించి ప్రఖ్యాతిగాంచిన ప్రొటస్టాంటుమతస్థుఁడు. ఇతని తల్లిదండ్రులు మిక్కిలి బీదవారగుటచేత స్నేహితుల ప్రాపునఁ జక్కనివిద్య నభ్యసించెను. సేడన్ పట్టణమున విద్య నభ్యసించి పదునేడవయేటనే పరమార్థవిద్య (ఈశ్వరవిషయకవిద్య) యందు డాక్టరు పట్టము నొంది మిక్కిలి ఖ్యాతి గాంచెను. ఇతఁడు బర్లిన్‌నగరమున కొన్ని సంవత్సరములు గడపినతరువాత ఫ్రెంచిప్రొటస్టాంటు చర్చిలో ప్రధానమతబోధకుఁడుగ నుండి ౧౬౮౮-వ సంవత్సరములో మార్షల్ స్కాంబర్గుతోఁగూడ నింగ్లాండునకుఁ బోయి లండనులోని శావాయ్ ఫ్రెంచిచర్చిలో ప్రధానమతబోధకుఁ డయ్యెను. విలియమ్ రాజునెడ మిక్కిలి ప్రేమానురాగములు గలవాఁ డగుటచేత ౧౬౮౮-వ సంవత్సరమున సంభవించిన విప్లవచరిత్రమునుగూర్చి కావలసిన యుపకరణములు రాజకీయ మంత్రులవలన సమకూర్చె నని చెప్పుదురు. ఐర్లాండులోని కిల్లాలో సురస్థానాధికారిగ రాజుచే నియమింపఁబడియెను. ఇతఁడు మహావక్తయు, శక్తియుక్తుఁడును, మహాబోధకుఁడునై యనేకమతగ్రంథములను విరచించి ౧౭౨౭-వ సంవత్సరమున లండననగరములో మృతి నొందెను.

**అబ్బాస్** — ౧. ఇతఁడు (౫౬౬ - ౬౫౨) మహమ్మదు యొక్క పినతండ్రి. బేదరుయుద్ధములో చెఱఁబట్టఁబడియెను. తరువాత మహమ్మదీయమతమునకు ముఖ్యసహాయుఁ డయ్యెను. ౭౫౦-వ సంవత్సరము మొదలుకొని ౧౨౫౮-వ సంవత్సరములో మంగోలు (మొగలు)లచే జయింపఁబడువఱకును పరిపాలనము చేసిన బాగ్దాదు ఖలీఫా లగు అబ్బాసువంశమునకు మూలపురుషుఁడుగ నుండెను.

౨. పారసీక (పరిషియా) దేశపు రాజులలో ఈపేరుగలవారిలో ఇతఁడే (౧౫౮౫ - ౧౬౨౮) మొదటివాఁడు. ఇతఁడు ప్రసిద్ధుఁ డగుటవలన నీతనిని 'అబ్బాస్ ది గ్రేటు' 'ఘనుఁడైన అబ్బాస్' అందురు. ఇతఁడు ౧౫౮౫-వ సంవత్సరమున సింహాసన మెక్కెను. ౧౫౯౭-వ సంవత్సరములో హీరాత్ నగరమున ఉజ్బేగు లనువారి నోడించెను. ౧౬౦౧-౯ సంవత్సరముల నడుమ ననేకపర్యాయములు తురుష్కుల నోడించెను. బ్రిటిషువారిసాహాయ్యముతో ౧౬౨౨-వ సంవత్సరములో ఆర్మజ్ నుండి పోర్చుగీసువారిని తఱిమివైచెను. ఇతనిరాష్ట్రము టైగ్రిసునది మొదలుకొని సింధునదిపర్యంతము వ్యాపించియుండెను. ఇస్పహానుపట్టణమును రాజధానిగఁ జేసికొని రాజ్యతంత్రమునందు ముఖ్యము లయిన సంస్కారములను పెక్కింటిని గావించెను.

౩. పారసీకదేశపు శాహ (చక్రవర్తి) (౧౬౪౨ - ౧౬౬౬). ౧౬౩౦ లో జన్మించెను. ప్రజలకు ననుకూలముగ రాజ్యము చేసెను. ఇతని రాజ్యకాలమున ప్రజలు ధనసంపన్నులయిరి. ఇతఁడు కంధహారును వశపఱచుకొనెను. కాని మొగలులు తిరిగి తీసికొనిరి.

౪. పారసీకదేశపుశాహ (చక్రవర్తి) (౧౭౩౨ - ౧౭౩౬). ఇతఁ డెనిమిదినెలల బాలుఁడుగా నున్నపుడు రాజ్యమునకు వచ్చెను. ఆదేశములమీఁద రాజ్యముచేసిన సాఫీవంశములోని చివరవాఁడు.

అబ్బాస్ పాషా (౧౮౧౩ - ౧౮౫౪) — మహమ్మద్ పాషాయొక్క మనుమఁడు. ౧౮౪౮-వ సంవత్సరములో ఈజిప్టునకు రాజప్రతినిధిగ ఇబ్రాహిమ్‌పాషాకు తరువాత నేర్పడియెను. ఇతని ప్రభుత్వము అభివృద్ధి లేనిదిగను, నష్టకర మైనదిగ నుండెను.

అబ్బాస్ బిన్ అలీ షెర్వానీ — అక్బరుకాలమున నుండినచరిత్రకారుఁడు. ఇతఁడు షర్‌షాచరిత్రమును వ్రాసెను. షర్‌షా యనఁగా హుమాయూనును ౧౫౩౯ లో హిందూస్థానమునుండి వెడలఁగొట్టి ఢిల్లీరాజ్యము నాక్రమించినవాఁడు. ఈచరిత్రము అక్బరున కంకిత మీయఁబడినది.

అబ్బాస్ మీర్జా (౧౭౮౩ - ౧౮౩౩) — ఇతఁడు పారసీకదేశపు 'షా' అయిన ఫత్ అలీయొక్క కుమారుఁడును యువరాజునై యుండి ౧౮౧౧-౧౮౧౩ సంవత్సరములలోను ౧౮౨౬-వ సంవత్సరములోను జరగిన రష్యనుల దండయాత్రలలో పారసీకసైన్యమున కధిపతిగా నుండి కకాసియారాష్ట్రములను గోలుపోయెను కాని ౧౮౨౮-వ సంవత్సరములో జరగినయొడంబడికలో నీతఁడు 'షా' గా నుండుట కంగీకరింపఁబడియెను.

**అబ్బాస్‌వంశము** — ఈవంశజులు ఒమ్మియాదు వంశమువారితరువాత నరేబియన్ (మహమ్మదీయ) సామ్రాజ్యమును క్రీ. శ. ౭౫౦ మొదలు ౧౨౫౮ వఱకును బరిపాలించిన 'ఖలీఫా' లనఁబడు మహమ్మదీయమతాచార్యులు. వీరివంశమునకు మూలపురుషుఁడు మహమ్మదీయమతసంస్థాపకుఁ డగు మహమ్మదునకుఁ బినతండ్రియు, సహకారియునైన అబ్బాసు. వీరికి పూర్వ మాపీఠముమీఁద ఒమ్మియాదు లనువారు ౬౬౧ మొదలు ౭౫౦ వఱకును ఖలీఫాలుగా నుండిరి. వారిని వెడలఁగొట్టి మహమ్మదుయొక్క వంశములోని వారైన అబ్బాసులు పీఠము నాక్రమించుకొనవలయు నని యత్నము చేయుచుండిరి. అబ్బాసునొద్దనుండి నాల్గవతరమువాఁ డగు (మునిమనుమఁడు) అబుల్ అబ్బాసు అనునతఁడు అబు ముసిలిమ్‌ను సేనానాయకునిసాహాయ్యమున ఒమ్మియాదువంశజుఁ డగు రెండవ మెర్వాన్ అనువానిని జాబ్‌నదీప్రాంతమున నోడించి, రాజ్యమంతయు నాక్రమించుకొని ఖలీఫాపీఠము నెక్కెను. అప్పటినుండియు వాని

sampath_Ebooks

సంతతివారే మహమ్మదీయరాష్ట్రము నైదునందల సంవత్సరములకంటె నెక్కువకాలము పరిపాలించి మహోన్నతఖ్యాతిని బడసిరి.

వీరిలో నీవంశస్థాపకుఁ డగు అబుల్ అబ్బాసు నాలుగుసంవత్సరములు మాత్రమే రాజ్య మొనర్చెను. ఈకొలఁది కాలములోనే అనేక క్రూరకృత్యముల నొనర్చి మహాక్రూరుఁ డని యపఖ్యాతిఁ గాంచెను. ఇతఁ డొమ్మియాదువంశమును నిర్మూలముచేయఁ గంకణము కట్టుకొనినను అబ్దుల్ రహిమా నను నతఁ డొక్కఁడుమాత్రమే వీనిబారినుండి తప్పించుకొని పోయి స్పెయినుదేశము నాక్రమించుకొనెను. ఇట్లే ఆఫ్రికాదేశముకూడ నించుమించుగ స్వాతంత్ర్యము వహించి వలస పోయెను. ఇతనితరువాత నితనితమ్ముఁడు మన్సూ రనునతఁడు పట్టము గట్టుకొని యనేకయుద్ధములందు జయ మొంది విజయుఁ డను సార్థకబిరుదము గడించెను. ఇతఁడు ౭౬౨ - వ సంవత్సరమున బాగ్దాదుపట్టణమును పట్టణరాజములలో నిరుపమానముగా నిర్మించి దానిని ముఖ్యపట్టణముగా నేర్పఱచుకొనెను. ఇతఁడు క్రీ. శ. ౭౭౫ లో మృతినొందఁగా నతనికుమారుఁడు మహదీ యనునతఁడు రాజ్యమునకు వచ్చి పాశ్చాత్యరోమనుచక్రవర్తిని యగు ఐరినితో యుద్ధ మొనర్చి జయ మొంది ఆమె కప్పము గట్టునట్లు సంధిచేసికొనియెను. మఱియు మక్కా, మదీనా, జెరూసలేము మున్నగు పట్టణములలో నుండు మసీదుల బాగుపఱచి అనేకసత్రముల నితరసౌకర్యములను గుదిర్చి ఖ్యాతిని బడసెను. క్రీ. శ. ౭౮౫ లో నితనికుమారుఁడు హాదీ అను నతఁడు రాజ్యమునకు వచ్చి ౧౫ నెలలలోపలనే చంపఁబడెను. అతని యనంతర మతని తమ్ముఁడగు హారూన్-అల్-రషీద్ అను మహాపురుషుఁడు సింహాసన మధిష్ఠించి ౨౩ వత్సరములు ( ౭౮౬ - ౮౦౯ ) మహావైభవముతో రాజ్యమును బాలించి తనవంశపుఖ్యాతిని దిగంతముల వ్యాపింపఁజేసెను.

ఇతఁడే అరేబియన్‌రాత్రులను గ్రంథమునకు కథానాయకుఁడు. ఇతఁడు పండితులను, కవులను, గాయకులను, శాస్త్రజ్ఞులను సభకు రావించి వారి కుచితసత్కారము లొనర్చి బహూకరించి వారి పాలిటి కల్పవృక్షమై లోకమునకు హితకారి యయ్యెను. ఇతనికాలములో చక్కనిపట్టణంబులు పెక్కులు నిర్మింపఁబడెను. ఇతఁడు ప్రజలను బిడ్డలవలె పోషించి వారిచే నధికముగఁ బ్రేమింపఁబడుచుండెను. ౮౦౨ - వ సంవత్సరమున పాశ్చాత్యరోమను చక్రవర్తి నిసిఫోరసు కప్పము గట్టుట మానినందున నతనిపై దండయాత్ర వెడలి జయశాలి యయ్యెను. ఇతనిపరిపాలనంబున మహమ్మదీయవిఖ్యాతి అత్యున్నతదశను జెందెను. అందువలన నితనికీర్తి వేనోళ్లఁ జాటఁబడుచుండును. కాని దానియందు కళంక మొకింత లేకపోలేదు. తనకును, తనపూర్వులకును రాజ్యపరిపాలనంబున సాహాయ్యభూతమైన బార్మెసైదులవంశము నిర్మూలనము అన్యథా స్వచ్ఛమైన యితనికీర్తిని కళంకితముగ నొనర్చుచున్నది. ఈతని కుమారులలో నంతఃకలహము లుప్పతిల్ల మమూ నను నతఁడు తనయగ్రజు నమీనుని ద్రుంచి ౮౧౩-వ సంవత్సరమున పట్టము గట్టుకొని ౨౧ సంవత్సరములు రాజ్య మేలెను. మొదట నితఁడు అలీవంశస్థులమూలమున ననేక కష్టములకు పాలై తుదకు విజయియై తనతండ్రివలె పండితాభిమాని యై ప్రఖ్యాతి గాంచెను. ఇతనికాలములో గ్రంథాలయములు పెక్కులు స్థాపింపఁబడినవి. జ్యోతిషము, గణితము, వేదాంతము, భౌతికశాస్త్రములు, వైద్యము మొదలయిన విషయములను గుఱించిన పెక్కుశాస్త్రములు వ్రాయఁబడినవి. మఱియు గ్రంథములు సంస్కృతమునుండి భాషాంతరీకరింపఁబడినవి. ఇతని యనంతరము రాజ్యము విచ్ఛిన్నమై అంతరించుమార్గము పట్టెను.

ఇతనితరువాత నితని తమ్ముఁడు ముతాసిం అనునతఁడు రాజైస్వరక్షణమునకై తురుష్కసైన్యమును స్థాపించెను. ఈ సైన్యము రోమను ప్రిటోరియనుసేనవలె వృద్ధిఁ జెంది రాజ్యమున సర్వాధికారమును హరించి రాజులను నామమాత్రావశిష్టులుగఁ జేసెను. ఇతని కుమారుఁడు వాథిక్ అనునతఁడు ౫ వత్సరములు వైభవముతో రాజ్య మేలెను గాని తరువాతివా రందఱును తురుష్కసైనికులచేతులలో తోలుబొమ్మలగతి మెలఁగుచుండిరి. తుదకు కాహిర్ అనునతఁడు క్రీ. శ. ౯౩౨-లో అబ్దుల్ రజాకను తురుష్కసేనానికి అమీర్‌ఉమ్రా అను నున్నతపదవి నొసంగి యతనికి సర్వాధికారము వదలి నామమాత్రావశిష్టుఁడై యుండెను. అప్పటినుండియు నీ తురుష్కులు ప్రబలులై అబ్బాసైదువంశస్థులను పేర రాజ్య మేలుచుండిరి. వీరి పాలనమున ఖురాసాను, సిరియా మొదలగురాష్ట్రములు స్వతంత్రత వహించి విడిపోయెను. తుదకు బాగ్దాదుపట్టణముమాత్రమే అబ్బాసైదులవశమైయుండెను. ఇదియుఁగూడ ౧౨౫౮-వ సంవత్సరమున నంతరించెను. ఆ సంవత్సరమున హులా గను మంగోల్‌రాజు బాగ్దాదుపట్టణమును ముట్టడించి కాల్చివైచి ముతసిమ్ అను ప్రభువును ద్రుంచివైచెను.

ఇంతటితో అబ్బాసైదుల రాజ్యము నశించినను ఈజిప్టునందు మాత్ర మీ వంశస్థులు ౩౦౦ల వత్సరములు పేరునకుమాత్రము రాజులైయుండిరి. వీరిలో కడపటివాఁ డగు మూఁడవ ముతవక్కిలు తురుష్కవంశస్థుఁ డగు సుల్తాను సలీముచే నోడింపఁబడి కాన్‌స్టాంటినోపిలునకు బందిగాఁ గొంపోవఁబడి తుదకు ౧౫౩౮-వ సంవత్సరమున కైరోపట్టణమున మృతి నొందెను.

బాగ్దాదుపట్టణమున రాజ్యము చేసిన యీ వంశపురాజులు మొత్తముమీఁద ౩౭ గురు. వారిపేళ్లు, రాజ్యకాలము నీ క్రింద నీయఁబడుచున్నవి. వీరిపేళ్లకు ముందు 'అల్' అను గౌరవార్థపదము నుంచెదరు.

౧. అబుల్ అబ్బాస్ అల్‌సఫా ( ౭౫౦ - ౭౫౪ )
౨. మన్సూర్ ( ౭౫౪ - ౭౭౫ )
౩. మహదీ ( ౭౭౫ - ౭౮౫ )
౪. హాదీ ( ౭౮౫ - ౭౮౬ )
౫. హారూన్ - అల్ - రషీద్ ( ౭౮౬ - ౮౦౯ )

౬. అమీన్ (౮౦౯ - ౮౧౩)
౭. మమూన్ (౮౧౩ - ౮౩౩)
౮. ముతాసిం (౮౩౩ - ౮౪౨)
౯. వాథిక్ (౮౪౨ - ౮౪౬)
౧౦. ముతవక్కి - ల - లల్లా (౮౪౬ - ౮౬౧)
౧౧. ముస్తసిర్ (౮౬౧ - ౮౬౨)
౧౨. ముస్తయీన్ బిల్లా (౮౬౨ - ౮౬౬)
౧౩. ముతజ్ (౮౬౬ - ౮౬౯)
౧౪. ముహ్తదీబిల్లా (౮౬౯ - ౮౭౦)
౧౫. ముతమిదలల్లా (౮౭౦ - ౮౯౨)
౧౬. ముతదిద్ (౮౯౨ - ౯౦౨)
౧౭. ముక్తఫీ (౯౦౨ - ౯౦౮)
౧౮. ముక్తదిర్ బిల్లా (౯౦౮ - ౯౩౨)
౧౯. కాహిర్ (౯౩౨ - ౯౩౪)
౨౦. రాజీబిల్లా (౯౩౪ - ౯౪౦)
౨౧. ముత్తకీబిల్లా (౯౪౦ - ౯౪౪.)
౨౨. ముస్తక్ఫీ బిల్లా (౯౪౫ - ౯౪౬)
౨౩. ముటీబిల్లా (౯౪౬ - ౯౭౪)
౨౪. టాయిలి అమ్రిల్లా (౯౭౪ - ౯౯౧)
౨౫. కాదిర్ బిల్లా (౯౯౧ - ౧౦౩౧)
౨౬. కాయిం - బి - అమ్రిల్లా (౧౦౩౧ - ౧౦౭౫)
౨౭. ముక్తదీ - బి - అమ్రిల్లా (౧౦౭౫ - ౧౦౯౪)
౨౮. ముస్తజ్హిర్ బిల్లా (౧౦౯౪ - ౧౧౧౮)
౨౯. ముస్తర్షిద్ బిల్లా (౧౧౧౮ - ౧౧౩౫)
౩౦. రాషిద్ బిల్లా (౧౧౩౫ - ౧౧౩౬)
౩౧. ముక్తఫీ - లి - అమ్రిల్లా (౧౧౩౬ - ౧౧౬౦)
౩౨. ముస్తన్జిద్ బిల్లా (౧౧౬౦ - ౧౧౭౦)
౩౩. ముస్తదీ - బి - అమ్రిల్లా (౧౧౭౦ - ౧౧౮౦)
౩౪. నాసిర్ - లి - దీనిల్లా (౧౧౮౦ - ౧౨౨౫)
౩౫. జాహిర్ - బి - అమ్రిల్లా (౧౨౨౫ - ౧౨౨౬)
౩౬. ముస్తన్సిర్ బిల్లా (౧౨౨౬ - ౧౨౪౨)
౩౭. ముతసింబిల్లా (౧౨౪౨ - ౧౨౫౮)

**అబ్బాసీబందర్** — ఈరాన్ దేశమునందలి ఒకరేవు పట్టణము. మొదట దీనికి గోంబ్రూన్ అని పేరు. ౧౬౧౪-వ సంవత్సరమున మొదటి అబ్బాసు ఆకాలమున నచట నుండిన పోర్చుగీసువారిని పాఱఁద్రోలి దీనిని వశపఱుచుకొనెను. అటుపై నతనిపేరను దానికి అబ్బాసీబందర్ అనుపేరు వచ్చినది. ఇంగ్లీషువారు, ఫ్రెంచివారు మున్నగు యూరోపియను లిచట వ్యాపారమునకై తగవు లాడుకొనుచుండువారు. ప్రస్తుతకాలమునఁగూడ ఇందు వ్యాపారము బాగుగా సాగుచున్నది. దీని జనసంఖ్య ౧౦,౦౦౦.

**అబ్రహాము** — 'దేవునిస్నేహితుఁ' డనియు, 'భక్తజనకుఁ' డనియు నాధిక్యబిరుదములతో యూదు (Jews) ప్రపంచమునను, క్రైస్తవసంఘమునను బ్రఖ్యాతుఁ డగు నబ్రహాము క్రీస్తునకుముందు ౧౯౯౬-వ సంవత్సరమునుండి ౧౭౫ వఱకు జీవించిన మహాసిద్ధపురుషుఁడు. ఈతఁడు హీబ్రూవంశస్థాపకుఁడును యేసుక్రీస్తు వంశావళిమూలకర్తయు నైయున్నాఁడు.

బైబిలునకుఁ జాలసంవత్సరములకు వెనుక వ్రాయఁబడిన ఖురానునందును నబ్రహాముచరిత్రము కనఁబడును. అయితే బైబిలులో మోసెస్ వ్రాసినచరిత్రాంశములే యీభక్తశిఖామణిచరిత్రమునకు ముఖ్యాధారములు.

అబ్రహాముతండ్రి తెరహు. ఇతఁడు షేముగోత్రీయుఁడు. ఈతఁడు యూఫ్రటీస్ నదీపరిసరమునందలి యుర్ గ్రామనివాసి యై విగ్రహారాధనాతత్పరుఁ డైయుండెను. కథానాయకుఁడు గాక యతనికి నాహోరు, హరన్ అను మఱియిద్దఱు కొమాళ్లుండిరి. ఆకాలమున నాదేశ మంతయుఁ బ్రతిమార్చనమున మునిఁగియుండెను. ఒక్క అబ్రహాముమాత్ర మేకదైవారాధనుఁడై యీశ్వరునితో ననుసంధానము చేయుచుండెను. తెరహు సకుటుంబపరివారముగా నుర్ విడచి మెసెపొటేమియాలోని హరన్ పురమునకుఁ జని యచ్చట నివాస ముండి వెనుకను పరమపద మందెను. అబ్రహాము సరై యను కన్యను వివాహ మాడియుండెను. హరన్ కుమారుఁడగు లాటు నతనితో నుండెను.

ఈస్థలమున నబ్రహాముయొక్క భక్తికళిక ప్రజ్వరిల్లినది. అప్పు డాయనకు భగవంతునితోఁ గల సంధానరహస్యమును విచారించినయెడల, నబ్రహాము సమాధి సాధించుచు నావేశపరవశుఁ డగుచుండె నని యనుభవజ్ఞులు గ్రహింపఁగలరు. ఏల యన బైబిలులోని ఆదికాండము (౧౨. ౫) లో దైవవాక్యము లబ్రహామునకు వినఁబడి 'యోయీ భక్తా! నీవు లేచి కెనయానుదేశమునకు వెళ్లుము; నిన్ను గొప్ప జనాంగసంస్థాపకునిఁ జేసెదను. నీవంశమూలకమున సర్వలోకకుటుంబము లాశీర్వాదపాత్రము లగు' నని చెప్పినట్టు వివరింపఁబడియున్నది. ఆదేశాచారప్రకార మబ్రహా మప్పుడు డేరాలు వేసి నివసించుచుండెను. దాసదాసీజనంబులు, పశుగణములు విశేషముగ నుండెను. ఒకచో నివాస ముండినవెనుక నొక సంసారము లేవఁదీసికొని సంగతి సంపర్కము తెలియఁగనివిదేశయాత్రను జేయ నెవ్వరికి సులభసాధ్య మగును? అయితే అబ్రహామునకుమాత్రము తానాస్థలము విడువవలె నని సమాధిలో దేవదర్శనమునఁ దెలియుటతోడనే దైవాజ్ఞను శిరసావహించుచు, వెంటనే తా నెఱుఁగనిదేశమునకుఁ బ్రయాణోన్ముఖుఁడై షెకీ మని యప్పు డెఱుఁగఁబడినస్థలమున డేరా వేసెను. తిరుగ భగవంతుఁ డాతనికిఁ బ్రత్యక్షమై, వానికి వాగ్దానము చేయఁబడినదేశ మదియే యని తెలియఁజేసెను.

sampath_Ebooks

కొన్నాళ్లయినవెనుక, నేకారణముననో అబ్రహాము బెతెల్, అయి యనుస్థలములమధ్య నివాస ముండ నొక గొప్పకాటక మాదేశమున వ్యాపించెను. అబ్రహా మప్పు డాఫ్రికాఖండమునకుఁ జనెను. అతనిభార్య రూపరేఖావిలాసములచేత వెలయుచున్నందున నల్ల నిరూపముగల యాదేశస్థు లావనితారత్నముయొక్క సౌందర్యాతిశయములను ఫరవారాజునెదుటఁ బొగడిరి. అబ్రహా మామె హరింపఁబడి, తాను విగతప్రాణుఁడుగాఁ జేయఁబడు నమభయమున వార లుభయులకును గల యింకొకవరుసప్రకారము సరై యతనికి సోదరి యగు నని యామె ఫరవాతోఁ జెప్పవలె ననెను. రాజాజ్ఞఁ బూని యబ్రహాము సరైను ఫరవానగరికిఁ బంపవలసివచ్చెను. ఆనృపవరుఁడు వారివరుస విని, సోదరి యైనయొడల నతఁ డామెను వివాహ మాడ నిశ్చయించి యబ్రహామున కమూల్యములగు వెండి బంగారులను దాస దాసీజనంబులను పశ్వాదుల నిచ్చెను. అయితే ఆమె యతనిప్రాణ నాయకి యని రాజు గ్రహించినప్పుడు భయపడి తా నిచ్చినసొమ్ములను దీసికొనక యబ్రహామును, సరైను దారిఁబట్టించెను. కావున వారు ధనసమృద్ధితో స్వదేశమును జేరిరి.

అబ్రహామును లాటును నింతవఱకు సమష్టిగా నుండిరి; కాని వారిపరివారములు హెచ్చి సేవకజనంబులలో ద్వంద్వములు పుట్టినందున విభక్తులు కావలసినవారైరి. లాటు దూరవిచారము సేయక దుర్మార్గులతో నిండియుండిన సొడోమ్, గొమొర్రా ప్రాంతముల నివాసముగ నేర్పఱచుకొని యాదుండగీంద్రమధ్య నివాస ముండెను. అబ్రహాము హెబ్రోనుమైదానమున నిలిచెను. కొన్నిదినములవెనుక ఏలము దేశపురాజగు కెదర్లామె రనునాతఁడు సొడోమ్‌పై దండెత్తి కొల్లధనముతో లాటును నతనికిఁగల యావదాస్తిని చెఱగాఁ గొంపోయెను. అబ్రహాముకడ నప్పుడు యుద్ధశిక్షలో నారితేరిన ౩౧౮ గురు సైనికు లుండిరి. వారితో నాతఁ డారాజుపైఁ బడి వాని నెదిరించి తమ్ముని విడిపించుకొని వచ్చెను. వెనుక సొడోమ్, గొమొర్రాపట్టణములు నాశము చేయఁబడెను. ఆసందర్భమున అబ్రహాము భగవంతునితో ముఖాముఖిగా సంభాషించెను. ఒకనాఁ డబ్రహాము తనకు సంతాన మను గ్రహింపవలె నని దేవుని వేఁడుకొని యొకమతకర్మముద్వారా వాగ్దానము వడసెను. సమయోచితవరముల నిడుభగవంతుఁడు పదేండ్లవఱకును నావృద్ధదంపతులకు సంతానసౌఖ్య మనుగ్రహింపమి భార్యయొక్క బలవంతముచే నబ్రహాము హగ రనుదాసీని బరిగ్రహించి యిష్మాయి లను కుమారునిఁ గాంచెను. అయితే యతఁడు ఈశ్వర వాగ్దత్తపుత్రుఁడు కాఁడు. దేవుఁ డింకొకపర్యాయ మబ్రహామునకు దర్శన మిచ్చి సరైద్వారా అతనికిఁ గులదీపకుఁ డగు నందనుఁడు జన్మించు నని వాగ్దానము దృఢపఱుపఁగా దైవపరిమాణకాలమున ఈజా కనుసుతుఁడు వారికి జన్మించెను. ఈచిన్నవాఁడు కొంచెము పెద్దవాఁడు కాఁగానే వానిని బలిగా నియ్యవలె నని భగవంతుఁ డబ్రహామున కాజ్ఞాపించెను. ఆకుమారుని సమర్పించినను దేవుఁడు తన వాగ్దానమును నిలుపఁగలఁ డనువిశ్వాసముతో నాభక్తాగ్రేసరుఁ డాబుడు తని యజ్ఞవేదిపై బలియియ్యఁబోవుచుండఁగా నొకదూత యాతనికి నడ్డు వచ్చి బలి యియ్యకుండ నాఁపెను. దైవాజ్ఞను శిరసావహించిన యీయసిధారావ్రతచర్యయే యాభక్తునివిశ్వాసమును నాచంద్రార్క సౌరభముతో నింపుచున్నది. సరైమరణానంతరము, అబ్రహాము కెతురా యనుస్త్రీని వివాహ మాడి ౬ గురు పిల్లలను గనెను. ఈజాకు వివాహ మాడి యిద్దఱుకొమాళ్లను గనినంతవఱకు నబ్రహాము జీవించి ౧౭౫ సంవత్సరముల ప్రాంతమున బంధవిముక్తుఁడై తాను చిరకాల మపేక్షించియున్న శాశ్వతపరమపదవి నందెను. ఈయబ్రహాము వంశమునందే యేసుక్రీస్తు మూర్తీభవించుటచేఁ గ్రైస్తవప్రపంచ మంతయు నబ్రహామునకుఁ జేయఁబడిన వాగ్దానఫల మని నమ్మఁబడుచున్నది. [జా. చా.]

**అబ్సలన్** (లేక ఆక్సెల్) (౧౧౨౮-౧౨౦౧)—ఇతఁడు డెన్మార్కు దేశపు ఆర్చిబిషప్పు. ౧౧౨౮ ప్రాంతమున జన్మించెను. ౧౧౫౭-వ సంవత్సరము మొదలుకొని డెన్మార్కురాష్ట్రమును బలపఱచుటకై వాల్డెమర్ రాజునకు మిక్కిలి సామర్థ్యముతోఁ దోడ్పడియెను. అన్యమతస్థు లయిన వెండులతోడి పోరాటములో నధికముగాఁ బ్రవేశము కలిగించుకొనియెను. తరువాత రాస్కిల్డెకు బిషప్పును, 'లండ్'నకు ఆర్చిబిషప్పును అయ్యెను. ౧౧౭౮న వాల్డెమర్ రాజు మరణమును జెందినతరువాత ౧౧౮౨న అబ్సలన్ యొక్క అధికారము మిక్కిలి విజృంభించియుండుటచేత పడుచువాఁడైన కెన్యూట్ రాజునకు పొమెరేనియనులకాపరశముతోడి పోరాటమునం దుపయోగకారిగ నుండెను (౧౧౮౪). డెన్మార్కు దేశమునందు జన్మించిన మతగురువులలోనేమి, రాజ్యతంత్రజ్ఞులలోనేమి అబ్సలను మిక్కిలి గొప్పవాఁడుగ నుండెను. ఇతఁడు పండితుఁ డగుటవలన తనగొప్పచరిత్రమును వ్రాయుటకుఁ గావలసినయుపకరణములను తన వ్రాయసకాఁ డయిన సాక్సోగ్రామాటికస్సునకు నొసంగెను.

**అభయగిరి** — సింహళమునం దనురాధపురమునొద్ద నుండిన బౌద్ధవిహారము. ఇది అభయుఁ డనురాజుచే బుద్ధునియస్థులపై మిక్కిలి యెత్తుగఁ గట్టఁబడియెను. ఈవిహారమం దుండెడి భిక్షువులకును, మహావిహార మని పేరొందినమఠమొక విహారమునం దుండెడి భిక్షువులకును అభిప్రాయభేదములు గలిగి బౌద్ధమతమునందుఁ గొన్ని సిద్ధాంతభేదము లేర్పడెను. ఈ విహార మిప్పుడు వినాశముఁ జెంది, చూడఁబోవువారికిఁ దనపూర్వవైభవమును సూచించుచుండును.

**అభయదేవసూరి** — శ్వేతాంబరులతెగకుఁ జెందిన గొప్పజైనసైయాయికుఁడు; రాజగచ్ఛమునకుఁ జెందిన ప్రద్యుమ్న సూరిశిష్యుఁడు; అతనితరువాతను గురువయినవాఁడు. ఇతఁడు వాదమహార్ణవమను 'న్యాయ' గ్రంథమును, సమ్మతితర్కసూత్రమునకు 'తత్త్వార్థబోధవిధాయిని' యను వ్యాఖ్యానమును రచియించెను. ఇతనికిఁ బిదప ముంజరాజునకు సమకాలికుఁ డయిన జినేశ్వరసూరి గురు వయ్యెను.

**అభయవర్షము** — ప్లక్షద్వీపమందలి ఏడవవర్షము.

**అభయసింగు** — ౧౬, ౧౭ శతాబ్దులలో రాయగఢ సంస్థానము నేలిన అమరసింగుకుమారుఁడు. జయపూరురాజగు జయసింహుఁడు తనదేశమును ముట్టడించినప్పు డమరసింగు అతనికి తొమ్మిది లక్షలరూపాయ లిచ్చుట కొప్పుకొనెను. అందు మూఁడులక్షలకు తన కొడుకగు నీయభయసింగును జామీనుపెట్టెను. తరువాత నీబాకియెట్లో వదలిపోయినది కాని, కొలఁదిరోజులలోనే యభయసింగు సేవకుఁడే యొకఁడు తనయజమానుని జంపివైచెను.

**అభయసింహుఁడు** — ౧. ఉదయపురపురాజు (౧౫౫౯ - ౧౬౨౧). విఖ్యాతిఁ జెందిన ప్రతాపసింహుని జ్యేష్ఠపుత్త్రుఁడు. ఈతనికి ఉమరావ్‌సింగ్, అమరసింగ్ అనునామాంతరములు గలవు. ఈతఁడు బాల్యమునఁ దండ్రితోఁ దిరుగుచు కష్టములనుభవించుట కలవడినను తండ్రిమరణానంతరము సోమరియై వినోదములతో కాలక్షేపము చేయుచుండెను. కాని కొలఁదికాలములోనే తనతండ్రిమిత్త్రుఁడును, వీరాగ్రేసరుఁడును అగు సాలుంబ్రాధిపతి యగు ఠాకుర్ చేసినయొకసాహసకృత్యమువలన తనవడవడిని దిద్దుకొని ఢిల్లీశ్వరునిసైన్యములతో యుద్ధము చేయ నిశ్చయించెను. క్రీ. శ. ౧౬౦౭ లో ఠాకూర్ మొదలుగాఁ గల వీరులసమాజమును వెంటఁబెట్టుకొని దివేర్‌పట్టణమును బోయి విడిసెను. ఖానఖానన్ అను ఢిల్లీశ్వరుని మంత్రియొక్క తమ్ముఁ డయిన అబ్దుల్లా యనువానితో నక్కడ యుద్ధమును జేసి తురుష్కులను బూర్తిగ నోడించెను. అప్పుడు జహాంగీరుపాదుషాహ ఢిల్లీచక్రవర్తిగ నుండెను. ఈ యుద్ధములో నోడిపోయినందున పాదుషాహ రాణాతో కొన్ని దినములవఱకు నుండునట్టిసంధి చేసికొనెను. కాని పాదుషాహ యాసంధినిఁ బాటింపక అబ్దుల్లాఖానునిసైన్యాధిపత్యము క్రింద బ్రహ్మాండమైన సైన్యమును మేవాడమీఁదికిఁ బంపెను. ౧౬౧౦-వ సంవత్సరపు ఫాల్గునమాసములో రాణ్‌పుర్ వద్ద రాజపుత్త్రులకును, తురుష్కులకును ఘోరసంగ్రామము జరగెను. తురుష్కులే మరలఁ బరాభూతులయిరి. ఈ దిగ్విజయమువలన మేవాడకీర్తి హిందూదేశమందంతటను బ్రసరించెను.

చితోడ్‌గడమునుగుఱించినయభిమానమున రాజపుత్త్రులందఱును మేవాడరాజునకు సాయము చేయుచున్నా రనియు, అందుమూలమునఁ దమ కెల్లెడల, పరాజయములు గల్గుచున్న వనియుఁ దలంచి తురుష్కులు చితోడ్‌సింహాసనముపైని తమ కనుకూలుఁ డగు సంగరాజితుఁ డను రాజపుత్త్రుని కూర్చుండఁబెట్టిరి. ఇట్లు చేసినను రాజపుత్త్రులు మేవాడరాణాకే సహాయులుగా నుండి తురుష్కులకు నంకితుఁ డగుటచే సంగరాజితుని అనాయతోఁ జూడసాగిరి. సంగరాజితుఁడు కొలఁదికాలములో బుద్ధి దెచ్చుకొని, తనపూర్వుల జయపరాక్రమములను, తురుష్కుల దుష్కృత్యములను దలంచి ఒకనాఁ డభయసింహుని బిలిపించి యాతనికి చితోడ్‌గడ మొసంగి వెడలి పోయెను.

ఇట్లు అభయసింహునకుఁ దనపూర్వుల రాజధాని యగు చితోడ్‌గడము సులభముగఁ బ్రాప్తమయ్యెను. అనంతరము కోట సురక్షితముగాఁ దనచేతిలో నుండుటకై కోటచుట్టు నున్న యెనుబది పట్టణములను, నలుబది దుర్గములను గెలిచెను. ఇది చూచి సహింపఁజాలక పాదుషాహ తనకుమారుఁ డగు పర్వేజ్ అనువానికి సైన్యాధిపత్య మిచ్చి క్రీ. శ. ౧౬౧౧ లో గొప్పసైన్యమును మేవాడమీఁదికిఁ బంపెను. ఖామ్‌నోర్ వద్ద రాణాసైన్యములకును, మొగలుసైన్యములకును ఘోరసంగ్రామము జరగెను. అందును మొగలులే యోడి పాఱిపోయిరి. ఈప్రకారము రాజపుత్త్రులు మొగలులను పదునేడు పర్యాయములు ఓడించి తమ యద్వితీయశౌర్యమును గనఁబఱచిరి. కాని పెక్కురుయోధాగ్రేసరులను, అసంఖ్యసైన్యమును గోలుపోవలసిన వారైరి. ఇది కనిపట్టి జహాంగీర్‌పాదుషాహ మరల గొప్పసైన్యముల నిచ్చి పరాక్రమవంతుఁ డయిన ఖుర్రుమ్ అను తనకుమారుని రాణామీఁదికిఁ బంపెను. కాని యీ తడవ తనమర్యాదకు లోపము లేని సంధి చేయుటయే మంచి దని అభయసింహుఁడు తలంచెను. కావున మేవాడరాణాలు ఢిల్లీశ్వరుని సార్వభౌమునిగా నొప్పుకొనునట్లును, వారు ఢిల్లీకి నేఁగ నక్కఱలేకుండునట్లును, మేవాడరాజపుత్త్రునకు ఢిల్లీశ్వరుఁడు తనకుడిపైపున నంపదు సరదారులకంటె నగ్రస్థాన మొసఁగునట్లును ఒప్పిదములతో క్రీ. శ. ౧౬౧౬ లో సంధి చేసికొనెను. ఢిల్లీశ్వరుఁడు ఉదయపురపురాజుమనసు నొవ్వకుండఁ జేయఁ బ్రయత్నించుచుండెను. అయినను తనవంశపు శాశ్వతకీర్తికి సంధి చేఁ గలంకము వచ్చె నని తలఁచి తనకుమారుఁ డగు 'కర్ణుఁడు' అనువానికిఁ బట్టము కట్టి అభయసింహుఁడు వానప్రస్థాశ్రమమును స్వీకరించి, ఉదయపురమును విడిచి పోయెను.

ఇతఁడు అద్భుతపరాక్రమశాలియు, మిక్కిలి దీర్ఘకాయుఁడును, విశాలవక్షుఁడును అయియుండెను. ఈతఁడు సరదారులకును, ప్రజలకును అత్యంతప్రియుఁడు. ఇందుల కితని దయాళుత్వమును, న్యాయప్రియతయు ముఖ్యకారణములు. ఈతఁడు తనరాజ్యములోఁ బన్ను వసూలు చేయుటనుగుఱించి పెక్కుచట్టములు చేసి వానిని శాసనస్తంభములపైని జెక్కించెను. ఆశాసనము లిప్పటికిని గాన వచ్చుచున్నవి. ఈతఁడు తనసరదారులకుఁ దగినట్లు జాగీరు లొసఁగి, వారు తనసభకు వచ్చునప్పుడు ధరింపవలసిన దుస్తులపద్ధతియు, వారు సభలోఁ గూర్చుండవలసినక్రమమును నిర్ణయించెను. ఈతనిచే నేర్పఱుపఁబడిన శిరోవేష్టనమును ఇప్పటికిని 'ఉమరావ్‌శాహిపగ్‌డీ' అని యాప్రాంతమున ననియెదరు.

౨. యోధపురపురాజు. మహమ్మద్‌షా ఢిల్లీలో రాజ్యము చేయుచుండఁగ రమారమి క్రీ. శ. ౧౭౨౪-వ సంవత్సరమున తన తండ్రియైన రాజా అజిత్‌సింగ్ రాథోడును జంపి రాజయ్యెను. ఈతఁడు ఢిల్లీచక్రవర్తి క్రింద పని చేసెను. గుజరాత్ రాజ్యము నపహరించిన సర్ బులంద్‌ఖాఁ అనువానిని నోడించినందున క్రీ. శ. ౧౭౩౦ లో ఆ రాజధానికి సుబేదారుగా నియమింపఁ

sampath_Ebooks

బడెను. కాని యీతనిసోదరుఁడైన బఖత్ సింగు జోధపురపురాజయ్యెను. క్రీ. శ. ౧౭౫౨ లో అభయసింహుఁడు విషము పెట్టఁబడి మృతినొందెను. ఇతనితరువాత విజయసింగను నీతనికుమారుఁడు తండ్రిస్థానము నలంకరించెను.

**అభయుఁడు** — ౧. స్వాయంభువ మన్వంతరమునం దుండిన ధర్ముఁడనుఋషియొక్క కుమారుఁడు. తల్లి దయ.

౨. ప్రియవ్రతపుత్రుఁడయిన ఇధ్మజిహ్వునియేడ్గురుకుమారులలోఁ గనిష్ఠుఁడు. ఇతఁడు ప్లక్షద్వీపమండలి ఏడవవర్షమునకు నధిపతి. కావున ఆవర్షమున కితని పేరు వచ్చెను.

౩. ఒక బ్రహ్మర్షి.

౪. ఒక బ్రహ్మర్షి.

౫. ధృతరాష్ట్రుని నూర్గురుపుత్రులలో నొకఁడు.

**అభావము** — వైశేషికులచే నంగీకరింపఁబడిన సప్తమపదార్థము. నైయాయికులు కూడ దీని నంగీకరించిరి. వైశేషికసూత్రములలో 'ద్రవ్యగుణకర్మసామాన్యవిశేషసమవాయ'ము లను నాఱు పదార్థములే చెప్పఁబడినవి. కాని తరువాతినైయాయికులు 'అభావ' మను నొకపదార్థము నంగీకరించిరి. ఆఱును భావపదార్థము లనియు, నిది యభావపదార్థ మనియు వారితాత్పర్యము. అట్లు అభావమును వేఱుపదార్థముగ నెంచనియెడల 'ఇచ్చట ఘటము లేదు. ఇచ్చట పటము లేదు' అన్నజ్ఞానము కలుగనేరదు. ప్రతివస్తువు తనయభావమునకు 'ప్రతియోగి' యనిపించుకొనును. ఘటము ఘటాభావమునకుఁ బ్రతియోగి. పటము పటాభావమునకుఁ బ్రతియోగి. అభావము రెండువిధములు: సంసర్గాభావము, అన్యోన్యాభావము. సంసర్గాభావము మూఁడువిధములు: ప్రాగభావము, ప్రధ్వంసాభావము, అన్యోన్యాభావము. పదార్థము పుట్టుటకుఁ బూర్వ ముండునట్టి దాని యభావమును (లేమిని) ప్రాగభావ మనియెదరు. ఘటము పుట్టుటకుఁ బూర్వ మున్నదానియభావము ఘటప్రాగభావ మనిపించుకొనును. ముందు కల్క్యవతారము వచ్చు నందురు. కావున నిప్పుడు కల్కిప్రాగభావము. కుమారుఁడు పుట్టువఱకును కుమారప్రాగభావము. కపాలమునందు ఘటోత్పత్తికిఁ బూర్వము ఘటాభావ మున్నది. కూరగాయలయందు రక్తోత్పత్తికి ముందు రక్తాభావ మున్నది. ఇట్లు పదార్థోత్పత్తికిఁ బూర్వము ఆపదార్థముయొక్క ప్రాగభావ ముండును. పదార్థోత్పత్తితో వినాశమును జెందును. కావున ప్రాగభావ మనాది యనియు, సాంత మనియుఁ జెప్పెదరు; అనఁగా దానికి మొదలు లేదు గాని చివర యున్నది. పుట్టుక లేదు గాని చావున్నది. ఘటము పుట్టుటకుఁబూర్వము ఘటప్రాగభావము అనాదికాలమున నుండి యున్నదని చెప్పవలెనుగదా? ఈప్రాగభావము ఘటోత్పత్తితోడనే వినాశమును జెందును. కల్కిప్రాగభావము కల్క్యవతారముతో నంత మొందును. పుత్రుని ప్రాగభావము పుత్రోత్పత్తితో ముగియును. పదార్థము నాశనమును జెందినతరువాతను గలుగునట్టిదాని యభావము ప్రధ్వంసాభావ మనిపించుకొనును. కుండ పగిలిపోయిన తరువాత దానియభావము ఘటప్రధ్వంసాభావ మనిపించుకొనును. ఘటవిధ్వంసానంతరమున పగిలియుండు పెంకులలో నేఘటాభావ మున్నదో యది ప్రధ్వంసాభావము. ప్రధ్వంసాభావము సాది అనంతము; అనఁగా దీనికి నుత్పత్తి యున్నది గాని నాశము లేదు. దీనికి పుట్టుక యున్నది, చావు లేదు! ప్రతియోగిధ్వంసమే దానియుత్పత్తికాలము. ఇది పుట్టినతరువాత దీనిప్రతియోగికి (ఘటమునకు) మరల నస్తిత్వ ముండుట సంభవింపదు. కనుక ప్రధ్వంసాభావమునకు నాశము లేదు. అత్యంతాభావ మనఁగా నెప్పుడును లేకపోవుట. గొడ్రాలికొడుకు, కుందేటికొమ్ము ఇందుల కుదాహరణములు. ఈయభావ మనాది, యనంతము. ఇది యొకప్పుడు పుట్టలేదు; ఒకప్పుడు చచ్చిపోదు. సాధారణముగా సంసర్గాభావ మిట్లు మూఁడువిధములుగాఁ జెప్పఁబడినను కొందఱు సామయికాభావ మని యొక భేదమును జెప్పిరి. సమయవిశేషమునం దుండునభావము సామయికాభావము. ఇది సాది, సాంతము. దీనికి పుట్టుక యున్నది. చావున్నది. అన్యోన్యాభావ మొక్క విధమే. రెండుపదార్థములలో నొకటి మఱియొక దానియం దుండకపోవుట అన్యోన్యాభావ మనిపించుకొనును. ఘటమునందు పటాభావము కలదు, పటమునందు ఘటాభావము కలదు. ఇది అన్యోన్యాభావము. అభేదమును నిషేధించునట్టి యేయభావము కలదో యది యన్యోన్యాభావము. 'ఘటము పటము కాదు' అను వాక్యమునందు ఘట పటములకు నభేదము నిషేధింపఁబడుచున్నది. కావున ఘటమునందు పటముయొక్క యన్యోన్యాభావము కలదు.

లక్షణము:— అభావలక్షణము చెప్పుటకు నైయాయికులు పెక్కువిధముల యత్నించిరి. కాని సమాధానకరమైన లక్షణము మాత్రము వారికిఁ జిక్కదయ్యెను. మొదట భావము కానిది యభావ మనిరి. కాని యది భావలక్షణసాపేక్షము. భావమునకుమాత్రము చక్కనిలక్షణము చెప్పినవా రెవరు? కావున భావ మనఁగా అభావము కానిది, అభావ మనఁగా భావము కానిది యన్న అన్యోన్యాశ్రయదోషము పట్టెను. దీనిలక్షణము చెప్పుటకు వీలు లేనందున నవీననైయాయికులు దీనిని అఖండోపాధి యన్నారు. అఖండోపాధి యనఁగా లక్షణశూన్యజాతివిశేష మని యర్థము.

అభావస్వరూపము:— ప్రాచీననైయాయికులమతమున ప్రాక్ప్రధ్వంసాత్యంతాభావములు మూఁడును నఞ్ (లేదు) అనుశబ్దము వలనఁ బుట్టినప్రతీతికి (జ్ఞానమునకు) విషయములు; అనఁగా వీని యన్నిటివల్లను ఒకానొకపదార్థము లే దనుజ్ఞానము కలుగును. మఱియుఁ బ్రతియోగియొక్క యుపాదానకారణమునం దత్యంతాభావముతో ప్రాగభావము గాని, ప్రధ్వంసాభావము గాని కలసి

sampath_Ebooks



యుండనేరదు. నవీననైయాయికులమత మిందులకు విరుద్ధము. వారి మతమున ప్రాగభావప్రధ్వంసాభావములు నఞ్‌శబ్దజన్యప్రతీతికి విషయములు కావు. అవి అత్యంతాభావముతోఁ గలసియుండ వచ్చును. ప్రతియోగియొక్క యుపాదానకారణమునందును అత్యంతాభావ మున్నది. దేనియభావమునుగురించి మనము మాటాడు చున్నామో యది యాయభావమునకుఁ బ్రతియోగి. ఘటాభావమునకు ఘటము ప్రతియోగి. ప్రతియోగియైన ఘటముయొక్క యుపాదానకారణము మృత్తిక లేక కపాలద్వయము[1]. నవీనమతము ననుసరించి అత్యంతాభావమునకు ప్రతియోగితో విరోధ మున్నది. అన్యముతో లేదు. ఎచ్చటెచ్చటఁ బ్రతియోగి యుండదో యచ్చటచ్చట నత్యంతాభావ ముండును. ఘటము లేనిచోటనెల్ల ఘటాత్యంతాభావ ముండును. కావున ఘటోత్పత్తికిఁ బూర్వమందును (ప్రాగభావకాలమందును), ఘటనాశకాలమునందును (ప్రధ్వంసాభావకాలమందును) ఘటముయొక్క (ప్రతియోగియొక్క) యత్యంతాభావ ముండుట వలన 'కపాలమునందు ఘటము లేదు' అన్న ప్రతీతికి (అనుభవమునకు, జ్ఞానమునకు) విషయ మత్యంతాభావ మగుచున్నది.

ఈజ్ఞానము ప్రాగభావ, ప్రధ్వంసాభావజ్ఞానము కాదు. ఆ ప్రతీతి యెట్లు కలుగు ననఁగా 'కపాలమునందు ఘటము పుట్టఁగలదు' అన్న ప్రతీతి మనకుఁ ఘటోత్పత్తికిఁ బూర్వము కలుగును. ఇదియే ప్రాగభావజ్ఞానము. ఇట్లు ఘటోత్పత్తికిఁ బూర్వము మనకు రెండు జ్ఞానములు కలుగుచున్నవి. ఒకటి 'ఘటము లేదు' అనునది; రెండవది 'ఘటము పుట్టఁగలదు' అనునది. మొదటిది అత్యంతాభావమునకును, రెండవది ప్రాగభావమునకును విషయములు. ఇవి రెండును ఏకకాలమం దుండును. అట్లే ప్రధ్వంసాభావజ్ఞానమును, అత్యంతాభావజ్ఞానమును ఏకకాలమం దుండును. ఘటమును కఱ్ఱతోఁ బగులఁ గొట్టినతరువాత మనకు రెండువిధములైన ప్రతీతి కలుగును. 'ఘటము లేదు' అని ఒకటి, 'ఘటము పగిలినది' అని యొకటి. మొదటిది అత్యంతాభావవిషయము, రెండవది ప్రధ్వంసాభావవిషయము. ఇట్లు ప్రాగభావమందు 'ఘటము పుట్టఁగలదు' అన్న జ్ఞాన ముండునేకాని ఘటము లే దన్న జ్ఞాన ముండదు; ప్రధ్వంసాభావమునందు 'ఘటము పగిలినది' అన్నజ్ఞానమే ఉండును గాని ఘటము లే దన్నజ్ఞాన ముండదు. ఇందువలననే నవీనమతమునందు 'ప్రాగభావ, ప్రధ్వంసాభావములు నఞ్‌శబ్దజన్యప్రతీతికి విషయములు కావు' అని చెప్పఁబడును.

**అభావమునకు అభావము:—** భావపదార్థములకే కాక యభావములకుఁగూడ నైయాయికు లభావము నొప్పుకొనియున్నారు. భావముయొక్క యభావమును 'భావప్రతియోగికాభావ' మందురు. అభావముయొక్క యభావమును 'అభావప్రతియోగికాభావ' మందురు. ఘటముయొక్క యభావము ఘటాభావము. దీనికి ఘటము ప్రతియోగి. ఈ ఘటాభావముయొక్క యభావము మరల ఘటమే యగుచున్నది. ఇట్లు ఈ రెండవ అత్యంతాభావము మొదటియత్యంతాభావముయొక్క ప్రతియోగి యగు ఘటముతో సమనియతము; అనఁగా ఘటస్వరూపము అయియున్నది, దానికంటె భిన్నము కాదు. ఇట్లు రెండవయభావము ప్రతియోగిస్వరూప మని యొప్పుకొననిచో రెండవదానికి మూఁడవ యత్యంతాభావము, మూఁడవదానికి నాల్గవ యత్యంతాభావము. ఇట్లనంతధార కలిగి యనవస్థాదోషము ప్రాప్తించును. ఇది ప్రాచీనులమతము. నవీనులు[2] ఈమతము నంగీకరింపరు. వీరిమతమున ప్రతియోగి యగు ఘటము విధిముఖప్రతీతికి విషయమై యున్నది, అనఁగా భావరూపము. రెండవయభావము, అనఁగా ఘటాభావాభావము నిషేధముఖప్రతీతికి విషయము, అనఁగా అభావరూపము. కావున నది ఘటరూపముకాదు, ఘటము కంటె పృథక్కు. కావున ఘటాభావము, ఘటాభావాభావము అని రెండు అభావములను గైకొనవలెను. అమీఁదను మూఁడవయభావము మొదటి యభావముతో సమనియత మగును. నాల్గవయభావము రెండవయభావముతో సమనియత మగును. ఇట్లు యుగ్మసంఖ్యాభావములు (సరిసంఖ్య గలవి) ద్వితీయాభావమునకును, విషమసంఖ్యాభావములు ప్రథమసంఖ్యాభావమునకును సమనియతము లయినందున అనవస్థ లేదు. ప్రాచీనమతమున నొక్క యభావమును, నవీనమతమున రెండభావములను గ్రహింపవలెను. ఇట్లు ప్రాచీనమతమునకు లాఘవమును, నవీనమతమునకు గౌరవమును కలుగుచున్నను భావాభావము లేకము లన్న పురాతనులమత మంతగా నంగీకరించుటకు వీలులేదు కావున, ఈ నవీనమతమే నైయాయికులలో నెక్కుడు గ్రాహ్యముగా నెంచఁబడును.

(కో. వేం. ల.)

**అభిచారము** — ఒకతంత్రవిశేషము. ఇది ఆఱువిధములుగ నున్నది: మారణము, మోహనము, స్తంభనము, విద్వేషణము, ఉచ్చాటనము, వశీకరణము.

౧. మారణము:— హోమాదికర్మములచే నితరులను జంపుట. మొదట దీని కెన్నియో పద్ధతు లుండెడివఁట! ఇప్పటికి నీయాచార మక్కడక్కడ నున్నది. తాంత్రికు లిప్పటికిని మారణాద్యభిచారములను జేయుచునేయుందురు. మొదటమొదట నిట్టిమారణకర్మముల నొనర్చువారి నేలికలు దండించెడివారు.

1. కుమ్మరివాఁడు కుండను జేయుటకు మొదట మంటితో రెండు చిప్పలను చేయును. ఆ రెంటిని కలిపి కుండను జేయును, వానినే కపాలద్వయ మనియెదరు. ఈ రెండును కలయుట కపాలద్వయసంయోగము.

2. మన నైయాయికులలో 'పురాతనులు', 'నవీనులు' అని రెండు భేదములు కలవు.

sampath_Ebooks

౨. మోహనము :— మంత్రసామర్థ్యమున ప్రజలను ముగ్ధులఁ గావించివైచుట.

3. స్తంభనము :— పూర్వము తాంత్రికు లనేకవిధముల వాక్స్తంభనము, హస్తపాదాద్యవయవస్తంభనము, శత్రుసేనాస్తంభనము మున్నగునవి చేయుచుండువారు. ఇవి యన్నియు స్తంభనాభిచారమునకుఁ జెందినవే.

౪. విద్వేషణము :— ఒకరి కొకరికి విరోధములను గల్పించుటకై చేయుతంత్రవిశేషము.

౫. ఉచ్చాటనము :— ఇతరులకుఁ బిచ్చి యెత్తించుటకై చేయు తంత్రవిశేషము.

౬. వశీకరణము :— ఇతరులను వశపఱుచుకొనుటకై చేయఁబడునొకవిధమగు నభిచారము.

**అభిజ్ఞానశాకుంతలము** — మహాకవి కాళిదాసునిచే రచియింపఁబడిన సంస్కృతప్రాకృతనాటకము. సంస్కృతనాటకము లనఁబడునవి యన్నియు సంస్కృతప్రాకృత భూయిష్ఠముగ నుండుటచే వానిని కేవల సంస్కృతనాటకము లనుటకంటె సంస్కృతప్రాకృతనాటకము లనుటయే సమంజసము. ఈ నాటకమునందు రెండుపాళ్లు సంస్కృతమును, మూఁడుపాళ్లు ప్రాకృతమును ఉన్న వని చెప్పవచ్చును. ముఖ్యపాత్రలలో రాజు, ఋషులు తప్ప మిగిలినవా రందఱును ప్రాకృతమే మాటలాడెదరు. రాజుస్నేహితుఁడును, బ్రాహ్మణుఁడును అయిన విదూషకుఁడుగూడఁ బ్రాకృతమే మాటలాడును.

యోగ్యత :— ప్రపంచమందలి యుత్తమోత్తమనాటకరాజములలో నిది యొక్కటి యనియు, హిందూదేశమందలి నాటకములలో నుత్తమోత్తమ మనియు దీనికి ఖ్యాతి కలదు. 'కావ్యేషు నాటకం రమ్యం తత్ర రమ్యా శకుంతలా' యన్నశ్లోకమును పరంపరగ నీ దేశమునందుఁ బండితులు శిష్యులకుఁ జెప్పుచున్నారు. క్రీ. శ. ౧౭౮౯ లో సర్ విల్యం జోన్సు అను నాంగ్లపండితుఁడు కలకత్తాలో న్యాయాధీశుఁడుగ నున్నవాఁడు ఈనాటకమును ఇంగ్లీషులోనికి భాషాంతరీకరించెను. అప్పు డీనాటకముయొక్క ఖ్యాతి యూరోపుఖండమునం దంతటను బ్రసరించెను. ఆశతాబ్దిలో యూరోపుఖండమందు కవిశ్రేష్ఠుఁ డని ఖ్యాతి గాంచిన గెటి (Goeth) అనుతత్త్వజ్ఞుఁ డీనాటకమును జదివి యానందమును పట్టలేక నృత్యము చేసె నని చెప్పెదరు. 'భూలోక స్వర్గలోకములలోని సౌందర్య మొక్కచోటను జూడవలయు నన్న నీశాకుంతలమే చాలును' అన్న యర్థము గల పద్యమునుగూడఁ జెప్పెను! అప్పటనుండియు నీనాటకమును పాశ్చాత్యులు విశేషశ్రద్ధతోఁ జదువుచున్నారు. యూరోపుఖండమందలి యన్నిభాషలలోనికి నిది భాషాంతరీకరింపఁబడుటయే కాక యిందునుగుఱించి చర్చాత్మకగ్రంథములుకూడఁ బెక్కులు పుట్టినవి[1]. ఇట్లు తనయప్రతిమసౌందర్యముచే శాకుంతలము పాశ్చాత్యపౌరస్త్యపండితులను మోహింపఁ జేసినది!

నాటకస్వరూపము, భిన్నపాఠములు :— ఇందు నేడంకములు కలవు. ఇవి గాక నాటకప్రారంభమునందు ప్రస్తావనయు, ద్వితీయ తృతీయాంకములకు నడుమ నొకవిష్కంభకమును, తృతీయ చతుర్థాంకములకు నడుమ నొకవిష్కంభకమును, పంచమషష్ఠాంకములకు నడుమ నొక ప్రవేశకమును గలవు. క్రమముగ నాడినయెడల నీ నాటక మాడుటకుఁ దక్కువలోఁ దక్కువకాలము తొమ్మిది గంటలు పట్టును. మొత్తముమీఁద నాడుట కిది కొంచెము పెద్దనాటకమనియే చెప్పవలెను. పూర్వకాలమం దాడునప్పుడు నటులు తమవీలు ననుసరించి కొంతభాగము తగ్గించి యాడుచుండిరేమో యని తలంపవలసియున్నది.

ఈ నాటకముయొక్క వేఱువేఱుప్రతులలో ననేకపాఠాంతరములు కలవు. చిన్నచిన్న పాఠాంతరముల నటుండనిచ్చినను, ఈనాటకముయొక్క మూఁడుభిన్నపాఠములు హిందూదేశమునందుఁ గానవచ్చుచున్నవి: (౧) గౌడీయపాఠము, (౨) దేవనాగరపాఠము, (3) దాక్షిణాత్యపాఠము. మొదటిది బంగాళీఅక్షరములతో వ్రాయఁబడినది, బంగాళదేశమందు వాడుకలో నున్నది. రెండవది దేవనాగరాక్షరములతో వ్రాయఁబడినది. కాశీదేశమునందును, మహారాష్ట్రమునందును ప్రచారములో నున్నది. మూఁడవది యాంధ్రాక్షరములతోడను, గ్రంథాక్షరములతోడను వ్రాయఁబడినది. వీనిలో దేవనాగర, దాక్షిణాత్యపాఠములకు నంతగా విశేషభేదము లేదు. కాని గౌడీయపాఠమునకును, ఇతరపాఠములకును చాల భేద మున్నది. ఈ నాటకమును గౌడీయపాఠముప్రకారము పండిత ప్రేమచంద్రతర్కవాగీశుఁడు ౧౮౬౦ లోను, డాక్టరు పిషెల్ ౧౮౭౭ లోను ముద్రింపించి ప్రకటించిరి. దేవనాగరపాఠము ననుసరించి ఈశ్వరచంద్రవిద్యాసాగరులవారును, ప్రొఫెసర్ మోనియర్ విల్యమ్సుపండితుఁడును ముద్రింపించిరి. దాక్షిణాత్యపాఠము పాశ్చాత్యసాహిత్యశాస్త్రనియమములప్రకారము శోధించి అచ్చువేసినవా రెవరును లేరు. కొన్ని గుజిరీప్రతు లున్నవి. ఇవియుఁ గాక, దక్షిణదేశమునఁ

1. ఇంగ్లీషుభాషలో నీ నాటకమునకుఁ బండ్రెండుభాషాంతరములును, జర్మనుభాషలోఁ బదునెనిమిదియు, ఇటాలియనులో నాలుగును, రషియనులో మూఁడును, డ్యానిషులో రెండును, స్వీడిషులో రెండును, డచ్చిలో రెండును, స్పానిష్, పోలిష్, హంగేరియన్, బోహెమియన్, ఐస్ల్యాండిక్ భాషలలో నొక్కొక్కటియుఁ గలవు! హిందూదేశమందలి భాషాంతరములనుగుఱించి ముందు వ్రాయఁబడును.

sampath_Ebooks



గల యనేక ప్రతులలోని పాఠాంతరములను ఫౌల్క్సు అనునతఁడు సంగ్రహించి యొకచోట నచ్చొత్తించినాఁడు. కాళిదాసుని యితర కావ్యములనుగుఱించియు నీతఁడు దాక్షిణాత్యపాఠాంతరములను సంగ్రహించినాఁడు[1]. ఈ మూఁడుపాఠములలోను గౌడీయపాఠము పెద్దది; అనఁగా నితరపాఠములలో లేనికథ కొంత యందధికముగ నున్నది. ఇందుల కొక చిన్నయుదాహరణ మిచ్చెదము. దేవనాగర దాక్షిణాత్యపాఠప్రకారము మూఁడవయంకమునందు, శకుంతలా దుష్యంతు లొక్కసారి కలసి కొలఁదికాలములోఁ జీలుదురు. గౌడీయ పాఠప్రకారము, శకుంతల వెడలిపోయినతరువాత చేతిపువ్వుకంకణము పోయిన దన్నమిష పెట్టుకొని రాజును జూచుటకు మరల వచ్చును. ఇద్దఱును కలసి లతామండపమందలి చంద్రశిలావేదికపైని గూర్చుండి ముచ్చటింతురు. ఈభాగ మంతయు నంకములో నాల్గవవంతు ఉండును. మొత్తముమీఁదఁ బండితులయభిప్రాయము చూడఁగా దేవనాగరపాఠము నిజమైనపాఠ మనియు, గౌడీయపాఠమునందలి యధికభాగ మంతయును బ్రక్షిప్త మనియుఁ దేలుచున్నది. అయినను గౌడీయపాఠాభిమానులు లేకపోలేదు. గౌడీయ పాఠమే నిజమైన మూలపాఠ మనియు, నది యాటుటకుఁ బెద్దదైనందున నాయాదేశములవారు ప్రయోగమున కనుకూలముగఁ గొన్ని భాగములను తగ్గించి, చిన్నపాఠములను నిర్మించి రనియు వారు చెప్పెదరు. దాక్షిణాత్యపాఠము మూఁడు పాఠములలోను బనికిరాని దని మోనియర్ విల్యమ్సు వ్రాసెను. కాని యీమాట యంతగ నమ్మఁదగినది కాదు. ఏల యన వేఱువేఱుపాఠములను పోల్చిచూడఁ గొన్నియెడల దాక్షిణాత్యపాఠములే మూలానుసారముగ నున్న వని పాటన్కర్ అనునాతఁడు చూపినాఁడు[2]. మొత్తముమీఁదఁ జూడఁగా మూఁడుపాఠములలోను నున్నభాగ మంతయు నిజమైన గ్రంథ మని గ్రహించి మిగిలినభాగములను వానివాని యోగ్యతను బట్టి గ్రహింపవలెను.

కథా సందర్భము :— ఇందలికథ సంస్కృతమహాభారతమున నుండి గ్రహింపఁబడినది. మహాభారతమునం దాదిపర్వములో ౬౮-వ అధ్యాయము మొదలుకొని ౭౪-వ అధ్యాయమునఱకును శకుంతలాఖ్యానము కలదు. కాళిదాసుఁడు ముఖ్యకథను మహాభారతమున నుండి తీసికొన్నను మూలకథలోఁ గొన్నిమార్పులు చేసి దానికి మెఱుఁగు పెట్టియున్నాఁడు. భారతకథకును శాకుంతలముకథకును గల భేదము తెలియుటకై యా రెండుకథలును సంక్షేపముగ నిందు నిచ్చుచున్నారము :—

భారతకథాసంగ్రహము :— దుష్యంతమహారాజొకనాఁడు సైన్యసమేతుఁడై యరణ్యమునకు వేటకుఁ బోయి మృగముల సంహారించుచుఁ గడుదూరము గడచి చనిచని మాలినీతీరమునం దున్న కణ్వమహర్షి యాశ్రమమును సమీపించెను. అమ్మహామహునిదర్శనము చేయఁదలఁచి తనపరివారము నాశ్రమద్వారమునందే నిల్పి తా నొక్కఁడు లోనఁ బ్రవేశించెను. ఆశ్రమ మనఁగా నొకమునిపల్లె యని యర్థము. అందు హోమములు చేయువారును, వేదముఁ బఠించువారును, పూర్వపక్ష సిద్ధాంతములఁ బ్రసంగించువారును అగుఋషిపుంగవులు పెక్కురుండిరి. రాజు కణ్వమహర్షి యుండు కుటీరమునకుఁ బోయెను. అప్పు డాయాశ్రమమం దెవ్వరును గానరానందున రాజు 'ఎవ రిచ్చట' ననియెలుంగెత్తి పిలిచెను. అంత లోననుండి సౌందర్యవైభవ యగు శకుంతల వచ్చి 'మాతండ్రిగా రగు కణ్వులు వనమునకు ఫలంబులు తెచ్చుటకుఁ బోయిరి. ముహూర్తమాత్రంబున వచ్చెదరు కూర్చుండుఁడి' యని చెప్పి యతిథిసత్కారము చేసెను; మహారాజలక్షణంబులచే నాతనిని దుష్యంతునిగ నెఱిఁగెను. దుష్యంతుఁడు తాపసీవేషముతో నున్న యాచక్కనిపడుచును మోహించి 'నీ వెవ్వతవు? ఇచ్చటికేల వచ్చితివి? బ్రహ్మచారియైన కణ్వునికి నీవు కూఁతుర వగుట యెట్లు?' అని యడుగఁగా నామె, తాను విశ్వామిత్రునితపోభంగము చేయుటకు బోయిన మేనకకుఁ బుట్టినదాన ననియు, మేనక విడిచిపోఁగా శకుంతములు (పక్షులు) పెంచుచుండఁగాఁ గణ్వమహర్షి తెచ్చి చిన్నప్పటి నుండియుఁ బెంచె ననియుఁ దనజన్మవృత్తాంత మంతయు సవిస్తరముగఁ జెప్పెను. అంత రాజు తన్ను గాంధర్వవిధిని వివాహ మాడు మని కోరఁగా నామె 'నీవలన నాకుఁ గలిగెడిపుత్రుని యువరాజును జేసెద నని యొప్పితివేని నిన్ను వివాహ మగుదు' నని చెప్పెను. రా జామాట యొప్పుకొని యామెను గాంధర్వమున వివాహ మాడి 'నిన్ను నారాజధానికిఁ దోడ్కొనిపోవుటకు సిబ్బందిని త్వరలోనే పంపెద' నని యామెతోఁ జెప్పి కణ్వుఁడు వచ్చినఁ గోపపడు నేమో యని తలంచి నిజనగరమునకుఁ బోయెను. శకుంతల గర్భముఁదాల్చెను.

రాజు పోయినముహూర్తమునకు ఋషి వచ్చి దివ్యజ్ఞానమున నంతయుఁ దెలిసికొని, సిగ్గుతో నున్నకూఁతునకు ధైర్యము చెప్పి, యావివాహమునకు సమ్మతించెను. శకుంతల మూఁడుసంవత్సరముల వఱకును గర్భము ధరించి చక్రవర్తిచిహ్నములు గలపుత్రునిఁ గనెను. వాఁడు గజసింహాదులను బట్టి యాడుకొనుశక్తి కలవాఁ డగుటచే మునులు వానికి సర్వదమనుఁ డన్న పేరు పెట్టిరి. వాఁ డచ్చట నాఱేండ్లవాఁ డగువఱకును ఉండెను. కాని దుష్యంతుఁ డింతవఱకును శకుంతలను దీసికొనిపోవుటకు మనుష్యులను పంపినవాఁడు కాఁడు. ఆఁడుపడుచులు పెక్కుదినములు పుట్టినింట నుండఁగూడ దని తలఁచి, కొందఱుశిష్యులను వెంట నిచ్చి కణ్వుఁడు శకుంతలను, ఆమెకుమారుని దుష్యంతుని యొద్దకు హస్తినాపురమునకుఁ బంపెను. శిష్యు లామె నచ్చట విడిచి వచ్చిరి. శకుంతల రాజును జూచి 'నేను నీకు ధర్మపత్నిని. ఈ బాలుఁడు నీ ఔరసపుత్రుఁడు. నీవు కణ్వాశ్రమమునందు నొప్పు

1. Foulkes' Complete Collection of the various readings of the Madras Mss. of Kalidasa.

2. Patankar's Edition, Bombay.

sampath_Ebooks

కొన్నట్లు ఈబాలుని యువరాజును జేయుము'. అని యనఁగా నాతఁడు తాను శకుంతలను వివాహ మాడుటయు, నామెకుఁ బుట్టిన కుమారునకు యౌవరాజ్యాభిషేకమును జేసెద నని యొప్పుకొనుటయు నెఱింగియుండియు, లోకాపవాదభీతిచేత నెఱుంగనివానివలె నటించి, 'ఓతాపసీ! నీ వసత్య మాడుచున్నావు. నేను నిన్నెఱుఁగను. నిన్ను వివాహము చేసికొనలేదు; వీఁడు నాపుత్త్రుఁడు కాఁడు; వెడలి పొమ్ము' అని యామెను నిరాకరించెను. అందుమీఁద నామె యసత్య మాడుట దోష మనియు, భార్యాపుత్త్రులను పరిత్యజించుట తగ దనియు గంభీరవచనములతోఁ జెప్పెను. కాని రాజు వినఁడయ్యె; అంత నామె మిక్కిలి కోపమును గలదియై 'నీవు దగ్గఱఁ జేర్పకుండినను ఈ కుమారుఁడు తప్పక సకలపృథ్వీమండలంబుఁ బాలింపఁగలఁడు' అని చెప్పి వెడలిపోఁదొడఁగెను. అంత నాకాశవాణి 'శకుంతల చెప్పుమాట నిజము. ఈమె నీ భార్య; వీఁడు నీ కుమారుఁడు. వీరిని భరింపవలయు' నని పలికెను. అప్పుడు రాజు లోకాపవాదభీతిచేతఁ దా నట్లెఱుఁగనివానివలె నటించితి నని చెప్పి శకుంతలను, సర్వదమనుని సగౌరవముగ గ్రహించెను. సర్వదమనుఁడే భరతుఁడు1.

అభిజ్ఞానశాకుంతల కథాసారాంశము:— దుష్యంతమహారాజొకనాఁడు లేడివెంటఁ దగిలి రథముమీఁద మిక్కిలిదూరము పోయెను. లేడిపైని బాణము వేయఁబోవునపు డాశ్రమప్రాంతమందలిఋషికుమారులు 'రాజా! ఇది ఆశ్రమమృగము, చంపవల' దని చెప్పిరి. రాజు వారిమాటలు విని యెక్కుపెట్టినబాణమును దీసి, రథము డిగ్గి కణ్వాశ్రమమును జూడఁబోయెను. ఆశ్రమమునందుఁ గణ్వమహర్షి లేఁ డనియు, కన్యయొక్క ప్రతికూలగ్రహముల నివారణనిమిత్తము సోమతీర్థమునకు వెళ్లెననియు, ఆయనకూఁతురు శకుంతల యాశ్రమమందున్న దనియు వినెను. ఆశ్రమమునందుఁ బ్రవేశించినతరువాతను చెట్లకు నీళ్లు పోయుచున్న ముగ్గురు తాపసకన్యకలు కనఁబడిరి. వారిలో నొకతె శకుంతల, మిగిలినవారు అనసూయయు, ప్రియంవదయు నను నామెచెలికత్తెలు. రాజు చెట్టుచాటున డాఁగియుండి వారిసంభాషణము వినెను. వారిలో శకుంతలయందు నాతని మనస్సు తగిలెను. కాని యామె బ్రాహ్మణకన్యక యేమో యన్న సంశయ మాతని బాధించుచుండెను. ఇంతలో శకుంతలముఖము చుట్టును పద్మభ్రాంతిచేత నొకతుమ్మెద తిరుగఁజొచ్చెను. ఆమె భయపడెను. తాను బయల్పడుటకు నదియే మంచిసమయము గదా యని తలంచి రాజు భ్రమరము నవల్పుటకై ముందునకుఁ బోయెను. ఆతనిఁ జూచి శకుంతలకు నాశ్రమవిరుద్ధమైన వికారము కలిగెను. ఆమె సిగ్గుచే మాటాడకుండెను గాని అనసూయాప్రియంవద లాతని గౌరవించి కూర్చుండఁబెట్టిరి. వారితో సంభాషించునెడ ననసూయవలన నాతనికి శకుంతలయొక్క పూర్వజన్మవృత్తాంతము తెలిసెను. ఆమెకు కణ్వుఁడు వివాహము చేయఁదలఁచినాఁ డనియుఁ దెలిసెను. ఇంతలో వెనుకఁబడ్డ సిబ్బంది వచ్చినందున నొకగజము బెదరి యాశ్రమప్రాంతమును ధ్వంసము చేయుచున్న దని విని యందఱును వెడలిపోయిరి. రాజు ఆశ్రమమునకు వెలుపలనున్న తనశిబిరమునకుఁ బోయెను. శకుంతలమీఁదివలపుచే రాజునకు వేఁటమీఁద మనసు పోదయ్యె. అందుచే వేఁటప్రయత్నము లన్నియు మానవలసిన దని యాతఁడు తనసేనాధిపతిని బిలిచి యాజ్ఞాపించెను. శకుంతలను జూచుటకు మరల నాశ్రమములోనికి నేమిమిషమీఁదఁ బోవచ్చు నని తన మిత్త్రుఁ డైన విదూషకునితో నాలోచించుచుండఁగా, నాశ్రమములోనుండి యిద్దఱు ఋషికుమారులు వచ్చి 'కణ్వమహర్షి యాశ్రమమందు లేనందున రాక్షసులు మాయిష్టికి విఘ్నముఁ గావించుచున్నారు. కావున మీరు మా యాశ్రమమునకు వచ్చి కొలఁదిదినములవఱకును మమ్ముఁ గాపాడవలయును' అని వేఁడిరి. అందునకు రాజొప్పుకొని పోవఁ బ్రయత్నింపఁగా రాజధానినుండి రాజమాత సెలవుప్రకారము 'నేఁటికి నాల్గవదినమున పుత్త్రపిండపరిపాలనము నుపవాసము కలదు. నాఁటిదినమునకు నీవు తప్పక రావలెను' అని వార్త వచ్చెను. ఇట ఋషులయాజ్ఞ; అట తల్లియాజ్ఞ. రెండును అనుల్లంఘనీయములు. విదూషకునిని రాజమాత తనకుమారునిగా నెంచుచున్నందున, పుత్త్రకృత్యమును దీర్చుటకు రాజధానికి విదూషకునిఁ బంపి రాజు తాను ఋషికార్యమునకై యాశ్రమమునకుఁ బోయెను. ఆశ్రమమునకు బాధ కలుగకుండఁ దనసైన్యమునుగూడ విదూషకునివెంట నగరమునకుఁ బంపివైచెను.

అట శకుంతల విరహవేదనతోఁ గృశింపఁజొచ్చెను. ఆమె సఖు లీసంగతిఁ గనిపట్టిరి. ఒకదినమున సఖులు ముగ్గురును ఒక లతామండపమునందుఁ గూర్చుండియుండిరి. శకుంతలను పరుండఁబెట్టి

1. సంస్కృతభారతముయొక్క యచ్చుపడినప్రతు లిప్పుడు నాల్గు కానవచ్చుచున్నవి. ఒకటి కలకత్తాలో ప్రతాపచంద్ర రాయి గారిచే నచ్చొత్తింపఁబడినది. రెండవది బొంబాయిలో నాగరాక్షరములతో నచ్చొత్తింపఁబడినది. దీనినే గణపతికృష్ణాజీప్రతి యందురు. మూఁడవది చెన్నపట్టణమున ఆంధ్రాక్షరములతో నచ్చొత్తింపఁబడినది. నాలవది యిటీవల కుంభఘోణములోఁ గొందఱు మధ్వమతస్థులచే దాక్షిణాత్యపాఠానుసార మని నాగరాక్షరములతో నచ్చువేయఁబడినది. మొదటి మూఁడుకూర్పులును సాధారణముగ నొక్కవిధముగనే యుండును. ఈ మూఁడింటిలోను శకుంతలాఖ్యానము ౬౮-వ అధ్యాయము మొదలు ౭౪-వ అధ్యాయమువఱకును వర్ణింపఁబడియున్నది. కుంభఘోణముకూర్పులో మాత్రము ౯౦-వ అధ్యాయముమొదలు ౧౦౦-వ అధ్యాయమువఱకు నున్నది. ఆంధ్రమహాభారతమునందు శకుంతలాఖ్యాన మాదిపర్వము చతుర్థాశ్వాసమునందు వర్ణింపఁబడినది. సభలో శకుంతల దుష్యంతునితోఁ జెప్పినమాటలు, ముఖ్యముగ భార్యయొక్క యోగ్యత సంస్కృతాంధ్రభారతములలో మిక్కిలి చక్కఁగ వర్ణింపఁబడినది.

sampath_Ebooks

అనసూయాప్రియంవదలు శైత్యోపచారములు చేయుచుఁ దిన్నఁగా నామెమనసులోనిమాటఁ గనుంగొనిరి. వారు ముగ్గురును ఆలోచించి శకుంతలచే రాజునకు నొక ప్రణయపత్రిక వ్రాయించిరి. ఈలోపల రాజు కొంత విశ్రాంతి పుచ్చుకొనుటకు ఋషులవలన ననుజ్ఞాతుఁడై, మనసునందలివిరహవ్యథ మాన్పుకొనుటకు శకుంతల యెచ్చట నుండు నని యాలోచించి, సఖీత్రయ మున్నమండపమునకుఁ బోయి, చాటునఁ గూర్చుండి వారిమాట లన్నియు విని సంతసించి, శకుంతల తనచే రచింపఁబడిన ప్రణయపద్యమును చదివినసమయమందు వారికిఁ బ్రత్యక్ష మయ్యెను. అనసూయాప్రియంవదలు శకుంతలాదుష్యంతులకు ననురాగము కలిపి, వారి నిద్దఱను నచ్చటనే విడిచి వెడలి పోయిరి. శకుంతల వెడలఁబోయెను. రాజు శకుంతలను చేయి పట్టుకొని మరలించెను. అంత నామె 'పౌరవ! మర్యాద కాపాడుము. నేను నీయెడఁ బ్రణయము కలదాన నైనను స్వతంత్రను కాను. నా తండ్రి నన్ను నీ కీయవలెను' అని యనెను. అంత రాజు 'నీవు భయపడవలదు. పూర్వరాజకన్యలు స్వతంత్రలై గాంధర్వ వివాహమునఁ దమ కిష్టమున్నవరులను బెండ్లియాడిరి. వారితండ్రులందులకు వారి నభినందించిరి.' అని ప్రత్యుత్తర మిచ్చి యామెను ముద్దుపెట్టుకొనుటకు నామెముఖము పైకి నెత్తెను. ఆమె సిగ్గుచేఁ దల వంచుకొనెను. ఇంతలో నాశ్రమములోని వృద్ధతాపసి యైన గౌతమి శకుంతలయొక్క శరీరస్థితిని విచారించుటకును, ఆరోగ్యమునకై తీర్థ మిచ్చుటకును ఆ లతామండపమునకు వచ్చెను. ఆమె వచ్చుచున్న దని తెలిసి శకుంతల రాజును పొదచాటున దాఁచి తాను గౌతమి తెచ్చిన తీర్థము దీసికొని యామె రక్షణఁగా నామెవెంట వెడలిపోయెను. అంత రాజు పొదచాటుననుండి వచ్చి శకుంతల వెళ్లినందునకుఁ జింతించి సవనరక్షణమునకై వెళ్లిపోయెను.

[శకుంతలా దుష్యంతులకు గాంధర్వవివాహము జరిగెను. ఆమె గర్భవతి యయ్యెను. సవనకార్యము పూర్తి యైనందున ఋషుల యాజ్ఞను బొంది రాజు కణ్వమహర్షి తిరిగి రాకమునుపే, తన నగరమునకుఁ బోయెను. పోవునప్పుడు శకుంతలచేతికిఁ దన పేరుగలరత్నములయుంగరము నిచ్చి, యందలియక్షరములను దినమున కొక్కటి చొప్పున లెక్కపెట్టుచుండవలసిన దనియు, చివరయక్షరము లెక్కపెట్టుపఱకు నామెను తీసికొనిపోవ రాజధానినుండి జనులు వచ్చెద రనియుఁ జెప్పి వెళ్లెను. ఈకథ యంతయు జరుగుటకు రమారమి ఆఱు దినములు పట్టియుండును.][1]

రాజు హస్తినాపురమునకు వెడలిపోయిన దినమున శకుంతల వివశచిత్తయై కుటీరమునందుఁ బరుండియుండెను. అప్పుడు దుర్వాస ఋషి భిక్షకు వచ్చెను. కాని శకుంతలచిత్త మటు లేనందున నామె యాతనికి భిక్ష పెట్టదయ్యెను. అందుచే నాతనికిఁ గోపము వచ్చి, 'నీ వెవ్వనిని తలంచుచు నన్ను నగౌరవము చేసితివో యాతఁడు నిన్ను గుర్తింపకపోవునుగాక' యని శపించెను. ఈశాప మామెకు వినఁబడలేదు; కాని యామెచెలికత్తె లైన యనసూయా, ప్రియంవదలు వినిరి. వారిలోఁ బ్రియంవద వెళ్లి దుర్వాసఋషికోపమును దీర్చి 'ఏదైన నగ గుర్తు చూపినయెడల శాపము పోవును' అని యాతనివలన శాపశాంతి వరము వడసెను. వా రీసమాచారము శకుంతలకుఁ జెప్పలేదు.

తరువాతఁ గణ్వుఁడు వచ్చెను. ఆతని కగ్నిహోత్రశాలయం దశరీరవాణివలన శకుంతలాదుష్యంతుల వివాహసమాచార మంతయు, నామె గర్భవతి యనియుఁ దెలిసెను. ఆఁడుపిల్లలు పుట్టింటఁ బెక్కు దినంబు లుండరా దని వెంటనే యాతఁడు, గౌతమిని శార్ఙ్గరవ శారద్వతు లనువారిని వెంటనిచ్చి శకుంతల నత్తవారియింటికిఁ బంపెను. వెళ్లునప్పు డనసూయాప్రియంవదలు 'నిన్ను నీభర్త గుర్తింపఁడేని యుంగరము చూపుము' అని శకుంతలకుఁ జెప్పిరి. [ఆమె మార్గమునందలి శక్రావతారమునందు శచీతీర్థమునకు వందన మాచరించునప్పు డామెకుఁ దెలియకుండ నాయుంగర మానీళ్లలోఁ బడిపోయెను].

ఋషిశిష్యులును, గౌతమియు శకుంతలను దీసికొనిపోయి రాజునకు 'నీభార్య ఈమెఁ గైకొనుము' అనిరి. రాజు శాపోపహతుఁ డగుటచే నామెను మఱచి, దీనిని వివాహ మాడినట్లు నే నెఱుఁగ నని యామెను నిరాకరించెను. శకుంతల తనచేతియుంగరముఁ జూపఁ బోయెను. కాని యది వ్రేల లేనందునఁ జిన్నవోయి, రాజునకుఁ దమ ప్రణయకాలమందలి కొన్నిగుర్తులఁ జెప్పెను. కాని యాతనికి స్మృతి రాదయ్యె. అంత ఋషిశిష్యులు 'ఈమె నీభార్య. ఉంచుకొనిన నుంచుకొనుము; వెడలఁగొట్టిన వెడలఁగొట్టుము' అని చెప్పి యామెను విడిచి వెళ్లఁదొడఁగిరి. రాజు తనపురోహితుని ధర్మసందేహ మడిగెను. ఆతఁ డిట్లు సమాధానము చెప్పెను: 'నీకు మొదటికొడుకు చక్రవర్తి లక్షణములుగలవాఁడు పుట్టు నని చెప్పఁబడియున్నది; కావున నీల్లాడు పఱకు నీమెను నాయింట నుంచుకొనియెదను. పుట్టినపిల్లవాఁడు చక్రవర్తిలక్షణములు గలవాఁడేని యీమెను నీవు నీభార్యగా గ్రహింపవచ్చును'. [ఆమె యావలికి వెళ్లఁగా నామెతల్లి యగు మేనక వచ్చి యామె నాకాశమార్గమునఁ దీసికొనిపోయెను].

[శక్రతీర్థములోఁ బడిపోయినరాజముద్ర నొకచేప మ్రింగెను. ఒకబెస్తవాఁ డాచేపను బట్టి కోయఁగా నాయుంగరము వానికి దొరకెను. వాఁడు దాని నమ్ముచుండఁగా రాజభటులు వానిని బట్టుకొనిరి]. దొంగ యని తలంచి వానిని రాజభటులును, వారినాయకుఁడును శిక్షింపనెంచిరి. ఆయుంగరము రాజుగారికిఁ జూపుటకు నాయకుఁడు తీసికొనివెళ్లెను. ఆయుంగరమును జూచినతోడనే రాజునకు మేల్కొనినట్లు స్మృతి వచ్చి, శకుంతలవివాహవిషయ మైనయదంత మంతయుఁ గనులఁ గట్టినట్టుండెను. బెస్తవానిని విడుదలచేసి వానికి

1. ఈవిషయములు రంగముపైఁ గానరావు. ప్రవేశకములవలనను, కథాసందర్భమువలనను ప్రేక్షకు లూహించుకొనవలెను.

sampath_Ebooks

బహుమతి చేసెను. అప్పటినుండియు రాజు విరహతాపముచేతను, పశ్చాత్తాపముచేతను పొగలఁజొచ్చెను. ఇంతలోఁ గాలనేము లను దైత్యులను జంపుటకు రావలసిన దని ఇంద్రుఁడు దుష్యంతునియొద్దకు రథ మిచ్చి మాతలినిఁ బంపఁగా నాతఁ డింద్రునియొద్దకు వచ్చెను.

[ మేనక శకుంతలను దీసికొనిపోయి స్వర్గమునకును భూలోకమునకును నడుమ నున్న కింపురుషపర్వత మైన హేమకూటపర్వతముపై మారీచ (కశ్యప)ఋషియొక్క ఆశ్రమములో నుంచెను. అచ్చట నామె ప్రసవమై బాలునిఁ గనియె. అతనికి నాతని సత్త్వమును బట్టి యచ్చటివారు సర్వదమనుఁ డని పేరు పెట్టిరి].

దుష్యంతుఁడు కాలనేముల సంహరించి యింద్రుని వీడ్కొని తిరిగి భూలోకమునకు వచ్చునప్పుడు త్రోవలో నున్న మారీచాశ్రమమును దర్శింపఁబోయెను. అచ్చట దైవవశమునఁ దనభార్యాపుత్రులఁ గలసికొనెను[1].

రెండు కథలకును గల భేదము :— భారతములోని మూల కథయు నాటకసంవిధానమునకు ననుకూలమైనదిగనే యున్నను, కాళిదాసుఁ డందుఁ గొన్ని మార్పులు చేసి దానికి వన్నె తెచ్చె ననుటకు సందేహము లేదు. పైని యీయఁబడిన రెండు కథలను ముఖ్యముగ గమనించితిమేని వానిలో ముఖ్యమైన కథాభేదములు నాల్గుతావులందుఁ గానవచ్చును.

౧. మొదటిమార్పు నాయికానాయకులరాగోదయమునకు ననురాగాభివృద్ధికిని సంబంధించినది. మహాభారతమునందు దుష్యంతుఁడు శకుంతలను కుటీరములో నొంటిగాఁ జూచి మోహించి, నీకుఁ బుట్టినకుమారునకు రాజ్య మిచ్చెద నన్నలంచ మిచ్చి గాంధర్వమున వివాహమాడును. ఈవ్యాపార మంతయు నొకటిరెండుముహూర్తములలోఁ బూర్తి యగును. ఇందు రాజుయొక్క నిర్వ్యాజానురాగము కనుపడునే కాని శకుంతలకు రాజుపైఁగల ప్రేమ గానరాదు. కానవచ్చినంతవఱకు 'నాకుమారుని యౌవరాజ్యాభిషిక్తునిఁ జేసినఁ గాని నిన్నుఁ బెండ్లాడ' నన్నందున సవ్యాజముగఁ గానవచ్చునే కాని నిర్వ్యాజప్రేమ లేదు. నాటకమునందు నీ ప్రేమ పరస్పర మైనట్లును, నిర్వ్యాజ మైనట్లును వర్ణింపఁబడుటయే కాక, దీని యుత్పత్తికిని నభివృద్ధికిని పరిపూర్ణతకును అయిదాఱుదినములకాలము పట్టినట్లు చూపి నాయికానాయకులమనంబులందలి భావోదయాదులు వేఱువేఱురంగముల మూలమునను, ప్రసంగములమూలమునను ప్రదర్శింపఁబడినవి. భారతమునందు రాజు దొంగవలె భీతితోఁ బాఱిపోవును. నాటకమునందు నాతఁడు ఋషిపుత్రులప్రార్థనపై నాశ్రమములోఁ గొన్ని దినము లుండి వారివలన సెలవు పొంది వెళ్లును.

౨. రెండవమార్పు దుర్వాసఋషిశాపము. భారతకథానకమునందు కాళిదాసునిచేఁ జేయఁబడిన ముఖ్యమైన మార్పిదియే యని చెప్పవలసియున్నది. భారతకథయందు దుష్యంతుఁడు మొదటినుండియు నసత్యసంధుఁడుగను, మోసగాఁడుగను కాన్పించును. 'పట్టణమునకు వెళ్లినతోడనే నిన్నుఁ దెచ్చుటకు జనములను బంపెద' నని శకుంతలతో నాతఁడు చెప్పెను. ఇట్లు చెప్పునప్పుడే యాతనికి మనసునం దొక యుద్దేశము పైకి మఱియొకయుద్దేశము కలిగె ననుట స్పష్టము. శకుంతలను పట్టణమునకుఁ దీసికొనిపోవుటకు జనులు వలయునన్న నాశ్రమమునకు వెలుపలనే యాతని సైన్య మంతయు నుండెను. కణ్వుఁ డాశ్రమమందు లేనందున శకుంతలను తీసికొనిపోవుటకు వీలులే దనుకొనిన నాతఁడు వచ్చినతరువాత నాతని యాజ్ఞనొంది తీసికొని వచ్చుటకుఁ గొందఱ నచ్చట నుంచి వెళ్లఁగూడదా? తరువాత రాజు తొమ్మిదిసంవత్సరములవఱకును, శకుంతల వివాహముసంగతి జ్ఞాపకముండియే యామె యేమియైనదియుఁ గనుఁగొనినవాఁడు కాఁడు. పిదప నామె పుత్రునితోఁగూడ వచ్చి వివాహవిషయమును సూచించియు, యౌవరాజ్యపరమును గుఱించియు జ్ఞాపకముచేయఁగాఁ దెలిసియు వారిని నిరాకరించెను. కావున శకుంతల చెప్పినట్లు అతఁ డసత్యసంధుఁడుగఁ గానవచ్చుచున్నాఁడు. ఇదియుఁగాక అతఁ డామెయందలి నిస్సీమప్రేమచేఁ గాదనియుఁ దోఁచును. 'ఇన్నిదోషములు గలవాఁడు నాయకుఁడుగఁ బనికిరాఁడు. అతనియందు నీదోషములు లేకుండఁజేయ' వలెనని తలంచి కాళిదాసుఁ డీమార్పు చేసెను. రాజు శకుంతలాసంబంధమును వెంటనే మఱచిపోవుటకు దుర్వాసశ్శాపమును కల్పించెను. రాజు తపోవనమునుండి వెడలిపోయినదినమే దుర్వాసశ్శాపసమాచారము జరగినది. అతఁ డా దినమునుండియే యంతయు మఱచిపోయెను. కావున నామాత్రములసంఖ్య పూర్తియగువఱకు నాతఁడు శకుంతలను తీసికొనిపోవుటకు జనులను పంపకపోవుటయు, తరువాత శకుంతల యాతనియొద్దకుఁ బోయినప్పు డామెను గుర్తింపక నిరాకరించుటయు సుసంగతములే. దుర్వాసశ్శాపము రాజు స్మృతిపథమును

---

1. శకుంతలను గుఱించి ఈ నాటకమునం దున్న కథవంటి కథయే పద్మపురాణమునందు స్వర్గఖండమున ౧-౫ అధ్యాయములలోఁ గలదు. అది భారతకథవలె నుండక, ఉంగరముతో సంబంధించిన కథగలిగి అభిజ్ఞానశాకుంతలకథను పోలియున్నది. కావునఁ గొందఱు కాళిదాసుఁ డీకథయంతయు నీ పురాణమునుండియే గ్రహించె నని తలంపవచ్చును. కాని పద్మపురాణము కాళిదాసునకుఁ దరువాతిది యని చెప్పుటకుఁ దగిన కారణము లుండుటచేతను, ఈ కథ గల స్వర్గఖండము ఉత్తరదేశప్రతులలోమాత్ర ముండి, దక్షిణదేశప్రతులలో లేకుండుటచేతను (చూడుఁడు, పూనాలోఁ బ్రకటింపఁబడిన ఆనందాశ్రమముద్రణాలయములోని పద్మపురాణము) పద్మపురాణము వ్రాసినవాఁడే నాటకమునుండి కథను గ్రహించె ననుట స్పష్టము. ఇదియుఁగాక యొకప్రతిలోఁ గానిపించి యొకప్రతిలో లేనందున ప్రక్షిప్తమైన దనియుఁ జెప్పవచ్చును; అనఁగా వెనుకనుండి యెవరిచేతనో వ్రాయఁబడి యందుఁ జేర్చఁబడిన దని భావము.

sampath_Ebooks


బూర్తిగ నాక్రమించిన దని చూపుటకుఁ గవి పంచమాంక ప్రారంభ మున నొక చిన్న రంగమును ప్రదర్శించినాఁడు. అది యెంతయు భావగర్భితముగను, భావభరితముగను, సరసముగను ఉన్నది. రాజును, విదూషకుఁడును కలసియుండ సంగీతశాలవైపునుండి యీక్రింది పద్యము వినవచ్చినది.—

> ' అహిణవమహులోలువో తుమం
> తహ పరిచుంబిఅ చూఅమంజరిం,
> కమలవసఇమెత్తణివ్వుదో
> మహుఅర విమ్హరిఓసి ణం కహం.[1] '

ఇఁకముందు నీయఁబడు భాషాంతరములు ప్రాయికముగ శ్రీవీరేశలింగకవిగారి శాకుంతలమునుండియే యీయఁబడినవి.

ఈపాట హంసపదిక యనునామె రాజును ఉద్దేశించి పాడెను. ' నాయం దొకప్పుడు ప్రేమకలవాఁడవై యిప్పు డన్యస్త్రీప్రేమచే నన్ను మఱచిపోతి ' వని దీనిభావము. ఈభావము రాజు గ్రహించెను గాని హంసపదికచే నుద్దేశింపఁబడిన యన్యస్త్రీ తనరాణి యగు వసుమతీదేవి యని తలంచెనేకాని, శకుంతలనుగుఱించిన ప్రణయ మాతనికి నెంతమాత్రమును జ్ఞప్తికి వచ్చినదికాదు. శకుంతలావియోగము స్ఫురింపకపోయినను రాజునకుఁ జెప్పరానట్టి యొకవిధమైన మనోవ్యథమాత్రము కల్గెను. రా జిట్లనుకొనియె :—

రాజా – ( ఆత్మగతమ్ ) కింను ఖలు గీత మేవంవిధార్థ మాకర్ణ్యేష్టజనవిరహాదృతేఽపి బలవ దుత్కంఠితోఽస్మి, అథవా,

> ' రమ్యాణి వీక్ష్య మధురాంశ్చ నిశమ్య శబ్దా
> న్పర్యుత్సుకీభవతి య త్సుఖితోఽపి జంతుః,
> తచ్చేతసా స్మరతి నూన మబోధపూర్వం
> భావస్థిరాణి జననాంతరసౌహృదాని. '
>
> [ఇతి పర్యాకుల స్తిష్ఠతి][2]

ఇట్లు శకుంతలావివాహవిషయము రాజునకుఁ బూర్వజన్మవ్యాపారమువలెఁ బూర్తిగ మఱపునకు వచ్చినది. అకారణముగ మనసునకు వ్యాకులత కలిగినయెడల పూర్వజన్మమందలి సంస్కారము దానికిఁ గారణ మని సాధారణముగ ననుకొనియెదరు. అట్లే రాజు తనమనోవ్యాకులతకుఁ బ్రస్తుతజన్మసౌహార్దము కారణము గాక జన్మాంతర సౌహార్దము కారణ మని తలంచుచున్నాఁడు.

ఈలాగు శాపప్రభావముచే రాజు పూర్వవృత్తాంతము మఱచినందున నాతనిని అసత్యదోష మంటదు. అతనిసచ్చారిత్రమునకు భంగము కలుగకుండెను. కాని వట్టిశాపముమట్టునకుఁ దెచ్చిపెట్టి యూరకుండినచో రాజునకు నెప్పటికిని శకుంతలావివాహవిషయము జ్ఞప్తికి రాఁజాలదు. కథాచమత్కారమునకు భంగము కలుగును. కావున అభిజ్ఞాన ( గుర్తుగ ) మందు నుంగరము కనఁబడినప్పుడు రాజునకుఁ బూర్వసమాచార మంతయు స్మృతికి వచ్చు నన్న శాప విముక్తివిధానము చాతుర్యముతోఁ గల్పింపఁబడినది. ఆయుంగరము శక్రతీర్థమునఁ బడుటయు నొకజెస్తవానివలన రాజునకు మరల దొరకుటయుఁ గాళిదాసుని ప్రతిభావిలాసమువలననే. ఇంత యేల ? అభిజ్ఞానమైన యీ యంగులీయకమే యీనాటకసంవిధాన చాతుర్యమున కంతకును మూలాధారము. అందుచేతనే యీ నాటకమున కభిజ్ఞానశాకుంతలమ[3] మన్న పేరు వచ్చినది.

---

1. ద్విపద. క్రొత్తపూఁదేనియఁ గ్రోలంగ నీవు, చిత్తంబునను గోరి స్వేచ్ఛగా నపుడు
క్రొమ్మావివిరిదేనెఁ గోర్కి తీరంగ, నమ్మాడ్కి హాయిగ ననుభవించియును,
నిపు డీవు మధుపమా ! యింతలో నిచట, నపరూప మైన యీయంబుజవసతి
మఱగి సుఖించెదుమాత్రన యెట్లు, మఱవఁగల్గితి తొంటిమావిమంజరిని. ( వీరేశలింగకవి ).

2. రాజు – [తనలో] అది యేమో కాని గీతార్థమును విని ప్రియజనవియోగము లేకయు నే నేమియుఁ దోఁచనివాఁడనుగా నున్నాఁడను. అట్లు కాదు.

గీ. మున్నెఱుఁగకయు మది నంటు పూర్వజన్మ, భవ్యసఖ్యముల్ స్మరణకు వచ్చుఁ గాన
జనుఁడు సుఖితుఁ డయ్యు సురూపచయము గనియు, సుస్వరంబుల వినియు నుత్సుకతఁ గాంచు.
[అని యాకులపాటుతో నుండుచున్నాఁడు].

3. ఈ నాటకమునకుఁ గలకత్తాలో నచ్చువేసిననాగరీప్రతులలో నన్నింటిలోను ' అభిజ్ఞానశకుంతలమ్ ' అనియు, బొంబాయి, చెన్నపట్టణములలోఁ బ్రకటింపఁబడినవానిలోను ' అభిజ్ఞానశాకుంతలమ్ ' అనియుఁ బేర్లు కలవు. వాచస్పత్యమునందుఁగూడ నాటకముపేరు ' అభిజ్ఞానశకున్తలమ్ ' అనియే యున్నది. దీనివివర మిట్లు వ్రాయఁబడియున్నది : ' అభిజ్ఞానశకుంతలా – స్త్రీ. అభిజ్ఞాయతే కర్మణి ల్యుట్ తథాభూతాం శకుంతలా మధికృత్య కృతాఖ్యాయికా......లుబభావే అభిజ్ఞానశకుంతలమ్. న.' ఈ నాటకముపై టీక వ్రాసినవారిలో నొకఁడైన వైఖానస శ్రీనివాసాచార్యుఁడు ' అభిజ్ఞానశాకుంతలమ్ ' అనుపాఠమునే గ్రహించి యిట్లు విగ్రహము వ్రాసినాఁడు : ' శకుంతలా మధికృత్య కృతో గ్రంథ ఇతి శాకుంతలం – నాటకవిశేషణత్వాత్ నపుంసకం – అభిజ్ఞాన ప్రాధాన్యం ' శకుంతల – శాకుంతలరూపమె ట్లున్నను ' అభిజ్ఞానశాకుంతల ' మను సమాసముయొక్క విగ్రహమునుగుఱించి పలువురు పలువిధముల వ్రాసియున్నారు. ' అభిజ్ఞానస్మృతా శకుంతలా, అభిజ్ఞానశకుంతలా ( శాకపార్థివాదివత్ )' అని కొందఱును, ' అభిజ్ఞానం చ శకుంతలా చ ' ( ద్వంద్వము ) అనికొందఱును, ' అభిజ్ఞానేన స్మృతా శకుంతలా యస్మిన్ తత్ ( మధ్యమపదలోపి )' యని కొందఱును వ్రాసియున్నారు.

sampath_Ebooks

3. భారతకథలోఁ గాళిదాసునిచేఁ జేయఁబడిన మూఁడవ మార్పు కుమారసంబంధమైనది. కుమారుఁడు పుట్టినతరువాత వానితోఁగూడ శకుంతల రాజునొద్దకు వెళ్లినట్లు భారతమునం దున్నది. శకుంతల గర్భముతో నున్నప్పుడే, యనఁగా నింకను పిల్లవాఁడు పుట్టుటకుఁబూర్వమే రాజునొద్దకుఁ బోయె ననియు, నచ్చటనుండి యామె నిరాకరింపఁబడినతరువాత మారీచఋషియొక్క యాశ్రమములో నామె ప్రసవమై పుత్త్రునిఁ గనియె ననియు నాటకమునందుఁ గథ మార్పఁబడినది. ఇట్లు చేయుటకు రెండు మూఁడు కారణము లున్నవి. పిల్లవానితోఁగూడఁ దల్లి వచ్చియున్నయెడల, తల్లిని గుర్తింపకపోయినను చక్రవర్తిచిహ్నాంకితుఁడును, అమితసత్త్వుఁడును, దుష్యంతప్రతిముఁడును అగు సర్వదమనుని రాజు తనపుత్త్రునిగా గుర్తింపకయుండుట యసంభవము. గుర్తించినయెడల సంవిధానమునకు భంగము కలుగును. గుర్తించియో లేక గుర్తింపకయో రాజు కుమారునిఁగూడ వెడలఁగొట్టె నన్న యనౌచిత్యప్రసంగము సంభవించుటయే కాక సప్తమాంకమందలి సర్వదమనునిబాలలీలావినోదాదికభాగ మంతటికిని నాటకమునందుఁ బ్రసక్తి లేకపోవును.

౪. నాల్గవమార్పు శకుంతలాదుష్యంతులను హేమకూటము మీఁదఁ గశ్యపాశ్రమమందుఁ గలుపుట. రెండవ, మూఁడవ మార్పులను బట్టి యీ నాల్గవమార్పు చేయవలసివచ్చినది.

వేఱు మార్పులు :— పైని జెప్పఁబడినవి కథానకమందలి ముఖ్యమైనమార్పులు. ఈ మార్పులు చేసినంతమాత్రమున మూలకథలోనుండి చక్కనినాటకము వెలువడునా? వెలువడనేరదు. ప్రదర్శనీయమైన యప్రతిమనాటకరూపము వచ్చుటకు నింకను గ్రొత్త కథలును, క్రొత్తరంగములును, క్రొత్తపాత్త్రములును కావలెను. ఈ నాటకమందలి ప్రథమ, పంచమాంకములకును, సప్తమాంకమందలి స్వల్పభాగమునకును మూలభారతమునందు నాధారము గలదు. ద్వితీయ తృతీయ చతుర్థ, షష్ఠాంకములు పూర్తిగను, కొంచెము తప్ప మిగిలిన సప్తమాంక మంతయును కాళిదాసునియొక్క నూతనసృష్టి యనియే చెప్పవలసియున్నది; అనఁగా నిందలికథయు, నాయికానాయకులు దప్ప నితరపాత్త్రలును, రంగములును, కల్పనలును నవీనముగఁ గవిచే నిర్మింపఁబడినవి. మొదటఁ జెప్పినయంకములందుఁగూడ నూతనపాత్త్రలు కలవు. కాని మొత్తముమీఁదను గవికి మూలమందు నాధార మున్నది. రెండవభాగమునకు నా యాధారమైనను లేదు.

నాటకమునకు వన్నె పెట్టుటకై కవిచే నిర్మింపఁబడిన నూతన కథాసందర్భములలో, ప్రథమాంకమందలి భ్రమరప్రకరణమును, శకుంతల వెడలిపోవునపుడు రాజును చూచుటకై కాలికి దర్భ గ్రుచ్చుకొనె ననియు, బట్ట చెట్టునకుఁ బట్టుకొనె ననియు మిషలు కల్పించి యాఁగుటయు, నాల్గవయంకమందలి శకుంతల యత్తవారియింటికి బోవునప్పుడు లేడి యడ్డగించుటయు, ఐదవయంకమందలి హంసపదికాగానమును, ఆఱవయంకమందలి ధనమిత్త్రుని మరణవార్తయు, మాతలి వచ్చి విదూషకునిఁ బట్టుకొని పీడించుటయు, ఏడవయంకమందలి సర్వదమనుని మెడలోనితాయెతుమాహాత్మ్యమును ముఖ్యముగఁ జేర్కొనవలసియున్నవి. ఈ చిన్నచిన్న వ్యాపారములవలనఁ గవి కథయొక్క పూర్వాపరసందర్భములను చక్కఁగఁ గల్పుటయేకాక మానవునకుఁ దెలియకుండ మానవాంతఃకరణములో నుండునట్టి యుదాత్తభావములను మనోహరముగ వ్యక్తపఱచియున్నాఁడు. గొప్ప మార్పులకంటె నిట్టి కొలఁది మార్పులలోనే రసభావములను చిత్రించునట్టి కవి ప్రతిభయొక్క మనోహరాకృతి దృగ్గోచర మగును. ముఖ్యముగ దృశ్యకావ్యమునందు నూఱుపద్యములకంటె పదిరంగములకంటె నొక్కహావభావము, ఒక్కనయనకటాక్షము, ఒక్కచిఱునవ్వు, ఒక్క చిన్నమాట నూఱురెట్లు కథాసౌందర్యమును, సంవిధానకమాధుర్యమును హెచ్చించును.

శకునములమీఁద జనులకుఁగల నమ్మిక ననుసరించి, వానిని గథలోఁ జేర్చి యచ్చటచ్చటఁ గవి ముందు రాఁబోవుసంవిధానకమును ప్రేక్షకు లూహించునట్లు చేసియున్నాఁడు. రాజు తపోవనమునఁ బ్రవేశింపఁగనే యాతనిబాహువు స్ఫురింప నాతఁ డిట్లనును :

'శాంత మిద మాశ్రమపదం
స్ఫురతి చ బాహుః కుతః ఫల మిహాస్య,
అథవా భవితవ్యానాం
ద్వారాణి భవన్తి సర్వత్ర.[1]'   [౧-వ అంకము.

రాజునకుఁ గలుగఁబోవు మేలు, స్త్రీలాభ మిందువలన స్పష్టముగ సూచింపఁబడెను.

నాల్గవయంకమందు శకుంతల యత్తవారియింటికిఁ బోవ నుద్యుక్తయై కదలినపుడు శోకచక్రవాకి తామరాకుచాటున నున్న తన ప్రియునిఁ గానక తల్లడిల్లుచున్నట్లు కానవచ్చును.

'హలా పేక్ఖ! ణలిణీపత్తన్తరిదం పి సహఅరం అదేక్ఖన్తీ ఆదురా చక్కవాఈ ఆరడది[1] దుక్కరం అహం కరేమి.[2]'

కొంతకాలమువఱకును శకుంతలకుఁ గలుగఁబోవు పతివిరహము ప్రేక్షకులకీ శకునము చెప్పకచెప్పును.

1. గీ. ఇది ప్రశాంత మా నాశ్రమపదము చూడ, నదరెడు భుజంబు; ఫల మెట్టు లొదవు నిందు?
అట్లనఁగ నేల భాగ్యంబు లమర నున్న, కాలమందు, సర్వత్ర మార్గములు కలుగు.

2. సఖీ! చూడు. తామరాకుచాటున దాఁగిన ప్రియవల్లభుని గానక యాతురయై చక్రవాకాంగన కూయుచున్నది. దుష్కరమును నేను చేసితిని.

sampath_Ebooks



ఇట్లే సప్తమాంకమునందు రాజు మారీచాశ్రమమునఁ బ్రవేశించినప్పుడు మగల దుష్యంతునిబాహువు అదరును.

[ నిమిత్తం సూచయిత్వా ]

'మనోరథాయ నాశంసే కిం బాహో! స్పన్దసే వృథా,
పూర్వావధీరితం శ్రేయో దుఃఖం హి పరివర్తతే.1'

నాయికానాయకసమాగమము త్వరలోనే కానున్న దని యీ పద్యము చదివిన లేక విన్న యే చదువరికిఁగాని ప్రేక్షకునకుఁగాని తోఁచదు?

ఔచిత్యప్రశంస :— ముఖ్యముగ నిది శృంగారకావ్య మైనను, నాయికానాయకులనుగురించిన సంభోగవిప్రలంభశృంగారరసమును వర్ణించుటయే కవియొక్క యుద్దేశ మైనను, వినయమునకును, అత్యుచ్చనీతికల్పనలకును, మర్యాదకును భంగము రాకుండ నాటకమందలి సంభాషణములును, వర్ణనములును రచింపఁబడినవి. ఔచితికి భంగము రాకుండుటకై కవిపుంగవుఁడు పడినజాగ్రత్త యధికప్రశంసనీయము. రంగముమీఁదను స్త్రీపురుషు లొకరొకరినిఁ దాఁకి కూర్చుండుట గాని, కౌఁగిలించుట గాని, ముద్దాడుట గాని యొచ్చటను గానరాదు. ఈ విషయమునందు నీతఁడు పాశ్చాత్యనాటకకారులచే ననుకరణీయుఁ డని చెప్పవలెను. దుష్యంతుఁడును శకుంతలయు నేకాంతమునం దుండఁగా నామె వెళ్లఁబోవును. దుష్యంతుఁ డామె నాపఁజూచును, అప్పు డామె మర్యాదాభంగ మగు నని భయపడి,

'పౌరవ! రక్ష వినయం.'

'పౌరవ! వినయమును రక్షింపుము.' అనఁగా 'అవినయశీలుఁడవు గాకుము' అని యనును. పాపము, దుష్యంతుఁడు వినయమునకు భంగము చేయఁదలంచినను మాకవిమాత్రము ఓరకుండువాఁడు కాఁ డని యామె యెఱుంగదు!

నాయికానాయకు లొకచోటఁ గొంతకాల మున్నప్పుడు, శృంగారచేష్టలకుఁ దావు కల్గుట స్వాభావికము; ముద్దులవలె యూరకుండుట యస్వాభావికము. కావునఁ గవి యట్టి సమయమున వినయభంగము కలుగు నేమో యని ప్రేక్షకులకు భీతి కలుగునంతవఱకును గథాప్రసంగము తెచ్చిపెట్టి, ఆకస్మికమును, చమత్కారకరమును అగు ప్రసంగ మొకటి కల్పించి యా వినయభంగప్రసంగమును తప్పించును.

ఏకాంతమునం దున్నప్పుడు దుష్యంతుఁడు శకుంతలను ముద్దు పెట్టుకొనఁ బోవును. ఆమె నాట్యముచేఁ దప్పించుకొనును. అప్పుడింకను కొంచెముకాలము గడచిన స్వాభావికముగ నేమి జరగవలెను? నాయకుఁడు నాయికను బలవంతముగ ముద్దు పెట్టుకొనవలెను. అట్లు జరగ లేదని చూపుట అస్వాభావికము. జరగిన దని చూపుట అశ్లీలము, అనౌచిత్యము. కావునఁ గవి గౌతమియొక్కరాక యను ఆకస్మిక ప్రసంగమును గల్పించి వారి యేకాంతమునకు భంగము కల్పించెను ఆభాగముయొక్క యాంధ్రీకరణముమాత్ర మిచ్చుచున్నాను. గ్రంథవిస్తరభీతిచేత మూల మిచ్చుట లేదు :—

శకుంతల — ఆర్యా! ఇప్పుడు నన్ను విడువుము. మరల సఖీజనములఁ గని యనుమతింబు వడసివచ్చెద.

రాజు — అలాగుననే విడిచెదను.

శకుంతల — ఎప్పుడు?

రాజు — గీ. లలన! యపరిక్షితము గోమలంబు నైన
క్రొత్తపూఁదేనె భృంగంబు గ్రోలినట్లు
నీయనుగ్రహమునఁజేసి నే నొకింత
తవిలి నీయధరసుధను ద్రావుచిదప.

[ అని ఆమెముఖము నెత్తఁబోవుచున్నాఁడు].

శకుంతల — [ నాట్యముచే మోము త్రిప్పుకొనుచున్నది ].

[ తెరమఱుఁగున ]

ఓ చక్రవాకకాంతా! నీ సహచరుని వీడ్కొనుము. రాత్రి సమీపించుచున్నది.

శకుంతల — [ ఆలకించి తొట్రుపాటుతో ] ఓ పౌరవా! సందేహము లేదు. నా దేహస్థితిని దెలిసికొనుటకై పూజ్యురా లైన గౌతమి యిచ్చటికి వచ్చుచున్నది. ఆకొమ్మలచాటున దాఁగి యుండుము.

రాజు — అలాగుననే [ అని దాఁగుకొనుచున్నాఁడు ].

[ అంత చేతను పాత్రమును బట్టుకొని గౌతమియును సఖులును బ్రవేశించుచున్నారు].

పైవాక్యములలో 'చక్రవాకకాంతా' యన్న యన్యోక్తిచే శకుంతలకు గౌతమిరాక తెలిపినవా రామెసఖు లైన యనసూయాప్రియంవద లే యని చదువరు లూహించియుందురు. ఇట్లు ఔచితీపోషణకుఁ గల్పింపఁబడినయుక్తియు, దానికి ననుకూలముగఁ జెప్పఁబడిన యన్యోక్తియుఁ గవిసార్వభౌముని యద్భుతకల్పనాశక్తికి నిదర్శనములు.

శకుంతల మొదలగువారు వెడలిపోయినతరువాత రాజు ఈవలకు వచ్చి,

'ముహు రంగులిసంవృతాధరోష్ఠం
ప్రతిషేధాక్షరవిక్లవాభిరామమ్,

1. గీ. కోరను మనోరథం బేను గొంచెమేని, వ్యర్థముగ నో భుజంబ! నీ వదరె దేల?
మును నిరాకరించినమేలె పూని యిపుడు, దుఃఖముగ మాఱుచున్నది దుస్సహముగ.

sampath_Ebooks

ముఖమంసవివర్తి పక్ష్మలాక్ష్యాః
కథమప్యున్నమితం న చుంబితం తు.[1]'

అని చింతించును. ముద్దు పెట్టుకొనలేకపోవుట, రాజా! నీ తప్పు కాదు. అది కవిసార్వభౌమునియాజ్ఞ. దానిని నీవుమాత్రమె ట్లతిక్రమింపఁ గలవు?

శాకుంతలనాటకము దృశ్యకావ్యము. అందు ముద్దు పెట్టుకొనుట మొదలయినవ్యాపారములు కూడ దని నాట్యశాస్త్రనియమము లుండుటచేఁ గవి వానిని తప్పించెనే కాని యట్లు తప్పించుట బుద్ధిపూర్వకము కా దని కొందఱు వాదింపవచ్చును. కాని కాళిదాసాది మహాకవు లిట్లు పవిత్రమైన శృంగారమును ప్రదర్శించిరి కావుననే నాట్యశాస్త్రములయందు నట్టి నియమములు పుట్టుటకుఁ గారణ మైన దని చెప్పుట న్యాయ్యము; కాని నిరంకుశు లగుకవులు శాస్త్రనియమములను పాటించుట కిట్లు వ్రాసి రనుట న్యాయ్యము కా దని మా తాత్పర్యము.

ఇదియుఁ గాక నేఁడు మనదేశమునం దేమి, పాశ్చాత్యదేశములం దేమి యీ శాకుంతలనాటకమును శ్రవ్యకావ్యముగఁ జదివి పండితు లానందించుచున్నా రేకాని దృశ్యకావ్యముగఁ గాదు. మన పురాతన పండితులు దానిని పొగడినను, గెటేవంటి పాశ్చాత్యకవిపుంగవులు దానిని తలఁదాల్చినను కావ్యము చదివి సంతసించినవారే కాని నాటక ప్రదర్శనమును జూచి యానందించినవారు కారు. కావున దీనిని దృశ్యకావ్యములలోను, శ్రవ్యకావ్యములలోను శ్రేష్ఠ మనియే చెప్పవలెను. మేము పైని చెప్పిన ఔచితి యనునది యీ కావ్యమునకు శ్రవ్యకావ్యముగఁగూడ ఘనతఁ దెచ్చుటకుఁ గారణ మని చెప్పవచ్చును.

ఇంకొకవిశేషము. కనఁబడు కథాభాగమునందే కాక వినఁబడుకథాభాగమునందుఁ గూడ కవి శృంగారవర్ణనములందు నౌచితిని మిక్కిలి జాగరూకతతోఁ బోషించినాఁడు. మహాభారతమునందు శకుంతలాజన్మవృత్తాంత మంతయు దుష్యంతునకు శకుంతలయే చెప్పును. అంతియ కాదు. మేనక వెళ్లి విశ్వామిత్రుని మోహింపఁజేసి యాతనితపమునకు విఘ్నముకల్గించినవిధ మంతయు వన్నెచిన్నెలతో వర్ణించును. ఇది యంతయు నస్వాభావికము. నాయిక సిగ్గు విడిచి తనతల్లియొక్క వ్యభిచారవృత్తాంత మంతయు నాయకునకు వివరముగఁ జెప్పుట విపరీతముగదా? కావున ఈ కథను మనకవి దుష్యంతునకు శకుంతల సఖి యైన అనసూయచేఁ జెప్పించెను. ఆ చెప్పించుటలోను మొదటిభాగము కొంచెము చెప్పించి మిగిలినభాగము వినయముచే ననసూయ చెప్పలేకపోయినట్లును, రాజూహించినట్లును చెప్పెను. ఆ భాగ మిం దుదాహరించుచున్నాము:—

రాజు — మహానుభావుఁ డగు కాశ్యపుఁ డు శాశ్వతబ్రహ్మనిష్ఠుఁ డని ప్రసిద్ధి. అట్టివాని కెట్లు మీ నెచ్చెలి కూఁతు రయ్యెను?

అనసూయ — దేవా! యాకర్ణింపవలయును. కౌశికుఁ డని వంశనామము గల మహాప్రభావసంపన్నుఁ డయిన రాజర్షి యొకఁడు కలఁడు.

రాజు — కలఁడు. వినియున్నాను. అనంతరము.

అన — అతఁడే మా చెలియను గన్నవాఁడు. కన్నవానిచే విడువఁబడినయామెను పెంచుటమొదలుగాఁగల పనులు నిర్వర్తించుటం జేసి పూజ్యు లగు కణ్వులును నీమెకు జనకు లయిరి.

రాజు — 'విడువఁబడిన' యను శబ్దశ్రవణముచేతనే వేడుక పొడముచున్నది. మొదటినుండియు వినఁగోరుచున్నాను.

అన — దేవర యవధరింపవలయును. పూర్వ మారాజర్షి యుగ్రతపస్సు చేయుచుండఁగా, దేవతలు భయపడి యా నియమమునకు విఘ్న మాచరింప మేనక యను నప్సరసం బుచ్చిరి.

రాజు — దేవతలకీ పరతపోభయశీలత యెప్పుడు నున్నదియే. తర్వాత, తర్వాత.

అన — అంత నత్యంతరమణీయ మగు వసంతకాలమున నున్మాదమును బుట్టించు నామెరూపమును జూచి......

[అని సగము చెప్పి లజ్జచే నూరకున్నది]

రాజు—అపయిని తెలియనే తెలియుచున్నది. తప్పక యీపె యప్సరస్సంభవయే.

ఇచ్చటి 'అని సగము చెప్పి లజ్జచే నూరకున్నది' యన్న యొకవాక్యము వినయమును సూచించి కవియొక్కభావ మెంత పవిత్రమైనదియో తెలిసికొనుటకుఁ జాలును. ఇక్కడ మేనకకథ వర్ణనవిషయము గాని నర్తనవిషయము కాదు. నోటఁ జెప్పవలసినదే కాని చేసి చూపవలసినది కాదు. శ్రవ్యకావ్యవిషయమే కాని దృశ్యకావ్యవిషయము కాదు. కావున నిష్టము వచ్చినట్లు శృంగారము వర్ణించుటకుఁ గవికి నిచ్చట నాట్యశాస్త్రనియమము లడ్డము రావు. రంగమందు ముద్దు పెట్టుకొనవలదన్నాఁడు, కౌఁగిలించుకొన వలదన్నాఁడు, కాని ముద్దుకౌఁగిలింతలు వర్ణింపవల దని చెప్పలేదు. అయినను సత్కవి ఔచితి విచారింపఁడా? ఇచ్చట వర్ణన చేయుచున్న దొకస్త్రీ. ఆమె యొకపురుషునకు మఱియొకస్త్రీపురుషులశృంగారచేష్టలను వర్ణించుట వినయమునకు భంగకరము. కావున నీకవిపుంగవుఁడు మిగిలినభాగ మంతయు రాజే యూహించుకొనునట్లు చేసెను.

స్వభావవర్ణనము:— నాటకము లోకవ్యవహారమునకుఁ బ్రతిబింబముగ నుండవలయును. నాటకమందలి ప్రసంగములు ప్రేక్షకుల

1. గీ. మాటి కధరంబు వ్రేళ్లతో మాటికొనుచు, నడ్డగింపుమాటలను విహ్వలతఁ జూపి
మూఁపువంకఁ ద్రిప్పిన కల్కి ముద్దుమోము, లేవనెత్తియు ముద్దిడలేకపోతి.

యనుభవమునకు సరిపోవుచుండవలయును. ఇదియే శ్రవ్యకావ్యము నందలివర్ణనావిషయమైనయెడల దానిని స్వభావోక్తి యనియెదరు. కేవలాలంకారగ్రథితవర్ణనములకంటె నొక్క స్వభావోక్తిశోభితమైన వర్ణనము సహృదయులహృదయమును త్వరగ నాకర్షించుకొనును. శ్రవ్యకావ్యములయందే స్వభావోక్తి కింత ప్రాధాన్య ముండ నిక స్వాభావికవర్ణనములును, స్వాభావికప్రదర్శనములును, ప్రసంగములును దృశ్యకావ్యమునకుఁ బ్రాణములతో సమానము లని చెప్పవలెనా? ఇందును గుఱించి చిత్రకారుఁడును, కవియు పెట్టుకొనవలసినగుఱి యొక్కటియే. సృష్టియందుఁ గానవచ్చెడువస్తువులు గాని, సంసారమునందు జరుగునట్టిప్రసంగములు గాని ప్రత్యక్షముగఁ గనులకుఁ గానవచ్చుచున్నవా యేమి యన్నట్లుభయులును వర్ణములతోఁ జిత్రింపవలయును. ఒకఁడు కజ్జలరూపవర్ణములతోడను, మఱియొకఁడు శబ్దరూపవర్ణములతోడను వ్రాయవలెను; ఇంతియ భేదము. పటమును జూచి పురుషుఁడే యన్నభ్రాంతి గలుగునట్లు చిత్రించినవాఁడు చిత్రకారుఁడు. వినుచున్నలేక చూచుచున్నప్రసంగము నిజమైనదియే యన్నభ్రాంతి తప్పకమైనను కలుగునట్లు వర్ణించువాఁడు కవి. కవిని సుర్తింపవలసినసుర్తు లనేకము లున్నవి. వానిలో నిది యొకటి.

ఈ దృష్టితో శాకుంతలనాటకమును చూచితిమేని యందు ప్రత్యక్షముగఁ జూచుచున్నామా యన్నట్లు వర్ణనములును, హృదయతాదాత్మ్యమును కలుగఁజేయునట్టి ప్రసంగములును గల రంగములును పెక్కులు కలవు. కొన్ని యుదాహరణములను మాత్ర మిచ్చట నిచ్చుచున్నాము.

కేవలవర్ణనములను జూడుఁడు :—

౧. రాజు వెంటఁబడిగిలివందునఁ బ్రాణభయముతోఁ బరుగెత్తుచున్న లేడియొక్క యీ క్రిందివర్ణనము స్వభావోక్తికి నుత్కృష్టోదాహరణ మని చెప్పవలెను.

'గ్రీవాభంగాభిరామం ముహు రనుపతతి స్యందనే దత్తదృష్టిః
పశ్చార్ధేన ప్రవిష్టః శరపతనభయా ద్భూయసా పూర్వకాయమ్,
దర్భై రర్ధావలీఢైః శ్రమవివృతముఖభ్రంశిభిః కీర్ణవర్త్మా
పశ్యోదగ్రప్లుతత్వాద్వియతి బహుతరం స్తోకముర్వ్యాం ప్రయాతి.1'

ఇందు, లేడి తనవెంటఁ దగిలివచ్చుచున్న రథమును తేప తేపకు మెడ త్రిప్పి చూచుటయు, బాణ మెక్కడ వచ్చిపడునో యన్న భీతిచేత తనవెనుకశరీరమును ముందునకు లాగుకొనుటయు, తినుచున్న దర్భలను మార్గమం దంతటను పడవేయుటయు, భూమిని తాఁకీతాఁకనట్లుగ నెగురుచు వెళ్లుటయు కనులకుఁ గట్టినట్లుగ వర్ణింపఁబడినవి.

౨. ఇట్లే గుఱ్ఱములవేగమును స్వాభావికముగ వర్ణింపఁబడినది:-

'ముక్తేషు రశ్మిషు నిరాయతపూర్వకాయా
నిష్కంపచామరశిఖా నిభృతోర్ధ్వకర్ణాః,
ఆత్మోద్ధతైరపి రజోభి రలంఘనీయా
ధావ న్త్యమీ మృగజవాక్షమయేవ రథ్యాః.2'

పగ్గములు సళ్లు చేసినపుడు గుఱ్ఱములు మేను సాఁచి, చెవులు నిక్కఁబెట్టి మిక్కిలి వేగముతోఁ బరుగెత్తుట రథము నెక్కువారికి ననుభవవేద్యముగదా?

3. ఇటు దుష్యంతుఁడు తన్ను భార్యగా నంగీకరింపక పోవుటయు, అటు గురుశిష్యులు తమవెంట రావల దని అదలించుట తటస్థించినప్పుడు శకుంతల రాజుపై దీనదృష్టితోఁ జూచె నని యీ క్రింద వర్ణించినాఁడు. ఆదృష్టి యెవరికి జాలి పుట్టింపకుండును?

'ఇతః ప్రత్యాదేశాత్ స్వజన మనుగంతుం వ్యవసితా
స్థితా తిష్ఠేత్యుచ్చై ర్వదతి గురుశిష్యే గురుసమే,
పున ర్దృష్టిం బాష్పప్రసరకలుషా మర్పితవతీ
మయి క్రూరే యత్తత్ సవిషమివ శల్యం దహతి మామ్.3'

౪. ఆఱవయంకమునందు, రాజు శకుంతలచిత్రపటము వ్రాసి అందు నింకను తాను పూరింపఁ దలఁచుకొన్నభాగముల నీక్రిందివిధముగ వర్ణించినాఁడు. ప్రకృతిని - సృష్టిని మిక్కిలి సూక్ష్మదృష్టితోఁ జూచుటకు నంతశ్చక్షువు కవిపుంగవునకుఁ గల దని చూపుటకు నింతకంటె మఱియేమి కావలయును?

'కార్యా సైకతలీనహంసమిథునా స్రోతోవహా మాలినీ
పాదాస్తామభితో నిషణ్ణహరిణా గౌరీగురోః పావనాః,
శాఖాలంబితవల్కలస్య చ తరో ర్నిర్మాతుమిచ్ఛా మ్యధః
శృంగే కృష్ణమృగస్య వామనయనం కండూయమానాం మృగీమ్.4'

---

1. చ. వడిఁ బఱతెంచు తేరి దెసఁ బల్మఱు మార్మెడ పెట్టి చూచుచుం, గడు శరపాతభీతిఁ దన కాయము ముందుకుఁ జొంచి, యొంతయుం బడలిక నోటినిం దెఱచి మార్గమునిండ సగంబు తిన్న దర్భలు పడ, మింటఁ బాఱెను ధరం బద మూనక, పెద్దదాఁటులన్.

2. ఉ. పగ్గముల న్సడల్చుడును వాజులు మేనులు సాఁచి పాఱెడున్, నిగ్గగు చామరాగ్రములు నిశ్చలతన్ వహియింపఁగాఁ జెవుల్ దిగ్గన నిక్కఁబెట్టి తమలేపినధూళికి నంటరానివై, వెగ్గలి పాఱు నామృగమువేగము సైఁపక కూడఁ బాఱు నాన్.

3. ఉ. ఏను నిరాకరింప నపుడే స్వజనంబులవెంటఁ బోవఁబోఁ,గా, నిలు మంచు గట్టిగను గురుసమానుఁ డదల్ప శిష్యుఁ డా చాన నిగిడ్చె బాష్పకలుషం బగుదృష్టిని గ్రూరునైన నా,పై, నది నన్నుఁ బెన్విషపుబాణముకై వడి నిర్దహించెడున్.

4. చ. పులినములందు హంసయుగము ల్విహరించెడుమాలినీనదిన్, బలుహరిణంబు లున్నతదుపాంతపవిత్రహిమాద్రిపాదమున్ వలువలు గట్టుశాఖలను వర్తిలువృక్షముక్రింద నిల్చికొమ్ములఁ దనకన్ను గోఁకికొను ముగ్ధమృగిన్ లిఖియింపఁగోరెదన్.

sampath_Ebooks



౫. ఆకాశముమీఁదనుండి త్వరగా క్రిందికి దిగుచున్నవారికి భూమి యెట్లు గానవచ్చునో యీ క్రిందిపద్యమందు వర్ణించి యున్నాఁడు:—

రాజా—[ అధోఽవలోక్య ].

'మాతలే! వేగావతరణా దాశ్చర్యదర్శన స్సంలక్ష్యతే మనుష్యలోకః. తథాహి[1]

శైలానా మవరోహతీవ శిఖరా దున్మజ్జతాం మేదినీ
పర్ణాభ్యంతరలీనతాం విజహాతి స్కంధోదయాత్ పాదపాః,
సంతానా త్తనుభావనష్టసలిలా వ్యక్తిం భజం త్యాపగాః
కేనా ప్యుత్‌క్షిపతేవ పశ్య భువనం మత్పార్శ్వ మానీయతే.[2]

[ ౭–వ యంకము.

౬. చిన్నబాలునిచేష్టలును, అందువలనఁ దండ్రికిఁ గలుగుసంతోషమును ఈ క్రిందిపద్యమునందు వర్ణింపఁబడినవి. చిన్నబిడ్డలను ముద్దులాడి యా యానందమునఁ బరవశతఁ జెందుభాగ్యము లభించిన తలిదండ్రులందఱకును నిందలిభావము స్వానుభవైకవేద్యము.

'ఆలక్ష్యదన్తముకులా ననిమిత్తహాసై
రవ్యక్తవర్ణరమణీయవచః ప్రవృత్తీన్,
అంకాశ్రయప్రణయిన స్తనయాన్ వహన్తో
ధన్యా స్తదంగరజసా మలినీభవన్తి.[3]'

ఈ శ్లోకతాత్పర్యమును చదివి గేటే యను జర్మన్‌కవి సార్వభౌముఁ డానందాతిరేకమునఁ దాండవ మాడెనఁట!

ఇవి విడివిడి శ్లోకములకు నుదాహరణములు. ఇఁకఁ బ్రసంగములయుదాహరణము లొకటిరెం డిచ్చి యీ ప్రకరణము ముగించెదము. ప్రథమాంకమునందు శకుంతలా ప్రియంవదానసూయలు చెట్లకు నీరుపోయుటయు, వారిసంభాషణమును నైసర్గికముగ నుండుటవలన రసము నెంతయుఁ బోషించుచున్నవి. ముగ్ధత్వయౌవనములకు నడుమనుండు ఈడుగల బాలిక లిట్లు మాటాడుకొనుట సహజముగదా!

నాల్గవయంక మిందుకువిషయమున విశేషముగఁ జేర్కొనఁబడఁదగి యున్నది. ఈనాటకమునందు నాల్గవయంకమును, అందు నాల్గు శ్లోకములును మిక్కిలి మనోహరము లని ప్రఖ్యాతి కలదు.

'కావ్యేషు నాటకం రమ్యం తత్ర రమ్యా శకుంతలా,
తత్రాపిచ చతుర్థోఽంక స్తత్ర శ్లోకచతుష్టయమ్.'

కావ్యములలో నాటకము రమ్యము, నాటకములలో శాకుంతలము, అందు నాల్గవయంకము, అందు నాల్గుశ్లోకములును మిక్కిలి రమ్యములు. ఈనాల్గవయంకమునకు నింత రమ్యత కల్గుటకుఁ గారణ మేమి? ఎల్లప్పుడును మనకుటుంబములలో జరగుచున్న ఆఁడుపిల్లను అత్తవారియింటికిఁ బంపుట యనువ్యాపారమును కవి యీ యంకమునందు నున్నది యున్నట్టుగాఁ జిత్రించుటయే యీ యంకముయొక్క యోగ్యత హెచ్చుటకుఁ గారణము. ఈయంకము చదివి కాని చూచి కాని యే సహృదయుఁడు కంటఁ దడి పెట్టకుండును? జాలి పడకుండును? తాను తనకూఁతును అత్తవారియింటికిఁ బంపినప్రసంగము జ్ఞప్తికిఁ దెచ్చుకొనకయుండును? అందఱకును దెలిసినట్టియు, నందఱి మనస్సులఁ గరఁగించునట్టియు నీకూఁతు నత్తవారియింటి కంపు ప్రసంగము కవిపుంగవునిచే నింత యథార్థముగ వర్ణించుటఁ జూచి యిచ్చటఁ గవి తన స్వానుభవమునే వర్ణించెనా యేమి యని మన మూహించినను నూహింపవచ్చును. శ్లోకచతుష్టయములోనిది యగు 'యాస్యత్యద్య శకుంతలేతి' యన్న పద్య మెవ్వనిమనసు గరఁగింపకుండును?

ఇచ్చటఁ దండ్రి ఋషి యైనను, తల్లి లేకపోయినను, ఇల్లు తపోవన మైనను, ఇతరజనులు బ్రహ్మచారులును, బ్రహ్మచారిణులును అయినను, వారిపవిత్రత కెంతయు భంగము రాకుండఁగ, సామాన్యగృహస్థునియింట నంపకములు జరగుచున్నట్టుగనే కవి ఛాయాపటమును దింపియున్నాఁడు. ఇది విశేషములోని విశేషము.

పిల్లను పతియింటికిఁ బంపునప్పు డామెకు వస్త్రాభరణము లిచ్చుటయు, వడి నింపుటయు, వెంటఁ దగినబంధువుల స్త్రీపురుషుల నిచ్చి పంపుటయు, పిల్లకుఁ దగినబుద్ధులు చెప్పుటయు, వెంటఁ జాల దూరమువఱకును బోవుటయు, ఆఁగవలసిన దని యితరులు చెప్పువఱకును బోవుచుండుటయు, పిల్ల బంధువులను కౌఁగిలించుకొని దుఃఖించుటయు, పోలేకపోలేక పోవుటయు, చివరకు 'అమ్మాయిని అత్తవారియింటికిఁ బంపితిని. నాభారము తీఱినది. మగఁడు పెండ్లాము సుఖముగ నున్నఁజాలు' అని తండ్రి యనుకొనుటయు నీయంకమునందు మనయింట జరగినట్లే చూపఁబడినవి. ఈసందర్భమున ఈ క్రిందిగద్యపద్యములు గమనింపఁదగియున్నవి.

శకుంతలా—

[బాష్పం విసృజతి]

ఉభే సఖ్యౌ – సహి ఉఇదం ణ దే మంగలకాలే రోఇదుం.

---

1. రాజు (క్రిందఁజూచి)— మాతలీ! వేగముగా దిగుచుండుటవలన మనుష్యలోక మాశ్చర్యదర్శన మయి కనఁబడుచున్నది.

2. చ. అదె మహీ ప్రస్ఫుటాద్రిశిఖరావళినుండియు డిగ్గనట్టు లౌ, మొదలులు తోఁపఁ జెట్టు డిగ మున్నటు లాకులలో నడంగుటల్ నదులు తొలంగ డాయుట జలంబు కనంబడ నట్టిరూపముల్, బదిగ నెవండొ భూమి నిటు ప్రక్కకుఁ ద్రోసెడురీతి తోఁచెడున్.

3. ఉ. హేతువు లేనినవ్వుల నొకించుక చూపుచు లేఁతదంతముల్, వాతెర చింద నందముగఁ బల్కుచు స్పష్టము గానివాక్కులన్ భూతలధూళి దేహమునఁ బూయుచు మైల యొనర్చు పుత్రులం, బ్రీతిని ధన్యులెత్తి తొడమీఁదను జేర్చి సుఖింతు రెంతయున్.

sampath_Ebooks



శుభకాలమం దేన్నటి తప్పని సమాధానము చెప్పుట యిప్పటికిని గలదు.

కాశ్యపః :—

'సంకల్పితం ప్రథమమేవ మయా తవార్థే
భర్తార మాత్మసదృశం సుకృతైర్గతా త్వమ్,
చూతేన సంశ్రితవతీ నవమాలికేయ
మస్యా మహం త్వయి చ సంప్రతి వీతచింతః.[1] '

కూఁతునకుఁ దగిన సంబంధము దొరకఁగాఁ దండ్రికిఁ గలుగు సంతోష మిచ్చట ముపమానముతోఁ జెప్పఁబడినది.

కాశ్యపః :—

'అభిజనవతో భర్తుశ్లాఘ్యే స్థితా గృహిణీపదే
విభవగురుభిః కృత్యైస్తస్య ప్రతిక్షణ మాకులా,
తనయమచిరాత్ ప్రాచీవార్కం ప్రసూయ చ పావనం
మమ విరహజాం న త్వం వత్సే! శుచం గణయిష్యసి.[2] '

గొప్పవారియింటి కిచ్చినయమ్మాయిని తలిదండ్రులు గాని, యన్నదమ్ములు గాని హాస్యమునకు 'మీయత్తవారియింటికి వెళ్ళినతరువాత నాయంతఃపురములలో, కంటెలు కాసులపేరులలో మేము జ్ఞాపక ముందుమా?' అని యనుచుందురు గదా!

అర్థో హి కన్యా పరకీయ ఏవ—

ఎన్నిదినము లున్నను ఆఁడుపిల్ల యొకనియింటికిఁ బోవలసినదే యని మనవారు చెప్పుమాటయేకదా యిది.

ఈ నాటకమునందలి ముఖ్యపాత్రములు : వాని స్వభావోన్మీలనము :— మహాభారతకథయందుఁ గల పాత్రములు నాలుగు: దుష్యంతుఁడు, శకుంతల, కణ్వుఁడు, సర్వదమనుఁడు. ఈనాలుగును నాటకమునందు ముఖ్యపాత్రములుగనే యుంచఁబడినవి. కొన్ని క్రొత్తపాత్రము లధికముగఁ జేర్పఁబడినవి. అట్లు చేర్పఁబడినవానిలో శకుంతలసఖు లగు అనసూయాప్రియంవదలు, గౌతమి, కణ్వశిష్యు లైన శారద్వత శార్ఙ్గరవులు, విదూషకమాఢవ్యుఁడు అనువారు ముఖ్యులు. 'ఈ నాటకమునందలిముఖ్యపాత్రముల గుణావగుణము లెట్టివి? కవి వానిని ఏయుద్దేశములో నిర్మించెను? ఆయుద్దేశము ఫలించునట్లు వానిని నాతఁడు చిత్రించెనా లేదా, ఈపాత్రముల యేయేచర్యలచే మన మెట్టిస్వభావముల నూహింపవచ్చును?' అను చర్చను స్వభావోన్మీలన మనియెదరు. ఇయ్యది యింగ్లీషులోని క్యారక్టరైజేషన్ (Charactarisation) అనుపదమునకు నూతనముగ నిర్మింపఁబడినప్రతిపదము. దీనిని మన ఆలంకారికులు సాధారణముగ పాత్రౌచిత్య మనియెదరు. ఈ నాటకములోని ముఖ్యపాత్రములను గురించి యిట్టిచర్చ కొంతవఱకు సంక్షేపముగఁ జేయుదము.

ఒకానొకమనుష్యుఁ డెట్టివాఁ డైనదియు నాతనిగుఱించి యితరులు చేసిన వర్ణనములనుబట్టియు, నాతఁ డాడెడుమాటలనుబట్టియుఁ, జేయు పనులనుబట్టియుఁ దెలిసికొనవచ్చును. కవియుఁ దనపాత్రముల స్వభావము చదువరులకు నీరూపముననే తెల్పును. ఒరులు చేయు పొగడ్తలు స్వభావోన్మీలనమునకు నంతగఁ బోషకములు కావు. పాత్రముయొక్క ఆత్మగతసంభాషణలవలనను, ఏకాంతమందలి యాచరణవలనను స్వభావము చక్కఁగ వెల్లడి యగును; అనఁగాఁ గవి యేయేపాత్రలగుణ మెట్టిది యని చూపఁదలఁచుకొనియెనో యా యా గుణమునకుఁ దగినట్లు వారిసంభాషణములును, నడతలును ఉండునట్లు వర్ణింపవలెను. కావున కావ్యమందలి నాయకాదుల చర్యలనుబట్టి వారిస్వభావమును ఆలంకారికులు నిర్ణయింతురు. ఈ మార్గమున మన మీనాటకమందలి ముఖ్యస్త్రీపురుషులస్వభావమును పరీక్షింతము.

దుష్యంతుఁడు :— ఈ నాటకమున దుష్యంతుఁడు నాయకుఁడు. ఇది శృంగారకావ్య మగుటచే శృంగారనాయకుఁడు; అనగా నొకానొకస్త్రీపై ననురాగము కలిగి యామెను కోరువాఁడు. శృంగారప్రబంధ మైనందున నాయకుఁడు కాముకుఁడుగా నున్నను అతఁడు మాననీయసద్గుణశోభితుఁ డైన ధీరోదాత్తుఁడు. ధీరుఁడు, ఉదాత్త గుణోపేతుఁడు. ధీరోదాత్తనాయకుఁడు మహాసత్త్వుఁడుగను, అతిగంభీరుఁడుగను, కృపావంతుఁడుగను, అవికత్థనుఁడుగను, నిగూఢాహంకారుఁడుగను, దృఢవ్రతుఁడుగను ఉండవలయు నని ధనంజయునిదశరూపకమందుఁ జెప్పఁబడినది (౨. ౪)[3]. మహాసత్త్వుఁ డనఁగా, సత్త్వగుణప్రాధాన్యము కలవాఁడు లేక అసమానశక్తియుఁ బౌరుషమును కలవాఁడు. వికారము లున్నప్పటికిని చలింపనివాఁడు, గంభీరుఁడు. పరదుఃఖనివారణేచ్ఛగలవాఁడు, కృపావంతుఁడు (క్షమావంతుఁ డని కొన్నిగ్రంథములు). ఆత్మస్తుతి నొల్లనివాఁడు, అవికత్థనుఁడు — ఉద్దిష్టకార్యమునుండి చలింపనివాఁడు స్థిరుఁడు. ఇతనినే ధీరుఁ డందురు. తనసామర్థ్యాదికములయెడల నమ్మిక గలిగి ప్రవర్తించుచు గర్వమును పైకిఁ గానరానీయనివాఁడు, నిగూఢాహంకారుఁడు.

---

1. గీ. తొలుత నీనిమిత్తము నేను దలఁచినట్లు, పుణ్యమున నీవుఁ దగుభర్తఁ బొంది తీవు
మావిఁ జేపట్టె నెలమి నీమాధవియును, గాన మీకయి యిఁకఁ జింత మానియుందు.
2. చ. గరిమ మహాకులీనుఁ డగు కాంతునిపట్టపుదేవి వౌచు, దుర్భర ఘనకార్యవైభవము పైఁబడి యుండి ప్రతిక్షణంబు భాస్కరు నలపూర్వదిక్కువలెఁ గాంచి పవిత్రునిఁ బుత్రు వేగ మద్విరహభవార్తిదుఃఖమును బిడ్డ! గణింపవు నీవు లేశమున్.
3. ఈ దశరూపకలక్షణమును అనుసరించియే ప్రతాపరుద్రీయమునందు విద్యానాథుఁడు ధీరోదాత్తలక్షణ మిట్లు చెప్పియున్నాఁడు:—
మహాసత్త్వోఽతిగంభీరః కృపావా నవికత్థనః, ప్రతాపరుద్రవ ద్ధీరో ధీరోదాత్తస్స సమ్మతః. [౧. ౨౮.]

sampath_Ebooks



ఇప్పు డిట్టిగుణమును ఆత్మగౌరవ మందురు. తాను కర్తవ్య మనుకొన్న పనిని ఎన్ని యాటంకములు వచ్చినను సాధించువాఁడు దృఢవ్రతుఁడు. పైలక్షణమునుబట్టి చూడ మన యాలంకారికుల మతమున ధీరోదాత్త నాయకుఁ డనన్యసామాన్యసద్గుణభూషితుఁ డై యుండవలెను.

మననాయకుఁడైన దుష్యంతుఁడు నాల్గవయంకమునందుఁ దప్ప మిగిలినయాయంకములలోను వేఱు వేఱు అవస్థలలో రంగముపైని గానిపించును. కావున నాతనియందుఁగల వేఱువేఱు గుణములను మనము సావకాశముగఁ జూడవచ్చును. మొదట నాటకము ప్రారంభ మైనతోడనే దుష్యంతుఁడు మనకు వేఁటకాఁడుగఁ గానిపించును.[1]

నాయువేగముతోఁ బరు గెత్తుచున్న లేడివెంటఁ దగిలి దానిని జంప వలెనని వచ్చుచున్న యాతని మృగయాప్రియత్వము స్పష్టపడును. వేఁట వ్యసన మని యున్నను రాజులకు నది యుద్ధమునకుఁ బూర్వప్రయత్నముగ నెంచఁబడినది. ఇందువలనఁ గావలసినంతగ వారిపౌరుషమునకుఁ బదును పెట్టినట్టగును. కావున పైనఁ జెప్పఁబడిన సూచనప్రకారము రంగముమీఁదికి రాజు వచ్చినతోడనే యాతనిధనుర్విద్యాప్రతిభ వెల్లడియగును. ప్రవేశింపఁగనే సూతునివాక్యము చూడుఁడు :—

'కృష్ణసారే దద చ్చక్షు స్త్వయి చాధిజ్యకార్ముకే,
మృగానుసారిణం సాక్షాత్పశ్యామీవ పినాకినమ్.[2]'

ధనుర్ధరులలో పినాకపాణి (శివుఁడు) శ్రేష్ఠుఁడు. రాజు యొక్క ధనుర్ధరత్వము వెల్లడిచేయుటకై సూతునినోట నీసామ్యమ్యము చెప్పింపఁబడినది. రాజుయొక్క యమితసత్త్వమును, గంభీరాకృతియు ద్వితీయాంకమునందు నీ క్రిందిశ్లోకమున సేనాపతిచేఁ జక్కఁగఁ జిత్రింపఁబడినవి :—

'అనవరతధనుర్జ్యాస్ఫాలనక్రూరపూర్వం
రవికిరణసహిష్ణు స్వేదలేశై రభిన్నమ్,
అపచితమపి గాత్రం వ్యాయతత్వా దలక్ష్యం
గిరిచర ఇవ నాగః ప్రాణసారం బిభర్తి.[3]'

దుష్యంతుఁడు రెండవ మూఁడవ యంకములందు విశేషముగఁ గాముకుఁడుగనే కానవచ్చును. ఆవిషయము మరలఁ జర్చించెదము. షష్ఠసప్తమాంకములయందు నింద్రుఁడు మాతలిని రథమును బంపి తన సాహాయ్యమునకు దుష్యంతునిఁ బిలిపించుకొనుటయు, ఇంద్రసభ యందు నతనికి జరగినగౌరవమును ప్రత్యక్షముగ రంగముపైఁ జూపక పోయినను సంభాషణలలో వర్ణించి, చదువరులు దుష్యంతుని నను పమశౌర్యాదికములుగల యద్వితీయవిభూతి యని తలఁచునట్లు కవి కల్పించెను. నాటకము పూర్తి యగుసమయమున దేవతలతండ్రి యైన మారీచఋషిచే దేవతలతల్లి యైన అదితికి నీరాజును జూపించి, ఈప్రకారము చెప్పించి ప్రేక్షకు లందఱును దుష్యంతునిగుఱించి యధికాదర ముతో నిండ్లకు వెళ్లునట్లు చేసెను.

'మారీచః (రాజాన మవలోక్య) దాక్షాయణి,
పుత్రస్య తే రణశిరస్యయ మగ్రయాయీ
దుష్యంత ఇత్యభిహితో భువనస్య భర్తా,
చాపేన యస్య వినివర్తితకర్మ జాతం
త త్కోటిమ త్కులిశ మాభరణం మఘోనః.'

అదితిః— సంభావణీఅణుభావా సే ఆకిదీ (సంభావనీయానుభావా అస్య ఆకృతిః)[4]

దుష్యంతుఁడు కేవలము చక్కనివాఁడు, గంభీరాకృతికలవాఁడు, గొప్పవిలుకాఁడు, ఇంద్రునియర్ధాసన మెక్కినవాఁడు మాత్రమే కాఁడు. ఇవి యన్నియు నాయకునియొక్క సామగ్ర్యమును దెలుపునేకాని యందువలనఁ గావలసినంతగ నాతనిసద్గుణములు, సచ్చారిత్రము బోధపడనేరవు. దీనుల సాధువుల రక్షించుటయు, ఆర్తుల నుద్ధరించుటయు, తనసౌఖ్యము నైనఁ బోవిడిచి ప్రజలకు సౌఖ్యము కలుగఁజేయుటయు రాజుయొక్క ముఖ్యధర్మములు. ప్రకృతిరంజనమే, అనఁగాఁ బ్రజలకు సౌఖ్యము కలిగించుటయే, రాజుముఖ్య కర్తవ్య మని కాళిదాసుని సిద్ధాంతము. ఆ సిద్ధాంతమునకు ననుగుణముగ నాతఁ డీనాటకమునం దంతటను, దుష్యంతునిఁ జిత్రించినాఁడు. మొదటియంకమునుండి చివరయంకమువఱకును, పెక్కు ప్రసంగములు కల్పించి కవి నాయకునియనురాగాభివృద్ధిని నెట్లు కనఁబఱచినాఁడో యట్లే యతనికర్తవ్యదక్షతనుగూడఁ గనఁబఱచి యున్నాఁడు.

మొదటియంకమున మొదటిరంగముననే దుష్యంతునిదయాగుణము, కర్తవ్యదక్షతయు వెల్లడియగును. అతఁ డెట్లయిన లేడిని వేయ

1. 'తతః ప్రవిశతి మృగానుసారీ చాపహస్తో రాజా రథేన సూతశ్చ' (అంత మృగమును వెంటఁ దఱుముచు రాజు రథముతోఁగూడ సారథిసహా ప్రవేశించుచున్నాఁడు).

2. గీ. ఆ మృగమును సధిజ్యశరాసనంబుఁ, గరమున ధరించుమిమ్ము గాంచ నాకు
యజ్ఞమృగమును వెన్నంటి యరుగునట్టి, యల పినాకపాణిని గన్న యట్ల యయ్యె.

3. చ. పొరిపొరి నార్వె లాగుటను బూర్వశరీరము గట్టివాఱి భాస్కరకిరణాళి కెంతయును నైచుచుఁ జెమ్మట లేక మైనమం
జారయక చిక్కియుఁ గృశతఁబొందుటఁ బల్చనిమేన విక్రమ, స్థిరుఁ డయి యాతఁ డొప్పెడును జెల్వుగ శైలచరద్విపంబనన్.

4. కశ్యపుఁడు - (రాజుకంకఁ జూపి) ఓ దక్షపుత్రీ!
ఉ. ఎంతయు నీదుపుత్రునకు నేతఁడు తోడయి ముందు నిల్చి దుష్యంతధరాతలేశ్వరుఁడు సంగరరంగమునందు వింటిచే
సంతత మెల్లకార్యములుఁ జక్కఁగ నిర్వహణం బొనర్పు, నిశ్చింతత భూషణంబె యగుఁ జేతికి వజ్రము గోత్రభేదికిన్.

sampath_Ebooks



వలయు నని పట్టుపట్టి రథమును శీఘ్రముగఁ దోలు మని సారథిని తొందరచేయుచు బాణమును ఎక్కుపెట్టినసమయమున, వైఖానస ఋషి శిష్యులతో వచ్చి,

'రాజన్! ఆశ్రమమృగోఽయం న హన్తవ్యో న హన్తవ్యః.

*　　*　　*　　*　　*

ఆర్తత్రాణాయ వః శస్త్రం న ప్రహర్తు మనాగసి,'

అని చేతు లెత్తి చెప్పినతోడనే, వినీతేంద్రియుఁడు గాన వేయఁబోయినబాణము నుపసంహరించెను! తరువాత నాఋషియే రాజును ఆశ్రమమునకు రమ్మని పిలిచి,

'రమ్యా స్తపోధనానాం ప్రతిహతవిఘ్నాః క్రియా స్సమవలోక్య,
జ్ఞాస్యసి కియ ద్భుజో మే రక్షతి మౌర్వీకిణాంక ఇతి.1'

అని చెప్పెను. ఇందువలన, అరణ్యములో నుండువారినిగూడ దుష్యంతుఁ డెంత శ్రద్ధతో రక్షించుచుండెనో సూచింపఁబడినది. గండుఁదుమ్మెద శకుంతలముఖముమీఁదికి రాఁగా నామె 'కావుఁడు, కావుఁడు' అని సఖులను గోరఁగా వారు చిఱునవ్వుతో 'మే మెవ రము కాచుటకు? దుష్యంతుని బిలువుము. రాజుగదా తపోవనము లను రక్షించువాఁడు'2 అని ప్రత్యుత్తర మిచ్చిరి. రాజు వేఁటకు వచ్చినాఁ డనికాని, చాటుననుండి తమమాటలు వినుచున్నాఁ డనికాని యనసూయాప్రియంవద లెఱుఁగరు. నవ్వులకు వారు సహజముగ రాజును దుష్యంతుని బిలువు మనిరి. అందుచేతఁ దపోవనములను దుష్యంతుఁడు దప్పక కాచుచున్న నమ్మిక వనమునందలియాఁడుపిల్లలకుఁ గూడ సహజముగఁ గలుగునంతజాగరూకతతో రాజు తనరాజ్యమును పాలించుచుండె నని కవిసార్వభౌముఁడు ప్రత్యక్షశబ్దములతోఁ గాక ధ్వనిచేఁ జెప్పి 'ధ్వనిప్రాధాన్య మైనది యుత్తమ కావ్య' మన్న నియమమునకు దృష్టాంతము జూపెను! ఇదియుఁగాక చాటుగా నున్న దుష్యంతుఁడు వెలువడుటకు నీప్రసంగము మిక్కిలి యనుకూల ముగ నిర్మింపఁబడినది. ఇట్లు కవికులగురుని ప్రతిభ ఒక్కప్రసంగము వలన నెన్నియో ప్రయోజనములను సాధించినది!

ద్వితీయాంకమునందు, ఋషిపుత్రులు వచ్చి తమ సత్రమునకు విఘ్నము లేకుండఁ గాపాడుటకుఁ గొలఁదిదినము లాశ్రమమునం దుండవలసిన దని దుష్యంతునిఁ గోరునపుడు నా రాతనినిగుఱించి చెప్పిన యీక్రిందిపద్యములవలన ప్రజాపాలనము, ఆర్తరక్షణము అనునవియే యాతఁడు చేయు తపోయజ్ఞము లని సొగసుగఁ జెప్పఁబడినది.

ప్రథమః :—

'అహో దీప్తిమతోఽపి విశ్వసనీయతాఽస్య వపుషః. అథవా' ఉపపన్నమేత దస్మిన్ ఋషిభ్యో నాతిభిన్నే రాజని. కుతః :—

అధ్యాక్రాన్తా వసతి రమునా ప్యాశ్రమే సర్వభోగ్యే
రక్షాయోగా దయమపి తపః ప్రత్యహం సంచినోతి,
అస్యాపి ద్యాం స్పృశతి వశిన శ్చారణద్వంద్వగీతః
పుణ్య శ్శబ్దో మునిరితి ముహుః కేవలం రాజపూర్వః. 3

*　　*　　*　　*　　*　　*

ఉభౌ (సహర్షమ్) :—

అనుకారిణి పూర్వేషాం యుక్తరూప మిదం త్వయి,
ఆపన్నాభయసత్త్రేషు దీక్షితాః ఖలు పౌరవాః.4'

పంచమాంకమునారంభమునందు దుష్యంతునిపరిపాలనదీక్ష విశే షముగఁ గానవచ్చునట్లు ప్రసంగము కల్పింపఁబడినది. రాజంతవఱ కును ధర్మాసనముపైని గూర్చుండి యప్పుడే లేచెను. అంతలోఁ గణ్వ శిష్యులు శకుంతలతో వచ్చిరి. ఈవార్త రాజునకుఁ జెప్పుటకుఁ గంచుకి వచ్చెను. అంతవఱకును గష్టపడియున్న రాజును మరలఁ గష్ట పెట్ట మన సొప్పక కంచుకి తనలో నిట్లనుకొనును :—

'ఓయీ! రాజునకు ధర్మకార్యము మిక్కిలి యనతిక్రమణీ యము. అట్లయినను ఇప్పుడే ధర్మాసనమునుండి లేచినయీయనకు

---

1. గీ. ధన్యాదములును నిర్విఘ్నములును నైన, యల తపోధనానుష్ఠానములను జూచి
'జ్యాకిణాంక మీభుజమెకా యరసి యింతపడవ్వ రక్షించునది' యని తనరఁగలవు.

2. కా ఖలం పరిత్రాతుం. దుష్యన్తం ఆక్రన్ద, రాజరక్షితవ్యానిఖలు తపోవనాని నామ (కా వయం పరిత్రాతుమ్. దుష్యంత మా క్రంద. రాజరక్షితవ్యాని తపోవనాని నామ).

3. ప్రథ :— అహో! ఈయనమూర్తి తేజోవంత మయ్యును విశ్వసనీయముగా నున్నది. ఋషులకంటె నతిభిన్నుఁడు కాని రాజునం దిట్లుండుట యుక్తమే. ఎట్లనిన :—

చ. అరయఁగ సర్వభోగ్య మగునాశ్రమమం దితఁ డుండు నిత్యముఁ, పరపరిపాలనంబునఁ దపఃఫల మాఱవపాలు గాంచు, నం
బరతల మంటు ఋష్యభిధ పావనరాజపదానుపూర్వ మై, సరసత మీఱఁ జాడుపటుచారణగీతములందు మాటికిన్.

*　　*　　*　　*　　*

4. ఇద్దఱు :— (హర్షముతో)

గీ. వినుము పూర్వులమార్గంబు ననుసరించు, నీకు నియ్యది యుక్తంబు నిక్కవముగ
నవని నాపన్నరక్షణయాగమందు, దీక్షితులు గారె? పౌరవుల్ ధీవిశాల!

sampath_Ebooks



మరల శ్రమ కలిగించుకొన్నాశిష్యులరాకను దెలుపుటకు మనకు గొలుప కున్నది. అట్లు కాదు. ఈ లోకతంత్రాధికారమున కెన్నఁడును విశ్రాంతి లేదు. ఎట్లన:—

'గీ. అరుకుఁ డొక్కమొగినె యశ్వంబులను గట్టి
రేయుఁ బగలుఁ దిరుగు వాయుదేవుఁ
డవనిభరముఁ దాల్చు ననయంబు శేషుండు
ధరణిపాలురకును ధర్మ మిదియ.

ఇఁకఁ గణ్వనియోగము నడపెదను. (అని నడచిచూచి) ఈ రాజు:—

గీ. నడపి గజయూథముల నెండఁ బనుచుఁ బగలు
శీతలస్థలి గజరాజు చేరునట్లు
ప్రజలఁ దనకన్నబిడ్డలవలెను నడపి
స్వస్థచిత్తుఁడై నిర్జనస్థలముఁ జేరె.'

విషయాసక్తులగువారికి రాజ్యమే మైన సౌఖ్యప్రదముగ నుండిన నుండుఁగాని తనకర్తవ్యము చేయఁదలఁచినరాజునకు రాజ్యము కేవలము సౌఖ్యప్రదము కాదు; దుఃఖప్రదముకూడ నన్నభావము దుష్యంతుని ఈక్రిందిపద్యములవలనఁ దేటపడి యాతఁ డెంతకష్టమున కైనను ఓర్చి రాజకర్తవ్యముల నెట్లు నెఱవేర్చుచున్నది తెలియును:—

'రాజు (నడచి, అధికారదుఃఖమును కనఁబఱచి) జను లందఱును గోరినవస్తువులను బొంది సుఖు లగుచున్నారు. రాజులకో కార్యసాఫల్య మైనను దుఃఖమే.

గీ. అగపడగనీదు చింత రాజ్యప్రతిష్ఠ;
రాజ్యపాలన మెంతయు శ్రమకరంబు
దండమును జేతఁ దాల్చుఛత్రంబువోలె
రాజ్యమె శ్రమంబు నిచ్చును శ్రమము నడఁచు.'

కణ్వశిష్యు లేదో వార్త తెచ్చి రని విన్నతరువాత వారి యాశ్రమమునకు నేమిబాధ కలిగెనో యన్నభీతియే పైవిచారమునకుఁ గారణము. కణ్వాశ్రమమునకు నేమి యాపత్తు వాటిల్లెనో యని యిట్లు వితర్కించెను:—

చ. 'పరమతపోనిరూఢమునివర్యతపస్సులు విఘ్న మొందెనో?
యరయక యెవ్వరైన ఖలు లాశ్రమజంతుల కగ్గ చేసిరో
విరుల మదీయదోషమున వృక్షలతావళు లియ్య మానెనో?
యరయఁగలేక సంశయము నాకులపాటు మనంబు చెందెడున్.'

వైతాళికులచేఁ బాడఁబడిన యాక్రిందిగీతములలో దుష్యంతునిస్వసుఖనిరభిలాషత్వమును, ప్రజాబంధుత్వమును కవి యద్దమందుఁ జూపినట్లు చూపినాఁడు:—

ప్రథముఁడు:—

గీ. 'స్వసుఖమును జూడ కలసెదు జగముకొఱకుఁ;
బ్రతిదినంబును నీకు వ్యాపార మిదియె;
చెట్టు తీక్ష్ణాతపము దాల్చి శిరసుచేతఁ
దనదునీడచే నాశ్రితతాప మడఁచు.

ద్వితీయుఁడు:—

గీ. మరలిచెదు శిక్షచేసి దుర్మార్గచరులఁ;
గలహము లడంతు, వారసి కాతు వీవు;
బంధు లెంతటివారైన నైశ్వర్యవంతు లున్న
బంధుకృత్యంబు నెఱపెదు ప్రజల కీవె.'

ఇచ్చట వైతాళికులచేత 'నాతఁ డింద్రుఁడు, చంద్రుఁడు, గొప్పరాజ్యము కలవాఁడు, చక్కనివాఁడు' అని చెప్పింపక ప్రజావాత్సల్యము, లోకకల్యాణేచ్ఛ, స్వసుఖనిరభిలాష అను నిటువంటిగుణములను గవి బుద్ధిపూర్వకముగఁ జెప్పించె నేకాని సహజముగఁ గాదు. కణ్వశిష్యులతో వచ్చిన శకుంతలను నాభార్య కా దని ధిక్కరించును; అసత్యము లాడుచున్న దని నిందించును. అట్టిపట్టున చదువరులకుఁ గాని ప్రేక్షకులకుఁగాని రాజు బుద్ధిపూర్వకముగ నసత్యము లాడుచున్నాఁ డని తోఁచవచ్చును; అతనియందు గౌరవము తగ్గవచ్చును; అట్లు గాకుండ నాతినిన్యాయైకబుద్ధియు, ఆత్మలాభమునందుఁ గలయౌదాసీన్యమును చదువరులమనసునందు మొదట బాగుగ నింపి యేది యెట్లయినను అతఁ డన్యాయము చేయువాఁడు కాఁ డన్నమాట వారిచే నమ్మించి, 'శాపమోహితుఁ డగుటచే నిట్లు పొరపడెను గాని, అన్యథా కాదు' అని ప్రేక్షకులకు సహజముగ శాపమాహాత్మ్యమును దోఁచునట్లు చేయుటయే కవియొక్కయుద్దేశము. ఈ ప్రకరణమున రాజు శకుంతలను, గౌతమిని, కణ్వశిష్యులను కొంచెము పరుషవాక్యము లాడును. గర్భవతిగ నున్న యొకపరస్త్రీనిఁ దీసికొని వచ్చి యిది నీభార్య యని మరలమరల సభలోఁ జెప్పినచో నెట్టిశాంతున కైనను కోపము వచ్చుట సహజము. అది సదాచరణమునందుఁ గల భక్తిచేఁ గల్గినకోపము (Righteous indignation). అంతమాత్రము కోపము రానియెడల నాతఁడు మానవుఁడు కాఁడు; ఒకశిలావిగ్రహము!

ఈ సంబంధమున దుష్యంతునకుఁ గల పరస్త్రీవిముఖత్వము దెల్పవలసియున్నది. పరస్త్రీ తల్లితో సమానము, ఆమెను కన్నెత్తియైనను చూడఁగూడ దని కాళిదాసునియభిప్రాయము. నాయకునిఁ గూడ నాతఁ డట్టివానిగనే చిత్రించినాఁడు! ముసుఁగు వేసికొని ఋషిశిష్యులతోఁ దనయొద్దకు వచ్చుచున్నశకుంతలను చూచి యామె యెవతయో యని వితర్కించి, యామె చక్కని దని ప్రతీహారి చెప్పఁగా,

'భవతు. అనిర్వర్ణనీయం పరకలత్రమ్.'

'అవుఁగాక. పరస్త్రీని దేఱి చూడరాదు' అని చెప్పెను. రాజు పరస్త్రీపరాఙ్ముఖుఁ డని పదిపద్యములు వ్రాసినదానికంటె నాతనిభావమును జూపుటకు నొక్కచిన్నవాక్య మాతనినోటను జెప్పించినఁ జాలును. అట్లే శకుంతల తన్ను నధర్మాచరణము గలవాఁ డని నిందింపఁగా దుష్యంతుఁడు,

sampath_Ebooks



'ఆర్యే! ప్రథితం దుష్యంతస్య చరితమ్, ప్రజాస్వపీదం న దృశ్యతే.[1]'

అని అభిమానపూర్వకముగఁ బ్రత్యుత్తర మిచ్చెను. ఈమాట చెప్పుటకు దుష్యంతునకుఁ దనపవిత్రాచరణమునందు నెంతదృఢ విశ్వాస ముండవలయును?

ఏడవయంకమందును నిట్టిప్రసంగమే యొకటి కలదు. సర్వద మనునితల్లి పేరేమో యడుగవలె ననుకొని వెంటనే దుష్యంతుఁడు 'అథవా అనార్యః పరదారవ్యవహారః' 'అట్లు కాదు, పరస్త్రీని గుఱించి ప్రసంగించుట అయోగ్యము.' అని యూరకుండెను. ఇట్టి చిన్నచిన్నమాటలే యంతఃకరణమందలి యతిరహస్యములను వెలిఁ బుచ్చును.

ధనమిత్రుఁ డను సముద్రవర్తకుఁడు చనిపోవును. వానికి సంతతి లేనందున వానియాస్తి యంతయు రాజుబొక్కసమునకుఁ జేరవలయు నని మంత్రి తీర్మానించి దుష్యంతునకుఁ దెల్పును. అంత నాతఁ డాధనమును దీసికొనుటకు నొప్పుకొనక మొదట నాతనిభార్యలలో నెవ రైన గర్భముతో నున్నదా యని విచారించి, యొక్క తె యున్న దని తెలిసినతోడనే ధన మాగర్భము దే యనియు, తనది కా దనియుఁ దెల్పును. వెంటనే బంధువులు పోయినజనుల కంపఱకును తానే బంధుఁడ నని చాటింపు మని పంపును. ఆచాటింపునకు జనులు సకాలవర్షమునకుబలె సంతసించిరి (౬-వ యంకము)! ఇంతకంటె నౌదార్యమును, ప్రజావాత్సల్యమును స్వాచరణముచే నెవ్వరు చూపఁ గలరు?

ప్రజలమేలే రాజుకర్తవ్య మన్నమాట మహాకవి కాళిదాసుఁ డీనాటకమునందుఁ జివరవఱకును మఱవలేదు. నాటకముయొక్క యంతమందుఁ గూడ రాజుచేఁ జెప్పించెను. భరతవాక్యమునందు మొట్టమొదట రాజు కోరిన దేమి? 'ప్రవర్తతాం ప్రకృతిహితాయ పార్థివః'—'ప్రజలహితమునకై రాజు ప్రవర్తించునుగాత' అని భరతవాక్యము యొక్క మొదటిచరణము! ఇట్లు శృంగారనాయకునిచరితమువలనఁ గూడఁ బ్రజలహితము చేయుటయే రాజునకుఁ బరమార్థ మన్న రాజకీయమహాసిద్ధాంతమును లోకమునకు బోధించినవాఁడు కాళిదాసు తప్ప మఱియొకఁడు కానరాఁడు.

ఇఁక దుష్యంతునిప్రేమనుగుఱించి విచారింతము. ఇందు వర్ణింపఁబడినది సాత్త్వికప్రేమ. గంభీరులైన స్త్రీ పురుషులయనురాగమునుగుఱించిన కాళిదాసునియూహ మిక్కిలి యుదాత్త మైనది; పవిత్ర మైనది. పూర్వజన్మవాసనచేతనో, మానవుల కజ్ఞేయ మగు నన్యకారణముచేతనో, ఒకానొకపురుషునకును స్త్రీకిని పవిత్ర మైన పరస్పరానురాగము ఒకరిని ఒకరు చూచుకొనుటవలననే కలుగును. అట్టియనురాగము సహజ మైనది; నైసర్గికము; కేవలముగ నైహిక కామవికారమునకు లో నైనది కాదు. సవ్యాజము కాదు. నిర్హేతుకము. ఆవికార మైహికము కాదు; స్వర్గీయము. ఇట్లు నిర్వ్యాజముగ నేర్పడుప్రేమ తనకుఁ దగినస్త్రీమీఁదనే పురుషునకు నేర్పడును; తగినపురుషునిమీఁదనే స్త్రీకి నేర్పడును. తనకుఁ దగనిస్త్రీలమీఁదఁ బురుషునకు మనసు పోనేపోదు; అనఁగాఁ బరస్త్రీమీఁద (నదివఱకు వివాహమైన స్త్రీమీఁద) తనకుఁ దగనికులము, వయసు గలస్త్రీమీఁదను గాని మనసు పోదు. ఇందులకు వారివారి యంతఃకరణప్రవృత్తియే సాక్షి.

దుష్యంతుఁడు తపోవనమునందు ముగ్గురు కన్యలను జూచును. వారు ముగ్గురును చక్కనివారే.[2] అయినను శకుంతలమీఁదనే యాతనికిఁ బ్రేమ కలిగెను. శకుంతలను జూడఁగానే దుష్యంతునకును, దుష్యంతుని జూడఁగనే శకుంతలకును బ్రేమ కలిగెనేకాని, అనసూయాప్రియంవదలపైని దుష్యంతునకుఁగాని, దుష్యంతునిపై ననసూయాప్రియంవదలకుఁ గాని ప్రేమ కలిగినది కాదు! ఏ స్త్రీపురుషులకుఁ బ్రేమానుబంధము కలదో వారికే ప్రీతి యంకురించు నని కవితాత్పర్యము. ఇట్లంకురించుట వీ రెవరో వారికి, వా రెవరో వీరికిని దెలియకపూర్వమే. కావున ప్రేమ నిర్హేతుకము.

శకుంతల కణ్వునిబిడ్డ అయినట్లు ముగ్గురుపిల్లలసంభాషణవలనఁ దోఁచఁగా, నట్లయిన నామె బ్రాహ్మణకన్య యగునేని క్షత్రియుఁ డైన తాను వివాహమాడుటకు వీ లుండదే. అట్లయినఁ దనమన సామెమీఁద నేల పోయియుండు నని యిట్లు వితర్కించును:—

'అపినామ కులపతే రియ మసవర్ణక్షేత్రసంభవా స్యాత్? అథవా కృతం సందేహేన.

'అసంశయం క్షత్రపరిగ్రహక్షమా
యదార్య మస్యా మభిలాషి మే మనః,
సతాం హి సందేహపదేషు వస్తుషు
ప్రమాణ మంతఃకరణప్రవృత్తయః.[3]'

విదూషకుఁడు మునికన్యను వలచితివా యని పరిహాసముచేయఁగా దుష్యంతుఁడు 'సఖే! న పరిహార్యే వస్తుని పౌరవాణాం మనః ప్రవర్తతే' [మిత్రమా! పరిహరింపఁదగినవస్తువులపైని పౌరవుల మనస్సు

1. ('కల్యాణీ! దుష్యంతునినడక యందఱకుఁ దెలిసినదే. నా ప్రజలలోఁ గూడ నిట్టినడత లేదే').
2. (౧) అహో మధురమాసాం దర్శనమ్. (ఆహా! వీరిరూప మెంత మనోహరముగ నున్నది!)
(౨) అహో సమవయోరూపరమణీయం భవతీనాం సౌహార్దమ్. (ఆహా! చెలిమి సమవయోరూపములం జేసి రమణీయముగ నున్నది.)
3. గీ. నృపపరిగ్రహయోగ్య యీ నెలఁత నిజము!, కాక, నామది నిర్దోష మేల కెట్లు
దవులు? సందు సందేహవస్తువులయందు, సాత్త్వికులకె ప్రమాణంబు లాత్మలకును.

sampath_Ebooks

పోదు ] అని యభిమానపూర్వకముగఁ బ్రత్యుత్తర మిచ్చెను; అనఁగా వంశపరంపరాగతసదాచరణముచే దుష్యంతునిమనస్సు స్వాభావికముగ సన్మార్గగామియై యుండెడు, దుర్మార్గగామి కాదు. దాని నిచ్చ వచ్చినమార్గమునఁ బోనిచ్చిన నదియే సన్మార్గ మగును. మన నాయకుని మన స్సంత నైతికౌన్నత్యమును బొందియుండె నని భావము. ఇట్లు సంభోగ విప్రలంభశృంగారములను వర్ణించునపుడు కూడ దానివలన మన సౌశీల్యోన్నతి గానవచ్చునట్లు మననాయకునిపటమును జిత్రించుట మనకవియొక్క యసాధారణప్రతిభ యనియే చెప్పవలసి యున్నది.

మనకవిమతమున బహుపత్నీకత్వ మొక దోషము కాదు. అందువలన నాయికయెడ నాయకునికిఁ గలయనురాగమునకు లోపము రాదు. ధనవంతు లెక్కుడుభార్యలను చేసికొనుట యప్పటియాచారము.[1] కావున దుష్యంతుఁడు బహుపత్నీకుఁడుగ నున్నాఁడు. అప్పటినీతికల్పనల ననుసరించి యన్యునిభార్యను బ్రేమించుట తప్పె కాని యవివాహితకన్యను, వేశ్యను బ్రేమించుట తప్పుకాదు. ఈ నాటకమునందు శకుంతలను బ్రేమించుటకుఁ బూర్వము రాజునకు వసుమతి యనుభార్యయు (౬-వ అంకము), హంసపదిక యనుభోగస్త్రీయు (౫-వ అంకము) నున్నట్లు నాటకమునందుఁ గానవచ్చును. వీరిద్దఱిలోను రంగముమీఁదికి నెవ్వరును రాకపోయినను, రంగముమీఁద వారినిగుఱించి వచ్చినసంభాషణమునుబట్టి వారిస్వభావమును వారివిషయమున రాజునకుఁ గల భావమును సుస్పష్ట మగుచున్నవి.

శకుంతలపైని రాజునకుఁ గ్రొత్తగ మోహము గలిగినను, తన ప్రథమభార్య యైన వసుమతిమీఁద నాతనికి గౌరవభావము పోలేదు. ఆమె వచ్చుచున్న దని విని శకుంతలపటమును దాఁచ యత్నించును. ఆతఁడు కేవలము స్త్రీలోలుఁడు గాక పెక్కురుభార్య లున్నను, ఎవరికి నీయవలసినమర్యాద వారికిఁ గలుగఁజేయుచుండును. ఆమెయు రాజునెడఁ దనకుఁ గలచనవును సమయాసమయములఁ జూచి యుపయోగించును. రాజు రాజ్యకార్యముల నాలోచించుచున్నాఁ డని వినఁగనే యామె తిరిగి వెడలిపోవును.

మొదటియంకమునందుఁ గన్యలు చెట్లకు నీరు పోయునప్పుడును, రెండవ మూఁడవయంకములందు వారు లతాగృహములోఁ గూర్చుండియున్నప్పుడును రాజు చాటుననుండి వారిసంభాషణము వినును. రెండవయంకముచివర విదూషకుఁ డింటికి వెళ్లునపు డతఁ డంతఃపురములో శకుంతలసమాచారము చెప్పునేమో యని యతనితో తా నదివఱకు శకుంతలనుగుఱించి చెప్పిన ప్రేమకథ యంతయు నవ్వులకే కాని నిజము గా దని చెప్పును. కొందఱకు నివి దుష్యంతుని యందుఁ జిన్నదోషములుగఁ గాన్పింపవచ్చును. కాని యొకరికి నష్టము చేయనట్టి యిట్టివినోదము లైనయసత్యములు ప్రణయప్రసంగములలో దోషములుగ నేదేశమునవారును ఎంచలేదు. నాయకుని యీ చర్యలవలన నితరుల కెవరికిని నష్టము కలుగకపోవుటయేకాక యవి కథానకమునకు సహకారులుగ నుండును. శృంగారనాయకుఁ డుదాత్తుఁడుగ నుండవచ్చునే కాని, నవ్వుల కైనను, వినోదమున కైనను, అసత్యము చెప్పని తత్త్వజ్ఞుడుగను, అసంసారిగను, ఋషిగను ఉండ నక్కఱలేదు. అట్లున్న నది తత్త్వజ్ఞానగ్రంథ మగును గాని నాటకము కానేరదు.

శకుంతలను జూచినదిమొదలు లతామండపములో నామెను ఏకాంతమునందుఁ గలసికొనువఱకును రాజు పడినయాందోళనము మొదలయినవియు, ఉంగరము దొరకినతరువాత నాతనికిఁ గలిగినవిరహతాపాదికములును, తరువాత మారీచాశ్రమములో నాతఁడు భార్యను కలసికొనినపిదప నామెకాళ్లమీఁదను బడుటయు మొదలయిన శృంగారచేష్ట లన్నియు, సర్వశృంగారనాయకులకును సామాన్యములే కనుక, వానినిగుఱించి వేఱుగా వ్రాయ నక్కఱలేదు.

ఆఱవయంకమునందుఁ గల శకుంతలాచిత్రపటమునుగుఱించిన రంగమువలన రాజుయొక్క చిత్రకళానైపుణి కానవచ్చుట సరేకదా మనకవికి నాలలితకళయందుఁ గల చక్కనిపరిచయము వెల్లడి యగుచున్నది.

శకుంతల:— కణ్వునకుంబలె నీనాటకమునకును శకుంతల జీవితసర్వస్వము. ఈమె ౨-వ, ౬-వ యంకములందుఁ దప్ప మిగిలిన యన్ని యంకములందును రంగముమీఁదను గాన్పించును. ఆరెండంకములం దైనను ఆమె ప్రత్యక్షముగఁ గాన్పింపకపోయినను ఆమె యశఃప్రభచేతనే యవి నిండియున్నవి. నాయిక యైనశకుంతల యెదుట నితరపాత్ర లన్నియు దివిటీక్రిందిదీపములవలె వెలవెలఁబాఱును. ఆమెబహిశ్శరీర మెంత చక్కనిదో యంతశ్శరీరముగూడ నంతచక్కని దగుటచే నిన్నివందలసంవత్సరములనుండియుఁ బ్రపంచముయొక్క చిత్తము నాకర్షించుచున్నది. నాయిక చూచుటకు మిక్కిలి చక్కఁగ నున్న దని యేకవి యైనను వర్ణించును. అట్లే మనకవియు 'అధరః కిసలయరాగః' మొదలయినపద్యరాజములచే నామెసౌందర్యమును వర్ణించియున్నాఁడు. అందు విశేష మేమియు లేదు. శకుంతలభూమికను ధరించిననటి (లేక నటుని) యొక్క చక్కఁదనమునుబట్టి ప్రేక్షకు లామెసౌందర్యము నెంచుదురే కాని యీవర్ణనములవలనఁ గాదు. కాని యీభూమికను గ్రహించిననటి యెట్టి దైనను, ఆమెచేఁ గవి చెప్పించుమాటలవలనను, చేయించుపనులవలనను ఆమెయంతస్సౌందర్యము ప్రేక్షకులకు వ్యక్త మగును. ఆమె మొదట రంగముపై నేమాయ యెఱుంగనియారణ్యకకన్యగఁ గాన్పించి క్రమముగ నెన్నియో యవస్థాంతరములఁ జెంది చివరకుఁ బుత్రవతి యైనమహారాజ్ఞిగ మాఱును. కావున, చిన్నవాఁడు తండ్రియింటఁ

1. రాజా — ......వేత్రవతి, బహుధనత్వా ద్బహుపత్నీకేన తత్రభవతా భవితవ్యమ్......

(వేత్రవతీ! అతఁ డెక్కుడుధనముకలవాఁ డగుటచేత నాతనికిఁ బెక్కురుభార్య లుందురు) —[౬-వ అ.]

sampath_Ebooks

జెలులతో నాడుకొనునాఁటనుండియుఁ బెద్దది యగువఱకును ఈ యమ్మాయి మనకనులయెదుటనే పెరుఁగు నని చెప్పవచ్చును. ఈమె తండ్రియాశ్రమములో నున్నపుడును, అనురాగములోఁ జిక్కినప్పుడును, వివాహ మాడినప్పుడును, పతి వెడలిపోయినప్పుడును, పుట్టినింట నుండి యత్తవారింటికిఁ బోవునపుడును, ఈమెను పతి నిరాకరించినపుడును, పతివిరహకాలమునను, ఏమేమి మాట లాడినదియు మనము వినుచుందుము. ఎట్లెట్లు ప్రవర్తించినది మనము చూచుచుందుము. ఆమెమనస్సులో నిరహస్యములుగూడఁ గవియనుగ్రహముచే మన మెఱుఁగుదుము. అందుచే నామెసద్గుణము లన్నియు మనకనులయెదుట మూర్తీభవించి నిలిచియున్నట్లుండును. ఆయాప్రసంగములయప్పుడామె చూపినట్టిసద్గుణములును, మనోధైర్యమును, శుద్ధాంతఃకరణమును దెల్పునవ్యాజానురాగమును మనయంతఃకరణమును గరఁగించి యామెయెడ సానుభూతిని, గౌరవమును బుట్టించును.

మొట్టమొదట నామె కల్ల కపట మెఱుఁగక, స్వాభావికపవిత్రాంతఃకరణము గలదిగ రంగముపైకి వచ్చును. ఋష్యాశ్రమమునందుఁ బెరిఁగిన దగుటచేతను జాణ గానందునను వివాహసంబంధమైన వికారములను అంతగ నెఱిఁగినదికాదు. దుష్యంతుని చూడఁగనే యామెకు సహజముగఁ గల్గిననూతనవికారము 'తపోవనవిరోధి' యని యామెకే తోఁచెను. కావున నంతకుఁబూర్వ మామె తపోవనవృక్షములతోడను, మృగాదులతోడను, సఖులతోడను ఆటపాటలయందును, ఋషులహోమక్రియాదులలోఁ బనిపాటులు చేయుటయందును గాలము గడపుచుండినముద్దరాలు. ఇందుచే నామె తెలివిలేనిది యని తలంపవలదు. ఆశ్రమసంబంధమైన వ్యవహారములలో నెఱజాణయే యైయుండెను. అట్లు లేనియెడలఁ గణ్వుఁడు తా నాశ్రమమునందు లేనప్పుడు తనకు మాఱుగా అతిథిసత్కారాదికార్యములయం దీమెను నియోజించుట[1] యెట్లు తటస్థించును? తరువాత నామె దుష్యంతునకుఁ బ్రణయపత్రికను వ్రాయునిమిత్తము పద్యమును రచించును. కావున నామెసాహిత్యమునందుఁ బ్రజ్ఞగల ప్రతిభాశాలిని యని చూపుటయే కవియొక్క తాత్పర్యము. ప్రథమదర్శనకాలంబున నిట్లు శకుంతల ప్రతిభ, అమాయికత్వము అను విరుద్ధము లైనరెండుగుణములచే శోభించును. ఈరెండుగుణముల వైరుధ్యమే యాశోభ హెచ్చుటకుఁ గారణము.

శకుంతలయందు మనకు మొదటను గానవచ్చు లలితగుణ మామెకు సృష్టియందుఁగల నిసర్గభ్రాతృభావము; అనఁగా వృక్షములు, మృగములు మొదలయినవానియెడల మానవులకుఁ గల మనోభావముల నారోపించి వానిని స్వబంధువులవలెఁ బ్రేమించుట. శకుంతలకును, సఖులకును జరగిన యీక్రిందిసంభాషణము లీసందర్భమునఁ జదువఁదగినవి :—

'అనసూయ :— సఖీ శకుంతలా! కాశ్యపులు నాయనగారికి నీకన్న నాశ్రమవృక్షమే ప్రియ మని నేఁ దలఁచెదనుసుమా; ఏల యనఁగా, విరజాజిపువ్వువంటి కోమలాంగిని నిన్నుఁగూడ వీనిపాదులకు నీళ్లు పోయ నియోగించిరి.

శకుంతల :— నాయనగారియాజ్ఞ యనిమాత్రమేనా? నాకుఁగూడ వీనిమీఁద సోదరప్రేమ కలదు.

* * * * *

శకుంతల :— [ఎదుటఁ జూచి] ఇదిగో! ఈ పొగడనున్న, తెమ్మెఱకుఁ గదలు చివురువ్రేళులతో నన్నుఁ ద్వరగా రమ్మని సంజ్ఞ చేయుచున్నది. దీనిని సంభావించెదను.

అనసూ :— సఖి శకుంతలా! ఇది బాలసహకారుని స్వయంవరవధూటి. దీనికి వనజ్యోత్స్న యని నీవు పేరు పెట్టుకొంటివి; దీనిని మఱచితివిగదా.

శకుంతల :— అట్లయిన నన్నే మఱతును. [లతయొద్దకుఁ బోయి చూచి] సఖి! రమణీయ మైన సమయములో నీ లతాపాదపమిథునమునకు వివాహ మైనది; ఎట్లన్న నవకుసుమయౌవన వనజ్యోత్స్న, బద్ధపల్లవతచే నుపభోగక్షముఁ డీ బాలసహకారుఁడు.[2]'

'పాతుం న ప్రథమం' అనుపద్యమునందుఁ జెప్పినట్లు శకుంతల మొదటఁ జెట్లకు నీరు పోసికాని తాను త్రాగునది కాదు. వానికి నొప్పి పుట్టు నని తనయాభరణములకుఁగూడ వానిచిగుళ్లఁ గోయదు, వృక్షములు క్రొత్తగఁ బుష్పించినప్పుడు గొప్పపండుగు చేసికొనుచుండెను. ఆమె యత్తవారియింటికిఁ బోవునపుడు తనలతాభగిని యైన వనజ్యోత్స్నను గౌఁగిలించుకొని పోయివచ్చెద నని చెప్పి దానిని తనసఖులచేతులలోఁ బెట్టి వెళ్లెను.

ఏమి యీసృష్టియెడ నామెకుఁ గల నిసర్గనిర్వ్యాజప్రేమ! ఇట్టిప్రేమకు నిర్మల మైనట్టిదియు, పవిత్ర మైనట్టిదియు, దయార్ద్ర మైనట్టిదియు నగుహృదయమే కారణము!

ఒకలేడి బిడ్డను గని మృతి నొందఁగా నా మగలేడిపిల్లను శకుంతల యెంతయుఁ గష్టపడి పెంచి పెద్దచేసెను. దర్భలు తినునప్పుడు దానిమూతి కవి గ్రుచ్చుకొని గాయము కాఁగా నామె దానికి నూనె రాచి యుపచారములు చేసి మాన్పి, యాలేడిని కుమారునివలెఁ బెంచెను. అత్తవారియింటికిఁ బోవునప్పుడు దాని నెంతయుఁ బ్రేమతో మరలిపొమ్మని చెప్పెను. పర్ణశాలలో నొకయాఁడులేడి గర్భిణిగా నుండెను. తా నత్తవారియింటికిఁ బోవుచు శకుంతల ఆలేడి సుఖప్రసవ యైనతోడనే తప్పక తనకుఁ దెల్పు మని తనతండ్రికిఁ జెప్పెను. ఏమి యీ సౌహార్దము! ఇట్టిచిన్నప్రసంగములే అంత

1. ఇదానీమేవ దుహితరం శకుంతలా మతిథిసత్కారాయ సందిశ్య దైవ మస్యాః ప్రతికూలం శమయితుం సోమతీర్థం గతః.

2. శ్రీ వేదము వేంకటరాయశాస్త్రిగారి భాషాంతరీకరణమునుండి.

sampath_Ebooks

రాత్మయొక్క యవలోకింకొన్నతిని, స్వర్గీయమాధుర్యమును వెల్లడి చేయును.

వృక్షమృగాదులనుగుఱించియే యిట్టిప్రేమ కనఁబఱచినపుడు శకుంతలకుఁ దన తండ్రియందును, చెలికత్తెలయందును గల ప్రీతిని గుఱించి వేఱుగ వ్రాయ నక్కఱలేదు. అత్తవారియింటికిఁ బోవునపుడు శకుంతల చివరకు తనదుఃఖము నంతను ఆఁపుకొని తండ్రి కార్శ్యమునకుఁ జింతించి, తండ్రి నాలింగనము చేసికొని యాతనితో 'నాయనా! తపశ్చరణముచేతఁ జిక్కిపోయిన యీ దేహమును నావిరహదుఃఖమునకై మిక్కిలి కృశింపనీకుము' అని చెప్పెను. ఈ యొక్కవాక్య మామెకుఁ దండ్రియెడఁ గలయకృత్రిమ, అవ్యాజ ప్రేమను వేయినోళ్లఁ జాటును. ఒకచిన్నివాక్యమువలనఁ గంపంత యర్థము స్ఫురింపఁజేయుట కాళిదాసునిచాతుర్యవిశేషములలో నొక్కటి. ఇట్లు చరాచరజంతుజాలముల నెల్ల సోదరభావముతోఁ జూచు నీసతీమణిని, కణ్వశిష్యులు దుష్యంతునకు నొప్పఁజెప్పునప్పుడు 'శకుంతలా మూర్తిమతీ చ సత్క్రియా' యని చెప్పినట్లు మనమును భూషింపవలసియున్నది.

ప్రసంగవిశేషములనుబట్టి భీరుత, లజ్జ యనునవి (మనకవుల మతమున) స్త్రీలమనశ్శరీరసౌందర్యముల నభివృద్ధిచేయునట్టిగుణములు. శృంగారనాయికకు నివి యత్యంతావశ్యకము లయినభూషణములు. కావున మనశకుంతల భీరువు. తుమ్మెదను మాచి బెదరును; ఈ చెట్టుననుండి యాచెట్టునకుఁ బోవును; 'నన్ను రక్షింపుఁడి, నన్ను రక్షింపుఁడీ' యని యఱచును; దుష్యంతుఁడు కనఁబడి 'తపస్సు వర్ధిల్లుచున్నదా?' యని యడుగఁగా భయపడి, గడబిడపడి, మాటలాడక యూరకుండును. మొదట మాటలాడకుండుట భీతిచేనైనను, తరువాత మాటలాడకుండుట లజ్జచేత. దుష్యంతుని జూచినవెంటనే యామెకుఁ దపోవనమునకుఁ దగని వికార మనఁగా ననురాగము సహజముగ జనించెను. ఆతఁ డెవఁడో యామెకుఁ దెలియకపూర్వమే యామెకుఁ బ్రేమ యంకురించెను. అంత నామె లజ్జావశయై దుష్యంతునితో మాటలాడుటకు సిగ్గుపడెను. ఆరంగమునం దెల్లను రాజుతో అనసూయా ప్రియంవదలు మాటలాడుదురే కాని శకుంతల యాతనితో నొక్కమాట యైనను మాటలాడదు. ఇంతియ కాదు. సఖులు హాస్యము చేసినఁ గోపము వచ్చినదానివలె నటించును. కాని యామె చేష్టావిశేషములవలన నామె మనోవ్యాపారముల నూహించుటకు వీలు గలదు.

శకుంతల లజ్జచేతఁ దనయనురాగమునుగుఱించి సఖులతోనైనఁ జెప్పక కృశించును. వారే కనుఁగొని దుష్యంతునకుఁ బ్రణయపత్రిక వ్రాయు మనఁగా నాతఁ డగౌరవించునేమో యని సందేహించును. తనచక్కఁదనమును సద్గుణములను తా నెఱుఁగదు.[1] చివరకు నాయకుని గలసికొన్నసమయమునను లజ్జాభయాదులచేఁ బరివేష్టిత యై యుండును. వివాహానంతరము దుష్యంతుఁడు వెడలిపోఁగా, మిక్కిలి విచారముతో నుండును. వెలుపల నేమి జరగుచున్నదో యెఱుఁగదు. దుర్వాసఋషి వచ్చుట గాని, శాప మిచ్చుట గాని యెఱుఁగదు. ఆశ్రమముననుండి రాజునొద్దకుఁ బోవునపుడును, రాజసభలోను, తన్నాతఁడు గుర్తించునో లేదో యని శంకించుచు, భయపడుచునేయుండును. పతియాదరణకై యాతుర లయిన స్త్రీలస్వభావమును చక్కఁగ నెఱిఁగినకవిరా జీకథాభాగమును సరసముగఁ జిత్రించి శకుంతలయొక్క యంతరాత్మను బయల్పఱిచి మనకుఁ జూపినాఁడు. కోమల మయినట్టిదియు, కల్ల కపట మెఱుఁగనట్టిదియు, పవిత్రమైనట్టిదియు నగు నిట్టిహృదయమును జూచి, నాయికయెడ నెవరికి సహానుభూతి కలుగకయుండును!

ఇట్లమాయికవృత్తి గలది యన్నమాత్రమునఁ దనగౌరవమునకు భంగము గలుగునపుడుకూడ సహించి యూరకుండు నని తలంపవలదు. అట్టియెడఁ దోఁక త్రొక్కినపామువలె బుస్సున లేచును; మనసు మృదుత్వమును విడిచి కాఠిన్యమును వహించును. స్వరూపము మాఱిపోవును. తన్ను రాజు నిరాకరించి స్వచ్ఛందచారిణి యని లోకు లనుకొనునట్లు సంభాషింపఁగా నంతవఱకును శాంతము వహించిన శకుంతల మిగుల రోషము వహించి, సభలో రాజును లక్ష్యము చేయక,

'కుత్సితుఁడా! నీ హృదయానుమానముచేత నితరులను నట్లే మాచుచున్నావు. పైకి ధర్మకవచమును దొడిగి గడ్డికప్పియున్ననూతివలె నున్న నిన్నెవ్వరు పోలఁగలరు!'

అని నిరాకరించును. అట్టియెడ మన ముద్యానవనమునఁ జూచిన శకుంతల యీమెయేనా యన్నసంశయము మనకుఁ గల్గును. రాజుకూడ నామెకోపమును, మాటలను చూచి యిట్లనుకొనును:—

'రాజు (తనలో) - నాకు మనస్సునందు సందేహము పుట్టించుచుఁ గపటము లేనియట్లే యీ మెకోపము కనఁబడుచున్నది. అట్లే కదా!

చ. స్మరణకు రాక క్రూరముగ
స్వాంతములోపలఁ దాప మొందుచున్
గరము రహస్యపుం బ్రణయ
గాథ యెఱుంగఁగలేని నాపయిన్
దరుణి యపారకోపమునఁ
దద్దయు నేత్రము లెఱ్ఱఁజేసి వం
కర లగు కన్బొమల్ విఱుచుఁ
గా స్మరచాపవిఖండనక్రియన్.'

పతిప్రేమ:— ఇట్లు భర్తమీఁదను గోపముతోడను దుఃఖముతోడను వెడలిపోయినశకుంతల మనకు మరల నెట్టిస్థితిలోఁ గనఁ

1 'అయి ఆత్మగుణావమానిని!'

sampath_Ebooks

బడును? మారీచాశ్రమమునందు దుష్యంతునకుఁ గాన్పించినప్పటి యామెస్థితి నాతఁడే యిట్లు వర్ణించెను.

> ‘గీ. మిగుల మాసినవస్త్రంబు మేనఁ దాల్చి
> నియమకృశముఖి యేకవేణిని ధరించి
> శుద్ధశీలయై యతిదయాశూన్యుఁడ నగు
> నాదు చిరవిరహవ్రతి యీనాతి దాల్చె.’

పతి తన్ను నిరాకరించె నని యామె పతిప్రేమను ద్రోసివైచి పాతివ్రత్యధర్మమును పాటింపకయుండెనా? లేదు. ‘భర్తు ర్విప్రకృతాపి రోషణతయా మాస్మ ప్రతీపం గమః’ (వరుఁ డలుక వ్యహించినను భర్తృవిరుద్ధవు గాకు మీ సుదతీ) అన్న కణ్వునిబోధ యామె చక్కఁగ గ్రహించెను. సీతాదేవివలెనే యీసాధ్వికూడఁ దనకు నన్యాయ మొనర్చిన తనపతిచింతతోడనే కాలము గడపెను. తల యైనను ముడువదయ్యె, మంచి చీరె యైనను కట్టదయ్యె, ఆహార మైనను తిన్నఁగఁ దినదయ్యె! ఆర్య పతివ్రతాతిలకములకు నాదర్శము గదా!

అనసూయా ప్రియంవదలు :— వీరు శకుంతలచెలియం డ్రని చెప్పవలెను. ఆమెనువలెనే వీరినిఁగూడఁ గణ్వమహర్షి పెంచి పెద్ద వారిని జేసెను. ముగ్గురును సమానరూపసౌహార్దము గలవారు. వీ రిద్దఱును కావ్యేతిహాసములను జదివియుండిరి.[1] చిత్రకర్మమును అభ్యసించిరి.[2] ఇందుఁ బ్రియంవద హాస్యోక్తులందును, కొంతవఱకు స్త్రీపురుషప్రణయవ్యవహారములందును నిపుణ. అనసూయ మనోధైర్యము కలది, దూరపుటాలోచన చేయునది, కార్యమును సాధించునుపాయము కలది. ప్రథమాంకమునందుఁ జెట్లకు నీరు పోయుప్రసంగమున శకుంతలను ‘అత్ర పయోధరవిస్తారయితృ ఆత్మనో యౌవన ముపాలభస్వ’, ‘యావత్ త్వయా ఉపగతయా లతాసనాథ ఇవ అయం కేసరవృక్షకః ప్రతిభాతి’ యనుచుఁ గేరడము లాడి యామెచే ‘అతః ఖలు ప్రియంవదాసి త్వమ్’ అన్న పొగడ్తను గాంచెను. తృతీయాంకమునందు దుష్యంతునకు మదనలేఖ వ్రాయు మనియు, పూలలోఁ బెట్టుకొని పోయి తాను రాజునకు నిచ్చి వచ్చెద ననియు నుపాయము చెప్పెను. మొదటియంకమునందు దుష్యంతుఁడు చెట్టు చాటునుండి రాఁగా కన్య లందఱును సంభ్రాంత లగుదురు. వారిలో అనసూయ వెంటనే ధైర్యముఁ దెచ్చుకొని రాజునకు బదులు చెప్పి అతిథిసత్కారమునకుఁ గడంగును. రాజుతో నెక్కువగా మాటలాడినది యామెయే. దుర్వాసశ్శాపము వినినతోడనే ప్రియంవద భ్రాంతి చెంది యూరకుండును. ఋషికోపము తీర్చుటకు ననసూయను పంపును. ఆమె వెళ్లి ముక్కోపి యైనదుర్వాసునికోపమును దీర్చి శాపశాంతి వరంబు వడసివచ్చును.

కణ్వుఁడు :— అభిజ్ఞానశాకుంతలమందలి కణ్వుని ఋషి యని చెప్పుటకంటెఁ బవిత్రుఁడును, సత్త్వగుణప్రధానుఁడును, తన కూఁతులయెడ నిరతిశయప్రేమగల గృహస్థుఁడును అనియే చెప్పవలెను. తాను నిత్యబ్రహ్మచారి యయ్యును తనకుఁగల భూతదయ పురికొల్పఁ దలిదండ్రులచే విడువఁబడిన ఆఁడుపిల్లలఁ దెచ్చి పెంచును. వారికి విద్యయు బుద్ధులును గఱపును. మిక్కిలి జాగరూకతతో వారి యోగక్షేమ మరయును. వారికి దైవము ప్రతికూల మైనపుడు తీర్థములకుఁ బోయి దానిని శాంతింపఁజేయును. మంచిసంబంధములు చూచి వారికి వివాహములు చేయఁ బ్రయత్నించును. శకుంతల గాంధర్వ వివాహము చేసికొనఁగా నభినందించును. ఆమెకుఁ జీర సారె మేరలఁ బెట్టి వెంట మనుష్యుల నిచ్చి యత్తవారియింటికిఁ బంపును. తద్వియోగమునకుఁ జింతపడును. శకుంతలకు నితఁడు చేసినబోధవలనను, రాజునకుఁ బంపినవార్తవలనను ఈతనికి వ్యవహారజ్ఞానము మెండుగాఁ గల దని తెలియును. ‘అస్మాన్ సాధు విచింత్య సంయమధనాన్’ అన్న సందేశమువలన నాతనిస్వాత్మగౌరవము వెల్లడి యగును. మీకు రత్నాదికధన మున్నను మాకు దానిని మించినతప స్సనుధనము గలదు. కావున మేము మీకంటెను దక్కువవారము కాముసుమా! జ్ఞాపక ముంచుకొను మని భావము.

శార్ఙ్గరవుఁడు, శారద్వతుఁడు :— వీ రిద్దఱును శకుంతలను దుష్యంతునియొద్దకుఁ దీసికొనిపోయిన కణ్వశిష్యులు. వీ రిద్దఱును వేఱువేఱుస్వభావము కలవారు. శార్ఙ్గరవుఁడు కోపదారి, యితరుల మాటను ఎంతమాత్రమును సహించువాఁడు కాఁడు. ప్రసంగము వచ్చినపుడు చక్రవర్తినిగూడ లక్ష్యము చేయక యెంతమాటయైనను అనును. ఈతఁడు పెద్దశిష్యుఁడుగఁ గానవచ్చుచున్నాఁడు. కణ్వుఁ డితనితోడనే తాను రాజునకుఁ జెప్పవలసినవార్త చెప్పును. రాజుతోడను ఈతఁడే మొదట సంభాషించును. శారద్వతుఁడు శాంతుఁడు, తొందరపడువాఁడు కాఁడు. దుష్యంతునకు శార్ఙ్గరవునకును జరగుచున్నవాదము ముదురుచుండుట చూచి యాతఁడు రెండుపర్యాయములు తోడిశిష్యుని నిలిపి చివరకు రాజుతో ‘ఈమె నీ భార్య. ఏలిన నేలుకొమ్ము, వెడలఁగొట్టిన వెడలఁగొట్టుము’ అని చెప్పి శార్ఙ్గరవ గౌతములను మరలునట్లు చేయును. అరణ్యములో నుండుట యలవాటుపడ్డ యీ యిద్దఱు ఋషికుమారులును జనాకీర్ణ మయిన రాజధానిని చూచి కళవళ మంది ‘ఈయూరు నిప్పంటుకొన్నకొంప మాదిరి నున్న’ దనియు, మఱియొకఁడు, ‘ఇందలి జనులు మడ్డివారుగను, అపవిత్రులుగను, బద్ధులుగను, అప్రబుద్ధులుగను ఉన్నారు’

1. అనభ్యంతరాః ఖలు వయం మదనగతస్య వృత్తాంతస్య, కింతు యాదృశీ ఇతిహాసనిబంధేషు కామయమానానామవస్థా శ్రూయతే తాదృశీం తే ప్రేక్షే. —[౩-వ అంకము].

2. అనుపభుక్తభూషణోఽయం జనః, చిత్రకర్మపరిచయేన అంగేషు తే ఆభరణవినియోగం కుర్వః. —[౪-వ అంకము].

sampath_Ebooks



అనియుఁ జెప్పెను. ఈ దినములలోఁగూడ సేవోపనిమీఁదను బల్లెటూరివారు పట్టణములకు వచ్చి, యచ్చటిజనసంకీర్ణతయు, నవాచారంబును జూచి బెదరి కణ్వశిష్యులవలెనే పలుకుచుందురుగదా!

విదూషకుఁడు :— నాటకమందలి ముఖ్యరస మేదియైనను ప్రేక్షకులకు విసుగు పుట్టకుండ నుండుటకై నడుమనడుమను గొంత హాస్యరసమును బ్రదర్శించుట యావశ్యకము. ఇందులకై సంస్కృత నాటకములందు విదూషకుఁ డనుపాత్రమును కల్పించెదరు. విదూషకుఁడు సాధారణముగ బ్రాహ్మణుఁడుగను, నాయకుని స్నేహితుఁడుగను ఉండును. ఈ నాటకమునందు మాఢవ్యుఁ[1] డనువాఁడు విదూషకుఁడు. అతఁడు రెండవయంకమునందును, అయిదవ, ఆఱవయంకములందును గానిపించును. శకుంతలనుగుఱించి రాజు మనసులోఁ గల ప్రేమాతిశయము లన్నియు మిత్త్రునితోఁ జెప్పినట్లు చేసి ప్రేక్షకులకుఁ దెల్పవలె నన్నయుద్దేశముతోఁ గవి యీపాత్త్రమును నిర్మించినట్టు గానవచ్చుచున్నది. ఇంతియకాని యితనిసంభాషణమునందుఁ బ్రేక్షకుల నవ్వించునట్టి హాస్య మేమంతగఁ గానరాదు; నాటకమునందలి సంవిధానకమున (Plot) ఈ పాత్త్రమునకుఁ బనియు నంతగ లేదు. దీనికంటె విక్రమోర్వశీయమందలి విదూషకుఁ డెక్కువ హాస్యగాఁడు, సంవిధానమున కావశ్యకుఁడు. ఈ విదూషకుని ఏకాంతమందు రాజునొద్ద నుండనిచ్చి, పిదప రాజునొద్దనుండి తొలఁగనీయవలయు నని కవిప్రయత్నముగఁ గానవచ్చుచున్నది. అందుకే రెండవయంకమునందు రాజతనిని రాజధానికిఁ బంపివైచును. అయిదవయంకమునందు హంసపదికయొద్దకుఁ బంపివేయును.

ఈ నాటకమందలిహాస్యమును జూడవలె నన్న మాఢవ్యుని మాటలు విన్నఁ బ్రయోజనము లేదు. పంచమషష్ఠాంకములకు నడుమనున్న జెస్తవానిసంబంధమైన ప్రవేశమును జూడవలెను.

ఈ నాటకముమీఁది టీకాగ్రంథములు :— ఈ నాటకముయొక్క యోగ్యతనుబట్టి దీనిపైని పెక్కు టీకాగ్రంథములు వ్రాయఁబడినవి. మూలగ్రంథ మంత కఠినము కాదు గాన టీకాగ్రంథములతోఁ బండితులకు నంతగాఁ బ్రయోజనము లేకపోయినను, విద్యార్థులకు నివి కడు సహకారులు. ఇదియుఁగాక వేఱువేఱుపాఠములను గమనించుటకును, ఏయేదేశమందు నేయేకాలమందుఁ బాఠము లెట్లెట్లు మాఱినవి తెలిసికొనుటకును ఈ టీకాగ్రంథము లుపయోగకరములు. శాకుంతల టీకాకారులలో నీక్రిందివారు పేర్కొనఁదగినవారు :—

అభిరామభట్టు, కాటయవేముఁడు, కృష్ణనాథపంచాననుఁడు, చంద్రశేఖరుఁడు, డమరవల్లభుఁడు, నారాయణరాఘవుఁడు, రామభద్రుఁడు, శంకరుఁడు, శ్రీనివాసుఁడు, చంద్రశేఖరుఁడు, ప్రకృతాచార్యుఁడు, ఘనశ్యాముఁడు, ప్రేమచంద్రుఁడు.

వీరిలో అభిరామభట్టు, కాటయవేముఁడు, చంద్రశేఖరుఁడు శంకరుఁడు అనువారు పురాతనులు. టీకాకారులలో కాటయవేముఁడు, శ్రీనివాసుఁడు ఆంధ్రులు.

కాటయవేమారెడ్డి, కొండవీటిరాజ్యము నేలిన ప్రోలయవేమారెడ్డికి (౧౩౨౮-౧౩౫౦) దౌహిత్రుఁడును, అనపోతారెడ్డికి (౧౩౫౦-౧౩౬౨) మేనల్లుఁడును, అల్లుఁడును, కుమారగిరిరెడ్డికి (౧౩౮౩-౧౪౦౦) బావయు, మంత్త్రియు నైయుండెను. కుమారగిరిరెడ్డివలన రాజమహేంద్రవరరాజ్యము వడసెను. ఈతఁడు క్రీ. శ. ౧౪౧౫వఱకును బ్రతికి యుండిన నుండవచ్చును. ఈతఁడు మహాశూరుఁడుగ నుండుటయేకాక పండితుఁడై కాళిదాసరచితమైన శాకుంతల, విక్రమోర్వశీయ, మాళవికాగ్నిమిత్త్రము లను నాటకములమీఁదఁ జక్కని టీకలు వ్రాసెను. ఈ టీకలకు వసంతరాజీయ మని పేరు. ఈతని బావయు, యజమానుఁడును అగు కుమారగిరిరెడ్డికి వసంతరాజని మాఱుపేరు. అతఁడు వసంతరాజీయ మన్న పేరట ఒకనాట్యశాస్త్రమును రచించెను. ఆనాట్యశాస్త్రము ననుసరించి కాటయవేమారెడ్డి వసంతరాజీయ మను ఈ మూఁడుటీకలను వ్రాసెనఁట! ఆ టీకకుఁ బ్రారంభమం దున్న ఈశ్లోకముల నీక్రింద నిచ్చుచున్నారము.[2] కాటయవేమునివ్యాఖ్యానము పెక్కురుపండితులచేత మిక్కిలి కొనియాడఁబడినది. 'ఈ టీకాగ్రంథమువలన నీగ్రంథకర్త పూర్ణపండితుఁ డనియు, సమర్థుఁడైనవ్యాఖ్యాత యనియుఁ గానవచ్చును. ఈతఁడు శబ్దములయొక్క ధ్వన్యర్థమును కనుఁగొనుటలో సూక్ష్మదృష్టి కలవాఁడు. కావ్యసౌందర్యమును జక్కఁగఁ జూడఁగల్గు రసికుఁడు. నిస్సంశయముగ నీవ్యాఖ్యానము గొప్పయోగ్యత గలది. అయిన నిందు స్వల్పవిషయములు వివరింపఁబడనందునఁ దరుణవిద్యార్థుల కంతగ నుపయోగకరము కాదు' అని యొకపండితునియభిప్రాయము.[3] ఇట్టి యుత్తమవ్యాఖ్యాన మింకను అచ్చుపడలేదు!

---

1. మాఢవ్యుఁ డనుపాఠముకూడఁ గలదు.

2. మునీనాం భరతాదీనాం భోజాదీనాంచ భూభృతామ్, శాస్త్రాణి సమ్యగాలోచ్య నాట్యవేదార్థవేదినామ్. ౧
ప్రోక్తం వసంతరాజేన కుమారగిరిభూభుజా, నామ్నా వసంతరాజీయ నాట్యశాస్త్రం య దుత్తమమ్. ౨
తత్రోక్తే నైవ మార్గేణ దర్శితాశేషలక్షణః, కవీనా మాశ్రయో మంత్రీ కాటభూపతసూథిపః. ౩
సోఽయం వేమవిభుః కుమారగిరిణా రాజ్ఞా నియుక్తః కృతీ, నాట్యానాం త్రితయం కృతం కృతధియా శ్రీకాళిదాసేన యత్,
తస్యోద్దీర్ణరసార్ణవస్య రసికశ్శాకుంతలాదేః స్వయం, వ్యాఖ్యానం కురుతే కుమారగిరిరాజీయాఖ్య మస్మై హితమ్. ౪

3. 'The Commentary indicates that the author was a sound scholar and able expositor. He penetrates into the suggested sense of the word and seems naturally able to appreciate beauty in poetry. The

sampath_Ebooks

ఆంధ్రటీక మఱియొక టీకాకారుఁడు శ్రీనివాసుఁడు లేక శ్రీనివాసాచార్యుఁడు. ఈతఁడు ప్రతియంకమునకును చివర వ్రాసికొనిన 'ఇతి శ్రీరమా వేంకటాచలేశ్వరపాదారవిందసమారాధక వైఖానసకులతిలక శ్రీ కౌశికగోత్ర శ్రీ తిరుమలాచార్య పుత్రేణ... శ్రీనివాసాచార్యేణ విరచితాయాం శాకుంతలవ్యాఖ్యాయాం... అంకః' అను గద్యమును చూచి యీతఁడు తిరుపతిలోని దేవర సన్నిధానమందున్న పూజారి యని తోఁచుచున్నది. ఈతనికాలమును నిర్ణయించుటకు నాధార మేమియు లేదు.

ఈ నాటకమునకుఁ దెనుఁగు భాషాంతరములు :— తెనుఁగునఁ బూర్వకవులు నాటకములు వ్రాయలేదు. నాటకమునందుఁ బాత్రల ననుసరించి గ్రామ్యభాషను వ్యవహరింపవలసివచ్చునని కాఁబోలును వారు నాటకములను తెలిఁగింపవలసివచ్చినప్పుడు దృశ్యకావ్యములఁగా మార్చక, శ్రవ్యప్రబంధములుగానే వ్రాయుచువచ్చిరి. మంచన కవి మొదటి పదునాల్గవశతాబ్దిని విద్ధసాలభంజిక యనుసంస్కృత నాటకమును కేయూరబాహుచరిత్ర మను కావ్యముగఁ దెలిఁగించెను[1]. పదునైదవశతాబ్దివారగు నంది మల్లన, ఘంట సింగన యను కవులు కలసి ప్రబోధచంద్రోదయ మను సంస్కృతనాటకమును తెలుఁగుప్రబంధముగ మార్చిరి. ఇట్లే పదునాల్గవశతాబ్దియంతమువాఁడగు పిల్లలమఱ్ఱి పినవీరభద్రకవి కాళిదాసునినాటకము ననుసరించి శృంగారశాకుంతల మనునామాంతరముగల శకుంతలాపరిణయమును రచించెను. అది మూఁడాశ్వాసముల గ్రంథము. ఇతఁడు గాక, కృష్ణకవి యొకశకుంతలాపరిణయమును, పిండిప్రోలి లక్ష్మణకవి మఱియొక దానిని, పెద్దాపుర నాగయామాత్యుఁ డింకొకదానిని, రేవుణూరి వేంకటార్యుఁడు మఱియొకదానిని వ్రాసిరి. కృష్ణకవి నెల్లూరుమండలము వాఁడు. ఈ గ్రంథము చిలుకమఱ్ఱి పాపయ్య యనుకమ్మనాయని ప్రేరణమువలన రచియింపఁబడినది. ఇందు శాకుంతలములోని పెక్కు పద్యములు చక్కఁగ భాషాంతరీకరింపఁబడినవి. పిండిప్రోలి లక్ష్మణకవి గోదావరీమండలమునఁ గుర్యోటి గ్రామనివాసి. నాగరాజు గోదావరీమండలాన్తర్గత వీరవాసరవాస్తవ్యుఁడు. ఇందు భారతికథ యొక్కువగ ననుసరింపఁబడినది. ఈముగ్గురుకవులును ఇంచుమించుగా పదునెనిమిదవ శతాబ్దివారు. ౧౮౯౦-వ సంవత్సరమున నూజివీటివిద్వాంసులగు విద్వాన్ మాడభూషి వేంకటాచార్యులవారు 'భరతాభ్యుదయ' మను కావ్యమును రచించిరి. ఇయ్యది కాళిదాసునినాటకము ననుసరించి వ్రాయఁబడిన ప్రౌఢప్రబంధము. ఈకావ్యములు కాళిదాసుని నాటకమునకు భాషాంతరము లని చెప్పుటకు వీలు లేకపోయినను శాకుంతలకథ ననుసరించి యాంధ్రమున వ్రాయఁబడినకావ్యము లని చెప్పవచ్చును.

సంస్కృతనాటకములను తెనుఁగుబాసలోనికి నాటకములుగ భాషాంతరీకరించుపద్ధతి పందొమ్మిదవశతాబ్దియంతమునందుఁ బ్రారంభ మైనది. శాకుంతలమునకుఁ దెనుఁగున నచ్చుపడినట్టి భాషాంతరములు పెక్కులు కలవు. వీనిలో కాలక్రమముగఁ జూచినచో మొదటిది శ్రీ వీరేశలింగముకవిగారిది.

(కో. వేం. ల.)

**అభిజిత్తి** — ఒకనక్షత్రము. రోహిణిప్రక్క నుండునది. దక్షునికూమార్తె. చంద్రునిభార్య. ఈమె అందఱకన్నఁ దాను చంద్రున కెక్కుడు ప్రేమాస్పద కావలయు నని తప మొనరింప నరిగెను. ఈసమయమును గనిపట్టి కుమారస్వామి యగ్నిదైవత్య మగు నక్షత్రము నాస్థానమున నిలిపెను.

**అభిధ** — ఆలంకారికుల మతమున సంకేతితార్థమును బోధచేయునట్టిదియు, శబ్దమునం దుండునదియు నగు (శబ్దనిష్ఠయగు) నొకశక్తి (వృత్తి). వీరిమతమున పదమునకు వాచ్య, లక్ష్య, వ్యంగ్యము లను మూఁ డర్థము లుండును. వానిలో ముఖ్య మైనదియు, సాక్షాత్ సంకేతిత మైనదియు నగునర్థము వాచ్య మనునది; అనఁగా సాధారణముగ లోకములో నేపద మేయర్థమందు వాడఁబడుచున్నదో యది యాపదమునకు వాచ్యార్థము (కావ్యప్రకాశము, ద్వితీయోల్లాసము). ఇట్టిముఖ్యార్థమును స్ఫురింపఁజేయునట్టివ్యాపారమున కభిధ యని పేరు. దీనిని కావ్యప్రకాశకారుఁడు వ్యాపార మనెను, సాహిత్యదర్పణకారుఁడు శక్తి యనెను, ప్రతాపరుద్రీయకారుఁడు వృత్తి యనెను. ఇతనిమతమున శబ్దవృత్తులు మూఁడు: అభిధా, లక్షణా, వ్యంజన లనునవి. సంకేతితార్థగోచర మైనశబ్దవ్యాపార మభిధ యనఁబడును. అది రెండువిధములు : రూఢిపూర్వక, యోగపూర్వక. భువనము అనునది మొదటిదానికిని, వసుమతి రత్నగర్భ యనునవి రెండవదానికిని ఉదాహరణములు (కావ్యప్రకరణము).

భాట్టమతమునం దభిధ యనఁగా ఫలమును పుట్టించునట్టివాచకశబ్దగత వ్యాపారము. దీనికే భావన యని పేరు. ఇది యొక వేఱు పదార్థ మని వారియభిప్రాయము. దానిజ్ఞానమునకే ప్రవర్తకశక్తి కలదు. దానియందే భావనాత్మరూపమున విధిశక్తి యుండును (వాచస్పత్యము).

పదార్థమే వాక్యార్థ మనుప్రాభాకరులమతమున నభిధావృత్తి వృత్త్యంతరముతో మిళిత మగును. భట్టనాయకుఁ డభిధలోఁ దాత్పర్యవ్యంజనాలక్షణముల నంతర్భవింపఁజేసి వృత్త్యేకత్వము రసస్వరూపమున కంగీకరించెను.

---

Commentary is undoubtedly of a high order, but dose not explain minor points and is not therefore fully serviceable to young students' — Patankar's Abhijnana Sakuntalam.

1. ఈ గ్రంథము కాకినాడలోని సరస్వతీపత్రికయందుఁ బ్రకటింపబడినది.

sampath_Ebooks



**అభిధమ్మము** (అభిధర్మము) — త్రిపిటకము లనఁబరఁగు బౌద్ధులవేదములలో అభిధమ్మ మనునది మూఁడవ పిటకము. ఇయ్యది సప్తప్రకరణంబులుగా విభజింపఁబడినది. ఈ గ్రంథము క్రీ. పూ. ౪౦౦ మొదలు ౨౫౦ వఱకును జరగినకాలము నందు వ్రాయఁబడియె నని విద్వాంసులయభిప్రాయము. ఇందలి మొదటిప్రకరణము మొదట వ్రాయఁబడె ననియు, మూఁడవప్రకరణము చివర వ్రాయఁబడె ననియు నూహింపఁబడుచున్నది. ఈ గ్రంథమునందలి బోధ లన్నియు స్వయముగా బుద్ధునిచేఁ జెప్పఁబడియె నని బౌద్ధులయభిప్రాయము. బౌద్ధమతమునకు సంబంధించిన నైతిక తత్త్వము లన్నియు నిందు విశదముగఁ జర్చింపఁబడినవి. మొదటి ప్రకరణమునందు ధర్మములపట్టికయు (ధమ్మసంగని), రెండవప్రకరణమునందు ధర్మనిరూపణమును (విభంగ), మూఁడవప్రకరణమునందు మతములకు మూలాధారములును (కథావత్థు), నాల్గవప్రకరణమునందు వ్యక్తివిశేషములును (పుగ్గలపన్నత్తి), అయిదవ ప్రకరణమునందు చిన్నచిన్న నైతికప్రకృతులకుఁగల సంబంధమును (ధాతుకథ), ఆఱవప్రకరణమునందు నైతికయమకమును (యమక), ఏడవప్రకరణమునందు నైతికస్థితియొక్కయభివృద్ధియును (పత్థాన) వర్ణింపఁబడినవి. ఈ గ్రంథ మంతయు పాలీభాషలో వ్రాయఁబడి యున్నది. సర్వాస్తివాదు లనువారు బౌద్ధులలో నొకతెగవారు. వారు తమసిద్ధాంతముల కనుకూలముగా మఱియొక అభిధమ్మమును నిర్మించుకొనిరి. హిందూదేశమునం దీభాగము నశించినది. కాని చీనా దేశమునందు దీనిభాషాంతరము కలదు.

**అభిధర్మకోశవ్యాఖ్య** — అభిధర్మకోశ మని వసుబంధునిచే రచింపఁబడిన సంస్కృతకోశ మొకటి యుండెను. అది యిప్పు డెచ్చటను కానరాదు. దానిపై వ్రాయఁబడినవ్యాఖ్యలు మాత్రము చీనా, టిబెట్ దేశములందు కానవచ్చుచున్నవి. దీనికి చైనీస్, టిబెట్ భాషాంతరీకరణము లిప్పటికిని గలవు. ఇందు బౌద్ధమతసంబంధము లయినవిషయము లన్నియుఁ జర్చింపఁబడెను.

**అభిధానచింతామణి** — హేమచంద్రరచిత మైనకోశము. ఇందు జైనసిద్ధాంతములు చక్కఁగ వివరింపఁబడినవి.

**అభిధాననిఘంటువు** — హేమచంద్రకృత మైన శబ్దకోశము.

**అభిధానరత్నమాల** — హలాయుధప్రణీత మగు సంస్కృతనిఘంటువు.

**అభిధావృత్తిమాతృక** — వృత్తిస్వరూప మెఱుకపఱుచు చిన్నగ్రంథము. ముకులభట్టప్రణీతము.

**అభిధేయము** — ఇది యొక యర్థవిశేషము. సామాన్యముగ నర్థములు మూఁడువిధములు: వాచ్యము, లక్ష్యము, వ్యంగ్యము. కొందఱుమతమునఁ దాత్పర్య మను మఱియొకయర్థము కలదు. ఈయర్థములలో వాచ్యమునకే యభిధేయ మనునది నామాంతరము. ఒకశబ్ద మొకయర్థమును బోధించునపు డట్టియర్థమును బోధించుటలో నాశబ్దమునకు శక్తి యుండవలెను. ఏశబ్దమున కేయర్థమున నీశక్తి యుండునో ఆశబ్దమున కాయర్థ మభిధేయ మనఁబడుచుండును. రామశబ్దమునకు దశరథాపత్యరూపార్థమున శక్తి కలదు కావున, రామశబ్దమునకుఁ బ్రాసక్తార్థ మభిధేయ మగుచున్నది. కావున నభిధచే వాచకశబ్దమువలనఁ గల్గునర్థము వాచ్యార్థము లేక అభిధేయార్థ మని చెప్పఁబడుచున్న దని సారాంశము. అభిధావ్యాపారమువలనఁ గల్గునర్థ మగుటచే నిది యభిధేయ మనఁబడుచున్నది.

అభిధేయార్థమునకు సంకేతితార్థ మని నామాంతరము కలదు. ఈయర్థము జాతి, గుణము, క్రియ, ద్రవ్యము నని నాల్గువిధములు. ద్రవ్యమునకు యదృచ్ఛ యని నామాంతరము కలదు. ప్రపంచములోని పదార్థజాతి యంతయు నీమీఁది నాల్గుతరగతులలో నిముడిపోవుచున్నది. అం దొక్కటికంటె నెక్కువగ నుండుపదార్థములు జాతి యందలివిగాఁ జెప్పఁబడుచున్నవి.

ఆకారముచే గ్రహింపఁదగినది జాతి యగును. 'గోవు' అను పదము జాతివాచకము. ప్రపంచమున నొక్కటికంటె నధికముగ గోవు లున్నవి. మన మొకగోవును జూచితి మనుకొందము. తోఁక, చీలినడెక్కలు గల నాల్గుకాళ్లు, కోలముఖము, గంగడోలు మొదలగునవి కలది గోవు అని మనకు జ్ఞానము కలుగును. కాని నిదివఱకు మన మెఱిఁగినయాకారముకల మఱియొకగోవును జూచినపుడుకూడ మన కది గో వనుజ్ఞానము కలుగుచున్నది. కాన గోపదార్థము జాతి యగుచున్నది.


పదార్థమునందలి విశేషమును దెలుపునది గుణవాచక మగును. ఇది సామాన్యముగ విశేషణ మగుచుండును. 'తెల్లనిగుఱ్ఱము, ఎఱ్ఱని కాగితము, మంచి బాలుఁడు' అనుపదములలోఁ దెల్లని, ఎఱ్ఱని, మంచి అనుపదవిశేషణములు తద్వస్తువులవిశేషములను (గుణములను) దెలుపుచున్నవి. కావున నిందలి తెల్లఁదనము, ఎఱ్ఱఁదనము, మంచితనము గుణములు.

పనిని దెలుపునవి క్రియావాచకములు. 'వంటవాఁడు' అను పదము వంట చేయువాఁ డనునర్థమును బ్రతిపాదించుచున్నది. వంట చేయుట యొకపని యగుటచే మీఁదిపదము క్రియావాచకము.

ద్రవ్య మనఁగ నొక్కటే పదార్థము. సంజ్ఞావాచకము లన్నియు ద్రవ్యవాచకము లనవచ్చును. వెంకన్న, అచ్చెన్న, కాశీ, విజయనగరము మొదలగునవి కేవల మొక్క పదార్థమునే తెలుపును. కావున వెంకన్న మొదలగునవి ద్రవ్యములు.

కాని సిద్ధాంతమునందుమాత్ర మొక్క జాతియందే పదార్థము లన్నియు నంతర్భవించును. కాన గుణము, క్రియ, ద్రవ్యము వేఱే

# అభినయము




౧. పతాకహస్తము : లక్షణము

అంగుళ్యః కుంచితాంగుష్ఠాః సంశ్లిష్టాః ప్రసృతా యది,
స పతాకకరః ప్రోక్తో నృత్యకర్మవిశారదైః.

౨. త్రిపతాకహస్తము : లక్షణము

స ఏవ త్రిపతాకస్స్యాత్ వక్రితానామికాంగుళిః.

౩. అర్ధపతాకహస్తము : లక్షణము

త్రిపతాకే కనిష్ఠా చేద్వక్రితార్ధపతాకికా.

౪. కర్తరీముఖహస్తము : లక్షణము

అస్మిన్నేవ చాపి హస్తస్య తర్జనీచ కనిష్ఠికా,
బహిః ప్రసారితే స్యాచ్చేత్ స కరః కర్తరీముఖః.

౫. మయూరహస్తము : లక్షణము

అస్మిన్ననామికాంగుష్ఠౌ శ్లిష్టౌ చాన్యే ప్రసారితే,
మయూరహస్తః కథితః కరః ప్రేక్షావిచక్షణైః.

౬. అర్ధచంద్రహస్తము : లక్షణము

అర్ధచంద్రకరస్సోఽయం పతాకేఽంగుష్ఠసారణాత్.

౭. అరాళహస్తము : లక్షణము


పతాకే తర్జనీ వక్రా నామ్నా సోఽయమరాళకః.

౮. శుకతుండహస్తము : లక్షణము

అస్మిన్ననామికా వక్రా శుకతుండకరో భవేత్.

sampath_Ebooks

# అభినయము




**౯. ముష్టిహస్తము : లక్షణము**

మేళనా దంగుళీనాంచ కుంచితానాం తలాంతరే,
అంగుష్ఠేనోపరియుతో ముష్టిహస్తోఽయ ముచ్యతే.

**౧౦. శిఖరహస్తము : లక్షణము**

చేన్ముష్టి రున్నతాంగుష్ఠ స్స ఏవ శిఖరః కరః.

**౧౧. కపిత్థహస్తము : లక్షణము**

అంగుష్ఠమూర్ధ్ని శిఖరే వక్రితా యది తర్జనీ,
కపిత్థాఖ్యకర స్సోఽయం......

**౧౨. కటకాముఖహస్తము : లక్షణము**

కపిత్థతర్జనీ చోర్ధ్వం మిశ్రితాంగుష్ఠమధ్యమా,
కటకాముఖహస్తోఽయం కీర్తితో భరతాదిభిః.

**౧౩. సూచీహస్తము : లక్షణము**

ఊర్ధ్వం ప్రసారితా యత్ర కటకాముఖతర్జనీ,
భవే త్సూచీకరస్సోఽయం కీర్తితో భరతాగమే.

**౧౪. చంద్రకలాహస్తము : లక్షణము**

సూచ్యా మంగుష్ఠమోక్షేతు భవే చ్చంద్రకలాకరః.

**౧౫. పద్మకోశహస్తము : లక్షణము**

అంగుళ్యో విరళాః కించి త్కుంచితా స్తలనిమ్నగాః,
పద్మకోశాభిధో హస్తః......

**౧౬. సర్పశీర్షహస్తము : లక్షణము**

పతాకతలనిమ్నత్వా త్సర్పశీర్షకరో భవేత్.

sampath_Ebooks

యంగీకరింప నక్కఱలేదు. వానియందు శక్తి నంగీకరింప నక్కఱలే దనియు, జాతియందే శక్తి నంగీకరించినఁ జాలు ననియు నభిప్రాయము. ఉపాధిభేదము ననుసరించి గుణములు వేఱగుచుండును. కాని గుణమాత్ర మొక్కటియే యగుచుండును. తెల్లనిగుఱ్ఱము, తెల్లనిపాలు, తెల్లనికాగితము అనుచోట్ల నన్నిటియందుగల తెల్లదనఁ మొక్కటియే యైనను, గుఱ్ఱము, పాలు, కాగితము ననుపదార్థములం బట్టి వేర్వేఱను జ్ఞానము భ్రమమూలకము కలుగుచున్నది. ఒక్కటే యగుముఖము నద్దమునఁ జూచుకొనిన నొకమాదిరిగను (ఉన్న గున్నట్లును), కత్తియొక్క కాంతియందుఁ జూచికొనినఁ గోలగను గన్పించును. అంతమాత్రమున నా ముఖములు వేర్వేఱు అని చెప్ప వీలగునా? కాదు. కావున గుణము లన్నియు జాతియం దంతర్భవించుఁ గావున వేఱే గుణములయందు శక్తి యనవసరము.

ఇట్లే క్రియంగూడ్చియు గ్రహింపవలెను. సూపపాకము, తండులపాకము, లడ్డుకపాకము మొదలగు పాకములయందలి పాక మొక్కటియే. ఆశ్రయములగు బెల్లము, బియ్యము లడ్డువులు మొదలగు వానివలన పాకము వేర్వేఱైనట్లు తోఁచును. కావునఁ గ్రియ జాతియం దంతర్భవించుటచే వేఱే క్రియయందు శక్తి యనవసరము.

ద్రవ్యముగూడ జాతియే యనవలెను. వెంకన్న, అచ్చెన్న మొదలగువా రొక్కొక్కరే యైనను వయోఽవస్థలచే వారు మాఱుచుందురు. అట్లే విలుకచేఁ బిలువఁబడిన వెంకన్న యొకఁడును, బిల్లవానిచేఁ బిలువఁబడినవాఁడు వేఱును, ముదుసలి పిలిచినవెంకన్న వేఱు ననుచున్నారు. ఇట్లు వయోవ్యక్తిగతభేదములంబట్టి పెక్కుమంది వెంకన్నలు ప్రసిద్ధు లగుటచే నీమొత్తమున వెంకన్నత్వజాతి యుండి తీఱును. కావున వ్యక్తియందు శక్తి నంగీకరింప నక్కఱలేదు. ఇట్లు పదార్థ మొక్క జాతిరూప మగుటచే నేకవిధమే యని తేలినది. గుణాదు లిందే యంతర్భవించును. కావున గుణాదులు పదార్థము లని భ్రమసి యర్థోపలబ్ధికై తద్వాచకపదములందు శక్తి నంగీకరింప నక్కఱలే దని తాత్పర్యము.

కొందఱు క్రియయే శబ్దార్థ మనియు, జాతిగుణద్రవ్యములు క్రియయందే యంతర్భవించు ననియు నిరూపించియున్నారు. ఇయ్యది శ్రౌతసిద్ధాంతము. ఆలంకారికాగ్రేసరుఁడగు మహిమభట్టు వ్యక్తివివేకమున నీమతమును నిరూపించియున్నాఁడు. ఘటమందు ఘటత్వసామాన్య మున్నను ఘటన మను ( రెండిటిని ( సం ) ఘటించు నను ) క్రియ లేనిదే ఘటరూపార్థబోధ కలుగఁజాలదు. శుక్లాదికము గుణ మైనను శుక్లత్వమును (తెల్లఁదనమును) బొందించే నది శుక్లము కాఁజాలదు. వంటవాఁడు వంటను జేయకుండఁగనే పాచకుఁడు కాఁజాలఁడు. కావునఁ గ్రియయే పదార్థ మని యతఁడు నిరూపించియున్నాఁడు.

నైయాయికులు జాతివిశిష్టవ్యక్తియందు శక్తి నంగీకరింతురు. 'గోవు' అనునపు డాపదమందు గోత్వజాతియుఁ గల దనియు, నాజాతితోఁ గూడినగోవ్యక్తియే (గోద్రవ్యమే) గోశబ్దమున కర్థ మనియు వారిమతము. సౌగతులు తద్భిన్నభిన్నమునందే శబ్దమునకు శక్తి నంగీకరింతురు. దానికంటె వేఱగుదానికంటె వేఱగునది శబ్దార్థము. ఘటముకంటె వేఱగునది పటము. పటముకంటె వేఱగునది ఘటమే కాని వేఱొకటి కాదు. కాన ఘటశబ్దమునకు ఘటమే యర్థ మని తేలినది. ఇట్లే తత్తన్మతానుసారముగ శబ్దార్థము మాఱుచుండును. సిద్ధాంతమునమాత్రము జాతియే శబ్దార్థ మని తెలియవలెను.

[ బు. వేం. ర. ]

అభినందుఁడు — కాశ్మీరరాజగు ముక్తాపీడునకు నూఱేండ్లపిదపనుండి న్యాయసూత్రములకు 'న్యాయమంజరి' యను వృత్తిరచించిన జయంతభట్టుకుమారుఁడు ; కాదంబరీకథాసార మను సుందరమైన లఘుకావ్యమును రచించెను. గౌడాభినందుఁడను మఱియొకకవి వంగదేశపురాజగు యువరాజనరేంద్రుని యాస్థానభూషణమై రామచరితమను మహాకావ్యమును విరచించెను. ఈ యిరువు రభినందులును క్రీ. శ. ౮౫౦-౯౫౦ మధ్యకాలములో నుండిరి. వీరు కాక యార్యావీనుఁ డను నభినందుఁడు వాసిష్ఠరామాయణమునకు మంచి వ్యాఖ్యగూర్చెను.

**అభినయము** — నటుఁడు తన హృద్గతక్రోధాదిభావములను శరీరాదిచేష్టలవలన వ్యక్తీకరించుట అభినయము. రామయుధిష్ఠిరాదులయవస్థలను రంగాదిసాహాయ్యముచేఁ జూపుట యభినయముయొక్క ప్రయోజనము. అభినయమున కనుకరణ మావశ్యకము. లోకమునందుఁ దండ్రి తనకుమారుని ముద్దాడుట అభినయ మనిపించుకొనదు. పితాపుత్రులు కానివారు వారివేషములు వేసికొని, యందుఁ దండ్రివేషము వేసికొనినవాఁడు కొడుకువేషము వేసికొనిన వానిని ముద్దాడిన నది యభినయ మగును. భరతమునిప్రణీతనాట్యశాస్త్రమతమున అభినయము నాలుగువిధములు, ౧. ఆంగికము, ౨. వాచికము, ౩. ఆహార్యము, ౪. సాత్త్వికము (౮-౯). ఇఁక వీనినిగుఱించి కొంచెముకొంచెము విచారింతము.

ఆంగికము:— నేత్రముఖహస్తపాదాదికముల వ్యాపారమువలన మనోవ్యాపారములను దెలియఁజేయుట ఆంగికాభినయము. లోకమునందు జనులు కోపము వచ్చినప్పు డొకవిధముగను, ప్రేమ యధికమైనపు డొకవిధముగను, విషాదము కలిగినపు డొకవిధముగను ముఖవికాసమును, హస్తాదివిక్షేపములను జేయుట మనము చూచుచున్నారము. ఒకనియొక్క బహిరింద్రియవ్యాపారమునుబట్టి యతని మనోవ్యాపారమును మనము కనుఁగొనఁగలము. లోకమందలి యీ శారీరవ్యాపారములను నటులు చక్కఁగ ననుకరణమును జేసినఁగాని ప్రేక్షకులకు రామాదితాదాత్మ్యబుద్ధిచే నానందము కలుగ నేరదు. ఇంతియ కాదు, ఈయంగవ్యాపారములు లోకము ననుసరించి బాలురకు, తరుణులకు, వృద్ధులకు, గొప్పవారికి భృత్యులకును వేఱువేఱుగ నుండవలెను. గంభీరుఁ డైననాయకుఁడు దుఃఖసమయమున బాలునివలె బావురుమని యేడ్చినచో బాగుగ

మందునా? ఒకపురుషుఁడే యొక్క భావమునే భిన్నభిన్న వ్యక్తుల యెడఁ గనఁబఱుచునపుడు భిన్నాభినయములను జూపవలయును. ఒకానొకపురుషుఁడు ప్రేయసిని ప్రేమించునప్పుడును, సోదరినిఁ ప్రేమించునప్పుడును, పుత్రుని ప్రేమించునప్పుడును ఒక్కవిధ మైన యభినయమే చూపుటకు వీలు లేదుగదా!

నాటకమునం దాంగికాభినయప్రాధాన్యమును జూపుటకు రెండు ఉదాహరణములను జూపెదను. శాకుంతలనాటక ప్రథమాంకమందలి యీక్రిందిభాగమును చూడుఁడు:—

శకున్తలా:— (శృంగారలజ్జాం రూపయతి)

సఖ్యౌ:— (ఉభయో రాకారం విదిత్వా, జనాన్తికమ్) హలా! శకున్తలే! యద్యత్రాద్య తాతః సన్నిహితో భవేత్.

శకున్తలా:— (సరోషమ్) తతః కిం భవేత్?

సఖ్యౌ:— ఇమం జీవితసర్వస్వేనాప్యతిథివిశేషం కృతార్థం కరిష్యతి.[1]

ఇచ్చట శకుంతల ఊరకుండియున్నది. మాటలాడుట లేదు. కాని యామె అనురాగవ్యంజకము లగు 'ఉద్వీక్షణ, చింతన, ముఖావనమన, నఖకర్తన, వస్త్రాంగుళీయకస్పర్శాదికము' లయిన యంగచేష్టలవలన శృంగారలజ్జ నభినయించినందున సఖుల కామె భావము తెలిసెను. అట్లే నాయికానాయకులయాకార మునఁగా పరస్పరస్నిగ్ధావలోకనమువలన వారిభావమును సఖు లెఱింగిరి. కావున శకుంతలాదుష్యంత వేషములను వేసికొనినవారు, వారిభావము ప్రేక్షకులకుఁ దెలియున ట్లభినయింపవలెను. లేనియెడల నీభాగము ప్రేక్షకులకు గమ్యముగ నుండదు.

శాకుంతలమునందలి యింకొక ప్రసంగమును చూడుఁడు:—

శకున్తలా:— అనసూయే! అభినవకుశసూచ్యా పరిక్షతం మే చరణం, కురవకశాఖాపరిలగ్నం చ వల్కలం, తావత్పరిపాలయత మాం యావ దేనత్ మోచయామి[2] (రాజాన మవలోకయన్తీ సవ్యాజం విలమ్బ్య సహ సఖీభ్యాం నిష్క్రాన్తా).

ఇచ్చట శకుంతల, కాలికి దర్భాంకురము గ్రుచ్చుకొనియె ననియు, పయ్యెద చెట్టుకొమ్మకుఁ బట్టుకొనియె ననియు వ్యాజము కల్పించుకొని కొంత కాలయాపనము చేసి యితరులకుఁ దెలియనట్లుగ రాజును జూచెను. పైని చూపినయభినయమునకంటె నిది యొక్కువ కష్టము. ఇచ్చట కాలికి దర్భ గ్రుచ్చుకొనినట్లును, కొంగు చెట్టునకుఁ బట్టుకొనినట్లును అభినయము చేయుటయేకాక యాచేష్ట లన్నియు రాజును జూచుటకై కల్పింపఁబడినవ్యాజములు (సాకులు) అని ప్రేక్షకుల కభినయమువలననే బోధపడునట్లు నటింపవలెను. ఇది యభినయవిశేషము.

ఉత్తరరామచరితమందలియీక్రింది ప్రకరణమును చూడుఁడు:

సీతా:— ఏతే ఖలు తత్కాలకృతగోదానమఙ్గళా శ్చత్వారో భ్రాతరః, వివాహదీక్షితా యూయమ్. అహో జానామి తస్మిన్నేవ ప్రదేశే తస్మిన్నేవ కాలే వర్తే.

* * * *

లక్ష్మణః:— ఇయ మార్యా, ఇయ మప్యార్యా మాణ్డవీ, ఇయం వధూః శ్రుతకీర్తిః.

సీతా:— వత్స, ఇయ మప్యపరా కా?

లక్ష్మణః:— (సలజ్జస్మితమ్, అపవార్య స్వగతమ్) అయే ఊర్మిళాం పృచ్ఛ త్యార్యా. భవతు. అన్యతః సఞ్చారయామి (ప్రకాశమ్) ఆర్యే ద్రష్టవ్య మేతత్, అయం చ భగవాన్ భార్గవః.[3]

---

1. చదువరులసౌకర్యార్థము ప్రాకృత మీయక, సంస్కృతచ్ఛాయయే యీయఁబడినది. అర్థము:—

శకుంతల:— (శృంగారలజ్జ నభినయించుచున్నది).

సఖులు:— (ఇరువురయాకారమునుం గని, జనాంతికము) సఖీ శకుంతలా, నాయన యిపు డిచట నుండినయెడల?

శకుంతల:— (రోషముతో) ఉండిన నేమి?

సఖులు:— జీవితసర్వస్వమేని యిచ్చి యీయతిథిని కృతార్థునిఁ జేయుదురు. — [ వే. వేం. శాస్త్రిగారి భాషాంతరీకరణము ]

2. కొన్ని దాక్షిణాత్యపాఠములలో నీవాక్యము లేదు. అర్థము:— శకుంతల - అనసూయా! నూదివంటి క్రొత్తదర్భపుడెక్క నాపాదమున గ్రుచ్చుకొన్నది. నాచీర కురవకవృక్షముయొక్క కొమ్మం జిక్కుకొన్నది. దీనిం దీసికొనువఱకును నిలిచి నన్ను వెంటఁగొనిపొండు. (అని మిష పెట్టి రాజుం జూచుచు నాలస్యము చేసి సఖులతో వెడలిపోవుచున్నది). — [ కం. వీ. ]

3. సీత - నిజముగా వీ రప్పుడే గోదానమంగళకార్యమును నెఱవేర్చిన నలుగు రన్నదమ్ములు. వీరు వివాహదీక్షను గైకొనినవారు ఆహా! ఆప్రదేశమునందే యాకాలమునందే నే నిప్పు డున్నట్లున్నది. * * * *


లక్ష్మణుఁడు:— ఈమె వదినెగారు. ఈమె మాండవివదినెగారు. ఈమె మఱఁదలు శ్రుతకీర్తి.

సీత:— వత్సా! ఇదిగో నింకొకతె యున్నదే ఈమె యెవరు?

లక్ష్మణుఁడు:— (సిగ్గుపడి, నవ్వుచు, మొగము త్రిప్పి, తనలో) - ఆహా! మావదినెగారు నన్ను ఊర్మిళనుగుఱించి యడుగుచున్నారు. సరే. మంచిది. ఆమెను ఇంకొకవైపునకుఁ ద్రిప్పెదను. (ప్రకాశముగ) ఇదుగో మీరు చూడఁదగినది చూడుఁడు, ఇతఁడు భగవంతుం డగు భార్గవుఁడు.

sampath_Ebooks






౧౭. మృగశీర్షహస్తము : లక్షణము

అస్మిన్నే కనిష్ఠికాంగుష్ఠే ప్రసృతే మృగశీర్షకః.

౧౮. సింహముఖహస్తము : లక్షణము

మధ్యమానామికాగ్రాభ్యాం అంగుష్ఠో మిళితో యది,
శేషౌ ప్రసారితౌ యత్ర స సింహముఖ ఈరితః.

౧౯. లాంగూలహస్తము : లక్షణము

పద్మకోశే అనామికా చేన్నమ్రా లాంగూలకో భవేత్.

౨౦. సోలపద్మహస్తము : లక్షణము

కనిష్ఠాద్యా వర్తితాశ్చే ద్విరళా స్సోలపద్మకః.

౨౧. చతురహస్తము : లక్షణము

తర్జన్యాద్యాస్త్రయశ్శ్లిష్టాః కనిష్ఠా ప్రసృతా యది,
అంగుష్ఠేనామికామూలే తిర్యక్చేచ్చతురః కరః.

౨౨. భ్రమరహస్తము : లక్షణము

మధ్యమాంగుష్ఠసంస్పర్శే తర్జనీ వక్రితా యది,
శేషౌ ప్రసారితౌ యత్ర భ్రమరాభిధహస్తకః.

౨౩. హంసాస్యహస్తము : లక్షణము


మధ్యమాద్యాస్త్రయోఽంగుల్యః ప్రసృతా విరళా యది,
తర్జన్యంగుష్ఠసంయోగే హంసాస్యకర ఈరితః.

౨౪. హంసపక్షహస్తము : లక్షణము

సర్పశీర్షకరే సమ్యక్ కనిష్ఠా ప్రసృతా యది,
హంసపక్షకర స్సోఽయం......

sampath_Ebooks

# అభినయము




**౨౫. సందంశహస్తము : లక్షణము**

పునఃపునః పద్మకోశే సంశ్లిష్టాః ప్రసృతా యది,
సందంశాభిధహస్తోఽయం కీర్తితో భరతాగమే.

**౨౬. ముకుళహస్తము : లక్షణము**

అంగుళీపంచకం హ్యేవ మిళిత్వాగ్రే ప్రసార్యతే,
ముకుళాభిధహస్తోఽయం కీర్తితో భరతాగమే.

**౨౭. తామ్రచూడహస్తము : లక్షణము**

ముకుళే తామ్రచూడస్స్యాత్ తర్జనీ వక్రితా యది.

**౨౮. త్రిశూలహస్తము : లక్షణము**

నికుంచయిత్వాంగుష్ఠంచ కనిష్ఠాంచ త్రిశూలకః.

**౨౯. అంజలిహస్తము : లక్షణము**

పతాకతలయోర్యోగా దంజలిః కర ఈరితః.

**౩౦. కపోతహస్తము : లక్షణము**

కపోతస్స కరో జ్ఞేయ శ్లిష్టమూలాగ్రపార్శ్వతః.

**౩౧. కర్కటహస్తము : లక్షణము**

అన్యోన్యస్యాన్తరే యత్రాంగుళ్యో నిస్సృతహస్తయోః,
అంతర్బహిర్వా వర్తంతే కర్కటస్సోఽభిధీయతే.

sampath_Ebooks

ఇచ్చట లక్ష్మణుఁడు తన నల్గురన్నదమ్ములవివాహకాలపుఁ బటమును జూపుచు సీతా, మాండవీ, శ్రుతకీర్తులను బటమునఁ జూపి పేర్కొనెను. తనభార్య యైన యూర్మిళపటమును సిగ్గుచేఁ జూపక యూరకుండెను. అంత సీత యూర్మిళపటమును జూపి చెరఁడమునకు 'ఇదిగో నిచ్చట నింకొకయామె యున్నదే, ఈమె యెవరు?' అని యడిగెను. అంత లక్ష్మణుఁడు 'వదినెగారు యూర్మిళనుగుఱించి యడుగుచున్నా' రని మనసులో ననుకొని ముసిముసినవ్వులు నవ్వి యామాటను తప్పించి వివాహకాలోనితరువాతిభాగమును పరశురామ గర్వభంగప్రకరణమునకుఁ బోవును. ఇచ్చట చెరఁడ మాడినప్పటి సీతముఖవికాసమును, లక్ష్మణునిమనోభావమును దెల్పుముసిముసినగవులును నటులు చూపలేకపోయినయెడల నీకథాభాగమునందలి స్వారస్యమంతయు వ్యర్థ మగు ననియు, నట్టియభినయము లేని నాటకప్రదర్శనము రసము లేనిపిప్పివంటి దనియుఁ జెప్పవలసియున్నది.

ఈ యాంగికాభినయమును నాట్యశాస్త్రకారు లనేకవిధములుగ విభజించియున్నారు. ఆంగికాభినయము మూఁడువిధములు: శారీరము, ముఖజము, చేష్టాకృతము. మొగము గాక శరీరముయొక్క యితరభాగములవలనఁ గానవచ్చునది శారీరము, ముఖరాగములవలనఁ గానవచ్చునది ముఖజము, క్రియారూపముగఁ గానవచ్చునది చేష్టాకృతము. ఇందు ముఖరాగాన్వితము శ్రేష్ఠ మైన దని చెప్పఁబడినది:—

'శాఖాంగోపాంగసంయుక్తః కృతో ఽప్యభినయః స్మృతః,
ముఖరాగవిహీనస్తు నైవ శోభాన్వితో భవేత్.
శారీరాభినయో ఽల్పో ఽపి ముఖరాగసమన్వితః,
ద్విగుణాం లభతే శోభాం రాత్రావివ నిశాకరః.
నయనాభినయో ఽపి స్యా న్నానాభావరసస్ఫుటః,
ముఖరాగాన్వితో యస్మా న్నాట్య మత్ర ప్రతిష్ఠితమ్[1].'

మనస్సునందలి భావములు మాఱినకొలఁదియు ముఖముమీఁది వికారములు (రాగములు, రంగులు) మాఱుచుండవలెను. ముఖము హృదయప్రతిబింబమును జూపునట్టి యద్దము. హృద్గతభావములు ముఖముమీఁదను జూపఁగల్గిననటుఁడు అతిశ్రేష్ఠుఁడు. మనస్సునందలి భావములు మాఱినకొలఁదియు ఒక్కక్షణములో ముఖరాగములు మార్పవలసియుండును. ఇందులకు మననాటకములలోనుండి రెండు ఉదాహరణములు తీసికొందము.

౧. శాకుంతలనాటకమునందలి పంచమాంకమున, శకుంతల రాజుకొద్దకు వచ్చి నిరాకరింపఁబడినప్రకరణమునందు, ఆమెమనస్సులోఁ గ్రమముగ ఆతురత (రాజు తన్ను గౌరవించునో గౌరవింపఁడో యన్నశంక), నిరాశ, కోపము, దుఃఖము అను మనోవికారములు కథాసందర్భమునుబట్టి యుత్పన్నమగును. ఆమెముఖముమీఁదఁగూడ నీభావములప్రతిబింబములు ప్రేక్షకులకుఁ గానరావలయును. అట్లు చూపలేనినటుఁడు శకుంతలవేషము వేసికొనినయెడల నాటకముయొక్క మూఁడువంతులశోభ తగ్గ ననియే చెప్పవలెను.

౨. ఉత్తరరామచరితమునందలి మూఁడవయంకమును విశేషముగ నిందునుగుఱించి గమనింపవలయును. అందు రాముఁడు గానరాకుండ సీత యాతనియాలాపములను వినుచుండును. అతఁడు మూర్ఛపోయినపు డాతనిని, ఆతనికిఁ గానిపింపకుండ ముట్టుకొనును. ఈయొక్క రంగమం దామెమనస్సులో నెన్నియో భావము లుదయించును. ఈక్రిందిసందర్భమును జూడుఁడు:—

సీతా:— అహో! ఉద్భ్రాంతాస్మి.

* * * *

సీతా:— బహుమానితాస్మి పూర్వవిరహే నిరవధి రితి, హా హతాస్మి.

* * * *

సీతా:— (సోద్వేగం తమసా మాశ్లిష్య) హా భగవతి తమసే! గచ్ఛతీదానీ మార్యపుత్రః. కిం కరోమి.

* * * *

రామః:— అస్తి చేదానీ మశ్వమేధసహధర్మచారిణీ మే.

సీతా:— (సాక్షేపమ్) ఆర్యపుత్ర! కా?

వాసంతీ:— పరిణీత మపి కిమ్?

రామః:— నహి నహి హిరణ్మయీ సీతాప్రతికృతిః.

సీతా:— (సోచ్ఛ్వాసాస్రమ్) ఆర్యపుత్ర! ఇదానీ మసి త్వమ్. అహో ఉత్ఖాతిత మిదానీం మే పరిత్యాగశల్య మార్యపుత్రేణ.

* * * *

తమసా:— (సస్మితస్నేహార్ద్రం పరిష్వజ్య) అయి వత్సే! ఏవ మాత్మా స్తూయతే.

1. అంగోపాంగములతోఁ గూడుకొనియున్న శాఖా(ఆంగికా)భినయము చక్కఁగఁ బ్రదర్శింపఁబడినను ముఖరాగము లేనిది శోభింపదు. శారీరాభినయము కొలఁదిగా నున్నప్పటికిని ముఖరాగముచేఁ గనఁబడు ముఖజాభినయ మున్నయెడల, రాత్రిపూటఁ జంద్రునివలె రెట్టింపుశోభ కలుగును. నేత్రాభినయము ముఖరాగముతోఁ గూడుకొనినయెడల నన్నిభావములను, రసములను అది స్పష్టపఱుపఁగలదు. కావుననే నాట్యము దీనియందు నిల్పఁబడినది (నాట్యమునకు నిది మూలాధార మని భావము) [భరతాచార్యకృత నాట్యశాస్త్రమ్ - (బొంబాయి నిర్ణయసాగర ప్రతి) అ. ౮., శ్లో. ౧౬౯-౧౭౧].

sampath_Ebooks

సీతా :— (సలజ్జమ్) పరిహసితాస్మి భగవత్యా.

ఒకస్త్రీకి తనభర్త యింకొకస్త్రీని వివాహము చేసికొననేమో యన్న సంశయము కల్గినప్పు డామెముఖమునం దుండువికారమును, ఇంకొకస్త్రీని చేసికొనలేదు, తనయందుఁగల ప్రేమచేఁ దనబంగారు ప్రతిమనే చూచి సంతోషించుచున్నాఁ డని విన్నతరువాత నామె ముఖమునందుఁ గనఁబడువికారమును అభినయింపలేనినటుఁడు నటుఁడే కాఁ డని చెప్పవలెను.

ముఖరాగము స్వాభావికము, ప్రసన్నము, రక్తము, శ్యామము అని నాలుగువిధములు (౮ - ౧౬౫). మాధ్యస్థ్యాదిభావసమాపనమునకు స్వాభావికమును, అద్భుతహాస్యశృంగారాదులకు ప్రసన్నమును, వీరరౌద్రకరుణమదాదికములకు రక్తమును, భయానకబీభత్సములకు శ్యామమును అను ముఖరాగము నుపయోగింపవలయు నని భరతాచార్యులయభిప్రాయము (౮ - ౧౬౬ - ౮).

ఆంగికాభినయము మరల రెండువిధములుగ విభజింపఁబడినది: షడంగాభినయము, ఉపాంగాభినయము. శిరస్సు, హస్తములు, ఉరము, పార్శ్వము (ప్రక్కలు), కటి (పిఱుఁదు), పాదములు అనునవి షడంగములు. నేత్రములు, భ్రూవు (కనుబొమ), నాస, అధరము (పెదవి), కపోలము (చెక్కిలి), చిబుకము (గడ్డము) అనునవి ఉపాంగములు. ప్రత్యంగము లని యాఱు కలవు: మూఁపు, బాహువు, వీపు, కడుపు, తొడ, పిక్క, కొందఱు మణికట్లు, మోఁకాళ్లు, మోఁచేతులుకూడ ప్రత్యంగము లని చెప్పెదరు.

ఈప్రకార మంగము లన్నియు విభజించి యొక్కొకయంగము యొక్క చలనభేదములను నాట్యగ్రంథకారులును, అభినయగ్రంథకారులును విశేషముగ వర్ణించియున్నారు. అవి యసంఖ్యములు. హస్తభేదములు మూఁడువందలకు హెచ్చుగ నున్నవి. వాని నన్నిటిని నిచ్చట నుదాహరించుట యనావశ్యకము. దిక్ప్రదర్శనముగఁ గొన్నింటిని జెప్పెదము.

చేతివ్రేళ్ల నన్నిటిని చాఁచి అంగుష్ఠము మిగిలిననాల్గువ్రేళ్లను తాఁకునట్లు ఉంచినయెడల నది పతాకహస్త మనిపించుకొనును. పతాకహస్తమందలి యనామికను వంచిన త్రిపతాకహస్త మగును. పతాకహస్తమందలి యనామికాకనిష్ఠికలను వంచిన అర్ధపతాకహస్త మగును. కొన్ని హస్తముల ప్రతిమలు వేఱొకపుటయందుఁ జూపఁబడినవి. వానిని జూచిన వేర్వేఱు హస్తముల లక్షణములు తెలియఁగలవు. ఏయేహస్తము లేయే ప్రసంగములయం దుపయోగింపవలసినదియు నాట్యశాస్త్రమునఁ జెప్పఁబడినది. ఆవాహనము, అవతరణము, విసర్జనము, ధారణము, ప్రవేశము, ఉన్నామనము, ప్రణామము మొదలయినప్రసంగములందు త్రిపతాకహస్తము నుపయోగింపవలెను.

పతాకాదిహస్తములలో నొక్కొకటి నానావస్థలలో వినియోగింపఁబడినప్పుడు, ఊర్ధ్వగ పార్శ్వగ అధోముఖ పరాఙ్ముఖోత్తాన త్ర్యశ్ర చంచలాచంచలత్వాదిభేదములచే భావభేదములు సామాజికుల హృదయమునకు గోచరింపఁజేయఁబడును. పతాకమునకు వినియోగము — ప్రహారము, ప్రతాపనము, ప్రహర్షము, గర్వము మొదలగునవి. అందుఁ బ్రహారాభినయమునను పతాకము హృదయలగ్నతలమై కొంచెము కంపించున ట్లుంచవలయు. ప్రహర్షాభినయమున సోమాంచనసమ్ముఖముగా పైకెత్తవలయును. నేను వాదియను గర్వార్థమున పార్శ్వమునుండి పార్శ్వమునకుఁ ద్రిప్పుచు లలాటాభిముఖముగా పైభాగమునకుఁ జేర్చవలయును. ఉభయహస్తముల పతాకము నగ్నివర్షధారాపుష్పవృష్ట్యాదికములఁ బ్రయోగింపవలెను. ఉభయహస్తపతాకకరణముచే నగ్నిజ్వాలలో నూర్ధ్వగమనముగా, జలధారలలో నధోగమనముగా, పుష్పవృష్టిలో నూర్ధ్వముఖహస్త ముంచుకొని యంగుళుల నగ్రోత్క్షేపమున క్రమముగా నధోముఖహస్తమై యంగుళుల యధోగమనము నడపవలయును. కావునఁ బతాకాదుల నూర్ధ్వాదిస్థితిభేదములచే నవస్థాభేదముల నభినయింపఁగును. నందికేశ్వరాదులమతమున హస్తాభ్యభినయము నాట్యమునకుఁ గేవల మంగరూపము గాక నృత్త

1. సీత :— అయ్యయ్యో! పిచ్చిదాన నైతిని.

* * * *

సీత :— పూర్వవిరహమున గౌరవింపఁబడితిని. ఇప్పటివిరహము నిరవధిక మనినతోడనే నాప్రాణము లెగిరిపోయెను.

* * * *

సీత :— (దిగులుతో గట్టిగ తమసను బట్టుకొని) ఓభగవతి తమసా! నాప్రాణేశ్వరులు వెళ్లెదరట్లున్నా. ఏమి చేసెదను?

రాముఁడు :— అయినను, అశ్వమేధక్రతువులో నాకు సహధర్మచారిణి యున్నదిగదా.

సీత :— (ఉత్తలపాటుతో) ప్రాణేశ్వరా! ఆమె యెవరు?

వాసంతి :— వివాహముకూడఁ జేసికొంటిరా యేమి?

రాముఁడు :— లేదు లేదు. బంగారముతోఁ జేయఁబడిన సీతాప్రతిమ.


సీత :— (నిట్టూర్పు విడిచి, కన్నీటితో) ప్రాణేశ్వరా! మీ కిప్పుడు నామీఁదను దొల్లిటి యనురాగము పోలేదు గదా! నిశ్చయముగా నాహృదయములోనుండి మీయంతట మీరే పరిత్యాగశల్యమును పెకలించితిరి. * * *

తమస :— (స్నేహాశ్రువులు రాల నవ్వుచుఁ గౌఁగిలించుకొని) కుమారీ! ఇది యాత్మస్తుతి కాదే?

సీత :— (సిగ్గు దోఁపఁ గ్రిందు చూచుచు స్వగతముగా) భగవతి తమస నన్నుఁ బరిహాసము చేయుచున్నదిగదా! [వా. వా.]

sampath_Ebooks






**3౨. స్వస్తికహస్తము : లక్షణము**

పతాకయో స్వస్తియుక్తౌ కరయో ర్మణిబంధయోః,
సంయోగేన స్వస్తికాఖ్య......

**33. డోలాహస్తము : లక్షణము**

పతాకావూరుదేశస్థౌ డోలాహస్తోయ ముచ్యతే.

**3౪. పుష్పపుటహస్తము : లక్షణము**

సంశ్లిష్టకరతో సర్పశీర్షే పుష్పపుటః కరః.

**3౫. ఉత్సంగహస్తము : లక్షణము**

అన్యోన్యబాహుమూలస్థౌ మృగశీర్షకరౌ యది,
ఉత్సంగనామా హస్తోయం కీర్తితో భరతాగమే.

**3౬. శివలింగహస్తము : లక్షణము**

వామేఽర్ధచంద్రే విన్యస్తే శిఖరః శివలింగకః.

**3౭. కటకావర్ధనహస్తము : లక్షణము**


కటకాముఖయోః పాణ్యోః స్వస్తికా మణిబంధయోః,
కటకావర్ధనాఖ్యస్స్యాత్ ఇతి నాట్యవిదో విదుః.

**3౮. శకటహస్తము : లక్షణము**

భ్రమరా మధ్యమాంగుష్ఠ ప్రసారా చ్ఛకటో భవేత్.

sampath_Ebooks

# అభినయము




**౩౯. శంఖహస్తము : లక్షణము**

శిఖరాన్తర్గతాంగుష్ఠ ఇతరాంగుష్ఠసంగతి,
తర్జన్యావ్యాయతా శ్లిష్టా శంఖహస్తః ప్రకీర్తితః.

**౪౦. చక్రహస్తము : లక్షణము**

యత్రార్ధచంద్రౌ తిర్యక్త్వాచ్చావర్త్యాన్యతలసంస్పృశౌ,
చక్రహస్తస్స విజ్ఞేయః.........

**౪౧. కూర్మహస్తము : లక్షణము**

కుంచితాగ్రాంగుళీకృత్య త్ర్యకాంగుష్ఠకనిష్ఠకః,
కూర్మహస్తస్స విజ్ఞేయః.........

**౪౨. మత్స్యహస్తము : లక్షణము**

కరపృష్ఠోపరి న్యస్తో యత్ర హస్తస్త్వధోముఖః,
కించిత్ప్రసారితాంగుష్ఠకనిష్ఠో మత్స్యనామకః.

**౪౩. గరుడహస్తము : లక్షణము**

తిర్యక్సంస్థితా వర్ధచంద్రా సంశ్లిష్టాంగుష్ఠయోగతః,
గరుడః.........

**౪౪. వరాహహస్తము : లక్షణము**

మృగశీర్షే త్వన్యస్యాగ్రస్థే సంశ్లిష్టాంగుష్ఠతో యదా,
కనిష్ఠాంగుష్ఠయోగాద్వా వరాహాఖ్య కర ఈరితః.

**౪౫. నాగబంధహస్తము : లక్షణము**

సర్పశీర్షౌ స్వస్తికా చే న్నాగబంధ ఇతీరితః.

sampath_Ebooks



మునకుఁ బ్రధానభూతముగా గ్రహింపఁబడును. దిక్ప్రదర్శనముగా బృహస్పతిమతమునఁ బతాకహస్తవినియోగమును చెప్పుచున్నాము. దానిని పైనుదహరించిన భరతమతముతోఁ బోల్చిచూచిన నాట్యవృత్తి భేదములచేఁ బ్రత్తిప్రక్రియాభేదము లేర్పడును. గురుమతమునఁ బతాక కర్మములు:—

"స్పర్శే దేహీతివచనే నిషంగస్య నికృన్తనే,
శీఘ్యాం ప్రవేశభావేఽపి వికారే నాంగరాగకే.
ఆత్మార్థే శపథే చాపి తూష్ణీంభావనిదర్శనే,
నృపశ్రేష్ఠస్య భావేచ గాఢాలింగనభావనే.
ప్రణామే ఖడ్గహస్తేఽపి పలాయనవిక్రమే,
మంచార్థే సలిలే సింధౌ క్షీరే నిర్ఘోషకుంచితే.
తత్రనక్రేతివచనే తారాక్ష్యే స్వప్నక్రమే,
ఏవం పతాకహస్తస్య వినియోగః ప్రకల్పితః."

భరతమతమున రసభావహావమూలకముగా నాంగిక ముండును. నంది సర్వానిమతమున నాంగికము లాస్యమున కుపయోగకర మగును.

ఈలాగుననే నేత్రాదికములకును వినియోగములు గలవు. నటుఁడు ఈనియమముల నన్నిటిని నేర్చుకొనుచుండవలెను కాని, దానితో తాదాత్మ్యమును జెందక మనఃప్రవృత్తిచేఁ గాక కేవల మిట్టి నియమముల ప్రకార మభినయము చేయఁబోయిన నది యెుకానొకప్పుడు కృత్రిమాభినయ మగునే కాని స్వాభావికముగ నుండదు. నటునకుఁ బ్రపంచజ్ఞాన ముండి లోకవ్యవహారము ననుసరించి యభినయము చేసినచో నది ప్రేక్షకమనోరంజకము చేయునే కాని కృత్రిమాభినయము చేయఁజాలదు. కావుననే భరతాచార్యులవా రభినయ విశేషములను చెప్పిచెప్పి చివరకు నిట్లు వ్రాసిరి:—

"యాని శాస్త్రాణి యే ధర్మా యాని శిల్పాని యాః క్రియాః,
లోకధర్మప్రవృత్తాని నాట్యమిత్యభిసంజ్ఞితమ్. ౧౨౧
న చ శక్యం హి లోకస్య స్థావరస్య చరస్య చ,
శాస్త్రేణ నియతం కర్తుం నానాచేష్టావిధిం ప్రతి. ౧౨౯
నానాశీలాః ప్రకృతయః శీలే నాట్యం ప్రతిష్ఠితమ్,
తస్మాల్లోకప్రమాణం హి జ్ఞేయం నాట్యం ప్రయోక్తృభిః.[1]"
(౨౫-వ అధ్యాయము)

రవివర్మాదిచిత్రకారులచేఁ జిత్రింపఁబడిన రాధామాధవాదిపటములవల్లను, ఇటీవల వాడఁబడుచున్న బైస్కోపుపటములవల్లను అభినయము కొంతవఱకు నేర్చుకొనవచ్చును. కాని నిజమైనయభినయమును నేర్చుకొనవలె నన్న లోకమందలి ప్రజలయాచరణమును జూచియే నేర్చుకొనవలెను. ప్రేమ హెచ్చుగ నున్నప్పుడు తల్లి తన చంటిబిడ్డ నెట్లు ముద్దాడునో, శోకవిషాదసంతాపసమయములలో ముఖవికాసము లెట్లు మాఱునో తెలిసికొనవలయు నన్న నట్టిసందర్భములు లోకమునందుఁ జూచితీరవలయును. ఎన్ని పటములను జూచిన నేమి? కావున నాటకాభినయములో నటునకు, నేర్చినవిద్యకంటె లోకానుభవమే యెక్కుడు ఉపయోగకారి యగును.

వాచికాభినయము:— నటుఁడు శరీరాభినయమువలనఁ దన భావములను దెల్పుట గాక వాక్కువలనను దెలుపును. ధ్వనిభేదముచేతను, కాకుభేదముచేతను, విరామభేదముచేతను ఒక్కవాక్యమునకే వేఱువేఱుతాత్పర్యము లేర్పడును. కావునఁ బాత్రమునకుఁ దగినట్లును, సందర్భమునకుఁ దగినట్లును మాట లాడవలయును. ఉపన్యాసములఁ జేయునక్తలకును ఈయభినయ మావశ్యకము. నాటకము లోకవ్యవహారప్రతిబింబము గనుక పాత్రములనుబట్టి వారిభాషయు మాఱు చుండవలె నని సంస్కృతనాట్యశాస్త్రకారులమతము. కాని యిచ్చట నొకవిశేషము చెప్పవలసియున్నది. శౌరసేన్యాదిప్రాకృతభాషలు నాటకములలోఁ బాత్రోచితముగ వాడవచ్చు నని చెప్పి, బర్బరాంధ్రప్రభృతిభాషలు నాటకమున నిషేధింపఁబడినను వైకల్పికముగా స్థానోచితముగా వాడవచ్చు నని భరతుఁడు చెప్పుచున్నాఁడు:—

"న బర్బరకిరాతాంధ్రద్రవిడాద్యాసు జాతిషు,
నాట్యప్రయోగే కర్తవ్యం కావ్యం భాషాసమాశ్రయమ్.
జాతిష్వేతాసు సర్వాసు శుద్ధాసు ద్విజసత్తమాః!,
శౌరసేనీం సమాశ్రిత్య భాషా కార్యా తు నాటకే,
అథవా ఛందతః కార్యా దేశభాషా ప్రయోక్తృభిః.[2]"

శాకుంతలనాటకమునందు శార్ఙ్గరవ దుష్యంతసంభాషణములో మొదట శార్ఙ్గరవుఁడు శాంతముగ మాటలాడి పిదపఁ గోపముతో మాటాడును. ఆ రెండుసమయములందలి యాతనిధ్వని వేఱువేఱుగ నుండవలెను. షేక్స్పియరుకృతమయిన జూలియస్‌సీజరునాటకమునందు జూలియస్‌సీజరు చనిపోయినతరువాత నాతనినిగుఱించి చెప్పుచు, అంటొని బ్రూటసు నధిక్షేపించుచుఁ జెప్పుచు ('Brutus is an honourable man') 'బ్రూటసు మర్యాదాయుక్తుఁడు' అని మూఁడుసారు లనును. ఈ మూఁడుసారులును ఈవాక్యమును

---

1. ఏశాస్త్రములు, ఏధర్మములు, ఏశిల్పములు, ఏక్రియలు లోకధర్మమును అనుసరించి యుండునో దానిని నాట్య మందురు (౧౨౧). స్థావరజంగమాత్మకమైన లోకముయొక్క చేష్టావిధుల నన్నిటిని శాస్త్రముచే నరికట్టుట సాధ్యము కాదు (౧౨౯). ప్రకృతులు పెక్కుశీలములు కలవి, శీలమునందే నాట్యము నిల్చియున్నది. కావున, నాట్యమునకు లోకమే ప్రమాణ మని నాటకములను బ్రదర్శించువారు తెలిసికొనవలెను (౧౩౦).

2. నాట్యశా., అ. ౧౭., శ్లో. ౪౪-౪౫.

మాఁడువిధముల నుచ్చరింపవలయును. అట్లుచ్చరించినఁ గాని యందలి యర్థవిశేషము ప్రేక్షకులకు బోధపడనేరదు.

ఆహార్యాభినయము :— ఆహార్య మనఁగా నేపథ్యవిధానము. కేవలము వేషముచేతనే పాత్రమనోభావముల సామాజికులహృదయమున కందఁజేయుట యాహార్యాభినయము; అనఁగా నటులను వారి వారి భూమికలకుఁ దగినట్లుగ వస్త్రభూషాదులచే నలంకరింపఁ జేయుట. ఇందులకు తమకాలమందలి వస్త్రభూషాదులజ్ఞాన మావశ్యక మగుటయే కాక, పూర్వకాలమందలి ఋషి నృపకంచుక్యాదులవస్త్ర భూషాదులజ్ఞానమును గొంతవఱకుఁ గలిగియుండవలెను. మాలతీమాధవ నాటకమునందలి అఘోరఘంటకపాలకుండల మొదలయిన భూమికలకు వేషములు వేయుటకై తాంత్రికమతమువారు పూర్వము వేసికొనునట్టి వేషముల నెఱుంగవలయును. అట్లే ప్రబోధచంద్రోదయమునందలి పాత్రములను సింగారించుటకు నందు వర్ణింపఁబడిన మతములవా రెట్టివస్త్రము మొదలయినవి ధరించుచుండిరో తెలిసి యుండవలెను. లేనిచో నవి వేషములు శోభింపనేరవు. రంగాలంకారము లన్నియు, రంగమునీఁదను జూపఁబడు వనజలపర్వతాదు లన్నియు నిప్పటివారిచేఁ బ్రదర్శింపఁబడు తెరలు మొదలగునవియు నాహార్యాభినయమునకు సంబంధించినవియే.

సాత్త్వికాభినయము :— సాత్త్విక మన మనస్సత్త్వముచే నిర్వర్తింపఁబడునది. సాత్త్వికాభినయ మనఁగా రసనిష్పత్తిని గలిగించు విభావ స్థాయి సంచారి సాత్త్వికభావములను అనుభావములచే సామాజికుల హృదయములకుఁ దత్తద్భావముల నుద్ద్యోతింపఁజేయు ప్రక్రియ. కావున సాత్త్వికాభినయమున నాయికానాయకప్రభృతు లను మనోవృత్తిరూపములగు రసవిశేషములలోని స్థిరభావము లగు రతి, శోకము, ఉత్సాహము, భయము, విస్మయము, క్రోధము, నగవు, జుగుప్సయును, నిర్వేదాదు లగు ముప్పదిమూఁడును, స్తంభప్రళయాదు లగు నెనిమిదియు ననుభావములచేఁ జూపఁబడును. అనుభావము లనఁగ క్రియలు. ఉదాహరణముగాఁ గ్రోధమున — వికృష్టనాసాపుటము, ఉద్వృత్తనయనము, సందష్టోష్ఠపుటము, గండస్ఫురణము మొదలగునవి యనుభావములు. వీనిచేఁ గ్రోధభావము నభినయింపఁదగు. ఇట్లే శంకకు — ముహుర్ముహుగవలోకనము, అవకుంఠనము, ముఖశోషణము, జిహ్వాపరిలేహనము, ముఖవైవర్ణ్యము, స్వరభేదము, కంపము, శుష్కోష్ఠము, కంఠావయాసము — మొదలగునవి యనుభావములు. వీనిచే శంకావస్థ నభినయింపఁదగు.

సాత్త్వికభావములఁగూడ నిట్లే అభినయింపఁదగు. ఆలంకారికులమతమున సాత్త్వికభావము లెనిమిది: స్వేదము (చెమట), స్తంభము (స్రాణుపాటు), రోమాంచము (గగుర్పాటు), స్వరభేదము (మాట మాఱుట), వేపథువు (మాట తడఁబడుట), వైవర్ణ్యము (వెలవెలఁ బాఱుట), అశ్రువు (కన్నీరు), ప్రళయము (మూర్ఛ).

ఇతరులసుఖదుఃఖములను జూచి వానివలన మనస్సునకు సానుభూతి గలిగినఁగాని యీభావము లుత్పన్నములు కావు గనుక వీనికి సాత్త్వికభావము లని పేరు వచ్చెను. సత్త్వము లనఁగా మనస్సులో నుండి పుట్టినవి; లోకధర్మమును అనుసరించుటచే నాట్యమునకు సత్త్వము కావలెను. ఏభావమును అభినయించునప్పు డాభావముగల పురుషునితో తాదాత్మ్యమును బొందవలెను. దుఃఖము రోదనాత్మకము. దానిని అదుఃఖితుఁ డెట్లు అభినయించును? సుఖము ప్రహర్షాత్మకము. దానిని దుఃఖితుఁ డెట్లు అభినయింపఁగలఁడు? కావున నటుఁడు తాను గైకొనినభూమికతోఁ గొంతవఱకైనను ఐక్యమును బొంది యీభావములను నటింపవలె నని భరతాచార్యులవారి యభిప్రాయము[1].

ఈ సాత్త్వికాభినయమున స్థాయిసంచారిభావాభినయము కాక సాత్త్వికభావముల నభినయించుటయుఁ జైని సూచింపఁబడియె. సమస్తభావములకును బ్రయోజనస్థానములు కలవు. అందులో సాత్త్వికభావముల నేయేపట్ల నభినయింపవలసినది యిట్లు చెప్పినాఁడు.

హర్ష భయ శోక విస్మయ విషాద రోగములను జూపుటకు స్తంభమును, క్రోధ భయ హర్ష లజ్జా దుఃఖ శ్రమ రోగ తాప వ్యాయామ శ్రమములపరిణామముగ స్వేదమును, శీత భయ హర్ష రోష స్పర్శ జరారోగములకుఁ గంపమును, స్పర్శ భయ శీత హర్ష క్రోధ రోగములవలన రోమాంచము, భయ హర్ష క్రోధ జరా రోగ మద జనితము స్వరభేదమును, సంతోషము, బెదరించుట, జ్వరము, కోపము మొదలయినవానిచే వేపథువును, శీత క్రోధ భయ శ్రమ రోగ శ్రమతాపజము వైవర్ణ్యమును, ఆనందము కోపము పొగ గాని కాటుక గాని కనులలోనికిఁ బోవుట, శోకము, ఱెప్ప వాల్పక చూచుట శీతము రోగములవలన అశ్రువులు, శ్రమ మూర్ఛ మద నిద్రాభిఘాత మోహాదులవలన ప్రళయము.


ఇట్లు వీని ప్రయోజనములు చెప్పుచు, అభినయమునందు వీనిని నెట్లు చూపవలయునో యీ క్రిందివిధముగఁ జెప్పినాఁడు :—

1. అత్రాహ - కిమన్యే భావాః సత్త్వేన వినాభినీయంతే యేనైతే సాత్త్వికా ఉచ్యంతే. అత్రోచ్యతే - ఇహ హి సత్త్వం నామ మనఃప్రభవమ్. తచ్చ సమాహితమనస్త్వా దుచ్యతే. మనస్సమాధానాచ్చ సత్త్వనిర్వృత్తి రితి. తస్య యోఽసౌ స్వభావో రోమాంచాదికృతః స న శక్యతేఽన్యమనసా కర్తు మితి. లోకస్వభావానుకరణాచ్చ నాట్యస్య సత్త్వ మీప్సితమ్. కో దృష్టాంతః, ఇహ నాట్యధర్మప్రవృత్తాః సుఖదుఃఖకృతో భావా స్తథా సత్త్వవిశుద్ధాః కార్యా యథా సరూపా భవన్తి. దుఃఖం నామ రోదనాత్మకం తత్కథ మదుఃఖితేన, సుఖంచ ప్రహర్షాత్మకం తత్కథం దుఃఖితేనాభినేయమ్? ఏతదేవాస్య సత్త్వం యద్దుఃఖితేన సుఖితేన వా అశ్రు రోమాంచౌ దర్శయితవ్యా వితి కృత్వా సాత్త్వికా భావా ఇత్యభివ్యాఖ్యాతాః (నాట్యశాస్త్రము, ౭-వ అధ్యాయము).

sampath_Ebooks

sampath_Ebooks






**౪౬. ఖట్వాహస్తము : లక్షణము**

చతురే చతురం న్యస్య తర్జన్యంగుష్ఠమోక్షణాత్,
ఖట్వాహస్తో భవేత్......

**౪౭. లతాహస్తము : లక్షణము**

పతాకౌ డోలికాకారౌ లతాఖ్యః......

**౪౮. ముష్టిస్వస్తికహస్తము : లక్షణము**

ముష్టిహస్తౌ స్వస్తికౌ తౌ కుక్షిస్థానే గతౌ యది,
ముష్టిస్వస్తికతాం స్యాతాం......

**౪౯. కుశలహస్తము : లక్షణము**

అన్యోన్యాభిముఖౌ వర్ధచంద్రౌ కుశలసంజ్ఞకః.

**౫౦. నృసింహావతారహస్తము : లక్షణము**


వామే సింహముఖం ధృత్వా దక్షిణే త్రిపతాకకః,
నరసింహావతారస్య హస్త ఇత్యభిధీయతే.

**౫౧. వామనావతారహస్తము : లక్షణము**

ఊర్ధ్వాధోధృతముష్టిభ్యాం సవ్యాన్యాభ్యాం యది స్థితః,
స వామనావతారస్య హస్త ఇత్యభిధీయతే.

sampath_Ebooks

# అభినయము




౫౨. రఘురామావతారహస్తము : లక్షణము

కపిత్థం దక్షిణే హస్తే వామేతు శిఖరః కరః,
అంగుష్ఠేతరభాగేను రామచంద్రకరః స్మృతః.

౫౩. కృష్ణావతారహస్తము : లక్షణము

మృగశీర్షే తు హస్తాభ్యా మన్యోన్యాభిముఖీకృతే,
అంసోపకంఠే కృష్ణస్య హస్త ఇత్యభిధీయతే.

౫౪. కల్క్యవతారహస్తము : లక్షణము

పతాకం దక్షిణే వామే త్రిపతాకకరో ధృతః,
కల్క్యవతారహస్తస్స్యా దితి నాట్యవిదో విదుః.

౫౫. విష్ణుహస్తము : లక్షణము

హస్తాభ్యాం త్రిపతాకాభ్యాం విష్ణుహస్తః ప్రకీర్తితః.

౫౬. సరస్వతీహస్తము : లక్షణము

సూచీకృతే దక్షిణేఽర్ధచంద్రే వామకరే తథా,
సరస్వత్యాః కరః ప్రోక్తో భరతాగమవేదిభిః.

౫౭. మత్స్యహస్తము : లక్షణము

వామే కరే తు శిఖరం దక్షిణే కటకాముఖం,
మత్స్యస్య కరః ప్రోక్తో నాట్యశాస్త్రవిశారదైః.

sampath_Ebooks


అంగము లన్నియు నిష్క్రియముగ నుండుటయే స్తంభము. చెమట తుడుచుకొనుట, విసనకఱ్ఱతో విసరుకొనుట, గాలిని కోరుట యను క్రియలచేత స్వేదమును; శరీరమును చేత స్పృశించుటవలన (గాత్రసంస్పర్శముచే) రోమాంచమును; గద్గదిక (గద్గదము) మొదలైనవానిచే స్వరభేదమును; ధ్వనికంపమును, స్ఫురణము (అదరుట), శరీరకంపములవలన వేపథువును; ముఖమువాడికళను మార్చియు ఇడా పింగళాదినాడులను బిగఁబట్టియు వైవర్ణ్యమును; కనులు నులుపుకొనుట కన్నీరు గార్చుట మొదలయినవానివలన నశ్రువులను; నిశ్చేష్ట నిష్కంపశూన్య జడాకృతి దాల్చుటవలనను, భూమిపైఁ బడుటలనను ప్రళయమును అభినయింపవలెను.

పై భావములు గనుపఱుపవలసినవిధము లిట్లు తెల్పఁబడినను, అభినయమునకు నటునియొక్క యనుకరణకౌశలమే మూలాధారము. శక్తిసామర్థ్యము లేనివాఁడు నటుఁడుగాఁ బనికిరాఁడు. అందఱు నటులకు నన్నిరసములను గాని, అన్నిభావములను గాని అనుకరణము చేయు కౌశల ముండదు. కొందఱకు హాస్య మభినయించుటయందును, కొందఱకు వీరరౌద్రాదులను జూపుటయందును, కొందఱకు శాంతాదికముల నటించుటయందును మాత్రము ప్రజ్ఞ యుండును. వారివారి ప్రజ్ఞల ననుసరించి వారివారికి వేషములు వేయవలయును.

పైని అభినయముయొక్క భేదములు నాల్గు చెప్పఁబడినవి. వానిలో సాత్త్వికాభినయము రసభావోద్ద్యోతకము గావున సర్వోత్కృష్టము సిద్ధకారి. ఆంగికవాచికభేదములు ముఖ్యము లనియు, ఆహార్య మంగరూప మనియు నొకవిధముగఁ జెప్పవచ్చును. సాత్త్వికవాచికాహార్యాభినయములు సహిత మాంగికముననే పర్యవసించుచున్న వని కొందఱిమతము. సమావేశభేదముచే సాత్త్వికాద్యభినయములు భేదించుచున్నవి. నందికేశ్వరాదులు కేవల మాంగికముననే సాత్త్వికాదుల నంతర్భవింపఁజేసి నాట్యవిద్యను గృత్రిమప్రధానముగాఁ జేయుచున్నా రని భరతవ్యాఖ్యాతలమతము. నందికేశ్వరకోహళాదులు ప్రతిపాదించిన ఆంగికాభినయమే ప్రధానముగఁగల విద్యలలో మనదేశమందు బోగమువాండ్రయాటయు, పాశ్చాత్యదేశమునందు ప్యాంటోమైమ్స్ (Pantomime) అను నాట్యవిశేషమును ముఖ్యములు. ఇటీవల వెలసినట్టిబయోస్కోపు అను ఆటలును ఇట్టివే. ఇందు శబ్ద మెంతమాత్రమును లేకుండ కేవల మభినయము వలననే కథాభాగ మంతయుఁ జూపఁబడును. ఆంగికాభినయము మనోభావము నెంత చక్కఁగ వెల్లడి చేయఁగలదో చూపుట కీబయోస్కోపు ఆటలు మంచిదృష్టాంతములు. డిదార్ సెట్ అను ఫ్రెంచివిద్వాంసుఁడు నాటకమును జూడఁబోయినప్పుడు చెవులు మూసికొని యుండువాఁడఁట! కేవ లాంగికాభినయమువలన నటు లెంత యర్థమును బోధింపఁగలరో చూచుట యాతని యుద్దేశము. వాచికాభినయము ప్రధానముగాఁ గలది యొకయర్థమునందు సంగీతము, మఱియొకయర్థమునందు వక్తృత్వము. అన్నియభినయములును కావలసినది నాటకము. ఇందును పెక్కుభేదములు గలవు. ఇందును గుఱించి యింకను అధికము తెలిసికొనఁగోరువారు 'నాటకము', 'నాట్యము', 'భరతము' అనుశబ్దములను జూడఁదగును.

(కో. వేం. ల.)

(మా. రా. క.)

**అభినవకాళిదాసు** — ౧. సంక్షేపశంకరవిజయము రచించిన మాధవాచార్యునిబిరుదము.

౨. కాశ్యపగోత్రమునందుఁ బుట్టిన యొకసంస్కృతకవి. ఇతఁడు రచించినగ్రంథము శృంగారకోశభాణము.

3. 'అభినవభారతచంపు', 'భాగవతచంపు' అనుగ్రంథములను రచించిన సంస్కృతకవి.

**అభినవగుప్తాచార్యుఁడు** — ౧. కాశ్మీరమండలి గొప్పపండితుఁడు, ఆలంకారికుఁడు, మహామాహేశ్వరాచార్యబిరుదాంకితుఁడు. ఇతఁడు క్రైస్తవీయమైన పదవశతాబ్దియొక్క చివరకాలమందును, పదునొకండవశతాబ్ది యారంభమందును ఉండెను. వరాహగుప్తుఁడు తాత, సుఖలుఁడు తండ్రి, మనోరథగుప్తుఁడు తమ్ముఁడు, లక్ష్మణగుప్తుఁడు, భట్టేందురాజు, భట్టతౌత లనువారు విద్యాగురువులు, కర్ణ క్షేమరాజాదులు శిష్యులు. ఈతనిచే రచింపఁబడినగ్రంథములు (౧) అనుత్తరాష్టికా (౨) కావ్యకౌతుకవివరణమ్, (3) క్రమస్తోత్రమ్ (౪) ఘటకర్పరకులక వివృతిః (౫) తంత్రవటధానికా (౬) తంత్రసారః (౭) తంత్రాలోకః (౮) దేహస్థదేవతాచక్రస్తోత్రమ్ (౯) ధ్వన్యాలోకలోచనమ్ (౧౦) నాట్యలోచనమ్ (౧౧) పరమార్థచర్చా (౧౨) పరమార్థద్వాదశికా (౧3) పరమార్థసారః (౧౪) పరాత్రింశికా వివరణమ్ (౧౫) ప్రకరణస్తోత్రమ్ (౧౬) ప్రత్యభిజ్ఞావిమర్శినీ బృహతీవృత్తిః (౧౭) ప్రత్యభిజ్ఞావిమర్శినీ లఘువృత్తిః (౧౮) ప్రబోధపంచదశికా (౧౯) భగవద్గీతాటీకా (౨౦) అభినవభారత్యాఖ్య భారతీయనాట్యశాస్త్రటీకా (౨౧) విజ్ఞానభైరవోద్ద్యోతటీకా (౨౨) మహోపదేశవింశతిః (౨3) మాలినీవిజయవార్తికమ్[1] (౨౪) భైరవస్తోత్రమ్ - మొదలగునవి.

౨. అస్సాము దేశమందలి మహాపండితుఁడు. శాక్తుఁడు. బ్రహ్మసూత్రములపై శాక్తభాష్యమును రచించెను. శంకరాచార్యులు దిగ్విజయార్థము బయలుదేఱి కామరూపదేశమునకుఁ బోయినప్పు డీతనితో వాదము సల్పి యాతనిని గెల్చెను. అంత నీతఁడు వెలుపలికి నాచార్యులశిష్యత్వము నంగీకరించెను. కాని మనస్సునందు ద్వేష ముంచుకొని మంత్రతంత్రము లెఱింగినవాఁడగుటచే నీన మంత్రబలముచే నాచార్యులవారికి భగందరరోగమును బుట్టించెనఁట! ఎంతగొప్పరాజవైద్యులు వచ్చి యుపచారము చేసినను

1. (కావ్యమాల. ౨౫, ధ్వన్యాలోకనమునకు సంపాదకులు వ్రాసినట్టియుపోద్ఘాతమును జూడుఁడు).

sampath_Ebooks



ఆరోగము కుదురలేదు. అందుమీఁద పద్మపాదాచార్యుఁడు ప్రతి ప్రయోగమును జేసి యాచార్యుని బాగుచేసెనఁట. అభినవగుప్తుఁ డా రోగముతోనే చచ్చెనఁట! (మాధవకృత శంకర దిగ్విజయము., ౧౬-వ సర్గము).

ఈ యభినవగుప్తుఁడు వాదించినది యాదిశంకరునితోఁ గా దనియు, ఆ పీఠమునీఁదను గూర్చుండినవిద్యాశంకరభారతి యను శంకరాచార్యునితో ననియు, ఈసమాచారము శా. శ. ౧౬౨౨ లో జరిగె ననియు అర్వాచీనకోశకారుఁడు వ్రాసినాఁడు; కాని ప్రమాణ మేమియు నిచ్చినవాఁడు కాఁడు.

అభినవచంద్రుఁడు — ఇతఁడు కన్నడమున 'అశ్వ వైద్యము' అను గ్రంథమును వ్రాసిన బ్రాహ్మణగ్రంథకర్త. ఈతఁడు క్రీ. శ. పదునాలుగవందల సంవత్సరప్రాంతమునం దుండియుండు నని కర్ణాటకకవిచరిత్రకారు లభిప్రాయపడియున్నారు.

అభినవబాణుఁడు (వామనభట్టబాణుఁడు) — కొండవీటిరాజగు వేమభూపాలునియాస్థానకవి. ఇతఁడు 'వీరనారాయణచరితము', 'పార్వతీ పరిణయము' అను రెండునాటకములను రచించెను. పార్వతీపరిణయములోనికథ కామదహనము, పార్వతీ వివాహము. ఈయభినవబాణుఁడు రచించినవి 'శృంగారభూషణ భాణము', 'శర్వచరితము' అను మఱిరెండుగ్రంథములు కలవు.

అభినవమంగరాజు — 'కవిమంగాభిధాన' మనఁబడు అభినవనిఘంటువును కన్నడమందు వ్రాసినవాఁడు. 'చింతామణిపతిపదము' అనుగ్రంథమునుగూడ నితఁడు వ్రాసె నని ప్రతీతి కలదు కాని ఆగ్రంథము దొరకినది కాదు. అభినవనిఘంటువు క్రీ. శ. ౧౩౯౮ లో రచింపఁబడుటచే నీకవి పదునాల్గవశతాబ్ది-అపరార్ధమున నుండినవాఁడు. ఇతఁడు బ్రాహ్మణుఁడు.

అభినవశ్రుతముని — ఇతఁడు మల్లిషేణరచిత మైన 'సజ్జనచిత్తవల్లభము'నకు కర్ణాటకవ్యాఖ్య వ్రాసినవాఁడు. శ్రవణబెళ్గొళయందలి యొకశాసనమునుబట్టి యీ కవి పదునాల్గవశతాబ్ది చివరకాలమున నున్నవాఁ డని యూహింపఁదగియున్నది.

అభిమతి — అష్టవసువులలోని యొకవసువుభార్య.

**అభిమన్యుఁడు** — ౧. ఆఱవ చక్షుర్మనువుయొక్క పుత్రులలో నొక్కఁడు.

౨. (చం. వం) పాండవమధ్యముం డగు అర్జునునకును, శ్రీకృష్ణునకుఁ జెల్లె లగు సుభద్రకును బుట్టినకుమారుఁడు. ఇతఁ డష్టవసువులలోని సోమనామకవసువు పుత్రుఁ డైన 'వర్చా' యనువానియంశమునఁ బుట్టెను (భార., ఆది. అ. ౬౭). ఈతఁడు జన్మకాలమునందు దీర్ఘబాహుఁడుగను, మహాక్రోధుఁడుగను కానవచ్చినందున ఇతని కభిమన్యుఁ డని నామకరణము చేసిరి. ఇతఁ డర్జునునియొద్ద దశవిధధనుర్వేదమును అభ్యసించి దివ్యాస్త్రములను సంపాదించెను. ధనుర్వేదమం దితనికిఁ గల యప్రతిమ ప్రావీణ్యమును గాంచి బలరాముఁడు సంతసించి యాతనికి రౌద్రనామకశ్రేష్ఠధనుస్సు నొసంగెను. ఇతనిరథమునకు పింగళవర్ణముగల గుఱ్ఱములును, శార్ఙ్గపక్షి ధ్వజమును గలవు. సుమిత్రుఁ డనువాఁ డితనిసారథి. ఇతఁ డాకారమునందును, శౌర్యమునందును తన మేనమామ యైనకృష్ణుని పోలియుండెను. ఇతని కిద్దఱు భార్య లుండిరి. పెద్దది బలరామునికూఁతు రైన వత్సల (జైమిని - అశ్వ). రెండవది విరాటరాజుకూఁతు రయిన ఉత్తర. శౌర్యమునం దీతఁడు కృష్ణార్జునులకు సమానుఁడు. ఇతఁడు భారతయుద్ధమునందు పదుమూఁడవ నాఁడు, అనఁగా ద్రోణాచార్యులు సైన్యాధిపత్యమును వహించిన మూఁడవనాఁడు, కౌరవులచే నిర్మింపఁబడిన పద్మవ్యూహమును, ధర్మరాజు ప్రేరణచే భేదించి, లోనికిఁ జొచ్చి, సైంధవుఁ డడ్డుపడుటచే ధర్మరాజాదులు తనకు సాహాయ్యార్థము రాకపోయినను, ఒక్కఁడే, కౌరవసైన్య మంతటితోను భీకరముగఁ బోరాడి, గొప్పగొప్పవా రైనపెక్కురాజులను సంహరించి ద్రోణకర్ణశల్య దుర్యోధన దుశ్శాసనాదివీరుల ననేకపర్యాయము లోడించి పాంచాలి తనయునకు సామాన్యపరాక్రమంబును దెల్పించెను. ఇవాఁ డితనిచేఁ జచ్చిన పదివేలరథులలో దుర్యోధనపుత్రు డైన వృందారకుఁడు, మగధరాజపుత్రు లయిన శ్వేతకేతువు, అశ్వకేతువు, కుంజరకేతువు, కోసలరాజైన బృహద్బలుఁడు, దుర్యోధనకుమారుఁ డయిన లక్ష్మణుఁడు, సత్యశ్రవుఁడు, శల్యనందనుం డైన రుక్మరథుఁడు, శల్యునిసోదరుఁడు, కర్ణునితమ్ముఁడు, కర్ణపుత్రుఁ డయిన వృషసేనుఁడు ముఖ్యులు. తుదకు కర్ణద్రోణాదులాగ్గురు మహావీరు లధర్మయుద్ధమునకుం బోరఁ బడి, వెనుకనుండి కర్ణుఁడు విల్లు ద్రుంచి, ద్రోణుఁడు కవచమును ఛేదించి, అశ్వములను జంపి, కృతవర్మ సారథిని జక్రరక్షకులను గూల్చి అభిమన్యుని విరథుం జేసిరి. అంత నాతఁడు వాలుం బలకయుఁ దీసికొని కొంతవడలకుఁ బోరాడె. శత్రువులు వాలుం బలకయుఁ బడలఁగొట్ట, రథచక్రముతోడను, గదతోడను కొంతకాలము యుద్ధము చేసి పెక్కురుయోధుల సంహరించెను. తుదకు దుశ్శాసనకుమారుఁడు పోరుటకు రాఁగా వా రుభయులును ఘోరముగాఁ బోరుచుండ కౌరవసైనికు లందఱును చుట్టుముట్టి, తమబాణములచే నభిమన్యుం జంపిరి. ఇట్లు భారతమునందు వర్ణింపంబడిన అభిమన్యుని యుద్ధప్రకార మత్యద్భుతము. ఈతఁడు కీర్తిశేషుఁ డైనప్పు డీతని భార్య యైన ఉత్తర గర్భము దాల్చియుండి, తరువాతఁ బుత్రుని బడసెను. ఆతఁడే పరీక్షన్నరేంద్రుఁ డని విఖ్యాతిం బడసె (భార., ద్రోణ. అ ౩౫-౪౯).

౩. ఇతఁడు కాశ్మీరదేశపురాజు. కనిష్కునితరువాత రాజ్యమునకు వచ్చెను. క్రీ. శ. రెండవశతాబ్ది ప్రారంభమునం దున్నవాఁడు. అభిమన్యుపుర మనుపట్టణమును కట్టించి యచ్చట శివాలయమును బ్రతిష్ఠించెను. ఈతనికాలమువఱకు పతంజలి

sampath_Ebooks

కృతమహాభాష్యముయొక్క ప్రచారము కాశ్మీరమునందు లోపించి నందున, నీతఁడు దేశాంతరములనుండి చంద్రాచార్యాదులచే దానిని తెప్పించెను. చంద్రాచార్యాదులుకూడ వేఱువ్యాకరణములను క్రొత్తగా వ్రాసిరి. కాశ్మీరమునందు బౌద్ధులమహిమ హెచ్చినందున నాగదేవత లకుఁ గోపము వచ్చి శపింప కాశ్మీరమునందుఁ బ్రతిసంవత్సరమును మంచు అధికముగఁ గురిసి, జనక్షయము కలుగుచుండెనఁట! యజ్ఞ యాగాదులు చేయునట్టి బ్రాహ్మణులకు అది బాధ చేయకుండెను; కాని బౌద్ధులుమాత్రము నాశమును జెందుచుండిరి! కాశ్యపగోత్రుఁ డైన చంద్రదేవుఁ డను బ్రాహ్మణుఁడు నీలుఁడనునాగదేవుని తపస్సుచే మెప్పించెను. అతఁడు నీలపురాణము నిచ్చి కాశ్మీరమును మంచువలన నుండియు, బౌద్ధభిక్షువులవలననుండియు రక్షించెను (రాజతరంగిణి ౧-౧౭౮-౧౮౬).

౪. కాశ్మీరరాజు;

క్రీ. శ. ౯౫౮ మొదలు ౯౭౨ వఱకును రాజ్యము చేసెను. ఇతనితండ్రి క్షేమగుప్తుఁడు, తల్లి దిద్ద. ఇతఁడు రాజ్యమునకు వచ్చినప్పుడు చిన్న వాఁడుగ నున్నందున నాతనితల్లి యాతనిపాలికగా రాజ్యముచేసెను. ఈమెపాలనకాలమందుఁ గొందఱు సరదారులు తిరుగఁబడిరి. కాని వారు చివరకు నోడిపోయిరి. రాజయక్ష్మచే అభిమన్యుఁడు ౯౭౨ లో మృతుఁ డయ్యె. ఆతనికుమారుఁడు నందిగుప్తుఁడు (రాజతరంగిణి ౬-౧౮౮-౨౯౨).

అభిమానిని — షాడవ-షాడవరాగము. అయిదవ మేళకర్త యగు మానవతీజన్యము. స రి గ మ ధ ని స — స ని ధ మ గ రి స యని ఆరోహణావరోహణములందు సంచారము.

అభిమానుఁడు — స్వాయంభువ మన్వంతరంబునం దుండిన ధర్మఋషియొక్క పుత్త్రుఁడు. ఈయనతల్లి పేరు ఉన్నతి.

**అభిలషితార్థచింతామణి** — ఇది రాజనీతికి సంబంధించిన గ్రంథము. రాజకవియు, పశ్చిమచాళుక్యవంశజుఁడునగు మూఁడవ సోమేశ్వరునిచే లిఖింపఁబడినది. ఇతనికి భూలోకమల్ల బిరుదముకలదు. ఈగ్రంథ మైదుభాగములు. మొదటిభాగములో రాజ్యాభిలాషి రాజ్య మేలాగున సంపాదింపవలసినదియు వ్రాయఁబడియున్నది. రెండవభాగములో సంపాదించినరాజ్యమును రక్షణము చేసికొనఁదగిన విధానములు వివరింపఁబడినవి. తనకును, తనరాజ్యమునకు నేవిఘ్నమైన హానియు రాకుండులాగున రాజైనవాఁ డనుభవింపఁదగిన విహారములు, ఆనందములు లోనగువానింగూర్చి మూఁడవ, నాలుగవ, యైదవభాగ ములలో వర్ణింపఁబడియున్నది. పై నుదాహరించినవిషయములనుఱించి వ్రాయుచు నితఁడు సందర్భానుసారముగ నాయాస్థలములందు రెండు ప్రకారములను జ్యోతిషము, సాహిత్యము, కావ్యము, సంగీతము, చిత్రలేఖనము, శిల్పము, ఔషధము మున్నగువానిని వివరించి తన విశాలవిద్యానైపుణ్యమును వెల్లడిచేసియున్నాఁడు.

అభిషిక్తరాఘవము — దీనికి తిరువేంకటనాథ చరిత్ర మనియుఁ బేరు. కవి నడిపింటి వేంకటకవి. ఇది మట్ల అనంత భూపాలునికుమారుఁ డయిన తిరువేంగళనాథునిప్రేరేపణచే వ్రాయఁ బడినగ్రంథము. గ్రంథాదిని మట్లసంతతివారి చరిత్ర కొంత గలదు. కాని గ్రంథము సమగ్రముగ లేనందున నితరవిశేషము లెవ్వియు నెఱుంగఁజాలము.

అభిషేకనాటకము — ఇది యొక సంస్కృత దృశ్యకావ్యము. కాళిదాసమహాకవికంటెఁ బ్రాచీనుఁడగు భాసమహాకవి రచించె నని ప్రసిద్ధిఁగన్న రామాయణనాటకము. మహామహోపాధ్యాయ, గణపతిశాస్త్రులవారు ప్రచురించిన పదుమూఁడు భాస నాటకములలో నిదియుఁ గలదు. ఇందుఁ గిష్కింధా, సుందర, యుద్ధ కాండములకథ సంక్షేపముగ వర్ణింపఁబడినది.

భాసునిరామాయణనాటకములలోఁ బ్రతిమానాటకము చాల బాగుగ నుండు నని ప్రతీతి. ఈయభిషేకనాటకముకూడఁ బ్రతిమా నాటకముతోఁ దులఁదూఁగఁగలదు. ఇం దొకవిశేషము కలదు. ప్రాచీనరూపకములఁ బరిశీలించినచోఁ బాత్రపోషణ మిందు చేయఁ బడిన ట్లింకెందును జేయఁబడలే దని తేలకమానదు. ఇందు రాముఁడు, రావణుఁడు మొదలగు ముఖ్యపాత్రముల సౌశీల్యము బాగుగఁ బోషింపఁబడినది. నిరపరాధుఁడ నగు నన్నేల చంపితి? యను వాలిప్రశ్నకు రామునియుత్తరమును, విభీషణుని లంకనుండి పొమ్మని రావణుఁడు పలుకుసందర్భమునకూడ నించుకంతేనియుఁ బాత్రల యందలిలోపము కన్పింపదు.

కాళిదాసుని శాకుంతలనాటకపుఁ బోలికలు కొన్ని భాస నాటకము లన్నింటియందును గన్పించుచుండుటచేఁ గాళిదాసు భాసునిశ్లోకముల నాదర్శముగఁ దీసికొనె నని నిశ్చయింప వీలగు చున్నది. ఇందలి 'యస్యాం న ప్రియమండనాపి మహిషీ దేవస్య మందోదరీ' అను నిందలిపద్యమే కాళిదాసుని 'తత్ర శ్లోకచతుష్టయ' మ్మనఁబడు నాల్గుశ్లోకములలో నొకటి యగు 'పాతుం న ప్రథమం వ్యవస్యతి జలమ్' అను శ్లోకమున కాధారమై యలరారెను. ఈవిషయముంబట్టి దీనిప్రాశస్త్య మూహ్యము.

(బు. వేం. ర.)

**అభిషేకము** — ప్రజాపాలనాదికర్తవ్యభారము గల మహాకార్యములందు నియోగింపఁబడునారంభకాలమున నట్టిపురుషు నకుఁ జేయు మంగళస్నానము ముఖ్యముగ నీపేరను బిలువఁబడు చున్నది. ఋగ్వేదసామవేదములలో నీశబ్దము కానవచ్చుట లేదు కాని అథర్వవేదమం దున్నది. శుక్లయజుర్వేదమునందు, కృష్ణయజుర్వేదము యొక్క మూఁడుసంహితలలోను బ్రాహ్మణములలోను, శ్రౌతసూత్రము లందును రాజసూయసమారంభకాలమున నీయభిషేకము కావింపఁబడ వలయు నని వ్రాయఁబడియున్నది. దోలాయాత్రాభిషేకము, దుర్గా

sampath_Ebooks



పూజాభిషేకము, దేవప్రతిష్ఠాభిషేకము, రాజాభిషేకము నని ఇది యనేకవిధములు. అందు రాజాభిషేకము పునరభిషేక మనియు, ఐంద్రమహాభిషేక మనియు రెండుప్రకారములు. ఇందులో మొదటిది రాజసూయయజ్ఞమునకుఁ జెందినది. ఐతరేయమం దీ యభిషేకమును గుఱించి విపులముగ లిఖింపఁబడియున్నది.

పవిత్రజలములతో నిట్లు స్నాన మొనరించు నాచారము క్రొత్తది కాదు. ఇది అత్యంత ప్రాచీనకాలమునుండియు వచ్చుచున్నది. మఱియు నిది కేవలము హిందూస్తానమందే కాదు, తక్కిన దేశములలోఁగూడ సలుపఁబడుచువచ్చినది. ఇట్టియభిషేకమువలన స్నాతుఁ డగువాని కొకవిధ మగు సామర్థ్యము గలుగు నని ప్రాచీనులం దఱును నమ్మకము కలిగియుండిరి. దీనివలన సార్వభౌమికస్వాతంత్ర్యము లభించు నని ఐతరేయబ్రాహ్మణము వక్కాణించుచున్నది. పూర్వకాలమున నీసంస్కారమును బొందిన కొందఱు మహారాజుల పేరులును బ్రాహ్మణములలోఁ గలవు. యుధిష్ఠిరుని - అభిషేకమును మఱికొన్ని యభిషేకములును మహాభారతములో సభా, శాంత్యాది పర్వములలో వర్ణింపఁబడియున్నవి. కాళిదాసునిరఘువంశమందును ఒకయభిషేకవిషయ మైనవర్ణనము గలదు. ప్రాచీనకాలమున నభిషిక్తులైనవారిలోఁ గొందఱినామములు బ్రాహ్మణములం దీవిధమున లిఖింపఁబడియున్నవి.

| అభిషిక్తమహారాజులు | అభిషేచనముం జేసినవారు |
|---|---|
| పరీక్షితునికొడుకు జనమేజయుఁడు | కవషసుతుఁడు తురుఁడు |
| మనుసుతుఁడు శర్యాతి | భృగుసుతుఁడు చ్యవనుఁడు |
| సత్రాజిత్సుతుఁడు శతానీకుఁడు | వాజరత్నసుతుఁడు సోమశుష్మ |
| అంబాష్ఠ్యుఁడు | పర్వతనారదులు |
| ఉగ్రసేనసుతుఁడు యుధాంశ్రౌష్టి | పర్వతనారదులు |
| భువనునికొడుకు విశ్వకర్మ | కశ్యపుఁడు |
| పిజవనునికొడుకు సుదాసుఁడు | వసిష్ఠుఁడు |
| అవిక్షిత్సుతుఁడు మరుత్తుఁడు | అంగిరస్సుతుఁడు సంవర్తుఁడు |
| అంగుఁడు | అత్రిసుతుఁడు ఉదమయుఁడు |
| దుష్యంతునికొడుకు భరతుఁడు | మమతాసుతుఁడు దీర్ఘతమసుఁడు |

బృహదుక్థుని వలననుండి పాంచాలదుర్ముఖుఁడును, వసిష్ఠసాత్యహవ్యునివలననుండి జనంతపయసుతుఁడు అత్యరాతియు నీయభిషేకసంస్కారమును నేర్చుకొనినంతమాత్రముననే విజయులైరి.

క్రమముగ నీయభిషేకకార్యము కొంచెముగఁ గాని, గొప్పగఁ గాని స్వాతంత్ర్యముగల సకలవిధభూపాలురకును సలుపఁబడుచు వచ్చినది. ఐతరేయమువలన సామాన్యరాజులకుఁగూడ నీసంస్కారముండినట్లు దెలియుచున్నది. వెండియు నథర్వవేదమునకుఁ జెందిన కౌశికసూత్రములలో సామాన్యభూపాలునకును రాజాధిరాజునకును జేయవలసినదానిలో భేద మున్న దని ప్రతిపాదింపఁబడియున్నది. ఏదేశపాలకుఁ డైనను పట్టభద్రుఁ డగుసమయమున నభిషేచనముం జేసికొనితీఱవలయును. హర్షశిలాదిత్యునితండ్రి యగుప్రతాపశీలుఁడు తనరాజ్యారంభకాలమున నభిషేచనముం జేసికొనియుండెను. ఇతఁడు సామాన్యపాలకుఁడే కాని సార్వభౌమకోటికిఁ జెందినవాఁడు కాఁడు. అథర్వవేదమందలి ఒకసూక్త మభిషేకమంత్రములతోడనే నింపఁబడియున్నది. పైతృకసింహాసనమున కధికారముగల యువరాజునకును వేఱొకవిధ మగు అభిషేకసంస్కారము గలదు. రామునిరాజ్యాభిషేకము రామాయణములో నయోధ్యాకాండమం దారంభమై యుద్ధకాండానంతరము పరిసమాప్త మైనది. ఇట్టిదానికి పుష్యాభిషేక మని పేరు. ఈవిధాన మథర్వవేదపరిశిష్టమందును, వరాహమిహిరునిబృహత్సంహితయందును, కాళికాపురాణమందును వివరింపఁబడియున్నది. దీని యందలివిశేష మేమనఁగా, నిది సంప్రపుష్యయోగకాలమునఁ గావింపఁబడినది. అదేతరుణమున నింద్రుఁడు రాక్షసులను జయించియుండెను. బృహత్సంహితా కాళికాపురాణములలో వ్రాసినదానిని బట్టి పుష్యాభిషేకములు కేవలము సార్వభౌమికము లని యెంతమాత్ర మగపడదు.

ఈయభిషేకము రాజులకు, చక్రవర్తులకే కాదు. ప్రధానమంత్రులకును జేయఁబడుచుండెడి దని 'మూర్ధాభిషిక్తామాత్యరాజానః' అని హర్షచరిత్రమందలివాక్యమువలన విదిత మగుచున్నది. మఱియు రాజ్యములోని ప్రధానపురోహితునకును బృహస్పతిసవమను ప్రత్యేకసంస్కారమం దభిషేచనము గలుగుచున్నది. ఈసవము ప్రత్యక్షముగ వాజపేయముతోడి సంబంధము కలిగియుండినట్లు శతపథమువలన ననుమానింపవచ్చును. తరువాత సేనానాయకత్వము వహించు వీరపురుషు లభిషిక్తు లగుచుండుట మహాభారతములోని యుద్ధపంచకమువలనఁ దెలియవచ్చుచున్నది. ప్రతిష్ఠించబడు విగ్రహములను, ఉత్సవసమయములందు, నిత్యముగను, నైమిత్తికముగను విగ్రహముల నభిషేకించుట మనదేశమం దాచార మైయున్నది. పూజావిధానములందును, ప్రతిష్ఠాసమయములందును దేవతావిగ్రహస్నానాదులం గూర్చి యనేకనియమములు గలవు. ఈసంస్కారములందు పాలు, వివిధమృత్తికాయుతము లైన జలములును ముఖ్యముగ నుపయోగింపఁబడుచుండును.

ముక్తిమార్గము లని బౌద్ధులచేఁ గల్పింపఁబడిన పదివిధములగు దశలలో అభిషేకభూమికయు నొకటి యైయున్నది. ఇది యిట్టు లుండఁగా పుణ్యక్షేత్రములలో తీర్థములలో నచట స్నానము గావించినను నవియు నభిషేకము లనియే పిలువఁబడుచున్నవి. మఱియు నుపనయనాదులందేమి, స్త్రీలవంధ్యాత్వదూరీకరణకార్యములందేమి చేయింపఁబడుస్నానము లభిషేచనము లనియే వాడఁబడుచున్నవి.

ఈయభిషేకవిధాన మైతరేయబ్రాహ్మణకాలము మొదలుకొని నేఁటివఱకును పెక్కుమార్పులను జెందుచువచ్చినది. కావున వైదికయుగమునఁ జేయఁబడుచుండిన విధానమునకును పౌరాణికయుగమందుఁ గావింపఁబడినదానికిని చాల వ్యత్యాసము కలిగినది. ఇందులకు ముఖ్యకారణము శ్రౌతవిధానమును బరిత్యజించుటయే. వెండియు

క్షత్రియులు గాని ఇతరభూపాలకులనిమిత్తమును నీయభిషేకము లావశ్యకము లగుటంజేసి శాస్త్రకర్తలు తత్తత్కాలములకు, రాజులకును దగినట్లు మార్పులు గలుగఁజేసి వ్రాయుచువచ్చిరి.

అభిషేకము జరుగుట కొకదినము ముందుగ రాజదంపతులు మంగళస్నాన మొనరించి దీక్షాగ్రహణ మొనరింతురు. మఱియు గణేశపూజనము, మాతృకాపూజనము, పుణ్యాహవాచనము, నాందీశ్రాద్ధము లోనగు పుణ్యాంగక్రియ లాదినముందే కావింపఁబడును. రాజదంపతు లానాఁ డుపవాసము చేయుదురు. రాజ్యమండలి సముస్తముఖ్యాధికారులు సంతుష్టులుగాఁ బూర్వమే నియమింపఁబడియుందురు. మృగచర్మావృతమై మైన సువర్ణభద్రాసనము, గంగాయమునాసంగమ జలము, సకల పుణ్యనదీజలము, పూర్వ పశ్చిమముఖనదీజలము, తిర్యఙ్నదీజలము, సకలసముద్రజలము, న్యగ్రోధ, ఉదుంబర, అశ్వత్థ, పాలాశ, ప్లక్ష (పాలాశమునకు బదులు శమీవృక్షముగాని వేతసము గాని స్వీకరింపఁబడును) వృక్షముల పల్లవములు, పుష్పోత్పలదళసమలంకృతము లైన సువర్ణ జలపూర్ణ కుంభములు, గుడకము, గోచనము, ఘృతము, తేనె, పాలు, పెరుగు, పుణ్యతీర్థజలము, పుణ్యతీర్థమృత్తిక, మంగళద్రవ్యములు, మణిమండితమయిన శ్వేతచామరములు, మాల్యాలంకృత శ్వేతచ్ఛత్రము, శ్వేతవృషభము, శ్వేతాశ్వము, మహాగజము, శ్రేష్ఠాలంకారభూషిత లైన షోడశకన్యకలు, సకలవాద్యములు, సుభాషితులైన వందిమాగధులు పరికరములు, ద్రవ్యములు, మనుజులు సిద్ధముగ నుంపఁబడుదురు. మఱునాఁడు మహామాత్యసామంతప్రభుసమేతముగ పురోహితుఁడు రాజదంపతులను మంగళస్నానము చేయించి తనవెంట నడిపించికొని వచ్చి మణికాంచనవృషభపుష్పములను వారిచే స్పర్శనముచేయించి నానావిధరత్నములతోను, చాందనీతోను నలంకరింపఁబడిన మండపాభ్యంతరమునఁ బులివ్యాఘ్ర చర్మావగుంఠిత మైన భద్రసింహాసనముపైని కూరుచుండఁజేయును. తక్కిన మంత్రులు లోనగువారు నుచితాసనములపై నాసీను లైయుందురు. ఇంద్రప్రార్థనముతో నభిషేకసంస్కార మారంభ మగును. అంత నతఁడు పూర్వోత్తర దిశలం దేర్పఱుపఁబడియున్న వేదులపై స్వకీయగృహ్యోక్తవిధి ననుసరించి వహ్నిస్థాపనము చేసి వేదమంత్రోచ్చారణపూర్వకముగ హోమము చేయును. ఔదుంబరస్రువముతో నంత మంత్రముల నుచ్చరించుచు ఘృతాహుతుల నొసంగవలయును. అనంతరము సర్వతోభద్రమండపమునందు స్థాపింపఁబడియున్న స్వర్ణరజతతామ్రమృణ్మయ కుంభములలోని సకలౌషధిపల్లవమిశ్రితంబును, నేలాలవంగాదిసుగంధద్రవ్యవాసనాసమేతంబును నగు పుణ్యనదీజలమును స్వర్ణశంఖములలో నింపుకొని పురోహితుఁడు ఋత్విక్సహితుఁడై తూర్యాదిఘోషములు మంగళవాద్యములు వెలయుచుండ రాజసూయవాజపేయమహాభిషేకోక్తమంత్రోచ్చారణపూర్వకముగ సస్త్రీకుఁ డైన రాజును బూర్వాభిముఖునిగ నాసీనుం జేసి యతని యుత్తమాంగముపైని కన్నెలచేత నభిషేకము చేయించును. అటుపిమ్మట నమాత్యులు, బ్రాహ్మణులు, బంధువులు, నగరవాసు లందఱును జలములఁ బ్రోక్షింతురు. అనంతరము, పురోహితమంత్రిసామంత ప్రకృతిపురుషు లందఱును గన్యకలతోపాటు సువస్త్రగంధమాల్యాలంకృతు లగు రాజదంపతుల లలాటసీమలందు కుంకుమాగరు కస్తూర్యాదిద్రవ్యమిళిత మైన తిలకమును బెట్టుదురు. అప్పుడు రాజదంపతులశిరస్సులపైని కిరీటములను బెట్టి ఛత్రచామరములు లోనగు రాజచిహ్నములను సమర్పింతురు. అంత దుందుభివాద్యము లాలయ స్వస్తివాచకములతోపాటు వేదమంత్రముల విప్రులు ఘోషించుచుండ స్వకీయకులక్రమాగత మగు నామధేయ మిడి 'నీవు రాజవు గమ్ము' అని ప్రభువుమీఁద శ్వేతపుష్పములను, లాజలను నందఱును జల్లుదురు. తరువాత వందిమాగధులస్తుతిగానములు, బ్రాహ్మణులయాశీర్వాదపూర్వకజయజయధ్వానములు మిన్నుముట్టుచుండ సామంతు లందఱును గానుక లర్పించి వందనములు చేయుదురు. రాజును అందఱకును బహుమానము లొసఁగును. పురోహితులకు భూరిదక్షిణ లొసంగఁబడును. అటుపిమ్మట నశ్వము నధిరోహించి రాజు నగరప్రదక్షిణము గావించి వచ్చు నని అగ్నిపురాణమునందు వ్రాయఁబడియున్నది. ఇట్టి సందర్భములలో నొక్కొక్కసమయమున రాజ్యములోని ఖైదీ లందఱును విడుదల చేయఁబడుచుండిరి. ఇది సర్వసాధారణముగాఁ జేయఁబడుచుండు నభిషేకవిధానము.

ఇది పునరభిషేక మనియు, నైంద్రమహాభిషేక మనియు రెండు ప్రకారము లని యిదివఱకే వ్రాయఁబడినది. దేవతాధిపత్యము వహించుకాలమున నింద్రుఁ డీ విధి నభిషిక్తుఁ డగుటవలన దీనికీ పేరు కలిగినది. సార్వభౌమత్వమును వాంఛించు రాజునకుఁ బురోహితుఁడీ క్రిందివిధానమున క్రియాకలాపమును జరగింపవలయును.

"అహం సర్వా జితీ ర్జయేయ మహం సర్వాన్ లోకాన్ విందేయ మహం సర్వేషాం రాజ్ఞాం శ్రైష్ఠ్యం ప్రతిష్ఠాం పరమతాం గచ్ఛేయం సామ్రాజ్యం భౌజ్యం స్వారాజ్యం వైరాజ్యం పారమేష్ఠ్యం రాజ్యం మహారాజ్య మాధిపత్య మహం సామంతపర్యాయీ స్యాం సార్వభౌమః సార్వాయుష ఆన్తా దాపరార్ధాత్ పృథివ్యై సముద్రపర్యంతాయా ఏకరాట్."

ఏతన్మంత్రపఠనపూర్వకముగ తంత్రము నడపఁబడును. న్యగ్రోధ, ఉదుంబర, అశ్వత్థప్లక్షముల పల్లవసహితముగ, రాజసూయయాగమున కవసరము లయిన పదార్థములనే ఇందు సేకరింపవలయును. రెండు ప్రకారము లైన వరిగడ్డి, ప్రియంగు, యవలను అభిషేకజలములలో నుంపవలయును. ఉదుంబరకాష్ఠనిర్మిత మైన సింహాసనము, కలశము, ఉదుంబరశాఖ మున్నగువానిఁగూడ సంసిద్ధము చేయవలయును. సింహాసనవిషయక మైన మంత్ర మొకదానిని బఠించినమీఁద రాజును దానిపైని గూర్చుండఁబెట్టి రాజకర్త లుద్ఘోషములఁ జేయుదురు. అంత పురోహితుఁడు వరుణమంత్రములఁ బఠించుచుఁ బరిపూరితము లైన యభిషేకజలములను నుదుంబరపల్లవములు, స్వర్ణపవిత్రముసుండఁ బడులాగున నృపునిశిరస్సుపై నభిషేకించును. అంత రాజుచే బహూకరింపఁబడి మరల నతఁడు సురాపాత్రము నృపున కొసంగును. పైని వచించిన రాజు లీవిధానమున నభిషిక్తు లైనవారే.

sampath_Ebooks



పునరభిషేకముగూడ మీఁద వచించినట్లే సెలవేర్పఁబడును. కాని యందుఁ గొంత వ్యత్యయము గలదు. ఈ సంస్కారము నూతనముగ రాజు సింహాసనము నధిష్ఠించునప్పుడుగాక అభిషిక్తుఁడైనరాజు స్థానమునందు స్థిరముగ నుండునిమిత్తము రెండవపర్యాయమో లేక మూఁడవ నాల్గవ పర్యాయములందో చేయఁబడును. కావుననే ఇది పునరభిషేక మని పిలువఁబడుచున్నది. ఈ సంస్కారమువలన రాజుయొక్క సామర్థ్యము మఱింత తేజోవంత మగును. ఇందుప యోగింపఁబడు నానావిధపదార్థములు రాజసూయయాగమును జేయుటవలన నతనినుండి వెలువడిపోయిన వివిధశక్తులను మరల నతనియందుఁ బ్రవేశింపఁజేయు నని విశ్వసింపఁబడియున్నది. ఈ యభిప్రాయముతోడనే ఇంద్రునభిషేక రాజసూయ యాగములలో స్తుతింపఁబడిన సవితృదేవత యిచటఁగూడ స్తుతింపఁబడును. కార్యవిధానము చాల వఱకు ఐంద్రమహాభిషేకవిధానమునకు సమానముగనే యుండును. మీఁద వచించిన ద్రవ్యములతోపాటు ఎండలో కురిసిన వర్షజలము, తృణము, పల్లవములు, సుర, దూర్వలు, కుశలు మొదలగునవిగూడ సంగ్రహింపఁబడును.

ఈ సంస్కారమునిమిత్తము కావలసిన వేది స్ఫ్యనామక కాష్ఠనిర్మితఖడ్గముతో గీయఁబడియుండును. సింహాసనము సగము వేదిలోపలను, సగము బయట నుండులాగున నమర్పఁబడును. కుడి మోఁకాలు భూమిపై నానించి సింహాసనము ప్రక్క నాసీనుఁడై రాజు స్వహస్తములతో దానిని బట్టుకొని దాని నధిరోహించుటకును రాజ్యసుస్థితికి, సార్వభౌమప్రాప్తికిని దేవతాస్తోత్రముల నొనరించి తరువాత దానిపై నెక్కి కూర్చుండును. అంత పురోహితుఁడు పరిస్రుతజలములను నుదుంబరశాఖాంతర్గతములై యతనిమీఁదను బడు లాగునఁ బ్రోక్షించి సురాపాత్రమును రాజున కొసంగ నతఁడు దానిలోఁ గొంతభాగమును ద్రావి మిగిలినదానిని దనమిత్రున కిచ్చును. పిదప నా యుదుంబరశాఖలమీఁదఁ బాదముల నిడుచు రాజు క్రిందికి దిగివచ్చి పూర్వాభిముఖముగఁ దిరిగి ముమ్మాఱు 'నమో బ్రహ్మణే' అని యుచ్చారణము సేయును. అనంతర మతఁడు పురోహితునకు దానమొసఁగి యక్కడనుండి లేచి విజయాభిలాషియై యగ్న్యాధానాహుతి ద్రవ్యముల వైచి మఱికొన్ని యాహుతిద్రవ్యేంధనములఁ జేత నిడుకొని పూర్వోత్తరదిశగా, ననఁగా నపరాజిత మను నింద్రప్రదేశమునై పుగ యోగక్షేమముకొఱకు, విజయముకొఱకు మూఁడడుగులు నడచిపోవును. చిట్టచివరకు గృహమున కేఁగి దానివెనుకటిభాగమునఁ గూరుచుండి యుండఁగాఁ బురోహితుఁడు గవాశ్వప్రజాభ్యుదయమునకై ప్రార్థనముల సలుపుచు సురాపాత్రమునుండి యాహుతు లొసఁగును. తక్కిన విధి యంతయుఁ బూర్వోక్తరీతిగనే జరగును.

అభిసారము — కాశ్మీరమునకు సమీపమునం దుండిన యొకదేశము (భార., సభా, అ. ౨౭).

అభిసారిక — స్వాధీనపతికాదు లగు అష్టవిధశృంగార నాయికలలో నిది యొకర్తుక. అభిసరించునది యభిసారిక, అనఁగాఁ బ్రియునిగూర్చి సంకేతస్థలమునకుఁ బోయెడుస్త్రీ. అట్లే యభిసరింపఁ జేయు వనితగూడ నభిసారిక కావచ్చును. తా నొకసంకేతస్థానమున నుండి తా నున్నస్థానమునకు 'ప్రియుని గప్పించుకొను నాయిక, కాన అభిసరతీత్యభిసారికా, అభిసారయతీత్యభిసారికా' అని రెండువిధము లుగ నర్థము చెప్పవచ్చును.

అభిసారిపురి — అభిసారదేశమునకు రాజధాని. ఇప్పటిరాజు చిత్రసేనుఁడు (చూ. చిత్రసేనుఁడు).

అభూతరజస్సు — రైవతమన్వంతరంబునం దుండెడి దేవతావిశేషము.

**అభ్రకము** — ఇది శిలాపరివర్తనమునందు ఖనిజములసముదాయము. ఇది యనేకప్రదేశములందు దొరకును. వీనిలోఁ గొన్ని వ్యాపారమునకు ముఖ్యమైనవి. మస్కొవైట్ (Muscovite), బయొటైట్ (Biotite), ఫ్లొగొపైట్ (Phlogopite), లెపిడొలైట్ (Lepidolite) నామకాభ్రకము లీసముదాయమునందు ప్రధానమైనవి. ఇవి ఇంగ్లీషులో 'మైకా' యనియు, జర్మనీలోఁ బలు కర్థముగల 'గ్లిమ్మర్' అనియు పిలువఁబడును.

ఖనిజశాస్త్రీయలక్షణములు:— పొరలుపొరలుగ నొకవైపు ననే మిక్కిలి సులభముగఁ జీలుటయు, మిగుల పలుచనైన రేకులుగూడ గట్టితనము గలిగి యొకవైపు వంచిన నటువైపు వంగుటయు, నటు వంచినను మరల పూర్వపురీతినే పొందుటయు ననునవి అభ్రకమునందలి విలక్షణములు. ఒకచోట నుండు నివి యన్నియు స్ఫటికములుగ ఘనీభవించుచుండును. కాని తఱుచుగ చతుష్ఫలకములుగను, సమచతురస్రములుగను అచ్చుకట్టుటయుఁ గలదు. ఈ అచ్చులు సాధారణముగా షట్ఫలకములవలెఁ గాని, చతురస్రముల మెట్లవలెఁ గాని, పలకలవలెఁగాని, త్రిపార్శ్వములవలెఁ గాని ఏర్పడి ౬౧-౧౨౦ అంశముల సరళకోణములు (Plane Angles) గలిగియుండును. అడుగుమట్టుపలకలు తప్పఁ దక్కినపార్శ్వములు స్నిగ్ధములై పరిష్కృతములైన యాకృతులు గలిగియుండవు. వివిధప్రకారములగు అభ్రకములును సమానాకారమును, అంతర్భాగమున సమానముఖకోణములును గలిగియుండును. అభ్రకస్ఫటికములు తఱచుగా కలసిమెలసి సమాంతరస్థితిలో పెంపొందుచుండును. సంపూర్ణముగ వికాసమును బొందినది వెసూవియస్ నందలి బయొటైట్ అభ్రకము. అభ్రకపురేకుమీఁదను మొక్కపోయిన సూదితో పొడిచినయెడల 'ఘాతాకృతి' (Percussion Figure), అనఁగా, షట్కిరణ నక్షత్రమువంటి పగు లేర్పడును. ఈకిరణములు సరాసరి ౬౦ అంశముల కోణములందు సంధించుచుండును. ఇందు బాగుగ వికసించినకిరణము అభ్రకస్ఫటికపుసరళ సమ్మితాకారమునకు సమాంతరముగ నుండును. అభ్రకపురేకుమీఁదను మొక్కపోయిన ఆరెను నొక్కుచు పోయినచో పైని వచించిన షట్కిరణమువంటి పగులు వెనుకటిదానికిరణముల నడిమికోణములను సంధించులాగున నేర్పడును.

sampath Ebooks

దీనికి 'పీడనాకృతి' (Pressure Figure) యని పేరు. ఈ పగుళ్లు సులభముగ విడివచ్చు రేకులతోడఁగాని లేక అభ్రకస్ఫటికము నందు ప్రసరించు రేకులతోడఁగాని సరిపోవుచుండును. అభ్రకస్ఫటికములకు ముఖములు లేనప్పుడు రేకు లేప్రకార మేర్పడునదియు నిశ్చయించుకొనుటయందు ఈపగుళ్లు ముఖ్యముగఁ దోడ్పడుచుండును. భూమియందు కలుగుసంచలనములకు లోనై అభ్రకపు రేకులు తఱచుగ పగిలి ఈపగుళ్లచాలులకు సమాంతరము లైయుండు గనిమలుగ నేర్పడుచుండును. అప్పుడీరేకు లెందుకును పనికిరావు.

దృక్శాస్త్రీయలక్షణము (Optical Characters)లలో అభ్రకము లపరిమితములగు వ్యత్యాసములను జెల్లడించును. వక్రీభవన సూచకములు (Indices of Refraction) ఎక్కువకావు. మధ్యమసూచకము (Mean Index) సుమారు ౧.౫౮, ౧.౬౦ గ నుండును. కాని ఋణాత్మకదృక్కాంతి యైన (Negative in Sign) ద్విగుణవక్రీభవనము (Double Refraction) మిగుల స్పష్ట మైనది. మస్కొవైటు, లెపిడొలైటు అభ్రకములందు దృగక్షముల (Optic Axes) నడిమికోణము ౭౦-౫౦ అంశములును, బయొటైట్, ఫ్లొగొపైటులందు ౧౦-౦ అంశములును ఉండును. బయొటైటు, ఫ్లొగొపైటులు తఱచుగా సమాక్షములు. దృగక్షముల రెండుగ విభజించులఘురేఖ (Acute Bisectrix) ముఖ్యలంబమునుండి మట్టపు చతురమునకు ఒకటి రెండు అంశములకంటె నెక్కువదూరము తొలఁగ నేరదు. అట్లగుటచే అభ్రకపురేకును ఏకరూపీకరణ అణువీక్షణి (Polarizing Microscope) ఎదుట నుంచియెడల నది ఏకకేంద్రాభిముఖప్రకాశము (Converging Light) లోని దృగ్రూపము వలెఁ గనిపించును. దృగక్షములనదును (Plane of optical Axes) అభ్రకస్ఫటికముయొక్క సమ్మితాకారపుచదునునకు లంబము (Perpendicular) గఁ గాని, సమాంతరముగఁ గాని యుండవచ్చును. దీని ఉనికినిబట్టి అభ్రకమునందలి భేదద్వయమును నిశ్చయించుకొనవచ్చును. దృగక్షపుచదును సమ్మితాకారపుచదునునకు లంబముగా నున్నయెడల నపు డది మస్కొవైట్, లెపిడొలైట్, పరగొనైట్, బయొటైటుయొక్క అపరూపపు విశేషముగు అనొమైటు నామకాభ్రకములలో నొకటి యని నిరూపించుకొనవచ్చును. ఇది యొకభేదము. దృగక్షపుచదును సమ్మితాకారపుచదునునకు సమాంతరముగ నుండినయెడల నప్పుడు పిన్వల్డైట్, ఫ్లొగొపైట్, లెపిడొమెలేన్, పయొటైట్ నామకాభ్రములకుఁ జెందిన దని నిశ్చయించుకొనవచ్చును. ఇది రెండవవిభేదము. కృష్ణవర్ణాభ్రకములు దిగముకారివర్ణములు (Pleochroic), అనఁగా వేఱువేఱు దిక్కులనుండి చూచిన వేఱువేఱురంగుల నీనుచుండును.

బొత్తిగా రంగులేని పారదర్శక (Transparent)మైన మస్కొవైటు మొదలుకొని పసుపు, ఆకుపచ్చ, ఎఱుపు, గోధుమచాయల నొప్పి అపారదర్శక(Opaque)మైన లెపిడొమెలేన్ వఱకు ననేకవిధములగు అభ్రకములు కలవు. మొదటి విధానపురేకులు ముత్యపుకాంతి కల్గియు, రెండవప్రకారపురేకులు హీనధాతుకాంతి కల్గియు నుండును. లోపలిపగుళ్ల ఉపరిభాగములమీఁద వెల్తురు పడునపుడు రేకులమీఁద రంగులు చుట్లుగను, బంధములుగను (Rings and Bands) ఏర్పడుచుండును. వేర్వేఱు అభ్రకముల విశిష్టగురుత్వాకర్షశక్తి (Specific Gravity) ౨.౭ మొదలు ౩.౧ వఱకును భిన్నభిన్నములుగ నుండును. గట్టితనము (Hardness) ౨ - ౩ అంశములు. మృదువైన రేకులమీఁదను గోటితో గీఁతలు గీయవచ్చును. అభ్రకములు ఉష్ణతావిద్యుద్వాహకములు గావు (Bad Conductors of heat and electricity). ఈ గుణధర్మము గలిగియుండుటచేతనే ఇది అనేకకళాకౌశలముల ప్రక్రియలందుపయోగింపఁబడుచున్నది. మఱియు వీనియందు ఇతరఖనిజము లనేకములు మిళిత మైయుండుట కానవచ్చును. చపరపు గార్నెటుస్ఫటికములు, శిలాస్ఫటికపుపొరలు, టోర్మాలిన్ మొదలు అభ్రకములందుఁ గలసియుండును. ఎఱుపు, నలుపు, గోధుమరంగులమచ్చలు, డాగులు పడుటవలన రేకులు తఱచుగా విరూపములై ఎందులకును బనికిరాకుండఁబోవును. వీనియందలి లోహామ్లజనములు (Iron Oxides) రేకులమీఁద వనస్పతుల యాకారములతో పడియుండుటచేతను అభ్రకములు పాడగును. మఱికొన్నిటియందు, ముఖ్యముగా ఫ్లొగొపైటునందు ఘూతాకృతి కిరణములకు సమానాంతరములో నేర్పడియుండు రూటైలు (Rutile) యొక్క సూక్ష్మసూచ్యాకారరేఖలు నక్షత్రపుంజపుదృశ్యములను గలిగించును. వెండియు నట్టి యభ్రకము గుండ మైనపువత్తిజ్వాలను గాని, అన్యప్రకాశమును గాని చూచిన యెడల నది షట్కిరణనక్షత్రమువలెఁ గన్పించును.

రాసాయనికసంఘటనము :— అభ్రకములసంఘటనము మహాసంకీర్ణమైనది, పరివర్తనశీల మైనదియు. ఇ వన్నియు సైకతములు (Silicates). పొటాషియం, సోడియం లిథియం, కాల్షియం మొదలగు క్షారములతోడను, భాస్మిక ఉదజనముతోడను మిళితమైన అల్యూమినము అభ్రకములం దుండును. మఱికొన్నింటియందు మగ్నము (Magnesium) కొలఁదిమాత్రపులోహము, క్రోమియము, మాంగనము (Manganese), బారియము మొదలైనవి ఉండును. ప్లవ (Flourine) మొకటి దీనియందలి ముఖ్యభాగము. కొన్నివేళల టిటేనియముకూడ కలసియుండును.

అభ్రకముయొక్క వివిధసంఘటనముల నీక్రింది సాంకేతికసూత్రములప్రకారము తెలిసికొనవచ్చును. కాని ఇ వన్నియు అసమగ్రములు. సంఘటనములలోని ఈవిభేదముల విశదీకరించుట కనేక ప్రయత్నములు జరగినవి. అన్నిరకముల అభ్రకములును మరల క్షారాభ్రకము (Alkali micas) లనియు, లోహమగ్నాభ్రకము (Ferro - magnesium micas) లనియు రెండువిధములు. ఇంచుమించుగ నివియే శ్వేతకృష్ణాభ్రకములతో సరిపోవును.

sampath_Ebooks

| | |
|---|---|
| మస్కొవైట్[1] | ఉ$_2$ పొ స్ఫ$_3$ (శై అ$_4$)$_3$ |
| పరగొనైట్ | ఉ$_2$ సో స్ఫ$_3$ (శై అ$_4$)$_3$ |
| లెపిడోలైట్ | పొ గ్రా [స్ఫ (అఉ, ప్ల)$_2$] స్ఫ (శై అ$_3$)$_3$ |
| జిన్వల్డైట్ | (పొ గ్రా)$_3$ [స్ఫ (అఉ, ప్ల)$_2$] లో స్ఫ$_2$ శై$_5$ అ$_{16}$ |
| బయొటైట్ | (ఉ, పొ)$_2$ (మ, లో)$_2$ (స్ఫ, లో)$_2$ (శై అ$_4$)$_3$ |
| ఫ్లొగొపైట్ | [ఉ, పొ, (మప్ల)]$_3$ మ$_3$ స్ఫ (శై అ$_4$)$_3$ |

మస్కొవైటు నందు ౪ మొదలు ౬ పాళ్లవఱకును, తక్కిన వానియం దింకను తక్కువగను, భస్మిక - ఉజ్జనరూపముననో లేక ప్లవమునకు (Fluorine) బదులు హైడ్రోక్సిల్ రూపముననో ఉండు నీరు ఉష్ణాధిక్యముద్వారా దూరము గావింపఁబడును.

రాస్కొలైట్ అనునది వేఱొకవిధ మగునభ్రకము. ఇందు అల్యూమినమునకు బదులు వనాడియము నామకధాతు వుండును. ఇది కాలిఫోర్నియా, కొలరేడో, పశ్చిమ - ఆస్ట్రేలియాలందు సువర్ణ తెల్లురిదము (Tellurides of Gold)లతో బాటుగఁ గలసి, గోధుమ ఆకు పచ్చరంగుల మెట్లగుండలవలె నేర్పడియుండును.

ఉనికి (Occurrence) :— అగ్నిమంతములైన సకలవిధశిలలందును అభ్రకము ప్రధానాంగముగ నుండును. వాతాతపశోషణముల వలనను (Weathering), మేళనములవలనను (Contact), డైనమో రూపాంతరకారకవిధానములవలనను (Dynamo - metamorphic - Processes), అనేకఖనిజశైలికము (Mineral Silicates)లనుండి విడఁదీయుటచేతను నిది లభించును. కరుడురాల (Sedimentary Rocks)లో నిది చూర్ణరూపమున నుండును. శైలాత్మకపాషాణము (Silicious Rocks)లందు సాధారణముగా మస్కొవైటు, బయొటైటు అభ్రకములు లభించును. 'సున్నపురాలయందు ప్రధానమైనది ఫ్లొగొపైటుఅభ్రకము.' పెనూవియనులోని మాంటిసోమానుండి వెలువడు సున్నపురాలబండల రంధ్రములందు పేరుకొనియుండు తెలుపులేని బయొటైట్ స్ఫటికములద్వారా అత్యుత్తమము లగు సకలవిధాభ్రకములను దీయవచ్చును. వ్యాపారోపయోగము లైన పెద్దపెద్ద మస్కొవైటురేకులు నల్లరాతియందు వ్యాపించియుండు ముదురైన స్ఫాటికపు చాలులనుండియే లభించును. మఱియు నీచాలులందు ఫెల్స్పార్, శిలాస్ఫటికము (Quartz), అభ్రకము ఈమూఁడును టోర్మాలిన్, బెరిల్, గార్నెట్ మున్నగు ఇతరస్ఫటికభూతఖనిజములతో మిళితమైయుండును. ఇవి ఇండియాయందును, అమెరికాసంయుక్తరాజ్యములలోని దక్షిణడకోటా, కొలరేడో, అలబామారాజ్యములందును, బ్రజిలుదేశములోని గొయాజు, బాహియా, మినాస్, జెరేస్ ప్రాంతములందును అభ్రకము దీయునిమిత్త ముపయోగింపఁబడు చున్నవి. కెనడా, సింహళదేశములలోని వ్యాపారోపయోగము లగు అభ్రకములు ఫ్లొగొపైటుజాతికి చెందినవి. కనియునికి విలక్షణమైనది. బంగాళముదగ్గఱి హజారీబాగును, మద్రాసునందలి నెల్లూరును అభ్రకపుగనులకు ముఖ్యమైన జిల్లాలు. హజారీబాగుదగ్గఱి అభ్రకము కెంపురంగును, నెల్లూరిదగ్గఱిది ఆకుపచ్చనిరంగును గలిగియుండును. నెల్లూరిదగ్గఱి ఇనుకుర్తిగనిలో ౧౦ అడుగుల పొడవును, ౧౫ అడుగుల వెడల్పునుగల అభ్రకపుపుస్తకములు (Books) దొరికినవి. మఱియు నచట పలకలు గాని, ముక్కలు గాని లేక ౩౦ అం. పొడవును, ౨౫ అం. వెడల్పునుగల సమచతురస్రముగల రేకులు తఱచుగ దొరకుచుండును.

ఉపయోగములు :— పారదర్శకత్వము గలిగియుండుటచేతను, అగ్నిని, తాపపరిమాణమునందలి ఆకస్మికపరివర్తనములను సహింపఁగలుగుటచేతను అభ్రకముస్టవుల యొక్కయు, కొలిముల యొక్కయు కిటికీలకును, కొలుములమూఁపుడు రంధ్రములకును, దీపముల 'గాస్' బర్నరుల చిమ్నీలకును విస్తారముగ నుపయోగింపఁబడుచుండెను. ఒకకాలమం దిది ఇంగ్లీషుకిటికీలకును, రష్యాయుద్ధ నౌకల కిటికీ ములకును, మస్కోవీయద్దము (Muscovy Glass) అనుపేర నుపయోగింపఁబడియుండెను. అనేకప్రకారములగు అలంకారకార్యముల కభ్రకపు తళుకులు విస్తారముగ నుపయోగింపఁబడుచుండెను. ప్రాచీనకాలమం దీఖనిజము వర్జిన్ మేరీని గ్రహముల కలంకరించుటయం దుపయోగపడి యుండినందున గ్లాసీస్ మేరియే (Glacies-Mariae) యని పిలువఁబడుచుండెను. మాక్సిమస్ సర్కస్ మైదానమును ధవళకాంతిని గలుగఁజేయుటకై చల్లఁబడిన దని ప్లినీ వ్రాసినలాపిస్ స్పెక్యులారిస్ నామకపదార్థ మీయభ్రకమే యైయుండవచ్చును. కుడ్యాలంకారపుకాగితముల నిర్మాణమందును, ఆటవస్తువులు, నాటకపుసీనులు మొదలగువానికి చక్కెరవంటి మంచుపొడి చల్లినరూపము గలుగఁజేయుటయందును అభ్రకపుపొడి అపరిమితముగ వాడఁబడుచుండెను. రంగులు, కాగితములు తయారు చేయునపుడు మెఱుఁగు దెప్పించుటకును, నైట్రోగ్లిసరైన్‌లోనగువానిని హరించుటకును నిది యుపయోగింపఁబడును. చిత్రలేఖనమున కభ్రకపు రేకులు ముఖ్యముగ నిండియాలో వాడఁబడుచుండినవి. మఱియు లాంతర్ల స్లైడులకును, ఫోటోగ్రాఫ్ఫిల్ముల నంచుటకును, చిత్రములను చారిత్రకములైన దస్తావేజులను గాపాడునిమిత్తము చుట్టుచుట్టుట

1. సూత్రములందలి పొడియక్షరముల సంపూర్ణనామములు :—

ఉ = ఉదజనము లేక ఉజ్జనము (Hydrogen)
పొ = పొటాసియము (Potassium or Kalium)
స్ఫ = స్ఫటము (Aluminium)
శై = శైలము (Silicon)
అ = అమ్లజనము (Oxygen)
సో = సోడియము (Sodium or Natrium)
గ్రా = గ్రావము (Lithium)
ప్ల = ప్లవము (Fluorine)
లో = లోహము (Iron or Ferrum)
మ = మగ్నము (Magnesium)

sampath_Ebooks

కును, ద్రావకములో ముంచఁబడి మెత్తనై ముడుచుకొనిపోవు జంగుపుగనయూవాల నెక్కించుటకును, వాయువేగమాపకముల కెండాలకును, సున్నితములైన భౌతికశాస్త్రసాధనముల యంత్రముల కును, అనేకదృక్శాస్త్రీయకార్యములకును, ఇంకను పలురకముల పనులకును అభ్రకము లుపయోగపడుచుండును. ఉష్ణవాహకము లగుటచే నివి స్టీముగొట్టములకును, బాయిలర్లకును చుట్టును గప్పుట కుపయోగపడును. ఆమ్లముల నిరోధింపఁగల వీనిసామర్థ్యమువలన మఱియు ననేకేతరోపయోగము లాధారపడియున్నవి.

ప్రస్తుత మిది విద్యుత్సంబంధములైన కార్యములం దత్యంత ముగ నుపయోగింపఁబడుచున్నది. విద్యుద్వాహకము కానికారణమున విద్యుత్నిరోధకముల ( Insulators ) కిది మిక్కిలి ప్రశస్తమైనది. ఎటు వంచిన నటు వంగునట్టి మృదువైన దీనిరేకులు డైనమోల యొక్క లోహఖండ( Armatures )నిర్మాణమం దుపయుక్తముగ నుపయోగింపఁబడుచున్నవి. ఇటులే ఇతర యనేకవిద్యుద్యంత్ర ములకును ఉపయోగపడుచున్నది. షెల్లాకుతోఁ గాని మఱియేవిద్యు ద్రోధకమైన సిమెంటుతోఁగాని అభ్రకపుముక్కలు కాగితము మీఁదనో లేక సుద్దమీఁదనో అతికింపఁబడినయెడల నది మైకానైట్ లేక మైకానైట్సుద్ద యని పిలువఁబడుచుండును. ఇట్టి ఈ మైకానైట్ అనేకకార్యములం దుపయోగింపఁబడును.

మస్కొవైట్, ఫ్లోగోపైట్ జాతి యభ్రకములే వ్యాపారమునం దుపయోగపడునవి. రంగులేని పారదర్శకపురేకులరూపమున ఫ్లోగోపైట్ అరుదుగ లభించుటచే చాలవఱకది విద్యుత్కార్యములకొఱకే ముఖ్యముగ నుపయోగింపఁబడుచుండును. అభ్రకమువలన మఱియు ననేకోపయోగములు కలవు. పొటాషియము కలిసియుండుటచే నిది యెరువుక్రింద నుపయోగపడును. లిథియమ్, రుబిడియమ్ మొదలగువాని నుత్పన్నము చేయుటయందు లెపిడొలైట్ అభ్రకము విస్తారముగ నుపయోగపడును.

త్రవ్వి తీయుట ( Mining ), తయారుచేయుట ( Preparation ), విలువ ( Value ) :— అభ్రకము త్రవ్వి తీయుట ముఖ్యముగ ఇండియాలో ప్రధానమైన పరిశ్రమ. కాని ఇచటిపద్ధతు లాదికాలము నాఁటివి, వ్యర్థవ్యయకారకములు. కష్టము లేనిక్వారీలందును, వంకర టింకరలైన రస్తాలందును తీయునపు డభ్రకము మిగుల పాడైపోవును. ఈ పాడైనపదార్థమును గనిలోనుండి మీఁదికిఁ జేర్చుటకే అమితముగ పరిశ్రమ వ్యర్థమగును. ఈఖనిజ మొక విస్తీర్ణమైన చాలలయందే యుండుటంజేసి ఇంతకంటెను తృప్తికరములై స్వల్పవ్యయదాయకములైన పద్ధతులను, అనఁగా నిలువైన సలకలకడ్డీలతోడను, అడ్డ కోఁతలతోడను, చాలలు పోయినమార్గమువెంట మట్టపుకడ్డీల దోపుట చేతను ధాతుగర్భితములైన గనులలో నవలంబింపఁబడువిధానముల నవలంబించినచో బాగుగ నుండును. అప్పు డభ్రకమును పైనుండియే తీసికొనుటకును, వ్యర్థపదార్థమును అక్కడక్కడనే అంతకుపూర్వము అభ్రకము తీయఁగా పడినగుంటలను బూడ్చుటకును వీలగును.

అభ్రకమును తయారు చేయుటకు బొత్తి ( Book ) నుండి పదులు ననుసరించి కావలసినంత మందపురేకులను విడఁదీసి వానిలో మచ్చలు మరకలు పడి పాడైనభాగముల నచటి పదునుగల కత్తితోఁ గాని, కత్తెరతోఁ గాని చదునుచేయఁబడురేకులను గోయుదురు. అనంతరము పరిమాణము, పారదర్శకత్వము, వర్ణము, మచ్చలు, డాగులు లేకుండుట మొదలగు లక్షణములఁబట్టి యా వస్తువు వేర్వేఱుగ విభజింపఁబడును. చినిఁగినముక్కలు చూర్ణముకొఱకో లేక మైకానైట్ నిమిత్తమో ఉపయోగింపఁబడును.

ఉత్పత్తి :— ఎచటినుండి పైనను త్రవ్వితీయఁబడు అభ్రకము నూటికి ౧౦ వంతులకంటె నెక్కువగ లేకుండఁ గన్పడుచుండును. పూర్వకాలమున అనావశ్యపదార్థ మంతయు చాలవఱకు వ్యర్థ మగు చుండెడిది. కాని ఇప్పుడీ ముక్కలు మార్కెట్టునిమిత్తము మిక్కిలి అవసరములుగ నున్నవి.

వర్మిక్యులేట్ ( Vermiculate ) అనునది అభ్రకాత్మకము లగు ఖనిజములసముదాయము. ఇవి వేఱొకవిధమగు అభ్రకమును బుట్టించును. కొన్ని యేండ్లక్రిందటివఱకు నివి విచిత్రఖనిజము లని తలంపఁబడుచుండినవి. ఇటీవల నివి కొలరేడో, మొంటానా రాజ్యములందు దొరకి, వ్యాపారోపయుక్తము లగుటచే మిగుల వ్యాప్తి నొందినవి. వేఁడి చేయుటవలన పదులునకు నిలువుగ నొకటే ప్రక్కను నిడుపై పెరిఁగిపోవును. ఇదియే వర్మిక్యులేటు నందలి విశిష్టలక్షణము. ఈపెరుఁగుట అసలుకంటె ౧౬ రెట్లు ఎక్కువ. అట్లు పెరుఁగునపుడు ఉష్ణాధిక్యమునుబట్టియు, వాయుస్పర్శమునుబట్టియు దీనివర్ణపరివర్తనము కలుగును. అభ్రకములోని ఇనుమున కమ్లజనసంయోగము కలుగుటచే ఈపరివర్తన మగు నని తలఁపఁబడినది. కాఁబట్టి యిందలి అమ్లజనభాగముల ననుసరించి ఈఖనిజమందలి వివిధభేదములు గలుగుచుండును. ఉష్ణముచే పెంపొందుభాగము మంచి ఉష్ణవాహకము, ధ్వనివారకము నని కనుఁగొనఁబడెను. మఱియు దీనితో వర్ణములు ( రంగులు ) తయారగును.

### ౧౯౨౧ – ౧౯౨౫ లలో ప్రపంచమందలి అభ్రకపు ఉత్పత్తి – మీటరుటన్నులు

| దేశముపేరు | ౧౯౨౧ | ౧౯౨౨ | ౧౯౨౩ | ౧౯౨౪ | ౧౯౨౫ |
|---|---|---|---|---|---|
| ఉత్తర అమెరికా | | | | | |
| కెనడా | ౬౩౭ | ౩౦౩౮ | ౩౧౯౭ | ౩౭౧౧ | ౩౬౪౭ |
| సంయుక్తరాజ్యములు | ౨౬౭౪ | ౬౫౧౪ | ౮౨౪౩ | ౪౯౩౪ | ౯౬౦౯ |
| దక్షిణ అమెరికా | | | | | |
| అర్జెంటినా | ౧౪౭ | ౬౪ | ౮౭ | ౧౨౦ | ౧౧౯ |
| బ్రెజిల్ | ౪౬ | ౬౭ | ౫౬ | ౭౯ | ౬౫ |
| యూరోపు | | | | | |
| నార్వే | ౨ | ౧ | ౧౦ | ౨౫ | |
| రుమానియా | | | ౬ | | |

sampath_Ebooks

| దేశము పేరు | ౧౯౨౧ | ౧౯౨౨ | ౧౯౨౩ | ౧౯౨౪ | ౧౯౨౫ |
|---|---|---|---|---|---|
| రష్యా | | ౯ | | | |
| స్పెయిను | ౨ | | ౩ | | |
| స్వీడను | | ౯ | ౫ | ౮ | |
| ఆసియా | | | | | |
| సిలోను | ౧ | ౧ | ౧ | | |
| చైనా | ౧౧ | ౧౯ | ౧౧ | ౨౩ | ౨౦ |
| ఇండియా (బ్రిటిషు) | ౧౬౫౦ | ౧౬౧౯ | ౧౭౨౦ | ౨౦౭౯ | |
| జపాను | | ౧౫ | ౪౩౦ | | |
| ఆఫ్రికా | | | | | |
| మెడగాస్కర్ | ౧౪౧ | ౯౨ | ౧౬౫ | ౨౯౬ | ౨౬౮ |
| దక్షిణరోడీషియా | ౭౭ | ౬౦ | ౯౩ | ౧౩౬ | ౧౩౨ |
| టాంగనీకా ఇలాకా | ౩ | ౧౧ | ౩౩ | ౫౭ | |
| దక్షిణఆఫ్రికాయూనియను ట్రాన్స్వాల్ | ౧ | ౩ | ౧౫ | ౭౩౫ | ౧౪౯౦ |
| ఓషియానియా : ఆస్ట్రేలియా | | | | | |
| ఉత్తర ఇలాకా | ౧ | ౧ | ౩ | ౩ | ౩ |
| క్వీన్స్లాండ్ | | | | | ౧ |
| పడమటి ఆస్ట్రేలియా | | ౨ | | | |

**ఆయుర్వేదశాస్త్రము ననుసరించి**

అభ్రకము అధునాతనముగఁ గాక నాగార్జునాది లోహతంత్రకారుల కాలమునుండియును ప్రచారమునందున్న ఖనిజపదార్థము.

వృత్రాసురుని సంహరించుటకొఱకు ఇంద్రుఁడు వజ్రమును పైకెత్తఁగా నావజ్రమునుండి యుద్భవించిన కాంతికణములు గగనమున కెగసి యందుండి పర్వతశిఖరములందు చెదరిపడి యభ్రకరూపంబుగా పరిణమించినవి. ఈ వజ్రకాంతికణంబులు క్రిందఁబడునపుడు ఉఱుమువలె ధ్వనిచేయుచు పడుటచేత నీ ఖనిజపదార్థము 'అభ్రక' మనియు, ఆకాశంబుననుండి కాంతికణములు పడుటచే 'గగనం' బనియు, ఇంద్రవజ్రమునుండి జనించుటచే 'వజ్రాభ్రం' బనియు వ్యవహరింపఁబడుచున్నది (ఆయుర్వేదప్రకాశము., వ్యాఖ్య, ౫).

జాతి, మతభేదములు :— ప్రాచీనులగు రసతంత్రకారులు నానావిధములగు ఖనిజపదార్థములను విభజించి సులభముగా తెలిసికొనుటకై కొన్నిటిఁజేర్చి పారిభాషికంబుగా 'మహారసములు', 'ఉపరసములు', 'లోహములు', 'సాధారణరసములు' ఇత్యాదినామంబుల నిడి యాయాపదార్థములను అట్టి పారిభాషికపదములచే వ్యవహరించుచువచ్చిరి. కాని ఇట్లు రానురాను కొందఱు గ్రంథకర్తలు అట్టి పారిభాషికనియమములను పాటింపక స్వాభిప్రాయానుసారముగా వ్రాయ మొదలిడిరి. ఒకరు మహారసములలోఁ జేర్చినపదార్థమును మఱియొకరు ఉపరసములలోఁ జేర్చుట, ఇంకొకరు సాధారణరసములలోఁ జేర్చుట, ఒకరు ఉపరసములలోఁ జేర్చిన దానిని కొందఱు మహారసములలోఁ జేర్చుట - ఇట్లు విధినియమాదులు లేక స్వతంత్రముగా నిచ్చవచ్చినట్లు వ్రాయుట తటస్థించినది. కొందఱు మహారసముగాఁ జేర్కొనినదానిని తదనంతరులు పరిశోధించి యయ్యది ఉపరస మని సిద్ధాంతముచేసి ఉపరసములలోఁ జేర్చిరని కాని, ఉపరస మని చెప్పఁబడినపదార్థమును పరిశోధనాదులచే మహారస మని సిద్ధాంతము చేసి మహారసములలోఁ జేర్చిరనికాని యనుకొనుటకు మార్గంబు గానంబడదు. కొంతకాల మట్టిభేదములను జెందని యేయేపదార్థములకు మహారసనామంబును గాని, ఉపరస నామంబునుగాని ఇతరులెట్టి వివరణము, ఆమహారస ఉపరసాది శబ్దనిర్వచనము రసతంత్రంబులందుఁ గానరాదు.

ఇట్టి యభిప్రాయభేదం బభ్రకము విషయమునందుఁగూడ జనించినది. రసరత్నసముచ్చయము, రసేంద్రచింతామణి, రసప్రకాశసుధాకరము మున్నగుగ్రంథములం దభ్రకము మహారసములలోఁ జేర్పఁబడియున్నది. భావప్రకాశము, రసేంద్రసారసంగ్రహము, రసరత్నాకరము, ఆయుర్వేదప్రకాశము, రససారము మున్నగుగ్రంథములందు ఉపరస మని వ్యవహరింపఁబడియున్నది.

భేదములు, అవాంతరభేదములు:— సత్త్వభేదంబులచే నుత్పన్నంబై యభ్రకము 'పినాకాభ్రకము', 'నాగాభ్రకము', 'మండూకాభ్రకము' అని నాలుగుభేదంబులుగా విభజింపఁబడియున్నది. అందు వజ్రాభ్రమే కృష్ణాభ్రకం బనియుఁగూడ వ్యవహరింపఁబడును. ఇదియునుఁగాక యీ నాల్గింటిలో ప్రత్యభ్రకము తెలుపు ఎఱుపు పసుపు నలుపు అను నాల్గువర్ణములు గలిగి నాల్గువిధంబులుగా నుండును; అవఁగా నభ్రకంబు పదునాఱువిధంబు లని తేలుచున్నది.

అభ్రక పరీక్ష :— పినాకాభ్రకమును కొలిమిలో నిడి యూఁదిన రేకులు విడిపోయి పొట్టుగా మాఱును. నాగాభ్రకంబును కొలిమిలోనిడి యూఁదిన సర్పంబువలె బుసలు కొట్టును. మండూకాభ్రకంబును కొలిమిలోనిడి యూఁదినచో కప్పవలె గంతులు వైచును. వజ్రాభ్రకంబును కొలిమిలో నూఁదిన సంపూర్ణ దోషంబు లన్నియు నశించి స్వచ్ఛంబై ప్రకాశములో నుండును (రసరత్నసముచ్చయము).

అభ్రకశ్రేష్ఠత :— పైని జెప్పఁబడిన యభ్రకంబులలో వజ్రాభ్రకంబు త్తమము వైయుండును. 'దానినే రాసాయనిక క్రియలందును ఔషధనిర్మాణములందును ఉపయోగింపవచ్చును' అని గ్రంథకారు లందఱు నేకగ్రీవముగా నుడివియున్నారు. ఇంతియకాక వజ్రాభ్రకంబుకంటె నితరంబులగు మూఁడు అభ్రకంబులలో పినాకాభ్రకంబును భుజించిన దుస్సాధంబగు కుష్ఠరోగము జనించును. నాగాభ్రకంబును భక్షించిన మండలకుష్ఠము జనించును. మండూకాభ్రకంబును సేవించిన కృచ్ఛ్రసాధ్యంబగు అశ్మరీరోగము జనించును. దానంజేసి పైమూఁడు అభ్రకంబులను సేవింపఁగూడదు. వజ్రాభ్రకంబునుమాత్ర ముపయోగింపవలెను.

వజ్రాభ్రకము, తద్గ్రహణనిర్ణయము :— వజ్రాభ్రకంబు కాటుకవలె నల్లనై కఠినముగానుండి బరువు గలిగియుండును. ఉత్తర

sampath_Ebooks

దేశపుపర్వతములయందు జనించుకృష్ణాభ్రక మధికముగా సత్త్వము గలిగియుండును, గుణాధికంబై యుండును. దక్షిణదేశపు పర్వతములయందు జనించు నభ్రకము అల్పసత్త్వంబై హీనగుణంబై యుండును. ఇట్టి కృష్ణాభ్రకంబును ఒకమనుష్యుని ప్రమాణముగా గోయి త్రవ్వి యచ్చట నున్న యభ్రకమును తీసికొనవలెను. భూమి పైభాగమున నున్న యభ్రకము నిస్సత్త్వంబై యుండును గాన దానిని గ్రహింపఁజనదు. ఇందులకు కారణమును అనేకగ్రంథకర్తలు చెప్పియుండలేదు. కాని రసవ్యాప్తియాతంత్రకారుఁడు మాత్ర మిట్లు వివరించియున్నారు. ఖనిజపదార్థము లన్నియు సూర్యకిరణసంతప్తంబులైనచో నట్టివానియందు సత్త్వము స్వల్పముగా నుండును. అయ్యది భూగర్భము నందుండి యెండవేఁడిమిని బొందకుండఁ జేసిన బహుసత్త్వంగాలై యుండును.

అభ్రకశోధనము :— అభ్రకంబును కొలిమిలోఁ గాల్చి ఏడు సారులు పాలలోఁగాని, గోమూత్రములోఁగాని ముంచిన భూసంబంధములచే జనించిన దోషము హరించి శుద్ధం బగును (రసరత్నసముచ్చయము).

శతపుటాభ్రకము :— అభ్రకంబును కొలిమిలోఁ గాల్చి ఏడు మారులు త్రిఫలాక్వాథంబులోఁగాని, పులికడుగులోఁగాని ముంచిన శుద్ధం బగును (ఆయుర్వేదప్రకాశము).

అభ్రకంబును గాల్చి రేగుపట్టకషాయంబులో ముంచి యెండిన పిమ్మట చేతులమధ్యను నలిపిన శుద్ధం బగును (రసమంజరి).

ధాన్యాభ్రకము :— ఒకభాగము ధాన్యము, నాలుగుభాగములు శుద్ధిచేసిన యభ్రకము — వీనిని ఒకవస్త్రములో మూటగాఁ గట్టి యామూటను మూఁడుదినములు పులికడుగులో నానవైచి నాల్గవనాఁడు ఆమూటను రెండుచేతులమధ్య నుంచుకొని నలిపినయెడల నాయభ్రకంబు ఇసుకరేణువులవలె నా పులికడుగులోనికిఁ బడును. పిమ్మట నా పులికడుగును వంచివైచి యడుగున యభ్రకంబును తీసియుంచుకొనవలెను. ఇయ్యది ధాన్యాభ్రకం బనఁబడును. ఇట్టి ధాన్యాభ్రకమును మొదట సిద్ధముచేసికొని దానినే భస్మము చేయవలెను.

అభ్రకభస్మము :— ఈ విషయంబున గ్రంథకారులు భిన్నభిన్నములుగా వివరించియున్నారు. అభ్రకభస్మ మనఁగా, అభ్రకమును ఔషధసముదాయముతో నూఱి బిళ్ళలయందు పుటమువైచి సింధూరముగా మార్చి యందలి పరమాణుసంయోగమును విడఁగొట్టి సేవనయోగ్యముగాఁ జేయుట. కొందఱు ఒకపుటముచేతనే సింధూరముగా పరిణమింపఁజేయు ప్రక్రియలను వివరించిరి. మఱికొందఱు పదిపుటములు, ఇంకొకరు నలువదిపుటములు, వేఱొకరు నూఱుపుటములు, కొందఱు వేయిపుటములు — ఈరీతిగా ప్రక్రియలను జెప్పియుండిరి. ఎవ్వరెవిధంబుగా వివరించినను, అభ్రకమును సింధూరముగా మార్చి యందలి తళుకు పోవునట్లుగను, పరమాణ్వాకర్షణము నశించునట్లుగను జేసి సేవనయోగ్యంబుగాఁ జేయుట సర్వసమ్మత మగువిషయము. నూఱుపుటములువైచిన యభ్రకము, వేయిపుటములు వైచిన యభ్రకము ఉత్తమంబు లని యనేక ప్రసిద్ధి గలదు. ఇట్లుండఁ బదిపుటములతోడను, ఒకపుటముతోడను అభ్రకము నిశ్చంద్రకంబై సింధూరరూపమును బొంది సేవనయోగ్యం బగునా యనుసందేహ మనవసరము లేదు. అయ్యది అభ్రకముతోఁ జేర్చుపదార్థములనుబట్టి యుండును. ఆపదార్థములు పైని జెప్పినశక్తి గలిగియుండినచో నొక్కపుటముచేతనే నిశ్చంద్రకంబగు సింధూరము గావచ్చును. కొన్ని అభ్రకభస్మయోగములు ఈ క్రింద వివరింపఁబడును.

ఏకపుటాభ్రకము :— ధాన్యాభ్రకము, టంకణము — వీనిని సమముగాఁ గలిపి మూఁకుడుపాత్రమునందుంచి పైని క్రింద మంటఁబెట్టుచు, పాత్రములోని అభ్రకమును ఇనుపబందితో నూఱుచుండిన కొంతకాలమునకది యంతయు నీరగును. పిమ్మట దానిని ఆవుపాలతో నూఱ్చినచో నందలి తళుకు నశించి నిశ్చంద్రక మగును (ఆయుర్వేదప్రకాశము).

దశపుటాభ్రకము :— ధాన్యాభ్రకంబును కలబందరసముతోఁ గాని, తుంగముస్తెలరసముతోఁగాని, ఉజ్జీసూరరసముతోఁగాని నూఱి పదిపుటములు వైచిన నిశ్చంద్రకం బగు భస్మం బగును (రసరత్నసముచ్చయము).

నలువదిపుటముల యభ్రకము :— తుంగముస్తెల కషాయము, తెల్లగలిజేరురసము, కసివిందరసము, తమలపాకులరసము, జిల్లేడు పాలు, మఱ్ఱియూడలకషాయము, నేలతాడివేర్లరసము, పెద్దపల్లేరు కషాయము, నేలగొండిరసము, అరఁటిగడ్డరసము, నీటిగొబ్బిరసము, లొద్దుగచెక్కరసము — వీనిలో నొక్కొక్కదానిచే మూఁడేసి పుటములను, పాలచే రెండుపుటములను, పెరుఁగు, నేయి, తేనె, చక్కెర వీనితో ప్రత్యేకముగా నొక్కొక్కపుటమును వైచిన అభ్రకము నిశ్చంద్రకంబై సేవనయోగ్యం బగు భస్మమగును (ఆయుర్వేదప్రకాశము).

శతపుటాభ్రకము :— మఱ్ఱిపాలు, జెముడుపాలు, జిల్లేడు పాలు, తుంగముస్తెకషాయము, నరమూత్రము, మఱ్ఱియూడలరసము, మేఁకనెత్తురు - వీనితో నూఱు పుటములు వైచిన పద్మరాగంబువలె నెఱ్ఱని సింధూర మగును (యోగరత్నాకరము).

ఇట్లే సహస్రపుటంబులు, వింశతిపుటంబులు, అఱువదిపుటంబులు గ్రంథాంతరములందు భిన్నముగా సింధూరపరిణామములు వివరింపఁబడియున్నవి.

అభ్రకసత్త్వపాతనము :— సత్త్వపాతనం బనఁగా ఖనిజంబులగు అభ్రకము, వైక్రాంతము, మాక్షికము, మయూరతుత్థము మున్నగు ద్రవ్యములనుండి వానియందు రసాయనసంయోగముచే నిమిడియున్న లోహము, రాగి మున్నగుధాతువులను రసాయనప్రయోగిక ప్రక్రియలచే విడఁగొట్టుట. ఆయుర్వేదమునం దిట్టి సత్త్వపాతనప్రకారములు కొన్ని మహారసములవిషయమై వివరింపఁబడి యున్నవి. కొన్ని ఖనిజపదార్థములయందు ధాతువు లిమిడియున్న వనియు, వానిని ప్రక్రియా

sampath_Ebooks

విశేషంబులచే విషఁదీయ వచ్చుననియు ప్రాచీనరసతంత్రకారు లెఱింగినవిషయము మే. అభ్రకము సంయుక్తయుతము లోహమువంటిపదార్థ మొకటి గలదనియు, అయ్యది రసగ్రాసకర్మమందు ప్రధానం బనియు, అట్టి సత్త్వము గ్రహించి దానిని భస్మము గావించి సేవించిన సర్వరోగములు నశించు ననియు వివరింపఁబడియున్నది. తదనుకూలంబుగా నవనాతన రసాయనతంత్రవేత్త లభ్రకమును పరిశోధించి యందు మగ్న శైలితము (Silicate of Magnesia), లోహము (Iron) విశేషముగాఁ గల వని స్థాపించియు చేసియున్నారు. ఆయుర్వేదమునందు వివరింపఁబడిన అభ్రకసత్త్వపాతన ప్రకారము లీక్రిందఁ గొన్ని వివరింపఁబడును. ధాన్యాభ్రకంబును నీటిప్రబ్బలిరసముతో నయిదు నాళులు భావనచేసి పిమ్మట నయిదుపుటంబు లిడిన భస్మంబగును. ఆభస్మంబును కొలిమిలోనుంచి యూఁదిన నిర్మలంబై కిట్టరహితమై లోహంబుతో సమునుగానుండు సత్త్వ ముండుండి వెలువడును (రసహృదయతంత్రము).

అభ్రకపత్రికలను మెత్తగాఁ జూర్ణము గావించి యాచూర్ణమును గంగ, అడవికందరసము, అరఁటిగడ్డరసము — వీనిలోఁ బ్రత్యేకముగ నొక్కొక్కదినము భావనచేసి యనంతరంబున నీయభ్రకపుచూర్ణంబులో నాలవపాలు టంకణము, చింతచేఁపలు — వీనిని గలిపి నూరి పిమ్మట మహిషీఘృతమును (బఱ్ఱెనేయి)తోఁ గలిపి ఉండలుగాఁ జేసి ఎండఁబెట్టి పిమ్మట మూసయందుంచి కొలిమిలో నూఁదిన లోహతుల్యంబగు సత్త్వంబు పూసలుపూసలుగా మూసయందు పడును. అట్టి పూసలను గ్రహించి మిత్రపంచకము (నేయి, తేనె, గుగ్గిలము, గురువింద విత్తులు, టంకణము) తోఁ గలిపి మరల మూసయందుంచి కొలిమిలో నూఁదిన నాపూస లన్నియు కంచువలెఁ గరఁగి ఏకంబగును (ఆయుర్వేదప్రకాశము).

అభ్రకద్రుతి :— ద్రుతి యనఁగా ఖనిజపదార్థములు ప్రక్రియావిశేషంబులచే శాశ్వతంబుగ పారదమువలె ద్రవీభావమును జెందియుండుట. రసాయనతంత్రములలోఁ బ్రతిగ్రంథకారుఁడును ప్రతిఖనిజపదార్థమునకును ద్రవీకరణప్రక్రియలను దెలిపియున్నాఁడు. ఇట్టి ద్రుతిని ప్రాచీనగ్రంథకర్తలు నిజముగాఁ జేయఁగలిగిరా యనుసందేహము బాధించుచున్నది. ఏలయనఁగా రసరత్నసముచ్చయకారుండగు వాగ్భటుఁడు ఇట్టిద్రుతిని జేయుటకై యనేకపరిశోధనలం జేసియు నందు కృతార్థుండు కానేరక ఇట్లు వచించియున్నాఁడు: ' ద్రుతిప్రక్రియలు శాస్త్రములం దనంతములుగ వివరింపఁబడియున్నవి. అయినను అట్టి ద్రవీకరణసామర్థ్యంబు పరమేశ్వరునియనుగ్రహంబు లేకున్న దుర్లభంబు '. అభ్రకద్రుతిప్రక్రియలలో నొకటి యీక్రింద నిరూపింపఁబడును.

ధాన్యాభ్రకమును అవిసియాకులరసముతో మర్దన చేసి, ఆముద్దను అడవికందగడ్డలో నుంచి పైని మన్నుతో లేపనముచేసి పశువులు వసించుస్థలమున బాఱెఁడులోఁతుగ గోయి త్రవ్వి యాగోతియందు, ఈపదార్థపుముద్ద నునిచి గోతిని పూడ్చి నెలదినము లుంచినపిమ్మట తీసిన నాయభ్రకంబు పాదరసమువలె శాశ్వతద్రవీభావమును జెందియుండును (ఆయుర్వేదప్రకాశము).

అభ్రకరసములు, యోగములు :— భస్మరూపంబుగఁ బరిణమింపఁజేసిన యభ్రకంబుగాని, యట్టి భస్మముచే నిర్మింపఁబడిన యౌషధంబుగాని నరములకు బలమును గలుగఁజేయును. వీర్యమును వృద్ధినొందించును. పాండురోగము, కామిల, మూత్రరోగములు, గ్రహణి, అతిసారము, ప్లీహోదరము, పురాణజ్వరములు, క్షయ — వీనిని తొలఁగించును. ఇత్యాది ప్రధానంబుగా ప్రమేహరోగంబున స్వతంత్రశక్తి గలిగియున్నది. ఇంతియకాక ఇతర ఖనిజపదార్థసమ్మిళితంబై యనేకరోగములఁ బాపును. అట్టి యోగంబులలోఁ గొన్ని క్రింద నుదాహరింపఁబడును.

జ్వరాశని రసము :— శుద్ధిచేసిన పాదరసము, శుద్ధగంధకము, సైంధవలవణము, శుద్ధిచేసిన వత్సనాభి — వీనిని సమముగ గ్రహించి యీమొత్తమునకు సమముగ లోహభస్మము, లోహభస్మమునకు సమముగ నభ్రకభస్మము గలిపి మొత్తముగ నీయౌషధమును ఖల్వములో వైచి వావిలియాకురసములో బాగుగ మర్దన చేసి పిమ్మట నందు పాదరసమునకు సమముగ మిరియపుచూర్ణమును గలిపి రెండుయవల (2 Grains) ప్రమాణంబుగ తమలపాకులరసముతో నిచ్చిన సర్వజ్వరములు నశించును. ప్లీహోదరము శమించును (భైషజ్యరత్నావళి).

అర్జునాభ్రకము :— వేయిపుటంబులు వైచిన యభ్రకభస్మమును మద్దిపట్టకషాయములో నేడుదినములు భావనచేసి ఎండించి పిమ్మట రెండు యవల ప్రమాణముగ నుపయోగించినచో హృద్రోగమును శమింపఁజేయును. అతిసారము, రక్తపిత్తము, అగ్నిమాంద్యము మున్నగు రోగముల నణంచును (రసేంద్రసారసంగ్రహము).

గళితకుష్ఠారిరసము :— శుద్ధిచేసిన రసము, శుద్ధిచేసిన గంధకము, తామ్రభస్మము, లోహభస్మము, శుద్ధిచేసిన గుగ్గిలము, చిత్రమూలము, శిలాజిత్తు, శుద్ధిచేసిన విషముష్టివిత్తులు, త్రిఫలములు — ఇయ్యవి ఒక్కొక్క భాగము, అభ్రకభస్మము నాలుగుభాగములు, క్రానుగవిత్తులు నాలుగుభాగములు — ఇటులు వీనిని ఖల్వములో — వైచి తేనె, నేయి — వీనితో ప్రత్యేకముగ నూరి ఒక నేతిపాత్రయం దుంచి కర్షప్రమాణముగ సేవించిన దారుణంబగు కుష్ఠరోగము శమించును. ఈయౌషధంబును సేవించునపుడు వరిబియ్యపు అన్నము, పాలు, తేనె, నెయ్యి, చక్కెర — వీనినిమాత్రము సేవింపవలెను. స్త్రీసంయోగమును వర్జింపవలయును (భావప్రకాశము).

అనుపానవివరణము :— మఱియు నభ్రకభస్మంబు అనుపానభేదంబులచే ననేకరోగములను నశింపఁజేయును. అభ్రకంబును పసుపు, పిప్పళ్లు, తేనె — వీనితో సేవించిన ప్రమేహంబులను, కరకకాయ, బెల్లము, ఏలకులు, చక్కెర — వీనితో సేవించిన రక్తపిత్తమును, ఏలకులు, పెద్దపల్లేరు, నేలయుసిరిక, చక్కెర, ఆవుపాలు — వీనితోఁ

గలిపి సేవించిన మూత్రకృచ్ఛ్రమును, పిప్పళ్లు, తేనె — వీనితో సేవించిన నశీర్ణంబును, ఆవుపాలు, నేలగుమ్మడి — వీనితో సేవించిన దౌర్బల్యమును, నల్లజీడివిత్తులతో సేవించిన మూలరోగంబును శమింపఁజేయును. ఇట్లు అనుపానభేదంబుచే ననేకరోగంబులను శమింపఁజేయుటయేకాక శరీరమందలి ముడుతలను తొలఁగించి దీర్ఘాయుస్సు నొసంగును[1] (యోగరత్నాకరము).

(గం. దూ.)

**అభ్రమువు** — ఇంద్రునివాహన మైన ఐరావత మనెడి యేనుఁగు భార్య.

**అమటి** — ఇటలీదేశమం దొకప్రసిద్ధ మైన ఫిడేళ్లు చేయుటకై పేరు వహించినకుటుంబము. ఆంద్రియా, నికాలో (౧౫౩౦-౧౬౧౧) అను సోదరు లిద్దఱు ఈ కుటుంబమునకు మూలపురుషులు. క్రొత్తవిధముగ ఫిడేళ్లు చేసి మిగుల ఖ్యాతిఁ గాంచిరి. ఈ వంశము నందు వంశపరంపరగ నీవిద్య యభివృద్ధియాయెను. ఆంద్రి కుమారులు అంటోనియో (౧౫౫౦-౧౬౩౮), గిరోల్యామో (౧౫౫౬-౧౬౩౦) అనువారు తండ్రికంటె నెక్కువ రమ్యముగఁ జేయఁ దొడఁగిరి. వీరిచే నిర్మింపఁబడిన ఫిడేళ్లకు నిప్పటికి రు 3,000 మొదలు రు. ౮,౫౦౦ లు వెల వచ్చును. గిరోల్యామోకుమారుఁడు నికోలో (౧౫౯౬-౧౬౮౪) అనువాఁ డీ కుటుంబములో మిక్కిలి ప్రఖ్యాతిని జెందినవాఁడు. ఇతఁడు 'గ్రాండ్ అమటి' అన్న పేరుతోఁ క్రొత్తఫిడేలు నిర్మించెను. ఆకారసౌష్ఠవమందును, లావణ్యమునందును, పనితనపుఁబరిపూర్ణతయందును, మహాప్రతిధ్వనులీనుటయందును ఈజంత్రములను మించినవి లే వని చెప్పెదరు. వీని కిప్పుడు ౮,౫౦౦ మొదలు రు. ౬,౦౦౦ వఱకు వెల వచ్చును.

**అమడియస్** — ౧. ఈ పేరుగల రాజులు తొమ్మండ్రు ఫ్రాన్సులోని సెవాయ్‌సంస్థానమున కధిపతు లయిరి. వారిలో ముఖ్యముగఁ బేరొందినవారు ముగ్గురు: (౧) ౫-వ అమడియస్ (౧౨౪౯-౧౩౨౩). ఇతనికి ఘనుఁడు (The Great) అని పేరు; ౧౨౮౫ లోఁ బ్రభుత్వమునకు వచ్చెను. యుద్ధములలోఁ జాల కాలము గడిపెను. రోడ్సునకు ముట్టడిచేసిన తురుష్కుల నోడించి వారు లేచిపోవునట్లు చేసెను (౧౩౧౫); తన సంస్థానమును విస్తరింపఁజేసెను. (౨) ౬-వ అమడియస్ (౧౩౩౪-౧౩౮౩) ౧౩౫౪ లో ఫ్రెంచివారి నోడించెను. వారితో సంధి చేసికొని యదివఱకు సెవాయ్‌సంస్థానాధిపతులకు లే వని వియన్నా రాజపుత్రులు పేచీలు పెట్టుచున్న యధికారము లన్నిటిని పేచీలు లేకుండునట్లు సంపాదించెను. ఇటలీదేశమందలి ఆల్ప్సుపర్వతములపై పు తనరాజ్యమును అభివృద్ధిచేసెను. అతఁడు చిన్నసంస్థానాధీశుఁ డైనను మిక్కిలి బలవంతుఁ డగుటచే యూరోపులోని గొప్పగొప్పరాజు లాతనిస్నేహమును సాయమును గోరుచుండిరి. అతఁ డొక్కఁడే తుర్కీదేశము మీఁదికి ధర్మయుద్ధమునకై దండెత్తిపోయివచ్చెను. పదభ్రష్టుఁ డైన గ్రీకురాజును సింహాసనాసీనుఁ జేసెను. ఇటలీదేశమందు వేరాజులకుఁ బోరాటము వచ్చినను ఈతనిని మధ్యస్థునిగఁ గోరుకొనుచుండిరి. ఏజియన్ సముద్రమందలి టెనెడాస్ అనుదీవినిగుఱించి వినీషియాజనులును, జినోవాజనులును చాలకాలమువఱకును బోరాడి తుదకు దానిని ఈతని కిచ్చిరి. ఇతఁడు నేపిల్సునకుఁ బోయి కొన్నియుద్ధములలో గెల్చి ౧౩౮౩ లో నొకయంటువ్యాధి తగిలి చచ్చెను. (3) ౮-వ అమడియస్ (౧౩౮౩-౧౪౫౧). ౧౪౧౬ లో స్వతంత్రుఁడని ఆస్ట్రియాచక్రవర్తివలన నధికారము నొందెను. ఇతఁడు డ్యూక్ అన్నబిరుదమును చక్రవర్తివలనఁ బడసెను. అంతకుఁబూర్వ మీ సంస్థానాధీశులకు 'కౌంటు' అన్న చిన్నబిరుదమే యుండెను. వర్సెలీప్రాంతమును గెల్చెను. జనెవాయిస్‌ప్రాంతమును గొనెను. మఱికొన్ని యాధికారములను సంపాదించెను. చుట్టుపట్టుల నున్న రాజ్యములయందలి ప్రజలు పరచక్రములవలన మిక్కిలి బాధపడుచుండఁగా నీతఁడు తనప్రజల కేవిధమైనబాధయు లేకుండ రక్షించెను. నలువది మూఁడుసంవత్సరములు రాజ్యము చేసి కుమారునకు రాజ్య మిచ్చి సన్న్యసించి పరిపయ్‌లె యనునాశ్రమమునందు నివాసము చేసెను. ౧౪౩౯ లో నీతనిని పోపుగ (క్రైస్తవ శంకరాచార్యునిగ) నెన్నుకొనిరి. ఫ్రాన్సు, ఇంగ్లండు, స్పెయిన్, జర్మనీ, లొంబార్డి దేశముల వా రీతనిని ఆచార్యునిగ నొప్పుకొనిరి. ఇటలీలోఁ గొంతభాగము, వెనీషియాలోనివా రొప్పలేదు. తొమ్మిదిసంవత్సరములతరువాత నీతఁ డాయధికారమును వదలుకొని (౧౪౪౯) మరలఁ దనయాశ్రమమునకుఁ బోయెను. ౧౪౫౧ లో జినీవాలో మృతుఁడయ్యెను.

౨. (స్పెయినురాజు) ఇటలీదేశమునకు రా జయిన విక్టర్ ఇమాన్యుఅల్ అనువాని రెండవకుమారుఁడు. ౧౮౭౦ లో స్పెయినుదేశమునకు రాజుగ నెన్నఁబడెను. కాని యచ్చటిప్రజలకు నాతనికిని బడనందున ౧౮౭౩ లో రాజ్యమును వదలుకొనవలసినవాఁ డాయెను. ౧౮౯౦ లో మృతుఁడయ్యెను.

**అమడియో, గియోవనీ అంటోనియో** (౧౪౪౭-౧౫౨౨) — ఇటలీదేశీయుఁడు. పేరొందిన శిల్పి, విగ్రహనిర్మాత ఇతనిపనులలో, వెనీసువాఁడును సేనాధిపతియు నగు బార్టోలోమియో కొల్లియోని యనువాని విగ్రహమును దానిక్రిందను పైని చేయఁబడిన చెక్కడపుఁబనియు నా కాలమందలి యతిశ్రేష్ఠపుఁబను

---

1. అభ్రకమును ఆంగ్లేయవైద్యులు నుపయోగింపరు. పైని వర్ణింపఁబడినమందులలో ననేకములయందు అభ్రకముగాక ఇతరపదార్థములు చేరియుండుటచేత, ఆ మందులగుణము తక్కిన పదార్థముల గుణములేకాని అభ్రకముయొక్కగుణము కాదని ఆంగ్లేయవైద్యు లనేకు లభిప్రాయపడుచున్నారు.

(కొ. వేం. ల.)

sampath_Ebooks

లలో నొక్కటి యనిరెంచెదరు. మిలన్‌పట్టణమందలి దేవాలయములోఁ గూడ నితఁడు కొంతపని చేసెను!

**అమరకంటకము** — సెంట్రల్ ఇండియాలో నున్న రీవాసంస్థానమునకు, మధ్యప్రాంతమందలి బిలాస్‌పూరు జిల్లాకును దగిలియున్న మైకల పర్వతముపై నున్న చిన్నపల్లె. ఇది నర్మదా నది పుట్టినస్థలము. కావున క్షేత్రముగ నెంచబడును. ఇది 3000 అడుగులయెత్తున నున్నది. చుట్టుపట్టులఁ బవిత్ర క్షేత్రములు గలవు. వానిలో నర్మద పుట్టినచోటును, కపిలధార యనుజలపతనమును భృగుని యాశ్రమమును, సోన్‌ముండ యను నదియును చూడఁదగినవి. ఇచ్చట పురాతన దేవాలయములును గలవు. వానిలో నర్మదాదేవి గుడియుఁ గలదు.

**అమరకము** — 'అమరకము' అనుపదము అమరు ధాతువునుండి పుట్టిన భావార్థకకృదంతము. అమరు అనఁగా కుదురు, పొందికపడు, ఒప్పు, స్థిరపడు అని అర్థము. కావున అమరకము అను భావార్థకపదమునకు, కుదుర్పుట, పొందికపడుట, ఒప్పుదల, స్థిరపడుట అని అర్థము మున్నది. దీనింబట్టి అమరకము అను పదము భూస్వామికిని కర్షకునకును తత్కాలవిషయమున చేసికొనఁబడు నేర్పాటునకు రూఢము చేయఁబడినప్పుడు భూస్వామికి కర్షకుఁ డీయవలసిన ఫలభాగమును గురించి యేర్పఱచుకొనఁబడిన ఒప్పుదల యనియు, కుదురుపా టనియు గ్రహింపవలసియున్నది. అయినను, అమరకపదము భూవిషయమునందే రూఢము గాని యితరవ్యవహారములయందలి పొందికను తెల్పు నని చెప్పుటకు వలనుపడదు. ఈ అమరకపదమునకు మాఱుగా నీయర్థమునందే పొందిక, కుదురు, అమరుబడి అనుపదములుగూడ వాడుకలో నున్నవి. ఈపదములును అమరకపదమువలెనే భూవిషయక మగురూఢ్యర్థమునే చెప్పుచున్నవి. ఈపదములయర్థమునందే లీజు, లెట్టింగు, రెంటింగు (Lease, letting, renting) అను నాంగ్లేయపదములును, ఇజారా, సగ్జాత్, ఖిరాయ్, పట్టాపదీ మొదలగు హిందూస్తానీపదములును వాడుకలో నున్నవి. కాని అమరకము కుదురు, అమరుబడిపదములవలె భూవిషయకమైన రూఢ్యర్థమునే యిచ్చుచుండక హిందూస్తానీ ఇంగ్లీషుపదములును గృహాదికములద్దె కిచ్చుట మొదలైన యర్థములయందుఁ గూడ వాడఁబడుచున్నవి. ఈ యర్థమునందు వినియోగింపఁబడుచున్న హిందూస్తానీపదములు గూడ నిట్టిరెండర్థముల నిచ్చుచున్నవే కాక భూవిషయమునం దుపయోగించినప్పుడు వచనాంతరభేదములనుగూడఁ దెల్పుచుండును. మఱియు, అమరకము మొదలయినపదములు భూవిషయమునందు రూఢములై సాధారణముగా వ్యవహరింపఁబడుచున్నను చెట్లు, తోఁటలు, దుకాణములు, సంతలు, గ్రామములు, అడవులు మొదలగు వానియందుఁ గూడ వాడఁబడుచున్నవి. కాఁబట్టి, ఈపదము అర్థవిచారణ చేసినప్పుడు యజమానునకును, ఫలపఱుచుగుత్తదారునకును జరుగు భూమ్యాదుల ఫలగ్రహణవిషయమగు నేర్పాటును దెల్పును.

కాఁబట్టి, అమరకమువిషయమున చర్చించునప్పుడు భూమ్యాదులకును, వానియందు హక్కుగల యజమానులకును గలసంబంధమును గురించియు, అట్టియజమానులకును, ఫలపఱుచుగుత్తదారులకును గల సంబంధమునుగురించియు, అట్టి ఫలపఱుచుగుత్తదారులకును, భూమ్యాదులకునుగల సంబంధమును గురించియు విమర్శింపవలసియున్నది. ప్రస్తుతము, అమరకమువిషయమును వ్రాయునప్పుడు ముందు భూమి విషయము చర్చింతము. భూస్వామి, భూస్వామివలన భూమిని అమరకము పొందువాఁడు, ఆభూమిని సేద్యము సేయువాఁడు అను ఈముగ్గురకును భూమితో సంబంధము గలదు. ఈముగ్గురకును భూమితోఁగల స్వామ్యము ముగ్గురయందుఁ గాని, యిరువురయందుఁగాని, యొక్కనియందుఁగాని యుండవచ్చును: అనఁగా భూమియందు హక్కుగల భూస్వామియే యితరుల కాభూమి నమరకము సేయక స్వయముగాఁ గాని, కూలివానిద్వారా సేద్యముచేయించికాని సేద్యము చేసి ఫల మనుభవింపవచ్చును. లేదా, భూస్వామికిఁ గొంత ప్రతిఫల మిచ్చుపద్ధతిమీఁద భూమిని, అమరకము పొందినవాఁడే తాను స్వయముగాఁగాని కూలిపనివాండ్రను నియమించికాని సేద్యము చేసి భూస్వామి కీయఁగా మిగిలినఫల మంతయు ననుభవింపవచ్చును. అట్లు కానియెడల నమరకము పొందినవాఁడు మరల కొంతలాభము తనకుఁ జెందుపద్ధతిమీఁద నింకొకని కమరకము సేయవచ్చును. ఇట్టిముగ్గురకును భూమివిషయమున జరుగునేర్పాటు అమరకము. ఈ అమరకము పరస్పరము నమ్మకముమీఁద మాటలమూలకముగాఁగాని, లిఖితరూపకముగాఁగాని జరుగుచుండును. లిఖితరూపకముగా జరిగినప్పుడు భూస్వామి తనభూమిని గుత్తదారున కిచ్చుపద్ధతు లన్నియు వ్రాయఁబడుపత్రమునకు కవులు, పదను, పట్టా అనియును, గుత్తదారు పైపద్ధతులకుఁ దన యంగీకారమును సూచించుచు వ్రాసి యిచ్చుపత్రమునకు కదపా, కబోలియత్, ముచ్చలిక యనియును పేరులు గలవు. ఈ పదములు హిందూస్తానీపదములు. ఈపదములరూఢ్యర్థము నిచ్చుసంస్కృతపదములు గాని, ఆంధ్రదేశ్యపదములు గాని లేవు. పత్రము అను సంస్కృతపదమును, కమ్మ యను తెలుఁగుపదమును, లిఖితసామాన్యమును దెలుపుపదములు గాని కవులు మొదలయినవానివలె విశేషవాచకములు కావు. అట్టి రూఢ్యర్థమును దెలుపు విశేషవాచకపదములు కావలసినప్పుడు దీనిని సమాసములో తత్తద్వాచకపదములతోఁ గూర్చి విశేషార్థములయం దుపయోగించుకొనవలయును. భూమియొక్క హక్కువిషయమును జర్చించుటకు ముందు, భూమి ఎవరిది, ఎటువంటిది, ఎట్లు చెందఁబడినది అనువిషయములు చర్చింపవలయును.

### భూస్వామ్యము

భూమియొక్కహక్కంతయు నాభూమిగల రాష్ట్రమును బరిపాలించురాజుదగునా కాదా అనువిషయము విమర్శనీయము. భూపతి యనుపదమువలన రాజునకుఁ దనరాష్ట్రమునందున్న భూమి కంతకును సంపూర్ణమైన హక్కు కల దని యూహింపఁదగుటలు లేదు. నరపతి యనుపద మున్నను, ఆపదమువలన రాజునకుఁ బ్రజలయందు

sampath Ebooks

సంపూర్ణ మైనహక్కు లేనివిధముననే భూపతి యనుపదమువలన రాజునకు భూమియందు సంపూర్ణ మైనహక్కు లే దని శాస్త్రజ్ఞుల యభిప్రాయము. రాజునకున్న నరపతిపదమువలన తనరాష్ట్రప్రజల యోగక్షేమములు కాపాడినందులకుఁ బ్రతిఫలముగా నితరవిధము లయినపన్నులు ప్రజలవలననుండి గ్రహించుట కధికారము వచ్చినట్లు గనే భూపతిపదమువలనఁ గర్షకుల యోగక్షేమములు కాపాడినందులకుఁ బ్రతిఫలముగా భూమియొక్క ఫలసాయములోఁ గొంతభాగము పుచ్చుకొనుటకుమాత్రమే హక్కు గలదు. కాని భూమియందు సర్వ స్వాతంత్ర్యములు గలహక్కు రాజున కున్నట్లు సిద్ధాంతము చేయుటకు వీలు లేదు. రాజునకు భూమియందుఁగాని, యితరవ్యవహారముల యందుఁ గాని పన్ను పుచ్చుకొనుటకుమాత్రము హక్కున్నట్లు కనిపించుచున్నది.

"శ్లో. పంచాశద్భాగ ఆదేయో రాజ్ఞా పశుహిరణ్యయోః,
ధాన్యానా మష్టమో భాగష్షష్ఠో ద్వాదశ ఏవ వా.
ఆదదీతాథ షడ్భాగం ద్రుమాంసమధుసర్పిషాం,
గంధౌషధిరసానాంచ పుష్పమూలఫలస్య చ.
పత్రశాకతృణానాం చ చర్మణాం వైదలస్య చ,
మృణ్మయానాం చ భాండానాం సర్వస్యాశ్మమయస్య చ."
—మనుస్మృతి.

అనఁగా రాజు ప్రజల యోగక్షేమములకొఱకు తాను పుచ్చుకొను శ్రమకుఁ బ్రతిఫలముగాఁ గ్రయవిక్రయాదులవలన వచ్చినలాభము వలననుండి పన్ను పుచ్చుకొనవలయు నని మనుస్మృతియందుఁ జెప్పంబడియున్నది. పశు హిరణ్యములవిషయమున నేఁబదియవవంతును, పండించిన ధాన్యాదికమునం దాఱవవంతు గాని, యెనిమిదవవంతు గాని, పండ్రెండవవంతు గాని పన్నును, చెట్లు, రాళ్లు, తేనె, నేయి, పరిమళద్రవ్యములు, ఓషధులు, రసములు — వీనిక్రయవిక్రయములవలన వచ్చినలాభములో నాఱవవంతు పన్నును, ఆకులు, గడ్డి, కూరలు, చర్మములు, దళములు,మట్టికుండలు, రాతివస్తువులు — వీని క్రయవిక్రయములవలన వచ్చినలాభములో నాఱవవంతుపన్నును రాజు గ్రహింపవలయు నని మనుస్మృతియందు నుడువఁబడియున్నది. మఱియు నితరవృత్తులవిషయమునందుఁగూడ రాజు గ్రహింపఁదగిన పన్నువిషయమున స్మృతికారులు వ్రాసియున్నారు. కాని, అవి ప్రస్తుతాంశమున కనవసరము లగుటచే నిందు విస్తరింపలేదు. భూమి విషయమున కర్షకుఁడు పండించినపంటలో నాఱవవంతు గాని, యెనిమిదవవంతు గాని, పండ్రెండవవంతు గాని రాజు పుచ్చుకొనవలె నని మనువు ( ౭ - ౧౩౦ ) చెప్పియున్నాఁడు.

మఱియు భూమి నెక్కడగా క్రయవిక్రయ మాచరించినట్లు గాని, కర్షకుని పాఱఁద్రోలి రాజు పుచ్చుకొనినట్లు గాని పూర్వగ్రంథములయందుఁ గాన్పింపదు. కాని భూస్వామికి తనభూమి కుదువ పెట్టుకొనుటకును, నితరులకు దాన మిచ్చుటకు నధికారము కలిగి యున్నట్లు నిదర్శనములు లేకపోలేదు. సేద్యము సేసికొనుటకుఁ గావలసినంతభూమి యున్నందువలనను, భూమి కావలయు నని యాసించువారు లేకపోవుటచేతను, భూమికి విరళముగ క్రయవిక్రయాదిక మాచరించుట కవకాశము లేకపోయియుండవచ్చును. రాజు స్వయముగాఁ గాని, నాలిగాండ్ర నేర్పఱచి కాని, స్వలాభముకొఱకు భూమిని సేద్యము చేయువాఁడు కాకపోవుటవలనను, సేద్యము చేయఁబడినభూమియొక్క ఫలములోఁ గొంతభాగమును గ్రహించుటకు మాత్రమే యంగీకరించియుండుటచేతను, సేద్యగాండ్రను దొలఁగించి భూమిని రాజు స్వీకరించుట కవకాశము కలిగియుండలే దని చెప్పినను జెప్పవచ్చును. దీనింబట్టి చూడఁగా సేద్యము గావింపఁబడు భూమియందు రాజునకు సర్వస్వతంత్రాధికారము లేనట్లు తోఁచుచున్నది.

పూర్వమీమాంస

రాజునకు తనరాజ్యమందలిభూమిమీఁదఁ గొంతహక్కు కల దనుటకు సందేహము లేదు. కాని ఆహక్కు ఎటువంటిది? 'రైతును భూమియందుండి తొలఁగించునట్టిహక్కు గలదా? లేక రైతునొద్ద నుండి శిస్తుమాత్రము వసూలుచేయుహక్కు కలదా?' యన్నవిషయమునుగూర్చి పూర్వమీమాంసలో జైమిన్యాచార్యులవారు విమర్శించియున్నారు. పూర్వమీమాంసయందు (అధ్యా. ౬, పాద. ౭, సూత్ర. ౩) 'భూమి ఒక్కరాజుసొత్తు కాదు, ప్రజ లందఱకును దానియందు హక్కు గలదు' అని చెప్పఁబడినది. మాధవాచార్యులవారు రాజు తనరాజ్యము నంతయు దానముగా నొసంగినను ప్రజలక్షేత్రములు, ఇండ్లు మొదలగునవి దానమునందు చేర వనియు, వానియందు రాజునకు స్వామ్యము లే దనియు విమర్శించియున్నారు.

ఇదేవిషయమునుగూర్చి వ్యవహారమయూఖకారుఁడైన నీలకంఠుఁ డిట్లు వ్రాసెను:—

"క్షత్రియులకు జయమువలన సొత్తు వచ్చు నని చెప్పఁబడినది. జయింపఁబడినరాజునకు నేయే గృహక్షేత్రద్రవ్యములయందు స్వత్వముండెనో యాయా గృహక్షేత్రద్రవ్యములయందు జయించినరాజునకు స్వత్వము గలుగును. జయింపఁబడినరాజునకు శిస్తు వసూలుచేయు నధికారముమాత్రమే భూములయందు నుండెనో వానియందు జయించినవానికి నాహక్కే కలుగును. స్వత్వము కలుగదు." కావుననే సార్వభౌముఁడు సంపూర్ణపృథ్వినీ, మాండలికుఁడు మండలమును నిచ్చుటకు వీలు లే దని పూర్వమీమాంసయొక్క షష్ఠాధ్యాయమునందుఁ జెప్పఁబడినది. భూమిమీఁది ఆయాగ్రామక్షేత్రములస్వత్వము, ఆయాభూములు దున్నువారిది. రాజునకు కరగ్రహణాధికారము మాత్రము గలదు. కావున నిట్టివలి పారిభాషికక్షేత్రదానాదులయందు భూదానము సిద్ధింపదు కేవలము వృత్తికల్పనముమాత్రము సిద్ధించును. భూమిని దున్నువారియొద్దనుండి కొన్న గృహక్షేత్రాదుల

sampath_Ebooks

యందు స్వత్వము తప్పక యుండెను. కావున నచ్చట భూదానఫలము కూడఁ గలుగును."1

ఇట్లు ప్రాచీనస్మృతికారులమతమున రాజునకు భూమియందు మేల్ వరం (పిస్తువసూలు చేసికొను) హక్కు మాత్ర మున్నట్లును, కుడివరం (సిరాయితీ) హక్కు లేనట్లును స్పష్టము.

భూమియొక్క హక్కెవరిది? ఈ హక్కెట్లేర్పడినది? ఏ విధముగా రాజువలన నంగీకరింపఁబడినది? అనువిషయము లిటఁ జర్చింపవలెను.

మనుష్యు లనాగరికులై యడవులయందు సంచరించుచు, పండ్లు, దుంపలు, ఆకులు, తాము వేటాడి చంపినమృగములు మొదలగువానివలన జీవించుచుఁ గాలము గడపినంతవఱకు భూమిని సేద్యము చేయుట తటస్థింపలేదు. తరువాతఁ బశువులను, మేఁకలను బెంచుకొని వానివలన జీవనము చేయుచు నొక ప్రదేశమునుండి యింకొక ప్రదేశమునకుఁ బోవుచుఁ గాలము గడపుచున్నయవస్థ యందుఁ గూడ నాఁడు నివాసస్థలము లేను వైనపుడల సేద్యము చేసి ధాన్యాదికమును బండించుకొని తమ కుటుంబపోషణము చేసికొనుచుఁ దమ కిష్టము వచ్చినప్పుడు మఱియొక ప్రదేశమునకుఁ బోయి యచ్చట సేద్యము చేసి ధాన్యాదులను పండించుకొనుచు నిలుకడ లేక తిరుగుచున్నయవస్థయందు మనుష్యునకు భూమియందు హక్కేర్పఱచుకొనుట యసంభవము. కనుక నట్టియవస్థయందు భూమియందు స్వామ్య ముండఁజాలదు. తరువాత నిలుకడ గలిగి మనుష్యకుటుంబములు కొన్నిగాఁ జేరికాని, ఒక్కొక్కటిగాఁగాని యొక్క ప్రదేశమునందు స్థిరపడియుండఁగలిగినప్పుడు నిలుకడగాఁ దాము నివసించినదాని సమీపమునందు సేద్య మేర్పఱచుకొన్నప్పుడు మనుష్యునకు భూమి యందు హక్కు గలుగుటయు, భూమి యాస్తి యగుటయు తటస్థించినది.

ఆయవస్థయందుఁ బ్రతికుటుంబమువారు నేఁటేఁట నొక్క ప్రదేశమే సేద్యము సేయుటయుఁ జిరకాలానుభవము గలిగియుండుటయు, దానింబట్టి స్వతంత్రాధికారము గలిగియుండుటయుఁ దటస్థించినది. ఆకాలమందు మనుష్యులకు సేద్యమే ముఖ్యజీవనాధారముగ నుండియుండుటంబట్టి వారికి భూమియం దత్యాదరణవృష్టియు, వాత్సల్యముఁ గలుగుట సంభవించినది. ఆర్యులు ప్రథమమున హిందూదేశమునకు వచ్చినప్పుడు సేద్యము చేయువారుగనే యుండిరి. ఋగ్వేదమందును, అథర్వవేదమందును భూమి నిసుకట్టుగల నాఁగలితో దున్ని విత్తులు చల్లి యవధాన్యమును బండించినట్లు చెప్పఁబడియున్నది. ఆకాలమునందుఁ జిన్న చిన్నపిల్లకాల్వలు త్రవ్వి భూమికి నీరెక్కించుకొనుసాధనము వారికిఁ దెలిసియున్నట్లే చెప్పఁబడియున్నది. మఱియు నా రెండువేదములయందును వ్యవసాయమునకు సంబంధించిన వస్తువు లుపమానములుగా వాడుచుండుటచే వారికి సేద్యమం దధికగౌరవము గలిగియున్నట్లు స్పష్ట మగుచున్నది. మఱియు నాసమయమం దన్ని జాతులవారును సేద్యము చేయుటయే గౌరవ మయిన వృత్తిగాఁ బరిగణించుచుండిరి. దక్షిణహిందూస్థానమం దార్యులు ప్రవేశించి తమ నాగరకతను ప్రచురపఱిచిరి. ఆర్యులు కృషివ్యాపారము ముఖ్యాధారముగా నున్నవా రని చెప్పుటకు సందేహము లేదు. మనుస్మృతియందు సేద్యము చేయఁబడినభూమివలనఁ గలిగినఫలములోఁ గొంతభాగము తీసికొనుటకు రాజున కధికారము గల దని చెప్పఁబడిన వాక్యములను, అంతకుఁ బూర్వము వ్యవహారాచరణ మందున్న దని మనువే చెప్పియున్నమాటలంబట్టి మనము గ్రహించి, తదాచారము నాదిసిద్ధ మనియు, పురాణాధారములంబట్టి యూహింపఁగాఁ బృథుచక్రవర్తి కాలమునుండి వచ్చిన దనియుఁ దలఁపవలయును. తరువాత గౌతముఁడు (గౌతమస్మృతి, ౧౦-౩౯), విజ్ఞానేశ్వరుఁడు (మితాక్షర, ౩-౧-౧౩), జీమూతవాహనుఁడు (౧-౧౩) మొదలగువారును, సరస్వతీవిలాసమందును (౪౬౬) కేవలసంగ్రహణమును ననుభవమునుమాత్రమే భూమియందును నీటియందును తృణాదులయందును వంటచెఱకు మొదలగునితరవస్తువులయందును మనుజున కధికారము కలుగుటకుఁ గారణము లని చెప్పిరి.

## మహమ్మదీయులకాలము

ఇఁక మహమ్మదీయులకాలములో మహమ్మదీయశాస్త్రపద్ధతి ననుసరించి భూమియందు మనుష్యున కెట్టియధికార మున్నదో చూడవలసియున్నది. నాతి ప్రవక్తయగు మహమ్మదు హిదాయా యనుగ్రంథమందు (౪-౪౫, ౧౨౯) బంజరుభూములను సేద్యము చేసినవాఁడు వానికి యజమానుఁ డగును అని చెప్పెను. కాని దీనిపై భాష్యము వ్రాసినయాతనిశిష్యుఁ డగు అబూహనీఫా అనువానిమతము ననుసరించి సేద్యగానికి భూమియందు సంపూర్ణాధికారము గలుగుటకు దేశాధికారిసమ్మతి యవసర మని తెలియును. కాని అతనిశిష్యు లగు అబూయూసిఫ్, ఇమాంమహమ్మదు అనువారిమతములంబట్టి సేద్యము చేయఁబడక యనాదిగ బంజరుగాఁ గాని అటవీప్రదేశముగాఁ గాని యున్నప్రదేశములందుఁ బ్రథమమున సేద్యము చేసినవానికి హక్కు భుక్తమును గల దని కనిపించుచున్నది (౪-౪౫, ౧౨౮). వీని నన్నింటినిబట్టి చూచించి మునుముందు భూమిని సేద్యము చేసి ఫలప్రదాయినిగా నొనర్చినవానికే భూమియందు న్యాయ్యమైన హక్కు గల దని నిశ్చయింపవలసియున్నది. కాబట్టి రాజునకు సేద్యము చేయఁబడిన భూమివిషయమున దానిఫలసాయములోఁ గొంతభాగముమాత్రమే పుచ్చుకొనుట కధికారము గల దని స్పష్ట మగుచున్నది.

## మన్వాదిస్మృతులు

మనుస్మృతియందు రాజున కాఱవభాగము గాని యెనిమిదవభాగముగాని పండ్రెండవభాగము గాని గ్రహించుట కధికారము గల దనియు (౭-౧౩౦), యుద్ధాదివిప్లవములు తటస్థించినపుడు నాలవభాగము పుచ్చుకొనవలయు ననియుఁ జెప్పఁబడియున్నది.

1. వ్యవహార మయూఖము, ఘార్ పురేహార్పు, బొంబాయి (౧౮౮౫), ౪౦-వ పుట.

sampath_Ebooks


(౧౦-౧౧౯). మఱియు యాజ్ఞవల్క్యుఁడు షష్ఠభాగమును (౧-౫-౩౩౪,౫,౭), ఆపస్తంబుఁడు షడ్భాగమును, గౌతముఁడు దశమభాగమును గాని, అష్టమభాగమును గాని, షష్ఠభాగమును గాని (౧౦-౫-౨౪), బోధాయన (౧-౧౦-౧౯-౧), నారద (౧౯-౫-౪౯), విష్ణువులు (౩-౫-౨౨) షష్ఠభాగమును పుచ్చుకొనుట కధికారము గల దని ధర్మశాస్త్రములయందు వ్రాసియుండిరి. మఱియు మనుస్మృతియం దీయేస్థితియం దిట్లు రాజునకు భాగగ్రహణమం దధికారము గలదో, ఎట్టియవసరములయం దింతకంటె నెక్కువగాఁ బుచ్చుకొనుట కధికారము గలదో, ఎట్టిసమయములయం దేభాగమును బుచ్చుకొనక యూరకుండవలయునో, ఎట్టియెట్టికాలములయందు శిక్షావిధిగా పన్ను వసూలు చేయుటకు రాజున కధికారము గలదో సవిస్తరముగాఁ జెప్పఁబడినది (అ. ౭, ౯, ౧౦). భూమి పన్ను విషయమున నింత సవిస్తరముగాఁ జెప్పఁబడినను హిందూ ధర్మశాస్త్రములయం దెక్కడను సేద్యగానివలననుండి భూమిని తీసికొనుటకుఁ గాని, యట్టిభూమిని మఱియొకని కిచ్చుటకుఁ గాని రాజున కధికార మున్నట్లు చెప్పఁబడియుండలేదు. కాని మహమ్మదీయరాజులపరిపాలనకాలమందు పన్నీయని భూస్వాములయొద్దనుండి భూమిని దీసికొని మఱియొకని కిచ్చుస్వాతంత్ర్యపద్ధతి యేర్పడినది. మహమ్మదీయులపరిపాలనకాలములో భూమిపైని పన్నెక్కువ సేయఁబడినకారణమున భూస్వాములు భూములను వదలిపెట్టుచుయు, నట్లు విడుదల చేయఁబడినభూములను దమపన్నొసఁగు మహమ్మదీయరాజులితరులకు సేద్యమునిమిత్త మిచ్చుటయుఁ బటస్థించుచువచ్చినది. కాని, హిందూధర్మశాస్త్రముంబట్టి పన్నొసఁగు రాజు భూమిని జప్తు చేసి యితరుల కమ్ముట గాని సిస్తువ కమ్ముట గాని వాడుకలో నున్న ట్లెక్కడను గానరాదు.

## ఇటీవలి ధర్మశాస్త్రటీకాకారులు

పయిని వ్రాసినవిషయముంబట్టి హిందూధర్మశాస్త్రములయందుచ్చటను రాజునకు భూమియందు సంపూర్ణస్వాతంత్ర్యాధికారమెన్నఁడును గలిగియుండలే దనియు, నట్టియధికారమేరాజును చెలాయించియుండలే దనియు స్పష్టమగుచున్నది. పైని తెల్పిన జైమినిమతము ననుసరించియు రాజునకు భూమియందు సర్వాధికారము లేనట్లే కన్పించుచున్నది. కాని జగన్నాథతర్కపంచాననుఁడుమాత్రము భిన్నాభిప్రాయము నిచ్చియున్నాఁడు. ౧౭౭౩-వ సంవత్సరమునందు సర్ విలియమ్ జోన్సు అనునాతఁ డతని నడుగఁగా రాజునకు సర్వస్వతంత్రాధికారము భూమియందుఁ గల దని యభిప్రాయ మొసఁగెను. ఇందులకు జగన్నాథతర్కపంచాననపండితుఁడు, పరశురాముఁడు క్షత్రియనిర్మూలనముం జేసి భూమి యంతయుఁ గశ్యపునకు ధారవోసినట్లును, అందువలనఁ గశ్యపుఁడు సర్వస్వతంత్రాధికారము గలిగి భూమి ననుభవించినట్లును, నాయధికారమంతయుఁ దరువాత రాజులకు సంక్రమించినట్లును, నందువలన రాజులే భూమియందు సర్వస్వతంత్రాధికారము గలవా రయినట్లును నరసింహపురాణమునుండి యొకయుక్తిని పన్నెను. కాని శ్రీకృష్ణతర్కాలంకారుఁ డింగులకు సమ్మతింపక భూమి జంతువులయాధారముకొఱకు సృజింపఁబడిన దగుటవలన భూమియం దున్నిజంతువులకును స్వాతంత్ర్యము గల దనియుఁ, బ్రజలను సంరక్షించినకారణముంబట్టి రాజునకుఁ గొంతపన్ను పుచ్చుకొనుటకుమాత్రమే అధికారము గల దనియు, నీయంశము భాగవతపురాణమునందును, మనుస్మృతియందును జెప్పఁబడియున్న దనియుఁ జెప్పి జగన్నాథపండితుని సిద్ధాంతమును ఖండించెను. వీని నన్నింటినింబట్టి చూడఁగా హిందూ సిద్ధాంతముంబట్టి రాజునకు సేద్యములో నున్నభూమియందు సర్వస్వతంత్రాధికారము లే దనియు, హిందూరాజు లెన్నఁడు నట్టియధికారమును చెలాయించుకొనలే దనియుఁ గనిపించుచున్నది.

## మహమ్మదీయుల సిద్ధాంతము

మహమ్మదీయశాస్త్రము ననుసరించి యీవిషయమునఁ గొంత వఱకు భిన్నాభిప్రాయము లున్నట్లు పైనే వ్రాయఁబడినదిగదా.

హిందూదేశముపైకి మహమ్మదీయులు కొంతపర్యాయములు దాడి వచ్చినట్లును, ఉత్తరహిందూస్థానము నాక్రమించుకొన్న విధమునఁ గాకపోయినను, దక్షిణహిందూస్థానమునుగూడ జయించి స్వాధీనపఱచుకొన్నట్లును చరిత్రలు తెలుపుచున్నవి. క్రీ.శ. ౧౩౦౦ సంవత్సరములో అల్లాఉద్దీను దక్షిణహిందూదేశమును సంపూర్ణముగా జయించెను. క్రీ. శ. ౧౩౪౭-వ సంవత్సరములో కృష్ణానదికుత్తరమున గల దేశము మహమ్మదీయులయధికారమునకు లోఁబడెను. రాజునకు భూమియం దధికార మున్న దనుసిద్ధాంతము మహమ్మదీయులది గాని హిందువులది గాదు. బలవంతముగా జయింపఁబడినదేశమును ఇమామ్ సెలవుమీఁదఁ బంచిపెట్టుటకుఁ గాని, అంతకుఁబూర్వ మున్న భూస్వాముల యనుభవమునందే యుండనిచ్చుటకుఁ గాని రాజునకు స్వాతంత్ర్యముగల దని మహమ్మదీయులయభిప్రాయము. జిజియత్తు అను తల పన్నును గాని, ఖిరాజ్ అను భూమిపన్నును గాని విధించి పూర్వపు భూస్వాములనే భూమి ననుభవింపనిచ్చుచుండిరి. ఉషర్ అనుపన్ను మాత్రము మహమ్మదీయులవలననే వసూలు చేయుచుండిరి. హిందూ దేశమున, అబూహనీఫాసిద్ధాంత మిదియే. ఈసిద్ధాంతమునే మన దేశమునందు మహమ్మదీయు లనుసరించిరి. ఇతరమహమ్మదీయశాస్త్రసిద్ధాంతముంబట్టి జయింపఁబడినదేశమునందలి సేద్యమం దున్నభూములన్నియు నాయాభూస్వాములయనుభవములో నుండనిచ్చినను వానియందలిసంపూర్ణాధికారముమాత్రము రాజుదే యని కనిపించుచున్నది; లేక ఖుగత్ అనుభూమిపన్ను అతిసులభమైనది గనుక మతాభిమానముంబట్టి యిది మహమ్మదీయులకుమాత్రమే విధించిరి. ఖిరాజ్ అనుపన్ను బలువైనది. ఇది మహమ్మదీయేతరులకు విధించిరి. మహమ్మదీయులకుఁగూడఁ గొన్నిపట్ల ఖిరాజ్ అనుపన్ను విధించుట సంభవించినది. ఈఖిరాజ్ అనుపన్ను సేద్యము చేయఁబడినభూమి నంత

sampath_Ebooks

టను వసూలు చేయవలయు నని అల్లాఉద్దీను మొదలైన మహమ్మదీయ ప్రభువు లనేకపర్యాయములు ప్రయత్నించిరి. కాని అంతకుఁ బూర్వము హిందూరాజులకాలములో నాటుకొని యున్న విధముగా భూమియొక్క ఫలసాయములోఁ గొంతభాగముమాత్రమే వసూలు చేయఁగలుగుచుండిరి. తరువాత షేర్షా సలీమ్‌ఖాన్ అనువారు ఫలసాయములో భాగమునకు మాఱుగా రొక్కము పుచ్చుకొను పద్ధతి నెలకొలిపిరి.

పిమ్మట, అక్బరుపాదుషా కాలములో సేద్యము చేయఁబడు భూమియొక్క విస్తీర్ణమును, ఫలమును నిర్ణయించి న్యాయ్యమైన ఖరారీ పన్ను వసూలు చేయుపద్ధతి యేర్పడెను. ఇట్లు మహమ్మదీయ ప్రభువులు ఖరారీ పన్ను వసూలు చేయుచున్నను, దీని నిచ్చుచున్నంతవఱకు భూమిని లాగికొనుటకుఁగాని, అట్టిభూమిని మఱియొకరి కిచ్చుటకుఁగాని అధికారము కలిగి దానిని చెలాయించినట్లు కనుపడదు. అట్టిభూమి యితరుల కిచ్చినప్పుడు తమకు వచ్చుచున్న పన్నులు వసూలు చేసికొనుటకుమాత్రమే అధికారము పొందినట్లును, భూమియందు సర్వస్వతంత్రాధికారము పొందినట్లును కన్పించుచున్నది. ఈవిషయముంబట్టి చూడఁగా భూమిపైని స్వతంత్రాధికారవిషయమున హిందూమహమ్మదీయమతములకు భేదము నంతగాఁ గానిపించదు. కాని హిందూరాజులకాలమందువలెఁ గాక తురక రాజులప్రభుత్వమందు భూమిపన్ను మిక్కిలిగా హెచ్చింపఁబడుట చేత భూస్వాములు భరింపఁజాలకుండిరి. లుండీ, సఫాన్ అనుపరగణాలు ఔరంగజీబును, అక్బరాబాద్, ఇలహాబాద్ అనుకోటలు కట్టుటకొఱకుఁ గొన్ని భూములు అక్బరుపాదుషాయును, షాజహానాబాద్‌కోట కట్టుటకుఁ గొన్ని భూములను షాజహానును, ఔరంగాబాద్ అనుకోటను గొన్ని మసీదులను గట్టుటకుఁ గావలసినభూములను ఆలంగీర్ పాదుషాయును భూస్వాములయొద్దనుండి కొనుట చూడఁగా మహమ్మదీయులకాలమందుఁగూడ రాజులకు భూమియందు సర్వస్వతంత్రాధికారము లేనట్లు గ్రహింపవలసియున్నది.

## బ్రిటిషు అధికారులయభిప్రాయము

మహమ్మదీయులు హిందూదేశమును జయించినప్పటికిని అంతకుము న్నున్నపద్ధతులను, వ్యవహారాచారములను సంపూర్ణముగా మార్చివైచి క్రొత్తక్రొత్తవ్యవహారపద్ధతుల నేర్పఱుపలేదు. తరువాత నాంగ్లేయప్రభుత్వ మారంభ మైనపుడు మొదట నాంగ్లేయదేశవ్యవహారపద్ధతి ననుసరించి భూమియందలి సర్వస్వతంత్రాధికారము రాజులదే యని యుద్దేశించిరి. మహమ్మదీయప్రభువులకాలమందు భూమిపన్ను ఎక్కువ చేయఁబడుటవలన సేద్యము చేయుటయందు లాభము లేక కొందఱును, పేదపడి కొందఱును భూములను వదలుచుండుట తటస్థించినది. అట్టిభూములపై సిస్తు రాకపోవుటవలన సర్కారునకు నష్టము వచ్చు నని వాని నితరులకు నమర్చుట సంభవించుచువచ్చినది.

మఱియు జనసంఖ్య హెచ్చుటచేతను, సేద్యము చేయుటకుఁ గ్రొత్తభూములు కావలసివచ్చుటచేతను, ఎన్నఁడును కృషి లేక బంజరుగా నున్నభూములను పన్ను గట్టి కొందఱ కిచ్చుచుండుట సంభవించుచువచ్చినది. ఈ సందర్భమునుబట్టి ఆంగ్లేయులు మహమ్మదీయప్రభువులకు సర్వస్వతంత్రత భూమిపైని గల దనియు, వారు హిందూరాజులవ్యవహారపద్ధతులను సంపూర్ణముగా మార్చియుండక పోవుటవలన వారికిఁగూడ నట్టిస్వాతంత్ర్యమే యుండిన దనియు నభిప్రాయపడి యుండవచ్చును.

ఇంగ్లండునందలి పూర్వపుఁబద్ధతిప్రకారము రాజే భూమి యంతకును ప్రభువు. కావున హిందూదేశమునందు నట్టిపద్ధతియే యున్న దనుకొని భ్రమపడి క్రీ. శ. ౧౭౯౬-వ సంవత్సరమునందు మద్రాసుప్రభుత్వమువా రట్టియభిప్రాయమును దల్పిరి.[1] కాని రెవిన్యూ బోర్డువారు వెంటనే యీయభిప్రాయము సరియైనది కాదని తెలిపిరి.[2] హైందవు లయిన రైతులహక్కులనుగుఱించి మిక్కిలి వ్యతిరేకాభిప్రాయముగల సర్ థామస్ మన్రోవంటివాఁడు గూడ 'హిందూదేశమున భూమిఖామందు పన్ను దీరు చునిన్నైనను శెల్లునెడ నది రైతునకే చెల్లును. అతఁడు భూమియందలి హక్కు లన్నియు దొరతనమువారితో సమానముగఁ బంచుకొనును. దొరతనమువారికి లేనిహక్కు లాతనికి భూమియందుఁ గల్గును. ఇష్టము వచ్చినప్పుడు గాని, కొన్నిసంవత్సరములకుఁ గాని వానిని వెడలఁగొట్టుటకు వీలు లేదు. ఇంకొకఁ డెక్కువసిస్తు ఇచ్చెద నన్న నాతనిని వెడలఁ గొట్టుటకు వీలు లేదు' అని చెప్పియున్నాఁడు. ఇందును గుఱించి జేమ్సు స్టూఅర్టు మిల్ ఈ విధముగ వ్రాసియున్నాఁడు:— 'రైతునకు భూమియందు స్వత్వ మున్న దనుటకు సందేహము లేదు. కాని యాస్వత్వ ముపాధిసహితము (with a limitation). దొరతనము వారికి భూమియందు స్వత్వ మున్న దనుటకు సందేహము లేదు. కాని, యదియు నుపాధిసహితమే. రైతుస్వత్వమునకు దొరతనము వారి స్వత్వము ఉపాధి, దొరతనమువారిస్వత్వమునకు రైతు స్వత్వము ఉపాధి'[3].

భూమియొక్క స్వామ్య మెవరిది యన్నవిషయమునుగుఱించి భేదాభిప్రాయము లన్నియు నాలోచించి మద్రాసుగవర్న మెంటువారీక్రిందితీర్మానమును జేసిరి.

1. Mirasi papers, 26.
2. Mirasi papers, 33.
3. As quoted in Srinivasaraghava Iyengar's Forty year'sProgress of the Madras Presidency,. p, 57.

sampath_Ebooks

"(౧) అనాదికాలమునుండియు వచ్చుచున్న యాచారమునకు వ్యతిరేకముగ, దొరతనమువారికి బంజరు (Unoccupied) భూముల లోని లోహములపైని బూర్ణాధికార మున్న దని చెప్పుటకు వీలు లేదు. కాని భూమిలోఁ బండిన ధాన్యాదులలోనుండి పాలు తీసికొనుటకు దొరతనమువారి కెట్టిహక్కు కలదో యట్టి హక్కే యిందును గలదు. (౨) భూమియందు రైతునకు నిరు పాధిక మైనట్టిదియు (absolute), పూర్ణ మైనట్టిదియు (Complete) నగు స్వత్వము (Proprietary right) గలదు. ప్రభుత్వ వ్యయములకై పంటలోఁ గొంతభాగ మాతఁడు ప్రభుత్వమువారి కీయవలయు నన్నమరకునకుమాత్ర మీహక్కు లోఁబడియుండును. (౩) రైతునకు తనభూమి తాకట్టు పెట్టుకొనుటకును, అమ్ముకొనుట కును, మరణశాసనముద్వారా ఎవరికైన నిచ్చివేయుటకును నధి కారము కలదు. (౪) ఈసిద్ధాంతముల ననుసరించి భూమి, అనాది కాలమునుండియు నొకనియొద్దనుండి మఱియొకనికిఁ జెందుచున్నది. కావున శాస్త్రప్రకారము గాని, ఆచారప్రకారము గాని ఎన్నఁ డును దొరతనమువారికి లేనట్టిదియు, దొరతనమువా రెన్నఁడును గోరనట్టిదియు నగునీహక్కు (భూమియందుఁ దమకు స్వత్వము గల దన్నస్తోత్రిహక్కు) గల దని దొరతనమువారు నేఁ డెందు కేని (ఆ ప్రదేశమునందుఁ బ్రజలలో దొరతనమువారియెడ) అపనమ్మి కయు, అసంతృప్తియుఁ గలుగును. వీనిని తొలఁగించుట కెంతయో దీర్ఘకాలము పట్టును. (౫) క్రొత్తగా భూమి రైతునకు నమరకము సేయునప్పుడు, ఆభూమిలోని లోహము లన్నిటిపైని దొరతనమువారికి సర్వస్వాతంత్ర్యము గల దన్నమరకు రైతు ఒప్పుకొనవలయు నని చెప్పుట దొరతనమువారిహక్కుల ననావశ్యకముగ సాగఁదీయుటయే. విశేషసమయములయందుఁ బ్రజలలాభమున కావశ్యక మేని యిట్టిషరతు పెట్టినఁ బెట్టవచ్చును. (౬) ఇదివఱకు రైతునధీన మైన భూమిని గుఱించియు, ఇఁకముందు వ్యవసాయమునిమిత్తము రైతునధీనము కాఁబోవుభూమినిగుఱించియు నిట్టిషరతు పెట్టుటవలన నేమియుఁ బ్రయోజన ముండదు. జనులమనస్సులో నపనమ్మక పుట్టించి దానిని నెక్కువగ వ్యాపింపఁజేయుటకుమాత్ర ముపయోగపడఁగలదు."[1]

## మధ్యవర్తులు

ఇట్లు భూమియందు స్వత్వము గలవాఁడు రైతు; అనఁగా వ్యవసాయము చేసి పండించువాఁడు. అందులో కొంతపాలు సిస్తుగఁ దీసికొనుహక్కు కలవాఁడు రాజు. కొందఱయభిప్రాయముప్రకా రము భూవిషయమున రాజును, రైతును భాగస్థులు. రాజు నిద్రపోవు (Sleeping) భాగస్థుఁడు, లాభములోఁ దక్కువపాలును దీసికొను వాఁడు. రైతు వ్యవహారమును జేయుభాగస్థుఁడు. లాభములో నెక్కుడుభాగమును దీసికొనువాఁడు. కావున భూమినిగుఱించి రాజు నకు రైతునకుమాత్రము హక్కుండును. మూఁడవవాని కెవ్వనికిని హక్కుండనేరదు. కాని రైతేప్రకారము తనహక్కు నితరుల కిచ్చివేయవచ్చునో యట్లే రాజుగూడఁ దనహక్కు నితరుల కీయ వచ్చును. రాజుహక్కు అనఁగా సిస్తు వసూలు చేసికొనుహక్కు. రైతునొద్దనుండి తాను స్వయముగ రాజు సిస్తు వసూలు చేయక, మధ్యవర్తి నొకని నేర్పాటు చేసి వాఁడు రైతులయొద్దనుండి సిస్తు వసూలు చేసికొనునట్లును, అందుఁ గొంత ప్రతిఫలముక్రింద వాఁడు తీసికొనునట్లును, కొంత రాజున కిచ్చునట్లును ఏర్పాటు చేయవచ్చును. ఈ యేర్పాటు లనేకవిధములుగ నుండవచ్చును. వానినిఁగూర్చి యింతకు ముందు చెప్పఁబడెను. ఇప్పుడు చూడవలసిన దేమనఁగా, 'ఈమధ్య వర్తికి భూమియం దెట్టిహక్కు గలదు? అతనికి భూమియందు స్వత్వము గలదా?' యన్నయంశము. రాజునకే లేనిహక్కు వీని కెట్లు వచ్చును? రాఁజాలదు. కావున నితఁడుఁగూడ సిస్తు వసూలు చేసికొనుహక్కు కలిగియుండునే కాని భూమియందు స్వత్వము గలిగి యుండఁడు. కాని, యీసంగతిని పాటింపక పెక్కురు జమీన్ దారులు తమకు భూమియందు స్వత్వ మున్న దనియు, తమరైతులను తమయిష్టము వచ్చినప్పుడు భూమియందుండి తొలగించుటకుఁ దమ కధికార మున్న దనియుఁ జెప్పఁదొడఁగిరి. దొరతనమువారును దమకు భూమియందు స్వత్వ మున్న దని భ్రమపడి, భూమియొక్క స్వత్వము జమీన్ దారుల కిచ్చితి మని ౧౮౦౨-వ సంవత్సరపు ౨౫-వ రెగ్యులేష నులోఁ జెప్పిరి. కాని, నాఁడు తమపొరపాటును గొంతకాలమునకుఁ గనుఁగొని ౧౮౨౨-లో ౪-వ నంబరు రెగ్యులేషన్ అమలులోనికిఁ దెచ్చిరి. రైతులకు భూమియందు సంబంధముఁ బూర్వ మున్నహక్కు లకు భంగము గలిగించుట ౧౮౦౨-వ సంవత్సరపు ౨౫-వ రెగ్యు లేషన్ యొక్క యుద్దేశము గా దని యిందుఁ జెప్పఁబడినది. ఇట్లు దొరతనమువారు చెప్పినను, జమీన్ దారులుమాత్రము తా మయినంత వఱకు రైతునకు భూమియందు స్వత్వము, అనఁగా కౌలుదారీహక్కు లే దని యనుచుండియు, రైతులు జమీన్ దారులు పోరాడి కోర్టుల కెక్కుచుండియు, కొన్నితీర్పు లిటు, కొన్నితీర్పు లటు నగుచుండియు, ౧౮౬౫-వ సంవత్సరమున 'రెంటురికవరీ యాక్టు' (౮-వ చట్టము) నిర్మింపఁబడినావఱకును జరుగుచునేయుండెను. ఈచట్టము వచ్చినప్పటి నుండియు జమీన్ దారీరైతుల కందఱకును కౌలుదారీహక్కు గల దన్నసిద్ధాంతము స్థిరపడిపోయినది. కాని అగ్రహారములలోనిరైతుల హక్కులనుగుఱించియు, ఈనాములలోనిరైతుల హక్కులనుగుఱించియు ఈచట్టము స్పష్టముగ నేమియుఁ జెప్పనందున, ఈనాముదారులకు వారిరైతులకు నింకను పెక్కువ్యవహారములు జరుగుచునేయున్నవి. రైతువారీఅమరకపుభూములపట్టాలు గలవారు పెక్కుమంది ఎక్కువ భూము లుండుటవలనను, స్వయముగ వ్యవసాయము చేయుటకు నోపికయు, వీలును లేనందునను, తమభూము లెల్లప్పుడును రైతులకే అమరకము చేయుచుందురు. ఇట్టిరైతుల కాభూమియం దెట్టిహక్కు గల దన్నవిషయ మింకను విచారణీయము. సామాన్యముగ పట్టాదారు

1. G. O. No. 1008, dated 21 st, September, 1882.

sampath_Ebooks



క్రిందిరైతునకు భూమిలో నట్టిహక్కును లేదనెడిసిద్ధాంతమే యిప్పటికిని సర్వత్ర అంగీకరింపఁబడుచున్నది.

రాజు భూస్వామితోఁ గాని, భూస్వామి సేద్యగానితోఁ గాని భూమిపన్ను విషయమునఁగాని, ఫలసాయములోని భాగము విషయమునఁ గాని, అట్టిభాగమునకు సరియైన ఖరీదుగల ద్రొక్కము విషయమునఁ గాని జరుపుకొనుచేర్పాటే అమరకము. భూమిపన్ను వసూలుచేయు విషయములో ననేకవిధము లగు నేర్పాటు లున్నవి. భూమికిని భూస్వామికిని గాని, భూమికిని సేద్యగానికిని గాని కలసంబంధము లనేకవిధము లైనవి. ఇట్టిసంబంధభేదములంబట్టి క్షేత్రానుభవములు (Tenures) కూడ ననేకవిధము లైనవి. ఇందు, పన్నిచ్చుచు ననుభవించునవి కొన్నియు, పన్నియనక్కఱ లేకుండ ననుభవించునవి మఱికొన్నియు నున్నవి.

## గ్రామము, గ్రామస్థులు, వారిక్షేత్రములు

నిలుకడ కలిగి యొకప్రదేశము నాక్రమించి యందు గృహములు గట్టుకొని మనుష్యులు కాఁపురము చేయుచుండుటకు పట్టునకు 'గ్రామము' అని పేరు. ఇట్లు గ్రామమందు నివసించు గ్రామస్థులకును నా గ్రామమున కంటుపాటుగా నుండుభూమికిని గల సంబంధమును గ్రామస్థులం దొండొరులకుఁ గలసంబంధమును, గ్రామస్థులకుఁ దాము సేద్యము సేయుభూమియందుఁగల హక్కును మనము విమర్శించి నిశ్చయింపవలసియున్నది. రెవిన్యూవ్యవహారమునకు గ్రామము ముఖ్య మైనది కావున గ్రామముయొక్క విధములును, వని యేర్పడినయేర్పాటులును జక్కఁగాఁ దెలిసికొనుట యావశ్యకము. భూమిని బాగుపఱచి సేద్యమున కర్హముగాఁ జేయుటకును, వన్యమృగముల వలనిబాధలను దప్పించుకొనుటకును, అన్యోన్యసాహాయ్యము చేసికొనుట కొక్క గ్రామములోనివా రందఱును గలసి తమక్షేమలాభముల కై పాటుపడుట యత్యావశ్యకముగా నేర్పడినది. అందువలన గ్రామస్థు లందఱకు నొకవిధమగు స్నేహబంధమును స్థానాభిమానమును గలుగుట తటస్థించినది. హిందూదేశమందలి గ్రామముల స్వభావములను బరిశీలించినయెడల రెండువిధములుగా గ్రామములు విభజింపఁబడఁదగియున్నవి.

ఇందు, గ్రామములలోఁ గృషి చేయఁబడుక్షేత్రములు వేఱుగా గ్రామస్థులలో నొక్కొక్కనిహక్కుగా నెంచఁబడుచుండునవి యొకవిధమైనవి. ఇట్టిగ్రామములు రైతువారీగ్రామములని చెప్పఁబడును. ఇట్టిగ్రామములలోని గ్రామస్థులు ప్రత్యేకక్షేత్రములు (వేఱువేఱుపొలములు) కృషి చేసికొని యొకరితో నొకరు సంబంధము లేనట్లున్నను దమక్షేమలాభములకొఱకుఁ దమలో బలవంతుఁ డగునొక్కని గ్రామాధికారిగా నెన్నుకొని యతనికి లోఁబడి గ్రామస్థులపనులు నెఱవేర్చుటకుఁ గొందఱను గ్రామసేవకుల నేర్పఱుచుకొని సుఖముగా నుందురు. ఈ గ్రామాధికారిని పటేలు, లంబార్దారు, రెడ్డి, పెత్తనదారు మొదలగుపేర్లతోఁ బిలుతురు. ఇట్టిరైతువారీగ్రామములు మదరాసు, బొంబాయి, బీరారు రాష్ట్రములయందును, మధ్యపరగణాలయందును విస్తారముగా నున్నవి. మధ్యపరగణాలలోని గ్రామములస్వభావము తర్వాత మార్పఁబడినను బ్రథమమున నిట్టిదియే యని నిశ్చయింపవలెను. బంగాళరాజధానిలోని గ్రామములుకూడ నిట్టివియే యైనను అనేకగ్రామములను గలిపి పరగణాలుగను, జమీన్దారీయెస్టేట్లుగను నేర్పఱిచి జమీన్దారీసెటిల్మెంటు చేసియున్నహేతువున నారాజధానియందలి గ్రామములస్వభావ మంత విచారణీయముగాఁ గనిపింపలేదు. ఇఁక రెండవతరగతిగ్రామములస్వభావము విచారింతము. ఒకఁడు గాని, యొకకుటుంబమువారు పలువురు గాని, పరస్పరసంబంధబాంధవ్యము గల యొక్కతెగవారు గాని యొక్కచో గ్రామమును నిర్మించుకొని యా గ్రామమునకు సంబంధించినభూమి యంతయు స్వాధీనభుక్తమైనదిగాఁ జేసికొని తరువాతను కుటుంబము వృద్ధియై జనసంఖ్య హెచ్చినప్పుడు పైభూమి యంతయు పిత్రార్జితమువలె భాగములుగాఁ బంచుకొని యనుభవించుచుండునవి రెండవతరగతిగ్రామములు. ఇట్టిగ్రామములలో గ్రామస్థు లందఱు నించుమించుగా సమానమైనహక్కు గలవారు. కనుక గ్రామాధికారి నొకనిని నియమించుకొని యతనికి లోఁబడియుండక వా రందఱును గలసి యొకపంచాయితీ నేర్పఱుచుకొని గ్రామవ్యవహారములు చక్కఁబెట్టుకొనుచుందురు. ఈ రెండవతరగతిగ్రామములు, 'ల్యాండులార్డువిలేజీలు' అని పిలువఁబడును. రైతువారీగ్రామములలో సేద్యములో నున్నభూమి యంతయు నన్యోన్యసంబంధము లేని వేఱువేఱుక్షేత్రములుగా వేఱువేఱుగ్రామస్థులభుక్తములో నుండును. ల్యాండులార్డువిలేజీలో సేద్యములో నున్నభూమి యంతయు గ్రామస్థులు తమతరతరములం బట్టి భాగములు గలిగి యనుభవించుచుందురు గాని యాభూమి యంతయు సంఘాధికారము గలదిగా నుండును. ఒకప్పుడు రైతువారీస్వభావముగల గ్రామము ల్యాండులార్డుగ్రామముగా మాఱుట కూడఁ గలదు. అది మరల రైతువారీగ్రామముగా నుండుట తటస్థించును.

ఇట్టిమార్పులు దక్షిణహిందూస్థానమునందలి గ్రామములలోఁ గలిగినవి. మదరాసురాజధానిలో చెంగల్పట్టు మొదలైన జిల్లాలలో నున్నగ్రామము లొకప్పుడు ల్యాండులార్డుగ్రామములస్థితియం దుండి మిరాశీగ్రామము లని పిలువంబడుచుఁ దరువాత రైతువారీగ్రామములై పోయినవి. ల్యాండులార్డుగ్రామములు పైని చెప్పినప్రకారమునవే కాక యితరవిధములుగాఁగూడ నగుచున్నవి. ఇట్టిగ్రామములు పట్టీదారీగ్రామము లనియు, భాయిచారాగ్రామము లనియు రెండువిధములు. ఈరెండువిధములలో లక్షణములు సంపూర్ణముగాఁ బట్టనివి కూడఁ గలవు. ల్యాండులార్డుగ్రామములమీఁదిభూమిపన్ను న గ్రామస్థుల కున్నభాగములవరుం బడినిబట్టి గ్రామము సిస్తంతయు వసూలు చేయఁబడుచుండెడుగ్రామములు నాలుగువిధములు.

sampath_Ebooks



౧. ఒకఁడే అధికారిగాఁ గలవి. వీనిని 'జమీన్‌దారీఖాలీస్' అందురు.

౨. అవిభక్తములైన కొంపెంలభుక్తములో నున్నవి. వీనిని 'జమీన్‌దార్ ముస్తార్కా' అందురు.

3. కూటస్థానుసార భాగములు ( Divided on ancestral shares ) గలవి లేక పట్టీదారీ గ్రామములు.

౪. సంపూర్ణలక్షణము లేని పట్టీదారీ గ్రామములు.

గ్రామస్థులు తాము కేవలము భుక్తపఱుచుకొనుచున్న క్షేత్రము మొత్తభూమిలో నెన్నవవంతో మొత్తగ్రామముసిస్తులో నన్నవవంతే సిస్తు నిచ్చుగ్రామములు. రెంపవతరగతిల్యాండులార్డు విలేకీగ్రామములు. ఇవి రెండువిధములు:

౧. భాయిచారా.

౨. అసంపూర్ణ భాయిచారా.

మహారాష్ట్రరాజధాని కాక హిందూదేశమున నితరప్రదేశముల యందు గ్రామస్థులలో కొన్నిభేదము లున్నట్లు కన్పడుచున్నది. అందు

(౧) 'ఖుద్‌ఖాస్త్'[1] అనువారు:— ఈరైతులు ప్రప్రథమమున గ్రామమును నిర్మించినవారి సంతతిలోనివారు. వీ రితర గ్రామస్థులకంటె నెక్కుడు స్వాతంత్ర్యము కలిగి యాస్వతంత్రతను అనుశ్రుతమగు నాచారమువలన ననుభవింపఁగలిగినవారు. వీరు భూమిపన్నిచ్చువంతవఱకు భూమియందుండి తొలఁగింపఁబడుటకు వీ లగువారు కారు. వీరికి తమభూముల నితరుల కిచ్చుటకుఁగాని యమ్ముటకుఁగాని యధికారము లేదని సర్ జాన్ షోర్ (Sir john shore), హారింగ్టన్ (Harrington) అనువారి యభిప్రాయము.

(౨) 'పైఖాస్తు' అనువారు:— వీ రితరగ్రామములనుండి వచ్చి గ్రామమునఁ గాఁపురమున్నవారు. వీరికి పై (ఖుద్‌ఖాస్తు) రైతుల కున్నస్వతంత్రత లన్నియు లేవు. వీరికి ఖుద్‌ఖాస్తురయితుల కున్న హక్కు లన్నియు లేకపోయినను శాశ్వతముగా వంశపారంపర్య మగు హక్కుమాత్రము లేకపోలేదు. కాని గ్రామమునందు మొదటితెగవారి కుండుగౌరవముమాత్రము లేదు.

(3) పాయికారీ అనువారు:— వీరు ప్రథమతరగతి రయితులభూములను సేద్యముచేసిపెట్టుటకు నితరగ్రామములనుండి వచ్చినవారు. వీరిని భూములనుండి యిచ్చవచ్చినట్లు తొలఁగింపవచ్చును. వీరికి భూములయందేవిధ మగు హక్కుగాని, గౌరవము గాని లేదు. వీరు మొదటితరగతిరైతులకు సిస్తు చెల్లించుటలో 'పాయికార' రైతులు. ఆంధ్రదేశపుగ్రామములయందు భూములు 'వారపట్టు', 'తీరువాపట్టు', 'తరిసు', 'పొరంబోకు' అని నాలుగువిధములుగా విభజింపఁబడినట్లు కన్పించుచున్నది. వారపట్టు అనఁగా ఫలసాయములో భాగ మిచ్చి సేద్యము చేయునది. ఈవిధమైనవి సాధారణముగా పల్లపుసాగుబడికి అర్హమైనభూములు. తీరువాపట్టు అనఁగా ద్రవ్యరూపకముగాఁ బన్నీయఁబడినది. సేద్య మయిన బంజరుభూములు తోఁటలు నిట్టివి. 'తరిసు' అనఁగా గయాళుభూములు. ఇవి రెండువిధములు. షేకల్ కరంబో, అనఁగా సేద్యము చేయఁబడిన గయాళులును, అనాదికరంబో అనఁగా సేద్యము చేయఁబడని గయాళులును. 'పొరంబోకు' అనఁగా, సేద్యము చేయఁగూడనట్టి, సేద్యమునకుఁ బనికిరానిభూములు. ఇందుఁ గొండలు, రాజమార్గములు, నదీప్రవాహప్రదేశములు, చెఱువులు, జలాశయములు, రుద్రభూములు, మాలపల్లెలు మొదలైన ప్రదేశములు చేరును.

## ఈనాములు, మాన్యములు వగైరా

తెలుఁగుదేశములోని గ్రామములు ఆంధ్రదేశములోని గ్రామముల వంటివే అయియున్నవి. ఇందుఁగూడ భూమి యంతయు సేద్యము చేయఁబడుచున్నభూమిగను, గయాళుభూమిగను విభజింపఁబడియున్నది. సేద్య మగుభూములు మాన్యములు, అనఁగా సర్కారున కీయఁబడుపన్ను గృహస్థులు వసూలు చేసికొనుటకు హక్కు గలిగినవియు, 'ఖండ్రికలు', అనఁగా సర్కారునకుఁ జెల్లవలసిన పన్నులోఁ గొంతభాగముమట్టునకే గృహస్థులు వసూలు చేసికొని అనుభవించుటకు హక్కు గలిగినవియు నని రెండువిధములు. ఇందు మాగాణిభూము, లనఁగా పల్లపుపంట పండునవి. ఈభూములలోఁ బండుపంటలోని సర్కారుభాగమునకు 'కోరు' అని పేరు. రయితుభాగమునకు 'మేడిపా' లని పేరు. మెరకభూములపై ఆంధ్రభూములవలెనే రొక్కపుసిస్తు వసూలు చేయఁబడుచున్నది. మధుర, తిరునెల్వేలిజిల్లాలలోనిగ్రామములకు 'కారె' అని పేరు. ఈగ్రామములు మిరాశీగ్రామములవంటివే. అయినను ఇందలిగ్రామస్థులహక్కులు కేవలము మిరాశీగ్రామస్థులహక్కులవంటివి కావు. మఱియు సముదాయము లేక 'ఘసంకరే' అనుగ్రామములుగూడ కలవు. ఇట్టి గ్రామములలో గ్రామస్థు లనుభవించు భూమిభుక్తము 'ఫలభాగ' మనియు, 'ఆచంద్రార్కము' లేక 'అరుండికరే' అనియుఁ బేళ్లు. గ్రామసముదాయమువారు భూమియొక్క మంచిచెడ్డలనుబట్టి కొన్ని సంవత్సరముల కొకపర్యాయము పంచుకొనక భూస్వభావములు తెలిసినతరువాత మరల మార్చుకొనకుండ తమభూములను శాశ్వతముగా నుంచుకొనినప్పుడు అవి పై పేళ్లఁ బరఁగును. ఇట్టిభూముల మీఁద సర్కారున కీయఁబడవలసిన సర్కారుభాగ మాయాభూము లనుభవించువారివియే అయియున్నవి. కావున నిట్టిగ్రామములు గ్రామసముదాయపుహక్కు గల గ్రామము లయినను రైతువారీగ్రామములస్వభావము గల గ్రామములలక్షణములే కలవి యైయున్నవి. తంజావూరుజిల్లాలో 'ఏకభోగము' లేక 'యజమాన్ గ్రామము' అనుగ్రామములు గూడఁ గలవు. చెంగల్పట్టుజిల్లాలో నున్న మిరాశీగ్రామములమిరాశీదార్లు మిరాశీదార్లు కానిగ్రామస్థులకు దొరతనము

---

1. 'ఖుద్‌ఖాస్త్' అనఁగా స్వయముగ వ్యవసాయము చేయువా రని యర్థము.

sampath_Ebooks



వారు భూమి నిచ్చి వసూలు చేయుపన్నులమీద 'తుంమువరం', లేక 'స్వామిభోగం' అనునొకవిధ మయినరుసుము ననుభవించుటకు హక్కు గలిగియున్నారు. మఱియు మిరాసీదారులు 'కాని' లేక 'గ్రామ' అనుపూరుమాన్యము అనుకొంత క్షేత్రప్రదేశము పన్ను లేక స్వేచ్ఛగా ననుభవించుటకుఁగూడ హక్కు గలిగియున్నారు. ఈ మిరాసీదార్లకుఁ గల హక్కులనుబట్టి సవిస్తరముగ వ్రాయుటకు నిందు వీలు లేదు.

### రైతువారీపద్ధతి

ఈ పద్ధతికి అమానీపద్ధతి యనికూడ నామాంతరము కలదు. ఇందు పట్టాదారు డనురయితువలన మధ్యస్థులయవసరము లేకయే దొర తనమువారు గ్రామోద్యోగస్థులద్వారా పన్ను వసూలు చేయుదురు. ఈపన్ను పంటలో భాగముగూపముగఁ గాని, రొక్కమురూపముగఁ గాని వసూలు చేయవచ్చును. ఫలములో భాగరూపముగా వసూలు చేయుపద్ధతి 'అసరా', 'వారం' అను పేళ్లు గలిగియుండును. కడప, కర్నూలు, బళ్లారిజిల్లాలలో 'అప్పనము' అనుపద్ధతి యొకటికూడ కలదు. ఈ పద్ధతియందు మంచితరగతిభూములకు నెక్కువగ సిస్తు కట్టి అందులకుఁ బ్రతిఫలముగఁ దక్కువతరగతిభూములను సులభములగు సిస్తుల కిచ్చుట కలదు. 'పట్టము' అనునది వ్యవసాయసమయమునందు రైతు లంతకుఁ బూర్వము సేద్యము సేసినభూములలో నేయేభాగములు సేద్యముచేయ నిశ్చయించుకొని యేయేభాగములు వదలివేయఁదలఁచి కొనిరో నిశ్చయించుపద్ధతి. రైతులశక్తికి మించినభూములు వారిపైని బడవేయుటవలన వానిని సేద్యము చేయఁజాలక కొంతభాగమే సేద్యము చేయఁగలుగుటవలన సిస్తువసూలుకొఱకు నీపద్ధతి యేర్పాటు చేయఁబడి నది. తిరునెల్వేలి, తంజావూరుజిల్లాలలో 'ఒలంగు', 'మోతాఫిసల్' అనుపద్ధతు లున్నవి. ఒలంగుపద్ధతిలోఁ బంటమొత్తమున కప్పటిధరల ప్రకారము ఖరీదు కట్టి సర్కారున కీయవలసినభాగము రొక్కము రూపముగాఁ బుచ్చుకొనుపద్ధతి. ఇది రైతునకు సమ్మతిలేనియెడల పంటమొత్తములో ధాన్యభాగమునే యియ్యవచ్చును. ఈపద్ధతిలో ధరలు నిర్ణయించుటలోఁ గొన్ని నియమములు గలవు. మోతాఫిసల్ పద్ధతి ఒలంగుపద్ధతివంటిదే. అయినను ధరలు నిర్ణయించుపద్ధతిమాత్రము వేఱుగా నుండును. తంజావూరు హిందూరాజుల యేలుబడిలో నున్నప్పుడు 'పాక్‌హాల్' అనునొకపద్ధతి వాడుకలో నుండెను. ఈ పద్ధతిలో 'పాటహక్కుదారు' అను మధ్యవర్తితోఁ బ్రత్యేకగ్రామములయొక్కకాని, కొన్ని గ్రామములయొక్కకాని సిస్తు ఏర్పాటు చేసికొని వసూలు చేయుదురు. 'పట్టుకట్టు' పద్ధతి:— ఈపద్ధతి యందు రైతు సేద్యము చేసినభూమి యేదియు నెప్పుడును వదలిపెట్ట వలనుపడదు. 'తరంభిత్తి' పద్ధతియందు రైతు స్వాధీనమందున్న ఎక్కువసిస్తుగల భూములను వదలిపెట్టి తక్కువసిస్తుగల భూములనే సేద్యము చేయవలెననినచో తక్కువసిస్తుగల భూములతోపాటు వదలిపెట్టిన యెక్కువసిస్తుగల భూములమీఁదిపన్నుకూడ పుచ్చు కొనుపద్ధతి. ఈపద్ధతియందుఁగూడ పట్టుకట్టుపద్ధతివలెనే రయితులు భూములను వదలిపెట్టుటకు కవకాశము లేకుండుటకుఁ గారణ మగు చున్నది. 'కీసబదిపద్ధతి':— ఈపద్ధతి త్రిలింగదేశమునందుఁ గలదు. ఈపద్ధతియందు గ్రామములలోఁ గొండఱు పెద్దరయితులు చేరి గ్రామములోనిభూమి యంతయు గ్రామమురయితు లందఱును వుమతిమ శక్త్యనుసారముగ పాలుబడికిఁ బుచ్చుకొని యందుల కీయఁదగిన గ్రామము మొత్తపుపన్నునందు న్యాయ్యమయిన భాగమును నిచ్చు కొందురు. 'కల్‌నాత్' పద్ధతి:— ఈపద్ధతి బారామహాల్ దేశము లోను, సేలముజిల్లాలోను ఉన్నది. ఈపద్ధతియందు మధ్యవర్తులతో నిమిత్తము లేకుండ రయితునొద్దనుండి సిస్తు గ్రామోద్యోగస్థులమూల మున వసూలు చేసి రహితులకుఁ దాము సేద్యము చేయుభూముల యందు పూర్ణమయిన హక్కు గలిగియుండునట్లు చేయఁబడెను.

హిందూరాజులకాలమున భూములక్రయవిక్రయము చేయు పద్ధతి యంతగా లే దనియు, తనఖా పెట్టుటమాత్రము కొంతవఱకు కల దనియు పైని వ్రాయఁబడెనుకదా![1] ఈ తనఖాపెట్టునాచార ముండుటవలన భూమియందు భూస్వాములకు హక్కు కల దని

1. పూర్వకాలమందు భూమిని అమ్మునట్టిపద్ధతి లేదని కొందఱు తీటవలియింగ్లీషు గ్రంథకారులు భ్రమపడియున్నారు. ఇప్పు డున్నట్లు భూమి కప్పుడు వెల లేకపోయినందునను, భూమి యెక్కువగను రైతు తక్కువగను ఉన్నందునను భూమిసంబంధమైన క్రయవిక్రయము లెక్కువగా లేకపోవచ్చును. అంతమాత్రమున హిందూరాజులకాలమునందు రైతులకు తమభూమిని అమ్మునధికారము లేదనిచెప్పుటకు వీలు లేదు. భూమిని విక్రయించుచుండి రని చూపుటకుఁ బ్రబలప్రమాణము లున్నవి. చాణక్యరచితమైన అర్థశాస్త్రమునందు భూమిని విక్రయించు పద్ధతులు చెప్పఁబడియున్నవి. భూమిని అమ్మఁదలఁచినవాఁడు మొదట జ్ఞాతులకు, తరువాత సామంతులకు (ప్రక్కవారికి) తరువాత అప్పుల వాండ్రకు నమ్మవలెను; అనఁగా వీరికి ఒకరితరువాత నొకరికి భూమియెడ నొకవిధమైన హంసాయిహక్కు (Pre-emption) కలదు. వీ రెవరును కొననియెడల ఇతరుల కమ్మవచ్చును. అమ్మునెడ భూమితో సంబంధము లేనివారిని, నలువది యిరుగుపొరుగు ఇండ్లవారిని పిలిచి వారికి విక్రయముసంగతి తెలుపవలెను. తరువాత నమ్మఁబడునట్టిక్షేత్రము, తోఁట, కాలువ, తటాకము, ఆధారము ఇది యని పరిహద్దులతోఁ జెప్పి, 'యీ వెలకు నెవరు కొందురు?' అని మూఁడుసారు లడుగవలెను. ఆపైని ఆభూమి నిరాటంకముగఁ గొనువానిది యగును (కాటిలీయమ్ అర్థశాస్త్రమ్., 3. అధి, ౯. అధ్యా, ౬౧. ప్రక); సిస్తు ఇచ్చువారు సిస్తు నిచ్చువారికే యమ్మవలెను. బ్రాహ్మణాగ్రహారములు బ్రాహ్మణులకే యమ్మవలెను (కాటిలీయమ్ అర్థశాస్త్రమ్., 3. అధి, ౯. అధ్యా, ౬౨. ప్రక) అని చెప్పఁబడియున్నందున క్రీ. పూ. ౪-వ శతాబ్దియందు, నన఼గా చంద్రగుప్తచక్రవర్తికాలమునందు భూమివిక్రయ ముండె ననుట స్పష్టము. బృహస్పతిస్మృతియందు స్థిరాస్తిని సంపాదించుమార్గము లేదు

sampath_Ebooks

చెప్పుటకు వీలు కలిగియున్నది. హిందూరాజులపరిపాలనకాలమందు సిస్తునియ్యనిరైతుయొక్క భూమిని అమ్మి వానిని దానినుండి తొలఁగించి మఱియొకరైతున కిచ్చి సిస్తు వసూలు చేయుపద్ధతి యున్నట్లు కనిపింపదు. రైతు సిస్తు నియ్యనియెడల వానిచరాస్తి అమ్మికాని, వానిని దండించి బాధపెట్టికాని వసూలు చేయునాచారము కలదు. మలయాళదేశమునందుఁ దక్కినప్రదేశములందుకంటె భూస్వాములకు భూములయందు నెక్కుడుహక్కును, స్వాతంత్ర్యమును కలదు. పూర్వకాలమునందు కూలివాండ్రను కొంచెము హెచ్చుతక్కువగా బానిసలుగా చూచుచుండినట్లు కనిపించుచున్నది. మలయాళ, కన్నడదేశములయందు భూస్వాములయొక్క పని చేయుకూలివాండ్రను అమ్ముటకును తాకట్టు పెట్టుటకును గూడ భూస్వాములకు నొకవిధముగ స్వతంత్రత యుండెను. వీండ్రను భూమితో సంబంధము లేక వేఱుగా చరాస్తివలె భావించి అమ్ముటకు భూస్వాముల కధికార ముండెను. ఆంధ్రదేశమునందుఁ గూలివాండ్రు భూమితో నమ్మఁబడువారుగను, భూమి యెవ్వరియధీనమం దున్న వారియధీనమునందుండి పని చేయువారుగను నుండిరి. కాని సర్కారున కియ్యవలసినపన్ను నేలికగ నున్నంతవఱకు భూస్వాములు కూలివాండ్రచే (పాలేళ్లచే) సేద్యము చేయింపఁగలుగుచుండిరి. మహమ్మదీయప్రభుత్వకాలమందు భూమి సిస్తు ఎక్కువగ చేయఁబడినందునఁ దామే స్వయముగ సేద్యము చేసినఁగాని లాభము లేకపోవుటవలన భూస్వాములే స్వయముగ సేద్యము చేయవలసినయవసరము కలిగినది. ఆంగ్లేయప్రభుత్వారంభమున సర్కారుభూముల క్రింద వసూలు చేయఁబడుపన్ను భూమిపన్నొకటియే యగుటవలనను, ఇతరవిధములగు పన్నులు వాడుకలోనికి రాకపోవుటవలనను భూమిపై సిస్తే ప్రధానమైనపన్నుగ నిప్పటికిని పరిగణింపఁబడుచున్నది. హిందూరాజులకాలమునందు ఫలసాయములోఁ గొంతిభాగము తీసికొనుచువచ్చుచున్నందున భూమియొక్క ఫలసత్తను బట్టియు, పండింపఁబడిన ధాన్యాదులవిలువనుబట్టియు సర్కారుపన్ను ఏర్పడుచువచ్చినది. ఆంగ్లేయులు అమానీపద్ధతి యారంభముచేసిన తరువాత ద్రవ్యరూపమున సిస్తు వసూలు చేయుచు భూములయొక్క పంటస్థితినిబట్టి రొక్కమురూపమున సిస్తులు వసూలు చేయుచు

చెప్పఁబడినవి. విద్య, క్రయము, తాకట్టు, శౌర్యము, భార్య (స్త్రీధనము), దాయము, వారసులు లేనిజ్ఞాతులసొత్తు (అనంతరవారసత్వము) [౯. ౨].

ఆస్మృతియందే ‘ఆస్తి రెండువిధములు: స్థిరాస్తి, చరాస్తి. విక్రయము పూర్తియైనతోడనే యారంభించుటకిని ‘పణ్యము’ అన్న పేరు వచ్చును (౧౫. ౨)’ అని యున్నది.

ఇట్లు పూర్వము రైతునకు భూమి విక్రయించునధికార మున్నట్టు స్పష్టము. కాని యాకాలమున నేగ్రామమునకు నాగ్రామము స్వతంత్రముగ నుండుటవలన వీలయినంతవఱకు గ్రామములోనిభూములు గ్రామములోనివారికే యమ్మవలయు నన్నయొకవిధమైన నిర్బంధము మొదట నున్నట్లు గానవచ్చుచున్నది. మితాక్షరాకారుఁడు ‘స్వగ్రామజ్ఞాతిసామంతదాయాదానుమతేన చ, హిరణ్యోదకదానేన షడ్భిర్గచ్ఛతి మేదినీ’ (తనగ్రామస్థుల, జ్ఞాతుల, హంసాయిదారుల, దాయాదుల సమ్మతివలనను, బంగారముతోడను, నీళ్లతోడి దానమువలనను – ఇట్లాఱువిధములచే భూమి యొకరినుండి మఱియొకరికిఁ బోవును) అనినపూర్వులశ్లోకమును ఒకదానిని తీసికొని, అవన్నియు వేఱువేఱు ఉద్దేశములతోఁ జెప్పఁబడెను కాని, విక్రయమునకు నివి యావశ్యకములు కావని వ్రాసెను. జరగినవిక్రయవ్యవహార మందఱకును దెలియవలె నని ‘గ్రామానుమతి’ కావలె నని చెప్పెనేకాని యది లేనిది వ్యవహారసిద్ధి లేదన్న యుద్దేశముతోఁ గాదు. సరిహద్దులతకరారు లేకుండ నుండుటకై హంసాయిదార్ల (సామంతుల) యనుజ్ఞ వలయు నని చెప్పఁబడినది. జ్ఞాతిదాయాదుల యనుజ్ఞ యెందుల కనఁగా, కుటుంబము సమష్టి యైనయెడల మిగిలిన భాగస్థులసమ్మతి యావశ్యకము. వ్యష్టి యైనయెడల ‘వారు సమష్టికుటుంబములోనివారా వ్యష్టికుటుంబములోనివారా?’ యన్న సంశయము ముందు రాకుండ నుండుటకై కాని జ్ఞాతులసమ్మతి లేనిది విక్రయము చెల్ల దనుటకు కాదు. భూమిని దానముచేయుట పుణ్యప్రద మని చెప్పినాఁడు గనుక, విక్రయించినప్పటికిని, ‘ఒకబంగారునాణెము పెట్టి నీళ్లు విడువవలసినది’ అని యాజ్ఞవల్క్యస్మృతియొక్క వ్యవహారకాండము, ౧. అధ్యాయము, ౧-౩౧, ౩౨ శ్లోకములపై వ్యాఖ్యానము వ్రాయునపుడు మితాక్షరాకారుఁడు వ్రాసి, సమష్టికుటుంబములోఁ జేరనివాఁడు తనభూమిని తనయిష్టము వచ్చినట్టు విక్రయింపవచ్చు నన్నభావమును తెలిపినాఁడు. భూమిని విక్రయించినయెడల కుటుంబమునకుఁగల శాశ్వతమైనజీవనాధారము పోవునేమో యని కొందఱు స్మృతికారులు నీతిబోధగ స్థిరాస్తిని అమ్మఁగూడ దని వ్రాసిరే కాని, ఆచారముమాత్రము పైని మితాక్షరాకారుఁడు వ్రాసినట్టే యుండెడి ననుటకు సందేహము లేదు. చోళపాండ్యరాజులప్రభుత్వకాలమునందు భూములవిక్రయము బాహాటముగా జరుగుచుండెడి నని చూపుట కాకాలపు పెక్కుశాసనములు వెలువడినవి (Ep. Coll., for **1915-16, Nos. 29, 61, 64, 71, 74, 75, 81.** etc.) గ్రామస్థులయొద్దనుండి భూములు కొని పుణ్యాత్ము లనేకులు దేవాలయములకు దానమిచ్చినట్లు పెక్కుశాసనములలోఁ జెప్పఁబడినది. సర్కారుసిస్తు చెల్లించుటకు శక్తి లేనందున వేళంగూడికాపురస్థులయిన మరవలు తమ భూమిని అమ్ముకొనినట్టు శా.శ. ౧౪౨౩ (క్రీ. శ. ౧౫౦౧) సంవత్సరపుశాసనమునఁ గలదు. ఇది విజయనగరమువారి ప్రభుత్వకాలములోనిది **(Ep. Coll., No. 50 of 1916).**

sampath_Ebooks



వచ్చిరి. దక్షిణహిందూస్థానమునం దొక్కొక్క భాగమున నొక్కొక్క యాచార మూండెను. కాని అంతట నొకేవిధముగ భూమిభుక్తముండె నని పైనివ్రాసిన యంశములనుబట్టియే తెలియఁగలను. అఱవ దేశమున నొకవిధముగను, తెలుఁగుదేశమున మఱియొకవిధముగను మలయాళ, కన్నడదేశములం దింకొకవిధముగను నిట్లు ఒక్కొక్క ప్రదేశమున నొక్కొక్కవిధముగ భూమిభుక్తము వాడుకలో నున్నది.

మద్రాసురాజధాని యంతయు నేకకాలమున నొకేవిధముగ నాంగ్లేయపరిపాలనలోనికి వచ్చియుండకపోవుటఁబట్టియు, నంతకు పూర్వమునం దున్నపద్ధతులనే సాధ్యమయినంతవఱకు ననుసరింప వలయు ననుతలంపుచేతను నొక్కొక్క భాగమున నొక్కొక్కవిధమున అమరకపుఁబద్ధతు లేర్పఱుపఁబడినవి. ఉత్తరసర్కారు లను గంజాం, విశాఖపట్నం, గోదావరి, కృష్ణ, గుంటూరు జిల్లాలయందు బంగాళదేశపు - అమరకపుపద్ధతి ననుసరించి 'శాశ్వత మనుజమీన్ దారీ-అమరకపుఁబద్ధతి' యేర్పాటు చేయఁబడెను. మదరాసుపట్టణమునకు చుట్టుపట్ల నున్నదేశము ఆర్కాటునవాబువలన ౧౭౫౦, ౧౭౬౩ సంవత్సరములయందు దఖలుపడి యుండుటవలన ఆ ప్రదేశమునందలిజిల్లాలయందు అంతకుఁ బూర్వమునం దున్నపద్ధతి ననుసరించి 'జాగీరు' పద్ధతిని అమరకము చేయఁబడెను. ౧౭౯౩-వ సంవత్సరమున టిప్పుసుల్తాన్ ఓడిపోయినతరువాత బారామహాలును సేలముజిల్లాయు మలయాళమును ఆంగ్లేయులయధీన మైనవి. పిమ్మట టిప్పుసుల్తానుతో రెండవయుద్ధ మయినతరువాత కన్నడదేశమును కోయంబుత్తూరుజిల్లాయును వచ్చినవి. ౧౮౦౦-వ సంవత్సరమున హైదరాబాదునవాబుతో జరిగినసంధి ననుసరించి తుంగభద్రాకృష్ణానదులకు దక్షిణమునం దున్న ప్రదేశ మంతయు నాంగ్లేయులయధీన మయినది. ౧౮౦౧-వ సంవత్సరములో ఆర్కాటునవాబునకు కర్ణాటదేశమునం దున్నరాజ్య మంతయు నాంగ్లేయులయధీన మైనది. ఇట్లనేకపూర్వరాజులనుండి యనేకవిధములుగ నాంగ్లేయుల కధీనపడిన యీప్రదేశములయందు ననేకవిధములగు నమరకపుఁబద్ధతు లేర్పాటు చేయవలసి వచ్చినవి.

## పాలెగాండ్రు

ఉత్తరసర్కారు లని పిలువఁబడు ప్రదేశమునందు మహమ్మదీయప్రభువులవలనను, అంతకు పూర్వపుహిందూరాజులవలనను చెందఁబడిన భూములు గాని, అట్లు భూములు చెందినభూనాయకులవలనఁ జెందినభూములు గాని యనేకము లుండుటవలన వీనివిషయమున నాంగ్లేయప్రభుత్వమువారి కొకవిధమగు అమరకము చేయవలసిన యవసరము కలిగినది. భూనాయకులవలనఁ జెందఁబడిన భూములు కల వారిని 'పాలెగాండ్రు' అని పిలుతురు. వీరు మూఁడువిధములుగా నుండినవారు.

౧. పూర్వము రాజ్యము లేలినవిజయనగరము, కాంచీపురము, మధుర మొదలగుదేశాధీశులసంతతిలోనివారు కొందఱు.

౨. పూర్వపురాజులయొద్ద సేనాధిపతులుగా నుండి మహమ్మదీయులదండయాత్ర నడ్డగించుకొని స్వశక్తివలనఁ గొంతదేశమునకు నాయకులై తరువాత నాయాప్రదేశములకుఁ బ్రభువులుగా నంగీకరింపఁబడినవారు కొందఱు.

౩. జిల్లా కధికారులుగ నుండి కాలక్రమమున మహమ్మదీయుల యధికారమునకు లోఁబడక స్వతంత్రులై ఆయాజిల్లాలపైని ప్రాభవమును సంపాదించుకొన్నవారు కొందఱు.

మహమ్మదీయు లీదేశ మింతయుఁ గైకొనఁబడుపక యీ ముత్తెగలపాలెగాండ్రను నొకవిధముగానే చూచుచు పాలెగాండ్రబలాబలములనుబట్టియుఁ, దాము చెలాయింపఁగలిగిన యధికారమునుబట్టియుఁ గప్పముఁ గొనుచుండిరి. కాని ఒకపద్ధతి ననుసరించి యమరకముఁ జేసి సిస్తు గాని, కప్పము గాని వసూలు చేయలేదు. ఈపాలెగాండ్రు తమ యిచ్చ వచ్చినట్లు తమక్రింద నున్నప్రజలను, గ్రామములను పరిపాలించుకొనుట కధికారము కలిగి మహమ్మదీయుల కంతగా లోఁబడక యుండిరి. వీరు సర్వదా ఒండొరులతోఁ బోరాడుచు మహమ్మదీయప్రభువులతోఁ బోరాడుచుఁ గాలముఁ గడుపుచుండిరి. మహమ్మదీయులకుఁ గట్టవలసిన కప్పము బరువు అని తోఁచినప్పుడు సాధ్యమయినంతవఱకు సిస్తు చెల్లింపకుండు ప్రయత్నము చేయుచు, నట్లపహరించుటకు వీలు గానప్పుడు తా నీయవలసినసిస్తు చెల్లించి తమ యెస్టేట్లకుఁ బ్రాంతములయం దున్నసర్కారు గ్రామములను దోచికొని తాము సొమ్ముచేసికొనుచుండిరి. ఇట్లు దోచికొనఁబడు గ్రామములయం దున్నసర్కారురైతులు లంచగొండులైన శ్రీబాధ పడలేక తమ్ము బాధింపకుండ విడిచిపెట్టినందులకు 'కావల్' అను పన్ను ఇచ్చుచుండిరి. తరువాత నాంగ్లేయప్రభుత్వదినములలో నీపాలెగాండ్ర దౌర్జన్యము లడఁచుట కనేకప్రయత్నములు జరిగినవి కాని యీపాలెగాండ్రయెస్టేట్లమీఁద వీరి కున్న న్యాయ్యమైన హక్కువిషయమున మాత్రము నిశ్చయముగాఁ దెలిసికొనుట కవకాశము గలిగినదికాదు. అప్పుడు వారితో శాశ్వతమైన యమరకపుపద్ధతి నొకదానిని ఏర్పఱుచుకొని వారియెస్టేట్లమీఁద వారికి రాఁదగినమొత్తమున మూఁడవవంతు తమ కిచ్చుపద్ధతిని చిత్తూరు, కాళహస్తి, వెంకటగిరి, బొమ్మరాజుపాలెము మొదలగు ఎస్టేట్ల నమరకము గావించిరి. దక్షిణమునం దున్న అఱవదేశములో ౩౩ గురు పాలెగాండ్రుండిరి. వీరిసంఖ్య నానాఁటికి క్షీణించి యిప్పుడు కొందఱుమాత్రమే మిగిలియున్నారు. బారామహల్ ప్రదేశమునందు రైతువారీపద్ధతి నమరకము చేయఁబడినది.

## మలయాళదేశమందలి అమరకపు విధములు

పశ్చిమతీరమునం దుత్తరమున గోకర్ణక్షేత్రము మొదలు దక్షిణమునఁ గన్యాకుమారివఱకును, కేరళము లేక మలయాళదేశ మని వాడఁబడును. తిరువాన్కూరు కొచ్చిరాజ్యములు ప్రప్రథమమున నుండియు స్వదేశప్రభువులపాలనమునందే యుండెను. మలయాళము కూడ తొమ్మిదవశతాబ్దివఱకు, నీవిధముననే స్వదేశప్రభువులపాలన

sampath_Ebooks



మున నుండెను. కాని తరువాత కళ్లికోటయందలి 'జామొరిన్' ప్రభుత్వముక్రిందికి వచ్చెను. ఈతఁడు మహమ్మదీయమత మవలంబించుటవలన ననేకులు మహమ్మదీయు లాదేశమునకు వచ్చుట కవకాశము కలిగినది. ఈతురకలను 'మోప్లా' లందురు. వీరు సాధారణముగ వర్తకము చేయుదురు. 'తుళువ' అను కన్నడదేశము ప్రత్యేక ప్రభుత్వముగా నుండెను. ఇది పండ్రెండవశతాబ్దిని పాండ్యరాజుల యధీనములోనికి వచ్చినతరువాత, అంతకు పూర్వము భూమి ననుభవించుచుండిన నాయర్లను తొలఁగించి భూమిపై పన్ను హెచ్చించి 'హల్లె'ర్లను కర్షకుల కీయఁబడినది. తరువాత నీదేశము విజయనగరరాజులకు సాంధ్రప్రభువులయధీనములోనికి వచ్చెను. అంతట నుండి తెలుఁగుదేశపు అమరకపుపద్ధతులు కొన్ని వాడుకలోనికి వచ్చినవి.

ఈదేశమునందలి భూమిభుక్తపద్ధతి విశేష మయిన దగుటచేత దానినిగురించి కొంత విస్తారముగఁ జెప్పవలసినయవసరము వచ్చినది. ఈదేశము ప్రప్రథమమున నంబూద్రి బ్రాహ్మణులయొక్కయు, కొర్గవంశులగు నాయరులయొక్కయు భుక్తమునం దుండెను. వీరిరువుర క్రిందను 'తీయరు' లను నొకజాతివారు సేద్యమువలననే జీవించుచుండిరి. వీరు ప్రప్రథమమున సింహళద్వీపమునుండి తీసికొనిరాఁబడినవారు. నాయరులు రాజునకు భూమిపన్నీయక తమతమపైనిరులతో రాజులకు యుద్ధసమయమునమాత్రము సాహాయ్యపడుచుండిరి. నంబూద్రిబ్రాహ్మణులుకూడ భూమిపన్నీయక దేవాలయములను సంరక్షించి పోషించుబాధ్యతమాత్రము కలిగియుండిరి. మోప్లాలకు కూడ భూమిపన్ను నిచ్చుబాధ్యతలు లేవు.

మలయాళదేశమందలి అమరకపుపద్ధతి రాష్ట్రమందలియితర జిల్లాలలోకంటె కొంత విలక్షణముగా నున్నది. ఆదేశమందు రైతులు పెక్కురకములుగా నున్నారు. అందఱికంటె నగ్రస్థానము నలంకరించుభూస్వామికి 'జన్మి'అని పేరు. 'జన్మి'అనుపదము జన్మశబ్దమునుండికలిగినది. 'జన్మి'కి తక్కిన ప్రాంతములందలి భూస్వాములకంటె భూమిలో పెక్కుహక్కులు కలవు. ఈ హక్కునకు 'జన్మంహక్కు' (Janmam) అని పేరు. 'జన్మి'లకు భూమియం దట్టిహక్కుండుటచేత రాజునకు భూమియందు సంపూర్ణస్వామ్యము కల దనుసిద్ధాంతము మలయాళదేశమందు వర్తింపదు. 'జన్మంహక్కు' కల యెంతచిన్నపరిమితిగలభూస్వామి యైనను 'జన్మి' యని పిలువఁబడును. అయినను 'జన్మి' యనుపదమునకు మలయాళదేశమం దాచారమున నే యర్థము కలదు. భూమిని సిస్తునకు కౌలునకు తీసికొని 'మిచ్చెవారం' అను పేరుతో సిస్తు చెల్లించురైతులకు 'కనోమ్దారు' లని పేరు. ఇట్టి కనోమ్దార్లకు భూమి నమరకపఱిచి వారివలన 'మిచ్చెవారం' వసూలు చేసికొను పెద్దజమీన్దార్లనే 'జన్మి' లని వ్యవహరింతురు.

'జన్మి' లు చేయు అమరకము మూఁడువిధములు : (౧) రైతు అమరకము పొందటివి. ఈరైతులు 'వెరుంపట్టందారు', 'కనోమ్దారు', 'కుళికనోమ్దారు' అని మూఁడువిధములు, (౨) తనఖా పద్ధతి. 'ఒత్తి', 'పరివర్తం' అను తనఖాపద్ధతులపయిభూమి నమరకమునకు తీసికొన్నవారు ఈరెండవపద్ధతిలోఁ జేరుచున్నారు. (3) శాశ్వతపుకౌల్ల ద్వారా చేయఁబడు అమరకము మూఁడవది. ఇట్టి కౌల్లకు శాశ్వతము లని పేరు. బ్రాహ్మణుల కీయఁబడు శాశ్వతపు కౌలునకు 'సంతతిబ్రహ్మస్వ' మని పేరు. భూస్వామితో సమానమయినట్టికాని, ఎక్కువయినట్టికాని కులస్థున కీయఁబడుశాశ్వతపు కౌలునకు 'అనుభవ' మని పేరు. తనకంటె తక్కువకులస్థున కీయఁబడినకౌలునకు 'అడిమ' యని పేరు.

## (౧) రైతు అమరకము

'వెరుంపట్టం :— పల్లపుభూముల కేటేఁట నీయఁబడుకౌలునకు 'వెరుంపట్టం' అని పేరు. ఆకౌలుక్రింద సేద్యము చేయురైతునకు 'వెరుంపట్టందా' రని పేరు. కౌలువలనఁ గలుగఁజేయఁబడిన బాధ్యతతప్ప అతనికి భూమియం దెట్టిహక్కును లేదు.

కనోమ్ :— 'కనోమ్', 'కుళికనోమ్' అనునవి మలయాళదేశమందు - ముఖ్యముగా అమలులో నున్న అమరకపుపద్ధతులు. కనోమ్దార్లకు భూమియం దేమయిన హక్కు కలదా లేక వారు స్వాధీనపుతనఖాదారులవంటివారా అనువిషయము మిక్కిలి వివాదగ్రస్త మయియున్నది. మద్రాసుహైకోర్టువారు 'కనోమ్' అనునది యొకవిధమయిన తనఖా అనియు, మలయాళదేశపు ఆచారములకు లోఁబడి 'కనోమ్దారు'ను తనఖాదారుగా నెన్నవలె ననియు తీర్మానించిరి. 'కనోమ్దారు' 'జన్మి'కి అత్యంతస్వల్పపుమొత్తమును పెట్టుబడిగా నిచ్చి, సామాన్యముగా పండ్రెండుసంవత్సరములకు 'స్వాధీనకౌలు' తీసికొనుచున్నాఁడు. ఈకౌలుకాలములో స్వల్పముగా నేటేట సిస్తుమకూడ 'జన్మి'కి చెల్లించును. ఈసిస్తునకే 'నిత్యవార' మని పేరు. గడువుకాలమునకు తరువాత 'కనోమ్దారు' అప్పిచ్చిన పెట్టుబడిమొత్తమును మరల 'కనోమ్దారు'నకిచ్చివేసి 'జన్మి' భూమిని స్వాధీనము చేసికొనవచ్చును. ఈగడువుకాలములో 'కనోమ్దారు' సొంతసొమ్ము ఖర్చుపెట్టి భూమి నభివృద్ధి చేసినను అట్టివ్యయమునకు నెట్టిపరిహారము నియ్యకయే 'జన్మి'లు 'కనోమ్దార్ల'ను భూమియందుండి తొలఁగించునాచార మొకప్పు డుండెడిది. అట్టియన్యాయమును నివారించుటకే 'మలబారు టెనెంట్సు ఇంప్రూవ్మెంటు ఆక్టు' అని ఒకచట్ట మేర్పడినది.

'కనోమ్' పద్ధతిని అమరకపఱిచినభూములకు 'జన్మి' 'మేల్చార్తు' (Mel-charth) అను మఱియొకకౌలు అన్యున కీయవచ్చును. 'మేల్చార్తు' పొందిన ఆసామీ 'కనోమ్దారు'నకు 'జన్మి' యియ్యవలసినసొమ్ము నిచ్చి 'కనోమ్దారు'ను తొలఁగించి భూమిని స్వాధీనము చేసికొనవచ్చును. 'జన్మి' మఱియొకనికి భూదానపూర్వకముగా నుపకారము చేయఁదలఁచినప్పుడు కాని, లేక తన యొద్ద పైకము లేనప్పుడు కాని 'మేల్చార్తు' ఇచ్చుచుండును. రెండవసందర్భమందు 'జన్మి' 'మేల్చార్తుదారు'వలన కొంత

sampath_Ebooks



నజరానా పుచ్చుకొనుట కాని యది దస్తావేజులో నుదాహరింపఁబడదు. ఆచారమందు 'జన్మి' లు వర్షముమీఁద మొదటి 'కనోమ్ దారు'నకును, అతనిసంతతివారికిని గడువుకాలమునకుఁ దరువాత మరల 'కనోమ్' ఇచ్చుచుందురు. అట్లు చేసినప్పు డెల్ల స్వల్పమయిన నజరానా (Renewal fee) తీసికొనుచుందురు.

'కుళికనోమ్':— 'కుళికనోమ్'యొక్క స్వభావము కొంచె మించుమించుగా 'కనోమ్' వంటిదే. అయితే బీడుభూములు (వీనిని 'పరంబా' అందురు) నూతనముగా సేద్యములోనికిఁ దీసికొనివచ్చుటకును, లేక చెట్లువేసి పెంచుటకును ఇయ్యఁబడుకౌలునకు 'కుళికనోమ్' అని పేరు. అట్టికౌలుదారునకు 'కుళికాలుదా' రని పేరు. ఉత్తరమలబారుజిల్లాలో ఈపద్ధతి హెచ్చుగా నమలులోనున్నది. ఆజిల్లాలోఁ గల తోఁటలు, ముఖ్యముగా కొబ్బరితోఁటలు 'కుళికనోమ్' పద్ధతినే అమర్పఁబడియున్నవి.

## (౨) తనఖాపద్ధతి

ఒత్తి:— ఇఁకను 'ఒత్తి', 'పరివర్తం' అను తనఖాపద్ధతులు వివరింపఁబడును. 'ఒత్తి' అనునది ఆంధ్రదేశమునం దమలునందున్న స్వాధీనపుతనఖాను పోలియున్నది. భూమిమీఁద పండినపంట యంతయు వడ్డీక్రింద 'ఒత్తిదారు'(అనఁగా స్వాధీనపుతనఖాదారు)నకు చెందుచుండును. 'జన్మి' అసలుబాకీ తీరుమానము చేసి తనఖా వదలించుకొనవచ్చును. 'కనోమ్' లోవలెఁ గాక 'ఒత్తి' లో భూమియొక్క సంపూర్ణమయిన విలువనే 'జన్మి' అప్పుగా పుచ్చుకొనును. 'కనోమ్'లోవలెనే పండ్రెండుసంవత్సరముల లోపల తనఖా తీర్చి భూమిని స్వాధీనము చేసికొన వీలు లేదు. 'జన్మి' తనఖాలో నుంచినభూమి నమ్మఁదలఁచుకొనినప్పుడు 'ఒత్తిదారు'నకే మొదట అమ్మఁజూపవలయును. 'ఒత్తిదారు' కొనలేనప్పుడే ఇతరులకు దాని నమ్మవలయును. 'జన్మి'కి ఆభూమిమీఁదనే మఱికొంత అప్పు కావలసియున్నయెడల ముందుగ 'ఒత్తిదారు'నే యడుగవలయును. అతఁ డీయలేనప్పుడే యితరులయొద్దను పుచ్చుకొనవలెను.

'పరివర్తం':— 'పరివర్త' మనునది 'ఒత్తి' వలెనే భూమి విలువకు తనఖా అయియున్నది. అయితే 'జన్మి' తనఖా తీర్చి భూమిని స్వాధీనపఱచుకొనునప్పటికి భూమివెల యెంత యుండునో అంత వెలయు 'పరివర్తందారు'న కీయవలెను, అనఁగా నీగడువుకాలములోపల భూమికి వెల పెరిఁగినచో ఆలాభమును పరివర్తందారు పొందుచున్నాఁడు.

## (3) శాశ్వతపుకౌలు

శాశ్వతపుకౌలు:— ఇదివఱకు చెప్పినప్రకారము బ్రాహ్మణుల కీయఁబడు శాశ్వతపుకౌలునకు 'బ్రహ్మస్వ' మనియు, సమానజాతివారి కీయఁబడుకౌలునకు 'అనుభవ' మనియు, తక్కువజాతివాని కీయఁబడు కౌలునకు 'అడిమ' యనియు పేరు. ఈ శాశ్వతపుకౌలు రద్దుపఱచుటకు వీలు లేదు. కౌలుదారునకు వారసులు లేనప్పుడు (చేవారసమయినప్పుడు) భూమి మరల 'జన్మి' కుటుంబమునకు చేరుచున్నది. కౌలుదారు భూముల నన్యాక్రాంతము చేయఁగూడదు. అట్లు చేసినచో, 'జన్మి' భూములను స్వాధీనము చేసికొనవచ్చును. అవిధముగ భూమి పొందినవానికి ఎట్టిహక్కు నుండదు. అయితే అన్యాక్రాంతము జరిగినప్పుడు కౌలును రద్దుపఱిచి భూమిని స్వాధీనము చేసికొనుహక్కు హైకోర్టుతీర్పులవల్ల కొంతవఱకు తగ్గింపఁబడినది. అన్యాక్రాంతము జరుగుటకు పూర్వము 'జన్మి' దాని నభ్యంతర పెట్టవచ్చును. అట్టియభ్యంతరమును పాటింపక శాశ్వతపుకౌలుదారు అన్యాక్రాంతము చేసినచో 'జన్మి' దానిని రద్దుపఱిచి భూమిని స్వాధీనము చేసికొనవచ్చును. ముందుగా 'జన్మి'వల్ల ఎట్టియభ్యంతరము లేక అన్యాక్రాంతము జరిగిపోయినచో తరువాత 'జన్మి' తకరరు చేసినను అది చెల్ల దనియు, అన్యాక్రాంతము స్థిరపడు ననియు తీర్పులవల్ల నిర్ధారణ చేయఁబడినది.

## మలబారు టెనెన్సీచట్టము

పైనిచెప్పినసంగతులనుబట్టి అమరకము పొందినవారికి మలయాళదేశమునందు భూమిలో హక్కులు తక్కువ యనియు, 'జన్మి' లకు తమయిష్టముప్రకారము వారిని తొలఁగించుటకు హక్కుండెననియు తేలుచున్నది. 'వెరుంపట్టందార్ల'ను ఇష్టము వచ్చినట్లును, 'కుళికనోందార్ల'ను, 'ఒత్తి', 'పరివర్తం' దార్లను గడువుకాలమునకుఁ బిదప సొమ్ము చెల్లించియు భూములలోనుండి తొలఁగింపవచ్చుననియు తేలుచున్నది; అనఁగా, 'జన్మి'లు మనప్రాంతములందలి జమీందార్లవలెనే పెద్ద భూస్వాము లయినను వారిక్రింద రైతులెవ్వరికిని శాశ్వతపురైతువారీహక్కులు లే వని విశద మగుచున్నది. ఇది మిక్కిలి విషమస్థితి. మలయాళదేశమందు కనోమ్‌దార్లును, కుళికనోమ్‌దార్లును ముఖ్యమయినరైతులు. వారు సంఘమందు పలుకుబడి కలవారును, ఆర్థికము గాఁగూడ ఉపపత్తి కలవారును అయియున్నారు. మఱియు వారిలో పెక్కండ్రు విద్యావంతులును, స్వాతంత్ర్యేచ్ఛకలవారు నయియున్నారు. అందుచేత వారు కొన్నిసంవత్సరములనుండి తమకు భూములలో శాశ్వతరైతువారీహక్కు లుండవలెననియు, 'జన్మి' లు వారియిష్టానుసారము తమ్మును భూములలోనుండి తొలఁగించుట అన్యాయ్య మనియు, ఇందున కనుకూలమయిన చట్ట మవసర మనియు తీవ్రమయిన యాందోళనము సల్పుచుండిరి. ఈయాందోళనముయొక్కఫలితమే 'మలబారు టెనెన్సీచట్టము (Malabar Tenancy Act, No. 14 of 1930).

ఈచట్టము 'కనోము' లు, 'కుళికనోము' లు, 'వెరుంపట్టము' లకును, కుడియిరుప్పు, అనఁగా నివేశనములకును మాత్రమే వర్తించును. తక్కిన రెండువిధములయిన అమరకములు, అనఁగా, 'ఒత్తి', 'పరివర్తం' అను తనఖా అమరకములకును, శాశ్వతములకును వర్తింపదు.

sampath_Ebooks



చట్టమువలన భూమిని సొంతముగా సేద్యము చేయువెరుంపట్టం దార్లకు ఒకవిధమయిన శాశ్వతపుజిరాయితీహక్కు కలిగినది. అతఁడు సిస్తుచెల్లింపకతప్పిపోయినప్పుడును, భూస్వామికి భూమియందుహక్కు లేదని వాదించినప్పుడును, భూస్వామికి నిజముగా తాను సొంతముగా వ్యవసాయము చేసికొనుటకు భూమి అవసరమయినప్పుడును తక్క 'వెరుంపట్టందారు' నిప్పుడు చట్టముప్రకారము భూమినుండి తొలఁగించుటకు వీలులేదు. ఒక్కసంవత్సరపుసిస్తునకు హామీ యియ్య వలయు నని భూస్వామి 'వెరుంపట్టందారు'ను కోరవచ్చును. 'వెరుం పట్టందారు' భూస్వామికి న్యాయ్యమయినసిస్తు చెల్లించుచుండవలెను. న్యాయ్యమయిన సిస్తును నిర్ధారణ చేయుపద్ధతులు చట్టమందు వివర ముగాఁ దెలుపఁబడినవి. ఈనియమములకు లోఁబడి వెరుంపట్టందారు తనకౌలులో నున్నభూమి నిష్టప్రకారము ఇతరులకు దానవిక్రయాది కము చేయవచ్చును. చట్టమునందు ఈహక్కులు స్వయముగా వ్యవ సాయము చేసికొను 'వెరుంపట్టందార్ల'కే కలుగఁజేయఁబడినవి. ఆచా రమునుబట్టి తదితరులకు వెరుంపట్టందారులు కనోమ్‌దార్లతో తుల్య ముగా నుందురు.

కనోమ్‌దార్లకుకూడ శాశ్వతపుజిరాయితీహక్కులు కలుగఁ జేయఁబడినవి. కనోమ్‌దార్లను పూర్వమువలె తొలఁగించుటకుఁగాని, గడువుకాలమునకుఁ దరువాత 'కనోమ్' తీర్చి 'జన్మి'లు భూములను స్వాధీనము చేసికొనుటకుఁగాని వీలు లేదు. అయినను 'కనోమ్' సొమ్ము దక్షిణమలబారుజిల్లాలో భూమియొక్కవిలువలో నూటికి అఱువది భాగములకును, ఉత్తరమలబారుజిల్లాలో నలువదిభాగములకును తక్కువకానియెడల అట్టి 'కనోము'లకు చట్టము వర్తింపదు. 'కనోమ్‌దారు' చట్టమునకు పూర్వమువలెనే 'మిచ్చైవారం', అనఁగా 'సాలీనసిస్తు'ను, నజరానాను (Renewal Fee) చెల్లించుచుండ వలెను. 'మిచ్చైవారము'నకును, నజరానా (Renewal Fee)కును భూమి జవాబుదారీగా నుండును. ఒక్కగవర్నమెంటురెవిన్యూతప్ప భూమిమీఁది యితరబాధ్యత లన్నియు 'మిచ్చైవారం', 'నజరానా'లకు లోఁబడియుండును. 'కనోమ్‌దారు' ఈక్రింద నుదాహరించిన కారణములవల్ల తప్ప వేఱువిధముగా భూమియందుండి తొలఁగింపఁ బడఁగూడదు:

౧. భూమిఖామందునకు భూమిమీఁద హక్కు లేదని వాదించుట.

౨. భూమిని వ్యవసాయమునకనుపయుక్తమగునట్లుచేయుట.

౩. నజరానా యిచ్చి 'కనోము'ను మరల పుచ్చుకొనక పోవుట.

౪. భూమిఖామందుయొక్కహక్కునకు భంగకరముగా ఇత రులు భూమి నాక్రమించుకొనఁగా నుపేక్షచేయుట.

౫. 'కనోమ్' గడువుకాలము ముగిసినపిదప 'జన్మి'కి సొంత వ్యవసాయమునకు భూమి యవసర మగుట.

బీడుభూములకనోములకు ఈచట్టము వర్తింపదు.

## కుడియిరుపు:

'కుడియిరు' పనఁగా రైతు కాఁపురముండు నిల్లు, దానినంటి యుండు నివేశనము, దానికి సంబంధించిన యితరస్థలములకు హక్కులు. ఈచట్టమువల్ల ఇట్టి 'కుడియిరుపు'లో రైతుగాని, అతని కుటుంబమువారు కాని పదేండ్లకు తక్కువకాకుండ నివసించుచుండిన యెడల దానికఖరీదును భూమిఖామందునకు చెల్లించి నిర్బంధముగాఁ గొనవచ్చును. అట్టికరీదును ఒక్కసారి యియ్యలేకపోయినచో పండ్రెండు సంవత్సరపువాయిదాలతో నూటి కర్ధరూపాయవడ్డితో చెల్లింపవచ్చును.

ఈచట్టమువలన మలబారురైతులస్థితి పూర్వమునకంటె చాల వఱకు బాగుపడినది. ఇంకను ఎక్కువహక్కులు కావలె నని 'వెరుం పట్టందార్ల'ను, 'కనోమ్‌దార్ల'ను ఆందోళన సలుపుచునే యున్నారు.

దక్షిణకన్నడదేశమందలి భూమి యొకానొకప్పుడు మలయాళ దేశస్థులగు నాయర్లయనుభవమునందుఁగూడ నున్నట్లగపడు చున్నది. కన్నడదేశమునందలిభూమియందు శాశ్వతపు హక్కు గల సేద్యగానికి 'ముల్గేని' అని పేరు. ఒక్కటేసిస్తునకు పూర్వమున నుండియు వ్యవసాయమునం దుండినట్టిదికాని, క్రొత్తగా వ్యవ సాయము చేయఁబడుచున్నట్టిదిగాని అగుభూమిని దున్నుటకు వంశ పారంపర్యము 'వలతి' అని 'ముల్గ' పదమున కర్థము. శాశ్వతపు కవులు కలిగి భూమినుండి తొలఁగింపఁబడకుండ కృషి చేయురయితు 'ముల్గేనిగారు' అని పిలువఁబడును. కొంతసొమ్ము పుచ్చుకొని వ్యవ సాయదారునకు కవు లిచ్చుపద్ధతి 'అర్ధముల్గ'ని యందురు. ధాన్య రూపముగాఁగాని, ద్రవ్యరూపముగాఁగాని భూమిపై సిస్తు వసూలు చేయుపద్ధతి దక్షిణకన్నడదేశమునం దున్నది. కాని ఫలసాయములో కొంతభాగము పుచ్చుకొనుపద్ధతి యెన్నఁడు నున్నట్టు తోఁచదు. ఈ'ముల్గేని'రైతు 'నాయర్ ముల్గేని' యనియు, 'మడ్ ముల్గేని' యనియు రెండువిధములు. 'నాయర్ ముల్గేని' యనునది పురాతనపద్ధతి. 'మడ్ ముల్గేని' యనునది భూమి కొనినతరువాత నేర్పడినపద్ధతి. కొన్ని సంవత్సరములకుమాత్రమే కవు లిచ్చుపద్ధతి 'వెయిద్గేని' యందురు.

## భూమికి వెల పుట్టుట, హెచ్చుట, తగ్గుట

రైతువారీఅమరకపుపద్ధతి చేయఁబడునప్పు డంతకుఁ బూర్వము హిందూరాజులకాలమందును, తరువాత మహమ్మదీయరాజులకాల మందును రైతులకును భూస్వాములకును పూర్వమునుండియు భుక్త ములో నున్నహక్కుల నాంగ్లేయదొరతనమువారు సాధ్య మగునంత వఱకు గమనించియే భూమి నమర్చిరి. ప్రప్రథమమున హిందూ రాజులప్రభుత్వకాలమందు కృషికిఁ దగినభూమి అమితముగా నుండుట వలనను, భూమి నంతయు సేద్యములోనికిఁ దీసికొనివచ్చుటకు చాలి నంతమంది రైతులు లేకపోవులచేతను, ప్రకోపయోగముకొఱకు

sampath_Ebooks

మాత్రమే కావలసినంత ధాన్యమును పండించుకొనుటకవసరము కలిగి యుండుటచేతను కృషికరులు తమశక్తికిఁ దగినట్లు తమకు వలసినంత ప్రదేశమును మాత్రమే వ్యవసాయము చేయుచువచ్చిరి. ఆకాలమున భూమి నపేక్షించువారు గాని, భూరూపమైన ఆస్తిని సంపాదించుకొనవలయు నని యాసక్తిపడువారు గాని, భూములు కొనువారు గాని యుండుట తటస్థపడలేదు. అట్టిసమయమందు పంటలో రాజభాగమునుమాత్రము రాజు వసూలు చేసికొనుచు కర్షకుఁ డిచ్చ వచ్చినట్లు భూమిని స్వేచ్ఛగా ననుభవించునట్లు అవకాశ మొసఁగుచు వచ్చిరి. అందువలన భూమి సేద్యమైనకొలఁదియు రాజునకు ద్రవ్యము వచ్చుటయు, నేకారణముచేత నయినను భూమి సేద్యము కాఁబడనియెడల రాజునకు ద్రవ్యము రాకపోవుటయు తటస్థించుచుండెను. గ్రామములు రెండువిధములైన వనియు, గ్రామముయొక్క స్థితి ననుసరించి ఆగ్రామమునకు సంబంధించియున్న పంటభూమియందు గ్రామస్థులకు హక్కేర్పడిన దనియు నింతకుముందే వ్రాయఁబడెను. గ్రామస్థులావిధముగా భూమియందు హక్కు భుక్తములు కలిగి దేశాచారమును బట్టి సంచరించుచు తమతమ గ్రామవ్యవహారములను తామే నెఱవేర్చుకొనుచు రాజులకు లోఁబడియుండిరి. తరువాత మహమ్మదీయుల కాలములోఁగూడ పూర్వపుపద్ధతులను మార్చివేయక పంటభూముల మీఁద సిస్తు వసూలు చేయుటకు కొన్ని క్రొత్తపద్ధతులనుగూడ నమలులోనికిఁ దీసికొనివచ్చిరి. ఈకాలమున వ్యవసాయము చేయువారు వృద్ధి యగుటయు, భూమిపన్ను మిక్కిలిగా హెచ్చింపఁబడుటయు, కొంతమంది కయినను భూమి సంపాదింపవలయు ననునాసక్తి కలుగుటయు సంభవించినది. మహమ్మదీయులప్రభుత్వకాలములో భూమి లేనివానికన్న భూమి కలవాని కెక్కువపరపతియు గౌరవమును గలుగుట తటస్థపడెను. రొక్కరూపమైన ద్రవ్యమెంత యున్నను భూస్వామ్యము గలవాని కెక్కువ గౌరవముండెను. ఈకారణములఁబట్టి కొందఱకు భూమి సంపాదింపవలయు ననుకోరిక పుట్టుట కవకాశము కలిగినది. అయినను భూమిపన్ను మిక్కిలి హెచ్చింపఁబడుటచేత సేద్యము సేయుటవలన లాభము లేక భూములను వదలిపెట్టవలయు ననుతలంపు కలవార లనేకు లుండిరి. భూమి సేద్య మయినకొలఁదియు తమకు ద్రవ్య మెక్కువ వచ్చు ననువారిచే సాధ్య మగునంతవఱ కెక్కువభూమిని సాగుచేయించుట కమర్చవలె నని మహమ్మదీయప్రభువులయొద్ద నున్నయుద్యోగస్థు లనేకప్రయత్నములు చేయ నారంభించిరి. దేశ మభివృద్ధి చెందుటకును, ప్రజలు భాగ్యవంతు లగుటకును, రాజులకు విస్తారము ద్రవ్యము వచ్చుటకును భూమి హెచ్చుగ మంచిపద్ధతులమీఁద సేద్యము చేయఁబడుటయే ముఖ్యకారణము. ఈవిషయము మహమ్మదీయప్రభువులును వారియుద్యోగస్థులును గ్రహింపకపోలేదు. అయినను నిప్పటివలె ధాన్యాదులకు ధరలు లేకపోవుటవలన నెంతప్రయత్నము చేసినను అభిరుచితో వ్యవసాయము చేయవలె ననునాశమాత్రము రైతులకు చాలకాలమువఱకును లేకపోయెను.. సాధ్య మగునంతవఱకు భూమిని సాగుచేయునట్లు రైతులను ప్రోత్సాహపఱిచియు, నిర్బంధపఱిచియు భూములు వదలిపెట్టకుండ నభ్యంతరములు కలుగఁజేయు మహమ్మదీయప్రభువులక్రిందియుద్యోగస్థు లనేకసాధనములతోఁ బలువిధము లగుపద్ధతులమీఁద భూమి నమరకము చేయుచువచ్చిరి. మహమ్మదీయప్రభుత్వకాలమున సేద్యము చేయుట కిష్టము లేనప్పుడు గాని, సేద్యమువలన లాభము లే దని తోఁచినప్పుడు గాని రైతు భూమిని వదలిపెట్టినట్లును, అట్టివిడుదల మహమ్మదీయప్రభువు లంగీకరించినట్లును కనిపింపదు. హిందూరాజులపరిపాలనకాలమునఁగాని మహమ్మదీయప్రభుత్వకాలమునఁ గాని రైతు గాని భూస్వామి గాని భూమిపన్ని యనప్పు డట్టిపన్ను అతనిచరాస్తి నమ్మించికాని అతనిని దండించి చెఱసాల నుంచి శిక్షించికాని బాధపెట్టి రని వినియుండుము గాని భూమి జప్తుచేసి సిస్తు వసూలుచేయుపద్ధతి యున్నట్లు వినము కాని హిందూరాజులకాలములో భూమిని క్రయవిక్రయపఱుచువాడుక తక్కువగ నుండినను మహమ్మదీయరాజ్యసమయమునమాత్ర మక్కడక్కడ భూము లమ్ముకొనుపద్ధతి హెచ్చినది. సర్కారుభూమిని జప్తుచేసి అమ్మించుపద్ధతిమాత్ర మంతగాఁ గన్పింపదు.

## రైతులను తొలఁగించుట

వారసులు లేక చనిపోయినవాని( ఖాతీ )యొక్క కాని, యూరు విడిచి పాఱిపోయినవాని(పరారి)యొక్క కాని భూములను దప్పఁ దక్కినవాండ్రభూములను సర్కారు తీసికొని యన్యాక్రాంతము చేయుపద్ధతికూడ మహమ్మదీయులకాలములో నైన నంతగాఁ గానిపింపదు. రాజద్రోహులు, గొప్పనేరములు చేసినయపరాధులు శిక్షింపఁబడుటయే కాక వారిభూములను మహమ్మదీయప్రభువులు తీసికొని యితరుల కుచితముగా నిచ్చుట గాని, సిస్తు కట్టి యిచ్చుట గాని వాడుక కలదు. దీనింబట్టి యోజింపఁగా రైతు భూమిపన్ను చెల్లించుచున్నంతవఱకుఁ దనభూమిని స్వేచ్ఛగా కృషి చేసికొని అనుభవించుటకు హక్కు కలిగియేయుండె నని చెప్పవలసియున్నది. మఱియు రైతులు సాధారణముగా ఫలవత్తరమైన మంచిభూముల నుంచుకొని తక్కిన నీరసభూములను బరిత్యజించువాడుకకూడ నుండియుండెను.

## పెక్కు విధములయిన అమరకముపద్ధతులు : కారణము

లాభము లేనిపని చేయుట మనుష్యస్వభావము కాదు. కావున సేద్యము సేయుటవలన లాభ మున్నభూములను విశేషవ్యయప్రయాసము లక్కఱలేకుండ లాభమునకు వ్యవసాయము చేయఁదగినభూములనుమాత్రమే వ్యవసాయము చేయుటకు రైతు లిచ్ఛగించుచుఁ దక్కినభూములను నిరాకరించుచుండిరి. కాని మహమ్మదీయప్రభువులు భూమి నంతయు మంచిస్థితిలోనికిఁ దీసికొనివచ్చి అన్నివిధము లగు భూములను సేద్యపఱచునట్లు ప్రోత్సాహము చేయుటవలన లాభమును గ్రహించి అందువిషయమునఁ దమయుద్దేశములను సఫలీకృతము లగుటకుఁ దగినయుపాయములను పన్ని అనేకోపాయములను నెఱవేర్చు

sampath_Ebooks



బడు తగినమరతులతో ననేకవిధములగు నమరకపుపద్ధతుల నేర్పఱిచి ఆయాపద్ధతులమీఁద నమరకము చేయుచువచ్చిన హేతువుచుబట్టి ఒక్క రైతువారీయమరకపుపద్ధతియందే యనేకవిధములగు నంతర్భేదము లుండుట కవకాశములు కలిగినవి. మఱియు దేశకాలపాత్రములనుబట్టియు నాయాదేశములయందు భూమిసిస్తు వసూలు చేయు మార్గభేదములను, మర్యాదాభేదములనుబట్టియు, సాధ్య మగునంత మట్టున కలజడి లేకుండ సిస్తు వసూలు చేసికొనుటకును హెచ్చుగా భూమి సేద్య మగుటకు ప్రోత్సాహపఱుచుటకును రైతులయొద్దనుండి స్వయముగా సిస్తు వసూలుచేసికొనుకష్టములు తగ్గించుకొనుటకును తాలూకాదారీ, గ్రామవారీ, జమీందారీ మొదలగు కొన్ని పద్ధతులను గూడ మహమ్మదీయు లవలంబించిరి.

ఆకాలమున అక్బరుచక్రవర్తి రాజ్యమునకు వచ్చునంతవఱకును భూమిని బరిశీలించి ఫలవత్తనుబట్టి సిస్తు నిర్ణయించి ఏవిధమగు 'సెటిల్ మెంటు'ను మహమ్మదీయరాజులు చేసి యుండకపోవుట వలన తత్కాలోపయుక్తమైన అనేకవిధములగు నేర్పాటులు చేయ వలసివచ్చినది. ఆసేతుహిమాచలపర్యంతమగు హిందూదేశ మంతయు నొక్కనియేలుబడియం దేకకాలమున నొక్కనియధీనములోనికి వచ్చియుండలేదు. దేశ మంతయు భిన్నభిన్నరాజ్యములుగను ననేకరాష్ట్రములుగను విభజింపఁబడి యుండుటచేతను, ఒక్కొక్కరాష్ట్రము నొక్కొక్కరాజు నేలుబడియం దొక్కొక్కపద్ధతి ననుసరించి ప్రజలకు భూమియందు హక్కును, ఆస్తియు నధికారమును నేర్పడియుండుటంబట్టియు, నొక్కటేరాజ్యమును, ఒక్కటే రాష్ట్రమును ననేకప్రభువులపాలనకు లోఁబడి యనేకవిధములగు వ్యావహారికభేదములను బొందియుండుటచేతను పూర్వపుపద్ధతు లెంతగా మార్పు నొందక గాపాడఁబడుచువచ్చినను కొన్నిమార్పులుమాత్రము రాక తప్పవయ్యెను. అమరకపుపద్ధతులనుగూర్చి యోచించునప్పుడును, తద్విషయకవ్యవహారములను విమర్శించునప్పుడును, పలువిధములగు అమరకపుభేదములను విమర్శించునప్పుడును ఈ విషయమును మన మనసునం దుంచుకొనకతప్పదు. ఆంగ్లేయులు హిందూదేశము నంతయు జయించి స్వాధీనపఱిచికొని రని కాని బలాత్కారముగా నాడఁ దీసికొని రని కాని బహుమానపూర్వకముగాఁ బొంది రని కాని చెప్పుటకు వీలు లేదు. ఈదేశ మంతయు నొక్కపర్యాయముగా నాంగ్లేయ ప్రభుత్వమునకుఁ జిక్కలేదు. ఒక్కొక్క రాష్ట్ర మొక్కొక్కవిధముగా నొక్కొక్కసమయమున నాంగ్లేయులయేలుబడిలోనికి వచ్చినది. అందువలన హిందూదేశమునందలి రాష్ట్రములయందు వాడుకయం దున్న అమరకపుపద్ధతు లన్నియుఁ బలువిధములైనవి. మహమ్మదీయప్రభుత్వకాలమందు వాడుకలో నున్న అమరకపుపద్ధతు లన్నింటిని వీరు మార్చివేయలేదు. ఆంగ్లేయప్రభుత్వారంభదినములలో మహమ్మదీయులయమరకపుపద్ధతులనే యనుసరించుచు భూమివిషయమున భూస్వాములకుఁగల హక్కు తమస్వదేశ మగు నింగ్లాండుదేశములోని హక్కువంటిదే యని భ్రమపడి కొన్ని మార్పులను జేసిరి. వివిధము లగురాష్ట్రములయందు భూస్వాములకు భూమియందుఁ గలహక్కు సాధ్య మగునంతవఱకు పరిశీలించి వారి వారిహక్కులకు భంగము కలుగకుండ నాయారాష్ట్రములకుఁ దగిన విధమున గ్రామములస్వభావములుకూడ గమనించి అమరకపుపద్ధతుల నేర్పఱిచిరి.

## గ్రామము

కాఁబట్టి యిప్పుడు మన మమరకమువిషయమున యోచించు నప్పుడు హిందూదేశమునందలి యన్నిరాష్ట్రములయందును అన్ని ప్రదేశములయందును అన్నిజిల్లాలయందును వాడుకలో నున్నపలు విధము లయిన అమరకపుపద్ధతులను యోచించుచు గ్రామస్వభావములంబట్టి గ్రామములయందు మార్పు చెందిన అమరకపుభేదములం గూడ నిర్ణయింపవలసియున్నది. సిస్తు (రివిన్యూ) సంబంధమైన వ్యవహారమునకు గ్రామము ప్రధానాంశము. ఆ గ్రామమునకు సంబంధించి గ్రామస్థు లిండ్లు కట్టుకొని కాఁపుర ముండుప్రదేశము కొంతయు, నత్తం, గ్రామకంఠం మొదలయిన పేర్లతో వ్యవహరింపఁబడుప్రదేశము కొంతయు, చెఱువులు, నూతులు, మార్గములు, పుంతలు, పోరంబోకులు, శ్మశానభూములు, ధాన్యము నూర్చు కొనుట కేర్పడినప్రదేశములు, ధర్మారామములు మొదలగునవి యుండు ప్రదేశము కొంతయు, గ్రామస్థు లందఱుయుపయోగార్థ ముమ్మడిగా ననుభవింపఁదగినస్థలములు కొన్నియు, గ్రామస్థులపశువులు మేయుటకును దిరుగుటకును నున్న ఉమ్మడిభూమి కొంతయు, సేద్యము చేయఁబడుచున్నభూమి కొంతయు, సేద్యమునకుఁ దగియున్నను సేద్యము కాకయున్నభూమి కొంతయుఁ గృష్యర్హతకుఁ దేఁదగినభూమి కొంతయు నడవి కొంతయు నుండుట సాధారణము. గ్రామము యొక్క వైశాల్యమునుబట్టియుఁ బ్రాముఖ్యమునుబట్టియు నడవిప్రదేశమునకు దూరమున నుండుట దాపున నుండుటంబట్టియు నీయా ప్రదేశములయొక్క వైశాల్యము లుండుట సంభవించును. ఇందు గ్రామస్థు లుమ్మడిగా ననుభవింపఁదగినట్టివియు సేద్యము చేయఁదగి నట్టివియు నగుప్రదేశములు గాక (౧) సేద్యములో నున్నప్రదేశము, (౨) కృష్యర్హత గలిగి కృషి చేయనిప్రదేశము, (౩) కృష్యర్హతకుఁ దేఁదగినప్రదేశము, (౪) అడవి — ఈ నాల్గింటివిషయమున కొంచెము చెప్పవలసియున్నది.

## (౧) వ్యవసాయములో నున్నప్రదేశము

రైతువారీపద్ధతిక్రింద నమరకములో నున్న గ్రామములలో వేర్వేఱురయితులకు ౩౦ సంవత్సరముల కొకపర్యాయము భూమి యొక్క వైశాల్యమునుబట్టియు ఫలవత్తనుబట్టియు సిస్తు నిర్ణయించి ఆసిస్తు ఇచ్చుచుండువఱకు నిరాటంకముగా ననుభవించుపద్ధతి నొక పట్టాతో నీయఁబడినభూమి. ౩౦ సంవత్సరములతరువాత మరల 'సెటిల్ మెంటు' సిస్తు ఏర్పాటుచేయునపుడు విధింపఁబడుపన్ను నంగీకరించినంతవఱకు రైతును తొలఁగించుట సంభవింపదు. భూమి

యొక్క అలేనప్పుడు సకాలములో భూమిని విడుదలపెట్టుటకు రైతునకు హక్కు కలదు. రైతు భూమిపన్ను చెల్లింపనప్పుడు భూమి యంతయుఁగాని, అందుకొంతభాగముగాని వేలమువేసి అమ్మి సిస్తుబకాయీలు వసూలుచేసికొనుటకు సర్కారున కధికారమున్నది. ఈషరతులకు లోఁబడిన పట్టాదారైన రైతునకు భూమి నమ్ముకొనుటకుఁగాని దాన మిచ్చుటకుఁగాని తనఖా పెట్టుటకుఁగాని స్వాతంత్ర్యము కలదు. ఒక్క తిరునెల్వేలి జిల్లాలోఁ దప్ప తక్కినజిల్లాలలో నిట్టిపట్టాభూములలోని చెట్లయందుఁ గూడ రైతునకు స్వాతంత్ర్యము కలదు. భూమిలోనిఖనిజములకు మాత్రము సర్కారునకు హక్కు కలదు. వా రట్టివి త్రవ్వుకొనునప్పుడు ఖనిజములస్వభావమునుబట్టి 'రాయల్టీ' అనుపన్ను వసూలు చేయుదురు. ఇట్టిభూమియందు రైతు తన కిష్టమైనసస్యమును వేసి పండించుకొనవచ్చును గాని సర్కారునీటివలన పల్లప్రసాగుబడి చేసినప్పుడుమాత్రము వారు విధించిననీటిపన్ను అధికముగా నిచ్చుకొనవలయును.

ఇట్టిభూములు జిరాయితీభూము లనఁబడును. ఒక్కొక్క గ్రామములోని భూములను గొలచి కొంతకొంతభూమి కొక్కొక్క నెంబరుగా నేర్పఱుచుపద్ధతి సర్వే యందురు. పట్టాదారులైన రైతులపట్టాలలో నొక్కపట్టాలో పెక్కునెంబర్లు కలసి యుండుట గాని ఒకపట్టాలో చేరినయొక నెంబరునం దనేకభుక్తదారులపేర్లు చేరియుండుట గాని తటస్థించుచుండును. పట్టాదా రయినరయితున కొకనెంబరుభూమిలో తనయిష్టము వచ్చినంతప్రదేశము తన కిష్టము వచ్చినవారికి దానవిక్రయాధికారములతో నిచ్చివేయుట కధికారము కలిగియుండుటవలనను భూములు కుటుంబమువారు పంచుకొనుటవలనను ఒక్కనెంబరుభూమి అనేకులక్రింద భుక్తములో నున్నట్లు రిజిష్టరులో వ్రాయుచుండుట తటస్థించును. భుక్తమునుబట్టి భూమి హక్కు నిర్ణయింపఁబడుటచేత పట్టా అంత అత్యావశ్యకమైనది కాదు. ఇంతియేకాక రైతు ఇయ్యవలసిన సిస్తుమొత్తము తెలియఁబఱుచుటకుమాత్రమే పట్టా యుపయోగము గాని అందువలన రైతున కొకహక్కును గలుగఁజేయు పత్రమువంటిది కాదు. సేద్యము గు భూమిలో సిస్తు వసూలు చేయఁబడు ఈజిరాయితీభూమి గాక సిస్తు లేకుండ ననుభవింపఁబడుచుండునట్టివియు, దేవాలయములు, మసీదులు, సత్రములు, గ్రామనౌకర్ల వేతనములు మొదలుగువానికొఱకు ఈయఁబడినట్టివియు నగుభూములుకూడఁ గొన్ని యుండును. ఈభూములంగూర్చి ముందు చర్చింపఁబడును. జిరాయితీభూములమీఁద ౩౦ యేండ్ల కొకపర్యాయము సిస్తు నిర్ణయించుపద్ధతి 'సెటిల్ మెంటు' అనఁబడును. ౩౦ యేండ్లకు తక్కువకాలమునకుఁ జేయఁబడిన 'సెటిల్మెంట్లు' గల గ్రామము లున్నవి గాని యొక్కువకాలమునకు చేయఁబడినసెటిల్మెంట్లు గలగ్రామములు లేవు.

జమీందారీగ్రామములలోను తాలూకాదారీగ్రామములలోను చేరిన జిరాయితీపద్ధతులకును గవర్నమెంటు జిరాయితీపద్ధతులకును భేదము కలదు. వానివిషయ మాయాసందర్భములయందు చర్చింపఁబడును.

## (౨) వ్యవసాయార్హమై వ్యవసాయములో లేని భూమి

ఇట్టిభూమి యొకప్పుడు సర్వే కాఁబడి నెంబరుగా విభజింపఁబడుటయు కలదు. ఇట్టిభూమి దరఖాస్తుమీఁదఁ గాని వేలము పాడి యొక్కువపాట పాడినరైతునకుఁ గాని రివిన్యూబోర్డువా రేర్పఱచిన నిబంధనల ననుసరించి సిస్తు నిర్ణయించి అమరకము చేయఁబడుచుండును.

## (౩) వ్యవసాయార్హము కాఁదగినభూమి

ఇట్టిభూమి సాధారణముగా సర్వే కాఁబడియుండదు. కాని దరఖాస్తు చేయఁబడినతరువాత సర్వే చేయఁబడి సిస్తు నిర్ణయింపఁబడును. దరఖాస్తుదారునిపరపతిని యోజించి రివిన్యూబోర్డువా రేర్పఱచిన నిబంధనలకు లోఁబడిచి అమరకము చేయఁబడును.

ఇట్లు రైతునధీనము చేయఁబడిన ౨-౩ తరగతులభూములు కూడ జిరాయితీభూములలక్షణముఁ జెందును.

సర్కారురైతువారీగ్రామములలో నున్న అనాదిబంజరుభూములయొక్కయు బంజరుభూములయొక్కయు హక్కు సంపూర్ణముగా సర్కారుదే. ఇట్టిభూమిని రయితునకు దరఖాస్తుమీఁద నిచ్చునప్పు డితరులకంటె నాగ్రామస్థులకు నిచ్చుట సర్కారు మతము.

జమీందారీగ్రామములోని అనాదిబంజరుభూమియు జమీందారుయొక్క సంపూర్ణముగుహక్కునకు లోఁబడియుండును. జమీందారీగ్రామములయందు రయితుచే విడుదల పెట్టఁబడినట్టివిగాని జమీందారుచేఁ గొనఁబడినట్టివిగాని, మఱి యేవిధముగానైనను జమీందారునకే మిగిలియున్నట్టివిగాని యగుభూములవిషయముంగూర్చియు అనాదిబంజరుభూములనుగూర్చియు నమరకము చేసికొనుటకు సర్వాధికారము జమీందారుల కున్నను ౧౯౦౮-వ సంవత్సరమున జారీ చేయఁబడిన ఎస్టేటుల్యాండు అక్టునందలి షరతులకుమాత్రము సంబంధించిన ట్లమరకము చేయఁబడవలెను. సర్కారుజిరాయితీగ్రామములయందలి జిరాయితీ, బంజరుభూములను రయితుల కిచ్చుయేర్పాటులన్నియు సర్కారురివిన్యూశాసనములలో విస్తరించి చెప్పఁబడియేయున్నవి. ఈశాసనములలో రయితున కున్నస్వాతంత్ర్యములును హక్కులును సర్కారున కున్నస్వాతంత్ర్యము నధికారమును విస్పష్టముగాఁ జెప్పఁబడియున్నవి. అమరకపుపద్ధతు లన్నియు రివిన్యూబోర్డువారు జారీచేసిన 'స్టాండింగు ఆర్డరుల'నుబట్టియు, రివిన్యూఅధికారులు జారీచేయునధికారపత్రికలంబట్టియు వ్యవహరింపఁబడుచుండును. కాని రయితువారీసెటిల్మెంటుయొక్క ప్రధానలక్షణములుమాత్రము మార్పు చెందవు. అగ్రహారములు, శ్రోత్రియములు, ముఖాసాగ్రామములు మొదలగు శాశ్వతపు అమరకములు

చెందిన గ్రామములయందలి జిరాయితీభూములును బంజరు, అనాది బంజరుభూములును జమీన్‌దారీ గ్రామములయందలి యీభూముల లక్షణమే యించుమించుగాఁ గలిగియుండి వాని యమరకమువిషయమునఁగూడ 'ల్యాండుఆక్టు' ననుసరించే వర్తింపఁజేయఁబడుచుండును. నీలగిరి, వైనాడ్ మొదలగు దేశములయందలి అమరకపుపద్ధతులు వేఱువిధము లైనవి. తేయాకు, కాఫీ, రబ్బరు, చింకోనా మొదలగు తోఁటలు వేయుట కర్హమైన భూముల - అమరకపుపద్ధతులుగూడ వేఱువిధము లైనవే. ఈసాధారణరైతువారీ అమరకముపద్ధతులు గాక సర్కారువారు శాశ్వతముగాఁ గాని తొంబదితొమ్మిదిసంవత్సరములకుఁగాని వారియిష్టము వచ్చిన కొన్ని సంవత్సరములకుఁ గాని యిండ్లు, కట్టడములు, ఫ్యాక్టొరీలు మొదలగునవి నిర్మించుటకుఁగాని యితరములయిన ఖారుఖానాపనులు చేసికొనుటకుఁ గాని గనులు త్రవ్వుకొనుటకుఁ గాని భూముల నమర్చుపద్ధతులు గలవు. ఇట్టివాని విషయమున వేఱువేఱుచట్టములును నిబంధనలు నేర్పడియున్నవి. ఆయాచట్టములను నిబంధనలను అనుసరించి అట్టివాని యమరకపువిశేషము లములు జరుగుచుండును. సర్కారురయితువారీభూముల యమరకపుపద్ధతులు మొదలగువానివిషయమున బొంబాయిరాజధానియందు 'బొంబాయి రివిన్యూఆక్టు' అనునొకచట్టము నేర్పఱిచి ఆచట్టము నిబంధనల ననుసరించి వ్యవహారము జరపుకొనుచున్నారు. కాని మన రాష్ట్రమందుమాత్రము దొరతనమువా రట్టినిబంధనలు చేయక సందర్భానుసారముగాఁ దాము జారీచేయునిబంధనలనుబట్టియే రివిన్యూవ్యవహారము జరపుచుండుటచేత నీరాష్ట్రమందు రివిన్యూవ్యవహారము కేవలము దొరతనమువారిచిత్తవృత్తి ననుసరించియే జరపఁబడుచుండుట కవకాశము లటస్థించినది. ఇంతియేకాక జమీన్‌దారీగ్రామములలోని జిరాయితీభూములసిస్తు పెంచఁబడుటకు కొన్ని నిబంధనలును కొన్ని మితులును 'ల్యాండుఆక్టు'నందు వివరించి విధించియుండెను. కాని ౩౦ సంవత్సరములతరువాత సర్కారుభూములు మరల సెటిల్‌మెంటు చేయునప్పు డిట్టినిబంధనలను గాని మితులను గాని వివరించి విధించియుండలేదు. రయితువారీపద్ధతిలో 'ఊలుగు', 'మోతాఫిసల్', 'అమానీ' అనుభేదములు గలవు. ఊలుగుపద్ధతిలో రయితువారీపద్ధతియందువలె సెటిల్‌మెంటుసమయమునందలి ధరలను బట్టి కాక యెప్పటికప్పుడు ధాన్యమున కున్నధరలంబట్టి సిస్తు నిర్ణయింపఁబడుచుండును. గ్రామసముదాయోపయోగమునిమిత్తముగా నేర్పాటు చేయఁబడిన 'పోరంబోకులు', 'పుంతలు' మొదలగు నదియు, చెఱువులు మున్నగునవియు, నవి నిర్ణయింపఁబడినకార్యముల కుపయోగింపనప్పుడును గ్రామోపయుక్తములు కానప్పుడును సర్కారు కేలంపాటమీఁదఁ గాని, దరఖాస్తుమీఁదఁ గాని సిస్తు కట్టి రయితులవశము చేయుచుండునాచారము గలదు.

౩౦ సంవత్సరముల కొకసారి రయితువారీభూమిపై సిస్తు నిర్ణయించునపుడు (సెటిల్‌మెంటు చేయునపుడు) భూమియొక్క ఫలవత్తనుబట్టి తరగతులు నిర్ణయించి, అట్టి తరగతినిబట్టియు జలాధారాదిసదుపాయములనుబట్టియు ఫలసాయ మమ్మఁబడుప్రదేశమునకుఁ గల దూరమునుబట్టియు, పొలములోనుండి ఫలసాయ మావలికిఁ దీసికొనిపోవుట కున్నమార్గసదుపాయములంబట్టియు, కూలిపని చేయు కూలివాండ్రజీతములంబట్టియు, నంతకుమున్ను ౧౦ సంవత్సరములయం దున్నధాన్యపువెలలు దామాయిషీ చేసి దానింబట్టియుఁ గాలవైపరీత్యముంబట్టి సంభవింపఁబోవునష్టములను గుర్తించియు సేద్యము గావించుటకు రయితున కగునన్నివిధము లగుఖర్చులను, రయితులకుఁ గాలవైపరీత్యమువలన సాధారణముగా సంభవించునష్టములను, పంట మోఁతకూలి వగైరాఖర్చులను, భూమి బాగుచేసికొనుటకును ఎరువు పెట్టుటకుఁ గాఁదగినసొమ్మమీఁదివడ్డీయును లెక్క చూచి అవి పోఁగా, మిగిలినదానిలో సగముభాగము భూమికి సిస్తు కట్టవలసిన దని సర్కారువారియేర్పాటు. భూమిసిస్తు నిర్ణయించుపద్ధతియు నట్లు నిర్ణయించువిధమును సవిస్తరముగా సెటిల్‌మెంటురూల్సులోఁ జెప్పఁబడుటయే కాక దేశకాలపాత్రములంబట్టి రివిన్యూబోర్డువారును సర్కారువారు నుత్తరువులు జారీచేయువాడుకగూడ కలదు. ఒకజిల్లా 'సెటిల్‌మెంటు' చేయునపుడు సెటిల్‌మెంటు ఆఫీసరు, ఆజిల్లాలోనిభూములను కొన్నింటిని తనిఖీచేసి, అంతకుపూర్వము చేసిన సెటిల్‌మెంటునందలి సిస్తులను విమర్శించి భూములతరములు పరీక్షించి సెటిల్‌మెంటుమాన్యూలులో నున్ననిబంధనలంబట్టి పల్లపుభూములయు మెరకభూములయు సిస్తురేట్లను నిర్ణయించి సవిస్తరముగా నొకరిపోర్టు వ్రాసి దానిని రివిన్యూబోర్డువారికి కలెక్టరుద్వారా పంపును. ఆ రిపోర్టునే 'స్కీమురిపోర్టు' అందురు. ఆస్కీమురిపోర్టును పరిశీలించి తమ యభిప్రాయములతో రివిన్యూబోర్డువారు దానిం బ్రచురింతురు. అప్పుడును అంతకుపూర్వము సెటిల్‌మెంటు - ఆఫీసరు సిస్తురేట్లను నిర్ణయించునప్పుడు చేయువాకబుసమయమందును భూస్వాములును రయితులును దమతమ యాక్షేపణలను చెప్పుకొనవచ్చును. తరువాత రివిన్యూబోర్డువారియభిప్రాయములతోఁ బంపఁబడిన 'స్కీమురిపోర్టు'ను గవర్నమెంటువారు పరిశీలించి దానిపైని తుట్టకుదియుత్తరువును జారీ చేయుదురు. ఆయుత్తరువు ననుసరించి సిస్తురేట్లు కట్టి సెటిల్‌మెంటు ఖాయము చేసి పట్టా లీయఁబడును. మొదట స్కీమురిపోర్టులో సెటిల్‌మెంటు - ఆఫీసరు కట్టినరేట్ల నామోదించుటకుఁగాని తగ్గించుటకుఁగాని హెచ్చించుటకుఁగాని రివిన్యూబోర్డువారి కధికారము గలదు. అందుపైని గవర్నమెంటువా రుత్తరవు జారీచేయునపుడు రేట్లను మార్చుటకు వారి కధికారము గలదు. ఈ యధికారములంబట్టి సాధారణముగా స్కీమురిపోర్టులో సెటిల్‌మెంటు ఆఫీసరు సిఫారసు చేసినరేట్లను బోర్డువారు హెచ్చించుటయు, నారేట్లను మరల దొరతనమువారు హెచ్చించుటయు సంభవించుచుండుటంబట్టి స్వయముగా భూమిని జూచి పంటలు పరిశీలించి సిస్తు నిర్ణయించినసెటిల్‌మెంటు ఆఫీసరుసిద్ధాంతమెందులకును బనికిరాకపోవుటయుఁ దటస్థించుచుండును.

sampath_Ebooks

(ర) అడవి

పూర్వము హిందూరాజులకాలమున నడవికి విలువ గాని హక్కు గాని యున్నట్లగపడదు. జనులకు తమయిష్టము వచ్చినట్లు అడవిలోఁ దిరుగుటకును ఇష్టము వచ్చిన ప్రదేశములయందు సాగుబడి చేసికొనుటకును కలప మొదలగు అడవిఫలసాయమును స్వేచ్ఛగా ననుభవించుటకును అధికారముండెడిది. తరువాత మహమ్మదీయరాజుల కాలమందుఁగూడ మహారణ్యములలో నిట్టియధికారమే ప్రజల కున్నను గ్రామము లేర్పడినతరువాత నాయా గ్రామములకు సంబంధించి దాపున నున్నయడవుల నాయా గ్రామస్థులే అనుభవించువాడుక కలిగినది. దానింబట్టి గ్రామస్థులు తమ గ్రామములకు సంబంధించి దాపున నున్నయడవియందు వంటచెఱకు, కలప, ఆకులు, పండ్లు, కంప, గడ్డి మొదలగు నడవియందలి యుపయుక్తవస్తువు లన్నియు స్వేచ్ఛగా ననుభవించుచుఁ గాలము గడపుచుండిరి. ఇతర గ్రామస్థులు తమ గ్రామముతో సంబంధించిన యడవి ననుభవింపకుండునట్లు నివారింపకుండ నూరకుండుటయుఁ గలదు. అది గ్రామస్థులయిష్టముం బట్టియు, గ్రామస్థులశక్తినిబట్టియు, నడవియొక్క వైశాల్యమునుబట్టియు, నడవియొక్క స్వభావమునుబట్టియు జరగుచుండెను. ఆ కాలమందు కలప మొదలగునడవివస్తువులకు ఖరీదు లేదనియే చెప్పవచ్చును. అందువలన నవి అమ్ముకొనువాడుక లేదు. ఇండ్లు కట్టుకొనుటకును కలప, వ్యవసాయము చేసికొనుటకు కఱ్ఱలు కంప మొదలగునవియు, భూమి కెరువు కట్టుటకు సారుటాకులు మొదలగునవియు, గృహోపయోగము నిమిత్తము కట్టెపుల్లలును, ఆవులను ఎడ్లను గొఱ్ఱెలను మేఁకలను మేపుటకు గడ్డిగాదము మొదలగునవియు నవి తిరుగుటకుఁ గావలసినంత ప్రదేశమును వ్యవసాయదార్ల కత్యావసరము. గ్రామస్థులు వ్యవసాయదార్లగుటచేతను, వ్యవసాయమే ప్రధానవ్యాపారముగాఁ గలవారగుటచేతను వారి కడవి బహూపయుక్తముగాఁ గావలసినదైనది. వ్యవసాయదార్లగు గ్రామీణుల కడవియందలివస్తువులు వ్యవసాయమున కత్యవసరముగాఁ గావలసియుండుటంబట్టియు నట్టి వస్తువులు వారికి చేకూరనియెడల వ్యవసాయము జరగ దనుకారణముంబట్టియు వ్యవసాయమున కేవిధ మగునాటంకమును గలుగకుండఁ జేయుటకై గ్రామస్థులు తమతమ గ్రామములకు సంబంధించిన యడవులను స్వేచ్ఛగా ననుభవించుటకు నేవిధ మగునాటంకమును మహమ్మదీయప్రభువులు కల్పింపలేదు. కాని, అడవులలో నున్న మంచి గంధపువృక్షములు మొదలగు విలువగలచెట్లనుమాత్రము కొట్టకుండఁ గొంతవఱకుఁ గట్టుదిట్టము చేయుచుండిరి.

తరువాత నాంగ్లేయప్రభుత్వ మారంభ మైనపిమ్మట నే గ్రామముతో సంబంధించినయడవి నా గ్రామస్థులు స్వేచ్ఛగా ననుభవించుటకుఁ బ్రతిబంధింపక యే గ్రామముతోడను సంబంధింపకుండిన పెద్ద యడవులవిషయమున నేవిధ మయినయేర్పాటును జేయకయుండిరి. గ్రామస్థులు చాలకాలమునుండి వారివారి గ్రామములతో సంబంధించియుండునడవుల ననుభవించుచుండుటవలన వానియందు వారి కొక విధమయిన భుక్తమువలన సంభవించినహక్కు కలిగినది. కాని గ్రామముతో సంబంధించిన యడవి యెంత యనువిషయమును గూర్చి యోజించి నిశ్చయింపవలసినయవసరము కలిగినది. ౧౮౬౫-వ సంవత్సరమువఱకు నడవులవిషయమున నేవిధ మైనశాసనమును జేయుటకు దొరతనమువారు ప్రయత్నింపలేదు. కాని, అడవి పాడువడఁజేయకుండునట్లును గార్చిచ్చు మొదలగువానివలన దగ్ధము కాకుండునట్లును కొన్ని ప్రయత్నము లప్పుడప్పుడు చేయుచువచ్చిరి. ఇందువిషయమున నుచిత మగుపద్ధతులనుమాత్ర మేర్పఱుపలేదు. మనదేశముయొక్క శీతోష్ణస్థితినిబట్టియు మనదేశస్థులవృత్తివిశేషముంబట్టియు నడవి మిక్కిలి ముఖ్య మైనది. అడవులస్థితినిబట్టి శీతోష్ణస్థితియు వాతావరణగతియు అతివృష్టి, అనావృష్టులును నేర్పడుచుండు ననుసిద్ధాంతముంబట్టియు, మనదేశమునయందలి యడవులయందు సంభవ మగుచున్న మిక్కిలి విలువగల కలప మొదలగు వస్తువులయొక్క విశేషముంబట్టియు నడవులు మనదేశమునకు ముఖ్యము లైనవియు నమూల్యము లైనవియు నని పరిగణింపఁబడవలసివచ్చినది. ఆంగ్లేయు లీవిషయమును గ్రహించి, అడవులను గాపాడుటవలన దేశమునకును బ్రజలకును క్షేమ మనియు లాభ మనియు దొరతనమువారికి విశేషద్రవ్యాదాయము వచ్చుటకు సాధన మనియు గ్రహించిరి. ఈయుద్దేశముంబట్టి యడవులను కాపాడవలయు నని వారు నిశ్చయించికొని యాపనికై పూనుకొనిరి. అడవు లెవరిపరమందు నుండని వనుటచే దొరతనమువారికి సర్వస్వతంత్రత గలవిగా పరిగణింపఁబడవలెను. కాని జమీందారీ యెస్టేట్లు, జాగీర్లు, అగ్రహారములు, శ్రోత్రియగ్రామములు, తాలూకాదారీయెస్టేట్లు మున్నగువానికిని స్వతంత్రరాజ్యములకును సంబంధించినయడవులహక్కు వారిదే కాని గవర్నమెంటు దెంతమాత్రము కానేరదు. కాఁబట్టి సర్కారు - అడవి యేదియో, యితరుల - అడవి యేదియో ముందు నిర్ణయించుట కవసరము కలుగుటచే దొరతనమువారానిర్ణయమును గావించి పరిహద్దు లేర్పఱచిరి. దొరతనమువారియడవులయందు వారికి సర్వస్వతంత్ర మైన హక్కు కలదు గాని పూర్వమునుండియు గ్రామస్థు లనుభవించుచున్నహక్కుభుక్తములు కేవలము పరిగణింపఁబడకుండుటకు వీలు లేకపోయినది. ౧౮౬౫ - వ సంవత్సరముతరువాత నడవులను కేవలము నిరాకరించి విడిచిపెట్టుటకిష్టముకొనక గ్రామస్థుల కడవియం దున్న హక్కుభుక్తములవిషయమున పరిశీలించుచు 'నేయే గ్రామముతో సంబంధించునది యెంతో' అనుసంగతి సిద్ధాంతీకరించు నేర్పాటులను చేయుసాధనములను యోజించుచు నడవులను విస్తృత విచారణలకిచ్చుపద్ధతి నములులోనికిఁ దీసికొనివచ్చిరి. తరువాత గ్రామస్థులు తమతమ గ్రామములకు సంబంధించినట్టివియు, దమ కుపయుక్త మగునట్టివియు నగు నడవుల నిజారాకుఁ బుచ్చుకొనుపద్ధతి యేర్పడినది. ప్రస్తుత మములులో నున్న 'ఫారెస్టులా' ౫ - వ నెంబరు శాసనముగా ౧౮౮౨ - వ సంవత్సరమున జారీచేయఁబడినది. తరువాత మద్రాసుదొరతనమువారిందువిషయమున ౧౮౯౦ - వ

sampath Ebooks

సంవత్సరమునందు ౫-వ నెంబరు ఆక్టు జారీచేసిరి. ఈయాక్టు ౧౮౭౮-వ సంవత్సరమునందు చేయఁబడిన శాసనముకన్న విపులమైనది. ఈరెండుశాసనముల ననుసరించియు దొరతనమువా రేర్పరిచిన నిబంధనల ననుసరించియు నడవులవ్యవహార మిప్పుడు జరగుచున్నది.

అడవులను గాపాడి పెంచవలయు ననునుద్దేశముతో కొన్నింటిని ఆకట్టి 'రిజర్వుఫారెస్టు' లనియుఁ దక్కినవానిని ఆఁకట్టక 'అన్‌రిజర్వుడు ఫారెస్టు' లనియు రెండువిధములుగా విభజించిరి. గ్రామస్థులకు వ్యవసాయగృహోపయోగములవిషయమునఁ దప్పక కావలసినంత యడవినిమాత్రము ఆఁకట్టక 'అన్‌రిజర్వుడుఫారెస్టు' గా నుంచి తక్కినదానిని ఆఁకట్టుపద్ధతి నములులోనికిఁ దెచ్చిరి. మొదటి యిజారాపద్ధతిమీఁద నడవుల నమరుచుమార్గమును వదలిపెట్టి, అడవులను 'అమానీ' చేసి, అడవివస్తువు లన్నిటికిని 'ఫీజు' నిర్ణయించి, అట్టివస్తువులు నిర్ణయింపఁబడినఫీజు చెల్లించి, అసంరక్షితారణ్యముల నుండి గ్రామస్థులు తెచ్చుకొనునేర్పాటు చేసిరి. పెద్ద-అడవులలో నున్నగ్రామనికలప మొదలగువానికిఁ గూడ ఫీజురేట్లు నేర్పరిచిరి. ఈపద్ధతు లన్నియు నాఁకట్టఁబడక సంపూర్ణముగాఁ దెరిఁగినయడవుల యందే అములు జరపఁబడుచున్నవి గాని ఆఁకట్టఁబడినయడవులయందములు జరపుట లేదు. అట్టియడవులలోఁ బ్రవేశించినను ఏకలపగాని కొట్టినను శిక్షించువిధిమూడ నేర్పఱుపఁబడినది. ఈపద్ధతుల ననుసరించి గ్రామస్థులు వ్యవసాయముకొఱకుఁగాని గృహోపయోగమునకైకాని కావలసిన యడవివస్తువు లన్నిటికిని పన్ను చెల్లించి తెచ్చుకొనవలసిన యవసరమును, దుమ మేఁకలు గొఱ్ఱెలు ఆవులు మొదలగువాని నడవిలో మేపుకొన్నందులకు పన్ను, అనఁగా పుల్లరి చెల్లింపవలసినయవసరమును గలిగినది. అడవిలోఁ బుట్టిన మైనము, తేనె, లక్క, బెరడు, ఆకులు, బంక మొదలగు సర్వపదార్థములును తెచ్చుకొనుటకుఁగూడ పన్నురేట్లు కట్టఁబడుటవలన నడవివస్తు వేదియు నెవ్వరును స్వేచ్ఛగాఁ దెచ్చుకొని వాడుకొనుటకు వీలు లేదు.

జమీన్‌దారీయెస్టేట్లు, శాశ్వతపు-అమరకపుపద్ధతిలో నున్న అగ్రహారములు, శ్రోత్రియములు, ముఖాసాలు, జాగీర్లు మొదలగువానిలోఁ జేరిన అడవు లాయాయధికారులహక్కు భుక్తములు కలిగి వారిసంపూర్ణాధికారమునకు లోఁబడి యుండుటచేత నాయా యడవులయమరకమువిషయమున వారియిష్టానుసారముగా వ్యవహరించుకొనుట కవకాశము గలిగియున్నది. ఇట్టి ప్రైవేటు అడవులపై వానిహక్కుదారులు చేసికొనునేర్పాటులయందు సర్కారువారి కేవిధ మగుజోక్యమును లేదు. కాని సర్కారువారి యడవికి నష్టము వచ్చునట్లు వారు వ్యవహరించినయెడల దొరతనమువారు జోక్యము కలుగఁజేసికొనుటకుమాత్రము 'ఫారెస్టులా' లో అవకాశము నేర్పఱుచుకొనిరి. ఇప్పటి దేశకాలస్థితులనుబట్టియు నడవివస్తువులధరలనుబట్టియు నడవులు మిక్కిలి లాభకరము లైనవియు ఖరీదు గలవియు నగుటయే కాక కొన్నిచోట్ల సేద్యము సేయుప్రదేశములకంటెఁగూడ ముఖ్యమైన వయినవి.

## వేఱుపరగణాలలోని అమరకపు పద్ధతి

మదరాసురాజధానిలో రైతువారీ అమరకపుపద్ధతి ముఖ్యమైన దయినను జమీన్‌దారీ అమరకపుపద్ధతిగూడ కలదు. ఈరాజధానిలో ౫-వ వంతుప్రదేశము జమీన్‌దారీ అమరకపుపద్ధతిక్రింద నున్నది. బంగాళరాజధానియంతయు జమీన్‌దారీపద్ధతిమీఁదనే అమరకము చేయఁబడినది. సంయుక్తరాష్ట్రము, పంజాబు, మధ్యపరగణాలయందు గ్రామమును ముఖ్యముగా నెంచి గ్రామవారీసెటిలుమెంటుపద్ధతిని అమరకము చేయఁబడినది. అట్టి గ్రామవారీఅమరకపుపద్ధతిలో గ్రామమున కంతకును ఒకఁడే హక్కుదారుగాఁగాని, గ్రామసముదాయ మంతయుఁ గలసి హక్కుదారులుగాఁ గాని యుండినను సెటిలుమెంటురికార్డులో తప్పక వ్రాయఁబడినను శిస్తువసూలుపద్ధతిమాత్రము రైతువారీని గాక గ్రామ మంతకును మొత్తముగా తత్తదధికారులవలన వసూలు చేయఁబడును. ఈ గ్రామవారీసెటిలుమెంటును రయితువారీ సెటిలుమెంటువలె ౩౦ సంవత్సరములుమాత్రమే పరిమితిగలది. బొంబాయిరాజధానిలో నక్కడక్కడ నితరవిధము లైన అమరకపుమార్గము లున్నను సాధారణముగా మదరాసురాజధానియందువలెనే రైతువారీ అమరకపుపద్ధతియే వాడుకలో నున్నది. అయోధ్యలో ౧౮౫౭-వ సంవత్సరమున జరిగిన పితూరీ తరువాత నక్కడ నున్న పెద్దపెద్దభూస్వాములను బలవంతు లైననాయకులను సర్కారువారిక్రింద నున్నయెస్టేట్లకు తాలూకాదారు లన్ననామముతో సర్వాధికారులుగా నంగీకరించి బంగాళరాజధానియం దున్నజమీన్‌దారులకంటెఁ గూడ నెక్కువస్వాతంత్ర్యము కలిగియుండునట్లు అమరకపుమార్గ మేర్పఱుపఁబడినది. 'అస్సాము' దేశములోని అమరకము రయితువారీఅమరకమువంటిదే. అయినను ఇచ్చట నున్నన్నికట్టుఁబాట్లతో నింతియుండ లేదు. బర్మాదేశములో వ్యవసాయము పూర్వపద్ధతినే జరపఁబడుచుండుటవలన నక్కడి యమరకపుపద్ధతులు సులభము లైనవియు భూమిపన్ను సులభ మైనదిగాను ఉన్నది. ఈ యమరకపుపద్ధతులనుగూర్చి వేఱు వేఱుగా వివరింపఁబడుచున్నది.

## జమీందారీ అమరకము

శాశ్వతపుహక్కుతో జమీన్‌దారీపద్ధతిని జేయఁబడిన యమరకము బంగాళరాజధానియం దంతటను మదరాసు రాజధానిలో ౫-వ వంతుప్రదేశమందును వాడుకలో నున్న దని యింతకుమున్నె వ్రాయఁబడినది. గవర్నరుజనరల్ అను 'కార్నవాలీస్' ప్రభువు బంగాళరాష్ట్రము (బంగాళము, బేహారు, ఒరిస్సా) లో శాశ్వతపుహక్కుగల జమీన్‌దారీఅమరకపుపద్ధతిని (Permanent Settlement) ౧౭౯౩-వ సంవత్సరములో అమరకము చేసెను.

'లార్డుకార్నవాలీసుప్రభువును', కంపెనీయుద్యోగి యగు 'సర్జాన్‌షోర్' గారును కొన్ని టెంపొరరీఅమరకపు పద్ధతులను అవలంబించి చూచిరి. అవి తృప్తికరములుగా నుండనందున జమీన్‌దారులు

sampath_Ebooks

రైతులయొద్దనుండి సిస్తు వసూలు చేయుటకు నొకవిధమైన అధికారమును, తమజమీన్ దారీయెస్టేట్లయందలి భూములయందు హక్కు గలిగియుండనియెడల సిస్తు వసూలగుటయే దుర్ఘటమని యెంచి వారి కొకవిధమైన యధికారమును గౌరవప్రపత్తియు భూములయందు హక్కును గలుగఁజేయుట అత్యావసరమని యెంచి ౧౭౯౩-వ సంవత్సరమున జమీన్ దారులకు వారివారి క్రిందనున్న యెస్టేట్లయందు వంశపారంపర్యముగా వచ్చు శాశ్వతపుహక్కును దానవిక్రయాదు లాధికారములను కలుగఁజేసి వారీయవలసినసిస్తు (పేష్కష్) మొత్తము చెల్లించుచున్నంతవఱకు వారు యథేచ్ఛముగా ననుభవించి తమతమయెస్టేట్లను బాగుపఱుచుకొనఁగలుగునట్లు గావించిరి. బెనారెస్ (కాశీ) పరగణాసూడ నీపద్ధతినే ౧౭౯౫-వ సంవత్సరమున అమరకము చేయఁబడినది.

నార్తర్న్ సర్కార్లసూడ నీవిధముగానే జమీన్ దారీఅమరకపుపద్ధతి నమరకము చేయవలసిన దని ౨౧-వ ఏప్రిల్ ౧౭౯౫-వ సంవత్సరమున 'కోర్టు ఆఫ్ డైరక్టర్సు' వారు మదరాసుదొరతనమువారికి ఆజ్ఞ పంపిరి. కాని, మదరాసుదొరతనమువారి కాపద్ధతి యీరాజధానిలో నవలంబించుట కంతగా నిష్టము లేకపోయినది. ౧౭౯౮-వ సంవత్సరమున జమీన్ దారీపద్ధతి తప్పక అవలంబింపవలసిన దని కఠినమైనయుత్తరువును జారీచేయుటవలన నీజిల్లా లన్నియు జమీన్ దారీ యెస్టేట్లుగా నేర్పఱచి అప్పటి కున్నయెస్టేట్లను యథాస్థితిగా నుంచి వారు చెల్లింపఁదగిన 'పేష్కష్' మొత్తమును నిర్ణయించుటకు సమకట్టిరి. ఉత్తరసర్కార్లు కంపెనీవారిస్వాధీనమునకు వచ్చినతరువాతఁ గొన్ని సంవత్సరము లమరకమువిషయమున గట్టిప్రయత్నము లేవియు జరుపక యథాస్థితముగానే పోనిచ్చిరి. తరువాత ప్రతిజమీన్ దారీ యెస్టేటుయొక్క రాబడిని తెలిసికొనుటకు 'ఎస్టేట్సురిజస్టర్లు' (Estates' register) అనుపేర ౧౦ సంవత్సరముల లెక్కలు తయారుచేయించిరి. తరువాత జమీన్ దారీగ్రామముల కుడికట్టు, శిస్తు, నాఖరుగు వగైరాభూములనుగూర్చి ౧౨ సంవత్సరముల లెక్కలు తయారుచేయించిరి. ఈలెక్కలనే 'బారాఫసలీ' లెక్కలందురు. ఒకకమిటీని నిర్ణయించి ఆకమిటీ దేశమంతయుఁ దిరిగి జమీన్ దారీయెస్టేట్లస్థితిగతులను వానిమీఁద వచ్చు పన్నుమొత్తమును నిర్ణయించుట కొకయేర్పాటు చేసిరి. ఈకమిటీనే 'సర్క్యూటు కమిటీ' యందురు. వీరును కొన్ని లెక్కలు తయారుచేసిరి. తరువాత ౧౮౦౨-వ సంవత్సరములో జమీందారీయెస్టేట్లమీఁద విధింపఁబడిన 'పేష్కష్' మొత్తమును నిర్ణయించుట కేర్పాటు చేసి ఆసంవత్సరము జారీచేసిన ౨౫-వ నెంబరు 'రెగ్యులేషన్' ను బట్టి జమీన్ దారీ అమరకపుపద్ధతి నుత్తరసర్కార్లలో నమలునకుఁ దీసికొనివచ్చిరి. ఇట్లు జమీన్ దారీపద్ధతి నమరకము చేయునప్పుడాయాజమీన్ దారీ యెస్టేట్లవలన వచ్చుసిస్తుమొత్తము లెక్కచూచి సేద్యములో లేని భూమికిఁగూడ కొంతసిస్తు కట్టి అట్టిమొత్తములో సాధారణముగా 3 వంతులలో ౨ వంతులు పేష్కషుగా నిర్ణయించిరి. పర్వతప్రాంతములయం దున్నజమీన్ దార్లహక్కులకును వెల్లడిప్రదేశములయం దున్నజమీన్ దారీహక్కులకును కించిత్తు భేదము చూపించిరి. పర్వతప్రదేశములయం దున్నజమీన్ దారులను సంపూర్ణముగా స్వాధీనపఱుచుకొనుటకును లొంగఁదీయుటకును వీలు గలుగకపోవుట వలన వారికిఁ గొన్ని యెక్కువస్వాతంత్ర్యము లీయవలసివచ్చినవి.

ఉత్తరసర్కారులలో నున్నజమీన్ దారులు సాధారణముగా మూఁడువిధములుగా నున్నారు.

౧. పూర్వరాజుల సంతతిలోనివారు గాని, సామంతనాయకులు గాని, పూర్వరాజులకు భూమిపన్ను వసూలు చేసి చెల్లించుట కేర్పఱుపఁబడినవారు గాని యొకతెగవారు.

౨. మొగలాయీల ప్రభుత్వకాలమందు మొగలాయీ చక్రవర్తులక్రింద భూమిసిస్తు వసూలు చేయుట కేర్పఱుపఁబడిన పెద్దయుద్యోగులసంతతివారు. వీరిని దేశముఖ దేశపాండ్యా లనుచుండిరి.

(3) హవేలీభూములు కవులు పొందినవారు.

ఉత్తమండలమందును కన్నడదేశమందును ఈజమీన్ దారీ-అమరకముక్రింద నున్న 'పాళెగాండ్రు' నాలుగువిధములుగా నున్నారు.

౧. పూర్వరాజులసంతతిలోనివారు.

౨. బందిపోట్లు దారిదోపుడు మొదలయినపనులు చేయువారికి నాయకులుగా నుండి దేశమందలి జనులకు నష్టములు కలుగకుండునట్లు ప్రజలను కాపాడు పోలీసుఉద్యోగము చేసినందులకు నియోగింపఁబడినవారియొక్క కాని, అట్టి యుద్యోగమును తమంతట తామే కల్పించుకొని సెలవేర్పఱుచుకొన్నవారియొక్క కాని సంతతివారు.

3. హిందూరాజులక్రింద గొప్పయుద్యోగములు చేసి వారు చేసినయుపకారములకుఁ బారితోషికముగాఁ గాని అట్టిరాజులు కొరినప్పుడు కాల్బలమును సప్లయిచేయుటకును సమకూర్చునపద్ధతిని ఆసీనలను భరించుటకుఁ గాని యీయఁబడిన గ్రామములును పరగణాలు ననుభవించువారిసంతతివారు.

౪. జిల్లాలను ఇజారా పాడినవారియొక్క కాని గొప్ప రెవిన్యూయుద్యోగులయొక్క కాని తుదకుఁ బ్రబలులైన గ్రామోద్యోగులయొక్క కాని సంతతివారు.

పూర్వము హైదరాబాదునవాబువారి స్వీయోపయోగముకొఱకును, సర్కారు ఉపయోగమునిమిత్తమును, నుత్తరసర్కారులలోఁ గొన్ని ప్రదేశములు 'హవేలీ' లేక 'సర్కారు' భూములక్రింద నుండెను. మఱియు నేలంజిల్లాలో సర్కారు లేక 'అమానీ' భూము లనుపేర కొన్ని ఎస్టేట్లును ముఠాలు నుండియుండెను. అట్టి వాని నన్నింటిని దొరతనమువారు వేలము పాడి యెక్కువసిస్తు కట్టుకొన్నవారికి జమీన్ దారీయెస్టేట్లవలె ఆపద్ధతులమీఁదనే శాశ్వతపుకవులున కమరకము చేసిరి. ౧౮౦౨-వ సంవత్సరమున జారీ చేయఁబడిన 'రెగ్యులేషన్' ను బట్టి జమీన్ దారులకు వారియెస్టేట్ల

 sampath_Ebooks 

రైతు సర్వస్వతంత్రాధికార మున్నట్లగపడుచున్నది. కాని తరువాత ౧౮౨౨-వ సంవత్సరములో ౪-వ నెంబరు 'రెగ్యులేషన్' జారీ చేయబడినది. ఈచట్టములో స్పష్టముగ నేమి చెప్పబడియున్న దనగా ౧౮౦౨-వ సంవత్సరపు ౨౫-వ చట్టమువలన రైతున కదివరకున్న యేహక్కును తీసివేయబడలేదు, అనగా నాచట్టమువలన రైతుహక్కు తీసి జమీన్‌దారున కీయబడలేదు. ఇందునుగూర్చి కొన్ని తీర్పులును బుట్టియున్నవి. ౧౯౦౮-వ సంవత్సరపు ౧-వ ఆక్టులోని ౬-వ సెక్షనులో వాడబడిన 'స్వామ్యస్వాధీనత' (Proprietary Possession) అనుపదమును పారిభాషిక (Technical) పదముగ నెంచి గవర్నమెంటునకు స్వయముగ పన్ను చెల్లించుచున్నవాడని అర్థము చేయవలెను. భూమియందు సర్వాధికారి యని అర్థము చేయగూడదు.1 రైతుయొక్క హక్కులు దొరతనమువారికి బూర్వమే (వారు ఈయకుండగనే) పుట్టినవి గనుక, గవర్నమెంటువారు తమకు భూమియందుగల హక్కును మాత్రమే యీయగలరు గాని రైతునకుగల స్వామ్యము నీయలేరు. దొరతనమువారికి, మేల్వారమ్, కుడివారమ్ అను రెండు హక్కులును కల గయారుభూములుంటివానివిషయమున వారు, ఈరెండుహక్కుల నీయగలరేకాని, తక్కిన యన్నిభూములవిషయమున ఒక్క మేల్వారమ్ (పన్నువసూలు చేసికొను) హక్కు మాత్ర మీయగలరు.2

ప్రివికౌన్సిలువారు నిమ్మన్యను చేసినతీర్పులలో పూర్వపురాజులకును, వారివల్ల నెలకొలుపబడిన జమీన్‌దార్లకును జమీన్‌దారీలలోని భూములయందు స్వామ్యము గల దనియు, వారగ్రహారములు, ఈనాములు ఇతరులకు ఇచ్చినప్పుడు కేవలము మేల్వారము, అనగా పన్ను వసూలు చేసికొనుహక్కుమాత్రమే అగ్రహారీకులకు ఈనాందార్లకు నిచ్చినట్లు ఎంచవలెననియు, రయితులకు అట్టి అగ్రహారములలోను ఈనాములలోను జిరాయితీహక్కుగలదా లేదా అను విషయము ఏకేసులో వచ్చినసాక్ష్యమునుబట్టి ఆకేసులో తీర్మానించవలసియుండు ననియు తీర్మానించి యున్నారు. పూర్వపురాజులకు భూములలో స్వామ్యము గల దని ప్రివికౌన్సిలువారు చెప్పిన అభిప్రాయమునకు ఆధారములు అంతగా కానరావు.

ఈరెండు రెగ్యులేషనులబట్టియు జమీన్‌దారీఅమరకపుపద్ధతి యిప్పటికి వ్యవహరింపబడుచున్నది. ఈ యమరకపుపద్ధతిని విధింపబడిన 'పేష్‌కష్' భూమిపన్ను శాశ్వతమైనది. రైతువారీఅమరకమునందువలె వీరి సర్కారుమునగాని 'రిమిషన్' అనగా పన్ను కొట్టివేయుట అమలు జరపబడదు. జమీన్‌దారులకు వారివారియెస్టేట్లనుగూర్చి "సనద్-ఇ-ముల్క్-ఇస్తిమిరార్" అను శాశ్వతపుపట్టా లీయబడి వారివలన 'కబూలీయత్' అను ముచ్చిలకాలు తీసికొనబడినవి. ఈపట్టాలనుబట్టి ఉప్పుపన్ను మూరికారము పన్ను సాయరురేట్లు, సముద్రముమీదనుండి కాని భూమిమీదనుండి కాని వచ్చుసరకులమీద పన్నులు, కల్లు, సారా మొదలగు మత్తుద్రవ్యములమీదిపన్నులు, నాగరుదుభూములమీది పన్నులు, అదివరకు నౌకరీనిమిత్త మీయబడినభూములమీది పన్నులు, మోతర్ఫాపన్నులు మొదలగునవిమాత్రము వసూలు చేయుటకు జమీన్‌దారుల కధికారము లేదు. కాని తోటలు, చెట్లు, పుల్లరిభూములు, చేపలు పట్టుప్రదేశములు, కొత్తగా నాక్రమించి సాగుచేయబడుభూములు, దుకాణము మొదలగు నితరకట్టడములు మొదలగువానినుండి పన్ను వసూలు చేయుట కధికార మీయబడినది. చెఱువులను సరియైనస్థితిలో నుంచినందుల కీనాందారుల వలన జమీన్‌దారుల కీయబడు 'ఘట్టుతూములు' అను పన్ను జమీన్‌దారు వసూలు చేసికొనవచ్చు నని తీర్మానింపబడినది. ఈవిధముగా జమీన్‌దారుల కుంతస్వాతంత్ర్యము లన్నియు స్పష్టముగా నిశ్చయింపబడినవి. జమీన్‌దారు తనయిష్టము వచ్చినట్లు అంతయుగాని కొంతమాత్రము గాని దానవిక్రయాదిమనములు చేయుట కధికార మీయబడినది. అట్లు జమీన్‌దారులచే విక్రయింపబడినది, దత్తములు, అయినజమీన్‌దారీలలోని భాగము వేఱుజమీన్‌దారీలుగా విభజించి వానిమీద 'పేష్‌కష్' పంచి కట్టి శాశ్వతపుహక్కు గలుగునట్లు చేయుటకు కలెక్టరుల కధికార మీయబడినది.

ఇట్లు శాశ్వతపుహక్కుతో జమీన్‌దారీపద్ధతులమీద అమరకము చేయబడిన జమీన్‌దారీయెస్టేట్లలో చాలకాలమువఱకును రైతులయొద్దనుండి జమీన్‌దారులు పన్ను వసూలు చేసికొనుటకు తగినయేర్పాటులు చేయబడి యుండకపోవుటచేతను పన్నులు చాల భాగము రైతువల్ల చెల్లక బకాయి పడిపోవుటవలనను, జమీన్‌దారులు తాము సర్కారునకు చెల్లింపవలసిన 'పేష్‌కష్' చెల్లింపలేక పోవుట తటస్థించుచువచ్చినది. అట్లు 'పేష్‌కష్' చెల్లింపలేని యెస్టేట్లను దొరతనమువారు వేలము వేసి బాకీ మొత్త మిచ్చినవానికి మరల పూర్వపుషరతులతో శాశ్వతపుహక్కుతో పేష్‌కష్ నిర్ణయించి వేలంపాటమీద విక్రయించుచువచ్చిరి. తరువాత కొంతకాలమునకు, అనగా ౧౮౬౬-వ సంవత్సరమునకు పిరాయితీ నట్లు పేష్‌కష్ చెల్లింపలేనియెస్టేట్లను విభజించి కాని యేకముగా గాని పూర్వపుఅమరకపుపద్ధతికే అమర్పక రైతువారీపద్ధతి ననుసరించి యమరకము చేయ నారంభించిరి. ౧౮౬౫-వ సంవత్సరమున 'రెంటు రికవరీ' ఆక్టు అనుచట్టము జారీచేయువఱకును జమీన్‌దారులకు తమతమరైతులయొద్దనుండి పన్ను వసూలు చేయుటకు దగినచట్టమే లేకపోయెను. ఇందువిషయమున కొన్ని రెగ్యులేషనులు, నిబంధనలు ఉన్నను అవి అంతగా బని చేయునవిగా నుండలేదు.

1. The Collector of Trichinopoly, V. Lakkamani I. 1. A. 282; 14 Ben. L. R. 115; 21 W. R. 358.
2. 1 Mad. 205 (212); 16 Mad. 271; 20 Mad. 299 (302); 26 Mad. 252.

sampath_Ebooks

## మద్రాసు ఎస్టేటులాండ్ ఆక్టు

తరువాత ౧౮౦౨-వ సంవత్సరములో జమీన్దారీరయితుల కును జమీన్దారులకునుగల భూవిషయమునుగూర్చియు శిస్తువిషయ మునుగూర్చియు సంబంధములను పద్ధతులను విపులముగా నిర్ణయించి యేర్పఱుపఁబడినవి. ఇట్టిజమీన్దారీయెస్టేట్లలోఁ గొన్ని అవిభక్తము లనుజమీన్దారీలుగా నెంచఁబడి ౧౯౦౪-వ సంవత్సరమున నొక చట్టము నిర్ణయింపఁబడినది. జమీన్దారీ గ్రామ సేవకులవిషయమున ౧౮౯౪-వ సంవత్సరములో నొకచట్టము జారీచేయఁబడినది. ఇది జారీచేయుటకుఁ బూర్వము ౧౮౬౫-వ సంవత్సరములో జారీ చేయఁ బడిన ౨౫ - ౨౯ నెంబర్లు రెగ్యులేషనులనుబట్టియే వ్యవహారము జరపఁ బడుచువచ్చినది. జమీన్దారులకు తమయెస్టేట్లలో నున్న ఖనిజములు, లోహములు, రత్నములు మొదలగు నన్నివస్తువులను త్రవ్వుకొనుటకు సర్వాధికారము గలదు. వారు త్రవ్వించినచెఱువులు, నీటికాలువలు మొదలగువానివలన రైతుల కీయఁబడిననీటికి నీటిపన్ను వసూలు చేసి కొనుటకుఁగూడ నధికార మున్నది. సర్కారునీటి నుపయోగించు కొనినయెడల నానీటిపన్ను సర్కారునకే చెల్లును. దీనివిషయమున ౧౮౬౫-వ సంవత్సరమున జారీకాఁబడి ౧౯౧౩-వ సంవత్సరమున సవరింపఁబడినచట్టమునుబట్టి అమలు జరపఁబడుచుండును.

జమీన్దారీయెస్టేట్లపైని పేష్కష్ నిర్ణయించునపుడు, ఆయా యెస్టేట్లరాఁబడిని పూర్వపులెక్కలను బట్టి నిర్ణయించి యేర్పఱుపఁ బడినది. ఆకాలములో కంపెనీవారికి సరియైనలెక్కలు దొరకక పోవుటచేతను, ఆయాయెస్టేట్ల మంచిచెడ్డలు తెలిసికొనుట కవకాశము లేకపోవుటచేతను, అప్పటికి దొరకినలెక్కలనుబట్టి అమరకము చేయఁబడినది. పోరంబోకులు, గ్రామకంఠములు, గ్రామస్థు లుమ్మడిగా ననుభవించుట కేర్పఱుపఁబడినప్రదేశములు, చెఱువులు, నీటికాలువలు మొదలైనవి, ధర్మాదాయములు, అగ్రహారములు, శ్రోత్రియ ములు మొదలగు నీనాముభూములును ఎస్టేట్లమొత్తపు ఆదాయములో నుండి తగ్గింపఁబడి వానిపై పేష్కష్ చెల్లింపఁబడకపోవుటచే జమీన్దారులు తమయిష్టము వచ్చిన ట్లుపయోగపఱుచుకొనుటకును వీలు లేకపోయినది. అట్టిప్రదేశము లుపయోగపడినప్పుడు వానిమీఁద న్యాయ్యమైనశిస్తు కట్టి అది పేష్కష్‌లోఁ జేర్చి ఆభూములు జమీన్దారులకే యియ్యఁబడును. ఇట్టివిషయములనుగుఱించి బోర్డు స్టాండింగుఆర్డరులలో నున్ననిబంధనల ననుసరించి వ్యవహారము జరపఁ బడుచుండును. జమీన్దారీయెస్టేట్లలో నున్న అనాదబంజరుభూమి యందును, బంజరుభూమియందును, సొంతసేరీభూములయందును జమీన్దారులకు స్వతంత్రమయి సంపూర్ణమయిన హక్కు గలదు. జమీన్దారీయెస్టేట్లయం దున్నయడవులమీఁద వారికి సంపూర్ణమైన హక్కు కలిగియుండుటవలన వానిని వారి కిష్టము వచ్చినట్లు వ్యవహరించుట కధికారము గలదు. రయితుల పట్టా భూములలో నున్నచెట్లహక్కు ౧౯౦౮-వ సంవత్సరపు ౧-వ నంబరు ఆక్టు అనఁగా మద్రాసు ఎస్టేటులాండు ఆక్టునకు పూర్వము జమీన్దారునకు రయితునకును మధ్యను జరగినయేర్పాట్లనుబట్టి అనఁగా పట్టాముచ్చిలకాలలోని షరతులనుబట్టి నిర్ణయింపఁ బడుచుండిన ఎస్టేటులాండుఆక్టులో జరగిన మార్పుప్రకారము ౧౯౦౮-వ సంవత్సరము జూలై ౧-వ తేదీకి పూర్వమం దున్న చెట్లహక్కు, ఆచారమువల్లఁగాని రైతులచే వ్రాయఁబడిన ఒప్పు దలప్రకారము గాని జమీన్దారున కున్నయెడల వానిదే, లేని యెడల నాహక్కు జిరాయితీరైతుదే. ఆతేదీతరువాతఁ బాతినచెట్ల హక్కు రైతులదే (౧౨-వ సెక్షన్). చెఱువులు, ఆఱులు, జలా శయములు, కొండకాల్వలు మొదలగువానియందు చేపలను పట్టు కొనువారిపైని పన్ను వేయుటకుఁగూడ వారికి సంపూర్ణమైన అధి కారము కలదు. మహమ్మదీయప్రభుత్వకాలమందు కొన్నివిధము లయిన 'సాయరు' పన్నులు వసూలు చేయుటకు, యాత్రికుల యొద్దనుండియు వివాహాదిశుభకార్యములు జరగినప్పుడును కొన్ని పన్నులు వసూలు చేయుటకు, తహస్సీలుపన్ను గోడ్డుపన్ను మొద లయిన కొన్నిపన్నులుగూడ వసూలు చేసికొనుటకు జమీన్దారుల కధికార ముండెను గాని ఆంగ్లేయులప్రభుత్వ మారంభమైనతరు వాత నట్టిపన్నులలో కొన్ని అన్యాయ్యమని అపుడే కొట్టివేసి తక్కినవానిని వసూలు చేసికొనుటకుఁగూడ వీరి కధికారము లేకుండఁ జేసిరి.

జమీన్దారీయెస్టేట్లలోఁ బ్రవహించు నదీగర్భములయొక్క హక్కు జమీన్దారులదే యని నిశ్చయింపఁబడెను. జమీన్దారు భూమిలో నట్టియేటిపరినుండి యేఱు తగ్గినప్పుడు బయలుపడిన ప్రదేశము జమీన్దారునిహక్కు కలది యగుటవలన నాజమీన్ దారు దాని నిష్టము వచ్చిన ట్లనుభవింపవచ్చును. అప్పుడప్పుడు నీటిముంపుల కాసించుచు నదియొడ్డునఁ దేలినభూములు జమీన్ దారునివే. అట్లు కాక పెద్దపెద్దనదులకు సంబంధించిన యిసుక నేలలో దగ్గరగడ్డి యేటివఱదవచ్చినప్పుడు వండుమన్నువలన పెంచఁబడిన భూములు లంక లనఁబడును. ఈలంకప్రదేశములు కొన్ని జమీన్ దారులకు సంపూర్ణమైన హక్కుకలవి. కొన్నిటిలో రయితులకు జిరాయితీహక్కు గలదు. గవర్నమెంటు గ్రామములలో నున్న లంక భూములు సిటెలు మెంటులంక లనియు పసుపైరుభూము లనియు నిజారాలంక లనియు మూఁడువిధములుగా సర్కారువారు విభజించిరి. పసుపైరుభూములు (సర్కారు సిటెలుమెంటులంకలు) ౩౦ సంవ త్సరముల కొకసారి తక్కినజిరాయితీభూములవలెనే సిటెలుమెంటు కాలమందు శిస్తు ఏర్పఱుపఁబడి అమరకము చేయఁబడుచుండును. ఇజా రాలంకలు కొన్నిసంవత్సరముల కొకసారి వేలముపాడి యెక్కువ శిస్తు పెట్టినవారికి కొన్నిసంవత్సరముల కమరకము చేయఁబడుచుండును. జమీన్దార్లు తమ యెస్టేట్లలోని గ్రామములను జిరాయతీరయితులకుఁగల హక్కులకు భంగములేకుండ భూములను కొన్నిసంవత్సరముల కిజారా కిచ్చుటకుఁగాని కొంతశిస్తు కట్టి, కట్టుబడిక్రిందను, నిమెబడి క్రిందను నిచ్చుటకుఁగాని నౌకరీనిమిత్తము గాని అనుగ్రహపూర్వక

sampath_Ebooks

ముగాఁ గాని దానపూర్వకముగాఁ గాని యిచ్చుటకును అధికారము కలదు. జమీన్‌దారీ గ్రామములో నున్న జిరాయితీభూములయందలి ఫలసాయము రెండుభాగములుగా వ్యవహరింపఁబడుచున్నది. అందులో జమీన్‌దారునకు రావలసినభాగము మేల్వార మనియును (మేల్వార మనియును), రయితుభాగము కుడివార మనియుఁ జెప్పఁబడును. దీనిం బట్టి జమీన్‌దారుయొక్కయు రయితుయొక్కయు హక్కు మేల్వారపుహక్కనియు, కుడివారంహక్కనియు వరుసగాఁ జెప్పఁబడును. పర్మనెంటుసెటిలుమెంటుతరువాత జమీన్‌దారులచే నౌఖరీకి జీతముక్రింద నియ్యఁబడిన యీనాంభూములు మొదలయినవి వారి కానౌఖరీ అవసరము లేనప్పుడును దయాపూర్వకముగా నిచ్చిన యీనాంభూము లీనాందార్ల సంతతి యంతరించినప్పుడును, అట్టి భూములు వారు సిస్తుకట్టి అమర్చుకొనుటకు హక్కు గలదు. కొన్ని గ్రామములను గొన్ని సంవత్సరములవరకున కిజారా కిచ్చుపద్ధతి సర్కారువా రొకప్పు డవలంబించినను నిప్పు డాపద్ధతి వదలిపెట్టిరి.

గోదావరిజిల్లాలో నున్న భద్రాచలము, నూగూరు, చెర్ల అల్బాకా అనుతాలూకాలలో నింకొకవిధమగు అమరకపుపద్ధతి కలదు. ఆజిల్లాలలో రైతువారీఅమరకపుపద్ధతితోఁగూడ నొకవిధమగు ప్రొప్రైటరీజమీన్‌దారీఅమరకపుపద్ధతికూడ నున్నది. ఆయమరకపుపద్ధతి ననుసరించి 30 సంవత్సరముల కొకసారి కొన్ని గ్రామములు ఎస్టేట్లుగా విభజించి ఒక్కొక్కనికిఁ గొంతమొత్తమున కమరకము చేయుపద్ధతి వాడుకలో నున్నది. ఇట్టి యమరకమును బొందు వారు 'సుపీరియర్ ప్రొప్రైటర్సు' అనియు 'ఇన్‌ఫీరియర్ ప్రొప్రైటర్సు' అనియు రెండుతెగలవారుగా నేర్పఱుపఁబడి సర్కారుతో నీవిధమయిన అమరకపుపద్ధతిలో నున్నారు. ఈతాలూకాలు మన్య పరగణాలలోఁ జేరిన వగుటచేత నక్కడ వాడుకలో నున్నపద్ధతినిబట్టి అట్టియమరకమే యీతాలూకాలలోఁ గావింపఁబడినది. ఇది మధ్యపరగణాలలో నున్న మాల్గుజారీపద్ధతివంటిది.

శాశ్వతపుసెటిలుమెంటునకు పూర్వము ౫౦ సంవత్సరముల నుండి పన్ను చెల్లించుచు ననుభవించుచున్న హేతువుంబట్టి శాశ్వతపుసెటిలుమెంటుకాలమున శాశ్వతపుపట్టాలు సర్కారీయ నిశ్చయించినప్పు డందుల కిష్టపడక శాశ్వతపుసనదులు చెందని పాళ్యములతరగతిలోఁ జేరినకొన్ని యెస్టేట్లుకూడఁ గలవు. అట్టి పాళ్యములను 'అన్‌సెటిల్డుపాళ్యము' లందురు. ఇట్టి పాళ్యములకును శాశ్వతపుహక్కుతో నమరకము చేయఁబడినజమీన్‌దారీయెస్టేట్లకును గలభేద మేమనఁగా, జమీన్‌దారీయెస్టేట్లమీఁది పేష్కషు హెచ్చించుటకు సర్కారువారి కెన్నఁటికిని స్వతంత్రత లే దనియు, 'అన్‌సెటిల్డుపాళ్యముల' విషయమున నాయాపాళ్యములస్థితిగతులంబట్టి పేష్కషు హెచ్చించుటకును, తగ్గించుటకును సర్కారునకుఁగల హక్కును నిర్ణయింపవలసియుండు ననియు 'ప్రివికౌన్సిలు' వారు తీర్పు చేసిరి. ప్రస్తుతము శాశ్వతముగా నమరకము చేయఁబడినజమీన్‌దారీతరగతిలోఁ జేరినపాళ్యము ఎస్టేట్లకును, అట్లు గాని అన్‌సెటిల్డుపాళ్యము ఎస్టేట్లకును భేద మంతగాఁ గన్పింపదు. ఈ రెండువిధము లైన పాళ్యములకును పేష్కషు నిశ్చయింపఁబడి ఒక్కటేవిధ మైన వంశపారంపర్యము గలహక్కుభుక్తములకు లో నై యున్నవి. ఇట్టి అన్‌సెటిల్డుపాళ్యము-ఎస్టేట్లపైని 'డిమేండు' మార్చఁబడునది కాకపోయినను భుక్తమువలన వచ్చినహక్కు తప్ప శాశ్వతపుహక్కును చెప్పుపట్టాలుమాత్రము లేవు.

జమీన్‌దారీయెస్టేట్లలో భూము లమరకము సేయునప్పుడు 'వంతువారడి' అను నొకపద్ధతి కొన్నిచోట్ల వాడుకలో నుండెను. ఒకరయితు మఱియొకరయితుసేద్యములో నున్న భూమిపైని సదరుభూమి తన కిచ్చుపద్ధతిని ఆభూమిపై నంతకుమున్ను చెల్లఁబడుసిస్తు సక్రమమయిన రేటుకంటె తక్కువగా నున్నప్పుడు సరియైనరేటు కట్టుకొందు నని పోటీకి వచ్చినప్పు డాభూమి ఆయెక్కుడుసిస్తున కప్పుడు సేద్యము సేయుచున్న రైతు సేద్యముచేయుట కొప్పుకొనని యెడల వా రిరువురభూముల నొకరి కొకరికి మార్చివేయుపద్ధతి 'వంతువారడి' అనఁబడును. ఇది రయితులకు జిరాయితీహక్కులకు భంగము లేకుండ జరుగుచుండిన ఏర్పాటు. ఈవిధముగా భూములను మార్చుకొనుపద్ధతి యుండుటవలన భూములు మోయఁగలిగినంతసిస్తు వానిపైని పెరుఁగుటకును, జమీన్‌దారులకు భూములపై నెక్కుడుసిస్తు వచ్చుటకును, భూములలోని భేదాలు వారికి స్పష్టముగఁ దెలియుటకును కారణ మగుటవలన నీపద్ధతి కొన్నిజమీన్‌దారీయెస్టేట్లలో నవలంబింపఁబడ్డది. కాని ఈపద్ధతి సక్రమముగా అమలు జరపనిచోట్ల భూములు బాగుపఱుపవలయు ననుత్సాహము రయితులకుఁ గలుగక పోవుటకును, అందువలనఁ దుదకు రయితులకును జమీన్‌దారులకును గూడ నష్టము సంభవించుటకును గారణ మగుచుండెను.

మఱియు పూర్వము జిరాయితీభూము లమర్చునప్పుడు రయితులకు గ్రామములలో నున్న అన్నిరకములభూములను గొంచెము కొంచెముగా నమర్చఁబడుచుండుపద్ధతి వాడుకలో నుండెను. ఇట్టి వాడుక జమీన్‌దారీయెస్టేట్లలోఁ బలుమఱు నుండెను. ఒకరయితునకుఁ బల్లము, మెరక, గరువు, రేవడి, లంక మొదలగు గ్రామములోని యన్నిరకములభూములు, అతని మోతుబరినిబట్టి కొంతకొంత పరిమితిగా నమర్చఁబడుచుండెను. గ్రామములలో నున్న అన్నిరకముల భూములును సేద్యములోనికిఁ దేఁబడవలయు ననుద్దేశముతోడను రయితు లొక్కరకముపంటనే పండించి యూరకుండక అన్నిరకములపంటలను బండింపఁగలుగుటకు వారికిఁ బ్రోత్సాహము గలిగింపవలయు ననియు నీపద్ధతి వాడుకలోనికిఁ దెచ్చినట్లు తోఁచుచున్నది. రయి తిన్నిరకములభూములు తీసికొనకతప్పదు. మంచిభూములనే తీసికొనవలయు నన్నచో నేభూమియు నతని కీయకుండఁ జేయుట గాని ఆతఁడు తీసికొనవలసిన భూములమీఁది మొట్టసిస్తు అంతయు నాతఁడు సేద్యము సేయఁ దలఁచుకొన్నభూములమీఁదనే యిచ్చుకొనవలసినబాధ్యత గలిగియుండుట గాని అమలులో నుండెను. పంటలకు ధరలు లేని పూర్వకాలములో నిట్లు నిర్బంధములు కల్పించి

sampath_Ebooks

రయితులు పలువిధములను భూములు సేద్యము చేసి యన్ని రకముల పంటలను పండింపఁగలిగినట్లు ప్రోత్సాహము కలిగించుటవలననే ప్రతిగ్రామమందు ననేకవిధములగు పంటలు పండించుటకును, అన్ని రకములభూములను సేద్యములోనికిఁ దేఁబడుటకును కారణ మైనది.[1]

---

1. నైజాము రాజ్యమందలి పూర్వపు అమరకపుపద్ధతి:— ఇంగ్లీషు ప్రభుత్వము రాకపూర్వము ఉత్తరసర్కారులుకూడ నైజాము వశీనమునం దుండెను. ఆకాలమునందును, అంతకుఁబూర్వము గోలకొండనవాబుల క్రిందను, బహామనీసుల్తానుల క్రిందను, ఉత్తరసర్కారులలోను ఇంగ్లీషులకుఁ జిట్టుపట్టుల నైజాము రాజ్యమందలిజిల్లాలలోను భూసంబంధమైన అమరక మీక్రింది విధముగ జరగుచున్నట్లు కానవచ్చుచున్నది. ఏఁబదియో నూటయో గ్రామములు కలసి యొకపరగణా యనఁబడుచుండెను. పరగణానే తాలూకా యని అనుటయుఁ గలదు. ఒక్కొక్క గ్రామమున కొక్కొక్క కరణమును, పెద్దకాఁపును, పోరగవనమువారిపక్షమున వంశపరంపరాగతములైన యధికారములతో నుండిరి. అట్లే యొకపరగణా కొక దేశముఖుఁడును, ఒక దేశపాండ్యాయు నుండిరి. దేశముఖుఁడు సాధారణముగ శూద్రుఁడు; దేశపాండ్యా సాధారణముగ బ్రాహ్మణుఁడు. దేశముఖుఁడు పరగణాలలోని పెద్దకాఁపుల కందఱకు నధికారి. దేశపాండ్యా కరణముల కందఱకు నధికారి. దేశముఖశబ్దము దేశముఖ్యశబ్దభవము, దేశపాండ్యాశబ్దము దేశపండితశబ్దభవము. పెత్తన మంతయు దేశముఖులది. లెక్కజవాబుదారీ యంతయు దేశపాండ్యాలది. అధికారమునందుఁ గొన్ని విషయములలో దేశముఖుల నిప్పటితహసీలుదారులతోడను, దేశపాండ్యాలను తాలూకాశిరస్తాదారులతోడను బోల్చవచ్చును. సర్కారుదర్బారులో వీరియిద్దఱకును సమానమైన మర్యాదలుండెను. వీరిలో వీరొకరి నొకరు చూడఁబోయినప్పుడు, కూర్చున్నవారు లేచి నిలువఁబడి గౌరవించుచుండిరి. దీనినే ‘ఖడీతాజిమ్’ అందురు. వీరికి సర్కారుదర్బారులలోఁ గూర్చుండుటకుఁ గుర్చీ యిచ్చుచుండిరి. కరణములకేమి దేశముఖపాండ్యాలకేమి, పస్త వసూలు చేయుట మొదలైన సర్కారుపనులు నెఱవేర్చినందులకు, ఈనాము భూములును, గ్రామము ఆదాయము మీఁదను, పరగణాఆదాయము మీఁదను నూటి కింత యని రుసుమును దొరకుచుండెను. కొండఱు దేశముఖులమీఁద సర్ దేశముఖులును, కొందఱు దేశపాండ్యాలమీఁద సర్ దేశపాండ్యాలు నుండిరి. కొన్ని పరగణాలు కలసి యొకసర్కారు (జల్లా) అనఁబడుచుండెను.

ఇది యిట్లుండ, భూమి అమరకమునిమిత్తము, సాధారణముగాఁ బ్రతిసంవత్సరము, నొకప్పుడు మూఁడు, అయిదు ఏండ్లకును, పరగణాలవంతునను, ఒకప్పుడు విడివిడి గ్రామములును అమరకమునకై పాట పాడుచుండిరి. ఆపాటనిమిత్త మన్ని పరగణాల దేశముఖ, దేశపాండ్యాలును సర్కారులోనికి వెళ్లుచుండిరి, అనఁగా గోలకొండకో, హనుమకొండకో, ఖమ్మంమెట్టునకో, రాజమహేంద్రవరమునకో, బందరునకో పోవుచుండిరి. సాధారణముగ నాపరగణా దేశముఖుఁ డాపరగణాకుఁ బాట పాడి తనపేరిటనే కౌలు తీసికొని వచ్చుచుండెను. కర్షము చాలక మఱియొకఁడు పాటకు వచ్చి ఖత్తు వ్రాసెనో, ఆపరగణాయధికారు లనుటచే, దేశముఖదేశపాండ్యాలేకమై ఆక్రొత్తయిజారాదారునకు పిస్తు వసూలు కాకుండ ననేకవిధములఁ జిక్కులు పెట్టుచుండిరి. కావున సాధారణముగ నొకని తాలూకాపాటకు మఱియొకఁడు వచ్చువాఁడు కాఁడు. ఇట్లు దేశముఖులు సర్కారునకు ఖత్తు వ్రాసి వచ్చి రైతులకు భూములనమరకపఱుచుచుండిరి. తమఖత్తు మొత్తము ననుసరించి కొంచెము హెచ్చించియో కొంచెము తగ్గించియో పూర్వపురైతులకే మరల భూముల నిచ్చుచుండిరి. కాని పూర్వమువారిని వెడలఁగొట్టి క్రొత్తవారి కిచ్చుచుండెడివారు కారు. ఈప్రకారము పరగణా యంతయుఁ బాట పాడి ఖత్తు వ్రాసి వచ్చుపద్ధతిని ‘సర్ బస్తాలపద్ధతి’ యందురు.

ఇట్లు పరగణాయందు దేశముఖులకు రెండువిధములయభిమానముండెను. ఒకటి యది వారి దేశముఖాగిరిమిరాసి; రెండవది వారి యిజారా. కావున పరగణాను ఆబాదు చేయుటకు వారు తమశక్తి కొలఁదియుఁ బాటుపడిరి. క్రొత్తగ గ్రామముల నిర్మించి, దేశదేశములనుండి క్రొత్తరైతులను తీసికొనివచ్చి, వారికిఁ దగినసదుపాయములు కల్పించి భూమిని అమరకము చేయుచుండిరి. చెఱువులు కుంటలు వేయించిరి. అధికార మున్నను లేకున్నను ఇష్టము వచ్చినవారికి మాన్యములు, మళ్లు ఇచ్చుచుండిరి. ఇజారాదార్లను దేశముఖులును వీరే యైనందున వలదనువారు గాని, ఈనాముల నడ్డగించువారు గాని లేరైరి. పిస్తు లప్పుడప్పు డెక్కించుచున్నను భూమినుండి రైతులను తప్పించువారు కారు. అమరకమునిమిత్తము రైతులను లాలించుచు పాలించుచు నుండిరి. సంవత్సరాదిపండుగనాఁడు గ్రామములనుండి పెద్దరైతులను పిలిపించి, క్రొత్తరైతులను పిలిపించి, వారికి విందులు చేసి, గంధములు పూయించి తాంబూలము లిచ్చి, పంచాంగము చదివించి, ‘ఈయేఁట మంచివర్షములు కురియును, పంటలు సమృద్ధిగఁ బండును’ అని పురోహితునిచేతఁ జెప్పించి, ఖత్తులు వ్రాయించుచుండిరి! ఎప్పుడు రైతు ఖత్తు వ్రాయునా యని అప్పటిజమీందారులచింత. ఎప్పుడు రైతు భూమివిడుదల చేయునా యని యిప్పటికొందఱుజమీందారులచింత!! ఇది యంతయును కాలమహిమ!!!

అరాజకపుదినములలో దేశముఖులు కొందఱు దోపిడిపనులు చేసినను తమరైతులను దోచుకొనువారు కారు; పెఱదేశముఖుల రైతులను దోచుకొనుచుండిరి.

ఇట్లు జరగుచుండఁగా నుత్తరసర్కారు లనఁబడు అయిదు సర్కారులలో (జిల్లాలలో) ముస్తఫానగర్ (కొండపల్లి), ఏలూరు, రాజమంద్రి, శ్రీకాకుళము సర్కారులు నైజాముతోఁ జేయఁబడిన యొడంబడికప్రకారము (౧౨-వ నవంబరు ౧౭౬౬) ఇంగ్లీషువారియధీన మయ్యెను. ముర్తజానగర్ (గుంటూరు)

sampath_Ebooks

## గ్రామవారీ లేక మహాల్వారీపద్ధతి

ఈపద్ధతి ఆగ్రా మొదలగు పరగణాలలో వాడుకయం దున్నది. ఇది శాశ్వతమైన అమరకపుపద్ధతి కాదు. గ్రామసముదాయములకు హక్కుభుక్తములుగల యీయమరకపుపద్ధతి గ్రామము లున్న దేశములలో నవలంబింపఁబడవలసినయవసరము కలిగినది. గ్రామసముదాయమున కంతకును తత్ గ్రామభూములయందు హక్కుభుక్తములు కలిగియుండుటవలన భూమిపన్ను చెల్లింపవలసినభారము, ఆగ్రామసముదాయమం దుండుట తటస్థమైనది. మఱియు నొక గ్రామముపైఁగాని కొన్ని గ్రామములు కలసినపరగణాపైఁగాని హక్కుభుక్తములను బడసినభూస్వామితోఁగూడ నిట్టియమరకపుపద్ధతియే సులభముగాఁ గన్పట్టినది. కాఁబట్టియే అయోధ్యయందలి తాలూకాదారీఅమరకము గూడ నీతరగతిక్రిందనే వచ్చునని చెప్పుటకవకాశము కలిగినది. ఈగ్రామవారీఅమరకపుపద్ధతి 'అజమీరు' రాజ్యము, పంజాబుదేశము, 'మధ్యపరగణాల' యందుఁ జేయఁబడినది.

---

౧౭౬౫ లో నింగ్లీషువారికి వచ్చెను. ౧౭౬౬ మొదలు ౧౭౬౯ వఱకు నీజిల్లాలు హుసేనల్లీ యనువానికి నిజారాగా నుండెను. ౧౭౭౦ మొదలు కొన్ని సంవత్సరములవఱకును కంపెనీవారు పూర్వపు దేశముఖులే భూమికి యజమానులని యెంచి యేఁటేఁట వారికి కౌల్లు ఈయఁదొడఁగిరి. ఈదేశముఖులనే, బంగాళదేశమందలిజమీన్ దారు లన్న పేరునుబట్టి యప్పటినుండియు, జమీన్ దారు లని పిలువఁ దొడంగిరి. ఇది ఉత్తరసర్కారులో నింగ్లీషువారిచేఁ బ్రత్తగఁ బెట్టఁబడినపేరు. ఈజమీన్ దారులకుఁ గొన్నియేండ్లవఱకు నేఁటేఁటి కౌల్లును, పిదప మూఁడేండ్లకౌల్లును, పదేండ్లకౌల్లును నిచ్చిరి. పిదప ౧౮౦౨ లో వీరికి అప్పటియాదాయమునుబట్టి సులభమైన పిస్తువకు శాశ్వతమైనకౌల్లిచ్చిరి. దానికనఁగ మిరాసీకే ఖాయంఁబడినది. ఇట్లు బ్రిటిషుప్రభుత్వముక్రిందికి వచ్చినదేశముఖులు సులభ మగుపిస్తు ఇచ్చుపద్ధతిమీఁద గొప్పగొప్ప సంస్థానములకు నధిపతులైరి. దేశముఖులతోడివారు సంబంధించినయధికారము ౧౮౫౨ లోఁ బ్రభుత్వమువారు తీసివేసిరి. దేశపాండ్యాలకు సంబంధించినయధికార మిట్లే, శాశ్వతపట్టాలు వచ్చినతరువాత కొన్నిచోట్ల జమీన్ దారులు తీసివేసిరి. కొన్నిచోట్ల సర్కారువారే తీసివేసిరి. ఈయధికారమును తీసివేయునపుడు కొందఱు దేశపాండ్యాలకుఁ గరిణీకము లిచ్చిరి, కొందఱకు దేశపాండ్యాగిరీకి బదులు అగ్రహారము లిచ్చిరి. కొందఱు దేశపాండ్యాలకు జమీన్ దారీలుకూడ నీయఁబడినవి.

ఇంక నైజాములో నున్నయాంధ్రదేశమునందలి దేశముఖుల స్థితి యేమైనదో చూతము. కొన్ని దినములు పోయినతరువాత నిజాము వారాపద్ధతి మానివేసి గ్రామములను రైతులకే అమరకపఱిచి అమానీ పద్ధతిని బ్రారంభించిరి. అంత దేశముఖులయధికారము తగ్గి, గ్రామము మీఁద వసూలైనపైకములోనుండి నూటి కింత యని రుసుము మాత్రము పూర్వమువలెనే వారికి ముట్టుచుండెను. పిస్తు వసూలు చేయుట మొదలయినయధికారము లుండెను. అంత నీపూర్వపద్ధతి మానివేసి, జిల్లాబందీ చేసిరి. జిల్లాబందీ యనఁగా బ్రిటీషుప్రభుత్వములో నున్నట్లు, జిల్లాలుగను తాలూకాలుగను దేశమును విభజించి, వానికి వేఱువేఱు అధికారులను నియమించి, ఆయధికారులకు వంశపరంపరహక్కు లేమియు లేకుండ నిక్కడివారి నక్కడకు నక్కడివారి నిక్కడకును మార్చుట. ఇట్లు జిల్లాబందీ అయినతరువాతఁగూడఁ గొంతకాలము దేశముఖులు తమయధికారమును నిలుపుకొనిరి. తుదకు సర్ సాలార్ జంగుమంత్రిత్వకాలమున దేశముఖాగిరీహోదాను తీసివేసి, అప్పటికి దేశముఖులుగ నున్నవారికి వారివారిపరగణాలమీఁద వసూలు చెల్లుచున్నపిస్తునుబట్టి నూటి కయిదురూపాయలచొప్పున, రుసుము-అనఁగా శాశ్వతమైన పెన్షను - నేర్పఱిచిరి. వారిభుక్తములో నదివఱకున్నసావరముభూములు పిస్తు లేకుండ నిచ్చిరి. కొందఱకు గ్రామముపటేల్గిరీలు (మునసబుపనులు) ఇచ్చిరి. ఇట్లు నైజాము రాజ్యమందలి దేశముఖు లంతరించిరి. వారిసంతతివా రిప్పటికిని అధికారవిరహితమైన దేశముఖపదవిని ధరించుచు వందవ రెండువందలరుసుమును తెచ్చుకొనుచు జీవనము గడుపుకొనుచున్నారు. ఇప్పటికిని వీరిని మీ రెవరని యడిగినయెడల మేము దేశముఖులము, మాకు నలువది గ్రామములు గలవు, ఏఁబది గ్రామములు కలవు అని చెప్పుదురు. నలువది గ్రామము లున్నవి యనఁగా, పూర్వము నలువది గ్రామములకు వారిపూర్వులు దేశముఖు లన్నయధికారులుగ నుండిరి. రుసు మేర్పఱిచినపుడు, గ్రామములమీఁది అప్పటియాదాయమునుబట్టి యేర్పఱిచి రని యర్థము. ఇప్పు డాగ్రామములలో వీరికే విధమైన యధికారమును లేదు. జనులయజ్ఞానమునుబట్టి యింకను కొందఱు దేశముఖవంశమువారు ఆగ్రామములలో తామే దొరల మని యధికారము చూపుచుండుకొనుచున్నారు. కాని యది వేఱుసంగతి. ఇట్లు పూర్వ మొక్కవిధమైన యధికారమునే కలిగియున్న దేశముఖులలో బ్రిటీషుప్రభుత్వముక్రిందికి వచ్చినవారు జమీన్ దారులై తమతాలూకాలకు శాశ్వతప్రభువులై యనుభవించుచున్నారు. నైజాములోనే యున్నవారు మొదటి యిజారాలను బోఁగొట్టుకొని అధికారమునుగూడఁ గోలుపోయి, చిన్న మొత్తములను ఉపకారవేతనముగఁ బొందుచు నితరరైతులతోపాటు వ్యవసాయదారులైరి! ప్రభుత్వభేదమువలన దేశముఖులస్థితిగతులలో నింత భేద మేర్పడినది! మునగాలజమీన్ దారులపూర్వులు మునగాలపరగణాకును చింతకాణిపరగణాకును దేశముఖులుగ నుండిరి. ౧౭౬౬ విభజనలో మునగాల బ్రిటీషులోఁ బడ్డది. చింతకాణి నైజాములోఁ బడ్డది. అంతకుఁబూర్వము వీరు రెండుపరగణాలకును సమానమైనహక్కు గలవారే యైనను, రెండుతాలూకాలును వైశాల్యమునందును, ఆదాయమునందును సమానములైనను, ఆకుటుంబములో నొకశాఖవారికి మునగాల శాశ్వతపుజమీన్ దారీగఁ దక్కినది. రెండవశాఖవారికి చింతకాణికి నైజామువారివలన సంవత్సరమున కైదువందల రుసుమువాత్రము ముట్టుచున్నది.

## బేహారు మొదలగు దేశములు

బేహారుసరిహద్దు మొదలుకొని యమునానదివఱకు నున్న ప్రదేశమందలి గ్రామములు సాధారణముగా 'ల్యాండులార్డు' గ్రామములు. కావున నవి 'పట్టాదరీ', 'భాయిచారీ' తరగతులక్రింద నుండుట తటస్థమైనది. బంగాళరాజధానియందువలెనే ఈదేశమునందుఁగూడ గ్రామాధికారులను భూస్వాములలో ౧౦-సంవత్సరములవరకునకు నొకవిధమగు అమరకము చేయఁబడినది. గ్రామాధికారిత్వము ఒకనికిఁగాని అనేకభాగస్వాములకుఁగాని, గ్రామసముదాయమునకుఁగాని యుండవచ్చును. సంపూర్ణ, అసంపూర్ణ, పట్టాదరీ, భాయిచారీభేదములతో నున్నల్యాండులార్డు గ్రామలక్షణములనుబట్టి యిట్టియధికారమేర్పడును గాన ల్యాండులార్డుగ్రామలక్షణములను సవిస్తరముగా గ్రహింపవలసియుండును. ఈగ్రామముల నమరకము చేయుటలో పదిసంవత్సరములయమరకమయినపిమ్మట నాయమరకములయనుభవమునుబట్టి శాశ్వతముగాఁ జేయవలయు నని మొట్టమొదట నుద్దేశించిరి గాని అట్లు చేయుటవలన గ్రామములయందలి న్యాయ్యమైన హక్కుదారులహక్కులకు భంగము కలుగుటు తటస్థించు ననియు, గ్రామసంఘములోఁ జేరినరయితుల హక్కుభుక్తములను నిర్ణయించుట యత్యావశ్యక మనియుఁ దలఁచి శాశ్వతపుఅమరకపుపద్ధతిని వదలిపెట్టి ౧౮౭౩-వ సంవత్సరమున జారీచేయఁబడిన ౭-వ నెంబరు 'రిస్యులేషను'ను బట్టి టెంపొరరీ గ్రామవారీఅమరకము చేసిరి. ఈవిధముగా నీరిస్యులేషనునుబట్టియే ఓఢ్రదేశమందుఁగూడ నమరకము చేయఁబడినది. అందు నొక్కొక్కగ్రామమును దీసికొని ప్రతిస్వాయదారునియొక్కయు రైతుయొక్కయు భూస్వామియొక్కయు హక్కు-భుక్తములను సవిస్తరముగాఁ బరిశీలించి ౧౮౩౩-వ సంవత్సరమున ౨౦-సంవత్సరములవరకునకు గ్రామవారీఅమరకము చేయఁబడినది. తరువాత ౧౮౬౦-సంవత్సరము మొదలుకొని ౧౮౭౦-సంవత్సరము లోపున నీయమరకము మరలఁ బరీక్షింపఁబడి గ్రామవారీఅమరకము చేయఁబడినది. ఈగ్రామవారీఅమరకపుపద్ధతిలో సాధ్యమగునంతమట్టునకు పూర్వపురాజభాగమైన పంటలోని యాదాయమంతయు పన్నుగాఁ బుచ్చుకొనుటయే ప్రధానోద్దేశము. ఈగ్రామవారీ సెటిలుమెంటు ఆగ్రా, అయోధ్య మధ్యపరగణాలలోఁ జేయఁబడినను ఆయాదేశములలోఁ గొంచెముకొంచెము భేదములు కలిగియున్నవి. ఈయమరకపుపద్ధతి ౧౮౩౩-వ సంవత్సరములోఁ గొన్ని మార్పులు చెందినది. గ్రామములయొక్క సరియైన రాబడిమొత్తమును నిర్ణయించుట ముఖ్యమయినందున నందువిషయమున ననేకములయిన యేర్పాటులు చేసి నిశ్చయింపవలసివచ్చినది. ఆమొత్తము నిశ్చయించినపిదప గ్రామమునందు హక్కుభుక్తములు గలవారిహక్కుభుక్తములసంగతి సరిగా నిర్ణయించినపిమ్మట నాయాగ్రామములపైఁ జెల్లవలసినసిస్తు నిర్ణయింపవలసివచ్చినది. ఇట్టియేర్పాటు లన్నియు సాధ్యమగునంతవఱకు జాగరూకతతోఁ జేసి గ్రామవారీసెటిలుమెంటు చేయఁబడినది. అయోధ్యయందు తాలూకాదారీసెటిలుమెంటు చేయునప్పుడు గ్రామవారీసిస్తుమొత్తము నీవిధముగానే నిశ్చయించి తాలూకాదారుభుక్తములో నున్నగ్రామము లన్నింటిసిస్తుమొత్తము తాలూకాదారువలన సర్కారువారు పుచ్చుకొనుచుండిరి. మధ్యపరగణాలలో నీగ్రామవారీఅమరకమే మఱికొన్నియేర్పాటులతోఁ జేయఁబడినది. పంజాబుదేశమందుఁగూడ నీగ్రామవారీయమరకమే యింకఁగొన్నియేర్పాటులతోఁ జేయఁబడినది. ఈపైనిఁ జెప్పినదేశములయం దంతటను సాధారణముగా గ్రామవారీఅమరకపు పద్ధతినే అమరకము చేయఁబడినను సిస్తు నిర్ణయించుట మాత్రము వేఱువేఱువిధమగురీతి ననుసరించి చేయఁబడినది.

ఎడారులయందును పెద్దపెద్ద నదులవలన నప్పుడప్పుడు భంగముఁ జెందుచువచ్చు ప్రదేశములయందును, కొన్నిసంవత్సరములవరకునకు సిస్తు నిర్ణయించి అమరకము చేయుపద్ధతికి వీలు లేదు. కాఁబట్టి అట్టిభూములయందుఁ బ్రతిసంవత్సరము సాగు చేయఁబడినప్రదేశమును నందలి పంటను నిశ్చయించి దానింబట్టి సిస్తు నిర్ణయించు నేర్పాటు జరుగుచున్నది. ప్రస్తుత మిట్టియమరకపుపద్ధతి పంజాబు బర్మాదేశములలో నున్నది. పంజాబుదేశమున సాగుబడిలో నున్నప్రదేశములో ౧-౨ వంతు ఇట్టియమరకములోనే యున్నది. ఉత్తరబర్మాదేశములో నవావృష్టిదోషము తఱచు గావున నచ్చటఁగూడ నీయమరకపుపద్ధతియే అవలంబింపఁబడినది. పంజాబులో 'కెనాల్ కాలనీస్' యందును బొంబాయి రాజధానిలో సింధునదీప్రాంతములయందును నీయమరకపుపద్ధతియే అవలంబింపఁబడినది. బీరారురాష్ట్రమందు బొంబాయి రాష్ట్రమునందలి రైతువారీపద్ధతినే అతిస్వల్పభేదములతో నమరకము చేయఁబడినది.

గ్రామవారీసెటిలుమెంటుపద్ధతిలో నొక్క భూస్వామిభుక్తాధికారములో ననేకగ్రామము లుండినను వాని కన్నింటికి నతఁడే యజమానుఁడుగా నున్నపట్ల నాగ్రామము లన్నింటిమీఁద మొత్తముగా నొకసిస్తు నిర్ణయించి అట్లు సిస్తు నిర్ణయింపఁబడినగ్రామములుగల యెస్టేట్లలోని గ్రామములను మరల లోపాయికారీసెటిలుమెంటు చేసి గ్రామవారీసిస్తు నిశ్చయించుటయుఁ గలదు. ఒక్క గ్రామము గాని, అనేకగ్రామములలో నున్న వేఱువేఱుభూములు గాని కలసి కొందఱు భూస్వాములయనుభవములో నుండుట తటస్థపడి యాజమాన్యమునుబట్టియు సెటిలుమెంటు చేయఁబడినప్పు డట్టిగ్రామమునకుఁ గాని అట్టిభూముల సముదాయమునకుఁ గాని యేర్పఱుపఁబడిన సిస్తుమొత్తమంతయు వానియం దనుభూతభుక్తము గలవా రందఱును నీయవలసియుండును. ఆసిస్తున కందఱును కలసికాని ప్రత్యేకముగఁగాని చెల్లించుటకు బాధ్యత గలిగియున్నారు. ఎవరిభాగము వారు వేఱుగా విడఁదీసికొనువఱకు నీబాధ్యత తప్పదు. అయినను గ్రామములస్వభావమునుబట్టి భాగస్వాములయొక్క హక్కుబాధ్యతలను ప్రత్యేకముగా నిర్ణయించి లెక్కలలో వ్రాయఁబడుచున్నది. గ్రామమందలి భూములను అట్టిభూములు సేద్యముసేయువారిని, సిస్తు చెల్లింపవలసినబాధ్యత కలవారిని గ్రామములు సర్వేచేసి సెటిలుమెంటు చేయుకాలమున విశదముగా లెక్కలలో వ్రాసియుండుటవలన గ్రామవారీసిస్తు నిర్ణయించుట

కును సిస్తు చెల్లించుటకు బాధ్యత కలవారి కేర్పడుచుటకును, గ్రామాధికారులయొక్కయే కాక రయితులయొక్కయు లోపాయికారీభూస్వాములయొక్కయు నేవ్యగాండ్రయొక్కయు తదితరులయొక్కయు నా గ్రామభూములయందలి హక్కులు, ఫలసాయములోనిభాగములును నిశ్చయింపఁబడుచున్నవి.

## అస్సాము

అస్సామురాష్ట్రములోని సిల్‌హెట్, గోల్పారా అను రెండు రాష్ట్రములును కారన్‌వాలీసుప్రభువుకాలమందు, అనఁగా పదునెనిమిదవ శతాబ్దియంతమున శాశ్వతపుసెటిల్‌మెంటుక్రిందికి తేఁబడినవి. ఆజిల్లాలమిరాసీదారులును, జమీన్‌దారులును అప్పు డేర్పడిన రివిన్యూరేట్లనే ఇప్పటికిని శాశ్వతముగా చెల్లించుచున్నారు. వారికి తాము సేద్యము చేయుభూమిలో సంపూర్ణమయిన స్వామ్యము కలదు. వంశపారంపర్యముగా అనుభవించుహక్కే కాక వారియిష్టాను సారము దానవిక్రయాదివినిమయములు చేసికోవచ్చును. రివిన్యూ బాకీకి తప్ప గవర్నమెంటువారికి దానిని విక్రయించుటకుఁ గాని, లేక మిరాసీదారులను, జమీన్‌దారులను తొలఁగించుటకుఁ గాని హక్కు లేదు. సిల్‌హెట్‌లో గవర్నమెంటునకు చెందు ల్యాండు రివిన్యూ మిక్కిలి స్వల్పము. 'టెంపొరరి సెటిల్‌మెంటు'లో నున్న భూములకు సర్వము మీఁద ఎకరమునకు రు ౧-౪-౦ చెల్లుచుండఁగా శాశ్వతపు సెటిల్‌మెంటునకు లోఁబడినభూములమీఁద ఎకరమునకు సుమారు రు ౦-౨-౬ లు చెల్లుచుండినట్లు నిర్ధారణచేయఁబడినది. సిల్‌హెట్‌లో ఇట్టిభూస్వాములక్రింద నున్నరైతులకు 'జోతిదారు' లనియు, 'జోతిదారుల' పట్టాలలోనిభూములకు 'జోతు' లనియు పేరు.

౧౮౮౬-న సంవత్సరపు ౪-వ నెంబరుచట్టముప్రకారము జోతిదారులకు శాశ్వతపుజిరాయితీహక్కు కలిగింపఁబడినది. కాని, భూస్వామియనుమతి లేక 'జోతిదారు' తనపట్టాభూమిని విక్రయించుటకు వీలు లేదు. ఇందువల్ల రైతులకు, అనఁగా జోతిదారులకు తమపట్టాభూములను తనఖాపెట్టుకొనుటకును, విక్రయించుకొనుటకును చాల చిక్కులు కలుగుచున్నవి. భూస్వామియిష్టము లేకయే తనఖా గాని, క్రయము గాని జరగినప్పుడు తనఖాదారులును, 'విక్రయదారు' లును భూస్వాములచేత భూమియందుండి తొలఁగింపఁబడి చిక్కుపడుచున్నారు.

గోల్పారాజిల్లాలో జోతిదారులకు తమభూముల నితరరైతుల కమరకము చేసికొని అనుభవించు నాచారము కలదు. ౧౯౨౯-వ సంవత్సరము 'గోల్పారా టెనెన్సీఆక్టు' ప్రకారము జోతిదారులకును భూమిలో శాశ్వతపుజిరాయితీహక్కు కలుగఁజేయఁబడినది. జోతిదారులక్రిందిరైతులకు వారొకటేగ్రామములో పండ్రెండుసంవత్సరము లెడతెగకుండ భూమిని సాగు చేసినయెడల వారికిఁగూడ భూమిలో జిరాయితీహక్కు ఏర్పడుచున్నది. కొన్నిపద్ధతులకు లోఁబడి జోతిదారులును, వారిరైతులును వారిజిరాయితీహక్కులను తనఖాపెట్టుకో వచ్చును. తమజిరాయితీహక్కుల నితరులకు సంక్రమింపఁజేసినప్పుడు భూస్వామికి 'ట్రాన్స్‌ఫరుఫీజు' చెల్లింపవలసియుండును.

ఇట్టి శాశ్వతపుసెటిల్‌మెంటునకు లోఁబడుపఁబడిన సిల్‌హెట్, గోల్‌పారాప్రాంతములు తప్పఁ దక్కిన అస్సామురాష్ట్రము నందలి భూమి యంతయు గవర్నమెంటువారిక్రిందనే యున్నది. గవర్నమెంటువారు భూమిని కొన్నివత్సరములకాలపరిమితితోఁ గాని, లేక ఏఁటేటఁ గాని కౌలున కిచ్చుచుందురు. నూతనముగా సాగులోనికి తీసికొనిరాఁబడిన భూముల కిట్టి 'సాలీనాకౌల్లు' ఈయఁబడును. ఏఁటేఁట, కౌలుదారుని మార్చుటకు గవర్నమెంటున కధికార మున్నను సరిగా సిస్తు చెల్లించినంతకాలము ఒకరైతునకే కౌలు ప్రతిసంవత్సరము నియ్యఁబడుచుండును. ఈ 'సాలీనాకౌల్లు' పొందు రైతులకు వారిపట్టాలోని భూమిని విక్రయించుటకు వారి కధికారము లేదు. అయినను, అట్లు వారు విక్రయించుకొనుటయు, గవర్నమెంటువా రెట్టియాక్షేపణయు చేయకుండుటయు జరుగుచున్నది. ఇట్టిభూమి సంపూర్ణముగా వ్యవసాయమునకు లాయకు చేయఁబడిన తరువాత ఈ 'సాలీనారైతు' లకు మరతుకౌల్లు ఇయ్యఁబడుచున్నవి. మరతుకౌలు పొందురైతులకు వారిపట్టాభూమి యందు సంపూర్ణమయిన జిరాయితీహక్కేర్పడుచున్నది. వంశపారంపర్యముగ అనుభవించుటకే కాక విక్రయాదికములు చేసికొనుటకుఁగూడ హక్కు కలదు. ౧౯౧౯-వ సంవత్సరమునకు తరువాత అస్సామువాలీ (లోయ)లో గవర్నమెంటువారికౌల్లలో నొకక్రొత్తమరపును చేర్చుచున్నారు. అదేమనఁగా, కౌలుదారు తనపట్టాభూమిని మఱియొకవ్యవసాయదారునికి తప్ప అన్యునకు విక్రయింపఁగూడదని. దీనియుద్దేశమేమనఁగా, భూమి పెట్టుబడిదారులయిన మార్వాడీలపరము గాకుండుటకే. ఈమరతుకౌల్లు పొందినపట్టాదారులలో పాయకాశీరైతులకు భూమియం దెట్టిహక్కును లేదు. భూమిని స్వయముగా సాగు చేయులోపాయకాశీరైతులకు జిరాయితీహక్కులు కలుగఁజేయవలెనని గవర్నమెంటువారు పెక్కుసారులు ప్రయత్నించిరి. కాని ఈప్రయత్నము లింతవఱకును కార్యరూపమును దాల్చలేదు.

అస్సామువాలీ(లోయ)లో సంపూర్ణముగా సిస్తు లేనట్టియు, సగముసిస్తు చెల్లించునట్టియు భూములు కలవు. మొదటిరకముభూములకు 'లాఖిరాజ్' భూము లనియు, రెండవరకముభూములకు 'నిస్ఫఖిరాజ్' భూము లనియు పేరు. ఇవి పూర్వకాలమందు హిందూదేవస్థానములలో నౌకరీ చేయు అర్చకులు మొదలగువారి కియ్యఁబడిన ఈనాములవంటివి. ఇవి ముఖ్యముగా కామరూపము జిల్లాలో ఎక్కువగానున్నవి. ఇట్టి 'లాఖిరాజ్' దార్లకును 'నిస్ఫఖిరాజ్' దార్లకును వారిక్రిందిరైతులకును గలహక్కులను గురించినవిషయములు మిక్కిలి క్లిష్టముగాను, అస్పష్టముగాను ఉన్నవి. వీనిని నిర్ధారణ చేయుటకు గవర్నమెంటువారు ప్రయత్నించుచున్నారు.

## బర్మాదేశము

౧౮౮౫-వ సంవత్సరములో బర్మారాజ్యము నింగ్లీషువా రాక్రమించుకొనుటకుఁ బూర్వము దక్షిణబర్మాదేశము బ్రిటిషుబర్మా యని పిలువఁబడుచుండెను. ఇపుడు బర్మాదేశము లోయరుబర్మా అనియు, అప్పరుబర్మా యనియు రెండుభాగములుగా వ్యవహరింపఁబడుచున్నది. పూర్వము లోయరుబర్మాలోఁ జేరినపట్టణములు వేఱువేఱుఖండములుగా విభజింపఁబడి ఆయాఖండములసిస్తు 'థుగీ' యను మనోవ్యగస్థునిద్వారా వసూలు చేయఁబడుచుండెను. ఈ 'థుగీ' భూమి పన్ను వసూలు చేయుటయేకాక క్రొత్తగా సేద్యము చేయఁబడిన భూమిని కొలచి ప్రతిసంవత్సరము సిస్తుమొత్తమును దెలియఁజేయు లెక్క తయారు చేయవలయును. ఇప్పు డాథుగీలను తొలఁగించి క్రమక్రమముగా గ్రామమున కొక్కొక్క పెద్ద నేర్పఱుచుచున్నారు. పూర్వము బర్మారాజ్యములో భూమిహక్కు, ముందు భూమిని వ్యవసాయమునకుఁ దీసికొనివచ్చినవాని దయియుండెను. ప్రప్రథమమున భూమి విస్తారముగా నుండి జనసంఖ్య తక్కువగా నుండుటవలన ఒకటి రెండుసంవత్సరము లొకప్రదేశమునందు వ్యవసాయము చేసి తరువాత రెండుమూఁడుసంవత్సరము లింకొకచోట వ్యవసాయము చేయును నిట్లిష్టము వచ్చినచోట వ్యవసాయము చేయుచువచ్చిరి. ఇట్లు వ్యవసాయము చేయఁబడినప్రదేశమును ప్రతిసంవత్సరమును కొలచి ప్రధానరెవిన్యూఅధికారి సిస్తు నిర్ణయించిన ప్రకారమే కొన్నిసంవత్సరములు వసూలు చేయుచువచ్చుచుండెను. బర్మాదేశములోనిభూమి మిక్కిలి ఫలవత్తరమైనది. ఈభూమిలో వరిపంట విస్తారముగా పండుభూమి గలదు. తక్కిన భూమిలోఁ గొబ్బరిచెట్లు మొదలయిన ఫలవృక్షారామములు వేయుచుందురు. తోఁటలలోఁ జెట్టున కింత యని పన్ను వేసి అమరకపు సిస్తు వసూలుచేయఁబడును.

ఇప్పుడిప్పుడు లోయరుబర్మాలో సరియయిన సెటిలుమెంటు చేయఁబడినది. ఆసెటిలుమెంటు రయితువారీ అమరకపుపద్ధతిని బోలియున్నది. ప్రతిభూస్వామియు తనభుక్తములో నున్నభూమియొక్క వైశాల్యమునుబట్టి యేసంవత్సరమున కాసంవత్సరము విధింపఁబడుసిస్తును సెటిలుమెంటురేట్లప్రకారము ఇయ్యవలసియున్నది. అట్టి భూస్వామి, అక్కఱలేనప్పుడు తనసేద్యములోనిభూమిని అంతయుఁగాని కొంతగాని వదలిపెట్టవచ్చును. మొదట పండినపంటలో ౫-వ వంతు పన్నుగా వసూలు చేయఁబడుచుండెను. తరువాత వ్యవసాయపుఖర్చులు పోఁగా మిగిలినదానిలో సగము వసూలు చేయుట కారంభించిరి. యోమాకొండలప్రదేశములో 'టాఙ్యా' అను పోడువ్యవసాయము చేయఁబడుచున్నది. ఈవ్యవసాయము అడవిప్రాంతములయందలివారు చేయునది గావున వారికుటుంబములలో 'దా' అనుకత్తిని ధరించి దాని నుపయోగింపఁగలమనుష్యుల కందఱకును గొంచెము రొక్కము పన్నుగా విధించి సంవత్సరమున కొకసారి వసూలు చేయఁబడుచున్నది.

థీబారాజు రాజుగా నుండినకాలమున, అప్పరుబర్మాలో భూములు రెండువిధములుగా విభజింపఁబడియుండెను:

౧. రాజులసొంతభూము లనియు,

౨. రాజుసొంతము కానిభూము లనియు.

ఇందు రాజుసొంతభూములలోఁ గొన్ని రాజుగారియుపయోగార్థము బానిసగాండ్రచే సేద్యము సేయఁబడుచుండుభూములును, లంకలును, మిక్కిలి ఫలవత్తరమైనభూములును, అశ్వసైనికులకును, రాజుగారియుద్యోగస్థులకునీయఁబడినభూములును రాజుసొంతభూములు. తక్కినవ్యవసాయము నున్నట్టివియు కానట్టివియు ననుభూము లన్నియు నితరము లైనవి. ఈభూములమీఁదను పన్నింతని నిశ్చయింపఁబడలేదు. వ్యవసాయము చేయుచున్నభూములయొక్క హక్కుభుక్తము లాచారమునుబట్టి నిర్ణయింపఁబడుచుండెను. ప్రజ లందఱును భాగ్యవంతులను బీదలనుగూడ నొక్కతీవిధమై ఒక్కతీరేటుగల 'థాథమేడు' అను ఇంటిపన్ను నిచ్చుచుండిరి.

ఈథాథమేడుపన్నే భూమిపన్నుగా నింగ్లీషుదొరతనమువారు మార్చి భూమి నమరకము చేయుపద్ధతి నమలులోనికిఁ దీసికొనివచ్చిరి. ౧౯౦౧-వ సంవత్సరమున జారీచేయఁబడిన రివిన్యూ లేఖనునుబట్టి భూములు అమరకపఱిచి సిస్తులు వసూలు చేయఁబడుచున్నవి. బర్మాదేశమందలిభూములయమరకపుస్థితి గైకువారిపద్ధతి ననుసరించి యున్నను నింకను సరియైనస్థితిలోనికి దెచ్చియుండలేదు.

ప్రస్తుతము బర్మాదేశములో వ్యవసాయము చేయురయితులు తక్కువగా నున్నహేతువువలన బంజరుగా నున్నభూమి విస్తారము గలదు. ఈభూమి మిక్కిలి ఫలవంతమైన దయినను సేద్యము చేయుటకు రయితుమోపు లేక బంజరుగా నున్నది. ఇప్పుడు దొరతనమువారు దరఖాస్తుదార్లకు దరఖాస్తునిబంధనల ననుసరించి భూముల నిచ్చుచున్నారు. భూములు గావలసినవారు మంచి ఫలవంతమైనభూమిని బర్మాదేశములో జిరాయితీహక్కులతో దరఖాస్తులమీఁదఁ బొందుటకిప్పుడు మంచియవకాశము గలదు. రయితులను జేర్చి బర్మాదేశమందలి భూమిని మంచివ్యవసాయములోనికిఁ దీసికొనిరానెంచి దొరతనమువా రీయేర్పాటులను జేసిరి. రయితులు విస్తారముగా నక్కడఁ బ్రవేశించినకొలఁదియు నిప్పటిసదుపాయములను దొరతనమువారు కొంతకాలమునకుఁ దీసివేయవచ్చును.

## లాఖిరాజ్ భూములు

భూమిపన్ను చెల్లింపఁబడనిభూము లన్నియు 'లాఖిరాజ్' భూము లని చెప్పఁబడును. ఇట్టిభూములు సిస్తు లేకుండ వితరులకీయఁబడినవి. ఇందు భూస్వాములకు భూమియందు హక్కు కలుగునట్లీయఁబడినవి 'మిల్కు' అని చెప్పఁబడును.

ఇట్టిభూములు భక్తులకును పండితులకును ప్రసిద్ధులగు దైవజ్ఞులకును పాఠశాలలు, మసీదులు, దేవాలయములు, దివ్యక్షేత్రములు,

sampath_Ebooks

గోరీలు మొదలగువానికి నీయఁబడినవి. భూమిమీఁదను చెల్లింపఁబడు చున్నసిస్తు కొట్టివేయఁబడినట్టివిగాని సిస్తు లేకుండఁగనే యియ్యఁబడి నట్టివిగాని అగుభూములు 'మాఫీ' లేక యీనాము లనఁబడును. ఇట్లీయఁబడినభూములు గాక సర్కారునకు యుద్ధవిషయమునఁ గాని యితర వ్యవహారవిషయమునఁ గాని మేలు చేసినవారికి పెద్ద పెద్దప్రదేశములు సిస్తు లేకుండ 'జాగీర్లు' అను పేరుగల వీయఁబడి నవి. మొగలాయీచక్రవర్తులరాజ్యమున సర్కారు ఉద్యోగము చేసిన యుద్యోగస్థుల కండఱకును మనసబ్ హోదాలతోపాటు సిస్తు లేకుండ కొన్నికొన్ని ప్రదేశములు వారివారిప్రపత్తులంబట్టి యియ్యఁబడెను. వీని యన్నిటికిని జాగీర్లు అని పేరు.

నాఖరుదుగా నున్న బంజరుభూములు దేశమం దంతటను గలవు. బంగాళరాజధానిలో నిట్టిబంజరుభూములు శాశ్వతముగా నమరకము చేయఁబడినయెస్టేట్లకు సంబంధించినవి. ౧౭౯౩-వ సంవత్సరము వఱకు నాయాయెస్టేట్లజమీందార్లిష్టము వచ్చిన ట్లాక్రమించుటకు వీలు కలుగుచుండెను. తరువాత ౧౮౧౯-వ సంవత్సరమున జారీ చేయఁబడిన రిగ్యులేషనునుబట్టి యట్టిబంజరుభూముల నాక్రమించు కొనక కొన్నింటిని పల్లీకు అడవులక్రిందను దక్కినవానిని వ్యవ సాయదారులకు కవులుక్రిందను ఇచ్చుచువచ్చిరి. సంయుక్తపరగ ణాలు అయోధ్యయం దున్న అడవు లేగ్రామముతో సంబంధించినవి, ఆగ్రామముతో కలిపి అమర్చుచువచ్చిరి.

పర్వతప్రాంతమందలిజిల్లాలలోని పెద్దబంజరుభూములును పెద్ద పెద్ద అడవులును దొరతనమువారివశమునందే యుంచుకొనిరి. అయో ధ్యలో తాలూకాదారీయెస్టేట్లకు సంబంధించినబంజరుభూమి ౫౦౦ యెకరములవఱకు, ఆయాయెస్టేట్ల కిచ్చి తక్కినదానిని దొరతనము వారి వశము చేసికొని సిస్తు నిర్ణయించిరి. మధ్యపరగణాలయందును పంజాబుదేశమందును ప్రతిగ్రామమునకును సేద్యము కాఁబడినభూమికి ౧౦౦-కి ౨౦౦ లుగా బంజరుభూమి గ్రామస్థులయుపయోగమునిమి త్తము వదలిపెట్టి తక్కినభూములకు సిస్తు కట్టిరి. రయితువారీ-అమర కములో నున్న బొంబాయి, మదరాసురాజధానులయం దున్న బంజరుభూమిలోఁ బ్రతిగ్రామమునకును బసువులమేఁతకు కావలసి నంతభూమి విడిచిపెట్టి తక్కిన దంతయు సొంతహక్కుగల భూమిగా నెంచఁబడి సర్వేనెంబర్లుగా విభజింపఁబడి ఆయాభూముల స్థితినిబట్టి సిస్తు ఏర్పఱచి అమలులోనికి తీసికొనిరాఁబడెను. బంజరు భూములు సాధారణముగా నీక్రింద వివరింపఁబడినపద్ధతులనుబట్టి అమరకము చేయఁబడుచున్నవి :—

### బంజరుభూముల-అమరకము

౧. పెద్దపెద్దచెట్లచే నిండియుండి అడవిగా నుపయోగింపఁ బడుటకు వీలైనవి అమరకము చేయఁబడవు. కాని చిట్టడవితో నిండి యుండి సేద్యమునకుఁగాని తేయాకుతోఁటలు మొదలగునవి నాఁటు టకుఁ గాని వీలుపడుబంజరుభూము లమరకము చేయఁబడును. బంజరుభూములు ముందు తనిఖీచేసి అవి అడవిగా నుపయోగించుటకు పనికిరావని తోఁచినపుడు బంజరుభూమి అమరకమునుగుఱించి వ్రాయఁబడిననిబంధనల ననుసరించి అమరకము చేయఁబడును.

౨. ఇట్లమరకము చేయఁబడుభూమి కొన్నిసంవత్సరములకు వ్యవసాయమునకు లాయకుగా చేసికొనుట కవసరమైనకాలపరిమితి ననుసరించి సగుపాయ మైనసిస్తునకు కవు లీయఁబడుచుండెను.

౩. ఇట్టిభూములను సర్వే చేసి గోడ్డులు రస్తాలు నదులు పంటకాల్వలు చేఁపలుపట్టుప్రదేశములు గనులు రాళ్లు మొదలగువాని యందు హక్కు గలుగకుండ నీయఁబడుచుండును.

౪. ఇట్టికవులుదారు తనకవులులో నున్నభూమిని న్యాయ ముగా నుపయోగించి సరియైనస్థితిలోనికిఁ దీసికొనివచ్చినయెడల కొన్నిషరతులమీఁద నాభూమియందు శాశ్వతపుహక్కు పొంద నచ్చును.

౫. ఇట్టిభూమికి కడమప్రాప్రైటరీయెస్టేట్లకువలెనే సెటిల్ మెంటు చేసి సిస్తు నిర్ణయింపఁబడును. ఇట్టిభూములవిషయమున నొక్కొక్కరాజధానియం దొక్కొక్కవిధమగు నిబంధన లేర్పడి యున్నవి. విశేషధనము వెచ్చించి పెద్దపెద్దవైశాల్యముగల భూముల యందు తేయాకు, కాఫీ, చింకోనా మొదలగుతోఁటలు వేయు భూముల కమరకము వేఱుగా నుండుటయు, ౧౦ యెకరములు మొదలుకొని ౨౦౦ యెకరములవఱకును సాధారణముగా వ్యవసాయము చేయుటకు కవులు పొందఁబడుభూములయొక్క అమరకపుపద్ధతు లు వేఱువేఱుగా నుండుటయు నవసరమును న్యాయ్యమును గావున వానివిషయమున సందర్భానుసారముగా నమరకపుపద్ధతు లేర్పఱుపఁ బడుచుండును. ఒకప్పుడు బంజరుభూములు వేలముమీఁదనే యీయఁబడును. కాని విస్తారప్రదేశ మమరకము చేయునప్పు డట్టి ప్రదేశము సర్వే చేయుటకు కావలసినఖర్చు లిచ్చుపద్ధతిని కొంత సొమ్ము హామీ పుచ్చుకొని ఆభూమికి తగినసిస్తు కట్టి అమరకము చేయఁబడును. ఈవిధముగా హిందూదేశమందలి రాజధానులయందు అనేకవిధములగు అమరకపుపద్ధతు లమలులో నున్నవి. ఈ యమర కపుపద్ధతు లన్నియు కొంచెముగనో గొప్పగనో సర్కారునకు పన్ను చెల్లించునవి. ఇఁక సర్కారునకు పూర్ణమైన సిస్తు చెల్లింపఁ బడకుండ భూస్వాములయనుభవభుక్తములో నున్నభూములనుగూర్చి వివరింపవలసియున్నది.

### భూస్వాముల లబ్ధికొఱకుఁ జేయఁబడిన యమరకము

ఇట్టి యమరకముపద్ధతిలో నున్నభూములను మాన్యము లనియు ఈనాము లనియు వాడుదురు. సిస్తు లేకుండఁ గాని తక్కువ సిస్తునకుఁ గాని సైనికులజీతముక్రిందను ఉద్యోగస్థులవేతనముల క్రిందను దేవాలయములయొక్క సంరక్షణకొఱకును వానిసేవకుల యొక్క భుక్తికొఱకును సత్రములు మొదలగు ధర్మములనిమిత్తమును కవులు, శాస్త్రజ్ఞులు, పండితులు, దైవజ్ఞులు మొదలగువారిజీవనాధా

sampath_Ebooks

నముకొఱకును నొరతనము వారికిఁ గాని దొరతనమువారి మెప్పు వడయు నట్లు చేసిన ప్రజాక్షేమమునకుఁ గాని చేసిన గొప్ప కార్యములకును బహుమతిగా భూములను గ్రామములను నిచ్చువాడుక చిరకాలమునుండి హిందూదేశమునఁ గలదు. హిందూరాజుల కాలములో నిట్లు గ్రామములు భూములు నిచ్చునప్పుడు, అట్టియీవిని ప్రకటించుచు శాసనములమీఁద వ్రాయువాడుక కలదు. ఇవి రాజు గాని, సంధివిగ్రహాధికారి యని పిలువఁబడుమంత్రి గాని యిచ్చువాడుక కలదు. సైనికుల కిట్టిభూముల నిచ్చుపద్ధతి విజయనగర రాజ్యమందును, దక్షిణహిందూస్థానమును మహమ్మదీయులు జయించినప్పుడు దక్కనును గలిగియుండెను.

## హిందూరాజులు

ఇట్లు హిందూరాజులచే వ్యవహరింపఁబడుపద్ధతిని మహమ్మదీయులుగూడ నవలంబించి జాగీర్లను మిల్లుభూములు నుచితముగా నిచ్చుచుండిరి. అట్టిభూముల నన్నింటిని 'ఈనాముభూములు' అను సామాన్యపదముచే వాడుచున్నారు. ఇట్టి యీనాములలో విజయనగరము నేలిన హిందూరాజులును, మధురరాజ్యమును బాలించిన పాండ్యులును, తంజావూరు మొదలగువని యేలినమహారాష్ట్రప్రభువులును, ఓఢ్రదేశము నేలినగజపతులును నాయకులును, ఆయా దేశము లేలుచు విస్తారముగా ధర్మకార్యములనిమిత్త మిచ్చినభూములు నగ్రహారములు నాయాప్రదేశములందును నుత్తరసర్కారులయందును ఇట్టి యీనాములలో నెక్కువగాఁ గలవు. తరువాత హిందూరాజ్యములు క్షీణించి దేశ మరాజకస్థితిలోనికి వచ్చి పిమ్మట మహమ్మదీయులవశమైనతరువాతఁ జిన్నచిన్న దేశనాయకులును బ్రబలు లైనస్థానాధికారులును బలవంతు లైనసర్కారుద్యోగస్థులును స్వతంత్రించి యిట్టి భూముల నిచ్చుచువచ్చిరి. ఉత్తరసర్కార్లలో నిట్టియీనాముభూము లనేకము లప్పటిజమీందారులవలన, పాళెగాండ్రవలన, గ్రామములు పరగణాలు నిజారాపాడిన యిజారాదారులవలనఁగూడ నీయఁబడిన యిట్టిచిన్నచిన్నయీనాము లనేకములు కలవు. దత్తమండలములోను దక్షిణాదిజిల్లాలలోను నున్నపాళెగాండ్రుకూడ నంతకంటె నెక్కువగా నీనాము లిచ్చుచువచ్చిరి.

## మహమ్మదీయరాజులు

శాశ్వతముగా సిస్తు లేకుండ భూములను గ్రామముల నిచ్చుపద్ధతి మహమ్మదీయరాజుల కంగీకారము కాకపోయినను బ్రాహ్మణుల యొక్క దేవాలయము మొదలగువానియొక్క అనుభవములో నున్న భూములభుక్తమానకుమాత్రము, అడ్డగించుట వారి కిష్టము లేకపోయెను. ఇంతియేకాక వారుగూడఁ గ్రొత్తగా నట్టివారి కట్టి భూముల నిచ్చిరి. తరువాత నింగ్లీషువారికిని ఫ్రెంచివారికిని జరగిన యుద్ధములలో దేశ మల్లకల్లోలముగా నున్న యవస్థయందు నేవిధమైనన్యాయ మైనయధికారము లేనివారుగూడ నిట్టిభూముల నిచ్చుచుండిరి.

## ఇంగ్లీషుప్రభుత్వము

ఆంగ్లేయప్రభుత్వారంభదినములలోఁ బూర్వాచారము ననుసరించి శాశ్వతముగాఁ గాని కొన్నితరములవఱకు ననుభవించునట్లు గాని కొన్నిజాగీర్ల నిచ్చుచుండిరి. తరువాత ౧౮౨౨-వ సంవత్సరమునందును, ౧౮౨౯-వ సంవత్సరమునందును, ఈస్టిండియాకంపెనీవారి యుద్యోగస్థుల కింగ్లాండుదేశమునుండి 'కోర్టు ఆఫ్ డైరక్టర్సు' పంపించినయుత్తరువులనుబట్టి, పారితోషికముగా ఈనాముభూముల నొసఁగువాడుక మాని అట్టివారికి పెన్షను పూర్వకముగా నొక్కమే యిచ్చుపద్ధతి నవలంబించిరి. ఇట్టిభూములు ప్రథమమున నియమింపఁబడినపనులకంటె భిన్నమగుపనులక్రింద వినియోగపడుటకు వలనుపడ దని ౧౮౩౧-వ సంవత్సరమున నొకనిర్బంధన మేర్పఱచి ౧౮౪౫-వ సంవత్సరము మొదలుకొని అట్టిభూముల నన్నింటిని సర్కారునకు దాఖలు చేసికొనుపద్ధతి నవలంబించిరి.

## ఈనాం కమీషను

తరువాత ౧౮౫౮-వ సంవత్సరము నవంబరు నెలలో 'ఈనాము కమీషన్' ఒకటి యేర్పఱుపఁబడి, ఈనాములసంగతి యంతయుఁ బరీక్షించి న్యాయ్యమగువానికి శాశ్వతపుపట్టాలీయు నారంభింపఁబడెను. ౫౦-సంవత్సరములభుక్తము ఋజువుపడినయీనాముభూములన్నింటికి నట్టిభూము లేనియమముతో పుట్టఁబడినను సిస్తు లేకుండ శాశ్వతముగా నీయఁబడినవి. అట్లు ౫౦-సంవత్సరములభుక్తము కనుపడుపక చాలసంవత్సరములు కనఁబడినవారికిఁగూడ సిస్తు లేకుండ నీయఁబడినవి. ఉచితముగా నీయఁబడినయీనాములు దానవిక్రయాద్యధికారములు లేకుండ నిష్టము వచ్చినంతకాల మనుభవించుటకుఁ గాని, అట్టిదానవిక్రయాదిస్వతంత్రాధికారము పొందవలె నన్నచో సంవత్సరమునకు స్వల్పముగా 'క్విట్ రెంటు,' అను పన్ను నిచ్చుకొను పద్ధతిమీఁదఁ గాని, ఒక్కపర్యాయ మే క్విట్ రెంటుక్రింద కొంతసొమ్మిచ్చి స్వేచ్ఛగా పన్ను లేకుండ ననుభవించుపద్ధతిమీఁదఁ గాని యేర్పాటు గావించి పట్టాలొసంగిరి. ఇట్లు విధింపఁబడిన 'క్విట్ రెంటు' స్వల్ప మైనను నది యిచ్చుట కియ్యకొనక కొందఱు ఈనామదారులు తమకుఁ గలుగఁజేసిన విక్రయాద్యవకాశమును బోఁగొట్టుకొనిరి అట్టియీనాములు 'నప్రక్రిటు' ఈనాము లని చెప్పఁబడును. అట్టియీనాము లిప్పటికిని కొన్ని గలవు. వానిని ఈనాముదారులు వంశపారంపర్యముగా ననుభవించుటకు హక్కున్నది గాని ఇతరులకుఁ జెందఁజేయుట కధికారము లేదు. అట్టిభూములు దానవిక్రయాదిమార్గమున నితరులకుఁ జెందినపుడు సర్కారుజిరాయితీ భూమిగా నెంచఁబడి తగినజిరాయితీసిస్తు విధింపఁబడును. నౌకరీ క్రింద నీఁబడినయీనాములలో నవసర మున్ననౌకరీలబాపతువాని నుంచి తక్కినవానికి క్విట్ రెంటు కట్టికాని కొన్ని సంవత్సరముల క్విట్ రెంటు పుచ్చుకొని పన్ను లేకుండఁ గాని యిచ్చిరి. ఇట్టినౌకరీ యీనాములకుమాత్రము, ఈనాందారు లంగీకరించినను నంగీకరింపక పోయినను క్విట్ రెంటు బలవంతముగాఁ గట్టియిచ్చివేసిరి. దేవాలయ

sampath Ebooks

ములు మసీదులు మొదలగువానిసంరక్షణకొఱకును, వానివిషయమున నేర్పఱుపఁబడినధర్మకర్తల చేతులక్రిందను ఇయ్యఁబడినభూములు, ఆయాకార్యములు చక్కఁగా జరగుచున్నంతవఱకును భూము లనుభవించుపద్ధతితో పట్టా లీఁబడెను. ఆకార్యములు జరగకపోయినప్పుడుమాత్రము దొరతనమువారు లాగికొని జిరాయితీపన్ను కట్టుటకు హక్కుంచుకొనిరి. ఈనాముదారులహక్కునుకూర్చియు, అట్టియీనాముభూముల మీఁద నున్న దొరతనమువారి స్వాతంత్ర్యమునుగూర్చియు సాధ్యమగునంతవఱకుఁ జక్కఁగాఁ బరిశీలించి మిక్కిలియు నారబాటుతో సాక్ష్యములు నిదర్శనములు పరీక్షించి హక్కుభుక్తములు నిర్ణయించి యీ 'కమీషన్‌'వారు పట్టా లొసంగిరి.

## ఈనాము భేదములు

ఈనాములు 'సన్నద్ ఈనాములు', 'మరంజామ్ ఈనాములు', 'జాగీర్లు', 'వశీఫాలు', 'వాకళులు', 'దేవస్థానములు' అని అనేకవిధములు గలవు. జమీన్‌దారులు శాశ్వతపుసెటిలుమెంటునకు దరిమిలా నిచ్చినయీనాములు పరిమితాయీనాము లని నాడఁబడుచున్నవి. ఇట్టియీనాములు సిస్తు లేకున్నను, తక్కువసిస్తున కీయఁబడినను, జమీన్‌దారీ జిరాయితీభూములవంటివే యని గ్రహింపవలయును. కొన్నియీనాముభూములును గ్రామములును సిద్ధిస్వామ్యములగు తరు లతా గుల్మాదిక పాషాణ నిధి నిక్షేపములతోఁగూడ నీయఁబడినవికూడఁ గలవు. దానపూర్వకముగాఁ బ్రతిగ్రహీతల క్షేమలాభముల కీయఁబడినయీనాములు ఒక గ్రామముగాఁగాని, గ్రామములోఁ గొన్నిభూములుగాఁ గాని యున్నవి. ఒక గ్రామ మంతయు దాన మిచ్చినపుడు 'దేహాత్తు' లేక 'మేజరు' ఈనాము లనఁబడును ఒక గ్రామములో నీయఁబడినయీనాములు మైనర్‌నాములనఁబడును. మైనర్‌నాములకంటెఁ బెద్దదై గ్రామమునిపించుకొనని యీనాము 'ఖండ్రిక' లేక 'పోహాల్ శ్రోత్రియ' మనఁబడును. అదివఱకు సేద్యములో నున్న గ్రామ మీనాముగా నీయఁబడినప్పుడు షాంజే గ్రామయీనా మనఁబడును. ఒక పెద్దవైశాల్యముగల భూమిపై నొకపల్లె కట్టఁబడి, అది యీనాముగా నీయఁబడినచో నట్టిపల్లె గ్రామలెక్కలలోఁ బ్రత్యేక గ్రామముగా వ్రాయఁబడియుండనపుడు, అది గ్రామగర్భఖండ్రిక యనఁబడును. ఇట్టి యీనాములు రెండువిధము లయినవి. తారాపదీయీనాములు లేక మాన్యము లనియు, సనదు లేక దుంబాలాయీనాము లనియు, గ్రామము ప్రప్రథమమునఁ గట్టఁబడినప్పుడు గ్రామోపయోగమునిమిత్త మీయఁబడిన గ్రామమాన్యములు, అనఁగా రివిన్యూ, పోలీసు, గ్రామనౌకర్లు, గ్రామదేవత, గ్రామదేవాలయములు, మొదలగువానిక్రింద నీయఁబడి చిరకాలభుక్తములో నున్నవి తారాపదీయీనాము లని చెప్పఁబడును. ఇవి రాజుచేతఁ గాని గ్రామసమాయమువారిచేతఁ గాని యియ్యఁబడినయీనాములు. రాజుచేతఁ బ్రతిగ్రహీతలకును ధర్మకార్యములనిమిత్తమును మతసంబంధ మగువిషయములకు నియ్యఁబడినయీనాములు 'సనద్' లేక 'దుంబాలా' యీనాములనఁబడును. తంజావూరునందు రాజ్యము చేసినహిందూరాజులవలన నీయఁబడిన యీసనదీయీనాములుకూడ త్రివిధములు:—

౧. క్రమ మయినపట్టాలతో నీయఁబడినవి శాసనములు ఈశాసనములక్రింద భూమి యనుభవింపక దానిమీఁద రొక్కపుసిస్తునూపకముగా ననుభవింపఁబడునవి ఆయకట్టుమాన్యము లనఁబడును.

౨. రాజుయొక్క నగరునందలి ఖాసులెక్కలలో, ఈనాము భూమిపరఖాస్తువిషయమున వ్రాయఁబడి యందుపైని ఈనా మిచ్చినట్లు రాజుయొక్క అంగీకారము పొందినవి 'దత్తక్రోఖాలు' అనఁబడును.

౩. ఈనా మిప్పించవలసిన దని కోరి యిచ్చుకొన్న అర్జీమీఁద, ఈనా మిచ్చినట్లు వ్రాయఁబడినవి 'అర్జీరోఖాలు' అనఁబడును. మిరాశీదార్లకు తమమిరాశీగ్రామమందలి బంజరుభూమిని దీసికొని దానిక్రింద నీయఁబడినయీనాములు గ్రామభాగయీనాములని తంజావూరుజిల్లాలోఁ బ్రచురింపఁబడియున్నది. ఒకప్పుడు జాగీరుగా నున్నచెంగల్పట్టునందు నొకవిధమయిన సనదు ఈనాములు గలవు. ఈసనదు ఈనాములు ప్రతిసంవత్సర మీయఁబడు పట్టాల ననుసరించి భుక్తములో నుండునవిగాఁ గన్పించుచున్నవి.

ఈనాములు, సిస్తు కొంచెమేని ఇచ్చుకో నక్కఱలేకుండఁగాని, సిస్తులోఁ గొంతభాగ మిచ్చుకొనుపద్ధతిమీఁదఁ గాని, కొంచెము సాస్తి మ్చుపద్ధతిమీఁదఁ గాని యీయఁబడెను. ఇందు మొదటితరగతి సర్వయీనాములు లేక 'సర్వమాన్యములు', 'సర్వదుంబాలాలు' అనఁబడును. ఇట్టియీనాములు సాధారణముగా ధర్మకార్యములకొఱకును, దైవజ్ఞులు పండితులు కవులు నగు బ్రాహ్మణులకొఱకును, సేవచేసిన రాజకుటుంబములలోనివారికి నీయఁబడినవి. శ్రోత్రియములను ఈనాములు వేదములు చదువుకొన్నవారి కీయఁబడినవే యైనను కాలక్రమమున నితర బ్రాహ్మణుల కిచ్చునీనాములుకూడ శ్రోత్రియము లనఁబడుచువచ్చెను.

రెండవతరగతియీనాములు. ఇవి సిస్తులోఁ గొంతభాగ మిచ్చుకొనుపద్ధతి నీయఁబడినవి:—

౧. అర్ధమాన్యములు:— సిస్తులో సగముసిస్తున కీఁబడినవి.

౨. చాతుర్భాగములు, లేక పాతికబడులు:— భూమిసిస్తులో నాల్గవవంతుమాత్రము సర్కారున కీయవలసినయీనాములు.

౩. ముప్పాతికబడి:— భూమిసిస్తులో ముప్పాతికవంతు మాత్రము సర్కారునకు పన్నీయవలసినయీనాములు.

౪. రాయయత్ ముఖాసాలు:— ప్రతిసంవత్సరమును జేయఁబడుచున్న సాగుబడినిబట్టి తక్కువసిస్తు కట్టి యీయఁబడినముఖాసాగ్రామములు.

౫. త్రిభాగములు:— భూమియందు పండినపంటమొత్తములో మూఁడవవంతుమాత్రము సర్కారున కిచ్చు నీనాములు.

sampath_Ebooks

ఇట్టి యీనామములలో, 'క్విట్ రెంటు' లేక 'జోడీ', 'పేషిగ్', 'పొగుపు', 'కట్టుబడి' అనుపన్నులు చెల్లించి యనుభవించు ఈనామములు చేరియున్నవి. ఇట్టియీనామములలో నొక్కపర్యాయమే నిర్ణయింపఁబడినసిస్తు ఏఁటేఁట చెల్లించునవి 'బిల్మక్తా' యీనామము లనియు, ప్రతిసంవత్సరమును పంటపంటనుబట్టి యీయవలసినసిస్తు నిర్ణయింపఁబడినవి 'హంగామీజోడీ' యీనామము లనియుఁ జెప్పఁబడును. పూరాసిస్తుకంటె తక్కువసిస్తు రొక్కరూపకముగాఁ జెల్లించునవి 'కట్టుకుట్టగి' భూము లనఁబడును. ఇట్టిభూములు యుద్ధములోఁ బనిచేసిన సైనికుల కీయఁబడినవి. ప్రతిసంవత్సరము నొకపర్యాయము నిర్ణయింపఁబడిన క్విట్ రెంటుపన్ను నిచ్చు ఈనామ భూములు 'ఖాయమ్‌జోడీ' లేక 'హరసాల్ మక్తా' లనఁబడును. 'జోడీ' కంటె నెక్కువగాను, న్యాయ్యమైన సర్కారుపన్నుకంటెఁ దక్కువగను సిస్తు చెల్లించుచు ఖాయమైన అమరకపుపద్ధతిలో నున్న గ్రామములు 'రొక్కకుట్టగి' గ్రామము లనఁబడును.

## ధాన్యరూపముగా పన్నిచ్చి యనుభవింపఁబడుభూములు

౧. సేల్ కుట్టగి :— పూరాసిస్తుకంటె తక్కువయినసిస్తు ధాన్యరూపముగాఁ గాని, అప్పటి కైన ధాన్యమూల్యముగాఁ గాని పన్నిచ్చునవి.

౨. పాలంభూములు - ధాన్యరూపముగా తక్కువసిస్తు చెల్లించుపల్లపుభూములు. స్థలనిర్ణయము లేకుండ భూములు పాయింపు చేయఁబడకుండ నీయఁబడినయీనామములు.

౧. గ్రామముపైఁ జెల్లు సర్కారుసిస్తుమీఁద రూపాయకుఁ గొన్ని అణాలవంతున అనుభవించుటకు హక్కు గలుగఁజేయఁబడిన గ్రామము లన్నియు శ్రోత్రియము లనఁబడును.

౨. దిట్టము :— అనఁగా గ్రామములో నేఁటేఁట సాగుబడి చేయఁబడుభూమిలోఁ గొంతభాగము వేఱుపఱచి, ఆభాగముమీఁద సిస్తు గ్రామలెక్కలలోఁ జేర్పకుండ ననుభవించుగ్రామములు.

3. ఈవుమాన్యము :— 'సర్కారునకుఁ జెల్లఁబడు భూమిసిస్తులోఁ గొంతభాగము' అని అనుభవించునది.

## చక్ బందీ యీనామములు

ఇట్లు గాక స్థలనిర్దేశ మేర్పడి సరిహద్దులు గలిగినయీనామములు 'చక్ బందీ' ఈనామము లనఁబడును. ఈయీనామములు రెండువిధములు.

౧. రివిన్యూలెక్కలలో నమోజు కాఁబడినవి దాఖలా యీనామములు.

౨. అట్లు లెక్కలలో నమోజు కానివి గైర్ దాఖలా యీనామములు.

మఱియును, ఈనామములు ప్రతిఫల మపేక్షింపక యీయఁబడినవనియు, నొకరి నపేక్షించి యీయఁబడినవనియు రెండువిధములు. ఇవి గాక దస్తర్ తోఁట లనియు, తోఁపుఈనామము లనియు దక్షిణార్కాటుజిల్లాలో నొక తెగయీనామభూములు గలవు. ఇవి తోఁటలు వేసి పెంచుటకుఁ బ్రోత్సాహము కలిగించునిమిత్తము తోఁటలు వేయువారి కీయఁబడినవి. అట్టియీనామభూములలోనితోఁటలు చచ్చిపోయినప్పుడు భూములు సర్కారునకుఁ జెందును. వీనినే ధర్మారామ ఈనామము లందురు.

స్వకుటుంబపోషణార్థ మొకని కనుగ్రహపూర్వకముగా బహుమతిగా వంశపారంపర్యానుభవము గలహక్కుతో దానవిక్రయాద్యధికారములతో నీయఁబడినవి కొన్నియు, ప్రతిగ్రహీతవంశ మున్నంతవఱకు ననుభవింపఁబడునట్లు కొన్నియు, ప్రతిగ్రహీతయావజ్జీవము మాత్రమే యనుభవింపఁదగినట్లు కొన్నియు, నీయఁబడినయీనామములు గలవు. ఈనామకమీషన్ కాలమందు దానవిక్రయాద్యధికారము లేనియీనామములు- పుత్రపౌత్రులవంశస్థులకు దానరూపముగాఁ గాని దయారూపముగాఁ గాని దఖలుపడినవానికిని ఒప్పఁ జిక్కిన యీనామము లన్నింటికిని క్విట్ రెంటుపన్ను కట్టఁబడి పట్టా లీఁబడినవి. బ్రాహ్మణుల కీయఁబడిన యీనామములు బ్రహ్మదాయము లనఁబడును. ఇవి అధ్యయన, భారత, భట్టవృత్తి, పంచాంగ, పురాణ, వేదవృత్తు లను నానాభేదములు చెందియున్నవి. ఇట్లు గ్రామ మంతయు నీయఁబడినప్పుడు అగ్రహారము లని పిలువఁబడుచు నొక్కకుటుంబము వారికి నిచ్చినప్పు డాకుటుంబము వారును, ఒక్కకుటుంబముకంటె నెక్కువకుటుంబములవారి కిచ్చినప్పుడు, అన్నికుటుంబములు నన్నిభాగములుగా ననుభవించుటకును హక్కు గలిగియున్నారు. ఇట్టియగ్రహారములలోఁ గొంత క్విట్ రెంటు కట్టి యీయఁబడినవి బిల్మక్తా అగ్రహారము లనియు, కొంతపన్ను కట్టి యీయఁబడినవి కట్టుబడి లేక జోడీ అగ్రహారము లనియు, అగ్రహారములోఁ బండినపంట మీఁద పుట్టి ౧-కి ఇంతసిస్తు అని నిర్ణయించి సిస్తు కట్టఁబడినవి పుట్లకట్టుబడియగ్రహారము లనియు, ఏపన్ను లేకుండ నీయఁబడినవి సర్వాగ్రహారము లనియు, పంటలో మూఁడవవంతు సిస్తుగా నిచ్చి యనుభవింపఁబడునగ్రహారములు త్రిష్యేకాగ్రహారము లనియుఁ జెప్పఁబడును. అగ్రహారములో నున్న బ్రాహ్మణకుటుంబములవారందఱును తక్కువపన్ను చెల్లించుచు ననుభవించునగ్రహారములు ధర్మాసనాగ్రహారము లని పిలువఁబడును. శ్రోత్రియాగ్రహారములు వేదాధ్యయనసంపన్ను లగు బ్రాహ్మణుల కీయఁబడినవే కాక యితర బ్రాహ్మణుల కీయఁబడినవి కూడఁ గలవు. బ్రాహ్మణేతరులకు ధర్మార్థమీయఁబడిన యీనామములు ఖైరాతీయినామ లనఁబడును. తొల్లింటి హిందూరాజులచే శాసనములు వ్రాయఁబడి దఖలుపడినయీనామములు 'అల్తమఘా' యీనామము లని పిలువఁబడును. ఆయీనాందారులకు దానవిక్రయాద్యధికారములతో సర్వాధికారము గలిగి వంశపారంపర్యముగా శాశ్వతముగా నవి యనుభవింపబడుచున్నవి.

sampath_Ebooks



ఈయీనాములు కాక పారితోషికముగాఁ గాని, ప్రతిగ్రహీతలు చేసినకార్యములకు బహుమతిగాఁ గాని యీయఁబడినయీనాములు కొన్ని గలవు. అవి యే వనఁగా:—

అడైయోవిమాన్యము - అడవి కొట్టి భూమిని వ్యవసాయార్హముగాఁ జేసినందుల కీయఁబడినయీనాము.

అరసినాగె యీనాము - వివాహకాలమందు కట్నముగా నీయఁబడినయీనాము.

బాఘ్‌మారీ - పెద్దపులిని జంపినందుల కీయఁబడినయీనాము.

బరూన్ లేక కోటకుజ్జి - గ్రామము కాపాడుకొనుటకు నొక బురుజు కట్టినందులకై యీయఁబడినయీనాము.

దండుగ - రాజకార్యములనిమిత్తము విస్తారముసొమ్ముఁ దీసికొనఁబడుటవలన మిక్కిలి నష్టమును పొందినవారి కీయఁబడినయీనాము.

ఏరునాక - గ్రామములో భూమిని మొట్టమొదట కాఁడి కట్టియున్నవాని కీయఁబడినయీనాము.

గట్టితీరువ - వ్యవసాయము చేయుటకు మిక్కిలి కష్టతరమైన మెరకభూములను సేద్యముచేసినందులకు తక్కువసిస్తు కట్టి యీయఁబడినయీనాము.

ఈడిగ - కల్లునిమిత్త మీఁతచెట్లు నేసినవాని కీయఁబడిన యీనాము.

ఇరుంబుకట్టి - రాళ్లనుండి యినుము తీసి కమ్మరిపని చేయుటకుఁ బ్రోత్సాహము కలిగించినందుల కీయఁబడినయీనాము.

జూలాహతాక్ - నేఁత గాండ్రు గ్రామములో నివసించియుండుటకుఁ బ్రోత్సాహము కలిగించినందుల కీయఁబడినయీనాము.

మేటి - సేద్యగాండ్రను దీసికొనివచ్చి గ్రామములోఁ గాఁపురము పెట్టించిన పెద్దరైతున కీయఁబడినయీనాము.

నారివెట్టి - వేఁటలో నక్కలను జంపినందుల కీయఁబడిన యీనాము.

నెత్తురుకట్టు, నెత్తురువెట్టు, రక్తమాన్యము, ఉదరపట్టు, పలిక్కాణీ, రక్తకొడగె అను పేళ్లుగల ఈనాములు యుద్ధములోఁ జచ్చిపోయినవారికుటుంబపోషణార్థము గాని, పరోపకారార్థము శరీరమునందు గాయములు పొందినవానికిని వానికుటుంబమునకుఁ గాని ప్రతిఫలముగా నీయఁబడినయీనాములు.

నీర్‌సరిహద్దు - ఇంకొక గ్రామము నుపయోగార్థము తమభూముల గుండ నీటికాలువ త్రవ్వుట కంగీకరించినందులకుఁ బ్రతిఫలముగా నీయఁబడినయీనాము.

పెల్లెట్టు - చెఱువు త్రవ్వునప్పుడు మొట్టమొదటఁ బెల్లు విఱిచి త్రవ్వుట మొదలిడినవాని కీయఁబడినయీనాము.

పల్లికట్టు - గ్రామము కట్టినవాని కీయఁబడినయీనాము.

పులికట్టు - మంత్రసామర్థ్యముచేత పులినోరు కట్టి దానివలని యపాయము తప్పించినందుల కీయఁబడినయీనాము.

పంగువాలీ లేక పట్టువాలీ - గ్రామమం దుమ్మడిహక్కు గల రైతులకు, ఆగ్రామకృషి వృద్ధిపఱిచినందుల కీయఁబడినయీనాము.

స్థలఈనాము - ఉత్తరార్కాడుజిల్లాలో పల్లికట్టు ఈనాములనే స్థల యీనాము లని పిల్తురు. తిరుమనాపల్లి మొదలగు కొన్ని దక్షిణాదిజిల్లాలలో గ్రామస్థు లందఱకును గావలసినపసులవిషయమై సేద్యము చేయఁబడుభూములలోనుండి రైతు లంపఱుచేఁ గొంచెము కొంచెముగా నీయఁబడుమాన్యములు స్థలఈనాము లందురు.

భళేరావ్ - రాజుసాన్నిధ్యమునకుఁ దఱచుగా రానీయఁబడుచు నచట గౌరవమును జెందుట కర్హతగల పెద్దమనుష్యులపోషణము కొఱకును, వారు రాజగౌరవమును కాపాడుకొనుటకు నీయఁబడిన యీనాము.

ముడవ లేక నప్పణి - నడవలేనికుంటివాని కీయఁబడినయీనాము.

ముతలికన్ - ఒక గొప్పగౌరవస్థుని నాశ్రయించుకొన్నవారికిని సేవ చేయువారికి నీయఁబడినయీనాము.

నిర్వాణమాన్యము - దిగంబరుఁడై తిరుగుసన్న్యాసి కీయఁబడిన యీనాము.

రాజబంధువు - పాళ్యగార్లయొక్కయు, జమీన్దారులయొక్కయు బంధువులకుటుంబపోషణార్థ మీయఁబడినయీనాము.

వేదాగ్ - వేఁటలోఁ బ్రజ్ఞకలవాని కీయఁబడినయీనాము.

## నౌకరీయీనాములు

భూస్వాములకుఁ గాని జమీన్దారులకుఁ గాని సొంతనౌకరీనిమిత్త మీయఁబడినవియు, గ్రామసముదాయమునకుఁ గాని ప్రజాక్షేమముకొఱకుఁ గాని నౌకరీ చేయుట కేర్పఱుపఁబడిన వనియు నివి రెండువిధములు. ఇందు మొదటిరకము ఈనాములు పాళ్యగార్లవలనఁ గాని, దేశాధిపతులవలనఁ గాని పోలీసు లేక మిలిటరీనౌకరీలు చేయఁబడినందుల కీయఁబడినభూములు. ఇవి 'అమరం' భూములనఁబడును. వీని ననుభవించువారి నమరందారు లని పిలుతురు. అట్టి యుద్యోగములను జేయుబంట్రోతుల కీయఁబడినభూములు కట్టుబడులనఁబడును. గంజాముజిల్లాలో పర్లాకిమిడిజమీన్దారిలో చేరిన 'మలయ' లను కొండభూములయందు నొకవిధమగు మిలిటరీనౌకరీయీనాముల భుక్తపద్ధతి కలదు. ఈప్రదేశమున నివసించు ప్రజలు సవర లనఁబడుదురు. వీరు తిరుగఁబాటు చేయుచు వెల్లడిప్రదేశములయందలి ప్రజలను బాధించుచువచ్చుచుండిరి.

sampath_Ebooks

### మలయః

సవరలు నివసించు మలయా ప్రదేశము లన్నియు ౧౧ ముఠాలుగా విభజించి అలజడి లేకుండ దేశమును గాపాడుటకును, మలయలనుండి పల్లపుప్రదేశముల కేతెంచుమార్గములలో దోపిళ్లు దొంగతనములు లేకుండ దేశమును సంరక్షించినందులకును నీ ౧౧ ముఠాలకును ౧౧ గురు బిస్సోయీ లను నాయకులను నియమించిరి. ప్రతి బిస్సోయీయు నొకచిన్నకోట గట్టుకొని పాయక్ లను తమ క్రింది యుద్యోగస్థులతోఁ గాఁపుర ముంచి తమయేలుబడిముఠాలలో నున్న సవరజాతివారినిఁ గట్టుఁబాటులో నుంచుచుండిరి. ఇట్టిబిస్సోయీలు తమముఠాలను బైని జెప్పిననౌకరీ చేసినందుల కీనాములుగా ననుభవించుచున్నారు. వీరికిఁ గొంచెము కట్టుబడిపన్ను కూడ కట్టుట గలదు. ఈబిస్సోయీలు తమక్రిందిపాయక్ లను నుద్యోగస్థులకు భూరూపముగాఁ గాని రొక్కరూపముగాఁ గాని ధాన్యరూపముగాఁ గాని జీతము లిచ్చుచుండిరి. ఈబిస్సోయీలయేలుబడిలో నున్న సవరలు బిస్సోయీలసొంతభూములను సేద్యము చేయుటకు వెట్టి చేయుటవలనఁ గాని లేక వారు చేయు కుమ్మరి లేక పోషువ్యవసాయమునకు నింటి కొక్కరూపాయచొప్పున రొక్కమో, ఒకపుట్టెడు ధాన్యముచొప్పున ధాన్యమో యిచ్చుటవలనఁ గాని బిస్సోయీలకు సిస్తు కట్టుచుండిరి. ఇదిగాక సంవత్సరమున కొలుపర్యాయములు పండ్లు కాయగూరలరూపముగా 'సంబోలో' అనుపన్ను కూడఁ జెల్లించుచుండిరి. ఇట్లు దేశోపయోగముకొఱకు నేర్పఱుపఁబడినబిస్సోయీలు పాయక్కులు గాక సవరలవలన బాధ లేకుండ గ్రామములను గాపాడినందులకు దొర లని పిలువఁబడుచుండిరి. సర్లాకిమిడి జమీన్ దారీలో ౨౩ గురు రిట్టిదొరలు గలరు. వీరు చేయు నౌకరీనిమిత్త మనుభవించుభూములు దొరతన మీనాము లందురు.

### జీవితములు

మఱియు, మధురజిల్లా, రామనాథపురములో నిట్టియీనాములు గలవు. ఇవి యుత్తరసర్కార్లలోని 'ముఖాసా' లను బోలియుండును. ఇవి జమీన్ దారులు తమకు చేసిననౌకరీకిఁ బారితోషికముగాఁ గాని, చేయవలసిననౌకరీనిమిత్తముగాఁ గాని కుటుంబపోషణార్థము తాజీలుగాఁ గాని తమ్మాశ్రయించుకొన్నయాశ్రితులకును రాజబంధువులకును నీఁయఁబడినయీనాములు.

### కట్టుబడి

ఆయుధములు ధరించిన తమ నౌకరులకుఁ దమకు నౌకరీ చేయుపద్ధతిని జమీన్ దారులవలనఁ దక్కువసిస్తున కీఁబడినభూములు. ఈకట్టుబడిభూములు సంవత్సర మంతయు గ్రామనౌకరులుగా నుండి నౌకరీ చేయుట కీయఁబడినవి. గ్రామకట్టుబడులును అవసరము వచ్చినప్పుడుమాత్రము నౌకరీ చేయుట కీయఁబడినవి 'జంగీకట్టుబడు' లనియును జెప్పఁబడును. ఈకట్టుబడిభూములు నౌకరీ అక్కఱ లేనప్పుడు మరలఁ దీసికొనవచ్చును. మఱియును, తాలూకాయుద్యోగస్థులకు గ్రామములనుండి వస్తువులను దీసికొనిపోయి యిచ్చునౌకరీభూములు 'అనకాలకట్టుబడు' లనియు, భూములకు నీరు పంచిపెట్టి మామూలుగాఁ జేయవలసినపనులకు రైతులను సమకూర్చినందుల కీయఁబడినభూములు 'అంగజాలకట్టుబడు' లనియు, కట్టుబడి బంట్రోతులలోఁ బెద్దవాని కీయఁబడినది 'పండీయకట్టుబడి' యనియు, నౌకరీ యిట్టి పని నిర్ణయము లేక యేనౌకరీ చేయుచుండఁగనే యీయఁబడినది 'జీవవృత్తి' లేక 'జీతోత్తర' కట్టుబడి యనియు, బళ్లారిజిల్లా యందలి పడమటితాలూకాలయందు తాము సేద్యము చేయుభూములలోఁ గొంతసిస్తు మినహాయింపఁబడి, అనుభవింపఁబడుభూములు 'ఖండాచార' కట్టుబడు లనియు, గంజాముజిల్లాలో నాయుధము ధరించి జమీన్ దారులకు నౌకరీ చేయువారి కిచ్చుభూములు 'కోల పాయకో' కట్టుబడు లనియు, బంట్రోతు-ఉద్యోగము చేసినందులకు ముత్రాసుజాతివారి కీయఁబడినవి 'ముత్రాసు' కట్టుబడు లనియు, గంజాం జిల్లాలో మిలిటరీనౌకరీనిమిత్త మీయఁబడినభూములు 'పాయక్' కట్టుబడు లనియు, విశాఖపట్టణముజిల్లాలో దేశమునందు దొంగతనములు దోపిళ్లు మొదలగునలజడులు లేకుండఁ గాపాడినందులకు నాయుధములు ధరించిన బంట్రోతులకు పర్వతప్రాంతమందలిజమీన్ దారులచే నీయఁబడినభూములు 'నిగస్తు కట్టుబడు' లనియుఁ జెప్పఁబడును.

### ముఖాసా

తక్కువసిస్తున కొకగ్రామము గాని కొన్నిగ్రామములు గాని నౌకరీనిమిత్త మీయఁబడినవి ముఖాసా లనఁబడును. ఇట్టిముఖాసా లనుభవించువారు చేయునౌకరీ సామాన్యముగా మిలిటరీపనియే. ఇట్టి ముఖాసాలలోఁ గొంచెము తక్కువక్విట్ రెంటు చెల్లించుచు ననుభవించునవి కట్టుబడిముఖాసా లనియు, ప్రతిసంవత్సరము పండుపంట లనుబట్టి నిర్ణయింపఁబడుచు తక్కువసిస్తున కనుభవించునవి రాయయస్తుముఖాసా లనియు, ఏ నౌకరీయును చేయకుండ ననుభవించునవి సర్వముఖాసా లనియుఁ జెప్పఁబడుచుండును. తంజావూరుజిల్లాలో శరభోజీమహారాజు తనదేశమును సర్కారున కిచ్చినపుడు తనక్రింద నుంచుకొన్నట్టిదియు, రేటురాజా అనుభవభుక్తములలో నున్నట్టిదియు నగు ప్రైవేటుఎస్టేటు ముఖాసా అనుపేరఁ బిలువఁబడుచున్నది. ఈముఖాసా సర్కారునకు నీటివిషయమున చెల్లించునీటితీరువయు లోకలుసెస్సు మొదలగు తక్కినపన్నులు గాక చెల్లింపవలసిన భూమిసిస్తేమియు లేదు.

ఈనౌకరీయీనాములు గాక అనేకవిధములగు చిల్లరనౌకరీయీనాములు పెక్కులు గలవు. అవి యీక్రింద వివరింపఁబడుచున్నవి.

౧. అత్తర్ - పాళ్యగారులకు పరిమళద్రవ్యముల నిచ్చునౌకరీనిమిత్త మీయఁబడినయీనాము.

sampath_Ebooks

౨. బారుత్ గోలా - పాళ్యగారులకు, తుపాకి మందుగుండ్లు సమకూర్చుట కీయఁబడినయీనాము.

౩. భట్రాజు లేక సంగీతము - జమీందారులయు, పాళ్యగారులయు ప్రాభవమును గయివారము సేయు భట్రాజులు మొదలైన స్తుతిపాఠకుల కీయఁబడినయీనాము.

౪. బోయీ లేక గడబా లేక గడబాలు లేక పండీ-పాలకీలు సవారీలు మొదలగునవి మోయుబోయీల కీయఁబడినయీనాము.

౫. దర్జీ లేక తయుల్కార్ - జమీందారులకును పాళ్యగార్లకును కుట్టుపని చేసినందుల కీయఁబడినయీనాము.

౬. డేగ - డేగలను పట్టుకొని పక్షులను వేటాడు జమీందారీ నౌకరుల కీయఁబడినయీనాము.

౭. దొమ్మర - దొమ్మరిఆట లాడువారి కీయఁబడినయీనాము.

౮. పలుకల - మందులనిమిత్త మూలికలు మొదలగు గ్రంథిగాండ్లు జమీందారులకుఁ దెచ్చియిచ్చునౌకరీ కీయఁబడినయీనాము.

గొల్లమంద లేక గొల్ల లేక పాల్కాలమంద - జమీందారులకు, పాలు పెరుఁగు సమకూర్చినందులకును, గ్రామమునందలి భూములకు మంద కట్టుటకును గొల్లల కీయఁబడినయీనాము.

గొడుగు - జమీందారులకు గొడుగు పట్టునౌకరీ కీయఁబడినయీనాము.

గుప్తప్రకాశనాం - జమీందారులగుప్తములను తనిఖీ చేయుము వానికి నసీక చెప్పి శిక్షించుటకును, గుప్తములను సంరక్షించుచుండుటకును నీయఁబడినయీనాము.

జెట్టి - పాళ్యగార్లయు జమీందారులయు సమీపమునందు కుస్తీ చేయువాని కీయఁబడినయీనాము.

కడియ్యార్ - జమీందారులకు చాపలు, వ్రాఁతకు పసగొంగించు తాటియాకులు సమకూర్చు నౌకరీ కీయఁబడినయీనాము.

కవిగోయార్ లేక పులవర్ - జమీందార్లయు పాళ్యగార్లయు నాస్థానమందున్నకవుల కీయఁబడినయీనాము. ఇట్టిభూమి బ్రాహ్మణకవులయధీనములో నున్నప్పుడు 'కవితాపట్టం' అనఁబడును.

ఖాసా - జమీందారుల యిండ్లలోని నౌకర్ల కీయఁబడినయీనాము.

కొమ్ము - తహస్సీల్దారుముందు కొమ్ము, బాకా యూఁదునౌకరీ కీయఁబడినయీనాము.

కోస్ - జమీందారు గాని అతనియుద్యోగస్థులు నౌకర్లు గాని గ్రామములో మకాము చేసినప్పుడు పాలు, పెరుఁగు, నెయ్యి మొదలైనవి సమకూర్చునిమిత్త మీయఁబడినయీనాము.

కుడుకుడుప్పై - శకునములు చెప్పినందులకు బుడుబుక్కల వాని కీయఁబడినయీనాము.

మటాపట్టీ - సర్కారుద్యోగస్థులకు పాలు తెచ్చియిచ్చినందులకును, గ్రామాధికారు లగురెడ్లు సర్కారుపనిమీఁద గ్రామము విడిచి పయికి వెళ్లినప్పుడు అన్నము వండిపెట్టినందులకును నీయఁబడినయీనాము.

నగారా - నవాబులగుమ్మములదగ్గఱను మసీదులదగ్గఱను నగారా వాయించుట కీయఁబడినయీనాము.

పాలపట్టీ - గ్రామదేవతజాతర అయినప్పుడు ఊరిసరిహద్దులో పాలు పోయునౌకరీ చేయువాని కీయఁబడినయీనాము.

పెరియఅరమ్మణి - జమీందార్లగృహములకుఁ గావలి యున్నందుల కీయఁబడినయీనాము.

పెరుకులి - అప్పుడు రాజ్యము చేయుచున్న జమీందార్ల పేర్లు పిల్లలకు పెట్టుకొనినవారికిఁ గాని జమీందారుల పిల్లలకు నామకరణము చేయించినపురోహితునకుఁ గాని యిచ్చినయీనాము.

పుష్పాడి - జమీందారునకు పువ్వులు సమకూర్చినందుల కీయఁబడినయీనాము.

శైకల్గా - జమీందారులఆయుధములు బాగుచేసినందుల కీయఁబడినయీనాము.

శమ్మర్ - జమీందారులకు సున్నము సమకూర్చినందుల కీయఁబడినయీనాము.

శ్యాహివాలా - ఉద్యోగస్థులకు సిరా చేసియిచ్చినందుల కీయఁబడినయీనాము.

తబేలా - జమీందారులగుఱ్ఱపులాయమును తనిఖీ చేయువాని కీయఁబడినయీనాము.

తములపాకులయీనాం - తములపాకుల నిచ్చువాని కీయఁబడినయీనాము.

ఉస్తాద్ - జమీందారులకు కఱ్ఱ, కత్తి త్రిప్పుట మొదలగు సాము నేర్పినందుల కీయఁబడినయీనాము.

వలయన్ - జమీందారులకు వలలు వేసి చేఁపలు తెచ్చియిచ్చువాని కీయఁబడినయీనాము.

జింగార్ - జమీందారులకొఱకు గుఱ్ఱపుజీనులు తయారు చేయువాని కీయఁబడినయీనాము.

గోనెబరకాలు - గోనెసంచులు తయారుచేయుచు వాని నమ్ము కొనుచు గ్రామములో నివసించియుండి కొన్ని రుసుములు మామూళ్లు ననుభవించుటకు హక్కుగలిగి తాము కాఁపురమున్న యిండ్లయందు మాత్రము హక్కు లేనిరైతులు కసపర్గరైతు లనఁబడుదురు. ఈరయితులు సేద్యము సేయుభూమిలో వారికి హక్కు లేదు.

sampath_Ebooks

### దశబంధము

గ్రామస్థులకు నౌకరీ చేయుటకొఱకు కీయఁబడిన యీనాము భూములు కొన్ని కలవు. ఇందు దశబంధము, లేక కట్టుకోడిగ అనునీ నామములు ముఖ్యము లైనవి. మెట్టపంటలో ౧౦- వంతు ఈనాముగా నీయఁబడుటచే నివి దశబంధయీనాము లని పేరు చెందినవి. చెఱువు గాని నూయి గాని నీటికాల్వ గాని త్రవ్వి దానిని మంచిస్థితియం దుంచుచున్నందులకు భూరూపముగాఁ గాని సిస్తురూపకముగాఁ గాని యీఁబడు నీనాములు దశబంధయీనాము లనఁబడును. భూరూపకములకు 'ఖండదశబంధ' మనియు, సిస్తురూపకముగా నీయఁబడినప్పుడు 'మమిూలద్దశబంధ' మనియుఁ జెప్పఁబడును. ఇట్లీనాముగా నీయఁబడినభూమికిమ్ముత్తు గాని రొక్కపుముత్తము గాని ఆపనికి నెచ్చింపఁబడినసొమ్మునెుత్తమునుబట్టి యీయఁబడుచువచ్చెను. కడపజిల్లాలో సర్కారుభూములకు నీరు సమకూర్చుచెఱువులను మంచిస్థితియం దుంచుటకుఁ గాని, భూములను చదును చేసి కృష్యర్హముగాఁ జేసినందులకుఁ గాని బంజరుభూమి సేద్యము చేయఁబడుస్థితికిఁ దెచ్చినందులకుఁ గాని దశబంధ మనుపేరనే యీనాములు పుట్టఁబడినవి. ఉత్తరార్కాటుజిల్లాలో దశబంధ మిూనాందారు ఆయకట్టుభూమి మిూఁదినాలవవంతు, ఈనాముగాఁ బొందినప్పుడు 'చౌతాయిదశబంధం దారు' అనియు, ఆయకట్టుభూమి యంతయుఁ దక్కవసిస్తున కనుభవించునప్పుడు 'వలవాడీదశబంధం దారు' అనియుపిలువఁబడుచుండును. ఈదశబంధం ఈనాందారులు చెఱువులను మంచిస్థితిలో నుంచనప్పుడు వారి కీయఁబడినయీనాముభూములనుగాని చేసినసదుపాయములనుగాని తొలఁగింపవచ్చును. లెక్కదాఖలాభూములకన్న నెక్కువనేల దంప సాగుబడి అయినప్పు డట్లు అదనముగా సాగుబడి అయినభూములలో వచ్చిన లాభములోఁ గొంతభాగముకూడ మమిూలద్దశబంధమిూనాందార్లు పుచ్చుకొనుటకు హక్కు కలిగియుండుట గలదు. క్రొత్తగా, పల్లపుసాగుబడి కాఁబడుభూములమిూఁదను చెల్లఁబడు నీటిపన్నులో రు. ౧౦౦-కి రు ౨౦ వంతున ఖండదశబంధందారు లనుభవించుటకు హక్కు కలిగియున్నారు. శాశ్వతపుజమీన్దారీసెటిలుమెంటగునాఁటి కిట్టి దశబంధంఈనాములు భుక్తములో నుండియున్నను జమీన్దారీయెస్టేట్లలో నున్న అట్టియీనాములహక్కు సర్కారువారు సంపూర్ణముగా వదలివైచిరి.

### ఇతర యీనాములు

అలొట్టి - మామూలుగాఁ జేయవలసినపనులకొఱకు రయితుల నందఱను సమకూర్చువాని కీయఁబడినయీనాము.

అంబిక లేక పల్లివాఁడి లేక తెప్పన్ - ఏఱు దాఁటించునౌకరీ కీయఁబడినయీనాము.

అన్కెకరమ్ - ఏటిగట్లు, ఆనకట్టలు మొదలగునవి పశువులు త్రొక్కి పాడు చేయకుండఁ గాపాడి వానిపై గడ్డి పెంచినందుల కీయఁబడిన యీనాము.

బందెలా - పశువులు చేలలోఁ బడి సస్యము పాడుచేయకుండఁ గాపాడినందుల కీయఁబడినయీనాము.

కరేమాన్యం లేక కలంవెట్టు లేక కమ్మాయివెట్టు - చెఱువులు బాగుచేయునిమిత్తము కూలివాండ్రను సమకూర్చినందుల కీయఁబడిన యీనాము.

ఖుల్లా లేక పటరా - ఇది చెఱువులకును కాలువలకును చిన్న చిన్న రిపేర్లు గావించి త్రవ్వుచున్నందుల కీయఁబడినయీనాము.

కులంకావల్ - రయితులు చెఱువులో నీరు వృథాగా కర్చు పెట్టకుండఁ గాపాడినందుల కీయఁబడిన యీనాము.

నానల్ - ఆనకట్టలమిూఁదను, పంటకాల్వలగట్లమిూఁదను సుబ్బగడ్డి పెంచుటకకై కీయఁబడిన యీనాము.

నీరుమానక - నీటిలో మునిఁగి చెఱువుతూములను తెఱచుటకకై కీయఁబడిన యీనాము.

పట్టి - పశువులు చేలలోఁ బడి మేయకుండఁ గాపాడుటకకై కీయఁబడిన యీనాము.

సాగుబడి - సర్కారుభూములను సాగుబడి చేయుటకుఁ బ్రోత్సాహపఱచుచున్నందులకుఁ బెత్తనదారుల కీయఁబడిన యీనాము.

ఉప్పర లేక ఒడ్డె - చెఱువులు మరమ్మత్తు చేయుటకకై కీయఁబడినయీనాము.

ఊరమి - గ్రామస్థులవాడుకనిమిత్తము మంచినీళ్ల చెఱువులను మంచిస్థితియం దుంచుటకకై కీయఁబడిన యీనాము.

వాయిక్కాల్ - నీటికాల్వలు, పంటభూములయొక్క యితర జలాధారములు సరియయినస్థితియం దుంచినందుల కీయఁబడిన యీనాము.

కృషి యాధారముగను వృత్తిగను నొక గ్రామమందుఁ గాఁపురమున్న గ్రామస్థులు తమవ్యవహారము లన్నియుఁ జక్కఁగా నెఱవేర్చుకొనుటకును, తమవృత్తులకు భంగము లేకుండ సుఖముగా జీవించుటకును ముఖ్య మగునేర్పాటు లన్నియుఁ బ్రతిగ్రామమందును జేయఁబడియున్నవి. గ్రామలెక్కలు వ్రాయుటకు కరణము లను నధికారు లుండిరి. వీరినే మహారాష్ట్రదేశమున కులకరణీ లనియు, ఉత్తరహిందూదేశమున పటవారీ లనియు, అఱవదేశమున కనకపిళ్లె లనియు నందురు. ఈవ్యవహారస్థులు ప్రతిగ్రామమునకు నొకరిద్దఱు ప్రప్రథమమునుండియు నేర్పడియున్నారు. ఈయుద్యోగస్థులకును, గ్రామస్థులసదుపాయమునిమిత్త మేర్పడినయితర గ్రామసేవకులకును వారు చేయుపనులకుఁ బ్రతిఫలముగఁ గొంతభూమి గాని కొంతసిస్తు గాని పంటలోఁ గొంతభాగము గాని మేరలు, రుసుములు, 'స్వతంత్రము' అనుపేర నీయఁబడుచున్నవి. ౧౮౦౨-వ సంవత్సరములో జారీకాఁబడిన ౨౯-వ నెంబరు రెగ్యులేషనుల ననుసరించి శాశ్వతముగా

sampath_Ebooks



సెటిలుమెంటు కాఁబడిన జమీందారీయెస్టేట్లయందలి కరణములను నియమించుట, శిక్షించుట మొదలగునధికారములు జమీందారుల కీయఁబడినవి. ఈ కరణములయుద్యోగము వంశపారంపర్యముగ వచ్చుహక్కు కలది. ఈ రెవిన్యూ శేషసులు కరణములవిషయముననే కాక తక్కిన గ్రామనౌకర్లు, అనఁగా గ్రామపట్రంగి, గ్రామ కుమ్మరి, గ్రామమంగలి, గ్రామచాకలి, గ్రామకమ్మరి, గ్రామజ్యోతిష్కుఁడు, గ్రామపురోహితుఁడు వను నీ యేనుగురవిషయమునను సంపూర్ణమైన యేర్పాటులును నిబంధనలును గలిగియున్నవి. తరువాత ౧౮౯౪-వ సంవత్సరమున జారీచేయఁబడిన ౨-వ నెంబరు ఆక్టు అను మదరాసు ప్రొప్రైటరీయెస్టేట్లవిలేజిసర్వీసుఆక్టు జారీకాఁబడి దానినిబట్టి జమీందారులకు కరణములమీఁదియధికారమునకుఁ గొన్ని మార్పులు కలుగఁజేసి అంతకుమున్ను కరణము లనుభవించుచున్న నౌకరీయీనాములకు సిస్తు కట్టి శాశ్వతపుహక్కుతోఁ బట్టాల నిచ్చి సర్కారుగ్రామములయొక్క సిస్తునుబట్టియు, కరణములు చేయఁదగు పనులనుబట్టియు నెలజీతము లేర్పఱిచిరి. తరువాత ౧౮౯౫-వ సంవత్సరమున ౩-వ నెంబరున జారీకాఁబడిన 'హెరిడిటరీ విలేజి ఆఫీసర్సు' ఆక్టునుబట్టి గ్రామపట్రంగి, మంగలి, చాకలి, కుమ్మరి, జ్యోతిష్కుఁడు, పురోహితుఁడు తప్పఁ దక్కిన గ్రామసేవకుల నేర్పఱచు విషయమున విపులముగా నిబంధన లేర్పఱుపఁబడినవి. గ్రామకరణము, గ్రామమునసబు, గ్రామతలారులను దప్పఁ దక్కిన గ్రామనౌకర్లను గ్రామములోఁ గాఁపుర ముండకపోయినను విమతమునౌకరీలను జేయకపోయినను నుచితముగా ప్రవర్తింపకపోయినను దొలఁగించుటకుఁ గాని కొంతకాలము నిలుపుదల (సస్పెండు) చేయుటకుఁ గాని జమీందారుల కధికార మీయఁబడినది.

మతవిషయకముగ దేవాలయములు మొదలగువానినౌకరీ కీయఁబడిన యీనాము లమ్ముకొనుటకుఁ గాని యితరుల కిచ్చుటకుఁ గాని యీనాందారుల కధికారము లేదు. దేవాలయాదికముతో సంబంధించిన నౌకర్ల కీయఁబడినయీనాములు వారివారికి నిర్ణయింపఁబడిన పనులు వారు యథోచితముగా చేయుచున్నంతవఱకు వారి కాయీనాములపై నధికారము గలదు. అట్టినౌకరీలు వారు చేయనప్పుడు వారి స్థానము నితరులను నియమించి వారి కాభూము లనుభవింప నధికార మీయఁబడును. శాశ్వతపుసెటిలుమెంటునకుఁ బూర్వ మీయఁబడినవియు, ఎస్టేట్లయొక్క జమమొత్తములోఁ (Assets) జేర్పఁబడనిసిస్తుగలవియు నయినయీనాములను లాఖిరాజ్ భూములను వానినియ్యఁబడినయుద్దేశము నెఱవేర్పఁబడనప్పుడు వానిని దీసికొనుటకు సర్కారువారికి హక్కు గలదు. శాశ్వతపుసెటిలుమెంటునకుఁ బూర్వము 'జోడీ' పన్ను చెల్లించుచున్నపుడును, అట్టిజోడీపన్ను ఎస్టేట్లజమమొత్తములోఁ జేర్పఁబడినపుడును జోడీపన్నుమాత్రము పెంచుకొనుటకు జమీందారులకు హక్కు గలదు కాని యీనాములను దీసికొనుటకు హక్కు లేదు. సాధారణముగా సర్కారు ఈనామభూములకు పట్టాల నిచ్చునపు డట్టియీనాములు భుక్తములో నున్నవారికే యిత్తురు. స్థలనిర్దేశము కాఁబడనియీనాములకు సిస్తు కట్టవలసివచ్చినపు డాభూమికి సిస్తు కట్టి దానికి పట్టా జమీందారునకే యీయఁబడును. శాశ్వతపుసెటిలుమెంటునకు దరిమిలా నీయఁబడినయీనాములు తీసికొని జిరాయితీభూములకువలె పన్ను కట్టుట కధికార మున్నది. పైని వివరింపఁబడిన పలువిధము లగు ఈనాములహక్కుభుక్తములు న్యాయశాస్త్రములను బట్టియు, నితర శాసనములనుబట్టియును, దేశాచారములనుబట్టియు, హిందూధర్మశాస్త్రసమ్మతము లైనహక్కులనుబట్టియును వ్యవహరింపఁబడుచుండును.

## ఇతరాస్తుల యమరకము

ఇట్లు సేద్యము సేయఁబడుభూమియే కాక యితరాస్తులు కూడ నమరకము చేయుపద్ధతి కలదు. ఇండ్లు, ఫ్యాక్టరీలు, ఇతరమయినకట్టడములు మొదలగునవి కట్టుటకు స్థలము కొన్నిసంవత్సరములవఱకును కమరకము చేయుట కలదు. తోఁటలు, నీడ్లు మొదలగునవి తదధికారియు రయితును నేర్పఱుచుకొనుషరతులమీఁద నమరకము చేయఁబడుచుండును. తోఁటలు కాపునుబట్టికాని అంతకుఁ బూర్వమే కాని వీలునుబట్టి కొంతమొత్తము సిస్తున కమరకము చేయఁబడుచుండును. కల్లు గీచుకొనునిమిత్తము తాటిచెట్లమీఁద గీఁతప న్నొకటి విధించి చెట్టునకు కొంతసొమ్ముచొప్పున వసూలు చేయుపద్ధతికూడ కలదు. ఇట్టిచెట్లు అబ్కారీయుద్యోగస్థులు నెంబర్లు వేసి చెట్లను కల్లునిమిత్తము గీచుకొనువారియొద్ద నట్టిపన్నును వసూలు చేయుచుందురు. ఈపన్ను కొన్నిసంవత్సరములక్రింద లేదు. ఇప్పు డేజన్సీప్రదేశములయందుఁగూడ నీపన్ను వసూలు చేయఁబడుచున్నది.

సముద్రప్రాంతములయందలి చవిటినేలలు ఉప్పు పండించుకొనుటకును సురేకారము చేయుటకును అమరకము చేయఁబడుచుండును. ఈ యమరకముగూడ ఫలసాయమునుబట్టి రయితులు కొంతమొత్తము సిస్తున కమర్చుచుందురు. ఉప్పుపంట సర్కారు తప్ప నితరులు పండింపఁగూడనిది కావున నట్టిభూము లమర్చుకొనునధికారము భూస్వామికి కలిగియుండినను, అందు పండినపంటమాత్ర మందువిషయమున నేర్పడిననిబంధనల ననుసరించి సర్కారువారికే యప్పగింపవలయును. చెఱువులు జలాశయములు మొదలగువానిలో సర్కారుగ్రామములలో నున్నవానిని సర్కారును, ఇతరభూస్వాములగ్రామములో నున్నవానిని నితరభూస్వాములును చేఁపలు పట్టుకొనుటకును, నంచలితామరాకులు మొదలగునవి యుపయోగించుకొనుటకును సిస్తున కమరకము చేయఁబడుచుండును. సముద్రతీరములయందు నున్నపుసుల్ల మొదలయినవి తీసికొనుటకుఁగూడ నొకవిధ మయినయమరకము కలదు. ముత్యములు పగడములు మొదలగునవి దొరకుప్రదేశములోని సముద్రప్రదేశములు విశేషపుమొత్తపు సిస్తున కమర్పఁబడుచున్నవి. మఱియు రేవు దాఁటునట్టియేటిప్రదేశములు, త్రోవలలోని ఘాటీలు, సంతలు, ఉత్సవదినములలోని టెంపరరీదుకాణములు మొదలగునవికూడ నాయాప్రదేశముల కధికారులగువారికి కొంతసిస్తుమొత్తమున కమర్పఁబడుచుండును. మఱియు

sampath_Ebooks

కల్లు, సారాయి, దుకాణములు, నల్లమందు, గంజాయి మొదలగు మత్తుద్రవ్యములను కాంట్రాక్టులు సర్కారువారి 'అబ్కారీ' యుద్యోగస్థులవలన వేలంపాట పాడఁబడి యెక్కువసిస్తు కట్టుకొన్నవాని కమరకము చేయఁబడు చుండును. ఇట్టి నుకాణము లమరకము చేయఁ బడుటయందు సిస్తు రాఁబట్టవలె ననునుద్దేశమే కాక అట్టిమత్తు ద్రవ్యములయుపయోగము సాధ్యమైనంతమట్టునకు నిర్బంధించి కట్టి పెట్టింపవలయు ననియే గౌరవనమువారియుద్దేశము. అడవులు, పుల్లరిభూములు, పాటిపెరళ్లు మొదలగునవికూడ వానియం దధికారము కలవారిచే నమర్పఁబడు చుండెను.

## పురాతనకాలపు భూమికొలత

భూమికొలత యనఁగాఁ జదరపుఁగొలత. ఒకానొక క్షేత్రము యొక్క వైశాల్యమును దెలిసికొనుట. దీనిని మనగణితశాస్త్రములో క్షేత్రవ్యవహార మనియెదరు. క్షేత్రపరిమాణమును దెలిసికొనుట సులభ మైన పని కాదు. అందులకుఁ గొంత రేఖాగణితమును (Geometry), క్షేత్రగణితమును (Mensuration) తెలిసియుండవలెను. హిందువుల కీవిద్యలు మిక్కిలి పూర్వకాలమునుండియుఁ దెలిసి యుండె ననుటకు సందేహము లేదు. ప్రతివేదశాఖకును సంబంధించి నట్టి కల్పసూత్రములలోఁ జివరను 'శుల్బసూత్రము' లుండును. ఇవి క్షేత్రపరిమితిని దెల్పురేఖాగణితమునకు సంబంధించిననియమములు. పురుష మన్నది యప్పటి యొకమానము. చేతు లెత్తి పురుషుఁడు నిల్చిన యెంతపొడుగునో యంత (౧౨౦ అంగుళములు) పురుష మానము.[1] ఇట్టిపురుషప్రమాణము పొడుగును, పురుషప్రమాణము వెడల్పునుగల క్షేత్రము చతురస్రపురుషము, చదరపుపురుషము. చిన్న యజ్ఞకుండము ౭½ చదరపుపురుషము లుండవలెను. ఇది చతురస్రముగ నుండవలెను. ఇంతియె వైశాల్యముగల ముక్కోణపు కుండమును, చక్రాకారపుకుండమును గట్టవలెను. తరువాత నీవైశాల్యముకంటె నొక్కొక్క చదరపుపురుషము వైశాల్య మధికముగ నుండువానిని నిర్మింపవలెను. రెండుకుండముల వైశాల్యములు కలసి యెంత యగునో యంతదియు, ఒకదానిలోనుండి యొకటి తీసివేసిన నెంత యగునో యంతదియు నగువేఱుకుండములను నిర్మింపవలెను. వైశాల్యము హెచ్చింపక తగ్గింపక సమచతురస్రముగను, (Square) దీర్ఘచతురస్రముగను (Oblong), వృత్తముగను (Circle) మార్చవలెను. ఇట్టివాని కన్నిటికిని శుల్బసూత్రకారులు సూక్ష్మనియమములను జెప్పియున్నారు. కావున భూమివైశాల్యమును గనుఁగొనువిద్య వారికిఁ దెలియు ననుట స్పష్టము. ఈసూత్రములు క్రీ. పూ. ౫-౬ శతాబ్దులనాఁటివి.

చంద్రగుప్తచక్రవర్తికాలమునందుఁ (క్రీ. పూ. ౩౧౧-౨౭౫) భూములు కొలచు నాచార మున్నట్టు స్పష్టముగఁ గానవచ్చుచున్నది. కౌటిల్యార్థశాస్త్రమునందు భూమికొలత తీయఁబడినది. దేశమానములలోఁ బొడుగుమానములును, చదరపుమానములును జెప్పఁబడినవి.[2]

౧౦ అంగుళములు ౧ గార్హపత్యధనుస్సు (గజముబద్ద). గృహపతి యనువాఁడు వడ్రంగి. దీనిని త్రోవలఁ గొలుచుటకును, ప్రాకారములు కొలచుటకును, ఉపయోగించుచుండిరి. అగ్నిచితులు కట్టుటలోఁ బౌరుష మను మానము నుపయోగించుచుండిరి. ఆఱు కంసములు పొడుగు గల దండము బ్రాహ్మణుల కిచ్చిన భూములు కొలచుటలో నుపయోగింపఁబడెను. పదిదండము లైన నొక్క రజ్జువు, రెండు రజ్జువు లైన నొక్క పరిదేశము, త్రిరజ్జుక మైన నొకనివర్తనము. పరిదేశ, నివర్తనములు క్షేత్ర (చదరపు) మానము.

నీటిపాఱుదలకు సంబంధించిన యధికారులె భూములు కొలచుచుండి రని మెగస్తనీస్ వ్రాసియున్నాఁడు[3]. ౯-వ శతాబ్ది వాఁడయిన మహావీరాచార్యుఁ డతనిసారసంగ్రహగణితములో దేశమానము లిచ్చుటయె కాక క్షేత్రవ్యవహార మని యొక్క అధ్యాయము వ్రాసియున్నాఁడు. అందు త్రిభుజ చతుర్భుజ వృత్తాది క్షేత్రముల చదరపుకొలత కనుఁగొను స్థూల (Approximate), సూక్ష్మ (Exact) పద్ధతులు చెప్పియున్నాఁడు. పండ్రెండవశతాబ్దివాఁ డగు భాస్కరాచార్యుఁడు లీలావతీగణితమునందు 'నివర్తన' మను చదరపుమాన మిచ్చి[4] క్షేత్రవ్యవహారాధ్యాయమందు పొలములవిస్తీర్ణమును గనుఁగొనువిధములను వివరముగఁ దెల్పెను. ఈ 'నివర్తనము' అనునది రమారమి రెండు-ఎకరము లగును. ఈమానము చాంద్రగుప్తునికాలమున

---

1. 'అర్ధాష్టమపురుషాః ప్రథమోఽగ్నిః' అన్న ౨-వ అధ్యాయమందలి ౧-వ సూత్రముమీఁద నిట్లు వృత్తి వ్రాయఁబడియున్నది. 'పురుషశబ్దేన పంచారత్నినా వింశత్యధికశతాంగులేన వేణునా పరిమితం క్షేత్రముచ్యతే. తత్ర చతుర్దశసహస్రాణి చత్వారిశతాన్యంగులయః పురుషే సంతి' [కాశీవిద్యాసుధానిధి, ౧౮౭౫ ఆగస్టు నెలసంచికలోని శుల్బసూత్రములు].

2. "గార్హపత్య మష్టశతాంగులం ధనుః ప్రథిప్రాకారమానం, పౌరుషంచ అగ్నిచిత్యానామ్, షట్కంసో దండో బ్రహ్మదేయాతిథ్యమానమ్, దశదండో రజ్జుః, ద్విరజ్జుకః పరిదేశః త్రిరజ్జుకం నివర్తనం, ఏకతో ద్విదండాధికో బాహుః" [కౌటిలీయం అర్థశాస్త్రమ్, Bibliotheca Sanskrita, No. 37., Pages 106-107, Mahadeva Sastry's edition].

3. Vincent Smith's Early History of India, 3rd Edition, p. 132.

4. "తథా కరాణాం దశకేన వంశః, నివర్తనం వింశతివంశసంఖ్యైః క్షేత్రం చతుర్భిశ్చ భుజైర్నిబద్ధమ్. ౬." [౧-వ అధ్యాయము]. పదియొకరములకు (మూరకు) నొకవంశము (వెదురు), ఇరువదివంశములు పొడుగు, ఇరువది వంశముల వెడల్పుగల చదరము నివర్తనము, నాలుగుభుజలచే నాక్రమింపఁబడియుండును.

sampath_Ebooks

నుండియు వచ్చుచున్నట్లున్నది.[1] మితాక్షర[2] లోఁగూడ భూవివాదము వచ్చినప్పుడు 'ఒకఁడు నివర్తనముకంటెఁ బెద్దది యనును; ఒకఁడు నివర్తనముకంటెఁ జిన్నది యనును' అని చెప్పఁబడినది.

క్రీ. శ. ౬౯౨-లోనివి యగు పశ్చిమచాళుక్యరాజుయొక్క తామ్రశాసనములో రెండువందల నివర్తనములభూమి దానమిచ్చినట్లు చెప్పఁబడియున్నది[3]. కావున, మహమ్మదీయుల కాలములో 'బీగా' మానమును, ఇంగ్లీషు ప్రభుత్వకాలమున 'ఎకరము' అను మానమును బాహాటముగ వాడుకలో నున్నట్లు హిందూరాజుల ప్రభుత్వకాలమున మిక్కిలి పురాతనకాలముననుండియు 'నివర్తన' మను క్షేత్రమానము వాడుకలో నుండెనని స్పష్టమగుచున్నది.

పూర్వము సాధారణముగా భూములను వెదచల్లి పంట పండించు వాడుకయే యున్నట్లును, అకు పోసి యూడ్చువాచారము లేనట్లును గన్పించుచున్నది. దీనినిబట్టి యెన్ని విత్తనములు చల్లుటకు తగిన భూమియో ఆవిత్తనములకొలతనుబట్టి భూమికొలత యేర్పడినట్లు తోఁచుచున్నది. అనఁగా కుంచెఁడువిత్తులు వెదచల్లుటకుఁ జాలిన భూమి కుంచెఁడనియు, తూమెఁడు విత్తులు విత్తుభూమి తూమెఁడనియు, ఏదుము విత్తులు చల్లఁబడుభూమి యేదుమనియు, పందుము విత్తులు చల్లఁబడుభూమి పందుమనియు, పుట్టెఁడువిత్తులు చల్లఁబడుభూమి పుట్టెఁడనియు పిలువఁబడెను. పుట్టి యనఁగా ౮౦ కుంచములు పరిమాణము గలదియే యిచట గ్రహింపవలెను. రాజు, పండినపంటలో భాగము పుచ్చుకొనుటయే కాని మొదట మొదట భూమిపరిమాణము ననుసరించి పన్ను పుచ్చుకొనువాడుక యున్నట్టు కానరాదు. మిక్కిలి పురాతనకాలమందు వెదచల్లువిత్తనములమానము పేరిటనే విత్తనములు చల్లుభూమినిగూడ వాడుచువచ్చిరి. పాణినీయాష్టాధ్యాయి సూత్రములలో 'తస్య వాపః' (అ. ౫, పా. ౧, సూ. ౪౫) విత్తెడు విత్తనములనుబట్టి భూమికి పేరు వచ్చువిషయమే చెప్పఁబడియున్నది. ధాన్యపరిమాణవాచిపదములమీఁద 'ఠక్' అను తద్ధితప్రత్యయము వాపార్థమందు, అనఁగా వెదచల్లఁబడు ననునర్థమందు విధింపఁబడినది. దానిచే కౌడవికీ, ప్రాస్థికీ, ద్రౌణికీ, ఖారికీ, అని క్షేత్రభక్తికిఁ (క్షేత్రపరిమాణమునకు) బేర్లేర్పడినవి. మఱియు నష్టాధ్యాయి 'తదస్మిన్ వృద్ధ్యాయ లాభశుల్కోపదా దీయతే' (అ. ౫, పా. ౧, సూ. ౪౭) అనుసూత్రముంబట్టి 'ఇంత రాజభాగ మీయఁబడు' ననునర్థమందుఁ బ్రత్యయము విధింపఁబడుచున్నది. దానింబట్టి పంచకీ, శతికీ అని పేర్లు భూమికి వచ్చినవి. కావునఁ బూర్వ మీయఁబడు రాజభాగముంబట్టియు, చల్లఁబడువిత్తనములంబట్టియు, భూమికి మానమేర్పడినట్లు కానవచ్చుచున్నది. మొదట ధాన్యమానము ననుసరించి భూమాన మేర్పడినను, భూమి బలము ననుసరించి యేకపరిమాణము గల వేఱువేఱుపొలములలో ధాన్యము హెచ్చుతగ్గుగ విత్తుట సంభవించుటచే నామాన మజ్ఞజనులకుఁ గొప్ప చిక్కువ్యాప్తిఁ జెందలేదు. వ్యవహారమునకుఁ జిక్కు వచ్చును. కావున నీధాన్యమానములు క్షేత్రమానములుగాఁ ద్వరలోనే మార్పఁబడును; అనఁగా నింత పొడుగు ఇంత వెడల్పుగల భూమి పుట్టెఁడు అని మాన మేర్పడును. క్రీ. శ. ౧౧-వ శతాబ్దియందుఁ దెనుఁగుదేశమునందు భూమికొలత బాగుగఁ దెలిసియుండెననియు, 'పుట్టెఁడు', 'తూమెఁడు' భూమి అను మానములు క్షేత్రమానములు (Area measures) గా మార్పఁబడియుండెననియు పావులూరి మల్లనచే రచింపఁబడిన సారసంగ్రహగణితమందలి యీక్రిందిపద్యములవలనఁ దెలుపఁగలను.

క. మానుగ నిడుపు వెడల్పును,
గా నొకకోల కుంట గదియఁగా నసుఁబుట్టిం
డేనూఱుకుంట, లిరువది,
యే నొకతూమెఁడు, తదర్థ మిర సనఁ బరఁగున్.

క. కానులు మొదలుగఁ జిన్నము,
మానము కోల[4] యనును కుంటమానము, మఱి భూ
మానము ధాన్యములోటి స,
మానముగా వ్యవహరింతు మహి నాంధ్రజనుల్. [౧-వ ఆశ్వా.]

## మహమ్మదీయ కాలపుకొలతలు

మఱియు వ్యవసాయము చేయఁబడుభూములు ఇన్ని 'కత్తులు' అని వ్యవహరింపఁబడుట కలదు. పూర్వమందు పదవిగా నున్నప్పుడొకకత్తితో పొదు కొట్టి యొకదినములో నొకమనుష్యుఁడు సేద్యమునకుఁ దీసికొని రాఁదగినంతభూమి యొకకత్తిపరిమాణము కలది యని ప్రమాణ మేర్పడినది. అక్బరుచక్రవర్తికాలమున భూమియొక్కమాన మేది యనఁగా ౩౩ ఇంగ్లీషుచదరపు టంగుళములు ౧ గాసు, ౬౦ గాసులు ౧ షాజహానీ 'బిఘా', ౧ బిఘా = ౩౦౨౫ చతురపుగజము = ౫౮ (5/8) ఎకరము.

బంగాళరాజధానిలో వాడుకలో నున్న బిఘా - ౧౬౦౦ చతురపుగజములు |-| (1/3) ఎకరము.

బిఘా ౨౦ బిస్వాలక్రింద, బిస్వా ౨౦ బిస్వాన్సీలక్రింద విభజింపఁబడెను. బంగాళరాజధానిలో బిస్వా, బిస్వాన్సీలను కొట్టా లేక కర్టా లేక గండా అని వాడుదురు. పంజాబుదేశములో భూమికొలతి 'ఘుమావూల' ను బట్టి వాడఁబడును. హిందూస్థానీలో

1. చూడుఁడు, అర్థశాస్త్రము, ఇదివఱకు నుదాహరింపఁబడినభాగము.

2. వ్యవహారకాండము, భూవాదప్రకరణము.

3. Epigraphical Report for 1915—1916, No. 7th in the List of Copper-plates examinedduring 1915—1916.

4. 'కోల' యనఁగా 'దండము'. నాలుగు 'హస్తములు' (మూరలు) అయిన నొక 'దండము' అని యీగ్రంథమునందు చెప్పఁబడియున్నది.

'ఘుమానా' అనఁగాఁ దిరుగుటల యని యర్థము, అనఁగా నొక నాఁగలి తిరిగిన ప్రదేశము ఒక 'ఘుమావు' అనఁబడును. ఇట్టి ఘుమావు ౮ ఖనాల క్రిందను, ఖనాలు ౨౦ మార్గక్రిందను విభజింపఁ బడును. ఈ ఘుమావు ఒక్కొక్క ప్రదేశమున నొక్కొక్క పరిమాణము కలది. ఒకయొకరము ప్రదేశ ముండు టరుదు. ఇది సాధారణముగా ౧౧౧ యొకర ముండును. ప్రస్తుతము ౨ ఎకరములు = ఒక ఏను, ౨ ఏనులు పందుము, ౨ పందుములు ఒకపుట్టెఁడు అనియు వ్యవహరింపఁబడుచున్నది.

మఱియు దక్షిణాదిజిల్లాలలో 'కాణీ' యనునొక భూపరిమాణము కలదు. 'కాన్' అనఁగా నరవములో చూచుట అని యర్థము. కంటిచేఁ జూడఁబడి ఆనవాలు పట్టఁదగిన దని కాణీశబ్దమునకు వ్యుత్పత్త్యర్థము. ఈ పదము కన్నడ, ద్రవిడభాషలయం దున్నది.

౧౦౦ కూజీలు = ౧ కాణీ = ౫౭,౬౦౦ చతురపు టడుగులు-౧.౩౨౨ ఎకరములు. సేద్యపు భూమి కాణీ నూరుకూజీలక్రిందను ఇండ్లు కట్టుకొనుట కుపయోగించు నేల కాణీ ఇరువదినాల్గు మనైలు లేక ౬౦ × ౪౦ చతురపుటడుగులుగల స్థలములక్రింది వాడఁబడుచున్నది. మధుర తిరుచునాపల్లిజిల్లాలలోఁ గొన్ని భాగములలో కాణీ యిరువదొక్క చతురపుటడుగులుగల నూఱుకూజీలు లేక ౪౪,౧౦౦ చతురపుటడుగులు, లేక ౧.౦౧ ఎకరము పరిమితిగల నేలకు వాడఁబడుచున్నది. కొన్నిచోట్ల కాణీ ౫,౭౬౦ చతురపు అడ్డీలుగా నెంచఁబడుచున్నది.

అ ట్లెంచఁబడినప్పు డెకరముకంటెఁ దక్కువపరిమితిగల నేల యగును. ౧౮౦౨-వ సంవత్సరమునకుఁ బూర్వ మున్న భూమి కొలత.

౧ కోలు లేక కజ్జి = ౨౪ అడుగులు.

౧ చతురపుకోలు - ౧ కూడీ లేక గూంట = ౫౭౬ చతురపు టడుగులు.

౧౦౦ కూజీలు లేక గూంటలు=౧ కాణీ = ౫౭౬౦౦ చతురపుటడుగులు, లేక ౧.౩౨౨౩౧౪ ఎకరములు.

రివిన్యూలెక్కలలో కాణీ ౧౬ భాగములుగా (అణాల క్రింద) ను వ్యవహరింపఁబడుచుండెను.

౧ అణా = ౩౬౦౦ చతురపుటడుగులు.

౧ చిణా = ౨౫౦౦ చతురపుటడుగులు.

కాళహస్తిజమీందారీలో భూమిని గొల్సులక్రిందఁ గొలచి, ఆప్రమాణముతో వాడుచుండిరి.

౧ గొల్సు = ౩౫ గూంటలు.

౧ గూంట = ౮౪ దేశవాళీచతురపుటడుగులు.

నూరపూఁడి మొదలగు గ్రామములలో:—

౧ గొల్సు - ౪౦ గూంటలు.

౧ గూంట = ౭౨ దేశవాళీచతురపుటడుగులు.

పొతరవేడు మొదలయిన గ్రామములలో : —

౧ గొల్సు = ౫౬ గూంటలు.

౧ గూంట = ౬౪ దేశవాళీచతురపుటడుగులు.

సూరంపూఁడి మొదలగు గ్రామములలో :—

౧ గొల్సు = ౨౫ గూంటలు.

౧ గూంట = ౪౮ దేశవాళీచతురపుటడుగులు.

దేశవాళీ అడుగు, ఆ యా ప్రదేశములయం దున్న యొకపొడుగుపాటి మనుష్యునిపాదప్రమాణమును బట్టి యేర్పఱుచుకోఁబడినందున దాని కిన్ని భేదములు తటస్థించినవి. ఇవి వరుసగా ౭౯.౧, ౬౬, ౬౦.౧, ౪౨ ఇంగ్లీషు అడుగులకు సరిపడి యుండును. దేశవాళీ అడుగు వరుసగా ౧౧.౩౨, ౧౧, ౧౧.౧౪, ౧౦.౫ ఇంగ్లీషు అంగుళముల ప్రమాణము గలిగియున్నది. దీనిబట్టి పైని జెప్పిన ప్రదేశముల యందలి గొల్సులు వరుసగా ౫, ౪, ౪.౬౬, ౧.౦౧ ఎకరముల ప్రమాణము గలిగియుండును.

కార్వేటినరగము జమీందారీలో గూంట అనఁగా ౬౯ అడుగులగల గొలుసుపొడుగును గొలుసువెడల్పునుగల మెరకనేల యనియు, ౫౬ దేశవాళీఅడుగులపొడుగుగల ౧ గొలుసు పొడుగును ౧ గొలుసు వెడల్పునుగల పల్లపునేల ౧ గుంట యనియు వ్యవహరింపఁబడుచుండెను. కాఁబట్టి చెంగల్పట్టునందువలె దేశవాళీఅడుగు ౧౦.౨౮౫౭ అంగుళము లని భావించినయెడల మెరకనేల గూంట .౦౬౦౭ ఎకరమును, పల్లపునేల గూంట .౫౩ ఎకరము పరిమితిగలిగి యుండును. కంగుంది జమీందారీలో విత్తఁబడు విత్తనములంబట్టి భూమికొలత యేర్పడినందున ౬౩ మద్రాసుపళ్లధాన్యము చల్లఁబడుపల్లపునేల ౧ కాణీ యనియు ౧౫¾ మద్రాసుపళ్ల ధాన్యము చల్లఁబడు మెరకనేల 'కాణీ' యనియు వాడఁబడుచుండెను.

౫½ మూరలు ౯½ ఇంగ్లీషు అడుగులకు సరిపడి యుండును. దీనిబట్టి ౧ మూర ౨౦.౭౨౭౩ అంగుళములు లేక ౧.౭౨౭౩ అడుగు లగును. ఈ అడుగు ప్రక్కపుటలో వ్రాయఁబడినపారములోని నెం. ౧. యొక్క కొలత కుపయోగింపఁబడినది.

తోఁటభూమివిషయమున కొలతయందు ౪½ మూరలు ౭ అడుగుల ౮ అంగుళములు లేక ౧ మూర - ౨౦.౪౪౪ అంగుళములు. ఈకొలత నెం. ౨. బాపతుకొలత.

బెజవాడలో ౪¾ మూరలు ౮ అడుగుల ౨ అంగుళములు లేక ౧ మూర - ౨౦.౬౨౧ అంగుళము లగును. ఇది నెం. ౩. బాపతు కొలత.

sampath_Ebooks

భూమికొలత కత్తులనుబట్టికూడ సాధారణముగా వ్యవహరింపఁబడుచుండును. కత్తి ఒకచోట ౩౨ కుంటలుగను, నింకొకచోట ౩౫ కుంటలుగను, మఱొకచోట ౩౦ కుంటలుగను వ్యవహరింపఁబడుటచే ప్రక్కను గనఁబడినపట్టికలో నీయాఁడుపరిమితులుగూడ నుపయోగింపఁబడినవి. మఱియు ౧ కుంట ౧౬ వీసములుగను, ౧ వీసము ౪ కత్తులపొడుగును ౪ కత్తులు వెడల్పును గలప్రదేశముగను వ్యవహరింపఁబడును. ఈకత్తి ౫½, ౫, ౪¾, ౪½ మూరలప్రమాణము కలదిగా నొక్కొక్కచోట వ్యవహరింపఁబడుచుండును. ఈనాలుగుకొలతలు గలకత్తులనుబట్టి క్రమముగా ౨౩౧౦౪, ౧౯౮౯౦, ౧౭౦౬౮, ౧౫౦౪౭ చదరపుటడుగులు ఒక్కొక్కకుంటప్రమాణమని తేలుచున్నది.

ఇందుల కుదాహరణముగా :—

౪ కత్తులు = ౫ మూరలు = ౪ × ౮.౬౩౬ = ౩౪.౫ అడుగులు ౩ (౩౪.౫) = ౨.౧౯౮౯౦ చతురపుటడుగులనేల యగుచుండును.

రాజమహేంద్రవర ప్రాంతములలో ౧ కత్తి = ౩౨ కుంటలు. ౨ కుంట = ౮౦ మూరలపొడుగు, అంతే వెడల్పుకలది. మూర ౧౯.౮ అంగుళములు పొడుగుకలది. బందరులో మూర ౨౦. ౭౨౭౩ అంగుళములపొడుగు గలది. కాఁబట్టి రాజమహేంద్రవర ప్రాంతముల యందు వాడఁబడుకత్తి ౧౨.౮ యెకరములు కలది. ఇది బాపిరుకత్తి.

కర్నూలుజిల్లా ౧౮౩౯-వ సంవత్సరమున నాంగ్లేయుల యధీనములోనికి రాకపూర్వ మాజిల్లాలో ‘మాడు’ అను ప్రమాణము భూమికొలతకు వాడుకలో నుండెను. ఒకమాడుధాన్యము విత్తనములుగాఁ జల్లఁబడునేల మాడుపరిమాణము కలదిగా వ్యవహరింపఁబడుచుండినది. ఈమాడు ౩ ఎకరములు మొదలు ౩½ యెకరములవఱకు వైశాల్యము కలిగియుండెను. మఱియు పైని జెప్పఁబడిన గొఱ్ఱుకొలత గూడ నీ జిల్లాలో వాడుకగా నుండెను. ఉదయము మొదలు రాత్రి వఱకు నొకకాడియెడ్లచే లాగఁబడు నొకగొఱ్ఱుచే విత్తనములు నాటఁబడు నేల యొకగొఱ్ఱుప్రమాణము కలది. తరువాత ౧౮౪౧-వ సంవత్సరములో సానుబడిభూములు ౩౩ అంగుళములు పొడుగుగల గొలుసుచేఁ గొలవఁబడి యెకరములుగను, గుంటలుగను నిర్ణయింపఁబడుచు వచ్చెను.

మధురజిల్లాలోని రామనాథపురము, శివగంగ మొదలగు జమీన్‌దారీలలో భూమిని బే (bhey)ల క్రింద, గూలీ (gooly) ల క్రిందను, తచ్చకోల (Tatchakola) ల క్రిందను, కురూకముల క్రిందను బౌహం (Bouham)ల క్రిందను, గూంట (Goonta) ల క్రిందను కొలతప్రమాణము చేర్చుచుకొని భూపరిమాణము తెలుపుకొనుచుండిరి. ఉత్తర మలయాళములో మెక్లియోడ్, యెడగలి యనుప్రమాణములు వాడుకలో నుండిరి. ఏఁబదియైదు మొదలు డెబ్బదిరెండు మెక్లియోడు యెడగలి ఒక యెకర మగును. కాని సగటున అఱువదిగొప్పెగలీలు ఒకయెకరముగ భావించిరి. దక్షిణ మలయాళమున ‘పర్ర’ అను భూమికొలత వాడుకలో నున్నది. ఎకరమునకు నిట్టిపర్రలు తొమ్మిదింబాతున లెక్క చూడఁబడుచుండెను.

నెల్లూరుజిల్లాలోని భూమికొలత :— ౩౩ × ౩౩ అడుగులు = చదరపుగొలుసు. ౧ చదరపుగొలుసు = ౧౦౮౯ చదరపుటడుగులు లేక లేక గూంట. ౪౦ గూంటలు = ౪౩౫౬౦ చదరపుటడుగులు = ౧ ఎకరము.

పూర్వరాజులకాలమం దీ జిల్లాలో ౫౨½ ఇంగ్లీషు అడుగులకు సమానమైన ౩౨ మూరలకత్తితో తోఁటభూములు కొలవఁబడుచుండెను. దీనినిబట్టి మూర ౧౯.౬౮ అంగుళములపొడు గగును. ఇట్లు ఒకకత్తిపొడుగును ఒకకత్తివెడల్పును = ౨౭౫౬¼ చదరపుటడుగులు = ఒకగూంట = .౦౬౩౩ ఎకరము; ౫౦ గూంటలు = ౧ గూర్తి = ౧౩౭౮౧౨½ చదరపుటడుగులు = ౩.౧౬౩౭ ఎకరములు; గూర్తి ౨½ తూములవిత్తనములు చల్లుటకు తగుప్రదేశమని సాధారణముగా వాడఁబడుచుండును. తూము = ౫౬ పక్కానేరులబియ్యము వడ్లధాన్యము. తోఁట లేక జరీబుభూములు ౨౧ మూర లేక ౩౪ ౨౯/౬౪ ఇంగ్లీషు అడుగులపొడుగుగల కత్తితో కొలవఁబడుచుండెను. ఇట్లు ఒకకత్తిపొడుగును ఒకకత్తివెడల్పును కలది = ౧౧౮౭ చదరపుటడుగులు = ౧ గూంట = .౦౨౭౨౫ ఎకరములు; ౧౧౬ గూంటలు = ౧ గూర్తి లేక ౧౩౭౬౯౩ చదరపుటడుగులు, లేక ౩.౧౬౧ ఎకరములు. గుంటూరుసరిహద్దున నున్న వంగవోలుతాలూకాలో కూటచేల్ అనుపరిమాణ ముండెను. ౧ కూటచేలు = ౮ గూర్తులు లేక దాదాపు ౨౫ ఎకరములనేల. తంజావూరుజిల్లాలో మహాలు, వేలీలు, కానీలు, తిరునెల్వేలిజిల్లాలో ప్రాడ్డీలు, మరకాలు, కుమాచీలు అను పరిమాణములును, సేలముజిల్లాలో నొక్కొక్కప్రదేశమున నొక్కొక్కవిధముగ పైని జెప్పఁబడినభూమికొలతలును నుండెను. విశాఖపట్టణము జిల్లాలో నొక్కొక్కతాలూకాలో నొక్కొక్కభూమికొలత వాడుకలో నుండెను.

పాలకొండ గొలుగొండతాలూకాలలోను, జమీన్‌దారుల యెస్టేట్లలోను భూమికి ఉన్న కొలత :—

౮౮⅜ చదరపుటడుగులు = ౧ కుంచము. ౨౦ కుంచములు = ౧ పుట్టి = ౧౭౬౮ చదరపుటడుగులు. ౩౦ పుట్లు = ౧ గరిసె = ౫౩౦౨౯ చదరపుటడుగులు = ౧ ౨౧౭౩౮ ఎకరములు.

తక్కినప్రదేశములలో :— ౩౩౧౫ చదరపుటడుగులు = ౧ పర్ర = .౦౭౦౬౮ ఎకరములు. ౧౬ పర్రలు = ౧ వీసము లేక ౧ గరిసె. ౧౬ వీసములు = ౧ కత్తి అనఁగా ౧౯.౪౭౮౨ ఎకరములు. గరిసెడునేల అనఁగా గరిసెడుధాన్యము పండునది యని యర్థము.

విశాఖపట్టణముగరిసె ౧౮౦౦ ల సేర్లు కలది అయినను గంజాం జిల్లాలోనిగరిసెడునేలలో విశాఖపట్టణముజిల్లాలోని గరిసెడునేల

sampath_Ebooks

నగమే యుండును. ఇట్లు భూమికొలత యొక్కొక్క జిల్లాలో నొక్కొక్క ప్రదేశమున నొక్కొక్కవిధ మయినదిగా నుండెను. కాని యిప్పుడు సాధారణముగ ఎకరములపరిమితి వాడుకలోనికిఁ దేఁబడి అంతటను ఎకరములపరిమితియే వాడఁబడుచున్నది. ఎకరము = ౪౮౪౦ చదరపుగజములనేల.

రివిన్యూ వ్యవహార పద్ధతి:— రివిన్యూవ్యవహారవిషయమున గ్రామము ప్రధానాంశముగా గ్రహింపవలయు నని యిదివఱకే చెప్పఁబడియున్నది. గ్రామముయొక్క అమరకపుపద్ధతులు, భూమి విషయ మయినట్టివియు సిస్తువిషయ మైనట్టివియు నగు లెక్కలను తయారుచేయుటకును, గ్రామమువీఁద చెల్లవలసినసిస్తు వసూలు చేయఁబడుటకును, గ్రామకరణము, గ్రామమునసబు గ్రామమునే గారు లను గ్రామోద్యోగస్థులు కలరు. గ్రామమునసబునకుఁ గొంతవఱకు సివిల్ మేజస్ట్రేటు అధికారములుకూడ కలవు ఇట్టి గ్రామములను కొన్నింటిని జేర్చి ఫిర్కా లేక రివిన్యూరేంజిగాఁ జేయఁబడి అందలి గ్రామములయొక్క భూములయమరకము, విడుదలలు, దరఖాస్తులు, రిమిషన్‌దరఖాస్తులు మొదలగువానిని తనిఖీ చేయుటకు రివిన్యూయినస్పెక్టరను నుద్యోగస్థుఁడు నియమింపఁబడి యుండును. ఇట్టి ఫిర్కాలు రెండుమూఁడు కలసి ఒకతాలూకాగాఁ[1] జేయఁబడి దానిని తహస్సీల్దారు అను నుద్యోగస్థునిక్రింద నుంచెదరు. ఇట్టితాలూకాలు రెండుగాని మూఁడుగాని కలిపి యొక్కడివిజన్‌గాఁ జేయఁబడి దానిని నొక డివిజనల్ ఆఫీసర్ క్రింద నుంచుదురు. ఇట్టి డివిజనల్ ఆఫీసర్లుగల కొన్ని డివిజనులు కలిపి జిల్లాగాఁ జేయఁబడి దాని కధికారిగా నొకకలెక్టరు నియమింపఁబడును. ఇట్టిజిల్లాలు కొన్నింటిని జేర్చి యొకరాజధానిగాఁ జేసి జిల్లాకలెక్టర్లందఱపైని కొందఱు మెంబర్లతోఁ గూడిన రివిన్యూబోర్డు అనుకార్యస్థాన ముండును. అది పెద్దప్రాంతములలో (మేజర్ ప్రావిన్సులలో) వాలోచనసంఘముతోఁ గూడిన గవర్నరుక్రిందను, చిన్నప్రాంతములలో (మైనరు ప్రావిన్సులలో) లెప్టినెంటుగవర్నరుక్రిందఁ గాని చీఫ్‌కమీషనరు అనునధికారిక్రిందఁ గాని యుంచబడును. కొన్నిరాజధానులలో రివిన్యూబోర్డునకు మాఱుగ నాలుగైదుజిల్లాల కొకకమీషనరు నియమింపఁబడి, అతఁడాయాజిల్లాలరివిన్యూ మొదలగు సిస్తులవ్యవహారమును పరిశీలించును. భూములపై సిస్తు చెల్లింపఁబడుచున్నంతవఱకు జిరాయితీభూములను పట్టాదార్లు మొదలగు భూస్వాములయొద్దనుండికాని, ఈనాముభూములను ఆయాయీనాముదార్లయొద్దనుండికాని, సర్కారుపనులనిమిత్తము రైలురోడ్లు మొదలగు దేశోపయోగకరము లగుకార్యములకుఁ దీసికొనవలసివచ్చినప్పుడు ప్రభుత్వమువారు వానిని దీసికొని వానికి మఱియొకచోట వానికించుమించుగా సరియగు భూమి నిచ్చుచుండెడివారు. ఇప్పు డట్టి భూములను దీసికొని వానిఖరీదులు కట్టి సొమ్ము ఇచ్చుచున్నారు. ఇట్లు దొరతనమువారు భూములను భూస్వామిసమ్మతము లేకపోయినను దీసికొనుటకు 'ల్యాండు అక్విజిషన్ ఆక్టు' (Land Acquisition Act) వలన అధికారము గలిగించుకొనియున్నారు.

ఈ యాక్టునుబట్టి భూములనే కాక అందుండు చెట్లు మొదలగువానిని, ఇండ్లు మొదలగుకట్టడములనుగూడ వానికి న్యాయ్యముగా నియ్యఁదగ్గసొమ్మిచ్చి తీసికొని యిష్టము వచ్చిన ట్లుపయోగపఱుచుకొనుటకు దొరతనమువారికి హక్కు కలదు. జమీన్‌దారీగ్రామములోనిభూములు ప్రజలయుపయోగముకొఱకు చేయఁబడుపనులనిమిత్తము గావలసివచ్చినప్పు డట్టి జనోపయోగకరములగు పనులు చేయించువారు సర్కారువా రైనను జమీన్‌దా రైనను ఈ యాక్టునుబట్టి భూములను సొమ్మిచ్చి తీసికొనుటకు కవకాశ మేర్పఱుపఁబడినది.

## అనుబంధము

పయిని వివరింపఁబడిన అమరకపుపద్ధతులు గాక యీదేశమునం దింకను గొన్నివిధము లగునమరకపుపద్ధతులు గలవు. అవి ఈక్రింద వివరింపఁబడుచున్నవి.

అయిమా — బంజరుభూములు వ్యవసాయములోనికిఁ దేఁబడు నిమిత్తము ముందుగా సిస్తు లేకుండ నీయఁబడి, క్రమక్రమముగాఁ గొన్నిసంవత్సరములకుఁ బూర్తిసిస్తు కట్టి అమర్పఁబడుభూములు. బంగాళరాజధానిలో మిద్నపూరుజిల్లాలోను, బలరామపురంజమీన్‌దారీలోను నీవిధ మగునమరకము వాడుకలో నుండెను. మిద్నపూరుజిల్లాలో 'మండలీజాక్' అనునమరకపుపద్ధతియు నిట్టిదే!

అయినీ — భూమిలోఁ బండింపఁబడుఫలసాయముంబట్టి మహమ్మదీయులు వసూలు చేయుచువచ్చినసిస్తును మార్చి మహారాష్ట్రులు గ్రామమందలిభూము లన్నిటికిని దానూపాహిమీఁద నొకరేటుసన్ను నిర్ణయించి దానింబట్టి పూర్తిసిస్తు వసూలుచేయుటకు డక్కనులో నేర్పఱిచిన పద్ధతి.

ఖాల్సా — అజమీరు, మార్వాడ ప్రదేశములయందు స్థలాధికారి యగుమహారాజుయొక్కకాని దేశనాయకునియొక్కకాని యెస్టేటునందు నుయ్యిగాని, చెఱువుగాని, మఱియొకవిధ మయిననీటి సదుపాయము గాని యేర్పఱుచుకొని వ్యవసాయము చేయుపద్ధతిని శాశ్వతపుహక్కుతో నాజలాధారముచే సేద్యము కాఁబడినంతభూమి యమరకముఁ జెందుపద్ధతి. ఈదేశములో వర్షము మిక్కిలి యరుదుగాఁ గురియుటవలన నిట్టియమరకము చేయవలసివచ్చినది.

అనువాడా — రైతు సొమ్ము ఖర్చుపెట్టి శ్రమపడి బంజరుభూమి సేద్యములోనికిఁ దీసికొనిరావలసినయవసరము లేకుండ భూస్వామియే అట్టిపని చేయించి యితరబంజరుభూములకంటె నెక్కువసిస్తు కట్టి అమరకము చేయుపద్ధతి. ఇది పంజాబురాజధానిలో నున్నది.

బాబన్ — పంజాబురాజధానిలో 'బాబన్' అనుతెగవారు తమగ్రామములలోనిభూములను సమానముగాఁ బంచుకొని యొకరికిన్ని

1. ఉత్తరదేశమునందు 'తాలూకా' ను 'తహసీల్' అందురు. దానికి నధికారి 'తహసిల్‌దారు'

sampath_Ebooks

లోఁబడక స్వతంత్రమైన యనుభవము కలిగి సిస్తు చెల్లించుచు సేద్యము సేయుపద్ధతి.

దిఘాకీ - అయోధ్యలో భూస్వామిభుక్తములో నున్న గ్రామము నతని యిష్టము లేకుండఁ దీసికొనునప్పుడు గాని, యితర గ్రామములతోఁ గలిపి తాలూకాదారీ అమరకము చేయఁబడునపుడు గాని, తక్కువసిస్తు కట్టికాని, సిస్తు లేకుండఁగాని అసలు హక్కుదారునకు గ్రామములో విడిచిపెట్టఁబడినభూమి. ఒక గ్రామముకంటె నెక్కువ గ్రామములు పోఁగొట్టుకొనువాని కొక్క గ్రామ మంతయు నీయమరకపుపద్ధతిమీఁద నిచ్చుటయుఁ గలదు.

సర్ - సొంత సేద్యభూమి.

బిర్తు సంకల్ప - పర్ణ గాని తులసి గాని ఆశీర్వదించి యిచ్చినందులకు బ్రాహ్మణుల కీయఁబడినభూమి అమరకము.

తీ - గ్రామము పాడుపడిపోయినపుడు గ్రామస్థులు విడిచిన గ్రామము మగల గ్రామముగా నేర్పడినపుడు పూర్వము గ్రామకంఠమునఁ జేరినదియు నిండ్ల క్రింద నున్నదియు నగుభూమి వ్యవసాయము చేయఁబడుటకు నమరకము చేయుపద్ధతి.

పస్వంగు చెహరమ్ - బంజరుభూమిని చక్కఁజేసి వ్యవసాయస్థితిలోనికిఁ దీసికొనివచ్చినందులకు నట్లు బాగుపడినభూమిలో ౧౦-వ వంతు గాని ౮-వ వంతు గాని సిస్తు చెల్లింపకుండఁ జేయునమరకపు పద్ధతి.

పుర్వాబన్నా - గ్రామముల నిజారా కిచ్చినపుడా గ్రామము చుట్టు నుండు బంజరుభూమిని వ్యవసాయములోనికిఁ దీసికొనివచ్చినందుల కా గ్రామ మిజారా క్రింద నున్నంతవఱకు నుచితముగా ననుభవింప నిచ్చి, ఆ గ్రామము తీసికొనినప్పుడతఁడు పడినశ్రమకుఁ గొంత సిస్తు కట్టికాని సిస్తు లేకుండఁ గాని కొంతభూమి నిచ్చువరకున కమరకము చేయుపద్ధతి.

మార్వత్ - రాజును కనిపట్టుకొనియుండి యతఁడు యుద్ధమునకు వెళ్లునపుడతనితోఁ గలసి యుద్ధమునకుఁ బోవుపద్ధతిని అమరకము చేయుభూమి.

బాయిపితాయత్తు - ఒక గ్రామములోనిభూమిని ఖండములుగా విభజించి యొక్కొక్క ఖండమును అమ్మి అమరకము చేయుపద్ధతి.

బిస్వి - భూస్వామి రయితుదగ్గఱఁ గొంతసొమ్ము బదులు పుచ్చుకొని, ఆఋణము తీఱువఱకును సిస్తులోఁ గొంతభాగము పుచ్చుకొని కాని సిస్తంతయు పుచ్చుకొనక కాని అమరకము చేయుపద్ధతి.

రఖౌనా - బంజరుభూమిలో పుల్లరినిమిత్త ముపయోగించుకొనుట కమరకము చేయుపద్ధతి.

బాఘుట్ - భూస్వామియనుమతి లేకుండఁగనే భూమిలోఁ జెట్లు వేసి పెంచుటవలన నాచెట్లు బ్రతికియున్నంతవఱకు వానిఫలసాయమునందు హక్కు గలిగియుండుపద్ధతి నమరకము చేయుట.

ఈ పదునొకండు అమరకపుపద్ధతులును అయోధ్యలో నున్నవి.

బన్కీ - ఓఢ్రదేశములో సర్కారు క్రింద నున్నభూమి.

బన్నా - పంజాబుదేశములో నొకవిధ మగు నమరకము.

బగ్దేయిట్ - బీహారురాష్ట్రములో ధాన్యరూపముగా సిస్తు చెల్లించు లోపాయకారీ అమరకపు పద్ధతి.

బార్వా - సంయుక్తరాష్ట్రములలో గ్రామమునకు మారముగా నుండుటవలన నెరువు మొదలగువానిచే బాగుపఱుచుకొనుట కలవి గాని భూములు.

బాగీ - అస్సాముదేశములో పాయకుల కింట్లు కట్టుకొనుటకును, ఆయింటి నంటి తోఁట వేసికొనుటకును సిస్తు లేకుండ విడిచిపెట్టఁబడిననేల. కొడగుదేశమునఁ బసువుల మేఁతకొఱకు రయితుల కీయఁబడిననేలనుగూడ నీపదముననే వాడుదురు.

బారికే - కొడగుదేశమునఁ బసువుల మేఁత కుపయోగించుపుల్లరి భూమి.

ఘట్వాలీ - ఛోటానాగపూరు, మాంభూమ్, సంతాల్ పరగణాలు మొదలగుజిల్లాలలో మొదట దేశసంరక్షణకై ప్రబలులకుఁ బట్టఁబడి తరువాత వారివలననే దేశమున నుపద్రవము వచ్చుట తటస్థమైనప్పుడు శాశ్వతపుసెటిలుమెంటుకాలమున శాశ్వతమైన హక్కుతో నమరకము చేయఁబడినభూములు.

జేత్ ఖేటా - ఛోటానాగపూరులో రాజుయొక్క సొంత సేద్యభూములను వ్యవసాయముచేయుకొఱకు సిస్తు లేకుండ నీయఁబడిన కొంతభూమి.

జేవార్ - మధ్యపరగణాలలో నడవి కొట్టి కాలిచి, ఆబూడిదమీఁద విత్తనములు చల్లి పండించుపద్ధతి.

భోగ్ దానీ - అస్సాముదేశములోఁ బూర్వపురాజులవలన సిస్తు లేకుండ నమరకము చేయఁబడ్డభూమి.

భూమ్ - ఛోటానాగపూరులోఁ బ్రప్రథమమున గ్రామముల నేర్పఱచి యిప్పటికిని శాశ్వతపుహక్కులతో గ్రామాధికారోద్యోగములు సేయుచున్న గ్రామాధికారులకుఁ గొన్ని విశేషము లైన హక్కులతో నమరకము చేయఁబడినభూమి.

భూమ్ - అజమీరు మార్వాడ దేశములలో దేశముల కలజడి లేకుండఁ గాపాడుటకును, దేశములలో జరగిన యక్రమములకు జవాబుదారులై యుండునిమిత్తమును శాశ్వతపుహక్కుతోఁ జేయఁబడిన అమరకము.

బీజువార్ - దక్షిణకర్ణాటకదేశమున భూమియందుఁ జల్లఁబడిన విత్తనములఁబట్టియు, నందులకు రాఁబడు ఫలసాయములంబట్టియు నిర్ణయింపఁబడినసిస్తున కమరకము చేయఁబడిననేల.

ఇస్తిమ్రారీ - అజమీరు దేశమున భూమిలో నాయి త్రవ్వుట వలన శాశ్వత ప్రహక్కును పొందఁబడిన నేల.

బిస్వీ - అయోధ్యలో తనఖాపద్ధతివలనఁ జెందఁబడిన లోపాయకారీభూమి యనుభవము.

బొంబాయి రాజధానిలో ఏక్కువనందును రాజధానియందంతటను సామాన్యముగ వాడుకలోనున్న పద్ధతి రైతువారీ అమరకపుపద్ధతి పూర్వపుజాయంటు గ్రామముల పద్ధతులను సంపూర్తిగా పోక, కొన్ని అమరకమున వాడుకలో నున్నవి.

గుజరాతుదేశము :— కొన్ని గ్రామములలో నార్వా లేక భాగ్ దారీ అమరకపుపద్ధతులు కలవు.

కొన్ని గ్రామములలో తాలూకాదారీఅమరకపుపద్ధతులు, పట అమరకపుపద్ధతి, మేవాసి అమరకపుపద్ధతి, మాలికి అమరకపు పద్ధతి మొదలగునవి కలవు.

ఉత్తరకొంకణములో :— ఖోతీ, షిల్ హోత్రి, యిజాఫత్ అమరకపు పద్ధతులును, దక్షిణకొంకణములో దాశెఖారీపద్ధతులును గలవు.

ఖాక్ - బంగాళరాజధానిలోని చిట్టిఅడవికొట్టి భూమిని బాగు పఱుచుపద్ధతిమీఁదఁ జేయఁబడిన అమరకము. సంయుక్తపరగణాలలో గ్రామములలో నున్న అన్నిరకములను, అన్నితరగతులను గలిపి కొంచెముకొంచెముగా నమరకము చేయుపద్ధతికే యీపేరు కలదు.

ఖాత్ సగ్ దేశముఖీ - మహారాష్ట్రులు తాము జయించిన దేశమందు సరియైన అమరకపుపద్ధతి నేర్పఱుచుదాఁక వసూలు చేయుచు వచ్చిన తాత్కాలిక (టెంపొరరీ) మగు అమరకపుపద్ధతి.

చిరాఘీ - మసీదులలోను గోరీలసగ్గఱను దీపము వెలిఁగించు పద్ధతి నీయఁబడినభూమి. ‘చిటగాంగుజిల్లాలో’ ఇజ్, హాశీ, హవాలా, మిరాస్‌హవాలా, కైవ్వనీహవాలా, కరాశీహవాలా, రాయితీ హవాలా అను అమరకపద్ధతులు వాడుకలో నున్నవి. మఱియు నీజిల్లాలో కొంతప్రదేశములలో ‘జమ్’ అనునొక అమరకపుపద్ధతి గలదు. ‘పంజాబు’దేశములో భూమియొక్క వైశాల్యమునుబట్టి మోహదృష్టిచేఁ గొంత సిస్తున కమరకము చేయుపద్ధతికి ‘దుకోటా’ అని పేరు.

దాదాయిల్లాహి - వంశపారంపర్యముగాఁ గాక కేవలభుక్తమునే యేర్పఱిచి హక్కు గలుగఁజేయు అమరకపుపద్ధతి.

దానాబాదీ - పంటను గొలచి కాని భూమిని గొలచి కాని లేక కేవలమోహదృష్టిచేఁ గాని సర్కారు సిస్తు నిర్ణయించి అమరకము చేయుపద్ధతి.

గైరు మాఫూశీ - ఇష్టము వచ్చినప్పుడు రయితును తొలఁగించుపద్ధతిని జేయఁబడునమరకము.

ఘాసావస్తు - గ్రామమునొక్క భూమి స్వస్థంతయు గ్రామస్థులు తామనుభవించుభూమినిబట్టి యిచ్చుటకును, అటులె భాగస్వామి యైనవాఁడు తనభాగముసిస్తు నీయనియెడల, ఆసిస్తు మఱియొక భాగస్వామి యిచ్చినచో నాభూమి నతఁడే యనుభవించుచుండునటులును చేయఁబడిన అమరకము. మఱియు, బంగాళరాజధానిలో రాయితీ, గంధీ, ముషాశీ, ఖాక్‌సిసీ, చౌహద్దీ, ముకర్రారీ, కైవ్వనీ, సుజస్తాజాగ్, జిమ్మామీరాస్, గోయిబందీ, మజ్కూరీ, పంచక్, బంగోబస్తీ, మాలిఖానా, బ్రహ్మోత్తర్, శివోత్తర్, దేవోత్తర్, పీరోత్తర్, హాజరాత్, ఉగ్గా, నాక్రామ్, పత్నీ, ఇజారా, జాగీర్ఖేష్కి, గాన్ఛి, కిస్మత్, ముల్గుజారీ, హవాలా మొదలగు నమరకపుపద్ధతులు గలవు.

గిరానిరూ - ఇది భూమిసిస్తు విధిగా రయితు చెల్లించునట్లును, అట్లు చెల్లింపనియెడల భూస్వామికిఁ గాని సర్కారునకుఁ గాని నష్టము లేకుండునట్లును జాగ్రత్తపఱుచుకొనుటకుఁ జెల్లింపవలసినసిస్తునకుఁ జాలినంత కొంతభూమిని హామీ యిచ్చుపద్ధతిని జేయఁబడిన అమరకము.

గోనామఫ్తీ - అస్సామదేశములో నిల్లు కట్టుకొనుటకును, కొంతతోఁట వేసికొనుటకును, వరి పండించుకొనుటకును ‘పాయక్కు’లకుఁ జేయఁబడిన అమరకపుపద్ధతి.

సుజారా - పంజాబుదేశములో రయితులకు వారిపశువుల మేఁతనిమిత్తమును, వంటచెఱకునిమిత్తమును అనుభవించుట కమరకము చేయఁబడినయాడనిభూమి.

టాల్‌హాసాలా - ప్రతిసంవత్సరము భూమిలోఁ బండింపఁబడు ధాన్యాదిని శేషములంబట్టి సిస్తు కట్టఁబడు నమరకపుపద్ధతి.

ఇంగ్లిస్ - బంగాళరాజధానిలో నౌకరీకిఁ బనికిరాకుండ గాయములు తగిలిన ఆంగ్లసిపాయీలకుఁ గుటుంబపోషణనిమిత్త మీయఁబడినభూమి.

జల్సాజాబ్ - ఛోటానాగపూరులో నొకవిధమగు పాయకారీ అమరకము.

జంగల్‌బూరీ, జస్వోలు, బల్పబూరీ మొదలయిన అమరకపుపద్ధతులుకూడ బంగాళములోఁ గలవు.

కామ్‌నూరా - బంగాళరాజధానిలోని భూమిని బాగుపఱుచుపద్ధతిని జేసిన అమరకము.

కామస్ - మలయాళములో, తనఖాపద్ధతిమీఁదఁ జేయఁబడిన అమరకము.

కక్కినా - బంగాళరాజధానిలో ఇజారాదారువలన నమరకము చేయఁబడుపద్ధతి.

ఖోల్కారీ - ఛోటా నాగపూరులో భూమియందలి చెట్లు మొళ్లను గొట్టి వ్యవసాయము చేయుపద్ధతి.

sampath_Ebooks



ఖోటీ - కొంకణదేశములోని యొకవిధమగు నమరకపద్ధతి.

ఖువాబడి - సంయుక్తపరగణాలలోని యొకవిధ మగునమరకము.

ఖులావేష్ - పంజాబుదేశములోని హింమాదేశ సీమాప్రదేశములలోఁ గుటుంబములో నున్న మనుష్యులసంఖ్యనుబట్టి భూమి నిచ్చు నమరకపుపద్ధతి.

ఈవిధముగా నమరకపుపద్ధతులు సమానము లైనను కొంచెము భేదములతో నాయాదేశములయందు దేశభాషలలోనిపేర్లతో వ్యవహరింపఁబడునవి యనేకములు గలవు. ఒకదేశములో నున్న యమరకపుపద్ధతియే పలుదేశములలోఁ బలువిధములగు నామములతో వ్యవహరింపఁబడుచుండుటవలన నమరకపుఁబద్ధతులపేర్లు లెక్కకు మిక్కిలి యైనవి.

ప్రమాణగ్రంథములు.:

BADEN POWELL'S Land Revenue in British India; Land systems in British India, 3 volumes; Indian Village Communities;

SIR HENRY S. MAYNE'S Village Communities in the East and West;

TAGORE LAW Lectures on Land Tenures;

DR. MCLEAN'S Manual of Administration., Vols 1, 2, and 3; Vyavahara Mayukha Yagnavalkya Smruti by Rao Saheb V. N. Mandalik;

TURNER'S Minute on the Draft Bill relating to Land tenures of Malabar;

HUDDLE STONE'S Collection of papers on Mirasi Rights;

Moore's Malabar Law and Custom;

Selections from the minutes of SIR THOMAS MUNRO; SIR ALEXANDER ARBUTNUT;

Standing Orders of the Board of Revenue;

DEWAN BAHADUR S. SRINIVASA RAGHAVA AIYANGAR'S Progress of the Madras Presidency during the last 40 years

LIEUTENANT COLONEL MARKS WILKS History of Mysore;

WILSON'S Glossory;

BADEN POWELL'S Forest Law;

Ain-i-Akbari;

Fifth Report of the Select Committee on the affairs of the East India Company, Vols. 1 and 2;

Harrington's Analysis;

Report of the Rent Law Commission of Bengal;

DISTRICT MANUALS;

SUNDARA RAJA AIYANGAR'S Tenures in the Madras Presidency

Settlement Manual;

ELPHINSTONE'S History of India;

SIR W. W. HUNTER'S Imperial Gazetteer;

Manusmruti; Report of the Inam Commission; Forest Acts; Mining rules;

Circuit committee's reports and accounts.

SETON KARR'S Cornwallis (RULERS OF INDIA SERIES)

Land Revenue Administration in the Central Provinces.

Land Revenue Policy published by the Government of India.

R. C. Dutt Economic History of India.

(కో. రా. వేం. కృ.)

**అమరకోశము** — అమరసింహునిచే రచియింపఁబడిన సంస్కృతశబ్దసంగ్రహము. దీనికి నామలింగానుశాసన మని పేరు. ఇందు నామములయొక్కయు, అనఁగా విశేష్యముల యొక్కయు, వానిలింగములయొక్కయు వివర ముండును. ఇంగ్లీషు కోశములకును తెనుఁగుకోశములకును లింగసంగ్రహముతోఁ బని లేదు. నామసంగ్రహమాత్ర ముండినఁ జాలును. ఎందు కన, ఆయాభాషా వ్యాకరణసంప్రదాయప్రకారము శబ్దములయర్థమునుబట్టి వానిలింగములను నిర్ణయించుకొనవచ్చును. పురుషుఁ డని యర్థ మిచ్చునది పుల్లింగము, స్త్రీ యని అర్థ మిచ్చునది స్త్రీలింగము, స్త్రీ పురుషభావము లేనిది నపుంసకలింగము. సంస్కృతమునం దట్లు కాదు. లింగ మర్థనిష్ఠము కాదు, శబ్దనిష్ఠము. కావున సంస్కృతకోశములందు ప్రతి శబ్దముయొక్కలింగమును తెల్పుట యత్యంతావశ్యకము. ఈకోశము మూఁడుకాండములుగ విభజింపఁబడినది. ప్రథమకాండమునందు, స్వర్గ, వ్యోమ, దిక్, కాల, ధీ, వాక్, శబ్దాది, నాట్య, పాతాళ, భోగి, నరక, వారి వర్గము లనఁబడు ౧౦ వర్గములు గలవు. ద్వితీయ కాండమునందు, భూ, పుర, శైల, వనౌషధి, సింహాది, మనుష్య, బ్రహ్మ, క్షత్రియ, వైశ్య, శూద్రవర్గము లన్న ౧౧ వర్గములు గలవు. తృతీయకాండమునందు విశేష్యనిఘ్న, సంకీర్ణ, నానార్థ, అవ్యయ, లింగాదిసంగ్రహవర్గము లనునవి ౫ వర్గములు కలవు. ప్రథమకాండమునందు ౨౭౯ శ్లోకములును, ద్వితీయకాండమునందు ౭౩౧ శ్లోకములును, తృతీయకాండమునందు ౪౮౩ శ్లోకములును మొత్తము మీఁద ౧,౪౯౩ శ్లోకము లీగ్రంథమునందుఁ గలవు. వర్గసంఖ్యయు శ్లోకసంఖ్యయుఁ గొన్ని ప్రతులలోఁ గొంచెము వేఱువిధముగ నుండును. ఇందు ౧౧-వేల శబ్దములసంగ్రహము కలదు. దీనికి పూర్వము

sampath_Ebooks

కొన్ని కోశము లుండినను ఇది వాని నన్నింటిని వెనుకకుఁ ద్రోక్కి హిందూదేశమునం దంతటను సంస్కృత విద్యాభ్యాస క్రమమునందు విద్యార్థులకుఁ జెప్పఁబడు ప్రథమగ్రంథముగ నేర్పడినది. గ్రంథకర్త బౌద్ధుఁడైనను హిందువు లందఱును ఈ గ్రంథమునెడ నింతగౌరవమును జూపుట చూడ దీని యోగ్యత వేఱుగఁ జెప్పనక్కఱలేదు. ఈగ్రంథమునకు మహేశ్వరుఁడు, క్షీరస్వామి, నీలకంఠుఁడు, వామముకుటుఁడు, భోజరాజు, రాజదేవుఁడు, భరతమల్లికుఁడు, రామతర్కవాగీశుఁడు, భానుజిదీక్షితుఁడు, రుద్రభట్టు, నారాయణచక్రవర్తి, అయ్యలోపాధ్యాయుఁడు, మఘుశేశపండితుఁడు, మహాదేవభట్టు వేదాంతి, లింగాభట్టు మొదలైన పెక్కురు పండితులు టీకలు వ్రాసియున్నారు. వీనిలో నుత్తరదేశమునందు భానుజిదీక్షితుని రామాశ్రమీటీకయు, ఆంధ్రదేశమునందు లింగాభట్టీయమును, ఎక్కువప్రచారము కలిగియున్నవి. తాళ్లపాక అన్నయ్యవంశజుఁడగు తిరువెంకటయ్య లింగాభట్టీయమునకుఁ దెనుఁగున గురుబాలప్రబోధిక యనుపేరు పెట్టి చక్కని టీక వ్రాసియున్నాఁడు. అది పెక్కుసారు లచ్చుపడఁ బడినది (చూడుఁడు, అమరసింహుఁడు).

**అమరగడతాలూకా** — పంజాబుదేశమందలి, పటియాలాసంస్థానములోని అమరగడనిజామతునకు సంబంధించిన ఒక తాలూకా. విస్తీర్ణము ౩౩౭ చదరపుమైళ్లు. జనసంఖ్య ౧,౭౩,౪౬౮. గ్రామములసంఖ్య ౧౬౧. ధోరి అనునది ముఖ్యపట్టణము. చెల్లుబడి ౩,౪౦,౦౦౦.

**అమరగడనిజామత్** — పంజాబు దేశమందలి పటియాలా సంస్థానమందలి ఒక నిజామత్. నిజామత్ అనఁగా జిల్లా. నిజామ్ అను ఒక యధికారిచే పాలింపఁబడు దేశభాగము. విస్తీర్ణము ౧౫౮౮ చదరపు మైళ్లు. జనసంఖ్య ౩,౬౫,౪౮౮. గ్రామములసంఖ్య ౬౦౫. ముఖ్యస్థానములు బాసి, షేక్, సర్హింద్ అనునవి ముఖ్య పట్టణములు. చెల్లుబడి రు. ౯,౧౦,౦౦౦. ఈ నిజామత్‌లో ౩ తాలూకాలు గలవు: ఫతేగడ్, సాహిబ్‌గడ్, అమరగడ్.

## అమరచింతసంస్థానము

**అమరచింతసంస్థానము** — దీనికే ఆత్మకూరు సంస్థాన మనియెదరు. ఇయ్యది నైజామ్ హైదరాబాదురాజ్యమునందు రాయచూరుజిల్లాలో నున్నది. ఇందు ౬౯ గ్రామములు కలవు. విస్తీర్ణము ౧౯౦ చదరపుమైళ్లు. జనసంఖ్య ౩,౪౪౭. ఆదాయము రు. ౧,౪౦,౦౦౦. నైజామువారికి చెల్లింపవలసిన కప్పము రు. ౬,౨౬౩ లు. ఆత్మకూరు అనునది సంస్థానాధీశ్వరుం డుండుస్థలము. అచ్చట మంచికోట గలదు. కృష్ణానది ఈసంస్థానమునకు దక్షిణముగాఁ బ్రవహించును. ఆనదికి దక్షిణమున అమరచింతకు సరిహద్దున గద్వాల్ సంస్థానము గలదు. ఇచ్చట మిక్కిలి సన్నవి, సొగసైనవి మల్లువస్త్రములు, రుమాళ్లు, దోవతులు, తలగుడ్డలు నేయుదురు. వానికి పట్టంచును జరీయుంచును ఉండును.

**అమరదాసుఁడు** — సిక్కుల మూఁడవ గురువు. తండ్రి అమృతసరమున నుండు క్షత్రియకులజుఁ డగు తేజభానుఁడు. తల్లి సులఖని. జన్మము క్రీ. శ. ౧౪౭౯. మరణము ౧౫౭౪. నూఱు సంవత్సరములు బ్రతికెను. ౧౫౪౦ లో అంగదునియొక్క శిష్యుఁడాయెను ౧౫౫౨ లో అంగదుఁడు పరధామమునకుఁ బోఁగా నితఁడు సిక్కులకు గురు వాయెను. ఇతనికాలమున బాల్యావస్థ యనఁబడు సిక్కుమతము మిక్కిలి యభివృద్ధిఁ జెందెను. ఇతఁడు గొప్పభక్తుఁడై రాత్రిందివమును భజనయు, ఈశ్వరోపాసనయును జేయుచుండెను. పర్వతప్రాంతమునందలి పెక్కురు రాజులకు తన మత మిప్పించెను. చక్రవర్తి అయిన అక్బరునకు నితనియందు గౌరవము. ఇతని తరువాత, ఈతని యల్లుఁడైన రాందాస్ అనునతఁ డితనిసింహాసన మెక్కెను. పంజాబులోని గోయందవాలముల్క్ అను గ్రామమందు నీతనివంశజులు పెక్కు రిప్పటికి నున్నారు (సాధనకోశము).

**అమరనాథము** — బదరీనారాయణక్షేత్రమువలె నిది యు హిమాలయపర్వతమాలికలలో నొక పుణ్యక్షేత్రము; బదరీనారాయణము విష్ణుసంబంధమైనది. అమరనాథము శివసంబంధియైనది. కాశ్మీరదేశపు రాజధాని యగు శ్రీనగరమున కిది సుమారు ౬౦ మైళ్లు ఉత్తరముగ నున్నది. దీనికి నుత్తరమున టిబెట్టుదేశము ౧౫,౦౦౦ లు మొదలుకొని ౧౬,౦౦౦ ల యెత్తున నున్నది. భైరవఘాటి యను కోనలోనున్న హరముఖపర్వతమునందలి యొకగుహయే యక్కడి దేవాలయము. అందలి లింగము హిమమయము, పాషాణమయము కాదు. భాద్రపదమాస పౌర్ణమికి అక్కడ గొప్ప ఉత్సవము జరగును. ఆ యుత్సవదినములలో యాత్రికులందఱితోఁ గూడి పోవుటకు వీలగును కాని యిష్టమువచ్చినపుడెల్లఁ బోవుటకు వీలు లేదు. భాద్రపదమాసము ప్రారంభ మయినతోడనే శ్రీనగరమందలి రాంబాగ్ అనుతోఁటలో నొరతసముదా రోకపతాకము నెత్తించెదరు. ఈ జెండా ముందు నడచుచుండఁగా జనులు వెనుక నడచెదరు.

అమరనాథయాత్ర :— యాత్రకుఁ బోనెంచినవా రందఱును భాద్రపదపూర్ణిమకు ౨౦ రోజులు ముందుగ శ్రీనగరములోఁ బ్రోవగుదురు. మహారాజాయొక్క ఆజ్ఞానుసారము యాత్రికులకుఁ గావలసిన యాహారపదార్థముల వెంటఁగొని వర్తకులు యాత్రికమండలితో బయలుదేఱుదురు. మఱియుఁ గావలసిన యేర్పాటులఁ జేయునిమిత్తము రాజకీయోద్యోగస్థులు వెంటఁ జనుదెంచుచుందురు. యాత్రికు లందఱి యొక్క సామానులు, మకాములలో దిగినపుడు గావలసిన చిన్న చిన్న గుడారములు లోనగువానిని మోయుటకు గుఱ్ఱము లుండును. శ్రీనగరమునుండి అమరనాథము మరల నక్కడనుండి శ్రీనగరమును జేర్చుట కిగుఱ్ఱ మొకటింటికి సుమారు రు. ౧౫ లేక ౨౦ అద్దె నియ్యవలసి వచ్చును. యాత్రికు లందఱును భాద్రపదశుక్ల పంచమినాఁడు శ్రీనగరమును వదలి మటన్, జనకమహల్, పహల్‌గాంవ్, చందన

sampath_Ebooks

వాణీ, శేషనాగము లను పేరులు గల మకాములలో బసచేయుచు చతుర్దశినాఁటి మధ్యాహ్నమునకు పంచతరణి యను అఖరుమకామును చేరుదురు. శ్రీనగరమునుండి యమరనాథమువఱకును గల మార్గముయొక్క ప్రాకృతిక సౌందర్యము వర్ణనాతీతము; హిమాలయ మాలచి యానందింపఁ దగినదే. చందనవాడినుండి ఘనీభవించియుండు మంచుగడ్డలమార్గము మీఁదుగ మధ్య నక్కడక్కడ నడవవలసి వచ్చును. శేషనాగ మను నది యొక గొప్పసరస్సు. ఈ సరోవరము నానుకొనియుండు పర్వతములు అడుగునుండి శిఖరపర్యంతము మంచుగడ్డలతో నిండి కైలాసమును స్మరణమునకుఁ దెచ్చుచుండును. సరస్సులోని నీరు నీలవర్ణము. ఇందులకు కారణము చుట్టుప్రక్కల నీటియడుగునను ఘనీభవించిన హిమ ముండుటయే యై యున్నది. పంచతరణి యను నది యైదు పాయలుగాఁ బాఱుచుండును. ఈ యైదు ప్రవాహములలో స్నానమొనరించినవారు జన్మము తరింతు రని చెప్పుదురు. యాత్రికు లందఱు పూర్ణిమనాఁడు ప్రాతఃకాల మైదుగంటలకే లేచి స్నానము పూజాద్రవ్యముల వెంటఁదీసికొని యమరనాథుని గుహకు బయలుదేఱుదురు. ఈగుహయందే అమరనాథుఁ డను పేర హిమలింగ ముండును. కొన్నిచోట్ల నీగుహ ౧౫ మూరలకంటె నెత్తుండదు. లింగముమీఁద నెల్లప్పుడును పైనుండి తుషారము పడుచుండును. కావున దీనిని జలలింగ మనియు ననియెదరు. ఈ లింగముయొక్క కళలు చూడ చంద్రునితో హెచ్చుచుఁ దగ్గుచు నుండు నని చెప్పెదరు. పంచతరణినుండి గుహయొక్క దూర మయిదుమైళ్లు. అత్యంతకఠినమైన మార్గము. ఫర్లాంగుల కొలఁది ఘనీభవించిన హిమముమీఁద నడవవలసివచ్చును. గుహను చేరుటకు రెండు మూఁడు గంటలకాలము పట్టును. అక్కడ గుహమీఁదుగా నొక ప్రవాహమును, గుహయొక్క యడుగుభాగమున నొక ప్రవాహమును బాఱుచుండును. గుహమీఁదుగఁ బ్రవహించునది అమరగంగ. ఈగంగ గుహమీఁద ఉత్తర - దక్షిణముగఁ బాఱి గుహ దాఁటిపోయిన వెంటనే ప్రపాతరూపమున క్రిందఁబడి యడుగునఁ బ్రవహించు రెండవవాహినిలోఁ గలయును. యాత్రికు లందఱు నీ యమరగంగా ప్రపాతములో స్నాన మొనరించి గుహలోనికేఁగి యమరేశ్వరదర్శనము చేసి మరల వెలుపలికివచ్చి వేర్వేఱు ప్రదేశములలో గుంపులుగుంపులుగఁ గూర్చుండి తాము వెంటఁదెచ్చికొనిన ఫలాహారముల నారగింతురు. ఇక్కడి వేఱొకచిత్ర మేమన హిందూయాత్రికులకు గుహలోని భస్మము నొసఁగువారు మహమ్మదీయులు. ఈపని తురకల జన్మహక్కు. ప్రాచీనకాలమున వీరును హిందువులే యై యుందురు. ఇప్పుడు వీరిమతము మాఱినది కాని వృత్తి మాఱలేదు. యాత్రికు లందఱును స్వల్పఫలాహారముల నారగించి విశ్రాంతినొందుచుండు సమయమున అమరేశ్వరుని గుహమీఁదుగ నున్న ఉన్నతశిఖరముమీఁదికి రెండు పావురములు వచ్చి విహరించుచుండును. ఆ చుట్టుప్రక్కల కొన్నిమైళ్లదూరముపర్యంతము పక్షి గన్పింపదు. ఈ పావురములను జూచి యాత్రికులు తమ పుణ్యము ఫలించిన దని తలఁతురు. ఈలాగున కొంతతడ వక్కడ ప్రకృతిసౌందర్యముల ననుభవించి మరల నందఱును పంచతరణి చేరి యక్కడ భోజనాదికములను గావించుకొందురు. సాయంకాలము మూఁడుగంటలు దాఁటినతరువాత సర్కారువారు లక్కడ అమరనాథగుహదగ్గఱ నెవరిని నుండనీయరు. మఱునాఁడు పాడ్యమినాఁటినుండి తిరుగు ప్రయాణ మారంభమగును.

**అమరపురము** — బర్మాదేశమునందలి యొక గ్రామము. మాండలేపట్టణమునకు సమీపమం దుండును. ఒకప్పు డిది బర్మాదేశమునకు రాజధానిగ నుండెను. ౧౭౮౩-లో నిది నిర్మింపఁబడెను. క్రమముగ వృద్ధిఁ జెందెను. ౧౮౧౦ లో నిందు ౧,౭౦,౦౦౦ ప్రజ లుండిరి. ఆ సంవత్సరములోనే ఈ పట్టణము అగ్నిచే చాల భాగము నాశనము నొందెను. అప్పటినుండియు దినదినము హీనావస్థఁ జెందుచు నేఁ డచ్చట ౧౦,౦౦౦ జన మైనను నుండుట లేదు. ౧౮౬౦లో రాజధాని మాండలేకు మార్చిరి. ఇప్పు డచ్చట పూర్వవైభవమును సూచించు శిథిలమందిరము లనేకములు కలవు. ఇప్పుడు దీనిని బర్మాదేశమువారు మియోహాంగ్ అందురు. ఇచ్చట బౌద్ధదేవాలయములు చూచుటకు సొంపైనవి పెక్కులు గలవు.

**అమరసింగ్** — ౧. గూర్ఖాజాతి మహావీరుఁడు; సేనాపతి. ౧౮౧౫ లో నేపాలముగూర్ఖావారికిని ఇంగ్లీషువారికిని యుద్ధము జరగినప్పుడు మిక్కిలి సాహసముతోను దేశభక్తితోను పోరాడెను. కాని చివరకు నోడిపోయెను. అతనికి అమీరసింగుథాపా అనియు పేరు కలదు.

౨. ప్రతాపునికుమారుఁడు. ఇతనికి అభయసింహుఁ డని నామాంతరము (చూడుఁడు, అభయసింహుఁడు).

౩. పటియాలా రాజు. సరదార్ సింహుని కుమారుఁడు.

౪. రాజపుత్రవీరుఁడు; రాథోడ్ వంశజుఁడు. గజసింహుని కుమారుఁడు. సాహసుఁడు. ఇతఁడు ౧౬౪౪ లో షాజహాన్‌చక్రవర్తియెదుట సలాబత్ ఖాన్ మీర్ బక్షీ అనువానిని నఱకివైచెను. అంత చక్రవర్తియాజ్ఞను సైన్యములు వెంబడింప నాతఁ డాగ్రాద్వారమునొద్ద వారితో ఘోరముగ పోరాడి వీరస్వర్గము నొందెను.

౫. కాశీనివాసి కవి. ఇతనికి కవిత్వసంబంధమున కుష్గో అన్న పేరు గలదు. ఇతఁడు ఢిల్లీలో దొరతనము వారి యుద్యోగమునం దుండెను. ఇతఁ డకబర్ రాజమందిరమును తాజ్ మహాలును వర్ణించుచు చరిత్ర వ్రాసెను. మఱియు దానిష్ అను గ్రంథమును పద్యకావ్యముగ రచించెను.

**అమరసింహుఁడు** — సంస్కృతశబ్దశాసనుఁడు. 'అమరము' అని సామాన్యముగ వాడఁబడు సంస్కృతనామలింగానుశాసనమునకుఁ గర్త. ఇతని నిజమైనచరిత్ర మేమియు తెలిసికొనుటకు సాధనములు లేవు. పూర్వకాలమునుండి వచ్చుచున్న దంత

sampath_Ebooks

కథలే యాధారములు. అమరసింహుఁడు బౌద్ధుఁడఁట! విక్రమార్కుని సభలో నున్న నవరత్నములలో నొకఁడఁట. ఈ కథయే నిజమైన యెడల నితఁడును కాళిదాసుఁడును ఒకకాలమువారై యుందురు. కాళిదాసునికాల మింకను నిశ్చితముగఁ దేలలేదు. కొందఱతఁడు క్రీ. శ. ౪-౫ శతాబ్దివాఁడని యందురు. ఈతఁడే రాజుసభలో నుండెనో ఆరాజు హుయన్‌సాంగుచే వర్ణింపఁబడిన చంద్రగుప్తవిక్రమాదిత్యుఁడే యని కొందఱందురు.

ఈతనికాలమును ఒకవిధముగ నిర్ణయించుటకు రెండు మూఁడు ప్రమాణములు కానవచ్చుచున్నవి. అమరకోశమును ఉజ్జయినీ నివాసి యగు గుణరాతుఁడనువాఁడు, ౬-వ శతాబ్దియందు చీనా భాషలోనికి భాషాంతరీకరించెను.[1] కావున నిది యంతకుపూర్వ ముండె ననుటకు సందేహములేదు. ప్రథమకాండమందలి కాలవర్గములోని ౧౩-వ శ్లోకమునందు 'ద్వౌ ద్వౌ మాఘాదిమాసౌ స్యా దృతుస్తై రయనం త్రిభిః', అనఁగా 'మాఘాదిమాసములు రెండురెండింటికి ఒకఋతువును, మూఁడుఋతువులు గలసి యొకఅయనమును' అనును అని చెప్పఁబడి యున్నది. దీనిమీఁద టీక వ్రాయుచు క్షీరస్వామి 'మాఘాద్యుపక్రమ స్తతోఽయనారంభాత్' అనఁగా మాఘమాసమునుండి ప్రారంభ మని చెప్పుటకు కారణ మప్పటినుండి అయనము ప్రారంభ మగుటయే అని చెప్పియున్నాఁడు. కావున అమరసింహుఁడు తనకోశము వ్రాయుకాలమున నుత్తరాయణము మాఘమాసప్రారంభమునందు వచ్చుచుండెను. లెక్కవేసి చూడఁగా నిట్లు ౧౫-౧౬ వందలసంవత్సరములకుఁ బూర్వము జరగుచుండె నని తెలియుచున్నది. కనుక అమరుఁడు క్రీ. శ. ౪-వ శతాబ్దియందో ౫-వ శతాబ్దియందో యుండె నని మన మూహింపవచ్చును.

ఈతఁడు బౌద్ధుఁ డని యనుకొనుట కీతనికోశమునం దొకటి రెండు ప్రమాణములు కానవచ్చుచున్నవి. గ్రంథాదిని దైవప్రార్థన చేయునపుడు హిందువులసంప్రదాయము ననుసరించి చేయక బౌద్ధుల సంప్రదాయమునుబట్టి చేసినట్లు కానవచ్చుచున్నది. అమరకోశమునకు మొదటిదైన 'యస్య జ్ఞానదయాసింధోః' అను శ్లోకముయొక్క అర్థము నిర్గుణపరబ్రహ్మపరముగఁ జేయుటకు వీ లున్నను ఈప్రార్థనా సంప్రదాయము కాళిదాసాదుల ప్రార్థనాసంప్రదాయమును పోలి యుండలేదు. దేవతాదులనామమును చెప్పునపు డమరకోశములో మొదట బుద్ధునియొక్క నామములను జెప్పుటయేకాక పర్యాయపదము లిచ్చునపు డాతనియుత్కర్షము తెలుపునట్టి పదములను మెండుగ నిచ్చెను. అమరమునందలి బుద్ధునిపర్యాయపదములలోఁ గొన్ని చూడుఁడి: సర్వజ్ఞుఁడు, సుగతుఁడు, ధర్మరాజు, తథాగతుఁడు, భగవంతుఁడు, మారజిత్తు, లోకజిత్తు, జినుఁడు, షడభిజ్ఞుఁడు, దశబలుఁడు, అద్వయవాది, మునీంద్రుఁడు, శ్రీఘనుఁడు, శాస్త, శాక్యసింహుఁడు, సర్వార్థసిద్ధుఁడు.

మండనమిశ్రునికాలములోను శంకరాచార్యునికాలములోను బౌద్ధజైనులగ్రంథము లన్నియు నాశనము చేయించి, ఈతనిగ్రంథము విద్యార్థులకు నత్యంతోపయుక్త మగుటచే దీనినిమాత్రము కాల్చివేయక యుంచి రని కథలు చెప్పెదరు (చూడుఁడు, అమరకోశము).

**అమరప్రాదము** — భారతవర్ష తీర్థము.

**అమరాపురము** — బొంబాయిప్రాంతమందలి రీవాకాంతలోని మిక్కిలి చిన్న సంస్థానము.

## అమరావతి

— ౧. దేవతలముఖ్యపట్టణము. ఇంద్రునిరాజధాని. దీనినే స్వర్గలోక మనియెదరు. ఇయ్యది మేరుపర్వతము మీఁద నున్నది. ఇందు దేవతలు, అప్సరసలు, కిన్నరులు, యక్షయోగాదులు చేసినమానవులు నుందురు. ఇం దుండువారికి ఆఁకలి, దప్పి, నిద్ర, ముసలితనము, చావు లేదు. ఇందు నందనవన మను తోఁటయు, అత్యద్భుతమైన ఇంద్రసభయుఁ గలవు. ఇచ్చటియిండ్లు వాకిండ్లు, శిఖరములు మొదలైన వన్నియు బంగారములోఁ జేయఁబడినవి. ఇందును గూర్చిన యధికము తెలిసికొనఁగోరువారు భారతము సభాపర్వము, ౭-వ అధ్యాయము (తెలుఁగుభారతము, ౧-వ ఆశ్వాసము), కాశీఖండము, ౧౦-వ అధ్యాయము (తెలుగు, ౧-వ ఆ.) చూడవలెను.

౨. వర్హాడు (బీరారు) ప్రాంతములకు ముఖ్యపట్టణము. దీని నిజమయిన పేరు ఉమరావతి. మహారాష్ట్రులందఱును అట్లే వ్రాయుదురు. 'ఉమరావతి' పదమును ఇంగ్లీషులో వ్రాయునపుడు మొదట నెవఁడో Amraoti (అమరావతి) అని వ్రాసెను. అతప్పే యిప్పటివఱకును బరంపరగ వచ్చుచున్నది. కావున 'ఉమరావతి' శబ్దము చూడవలెను.

౩. గుంటూరుజిల్లా, సత్తెనపల్లి తాలూకాలో కృష్ణానదియొడ్డున నున్న యొకయూరు, అక్షాంశము ౧౬°. ౩౪'-౪౫'' - ఉ; రేఖాంశము ౮౦°-౨౪' - ౨౧''-తూ. ప్రస్తుత మిది యొకచిన్నపల్లెటూరు. జనసంఖ్య ౬,౧౨౦. అయినను ఈస్థలమును దీనిమీపమునం దున్నట్టి ధరణికోట యనుగ్రామమును మిక్కిలి వైభవము ననుభవించినపట్టణములు. ఇప్పటికిని దీనిని అటువైపువారు అమరావతీపట్టణ మని యందురు. రెండువేలయేండ్లకుఁ బూర్వము కట్టఁబడిన బౌద్ధస్తూపరాజమునుబట్టి యీగ్రామమున కీవేవల లోకవిఖ్యాతి కలిగెను. ఇచ్చటఁ బూర్వము బౌద్ధులుండి రనియు, వారికిని హిందువులకును పోరాటము జరగి హిందువులు వారిని వెడలఁగొట్టి రనియు, ఆ పోరాటమునందు విప్రవినోదులనువారు బ్రాహ్మణులకు సాయముఁ జేసి రనియు విప్రవినోదులు కథలు చెప్పెదరు. ఈ కథ లెంతవఱకు నిజమో తెలియదు కాని రెండువేలయేండ్లక్రిందట నిచ్చట బౌద్ధదేవాలయము లున్నట్లును,

1. Max muller's India : what can it teach us? (1st edition), page, 828.

sampath_Ebooks

# అమరావతిపటము




స్కేలు : అంగుళమునకు మైలు.

sampath_Ebooks

sampath_Ebooks


ఏనుబందలయొండ్లక్రిందటనే యిచ్చట అమరేశ్వరాలయ మున్నట్లును శాసనములవలనను గానవచ్చుచున్నది. బౌద్ధస్తూపమునందు క్రీ. శ. ౨-వ శతాబ్దిని రాజ్యము చేసిన ఆంధ్రరాజను పులుమావి వాసిష్ఠీపుత్త్రుని శాసనము కలదు.[1] ధరణికోటలో సర్వలోకాశ్రయ విష్ణువర్ధనుని శాసన మొకటి కలదు.[2] కావున నాఁటి కాలమునకుఁ బూర్వమే అమరేశ్వరాలయ మున్న దని తెలియుచున్నది. అమరేశ్వర దేవాలయ మెప్పు డేర్పడినదో చెప్పుటకు వీలు లేదు. ఇచ్చటి అమరేశ్వరాలయము చుట్టుపట్టులవారిచే గొప్ప క్షేత్రముగా నెంచఁబడుచున్నది. ఆంధ్రదేశమునందుఁ గల పంచారామములలో నీయది యొకటి. ఇచ్చటి లింగము మిక్కిలి యెత్తుగ నుండుటచే కొన్నిమెట్లెక్కి అభిషేకము చేయవలెను. ఆలయము యొక్క క్రిందియంతస్తు మూసివేయఁబడియున్నది. దేవాలయము నందు కోట కేతరాజు (క్రీ. శ. ౧౧౮౨) శాసనమును, కొండవీటి రెడ్డిరాజుల (క్రీ. శ. ౧౩౮౬) శాసనమును, కృష్ణదేవరాయల (క్రీ. శ. ౧౫౧౫) శాసనమును[3] ఉండుటచే నీయది ఆంధ్రదేశమునఁ బ్రఖ్యాతిఁ గాంచియుండె నని చెప్పవలసియున్నది. ఇప్పు డమరేశ్వరుఁ డనఁబడులింగము జైనుల లేక బౌద్ధుల విగ్రహ మనియు, బౌద్ధులు వెడలిపోయినతరువాత బ్రాహ్మణులు దానిని లింగముగ మార్చుకొని రనియును కొందఱు చరిత్రకారులయభిప్రాయము. ఇప్పటికిని కొన్నిజైనప్రతిమలు దేవాలయసమీపప్రదేశమునఁ గానవచ్చుటవలనను, ఈయాలయము కొన్ని విషయములలో బౌద్ధస్తూపమును బోలి యుండుటవలనను పైయభిప్రాయము దృఢ మగుచున్నది. ఈపట్టణము జీర్ణస్థితి నుండ ౧౭౯౬ లో చింతపల్లి జమీందారైన రాజా వాసిరెడ్డి వేంకటాద్రినాయఁడు చింతపల్లిని విడిచి, ఈపట్టణమును తననివాసస్థలముగఁ జేసికొనెను. ఇతఁడు పట్టణము నందు విశాలము లైనవీథుల నేర్పఱిచెను; నలువైపులను రమణీయము లైనతోఁటలను వేయించెను. చింతపల్లి, పెనుగంచిప్రోలు, నందిగామ, బేతవోలు (జగ్గయ్యపేట) మొదలయినస్థలములనుండి కోమట్లను రప్పించి, వారికిఁ గొంత ధనసాహాయ్యమును జేసి గ్రామమును మిక్కిలి యభివృద్ధికిఁ దెచ్చెను. ఇచ్చట నతఁ డొకభవ్య మయిన రాజమందిరమును గట్టించెను.[4] ఈ మేడపైకప్పు ధళ ధళమను రాగిరేకులతోఁ గప్పఁబడెనఁట! వేంకటాద్రినాయనిమరణానంతరమున (౧౮౧౬) ఆతనిదత్తపుత్త్రులలోఁ గలహములు పుట్టి వారిసంస్థానమంతయుఁ బోయి గవర్నమెంటువారి క్రిందికి వచ్చెను. ఇచ్చటి అమరేశ్వరస్వామికి నైజామ్‌రాజ్యములోఁ గొన్ని యీనాముభూములును, సంవత్సరమునకుఁ గొంతధనమును ముట్టుచుండును. ఈయేర్పాటులు చందూలాలు మంత్రిగా నున్నకాలమందుఁ జేయఁబడినవని యందురు.

**అమరావతీస్తూపము** — ఈశీర్షిక దక్షిణాపథము నందలి బౌద్ధకళా, శిల్పములకును, ఆంధ్రదేశమున ప్రాచీనకాలము నందు వ్యాపించిన మతముపరిస్థితులకును సంబంధించిన గొప్పవిషయమును తెలుపును. ప్రధానముగా గుంటూరుజిల్లా సత్తెనపల్లి తాలూకా అమరావతీగ్రామమునందలి స్తూపముయొక్క చరిత్రమువలననే ఈ విషయము విశదము కాఁగలదు.

**స్తూపము** : — స్తూప మనుపదము సంప్రదాయమునుబట్టి బౌద్ధనిర్మాణములకే వర్తించును. దీనిప్రాకృతరూపము థూపము. ఇప్పటికి నీపదము సింహళమున వ్యవహారమునం దున్నది (చూడుఁడు: థూపారామము). ఈపదమే సామాన్యజనవ్యవహారమున తోఁపు అయినది. అయితే బౌద్ధవాఙ్మయమునుబట్టి కాని, అమరావతి మొదలయిన బౌద్ధక్షేత్రములందుఁ గానవచ్చిన శాసనముల ననుసరించి కాని అప్పు డీస్తూప మనుపదము వాడుకయం దుండినట్లు కానరాదు, కాని యిందులకు బదులుగ చైత్య మనుపేరే వ్యవహారమునం దుండెను. ఒక్కచైత్యమే యుండునెడల చైత్య మనియు, పెక్కుచైత్యము లుండునెడల నందు ప్రధాన మయినదానికి మహాచైత్య మనియు పేరుండును. ఇందులకు నిదర్శనముగ నమరావతియం దుండిన ప్రధాన చైత్యమును, ఇటీవల నాగార్జునునికొండయందు త్రవ్వఁగా బయలు పడిన స్తూపములలో ప్రధాన మయినదియు మహాచైత్యనామాంకితము లయియుండుట గమనింపవచ్చును.

**చైత్యము** : — చైత్య మన్నపదము 'చితా' శబ్దమునుండి పుట్టినది (చితాయాః ఇదం చైత్యం, అనఁగా, చితికి సంబంధించినది). ప్రాచీనబౌద్ధులలో బుద్ధునియొక్కయు, ప్రసిద్ధు లయిన అర్హతులయొక్కయు ధాతువిశేషములను పూజించుతలంపుతో భద్రపఱుచుట ఆచారముగ నుండినట్లు మనకు బౌద్ధవాఙ్మయమువలనఁ దెలియుచున్నది. (౧) బుద్ధులయొక్కయు, (౨) ప్రత్యేకబుద్ధులయొక్కయు (౩) అర్హతులయొక్కయు, (౪) చక్రవర్తులయొక్కయు ధాతువులు చైత్యనిర్మాణములందు భద్రపఱిచి పూజింపవచ్చు నని యొకప్పుడు బుద్ధుఁడే తనప్రధానశిష్యుఁడయిన ఆనందునితో తెలిపినట్లు 'మహాపరినిబ్బానసుత్తము'నఁ గలదు. తన మతప్రచారమునకు చక్రవర్తి యెక్కువ యావశ్యక మని గ్రహించినవాఁడోలు బుద్ధుఁ డీపట్టికయందు వివేకముతో చక్రవర్తులనుగూడ చేర్చినట్టు కన్పట్టును. ఈపూజ్యత కాశించియో యేమో తరువాతికాలమున అశోకచక్రవర్తి (క్రీ. పూ. ౨౫౦) బౌద్ధధర్మప్రచారమునం దసాధారణకుతూహలమును గనఁబఱిచెను. బుద్ధునియాదేశమును శిరసావహించి అతఁడు నిర్వాణము చెందిన వెంటనే ఆతనిధాతువుల ననేక భాగములు చేసి, యొక్కొక్క

1. Burgess 'Amaravati Stupa', p. 100.
2. Kristna District Manual, p. 164.
3. Epigraphical reports for 1897, Nos. 257, 259, 266, etc.
4. Burgess 'Amaravati', p. 14; Kistna Manual, P. 164.

sampath_Ebooks


ధాతువుమీఁద నొక్కొక్కటిచొప్పున నెనిమిది చైత్యములను నిర్మించిరి. వీనికి 'శారీరకచైత్యము' లని పేరు. అశోకుని నాఁటి కాతని దిగ్విజయములవలనను, మఱి యితర కారణములవలనను బౌద్ధమతము దేశమున హెచ్చుగా వ్యాపించుటచేత తనరాజ్యమునందలి ప్రజలబౌద్ధ శ్రద్ధను తీర్చుటకయి, అపవిత్రకార్యమయినను అతఁడీ శారీరక చైత్యములఁగో నేకింటిని తెఱపించి, అందలిధాతువులను ఎనుబది నాలుగువేల శకలములు కావించి, తనరాజ్యమునందలి వేలువేలుభాగముల కొక్కొక్కశకలమును గొనిపోయి, వానిపై నిట్లు ఎనుబదినాలుగు వేలస్తూపములను గట్టించె నని ప్రతీతి కలదు. ఆధునికపురాతత్త్వజ్ఞులు మనదేశమునందలి నేఁడువేలు ప్రాంతములందుఁ జేయు ఖననపరిశోధనలవలన పెక్కుచైత్యములు బయలుపడుచున్నవి. దీని ననుసరించి చూడఁగా నీప్రతీతి అవిశ్వసనీయముగాఁ దోఁచదు.

'మహాపరినిబ్బానసుత్తము'నందే బౌద్ధకథా, స్తూపములయుత్పత్తికి సంబంధించిన హృదయాకర్షకమగు మఱియొకవిషయముకూడ బుద్ధుఁడు చెప్పినట్లు కలదు. బుద్ధుఁ డానందునితో తననిర్వాణమునకుఁ బిదప బౌద్ధులు సందర్శింపఁదగిన స్థలములు నాలుగు కల వని చెప్పెను. అవి యేవన: (౧) తాను పుట్టినస్థలము, (౨) తాను 'సంబోధి' నొందినస్థలము, (౩) మొట్టమొదటిసారి తనధర్మమును బోధించిన స్థలము, (౪) బుద్ధుఁడు నిర్వాణమునొందిన స్థలము. బుద్ధుఁడు చెప్పె నన్నయీవిషయము చారిత్రకసత్యమయినను కాకపోయినను బౌద్ధులుమాత్ర మిప్పటికి నీయాదేశము బుద్ధప్రోక్తమే యని శిరసావహించి నేఁటికిని ఈనాలుగుస్థలములకును, అనఁగా నేపాళతెరై ప్రదేశమునందలి కపిలవస్తునగరసమీపమునం దున్న లుంబినీవనమునకును, సంబోధి నొందిన బుద్ధగయకును, మొట్టమొదటిమాఱు ధర్మప్రవర్తనము కావించినమృగదావము (సారనాథ్) నకును, నిర్వాణము చెందినకుసినగరమునందలి సాలవనమునకును యాత్రలు చేయుచున్నారు. బౌద్ధులందఱియాచారమునందే బౌద్ధకళాబీజములు నిక్షిప్తము లయియున్నట్లు కన్పట్టును. ఎట్లన, ఈస్థలములను సందర్శించినయాత్రికులు బుద్ధజీవితముతో సంబంధించిన యాగొప్పవిషయములకు జ్ఞాపకార్థముగ నిటికెలమీఁద ముద్రిత మయినచిహ్నములను దమతోఁ దీసికొనిపోవుచుండువారు. పద్మము బుద్ధునిజననమునకును, బోధివృక్షము (అశ్వత్థము) బుద్ధునిసంబోధికిని, మొట్టమొదటిధర్మప్రవర్తనమునకు ధర్మచక్రమును, బుద్ధునినిర్వాణమునకు స్తూపము (చైత్యము)ను ప్రాయికముగ చిహ్నములుగ నుండెను.

బుద్ధునియాదేశములను వినయవిధేయతలతో ననుసరింపఁగోరిన బౌద్ధులు ఈనాలుగుస్థలములును దమపూజాభినివేశమునకు సరిపోవక ఈస్థలములయందే కాక బుద్ధజీవితముతో సంబంధము గల యితరస్థలములందుఁగూడ స్తూపములు నిర్మించిరి. బౌద్ధమత మశోకుని కాలములో హెచ్చుగా వ్యాపించుటచేత ఈస్థలములుకూడ చాలక బోధిసత్త్వునికి సంబంధించిన జాతకకథలు జరిగినచోట్లఁగూడ స్తూపములు కట్టిరి. తుదకు బౌద్ధులు స్తూపనిర్మాణమును పుణ్యప్రద మయిన మతధర్మముగ భావించి, తమమతము వ్యాపించిన ప్రతిదేశమునందును పెక్కుస్తూపములు నిర్మించుచువచ్చిరి. మంజుశ్రీ మొదలగు బోధిసత్త్వులకుఁగూడ స్తూపము లంకితము లయియుండుటచేత — బోధిసత్త్వులింకను నిర్వాణము నొందనివా రను అభిప్రాయప్రాబల్యమును బట్టి — స్తూపము లన్నిటియందును ధాతువు లున్నట్లు భావింపరాదు. కాని యట్టివానిని ఆరాధ్యములయిన బౌద్ధాలయములుగ నెంచవలసియుండును. ఈయర్థమునందు స్తూపపదము చైత్యమునకు పర్యాయపదముగ గ్రహింపవచ్చును. కాలాంతరమున చైత్య మను పేరు వృక్షవేదికకుఁ గాని, సంపూర్ణదేవాలయమునకుఁ గాని, గర్భగృహమునకుఁ గాని వర్తించుచువచ్చినది. కాఁబట్టి చైత్య మనునది బౌద్ధమతవిషయక మయిన సాధారణపదముగను, స్తూప మనునది వస్తువిశేషసంబంధము గల నిర్మాణమునకు (Relic mound) వాస్తుశాస్త్రీయపదముగను (Architectural term) ఇటీవల వ్యవహరింపఁబడుచువచ్చినది.

కొందఱు 'ధాతుగర్భ'పదముయొక్క వికారరూపమయిన 'దాగోబ'ను స్తూపమునకు పర్యాయపదముగ నుపయోగించుచున్నారు కాని యిది సరియయినవ్యవహారము కాదు. ఏల యన, నిది స్తూపమునందలి యొకప్రత్యేకప్రధానభాగమునకుమాత్రమే, అనఁగా, ప్రత్యేకము ధాతువు నుంచుస్థలమునకు మాత్రమే వర్తించును. ఈధాతువుంచుస్థలము పెట్టెగాఁ గాని, భరణి (Casket) గాఁ గాని యుండవచ్చును. స్తూప మనునది నిర్మాణమున కంతకును వర్తించును. స్తూపము లన్నియు ధాతుగర్భములు కాకపోవుటచేత 'దాగోబ'పదము స్తూపమునకు పర్యాయపదముగ పరిగణించుట యసమంజసము. 'ధాతుగర్భ'పదమే 'దాగొబ్బ', 'దగ్బ', దబ్బగ వికారముపొంది తుదకు డిబ్బగ మాఱియుండవచ్చును; లేదా డిబ్బ యనునది థూప - తుప్ప పదమునుండి యైనను వచ్చియుండునేమో?

చితాసంబంధి యైనను, లేక ధాతుగర్భసంబంధి యైనను ఈ నిర్మాణమున కీయాకృతి యెట్లు వచ్చిన దనువిషయమున భిన్నాభిప్రాయములు కలవు. కొందఱు ప్రాతఃకాలమున సగ ముదయించిన సూర్యునిఁ గాంచి, తదాకృతి ననుసరించి స్థపతి (Architect) ఈ నిర్మాణము నిట్లు రచియించె నని చెప్పుదురు. కాని బౌద్ధవాఙ్మయము ననుసరించి చూడఁగా నీస్తూపాకృతి బుద్బుదరూపమున వ్యక్తీకరింపఁబడిన తాత్త్వికాభిప్రాయముయొక్క స్థాపత్యనిర్వచనము (Architectural expression) గాఁ దోఁచును. ఇందలి తాత్త్వికాభిప్రాయ మిది: ప్రతిశరీరమునందును పరమాత్మ అంతర్నిహితముగ నున్నది, అనఁగా శరీరమే లక్ష్యముగ భావించువారికి పరమాత్మ వ్యక్తము కాదు. పరమాత్మాన్వేషులయిన తత్త్వవేత్తలకు క్షణికస్థితిగల దమువలె నుండుశరీర మను తెర తొలఁగి పరమాత్మయే గోచరించును. అయినను వ్యవహారదశలో పరమాత్మ శరీరాంతర్నిహితముగనే యుండును. వ్యావహారికమయిన యీ తాత్త్వికసమస్య అతినిపుణముగను, చమత్కారముగను బౌద్ధకళయందు స్తూపనిర్మాణమున బుద్బుదము అండాకృతి గల స్తూపరూపమునను, పరమాత్మ అం దంతర్గర్భిత



పటము, ౧. అమరావతీస్తూప విన్యాస (Plan), ఖండికలు (Section).

( ౧౮౧౭ లో మెకలనల్ కెంజి చేసిన సర్వే ననుసరించి )

sampath_Ebooks

sampath_Ebooks

sampath_Ebooks


మయిన ధాతురూపమునను వ్యక్తీకరింపఁబడినది. అండాకృతిగల స్తూపముమీఁద నొకటి గాని, మూఁడు కాని ఛత్రము లుంచుట వాడుక. ప్రాయికముగ స్తూపముమీఁద మూఁడు ఛత్రము లుంచుట యాచారము; ఎందువల్ల ననఁగా, సరియైన స్తూపమును నిర్మింపవలె నన్న నది బుద్బుదాకృతి నుండవలె నని, ఒకటి దేవతలకును, రెండవది మనుష్యులకును, మూఁడవది నిర్వాణమునకు, అనఁగా బౌద్ధమోక్షమునకును సూచనగ మూఁడుఛత్రములు దానిపై నుండవలె నని, ఈవిధమైన నిర్మాణమే సరియైన దని పెద్దలవల్ల నంగీకరింప బడిన దని బౌద్ధవాఙ్మయమువలనఁ దెలియవచ్చుచున్నది. ఈ ఛత్రత్రయమును బౌద్ధుల నిర్వాణ, పరినిర్వాణ, మహాపరినిర్వాణములకుఁ గూడ సూచనగ గ్రహింపవచ్చును. ఈదృష్టితోఁ జూచినచో నివి అద్వైతుల సత్, చిత్, ఆనందభావములకు సమముగ నుండును. ఈ సందర్భమునందు మనము గమనింపవలసినది చిత్రమయిన యొక విషయము కలదు. స్తూపము పొందిన పరిణామములో ముఖ్యమయినది ఛత్రవిషయము. మొట్టమొదటి నిర్మాణములందు స్తూపాధిష్ఠితము యొక్క ఛత్రమే యుండెడిది, కాని క్రమక్రమముగా నీఛత్రసంఖ్య పెరిఁగినది (చూడుఁడు, పటము, 3). పెరిఁగి పెరిఁగి, తుదకు సంఖ్యాతీతమయి, ఛత్రసమూహ మేర్పడి, యది చీనా, నేపాళదేశములలోవలె, స్తూపమునకు దీర్ఘీకృతాకారమును కలిగించినది. చిట్టచివరకు క్రమముగా ఛత్రసమూహవిన్యాసము పొడు గయిన సూచ్యాకృతిని (Spiral appearance) పొందఁగా, స్తూప మొక గోపురము (Tower)వలె నేర్పడినది. ఈస్తూపముమీఁద రెండుకాని, మూఁడు కాని, అయిదుకాని, తొమ్మిదికాని, పదుమూఁడుకాని ఛత్రము లుండవచ్చును. అండోపరిస్థిత మయిన 'హర్మిక' విభాగములు విశ్వవిభాగములను సూచించును. ఈవిధమున స్తూపముసందలి ప్రతిభాగము నొక్కొక్క విషయమునకు సంకేత మయినది. స్తూప మంతయుఁ గలసి మేరుపర్వతమునకు చిహ్న మయినది.

ఒకవేదిక (Drum), దానిమీఁది అర్ధగోళాకారము అండము (Hemispherical dome), అండముపయి నొకహర్మిక (Pavilion), దానిపయిని నిర్మాణము నంతను ఆవరించు దండసహితచ్ఛత్రము కలసిననిర్మాణము స్తూప మందురు. ఈనిర్మాణమునకు చుట్టు నొకటి కాని, రెండు కాని ప్రాకారము (Railings) లుండును. అండ, హర్మికలకు మధ్య నుండుభాగమునకు గళ (Neck) మని పేరు.

అమరావతి:— దక్షిణహిందూదేశమునందలి పురాతత్త్వఖనన పరిశోధనలవలన బయలుపడిన బౌద్ధనిర్మాణావశేషములను పరిశీలించిన శాస్త్రజ్ఞులు పైని చెప్పిన స్తూపలక్షణ మితరస్థలములయందలి వాని యన్నిటికంటెను అమరావతీస్తూపమునందు పరిపూర్ణతను చెందిన దని చెప్పుదురు. అమరావతీప్రాముఖ్యము స్తూపమువలననా? లేక మఱి యితరకారణములవల్లనా యను విషయము విచారింపవలసి యున్నది. అమరావతియందలి బౌద్ధనిర్మాణావశేషములలో కడు పురాతన మయినవి అశోకచక్రవర్తి కాలమునకు పూర్వపు వనుటకు తగినయాధారములు లేవు; అనఁగా, నవి యశోకునికాలమునాఁటివి కాని, అతని కించుక తరువాతివి కాని అయియుండవచ్చును. కడు పురాతనములయిన వనఁబడు నీనిర్మాణములమీఁదఁ గానవచ్చు కొన్ని శాసనములు మౌర్యలిపిరీతి ననుసరించి యున్న వనుటచేత అవి యశోకునినాఁటివే యని చెప్పుట యుక్తము. ఈసందర్భమున అశోకుఁడు ౮౪,౦౦౦ల స్తూపములను గట్టించె ననుప్రాగ్వ్యక్తప్రతీతి స్మరింపఁదగినది. క్రీస్తుశకము రెండవశతాబ్దియందు మాధ్యమికవాదమును వ్యాపింపఁజేసిన సుప్రసిద్ధుఁ డగు నాగార్జునాచార్యుఁ డీస్తూపము చుట్టును గొప్పప్రాకారమును గట్టించె నని తారానాథుఁ డను టిబెత్తుచరిత్రకారుఁడు చెప్పుటచేత ప్రాయికముగ అశోకుఁ డిచట స్థాపించినబుద్ధుని - అసలుధాతువువలననే ఈస్థలమున కంతటి ప్రాముఖ్యమును, మహాత్త్యమును గలిగిన వనుట సమంజసము. అమరావతీస్తూపశాసనములం గొన్ని యీస్తూపము చైత్యకసంఘవారి దని చెప్పుటచేత అశోకునిచేత మతప్రచారము గావింప మహిషమండలమునకుఁ బంపఁబడిన మహాదేవభిక్షువే తచ్చక్రవర్తిప్రోత్సాహమున బుద్ధధాతువు నిచట చైత్యగర్భితముఁ గావించి, చైత్యవాదమును స్థాపించి యీస్థలమును దన మతప్రచారమునకు ప్రధానస్థానముగఁ జేసికొనినట్లు తోఁచును.

సమ్యక్సంబుద్ధుని శారీరకధాతువు నిచ్చట స్థాపించుటచేతనే వేలువేలుసంప్రదాయములకుఁ జెందినబౌద్ధు లిచట నివాసము లేర్పఱుచుకొనియుండిరి. గుంటూరుజిల్లా రేపల్లెతాలూకాయందలి భట్టిప్రోలునందును, పల్నాడుతాలూకాయందలి నాగార్జునికొండయందునుగూడ నిట్టిశారీరకధాతువులే కానవచ్చినవి. పూర్వకాలమున విజయపురి అను పేరుగలిగి ఇక్ష్వాకునృపాలురకు రాజధాని యయి, ప్రస్తుతకాలమున నాగార్జునికొండ అను పేరఁ బరఁగుచోట త్రవ్వఁగా ఇటీవల పెక్కుచైత్యములు, విహారములు, మండపములు బయలుపడినవి. అచ్చట దొరకినశాసనములనుబట్టి చూడఁగా ఇక్ష్వాకునృపతులకాలమున నిది బౌద్ధమతమునకు, అందును, మహాసాంఘికవాదమునకు, అమరావతి యెట్లో అట్లే ప్రధానస్థానముగ నుండినట్లు తెలియుచున్నది. కృష్ణానదీతీరమున, అమరావతికి సమీపముననే యున్న యీనాగార్జునికొండకుఁగూడ అంతటి ప్రాముఖ్యము కలుగుట కచ్చటఁగూడ బుద్ధునిశారీరకధాతు వుండుటయే కారణము కావచ్చును. అచ్చటిస్తూపములలో నొకదానిలో నొకయెముకముక్క దొరకినది. అది బుద్ధుని దని తీర్మానించి సారనాథ్‌నందు నూతనముగా స్థాపించిన మూలగంధకుటీవిహారమున దానిని భద్రపఱచి బౌద్ధులు పూజించుచున్నారు. ఒక్కకృష్ణానదీతీరమునందలిపరిమితప్రదేశముననే ఇట్లు మూఁడు శారీరకధాతువులు కానవచ్చుచుండుటచేత బుద్ధుని శారీరక

sampath_Ebooks

ధాతువులను ౮౪,౦౦౦ల తునుకలు చేసి దేశమునం దెల్లెడల ౮౪,౦౦౦ల స్తూపములను అశోకుడు కట్టించె ననుగాథ విశ్వాసార్హము గాఁ దోఁచుచున్నది. క్రీస్తుశకము మూఁడవశతాబ్దికి పూర్వము కాంచీ నగరము ప్రాధాన్యమును వహింపకమునుపే అమరావతి దక్షిణాపథమున కంతకును గొప్పవిద్యాస్థానముగను, బౌద్ధమతప్రధానపీఠముగను ప్రఖ్యాతిని చెందియుండె నని చెప్పుట సమంజసము.

గ్రామనామము :— అమరావతీస్తూపమునందలి ప్రాచీన శాసనములనుబట్టి ఈ గ్రామమునకు పూర్వము ధాన్యకటకము (ధంనకటక, ధంనకడక) అనియే పేరు. క్రీస్తుశకము పదునాఁడవ శతాబ్దివఱకు నీ పేరే వ్యవహారమునం దుండెను. తరువాత నిది ధరణికోటగా మాఱినది. క్రీ. శ. ౧౧౮౨ నాఁటి యొకశాసనమున,

‘అస్తి శ్రీధాన్యకటకం పురం సురపురాత్పరమ్,
యత్రామరేశ్వరశ్శంభు రమరేశ్వరపూజితః,
బుద్ధో దేవస్య సాన్నిధ్యాత్ యత్ర ధాత్రోపపూజితః,
చైత్య మత్యున్నతం యత్ర నానాచిత్రసుచిత్రితమ్.’

అని యుండుటచేత నప్పటికికూడ ఇది ధాన్యకటక మనియే సుప్రసిద్ధమయియుండె నని, ఇక్కడ బుద్ధునిపూజయు, అమరేశ్వరుఁ డనుపేర శివునిపూజయుఁగూడ నుండె నని, మతసహనము బాగుగ నుండుటచేత నిచ్చటిచైత్య మప్పటికింకను శోభించుచుండె నని స్పష్టమగుచున్నది. దీనినిబట్టి చూడఁగా, ఈనగరమున కమరావతి యనుపే రమరేశ్వరుని బట్టి యెప్పుడో క్రీ. శ. ౧౧౮౨ తరువాత వచ్చిన దని నిశ్చయింపవచ్చును. పదునాఁడవశతాబ్దిలోఁగూడ నిచ్చట బుద్ధపూజ జరుగుచుండె నని శాసనములు తెలుపుచున్నవి. ఎట్లు మాఱినదో, ఎప్పుడు మాఱినదో కాని ధాన్యకటక మనుపేరు తరువాత ధరణికోట యైనది. ఈపేరు క్రీ. శ. ౧౪౦౯ నాఁటి శాసనమునఁ గనఁబడును. ఇప్పుడు వ్యవహారమునం దున్న ధరణికోట, అమరావతి యనుపేరులు పూర్వమొక్కనగరమునకే వర్తించుచుండెను కాని ప్రస్తుతకాలమున ఆనగరమున్న ప్రదేశమునందలి పడమటిభాగమునకు ధరణికోట యని, స్తూప మున్నభాగమున కమరావతి యని వర్తించుచు, పూర్వపుపట్టణమిప్పుడు రెండు వేఱువేఱు గ్రామములుగ విడిపోయినది. అయినను, ఈరెండు గ్రామములందునుగూడ స్తూపాదులకు సంబంధించిన బౌద్ధనిర్మాణావశేషములు దొరకుట కలదు.


క్షేత్రప్రఖ్యాతినిబట్టి సార్నాథ్, బుద్ధగయలయం దిప్పటికిని దానస్తూపములు వెలయుచున్నట్లే, వెనుక నీ యమరావతీక్షేత్రమునందును ప్రధానచైత్యముపొరుగున పెక్కు దానచైత్యములు విలసిల్లినవి. ఈకారణమున అమరావతియందలి ప్రధానచైత్యమునకు మహాచైత్య మనుపేరు కలిగినది. అమరావతియందు వెలసిన యీదానస్తూపములలో ఒకదానివేదిక ౧౧ అడుగులవ్యాసము గలిగి చైత్యచిత్రిత మయినశిలాఫలకములతో శోభించుచుండెను. ఈ మహాచైత్యమును లక్ష్యముగాఁ గొని ఈశిలాఫలకములను చెక్కినారు. ఇట్టి చైత్యశిలాఫలకములలో తొమ్మిది మద్రాసుగవర్నమెంటు మ్యూజియమునందు భద్రపఱుపఁబడినవి.

ఈక్షేత్రము విద్యాస్థానముగను, గొప్ప యాత్రాస్థలముగను పేరుపడుటచేత బౌద్ధు లనేకు లిచటికి వచ్చుచుండిరి. వారు నివసించు నిమిత్త మిచట సంఘారామము లనేకములు నెలకొల్పఁబడినవి. ఇచట వేఱువేఱుబౌద్ధమతసంప్రదాయములకును, శాఖలకును చెందిన బౌద్ధభిక్షువులు నివసించుటకు వేఱువేఱుశాఖలవారి సంఘారామములు వెలసినవి. వేఱువేఱుశాఖలకు చెందినబౌద్ధు లిచటికి వచ్చుచుండినట్లును, ఇచట నివసించుచుండినట్లును అమరావతీస్తూపమునందలి శాసనములను బరిశీలించినచోఁ దెలియఁగలదు. అందువలన ఆయాబౌద్ధమతశాఖలనుగుఱించి తెలిసికొనుట యుక్తము.

బౌద్ధమతశాఖలు :— శాక్యముని బుద్ధుని పరినిర్వాణకాలమునకుం డిరేమో, అతఁ డున్నతో స్దేశములతో నేర్పఱిచినసంఘమున అభిప్రాయభేదములు కలిగి పగు లేర్పడినది. వైశాలియందు సమావేశమయిన ‘సంగీతి’ యందు ఈ యభిప్రాయభేదములు చాల ప్రస్ఫుటమయి బౌద్ధసంఘము మహాస్థవిరు లని, మహాసాంఘికు లని రెండుపక్షములుగ విడిపోయినది. మహాస్థవిరశాఖ ఆత్మానుభవముగల వృద్ధులకే ప్రాముఖ్యము నొసంగును. మహాస్థవిరులు శీలమునకును, వృద్ధాచారమునకును, నైతికశిక్షణమునకును ప్రాధాన్య మిచ్చెదరు. ఈ ధర్మములప్రకారము నడచుకొనుట చాలఁ గష్ట మయినందున ఎల కవి నచ్చక వారు స్థవిరవాదమును తిరస్కరించి క్రొత్తమార్గము నవల్బిరి. వీరు మహాస్థవిరులవలెఁ గాక వేదాంతవిషయములకును, లోకోపకారక విషయములకును ప్రాముఖ్యము నిచ్చిరి. మహాస్థవిరశాఖయందలి యొకసంప్రదాయమునకు ‘విభజ్యవాద’ మని పేరు. మౌర్యవంశజుఁ డయినయశోకచక్రవర్తి బౌద్ధమతశాఖ లన్నిటిని సమానముగ నాదరించినను అతని కీసంప్రదాయమం దాదరమును, ప్రీతియు నెక్కువ. ఆచక్రవర్తియాదరమున నిది కొంతకాలము వర్ధిల్లినది కాని తరువాత దీని కాదరము తగ్గి, పుష్యమిత్రుఁడు మొదలగు శుంగవంశజులు పెట్టినహింసలవలన నిది క్షీణించినది. ఈసంప్రదాయమునకు చెందినవారు పిదప దక్షిణదేశమునకు పాఱిపోయి తుదకు సింహళమున కరిగి యచ్చట తల దాఁచుకొనిరి. యువజనులయిన మహాసాంఘికులయుద్దేశము లున్నతము లయిన వగుటచేతను, వారత్యంతోత్సాహపరతతో తమసంప్రదాయధర్మములను ప్రచారము చేయుటచేతను, యుక్తిపరు లగుటచేతను వారిసంప్రదాయము జనసమ్మత మయి అతిశీఘ్రకాలమున దేశమున బాగుగ వ్యాపించినది. మహాసాంఘికులు హిందూదేశమునకు క్రొత్తగా వచ్చినవిదేశీయులయిన యవన, శక, పహ్లవ, కుషాణాదులతో స్నేహము కలిపి వారిప్రాపు సంపాదించుకొనిరి. వారు ముఖ్యముగా కనిష్కునికాలమున చాల ప్రాముఖ్యమును వహించిరి. కనిష్కునికాలమున జరగిన ‘సంగీతి’ యందు వీరు బుద్ధసూక్తములకు క్రొత్తభాష్యములు రచించి వానిని ‘విభాషా’ నామాంకితములు కావించిరి. కనిష్కునికాలమున జర

sampath_Ebooks

# అమరావతీ స్తూపము




స్తూపభాగముల సూచి

ప్రాకార రేఖ :


౧. ఊర్ధ్వపటములు ( వెలుపలివైపు )
౧ క. ఊర్ధ్వపటములు ( లోపలివైపు
౨. సూచులు ( వెలుపలివైపు )
౨ క. సూచులు ( లోపలివైపు )
౩. ఉష్ణీషము ( వెలుపలివైపు )
౩ క. ఉష్ణీషము ( లోపలివైపు )
౪. అధిష్ఠానము
౫. ప్రదక్షిణవీథి

వేదిక :

౬. వేదిక : ఈ అరుగువంటిభాగము
౭. చైత్య గాఫలకములు
౮. చైత్య గాఫలకములు : ఉష్ణీషము
౯. ఆర్యక స్తంభములు
౧౦. అండము
౧౧. హర్మిక
౧౨. ఛత్రము

sampath_Ebooks

# అమరావతీ స్థూపము



చైత్యశిలాఫలకముంమీది నమూనా ననుసరించి వ్రాసిన అమరావతీ స్తూపపు సంపూర్ణాకృతి

sampath_Ebooks

sampath_Ebooks

sampath_Ebooks


గిన 'సంగీతి'లో థేరవాదులు (స్థవిరవాదులు) అల్పసంఖ్యాకులుగ నుండిరి. మహాస్థవిరశాఖకు చెందిన విభజ్యవాదసంప్రదాయమువా రొక్కరును ఆసంగీతియందుఁ గానఁబడరైరి. మఱియొకవిశేష మేమన, ముప్పదిపర్యాయ మీసంగీతియందే మహాయాన మను వేఱొకసంప్రదాయమునకుఁ జెందినయుత్సాహశీలురు కానవచ్చిరి. కాని యీ 'సంగీతి'లో వీరిసంఖ్య చాల తక్కువగ నుండుటవల్ల అక్కడ వీరు లెక్కలోనికి రారైరి. నాగార్జునాచార్యులవారి నాయకత్వమునను, ఆయనశిష్యుఁ డయిన ఆర్యదేవుని నాయకత్వమునను ఎప్పుడో క్రీస్తుశకము రెండవశతాబ్ది తరువాతను గాని వీరికి పేరుప్రతిష్ఠలును, ప్రాముఖ్యమును రాలేదు. నాగార్జునాచార్యుఁడును, ఆర్యదేవుఁడును బౌద్ధతర్కమున 'శూన్యవాద' మని పేరుపడినయొకగొప్ప తత్త్వవాదమునకు పట్టుఁగొమ్మలు. కాని యీవాదము జనాదరపాత్రము కాలేదు. అతిస్వల్పకాలముననే నాగార్జునాచార్యులవారి కొకటిరెండు తరములకుఁ దరువాత మైత్రేయనాథుఁ డనుపేరుగల గొప్పబౌద్ధాచార్యుఁడు 'శూన్యవాదము'న 'విజ్ఞాన'మను తత్త్వవిశేషమును జేర్చి విజ్ఞానవాదమును స్థాపించెను. ఈవిజ్ఞానవాదమునకే తరువాతి కాలమున 'యోగాచార' మని పేరు కలిగినది. బౌద్ధవాఙ్మయమును బట్టి చూడఁగా విజ్ఞానవాదులకు, శూన్యవాదులకును పెక్కుశతాబ్దుల కాలము వివాదము జరుగుచుండినట్లు తెలియుచున్నది. బౌద్ధధర్మావలంబకుఁ డయిన సామాన్యమానవుఁ డీవిజ్ఞానవాదముతోఁగూడ సంతృప్తి పొందలేదు. అందువలన క్రీస్తుశకము ఎనిమిదవశతాబ్దియందు విజ్ఞానవాదమునకు బౌద్ధులు మఱియొక తత్త్వవిశేషమును జేర్చిరి. ఈ నూతనసంప్రదాయమునకు 'మహాసుఖవాద' మని పేరు. ఇట్లు బుద్ధుఁడు మొదట కనిపట్టిన ప్రాథమికనిర్వాణపంథకుఁ బిదప క్రమముగా మూఁడు తత్త్వవిశేషములు చేరి యవి పైని చెప్పిన 'శూన్య', 'విజ్ఞాన', 'మహాసుఖవాదము'లుగ పరిణమించినది.

బౌద్ధతత్త్వవాఙ్మయమున నాలుగు సంప్రదాయములు కలవు. అవి యేవన, (౧) వైభాషిక, (౨) సౌత్రాంతిక, (౩) యోగాచార, (౪) మాధ్యమికములు. ఈనాలుగుసంప్రదాయములును శ్రావక, ప్రత్యేక, మహాయానము లనుమూఁడుపంథలలో అంతర్గత మయి యున్నవి. శ్రావక, ప్రత్యేకయానములకు 'హీనయాన' మని పేరు. వైభాషికసంప్రదాయము శ్రావక, ప్రత్యేకయానములను వివరించును. మహాయానము రెండువిధములు: (౧) పారమితనయము, (౨) మంత్రనయము. యోగాచారము కాని, సౌత్రాంతికము కాని, మాధ్యమికము కాని పారమితనయమును వివరించును; కాని, మాధ్యమిక, యోగాచారములే మంత్రనయమును వివరించును. ఇందు శూన్య, విజ్ఞానవాదములు వివరింపఁబడును.

హీనయానమునకును, మహాయానమునకును లక్ష్యములోఁ గొంత భేదము కలదు. అది యే దన, హీనయానవాది కొంతవఱకు స్వార్థపరుఁడు. అతఁడు కేవలము తననిర్వాణముకొఱకే ప్రయత్నించును. మహాయానవాది యట్లు కాదు. విశ్వప్రేమ యితనియాదర్శము. మనుష్యుల నెల్లర నుద్ధరించుట కితఁడు ప్రయత్నించును.


హీనయానవాదిమతమున బుద్ధుఁడు ధర్మప్రవర్తకుఁడు. అందువల్ల అతఁడు ధర్మప్రవర్తకుఁడయిన అలౌకికపురుషుఁడు. బౌద్ధత్రిరత్నములను బుద్ధ, ధర్మ, సంఘక్రమమున హీనయానవాది పూజించును, అనఁగా, మొదట నాతఁడు పూజించునది ధర్మప్రవర్తకుని, రెండవది ధర్మమును, మూఁడవది సంఘమును. మహాయానవాది మత మిది కాదు. అతనియుద్దేశమున బుద్ధుఁడు శాశ్వతుఁడు. అతఁడు మారబాధితులైన ప్రజలదుఃఖమును నివారింపఁజేయుట కప్పుడప్పుడు భూమియం దవతరించుచుండును (బౌద్ధులకు మారుఁ డనఁగా కలిపురుషునివంటివాఁడు). మహాయానవాది బౌద్ధత్రిరత్నములను ధర్మ, బుద్ధ, సంఘక్రమమున పూజించి, మొట్టమొదట ధర్మమునకు, నటుపిదప ధర్మప్రవర్తకుఁ డగు బుద్ధునికిని ప్రాధాన్య మిచ్చును. ఈధర్మమునకే మహాయానవాది 'ప్రజ్ఞ' యని పేరుపెట్టి, అది శాశ్వత మనియు, బౌద్ధమతమున సాధింపవలసిన పరమపురుషార్థ మనియు, బుద్ధుఁడు ఆప్రజ్ఞను సాధించుటలో ఒక సాధన మనియుఁ జెప్పును. ధర్మమునకు ప్రజ్ఞ యని పేరిడినట్లే యతఁడు బుద్ధునికి ఉపాయ మని పేరు పెట్టెను.

మహాసుఖవాదమునుండి తరువాతికాలమున వజ్రయాన మని పేరొందిన యొకనూతనసంఘ యేర్పడినది. ఈపంథ బహువిధభావములకు లక్ష్యముగ పెక్కురకముల విగ్రహములను సృష్టించినది. ఈమహాసుఖవాదములో మహాసుఖ మనఁబడు లక్ష్యమును కరుణాస్వరూపమయిన శక్తిసాహాయ్యము లేనిదే పొందఁజాలరు.

మాధ్యమికులమతమున శూన్య మనఁగా అభావముకాదు. అయితే వారు దానిని ఒక అతీతస్థితియో (Transcendental stage) కాని నాశము (Annihilation) మాత్రము కాదందురు. కాని యది సత్తో (Existant), అసత్తో (Non-existant), లేదా యీరెంటిసమవాయమో (Combination), లేదా యీరెంటినిరాసమో (Negation) నిరూపింప శక్యముకానిది. 'శూన్యము'ను సరిగా అర్థము చేసికొనుటవలననే తరువాతికాలమున బౌద్ధులవిగ్రహశిల్పము వర్ధిల్లినది. స్వస్త్రీశక్తియుక్తదేవతాత్మకమయిన వజ్రయానము శూన్య, కరుణాద్వైధీభావములపరిణామమే. వజ్రయానమున దేవతావిగ్రహములు, శక్తి విగ్రహములు అనేకములు వెలసి వానికి పూజ యేర్పడినది.

పూర్వోక్తపంథలవారి కందఱకును అమరావతియందు మహాచైత్యక్షేత్రసమీపమున సంఘారామము లనేకములు వెలసినవి. ఈ ప్రక్కపుటయందు వేసిన బౌద్ధమతసంప్రదాయవృక్షమువలన బౌద్ధధర్మ మెన్నివిధములుగ విడిపోయినదియుఁ దెలియఁగలదు.

sampath_Ebooks




బుద్ధధర్మము మహాస్థవిరవాద మని, మహాసాంఘికవాద మని రెండు తెఱఁగు లయినది. మరల మహాసాంఘికవాదము చైత్యవాద మని, ప్రజ్ఞప్తివాద మని రెండు ముఖ్యవిభాగము లయినది. అందు చైత్యవాదము విశేషముగా అంధకులది (ఆంధ్రులది). ఈచైత్యవాదము వైపుల్య మని, పూర్వశైల మని, అపర (అవర) శైల మని, రాజగిరిక మని, సిద్ధార్థక మని అయిదుసంప్రదాయములుగ విడిపోయి, కొంత కాలమునకుఁ బిదప నాగార్జునాచార్య, ఆర్యదేవ, అసంగాదుల నాయకత్వమున మహాయానముగాఁ బరిణమించినది. ఈసంప్రదాయములవా రందఱును ధాన్యకటకమును దమ ప్రధానస్థానమును గావించుకొని యచట వేలువేలు సంఘారామములలో నివసించుచుండిరి. మహాయానపక్షావలంబకులకువలెనే, ధాన్యకటకము మహాబౌద్ధక్షేత్రమగుటచేత, హీనయానపక్షమువారికిఁగూడ నక్కడ స్థాన ముండినట్లు అమరావతీస్తూప శిల్పములను బట్టియు, యువాన్‌చాంగ్ వ్రాసియుంచిన వృత్తాంతములనుబట్టియు తెలియుచున్నది.

అమరావతీస్తూప శాసనములనుబట్టి యిచ్చటి ప్రధానచైత్యము చైత్యకనికాయముయొక్క బుద్ధమహాచైత్య మని తెలియుచున్నది. అమరావతీస్తూపశిల్పచిత్రములను బరిశీలించినచో, మహాయానము కడపటిపరిణామమునఁ గన్పట్టు అవలోకితేశ్వరుఁడు, తార, మంజుశ్రీ మొదలగు ప్రధానదేవతావిగ్రహము లిచటఁ గానరావు. అందువల్ల క్రీస్తుశకము నాలుగవ, యైదవశతాబ్దులవఱకు మహాయానము పొందిన పరిణామముమాత్రమే యమరావతీశిల్పచిత్రములవల్ల సూచిత మగుచున్నది. ఇచటి శిల్పములను బరిశీలించినచో ఇచట నెప్పుడును వజ్రయానము వర్ధిల్లిన దనుట కవకాశము కనఁబడదు.


మహాచైత్యము :—ఈ మహాచైత్యము సరిగా నెప్పుడిచట స్థాపిత మయినదో తెలియదు కాని యిచటిశిల్పచిత్రములలో అండోపరితలమున కలంకారభూతములయినవికొన్ని — వానిపనివానితనమును, ఇతర లక్షణములను ననుసరించి చూచినయెడల — క్రీస్తుపూర్వము రెండు వందలనాఁటివిగఁ దలంపవచ్చును.

స్తూపాధిష్ఠానము (Base of the stupa) రమారమి ౧౩౮ అడుగులవ్యాసముకలది. అండము (Dome) ఎత్తు తొంబదియడుగులకంటెఁ బైని కలదు. మొత్తము స్తూపమంతటియెత్తు రమారమి నూఱు అడుగులకంటె పైఁగానుండును. జగ్గయ్యపేటలోఁగల చిన్న స్తూపమునే లక్ష్యముగఁ దీసికొని ఈమహాచైత్యమును నిర్మించియుండవచ్చును. మొదట నొకతెర మట్టి పోసి దానిని దిమ్మిసకొట్టి, పిదప మరల నొకకేటుమట్టి పోసి మరల దిమ్మిసకొట్టి యిట్లే కేట్లుకేట్లుగ పోసిన మట్టితో స్తూపాకృతి నేర్పరచిరి. ఇట్లు నేర్పిరచినమట్టిస్తూపము చుట్టును పైని ఇటికలను పేర్చి యతికిరి. అటువెనుక నీ యిటికలమీఁద చిత్రశోభితములయిన పాలరాల నతికించిరి. ఈరీతిని స్తూప మంత రొభాగమున వట్టి మట్టితో గట్టిగ నుండి పైకిమాత్రము శిలాఫలకములతోఁ గప్పఁబడియుండును. స్తూపరూపమును నిట్లు కేట్లుకేట్లుగ మట్టిపోసి-నేర్చి నిర్మించియుండవచ్చినుగాని కొత్తబుద్ధిను కనుమకొలఁదియు అండము వికారపము చెందకుండునే కాక అంతటియెత్తుగ స్తూపమును నిర్మించుటకును, శిలాఫలకములను ఎత్తునకుఁ గొనిపోవుటకునుగూడ వీలుండకపోయి కాదు. ఒక్కసీటిముక్కయునను లోపలికిఁ బోనంతకట్టు దిట్టముగ నుండులాగున శిలాఫలకముల నొండొంటితో దక్కనిపస్థితిని స్తూపోపరితలమున నతికించినారు. అండముపైని గళమును, దానిపయిని హర్మికయును, దానిపైని ఛత్రము నుండినవి కాని వీనిపరిమాణములు తెలియరావు. అమరావతీస్తూపమున నెన్నిఛత్రము లుండినవో మనకు తెలియదు కాని ప్రాయికముగ మూఁడుండి యుండవచ్చును; ఎందువల్ల ననఁగా, సరియైన స్తూపమును నిర్మింపవలె ననిన మూఁడు ఛత్రము లుండవలెను. అమరావతియందలి స్తూపము నిట్టి సనాతన సంప్రదాయము ననుసరించి కట్టినట్లు చెప్పుదురు. ఈ స్తూపము చుట్టు నాగార్జునాచార్యులవారు కట్టించినదని చెప్పఁబడు నొకవిచిత్రమయినశిలాప్రాకారము కలదు (బర్గెస్, అమరావతీస్తూపము, పుటము, ౮).

అండముదిగువభాగమునకు వేదిక యని పేరు. ఈవేదికయుపరితలమును గప్పియుండు శిలాఫలకములలో చాల వానిమీఁద చైత్యచిత్రములు చెక్కియుండుటచేత ఈస్తూపమునుగుఱించి యిదివఱలో వ్రాసినరచయితలు వీనికి చైత్యశిలాఫలకము లని పేరిడినారు. కడుశోభాయమానముగ నుండినదినములయందలి అమరావతీచైత్యాకృతినే ప్రాయికముగ నీచైత్యశిలాఫలకములమీఁద చెక్కియుండుట చాల అదృష్టము కదా! ఏల యన, కాలముయొక్క రాటుపోటులవలన విధ్వంసము చెందిన అమరావతీస్తూపముయొక్క సరియైన స్వరూపమును దెలిసికొనుటకు మన కిపుడీచైత్యశిలాఫలకములే గతియగుచున్నవి. ఇట్టి చైత్యశిలాఫలకములలో నుత్తమమయిన దొకటి మద్రాసు చిత్రవస్తుప్రదర్శనశాల (Museum) యందున్నది. ఇట్టిశిలాఫలకములమందము రకరకములుగ నుండును; వీనిమందము అడుగు రెండంగుళములు మొదలు అడుగు నాలుగంగుళములవఱకు నుండును. వేదికయొత్తు అఱడుగులు; కావున దానిని గప్పియుండు శిలాఫలకములయెత్తును అంతే యుండును. నాలుగుదిక్కులందును ఈవేదిక ప్రతిద్వారమునకు

sampath_Ebooks






క. వెలుపలివైపు

౨. ప్రాకారరేఖా చిత్రములు (పటము ౨౧)

ఖ. లోపలివైపు


sampath_Ebooks



3. అధిష్ఠానచిత్రములు (పటము ౬)

sampath_Ebooks


# అమరావతీ స్తూపము



౪. ఊర్ధ్వపటచిత్రములు ( పటము ౮ )
( సంఖ్యలిమ్మై ఫ )

sampath_Ebooks





౫. ఊర్ధ్వపటచిత్రములు (పటము ౮)
(లోపలివైపు)

నెదురుగా నరుఁగువలె ముందటి కుంకునట్లు తీర్పఁబడినది. ప్రతిద్వారమునకు నెదురుగా ఈ ముంగటికి వచ్చిన భాగములమీఁద నైదేసి స్తంభముల చొప్పున నాలుగుదిక్కులందును గలసి యిరువది స్తంభము లుండును. వీనికి ‘ఆయకకంభములు’ (ఆర్యకకంభములు – పూజనీయ స్తంభములు) అని పేరు. స్తంభాధిష్ఠిత భాగములతోఁ గలసి వేదికచుట్టుకొలత ౫.౨౧ అడుగులు; ఆభాగములను మినహాయించినచో, దానిచుట్టుకొలత ౪౭౦ అడుగులు. ఇంత లెక్కయు నది యెడతెగని శిల్పచిత్రములతో శోభిల్లుచుండును.

వేదిక నంటియుండు తోట అంచుచుట్టుకొలత ౪౩౫ అడుగులు. హర్మ్యశాలకుఁ గల అండోపరితల మంతయు రకరకములయిన సుందరములగు శిల్పచిత్రములతో నలరారుచుండును. పూర్ణిమామావాస్యోత్సవములకును, ఇతర బౌద్ధోత్సవములకును ఈచైత్యమును ప్రాయికముగ జెండాలతోను, పుష్పతోరణములతోను, దీపసహస్రముతోను అలంకరించువారు. రాత్రులయందు దీనిని జూచినయెడల నిది దీపాలదిన్నెవలె కన్పడుచుండెడిది. ఇందువల్లనే కావచ్చు నీస్తూపమునకు ‘దీపాలదిన్నె’ యని పేరువచ్చినది. వేదికను గప్పియుండు చైత్యశిలాఫలకము లొక ప్రాకారమునకు సంబంధించిన వనియు, ఇక్కడనే యింకొక పెద్దప్రాకార ముండి యుండవలె నని యూహించి, యది వెలుపలిప్రాకార మనియు, నిది లోపలిప్రాకార మనియు ఈ యమరావతీస్తూపమునుగూర్చి యిదివఱలో వ్రాసినపండితులు కొందఱు వ్యవహరించియున్నారు. కాని యిటీవలి పరిశోధనల ననుసరించి చూడఁగా నీవ్యవహారము తప్పని చెప్పవలసియున్నది. అంతేకాక, బౌద్ధవాస్తుకళయందు ఏస్తూపమునకును రెండుప్రాకారములు కానరావు. ఈకారణము ననుసరించికూడ ‘లోపలి ప్రాకార’ మనువ్యవహారము తప్పనియు, లోపలిప్రాకార మను వ్యవహారము కేవలము వేదికను గప్పియుండు చైత్యశిలాఫలకములకే వర్తించు ననియు తేలినది.

వెలుపలిప్రాకారము :— ఈ స్తూపప్రాకారమునకు రెండువయిపుల నందమయిన శిల్పచిత్రములు కలవు. ఈ ప్రాకారరేఖ చాల గొప్పది. ఇందలి శిలాఫలకములమీఁద చెక్కినశిల్పచిత్రములు కొలఁదియైనను అవి ఆశ్చర్యమును గొలుపును, మనోహరములుగ నున్నవి. ఈ కారణములవలన ఈస్తూపమువెలుపలి ప్రాకారమునకు దీటువచ్చునది హిందూదేశమున మఱియెచ్చటను గానరా దని పరిశోధకపండితుల యభిప్రాయము (చూడుఁడు, ప్రాకారరేఖాచిత్రములు, పటము, ౫).

వేఱువేఱు బౌద్ధక్షేత్రములలోఁగల ప్రాకారములవలెనే యీ స్తూపప్రాకారముకూడ బౌద్ధులయందు సంప్రదాయసిద్ధముగ వచ్చుచుండినపద్ధతినే యనుసరించి నిర్మింపఁబడినది. అది యెట్లనిన, సాధారణముగ నిట్టి ప్రాకారరేఖానిర్మాణములయందు శిలామయనిర్మాణములయందు కానవచ్చు ద్రవలంబించుపద్ధతి కాక, దారుమయనిర్మాణములయందు వర్ధకు లవలంబించుపద్ధతి ననుసరించుట వాడుకగఁ గన్పట్టును. వెలుపలివైపున నుండి చూచినచో ప్రాకారము నెత్తు రమారమి పదుమూఁడడుగులు; లోపల స్తూపమునకు, నీప్రాకారమునకును నడుమ నుండు ప్రదక్షిణమార్గము ఎత్తుచేయఁబడుటచేత లోపలనుండి చూచినచో ప్రాకారము నెత్తు పదియడుగులు మాత్రమే. చుట్టు నీప్రాకారము నిలువురాతిస్తంభములతోను, రెండేసి స్తంభములకు నడుమ, వానిలో అడ్డముగాఁ జొనిపి కలిపిన మూఁడేసి రాతి అడ్డుకమ్ములతోను నేర్పడినది. నిలువురాతి స్తంభములలో ప్రతిదానికి నెడనెడ మూఁడు తొలలు కొట్టి అడ్డుకమ్ముల చివరలు కుసులుగతీర్చి వానిని స్తంభపుతొలలయందుఁ దూర్చి యతికినారు. శాసనములం దీ నిలువురాతి స్తంభములు ఊర్ధ్వపటము లనియు, అడ్డుకమ్ములు సూచులనియు పేర్కొనఁబడినవి. నిలువురాతి స్తంభ మొక్కొక్కటి తొమ్మిదడుగుల యొకయంగుళ మెత్తుగ నుండెను. ఒక్కొక్కయడ్డుకమ్మిపొడవు అ 3. అం ౬ లు. స్తంభాగ్రములు కుసులుగ తీర్పఁబడినవి. ఈకుసులు స్తంభములమీఁద మకుటమువలె పఱుపఁబడిన రాతిమూలములలో వాని యడుగు భాగమునఁ దొలిచిన తొలలోఁ దూర్చి బిగింపఁబడినవి. ఈ రాతిమూలములతో నేర్పడిన మకుట మూర్ధ్వపటములకు పైని ఉష్ణీషము (తలపాగ) వలె నుండుట వలన నది ఉష్ణీష మని శాసనములందు పేర్కొనఁబడినది. ఈమూలములలో నొక్కొకటి చాల పొడవును వెడల్పును గలది. ఈ రాతిమూలము లొక్కొక్కదానియెత్తు రెండడుగుల తొమ్మిదంగుళములు. ప్రాకారరేఖయందు దిగువభాగమునందు అడుగు ఎత్తున నొక యిటికగోడ కలదు. ప్రాకారరేఖలోపలిభాగమున ప్రదక్షిణమార్గ మెత్తుగ నుండుటచేత ఈగోడ కానరాదు; వెలుపటమాత్రమే కనఁబడును. ఈగోడ కలంకారముగ వెలుపలితట్టున ప్రక్కలందు బొమ్మలుచెక్కిన రాతిపలకల నతికినారు. ఈపలకలమీఁద జంతువులయొక్క, బాలురయొక్క చిత్రములు నవ్వుపుట్టించునట్టిరీతులలోఁ జెక్కఁబడినవి. ప్రాకారరేఖయందలి యీ భాగమునకు అధిష్ఠాన (Plinth) మని పేరు (చూడుఁడు, అధిష్ఠానచిత్రములు, పటము, ౬). బొమ్మలుచెక్కిన కొన్ని శిలాఫలకములను ఈయధిష్ఠానమునకు సరిపడినట్లు మలిచి కోసివేసియుండుటచేత నవి పూర్వము మఱొక మందిరయొక్క ప్రాకారరేఖయందలి యుష్ణీషమునందలి వయి యుండు ననియు, ఏకారణముననో యది నశించినతరువాతనో యేమో వాని నధిష్ఠానశిలాఫలకములుగ మార్చినా రనియు పురాతత్త్వవిదులు చెప్పుదురు.

ద్వారములు :— ఈప్రాకారరేఖ వృత్తాకారముగ నున్నదని యిదివఱకే తెలుపఁబడినది. అది నాలుగువైపులందు నడిమిభాగమున ముందునకు పొడుచుకొనివచ్చినట్లు తీర్పఁబడినది. నాలుగువైపులందును పొడుచుకొనివచ్చిన యీభాగము లొండొంటికి నడుమఁగల మడుపులలో ఒక్కొకభాగమున ఇరువదిరెండేసిచొప్పున నిలువురాతిస్తంభము లున్నవి. రెండేసిస్తంభములకు నడుమ మూఁడేసిచొప్పున ఒక్కొక్కమడుపునందు అఱువదిమూఁడు సూచు లున్నవి. ఒక్కొకవైపున ముందునకు చొచ్చుకొనివచ్చిన ద్వారరేఖ ఉభయపార్శ్వములందుఁగల మూఁడేసి నిలువురాతిస్తంభములతో నేర్పడినది. ఒక్కొక ప్రక్క నీస్తంభములనడుమ మొత్తముమీఁద పండ్రెండు

sampath_Ebooks

సూచు లున్నవి. ఈరీతి కేర్పడిన యొక్కొక్కద్వారమువెడల్పు ఇరువదియాఱడుగులు; పొడవు పదునాఱడుగులు. ఈప్రాకారద్వార స్తంభములమీఁద వెనుకటికాళ్లమీఁద కూర్చుండియున్నట్లు చెక్కిన సింహప్రతిమలు కలవు ( చూడుఁడు, పటము, ౭ ).

మొత్తముమీఁద నీప్రాకారరేఖయందు ౧౩౬ ఊర్ధ్వపటములును, ౩౪౮ సూచులును, ౮౦౩ అడుగుల పొడవుగల ఉష్ణీషమును ఉండెను.[1] ఈప్రాకారరేఖ వెలుపలితట్టునను, లోపలితట్టునను గూడ శిల్పచిత్రశోభిత మయియున్నది. వెలుపలివైపునఁ గల బొమ్మలు ఆచారసిద్ధ మయినరీతిని చెక్కఁబడినవి; చిత్రములయందలి కల్పనా పద్ధతి ఒకవిధముగ నున్నది. వెలుపలివైపునను, లోపలివైపునను ప్రతిస్తంభము మధ్యభాగమునందును దారుమయప్రాకారమునఁ గాన వచ్చు మేకుతలలను స్మరణకుఁ దెచ్చునట్లు వృత్తములు తీర్పఁబడినవి. ఈ వృత్తములందు పద్మచిత్రములను చెక్కినారు. స్తంభాగ్రభాగము నందును అధోభాగమునందును అర్ధవృత్తమునకు మించియుండు పద్మ చిత్రములు కలవు. మధ్యవృత్తమునకును, ఊర్ధ్వాధోవృత్తములకును నడిమిభాగములు మూఁడేసి నిలువుపట్టికలుగ విభాగింపఁబడినవి. ఈ పట్టికలందు రకరకముల జంతుచిత్రములు, మనుష్యచిత్రములు, పుష్పచిత్రములు మొదలైనవి కానఁబడును. స్తంభాగ్రభాగమున నుండు నర్ధవృత్తముమీఁదను, దిగువభాగమున నుండు నర్ధవృత్తము దిగువను కొంచెము వెడలుపయిన అడ్డుపట్టికలు (Horizontal Bands) కలవు. అందు సాధారణముగ పుష్పచిత్రములు, జంతు చిత్రములు కానవచ్చును.

స్తంభము వెలుపలివైపునం దెగువఁగల వెడలుపయిన అడ్డు పట్టికయందు మధ్యభాగమున తఱచుగా స్తూపపుబొమ్మ కనఁబడును. స్తూపమున కుభయపార్శ్వములయందును దానిని పూజించుటకు వచ్చిన యేనుఁగుబొమ్మలు చెక్కియున్నవి. వెలుపలివైపునఁ గల స్తంభపు నిలువుపట్టికలలో సాధారణముగ ఆచారసిద్ధ మయిన శిల్పచిత్రము లుండును. స్తంభమధ్యభాగమునం దుండు పద్మవృత్తమున కెగువఁ గల నిలువుపట్టికలందు సాధారణముగ నాగము, దాగోబా, బుద్ధుఁడు, పూజచేయువారు మొదలయిన ప్రతిమలును, దిగువ నిలువుపట్టికలలో నాట్యముచేయు కుబ్జ, యక్షగణ చిత్రములును చెక్కియున్నవి. లోపలివైపునఁ గల వృత్తములందును, ఆవృత్తము లొండొంటికి నడుమఁగల నిలువుపట్టికలందును రకరకములయిన చిత్రములు కలవు. వీనిలోఁ జాలవఱకు బుద్ధజీవితమునందలి గాథలకును, జాతకకథలకును, బౌద్ధమతసంప్రదాయ చరిత్రాత్మకము లయిన కథలకును సంబంధించినవి. ఎడనెడ గార్హ్యక చిత్రములుకూడఁ గానఁబడును. (చూడుఁడు, ఊర్ధ్వపటచిత్రములు, పటము, ౮ ).

అడ్డుకమ్ములు :— ఇవి సూచికపనిని స్ఫురింపఁజేయున వగుట చేత వీనికి సూచులని పేరు కలిగినది. ఈసూచులు వృత్తాంచితములు. ఒక్కొక్కవృత్తమువ్యాసము అ ౩ లు. వెలుపలివైపునను లోపలి వైపున నూర్ధ్వాధోసూచికలందును గల వృత్తములందు పద్మములు చెక్కఁ బడినవి ( చూడుఁడు, పటము ౯ ). నడిమిసూచియందలి లోపలి వైపునఁగల వృత్తమునందు మాత్రము బుద్ధజీవితకథలును, జాతక కథలును చెక్కినారు ( చూడుఁడు, పటము, ౧౦ ).


ఉష్ణీషము :— ఉష్ణీషము పైభాగమున గుండ్రనదేలియుం డును. దానికి లోపలివైపున, వెలుపలివైపున శిల్పచిత్రము లనేక ములు కలవు. వెలుపలివైపున నది తరంగాకృతి కల పొడవయిన పుష్పదండము నెడనెడ మనుష్యులు మోయుచున్నట్లు చిత్రితమయి యున్నది. తరంగ ముచ్చదశ నందినపుడు దానిని దిగువ మనుష్యులు మోయుచున్నట్టి చిత్రములును, పతనము చెందినపుడు దానిమీఁద దాగోబా, బోధివృక్షము, ధర్మచక్రము, త్రిరత్నములు, నాగములు, యక్షులు -వీని చిత్రములును చెక్కఁబడినవి. లోపలివైపున జాతక కథలను, బౌద్ధసంప్రదాయచరితములను, బుద్ధజీవితకథలను చెక్కి నారు ( చూడుఁడు, ఉష్ణీషచిత్రములు, పటము, ౧౦).

వేదిక :— అమరావతీస్తూప వేదిక యెత్తు ఆఱడుగు లని యిది వఱకే చెప్పఁబడినది. ఈవేదిక చుట్టుకొలత ౫౨౧ అడుగులు. దీని లోపలివైపుభాగము నిర్మాణమునందుఁ బడిపోవుటచేత నిది వెలుపలి వైపునమాత్రమే చిత్రిత మయినది. ప్రాకారరేఖయందును, దీనియం దును మొత్తము చిత్రితమయినభాగము సరిసమానమే యయినను వేదిక యందలి చిత్రరంగములు ప్రాకారమునందలివానికన్న మిక్కిలి చిన్నవి. కాని ప్రాకారపురాతికంటె వేదికరాయి మిక్కిలి మెత్త నయిన దగుటచేత వేదికయందలి ప్రతిమాశిల్పము ప్రాకారమునందలి దానికంటె అతిప్రశస్త మయినది. వేదికను గప్పియుండు నీచైత్యశిలా ఫలకములమీఁద సర్వసాధారణముగ దాగోబాలును, నాగములును చెక్కియున్నవి. ఈ దాగోబాలు చెక్కిన పలకలకు కుడి, యెడమ వైపులందు విడిరాలమీఁదఁ జెక్కిన స్తంభము లున్నవి. ఈ విడి స్తంభములమీఁద బోధివృక్షము, ధర్మచక్రప్రవర్తనము, మారప్రలో భనము మొదలయిన చిత్రము లుండును ( చూడుఁడు, విడిస్తంభము, పటము, ౧౧ ) దాగోబాలును, స్తంభములును విడివిడిశిలాఫలకముల మీఁదఁ గాక యొక్కొకప్పుడు ఒకటే ఫలకముమీఁద చెక్కి యుండుటయుఁ గలదు. ఈ వేదికాచైత్యశిలాఫలకములకుమీఁద నంచు కట్టినట్లు చిత్రాలంకృతమయిన యొకపట్టిక (Frieze) యుండును. వేఱువేఱు రాతిపలకలను కూర్చి యీయంచును దీర్చెదరు. కొన్ని కొన్ని సందర్భములలో ఒకటే రాతిఫలకముమీఁదను ధర్మచక్ర స్తంభమును, దాగోబాయును, వీని కెగువను చిత్రాంచిత మయిన యంచునుగూడ నుండుట కలదు. మద్రాసు చిత్రవస్తుప్రదర్శన శాలయందుఁ గల చైత్యశిలాఫలక మీతరగతికి చెందినది ( చూడుఁడు, పటము, ౧౨).

1. Burgess' The Buddhist Stupas of Amaravati and Jaggayyapeta, p. 25.

sampath_Ebooks





౨. సూచీచిత్రములు ( పటము ౭ )
( వెలుపలివైపు )


sampath_Ebooks

అమరావతీస్తూపము



sampath_Ebooks


# అమరావతీస్తూపము



౮. ఉష్ణీషచిత్రములు ( పటము ౧౨ )
( వెలుపలి వైపు )

sampath_Ebooks





౮. ఉష్ణీషచిత్రములు ( పటము ౧౦ )
( లోపలివైపు )

sampath_Ebooks



ఈ చైత్యశిలాఫలకములకు తలకట్టుగ నుండు చిత్రశోభితమయిన పూర్వోక్తమగు నా యంచును దీర్చుటలో శిల్పులు నాగుమయ ప్రాకారము నాదర్శముగఁ దీసికొని రని కను ప్రాచీనములగు నంచులరీతి ననుసరించి చెప్పుట కవకాశము కలదు. తొలుదొలుత తీర్చిన యట్టి తీర్పులలో అంచు నష్టముగ నయిదువిభాగములు చేసి యగ్రమునందుఁ గల మొదటివిభాగమున పుష్పకల్పనలును, వెలుపుగనుండు రెండవభాగమున ప్రాకారాకృతిని, మూఁడవభాగమున ప్రయాణమయిపోవుచున్నట్లు చిత్రింపఁబడిన వరాహమును, సింహమును, ఉష్ట్రము, వృషభము మొదలయిన జంతువుల చిత్రములను చెక్కినారు. రెండవవిభాగమున చిత్రింపఁబడుచువచ్చిన ప్రాకారచిత్రమున మొదటికాలపు తీర్పులకును, తరువాతికాలపు తీర్పులకును భేదము కలదు. మొదటికాలపుతీర్పులందు ఈ ప్రాకారచిత్రము చిత్రాలంకారరహితముగఁ గన్పట్టును. తరువాతికాలపు తీర్పులందు ఈ ప్రాకారమునందలి సూచీవృత్తము లొండొంటికి నడుమనున్న స్థలమున మనుష్యప్రతిమలు మొదలయిన వేలువేలు రకముల చిత్రరంగములను దీర్చినారు. ఎగువను, దిగువను గల ప్రతి సూచీవృత్తమునందును పద్మములను జెక్కినారు; కాని ప్రతి నడిమి సూచీవృత్తమును గాత్రము పద్మముగ తీర్పక అప్పటియందలి మానవజీవితమునకు సంబంధించిన చిత్రరంగములను చెక్కినారు. ఈసూచీవృత్తము లొక్కొక్కటి రెండు మూఁడంగుళముల వ్యాసరేఖ గలవి. ఇంతటి స్వల్పస్థలమునందు ఆకాలపు బౌద్ధశిల్పులు చక్కఁగ మనోహరములయిన మనుష్యప్రతిమలను చెక్కినా రనిన వారి కళాకౌశల మెంతటిదో యూహించుకోవచ్చును. నాలుగవభాగమును చిత్రించుటలో నొక చిత్రము కలదు. ఈభాగ మంతయు దారుశిల్పపద్ధతిని చిత్రిత మయినట్లు కన్పట్టును. ఈభాగమున చతురస్రముగ నుండు రంధ్రము లొకదాని కొకటి సమానదూరములం దుండునట్లు చేసినారు. తొలుదొలుత తీర్చిన యంచులం దీభాగమున రంధ్రమునకు రంధ్రమునకు నడుమనుండు భాగమునం దేచిత్రములును చెక్కకుండ వదలివేసినారు. తరువాతికాలమునఁ దీర్చిన యంచులను బరిశీలించినచో నా రంధ్రాంతరస్థలముల నుబ్బెత్తుగ సింహశీర్షములు చెక్కుటకు విడిచివేసినట్లు స్పష్టమగును. అయిదవ దగు నట్టడుగుభాగము బొమ్మలు చెక్కు నిమిత్తము గాక శాసనములు చెక్కుట కుద్దేశింపఁబడుటచేత నది చిత్రరహితముగ నున్నది. ఈపట్టికయందు చెక్కఁబడు శాసనములు సాధారణముగ నట్టి యలంకారఫలకములను దానముగ నొసంగిన దానపతులనుగూర్చి తెలుపును. ఈ శాసనములందు చిత్రశోభితములయిన యట్టి యంచులు 'పటము' లని పేర్కొనఁబడినవి (మొదటికాలపు 'పటము'నకు చూడుఁడు, పటము, ౧౩; తరువాతికాలపు 'పటము'నకు, చూడుఁడు, పటము, ౧౪).

'ఆయకకంభములు':— నాలుగువైపులందును, నాలుగు ద్వారములకు నెదురుగా నరుఁగులవలె ముందున నుండిన వేదికాభాగముల మీఁద నొక్కొక్కవైపున నయిదేసి చొప్పున నాలుగువైపులఁ గలసి యిరువది స్తంభము లుండె నని, వీనికి 'ఆయకకంభము' లని పేరని యిదివరకె తెలుపఁబడినది. ఒక్కొక్కదిక్కున నిట్లయిదేసి స్తంభము లుండుట ఆంధ్రదేశస్తూపములందే కానవచ్చు విశిష్టలక్షణము. ఈ విధమున స్తంభములను బ్రతిష్ఠింపవలె ననుభావము ప్రాయికముగ అమరావతీస్తూపమున కింకను పూర్వకాలముననే నిర్మింపఁబడిన యుత్తరహిందూస్థానమునందలి సాంచీ, భార్హూత్ మొదలగు స్తూపములనుబట్టి కలిగియుండవచ్చును. రాతిపలకలమీఁదఁ జెక్కిన భార్హూతు స్తూపాకృతులను గాంచినయెడల స్తూపవేదికమీఁద నుభయపార్శ్వములయందును అలంకారముగ నున్న కొన్ని ధ్వజములు చూడనగును. ఏతాదృశధ్వజభావమును గైకొని యాంధ్రశిల్పవిదులు అట్టి ధ్వజములను గౌరవాలంకారార్థముగమాత్రమే కాక విశేషప్రయోజనము నిమిత్తముకూడ నుపయోగించియున్నారు. ఉపాసకులకు స్తూపసందర్శనమున బుద్ధనిర్వాణము స్ఫురించునట్లే ఈ స్తంభసందర్శనమున బుద్ధజీవితమునందలి ప్రధానవిశేషములు స్ఫురించునట్లు చేసినారు. ఈ యైదు స్తంభములను పంచకల్యాణము లనఁబడు బుద్ధజీవితప్రధానవిశేషములకు సద్గుర్తుగ నిలిపి గౌరవించినారు. (౧) బుద్ధావతారము, (౨) మహాభినిష్క్రమణము, (౩) మారప్రధ్వంసము, (౪) సంబోధి, (౫) ధర్మచక్రప్రవర్తనము అనునవి పంచకల్యాణము లనఁబడును. అప్పుడు మహాపరినిర్వాణమునకు స్తూపమే సూచన యనవలెను. మారప్రధ్వంస, సంబోధుల నొక్కవిశేషముగనే గైకొనినయెడల నప్పుడు (౧) బుద్ధావతారము, (౨) మహాభినిష్క్రమణము, (౩) సంబోధి, (౪) ధర్మచక్రప్రవర్తనము (౫) మహాపరినిర్వాణము అను నీ యైదింటిని దెలుపుటకీ స్తంభములు సద్గుర్తు నున్నట్లు గ్రహింపవలెను. ఈవిషయము ప్రస్ఫుటము మగుటకయి తరువాతికాలమున స్తంభము దిగువభాగములందు, చూచువారి దృష్టిపథమునఁ బడునట్లు బోధివృక్షము, స్తూపము, ధర్మచక్రము మొదలయినవి చెక్కినారు. ప్రాకారమును గడచి లోపలికి వెళ్లినంతనే బౌద్ధులు, ఉపాసకులు పూజాద్రవ్యముల నీ స్తంభములముం దుంచి, వాని నారాధించి పిదప స్తూపప్రదక్షిణము చేయుదురు. ఈ స్తంభము లీవిధమున గౌరవపాత్రము లగుటవల్ల కావచ్చును వీనికి 'ఆయక కంభములు (ఆర్యక కంభములు - పూజ్యస్తంభములు) అని పేరు కలిగెను (చూడుఁడు, ఆర్యకకంభచిత్రములు, పటము, ౧౫). స్తంభములయితే పూజ్యములు కావు కాని యవి మతసంబంధ మయిన పూజ్యభావములకు చిహ్నములుగ నిలుచుటచేత నవి పూజ్యస్తంభము లయినవి. ఈ స్తంభములు దిగువభాగమున చతురస్రముగ నుండును. స్తంభపాదము (Shaft) అష్టకోణాకారముగ నుండును. అండము రూపమునఁ దేలిన చూళిక (Capital) ప్రతిదిక్కున తోరణముగ (Arch) మలచఁబడినది: దీనికే బౌద్ధవాస్తువున చైత్యతోరణ మని పేరు. చూళికయందలి తోరణముల దిగువభాగములు వట్టి గూండ్లుగ నుంచెదరు; లేదా ఆగూండ్లయందు యక్షిప్రతిమలను జెక్కెదరు (చూడుఁడు, అమరావతి యక్షిప్రతిమ, ౧౬). చూళికశిఖరభాగమున

sampath_Ebooks

కేతనచిహ్నములను పాలకులకు సంకేతములుగా వాడిరి. అమరావతి ఆర్యక స్తంభమాలికలయందలి యక్షి ప్రతిమ లత్యంత సుందరము లయినవి. భార్హూతుస్తూపమునందలి యక్షి ప్రతిమలను, అమరావతిఆర్యకస్తంభాగ్రములందలి యక్షి ప్రతిమలను పరిశీలించి చూచిన కళావిమర్శకులు అమరావతీయక్షి ప్రతిమ లత్యుత్కృష్టకళాకౌశలమును వెల్లడించు చున్నవనియు, ఈయక్షి ప్రతిమలను చెక్కుటయందు చూపిన కళ శ్రీలంకను వెళ్లినదని మరియొకటి కాదని నిశ్చయముగ నభిప్రాయపడుచున్నారు. ఈ ప్రతిమలయందు గూడను నానావిధభావస్ఫురణమున నిర్మింపఁబడిన పని చెప్పుకొనదగినది. అమరావతియందలి నిదర్శనములు కలవు. ఇట్టి గూండ్లు కొన్ని జాలకమ్ముల కుండునట్టి కమ్ములతో నుండి, వాని నడుమనుండి మనుష్యులు ముందునకు తొంగిచూచుచుండినట్లు చెక్కఁబడినవి. ఇట్టి గూండ్లకు చైత్యవాతాయనము లని పేరు. తరువాతికాలమున దక్షిణహిందూదేశ దేవాలయనిర్మాణమున అభివృద్ధి గాంచిన 'కపోతపట్టిక' కు మూలరూపమును, ప్రాచీనదేవాలయ ద్వారములందును ఈ చైత్యవాతాయనములందే కనుగొనఁగలము.

అండము:— వేదికమీఁదినుండి యండము లేచును. కాని యండమునకును వేదికయొక్క పైభాగమును సరిగా నంటియుండక యుండుటకు లోపలికి తగ్గియుండును. ఉపాసకుఁడు కాని, బౌద్ధుఁడు కాని ప్రాకారద్వారమును గడచి లోపలికి వెళ్లి ప్రాజాప్రిత్యములను ఆర్యకస్తంభములముందుండి దృష్టి సారించి చూచినంతనే పంచస్తంభములను పంచకల్యాణములను మనసునకు తట్టునట్లు చేయును. ఒకవేళ నవి మనసున కద్దకపోయినను ప్రాదక్షిణ్యసమగ్రతానంతరము ప్రదక్షిణము చేయునప్పుడు అండపుపరిధులమున చిత్రితములయిన బౌద్ధచిత్రములవలన నయినను బౌద్ధధర్మము స్ఫురణకు వచ్చుచుండును. ఇట్టి చిత్రములు, అండముదిగువభాగమునందే యారంభమగును. అండముదిగువభాగమున క్రిందివరుసయందు సాధారణముగా బుద్ధుని సంబోధిని జ్ఞాపకమునకుఁ దెచ్చు తచ్చిహ్నమయిన బోధివృక్షము చెక్కఁబడును (చూడుఁడు, పటము, ౧౭). ఈ వరుసకు పైని ఇంకను రెండువరుసల చిత్రము లుండును. వీనిలో క్రిందివరుసయందు సాధారణముగ ధర్మచక్రమును, పైవరుసయందు స్తూపమును చెక్కఁబడును (చూడుఁడు, పటము, ౧౮). బుద్ధుఁడు మహాభినిష్క్రమణము చేసినయనంతరము లోకకల్యాణముకొఱకు కని పట్టిన సమ్యక్సంబోధియు, దానిని ప్రజల కుపదేశించిన యుపదేశమునకు సూచకముగ ధర్మచక్రమును, తుదకు నిర్వాణసూచకమయిన స్తూపమును బుద్ధుని జగద్భ్యుదయకాంక్షను వెల్లడించుచుండును. దిగువవరుసయందలి చిత్రశిలాఫలకముల కెడమను, అట్టిఫలకములు పట్టుటకు వీలు లేనిస్థలములయందు పూర్ణఘటములను చెక్కిన శిలాఫలకముల నతికి యాబద్ధము చేసెదరు (చూడుఁడు, పటము, ౧౯). ఇట్లు ఆబద్ధము చేసినకారణమున నీ పలకలకు 'ఆబద్ధమాల' (ఆ సమంతాత్ బద్ధా మాలా) అని పేరు కలిగినది. శాసనములందు దీనికే ప్రాకృతరూపమున 'అబతమాల' అని పేరొసఁగఁబడినది. శాక్యసింహుఁడు (బుద్ధుఁడు) మారవిజయమునఁ బ్రయత్నించి విజయము నొందెనని తద్విజయమునకు సూచకముగ ఆ మూఁడువరుసల చిత్రములకు పైనున్న వరుసయందు సింహప్రతిమలు చిత్రింపఁబడినవి. ఇట్లు బుద్ధుఁడు విజయమునొందిన బుద్ధుఁడు, ధర్మము, సంఘము అను త్రిరత్నములరూపమున ధర్మస్థాపనము చేసెననుటకు గుర్తుగ సింహచిత్రపట్టికకు పైని త్రిరత్నచిహ్నమయిన త్రిశూల పరంపర చిత్రితమయినది (చూడుఁడు, పటములు, ౨౦). త్రిరత్నములను శరణము నొందినవారగుల కింక 'శూన్యమే' యనుటకు సూచనగ త్రిరత్నచిత్రపట్టికకు పైని కొంతస్థలము చిత్రరహితముగ నుంచఁబడినది, కాని యుపాసకులకు ప్రాపంచికవృత్తమున ఫలమును నిరూపించి నదేకాని వారికి నట్టి 'శూన్యము' హృదయాకర్షకము కాదని యెంచి, శూన్యస్థలమునకు పైవరుసను సమరవిజయమునొందిన వీరులు పుష్పమాలాదులతోఁ బ్రసంగమున గౌరవింపఁబడునట్లే త్రిరత్నశరణాగతులయి బౌద్ధధర్మవిజేతలు లయినవారును లౌకిక పుష్పమాలాగుల్మమయిన గౌరవమునకు పాత్రు లగుదు రనునట్లు పుష్పమాలికలు చిత్రితము లయినవి. అట్టిగౌరవస్థితి కలుగుటకుఁ గూడ బుద్ధుఁడే కారణమని ఆ భగవానుఁడు స్మరణకు వచ్చునట్లు ఈ పుష్పమాలికలలో నడనడ చిన్నిక్రొత్తిములందు మరల బుద్ధజీవితగాథలు చిత్రితము లయినవి. ఈవిధమున బుద్ధధర్మము ననుసరించువారికి స్వర్గమున ప్రత్యేకస్థానము గొరకు సరి చేయునట్లు పుష్పమాలికలవరుసకు పైని అండాగ్రభాగమున హార్మిక చూపఁబడినది. ఇది బౌద్ధుల మహాసుఖావాసమునకు సూచన. ఈ మహాసుఖావాసమును బడసినవాఁడు ధర్మరాజ్యమున నేకచ్ఛత్రాధిపతి యగు ననుటకు గుర్తుగ హార్మికపయి నుంచఁబడియున్న ఛత్రము వెలసినది. ఈవిధమున ఆర్యకస్తంభభావమే బౌద్ధులకు స్పష్టముగ బోధపడునట్లు అండపుపరిశిల్పములును, హార్మికాఛత్రాదులును తీర్పఁబడినవి.

హార్మిక:— ఇది అండాగ్రభాగమున చతురముగనో, చతురస్రముగనో పేటికవలె నుండు నిర్మాణము. ఈ హార్మికాపార్శ్వములు సాంచీ మొదలగు స్తూపములందువలె దారుమయప్రాకారశోభితము లయియున్నట్లు చిత్రితము లయినవి. కొందఱు పురాతత్త్వవిదులు ఈ హార్మికయందే బుద్ధధాతువులు నిక్షిప్తము లయియుండెనని చెప్పుదురు. స్తూపమంతటిలో నిదియే పవిత్రమయిన యుచ్చస్థానము కావున ప్రాయికముగ నిట్లు వారు భావించుటకు కారణము కావచ్చును.

శిలాఫలకములమీఁద చెక్కఁబడిన స్తూపచిత్రముల ననుసరించి చూచినచో నాలుగువైపుల ప్రాకారాంతర్భాగమున మూలలందు స్తూపాధిష్ఠితమయిన విడిస్తంభములు నెలకొల్పఁబడినట్లు కన్పట్టును. ఇట్టి స్తంభములుమాత్రమే కాక బుద్ధుని విడివిగ్రహములు కొన్ని స్తూపభూమియందుఁ గానవచ్చినవి. కాని అవి యేనాటివో, యెక్కడనుండెడివో నిశ్చయముగఁ దెలియరాదు. కాని యవి చాలతరువాతి కాలపువి. ప్రాయికముగ మూఁడవ, నాలుగవ శతాబ్దులనాటివి

sampath_Ebooks






౧౦. ఉష్ణీషచిత్రము (లోపలివైపు)

# అమరావతీ స్తూపము


sampath_Ebooks



౧౧. పటము : శిల్పఫలకములు

sampath_Ebooks


# అమరావతీస్తూపము



౧౨. చైత్యశిలాఫలకము ( పటము ౧౨ )

sampath_Ebooks





౧౩. చైత్యశిలాఫలకపు ఉష్ణీషము.

క. పూర్వకాలపుది (పటము ౧౩)

చ. తరువాతికాలపుది (పటము ౧౪)

sampath_Ebooks



గాఁ దగు నని విన్సెంటుస్మిత్తుగారు వ్రాసియున్నారు. యజ్ఞోపవీతము ఛక్క నీ విగ్రహములు వసనము దాల్పుటచేత వీని కుడిభుజమును, కుడిరొమ్మును గనఁబడుచుండును. ఇదియే యీ మూర్తులయందుఁ గానవచ్చు చక్కని లక్షణము. ఈపద్ధతి ధరించిన వస్త్రము భుజములను రెంటినిగూడఁ గప్పివేయు గాంధారపద్ధతికి భిన్నమయినది. ఇట్టి విశి బుద్ధవిగ్రహములలో రెంటిని మద్రాసు మ్యూజియమునందుఁ జూడ వచ్చును. బుద్ధునివిగ్రహములే కాక యితరవిగ్రహములు కూడ — ప్రాయికముగ యక్షుల వనుకనేమో — కానవచ్చినవి. ఇట్టివానిలో శీర్షరహితమయిన విగ్రహ మొకటి మద్రాసు చిత్రవస్తుప్రదర్శనశాలయం దున్నది. ఈ విగ్రహ మెవ్వరి దనువిషయమున పురాతత్త్వవిదులలోఁ గొంత వివాదము కలదు. ఈ విగ్రహములో డభాగమునందుఁ జెక్కియున్న శాసనమును సరిగా చదువక కొంద ఱిది రెండవశతాబ్దివాఁటివాఁ డగు ఆంధ్రరాజు గౌతమీపుత్ర శాతకర్ణి యని వ్రాసియున్నారు. కాని శిల్పరీతి ననుసరించి చూచినను, ఆ శాసనమునుబట్టి చూచినను ఆ విగ్రహ మంతకు పూర్వకాలపుదయి యుండు ననియే కాక, అది గౌతమీపుత్ర శాతకర్ణిది కా దని కూడ నిర్ధారణ మగుచున్నది. అంపలి పనివాని తనము ననుసరించి డాక్టరు ఆనందకుమారస్వామిగారు అది క్రీస్తునకుఁ బూర్వము నూఱుసంవత్సరములనాఁటి దయి యుండునని తేల్చినారు. దానిమీఁది శాసనమును 'గౌతమీ నమో.....దాన' అని కాని, 'గౌతమీన మా...దాన' అని కాని చదువఁబడగియుండుటచేత నది యెట్లయినను గౌతమి యనుపేరఁ బరఁగు స్త్రీ చేసిన దానమును దెలుపుచున్నట్లే గ్రహింపవలసియుండును గాని దానిని గౌతమీపుత్ర శాతకర్ణివిగ్రహముగ భావించుటకు వీలులేదు. తలలేనికారణమున నావిగ్రహ మెవ్వరి దనువిషయమున నెన్నియూహలయినను కలుగుట కవకాశము కలదు. ఈ విగ్రహముయొక్క యంజలిబద్ధమయిన చేతిలో పద్మమువంటి పువ్వుము లుండుటవలనను, బౌద్ధపురాణగాథలందు శాక్యవర్ధనుఁడు మొదలయిన యక్షులను గుఱించి చెప్పఁబడి యుండుటవలనను ప్రాయికముగ నది బుద్ధుని పూజించుటకు వచ్చిన యక్షుని విగ్రహమే కావచ్చును.

పూర్వోక్తవిగ్రహోదులేకాక యిడిగా దొరకిన శిల్పకృతులును ఇంకను అనేకములు కలవు. వానిలో ముఖ్యముగ నిట పేర్కొనఁ దగినవి బుద్ధపాదములు. బుద్ధుని యీపాదముల యడుగున (అరకాలియందు) మహాపురుషలక్షణసూచకములయిన సంకేతము లెన్నో యుండును. అమరావతీస్తూపభూమియందు దొరకిన బుద్ధుని శ్రీపాదములలో ప్రాయికముగ సహస్రారచక్రమును, త్రిరత్నచిహ్నమగు త్రిశూలమును, స్వస్తికమును గానవచ్చినవి. సహస్రారచక్రము ధర్మచక్రమునకును, త్రిశూలము బుద్ధ, ధర్మ, సంఘములకును సంకేత మని యిదివఱకే మనకుఁ దెలియును. స్వస్తికమునుగుఱించి యించుక తెలిసికొనవలసియున్నది.

స్వస్తికచిహ్నము చతురరసమన్వితము. కొనలతో నుండు నీ యాకులలో నొక్కొక్కటి యొక్కొక్క దిక్కున నుండును: ఉత్తరపుటాకుకొన తూర్పువైపునకు, తూర్పువైపుదానికొన దక్షిణమునకు, దక్షిణపుటాకుకొన పడమటికి, పడమటిదానికొన ఉత్తరమునకును సాగియుండును. ఈకొనలు చతురరసమన్విత మగు స్వస్తికచక్రగతిని నిరూపించును. తూర్పువైపునకుండు ఆకు చూపునది మనుష్యగతి. సరిగా దీనికెదురుగ పడుమటివైపునకుండు ఆకు చూపునది దేవగతి. దక్షిణమువైపున కుండు ఆకు చూపునది నరకగతి. ఉత్తరమువైపునకుండు ఆకు చూపునది సమ్యక్సంబుద్ధత్వగతి, అనఁగా బౌద్ధ ముక్తస్థితి. మనుష్యుఁ డెప్పుడును తన మనసు వచ్చినట్లు తన్ను వదలివేసికొనినచో నతనియందలి జంతుప్రకృతివలన నతఁడు నరకమునకుఁ బోవుట సహజము కాన, పతితులయిన యట్టిమానవుల నుద్ధరించుటకు బుద్ధునివలన నిరంతరము ప్రయత్నము జరుగుచున్నది. తత్ప్రయత్నఫలము సమ్యక్సంబుద్ధి లేక పరినిర్వాణము. ఈ విధమున సర్వమానవజాతిని దుఃఖమునుండి యుద్ధరించి సమ్యక్సంబుద్ధస్థితికిఁ గొనివచ్చుటకయి బుద్ధుఁడు సంకల్పించిన సంకల్పమును దెలియఁజేయుటకే స్వస్తికము చిహ్నమయి తనరారుచున్నది. బుద్ధుఁ డిట్లు చేయుటకు కరుణయే కారణము కావున నీచతురరస్వస్తికచక్రమున కదియే కీలకము (Pivot) గ నున్నది. ఈ కేంద్రమునుండియే బుద్ధుని విశ్వకారుణ్యము సర్వదిశలకును సర్వమానవాభ్యుదయమునకయి ప్రవహించుచున్నదని యీచక్రమునందలి యాకులు తెలుపుచుండును. ఈ కరుణయే బౌద్ధమతమునందలి ప్రధానతత్త్వము. దీనిని తరువాతికాలమున బౌద్ధతత్త్వజ్ఞులు శక్తిగను, జగన్మాతగను వెలయించి ఆ దేవివలననే బుద్ధత్వప్రాప్తి కలుగునని నిర్వచించియున్నారు. ఈ కరుణాతత్త్వము వలననే తరువాతికాలమున బౌద్ధమునందు ఇదివఱలో నుడివినట్లు వజ్రయాన, మంత్రయాన, తంత్రయానాదులు వెలసినవి. ఈ బౌద్ధమత సంప్రదాయములందు కరుణ జగన్మాత యను స్త్రీగను, బుద్ధుఁడు జగత్పిత యను పురుషుఁడుగను వ్యక్తీకరింపఁబడిరి.

స్తూపనిర్మాణకాలము :— అమరావతీస్తూప మొక్కకాలమునను, ఒక్కతడవను గట్టినదికాదు. దీనికి వేఱువేఱుకాలములందు మార్పులు, చేర్పులు చేయఁబడినవి. నాలుగుతడవలలో నీ నిర్మాణము పూర్తియైనట్లు స్తూపపు రాతిపలకలమీఁది శాసనములలిపిరీతి ననుసరించియు, చిత్రములరీతి ననుసరించియు సుకరముగను, స్పష్టముగను కనిపట్టవచ్చును.

మొట్టమొదట కట్టిననాఁటి వనఁదగిన శిలాఫలకములను గొన్నిటిని జూడఁగలము. వీనిలోఁ గొన్నిటిమీఁద శాసనములు చెక్కియున్నవి; మఱికొన్నిటిమీఁద చిత్రములు చెక్కియున్నవి; వేఱొకకొన్నిటిమీఁద రెండును గలవు. ఈ కొలఁది పలకలయినను సుష్ఠుగ లేక చాలభాగము పగిలియున్నవి. ఈ పలకలమీఁదఁ గానవచ్చు శాసన, చిత్రములరీతికిని భార్హూతుస్తూపమునందలి శాసన, చిత్రరీతికిని ఎక్కువ పోలికయు, దగ్గఱ సంబంధమును కనఁబడును. దీని ననుసరించి మొదటి

తడవనాఁటి వసఁడు రాతిపలకలు ఇంచుమించుగ భట్టిప్రోలుస్తూప నిర్మాణకాలమునాఁటివే (క్రీ. పూ. ౨౦౦) యని యూహింప వచ్చును.

వీనికి తరువాతవచ్చినవి మఱికొన్ని శిలాఫలకములు కలవు. రాయి కొంచెము ముతకది కాని పలకలు చాల వెడలుపయినవి. వీని యొత్తు అన్నిట సరిసమానముగ నుండక భేదించుచుండును. ఈపలకల మీఁద గళ్లుగళ్లుగ తీర్చిన చిత్రపట్టిక లొకదానిపై నొకటి కలవు. ఈ పట్టికలందలి గళ్లలో (Panels) సాధారణముగ బుద్ధసంబోధి కాని, మొట్టమొదటివారలు తనధర్మమును బోధించుచున్నట్టుగాని, బుద్ధనిర్వాణముకాని సాంకేతికవిధమున, అనఁగా బోధి వృక్షము, ధర్మచక్రము, స్తూపములరూపమున చెక్కఁబడినవి. పుష్ప ఘటము, సింహాసనస్థ బుద్ధపాదపూజనము, నాగములు, మనుష్య చిత్రములు వెరవెర చెక్కఁబడినవి. బోధివృక్ష, ధర్మచక్ర, స్తూప ములచిత్రములు ఒకదానిమీఁద నొకటిగ మూఁడుపట్టికలందును తీర్పఁ బడినవి. ఈమూఁడువరుసలకును పైని తలకట్టుగ నాలుగుపట్టెల నుంచి కట్టినారు. దీనియందలి మొదటిది, మూఁడవపట్టెలో సామాన్య మయినవే కాని విశేషపరికల్పన లేమియును లేవు; కాని రెండవపట్టెలో ప్రయాణము చేయుచున్నట్లు సింహములును, నాలుగవపట్టెలో త్రిశూలపరంపరయు చెక్కఁబడినవి. ఇట్టి శిలాఫలకములమీఁద గానవచ్చుశాసనలిపిరీతి నాధారముగ చేసికొని యవి ప్రాకారశిలలకుఁ బూర్వపువనియు, ప్రాయికముగ క్రీస్తుపూర్వమో, క్రీస్తుశకమునకుఁ దరువాతనో వందసంవత్సరములనాఁటి వనియు చెప్పవచ్చును.

ప్రాకారము రెండువైపులను చాల జాగ్రత్తగ చెక్కిన చిత్ర ములు కలవు. ఈ ప్రాకారశిలలు రెండవతడవ నిర్మాణమున నుపయోగ పడిచిన శిలాఫలకములకంటెను మెత్తనివి. ఈ ప్రాకారమును శ్రీనాగార్జునాచార్యుఁడు నిర్మించినట్లు టిబెత్తుదేశమున నొకగాథ కలదు. అదియును గాక, వాసిష్ఠీపుత్ర శ్రీపుళుమావి పరిపాలనమునందు, అనఁగా రెండవశతాబ్దిమధ్యమున అమరావతీస్తూపమున క్రొత్తహర్మ్యములు, చేర్పులు జరుగుచుండె ననియు, దానికి క్రొత్త శిల్పాలంకారము లమరుచుండె ననియు సూచించునట్టి శాసన మొకచిన్న శిలాఫలకముమీఁద గలదు. పూర్వోక్తటిబెత్తుదేశగాథయు, నీశాసనమును, ప్రాకారశిలలమీఁద చెక్కియున్న యితరశాసనములయందలి లిపిరీతినిబట్టి చూడఁగా ఈ ప్రాకారము క్రీస్తుశకము రెండవశతాబ్ది కడపటిభాగమున నిర్మిత మయినట్లు చెప్పవచ్చును.

నాలుగవతడవ కట్టిననాఁటి వసఁడగు రాతిపలకలన్నియు, వేదికను గప్పుటలో నుపయోగపడిచినవే. ఈ రాయి మిక్కిలి మెత్తనిది; చాల నున్నితమయినది. ప్రాకారశేఖరమందలి శిలలమీఁదకంటెను ఈపలకలమీఁది చిత్రసంపద శ్రేష్ఠమయినది. వీనిమీఁద దివ్యమయిన చిత్రములను అతివిస్తృతముగఁ జెక్కినారు. ఈ చిత్రములలో ఆ కాలపు అమరావతీస్తూపమును లక్ష్యముగఁ దీసికొని చెక్కిన స్తూప చిత్రములు, మారప్రలోభనము, బుద్ధుని ప్రథమధర్మబోధలకు సంకేత ములుగ నున్నచిత్రములు, జాతకకథలు — ఇవి యాకాలపు శిల్పులకు చాల నిష్టము కాఁబోలు — సాధారణముగఁ గానవచ్చును. ఈఫల కములకంచుకట్టుగ నెరువ చిత్రపట్టికారేఖ తీర్పఁబడినది. ఈ పలక లనేకములవలెనే ఈచిత్రపట్టికారేఖకూడ రమ్యములయిన చిత్తరువు లతో శోభించుచున్నది. ఈ చిత్రపట్టికయందలి చిత్రముల రీతిని బట్టియు, ఈఫలకములమీఁద చెక్కిన శాసనముల లిపిరీతినిబట్టియు నీశిల్పచిత్రములు క్రీస్తుశకము మూఁడవశతాబ్దినాఁటి వయియుండు నని నిర్ణయించియున్నారు.

నిలుచున్న ట్లున్న బుద్ధుని విశేషవిగ్రహము లొకకొన్ని స్తూప భూమియందు దొరకినవి. ఇవి యేకాలపువో సరిగా తెలియదు. సి. ఏ. స్మిత్తుదొరగారివి క్రీస్తుశకము మూఁడవ, నాలుగవ శతా బ్దులనాఁటి వగు నని వ్రాసినారు.

శాసనములు : లిపి : భాష :— అమరావతీస్తూపమునఁ గానవచ్చు శాసనము లనేకములు కలవు. వీనిలో చాలవఱకు దానశాస నములు. ఈశాసనలిపుల పరిణామము ఈమహానిర్మాణము క్రమమయిన యంతరువులలో నెట్లు పెంపుచెందినదియు సూచింపఁగలుగుటచేత ఈ శాసనము లీస్తూపమునిర్మాణకాలమును నిశ్చయించుటలో సాయపడు ముఖ్యసాధనములలో నొకటై యున్నవి.

౧. ఇవి పలురకములయిన బ్రాహ్మీలిపియందు వ్రాయఁ బడినవి. ఇట్టి రకములను నాలుగింటిని స్పష్టముగ మనము గుర్తింపవచ్చును. నల్లరాతిస్తంభములును, తొలుతటి నిర్మాణము నాఁటివిగ మలచినశిల్పచిత్రము లనేకములును గల యాగ్నేయదిశ యందలి ప్రాకారభాగమున నొకరాతిశకలము కలదు. దానిమీఁద మౌర్యలిపియం దొకశాసనము చెక్కియున్నది. ఇందలి యక్షర ములు ఆశాసనమునకుఁ బ్రక్కలఁ గానవచ్చిన చిత్రశిల్పములుకూడ వానియంత పురాతనపు వయియుండవచ్చు ననునూహను స్థిరపఱుచు చున్నవి. క్రీస్తుశకము రెండవశతాబ్దిని స్తూపము మరల నిర్మింపఁ బడుచుండినట్లు కాకపోయినను దానికి గొప్పమార్పులు, చేర్పులు జరగి యది పెంపుచెందుచుండినట్లు సూచిత మగుచుండినప్పటికిని ఆశాసనలిపివలన నీమహాచైత్యము ప్రాయికముగ క్రీస్తుపూర్వము ౨౦౦ల సంవత్సరములనాఁటికే యుండినట్లు సిద్ధాంత మగుచున్నది. ఆశాసన మిది :

"......సెనగొపస ముడకుతలస థభో........."

[...సేనాధిపతియగు ముడకుతలుని[1] (ముడకుంతలుని?) స్తంభము...]

గుంటూరుజిల్లాయందలిదే యగు భట్టిప్రోలు స్తూపమునందలి ధాతుకరం డశాసనములే అమరావతికి దగ్గఱగఁ గానవచ్చిన బ్రాహ్మీలిపియందలి

1. లూడర్సుదొరగారు దీనిని ముడుకుతలుని (మృదుకుంతలుని) అని సవరించినారు.

sampath_Ebooks





౧౪. 'ఆర్యకకంథ' చిత్రములు (పటము ౧౫)

sampath_Ebooks






౧౫. 'ఆర్యకకంభ' చూళిక (పటము ౧౬)
(అమరావతి యక్షిప్రతిమ)

sampath_Ebooks






౧౬. అంసచిత్రములు (పటములు ౧౭, ౧౮, ౨౦)

sampath_Ebooks



౧








౪



౧. ప్రాకారరేఖ : సింహప్రతిమ ( పటము ౭ )

౨. బుద్ధపాదములు

౩. అండచిత్రము : పూర్ణఘటము ( పటము ౧౯ )

౪. రామగ్రామస్తూపము ( పటము 3 )

౫. వేదికావృత్తిచిత్రము : ధర్మచక్రస్తంభము ( పటము ౧౧ )

sampath_Ebooks



తోలుదోలుతటిశాసనములు. ఈ భట్టిప్రోలుస్తూపశాసనములననుసరించి బ్రాహ్మీలిపి కృష్ణాజిల్లాయందు క్రీస్తుపూర్వము మూఁడవశతాబ్ది నుండియు వాడుకయం దుండినట్లు తెలియుచున్నది. భట్టిప్రోలుశాసనములందలి ద, ధ, భ, చ, జ, వ, ళ, ల వంటి వర్ణములు కొన్ని అశోకశాసనములందలివానితో భేదించుచునని బూలరుదొరగారు చూపి వానిని ద్రావిడవర్ణము లన్నారు. కాని యమరావతియందలి ప్రాచీన బ్రాహ్మీశాసన వర్ణములును, దక్షిణాదిరకము అశోకశాసనవర్ణములును ఒక్కటే పోలిక నుండును. 'గ' వర్ణమునకు పైని కోణమును, చ, ఠ, ప వర్ణములును రూపమున ఆర్షము (Archaic)గా నున్నవి; అనఁగా అశోకశాసనములలోనివానిని పోలియున్నవి.

౨. నాగార్జునకాలపుశాసనములకు తరువాతికాలపు వానియందలి ముఖ్యలక్షణము లివి: (౧) 'ద' వర్ణముయొక్క గూఁడ్లరూపమింకను నిలిచియుండుట, (౨) తలకట్టు లన్నివర్ణములయందును సమానముగ నుండుట, (3) క్షత్రపుల, కదపటి ఆంధ్రరాజులనాఁటి పశ్చిమహిందూదేశశాసనములయందలి ముఖ్యలక్షణముగఁ గానవచ్చు 'ఆ', 'క', 'ర', వర్ణములకు దిగువభాగమున నుండు వంకరకోణములు లేకపోవుట, (౪) వక్రరేఖలతోడి 'ఇ' వర్ణము. ఈలక్షణములను బట్టి యివి క్రీస్తుపూర్వము మొదటిశతాబ్దినో, క్రీస్తుశకము మొదటి శతాబ్దినో అయియుండు నని నిరయింపవచ్చును. వర్ణములయూర్ధ్వ భాగాంతమునందలి చిన్న యడ్డుగీటులవల్ల నీరకము నానాఘాటు ఆంధ్రశాసనలిపినుండి భేదించుచున్నది.

3. బూలరుదొరగారు లిపినిబట్టి, పదుమూటికన్నను, కొంకణములందలి గుహాశాసనములతో సరివచ్చున వని పరగణితివారీవిభజనముచేసి చూపిన అమరావతీ శాసనములలో చాలభాగము క్రీస్తు శకము రెండవశతాబ్దినాఁటివి.

౪. ఇక్ష్వాకువంశపురాజయిన శ్రీవీరపురుషదత్తునినాఁటి జగ్గయ్యపేట శాసనములందు కానవచ్చులిపిని జోలి మిక్కిలి సొగసులు దేఱియుండులిపితో నున్నశాసనములు కొన్ని కలవు. బూలరుదొరగారివి క్రీస్తుశకము మూఁడవశతాబ్దినాఁటి వగు నని యూహించినారు.

ఈయమరావతీశాసనములందు వాడినభాష ప్రాకృతము. దీని కిని, వ్యాకరణశాస్త్రజ్ఞుల పైశాచీప్రాకృతమునకును దగ్గఱ సంబంధము కలదు. ఇందు 'గ'కు బదులుగ 'క'యును (ఉదా: నకయ), 'జ'కు బదులుగ 'చ'యును (ఉదా: పవచితయ), 'ద'కు బదులుగ 'త'యును (ఉదా: వేతిక), 'ణ'కు బదులుగ 'న'యును (ఉదా: ఉనిస, ఉంనిస, సమనస, తిని) ప్రయుక్తము లయినవి. కాశ్మీరదేశగాథ ననుసరించి పైశాచీప్రాకృతమున బృహత్కథ రచియించిన గుణాఢ్యుఁ డాంధ్రరాజాస్థానము నలంకరించిన విద్వాంసుఁడు. ఈ గాథనుబట్టి ఆంధ్రభృత్యరాజులక్రింద నాంధ్రరాజ్యమున పైశాచీప్రాకృతభాషను కృషి జరుగుచుండినట్లు విశ్వసించుట కవకాశము కలదు.

ఈశాసనములు చరిత్రాత్మకమయిన, అనఁగా రాజవంశములకు సంబంధించిన విషయముల నేమియుఁ దెలుపవు. ఆంధ్రరాజులలో వాసిష్ఠీపుత్త్ర శ్రీపులుమావి, శివశ్రీశాతకర్ణుల శాసనములు మాత్రమే కలవు. అందు వాసిష్ఠీపుత్త్రునివే యెక్కువ. ఈకారణమున నాగార్జునాచార్యుల మిత్త్రుఁ డయిన శాతవాహనుఁడను ఆంధ్రరాజు వాసిష్ఠీపుత్త్రుఁడే యగునని కొంద ఱూహించుచున్నారు. నాగార్జునాచార్యులవారు స్తూపమున కొసంగిననూతనరూపము ప్రోద్బలము నూఁతగాఁ గొని యాంధ్రు లీ మహానిర్మాణమునకు పెంపుసొంపులు సమకూర్చియున్నారు. ఆంధ్రులకుఁ బిదప నీశాసనములు ప్రాయికముగ 'పాకోటక' జాతినామమును, 'వాకాటక' మనువ్యక్తినామమును వెల్లడిపఱుచుచున్నవి. విన్సెంటుస్మిత్తుదొరగారి మతముప్రకారము వాకాటక వంశము క్రీస్తుశకము 300 ల ప్రాంతమున రాజ్యమునకు వచ్చినది. ఈశాసనములందు వచ్చు వాకాటకపాఠము సరియయిన దయినచో క్రీస్తునకు పూర్వము ౧౫౦ సంవత్సరములనాఁడే దక్కనునందు వాకాటకు లుండినట్లు స్మరింపవచ్చును.

**అమరావతీకళ :—** అమరావతీస్తూపశిల్పచిత్రములను విడివిడిగాను, వాని నొండొంటితోను, ఇతరబౌద్ధ నిర్మాణములందలి శిల్పచిత్రములతోను పోల్చి పరిశీలించి చూచినయెడల అమరావతీస్తూపనిర్మాణ మొక్కకాలమునఁ గాక నాలుగుతెడవలలో జరిగినట్లును, అమరావతీస్తూపశాశనలిపిపరిణామమున నొక్కరకము గాక నాలుగు రకము లుండినట్లును తెలియవచ్చుచున్నట్లే, అనఁగా నిర్మాణమునందును, లిపియందుసుగూడ వికాసము కనఁబడునట్లే శిల్పచిత్రములతీర్పునందుఁ గూడ వేఱువేఱురకము లయినరీతులు కన్పట్టును. క్రీస్తునకు పూర్వము మూఁడునూర్ల సంవత్సరములనుండి క్రీస్తుశకము మూఁడవ శతాబ్దివఱకును స్తూపమున వేఱువేఱు నిర్మాణములు జరుగుచుండినట్లే, స్తూపశాసనలిపియందు పరిణామమును చెందుచుండినట్లే చిత్రశిల్పపు రీతులుగూడ ఆకాలముననే పరిణామమును పొంది పరిణతములైనవి.

మొట్టమొదటికాలపు శిల్పచిత్రములు తరువాతికాలపుచిత్రము లంత హృదయరంజకముగ చిత్రింపఁబడలేదు. అంతియకాక మొదటికాలపు శిల్పచిత్రములందు కథావస్తువిన్యాసముగూడ నతిసంగ్రహముగఁ జూపఁబడినది. ఇట్లు సంగ్రహ మగుటవలన వివరములను చాల వఱకు విడిచివేయుటయేకాక, కథావస్తుతత్త్వమునను శిల్పులు సమయబద్ధమైన సంకేతపద్ధతి నుపయోగించినారు. ఇట్లు సంకేతముల నేర్పఱచుటవలన చిత్రితమయిన కథావస్తు వాకాలమునాఁటివారికి సుబోధమగుచువచ్చినను, ఏయేవిషయముల కేవేవి సంకేతములో తెలియక యిప్పటివారి కాచిత్రరంగములు దురవగాహము లయినవి. ఈకారణమున కళావిమర్శకులు కొంద ఱట్టికళ ప్రశస్త మయినది కా దనియు, ఆకాలమున కళాకౌశలము లే దనియు స్థూలముగ తెగడియున్నారు; కాని యాకళ నట్లు తెగడుటకు వీలు లేదు; వీల యన, కథావస్తు విన్యాసము పెద్దదిగఁ గాక సంకుచితము చేసినను ఆకాలపుశిల్పి తాను

sampath_Ebooks



తనకళాకౌశలమును జూపుట కవకాశ మున్నచోటుల నెల్లఁ దననేర్పును విపులముగఁ జూపియే యున్నాఁడు. ఈ సంకేతపద్ధతిని ముఖ్యముగ బుద్ధజీవితగాథలను చిత్రించునపు డుపయోగించియున్నాఁడు. కావున సంకేతపద్ధతి యేదియో విచారింతము. ఈ సందర్భముననే చాల హృదయాకర్షకమును, వివాదగ్రస్తమును అయిన బుద్ధవిగ్రహావిష్కార మీవిషయమునం దంతర్గర్భిత మయియుండుటవలన దానినిగూర్చి కూడ ఆలోచింతము.

బుద్ధజీతమునందలి యన్నిగాథలలోను పంచకల్యాణములు ముఖ్యమయినవి. వీనిని శిల్పమునఁ జిత్రింపవలెను. ఆకాలము నాఁటికి బుద్ధుఁడు మహాపరినిర్వాణమును బొందెను. బౌద్ధమతానుసారము మహాపరినిర్వాణ మనఁగా విజ్ఞానస్థితి యని కాని, కేవలము శూన్యస్థితి యని కాని చెప్పవలెను, అనఁగా బుద్ధుఁడు నామరూపాతీత మయినస్థితిని పొందినవాఁడు. అట్టివానికి నామరూపములు కల్పించి, శిల్పచిత్రములందు చూపుట అసాధ్యమేకాక పాపకార్య మని కూడ వారు భావించుటచేత ఆకాలపుశిల్పులకు బుద్ధజీవితగాథలను జెప్పుటలో సంకేతముల నేర్పఱుచుకొన వలసి వచ్చినది. అయిన నీగాథలను అసలు చూపవలసినంత యవసర మేమి కలిగిన దని కొందఱు అడుగవచ్చును. క్రొత్తగా బౌద్ధమతమును స్వీకరించిన పామరునికి బుద్ధుఁడు బోధించినతత్త్వము సరిగా గ్రహింపరానందున బుద్ధజీవితమునందలి గొప్పవిషయములు బోధపడుటకు బొమ్మల రూపమున చిత్రించి చూపుటకును, తత్కారణమున బుద్ధునియెడఁ భక్తి విశేషించునట్లు చేయుటకును మహోత్తము డయిన యట్టిబుద్ధుని జీవితమునందలి ముఖ్యగాథలను చెక్కినారు. ఇట్లు చెక్కుటలో సంకేతపద్ధతి యావశ్యకమయినది. ముఖ్యముగ నీసంకేతములు పంచకల్యాణముల విషయమున ప్రయుక్తములయినవి. బుద్ధజననమునకు పొత్తిళ్లలో బుద్ధపాదములనుగాని, పద్మమునుగాని చెక్కెదరు. మహాభినిష్క్రమణ, మనఁగా సర్వభోగవర్జనము జీనుతోనుండు పట్టెగుఱ్ఱమును చిత్రించుటవలనను (సిద్ధార్థుఁ డర్ధరాత్రమున తండ్రిని, భార్యాపుత్రులను, రాజ్యభోగములను విడిచి కంటక మనుగుఱ్ఱము నెక్కి కపిలవస్తునగరమునుండి వెడలిపోయినట్లు మనకు బుద్ధచరితమునుబట్టి తెలియును), మారధర్షణపూర్వకమయిన సమ్యక్సంబోధిని బోధివృక్షమును, దానిక్రింద నొక యాసనమును దీర్చి, యాసనముమీఁదనో, క్రిందనో బుద్ధపాదములను జెక్కుటవలనను, బుద్ధుని ధర్మబోధను ధర్మచక్రమును, దానిక్రింద నొక యాసనమును జిత్రించుటవలనను — బుద్ధుని మొదటిధర్మబోధను దెలుపవలసివచ్చినపుడు ధర్మచక్రమును, దానిక్రింద నొకయాసనమును రచియించి, యాసనమున కుభయపార్శ్వములందును మృగములను జూపుదురు —, మహాపరినిర్వాణమును స్తూపమువలనను దెలుపుదురు.

**అమరావతీకళ దేశీయము :—** బుద్ధవిగ్రహమును మలచుట భారతీయశిల్పికి తెలియ దనియు, దానిని మలచుట నాతఁడు గ్రీకులవలననుండియో, రోమనులవలన నుండియో నేర్చుకొనె ననియు కొందఱు విశ్వసింతురు కాని యిది మృషోక్తి యని అమరావతీశిల్పచిత్రములను బరిశీలించినచో తెలియఁగలదు : ఎట్లన, ఆశిల్పి సామాన్యమానవవిగ్రహములను, బౌద్ధేతరు లయిన బోధిసత్త్వుల విగ్రహములను మానవరూపమునను మలచియుండుటవలన అతనికి మానవరూపమును జిత్రించుట తెలియ దని యనుకొనుట కవకాశము లేదు. అతఁడు మానవప్రతిమలను జెక్కుట రోమనులవల్లఁ గాని, గ్రీకులవల్లఁ గాని నేర్చుకొన నవసరము లేదు. మానవరూపమును జిత్రించుటలోఁ గాక సంకేతపద్ధతిని ధైర్యముతోను, సాహసముతోను వదలిపెట్టునట్లు చేయుటలో గ్రీకులు తోడ్పడి రని మఱికొందఱు వాదింతురు కాని యీసిద్ధాంతము నంగీకరించుటయుఁ గష్టమే ; ఏల యన, అర్వాచీన శిల్పచిత్రములలో బౌద్ధవిగ్రహ మున్నచోటుల దాని ప్రక్కనే దానితోపాటు సంకేతపద్ధతిని బుద్ధునిఁ జూపుటయు మనము గాంచఁగలము.

శిల్పమున బుద్ధవిగ్రహావిష్కరణమునకు మనము గ్రీకులదాఁక పో నవసరము లేదు. దీనికి మూలము మనము స్థానికవిషయపరిణామములందే కాంచవచ్చును. కాలక్రమమున బౌద్ధునిపర్యవేక్షలో మొదట నామరూపరహితమూర్తిగ నెన్నఁబడినబుద్ధుఁడు కరుణామూర్తిగ మార్పుచెందెను. ఈమార్పే బౌద్ధమతచారిత్రమున నిది వఱకే తెలుపఁబడిన మహాయాన, మహాసుఖవాదములరూపమయిన పరిణామము. ఈమార్పు వచ్చినయనంతరము బౌద్ధాంధ్రశిల్పి బుద్ధునికి చక్కనిమానవరూపము నిచ్చి, యాతని ముఖవైఖరియందును, అభయహస్తమునందును కరుణామూర్తి యని పరిణామమును చెందిన యాతని ముఖ్యస్వరూప మయినకరుణను చక్కఁగా వ్యక్తీకరించెను. శిల్పమున బుద్ధవిగ్రహావిష్కరణమునందు బౌద్ధమతతత్త్వపరిణామమును సులభముగా గ్రహింపఁగలము. భారతీయచిత్రశిల్పమున బుద్ధవిగ్రహ మేర్పడుట కిదే కారణము కాని, గ్రీకులయొక్క కాని, రోమనులయొక్క కాని తోడ్పాటు కా దని తెలియఁగలదు.


బౌద్ధాంధ్రశిల్పి తాను మలచుటకు ప్రత్యేకకథావస్తు వున్నంతకాలము తనసొంతదారినే త్రొక్కెను కాని గ్రీకుకళాప్రభావమునకు మాత్రము వశుఁడు కాలేదు. గ్రీకులయుత్తమశిల్పరచనల ననేకముల నతఁడు చూచియుండవచ్చును కాని యతఁడు వాని ననుసరించియుండ లేదు. అమరావతీచిత్రశిల్పములందుఁ గానవచ్చు బుద్ధవిగ్రహశిల్పముననే కాక మఱి యేయితర మానవవిగ్రహరచనమునందునుగూడ గ్రీకువిగ్రహశిల్పముఖ్యలక్షణ మయిన స్నాయువిస్ఫుటత్వమును గాంచలేము. ఇది యొక్కటియే అమరావతీమానవవిగ్రహశిల్పము దేశీయమే కాని గ్రీకుకళానుసరణము కాని, గ్రీకుకళాప్రభావజన్యము కాని కా దని చెప్పుటకుఁ జాలును. స్త్రీప్రతిమాశిల్పమున గ్రీకుకళకును, అమరావతీకళకును గలవ్యత్యాసము మఱింత స్పష్టముగఁ గనఁబడఁగలదు. స్త్రీప్రతిమారచనమునందు అమరావతీశిల్పికి సాధారణముగ త్రిభంగములను జూపుట వాడుక. గ్రీకుశిల్పికీపద్ధతి కేవలము విదేశీయము. కాని దుస్తులు, గిన్నెలు మొదలయిన కొన్నిపాత్రములు, జంతువులు మొదలయినవాని రచనములందు గ్రీకుశిల్పసామాన్యము లయిన లక్షణములు కొన్ని అమరావతీశిల్పచిత్రములందుఁ గానవచ్చును.

sampath_Ebooks




## అమరావతీస్తూపశాసనములు కొన్ని


( అమరావతీస్తూపశాసనలిపి పరిణామమును తెలుపుటకు )




౧




౨




3




౪



౫



౬



౭

౧. రేవతిస పసిపుతి [ని]యానం.

౨. గంబకటకస నిగమస.

3...[స] భదస చ మాతుయా...
...వం సకమికా ప( ిప )ధానదా( ిప)రి...
...ణో గమకధిణో అయదా( ిపా )రదో( ిపా ) చ

౪...గామె వాశివస గహపతిస వాకాటకస గహపతికి [ని]
...నా థెరెన బోధికెన భరియాయ చమునాయ సభాతుకెహి...
...కెహి సనాతిమితబంధసహి చ అపణో ఆయకఖనిక [పు]

౫. సుతు-ఉపరకస
కొడిముటికస
తిణి సుచిరు
దానం.

౬. రాజలెఖకస బల
స జాయాయా సామన[తా]

౭. పవచితాయా భదియ పసచ(ది)తియ సకయ
దొయగమ సమ.

sampath_Ebooks

# అమరావతీస్తూపము



అమరావతీశిల్పమునుండి : జంత్రవాద్యములు : నృత్యము

sampath_Ebooks


# అమరావతీస్తూపము



అమరావతీశిల్పములనుండి: వస్త్రధారణపద్ధతులు

sampath_Ebooks





అమరావతీశిల్పము : నాగినులు ( నాగకన్యలు )

sampath_Ebooks


అమరావతీకళయందు గ్రీకుకళాప్రభావము లేదని, అది గ్రీకుకళాను సరణము కాదని తెలుపఁబడినదికదా, ఇది యెట్లు కలిగ నన్న దీని నిట్లు సమర్థింపవచ్చును. బౌద్ధాంధ్రశిల్పి యుత్తమగ్రీకుశిల్ప పరికల్పనములను గాంచియుండవచ్చు నని యిదివఱకే తెలుపఁబడినది. ఈకారణమున నాతఁడాకళయందలి మనోహరములయిన యుత్తమశృంగార పరికల్పనములను జేపట్టి భారతీయకథావస్తువుల కనురూపముయినరీతి సింగారమునకుఁ బ్రయోగించి తన నేర్పును, బుద్ధివైశద్యమును జూపినాఁడు. ముఖ్యముగ బుద్ధునిచేలము, మిథునప్రతిమలు, సింహములు — వీనియందు గ్రీకుకళాప్రభావము స్పష్టముగ కనఁబడును. గిన్నెలను గ్రీకులు వాడుకొను గిన్నెలరూపమునను, గొల్లబోయలకళ్ళలను గ్రీకు సింహముల విధమునను రచియించుటయందును, హిందూదేశమునకు నజ్ఞాతము లయినసింహములను చిత్రించుటయందును గ్రీకుకళాప్రభావము పొడకట్టఁగలదు.

బుద్ధవస్త్రధారణమున నుత్తరీయమును యజ్ఞోపవీతధారణ పద్ధతిని వల్లెవాటువేసికొని కుడిభుజము ననాచ్ఛాదితముగ నుంచుట దేశీయ పద్ధతి. ఇందుకు భిన్నమయిన గ్రీకుపద్ధతియందు బుద్ధుఁడు తన యుత్తరీయము నురమును, భుజములను పూర్తిగ నాచ్ఛాదించునట్లు కప్పుకొనును. స్త్రీపురుషుల జంటలలో (మిథునప్రతిమలు) స్త్రీలును, పురుషులును వస్త్రములు ధరించుట గ్రీకుపద్ధతి; కాని దేశీయకళాపద్ధతి నీజంటలు కొంచెమించుమించుగ వివస్త్రలుగనే యుందురు. కటిప్రదేశమునకు పైని స్త్రీ, పురుషుల నుభయులను నగ్నులుగనే చూపుట దేశీయకళయందలి సామాన్యాచారము. కటిప్రదేశమునకు దిగువ పురుషులకు వసనధారణము చూపఁబడుట కలదు. కాని స్త్రీలను కేవలము నగ్నలుగఁ జూపుటయే వాడుక. కాని కొన్ని కొన్ని రచనలందు మానసంరక్షణమునకు కొన్నికొన్నిసందర్భములందు శృంగార రూపమయిన యాచ్ఛాదన ముండిన నుండవచ్చును. దేశీయకళయందలి యీవిధమగు నగ్నతనుగూర్చి యించుక చర్చింతము.

**నగ్నస్త్రీచిత్రములు** :— అమరావతియందలివియు, దానికి చుట్టుప్రక్కల దగ్గఱగ నున్న స్థలములయందలివియు నగు స్తూపముల మీఁది ప్రతిమాశిల్పమున స్త్రీలు కొన్నికొన్నిసందర్భములలో వస్త్రవిహీనలుగాఁ జూపఁబడుటచేత కళావిమర్శకులు కొందఱు ఆకాలపు స్త్రీలకు వస్త్రధారణ ముండెడిదికాదని సిద్ధాంతము చేసినారు; కాని యీవిషయము స్త్రీలకటిప్రదేశమునకు పైనుండు వక్షోభాగమునుగూర్చి చెప్పినప్పుడు సత్యమయినఁ గావచ్చును కాని స్త్రీలకు అసలు వస్త్రధారణమే లేదని చెప్పుటమాత్రము సత్యదూరమే యగును; ఏలయన, అమరావతియందును, ఇతరసమీపస్థలములందును గల స్తూపములమీఁది శిల్పచిత్రములను బరిశీలించినచో వస్త్రవిహీనలయిన స్త్రీలతోపాటు వస్త్రధారులయిన స్త్రీచిత్రములును కానవచ్చుచున్న కారణమున మన కట్టితీర్మానమును జేయుట కవకాశము కనిపింపదు. స్త్రీప్రతిమారంగముల నొండొంటితోను, ఒక్కొక్కరంగమునఁ జెక్కిన ప్రతిమలనే యొండొంటితోను పోల్చి చూచినయెడల తన కళావైదుష్యమును జూపుట కవకాశమును, స్వేచ్ఛయుఁ జిక్కిన సందర్భములయందు మాత్రమే యాంధ్రశిల్పి నగ్నస్త్రీప్రతిమలను జిత్రించె నని బోధపడఁగలదు.

సంపూర్ణసౌందర్యపిపాసు వగుటచేత శిల్పికిఁ దనకళయందుఁ జూపరానిది కాని, అనుచితమైనది కాని యేదియు లేదు. ఈ కారణమున కళయందు నగ్నతామతము (Nude in art) అను నొకవాదము కలదు. దీనిని ప్రబలముగఁ జేపట్టినవారు గ్రీకులు. కావుననే గ్రీకుశిల్పులకళారచనములయందు నిట్టినగ్నత విశేషముగఁ గానవచ్చును. కాని గ్రీకుశిల్పి నగ్నపురుషచిత్రములను రచియించుటలోఁ జూపఁగలిగినంత నేర్పు నగ్నస్త్రీప్రతిమారచనమునఁ జూపఁజాలఁడయ్యెను. బౌద్ధాంధ్రశిల్పి గ్రీకుశిల్పి కెదురొడ్డి నిలిచి యాతఁడు కృతార్థుఁడు కాని విషయమునఁ దాను తననేర్పును చూపఁదలపెట్టి నగ్నస్త్రీశరీరావయవవిన్యాస సౌందర్యరచనమున అతనిని త్రోసిరాజని విజయి యయ్యెను. స్థానిక చిత్రరచనములయం దొక్క స్త్రీ చిత్రములయందుమాత్రమే నగ్నత చూపఁబడుట కిదియే కారణము. గ్రీకుశిల్పి తనకౌశలమును జూపుటయం దెక్కడ నిలిచిపోయెనో యచ్చటనుండి యందికొని యాంధ్రశిల్పి తనప్రజ్ఞను జూపుటకుఁ దలపెట్టెను. ఇదియే బౌద్ధాంధ్రశిల్పి విశిష్టలక్షణము. ఆంధ్రశిల్పి గ్రీకుశిల్పికంటె భావోన్నతి కలవాఁడని తెలుపుట కీయొక్క విషయమే చాలును. ఈకారణముననే గ్రీకుశిల్పులు పురుషావయవవిన్యాససౌందర్యప్రదర్శనమున గొప్పనేర్పును చూపినవారు కాఁగా, భారతీయశిల్పి స్త్రీశరీరావయవవిన్యాససౌందర్యప్రదర్శనమున తనకళావిదగ్ధతను జూపి ప్రశస్తి వహించెను. తనకళాకౌశలమును జూపుటయే యిట్టి నగ్నస్త్రీప్రతిమారచనము నందలి ప్రయోజనమగుటచేత బౌద్ధశిల్పి పవిత్రములయిన బుద్ధజీవితగాథలనుకాని, జాతక కథలనుగాని చెక్కునప్పుడు నగ్నత చూపియుండలేదు. పాపమని, అపవిత్రమని, బౌద్ధభిక్షుబృందమునకు హృదయావేదకర మని మతవిషయకగాథాచిత్రరచనమున శిల్పి నగ్నతజోలికి పోయినవాఁడు కాఁడు. దీనికిదే కారణము కానిచో మారధర్షణసందర్భములందు మారతనయలు నగ్నలుగ వచ్చినట్లు బౌద్ధగ్రంథములందుఁ దెలుపఁబడినను శిల్పి వారిని నగ్నలుగ నేల రచియింపలేదు? మతవిషయకము లయిన గాథలయి యవి పవిత్రమయిన వని శీలభంగము చేయరాని దని శిల్పి అట్టివిషయములందు నగ్నత యావశ్యక మయినను ప్రదర్శించియుండలేదు. సౌందర్యప్రయోజనము నిమిత్తమును, శృంగారసౌభాగ్యము నిమిత్తమును అవకాశమును, స్వేచ్ఛయును లభించిన సందర్భములందు మాత్రమే, అనఁగా స్త్రీపురుషులజంటలు మొదలయిన చిత్రరచనములందే యిట్టినగ్నతను జూపుచువచ్చెను. ఇట్టి నగ్నప్రతిమలు కేవల మిట్టిశృంగారసౌభాగ్యమునకు మాత్రమే యన్న విషయము సింగారించుకొనుచుండినట్లు చిత్రింపఁబడిన యక్షిప్రతిమలను గాంచిన స్పష్టమగును. బౌద్ధజీవితగాథలను కాని, జాతకకథలనుగాని రచియించినప్పుడట్టిరంగములందు నగ్నతను జూపక ప్రక్కనే శృంగారమునకొఱకు చిన్నగడి కల్పించుకొని యందు మిథునచిత్రములను జెక్కి నగ్నతఁ

sampath_Ebooks



జూపియుండుటచేత శిల్పి కీనగ్నతమీఁదఁగల యభిమానము వెల్లడి కాఁగలదు. బుద్ధజీవితగాథా, జాతకచిత్రరంగములయందే అవకాశము చిక్కినచో, స్థలము దొరకినచో నతఁడు కథావస్తువునకు సంబంధింపని సామాన్యస్త్రీరచనములందును నగ్నత కనఁబఱచుట కలదు. ఇందు వల్ల నతఁడు మతగాథాపవిత్రతకు భంగము రాకుండ జాగ్రత్తపడుచు తన నగ్నత కవకాశము కల్పించుకొనుచువచ్చెనని భావింపవచ్చును. విలాసినీరంగములందే యొక్కొకప్పుడు కేవలము నగ్నలుగనే కాక స్త్రీలమానము నీషదాచ్ఛాదనముతోఁ జూపుటయు నుండుటచేత స్త్రీ లాకాలమున నగ్నలుగ నుండిరని కాని అట్టినగ్నప్రతిమలను జెక్కుటయే యాకాలపు శిల్పులయాచార మనికాని వచించుటకు వీలు లేదు. శిల్పి నగ్నతను జూపఁదలఁచినప్పుడు స్త్రీని వసనము పూర్తిగ ధరించినట్లయినను, మోకాలివఱకు ధరించినట్లయినను, నడుము కటిబంధమున కంటియుండి సూక్ష్మమగు నీషదాచ్ఛాదనముతో నైనను రచియించువాఁడు. ఇందువలన, శిల్పియుద్దేశమున స్త్రీమానసంరక్షణమునకును, నగ్నతాభావమునకు నీషదాచ్ఛాదనమయినను చాలునని తేటపడఁగలదు. ఈయాచ్ఛాదనమయినను వస్త్రరూపమున నేయుండ నక్కఱలేదు. ఇప్పుడు బాలికలు ధరించు ‘అంగబిళ్ల’ రూపమున నుండవచ్చును. కొన్నికొన్ని యమరావతీశిల్పచిత్రములం దిట్టిబిళ్లలనే చూడవచ్చును. శిల్పి నగ్నాభావమునకు ఈబిళ్లను దిగువకు వ్రేలాడఁ జేసియు, నగ్నత కాబిళ్లను పై కెత్తియుఁ జూపి యాతఁడు తృప్తి నొందఁగలఁడు.

**సంగీతవాద్యములు** :— లలితకళలలో నొకటియైన సంగీతమునకుఁగూడ అమరావతీశిల్పమున ప్రాధాన్య మియ్యఁబడినట్లు శిల్పచిత్రములనుబట్టి తెలియవచ్చుచున్నది. శిల్పికి చిత్రరచనమున నెట్టి ప్రావీణ్యము కలదో యట్లే యాకాలపువారికి నృత్త, గానవిద్యలయందును అంతటి విశేషకౌశలాభిమానములు కల వని చిత్రశిల్పమునుబట్టి విశదమగుచున్నది.

నాట్యచిత్రరచనములను బరిశీలించినచో స్త్రీలే నాట్యార్హులనువిధిని అమరావతీశిల్పి యంగీకరించినట్లు కనఁబడదు; ఏల యన, నాట్యాభినయములు చేయుచున్నట్లు రచియింపఁబడిన పురుషచిత్రముల నెన్నిటినో అమరావతీశిల్పమునఁ గాంచఁగలము. ఒక్క స్త్రీపురుషులే కాక, నాట్యాభినయానర్హులయిన కుబ్జయక్షగణములఁగూడ లయకట్టి చక్కనినృత్తభంగిమలతో వాస్తవతయుట్టిపడునట్లు నాట్యము చేయుచుండినట్లు శిల్పి రచియించినాఁడు. నాట్యాభినయానర్హులుకూడ నృత్యముచేయుచుండినట్లు శిల్పి చిత్రించుటకుఁగలకారణమును మనము గ్రహింపఁగలిగినచో నతనిభావోన్నతి మనకు బోధపడఁగలదు; అదియేదన, మానవునియంతరానందవ్యక్తీకరణమే నాట్యము. తదానందము లోకమున నందఱకును సామాన్య మగుటవలన తద్బహిర్లక్షణములయిన నాట్యాభినయములుకూడ నందఱకును సామాన్యమే. ఈకారణమున నతని కిచ్ఛ యున్నచో, నవకాశము దొరకినచో జంతువులుకూడ నాట్యము చేయుచున్నట్లు చూపియుండెడివాఁడేమో! బౌద్ధమతమున నెట్లు సర్వసత్త్వములకును బుద్ధత్వప్రాప్తి లభ్యమో అట్లే నాట్యాభినయములును సర్వసత్త్వలభ్యములే; బుద్ధత్వప్రాప్తియందు కష్టముండిన నుండవచ్చునేమోకాని యిందెంతమాత్రమును కష్టము లేదని చూపుటకే శిల్పి సామాన్యులయిన కుబ్జాదిగణములు కూడ లయబద్ధములైన శరీరభంగిమలతో నాట్యాభినయములు చేయుచుండినట్లు రచియించినాఁడు.

అభినయమును బురస్కరించుకొని యుండు జంత్ర, గాత్రసంగీతముకూడ చిత్రశిల్పమునఁ బ్రదర్శితమయినది. గాత్రపాట శిల్పమునఁ జూపుట యసాధ్య మగుటచేత తాళము వేయుచుండినట్లు చూపఁబడిన చిత్రరచనములవలన నది యూహాసాధ్యము కావింపఁబడినది. ఇఁక జంత్రవాద్యము వేణువు, ఒకవిధమయినవీణ ( Harp ) మొదలయినయుపకరణములవలనఁ దెలుపఁబడినది. ఇప్పుడు మనదేశమున నరుదుగను, పాశ్చాత్త్యదేశములందు సామాన్యముగను గానఁబడు నిట్టివీణ ( Harp ) అమరావతీశిల్పచిత్రములయం దతిసామాన్యముగఁ గనిపించుట విశేషము. కొన్నికొన్ని సందర్భములందు తంతులను వేలితోనే మీటియు, మఱికొన్నిట నొకవిధమయిన సాధనముతో మీటియు నీవీణ వాయింతురు. ఈవిధమగుపద్ధతి నేఁడు మనము గోటువాద్యమునందుఁ గాంచఁగలము.

వేఱువేఱురకము లయినజంత్రసాధనములచే కొందఱు సంగీతమును వర్తించుచుండ నితరులు కొందఱు మృదంగములు మొదలయిన సాధనములతో తాళము వేసి మేళము చేయుచుండినట్లు చెక్కినశిల్పచిత్రము లమరావతియం దనేకములు కలవు. ఈనాఁడు మనకుఁ దెలిసినసంగీతసాధనము లన్నియు నానాఁడుకూడ వాడుకలో నుండినట్లు అమరావతీశిల్పచిత్రములవలన విశదమగుచున్నది. శంఖము, ఒకవిధమయినవీణ ( Harp ), వేణువు, సితారు మొదలయిన జంత్రవాద్యముల నమరావతీచిత్రశిల్పమున గుర్తింపఁగలము. తాళము వేయుటలో పెక్కుసాధనములు గలవు. కరతాళము, తాళపుచిప్పలు, మృదంగము, తబలా, ఢక్క, ఖంజర, తప్పెటలు, వీరణము—ఇంత యేల తాళమునకు నేఁ డుపయుక్తములగున వన్నియు శిల్పచిత్రములందుఁ జూడఁగలము.

**క్షాత్రజీవనము** :— అమరావతీ చిత్రశిల్పమునఁ జూపఁబడిన యుద్ధచిత్రములనుబట్టి యప్పుడు సైన్యము రథ, గజ, తురగ, పదాతిసమేత మని తెలియవచ్చుచున్నది. రథముల నెక్కి యుద్ధము చేయురథికులును, గజతురగముల నెక్కి పోరుసలుపు నాశ్వికులును పెక్కురుండువారు. యుద్ధమున నుపయోగింపఁబడుచుండిన రథములు ద్విచక్రయుతములే యని యుద్ధచిత్రములను బరిశీలించినఁ దెలియఁగలదు. ఇట్టిరథములకు సాధారణముగ రెండుగుఱ్ఱములను గట్టువారు. ఈరథములందు రథచోదకునికిని, రథికునకును సరిపడిన స్థలముమాత్రముండును. ఉత్తరహిందూదేశమున నిప్పుడు వాడుకయం దున్న ‘టోంగా’ యను శకటము ప్రాయికముగ నీమాదిరిరథమున నుండి పరి

sampath_Ebooks



ణాము చెందినదియే కావచ్చును. రథికుఁ డెప్పుడును ధానుష్కుఁడే. ప్రాచీనకాలమున రథికయోధులు ధానుష్కు లన్నవిషయ మీ చిత్ర శిల్పమువలననే కాక పురాణాదిగ్రంథములవలనను, అర్వాచీన వాఙ్మయమువలనను దెలియవచ్చువిషయమే. శిల్పచిత్రములందు రథికుఁ డెప్పుడును నిలుచుండియే యుద్ధము చేయుచున్నట్లు చూపట్టును.

అశ్వద్వయమును బూన్చిన ప్రాగుక్తరథములు కేవలము యుద్ధ వ్యాపారమునందే కాక, కొన్ని కొన్ని ప్రత్యేక సందర్భములందును వాడుకయం దుండినట్లు తెలియుచున్నది. రాజు పట్టాభిషిక్తుఁ డయి యూరేఁగునప్పుడును, దేవదర్శనార్థము కాని, మహాత్ముల సందర్శనార్థము కాని వెడలునప్పుడును, భక్తిగౌరవ ప్రపత్తులు చూపవలసిన యిట్టి యితరసందర్భములయందును ఇట్టిరథములే వాడుకయం దుండెడివి. సామాన్యావసరములయందు రథమును జూపుట వాడుక కాదు. ఈవిషయము వెస్సంతరజాతకకథాచిత్రరంగములను బరిశీలించిన విస్పష్టము కాఁగలదు. ఈజాతకకథయందు యువరాజు వెస్సంతరుఁడు రాజ్యబహిష్కృతుఁ డయి దారపుత్త్రులతో నరణ్యముల కరుగు నప్పుడు, అశ్వవాహక మయిన రథము నెక్కి వెళ్లినట్లు బౌద్ధగ్రంథములయం దున్నను అమరావతీశిల్పి యాకాలమునందలి విధి ననుసరించి రథమునకు ప్రాగుక్తమయిన విశేషప్రయోజనమును జూపుటచేత యువరాజయినను వెస్సంతరుఁడు సామాన్యమయిన యెద్దులబండి నెక్కియే వెళ్లినట్లు చిత్రించినాఁడు. వెస్సంతరజాతక కథావిషయమున చిత్రశిల్పమునందుఁ గనఁబడునట్టిమార్పు కేవల మొక్కయమరావతియందే కాక, దాని కిరుగుపొరుగుల ననఁగా, నాగార్జునికొండ, గోలి మొదలగు స్థలములయందు కొంచె మించుమించుగ నాకాలముననే వర్ధిల్లిన బౌద్ధచిత్రశిల్పమునందును జూపట్టును.

యుద్ధచిత్రములుగల యమరావతీచిత్రశిలాఫలకము లతిశిథిలము లయియుండుటవలన క్షాత్త్రవీర్యోచిత మయిన వేష, భూషా, శిరస్త్రాణాదులనుగుఱించి విశేషముగఁ దెలిసికొనుటకు వీలు లేకయున్నది. కాని క్షాత్త్రవ్యాపారమున నుపయోగింపఁబడుచుండిన యాయుధములను చిత్రములను జూచి గుర్తింపవచ్చును. ధనుస్సు, బాణము, ఖడ్గము, డాలు — (ఇందు సామాన్యముగఁ గానఁబడు కడుచిన్నరకము డాలును, మనుష్యునియంత యెత్తుగల పెద్దరకము డాలును గూడఁ గలవు) —, చక్రము, చిన్నయీఁటె, బల్లెము — ఇవి యానాఁడు వాడుకయందుండిన ముఖ్యమయిన యాయుధములు. ఒంటెలుకూడ యుద్ధరంగమున వాడుకయం దుండినట్లు అమరావతీచిత్రశిల్పమునుబట్టి తెలియుచున్నది.

కట్టడములు :— అమరావతీచిత్రశిల్పమును బరిశీలించిన యెడల మన కందు సామాన్యము లయిన పూరిగుడిసెలు మొదలు రాజహర్మ్యములవఱకును గానవచ్చును. మట్టితోఁ గట్టిన గుడిసెలమీఁద నిప్పటివలెనే జమ్ము, అవురుగడ్డి మొదలయిన రకరకములయిన పూరిని గప్పువారు. ఇట్టి పూరిగుడిసెలలో చుట్టుగుడిసెలును, సమకోణముగఁ దీర్చిన గుడిసెలును కూడ కలవు. రెండవరకము గుడిసెలకు లోపలికి గాలి వచ్చుట కేర్పాటు వేసిన జాలకట్టెలుగూండ్లుకూడ శిల్పమునఁ గానవచ్చును. పేదవారు గుడిసెలయందే కాఁపురము చేయువారు. ఇట్టి పూరిగుడిసెలతోఁ గూడిన చిన్నపల్లె కయినను చుట్టును ప్రాకారపుగోడ యుండెడిది. ఈగోడ ప్రాయికముగ గ్రామస్థులు సాముదాయికము మీఁదఁ గట్టిన దగుటచేతఁ గావచ్చును సాధారణముగ నిటికలతో నిర్మింపఁబడుచుండెడిది.

గుడిసెలకుఁ బిదప, కాఁపురముండువారిస్థితికిఁ దగినట్లు సాధారణగృహములు మొదలు అంతస్తులుగల మేడలును, మిద్దెలును, రాజభవనములును గూడ నుండెడివి. ముందుభాగమున మిద్దెలుగల మేడలు కొన్ని, రెండంతస్తులవి, మూఁడంతస్తులవి కొన్ని శిల్పమునఁ జూపఁ గలవు. వీథిలో జరుగువిషయములను చూచుటకు వీలగునట్లు ముందు వైపునఁ గొన్ని మేడలకు వసారా లుండెడివి. మేడలకు గుఱ్ఱపునాడముల యాకృతిని (Horse shoe) వాతాయనము లుండెడివి. పెద్ద యిండ్లకు నింటికప్పుకొనభాగములును అట్టి యాకృతిని దీర్చుట కలదు. ఉద్యానవనముల నంటి చలువగప్పరము లుండెడివి. ఉద్యానవనములందు జనులు కూర్చుండుటకు నేఁటి పాశ్చాత్యోద్యానవనములందు వలెనే శిలాఫలకములతోఁ గాని, దారువుతోఁ గాని నిర్మించిన పీఠము లుండెను. వీనిలోఁ గొన్నిటికి జనులు కూర్చుండునప్పుడు వెనుక కానుకొనుటకు కమ్ములుకూడ నుండెడివి.

కొన్నికొన్ని యావరణపుగోడలు దారుమయనిర్మాణములను జ్ఞాపకమునకుఁ దెచ్చుచు స్తూపప్రాకారములవలె నున్నవి. గ్రామప్రాకార ద్వారములును, విలాసద్వారములును ( Gate-ways ) తోరణసంశోభితములు. ఇట్టితోరణము లొకటికాని, రెండుకాని, మూఁడుకాని యుండెడివి. దుర్గముల చుట్టును, నగరములచుట్టును గొప్పప్రాకారములను దీర్చువారు. వీనిని గడచి లోపలఁ బ్రవేశించుటకు పెద్దద్వారము లుండెను. ఏతద్దుర్గ, నగరద్వారకుడ్యములు మిక్కిలి యెత్తయినవి. వీని యగ్రభాగములు చైత్యవాతాయనాకృతిని పొంది, రక్షకాగారములయి తనర్చుచుండెను. ద్వారకుడ్యముల లోపలికొనభాగములందు ద్వారమునకుఁ బైని తోరణములవలె నుత్తరవాసము ( Palisades ) లమర్చువారు. వీనిపార్శ్వభాగములనుకూడ రక్షకాగారములవలెనే చైత్యవాతాయనాకృతిని దీర్చుట వాడుక.

బౌద్ధప్రార్థనశాలలయిన చైత్యాగారములును, స్తూపములునుగాక గంధకుటు లని, పుణ్యశాల లని పేరొందిన దేవాలయములు కొన్ని యుండెడివి. వీనియందు చిన్నస్తూపమును గాని, బుద్ధపాదములను గాని పెట్టి పూజించువారు. వీనిని సమకోణాకృతినో, చతురస్రాకృతినో, వృత్తాకృతినో నిర్మించుచుండిరి. వృత్తాకృతిగల యిట్టినిర్మాణము చుట్టు నధిష్ఠానకుడ్యమును, దానిమీఁద స్తంభములు నుండి, పైని ఛత్త్రాకృతి గల విమానముతో నొప్పుచుండెను. ఈవిమానముపార్శ్వములందు స్తూపప్రాకారపరికల్పనలును, చైత్యవాతాయనపరికల్పనలును శృంగా

sampath_Ebooks

రముకొఱకు రచియించువారు. నిర్మాణము వృత్తాకృతిగల దయినయెడల నగ్రభాగమున నొకశిఖరము, నితరాకృతుల నున్నయెడల నాలుగుశిఖరములనో, యంతకెక్కువసంఖ్యగనో యుంచుటయు సంప్రదాయముగ నుండెను. చైత్యశాలలు గుఱ్ఱపులాడములయాకృతి నుండెడివి.

బౌద్ధభిక్షువు లనేకులు వచ్చి నివసించి యధ్యయనము చేయుటకనుకూలము లయియుండవలసిన వనుటచేత బౌద్ధవిహారములు సాధారణముగ స్తూపములకును, చైత్యాగారములకును సమీపమునందుండెడివి. పెక్కుగదులతో శోభిల్లు నిట్టినిర్మాణములందు వందలకొలఁది బౌద్ధభిక్షువులు నివసించుటకు సౌకర్యము లుండెడివి. ఈనిర్మాణములు వృత్తాకృతినో, చతుశ్శాలవిధమున సమకోణాకృతినో, చతురస్రముగనో యుండెను. చతుశ్శాల ననుకరించు నిట్టినిర్మాణమునడిమిభాగమున మండువావిధమున ఖాళీస్థల ముండును. ఈ ప్రదేశముమధ్యభాగమున అశ్వత్థవృక్షముకాని, దానినిబోలి గొప్పనీడ నొసఁగు మఱియొకవృక్షముకాని యుండుట వాడుక. చతుశ్శాలరీతిని, చతురస్రముగను నిర్మితములయిన విహారములందు ఏదో యొకప్రక్క నున్నశాల మహాసనగృహముగ నుండును. మిగిలిన మూఁడుప్రక్కలనున్న శాలలు పెక్కుగదులుగ విభక్తములయి భిక్షుకావాసమునకనుకూలము లయియుండును. ఈగదులద్వారములు లోపలఁగల ఖాళీప్రదేశమువైపే కాని వీథివైపుండవు. ఒక్కొక్కగదికి గాలి వచ్చుట కనువగు చైత్యవాతాయనాకృతిని గవాక్ష ముండును. వీథివైపునుండి చూచినచో నీవాతాయనము లొకచక్కని మాలికవలె నయనపర్వ మొనరించుచుండును. చతుశ్శాల ననుకరించు మూఁడంతస్తుల విహారములుకూడ అమరావతీ చిత్రశిల్పమునఁ గానవచ్చును.

వేషభూషాదులు :— అమరావతీశిల్పచిత్రములను బరిశీలించినయెడల వేషభూషాదుల ననుసరించి శిల్పి తీర్చిన ఆయాతరగతులవారి స్థితిని నిర్ణయింపవచ్చును. ఇట్టివారిలో ముందుగ రాజుల వేషాదులను గుఱించి విచారింతము.

రాజులు పెద్దకిరీటములను గాని, చిన్నమకుటములను గాని, భూషణాలంకృత మయినశిరోవేష్టనమును గాని ధరించుచుండిరి. శిరోవేష్టనమును పార్శ్వభాగములకు కొరకొప్పు వచ్చునట్లు ధరించుటయుఁ గలదు. ఆకాలపువారు పెక్కువిధము లయినకర్ణభూషణములను ధరించుచుండిరి. అర్వాచీనశిల్పశాస్త్రవిహితము లయిన మకరకుండలములును, పత్రకుండలములును ఈరకములలోనికొన్నిటిపరిణామములే. చేతులకు కంకణములను, కేయూరములను, కంఠమునకు హారములను ధరించుచుండిరి. సన్నవలిపెంపుమల్లుసెల్లాలను కుచ్చెళ్లు పోసి, బిళ్లగోఁచి పెట్టి రకరకముల నందమయినరీతులఁ గట్టుచుండిరి. కట్టినదోవతిమీఁద నడుమునకుఁ జక్కనియుత్తరీయములును శృంగారమొలుకునట్లుచుంగులు వదలి ముడివేయువారు. కటిబంధమును ధరించువారు.

రాజులకును, రాజకుమారులకును వేషాలంకరణములయందెక్కువవ్యత్యాసము కానరాదు. రాజకుమారు లెప్పుడును కిరీటమును గాని, చిన్నమకుటమును గాని దాల్చువారు కారు. రాజకుమారు లుష్ణీషమును చిత్రమయినరీతుల మిక్కిలి సొంపుగ రచియించువారు. రూపసంపదయం దీరాజకుమారు లెప్పుడును యౌవనవంతులుగఁ గనఁబడునట్లు శిల్పి తీర్చుచుండెను.

ప్రభువుల వేషధారణముకూడ కొంచె మించుమించుగ రాజవేషమును బోలియేయుండెడిది. ఎటు వచ్చియు వీరికి మకుటాదు లుండవు. తలపాగాలను చక్కనిరీతులను జుట్టువారు.

మంత్రులవేషము రాజ, ప్రభువేషమున కించుక భిన్నమయినది. మంత్రు లుత్తరీయమును యజ్ఞోపవీతమును ధరించుచక్కని వల్లెవాటుగ వేసికొనువారు. ఉష్ణీషమును వీరు ఇప్పటిపార్సీకులటోపీల వలె నిలువుగఁ దీర్చి ధరించుచుండిరి. కొన్నికొన్నిరంగములందు మంత్రుల కుష్ణీషమే కానరాదు. వీరికి కుండలాదులును లేవు. బిళ్లగోఁచీ పెట్టి దోవతిని ధరించువారు. మంత్రికి రాజసింహాసనము సమీపముననే యించుక దిగువను పీఠ ముండెడిది. తత్పీఠమున నాసీనుఁ డయి యితఁడు రాజాజ్ఞలను తాళపత్రములమీఁద వ్రాయువాఁడు; రాజకీయలేఖలను (తాళపత్రములమీఁద వ్రాసినవి) రాజునకుఁ జదివి వినిపించువాఁడు.

బ్రాహ్మణులకును, యతులకును భూషణము లుండవు. యతులు పెక్కురీతుల జటాధారణము సేయువారు; గడ్డములను పెంచి పెక్కురకముల వానిని పరిష్కరించువారు. బ్రాహ్మణులు కొందఱు శిరోజములను పెంచక దగ్గఱగ కత్తిరించెదరు. యతులును, బ్రాహ్మణులును సూత్రాకృతి యైనయజ్ఞోపవీతమును గాని, దానికి బదులుగ యజ్ఞోపవీతధారణపద్ధతిని కృష్ణాజినమును గాని ధరించుచుండిరి. యతులు మలయాళదేశీయులపద్ధతిని దోవతిని గట్టువారు. బ్రాహ్మణులలోఁ గొందఱు అంగవస్త్రములను మోకాలివఱకే వచ్చునట్లు కట్టుటయు శిల్పమునఁ జూడఁగలము.

బౌద్ధభిక్షువులు ముండితశిరస్కులు. తమిళులపద్ధతిని లోపల దోవతిని ధరించి, పైని యజ్ఞోపవీతధారణపద్ధతిని చీలమండవఱకునుండు 'సంఘాటి'ని వల్లెవాటుగ ధరియింతురు. వీరొక్కొకప్పుడు గాంధారపద్ధతి నీసంఘాటి నొడలంతయుఁ గప్పునట్లు ధరించుటయుఁ గలదు. వీరు భూషణరహితులు. శిల్పులు బౌద్ధభిక్షువులను జ్యోతిఃప్రభారహితుఁ డయినబుద్ధునిమాదిరిగే చెక్కుచుండిరి.

యోధులు శిరస్త్రాణములను ధరించుచుండిరి. యోధులకు భూషణము లుండెడివి కావు. వీరు దోవతిని చుంగులు వెనుకకు విఱిచి కట్టి పైజామావలెఁ గానవచ్చునట్లు ధరించుచుండిరి. ఒక్కొక్క కాలిబంటునకు నడుమునకు కొంచె మెగువను మూఁడు విడివిడివరుసలుగ చుట్టి కట్టినపట్టీలును, వేటకట్టువలె 'కత్తిరికోలు' విధమున ధరించినపట్టీలును ఉండెడివి. నడుమునకుఁ జుట్టి కట్టినమూఁడు వరుసలపట్టీలును, పురోభాగమున 'కత్తిరికోలు' విధమున ధరించిన పట్టీలును ఆకాలపుకాలిబంటుల లాంఛనములుగఁ గనిపించును. సేనా

sampath_Ebooks

# అమరావతీస్తూపము



అమరావతీశిల్పఖండము ౨: ఉష్ణీష వేణీబంధాలంకారములు

sampath_Ebooks


# అమరావతీ స్తూపము



అమరావతీశిల్పమునుండి : రథ, తురగాలంకారములు : యోధవేషాయుధాదులు

sampath_Ebooks

# అమరావతీస్తూపము



౧. బుద్ధపాదములు
౨. త్రిశూలము
౩. కర్ణాభరణములు
౪. మహానాగము
౫. పురద్వారతోరణములు
౬. పుణ్యశాల
౭. ప్రాసాదము

sampath_Ebooks

# అమరావతీస్తూపము



అమరావతీశిల్పమునుండి : వేణీబంధాలంకారములు

sampath_Ebooks



పతులు ప్రభువులమాదిరిగ వేషధారణము చేసి అశ్వారూఢు లయియుండువారు. అమరావతీప్రాంతమున నాంధ్రరాజాస్థానములయందు విదేశీయయోధులుకూడ నుండి రని అమరావతీశిల్పమున వారికిఁ దీర్చిన దుస్తులనుబట్టి యూహింపవచ్చును. ఈ విదేశీయయోధులు పొడుగయిన యంగీలను తొడుగుచుండిరి.

విదేశములనుండి స్థానికరాజాస్థానములకు వచ్చురాయబారులను వారు ధరించు పొడుగయిన కంచుకములనుబట్టి వేర్పఱచి చూపవచ్చును. వీరు ధరించుదోవతిమీఁది కంచుకము మోఁకాలివఱకును వచ్చును. వీరు నడుమునకు కటిబంధమును ధరించి యందునుండి ఖడ్గమును వ్రేలవేయువారు. ఈరాయబారులలోఁ గొందఱకు కుళ్ళాయముండెను; కొందఱి కుండదు.

దాసజనము మోఁకాలు దిగని చిన్నపంచె కట్టి నడుమునకు రుమాలు చుట్టుచుండిరి. సేద్యము సేయునప్పుడు కృషీవలులు పంచె కుచ్చెళ్లు వెనుకకు విఱిచి కట్టువారు.

నడిమితరగతులవారు దుస్తు లిప్పటివలెనే ధరించి కొంపెసిగలను, ప్రక్కసిగలను దీర్చుచుండిరి.

కటిభాగమునకు పైని నగ్నలుగఁ జూపఁబడినను దిగువభాగమున స్త్రీలకు వస్త్రధారణ ముండెడిది. వీరు బహువిధాభరణభూషితలు. వీరికర్ణములకు కుండలములు, చేతులకు కంకణ, కేయూరములు, మెడలో తారహారములు, మొలకు మేఖలలు, కాలికి నూపురములు నుండెడివి. కొన్నికొన్ని స్త్రీచిత్రములకు కాలి కొక్కొక్క నూపురమును, రెండేసినూపురములనుమాత్రమే యున్నను చాలజతల నూపురములతో నొప్పు స్త్రీచిత్రములనుగూడ అమరావతీశిల్పమునఁ గాంచఁగలము. ఇట్టినూపురములలోఁ గొన్నిటికి మువ్వలుకూడఁ గలవు. నేఁడు దక్షిణహిందూదేశమునందలి యాంధ్ర, కర్ణాట, తమిళ, మలయాళదేశములందలి స్త్రీ లెన్నెన్నివిధములఁ దమశిరోజములను బరిష్కర మొనర్తురో యన్నన్నివిధముల, ఇంక నంత కెక్కువ రీతుల నమరావతీస్త్రీలు శిరోజములను సొగసుగ పరిష్కరించుకొనుచుండినట్లు అమరావతీశిల్పచిత్రములనుబట్టి తెలియఁగలదు. రాణులును, గొప్పయింటి యాఁడుఁబడుచులును పాపటబొట్టువలె నుదుటిమీఁదికి వ్రేలాడు నొకవిధమయిన యాభరణమును ధరించుచుండిరి. వేశ్యలు నూలుకుళాయలను ధరించుటకూడఁ గలదు. అమరావతీశిల్పమునఁ దీర్చినస్త్రీలు గొప్పవా రయినది, కాఁదివా రయినది వారివేషభూషాదులనుబట్టియే నిర్ణయింపవచ్చును.

అమరావతీశిల్పమునఁ గానవచ్చు స్త్రీప్రతిమలను గాంచినచో నాఁటికాలపుస్త్రీలు సౌందర్య, శృంగారములమీఁద నెంతటిలక్ష్యముంచువారో విశదము కాఁగలదు. అమరావతీశిల్ప మాంధ్రభూమిని కళామయము కావించి యాంధ్రులకు కీర్తిప్రతిష్ఠలను సముపార్జించినది. ఆధునికసభ్యతాసంస్కృతులు సౌందర్యాలంకారములవిషయమునఁ గలిగించిన ప్రతిపరిణామమును ఇప్పటికి రమారమి రెండువేల సంవత్సరముల క్రిందట రేకెత్తి విలసిల్లిన అమరావతి ఆంధ్రకళయందే నయనగోచర మగుట ఆశ్చర్యజనకముకదా!

[ టి. యన్. రా. ]

ప్రమాణగ్రంథములు :

Burgess — Topes of Amaravati and Jaggayyapeta.

Fergusson — Tree and serpent worship.

T. N. Ramachandran — Goli Sculptures.

R. Chanda — Some unpublished Amaravati inscriptions. ( Ep. Ind., Vol. xv, p. 258).

**అమరావత్యమామహేశ్వరశతకము** — విశ్వనాథ కామయ్యకృతము. తెలుఁగులో వ్రాయఁబడిన శివస్తోత్రము.

**అమరి**, మైకేల్ (క్రీ. శ. ౧౮౦౬ - ౧౮౮౯)—ఇటలీదేశపు చరిత్రకారుఁడు. పౌరస్త్యభాషావేత్త, రాజకార్యనిపుణుఁడు. ఇతఁడు ౧౮౩౮ లోను, ౧౮౪౨ లోను చరిత్రగ్రంథములను కొన్నింటిని ప్రకటించెను. సిసిలీసంబంధముగ నితఁడు వ్రాసినగ్రంథమందలి రాజకీయాభిప్రాయమునకు వెఱచి యప్పటిగవర్నమెంటువా రాగ్రంథము నణఁగఁద్రొక్క యత్నించిరి. ఆగ్రంథము నాతఁడు ఫ్రాన్సులోని పారిసుపట్టణమునందు మాఱుపేరుతో ప్రకటించెను. ౧౮౪౮ లో సిసిలీదేశమున ప్రజలు తిరుగఁబడినప్పు డాతఁడు పారిసుపట్టణమునకుఁ బోయి కొన్నిసంవత్సరములవఱకును విద్యాప్రసంగములతో కాలము గడుపుచుండెను. దేశోద్ధారకుఁడైన గ్యారిబాల్డితోఁ గలసి దేశసేవ చేయవలె నని యాతఁడు ౧౮౫౯ లో మరల ఇటలీదేశమునకు వచ్చెను. ౧౮౬౧ లో సెనేట్‌సభాసభ్యుఁ డయ్యెను. ౧౮౬౨-౪ కాలమున విద్యాశాఖకు మంత్రిగ నుండెను. కొన్నిసంవత్సరములవఱకును పైజాలోను, తరువాతను ఫ్లారెన్సులోను అరబ్బీభాషకు మహోపాధ్యాయుఁడుగ నుండెను.

**అమరుకకావ్యము** — నాయికానాయకుల శృంగారచేష్టలను వర్ణించునట్టి యొకచిన్నసంస్కృతశతకము. ఇది అమరుకుఁడను కవిచే రచియింపఁబడె నని కొంద ఱందురు. మఱికొందఱు శంకరాచార్యులు కామశాస్త్రము నభ్యసించునిమిత్తము తనశరీరమును విడిచి యొకచోట నుంచి చనిపోయిన అమరుకుఁ డనురాజు యొక్క శరీరములోఁ బ్రవేశించి ఆతనిభార్యలతో విలాసంబును సలుపుకాలంబున నాతఁడు వ్రాసినట్టికావ్య మిది యని చెప్పుదురు. ఈ యమరుకుఁ డెవఁడో నిశ్చయముగఁ దెలియలేదు. ౯-వ శతాబ్దియం దుండిన ఆనందవర్ధనాచార్యుఁడు తనధ్వన్యాలోక మను అలంకారగ్రంథమునందు నిందలిశ్లోకముల నుదాహరించుటచే నీయది యంతకుఁ బూర్వము రచింపఁబడిన దని మన మూహింపవచ్చును.

sampath_Ebooks

ఇందుపై అర్జునదేవ, రుద్రమదేవ, సూర్యనారాయణ, శేషరామకృష్ణ, పెదకోమటివేమభూపాలాదికవిరచితము లైనవ్యాఖ్యానములు పెక్కులు కలవు. వీనిలో పెదకోమటివేమభూపాలుడు కొండవీటిలో క్రీ. శ. ౧౪౦౦–౧౪౨౦ వఱకును రాజ్యము చేసినరెడ్డిరాజు.

ఈ కావ్యమును తాళ్ళపాక వేంకటేశ్వరదీక్షితులకుమారుడైన తిరువెంగళప్ప తెనిగించియున్నాడు.[1] ఈ భాషాంతరమందలి పద్యములు రసవంతములుగ నున్నవి. ప్రతిపద్యమునకును పూర్వము వ్యావహారికభాషలో గద్యరూపమైన యవతారిక కలదు. దీనికి సీస పద్యములతో చేయబడిన మఱియొక భాషాంతరమును గానవచ్చుచున్నది. కాని, అది యంత సరసముగ లేదు. గ్రంథకర్త యెవడో తెలియదు.[2] దీనికి తెనుగున ప్రతిపదార్థము వ్రాసి వేమభూపాలుని వ్యాఖ్యానముతో ఇటీవల బ్రహ్మశ్రీ వేదము వేంకటరాయశాస్త్రి గారు ప్రకటించియున్నారు.

**అమరేశ్వరుడు** — ఒక యాంధ్రకవి. ఇతనికావ్యమొద్దియు నిప్పుడు కానరాకున్నను ఒకప్పు డీతడు గొప్పయాంధ్రకవిగా బరిగణింపబడుచుండెనని ఇతరకవులు స్తుతించుటచే దెలియుచున్నది. ఇతనిని మొట్టమొదట స్తుతించినవాడు ఛందస్సును రచించిన అనంతామాత్యుడు. తనచే రచింపబడిన 'భోజరాజీయము'నందు బూర్వకవులను స్తుతించుచు 'వే, రెన్నిక కెక్కినట్టియమరేశ్వరు.........పలుకు' నని చెప్పెను. అనంతామాత్యుడు పదునైదవశతాబ్దిమధ్యమునందు (క్రీ. శ. ౧౪౩౫) నుండినవాడు (చూడుడు, అనంతామాత్యుడు). కావున నమరేశ్వరుడు ౧౩ లేక ౧౪-వ శతాబ్దివాడై యుండవలెను. 'క్రీడాభిరామము' అను గ్రంథమునందు వల్లభరాయకవి 'చిమ్మపూడి యమరాధిపు డెన్నను సత్కవీశ్వరుల్' అని చెప్పి యాతనిని గొప్పకవులలో జేర్చెను. వల్లభరాయనికాలము క్రీ. శ. ౧౪౨౦ అని యందురు[3]. ౧౬-వ శతాబ్దియంతమువాడైన భట్టుమూర్తి 'నరసభూపాలీయము'నందు నితనిని 'శ్రీనాథునిపద్యప్రసిద్ధధారాశుద్ధి, యమరేశ్వరునిసహస్రముఖపుష్టి' యని మహాకవులతో సాటిగ బొగడియున్నాడు. ఇట్లీకవి పూర్వకాలమునందు నన్నయ, తిక్కన, శ్రీనాథాదులతో సమానముగ స్తుతింపబడుచుండెను. పదునాఱవశతాబ్దియంతమువఱకు నీతనిచే రచింపబడిన 'విక్రమసేనము' అను కావ్యము వాడుకలో నుండినట్లు స్పష్టమగుచున్నది. పదునాఱవశతాబ్దివాడగు జగన్నాథకవి యనునాతడు వేఱువేఱుకవులవర్ణనములను సంగ్రహించి ప్రబంధరత్నాకర మన్నకావ్యము నొకదానిని సమకూర్చెను.[4] అందు నమరేశ్వరుని 'విక్రమసేనము' లో నుండి ౫౦ పద్యములకంటె నెక్కుడు పద్యము లుదాహరింపబడినవి. ౧౮-వ శతాబ్దిమధ్యమం దుండిన కూచిమంచి తిమ్మకవిరచితసర్వలక్షణసారసంగ్రహమునం దమరేశ్వరుని విక్రమసేనమునుండి యొకపద్యము నిచ్చియున్నాడు. ఆతడీగ్రంథమును స్వయముగ జూచియే వ్రాసెనో లేక యితరగ్రంథములయందుండి గ్రహించెనో? ఎట్లయిన నేమి యీ మహాకవి యొక్క విక్రమసేనకావ్యము ౧౮-వ శతాబ్దినుండి తెలుగుదేశమున లోపించినది. ప్రబంధరత్నాకరములో నిందుండి ౫౨-౬౦ పద్యము లీయబడినను అన్నియు వర్ణనములు గనుక, గ్రంథవిషయమును గుఱించి కాని, యందలి నాయికా నాయకులను గుఱించి కాని యేమియు దెలిసికొనుటకు వీలు లేదు.

అమర్షణుడు — (పు. సం) శ్రీరామచంద్రుని పుత్త్రుడైన కుశునిసంతతివాడైన రఘునివంశమునందు బుట్టినసంధియను రాజుయొక్క కుమారుడు. ఇతనిపుత్త్రుని పేరు మహస్వంతుడు.

అమరుకుడు — శుక్రాచార్యునియొక్క యిద్దఱు పుత్త్రులలో రెండవవాడు.

అమల — వైవస్వతమన్వంతరమందలి అత్రిఋషియొక్క కన్య. ఈమె మిక్కిలి బ్రహ్మనిష్ఠ గలది.

అమలపాడు — గంజాంజిల్లా తెక్కలి తాలూకా యందలి జమీందారీగ్రామము. జనసంఖ్య ౩,౧౫౭ (౧౯౩౧).

అమలానందుడు — ౧. అనుభవానందుని శిష్యుడు. ఇతడు 'శాస్త్రదర్పణము' (బ్రహ్మసూత్రములపై భాష్యము) అను గ్రంథమును రచించెను. అమలానందుడు ౧౩-వ శతాబ్దివాడు. కృష్ణదేవుని యాస్థానమున నుండెను.

౨. క్రీ. శ. ౧౨౪౭-వ సంవత్సరమున దేవగిరిని పాలించిన కృష్ణభూపాలుని సమకాలికుడు. శంకరాచార్యులవారు వ్రాసిన వేదాంతసూత్రభాష్యమునకు భామతి యనుటీక కలదు. దీనిని రచించినవారు వాచస్పతిమిశ్రులు. ఈభామతికి మరల వ్యాఖ్యానరూపముగ నమలానందుడు వేదాంతకల్పతరు వను గ్రంథమును లిఖించెను. ఈయన గొప్పవేదాంతి.

**అమలాపురము** — ౧. (గ్రామము). అమలాపురము తాలూకాకు ముఖ్యస్థలము. జనసంఖ్య ౧౫,౧౬౩ (౧౯౩౧).

---

1. Triennial Catalogue of Manuscripts in the Oriental Manuscrpit Library, Madras 1910-11 to 1912-13.
2. Ibid., R. No. 17. లైబ్రరీలోని నెంబరు క. ౪౧౭.
3. బ్రహ్మశ్రీ మానవల్లి రామకృష్ణకవిగారు క్రీడాభిరామమును బ్రకటించి యందలిపీఠికలో 'ఈ గ్రంథము క్రీ. ౧౪౨౦ లోగా రచితమైనది' అని వ్రాసినారు. కాని యీకవికాల మింకను నిశ్చయముగ దెలిసికొనవలసియున్నది.
4. ఈ గ్రంథముయొక్క ప్రతి తంజావూరుపుస్తకభాండాగారమునం దున్నది.

sampath_Ebooks

అందు మగవారు ౭,౫౮౧; ఆడువారు ౭,౫౮౨; హిందువులు ౧౪,౨౩౦. మహమ్మదీయులు ౬౫౬. క్రైస్తవులు ౨౭౭. ఇక్కడ నుండు అధికారులు :— తహసీల్ దారు, స్టేషనరి సబ్ మ్యాజిస్ట్రేటు, డిస్ట్రిక్టు మునసబు, సబ్ రిజిస్ట్రారు. ఇచ్చట ఒక పోలీసుస్టేషన్, రాదారి బంగళా, స్వదేశీయులకై కారొనేషన్ విశ్రాంతిగృహము, లోకల్ ఫండు ఆసుపత్రి, హైస్కూలు కలవు. ఇది రాజమహేంద్రవరమునకు ఆగ్నేయదిక్కున ౩౫ మైళ్లదూరమున ముఖ్యమయిన కాలువమీఁద నున్నది.

౨. (తాలూకా). తూర్పుగోదావరి జిల్లాలోని ఒక తాలూకా. దీనివిస్తీర్ణము ౩౬౭ చదరపుమైళ్లు. ఇందు మొత్తముమీఁద ౧౦౭ గ్రామములు కలవు. వానిలో ౭౬ గవర్నమెంటు గ్రామములు, ౨౫ జమీన్ దారీ గ్రామములు, ౬ ఈనాం గ్రామములు. ఈతాలూకా ఒక త్రిభుజమువలె నుండును. గోదావరీశాఖలైన వసిష్ఠ, వైనతేయము, గౌతమి యను నదులకును, సముద్రమునకును నడుమ నున్నది. ఇందు నగరములంకయుఁ గలదు. ఇది యంతయు గోదావరీనదియొక్క మధ్య డెల్ టాలోనిభాగము. ఈ తాలూకా లోని విశేషభూములు పంటకు మిక్కిలి అక్కఱకు వచ్చునట్టి ఒండు భూములు. ఇందలి జనసంఖ్య ౨,౫౯,౦౮౯ (౧౯౩౧). వీరిలో ౧,౨౬,౦౧౯ మంది పురుషులు, ౧,౩౩,౦౭౦ మంది స్త్రీలు. గోదావరిజిల్లాలో అన్ని తాలూకాలకంటె నిందు ఎక్కువ జనసమ్మర్దము కలదని చెప్పవచ్చును. ఇందలిజనులలో ౩,౦౦౩గురు మహమ్మదీయులు, ౮౪౩ మంది క్రైస్తవులు, మిగిలినవారందఱును హిందువులు.

ఇందలి పల్లపుభూము లన్నియు కాలువ పాఱుదలవలన ఫలించును. అయినను అచ్చటచ్చట బావులక్రిందను వ్యవసాయము చేయు నాచారము కలదు. పురాతనకాలమునుండియు ఈ తాలూకాలో పెద్దపెద్దబావులక్రింద తోఁటలు మొదలైనవి పండించు నాచారము కలదు. కొన్ని పురాతనములైన బావులను జైనులబావు లని, రెడ్లబావు లని అచ్చటి జనులు వాడుదురు. పూర్వకాల మచ్చట జైనులు నివసించి రని చెప్పెదరు. అచ్చటి జనులు ఈదేశము పాంచాలదేశమనియు, అమలాపురము దానికి రాజధానిగ నుండె ననియు చెప్పుదురు. కాని భారతమునందు వర్ణింపఁబడిన పాంచాలదేశ మిది గా దనుట నిశ్చయము. ఈ తాలూకాలో వ్యవసాయమే ముఖ్యవృత్తి. ఇదివఱకు దేవాంగులు బట్టలను నేసి యితర దేశములకుఁ బంపుచుండిరి. కాని బెండమూడిలంక రేవుయొక్క ప్రముఖత తగ్గినప్పటినుండియు ఈ వ్యాపారము నశించినది. బెండమూడి లంకలో ౧౭౫౧-వ సంవత్సరమున ఈస్టు ఇండియా కంపెనీవారు వర్తకము నిమిత్తము ఒకగిడ్డంగి (Factory) కట్టిరి. ఫ్రెంచి సేనాని యగు బుస్సీ ౧౭౫౨ లో దానిని స్వాధీనపఱుచుకొనెను. కొంతకాలము యుద్ధానంతరమున మరల నది కంపెనీవారికి స్వాధీనమయ్యెను. సీమబట్టలు వచ్చినతరువాత క్రమముగ నచ్చటి వర్తకము తగ్గిపోయెను. ఈ తాలూకాలోని అంబాజీపేట అను గ్రామమునందు పసువులసంత జరగుచుండును. ఈ ప్రాంతమును ఆంధ్రులు సాధారణముగ కోనసీమ యందురు. ఇందలి పేరూరు అను గ్రామమున మిక్కిలి పూర్వకాలమునందు ద్రావిడ బ్రాహ్మణులు కొందఱు వచ్చి నివసించిరి. వారిని పేరూరుద్రావిడు లందురు. నేదునూరు, ఆత్రేయపురము అను గ్రామములలో జైనులకు సంబంధించిన శీర్ణ శిలాశాసనాదులు కలవు.

౩. బళ్లారిజిల్లా కుడ్లిగితాలూకా యందలి గ్రామము. జనసంఖ్య ౫౫౩.

౪. విశాఖపట్టణముజిల్లా గొలుగొండ తాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౧,౩౩౨ (౧౯౩౧).

**అమలుఁడు** — దుష్టబుద్ధి యనుమంత్రియొక్క కనిష్ఠపుత్రుఁడు (మాధవుఁడు, చంద్రహాసుఁడు).

**అమల్ నామా** — హిందువులలోని చిత్రగుప్తుఁడు లోనగువారిం బోలె ముసల్మానుదేవతలలోఁ గొందఱు సంసారములోని సకలకార్యములజాబితాలను వ్రాయువారు గలరు. ఈలాగున వీరు వ్రాయువృత్తాంతమునకే అమల్ నామా యని పేరు.

**అమల్ నేర్** — ౧. (గ్రామము). బొంబాయిరాజధాని, తూర్పుఖాందేశ్ జిల్లాలోని అమల్ నేర్ తాలూకాకు ముఖ్యస్థలము. జనసంఖ్య ౧౦,౨౯౮. ఇచ్చట ఒకమునిసిపాల్టీ కలదు. ఇక్కడ ధాన్యవర్తకము అధికముగా నుండును. ఇక్కడ రెండు ప్రత్తిఫ్యాక్టరీలు గలవు. సఖారాంబావా యను ఒకమహాత్ముఁడు ౧౮-వ శతాబ్దిలో నిచ్చట నుండెను. ఆతనిపేర నొకదేవాలయ మున్నది. మే నెలలో ప్రతిసంవత్సరమును ఉత్సవము జరుగుచుండును. ఇచ్చట నొక సబ్ జడ్జికోర్టును, ఒక ఆసుపత్రియు, రెండు బాలురపాఠశాలలును, ఒక బాలికాపాఠశాలయుఁ గలవు.

౨. (తాలూకా). బొంబాయిరాజధాని, తూర్పుఖాందేశ్ జిల్లాలోని ఒకతాలూకా. విస్తీర్ణము ౫౨౮ చదరపుమైళ్లు. గ్రామములసంఖ్య ౨౨౮. జనసంఖ్య ౧,౧౧,౯౩౩. భూమిపన్ను రు. ౩,౪౦,౦౦౦. సెస్సులు రు. ౨౩,౦౦౦. తపతీ నదియు, దానియుపనదులగు బోరి, పాంఝ్రానదులును ఈతాలూకా లోనిభూములకు జల మిచ్చును. ఇచ్చటిశీతోష్ణస్థితి ఆరోగ్యకరమైనది. వర్షమానము సంవత్సరమునకు ౨౩ అంగుళములు.

**అమవసువు** — పురూరవునికొడుకు. వీనికి విజయుఁడని నామాంతరము కలదు.

**అమానిగంజ్ హాట్** — బంగాళరాజధాని యందలి ... జిల్లాలోని ముఖ్యమైన పట్టువర్తకస్థలము. ఇచ్చట విశేషజనులు కాఁపుర ముండరు గాని చుట్టుపట్టులనున్న ముర్షిదాబాదు, రాజషాహి

జిల్లాలలోనుండి వర్తకులు పట్టుపురుగులనిమిత్తము పట్టుదారమునిమిత్తము వందలువందలుగా సంతకు వచ్చుచుందురు. ఎక్కువగా వర్తకము జరుగుదినములలో ఒకసంతదినమున లక్షరూపాయలవర్తకము గూడ జరుగును.

అమానిగుడిపాడు — కర్నూలుజిల్లా మార్కాపురం తాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౨,౪౦౦ (౧౯౩౧).

అమానిచిరువెళ్ల — నెల్లూరుజిల్లా ఆత్మకూరు తాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౧,౭౧౧

అమానిజమ్ములమడక — గుంటూరుజిల్లా పల్నాడు తాలూకాయందలి ఈనాం గ్రామము. జనసంఖ్య ౧,౬౬౬ (౧౯౩౧).

అమా౯దాసు — సంగ్రామషా యను గఢమండలరాజు ... మామగారు. ఇతనితండ్రి యస్తదాసనువాడు. అర్జునదాసునకు కొడుకుతో సరిపడలేదు. అమా౯దాసు తండ్రిని చంపి రాజ్యమాక్రమించుకొనవలయునని ప్రయత్నము చేసి పారిపోయెను. తరువాత మరల ఢిల్లీతన్నోడించి తనతండ్రిపక్షమునకు జేరియున్న నరసింగదేవు నాశ్రయించి రాజ్యమును సంపాదించుకొనెను. ౧౫౦౮-వ సంవత్సరములో అమా౯దాసు ఢిల్లీచక్రవర్తియగు బహాదూరుషాకు యుద్ధమున సాయపడి 'సంగ్రామషా' యనుబిరుదమును బొందెను.

అమారెడ్డిపాలెం — నెల్లూరుజిల్లా కోవూరు తాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౧,౪౯౩ (౧౯౩౧).

అమూర్తరయుడు — ఒక ఋషి (పాలకుడు, భృగువు).


అమోద్ — బొంబాయిరాజధానిలోని ఒకచిన్నసంస్థానము. దీని వైశాల్యము ౨౦౦ చ. మైళ్లు. ఆదాయముమాత్రము రు. 3 వేలే. జనసంఖ్య ఇంచుమించుగ ౫ వే లుండును. ఇందలిప్రజలలో చాలమంది భిల్లులు.

అమాల — బొంబాయిరాజధానియందలి ఒక మిక్కిలి చిన్నసంస్థానము.

అమావసువు — పితృదేవతలలో నొకడు. ఇతడు మంచి ఇంద్రియనిగ్రహము గలవాడు. ఇతనినిగూర్చి యీక్రిందికథ కలదు:— అచ్ఛోద యనునామె యొకపితృదేవతమానసపుత్రిక, అమావసువును వలచి యతనిని లోబఱచుకోవలయు నని ప్రయత్నించెను. కాని యాప్రయత్నము వ్యర్థ మయ్యెను. అమావసు వామెను నిరాకరించివైచెను. ఈసంగతి తక్కినపితృదేవతలు విని యతని ప్రవర్తనబలమునకు మెచ్చి యచ్ఛోద నతడు నిరాకరించినదినము తమకు సుదిన మని నిర్ణయించుకొని అమావసువు పేర నానాటికి అమావాస్య యని పేరిడిరి.

పితృదేవతలు అచ్ఛోదను మర్త్యలోకమున జన్మింపుమని శపించిరి. ఆకారణమున నామె మత్స్యగంధియై (సత్యవతి) యీలోకమునఁ బుట్టినది.

**అమావాస్య** — ఈ శబ్దమునకు అమావస్య అనియు రూపాంతరము గలదు. సూర్యచంద్రులకు పూర్వ, పశ్చిమాంతరమేమియు లేక వారిద్దఱును ఒక్కచోట నుండుకాలము. ఇదియే కృష్ణపక్షమందలి ౧౫-వ తిథి. ఈదినమున చంద్రుడు కానరాడు. చంద్రునికళలు బహుళపాడ్యమినుండి తగ్గుచు తగ్గుచు అమావాస్యనాఁటికి పూర్తిగ లోపించును. శుద్ధపాడ్యమినుండి యెక్కుచు పూర్ణిమనాఁటికి పూర్తియగును. ఈ విధముగ చంద్రకళలు హెచ్చుటకును తగ్గుటకును కారణములు విచారింతము. చంద్రునకు స్వతస్సిద్ధమైన తేజస్సు లేదు. భూమివలెనే అతఁడును సూర్యుని తేజస్సుకలననే ప్రకాశించును. చంద్రునియొక్క యేభాగమునందు సూర్యకిరణములు పడునో యది ప్రకాశవంతముగను, మిగిలినభాగము చీకటిగను ఉండును. గోళాకారముగ నున్న చంద్రుని-అర్ధభాగముమీఁద సూర్యుఁ డెప్పుడు ప్రకాశించుచుండినను, చంద్రుఁడు భూమి చుట్టును, తన చుట్టును తిరుగుచుండుటచే ప్రకాశవంతమైన అతని భాగమంతయు మనకు అన్నిసమయములందును కానరాదు. మనకు కనఁబడువెలుతురుగలభాగమును అనుసరించి చంద్రబింబము మన కొకప్పుడు చిన్నదిగను ఒకప్పుడు పెద్దదిగను కనఁబడుటయు, నొకప్పుడు కనఁబడకుండుటయు తటస్థించును. ఈ పైపటముయొక్క సాహాయ్యమున చంద్రునికళల వృద్ధిక్షయములు తెలిసికొనవచ్చును.




చంద్రకళలను జూపుపటము

sampath_Ebooks



ఈ పటమునందు చంద్రునియొక్క ఎనిమిది రూపములు చూపఁబడినవి. ఈ యెనిమిదియు నొకనెలలోని ఎనిమిదితిథులను సూచించును: ౧. అమావాస్య, ౨. పూర్ణిమ, ౩. శుద్ధతదియ, ౪. బహుళతదియ, ౫. శుద్ధ అష్టమి, ౬. బహుళాష్టమి, ౭. శుద్ధద్వాదశి, ౮. బహుళద్వాదశి.

ఈ పటము అగ్రమునందు నడుమ భూమి యున్న దని అనుకొనుఁడు. కన్నులకు కుడిప్రక్క కడుదూరమున సూర్యుఁ డున్నాఁ డనుకొనుఁడు. ౧-వ స్థానమునందు చంద్రుఁడు భూమికిని అనఁగా మనకును, సూర్యునకును నడుమ నున్నాఁడు. కావున వెలుతురుగల చంద్రార్ధభాగము మనకు మఱుఁగై చీకటిగల యర్ధభాగమే భూమి వైపు తిరిగియుండును. ఇట్లు మనకు చంద్రుఁడు కనఁబడఁడు. ఇది అమావాస్యదినము. అక్కడనుండి చంద్రుఁడు బయలుదేఱి వెళ్లిన కొలఁది యు వెలుతురుగల చంద్రార్ధభాగములోని కొంచెముకొంచెము భాగము దినదినము మనకు కానవచ్చుచుండును.

౨-వ స్థానమునందు ౪ దినము లైనతరువాత చంద్రుఁ డుండుట తెలుపఁబడినది. బింబములో నాలుగవవంతు మనకు ప్రకాశవంతముగాఁ గానవచ్చును. ఇదియే శుద్ధతదియ వెనుక చవితి జరుగుచున్నకాలము. ౩-వ స్థానమునందు చంద్రునిమీఁదివెలుతురు భాగములో మనకు సగము కనఁబడుటవలన చంద్రబింబము సరిగ సగము కనఁబడును. ఇది శుద్ధసప్తమి గడచి అష్టమి జరుగుచున్న కాలము. ౪-వ స్థానమందు చంద్రబింబము రమారమి మూఁడువంతులు కానవచ్చును. ౫-వ స్థానమునకు చంద్రుఁడు వచ్చినప్పుడు భూమి చంద్రునకును సూర్యునకును నడుమ నున్నందున వెలుతురుగల చంద్రార్ధభాగ మంతయు మనకుఁ గానవచ్చును. ఇదియే పూర్ణిమతిథి. ౫-వ స్థానమునుండి చంద్రుఁడు ౧-వ స్థానమునకుఁ బోవుకాలము కృష్ణపక్ష మనిపించుకొనును. ఈ పక్షమునందు చంద్రునికళలు తగ్గుచు అమావాస్యనాఁటకి పూర్తిగ పోవు నని పటములో ౬,౭,౮,౧ అంకములయొద్ద నున్న చంద్రబింబాకారములవల్ల సూచింపఁబడినది.

**అమావాస్యశాండిల్యాయనుఁడు** — వంశబ్రాహ్మణమునందు అంశుధనంజయుని గురువుగఁ జెప్పఁబడినవాఁడు.

**అమాసిస్** (లేక ఆమాసిస్; క్రీ. పూ. ౫౭౦-౫౨౬) — ఈజిప్టుదేశపురాజు. ఇతని ప్రభుత్వకాలమున ఈజిప్టుదేశము మిక్కిలి వైభవము ననుభవించినది. గ్రీసుదేశముతో వర్తకము ప్రారంభించెను. గ్రీసుదేశపుపడుచును వివాహమాడెను. సోలన్, థేల్స్, పైతగోరస్ అనుతత్త్వజ్ఞులతో ఇతనికి స్నేహ ముండెనఁట.

**అమిత** — ఈమె మహాసమ్మతవంశములోనివాఁడగు శిహహానునికూఁతురు. సక్కసుప్పబుద్ధుని (శాక్యసుప్రబుద్ధుని) ధర్మపత్ని. భద్దకచ్చాన, దేవదత్తు లని యీమె కిరువురు కుమారులు గలరు.

**అమితగతి** — పేరందిన యొకదిగంబర జైనపండితుఁడు, సన్న్యాసి. మాలవదేశమును పాలించినముంజరాజుకాలమువాఁడు. ఈరాజు క్రీ.శ. ౯౭౦-వ సంవత్సరమున రాజ్య మేలినట్లు నిదర్శనములు కలవు. మఱియు నమితగతిరచించిన 'సుభాషితరత్నసందోహము' 'ధర్మపరీక్ష' యను రెండుగ్రంథములును వరుసగ క్రీ. శ. ౯౯౪, ౧౦౧౪ సంవత్సరములలో రచించినట్లు తెలియుచున్నది. ఈకారణములనుబట్టి యీపండితుఁడు ౧౦-వశతాబ్దిచివరిదినములలోను, ౧౧-వశతాబ్ది మొదటిదినములలోను ఉండినవాఁ డని మనము నిశ్చయించుకొనవచ్చును.

ముంజరాజు ఇతనిని తనయాస్థానమున నుంచుకొని, మిగుల సమ్మానించెను. ఆ యాస్థానములోని పండితులలో నితనిదే యగ్రస్థాన మనవచ్చును.

ఇతనితలిదండ్రులనుగూర్చికాని, జీవితమునుగూర్చికాని తెలిసికొనుటకుఁ దగు నాధారము లేవియు లేవు. జైనమతమునకుఁ జెందిన 'మాథుర' శాఖకు ఇతఁ డాచార్యుఁ డయ్యెను. అమితగతిరచించిన గ్రంథము లెన్ని యున్నవో మాకు తెలియదు. ఇప్పటికి లభించినవి మూఁడు: (౧) శ్రావకాచారము, (౨) సుభాషితరత్నసందోహము, (౩) ధర్మపరీక్ష.

**అమితాభుఁడు** — పంచధ్యానిబుద్ధులలో నితఁడు నాలుగవవాఁడు. ఇతఁడు సుఖావతి యనుపేరుగల పశ్చిమస్వర్గమున కధిపతియై శాంతముగ ధ్యానముచేయుచు నివసించుచుండు నని బౌద్ధుల విశ్వాసము. భద్రకల్ప మనుపేరఁబరఁగు వర్తమానకల్పమున కితఁ డధిదైవము. సృష్టిచేయుట కాని, యితరకార్యకరణము కాని యీతని



అమితాభుఁడు

పనులు కావు. అవి యీతనిబోధిసత్త్వుఁ డగుపద్మపాణిపనులు. ఇతని రెండుహస్తములును ధ్యానముద్రాంకితము లయి తొడమీఁద నుండును. ఇతఁడు రక్తవర్ణుఁడు; మయూరద్వయవాహనుఁడు; పద్మలాంఛనుఁడు; జల, రక్తవర్ణ, రసనేంద్రియకారకుఁడు.

sampath_Ebooks



ఇతఁడు పౌత్తరాహశాస్త్ర దేవతలలోనివాఁడు. హీనయానశాస్త్రమున నీతఁడు తెలియరాఁడు. ఈకారణమున సింహళము, బర్మా, సయాములం దీతని పూజ కానరాదు.

**అమితాయువు** — శాస్త్రమతపరిణామమును తెచ్చిపెట్టిన బుద్ధులలో నీతఁ డొకఁడు. అపరిమితాయు వనియు నితనికిఁ బేరు కలదు. మధ్యయుగమున హిందూదేశమునం దీతని పూజ యెక్కువగ నుండినట్లు మధ్యహిందూదేశమునందలి మధ్యయుగమునాఁటి జీర్ణబౌద్ధాలయములయం దీతని విగ్రహము లధికముగఁ గానవచ్చుటను బట్టి చెప్పవచ్చును. ఇతఁడు ప్రజలకు దీర్ఘాయువు నొసంగునని బౌద్ధులు విశ్వసింతురు. ఈకారణమున టిబెత్తుదేశమునందలి బౌద్ధులలో నీతనికి పూజ యెక్కువ. అచ్చట నెంచుమించుగఁ బ్రతియాలయమున నీతని



అమితాయువు

విగ్రహము కానవచ్చును. అమృతకుంభిక యితని లాంఛనము. ఇతనిని బౌద్ధులు శాంతముగ నాసీనుఁడయి ధ్యానముచేయు అమితాభబుద్ధుని క్రియాశక్త్యావిష్కారముగ తలంతురు. విగ్రహశిల్పమునం దీతనిని గూడ అమితాభునివలెనే తీర్చెదరు కాని వ్యత్యాస మేమన, నితఁడితనివలెఁగాక, కిరీటధారి; రత్నోపశోభూషణాలంకృతుఁడు; అమూల్యాంబరవిరాజితుఁడు. ఈతనిహస్తములు ధ్యానముద్రాంకితము లయి తొడమీఁద నుండును. చీనా, జపాను దేశీయులు అమితాయువు నమితాభుని పేరనే పూజింతురు కాని టిబెత్తుదేశీయులుమాత్ర మట్లు కాదు.

**అమితాశ్వుఁడు** — ఇతనికి బర్హితాశుఁ డని నామాంతరము గలదు.

**అమితౌజుఁడు** — భారతయుద్ధమునందు దుర్యోధన పక్షమున పోరినరాజు. హేతుమంతుం డను అసురునియంశంబున జన్మించినవాఁడు (భార, ఉద్యోగ, ౧౭౧).

**అమిత్రజిత్తు** — (సూ. వం) ఇక్ష్వాకువంశజుఁడైన అంతరిక్షరాజునకు పౌత్రుఁడు. సుతపోరాజునకుఁ బుత్రుఁడు.

**అమిత్రతపనశుష్మిణశైబ్యుఁడు** — అత్యారాతిజానంతపియను వానిని చంపినవాఁడు (ఐతరేయ బ్రా, ౮, ౨౩).

**అమిదాల** — చిత్తూరుజిల్లా తిరుత్తని తాలూకాయందలి జమీందారీగ్రామము. జనసంఖ్య ౭౯౯.

**అమిందీవిలంకలు** — మద్రాసురాజధానిలోని దక్షిణకన్నడజిల్లాకు సంబంధించిన పశ్చిమ (అరబ్బీ) సముద్రములోని దీవులు. ఇవి అయిదు. వీనిలో నాలుగుదీవులలో జనులు నివాస ముందురు. ఆ నాలుగుదీవులవిస్తీర్ణము 3 చదరపుమైళ్లు అవి పశ్చిమతీరమునుండి నూటడెబ్బది మొదలుకొని రెండువందలమైళ్ల దూరమునం దున్నవి. ఇవి సముద్రముమీఁద ౧౦ మొదలుకొని ౧౫ అడుగులయెత్తున నుండును.

ఈదీవులు ౧౯ శతాబ్దారంభమునను క్యానసూరుసంస్థానాధీసుల సంరక్షణమునం దుండెను. కాని క్రీ. శ. ౧౭౮౬ లో జనులు తిరుగఁబడి మదరాసువారియధీన మైరి. క్రీ. శ. ౧౮౭౭ లో దక్షిణ కన్నడజిల్లా కంపెనీవారియధీన మైనప్పు డీదీవులుగూడ వారిప్రభుత్వములోనికి వచ్చెను. క్యానసూరుసంస్థానాధీశ్వరి యైన బిబ్బీకి నీదీవులక్రింద కంపెనీవారు ౫,౨౫౫ రూపాయ లిచ్చిరి. ఇప్పు డీదీవులమీఁద నొకమోనేగారు అధికారిగ నున్నాఁడు. వానికి మూఁడవ క్లాసు మేజస్ట్రీటుఅధికారము గలదు. కొన్ని సివిల్ కేసులుగూడ అతఁడు విచారించును. ఈ విచారణ చేయునప్పు డాతనికి గ్రామమునందలి కొందఱు పెద్దలు పంచాయతీగ నేర్పడి సాహాయ్యము చేయుదురు. జనసంఖ్య ౩౦,౨౨.

ఇచ్చటిజనులు చాలమంది ముసల్మానులుగా మారిన హిందువులు. వీరు మాటలాడునది అపభ్రంశమైన మలయాళముభాష. వీరు మలయాళమునుండియే వచ్చియుందు రని యూహింపఁబడుచున్నది. ఇచ్చటిజనులు సాధువృత్తిగలవారు, శాంతిప్రియులు, సంతృప్తిగలవారు. గొప్పనేరము లిచ్చట నరుదు. ఇచ్చట కొబ్బరిచెట్లు విస్తారముగ నుండును. ఇక్కడి యాఁడువాండ్రు కొబ్బరినార, త్రాళ్ళు విశేషముగ చేయుదురు.

ఈనారయు, త్రాళ్ళను ప్రభుత్వమువారే కొనుదురు గాని యితరులు కొన వీలు లేదు. ప్రభుత్వమువా రిచ్చునగకు నచ్చటిజనులు వాని నమ్మవలయును. ప్రభుత్వమువారుమాత్రము వారియిష్టమువచ్చిన వెల కమ్ముకొందురు. ఈనర్తకమువలననే క్యానసూరు సంస్థానమువారి కియ్యవలసిన రు. ౫,౨౫౫ పోను ౨,౩౮౨ రూపాయలు లాభము వచ్చును.

**అమిరేకుల** — తూర్పుగోదావరియే జెన్సీజిల్లాయెల్లవరం తాలూకాయందలి గ్రామము, జనసంఖ్య ౨౩౪.

**అమిలి** — విశాఖపట్టణముజిల్లా జయపురంతాలూకా యందలి గ్రామము. జనసంఖ్య ౪౧౩.

**అమిలేపల్లి** — చిత్తూరుజిల్లా వాయల్పాడు తాలూకా యందలి గ్రామము. జనసంఖ్య ౪౭౧.

**అమీ** — ఛప్రానగరమునకు ౧౧ మైళ్లదూరమం దున్న యొక గ్రామము. ఇక్కడ భవానీదేవాలయ మున్నది. సతియొక్క శరీరావశేషములు గల యేబదిరెండు పవిత్రస్థానములలో నిదియు నొకటి.

**అమీన్** — స్థానేశ్వరమున కాగ్నేయముగ ౫ మైళ్ళ దూరమునందుగల ఒకమిట్టప్రదేశము. దీనియెత్తు ౨౫-౩౦ అడుగు లుండును. పొడుగు (ఉత్తర-దక్షిణములుగ) ౨,౦౦౦ అడుగులు. ఇచ్చటనే అదితి తప మొనర్చి సూర్యుని కుమారునిగఁ బడసెనట! అప్పటికి చక్రవ్యూహ మని పేరు. ఇదియే యభిమన్యుఁడు మర ణించినతావు. ఈమిట్టపైని అమీన్ అను పేరుగల గ్రామ మొకటి యున్నది. ఇందు అదితిదేవియాలయము, ఆదిత్యకుండమును గలవు. పుత్రసంతానము గావలసినవా రీయదితిదేవి నర్చించి సూర్యకుండ మున స్నానమాడి పోవుచుందురు.

**అమీనా** — మహమ్మదీయమతస్థాపకుఁడైన మహమ్మదు యొక్కతల్లి, అబ్దుల్లాభార్య, వాహాబ్‌కొమార్తె. అప్పటిస్త్రీలలో మిక్కిలి చక్కని దనియు, బుద్ధిశాలిని అనియు, సద్గుణవతి యనియు చెప్పెదరు. మహమ్మదు పుట్టిన ఆరవయేట, అనఁగా క్రీ. శ. ౫౭౭-వ ప్రాంతమున మృతి నొందెను.

**అమీనుపల్లి** — అనంతపురంజిల్లా గుత్తితాలూకా యందలి యీనాం గ్రామము. జనసంఖ్య ౨౭౩.

**అమీనుపురం** — కృష్ణాజిల్లా గుడివాడతాలూకా యందలి యీనాం గ్రామము. జనసంఖ్య ౧,౧౫౨ (౧౯౩౧).

**అమీనుబాదా** — ౧. గుంటూరుజిల్లా సత్తెనపల్లి తాలూకా యందలి గ్రామము. జనసంఖ్య ౩,౨౫౧ (౧౯౩౧).

౨. తూర్పుగోదావరిజిల్లా పిఠాపురం తాలూకాయందలి జమీన్‌దారీ గ్రామము. జనసంఖ్య ౧,౧౨౬ (౧౯౩౧).

౩. తూర్పు గోదావరి యేజెన్సీ జిల్లా రొల్లవరంతాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౧౨౨.

**అమీన్ అహమ్మద్** — ఇతనికే అమీన్ అహమ్మద్ రాజీ అందురు. ఈతఁడు అక్బరుచక్రవర్తికాలమునందు హఫ్త్ అక్లీమ్, అనఁగా సప్తప్రదేశములు అను చరిత్రాత్మకమైన కోశమును వ్రాసెను. సమశీతోష్ణ కటిబంధము (Temperate Zone) నేడు ప్రదేశములుగా విభజించి అందొక్కొక్కదాని వివరణమును, అందలి ముఖ్యపట్టణమును ఇచ్చుటయే కాక, ఆయాస్థలములందుఁ బుట్టిన ప్రసిద్ధపురుషులయొక్కయు, ప్రసిద్ధకవులయొక్కయు చరిత్రమును వ్రాసియున్నాఁడు.

**అమీన్‌గడము** — బొంబాయిరాజధాని, విజాపూరు జిల్లా, హుంగుందుతాలూకాలోని ఒక గ్రామము. హుంగుందునకు తూర్పున ౭ మైళ్లదూరమున నున్నది. జనసంఖ్య ౭,౭౩౪. ఇచ్చట పశువులసంతయొకటి గొప్పగ జరుగుచుండును. సముద్రమువీఁద నుండి వచ్చు టెంకాయల యొక్కయు, బియ్యము యొక్కయు వర్తకమున కిది ముఖ్యస్థల మైయున్నది.

**అమీన్‌భావి** — బొంబాయిరాజధానిలోని ధార్వాడ జిల్లాలో నొక గ్రామము. ధార్వాడకు ౭ మైళ్లదూరమున నున్నది. జనసంఖ్య ౩,౫౦౧. పేష్వాలకాలమున నిది ఒక అష్టగ్రామమునకు (అష్టగ్రామ మనఁగా ఎనిమిదిగ్రామములతోఁగూడిన ఒకఫిర్కా) ముఖ్యస్థానముగ నుండెడిది. ఈయూరిలో నాలుగైదు దేవాలయములు కలవు. గ్రామమున కుత్తరమున నేమినాథుని జైనదేవాలయ మున్నది. ఈయూరిలో ౬ శిలాశాసనములు దొరకినవి.

**అమీన్‌సాహేబుపెంథో** — గంజాంజిల్లా బరంపురంతాలూకాయందలి యీనాం గ్రామము. జనసంఖ్య ౨౭౧.

**అమీన్‌సాహేబుపేఁట** — విశాఖపట్టణము జిల్లా అనకాపల్లి తాలూకాయందలి జమీన్‌దారీ గ్రామము. జనసంఖ్య ౬౭౨.

**అమీరసింగుటప్ప** — (చూడుఁడు: అమరసింహుఁడు.)

**అమీరుకల్యాణి** — (చూడుఁడు: హమీరుకల్యాణి).

**అమీర్ ఇస్మైల్** — గజనీమహమ్మదు తమ్ముఁడు. తండ్రియగు సబక్తజీనుమరణసమయమున మహమ్మదు దూరదేశమున నుండెను. ఈయదను చూచి అమీరు ఇస్మైల్ తనప్రభుత్వము స్థాపింపవలయునని లంచములకు చాల ధనము వ్యయపఱిచెను. కాని యంతలో మహమ్మదు వచ్చి తమ్ము నోడించి రాజ్యము వశపఱుచుకొనెను. అమీర్ ఇస్మైల్ మరణించుదనుక నొకకోటలో బందీగ నుంచఁబడెను.

**అమీర్ ఖాన్** (నవాబ్) — ఢిల్లీ చక్రవర్తి యగు మహమ్మద్ షాహాకాలమునాఁటి ఒక సరదారు. ౧౭౩౯ లో అలహాబాద్ ప్రాంతమునకు గవర్నరుగ నియమింపఁబడెను. ఇతఁడు చక్రవర్తితో మిక్కిలి చనవుగా భయము విడిచి మాటాడుచుండెను. ఇతనిని ఒక సేవకుఁడు చక్రవర్తిసమ్మతితో ౧౭౪౭ లో పొడిచి చంపెను. ఇతఁడు కవిత్వముకూడ చెప్పుచుండెను.

sampath_Ebooks

అమీర్ ఖాన్ (పిండారీ) — ఇతఁడు ప్రస్తుతపు టోంక్ నవాబునకు మూలపురుషుఁడు. ఇతఁడు మొదట యశవంతరావుహోళ్కరునొద్ద సేనాపతిగ నుండెను. తరువాత ౧౮౦౬ లో అచ్చటినుండి వెళ్లిపోయి పిండారీలకు సర్దారై దేశము నెల్ల కొల్లగొట్టెను. ఇతఁడు హోళ్కరురాజులయొద్దనుండి సంపాదించినరాజ్యమంతయు నితని కిచ్చివేసి ౧౮౧౭ లో నితనితో ఇంగ్లీషువారు సంధి చేసికొనిరి. ఇతఁడు తనయొద్దనున్న ఫిరంగు లన్నియు నింగ్లీషువారి కిచ్చివేసి తనసైనికులను పిండారీదోపుడు మూఁకను పంపివేసెను.

అమీర్ జుమ్లా — ౧. ఇతఁడు ఔరంగజేబునకు ప్రియమిత్రుఁడు. ఔరంగజేబునకు ఢిల్లీసింహాసనము లభించునిమిత్త మితఁ డమితపరిశ్రమము సలిపెను. షుజాను బంగాళమునుండి తఱుమఁగొట్టుటకై యితఁడు ఔరంగజేబుకుమారుని వెంటఁ బోయి యాకార్యానంతరము తానే యాదేశమునకు సుబేదారుగ నిలిచిపోయెను. బంగాళమునకు గవర్నరుగ నుండినకాలములో అస్సామును గూడ జయింపవలయు నని ప్రబలసేనాపరివృతుఁడై బయలుదేఱెను. పర్వతారణ్యమయ మగు అస్సామును జయించుట సులభసాధ్యము కాలేదు. బహుళప్రయాసముతో అస్సాము రాజధానివఱకును బోయెను. ఇంతలో వర్షము లారంభమగుటచే నచటనుండి వెంటనే మరలవలసి వచ్చెను. ఈయవసరమున నితఁ డాదేశమందలి ప్రతిష్ఠితులను పురుషులగోరీలను త్రవ్వించి వానియందుండి యమితమైన ద్రవ్యమును హరించెను. ఈలాగున దౌర్జన్యము లొనరింప నస్సాముజనులు నాలుగు ప్రక్కలఁ గ్రమ్ముకొని బాధింపసాగిరి. ఇతఁడును మధ్యమధ్య వారల నెదిరించుచు నతికష్టముమీఁద కూచ్‌బిహార ప్రాంతమందలి ఖిజాపురమును జేరి యక్కడ క్రీ. శ. ౧౬౬౩-వ సంవత్సరమున మరణించెను.

౨. క్రీ. శ. ౧౭౧౩ మొదలుకొని ౧౭౧౯ వఱకును ఢిల్లీని బాలించిన ఫరుక్ సియ్యర్ యొక్క ప్రియమిత్రుఁడు. ఇంతకుఁబూర్వము జహందర్ శాహ చక్రవర్తిగను, జుల్ ఫకీర్ ఖాను వజీరుగను నుండిరి. రాజనిర్మాత లని ప్రసిద్ధి గాంచిన సయ్యద్ సోదరులు జహందర్ శాహను దొలఁగించి ఫరుక్ సియ్యరును సింహాసన మెక్కించిరి. అంత నీనూతనసార్వభౌమునిమనసులోఁ బూర్వపువజీరును దొలఁగించి తనమిత్రుని మంత్రిగ నేర్పఱుచుకొన బుద్ధి పుట్టినది. అందుల కితఁడు తనస్నేహితునే జుల్ ఫకీర్ ఖానుకడకు రాయబారిగఁ బంప నితఁడును వారిని సమీపించి యభయవచన మిచ్చి వచ్చెను. కాని సయ్యదుసోదరులు కాలహరణమునకు సహింపక త్వరితముగనే జుల్ ఫకీరును గడతేర్చి యతనిజనకుని అసద్ ఖానుని కారాగారమునఁ ద్రోయించిరి. పిదప ఫరుక్ సియ్యర్ అమీరుజుమ్లాను మంత్రిగఁ జేసికొనవలయు ననుప్రయత్నములో తన ప్రాణములనే కోలుపోయెను.

అమీర్ తలిక్ — మొఘలిస్థానచరిత్రమును వ్రాసిన మిర్జా హైదరుయొక్క పితామహుఁడు. వీరలు బాబరుసంబంధులు. మొఘలిస్థానపాలకుఁడగు తుగ్లక్ తైమూర్ ఖాన్ మహమ్మదీయమతము నవలంబించి మఱునాఁడు తనయమీరుల నందఱ రావించి యిస్లాముమతమును స్వీకరింపుఁడని యడుగుటకును, నందులకు సమ్మతింపనివారిని జంపుటకును నిశ్చయించుకొనెను. అమీర్ తలిక్ కూడ తైమూరుయొక్క సామంతప్రభువే. ఇతఁ డింతకు మూఁడుసంవత్సరములకు పూర్వమే మహమ్మదీయమతము నవలంబించియుండెను. కాని తైమూరునకుఁగల భయముచే నాసంగతిని వెల్లడించియుండలేదు. మఱునాఁడు తైమూరు సభలోని కేతెంచి యమీరుల నందఱను బిలిపించెను. వారిలో తలిక్కునకే మొదటిస్థానము రాఁగా నితఁ డున్న సమాచారము నంతయు వెల్లడించెను. దానిని విని తైమూరు సగౌరవమున నతని నాలింగనము చేసికొనెనఁట!

**అమీర్ బరీద్** — ౧. ఇతఁడు బీదరులో రాజ్యమేలిన బరీద్ షాహివంశరాజులలో రెండవవాఁడు. కాసింబరీద్ కుమారుఁడు. తండ్రిమరణానంతరమున ౧౫౦౪ లో రాజ్యమునకు వచ్చెను. ఆకాలమునందు బహమనీరాజైన సుల్తాన్ మహమూద్ షాహ అనువాఁడు ౧౫౧౮ లో మరణింపఁగా నతనిస్థలమున ౩-వ అల్లా ఉద్దీను అనువానిని సింహాసనాసీనునిగాఁ జేసెను. వాఁడు కొలఁదిదినములలో మృతినొందఁగా కలీముల్లా అనువానిని పేరునకు రాజ్యముమీఁదఁ గూర్చుండఁబెట్టెను. వాఁడు అమీర్ బరీద్ పెట్టినట్టి బాధలు సహింపక అహమద్ నగరమునకు పాఱిపోయి అచ్చటనే మరణించెను. దానితో బహమనీవంశము పూర్తిగ నశించెను. అమీర్ బరీద్ అహమదాబాద్-బీదరు రాజ్యమును సర్వస్వతంత్రముతో ౨౫ సంవత్సరములు పరిపాలించెను. ఇతనిరాజ్యములోనుండి కొంతభాగము విజాపురరాజు తీసికొనినందున ౪, ౫, లక్షలు వచ్చురాజ్యము మాత్రమే యితనికి నిలిచియుండెను. ఇతఁడు ౧౫౪౨ లో దౌలతాబాదులో మృతినొందెను.

౨. బరీద్ షాహిరాజులలో చివరివాఁడు. ౨-వ బరీద్ షాహ అనువానిని ౧౬౦౯ లో రాజ్యభ్రష్టుని చేసి ఇతఁడు రాజ్యమునకు వచ్చెను.

అమీర్ హసన్ — తుర్కీసార్వభౌముఁడైన ద్వితీయ బజాజత్ యొక్క జలసేనానాయకుఁడు. పోర్చుగీసులు హిందూస్థానములోఁ బ్రవేశించినతోడనే వారి నెదిరించునిమిత్తము తురుష్కదేశపుసుల్తాను తనసేనానాయకుని బంపెను. ఇతఁడు వచ్చి గుజరాతుతీరమున దిగి యక్కడనుండి మహమ్మద్ శాహ, అమీర్ ఐజ్ సుల్తానులఁ గలసికొని దక్షిణముగ నేతెంచి చౌలురేవునకు దూరమందున్న పోర్చుగీసులం దాఁకఁగా వార లమితనష్టముతోఁ బాఱిపోయిరి.

అమీర్ హుసేన్ — ఇతఁడు తైమూరుయొక్క బావమఱఁది. వీ రిద్దఱును గలసి జక్సార్టీసునదికి నుత్తరమం దుండిన

sampath_Ebooks



ప్రాంతములలోని రాజులతోడను, మావాగ్ అన్నా పేగ్ యిలాకాలోని ప్రభువులతోడను నిరంతరము పోరాడుచువచ్చిరి. కాని యుద్ధ విజయమువలన దొరకినసొత్తును బంచుకొనుటలో నిరువురకును వివాదము సంభవించెను. సామాన్యముగ తైమూ రెక్కుడుభాగమును హరించుచుండెడివాడు. హుసేనున కిది యెంతమాత్రమును గిట్టకుండెను. తుదకు బలవంతుడగుకారణమున తైమూరు హుసేనుని మోసమునతో కొట్లో పట్టించి తనకైదీగ జేసికొనెను. కాని యింతవఱకు నతని సాహాయ్యమును బొందియుండినవాడగుటచే నతని ప్రాణముల కేమియు హాని గలిగింప నని తైమూరు హుసేనునకు వాగ్దానమిచ్చెను. ఇట్లు లుండగా తైమూరుమనోరథసిద్ధి మఱియొకవిధముగ నెఱవేఱినది. తైమూరుయొక్క సామంతప్రభు వొకడు డేతెంచి తనతమ్ముని హుసేను చంపె ననియు, నందులకు బదులుగ నతని మరిదీయింపు మనియు వేడికొన, తైమూరు తనవాగ్దానము నెఱింగించి యతనిని వదిలిపెట్టించెను. అంత నాసామంతప్రభువు హుసేనువెంటబడి యతని ప్రాణముల దీయుచుండ తైమూరు చూచుచుండెను గాని తనసేవకులను వారించుటకైనను బంపడయ్యెను. ఇందు వలన నీపన్నుగడ యంతయు తైమూరుపన్నినదే యని యనుమానము కలుగుచున్నది.

అముదూరు — చిత్తూరుజిల్లా కాళహస్తి తాలూకా యందలి జమీందారీగ్రామము. జనసంఖ్య ౧౨౩.

**అముద్రితగ్రంథ చింతామణి** — ఇది నెల్లూరు నివాసులుగ నుండిన పూండ్ల రామకృష్ణయ్యగారిచే ౧౮౮౫-వ సంవత్సరము జూన్ నెలనుండి ౧౯౦౪-వ సంవత్సరము జూన్ మాసమువఱకును నడుపబడిన మాసపత్రిక. ఒడయారు వీరనాగయ్యగారును, పి. వేంకటరామానుజరావునాయుడు బి. ఏ. గారును కొంతకాలము వీరితోగూడ సంపాదకులుగ నుండిరి. ఇందు ప్రాచీనాంధ్రగ్రంథము లనేకములు ప్రకటింపబడియెను. కొన్ని ప్రౌఢవిమర్శనలకుగూడ నిదియే పుట్టినిల్లయ్యెను. సమకాలికగ్రంథకర్తలవిషయమున వ్రాయబడిన వ్రాత లచ్చటచ్చట నుచితములుగ గన్పట్టుచున్నను మొత్తముమీద నీపత్రిక తత్కాలమున తెలుగుభాషయొక్క యభివృద్ధికి సాయపడిన ముఖ్యోపకరణములలో మిన్న యని పేరు గాంచినది.

అములూరు — ౧. నెల్లూరుజిల్లా కోవూరుతాలూకా యందలి గ్రామము. జనసంఖ్య ౭౭౧.

౨. నెల్లూరుజిల్లా నెల్లూరుతాలూకా యందలి గ్రామము. జనసంఖ్య ౧,౧౫౨ (౧౯౩౧).

అమూర్ రాష్ట్రము — అమూర్నదీప్రాంతమున చాలభాగము క్రీ. శ. ౧౮౫౮-వ సంవత్సరమున చీనావారియధీనము దప్పి రషియాప్రభుత్వమునకు లోనయ్యెను. మిగిలినదానిలో పడమటిభాగ మంతయు అమూర్ అనుపేరుతో నొకప్రత్యేకరాష్ట్రముగ నేర్పడినది. దీనివైశాల్యము ౧,౫౮,౬౯౫ చ. మైళ్లు. జనసంఖ్య ౨,౬౧,౫౦౦.

అమూర్తరయుడు — (సూ. వం) ఇనకులోత్పన్నుడగు గయునివంశములోనివాడు.

అమృతచంద్రసూరి — దిగంబరశాఖకు జెందిన జైనపండితుడు. తత్త్వార్థసారము, ఆత్మఖ్యాతి మొదలయిన గ్రంథములను రచియించెను. ఇతడు క్రీ. శ. ౯౦౫ ప్రాంతమున నున్నవాడు.

అమృతతరంగిణి — షాడవ సంపూర్ణరాగము. పందొమ్మిదవ మేళకర్త యగు ఝుంకారధ్వనిరాగజన్యము. ఆరోహణావరోహణములందు స రి గ మ ధ ని స — స ని ధ ప మ గ రి స యని సంచారము గలది.

అమృతధన్యాసి — షాడవషాడవరాగము. ఎనిమిదవ మేళకర్తయగు హనుమతోడిజన్యము. ఆరోహణావరోహణములందు స రి గ మ ప ని స — స ని ప మ గ రి స యని సంచారము.

అమృతనాదోపనిషత్తు — ఒక యజుర్వేదోపనిషత్తు. దీనికి నాదోపనిషత్తనియు పేరు గలదు.

అమృతపంచమము — షాడవ-వక్రషాడవరాగము. నలువదియెనిమిదవ మేళకర్తయగు దివ్యమణిరాగజన్యము. ఆరోహణము - స రి గ మ ధ ని స; అవరోహణము - స ని ధ మ గ స రి స అని సంచారము.

అమృతపురం — ౧. చిత్తూరుజిల్లా తిరుత్తనితాలూకా యందలి జమీందారీగ్రామము. జనసంఖ్య ౭౫౯ (౧౯౩౧).

౨. విశాఖపట్టణముజిల్లా అనకాపల్లి తాలూకాయందలి జమీందారీ గ్రామము. జనసంఖ్య ౧,౬౦౬ (౧౯౩౧).

అమృతప్రభులు — ఎనిమిదవ సావర్ణి మన్వంతరమునందు బుట్టబోవు దేవతావిశేషులు.

అమృతబజారు — బంగాళప్రాంతము జస్సూర్ జిల్లాలోని ఒకపల్లె. ప్రకృతము కలకత్తాలో ప్రకటింపబడు అమృతబజారుపత్రిక యను ఆంగ్ల దైనికపత్రికారాజమునకు నిది పుట్టినిల్లు. తత్పత్రికాధిపతులగు శిశిరకుమార, మోతీలాల్ ఘోషులు మొదట నీగ్రామములోనే బంగాళభాషలో ఈపత్రికను ప్రకటించుచుండిరి.

sampath_Ebooks

**అమృతబిందూపనిషత్తు** — ఇది అష్టోత్తరశతసంఖ్య గల ఉపనిషత్తులలో నొకటి. యజుర్వేదాంతర్గతము.

**అమృతము** — దేవతలకు మరణము లేకుండఁ జేయునట్టిగసవిశేషము. పృథురాజు శిక్షించు నని భయముచే భూమి గోరూపమును ధరించెను. అప్పు డింద్రుని దూడగాఁ జేసి దేవతలు సువర్ణపాత్రలో నా ధేనువు స్తనములనుండి ధారలను పితుకఁగా, అమృతము వచ్చెను. కాని దుర్వాసఋషియొక్క శాపముచే నాయమృతము సముద్రముపా లయ్యెను. అంత దేవదానవులు సముద్రమథనము చేసి యాయమృతమును పదునాల్గురత్నములలో నొకరత్నముగాఁ బడసిరి. సముద్రములోనుండి ధన్వంతరి యమృతకుంభమును దీసికొని పైకి రాఁగా నసురులు మీఁదఁబడి యాకుంభము నపహరించిరి. ఇట్లమృతమును పోఁగొట్టుకొనిన దేవతలు విష్ణుమూర్తిని వేఁడఁగా నాతఁడు మోహినీవేషము ధరించి, అసురులను మోహితులుగాఁ జేసి మీ యిరుతెగల నమృతమును సమానముగాఁ బంచిపెట్టెద నని చెప్పి, వారియొద్దనుండి యమృతపుకలశమును దీసికొని యసురులకు నొకబొట్టయినను లేకుండ, అమృతము నంతయును దేవతలకుఁ బంచిపెట్టెను.

**అమృతయోగము** — తిథివారములతోఁగాని, వారనక్షత్రములతోఁగాని కూడుకొనిన ఆయాయోగములకు అమృతయోగము లని పేరు. ఆదిసోమవారములతో పూర్ణ, మంగళవారముతో భద్ర, బుధశనివారములతో నంద, గురువారముతో జయ, శుక్రవారముతో రిక్త - ఈవారములలో నీతిథులు కలసినప్పుడు అమృతయోగ మేర్పడును. దీనికి తిథ్యమృతయోగ మని పేరు. ఆదివారముతో హస్త, సోమవారముతో శ్రవణము, మంగళవారముతో రేవతి, బుధవారముతో అనూరాధ, గురువారముతో పుష్యమి, శుక్రవారముతో రేవతి, శనివారముతో రోహిణి - ఈవారములతో నీనక్షత్రములు కలసినప్పుడు అమృతయోగ మేర్పడును. దీనికి నక్షత్రామృతయోగ మని పేరు.

**అమృతరజుఁడు** — ౧. (చం. వం) విజయునిలో బ్రన్నఁడైన కుశికరాజుయొక్క నలుగురుపుత్రులలో నొక్కఁడు.

౨. ఒక బ్రహ్మర్షి. ఇతని ముఖ్య నామము గయుఁడు (చూడుఁడు, గయుఁడు).

**అమృతరాయకవి** — మహారాష్ట్రకవి. ఇతఁడు దేశస్థబ్రాహ్మణుఁడు. ఇతఁడు శా. శ. ౧౬౨౦ లో జన్మించెను. ఇతఁడు మొదట హాస్యగాఁడు. మధ్వమునీశ్వరుఁ డనుభక్తుని నొకసారి వెక్కిరింపఁగా నతఁడు కోపపడక 'నీకు భగవంతుఁ డమృతమువంటి వాణి నిచ్చియున్నాఁడు. తలిదండ్రు లమృతరాయఁ డని పేరు పెట్టియున్నారు. నీవిట్టి విమతుల్యములైన మాటల నేల ఉచ్చరించెద' వని మందలింపఁగా నితనికిఁ బశ్చాత్తాపము కలిగి పిదప హాస్యవృత్తిని విడిచి చక్కని కవిత్వము చెప్పఁదొడఁగెను. ఇతఁడు దామాజీపంతులచరిత్రము, శుకచరిత్రము, ధ్రువచరిత్రము, ద్రౌపదీవస్త్రాపహరణము, మార్కండేయచూర్ణిక, దుర్వాసోయాత్ర మొదలైన పెక్కుకావ్యముల రచియించియున్నాఁడు. ఇతని కవిత్వము యమకప్రబోధమై వినుటకు సొంపుగా నుండును. ఇతఁడు హిందీభాషయందును కవిత్వము చెప్పినాఁడు. ఇతఁడు మిక్కిలి వైరాగ్యశీలుఁడు. మొదట ఔరంగాబాదులో గుమస్తాపని చేసి పెద్దతనమున దానిని వదలి, హరికథలు చేయఁజొచ్చెను. బాలాజీబాజీరావు పేష్వాకాలమం దితనిహరికీర్తన పేష్వాలమందిరమునందు జరగెను. శా. శ. ౧౬౭౫ లో నితఁడు మృతిఁజెందెను.

**అమృతరావు** — క్రీ. శ. ౧౭౯౬-వ సంవత్సరములో పునహాసింహాసన మెక్కిన బాజీరావుయొక్క సత్సోదరుఁడు, రఘునాథరావు దత్తపుత్రుఁడు. పేష్వాస్థానమున కితఁడును గొప్ప పరిశ్రమ లొనరించెను. ఒకసమయమున మహాదాజీసింధియాసరివారమున కితఁడు శరణ మొసంగ వారితో విరోధ మూనియున్న సర్జేరావు ఘాట్గే యితనిని ముట్టడింప నెంచెనుగాని సఫలుఁడు గాలేదు. క్రీ. శ. ౧౮౦౨-వ సంవత్సరములో హోల్కరు బాజీరావు నోడించి పాఱఁదోలి తత్కాలమందు జున్నారులో నుండిన యమృతరావును బిలిపించి పేష్వాస్థానమున నియోగించెను. ఆసమయమున నితఁడు పేష్వాస్థానమునఁ దనకుమారుని వినాయకరావును గూర్చుండఁబెట్టి తాను పునహానగరమును గొల్లగొట్టఁ బోయెను. క్రీ. శ. ౧౮౦౩-వ సంవత్సరములో నింగ్లీషువా రమృతరావును దమయాధీనములోనికిఁ దైకొనిరి. తరువాత నితఁడు కొన్నియుద్ధములలో నాంగ్లేయులకుఁ దోడ్పడుటవలన వార లితని కెనిమిదిలక్షలరూప్యములవృత్తి నేర్పాటు చేసిరి. ఇతఁడు నా ద్రవ్యమువలనఁ గాశిలోఁ గూర్చుండి సుఖజీవనమును జేయసాగెను.

**అమృతలహరి** — షాడవ-షాడవరాగము. నలువదియాఱవ మేళకర్తయగు షడ్విధమార్గిణిరాగజన్యము. ఆరోహణము సరిగమపధస; అవరోహణము - సధపమగరిస యని సంచారము.

**అమృతలింగంపేఁట** — పశ్చిమగోదావరి జిల్లా ఏలూరుతాలూకాయందలి జమీన్దారీగ్రామము. జనసంఖ్య ౬౩౯.

**అమృతలింగనగరం** — గంజాంజిల్లా శ్రీకాకుళంతాలూకాయందలి జమీన్దారీగ్రామము. జనసంఖ్య ౧౪౩.

**అమృతలూరు** — గుంటూరుజిల్లా తెనాలి తాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౫,౦౪౪ (౧౯౩౧).

**అమృతవర్షము** — ప్లక్షద్వీపమునందలి ఆఱవవర్షము.

**అమృతవర్షిణి** — ఔడవ-ఔడవరాగము. అఱువదాఱవ మేళకర్తయగు చిత్రాంబరిరాగజన్యము. ఆరోహణము - సగ

మ ప ని స; అవరోహణము – స ని ప మ గ స యని సంచారము. పూర్వమున నిది ముప్పదిలోమ్మిదవ మేళమగు ఝలవరాళిరాగజన్య ముగ సంపూర్ణవక్రరాగముగ నుండెడిది. ఆరోహణము – స రి గ మ ప ధ ని ప స; అవరోహణము – స ని ప ధ మ గ రి స యనియు సంచారము నిరూపించియున్నారు.

**అమృతవసంతము** — షాడవ – ఔడవరాగము. ఏఁబది యేడవ మేళకర్తరాగమగు సింహేంద్రమధ్యమరాగజన్యము. ఆరోహణము – స రి గ ప ధ ని స; అవరోహణము – స ని ధ మ గ స యని సంచారము.

**అమృతవాహిని** — షాడవ – షాడవరాగము. ఇరువదవ మేళకర్త యగు నటభైరవీరాగజన్యము. ఆరోహావరోహణము లందు స రి మ ప ధ ని స – స ని ధ మ గ రి స యని సంచారము.

**అమృతసరతహస్సీల్** — తహస్సీల్ అనఁగా తాలూకా. ఇది అమృతసర్ జిల్లాలోని యొకతాలూకా. దీని విస్తీర్ణము ౫౪౫ చదరపుమైళ్లు. ఇందు ౩౭౩ గ్రామములు కలవు. జనసంఖ్య ౪,౮౮,౩౯౩. శిస్తు పెస్సులు రు. ౬,౨౨,౦౦౦ లు. అమృతసరపట్టణము దీనికి ముఖ్యస్థలము.

**అమృతసరము** — ఇది పంజాబునందలి యొకజిల్లాకును, నగరమునకును పేరు.

అమృతసరముజిల్లావిస్తీర్ణము ౧,౫౯౩ చదరపుమైళ్లు. జనసంఖ్య ౯,౨౯,౩౭౪ (౧౯౨౧). ఇది సిక్కుమతస్థులకు ప్రధానస్థానము. ఇచ్చట ౨,౯౭,౦౦౪ గురు సిక్కులును, ౨,౦౪, ౪౩౫ గురు హిందువులును, ౪,౨౩,౭౨౪ గురు మహమ్మదీయులును గలరు. గోదుమలు, ప్రత్తిసెనుసులు, మొక్కజొన్నలు నిచ్చటి ముఖ్యములయిన పంటలు. ఈజిల్లాయం దక్కడక్కడ ప్రత్తి పండును; చెఱకుతోఁటలును గలవు. ప్రత్తిని దూదిగా మార్చి జేళ్ళలో అణఁచి కట్టుటకు దూది మరలు కలవు. అమృతసరముజిల్లా యించుమించుగ సమమయిన మైదానము. తూర్పుననుండి పడుమర కిది కొంచె మేటముగ నున్నది. జిల్లాయందు బారీనదినుండి త్రవ్వినకాలువ లెక్కువగఁ గలవు. వీనివలన నీటిపాఱుదల కెక్కువ యవకాశము కలదు. ఈజిల్లాయందు రాకపోకలకును, వర్తకమునకును 'నార్త్ వెస్టర్న్ రైల్వే'యును, దానికి సమాంతరముగఁ బోవు 'గ్రాండు ట్రంకు రోడ్డు'ను ప్రధానసాధనములు.

అమృతసరపట్టణము అమృతసరముజిల్లాకు ముఖ్యపట్టణము. ఇది పంజాబునందలి నగరము లన్నిటిలో మిక్కిలి భాగ్యవంత మయినది. దీనిజనసంఖ్య ౧,౬౦,౨౧౮ మంది. వీరిలో మహమ్మదీయులును, హిందువులును ఎక్కువ. ఇచ్చట తివాచీపరిశ్రమలోఁ బని చేయుచున్న మగ్గములు ౨౦౦ లవఱకును గలవు. తోళ్ళు, చర్మములు, బట్టలతానులు – వీనితో నిచ్చట వర్తకము సాగుచున్నది. అందు, మొదటిరెంటికిని సంబంధించినవర్తక మెక్కువ. హిమవత్పర్వతములను దాఁటిపోవుమార్గములగుండ జరగువర్తకమున కిది ప్రధానస్థానము. ఇచట సంవత్సరమునకు రెండుతడవలు జరగుసంత లీరామ్రమునందంతటను జరగువానిలోని కెల్ల గొప్పవి.

ఇది సిక్కుమతమునకు ముఖ్యపీఠ మగుటచేత నీపట్టణమునకు మిక్కిలి ప్రఖ్యాతి కలిగినది. గురురామదా సనునాలుగవ సిక్కుగురువు ౧౫౭౪ – వ సంవత్సరప్రాంతమున నిచ్చట నొకసరస్సు త్రవ్వించి నివాస మేర్పఱుచుకొనెను. అతఁడు ౧౫౭౭ న అక్బరుషాదుషావలన నుండి అయిదువందల 'బిఘా'ల స్థలమును బడసెను. పిదప నతఁడు తాను త్రవ్వించిన సరస్సునకు అమృతసర మని పేరుపెట్టెను. తరువాత గురు అర్జునుఁ డనునతఁ డీసరస్సునకు నడుమ నొకదేవాలయమును గట్టించెను. పట్టణ మటుపిదప క్రమముగ నభివృద్ధి చెందఁజొచ్చెను కాని ౧౭౬౨ లో అహమ్మదుషా ఈదేవాలయమును ధ్వంసము కావించి, సరస్సులో మట్టిపోయించి, గోవులను గోయించి భ్రష్టముచేసి వెళ్ళిపోయెను. కాని సిక్కులు వెంటనే దానిని మరల బాగుచేసి ౧౭౬౬ వఱకును కాపాడిరి. కొన్నిదినము లీపట్టణము భంగిమిసల్ అనువారి యధీనమునం దుండి, తుదకు ౧౮౦౧ – వ సంవత్సరములో రంజితుసింగునధీన మయ్యెను. అతఁడు చాలధనమును వ్యయపఱచి దేవాలయమును బంగారునీరు పోసిన రాగిరేకులతోఁ గప్పించెను. తరువాత నీపట్టణమును, దీనిచుట్టుప్రక్కల నుండుప్రదేశమును పంజాబునందలి యితరభాగములతోపాటు రెండవ సిక్కుయుద్ధమునంతరమునందు బ్రిటీషువారి యధీనముక్రిందికి వచ్చినది.

ఈపట్టణమునందు నైదుసరస్సు లున్నను అందు ముఖ్యమయినది అమృతసరము. ఈసరస్సు రమారమి సమచతుష్కోణముగ నుండును. దీని నడుమనే సువర్ణదేవాలయము కలదు. దీనిని సిక్కులు 'దర్బార్ సాహెబ్' (గౌరవనీయమగుసభ) అని వ్యవహరింతురు. ఈయాలయపుమధ్యభాగమునకు హరిమందిర మని పేరు. అది యొక చిన్నకొట్టు. గోడవెలుపలిభాగముమీఁద తాజ్ మహలునందువలె చెక్కడపుఁబని చేయఁబడియున్నది. గోడలపైభాగమును, పైకప్పును బంగారునీ రానినరాగిరేకులతోఁ గప్పఁబడినవి. ఈహరిమందిరమున సిక్కులవేద మగు 'ఆదిగ్రంథ' ముండును. దానిని సిక్కులు ప్రతిదినము మిగుల భక్తితో నీవలకుఁ దెచ్చి పూజచేయుదురు. వైశాఖ, కార్తికమాసములం దిచట గొప్పయుత్సవములు జరగును.

ఇచ్చట రంజితుసింగుకాలముననుండి సాలువలవర్తకము విశేషముగ హెచ్చినది. పనుక కాశ్మీరమున కఱవువచ్చినపుడు సాలువలు నేయువారనేకు లచ్చటనుండి యమృతసరపట్టణమునకు వచ్చి యచ్చట నివాస మేర్పఱుచుకొనిరి. ఒకప్పు డీపరిశ్రమయందు నాలుగువేలమగ్గములు పనిచేయుచుండినవి. కాలక్రమమున సాలువలనేత తగ్గి తివాచీలనేత హెచ్చినది. పట్టుబట్టలుకూడ నిచట బాగుగ నేయుదురు. ముడిపట్టు బొఖారానుండియు, చీనాదేశముననుండియు

sampath_Ebooks

వచ్చును. ఇచ్చటనుండి పెషావరునకు, దానికావలనున్న పరదేశములకు పట్టుబట్టలవర్తకము జరుగుచుండును. ఇచ్చట మైలకుత్తము, కర్ణల మీఁదినుచెక్కడపుఁబని, దంతపుఁబని, ఇత్తడిసామానులు చేయుదురు.

ఇచ్చట ఖాల్సాకళాశాల, హిందుకళాశాల యనురెండువిద్యాలయములు కలవు. ఇవికాక ఇతరపాఠశాల లనేకములు కలవు. వృత్తులు నేర్పుపాఠశాల యొకటియు, వర్తకసంబంధ మయినవిద్య నేర్పుపాఠశాల యొకటియుఁ గలవు.

అమృతసరము సైన్యనివాసస్థానము. ౧౯౧౯ - వ సంవత్సరము, ఏప్రిల్ నెల ౧౩ - వ తేదీని ఈపట్టణమున జలియన్‌వాలాబాగునందు జరిగినవధలమూలమున రాజకీయముగ ఈనగరముపేరు హిందూదేశమునం దంతట మాఱుమ్రోగినది. వందలకొలఁదిజనము డయరుసేనాని వలన వధింపఁబడిరి. ఈవధలు హిందూదేశమునం దంతటను రాజకీయముగ గొప్పయాందోళనమును గలిగించినవి (చూడుఁడు: జలియన్‌వాలాబాగు).

**అమృతస్వరూపిణి** — ఔడవ - ఔడవరాగము. డెబ్బదిరెండవ మేళకర్తయగు రసికప్రియరాగజన్యము. ఆరోహణము - స రి గ మ ప ధ స; అవరోహణము - స ధ ప మ గ రి స యని సంచారముకలదు.

**అమృతాంజనము** — అమృతపదము ఆర్యభాషలందు "చావు లేదు" అనుభావమున కర్థవాచకము. ఇంగ్లీషునందలి (Ambrosia) అంబ్రోజియపదమును, అమృతపదమును సమానార్థకములు. అంజనపదము సామాన్యముగను కంటికివాడెడిమందున కుపయోగపడుచున్నది. అంజనము సామాన్యదృష్టి కతీతమైన దృష్టిని గలుగఁజేసెడి సిద్ధక్రియ యను ప్రతీతి కలదు. కాని అంజనము మలామునకును (Balm) పర్యాయపదముగను వాడఁబడుచున్నది. పాశ్చాత్యవైద్యవిధాన మారంభమైనతరువాతను తైలములు, ఘృతములతోపాటు (Balm, Ontiment) అంజనములును వాడుకకు వచ్చినవి. ఓరియంటలుబాము, (Oriental Balm) దానియనుకరణములును దేశమునం దంతటను వెలసినవి. అమృతాంజనము అమృతపదార్థమును, అంజనపదార్థమును కలసి తెలుఁగుకు కల్పింపఁబడిన మందు. అమృతాంజన మనఁగా అమృతతుల్యమైన (అంజనము) 'బాము'. శ్రీయుత కా. నాగేశ్వరరావుగారు ౧౮౯౩ సం|| కల్పించిన అమృతాంజనమునకు ఆంధ్రదేశమునందును, హిందూస్థానమునందును తలనొప్పిబాము, నొప్పులకు మందు అని రూఢ్యర్థ మేర్పడినది.

**అమృతానుభవము** — ఇది తెలుఁగు తెలియని రోమనుకాథలికుపాదిరిగా రెవరో వ్రాసియుండవలె నని సి. పి. బ్రౌన్‌దొరగా రభిప్రాయపడియున్నారు. క్రైస్తవులవేదగ్రంథమగు బైబిలునందలి సువార్తలలోని కొన్నిభాగములే ఈగ్రంథముయొక్క విషయము. రోమనుకాథలిక్ మతములోని నమ్మకములు కొన్ని ఈగ్రంథమునఁ జొప్పింపఁబడియున్నవి.

**అమృతాపురం** — బళ్ళారిజిల్లా ఆలూరు తాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౧౪౭.

**అమృతుఁడు** — ప్రియవ్రతపుత్త్రుఁ డగు ఇధ్మజిహ్వునియొక్క ఏడ్గురుపుత్త్రులలో నాలవవాఁడు. అమృతవర్షమున కధిపతి.

**అమృతులు** — గంజాంజిల్లా అస్కాతాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౨,౧౦౧ (౧౯౩౧).

**అమృతేశ్వరుఁడు** — ద్వారసముద్రపుహొయసల రాజులలో నొకఁడగు వీరబల్లాలునిమంత్రి. ఇతఁడు సమస్తభట్టారనియోగాధిపతి, దండనాయకేత్యాదిబిరుదములను గలిగియుండెను. ఇతనివిషయమును వెల్లడిచేయునట్టి భిల్లమునినాఁటిశాసన మొకటి ధార్వాడజిల్లాలో నణ్ణిగేరిదగ్గఱ నున్న యమృతేశ్వరదేవాలయములో నున్నది.

**అమృతోఘ** — క్రౌంచద్వీపమునందలి నది.

**అమెజాను** — ఇది ప్రపంచమునందు మిక్కిలి పొడుగైన నది. ఇది దక్షిణ-అమెరికాలో మిక్కిలి ఉత్తరపుభాగమునందు పశ్చిమతీరమందలి ఆండీస్ పర్వతములలో పుట్టి తూర్పువైపున అట్లాంటిక్ మహాసముద్రములోఁ గలయును. ఇది నాలుగువేలమైళ్లు పొడుగుగ నున్నది. దీని జలమువలన దక్షిణ-అమెరికాలోని దాదాపు సగముభాగము పోషింపఁబడును. ఈనదిలో సుమారు ౨,౩౦౦ మైళ్లు సముద్రములోనుండి స్టీమర్లు వచ్చి వెళ్ళుచుండును.

**అమెజానులు** — గ్రీసుదేశపుపురాణములలో వర్ణింపఁబడిన స్త్రీసంఘము. వీరు మిక్కిలి బలముగలవారు. యుద్ధప్రియులు. యుద్ధము చేయునపుడు శస్త్రములకు అడ్డము రాకుండ వీరు తమ కుడికుచములను కోసివేసికొందురు. వీరిదేశములో పురుషులు లేరు. వీరు సంతానోత్పత్తికొఱకుమాత్రము తమదేశమునకు ప్రక్కదేశములనుండు పురుషులతో కొంచెముకాలము సహవాసము చేయుదురు. ఒకవేళ పురుషసంతానము గలిగినచో దానిని జంపుచుండిరి, లేక తమదేశమునుండి వెడలఁగొట్టుచుండిరి. గొప్పగొప్ప యుద్ధములలో వీరు విడిపటాలముగఁ జేరి పోరాడుచుండిరి.

**అమెన్హోటెప్** — ఈజిప్టుదేశముపై రాజ్యము చేసిన ఫెరావో (Pharao) అనఁబడు రాజులయొక్క ౧౮ - వ వంశమందలి నలుగురు రాజులపేళ్ళు: (౧) ఇతఁడు క్రీ. పూ. రమారమి ౧౫౪౦ ప్రాంతమున పదిసంవత్సరములవఱకును రాజ్యము చేసెను. ఇతనిశవము ఘిజె (Ghizeh) వస్తుసంగ్రహాలయములో నున్నది. (౨) మూఁడవ తోథిమస్‌కుమారుఁడు, క్రీ. పూ. ౧౪౫౦ మొదలు ౨౫ సంవత్సరములు రాజ్యము చేసెను. (3) నాల్గవతోథిమస్‌కుమా

sampath_Ebooks



రుఁడు. ఈతఁడు క్రీ. పూ. ౧౪౧౦ మొదలు ౩౬ సంవత్సరములు రాజ్యము చేసెను. ఈతఁడు గొప్పగొప్పమందిరములను నిర్మించెను. ఇతఁడు థీబస్ అను దేవునకు పెక్కుదేవాలయములు కట్టించెను. (౮) మూఁడవ అమెన్‌హోటెప్ కుమారుఁడు. క్రీ. పూ. ౧౩౭౫ మొదలు ౧౮ సంవత్సరములు రాజ్యము చేసెను. ఈతనితల్లి విదేశ రాజకన్య, ఈతనిభార్యయు నట్టిదే. ఆమె హిందూదేశపుస్త్రీయై యుండునని కొందఱ యభిప్రాయము.

**అమెరికా** — ఆసియాతరువాత ప్రపంచమందలి ఖండము లన్నింటికంటె నిది పెద్దది. ౭౨-వ ఉత్తరాక్షాంశము మొదలుకొని ౫౬-వ దక్షిణాక్షాంశమువఱకును, ౩౫-వ పశ్చిమరేఖాంశము మొదలు కొని ౧౬౮-వ పశ్చిమరేఖాంశమువఱకును గల భూభాగ మీ పేరఁ బరఁగుచున్నది. పశ్చిమమున పసిఫిక్ మహాసాగరమును, ఉత్తరము నందు ఆర్కిటిక్ మహాసాగరమును, తూర్పున అట్లాంటిక్ మహాసాగర మును, దక్షిణమున అంటార్కిటిక్ మహాసాగరమును దీనికి సరిహద్దు లుగ నున్నవి. త్రిభుజాకారమున నొప్పు నీయుత్తరదక్షిణ - అమెరి కాలను పెనామానామకభూసంధి గలుపుచున్నది. ఉత్తరముననుండి దక్షిణాగ్రమువఱకు నీఖండముయొక్క పొడవు ౧౦,౦౦౦ మైళ్ళు. ఎక్కువ కెక్కువ వెడల్పు ఉత్తర - అమెరికాయందు తూర్పుపడమర లకు ౩,౪౦౦ మైళ్లు. దీనిచుట్టుకొలత ౪౪,౦౦౦ మైళ్ళు. ఈ ఖండ మునకు సంబంధించిన ద్వీపములన్నిటితోఁ గలసినయెడల వైశాల్యము ౧,౬౦,౦౦,౦౦౦ ల చదరపుమైళ్ళు. అందు ఉత్తర-అమెరికావైశా ల్యము ౮౩,౦౦,౦౦౦ ల చదరపుమైళ్ళు. దక్షిణమున కేఁగినకొలఁది ఈఖండము సన్నగిలుచుఁ బోయి తుదకు అగ్రము క్రింద నంత మగును. పశ్చిమోత్తరకోణమున నీఖండమునకును ఆసియాకును మధ్య ౫౦ మైళ్ళసముద్రముమాత్రమే కలదు. పూర్వోత్తరమున గ్రీన్ లాండ్‌నుండి యూరోపునందలి ఐస్‌లాండ్‌వఱకును ౩౭౦ మైళ్ళ దూరము. కాని అత్యంతదక్షిణమున పూర్వపశ్చిమార్ధగోళములకు వేల కొలఁదిమైళ్ళ అంతర మున్నది. ఇందువలన నీరెండుగోళములందలి సమానాక్షాంశములందు ఉత్పన్నము లగు వనస్పతులు మున్నగువానిలో సమానతయు, వ్యత్యాసము రెండును గానవచ్చుచున్నవి. యురా సియాలోని యుత్తరాక్షాంశములందు ఏయేవనస్పతులు, పశుపక్ష్యా దులును గానవచ్చునో యట్టివే అమెరికాయందలి తత్సమానాక్షాంశము లందును గానవచ్చును. కాని దక్షిణాక్షాంశములం దీరెండుగోళములలోఁ జాల వ్యత్యాసము కలదు. యూరోపునందువలె ఉత్తర - అమెరికా యందును ద్వీపము లెక్కువ కాని దక్షిణ - అమెరికాయం దన్ని లేవు. అయున్నవియు మిక్కిలి దక్షిణముగ నున్నవి. ఉత్తర, దక్షిణ - అమెరి కాలకు మధ్యఁ దూర్పుప్రక్కగా విశాల మగు సింధుశాఖ కలదు. అందు మెక్సికోసింధుశాఖయు, కరిబ్బియన్ సముద్రమును, పశ్చిమ హిందూద్వీపములును నెలకొనియున్నవి.

ఈఖండమందలి మువ్వాతికభాగము మంచిమైదానము. ఈ మైదానమునకుఁ బశ్చిమముగా ఉత్తరముననుండి దక్షిణాగ్రమువఱకును పర్వతశ్రేణులు వ్యాపించియున్నవి. ఉత్తర-అమెరికాయం దివి రాకీ లను పేరఁ బరఁగుచున్నవి. ఇవి కెనడాదేశమున ఉత్తరముననుండి యారంభమై దక్షిణాభిముఖముగ వచ్చి మెక్సికోదేశపుపర్వతములలోఁ గలసి పండియు దక్షిణమునకు సాగి దక్షిణ-అమెరికాయందలి శ్రేణు లతోఁ గలయును. రాకీపర్వతములనుండి వేఱుగ వీనికిఁ బడమటిదిశను సముద్రతీరమునకు సమానాంతరముగ సైర్రానెవేడా, కాస్కేడ్ నామకపర్వతములు మఱికొన్ని వ్యాపించియున్నవి. పూర్వసముద్ర తీరమునకు సమీపముగ అప్లాషియన్ పర్వతములు గలవు. ఇవి రాకీ లంత ఎత్తయినవి కావు. ఉత్తర-అమెరికాయందలి పర్వతశిఖరము లలో మెక్‌కిన్‌లేనామకకూటము తక్కినవానికంటె నెత్తయినది. దీనియెత్తు ౨౦,౪౭౦ అడుగులు. దానితరువాత ౧౯,౫౧౪ అడుగుల యెత్తుగల లోగన్, ౧౭,౦౦౦ అడుగుల యెత్తుగల పొపొకెటాపెటల్ నామకశిఖరములు ముఖ్యమైనవి. ఈరెండు అమెరికాలను గలుపు పెనామాభూసంధి సముద్రతలముననుండి ౨౬౦ అడుగుల పల్లమున నున్నది. దక్షిణ-అమెరికాయందు ఆండీజ్ పర్వతమాలికలు ఉత్తర మున పెనామాభూసంధినుండి దక్షిణమున హార్న్ నామకాగ్రమువఱకు వ్యాపించియున్నవి. ఎత్తునం దివి రాకీపర్వతములను మించినవి కాని వానియంత వెడల్పుగలవికావు. అకంకాగువా (౨౩,౦౮౦ అడుగులు), సొరటా లేక ఇల్లంప (౨౧,౪౮౪ అడుగులు), సహామా (౨౧,౦౫౪ అడుగులు) అను శిఖరము లీపర్వతములందు మిక్కిలి ఎత్తయినవి. ఉత్తరప్రాంతములందు ఈపర్వతములు మూఁడు మాలికలుగఁ జీలి యున్నవి. వీనిలో నొకశ్రేణి ఉత్తరపూర్వముగా వ్యాపించి వెను జూలాప్రాంతమున కేఁగును. పశ్చిమమందలిశాఖ పెనామాభూసంధివఱ కును బోయినది. ఈరెండింటికి నడుమనుండు శ్రేణిలో టొలిమానామ కాగ్నిపర్వతశిఖరము కలదు. దీని యెత్తు ౧౭,౬౬౦ అడుగులు. ఇది యొక్కటే కాక ఆండీజ్ పర్వతములలో నింకను అనేకము లగ్నిపర్వ తములు కలవు.

మీఁద వచించిన యుత్తరదక్షిణ - అమెరికాలలోని మైదా నములు భిన్నములగు ప్రాకృతికలక్షణములను, కాలమానములను గలిగియున్నవి. మఱియు నీయుత్తరదక్షిణ-అమెరికాలయందు నైసర్గి కముగఁ గొన్ని సమానధర్మములును, కొన్ని విపరీతధర్మములునుగూడఁ గలవు. పశ్చిమదిశయందు ఉత్తరదక్షిణముగా పర్వతములు వ్యాపించి యుండుటయు, వానికిఁ దూర్పున విశాలములగు మైదానములయునికి, ఉత్తర-దక్షిణపూర్వాభిముఖములై నదులు ప్రవహించుట మొదలగునవి ఈరెండుభాగములందును సమానధర్మములు. ఉత్తర-అమెరికా శీతకటి బంధమున నుండి దక్షిణ-అమెరికా ఉష్ణకటిబంధమున నుండుటయు, ఈకారణమున నీరెండుదేశములలో వసించు పశుపక్ష్యాదిజీవజంతువు లందు భేదము గలుగుటయు ననునవి వీనియందలివిధర్మములు.

ఈ రెండుభాగములలోని మైదానములును అనేకనదీప్రవాహ ములతోఁ గూడి సారవంతమైన నేలలం గలిగి సకలసస్యసంవర్ధకములై యలరారుచున్నవి. మెకంజీ, కాపర్మయిన్, యూకాన్ మొదలగు

sampath_Ebooks

# అమెరికా



sampath Ebooks

నదులు ఉత్తరప్రాంతమున ప్రవహించుచుండును. చర్చిల్, నెల్సన్, సెవరెన్, అల్బనీనదులు హడ్సన్ సింధుశాఖయందును గలయును. సెంట్ లారెన్స్ అట్లాంటిక్ మహాసాగరమందును, మిసిసిప్పి, రియో గ్రాండె డెల్‌నార్టె, మెక్సికోసింధుశాఖయందును, కొలంబియా, ఫ్రేజర్, సాన్ జోఅక్విన్, సాక్రమెంటో, కొలరేడో మొదలగు నదులు పసిఫిక్ మహాసాగరమందును గలయుచున్నవి. ఈచివరం జెప్పఁబడిన నదు లంత ప్రసిద్ధికెక్కినవి కావు.

మాగ్డలీనా, ఒరినోకో, కొలరేడో, రయోనీగ్రో, అమెజాన్, పరనహిబా మున్నగునదులు దక్షిణ-అమెరికాఖండమందలివి. ఇవన్నియు అట్లాంటిక్ మహాసాగరమునఁ గలయును. కస్సిక్వియారీనామకనది రయోనీగ్రోనదినుండి చీలి ఒరినోకోనదిలోఁ గలయుచున్నది. అమెజాన్ ప్రపంచమందలినదు లన్నింటిలోఁ బెద్దది. దీనిపొడవు 3,౫౦౦ల మైళ్ళు. దీనివరదయొక్క విస్తారము ౨3,౦౦,౦౦౦ల చదరపుమైళ్ళు. పెద్దదనమున ఉత్తర-అమెరికాయందలి మిసిసిప్పి గొప్పది. మఱియు నీదేశమున సరోవరము లనేకములు గలవు. వానిలో సుపీరియర్, మిషిగన్, హ్యూరన్, ఎరీ, ఒంటారియోనామకతటాకములు ప్రధానము లైనవి. వీనిద్వారా ఖండమధ్యభాగమునకుఁగూడ నౌకాప్రయాణముల సాగింపవచ్చును.

కాలమితి (Climate) యందు ఉత్తర, దక్షిణ-అమెరికాలలోఁ జాలభేదము కలదు. ఉత్తర-అమెరికాయందలి కాలమితి మొత్తముమీఁద మనరాష్ట్రమందలి కాలమును బోలియుండును. మఱియు నిచట పడమటితీరమునకంటెను తూర్పుతీరమున శీత మెక్కువ. ఈకారణముననే అమెరికాలోని అట్లాంటిక్ తీరమందలి పట్టణములలోని చలి తిన్నగ నవే యక్షాంశముల నుండు యూరోపు అట్లాంటిక్ తీరనగరములలోని చలికంటె పదిరెట్లెక్కువగ నుండును. మొత్తముమీఁద ఉత్తర-అమెరికాయందలి యెక్కువభాగమునఁ జలి అధికముగనే యుండును. కాని యొకవిధమగు శుష్కవాయువు అతిగుణమున వీచుచుండుటవలనఁ జలి యంతగ నసహ్య మనిపించదు.

దక్షిణ-అమెరికాయందు మూఁడింట రెండువంతులు ఉష్ణకటిబంధమున నుండినప్పటికిని చల్లగ వాయువులు వీచుచుండుటవలన వేఁడిమి యనిపించదు. నీడయం దిచటితాపపరిమాణము ౧౦౦ డిగ్రీలుండును. రయోడీజనీరానగరమున మధ్యమతాపపరిమాణము ౭౮ డిగ్రీలు; లీమాపట్టణమున ౭౨ డిగ్రీలు. దక్షిణ-అమెరికాయందలి వాతావరణము ఒక్కవిధముగ నుండదు. అమెజాన్ యొక్క యుపరిభాగములందు ౧౦ నెలలపర్యంతము వర్ష మపరిమితముగ కురియుచుండును. ఇందులకు ముఖ్యకారణము తూర్పునుండి వీచు ఆర్ద్రవాయువులు. అది యటు లుండ నీకొండుదేశములలోఁగూడ సంవత్సరముపొడుగునను బొత్తిగ వాన కురియనిప్రదేశములును గలవు. మెక్సికోయందలి యుత్తరభాగము మొదలుకొని కొంతదూరము ఉత్తరమువఱకును గల ఇలాకాయందు బొత్తిగ వర్షములు కురియవు. దక్షిణ-అమెరికాలోని పెరూ, చిలీదేశములందును గావలసినంతవర్షము కురియదు.

అమెరికాఖండమునందు సకలవిధములగు ఖనిజము లుత్పన్నము లగును. వెండి బంగారము లిచటనుండి సమస్తప్రపంచమునకును రవానా యగుచుండును. సంయుక్తరాష్ట్రములందు అక్షయములగు బొగ్గుగనులు గలవు. మఱియు ఇనుము, రాగి, సీసము, తగరము, పాదరసము లోనగుధాతువుల కీదేశము తఱుఁగనికొటారము. పెట్రోలియమునూనెకిది జన్మభూమి. ఇచటి పెట్రోలియముబావులకారణమున నూతననగరము లనేకము లావిర్భవించినవి. వజ్రములు, వివిధరత్నములు నిచట దొరకును.

దేశమం దంతట మహారణ్యములు వ్యాపించియుండుటచేతను, అరణ్యములు లేనిచోట్ల పచ్చికగడ్డితో నిండిన మైదానము లుండుటచేతను ఖండ మంతయు నాకుపచ్చవర్ణము గలిగి కడు మనోహరముగ నుండును. అరణ్యరహితములైన యీపచ్చనిమైదానములే ఉత్తర-అమెరికాయందు ప్రైరీలు, సవన్న లనియు, దక్షిణ-అమెరికాయందు ల్లానోలు, పంపాలు, సెల్వా లనియుఁ బిలువఁబడుచున్నవి. ఉత్తర-అమెరికాయందలి అరణ్యము లన్నియు మనుష్యోపయుక్తము లగుచున్నవి కాని దక్షిణ-అమెరికాయందలి వింకను అనాహతావస్థయందే యున్నవి. మిక్కిలి యుత్తరమున దేవదారు, ఫర్ (Fir) నామకవృక్షము లెక్కువ. ఈభాగములకు దిగువనుండు ప్రదేశములలో ఓకుమున్నగు మూల్యమైన కలప దొరకును. అనేకప్రకారములగు తాళ్ళు, నాగజెముళ్లు, కలబందలు మొదలగు కంచెలకు, నారకు నుపయోగపడు వృక్షములును పుష్కలముగఁ గలవు. దక్షిణ-అమెరికాలోని యరణ్యములు మనుష్యులకుఁ బ్రవేశింప నలవిగాక వృక్షములతోఁ గ్రిక్కిఱిసి యున్నవి. ఇచటియడవు లన్నియు, మూలమునుండి పైవఱకును గడ్డితోడను, పలురకములమొక్కలతోడను, తీగెలతోడను పెనవైచుకొనిపోయి దుర్గమము లై యుండును.

మొక్కజొన్నలు, బంగాళాదుంపలు, పొగాకు, కింకోనా మొదలగునవి మొదటినుండియు నమెరికాయం దుత్పన్నము లగుచుండెడివే. కాని వీనికిఁ దోడుగ గోదుమ వరి మొదలగుధాన్యములును, చెఱకు, కాఫీ, ప్రత్తి, నానావిధఫలజాతులు, శాకములు పరదేశములనుండి తెప్పింపఁబడి సాగు చేయఁబడుచున్నవి. ద్రాక్ష లీఖండమునఁ బుట్టినవియు, బయటనుండి వచ్చినవియుఁగూడ ఫలించుచుండును.

దక్షిణ-అమెరికాఅరణ్యములు సింహశార్దూలాది వన్యమృగముల కునికిపట్టులు. మఱియు ఎలుఁగులు, తోఁడేళ్లు, నక్కలు, కాఱెనుములు, కణుఁజులు, దుప్పులు, అల్పాకామృగములు, ఒంటెలు, దేవాంగిపిల్లులు లోనగు నుష్ణమండలభవము లగు అనేకవిధవన్యమృగము లిచటఁ గలవు. పలుతెఱఁగులసరీసృపములును గానవగును, నదులలో

మొస ల్పపరిమితముగ నున్నవి. గుఱ్ఱములు, గొఱ్ఱెలు తప్పఁ దక్కిన గృహ్యజంతువు లన్నియు నమెరికాదేశమునఁ బుట్టినవే.

ఇచటిజనులలోఁ బరదేశములనుండి వచ్చి వసింపఁగడఁగినవారు గాక దేశీయులును జాలమంది కలరు. ఆదిమవాసులను వీరు ఎఱ్ఱఇండియను లనుపేరఁ బరఁగుచుందురు. యూరోపునుండి వచ్చిన తెల్లవారివలన నీయాదిమవాసులు కొంచె మించుమించుగ నష్టప్రాయులై పోయిరి. ఆదిమవాసులలో భిన్నభిన్నజాతులు పెక్కులు గలవు. అందుఁ గొన్ని జాతులవారికి యూరోపియనుసభ్యతయెడల నెక్కుడు ప్రీతి. అది యటు లుండ యూరోపియనులు అమెరికాను గనుఁగొన్న యారంభదినములలో దక్షిణ-అమెరికాయందలి ఉత్తరప్రాంతములందును, మధ్య-అమెరికా, మెక్సికో దేశములందును గొందఱు సభ్యజాతులవారు నివసించుచుండిరి. వీరు నాగరకతయందు మంచి యౌన్నత్యమును బొంది విశాలోన్నతసౌధములలో నివాసము చేయుచు నొకప్రకారమగు రాజ్యవ్యవస్థను గలిగియుండిరి. ఇంతేకాక కృషియందును, యంత్రకళానిర్మాణమందును వీరికి మిక్కిలి అభిరుచి యుండినట్లునఁ గనుపడుచున్నది. కాని ౧౫-వ శతాబ్దియందు యూరోపియనులు తండోపతండములుగ వచ్చి యిచ్చట నివాసము నేర్పఱచుకొనుటచే నన్నివిధముల వారికంటెఁ దక్కువస్థితియం దుండిన ఆదిమనివాసులు నవాగంతుకులలో లీనమైపోవుటనుండి తప్పించుకొనఁజాలకపోయిరి. కొందఱు తెల్లవారితోడను, మఱికొందఱు నీగ్రోలతోడను సంబంధములఁ జేసికొని వీరు తమ వ్యక్తిత్వమునే నాశనము గావించికొనిరి. ఇట్లు మిశ్రితరూపమున వెల్వడినజాతులిపుడు మెస్టిజోలు, ములట్టోలు, జంబో లనుపేరఁ బరఁగుచున్నవి. యూరోపు మొదలగు విదేశములనుండి వచ్చి వసింపఁగడఁగినవారిలో ఆంగ్లేయు లధికసంఖ్యాకులు. వీరితరువాత జర్మనులు, స్కాండినేవియనులుగూడఁ గలరు. మధ్య-అమెరికా, దక్షిణ-అమెరికావాసులలో స్పెయినులు, పోర్చుగీసులు ఎక్కువ. అత్యంత-ఉత్తరప్రాంతములందు ఎస్కిమోజాతివారు నివసించుచున్నారు. ఆదిమవాసులందఱు నాసియాఖండమునుండియే వచ్చి రనుట నిస్సందేహము కాని ఏకాలమున నెచటనుండి ఏమార్గమున వచ్చినదియుఁ దెలియదు.

ఈఖండముయొక్క జనసంఖ్య ౧౮,౦౦,౦౦,౦౦౦. ఇందులో ౧౨,౪౦,౦౦,౦౦౦ తెల్లవారు. ౨,౮౦,౦౦,౦౦౦ మిశ్రజాతులు. ౧,౫౦,౦౦,౦౦౦ నీగ్రోలు. ౧,౩౦,౦౦,౦౦౦ లు ఇండియనులు. మతమున ఉత్తర-అమెరికాయం దంతట ప్రొటెస్టెంట్ క్రైస్తవులు. దక్షిణ-అమెరికాయందు ముఖ్యముగ రోమన్ కాథలిక్కులు. ఇండియను లందఱు నన్యమతమువా రగుటంజేసి అనాగరకమతమువారుగ పరిగణింపఁబడుదురు. ఈఖండమందలి స్వతంత్రరాజ్యము లన్నియు రిపబ్లికన్ ప్రభుత్వమును గలిగియున్నవి.

ఆధునికయుగమున నమెరికాఖండమును గనిపట్టె ననుఖ్యాతి జెనోవానావికుఁడగు క్రిస్టొఫర్ కొలంబస్ అనునతనికి లభించినది. ఇతఁడు క్రీ. శ. ౧౪౯౨-వ సంవత్సరమున ప్రస్తుతపు-అమెరికాఖండమునకుఁ జేరువగ నున్న బహామాద్వీపములలో నొకదానిని జేరి దానికి సాన్‌సాల్వేడర్ అని నామకరణము గావించెను. యూరోపియన్ నావికు లింతకుఁబూర్వమే ఈఖండపుపూర్వభాగమందలి స్థలములఁ గొన్నింటిని దర్శించియుండిరి కాని వారివే రంతపర్యంతము బయటికి వచ్చియుండలేదు. అ దన్నియు నటు లుండ నీఖండమునకు కొలంబస్ పేరునఁ గాక అమెరిగో వెస్పూచి అనువాని పేర నమెరికా యనునామధేయము కలిగెను.


కొలంబస్ కనిపట్టుటకుఁబూర్వము అమెరికాయొక్క చరిత్ర మెట్టిదో తెలియదు. కాని ప్రాచీనకాలపువిజయస్తంభములు, స్మారకచిహ్నములు పెక్కుతావులందుఁ గానవచ్చుచున్నవి. వీనివృత్తాంతము పూర్తిగఁ దెలియునప్పటికి దేశముయొక్క ఇతిహాసముగూడఁ దెలియవచ్చునను ఆశ యున్నది. ఈ ప్రాచీనస్మారకచిహ్నములందు ముఖ్యమైనవి మట్టితోఁ గట్టఁబడిన బ్రహ్మాండములైన వేదులు. ఇవి పర్వతశిఖరములమీఁదను, నదీద్వీపకల్పములందును నిర్మింపఁబడియున్నవి. శత్రువులు వచ్చి ముట్టడించినయెడల స్వకీయరక్షణోపాయమునకై యివి యుపయోగపడుచుండెడివి. ఇవి విశాలములై నాలుగువైపుల లోఁతైన కందకములు గలిగియున్నవి. మధ్యమధ్య బురుజులును గలవు. అన్నివైపులను నీటియేర్పాటు లున్నవి. మధ్యమధ్య మనుష్యులు కలసేయులు కొన్ని కాన్పించుచున్నవి. మఱికొన్ని ప్రదేశములం డీవేదులు దేవాలయములుగ నుండినట్లును నిదర్శనములు కలవు. వీనియాకృతి సమత్రముగను, చతురస్రముగను, సమచతురస్రముగను గూడ నుండెను. ఇల్లినాయిస్ లోని సెంట్‌లూఈపట్టణమున కెదురు కహోకియా యనుమైదానమందలి యొకవేది ౭౦౦ అడుగుల పొడవును, ౫౦౦ అడుగుల వెడల్పును, ౬౦ అడుగులయెత్తును గలిగియున్నది. మఱికొన్ని మృత్తికావేదులు బృహత్పరిమాణములు గలిగి ప్రాణులయాకారముల నొప్పియున్నవి. అం దొకటి మనుష్యాకృతిని గలదు. దీనికి తలలు రెండు. శరీరముయొక్క పొడవు ౫౦ అడుగులు. వక్షఃస్థలము వెడల్పు ౨౫ అడుగులు. దీనిపొడవు ౧,౦౦౦ అడుగులు మెక్సికో, మధ్య-అమెరికా, పెరూదేశములందును నిట్టివేదులు కలవు. ఇవి పైనుదాహరించిన వేదులకంటె నిటీవలివిగఁ గన్పట్టుచున్నవి. మఱియు వీనినిర్మాణము చారిత్రకయుగమును సూచించును. కాని నిర్ధారితములగు ప్రమాణము లేమియు దొరకనందున వీనినిగుఱించి యిదమిత్థ మని యేమి వ్రాయుటకును అవకాశము లేదు.

ఈవేదులకుఁ దోడుగ ననేకపట్టణములయొక్కయు, పల్లెలయొక్కయు శిథిలావశేషములును గలవు. ఈయవశేషములందు విశాలములగు రాతిచెక్కడములు, మహోన్నతగోపురాకృతుల నొప్పు దేవాలయములు, దుర్గములు, పాషాణవిగ్రహములు, విగ్రహాశిలలు, చిత్రములు, రోడ్లు, నీటికాలువలు, వంతెనలు మొదలైనవెన్నియో కలవు. ఇటీవల నూతనముగఁ బూర్వచారిత్రకయుగము నాఁటివి మఱికొన్ని శిథిలావశేషములు బయటఁబడినవి. పర్వతశిఖర

sampath_Ebooks

sampath_Ebooks

# అమెరికా అంతఃకలహాము



sampath_Ebooks



వాసులగృహము లని పురాతత్త్వవేత్తలు వీని నూహించియున్నారు. ఇవి ముఖ్యముగా కొలరేడో మొదలగు అమెరికా పశ్చిమభాగమందలి కొండచరియలందును, అగాధములై, నిట్టనిలువుగ నుండుకొండలోయలముఖముల నొప్పు గుహాభ్యంతరములందును గట్టఁబడియున్నవి. ఈగృహములందుఁ గొన్నింటికి పెక్కు అంతస్తులును కలవు.

**అమెరికా అంతఃకలహము** (American Civil-War) — ఐరోపాజాతులవా రమెరికాఖండమునందు వసించుటనిమిత్తము వలస పోఁగడఁగినయారంభదినములలో కృషికార్యాదులయందు తోడ్పడుటకై దాసులనుగూడ వెంటఁ గొనిపోవుచుండిరి. పాశ్చాత్యదేశములం దాకాలమున దాసుల నుంచుకొను నాచార మంత నింద నీయముగ గణింపఁబడకుండెను. యూరోపియను లాఫ్రికా మున్నగు అనాగరకఖండములకుఁ బోయి యచటిదేశీయుల నేదో యొకవిధముగఁ బట్టికొనివచ్చి అవసరములగు నితరస్థలములందు దాసులుగ విక్రయించి ధన మార్జించుచుండిరి. ఇట్టివ్యాపారము చేయువారి కిందువలనఁ బెక్కులగు లాభము వచ్చుచుండెడిది. యజమానులచరాస్తులందుఁ బెక్కునపసువులు మొదలగువానితోపాటు దాసులును ఒకరుగ నుండిరి. నూతనఖండములందు వ్యవసాయయోగ్యమగు భూమి యపరిమితముగ దొరకుటచే నిట్లు దాసులను బెట్టికొనుట పరమావశ్యకమయ్యెను. ఈరీతిగ జమపడిన దాసులసంఖ్య కాలక్రమమున లక్షలకు మించిపోయెను. ౧౮౫౦-వ సంవత్సరమునాఁటి కేర్పడిన సంయుక్తరాజ్యములందు ౧౫ రాజ్యములవారు దాస్యప్రథ న్యాయ్యమనియు, గౌరవమనియు, స్వాభావికమనియుఁ దలఁచి దానిని తమరాజ్యములందు స్థిరపఱుచుకొనిరి. ఇవన్నియు నందువలన దాస్యరాజ్యము లను పేరను వ్యవహరింపఁబడసాగెను. తక్కిన ౧౬ రాజ్యములవారు నట్టిదురాచారము న్యాయ్యము మని దానిని తమప్రాంతములం దశాస్త్రీయ మని నిర్ధారణము గావించిరి. అందువలన నీరాజ్యములకు స్వేచ్ఛారాజ్యము లను పేరు కలిగెను. దాస్యరాజ్యము లన్నియు మొత్తమున దక్షిణమందును, స్వేచ్ఛారాజ్యము లుత్తరమందును నుండెను. దాస్యప్రథను స్థిరపఱుచుకొనవలె నని దక్షిణమువారును, దానిని నిర్మూలింపవలయు నని ఉత్తరమువారును వాగ్వివాదములతో సరిపెట్టుకొనఁజాలక తుదకు యుద్ధమునకు దిగిరి. ఇదియే యమెరికాఅంతఃకలహము. ఈయుద్ధ మారంభ మగుసరికి పదిరెండురాజ్యములు స్వేచ్ఛారాజ్యములయ్యెను. కారణాంతరములవలన నాలుగుదాస్యరాజ్యములకును స్వేచ్ఛారాజ్యములపక్షము వహింపవలసివచ్చుట ముందుముందు తెలియఁగలదు.

ఈయంతఃకలహము ౧౮౬౧-వ సంవత్సరమున ప్రారంభ మైనప్పటికి నీతద్విరుద్ధప్రయత్నము లంతకుఁబూర్వము ముప్పది నలుబదియేండ్లక్రిందటనే జనించియుండెను. మొట్టమొదట దాస్యప్రథ కనుకూలురే యెక్కువగ నుండిరి. ప్రారంభకాలమున దాస్యప్రథ కూడదనువారు నానావిధములగు కష్టములకు లోనుగావలసివచ్చుచుండిరి. క్రీ. శ. ౧౮౩౧-వ ప్రాంతమున విలియమ్ లాయడ్ గారిజన్ అనునతఁడు దాస్యమును, దాసయజమానులను గూడఁ గడు తీవ్రముగ నిందించియుండెను. కాని యాకాలమున నట్టివారిమొఱ లన్నియు నరణ్యరోదనము లగుచువచ్చినవి. ఉత్తర, దక్షిణ, పశ్చిమరాజ్యములం దెచటఁగాని ఈప్రథ అన్యాయ్య మగు నని యనుటకైన సాహసించువారు లేరైరి. మిక్కిలి స్వేచ్ఛారాజ్యములందు సైతము దాస్యప్రతికూలురను నిందించువారే మిక్కుటముగ నుండిరి. సంయుక్తరాజ్యములప్రతినిధిసభయందు (House of Representatives) ఈదాస్యమును దూరము చేయుప్రయత్నము ననుమోదించువారు కేవలము నలుగురైదుగురు తప్ప పెక్కువమంది లేరైరి. దక్షిణరాజ్యములవా రల్పసంఖ్యాకు లగునీదాస్యప్రతిపక్షులను మనుష్యాకారమెత్తినసైతాను లని హేళనపూర్వకముగ నిందించుచుండిరి. దాస్యవిమోచనమును బోధించి ప్రచారము సేయువారి నందఱను బట్టికొని కారాగారములందు పైచుటకును, వారిప్రచారకగ్రంథముల నన్నింటిని నాశనము గావించుటకును చట్టము నొకదాని నేర్పఱుపవలయు నని వీరు ప్రభుత్వమువారిని గోరుచుండిరి. ఆదినములందు ప్రభుత్వముగూడ వీరి కనుకూలముగ నుండెను. దాస్యప్రతిపక్షులు సభలు గావించుచోట్ల ధూర్తసమూహములు వారిమీఁదఁ బడి యల్లరి గావించి చెదరఁగొట్టుచువచ్చెను. దాస్యము వల దనువారిగృహములను, ముద్రాలయములను ధ్వంస మొనర్చుచుండెను. వీరినాయకులను అత్యాచారపూర్వకముగ దాస్యపక్షమువారు హింసలఁ బెట్టుచుండిరి. బోస్టన్ నగరపువీథులం దీదాస్యానుకూలురు గారిజనును త్రాళ్ళతోఁ గట్టి ఈడ్చుకొనిపోయి బీభత్సము సలిపిరి. ఫిలడల్ఫియాయందలి దాస్యవిమోచకులసభాగృహ మగ్నిపాలొనరింపఁబడెను. ౧౮౩౭-వ సంవత్సరమున ఇల్లినాయిస్ రాజ్యమందలి ఆల్టన్ పట్టణమున ఎలిజా లవ్ జాయ్ అనునతఁడు దాస్యవిమోచనమును సమర్థించువార్తాపత్రికకు సంపాదకుఁడుగ నుండినందున హత్య కావింపఁబడెను. ఇతనిని జంపినవారు శిక్షితులు గాక వదలివేయఁబడిరి. కాని ఈయంతిమ ఘటనమువలన దాస్యప్రతిపక్షులకు లాభమే కలిగెను. ఈకార్యమే దాస్యప్రతికూలురయుద్యమము నున్నతమార్గములోనికిఁ ద్రిప్పె నని చెప్పవచ్చును. సమస్తవిధములగు యాతనల నొందుచుండియుఁ బట్టు వీడక గారిజన్, ఫిలిప్స్ మున్నగువారు చేయఁగడఁగినప్రచారములమూలమున ౧౮౪౦-వ సంవత్సరము వచ్చునప్పటికి దాస్యఖండనగ్రంథము లనేకములు వెలువడుటచే రాఁబోవుసంతతులందు పెక్కురు దాస్యవిముఖులుగనే తేలుచువచ్చిరి. మఱియు ౧౮౩౬-వ సంవత్సరము ప్రాంతమున దాస్యవిమోచనప్రయత్నముల నడఁగఁ ద్రొక్కవలయు నని బయటికిఁ దేఁబడిననియమములు, చట్టములు మున్నగున వన్నియు ౧౮౪౦-వ సంవత్సరమగుసరికి రద్దు చేయఁబడెను. దాస్యప్రతికూలుర నిరంతరదీక్షాప్రయత్నముల ఫలితముగ నుదారసంఘ (Liberal-Party) మని యొకసమాజ మేర్పడెను. ౧౮౪౪-వ సంవత్సరమున నీసంఘమునకుఁ జెందినపురుషుఁ డొకఁ డధ్యక్షుఁ డగుటకుఁ బ్రయత్నిం

sampath_Ebooks



షంగా నతనికి ౮౦,౦౦౦ వోట్లు లభించెను. అటుపిమ్మట క్రమాభివృద్ధి నొందుచు తుదకు దాస్యప్రతికూలుర సంఖ్యయే యెక్కువయ్యెను.

౧౮౬౦-వ సంవత్సర ప్రాంతమున స్వేచ్ఛారాజ్యములజనసంఖ్య ౧,౯౦,౦౦,౦౦౦ లును, దాసరాజ్యములసంఖ్య ౧ కోటికంటె కొంచెము తక్కువగను నుండెను. అందు ౮౦,౦౦,౦౦౦ లకు మించిన తెల్లవారును, ౩౦,౦౦,౦౦౦ లకు కొంచెము తక్కువగ దాసులును, ౨,౬౦,౦౦౦ లకును స్వేచ్ఛగల నీగ్రోలును ఉండిరి. యజమానులొకరిద్దఱు దాసులు మొదలుకొని వెయ్యిమందికంటె నెక్కువ కూడ నుంచికొనుచువచ్చిరి. ప్రెసిడెంటు టెయిలర్ అధీనమున లూయిసియానాయందు వెయ్యిమందికంటె నెక్కువదాసు లుండిరి. దేశమందు ఏకస్వాతంత్ర్యమును, ఐహికానందపరంపరల ననుభవించువారును కొలఁదిమంది యజమానులు. తక్కినవారిజీవనము సంకటమయమైయుండెను. ధనాఢ్యులు కాని తెల్లవారును సరిగ కూటికి సుఖము లేక కష్టపడుచుండిరి. వీరికంటెఁ దక్కువస్థితియందు స్వేచ్ఛగల నీగ్రోలుండిరి. వర్ణవిభేదమువలన తెల్లవారి కుండెడు స్వాతంత్ర్యములు కొన్ని ఈనీగ్రోల కుండెడివికావు. వీరికంటెఁగూడ నీచమగు దశయందు దాసు లుండిరి. అప్పటిచట్టముల ప్రకారము దాసుఁ డొక విత్తముగఁ బరఁగె. పశువులవలె వీరిని సైతము యజమాని ఇతరుల కమ్మివేయవచ్చును, లేక అన్యపదార్థములతో వినిమయము చేసికొనవచ్చును, ఋణకర్తయైనను దాసుల నితరుల కిచ్చివేయవచ్చును. దాసునిపై యజమానునకు వంశపారంపర్యమగు అధికార ముండెను. ఈ స్థితిగతు లన్నింటియందు అమ్ముట యనునది దాసులపాలిటికి గొప్ప అత్యాచార మైయుండెను. అమ్మఁబడినవెంటనే దాసునకు తన బంధుమిత్రపుత్రకళత్రాదుల నైన విడచిపెట్టవలసివచ్చుచుండెను. మొట్టమొదట యజమానులీదాసులను విదేశములవారికి సైతము విక్రయించుచుండిరి. కాని క్రమముగ నావిధానము మాని స్వదేశమునందే విక్రయింపసాగిరి. నియమానుసారము దాసుల కట్టి యధికారము నుండెడిదికాదు. సంతలకుఁ బశువులభంగి నొక్కొక్క సమయమున గుంపులు గుంపులుగఁ దీసికొనిపోయి యమ్మఁబడుచుండిరి. కొన్ని వేళలందు దాసులు తమకుఁ దామే యమ్ముడువోవుచుండిరి. వీరికి స్వేచ్ఛ యనునది సున్న. దాసుఁడు గొప్పయాస్తిపరుఁడు కాఁగూడదు. కాని కేవలము స్వోపయోగమునకై స్వల్పమాత్రపు ఆస్తి కలిగియుండవచ్చును. ఇఁక వీరిప్రాణము లనిన నవియు యజమానుల హస్తగతములే. తగినకారణము లేకుండ, అనఁగా స్వప్రాణరక్షణార్థము తప్ప దక్కినపరిస్థితులందు దాసుని జంపుటకు యజమానికధికారము లేదు. కాని జ్ఞానశూన్యులగుటచే దాసులఁ జంపినప్పటికిని తెల్లవారు శిక్షింపఁబడకుండనే తప్పించుకొనుచుండిరి. సాధ్యమైనంతవఱకు దాసహత్యలు జరగుచుండెడివికావు. ఇందులకు ముఖ్యకారణ మాసమయమున యోగ్యులగు దాసులఖరీదు ౧,౦౦౦ మొదలు ౧,౬౦౦ ల డాలర్లవఱకు నుండెను. ఇంతటిలాభదాయకపదార్థములను చేతులారఁ బోఁగొట్టుకొనుట కెవరును ఇచ్ఛగింపరుకదా! అదిగాక దాసప్రశ్నవిషయమున నెట్టియభిప్రాయము లుండినను వారిని మితిమీఱి హింసించుట కిచ్ఛగింపక అట్లు బాధించుయజమానులయెడల లోకులు విముఖత్వమును వహించుచువచ్చిరి. అందువలన దాసులను నెక్కువగ బాధింప యజమానులు జంకుచుండిరి. గృహములందలి పనులను గావించు దాసులస్థితి చాలవఱకు బాగుగనే యుండెడిది. కాని ప్రత్తి, పంచదార, వరి మొదలగు పంటలు పండుక్షేత్రములందు పనిపాట్లు సలుపువారియవస్థ కడుశోచనీయముగ నుండెను. దాసులొనరించుకార్యములను సామాన్యముగ యజమానులు స్వయముగఁ బరీక్షించుచువచ్చిరి. కాని యజమానులు కార్యాంతరాసక్తు లయియున్న సమయమున వారిచే నియుక్తులగు నిరీక్షకులు దాసకృత్యములను బరికించుచుండిరి. అట్టిసమయములందు నిరీక్షకులు యజమానుల మెప్పు వడయుటకై దాసులచే మితిమించినపని సేయించుటయుఁ గలుగుచుండెను. పనిపాటులయందు జాలస్యము గలిగియుండు దాసులు కొత్తపుదెబ్బలకు గుఱి యగుచుండిరి. ఇట్టిశిక్ష యాకాలమున సర్వజనాంగీకృతమైయుండెను. మఱియు పారిపోవుట, మాదకద్రవ్యసేవనము, ఒడలు మఱచియుండుట, దొంగిలించుట, సమయమునకు రాకుండుట, శరీరాంబరముల మలినము గావించుకొనుట, కర్తవ్యపాలనమున నిర్లక్ష్యము నొనరించుట, ఉపకరణములను బాడుచేయుట లోనగు హేతువులకై దాసులకు శిక్ష క[illegible]. ఆహారవిషయమునను గృహదాసులదశ బాగుగ నుండెడిది కాని కృషిదాసులస్థితి యావిషయమునను హీనముగనేయుండెను. లోభగ్రస్తులగు యజమానులు వీరి యాహారములనైనఁ దిన్నగ గణింపకపోవుదు రనుసందేహమున నట్టి పరిస్థితులు కలుగకుండుటకై నియమములుగూడఁ గావింపఁబడియుండెను. కాని స్వార్థమునకు వశీభూతులై న్యాయాన్యాయముల విచారింపనియజమానులయెడ నియమము లేమి కావింపఁగలవు? ఉత్సవములందును, శీతకాలమునందును దాసులకుఁ గడుపునిండ నన్నము దొరకుచుండెడిది కాని తక్కినసమయములందు శరీరధారణమాత్రమే యైయుండెను. కొలఁదిమాత్రపుసౌకర్యము లుండినను, దాస్యము దాస్యమే కాని వేఱొండు కానేరదుగదా! యజమానులుండు విశాల భవనములకుదగ్గఱ దాసులనిమిత్తము చిన్నయిండ్లు నిర్మింపఁబడియుండెడివి. ఇఁక మతవిషయమునందు యజమానుని యిష్టానుసారముగా దాసుఁడు నడచుకొనవలెను. అత్యవసరమగు పని లేనిచో ఆదివారము నాఁడు వీరి కవకాశము దొరకుచుండెను. మౌఖికముగ బైబిలు యొక్కయుపదేశములను వీరు వినవచ్చును కాని పవిత్రగ్రంథమును స్వయముగ చదువుట కర్హులు కారు. పాదిరిసల్ల (Churches) యందు వీరు ప్రత్యేక మగుభాగమున తెల్లవారితో సంబంధము లేనిచోటఁ గూరుచుండవలయును. విద్య యనునది వీరికి సున్న. విద్యావంతులైనచో కృషికార్యాదులకుఁ బనికిరా రనియు, చదువుకొని తిరుగఁబడుదు రనియు, ఆచదువే వీరిని స్వకార్యములయెడల నసంతుష్టులఁ గావించు ననియు సాధ్యమైనంతవఱకు వీరిని మూర్ఖులుగనే యుంచుచువచ్చిరి. కాని గృహదాసులవిద్యావిషయమున

ప్రోత్సాహము కలుగుచునే యుండెను. ఇట్టి యీ దాస్యప్రశ్న నిర్మూలింపఁబడకే అంతఃకలహ ముత్పత్తిల్లెను. మీఁద లిఖించినవిధమున కాలము గడచినకొలఁదియు నుత్తరమునందలివారివాదము దృఢమగుచుంబోయెను. రెండుపక్షములవారికలహములును మఱింత భయంకరము లయ్యెను. ఈ పోరాటములను శాంతింపఁజేయవలయు నని ౧౮౫౦-వ సంవత్సరప్రాంతమున ఉత్తరదక్షిణములవారిమధ్య నొక సమాధానము కావింపఁబడెను కాని ౧౮౫౪-వ సంవత్సరమున ప్రవేశపెట్టఁబడిన ఒకబిల్లుమూలమున సమాధానము భిన్నమైపోవ మరల నల్లకల్లోలము లారంభమయ్యెను. అనంతరము ఈ దాస్యప్రశ్న ధర్మమా యధర్మమా యనువాదవివాదములు చెలరేఁగెను. అర్థికముగ నిది యావశ్యక మయ్యు ధార్మికముగ ఘోరపాతక మగుటచే సర్వథా పరిత్యాజ్య మనుసిద్ధాంతము ప్రబలమైపోయెను. ఒకప్రక్క నిట్లు వాదవివాదములతో దేశమంతయు నాందోళిత మగుచుండ జాన్ బ్రౌన్ అనునతఁడు కొందఱు అనుచరుల వెంట నిడుకొని వర్జీనియాయందలి హార్పర్స్ ఫెర్రీ యనుస్థానమును జేరి యచటియుద్ధశస్త్రాగారమును ముట్టడించెను. ఆప్రాంతమందలి దాసుల నందఱను పురికొల్పి తిరుగఁబడునట్లు చేయుటకై ఇతఁడీ కార్యమును గావించెను కాని విద్యాహీనులై, యుక్తాయుక్తవివక్షణాశూన్యులై, మూఢులై పశువులకంటెను మహోనీచస్థితియం దున్న యచటిదాసుల హృదయములందు లేశమాత్రమైనను ఆవేశము కలుగదయ్యెను. బ్రౌను నిర్బంధితుఁడై వర్జీనియానియమముల ననుసరించి ఉరితీయఁబడెను. తమమానవజన్మప్రయోజనమునైన నెరవేర్చఁజాలని పరమభాగ్యులగు దాసుల నీహార్పర్స్ ఫెర్రీ ఘటనము కర్తవ్యపరాయణులఁ జేయఁజాలకపోయినప్పటికిని దేశమందలి దాస్యవిమోచనపక్షమువారి నందఱ నొక్కపెట్టున కార్యక్షేత్రమునకు గుమికూడునట్లు గావించెను. ౧౮౬౦-వ సంవత్సరమున అధ్యక్షుని (President) ఎన్నికలసందర్భమునందే ఉత్తరదక్షిణములవారి కత్యంతతీవ్రములగు వాగ్వాదములు జరిగినవి. రిపబ్లికన్ వ్యక్తి యగు అబ్రహాం లింకన్ ఎన్నుకొనఁబడెను. ఇతఁడును, కాంగ్రెసునందలి రెండుసభలవారును, దొరతనమునందలి ఉత్తరదాయిత్వము కల గొప్పగొప్పయధికారు లందఱును దాస్యప్రతిపక్షులే యైయుండిరి. ఆకారణమున దక్షిణమువారి కిఁకఁ దమకోరిక నెఱవేఱ దనునుద్దేశముతో సంయుక్తరాజ్య సంయోజన ప్రభుత్వమున (Union) నుండి వేఱుపడుట నిశ్చయించుకొనిరి. ఈవిషయమున అందఱకంటెను ముందడుగువైచినది దక్షిణకెరొలీనారాజ్యము. ౧౮౬౦-వ సంవత్సరము డిసెంబరునందు ప్రతినిధులు కొందఱు సమావేశమై దక్షిణసంఘాతము (Southern Confederation) అను పేర నేర్పడి జఫర్సన్ డేవిస్ అనునతనిని అధ్యక్షునిగ నెన్నికొని కలహమునకు సంసిద్ధులైరి. ౧౭౮౭-వ సంవత్సరమున తమపూర్వులు గావించికొన్న యొడంబడికను రద్దుపఱచి సంయోజనమున (Union) నుండి విడిపోయినట్లు ప్రకటించుచు నందులకు సమాధానముగ నీక్రిందిహేతువులఁ బ్రకటించిరి. ఏనియమములకు కట్టువడి తాము సంయోజనమునందుఁ బ్రవేశించిరో ఆనియమములను ఉత్తరరాజ్యములవారు భంగపఱచుటచేతను, ప్రస్తుతపురాజ్యవ్యవస్థయొక్క ప్రజాస్వాతంత్ర్యనియమములు దాసయజమానులకుఁ బ్రతికూలము లగుటచేతను, స్వేచ్ఛారాజ్యము లన్నియు దాస్యపద్ధతికిఁ బ్రతిపక్షి యగునతని నధ్యక్షునిగ నెన్నుకొనుటచేతను, ముందు కార్యరూపమునకు వచ్చుసంయోజనప్రభుత్వము దాస్యరాజ్యములకు విరుద్ధ మగునది యగుటచేతను, ఉపర్యుక్తకారణములవలన రాజ్యముల కన్నింటికిని సమానస్వాతంత్ర్యము నిలువ దనుహేతువుచేతను తామీసంయోజనమునుండి విడిపోవుచుంటి మని ప్రకటించిరి. అదిమొదలు దాస్యరాజ్యములవారందఱును కాన్ఫెడరేట్లనియు, స్వేచ్ఛారాజ్యములవారు యూనియనిస్టులు లేక ఫెడరేటులు అనియు పిలువఁబడసాగిరి. ఈ మొదటి పక్షమువారు సంయోజనమును భిన్నము గావింపవలె నని తలపెట్టను రెండవపక్షమువారు దానిని రక్షింపను కటిబద్ధులైరి. ఈతరుణమున దాస్యప్రశ్నము గౌణము కాఁగా యూనియనురక్షణమే ప్రాముఖ్యమును వహించెను. దక్షిణకెరొలీనావారు తమనిశ్చితాభిప్రాయములఁ దక్కిన దాసరాజ్యము లన్నింటికిని బంప ఫిబ్రవరినెల యగుసరికి మిసిసిప్పి, ఫ్లోరిడా, అలబామా, జార్జియా, లూయిసియానా, టెక్సాస్ రాజ్యములు యూనియనువదలి కాన్ఫెడరేటుపక్షమునఁ జేరెను. యుద్ధమారంభమైనతరువాత వర్జీనియా, ఉత్తరకెరొలీనా, టెన్నెస్సీ, అర్కన్సస్ అను మఱినాలుగురాజ్యములు కాన్ఫెడరేట్లతోఁ గలసెను. దక్షిణమువారందఱును రిచ్మాండ్నగరమును కేంద్రస్థానముగ నేర్పఱచుకొనిరి. ఆసమయమున జనరల్ విన్ఫీల్డ్ స్కాట్ అనునతఁడు ఫెడరల్ సేనల కధిపతిగ నుండెను. సమ్టర్ నామకదుర్గ మప్పుడు ఫెడరల్-అధికారమందే యుండెను కాని దానియందలి కోటలన్నియు కాన్ఫెడరేట్లకుఁ జెందియుండెను. ప్రెసిడెంటు మున్నగువారి నెన్నుకొనిన పిదప దాస్యరాజ్యములవారు దుర్గముమీఁది యూనియన్ పతాకమును దీసివేయ సంకల్పించిరి. ఇందునిమిత్తము వీరు ప్రెసిడెంటు లింకను నడుగ నతఁ డాసమాచారమును స్కాటున కెఱింగించెను. శాంతముతో వ్యవహారములఁ జక్కఁజేసుకొనుట మంచి దని స్కాటు ప్రత్యుత్తర మొసంగెను. లింకనుయొక్క మంత్రులును (కాబినెట్) నెక్కువమంది సమ్టర్దుర్గమును శాంతిపూర్వకముగ వదలుటయే మంచి దని సలహా నిచ్చిరి. కాని సమ్టర్ పోయినయెడల సమస్తము పోయినటులే యని యెంచి లింకన్ ఆదుర్గమును బలపఱచుటకై యుత్తరువుల నొసంగెను. ఈసమాచారము తెలిసినతోడనే కాన్ఫెడరేట్లు ఎక్కువజననష్టము లేకుండ నాదుర్గమును స్వాధీనపఱచుకొనుటకుఁ దమసేనాని యగు జేర్ గార్డున కాజ్ఞ నొసంగిరి. దుర్గమును వదలి పోవుటకై యచట నున్న మేజర్ ఆండర్సనునకు వార్త నంప నతఁ డందులకు సమ్మతింపఁడయ్యెను. అంత ౧౮౬౧-వ సంవత్సరము ఏప్రిల్ ౧౨-వ తారీఖున కాన్ఫెడరేటుసేనలు సమ్టర్దుర్గముమీఁద బాంబులఁ గురిపింప నారంభించెను. దుర్గమందు కేవలము ౭౦ మంది సైనికులే యుండినందున ఆండర్సన్ వెంటనే దానిని వదలిపోయెను.

సమ్టర్‌దుర్గపుఘటన మైనవెంటనే, స్వేచ్ఛారాజ్యములవారందఱు నొక్కుమ్మడి నేకీభవించి యింగ్లులకు ప్రతిక్రియ వింపవలెనని నిశ్చయించిరి. అనంతర మీ రెండు తెగలవారికిని బాల్టిమోరునందు సంగ్రామ మయ్యెను. ఇందనేకసైనికులు హతులైరి. అటుపిమ్మట వర్జీనియాయందు యుద్ధ మారంభమయ్యెను. ఇందు తూర్పునందలివారు దాస్యరాజ్యములపక్షమును, పడమటిదిక్కునందలివారు స్వేచ్ఛారాజ్యములపక్షమును అవలంబించుటచే వీ రిరువురకును పరస్పరము పోరాటము కలిగెను. పూర్వవర్జీనియనులు పడమటివారిమీఁద దండెత్తిపోయిరి కాని యచట మెక్‌క్లెల్లన్ అనువతఁడు వీరిని పరాజితులఁ గావించి పాఱఁద్రోలెను. ఈసందర్భమందే పడమటివర్జీనియా యని భిన్నరాజ్య మేర్పడెను. కెంటకీ, మిసోరీరాజ్యములందును ఇటులే పోరాటములు జరగియుండెను. ముత్తముమీఁద కాన్ఫెడరేట్లకు అపజయ మగుటచే ఈరాజ్యములు యూనియనునందే స్థిరపడెను. కీని యన్నింటికంటె మనస్సస్‌నందు జరగినయుద్ధ మత్యంతప్రచండమైనది. ఇందు జనరల్ మెక్‌డోవెల్ అనువతఁడు ౩౦,౦౦౦ ల సేనతో వాషింగ్టనునుండి బయలుదేఱి కాన్ఫెడరేట్లకేంద్రమగు రిచ్‌మాండ్‌నగరమును ముట్టడింప వచ్చుచుండెను. మెక్‌క్లెల్లన్‌వలన నోటువడిన పిదప బేర్‌గార్డు ౨౨,౦౦౦ ల సైనికులతో మనస్సస్‌సమీపమందలి బుల్‌రన్‌నామకప్రవాహముపొడుగునను వ్యాపించియుండెను. జూలై మాసమున నిచట నీరెండుపక్షములవారికిని జరగినయుద్ధమందు మెక్‌డోవెల్ క్రింద నున్న యూనియను సేనల కపాయము సప్పము వాటిల్ల స్వేచ్ఛారాజ్యములవా రందఱును సిగ్గుచే అవనతవదనులైరి. యూనియన్‌పక్షమువారందఱును మొట్టమొదటి గొప్పయుద్ధమున నపజయము కలుగుట అపశకునమని చింతింపసాగిరి. కాని, ప్రెసిడెంటు లింకన్‌మాత్రము మట్లు తలపోయక సైనికులశిక్షణము సరిగ లేనందున నిట్లు సంభవించెనని తెలిసికొనెను. అందువలన మెక్‌క్లెల్లను సేనానాయకుని గావించి సేనల నన్నింటిని శిక్షితయుక్తములుగఁ జేయుట కుత్తరువుల నొసంగెను. తదనుసారము డిసెంబరునెల వచ్చునప్పటికి ౧,౮౫,౦౦౦ల మంది సుశిక్షితులగు సైనికులు సంసిద్ధులైరి. పిదప నితఁడు కాన్ఫెడరేటులరేవుపట్టణము లుండిన పూర్వతీరమంతటిని ముట్టడివైచి విదేశములనుండి యట్టిపదార్థములుగాని రాకుండునటులఁ జేయవలయు నని నియమించెను. ఒకప్రక్క నిచట యుద్ధము సాగుచుండ నీయిరుపక్షములవారును వారివారి ప్రతినిధుల యూరోపుఖండమునకుఁ బంపి వారిద్వారా తమసిద్ధాంతములను ప్రచారము చేయింప మొదలిడిరి. ఈ కార్యమువలన ఉత్తరపక్షమువారికే యెక్కువలాభము కలిగెను. ఇవన్నియు నిటులుండ అసలుయుద్ధ మారంభ మగు సమయమునకు స్వేచ్ఛారాజ్యములు ౨౨ వఱకును పెరిఁగిపోఁగా దాస్యరాజ్యములు కేవలము ౧౧ మాత్రమే మిగిలెను. ద్రవ్యము, యుద్ధసామగ్రులు మొదలగువానిని సమకూర్చుకొనుటయందేమి, రాకపోకలకు మిగుల ననుకూలములైనమార్గముల వశములో నుంచుకొనుటయందేమి కాన్ఫెడరేటులకంటె యూనియనిష్టులే ఎక్కుడుసౌకర్యములను గలిగియుండిరి. కాని తిరుగఁబడినరాజ్యముల నోడించి వారిని మరల యూనియనునకు బద్ధులై యుండునటులఁ జేయుటయందు స్వేచ్ఛారాజ్యములవారికార్యమే యెక్కువ కఠినమై యుండెను. అధ్యక్షుని యాదేశానుసారము ౧౮౬౧-వ సంవత్సర మంతయు సైనికులను సుశిక్షితులఁజేయుటయందే కడచిపోయెను. ౧౮౬౨ ఆరంభమగునాటికి యూనియనిష్టులపక్షమున ౫,౦౦,౦౦౦ ల సైనికులును, ౨౦౦౦ ల యుద్ధనౌకలును తయారయ్యెను. అప్పటికి ౧౫,౦౦౦ లు మన్రోదుర్గమందును, ౨,౦౦,౦౦౦ లు వాషింగ్టన్‌చేరువ చుట్టుప్రక్కలందును, ౭౦,౦౦౦ లు పడమటివర్జీనియాయందును, ౧,౦౦,౦౦౦ లు లూయీవిల్లియొద్దను, ౭౦,౦౦౦ ల మంది అత్యంతపశ్చిమసీమలందును ప్రాపకులై యుండిరి. ఇతరత్రాయున కాన్ఫెడరేట్లయొద్ద ౨,౫౦,౦౦౦ ల సైనికులు సంసిద్ధులై యుండిరి. వారిలో ౧,౬౫,౦౦౦ ల మంది తూర్పువర్జీనియాయందును, ౩౦,౦౦౦ ల మంది కెంటకీరాజ్యములోని కొలంబస్, డొనెల్‌సన్, హెన్రీనామకదుర్గములందును, ౨౦,౦౦౦ ల మంది టెన్నెస్సీరాజ్యములోని నాష్‌విల్లీ, చట్టనూగాలయందును నిలిచియుండిరి. వీరుగాక మఱియనేకసేనలు, న్యూఆర్లియన్స్, నాచ్‌చేజ్, విక్సబర్గ్, మెంఫిసులఁగూడ మిసిసిప్పీలోయ సంతతిని గాచుచుండెను

మీఁద వచించినవిధమున సైనికుల నుత్తమరీతిని శిక్షితులను గావించుప్రయత్నములందే ౧౮౬౧-వ సంవత్సరము కడచిపోయెను. అంత ౧౮౬౨-వ సంవత్సరము జనవరినెల ౨౭-వ తారీఖున యూనియను సేనలకన్నింటికిని సర్వాధిపత్యము వహించియున్న ప్రెసిడెంటు లింకన్ ఈక్రిందివిధమున నుత్తరువులఁ గావించెను.

" ఈసంవత్సరము ఫిబ్రవరి ౨౨-వ తారీఖున సంయుక్తరాజ్యములసేనలు కాన్ఫెడరేటుసేనలపై దండెత్తి పోవలయును. కావున ముఖ్యముగా మన్రోదుర్గమందలి బలములును, వాషింగ్టన్ ప్రాంతములందు మెక్‌క్లెల్లన్ అధీనమున నున్న పొటొమాక్ సైన్యమును, పశ్చిమవర్జీనియాయందలి దళములును, కెంటకీరాజ్యమందలి లూయీవిల్లీయొద్ద నున్న సేనలును, కెయిరోదగ్గతి జలస్థలవాహినులును, మెక్సికోసింధుశాఖయందలి జలసేనలును పైని వచించినతారీఖున బయలుదేఱుటకు సర్వసన్నద్ధము లైయుండవలెను. ఇవికాక తక్కినసేనాసమూహము లన్నియుఁగూడ నుత్తరువులకై వేచియుండవలెను. ఈసేనావిభాగము లన్నింటికిని జెందిన యధికారులు, ఆఫీసరులు, దళాధిపతులు లోనగువారు తమతమకర్తవ్యములను బాగుగ గుర్తెఱిఁగి, ఈయుత్తరువుల నన్నింటిని అమలులోఁ బెట్టవలయును. "

అటుపిమ్మట నితఁడు యుద్ధమేలాగున సాగింపఁదగునదియు పన మంత్రివర్గములోఁ గలసి యాలోచించుకొని స్థిరపఱిచికొనెను.

కాన్ఫెడరేట్లకు ముఖ్యస్థాన మగు రిచ్‌మాండ్‌నగరమును ముట్టడి వేయుటయు, ఉత్తరమందలి యూనియనుసేనలు నిరాటంకముగ దక్షిణమున కేఁగుటకును, కాన్ఫెడరేట్లను విడఁదీయుటకును మీ లగు

sampath Ebooks

లాగున మిసిసిప్పీలోయను వశపఱచుకొనుటయు నిప్పుడు యూనియనిస్టులకు ముఖ్యకర్తవ్యములై యుండెను. అందునిమిత్తము వర్జీనియాయందును, పశ్చిమరాజ్యములందును, సముద్రతీరమంతటను వెంటనే యుద్ధము సాగింపవలసియుండెను. ఈవిధానము ననుసరించి యుద్ధారంభమైనవెంటనే పశ్చిమప్రాంతములందు టెన్నెస్సీనదిమీఁద నున్న హెన్రీదుర్గమందును, కంబర్లాండ్ నదిమీఁద డొనెల్సన్ దుర్గమందును కాన్ఫిడరేటుసేన లుంచినందున కమ్మొడోర్ ఫూట్ మొదటిదుర్గమును, సింప్సన్ గ్రాంట్ రెండవదుర్గమును ముట్టడించి వశపఱచుకొనిరి. అనంతరము జనరల్ హెల్లాకుతో గ్రాంటుతో నితఁడు కారింత్ నగరమును సైతము ఆక్రమించుకొనెను. క్రమముగా పోప్, ఫూట్ నామకసేనానుల ఉద్యమములమూలమున మిసిసిప్పీనది యుత్తరభాగమున విక్స్‌బర్గ్ వఱకును యూనియనిస్టులవశ మయ్యెను. దక్షిణమున అడ్మిరల్ ఫారెగట్ గావించిన ప్రయత్నములవలన మిసిసిప్పీమీఁది పోర్ట్‌హడ్సన్ వఱకును గలభాగము యూనియనిస్టులకు దొరకెను. కాని పూర్వప్రాంతములందు కాన్ఫెడరేట్లకే యెక్కువజయము చేకూరెను. రిచ్‌మాండ్ నగరము నాక్రమించుకొనవలయు నని మెక్‌క్లెల్లన్ ఘోరప్రయత్నముల సలిపెను కాని సాధ్యము కాకపోయెను. అందువలన యూనియనిస్టుసేనానాయకులందు మూఁడునాలుపర్యాయములు మార్పులు కలిగెను. అయినప్పటికిని ౧౮౬౨-వ సంవత్సరము సమాప్తమగుసరికి యూనియనిస్టుపక్షమువారికే యెక్కువ అనుకూలముగ నుండెను. పోర్ట్‌హడ్సన్, విక్స్‌బర్గ్ మధ్యఁగల భాగము దప్పఁ దక్కిన మిసిసిప్పీభాగమంతయు యూనియనిస్టులచేతులందుఁ జిక్కెను. సమగ్రపశ్చిమవర్జీనియా, యావత్తు మిసోరీ, సమస్తకెంటకీ, టెన్నెస్సీ, అర్కన్సస్‌లలోని విస్తారభాగమును, మిసిసిప్పీ, లూయిసియానాలలోని కొన్నిభాగములును యూనియనిస్టులవశ మయ్యెను. ఇఁక యుద్ధమునందలి జయాపజయము లనిన పశ్చిమదేశమున యూనియనిస్టుల కెక్కువజయములును, తూర్పున కాన్ఫెడరేట్ల కెక్కువజయములును లభించియుండెను. యుద్ధము లీప్రకారము హోరాహోరిగ జరుగుచుండినకాలమందే ౧౮౬౨-వ సంవత్సరము సెప్టెంబరుమాసమున లింకన్ దాస్యవిమోచనమును బ్రకటించి ౧౮౬౩-వ జనవరి మొదటితారీఖునుండి యూనియను మములలోనికి వచ్చు నని వెల్లడిగావించెను. తదనుసారము జనవరిమాసము వచ్చినతోడనే దాస్యరాజ్యములందలిదాసు లందఱును స్వతంత్రులై రనియు, సంయుక్తరాజ్యముల ప్రభుత్వము తక్కినజను లందఱవలె వీరిసంరక్షణాదులవిషయమున బాధ్యత వహించు ననియు, న్యాయానుకూలమగురీతిని ద్రవ్యార్జనపరులై వీ రిష్టమువచ్చినలాగున జీవింపవచ్చు ననియు, మఱియు నట్టివారు వలసినయెడల సంయుక్తరాజ్యములసేనలందు చేరి పని చేయుట కెట్టియభ్యంతరము నుండ దనియు దేశమందంతటను ఘోషణము చేయించెను. ఈఘోషణము కాన్ఫెడరేట్లకోపాగ్ని కింధనము గాఁగా, వారిప్రెసిడెంటగు డేవిస్ లింకనుయొక్క ఈప్రకటనము యజమానుల నందఱను హత్య గావింపుఁ డని బానిసలను ప్రేరేపించుట యని వక్కాణించెను. కాని దాస్యమును రూపుమాప నెంచువారి కందఱకు నిందువలన మహానందము కలిగెను. ౧౮౬౩-వ సంవత్సర మంత మగునప్పటికి ౧,౦౦,౦౦౦ ల మంది ముక్తదాసులు సంయుక్తరాజ్యముల సైన్యవిభాగమందుఁ బనిచేయుచుండిరి. ౫౦,౦౦౦ ల మంది సైనికులై ఆయుధములఁ దాల్చియుండిరి. దాస్యవిమోచనమువలన విదేశములందును, ముఖ్యముగ నింగ్లండునందును అమితానందము కలిగెను. ఆంగ్లేయు లింతవఱకును ఉత్తరరాజ్యములపట్ల సందేహమును వహించియుండిరి కాని దాస్యవిమోచనమువలన వీరియనుమానము లన్నియుఁ దీఱిపోయెను. ౧౮౬౩-వ సంవత్సరమున చాన్సలర్ విల్లీ మున్నగు ప్రదేశములందు యూనియనిస్టులకు పరాజయమే కలిగెను కాని తుదకు విక్స్‌బర్గ్, చట్టనూగా నామకస్థానములు దొరకుటవలన మిసిసిప్పీలోయ యంతయు వీరివశ మగుటయే కాక లూయిసియానా అర్కన్సస్, టెన్నెస్సీలు ఫెడరల్ రాజ్యములోనికి వచ్చెను. ఈజయమున కంతకును కారణుఁ డంతవఱకు నెక్కువప్రఖ్యాతి లేకయుండిన జనరల్ గ్రాంట్ అనువాఁ డగుటచేత ప్రెసిడెంటు లింకన్ ఇతనిని యుక్తమగురీతిని సన్మానించుటకై వాషింగ్టనునకుఁ బిలిపించి లెఫ్టినెంట్ జనరల్ అనుపదము నొసంగి అమెరికా సంయుక్తరాజ్యములసేనకు నాయకునిగఁ గావించెను. అటుతరువాత గ్రాంటు యుద్ధక్షేత్రమునకు మరలిపోయి మీడ్, షెర్మన్‌లను మఱి యిద్దఱు సేనానులతోఁ గలసి భావియుద్ధకార్యక్రమమును నిశ్చయపఱచుకొనెను. తదనుసారము గ్రాంటు వర్జీనియాయందలి కాన్ఫెడరేటు ముఖ్యసేనాని యగు జనరల్ లీ యనువానితోఁ దలపడుటకును, షెర్మన్ డాల్టన్‌వద్ద జాన్స్టన్ అను వేఱొక కాన్ఫెడరేటుసేనాని నెదిరించి జార్జియారాజ్యమును లోఁబఱచుకొని యటనుండి యుత్తరమునకుఁ బోయి రిచ్‌మాండును ముట్టడించునప్పుడు గ్రాంటునకుఁ దోడ్పడుటకును స్థిరపఱుపఁబడెను. ఈసమయమున యూనియనిస్టులపక్షమున ౭,౮౦,౦౦౦ ల సైనికులును, కాన్ఫెడరేట్లతరఫున ౪,౭౦,౦౦౦ లును ఉండిరి. ఇంతపర్యంతము జరగినయుద్ధము లన్నియు కేవల ప్రారంభికములే యైయుండెను. అసలుయుద్ధ మనునది ముందే యుండి లోకమంతయు దానిపరిణామమునకై యెదురుచూచుచుండెను.

పైని గావించికొనిన యేర్పాట్లప్రకారము ౧౮౬౪-వ సంవత్సరము మేనెలయందు షెర్మన్ బయలువెడలి డాల్టన్‌వద్ద జాన్స్టను నోడించి పాఱఁదోలి యనంతరము రెసకా, డల్లాస్, లాస్ట్‌మౌంటెన్, కెనీసామౌంటెన్ మున్నగుస్థానములలో నొకదానితరువాత నొకదానియందు జయము గొనుచు అటలాంటానగరముమీఁది కేఁగి దానినిగూడ వశపఱచుకొనెను. ఇక్కడ నీవిధమున జరుగుచుండ దక్షిణమున అడ్మిరల్ ఫారెగట్ మోబైల్ నగరమును జయించి పట్టుకొనెను. ఇదేతరుణమున రెండుసంవత్సరములనుండియు యూనియనిస్టునౌకల వేధించుచుండిన అలబామా యను శత్రులయుద్ధనౌక కేర్‌సర్జ్ నామకనౌకతోఁ దలపడి యోడి సముద్రమున మునిఁగిపోయెను. షెర్మన్ అటలాంటావిజయానంతరము జార్జియారాజ్యమును ధ్వంసము

sampath_Ebooks

గావించుచుఁ బోయి సవన్నానగరము నాక్రమించుకొనెను. ఈసంవిగ్రహమున జార్జియాకు పదికోట్లడాలర్ల నష్టము గలిగెను. షేర్మన్ ఇచట ఒకనెలరోజు లుండి తనసేన నింకను బలపఱుచుకొని ఉత్తరాభిముఖుఁడై జనరల్ గ్రాంటునకుఁ దోడ్పడ బయలుదేఱిపోయెను.

జార్జియా, కెరొలీనారాజ్యములం దీవిధమున సమాచారములు జరుగుచుండ వర్జీనియాలోని దేశమధ్యమున జనరల్ గ్రాంట్, జనరల్ లీతోడ ప్రతిఘటించి పోరాడుచుండెను. విల్డర్నెస్, స్పాట్సిల్వానియా, కోల్డ్‌హార్బర్ మొదలగు స్థలములందు జనరల్ లీయొక్క సేనల నెదిరించి భయంకరముగఁ బోరుచు ముందునకే సాగిపోయి, గ్రాంటు పీటర్స్‌బర్గును ముట్టడించెను. లీ ఇతనిని వేఱొకప్రక్క కాకర్షించు నిమిత్తము షెనెండోవా నామకనదీమార్గమును వశపఱచికొని వాషింగ్టన్ పట్టణమును ముట్టడించునట్లు జతిపింపవలసినదిగ నాజ్ఞాపించి అర్లీ యను కాన్ఫెడరేటు సేనానిని షెనెండోవాలోయకుఁ బంపెను. ఇతను సార మర్లీ యాలోయ నంతటిని స్వాధీనపఱచికొని క్రమముగఁ బ్రయాణములు సలుపుచు వాషింగ్టనునుండి ఆఱుమైళ్ల దూరములోనికిఁ బోయెను. కాని ఇంతలో గ్రాంటు పంపిన షెరిడన్ యూనియనిస్టు సేనలతో నితనిమీఁదఁబడి చావఁదన్ని, కాన్ఫెడరేట్‌సేన నంతయుఁ జెదరఁగొట్టెను. ఇట్లు లోయ నంతను ఎడారి గావించి వెనువెంటనే షెరిడన్ గ్రాంటుదగ్గఱకు వచ్చిచేరెను. అనంతరము రిచ్‌మాండ్ ముట్టడి మహాతీవ్రముగ జరగెను. ముఖ్యం దీనగరమునకు ద్వారముగ నున్న పీటర్స్‌బర్గును జయించినచో రిచ్‌మాండును బట్టికొనుట సుకరమని యెంచి యటులే చేయించెను. కాని పీటర్స్‌బర్గును జయించుటయే యూనియనిస్టులకు మిగుల కష్టమయ్యెను. తుదకు ౧౮౬౫-వ సంవత్సరమున పీటర్స్‌బర్గుపట్టణము స్వాధీన మయ్యెను. దీనితోపాటు రిచ్‌మాండునగరము పతనము కాఁగా జనరల్ లీ యూరోటు వీడి యూనియనిస్టుసేనలను త్రోసికొనుచు ముందునకుఁ బోవ ప్రయత్నించెను గాని సాధ్యము కాకపోయెను. అపరిమితములుగ నున్న గ్రాంటుసేనలు జనరల్ లీని అడుగడుగున నెదిరించి యతనిమార్గము నరికట్టినవి. అంతఁ జేయునది లేక ౧౮౬౫-వ సంవత్సరము ఏప్రిల్ తొమ్మిదవతారీఖున అప్పొమెట్టక్స్‌వద్ద నితఁడు ౨౮,౦౦౦ల మంది సైనికులతోఁగూడ జనరల్ గ్రాంటునకు లోఁబడిపోయెను. ఇట్టి అఖండవిజయము కలిగిన తరుణమున జనరల్ గ్రాంట్ జనరల్ లీని వీరోచితముగ సమ్మానించెను. గ్రాంటు అతనిచేతనుండి ఖడ్గమును దీయించియుండలేదు. మఱియు నితఁడు లీయొక్క సైనికులకు వారియశ్వములను వారికే యిప్పించి యాతనిసైన్యమునకు ౫ రోజులవఱకును సరిపోవునట్టి యాహారపదార్థము లన్నింటిని నిప్పించెను.

రిచ్‌మాండ్ పతనానంతరము కాన్ఫెడరేట్‌ప్రెసిడెంటగు డేవిస్ తనమంత్రివర్గములో చార్లొటెపట్టణమునకుఁ బోయెను. కాని యచట కాన్ఫెడరేట్‌సేనాని జాన్‌స్టన్ షేర్మన్‌చే పరాజితుఁడై యతనికి లోఁబడిపోయినందున దాస్యరాజ్యములవారిప్రభుత్వమే భగ్నమైపోయెను. డేవిస్ జార్జియాకుఁ బోవుచుండ మేనెలలో ఇర్విన్ విల్లీయొద్దఁ బట్టికొనఁబడి వర్జీనియాయందలి మన్రోదుర్గమున కంపఁబడెను. అచట రెండుసంవత్సరములు ఖైదీగ నున్నపిమ్మట యూనియనుప్రభుత్వము వా రితనిని జామీనుమీఁద వదలిరి. యుద్ధము పరిసమాప్తమగునప్పటికి యూనియను సేనలందు ౧౦,౦౦,౦౦౦ల మంది సైనికు లుండిరి. వీరిలో ౮,౦౦,౦౦౦ల మంది ఒక్కపర్యాయముగ సైనికవృత్తి విడనాడి మరల వారివారివృత్తులందు మున్నలై జీవనము సేయసాగిరి. యూనియనిస్టులపక్షమున నీయుద్ధమందు ౩,౬౦,౦౦౦ల మంది మనుజులు హతులైరి. కాన్ఫెడరేటుపక్షమునందును నింతకెక్కువగనే మరణించియుందురు. కావున ౩ లక్షలకు పైగ మనుష్యప్రాణము లర్పణము కాఁగా నీదాస్యప్రథ అమెరికానుండి యంతరించిపోయినది. దాస్యరాజ్యములవారిం గ్లండు తమపక్షము వహించి తమ స్వాతంత్ర్యమును స్వీకరించు నని నమ్మియుండిరి కాని యది వట్టి భ్రమయే యైపోయెను.

## అమెరికా సంయుక్త రాజ్యములు (The United states of America)

— ఇది ప్రజాపాలితమగు సంఘాతరాజ్యము (Federal Republic). సమశీతోష్ణకటిబంధమున (Temperate Zone) ఉత్తర-అమెరికామధ్యభాగము నంతటను అనఁగా ౨౫ ౩౫-౪౯ ఉత్తర-అక్షాంశములమధ్యను, ౬౬ ౫౫ - ౧౨౪ ౪౫ పశ్చిమ రేఖాంశములమధ్యను వ్యాపించియున్నది. దీని కుత్తరమున కెనడా రాజ్యము. విశాలసరస్సులవలన నేర్పడిన నైసర్గికరేఖయు ౪౯-వ యక్షాంశమునకు సమానాంతరమున దానిదగ్గఱనేయుండు కల్పిత రేఖయుఁ గలసినచో దీనియుత్తరసీమారేఖ యగును. దక్షిణమున మెక్సికోసింధుశాఖాతీరమును, రియోగ్రాండె డెల్ నార్టె యొక్క లోయకొంతవఱకు, ననంతరము పశ్చిమోత్తరముగఁ బోయిన కల్పిత రేఖయు నెల్లలుగ నున్నవి. తూర్పున అట్లాంటిక్ మహాసాగరము. ఈ మహాసముద్రము యూరోపు పశ్చిమతీరము పర్యంతము మూఁడువేల మైళ్ల దూరము వ్యాపించి ఈ రెండు ఖండముల వ్యాపారాదులకును ముఖ్యమార్గముగ నున్నది. సంయుక్తరాజ్యములకుఁ బశ్చిమట పసిఫిక్ మహాసాగరము. ఇది ౫, ౬ వేలమైళ్ల నిడివిని ప్రాచ్యఖండముల పూర్వతటములవఱకును వ్యాపించియున్నది. దీనిమార్గమున నంత యెక్కుటమగు వ్యాపారము జరగదు.

ఆరంభదశయం దీదేశమునకు మూలభూతములైన ౧౩ రాజ్యములను ఏకీభవించి ౧౭౮౭-వ సంవత్సరమున సంయోజనవ్యవస్థ నేర్పఱుచుకొని దానిద్వారా కొన్ని పరిపాలనాధికారములను (Powers of Administration) సంయోజనప్రభుత్వమున కొసంగియుండెను. ౧౭౮౯ మొదలుకొని ఈవ్యవస్థ ననుసరించియే పరిపాలనము జరగుచున్నది కాని యవసరమునుబట్టి ఈ వ్యవస్థయందు వేర్వేఱుసమయములలో మార్పులు కలుగుచుఁబోయె నని మందు విశదము కాఁగలదు. ఆదియందలి ౧౩ రాజ్యములును క్రమముగ ౪౮ రాజ్యములుగఁ బెరిగిపోయెను. వీని యన్నింటి మొత్తపు వైశాల్యము

sampath_Ebooks

sampath_Ebooks

# అమెరికాసంయుక్తరాజ్యములు



sampath Ebooks

౩౦,౨౬,౭౮౯ చదరపుమైళ్లు. ౧౯౨౦-వ సంవత్సరపు జనాభా ప్రకార మిచట ౧౦,౫౭,౧౦,౬౨౦ మంది జను లుండిరి; అనఁగా చదరపుమైలునకు ౩౫.౫ వంతునఁ గలరు. ఇందు నూటికి ౮౯.౭ మంది యూరోపియన్ సంతతు లగు తెల్లవారు. ౧౯౨౮-వ సంవత్సరము నాఁటి జనగణనమునుబట్టి ౧౨,౦౦,౧౩,౦౦౦ ల జను లుండిరని తెలియ వచ్చెను. ఇందులకుఁ దోడుగ నీరాజ్యములకు వెలుపల దీనికిఁ జెందినది ౭,౧౧,౬౦౪ చదరపుమైళ్ల దేశమును, అందు ౧,౨౧,౧౨,౫౪౫ మంది మనుష్యులును ఉండిరి. ఇంవలి నలుబదియెనిమిది రాజ్యములు నీ క్రింది పేరులఁ బరఁగుచున్నవి.

| | | |
|---|---|---|
| ౧. అల్బమా | ౧౭. కెంటకీ | ౩౩. ఓహియో |
| ౨. అరిజోనా | ౧౮. లూయిజియానా | ౩౪. ఓక్లహోమా |
| ౩. అర్కన్సస్ | ౧౯. మెయిన్ | ౩౫. ఆరెగన్ |
| ౪. కాలిఫోర్నియా | ౨౦. మేరీలాండ్ | ౩౬. పెన్సిల్వనియా |
| ౫. ఉత్తర కెరొలీనా | ౨౧. మసచూసెట్స్ | ౩౭. రోడ్‌దీవి |
| ౬. దక్షిణకెరొలీనా | ౨౨. మిషిగన్ | ౩౮. టెన్నెస్సీ |
| ౭. కొలరేడో | ౨౩. మిన్నెసోటా | ౩౯. టెక్సాస్ |
| ౮. కన్నెక్టికట్ | ౨౪. మిసిసిప్పి | ౪౦. ఉటాహ్ |
| ౯. డిలావేర్ | ౨౫. మిసోరీ | ౪౧. వెర్మాంట్ |
| ౧౦. ఫ్లోరిడా | ౨౬. మోంటానా | ౪౨. వర్జీనియా |
| ౧౧. జార్జియా | ౨౭. నెబ్రాస్కా | ౪౩. పశ్చిమవర్జీనియా |
| ౧౨. ఇడాహో | ౨౮. నెవాడా | ౪౪. వాషింగ్టన్ |
| ౧౩. ఇల్లినాయిస్ | ౨౯. న్యూహాంప్‌షైర్ | ౪౫. విస్కన్‌సిన్ |
| ౧౪. ఇండియానా | ౩౦. న్యూజెర్సీ | ౪౬. వియోమింగ్ |
| ౧౫. అయోవా | ౩౧. న్యూమెక్సికో | ౪౭. ఉత్తరడకోటా |
| ౧౬. కన్సస్ | ౩౨. న్యూయార్క్ | ౪౮. దక్షిణడకోటా |

ఇవిగాక సంయుక్తరాజ్యములవెలుపల దీనికిఁ జెందినవి:— ౧. అలాస్కా, ౨. గుఆమ్, ౩. హవాయి, ౪. పనామా, ౫. ఫిలిప్పైన్, ౬. పోర్టు రైకో, ౭. సమోవా, ౮. వర్జిన్‌దీవులు అను ఎనిమిది ఇలాకాలు కలవు.

నైసర్గికస్వరూపము, నదులు, పర్వతములు, సరస్సులు:— అట్లాంటిక్ సముద్రతీరమును, మెక్సికోసింధుశాఖాతీరమును పల్లముగ నుండును. ఈప్రక్కయంవలినదు లంత పెద్దవి కావు. ముఖ్యముగ పూర్వోత్తరపు - అట్లాంటిక్ తీరము సింధుశాఖలు- అఖాతములతోఁ గూడుకొని కడువక్రముగ నుండును. ఈప్రాంతమున సెంట్‌లారెన్స్, హడ్సన్, పొటొమాక్, డిలావేర్ నామకనదులు ముఖ్యమైనవి. అట్లాంటిక్ తీరప్రదేశమునకుఁ బశ్చిమమున అప్లాషియన్ పీఠభూములు పర్వతములు వ్యాపించియున్నవి. ఇవి సెంట్‌లారెన్స నదియొక్క దక్షిణమునుండి యారంభమై దక్షిణపశ్చిమాభిముఖముగ సుమారు ౩౦౦ ల మైళ్ల వెడల్పున మెక్సికోసింధుశాఖాతీరముపర్యంతమును బోవును. ఇం దనేకపర్వతమాలికలు సమూహములు గలవు. వానిలో న్యూహాంప్‌షైర్‌లోని శ్వేతపర్వతములును, వెర్‌మాంటులోని హరిన్మహీధరములును, దక్షిణపూర్వపు న్యూయార్కులోని కాట్స్‌కిల్ కొండలును, ఉత్తరన్యూయార్కునందలి అడిరన్‌డెక్స్ కొండలును, పెన్సిల్వనియాయందలి ఆల్లెనీపర్వతములును ముఖ్యమైనవి.

అప్లాషియన్ పీఠభూమికి పడమట మధ్య - సమతల భూమి వ్యాపించియున్నది. ఉత్తరమున లారెన్షియన్ పీఠభూమి దీనికి తగులును. ఈమైదాన ముత్తరమున ఆర్కిటిక్ మహాసముద్రము వఱకును, దక్షిణమున సింధుశాఖవఱకును బోయియున్నది. మధ్య - సమతలభూమికి (Central plain) పశ్చిమమున మధ్య - పీఠభూమి (Central plateau) కలదు. ఈపీఠభూమికిఁ బశ్చిమోత్తరములందు మధ్య - సమతలములును, దక్షిణపూర్వములందు సింధుశాఖా - సమతలములును జుట్టియున్నవి.

మధ్య-సమతలభూమికిఁ దిన్నగఁ బశ్చిమమున ఉత్తరమునుండి దక్షిణముగ వ్యాపించి రాకీపర్వతసీమలు గలవు. ఈపర్వతభూమి యొక్క వెడల్పు ఒక్కొక్కచోట వెయ్యిమైళ్లవఱకును గలదు. వీని పడమటిభాగములందు సైరా నెవాడాకొండలును, కాస్కేడ్, తీరపర్వతములును, నీలగిరులును (Blue Mountains) గలవు. మఱియు రాకీపర్వతప్రాంత మంతయు దక్షిణరాకీభూమి, వియోమింగ్ పరీవాహక్షేత్రము (Wyoming basin), మధ్యరాకీభూమి, ఉత్తరరాకీభూమి యని నాలుగు భాగములుగ విభజింపఁబడియున్నది. దక్షిణరాకీభూములందు ౧౨, ౧౪ వేల యడుగుల యెత్తు గల శిఖరము లున్నవి. ౮, ౧౦ వేల యడుగుల యెత్తుగల పీఠభూములును నిండుఁ గానవచ్చును. ఈపీఠభూములలో ముఖ్యమైనది పైక్స శిఖరమునకుఁ బశ్చిమమున నున్న సౌత్‌పార్కు (South Park). దీని యౌన్నత్యము ౯, ౧౦ వేల యడుగు లుండును. వియోమింగ్ రాజ్యపు పశ్చిమోత్తరకోణమున యల్లోస్టోన్ పార్కునామకమనోహరప్రదేశము కలదు. ఇది అగ్నిపర్వతమునుండి వెలికి వచ్చు ద్రవపదార్థమగు లావావలన నేర్పడినపీఠభూమి యని యూహింపఁబడినది. దీనియెత్తు సుమారు ౮,౦౦౦ అడుగు లుండును. ఇక్కడనుండి యనేక దిక్కులకు పర్వతమాలికలు చీలిపోయియున్నవి. మఱియు నీపార్కునకు మూఁడువైపులను పర్వతము లావరించియుండ నొకప్రక్కనుండియే లోనికిఁ బోవుమార్గము కలదు. ఇచట ౨,౦౦౦ ల అడుగుల లోఁతువఱకును లావాయే కలదని కనుఁగొనిరి. ప్రపంచమం దెచటను లేని విచిత్రములగు ఉష్ణజలకుండములును, ప్రవాహములు నిచటఁ గలవు.

వియోమింగ్ పరీవాహక్షేత్రము ఎత్తయినపీఠభూమి. గ్రీన్, బిగ్‌హారన్, ఉత్తరప్లాట్టె మొదలగు నదు లనేకము లీపీఠభూమియందు జనించును.

రాకీపర్వతభూములకు దక్షిణమున పడమరగ అంతఃపర్వత పీఠభూము లున్నవి. ఇందును ఉన్నతశిఖరములు చాలఁ గలవు.

పసిఫిక్ మహాసాగరము నంటియున్న తీరమున ౨౦౦ ల మైళ్ల వెడల్పులో తీరపర్వతప్రదేశములు (Coastal range

sampath_Ebooks



regions) వ్యాపించియున్నవి. ఇందు ఉత్తరమున స్నేక్, కొలంబియా నదులును, దక్షిణమున సాక్రిమెంటో, కొలరేడో నదులును ముఖ్యమైనవి.

ఈపైని వచించిన నదులుగాక సంయుక్తరాజ్యములం దసలు ప్రధానమైనవి మిసిసిప్పి, మిసోరీ, ఓహియో అను పేరులవి మూఁడు నదులు గలవు. అప్లాషియన్ శీతభూములు పూర్వముగను, రాకీ యున్నతభూములు దక్షిణపశ్చిమములుగను గల మధ్యమండలి మైదానము లన్నియు నీమూఁడునదులకును పరీవాహక్షేత్రము లని చెప్పవచ్చును. మిసిసిప్పినదియందు వేయిమైళ్లవఱకును నౌకలు రాకపోకలు సలుపుట కను వగును. ప్రతిసంవత్సరమును దీనిద్వారా నీటిలోఁ దేలియాడుచు ౩౪,౦౫,౦౦,౦౦౦ ల టన్నులును, ద్రవీభూతమై ౧౩,౬౪,౦౦,౦౦౦ ల టన్నులును ఘనపదార్థము సముద్రమునఁ జేరుచుండునట్లు లెక్క చేయఁబడినది.

మెక్సికోసింధుశాఖయందు ప్రవేశించునదులలో ప్రధానమైనది రియో గ్రాండెడెల్ నార్టె. ఇది మెక్సికో సంయుక్తరాజ్యముల సరిహద్దులమీఁద నున్నది.

ఈరాజ్యములలో గొప్పసరస్సు లుత్తరమున నున్నవి. సుపీరియర్, మిషిగన్, హ్యూరన్, ఎరీ, ఒంటారియో సరస్సు లుత్తర సీమలందును, గ్రేట్ సాల్ట్ సరస్సు ఇడాహో యందును గలవు. కాలిఫోర్నియా, ఆరిగనులందును మఱికొన్ని చిన్నసరస్సులు కలవు.

భూగర్భశాస్త్రానుసారము సంయుక్తరాజ్యఘటనము:— యూరోపువ భూఖండనిర్మాణమునం దగపడు పొర లన్నియు అమెరికాయందును గనుపడుచున్నవి. కాని అట్లాంటిక్ ద్వారా వీనికిఁగల సన్నిహితసంబంధ మింకను దేటతెల్లము కాలేదు.

ప్రాణిచిహ్నము లేమియుఁ గన్పించనికాలము మొదలుకొని నేఁటివఱకును గల అర్కియోజోయిక్ (Archaeozoic), ప్రోటెరొజోయిక్ (Proterozoic), పేలియోజోయిక్ (Palacozoic), మెసోజోయిక్ (Mesozoic), సెనోజోయిక్ (Cenozoic), సైకోజోయిక్ (Psychozoic) నామక యుగములకుఁ జెందిన పొర లన్నియు నీదేశమునఁ గలవు. అందు ప్రాణిచిహ్నరహితమైన అర్కియోజోయిక్ యుగపు రాళ్లపొరలు విస్కన్సిన్, మిన్నెసోటా, న్యూ ఇంగ్లండ్, అప్లాషియన్, పిడిమాంటులందుఁ గానవచ్చుచున్నవి. ఇట్టి పొరలం దినుపమట్టియు, గ్రాఫైటును బాగుగ దొరకుచున్నవి. వీనిలో సమ్మిశ్రితములై లేక ఈ పొరలకు ప్రక్క ప్రక్కల ప్రోటెరొజోయిక్ శిలల పొరలును గానవచ్చుచున్నవి. ఇందు సప్పిరియన్, హురోనియన్, అనిమికియన్, కివీనవన్ అను అంతర్భేదములు కలవు. సుపీరియర్ సమీపమున లోహము దొరకు జిల్లాలలో హురోనియన్ శిలలు చాలఁ గన్పట్టుచున్నవి. అనిమికియన్ రాలు ఉత్తరమిషిగన్, మిన్నెసోటాలయందలి లోహామ్లజదముల (Iron oxides) గనులలోఁ గానఁబడుచున్నవి. మఱికొన్ని ర్లస్ సిల లితరధాతువులతోఁ గలసి దొరకుచున్నవి. మఱియు రాకీలయందును, మొంటానా, ఇడాహోరాజ్యములందును ప్రోటెరొజోయిక్ శిలలపొరలు కలవు. పేలియోజోయిక్ యుగమున సంయుక్తరాజ్యములు నీటిలో నుండెను. ఈ యుగమునాఁటి పాషాణములు సెంట్ లారెన్స్, సరోవరములకు దక్షిణముగను, ఓహియోపరీవాహక్షేత్రముల కుత్తరముగను, మిసిసిప్పి, పూర్వమిసోరీభాగములందును గానవచ్చుచున్నవి. ఈయుగము కేంబ్రియన్, ఆర్డోవిషియన్, సిలూరియన్ మున్నగు పేరుల నేడంతర్భాగములుగ విభాగింపఁబడి యున్నది. అందు ఆర్డోవిషియన్ కాలమునాఁటికే మత్స్యజాతులవఱకును ప్రాణిసంచయము లేర్పడియుండెను. ఈ ఆర్డోవిషియన్ శిలలపొరలనుండి ఓహియో, ఇండియానాలయందు నైసర్గికమయిన గాస్ (Natural Gas), పెట్రోలియమును, అయోవాయందు సీసము, తుత్తినాగమును, టెన్నెస్సీయందు ఘటికస్ఫురితము (Calcium Phosphate)ను, వెర్మాంట్ టెన్నెస్సీలమధ్యఁగల ప్రదేశమున సున్నపురాయి, పాలరాయి, సిమెంటు లోనగు పదార్థములును వెలువడుచున్నవి. సిలూరియన్ పొరలవలన వెనుకటి ప్రాణికోటి మఱింత పరిపక్వదశ నందినట్లు తెలియుచున్నది. వీనినుండి ఎఱ్ఱ ఇనుపమట్టి (Red iron-ore), గాస్, ఉప్పు అపరిమితముగ వెడలుచున్నవి. సిలూరియన్ తరువాతిదియగు డివోనియన్ కాలపుపొర లేర్పడినపు డుత్తర-అమెరికా యంతయు నీటిబయటఁ బడె నని యూహింపఁబడినది. ఈ డివోనియన్ కాలపు పొరలనుండియు పెన్సిల్వనియా, పశ్చిమవర్జీనియా, ఓహియో, న్యూయార్కులందు పెట్రోలియం, నైసర్గికపుగాసులు అమితముగ వెలువడుచున్నవి. డివోనియన్ కాలము తరువాత నిదేయుగమున మిసిసిప్పియన్, పెన్సిల్వనియన్, పెర్మియన్ నామకములయిన మఱి మూఁడుకాలములు ఘటిల్లెను. అందు పెన్సిల్వనియన్ పొరలనుబట్టి యాకాలమున నుత్తర-అమెరికాకు మరల నీటిముంపులు చాలఁ గలిగెననియు, పెర్మియన్ కాలమునాఁటికి కొంచెము హెచ్చుతగ్గుగ ప్రస్తుతమున్నరీతి ఖండ మంతయు నీటనుండి వెల్వడె ననియుఁ దెలియుచున్నది. పెన్సిల్వనియన్ పొర లన్నియు బొగ్గుతో నిండియున్నవి. అప్లాషియన్ శీతభూములలోని బొగ్గుగనులును, మిషిగన్, ఇండియానా, ఇల్లినాయిస్ కెంటకీలందలి గనులును, అయోవా, మిసోరీ, టెక్సాస్ గనులును ఆకాలపు పొరలనుండియే కలిగినవి. మఱియు ఇల్లినాయిస్, కన్సస్, ఓక్లహోమాలయందలి యాకాలమునాఁటి ఇసుకరాతిపొరలనుండి పెట్రోలియం, నైసర్గికపుగాసులు వెలువడుచున్నవి.

అనంతరపు మెసోజోయిక్ యుగము ట్రియాసిక్, జురాసిక్, కొమంచియన్, క్రెటేషియస్ అని నాలుగుకాలముల క్రింద విభాగింపఁబడినది. ఈ యుగ మంతమగుసరికి వృక్షజాతు లన్నియు నేర్పడినవి. అదివఱ కేర్పడిన ప్రాణిజాతు లంతర్ధానము కాఁగా నూతనాకృతులప్రాణు లేర్పడెను. సరీసృపములును, జరాయుజములు నుత్పన్నముకాఁగా జలచరము లనేకములు నశించెను. గడ్డి, తుంగ,

sampath_Ebooks

జమ్మును ఆకాలమునందే జనించెను. ఈ యుగమందలి యంతిమభాగమగు క్రెటేషియస్‌కాలమున మరల నీఖండమును జలము ముంచివైచెను.

సెనోజోయిక్ యుగము ఇయోసిన్, ఒలిగోసిన్, మియోసిన్, ప్లియోసిన్, ప్లైయిస్టోసిన్ అని అయిదువిభాగములు. ఇందు ఇయోసిన్‌సంగ్రహములు కల పొరలు మేరీలాండ్, డిలావేర్, వర్జీనియాలయందు పొడగనుచున్నవి. మసాచుసెట్స్ మొదలు అలబమా వఱకును మియోసిన్‌సంగ్రహములు కల పొరలును, ప్లియోసిన్ కాలమునాటివి ఇచట నచటను పలుచోట్లను గనిపించుచున్నవి. హేట్టరాస్ అగ్రమునకు దక్షిణమునుండి దిన్నగ పడమట మిసిసిప్పి వఱకును గల ప్రదేశములందు ఇయోసిన్, ఒలిగోసిన్ పొరలును, ఫ్లోరిడాయందు మియోసిన్, ఒలిగోసిన్ పొరలును, లూయిసియానా యందు ఒలిగోసిన్ పొరలును బాగుగ పరిణామము నొందియుండెను. కాలిఫోర్నియా, ఆరెగన్, వాషింగ్టనులందు ౮,౦౦౦ లు మొదలు ౧౫,౦౦౦ ల అడుగుల లోతువఱకు ఇయోసిన్ వస్తువులును, సాన్‌ఫ్రాన్‌సిస్కోకు దక్షిణమున ౧౩,౦౦౦ ల అడుగుల లోతువఱకును ప్లియోసిన్, ప్లైయిస్టోసిన్ కాలపొరలును గలవు.

ప్లియోసిన్ కాల మంతమగునాటికి మరల సంయుక్తరాజ్యముల ఆకార మేర్పడెను. ప్లైయిస్టోసిన్ కాలము పూర్తియగుసరికి కాస్కేడ్ కొండలును పరిణతి నందినవి గాని ఖండమందలి చాలభాగము గడ్డమంచుతో నిండియుండెను. హడ్సన్ తూర్పున లెబ్రడార్ వఱకును, రాకీలపూర్వభాగములను కర్డిల్లరన్ సీమలు గడ్డమంచుతోఁ గప్పఁబడియుండెను. ఈ ప్లైయిస్టొసిన్‌హిమము తీసిపోయినపిదప నుత్తర-అమెరికా రూపొందెను. ఈయుగమందలి ఇయోసిన్‌కాల మంతరించుసరికే మెసోజోయిక్ ప్రాణిసంచయము లన్నియు రూపుమాసిపోయెను. ఒలిగోసిన్ కాల మారంభ మగునాటికి జరాయుజసృష్టి నూతనరూపధారణమును వహించెను. గుఱ్ఱములు, ఒంటెలు, ఖడ్గమృగములు, రేళ్లు, పులులు మున్నగు జంతుజాలము లుద్భవించెను. మానవున కాదులైన లెమూరులు అమెరికాలో ఇయోసిన్‌కాలమందే జనించినవి. ఈజిప్టులోని యాదిమవానరములు ఒలిగోసిన్ కాలమునను, జావాలో ప్లైయిస్టోసినునందును జనించినట్లు తెలియుచున్నది. అసలు మానవుని-ఆదిమరూపము మధ్య-ఆసియాయందు ప్లైయిస్టోసిన్ కాలమునను ఆవిర్భావ మందె నని యనేకుల మతము.

ప్రస్తుతకాలమున జరగుచున్నది సైకోజోయిక్ యుగము. అమెరికన్ శాస్త్రవేది యగు చార్లెస్ షూక్‌చెర్ట్ యొక్క కథనానుసారము 'మన మిప్పుడు నిమ్నోన్నతభూములును, పురాతనసమతల పరివర్తనములును, గ్రావముల-అతిశీతలకాలమానములును, నిర్దిష్టశీతోష్ణప్రదేశములును గల కాలమున వసించుచున్నాము. ప్రాణివర్గమం దిప్పుడు మానవశక్తి యన్నింటిని మించియున్నది. ప్రాణిసృష్టిని బాలించున దిప్పుడు మానవబుద్ధి. ఇందుమించుగ సమస్తసృష్టియు దానివశమే.'

కాలమానము :— వేలకొలఁది మైళ్ల వైశాల్యము కలిగియుండుటచేతను, నడుమనడుమ పర్వతమాలిక లుపస్థితము లైయుండుటచేతను ఒకచోటి కాలమానము వేఱొకచోట నుండదు కాని మొత్తము మీఁద దేశ మంతయు సమశీతోష్ణకటిబంధమున నున్న దని చెప్పవచ్చును. సంవత్సరమునందు మధ్యమతాపపరిమాణము ౪౦ మొదలు ౭౫ అంశములవఱకు నుండును. న్యూయార్క్, చికాగోపట్టణముల యక్షాంశములందలి ప్రదేశము లన్నియు బ్రిటిష్‌దీవుల మధ్యమతాపపరిమాణము కలిగియుండును. అది యట్లుండ నీదేశము 'పశ్చిమవాయుప్రసరణమండలమునం (Belt of prevailing westerly winds) దుండుటచేత నీవాయువు వీచుకాలమున ముఖ్యముగ నుత్తరమందలి వాతావరణమున మార్పు లనేకములు కలుగుచుండును; ఎందుచేత ననఁగా నీవాయువు దినమునకు ౫౦౦, ౬౦౦ ల మైళ్ల చొప్పున పశ్చిమపూర్వముగ వీచుచు తాపపరిమాణమందు హెచ్చుతగ్గులను, దుర్దినములను, శుభ్రదినములను గలుగఁజేయుచుండును. పశ్చిమమునుండి వీచు పసిఫిక్ వాయువు లాతీరమున కొంతదూరము వఱకును సాగరికకాలమానమును (Marine Climate) జనింపఁజేయుచుండును. సైర్రానివాడా, కాస్కేడ్ పర్వతముల పూర్వభాగమునుండి అట్లాంటిక్ వఱకును గల విశాలఖండమున భిన్నభిన్నములగు కాలమానములు గనుపడుచుండును. దక్షిణమున అట్లాంటిక్ సింధుశాఖాతీరముల కాలమానము వాణిజ్యవాయువులకారణమునఁ గలుగుచుండును. పశ్చిమవాయువులు కొనితెచ్చు వర్షము పైని వచించిన పర్వతములమీఁద కుర్యుటచే ౧౨౦-౧౮౦ యామ్యోత్తర వృత్తప్రదేశము శుష్క మగుటకు కారణ మగుచున్నది.

ఇంకను దూర్పునం దట్లాంటిక్ సింధుశాఖలనుండి వచ్చుసుడిగాలుల (Cyclonic winds) మూలమున నపరిమితమగు వర్షము కురియుచుండును. రాకీపర్వతములకుఁ దూర్పునఁ బూర్వపశ్చిమములుగా వ్యాపించియుండు పర్వతమాలిక లేమియు లేవు. కాని ఆర్క్టిక్ మొదలు సింధుశాఖవఱకును పల్లమగు సమతలము వ్యాపించియున్నది. దీనిగుండ నుత్తరమునుండి దక్షిణమునకును, దక్షిణమునుండి యుత్తరాభిముఖముగను వాయువులు వీచుచు మధ్యభాగమందలి వాతావరణమున మార్పులఁ గలుగఁజేయుచుండును. శీతకాలమున నత్యంతశీతలములగు హిమవాయువులు కెనడాప్రాంతములనుండి సింధుశాఖాతీరములవఱకును వచ్చి యచ్చట మంచు పేరుకొనునట్లు చేయుచుండును. ఎండకాలమున సింధుశాఖనుండి యుష్ణవాయువులు మధ్యభాగమున కేఁగి యచట నివసించువారికి తాపమును బుట్టించుచుండును.

బలమగు పశ్చిమవాయువులకారణమున అట్లాంటిక్ తీరమున నుండి వీచుపూర్వవాయువులు తూర్పునందలి వాతావరణములో నెక్కువమార్పులను గలిగింపఁజాలవు. అట్లాంటిక్ తీరము మొదలుకొని మిసిసిప్పీనదిపర్యంతము గల దేశమున జనవరిమాసమందు దక్షిణమునుండి యుత్తరమునకుఁ బోయినకొలఁదియు ౨-౩ డిగ్రీల

sampath_Ebooks



తంబున మధ్యమతాపపరిమాణము (Mean temperature) ప్రతి-అక్షాంశమునకును తగ్గుచుఁబోవును. ఈపూర్వభాగములందు పంటల కవసర మగునంత పర్యాప్తముగ వర్షము కురియుచుండును. సింధుశాఖా ప్రాంతమందలి కాలమానము సగము సాగరికము (Half Marine), సగము ఆయనికము (Tropical) నై యున్నది. చక్రవాతము లంతగ నిచట పనిచేయవు. ఎండకాల మతిదీర్ఘము నత్యుష్ణమునై యుండును. చలికాలము మాత్ర మానందదాయకముగ నుండును. కాని యప్పుడప్పుడు మంచుపడి గ్రామశిల్పములకు నష్టమును కలుగఁజేయుచుండును. కొన్నిసమయములందు వర్షమే లేక కఱవును బుట్టించుచుండును. సమతలముల(Plains)యందలి కాలమానములోని ముఖ్యవిశేషము వర్షాభావము. సంవత్సరమునకు సగటున ఇరువది యంగుళముల వర్షముకంటె నెక్కువ కురియదు. కాలువలమూలమునను మఱికొన్ని యుపాయములచేతను వ్యవసాయము సాధింపఁబడుచున్నది. ఈప్రాంతమందలి యెక్కువభూభాగము పశువుల మేఁతనిమిత్త ముపయోగపడుచున్నది. ఇచటివాయువు శుష్కము. ఎండకాలమున గాడ్పులు కొట్టి పంటలకును, పశువులకును నష్టము కలుగుచుండును. ఉత్తరమున శీతకాలమునందు భయోత్పాదకములగు హిమానీవర్షములు (Blizzards) పుట్టుచుండును.

రాకీ పర్వతములకును, సైర్రా నెవాడా, కాస్కేడ్ కొండలకును నడుమ పీఠభూములు కలవు. ఇందుఁ గొన్ని శిఖరములమీఁదఁ దక్కఁ దక్కినచోట్ల వర్షము కురియదు. దక్షిణకాలిఫోర్నియా, దక్షిణపశ్చిమ – ఆరిజోనా, పశ్చిమనెవాడా ప్రదేశము లెడారి నేలలు. ఇవి శుష్కవాతములకును, తీవ్రమగు నెండలకును వాసభూములు. సంవత్సరమునకు ౧.౫ అంగుళముల వర్షము కురియును. చావులోయ (Death Valley) అనునది ఈ ప్రాంతములందే యున్నది. ఈయెడారులలో నీడను వేఁడిమి ౧౩౪ డిగ్రీలు.

సముద్రతీర మగుటచేతను, భూమి పర్వతమయ మగుటచేతను పసిఫిక్ ప్రాంతమున భిన్నభిన్నమగు కాలమానము గోచరమగుచుండును. సముద్రతీరభూమియందు శీతకాలమున శాంతముగను, ఎండకాలమున మధ్యమోష్ణముగను నుండును. మధ్యమండలిలోయలలో నత్యుష్ణము. కాలిఫోర్నియాయందలి మధ్యమలోయలలో నెండకాలమున ౧౧౦-౧౨౦ అంశములవఱకు నెండవేఁడిమి యుండును. పసిఫిక్ ప్రాంతముయొక్క ఉత్తరభాగములం దీదేశము నంతటిలోను నెక్కువయగు వర్షము కురియును, అనఁగా నూఱంగుళములకంటె నెక్కువగఁ గురియును. సైర్రానెవాడా, కాస్కేడ్ పర్వతముల యుపరిభాగములందును వర్ష మపరిమితముగఁ గురియును. కాలిఫోర్నియాయందు వర్షము బొత్తిగఁ గురియదు. ఎండకాలమున పసిఫిక్ తీరమంతయు పొగమంచుతో నిండియుండును.

ఈరాజ్యములందు తుపానులు సంవత్సరమునకు నూఱుపర్యాయములు కలుగుచుండును. సాధారణముగ నివి ఎండకాలములోఁ గలిగి స్వల్పమాత్ర మగునష్టము గావించి పోవుచుండును. ౧౦౧ యామ్యోత్తరము(Meridian)నకు పడమట నివి చాల అరుదు. ఒక్కొక్క పర్యాయము ఉష్ణమండలముల(Tropical Belt)నుండి చక్రవాతములు (సుడిగాలులు) దక్షిణ-అట్లాంటిక్ సింధుశాఖాతీరములందు నష్ట మెక్కువ చేయుచుండును. ఈదేశపుపూర్వోత్తర ప్రాంతములందు మంచుతుపానులు, చలికాలపువానతుపానులు చెలరేఁగి సమస్తపదార్థములను మంచుతోఁ గప్పి చెట్లకు తీగెలకు నెక్కువ నష్టము కలుగఁజేయుచుండును.

జంతువులు, వనస్పతులు :— కాలమానమందలి తాపపరిమాణభేదములనుబట్టియు, నందందుఁ గన్పించు జంతు, వనస్పతుల సమానతనుబట్టియు నీదేశ మేడుమండలములుగ (Zones) విభజింపఁబడియున్నది. ఎట్లనఁగా: ఆర్కిటిక్ మండలము (Arctic Zone), హడ్సన్ మండలము (Hudson Zone), కెనడా మండలము (Canada Zone), దశాపరివర్తనమండలము (Transition Zone), దక్షిణోర్ధ్వమండలము (Upper Austral Zone), దక్షిణాధోమండలము (Lower Austral Zone), అయనమండలము (Tropical Zone). ఇందు మొదటిదానికి నుత్తరమునుండియు, ఆఖరు దానికి దక్షిణమునుండియు నీదేశమునఁ బ్రవేశము కలుగును. మధ్యమండలిభాగ మంతయుఁ జాలవఱకు దశాపరివర్తనమండలమునకే చెంది యున్నది. ఆర్కిటిక్ మండల లక్షణములు పర్వతాగ్రములందుఁ గానవగును. శ్వేతపర్వతములలోని వాషింగ్టన్ శిఖరమునను, రాకీ, నెవాడా, కాస్కేడ్ పర్వతోన్నత శిఖరములందును ఆర్కిటిక్ మండల లక్షణములు గలవు. ఈపర్వతాగ్రములందు గొప్ప గొప్ప మృగములు లేవు. న్యూయార్క్, న్యూ ఇంగ్లండ్, ఉత్తర కెరొలీనా రాజ్యములలోని ఉన్నతపర్వతపార్శ్వములందును, రాకీ కాస్కేడుల యుపరిపార్శ్వములందును, హడ్సన్ మండల లక్షణములు గలవు. ఇందు కొండగొఱ్ఱెలు, కొండమేఁకలుమాత్రము గానవచ్చును. మెయిన్, న్యూ హాంప్‌షైర్, మిషిగన్, మిన్నెసోటా, ఉత్తర డకోటారాజ్యములలోని యుపరిసీమలందును, హారిత్, కాట్‌స్కిల్, అడిరండక్ పర్వతములందును, పెన్సిల్వనియా, ఉత్తర కెరొలీనా మధ్యస్థ మహీధరాగ్రములందును, ఉత్తరరాకీ, కాస్కేడుల అధఃపార్శ్వములందును, దక్షిణరాకీ, నెవాడాకొండల ఉన్నత భాగములందును, పసిఫిక్ తీరస్థ మెండోసినో అగ్రపర్యంత పార్శ్వములందును కెనడామండలలక్షణములు గలవు. వీనిలో సివంగులు, ముండ్లపందులు ఎఱ్ఱనిఉడుతలు, కుందేళ్లు, శ్వేతకంఠచటకములు, అడవికోళ్లు, పాఁపిట్టలు మొదలగు జంతువులు నివసించుచున్నవి. దశాపరివర్తనమండలమున ఉత్తరభాగముల కత్యంతదక్షిణమునను, దక్షిణభాగముల కత్యంతోత్తరమునను గనుపడు జంతువులు కలసిమెలసి యుండుట కానవగును. ఊర్ధ్వదక్షిణ, అధోదక్షిణమండలములం దగణితముల జంతుజాలములు నిండియున్నవి. అధోదక్షిణమండలమున అయనమండలాంతర్గతజంతువులును అనేకములు గలవు. నేఁటిదినమునందుఁ ప్రెయిరీక్షేత్రములలో కంగారులు, అర్మడిల్లోలు, తోఁడేళ్లు, దుష్టఁ

sampath Ebooks

శేళ్లు, ఎలుఁగులు, అడవినక్కలు, విలక్షణము లగు మడుతలు, నుళ్లగూబలు, అనేకవిధపక్షులు, మకరాదిజలచరములు పెక్కురకముల ప్రాణులును గలవు.

అడవులగు ఉద్భిజ్జములును పైని వచించిన సప్తవిధములుగనే కనుపడుచున్నవి. ౯౮ యామ్యోత్తరరేఖకు తూర్పుగనున్న సంయుక్త రాజ్యములభాగమున సహజారణ్యములు కలవు. రాకీ, కాస్కేడ్, సైర్రానెవాడా పర్వతములలోని చాలభాగ మరణ్యమయము. కాని సమతలమండలములు, రాకీపర్వతపశ్చిమపరీవాహక్షేత్రములు, ఎడారులు, రాకీపర్వతపూర్వసమతలములు మొదలగువానియం దడవులు లేవు కాని ఒకవిధమగు గడ్డి మొదలుకొని సేజ్ బ్రష్, నాగజెముడు మున్నగువానివఱకును గల పొదలు కలవు. పూర్వమండలారణ్యములకును, శాంతమహాసాగర(Pacific Ocean)తీరదళాపరివర్తనమండలారణ్యములకును జాల వ్యత్యాసము కలదు. పసిఫిక్ నైరుతి దిక్కున అడవులు మిగుల దట్టములు. మఱియు పూర్వాటవులు ఆకురాలు సారదారువృక్షములతోడను, పశ్చిమాటవులు సూచ్యాకారవృక్షములతోడను నిండియున్నవి.

ఈరాజ్యములలో ననేకవిధములగు దేశీయవృక్షములు, అనఁగా నాదేశమందే పుట్టినవి కలవు. ౧౯౨౭-వ సంవత్సరమున జి. బి. సడ్వర్త్ నామక వృక్షశాస్త్రజ్ఞుఁడు ౧,౧౭౭ భిన్నజాతుల వనస్పతులను పేర్కొనియుండెను. ఇందు ౧౮౨ జాతు లార్థికముగ లాభించునవి. ఇచటనే పుట్టి పెరుఁగు పూలమొక్కలు ౧౨ వేలు మొదలు ౧౫ వేల రకముల వఱకును గలవు. వీనికిఁదోడుగ సంయుక్తరాజ్యనివాసులు యూరోప్, ఆసియా, ఆయన - అమెరికాలనుండి వందలకొలఁది జాతులచెట్లు దెచ్చి స్వదేశమున నాఁటి దేశీయములుగ మార్చుకొనిరి. కాలిఫోర్నియాపువ్వువృక్షపుమాన్యుయల్ నామకపుస్తకమున ౪,౦౧౯ జాతులు పేర్కొనఁబడియున్నవి. ఇందు ౩,౭౨౭ రకములు దేశీయములు, ౨౯౨ విదేశానీతములు. గ్రే రచించిన బాటనీమాన్యుయలునందు ౪,౮౮౫ జాతులు వర్ణింపఁబడినవి. ఇందు ౪,౧౭౯ జాతులు దేశీయములు, ౭౦౬ విదేశానీతములు.

కృషి, శిల్పము, వ్యాపారము :— ఈదేశము స్వాతంత్ర్య మందుటకుఁబూర్వ మాహారపదార్థములుమాత్ర మిచట నుత్పత్తి యగుచుండెడివి. పేర్కొనుటకు యోగ్యములగు శిల్పము లేవియు లేకుండెను. అదిగాక బ్రిటిష్‌వారు తాము నిర్మించుపదార్థము లన్నియు నమ్ముకొనుపోవుటకీదేశమును మార్కెట్టుగ నుంచుకొనఁగోరుచుండిరి కాని యిచట శిల్పములను ముందునకుఁ దేవలయు నని తలంపరైరి. వీరు అమెరికాయందలి పదార్థముల నుత్పత్తియైనవాని నట్లే తెప్పించుకొని వానిని తమదేశమున రూపము మాఱునట్లు చేసి వానిని మరల నెక్కువధరలకు సంయుక్త రాజ్యముల కంటఁగట్టుచుండిరి. కాని స్వాతంత్ర్యము కలిగినపిదప నిచటికృషిశిల్పవాణిజ్యములందు విచిత్రమగు పరివర్తనము కలిగెను. ౧౭౯౦ మొదలు ౧౮౨౫ వఱకును గల కాలమున మధ్య మధ్య నాటంకములు కలుగుచువచ్చినను, మొత్తముమీఁద వీరి శిల్ప వాణిజ్యములు వృద్ధినందుచుఁబోయెను. అనంతరము ౧౮౬౦-వ సంవత్సరము వఱకును మఱింత యభివృద్ధి గాంచఁగల్గెను. ఈ సమయమున స్టీము మున్నగువాని యావిష్కరణమువలన రైల్వేలును, కర్మాగారములును స్థాపింపఁబడుటచేతను కృషి, శిల్ప వ్యాపారము లమితముగఁ బెరిఁగిపోయెను. ౧౮౬౦ మొదలు ౧౮౯౯ వఱకును గల కాలమున శిల్పక్రాంతి కలిగె నని చెప్పవచ్చును. ౧౮౯౯ యగునప్పటికి ప్రపంచమందలి యన్నిదేశములకంటె నమెరికా అగ్రస్థానమును వహింపఁగల్గెను. విదేశములనుండి దిగుమతియగు వస్తువులపైని భారమైన సుంకములు వేయఁగలిగినందున స్వదేశములశిల్పము లమితముగ పెరిఁగిపోయెను ౧౮౯౯ తరువాత శిల్పవాణిజ్యములయభివృద్ధి సుడిగుపడుగున ముందునకుఁ బోయెననిన నతిశయోక్తి కాదు. ౧౮౯౯ - వ సంవత్సరమున ౪౮౦ కోట్లపదార్థములు తయారుకాఁగా ౧౯౧౪- నాఁటికి ౯౯౦ కోట్లవి తయారయ్యెను. వస్త్రములు, ఇనుము, ఉక్కు, కలప, చర్మము, రబ్బరు, కాగితము, ముద్రణము, రసాయనములు, రాయి, గాజు, మట్టితోచేసినవస్తువులు, ధాతువులు, పొగాకు, యంత్రములు, గానసాధనములు, గ్రామొఫోనులు, జల, భూ, వాయు యానములు మొదలగువానినుండి ౧౯౧౪ - వ సంవత్సరమున ౯౮౨ కోట్ల, ౩౦ లక్షల విలువగలవి తయారుకాఁగా ౧౯౨౫- నాఁటికి ౨౬౭౭ కోట్ల, ౮౦ లక్షలవి తయారయ్యెను. జర్మనీయుద్ధకాలమున నిచటి శిల్పపరిశ్రమ లపరిమితముగఁ బెరిఁగిపోయెను. ఈయభివృద్ధికి ముఖ్యకారణము సమస్తపదార్థముల నుత్పత్తిచేసి వినియోగించుట కావశ్యకము లగు ఉపాయము లతిశ్రద్ధతో పరిశీలనపూర్వకముగ విచారింపఁబడుచువచ్చినవి. దీనిఫలితముగ ఆవిష్కరణ, సాధన పరిశ్రమలందు పొదుపరితనము గలిగెను. నియతపరిష్కృతమార్గమున నిశ్చితవిభేదములందె పదార్థనిర్మాణము కానసాగెను. ఇందువలన ఆర్థికముగ నెక్కువగ లాభము కలిగెను. ౧౯౨౫- నాఁటికి ౧౦,౬౦౦ ల శిల్పసంస్థ (Manufacturing institutions) లేర్పడెను. జర్మనీయుద్ధకాలమున అమెరికనుల పరిశోధనము (Research) వలనఁగలుగు లాభమును బాగుగ గుర్తించిరి. తత్ఫలితముగ ౧౯౨౭- నాఁటికి వెయ్యిశిల్ప పరిశోధనశాల లేర్పడెను. పరిశోధనము లేనిశిల్ప మొకటియైన నిపుడు లేదు. ఇతరదేశము లన్నింటికంటె నమెరికాలో కార్మికులకు వేతన మెక్కువ. ఇది యుత్తమపదార్థనిర్మాణమునకు కారణ మయ్యెను.

నిర్మితానిర్మితములగు రెండువిధములపదార్థములును ఈదేశమునుండి యెగుమతియు దిగుమతియు నగుచుండును కాని నిర్మితపదార్థముల యెగుమతి క్రమముగఁ బెరిఁగిపోవుచున్నది. ౧౯౧౩-వ సంవత్సరమున ౩౧.౯% వంతున నెగుమతి యైయుండి ౧౯౨౮ నాటికి ౪౪.౯% వఱకును పెరిఁగెను. దిగుమతులందు అనిర్మితపదార్థములే యెక్కువ కానఁబడుచున్నవి. స్వాతంత్ర్యము లేనిదినములలో పొగాకు, ఫర్, నీలి, వడ్లు, నావోపకరణములు మున్నగువానిని యూరోపునకును, చేఁపలు, కలప, ధాన్యాదులు, మైనపువత్తులు పశ్చిమహిందూద్వీపములకును బంపుచువచ్చిరి. గ్రేటుబ్రిటననుండి

sampath_Ebooks



నిర్మితవస్తువులును, పశ్చిమహిందూదీవులనుండి చానిసలు, పంచదార, బంగారము దిగుమతి యగుచుండెడివి. స్వాతంత్ర్యము కలిగినపిదప ౧౭౯౦ మొదలుకొని ౧౮౧౫ వఱకును యూరోపునందు యుద్ధములు జరుగుచుండుటవలన నాసమయమున అమెరికనులు స్వదేశమున వస్తువుల నుత్పత్తిచేసి వాని నెగుమతి చేయుటకు బదులు ఇతరదేశములనుండి ప్రోగుచేసి పంపుచువచ్చిరి. ౧౮౧౨ - వ సంవత్సరమున నిందువలనఁ గలుగుహాని వీరికి బాగుగ అవగత మయ్యెను అవి మొదలు బయటివస్తువులను దెప్పించి పంపుట మాని దేశీయోత్పత్తుల నభివృద్ధినొందింపసాగిరి. అప్పటినుండి దేశీయవ్యాపారమునకు లాభము కలుగసాగెను. ఇందులకు మిసిసిప్పీనదీమార్గమును, వ్యవసాయపుటుత్పత్తుల బాహుళ్యమును, ధూమశకటముల గమనాగమనములును, బంగారముయొక్క ఆవిష్కరణమును, యూరోపున దిగుమతుల పైని పన్నును దీసివేయుటయు, కెనడాదేశముతోఁ గుదిరిన పరస్పరవినిమయపు సంధియు బాగుగఁ దోడ్పడెను. దక్షిణరాజ్యములనుండి ప్రత్తి, పొగాకు ఎగుమతి యగుచుండ ఉత్తరమునుండి నిర్మితపదార్థముల నిర్యాత మెక్కుడయయ్యెను. ౧౮౬౦-వ సంవత్సరమువఱకును వ్యాపారమును దానివలనిలాభమును దినదినాభివృద్ధి నందుచుఁబోయెను. కాని యంతఃకలహము( Civil war )వలన దీనికి చాల క్షతి కలిగెను. పదేండ్లు గడచినపిదప నీవాణిజ్యము లోనగునవి మరల నభివృద్ధి నొందసాగెను; అనఁగా ౧౮౭౦ మొదలు ౧౯౦౦ ల వఱకును వ్యాపార మినుమడించుచుఁబోయెను. ౧౯౧౪ న ఎగుమతులు ౨౩౦ కోట్ల డాలర్లనుండి ౧౯౧౯ నాటికి ౭౮౦ కోట్లకుఁ బెరిఁగెను. ఇదే వరుసున దిగుమతులును అభివృద్ధి నొందినవి. జర్మనీయుద్ధాంతమున నీలెక్కలు కొంచెము తగ్గిపోయెను కాని ౧౯౨౦ నుండి మరల వృద్ధి నందుచుఁ బోయెను. ౧౯౨౦ లో ౨౪౦ కోట్ల డాలర్లనుండి ౧౯౨౮ లో ౫౦౦ కోట్లవఱకు నెగుమతులును, ౧౮౦ కోట్లనుండి ౪౮౦ కోట్లవఱకును దిగుమతులును వృద్ధినొందినవి. ప్రత్తి, పెట్రోలియము, యంత్రములు, స్వయంయానములు, గోదుమలు, మాంసము, క్రొవ్వు, నూనె, సూకరతైలము, ఇనుము, ఉక్కుపనిముట్లు, రాగి పనిముట్లు, పొగాకు, వస్త్రములు, ఫలములు, కాయదినుసులు, పలకలు, కలప, ఇనుముతోను ఉక్కుతోను జేసినపరిష్కృతసాధనములు, రసాయనములు, చర్మములు, రైధాన్యము, బార్లీ, కొయ్యసామానులు, ఫర్ సామానులు, తెలకపిండి, కాగితములు, గ్రంథములు, ముద్రితములు, రంగులు, వార్నిషులు, ఫోటోగ్రాఫ్ సామానులు, చర్మపుసామానులు, చేఁపలు, వ్యవసాయపుపనిముట్లు మొదలగునవి విదేశముల కెగుమతి యగుచుండును.

పట్టు, రబ్బరు, కాఫీ, చెఱకు, కాగితములు, ఫర్, పెట్రోలియము, చర్మములు, తగరము, రాగి, ఫలములు, కాయదినుసులు, ఉన్ని, ఉన్నివస్త్రములు, శాకతైలములు, పొగాకు, ప్రత్తిగుడ్డలు, నూనెగింజలు, నారగింజలు, పలకలు, కొయ్యకడ్డీలు, కలపపదార్థములు, ఎరువులు, రసాయనములు, ఓడకీలు (Coal tar), కోకో, వజ్రములు, నారగుడ్డలు, పట్టుగుడ్డలు, శాకములు, తేయాకు మొదలగునవి ఇతరదేశములనుండి ఇచటికి దిగుమతి యగుచుండును.

జర్మనీయుద్ధమునకుఁ బూర్వమందు దిగుమతులు యూరోపులోని కొన్ని దేశములకుమాత్రమే పోవుచుండెడివి. కాని యుద్ధానంతర మెక్కువదేశముల కేఁగుచుండినట్లు దెలియుచున్నది. అదివఱకు యూరోపునకు ౬౩% వంతులవఱకు నెగుమతులు పోవుచుండెను. యుద్ధానంతరము ౧౯౨౮ నాటికి ౪౮% వంతులే పోవుచుండెను. మెక్సికో, దక్షిణ-అమెరికాలకుఁ బూర్వము ౧౪% లు. ఇప్పుడు ౧౮% వంతులు. దూరప్రాక్సీమ( Far East )లకు ౮% లకు బదులు ఇప్పుడు ౧౬% లు పోవుచున్నవి. ఇదేప్రకారము దిగుమతులందును మార్పు కలిగినది. యూరోపునుండి వచ్చు ౫౦% లు ఇప్పుడు ౩౦% లకే దిగినవి. దక్షిణ-అమెరికానుండి దిగుమతులలెక్క యథాపూర్వముగనే యున్నది. కాని దూరప్రాక్సీమలనుండి దిగుమతు లమితముగఁ బెరిఁగినవి. విదేశవ్యాపార మింత మిక్కుటముగ నభివృద్ధి గాంచినప్పటికిని స్వదేశమున జరుగు వ్యాపారములో నది యొన్నవవంతులో లే దని చెప్పవచ్చును. ఒక్కడాలరుసామాను పరదేశములకుఁ బోయిన ౧౦ డాలరుల సామాను స్వదేశమున ఖర్చగుచుండెడిది. సమస్తప్రపంచముతోఁ జేయు వ్యాపారమునకంటె దేశమునందు జరుగువ్యాపార మెక్కువగ నుండెను. రాకపోకల కనువగు మార్గములు, రోడ్లు, రైళ్లు, జల,వాయు మార్గములు, యానములు, శీఘ్రముగ నుత్తరప్రత్యుత్తరముల సలుపుకొనుట కనువగు సాధనములు, జాతీయాదాయము ( National profit ), అత్యుత్తమమగు ఆర్థికపద్ధతి మొదలగునవి దేశమందలివ్యాపారమును మితిమీఱునట్లు చేయుటకు సాయపడినవి. ౧౯౨౭-వ సంవత్సరము నాటికి సంయుక్తరాజ్యములందు ౨,౪౯,౦౦౦ ల మైళ్ల ఇనుపదారులును, ౨,౭౬౦ మైళ్ల సరోవరమార్గములును గాక ౨౭,౪౬౦ మైళ్ల నౌయానయోగ్యమార్గములును, ౨,౮౮,౦౦౦ ల మైళ్ల రోడ్లును, ౨౦ లక్షలకు మించిన వాహనములును, ౫౬౦ లక్షలకు మించిన టెలిఫోను తీగెలును, ౧౮౦ లక్షల టెలిఫోనులును వాడుకయందుండినవి. ఆసంవత్సరమున జాతీయాదాయము ౯,౦౦౦ ల కోట్ల డాలరులై యుండెను.

మొట్టమొదట పరదేశవ్యాపారము విదేశనౌకలద్వారా కావింపఁబడుచు వచ్చినది. కాని తరువాత క్రమముగ సంయుక్తరాజ్యములకు సొంతనౌకలేర్పడెను. ౧,౫౪,౬౨,౯౬౭ టన్నుల భారము గల ౨౭,౩౫౮ నౌక లుండెను (౧౯౨౨). వానిలో ౧,౫౯,౮౨,౧౦౦ టన్నుల భారముగలవి ౧౮,౯౬౦ స్టీమరులు. అట్లాంటిక్ రేవులందెక్కుడు నౌకలు రాకపోకలు సలుపుచుండును. న్యూయార్క్, బోస్టన్, ఫిలడల్ఫియా, బాల్టిమోర్, న్యూఆర్లియన్స్, న్యూపోర్ట్, విల్మింగ్టన్, సవన్నా, పెన్సకోలా, మోబైల్, గల్వెస్టన్, సాన్‌ఫ్రాన్సిస్కో, పోర్ట్‌లాండ్, డెట్రాయిట్, డులుత్, సుపీరియర్, చికాగో, బఫెలో నామకనగరములు ముఖ్యమైన రేవుపట్టణములు. వీనిలో గల్వెస్టన్, న్యూఆర్లియన్స్, సవన్నా, న్యూయా

sampath_Ebooks

ర్కులనుండి ప్రత్తియు, గల్వెస్టన్, న్యూ ఆర్లియన్స్, న్యూయార్కు, బాల్టిమోర్, సుపీరియరులనుండి గోధుమలును, న్యూయార్కు, బాల్టిమోరులనుండి గోధుమపిండియు, న్యూయార్కు, బోస్టనులనుండి నానావిధ జంతుమాంసములును, న్యూయార్కు, ఫిలడెల్ఫియాల నుండి పెట్రోలియమును, న్యూయార్కు, బోస్టన్, బాల్టిమోర్, ఫిలడెల్ఫియాలనుండి పసువులును, న్యూఆర్లియన్సునుండి పొగాకును అపరిమితముగ విదేశములకుఁ బోవుచుండును.

మీఁద వచించిన విధమున శిల్ప, వాణిజ్యాదు లభివృద్ధి నొంది యింతసంపత్తి యీదేశమునకుఁ గలుగుటకు కారణ మిచటి ఖనిజ బాహుళ్య మని చెప్పవచ్చును. శిల్పవ్యాపారాదులయభివృద్ధితోపాటు బొగ్గు, పెట్రోలియము, ఇనుము, రాగి లోనగు ఖనిజముల యుత్పత్తియు నమితముగఁ బెంపొందెను. ఇనుము ముఖ్యముగ సుపీరియర్ సరఃప్రాంతముల నుండియు, అప్లాషియను పరిసరముల నుండియుఁ దీయఁబడుచున్నది. పెన్సిల్వనియా, పశ్చిమవర్జీనియా, ఇల్లినాయిస్, కెంటకీ, ఓహియో, ఇండియానా, అలబమారాజ్యములందు బొగ్గగను లెక్కువఁ గలవు. ఇవిగాక మఱి యిరువది రాజ్యములలోఁగూడ బొగ్గు దొరకును. అప్లాషియన్సీములు, ఇండియానా, ఇల్లినాయిస్, మధ్యరాజ్యములు, మెక్సికోసింధుశాఖాతీరము, రాకీపర్వతములు, కాలిఫోర్నియా మొదలగు ప్రదేశములందు పెట్రోలియము గలదు. ఆరిజోనా, మోంటానా ఉటాహ్ రాజ్యములందు రాగిగను లున్నవి సీసము మిసోరి, ఇడాహోలం దెక్కువగను, విస్కాన్సి రాజ్యములందు స్వల్పముగను దొరకుచుండును. ౧౯౨౮-వ సంవత్సరమున ప్రపంచ మంతటి తుత్తినాగములో సగముభాగము సంయుక్తరాజ్యములనుండి లభించెను. అల్యూమినము ధాతువునకు మూలపదార్థ మగు బోక్సైటు నామక ఖనిజము అర్కాన్సస్, జార్జియా, టెన్నెస్సీ, అలబమారాజ్యములందు దొరకును. గంధకము, పాదరసము, స్ఫురితశిలాపాషాణము (Phosphate rock) గాసొలీన్‌కు మూల మగు నైసర్గికపుగాస్ (Natural Gas), నల్లరాయి, పాలరాయి, ఉప్పు, అంజనము, ప్లాటినం, నికెల్, కోబాల్ట్, మాంగనీస్, జిప్సమ్, వెలిగారము, అభ్రకము, ఫెల్‌స్పార్, గ్రాఫైట్, ఫ్లోర్‌స్పార్, ఆర్సెనిక్, క్వార్ట్జ్, బారైటెస్, బ్రోమిన్, బిస్మత్, సెలీనియం, టెల్లూరియం, తగరము, వనదియం, టిటనియం, మొలిబ్డినం, యురేనియం, టంటలం, టంగ్‌స్టెన్, వెండి, బంగారము, ఇంకను పెక్కురకములగు ఖనిజములు ఈదేశమునందుండి వెలువడుచున్నవి. ఈరత్నగర్భ నవవిధములనే కాదు ౧౨ ప్రకారములగు రత్నముల నీనుచున్నది.

**ఎత్తులు, కొలతలు, నాణెములు:**— గ్రేటుబ్రిటనునం దుపయోగింపఁబడుచున్న ఎత్తులు, కొలతలీదేశమునను వాడఁబడుచున్నవి. కాని ఇంపీరియల్‌గాలన్, ఇంపీరియల్ బుషెల్‌కు బదులుగ ప్రాఁత వించెస్టర్‌కొలత లిచట వాడుకలో నున్నవి. నాణెములు డాలర్లనియు సెంటులనియుఁ బిలువఁబడుచున్నవి. బంగారము గృధ్రచిత్రములతో నాణెముల క్రింద మాఱుచున్నది. వెండితో డాలర్లును సిద్ధమగుచుండును. నూఱుసెంట్ల విలువగల డాలర్లు ౪౯.౩౨ పెన్సులవిలువ కలిగియుండును. ౫ సెంట్ల నికెలునాణెములును, ఒక సెంటు విలువ గల కంచునాణెములును గలవు. కాలము (Time) తెలిసికొనుట కీదేశ మంతయుఁ బూర్వమునుండి పడమటికిఁ గొన్ని మండలములు (Zones)గ విభాగింపఁబడియున్నది. ఇందు తూర్పునందలి యొక మండలమునందలి కాలమునకంటె దానిపశ్చిమమండలమునందలి కాల మొక గంట ఆలస్యముగ నుండును. ఈమండలములకు వానివాని ప్రత్యేక కాలములు కలవు; ఎట్లనఁగా పౌర్వకాలము (Eastern time) న్యూయార్కు, వాషింగ్టన్ నగర ప్రాంతములందు వాడుకలో నున్నది. ఇది గ్రీనిచ్చికాలమునకంటె ౫ గంటలు వెనుకగ నుండును. చికాగో, సెంట్‌లూయీ పట్టణముల ప్రాంతమున మధ్యకాలమును (Central time), డెన్వర్ మండలమునందు పర్వతకాలమును (Mountain time), సాన్‌ఫ్రాన్సిస్కో ప్రాంతములందు పసిఫిక్ కాలమును (Pacific time) వాడుకయందున్నవి.

**జనులు, మతములు, వృత్తులు, విద్య, సంపత్తు:**— అమెరికనులకు స్వాతంత్ర్యము లభించినసమయమున ఉత్తరమున సుపీరియరాదిసరస్సులును, పడమట మిసిసిప్పీనదియు, దక్షిణమున సింధుశాఖయుఁ, బూర్వమ అట్లాంటిక్ మహాసాగరమును గల ప్రదేశ మంతయు లభించినప్పటికిని ముఖ్యముగ వీరు తీరములనే యాశ్రయించుకొనియుండిరి. వ్యవసాయము మొదలగు కార్యములకై తీరమునుండి పడమటగ నగటున ౨౫౦ మైళ్ల దూరమువఱకు నాక్రమింపఁబడి యుండెను. కాని యింకను పశ్చిమప్రదేశము నాక్రమించుట అప్పుడే యారంభమై యుండెను. మొహాక్, పోటోమాక్, అల్లెఘెనీ లోయలనుండి పర్వతములను దాఁటి పడమటికిఁ బోయి అమెరికనులు నివాసములను నేర్పఱచుకొనసాగిరి.

ఇట్లు ౧౭౯౦ నాఁటికి ౮,౬౭,౯౮౦ చదరపుమైళ్ల దేశమున ౩౯,౨౯,౮౮౧ మంది మాత్రము వాసము చేయుచుండిరి. ౧౯౨౦-వ సంవత్సరము నాఁటికి ౨౯,౭౩,౭౭౬ చదరపుమైళ్ల దేశ మమెరికనుల యధీనమునకు రాఁగా జనసంఖ్య, ౧౦,౫౭,౧౦,౬౨౦ వఱకుఁ బెరిగినది. ౧౯౨౮-వ సంవత్సరపు లెక్కల ననుసరించి యిచట ౧౨ కోట్ల, ౧౩ వేల జను లుండిరి. ౧౮౦౦ ల ప్రాంతమున యూరోపునందలి ముఖ్యదేశములలో ప్రతిదానియందును అమెరికాలోకంటె నెక్కువ జను లుండిరి. కాని ౧౯౨౫-వ సంవత్సర మనుసరికి జనసంఖ్యయందు యూరోపులో దీనిని మించినదేశము రష్యా ఒక్కటియే నిలిచెను. విదేశములనుండి వచ్చి యిచ్చట వసింపఁగడఁగినవారిలో నానాజాతుల వారు నుండిరి. మొదటిజనాభా లెక్కల ననుసరించి శ్వేతజనసంఖ్యయందు నూటికి ౯౦ మందికంటె నెక్కువ బ్రిటిష్‌దీవులవారు. అందు ౮౦ కంటె నెక్కువ కేవల మాంగ్లేయులే యుండిరి. నూటికి ౬గురు చొప్పున జర్మను లుండిరి. ౧౮౪౦ మొదలు ఐరిష్‌వారు వచ్చి వసింపసాగిరి. క్రమముగ డచ్, డేన్, స్వీడ్, నార్వీజియన్,

sampath_Ebooks

స్విస్‌జాతులవా రగుదెంచిరి. ౧౮౮౦ మొదలు ఇటాలియన్, రషియన్, పోల్, ఆస్ట్రియన్, బొహిమియన్, హంగేరియన్ జాతులవా రపరిమితముగఁ జేరఁగిపోయిరి. ౧౯౨౦ నాఁటికి జర్మనీ, రష్యా, ఇటలీ, ఆస్ట్రియా, హంగేరీ, పోలెండ్, కెనడా, అయిర్లాండులు జనసంఖ్యయందు క్రమప్రాధాన్యము గలిగియుండెను. ౧౯౧౦-౨౦ వఱకునుగల కాలమున నిచట ఇంగ్లిష్, స్కాచ్, వెల్ష్, అయిరిష్, నార్వీజియన్, స్వీడ్, స్విస్, జర్మనుజాతులు క్షీణించిపోవ డేన్, డచ్, బెల్జియన్, ఫ్రెంచ్, ఆస్ట్రియన్, హంగేరియన్, పోల్, రషియన్, ఫిన్, రుమానియన్, బల్గేరియన్, గ్రీక్, ఇటాలియన్, స్పానిష్, పోర్చుగీస్ మొదలగు జాతులవారు పెరిఁగిపోయిరి. కెనడియనులు తగ్గిపోవ మెక్సికన్, ఆసియాఖండ వాసులు పెరిఁగిపోయిరి. మఱియు ౧౯౨౦ నాఁటికి ౬౧,౬౩౮ చైనీయులును, ౧,౧౧,౦౧౦ జపానీయులును, ౧,౦౪,౬౩,౧౩౧ రు నీగ్రోలును, ౨,౪౪,౪౩౭ మంది అమెరికన్-ఇండియనులు నుండిరి.

పసిఫిక్ మహాసాగరముపర్యంతము వ్యాపించిన యనంతరము వసించుటకు క్రొత్తనేలలు లేనందున విదేశీయాగమనము నరికట్టుటకు కాందోళనము మొదలయ్యెను. కడపటి యూరోపునందు మహాసంగ్రామమైనతరువాతను తద్ఘాతపీడితులగు యూరోపువారందఱు నసంఖ్యాకులుగ వచ్చి దేశమునఁ జొరఁబడుదు రనువాశంకను ౧౯౨౪-వ సంవత్సరమున విదేశీయనిరోధపుచట్టముఁ జేసి విదేశాగతుల సంఖ్యకు పరిమితి కావింపఁబడెను. అటుపిమ్మట విదేశీయాగమనము క్రమముగఁ దగ్గిపోయినది.

౧౯౨౮-వ సంవత్సరము జూలైమాసమునాఁటికి సంయుక్తరాజ్యములందు లక్షకంటె నెక్కువజనసంఖ్య కల పట్టణములు ౬౮ వఱకు నయ్యెను. పైని వచించిన జనసంఖ్యయందు నూటికి ౫౧ వంతులు పురుషులును, ౪౯ వంతులు స్త్రీలును నుండిరి. కాని పూర్వతీర ప్రదేశములందు పురుషులకంటె స్త్రీలెక్కువ. ౧౯౨౦ నాఁటికి ౧౫ సంవత్సరములు దాఁటినస్త్రీలలో నూటికి ౩౫.౧ అవివాహితలు, ౫౯.౨ వివాహితలు, ౪.౮ విధవలు. ౦.౫ పరిత్యక్తలు, ౦.౪ అజ్ఞాతలు. పురుషులలో ౨౭.౩ అవివాహితులు, ౬౦.౬ వివాహితులు, ౧౧.౧ విధురులు, ౦.౮ పరిత్యక్తులు.

౧౯౨౦ లో పదేండ్లయీడున విద్యహీనివారు నూటికి ౬ గురు చొప్పున నుండిరి. ఈవిద్యాహీనతయు నీగ్రోలకలనను, విదేశాగతుల వలనను గలిగినదే కాని వేఱుకాదు. జాతినిబట్టి చూచినచో విద్యావిహీనులు నీగ్రోలం దెక్కువ. స్త్రీలలో విద్యాహీనలు కేవలము నూటికి ౫.౯ వంతున మాత్ర ముండిరి.

౧౯౨౬-వ సంవత్సరమున నిచట ౨౧౩ భిన్నములగు మత సంప్రదాయములును, వానికి సంబంధించి ౨,౩౧,౯౮౩ సంస్థలును ఉండెను. వీనియందు ౫,౪౬,౨౪,౯౭౬ మంది సభ్యు లుండిరి; అనఁగా మొత్తపుజనసంఖ్యలో నూటికి ౫౧ మంది ఏదోయొక మతసంప్రదాయమునకుఁ జెందియుండిరి. ౭,౫౦,౦౦,౦౦౦ లకు పైగా ప్రొటెస్టెంట్ క్రైస్తవులు దేశమందంతటను వ్యాపించి యున్నారు. తరువాతి ౧,౮౦,౦౦,౦౦౦ ల రోమనుకాథలిక్కులలో నధికసంఖ్యాకు లుత్తరపశ్చిమరాజ్యములందు వసించుచుందురు. వీరికిఁ దోడుగ ౧౬,౦౦,౦౦౦ ల యూదులును, ౬,౦౦,౦౦౦ మార్మనులును, ౪,౦౦,౦౦౦ పౌర్వమత సంప్రదాయులును గలరు. ౧౯౨౬-వ సంవత్సరమునాఁకు నీసంస్థలకన్నిఁటికిని వార్షికముగ ౮౧ కోట్ల, ౪౩ లక్షల ౭౧,౫౨౯ డాలర్లు వ్యయ మగుచుండెను. ఈ మతసంస్థల కన్నింటికిని ౩౮౪ కోట్ల ౨౫,౭౭,౧౩౩ డాలర్ల విలువగల ఆస్తి గలదు.

**వృత్తులు :—** పదియేండ్లకుమించినవారు మొత్తపుజనసంఖ్యలో ౪,౧౬,౧౪,౨౪౮ మంది లాభదాయకములగు వృత్తుల నవలంబించి యున్నారు. శిల్పముల, యంత్రములు, కృషి, అరణ్యశాస్త్రము, పశుపాలనము, వ్యాపారము, గృహోద్యోగము, పాదిరిగుడి సంస్థలు, (Churches), ఎనుమతి-దిగుమతులకార్యములు, గనులు, ప్రభుత్వోద్యోగములు మున్నగువానికిఁ జెందినవే ఇచటివృత్తులు. స్త్రీలు ముఖ్యముగ అధ్యాపనము, అంగడులందు పదార్థవిక్రయము, ఔషధాలయాదులందు ధాత్రీత్వము మొదలగు కార్యములందును కొలఁదిగ శిల్పములందును బని సేయుచుందురు.

౧౭౯౦ నాఁటి కీదేశపు సంపత్తి ౬.౨ కోట్ల డాలర్లు మాత్ర ముండెను కాని ౧౯౨౨ నాఁటికి ౩౨౦౮౦,౪౦,౦౦,౦౦౦ వఱకును పెరిఁగిపోయెను.

**దేశరక్షణము - సేన :—** సంయుక్తరాజ్యముల బాహ్యాభ్యంతర సంరక్షణముకొఱ కేర్పడినసేన స్థలసేన (Army), నౌసేన (Navy), సాగరికదళము (Marine Corps) లని మూఁడు విధములు. ఇందు స్థలసైన్యమున నిలువగను నెల్లప్పుడు నుండు క్రమదళములందు (Regular Forces) ఆఫీసరులును సైనికులు నందఱును గలసి ౧,౨౫,౦౦౦ మంది ౧౯౨౮ నాఁటి కుండిరి. తక్కిన రెండు విభాగములందును ౧౯౨౯ నాఁటికి ౧,౧౨,౦౦౦ మంది యుండిరి. జినీవాసంధి ననుసరించి పరిమితములైన యుద్ధనౌకలు ౨౨ న్ను, పరిమితము గానివి ౪౬౫ ను గలవు. వీనిలో క్రూయిజర్లు మున్నగునవి కలసి యున్నవి. ఇవికాక సహాయకనౌకలును జెక్కులు కలవు. ఈమూఁడు విధములగు సేనకును సాహాయ్యపడుటకు ప్రత్యేకముగ వాయుసేనలు కలవు. స్థలసైన్యమునకుఁ జెందిన వాయుదళవిభాగము స్థలసేనానాయకుని యాజ్ఞానుసారము పనిసేయుచుండును. ఇటులే తక్కిన రెండు విమానసేనలును వానియధికారుల యుత్తరువులప్రకార మాయాసేనల నంటిపట్టుకొని యుండును.

**వ్యవస్థ - ప్రభుత్వము :—** స్వాతంత్ర్యయుద్ధమునందు గెలుపొందినపిమ్మట ౧౭౮౧-వ సంవత్సరమున నీదేశమం దవలంబింపఁబడిన సంయోజననియమముల (Rules of Confederation) ప్రకారము

sampath_Ebooks



కేంద్రప్రభుత్వమునకు (Central Government) రాజ్యముల మీఁదనుగాని, తిన్నగ ప్రజమీఁదనుగాని ఏవిధమైన యధికారమును లేకుండెను. ఇట్టివిధానమును మార్చి కేంద్రప్రభుత్వమును దృఢపఱచి దానికి రాజ్యముల మీఁదను, జనులమీఁదను గొన్ని యధికారముల నొసంగుటకు ౧౭౮౭ వ సం రొకజాతీయవ్యవస్థ (National Constitution) ఏర్పడి ౧౭౮౯-వ సంవత్సరమున నమలులోనికి వచ్చెను. ఈనూతనవ్యవస్థానుసారము ౧౭౮౯ లో సమకూడిన మొదటి కాంగ్రెసునందు ౧౧ రాజ్యముల ప్రతినిధులు సమావేశమైరి. పిదప రోడ్‌దీవి, ఉత్తరకరోలీనాలు గలయ ౧౩ రాజ్యము లయ్యెను. అవి ఇప్పుడు పశ్చిమమున పసిఫిక్‌మహాసాగరముపర్యంతము వ్యాపించి ౪౮ రాజ్యములుగఁ బరిణమించియున్నవి.

రాజ్యములలోని వానివానివ్యవస్థలును, శాసనవిధానములును పరస్పరసాదృశ్యము కలిగి ఇంచుమించుగ సమానముగనే యుండును. ప్రతిరాజ్యమును దాని కది స్వతంత్రము. ప్రతిరాజ్యమును స్వకీయ వ్యవస్థాపక, శాసనసభలమూలమున దానివ్యవహారముల నన్నింటిని జరపుకొనుచుండును. ప్రతిరాజ్యపుశాసనాధికారము దానిగవర్నరునందుండును. ఈరాజ్యము లన్నింటిమీఁద నొక్కటే యున్నత వ్యవస్థాపకసభ కలదు. అదియే కాంగ్రెసు. ఇందు సెనేటుసభయు, ప్రతినిధిసభయు (House of Representatives) నుండును. సెనేటుసభయందు ప్రతిరాజ్యమందలి వ్యవస్థాపకసభద్వారా ఆఱు సంవత్సరములకాలమునకుఁగాను ఎన్నుకొనఁబడిన యిద్దఱు సభ్యులుందురు. సెనేటునందలి మొత్తపుసభ్యులలో మూఁడవవంతుసభ్యులు రెండుసంవత్సరముల కొకపర్యాయము మాఱి క్రొత్తవారు వచ్చుచుందురు. ప్రతినిధిసభయందలిసభ్యు లందఱును వేఱువేఱురాజ్యములలోని ప్రజలచే రెండుసంవత్సరములకాలమునకుఁగాను ఎన్నుకొనఁబడి వచ్చుచుందురు. ప్రతిపదియవయేఁటను జరగు జనాభాప్రకారము ఆయారాజ్యముల ప్రజాసంఖ్య ననుసరించి ప్రతినిధిసభాసభ్యుల సంఖ్యయందును హెచ్చుతగ్గులు కలుగుచుండును. ప్రస్తుత మీ సభయందు ౪౩౫ గురు ప్రతినిధులు గలరు. ప్రతి సెనేటరుయొక్కయు, ప్రతినిధియొక్కయు సాంవత్సరికవేతనము ప్రయాణపు ఖర్చులతోఁ గలసి ౭,౫౦౦ ల డాలర్లు. కాంగ్రెసు కనీసపక్షము సంవత్సరమున కొకపర్యాయము సమావేశమగుచుండును. పన్నుల విధించుట, సంయుక్తరాజ్యముల రక్షణము, సార్వజనిక సౌఖ్యమున కేర్పాట్లు చేయుట, బాహ్యాభ్యంతరవ్యాపారము నుచితరీతిని నడపుట, నాణెముల ముద్రించుట, యుద్ధఘోషణ మొనరించుట, జలస్థలసేనల నిర్మించుట మున్నగు సార్వభౌమాధికారము లన్నియు నీ కాంగ్రెసునకుఁ గలవు. ఈ యన్నింటి శాసనాధికారమును నాలుగుసంవత్సరముల కాలమునకుఁగాను ఎన్నుకొనఁబడు అధ్యక్షుని (President) యధీనమందుండును. అధ్యక్షుఁడు మరలమరల నెన్నుకొనఁబడవచ్చును గాని ప్రథమాధ్యక్షుఁడగు జార్జివాషింగ్టన్ రెండుపర్యాయములే ఆ పదమును స్వీకరించినందున ఆయాచరణమే ఇప్పుడును జరగుచున్నది. అధ్యక్షుని నెన్నుకొను సభ్యసమాజము 'ఎలెక్టొరల్ కాలేజ్' అను పేరఁ బరఁగుచుండును. ఈకాలేజిసభ్యులు ప్రతిరాజ్యమునందలి వ్యవస్థాపకసభల ద్వారా జనులచే నేర్పఱుపఁబడియుందురు. ఎక్కువవోట్లు వచ్చినయతఁ డధ్యక్షుఁడుగను, ద్వితీయుఁడుగ వచ్చిన యతఁ డుపాధ్యక్షుఁడుగను నేర్పడుచుందురు. ఎన్నిక లిరువురు వ్యక్తులకును సరిసమానముగ వచ్చిన యెడల ప్రతినిధిసభాసభ్యు లధ్యక్షుని, సెనేటుసభ్యు లుపాధ్యక్షుని నెన్నుకొనుచుందురు. అధ్యక్షుఁడు సంయుక్తరాజ్యములందు జన్మించినవాఁడై యుండవలెను. ఇతనికి సంవత్సరమునకు ౭౫,౦౦౦ ల డాలర్లు జీతముగను, ౫౦,౦౦౦లు ప్రయాణపు ఖర్చుల కనియు ముట్టుచుండును. సెనేటునందలి మూఁడింట రెండువంతులసభ్యులయంగీకారము ననుసరించి అధ్యక్షునకు సంధి గావించుటకును, లౌకిక (Civil), సైనిక (Military) అధికారుల నేర్పఱుచుటకును, యుద్ధము చేయించుటకును, ఆఁపుటకును అధికారము గలదు. కాంగ్రెసు చేయుచట్టముల నిషేధించుటకును నితని కధికార మున్నది కాని రెండుసభలలోని మూఁడింట రెండువంతులసభ్యు లాచట్టమును నిర్మించినయెడల నధ్యక్షునకు దానిని దీసివేయు నధికారము లేదు. ఉపాధ్యక్షునివేతనము ౧౫,౦౦౦ ల డాలర్లు. ఉపాధ్యక్షుఁడు సెనేటుసభ కగ్రాసనాధిపతిగ నుండును. ఆకస్మికముగ అధ్యక్షుఁడు మరణించినఁగాని, లేక దీర్ఘకాలమువఱకును స్వకర్తవ్యపాలనాసమర్థుఁడైనఁగాని, అతనిస్థానమున నుపాధ్యక్షుఁడు పనిచేయుచుండును. అధ్యక్షుఁడు జాతీయశాసనపరిపాలనమును దా నేర్పఱుచుకొనునట్టి శాసనాధికారులసాయమున నెఱవేర్చుచుండును; అనఁగా రాజ్యము, కోశము, యుద్ధము, న్యాయము, వార్తాహరణము, జలసేన, ఆంతర్యము, కృషి, వ్యాపారము, పరిశ్రమ మొదలగు శాఖలకు కార్యకర్తల నతఁ డేర్పఱిచి వారిసాయమున పరిపాలన మొనరించుచుండును. ఈవిభాగముల యధ్యక్షులే ఇతనికి మంత్రాంగసభా మంత్రులు (Cabinet). ఈపనిశాఖలును కాక ఇతనిక్రింద పనిచేయునవి ఇంకను అనేకములు కలవు. శాఖాధిపతులు సద్వర్తనము కలిగియున్నంతవఱకే వారివారి పదముల నుండుట కర్హులు. సంయుక్తరాజ్యములందు ముఖ్యస్థానము వాషింగ్టన్ పట్టణము. ప్రభుత్వమునకు కేంద్రస్థాన మిదియే. ఈదేశపు న్యాయాధికారము లన్నియు నిచ్చటి యుచ్చన్యాయాలయము (Supreme Court) నకుఁ గలవు. ఇం దొక ఛీఫ్‌జస్టిస్ మఱియెనమండ్రు జడ్జీలసాయముతో న్యాయపరిపాలన మొనరించుచుండును. ప్రతిరాజ్యమందును వారివారిజడ్జీల నారాజ్యమువారే నియోగించుకొని భరించుచుందురు.

చరిత్రము :— గ్రేట్‌బ్రిటన్, హాలెండ్, స్వీడన్, ఫ్రాన్స్, స్పెయిన్ దేశవాసులు యూరోపునుండి అమెరికాకుఁ బోయి రెండువందల యేండ్లకాలములో వలసల (Colonies) నిర్మింపఁగలిగిరి. కాలాంతరమున డచ్, స్వీడుల ప్రాంతములు న్యూ నెదర్‌లాండ్స్, న్యూ స్వీడనులు బ్రిటిష్‌ఇలాకాయందు సంక్రమింప ఫ్రెంచ్, స్పానియార్డుదేశము సంయుక్తరాజ్యములందుఁ గలసిపోయెను,


sampath_Ebooks

౧౬౦౬-వ సంవత్సరమున విశేషధనము నార్జింప నుత్సాహముగల యాంగ్లేయులు కొందఱు లండనుకంపెనీ యనుపేర నొక సంఘముగ నేర్పడి యమెరికాయందు నివసించుటకు రాజానుమతిని నొకయధికారపత్త్రమును ( Charter ) బొంది సంయుక్తరాజ్యము లందు ప్రస్తుతము వర్జీనియా యనఁబడు రాజ్యతీరమును జేరి యచటి జేమ్సురౌన్ అను-చోట నొకస్థానమును స్థాపించిరి. పిమ్మట ప్లిమత్ కంపెనీవా రిటులే మసాచుసెట్సుఅఖాతతీరమున నొకదానిని స్థాపించిరి. ఇవి క్రమాభివృద్ధి నొందుచుండి ౧౬౧౯ నాఁటికి అసెంబ్లీలుకూడ నేర్పఱిచినవి. ఈసమయమందే తైర్థికపితరు ( Pilgrim Fathers ) లని పిలువఁబడు ప్యూరిటనులు ( Puritans ) మాతృ రింగ్లండునుండి మే-ఫ్లవర్ ( May flower ) నామకనౌకలో బయలుదేఱి ౧౬౨౦-వ సంవత్సరమున మసాచుసెట్సుఅఖాతతీరము చేరి న్యూ ఇంగ్లండు అనువలసకుఁ బునాదిని వైచిరి. ౧౬౨౮-౩౦ సంవత్సరములందు క్రమముగ సేలం, బోస్టన్‌స్థానము లేర్పడెను. ౧౬౩౬-వ సంవత్సరమున రోగర్‌విలియమ్సు అనునతఁడు సాంఘిక, రాజకీయాభిప్రాయములందు భేదములు జనించినందున మసాచుసెట్సు నుండి వెడలఁగొట్టఁబడుటచే రోడ్‌దీవి కేఁగి యచట నొక వలసకుఁ బునాది వైచెను. మేరీలాండ్, వర్జీనియాలు రెండును ఆంగ్లేయ రోమను కాథలిక్కులవలనను, దేశము వీడివచ్చిన రాయలిస్టులవలనను నెలకొల్పఁబడినవి. మధ్యమండలి రాజ్యముల స్థాపించినవారు హాలెండ్, స్వీడన్ దేశీయులు. ఇవన్నియు వలసలుగ నుండినకాలముఁ దనేక కార్యములు ఘటిల్లియుండెను. వానియన్నింటిలోను ఫ్రెంచివారితో జరగిన యుద్ధము ముఖ్యమైనది. క్రమముగ వలస లభివృద్ధి నొందుచుండినకొలఁదియు వీనిని వశమందుంచికొని లాభము నందవలయు నని ఆంగ్లేయులు తీవ్రముగాఁ గాంక్షింపఁగడఁగిరి. అంతవఱకు నక్కడ నివాసము నుదుర్చుకొనియున్న తక్కినజాతులవారి నండఱ నడఁగఁ ద్రొక్కి వలసల వ్యాపారాదులవలనఁ దామే లాభము నొందవలయు నని బ్రిటీష్‌వారు నిశ్చయించి యనేకప్రకారములచట్టముల వెలువఱిచి తమ మనోరథమును బూర్తిచేసికొన ప్రయత్నించిరి. ఇట్టి యభిప్రాయములు గలిగియుండుటంజేసియే ఫ్రెంచివారితో యుద్ధము జనించెను.

మొట్టమొదట ఫ్రెంచివారు సెంట్‌లారెన్సునది, దాని సింధుశాఖాపరిసరములందే నివసింపఁ గడఁగిరి. వీరి ప్రయత్నమున కెనడా రాజ్య మేర్పడెను. ఇచట రోమన్ క్యాథలిక్కులకు ప్రాధాన్యము కలదు. ఫ్రెంచివారు ఫర్‌వ్యాపారమునందే శ్రద్ధ వహించియుండిరి. ఆంగ్లేయులు వారివారివలసలలో భూమిని స్వాధీనము చేసికొని కృషిని ప్రాధాన్య మొనరించుకొనుచుండ ఫ్రెంచివారు కేవలము ఫర్ వ్యాపారమునందే దత్తచిత్తులై యుండిరి. క్రమముగ వీరు మిసిసిప్పి, ఓహియోనదుల లోయలను గనిపట్టి సరోవరములమీఁదను గొన్ని నివాసస్థానముల నేర్పఱుచుకొనిరి. ౧౮-వ శతాబ్దియొక్క ప్రథమపాదమున మెక్సికోసింధుశాఖాతీరమునందు మొబైల్, న్యూ-అర్లియన్సునగరముల నెలకొల్పి ఈప్రాంతమునుగూడ లోఁబఱుచుకొనిరి. అనంతరము క్విబెక్కునుండి సింధుశాఖలోని రేవులవఱకు నొకదుర్గశ్రేణిని నిర్మాణము చేయించి మిసిసిప్పిలోయ యంతయుఁ దమయధీనమున నుండునటుల చేసికొనిరి. ఎరీ, హ్యూరన్‌సరస్సులదగ్గర క్రమముగా నయాగరా, డెట్రాయిట్ దుర్గములను, మామీనదీతీరమున మియామీ దుర్గమును, మిషిగన్‌సరస్సునకు దక్షిణముగా సెంట్‌జోసెఫ్‌దుర్గమును, వబాష్‌మీఁద విన్‌సెన్నెస్ ఫ్రెంచ్‌దుర్గములను, మిసిసిప్పిమీఁద సెంట్‌లూయీ కెదురుగ ఫోర్ట్‌క్రెస్‌దుర్గములను, ఉత్తరసరస్సులమీఁద మఱిరెండుదుర్గములను గట్టించి ఖండమునందలి మధ్యభాగము నంతటిని జయించి యాక్రమించుకొని బ్రిటీష్‌వారికి పశ్చిమమునకు వ్యాపించుటకు అవకాశము లేకుండఁజేసిరి. ఆంగ్లేయులును సముద్రతీరములందే ధ్యానము గలిగియుండిరి గాని పడమటి వ్యాపించుట కంతగ నభిలషింపరైరి. పశ్చిమమందలి భూమిపరిమాణము గాని, దానివిలువ గాని యప్పటి కింకను నెవరికిని దెలియదు. కాని, ఇంగ్లండులో జరగిన విప్లవకాలమున ఇంగ్లిష్-ఫ్రెంచి వారికి కలహ ముత్పన్నమై కాఁగా నది ప్రపంచమం దంతట నీరెండుజాతులవారు వసించుచున్న చోటు లంతయు వ్యాపించెను. అమెరికాయందును న్యూ-ఇంగ్లండువాసుల ప్రయత్నమువలన బ్రిటీష్‌వారు బ్రిటన్‌అగ్రమునొద్దనున్న లూయీబర్గును ముట్టడించి లోఁబఱుచుకొనిరి. తరువాత వీరు కెనడామీఁద దండెత్తిరి గాని ఫలము కలుగకపోయెను. యూరోపునం దప్పటికి యుద్ధము సమాప్తమగుటచే అమెరికాయందును బూర్తిగా లూయీబర్గు మరల ఫ్రెంచివారికే దొరకెను. అటుపిమ్మట ౧౭౫౪ మొదలుకొని ౧౭౬౩ వఱకును మరల నమెరికాలో నీరెండుజాతులవారికిని యుద్ధము ఘటిల్లెను. ఇందు వలసలవారితోడ్పాటువలన ఆంగ్లేయులకు సంపూర్ణజయము కలిగెను. దీనికి ఫలితముగా కెనడారాజ్యమును, మిసిసిప్పికి తూర్పుగనుండు ప్రాంతమును బ్రిటీష్‌వారికి లభించెను. అదిగాక అప్పటివఱకు నీదేశమున నితరయూరోపియనుజాతివారి కందఱకు నుండినహక్కులు నశించి కేవల మాంగ్లేయులకే సర్వాధికారము దొరకెను. విశాల మగుదేశమును, సర్వాధికారమును దొరకుటచే వీరికి నూతనాశయములును, నూతనసంకల్పములును జనింపసాగెను. ఈయాశయములను నెఱవేర్చుకొనుటకై ఇంగ్లండుపార్లమెంటువారు వలసలపై పెక్కుచట్టములను విధింపసాగిరి. వాని ననుసరించి క్రొత్త క్రొత్తపన్ను లమెరికనులమీఁదను పడసాగెను. వలసలవారికిని ఆంగ్లేయులకును విరోధము జనించుట కిదియే ఆరంభము. వలసలపరిపాలనవ్యయమునకు ద్రవ్యము కావలయు నని వీరు స్టాంపుచట్టమును విధింప అమెరికను లందఱు నేకమై దీని నెదిరించుటచే మఱుసటి సంవత్సర మది రద్దు చేయఁబడెను. కాని వలసలపైని పన్ను విధింపఁ దమ కధికారము గల దని బ్రిటీష్‌వారు పట్టుపట్టియేయుండిరి. దీని నాధారముగఁ గొని ప్రభుత్వమువారు మఱికొన్ని చట్టములను వలసలపై విధించిరి. మూఁడేండ్లపర్యంతము అందోళనము జరగినపిమ్మట ఒక్క తేయాకుపన్ను దప్పఁ దక్కినవాని నన్నింటిని దీసివైచిరి కాని అమెరికనులు దానికిని సమ్మతింపరైరి.

sampath_Ebooks

# మెరికాసంయుక్తరాజ్యములు



sampath_Ebooks

sampath_Ebooks

చివరకు ౧౭౭౩-వ సంవత్సరమున బ్రిటిషునౌకలు తేయాకు నింపికొని బోస్టనునగరపురేవులోనికి రాఁగా బోస్టనువాసు లిండియనుల వేష మూని ఆతేయాకు నంతను సముద్రమునఁ బాఱఁబోసిరి. దీనికి దండనముగా పార్లమెంటువారు, బోస్టన్‌పోర్ట్‌బిల్లు నొకదానిని సృష్టించి నగరవాసులు తేయాకునష్టము కట్టి యిచ్చువఱకును రేవునందు జరిగెడిసమస్తమైన వ్యాపారములును సలుపఁగూడ దని దానిని గట్టిపెట్టిరి. మఱియు నచటి ప్రభుత్వకేంద్రము సేలమ్‌నగరమునకు మార్పఁబడెను. అదిమొదలు యుద్ధ మనివార్య మని యందఱును నిశ్చయించియుండిరి. ౧౭౭౫-లో సాక్షాత్తుగ కలహ మారంభ మయ్యెను. బ్రిటిషుసేన యొకటి కంకార్డునగరమునందలి అమెరికనులయుద్ధసామగ్రులను నాశనము గావించుటకై బయలుదేఱి మధ్యమార్గమున లెక్జింగ్టన్ దగ్గఱ వలసలవారెదిరింప నందు వీరు హతులైరి. అంత దేశమం దంతటను కల్లోలము జనింప ఏప్రిల్ అంత మగుసరికి ౨౦,౦౦౦ల మంది క్రాంతిసైనికులు బోస్టనును ముట్టడించిరి. ఉత్తరదిశను టికండెరోగా, క్రౌనుపాయంట్ నామకస్థానము లమెరికనులవశ మయ్యెను. అమెరికన్ కాంగ్రెసు ఫిలడెల్ఫియాయందు సమావేశము కాఁగా దానిద్వారా జల, స్థల సైన్యముల నభివృద్ధి నొందించుటకు నిశ్చిత మయ్యెను. పిదప నామహాసభయందే జార్జ్ వాషింగ్టన్ అమెరికన్‌సేనలకు సర్వాధిపతిగ నియమింపఁబడెను. బంకర్‌హిల్ నామకస్థానమున జరిగినయుద్ధమున బ్రిటిషువా రపరిమితనష్టముతో గెలుపొందినప్పటికిని అమెరికనులధైర్యసాహసోత్సాహదేశప్రేమములు ప్రపంచమున కంతటికిని వెల్లడియయ్యెను. అనంతరము బ్రిటిషువారు బోస్టనును వదలి పోవ బాధ్యులైరి. ఈఘటనమువలన నమెరికనుల కుత్సాహ మెక్కుడయ్యెను. అంత ౧౩ వలసలనివాసులు కాంగ్రెసును సమకూర్చి యందు తమప్రతినిధులద్వారా వలస లన్నియు స్వతంత్రరాజ్యములైయుండవలయు ననియు, గ్రేటుబ్రిటన్‌తో వీనికిఁగల సంబంధమును రద్దుపఱుపవలయు ననియు తీర్మానములను జేయించిరి. తదనుసారము జూలై నాల్గవతారీఖున ఈతీర్మానమే జఫర్‌సన్ రచించిన విధమున స్వాతంత్ర్యఘోషణముక్రిందఁ బ్రకటింపఁబడెను. అంత ఇంగ్లీషువారు సర్ విలియం హౌయొక్క అధీనమున వలసలమీఁదికిఁ గొంతసైన్యము నంపఁగా నది ౧౭౭౬-వ ఆగస్టున లాంగుదీవిమీఁద వాషింగ్టన్ సేనతోఁ దలపడి దాని నోడించి పాఱఁదోలెను. అంత నతఁడు డిలావేరును దాఁటి యాతరుణమున కాంగ్రెసునకు కేంద్రస్థానముగ నుండిన ఫిలడెల్ఫియాను రక్షించుటకై బ్రాండివైన్ దగ్గఱ మరల శత్రువులతోఁ దలపడెను గాని ఈపర్యాయమును అపజయమే కలిగెను. ఉత్తరప్రాంతములందు ౧౭౭౭-వ సంవత్సరమున జనరల్ గేట్స్ అనునతఁడు బ్రిటిషుసేనాని యగు బర్గోయిసును సరటోగానామకస్థానము వద్ద జయించి పట్టుకొనెను. ఇందువలన మఱుసటిసంవత్సరము ఫ్రెంచివా రమెరికనులతోఁ గలసిరి. పిదప స్పెయిన్, హాలెండువారు సైతము అమెరికనులపక్షము పూనిరి. చివరకు ౧౭౮౧-వ సంవత్సరమున బ్రిటిష్‌సేనాని యగు లార్డ్ కారన్‌వాలిస్ యార్క్‌టౌన్ అనుచోట కోటచెంబో, వాషింగ్టనుల ఫ్రెంచ్, అమెరికన్ సేనలకు లొంగిపోవ బాధ్యుఁడయ్యెను. ఈఘటనముతో నీయుద్ధము సమాప్త మయ్యెను (చూడుఁడు, అమెరికా స్వాతంత్ర్యయుద్ధము). ౧౭౮౩-వ సంవత్సరము సెప్టెంబరు ౩-వ తారీఖున పారిస్‌నగరమున జరిగినసంధియందు బ్రిటిషువారు సంయుక్తరాజ్యములస్వాతంత్ర్యమును నిష్కృష్టగ స్వీకరించిరి. అది మొదలుకొని నాలుగుసంవత్సరములపర్యంతము స్పష్టమైన రాజ్యవ్యవస్థ లేని కారణమున దేశ మంతయు నల్లకల్లోలముగ నుండెను. కోరకిన స్వాతంత్ర్యము విఫల మగు నను భయముకూడఁ గలిగెను. అంత నీరాజ్యముల ప్రతినిధులు ౧౭౮౭-వ సంవత్సరమున ఫిలడెల్ఫియాయందుఁ గూడి నాలుగునెలలపర్యంతము వాదవివాద పూర్వకముగ పర్యాలోచనములఁ గావించికొని ఒక వ్యవస్థ (Constitution) నేర్పఱుచుకొనిరి. సంయుక్తరాజ్యముల రాజ్యప్రబంధమున కిదియే మూలము. దీనిప్రభావము సంయుక్తరాజ్యములమీఁదనే కాదు; స్విట్జర్‌లాండ్, అర్జెంటీనా, బ్రెజిల్, కెనడా, ఆస్ట్రేలియా మొదలగు ప్రజాపాలనపద్ధతిగల రాజ్యములమీఁదను బడియుండెను. ఇందు జాతీయప్రభుత్వముయొక్క (National Government) మూఁడు విధములగు నిర్మాణమును, దాని యధికారములును, జాతికి (Nation) రాజ్యములకును (States) గల సంబంధమును చక్కఁగ నిర్వచింపఁబడినది. ఇందు దిద్దుఁబాట్లు (Amendments) చేసికొనుటకును అవకాశ ముండుటవలన నిప్పటివఱకు నిది ౧౯ పర్యాయములు దిద్దుఁబాట్ల నందియున్నది.

మూలవ్యవస్థాపత్రముమీఁద జనించిన విమర్శనలనుబట్టి పది దిద్దుఁబాట్లు ౧౭౯౧-వ సంవత్సర మగునప్పటికే చేయఁబడుటవలన నివియును మూలము లనియే చెప్పవచ్చును. ౧౧-వ ది ౧౭౯౮-వ సంవత్సరమున ఒకరాజ్యవాసి వేఱొకరాజ్యవాసిపై నభియోగము దేఁగలుగుటకును, ౧౨-వ ది ౧౮౦౪-వ సంవత్సరమున అధ్యక్షోపాధ్యక్షుల యెన్నికలందుఁ గలుగులోపముల మారము చేయుటకును, ౧౩, ౧౪, ౧౫-లు దాస్యము తొలఁగించుటకును, దాసులకు పౌరాధికారము లొసంగుటకును, దాసుల సంరక్షణమునిమిత్తమును, ౧౬-వ ది ౧౯౧౩-వ సంవత్సరమున రాబడిపన్ను (Income Tax) విధించుటకును, సంయుక్తరాజ్య ప్రభుత్వమున సెనెటుడు ఉత్తరదాయిత్వము కలుగుటకు ౧౭-వ దియు, ౧౯౧౯ లో మద్యపాన విషయమును జాతీయప్రభుత్వమున కొసఁగుటకు ౧౮ వది, ౧౯౨౦-వసంవత్సరమున జాతీయలైనస్త్రీల కెన్నికహక్కుల నొసంగుటకు ౧౯-వ దిద్దుఁబాటును గావింపఁబడినవి.

౧౭౮౯-వ సంవత్సరమున నుపర్యుక్తజాతీయవ్యవస్థ అమలులోనికి వచ్చుటతో జార్జ్ వాషింగ్టన్ అధ్యక్షుఁడు (President) గ నెన్నుకొనఁబడెను. నాలుగేండ్లు గడచినతరువాత ౧౭౯౩ లో రెండవపర్యాయమును నతఁడే యెన్నుకొనఁబడెను. పిదప మూఁడవపర్యాయమును జను లతనినే యెన్నుకొనిరి కాని యందుల కతఁడు

sampath_Ebooks

స్వీకరింపఁబడెయ్యెను. ఇతఁడు పరిపాలనము చేసినకాలమునందు వెర్మాంట్, కెంటకీ, టెన్నెస్సీలనుమూఁడురాజ్యములు సంయుక్తరాజ్యములలోఁ గలసెను. వాషింగ్టన్‌తరువాత జాన్ ఆడమ్స్ అధ్యక్షపదము నందెను. ఇతఁ డీపదము నందినవెంటనే ఫ్రాన్సుతో విరోధములు పెరిఁగిపోయెను. వాషింగ్టన్ అధ్యక్షుఁడుగ నున్నసమయమందే 'జే' యనునతనిద్వారా ఇంగ్లండుతో నొకసంధి జరగియుండెను. ఒక్కవిషయమునఁ దక్క నిది తక్కిన యన్నివిషయములలోను అమెరికనులకే విరుద్ధముగ నుండెను. కేవలము ఆంగ్లేయులకుమాత్ర మనుకూలముగ నుండెను. ఫ్రెంచివారి కనిన సంపూర్ణవ్యతిరేకముగ నుండినది. ఫ్రాన్సుదేశీయు లిందువలన అమెరికనురాజ్యముల నిరసించిరి. ఈసంధి జరగినతత్‌క్షణముననుండి ఫ్రాన్సువారు దానికి వ్యతిరేకములను ప్రయత్నముల సలుపుచునేవచ్చిరి. వీరు అమెరికన్‌నౌకల ముట్టడించి తీసికొని తమదగ్గఱనున్న అమెరికనుప్రతినిధిని వెడలఁగొట్టి తమవిషయమునఁగల యన్యాయములఁ దీర్పనంతవఱకు సంయుక్తరాజ్యములతోఁ దమ కెట్టిసంబంధమును లేదని వక్కాణించిరి.

ఆడమ్స్ యుద్ధమును దప్పింపవలయు ననెడి యభిప్రాయముతో సంధికి రాయబార మంప ఫ్రెంచిదొరతనమువారు దూతను కలయక అనధికారులద్వారా లంచమును (Douceur) గోరిరి. ఈ సమాచారము దెలిసినవెంటనే అమెరికను లతిక్రోధపూరితులై స్వరక్షణార్థము లక్షలనైన వెచ్చింతుము కాని లంచమున కొక్క పమ్మిడినైన నొసంగువారము కా మని యుద్ధమునకు సన్నద్ధులైరి. కాని ఈ యుద్ధము త్వరితముగనే యంతరించినది. సముద్రమునఁ గొన్ని పోరాటములు జరగుటయే తడవుగ ఫ్రెంచివారు సంధికి సంసిద్ధులైరి. ఫ్రెంచివారు తాము పట్టుకొనిన నౌకల నన్నింటిని వదలివేసిరి. ౧౮౦౦ సంవత్సరమున నిరుపక్షములవారికి ననుకూలమగు సంధి కుదిరెను. దీని వలన అమెరికనువ్యాపారమునకు మంచిసౌకర్యములు లభించెను. యుద్ధప్రియులగు అమెరికను లందఱు నీసంధికి సమ్మతింపకపోయినప్పటికిని తక్కినవా రందఱును ఆడమ్స్ మంచిపని చేసె నని యామోదించిరి. వెనుక జేద్వారా కలిగిన సంధివలన అమెరికనులకు ఫ్రాన్సు చేతులలోఁ జిక్కుకొనుట తప్పినలాగున ఇప్పు డీసంధివలన ఆంగ్లేయుల చేతులలోఁ జిక్కుకొనుట తప్పిపోయెను. ౧౮౦౨-వ సంవత్సరమున ఓహియోరాజ్యము సంయోజన (Union) మందుఁ గలసెను. తరువాతి సంవత్సరమున అమెరికనులు, లూయిసియానా నామక విశాల ప్రాంతమును ఫ్రెంచివారినుండి కొనిరి. తరువాత జఫర్సన్ అధ్యక్షునికాలమున ఆఫ్రికాలోని ట్రిపోలీదేశముతో నొకచిన్నకలహము జనించెను. మధ్యధరాసముద్రమున ప్రయాణముసలుపు నేఁటినౌకలనైనను బట్టికొని ఆప్రాంతములయందలి సముద్రపుదొంగలు వానిని ధ్వంసము గావించివేయుచుండిరి. అట్లు చేయకుండుటకై యూరోపునందలి దేశములవా రందఱు నీ దొంగలకు లంచమురూపమున కొంత ద్రవ్యము నొసంగుచువచ్చిరి. అమెరికనులును కొంతకాలము వఱకు నిటులే చేయుచువచ్చిరి. కాని కాలక్రమమున వీరి బాధలు మఱింత యెక్కువయ్యెను. ౧౮౦౧ లో ట్రిపోలీమీఁదికి దండయాత్రలు పంపఁబడినవి. మూఁడుసంవత్సరములపర్యంతము వీరితో పోరాటము సాగుచునేయుండెను. తుదకు ౧౮౦౫-వ సంవత్సరమున అమెరికనుల కనుకూలమగువిధమున సంధి సమకూరెను. అటుతరువాత నమెరికన్ నౌకలకు మధ్యధరాసముద్రమున నేవిధమైనకష్టములును కలిగియుండలేదు. ౧౮౦౬-౦౭ ప్రాంతములందు బ్రిటిష్, ఫ్రెంచ్ జాతులు కలహించుకొనుచు ఒకరికి విరుద్ధముగ నొకరు ఉత్తరువుల జారీచేయుచుండిరి. ఇంగ్లండుతోఁగాని దానిమిత్రులతోఁగాని వ్యాపారములను జేయునౌకలు పట్టుకొనఁబడు నని ఫ్రెంచివారు డిక్రీలను గావింప, ఫ్రాన్సుతోఁగాని తత్సంబంధులతోఁగాని వ్యవహరించునవి పట్టుకొనఁబడు నని ఆంగ్లేయులు కౌన్సిలులద్వారా ఉత్తరువులఁ జేయసాగిరి. ఇందువలన అమెరికనునౌకలకును, వ్యాపారమునకును జాల నష్టము కలిగెను. ౧౮౦౩-౧౮౧౨ ల మధ్యకాలమున నీపైని వచించిన ఉత్తరువుల ననుసరించి ౯౦౦ ల అమెరికన్‌నౌకలను బ్రిటిష్‌వారును, ౫౦౦ ల ఓడలను ఫ్రెంచి వారును వశపఱుచుకొనిరి. ఇది యిట్లుండ మంచిజీతము, మంచి ఆహారము, మంచి యాదరణము అమెరికనులయొద్ద దొరకుచుండుటచేత బ్రిటిష్‌నావికు లనేకు లమెరికనునౌకలలో నౌకరీకిఁ గుదురుటయే కాక అమెరికన్‌పౌరులుగ మాఱి బ్రిటిష్‌సంబంధమును వదలుకొనసాగిరి. ఇట్లు అమెరికన్‌పౌరులుగ మాఱినను అట్టివారిమీఁదను తమ కధికార ముండుటచే అమెరికన్‌నౌకలను వెదకి వారిని పట్టుకొందు మని బ్రిటిష్‌వారు పట్టుపట్టిరి. ఈకారణమున ౧౮౦౩-౧౧ ల మధ్యఁ గలసమయమున ౮౦౦౦ ల మందిని బ్రిటిష్‌వారు పట్టుకొని ౧౨౦౦ ల మందిని వదలివైచిరి. సముద్రముపై నిట్టికార్యములు జరగుచున్నకాలమందే పశ్చిమోత్తరప్రాంతములం దాంగ్లేయులు కొంద ఱిండియనులను రేఁగఁగొట్టి అమెరికనులకు విరుద్ధముగఁ దిరుగఁబడుఁడని ప్రోత్సహింపసాగిరి. ౧౮౦౭-వ సంవత్సరమున లియోపార్డ్ అను బ్రిటిష్‌నౌక యొకటి చెసపీక్ నామకమైన అమెరికనునౌకను ముట్టడించి ముగ్గురను జంపి, కొంతమందిని గాయపఱిచి ముగ్గురను పట్టుకొనిపోయెను. అమెరికను లింగులకు నష్టపరిహార మొసఁగుఁడని యడిగిరి కాని కార్యము లేకపోయెను. పైని వచించినకారణము లన్నింటివలన ౧౮౧౨-వ సంవత్సరము జూన్‌మాసమున బ్రిటన్ మీఁద యుద్ధఘోషణము కావింపఁబడెను. సముద్రముమీఁద నమెరికన్‌పతాకమునకు వ్యతిరేక మొనరించుటచేతను, అమెరికన్ రేవులను నిర్బంధించుటవలనను, అమెరికన్‌నావికులను బలవంతము లాగికొనిపోవుటచేతను, అమెరికనులకు విరుద్ధములైన కౌన్సిలు-ఉత్తరువులను రద్దుపఱుపక పశ్చిమోత్తరములందలి ఇండియనులను రేఁగఁగొట్టినకారణమునను యుద్ధ మొనరింపఁ బాల్పడవలసె నని హేతువులను అమెరికనులు వెల్లడించిరి. నిజమున కిపుడు అధ్యక్షుఁడుగ నుండిన మాడిసనునకు యుద్ధ మొనరింపవలె నని లేదు కాని యుద్ధచాపల్యము గలవారి ప్రోద్బలముచే నట్లు గావించెను. అట యూరో

sampath_Ebooks

నందలి యుద్ధములచే క్షీణించియున్న ఇంగ్లండునకును మరల యుద్ధమునకు దిగుట యభీష్టము కావయ్యెను; ఎందుచేత ననఁగా అమెరికన్ కాంగ్రెసు యుద్ధఘోషణము చేసిన మఱి ౫ రోజులకే ఆఘోషణమువిషయమున లేశమైనఁ దెలియకపూర్వమే బ్రిటీష్‌వారు కౌన్సిల్ ఉత్తరువుల నన్నింటిని కొట్టివైచిరి. కాని యావిషయమున నమెరికాకుఁ దెలియకుండుటచే యుద్ధ మారంభము గాఁగా తరువాత దాని నాఁపుటకు వీలు లేకపోయెను.

౧౮౧౨ నందు జరిగిన అమెరికా ఇంగ్లండు యుద్ధము చాల వఱకు కడవులందును, మాఱుమూలలందును జరిగినది కాని జనబాహుళ్యము గలప్రదేశములందుఁ గాదు. యుద్ధఘోషణ మైనతోడనే అమెరికనులు కెనడాను జయింపవలయు నని ప్రయత్నించిరి కాని సాధ్యము గావయ్యెను. కాని యాదేసమయమున సెంట్‌లారెన్స్ సింధుశాఖయందు కన్‌స్టిట్యూషన్ నామక - అమెరికా నౌక గర్రీర్ అను బ్రిటీష్‌నౌకను దాఁకి పట్టుకొనెను. సరోవరములందు జరిగినయుద్ధములలోఁ గూడ అమెరికనులే గెలుపొందుచు వచ్చిరి. ౧౮౧౪ -వ సంవత్సరమున నెపోలియన్ లోఁబడిపోవుట వలన బ్రిటీష్‌వారు తమ శక్తినంతను అమెరికాపై పునకే త్రిప్పిరి. ద్విగుణీకృతోత్సాహముతో యుద్ధమునరింప నింగ్లండునుండి సేన లేతెంచినవి. వానిలో నొకటి ఉత్తరపుఁ దిక్కున ప్రాంతమును లోఁబఱుచుకొనవలెనని చాంప్లెయిన్‌సరస్సుగుండా రాఁదొడఁగెను. థామస్ మెక్‌డోనో యనునతఁడు దీని నెదిరించి ప్లాట్స్‌బర్గుసర్గుల ౯,౦౦౦ ల సేనను చెల్లాచెదరు గావించెను. కాని యుత్తరమందలి యుద్ధములలో రెండుపక్షములవారును సమానావస్థయందే యుండిరి. పూర్వతీరమున బ్రిటీష్‌వారు గ్రామములఁ దగులఁబెట్టియు, పంటలను పడఁగొట్టియు, కృషీవలుల పైరులను, ధనమును, వారిబానిసలను గొల్లగొట్టియు తుదకు రాజధాని యగు వాషింగ్టన్‌లోని కాపిటల్ నామక ప్రెసిడెంటు భవనమును తగులఁబెట్టియు అత్యాచారములఁ గావించి యుండిరి. అనంతరము వీరు బాల్టిమోరుమీఁద దండెత్తిపోయిరి కాని యచట నమెరికనులు సంసిద్ధులై యుండుటవలన వీరికి లభింపదయ్యెను అటుపిమ్మట మెక్సికోసింధుశాఖయందు ప్రవేశించిరి. ఇచట వీరు తీరములందు వసించు ఇండియనులను, అసంతుష్టు లయి యున్న ఫ్రెంచివారిని, స్పెయినువారిని దోడుచేసికొని లూయిజియానానుండి అమెరికనులను సంపూర్ణముగ వెడలఁగొట్టవలయు నని యుద్దేశించియుండిరి. వీరింకను ముట్టడి నారంభింపక ఆలోచనలు సలుపుచున్న సమయమందే జనరల్ ఆండ్రూ జాక్సన్ నామక అమెరికన్ సేనాని హఠాత్తుగఁ దీరవాసులగు ఇండియనులపైఁబడి పలుచోట్ల వారి నోడించి బ్రిటీష్‌వారికిఁ దోడ్పడకుండులాగునఁ గావించెను. తరువాత నితఁడు పెన్సకోలా నామకనగరమును గైకొని న్యూ ఆర్లియన్స్‌పట్టణమున నాంగ్లేయుల నెదిరింప సన్నాహములఁ జేయింపసాగెను. ౧౮౧౪ -వ సంవత్సరాంతమున నీపట్టణపుముట్టడి యారంభమయ్యెను. సర్ ఎడ్వర్డు పకెన్‌హాం అనునతఁడు ౧౦,౦౦౦ ల సైనికులతోను, ౫౦ నౌకలతో నీనగరమును దాఁకెను. జాక్సన్‌వద్ద నింత సైన్యము లేకుండినను కెంటకీ, టెన్నెస్సీలనుండి వచ్చినమంచిగుఱికాండ్రగు సైనికు లుండి ఆక్రమణకారుల ప్రయత్నములను వ్యర్థము సలుపసాగిరి. ౧౮౧౫ జనవరి ౮ -వ తారీఖున బ్రిటీష్‌సేనాని మహాఘోరముగ ఆక్రమణము గావించెను. కాని అమెరికనుల - అగ్నికి సహించుకొనఁజాలక బ్రిటీష్ దళములు వెనుకఁబడసాగెను. అంత వీరిసేనాని హతుఁ డగుటయు, ౨,౦౦౦ ల మంది బ్రిటీష్ సైనికులు మరణించుటయు సంభవింప వీరు వెనుకకు మరల బాధ్యులైరి. ఈప్రకారము లూయిజియానా ప్రాంతము అమెరికనులకు జాక్సన్‌మూలమున దక్కె నని ప్రఖ్యాతి కలిగెను. ఈయుద్ధమునకు రెండువారములు ముందుగనే, అనఁగా ౧౮౧౪ -వ సంవత్సరము డిసెంబరు ౨౪ -వ తారీఖు నాఁడే ఘెంటుపట్టణమున యూరోపియన్‌జాతుల కన్నింటికిని సంధి కుదిరెను. కాని ఈసంగతి అమెరికాయందుఁ దెలియదు. అన్ని జాతులవారు నేవిధముగనైన సంధి గావించుకొనఁ దలఁపు కలిగియుండిరి. కావున నేకారణములవలన యుద్ధ మారంభ మయ్యెనో అవన్నియు నటులే యుండ వానింగూర్చిన పరిష్కార మేమియు లేకయే సంధి జరిగెను. సముద్రముమీఁద జరిగిన యుద్ధములం దమెరికనులు చూపిన సాహసధైర్యములకు బ్రిటీష్‌వారు విస్మితులై సంధిషరతులు నిష్కర్షములు గాకపోయినప్పటికి నికముందును వెనుకటివలె నాచరించినచో మాట దక్కదనుభయమున నట్లు గావించుట మానిరి. ఈప్రకారము ౧౮౧౨-౧౪ సంవత్సరములలో జరిగిన యుద్ధమువలన అమెరికాకు వ్యాపారస్వాతంత్ర్యము సంపూర్ణముగ లభించెను. బ్రిటీష్‌వారి కౌన్సిల్ ఉత్తరువులును, ఫ్రెంచివారి డిక్రీలును అంతరించిపోయెను. అనంతరము బ్రిటీష్‌వా రెప్పుడు గాని యమెరికన్ నౌకలను వెదకి నావికులను బట్టుకొనియుండలేదు. అదిగాక యూరోపియను లందఱును వీరిని సమానగౌరవముతోఁ జూడసాగిరి. ఈ యుద్ధానంతరము జరిగిన యభివృద్ధికి ఫలితముగ ౧౮౧౬ - ౧౮౨౧ వఱకును గల ఆఱుసంవత్సరములలో ఇండియానా, మిసిసిప్పీ, ఇల్లినాయిస్, అలబమా, మెయిన్, మిసౌరీ నామకరాజ్యములు సంవత్సరమున కొకటి చొప్పున సంయుక్తరాజ్యములందుఁ గలసెను. మఱియు ౧౮౧౯ లో ఫ్లోరిడా స్పెయినునుండి కైకొనఁబడెను. ౧౮౩౦ - వ సంవత్సరమున రైలునిర్మాణ మారంభమగుడు సంయుక్తరాజ్యములయభివృద్ధి అతిశీఘ్రముగఁ గాఁదొడఁగెను. ౧౮౩౬ - ౩౭ లందు అర్కన్‌సస్, మిషిగన్ రాజ్యములు రెండు సంయోజనమందుఁ జేరినవి. టెక్సాస్ రాజ్యము గైకొనుసందర్భమున మెక్సికోతో యుద్ధ మారంభము కాఁగా నందమెరికన్ సేనలు మెక్సికోను, కాలిఫోర్నియాను జయించి ఆక్రమించెను. అనంతరము ౧౮౪౮-వ సంవత్సరమున గ్వడలూప్ హిడాల్గో యొద్ద జరిగిన సంధి ననుసరించి ప్రస్తుతపు కాలిఫోర్నియా, ఉటాహ్, అరిజోనా, న్యూమెక్సికో రాజ్యములు గల దేశ మంతయు నమెరికాకు దొరకెను. కాలాంతరమున నివి యన్నియు సంయోజనమందే కలసెను. ఈయాక్రమించుకొన్నభూమికై సంయోజన

ప్రభుత్వమువారు ౧,౫౦,౦౦,౦౦౦లడాలర్లను మెక్సికోప్రభుత్వమునకొసంగిరి. ఈప్రకారము ౧౮౬౦-వ సంవత్సరము సమీపించువఱకు దేశ మంతయు మహోన్నతదశ నందుచుంబోయెను. స్టీము ఇంజనులు, స్టీమునౌకలు మాత్రమే కాక ఈకాలమున దేశోపయుక్తములైన ఆవిష్కరణము లెన్నియో వెడలుటవలన దేశాభివృద్ధి యెంతయో తోడ్పడెను. కాని దేశము నంతటిని నొక్కపర్యాయముగఁ గల్లోలమున ముంచివేయఁగల దాస్యవిమోచనప్రశ్నము సంయుక్తరాజ్యము లేర్పడినకాలమునుండియు వచ్చుచుండెను. మొట్టమొదట దాస్యప్రథ కావలయు ననువారే యపరిమితముగ నుండిరి. కాని యొక అర్ధశతాబ్ది గడచునప్పటికి సమాచారములు తాఱుమాఱై దాస్యవిమోచనపక్షమువారే సంఖ్యయందుఁ బెరిఁగిపోయిరి. ౧౮౫౯-వ సంవత్సరమున హార్పర్స్ ఫెర్రీయొద్ద జరగిన తిరుగఁబాటువలన ఈప్రశ్నము మిక్కిలి ప్రాధాన్యమునకు వచ్చెను. ౧౮౬౦లో ప్రెసిడెంటు నెన్నుకొనుతరుణమందే ఈవిషయమున వాదవివాదములు మహాఘోరముగ జరగియుండెను. తుదకు రిపబ్లికన్ వ్యక్తి యగు అబ్రహాం లింకన్ అధ్యక్షుఁడైనవెంటనే దాస్యప్రథకల దక్షిణకరోలీనా, మిసిసిప్పి, ఫ్లోరిడా, అలబమా, జార్జియా, లూయియానా, టెక్సాస్‌రాజ్యములవారు తా మపజయము నొందినట్లు తలపోసి సంయోజనమునుండి విడివడపోగిరి. వీరు ౧౮౬౧ లో దక్షిణసంయోజన మను పేర (Southern Confederation) నేర్పడి జఫర్సన్‌డేవిస్ అనునతనిని అధ్యక్షునిగ నెన్నుకొనిరి. కలహము లారంభ మైనతరువాత వర్జీనియా, ఉత్తరకరోలీనా, టెన్నెస్సీ, అర్కాన్‌సస్‌రాజ్యములు దక్షిణులతోఁ గలసెను.

సుంకపుగృహములు(Custom Houses) ఆయుధాగారములు, సంయుక్తరాజ్యముల భవనములు, వారివారిరాజ్యములం దున్నవానిని దాస్యరాజ్యములవా రాక్రమించుకొనిరి. వీరు వేఱొండుప్రభుత్వమును సృష్టించి డేవిస్ అధ్యక్షుని ఉత్తరువుల ప్రకారము పరిపాలనము గావించుకొన నిశ్చయించిరి. ౧౮౬౧-వ సంవత్సరమున వీరు సమ్టర్‌దుర్గమును ముట్టడించి వశపఱుచుకొనిరి. అనంతరము నాలుగు సంవత్సరములపర్యంతము ఘోరమగు పోరాటము జరగెను. దాస్యపక్షమువారు జనరల్ లీక్రిందను, సంయోజనపక్షమువారు జనరల్ గ్రాంటుక్రిందను పలుచోట్లఁ బోరాడిరి. క్రమక్రమముగ దాస్యవిమోచనపక్షమువారికే జయము గలుగుచువచ్చెను. చివరకు దాస్యపక్షీయుల కేంద్రస్థానమగు రిచ్‌మాండ్‌పట్టణమును దృఢము గావించికొని నిలిచియున్న జనరల్ లీని జనరల్ గ్రాంటు ఓడించి పట్టుకొనుటతో నీయుద్ధము సమాప్తమయ్యెను. యుద్ధము జరగుచుండిన కాలమందే దాస్యవిమోచనముయొక్క ఘోషణము కావింపఁబడినది. దీని కంతకును ముఖ్యకారకుఁడగు అబ్రహాం లింకను రెండవపర్యాయ మధ్యక్షుఁడుగ నెన్నుకొనఁబడెను కాని వెంటనే హత్య గావింపఁబడెను (చూడుఁడు, అమెరికా-అంతఃకలహము). కాలక్రమమున నీయెదురుతిరిగిన రాజ్యము లన్నియు మరల యూనియనులోనికి వచ్చినందున యథాపూర్వము వానికి జాతీయాధికారము లన్నియు నొసంగఁబడినవి. ౧౮౬౮-వ సంవత్సరమున జనరల్ గ్రాంటు అధ్యక్షపదమును వహించి, తాఱుమాఱై యున్న వ్యవహారముల నన్నింటిని నెక్కి భవింపఁజేసి క్రమమార్గమునఁ బెట్టుటకై చాల ప్రయత్నముల సలిపియుండెను. ౧౮౭౦-వ మార్చియందు జాతీయవ్యవస్థలోఁ జేయఁబడినదిద్దుఁబాటు ననుసరించి జాతి, మత, వర్ణ, విద్యల విచక్షణ లేకుండ నేరాజ్యమం దైనఁగాని మనుజుఁడు పౌరాధికారమును బొందుట కవకాశము కలిగెను. కాని నీగ్రోలకును తెల్లవారికిని సమానాధికారము లుండవలయు ననువిషయ మిప్పటికిని వివాదాస్పదముగ నేయున్నది. ౧౮౭౧-వ సంవత్సరమున జరగిన వాషింగ్టన్ నగరపు-ఒడంబడికయందు గ్రేటుబ్రిటన్‌తోఁగల నానాకలహాస్పదములైన విషయములు పంచాయతీతీర్పుద్వారా పరిష్కృతములయ్యెను. అలబమా నామకనౌకను గొల్లగొట్టుటవలనఁ గలిగిననష్టమును బ్రిటిష్‌వారు కట్టియిచ్చుటను గూర్చియు, వాంకోవర్ దీపులయొద్ద బ్రిటిష్-అమెరికనుల సరిహద్దులను గూర్చియు, కెనడాదేశపు మత్స్యవ్యాపారమును గూర్చియు నీవివాదములు. వీనియందు ముఖ్యముగ నమెరికనులపక్షమునను నాఁడవది బ్రిటిష్‌వారి కనుకూలముగను తీర్పు గావింపఁబడెను. గ్రాంటుతరువాత ౧౮౭౭-వ సంవత్సరమున ఆర్. బి. హేస్ అనునతఁడు ప్రెసిడెంటుగ వచ్చెను. ఇతఁడు ౧౮౭౭-వ సంవత్సరమున ఫెడరల్‌సేనలను దక్షిణరాజ్యములం దంతఃకలహముతరువాత నిలిపినవానిని అచటనుండి వేఱొండు ప్రాంతములకుఁ బంపించి సంయుక్తరాజ్యముల పునర్నిర్మాణమును సంపూర్ణము గావించెను. పిదప ౧౮౮౦-వ సంవత్సరపు ఎన్నికలలో రిపబ్లికనులు జేమ్స్‌గార్‌ఫీల్డ్ అనునతని నెన్నుకొనిరి. ౧౮౮౪ నందు మరల ప్రజాపక్షమువారు ప్రబలులై గ్రోవర్‌క్లీవ్‌లాండ్ అనునతని నధ్యక్షునిగ నేర్పఱుచుకొనిరి. ౧౮౮౮ యందు బెంజమిన్ హారిసన్‌నామకరిపబ్లికన్‌వ్యక్తి అధ్యక్షుఁ డయ్యెను. ౧౮౯౨ క్లీవ్‌లాండ్ మరల ప్రెసిడెం టయ్యెను. విదేశములలోని రాజకీయములందుఁ బ్రవేశము కలిగించుకొనుటకు మన్రోసిద్ధాంతము ననుసరించి వెనిజూలా, బ్రిటిష్‌గయానాదేశముల సరిహద్దుల నేర్పఱుచుకొనుటలో వాదములు పెరిఁగి బ్రిటనుతో మరల యుద్ధము సంభవించులాగునఁ గనుపడెను కాని యావిషయము పంచాయతీకి ఒప్పగించులాగున స్థిరపడెను. ౧౮౯౬ న మెక్‌కిన్‌లే నామక రిపబ్లికన్‌వ్యక్తి అధ్యక్షపదము నందెను. ఇతనికాలమున క్యూబా ఫిలిప్పైనులతో పోరాటము కలిగెను. గ్రాంటు అధ్యక్షుఁడుగ నున్నకాలమునుండియు క్యూబాదీవియందలి స్పెయినువారిప్రభుత్వము చాల హీనావస్థయందుండెను. దొరతనమువారు చేయఁగడఁగిన దుష్పరిపాలనమువలన జనులు పలుమాఱు తిరుగఁబడసాగిరి. సంయుక్తరాజ్యములకు సమీపముగ నున్నందున ఇందనేకు లమెరికనులు నివసించుచుండిరి. క్యూబా నివాసులతోపాటు వారికిని దుష్ప్రభుత్వమువలనఁ గలుగు నిక్కట్లు తప్పవయ్యెను. చాలకాలమువఱకు నిచటి స్పెయినుదేశీయుల

# అమెరికా సంయుక్తరాజ్యములు 

దొరతనమును జక్కఁబెట్టవలయు నని అమెరికను ప్రభుత్వమువారు ప్రయత్నించిరి కాని లాభము లేకపోయెను. అంత ౧౮౯౮ యందు సంయుక్తరాజ్యముల జాతీయప్రభుత్వము పనిఁబూని క్యూబాపరిపాలనమును వదలుకొనవలసిన దని స్పెయినువారికిఁ దెలియఁబఱుప వారందులకు జవాబుగ నీదేశముపై యుద్ధఘోషణము కావించిరి. అంత సంయుక్తరాజ్యములనుండియు యుద్ధకార్యము లారంభమయ్యెను. ఈ కారణమునఁ బ్రపంచమునం దంతట నెచట నెచట స్పెయినువారుండిరో యచట నెల్ల నీరెండుజాతులవారికిని పోరాటములు కలుగ సాగినవి. యుద్ధఘోషణ మైనతోడనే అమెరికన్ దొరతనమువారు స్పెయిను క్రిందనున్న ఫిలిప్పైన్‌దీవులను ముట్టడింపవలయు నని హాంకాంగునొద్దనున్న తమజలసేనాని యగు జార్జ్ డ్యూయీ యనునతని కుత్తరువుల నంపిరి. తదనుసార మితఁ డాపట్టణమునుండి బయలుదెడలి నాలుగైదునినముల స్వల్పకాలమందే ఫిలిప్పైన్ దీవులందలి మానిలానామక నగరమును ముట్టడించి తీసికొనెను. ఇదేసమయమున క్యూబాయందలి శాంటియాగోనొద్దను, పోర్టోరికోదీవియందును యుద్ధములు జరుగుచుండెను. యుద్ధము జరిగినచోట నంతయు నమెరికనులే జయమందుచువచ్చిరి. పోర్టోరికోయందును స్పెయినువారి కపజయము కలిగినతోడనే వీరు సంధి గావించికొనుటకు సమ్మతించిరి. అంత పారిస్ పట్టణమున సంధి జరిగెను. అందలినియమముల ననుసరించి క్యూబా, పోర్టోరికో, గువామ్, ఫిలిప్పైన్ మొదలగు దీవు లమెరికనులపర మయ్యెను. కాని ఫిలిప్పైన్‌దీవులందు డాన్ ఎమాలో అగ్వినాల్డ్ అనునతఁ డమెరికనులు మానిలాపట్టణమును ముట్టడించి పట్టుకొనుటకుఁ బూర్వమే, అనఁగా ౧౮౯౮-వ సంవత్సరమున స్పెయినుదొరతనము మీఁదను దిరుగఁబడి యచట ప్రజాప్రభుత్వమును (Repu..lic) స్థాపించెను. కాని యదేసంవత్సరాంతమున అమెరికనులు గావించిన ప్రకటనమువలనఁ దమప్రజాప్రభుత్వము స్వీకృతము కాలే దని నిశ్చయమగుడు, అగ్వినాల్డోపక్షమువా రందఱు నెదురుతిరిగి కలహింపసాగిరి. ఫిలిప్పినోలు మంచిధైర్యసాహసములతోఁ బోరాడిరి కాని సమస్తయుద్ధోపకరణసంపన్న మగునమెరికనుసేనను జాలకాలమువఱకు నెదిరింపఁజాలకపోయిరి. అందువలన బహిరంగముగ యుద్ధము మాని చాటుమాటుననుండి సమయము దొరకినతోడనే అమెరికనులపైఁ బడి కొల్లగొట్టసాగిరి. ఇట్టివిధానము ౧౯౦౨ వఱకును సాగుచునేయుండెను. అమెరికను లోకగవర్నరు నేర్పఱిచి త్వరలో ద్వీపవాసులకు స్వాతంత్ర్య మొసఁగఁబడు నని చాటించుచు విద్రోహుల నడఁచుటకు మంచికట్టుదిట్టములను సలిపిరి. ప్రకటనము ననుసరించి ౧౯౦౭-వ సంవత్సరమున ఫిలిప్పినోఅసెంబ్లీయొకటి నెలకొల్పఁబడెను. అధ్యక్షుఁడగు టాఫ్టుయొక్క కోరికప్రకారము ౧౯౦౯-వ సంవత్సరమున కాంగ్రెసువా రాదీవులను సంయుక్తరాజ్యములందుఁ జేర్చుకొనిరి. అనంతరము విల్సన్ అధ్యక్షుఁడుగ నుండినకాలమున నీదీవులలో గవర్నరుజనరలుగ నున్న కామెరన్ ఫోర్బ్స్ అనునతనిని దొలఁగించి అమెరికన్ ప్రభుత్వమువారు బర్టన్ హారిసన్ అనునతని నియోగించిరి. మఱియు సౌమనస్యముతోడఁ బరిపాలనము చేయుచు ఫిలిప్పినోలను స్వాతంత్ర్యమున కర్హు లగునట్లు చేయుట కితని కుత్తరువు లొసంగఁబడియుండెను. కమీషన్ సంఘములో నెక్కువమంది ఫిలిప్పినో లుండులాగున విధించి పరిపాలనకార్యాలయమున నమెరికనులకు మాఱుగ స్వదేశీయులే యెక్కువగ నుండులాగునఁ గావింపఁబడెను. ౧౯౧౬ లోఁ జేయఁబడిన జోన్స్‌బిల్లుమూలమున నీదీవులప్రజలకు మఱికొన్ని యధికారములు లభించెను. యోగ్యత కలిగినతోడనే ఫిలిప్పినోలకు స్వాతంత్ర్య మొసంగుటయే ఈబిల్లుయొక్క ముఖ్యవిషయము. ఇటీవల, నన౽గా ౧౯౩౪-వ సంవత్సరమున ఏఁడుసంవత్సరముల పరిమితకాలానంతరము వీరికి స్వరాజ్యమొసంగఁబడు నని ప్రకటింపఁబడినది.

సుమారు ౧౯౦౦ ల ప్రాంతమున చీనాదేశమున బాక్సర్ కలహ ముప్పతిల్లెను. ఈబాక్సరు లనువారు చీనాదేశీయులు - జాతీయవాదులు. వ్యాయామాసు శారీరకపరిశ్రమలను సలుపుచు స్వదేశమును ఉన్నతస్థితికిఁ దేవలయు నని పాటుపడుచుండిరి. తమ దేశముయొక్క తీరముల నాక్రమించికొని యున్న విదేశీయుల నందఱను దఱుమఁగొట్టి చీనాను వారిజాలములనుండి తప్పింపవలయు నను అభిప్రాయముతో వీరు దేశీయ క్రైస్తవులను, యూరోపియనులను కొందఱను హత్య గావించి యనేకులను కారాగారములందు వైచిరి. చీనా రాజధాని యగు పెకింగ్ పట్టణమున గొప్పవధ జరుగుటకు సిద్ధముగ నుండెను. అంత నతిశీఘ్రముగ అమెరికా సంయుక్తరాజ్యములు, జపాను, బ్రిటన్, ఫ్రాన్స్, రష్యాదేశములవా రందఱును బోగయి బాక్సరుల నోడించి పట్టుకొని తమతమ కైదీల నందఱను విడిపించిరి. బాక్సరుల అపజయమువలన చీనాదేశమును విజేతలందఱు నాక్రమించి పంచుకొనియుందురు కాని సంయుక్తరాజ్యములే యట్టి విధానమును మాన్పించెను. వీరియొక్క సలహా ననుసరించి యుద్ధమునిమిత్తమైనఖర్చులకై ౩౩,౩౦,౦౦,౦౦౦ డాలర్లను మాత్రము దీసికొని మిత్రమండలివారు బాక్సరులను ముక్తులఁ గావించిరి. ఈ ద్రవ్యమును విజేతలగువారు పంచికొనసంయుక్తరాజ్యములకు ౨,౪౦,౦౦,౦౦౦ లు దొరకెను. ఈ మొత్తమునందుండియు కోటి పదిలక్షలడాలర్లను అమెరికనులు చీనావారి కిచ్చి వారి కృతజ్ఞతకుఁ బాత్రులైరి.

మెక్‌కిన్లే ఒకఘాతుకునిచే మృతుఁడు కాఁగా నతనిస్థానమును థియోడోర్ రూజ్‌వెల్ట్ (ఉపాధ్యక్షుఁడు) కైకొనెను. ఇతని పాలనకాలమున వ్యాపారప్రతిబంధములవిషయమున ముఖ్యముగ ట్రస్టు (Trusts) లని పిలువఁబడు మహాకూటముల నిమిత్తము కొన్ని నియమములు కల్పింపఁబడెను. ఇందువలన వ్యాపారులకు నితనికిని కలహము లేర్పడెను కాని మొత్తముమీఁద నితని పరిపాలన మత్యుత్తమమైనవానిలో నొకటిగ గణింపఁబడినది. అట్లాంటిక్, పసిఫిక్ మహాసాగరములను గలుపు పనామాకాలువ ఇతనికాలముననే త్రవ్వఁబడినది.

మఱియు నితనికాలమున అమెరికకాంగ్రెసునకు తమ ప్రతినిధిని బంపుట కధికారము అలాస్కాదేశవాసులకు లభించినది. ఇంతపర్యంతము విదేశీయులకు పౌరాధికారము ఒక్కొక్కరాజ్యమునం దొక్కొక్కవిధానమున దొరకుచుండెడిది. ఆవిధాన మిపు డన్నిరాజ్యములందు నొకటిగఁ జేయఁబడెను. ఇతనితరువాత నధ్యక్షుఁడైన టాఫ్ట్ అనునతనికాలమునందు పదార్థనిర్మాతల (Manufacturers) మేలునకై క్రొత్తచట్ట మొకటి కావింపఁబడెను. స్పెయిను యుద్ధానంతరము క్యూబాదీవియందు నిలుపఁబడిన అమెరికనుసేన లచ్చోటనుండి వేఱొకప్రదేశమునకు మార్పఁబడినవి. వెనెజూలాదేశముతోఁగల వాదవివాదములు పరిష్కృతము లయ్యెను. తరువాత మరల నితఁడును, రూజువెల్టు, లాఫోల్లెటె అనువారును అధ్యక్షపదవికిఁ బ్రయత్నించియుండిరి. ఈముగ్గురవిడిప్రయత్నముల మూలమున వీరిలో నొకరును గెలుపొంద రైరి. అపుడు డిమోక్రాట్ వ్యక్తి యగు వుడ్రో విల్సన్ ప్రెసిడెంటుపదము నందెను. ఇతఁడు విదేశములతో నెక్కుడు సంబంధములఁ గలుగఁజేసికొనుచుండెడివాఁడు. ౧౯౧౩ న సంయుక్తరాజ్యములు చీనాదేశముయొక్క ప్రజాప్రభుత్వము నంగీకరించినవి. ౧౯౧౪-వ సంవత్సరమున జర్మనీయుద్ధ మారంభ మయ్యెను. మొట్టమొదట యూరోపుసంపలి యుద్ధములతో సంబంధము కలుగఁజేసికొనరా దని సంయుక్తరాజ్యములు తాటస్థ్యమును వహించియే యుండెను కాని మిత్రమండలివారి కవసరములగు పదార్థముల నంపియు, కావలసినంత ద్రవ్యము నొసంగియు సాయము చేయుచునే యుండెను. ఇది కనిపట్టియే కాఁబోలు జర్మనీయు నూరకుండదయ్యెను. ఆకారణమున నమెరికావారికిని యుద్ధమునందుఁ బ్రవేశింపవలసి వచ్చెను. ౧౯౧౭-వ సంవత్సరమున జర్మనీతో యుద్ధఘోషణము కావింపఁబడినది. అమెరికా చేరిన కొలఁదికాలమునకే ఇఁక నెక్కువ నష్టమును బొందుటకంటె సంధి చేసికొనుటయే మే లని జర్మనీ యభిప్రాయపడి యటులే కావించెను. అనంతర మేదో యొకవిధమున బ్రిటీష్‌వారి యిచ్ఛానుసారము సంధి జరిగినది కాని అమెరికా-అధ్యక్షుఁడు విల్సన్ సూచించినట్లుమాత్రము గాదు. విజేతలగు మిత్రమండలివారు ముఖ్యముగ బ్రిటీష్-ఫ్రెంచిజాతులు శత్రువుల యధీనమందలి దేశము లన్నింటిని దమవశము చేసికొని సాధ్య మగునంతవఱకు వారి యైక్యమును ఛిన్నభిన్నము గావించి నూతనరాజ్యములను నెలకొల్పిరి. ఈ ప్రకారమేర్పడిన యీ నూతనరాజ్యముల స్వాతంత్ర్యమును అమెరికనులకును స్వీకరింపవలసి వచ్చెను. సంయుక్తరాజ్యము లీపంపిణీయందు భాగముగైకొనకపోయినప్పటికిని ప్రపంచమం దంతటను శాంతి, న్యాయములను స్థాపింతు మనుపేరుతో మిత్రమండలివారు చేయఁగడఁగినకార్యములను అటంకపఱచియుండలేదు. అనంతరము రిపబ్లికన్‌వ్యక్తి హార్డింగ్ అధ్యక్షుఁ డయ్యెను. కాని యతఁడు వెంటనే మరణింప నుపాధ్యక్షుఁడగు కాల్విన్ కూలిడ్జి యాపదమును గైకొనెను. ఇతఁ డధ్యక్షుఁడుగ నుండిన రెండుపర్యాయములుగూడ హార్డింజిరొక్క ఆర్థికనీతినే యవలంబించెను. యుద్ధకాలమున కల్పింపఁబడిన ఆదాయపు పన్నులన్నియు మరలఁ దగ్గింపఁబడినవి. ఈకాలమున ప్రాముఖ్యము వహించినవిషయములలో నొకటి మద్యపాన నిర్మూలనము ౧౯౨౨-వ మేమాసమున దీని వ్యాపారమును తగ్గించుటకై మరల నొకచట్టము కావింపఁబడినది.

౧౯౨౬-వ సంవత్సరమున జినీవాలో సమావేశమైన ప్రపంచాంతర్జాతీయప్రతినిధు లమెరికా కోరిన కొన్నిషరతులకు సమ్మతింపనందున నీదేశము ప్రపంచాంతర్జాతీయసంఘము (International League)నందుఁ బ్రవేశింప సమ్మతింపదయ్యెను. కూలిడ్జి తరువాత హూవర్-హెర్బర్ట్-సి- అధ్యక్షుఁ డయ్యెను. ఇతనికాలమున కృషికనుకూలమైన బిల్లు స్థాపింపఁబడెను.

ఈకాలమున ప్రపంచశాంతి కని జరగిన ముఖ్యవిషయములలో కెల్లాగు-బ్రియాండ్‌సంధి ఒకటి. ౧౯౨౭-వ సంవత్సరమున ఫ్రెంచి విదేశాంగమంత్రి అరిస్టైడ్‌బ్రియాండు వివాదాస్పదములైన సంగతులను శాంతివిధానములద్వారా తీర్చుకొనవలయునే కాని యుద్ధముద్వారా కూడ దని ఫ్రాన్సు, సంయుక్తరాజ్యములు సంధిచేసికొనవలసినదిగఁ గోరెను. అంగులకు అమెరికా స్టేటు శెక్రటరీ ఫ్రాంక్ బిల్లింగ్స్ కెల్లాగు ఇట్టిసంధికి ఇతరజాతులను గూడ చేరఁదీయవలె నని ప్రతిపాదనము గావించెను. తత్ఫలితముగ నామఱుసటిసంవత్సరమున ౧౫ జాతులవారు పారిసునగరమున సమావేశమయి ఈసంధిని గావించుకొనిరి. హూవరుకాలమున కృషివ్యాపారపు సుంకములసందర్భమునను అభివృద్ధికరములగు మార్పు లనేకములు జరగెను.

ఇతని యనంతరము ప్రెసిడెంటుపదము నధిష్ఠించి ప్రస్తుతము అమెరికాసంయుక్తరాజ్యములను నడపుచున్నది రూజువెల్టు. ఇతఁడు వ్యాపారమాంద్యమును పోఁగొట్టి, నిరుద్యోగసమస్యను పాఱఁదోలుట కత్యంతతీవ్రప్రయత్నములను సలుపుచున్నట్లు వార్తలవలనఁ దెలియుచున్నది. ఇతని పద్ధతులు ప్రపంచమునం దంతటను కలవరము పుట్టించినను స్వదేశమునకు కొంతవఱకు మేలు చేకూర్చినట్లే కనుపడుచున్నది. ఇంతవఱకు నిరసింపఁబడిన సోవియటు రష్యాతో సంధి గావించియు, ఫిలిప్పైనుద్వీపములకు స్వాతంత్ర్య మొసఁగియు రూజువెల్టు మహోత్కృష్టకార్యములఁ గావించెను. కాని పడేండ్లక్రిందఁ బోయినత్రాగుడును మరల న్యాయసమ్మతము చేయుట విషాదకరము.

స్వాతంత్ర్యము దొరకినది మొదలుకొని ఈదేశము సకలవిధముల నభివృద్ధి నొందుచువచ్చినది. కాని ౨౦-వ శతాబ్దియం దిచటఁ గలిగిన యభివృద్ధి సమస్తప్రపంచమునకు నాశ్చర్యము కలుగఁజేసెను. ఇందులకుఁ బ్రధానకారణము రత్నగర్భ యగుభూమి, తదీయ సంతతుల యుత్సాహశక్తి, విద్య-ఈమూఁడు నని చెప్పవచ్చును. ఇందులో నేది లేకపోయినను తక్కిన రెండును వ్యర్థము లయ్యెడివి. దేశమందలి ప్రతిబాలుఁడు, బాలికయును విద్యనభ్యసించుటకు వీలగులాగున అగణితములగు విద్యాలయములు నెలకొల్పఁబడినవి. ఇచట విద్యాశాల లేని

sampath_Ebooks



గ్రామమే లేదు. తుదకు నాలుగైదు గృహము లుండినను జాలును; అచట నొక పాఠశాల యుండును. ఈవిద్యాభివృద్ధి యనునదంతయు కేవలము దొరతనమువారి సాయమువలననే కాదు; ఆంద్రూ కార్నెగీ, జాన్. డి. రాక్ ఫెల్లర్ లోనగు కోటీశ్వరులు కోట్లకొలఁది ధనమును విద్యావ్యాపనమున కొసంగియుండిరి. ఈ ధనసాహాయ్యమునకుఁ దోడుగ, విద్యావంతు లనేకులు ఏ యుపాయముల నవలంబించినచో శీఘ్రముగను, సుకరముగను, స్థిరముగను విద్య వ్యాపించులాగున చేయ వచ్చునో వాని నన్నిటిని విచారించి, వారు గనిపట్టిన విషయముల నన్నింటిని వెలువఱచియుండిరి. వేలకొలఁదిగ పుస్తకాలయములు స్థాపింపఁబడినవి. ఆయాలయములనుండి గ్రంథములు పెద్దవారికే కాదు; బాలురకుఁగూడ నొసంగి వారియందు శీఘ్రముగ విద్య పెంపొందు లాగునఁ జేయఁబడినది. వీనికి సహాయకములుగ లక్షలకొలఁది వార్తా పత్రికలు వెలువడుచుండును. కార్మికులవిషయమున వారికి హితమగు మంచి కట్టుదిట్టములు కలవు. కొన్నిరాజ్యములందు ౧౪ ఏండ్లకు తక్కువయగు వయసుకల బిడ్డలను కూలిపనులందు వినియోగింపరా దని నియమము లున్నవి. బిడ్డలపరిశ్రమమువలనఁ దయారగు పదార్థములను విదేశముల కెగుమతి చేయఁగూడ దని యుత్తరువులు కలవు. స్త్రీలకు ప్రతిదినమును ౧౦ గంటల కెక్కువ పని నియ్యరా దని కొన్నిరాజ్యములందును, ఎనిమిదిగంటల కెక్కువకూడ దని మఱికొన్ని రాజ్యములందును చట్టము లున్నవి. ఇట్టిసర్వజనోపకారులైన విధానముల నలుపునది కేవలము ప్రభుత్వమే కాదు; ధనాఢ్యులగు ప్రజలును, ఇందులకుఁ జేయూఁత నొసంగుచుందురు. 'రస్సెల్ సేజ్ ఫౌండేషన్' (Russell sage found ition) అను గొప్ప సంఘ మొకటి ఏర్పడి దేశమందలి దారిద్ర్యమును, మౌర్ఖ్యమును బాఱఁదోలుటకుఁ గంకణము కట్టుకొనియున్నది. అంతర్జాతీయశాంతిస్థాపనార్థము కార్నెగీదానమువలన మఱియొకసంస్థ యేర్పడెను. సమస్త ప్రపంచారోగ్యమునకును, వైద్యసంబంధిగవేషణమునకును రాక్ ఫెల్లర్ మఱి ఇరువదిలక్షలడాలర్ల నొసంగియుండెను. 'సర్వే భద్రాణి పశ్యంతు, సర్వే సంతు నిరామయాః' అను వాక్యమును కార్యములోనికిఁ దెచ్చిన దీజాతియే యనుటవలన నిపు డన్నివిషయముల నిది ప్రపంచమున మహోన్నతస్థాన మందియున్నది.

**అమెరికా సారస్వతము** — అమెరికా సారస్వత చరిత్రము తల్లికడుపునుండి విడఁదీసి తీసికొనివచ్చి వేఱు ప్రదేశమున నాఁటిన భాషా, సంస్కృతులు క్రమముగాను, మెల్లదిగాను చెందు వేర్పాటును దెలుపుచరిత్రమే. మొదట నీసారస్వత మాంగ్లసారస్వత వృక్షశాఖగా నారంభమయి, మొదట నొక్కచోట పెరిఁగిన రెండు తెగల యింగ్లీషువారును ఒకరి కొకరు దూర మయి వేఱువేఱు పరిస్థితులయందు వేఱువే అనుభవములను బొందుచు రాఁగా, రీతియందును, విషయమునందును క్రమముగా మార్పు చెంది, తుద కింగ్లాండు సంస్కృతికి కడు భిన్నమయిన సంస్కృతికి నిర్వచనముగా విశానము చెందినది. ఒకతరమువఱకు నీవాఙ్మయరచయిత లమెరికాయందు నివాస మేర్పఱుచుకొనిన యింగ్లీషువారే.

మొట్టమొదటి నూటయేఁబదియేండ్లలోను అమెరికాయం దధినివేశముల నేర్పఱుచుకొన్నవా రింగ్లీషువాఙ్మయముత్రోవనే యనుసరించి గ్రంథములను రచియించుచువచ్చిరి. చాల నిటీవలనే అమెరికా గ్రంథకర్త లింగ్లీషుగ్రంథకారుల ననుసరించుట, యనుకరించుట మాని స్వతంత్రముగ తమత్రోవలను దా మేర్పఱుచుకొని తమ్ముఁ దాము వ్యక్తీకరించుకొనఁజొచ్చిరి. ౧౭౦౦ ల వఱకు కూడ అమెరికా గ్రంథకర్తల కింగ్లీషుసారస్వతముమీఁది వ్యామోహము పోలేదు; అవే తెన్నులు, అవే రీతులు, అవే సంప్రదాయములును అమెరికా సారస్వతమున మూర్తులు కట్టుకొని నిలిచినవి. అధినివేశములయందలి పరిస్థితులనుబట్టి, అనుభవములనుబట్టి అమెరికాసారస్వతమున నించుక భేదము కన్పట్టుచువచ్చినను ప్రధానముగ నది ఇంగ్లీషువాఙ్మయమునకు చేరిక యాయిన ప్రతిసృష్టిగ రూపొందినది. ఇందుఁగూడ లండను నందు రేకెత్తి వర్ధిల్లుచు వచ్చిన సాహిత్యాతివాదరీతి, సంప్రదాయముల పొంతఁబోవక అది వాని నించుక దువ్వి చదునుచేసి పెంచుచు వచ్చినది.

అమెరికాయందలి యుత్తరభాగము సారవంతము కాని యసమప్రదేశము. ఇందు నౌకాశ్రయస్థానములును, ఉరవడి యెక్కువగాఁ గల యేళ్లును, నదులును జాలఁ గలవు. ఇంచుక దక్షిణమునకుఁ బోయినయెడల విశాలము లయి, యొండ్రుమట్టితోఁ గూడిన మైదానములతో దేశము విపులు పడును. ఈప్రదేశము వ్యవసాయమున కనుకూల మయినది. పొగాకు, వరి, నీలి, ప్రత్తి యిందలి ప్రధానమయిన పంటలు. అనేకములుగ నున్న నౌకాశ్రయస్థానములవలనను, ఏళ్లవలనను ఉత్తరభాగము వాణిజ్యవ్యాపారమునకును, నౌకాయానసాహసికతకును పేరుగనెక్కఁగా దక్షిణభాగము బానిసవృత్తి నాధారము చేసికొని ముక్క మోటికి పండించి చేయు జీవనవిధానమున కనుకూలించినది. సంఘమున పరపతి గల ప్రముఖు లందఱు నెల్లచోటుల సామంతులుగనే యుండిరి. వీరికి బోస్టన్, ఫిలడల్ఫియాలయందలి వణిక్ప్రభుములును, న్యూయార్కు, వర్జీనియాలయందలి భూస్వాములును ఎంత చెప్పిన నంతే. అందువలన భూవసతియు, ధనాఢ్యతయు సంఘమును పాలించుచువచ్చెను. ప్రజాసత్తాకభావము చాల నిటీవల మొలకెత్తి పెరిఁగినది. ఫ్రెంచివిప్లవమునాఁటికిఁ గాని దీని కుద్ధృత మయినశక్తి రాలేదు. అప్పటినుండి యిది సంఘమును, జాతీయప్రభుత్వమును ప్రజాసత్తాకభావపరము కావించినది. ఇది కారణముగ నీ ప్రజాసత్తాకోద్యమమునకు పరపతిగల ప్రముఖు లెల్లరును పరమ శత్రుత్వము వహించిరి. ఈకారణమున అపహాస్యాత్మకసారస్వతము మిగుల గాటయినది చాల వెలువడినది.

అమెరికా సారస్వతమున క్రీ. శ. ౧౬౦౭ మొదలు ౧౭౬౫ వఱకు నొకరీతిగ ప్రాథమికయుగ మని చెప్పవచ్చును. ఈకాలమున

sampath_Ebooks

వెలువడిన సారస్వతము నిజమునకు ఇంగ్లీషుసారస్వతమునందలి యొక భాగముగనే గ్రహింపవచ్చును.

న్యూ-ఇంగ్లండునందు తక్క మిగిలిన ప్రదేశములందు గ్రంథరచన అరుదుగ నుండెడిది. ఉత్పత్తి యయిన గ్రంథములును చాల తక్కువ. వర్జీనియాయందు దేశశోధన, దేశవర్ణనములకు సంబంధించిన గ్రంథములు, సాగరిక యాత్రాచరిత్రములు మొదలయినవి పుట్టినవి. పదునెనిమిదవశతాబ్దిదాఁకను వర్జీనియాయందలి పరిస్థితులు గ్రంథోత్పత్తి కంత యనుకూలముగ నుండదయ్యెను. అంతటినుండి గ్రంథములు చాల వచ్చినవి.

ఒక్కొక్క వలస మనోరంజకమయినది కాని, ప్రాముఖ్యము గడించినది కాని యయినవెంటనే దానికి సంబంధించిన వర్ణనగ్రంథములును, వృత్తాంతములును బయలుదేఱుచు వచ్చినవి. సముద్రతీర ప్రదేశములందు గ్రంథరచన చాల వెనుకాదియముగ నుండెను. కాని క్రమాభివృద్ధినొందుచు ప్రాముఖ్యము గడించినవానియందు సహజముగ నెక్కువగ నుండెను.

మొదటినుండియు వర్జీనియాయందుకంటె న్యూ-ఇంగ్లండునందు గ్రంథరచనమునకును, గ్రంథముద్రణమునకును పరిస్థితు లెక్కువ యనుకూలముగ నుండెను. ప్యూరిటనులు చిన్న చిన్న గ్రామములయందు స్థిర నివాసము లేర్పఱుచుకొనిరి. ప్రతిగ్రామమును మతాచార్యునినాయకత్వమున చక్కనికట్టుఁబాటులతో నొప్పుచుండెను. ఈ మతాచార్యు లాస్తికవాద ప్రతివాదములను, ఆస్తికగ్రంథరచనను ప్రోత్సహించుచు వచ్చిరి. ఈరీతిని న్యూ-ఇంగ్లండునందు ఆస్తికమతవాఙ్మయము చాల బయలువెడలినది. ఆస్తికవాదమునకు సంబంధించిన పత్రికలు కూడ మొలకెత్తినవి. రోజర్ విలియమ్సు ఈ కాలపు ఆస్తికవాదులలో ప్రముఖతఁగన్నవాఁడు. ఇతనియభిప్రాయము లప్పటి ప్రభువులకు నరిపడక యతనిని దేశబహిష్కృతుని గావించిరి. అందువలన నితఁడు మస్సచుసెట్స్ అఖాతమునుండి వెడలిపోయి రోడ్ దీవి కరిగి యచట అమెరికాయందలి మొట్టమొదటి ప్రజాసత్తాక సమష్టిరాజ్యమును స్థాపించెను. ఇతఁడు ప్రజాసత్తాకతత్త్వమును విపులముగ వ్యాఖ్యానముచేసి విశదీకరించుటవలన ఆకాలపు రాజకీయభావకులలో ప్రముఖుఁడుగ పరిగణింపఁబడుచున్నాఁడు. ఈకాలమున పద్యకవులు కూడఁ గొందఱు విలసిల్లిరి. వారిలో మైకేల్ విగ్గల్స్‌వర్త్ ప్రథమగణ్యుఁడు. న్యూ-ఇంగ్లండునందలి ఆస్తికవాదగ్రంథకర్తలలో జోనాథన్ ఎడ్వర్డ్స్, సామ్యుయల్ హాప్‌కిన్సు, ఎజ్రా స్టైల్స్ అనువారు పేర్కొనఁ దగినవారు.

న్యూ-ఇంగ్లండు మతాచార్యుల యుపన్యాసములకు చెవియొగ్గి వినుచుండినకాలమున ఫిలడల్ఫియా బోస్టనుకంటెను సంస్కృతి సాహిత్యములకు ప్రధానపీఠ మగుచుండెను. ఇచ్చట పెక్కు గ్రంథములు ముద్రితము లగుచుండెను. నాటకరంగములను, పత్రికలను ప్రజ లాదరించుచుండిరి.

అమెరికాసారస్వతమునకు ౧౭౬౫ మొదలు ౧౮౦౦ల వఱకును ద్వితీయదశ యనవచ్చును. ఇది యమెరికాహృదయము పెక్కు విధములయిన రాజకీయసమస్యలతోఁ బటతటఁ గొట్టుకొనుచుండినకాలము. అమెరికాయంతఃకలహము, సంఘాతరాజ్యప్రతిష్ఠాపనప్రయత్నము, ఫ్రెంచివిప్లవసంజనితనూతనభావములు అను నివి యమెరికనులను గిలవరపెట్టుటవలన అమెరికాయం దొక నూతనజాతి తయారగుచుండినకాల మది. ఈకాలమున నుత్పత్తియయిన సారస్వతము రాజకీయముల కనుబంధిగ వర్ధిల్లుట సహజము. రాజకీయ సంబంధము గల కరపత్రములు, గ్రంథములు అనేకము లీకాలమునఁ బుట్టినవి. ఈరాజకీయ సారస్వత నిర్మాతలలో సామ్యుయెల్ ఆడమ్సు, జాన్ డికిన్సన్, జోసెఫ్ గాల్లోవే, టామ్ పెయిన్ లు ప్రముఖులు. వీరి రచనలు కారణముగ దేశము యుద్ధాగ్నికుండమున నుఱికినది. వీరిలో పెయిన్ కలము కడు శక్తిమంత మయినది. ప్రజాహృదయమునకు హత్తునట్లు స్వాతంత్ర్యమువలని లాభములనుగూర్చి తెలిపినవాఁ డితఁడు. 'మానవుని హక్కులు' అనునది ఆకాలమున ప్రజాహృదయమున ఉద్రేకమును కలిగించిన గొప్ప గ్రంథము. పైని పేర్కొనినవారు కాక రాజకీయనాయకులు జాన్ ఆడమ్సు, అలెగ్జాండరు హామిల్టన్, థామస్ జఫర్సన్ లవంటివారు పెక్కు రుండిరి.

అమెరికా యువజనసంఘ మారీతిని రాజకీయ స్వాతంత్ర్యమును సంపాదించి, అపేక్షితసూత్రములమీఁద నొక ప్రభుత్వము నేర్పాటుచేయుచుండిన కాల మగుటవలన అప్పుడు సభ్యసారస్వతము ప్రజాక్షేమలాభముల కణఁకువగ నుండుట, సహజము. ఈకారణమున కవిత్వ, వ్యాసములు పదునెనిమిదవశతాబ్ది కడపటిదశలం దచ్చటచ్చట పెరుఁగుచు వచ్చినవి. ౧౭౮౦, ౧౭౯౦ లలో హార్టుఫోర్డు, కాన్ లందు యువజనులు కొందఱు సమకాలికాంగ్లసారస్వత శిల్పశక్తిని గ్రహింపఁ బ్రయత్నించిరి. వీరిలోఁ గొందఱు ప్రజాసత్తాకవ్యతిరేకవాదులు. ఈకారణమున నీకాలమున అపహాస్య (Satirical) సారస్వతముకూడ తగినంత బయలుదేఱినది. దీనితోపాటు నాటకవాఙ్మయమును క్రమక్రమముగ మొలకెత్తి వర్ధిల్లినది.

౧౮౧౫-వ అమెరికాయుద్ధము పూర్తియైననాఁటనుండి అమెరికనుల జీవితమున మార్పు లనేకములు కలిగినవి. ప్రతివిషయమునను పరివర్తనము సంభవించినకాల మిది. సంస్కరణోద్యమములు, దాస్యప్రథానిర్మూలనప్రయత్నములు, పారిశ్రామికతారంభములు, ప్రజాసత్తాకప్రభుత్వభావవికాసము, యుద్ధములు— ఇవి యన్నియు వెనుకటి ప్రాచీనభావములతో నిండి కొయ్యవాఱిన అమెరికాహృదయమునకు పదును పోసి మార్చి దానిని నూతనభావతరంగితము కావించినవి. నాఁటనుండి అమెరికాసారస్వతమునకు క్రొత్తశక్తి, క్రొత్త వికాసము, క్రొత్తజీవము వచ్చి యది వివిధవిధములగు చక్కనిమార్గములు త్రొక్కి పేరుప్రతిష్ఠలు గడించుకొన్నది. అందువలన పందొమ్మిదవ శతాబ్ది నుండి నేఁటివఱకు నమెరికాసారస్వతము దినదినాభివృద్ధి నొందుచు

sampath Ebooks

ప్రపంచవాఙ్మయమునఁగూడ స్థానము గడించుకొన్నది. అమెరికా సారస్వతమున నీపందొమ్మిదవ, యిరువదవ శతాబ్దులందు పెక్కుగు ప్రతిభాశాలు లుదయించి, వేఱువేఱు శాఖలందు క్రొత్త క్రొత్త రీతులను, క్రొత్త క్రొత్త సంప్రదాయములను వెలయించి తమ వాఙ్మయ సౌభాగ్యమును పెంపొందించినారు. వాషింగ్టన్ ఇర్వింగ్, జేమ్స్ ఫెనిమోర్ కూపర్, ఎడ్గర్ అల్లన్ పో, హెన్రీ డేవిడ్ థోరో, జాన్ గ్రీన్‌లీఫ్ హ్విట్టియర్, హెన్రీ వాడ్స్‌వర్త్ లాంగ్ ఫెల్లో, నథనియల్ హాథార్న్, రాల్ఫ్ వాల్డో ఎమర్సన్, జేమ్స్ రస్సెల్ లొవెల్, ఆలివర్ వెండెల్ హోమ్స్, ఎమిలీ డికిన్సన్, వాల్ట్ హ్విట్‌మన్, హెర్మన్ మెల్విల్లి — ఈ మొదలగువారందఱును పందొమ్మిదవ శతాబ్దిని వర్ధిల్లిన సుప్రసిద్ధ అమెరికా గ్రంథకర్తలు.

౧౮౫౦ మొదలు ౧౯౦౦ ల వఱకును గ్రంథరచన శీఘ్రముగ సాగినది. చిన్నకథ కళావిస్ఫురితయం దుచ్ఛదశ నొంది పేరుగాంచినది. కవిత పరిమితముగ వర్ధిల్లినది. చారిత్రకకథా సంప్రదాయము కట్టుకొని వర్ధిల్లినది.

౧౯౦౦ మొదలు ౧౯౧౪ వఱకు అమెరికా సారస్వత మింకను క్రొత్తమార్పులను జెందుచు వర్ధిల్లుచున్నది. ఈకాలమున ప్రపంచమునందలి యేయితరభాగములందుకంటెను అమెరికాసంయుక్తరాజ్యములందు ఆర్థికనిర్మాణమునను, విద్యయందును, సాంఘికపరిణామమునను, రాజకీయములందును, సారస్వతమునందును, కళలందును గూడ గొప్ప మార్పు సంభవించినది. వ్యావసాయికదేశము పారిశ్రామికదేశముగ మార్పుచెందినది. దీనితో దేశమున నొక క్రొత్త ధనిక ప్రజాసత్తాకము వికసించినది. జాతీయభావము పునరుద్ధృతమయినది. ఇంతయేల, కడచిన మూఁడుదశలందును, మార్పుకలిగి యొక నూతనసాంఘిక, నైతిక, ఆర్థిక, విజ్ఞానసంప్రదాయములు రూపొందినవి. ఒక క్రొత్తయుగ మారంభ మయినది.

౧౯౧౦ లో అమెరికాదేశీయుల సారస్వతాభిరుచిలో మార్పు కలిగినది. ఈమార్పు కలుగుటకు బెర్నార్డ్‌షా గ్రంథములును, రషియా దేశపు నవలారచయితల గ్రంథములును, ఇబ్సెన్ గ్రంథములును కారణములు. ఈరీతిని ఇరువదవశతాబ్దియం దమెరికాసారస్వతమునకు నొక క్రొత్త ప్రోత్సాహశక్తుల నొసంగినది యూరోపు.

సారస్వతమునందే కాక యితరవిషయములందును నిట్టిప్రోత్సాహము కలిగినది. ద్రవ్య మొకశక్తిగ, కార్మిక లోకతరగతిగ, ప్రజాసత్తాక మొక యార్థికవిషయముగ (Economic Factor) అమెరికనులు గ్రహించిరి. ఈభావములను వ్యాపింపఁజేసినవారు రూజువెల్టు, బ్రియానులు. ఈభావములతోపాటు అమెరికనుహృదయము నుత్తేజనము నొందించిన గ్రంథకర్తలు మఱికొందఱు కలరు. వారిలో ఆధునికప్రపంచము సంకీర్ణమయిన దని, యందు స్త్రీపురుషులస్థితి తమ చుట్టుప్రక్కలనుండు పరిస్థితులనుబట్టి నిర్ణీత మగు నని నిర్వచించిన హెచ్. జి. వెల్సు, జాన్ గాల్సువర్దీలు ప్రధానులు. ఈ నూతనభావపరంపరలకారణమున అమెరికావిశ్వవిద్యాలయములనుండి ౧౮౯౦లో సృష్టిచెప్పఁబడిన సాంఘికవాదము (Socialism) తిరుగ విమర్శనకు, చర్చకుఁ దేఁబడినది. ఈవిధముగా సంఘమునందుఁ గలిగిన యశాంతి సారస్వతమునఁగూడ ప్రాఁకి యందును అశాంతి రేకెత్తినది. కార్మికతరగతులవారిమీఁద క్రొత్తగ కలిగిన శ్రద్ధాసక్తులవలన ఆ తరగతులయందలి వ్యక్తులయందును క్రొత్త శ్రద్ధాసక్తులు కలిగినవి. ఈ కారణమున సాధారణపరిస్థితులయం దుండు సామాన్యుఁడు సారస్వతమున అప్రధానపాత్రముగఁ గాక ప్రధానపాత్రముగ ప్రవేశమును గలిగించుకొనెను.

పందొమ్మిదవశతాబ్ది కడపటిదశలయందు అమెరికా పాఠశాలలయందును, కళాశాలలయందును పరివ్యాప్త మగుచుండిన శాస్త్రవిద్య (Scientific education) దీనికి నుద్దీపనము కలిగించినది. ఈకాలమునందలి పారిశ్రామికాభివృద్ధి కాధారభూత మయిన ప్రయోగపూర్వకమయిన శాస్త్రవిజ్ఞానము (Experimental Science) వలన సారస్వతమున వాస్తవికధోరణి (Realistic attitude) యొకటి కలిగినది. అందువలన అమెరికనులకు నమ్ర, నిరర్థక, అసద్విషయములందును శ్రద్ధ కలుగుట కిచ్చ జనించుచున్నది.

సారస్వతయోగ్యతలందలి మార్పు కవిత్వమునం దెక్కువగ పొడకట్టుచున్నది. అమెరికాకవిత్వమునందలి పునరుజ్జీవనము ఒకవిధముగ పరివర్తన మనియే చెప్పనగును. క్రొత్తసంప్రదాయములు, క్రొత్తశిల్పము కవిత్వమున నావిర్భవించినవి. సారస్వతమున కవిత్వము ప్రముఖవాఙ్మయశాఖగ పేరుగాంచినది. ఎమీలోవెల్, ఎడ్గర్ లీ మాస్టర్స్, రాబర్ట్ ఫ్రాస్ట్, ఎడ్విన్ ఆర్లింగ్టన్ రాబిన్సన్, వకెల్ లిండ్సే మొదలగు గ్రంథకర్త లీనూతనయుగమునకుఁ జెందినవా రనేకులు కలరు. కవిత్వముతోపాటు విమర్శనమును, కథయు కూడ సారస్వతరంగమును నేఁడు ప్రధానముగ నాక్రమించుకొనుచున్నవి.

## అమెరికా స్వాతంత్ర్యయుద్ధము

— స్వార్థరహితమైన న్యాయబుద్ధితో ఆలోచించి చూచినయెడల పాలితు లగు జనులసంరక్షణార్థమే పాలకు లేర్పడి రనియు, అట్టి పాలకులు తమ విధ్యుక్తధర్మము క్రమముగ నిర్వహింపనిచో వారిని తొలఁగించుటకు జనులకు హక్కు కల దనియు విశద మగును. ఆదికాలమున రాజపద మిట్టి యాశయములతో నేర్పడియుండినప్పటికిని లక్షలకొలఁది సంవత్సరములు కడచిపోవ నుపర్యుక్తసమయవిస్మరణము కలుగుటచే రాజు ఎట్టివాఁడైనను దేవాంశసంభూతుఁడను విశ్వాసము కలుగసాగెను. జను లందఱు నేకీభవించి తమ్ము శత్రువులనుండి కాపాడుటకును, తమకు శాంతిసౌఖ్యములను సమకూర్చుట కవసరములైన విధానముల నేర్పఱుచుటకును తమ తమ యాదాయములనుండి మిగుల్చుకొని చందారూపముగ పన్నులని యిచ్చిన ద్రవ్యముచేతనే ప్రబలుఁడై పాలకుఁడు తన విధ్యుక్తధర్మముల నెఱవేర్పకపోవుట యటు లుండ, మీఁదుమిక్కిలి తన్ను నేర్పఱుచుకొనిన జనులను వారుచేసినధన

sampath_Ebooks

సాహాయ్యముతో హింసింపఁబడెఁగినచో నిఁక చెప్పవలసిన దే మున్నది? 'ప్రభుత్వ మనునది రాజు ప్రజలు కలసి చేసికొనిన యొక నియమబద్ధ మైన సమయము. ఈయిద్దఱిలో నెవ్వరైన నొక రీసమయ విఘాతము కలిగించినయెడల రెండవపక్షమువారిని వారిబాధ్యతనుండి తప్పించి నట్లే యగును' అను నర్థ మిచ్చువాక్యములతో అమెరికాదేశపు రాజనీతికుశలులైన పాట్రిక్ హెన్రీ, జేమ్సు ఓటిస్ అనువారు విధ్యుక్తకర్తవ్యనిర్వహణాసమర్థుఁడైన బ్రిటిషురాజుయొక్క దేవాంశసంభూతత్వమును, అతనికిఁ దోడ్పడు పార్లమెంటుయొక్క సర్వాధిక్యమును నిరసించి వానికి బదులు సర్వసాధారణన్యాయమును, మానవుల సహజశాశ్వతాధికారములను ప్రతిపాదనము గావించిరి. ఈప్రతిపాదనమును స్థిరపఱుచుటకే అమెరికా స్వాతంత్ర్యయుద్ధము జరిగినది. దీనివలన అమెరికాసంయుక్తరాజ్యములు (United States of America) బ్రిటిషుసామ్రాజ్యదాస్యమునుండి విముక్తిని బొంది సంపూర్ణ స్వాతంత్ర్యమును బడసెను. ఈసంగ్రామము క్రీ. శ. ౧౭౭౫ వ మసాచూసెట్సునందలి లెక్సింగ్టన్ నగరమునొద్ద జరిగిన సంఘర్షణముతో ప్రారంభమై ౧౭౮౧-వ సంవత్సరమున అక్టోబరునెలలో యార్కుటౌనునొద్ద కార్న్‌వాలిస్ ప్రభువు అమెరికనులకు పట్టుపడుటతో సమాప్త మయ్యె నని చెప్పవచ్చును. సైనిక (Military), రాజకీయ (Political) దృష్టిపథము ననుసరించి ఈయుద్ధమునకు నొక గొప్ప మహత్త్వము కలదు. ఒక స్వల్పరాజ్యము తన జనకసామ్రాజ్యము నోడింపఁగల్గుటయే దీనికి తార్కాణము. మఱియు ఆకాలమున సంభవించిన అనివార్యపరిస్థితులనుగుఱించియు, ఆపరిస్థితులలో గాఢమగు దేశభక్తిని విద్రోహముక్రిందఁ గట్టి దానిని జంపవలె నను ఉత్కంఠాభిలాషతో పాలకులు సలిపియుండిన లోపాలోపములఁ గూర్చియు యథార్థమగు జ్ఞానము కలుగఁజేసి ఇది యొక శిక్షాదాయకమైన యుద్ధ మని చెప్పనగును.

కొలంబసు అమెరికాను కనుఁగొనిన తరువాత యూరోపుఖండములోని బ్రిటిష్, డచ్, స్వీడిష్, ఫ్రెంచ్, స్పానిష్‌జాతులవారు క్రొత్తదేశమునకుఁ బోయి నివాసములను కుదుర్చుకొనసాగిరి. ఇట్లు రెండువందలసంవత్సరములు గడచునప్పటికి వలస (Colonies) లేర్పడెను (అమెరికా సంయుక్తరాజ్యములు అను వ్యాసమును చూడుఁడు). కావున అమెరికన్ జాతి వివిధజాత్యాత్మకము. ఆంగ్లేయుల సంఖ్యాధిక్యమువలన వారే ప్రాధాన్యము వహించిరి. క్రీ. శ. ౧౬౦౭ మొదలుకొని ౧౭౬౦ వఱకు నీ వలస లన్నియు బ్రిటిష్ వారి అధినివేశప్రభుత్వము (Colonial Government) క్రిందనే యుండెను. స్వాతంత్ర్యము నందినపిదప నీవలస లన్నియు రాజ్యములు (States)గ మాఱిపోయెను.

ఈయుద్ధమునకు పూర్వము, అనఁగా క్రీ. శ. ౧౬౮౯ మొదలుకొని ౧౭౬౦ వఱకును గల కాలమున బ్రిటిష్‌వారికిని ఫ్రెంచివారికిని కలహములు జరగియుండెను. సంఖ్యాపరిమాణమున ఇంగ్లీషువారే యెక్కువ యగుటయు, వలసలవా రందఱును వారిపక్ష మవలంబించియుండుటయు సంభవించినందున చివరి కాంగ్లేయులకే జయము కలిగెను. ఈవిజయమువలన అమెరికాయందలి విస్తారభూభాగము బ్రిటిషువారికి దొరకెను. ఫ్లోరిడా, కెనడా, లూయిసియానాలతోపాటు మిసిసిప్పీనదిపర్యంతము గల దేశ మంతయు వారియధీన మయ్యెను. అంతకుపూర్వము వీరు వ్యాపారాభివృద్ధి కవసరములైన దేశములను మాత్రమే తమయధికారమున నుంచికొనవలయు ననుతలంపును గలిగియుండిరి. కాని బ్రిటిష్, ఫ్రెంచియుద్ధానంతరము పారిసునగరములో జరగినసంధి ననుసరించి పూర్వోక్తరీతిని వీరికి విశాలభూభాగము లభించుటచేత నదివఱకు వలసలయెడల వీ రవలంబించియుండిననీతి పరివర్తిత మైపోయెను. అది మొదలుకొని ఇంగ్లండునకు వ్యాపారాభివృద్ధికిఁ దోడు సామ్రాజ్యాభివృద్ధిచింతకూడ ఆవేశించెను. బ్రిటనులో సరిపోఁగా మిగులుజనమును అమెరికాయందు వసింపఁజేయ వీరు తలపెట్టిరి. ఇట్టియుద్దేశము గలిగియే ఫ్రెంచివారితో సంధి గావించుకొను సమయమున కెనడాదేశమును తమపద్దులో వేయించికొనిరి. దక్షిణరాష్ట్రములను వ్యాపారమునకును, కెనడాప్రాంతముల నధినివేశములకును ఉపయోగించుకొనవచ్చు నని యూహించిరి. ఆకాలమున ఇంగ్లండునందును, వలసలయందును బాధ్యతాయుతములైన పదవులందున్న యధికారు లందఱును అమెరికాలోని యాదిమనివాసుల విషయమున మంచి కట్టుదిట్టముల నేర్పఱుచుటకును, క్రొత్తగ లభించిన దేశముల పరిపాలనకొఱకు ప్రధానసేనానినాయకత్వమున నొక గొప్పసేనను నెలకొల్పుటకును, ఫ్రెంచివారుగాని స్పెయినువారుగాని దేశమందలివ్యాపారము నపహరింప నెంచినయెడల వారిని నిరోధించునిమిత్తము వలసలవారి సాయముతో మఱికొంతసేనను నిలువఁదీసి అందు నమ్మకముతోఁ బనిసేయు వలసలవారికి గొప్పగొప్పపదవులను గల్పించి వారిని ప్రోత్సహించుటకును ఎత్తుగడల నెత్తిరి. మంచి ఉత్తమమైన శాసనపద్ధతిని ఆదేశమునఁ బ్రవేశపెట్టవలయు నని వీరందఱి యాశయము. మఱియు పరిపాలనావిధానము ఫ్రెంచివారిపద్ధతి ననుసరింపవలయు నని కొందఱును, వెనుకటిరీతినే యుండవలయు నని కొందఱును వాదించిరి. కాని ఈయభిలాష లన్నింటిని చక్కఁగ సాగింపఁదలఁచినచో అప్పటికి వచ్చుచుండిన యాదాయ మెంతమాత్రము చాలదు. అది యటులుండ నాసమయమున ఇంగ్లండు అప్పులలో మునిఁగియుండెను. వలసలవారును అంతకుముందు జరగిన యుద్ధములకై అపరిమితముగ ధనమును వ్యయపఱిచియుండిరి. కావున నూతనసంస్కరణములకు ధనము దొరకుట మహాకష్ట మయ్యెను.

ఫ్రాన్సుయుద్ధముయొక్క అంతిమభాగమునందు వలసలవారు బ్రిటిషువిరోధులతో దొంగతనముగ నపరిమితమగు వ్యాపారమును సలిపియుండిరి. దీని నాఁపవలయు నని ఆంగ్లేయులు చేసినప్రయత్నములు మిగుల దూష్యములై యుండెను. పన్నులు వసూలుచేయు నౌకరులకు తాకీదు (Writs assistance) లిచ్చి దొంగపదార్థములను వెదకుట కధికారము నొసఁగిరి. నౌకరు లీపత్త్రముల నాధారముగఁ గొని రాత్రి యనక, పగ లనక ఇష్టము వచ్చినచోటఁ దూఱి సోదా చేయుచు

sampath_Ebooks



వలసలవారి ననేకవిధముల బాధింపఁగడఁగిరి. ఇఁక పూర్వోక్త సంస్కరణముల రాదాయమును పెంపొందింప బ్రిటీషువారు చాల కాలమునాఁటి పంచదారచట్టమును బైకిఁ దీసికొనివచ్చిరి. మొదట నీచట్టము క్రీ. శ. ౧౭౩౩ న సృష్టింపఁబడినప్పటికి నిరర్థకముగ పడియుండెను. దానినే ఇప్పుడు బాగుగ అమలులోనికిఁ గొనితేవలె నని బ్రిటీషువారు నిశ్చయించిరి. దీనివలన పడమటి ఇండీస్ దీవుల (West Indies Islands)లోని బ్రిటీషు ఇలాకాలనుండి తప్ప తక్కిన ఫ్రెంచి, స్పెయినువారి యిలాకాలనుండి వచ్చు బెల్లమునకై గాలనున కాఱుపెన్సులచొప్పున పన్ను వలసలవారి కియ్యవలసివచ్చెను. న్యూ-ఇంగ్లండులోని ప్రజ లందఱు నిందులకు విముఖత్వ మూనిరి. రమ్ (Rum) సారాయము నుత్పత్తి చేయుట క్షీణింపఁ బన్నుల మున మిగుల నష్టము కలుగు నని వారు మొఱలిడసాగిరి. కారణ మేమన, ఆఫ్రికాతోడను, కోయహిందువులతోడను జరుగువ్యాపారమునందు రమ్ సారాయమే వినిమయపదార్థము. అది యటు లుండ వలసలవారినిలువ సొమ్ము బిల్లులకు సొమ్ము నియ్యవలసివచ్చినయెడల నాణెములరూపమున నొసంగవల దని పార్లమెంటువా రొక యుత్తరువును జారీచేసిరి వలసలలో క్రెడిటువిధానమును నాశన మొనరించుటకే ఇట్లు చేసి రని అధనివేశవాసులు చింతిల్లసాగిరి. వీనికిఁదోడు వర్జీనియాయందు పొగాకువర్తకమునకు క్షతి చేకూరులాగున పెక్కుచట్టములు కొన్ని నిర్మింపఁబడినవి. వీనిహేతువున నాలుగువందల రూప్యములు దొరక వలసిన యొక వ్యాపారి కొకప్పుడు వందరూప్యములే దొరకుటయు, వేఱొకసమయమున తక్కువ దొరకవలసినయతని కెక్కువ దొరకుటయుఁ గలుగుచుండెను. పొగాకుపంట బాగుగ పండనిసంవత్సరమున పోరాటము లెక్కువ యగుచుండెడివి. మఱియు పైని వచించినరీతిని కోయహిందువుల ఉపద్రవములనుండియుఁ, ఎక్కిన యూరోపియన్ జాతులనుండియు అమెరికాను గాపాడుట కేర్పడు సైన్యమునకై మూఁడులక్షలపౌనులు వ్యయ మగు నని యంచనావైచికొని అందు ౨౫,౦౦౦ ల పౌనులు పంచదారచట్టముచే రావచ్చునని యూహతో ఒక లక్ష పౌనులనైనను వలసలనుండి రాఁబట్టుకొనవలెనని క్రీ. ౧౭౬౫-వ సంవత్సరమున బ్రిటీషువారు స్టాంపుచట్టము (Stamp Act) నొక దానిని తయారుచేసిరి. పంచదారచట్టమును వెన్నంటియే యిది వచ్చినందున దీనికి మఱింత ప్రతిఘటనము చెలరేఁగెను. కొన్ని వలసలలోని వ్యవస్థాపకసభలు (Legislative Assemblies) సైతము ఈ చట్టమును దిరస్కరించెను. న్యూయార్కుపట్టణమునం దొకమహాసభ (Congress) సమావేశముకాఁగా ౯ వలసల ప్రతినిధు లచ్చటికి వచ్చి ఈచట్టమునకు వ్యతిరేకముగ తీర్మానములను సలిపిరి. పెద్దపెద్ద రేవు పట్టణములందును, దేశమందలి మఱికొన్ని నగరములందును 'స్వేచ్ఛాపుత్రులు' (Sons of Liberty) అని కొందఱు బయలుదేఱి ఈచట్టమునకు ప్రతికూలముగ నాందోళనము సలుపసాగిరి. తుదకు దీనిని మఱింత దృఢముగ నెదుర్కొనుటకై అమెరికనులు విదేశ వస్తుబహిష్కరణము నవలంబించిరి. ఒక్క యింగ్లండునుండియే కాదు, సమస్తవిదేశములనుండియు నెట్టిపదార్థములను దెప్పించుకొనఁ గూడ దనియు, మితవ్యయము గలిగి సామాన్యజీవనముతో స్వదేశపు వస్తువులనే యుపయోగించుకొనవలయు ననియు వలసలవారు నిశ్చయించుకొనిరి. దేశీయవార్తాపత్రిక లన్నియు నీయుద్యమము నామోదించెను. వీనికి ప్రోద్బలముగ చిన్నిపుస్తకము లనేకములు వెలువడినవి. వర్జీనియాలోని ప్రముఖులగు బర్గెసస్ సంఘమువారును, మసచూసెట్స్ ప్రతినిధులును ఈచట్టములకు ప్రతికూలముగ తీర్మానములను సలిపిరి. వర్జీనియావారు చేసిన యేడుతీర్మానములలో రెండింటియందు రాజపక్షావలంబుల నడఁగఁద్రొక్కి బాధింపవలె నని యుండినందున సర్వాంగీకారమును బొందని నప్పటికి నవియు దేశమం దంతటను ప్రచురింపఁబడెను. మసచూసెట్స్ ప్రజలు ప్రత్యేకమహాసభను జరపవలయు నని కోరిరి. జేమ్సుఓటిస్, సామ్యుయల్ ఆడమ్స్ ప్రధాన కార్యకర్తలై కాంగ్రెసునీతిని బలపఱుచుచుండిరి. క్రమముగా ఆడమ్సు నేతృత్వమును వహించి బోస్టనుపట్టణమునఁ గూడినసభనే మహాసభగ మార్చి ప్రభుత్వమును భీతిల్లులాగునఁ జేసెను. న్యూ-ఇంగ్లండులోని పట్టణము లన్నింటియందు నీస్వాతంత్ర్యోద్యమము బాగుగ వ్యాపించిపోయెను.

కాని ఈపైని వ్రాసినదానినిబట్టి దేశ మంతయు నీయుద్యమమున కనుకూలముగ నుండె నని తలఁచుటకు వీలు లేదు. దీనికి ఘోర శత్రువులై దీని నెట్లయిన ధ్వంసము చేయవలె నని పాటుపడిన ప్రతికూలురును లక్షలకు మించియుండిరి. దేశమధ్యమందలి వలసలలోను, దక్షిణసముద్రతీరమునను పట్టణములు మారుమూరముగ నుండినకారణమున నీయుద్యమమునకుఁ దగినంత ప్రోత్సాహ మచట లేకుండెను. ప్యూరిటనుల (Puritans) ప్రభావము బాగుగ లేనిప్రదేశములందును నిది పరిమితముగనే యుండెను. న్యూయార్కుప్రాంతమునందలి కృషీవలులును, జర్మనీదేశపుభక్తులును (Pietists), దేశమం దంతట నున్న క్వాకర్లును (Quakers) — వీ రొకవిధ మనశ్శాంతి, సహన, నిరాడంబరముల నభిలషించువారు — ఈయుద్యమము నుపేక్షించియే యుండిరి. పెన్సిల్వనియాయందు పశ్చిమభాగమున నివసించువారు తూర్పువారితో సమానప్రాతినిధ్యముకొఱకుఁ బోరాడుచు ఈసార్వజనికోద్యమమునెడల విముఖులై యుండిరి. ఉత్తరకరొలీనా, దక్షిణకరొలీనాసరిహద్దులలో వసించువారును దీనియెడల సంపూర్ణసహానుభూతిని గలిగియుండలేదు. వీ రంతఱుకంటెను మిన్నగ టోరీలు మొదలగు ఉపర్యుక్తవర్గమువారు హృదయపూర్వకముగ అమెరికనులకు ప్రతిపక్షులై యుండిరి. కాని యుద్ధ మారంభమైనది మొదలుకొని అంత మగువఱకును న్యూ-ఇంగ్లండు వర్జీనియావాసులుమాత్రము అనుపమానమైన ఐకమత్యమును, ధైర్యసాహసములను గలిగి నిలువఁబడియుండిరి.

క్రీ. శ. ౧౭౭౬ వఱకు నా దేశమందలి మహాసభ (Congress) పాలకులచేతను క్రాంతిసంఘము (Revolutionary)గ గణింపఁబడుచు వచ్చినది; అనఁగా అందలి సభ్యుల ప్రతిపాదనము

లన్నియు బ్రిటీషు ప్రభువుల కనాదరణీయములు. కాని సభ్యులందఱు సమావేశమై అమెరికనుల కోరికలు న్యాయసంగతములైన వని తీర్మానించి తదనుసారము ఇంగ్లండునకు విన్నపముల నంపిరి. ఆవిన్నపములలో అమెరికనులయధికారములను బుజావుచేయుటకై వీరు బ్రిటీషు వారి పూర్వుల సిద్ధాంతములను ప్రమాణములుగఁ జూపిరి. సామ్రాజ్యములోని ప్రజ లందఱును సమానాధికారములు గలిగియుండుటం జేసి అమెరికనులకును అట్టి హక్కు కల దని నిరూపించిరి. పంచాయతీ (Jury) ద్వారా దోషవిమర్శనము జరుగుటయు, స్వకీయ ప్రాతినిధ్యముగల సంఘమువలన పన్నులు విధింపఁబడుటయు నను నీ రెండు హక్కులను స్టాంపుచట్టము భగ్నము చేయు నని వీరి వాదము. వీరి మతానుసారము పార్లమెంటు ఇంగ్లండునకే ప్రతినిధి కాని సమస్త సామ్రాజ్యమునకును గానేరదు. తమ దేశములోని తమ ప్రాతినిధ్యముగల సంఘములే తమమీఁదను పన్నుల విధింప నధికారము గలిగియుండును. పార్లమెంటు అట్టిది కాకపోవుటచే దాని యుత్తరువుల నంగీకరింప వలసిన బాధ్యత తమకు లే దని ప్రకటించిరి. దీనికిఁదోడు మానవులకుఁ గల జన్మస్వాతంత్ర్యములను పేర్కొనిరి. అమెరికనుల కింగ్లండు-పార్లమెంటును స్వీకరింపనందులకు దానిలో తమ ప్రాతినిధ్యము లేదు సరియేకదా, అట్టి సంబంధమును గల్పించుకొనుటకు తమ కెవ్విధమైన యభిమతమును లేదని స్పష్టీకరించిరి.

న్యూయార్కునందు కాంగ్రెసు సమావేశ మగుటకుఁ బూర్వమే చట్ట మిఁక సుమారు మూఁడు నెలలలో అమలులోనికి వచ్చు ననఁగా దీనికి ప్రతిఘాలకార్యములు నలుగడల జరుగసాగెను. స్టాంపులను పంచవలసినవారు రాపనులకు రాజీనామా లొసంగ బాధ్యులైరి. జార్జియాలోఁ దప్పఁ దక్కినవలసలలో స్టాంపులయుపయోగమే నిలిపి వేయఁబడెను. పలుచోట్ల స్టాంపులతో పనిపడువ్యవహారములే నిలిపి వేయఁబడినవి. కొన్నిచోట్ల స్టాంపులు లేకయే వ్యవహారములు జరిగి పోవుచుండెను. ఇందువలన పాలకు లీచట్టమును తగినంత దిట్టముగ అమలునందు పెట్టఁజాలకపోయిరి. అందుచే నిది బలహీనము గాఁజొచ్చెను. అచట ఇంగ్లండులో నప్పటికి వలసలవారిదరఖాస్తులన్నియు బ్రిటీషువారి యుపేక్షనే పొందినవి. కాని ఇట్టిపరిస్థితులందే రాకింగ్‌హాం అనునతఁడు మంత్రిపదము నంది స్టాంపుచట్టమునకు ముఖ్యకారకుఁడైన గ్రెన్‌విల్లి పదచ్యుతుఁడై పోయెను. మంత్రిమండలము మారిపోయెను. క్రొత్తగ నేర్పడినమంత్రు లీచట్టము నెడల నుపేక్షాభావ మూనియుండిరి. అంత నీచట్టమును రద్దుపఱుచు ప్రయత్నములు జరుగసాగెను. ఇందునుగూర్చి పార్లమెంటునం దభిప్రాయభేదము లేర్పడెను. వలసలదరఖాస్తులపైని వాదవివాదములు జరుగసాగెను. హక్కులవిషయమున ప్రస్తావించుచు పార్లమెంటునకు సర్వాధికారము కల దనియు, స్వదేశముననే కాక సామ్రాజ్య మంతటను పన్ను విధించుటకు దాని కధికారము గల దనియు లార్డ్ మాన్స్‌ఫీల్డు వాదించి యుండెను. కామ్డెన్, పిట్ట్ ప్రభృతు లట్టి హక్కు పార్లమెంటునకు లే దని వాదించిరి. రెండునెలల పర్యంతము వాదవివాదములు జరుగుచునే యుండెను. తుదకు తాత్కాలికపరిస్థితులయం దవసరమని ౧౭౬౬ నందు స్టాంపుచట్టము రద్దుగావింపఁబడినది. కాని డిక్లరేటరీచట్టమను వేఱొకదాని నమెరికనులపై విధించిరి. ఇందువలన వలసలమీఁద నింగ్లండుయొక్క ఆధిపత్యము విశదమే యగుచుండెను, కాని యప్పటికి వలసలవారు దీని నెదిరింపక ముందట్టిపన్నులను విధించినచో ప్రతిఘటింపవలె నని నిశ్చయించుకొనిరి. అట్టియవకాశము లభించుటకును ఎక్కువకాలము పట్టలేదు. ౧౭౬౭-వ సంవత్సరమున 'టౌన్‌షెండు చట్టములు' బయలుదేఱినవి. సైనికవిద్రోహపుచట్టము (Mutiny Act) ఇందులోనిదే. పదిమూడు సరిహద్దులలో క్రొత్తగ నేర్పడిన రక్షకసేనలనిమిత్త మీచట్ట మావిర్భవించినది. కాని యీరోపుననెక్కడఁగాని సైనికులకు లేని యవరోధములు కొన్ని అమెరికను సైనికులకొఱకు నిర్మింపఁబడినందున న్యూయార్కునందలి అసెంబ్లీయే మొదట నిందుల కంగీకరింపదయ్యెను. కాని యచటిగవర్నరు తన పలుకుబడివలన దానిని పునర్విచారణలోనికిఁ దీయించి యందలి యంతిమభాగము నామోదించులాగునఁ జేసెను. ఇదే తరుణమున ఇంగ్లండులో పిట్ - గ్రాఫ్టన్ మంత్రివర్గ మధికారమునకు వచ్చెను. అపుడు చార్లెస్ టౌన్‌షెండనునతఁడు ట్రెజరర్ (కోశాధ్యక్షుఁడు) ఎక్స్‌ఛెకర్ ఛాన్సెలర్‌గ నుండెను. ఇతఁడు పిట్ అస్వస్థుఁడుగ నుండినందున మంత్రివర్గమును తన యధీనమం దుంచికొన సమర్థుఁ డయ్యెను. అప్పుడితఁడు తనతోడివారిని, పార్లమెంటును ప్రోత్సహించి వలసలమీఁద పన్నుల విధింప మూఁడు బిల్లులఁ దయారుచేయించెను. దానిలో నొకదానిద్వారా సైనికవిద్రోహశాసనచట్టపునియమములను లోకులచే నమలులోఁ బెట్టింపనంతవఱకు నిఁక ముందేవిధమైన కార్యములను సలుపఁగూడ దని న్యూయార్కునందలి అసెంబ్లీని రద్దుపఱిచెను. క్రమముగ నీబిల్లు లన్నియు చట్టములుగఁ బరిణమించెను. బోస్టనునగరమున కరగ్రాహసంఘము (Custom Board) నొకదాని నేర్పఱుచువిషయమున నొకబిల్లు ఉండెను. అమెరికనులలో దాని నెవ్వరును అడ్డగింపరైరి. కాని వ్యాపార, రవిన్యూవిషయకమైన చట్టమునకు మహాతీవ్ర ప్రతివాదము లారంభ మయ్యెను. గాజు, సీసము, బొమ్మలరంగులు, కాగితములు, తేయాకు లోనగువానిపైని పన్నులు విధించి వానివలన వచ్చు ధనమునందుండియు, రెవిన్యూనుండియు వలసలలో పనిచేయు నాంగ్లేయగవర్నరులు, జడ్జీలు మొదలైనవారికి మాసికవేతనము లొసఁగుట కేర్పాట్లు జరిగెను. ఇట్లు వలసలదెబ్బ దినుసీయధికారులందఱును ప్రాంతిక - అసెంబ్లీలతో నెట్టిప్రమేయమును లేకయే ఇష్టము వచ్చినరీతిని సలుపుటకు స్వాతంత్ర్యమును బొందిరి. పన్నుల నియ్యనివారిని పంచాయతీ (Jury) విచారణ అక్కఱలేకయే తాకీదుల సాయముతో అడ్మిరాల్టీకోర్టులందు విచారించి దండింపవలయు నని యుత్తరువు చేయఁబడెను. కావున వలసలలో వీని కన్నింటికిని విరుద్ధ మగు నాందోళనము చెలరేఁగెను. ఈబిల్లులు ముఖ్యముగ మసాచూసెట్సునకే తగులుచున్నందున అచటివారు వీనిని రద్దు

sampath_Ebooks

గావింపుఁడని ఇంగ్లండువారి కొక విజ్ఞాపనపత్రము నంపుచు వలసల కన్నింటికినిగూడఁ బంపి వారివారి యభిప్రాయములనుగూడఁ దెలుపవలసిన దని కోరిరి. వీరిట్లు చేయుట వలసలకార్యదర్శికి సరిపడ దయ్యెను. పంపినసందేశముల నుపసంహరించుకొనుఁ డని మసాచూసెట్సువారికిని, వారిసందేశముల నుపేక్షింపవలసిన దని వలసలవారికిని నతఁ డుత్తరువు గావించెను. వలసలవా రతని యుత్తరువులనే యుపేక్షించి మసాచూసెట్సువారి కనుకూలముగనే ప్రత్యుత్తరముల నంపిరి. కార్యదర్శియాజ్ఞ నుల్లంఘించినందున గవర్నరు మసాచూసెట్సులోని అసెంబ్లీనిగూడ రద్దుపఱచెను. బోస్టన్ నగరమునందలి 'కస్టం'-అధికారులు జాన్ హాంకక్ అనునతని 'లిబర్టీ' (Liberty) అనుచిన్నయోడను బట్టుకొనిరి. ఆసమయమున గొప్పపోరాటము, నల్లరియు జరగెను. మందట్లు జరగఁగూడ దను నెపముతో బ్రిటీషువారు రెండుపటాలములసైన్యమును దెప్పించి బోస్టనునందు నిలిపిరి. ౧౭౬౮లో యుద్ధనౌకలుగూడ అరేవునందు నిలుపఁబడినవి. అట ఇంగ్లండునందు వలసలవా రంపినవిజ్ఞాపనములు క్రమమైన అధికారులద్వారా వచ్చినవి కా వనియో, లేక డిక్లరేటరీచట్టమునకు విరుద్ధము లనియో అన్నియు తృణీకరింపఁబడినవి. మసాచూసెట్సువాసులు రాజద్రోహు లనియు, అమెరికనులు ప్రతికార్యమును ఎదిరించుచుందు రనియు ఇంగ్లండురాజును, అతనిమంత్రివర్గమువారును ఘోషించిరి. పార్లమెంటువారు దాని నామోదించిరి. ఇంగ్లండుదేశమువెలుపల నెవరైన దానియెడల నపరాధము గావింతురేని అట్టివారిని బట్టికొని వచ్చి ఇంగ్లండునందు శిక్షించుట కనుకూలముగ నుండులాగున నెనిమిదవ హెన్రీ ఒకనియమమును సలిపియుండెను. ఆ ప్రాఁతచట్టమును బయటికిఁ దీసికొనివచ్చి తదనుసారము మంచిపలుకుబడికల అమెరికానాయకులమీఁద సాక్ష్యములను సేకరించి ఇంగ్లండునకు పంపవలసినదిగా బ్రిటీషుపాలకులు మసాచూసెట్సునందలి తమ ఉద్యోగుల కుత్తరువుల నంపిరి. ఈకార్య మమెరికనులకోపాగ్ని కింధన మయ్యెను. వర్జీనియాలోని బర్జెసులు ఇంగ్లండుయొక్క ఈనీతిని కడు తీవ్రముగ ఖండించిరి. ఇట్టిస్థితిగతులం దమెరికనులనిమిత్తము ఒకబిషపుపదమును సృష్టించుట కింగ్లీషుచర్చి తమదొరతనమును ప్రోత్సహింపనున్న దనుభీతితో న్యూ-ఇంగ్లండునందు వాదవివాదములు హెచ్చు పెరిఁగిపోయెను. ఆకాలమున మతమునెడల విశ్వాసము లేనివా రనేకు లుండినందున క్రొత్తగ మతగురువు (Bishop) ఏర్పడినయెడల నతనికి లోఁబడియుండవలసివచ్చు ననుటయే తీవ్రవివాదములకుఁ గారణము. కావున స్వేచ్ఛగా నుండఁదలఁచినవా రందఱును స్వరక్షణోపాయములను జూచికొనసాగిరి. నిజమునకు బ్రిటీషుదొరతనమువారి కప్పు డిట్టియభిప్రాయమే లేకుండెనఁట. కాని ఏతత్సంబంధమైన వాదవివాదములమూలమున నాందోళన మెక్కువ యయ్యెను. గాజు మొదలగు దిగుమతులమీఁదను సుంకము విధింపఁబడుటచే వ్యాపారాసహకారనీతిని (Policy of Commercial Non-intercourse) బాగుగ నవలంబింపవలసిన దని స్థానికసంఘములు (Local Bodies) గట్టితీర్మానముల సలిపినవి. కాని వలసలు ధనాఢ్యములును, సకలవస్తుసంపన్నములును నై యుండినందున యూరోపుతో దొంగతనముగ వ్యాపారము జరగుచునే యుండెను. వెనుక స్టాంపుచట్టపుదినములలో అమెరికాతో వ్యాపారము పడిపోవుటచే ఇంగ్లండులోనివర్తకు లందఱును దొరతనమువారితో మొఱలిడియుండిరి. కాని ఇప్పు డావిధమున మొఱలు పెట్టక స్వపక్షమున కోర్చియు ప్రభుత్వమునకు సాహాయ్యమొనరింప మొదలిడిరి. ఇంగ్లండురాజును ఉన్నతస్థానమును జక్కఁబఱుచుకొనఁదొడఁగి ౧౭౭౦లో లార్డు నార్తు (Lord North) ప్రధానమంత్రి యగుసరికి దానిని సంపూర్ణముగ దృఢపఱుచుకొనెను. ఇట్లు అట్లాంటిక్ మహాసాగరమున కిరుప్రక్కల నొకరు డిక్లరేటరీచట్టమునకుఁ బ్రతికూలముగను, వేఱొక రనుకూలముగను పోరాడుటకై సన్నాహములను గావింపఁగడఁగిరి.

టౌనుషెండుయొక్క రెవిన్యూచట్టములను బూర్తిగ నమలులోఁ బెట్టుటకు వీలు కలుగదయ్యెను. వలసలయం దుత్పన్నములగు పదార్థములమీఁదఁగాక వెలుపలనుండి వచ్చు గాజు మున్నగు ఉపర్యుక్త పదార్థములమీఁద నగుటచే అమెరికను లీపన్నులను దిరస్కరింప రని బ్రిటీషువారు తలఁచియుండిరి. కాని తలఁచినదానికి భిన్నముగ అమెరికనులు వీని నన్నింటిని బహిష్కరించి, తెప్పించుకొనుటయే మానిరి. అదిగాక ఈపన్నులు బ్రిటీషుపదార్థములపై విధింపఁబడుటచే వ్యాపారికనీతికి విపరీతమైయుండెను. కావున ౧౭౭౦-వ సంవత్సరమున ఒక్క తేయాకుమీఁదిపన్ను తప్ప తక్కిన వన్నియు రద్దు చేయఁబడినవి. పౌండుబరువుగల తేయాకునకు మూఁడుపెన్సుల సుంకము మాత్రము వలసలవారి కియ్యవలసివచ్చెను. పన్ను కొంచె మగుటచే ఆదాయము కొఱఁతపడినచో దానిని బూర్తిచేయుటకు మఱికొన్ని యుపాయములను గనిపట్టిరి. కాని పన్ను లెంత స్వల్పమైనను పోరాట మిప్పుడు పన్నులందలి హెచ్చుతగ్గులవిషయమున కాక దానిని విధించు నధికారమునుగూర్చి యగుటచే కొన్నిపన్నులను దీసివైచినను, తేయాకుపన్ను అత్యల్పమైనను ప్రతికూలాందోళనము యథాపూర్వము జరగుచునే యుండెను. తేయాకుదిగుమతులను బొత్తిగ నాఁపివేయవలయు నని వలసలవారు ప్రయత్నించుచుండిరి. ఈసందర్భములందే ౧౭౭౦వ సంవత్సరము మార్చినెల ౫-వ తారీఖున బోస్టన్‌హత్య (Massacre of Boston) అను ఘటనము జరగెను. ప్రజలకును, సైనికులకును కలహము జనింపఁగా, సైనికులు నలుగురు మనుష్యులను గాల్చి చంపిరి. దీనిచే బోస్టన్‌నివాసులు కోపపూరితులైరి. ఒక్కపెట్టున 3,000ల మంది ప్రోగై నిరాయుధులగు పౌరులను వధించి రని కల్లోలము సలుపసాగిరి. ఆడమ్సు ప్రజలకందఱకును నాయకుఁడై యచటి సేనను వేఱొక తావునకు మార్చవలయు నని బ్రిటిష్ అధికారిని బలవంతము సేయ నటులే జరగెను. తత్ఫలితముగ కల్లోలవాతావరణ మించుక శాంతి నొందెను. వాదవివాదములు సమసిపోవులాగునఁగూడ కన్పించెను. కాని ౧౭౭౨-వ సంవత్సరమున నర్రగన్‌సెట్ అఖాతమునందు చోరవ్యాపారము నడుపుటకై చేసిన ప్రయత్నములలో నౌకాధి

sampath_Ebooks

కారులు కొందఱు సల్పిన కృత్యములచే గాస్పీనామక బ్రిటీషునౌక ధ్వంస మయ్యెను. ఇందునుగూర్చి యొక విచారణ జరిగెను. దానికి ఫలితముగ బ్రిటీషునౌకలు, నౌకానిర్మాణ స్థానములు, సామగ్రులు మున్నగువాని రక్షణముకొఱకు ప్రత్యేకమైన యేర్పాట్లు జరిగెను. వలసలయందలినాయకులు దోషవిమర్శనార్థము ఇంగ్లండునకు పంపఁబడులాగునఁ గన్పట్టెను. మఱియు మసాచుసెట్సు గవర్నరు, ఉన్నత న్యాయాలయపు ( Superior Court ) జడ్జీలు మొదలగువారిని నియోగించుట రాజాధికారమున నుండు ననియు, వారికి వేతనములు బ్రిటీషు దొరతనమువలన ముట్టు ననియు ఒక నియమ మేర్పడెను. ఈ కారణము లన్నింటిచే వలసలలో మరల ప్రబలమైన యాందోళనము చెలరేఁగెను. ఈపర్యాయ మెప్పటిసమాచారము లప్పుడు దెలిసికొనుటకును తమవార్తల నందఱకును పంపుటకును వీ లగులాగున వలసలవారు వారి వారి రాజ్యములలో నొకవిధమగుసంఘముల నేర్పాటుచేసికొనిరి. ఇదే సమయమున ఇంగ్లండునందలి ఈస్టిండియా కంపెనీడైరెక్టర్లు అమెరికను వ్యాపార మంతయు డచ్చివారికిఁ బోవుటచే తమకు నష్టము కలిగె ననియు, దానికి పరిహారము నొసంగుఁ డనియు పార్లమెంటువారి నడిగిరి. అందులకు వారు మంచి దని తేయాకుచట్టము నొకదానిని సృష్టించి తేయాకు నమెరికావలసలకు పంపుఁ డనియు, దానిమీఁదఁగల దిగుమతిపన్నును రద్దు చేసినయెడల నష్టపరిహారము వేఱుగ నియ్యవలసిన యవసరము లేకయే పూర్తియగు ననియు తీర్మానము గావించిరి. ఈవిధానమున కంపెనీవారు డచ్చివారికంటె నెక్కుడు లాభము నొందఁగల రని వీరు తలంచియుండిరి. కాని దేశమం దంతట నింగ్లండునకు వ్యతిరేకముగ నాందోళనములును, ఉపద్రవములును జరుగుచుండుటచే తేయాకును గొనువారే లేరైరి. రెండు దేశములకును గల విరోధము దినదినప్రవర్ధమాన మగుచుండెను. తుదకు ౧౭౭౩ - వ సంవత్సరమున కంపెనీవారి తేయాకు న్యూయార్కు, ఫిలడెల్ఫియా, బోస్టన్, అన్నపొలిస్ రేవులందు వచ్చిచేరెను కాని ఒక రేవునందైన లోపలి కేఁగఁజాలకపోయెను. బోస్టన్ నివాసులు ౩౪౨ పెట్టెల తేయాకును సముద్రమునఁ బాఱవైచిరి. ఈ కార్యము చేయునపుడు వీరు గుర్తింపవీలులేకుండులాగున శోణహిందువులవేషములను దాల్చియుండిరి. అప్పు డింగ్లండురాజుయొక్కయు, నార్తు మంత్రివర్గముయొక్కయు నధికార మున్నతదశ నందియుండినందున తేయాకు లూటీ జరగినవెంటనే అమెరికనులు ఘోరనిర్బంధముల పాల్పఱుప మొదలిడిరి. నష్టమైన తేయాకు ఖరీదును గట్టి యియ్యనంతవఱకు బోస్టన్ రేవు కట్టివేయవలయు ననియు, మసాచుసెట్సుయొక్క అధికారపత్రము ( Charter ) ను లాగుకొని రాజస్వామికమైన వలసగ చేయవలె ననియు, బ్రిటీష్ అధికారుల కర్తవ్యపాలనమున నడ్డగించువారిని బంధించి యింగ్లండునకు పంపవలయు ననియు, వలసలయం దవసరమైనచోట్ల బ్రిటీషుసేనల నిలుపవలయు ననియు, సైనికులకుఁ గావలసిన భవనములు లేనిచో ఖాళీగ నుండు ఏగృహస్థులకట్టడములఁగాని ధాన్యాగారములఁగాని యుపయోగించుకొని వాని యజమానులకు నుచితరీతిని ప్రతిఫలమియ్యవలె ననియు ఉత్తరువులను జారీచేయించి పార్లమెంటువారు వాని నన్నింటిని అమలులోఁ బెట్టింపుఁ డని తమ యుద్యోగుల కాజ్ఞ నొసంగిరి. తదనుసారముగ వలసలయం దన్నింట ముఖ్యముగ మసాచుసెట్సు వర్జీనియాల యందు భయంకరనిర్బంధము లారంభము కాఁగా ఒక్కపెట్టున కార్యజాలము లన్నియుఁ దాఱుమాఱైపోయెను.

సామ్రాజ్యము నభివృద్ధి నొందింపవలె ననుతృష్ణతో బ్రిటిష వారు ప్రపంచమందలి వివిధ భాగములతో సంబంధమును గలుగఁజేసికొనుచున్నందులకు ఫలితముగ ననవసరములైన విషయములలోనికిఁ దమ్మునఁగూడ దించుచున్నా రని మేధావు లగు వలసలవా రనేకులు చాలకాలముక్రిందటనే గ్రహించియుండిరి. ఇట్టిపరిస్థితులవలననే అప్పుడు- మరల క్యూబెక్కుచట్ట మొకటి జన్మించెను. తదనుసారము వలసలపడమటిభాగము నంతయు ప్రభుత్వమువారు క్యూబెక్కు ప్రాంతమునందుఁ గలిపిరి. ఇందుచే వలసలవారికి పడమటఁ బ్రసరించుటకు ప్రతిబంధకము లేర్పడెను. అదిగాక క్యూబెక్కుఇలాకాయందు రోమనుకాథలిక్కుమత మెక్కు వగుటంజేసి క్రొత్తగఁ గలుపఁబడిన దేశమందలి ఇతరమతస్థులకు బాధాకర మయ్యెను. అల్లరులకు, అసంతుష్టికి, విద్రోహములకును ప్రధానకేంద్రము మసాచుసెట్సు. ఉపర్యుక్తములైన చట్టములు, ఉత్తరువులు సరాసరి మసాచుసెట్సునకు తగులునవియే యని ఇదివఱకే వ్రాయఁబడినది. ఒకదానివలన బోస్టన్ రేవు మూఁతపడెను. వేఱొకదానివలన ప్రజ లందఱును నెన్నుకొనుసభ అంతర్ధానమై రాజనియుక్త మగుసంఘ మేర్పడెను. ఆ వలసవారికి వోటు నొసంగునట్టి యధికారము పోయెను. మఱియొకచట్టము ననుసరించి నేర మొనరించువారు స్వదేశమునఁ గాక ఏయన్యదేశమందో లేక ఇంగ్లండునందో న్యాయవిచారణముకొఱకు పంపఁబడవలసియుండిరి. అమెరికాయందు ముఖ్యసేనానిగ నుండిన థామస్ గేజ్ అనునతనిని మసాచుసెట్సునకు గవర్నరుగ నియమించి క్రొత్తనియమముల నన్నింటిని సైనికబలముద్వారా అమలుపఱుచుటకు బ్రిటిషువా రధికార మిచ్చిరి.

బోస్టన్ పట్టణముమీఁద పడినన్న ఈవిపత్తినిగుఱించి తెలిసిన తోడనే తక్కినవలసలవా రందఱును స్థానిక, ప్రాంతికసభలను గావించి మసాచుసెట్సు, వర్జీనియాలు సూచించినవిధమున సార్వదేశికమైన కాంగ్రెసును సమావేశ మొనరింప నిశ్చయించిరి. అందు జార్జియావలసనుండి తప్పఁ దక్కినయన్నింటినుండి ప్రతినిధు లేతెంచిరి. వీరిలో దేశాభిమాను లగు రాడికలులే యెక్కువగ నుండిరి. వీ రందఱును బాహాటముగ ఇంగ్లండుతో యుద్ధ మొనరింపవలె ననియే కోరుచుండిరి. జోసఫ్ గాలోవేనాయకత్వమునఁ గొందఱు శాంతియుత మగుసంధికిఁ బ్రయత్నింపసాగిరి. తీవ్రవాదవివాదములయనంతరము తమ రేర్పఱుచుకొనిన అసెంబ్లీలకుఁ దప్ప నితరుల కెవరికిని తమమీఁద పన్ను విధించుట కధికార ముండఁగూడ దని స్థిరపఱచిరి. ౧౭౬౩-వ సంవత్సరము మొదలుకొని పార్లమెంటువారు తమమీఁద

sampath_Ebooks

చేయఁగడఁగిన చట్టములను, పన్నులను ఉదాహరించి శోకదాయకము లగు నిట్టి విధానముల కమెరికను లెంతమాత్రమును సమ్మతింపఁగూడ దని తీర్మానించిరి. పార్లమెంటు చేసిన క్రొత్తయుత్తరువులను నిరసించుచు మసాచూసెట్సు తీర్మానముల నామోదించుటయే కాక వానిని కార్యము లోనికిఁ దెచ్చునపుడు బలము ప్రయోగింపవలసివచ్చినయెడల నితర వలసలవారందఱును సాహాయ్యము చేయవలయు ననియు నిశ్చయించిరి. రెండవది ప్రతివలసయందును సంఘముల నేర్పఱుచుకొని వాని ద్వారా సమస్తవ్యాపారకార్యములను నెఱవేర్చుకొనవలయు నని ఘోషించుచు కొనిరి. అంతమున కీతీర్మానముల నన్నింటిని కాంగ్రెసువా రింగ్లండు రాజునకును, వలసలనివాసులకును, క్యూబెకు ప్రాంతీయులకును, గ్రేటుబ్రిటను ప్రజలకును పంపించిరి కాని పార్లమెంటునకుఁ బంపరైరి.

కాంగ్రెసుయొక్క సంఘనిర్మాణాది కార్యములు మిగుల సాహసాత్మకము లైనను రాఁబోవు నూతనప్రభుత్వ సంఘటనమున కంకురభూతము లైన విషయములు గలవై యుండెను. సంఘము (Association), అనాగమనము (Non-Importation), అనిర్యాతనము (Non-Exportation) లనునవి వీరలయొక్క కార్యక్రమమునందు జనించినవే. వీనికిఁ దోడుగ కృషిని, దేశీయపరిశ్రమలను బ్రోత్సహించుటకును, క్రొత్తగ కల్పించుకొన్న కార్యవిధానము లన్నింటిని అమలులోఁ బెట్టించుకొనుటకును మఱికొన్ని సంఘముల (Committees) నేర్పఱుచుకొనిరి. బహిష్కరణసిద్ధాంతానుసార మమెరికను సంఘముల నియమములను స్వీకరించి తదనుకూలముగ వర్తింపనివారిమీఁద వలసలవారును, స్థానికసంస్థలును నిర్బంధముల ప్రయోగించుటకును నిష్కర్ష కావింపఁబడెను. స్టాంపుచట్టము పుట్టినది మొదలుకొని యిట్టి విధానము లప్పుడప్పు డవలంబింపఁబడుచునే వచ్చినవి. కావున నిపు డీసంఘము లన్నియు శీఘ్రముగ కాంగ్రెసుతీర్మానములను కార్యరూపమునఁ బెట్టుటయందే నిమగ్నము లయ్యెను. ఈసంఘములద్వారా రాజపక్షీయు లెవరైనదియు, జాతీయపక్షీయు లెవరైనదియు నుర్తింప మంచియవకాశము దొరకెను. కాంగ్రెసుతీర్మానములను రాజపక్షీయులు సమ్మతింపరైరి. అట్టివారిపై నిర్బంధము లెక్కువయ్యెను. జాతీయులు వీరిని దోషులుగ గణించి విచారణపూర్వకముగఁ గొందఱకు కారాగారశిక్షయు, మఱి కొందఱకు ప్రవాసశిక్షయు విధింపసాగిరి. కాంగ్రెసుయొక్క సాధారణనియమముల ననుసరించి పనిచేయఁగడఁగిన క్రాంతికారకము లగు స్థానికసంస్థ లన్నియు నిటులే కావింపుచువచ్చెను. ఈసంస్థలే తుదకు నూతనప్రభుత్వమునకు మూలాధారము లయ్యెను. మీఁదఁ జెప్పఁబడిన యీ ప్రధానకార్యములే మొదటి సార్వజనికమహాసభ (Continental Congress) వలనఁ గావింపఁబడినవి. తాము గావించుకొనిన తీర్మానముల కనుకూలముగా నప్పటిరాజకీయపరిస్థితులం దేవిధమైన మార్పులనుగాని బ్రిటిష్ప్రభుత్వమువారు చేయనియెడల ౧౭౭౫-వ మే నెలలో మరల సమావేశ మగుట కేర్పాట్లను చేసి కాంగ్రెసువా రప్పటికి విడిపోయిరి.

వలసలవారి యీకార్యక్రమమువలన నాంగ్లేయ దొరతనమువా రత్యంతము క్రోధపూరితు లైరి. అమెరికనులు పంపుకొనిన దరఖాస్తులను విచారించి సమాధానపూర్వకముగ వారికిఁగల దుఃఖములను తొలఁగించుటకు మాఱు నియమనపుచట్టము (Restraining Act) నొకదానిని బ్రిటీషువారు వారిమీఁద వైచిరి. ఇందువలన వలసలవారి సముద్రవ్యాపారమునకు ప్రతిబంధము కలిగెను. బ్రిటీషుదీవులతోఁ దప్ప నితరులతో వ్యాపారము సలుపుట కమెరికనుల కధికారము లేకపోయెను. బ్రిటీషువా రంగీకరించిన సభలద్వారా నుచితమార్గమునఁగాక అమెరికనులు స్వయముగ నేర్పఱుచుకొన్న క్రాంతిసమాజములు, కాంగ్రెసులు సలహాలోసంగువిధానము లన్నియు రాజద్రోహకము లని పాలకులు నిరసింపసాగిరి. అమెరికను లేర్పఱుచుకొన్న సంఘములును నిర్బంధమార్గముల నవలంబించి రాజపక్షీయుల జడిపించుచు, తమవిధానములను కార్యరూపమునకుఁ దేఁగడఁగినందున, సామ్రాజ్య వ్యాపారమున కమితముగు నష్టము కలుగసాగెను. అందుచే నాంగ్లేయులకు యుద్ధముచేసి ప్రతీకారము గావించుకొనుట తప్ప వేఱొండుమార్గము లేకపోయెను. ఇటు వలసలవాసులును యుద్ధ మవశ్యంభావి యని తలపోయుచుండిరి. న్యూ-ఇంగ్లండునం దన్నికడల నిట్టి ప్రవాదము లే వ్యాపించియుండెను. మసాచూసెట్సునందు ప్రాంతికసభ సమావేశమై రాజ్యభారమును హస్తగతము గావించుకొని స్వకీయరక్షణము (Defence) నందు మగ్న మయ్యెను. కాంగ్రెసు లేనికాలమున తత్స్థానమున వ్యవహారములను జరపుటకై అమెరికనులు రక్షకసేన నొకదానిని స్థాపించుకొనిరి. అటు బోస్టనునగరమందలి యాంగ్లేయ గవర్నరు థామస్ గేజ్ అనునతఁడు దుర్గమును మరమ్మతు చేయింప మొదలిడి వలసలవారు సంగ్రహించుచుండిన యుద్ధసామగ్రులను కొల్లగొట్టించుటకై యవకాశమును వెదకుచుండెను. ఇటు అమెరికనుల పక్షమున వర్జీనియాయందు వాలంటీరుదళములు ప్రోవగుచుండెను. బోస్టను, న్యూయార్కులందువలె దక్షిణకరోలీనాయందును తేయాకు ధ్వంసము చేయఁబడెను. అచటిపాలనాధికారము నంతను అమెరికను సంఘము హస్తగతము చేసికొనెను. న్యూయార్కు, ఫిలడల్ఫియా పట్టణములను ముఖ్యస్థానములుగఁ జేసికొని అమెరికనులు దేశమెల్లెడల విప్లవప్రచారమును సలుపఁదొడఁగిరి. అట ఇంగ్లండులో ౧౭౭౪-వ సంవత్సరమున పార్లమెంటుసమావేశము కాఁగా నందు రాజును మంత్రివర్గమును అమెరికాయం దతిభయంకర మైన విద్రోహము పెరుఁగుచున్న దని యుద్ఘోషించిరి. పార్లమెంటులోని రెండు సభలవారును దీనిని గ్రహపడిచిరి. అప్పు డీరెండుదేశములవారికిని సమాధానము కలిగింపవలె ననునాశతో చాథాంప్రభువు (Pitt) కొన్ని షరతుల సూచించెను. తదనుసారము ‘ ఇంగ్లండుపార్లమెంటు వలసలమీఁద నేవిధమైన పన్నును విధింపఁగూడదు. కాంగ్రెసువారే వారియిష్టానుసారము విధించుకొనవచ్చును. కాని పార్లమెంటు నిష్కర్ష చేయు కప్పమును కాంగ్రెసు ఇంగ్లండునకు చెల్లించుచుండవలెను. వ్యాపారము, జలయానము మొదలగువిషయములం దెట్టిపరి

sampath_Ebooks

# అమెరికా స్వాతంత్ర్యయుద్ధము

వర్తనము గాని చేయఁబడదు. చట్టములకు విరుద్ధము గాకుండ న్యాయానుసారము వలసలయం దవసర మని తోఁచినచోట్ల బ్రిటీష్ సేనలు నిలుపఁబడును. న్యాయసమ్మతమైన ప్రజల హక్కులను భంగపఱుచుటకై ఈసేన లుపయోగింపఁబడవు' అని ఈషరతులయందలి సారాంశములు. నా స్తవమున కివి యన్నియు నింగ్లండునకే లాభకరములు. ఇందువలన నమెరికాకుఁ గలిగెడులాభ మేమియు లేదు. కాని పార్లమెంటు వీనికిని సమ్మతింపదయ్యెను. పిదప ఎడ్మండ్ బర్క్ అనునతఁడు ప్రతిపాదించిన విష్టిపద్ధతి (Requisition System)యు బ్రిటీష్ స్వీకారమును పొందఁ జాలకపోయెను. చిట్టచివరకు లార్డ్ నార్తుయొక్క ప్రతిపాదనము నంగీకారమును బడసెను. దానియందలి సారాంశ మేమనఁగా:— "అమెరికను లేర్పఱుచుకొనినసంఘము లంగీకరింపఁబడవు. ఏవలసయందలి ఎసెంబ్లీయైనను దానిస్థానిక ప్రభుత్వమును బోషించుచు సార్వజనికపోషణమునకై శక్త్యనుసారము నొసఁగుచుండునెడల నప్పుడు రాజును పార్లమెంటును ఆవలసయందలి వ్యాపారవిషయమునఁ దప్ప మఱియేవిషయమునను బన్ను విధింపరు. న్యూయార్కు, ఉత్తరకెరోలీనా, జార్జియా దప్పఁ దక్కినవలసలవారికి మత్స్యవ్యాపారపుహక్కు ఉండదు." ఈయంతిమనియమ మమెరికనులకు ప్రాణఘాతము వంటిది. లార్డునార్తుయొక్క నియమముల నమెరికను లేకగ్రీవముగ నిరసించిరి. తత్ఫలితముగ రెండు పక్షములందును యుద్ధసన్నాహములు మిక్కిలి చుఱుకుగ జరుగసాగెను.

యుద్ధారంభమున నమెరికాకు కావలసినంత శిక్షితజలసేన లేకపోయినను, సముద్రప్రాంతవాసులసంఖ్య ఎక్కువగుటచేత వ్యాపారమునిమిత్తము విదేశములకుమాత్రమే కాక స్వదేశమునఁ గూడ గమనాగమనములఁ గావించునట్టి ఓడలుమాత్రము సిద్ధముగ నుండెను. వర్తకపునౌకలను శత్రువులనుండియు, సముద్రపు దొంగలనుండియు రక్షించునిమిత్తము యోధులును సిద్ధముగఁ బోవుచుండిరి. ఈ జలయానరక్షకభటులు కర్ణటీనా, లూయిబర్గులమీఁద జరగిన దండయాత్రలందు ప్రసిద్ధికెక్కిన శౌర్యపూరితకార్యముల సలిపియుండుటయేకాక క్రొత్తగ జరగియుండిన ఫ్రాన్సుదేశముతోడి యుద్ధములందును పనిచేసియుండిరి. కావున యుద్ధ మారంభమైనతోడనే వర్తకపు నౌకలు పెక్కు యుద్ధనౌకలుగ మార్చఁబడినవి. ఈనౌకాపరివర్తనము యుద్ధము పూర్తియగునంతవఱకును జరుగుచునేయుండెను. ఆసమయమున ౧౫,౦౦౦ ల ఆయుధములును, ౭౦,౦౦౦ ల సైనికులును ప్రయాణము చేయఁగల ౨,౦౦౦ ల ప్రయివేటునౌక లిట్లు మార్పుడలవందెను. ఇవికాక మఱికొన్ని ప్రాంతములందు తయారైన నౌకలును బ్రిటీషువ్యాపారమునకు నష్టము వచ్చు నుపాయముల సలుపసాగెను.

౧౭౭౫-వ సంవత్సరము, ఏప్రిల్ మాసమున మసాచుసెట్సునందు కలహము లారంభమైనవి. ఇంగ్లండులో మూఁడవజార్జిరాజునకును, మంత్రులకును ఈరాజ్యము విద్రోహాగ్నిలో నుడికిపోవుచుండినలాగున గోచరమయ్యెను. బ్రిటీషువారు వలసలయెడల నవలంబింప నెంచినరాజనీతిప్రసరణమున కీప్రాంత మొక పెద్దబండ. కావున పాలకులు మొట్టమొదట నీప్రాంతమునే అడఁగఁద్రొక్కవలయు నని నిశ్చయించిరి. అమెరికాలోని బ్రిటీష్ సేనలకు ముఖ్యనాయకుఁడుగను, మసాచుసెట్సువలసకు గవర్నరుగను వచ్చిన జనరల్ గేజ్ యొక్క ముఖ్యస్థాన మావలసయందలి బోస్టన్ పట్టణమే యైనందున వెంటనే అధికారపూర్ణమైన తమప్రతిష్ఠను స్థాపించుకొనుట కదియే తగినచోటని ఆంగ్లేయులు తలపోసిరి. తాత్కాలిక ప్రభుత్వమునెడల అసంతృప్తులై తిరుగఁబడుటకు సిద్ధముగఁ గూర్చున్న అమెరికనుజనబృందమును భయముగొల్పి చెదరఁగొట్టుట కపుడు గవర్నరునొద్ద నాలుగురెజిమెంట్లసేన సంసిద్ధముగ నుండెను. కావున వలసలవా రెచటనైన తుపాకిమందును ప్రోవుచేసి యుంచినచోఁ గనిపట్టుటకు గవర్నరొకచిన్న సేనను సిలమునైపునకు జలమార్గమునఁ బంపెను. వేఱొక పటాలమును నాటుమార్గముద్వారా కంకార్డుపట్టణముదగ్గఱ నమెరికనులు సంగ్రహించి రని తెలిసిన యుద్ధసామగ్రుల నపహరించుటకో లేక ధ్వంసము గావించుటకో పంపెను. మఱియు నతఁ డప్పటికి ౨౦,౦౦౦ ల సైనికు లుండినచో కార్యము లన్నియుఁ జక్కఁబడఁగలవని పైయధికారుల కొలుకపఱచి అమెరికనుల ప్రచారాందోళనములను రూపుమాపుటకై బయలువెడలెను. కంకార్డునగరమునకుఁ బోవుచుండిన సేనకు మార్గమందలి లెక్సింగ్టన్ పట్టణముదగ్గఱనే అమెరికనులతోఁ దలపడవలసివచ్చెను. బ్రిటీషువా రమెరికనుల నోడించి చెల్లాచెదరుగఁ దఱుముఁగొట్టిరి. స్వకీయ స్వాతంత్ర్యమునకై అమెరికనులు గావింపఁ గడఁగిన యుద్ధమునందు మొట్టమొదట వారిరక్తము స్రవించిన దీలెక్సింగ్టన్ సమీపమందే. అనంతరము బ్రిటీష్ సేనలు కంకార్డునుచేరి యచట నమెరికను లాస్వల్పకాలములో రక్షించుకొనఁ గలిగి నన్నింటిని రక్షించుకొనిన పిదప మిగిలి పడియున్న యుద్ధసామగ్రులను నాశనము గావించియో లేక హరించుకొనియో వెనుకకు మరలెను. ఈమరలివచ్చునపుడు మార్గమధ్యమున బ్రిటీష్ సేనలవెనుకనుండియు, దారిలోని యిండ్లచాటుననుండియు కంచెలమాటుననుండియు నమెరికనులు వీరిపై నిప్పులు గురిసిరి. ఆసమయమున వేఱొకసహాయకసేన వచ్చుటచే రక్షణము కలిగినది. అన్యథా, బోస్టన్ చేరులోపల నాదళ మంతయు నాశన మైయుండెడిది. అట్టిసమయమున పాలకులపక్షము వహించి అమెరికనులస్వాతంత్ర్యోద్యమమును ధ్వంసము చేయవలయు నని కంకణము గట్టుకొనియున్న 'టోరీ'లగుంపులు చెలరేఁగి జాతీయవాదులకు ప్రతిబంధకములఁ గల్పింపసాగెను. వీ రందఱు నాయుధపాణులై అమెరికనుల నెదిరించి పోరాడఁదొడఁగిరి. న్యూయార్క్, పెన్సిల్వనియాలోనగు కొన్నివలసలందు రాజపక్షీయులగు నీటోరీలసంఖ్యయే యెక్కువ. కాని అమెరికనులు సకాలమున మేలుకొని రాజపక్షీయుల గృహములలో బలవంతముగఁ జొరఁబడి వారియొద్ద దొరకిన యాయుధముల నన్నింటిని లాగికొని వారిని నిరస్త్రులను గావించిరి. అటుపిమ్మట రాజపక్షీయులను కంచెలలోఁ బడవైచి హింసించియు, రోడ్లమీఁదఁ బడవైచి లాగించియు, మీఁద రాలు విసరించియు ప్రభుభక్తులగృహములను, దుకాణములను దగులఁబెట్టించియు, ధనాఢ్యు

sampath Ebooks

లకువారిని స్వగృహములందే బంధించి వెలుపల కాపుదల పెట్టించి అందుల కగువ్యయము నాగృహస్వామిచేతనే యిప్పించియు, ఇంకను అనేకవిధముల నమెరికనులను శత్రువుల బాధపెట్టిరి. ఇట్టిదారుణము లోనరించుట తగునా యని యెవరైనను ప్రశ్నించినచో తమమధ్యనే యుండి తమకు పుల్ల లెక్కించు నీరాజపక్షీయులు దూరమున నుండు బ్రిటిషు సైనికులకంటె నీచమైనహింసకు లగుటచే వారి నట్లు బాములఁ బెట్టుట న్యాయ్యమే యని అమెరికనులు ప్రత్యుత్తర మొసఁగు చుండిరి. ఇట్లడిగినయొక ప్రశ్నకు 'రాజపక్షీయులతల ఇంగ్లండు నందును, శరీరము అమెరికాయందును ఉండును' అని అమెరికా స్వాతంత్ర్యవాది ప్రత్యుత్తర మిచ్చెను. ఇట్టిదారుణశిక్షల విధించుట చేతనే రాజపక్షీయులు క్రమముగ లొంగిపోయిరి. లేనిచో యుద్ధము మీఱినతరువాత దేశాభిమానులకు వీరు మఱింత ప్రాణాంతకము లగు కంటకములుగఁ బరిణమించియుందురు.

లెక్సింగ్టన్ సంఘర్షణమువలన పొడమిన కలవరముచేత న్యూ-ఇంగ్లండునుండియు, తత్పరిసర ప్రాంతములనుండియు పౌరజనులు గుంపులు కట్టి రాఁదొడఁగిరి. కొలఁదిదినములలో ౧౬,౦౦౦ ల మంది పౌరులు సమావేశమైరి. మసాచూసెట్సు లోనగువలసలందు ప్రాంతిక సభలు (Provincial Congresses) సమావేశమై వచ్చినపౌరబృందము లకు నాయకుల నేర్పాటు గావించెను. లెక్సింగ్టన్ దగ్గఱ జరిగినటు వంటిఘటనము వేఱొకటి జరగకుండులాగున కట్టుదిట్టములను జేయుట కొఱకు పౌరబృందము లన్నియు బోస్టన్ మీఁదికి నడవసాగెను. ఈపౌరజనులు శిక్షితులు గానిహేతువున క్రమము, కట్టుఁబాటు అను నది లేక అడ్డదిడ్డముగ పశువులమందలపగిది నడచిపోవసాగిరి. కాని అశిక్షితులైన వీరివలననుండియే తరువాత యుద్ధాంతమువఱకును పోరాడుచుండిన వలసలసేన యుద్భవించినది. కంకార్డుపోరాటముతరు వాత ప్రాంతములవాస్తవ్యులు కొందఱు వలసలలోని బ్రిటిషు-అధికా రులద్వారా ఇంగ్లండురాజునకు దరఖాస్తుల నంపుకొనిరి. అందు బ్రిటిషుదళములే ముందు ప్రజలమీఁదను తుపాకులను గాల్చినందున స్వాధికార, స్వగృహదారాదులసంరక్షణార్థము వలసలవారికిని సైని కులపైని గాల్పవలసివచ్చె నని వ్రాయఁబడియుండెను. ఇట్టివిన్నప ములు లోనగునవి యుద్ధ మారంభ మైనపిదప నొకసంవత్సరముపర్యం తము పంపఁబడుచునేవచ్చినవి. కాని యుద్ధ మాఁగ దనువృథవిశ్వాస ముతో వేఱొకవైపు సేనల సంగ్రహించుటయందును అప్రమత్తులుగనే యుండిరి.

ఈ తరుణమునం దమెరికనుల కాయుధము లత్యావశ్యకము లయ్యెను. చాంప్లెయినుసరోవరముమీఁది టికండెరోగాదుర్గమునందు బ్రిటిషువారు శస్త్రాస్త్రములు ప్రోవుచేసియుంచిరి. ఈ దుర్గమును లోఁబఱుచుకొనుటకు జలసైన్య మావశ్యక మగుటచేత నమెరికనులు తదాదిగ క్రమబద్ధమైన జలసేనను తయారు చేయసాగిరి. బోస్టన్ ముట్టడియందు చేరియుండిన కప్టెన్ బెనిడిక్టు ఆర్నాల్డును అచటనుండి మరలించి ఎథన్ ఎలెన్ అనునతనితోఁ గలసి ఆకస్మికముగ టికండెరోగాను ముట్టడింపు మని కాంగ్రెసువా రాజ్ఞాపించిరి. మసాచూసెట్సు, కన్నెక్టికట్, న్యూహాంప్షైర్ వారలుగూడ ఈకార్యమునకుఁ దోడ్ప డినందున దుర్గము శీఘ్రముగనే అమెరికనులవశములోనికి వచ్చెను. ఇందువలన అమెరికనులకు శస్త్రాస్త్రములు లభించుటమాత్రమే కాదు; చాంప్లెయిన్ సరోవరములోని నౌక లన్నియు వీరియధీన మయ్యెను. మఱియు సెంట్ లారెన్సునదినుండి హడ్సన్ నదిలోయవఱ కునుగల మార్గము వీరిచేతఁబడెను. ఇవన్నియు నిటులుండ టికండె రోగాదుర్గజయమువలన కాంగ్రెసునీతియే మాఱిపోయెను. ఆయుధా గారము వశ మగుటతోడనే సంధియుద్దేశమును మానుకొని బ్రిటిషు సేనలు ముట్టడించునెడల స్వరక్షణార్థము పాటుపడవలసిన దని కాంగ్రెసు తీర్మానము గావించెను. వర్జీనియావాసియగు జార్జి వాషింగ్టనును కమెరికను సేనలసర్వాధిపత్య మొసంగఁబడెను కాని యితఁడు వచ్చి యీనియోగమును హస్తగతము చేసికొనకమునుపే బంకర్ హిల్ యుద్ధము ఘటిల్లెను.

బోస్టన్ పట్టణమునందు ౧౦,౦౦౦ ల సేన సమకూడినవెంటనే ఆంగ్లేయులు దక్షిణమున డార్చెస్టర్ కొండలను, ఉత్తరమున చార్లెస్టన్ నగరమును ఆక్రమించుకొని తమసేనాపంక్తి నింకను అభివృద్ధి నొందింప నిశ్చయించుకొనిరి. ఈసమాచారమును దెలిసికొని అమెరి కనులు చార్లెస్టనునకు నెడవగా నున్న బ్రీడ్స్‌హిల్ నా నొప్పుకొండను బంకర్‌హిల్ అనుకొని రాత్రికిరాత్రి ప్రవేశించి యచట బురుజుల నిర్మించుకొని నివేశనస్థానముల నేర్పఱుచుకొనిరి. తత్క్షణమే ఆంగ్లే యులు దీనిని ముట్టడించియుండినచో సుకరముగ గెలిచియుందురు. కాని యట్లు చేయక రెండవనాఁడు పోయి ముట్టడింప వెయ్యిమంది కంటె నెక్కువసైనికులు హతులైనపిదపఁగాని అమెరికనుల నచ్చోట నుండి పాఱఁదోలుటకు వీరికి శక్యము గాకపోయెను. ఈయుద్ధమునం దమెరికనుముఖ్యనాయకులలో నొకఁడు మసాచూసెట్సునివాసి యగు జోసెఫ్‌వారన్ అనునతఁడు మృతి నందెను. అనంతరము అమెరి కనులు బోస్టనునకు చుట్టును బురుజులను నిర్మింపసాగిరి. ఇందువలన నాంగ్లేయులకు స్థానసంకోచము గలుగసాగెను.

ఇట్లు యుద్ధ మారంభ మైనవెంటనే వలసలయం దన్నింట జనులలో ఉద్రేకము పెరిఁగిపోయెను. న్యూ-ఇంగ్లండు కెనడాలసరి హద్దులందును, తక్కినవలసలందును ఒకవిధమగు సంగ్రామావస్థ యేర్ప డెను. ఇంగ్లండునుండి క్రొత్తసేనలు వచ్చుచున్న వని దేశమం దంతట నాందోళనము జనించెను. కావున రెండవమాఱు కాంగ్రెసుసమా వేశము కావలసివచ్చెను. ఇంతవఱకు బ్రిటిషువ్యాపారమునకుమాత్రము ప్రతికూలముగఁ బని సేయుచువచ్చిన యమెరికనుసంఘము లిప్పుడు రక్షణోపాయములను గావించుకొన మొదలిడెను. మహాసభ సమా వేశమై కొన్నివలసలకు సలహారూపముగను, మఱికొన్నింటి కాజ్ఞా రూపముగను తీర్మానముల నందఁజేసెను. మఱియు సేనల కావశ్యక పదార్థముల సంగ్రహించుట, వలసలయందలి కేంద్రసంఘముల నన్నిం

టిని ప్రభుత్వాధికారమును వహించునట్లు చేయుట, న్యూయార్కు, ఉత్తరసీమలు, హడ్సన్ కొండలు లోనగుచోట్ల రక్షణోపాయములను నెలకొల్పఁ దీర్మానించుట, సేనానిర్మాణము, తన్నాయకనియోగము, నాయకుల వేతనప్రబంధము, యుద్ధనియమముల ప్రతిపాదనము, వ్యాపారవిధానము, అమెరికాఇండియనులవ్యవహారము, వార్తాహరణ విభాగ(Postal Department)సంఘటనము మొదలగు సకల కార్యములను కాంగ్రెసు నిర్వహించి నలుపసాగెను. వలసలవారప్పుడు శాసనాధికారము (Executive Power) సభల అనిష్టమానియుండినందున మరల నదేవిధమును పద్ధతి నేర్పఱిచికొనక సర్వజనాంగీకారముతో నియమించుకొనినసభలు (Conventions), సంఘములు (Committees) మొదలగువానిద్వారా సకలకార్యముల నిర్వర్తించుకొనుచుండిరి. విప్లవోద్యమ మభివృద్ధి నొందినకొలఁదియు రాజాధికృతములైన ప్రాంతములందలి ప్రభుత్వము నాశన మందసాగెను. క్రమముగ వలసలలో అసెంబ్లీలును లోపము గాఁబోవఁజొచ్చెను. లోపింపక నామమాత్రముగ నిలిచినవి సమావేశ మగుట మానెను. బ్రిటిషుగవర్నరులయధికారము క్షీణింపసాగెను. కొందఱు గవర్నరులు బ్రిటిషుయుద్ధనౌకలమీఁద నియుక్తులైపోయిరి. కొందఱింగ్లండునకు వెడలిపోయిరి. మఱికొందఱు అమెరికనులచేతులలో ఖైదీలుగఁ జిక్కిరి. వలసలలోని శాసనసభల (Executive Councils) యొక్కయు, సామ్రాజ్యప్రభుత్వముయొక్కయు అధికారము క్రమముగ క్షీణించిపోవుచుండ జనాంగీకారమును వడసి యేర్పడుచు వచ్చినసభలు మున్నగునవి ఆయధికారములను గ్రహింపసాగినవి. అదివఱకే అర్ధసంయుక్తరాజ్యములు (Half Federated States) గనుండి భగ్నమైపోయిన సామ్రాజ్యపు శిథిలావశేషములనుండియే సంపూర్ణసంయుక్తరాజ్యము లుద్భవించినవి. మీఁద వచించినసభలు, సంఘములు మున్నగునవి ఈసంయుక్తరాజ్యముల కంకురతుల్యములయ్యెను. వలసలలోని రాజకీయసాంఘికపరిస్థితుల ననుసరించి యీరాజ్యపరిపాలనవిధానములందుమాత్రము భేదము లనేకము లుండెను.

ప్రజాధికృతములు (Democratic), స్వామ్యధికృతములు (Proprietory), రాజాధికృతములు (Royal) అనివలసలలో మూఁడు ప్రకారము లగు విభాగము లుండెను. కన్నెక్టికట్, రోడ్‌దీవులు ప్రజాధికృతములు. పెన్సిల్‌వనియా, మేరీలాండు ప్రాంతములు స్వామ్యధికృతములు. తక్కిన వన్నియు రాజాధికృతములు. సమాజములను, వానియందలినాయకులను జనులచే నెన్నుకొనఁబడినవారగుటచే కన్నెక్టికట్, రోడ్‌దీవులందలి రాజ్యపద్ధతులలో మార్పులు చేయవలసినయవసరము లేకపోయెను. లోలోపల కొన్ని చిల్లర యేర్పాటులందుమాత్రము మార్పులు జరగవలసియుండెను. ఇఁక స్వామ్యధికృతములైన పెన్సిల్‌వనియా, మేరీలాండులం దుండిన అసెంబ్లీలు రాజాధికృతప్రాంతములలోని అసెంబ్లీలంత పట్టుదలతోను, నిశ్చయముతోను సామ్రాజ్యప్రభుత్వరక్షణమునకై శపథముల సలిపియుండలేదు. వీనిలోనియసెంబ్లీలు కొంతకాలమువఱకట్లో ఈడ్చుకొనుచు వచ్చి తుదకు స్తంభించిపోయెను. రాజాధికృతములలోనివి దీర్ఘకాలమువఱకును సమావేశము గాకుండుటచేతను, తఱచుగ సమావేశములు వాయిదా పడుచుండుటచేతను, కొంతకాలమునకు బొత్తిగ నిలిచిపోయెను. మసచూసెట్సునందలి అసెంబ్లీ ౧౭౭౪ న లోపించిపోయెను. వర్జీనియాలోనిదియు నాసంవత్సరముననే అంతర్ధానమయ్యెను. ౧౭౭౫-వ సంవత్సరము జనవరి మొదలుకొని మార్చివఱకును దీర్ఘకాలము జరగియుండిన అసెంబ్లీయే న్యూయార్కునందు కట్టకడపటిది. అదేసంవత్సరము ఏప్రిల్ నెలలో ఉత్తరకరోలీనాయందు చిట్టచివరిగవర్నరు అంతిమపర్యాయము అసెంబ్లీని గూర్చెను. అప్పుడే అమెరికనులసభకూడ జరగినది. ఈరెండుసభలయందును సభ్యులు ఒక్కరే. అదేసంవత్సరము మేనెలలో జార్జియాయందలి అసెంబ్లీ యడుగంటెను. ఆమఱుసటినెలలో న్యూహాంప్‌షైర్, దక్షిణకరోలీనాలయందలి యసెంబ్లీలు అంతిమపర్యాయము సమావేశమైనవి. ఆసంవత్సరము నవంబరుమాసమున న్యూజెర్సీలోని అసెంబ్లీ కూడెను కాని అంతకుఁబూర్వమే యచట జాతీయసభ ఏర్పడి యచటివ్యవహారములను స్వాధీనము గావించుకొనెను. బ్రిటిషునాయకోద్యోగులు, శాసనసభలు మఱికొన్నినెలలపర్యంతే మెల్లో కడచి తుదకన్నియు నేగులేకుండఁబోయెను.

బంకర్‌హిల్‌ఘటనానంతరము బోస్టన్‌నగరమునందు సేనకు బదులుగ సర్ విలియంహో యనునతఁడు బ్రిటిషుప్రభుత్వపుసర్వాధిపతిగ పదార్పణము గావించెను. సర్ హెన్రీ క్లింటన్, జాన్ బర్గాయిన్ నామకసేనానులిద్దఱు హోతో తోడ్పాటుగ నుండిరి. ఒకసంవత్సరము గడచినతరువాత కార్న్‌వాలిస్ వచ్చి వీరితోఁ గలసెను. బ్రిటిషువ్యవహారము లన్నియు నీనలుగురిసలహాల ననుసరించి జరగసాగెను. ఇటు అమెరికనులపక్షమున వాషింగ్టను సర్వసేనాధిపత్యమును వహించి సేనయందు పెక్కుకట్టుదిట్టములను గావించెను. ఇతఁడు వచ్చునప్పటికి బోస్టన్‌దగ్గఱ ౧౫,౦౦౦ల మంది సైనికులుండిరి. వీరందఱును క్రమముగ శిక్షితులు గానికారణమున సేనయంతయు మిగుల అస్తవ్యస్తమగుస్థితియందుండెను. ఒకచేకార్యము కొఱకు ప్రోగైయుండియు సైనికులు వలసలభేదములను పాటించుకొనుచుండిరి. అందుచేత నితఁడు వచ్చినతోడనే ‘మీరందఱు నిపుడు ఉత్తర-అమెరికా-సంయుక్తరాజ్యముల సైనికులు గావున మీమీప్రాంతికభేదముల నన్నింటిని విడనాడుకొనవలయును’ అని బోధించెను. సైనికులు ప్రభుత్వముయొక్క ఆస్తులనే కాక ప్రయివేటువానినిసహితము ముట్టడించుచువచ్చిరి. వాషింగ్టన్ ఈదురాచారమును మాన్పించెను. సైనికు లుపయోగించు రమ్ము (Rum) సారాయముయొక్క ప్రమాణమును తగ్గించెను. మఱియు సైనికులిష్టము వచ్చినపుడంతయు సెలవు దీసికొని, ఒకరెజిమెంటును (Regiment) వదలి వేఱొకరెజిమెంటులోఁ బోయి చేరుచుండిరి. ‘స్వేచ్ఛ (Liberty) అను పవిత్రకార్యమునిమిత్తము కటిబద్ధులైన వీరపురుషు లెదురుగ నున్నంతకాలము తమ స్థానము నెప్పటికిని

sampath Ebooks



వలెఁగూడను ' అని సైనికుల నంపెను శాసించెను. వాషింగ్టనునకు మఱింత వ్యాకులమును కలుగఁజేసినది సైనికుల నిరంకుశశిథిలవర్తనము. సేనానివేశములను గావలి గాచు పహరాదారులు( Sentries ) అప్రమత్తులై చులుకుఁదనము గలిగియుండెక పరాకుతో వర్తించుచు శత్రువులతో సైతము ప్రసంగములను సలుపుచువచ్చిరి. ఈదురభ్యాసము నితఁడు తీవ్రముగ ఖండించి అమెరికాదేశమున జనింపనివానికి, అనఁగ భార్య, బిడ్డలు, కుటుంబము లేనియతనికి నట్టిఉత్తరదాయిత్వముగల పదము నప్పగింపకూడదని యాతఁడు కఠినముగ శాసించెను. మఱియు విదేశీయులను సేనయందు చేర్చుకొనవలదని యాజ్ఞాపించెను. ఇతనియాజ్ఞ యెంతయు సంగతమైయుండెను; ఎందుచేత నన యుద్ధ మారంభమై రెండుసంవత్సరములు గడచినపిదప నితఁడు జార్జిలో యున్నపుడు ౧,౧౩౮ సురు సైనికులతని విడనాడి వెడలిపోయిరి. వారిలో ౨౦౦ మంది మాత్రమే అమెరికాదేశీయులు. తక్కినవా రందఱును విదేశీయులే. ఇవన్నియు నిట్లుండ నితఁడు కుశలులగు ఆఫీసరులను నియోగించి సైనికులకు క్రమమైన యుద్ధశిక్షణము నిప్పించెను. అనంతర మితఁడు బోస్టనునగరపుముట్టడిని సాగించుచు ఒకజలసేనను సిద్ధము చేయించి దానిద్వారా బ్రిటిషువారిజలమార్గముల నరికట్టించెను. పిమ్మట నితనికిఁ క్రొత్తగ వచ్చిన ఫిరంగుల సాయముతో హార్చెస్టరుకొండల నాక్రమించుకొని యచట సేనారక్షకస్థానములను నిర్మింపఁజేసెను. ఇట్లు బోస్టన్ - ఆక్రమణము నానాఁటికి తీవ్రమగుచుండుట చూచి యిఁక నచట నుండుట క్షేమంకరము గాదని జనరలు హౌ ఆప్రదేశమును వదలి నోవాస్కోషియాయందలి హాలిఫాక్సుపట్టణమునకుఁ బోయి చేరెను. రేవులందు బ్రిటిషు నౌకల నరికట్టుటవలనఁగూడ అమెరికనులకుఁ గొన్ని యుద్ధసామగ్రులు లభించెను.

టికండెరోగాదుర్గము స్వాధీనమైనపిదప అర్నాల్డు కొంత సేనతో మెయినురాజ్యములోని ఘనాటవులగుండఁ బ్రయాణముల సలిపి క్యూబెక్కునగరమును ముట్టడింపఁబోయెను. అక్కడ నతఁడు తనకంటె ముందుగనే చేరియున్న జనరల్ రిచర్డు మాంటుగొమరీతోఁ గలసి పట్టణమును ముట్టడించెను కాని సఫలుఁడు కాలేదు. యుద్ధమున మాంటుగొమరీ హతుఁడయ్యెను. అంత అర్నాల్డ్ మిగిలినసేనతో చాంప్లెయిన్ సరోవరముం జేరి దానిని దనవశముం దుంచికొనుటకై ఒకపెద్దజలసేనను నిర్మాణము సేయింపఁగడఁగెను.

ఇన్నిఘటనములు జరగినపిదప నింగ్లండు ప్రధానమంత్రి యగు లార్డు నార్తు ( Lord North ) సమాధానమను పేరఁ గొన్ని షరతులను వెలువఱిచెను గాని అమెరికన్ కాంగ్రెసు వీనిని సరాసరి తిరస్కరించెను. అది మొదలుకొని పార్లమెంటువారు తెచ్చినషరతుల నన్నింటిని కాంగ్రెసు నిరాకరించుచునేవచ్చెను. అందువలన బ్రిటిషుపాలకులు మఱింత తీవ్రములైన నిర్బంధములకు దిగిరి. ౧౭౭౫-వ సంవత్సరము అక్టోబరుమాసమున పార్లమెంటునందు వ్యాఖ్యానమొసంగుచు మూఁడవజార్జిరాజుగారు వలసలవారిని సంపూర్ణముగ నణఁగఁ ద్రొక్కి లొంగఁదీయవలయును గాని వేఱొకమార్గము లేదని వక్కాణించెను. పిమ్మట రెండునెలలకు మూఁడవవించినియమనషు చట్టమునకుఁ దోడుగ నిషేధపుచట్ట మొకటి ( Prohibitory act ) వలసలపై విధింపఁబడెను. తదనుసారము ఇతరదేశములవా రెవ్వరును వలసలవారితో ఏవిధమైన వ్యాపారములనుగాని వ్యవహారములనుగాని సలుపఁగూడదు. అట్లు గావించినయెడల నట్టివారి నౌకలు మున్నగునవి జప్తు చేయఁబడును. ఈచట్టమువిషయమున ఆడమ్సు వక్కాణించిన విధమున నిది యొకప్రకారమగు యుద్ధఘోషణమే. దీని కన్నింటికి ననుగుణముగ నాంగ్లేయ లింకను సేనల నభివృద్ధి చేయవలయు నని నిశ్చయించి అధికారుల కట్టియుత్తరువులనే పంపి అమెరికనులతోఁ బోరాడుటకు జర్మనుసైనికుల సంగ్రహింపఁబూనిరి. విశాలమగు జల, స్థలసైన్యమును అమెరికాయందు సమకూర్చి యందునుండి కొంతభాగమును న్యూయార్కునందును, దక్షిణపువలసలందును విప్లవకారుల మీఁదికిఁ బంపి తక్కినదానిని కెనడాదేశమునకును బంపవలయు నని నిశ్చయింపఁబడెను. మఱియు అల్లరు లెచట మిక్కుటమో, ఎచట కొంతకాలముపర్యంతము విద్రోహు లెదిరించి పోరాడుట సంభవమో యాప్రదేశముమీఁదనే ముందు దండెత్తి విప్లవము నడంచివేయవలయు నని తీర్మానింపఁబడెను. వలస లన్నింటిలో నెక్కువ జనసంఖ్యగల భాగము చెసపీక్ అఖాతమున కుత్తరముగ నుండెను. అమెరికనుల కాహారాదులు రావలసినది ఉత్తరమునుండియే. కావున నిఁకముం దారంభింపఁబోవుయుద్ధమునకు కేంద్రస్థానముగ న్యూయార్కుపట్టణమును గావింపవలయు నని నిశ్చయింపఁబడెను. మఱియు కెనడానుండి దక్షిణమునకు నిరాటంకముగ రాకపోకల సలుపుటకు హడ్సన్ నదిలోయను తమవశముం గుంచుకొనవలె నని ఆంగ్లేయులు స్థిరపఱుచుకొనిరి. ఇందువలన దక్షిణపువలసలవారిని ఉత్తరమునుండి విడఁదీసినయట్లగును. అమెరికనుల ఐక్యమును భగ్నముచేయుట కిది యొక్కయుపాయమేకాదు; తక్కువ ఎదురఁబాట్లు గలచోట్ల ముందు యుద్ధము సలిపి యక్కడిజనుల నందఱను హస్తగతులఁ గావించుకొన నెంచిరి. ఒకవైపున యుద్ధకార్యముల కిట్లు అఖండప్రయత్నములను సలుపుచు మఱియొకప్రక్క వలసలు తమయాధిపత్యమును స్వీకరించునెడల కొన్నిషరతులమీఁద సంధి చేయుటకును బ్రయత్నింపఁ దని యింగ్లండుదొరతనమువారు తమగవర్నరుల కాజ్ఞాపించిరి. బ్రిటిషువారికి లోఁబడినచో మరల శాంతి నెలకొల్పఁబడు ననియు, జనులందఱును క్షమింపఁబడుదు రనియు, అమెరికనులకు వ్యతిరేకములైన చట్టములు దీసివేయఁబడు ననియు, వలసలకార్యనిర్వహణములకై కావలసినమట్టున కతిస్వల్పమగు ధనముమాత్రము కప్పముగాపమున రాఁబట్టుకొనఁబడు ననియు ప్రజలకు బోధింపవలసినదిగ దొరతనమువారు తమగవర్నరుల కుత్తరువుల నొసంగిరి. వెనువెంటనే రేవులలో ప్రధానములైన న్యూయార్కు, ఫిలడల్ఫియా, చార్లెస్టన్ నగరములను లోఁబఱిచి వశముం దుంచికొనవలసిన దనికూడ తాకీదుల నంపిరి. ఈ సంగతుల నన్నింటిని ముందుగనే ఊహించుకొనియుండిన వాషింగ్టన్

sampath_Ebooks

వారియుపాయములకుఁ బ్రతివిధానములను పన్నసాగెను. న్యూయార్కుపట్టణమునకు చుట్టుప్రక్కలందు రక్షణస్థానములను నిర్మింపఁజేసి ౯,౦౦౦ ల సేన నాప్రాంతములందు నిలిపెను. బ్రిటిషువ్యాపారమును నాశన మొనరించునిమిత్తము అమెరికనుసైనికులను బ్రయోగించెను. చిన్నయోడలను గట్టించి సముద్రతీరప్రదేశములను గాపాడుటకును, ఆహారాదిపదార్థములను సమకూర్చుటకును నియోగించెను. రాజపక్షీయులను సంపూర్ణముగ నిరస్త్రులఁజేయించెను. బ్రిటిషువారికి లోఁబడియుండని యితరదేశములకన్నింటికిని వ్యాపారమునిమిత్తము అమెరికనురేవులను దెఱపించెను. వాషింగ్టను చేయుచుకార్యజాలము లిటు లుండ స్వాభావికముగనే ఒకసంవత్సరముక్రింద న్యూ-ఇంగ్లండులో నుండిన పరిస్థితు లిప్పుడు వలసలయందన్నింట నేర్పడెను. వలసలలోని కాంగ్రెసునకుఁ జెందినసభ లన్నియు సుస్థిరము లయ్యెను. ఇంగ్లండుతో సంబంధము కలిగియుండుటనుగూర్చి యింతవఱ కెవరియభిప్రాయము లెటు లున్నను ఇఁకముందుమాత్రము దానినుండి సర్వథా విడివడుటకు బద్ధసంకల్పులై వలసలవారందఱును స్వాతంత్ర్య ఘోషణము సలుపవలసినదిగా కాంగ్రెసునకు విన్నపములను బంపసాగిరి. తదనుసారము ౧౭౭౬-వ సంవత్సరము మేనెలయందు 'సర్వసాధారణముగా అమెరికాదేశ మంతటికిని, విశేషించి వారివారిరాజ్యములకును ఎట్టివిధానము గల ప్రభుత్వమువలన జనులకు సౌఖ్యము గలుగునని ప్రతినిధులకుఁ దోఁచునో అట్టిదాని నేర్పఱుచుకొనవలసిన' దని వలసలలోని కార్యకర్తలకు కాంగ్రెసువారు సలహాల నిచ్చిరి. 'వలసలయందుఁ గలుగుబాధలను దొలఁగించుటకై విన్నవించుకొనినవిన్నపము లన్నియు బ్రిటిషుపాలకులచే నుపేక్షింపఁబడినవి. వలసలలోని సేనాబల మంతయు దేశీయుల నణఁగఁద్రొక్కు నిమిత్తమే వినియోగింపఁబడుచున్నది. కావున నిట్టి ప్రభుత్వముతో సహకార మొనరింతు మని శపథములనుచేయుట వలసలకు సహేతుకము గాదు, గౌరవమును కాదు.' ఇట్టివే యగు అంశములుగల లేఖ లనేకములు దీర్ఘకాలముగ కాంగ్రెసునకు వచ్చుచుండుటంజేసి అప్పటి ప్రభుత్వవిధానమునందు మార్పుల చేయవలసివచ్చె నని ప్రకటింపఁబడెను. వలసలన్నియు రాజ్యములు( States )గ పరిణమింపఁ దన్నివాసు లందఱును స్వాతంత్ర్య ఘోషణము సలుపవలసిన దని తమ ప్రతినిధులను బలాత్కరింపసాగిరి. ఆ కారణమున నదే సంవత్సరము జూన్ నెలలో వర్జీనియానివాసి యగు ఆర్. హెచ్. లీ అను నతఁడు 'సంయుక్తములైన యీవలసలు హక్కుప్రకారము స్వేచ్ఛాస్వాతంత్ర్యములను గలిగియుండవలయును' అని కాంగ్రెసునందు ప్రతిపాదనము గావించెను. మఱియు విదేశములతో సంబంధమును సంపాదించుకొను టవసర మనియు, సంయుక్తరాజ్యవిధానము నొకదాని నేర్పాటు చేయవలయు ననియు నితఁడు వక్కాణించెను. మధ్యదేశపు వలసలకు ప్రతినిధిగ వచ్చిన డికిన్సన్ పైని వచించిన కార్యక్రమమునందు పరివర్తనము నభిలషించెను. ముందు సంయుక్తరాజ్య నిర్మాణ మొనరించి, విదేశములమైత్రి సంపాదించుకొని యనంతరము స్వాతంత్ర్యఘోషణము గావింపవలయు ననుట యితనివాదము నందలి సారాంశము. కాని ప్రతిపాదితమైన ఘోషణ ప్రకటనమే యన్నింటిని జక్కపెట్టును గావున దానిని తలక్రిందులుచేయుట అనవసర మని జాన్ ఆడమ్స్ మున్నగువారు ప్రతిఘటించిరి. ఈ వాదవివాదముల మూలమునను, దక్షిణకెరోలీనావారు అసలు ఘోషణమునకు సమ్మతింపకపోవుటచేతను ఘోషణప్రతిపాదనము పరిష్కరింపఁబడవలయు నని మూఁడువారములు గడువొసంగఁబడినది. ఈ యవకాశకాలములో సంయుక్తరాజ్య నిర్మాణమును గూర్చిన నియమములు, సమాధానములు కొన్ని గావింపఁబడినవి. చట్టములను జేయుటకును, యుద్ధవిషయములందు విచారణపూర్వకముగ నేర్పాటులను జేయుటకును కాంగ్రెసు ఒకనూతనసంఘమును సృష్టించెను. ఇదియే కాలాంతరమున శాసనవిభాగము( Executive Department )గఁ బరిణమించెను. మూఁడువారములు గడచినవెనుక జార్జియా, దక్షిణకెరోలీనా, న్యూయార్కు ప్రజలు దప్పఁ దక్కినవారందఱును స్వాతంత్ర్యఘోషణమున కనుకూలముగ వోటు (Vote) నొసఁగుఁడని వారి ప్రతినిధులకు లేఖల నంపిరి. జార్జియా, కెరోలీనా ప్రజ లీవిషయమును ప్రతినిధుల యిష్టానిష్టములమీఁద వదలిరి. చార్లెస్టన్ పట్టణముమీఁద ముట్టడి జరుగుటకు సంసిద్ధముగ నుండినందున ఆ ప్రతినిధులిద్దఱును స్వాతంత్ర్యఘోషణమునకే సమ్మతించిరి. ఇంతలో జనరల్ హో అపారమగు సేనతో వచ్చి సాండీహుక్కునందు దిగె నను వదంతులు దేశ మంతటను వ్యాపించిపోయెను. సుశిక్షితులైన 30,000 ల మంది యోధులుగల సేన యతనివెంట నుండెను. ఈసేనకు సాహాయ్య మొనరింప వెంట నొకజలసేనయు నుండెను. ఉద్రేకదాయకములైన ఈవార్తలన్నియుఁ జెవిని బడుటచేత డికిన్సన్ అతని యనుయాయులతోపాటు ప్రతివాదము లన్నింటిని ఉపసంహరించుకొనెను. అంత థామస్ జఫర్సన్ నిర్మించిన పడువున స్వాతంత్ర్యఘోషణము ౧౭౭౬-వ సంవత్సరము జూలై నాలుగవ తారీఖున బ్రకటింపఁబడెను. న్యూయార్కునుండి వచ్చినప్రతినిధు లప్పటికి ఘోషణమునుగూర్చి జోక్యము కలుగఁజేసికొనరైరి; కాని కొన్నిదినములు గడచినవెనుక నారాజ్యమందలి సంఘముకూడ దీనిని స్వీకరించెను. ఈ ఘోషణపత్రము( Declaration Document )పైని కాలాంతరమున సభ్యు లందఱును సంతకములు గావించి యుండిరి. మసాచూసెట్సు అఖాతము, జార్జియా, ఉత్తరకెరోలీనా, దక్షిణకెరోలీనా, మేరీలాండ్, వర్జీనియా, పెన్సిల్వనియా, డిలావేర్, న్యూయార్కు, న్యూజెర్సీ, న్యూహాంప్షైర్, రోడ్దీవి, కనెక్టికట్ నామకములయిన పదుమూఁడు రాజ్యములపక్షమున నీ ఘోషణము గావింపఁబడెను. అనంతర మీపత్రముయొక్క నకళ్లను రాజ్యములలోని వేఱువేఱు సంఘములకును, సేనలను నడపుచుండిన సేనాధిపతులకును బంపిరి. యూరోపియను లమెరికాకుఁ బోయి నివసింపఁగడఁగిన తరువాత వారివారి హృదయములందు చెలరేఁగుచుండిన స్వాతంత్ర్యేచ్ఛ లీప్రకారముగ కార్యపరిణామమును బొందినవి. ప్రజా

sampath Ebooks



స్వామిక ( Democratic ) భావనములును, ఆంగ్లేయసామ్రాజ్యమున నుండి విడివడుటకుఁగల కారణములును ఈపత్రమునందు విస్పష్టముగ వివరింపఁబడినవి. అందలి ప్రధానాంశ మే మన :—

' ప్రభుత్వములు వాని న్యాయాధికారమును పాలితులయొక్క సమ్మతిమీఁదఁ బడయుచుండును. ఏపద్ధతియైనను ఇందులకు విఘాతము కలిగించునది యగుచో నట్టిదానిని రూపుమాపి దానికి బదులుగ నెట్టి సిద్ధాంతముల నెట్టిపరిపాలనముల స్థాపించుటచేతఁ దమకు రక్షణమును, సౌఖ్యమును గలుగునో యట్టి పద్ధతిని స్థాపించుకొనుటకు ప్రజలకు హక్కు గలదు. '

రాజ్యక్రాంతియొక్క మహాకార్యము లన్నియు అమానుషికాత్యాచారముల సహించినమీఁద, నగకయాతనల ననుభవించినమీఁద నిరంతర ఘోరపరిశ్రమములను సలిపినమీఁద లక్షలకొలఁది ప్రాణము లర్పించినమీఁద ఫలముల నొసంగినవి కాని కేవలము మాటలవలనఁ గాదు. అందుల కీస్వాతంత్ర్యయుద్ధము ప్రబలనిదర్శనము. సర్వజనాంగీకారముతో నీపై ఘోషణము ప్రకటింపఁబడినది. కాని రాజపక్షీయులు దీని నిర్మూలింప సర్వశక్తులఁ బాటుపడుచుండిరి. బ్రిటిషు ప్రభుత్వము వికల మైపోవుచుండ వలసలయం దొకవిధమగు సంక్షోభ మేర్పడెను. ప్రాంతవిభాగము లన్నియు నాశనముకాఁగాఁ గ్రొత్తవి త్వరితముగఁ బైకి రాఁజాలకుండెను. స్థానికప్రభుత్వముల సంస్థలును, గ్రామ, నగరములలో ప్రభుత్వములును మార్పునొందియుండలేదు. వీనినే యాధారములుగఁ గొని వీనిమీఁదనే నూతనపరిపాలనాపద్ధతుల నమెరికనులు రచించిరి. మొట్టమొదట దేశాభిమానుల కందఱకును కాంగ్రెసు ముఖముగ వర్తించుననిమాత్రము దలఁపఁబడెను. అంతకు మించి యా సంస్థ కెట్టియధికారమును లేకుండెను. వలసలవారి కందఱకు నుచితాలోచనముల నొసంగుట నిది వారిమీఁదనే యాధారపడి యుండెను. కాని కాలక్రమమున పైని వ్రాసిన విధమున నీ మహాసభ కర్తవ్యము లగణితము లైపోయెను. కాంగ్రెసు - అధికారము లెక్కు వగుచున్నకొలఁదియు, యుద్ధభార మెక్కు వైనకొలఁదియు సహింపలేనికొందఱకు దానియెడల ద్వేషబుద్ధి జనించెను. మఱియు నొక పక్షమువారికి వేఱొకపక్షమువారియెడలను, ఒకరాజ్యముతోడ వేఱొకరాజ్యము నకును విద్వేషము లారంభమయ్యెను. చాలమంది న్యూ-ఇంగ్లండు వారల సేవగింపసాగిరి. రాజ్యములన్నియు కాంగ్రెసునకు వోట్లనిచ్చియుండినందున ఆరాజ్యములకంటె భిన్నములైన పంచాయతీ సంస్థానములు ( Common-wealths ) కాంగ్రెసువారి ప్రతిపాదనములను పడఁగొట్టవలె నని ప్రయత్నింప సాగెను. ముఖ్యముగ యుద్ధసంచాలన క్రమమువలనను, విదేశసంబంధములవలనను మితిమీఱిన వైరములు జనింప పెక్కుపోరాటము లారంభమయ్యెను. ఇందువలన నత్యవసరము లగు కార్యములకును ప్రతిబంధకములు గలుగుచుండెను. ఒక యల్లరిగుంపు వాషింగ్టనుమీఁదనే తిరుగఁబడెను. బెంజమిను ఫ్రాంక్లిను ఇట్టి విద్వేషములకే గుఱియయ్యెను. కాని క్రమముగ శాసన విభాగములు, యుద్ధసంఘములు, పోస్టుప్రబంధములు లోనగునవి సృష్టింపఁబడుటచే కొంతవఱకు కట్టుదిట్ట మేర్పడెను. వీనికి సహాయకముగఁ గాలాంతరమున విదేశకార్యదర్శి, ఆర్థికనిరీక్షకుఁడు, యుద్ధకార్యదర్శి, సముద్రసంబంధి కార్యదర్శి లోనగు పదములును సృష్టింపఁబడెను.

హడ్సన్‌నదిలోయను తమవశమునం దుంచికొని ఉత్తర, దక్షిణ రాజ్యవాసులను విడఁదీయవలయు నని బ్రిటిషువారు ప్రయత్నించుచుండిన ట్లిదివఱకు వ్రాయఁబడినది. కాని తలఁచినప్రకారము వీరి కిందు కార్యసిద్ధి కలుగదయ్యెను. ౧౭౭౬-వ సంవత్సరమున జనరల్ హో హాలిఫాక్సునుండి బయలుదేఱి న్యూయార్కు నగరమునకు దక్షిణముగనున్న లాంగ్ దీవియం దమెరికనుల నోడించి పాఱఁదోలెను. అమెరికనుసేనాపతు లిరువురు కైదీలుగఁ బట్టుబడిరి. పిదప నొకచోట బ్రిటిషువారి కించుక నష్టము కలిగినప్పటికిని మఱి రెండుచోట్ల నమెరికనులే యోడిపోయిరి. వాషింగ్టన్ డిలావేర్ నదిని దాఁటి హతశేషమగుసేనతో వెడలిపోయెను. అనంతరము ౩,౦౦౦ ల కైదీలతోపాటు వాషింగ్టన్ నామకదుర్గ మాంగ్లేయులచేతఁ జిక్కెను. ఈ దుర్గము పోవుటవలన నమెరికనుల కమితనష్టము కలిగెను. అటుపిమ్మట బ్రిటిషుసేనాని ఫిలడల్ఫియాను జయింప నిశ్చయించుకొని యప్పటికి శీతకాల మాసన్నమైనందున తనావాసమునకు బయలువెడలి పోయెను. ఈసమాచారము తెలిసినతోడనే వాషింగ్టన్ వెనుకకుఁ దిరిగి డిలావేరునదిని మరల దాఁటి ట్రెంటన్ వద్ద లెఫ్టనెంట్ కల్నల్ రాల్ సేనమీఁద ఆకస్మికముగఁ బడి దాని నోడించి వేయిమందికైదీలను బట్టుకొనెను. దీనికి తోడుగ నితఁడు మఱికొన్ని దినములకు, అనఁగా ౧౭౭౭-వ సంవత్సరమున జనవరినెలలో న్యూజెర్సీయందలి ప్రిన్‌స్టన్‌ దగ్గఱ కార్న్‌వాలిస్ వెంట నుండిన మూఁడు పదాతిదళములను, మూఁడు అశ్వికదళములను ఓడించి యచటనుండి శీతకాలము గడప మారిస్‌టౌనునకుఁ బోయెను.

మొట్టమొదట నోడిపోయినప్పటికిని వాషింగ్టన్ శాంతిసహనములను గోల్పోవక వీలయినచోట నెల్ల పోయినదానిని రాఁబట్టుకొనుచు తోడ్తోడ కాంగ్రెసును, రాజ్యవాసులను మఱింత చుఱుకుగఁ బని సేయవలసిన దని హెచ్చరించుచుండెను. దేశమందలి పౌరపరిపాలనాధికారమును ( Civil Power ) నాశన మొనరింప నితఁడు ప్రయత్నించియుండలేదు. దేశ మంతయు నిమ్నోన్నతమును, అరణ్యమయమును నైనందున రాకపోకలకు సరియగు మార్గములు లేకపోవుటచేఁ గలుగుకష్టములు బ్రిటిషువారికి బాగుగ ననుభవమునకు వచ్చుచుండెను. అమితమగు యుద్ధసామగ్రులభారమును, ఆడంబరమును గల బ్రిటిషుసేనలకు మార్గములు లేని ఘనారణ్యములగుండాను కొండలమీఁదుగను లోయలను, నదులను దాఁటుచుఁ బోవవలయు ననిన మిక్కిలి కష్ట మగుచువచ్చెను. ఎక్కువయుద్ధసామగ్రులు గాని, భారసహము లగు వాహనాదికములు గాని లేకపోవుటంజేసి అమెరికను లొకమార్గమునఁ గాకపోయిన వేఱొకమార్గమునఁ బోవుచువచ్చిరి. మొట్టమొదట వాషింగ్టన్ పరాజితుఁడై, డిలావేరును దాఁటిపోయిన

sampath_Ebooks

తోడనే జనరల్ హో ఫిలడెల్ఫియానగరము ముట్టడించి కాంగ్రెసును చెదరఁగొట్టి అమెరికనుసేనలను వేఱొకప్రక్కకుఁ బాఱఁదోలవలసినవాఁడైయుండెను. కాని యట్లు చేయక శీతకాలావాసమున విశ్రాంతిఁ గైకొనుటకై వెడలిపోయెను. దానిని గమనించియే వాషింగ్టన్ పైని లిఖించినవిధమున డిలావేరునదిని మరల దాఁటి వచ్చి జయము గాంచఁగల్గెను. ఇట్టి సమయోచితకార్యములమూలమున వాషింగ్టన్ పోయిన విశ్వాసమును రాఁబట్టుకొనుచుండెను. ఇందువలన రాజపక్షీయులనేకులు వాషింగ్టన్ పక్షమునఁ జేరిరి.

జనరల్ హో ముందు జరగవలసిన యుద్ధమునకై ఇంగ్లండునుండి గొప్పసేనను దెప్పించుకొని కొన్నికొన్నిమట్టుకు కెనడానుండియు బలముల రావించుకొనెను. వీనితోడ్పాటుతో విశేషము ఫిలడెల్ఫియానగరమును ముట్టడించి పట్టుకొని అమెరికాస్వాతంత్ర్యయుద్ధమును పెన్సిల్వేనియా, న్యూజెర్సీ, న్యూయార్కులందే అంతము నొందింపవలయు ననియు, న్యూ-ఇంగ్లండును, దక్షిణరాజ్యములను తరువాత వేర్వేఱుగ జయింపవచ్చు ననియు నేర్పాటులను గావించుకొనెను. కాని బ్రిటిషువారిపక్షమున వలసలన్నింటికిని కార్యదర్శిగ నున్న లార్డ్ జార్జి జర్మెయిన్ అనునతఁడు ఈ యుద్దేశమును సాగనిచ్చినవాఁడు కాఁడు. రాజపక్షీయులైన ఆంగ్లేయులును ఇండియనులును గలసిన యొక గొప్పసేన కెనడానుండి బయలుదేఱి హడ్సన్‌నదివెంబడి దక్షిణమునకు రావలయు ననియు, జనరల్ హో దక్షిణమునుండి బయలు వెడలి ఆనదివెంటనే ఎగువకు ప్రయాణము సలుపుచుఁ బోయి ఉత్తరమునుండి వచ్చుసేనను ఆల్బనీనగరమునొద్ద సంధింపవలయు ననియు, పడమటిదిక్కునుండి వేఱొకసేన పూర్వాభిముఖమై వచ్చి ఆదే నగరమునొద్ద నా రెండుసేనలతోఁ గలయవలయు ననియు లార్డ్ జర్మెయిన్ ఏర్పాటు చేసెను. ఈ యుద్దేశము నెఱవేఱి యుండినచో హడ్సన్‌లోయ యంతయు బ్రిటిషువారిచేతఁ బడి న్యూ-ఇంగ్లండు తక్కిన వలసలనుండి వేఱైయుండెడిది. కాని, యట్లు జరగియుండలేదు. ఇందులకు కారణము జనరల్ హోకు నిశ్చయాత్మకములైన యుత్తరువులు లేకుండుటచే నతఁడు సమయమునకు ఆల్బనీకడకు రాకుండుటయే. ౧౭౭౭-వ సంవత్సరమున వేసవికాలము సమీపించినతోడనే వాషింగ్టన్ మరల జాగరూకుఁడై జనరల్ హోయొక్క సంచారములను గనిపట్టి వానికి ప్రతిబంధకములఁ గల్పింప సంసిద్ధుఁడైయుండెను. పరిష్కృతమైనయుత్తరువులు లేనికారణమున జనరల్ హో న్యూయార్కునుండి బయలుదేఱి న్యూజెర్సీగుండ ఫిలడెల్ఫియాకుఁ బోవలయు నని సంసిద్ధుఁ డయ్యెను. భూమిమార్గమున నేఁగినచో వాషింగ్టన్ అడ్డుపడు నని జలమార్గమున నోడలపైఁ బయనమయ్యెను. అయినప్పటికిని వాషింగ్టన్‌తో పోరు తప్పదయ్యెను. జనరల్ హో నౌకాప్రయాణము సలుపుచు వచ్చి చెసపీక్ అఖాతముయొక్క ఉత్తరపు చివరనున్న ఎల్క్ అను ప్రదేశమున దిగెను. అచటి కనతిదూరమునందే వాషింగ్టన్ ఉండినందున నతఁడు బ్రాండిలైనుమీఁది చడ్స్‌ఫోర్డువద్ద ఆంగ్లేయుల నెదిరించెను కాని లాభింపదయ్యెను. అనంతరము అక్టోబరు నెలలో జర్మన్‌టౌనువద్ద అమెరికనులు మరల ఆంగ్లేయులతోఁ దలపడిరి. ఈపర్యాయమును ఆంగ్లేయులే గెలిచిరి. కాని యపారమగు నష్టము కలిగెను. అందువలన వెన్నిచ్చిన అమెరికనులను వీరు తఱుముకొనిపోజాలరైరి. అనంతరము మఱికొన్ని దినములవఱకును హోను నట్టుముట్టియుండి పిదప వాషింగ్టన్ శీతకాలము గడపుటకు ఫోర్జ్‌లోయకు వెడలిపోయెను.

ఇక ఉత్తరప్రాంతములయందు ౧౭౭౭-వ సంవత్సరమున ఆర్నాల్డు చాంప్లెయిన్ సరోవరమును చేరి యచట రెండు నౌకాసమూహములఁ జేయించుచున్న సమయమున ౩,౦౦౦ల [illegible] బ్రిటిషుసేన క్యూబెక్కునుండి వచ్చెను. కాని ఆర్నాల్డుయొక్క ప్రతిబంధకములవలన ఆసేన ముందునకు సాగఁజాలదయ్యెను. ఆర్నాల్డువెంట నున్న బలమును జయించుటకై ఆంగ్లేయులకు జలసైన్య మావశ్యకమయ్యెను. అందులకై తమ సెంట్‌లారెన్సునదియందలి పనివాండ్రను పిలిపించి యచట పరిత్యక్తమై పడియున్న ఒక ప్రాఁతనౌకను మరమ్మతు చేయించుటవలన కొన్ని నెలలదనుక వారి సేన సంసిద్ధము గాదయ్యెను. అటుపిమ్మట నాంగ్లేయులు లీనాతనజలసైన్యపుఁ దోడ్పాటున ఆర్నాల్డు నోడింప సమర్థులైరి. కాని ముందునకు సాగిపోవ నప్పటికిని వీలు కలుగదయ్యెను. ఈకారణమువలననే దక్షిణమునందలి జనరల్ హోకు నిశ్చితమైన యుత్తరువులు చేరకపోయినవి. మఱుసటిసంవత్సరము బర్గోయిన్ నామక బ్రిటిషు సేనాని విశాలసైన్యముతో బయలువెడలి టికండెరోగాదుర్గమును ముట్టడించి యందలి అమెరికనులను వెడలఁగొట్టెను. అనంతరము మహాకష్టములనందా ప్రయాణములఁ జేయుచు వచ్చి ఎడ్వర్డుదుర్గమువద్ద హడ్సన్‌నదిని చేరి యచట విడిసియుండెను. వెర్మాంటు-ఇలాకాయందలి బెన్నింగ్టన్ గ్రామమునొద్ద సైన్యోపయోక్తములగు వస్తుసామగ్రుల నపరిమితముగ నమెరికనులు సంగ్రహించియుండి గని విని వానిని కొల్లగొట్టునిమిత్తము ఫ్రెడరిక్ బాం అనునతని సాయమున ౧,౦౦౦ సైనికుల నంపెను. కాని యచటికిఁ జేరకపూర్వమే జనరల్ స్టార్కు అను అమెరికన్‌సేనాని హరిన్మహీధరయువకుల (Green Mountain Boys) సాహాయ్యమున ఫ్రెడరిక్ బాంసేనను చెదరఁగొట్టుటయేకాక అతనికి సాయపడ వచ్చిన కల్నల్ బ్రెమన్‌డంపును సైతము నాశనము గావించెను. ఇందుచే బ్రిటిషువారికి ౧,౦౦౦ యోధులు నష్టమైరి. బర్గోయినునకు సాహాయ్యము చేయుటకై మొహాక్‌లోయనుండి కల్నల్ బారీ సెంట్‌లీజరు నాయకత్వముగల వేఱొకసైన్యమునకును ఇట్టిగతియే పట్టినది. జనరల్ నికోల్సు హెర్కిమేర్ అను అమెరికనుసేనాధిపతి ఒరిస్కనీ దగ్గఱ లీజరున కడ్డుతగిలెను. స్థితిగతులింత ప్రతికూలముగ నుండినప్పటికిని ధైర్యసాహసములను వీడక బర్గోయినుమిక్కిలి ప్రయాసముతో దక్షిణమువైపునకు వచ్చెను. కాని మీఁద వ్రాసిన విధమున జనరల్ హో రాకపోవుటచేతను, మఱి యేయితరమయిన తోడ్పాటుగాని దొరకకపోవుటచేతను బర్గోయినునకు మఱి రెండుచోట్ల నపజయము కలిగెను. తుదకు సరటోగానామకప్రదేశమునం దిరుపక్షముల

sampath_Ebooks



వారికిని మహా భయంకరమైన యుద్ధము జరిగెను. అందు బర్గోయిన్ పరాజయమును బొంది ౫,౦౦౦ల సైనికులతోఁగూడ అమెరికనులచేతఁ జిక్కెను. చాంప్లెయిన్ సరోవరమున ఆర్నాల్డు ఓడిపోయినప్పటికిని జయించినటులే యయ్యెను. అతఁ డింగ్లీషువారి నొక సంవత్సరము పర్యంతము ఆఁపుదల చేయుటచేతనే బర్గోయినునకు ఇన్ని బోట్ల నపజయము కలుగఁగా చివరకు సర్టోగాయం దమెరికనులకు సంపూర్ణజయము కలిగినది. అమెరికనుల భాగ్యచక్రమును ద్రిప్పిన దీసర్టోగా విజయమే. అటుపిమ్మట యుద్ధపువైఖరి సంపూర్ణముగ మారిపోయెను.

క్రీ. శ. ౧౭౬౩ మొదలుకొని, అనఁగా ఫ్రెంచివా రాంగ్లేయులచేఁ బరాజితులై అమెరికాయందలి తమ ప్రాంతముల నన్నింటిని బోఁగొట్టుకొనిన నాఁటినుండియు అవకాశము దొరకినయెడల నింగ్లండుపై పగను దీర్చుకొనుటకు వారు తహతహపడుచుండిరి. వలసల తిరుగఁబాటువలన వీరికి శీఘ్రముగనే యట్టి యవకాశము లభించెను. ౧౭౭౪-వ సంవత్సరమునం దమెరికనుకాంగ్రెసు రహస్య వ్యవహారములకై ఒక సంఘమును సృష్టించెను. ౧౭౭౭-వ సంవత్సరమున నిదియే విదేశవ్యవహారసంఘముగ మారి ౧౭౮౧-వఱకు నటులే పనిచేయుచు వచ్చెను. అమెరికనుకాంగ్రెసునకును, దానిరహస్యసంఘమునందలి సభ్యులకును ఫ్రెంచివారి యాంతరంగికాభిప్రాయ మొకటినుండియు విదిత మయియేయుండెను. అమెరికనులు తమదేశముయొక్క యుత్పత్తిసంపదలమీఁదను పూర్ణవిశ్వాసము కలవారై అనుకూల మగు కాలము లభించినవెంటనే మరల నిచ్చివేయుతలంపుతో యూరోపునుండి ఆహారపదార్థములు, ఋణములు మున్నగువానిని దెప్పించుకొనుచుండిరి. ౧౭౭౬-వ సంవత్సరమున సిలస్ డీన్ అనువతఁడు పైకిమాత్రము వ్యాపారపు-ఏజంటుగ పారిస్ నగరమునకుఁ బోయెను. ఫ్రెంచిదొరతనమువారు చూచియుఁజూడనట్లు తటస్థభావము వహించియుండిరి. ఇతనిద్వారా భోజనాదిసామగ్రు లమెరికాకు రవాణా చేయఁబడెను. మఱియు నమెరికన్ నౌకలు ఫ్రెంచిరేవులలోనికి వచ్చుచుండెను. అమెరికన్ నౌకాయోధులు బ్రిటిష్‌నౌకలం బట్టుకొని ఫ్రెంచిరేవులలోఁ జేర్చుచుండిరి. అందుచే బ్రిటిష్‌వ్యాపారమున కమితనష్టము గలుగుచువచ్చెను. మఱియు నదేసంవత్సరమునం దమెరికను కాంగ్రెసు మువ్వురుమాతలను ఫ్రాన్సుదేశమున కంపెను. స్పెయిన్, ప్రష్యా, ఆస్ట్రియా మొదలగు యూరోపురాజ్యములను గలసి వారిని అమెరికన్‌జాతిని స్వీకరించుటకును, దానికి సాయపడుటకును ప్రార్థింపవలసినదిగ నీమాతలనియోజన మైయుండెను. అదేసంవత్సరమున ఆర్థర్ లీ, డీన్ అనువారితోఁ గలసి ఫ్రాంక్లిన్ వ్యాపారికసంధుల గుఱించియు, పరస్పరము గాపాడుకొనఁదలఁచినసంధినిగుఱించియు మాటలాడుటకై ఫ్రాన్సుదేశమున కేఁగియుండెను. కాని ఫ్రాన్సు అమెరికాల ఈసమాచారము లన్నియు సర్టోగాయుద్ధమువఱకును రహస్యముగ జరుగుచువచ్చెను. అనంతర మివి బహిరంగమైనవి. ఈ యుద్ధమునందుఁ గలిగిన విజయముచేతనే ప్రోత్సహింపఁబడి ఫ్రెంచివా రమెరికనులతో పరస్పరసాహాయ్యములకై సంధి చేసికొనిరి. ఏతత్ ఫలితముగ మఱుసటిసంవత్సరమునం దింగ్లండు ఫ్రాన్సులకు యుద్ధమారంభమయ్యెను. స్పెయినునకు బ్రిటీషువారికి మొదటే వైరముండియుండెను. కాని వలసలవారి తిరుగఁబాటు - తమవలస లెక్కడ తిరుగఁబడునో యను భయమున - స్పెయినునకు సమ్మతము కాదు. అందుచే స్పెయిను మౌనముద్ర నూనియుండెను. ఒకసంవత్సరము గడచినవెనుక స్పెయిను ఇంగ్లండునకు విరుద్ధముగ కలహము సాగించినది; కాని ఫ్రెంచివారికి తోడుపడుచుండినట్లే యగపడుచుండెను. అమెరికా - ఫ్రాన్సుల సంధి ౧౭౭౮ లో జరిగెను. తరువాత డచ్చివారును ఇంగ్లండున కెదురు తిరుగ బాధ్యులైరి. సముద్రముమీఁదియాధికారము తమదే యని ఎవరి యోడలనైనను సోదా చూచి తమకు ప్రతికూలము లైన పత్రములు దొరకినచోఁ దీసికొనుటకు హక్కు గల దని వచింపుచు బ్రిటిషువారు హాలెండునకు రాయబారిగ వచ్చుచుండిన హెన్రీ లారన్సు అను నొక అమెరికాదేశీయుని మార్గమధ్యమున నడ్డగించి యతనియొద్ద దొరకిన పత్రముల నన్నింటిని లాగికొనిరి. డచ్చివారి కాంగ్లేయులతో పోరాడుట కిదియే కారణము. అంత నీయుద్ధము కేవలము అమెరికా బ్రిటనులకే కాక విస్తృతరూపమున సమస్తయూరోపుజాతులకును సముద్రవ్యాపారికయుద్ధముగఁ బరిణమించెను. అంత ప్రపంచమునం దెందు నెక్కడెక్కడ నాంగ్లేయ, ఫ్రెంచి, డచ్చి, స్పెయిను లోనగు జాతు లుండెనో అక్కడ నంతయు నీయుద్ధ మారంభ మయ్యెను.

ఫ్రాన్సుతో సంధి జరిగినవెంటనే, ౧౭౭౮-వ సంవత్సరము ఏప్రిల్ మాసమున కౌంట్ డెస్టెయింగ్ నాయకత్వమున నొకగొప్ప ఫ్రెంచిజలసేన ఫ్రాన్సునందలి టౌలన్ రేవునుండి అమెరికాకు బయలుదేరెను. అమెరికాసంయుక్తరాజ్యములమంత్రి యగు యం. కానరడ్ అలెగ్జాండ్రె జెరార్డ్ డిరెనేవల్ అనునతఁడును, అమెరికాకు మరలివచ్చుచుండిన సిలస్ డీనును ఈసైన్యముతో నుండిరి. అమెరికాలోని బ్రిటిషుసేనయం దిప్పుడు జనరల్ హోవు బదులుగా వచ్చిన సర్ హెన్రీ క్లింటన్ ఫిలడల్ఫియానగరమునం దుండెను. ఫ్రెంచిజలసేన అమెరికాకు వచ్చుచుండినవార్త తెలిసినవెంటనే క్లింటన్ స్థలసేనకు రక్షకముగ నుండిన డిలావేర్ నదీముఖముదగ్గఱి బ్రిటిష్ జలసేన ఆప్రదేశమును విడిచిపోయెను. అంత క్లింటన్ అచట నుండి సాహసింపక న్యూయార్కుపట్టణమునకు పోవుచుండ మార్గమధ్యమున మన్మాతు నామకస్థానముదగ్గఱ వాషింగ్టన్ అడ్డగించి పోరాటమునకు దింపెను. ఇచట నమెరికన్ సేనలోని జనరల్ చార్లెస్ లీ నామకమూర్ఖుఁడు చేసిన ద్రోహమువలనఁ గాకపోయిన బ్రిటిష్ సేన సమస్తము నచట నాశనమందియుండెడిది. ఇతఁడు చేసినబుద్ధిహీనపుకార్యమువలననే క్లింటన్ దప్పించుకొని పోయి న్యూయార్కును జేరఁగలిగెను. అదిమొదలు యుద్ధము సమాప్తమగువఱకును న్యూయార్కుపట్టణమే ఆంగ్లేయులకు ముఖ్యస్థానముగ నుండెను. బ్రిటీషువారు ఫిలడల్ఫియాను దీసికొని నప్పుడు దాచోటిని వదలిపోయిన అమెరికనుకాంగ్రెసు మరల నాస్థానము నాక్రమించుకొనెను. అచటనుండియే అమెరికనులు ఫ్రెంచిసేన

sampath_Ebooks

లతో వచ్చిన జరార్డునకు స్వాగతము నొసంగిరి. అతఁ డా ప్రదేశము నందే నిలిచి వాషింగ్టనుయొక్కయు, జనరల్ హొరాషియోగేట్సు యొక్కయు యుద్ధనీతిపద్ధతులకు సాహాయ్యభూతములుగ నుండులాగున ఉపాయములను పన్నుచుండెను. అనంతరము వాషింగ్టనుసేనలు దుర్గపంక్తి నొకదానిని జయింపఁగల్గెను. ఆపంక్తిలో హడ్సన్ సీతభూములందలి వెస్టుపాయంట్ నామకస్థానమును వాషింగ్టన్ తన సేనలకు కేంద్రస్థానముగ నేర్పఱుచుకొనెను. అందువలన నితనికి న్యూపోర్టునందున్న తనవారితో నుత్తర ప్రత్యుత్తరములు సలుపుటకును, బ్రిటీషుసేనలు దేశమధ్యమునకు రానెంచినవాని నడ్డగించుటకును, దక్షిణమందలి డిలావేరుతో సంబంధ ముంచుకొనుటకును, సకల విధ సౌకర్యములును దొరకుటకును ననుకూలముగ నుండెను. డిలావేరునందు బ్రిటీష్ సేన లపరిమితముగ నుండినందున సరియగు జయమును గానక ఫ్రెంచిడెస్టెయింగు న్యూపోర్టునకు వెడలిపోయెను. అచట ఫ్రెంచివారు, అమెరికనులు గలసి ౬,౦౦౦ల బ్రిటీషుసేన నెదుర్కొనఁ బ్రయత్నింపసాగిరి. కాని ఇంతలో ఇంగ్లండునుండి మఱికొంత జలసేన వచ్చుట తెలిసి డెస్టెయింగు స్థలప్రయత్నములను మాని క్రొత్తసేన నెదిరింపఁబోయెను. యుద్ధము స్వల్పకాలమే జరిగెను కాని ప్రచండమగు తుపాను రేఁగుటవలన ఓడలు పాడుగాఁగా, వానిని మరమ్మతు చేయించుకొనుటకు డెస్టెయింగు బోస్టన్ పట్టణమునకు వెడలిపోయెను. అంత న్యూపోర్టునందలి స్థలసేనయు వెనుకకుఁ బోయెను. ఇంతలో బ్రెస్టునందు మఱికొంత ఫ్రెంచిసేన సముద్రతీరములందలి అమెరికను జలసేనలకుఁ దోడ్పడ సంసిద్ధమయ్యెను. ఇదేతరుణమున ఉషాంటు దీవియొద్ద ఫ్రెంచి-బ్రిటీషువారలకు యుద్ధము జరిగెను. కాని పరిణామ మనిశ్చితముగ నుండెను. ఆట్లయ్యు నీయుద్ధము లన్నింటివలనను మిగుల ప్రోత్సాహితులై కెప్టెన్ జాన్‌పాల్ జోన్సు నాయకత్వమున అమెరికనులు బ్రిటీష్‌నౌకలపైని దండెత్తియుండిరి.

వలసలతూర్పుతీరములం దిట్లు పోరాటములు జరుగుచుండిన కాలమందే (౧౭౭౮-౧౭౭౯) పడమటను, ఉత్తరసీమలందును అమెరికనుల కనుకూలములగు విషయములు ఘటిల్లియుండెను. వర్జీనియా రాజ్యముయొక్క ఆధారమున జార్జ్ రోగర్సు అనునతఁడు పశ్చిమోత్తరసీమలందున్న బ్రిటీష్‌వారిస్థానము లన్నింటిని ముట్టడించెను. స్వయంసేవకులసాయముతో నితఁడు ఇల్లినాయిస్ ప్రాంతమందలి బ్రిటీష్‌వారి ప్రధానస్థానమగు కస్కాసియాను ముట్టడించి యనంతరము విన్సెన్నెసును సైతము లోఁబఱుచుకొనెను. తరువాత డెట్రాయిటునందలి ఆంగ్లేయసేనాధిపతి ఆపట్టణమును జయించి తీసికొన ౧౭౭౯లో అమెరికనుసేనాని క్లార్కు అనునతఁడు మఱికొంతసేనను వెంట నిడికొని యానగరమును ముట్టడించి మరల వశపఱచికొనెను. ఈ పశ్చిమోత్తరదండయాత్రవలన నమెరికనుల కమితమగు లాభము కలిగెను. ఇందువలన పడమటిసరిహద్దులనుండి కోణహిందువులు కావించునాక్రమణములు పూర్తిగ తగ్గిపోయెను. యుద్ధానంతరము సంధికాలమునం దమెరికను లీసరిహద్దులందు తమకుఁగల హక్కును బుజువుపఱుచుకొనుటయందు సమర్థులైరి. మఱియు నీపశ్చిమవిజయము వలన ముస్ముందు ఆవైపునఁ దమయధికారమును వ్యాపింపఁజేసికొనుట కత్యుత్తమమైన అవకాశము దొరకెను.

ఇఁక నిటు పూర్వభాగమున న్యూయార్కుపట్టణముఁ జేరిన పిమ్మట క్లింటన్ సైతము హోకంటె నెక్కుడుగ నేమియుఁ జేయఁజాలఁడయ్యెను. వెస్టుపాయింటునొద్ద సేనానివేశ మేర్పఱుచుకొని యున్న వాషింగ్టనును ఎదిరింప ధైర్యము చాలక అతని నెటులైన నాయున్నతస్థానములనుండి క్రిందికి మైదానములోనికి లాగవలయునని ఇతఁ డనేకప్రయత్నము లొనరించుచు స్టోనీపాయింటునొద్ద ౭౦౦ల మంది యోధులను సైతము పోఁగొట్టుకొనెను. జనరల్ వేన్ అను అమెరికనుసేనాని ఆశ్వదళముతో స్టోనీపాయింటునొద్దనున్న క్లింటన్ సేనను నాశనము చేసిపోయెను. ఇంతపర్యంతము ఒనైదసులు, టస్కరోరసులలోని కొందఱును దక్కఁ దక్కిన ఇరోకోయిస్‌జాతుల ఇండియను లందఱును బ్రిటీష్‌వారిపక్షమును వహించియుండిరి. బ్రిటీష్‌పరిపాలకుల ప్రోత్సాహముచేతనే ఈయిండియనులు పడమటివలసలమీఁదఁ బడి కొల్లగొట్టుచు, అచటఁ గాఁపురము సేయువారిని హింసించుచుండిరి. ఇంతియే కాదు. న్యూయార్కు రాజ్యపు పడమటిసరిహద్దులలోని రాజపక్షీయు లమెరికనులభూములపైఁ బడి దోపిడు లొనరింపసాగిరి. అంత జాన్‌సల్లివన్ అనెడి అమెరికనుసేనాపతి గొప్పదండును వెంట నిడుకొనిపోయి ప్రస్తుతపు ఎల్మిరానామకస్థానమున నున్న న్యూటౌనుదగ్గఱ నీవోపిడికాండ్ర నందఱను సంపూర్ణముగ నోడించి చెదరఁగొట్టెను. అనంతరము పశ్చిమన్యూయార్కులోని సరోవరసమీపములందు నివసించునిండియనుల గ్రామముల నన్నింటిని తగులఁబెట్టించి వారిపంటలను నాశనము చేయించెను. వలసలలోనిస్థితిగతు లిట్లుండ నిదేసమయమున పశ్చిమహిందూద్వీపములందును బ్రిటీష్ - ఫ్రెంచివారి మధ్యను కలహములు చెలరేఁగుచుండెను. మిక్కిలి సారవంతములైన నేలలు గలిగి, ఉత్పత్తి నపరిమితముగ నిచ్చుచుండుటవలన నీదీవు లాకాలమున ప్రపంచమందలి వ్యాపారికస్థానము లన్నింటిలోను ప్రధాన మైనవిగ నెంచఁబడుచుండెను. అందుచే ఆదీవులపై నధికారము తమదే యని ఫ్రెంచివారును, బ్రిటీష్‌వారును పరస్పరము పోరాడసాగిరి.

యుద్ధము లీప్రకారముగ జరుగుచున్నసమయమందే వలసలవారు తమదేశమున కవసరములైన ప్రభుత్వవిధానముల నేర్పఱుచుకొన మొదలిడిరి. కాంగ్రెసుసభ్యులు రాజ్యసంయోజనము (Confederacy of States)న కేనియమము లనుకూలముగ నుండునో ఆలోచింపఁ గడఁగి విప్లవము (Revolution)వలనఁ గల్గిన ప్రత్యక్ష ఫలితములను సుస్థిరములుగఁ జేయుటకు ప్రయత్నింపసాగిరి. అప్పటి జనులకు రాజప్రభుత్వ మనిన ద్వేషము కలుగుచుండెను. సర్వాధికారములును ప్రజలయందే యుండినవి. అవి వారు తెచ్చిపెట్టికొనినవి కావు; సహజములు. ప్రభుత్వమునకు వీనిజవాబుదారీ లేదు, అనఁగా ప్రజల కధికార మిచ్చునదియుఁ బుచ్చుకొనునదియు ప్రభుత్వము కాదు. ప్రభు

sampath_Ebooks

త్వము జన్మింపకపూర్వమునుండియే సమస్తాధికారములును ప్రజలయందు విద్యమానము లైయుండెను. ప్రజయే ప్రభుత్వమున కధికార మిచ్చునది; మరల వారివలననుండి పుచ్చుకొనునది. ప్రజలవలననుండి యధికారము నొందినపిదప ప్రభుత్వము సర్వసామాన్యుల లాభమునకును, రక్షణమునకును ఉత్తరదాయిత్వమును వహించును. ప్రభుత్వోద్యోగు లిందుల కుత్తరదాతలు. ఏవిషయ మయినను వీరు లోబడి ప్రజలకు ప్రత్యుత్తర మిచ్చితీరవలెను. ప్రభుబిరుదము లనవసరములు. ఏయుద్యోగమునకుఁ గాని, ఏ యధికారమునకుఁ గాని పరంపరగా వచ్చుబిరుదములు (Hereditary Titles) ఉండ నక్కఱలేదు. ఈహేతువుచేత వర్జీనియాయందలి క్రమగతాధికార పద్ధతి (System of Entails) తీసివేయఁబడినది. నిరంకుశాధికారము నెదిరించుట అశాస్త్రీయ (Unlawful) మను సిద్ధాంతము ధృఢసాఖ్యము. స్వతంత్రరాజ్యముయొక్క జీవనవిస్ఫూర్తికి స్వాయత్తీకరణములు (Monopolies) ప్రత్యక్షవిరుద్ధములు. వార్తాయాంత్రాత్మలకు లవమాత్రమైన నిర్బంధము లుంచక స్వేచ్ఛాయుతము లైయుండవలెను. న్యాయపూర్వకముగ, అతిశీఘ్రముగ జరుగునట్టి పంచాయతీవిమర్శనముల కాటంకములను గలుగనియ్యఁ గూడదు. ఎన్నికలు తఱచుగను, స్వేచ్ఛగను జరుగుచుండవలయును. ప్రభుత్వాంగములందు వ్యవస్థాపకసభ ప్రధానమైనది. వివిధాధికారములు విభక్తములు కావలయును. వ్యవస్థాపకసభా నిర్వాచకు లెనిమిదిరాజ్యముల శాసకు లైయుండవలయును - అని ఇట్టివే యగు నియమము లనేకము లేర్పడెను.

జాన్ డికిన్‌సన్ రాజ్యసంయోజనమునిమిత్తము ౧౭౭౬-వ సంవత్సరమునందే కొన్ని నియమముల నేర్పఱచి యందఱకును వినిపించియుండెను. స్వాతంత్ర్యఘోషణానంతరము కొన్ని వారములవఱకును వీనిపైని వాదవివాదములు జరుగుచువచ్చెను. కాని అటుపిమ్మట యుద్ధముయొక్క ఒత్తిడివలన ౧౭౭౭వఱకు నవి యటులే పడియుండెను. యుద్ధసమయమున జయాపజయములు తాఱుమాఱగు చుండుటచే అట్టితరుణమున జను లందఱు నంగీకరించెదరో అంగీకరింపరో యనుసందేహమున వానిని బయలుపఱుపక యుంచి చివరకు సరటోగాయందుఁ గలిగిన జయమువలన జను లుత్సాహపూరితు లైయున్నయదను గనిపట్టి యప్పుడు జనస్వీకారార్థము వానిని రాజ్యము లన్నింటికిని బంపిరి. వానిలో ప్రజాప్రభుత్వ సంఘ నియమములు, వాని విధులు, కాంగ్రెసున కొసంగఁబడిన యధికారములు, జనుల పౌరాధికారములు, జను లిచ్చు వోట్లను పరిష్కరింపవలసిన విధానములు-అన్నియు విశదీకరింపఁబడి యుండెను. కాని వలసలకు పశ్చిమముగా ఉన్న నేలలవిషయమున విరుద్ధాభిప్రాయము లేర్పడుటవలన ప్రజ లీ సంయోజననియమములకు వెంటనే సమ్మతింపరైరి.

పోరాటము లారంభింపకపూర్వమునుండియే జను లనేకులు అప్లాషియనుపర్వతములను దాటిపోయి యచట వారి వారి యానుకూల్యములనుబట్టి పంచాయతీరాజ్యములనో (Commonwealths), లేక స్వామ్యధికారప్రాంతములనో (Proprietory Provinces) నిర్మింపవలెనని ప్రయత్నింపసాగిరి. ఇట్లు వర్జీనియాకు పడమట కెంటకియాప్రాంతమును, ఉత్తర కెరొలీనాకు పడమట వటౌగా ప్రాంతమును ఏర్పడెను. డేనియల్ బూను అనునతఁడును అతనియనుయాయులును గలసి ఇంకను పశ్చిమమునకుఁ బోయి ట్రాన్‌సిల్వానియా పంచాయతీరాజ్యమును ఏర్పాటు చేయనెంచిరి. ఇదే విధమున నదివఱ కేర్పడియుండిన సముద్రప్రాంతపువలసలలో దేనినో యొకదాని ననుసరించి క్రొత్తవలసలను సృష్టించునిమిత్తము ప్రయత్నములు జరుగుచుండెను. ఈకార్యముల నన్నింటిని దలపెట్టిన పశ్చిమారణ్యవాసులు (Backwoodsmen) మిక్కిలి వైయక్తికులు (Individualists). ప్రభుత్వముమీఁదను దిరుగఁబడుట యనిన వీరికి మహానందము. స్వాతంత్ర్యయుద్ధమునెడల వీరికి మిక్కుటమగు సహానుభూతి. తూర్పువలసలం దింకను అవశిష్టము లైయుండిన క్విట్‌రెంట్లు మున్నగు దాస్యచిహ్నము లనిన వీరికి పరమాసహ్యము. అట్టి దాస్యలాంఛనములనుండి దూరగులై స్వేచ్ఛగల భూములందు, స్వేచ్ఛాజీవనములను సలుపవలయు నని వీరి పడమటిసీమలకు వచ్చిచేరిరి. డెట్రాయిట్ నగరమందలి ఆంగ్లేయులు శోణహిందువులను ప్రోత్సహించి పంపిన దీక్రొత్తసీమలమీఁదికే. ఈ దొంగదోపిడులను రూపుమాపుటకే క్లార్కు వర్జీనియాసేనతో పోయి శోణహిందువులనే కాక వారిని ప్రోత్సహించిన ఆంగ్లేయులనుగూడ నడఁగఁద్రొక్కి ఉత్తరపశ్చిమపు పరిహద్దులం దమెరికను అధికారమును స్థాపింపఁగలిగెను.

మిసిసిప్పీలోయయందలి ఈక్రొత్త నేలలమూలముననే వలసలవారు సంయోజననియమములను వెంటనే యంగీకరింపరైరి. పెద్దరాజ్యములకును చిన్నరాజ్యములకునుగల పరిమాణభేదమే వీరివివాదములకు మూలకారణము. పెద్దరాజ్యములవారు తమ్ము మ్రింగివేయుదు రని చిన్నరాజ్యములవారు భయపడసాగిరి. అప్లాషియన్‌పర్వతములకును, మిసిసిప్పీనదికిని మధ్య మస్‌షూసెట్స్, కన్నెక్టికట్, న్యూయార్కు, వర్జీనియాలకును, దక్షిణమందలి మఱిమూఁడురాజ్యములకును ఎక్కుడు భూము లుండెను. న్యూ హాంప్‌షైర్, న్యూజెర్సీ, డిలావేర్, మేరీలాండులకు పడమట వ్యాపించుటకు వీలు లేకుండెను. ఈపెద్దరాజ్యములవా రింకను బెరుఁగుచు పోయినచోఁ దమ్ము నెక్కడ మ్రింగివేయుదురో యనుభయమున చిన్నరాజ్యములవారీరాజ్యసంయోజనమందుఁ బ్రవేశింప నిష్టము లేక పడమటిసీమలం దెక్కువభూములుగలవారు సంయుక్తరాజ్యములసార్వజనికలాభమునకై వారిహక్కులను వదలుకొనవలయు నని పట్టుపట్టిరి. అనంతరము రాజ్యములసమానత (Equality of States), జాతీయత (Nationality) అను నీ రెండువిషయములును గెలుపునొందువఱకును మేరీలాండువాసులు తమయంగీకారము నొసంగరైరి. అంత పెద్దరాజ్యములవారు వారినేలలపైఁగల హక్కును వదలుకొనఁగా ఆభూములను వేఱురాజ్యముల క్రింద విభాగించి తన్నివాసులును దక్కినవారితోపాటు సమానాధికారములు గలిగి సంయోజనమందు చేరవలయు నని కాంగ్రెసు ఘోషణము గావించెను. అటుపిమ్మట మేరీలాండువాసులుగూడ సంయోజననియమ

sampath_Ebooks

ముల నంగీకరించి పంపిరి. అంతట నీనియమము లన్నియు కార్య రూపమునకు వచ్చెను. సంయుక్తరాజ్యనివాసులు నూతనభూముల నాక్రమించుచు అభివృద్ధి నొందఁగలమార్గము లిందువలన లభించెను.

౧౭౭౮ - ౭౯-వ సంవత్సరములం దుత్తరపువలసలలో జరగినయుద్ధములచే బ్రిటీషువారిమనోరథము సిద్ధింపనందున నిపుడు వారి దృష్టి దక్షిణపువలసలకు దిగెను. అంతపర్యంతము నుత్తరమునఁ గావించుచువచ్చిన కార్యములను బొత్తిగ వదలక, దక్షిణభాగములను సంపూర్ణముగ లోఁబఱచుకొనవలె నని నిశ్చయించిరి. ౧౭౭౮-వ సంవత్సరమునందే సర్ హెన్రీ క్లింటన్, సర్ పీటర్ పార్కర్ అనువారు చార్లెస్టన్ పట్టణముమీఁద నాక్రమణము సలిపియుండిరి. కాని అమెరికన్ సేనాని జనరల్ విలియమ్ మూల్ట్రీయొక్క బలము నెదురఁబాటువలన వారిప్రయత్నములు విఫలము లయ్యెను. తదనంతరము ౧౭౭౯ లో ఫ్రెంచివారును, అమెరికనులును గలసి యుద్ధ మొనరింపఁ గడఁగినందున నపుడును బ్రిటీషువారి కంతగ లాభించినదికాదు. కల్నల్ ఆర్చిబాల్డు కాంప్ బెల్ అనువతఁడు న్యూయార్కులోని క్లింటనుసేన నుండి ౩,౫౦౦ ల సైనికులను వెంటఁగొని సవన్నానగరముమీఁదఁబడి యచట నమెరికనుసేనానియగు రాబర్టుహోవ్ నాయకత్వమున నున్న సేన నోడించెను. తరువాతి నెలలో నితఁడు దేశమధ్యమునఁ బ్రవేశించి అగస్టాను స్వాధీనపఱచుకొనెను. అటుపిమ్మట రాబర్టు హోవ్ కు బదులుగ వచ్చిన బెంజమిన్ లింకలన్ ఆంగ్లేయులను జార్జియానుండి వెడలఁగొట్టుటకు ప్రయత్నించుచుండెను. కాని ఫ్లోరిడాయందు బ్రిటీష్ సేనాదండనాధికారి యగు జనరల్ అగస్టయిను జార్జియాలోని ఇంగ్లీషువారికిఁ దోడ్పడుటకు వచ్చుటచే లింకలన్ తనప్రయత్నమును విడనాడి చార్లెస్టనునకు మరలిపోవవలసినవాఁడయ్యెను. అగస్టయిను సవన్నాను ముఖ్యస్థానముగఁ జేసికొని జార్జియానుగూడఁ బాలింపసాగెను. అనంతరము ఆంగ్లేయులు కెరొలీనాయందలి దక్షిణోత్తర ఖండముల రెండింటిని గొల్లగొట్టిరి. ఇదేసమయమున క్లింటను జలస్థలసైన్యములకు నాయకుఁడై సవన్నాయందలి దండనాధికారికిఁ దోడ్పడుటకు బయలుదేఱెను. ఇందునిమిత్త మితఁడు న్యూపోర్టును వదలిపెట్టి న్యూయార్కును విల్ హెల్మ్ వన్ నిఫౌసెన్ నామకజర్మనుసేనాని వశమునం దుంచి ౭,౫౦౦ ల సైనికులతో బయలువెడలెను. కార్న్ వాలిస్ ఇతనివెంటనే యుండెను. తరువాత లార్డు రాడను మఱికొంత సేనతో వచ్చి కలసికొనెను. వీరు - క్లింటనుప్రభృతులు - మార్గములో నున్న చార్లెస్టనునగరము నాక్రమించి బయటనుండి సాహాయ్యము రాకుండ నరికట్టుటచే లింకలనునకు లోఁబడక తప్పదయ్యెను. లింకలన్ దగ్గఱ నపుడు ౫,౦౦౦ ల సైనికు లుండిరి. వీ రందఱితోఁ గూడ చార్లెస్టనుపతనమువలన అమెరికనులకు భరింప నలవికానిక్షతి కలిగెను. దీనితో దక్షిణకెరొలీనారాజ్య మంతయు లోఁబడిపోయెను. అటుతరువాత నుత్తరకెరొలీనానుసైతము జయించుటకు సలహా నిచ్చి కార్న్ వాలిసును అచటనే నిలిపి క్లింటన్ తాను సవన్నాకుమాఱుగ న్యూయార్కునకే మరలిపోయెను.

ఇదేసమయమున నుత్తరపువలసలందు ప్రస్తుతపుకాస్టయిన్ అను స్థానమునం దమెరికనులకును బ్రిటీషువారికిని నెలరోజుల పర్యంతము తీవ్రమగు యుద్ధము జరగెను. కాని తుదకు బ్రిటీషువారికి బయటనుండి బలమును సాహాయ్యము వచ్చినందున అమెరికనులు వెనుకకు మరలిపోయిరి.

ఇంగ్లీషువారు చార్లెస్టనును జయించుటచేత దక్షిణకెరొలీనాయం దమెరికనుల ప్రభావము తగ్గిపోయినది కాని దానిని సంయోజనమునుండి విడఁదీసి యాప్రాంతమునందే యుద్ధమును గుద ముట్టింపవలయు ననుకొనిన బ్రిటీషువారి యభిప్రాయమువాత్రము నెఱవేఱినదికాదు. ఇందులకు కారణము, ఆంగ్లేయు లచటఁ గావింపఁ గడఁగిన క్రౌర్యములే. చార్లెస్టన్ వద్ద లోఁబడిన అమెరికను సైనికు లందఱును బ్రిటీషువారిక్రింద సైనికోద్యోగములను స్వీకరించి వారి పక్షమునఁ బోరాడవలయు నని ఆంగ్లేయు లొక యుత్తరువును గావించిరి. కల్నల్ బనస్ట్రె టర్లేటన్ అనునతఁడును, కొందఱు టోరీలును, వారి గుంపులును గలసి శతయుత్తరపువ్వల వమలులోఁ బెట్టుటకై చేసిన దారుణక్రౌర్యములమూలమున దక్షిణకెరొలీనాయందు ముఖ్యముగ నుత్తరపుపై పు జిల్లాలలో గుములయుద్ధ మానంధముగాఁగా మహాసంక్షోభము కలుగసాగెను. రాజపక్షీయు లను టోరీ లొకప్రక్కను, విగ్గు (Whigs) లందఱును మఱియొకవైపునను గుములుగుములుగ బయలువెడలి పరస్పరము హత్యలను గావించుకొనసాగిరి. ఆయుద్ధ పాణులై అశ్వికులుగఁ గొందఱును, తుపాకులు ధరించి కొందఱును ఒకరి నొకరు చంపుకొనుచుండిరి. టర్లేటను అకస్మికముగ లింకలను యొక్క అశ్వికదళముమీఁదను బడి దానిని చెల్లాచెదరుగఁ బాఱఁదోలెను. మఱియు నితఁ డుత్తరకెరొలీనా సరిహద్దులం దున్న బ్యూఫోర్టుస్థానమునందలి వర్జీనియా పటాలమును నాశన మొనరించెను. అమెరికనులను భయభ్రాంతులఁ గావించు నిట్టి దారుణకృత్యము లొకప్రక్కను జరగుచుండినప్పటికిని వేఱొకప్రక్కను ఫ్రాన్సిస్ మారియన్, థామస్ సుమ్టర్ లవంటి ధీరులు కొంద ఱమెరికన్ సేనానులు బ్రిటీషువారి బహిస్సేనానివాసముల ముట్టడించి గెలుపొందుచు తమ జాతియందు రణోత్సాహము క్షీణింపకుండునట్లుగఁ జేయుచుండిరి. హాంగింగ్ రాక్, నైంటీసిక్స్, రాకీమౌంట్ మున్నగు ప్రదేశములం దమెరికను లత్యంతసాహసకార్యము లొనరించి మాతృదేశమునందు వారికున్న యభిమానమును ప్రేమను వెల్లడించుకొనిరి. కాని కరొలీనాయందలి స్థితిగతులవలన అమెరికన్ కాంగ్రెసునకును, వాషింగ్టనునకును మిక్కిలి ఖేదము కలిగెను. అచట నపాయమం దున్నవారిని రక్షింప వీరు ప్రయత్నింపసాగిరి. మఱియు నీసంవత్సరమునఁ గలిగిన యార్థికదుఃస్థితివలనను, జనులలో నుత్సాహము క్షీణించుటచేతను వాషింగ్టనున కేమిచేయుటకును పాలుపోకుండెను. లింకలన్ పరాజయముచే బ్రిటీషువారల నెదిరింప వేఱొండుసేనను దక్షిణమునకు పంపవలసి వచ్చెను. కావున జొహాన్ డికల్బ్ యొక్క ఆధిపత్యమున వాషింగ్టన్ కాంపునుండి ౨,౦౦౦ ల సైనికులుగల సేన శీఘ్రప్రయా

sampath_Ebooks



గములతో దక్షిణమునకు వెడలెను. ఈ సైనికులు జనరల్ గేట్సు యొక్క ముఖ్యసేనానాయకత్వమున కామ్డెన్ పట్టణము మీఁది కేఁగి యచట నున్న కార్న్‌వాలిసును ముట్టడించిరి. కాని గేట్సునకు సంపూర్ణమగు పరాజయము కలిగెను. డికల్బు యుద్ధమునందే హతుఁ డయ్యెను. ఆపైన కటుసిమ్మటు జనరల్ గ్రీన్ అనునతఁడు సేనాని యయ్యెను. కార్న్‌వాలిస్ అటనుండి ఉత్తర కెరొలీనాకు వెడలెను. అతఁడు క్లింటనుతో చేసికొనిన యేర్పాటు ప్రకార ముత్తర కెరొలీనా, వర్జీనియా రాజ్యముల వెంబడి బాల్టిమోర్, ఫిలడెల్ఫియా పట్టణములకుఁ బోవలసియుండెను. కాని మార్గమందలి స్థితిగతు లితని నట్లు పోనీయ వయ్యెను. జనరల్ గ్రీనుతో నితనికి సంగ్రామము కలిగెను. ఆసంగ్రామమునకు పూర్వమే కింగ్సుమౌంటెన్, కౌపెన్సు నామక ప్రదేశములందు కార్న్‌వాలిస్ పక్షపుసేనలకు పరాజయము కలిగెను. కౌపెన్సు వద్ద టార్లెటనునకు సంపూర్ణమగు పరాజయము కలిగెను. ఈ యుద్ధముల వలన బ్రిటిష్‌సేన క్షీణించిపోవుచుండినను, ధైర్యసాహసములను గోల్పోవక కార్న్‌వాలిస్ ఉత్తరకెరొలీనానుండా పోయి వర్జీనియా సీమలందు గ్రీనుతోఁ బలుపడి యతనిసేనను కొంతవఱకు చెదరఁగొట్టి ముందునకు సాగిపోయెను. ౧౭౮౧-వ మార్చినెలలో గిల్‌ఫోర్డుకోర్టుహౌసునొద్ద నమెరికన్-బ్రిటిషుసేనలకు మరల కలహ మయ్యెను. ఇందును బ్రిటిషువారికి జయము కలిగినప్పటికిని ౬౦౦ ల సైనికులు మరణించిరి. అప్పటికి కార్న్‌వాలిసు వెంబడి ౧౫౦౦ ల సైనికులుమాత్రము మిగిలిరి. అస్వల్పసేనతో గ్రీనును వెన్నంటి తఱుముటకు సాహసింపక హెల్స్‌బరోకు పోయి, యచట బ్రిటిషుపతాకము నితఁడు నెలకొల్పెను. అక్కడ కొన్నివారములు గడపి క్రొత్తసైనికులను ప్రోవుచేసికొనుసభిప్రాయముతో నితఁడు తరువాత సముద్రతీరమందలి విల్మింగ్టనునకు వెడలిపోయెను. అంత గ్రీను ఇతఁడు పోయినదిశకుఁ బోవక దక్షిణకెరొలీనాయందలి కామ్డెన్, చార్లెస్టన్ నగరములవైపునకుఁ దిరిగెను. అక్కడ నితఁడు బ్రిటిషుసేనాని యగు రాడెనును తఱుమఁగొట్టి కార్న్‌వాలిసు నచటికి రప్పింపవలెనని ప్రయత్నించెను. నైంటీసిక్సుయొద్దనున్న బ్రిటిషుస్థానమును ముట్టడించెను కాని యందితనికి జయము గలుగదయ్యెను. సెప్టెంబరునెలలో యూటా స్ప్రింగ్సునొద్ద మఱియొక యుద్ధము జరిగెను కాని యందును ఇరుపక్షములవారికి నమితముగ నష్టము కలిగెను. కాని గ్రీనుయొక్క ఆజ్ఞానుసారము చిల్లరపోరాటములను సలుపఁగడఁగిన మారియన్, సుమ్టర్, అంద్రూ పికెన్సు, హెన్రీలీ, విలియం వాషింగ్టన్ అనువారలు మాత్రము పోయినచోట నంతయు జయమునే కాంచిరి. బ్రిటిషు పక్షపాతులైనవారి రక్షణార్థము విడివిడిగ నక్కడక్కడ స్థాపింపఁబడియుండిన ఇంగ్లీషువారిస్థానముల (Posts) మీఁదను బడి కొన్నింటి నాక్రమించికొనియుఁ, గొన్నింటిని చెదరఁగొట్టి నాశనము గావించియు నుండిరి. బ్రిటిషువారలకుఁ దోడ్పడ వచ్చిన జనరల్ రాడన్ తనక్షీణసేనతో చార్లెస్టన్ దాటిపోవుటకు సాహసింపక దక్షిణప్రాంతములను వదలి యానగరమునకే పోయెను. ఇట్లు దక్షిణము నుద్ధరించె ననుకీర్తి గ్రీనునకుఁ జేకూరినది. కాని దక్షిణమం దీపరిస్థితులు గలుగుటకు ముఖ్యకారణము కార్న్‌వాలిసు ఈచోటు వదలి వర్జీనియాకుఁ బోవుటయే. వర్జీనియాను గెలువకుండిన దక్షిణప్రాంతములను వశమునం దుంచికొనుట అసాధ్యమని యితఁడు తలపోసియుండెను. మఱియు వర్జీనియాకుఁ బోయిన యెడల జలసేనాసాహాయ్యమున నక్కువ లాభము నొందవచ్చు నని యితని యుద్దేశమైయుండెను. కాని యిందువలన నమెరికనులకే లాభము కలిగెను. విల్మింగ్టనునుండి కార్న్‌వాలిసు పీటర్సుబర్గు అనుపట్టణమున కేఁగెను. అచట క్లింటన్ పంపినసేన ౫,౦౦౦ ల వఱకు నుండెను. అమెరికన్ కాంగ్రెసు చేసినతీర్మానమువలన క్రుద్ధుఁడై స్వపక్షమును వీడి శత్రుపక్షమునఁ జేరిన బెనిడిక్ట్ ఆర్నాల్డును, విలియం ఫిలిప్సు అను వేఱొకవ్యక్తియు పీటర్సుబర్గుసేనకు నాయకులుగ నుండిరి. కెరొలీనాయందు కార్న్‌వాలీసు చేయుచున్న కార్యములకు సాహాయ్యభూతములుగ నుండులాగున చెసపీక్-అఖాతమునం దొక సేనాస్థానము నేర్పాటుచేయుటకు వీరిచటికిఁ బంపఁబడియుండిరి. వర్జీనియారాజ్యమున నెదురఁబా టేమియు లేదని యుత్తరమున ఫ్రెడరిక్స్‌బర్గువఱకును, పడమట చార్లెట్టోస్విల్లీ వఱకును గల ప్రదేశము నంతను బ్రిటిషువారు కొల్లగొట్టిరి. కాని యింతలో లెఫయట్టె నాయకత్వమున నొక యమెరికనుసేన వీరి నడ్డగించెను. ఈ పరిస్థితిని గనిపట్టి భూమిమీఁద నింకను యుద్ధము సాగించుటకుఁ దగినంత సేనాబలము లేనందున జలసేనకు సమీపములో నుండులాగున నొక యనుకూలప్రదేశమును సేనానివేశముగ నేర్పఱుచుకొనవలసిన దని న్యూయార్కునందలి క్లింటన్ కార్న్‌వాలిసునకు నుత్తరువు గావించెను. ముందట కెరొలీనాను విడువవలసిన దని క్లింటనుయొక్క అభిమతము గాదు, కాని ఎట్లును వదలి వచ్చినందున చేయునది లేక క్లింటను అట్టి యుత్తరువును గావించెను. ఈయాజ్ఞల ననుసరించి కార్న్‌వాలిస్ యార్కుటౌనునొద్ద విడిసెను.

అప్పటిపరిస్థితులయందు సముద్రముమీఁద నందును ముఖ్యముగ చెసపీక్-అఖాతముమీఁద నధికారము గలిగి దానిని వశమునం దుంచికొనుట పరమావశ్యక మైయుండెను; ఎందుచేత ననఁగా, కార్న్‌వాలిసున కాహారసామగ్రులు మున్నగునవి రావలసినను, వాషింగ్టనునకు న్యూయార్కు ప్రాంతములనుండి త్వరితముగ సేనలు రావలసినను, అదియే అనుకూలమైన మంచిమార్గము. ఆకారణమున కార్న్‌వాలిస్ యార్కుటౌనునందు దిగెనను సంగతి తెలిసిన వెంటనే ఒక్కపర్యాయముగ భూమియందుండియు, జలమునందుండియు నతనిని ముట్టడింపవలయు నని వాషింగ్టను కృతనిశ్చయుఁడయ్యెను. తదనుసారముగ నాతఁడును, అతనికి సాయపడ వచ్చిన రోచెంబో నామక ఫ్రెంచిసేనానియు నిరువురును గలసి పశ్చిమహిందూ ద్వీపములందు బ్రిటిష్‌వారితో పోరాడుచుండిన ఫ్రెంచివారల నౌకాసేనలను చెసపీకు-అఖాతమును వశపఱుచుకొనవలసినదిగ నుత్తరువుల గావించిరి. ఫ్రెంచి ఎడ్మిరల్ డి. గ్రాస్సి అందులకు సమ్మతించి

 sampath_Ebooks

౧౭౮౧-వ సంవత్సరము ఆగస్టుమాసమున ౨౮ నౌకలతో హౌయిస్ట్ నుండి బయలువెడలి రాఁదొడఁగెను. బ్రిటీష్ ఎడ్మిరల్ గ్రేవ్సుకు ఈవార్త శీఘ్రముగనే తెలిసినందున ఇతఁడును వెంటనే బయలుదేఱెను కాని గ్రాస్సీ పోవనెంచిన నిర్దిష్టస్థాన మేదియో యది ఇతనికిఁ దెలియదు. కావున గ్రాస్సీకంటె ముందుగనే చెసపీకు-అఖాతమును జేరి యచట నేమియుఁ గానక న్యూయార్కునకుఁ బయనమై పోయెను. అచటి కేఁగినపిదప, వాషింగ్టన్, రోచెంబోలు దక్షిణాభిముఖులై ప్రయాణములు సలుపుచుండుట వినినతోడనే వారి యుద్దేశము యార్కుటౌనును ముట్టడించుట యని గ్రహించి వెంటనే యతఁడు దక్షిణమునకు మరలెను. కాని ఈమధ్యకాలములో గ్రాస్సీ చెసపీకు-అఖాతమునఁ బ్రవేశించి యచట నిలువఁదగిన నెలవు నేర్పఱుచుకొని కార్న్వాలిసు దక్షిణమునకుఁ దప్పించుకొని పోకుండునట్లుగ జేమ్సునదియందును క్రూయిజరు-ఓడలను స్థాపించెను. భూమిమార్గమున నేతెంచి వాషింగ్టను, రోచెంబోలు యార్కుటౌనును ముట్టడించిరి. తరువాత బ్రిటీషుజలసేన చెసపీక్-అఖాతమునకు రాఁగా ఫ్రెంచిజలసేన దానిని నోడించి పాఱఁదోలెను. బ్రిటీషు ఎడ్మిరలు వారమురోజుల పర్యంత మచట సమీపముననే యుండి లేశమాత్రమైన నవకాశము లభించునో, లోపలఁ జొరఁబడి కార్న్వాలిసునకుఁ దోడ్పడవలయునని శతవిధములఁ బ్రయత్నించెను గాని వీలు కలుగదయ్యెను. మీఁదు మిక్కిలి న్యూపోర్టునుండి వేఱొక ఫ్రెంచిజలసేన తన మీఁదికి రాఁగా గ్రేవ్స ఆచోటు వదలి న్యూయార్కునకు పోవవలసినవాఁడయ్యెను. ఈప్రకారము సముద్రమార్గమున దొరకవలసిన సమస్త విధములగు తోడ్పాటులనుండియు వంచితుఁడై భూమిమీఁదనుండి వాషింగ్టన్-రోచెంబోల-ఆక్రమణ మత్యంతతీవ్రరూపమును దాల్పఁగాఁ, జేయునది లేక ౧౭౮౧-వ సంవత్సరము అక్టోబరు ౧౯-వ తారీఖున కార్న్వాలిసు అమెరికనులకు లోఁబడిపోయెను. దీనితో అమెరికా స్వాతంత్ర్యయుద్ధము పరిసమాప్త మయ్యెను.

యార్కుటౌనునందు కార్న్వాలిసు ఓడిపోయినవార్త తెలిసిన వెంటనే ఇంగ్లండులో లార్డునార్తు మంత్రిపదమునుండి వెడలఁగొట్టఁబడెను. ఇంగ్లండురాజు అమెరికనులతో సంధి గావించుకొన బాధ్యుఁడయ్యెను. రాకింగ్‌హాం ప్రధానమంత్రియై నూతనమంత్రిమండలము నేర్పాటు చేసికొనెను. ఆమంత్రు లందఱు నమెరికాకు స్వాతంత్ర్య మియ్యకతప్ప దని తలపోసిరి. అందుచే సంధికై రాయబారపుపను లన్నియు షెల్‌బర్న్ పరము కావింపఁబడినవి. రిచర్డు ఓస్వాల్డు బ్రిటీష్ వారికి ఏజంటుగ నియోగింపఁబడెను. ఫ్రాంక్లిన్, జే, జాన్ ఆడమ్సు, హెన్రీ లారెన్సులు అమెరికనులపక్షమున రాయబారము వహించిరి. మొట్టమొదటినుండియు స్వాతంత్ర్యస్వీకరణము, సీమాపరిష్కారము, మత్స్యవ్యాపారాధికారము అను నీ మూఁడింటినిగూర్చి యమెరికనులు పట్టు పట్టియేయుండిరి. మఱియు స్వేచ్ఛావ్యాపారమునుగూర్చియు, యుద్ధపుఖర్చుల రాఁబట్టుట కనియో లేక రాజపక్షీయులనష్టపరిహారములకనియో కెనడాదేశ మమెరికనులకియ్యఁబడుటనుగూర్చియు సంధి నియమములం దుపపాదింపఁబడెను. మొదటి మూఁడుషరతులను వెంటనే స్వీకరించిరి కాని బ్రిటీష్‌వారితీరములందు చేఁపల నెండించు కొనువిషయమున వాదవివాదములు జరగెను. మఱియు యుద్ధమునకు పూర్వము బ్రిటీష్‌ప్రజలకుఁ జెల్లింపవలసిన ఋణములనుగుఱించియు, రాజపక్షీయులకు తిరిగి ఆస్తి నిచ్చుటనుగుఱించియు తీవ్రవాదము లుప్పతిల్లియుండెను. మత్స్యాధికారములనుగూర్చి ఆడమ్సు మిక్కిలి పట్టుదలతో వాదించెను. తుదకీయధికారము నంగూడ నమెరికనులు పొందిరి. రాజపక్షీయుల-అభ్యర్థనములను ఫ్రాంక్లిన్ ఎంతమాత్రము సమ్మతింపఁడయ్యెను. చివరకు వారు కాంగ్రెసు కావించుతీర్మానముల కొప్పుకొనునట్లుగఁ జేయఁబడెను. రెండుపక్షములలోని ఉత్తమర్ణులు వారివారి బాకీలను రాఁబట్టుకొనుటయం దెట్టివిఘ్నములును కల్పింపఁబడకుండునట్లుగ నిశ్చయింపఁబడెను. అమెరికనులవాదము లపరిమితము లనియు, అతితీవ్రము లనియుఁ దలఁచి ఫ్రాన్సు, స్పెయిన్ దేశము లిరువురును వాని నంగీకరించుట కిచ్చగింపరైరి. కాని అమెరికనులు, ఇతరులమాటలక్ష్యమును బెట్టుకొనక బ్రిటీష్‌వారితోఁ దామే స్వయముగ నుత్తరప్రత్యుత్తరములను సల్పుకొనిరి. అందుచే ఫ్రెంచిదొరతనపుసలహా లేకయే సంధినియమపత్రముపై సంతకములు పడెను. ఇట్లు గావించుట ఫ్రెంచిప్రముఖుఁడగు వర్జెన్నెసునకు కోపకారణ మయ్యెను. కాని ఇట్టివిధాన మవలంబనీయ మని జే, ఆడమ్సుప్రభృతులు ప్రతిఘటించి వాదించిరి. ఫ్రాంక్లిన్‌యొక్క నీతికౌశలము ఫ్రాన్సుతో నేవిధమైన విరోధములును లేకుండునట్లుగఁ జేసెను. యుద్ధము ౧౭౮౧ యందే ఆఁపివేయఁబడెను. కాని రెండుసంవత్సరము లిట్లు నానావిధ ప్రయత్నములు జరిగినపిమ్మట ౧౭౮౩-వ సంవత్సరము సెప్టెంబరు ౩-వ తేదీయందు పరిష్కృతమగు సంధి నెఱవేఱెను.

యుద్ధము సమాప్త మగుటతోడనే అమెరికనుసేన లన్నియు రద్దు గావింపఁబడెను. ప్రధాన యుద్ధకార్యము లన్నియు నిలుపు చేయఁబడిననాఁటినుండియు ఆఫీసరులును, సైనికులును వారివారి వేతనములను — వెనుకఁబడి పోవుటచే నమితముగఁ బెరిఁగియున్న వానిని — రాఁబట్టుకొనఁ బ్రయత్నింపసాగిరి. కొంద ఱాఫీసరులకు బ్రతికి యున్నంతకాలము సగముజీతము లిచ్చునట్లుగ కాంగ్రెసువారు సమ్మతించిరి. కొందఱు కొన్నిసంవత్సరములవఱకే యైనను సరే యని నిండుజీతములను గోరిరి. ఇందునిమిత్త మందఱకును సర్టిఫికెట్లు లొసంగఁబడినవి. కాని ఇతరవిషయములకుం బోలె నిందునిమిత్తమును ధనము దొరకుట అసాధ్య మయ్యెను. అందుచే సేనావిభాగము లనేకము లెదురు తిరుగసాగెను. కాంగ్రెసుమీఁదను, ప్రజాపరిపాలనపు ఉద్యోగీయులమీఁదను మహాభయంకరమగు విద్రోహము సేనా భాగములందు పెరుఁగసాగెను. కాని వాషింగ్టన్ ప్రభావమువలన నివన్నియు సమసిపోయినవి. కట్టకడపటిసారి సేనయంతయు రద్దు చేయఁబడినసమయమున ఆఫీసరుల కిచ్చిన సర్టిఫికెటులు క్షీణమూల్యము లయ్యెను. రాజ్యనివాసులు వానిని లెక్కసేయరైరి. అందుచే నీయాఫీసరులు వచ్చినంతే చాలు నని దొరకినమట్టునకు ధనమును రాఁబట్టు

sampath Ebooks

కొనిరి. సైనికుల కసలు కొరకలే దనియే చెప్పవచ్చును. దీర్ఘకాల వ్యాప్తమగు యుద్ధమువలన సార్వజనిక, వైయక్తిక విశ్వాసము క్షీణింప దేశమంతట నవినీతి వ్యాపించెను. దారిద్ర్య మధిక మయ్యెను. ఈకారణములచేతనే మాతృదేశస్వాతంత్ర్యమునకై ప్రాణముల గణింపక యుద్ధ మొనరించిన సైనికులకుగూడ వారికి న్యాయ్యముగ దొరకవలసినదియు దొరకదయ్యెను. అసలు ఈయుద్ధ మంతయు నొక విధమగు నంతఃకలహముగనే యుండెను. బ్రిటీషు-అమెరికను పక్షములలో దేనికో ఒకదానికి నొకదానితోఁ జేరి ప్రజలు పరస్పరము పోరాడుకొని హత్యలఁ గావించుకొనియుండిరి. సామాన్యముగా నైకమత్యము గలిగి ఒక్కభావముతోఁ బనిసేయుచుండు రాజపక్షీయులకంటె దేశాభిమానులే యెక్కువ యోగ్యతను జూపియుండిరి. ఆ హేతువున చిల్లరపోరాటములు ఘటిల్లిన ప్రతిస్థలమందును రాజపక్షీయుల కోటమియు, దేశాభిమానులకు జయమును గలుగుచు వచ్చెను. ఈయుద్ధముయొక్క భయంకరపరిణామము బ్రిటీషువారిమీఁదను కాక రాజపక్షీయులంబులమీఁదను బ్రకటిత మైయుండెను. వీరల చరస్థిరాస్తులు — కోట్లకొలఁదిగల విలువకలవి — అమెరికనులచే జప్తు కావింపఁబడెను. ప్రఖ్యాతజీవనులై బ్రిటీషువారిచ్చిన బిరుదములతో, పదవులతో ఇంద్రభోగము లనుభవించుచు మాతృదేశవిముఖులై యుండిన వేలకొలఁది పౌరశ్రీమంతులు దేశమునుండి వెడలఁగొట్టఁబడిరి. ఆకారణమున ఆస్తిసంబంధమునందును, సమాజ సంఘటనమునందును అనేకపరివర్తనములు జరిగెను. ఈ వెడలఁగొట్టఁబడినవారిలో సాంఘిక, రాజకీయనాయకు లుండిరి. నూతన ప్రభుత్వముతో సమ్మతపడి అక్కడనే నిలిచిపోయినవారును గలరు. కాని వీరిప్రభావమే నష్టమైపోయెను. స్వాతంత్ర్యయుద్ధమునెడల సానుభూతి కలవా రందఱును ఉన్నతస్థానములను బొందిరి. బ్రిటీష్ వారియొక్కయు, రాజస్వామికప్రభుత్వముయొక్కయు సంస్థలు నాశనము గాఁగా ప్రజాస్వామికసంస్థలు సుస్థిరము లయ్యెను. అమెరికనులకు విజయము గలుగుటకనేక కారణములు కలవు. వానిలో ముఖ్యమైనవి వలసలవారిపట్టుదల, ఐకమత్యము, వాషింగ్టనుయొక్క నిపుణమైన నాయకత్వము, వీని నన్నింటిని మించినది ఫ్రెంచివారిసాయమని చెప్పవలెను. 'కాని యుద్ధసమయమందలి పరిస్థితులను జూచిన నట్టిధైర్యశాలికిని గుండె నీరగుచుండెను' అని యొకచరిత్రకారుఁడు వ్రాసియుండెను.

**అమెరిగో వెస్పూచీ** (౧౪౫౧ – ౧౫౧౨) — ఒక నావికపరిశోధకుఁడు. క్రీ. శ. ౧౪౯౭-వ సంవత్సరమున నితఁడమెరికాతీరమువెంట చాలదూరము ప్రయాణ మొనర్చెను. కొలంబస్ ఇతనికన్న ముందుగనే అమెరికాను కనుఁగొనెను. కాని యీ సంగతి వెల్లడి యగుటకుమున్నే అమెరిగోపరిశోధనచరిత్రము ప్రకటింపఁబడినది. ఇతనిపేరునుబట్టియే అమెరికాఖండమున కాపేరు వచ్చినది.

**అమేట్** — రజపుతానాలోని ఉదయపురసంస్థానమునం దున్న యొకజమీందారీ. దీనిరాజధానిపేరుగూడ అమేట్. అది ఉదయపురమునకు నుత్తరమున ౫౦ మైళ్లదూరమున చంద్రభాగా నదియొడ్డున నున్నది. ఈ పట్టణముచుట్టును ప్రాకారము గలదు. ఈ జమీందారు మేవాడ్‌లోని మొదటితరగతిసరదారులలో నొక్కఁడు. రావత్ అని ఆతనిబిరుదు. జమీందారీలో ౨౭ గ్రామములు గలవు. సంవత్సరపు ఆదాయము రమారమి ౩౦,౦౦౦ల రూపాయలు. ఉదయపురప్రభువున కితఁడు ౨,౭౦౦ల రూపాయలు పేష్కష్ కట్టవలయును. ఈ జమీందారు శిశోదియావంశములోనిది యగు చోండావత్ శాఖలోనివాఁడు. ఇతనిపూర్వుఁడగు పట్టా అనువాఁడు శౌర్యమునందు మిక్కిలి ప్రఖ్యాతి వడసి క్రీ. శ. ౧౫౬౮ లో అక్బరు చక్రవర్తి చిత్తూరిమీఁదికి దండెత్తి వచ్చినప్పుడు రాంపోల్ ద్వారమునొద్ద ఘోరముగ నాతనితోఁ బోరి హతుఁడయ్యెను.

**అమేతీ** — ౧. యునైటెడ్ ప్రావిన్సెస్‌లోని సుల్తానుపూర్ జిల్లాయందలి ఒకతాలూకా. విస్తీర్ణము ౩౮౮ చదరపుమైళ్లు. జనసంఖ్య ౨,౧౭,౨౦౭. ఇందు ౪౫౫ గ్రామములు కలవు. భూమిశిస్తువలన దొరతనమువారికి ఆదాయము రు. ౩,౧౯,౦౦౦. సెస్సులు రు. ౫౧,౦౦౦.

౨. యునైటెడ్ ప్రావిన్సెస్‌లోని లక్నో జిల్లాయందలి మోహన్‌లాల్‌గంజ్ తాలూకాలోని ఒకగ్రామము. ఇచ్చట మిక్కిలి పూర్వకాలమునందు అమేతియారాజపుత్రులు రాజ్యము చేయుచుండిరి. వారియొద్దనుండి తురకలు క్రీ. శ. ౧౫౫౦ లోఁ దీసికొనిరి. అప్పటినుండియు నది మహమ్మదీయమతమువారికి నాధారమైన పట్టణముగ నుండెను. ఈమతమువారు తమపీరులుగా నెంచునట్టి పెక్కుశాహువు లిక్కడ పుట్టిరి. వాజత్ అలీషా రాజ్యము చేయునప్పు డీగ్రామస్థుఁడైన షాల్వీ అమీరల్లీ అనువాఁ డయోధ్యాపట్టణమందలి హనుమంతునిదేవాలయమును పడఁగొట్టవలయు నని యత్నించెను; గాని యప్పటిరాజులయొక్క సైన్యములచే నతఁడోడింపఁబడియె. ఇక్కడ బట్టలు నేయఁబడును.

**అమేలియా** (౧౭౩౯–౧౮౦౭) — జర్మనీదేశమందలి శాక్స్, వీమార్, ఈసెనాఖ్ అను సంస్థానములకు జమీందారిణి (Duchess), అర్నెష్టు అగస్టు కాన్స్టెంటయిన్ అను డ్యూకుయొక్క భార్య. ఆతఁడు కాలముచేసినతరువాత (౧౭౫౮) ఈమె తనపసిబాలుఁడగు కారల్ అగస్టు అనువానికి రక్షణకర్త్రిగా నుండెను. ఈమె తనసంస్థానములో కళాకౌశలమును, వర్తకమును మిక్కిలి అభివృద్ధిపఱిచెను. విద్వాంసుల నాదరించుటయందు నీమె మిక్కిలి విఖ్యాతిఁ జెందెను. ఆమెసభలో ఆకాలమందలికవిశ్రేష్ఠులును పండితశ్రేష్ఠులును అగు హర్డర్, గయిటే, వీలెండు, షిల్లా అనువారు మిక్కిలి మన్ననఁ బడయుటయేకాక పలుమాఱు సభ నలంకరించుచు నామెయొద్ద కొంతకాలము గడపుచుండిరి.

sampath_Ebooks

**అమొలకుడియా** — గంజాంజిల్లా టెక్కలితాలూకాయందలి జమీన్దారీగ్రామము. జనసంఖ్య ౩౩౮.

**అమోఘవర్షుఁడు** — ౧. ఈపేరుగలరాజులు ముగ్గురు రాష్ట్రకూటవంశమునందు కానవచ్చుచున్నారు.

మొదటి అమోఘవర్షుఁడు రమారమి ౬౩ సంవత్సరముల వఱకు క్రీ. శ. (౮౧౫–౭౭) రాజ్యమేలెను. ఇతనికి నృపతుంగుఁడు అనుబిరుదుగలదు. ఈతఁడు వేంగీరాజులైన చాళుక్యులతోఁ బెక్కుయుద్ధములు చేసెను. ఈతఁడు తనరాజధానిని నాసికపట్టణమునుండి మాన్యఖేటపట్టణమునకు మార్చెను. దీని నిప్పుడు మాల్ఖేడందురు. ఇది నైజామ్ రాజ్యములో నున్నది. అమోఘవర్షుఁడు ముసలివాఁడు కాఁగా తన కుమారుఁడైన రెండవకృష్ణునకు రాజ్యమొసఁగి తాను యతి యయ్యెను. ఈతనికి దిగంబరజైనమతమునందు మిక్కిలి అభిమానము. ఇతనికాలమునందును, తరువాతికాలపురాజుల యాశ్రయము వలనను జైనమతము మిక్కిలి అభివృద్ధిఁ జెంది శైవమతము క్షీణించెను. కాంచీనగరమువఱకు నీతని రాజ్యముండెననియు, ఈతఁడు జైనాచార్యుఁడగు జినసేనపండితుని భక్తుఁడనియుఁ జెప్పెదరు. జినసేనాచార్యుఁడు జైనమతమును గుఱించిన పెక్కు గ్రంథములను వ్రాసినాఁడు. ఇతనికాలమున పెక్కు మతగ్రంథములును, శాస్త్రగ్రంథములును పుట్టినవి. ప్రశ్నోత్తరరత్నమాలిక యను నీతివిషయక గ్రంథమును రచియించిన దీ యమోఘవర్షుఁడే యని దిగంబరజైనులు చెప్పుదురు.

౨. (ద్వితీయుఁడు) — తృతీయ ఇంద్రుని పుత్త్రుఁడు. తండ్రిగతించినతోడనే సింహాసన మెక్కెను. కాని స్వల్పకాలములోపలనే మరణించెను. తండ్రిమీఁదఁగల ప్రేమాధిక్యమున నితఁడిట్లకాలమున గతించెనని జనులు చెప్పుకొందురు. అమోఘవర్షునకు గోవిందుఁడను తమ్ముఁడు గలఁడు. రాజ్యలోభమున నతఁడన్నను గడముట్టించెనని కొందఱి యనుమానము.

౩. (చతుర్థుఁడు) — ఇతనికి కక్క, కరక, కక్కర, కక్కల యని పేరులు కలవు. రాష్ట్రకూటరాజులలోఁ జివరవాఁడు. ఇతని తండ్రిపేరు నిరుపముఁడు. చాళుక్యవంశీయుఁడగు తైలపుఁడితని నోడించి దక్షిణమున రాష్ట్రకూటులరాజ్యము నంతము గావించెను.

**అమోఘసిద్ధుఁడు** — బౌద్ధులదేవతలలో నొక్కఁడు. అతనినిగూర్చి ప్రార్థన హవనము చేయుసంప్రదాయము గలదు.

**అమోఘుఁడు** — బృహస్పతికి తారయందుఁ బుట్టిన స్వాహా యనుకన్యకయొక్క ముగ్గురు పుత్త్రులలోఁ గడగొట్టువాఁడు.

**అమోడ్** — ౧. బొంబాయి రాజధానిలోని భడోచ్ (Broach) జిల్లాయందలి యొక తాలూకా. విస్తీర్ణము ౧౭౬ చదరపు మైళ్లు. జనసంఖ్య ౩౧,౯౧౧. ఇందు ఒకపట్టణమును, ౫౧ పల్లెలును కలవు. ఆదాయము రు. ౩,౨౧,౦౦౦.

౨. ఈ పేరుగల తాలూకాకు ముఖ్యపట్టణము. జనసంఖ్య ౪,౩౭౫. ఇచ్చట నాహారు అనునొక భూస్వామి యుండును. వానికి ౨౧,౨౦౦ల యెకరముల భూమియు, రు. ౭౨,౦౦౦ల ఆదాయమును గలదు. ఇక్కడ మంగలికత్తులు, చాకులు చేయఁబడును.

**అమ్నేర్** — ౧. బీరారు రాష్ట్రమునందలి అమరావతిజిల్లాలోనొక పట్టణము. ఇది మోర్సీ తాలూకాలో నాగా జాంనదులసంగమస్థానమున నున్నది. ఇందు నివసించువారిలో నెక్కువమంది మురకలు. ఇచ్చట జాగీరుదారునకును, నిజామునకును ఒకకాలమున భయంకరమగు యుద్ధము జరిగెను. నేఁడుగూడ నిచ్చట నేకవేలమంది సిపాయీలగోరీలు కానవచ్చుచుండును. నదీతీరమునఁ బురాతనమగు నొక యీశ్వరాలయము కలదు. దానిక్రింద నద్భుతమగు కోనేరొకటి యేర్పడియున్నది.

౨. ఎల్లిచ్పూర్ జిల్లాలోఁ గల మేల్ఘాట్ దుర్గము. గర్గా తపతీనదులసంగమమున నేర్పడిన త్రికోణాకారముగల కొండ నిది నిర్మింపఁబడియున్నది. వాయవ్యభాగమునుండి తప్ప మఱియొందుండియు శత్రువులు దీనిని ముట్టడింపఁజాలరు. అంతేకాక తపతీనదియొడ్డుగట్టు ఏటవాలుగ నెత్తయియుండును. కోట ఒకయెకరము భూమి నాక్రమించినది. చదరమై నాలుగు బురుజులుగలిగి యిటికతోఁ గట్టఁబడియున్నది. క్రీ.శ. ౧౮౫౮-వ సంవత్సరమున నిందుండి ఆయుధసామగ్రి యంతయుఁ దొలఁగింపఁబడినది.

**అమ్మంగదేవి** — చోళ రాజేంద్రుని కూఁతురు. పూర్వచాళుక్యరాజగు విమలాదిత్యునకును, రాజరాజకుమారి యగు కుందవ్వకును జనించిన పుత్త్రు నీమె పెండ్లియాడినది. కులోత్తుంగ చోడరాజకుమారుఁ డీమె పుత్త్రుఁడు.

**అమ్మగారిపల్లి** — ౧. చిత్తూరుజిల్లా చిత్తూరు తాలూకాయందలి యీనాం గ్రామము. జనసంఖ్య ౨౩౭.

౨. చిత్తూరుజిల్లా పుంగనూరు తాలూకాయందలి జమీన్దారీగ్రామము. జనసంఖ్య ౧,౩౫౩ (౧౯౩౧).

**అమ్మచెఱువు** — చిత్తూరుజిల్లా కాళహస్తి తాలూకాయందలి జమీన్దారీగ్రామము. జనసంఖ్య ౧౨౩.

**అమ్మనఁబ్రోలు** — గుంటూరుజిల్లా ఒంగోలు తాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౮,౩౧౬ (౧౯౩౧).

**అమ్మనాయకనూరు** — మధుర జిల్లాలోని యొక జమీన్దారీ. ఈ జమీన్దారుని మూలపురుషుఁడు మాకయ్య

sampath Ebooks

నాయకుఁడు. ఈతఁడు విజయనగరపురాజులయొద్ద నుండెను. విశ్వనాథనాయకుఁడు ౧౫౫౬ లో మధురకుఁ బోయెను. అప్పుడు వాతనికి మధుర కోటలోని ౭౨ బురుజులమీఁద నధికారమును, ఈ జమీన్దారీయు నిచ్చిరి. మైసూరువారు దిండిగల్ పట్టుకొన్నప్పుడు జమీన్దారీలోఁ గొంత భాగము తీసికొనిరి. ౧౭౩౬ లో నీ గ్రామము నొద్దనే చందాసాహేబు బంగారుతిరుమలనాయకుని నోడించి మధుర నాయకవంశమును వినాశముచేసెను.

౧౭౫౫ లో హైదరు దిండిగల్ పాళెగారులపై దాడివెడలఁగా నీజమీన్దారాతనికి సాయము చేసి తన మీఁది కాతఁడు రాకుండఁ జేసికొనెను. టిప్పుబాదుక్రింద నీజమీన్దారీని ౧౭౮౭ లో టిప్పూ జప్తుచేసెను. కాని ౧౭౯౦ లో కుంపిణీయాకంపెనీవారు దానిని విడుదలచేసిరి. ౧౭౯౬ లో ఈ జమీన్దారు గౌరతనమువారిని కొంత తొందరచేసెను. తరువాత నీజమీన్దారీ నేలినవారు గస్తీవగ నప్పులు చేసి, గ్రామము లొకప్పుడు యజమానులపాలై యనావశ్యకపు సొమ్ములకును, ఒకప్పుడు నప్పులును తాకట్టు పెట్టుచు నిలుపుకొనుచుండిరి. అందు వలన రైతులకుఁగూడ మిక్కిలి చిక్కులు, బాధలు కలుగుచుండెను. ౧౮౦౩ లో నీజమీకి శాశ్వతపు కౌలు పుట్టినది.

ఇప్పటి వారసత్వము జమీన్దారుని పెద్దకుమారునకు రాదు. ఆతని మరణానంతరమున వాని వంశములో నెవ్వఁడు వయస్సునందుఁ బెద్దవాఁడో వానికి వచ్చును. ఇప్పుడున్న జమీన్దారు శ్రీ రామస్వామినాయకుఁడు.

**అమ్మనేరి** — చిత్తూరుజిల్లా తిరుత్తణితాలూకా యందలి జమీన్దారీ గ్రామము. జనసంఖ్య ౯౬౪.

**అమ్మపటము** — తంజావూరుజిల్లా, పట్టుకోట్టాయి తాలూకాలోని యొకసముద్రపురేవు. ఇప్పటినుండి ముఖ్యముగ సింహళమునకు వర్తకము జరుగుచున్నది. పశువులు విశేషముగ నెగుమతి యగును. సింహళమునందలి తేయాకుతోఁటలనిమిత్తమిచ్చటినుండి కూలివాండ్రు వారమునకు రెండు పర్యాయములు వెళ్లుచుందురు.

**అమ్మపల్లి** — చిత్తూరుజిల్లా పుత్తూరుతాలూకా యందలి జమీన్దారీ గ్రామము. జనసంఖ్య ౨౬౬.

**అమ్మపాలెం** — ౧. నెల్లూరుజిల్లా వేంకటగిరి తాలూకా యందలి జమీన్దారీ గ్రామము. జనసంఖ్య ౩౨౭.

౨. తూర్పుగోదావరి యేజెన్సీ జిల్లా పోలవరం తాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౫౨.

౩. పశ్చిమ గోదావరిజిల్లా చింతలపూఁడి తాలూకాయందలి జమీన్దారీ గ్రామము. జనసంఖ్య ౮౩౬.

**అమ్మపేఁట** — విశాఖపట్టణముజిల్లా గొలుగొండ తాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౮౮౨.

**అమ్మరాజవిజయాదిత్యుఁడు** (క్రీ. శ. ౯౪౫-౯౭౦)- ఆంధ్రభూమి నేలిన వేంగీచాళుక్యవంశజుఁడగు మహారాజు. ఇతఁడు రాజభీమాపరనామఁ డయిన రెండవచాళుక్యభీమనృపాలునకు లోకమహాదేవియందు జన్మించెను. ఇతనికి నృపకాముఁడను కనిష్ఠసోదరుఁడును, దానార్ణవుఁ డను జ్యేష్ఠభ్రాతయు నుండిరి. దానార్ణవుఁ డంకిమహాదేవియందు పుట్టినవాఁ డగుటచేత అమ్మరాజునకు సవతియన్న యయినాఁడు. రాజభీముఁడు తనవైమాత్రుజభ్రాతపైఁ గల విశేషభక్తి, గౌరవ, విశ్వాసములకతమున తనకుమారున కమ్మరాజని నామకరణము చేసెను. చాళుక్యవంశమునందలి అమ్మరాజాభిధానులలో నీతఁడు ద్వితీయుఁడు. అమ్మరాజవిజయాదిత్యుఁ డనునది యితని సంపూర్ణనామము. విజయాదిత్యనామమును ధరించిన చాళుక్యరాజులలో నితఁ డాఱవవాఁడు. ఇతనియందుఁగల మక్కువచేత తండ్రి రాజభీముఁడు పెద్దవాఁడగు దానార్ణవుని త్రోసిపుచ్చి చిన్నకుమారుఁడగు నీయమ్మరాజునకు యౌవరాజ్యపట్టబంధము కట్టెను.

తండ్రి మరణించిననాఁటికి కమ్మరాజునకు పండ్రెండవయేఁడు. అయినప్పటికిని మంత్రిపురోహితామాత్యసేనాపతులును, సకల సామంతకులమునుగూడ నైకకంఠ్యముతో అమ్మరాజునకు పట్టాభిషేకము చేసిరి. అతనిపట్టాభిషేకము శకవర్షములు ౮౬౭-వ మార్గశిరమాసమున బహుళత్రయోదశీ శుక్రవారమున అనూరాధానక్షత్రమున చంద్రుఁడును, ధనుస్సునందు రవియు నుండఁగా కుంభలగ్నమున జరిగినది. ఆ తిథివారనక్షత్రములు లెక్కించినచో క్రీ. శ. ౯౪౫-వ డిసెంబరు ౫-వ తేది శుక్రవారముదయము తొమ్మిది పది గంటలకు సరిపోవును.

ఉత్తరమున మహోదయ లేక కన్యాకుబ్జఘూర్జరరాజ్యసీమల నుండి దక్షిణమున కాంచీపురరాజ్యమువఱకును దక్షిణాపథమునందలి పశ్చిమార్ధభాగము నాక్రమించుకొన్న రాష్ట్రకూటసామ్రాజ్యము అమ్మరాజునకు సమకాలికుఁ డయిన మూఁడవ కృష్ణవల్లభునిపాలనమున (క్రీ. శ. ౯౩౮-౯౬౬) అత్యుచ్ఛదశ నొంది క్షీణదశ నొందసాగెను. మూఁడవ కృష్ణరాజు అమ్మరాజవిజయాదిత్యునితో వైరము వృద్ధిచేసికొనియు, తనజీవితకాలమున వాతని నెదుర్కొని యోడింపఁ జాలఁడయ్యెను. ఉత్తరమున కళింగగాంగులు వేంగీసామ్రాజ్యమునకు లొంగియుండి స్వాతంత్ర్యమునకయి పెనఁగులాడుచు వేంగీశ్వరు నెదిరింపఁజాలక తలయొగ్గియుండిరి. అమ్మరాజునకు కళింగమున మొదటి కామార్ణవుఁడు (క్రీ. శ. ౯౪౩-౯౪౮) సమకాలికుఁడు. దక్షిణమున రేనాటితెలుఁగుచోడసామంతులు రాష్ట్రకూటులయండ నాశ్రయించుకొని వర్ధిల్లుచున్న నొళంబపల్లవ, వైదుంబాది స్వల్పరాజవంశముల ప్రాబల్యము నదిమిపట్టి తొండమండలమును జయించి వేంగీసామ్రాజ్యమును కాంచీపురమువఱకును వ్యాపింపఁజేసిరి.

అమ్మరాజవిజయాదిత్యుఁడు పూర్వమునుండియు వంశానుగతముగ వచ్చుచున్న మహారాజాధిరాజ, పరమేశ్వర, పరమభట్టారక,

sampath_Ebooks

వఱకును పాలించెను. అలెగ్జాండ్రియా పుస్తకభాండాగారమును తగులఁ బెట్టించినవాఁ డితఁడే యని చెప్పుదురు కాని ఋజువు కాలేదు.

**అమ్రేలి** — ౧. (తాలూకా) బడోదా సంస్థానమున, అమ్రేలి ప్రాంతమందలి ఒక తాలూకా. దీని విస్తీర్ణము ౨౨౮ చదరపు మైళ్లు. జనసంఖ్య ౫౫,౧౮౩. ఇందు ౫౮ పల్లెలును, ఒక పట్టణమును కలవు. భూమిసిస్తు రు. ౭౦,౦౦౦ లు.

౨. (పట్టణము) అమ్రేలి ప్రాంతమునకు ముఖ్యపట్టణము. జనసంఖ్య ౧౭,౯౭౭. ఇది ఠేబీ అనునదియొడ్డున నున్నది. దీనిచుట్టును పూర్వము మంచి ప్రాకార ముండెను. దీనిని పూర్వము అమరవల్లి అనుచుండిరి. ఇది కాఠేవాడ్ ప్రాంతమునఁగల ముఖ్యమైన ప్రత్తిసంతలలో నొకటి. ఇంగ్లీషువారితరఫున నిచ్చట ఒక పొలిటికల్ అసిస్టెంటు ఉండును. అతఁడు బడోదాలో నుండు రెసిడెంటు చేతిక్రిందివాఁడు.

౩. (ప్రాంతము) బడోదా సంస్థానములోని ఒకజిల్లా. ఇది గుజరాత్‌లో కాఠేవాడ్ దేశమునం దున్నది. దీని విస్తీర్ణము ౧,౨౭౫ చదరపు మైళ్లు. పదునేడు విడివిడి భూఖండములు కలసి యీ ప్రాంత మైనది. వానిలో ఓఖామండల్ తాలూకా యనుదానికి ఉత్తరమున కచ్ జలసంధియు, పశ్చిమమున అరబ్బీసముద్రమును గలవు. జనసంఖ్య ౧,౭౩,౪౩౬. వీరిలో నూటికి ౯౯ మంది గుజరాతీభాష మాటాడుదురు. ఇందలిభూమిలో విస్తారముభాగము నల్లనిదియు, సారవంత మైనదియు నగును.

ఇందలి గీర్ అనుపట్టణములోని ఆవులు మిక్కిలి ప్రఖ్యాతి కెక్కినవి. నూలుబట్టలు, చొకపట్టుమీఁద జరీపనిచేయుట, వెండిపని, కొలఁదిపాటియినుపవస్తువులు తయారుచేయుట ఇక్కడి కళాకౌశలములు. ఈ ప్రాంతములో ౭ ప్రత్తిని ఏకునట్టి ఫ్యాక్టరీలు కలవు. ఇందు కోడినార్, ద్వారక, బేట్ అను మూఁడు సముద్రపురేవులు గలవు. పశ్చిమతీరమందలి మహాక్షేత్రమైన ద్వారక ఇందులోనిదియే.

మొట్టమొదట మహారాష్ట్రులు కాఠేవాడ్ దేశముమీఁదికి ఖండేరావు దాభాడే, ప్రథమదామాజీగాయక్వాడ్ కాలమున వెళ్లిరి. కాని రెండవదామాజీ గాయక్వాడ్ ౧౭౩౨ - ౧౭౬౮ కాలమువఱకును ఈ ప్రాంతము వారికి స్వాధీనమైనదికాదు. స్వాధీన మైనతర్వాత పూనా పేష్వాయును గాయక్వాడును కలసి ప్రభుత్వము చేయుచుండిరి. ౧౮౧౮ లో పేష్వాప్రభుత్వ మంతరించినతరువాత కాఠేవాడ్‌పై నాతనికిఁగల హక్కు ఇంగ్లీషువారికి సంక్రమించెను. గాయక్వాడు నకుఁగల హక్కు వారికే యుండిపోయెను.

ఈ ప్రాంతము రమారమి ౬,౫౦,౦౦౦ రూపాయలు చెల్లును. ఈ జిల్లాలో ఆఱు మున్సిపాలిటీలును, ఒక హైస్కూలును, ఒక ఆంగ్లో వర్నాక్యులరుస్కూలును, ౧౪౮ వర్నాక్యులరుస్కూళ్లును, ౨ సివిల్ ఆసుపత్రులును కలవు.

అమ్లజని — (చూడుఁడు: ఆక్సిజన్).

**అమ్లపిత్తము** — రోగోత్పత్తి కారణము (ఆయుర్వేదము ననుసరించి):— విరుద్ధక్షీర మత్స్యాద్యాహారములు, పులుసు, విదాహకరద్రవ్యములు, వమనకరద్రవ్యములు, పులిసినయన్నము, పిత్తమును బ్రకోపింపఁజేసెడియన్నము, పానము అనువానిసేవనము వలనను, వర్షాదిఋతువులవలనను పిత్తము ప్రకోపించి భుజించిన యన్నాదులు జీర్ణము గాక పులిత్రేనుపులు వచ్చుటయే అమ్లపిత్తమని తెలియవలయు.

సామాన్యలక్షణములు:— అందు అజీర్ణము, ఆయాసము, ఓకారములు, దురద, పులిత్రేనుపులు, శరీరభారము, హృదయ కంఠములయందు- తాపము, దప్పి, భ్రమ, మూర్ఛ, అగ్నిమాంద్యము, గుసర్పాటు, ఒకానొకప్పుడు చేదుగ పుల్లగ వమనము చేయుట, కడుపులో శూలించుట – యీ లక్షణములు కల్గినది అమ్లపిత్తం బని యెఱుంగునది.

గతిభేదముచే ద్వివిధము:— ఇయ్యది అధోగతామ్లపిత్తము, ఊర్ధ్వగతామ్లపిత్తము అని గతిభేదముచే ద్వివిధం బగుచున్నది. అందు శరీరమునం దధోభాగమున నానావిధంబులుగ నొకప్పుడు మలాదులు వెడలుటచేత అధోగత - అమ్లపిత్త మనియు, చేఁదుగ నయినను పుల్లగ నయినను పలువిధములయిన రంగులతోఁగూడిన పసరు నోటఁ గ్రక్కుచుండుట ఊర్ధ్వగతామ్లపిత్త మనియు నెఱుఁగఁదగును.

సాధ్యాసాధ్యత:— అమ్లపిత్తము నూతనముగ జనించినయెడల యత్నముచే సాధింపనగును. చిరకాలజ మయినచో యాప్య మైయుండును. పథ్యనియమము గలవానికి నొకప్పుడు కష్టసాధ్యం బైయుండును (మాధవనిదానము).

పిప్పలీఘృతం:— పిప్పలికషాయములో పిప్పలికల్కమును వేసి ఘృతమును జేర్చి ఘృతపాకవిధి ననుసరించి పాకము గావించి అట్టి ఘృతములో తేనె గలిపి ఉదయమున సేవించినచో అమ్లపిత్తము శాంతించును (చక్రదత్తుఁడు).

ఖండకూష్మాండము:— బూడిదగుమ్మడికాయరసము నూఱు పలములు, ఆవుపాలు నూఱుపలములు ఈ రెంటిని కలిపి ఉసిరికపప్పు చూర్ణమును ఎనిమిదిపలములను వేసి పొయిమీఁద నుంచి సన్న సెగచే ముద్ద యగువఱకును వండి ఉసిరికపప్పునకు సమముగ చక్కెరను చేర్చుకొని లేహ్యపాకముగ దించుకొని జాగ్రత్తపెట్టి యుంచవలెను. దీనిని పూఁటకు అరపలముచొప్పున సేవించినచో అమ్లపిత్తము శాంతించును (యోగరత్నాకరము).

దశాంగకషాయము:— అడ్డసరము, తిప్పతీగ, పర్పాటకము, నేలవేము, వేము, గుంటగలగర, త్రిఫలములు, కులకము — వీనిని కషా

sampath Ebooks

యము కాఁచి, తేనె కలిపి సేవించినచో అమ్లపిత్తము నిశ్చయముగా శాంతిఁ జెందును (చక్రదత్తుఁడు).

పథ్యాపథ్యములు:— యవలు, గోదుమలు, పెసలు, ప్రాఁతశాలి ధాన్యము, కాఁచి చల్లార్చినజలము, కాఁకరకాయ, అరఁటిపువ్వు, లేఁత వెదురుమొప్పు, బాగుగ ముదిరిన బూడిదగుమ్మడికాయ, దాడిమకాయ, కఫపిత్తహారములయిన సర్వాన్నపానములు అమ్లపిత్తరోగులకు హితకరముగ నుండును. నువ్వులు, మినుములు, ఉలవలు, గొర్రెపాలు, ధాన్యామ్లము, లవణామ్లకటుపదార్థములు, గుర్వన్నము, పెరుఁగు, మద్యము- వీనిని అమ్లపిత్తరోగులు వర్జింపవలెను (యోగరత్నాకరము).

[గం. దూ.]

**అమ్లము** — ౧. షడ్రసములలో నొకటి.

౨. అమ్లజనితో కొన్ని ఉపధాతువులు కలసినప్పుడు ఏర్పడుపదార్థము. దీని నింగ్లీషులో ఆసిడ్ అందురు. నీటిలోఁ గలిపినయెడల అమ్లము లగును (చూడుఁడు: ఆసిడ్).

**అమ్లియార** — 'అమ్లియార' యను మిక్కిలి చిన్న సంస్థానముయొక్క ముఖ్యగ్రామము. ఈ సంస్థానము బొంబాయి రాజధానియందు మాహికాంత యేజన్సీలో నున్నది. అహమదాబాదు పట్టణమున కీశాన్యమున ౩౪ మైళ్లమీఁద నీగ్రామ మున్నది. జనసంఖ్య ౧౯౧౧ లో ౧,౪౭౪. ఇం దొక శివాలయమును, తురకలగోరీయును, పురాతనపట్టణముయొక్క జీర్ణావశేషములును గలవు.

**అమ్లోర** — పంజాబునందలి నాభాసంస్థానములో నొక నిజామత్, అనఁగా జిల్లా. దీనివైశాల్యము ౨౯౧ చదరపుమైళ్లు. జనసంఖ్య ౧,౧౫,౦౭౮. ఇందు ౨౨౮ పల్లెలును, నాభాగ్రామమును ఉన్నవి. అంటోహ అనునది రాజధాని. భూమిసిస్తు, సెస్సులు కలసి రు. ౩,౩౦,౮౦౦ లు. భూమి రేగడ, మిక్కిలి సారవంతము; నీరు పైనే పడును. సర్‌హింద్ కాలువవలన భూములకు నీరు పాఱును. చలిజ్వరము ఇతరమయిన జబ్బులు కలవు.

**అమ్‌స్టర్‌డం** — ఐరోపా ఖండములోని ప్రధాన వ్యాపారస్థానములలో నొకటి. హాలండుదేశపు రాజధాని. రాజుగారు మాత్ర మిందు నివసింపరు. దీని జనసంఖ్య ౬,౪౭,౧౨౦.

అమ్‌స్టర్‌డంనగరము మిక్కిలి పల్లమునం దుండుటచేత, నిందలికట్టడము లన్నియు చాలభాగము ఎత్తయిన దిన్నెలపైఁ గట్టఁబడినవి. పెక్కుకాలువలచే నీనగర మనేకద్వీపములుగ విభజింపఁబడినది. ఈ చిన్నచిన్న లంకలను కలుపుటకు ౯౦౦ల వంతెనలు కలవు. చాల వీథులలో నీటికాలువలు ప్రవహించుచుండును. కాలువల కిరువైపుల నెత్తయిన యిసుకదిన్నెలపై వృక్షపంక్తు లుండును. రాజమందిరము, విశ్వవిద్యాలయభవనములు, వస్తుప్రదర్శనశాల మున్నగునవి కొన్ని యీనగరములోని గొప్పకట్టడములు. వజ్రములను తయారుచేయుట యిందలి ప్రధానపరిశ్రమలలో నొకటి. దీని సముద్రవ్యాపారము మంచి యభివృద్ధిలో నున్నది. ౧౩-వ శతాబ్దిలో అమ్‌స్టర్‌డం ఒక చేఁపలపల్లెగ నుండినది. ౧౭, ౧౮ శతాబ్దులలో నది ప్రపంచములో నెల్ల నెక్కువ ధనవంతములగు నగరములలో నొకటి యయ్యెను.

**అమ్హర్స్టు** (క్రీ. శ. ౧౭౭౩ - ౧౮౫౭) — విల్లియమ్ పిట్ అమ్హర్స్టు అనునితఁడు లెఫ్టినెంటు జనరల్ విలియమ్ అమ్హర్స్టు కుమారుఁడు. ఇతనితల్లి ఎలిజబెత్తు. ఇతఁడు ౧౭౭౩-వ సంవత్సరమున జనవరి ౧౪-వ తేదీని బాత్ నగరమున జన్మించెను. ఇతఁ డెనిమిదేండ్లవాఁ డయియుండఁగనే యితనితండ్రి కాలధర్మము నొందెను. నాఁటినుండి యితఁడు పినతండ్రియయిన జనరల్ జెఫరీ అమ్హర్స్టుయొద్దనే పెరిఁగెను. వారన్ హేస్టింగ్సు మొదలయినవారలు చదివిన వెస్ట్‌మినిస్టరు పబ్లిక్ స్కూలునందే యితఁడును చదివి, పిదప ౧౭౯౩ న ఆక్సుఫోర్డునందు పట్టపరీక్షయం దుత్తీర్ణుఁ డయ్యెను. కళాశాలవిద్య ముగించినపిదప నాఁటియాచారము ననుసరించి యూరోపుఖండమున పర్యటనము కావించి, యేయేదేశములగుండా ప్రయాణము కావించెనో యాయాదేశములభాషలనుగూర్చి, యాచారములనుగూర్చి యధ్యయనము కావించెను. పిదప రాజకీయోద్యోగమునందు నియుక్తుఁడయి ౧౮౦౯ లో సిసిలీకి రాయబారిగను, పిదప నంత నెక్కువయధికారములను వహించి చీనాకు రాయబారిగను వెళ్లెను. ౧౮౦౦ లలో నితఁడు ప్లిమత్ కౌంటెస్సును వివాహము కావించుకొనెను. ౧౮౧౫ లో అమ్హర్స్టు ప్రభువు ప్రివీకౌన్సిలరయ్యెను. ఆ మఱుసటిసంవత్సరమే యితఁడు చీనాదేశమునకు ప్రత్యేకదౌత్యమును వహించి వెడలెను. ౧౮౧౭ న చీనాదేశమునుండి తిరిగి వచ్చినపిదప కొంతకాల మింగ్లండునందే యుండి రాజకీయములందు పాల్గొనుచు వచ్చెను.

ఇట్లు లుండ హేస్టింగ్సుప్రభువు హిందూదేశమున గవర్నరు జనరలుగఁ బనిచేయవలసినకాలము పూర్తియయ్యెను. ఆపదవిని మహావక్తయు, రాజ్యతంత్రనిపుణుఁడును అయిన జార్జి కానింగున కొసంగఁగా నతఁడు దానిని నిరాకరించెను. పిదప దానిని అమ్హర్స్టుప్రభువున కొసంగ నతఁ డంగీకరించెను. నూతనాధికారనియుక్తుఁ డయి యితఁడు ౧౮౨౩ -వ మార్చినెలలో బయలుదేఱి ౧౮౨౩-వ ఆగస్టు ౧-వ తేదీకి కలకత్తా చేరెను.

అమ్హర్స్టుప్రభువు నూతనాధికారమును స్వీకరించిన కొలఁది కాలమునకే హిందూదేశప్రభుత్వమువారికిని, బర్మారాజునకును వైరము సంఘటిల్లినది. ౧౭౫౦ ప్రాంతమున అలౌంప్ర (అలౌంగ్‌పయ) అనునతఁ డొక నూతనవంశమును స్థాపించెను. ఈ వంశమువారు కడు పరాక్రమవంతులై శీఘ్రకాలముననే ఉత్తరబర్మాయందలి షాన్ నాయకులను, ఐరావతీనదీప్రాంతపు పల్లపుప్రదేశములందును, టెనస్సెరిమునను పాలించుచుండిన తలైంగ్ ప్రభువులను జయించి బర్మాయం దంతటను దమ యధికారమును వ్యాపింపఁజేసిరి; బంగా

దేశము నంటియుండిన అస్సాము, అరకాను దేశములనుగూడ వారు జయించిరి. అరకాను రాజ్యమును జయించినపిదప చిట్టగాంగును, బంగాళమునందలి కొన్ని యితరభాగములను దమకొసంగవలసిన దని బర్మావారు ఇంగ్లీషు ప్రభుత్వమును గోరిరి. ౧౮౨౧-౨౨ లో అస్సాము దేశమును జయించినపిదప వారు చిట్టగాంగు దగ్గఱనుండు బ్రిటీషుబహిస్సీమాని వేశాధికారులను బఱిమివైచి బంగాళదేశముపయి వండెత్తుదు మని బెదరించిరి. ఈ కారణమున బ్రిటీషు ప్రభుత్వమువారికిని, బర్మా వారికిని యుద్ధము సంభవించినది. ఇది చరిత్రమున మొదటి బర్మాయుద్ధ (౧౮౨౪-౨౬) మని వ్యవహరింపఁబడుచున్నది.



అమ్హర్స్టు ప్రభువు

శీఘ్రకాలముననే కొంత సైన్యము అస్సాముదేశమునకు వెళ్లి యచటినుండి బర్మావారిని బఱిమివైచినది. కాని బర్మావారు చిట్టగాంగు సరిహద్దులందు జరిగినయుద్ధమున విజయము నొందిరి. అటుపిదప బర్మావారిని లొంగఁదీయుటకు శీఘ్రకాలముననే మదరాసు ప్రధానసేనాధిపతియైన సర్ ఆర్చిబాల్డ్ కాంబెల్ నాయకత్వమున కొన్ని సేనలు బంగాళాఖాతము మీఁదుగ రంగునగరమునకుఁ బంపఁబడినవి. ౧౮౨౪-వ మే ౧౧-వ తేదీని రంగము సులభముగా ఇంగ్లీషువారికి వశమయినది. కాని వర్షము లప్పు డధికముగఁ గురియుచుండుటచేతను, సరఫరాలును, రాకపోకల కానుకూల్యములును లేకపోవుటచేతను ఇంగ్లీషువారు చాలకష్టములపాలయిరి. బర్మావారు రంగమును మరల వశపఱుచుకొనవలె నని ప్రయత్నించియు విఫలమనోరథులయి వెనుకకు మరలిపోయిరి. వారి సేనానాయకులలో కడుపరాక్రమవంతుఁడును, గొప్పవాఁడును అగు మహాబందుల దొనాబి యుద్ధరంగమున హతుఁ డయ్యెను. విజయులైన ఇంగ్లీషువారు మాండలేవైపున కింక నుత్తరదిశకు సాగిపోయిరి. ప్రతిస్థలమునను మూలములతోను, దుంగలతోను అవరోధనిర్మాణములను గట్టికొని బర్మావారు వానివెనుకనుండి తమ్ముఁ దాము సంరక్షించుకొనుచు వచ్చిరి. కాని తుదకు వారు ఇంగ్లీషువారికి లోఁబడిపోయిరి. యెండబునగరమునొద్ద నుభయపక్షములవారికి సంధి జరగినది. ఈసంధి ననుసరించి ఇంగ్లీషువారికి అస్సాము, అరకాను, టెనస్సెరిమ్ రాజ్యములు లభించినవి. యుద్ధనష్టపరిహారముక్రింద పది లక్షలపౌనులను నాలుగుతడవలలో నింగ్లీషువారికి చెల్లించుట కేర్పాటు జరగెను. బర్మారాజధానియైన ఆవానగరమున రాజాస్థానమున బ్రిటీషు రెసిడెంటు ఉండుటకు నియామకము జరగినది.

అమ్హర్స్టుప్రభువు గవర్నరు జనరలుగ నుండినకాలమున జరగిన మఱియొక ముఖ్యవిషయము భరతపురపుముట్టడి. బర్మాయుద్ధమువలన హిందూదేశమునందుఁ గొంత కలవరము జనించినది. ఈయుద్ధము ప్రారంభవేళలో ఇంగ్లీషువారికిఁ గలిగిన యపజయములు గొప్ప యుపద్రవములుగ నభివర్ణితము లయినవి. పటాలములనుండి వెడల నడపఁబడిన సిపాయీలలోను, స్వతంత్రులుగను సామంతులుగను పాలించుచుండిన కొందఱు సంస్థానాధిపతులలోను అశాంతి రేకెత్తి వర్ధిల్లుచుండెను. ఈ యశాంతికి ఫలముగ చాలచోటుల నింగ్లీషువారిమీఁద తిరుగఁబాటులు పెక్కులు జరగినవి. వీనిలో ప్రసిద్ధమయినది భరతపురకలహము.

భరతపురసంస్థానము జాట్ కుటుంబమువారి పరిపాలనముక్రింద నుండెను. ఏడేండ్ల యీడుగలబాలుఁ డొకఁడు ౧౮౨౫-న సింహాసన మెక్కెను. తండ్రి యనంతరము ఆసంస్థానమునకు రాజు కావలసినవాఁడా బాలుఁడే యని హిందూదేశప్రభుత్వమువారుకూడ నంగీకరించిరి. ఈ క్రొత్తరాజు చిన్నవాఁ డయినందున అతని మేనమామ సంరక్షకుఁడుగ నుండి రాజ్యకార్యములను నిర్వహించుచుండెను. ఇంతలో నతని బంధువు దుర్జనలా లనునతఁడు ఆబాలుని కారాగృహమున బంధించి, యాతని మేనమామను గడతేర్చి సంస్థానాధిపత్యమును స్వీకరించెను. బాలునిపక్షమును వహించి హిందూదేశప్రభుత్వమువారు దుర్జనలాలుపై పగఁ బ్రకటించిరి. అనతికాలముననే నూతనప్రధానసేనాధిపతి కంబర్మియరు ప్రభువు నాయకత్వమున బ్రిటీషుసైన్యములు భరతపురదుర్గమును ౧౮౨౫-వ డిసెంబరు ౧౦-వ తేదిని ముట్టడించినవి. దుర్గమున సైనికులు కొలఁదిమందిమాత్రమే యుండినను ఇంగ్లీషు ప్రభుత్వమునెడల నసంతృప్తి వహించిన మహారాష్ట్రులును, రాజపుత్రులును దుర్జనలాలుసైన్యమునందుఁ జేరిరి. అయినను విధి ప్రతికూలముగ నుండుటచేత నాదుర్గము ఇంగ్లీషువారికి ౧౮౨౬-వ జనవరి ౧౮-వ తేదిని వశమయినది. యుద్ధరంగమునుండి తప్పించుకొనిపోవుచుండఁగా దుర్జనలాలు పట్టువడెను. అతనిని మొదట అలహాబాదునందును, పిదప కాశీయందును ఖైదీగ నుంచిరి. అంతవఱకు కారాగారనిర్బంధమున నుండిన బాలరాజు మరల సింహాసనస్థుఁ డయ్యెను. చలనమునొందిన బ్రిటీషుప్రభుత్వమువారి కీర్తిప్రతిష్ఠలు ఈ భరతపురదుర్గవిజయమువలన మరల ప్రతిష్ఠితము లయినవి.

sampath_Ebooks

బర్మాయుద్ధముసందర్భమున జరగిన మఱియొకవిషయము గమనింపవలసినది కలదు. బర్మాయుద్ధమునందుఁ బోరాడుటకు వెళ్లినసైన్యములలో మద్రాసునుండి వెళ్లినవి యెక్కువ; బంగాళమునుండి వెళ్లినవి తక్కువ. మద్రాసుసైనికులు చాలవఱకు హీనవర్ణములవారు. బంగాళదేశపుసైనికులలోఁ జాలమంది అగ్రవర్ణములవారు కలరు. వారు నౌకలమీఁదుగ సముద్రప్రయాణము చేసినయెడలఁ దమవర్ణమునకు భంగముకలుగునని వారిలోఁ జాలమంది బర్మాయుద్ధమున కరుగ నిరాకరించిరి. ఈకారణమువలనను, మఱి కొన్ని యితర కారణముల వలనను కలకత్తాదగ్గఱనున్న బారకపూరునందున్న సేనలో నసంతృప్తి క్రమముగా హెచ్చి యచట విప్లవము రేగినది. త్వరితముగనే యిది యణఁచివేయఁబడినది కాని బ్రిటీషు ప్రభుత్వముక్రిందనున్న సిపాయీల సేనలలోఁ గ్రమముగఁ బెరుఁగుచుండిన యసంతృప్తి కిది ముఖ్యసూచనగ సంభావింపఁబడినది.


అమ్హర్స్టుప్రభువు తన యుద్యోగకాలపరిసమాప్తియయిన పిదప ౧౮౨౮ న ఇంగ్లండున కరిగెను. అటుపిదప నాతనిజీవితమునఁ జెప్పఁదగిన విశేషము లేవియు లేవు. అమ్హర్స్టుప్రభువుభార్య ౧౮౩౮-వ సంవత్సరమున కాలధర్మము నొందెను. రెండేండ్లయనంతర మతఁడు మరల వివాహము చేసికొనెను. అతఁడు ౧౮౫౭-వ సంవత్సరము మార్చి ౧౩-వ తేదిని తన యెనుబదినాలుగవసంవత్సరమున మృతినొందెను.

**అయతి** — నహుషరాజు నల్గురు పుత్త్రులలో నాలవవాఁడు.

**అయనంబాకం** — చిత్తూరుజిల్లా పుత్తూరుతాలూకాయందలి జమీన్‌దారీగ్రామము. జనసంఖ్య ౬౨౧.

**అయనము** — అయన మనఁగా మార్గము. ఇది జ్యోతిశ్శాస్త్రమందలి పరిభాషలో ఉత్తరాయణ మనియు, దక్షిణాయన మనియు వ్యవహరింపఁబడుచున్నది, అనఁగా ఉత్తరమార్గ మనియు, దక్షిణమార్గ మనియు అర్థము. 'ఉత్తరాయణ'మందు 'ణ' కారము 'రషాభ్యాం నో ణస్సమానపదే' అను పాణిని ౮-౪-౧ సూత్రప్రకారము సిద్ధించును. ఇఁక నుత్తరమార్గ మేమి? దక్షిణమార్గ మేమి? అని విచారింతము.

ఆకాశమందు గ్రహములు సంచరించుమార్గ మొకటి గలదు. అందు ప్రతిగ్రహమునకు నొక్కొకమార్గము వాస్తవముగాఁ గలదు. వీనినే గ్రహముల కక్ష్యావృత్తము(Arbits) లందురు. కాని ఇవి చంచలములు, అనఁగా ఇప్పు డున్నకక్ష్యలు మఱికొంతకాలమునకు మార్పు చెందును. ఇందు నియత మగు మార్గ మొకటి గలదు. దీని ననుసరించియే యెల్లప్పుడును సూర్యసంచార ముండును. ఈ సూర్యసంచారమార్గమునకే (Sun's path in the Heavens) క్రాంతివృత్త (Ecliptic) మని పేరు. ఈవృత్తస్వరూపము బోధపడినసేకాని ఉత్తర, దక్షిణమార్గభేదము బోధపడదు. కావున ఈవృత్తమును, ఖగోళమును కొంత విమర్శింతము. ఇదంతయు భావనాత్మకశాస్త్రము (Imaginary Science). ౧-వ పరిలేఖనము చూడుఁడు.





౧ - వ పరిలేఖనము

ధ్రు$_{౧}$. మే. ధ్రు$_{౨}$ = తూర్పుక్షితిజము. ధ్రు$_{౧}$, తు, ధ్రు$_{౨}$ = పశ్చిమక్షితిజము. క్షితిజ మనఁగా భూమ్యాకాశములు రెండును కలసినట్లుగా మన కగపడుప్రదేశము (Horizon). ధ్రు$_{౧}$ = ఉత్తర ధ్రువము (North Pole), ధ్రు$_{౨}$ = దక్షిణ ధ్రువము (South Pole), క$_{౧}$ = ఉత్తర కదంబము (Arctic), క$_{౨}$ = దక్షిణకదంబము (Antarctic), (మ, ధ్రు$_{౨}$ క$_{౨}$, క, ధ్రు$_{౧}$, క$_{౧}$, ఖ) = యామ్యోత్తరవృత్తము (Meridian), (మ. మే. క, తు) = క్రాంతివృత్తము (Ecliptic), (ఖ. తు. మే) = విషువద్వృత్తము (Celestial Equator), ఖ = ఖమధ్యము (zenith), మే = మేషము, తు = తుల, మ = మకరము, క = కటకము.

ఇందు ధ్రువమున కాకర్షణశక్తి మొదలగు విశేషశక్తులు గలవు. ఈధ్రువమును మధ్యగా నుంచుకొని యేర్పడినవృత్తమే (Circle) విషువద్వృత్తము, అనఁగా రెండుధ్రువములకును మధ్యగ నుండు వృత్తము. సూర్యుఁ డీవృత్తగతుఁ డైనపుడు రాత్రియుఁబగలు నన్నిదేశములందును సమానముగ నుండును. ప్రస్తుతమందు మార్చి ౨౧-వ తేదీయందును, సెప్టెంబరు ౨౩-వ తేదీయందును సూర్యుఁ డీవృత్తగతుఁ డగును. ఈధ్రువములకు ప్రస్తుతకాలమున ౨౩½ డిగ్రీలదూరములో 'కదంబ' మను బిందువు గలదు. ఈకదంబముల మధ్య నుంచుకొని యేర్పడినవృత్తమే క్రాంతివృత్తము. ఈధ్రువకదంబములఅంతరమునకే పరమక్రాంతి (Obliquity of the Ecliptic) యని పేరు. ఈదూరము సుమారు ౧౨,౦౦౦ ల సంవత్సరముల క్రిందట ౨౪ డిగ్రీలుండెడిది. అప్పటనుండి కాలక్రమమున తగ్గుచు ఇప్పుడు ౨౩½ డిగ్రీలయినది. ఇఁకముందు ౧౨,౦౦౦ ల సంవత్సరములకు ౨౨ డిగ్రీలు కాఁ

sampath_Ebooks

గలదు. ఇట్లే కాలవశమున పెరుఁగుచు, తఱుఁగుచు నుండును. ఇందుకు కారణములు ధ్రువ కదంబములు రెండుగాని, ఏదో నొకటిగాని చలించుట యను విషయములలో ప్రాచీన,నవీనమత భేదము లనేకములు గలవు. ఎట్లయినను కదంబద్వయమునకు మధ్య క్రాంతివృత్తము గలదు. అందుచే విషువద్వృత్తమునకు తిరశ్చీనముగ క్రాంతివృత్త మున్నది. మహావృత్తములకు సంపాత మందునపుడు రెండుప్రదేశములందు మాత్రమే యుండునను క్షేత్రమితి 3-వ అధ్యా, ౧౦-వ ప్రతిజ్ఞానుసారముగ (Euclid, III, 10) ఈ రెంటికిని రెండుప్రదేశములందు కలయిక గల్గును. వీనికే మేషాది (Aeris), తులాది (Libra) యని పేర్లు. ప్రస్తుతకాలమం దీకలయిక ఉత్తరభాద్రానక్షత్ర ద్వితీయపాద ప్రాంతమందును, ఉత్తరఫల్గునీనక్షత్ర చతుర్థపాద ప్రాంతమందును ఉన్నవి. ఇవి సృష్ట్యాదిలోను, ప్రతియుగాదిలోను, ప్రతియుగాంతమందును అశ్వినీప్రారంభమం దుండునని ఆర్షాశయము.




౨-వ పరిలేఖనము

౨-వ పరిలేఖనము చూడుఁడు. మేషము (Aeris), కటకము (Cancer), తులాది( Libra), మకరము (Capricorn). నక్షత్రము లన్నియు మొదటిఅక్షరముచే నుదాహరింపఁబడినవి. ఈపరిలేఖనమున మేషము మొదలు కటకమువఱకును విషువద్వృత్తమునుండి ఉత్తరముగ క్రాంతివృత్తమునకుఁగల దూరము క్రమముగ పెరుఁగును. కటకమునొద్ద నీదూరము పరమము. అటనుండి దక్షిణముపై పునకు (Direction) మార్గము తిరుగును. అటనుండి తులాదివఱకు నీదూరము క్రమముగ తగ్గి వృత్తములు రెండును కలయును. అటనుండి మకరాదివఱకును విషువద్వృత్తమునకు దక్షిణముగ క్రాంతివృత్తమునకుఁగల దూరము క్రమముగ పెరుఁగును. మకరమం దీదక్షిణాంతరము పరమము (Maximum). అటనుండి ఉత్తరముపై పునకు (Direction) మార్గము తిరుగును. ఆమకరమునుండి మేషమువఱకు నీదక్షిణదూరము క్రమముగ తగ్గుచు మేషాదియందు రెండువృత్తములు కలయును. ఇందు క్రాంతివృత్తమే సూర్యమార్గము. ఇది కటకాదినుండి మకరాదివఱకును దక్షిణముగాను, మకరాదినుండి కటకాదివఱకు నుత్తరముగాను ఉండును. అందుచే దక్షిణముగా నున్నమార్గము దక్షిణాయన మనియు, ఉత్తరముగా నున్నమార్గము ఉత్తరాయణ మనియు వ్యవహరింపఁబడుచున్నవి. ఇదంతయు ౨-వ పరిలేఖనమందు స్పష్టమగుచున్నది. ఉత్తరాయణమందు దేవస్థాన మగు ఉత్తరధ్రువ ప్రాంతభాగము దృశ్య మగుటచే ఆకాలము దేవప్రీతికర మనియు, దక్షిణాయనమందు దక్షిణధ్రువప్రాంతమందలి పితృలోకము దృశ్య మగుటచే ఆకాలము పితృప్రీతికర మనియు మనవారు వ్యవహరించుట సమంజసముగనే కన్పడుచున్నది. ప్రస్తుతకాలమందు ౨౧-వ జూన్ మొదలు ౨౨-వ డిసెంబరువఱకును సూర్యుఁడు దక్షిణమార్గమం దుండుటచే దక్షిణాయనమును, ౨౨-వ డిసెంబరు మొదలు ౨౧-వ జూన్‌వఱకును సూర్యుఁ డుత్తరమార్గమం దుండుటచే ఉత్తరాయణమును గల్గుచున్నవి. [చి. వేం. శా.]

**అయనుఁడు** — దేవవిశేషము. ధర్మఋషికి సాధ్య యను స్త్రీయందుఁ బుట్టిన సాధ్యదేవత లనువారిలో నొకఁడు (మత్స్య. అ. ౨౦౨).

**అయలూరివారిపల్లి** — నెల్లూరుజిల్లా కనిగిరితాలూకాయందలి జమీన్‌దారీగ్రామము. జనసంఖ్య ౫౫౨.

**అయవాహము** — భారతవర్షీయదేశము.

**అయశ్శిరుఁడు** — కశ్యపునివలన దనువునకుఁ గలిగిన దానవులలో నొకఁడు.

**అయసాపరగణా** — సంయుక్తప్రాంతములందలి ఫతేపూరుజిల్లా, ఘాజీపూరుతాలూకాలో నొకపరగణా. దీనివైశాల్యము ౪౦.౫ చ. మైళ్లు. జిల్లా మొత్తముమీఁద తక్కిన పరగణాలన్నిటిలోకన్న దీనిలోనిభూములు మిక్కిలి సారవంతములయినవి. జనసంఖ్య యించుమించుగ ౧౫,౦౦౦ ఉండును. వ్యవసాయమున కిచట మంచి సదుపాయములు కలవు. ౧౮౫౭-వ సంవత్సరపు కలవరపుదెబ్బ యీపరగణాకు ఎక్కువగఁ దగిలినది. మొదట నిది అలహాబాదుజిల్లాకుఁ జెందియుండెడిది. ౧౮౦౨-వ సంవత్సరమున ఫతేహపూరుజిల్లాకుఁ జేర్చఁబడినది.

**అయస్కాంతము** — అయస్కాంత మనఁగా సూదంటురాయి. ఇనుముతోఁ జేయఁబడినసూది, పాళీ, మొదలగు వస్తువుల నాకర్షించుగుణము గలిగియుండుటచే నిది అయస్కాంత మనఁబడును (చూడుఁడు: మేగ్నటిజమ్).

**ఆయుర్వేదము ననుసరించి:**— ఇనుము ముండము (ఇనుము), తీక్ష్ణము (ఉక్కు), కాంతము (సూదంటురాయి) అని మూఁడువిధములు. అందు కాంతమునకు అయస్కాంత మను నామాంతరముకూడఁ గలదు. మరల నీ అయస్కాంతము భ్రామకము, చుంబకము, కర్షకము, ద్రావకము, రోమకాంతము అను భేదములు గలదిగ పరిగణింపఁబడుచున్నది. మరల వీనిలో నొక్కొక్కటియు ఏకముఖము, ద్విముఖము, త్రిముఖము, చతుర్ముఖము, పంచముఖము, సర్వతోముఖము అను పేర్లతో వ్యవహరింపఁబడుచున్నది. ఏకముఖ మన సూదంటురాయియొక్క యేకముఖమునందే సూది లాకర్షింపఁబడును. ద్విముఖ మనఁగా, రెండుకోణములయందు మాత్రము సూదు లాకర్షింపఁబడును. ఇటులే త్రిముఖ, చతుర్ముఖముల యందుఁగూడ సూదు లాకర్షింపఁబడును. సర్వతోముఖ మనురాయియొక్క యన్నికోణములయందును, పైభాగమున క్రిందుభాగమునఁ గూడ సూదు లాకర్షింపఁబడును. ఇందు ఏకద్విత్రిచతుష్పంచసర్వతోముఖములలో క్రమముగా నొకదానికంటె నొకటి గుణాధిక్యము గలదై యుండును. కాంతము పీత కృష్ణ రక్తవర్ణములచే త్రివిధము. పీతము స్పర్శవేధక్రియయందును, కృష్ణము రసాయనప్రక్రియలయందును, రక్తము రసబంధనక్రియలయందును ప్రశస్తములు (రసరత్న సముచ్చయము).

శోధన:— శోధనవిధానము లనేక మున్నను సర్వసామాన్యముగ నిమ్మపండ్లరసము, కలి, పులిచల్ల అనువానిలో ప్రతిదానియందు నేడేసిమార్లు వేసి యేడేసిగడియ లెండ నెండించిన శుద్ధి యగును (బసవరాజీయము). కుండేటిరక్తముతో తడిపి ఏడుపర్యాయములు ఎండ నెండించినను శుద్ధియగును (ర. ర. సుధా).

మారణవిధానము:— కాంతలోహచూర్ణమునకు సమముగ జెల్లమును గంధకమును కలిపి ఖల్వమున మర్దించి ఇరువదిపుటంబు లిడిన భస్మమగును. ఈ భస్మమును తెల్లగలిజేరు-ఆకురసముతో నూటి పది పుటంబు లిడిన నెఱ్ఱగ సిందూరించును (ర. ప్ర. సుధా).

కాంతసిందూరము:— ఇట్లు శోధన మారణవిధానము లనేకము లనేకగ్రంథములయందు వేర్వేఱుగఁ గన్పట్టుచున్నవి. ఇచట నొకటి రెండుమాత్రము వివరింపఁబడినవి.

గుణములు:— ఇది శీతవీర్యము గలది. ప్రధానరసము మధురము. అనురసము కషాయము. ఆయుష్కరము, ధాతువివర్ధనము, త్రిదోషహరము. ఇట్టిగుణములు గలదై వ్రణ మేహ కుష్ఠ ప్లీహ ఉదర క్రిమిరోగములను నాశనము చేయునదిగ నున్నది. మఱియు పాండువును పోనడచును. క్షయరోగమును నశింపఁజేయును. శ్వాస, భ్రమ, గుల్మ, శూల మొదలగురోగములను పోఁగడచి శరీరమునకు కాంతి నిచ్చును (యోగరత్నాకరము).

అనుపానములు:— కాంతిభస్మమును త్రిఫలములతో సేవించినచో వలీపలితములు, త్రికటుకములు గంటుబారంగి - వీనితో సేవించినచో ధాతుక్షయము, శర్కర చాతుర్జాతకము - వీనితో సేవించినచో రక్తపిత్తము, గలిజేరు ఆవుపాలు- వీనితో సేవించినచో దౌర్బల్యము, కేవలము గలిజేరురసముతో సేవించినచో పాండువు, పసపు పిప్పలి తేనె - వీనితో సేవించినచో ౨౦ మేహములు, శిలాజతుతో సేవించినచో మూత్రకృచ్ఛ్రము, అడ్డసరము పిప్పళ్లు ద్రాక్ష తేనె- వీనితో లోహచూర్ణమును కలిపి మాత్రలు చేసి ఉదయమున సేవించినచో అయిదువిధములగు కాసరోగములు, తాంబూలముతో సేవించినచో అగ్నిమాంద్యము శాంతించును (యోగరత్నాకరము).

కాంతముకలసినయౌషధము:— ఆయుర్వేదమునందు కాంతము గలసిన ఔషధములు సుప్రసిద్ధములు. వానిలో బసవరాజీయమునఁ జెప్పఁబడినకాంతవల్లభరసము, రసేంద్రసారసంగ్రహమందలి కాలాగ్నిరుద్రరసము, చరకసంహితయందలి లోహరసాయనము, నవాయసచూర్ణము, అష్టాంగహృదయమందలి యస్కృతి ముఖ్యముగ చూడనగును.

[గం. దూ.]

**అయస్యాంగిరసుఁడు** — ఋగ్వేదమునం దితని పేరు రెండుసారులు వచ్చినది (౧౦. ౬౭, ౧; ౧౦౮, ౮). ఋగ్వేదమందలి కొన్నిఋక్కుల నితఁడు రచియించినట్లు అనుక్రమణిలోఁ జెప్పఁబడియున్నది. ఈతఁడు రచించిన మంత్రములు ఋగ్వే. ౯. ౪౪-౪౬; ౧౦. ౬౭ - ౬౮.

శునశ్శేపునిఁ జంపఁదలఁచిన రాజసూయమునందు నితఁడు ఉద్గాతగా నుండెను. ఇతఁడు యజ్ఞయాగాదిక్రతు విధానమును చక్కఁగ నెఱిఁగినవాఁడు (పంచవింశ బ్రాహ్మణము; ౧౪. ౩, ౨౨, ౧౬. ౧౨, ౪; బృహదారణ్యకోపనిషత్తు; ౧. ౩, ౮. ౧౯. ౨౪; కౌశితక బ్రాహ్మణము; ౩౦. ౬). ఇతఁ డాభూతిత్వష్ట్రయొక్క శిష్యుఁడు (బృహ. ఉ; ౨౯, ౬, ౩. ౪. ౬, ౩).

**అయస్థూణుఁడు** — శాలువాయణుఁడు అధ్వర్యుఁడు గాఁగల గృహపతి. ఈతఁడు తనయధ్వర్యునకుఁ గొన్నియజ్ఞపాత్రల నెట్లె ట్లుపయోగింపవలసినది నేర్పెను (శతపథబ్రాహ్మణము., ౧౧-౪, ౨,౧౭).

**అయాస్యుఁడు** — ఆంగిరస గోత్రోత్పన్నుఁ డైన యొక ఋషి. ఆయనవంశజులను ఆయాస్యు లందురు. ఇతఁడు హరిశ్చంద్రుని యజ్ఞమునందు ఉద్గాతగా నుండెను (భార; సభా, అ. ౧౨).

**అయి** — అస్సామురాష్ట్రములోని యొక చిన్ననది. బ్రహ్మపుత్రకు ఉపనదిగ నున్నది. ఇంచుమించుగ ౧౦౦ మైళ్లపాడు

sampath_Ebooks

వుండును. అడవులలోనుండియే యిది యెక్కువగఁ బ్రవహించు చున్నది. ఈనది చిన్నచిన్న పడవలు ప్రయాణముచేయుటకుమాత్ర మనుకూలముగ నుండును.

**అయిజల్** — ఇది లుశాయీ జిల్లాకు ముఖ్యపట్టణము. జిల్లాకు ముఖ్యపట్టణ మయినను ఊరు చిన్నదే. దీనిజనసంఖ్య ౨,౫౦౦. అయిజల్ పట్టణము ౩,౫౦౦ అడుగులయెత్తున నున్న యొకకొండ మీఁద నున్నది. ఇందుచే నీటిసౌకర్య మిచ్చట తక్కువయైనది. దానికై ఎక్కువధనము ఖర్చుచేసి తగిన యేర్పాట్లు చేయఁబడినవి. ఎప్పుడును విడువక యిచ్చట నొకసైనికదళ ముండును.

**అయితంపాడు** — నెల్లూరుజిల్లా కావలి తాలూకా యందలి యీనాంగ్రామము. జనసంఖ్య ౧౮౯.

**అయితంపూఁడి** — పశ్చిమగోదావరిజిల్లా తణుకు తాలూకాయందలి యీనాంగ్రామము. జనసంఖ్య ౯౭౮.

**అయితేపల్లి** — చిత్తూరుజిల్లా చంద్రగిరి తాలూకాలో నిది యొకపల్లె. జనసంఖ్య ౧,౧౪౨. ఇనుము సున్నపురాయి యిచ్చట దొరకును. ఆ యినుముతో నాఁగళ్లు చేయుదురు.

**అయినంపూఁడి** — కృష్ణజిల్లా దివితాలూకాయందలి యీనాంగ్రామము. జనసంఖ్య ౧,౧౪౧ (౧౯౩౧).

**అయినముక్కల** — కర్నూలుజిల్లా మార్కాపురం తాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౨,౧౫౩. (౧౧౯౩).

**అయినవల్లి** — గోదావరిజిల్లా అమలాపురము తాలూకాలో ఒకపల్లె. జనసంఖ్య ౩,౩౬౩. ఇచ్చట సుప్రసిద్ధమయిన సిద్ధి వినాయకదేవాలయ మొకటి కలదు. బులుసు అచ్చయ్య పాపయ్య శాస్త్రు లనఁబరఁగిన ప్రఖ్యాతసంస్కృతవిద్వాంసుల కిది జన్మస్థలము. ఋణముక్తేశ్వర మనుక్షేత్ర మొకటి దీనికి మజరా.

**అయినవీడు** — చిత్తూరుజిల్లా చిత్తూరు తాలూకా యందలి జమీన్దారీగ్రామము. జనసంఖ్య ౧౨౪.

**అయినహళ్లి** — బళ్లారిజిల్లా కుడ్లిగితాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౨,౦౨౨ (౧౯౩౧).

**అయినాపురం** — తూర్పుగోదావరిజిల్లా అమలాపురం తాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౮,౦౫౫ (౧౯౩౧).

**అయిరాల** — చిత్తూరుజిల్లా చిత్తూరుతాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౧,౭౬౯ (౧౯౩౧).

**అయిలాఫుల్ ఝురి** — వంగదేశములోని అంతాలి ఠాణాలోని యొక ప్రదేశము. రెండుగ్రామములు కలసి యీపేరను బిలువఁబడుచున్నది. ౧౮౦౫-వ సంవత్సరమున నీప్రదేశము అడవులతో నిండియుండెను. అప్పటి దీనివైశాల్యము ౮౮,౦౦౦ ఎకరములు. దీనిపై వచ్చు ప్రభుత్వాదాయము అప్పటికి రు ౩౪౨ లు. ప్రస్తుతమున నిది ఢక్కా నవాబునకుఁ జెందియున్నది. దీనివలన నవాబునకు ఇప్పుడు ఇంచుమించుగ నొక లక్షరూపాయల యాదాయము వచ్చును.

**అయీనుద్దీన్ (షేక్)** — ఇతఁడు విజాపుర వాసియగు నొక ముసల్మానుకవి. బహమనీసుల్తానగు అల్లా ఉద్దీన్ హసన్ కాలమువాఁడు. 'ముల్హీకత్', 'కితాబ్ ఉల్ అన్వార్' అను గ్రంథములను వ్రాసెను. ఇందు హిందూస్థానమునందలి మహమ్మదీయసాధువులచరిత్రము వర్ణింపఁబడినది.

**అయుఁడు** — రెండవ స్వారోచిష మన్వంతరము నందలి ప్రజాపతి. వసిష్ఠునిపుత్త్రుఁడు.

**అయుతజిత్తు** — యాదవుఁడు. క్రోష్టాజ్యామఘవంశీయుఁడైన సాత్వతరాజుయొక్క మనుమఁడు. భజమంతునకు బాహ్యక యను రెండవభార్యయందుఁ బుట్టిన ముగ్గురు కుమారులలో నొకఁడు.

**అయుతాయువు** — ౧. (సూ. వం.) ఇక్ష్వాకుకులోత్పన్నుఁడైన సింధుద్వీపుని కొడుకు. ఋతుపర్ణుఁ డితని కుమారుఁడు.

౨. (చం. వం.) ఉపరిచరవసు రాజుయొక్క వంశజుఁడగు శ్రుతశ్రవరాజుయొక్క పుత్త్రుఁడు. ఇతనికొడుకు నిరమిత్త్రుఁడు.

**అయుతుఁడు** — (చం. వం) పురుకులోత్పన్నుఁడై, అజమీఢునిశాఖలోనివాఁ డగు జహ్నువను రాజుయొక్క సంతతివాఁడైన రాధికరాజుపుత్త్రుఁడు. ఇతని కయుతాయు వనియు నామాంతరము గలదు.

**అయుధియా** — సయామదేశమునందలి ఒక పురాతన నగరము. బ్యాంకాక్ నగరమున కిది ౮౨ మైళ్లదూరమున నున్నది. వర్తక మిచ్చట మంచియభివృద్ధిలో నున్నది. వ్యవసాయమునకు సంబంధించినపనిముట్లవ్యాపారమే యిచ్చట ఎక్కువగ నుండును. ౮౦౦ల సంవత్సరములకన్న నెక్కువకాల మిది సయామదేశమునకు రాజధానిగ నుండెను. ఇచ్చటి ప్రాచీనావశేషములు పురాతనవస్తుసంశోధనమున కెక్కువగ నుపయోగింపునవిగ నుండుటచే వాని నన్నిటిని దీనియచ్చటి వస్తుప్రదర్శనాలయమున (Museum) జాగ్రత్తపఱిచియున్నారు. ఇప్పుడు దీనిపేరు 'క్రుంగ్ కావో'. సయాములోని ఎక్కువ యైశ్వర్యవంతములగు భాగములలో, అందముగల ప్రదేశములలో నిది యొకటి. ఇది హైకమిషనరుపరిపాలనమున నున్నది.

sampath_Ebooks

పూర్వపురాజులు వేసవిలో నివసించుటకుఁ గట్టించుకొన్న మందిరము నందే యిప్పుడు ప్రభుత్వకార్యాలయము గలదు. పూర్వవైభవమును దెలుపు చిహ్నములిప్పటికి నింకెన్నియో కలవు. ౧౫౫౫ - ౧౭౬౭ సంవత్సరములలో రెండుసారులు బ్రాహ్మీజాతివారు దీనిని పాడు పఱిచిరి.

**అయూబ్** — ఇతఁడు మహమ్మదీయపైగంబరులలో నొకఁడు. నిశ్చలుఁడైన దైవభక్తుఁడు. శాంతమూర్తి. ఈ సావ్రా జాతికిఁ జెందినవాఁడు. ఇతనిభార్య యూసఫ్‌కుమారుఁడైన ఎఫ్రేమునకుఁ గుమారిత యగు రామేహా యని కొందఱును, మనాసెస్‌యొక్క పుత్త్రిక మఖీర్ అని మఱికొందఱును వచింతురు. ఇతఁడు మహాధనికుఁడు. అపరిమితమైన ధనధాన్యసమృద్ధితోఁ దులఁదూఁగుచుండియు నితఁ డనారతము దైవోపాసనయందు మగ్నుఁడై కాలము గడపుచుండెను. భగవంతుఁ డితనిభక్తిని బరీక్షింప నెంచి యనేకప్రకారములను కష్టములకుఁ బాలుచేసెను. అమితధనవంతుఁ డయ్యును దైవోపహతుఁడై కొలఁదికాలములోపలనే యైశ్వర్యము నంతయుఁ గోలుపోయెను. దైవనియోగంబున నితని మహావిశాలప్రాసాదము నేలం గూల నితనిబిడ్డలాయింటిక్రిందఁ బడి మడిసిరి. ఇంతటితో నితనిదైవభక్తి లేశమైనను గొఱఁతపడలేదు. అంత భయంకరరోగము లితని నాక్రమించెను. శరీర మంతయు వ్రణపూరితమై కుళ్లి దుర్గంధము వెడలించుచు నూరిబయటఁ బడియుండ నితనిసమీపమున కెవ్వరును బోవుటకు సాహసింపరైరి. కాని యితనిభార్యమాత్రము నిరంతర మెడఁబాయక యితనిసేవ సలుపుచుండెడిది. దగ్గఱ ధనము లేకపోవ నీపతివ్రతాతిలకము పరిశ్రమమూలమున ధన మార్జించి తనపెనిమిటిని గాపాడెను. ఎట్లయ్యు నబలయేకదా! దారిద్ర్యాంధకారమున నీమె వివేకదృష్టి మందగించిపోవ నొకమాఱీమె సైతాను దుర్బోధనములకు లొంగి తనమగనిదగ్గఱ కేఁగి దైవమును వదలి సైతానును గొలువుఁ డనియు, నాలాగు చేసినచో కష్టము లన్నియుఁ బాయు ననియు నతనితో వచించెను. అంత నతఁడు కోపపరిపూర్ణుఁడై యామెను ధిక్కరించుటయేకాక శరీరము బాగైనపిదప నామెపని పట్టించెద నని కసరి వెడలనడఁచెను. అంత నితని నిశ్చలభక్తికి మెచ్చి భగవంతుఁ డీయనపై మరల ననుగ్రహ మూనెను. శరీరము రోగరహితమై కాలక్రమమునఁ బోయినభాగ్యముకూడ మరల వచ్చినది. ఇతనిభార్య సౌందర్యాకృతి దాల్చినది. ఆమెయం దితనికి ౨౬ గురు కుమారులు జన్మించిరి. ఇతనికి భాగ్యము మరల లభించుటంగూర్చి యొకచిన్నగాథ కలదు. ఇతనికి రెండు పంటకళ్ళము లుండెను. అందులో నొకటి గోదుమలరాశి. రెండవది బార్లీధాన్యరాశి. దైవప్రేరితములై రెండు మేఘము లేతెంచి యొకదానిపై బంగారమును గురిసియు, వేఱొకదానిపై వెండి గురిసియు నా కుప్పలను గప్పెనట. ఇతనివిషయమున ఖురానులో ననేకస్థలములం దుల్లేఖములు కలవు.

**ఆయేషా** — అబూబక్రుయొక్క కుమారిత; మహమ్మదుయొక్క మూఁడవభార్య. ఏడుసంవత్సరములప్రాయము గలదిగ నున్నప్పుడే ఈమెను మహమ్మదు భార్యగఁ గైకొనెను. ఈమెతండ్రికీమెను మహమ్మదునకు పెండ్లి చేయుట కిష్టములేదు. అయినను మహమ్మదు దైవాజ్ఞ ఈమెను వివాహ మాడవలసిన దని యున్నదన్నందున నొప్పుకొని పెండ్లి చేసెను. ఈమెకు మహమ్మదువలన సంతానప్రాప్తి కలిగియుండలేదు. భర్తమరణానంతరము అలీ ఆతని పీఠము నధిష్ఠించుట కొప్పుకొనక అతనితో అనేకఘోరయుద్ధములు చేసెను. మిక్కిలి కోపశీలయైనప్పటికిని ఆమెను అందఱును మిక్కిలి గుణశాలిని గనుక గౌరవించుచుండిరి. అలీ యీమెను గెలిచి ఖయిదీగ (క్రీ. శ. ౬౫౬) పట్టుకొనినను అపాయము కలిగింపక విడుదలచేసెను.

ఈమెను మహమ్మదీయులు తల్లి యనియు దేవమాత యనియు భావించెదరు. క్రీ. శ. ౬౭౮-వ సంవత్సరమున ౬౭ ఏండ్లప్రాయమున మదీనాపట్టణమునం దీమె మరణించెను.

**అయోడిను** — దేశీయభాషలందు దీనికి నైలమనియు, అవ మనియు పేరులు కలవు. గ్రీకుభాషలో 'అయొణ్' (Ion) అనఁగా ఊదారంగుగల కర్థము. దీనిని తయారుచేయునపుడు ఊదా రంగు ఆవిరి వెడలుటచే దీనికి అయోడిను అని పాశ్చాత్యభాషలందు పేరు కలిగెను. ఇది యొక ఉపధాతువుమూలతత్త్వము (Non-Metallic Element). నైలాదివర్గము (Halogen group)లో చేరినది. సముద్రజలమునం దిది ధాతవనైలిదముల (Metallic-Iodides) రూపమున లభించును కొన్నివిధము లగు సాగరిక శైవాలముల (See weeds) నుండియు, ముఖ్యముగా లమినారియా డిజిటాటా (Laminaria digitata), లమినారియా స్టెనోఫిల్లా (Laminaria Stenophylla) మొదలగువానిద్వారా సముద్రజలమున నుండియు నిది తీయఁబడును. ఈ శైవాలములం దిది నూటికి ౦.౫ అంశములచొప్పున నుండును. సోడియము నైలిదముల (Sodium-Iodides) రూపమున నిది కలిచే (Caliche) యనఁబడు చిలీ సూరేకారమునందును నూట ౦.౨ ల చొప్పున విద్యమాన మైయుండును. కంఠగ్రంథుల (Thyroid glands) యందును నిది స్వల్పపరిమాణమున నుండును.

సాగరికశైవాలముననుండి దీనిని తయారు చేయుటలో ఎండిన శైవాలమును గాల్చి అందువలన లభించిన బూడిద (Kelp) ను నీళ్లలోఁ గలిపి ఉడుకఁబెట్టి అందులోని ఉప్పు చాలవఱకు విడివడు పర్యంతము ఆద్రావణమును నిలువఁబెట్టుదురు. అంత ద్రావణరూప నైలిదము (Iodide in solution) గల యా తేరిన ద్రావకమును గంధకామ్లము (Sulphuric acid) తోడను, మాంగలద్వ్యమ్లజిదము (Manganese dioxide) తోడను కాఁగఁబెట్టి ఆవిరిరూపమున వెడలు అయోడినును చల్లనిమట్టికుండలలోఁ బట్టి ఘనీభవింపఁజేయుదురు. పునఃస్ఫటికీకరణము (Recrystallization) ద్వారా సోడి

యము నత్రితము( Sodium Nitrate )ను విడదీసినతరువాత దేలు నట్టి మాతృద్రవముల( Mother liquors )నుండియు, కలిచే ( Caliche )నామక చిలీనూరేకారమునుండియు అయోడీను తీయబడు ను. మీద ద్రవములందు సోడియము ద్విగంధకితము( Sodium bisulphate )ను ప్రయోగించుటవలన నది నైలము( Iodine )గ నడుగ నడుగునను జేయుటకొనములాగునను జేయుదురు. ఊర్ధ్వపాతనము ( Sublimation )ద్వారా మతకపదార్థము శుద్ధి కావింపబడును.

సాధారణతాపపరిమాణమందు అయోడీను నూసరము నలుపు గలసిన రంగుగల స్ఫటికపుగడ్డలాగున ఉచ్చ్వధాతులావణ్యము కలిగి యుండును. దీనివిశిష్టగురుత్వము ( Specific Gravity ) ౪. ౯౫; అణుభారము ( Atomic weight ) ౧౨౬. ౧౧౮ శతాంశాంశము లం దిది కరగును. వేడి చేయుటవలన నిది దట్టమైన, ఘాటువాసనగల, ఊదారంగుఆవిరిరూపమున గాలిలో నెగిరిపోవును. నీటిలో నిది స్వల్పముగ కరగును. కాని ఆల్కహాలు ( Alcohol ), ఈథరు ( Ether )లందును, ముఖ్యముగ పొటాశియం నైలిదద్రావణము ( Potassium Iodide Solutions )లందును బాగుగ లీన మగును. ఆల్కహాలు మున్నగువానిలో నేనితోc గలిపినను ఎఱుపు, నలుపు, పసుపు కలసినవర్ణము కల ద్రావణ మేర్పడును. కర్బనద్విగంధకిదము ( Carbon dioxide )తోడను, క్లోరోఫారములోడను కలిపిన యెడల ఊదారంగుద్రావణ మేర్పడును.

రాసాయనికగుణధర్మములం దిది హరితము ( Chlorire )ను, బ్రమము( Bromine )ను పోలియుండును కాని వానికంటె తక్కువప్రభావము కలది. మిశ్రితమై ఇది యనేకలవణముల నుత్పాదనము చేయును. నైలిదములు ( Iodides ), నైలితములు ( Iodates ) వానిలో చాల ముఖ్యమైనవి. గంజి( Starch )తోc గలయుటచే దట్టమగు నీలవర్ణ మేర్పడును. ఈనీలవర్ణపరివర్తనము అయోడినుయొక్క గుణలక్షణపరీక్షణమం దుపయోగపడును. లక్షలో నొకవంతు ఉండినను ఈవిధానమున అయోడినును గనిపట్టవచ్చును.

కడుపులోనికిc దీసికొనినయెడల ఇది మంటను బుట్టించు ఉప ద్రవకర మైనవిషము. కాని స్వల్పమాత్రలలో కొన్ని గ్రంథిరోగ ముల నివారణమున కుపయోగించును. పైపూతల కిది చాల మంచిది. ఆల్కహాలులోc గలసి టింక్చరు అయోడీను అయి చీమును పట్ట నియ్యదు. ఉపద్రవనిరోధకము. క్రిమినాశకము. పొటాశియము నైలిదరూపమున నిది కీళ్లరోగము ( Goitre ), గండమాలా ( Scrofula ) వ్యాధులందును, కడుపులో బల్లపెరుగుట మొదలగు రోగ ములకును, ఔపదంశికరోగములందును, ఆమవాతములందును, సీసపు విషమును విఱుచుటయందును బాగుగ పనిచేయును.

రెండియు అయోడీను కొన్ని అనిలీనురంగుల నిర్మాణమందును, కలావిషయకరాసాయనికశాఖాంతరములందును విస్తారముగ నుపయో గింపబడుచుండును.

దీనిసమ్మేళనములలో అయోడోఫారము, అయోలు, పూతినాశక ములు. ఫొటోగ్రాపుఫిల్ములు, ప్లేట్లు నిర్మించుటకు రజతనైలిదము ( Silver Iodide ) విస్తారముగ నుపయోగింపబడుచున్నది.

అయోధానము — ప్రస్తుతపు పంజాబుదేశములోని పాకపట్టణము. మాంటుగామరీజిల్లాలో సట్లజ్ నదికి ౭, ౮ మైళ్లదూర మున అమృతసరం, కసూరులనుండి లాహోరునకు బోవు పశ్చిమోత్త రపు ఇసుకవారిమీద నున్నది. అనేకపర్యాయములు లీపట్టణము సట్లజ్ వెల్లువవలన నాశన మైపోగా నూర కొట్టినారు మహాప్రయత్న మున నొకకొండను నిర్మించి దానిమీద నీపట్టణమును గట్టి యున్నారు. మైదానములమీదనుండి చూడగ కృత్రిమపర్వతముమీద యీపట్టణము మిగుల సుందరముగ గన్పించును.

అయోధ్య — కృష్ణాజిల్లా దివితాలూకాయందలి జమీను దారీగ్రామము. జనసంఖ్య ౧౧౯.

అయోధ్యాకాండ — రామాయణమునందలి ఆఱు కాండలలో రెండవది. శ్రీరాముని పట్టాభిషేకమునకై దశరథుడు ప్రయత్నించుట మొదలు పాదుకాపట్టాభిషేకమువఱకుగల కథా భాగ మీకాండలోc గలదు.

**అయోధ్యానాథ్** — పండిత అయోధ్యానాథుడు అలహాబాదునగరమునందలి యొక్క సుప్రసిద్ధన్యాయవాది. భారత జాతీయమహాసభ( Indian National Congress )యొక్క ప్రప్ర థమనాయకులలో ఈయన యొకడు.

అయోధ్యానాథుడు కాశ్మీరదేశపుబ్రాహ్మణశాఖకుc జెందిన వాడు. తండ్రి నాగరుకేదారనాథుడు. కేదారనాథుడు కొంతకాలము జాఫరునవాబుకడ దివానుగాc బనిచేసి, యటుపైని వర్తకవ్యాపారమునకు దిగెను. ౧౮౪౦-వ సంవత్సరము ఏప్రిల్ నెల ౮-వ తేదిని అయోధ్యానాథుc డాగ్రానగరమున జన్మించెను.

ఇతడు విద్యార్థిగ నుండినకాలమున అరబ్బీ, పారసీభాషలను బాగుగ నభ్యసించెను. ఆకాలమున ప్రభుత్వమువారుకూడ నితనిబుద్ధి కుశలత, ఆలోచనానిశితత్వము 'అసాధారణమైన' వని ముక్త కంఠముతో బహిరంగముగc బ్రశంసించిరి. కళాశాలవిద్య ముగిసిన పిదప నితడు న్యాయశాస్త్రము నభ్యసించి ౧౮౬౨-వ సంవత్సర మున అగ్రాహైకోర్టునందు న్యాయవాదిగc బ్రవేశించెను.

న్యాయవాదివృత్తియందుగూడ నితడు శీఘ్రకాలముననే గొప్పపేరుప్రతిష్ఠలను గడించుకొనెను. కొలది కాలముననే, అనగా ౧౮౬౮-వ సంవత్సరమున అగ్రాన్యాయశాస్త్రకళాశాలయందు అయా చితముగనే ఆయనకు అధ్యాపకపదవి ( Profesoor-ship ) లభించి నది. అలహాబాదులోని ప్రధానన్యాయస్థానమందలిన్యాయాధిపతుల కయోధ్యానాథుc డన్న నపరిమితమగు గౌరవభావ ముండెడిది.

sampath_ebooks

అయోధ్యానాథుఁడు తన యేఁబదిరెండవయేటనే మరణించెను. అతఁ డింతను గొన్నిదినములు జీవించియుండినయెడల న్యాయాధిపతిపదవిని దప్పక యలంకరించియుండెడివాఁడు.

సాధారణముగ న్యాయవాదుల కనేకకారణములవలనఁ దమ వృత్తినే యంటిపెట్టుకొని యుండవలసివచ్చును. కాని అయోధ్యానాథునియొక్క న్యాయవాదిజీవితముమాత్ర మట్లు గడచియుండలేదు. న్యాయవాదిగ నుండియును నతఁడు దేశహితకరములగు సార్వజనికోద్యమములలోఁ బెక్కువిధములఁ బాల్గొనుచుండెడివాఁడు. మొట్టమొదటి సారి అతఁడు సార్వజనికోద్యమములలోఁ బ్రవేశించినది విక్టోరియా కళాశాలా స్థాపనసందర్భమున. అటుపిదప నతఁడు పత్రికాప్రచారమునఁగూడఁ బ్రవేశించెను. ౧౮౭౯-వ సంవత్సరమున 'ఇండియన్ హెరాల్డ్' అనునొక యాంగ్లదినపత్రికను నెలకొల్పి, దానిని పైకి తెచ్చుటకయి స్వయముగ లక్షరూప్యములకు పైఁగ వెచ్చించెను. కాని యీప్రయత్నము సఫలము కాలేదు. కొలఁదికాలముననే యాపత్రిక యంతరించిపోయినది. అయిన నంతటితో అయోధ్యానాథుఁడు నిరుత్సాహపడలేదు. ౧౮౮౦-వ సంవత్సరమున నతఁడు మరల 'ఇండియన్ యూనియన్' అను మఱియొకపత్రికను స్థాపించెను. ఆకాలమున పండితమదనమోహనమాళవ్యగారు నీపత్రికకు సంపాదకులుగ నుండిరి.

అయోధ్యానాథుఁ డాదినములలో తక్కినవిషయములపయి కన్న, విద్యాభివృద్ధికి సంబంధించినసమస్యలపై నెక్కువ యాసక్తి గలిగి, అలహాబాదు, కలకత్తావిశ్వవిద్యాలయములు రెంటియందును సెనేటుసభ్యుఁడుగా నుండెను. పశ్చిమోత్తరప్రాంతపుశాసనసభలో ఆయనయే మొట్టమొదటి భారతీయసభ్యుఁడు.

దేశీయమహాసభ యేర్పడిన మొట్టమొదటి నాఁడేండ్లలోను మాత్ర మయోధ్యానాథుఁడు దానితో నంతగ జోక్యము కలిగించుకొనలేదు కాని ౧౮౮౫-వ సంవత్సరమున మొట్టమొదటి కాంగ్రెసు మహాసభాధ్యక్షుఁ డగు ఉమేశచంద్రబెనర్జిగారితో నీమహాసభా విషయమునుగుఱించి చర్చించినపిదప ఆయన కాంగ్రెసునఁ జేరుట కంగీకరించెను. ౧౮౮౮-వ సంవత్సరమున జరగవలసినకాంగ్రెసు (భారతజాతీయమహాసభ)సమావేశమును అలహాబాదున కాహ్వానించి, తాను స్వాగతసంఘాధ్యక్షుఁడుగ నుండి వ్యవహారమును సాగించెను.

అప్పటి కప్పుడే ప్రభుత్వోద్యోగులలో కాంగ్రెసుమహాసభ యన్న నయిష్టము పొడమినది. ఆంగ్లోయిండియనులుకూడ వారి కీవిషయమున బాసటయైరి. ఆయేఁడు పశ్చిమోత్తరరాష్ట్రముల గవర్నరుగా నుండిన సర్ ఆక్లండ్ కాల్విన్‌గారు మొదలుకొని జిల్లాయుద్యోగుల వఱకు నందఱును కాంగ్రెసుసమావేశము జరగకుండఁ జేయవలయునని యనేకవిధములఁ బ్రయత్నించిరి. మహమ్మదీయనాయకుఁ డగు సర్ సయ్యదు అహమద్ ఖానుగారుకూడ గవర్నరుగారికిఁ దోడ్పడిరి. వైస్రాయి డఫ్రిన్ ప్రభువుకూడ తక్కినప్రభుత్వోద్యోగు లందఱితో పాటు కాంగ్రెసునాయకులయుపన్యాసములును, వ్రాఁతలును రాజద్రోహకరము లని భావించెను. వీ రందఱునుగాక మఱికొందఱు దేశీయప్రముఖులే కాంగ్రెసును నిందించుచుండిరి. ఇట్టిస్థితియందు కూడ అయోధ్యానాథుఁ డనేకకష్టముల నెదుర్కొని ఆయేఁడు అలహాబాదు కాంగ్రెసుసమావేశమును కడు జయప్రదముగ కొనసాగించెను. ఆ సందర్భమున స్వాగతసంఘాధ్యక్షుఁడుగ నుండి ఆయన యొసంగినయుపన్యాసమును దిలకించినచో కాంగ్రెసుసమావేశము జరగకుండఁ జేయుటకు ప్రభుత్వోద్యోగులు కావించిన ప్రయత్నములు విశదపడఁగలవు.

ఒకసారి కాంగ్రెసుమహాసభలోఁ బ్రవేశించినతరువాత మరల నయోధ్యానాథుఁ డెన్నఁడును వెనుకంజవేసియుండలేదు. అలహాబాదుసమావేశము ముగియఁగానే యుత్తరహిందూస్థానమునం దంతటఁ బర్యటన మొనర్చి కాంగ్రెసుప్రచారము సాగించెను. ఆయన కాంగ్రెసున కొనరించినసేవనుగూర్చి ఉమేశచంద్రబెనర్జిగా రిట్లు నుడివిరి:

'కాంగ్రెసును, దేశమును అభివృద్ధికిఁ దెచ్చుటకై ఆయన స్వార్థత్యాగమున వెనుకంజ వైచిన దెన్నఁడును లేదు. కాంగ్రెసులో చేరినదిమొద లాయన ఒకకాలనియమము కాని, చిన్నపెద్దలను భేదము కాని పాటింపక నిరంతర మందఱితోఁ గలసి పనిచేయుచుండువాఁడు.'

అలహాబాదువిశ్వవిద్యాలయపు వైస్‌ఛాన్సలరుగా రయోధ్యానాథుని విషయమున నిట్లు చెప్పిరి.

'విద్యావిషయములం దాయనకు అత్యధికమగుశ్రద్ధ. మాసభలన్నిటికిని తప్పక హాజరగుచుండువాఁడు. ఈసందర్భమున ఆయన చూపిన బుద్ధికుశలత యసాధారణము. ఆయనవిషయమున నేజాతియైనను, ఏదేశ మయినను గర్వపడఁదగినదే. ఆయనస్వభావ మత్యున్నతము; సామర్థ్య మసందిగ్ధము, విజ్ఞాన మనేకవిధము.'

౧౮౯౧-వ సంవత్సరమున కాంగ్రెసు అధ్యక్షపదవి అయోధ్యానాథునకు లభింపనుండెను కాని మద్రాసువారిపట్టుదలవలన, బొంబాయికలకత్తాలవా రయినపిదప మదరాసువారి కంతవఱకు నధ్యక్షపదవి రాలేదనుకారణమునుబట్టి, నాఁడు కాయేఁడు మద్రాసువారే యొకరు కాంగ్రెసు అధ్యక్షులుగ నెన్నుకొనఁబడిరి. ఆమఱుసటిసంవత్సరపుసమావేశమునకు ప్రాయికముగ అయోధ్యానాథుఁ డధ్యక్షుఁ డయియుండెడివాఁడేమో కాని దురదృష్టవశమున నంతవఱకాయన జీవింపలేదు. ౧౮౯౧-వ సంవత్సరము డిసెంబరు నెలలో నాగపురమున జరగిన దేశీయమహాజనసభాసమావేశమునకుఁ బోయి మరలి రాఁగానే జ్వరపీడితుఁ డయి తుదకు ౧౮౯౨-వ జనవరి ౧౧-వ తేదీని కాలధర్మము నొందెను.

**అయోధ్యాపట్టణము** — యునైటెడ్ ప్రావిన్సెస్ నందలి ఫైజాబాద్ జిల్లాలోని యొకపట్టణము. ఇది గోగ్రా యను నామాంతరముగల సరయూనదీతీరమం దున్నది. ఇచ్చటికి ఔధ్-

sampath_Ebooks

రోహిల్‌ఖండ్ రయిల్వేయొక్క యొకశాఖ పోవును. జనసంఖ్య ౨౧,౫౮౪.

ఈయది హిందూదేశమందలి మహాక్షేత్రములలో నొక్కటి. సూర్యవంశపురాజులకు రాజధాని. వాల్మీకిరామాయణమునుబట్టి చూడఁగా నియ్యది మనువుచే నిర్మింపఁబడె ననియు, దశరథునికాలమున ౧౨ యోజనములు పొడువును, ౧౦ యోజనములు వెడల్పును ఉండె ననియు, పంక్తులు తీర్చినట్లు పట్టణమున వీథు లుండె ననియు, వానిపై నీళ్లు చల్లుచుండిరనియు, నానాదేశములనుండి పెక్కురువర్తకులక్కడకు వచ్చుచుండిరనియుఁ దెలియుచున్నది (బాలకాం., స.౫). ఇది ఉత్తరకోసలదేశమునకు రాజధాని. అప్పటికాలమున కోసలదేశములు రెం డుండినట్లు కానవచ్చుచున్నది. శ్రీరాముఁడు నిజధామమునకు వెళ్లునప్పు డీనగరమందలి జనుల నందఱను తనవెంటఁ దీసికొని వెళ్లినందున నిది పాడుపడెనఁట.

తరువాత సూర్యవంశజుఁడైన ఋషభరాజు మరల నీపట్టణమును జనాకీర్ణముగఁ జేసెను. నలునికాలమున నిచ్చోట ఋతుపర్ణుఁ డను రాజు రాజ్య మేలుచుండెను (మహాభార. వన). పాండవులకాలమున నిచ్చట మహాబలుఁడైన దీర్ఘయజ్ఞుఁ డను రాజు రాజ్యమేలుచుండెను.

బౌద్ధయుగమునందుఁగూడ నీపట్టణము వాసికెక్కియేయుండెను. అప్పుడు దీనికి సాకేతము అనునామము విశేషముగ వాడుకలో నుండెను. మన హిందూమతగ్రంథములలో అయోధ్యా, సాకేత నామములు పర్యాయపదములుగ వాడినను, బౌద్ధగ్రంథములలో రెండును వేఱువేఱుగఁ జెప్పఁబడినందున నవి మొదట ఒకదానికొకటి తగిలియున్న పెద్దపట్టణము లైయుండనోపు ననియుఁ, గ్రమముగ నొక్కపట్టణముగఁ గలసిపోయియుండవచ్చు ననియు నూహింపఁబడుచున్నది. బుద్ధుఁడు సాకేతపట్టణమునందు ౧౬ సంవత్సరము లుండి తనమతమును బోధించెను. జైనులమహాఋషులైన తీర్థంకరులలో మొదటివాఁడైన ఆదినాథుఁడును, రెండవవాఁడైన అజితనాథుఁడును, నాల్గవవాఁడైన అభినందననాథుఁడును, ఐదవవాఁడైన సుమంతనాథుఁడును ఈపట్టణమునందు జన్మించిరి. అందుచే నీపట్టణము హిందువులకువలెనే జైనులకుఁగూడ పుణ్యక్షేత్రము. బౌద్ధకాలానంతరము కొంతకాలమువఱకును మరల నీ పట్టణము పాడుపడినట్లు కానవచ్చుచున్నది. తరువాత విక్రమాదిత్యుఁ డనువాఁడు మరల దానిని గట్టించెనఁట. అతఁ డచ్చట నాగేశ్వరుఁ డను శివుని మందిరమును కట్టించుటయేకాక మొత్తముమీఁద ౩౬౦ మందిరములనుగూడ నిర్మించెనఁట. కాని యితఁ డేకాలమువాఁడో, యేవంశమువాఁడో తెలియరాకున్నయది. ౫-వ శతాబ్దియందు గుప్తరాజులు కొంతకాలమువఱకును దీనిని తమరాజధానిగఁ జేసికొన్నట్లు గానవచ్చుచున్నది. సముద్రగుప్తుఁడును (క్రీ. శ. ౩౦౦ - ౩౭౪), అతని కుమారుఁడును ఈ పట్టణమందే రాజ్య మేలినట్లు మన మూహింపవచ్చును[1]. ౬-వ శతాబ్దియందు హూణు అను అసభ్యజాతులవాండ్రు హిమాలయపర్వతప్రాంతమునుండి వచ్చి అయోధ్యాప్రాంతము నాక్రమించుకొనిరఁట. వీరినిగుఱించియుఁగూడ నిశ్చయమైన చరిత్ర తెలియదు. వీరు నూఱుసంవత్సరములు రాజ్యము చేసినతర్వాత వాయవ్యదిక్కునుండి సోమవంశపురాజులు వచ్చి రాజ్యము నాక్రమించుకొనిరి. ఇది పిదప కన్నోజరాజులయధీన మయ్యెను. వీరు జైనమతస్థులు. వీరితరువాత జయచంద్రునిశాసన మొకటి కాన్పించెను. 'భర' అను అసభ్యజాతివారుకూడ నిచ్చటఁ గొన్నిసంవత్సరములు రాజ్యము చేసిరఁట. వీరును జైనులే. కాని వీని కన్నిటికిని దంతకథలు తప్ప చరిత్రాధారములు లేవు. క్రీ. శ. ౧౧౯౪ లో మహాబుద్దీన్‌గోరీ కన్నోజపట్టణమును గెల్చినతరువాత నయోధ్యాపట్టణమును కొల్లగొట్టుకొనిపోయెను. తరువాత తురకలప్రభుత్వమును, తదుపరి ఇంగ్లీషువారిప్రభుత్వమును (౧౮౫౬) వచ్చెను. ఆచరిత్రవివరము 'ఔధ్' అను శబ్దముక్రింద సవిస్తరముగ వ్రాయఁబడును.

అయోధ్యాపట్టణమును, దానికి ౪ మైళ్లదూరమునం దున్న ఫైజాబాద్‌పట్టణమును గలసి యొకమ్యునిసిపాలిటీగా నేర్పఱుపఁబడినది. ఇప్పటి అయోధ్యయు, దానిచుట్టుపట్టుల నున్న జీర్ణమందిరాదులస్థలమును కొలది చూడ పశ్చిమమున గుప్తారుఘాటు మొదలుకొని తూర్పున రామఘాటువఱకును ౬ మైళ్లపొడు వుండును. ఇచ్చట ౯౬ హిందూదేవాలయములును, ౩౬ మసీదులును, ౬ జైనమందిరములును, ౪ వైష్ణవమఠములును కలవు. హిందూదేవాలయములలో ౬౩ వైష్ణవమందిరములు, ౩౩ శైవమందిరములు. ఈ గ్రామమునందెచ్చటఁ జూచినను శ్రీరామునిచరిత్రసంబంధమైన వేఱువేఱు ప్రసంగములం జూపుమందిరములు పెక్కుగలవు. ఇచ్చటిమందిరములలో రామ్‌కోట్ అనునది యొక్కువప్రాముఖ్యముగ నెంచఁబడును. అది రామునిజన్మస్థల మని చెప్పెదరు. అదియుంగాక రాముఁ డచ్చట పెద్దకోట కట్టించి దానికి ౨౦ బురుజు లేర్పఱిచి ఒకదానిమీఁదను హనుమంతుని, మఱియొకదానిమీదను సుగ్రీవుని, వేఱొకదానిమీఁద జాంబవంతుని ఇట్లు వేఱువేఱు సైన్యాధిపతులను వానిమీఁద నుంచెనఁట. ఈమందిరమునకు తగిలి ఒకపెద్దమసీదు గలదు. ఈయది క్రీ. శ. ౧౫౨౦ లో బాబరుచక్రవర్తిచే నప్పు డక్కడ నున్నగుడ్లు పడఁగొట్టించి కట్టింపఁబడెను. అప్పటినుండియు నిందలి కొంతస్థలము తమదేవాలయస్థలమే యని హిందువులును, తమమసీదులోనిస్థలమే యని మహమ్మదీయులును ఎడతెగక పోరాడుచుండిరి. కాని కొంతకాలముక్రిందట ప్రభుత్వమువారు మసీదునకును, మందిరమునకును హద్దులేర్పఱిచి నడుమను కంచె వేసిరి. అచ్చటిముఖ్యమందిరములలో స్వర్గద్వార మనునది యొకటి. ఇచ్చటనుండి రాముఁడు స్వర్గమునకు వెళ్లెనఁట. దానియొద్దనే ఔరంగజేబుచేఁ గట్టింపఁబడి జీర్ణమైన మసీ దొకటి కలదు. ఇప్పు డిచ్చట కానవచ్చు దేవాలయము లన్నియు ౧౭-వ శతాబ్దిలోనో, ౧౮-వ శతాబ్దిలోనో కట్టింపఁబడినవి.

1. V. A. Smith's Early History of India.

బహుబేగం అను నామెయొక్క గోరీ ఈపట్టణమునందలి చూడఁదగినస్థలములలో నొకటి. వారన్ హేస్టింగ్సువలన చెఱఁబెట్టఁబడి బాధపడినయామెయే యీమె. ఈగోరీ కట్టుటకు నామె సొత్తులోనుండి మూఁడులక్షలరూపాయ లింగ్లీషుగవర్న మెంటువారి యధీనము చేయఁబడినవి. ఆమె క్రీ. శ. ౧౮౧౬ లో మృతి నొందెను. అప్పటినుండియు గోరీ కట్టుట ప్రారంభింపఁబడి క్రీ. శ. ౧౮౫౭ లో పూర్తి చేయఁబడెను.

ఇచ్చట రామనవమికి గొప్పయుత్సవము జరగును. అప్పుడు యాత్రికు లయిదులక్షలకంటె నెక్కువ వచ్చెదరఁట.

**అయోధ్యాపురం** — గంజాంజిల్లా టెక్కలితాలూకాయందలి యీనాంగ్రామము. జనసంఖ్య ౨౫౦.

**అయోధ్యాప్రాంతము** — ఇప్పుడు దీనిని ఔధ్ లేక అవధ్ అనిరెదరు. ఇది అయోధ్యాశబ్దభవము. అయోధ్యాప్రాంతమునుగురించి 'ఔధ్' అనుశబ్దము చూడనగును.

**అయోధ్యాసంస్థానము** — యునైటెడ్ ప్రావిన్సెస్ (ప్రయాగప్రాంతము)లోని యొకజమీన్దారీ. దీని విస్తీర్ణము ౪౬౨ చదరపు మైళ్లు. ఇది ఫైజాబాద్, గోండా, సుల్తాన్పూర్, బారాబంకీ, లక్నో అను నయిదుజిల్లాలలో వ్యాపించియున్నది. ఇది తాలూకుదారీపద్ధతిమీఁద నమరక్రము చేయఁబడిన జమీన్దారీ. గవర్నమెంటువారికి చెల్లింపవలసిన పేష్కష్ రు. ౫,౯౦,౦౦౦ లు; జమీన్దారునకు ఆదాయము రు. ౧౧,౦౦,౦౦౦. వీరు బ్రాహ్మణులు. వీరి మూలపురుషుఁడు భక్తావర్ సింగ్. ఈతఁడు ఔధ్నవాబైన సాదత్ అల్లీఖాను (క్రీ. శ. ౧౭౯౮ - ౧౮౧౪)వొద్ద సైన్యములో గుఱ్ఱపురౌతుగా ప్రవేశించి ఈ జమీన్దారీని సంపాదించెను. క్రీ. శ. ౧౮౫౫ లో భక్తావర్ సింగ్ చనిపోయినందున నతనితమ్మునికుమారుఁడైన మానసింగ్ అతనిసొత్తునకు వారసుఁడయ్యెను. కాని ఔధ్ ప్రాంత మింగ్లీషువారు స్వాధీనపఱుచుకొన్నతరువాత నీతనిజమీన్దారీ యంతయు వారు తీసికొనిరి. క్రీ. శ. ౧౮౫౭ లో సిపాయిల విప్లవము ప్రారంభ మైనప్పు డీతఁడు ఫైజాబాదులో ఖైదీగ నుండెను కాని అతనిని విడుదలచేసి ఇంగ్లీవారు తమభార్యాపుత్రాదులను రక్షింపవలసిన దని కోరినందున నీతఁడు యూరోపియన్స్త్రీలను, బాలురను తనకోటలో నుంచుకొని రక్షించి సురక్షితముగ గోగ్రానది దాఁటించెను. తరువాత నతఁడు లక్నోపట్టణములో విప్లవకారులలోఁ జేరెను. కాని మరల నింగ్లీషువారికి సహాయుఁడై యసంఖ్యయూరోపియనుస్త్రీపురుషులప్రాణములను రక్షించెను. ఆ ప్రాంతమునం దంతటను కల్లోలములు లేకుండ శాంతి గలుగుటకు మిగుల సాయము చేసెను. అందుచే నింగ్లీషువారు క్రీ. శ. ౧౮౫౮ లో ఈతనికి అతనిజమీన్దారీ నిచ్చివేయుటయే కాక విప్లవకారులలోఁ జేరిన గోండారాజాయొక్క సంస్థానమునుగూడ నిచ్చివేసిరి. మహారాజా యన్నబిరుదును ఒసంగిరి. తరువాత కె. సి. యస్. ఐ., అను బిరుదును ఇయ్యఁబడెను. క్రీ. శ. ౧౮౭౦ లో నీతఁడు కాలధర్మము నొంద మహారాజా సర్ ప్రతాపనారాయణసింగ్, కె. సి. ఐ. ఇ., జమీన్దారయ్యెను. అతఁడు క్రీ. శ. ౧౯౦౬ లో మృతుఁడయ్యెను.

**అయోనియా** — ఆసియామైనరు పశ్చిమతీరమునందు ఏజియన్ సముద్రము నంటిగయున్నట్టియు, తూర్పున లిడియా సరిహద్దుగాఁ గలిగినట్టియు భాగమునకుఁ బేరు. ఇది పర్వతమయమయిన దేశము. ఉత్తరమునుండి దక్షిణమునకు దీనిపొడువు ౯౦ మైళ్లు; వెడల్పు ౨౦ నుండి ౩౦ మైళ్లవఱకు భేదించుచుండును. ఇది అందమయి సారవంతమయిన ప్రాంతము. ప్రాచీనగాథల ననుసరించి చూచినచో క్రీస్తుపూర్వము పదునొకండవశతాబ్దిని 'అట్టికా' నుండి గ్రీకు లిచ్చటికి వలస వచ్చి రనియు, పండ్రెండు పట్టణములను గట్టి రనియు, వీనియన్నిటికిని సంబంధించిన కార్యములను ఈపట్టణములవారు కలసి చేయుచువచ్చినను ఏపట్టణమున కాపట్టణమే స్వతంత్రముగ నుండెడి దనియుఁ దెలియవచ్చుచున్నది. వర్తకవ్యాపారమువలనను, ఓడల నడపుటవలనను, సేద్యమువలనను ఈపట్టణములు ధనసమృద్ధము లయి వృద్ధిలోనికి వచ్చినవి. కాని యీదేశము లిడియారాజయిన క్రొయిసస్నకును, తరువాత పెరిషయారాజయిన సైరస్నకును (క్రీ. పూ. ౫౪౬) సామంతరాజ్య మయినది. నడుమ నిది మరల కొంతకాలము స్వతంత్రముగ నుండినను, పెరిషియాసామ్రాజ్యమును అలెగ్జాండరు కూలఁద్రోయువఱకును (క్రీ. పూ. ౩౩౪ - ౩౩౧) ఇది పెరిషియారాజుక్రిందనే యుండెను. అటుపిదప నిది మాసిడోనియాసామ్రాజ్యమునం దంతర్భాగ మయినది. అటుతరువాతను గొంతకాలమునకు అయోనియా ఆసియాయందలి రోమనురాజ్యమునందుఁ జేరిపోయెను. అటుపిదప సారసెనులు దీనిని పూర్తిగ విధ్వంసము కావించిరి. ఈకారణమున, చూత మన్నను ఈప్రాంతమందు ప్రాచీనసభ్యతాచిహ్నము లేవియుఁ గానరావు.

తత్త్వశాస్త్రమున అయోనియనుసంప్రదాయ మని పేరొందిన యొకవాదమున కిది మాతృభూమి. అయిదవశతాబ్దియందలి ఏథెన్సుయొక్క చక్కనికళావికాసమున కిది మార్గము తీసినది. అయోనియాకళ ఎనిమిదవ, ఏడవ, ఆఱవశతాబ్దులందు వర్ధిల్లినది.

ప్రాచీనకాలమున హిందూదేశమునకు మునుముందు పరిచయులయిన గ్రీకులు అయోనియానివాసులు. ఈకారణముననే పూర్వము హిందువులు గ్రీకులను యవను లనుపేర వ్యవహరించుచువచ్చిరి. యవనపదము అయోనియను శబ్దభవ మని కొందఱుమతము.

**అయోనియాదీవులు** — గ్రీసుదేశమునకు పశ్చిమ, దక్షిణతీరముల పొడుగున వ్యాపించిన అయోనియనుసముద్రమునందలి సప్తగ్రీకుద్వీపము లీపేరఁ బరఁగుచున్నవి. వీనిలో కార్ఫ్యూ, సిఫెలోనియా, జాంటి, సెరిగోలు చాల పెద్దవి. ఈ దీవులమొత్తము వైశాల్యము ౧,౧౦౦ ల చ. మైళ్లు. ఈదీవు లన్నియు కొండలమయ

sampath_Ebooks

మైయున్నవి. ఇందు ద్రాక్షరకములు, ఆలివ్‌చెట్లు విశేషముగఁ బెరుఁగుటవలన ఇం దెక్కువజనులు నివసించుచున్నారు. ఇచ్చటి కాలమానము సమశీతోష్ణముగ నుండును. ద్రాక్ష, 'వెలోనియా', సారాయము, సబ్బు, ఉప్పు అనునవి యిచ్చటి ప్రధానములయిన యెగుమతులు. బట్టలు నేయుట, నగలు చేయుట యిచ్చటి ప్రధానమయిన పరిశ్రమలు.

గ్రీసుదేశపుప్రాచీనచారిత్రమునం దయోనియాదీవులసంగతి తఱచుగ వినవచ్చును. ౧౩౮౬-వ సంవత్సరమున కార్ఫ్యు ఐచ్ఛికముగనే వెనీసునకు లోఁబడిపోయినది. కొలఁదికాలముననే యితరద్వీపములుకూడ వెనీసురక్షణముక్రిందఁ జేరినవి. ౧౭౯౭ న ఈదీవులు ఫ్రెంచివారికి వశపడినవి. ౧౮౦౯-౧౦లో బ్రిటీషుసేనలు వచ్చి వీని నాక్రమించుకొనినవి. గ్రేటుబ్రిటనుసంరక్షకత క్రింద ౧౮౧౫ న నీ యేడుద్వీపములు నొకప్రజాస్వామికముగ నేర్పడినవి. ౧౮౬౪ న ఇవి గ్రీసుదేశమున కిచ్చివేయఁబడినవి. జనసంఖ్య దాదాపుగ ౨,౭౦,౦౦౦లు.

**అయోన్లాతహసీల్** — సంయుక్తరాష్ట్రముల యందలి బరేలీమండలమున నొకతాలూకా; ౨౬°౧౦', ౨౬°౩౧' ఉ.కును, ౮౧°౫౭', ౮౨°౨౬' తూర్పునకును నడుమ నున్నది. దీనివైశాల్యము ౩౦౬ చ. మైళ్లు. తహసీల్ మొత్తముమీఁద మూఁడుపట్టణములు గలవు. ౩౨౦ పల్లెటూళ్లు గలవు. ఈతహసీల్ అయోన్లా, బల్లియా, సనెహా, సిరౌలీ యను నాలుగుపరగణాలుగ విభజింపఁబడియున్నది. దీని ఉత్తరమునను, తూరుపునను రామగంగానది ప్రవహించును. ఈప్రదేశ మంతయు మిక్కిలి సారవంత మయినది. మొత్తముమీఁద నయోన్లాతాలూకాలో పైరుపంటలకు నదులకన్న చెఱువులే యెక్కువగ నాధార మయియున్నవి. ఈ తాలూకాలో జనసంఖ్య సగటున చ. మైలు ౧-కి ౮౯౨ వంతున నుండును.

**అయోన్లాపట్టణము** — అయోన్లాతాలూకాకుముఖ్య పట్టణ మిది. ఔధ్-రోహిల్‌ఖండ్ ఇనుపదారికిఁ జెందిన అలీఘర్-బరేలీ బ్రాంచిపై నున్నది. ౧౮-వ శతాబ్దియందుఁగూడ నీప్రాంత మంతయు నడవులతో నిండియుండెను. ఆకాలమున కతేహ్రియాలను నొకతెగప్రజ లీభాగమున నివసించుచుండువారు. అటుపై రోహిల్లాలకును కతేహ్రియాలకును యుద్ధము వచ్చెను. ౧౭౩౯-వ సంవత్సరమున రోహిల్లాలు కతేహ్రియాల నోడించి యాప్రదేశమును వశపఱుచుకొనిరి.

మొదటిరోహిల్లారాజగు అలీముహమ్మద్‌కాలమున అయోన్లా రోహిల్‌ఖండమునకు రాజధానిగ నుండెను. కాని యతనితరువాతను రాజ్యమును పాలించినవారు దాని నుపేక్షించిరి. క్రమక్రమముగ దానిప్రాముఖ్యము క్షీణించుచువచ్చినది. ఏవో నాలుగైదు పల్లెలు కలసి యొకచోట నున్నట్లుగ నిప్పు డయోన్లా కన్పించును. అలీముహమ్మద్‌రాజభవన మిప్పటికి నిందు నిలిచియున్నది.

**అయోబాహువు** — ధృతరాష్ట్రుని నూర్గురు కుమారులలో నొకఁడు.

**అయోముఖము** — భరతవర్షమునకు దక్షిణదిక్కున నున్న యొకసామాన్యపర్వతము (వా. రా., కిష్కింధకాం).

**అయోముఖి** — దండకారణ్యమునం దుండిన యొక రాక్షసి. సీతను వెదకుచు రామలక్ష్మణులు క్రౌంచారణ్యమునందు మతంగాశ్రమమువైపు వెళ్లుచుండఁగా నది వచ్చి తన్ను వివాహమాడు మని లక్ష్మణుని కోరఁగా నతఁడు దాని ముక్కు, చెవులు, స్తనములు కోసి పంపివేసెను (వా. రా., అరణ్య. స. ౬౯).

**అయోముఖుఁడు** — ఒకదానవుఁడు.

**అయోవా** — అమెరికా సంయుక్తరాజ్యములయందలి యొకరాజ్యము. దీని కుత్తరమున మిన్నెసోటాయును, తూర్పున మిసిసిప్పినదియును, దక్షిణమున మిసౌరీయును, పడమట మిసౌరీ, బిగ్‌సియోక్సునదులును గలవు. దీనిమొత్తము వైశాల్యము ౫౬,౧౪౭ చ. మైళ్లు. ఈ రాజ్యమునందు పెక్కునదులు కలవు. ఇవి యన్నియు నీరాజ్యమునకు పడమటి, తూర్పు సరిహద్దులంగుఁ బ్రవహించు పెద్దనదుల ఉపనదులు. ఇచ్చటిభూమి మిట్టపల్లములుగా నుండును. ఇందైదువంతులలో నాలుగువంతులభూమి సాగుబడికి యోగ్య మయినది. శీతోష్ణస్థితి చాల నారోగ్యముగ నుండును. డిసెంబరుమాసము మొదలు మార్చినెలవఱకును శీతకాలమే. నడుమనడుమఁ గురియువర్షములవలన వేసవి అంత తీవ్ర మనిపించదు. ఈ రాజ్యమునందలి ప్రాగ్భాగమున లోహములు విశేషముగ దొరకును. వీనిలో సీసము, తుత్తినాగము, ఇనుమును ముఖ్య మయినవి. రాక్షసిబొగ్గుకూడ విశేషముగ లభించును. ఈ రాక్షసిబొగ్గు దొరకుప్రదేశము వైశాల్యము ౧౯,౦౦౦ ల చ. మైళ్లు. ఈ ప్రదేశమునుండి ప్రతిసంవత్సరమును ౭౦,౦౦,౦౦౦ ల టన్నులబొగ్గు త్రవ్వుచుందురు. సున్నపురాయి, బంకమట్టి, సుద్ద విశేషముగ లభించును. అయోవా వ్యావసాయికరాజ్యము. ఈరాజ్యమున ఇండియాధాన్యము, గోదుమలు, ఓట్లు విశేషముగ పండును. వ్యవసాయమునకుఁ బనికివచ్చు పనిముట్లు, యంత్రములు, పిండిమరలు తయారుచేయుట, త్రవ్వి తీసిన యినుమును కరఁగి శుద్ధిచేయుట – ఇవి ప్రధాన మయిన యిచ్చటి పరిశ్రమలు. ఈరాజ్యమున ౧౦,౦౦౦ ల మైళ్లకు పైఁగా రైలుమార్గము కలదు. ఇదికాక దాదాపు ౧,౦౦౦మైళ్లవఱకు ఎలెక్ట్రిక్కుమార్గము కలదు. నదీమార్గములగుండా మంచివర్తకము సాగుచున్నది. విద్య ఇందు బాగుగ వ్యాపించియున్నది. ఈరాజ్యమున మూఁడు విశ్వవిద్యాలయములు కలవు. వ్యవసాయకళాశాల యొకటి కలదు. ౧౮౩౩-వ సంవత్సరమున అయోవాయందు వలస యేర్పడినది. అప్పుడే మొట్టమొదటిమాఱు వలస వచ్చినవారు ఇండియనులవలననుండి భూమిని గొనిరి. ౧౮౩౮-వ సంవత్సరమునం దీరాజ్యమున ప్రభుత్వ

sampath_Ebooks

మేర్పడినది; ౧౮౪౬ న ఇది యూనియనులోఁ జేరినది. ఈరాజ్యమునకు డెస్‌మోయిన్స్ రాజధాని. ఇచ్చట గొప్పవిశ్వవిద్యాలయము కలదు. ఈరాజ్యమునందలి జనసంఖ్య ౨౪,౦౩,౬౩౦ (౧౯౨౦).

అయోవానగరము — అమెరికాసంయుక్తరాజ్యములయందలి యొకనగరము. జాన్సన్ కౌంటీకి రాజధాని. అయోవా నదిమీఁద నున్నది. ౧౮౩౯లో ఈనగరము స్థాపితమయినది. ఇచ్చట స్టేటువిశ్వవిద్యాలయము కలదు. ఇది అయోవారాజ్యమునకు ౧౮౩౯ మొదలు ౧౮౫౭ వఱకు రాజధానిగ నుండెను. జనసంఖ్య ౧౦,౭౦౦లు.

అయఃపానము — ఒకనరకము. సురాపానము చేయువారికి నిచ్చట కరఁగఁబెట్టినయినుము త్రాగించెదరు.

అయ్యంకి — కృష్ణజిల్లా దివితాలూకాయందలి జమీన్‌దారీగ్రామము. జనసంఖ్య ౧,౮౨౦ (౧౯౩౧).

అయ్యంకెరె — (దొడ్డమదెక్కెరె) మైసూరుదేశమందలి ఒకచక్కనికొలను. బాబాబుడన్ అనుపర్వతమునకు తూర్పువైపున నున్నది. దీనిచుట్టు కొండలును, నడుమ లంకలును కలవు. దీనికట్ట ౧,౭౦౦ అడుగులపొడుగును, ౩౦౦ అడుగులయెత్తును కలదు. కొలనిలోనిజలము ౩౫ అడుగులలోఁతుగ నుండును. సక్కరపట్టణపు రాజైన రుక్మాంగదుఁడు దీనిని గట్టించినాఁడని ప్రతీతి గలదు. ౧౩-వ శతాబ్దియందు హొయసలవంశపురాజు లీ చెఱువుకట్టను బలపఱిచిరి.

అయ్యంగారిపల్లి — ౧. చిత్తూరుజిల్లా పుత్తూరు తాలూకాయందలి జమీన్‌దారీగ్రామము. జనసంఖ్య ౧౫౪.

౨. చిత్తూరుజిల్లా పుత్తూరు తాలూకాయందలి జమీన్‌దారీగ్రామము జనసంఖ్య ౨౩౫.

అయ్యంపేట — తంజావూరుజిల్లా తంజావూరుతాలూకాలోనిగ్రామము. జనసంఖ్య ౯,౪౫౪. నూలుబట్టల పట్టుబట్టల నేతవిషయమున నీయూరు ప్రఖ్యాతికెక్కెను. పట్టుబట్టలు, నూలుతోను పట్టుతోను ఉలుతోను నేయఁబడిన తివాసీలు, చిఱుచాఁపలు, అద్దకపుచీరెగుడ్డలు ఇచ్చట చేయఁబడును. ఇచ్చట నేయఁబడు 'కట్టుని' అను బట్ట విశేషముగ పేరుగలిగినది.

అయ్యంరెడ్డిపల్లి — చిత్తూరుజిల్లా పామ్మనేరుతాలూకాయందలి యినాంగ్రామము. జనసంఖ్య ౫౭.

అయ్య — గౌరవద్యోతక మగుపదము. కర్ణాటాంధ్రభాషలలో పురుషులనామముల కంతమునఁ జేర్పఁబడుచుండును. ఆర్యశబ్దము అజ్జక్రిందను, అది క్రమముగ అజ్జ, అయ్య శబ్దములక్రిందను బరిణమించినది. బొంబాయి, కర్ణాటకమునం దీశబ్దము జంగములయొక్కయు, లింగాయతులయొక్కయు గురువులకు వాడఁబడుచున్నది. ౫౦౦ ల సంవత్సరములకు పూర్వ ముత్తరకొంకణములోఁ గూడ నీపదము స్వామిపేరునకుఁ జివర వాడఁబడుచువచ్చెను. కాని తరువాత అయ్యకు మాఱుగ రావుశబ్దము వాడఁబడుచువచ్చినది. అయ్యాపదము బాసుగ లే దని రావుపదమునకే జనులు ప్రాధాన్యమిచ్చిరి. ఇప్పు డాంధ్రదేశములోఁగూడ నిదియే జరగుచున్నది. పూర్వమునకంటె రావుశబ్దమున కిప్పు డెక్కువ ప్రచారము.

అయ్యగారిపేఁట — తూర్పుగోదావరి ఏజెన్సీజిల్లా భద్రాచలము తాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౧౨౯.

**అయ్యదీక్షితులు** — తంజావూరురాజ్యము నేలిన మహారాష్ట్రరాజులలో రెండవవాఁడగు శాహజీరాజేంద్రునియాస్థానమునం దుండిన యీ ప్రశస్తవిద్వాంసునియసలు పేరు రామభద్రదీక్షితులు. ఈయన కుంభకోణమునకు సమీపమందలి కందరమాణిక్య మను నగ్రహారమునందు చతుర్వేదయజ్వ యనువారివంశమున, నల్లాదీక్షితులపౌత్త్రులును, యజ్ఞరామదీక్షితులపుత్త్రులునై బహ్వృచశాఖ, ఆశ్వలాయనసూత్రము, కౌండిన్యగోత్రమునందు జన్మించెను. ఈయన అప్పయ్యదీక్షితులవారి భ్రాతృపౌత్త్రుఁడై శివలీలార్ణవాద్యనేకగ్రంథకర్తయైన నీలకంఠదీక్షితులవారియొద్దను, తమకు మామగారును కందరమాణిక్యగ్రామవాస్తవ్యుఁడును శబ్దకౌముదీ ధాతురత్నావళీత్యాదిగ్రంథకర్తయు నగు చొక్కనాథమఖి యనువారియొద్దను శాస్త్రాభ్యాసము చేసెను. ఆనందరావు పేష్వా అనునామాంతరము గలిగిన ఆనందరాయమఖి, త్ర్యంబకరాయమఖి యనువారికి సోదరుఁడైన భగవంతరాయలు తాను రచియించిన రాఘవాభ్యుదయము అనునాటకమునవతారికయందు ఈయనను స్తోత్రముచేసియున్నాఁడు. తంజాపురరాజు శాహజీభూపాలుఁడు క్రీ. ౧౬౯౩ ఆంగిరసనామసంవత్సరమునందు శాస్త్రవిద్వాంసులకు దానము చేసిన శాహజీరాజపుర మనునామాంతరము గలిగిన తిరువిశలూరు (ఇప్పటి తిరువిశనల్లూరు) నం దీయనకు ౪ వృత్తులు దానముచేసెను. ఈయన తన యిష్టదైవ మగు శ్రీరాములను తనగ్రంథము లన్నిటియందును స్తోత్రముచేసియున్నాఁడు. ఈయన రచియించినగ్రంథములలో ముఖ్యములు: ౧. పరిభాషావృత్తివ్యాఖ్య, ౨. షడ్దర్శనీసిద్ధాంతసంగ్రహము, ౩. సిద్ధాంతసారము, ౪. జానకీపరిణయనాటకము, ౫. శృంగారతిలకభాణము, ౬. రామస్తవకర్ణరసాయనము, ౭. చాపస్తవము, ౮. తూణీరస్తవము, ౯. ప్రసాదస్తవము, ౧౦. బాణస్తవము, ౧౧. విశ్వగర్భస్తవము, ౧౨. పర్యాయోక్తినిష్యందము, ౧౩. అష్టప్రాసము, ౧౪. పతంజలిచరితము. వీనియందు శృంగారతిలకభాణమునకు 'అయ్యాభాణ' మనియు నామాంతరము గలదు. దీనిని కవి తనశిష్యుఁ డగు రఘునాథుఁ డను వాయనయొక్క ప్రేరణమున వ్రాసినట్లు చెప్పుకొనియున్నాఁడు. ఈ భాణమును అమ్మాల్ భాణ మనునామాంతరము గల 'ఘటికాశతకము అమ్మాల్' అని వ్యవహరింపఁబడు వరదాచార్యులవసంతతిలకభాణమునకు బదులుగా వ్రాసినట్లు వాడుక గలదు. పరిభాషావృత్తివ్యాఖ్యాన

sampath_Ebooks

ము వీరి గ్రంథమునందు ఆనందరాయమఖియొక్క యౌదార్యమును గొనియాడియున్నారు.

రామభద్రదీక్షితులశిష్యులలో ప్రధానులు ముగ్గురు: ౧. సర్వసిద్ధాంతచంద్రికాకర్త యగు శ్రీనివాసదీక్షితుఁడు, ౨. శాబ్దికవిద్వత్కవిప్రమోదనిఘంటువును, పతంజలిచరిత్రమునకు లలితవ్యాఖ్యయు వ్రాసిన వేంకటేశ్వరకవి, ౩. రఘునాథకవియు. ఈకవికి ప్రభువు-శాహజీరాజేంద్రుఁడు క్రీ. ౧౬౮౪ మొదలు ౧౭౧౧ వఱకును రాజ్యముచేసెను. కవియొక్క కాలముగూడ నదియే.

(రం. స.)

**అయ్యనకోట** — నెల్లూరుజిల్లా కనిగిరితాలూకా యందలి జమీన్దారీ గ్రామము. జనసంఖ్య ౨౫౪.

**అయ్యనవల్లి** — నెల్లూరుజిల్లా ఉదయగిరితాలూకా యందలి యీనాంగ్రామము. జనసంఖ్య ౯౭.

**అయ్యనసింహుఁడు** — క్రీ. శ. ౧౧౧౦ మొదలు కొని ౧౧౩౫ వఱకును కరదమునేలిన శిలాహారరాజు. ఇతని యసలు పేరు గండరాదిత్యుఁడు. ఇతఁడు మహామండలేశ్వరుఁడు. అయ్యనసింహ యనునది యొకబిరుదము. ఇతని యధీనమున మహాసామంతబిరుదము గల నింబదేవరాళయుఁ డను పురుషుఁ డొకఁ డుండి యితనికిఁ బట్టుఁగొమ్మగ వర్తించెను.

**అయ్యనహళ్లి** — బళ్లారిజిల్లా హడగల్లితాలూకా యందలిగ్రామము. జనసంఖ్య ౪౨౭.

**అయ్యనార్** — సంస్కృత ఆర్యశబ్దమునుండి జనించిన తమిళభాషాపదము. ఇది తమిళదేశమందలి ఒక దేవతకు పేరు. ఉత్తరహిందూస్థానమున నీదేవతనుగుఱించి ఏమియు తెలియదు. కాని ఆర్య, హరిహరపుత్ర, శాస్త, మహాశాస్త నామములతో ద్రావిడులకు బాగుగ పరిచయ మైనదే. ద్రావిడదేశమందుకంటెను మలయాళమునందు నీదేవత కెక్కుడు ప్రచారముకలదు. తమిళదేశమున సుబ్రహ్మణ్యదేవునకుంబోలె మలయాళమునం దయ్యనారునకు అనేక సంఖ్యాకములగు దేవాలయములు కలవు. మలయాళదేశమునందు ప్రతిదేవాలయము యొక్కయు నైరృతకోణమున శాస్తగుడి యుండవలయునని దేవాలయనిర్మాణనిబంధములం దొక నియమము కూడ కలదు. హరిహరపుత్ర, ఆర్యనామములకంటె శాస్తనామముతో మలబారునం దితని నెక్కువగఁ గొలుతురు. అచట నితఁడు క్షేత్రపాలకుఁడుగ గణింపఁబడును. పడమటికనుమలయందలి యెనిమిది పర్వతశిఖరములమీఁద నితని కెనిమిది దేవాలయములు కలవు. పర్వతమాలికల పశ్చిమమందలి మలయాళీజననివాస మగు దేశమును బాహ్యోపద్రవములనుండియు, అనిష్టములనుండియు కాపాడుటకై ఉపర్యుక్తదేవాలయము లెనిమిదింటియందును ఎనిమిది శాస్తమూర్తులు స్థాపింపఁబడి యున్నవి. మలబారునం దెక్కువగ పూజింపఁబడినప్పటికిని తిరునెల్వేలి, తంజావూరు భాగములందును దానితో సమానమగు ప్రజానురంజనమే ఇతనికి కలదు. ముఖ్యముగా నచట ఇతర తమిళజిల్లాలలో పెక్కింటియందువలె నితఁడు గ్రామదేవతగఁ గాక గ్రామపాలకదేవతలలో నొకఁడుగ గణింపఁబడుచున్నాఁడు. అందుచేత నితఁడు భూతపిశాచావృతుఁడై యుండును.

గోదావరీనదికి ఉత్తరభాగమున నెవరికి నెఱుక లేనట్టియు, ద్రావిడదేశమునకు విలక్షణమైనట్టియు ఈదేవతకు మనోరంజకమగు ఉత్పత్తి కలదు. ఇతని అసలుపేరు శాస్త. వ్యాకరణానుసారము దేశశాసకుఁ డని దీనియర్థము. ఒక్కొక్కప్పుడు దీనిని గురువులకు, జనకులకుఁగూడ నుపయోగింతురు. ప్రపంచమును వశమం దుంచుకొని శాసించువాఁ డగుటచే శాస్తనామము ఈదేవతకు నొసంగఁబడినది. అమరకోశమునం దీపేరు బుద్ధునకుఁగూడ కలదు. సంస్కృతవ్యాకరణమునం దేవిషయమునకైన నుదాహరణ మొసంగవలసివచ్చినపుడంతయు దేవదత్తశబ్ద ముపయోగింపఁబడులాగున తమిళవ్యాకరణమందును శబ్దరూపములకుఁగాని, విభక్తులకుఁగాని ఉదాహరణములను చూపింపవలసి వచ్చినపుడు ఆ యుదాహరణవాక్యములందు తప్పక శాత్తన్ (శాస్త) శబ్దము కర్తగ నుపయోగింపఁబడియుండినందున ఈ శాస్తశబ్ద మొకప్పుడు తమిళదేశమున మంచిప్రచారముగల సర్వసాధారణనామ మైయుండినట్లు సులభముగఁ దెలిసికొనవచ్చును. కాని విశేష మేమన తమిళుల కిప్పుడు ఈ పేరన్న నంత ఆదరము లేదు. కాని మలబారునందు తఱచుగా వాడఁబడుచున్నది. మఱియు పూర్వపు సంస్కృతగ్రంథ మేదియు నీదేవతను పేర్కొనకయుండుట ఆశ్చర్యము. తమిళనిఘంటువు లితనిని శాతవాహనుఁ డని పేర్కొనుచున్నవి. క్రైస్తవశకారంభమునందలి శతాబ్దులలోని శక్తిమంతు లగు రాజులవంశ నామ మగుటచే శాతవాహననామము మంచి ప్రఖ్యాతమైనది. కాని శాతవాహనులతో నీదేవత కేమి సంబంధమో తెలియదు. తమిళనిఘంటువులం దితని కొసంగఁబడిన నామములందును, విశిష్టలక్షణములయందును నిమ్నలిఖితములు పేర్కొనఁబడి యున్నవి: 'కారినామక శ్వేతకరివాహనుఁడు, శెణ్డు ఆయుధధారి, పూరణా, పుష్కలాప్రియుఁడు, ధర్మరక్షకుఁడు, యోగి ఇత్యాదులు. గజ మితని వాహనము. కుక్కుట మితని పతాకలాంఛనము.

ఈపేరులను, యోగి, ధర్మపాలకుఁడు మున్నగువానిని, అమరకోశమున బుద్ధుఁడు శాస్త యని పేర్కొనఁబడియుండుట లోనగువానినిబట్టి యోజించిచూడ బుద్ధుఁడే ఇట్లు తమిళదేశమునఁ బూజింపఁబడుచు చివరకు హిందూదేవతలందు చేర్పఁబడి కాలాంతరమున నతని యుత్పత్తినిమిత్త మొక పౌరాణికగాథ కల్పింపఁబడె' (హైందవమూర్తి శాస్త్రచరిత్ర, పు. ౪౮౮) నని పూర్వోదాహృతనామలక్షణాదులనుబట్టి గోపీనాథరావుగారు నిశ్చయించుట సమంజసమే.

ఇట్టి ఈ చోద్యమైన దేవతనుగూర్చిన సమాచారము విష్ణుపురాణము, శ్రీభాగవతము, పద్మసంహిత, అంశుమద్భేదాగమము, సుప్ర

sampath_Ebooks

భేదాగమము, పూర్వకారణాగమములయందుఁ గలదు. ఇతని పుట్టుకను గుఱించినగాథ యిట్లు:— క్షీరసముద్రమథనానంతరము అమృతము వెలువడినతోడనే దానిని పంచుకొనుటయందున దేవదానవులకు జగడ ముప్పతిల్ల నప్పుడు విష్ణువు మోహిని యనుపేర సుందరస్త్రీ రూపమును దాల్చి అమృతపానము కేవలము దేవతలకే లభించులాగున అసురులు దానినుండి వంచితు లగులాగున వారి నెట్టయెదుటనే పంచుచుండ వారు తమ కలహకారణమునే బొత్తిగ మఱచిపోవునంత మిక్కుటముగ ఆమె మోహనసౌందర్యమును గాంచి మోహితులై యుండిరి. హరుఁడు (శివుఁడు) ఆమెను జూచి మోహితుఁడై తప్పించుకొనఁజాలక యామెను, అనఁగా హరిని కూడెను. తత్ఫలితముగ హరిహరపుత్త్రుఁ డుద్భవించెను (హరిహరులపుత్త్రుఁడు). ఇతనికే ఆర్య, శాస్త, అయ్యనా రని ఇతర నామములు. ఇది యొక విలక్షణమైన ద్రావిడదేవత అనియు, కాలాంతరమున ఆర్యదేవతాగణమున చేర్పఁబడిన దనియుఁ గనుఁగొనవచ్చును.



అయ్యనార్

ప్రస్తుత మితఁడు తమిళదేశములో గ్రామములను గాపాడు దేవతగ ముఖ్యముగఁ బూజింపఁబడుచుండును. ఇతనిని బూజించువారు చాలవఱకు తక్కువజాతులవారు. ఇతని గుడిలోని పూజ నొక శూద్రుఁడు చేయుచుండును. పద్మసంహితానుసారము అయ్యనారు గుడిలోఁ బూజ చేయవలసినవాఁడు బ్రాహ్మణునకు శూద్రస్త్రీయందు జనించిన అనులోమజాతుఁ డగు పారశవుఁడు. కాని తమిళదేశములో తక్కువజాతులవారిచేఁ బూజింపఁబడు దేవియొక్క మఱింత తామసిక రూపము లైన కాళి మున్నగువానివలె మలబారులో అయ్యనారు బ్రాహ్మణుల చేతనే పూజింపఁబడుచుండును.

అంశుమద్భేదాగమము, సుప్రభేదాగమము, పూర్వకారణాగమములనుండి సంగ్రహీత మగు నీ విచిత్రమూర్తి వర్ణన మెట్లనఁగా:—

౧. అంశుమద్భేదాగమము:— ఆర్యుని పద్మాసనాసీనుని జేయవలెను. ఇతనికి నాలుగుచేతులు; ముందరి దక్షిణ, వామహస్తములు అభయ, వరదసూచకములు. వెనుకటి దక్షిణ, వామహస్తములలోఁ గ్రమముగ కత్తి, డాలు నుండును. ఇతనికి మూఁడుకన్నులు. శాంతమైన ముఖము బంగారుపసిమివర్ణము కలిగి ఇతఁడు పీతవసనధారి యై

౨. సుప్రభేదాగమము:— ప్రపంచశాసకుఁ డగుటవలన శాస్త యనఁబడును. ఇతనికి రెండుకన్నులు, రెండుచేతులు – దక్షిణహస్తమున సెంకరకట్టి (తమిళములో దీనికి చెండు అని పేరు) వామహస్తమున ఫలములు, పల్లవములు — భూతాకృతి, మహోదరము, తలపైని కాటుకవలెపు వెండ్రుకలు, నల్లని రంగు, తెల్లని యజ్ఞోపవీతము, అనేకభూషణములు నుండును. చేతులు, కాళ్లు ముడుచుకొనియుండవలెను. ఇతనిని కుక్కలు, కోళ్లు, గొఱ్ఱెలు మొదలగువానితో ఆడుకొనుచున్నట్లు గనుపఱుపవలెను. ఇతనికి మదన, వర్ణని యను నిద్దఱు ప్రియురాండ్రు. వీరి సుందరసుసజ్జిత రూపముల నితని కిరుప్రక్కల నుంచవలెను. ఇతనియెడమప్రక్కను విరూపుఁడను దమనకుఁడు ఉండవలయును. ఈ దమనకుఁడు బహుశః శాస్తయొక్క సేవకుఁడు కావచ్చును.

౩. పూర్వకారణాగమము:— హరునివలన మోహినియందు జనించినపుత్త్రుఁ డను నీయాగమమునందలి విషయము అంశుమద్భేదాగమమునందలి వృత్తాంతముతో సరిపోవుచున్నది. కాని సుప్రభేదాగమమున వచించినట్లు రెండుకన్నులు, రెండుచేతులు కలిగి యితఁడు నల్లగ నుండవలయు నని యిందు వ్రాయఁబడియున్నది. ఇతనిని పీఠముపైని గూర్చుండఁబెట్టి వామపాదము పీఠముక్రిందికి వ్రేలాడుచుండులాగునను, కుడికాలిని ముడిచికొని పీఠముమీఁద నిలువుగా నుంచుకొనులాగునను జేయవలయును. కుడిమోఁకాలిమీఁద చాఁచిన యెడమచేయి ఆని యుండవలెను. కుడిచేతిలో వజ్రదండ ముండవలెను. ఇదియే వంకరకట్టి. యువకుఁడై, శాంతమైనముఖము కలిగియుండవలెను. తలమీఁది వెండ్రుకలు నీలివలెపు సిగారంగువలె నుండి విడివడి యుండవలయును. ఇతనివాహనమును, పతాకాలాంఛనమునుగూడ గజమే. ఇతనిప్రక్క సుందరియగు నొక కన్య యుండవలెను. మఱియు నల్లనిగుఱ్ఱము గాని, తెల్లని యెద్దు గాని ఇతని వాహనములుగ నుండవచ్చును. నాలుగుచేతులుకూడ నుండవచ్చును. పతాకాలాంఛనముగ కుక్కుట ముండినను ఉండవచ్చును.

sampath_Ebooks

వెంకియు నితనిని యోగిగను గనఁబఱుపవచ్చును. అప్పు డితనిని యోగాసనమునఁ గూరుచుండఁబెట్టవలయును. ఇతఁడు వేదాధ్యాయివలె శ్రోత్రులందు పవిత్రమును ధరింపవలయును. వీరాసనమునను గూర్చుండఁబెట్టవచ్చును. అప్పు డితనియుత్తరీయము ఉపవీతములాగున నుండవలయును. సుఖాసనాసీనునిగను చేయవచ్చును. అప్పుడు వంచిన కుడికాలిపాదము క్రిందుచుండు నెడమకాలితొడమీఁద నానునట్లు చేయవలెను; దృష్టి కుడిపాదముపై నిలిపి యుంచవలెను.

చెక్కఁబడు విగ్రహములవలన మనకు తెలియున దేమనఁగా:— సాధారణముగ శైవదేవతల భయంకరాకృతులందువలె నితని పొడుగైన సంసురువెండ్రుకలు విప్పారియుండును. ఇతఁడు బాణ, బాణాసనములనుగాని, వంకరకత్తినుగాని, కోదండమునుగాని, గజాంకుశమునుగాని తాల్చియుండును; నల్లనివాఁడు; గజమునో, గుఱ్ఱమునో ఆరోహించి యున్నట్టులును, లేక కేవలము ఆసనముపై నొక్కొక్కప్పుడు వటవృక్షముక్రింద కూరుచుండి యున్నట్టులును కాంచనగును. ఇతనికెదురుగ కొయ్యతోఁగాని చీనీఇటుకలు సున్నముతోఁగాని నిర్మింపఁబడిన అశ్వవిగ్రహములు, గజమూర్తులు, మఱియు నితరజంతువుల విగ్రహములు నుంచఁబడియుండును. ఇతని రాత్రివిహారములం దివి వాహనములుగ నుపయోగించు నని తలఁపఁబడుచున్నది. మదన, వర్ణని ఇతని ప్రియురాండ్రు. వీరు సామాన్యముగ పూరణై, పుష్కలై (సం. పుష్కల) అని వ్యవహరింపఁబడుచుందురు.

ఇతనికి జైనమూర్తులందును స్థానము కలదు. ఇతని కచట బ్రహ్మదేవుఁ డని పేరు. ఇతఁడు ౧౦-వ తీర్థంకరుఁ డగు శీతలానాథుని యక్షుఁడుగ నుండును. ఇతని ప్రియురాండ్రును నచట వారి యుచితస్థానముల నుందురు.

పావాడైరాయన్, మదురై వీరన్ అని ఇతనికి ఇద్దఱు సేనానులు. ఇందు రెండవయతఁడు చారిత్రకపురుషుఁడు (చూడుఁడు: దక్షిణ-ఆర్కాటుజిల్లా గెజెటీర్, సం. ౧, పు. ౧౦-౧౨), మదురై వీరన్ ఇతర గ్రామదేవతలలో నొకఁడు. వీరిలో ముఖ్యుఁడు కరుప్పణ్ణస్వామి. అయ్యనారుని ఒక నియతమతానుయాయు లగు కల్లకులీస్వామిని బూజింతురు. కుట్టిశాత్తన్, శాత్తన్, కరుప్పన్, ముణ్డన్, గులికన్ అనునవి అయ్యనారుని సేవకు లగు కొండఱు క్షుద్రరాక్షసుల పేరులు.

(టి. యన్. రా.)

**అయ్యన్న అగ్రహారం** — విశాఖపట్టణము జిల్లా విజయనగరము తాలూకాయందలి యీనాం గ్రామము. జనసంఖ్య ౨౪.

**అయ్యన్నపాలెం** — ౧. గుంటూరుజిల్లా వినుకొండ తాలూకాయందలి యీనాం గ్రామము. జనసంఖ్య ౬౬౩.

౨. విశాఖపట్టణముజిల్లా అనకాపల్లి తాలూకాయందలి జమీన్దారీ గ్రామము. జనసంఖ్య ౨౬౨.

**అయ్యనేరి** — చిత్తూరుజిల్లా తిరుత్తని తాలూకాయందలి జమీన్దారీ గ్రామము. జనసంఖ్య ౬౮౬.

**అయ్యపరాజు కొత్తపల్లి** — తూర్పు గోదావరి జిల్లా తుని తాలూకాయందలి జమీన్దారీ గ్రామము. జనసంఖ్య ౩,౬౭౮ (౧౯౩౧).

**అయ్యపరాజుగూడెం** — పశ్చిమగోదావరిజిల్లా చింతలపూఁడి తాలూకాయందలి జమీన్దారీ గ్రామము. జనసంఖ్య ౧,౦౪౯ (౧౯౩౧).

**అయ్యపరాజుపాలెం** — నెల్లూరుజిల్లా కందుకూరు తాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౬౬౨.

**అయ్యపరెడ్డిపాలెం** — నెల్లూరుజిల్లా గూడూరు తాలూకాయందలి జమీన్దారీ గ్రామము. జనసంఖ్య ౩౩౫.

**అయ్యలకృష్ణారెడ్డిపల్లి** — చిత్తూరుజిల్లా చిత్తూరు తాలూకాయందలి యీనాం గ్రామము. జనసంఖ్య ౨౩.

**అయ్యలరాజు అయ్యల భాస్కరులు** — వీరు జంటకవులు. క్రీ. శ. ౧౬౬౯-వ సంవత్సరమున గ్రంథరచన చేసినవారు. వీరిపూర్వులలో నొకఁ డగు తిప్పనార్యుఁడు ఒంటిమిట్ట రఘువీరశతకమును వ్రాసెను; రాయలయాస్థానమున నుండెను. మఱియొకఁ డగు రామభద్రుఁడు రామాభ్యుదయమును వ్రాసెను. అయ్యలుఁడు పినయక్కమామాత్యునకును, భాస్కరుఁడు నాగమామాత్యునకును బుత్త్రులు. ఈ జంటకవులు చెట్టుమతి యను కాలస్వరూపాదులను దెలుపు గ్రంథమును రచించిరి. ఇది కన్నడమున చెట్టయ యను జ్ఞాని వ్రాసిన గ్రంథమునకుఁ దెనుఁగు. తెలుఁగు చెట్టుమతము కర్నూలుజిల్లా యొబ్బపాలెమునకు పాలకుఁడును, అహోబలక్షేత్రధర్మకర్తయు నయిన వేంకటరాజున కంకిత మియ్యఁబడినది. ఇతఁడు విద్యాప్రియుఁ డయినట్లు గప్పట్టుచున్నాఁడు. కామందక మను గ్రంథమునకుఁగూడ నితఁడు కృతిభర్త.

**అయ్యవాండ్లపల్లి** — చిత్తూరుజిల్లా చంద్రగిరి తాలూకాయందలి జమీన్దారీ గ్రామము. జనసంఖ్య ౫౬.

**అయ్యవారికంబాలదిన్నె** — కడపజిల్లా జమ్మలమడుగు తాలూకాయందలి యీనాం గ్రామము. జనసంఖ్య ౩౦౧.

**అయ్యవారికోడూరు** — కర్నూలుజిల్లా నంద్యాల తాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౯౨౬.

**అయ్యవారిగూడెం** — తూర్పుగోదావరి ఏజెన్సీ జిల్లా భద్రాచలము తాలూకాయందలి జమీన్దారీ గ్రామము. జనసంఖ్య ౧౧౯.

sampath_Ebooks

**అయ్యవారిగోకులపాడు** — కర్నూలు జిల్లా కర్నూలుతాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౧,౨౩౬ (౧౯౩౧).

**అయ్యవారిపల్లి** — ౧. కర్నూలుజిల్లా కంభంతాలూకాయందలి యీనాం గ్రామము. జనసంఖ్య ౨౪౪.

౨. నెల్లూరుజిల్లా కందుకూరు తాలూకాయందలి జమీన్దారీ గ్రామము. జనసంఖ్య ౬౬౧.

౩. నెల్లూరుజిల్లా కనిగిరితాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౧,౪౯౫ (౧౯౩౧).

౪. కడపజిల్లా కమలాపురంతాలూకాయందలి యీనాం గ్రామము. జనసంఖ్య ౨౧౪.

౫. అనంతపురంజిల్లా గుత్తితాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౩౮౩.

౬. చిత్తూరుజిల్లా వాయల్పాడు తాలూకాయందలి యీనాం గ్రామము. జనసంఖ్య ౩౬౯.

౭. నెల్లూరుజిల్లా ఉదయగిరి తాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౬౬౦.

**అయ్యవారిపాలెం** — ౧. నెల్లూరుజిల్లా రాపూరు తాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౬౩౩.

౨. నెల్లూరుజిల్లా గూడూరు తాలూకాయందలి జమీన్దారీ గ్రామము. జనసంఖ్య ౬౦౧.

**అయ్యవారిపేట** — తూర్పుగోదావరి ఏజెన్సీజిల్లా నూగూరుతాలూకాయందలి జమీన్దారీ గ్రామము. జనసంఖ్య ౪౮౮.

**అయ్యవారిపోలవరం** — తూర్పుగోదావరి ఏజెన్సీ జిల్లా పోలవరంతాలూకాయందలి యీనాం గ్రామము. జనసంఖ్య ౭౬౨.

**అయ్యవారిరుద్రవరం** — కృష్ణాజిల్లా దివితాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౧,౧౧౨ (౧౯౩౧).

**అయ్యామల్ బీజ్** — శుక్లపక్షమునందలి కొన్ని దినములు-త్రయోదశి, చతుర్దశి, పూర్ణిమ – ఈదినములలో మహమ్మదు, ప్రయాణము చేయుచుండినఁగాని, యెచటనైన నిలిచియుండినఁగాని యాహారము గైకొనకుండెడివాఁడు. ఈమూఁడుదినములకు అయ్యామల్ బీజ్ అని పేరు.

**అయ్యాశాస్త్రి** — పూనాను పాలించిన సవాయీ మాధవరావుకాలమునాఁటి సుప్రసిద్ధ న్యాయాధీశుఁడు. ఇతనికార్యము గ్రామోద్యోగుల నేర్పఱుచుట.

**అరంగ్** — మధ్యపరగణాలలోని రాయపూరుజిల్లాయందలి ఒక గ్రామము. అచ్చటికి మహానది నాలుగుమైళ్లపై నుండును. జనసంఖ్య ౬౪౯౯. ఇది యొకప్పుడు మంచివైభవ మనుభవించినస్థలము. ఇచ్చట చక్కనికోనేఁరులును, మామిడితోఁపులును, హిందూ జైన మతములకు సంబంధించినకట్టడములును, దేవాలయములును గలవు. బాగేశ్వరునిదేవాలయ మొకటి గలదు. అటువైపునుండి జగన్నాథమునకు పోవువారీదేవుని తప్పక దర్శింతురు.

**అరంటాంగి** — తంజావూరు జిల్లా పట్టుకోట్టాయి తాలూకాలోని డిప్యూటీ తహసిల్దారు ఉండుస్థలము. జరీబట్టలు, పట్టుబట్టలు, రంగుబట్టలు ఇక్కడనుండి రంగూనునకు ఎగుమతి యగును. ఈపట్టణము మొదట తంజావూరురాజులయధీనమం దుండెను. కాని పదునైదవశతాబ్దియందు పాండ్యరాజునకు సేనాని యగు రామనాథపురపురాజు దీనిని స్వాధీనపఱుచుకొనెను. పదునేడవశతాబ్దియందు మరల తంజావూరురాజులు దీనిని దీసికొనిరి. కాని ౧౬౪౬ లో రఘునాథ తేవన్ అను రామనాథపురరాజు దీనిని మరలఁ దీసికొనెను. సంధిప్రకార మిది మరల తంజావూరురాజు నధీన మైనను ౧౬౯౮ లో మరల యుద్ధము ప్రారంభమై ఈపట్టణము రామనాథపురరాజునధీన మయ్యెను. ఇట్లే పట్టణము పెక్కుసారులు వీరినుండి వారికి వారినుండి వీరికి మాఱుచు చివరకు ౧౭౪౯ లో తంజావూరువారికిఁ జెందెను. ఇచ్చట నొకకోట గలదు. కోటలోని దేవాలయమునందు పెక్కు శాసనములు గలవు.

**అరంతుకహ్రదము** — కురుక్షేత్రమందలి యొక కోనేరు. కురుక్షేత్రమునకు నొకవైపు సరిహద్దుగ నుండెను (భార; శల్య. ౫౩).

**అర** — డచ్చి ఈస్టు ఇండీస్‌లో నున్న లంకల సమూహము. వైశాల్యము ౩౪౪ చదరపుమైళ్లు. జనసంఖ్య ౨౨,౦౦౦. ఇచ్చటిజనులను పాపను లందురు. ఇచ్చట స్వదేశీయులైన రాజులు రాజ్యము చేయుదురు. ఇచ్చట డచ్చిప్రభుత్వమువారి ప్రతినిధి యుండును. అచ్చటిజనులు ఎండ్రగుల్లలు, ముత్యపుచిప్పలు నిచ్చి అందుకు బదులు ఆహారపదార్థములు పుచ్చుకొందురు.

**అరకటవేముల** — కడపజిల్లా ప్రొద్దుటూరుతాలూకాలోని గ్రామము. జనసంఖ్య ౧౮౨౫ (౧౯౩౧).

**అరకటివేముల** — అనంతపురముజిల్లా తాడిపత్రి తాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౭౭౯ (౧౯౩౧).

**అరకల్లు** — బళ్లారిజిల్లా ఆదోనితాలూకాయందలి గ్రామము. ఇచటి జనసంఖ్య ౮౮౮ (౧౯౩౧).

**అరకు** — విశాఖపట్టణముజిల్లా పాడ్వాతాలూకా ఏజెన్సీకి చెందిన జమీన్దారీ గ్రామము. ఇచటిజనసంఖ్య ౫౭౨ (౧౯౩౧).

sampath_Ebooks

**అరకోణము** — చిత్తూరుజిల్లా వాలాజాపేఁటతాలూకాలోని ఒక గ్రామము. మద్రాసుసదరన్మరాటారైలుదారికిని, దక్షిణ యిండియారైలుదారికిని ఇది సంధిస్థానము.

**అరఖ్** — ఉత్తరహిందూస్థానమున నున్న ఒక వ్యవసాయదారుల తెగ. వీరి జనసంఖ్య ౬౬,౪౩౬. వీరు ముత్తముమీఁద సంయుక్తప్రాంతములలోఁ జాలమంది కలరు. తాము హిందువులమనియే వీరు చెప్పుకొందురు. కాని, హిందువుల యాచార వ్యవహారములతో వీరి కంతగ సంబంధము లేదు. కరతలదేవతి యను నొక సర్పదేవతను వీ రారాధింతురు; గొఱ్ఱెల నీదేవతకు బలియిత్తురు. ముత్తముమీఁద వీ రొక యాదవిజాతివా రని తోఁచును. ఉత్తమవంశములకుఁ జెందిన బ్రాహ్మణు లెవ్వరును వీరి యిండ్లకు పౌరోహిత్యాదులకుఁ బోరు.

**అరగాడ** — తూర్పుగోదావరియే జెన్సీజిల్లా చోడవరము తాలూకాకు చేరినగ్రామము. ఇచటిజనసంఖ్య ౪౧ (౧౯౩౧).

**అరగొండ** — చిత్తూరుజిల్లా చిత్తూరుతాలూకాలోని యొక పల్లె. జనసంఖ్య ౧౯౫౯. చిత్తూరునకు ౧౪ మైళ్లు వాయవ్యమున బాగ నీళ్లవసతి కలిగి సారవంతమయిన భూభాగమున కట్టఁబడినది. ఒకప్పుడు కడప కర్నూలు మొదలుగాఁగల పశ్చిమమండలములద్వారపురాకపోకలకు నీ గ్రామము మధ్యస్థానముగా నుండెను. ఇచ్చట నొక శివాలయము కలదు. ఈయాలయమునుగుఱించి అచ్చటివా రొకకథ చెప్పెదరు. ఒకరాక్షసుఁ డీగ్రామమును మ్రింగి విష్ణుభయమున నిచ్చటికి క్రోసెఁడుమీఁద నున్న రాతిసతిప్పవెనుక దాఁగుకొనెను. అప్పుడు విష్ణువు మూఁడు శివలింగములను తీసికొని వానిని కాళహస్తియందొక్కటి తిరుపతియందొక్కటి అరగొండయందొక్కటిస్థాపించెనఁట. రాక్షసుఁ డీ మూఁడులింగములను దాఁటుకొని పోలేక పట్టుపడి చచ్చెనఁట! ఈలింగత్రయమును బట్టి ఆంధ్రదేశమునకు త్రిలింగ మని పేరు గలిగెనఁట!

**అరగో, డొమినిక్ ఫ్రాంకాయిస్** (౧౭౮౬ - ౧౮౫౩) — ఫ్రాన్సుదేశమందలి జ్యోతిషపదార్థవిజ్ఞానశాస్త్రవేత్త. ఇతఁడు రేఖాంశము (విషువచ్ఛాయ – Arc of the Meridian) కొలచుటయందు బయొట్ (Biot) అను శాస్త్రజ్ఞునకు సాయము చేసెను. ఎకోల్ పాలిటెక్నిక్ (Ecole Polytechnique) అను విద్యామందిరమునందు ౨౦ సంవత్సరములవఱకును విభాగాత్మక భూమితి (Analytical Geometry) అను శాస్త్రమునకు అధ్యాపకుఁడుగ నుండెను. భ్రమణాత్మక - అయఃకాంతత్వము (Rotatary magnetism) ను నూతనముగ కనుఁగొనినందులకు క్రీ. శ. ౧౮౨౫ లో లండనులోని రాయల్ సొసయిటీవారు కాప్లెపతకమును (Copley medal) ఈతనికి బహుమతి చేసిరి. క్రీ. శ. ౧౮౩౦ లో పారిస్ పట్టణమందలి నక్షత్రశాలకు నధిపతిగా నియమించిరి. తరువాత ఫ్రాన్సుదేశములో జరిగినరాజ్యక్రాంతి (Revolution) లో నీతఁ డొక నాయకుఁడుగ నుండెను. లూకానెపోలియన్ అనువాఁడు ఫ్రాన్సుదేశమున కధ్యక్షుఁ డయి ఈతని కసమ్మతి మగుటచేత నీతఁ డాతని ప్రభుత్వమునకు లోఁబడినట్లు రాజభక్తి శపథము (Oath of allegiance) తీసికొనఁడయ్యెను. (క్రీ. శ. ౧౮౫౧, డిసెంబరు). అయినను ఈతనియోగ్యతయు, ఈతనియందు ప్రజలకుఁ గల గౌరవమును బట్టి ప్రభుత్వమువా రీతనిని శిక్షింపరైరి. ఈతఁడు పెక్కుగ్రంథములు వ్రాసెను. వానిలో స్వీయచరిత్రమును జ్యోతిశ్శాస్త్రమును ముఖ్యములు.

**అరజ** — భార్గవునికన్య. ఈమె కౌమార్యమును దండకరాజు నష్టపఱిచెను.

**అరట్టము** — భారతవర్షీయదేశము. ఇది ఉత్తరమున హిమాలయము నంటియున్నట్టు గానవచ్చుచున్నది. ఇది యార్యులచే బహిష్కరింపఁబడినదేశము. ఇందు మంచియశ్వములు కల వని ఖ్యాతి యుండెను.

**అరట్లకట్ట** — తూర్పుగోదావరిజిల్లా కాకినాడతాలూకాలోని గ్రామము. దీనిజనసంఖ్య ౩౦౬౯ (౧౯౩౧).

**అరట్లకట్ట** — పశ్చిమగోదావరిజిల్లా నర్సాపురంతాలూకాలోని గ్రామము. ఇచటి జనసంఖ్య ౧౨౫౦ (౧౯౩౧).

**అరఁటికుటుంబము** — ఈకుటుంబములోఁ జేరినజాతుల కుదాహరణములు: అరఁటి, పసుపు, అల్లము, ఏలకులు, మెట్టతామర, కచ్చోరము, దుంపరాష్ట్రము. ఈ కుటుంబమునందలి జాతు లన్నియు గుల్మములు. వీనిప్రకాండము భూమియందు దుంపు మూలవాహి (Rhizome) అనఁబడు దుంప. దీనినుండి పిల్కలు బయలుదేఱి భూమిపై కెదుగును. వీనియొత్తు ఆయాజాతుల స్వభావమునుబట్టి మొదట ౨౦ - ౩౦ అడుగులవఱకు నుండును. అరఁటిచెట్టే అన్నిటిలో నెత్తుగఁ బెరుఁగునది. ఆకులతొడిమలు పెడఁబ్బగ నుండి మట్టలయాకారమును జెంది యొకదాని నొకటి యావరించుకొని యుండును. అరఁటిలో నీతొడిమల (డిప్పల) కూడికయే కాండరూపమును దాల్చుచున్నది. కొన్నిజాతులలో (నీళ్లఅరఁటి) భూమిపైనిజూడ నిజమగుకాండ మేర్పడుట గలదు. పూవులు ఆకుతొడిమల సమూహమధ్యమునుండి వెలువడు నొకనిడివియైన కాఁడచివర గుత్తిగా బయలుదేఱును. పుష్పకోశము (Calyx) ను దళవలయము (Corolla) ను వేర్వేఱుగఁగాని రెండును కలసి యొకటే నిచోళము (Perianth) గఁగాని యేర్పడియుండును. రెండును వేర్వేఱుగ నుండుచో సామాన్యముగ నందు మూఁడేసిదళములుండును. కింజల్కములు (Stamens) ఆయాజాతులలో నాఱువఱకు నుండును. అండాశయము నీచము (Inferior) 3 అరలు గలిగి యుండును. కీలాగ్రము ఆయాజాతులలో నేకముగఁ గాని చీలికలుగఁ గాని యుండును. కాయలు జాతినిబట్టి విదారణములుగఁగాని, అవిదార

ణములుగఁగాని యుండును. అందు గింజలు కొలఁదిగఁ గాని యనేకములుగఁ గాని యుండును. ఈభేదములనుబట్టియే ఈకుటుంబము పెక్కుగణములుగను, జాతులుగను విభజింపఁబడుచున్నది. అందు ముఖ్యమునవి యీక్రిందను పేర్కొనఁబడును.

౧. అరఁటి ( Musa ) గణము :— ఇఁదలిముఖ్యజాతులు :

(౧) పండ్లఅరఁటి ( Musa Sapientum )

(౨) కూరఅరఁటి ( Musa Paradisiaca )

(౩) నారఅరఁటి ( Musa Texilis )

౨. హెలికోనియము ( Heliconiam ) :— ఇది చిన్నఅరఁటి మొక్కలను బోలియుండు పెక్కుజాతులుగలగణము. రమ్యతకొఱకుద్యానములలోఁ బెంపఁబడును.

౩. మెట్టతామర ( Canna ) :— ఇది పూర్వము రమ్యతకొఱకు పెంపఁబడు నొక ముఖ్యగణము.

౪. నీళ్లఅరఁటి ( Travellers palm - Ravenala Madagascariensis)

౫. ఏలక ( Elettaria Cardamomum )

౬. పాలగుంప ( Maranta Angustifolia ) :— ఆరోరోటు ( Maranta Arundinacea ) దీనికి సంబంధించిన మఱియొకజాతి.

౭. పసుపు ( Curcuma longa ), మామిడల్లము ( Cucuma amada), కచ్చోరము(Curcuma Zodoria) ఈగణములోనిజాతులే.

౮. దుంపరాష్ట్రము ( Alpinia Galanga ), సన్నరాష్ట్రము ( Alpini, sp. ), కలింగరాష్ట్రము ( Alpinia sp. ) - ఇవియు నీగణములోనివే.

ఇవిగాక ఉద్యానవనములలో రమ్యతకొఱకుఁ బెంపఁబడునవి ఇంకను పెక్కుగణములును, జాతులును ఈకుటుంబమునకుఁ జేరినవి గలవు.


అరఁటి ( The banana or plantain - Musa Sapientum) :— ఇది సామాన్యముగ ౬ - ౧౫ అడుగులయెత్తువఱకు పెరుగు జాతి. కాని నలువదియడుగులవఱకు కెదిగినచోట్లును గలవు.

అరఁటివేళ్లు నిడివిగ త్రాళ్లవలె నొకచోటావుగ పెరుగును. అనుకూలస్థితిగతులం దీవేళ్లు నాలుగైదుగజములవఱకు పెరుగుట గలదు. ద్విదళబీజకములందువలె నరఁటివేళ్లకు శాఖ లంతగపోయినను, వానిపైని కొన్ని సన్నని మలిపె ళ్లుండును. వీనిమీఁదను పెద్దవేళ్లకొనలకు కొంచెము వెనుకగను మూలలోమము లుండును. ఇవియే నేలనుండి యాహారమును సేకరించు అంగములు. పెద్దవేళ్లు స్వాభావికముగ పలువలను చెట్టకపోయినను ఏకారణమున నైన నవి తెగినపుడు గాని, వానికేదేని రాయివంటిది అడ్డు తగిలినపుడు గాని శాఖలుగఁ జీలి పెరుఁగుట గలదు.

పసుపు మొదలగు జాతులయందువలె నేలలో నుండునుంపదయే అరఁటిచెట్టుయొక్క నిజమగు కాండము. భూమిపై కెదిగి ఆకులను పెట్టుచు కాండమువలె నగపడునది (వికాండము) ఆకులయొక్క తొడిమలచే నేర్పడిన స్తంభము.

ఆకులు సామాన్యముగ ౫-౯ అడుగులనిడివియు, ౧౽ - ౨౽అడుగులవెడల్పును గలిగియుండును. ఏకముగ నుండు ఆకులలో అరఁటియాకే మిగుల పెద్దది.

పూలగుత్తి భూమియందలి నిజమయినకాండమునుండి వికాండము నుండా పైకి వచ్చి దానిచివరనుండి వెలువడు నిడివియైన కాఁడచివర నుండును. ఇది మొదట నూర్ధ్వముఖముగ బయలుదేఱినను బరువుచే క్రిందికి వ్రేలాడును. పూలగుత్తిలో నందమగు నెఱుపురంగు గలిగిన వృంతములు ఒకదానిపై నొకటి యమర్పఁబడియుండును ప్రతివృంతపు పంగలోను ౧౦-౧౫ పూవులు జంటవరుసలుగ నమర్పఁబడియుండును





౧ - వ పటము

(౧-వ పటము చూడుఁడు). గుత్తి క్రిందికి వాలినపిమ్మట క్రమముగ వృంతము లొక్కొకటిగ విడిచి రాలిపోవుచుండును. వృంతము రాలిపోవునపుడే దానిపంగలోనుండు పూలు విడుచును. సామాన్యముగ మొదట విడుచుకొన్ని వృంతములయందలి పంగలలో నుండు ఆఁడుపూవులయండాశయములు మాత్రమే కాయలుగ పరిణామము నొందును (౨-వ పటము చూడుఁడు). తక్కినపూవునందలి వానిలో కొన్ని (మిథునములు) యండాశయము లిట్లు పరిణామము నొందక చిన్నవిగనే యుండును. తక్కినవి (మగపూలు) క్రమముగ రాలిపోవును. కావున పూవులు పెక్కువంద లున్నను, గెలలో కాయలు స్వల్పముగ నుండును.

పూవునందు రక్షకపత్రములకును, ఆకర్షకపత్రములకును బదులొకటే పెద్దదళమును, దానిలోపల మఱియొకచిన్నదళము నుండును. కింజల్కము లైదుండును. అండాశయము ౩ అరలు గలిగియుండును.

sampath_Ebooks

కొనకాఁడ చివర దిమ్మ కొంచెము పెద్దదిగ నుండును. సామాన్యపుఅరఁటి జాతులలో గింజలు నామమాత్రముగ నుండును. కొన్నిటిలో నవి మిరియపుగింజలంత యగును. ఇవి నాఁటినచో మొక్కలు పుట్టును.




౨-వ పటము

1. అండాశయము కాయగా మారు పూవు.
2. అండాశయము కాయగా పెరుగక కొంచె మెదిగి కాఁడ నంటిపెట్టికొనియుండు పూవు.
3. అండాశయము రాలిపోవు పూవు.

అరఁటిచెట్టు మనదేశమున ప్రాచీనకాలమునుండియు నున్నదని సందేహము లేదు, ఇప్పటికిని కొన్నిచోట్ల వన్యస్థితియందుఁ గానవచ్చును. రామాయణమహాభారతములందు దీని ప్రశంస గలదు. ప్రాచీన-అరబ్బీ, లాటిన్, గ్రీకుగ్రంథములలో అరఁటి హైందవఫలముగఁ జేర్కొనఁబడెను. Musa Sapientum అను లాటిన్‌పేరునకు జ్ఞానవృక్ష మని యర్థము. పూర్వకాలమున హైందవఋషులు అరఁటిచెట్లఫలములను దినుచు వానినీడ నుందు రని పాశ్చాత్త్యు లనుకొనుటచే నీపేరు గలిగెను.

అరఁటితోఁట లిపుడు ఆసియా, ఆఫ్రికా, అమెరికాఖండము లందలి యుష్ణభాగములందును, వానిసమీపముననున్న ద్వీపములందును విస్తారముగఁ గలవు. పడమటియిండియాదీవులనుండి బ్రిటిష్‌దీవులకు ౧౯౨౮-౩౧-వ సం. లందు ఏఁటేఁట ౪౬,౨౫,౦౦౦ గెల లెగుమతి యయ్యెను. ఇండియాలో బంగాళము, బొంబాయి, అస్సాము, బర్మా, చెన్నపురిరాష్ట్రములం దీతోఁటలు విస్తారముగఁ గలవు. చెన్నపురిరాజధానిలో పడమటిసముద్రతీరమునను, కావేరి, గోదావరి డెల్టాలలోను ఈతోఁటలు విస్తారముగఁ బెంపఁబడుచున్నవి. తెలుఁగు జిల్లాలలో నివి ఉత్తరసర్కారులందుమాత్రమే విస్తారముగఁ గలవు.

అరఁటిరకములను కూరరకము లనియు, పండ్లరకము లనియు రెండు ముఖ్యతరగతులుగ విభాగింపవచ్చును. కూరరకములలో పచ్చబొంత, పచ్చబొంతిబత్తీసా, బూడిదబొంత, బూడిదబొంతబత్తీసా - ఇవి ముఖ్యములు. పండ్లరకములలో చక్కరకేళీ (శర్కరకదళీ) కర్పూరచక్కరకేళీ (లేక గిన్నీ), అమృతపాణీ - ఇవి ముఖ్యములు. ఇవిగాక, కొమ్మరఁటి, ఎఱ్ఱ చక్కరకేళీ, వామనకేళీ, పొట్టిమొకరి, సపోటాఅరఁటి మొదలగు మఱికొన్ని రకము లనేకములు అచ్చటచ్చట సాగునందుఁ గలవు.

అరఁటితోఁటలను పెంచుటకు మూఁడు ముఖ్యవిధానములు గలవు. తోఁటయందు మొక్కలను దూరముగ నాఁటి పెక్కుసంవత్సరములవఱకును పెరుఁగనిచ్చుపద్ధతి యొకటి. దీనికి దేశవాళీపద్ధతి యని పేరు. ఇందు సామాన్యముగ మొక్కలను ౧౪ - ౧౬ అడుగుల దూరమున జంటలుగ నాఁటుదురు. మొక్కలమధ్య తఱచు దున్నిపదును నిలుచునట్లు చేయుటవలన నీరు తఱచుగా పెట్టనవసరము లేకుండఁగాని, అసలే పెట్టకుండఁగాని సాగుచేయుట ఈపద్ధతియొక్క ముఖ్యలక్షణము. మొక్కలను ఒంటరిగ ౬ - ౮ అడుగులదూరముననే నాఁటి ఒకటిమొదలు 3 సంవత్సరములుమాత్రమే పెరుఁగనిచ్చుట మఱియొకపద్ధతి. దీనిని 'కంపెనీపద్ధతి' అందురు. చుఱుకుగఁ బని చేయు నెగువులను వేసి తగినంత నీరు కట్టి శ్రద్ధగఁ బనిచేయుటవలన పెద్ద గెలలను శీఘ్రముగ వేయునట్లు చేయుట యీపద్ధతికి ముఖ్యలక్షణము. పిల్కలను ౧౦ - ౧౨ అడుగులదూరమునమాత్రమే ఒక్కొకటిచొప్పున నాఁటి కొంచె మించుమించుగ దేశవాళీపద్ధతిలోవలెనే సాగు చేయు మధ్యమపద్ధతి కూడఁ గలదు.

అరఁటితోఁటలు జిగు రంతగా లేని వండలినేలలందు బాగుగ పెరుగును. ఆకులలముగు చీకు వలన సేంద్రియపదార్థము హెచ్చుగ నుండునెఱ్ఱమన్నుగల కొన్నికొండలోయలలోఁగూడ నరఁటితోఁటలు బాగుగ పెరుగుచున్నవి. తగినంత నీరున్నయెడల పాటినేలలో నివి పెద్దగెలలు వేయును. తగినంతయెరువు, నీరును లభించుచో కడమ రకముల నేలలలోఁగూడ నీతోఁటలను పెంపవచ్చును. సామాన్యముగ కంపెనీపద్ధతి నీరు వడియు దంపనేలలకును, తక్కిన రెండుపద్ధతులును తోఁటనేలలకును అనుకూలములు.

అరఁటితోఁటలను నాఁటుటకు సాధారణముగ శీతకాలమును (నవంబరు - జనవరి), తొలకరియు (జూన్ - జూలై) అనుకూలమగుకాలములు. కాని తగినంత నీరు లభించుచోట్లను, ఇవకచేయని చోట్లను ఎపుడు నాఁటినను మొక్కలు బ్రతుకును. త్వరలో గెల వేయురకములుమాత్రమే నాఁటఁబడు కంపెనీతోఁటలకుమాత్రమె తొలకరి అనుకూలముగ నుండును. ఆలస్యపురకములకును, దేశవాళీ మధ్యమపద్ధతులకును శీతకాలమే యనుకూలము.

కంపెనీతోఁటలను వరితో మార్చి ౪, ౫ సంవత్సరముల కొకసారి నాఁటవచ్చును. తోఁటను దీసివేసినచోట మరల నరఁటితోఁటను

వేయు లోపల నెన్నిసార్లు వరి సాగుచేసిన నంత మంచిది. ఈకాలమున వరితరువాత మెట్టసుక్కి యావసరమగు నూవు మొదలగు పైరులను బెట్టక వరికోఁతకు ముందు 'తోణుకు' జల్లజనుము, పెసర, మినుము, పిల్లిపెసర మొదలగువానిని పెట్టుట మంచిది. తోఁటనేలలందు మిర్చి, కంద, పెండలము, పసుపు, కూరగాయలు మొదలగువానితో నరఁటితోఁటలను మార్చి సాగు చేయవచ్చును.

దంపనేలలందు పెంచు కంపెనీతోఁటలలో అరఁటిని ప్రత్యేకముగనే నాఁటఁబడును. కాని శీతకాలమున నాఁటునప్పుడు దంపనేలలందును, తోఁటనేలలందునుగూడ నీమొక్కలమధ్య ఉల్లి నాఁటుట గలదు. దేశవాళీతోఁటలలో నరఁటిమొక్కల మార్చి మధ్యమధ్య ఉల్లి, దనియాలు, పసుపు, పెసర, అనుము, కోస మొదలగువానిని మొదటిసంవత్సరము సాగు చేయవచ్చును. సామాన్యముగ బత్తాయి, నారింజ, నిమ్మ, కొబ్బెర మొదలగుతోఁటలను నాఁటఁబెట్టఁదిన చోట్ల మొదట నరఁటితోఁటను పెంచి ౩-వ సంవత్సరమునకో, ౪-వ సంవత్సరమునకో ఆఫలవృక్షములను నాఁటి, అవి నీడనిచ్చుకాలమునకు నరఁటి మొక్కలను దీసివేయుదురు.


తోఁట వేయునేలను వెనుకటిసస్యమును గోసినప్పటినుండియు ౮-౧౦ చాళ్లు బాగుగ దున్నవలెను. నేలను సుకరముగ నీళ్లు విడువఁగలుగునట్లు చేయవచ్చును. దున్నిననేలపై మొక్కలను నాఁటుటకు ముందు పశువులను గాని, గొఱ్ఱెలను మేఁకలను గాని మంద గట్టుట మంచిది. తగినంత పశువులయెరువునుగూడ వేయవలెను. శీతకాలమున నాఁటుతోఁటలను నేల యారు టాలస్య మగుటచే, ముందుగ దున్నకుండఁగనే మొక్కలను గోతులు దీసి నాఁటుట గలదు. అట్టిచోట్ల నేల ఆరినపిమ్మట మధ్య నీళ్లు విడుతురు; లేక దున్నుదురు.

ఆయాపద్ధతులలో మొక్కలను నాఁటుమార్గము పైని సూచింపఁబడెను. ఈ క్రింద ఆయారకములను ఆయాపద్ధతులలో నాఁటఁవలసిన దూరమును, అట్లు నాఁటినప్పుడు ఎకరమునకు పట్టు మొక్కల సంఖ్యయు వివరింపఁబడును:—

| పద్ధతి | (దూరము-అడుగులు) | రకము | ఎకరమునకు పట్టు మొక్కల సంఖ్య |
|---|---|---|---|
| కంపెనీపద్ధతి | ౬ | వామనకేళీ | ౧౨౧౦ ఒంటి మొక్క |
| | ౬ ౨/౩ (౧౦ లింకులు) | చక్కరకేళీ, వామనకేళీ | ౧౦౦౦ ,, |
| | ౭ ౧/౩ (౧౧ లింకులు) | బొంత, కర్పూర చక్కరకేళీ | ౮౨౬ ,, |
| | ౮ (౧౨ లింకులు) | బొంత, కర్పూర చక్కరకేళీ | ౬౮౧ ,, |
| మధ్యమపద్ధతి | ౧౦ | కర్పూరచక్కరకేళీ అమృతపాణీ, బొంత | ౪౩౬ ,, |
| | ౧౧ | ,, | ౩౬౦ ,, |
| | ౧౨ | ,, | ౩౨౫ ,, |
| దేశవాళీపద్ధతి | ౧౪ | బొంత, అమృతపాణీ కర్పూరచక్కరకేళీ | ౨౨౨ రెండేసి మొక్కలు |
| | ౧౫ | ,, | ౧౯౪ ,, |
| | ౧౬ | ,, | ౧౭౦ ,, |

మొక్కలను నాఁటుగోతులను నాఁటుటకు వారముపదిరోజులు ముందుగఁ దీయవలెను. కంపెనీపద్ధతిలో తగినంతలోఁతుగ దున్నినను, నీళ్లువిడిచినను గోతులు పిల్లల గుంపలు పట్టుటకు సరిపడునంతంత యున్న చాలును. సామాన్యముగ ౧ అడుగు లోఁతు వెడల్పు నుండవలెను. మధ్యమపద్ధతిలో ౧½-౧¾ అడుగువెడల్పులోఁతుగల గోతులను తీయవచ్చును. దేశవాళీపద్ధతిలో ౧½-౨ అడుగులలోఁతు వెడల్పుగల గోతులను దీయవలెను.

అరఁటితోఁటలలో సామాన్యముగ సూదిపిల్లలనియు, అల్లిపిల్లలనియు రెండుతరగతుల పిల్లలు బయలుదేఱును. సూదిపిల్లలు నేలలోనుండి బలముగ పైకి వచ్చి దిట్టముగ నెదుగును. ౧-౨ నెలలలోనే ౨-౪ అడుగు లెదుగును. ౪-౫ అడుగు లెదిగినను సన్నముగ (౨-౩ అం. వెడల్పు)నే యుండు ఆకులను గలిగి యుండును (౩-వ పటమును జూడుఁడు). ఇట్టి పిల్లలగుంపలు



౩-వ పటము

మొక్కకుఁ దగినంత పరిమాణముగలిగి విస్తారముగ వేరుపోసియుండును. తగుదుంపలు తల్లిగుంపల కంటెయున్నను త్వరలోనే స్వతంత్ర జీవనము నారంభించును. అల్లిపిల్లలు మొదటనుండియు వెడల్పుగ నుండు ఆకులను పెట్టి మెల్లఁగ నెదుగును. ౨-౪ అడుగు లెదుగుటకు

sampath_Ebooks



౩-౪ నెలలకు పైఁగా పట్టును. వీనిదుంపలు మొక్కలకుఁ దగినంత పెద్దవిగ నుండవు. వేళ్లును స్వల్పముగ నుండును. ఇవి తల్లిదుంపపై నెక్కువగ నాధారపడి పెరుఁగును. విడఁదీసి నాఁటినపుడు త్వరలో నాఁటుకొని బలముగ నెదుగవు. చాల ఆలస్యముగ గెల వేయును. కావున నాఁటుటకు సూదిపిల్లలనే యెంచుకొనవలెను. శీతకాలములో ౧½, ౨ నెలలవయసు పిల్లలను, ఎండకాలమున (తొలకరిలో) ౨-౩ నెలలవయసుపిల్లలను నాఁటవలెను. మెరక ప్రదేశములకుఁ గొనిపోయి నాఁటుటకు ౩-౪ నెలలవయసుపిల్లలను మేలు. పిల్లలకును వాని దుంపలకును దెబ్బ తగులకుండఁ దీసి సాధ్యమయినంతవెంటనే నాఁటవలెను. నాఁటకముందు ప్రాఁతవేళ్లను మొదలంటఁ గోసివేసినచో మరల త్వరలో క్రొత్తవేరు పోయును. పిల్లలతలలనుగూడ ౧½-౨ అడుగులయెత్తున నఱికివేయవలెను. కొన్నిచోట్ల పిల్లలను దీసి దుంపలను ౨-౪ వారములవఱకును ఆరనిచ్చి పిమ్మట నాఁటు ఆచారము గలదు. అట్టిదుంపలనుండి క్రొత్తపోతు బయలుదేఱి పెరుఁగవలసి యుండుటచే గెల వేయుటాలస్యమగును.

నాఁటుటకు ముందు గోతులలో నెరువు వేయ నగత్యము లేదు. కాని దేశవాళీపద్ధతిలో నిట్లు వేయు ఆచారము చాలచోట్లఁ గలదు. బాగుగ వారినగోతులలో బాగుగ నెండినపైమంటితో పిల్లలను నాఁటవలెను. నాఁటినపిమ్మట వానిచుట్టును మంటిని బిగియఁ ద్రొక్కి నీరు పోయవలెను. ఈ తేమ ఆరినవెనుక మరల నొకసారి బిగియఁ ద్రొక్కుట మంచిది. పిమ్మట కాలస్థితినిబట్టి నీరు పోయుచు రావలెను. మొక్క బ్రతికినపిమ్మట బోదులుదీసి నీరు కట్టవచ్చును; లేక తోఁట నంతటిని మళ్లు గట్టికాని, కట్టకకాని; తడుపవచ్చును. కావున నిండువలన పదు నెక్కువయి, మొక్కలకు హాని గలుగకుండఁ జూడవలెను. మొక్క లెదుగుచుండఁగా తోఁటలలో కలుపు పెరుఁగకుండ గొప్పు త్రవ్వి గడ్డిగాదములను లాగివేయవలెను; లేక అంతరకృషి చేయవలెను.

తొలకరిలో నాఁటు కంపెనీతోఁటలలో మొక్కలు బ్రతుకఁగనే యొకసారి యెరువు (మొక్క ౧-కి ½-౧ పౌను అముదపుపిండి గాని వేరుసెనగపిండి గాని దానికి సమానమగు సత్తువచేయు ఎమ్మోనియా సల్ఫేటు మొదలగు వేఱు ఎరువును గాని) మొక్కచుట్టును మూరెఁడుమూరమువఱకును వేసి గొప్పు త్రవ్వి ప్రతి రెండువరుసలమధ్యను కాల్వలను త్రవ్వి వానిమధ్య పెడలపై పోయవలెను. మఱి ౪-౬ వారము లయినపిమ్మట మరల మొక్కకు ౧½-౨ పౌనులపిండిచొప్పున లెక్కచూచి పెడలపై నంతటను చల్లి పారలతో త్రవ్వి, మరల కాల్వలను కొంచెము లోఁతుచేసియు మంటిని పెడలపైఁ బోయవలెను. వర్షాకాలము ముగిసినపిమ్మటఁ గాని యాలోపుగ తగినంతవర్షము లేనియెడలఁగాని తోఁటలోఁ ద్రవ్విన కాల్వలలో నీరు కట్టుచురావలెను. బాగుగ పెంచినతోఁటలు డిసెంబరు జనవరినెలలలో గెలలువేసి మార్చి ఏప్రిల్ నెలలలో పంటకు వచ్చును.

శీతకాలమున నాఁటుకంపెనీతోఁటలలో మొక్కలను నాఁటుకొనువఱకును పైని చెప్పినట్లు పాఁతనీటివలనను, పిమ్మట నీరు కట్టియు, పెంచుచు మధ్య నాంతరకృషి చేయుచు తొలకరివఱకును పెంచుచు రావలెను. సాధ్యమయినంత తక్కువనీటినే కట్టి పెంచవలెను. తొలకరించినపిమ్మట తగినంతవర్షము గురిసినవెనుకఁ గాని నీరు కట్టి కాని, తోఁటను పారలతో మరలఁ గొట్టి, పైని చెప్పినట్లు రెండుసార్లు వేయునెరువును ఒకటేసారి వేసి వరుసలమధ్యను కాల్వలను దీసి యామంటిని పెడలపైఁ బోయవలెను. బాగుగ పెంచినతోఁటలు జూలై సెప్టెంబరునెలలలో గెలలు వేసి, అక్టోబరు డిసెంబరు నెలలలో పంటకు వచ్చును. అశ్రద్ధగఁ బెంచినతోఁటలలో మరల తొలకరించువఱకును గెలలు పంటకు వచ్చుచునేయుండును.

మధ్యమపద్ధతిలోను, దేశవాళీపద్ధతిలోను తోఁటలోనిపదునును దుక్కివలననే సాధ్యమయినంతవఱకు కాపాడుచు, వేసవిలోమాత్ర మప్పుడప్పుడు తడుపుచురావలెను. తొలకరిలో నొకసారియు, శీతకాలమున నొకసారియు పశువులయెరువు, బూడిదెనుమాత్రమే వేయవలెను. ఈతోఁటలలో సామాన్యముగ సంవత్సరముపొడుగునను గెలలు వచ్చుచుండును. తొలకరించిన ౨, ౩ నెలలవఱకుమాత్రము గెలలు తక్కువగ నుండును.

కార్పితోఁటలకు పిల్లలను వదలఁదలఁచుచో, తొలకరిలో నాఁటిన కంపెనీతోఁటలలో మరల తొలకరించినపిమ్మట బయలుదేఱు బలమైనపిల్ల నొక్కొక్కదానిని వదలవలెను. శీతకాలమున నాఁటుతోఁటలలో డిసెంబరు జనవరినెలలో నొక్కొక్కపిల్లను వదలవలెను. మధ్యమపద్ధతిలో తొలకరిలో నొకపిల్లయు, సెప్టెంబరునెలలో నొకపిల్లయు, జనవరిలో నొకపిల్లయు వదలవలెను. దేశవాళీతోఁటలలో నిట్లు రెండేసి పిల్లలను వదలవలెను.

అరఁటితోఁటలలోని యెండుచొరుగును వర్షాకాలమునఁ గోసివేయవలెను. ఎండకాలమున నట్లె యుండనీయవలెను. ఇది బొంపలకు ఉడుకు తగులకుండ కాపాడును. గెలలను నఱికివేయునపుడు సామాన్యముచెట్టును గజమెత్తున నఱకుట యాచారము. ఇట్లు నఱికివేసినభాగములను చిన్నచిన్నముక్కలుగ నఱికి అరఁటితోఁటలలో నాకాల్వలలోనే యుంచి తొలకరిలో పెడలమీఁద పఱచి మరల కాల్వలను లోఁతుచేసి పైని మంటిని బోయవలెను. కాల్వలను త్రవ్విన మధ్యమ దేశవాళీపద్ధతులలో నీచెత్తను కప్పుటకు మధ్య నక్కడక్కడ నొకకాల్వను త్రవ్వి అందువైచి కప్పవలెను. తలలు నఱకఁగా మిగులు బొందలను వానిదుంపలను, తొలకరిమొదలు ఎండలు ముదురువఱకును నెప్పటికప్పుడు త్రవ్వివేసి ఆగోతులలో నెరువును మంటిని బోసి కప్పవలెను. ఎండకాలమున వీని నట్టె యుంచినయెడల నవి కొంతవఱకు దానిపిల్లలకు తేమ నొసఁగి కాపాడును.

గెలలు పడిపోకుండ పోట్లు పెట్టుట అరఁటితోఁటలలోఁ జేయవలసినముఖ్యమైనయొకపని. సామాన్యముగ రెండువెదుళ్లను కొంత

యొత్తున త్రాటితోఁ గట్టి వానిని చెట్టున కెదురుగ బోటు పెట్టుట ఆచారము. కాని గాలివీచుచో నీబోటునమండి చెట్టు తప్పించుకొని పడిపోవును; లేక బోటుపెట్టినచోట విఱిగిపోవును. ఇంతకంటె, కొంచెము లావుపాటివెదురును గాని యేదేనికొయ్యను గాని, గెల కెదురుగ నేటవాలుగ నేలలో ౧౨, ౧౫ అంగుళములలోఁతుగ నాఁటి దానిపైభాగమునకు గెలయొక్క కాఁడను అది క్రిందికి వంగినచోట కొబ్బెరనారత్రాటితో గట్టిగ కట్టుట మంచిది.

అరఁటితోఁటలకు వేయఁదగినయెరువులనుగూర్చి పైని స్వల్పముగ వ్రాయఁబడెను. సుమారు ౨౫,౦౦౦ పౌనులబరువుగల అరఁటిగెలల నిచ్చు కర్పూరచక్కరకేళీతోఁట యొక్క యెకరమునుండి ౧౮౭ పౌనుల నత్రిజనిని, ౬౦ పౌనులస్ఫురత్వంచామ్లజనితమును, ౬౯౦ పౌనులపొటాషును దీసికొను నని లెక్క వేయఁబడెను. పొటాషు హెచ్చుగ తీసికొనఁబడినను ఈదేశమున చాలనేలలలో నది తగినంత గలదు. కాని మగలమరల నొకచోట తోఁటలను వేయుచో నిది చాలకపోవచ్చును. సామాన్యముగ నేలలో లోటుపడునది నత్రజని కావుననే పైకి కంపెనీఅరఁటితోఁటలకు వేయఁదగిన యెరువులలో తెలపిన్నములును, ఎమ్మోనియాసల్ఫేటునుమాత్రమే పేర్కొనఁబడెను. సామాన్యముగ వీనిని వాడిన చాలును. అవసరమగుచో వీనితోపాటు మంటిని గాని బూడిదను గాని కూడ వాడవచ్చును. దేశవాళీతోఁటలకును, మధ్యమపద్ధతితోఁటలకును సామాన్యముగ పశువులయెరువు, వంపుమన్ను నీలికొట్టె పంది పెంట మానవపురీషము మొదలగు స్థూలపు టెరువులను బూడిదతోఁగాని పాటిమంటితోఁగాని చేర్చి వాడుట మంచిది.

అరఁటితోఁటలకుఁ బట్టు చీడలు తక్కువ. చిన్నమొక్కల కొకప్పుడు ఒకవిధమగు పచ్చపురుగులు ( Prodenia Letura) పట్టుచుండును. ఇవి మొదట సమూహములుగ నుండి తరువాత అంతటను వ్యాపించుటచే, వీనిని ముందుగ గుర్తించి, ఇవి పట్టిన ఆకులభాగములను కోసి, గోతిలో వేసి కప్పుటవలన వీనిబాధ తొలఁగును. ఒక్కొకప్పు డొకవిధమగు గొంగళిపురుగు ( Pericollia Rieini ) కూడ పట్టును. వానినిగూడ నిట్లె నాశనము చేయఁదగును. దుంపల కొకవిధమగు డాలువుపురుగుపట్టుట కొన్నిచోట్లఁ గలదు. తోఁటలలో పులిబొందలు లేకుండ ఎప్పటికప్పుడు తీసివేయుచుండుచో నీబాధ అంతగా నుండదు.

అరఁటిచెట్లకు కొన్నితెగుళ్లు విశేషహాని చేయునవి గలవు. కాని, యీదేశమున నవికూడ నరుదు. ఒక్కొకప్పు డొకసూక్ష్మజీవి ( Bacterium )వలనఁ గలుగు తెగులుచే మొవ్వు పూర్తిగ పైకి రాక నిలిచిపోయి బొందలోపలిభాగమున కుళ్లిపోవును. ఇది అమృతపాణీ తోఁటలలో విస్తారముగఁ గనిపించును. తెగులు పట్టినచెట్లను నఱికి వేసి దుంపతోఁగూడ తీసివేసి యెండుచొరుగు కప్పి కాల్చివేయుచో నిది వ్యాపింపదు. ఒక్కొకప్పుడు పండ్లలోపలిభాగమున ( ముఖ్యముగ అమృతపాణీపండ్లలో ) ఎఱ్ఱనికుదప లేర్పడును. ఈభాగము గట్టిగ నుండి తిన నసహ్యమగును. ఇది యొక శిలీంధ్రమువలనఁ గలుగును. ఈతెగులు విస్తారముగ పట్టినపుడు బోర్డోమిశ్రణము గెలలపై పిచికారీచేయుట మంచిది.

గెలలు పూర్తిగ ముదిరి ఒకటిరెండుకాయలు పండినవెనుక నఱికి పండవేసినచో నందలిపండు రుచిమంతముగ నుండును. కాని యింతవఱకు ముదురనిచ్చినగెల లెసమతి కాఁగవు. కావున నీస్థితికి వచ్చుటకు ౧౦-౧౫ దినములు ముందుగనే గెలలను నఱకుదురు. కొంద ఱింకను లేతగెలలను నఱికి పంపుదురు. అవి గమ్యస్థానము చేరినచోట పండుటకుఁగాను వానికి పొగపెట్టుటగలదు. కొన్నిచోట్ల చొరుగు చుట్టి నేలలో పాతుటయుఁ గలదు. తినుటకు మంచిపండ్లు గావలె నన్న బాగుగ ముదిరినగెలలను చొరుగు చుట్టి వ్రేలాడఁదీసి పండ్లు బాగుగ మెత్తఁబడువఱకు నుంచి తినవలెను. ఇట్లు బాగుగ మెత్తఁబడినసిమ్మట తినుపండ్లు సులభముగ జీర్ణమగును, ఆరోగ్యకరము. ఒకసామాన్యపు అరఁటిపండు ( 3 ఔన్సులు తూఁగునది ) ౧ ఔన్సు బియ్యపు అన్నమునకు సమానమగు ఆహారము. ఇందు బి. సి విటమినులు కొలఁదిపరిమితిగఁ గలవు. దినమునకు రెండుఔన్సులబియ్యపు తవుడును, పావుసేరుపాలనుండి తయారుచేసిన మజ్జిగ లేక పెరుఁగును, ౧౨ అరటిపండ్లును, నూఱుపౌనుల తూనికగల మనిషికి సమగ్రమగు ఆహారము.

అరఁటికాయలు గాక అరఁటిపూవులును, మాటయుకూడ కూర పచ్చడి వడియములు మొదలగువాని కుపయోగించును. అరఁటియాకులు భోజనమున కుత్తమము.

అరఁటిగెలలను, ఎగుమతికి తగినట్లు కట్టుటవలనను, వానికి గాలి తగులుటకు వీలగువాగనులు సంపాదించుటవలనను అవసరమగు చలవ వాగనులను సంపాదించుటవలనను, అవి యరుదగుపంజాబుప్రాంతములకు పంపఁగలుగుచో చాల లాభకరముగ నుండును.

అరఁటిచెట్టునకు సంబంధించిన పరిశ్రమలలో అరఁటిపిండిపరిశ్రమయు నారపరిశ్రమయు ముఖ్యములు. అరఁటిపండ్లనుగూడ ఎండఁబెట్టినచో నిల్వ చేయుటకు వీలు గలదు. అరఁటికాయలను పలుచనిబిళ్లలుగఁ గోసి, యెండఁబెట్టి జల్లించి పిండి చేయవచ్చును. ఈ పిండి పిల్లలకు మంచియాహార మందురు. బిళ్లలను తఱుగుటకు ఇనుప కత్తులనుమాత్ర ముపయోగింపఁగూడదు. వాఁడిగ నున్నవెదురుబద్దలను గాని యితరలోహపుకత్తులనుగాని యుపయోగింపవచ్చును. అరఁటిపండ్లకు తొక్కలను దీసి దుమ్ము లేఁగనిచోట్ల వెదురుపేళ్లదాగరలలో నెండఁబెట్టిన ౫, ౬ దినములలో నీ రిగిరిపోయి కాగితములలోఁగాని డబ్బాలలోఁ గాని నిల్వ చేయుస్థితికి వచ్చును. ఇట్లెండించిన యరఁటిపండు పండిన అంజీరపుపండుపరిమళము గలిగియుండును. ౪, ౫ మాసములు నిల్వయుండును. అరఁటిడిప్పలను వాఁడిలేని యొకవిధమగు మడతకత్తిపీఁటపై కత్తికిని పీఁటకును మధ్య నుంచి నొక్కి లాగుటచే నందలినార యితరభాగములనుండి విడిపోవును. దీనిని కడిగి ఆరఁబెట్టిన, నిగనిగలాడునార తయారగును. దీనిని ప్రత్యేకముగఁ గాని, నూలితోఁగలిపి కాని బట్టలుగ నేయవచ్చును. నార దీయుటకు

sampath_Ebooks

ఫిలిప్పైన్‌దీవులలో నొక ప్రత్యేకరకము సాగుచేయఁబడుచున్నది. సామాన్యరకములనుండి తీరిక యైనపుడు తమకు వలయునారను రైతులు తీసికొనవచ్చును. కాని కూలిపెట్టి నార తీయించిన గిట్టదు.

ఆయాపద్ధతులలో వ్యవసాయమున కగువ్యయమును, దినుబడి యగుగెలలసంఖ్యయు వానివిలువయు ఈక్రింద సంగ్రహముగ వ్రాయఁబడెను.

| పద్ధతి | వ్యయము ఎ. ౧-కి (పసువులజతకు ౭ అ. (మగవానికి ౪ అ. ఆడుదానికి ౨ అ. కూలి చొ.) | దినుబడియగు గెలల సంఖ్య | వాని విలువ | వి.రా. |
|---|---|---|---|---|
| కంపెనీపద్ధతి (తొలకరి) చక్కెరకేళీ | రు. ౨౦౦ | ౯౦౦ | రు. ౪౫౦ | గెల ౧-కి ౮ అణాలు చొప్పున |
| కర్పూర చక్కెరకేళీ (శీతకట్టు పద్ధతి) | | | | |
| మొక్కతోట | రు. ౧౭౦ | ౭౫౦ | రు. ౩౫౦ | ,, |
| కోడుతోట | రు. ౧౨౦ | ౭౫౦ | రు. ౩౫౦ | ,, |
| కర్పూర చక్కెరకేళీ ౩ సంవత్సరములకు | రు. ౨౫౦ | ౧,౯౨౦ | రు. ౯౬౦ | ,, |
| దేశవాళీపద్ధతి (అమృతపాణీ ౬ సంవత్సరములు) | రు. ౪౫౦ | ౪,౩౨౦ | రు. ౧,౦౭౦ | గెల ౧-కి ౪ అణాలు చొప్పున |

(గో. జో.)

**అరడికుంట** — చిత్తూరుజిల్లా పుంగనూరు తాలూకా యందలి జమీన్దారీగ్రామము. జనసంఖ్య ౮౬౯ (౧౯౩౧).

**అరణ్యఖండ్రిక** — చిత్తూరుజిల్లా పుత్తూరుతాలూకా లోని జమీన్దారీగ్రామము. జనసంఖ్య ౧౮౩౧ (౧౯౩౧).

**అరతాల** — చిత్తూరుజిల్లా చిత్తూరుతాలూకా యందు చేరిన జమీన్దారీగ్రామము. జనసంఖ్య ౬౫ (౧౯౩౧).

**అరదల** — విశాఖపట్టణముజిల్లా పాలకొండతాలూకాకు చెందిన ఈనాంగ్రామము. జనసంఖ్య ౬౫౧ (౧౯౩౧).

**అరని** (౧౮౧౭ - ౧౮౮౨) — జానాస్ అరని ( Janos Arany ) అనునాతఁడు హంగేరీదేశమందలి కవి. అచ్చట ఆధునిక కవులలో నీతఁడు మిక్కిలి లోకప్రియుఁడు. ఇతనికావ్యములు దేశాభిమానపూరితములు. ౧౮౪౮ లో జరిగినవిప్లవమునందు నేర్పడిన జాతీయప్రభుత్వమునం దీతఁ డొకయధికారిగ నుండెను. ఆ ప్రభుత్వమునకు పరాభవము కలిగినపిదప ౧౮౫౪ వఱకు నతఁడు కడు బీద వాఁడుగ నుండెను. తరువాత నీతనికి విద్యాపీఠములో మహోపాధ్యాయునిపనులు ఈయఁబడెను.

**అరపల్లి** — మధ్యరాష్ట్రములలోని చాందాజిల్లా మూల తహసీలులో నొక తాలూకా. ఇందు ౭౧ గ్రామము లున్నవి. ఈ తాలూకా యంతయు విస్తారముగ నడవులతో నిండి యుండును. అందుచే నిందు చాలగ్రామములు అడవులను తెగనఱికి కట్టినవే యై యున్నవి. ఇందు నదులుగూడ నెక్కువగనే కలవు. వానిలో పైన్గంగానది ముఖ్యమైనది. దీని యొడ్డుననే యీతాలూకాకు ముఖ్యపట్టణము ఘుగాస్ అను గ్రామ మున్నది. ఈయూరిలో చెఱకు విస్తారముగఁ బండింతురు. ఈతాలూకా వైశాల్యము ౪౪౦ చ. మైళ్లు.

**అరబస్థాన్** — చూడుఁడు, అరేబియా.

**అరబ్బిపాషా** (౧౮౪౦ - ౧౯౧౧) ఈజిప్టుదేశము నందు ౧౮౮౧-వ సంవత్సరమున తిరుగఁబాటు చేసినవారినాయకుఁడు. ఈతఁడు మొదట కూలివాఁడు. తరువాత ౧౨ సంవత్సరములు ఒకబీదసిపాయిగ సైన్యములో నుండెను. ఇంగ్లీషువారును ఫ్రెంచివారును ఈజిప్టుదేశపుప్రభుత్వములో జోక్యము కలిగించుకొనఁగూడ దని యీతనియభిప్రాయ మైనందున నతఁడు వారికి వ్యతిరేకముగ జాతీయపక్షమును దేశమునందు నిర్మించెను. ఆపక్షమునకు లొంగి ౧౮౮౧ లో అప్పుడున్న మంత్రులందఱును తమపనులను మాను కొనవలసినవా రైరి. ౧౮౮౨ లో నీతఁడు నూతనమంత్రిమండలమునందు యుద్ధసంబంధమైన మంత్రి యయ్యెను. తమ ప్రతిసాంవత్సరికాదాయవ్యయములలెక్కలను ఇంగ్లీషువారు గాని ఫ్రెంచివారు గాని తనిఖీ చేయ నవసరము లే దని వాదించి వానిని వారికిఁ జూపుట మానెను. అందుచే నింగ్లండుతో యుద్ధము సంభవించి ౧౮౮౨-వ సంవత్సరము జూలై ౧౧, ౧౨ తేదులలో ఇంగ్లీషునావికదళమువారు ఈజిప్టురాజధానియైన అలెగ్జాండ్రియామీఁద ఫిరంగిగుండ్లవర్షము కురిసిరి. ౧౩-వ సెప్టెంబరుదినమున టెల్ ఎల్ కెబిర్ అనుస్థలమునందు అరబ్బిపాషా పూర్తిగ నోడింపఁబడెను. అతనిఁ బట్టుకొని సింహళమునకుఁ బంపిరి. అతని వెళ్లఁగొట్టినతరువాతనే ఈజిప్టుదేశముపై నింగ్లీషువారితనిఖీ చక్కఁగఁ గుదిరెను. ఈతనిని ౧౯౦౦-వ సంవత్సరమున విడిచిపెట్టిరి.

sampath_Ebooks

**అరబ్బీసముద్రము** — దీనినే మనదేశస్థులు పశ్చిమ సముద్ర మందురు. ఇది హిందూదేశముయొక్క పశ్చిమతీరము నంటి యున్నది. ఇది హిందూమహాసాగరములోని యొకభాగము. ఇది అరబ్బస్థానమునకు తూర్పునను దక్షిణమునను వ్యాపించియుండును. ఈయది పరిషియాదేశమునకు పశ్చిమమునను, అరబ్బస్థానమునకు తూర్పున నున్న పారసీకజలసంధితో అరబ్బస్థానమునకు తూర్పుభాగమునఁ గలయును. ఎఱ్ఱసముద్రముతో అరబ్బస్థానమునకు పశ్చిమమున బాబుల్ మేండబ్ జలసంధిద్వారా కలయును. అచ్చటనే ఏడెన్‌పట్టణము గలదు.

అరబుపాలెము — విశాఖపట్టణముజిల్లా అనకాపల్లి తాలూకాలోని జమీన్‌దారీగ్రామము. జనసంఖ్య ౯౯౪ (౧౯౩౧).

అరబేలా — ఇది అదియాబేన్ దేశములోని ఒక పురాతన నగరము. అసురియనులకుఁ బూర్వమునుండియు నిది ఝాబ్ నదియొడ్డునఁ గల ప్రదేశములకు రాజధానిగ నుండెను. క్రీ. పూ. ౩౩౧-వ సంవత్సరమున సికందరుషా అరయసు నోడించిన దిచటనే యని కొన్ని గ్రంథములు చెప్పుచున్నవి. ప్రస్తుతమున నిది మోసల్ నగరమునుండి బాగ్దాదునకుఁ బోవుదారిలో నున్నది. క్రీ. శ. ౧౨౩౬-వ సంవత్సరమున మొగలులును, క్రీ. శ. ౧౩౯౩-వ సంవత్సరమున తైమూరును దీనిని దోచుకొనిరి. ప్రస్తుతమున దీని జనసంఖ్య యించుమించుగ ౬,౦౦౦ లు.

అరమడకి — చిత్తూరుజిల్లా వాయల్‌పాడు తాలూకాలోని గ్రామము. ఇందలి జనసంఖ్య ౩౭౬ (౧౯౩౧).

**అరయనులు** — ౧. వీరు పంజాబులో నివసించు నొకతెగ రాజపుత్రులు. సుమారు నాలుగుశతాబ్దులకు మునుపు మహమ్మదీయులు వీరి పూర్వులను రాజ్యభ్రష్టుల నొనర్చిరి. అప్పుడు వీరు తోటమాలీవేషములతోఁ దప్పించుకొని పోయిరి. నాటనుండియు వీరు వ్యవసాయము చేసికొనుచు జీవించుచున్నారు. ఆ సమయమున వీరికి రాయనులు అను పేరు వచ్చినది. ప్రస్తుతమున వీరు ఘుసుర్, ఖజ్నేర్, సిర్సా, తోహానాలలో నెక్కువగ నున్నారు. తరువాత నొకసారి మహమ్మదీయులశక్తి సన్నగిలినప్పుడు వీరు మరలఁ బైకి రాఁజూచిరి. కాని కలవులు మున్నగువానివలన వీరి యత్నము లేవియుఁ గొనసాగలేదు. ఆకాలమున వీ రక్కడక్కడ తిరుగుచుండెడివారు. పంజాబులోని సట్లెజ్‌నదీప్రాంతములలో నున్న అరయనులతోఁ దమ కెట్టిసంబంధమును లేదని వీ రందురు. వేషభాషలలో సట్లెజ్ మహమ్మదీయులనే వీరు పోలియుందురు.

౨. పంజాబులోని మహమ్మదీయులలో నొకతెగవారు. మొదట వీరు కంభో (Kambho) తెగకుఁ జెందినవారు. వ్యవసాయములో వీరి కంతగ నేర్పులేదు. తోటమాలీలుగ నుండుటయే వీరి పని.

౩. పంజాబులో నివసించు నొకతెగ ప్రజలు. ఈతెగకు మరల నెన్నియో యుపశాఖలు కలవు. వానిలో ముఖ్యమయినవి మన్, చందార్ మొదలయినవి. వీరిలో పెండ్లికి పదునాలుగురూపాయ లైన ఖర్చునకు సరిపోవునఁట.

౪. అమృతసరము జిల్లాలో నివసించు నొకతెగ ప్రజలు. వీరిలో విద్య మిక్కిలి తక్కువయఁట. నూటికొకఁడైనను చదువువచ్చినవాఁ డుండఁడఁట.

**అరరు** — ప్రయాగప్రాంతమందలి కోరా అనుసంస్థానమునకు జమీన్‌దారు. ఢిల్లీలో మహమ్మదుషాహ (క్రీ. శ. ౧౪౧౯) రాజ్యము చేయునప్పుడు ఆతఁడు బలహీనుఁ డని యెంచి అరరు తన జిల్లాకు అధికారియైన నిసారుఖానుని జంపి (క్రీ. శ. ౧౪౩౧ లో) స్వతంత్రుఁ డాయెను. ఆతనిని శిక్షించుటకు ఢిల్లీనుండి చంపఁబడినవానికుమారుఁడైన అజముల్లాఖాన్ పంపఁబడెను. కాని అరరు ఆతనికిని జిక్కనందున కొన్నిదినముల కతఁడు వెడలిపోయెను. అంత నరరు మరల నొకరాజప్రతినిధినిఁ జంపెను. అందువలఁద జౌన్‌పు సుబేదారయిన సాహెబ్ ఖాను ఈతనితో యుద్ధముచేసి యాతనిని జంపి యాతనితల చక్రవర్తికిఁ బంపెను (క్రీ. శ. ౧౪౩౫).

అరలిగనూరు — బళ్లారిజిల్లా సిరిగుప్పతాలూకాలోని గ్రామము. ఇందలి జనసంఖ్య ౯౦౫ (౧౯౩౧).

అరలిబండ — బళ్లారిజిల్లా ఆదోనితాలూకాలోని ఈనాం గ్రామము. ఇచటి జనసంఖ్య ౪౯౧ (౧౯౩౧).

అరవ — తెలుఁగుదేశమున స్థిరపడిపోయిన తమిళ ఇడయనులకు, వెల్లాలులకు పేరు. వీరినే తెలుఁగుదేశమున అరవగొల్లలని, అరవ వెలమలని యందురు.

అరవకొత్తూరు — చిత్తూరుజిల్లా కాళహస్తితాలూకాలోని జమీన్‌దారీగ్రామము. ఇచటిజనసంఖ్య ౬౨౧ (౧౯౩౧)

**అరవన్‌ఘాట్** — నీలగిరిజిల్లా కూనూరుతాలూకాయందలి ఉబ్బతలై గ్రామముయొక్క శివారు. ఇది కూనూరునకు మూఁడుమైళ్లదూరములో నున్నది. ఇండియాలోని సైన్యమున కంతకు 'కార్‌డైట్' అనుదాని నిచ్చుటకు ఇక్కడిలోయయందు ఒకగొప్ప ఫ్యాక్టరీ కట్టఁబడినది. ఇది సమీపమం దున్న వెల్లింగ్‌టన్ సైన్యశిబిరమునకుఁ జేర్పఁబడినది. కార్‌టేరీనదీపాతమువల్లఁ గలిగిన విద్యుచ్ఛక్తివల్ల ఫ్యాక్టరీ మరలు నడపఁబడును. దీనికి సమీపమున సారాబట్టీ గలదు. ఉదకమండలమునకుఁ బోవురస్తా ఈకార్‌డైట్ ఫ్యాక్టరీ ప్రక్కగఁ బోవును.

అరవపల్లె — గుంటూరుజిల్లా రేపల్లెతాలూకాలోని గ్రామము. జనసంఖ్య ౧౨౬౭ (౧౯౩౧).

sampath_Ebooks



**అరవవాండ్లపల్లె** — చిత్తూరుజిల్లా చంద్రగిరి తాలూకాకు చెందిన జమీన్దారీగ్రామము. ఇందలి జనసంఖ్య ౮౦ మాత్రమే (౧౯౩౧).

**అరవాసిపట్టడ** — చిత్తూరుజిల్లా తిరుత్తనితాలూకాలోని జమీన్దారీగ్రామము. జనసంఖ్య ౧౧౭ (౧౯౩౧).

**అరవిందులు** — గంగానదీమతల్లిచే పునీతమైనవంగదేశమున ౧౮౭౨-వ సంవత్సర మాగస్టుమాసము ౧౫-వ తేదీని వీరు జననమొందిరి. చిన్ననాఁడే సప్తమవర్ష ప్రాయమున విద్యాభ్యాసమునిమిత్త మింగ్లాండునకేఁగి యచ్చట పదునాల్గుసంవత్సరము లుండిరి. ఇంగ్లీషు, ఫ్రెంచి, జర్మని, గ్రీకు, లాటిన్, ఇటాలియాది పాశ్చాత్యభాషలయందు పాండిత్య మలవఱచుకొని యాధునిక ప్రాచీన పాశ్చాత్య తత్త్వశాస్త్రములను, మత సాంఘిక రాజకీయ సారస్వతాది సభ్యతా విశేషములను, చారిత్ర సంప్రదాయములను ఆమూలాగ్రముగ గ్రహించిరి. విద్యార్థిదశలోనే 'మిల్టన్' కవివరునివెనుక నింతటి మేధావిని గాంచియుండలే దని కళాశాలయందలి యాచార్యవర్గముచే సన్నుతుల నంది కీర్తిగాంచిరి.



శ్రీ అరవిందయోగి

శ్రీ అరవిందులు ఐ. సి. యస్. పరీక్షయం దుత్తీర్ణు లయ్యును విధిప్రేరణమున గుఱ్ఱపుస్వారిపరీక్షకు హాజరు కానికారణమున నుద్యోగానర్హులుగాఁ బరిగణింపఁబడిరి. ఆసమయమునం దింగ్లాండులో నున్న బరోడామహారాజును దర్శించి వారిరాజ్యమున నుద్యోగము సంపాదించుకొని ౧౮౯౩ లో తమ యిరువదియొకటవ సంవత్సరమున మాతృదేశమునకు వచ్చి చేరిరి. ప్రథమమున మహారాజులుంగారి యాంతరంగిక కార్యదర్శిగాను, కరగ్రాహి (రివిన్యూ)శాఖోద్యోగిగాను, కళాశాలలో నధ్యాపకులుగాను తుదకు కళాశాలోపాధ్యక్షులుగాను బనిచేసి మహారాజులుంగారిప్రశంసకు, విద్యార్థిబృందముయొక్క భక్తిస్తోత్రములకు, పౌరులప్రేమాదరణములకును బాత్రు లయిరి. ఇచ్చట నున్న పదుమూఁడు సంవత్సరముల కాలములోనే సంస్కృతము, బంగాళీ, గుజరాతీ, మరాఠీ, హిందీ మున్నగు దేశభాషల నభ్యసించి శ్రుతి స్మృతి పురాణేతిహాసాదులను నానాగ్రంథరాజములను సర్వతోముఖముగఁ బఠించి పరిశోధించి వేదాంతవిజ్ఞానపారంగతు లయిరి.

శ్రీ అరవిందులు రాజకీయరంగమునఁ గ్రీడించినకాల మత్యల్పమయ్యును - ఉద్యోగమందున్నందున పరోక్షముగా నాలుగుసంవత్సరములు, ఆవల ప్రత్యక్షముగా నాలుగుసంవత్సరములు, ౧౯౦౨ మొదలు ౧౯౧౦ వఱకు - ఆధ్యాత్మికముగనే మహోన్నతసిద్ధి గాంచి ప్రపంచ మింతవఱకును కనివిని యెఱుంగని యోగీశ్వరు లయ్యును, రాజసలోకమాతని తీవ్రజాతీయవాదిగామాత్రమె కొంత గుర్తించి యింతవఱకు పూజించుచున్నది. వంగదేశవిభజనానంతరము స్వదేశోద్యమఝంఝూమారుతము తీవ్రముగా వీచుచున్నకాలములో ౧౯౦౬-వ సంవత్సరమున పాశ్చాత్య లెక్కించిన పశుబలములోఁగాక కేవల మాధ్యాత్మికశక్తితో భారతమాత దాస్యబంధనములఁ ద్రెంచివైచి స్వాతంత్ర్యసిద్ధి నందవలయునను దృఢసంకల్పముతో మనఃప్రాణ శరీరముల సర్వము నర్పించి దేశారాధనచేసి తరింపవలయునను దీక్షతో, బరోడాకళాశాలలోని యున్నతోద్యోగమును త్యజించి కలకత్తా ప్రవేశించి నూతనముగా నటస్థాపితమైన జాతీయకళాశాలలో ప్రధానాచార్యపదవిని స్వీకరించి యువకుల కిహపరసాధనముగా విద్యాబోధను చేయఁదొడంగిరి. కాని పాశ్చాత్యసభ్యతావ్యామోహమునఁ బడలేకపోని జాతీయవిద్యాస్వరూపమే యెఱుంగని మితవాదు లాసంస్థను పరిపాలించువారై యందున లక్ష్యమందును విధానమందును భేదభావ మేర్పడి శీఘ్రకాలములోనే తమ యాచార్యపదవికి స్వస్తిచెప్పి కళాశాలాసంబంధమును బరిత్యజించిరి. ౧౯౦౬, ౧౯౦౮ సంవత్సరములలో శ్రీ అరవిందులు తమ ధర్మపత్రికకు వ్రాసిన సుప్రసిద్ధలేఖలను బఠించినవారికి ఆకాలమున భారతదేశీయ దాస్యస్థితికి వీరనుభవించిన హృదయపరివేదన, కేవల మాత్మశక్తితోడనే పశుబలము నెదుర్కొని విజయము గాంచవచ్చునను వీరి విశ్వాసము, సర్వము మాత కర్పింపవలయునను వీరి త్యాగదీక్ష స్పష్టము కాఁగలదు.

మాతృపూజావిధాన మిట్టి దని దేశీయుల కర్తవ్య మిదమిత్థమని నూతనోద్యమమును, జాతీయభావములను ఆధ్యాత్మికదృష్టితో స్పష్టముగా ప్రచార మొనర్చుటకు 'వందేమాతరం' అను దినపత్రికను కొందఱు మిత్రుల ప్రోత్సాహసాహాయ్యములతో స్థాపించి తత్పత్రికా సంపాదకవర్గమునఁ బ్రవేశించి దానికి నిజముగా సూత్రధారుఁ డయ్యెను. ఆపత్రికాజీవితకాలమించుమించుగ రెండుసంవత్సరము లేయైనను దేశము నుఱ్ఱూఁతలూఁగించి నేఁటికిని స్థిరస్థాయిగా నున్న సజాతీయ సద్ధర్మ సంపూర్ణస్వాతంత్ర్య భావముల నుద్బోధించి యపూర్వసంచలిత వాతావరణమును సృష్టించి పత్రికాప్రపంచమున నగ్రస్థానము వహించియుండెను. అంతటి తీవ్రతను స్వాతంత్ర్యధోరణి గలదయ్యు నిజసంపాదకీయవ్యాసములకుఁ గాక మఱొక పత్రికనుండి యనువదించి

sampath_Ebooks


ప్రకటించిన వ్యాసమునకై రాజద్రోహకరమని దోషారోపణము జరగుటయు తుదకు విచారణలో శ్రీఅరవిందులు దోషి యని ఋజువు గానందున విడుదల గాంచుటయు గమనించిన వీరి లేఖినీమాహాత్మ్యము స్పష్టము కాగలదు.

దేశీయమహాసభలో నాదర్శవిధానములపట్ల భిన్నభావము లుదయించి మితవాదాతివాదపక్షము లేర్పడి యిరుపక్షులవారును సూరత్ మహాసభా సమయమున ముష్టియుద్ధ మొనర్చి దేశీయమహాసభను ధ్వంసమొనర్చుటయు, జాతీయపక్షనాయకుడైన తిలక్ లోకమాన్యునికి శ్రీ అరవిందు లంతగా మండి జాతీయవాదుల మహాసభ కగ్రాసనాధిపత్యము వహించి దేశస్వాతంత్ర్య వాగ్వీణాగానమును బాడి జాతీయవాదుల కర్తవ్యము నిర్దేశించుటయు, ప్రభుత్వమువారు మితవాదులను జేరదీసి జాతీయవాదుల నెందఱినో చట్టములక్రిందనె ప్రవాసములపాల్చేసి రాజద్రోహపునేరములక్రింద కారాగారములకంపి శిక్షించియున్నందున దేశమున నాహాకారములు చెలంగి బీభత్సస్థితి యేర్పడుటయు, నాద్వేషోద్రేకోత్పాతసమయమున వంగదేశమున నాంగ్లేయుల నిద్దఱను బాంబుల (ప్రేలుడుగుండ్ల) బ్రయోగించి హత్యగావింపగా ౧౯౦౭-౮ సంవత్సరము మేమాసారంభమున నుషఃకాలమైదు గంటలపుడు శ్రీ అరవిందులు నిద్రించుచుండ పరున్నవానినట్లే విప్లవోద్యమమును స్థాపించి బాంబులను తయారుచేసి తద్ద్వారా బ్రిటీషు ప్రభుత్వము నంతరింపజేయవలయునను సంస్థకు ప్రధాననాయకుడను ఘోరదోషారోపణముక్రింద సంకెలలతో బందీకృతుని జేసికొనిపోవుటయు, విచారణకాలములో నొకసంవత్సరము పూర్తిగా కారాగృహమున నుంచుటయు, కృష్ణజన్మస్థానమగు కారాగృహముననే యోగలతయల్లుకొని ఆయన కృష్ణభగవానుని సాక్షాత్కార సందేశభాగ్యముల ననుభవించుటయు, తుదకు దీర్ఘ నిశిత విచారణాఫలితముగా న్యాయమూర్తిచే కేవలము నిరపరాధియని విడుదల యగుటయు గ్రంథస్థమైన చారిత్రికవిషయము లైయున్నవి.

ఆ నిర్బంధ ప్రయోగ పరంపరలు ఘోరశిక్షలు కఠినశాసనములు వీనిమూలమున బహిరంగముగా రాజమార్గమున బనిచేయుచున్న జాతీయోద్యమము జీవచ్ఛవమై తోడిదేశారాధకులు కారాగారవాసులై దిక్కుదోచక విషమస్థితి యేర్పడినపుడు జాతీయపక్షమునకు తానొక్కడే బహిరంగముగా నాయకత్వము వహింపవలసిన యావశ్యకమును గుర్తించి, 'వందేమాతరం' పత్రిక నాడే యంతరించినందున ౧౯౦౯ జూలై మాసములో ఆయన ఆంగ్లమున 'కర్మయోగి' యని బంగాళీలో 'ధర్మ' యని రెండువారపత్రికలను స్థాపించి నిర్వహింపసాగిరి. ఈపత్రికలలో వెలువడిన అనేక వ్యాసరాజములలో 'భారతమేధస్సు', 'జాతీయవిద్య', 'కళాప్రాశస్త్యము', 'కాళిదాసు', 'కర్మయోగి 'యాదర్శము', 'పరిణామ పరివర్ధనము' మున్నగునవి కొన్ని గ్రంథరూపమున వెలువడియున్నవి. ఉత్తరపరలో తదితర ప్రదేశములలో ఆకాలమున వీ రొసంగిన ఉపన్యాసములుగూడ గ్రంథరూపమున ప్రకటితమైయున్నవి. ఏకాంత కారాగారవాసమున తీవ్రముగా నొనరించిన యోగానుభవముతో ఆయన ఆధ్యాత్మిక దృష్టితో నానాటి దేశపరిస్థితుల కనుగుణముగా జాతీయవాదమును సమన్వయించి ప్రబోధ మొనరించుచుండిరి. న్యాయస్థానములో నిర్దోషి యని ఋజువైనను నిరంకుశప్రభుత్వవిధాన మాహాత్మ్యమున పోలీసు పీడనము తీవ్రమై ఆయన మనశ్శాంతికి భంగము కలుగజొచ్చెను. సంవత్సర కారాగారవాసానుభవఫలితముగా శ్రీఅరవిందులు రాజకీయములకు తిలోదక మిచ్చి యోగిగానో, సన్న్యాసిగానో ఏ హిమాలయపు గుహాలయందో ఏకాంతముగా నిరుపద్రవముగా జీవిత శేషమును గడత్రోయుదు నని యాశించిన పోలీసువారికి కర్మయోగియై అనుదినము బహిరంగోపన్యాసము లొసంగుచు ప్రభుత్వవిధానమును ఖండించుచు పత్రికలలో విమర్శించి యాక్షేపించుచు రాజకీయరంగమున నాయకుడై జాతీయపక్షమును బునరుద్ధరించుట హృదయశల్యమై ప్రాణగొడ్డముగా నుండెను. కాన వేగులవారిపోరు తీవ్రమై యెట్లయినను మరల కారాగారమున బంధించుటకు విశ్వప్రయత్నము లారంభమైనట్లు గట్టివదంతులు బయలుదేఱెను. అపుడే యుత్తరక్షణమున తనకేమి సంభవించునో యని యనుమానించి తన తుదిరాజకీయశాసనముగా 'నాదేశీయుల కొక బహిరంగలేఖ' యను నపూర్వపత్రమును కర్మయోగిలో ప్రకటించిరి. అందలి యాదర్శవిధానము లీనాటికిని ఆచరణసాధ్యము లైయున్న వన్న శ్రీ అరవిందుల రాజకీయదూరదృష్టి విశదము కాగలదు. ఈలేఖకే ప్రకటితమైనయెంతో కాలమునకు - రాజద్రోహమొనర్చి పాఱిపోయి రనునిందారోపణమున కవకాశ ముండునట్లు- కర్మయోగిముద్రాపకునిపై దోషారోపణ మొనరించి బంధించిరి. క్రింది కోర్టులో శిక్షితుడైనను ఉన్నతన్యాయస్థానమున నం దేరాజద్రోహమును లేదని యాతని వదలివేసిరి. ఇట్లు ఒకటి రెండు మూడు పర్యాయములు రాజద్రోహాది తీవ్రదోషారోపణములకు గుఱియైనను శ్రీఅరవిందులు నిర్దోషులని నిర్ధారణ మగుట ఈశ్వరవిలాసముగాక మఱేమి కాగలదు?

శ్రీ అరవిందుల యోగసాధనము నానాటికి తీవ్రమై తదేకాగ్రతను ఏకాంతవాసమును గాంక్షించుచుండెను. అంతర్ముఖుడై దేశీయులు తనజాతీయతత్త్వమును యథారూపమున గ్రహించు శక్తిసమయము లింకను రాలేదనియు, తుదకీ రాజకీయోద్యమమునకు తాను నాయకుడుగా నిర్ణీతముకాలేదనియు నిశ్చయించెను. వీరు స్వప్రయత్నమున యోగాభ్యాసము నారంభించుటకు ముందే చిన్నతనమున నుండియే ప్రధానమైన తమ జీవితఘట్టములందు నంతర్వాణిరూపమున ఈశ్వరాదేశముల గ్రహించుటయు తదనుగుణముగనే ప్రవర్తించుటయుం గానవగును. ఇంగ్లాండులోనున్నపుడే యాదేశానుగుణముగనే గుఱ్ఱపుస్వారిపరీక్షకు హాజరుగాక ఐ. సి. ఎస్. పదవిని త్రోసిపుచ్చిరి. బరోడాలోని యున్నతోద్యోగమును త్యజించిరి; ఇపుడును తదాదేశానుసారముగానే వంగదేశమును విడనాడి యేకాంతవాసమున కనుకూలముగా మొదట నొకటిరెండుమాసములు ఫ్రెంచివారి చంద్రనగరునం దుండి యావల ౧౯౧౦ ఏప్రిలు మాసారంభమున ఫ్రెంచియిండి

sampath_Ebooks



యాకు ముఖ్యపట్టణమగు పుదుచ్చేరి ప్రవేశించి నేటికిని అచ్చటనే నివసించుచున్నారు. ప్రారంభమున దేశకాలపరిస్థితు లనుకూలింపఁగానే వంగదేశమునకు తిరిగివచ్చి యాధ్యాత్మికదృష్టితో రాజకీయరంగమునఁ బ్రవేశించు నుద్దేశ్య ముండినను యోగసాధన మభివృద్ధి యగుకొలఁదియు మహోత్తమమైన యాధ్యాత్మిక పరిణామ పరమార్థము వారికి గోచరమై తమ సర్వశక్తుల నిటునటు వెచ్చింపక యేకాగ్రముచేసి యుంచుటయే యావశ్యక మని గ్రహించి రాజకీయసంబంధమును సంపూర్ణముగా త్యజించెను. అందువలననే దేశీయు లెన్నిపర్యాయములో దేశీయమహాసభాధ్యక్షునిగా వరించి, యాహ్వానించినను అరవిందు లంగీకరింపరైరి.

పుదుచ్చేరి చేరినతరువాత నాలుగుసంవత్సరము లేకాంతముగా తపోధ్యానములలో యోగసాధన మొనరించి తమకు సాక్షాత్కారమైన దివ్యానుభవములను జిజ్ఞాసు లోకమునకు వెల్లడించుటకొరకై ఫ్రెంచిదేశీయుని ప్రోత్సాహ సాహాయ్యములవలన ౧౯౧౪ ఆగస్టుమాసమున 'ఆర్య' యను తత్త్వజ్ఞానవిషయక మాసపత్రికను ఆంగ్లమున ప్రకటింప నారంభించిరి. 'భాగవతజీవనము', 'యోగసంకలనము', 'గీతాభాష్యము', 'వేదరహస్యము' 'ఈశ, కేన, కఠ, ముండకా ద్యుపనిషద్వ్యాఖ్యానములు', 'హైందవసభ్యతాసమర్థనము', 'మానవైక్యాదర్శము', 'భావికవిత్వము' మున్నగు వీరివ్యాసములును, విదేశములోను బరోడాలోను, పుదుచ్చేరిచేరిన ప్రథమసంవత్సరములోను వీరు రచించిన పద్యరత్నములు మున్నగునవియు ఈ యార్యపత్రికలో ప్రకటితములైనవి. ఇందు కొన్ని ప్రత్యేక గ్రంథరూపమునను వెలువడియున్నవి. మరల నాయీశ్వరాదేశమునఁగాఁబోలు నిరంతరాయముగా నాలున్నర సంవత్సరములు సాగనిచ్చి ౧౯౨౧ లో నీపత్రికనుగూడ నేసూచనయుఁ జేయకయే అకస్మాత్తుగా నిలిపి యోగానుభవములందే నిమగ్నులయిరి. శ్రీ అరవిందుని రచన కేవలము బుద్ధిబలముతోను, యోజనాసామర్థ్యముతోను చర్చించి తర్కించి ప్రాఁకులాడి ప్రయత్నమున వ్రాసినది గాక వేదకాలపు ఋషిపుంగవులవలె ద్రష్టయై అంతఃస్థితప్రేరణమున వెల్లివిరిసినవాఙ్మయము. 'ఆర్య' పత్రికాపాఠకులకు శ్రీ అరవిందులు ఋక్కులగాన మొనరించిన ఋషి కవియని, విమర్శసాధురీణుఁ డనిమాత్రమే కాక సర్వతోముఖపాండితీవిభాసియని, సర్వజ్ఞుఁడని కొంత తెలియఁగలదు. 'అహానా', 'ప్రేమ - మృత్యువు', 'బాజీప్రభువు' మున్నగు రసాత్మకకావ్యముల నిర్మించిన కవిగా, వేదములకు గీతాదిమహాగ్రంథములకును వ్యాఖ్యాన మొనర్చిన భాష్యాచార్యులుగా, కజిన్సు ఆర్చర్ మున్నగువారి గ్రంథములను సాకల్యముగా విమర్శించిన విమర్శకులుగా విద్యావిశారదులుగా నిట్లు వేర్వేఱుగా వారి యనంత ప్రతిభావిశేషములను సూక్ష్మముగానైన వర్ణించుటకలవి గాదు.

శ్రీ అరవిందులు మత, రాజకీయ, సాంఘిక, సారస్వతాది కళావిశేషముల నన్నింటిని ఆధ్యాత్మికదృష్టితో సమన్వయ మొనరించి వాని యన్యోన్య సంబంధమును పరమార్థమును వెల్లడించి యున్నారు. సుప్రసిద్ధపాశ్చాత్త్య కవిశేఖరుల కావ్యముల నన్నింటిని ఆమూలాగ్రముగ విమర్శించి అంతర్ముఖదృష్టితో కావ్యప్రపంచమున వారివారి యథాస్థానమిది యని సోదాహరణముగ నిర్ణయించిన కవిద్రష్ట యని వారు రచించిన 'భావికవిత్వము'ను ఇటీవలనే దిలీపకుమారరాయకృత 'అనామి' గ్రంథములో ప్రకటితమైన వారి లేఖలను బఠించినవారికి స్పష్టముకాఁగలదు. సచ్చిదానందద్యోతకములగు నాధ్యాత్మికభావములతో అపూర్వమైన క్రొంగ్రొత్త శయ్యాపాకములతో విశిష్టోజ్జ్వలభావార్థముల నెను నూతన పదజాలముతో అతీత విజ్ఞానవిభూషణముతో నాంగ్లభాషాకన్యను సర్వశోభాలంకృతం గావించి భాషాప్రపంచమునం దగ్రపీఠము నెక్కించిరి. ఆత్మానుభవము లేక కేవలము హేతువాదమునకు, తర్కమునకును, బుద్ధిసూక్ష్మతకు ప్రత్యక్ష భౌతికశాస్త్రపరిశోధనాపరీక్షలకును ప్రాముఖ్య మొసంగుటయే కాక యాధ్యాత్మిక మిదియే యను పాశ్చాత్త్యలోకమునకు యోగాభ్యాసపూర్వకానుభవములను వేదకాలపుసిద్ధాంతములను, పరమధర్మములను, సత్యములను సహేతుకముగ సప్రమాణముగ శాస్త్రీయముగ సర్వతోముఖముగ వెల్లడించి ప్రాచీప్రతీచీసభ్యతాసంకలనము గావించి ప్రపంచకల్యాణ మొనర్చుటయే భగవానుని సంకల్పమా యనునట్లు శ్రీ అరవిందుల నిరుపమానాంగ్ల రచనా వైభవము స్ఫురింపఁ జేయుచున్నది.

అనాదిగా భారతవర్షమున నభ్యస్తములైయున్న నానావిధములయిన యోగసాధనములను, తాంత్రికసాధనములను శ్రీ అరవిందులు సిద్ధాంతపూర్వకముగానే కాక ఆచరణానుభవమువలనఁగూడ గ్రహించి యవి యేవిధమున నెంతవఱ కాత్మోపలబ్ధికి సాహాయ్యకారులో నిర్ణయించిరి. సర్వయోగసంకలన మిందుండుటచే వీరియోగమును బూర్ణయోగ మందురు. వీరి పూర్ణయోగమునకును బూర్వయోగములకును భేదమెంతయో కలదు. ఈ సంసారము నిస్సారము, అజ్ఞానజన్యము, దుఃఖభూయిష్ఠము, మాయ యని దానిని త్యజించినఁగాని ముక్తికాంత లభ్యము కాదని పూర్వయోగులు విశ్వసించి సిద్ధాంత మొనర్చిరి. శ్రీ అరవిందు లన్నో అట్లు పరిత్యజించి పాఱిపోవుటవలన, వ్యక్తులుగా పరలోకానందము ననుభవించి కొందఱు కడతేరినను, భూలోకము మఱింత పతితావస్థకు వచ్చిన దనియు, ప్రస్తుత మజ్ఞానావృతమై యున్న భూలోకమును స్వర్గరాజ్యముగా మనోతీతమైన యొక విజ్ఞానశక్తిచే పరివర్తనము నొందించవలె ననియుఁ జాటుచున్నారు. వేదకాలఋషులలోఁ గొందఱు ప్రత్యేకముగా నా విజ్ఞానమున కారోహించిరేకాని మనః ప్రాణ శరీరముల పూర్ణదివ్యపరివర్తనమునకై దివ్యజ్ఞాన దివ్యచైతన్యములతో నీ స్థూలదేహములోని కవరోహణ మొనర్చుటకుఁ బ్రయత్నమేనియుఁ జేసినట్లు లేదు. మీఁదుమిక్కిలి ఈ పార్థివదేహము నింకను ధరించియుండియే జీవమందలి విజ్ఞానసంజ్ఞ యగు సూర్యుని సూర్యమండలాంతర్వర్తులై యుద్గమించుట అసాధ్యమనియే సూచించు నుపనిషద్వాక్యములుగూడఁ గలవు. పరమేశ్వరుని లీలావిలాసము మనఃపరిణామముతో నంతము కాలేదనియు, 'సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ' అను గీతావాక్యానుగుణ

sampath_Ebooks



ముగా ప్రపత్తిమార్గమునఁ బరమేశ్వరుని శరణుచొచ్చి త్రికరణశుద్ధితో సంపూర్ణాభీప్సతో యోగసాధన మొనర్చుటవలన పరమేశ్వరానుగ్రహప్రాప్తియు, తుదకు సాధన సాఫల్యము సాధకుఁడు సర్వము పరమేశ్వరుఁడుగా పరివర్తనమంది, సచ్చిదానంద త్రికమున కత్యంత సామీప్య సంబంధముగల యాపరమవిజ్ఞానసిద్ధియుఁ గలుగు ననియు, ఈ యభీప్సానుగ్రహములవలననే ఆవిజ్ఞానము భౌతికలోకమున కవరోహణమై తన్మూలముననే ప్రపంచమున దివ్యజీవనము సాధ్యమై సత్యలోక మేర్పడు ననియు శ్రీ అరవిందు లనుభవపూర్వకముగా వెల్లడించుచున్నారు. వేయేల పూర్వము భగీరథుఁడు మహాతప మొనరించి గంగావతరణమును సాధించి పితృదేవతలను పునీతులనొనర్చి భరతమాతను కామధేనువుగాఁ జేసినట్లు నేఁడు శ్రీ అరవిందులు భూలోకమును మానవకోటిని భాగవతమయముగా దేవమయముగా నొనర్ప సంకల్పించియున్నారు.

**శ్రీ అరవిందుల యుపదేశము** — కంటికగపడు జగద్రూపముల కావల నాత్మచైతన్యముల సత్యము ఏకము నిత్యమునగు సర్వభూతాత్మ కలదను ఆర్యావర్తపు పూర్వఋషుల సిద్ధాంతముననుండియే శ్రీ అరవిందుల యుపదేశము ప్రారంభ మగుచున్నది. ఆ యద్వితీయ బ్రహ్మమునందు, ఆచిత్స్వరూపమునందు సర్వభూతములును కూడియున్నవి. కాని చైతన్యముయొక్క యొకానొక పృథక్తత్త్వమువలన, మనఃప్రాణశరీరములందున్న తమ నిజాత్మ నిజతత్త్వముల నుఱింగిన యజ్ఞానమువలన నవి విభజింపఁబడి యున్నవి. ఈపృథక్భావకల్పితమగు నాచ్ఛాదనమును తొలఁగించుటకు, తనయందు నిఖిలభూతములయందును గల దైవమును - తన నిజాత్మను - సాక్షాత్కరింపఁ జేసికొనుటకును ఒకానొక యాంతఃకరణిక శిక్షణము వలన సాధ్య మగుచున్నది.

ఈ యద్వితీయైకాత్మయే ఈచైతన్యమే జడమగు భౌతికపదార్థములందు నిక్షిప్తమైయున్నదని శ్రీ అరవిందులబోధ వచించుచున్నది. అది తనయంతటఁ దాను విముక్తినొందునట్టివిధానమే పరిణామము. ఏది జడముగా నున్నట్లు గాన్పించునో దానియందు చైతన్యము పొడచూపుచున్నది. ఒకపరి గోచరమైన ఈచైతన్య మింకను ఉన్నతతర మగునట్లును, తత్కాలమందే యంతకంటెను మహత్తర మగు పరిపూర్ణత్వము పరిణామము నందునట్లును, అది స్వతఃప్రేరిత మగును. ఈచైతన్యవిముక్తియొక్క ప్రథమసోపానమే ప్రాణము; మనస్సు రెండవది; కాని పరిణామము మనస్సుతోడనే సంపూర్తి కానేరదు. అది యొకానొక మహత్తరస్థితిగా, ఆధ్యాత్మికమును విజ్ఞానమయము నగు నొక చైతన్యముగా బహిర్గత మగుటకు నిరీక్షించుచున్నది. చైతన్యపురుషుని యందు ప్రబలశక్తిగా, విజ్ఞానాత్మల వికసనము పరిణామమందలి తదనంతరసోపాన మై యుండవలెను. అపుడే యీ విశ్వపదార్థములందు నిక్షిప్తమైయుండు ఈశ్వరతత్త్వము సంపూర్ణముగా స్వయంవిమోచనము నందును. అపుడే ప్రాణశక్తికి తన పూర్ణత్వమును బ్రదర్శింప సాధ్య మగుచున్నది.

వృక్ష జంతు జన్మములయందు స్మృతిసహితేచ్ఛ లేకుండఁగనే ప్రకృతి తనపరిణామసోపానముల నధిరోహించుచున్నది. మానవుని విషయములో నుపాధియందలి స్మృతిసహిత సంకల్ప మూలముననే ప్రకృతి పరిణామసమర్థ యగుచున్నది. అయినను మానవుని మానసిక సంకల్పశక్తిమాత్రముననే యిది పూర్తి కాఁజాలదు. ఏలయన, మన స్సొకానొక స్థితికి పోఁగలదు; తదనంతరము ముందునకుఁ బోఁజాలక యందే చక్రాకారముగామాత్రమే పరిభ్రమించు చుండును. దీనివలన నున్నతతరతత్త్వముగా మనస్సు మాఱవలసియున్నదో యట్టి మార్పును చైతన్యపు పరివర్తనమును గావింపవలసి యున్నది. ఈ విధానమును బురాతన, ఆంతఃకరణిక శిక్షణ యోగసాధనముల మూలమునఁ గనుఁగొనవలసి యున్నది. పూర్వకాలమున నయ్యది వెలిగా ప్రపంచముననుండి సంక్షేపించుకొనుటవలనను ఆత్మ లేక పరతత్త్వముయొక్క సముచ్చస్థితిలో నంతర్ధాన మగుటవలనను బ్రయత్నింపఁబడినది. ఏవిజ్ఞాన సత్యచైతన్య మంతఃస్థితాత్మకుఁ దగిన యుపకరణమై మానవుని యంతర్ముఖముననేకాక సర్వప్రవృత్తులయందును దన్నుఁ దా నెఱుఁగునట్లు చేసి యింకను మృగప్రాయముగా నున్న మానవత్వమునుండి దివ్యజాతిగా నభివృద్ధి నందింపఁగలదో యట్టి విజ్ఞానమయ సత్యచైతన్యమును మనస్సుయొక్క యజ్ఞానమునకు మిక్కిలి పరిమితజ్ఞానమునకుఁ బ్రత్యామ్నాయముగా స్థాపించి, పరమాత్మను బ్రపంచమునకు పరముగాఁ గేవలము ముక్తునిగాఁ జేయుటయేకాక ప్రపంచస్థితిలోనే విముక్తిని బొందించుట కున్నతతర తత్త్వావతరణము సాధ్యమని శ్రీ అరవిందులు బోధించుచున్నారు. అత్యున్నతమై, ఇంకను నిగూఢమై యున్న విజ్ఞాన తత్త్వావతరణవ్యాపారములమూలమున పురుషుని సకలకోశములను మార్పు లేక పరిణామముగావించుటవలన తద్దివ్యత్వసిద్ధికై యోగముయొక్క యాంతఃకరణిక శిక్షణము నుపయోగింప వచ్చును.

అయిన నిది తత్క్షణమేకాని, స్వల్పకాలములోఁ గాని, లేక యేత్వరితమైన లేక అద్భుతమైన పరివర్తనమువలనఁ గాని చేయ వీలు లేదు. విజ్ఞానతత్త్వావతరణము సాధ్యమగుటకు పూర్వము తదన్వేషకుఁ డెన్నో సోపానములఁ గడచిపోవలసియున్నది. మానవుఁడు ముఖ్యముగా మనఃప్రాణశరీరముల యుపరితలముననందే నివసించుచుండును. కాని మహత్తరావకాశసహితమగు నంతఃస్థితాత్మ అతనిలో నున్నది. తదుపలబ్ధికై అతఁడు ప్రబుద్ధుఁడు కావలెను. ఏలయనఁగా, నాయంతఃస్థితాత్మనుండి ప్రస్తుత మాతఁడు పొందుచున్నది యత్యంతనిరోధితప్రభావముమాత్రమే. అదియే వి శేష సౌందర్యమునకు సామరస్యమునకు శక్తిజ్ఞానములకు నిరంతర ప్రయత్న మొనర్చునట్లతనినిముందునకుఁ ద్రోయుచున్నది. కావున యీయంతరాత్మయందలి విస్తృతుల బాహాట మొనర్చుటయు నంతఃస్థిత తేజశ్శక్తులవలన తన బాహ్యజీవితమును నిర్వహించుటయు నచ్చటనుండియే బాహ్యజీవితమును గడుపుటయు యోగముయొక్క ప్రథమవిధానము. ఇట్లుచేయుటలో మనోమయ ప్రాణమయ అన్నమయ భూతముల బాహ్యమిశ్రమునుగాక విలక్షణముగా వీనికి పరోక్షమున సత్యసంబంధమైన ఒకానొకదానిని, అద్వితీయ దివ్యపరంజ్యోతి

sampath_Ebooks

యందలి యొకవిస్ఫులింగమును, తన నిజాత్మను కనుంగొనుచున్నాఁడు. సాధకుఁ డాత్మస్థితుఁడై జీవించుటకును దన ప్రకృతి శేషమును బరిశుద్ధి గావించి సత్యోన్ముఖముగా నద్దాని ప్రచోదనముచేత తన్నిజస్థాన ప్రవేశాభిముఖము గాఁ జేయ నభ్యసింపవలెను. తదనంతర మూర్ధ్వోన్ముఖవికసనమును ఆత్మయొక్క యున్నతతర తత్త్వావతరణమును గలుగఁగలవు. కాని యప్పటికిని అది వెంటనే సంపూర్ణవిజ్ఞాన తేజస్సు, శక్తి కానేరదు. కారణ మేమనఁగా, సాధారణమానవబుద్ధికిని విజ్ఞాన సత్యచైతన్యమునకును మధ్య చైతన్యభూమిక లెన్నియో కలవు. ఈ యాంతరభూమికల నూర్ధ్వాభిముఖముగా బాహాట మొనరించి వాని శక్తిని క్రిందికి మనఃప్రాణశరీరములలోనికి తీసికొని రావలసియున్నది. అటుపిమ్మటనే సత్యచైతన్యముయొక్క పరిపూర్ణశక్తి ప్రకృతిలోఁ బనిచేయఁగలదు. కావుననే యీ యాత్మశిక్షణ లేక సాధనవిధానము దీర్ఘము కష్టమునై యున్నది. అయిననేమి, కడపటి స్వేచ్ఛావిముక్తిని పరిపూర్ణస్థితిని ఎక్కువ సాధ్యముగా నొనర్చుచున్నది గాన నవ్యది, అనఁగా నా సాధనప్రయత్న మల్ప మయ్యు నంతయును లాభ మైయున్నది.

మనస్సు నొకవిశేషవ్యాప్తికి అనంతపరమాత్మల భావోపలబ్ధికి బాహాట మొనర్చుట, విశ్వచైతన్య మనఁబడుదానియందు నిర్గమించుట, కోరికలపై నింద్రియోద్రేకములపై నాధిపత్యము వహించుట మున్నగున వెన్నియో పూర్వపద్ధతులకు సంబంధించి యీమార్గమునం దవసరమైనవి గలవు; బాహ్యసన్న్యాసనిష్ఠ అత్యవసరము గాదు; కాని ఆసక్తి ఇచ్ఛలను జయించుట, శరీరము వాని యొక్కయిలు, ఆశలు, స్వభావలక్షణములు వీనిని స్వాధీనములో నుంచుకొనుట తప్పని సరియైయున్నది. నిత్యానిత్యములను గుఱించిన మనోవివేచనముద్వారా జ్ఞానమార్గము, హృద్ధర్మమైన ప్రేమప్రపత్తుల భక్తిమార్గము, స్వలాభోద్దేశములనుండి సత్యమునకు, అహంకారమున కతీతమైన ఒక మహత్తర సత్యకైంకర్యమునకు సంకల్పమును మరలించు కర్మమార్గము మున్నగు పూర్వసంప్రదాయసిద్ధాంతముల సంకలన మిందుఁ గలదు. ఏలయన ప్రకృతిలో నా మహత్తర తేజశ్శక్తులు పనిచేయుటకు సాధ్యమైనపుడు, పురుషునిసర్వము దానినందుకొని పరివర్తన మొందునట్లు శిక్షితము కావలెను.

ఈ సాధనలో గురుప్రేరణము, క్లిష్టఘట్టములయందు వారిపరిశీలనము, వారిసాన్నిధ్యము నత్యావశ్యకము లైయున్నవి; ఎందు కనఁగా నవి లేకున్న జయావకాశమువంతను అభ్యంతరపఱుచు నొడుదుడుకులు ప్రమాదములుఁ లేకుండ నిర్వహించుట అసాధ్య మగుచున్నది. గురు వనఁగా నొక యున్నతతర ఆత్మస్థితికి చైతన్యమునకు నారోహించిన వారు. సాధారణముగా వారిని తత్ప్రత్యక్షప్రకాశముగా తత్ప్రతినిధిగా భావించెదరు. వారు తమయుపదేశమువలన నంతకంటె నెక్కువగా తమప్రభావాదర్శములవలన మాత్రమే కాక స్వానుభవము నితరులకు సంక్రమింపఁజేయునట్టి యొక శక్తిమూలమునను సాయపడుచుందురు.

ఇదియే శ్రీ అరవిందుల యుపదేశము, సాధనవిధానము. ఏదో యొక మతము నభివృద్ధిచేయుటగాని, లేక పురాతనమతములను మిశ్రమొనర్చుటగాని, లేక యేదోయొక నూతనమతమును స్థాపించుటగాని వారి యుద్దేశముగాదు; ఏలయన నివి యేవియైనను వారికేంద్రోద్దేశమును దూరమొనర్చును. వారియోగముయొక్క యేకైకలక్ష్య మంతఃస్థితాత్మాభివృద్ధియే. దాని ననుసరించు ప్రతివారును కాలమున సర్వభూతములందు నాయద్వితీయాత్మను గనుఁగొని మనోమయముకంటె మహత్తరమైన చైతన్యమును, మానవప్రకృతిని మార్చి భాగవతమయ మొనర్చు ఆధ్యాత్మికవిజ్ఞానమయచైతన్యమును వికసింపఁజేయుననును.

**అరవేహాళ్లి** — ౧. (నారాయణదేవరకెర దగ్గరది) బళ్లారిజిల్లా హాస్పేటతాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౬౯౬ (౧౯౩౧).

౨. (రామసాగరం దగ్గరది) బళ్లారి జిల్లా హాస్పేటతాలూకాలోని గ్రామము. జనసంఖ్య ౨౫ (౧౯౩౧).

**అరసనహాలు** — బళ్లారిజిల్లా హర్పనహళ్లితాలూకాలోని గ్రామము. ఇచటి జనసంఖ్య ౯౨౪ (౧౯౩౧).

**అరసబలగ** — విశాఖపట్టణముజిల్లా బొబ్బిలితాలూకాయందలి జమీందారీగ్రామము. ఇచటి జనసంఖ్య ౧,౪౬౭ (౧౯౩౧).

**అరసవల్లి** — గంజాంజిల్లా శ్రీకాకుళంతాలూకాయందలి గ్రామము. ఇది శ్రీకాకుళమున కుత్తరముగా నొకటిన్నర మైలుదూరమునం దున్నది. ఇచ్చట సూర్యభగవానుని దేవాలయము గలదు. ప్రతిభానువారమునందును, విశేషదినములందును ఉత్సవములు జరగుచుండును. గంజాంజిల్లావా రెక్కువగను, విశాఖపట్టణముజిల్లావారు సామాన్యముగను ఈదేవునిదర్శనమునకుఁ బోవుచుందురు. రోగులును, కనుచూపు తగ్గినవారును మ్రొక్కుకొని నీరోగు లయి మ్రొక్కులు చెల్లించుచుందురు. తమబిడ్డలకు పలువురు సూర్యనారాయణస్వామి పేరు పెట్టుచుందురు. ఇచటి జనసంఖ్య ౪౪౬.

**అరసాడ** — ౧. విశాఖపట్టణముజిల్లా బొబ్బిలితాలూకాయందలి జమీందారీగ్రామము. జనసంఖ్య ౧౫౧౭ (౧౯౩౧).

౨. విశాఖపట్టముజిల్లా పాలకొండతాలూకాకు చెందిన గ్రామము. జనసంఖ్య ౧,౬౩౫ (౧౯౩౧).

**అరసిబిడి** — బొంబాయి రాజధాని విజాపూర్ జిల్లా హంగుండ్ తాలూకాయందలి యొకపల్లె. ఇప్పు డిది పాడుపడిన దని చెప్పవఁ జెప్పవచ్చును. పూర్వ మిచ్చట చాళుక్యరాజులరాజధాని విక్రమపుర మనునది యుండెను. ఇది ఆఱవ విక్రమాదిత్యునిచే (క్రీ. శ. ౧౦౭౬-౧౧౨౬) స్థాపింపఁబడినది. కలచురిరాజులు ౧౧౫౧లో చాళుక్యులను గెలుచువఱకు నీపట్టణము చాళుక్యుల రాజధానిగ నుండె నని యూహింపఁబడుచున్నది. ఇందు శిథిలము

లైన రెండు శైవమందిరములును, రెండు చాళుక్య, కలచురిరాజశాసనములును గలవు.

**అరసు** — ౧. మైసూరు రాజుల బంధువులలోని తెగ. వీరిలో రెండుశాఖలు గలవు. వీరిని రాజబంధువు లనియెదరు. వీరిలో కొందఱు వైష్ణవులు, కొందఱు శైవులు.

౨. ఆంధ్రదేశమందలి పల్లెజాతిలోను పరయన్ జాతిలోను అరసు అనునొకయుపజాతి గల దని మద్రాసు సెన్ససు రిపోర్టు (౧౮౯౧) లోఁ జెప్పఁబడియున్నది.

**అరసూరుగుట్టలు** — బొంబాయి రాజధానిలోని మహీకాంత ఏజెన్సీయందలి గుట్టలు. ఇవి ఆరావళీపర్వతమాలిక యొక్క నైరృతమూల నున్నవి. ఈ పర్వతములలో అంబాభవాని యొక్క దేవాలయము కలదు. మిక్కిలి పురాతనకాలమునుండి యీ దేవాలయ ముండినట్లు తోఁచుచున్నది. ఇచ్చటనే సరస్వతీనదియొక్క యుత్పత్తిస్థానము కలదు. అంబాభవానిదేవాలయమున కెప్పుడును యాత్రికులు వచ్చుచుందురు. నవరాత్రిదినములలో నిక్కడ గొప్ప యుత్సవము జరుగును. దాంతసంస్థానాధీశ్వరున కీమె కులదేవత. ఇచ్చట పదునాలవశతాబ్దియందలిశాసనములు కలవు.

**అరసికేరి** — బళ్లారిజిల్లా హర్పనహళ్లి తాలూకాలోని గ్రామము. జనసంఖ్య ౧౭౪౧ (౧౯౩౧).

**అరాండా** (క్రీ. శ. ౧౭౧౯-౯౮) — స్పెయిన్ దేశమందలి రాజకార్యనిపుణుఁడు. సర్దారువంశమునందు జన్మించెను. ౧౭౫౯లో పోలెండుదేశమునకు రాయబారిగనంపఁబడెను. ౧౭౬౬లో క్యాస్టలీకి సైనికనాయకుఁడుగ చేయఁబడెను. ఆసంవత్సరముననే ముఖ్యమంత్రి యయ్యెను. ఈతఁడు ఫ్రాన్సురాజ్యక్రాంతి (French Revolution) కారకులగు తత్త్వవేత్తలతో సహానుభూతి గలవాఁడు. కావున తనమంత్రిత్వకాలమున తనప్రజాక్షేమమునే మనస్సునందుంచుకొని రాజ్యమేలెను. మతగురువులు చేయుచున్న పెక్కు అక్రమముల నాఁపివేసెను. మతభేదమునకై ప్రజలను బాధపెట్టునట్టి ఇన్క్విజిషన్ (Inquisition) అను మతగురువులయొక్క న్యాయసభలప్రభ తగ్గించెను. జెసూట్ అనువారలను స్పెయినునుండి వెడలఁగొట్టెను. ప్రజలయొక్క క్షేమమునకై యీతఁడు పెక్కుకార్యములు చేసెను; దేశమందలి పోలీసుసైన్యమును, న్యాయస్థానములను కట్టుఁబాటులకు లోఁబడునట్లు చేసెను. ఇంగ్లాండున కీతఁడు మొత్తము మీఁద ప్రతికూలుఁడుగ నుండెను. ౧౭౭౩ లో నీతనిని ప్యారిస్ పట్టణమునకు రాయబారిగఁ బంపిరి. ౧౭౯౨ లో నీతఁడు మరల ముఖ్యమంత్రి యయ్యెను. ఈతనిని పడవేయవలయు నని మతగురువులు పెక్కుమంత్రములఁ బన్నిరి.

**అరా** (సబ్ డివిజన్) — బంగాళదేశములోని శహాబాద్ జిల్లాయందలి ఒక హెడ్ క్వార్టర్సు సబ్ డివిజన్. వైశాల్యము ౯౧౩ చదరపుమైళ్లు. జనసంఖ్య ౬,౯౯,౯౭౬. బిహియా అనునది ముఖ్య వర్తకస్థలము.

**అరాకానియనులు** — దక్షిణ-అమెరికాలోని చిల్లీ రాజ్యమునందు నివసించుచున్న ఒకతెగప్రజలు. ఈతెగ దక్షిణ అమెరికా ఆదిమనివాసులతెగలలో నొకటి. కాని అరాకానియనులు తమతోడి తెగలవారికన్న నెక్కువ నాగరకతగలవారు; పరాక్రమశాలులు. ౨ శతాబ్దులకు పైగ స్పెయిన్ దేశీయులతో ఎడతెగనిపోరాటము జరపి తమ స్వాతంత్త్ర్యమును నిలువఁబెట్టుకొనిరి. తుదకు వీరు ౧౮౮౨-వ సంవత్సరమున చిల్లీపరిపాలనకు లొంగిపోయిరి.

**అరాజకత** — ప్రభుత్వము లుండునంతకాలము నిజమైన ధర్మము గాని న్యాయము గాని ప్రపంచమునందు నెలకొనఁజాలదనియు, ధర్మసంస్థాపనమునకు ప్రభుత్వముల వినాశ మత్యావశ్యకమనియు, బలాత్కరించుటయే ప్రధానలక్షణముగాఁగల ప్రభుత్వాధికారముమూలమునఁ గాక ఐచ్ఛికములగు సంఘములమూలమున సముదాయముమీఁద జరగవలసినపనులు జరగవలయు ననియు చెప్పు రాజకీయసిద్ధాంతమునకు 'అరాజకతా' సిద్ధాంత మని పేరు. నిర్బంధమునకు మాఱు పరిపూర్ణమగు స్వాతంత్త్ర్యమును స్థాపించుటయే దీని యుద్దేశము.

౧. అరాజకుల వాదము:— ఈ సిద్ధాంతమునకు ఐరోపాఖండము జన్మభూమి. దీనిని ప్రతిపాదించినవారు కొందఱు ప్రాచీనయుగమందును మధ్యయుగమందును నుండినవారైనను ఈమతప్రవక్తలలో ప్రముఖులైనవారు ఇటీవలివారే. వారిలో పేర్కొనఁదగినవారు పదునెనిమిదవ శతాబ్దియం దుండిన గాడ్విన్ (Godwin) అను ఇంగ్లీషుతత్త్వవేత్త, స్టర్నర్ (Sturner) అను జర్మనుదేశస్థుఁడును; పందొమ్మిదవశతాబ్దివారగు ప్రూడన్ (Proudhon), సోరల్ (Sorel) అను ఫ్రెంచివారు, బకునిన్ (Bakunin), క్రోపాట్కిన్ (Kropotkin), టాల్స్టాయ్ (Tolstoy) అను రషియాదేశస్థులు. ఈ సిద్ధాంతము ననుసరించినవారిలో గాంధీమహాత్ము లొకరని చెప్పవచ్చును. ఈకాలమునందు రాజకీయవేత్త లని కీర్తి గాంచిన రసెల్ (Russell), లాస్కి (Laski), కోల్ (Cole) మున్నగువారు అరాజకతాసిద్ధాంతమందు పూర్తిగ నమ్మకము లేనివారైనను, అందలి విషయములలో కొన్నిటియందు సత్య మున్నదని గ్రహించి, తదనుగుణముగ ప్రభుత్వవిధానమందు దోషములకు మార్పులను సూచించియున్నారు.

పదునెనిమిది, పందొమ్మిదవ శతాబ్దులలోని పాశ్చాత్త్యదేశములందలి ఆర్థికపరిస్థితులనుండియే ఈసిద్ధాంతము బయలువెడలినది. ఐహికసౌఖ్యమున కంతకును అర్థ మొక్కటే ఆధారము కాకపోయినను, అర్థము లేనియెడల నట్టిసౌఖ్యము లభింప దని చెప్పవచ్చును. శరీరపోషణమునకును, ఆరోగ్యమునకును, సౌఖ్యమునకును ఆహారము, వస్త్రములు, ఇండ్లు మొదలగునవి ఆవశ్యకములు. అవసర మైనంత

sampath_Ebooks

వలెకూడ నిట్టివి లేనివారిని దరిద్రు లనియు, అవసరమునకు మించి ఇట్టివి కలవారిని ధనికు లనియు మనము చెప్పుచుందుము. దారిద్ర్యబాధ నొందువారలకు స్వేచ్ఛతోఁగూడిన జీవన మసాధ్యము. వారి కాల మంతయు ఆహారాదుల సంపాదనమునకుమాత్రమే వినియోగ మగుచుండుటచేత ఉత్కృష్టమగు మానవజీవితమునకు పరమావధి యగు నాత్మవికాసమున కిట్టియవకాశమును లేకున్నది.

దరిద్రులదారిద్ర్యమునకు వారు కష్టపడి పనిచేయకుండుట కారణము కాదు. ధనికుల ఐశ్వర్యమునకు వారు కష్టపడి పని చేయుట కారణము కాదు. ప్రతిదేశమందును ధనికులకంటె దరిద్రులే ఎక్కువగ పనిచేయుచుందురు. ఆహారాదిపదార్థముల నుత్పత్తి చేయుటకు మనుష్యునిపరిశ్రమమాత్రము చాలదు. పరిశ్రమముతోఁపాటు భూమియు, మూలధనమును (Capital) ఆవశ్యకములు. కాని, ఈరెండుసాధనములును కష్టపడి పనిచేయఁగలుగు శ్రమికులకు లభించుటలేదు. ఇవి యెవరో కొందఱు భూస్వాముల యొక్కయు, సాహుకార్ల యొక్కయు నధీనమం దున్నవి. వీరియను మతి లేక పని చేయువాండ్రు వీని నుపయోగించుట దుస్సాధము. భూస్వాములకు అత్యధికములగు సిస్తులను, సాహుకార్లకు అపరిమితములగు వడ్డీలను ఇచ్చినఁగాని ఇట్టియనుమతి పనివాండ్రకు లభింపదు. కష్టపడి పనిచేసి, అధికమగు అర్థమును వా రుత్పత్తిచేయుచున్నను అందులో చాలభాగము సిస్తుల క్రిందను, వడ్డీల క్రిందను ఖర్చగుచుండుటవలన పనిచేయువాండ్ర పోషణమునకు మిగులునది చాల స్వల్పముగ నున్నది. కర్షకులును, కర్మకరులును ఉత్పత్తిచేయు అర్థ మల్పమగుటఁ బట్టి కాక, ఆయర్థవిభాగమందు అధికభాగము భూస్వాములకును, సాహుకార్లకును చెందుటఁబట్టియే దరిద్రులు దారిద్ర్యబాధ ననుభవింపవలసి యున్నారు. భూమియు, మూలధనమును కొందఱి యధీనమం దుండక పనిచేయ నిష్టపడువా రందఱికిని లభ్యమగుచుండునెడల ఉత్పత్తియగు ధన మంతయు పనిచేయువారికే చెందుచుండును. పని చేయక, ఆస్తిమూలముననే సుఖముగజీవించు భూస్వాములును, సాహుకార్లును కొంద ఱుండుటంబట్టి 'ధనికులు', 'దరిద్రులు' అనుభేదము కలుగుచున్నది. ఇట్టిభేదము లదృశ్యము లగుటకు భూమిమీఁదను, మూలధనముమీఁదను వ్యక్తు లెవ్వరికిఁగాని ఆస్తి (Property) హక్కు లేకుండుటయే తగినమార్గము.

అరాజకతావాదులు పైవిధముగ వాదించుటకు పాశ్చాత్త్యదేశములలో కొన్నిటియం దున్న విపరీతపరిస్థితులు కారణము. రష్యా, జర్మనీ, ఇంగ్లండు మొదలగు దేశములం దిటీవలివఱకును, ఫ్రాన్సు దేశమున పందొమ్మిదవశతాబ్ది యారంభమువఱకును 'భూమి' అంతయు ఎవరో కొందఱు జమీన్దారుల యధీనమం దుండెను. ఒక్కొక భూస్వామియు వేలకొలఁదియెకరముల భూమికిని, అనేక గ్రామములకును యజమానిగ నుండెను. ఆభూములను దున్ను రైతు లతనియనుచరులై, అతఁడు పెట్టుకష్టము లన్నిటి ననుభవించుచు, పండినపంటలో నధిక భాగము నతని కిచ్చుచుండిరి. అట్టిజమీన్దారులు కష్టమన నేమియో యెఱుఁగక, దివ్యభవనములందు పరిచారకులమధ్యను నివసించుచు, కాల మంతయు వేఁట, గుఱ్ఱపుస్వారి, ఆటలు మొదలగువానియందుఁ గడపుచుండుట సహజము. రాత్రి పగ లనక, ఎండ గాలి వర్షము లనక, కష్టపడి పని చేయు రైతులకు కడుపునిండ అన్నముకూడ లభించుట యసాధ్యముగ నుండెను. జమీన్దారులను ధిక్కరించిన యెడల భూమినుండి వెడలవలసినది తప్ప మఱియొకమార్గము వారికి లేకుండెను. భూమి తమది కాకపోవుటచేతను, జమీన్దారులది యగుటచేతను తా మిట్టిస్థితియం దుండవలసివచ్చిన దని కర్షకులలో కొందఱు గ్రహించిరి. ఇట్టిపరిస్థితుల నాధారము చేసికొనియే అరాజకతాతత్త్వవేత్తలు తమసిద్ధాంతములను బలపఱుచుకొనిరి.

భూస్వాములు 'భూమి తమది' అని చెప్పుటలో న్యాయమున్నదా? ఏవస్తువువిషయమునఁగాని యొకఁడు 'తనది' అనిచెప్పుటకు ముఖ్యమగుకారణములు రెం డుండవలెను. అతని ప్రాణధారణమునకును, ఆరోగ్యమునకును, నిజమైన సౌఖ్యమునకును ఆవస్తువు ఆవశ్యక మైయుండవలెను. అట్లు కానినాఁడు 'అది' 'తనది' ఎట్లగుచున్నది? ధనికులకైనను దరిద్రులకైనను ఆవశ్యకముగ కావలసిన ఆహారాదులు సమముగ నుండును. ధనికుఁ డగువాని యాఁకలి ఎక్కువ కాదు. అతనికి ఎక్కువఆహారము కావలసినదిలేదు. మానము కాపాడుటకు వస్త్రము లధికముగ కావలసియుండవు. ఇట్టిసందర్భములో వేలకొలఁది యెకరములభూమి తనది యని చెప్పుకొనుటలో అర్థముగాని, ధర్మముగాని కనిపించదు. అందులో పండుపంట అతని సౌఖ్యమున కెంతవఱ కావశ్యకమో అంతవఱకే అతనిది; తక్కినదంతయు ఆఁకలిగొన్నవారిదే. తా ననుభవింపలేనట్టిదియు, ఇతరుల యనుభవమున కత్యంతావశ్యక మైనట్టిదియు నగు వస్తువుపైని ఒకనికి 'స్వామ్యము' (Ownership, Proprietorship) ఉండుటకంటె ధర్మవిరుద్ధమగు పద్ధతి మఱియొకటి లేదు. ఇట్టి స్వామ్యము భూస్వాముల కుండుట వలననే రైతులు కష్టపడినను కడుపునిండ వారి కన్నము దొరకకున్నది.

స్వయంకృషిచేత తాను సంపాదించిన వస్తువును గుఱించి 'తనది' యని యొకఁడు చెప్పినను చెప్పుకొనవచ్చును. కాని పాశ్చాత్త్యదేశమందలి జమీన్దారు లీభూములనుగుఱించి ఈవిధముగ చెప్పుటకు వీలు లేకుండెను. సాధారణముగ 'భూమి' విషయమున నీసత్యము ప్రపంచమం దంతట వర్తించుచున్నది. సౌగంధికహరణార్థము వెళ్లిన భీమసేనునివాక్యము లీసందర్భమున నెంత యుక్తియుక్తములుగ నున్నవి!

క. గిరి నిర్ఝరములఁ బుట్టిన,
సరోవరం బిదియు సర్వసామాన్యము గా
కరుదుగ నొక్కనియడియే,
పరఁగఁ గుబేరుండు దీనిఁ బడసెను మొదలన్.

భూమిని సృష్టించినవారు జమీన్దారులు కారు; అడవులను నఱకి, వ్యవసాయమునకు తగినట్లు వానిని బాగుచేసినవారు జమీన్దారులు

sampath_Ebooks

కారు. శాంతముగ దానిని సేద్యము చేయుచున్న రైతులపై దౌర్జన్యము నుపయోగించి, యుద్ధము చేసి, బలాత్కారముగ భూములపైని వారు స్వామ్యమును సంపాదించిరి. కొందఱు రాజుల నాశ్రయించి, యుద్ధములందు వారికి సాహాయ్యము చేసియు, వారిని ముఖస్తుతి గావించియు, వారియంతఃపురములందు దాస్యము చేసియు వారివలన జాగీరులను పొందినవారు. ఇదిగాక భూస్వాము లందఱును కూడ చాలవఱకు 'వారసత్వము'చేత తమ భూములను సంపాదించుచున్నారు. ఇది భూస్వాములవిషయమందుమాత్రమే కాక ధనికు లందఱి విషయమునను కూడ చెల్లుచున్నది. ధనికులధన మంతయు స్వార్జితము కాదు. తండ్రితాతలు గడించినధనమునకు వారసు లగుటచేత వారి కది లభించుచున్నది. కావున నట్టిధనమునుగూర్చి 'తనది' అని చెప్పుకొనుట విపరీతము.

తాను సంపాదించనట్టిదియు తన యనుభవమున కక్కఱ లేనట్టిదియు నగుభూమి, మూలధనము లోనగువానిని 'నాది', 'తనది' అని చెప్పుకొనుట ధర్మ మని మనుష్యు లెంతవఱకు తలఁచుచుందురో అంతవఱకును దరిద్రులబాధ తీరఁజాలదు. వారు ధనికులకు దాస్యము చేయవలసియుందురు. శాస్త్రపరిజ్ఞానము వృద్ధిగాంచుటచేతను, క్రొత్తక్రొత్తయంత్రములు లెక్కలేనన్ని తయారగుచుండుటచేతను ఎంతో కాలము కష్టపడినఁగాని ఉత్పత్తికానంత ద్రవ్య మీకాలమున నత్యల్పకాలములో నుత్పత్తియగుచున్నది. యంత్రసాహాయ్యము లేని కాలమున నలువదియేఁబదిమంది మనుష్యులు చేయుచుండినపనులను ఇప్పటికాలమున యంత్రసాహాయ్యముచే నొక్కఁడు చేయఁగల్గుచున్నాఁడు. అర్థ మత్యధికముగ నుత్పత్తి యగుచున్నది. కాని కూలివాండ్రు దారిద్ర్య మనుభవించుట తప్పినది కాదు. లక్షాధికారులు కోటీశ్వరులగుచున్నారే కాని భిక్షాధికారులు భిక్షాధికారులుగనే యున్నారు. యంత్రములను నిర్మించుటకును, నడుపుటకును కావలసిన మూలధనము కొలఁదిమంది సాహుకార్ల యధీనమం దుండుటయే దీని కంతకును కారణము. వారెట్టినిర్బంధములు కలిగించినను, వారిచ్చుకూలి యెంత తక్కువైనను, వారు పెట్టుకష్టము లెంత యధికమైనను వారి వశమం దుండు మూలధనసాహాయ్యము లేక కర్మకరులు పని చేయఁజాలకుండుటచేత అన్నికష్టములకును ఓర్చి పనివాండ్రు పని చేయుచున్నారు. ఆస్తిగలవారు ఆస్తి లేనివారిపైని చెల్లించుచుండు అధికారమునకు మితి లేదు.

ఇట్టి విపరీతపరిస్థితులు వ్యాప్తి గాంచుటకు ప్రభుత్వమే మూలకారణము. ప్రభుత్వమునకు దండనాధికార మున్నది. సైన్యములు, పోలీసువాండ్రు, కోర్టులు, కారాగృహములు దానియధీనమం దున్నవి. వీనిమూలమున జనసామాన్యము భయపడి ధనికులయు, భూస్వాములయు, సాహుకార్లయు అధికారమునుండి తాము విముక్తి గాంచలేకున్నారు. తనయనుభవమున కక్కఱ లేనిదానిని తనది యని చెప్పుకొనుట నీతివిరుద్ధమైనను తనయధీనమం దుంచుకొని దానిమూలమున నితరులపై అధికారము వహింపఁగలశక్తి మనుష్యునికి ప్రభుత్వముమూలమున లభించుచున్నది. ఇట్టిశక్తి 'చట్టవిరుద్ధము' కాకుండుటయే దీనికి కారణము. ప్రభుత్వముయొక్క ఆజ్ఞకు చట్టమని పేరు. అధికారమం దుండువారియిష్టానిష్టములను వ్యక్తపఱుచుసూత్రములే చట్టములు. వారి కేది మంచి యని తోఁచునో దానిని చేయించుటయు, వారి కేది కీడని తోఁచునో దానిని నిషేధించుటయు సహజము. 'తనది', 'పరునిది' అనుమాటలకు అర్థమును నిర్ణయించుసాధనము చట్టము. భూమి జమీందారులదేకాని రైతులది కాదని చట్టమే శాసించుచున్నది. భూమి రైతులదిగ నుండవలయు నని శాసించుశక్తి చట్టమున కున్నది. అట్టిచట్ట మిప్పు డమలులో లేకుండుటకు కారణము ప్రస్తుతకాలమున ప్రభుత్వాధికారమం దుండువారల కది యిష్టము లేకుండుటయే. తండ్రియొక్క ఆస్తి కొడుకులకు చెందవలయు నని నిర్ణయించునది ప్రభుత్వమువారిచట్టమే. ఆచట్టము మాఱినయెడల వారసత్వపుపద్ధతికూడ మాఱును. ఇప్పు డది మాఱకుండుటకు కారణము ప్రభుత్వాధికారమం దుండువారి కామార్పు ఇష్టము లేకుండుటయే. చట్టములకును న్యాయాన్యాయములకును సంబంధము లేదు. చట్టములు న్యాయసమ్మతములుగ నుండవచ్చును; ఉండకపోవచ్చును. ప్రభువులయొక్క మనోభావములను వ్యక్తపఱుచుటయే వాటిలక్షణము. ఆమనోభావములు న్యాయసమ్మతములైనయెడల చట్టములుకూడ న్యాయానుకూలములుగ నుండును; అవి న్యాయవిరుద్ధములుగ నుండునెడల చట్టములుకూడ నట్లే యుండును.

మనుష్యుని మనోభావము లతనియనుభవములను, అతనివాంఛలను అనుసరించి యుండును. ఇతరులయనుభవములఁబట్టియు, కోరికలఁబట్టియు అతఁడు నడచుటకు సామాన్యముగ నిష్టపడఁడు. ఈసత్యము ప్రభుత్వాధికారమం దుండువారివిషయమునఁగూడ చెల్లుచున్నది. వారి యనుభవమునుబట్టియు, వారి కేది లాభము కలిగించునో దానిని బట్టియు వారు చట్టములను చేయుచుందురు. ప్రజలలోని అన్నితరగతులకును చెందినవారు ప్రభుత్వాధికారులుగ నుండునెడల అన్నిరకములయనుభవము ననుసరించిన చట్టములు శాసింపఁబడును. అట్లుగాక ఎవరో కొందఱుమాత్ర మట్టియధికారమం దుండునప్పుడును, ప్రజలతో సంబంధము లేనివా రధికారమం దుండునప్పుడును సంకుచితమగు ననుభవము ననుసరించినట్టివియు, స్వల్పసంఖ్యాకులకు లాభమును కలిగించునట్టివియు నగుచట్టము లమలులోనికి వచ్చును.

వివిధదేశచరిత్రములను పరిశీలించినయెడల ప్రభుత్వాధికారము సామాన్యముగ ధనికులయధీనమం దున్న దని స్పష్టమగును. వ్యవసాయ మొక్కటియే ప్రధానవృత్తిగ నుండినకాలములో జమీందారులను భూస్వాములు రాజ్యాధికారమును వహించి తమ కనుకూలమగు చట్టములప్రకారము ప్రభుత్వమును నడపుచుండి రని చెప్పవచ్చును. మధ్యయుగమున నింగ్లండు, ఫ్రాన్సు, జర్మనీ మొదలగు పాశ్చాత్యదేశముల రాజ్యాంగపద్ధతి ఇట్టిదే. నవయుగమున వ్యాపారము, పరిశ్రమలు వృద్ధియగుటచేత భూమికన్న మూలధన మెక్కుఁ ప్రాధాన్యమును వహించినది. వ్యవసాయముమూలమునఁగాక, వ్యాప

sampath_Ebooks

రముమూలమున ధనము సంపాదించుట కెక్కువ యవకాశము కలిగెను. కాఁబట్టి భూస్వాముల యధికారము తగ్గి, ఇటీవలికాలమున సాహుకార్ల (Capitalists) అధికారము విస్తరించెను. ప్రస్తుత కాలమున ఇంగ్లండు, అమెరికా మొదలగు దేశములం దంతటను సాహుకార్లే ప్రభుత్వాధికారమును వహించియున్నారు.

ప్రజ లందఱును ఎన్నుకొనుపద్ధతిని ప్రభుత్వాధికారుల నేర్పఱుచుకొనుటయే ప్రధానలక్షణముగాఁగల ప్రజాప్రభుత్వవిధానమందుకూడ ఇట్టిఫలితమే కలుగుచున్నది. పేరునకు వ్యక్తు లందఱును సములైనను కొందఱు ధనికులుగను, కొందఱు దరిద్రులుగను నుండుటచేతను, విశేషద్రవ్యము ఖర్చుపెట్టినఁగాని యెన్నికలలో విజయము గాంచుటకు వీలులేకపోవుటచేతను ఎన్నికలద్వారా అధికారమునకు వచ్చువారు ధనికులుగనే యున్నారు. ధనికులు, దరిద్రులు అను భేదముండునంతవఱకును ప్రభుత్వాధికారము ధనికులయందే సంక్రమించును. రాజకీయముగ వ్యక్తు లందఱును సమాను లగుదు రనుట మిథ్య.

పైని చెప్పఁబడిన విషయములనుండి గ్రహింపఁదగిన సత్యములు రెండుమూఁడు కలవు: (౧) ప్రభుత్వాధికారుల యభీష్టములను వ్యక్తపఱుచు విధినిషేధములు చట్టములు. (౨) అధికారమందుండు వారికి లాభము కలిగించనట్టి చట్టము లెన్నఁడును అమలులోనికి రాఁజాలవు. స్వలాభమును కోరుట మానవస్వభావము. తమకు లాభము కలిగించుచట్టము లన్నియు నితరులకుకూడ లాభము కలిగించు నని వారు తలంచుచుందురు. (3) ఆయాకాలములం దెవరు ధనికులుగ నుందురో అట్టివారే ప్రభుత్వాధికారమును వహించుచుందురు. అందుచేత చట్టములు ధనికులయెడ పక్షపాతము చూపుచుండును. చట్టములను ధిక్కరించినవారిలో దరిద్రులకంటె ధనికులకు శిక్షనుండి తప్పించుకొనుట కెక్కువయవకాశ ముండును. తెలివిగల న్యాయవాదులు, నేర్పుగల సాక్షులు, లంచములకు లోఁబడు ఉద్యోగస్థులును వారికి వశు లగునట్లు దరిద్రులకు వశులు కాఁజాలరు.

తమ కుండు ధనముద్వారా దరిద్రులను లోఁగదీయుటకు శక్తిగల ధనికులకు ప్రభుత్వాధికారము మఱింత సాహాయ్యము చేయుచున్నది. దహించుటయందు అగ్నికి వాయువు సాహాయ్యపడునట్లు ధనికులకు ప్రభువులు సాహాయ్యపడుచుందురు. దీనిమూలమున దరిద్రులదాస్యము మఱింత దుర్భర మగుచున్నది. ఇట్టిసాహాయ్యమే లేనియెడల దరిద్రులు ధనికులపైని తిరుగఁబడి న్యాయసమ్మతమగు ధర్మమును స్థాపించుట సుకరముగ నుండును. కాని ప్రభుత్వము లిట్టిపనికి ఆటంకము కలిగించుచున్నవి. ప్రభుత్వాధికారమున కంతకు దౌర్జన్యము (Force) మూలాధారము. సైన్యము, పోలీసులు, కారాగృహములు ప్రభుత్వమునకు ప్రధానచిహ్నములు. శరీరమునకు బాధ కలిగించియు, ప్రాణమునుకూడ తీసివేసియు ప్రభుత్వమువారు తమ యధికారమును నిలువఁబెట్టుకొనుచుందురు. ఇంతేకాక, ప్రభుత్వాధికారము తప్పించుకొనుటకు వీలగునట్టిది కాదు. ఇష్ట మున్న లోఁబడుటయు, ఇష్టము లేకున్న మానుటయు సాధ్యము కాదు. మనుష్యుఁడు భూమియందు పుట్టుటకు పూర్వమునుండియు ప్రభుత్వ మతనిపై నధికారము చెలాయించుచుండును. తలిదండ్రులకు తాను క్రమముగ పుట్టినవాఁడో కాఁడో యని నిర్ణయించు నధికారము దానికి కలదు. పుట్టుకతోడనే అతఁ డొకప్రభుత్వముక్రింద పుట్టుచున్నాఁడు. ఒకదేశమును వదలి మఱియొకదేశమునకు వెళ్లినను ప్రభుత్వము లేనిదేశము ప్రపంచమునందు లేకపోవుటచేత ప్రభుత్వాధికారమునుండి తప్పించుకొనుటకు మనుష్యుని కవకాశము లేకున్నది. ఇందుచేతనే ప్రభుత్వాధికారమునకు దౌర్జన్యము నిర్బంధము ననునవి ప్రధానలక్షణము లని చెప్పఁబడుచున్నవి.

తల్లిదండ్రులయధికారమునకు ప్రేమ మూలము; గురువుల యధికారమునకు జ్ఞానోపదేశము మూలము; యజమానుని యధికారమున కతఁ డిచ్చుకూలి మూలము; ఇష్టము లేనియెడల నీ యధికారము లన్నిటనుండి విముక్తి గాంచవచ్చును. ఈసంబంధములు ఐచ్ఛికములు. ప్రభుత్వాధికార మిట్టిది కాదు.

దౌర్జన్యము, నిర్బంధము, ధనికులయందలి పక్షపాతము లోనగునవి ప్రధానలక్షణములు గాఁగల ప్రభుత్వము ప్రపంచమున నుండునంతవఱకును ధర్మసంస్థాపనము, వ్యక్తిస్వాతంత్ర్యము దుస్సాధ్యములు. దాస్యవిముక్తికి ప్రభుత్వవినాశమే ముఖ్యసాధనము.

౨. అరాజకసంఘముయొక్క లక్షణములు :— ప్రభుత్వము లంతరించినంతటనే సైన్యములు, పోలీసువారు, కారాగృహములు, నిర్బంధముగ పన్నులను వసూలుచేయుట లోనగునవి అదృశ్యమగును. ప్రతికార్యమును మంచిమీఁద జరగవలసియుండును. ఇష్టములేనివానిని నిర్బంధపెట్టుటకు వీ లుండదు.

అరాజకసంఘమందు భూమిపైనిగాని, మూలధనముపైని గాని ఎవ్వరికిని స్వామ్య ముండదు.

భాగస్థులు కొందఱు కలసి సముదాయముగ నీకాలమున వ్యవహారముల ననేకములను జరపుకొనుచుండునట్లు అరాజకసంఘమందు వ్యవహారములు, వ్యాపారము, వ్యవసాయము లోనగునవి యన్నియు ఐచ్ఛికమయిన యొడంబడికలమూలమున జరుగును. పని చేయనివానిని బలవంతపెట్టువా రుండరు.

పాఠశాలలు, కళాశాలలు, ఉద్యానవనములు, గ్రంథాలయములు, చిత్రశాలలు మొదలగునవి ఇదేవిధముగ ఐచ్ఛికసంఘములద్వారా నెలకొల్పఁబడుచుండును. ప్రస్తుతకాలమునఁ గూడ ధర్మబుద్ధిగలవారెందఱో ఇట్టిఘనకార్యములను చేయుట సాధారణధర్మముగ నున్నది.

శరీరపోషణమున కత్యావశ్యకము లగు ఆహారపదార్థములు ఉచితముగ లభించును. శ్రమపడుట కిష్టము లేనివారికిసయితము నివి యుచితముగ దొరకుచుండును. కావలసినంతమట్టుకు ప్రతి వ్యక్తియు వీని ననుభవింపవచ్చును.

sampath_Ebooks


దరిద్రులు ధనికులు అనుభేదము తొలఁగినతర్వాత నేరములు చేయువా రెవ్వరు నుండరు. అట్టిబుద్ధి ఎవరికైనను కలిగినను ప్రజాభిప్రాయమూలమున నట్టివారిని మంచిమార్గములోనికి త్రిప్పుట కవకాశ ముండును. అట్టిపరిస్థితులలో సర్వమానవసౌభ్రాత్రము వృద్ధియై ప్రతిమనుష్యుఁడును సంపూర్ణస్వాతంత్ర్యము గలవాఁడై ఆత్మవికాసమునకు పాటుపడును. కలియుగమైకుంఠ మన నదియే.

3. విమర్శ:— అరాజకత యనుమాటను విన్నంతమాత్రముననే భయపడి కొందఱును, కోపోద్రేకము గలవారై మఱికొందఱును దానితత్త్వమును విమర్శింపకయే దానిని ఖండించుచుందురు. మఱికొందఱు అరాజకత యనఁగా బాంబులను ప్రయోగించుటయే యని భావించి దానియందు విముఖులగుచుందురు. బాంబులను వేయుటకును, అరాజకతాసిద్ధాంతమునకును ఎట్టిసంబంధమును లేదు. ఈ సిద్ధాంతమును ప్రతిపాదించినవారిలో బకునిన్ తప్ప తక్కినవా రెవ్వరును దౌర్జన్యమును బోధించి యుండలేదు. ప్రజాసామాన్యమును విద్యావంతులఁ గావించియు, ప్రభుత్వమువారితో సహాయ్యనిరాకరణము చేసియు పరిస్థితులను మార్చవలయు నని వా రభిప్రాయపడిరి. బాంబుల ప్రయోగించువా రందఱు నరాజకతాసిద్ధాంతమును నమ్మినవా రని యనుకొనఁగూడదు. కావున తక్కినసిద్ధాంతములను విమర్శించినట్లే ఈ సిద్ధాంతమునుగూడ నిష్పక్షపాతబుద్ధితో పరిశీలింపవలసియున్నది.

(౧) ప్రభుత్వముయొక్క ప్రధానలక్షణము దండనాధికారమనుటయందు గొప్పసత్య మున్నది. ప్రేమ, భక్తి, అనురాగము, గౌరవము మొదలగువానిని ఆధారముగఁ జేసికొని అనేకులు వ్యక్తులపై నధికారమును చెల్లించుచుందురు. ప్రభుత్వముయొక్క అధికారమునకు సైన్యముల, కారాగృహములద్వారా దండించుశక్తియే మూలము. భయముమూలముననే ప్రతిప్రభుత్వమువారును ప్రజలను లొంగదీయుచుందురు.

(౨) ఆస్తిహక్కు లుండుటవలన కష్టపడి పనిచేయుకూలివాండ్రు, రైతులు, కర్షకులు లోనగువారు కష్టమునకు తగినఫలమును పొందకుండుటయు, భూస్వాములు సాహుకార్లు కష్టమునకు మించిన ఫలమును పొందుచుండుటయు, సాధారణముగ ప్రభుత్వవ్యవహారములలో ధనికుల కుండునంత పలుకుబడి దరిద్రులకు లేకుండుటయు, ప్రభుత్వవిధానములు ధనికులయెడ పక్షపాతము గలిగియుండుటయు సత్యము. నిరంకుశప్రభుత్వము లుండునట్టివియు, ధనికులకు దరిద్రులకుఁ గల తారతమ్య మధికముగ నుండునట్టివియు నగు దేశములలో ఈ పక్షపాతము హెచ్చుగ నున్నది.

(౩) ఆహారపదార్థము లుచితముగ లభించునెడల పని చేయుట కెవ్వఁడుగూడ నిష్టపడఁ డను అనుమానము కలుగవచ్చును. స్వభావముచేత మనుష్యుఁడు సోమరి కాఁడు. ఎట్టిపనియు చేయక కాలము నంతయు వ్యర్థపుచ్చువా రరుదుగ నుందురు. ధనికులు కూలివాండ్రచేత శక్తికి మించినపని చేయించుచుండుటచేతను, ఎంతపని చేసినను కడుపునిండ నన్నము దొరకకుండుటచేతను సామాన్యముగ మనలో ననేకులు పని యనిన విసువుగొనుచుందురు. అట్లుగాక న్యాయమును సారముగను, శక్తి కనుగుణముగను పనిచేయు నవకాశము కలిగినయెడల నందఱును ఉత్సాహముతో పని చేయుచుందురు. నిర్బంధరాహిత్యముగల అరాజకసంఘమం దట్టి యుత్సాహము మెండుగ నుండఁగలదు. కావున మనుష్యు లందఱును సోమరు లగుదు రని భయపడవలసినజరూరు లేదు.

(౪) పరోపకారము చేయుటకూడ మనుష్యుని సహజగుణములలో నొక్కటిగ నున్నది. ఈగుణము వికసించుటకును, వ్యక్తమగుటకును తగినయవకాశములను కల్పించినయెడల పరస్పరసహకార మిప్పటికంటె ఎన్నిరెట్లో అధిక మగును. కీర్తిప్రతిష్ఠలకు మనుష్యులు పాటుపడునట్లు ధనసంపాదనమునకుఁగూడ పాటుపడఁజాలరు. ధనికులే గొప్పవా రనియు, ధనమునుబట్టియే మనుష్యుని గౌరవాగౌరవములు నిర్ణయ మగుచుండవలయు ననియు ప్రజ లనుకొనునంతవఱకును ధనము గడించుటయందే గొప్పవారు తమకాలమును, శక్తిని వినియోగించుచుందురు. మానవసేవయే గౌరవహేతు వనునభిప్రాయము వ్యాపించినయెడల శక్తిగలవా రందఱు నట్టిసేవకై పూనెదరు. ప్రస్తుతము ధన మున్నఁగాని జరగనిపనులలో ననేకములు అరాజకసంఘములందు పరోపకారబుద్ధిద్వారా జరగఁగలవు. 'ధనమూల మిదం జగత్' అనువాక్యమున కపార్థము చేయరాదు.

(౫) ఈవిషయములఁబట్టి అరాజకతయే వాంఛనీయ మగు నాదర్శ మని ఋజువు చేయుట సాధ్యము కాదు. పైని జేర్కొనిన అంశము లన్నియు సత్యములు కావచ్చును; కాని అంతమాత్రమున ప్రభుత్వాధికార మక్కఱలే దని చెప్పుటకు వీలు లేదు. ప్రభుత్వము శస్త్రముతో కూడుకొన్నది కావచ్చును; క్రౌర్యము దానికి లక్షణముగ నుండవచ్చును; దండనము దానిసాధనము కావచ్చును. కాని శస్త్రము, దండనము లోనగునవి లేక సాంఘికజీవనము సాధ్యమగునా యని మన మాలోచింపవలెను. విమర్శించి చూచినయెడల నట్టిది సాధ్యము కాదనియే చెప్పవలసియుండును.

(౬) మనుష్యుఁడు ఏకాకి కాఁడు. ఒంటరిగ జీవనము చేయలేఁడు. సంఘములో పదిమందితో కలసియుండుట అతనిస్వభావము. అట్లుండినఁగాని అతనియందు దిమిడియుండు శక్తిసామర్థ్యములు వికసించి వృద్ధి చెందఁజాలవు. అనేకు లొకసంఘముగ నేర్పడి యున్నప్పుడు ప్రభుత్వ మొక్కటియున్నఁగాని సక్రమముగ వ్యవహారములు జరగఁజాలవు. ప్రతిమనుష్యునియందును సుగుణములతోపాటు దుర్గుణములుకూడ కొన్నియున్నవి. బలమందును, బుద్ధియందును, నేర్పునందును అందఱును సమానులు కారు. బలముగలవారు బలహీనులను వశపఱుచుకొనఁజూతురు; అట్లే జ్ఞాన మున్నవారు జ్ఞానములేనివారిని, నేర్పుగలవారు నేర్పులేనివారిని వశపఱుచుకొనఁదలఁచుచుందురు. అధికారవ్యామోహము ప్రతిమనుష్యునికిని కలదు. వ్యాజము లేకయే క్రోధము అసూయ లోనగు దుర్గుణములు కొందఱికి కలుగుచుండును. అట్టివా రితరులను బాధించుచుందురు. మనుష్యులలోఁ గల భేదము

sampath_Ebooks

లన్నియు ధనముమూలముననుమాత్రమే సంభవించునవి కావు. ధనికులు దరిద్రులు అను భేదము అంతరించినప్పటికిని గూడ సహజములగు మఱికొన్ని భేదము లెల్లప్పుడు నుండఁగలవు. అట్టి సంఘర్షమున పరులను హింసించుటకును, వశపఱచుకొనుటకును ఉద్యుక్తు లగువారిని నిర్బంధించుట అత్యావశ్యకము. అట్టివారిని నిర్బంధింపనియెడల 'స్వేచ్ఛ' యనునది వారికిమాత్రమే యుండును. తక్కినవారు వారికి దాసులు కావలసి యుందురు. అందఱకును స్వేచ్ఛ యుండవలయుననిన అందఱును కొన్ని నిర్బంధముల నంగీకరింపవలెను. అట్టి నిర్బంధములను విధించునధికారమునకే ప్రభుత్వాధికార మని పేరు. ఈయధికారము లేనియెడల సాంఘిక జీవనము దుస్సాధ్య మగును. కావున అరాజకతమనము కోరఁదగినది కాదు.

అధికారము నందుండువారు ఎంతటి వేదాంతజ్ఞానము కలవారైనను తమయధికారమును స్వలాభముకొఱకై దుర్వినియోగము చేయుట సహజము. అధికారమందిట్టి లోప ముండుటచేత నే అరాజకతావాదులు దాని నడుగంట నాశము చేయ ప్రయత్నించుచున్నారు. కాని ఇది సరియగుమార్గము కాదు. సంఘము నిలుకడగ నుండుటకు ప్రభుత్వ మత్యావశ్యకము. అట్టియధికారము దుర్వినియోగము కాకుండుటకు వలయునుపాయములను కనుఁగొని, ఆయుపాయముల నాచరణయందుఁ బెట్టుటకు మనుష్యుఁడు ప్రయత్నము చేయవలెను. మనుష్యుని ప్రజ్ఞ యంతయు నీప్రయత్నమునందే యున్నది. రాజకీయాభివృద్ధి యనిన నిదియే. రాజ్యాంగశాస్త్రపరిశోధన చేయువా రిట్టియుపాయములను కనుఁగొనుటయందే తమబుద్ధిబలము నుపయోగించుచున్నారు. రాజ్యాంగ సంస్కర్త లీమార్గముననే నడచుచుందురు. దీనినిబట్టి అరాజకతావాదుల సిద్ధాంతము లన్నియు నిష్ఫలము లని మన మనుకొనఁగూడదు. నాడీ పరీక్ష చేసి రోగముయొక్క స్వరూపమును కనుఁగొను వైద్యునివంటి వారే అరాజకతావాదులు. రోగము కుదురుటకు కావలసిన ఔషధమును నిర్ణయించుటకు పూర్వము దానిస్వరూప మేదియో తెలిసికొనుట యావశ్యక మగునట్లు ప్రభుత్వాధికారమును సంస్కరించుటకు పూర్వము ఆయధికారముయొక్క స్వరూపమును, దానిలక్షణములును తెలిసికొనుట ఆవశ్యకము. ఈలక్షణవిమర్శయందు వా రత్యధికముగ తెలివి తేటలఁ జూపిరి. కాని లోపములను పోఁగొట్టుటకు వారు సూచించినమార్గము తగినమార్గము కాదు. రోగము కుదుర్చుటకు రోగిని చంపుటయే మార్గ మని తలఁచువైద్యునివలె వారు ప్రవర్తించుచున్నారు. ఇదియే అరాజకతావాదమందలి లోపము.

ప్రభుత్వలక్షణవిమర్శయందు వారు చెప్పినమాటలు సత్యము లని గ్రహించినవారు ప్రభుత్వాధికారము నిరంకుశము గాకయు, దుర్వినియోగము కాకయు నుండుట కుపాయము లెన్నిటినో సూచించి యున్నారు. వీని కన్నిటికిని ప్రధానసూత్ర మొక్కటి కలదు. అధికార మెన్నఁడును ఒక్కసంస్థయందు కేంద్రీకరింపఁగూడదు. సర్వాధికారము నొక్కసంస్థయందే సంక్రమించియున్నయెడల దుర్వినియోగమున కెక్కువయవకాశము కలుగును. కావున సాధ్యమైనంతవఱకు ప్రభుత్వాధికారము భిన్న భిన్నములగు సంస్థలకు చెందియుండవలెను. ఫెడరల్ విధానములోని సుగుణ మిదియే. స్థానికస్వపరిపాలనోద్దేశ మిట్టిదే. ప్రజాప్రభుత్వముకూడ నిట్టిలాభము నే సమకూర్చుచున్నది. భూమి, మూలధనము మొదలగు అర్థోత్పత్తిసాధనములపైని ప్రభుత్వము వారికే స్వామ్య ముండవలయు ననుపద్ధతిమూలమునఁ గూడ ప్రస్తుతకాల పురాజ్యాంగవిధానమునందలి లోపములు కొన్ని అంతరింపఁగలవు. కావున అరాజకతావాదమును విడనాడి, ప్రభుత్వాధికారము సద్వినియోగ మగుటకు కావలసినసాధనములను కనుఁగొనుటయే శ్రేయోదాయకము.

(మా. వేం. రం.)

**అరాపట్టణము** — బంగాళదేశమున శహాబాద్ జిల్లా యొక్క ముఖ్యపట్టణము. ఇది కలకత్తాకు ౩౬౫ మైళ్లమీఁద నుండును. జనసంఖ్య ౪౬,౧౭౦. ౧౮౫౭ లోని సిపాయిల తిరుగఁబాటుకాలమున కువర్‌సింగ్ అనునతఁడు ౨,౦౦౦ల మంది సిపాయిలతోను, ౪,౦౦౦ల మంది ఇతరజనులతోను ఈ గ్రామమునకు ౨౭-వ తేది జూలయిగోఁజున వచ్చి చెఱసాలలోని ఖైదీలను విడుదలచేసి ఖజానా కొల్లగొట్టెను. ఈ గ్రామము ౧౮౬౫ లో మ్యునిసిపాలిటీగ మార్పఁబడెను.

**అరాఫత్** — అరేబియా దేశములో మక్కానగరమునకు ౧౨ మైళ్లదూరమం దున్న యొకపర్వతము. 'గుర్తించుకొన్న కొండ' యని యీశబ్దార్థము. ఆదిమదంపతు లగు నాదాము, హవ్వయను వారు భగవంతునిచే నిషేధింపఁబడిన జ్ఞానఫలమును సైతాను ప్రోత్సాహమువలనఁ దినుటచేతఁ బవిత్రతతోపాటు స్వర్గమును గూడ గోల్పోయి భూమిమీఁదను బడిరి. ఈ దంపతులయధోగతికిఁ గారణభూతులైన సర్ప, మయూర, సైతానులు క్రమముగ ఇస్పహాను, కాబూల్, బిల్‌బేసు లనుప్రదేశములందును, హవ్వ అరాఫత్ మీఁదను, ఆదాము లంకలోని సెరాండిబుపర్వతముమీఁదను గూలిరి. స్త్రీ యగుటచే నున్న స్థలమును బాయవెఱచి యక్కడనుండియే హవ్వ తనమగనిని పేరుపెట్టి పిలువసాగెను. ఆదాము భార్యను వెదకు నిమిత్తము బయలుదేఱి యనేక సంవత్సరములపర్యంతముఁ బర్యటన మొనరించుచుఁ దుద కరాఫత్ పర్వతమును జేరి నిరంతరముగఁ దన నామముం గొని పిలుచుచున్న హవ్వను జూచి యామెసగ్గఱకుఁ బోవ నిరువురును బరస్పరము గుర్తించుకొనిరి. ఇందుచేతనే యీకొండ కరాఫత్ అని పేరు వచ్చినది. దీనిని 'అరాఫాహ' యనియుఁ బిలుచుచుందురు.

**అరారత్** — ఆర్మీనియా దేశములోని ఒక అగ్నిపర్వతము. దీనికి రెండు శిఖరము లున్నవి. మొదటిదానిని పెద్ద అరారత్ అనియు, రెండవదానిని చిన్న అరారత్ అనియు పిలుతురు. మొదటిదానియెత్తు ౧౬,౯౧౬ అడుగులు. రెండవదానియెత్తు ౧౨,౮౪౦ అడుగులు.

**అరారియా** (సబ్ డివిజన్) — బీహార్ ప్రాంతమందలి పూర్ణియాజిల్లాలోని యొకసబ్‌డివిజన్. ఇది నేపాళదేశము

sampath_Ebooks

నకు అని యుండును. వైశాల్యము ౧,౧౭౭ చదరపుమైళ్లు. జనసంఖ్య ౪,౧౫,౯౭౫. ఇందు ౬౦౦ ల గ్రామములు కలవు. రాణీగంజ్ ఠాణా (తాలూకా)లో పుల్లరిభూములు విస్తారముగఁ గలవు. ఇచ్చట ఎనుముజాతిని విస్తారముగఁ బెంచెదరు.

అరాలి — విశ్వామిత్రుని పుత్త్రుఁడు.

అరింగ్ — సంయుక్తప్రాంతములో మథురజిల్లా మథుర తాలూకాలో నొక గ్రామము. ౧౯-వ శతాబ్దిలో నీగ్రామము నిర్మింపఁబడినది. పురాతనమగు నొకమట్టికోటశిథిలభాగములు నేఁటికిని గలవు. ౧౭౬౮-వ సంవత్సరమునకు మునుపు ఇది అరింగ్ పరగణాకు ముఖ్యపట్టణముగ నుండెడిది కాని ఆపరగణాను మథురపరగణాతో కలిపివైచినతరువాత ఆ ప్రాముఖ్యము పోయినది. ౧౮౫౭-వ సంవత్సరమునాఁటి 'సిపాయిలకలహము' లోఁ బాల్గొన్న ప్రదేశములలో నిది యొకటి. ప్రస్తుతమున నీగ్రామము బృందావనములోని రంగజీ యాలయమునకుఁ జెందిన యీనాములలో నొకటి.

అరి — ఒక బ్రహ్మర్షి.

అరియోస్టో (౧౪౭౪-౧౫౩౩) — ఇటలీదేశమందలి గొప్ప కవి; ఇతఁడు ఓర్లాండో ఫ్యూరియోసో (Orlando Furioso) అను మహాకావ్యమును రచించెను. ప్రపంచమందలి మహాకావ్యములలో దీని నొకటిగా పరిగణించెదరు. ఇది ౪౦ ఆశ్వాసముల గ్రంథము. ఇతఁడు రాజకీయసంబంధమైన పనులను పెక్కింటిని జేసెను.

అరికెర — బళ్లారిజిల్లా ఆలూరు తాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౧౪౩౦ (౧౯౩౧).

అరికెల — చిత్తూరుజిల్లా పుంగనూరుతాలూకాలోని జమీందారీగ్రామము. జనసంఖ్య ౧,౫౭౨ (౧౯౩౧).

అరికేసరి — ఈతఁడు ఎనిమిదవ శతాబ్దియందు రాజ్యమేలెను. పల్లవుల నోడించెను.

**అరిక్‌బూకా** — ఇతఁ డొక మంగోలియావీరుఁడు. క్రీ. శ. ౧౨౬౦-వ సంవత్సరప్రాంతమున మంగోలియా రాజ్యపాలకుఁడగు మంగూమరణానంతరమున పాలకు లెవ్వరు నారాజ్యమునకు లేరైరి. కాని యా స్థానమునకుఁ బ్రయత్నించినవా రిరువురు. వారిలో నరిక్‌బూకా యనునతఁడు కారాకోరమం దొక సమావేశ మొనరించి యందలివారి సమ్మతిని పశ్చిమప్రాంతములకుఁ దానే రాజయ్యెను. రాజకుమారుఁడు కూబ్లాయ్‌ఖాను చీనాలో వేఱొక సమావేశ మొనరించి తా నచట నాయకుఁ డయ్యెను. తరువాత జరిగిన కలహములో కూబ్లాయ్‌ఖానునకే జయము గలుగఁగా రాజ్యమున కంతటికి నతఁడే నాయకుఁ డయ్యెను.

అరిగిపాలెం — విశాఖపట్టణము జిల్లా శృంగవరపుకోటతాలూకాయందలి జమీందారీగ్రామము. జనసంఖ్య ౫౫౧ (౧౯౩౧).

అరిగెలవారిపల్లె — చిత్తూరుజిల్లా వాయల్పాడు తాలూకాలోని ఈనాం గ్రామము. జనసంఖ్య ౨౯ (౧౯౩౧).

అరిగేపల్లె — నెల్లూరుజిల్లా వెంకటగిరితాలూకాలోని జమీందారీగ్రామము. జనసంఖ్య ౧౨౨ (౧౯౩౧).

అరిఘ్నుఁడు — రావణపక్షీయ రాక్షసుఁడు.

అరిచ్ఛత్రము — భారతయుద్ధము జరుగునపుడు కురుసేనలు విడిసిన యొకస్థలము.

అరిజిత్తు — శ్రీకృష్ణునకును భద్రకును బుట్టిన పుత్త్రుఁడు.

**అరిజోనా** — సంయుక్తరాజ్యములలోని ఒకరాజ్యము. ౧౯౧౨-వ సంవత్సరమున నిది ఆ దేశపు సంయోజనము (Union) నందు చేర్చుకొనఁబడినది. దక్షిణమున మెక్సికో, పడమట కాలిఫోర్నియా, నెవాడారాజ్యములును — మఱియు నీప్రక్కను కొలరేడోనది చాలదూరముపర్యంతమును సరిహద్దుగఁ బ్రవహించును — ఉత్తరమున ఉటాహారాజ్యమును, తూర్పున నవమెక్సికో (New mexico) రాజ్యమును దీని యెల్లలు. దీని వైశాల్యము ౧,౧౩,౯౫౬ చదరపుమైళ్లు. ౧౯౨౦ నాఁటికి ఈరాజ్యపుజనసంఖ్య ౩,౩౩,౯౦౩. అందులో ౧,౭౧,౪౬౮ మంది తెల్లవారు. ఈరాజ్యమున ౨౯,౦౧౭ చదరపు మైళ్ల వైశాల్యముగల రిజర్వేషను నేలలు గలవు. వానియందు అపాచెజాతి లోనగు ఉత్తర-అమెరికాహిందువులు ౪౨,౪౦౦ ల మంది వసింపుచు గలరు.

ఈరాజ్యమందలి భూమ్యుపరిభాగ మంతయు పర్వతమయము. కాని సస్యవంతములై, జలసమృద్ధములైన లోయ లీపర్వతాగ్రముల మధ్యమధ్యఁ గలవు. రాజ్యమందలి మఱికొంతభాగము బొత్తిగ మొక్కమొలక మొలవని వట్టి యెడారిభూమి. పడమట కొంతదూరము పర్యంతము కేవలము సరిహద్దుగఁ బ్రవహించుచుండుటయే కాక కొలరేడోనది ఈరాజ్యములోపలఁగూడ కొంతదూరము పాఱుచుండును. కావున నీప్రాంతమును ఆనదికి పరీవాహక్షేత్ర (Basin) మనియు చెప్పవచ్చును. దీని యుపనదు లగు గీలా, చిన్నకొలరేడో నదులు ఈ రాజ్యమున తూర్పుపడమరలుగాఁ బ్రవహించుచుండును. నూర్లకొలఁది మైళ్లపర్యంత మీనది ౧౫౦౦ మొదలు ౬౦౦౦ ల అడుగుల యెత్తున నిట్టనిలువుగ గోడలవలె నిలిచియుండు పర్వత పార్శ్వములు కల అగాధమగు పాషాణమయ మార్గముగుండా ప్రవహించుచుండుటచే నిచటికందరములు మహాశ్చర్యమును గొలుపుచుండును. కొన్ని తావులందు కలప అపరిమితము. ఇచట వర్షము చాల తక్కువ. కృషి

కార్యములనిమిత్తము నీటికాలువలు కలవు. విశాలములగు ఉన్నతభూభాగములు మేఁకలమందలకును, పశువులమందలకును మేఁత కుపయోగపడుట కతి ఉత్తమమైనవి. ఈప్రాంతము రాగి, బంగారము, వెండి, సీసము మొదలగు ఖనిజములకు స్థానమైనది. ఖననవ్యాపారము విరివిగ సాగుచుండును. రాగిని కరఁగించి శుద్ధిచేయుపనులు మిక్కుటములు. దక్షిణపాంటాఫే పసిఫిక్ రైల్వే ఈ ఇలాకామధ్యగఁ బోవును. ఫోనిక్సు దీని ముఖ్యపట్టణము. ౧౯౨౦లో జనసంఖ్య ౪౫,౦౫౩.

అరిణాంఅక్కివలస — విశాఖపట్టణముజిల్లా చీపురుపల్లెతాలూకాలోని ఈనాంగ్రామము. జనసంఖ్య ౬౧౬ (౧౯౩౧).

అరిద్యోత్తు — (చం. వం.) యాదవుఁడు. అంధక వంశజుఁడైన దుందుభిరాజు పుత్త్రుఁడు. ఇతనికుమారుఁడు పునర్వసువు.

అరిపిరాల — కృష్ణాజిల్లా గుడివాడ తాలూకాలోని గ్రామము. జనసంఖ్య ౯౫౭ (౧౯౩౧).

అరిబ — గంజాంజిల్లా పర్లాకిమిడితాలూకాకు చెందిన జమీందారీగ్రామము. ఇచటి జనసంఖ్య ౮౮౭ (౧౯౩౧).

అరిమర్దనుఁడు — (చం. వం) యాదవుఁడు. వృష్ణిపుత్త్రుఁడైన శ్వఫల్కరాజుయొక్క పదుమూఁగురు పుత్త్రులలో నొకఁడు.

అరిముత్తేనపల్లె — చిత్తూరుజిల్లా కుప్పంతాలూకాయందలి ఈనాముగ్రామము. ౧౯౨౦లో జనసంఖ్య ౬౮ (౧౯౩౧).

అరిమేజయుఁడు — ఒకయాదవుఁడు.

అరియంకావు — తిరువాన్కూరురాజ్యములోని షెంకోట్టతాలూకాలో నొకగ్రామము. అరియంకావు—కనుమ ద్వారమునకు ఇంచుమించుగ నొకమైలుదూరమున తిరునెల్వేలి-క్విలన్ రైలుదారిపై నున్నది. తిరువాన్కూరునుండి తిరునెల్వేలికిఁ బోవు రాచబాటయు నీయారినుండా పోవును. కాఫీల తేయాకులింబలవ్యాపారము దీనికి ప్రాముఖ్య మిచ్చినది. కొండలనడుమ నుండుటచే నిచ్చటి ప్రకృతి దృశ్యము చాల రమణీయముగ నుండును. కడు పురాతనమైన దేవాలయ మొకటి అరియంకావులోఁ గలదు. ఇది పరశురాముఁడు కట్టించిన దందురు.

అరియంబా — గంజాంజిల్లా పర్లాకిమిడి తాలూకాకు చేరిన ఈనాంగ్రామము. జనసంఖ్య ౩౦౫.

**అరియనాథమొదలియారు** — మధురను పాలించిన విశ్వనాథనాయఁకుని మంత్రి. రాజ్యపాలనమున నితఁడు విశ్వనాథనాయఁకునికి చాల సాయపడెను. ఇతఁడు కాంచీపురమండలము నకుఁ జెందినవాఁడు. విశ్వనాథనాయఁకుని యనంతరమున మధుర సింహాసనము నెక్కిన కృష్ణప్పనాయఁకునికిఁ గూడ నీతఁడు ప్రధాన మంత్రిగనే యుండెను. ఈకాలమున జరిగిన రక్షసతఙ్గడియుద్ధమునందు విజయనగరసామ్రాజ్యాధిపతి రామరాయల కార్యకర్త యయిన అళియరామరాయలను సాయపడుట కతఁడు కృష్ణప్పనాయఁకునిపక్షమున సొప్పుసైన్యములను దీసికొని విజయనగరమున కరిగెను.

కృష్ణప్పనాయఁకుని యనంతరమున సింహాసనము నెక్కిన వీరప్పనాయఁకునికాలమునఁగూడ అరియనాథుఁడు మధుర నాయఁకరాజ్యస్థానమున నెప్పటివలెఁ బ్రాధాన్యము వహించియుండెను.

రెండవ కృష్ణప్పనాయఁకుని కాలమున, అనఁగా క్రీ. శ. ౧౬౦౦ల ప్రాంతమున అరియనాథమొదలియారు కాలధర్మమునొందెను.

అరియనాథుఁడు మధురనాయఁకరాజులకడ ప్రధానమంత్రిగను, ప్రధానసేనాధిపతిగనుగూడ నుండెడివాఁడు. ఇతఁడు మధురయందు వేయి స్తంభముల మంటపమును గట్టించెను. దాని ద్వారమున మలచిన యతనివిగ్రహము నిప్పటికిని జూడవచ్చును. ఇతఁడు మధుర, తిరునెల్వేలి మొదలగు స్థలములందు వేయి స్తంభముల సత్త్రములను గట్టించినట్లు 'మృత్యుంజయవృత్తాంతము' లను గ్రంథమువలనఁ దెలియుచున్నది.

**అరియలూరు** — (పట్టణము) తిరుచునాపల్లిజిల్లా ఉడయార్పాలెయం తాలూకా అరియలూరు జమీందారీయందలి ముఖ్యపట్టణము. జనసంఖ్య ౮,౩౮౦. ఈపట్టణమున పట్నూలు కారన్ అను నేతగాండ్రచే ననువుగా నిట్టముగా పట్టుబట్టలు పెక్కురకములుగ నేయఁబడును. అరియలూరునాయఁకులు, నవాబురాజ్యము క్రిందను కర్నాటక్ యుద్ధములప్పుడును, అనేకము లగు మార్పులు చెందిరి. ఈజమీందారీ కొంతకాలము కంపెనీవారి పాలనక్రింద నుండెను. జమీందారు వసూలుమొత్తములో ౧౦-వ వంతు అనుభవించుచుండెను. క్రీ. శ. ౧౭౮౧ లో జమీందారు తాను నివసించు పట్టణమునకు మఱికొన్ని సమీపగ్రామములకును సన్నదును బొంది కంపెనీవారికి సంవత్సరమునకు రు. ౧,౦౯౦ లు పేష్కష్ చెల్లింప నొప్పుకొనెను. జమీందారులు వనియజాతివారు. ఈ జమీందారులకు అప్పు లధికమైనందున సాహుకారులు కోర్టుద్వారా వేలము వేయించిరి. అందుచే నిది పనునేడుచిన్నచిన్నముక్కలుగా విభజింపఁబడెను.

అరియాల్ ఖాన్ — బంగాళదేశమునందలి యొకచిన్న నది. ఇది ఫరీద్పురమునకు సమీపమున నున్న పద్మనుండి పుట్టి ఫరీద్పురము, బాకర్గంజ్ జిల్లాలగుండా ప్రవహించుచున్నది. వేసవిలో దీనివెడల్పు ౧,౮౦౦ గజములు; వానకాలమున ౩,౦౦౦ గజములు. ఎన్నియో పాయలుగఁ జీలి తుదకిది మీర్గంజ్ సమీపమున మేఘనానదిలోఁ గలయును. ఇది సంపూర్ణముగ పడవప్రయాణమున కనుకూలముగ నుండును.

అరివేముల — నెల్లూరుజిల్లా కనిగిరి తాలూకాలోని జమీందారీగ్రామము. జనసంఖ్య ౬౩౬ (౧౯౩౧).

sampath_Ebooks


**అరిసింహుఁడు** — లావణ్యసింహుని కుమారుఁడు. అమరచంద్రకవి యితనికి సమకాలికుఁడు; సహాధ్యాయి. అరిసింహుఁడు 'కవితారహస్యము' అనుపేర నలంకారశాస్త్రముపై నొక గ్రంథమును రచించెను. అమరచంద్రునికి 'కావ్యకల్పలత 'ను రచించుటలో నితఁడు తోడుపడినట్లు తెలియుచున్నది.

**అరిసేపల్లె** — కృష్ణా జిల్లా బందరు తాలూకాలోని గ్రామము. ఇచటి జనసంఖ్య ౭౭౩ (౧౯౩౧).

**అరిస్టయిడిస్** (క్రీ. పూ. ౫౩౦-౪౬౮) — ౧. ఇతఁడు ఏథెన్సుపట్టణవాసి, రాజకార్యకుశలుఁడు, దేశభక్తుఁడు, మహావీరుఁడు. ఇతనికి న్యాయస్వరూపుఁడు అను బిరుదుండెను. జగత్ప్రఖ్యాతిఁ జెందిన మరథాన్ యుద్ధమునందు (క్రీ. పూ. ౪౯౦) గ్రీకు సైన్యములను నడపిన పదిమంది నాయకులలో నీతఁ డొకఁడు. థెమిస్టోకస్ అను వానితో నీతనికి వైరముగలిగినందున నీతనిని క్రీ. పూ. ౪౮౪ లో ౫ సంవత్సరములవఱకును దేశమునకు రాఁగలదని వెడలఁగొట్టిరి. కాని ౪౮౦ లో పారసీకరాజైన క్షురక్షుఁడు (Xerxes) గ్రీసుదేశముమీఁదికి దండెత్తివచ్చినప్పు డితనిని మరల రావించిరి. సెలామిస్, ప్లెషియా అను యుద్ధములలో (౪౭౯) మిగుల పరాక్రమమును జూపి పారసీకరాజును పరాభవించెను. ఈతఁడు ౪౭౭ లో గ్రీసుదేశమందుండిన చిన్నచిన్న సంస్థానముల నొకటిగఁ జేసెను. దానిని డీలియాకా సంఘ మందురు. ఇతఁడు మిక్కిలి బీదవాఁడుగ చనిపోయెను. ఈతని యౌర్ధ్వదైహికక్రియలకు ప్రభుత్వమువారు సాహాయ్యము చేసిరి. ఇతనికూఁతులకును ప్రభుత్వమువా రుపకారవేతన మిచ్చిరి.

**అరిస్టయిడిస్, పబ్లియస్ ఈలియస్** (క్రీ. శ. ౧౨౯-౧౮౯) — ౨. గ్రీసుజాతివాఁడైన యొకగొప్ప యాలంకారికుఁడు, వక్త. ఇతఁడు గ్రీసు, ఇటలీ, ఈజిప్టు, ఆసియాదేశములన్నియుఁ దిరిగెను. తుదకు స్మర్నాపట్టణమందు నివాసస్థల మేర్పఱచుకొనెను. మార్కస్ ఆరీలియస్ అను రోమకచక్రవర్తికి నీతనియెడ నెక్కుడు గౌరవము. ఈతనివక్తృత్వసూచకము లగు ౫౫ ప్రవచనములును, రెండు ఆలంకారికగ్రంథములును ఇప్పటికిని వాడుకలో నున్నవి.

**అరిస్టాటల్** (క్రీ. పూ. ౩౮౪-౩౨౨) — గ్రీసుదేశమందలి సుప్రసిద్ధతత్త్వవేత్త, ఆచార్యశిరోమణి. ప్రపంచమునందు సకల విధములైన జ్ఞానమును ప్రసరింపఁజేయుటకై బోధరూపమునను, గ్రంథరూపమునను యత్నము చేసినమహర్షులలో నొకఁడు. ఈతనికాలమందుఁ దెలిసిన యన్నిశాస్త్రములమీఁదను ఈతఁడు గ్రంథములను వ్రాసెను. ఉపనిషత్తులును, షడ్దర్శనములును, వానిపై శంకరాదిభాష్యములును, ధ్వన్యాలోకమును ఒక్కయాచార్యుఁడె వ్రాసియున్నయెడల వానికి నెట్టిగౌరవము చేయవలయునో యట్టిగౌరవమునకు ఈతత్త్వవేత్త తగినవాఁ డని చెప్పినచో అతిశయోక్తి కానేరదు.



అరిస్టాటల్

చరిత్రము:— ఈతఁడు 'స్టాగిరా' అనుచోట క్రీ. పూ. ౩౮౪ లో జన్మించెను. స్టాగిరా యనునది గ్రీసుదేశమందలి సముద్రతీరపుఁబట్టణము. ఈతనిపూర్వులు వైద్యము చేయువారు. ఈతని తండ్రియైన నికొమెకసు మెసిడోనియాకు రాజైన అమింటాసు అనురాజునకు వైద్యుఁడు, స్నేహితుఁడు. ఈతఁడు తండ్రియొద్ద వైద్యమును నేర్చియుండవచ్చును. ఈతఁడు ౧౭-వ యేట (క్రీ. పూ. ౩౬౭) సాక్రటీసుశిష్యుఁడును, మహర్షియు నగు ప్లేటోయొద్ద తత్త్వమును అభ్యసించునిమిత్తము ఏథెన్సు నగరమునకుఁ బోయెను. కాని అప్పు డచ్చట ప్లేటో లేనందున, మూఁడు సంవత్సరములవఱకును తనంతట తానే విద్యాభివృద్ధి చేసికొనుచు క్రీ. పూ. ౩౬౭ లో ప్లేటో రాఁగా నతనికి శిష్యుఁ డాయెను. ఇతని కుశాగ్రబుద్ధి చూచి ప్లేటో ఈతనికి తనవిద్యాపీఠముయొక్క మూర్తిమంత బుద్ధివైభవ మన్న బిరుదు నొసంగెను. కాని యీతఁడు గతానుగతికుఁడు గాక, గురువు చెప్పిన దంతయు నేర్చుకొని, తన యభిప్రాయము లాతనికంటె భిన్నము లయినప్పుడు, గురువుతోఁగూడ వాదించుచుండువాఁడు. ప్లేటో ౩౪౭ లో మృతినొందఁగ, అతని మేనల్లుఁడైన స్పెసిప్పసు ఆవిద్యాపీఠమునకు నాచార్యుఁ డయ్యెను.

sampath_Ebooks

అంత అరిస్టాటలు ఏథెన్సు విడిచి, అటర్నియస్ రాజైన హర్మియాసు నొద్దకుఁ బోయెను. ఈ రాజుకూడ ప్లేటోకు శిష్యుఁడు.

క్రీ. పూ. ౩౪౨ లో మెసిడోన్ రాజైన ఫిలిప్పు తన కుమారుఁడైన అలెగ్జాండరునకు విద్య నేర్పుటకై అరిస్టాటలును పిలిపించెను. తరువాత మహాయోధుఁడైన అలెగ్జాండరు కప్పటికి పదునాల్గుసంవత్సరములవాఁడు. అలెగ్జాండరు రాజైనతరువాతను క్రీ. పూ. ౩౩౫ లో ఈతత్త్వవేత్త ఏథెన్సునకుఁ బోయి లిసియమ్ (Lyceum) అను విద్యామందిరమును స్థాపించి పండ్రెండు సంవత్సరములవఱకును జిజ్ఞాసువు లందఱకు నవ్యాహతముగ విద్యాదానము చేసెను. సంపులుగానుండు చెట్లక్రింద నిటు నటు తిరుగుచు నీతఁడు శాస్త్రపాఠములను జెప్పుచుండెను. క్రీ. పూ. ౩౨౩ లో అలెగ్జాండరు మృతుఁ డయ్యెను. అంత నాపట్టణమందలి యాతని ప్రతిస్పర్ధు లీతనిని బాధపెట్ట నెంచఁగా, నీతఁడు చాల్సిసునకుఁ బోయెను. అచ్చటనే ౩౨౨ లోఁ గీర్తిశేషుఁ డయ్యెను.

గ్రంథములు:— ఈతని గ్రంథములు పెక్కులు కలవు. కాని యాతనివి యనఁబడు గ్రంథము లన్నియు నీతనివియేనా యని సంశయము కలదు. ఈతని గ్రంథములు పెక్కులు టిప్పణిరూపమున నున్నవి. అందుచే నీతఁడు శిష్యులకు బోధచేయునప్పు డిచ్చిన టిప్పణులే యివి యైయుండు ననియు, స్వతంత్రపుస్తకరూపమున వ్రాయుటకుఁ బూర్వమే యీ యాచార్యుఁడు శరీరమును జాలించి నందున, అతఁడు శిష్యులకు నేర్పునిమిత్తము వ్రాసినటిప్పణులో, అతని శిష్యులు వ్రాసికొనినవో అతని పేరిట వచ్చుచున్న వని కొందఱుపండితులయభిప్రాయము. అందుచేతనే ఈతనిగ్రంథములు కొన్ని పూర్తిగ నుండక పోవుటయు, చెప్పినదే యొకప్పుడు మరలఁ జెప్పఁబడుటయు, ప్రతిజ్ఞ చేసిన కొన్నివిషయములను చర్చింపక పోవుటయు తటస్థించుచున్నది. ఈతనిచే రచింపఁబడిన గ్రంథము లన్నియు నీక్రింది యైదు తరగతులుగ విభజింపవచ్చును: ౧. తర్కశాస్త్రము (Logic); ౨. పదార్థవిజ్ఞానశాస్త్రము (Physics); ౩. జీవశాస్త్రము (Biology); ౪. వేదాంతశాస్త్రము (Metaphysics); ౫. నీతి, రాజనీతి. (Ethics & Politics); ౬. సాహిత్యశాస్త్రము (Literature).

౧. ఈతనిచే రచింపఁబడిన గ్రంథములలో తర్కశాస్త్రము ముఖ్యమయినది. పాశ్చాత్యుల యుక్తివాదమునకు మూలాధారము. న్యాయవైశేషికసూత్రములను రచించిన గౌతమ కణాదబుధులతో నీతనిని ఈవిషయమున పోల్చవచ్చును. ఇతఁ డీవిషయమున వ్రాసినట్టి ౬ గ్రంథములను జేర్చి తరువాతివారు దీనికి ఆర్గనమ్ (Organum), అనఁగా 'కరణము' అని పేరు పెట్టిరి. మన శాస్త్రమందలి లక్షణము చూచినను 'అనుమితికరణ మనుమానమ్'; కావున, అనుమానమును గుఱించి ముఖ్యముగఁ బ్రతిపాదించునట్టి తర్కశాస్త్రమును 'కరణ' మనుట సహజమే. ఈ యాఱుగ్రంథములందును పదార్థములు, తర్కవాక్యభేదములు, త్ర్యవయవవాక్యములు, ఊహలు, హేత్వాభాసములు మొదలయిన నిగమన (Deductive) తర్కమునుగుఱించి వివరముగఁ జెప్పఁబడినది. ఈ శాస్త్రమున కీతఁడు జనకుఁ డని చెప్పవచ్చును.

౨. పదార్థతత్త్వములను గుఱించియు, జ్యోతిషమును గుఱించియు నీతఁడు నాల్గుగ్రంథములను వ్రాసెను.

౩. జీవశాస్త్రసంబంధమైన యాతనిగ్రంథములలో మూఁడు ముఖ్యమైనవి. అం దొకదానిలో పశువులను గుఱించియు, ఇంకొక దానిలో శరీరమునకును, ఆత్మకును గల సంబంధమునుగుఱించియు, మూఁడవదానిలో ఇంద్రియములు, ధారణాశక్తి, స్వప్నములు మొదలగువానినిగూర్చియుఁ జెప్పఁబడినది.

౪. వేదాంతమునుగుఱించి యితఁడు వ్రాసిన గ్రంథమొకటియె సుప్రసిద్ధము. ఇందుఁ బూర్వపు తత్త్వవేత్తలప్రశ్నములను చర్చించెను. తరువాత 'సత్పదార్థము' (Being) యొక్క కారణములను, దాని తత్త్వములను, ధర్మములను చర్చించెను; ఈ ప్రపంచమును నడపించు ముఖ్యపాలకుఁ డీశ్వరుఁ డగు నని నిర్ధరించెను.

౫. ఇతఁడు వ్యక్తియొక్క నీతినిగుఱించి, అనఁగాఁ బ్రతిమానవుఁడును నడచుకొనవలసిన నీతిప్రవర్తననుగుఱించి మూఁడు గ్రంథములును, కుటుంబనీతినిగుఱించి యొకగ్రంథమును, రాజనీతినిగుఱించి యొకగ్రంథమును వ్రాసెను. అన్నిటియందును బ్రతిమానవునియొక్క క్షేమమే సంఘముయొక్క క్షేమముగ నెంచుకొనవలయు నని బోధించెను. రాజప్రభుత్వము గానీ, సరదారులప్రభుత్వము గానీ, ప్రజాప్రభుత్వము గానీ ప్రజలందఱక్షేమమును ఆలోచించు ప్రభుత్వము మంచి దనియు, ప్రభుత్వము చేతిలోఁ గలవారిక్షేమమునుమాత్రమే ఆలోచించు ప్రభుత్వము మంచిది కా దనియు నీతనియభిప్రాయము. రాజనీతిని గుఱించిన యాతనిగ్రంథము తప్పక చదువఁదగినది.

౬. సాహిత్యమునుగుఱించి యాతఁడు రెండు గ్రంథములను వ్రాసెను. ఒకటి అలంకారశాస్త్రము (Rhetoric) నకు సంబంధించినది; మఱియొకటి కావ్యమీమాంస (Poetics). ఇందు నతఁడు తనమార్మికత పెక్కుడుగఁ జూపించెను. ఇదియు మన సాహిత్యశాస్త్రములు చదివినవారు తెలిసికొనఁదగినది.

(కో. వేం. ల.)

**అరిస్టార్కస్** (క్రీ. పూ. ౨౫౦) స్యామోస — ౧. గ్రామనివాసి. గ్రీకుదేశపు జ్యోతిష్కుఁడు. ఇతఁడు జ్యోతిషవిషయక గ్రంథములు పెక్కులు వ్రాసెను. కాని అవన్నియు నశించినవి. సూర్యచంద్రులు భూమియొద్దనుండి యెంతదూరమున నున్నదియు కనుఁగొనుటనుగుఱించి వ్రాసిన చిన్నపొత్తమొకటి కానవచ్చుచున్నది. సూర్యుఁడు తిరుగుటలే దనియు, సూర్యునిచుట్టును భూమియే తిరుగుచున్న దనియు నితఁడు చెప్పెనఁట.

sampath_Ebooks

౨. (క్రీ. పూ. ౨౨౦ - ౧౪౪) – సమాత్రేస్ గ్రామనివాసి. గ్రీకువాఁడు. లక్షణవేత్త. ఆలంకారికుఁడు. అలెగ్జాండ్రియాలో అరిస్టోఫేనిస్ వద్ద విద్యాభ్యాసము నొనరించెను. గురువుతరువాత నీతఁడు అలెగ్జాండ్రియా పుస్తకభాండాగారమునకు అధికారి యయ్యెను. గ్రీకుకవుల కావ్యములను, ముఖ్యముగ హోమరుక వివగుని కావ్యములను విమర్శకబుద్ధితో చదివి చర్చించుట యందే ఇతని జీవితము గడచె నని చెప్పవచ్చును. ఇతఁ డొక వైయాకరణసంప్రదాయమును ప్రతిష్ఠించెను. ఆ సంప్రదాయమువారికి తరువాతి కాలమున అరిస్టార్కియన్సు అను పేరు వచ్చెను. వృద్ధుఁడైనతరువాత నచ్చటిరాజు తిన్నగఁ జూడనందున నితఁడు సైప్రసు పట్టణమునకుఁ బోయెను.

అరిస్టోడీమస్ — మెసినాదేశపు పౌరాణికరాజు. స్వాతంత్ర్యమునకై అతఁడు స్పార్టాదేశముతో (క్రీ. పూ. ౭౪౩ - ౭౨౪) నిరువది సంవత్సరములు పోరాడెను. తనదేశమునకు పారతంత్ర్యము రాకుండఁ జేయుటకై దేవతకు నరబలి యీయవలసివచ్చినప్పుడు తనకూఁతును బలియిచ్చెను. తరువాత నామెసమాధిమీఁద తాను పొడుచుకొని చచ్చెను.

**అరిస్టోఫేనిస్** — ౧. (క్రీ. పూ. ౪౫౦ - ౩౮౫) గ్రీసుదేశమునందలి యొకమహాకవి. ఈతఁడు హాస్యరసపూరితములైన నాటకములు వ్రాయుటలో మిక్కిలి పేరొందెను. తనకాలమందలి జనులను, ఆచారములను నాటకరూపముగ వెక్కిరించుటలో నీతఁడు గట్టివాఁడు. సరదారులు (Knights) అనునాటకములో డెమాస్థనీసును, మేఘములు (Clouds) అను నాటకములో సాక్రటీసును పరిహాసము చేసెను.

౨. (క్రీ. శ. ౨౬౦ - ౧౮౫) ఇతఁడు బైజాంటియంనివాసి. గ్రీకుపండితుఁడు. వైయాకరణుఁడు. ఇతఁడు పెక్కుగ్రంథములు రచించెను. అలెగ్జాండ్రియాలోని గ్రంథాలయమున కధికారిగ నుండెను.

అరిస్టోమెనిస్ — మెసీనియాదేశపు సేనాధిపుఁడు. క్రీ. శ. ౬౮౪ లో రాజుగ నెన్నుకొనఁబడెను. మెసీనియావారికిని స్పార్టావారికిని జరగిన రెండవయుద్ధములో (౬౮౫-౬౬౮) ఈతఁడు మిక్కిలి పౌరుషమును జూపి దేశసంరక్షణము గావించెను. తుదకు ఆర్కేడియాదేశస్థుఁడైన అరిస్టోక్రాటిస్ అన్నవానిచే మోసపోయి పరాభూతుఁడై ౬౬౮ లో రోడ్సుపట్టణమునకు పాఱిపోయెను.

అరిష్ట — కశ్యపునిభార్య.

**అరిష్టనేమి** — ౧. కశ్యప ఋషికి నామాంతరము (భార., శాంతి, అ. ౨౦౮).

౨. పుష్యమాసమునందు సూర్యునివెంటఁ దిరుగు గంధర్వుఁడు.

౩. ప్రాచేతసదక్షుని నలుగురుకన్యలకును బతి.

౪. విదేహవంశజుఁ డగు పురుజిజ్జనకుని పుత్త్రుఁడు. ఇతని పుత్త్రుఁడు శ్రుతాయువు.

౫. సహదేవుఁ డజ్ఞాతవాసకాలమునందు తంత్రీపాలుఁ డను నామముతోఁ గూడ ఈ పేరును ధరించెను.

అరిష్టపర్వతము — లంకలోనిది. పదియోజనముల పొడుగును, ముప్పదియోజనములయెత్తును కలది. సీతను చూచి హనుమంతుఁడు సముద్రపు టావలియొడ్డునకు గంతువేయవలె నని, దీనిపై నిలువఁగా నది యాతని బలమున కోర్వలేక భూమిలోనికి నణఁగిపోయెను (వా. రా., సుం, అ. ౫౬).

అరిష్టసేనుఁడు — భృగుకులోత్పన్నఋషి. ఇతనికిని యుధిష్ఠిరునకును సంవాదము జరగెను. ఇతనివంశజులు అరిష్టసేనులని పిలువఁబడుదురు (భార., వన, అ. ౧౫౯).

అరిష్టుఁడు — ౧. బలిదైత్యుని నూర్గురుపుత్త్రులలో నొకఁడు.

౨. దనుపుత్త్రులలో నొకఁడు.

౩. కంసుని యాజ్ఞవలన వృషభరూపుఁడై వచ్చి కృష్ణునిచేఁ జంపఁబడిన యొకయసురుఁడు.

అరిహుఁడు — అవాచీనుని కుమారుఁడు. వీని భార్య అంగి, కుమారుఁడు మహాభౌముఁడు.

అరుంగోళము — చిత్తూరుజిల్లా కార్వేటినగరము తాలూకాలోని యొకపల్లె. జనసంఖ్య ౨,౬౭౪. మిక్కిలి ప్రసిద్ధమైన జైనదేవాలయ మొకటి యిచ్చటఁ గలదు.

అరుంగోలము — చిత్తూరుజిల్లా తిరుత్తనితాలూకాయందలి జమీందారీగ్రామము. ఇచటి జనసంఖ్య ౨,౨౮౫ (౧౯౩౧).

**అరుంధతి** — ౧ స్వాయంభువమన్వంతరమందలి వసిష్ఠునిభార్య. కర్దమప్రజాపతికిని దేవహూతికిని బుట్టినకూఁతురు.

౨. వైవస్వతమన్వంతరమందలి మైత్రావరుణివసిష్ఠునిభార్య. ఈమెతండ్రిపేరు తెలియదు. ఈమెకు నారదుఁడు తోఁడఁబుట్టినవాఁడు. ఈమెకు వసిష్ఠునివలన శక్తి యను పుత్త్రుఁడు కలిగెను.

౩. ప్రాచేతస దక్షునికన్య. ధర్మఋషి యొక్క స్త్రీలలో నొకతె. ఈమెకు కకుబ యను నామాంతరము

sampath_Ebooks

కలదు. ఈమెకు సంకటుఁడను పుత్త్రుఁడును కేకటుఁడను పౌత్త్రుఁడును ఉండిరి.

౪. ఒక నక్షత్రము. సప్తర్షులలోని వసిష్ఠనక్షత్రమునకు వెనుక నుండును. కనఁబడీకనఁబడనట్లుండును. వివాహకాలమునందు దీనిని వధూవరులకుఁ జూపెదరు.

**అరుంబాక్కము** — చిత్తూరుజిల్లా తిరుత్తనితాలూకాకు చెందిన జమీన్దారీగ్రామము. జనసంఖ్య ౧,౦౧౭ (౧౯౩౧).

**అరుణపల్లి** — గంజాంజిల్లా బరహంపురంతాలూకాలోని గ్రామము. జనసంఖ్య ౭౭౬ (౧౯౩౧).

**అరుణసరియాపల్లి** — గంజాంజిల్లా సోంపేట తాలూకాలోని జలంత్రాయెస్టేటు జమీన్దారీగ్రామము. జనసంఖ్య ౩౯౪ (౧౯౩౧).

**అరుగొండ** — చిత్తూరుజిల్లా చిత్తూరు తాలూకాలోని యొక గ్రామము. జనసంఖ్య ౨,౫౨౪ (౧౯౩౧).

**అరుజుఁడు** — రావణపక్షీయరాక్షసుఁడు.

**అరుణ** — ౧. కౌరవపాండవుల యుద్ధభూమియైన కురుక్షేత్రమునందలి హిమప్రస్థ మనుస్థలమునకు సమీపమునం దున్నది. దీనికి సమీపమునందే సరస్వతీనదియొక్క సప్తప్రవాహములలోని ఓఘవతీప్రవాహము కలదు (భార., శల్య., అ. ౫).

౨. ప్లక్షద్వీపమందలి యొకనది.

౩. కశ్యపప్రజాపతి భార్యయైన ప్రాధకుఁ బుట్టిన యప్సరసలలో నొకతె.

**అరుణ ఔపవేశి గౌతముఁడు** — ఉద్దాలకారుణి తండ్రి. ఉపవేశునిశిష్యుఁడు. అశ్వపతి యనురాజునొద్దను బ్రహ్మవిద్య నేర్చెను (తైత్తి. సం., ౬. ౧. ౯).

**అరుణక్రియ** — ఔడవ-సంపూర్ణరాగము. ౫౩-వ మేళకర్త యగు సింహేంద్రమధ్యమరాగజన్యము. ఆరోహణమున — సరిమపనిస; అవరోహణమున సనిధపమగరిస యని సంచారము కలది.

**అరుణగిరి** — ఔడవ-ఔడవరాగము. ౬౪-వ మేళకర్త యగు వాచస్పతిరాగజన్యము. ఆరోహణమున సరిగమధస, అవరోహణమున సధమగరిస యని సంచారము కలది.

**అరుణగిరినాథడిండిముఁడు** — సాళువాభ్యుదయమును రచించిన రాజనాథుని తండ్రి. ఇతనికి శోణాద్రినాథుఁడని మఱియొకపేరు కలదు. 'డిండిమ' యనునది యీవంశజుల బిరుదనామము.

అచ్యుతరాయాభ్యుదయ, చంపూభాగవత గ్రంథములను రచియించిన రాజనాథుఁడు మఱియొకఁడు కలఁడు. అతని తండ్రి పేరు శోణగిరినాథుఁడు. ఈనామసామ్యము ననుసరించి శోణగిరినాథ, అరుణగిరినాథు లిరువు రొక్కరే యనియు, సాళువాభ్యుదయ, అచ్యుతరాయాభ్యుదయగ్రంథములను రచియించిన రాజనాథు లిరువు రొక్కరే యనియు నూహింప నవకాశము కలదు.

**అరుణచంద్రిక** — ఔడవ-షాడవరాగము. ౨౨-వ మేళకర్త యగు ఖరహరప్రియరాగజన్యము. ఆరోహణము — సరిగపనిస; అవరోహణము — సనిపమగస యని సంచారము గలది.

**అరుణశిఖరము** — హిమాలయముయొక్క యొక శిఖరము. ఇది కైలాసశిఖరమునకు పశ్చిమమున నుండును.

**అరుణాంబరి** — సంపూర్ణ-వక్రసంపూర్ణ రాగము. ౩౮-వ మేళకర్త యగు జలార్ణవరాగజన్యము. ఆరోహణమున — సరిగమపధనిస; అవరోహణమున — సధనిపధమగరిస యని సంచారము కలది.

**అరుణాచలకవి** — ద్రావిడభాషలో పంచలక్షణవిచక్షణుఁడు. వాగ్గేయకారకుఁడు. రామాయణమును కీర్తనములుగా ద్రావిడమునందు రసవంతముగఁ జెప్పి కీర్తి గడించెను.

**అరుణాచలము** — దక్షిణ-ఆర్కాటుజిల్లాలోని యొక గుట్ట, క్షేత్రము. దీనినే అఱవవారు తిరువణ్ణామలై యందురు. గుట్టక్రింద అరుణాచలేశ్వరుఁ డను దేవునిగుడి కలదు. దీనిని తేజోలింగ మందురు. ఇచ్చట కార్తికమాసమందు గొప్పయుత్సవము జరుగును.

**అరుణాయని** — ఒక బ్రహ్మర్షి.

**అరుణాశ్వుఁడు** — (సూ. వం.) ఇక్ష్వాకువంశజుఁడు. బర్హిణాశ్వుని రెండవకొడుకు.

**అరుణాస్పదము** — ఆర్యావర్తమున వరుణానది మీఁద నుండెడి యొకపట్టణము.

**అరుణి** — బ్రహ్మమానసపుత్త్రుఁడు.

**అరుణుఁడు** — ౧. అనూరుఁడు. సూర్యునిసారథి. కశ్యపునకును వినతకును బుట్టినవాఁడు. గరుడునకు నన్న. ఈతఁ డున్నయండము నీతనితల్లి తొందరపడి పగులఁగొట్టినందున నీతఁడు కాళ్లు లేకయే పుట్టెను. అందుచేఁ దల్లిని 'సవతికి దాసివగు' మ్మని శపించె. ఈతనిభార్య శ్యేని. సంపాతి, జటాయువులు కుమారులు.

౨. ఐదవ రైవతమనువుయొక్క పదిమందిపుత్త్రులలో నొకఁడు.

sampath_Ebooks

౩. గౌతమగోత్రుఁడైన యొకఋషి. ఇతనికి అరుణి యనియు పేరు గలదు. ఖ్యాతయశుఁడగు ఉద్దాలకారుణిఋషి యితనికుమారుఁడు.

౪. (సూ.వం.) ఇక్ష్వాకులలోఁ బ్రముఁడయిన మొదటి అనరణ్యునిపుత్త్రుఁడగు హర్యశ్వునకు దృషద్వతి యను స్త్రీయందుఁ గలిగినపుత్త్రుఁడు. ఇతనికుమారునకు నిబంధనుఁడు లేక త్రిబంధనుఁడు అను పేరు గలదు.

౫. విప్రచిత్తి దానవునివంశమువాఁడు. గాయత్త్రీజపము మూఁడువేలేండ్లు చేసి మహాబలవంతుఁడై లోకపాలుర వెడలఁగొట్టి దేవతలను మిక్కిలి బాధించెను. అంత దేవగురువగు బృహస్పతి యతనియొద్దకు వెళ్లి 'మేము జపించు గాయత్త్రియే నీవు జపించెద' వని చెప్ప, ఈతఁడు దేవతలగాయత్త్రి తనకుఁ బనికిరా దని భ్రమపడి దానిని జపించుట వదలి నాశము నొందెను (దే. భా., ౧౦. ౧౩).

౬. శ్రీకృష్ణునిచేఁ జచ్చిన యొక యసురుఁడు.

౭. శ్రీకృష్ణుని ప్రపౌత్రుఁడు. మహారథుఁడు.

౮. పదునొకండవది యగు ధర్మసావర్ణి మన్వంతరంబునందుఁ బుట్టఁబోవు సప్తర్షులలో నొకఁడు.

**అరుప్పుకోట్టాయ్** — మధురజిల్లాలోని రామనాథ సంస్థానమునందు తిరుచులీ అనుతాలూకాకు ముఖ్యపట్టణము. జనసంఖ్య ౨౩,౬౩౩. ఇచ్చటిజనము ౨౦ సంవత్సరములలో రెండింతలు అభివృద్ధి యయ్యెను. ఇచ్చట బట్టలనేఁతయు, రంగువేయుటయు చేయఁబడును.

**అరువ** — గంజాముజిల్లాలోని బరహాంపురముతాలూకాయందలి సముద్రపుటొడ్డుగ్రామములలో అరువ లన్నయొకజాతివారు కలరు. ఈ యరువజాతి మహమ్మదీయులకును ఓఢ్రస్త్రీలకును బుట్టిన మిశ్రజాతిగాఁ గానవచ్చుచున్నది.

**అరుళాళప్పెరుమాళ్ ఎంబెరుమానార్** — ఇతఁ డొక గొప్పపండితుఁడు. మొదటిపేరు యజ్ఞమూర్తి. అద్వైతమతమునకుఁ జెందినవాఁడు. ఒకసారి రామానుజునితోడి వాదమున నోడిపోయి దానికి ఫలితముగ వైష్ణవమతమును స్వీకరించెను. ఆసందర్భముననే యజ్ఞమూర్తి యనుపేరు పోయి పైపేరు వచ్చినది.

**అరేటియం** — ఎట్రూరియాప్రాంతములో నొకప్రాచీన నగరము; ఫ్లొరెన్సియాకు ౫౦ మైళ్లదూరమున నున్నది. క్రీ. పూ. ౪౯-వ సంవత్సరమున రోమను దీనిని వశపఱుచుకొనెను. క్రీ. శ. ౩, ౪, శతాబ్దులలో నిది రోమనుల విశోధివర్గమునధీనమున నుండెను. ఇచటి భూమి మిగుల సారవంతమయినది. అందమైన మట్టికుండ లిచ్చట తయారుచేయఁబడును. పూర్వవైభవమును సూచించు శిథిల చిహ్నము లిప్పటికిని కొన్ని కలవు.

**అరేబియా** — ఇది ఆసియాఖండమున పశ్చిమభాగమందలి విశాలద్వీపకల్పాకృతిగ నున్న యొక దేశము. దేశీయులు దీనిని అరబ్ లేక జిశీరతుల్ అరబ్ అని పిలుచుచుందురు. జిశీరతుల్ అరబ్ అన అరబ్ ద్వీపకల్పమని యర్థము. ఎడారులు, మైదానములు గల దేశమని యర్థమిచ్చు హీబ్రూపదమునుండి అరబ్ శబ్దము పుట్టినది. పారసీకులు, తురుష్కులు దీనిని అరబ్ స్థాన మని వ్యవహరింతురు. స్థాన్ అనునది పారసీకపదము, కావున పారసీకులవలననే దీని కీపేరు కలిగి యుండును.

సరిహద్దులు, నైసర్గికలక్షణములు :— ఈ దేశము ౧౨° - ౩౨° రేఖాంశములు, ౩౫°-౬౦° అక్షాంశములమధ్య వ్యాపించియున్నది. ఇటీవల బ్రిటిష్‌వారిరక్షణము క్రిందికి వచ్చిన ఈరాక్, ట్రాన్సుజోర్డాన్ ప్రాంతములు ఉత్తరమందును, దక్షిణమున హిందూమహాసముద్రము, ఏడెన్ సింధుశాఖయు, పడమట శోణసముద్రము, తూర్పున పర్షియన్, ఉమ్మాన్ సింధుశాఖలును దీని కెల్లలుగ నున్నవి. ఈదేశపు సీమారేఖ పర్షియన్ సింధుశాఖాతీరమందలి ఫౌనామకప్రదేశమునమండి యారంభమై రికాఈ అనుస్థానమువఱకును ఈరాక్, కువైట్ ప్రాంతముల నడిమియెల్లగాఁ బోయి యచటనుండి పశ్చిమోత్తరాభిముఖమై జబల్ అనైజాపర్వతములవఱకును బోవును. అచటనుండి పడమరగాఁ దిరిగి అకాబానగరము దిగువవఱకును బోయి యచటనుండి తిన్నగ దక్షిణమందలి యేడెనునగరమునకుఁ బోవును. ఏడెనునుండి తూర్పుగాఁ దిరిగి ఇది రాస్ ఎల్ హడ్డ్ మీఁదుగా ఆర్మజ్ జలసంధిగుండా మరల ఫౌనామకస్థానమును జేరును. ఈ దేశముయొక్క వైశాల్యము ౧౦,౦౦,౦౦౦ ల చదరపుమైళ్లు. అకాబానుండి యేడెనుపర్యంతము ౧,౪౦౦ ల మైళ్లు. అచటనుండి రాస్ అల్ హడ్డ్ వఱకు ౧,౨౫౦, దానినుండి ఫౌవఱకు ౯౦౦ లును, అచటనుండి అకాబావఱకును ౭౫౦ మైళ్లును దూరము కలదు.

ఈదేశపు పశ్చిమభాగము శోణసముద్రతీర మంతయు ఉత్తరదక్షిణముగా పైనుండి యడుగువఱకును పర్వతమాలికలతో నిండియున్నది. ఈపర్వతములయెత్తు తూర్పునకుఁ బోనుపోను క్రమముగ తగ్గిపోవును. కావున నిచటిభూభాగ మంతయుఁ బడమటినుండి తూర్పున కేటవాలుగ నున్న దని తెలియవలయును. అది యటులుండ నీదేశమును మూఁడు స్వాభావికభాగములక్రిందఁ జేయవచ్చును. వట్టియెడారులు, లోయలు, తరుస్థానములు కల కఱకుపీఁటనేలలు నట్టనడిమిభాగమున నుండ, వానిచుట్టు నిసుకయెడారులును, వానికి నలుప్రక్కల సస్యవంతములగు భూభాగములును దృగ్గోచరము లగుచుండును. ఇందు మధ్యస్థమగు పీఠభూమి అల్ నెజ్డ్ ప్రాంతము దాని

sampath_Ebooks

నావరించి యుండునవి నఫూద్, దహనా, రుబ్ అల్ ఖలీ యను యెడారిభూములు. వీనికి నాలుగుప్రక్కల సిరియన్ హమ్మాద్, హెజాజ్, అసీర్, హద్రామౌత్, ఓమ్మాన్, హాసా మొదలగు దేశము లావరించియున్నవి. వీనిలో అసీర్, యమన్, ఓమ్మాన్ ప్రాంతములు మిగుల సస్యవంతము లగుటచేత ప్రాచీన-అరబ్బులచే అరబ్‌ఫీలిక్స్, అనఁగా సౌఖ్యప్రదమయిన అరేబియా యని పిలువఁబడుచుండెడివి. ఇవి తప్ప తక్కినదేశ మంతయు మొరఁపుటిసుకయెడారులతో నిండియున్నది. దేశమందలి పర్వతములోయల నుండి జనించునదులను సముద్రమునఁ జేరఁజాలక ఈయెడారులందే యంతర్ధానము లగుచుండును. వీనియం దక్కడక్కడ జలపరిపూర్ణములగు తరుస్థానము(Oases)లనేకములు కలవు. మదీనా, కాసిమ్, హాసా మున్నగుపట్టణము లిట్టితరుస్థానములందుఁ గట్టఁబడినవే.

దేశమునందు వందలకు మించిన మైళ్లపర్యంతము నెడారులు వ్యాపించియుండుటచేతను, వానియందు సుప్రయాణయోగ్యములగు మార్గములు లేకపోవుటచేతను, యాత్రికుల ధన, మాన, ప్రాణములకు రక్షణము నొసంగఁగల సురాజ్యవ్యవస్థ దేశమున లేకుండుటచేతను, అరేబియానుగూర్చిన సమాచార మిప్పటికి వలసినంత బాగుగఁ దెలియదు. అదిగాక మక్కానగరమును జూడవలయునని మహమ్మదీయులకుఁ దప్ప నితరులకు బొత్తిగ వీలులేదు. ఆరంభమునందీనగరమును ముసల్మానులు కానివారు జూడరెంచిన మహమ్మదీయవేషములూనియే యిందుఁ బ్రవేశింపఁగలిగిరి. అరేబియాదేశమును గనుఁగొను నిమిత్తము ౧౮-వ శతాబ్దిమందియు అన్వేషణములు జరుగుచున్నవి. క్రీ. శ. ౧౭౬౧-వ సంవత్సరమున కార్‌స్టన్ నెయిబూర్ అను డెన్మార్కుదేశీయుఁడు డేనిష్‌దొరతనమువా రంపఁగా వచ్చి ౧౭౬౭ వఱకును పర్యటన మొనరించి తాను గనుఁగొన్నదానిని ప్రపంచమునకు వెల్లడిచేసెను. ఇతనిపరిశోధనములవలన సమగ్రముగ అరేబియాయొక్క సంక్షిప్తవృత్తాంతము లోకమునకు లభించినది. ఇతఁడు వెల్లడిచేసినవిషయములు తరువాతివారికి మార్గప్రదర్శకము లైనవి. ౧౮౬౯-వ సంవత్సరమున జె. హాలెవీ యనునతఁడు మారెబ్‌నగరమును జేరి తత్సమీపమందలి చెక్కడపురాలను బరీక్షించి యటనుండి సానా, మాడిడ్ పట్టణములమీఁదుగా మిజార్ అనుపేరఁభూమి నుత్తరించి సాబియన్‌శాసనములఁ బరీక్షించెను. మఱియు నితఁడు క్రీ. పూ. ౨౪-వ ఏఁట సాబియనులు రోమనులచే నోడినప్రదేశమును గుర్తింపఁగల్గెను. టాలెమీ వర్ణించిన నగ్రమనుస్థానము మదీనత్-అల్-మాహబాద్‌దగ్గఱ నున్నట్లు దెలిసికొనెను. మఱుసటిసంవత్సరమున నితఁడు మారెబ్‌దగ్గఱ మదీనత్-అల్-నహాస్ శిథిలావశేషములను బరిశోధించి పిదప నచటికిఁ దూర్పున వాడీషిబ్‌వానకు అడ్డముగ హిమ్యారైతులు గట్టించిన యానకట్టను గనిపట్టఁగలిగెను.

తరువాత మారిబును దర్శించినయతఁడు ఇ. గ్లాసెర్, ఆస్ట్రియాదేశపు పురాతత్త్వవేత్త. తుర్కీదొరతనపు సంరక్షణముక్రింద నితఁ డీదేశము నన్వేషింప నేతెంచెనుగాని సానాపట్టణమున నుత్తరమున నివసించియుండిన హాషిద్, బకిల్ జాతులవారు కొన్ని ప్రతిబంధకములను గల్పింపసాగిరి. కాని యితఁడు జెనుడీయుక ఖారిద్, హిరాన్ వాడీలయందు హిమ్యారైతుల ప్రాచీన నివాసస్థానములను, శోధించి మారిబ్‌వద్ద మఱికొన్ని శాసనముల సంగ్రహింపఁ గలిగెను.

అనంతరము అరేబియాసముద్రతీరమును సర్వే చేయనెంచిన వెల్‌స్టెడ్, కర్టెంషన్ అనువారు హద్రామౌత్ ప్రాంతమునఁ బ్రవేశించి మొకల్లానామకస్థానమునొద్ద హిమ్యారైత్ శాసనములను మఱికొన్నింటిని సేకరించిరి. ౧౮౪౩-వ సంవత్సరమున హిరష్ అను నతఁడు కైతీసుల్తానుసాహాయ్యమున దువాన్‌వాడీ చేరి హజరైన్ దగ్గఱ శిథిలావశేషములను గనుఁగొని, శాసనములను గూర్చుకొని హరౌరా, షిబంవగరములకుఁ బోయి యచటినుండి కథిరీజాతీయు నొకనిని మార్గదర్శకునిగఁ దోడుకొని టెరింపట్టణమునకుఁ బోయియుండఁ గొన్నిదినములు కడచినవెనుక నచటివారితో వైరము సంభవించెను. అంత నితఁడు వెనుకకు మరలవలసినవాఁ డయ్యెను. థియోడోర్ బెంట్ అనునతఁడు పత్నీద్వితీయుఁడై ఒక ఇమాంవకీల్ తోడ్పాటునుగూడఁ గలుగఁజేసికొని హిరష్‌మార్గముననే పోయి హిమ్యారైత్ శాసనముల సేకరింపఁగలిగెను. కాని యుప కితనికిని దేశీయులఆటంకము లడ్డుతగిలెను. ఇదేవిధమున వెల్‌స్టెడ్ ఓమ్మాన్ ప్రాంతమును బరిశోధించెను. అచటివా రతనికి విఘ్నములను గల్పించియుండలేదు. కాని వహాబీలాతగణమునఁ జెలరేఁగియుండుటచే ముందునకు సాగిపోవ వీలుకాకుండ దయ్యెను. పిదప మైల్సు అనునతఁడు వెల్‌స్టెడ్‌మార్గము నవలంబించి పోయి ఫహీరాయిలాకాయందలి బిరేమాపట్టణముంజేరి అల్ కటన్ ప్రాంతపు వృత్తాంతమును జాలవఱకుఁ దెలిసికొనెను. యల్. డి. వర్ థేమా, జోసఫ్‌పిట్స్ మొదలగువారు తీర్థయాత్రికులవలె పోయి మక్కానగరమును దర్శించియుండిరి.


బర్‌క్‌హార్డ్‌ట్ అనునతఁడు మక్కానుగూర్చి నియమబద్ధముగ పరిశోధనము సలిపెను. అతఁడు అలీ యనుపేరు పెట్టికొని యాత్రసలిపి కొన్నియవసరములందు తైర్థికులు గావింపవలసిన కర్మవిధానములంగూర్చియు విశదీకరించెను. మక్కాచుట్టుప్రక్కల నున్న గ్రామాదులవిషయమునఁగూడ నితఁడు లిఖించియుండెను. జె. యల్. బర్క్‌హార్డ్‌ట్ అనువేఱొకఁడును ముసల్మాన్‌యాత్రికునివేషమూని మక్కాయందు మూఁడునెలలు వసించి యచట నెఱవేర్పవలసినవిధులను గుఱించియు, మక్కా మదీనామార్గమందలి విశేషములనుగూర్చియు వ్రాసియుండెను.

రిచర్డ్‌బర్టన్ అనునతఁడు అఫ్‌గానియాత్రికునివేషమూని మక్కా మదీనాల పునర్నిరీక్షణ మొనరించి ఈజిప్టుపాలకునిచే ననుజ్ఞాతుఁడై మిదియాయందలి బంగారుగనులను బరిశోధించెను.

౧౮౧౮-వ సంవత్సరమున ఈజిప్టుపాలకుఁడగు మహమ్మదలీయొక్క దత్తపుత్రుఁడగు ఇబ్రహీంపాషా వహాబీల నడఁగఁద్రొక్క

sampath_Ebooks





sampath_Ebooks

నిమిత్తము కొంతసేనను అరేబియామధ్యమునకుఁ గొంపోయెను. ఇతని వెంట యూరోపియన్ ఆఫీసరులును పెక్కుమంది యుండిరి. వీరు ప్రత్యేకముగ నన్వేషించిన క్రొత్తవిషయము లేమియు లేవు కాని వీరు సమకూర్చినసామగ్రివలనఁ దరువాత శోధింపఁబోవువారికి మంచిసౌకర్యములు దొరకినవి. ఇంతియుగాక యీ వీరతనమువారు పర్షియన్ సింధుశాఖయందు జరుగు సముద్రపుదొంగతనమును రూపుమాపఁ దలపెట్టి యున్నందున దాప్రాంతమున అరేబియాస్థితిగతుల నరయుటకై జి. యఫ్. సాడ్లీర్ అను క్యాప్టెన్ ఒకనిని బంపియుండిరి. ఇతఁడా సింధుశాఖను జేరి ఇబ్రహీంపాషాతోఁగూడ సంప్రతింప నెంచి వని బయలుదేరెను. కాని ఇతఁడు వచ్చుటకుఁ బూర్వమే ఇబ్రహీం తానున్నస్థానమును వీడి మదీనావైపు బయలుదేఱిపోయెను. అంత సాడ్లీర్ గూడ ఇబ్రహీం చేన పోయినమార్గముననే పోవుచు, తుద కతనిని మదీనాయందుఁ గలసికొనెను. అనంతర మీ క్యాప్టెన్ శోణసాగరతటమందలి యంబోకేవునకుఁ బోయెను. ఇందువలన నితఁడీదేశమును దూర్పునుండి పడమటికి అడ్డముగ దాఁటినవాఁడయ్యెను. ఇతఁడొనరించిన ప్రయాణమువలన నెంతకాలమునం దైనను అరేబియాను దూర్పునుండి పడమటికి అడ్డముగ సేనాసహితముగ దాఁటవచ్చునని స్పష్టమయ్యెను. అటుతరువాత జి. ఎ. వల్లిన్ అనునతఁడు వాడీసిర్హాన్ మీఁదుగ జౌఫ్ నగరమునకును, అచటనుండి నఫూడ్ మీఁదుగ హెయిల్ పట్టణమునకును బోయెను. ఇతఁడు ప్రయాణము చేసిన ప్రాంతముయొక్క భౌతికలక్షణములు, జనుల యాకృతి, ఆచారవ్యవహారములు మొదలగువాని విషయమున లిఖించెను. ౧౮౬౪-వ సంవత్సరమున కార్లోగార్మనీనామక ఇటలీదేశీయుఁడు ఫ్రాన్సు చక్రవర్తికి గుఱ్ఱములను గొన అరేబియాకేతెంచినసందర్భమున ఖైబర్ హర్రాను గనిపట్టఁగలిగెను. మఱియు నితఁడు మధ్య-అరేబియాను గూర్చి విలువగల సమాచారము నొసంగెను. డబ్లియు, జి. పాల్గ్రేవ్ అనునతఁడు జౌఫ్, హెయిల్, బురైదా, రియాద్, ఖార్జ్, అఫ్లాజ్, హోసా లోనగుపట్టణములను ౧౮౬౨-౬౩ ల కాలమున సందర్శించెను. ఇతనివెంట బరకత్ అనుపేరుగల సిరియాదేశపు క్రైస్తవమిషనరీ యొకఁడుండెను. ఇతఁడరబ్బుల రాజకీయ, నైతిక, సాంఘిక విషయములను బాగుగ విశదపఱిచి లిఖించెను. ౧౮౬౫ నందు పర్షియా సింధుశాఖయందు పొలిటికల్ రెసిడెంటుగ నుండిన కల్నల్ లూయీ పెల్లీ యనునతఁడు వహాబీరాజధానికి మిషన్ కార్యార్థము పోయి తాను జూచినమార్గము నంతను భౌగోళికముగ వర్ణించెను. ఇతఁడు సాదుస్ దగ్గఱ నిస్లాంపూర్వయుగమునాఁటి స్తంభ మొకదానిని గనిపట్టెను. దానిని ధర్మాంధులగు ముసల్మానులు ధ్వంసము గావించిరి. ౧౮౭౬-వ సంవత్సరమున చార్లెస్ డాటీ యనునతఁ డెడారులవిషయమున పరిశోధనములసలిపి లిఖించెను. ఇతఁడు తైర్థికుల సమూహముతో డమాస్కస్ పట్టణమునుండి బయలువెడలి అల్ హజ్ర్ వద్ద మకాము చేసెను. అక్కడ నెలవుకుదుర్చుకొని మదాయిన్ సాలీవద్దనున్న రాతిగోరీలను పరీక్షణపూర్వకముగ రూపపటములను గైకొని, శాసనములను గొన్నింటిని సంగ్రహపఱిచి వాని నన్నింటిని పారిస్ పట్టణమునందలి రెనెన్‌కుఁ బంపియుండెను. తరువాత నితఁడు షకరాబనుటీలతో ప్రయాణముల సలుపుచు అల్ హెజ్జ్, హజాజ్ సరిహద్దులందు టెఇంనామక ప్రదేశమున మిగులఁ బ్రఖ్యాతికెక్కిన ప్రాచీనకాలపు పాషాణశాసనము నొకదానిని గనిపట్టెను. హ్యూబర్ పండితుఁడు దానిని పారిస్‌లోని లోవర్ నందుఁ జేర్పించెను.

విల్ ఫ్రెడ్ అనునతఁడును, ఎనీబ్లంట్ నామకవనితయుఁ గలసి కాఫ్, జౌఫ్, హెయిల్ పట్టణములగుండా బాగ్దాద్, కెర్బెలా నగరములఁ జేరి అల్ నెజ్జ్‌నుగూర్చియు, అరబీగుఱ్ఱములను, అరబ్ గ్రామీణులనుగుఱించియుఁ బ్రకటించిరి.

౧౮౮౩ నందు సి. హ్యూబర్ అను ఫ్రాన్సుదేశయాత్రికుఁడు డమాస్కస్‌నుండి హెయిల్ వఱకును బ్రయాణము సలిపెను. ఇతఁడు టెఇమాశాసనముతోపాటు మఱి పెక్కింటిని సంగ్రహించి జిడ్డానుండి స్వదేశమునకుఁ బంపి మరల హెయిల్ పట్టణమునకుఁ బోవుచు దారిలో మార్గప్రదర్శకులవలన హతుఁడయ్యెను.

౧౮౯౩-వ నోల్డ్ అనునతఁ డరేబియాసంచారము సలిపి గుఱ్ఱములను, ఒంటెలనుగుఱించి విశదీకరించెను. ౧౯-వ శతాబ్దిపరిశోధకులం దితఁడే కిట్టకడపటివాఁడు. ఇంతవఱకు నరేబియాయుత్తర ప్రాంతములుమాత్ర మన్వేషింపఁబడినవి. దక్షిణమందలి యెడారు లింకను అనన్వేషము లైయుండెను.

ఇరువదవ శతాబ్దియం దరేబియానుగూర్చి సంపూర్ణముగ జ్ఞానము కలిగెను. ఇందులకు ముఖ్యకారణము జర్మనీయుద్ధము. రాజకీయావసరములనుబట్టి ఈదేశమును బాగుగ నన్వేషింపవలసివచ్చెను. కేవలము స్థలమార్గముననే కాక వాయుయానములద్వారాకూడ పరిశోధనలు జరగినవి. అలోయిస్, మూసిల్, కల్నల్, జి. ఇ. లీచ్‌మన్, మిస్ జెర్ట్రూడ్, బెల్, షేక్స్‌పియర్ లోనగువారు యుద్ధకాలమున నన్వేషించినవారిలో ముఖ్యులు.

లీచ్‌మన్, బార్క్లేరాంకిన్, డిక్సన్, మేజర్. ఆర్. ఇ. చీజ్‌మన్ లనువారు అరేబియామధ్యభాగముల నన్వేషించిరి. ఈదేశమును దూర్పునుండి పడమటికి దాఁటినవారిలో మఱియొకఁడు జె. బి. ఫిల్బై. ఇతఁడు పూర్వులు లిఖించినవానిని ఖాయపఱిచెను. మఱియు అఫ్లాజ్, ఖార్జ్ ప్రాంతములం దేకాలమునాఁటివో గోరీలశిథిలావశేషములను గముఁగొని అల్ నెజ్జ్ ఇలాకాను అరేబియానైరృత దేశములతోఁ గలుపుట కనువగు తరుస్థానము లేదియు లేదని ఇతఁడు రూఢిపఱిచెను. యుద్ధకాలమున నెక్కువగ శోధింపఁబడినది హెజాజ్ ప్రాంతము.

దేశవిభాగములు, నదులు, కొండలు, సరస్సులు:— ఈదేశమం దంతట ఆఫ్రికాఖండములోని సహారాయెడారియొక్క భౌతికలక్షణములు కన్పట్టును. ఇందువలన నిదియు నాయెడారియు ప్రాచీనకాల

sampath_Ebooks

మున నొకటిగఁ గలసియుండవచ్చు నని యూహింపఁబడినది. వదులుగ నుండు ఇసుకమైదానములు, చాలదూరమువఱకును ప్రసరించి యుండు రాతిపేలలు, పెద్దపెద్దబండలు, బావులు, చిన్నయేఱులు గల తరుస్థానములు, వాని నంటికొని యుండుతాటితోఁపులు, సాగుబడి లేనిభూములు మొదలగునవి సహారాయెడారియం దెట్లో యటులే ఈదేశమందును గలవు. అరేబియాపేట్రియా, అరేబియా డెజర్టా, అరేబియాఫెలిక్సు అని ప్రాచీను లీదేశమును మూఁడుభాగములు కావించియుండిరి. పేట్రియానగరమునకుఁ జుట్టుప్రక్కల నుండు ఇలాకా అరేబియాపేట్రియా. ప్రస్తుత మీప్రాంత మరేబియానుండి విడివడియున్నది. ఎడారులు కలదేశ మరేబియాడెజర్టా. అరేబియాఫెలిక్సు అనఁగా సౌఖ్యదాయకమగు ప్రదేశమని యర్థము. ఇది ముఖ్యముగ నైరృతకోణమం దున్న యమనుప్రాంతమున కొసఁగఁబడినపేరు.

కాని ప్రస్తుతదేశవిభజనము రాజకీయానుకూల్యముల ననుసరించి కాని భౌతికలక్షణములనుబట్టి కాదు. శోణసముద్రపు తూర్పుతీరమున సినాయిద్వీపకల్పమునకు దక్షిణముగ హెజాజ్ ప్రాంతమును, దానికి దక్షిణమున అసీర్ యమన్ భాగములును, దక్షిణమున పడమటనుండి తూర్పుకోణమువఱకును వ్యాపించి హద్రామాత్ ఇలాకాయును, ఆగ్నేయభాగమున ఉమ్మాన్ ప్రాంతమును, పర్షియా సింధుశాఖమీఁద అల్ హాసా, కువైట్ ఇలాకాలును, మధ్యభాగమున అల్ నెజ్ద్ పీఠభూమియును, ఉత్తరమున జబల్ షమ్మార్, నఫూన్ దేశములును ఇప్పటివిభాగములు. ఇవిగాక, అల్ నెజ్ద్ కు దక్షిణముగను, హద్రామాత్ కు ఉత్తరముగను దహానా లేక రుబ్ అల్ ఖలీ యను అనన్విష్టమగు ప్రదేశము గలదు. ఇదంతయు పట్టి యెడారి. ౧౯౦౨ మొదలుకొని ౧౯౧౪ వఱకునుగల కాలమున బ్రిటిష్ తురుష్క ఆఫీసరుల సమ్మేళనములు కొన్ని జరగియుండెను. వానియందు అరేబియాలోని స్వతంత్రరాజ్యములకును, తురుష్క, బ్రిటిష్ రాజ్యములకును పరిహద్దులవిషయమున కొన్ని పరిష్కారములు జరిగియుండెను. కాని జర్మనీయుద్ధముకారణముగ నాసమయము లన్నియుఁ దాఱుమాఱైపోయినవి.

శోణసముద్రతీరమందలి ప్రాంతములలో నిలువున పైనుండి క్రిందివఱకును పర్వతమాలికలు వ్యాపించియున్నవి. వీని మొదళ్లు మిడియాదేశమునఁ గలవు. జబల్ ద్రూజ్ నామక అగ్నిపర్వతముల దక్షిణభాగము లనఁదగిన హర్రాత్ అవేరిత్, హర్రాఖైబరు లనుకొండలు ఈశ్రేణికిఁ దూర్పుగ నుండును. మిడియాయం దారంభమైన ఈ పర్వతమాలికలు దక్షిణాభిముఖములై క్రమముగ నున్నత మగుచు టెయిఫ్పట్టణముదగ్గఱగ అసీరునందలి పీఠభూములతో నేకీభవించి యమనునందలి కొండలతోఁ గలయును. హర్రాసమీపమందలి జబల్ అనాజ్ నామకశిఖరముయొక్క యెత్తు ౮,౦౦౦ల అడుగులు. యమనులోని పర్వతములలో ౧౦,౦౦౦ల యడుగుల యెత్తుగల అగ్రములును గలవు. హెజాజ్ దక్షిణమం దీశ్రేణి సారవంతమై సస్యసంవర్ధకమైయున్నది. మదీనా, యంబో, అల్ నఖల్ నామకతరుస్థానములును, మక్కానామకపట్టణమును ఈశ్రేణులందే కలవు. అసీరు యమనునందలి పర్వతములు మఱింత ఫలవంతమైనవి. ఇచట కాఫీ మిగుల తయారగుచుండును. హద్రామాత్ నందలి లోయ లన్నియుఁ దాటితోఁపులతో నిండియున్నవి. పొగాకును ఇచట బాగుగ పైరగుచుండును. మిడియాయందలి పర్వతములలో పూర్వము బంగారము దొరకుచుండెను. అసీరునందు కిరసనాయిల్ బావులు కలవు. పెక్కుచోట్ల రాతియుప్పు దొరకును. ఇటులే తూర్పునందలి ఉమ్మాన్ ప్రాంతమును మిక్కిలి సస్యవంతమైనది. ఇచట జబల్ అఖదర్ నామక శిఖరము కలదు. అల్ హాసాలోని సమ్మాన్ దదీబా లనుచోట్ల నున్న పురాతిగనులు కలవు. మఱియు నీప్రాంతము శీతోష్ణ జలకుండలములకును, పంటకాల్వలకును, చెట్లుచేమలకును ప్రసిద్ధికెక్కినది. ప్రపంచ మంతటిలో మేలైన ఖర్జూరము లిచట దొరకును. హొఫూఫ్, ముబారిజ్ లనునవి ఇందలి ముఖ్యపట్టణములు. ఇవిగాక కటీఫ్, ఉకేర్, కువైట్, కటర్, జబైల్ నామకనగరములును కలవు.

సిరియన్ ఎడారి లేక హమ్మాన్ (రాతియెడారి) అనుప్రదేశ మరేబియాఉత్తరభాగమున వ్యాపించియున్నది. ప్రకృతిసిద్ధముగ నిది అరేబియాకుఁ జెందినప్పటికిని రాజకీయముగ నిందలిచాలభాగము ఈరాక్, పాలెస్టయిన్, సిరియాలయందు కలుపఁబడినది. ఈ ప్రదేశమునకు పడమరగ ఫ్లింటురాలతో నిండిన నల్లనేలయెడారి కలదు. ఈయెడారినుండి ఈరాకువఱకును భూమి యేటవాలుగ నుండును. ఇందు వాడీ హౌరాన్ అను నది కలదు. ఇది జబల్ ద్రూజ్ ప్రాంతమున అజ్రాక్ దగ్గరి జలస్రోతములందుఁ బుట్టి దక్షిణపూర్వాభిముఖమై కాఫ్, ఇత్రీ లను ఉప్పుపండు నగరములమీఁదుగా జౌఫ్, సాకల్లన్ అను తరుస్థానములపర్యంతమును బోవును. కాఫ్, ఇత్రీలయొద్ద తాటితోఁపు లనేకములు గలవు. ఇచటఁ దయారగు ఉప్పు సిరియాదేశమునకుఁ బోవుచుండును.

అల్ నెజ్ద్ కు ఈశాన్యమునందు నఫూద్ పీఠభూమి వ్యాపించియున్నది. ఇది తూర్పునుండి పడమటికి ౪౦౦ల మైళ్లు. ఉత్తరమునుండి దక్షిణముగ ౨౦౦ల మైళ్లుండును. సముద్రతటమునుండి దీని యెత్తు 3,000ల యడుగులు. ఇచట నీటికి కఱవు. కాని చలికాలమున వర్షము కురియుటచే దేశమం దంతటను పశువులు మేయుటకనుకూలమగు పచ్చిగడ్డి మొలచును. దేశమందలి బదువీలు పశువుల మందలతో ఒంటెలతండములతో వచ్చి యిచ్చట మేపుకొనుచుందురు. మఱియు నీదేశమునందు ప్రచండవాయువులు వీచుచుండును. వీని వలన పెద్దపెద్ద యిసుకతిప్ప లేర్పడుచుండును. ఒక్కొక్కతిప్ప పొడుగు మనుజుఁ డొకదినమున నడవఁగలిగినంతదూర ముండును. ఈ తిప్పలమధ్య నేర్పడు లోయవంటిభాగమును దాఁటుటకు మూఁడు నాలుగుగంటలకాలము పట్టును. మఱికొన్నిచోట్ల నూతనచంద్రాకృతి నేర్పడుతిప్పలును గలవు.

sampath_Ebooks

అల్ నెజ్ద్, హాసా ప్రాంతములకు నడుమ దహానాయను ఇలాకా కలదు. దీనిపొడుగు ౪౦౦ ల మైళ్లు, వెడల్పు ౩౦ మైళ్లకు మించిలేదు. ఇందును ఇసుకతిప్ప లేర్పడుచుండును. వెండియు నిచటి యుత్తరభాగమున ౨౦౦, ౩౦౦ల యడుగులయెత్తుగల ఎఱ్ఱమట్టితిప్పలు కానవచ్చును. వీనిమీఁద పేరునకైన గడ్డి మొలవదు. దక్షిణమున కేఁగుకొలఁదియు నీతిప్పలు తగ్గుచుఁబోయి తుదకు సంపూర్ణముగఁ గానరాకుండఁబోవును. రియాద్ పట్టణమునుండి హాసాకుఁ బోవు రాజమార్గమునకు దక్షిణముగనున్న దహానాభాగ మింకను అజ్ఞాతదశయందే యున్నది. ఈ యిలాకాయందును నీటికిఁ గఱవే. ఇచటను శీతకాలపువానలచే మొలచుగడ్డిని మేపుకొనుటకై బదూవీ లేతెంచి నివసించుచుందురు.

అల్ నెజ్ద్ కు దక్షిణమున రుబ్ అల్ ఖలీ యను సెహారి ప్రాంతము కలదు. ఇది మున్న మొన్నటివఱకును నితాంత మజ్ఞాతముగ నుండెను కాని ఇటీవలజరగిన యన్వేషణములవలన ప్రాచీనకాలపు శిథిలావశేషములు కొన్ని యిచట వెలువడినవి. ఈ ప్రాంతవాసులకు అల్ ముర్రా లని పేరు. వీరు ఉమానీయా లనుపేరుగలఒంటెలఁబాలించి వానిపాలను ఉపయోగించుకొనుచుందురు. ఇందు జబ్రల్ అనునది ముఖ్యపట్టణము.

అరేబియాయొక్క నట్టనడుమనున్న దేశము అల్ నెజ్ద్. సంకరములేని అసలైన అరబ్ జాతివారి కిదియే జన్మస్థానము. ఈ యిలాకాయందు మూఁడు గొప్పవాడీలు కలవు. అరేబియా దేశమున సముద్రగామిను లగునదులు లేవని యింతకుఁ బూర్వమే వ్రాయఁబడినది. వర్షాకాలమునమాత్రము ప్రవహించి యేయిసుక యెడారులందో కానరాకుండఁబోవు కొండలోయలకారణమున నేర్పడిన నదు లనేకములు కలవు. ఇవి ఇచట వాడీలని పిలువఁబడుచుండును. అల్ నెజ్ద్ యొక్క యుత్తరభాగమున రీమా నామకవాడీ కలదు. ఇది హర్రా ఖైబరుకొండలందుఁబుట్టి కాసింజిల్లా నడిమివఱకు వచ్చును. అచ్చట భ్రష్టండములను నిసుకతిప్పలం దంతర్ధానమై మరల కొన్ని మైళ్ల తరువాత వెలువడి అల్ బతీన్ అనుపేరుతో జొబైర్ వఱకును బోవును. రెండవది వాడీ సిర్రా. ఇది నెజ్ద్ పడమరగ నున్న పీఠభూములందు జనించి కొంత దూరము ప్రవహించినపిదప షా-ఇబ్-బర్క్ అను పేరుతో జబల్ టువైక్ కొండలగుండా ప్రవహించి యమామా అను చోట వాడీ హనీఫాతోఁ గలయును. అచటనుండి హాసాగుండా వాడీసహాబా యనుపేరుతోఁ జని అల్ కటర్ వద్ద పర్షియాసింధుశాఖయందు పడును. మూఁడవది వాడీదవాసీర్. ఇది యమన్, అసీరు ప్రాంతములనుండి వచ్చు రన్యా, బిషా, టథ్ లిథులను వాడీల కలయికవలన నేర్పడినది. ఇది సులాఈల్ దేశముగుండా ప్రవహించి రుబ్ అల్ ఖలీయందలి యిసుకయెడారులలో నంతర్ధానమగును. ఈ మూఁడు వాడీలయందుమాత్రము ప్రతిసంవత్సరము క్రమము తప్పక సరియగుకాలమునఁ బ్రవాహము వచ్చుచుండును.

ఈవాడీల జన్మస్థానములగు హర్రాఖైబర్ మున్నగుపర్వతములే కాక హాథ్ బ దవాసీర్, దుఫ్, అర్ధ్ నామకపర్వతములును అరేబియాపశ్చిమమందే కలవు. ఇవి ౫, ౬ వేల యడుగులయెత్తు కలిగి యుండినప్పటికిని నడుమ కనుమదారు లుండుటచే నిటు నటు రాకపోకలఁ గావింప యోగ్యములై యున్నవి. మిక్కిలి యుత్తరమున నున్న జబల్ షమ్మార్ ప్రాంతమును ఒకయెత్తయిన పీఠభూమి. ఇందు జబల్ అజా, జబల్ సల్మా లను సమానాంతరముగ నుండు రెండు కొండలవరుసలు కలవు. హెయిల్ లోనగు పట్టణములు కొన్ని ఈకొండలనుండి వచ్చువాడీలమీఁదనే యాధారపడియుండును. పర్వత ప్రాంతములను వదలినచో తక్కిన షమ్మార్ ఇలాకా యంతయు వ్యవసాయానుకూలము. వాడీరీమాపాఱుదల కల కాసింజిల్లాయందు అనైజా, బురైదా నామకపట్టణములు రెండును తరుస్థానములమీఁదఁ గట్టఁబడినవి. ఈ జిల్లాకు దక్షిణమున నున్న ఖార్జ్ అను మఱియొక జిల్లాయందు అగాధములగు మడుగులు కలవు. వీనియందలి నీరు చాల దూరమువఱకును బ్రవహించి జనోపయోగ మగుచుండును. ఇచట ప్రాచీనకాలమున పర్షియనులు గట్టించిన నీటికట్టడముల శిథిలావశేషము లిప్పటికిని ఈవిషయమున అనాఁటివారికిఁగల శ్రద్ధాసైపుణ్యములను వెలిపఱుచుచున్నవి. ఇంకను దక్షిణమున ఫరా నామకజిల్లా కలదు. హవాటా, హరిక్ పట్టణము లిచటి ముఖ్యనగరములు. ఈ జిల్లాకు పశ్చిమమున అఫ్లాజ్ ప్రాంత మున్నది. ఇందు అరేబియా దేశమునం దంతటికిని విశాలమగు ఉమ్మాల్ జబల్ నామకతటాకము కలదు. దీని యాధారమునఁ జాలదూరమువఱకును నేల సాగుబడి యగుచుండును.

భూగర్భము :— మధ్య అరేబియాభూగర్భమునకును ఈజిప్టు భూగర్భమునకును సామ్యము కలదు. చాలలోఁతున నడుమనడుమ తొఱ్ఱలు కల నల్లరాలును, వానిపై నిసుకరాతిపొరలును గానవచ్చును. ఈయిసుకరాతిపొరలు జౌఫ్ వద్ద భూమ్యుపరిభాగమునకు వచ్చి హెజాజునందలి రైలుమార్గమువెంటవెంట దక్షిణముగఁ గొంతదూరము వఱకును బోయినవి. జౌఫ్ నుండి తూర్పుగఁ బోయినచో నిసుకరాలమీఁదను కంకరరాలు కప్పుకొని యుండుట కానవగును. సున్నపురాతిపొరలు వాడీసిరాయందును, ఈరాక్ సరిహద్దులయందును, జారాసియంపొరలు జబల్ తువైక్ కొండలవరుసలందును గలవు. ఇసుకరాలమీఁదను నల్లరాతిచట్టులమీఁదను జ్వాలాముఖిపర్వతవినిర్గత ద్రవద్రవ్యజాల మంతయు కరుడుగట్టి శిలారూపముగ మాఱియున్నది. హర్రాకొండ లీప్రకార మేర్పడినవే. ౧౨౫౬-వ సంవత్సరమున నొక జ్వాలాముఖి పగిలియుండెను. అగ్నిపర్వతముల కాంతవివృతవదనములును పెక్కులు కలవు. ఏడెనుదగ్గర నొక అగ్నిపర్వతమట్టిది కలదు. బేబిల్ మాండబ్ జలసంధియొద్దను నిప్పుకొండలరాలు కానవచ్చును. అరేబియాదక్షిణమునను, ఉమ్మానునందును నేల పలుగురాలమయము. కాని సున్నపురాయియు నమితముగఁ గలదు. ఇదికాక ఇనుము, రాగి, సీసము, బొగ్గు, పచ్చలు లోనగువాని నిచటిభూగర్భమునుండి పడయవచ్చును. పర్షియన్ సింధుశాఖయందలి బహరన్ దీవిదగ్గర ముత్యములు దొరకును. బహరన్ దీవియం దిటీవలనే పెట్రోలియము నూనెబావులు క్రొత్తగా బయలుపడినవి.

sampath_Ebooks

**కాలమానము, శీతోష్ణస్థితి :—** అరేబియా దేశమునందలి యుష్ణమత్యధికము. ఎడారులందు శీతలప్రదేశము లనఁబరఁగువానియందును ఉష్ణము రాత్రికాలములందు ౧౦౦° కాని లేక అంత కెక్కువ కాని యుండును. పగటిపూఁట ప్రాతఃకాలమున ౧౦౮ అంశములతో నారంభమై క్రమముగ ౧౧౦° ను మించిపోవును. అల్ నెజ్‌డ్ నందలి మధ్యమాత్యుష్ణము ౧౧౨ అంశములకు సాధారణముగ మించదు. ఉత్తరప్రాంతమున మంచువానలు కురియుట కలదు. అందుచే నచటి యుష్ణము ఒక్కొక్కసమయమున ౧౫° ల వఱకును దిగును. పశ్చిమ అరేబియాపీఠభూములందును, పర్వతములమీఁదను, ఉమ్మాన్ ఇలాకాయందును కాల మతిమనోహరముగను, సౌఖ్యదాయకముగను ఉండును. శోణసముద్రతీరపు మిడియాదేశమునఁ జలికాలమునఁ జలి యపరిమితముగ నుండును. యమన్, ఉమ్మాన్ ప్రాంతములందుఁ దక్క తక్కిన చోట్ల వానలు సరిగ కురియవు. ఒకవేళ కురిసినప్పటికిని పైరులు మున్నగువానికి సరిపోవు. కాని వసంతమాసమునందు తరుస్థానములను మాత్రము వికసింపఁజేయఁ జాలువర్షము కురియుచునే యుండును. హెజాజ్ పర్వతములందు వర్షము మిక్కుటము. అరేబియా యుత్తరప్రాంతమున తూర్పునుండియు, పడమటనుండియు వాయువులు వీచుచుండును. ఇందు పశ్చిమవాయువులు మధ్యధరాసముద్రమునుండి పాలస్టయినుమీఁదుగ వచ్చువర్షమును సూచించును. తక్కినదేశమందంతట వీచు ఉత్తర, దక్షిణవాయువులలో దక్షిణపుగాలి శీతకాలమునందైనచో వర్షమును, అన్యకాలములందు వేఁడిమిని సూచించును.

ఇదికాక సైమూన్ లేక సామియేల్ అనఁబడు విషవాయువు ఉత్తరప్రాంతములం దప్పుడప్పుడు వీచుచుండును. ఈ వాయువేగము వలన నెడారులందలి యిసుక పైకిలేచి మేఘములవలె క్రమ్ముకొనిపోవును. ఆసమయమున ప్రయాణము సలుపుచుండు ప్రాణులకు జీవములు నిలుచుట దుష్కరము. దీని దుష్పరిణామములనుండి తప్పించుకొనుటకు బాటసారులు గాలి యారంభమైన వెంటనే నేలమీఁదను బోరగిల పరుండెదరు. పశువులు ముఖముల నిసుకలోఁ బెట్టుకొని గాలి యడఁగువఱకు నటులే పడియుండును. వాయువు నిలిచిన పిదప మెల్లఁగ లేచి ప్రయాణముల సాగించుకొనవలసియుండును.

**జంతువులు, వనస్పతులు :—** ఆఫ్రికాఖండమునందలి జంతువులే ఇచటను గానవచ్చును. ఇవి యెడారులందు నివసించుటకలవాటుపడినవి. ఆఫ్రికావైపున శోణసాగరతీరమున మిక్కిలిగఁ గన్పించు దుష్టజాతులం దొకటి ఇచటను గలదు. అరబ్బులు దీనిని ఒకప్రకారము అడవియావుగఁ దలపోయుదురు. యమన్, హెజాజ్ పర్వతములం దొకవిధము అడవిగొఱ్ఱె కలదు. కోఁతు లిచట నపరిమితము. వానియం దనేకజాతులును గలవు. తోఁడేళ్లు, సివంగులు, చిఱుతపులులు చాలఁ గలవు. పర్వతమయ ప్రదేశములందు జంగుబిల్లు లెక్కువ. పక్షులం దన్నిటికంటెను పెద్దది నిప్పుకోడి. అడవికోళ్లు, పావురాలు, కౌజులు, గద్దలు, ఉల్లంకిపిట్టలు విస్తారముగఁ గలవు. ఎడారులందు మఱికొన్ని విశేషపక్షులు కన్పడుచున్నవి. తేళ్లు, జెఱ్ఱులు, రోకటిబండలు నత్యంతము. పైరుల ధ్వంసముచేయు మిడుతదండము లగణితములు. బదువీలు వీనిని ఆహారపదార్థముగ నుపయోగించుకొనుటకుఁ బట్టుకొని ధాన్యపుకోష్ఠములను నింపుకొనుచుందురు. హెజాజునందు తేనెటీఁగలు పాలింపఁబడుచున్నవి. ఒంటెలు, గుఱ్ఱములు, గొఱ్ఱెలు, మేఁకలు ముఖ్యములైన గృహ్యజంతువులు. కొలఁదిమాత్రముగ గోవులును గలవు. ఒంటెలవ్యాపార మిచట నెక్కువగ జరుగుచుండును. దీని నిచట నెడారియోడ యని పిలుచుచుందురు. ఇది దినమున కిరువదియైదు మైళ్లచొప్పునఁ బ్రయాణముసలుపుచు మూఁడుదినములపర్యంతము నీరు త్రాగకుండ నుండఁగలదు. చలికాల మైనచో ఒక్కనెలవఱకును నీరు త్రావ దని చెప్పుదురు. ప్రాచీనకాలమున గుఱ్ఱముల కిచట మంచిపే రుండెను. కాని ప్రస్తుతము వీనివ్యాపారము చాలవఱకు క్షీణించిపోయినది. కొలఁదిమాత్రముగ నిప్పటికిని అస్సైజా, కాశిం ప్రాంతములనుండి ఇండియాతో గుఱ్ఱములవ్యాపారము జరుగుచున్నది. హాసాప్రాంతమున తెల్లనిగాడిదలు కలవు. ఇవియు ఒంటెలవలె దాహము నోర్చుకొని యెడారులందు ప్రయాణము సలుపఁగలుగును. ఇచటిమేఁకలు, గొఱ్ఱెలు ఊనికొఱకు పనికిరావు. వీనివలన లభించు చర్మములును నేయియు పరదేశములకుఁ బోవుచుండును. బదువీల గుడారముల కుపయోగపడు ఒకవిధమగు మోటురకపువస్త్రములు గొఱ్ఱెవెండ్రుకలతోడను, టోపీలు మున్నగునవి ఒంటెవెండ్రుకలతోడను నిర్మింపఁబడుచుండును.

అరేబియాయందలి వృక్షజాతు లాఫ్రికాఖండమునందలి వానిం బోలియుండును కాని పశ్చిమాసియాఖండపువానిం గాదు. పీఠభూములందు చింత, అంజూరచెట్లు గలవు. అగరుచెట్లు చాలచోట్లఁ గానవచ్చును. మిడియాదేశమునం దనేకములగు ఫలవృక్షములజాతులు కలవు. ఈఁతచెట్లకు లెక్కలేదు. వీనిని పాలములకు కంచెలుగ నుపయోగపడులాగునఁగూడఁ బెంచుచుందురు. ద్రాక్షలు, ఖర్జూరములు, అక్రోటులు, పనసలు బాగుగ ఫలించును. సారవంతము లగు భూములందు జొన్నలు, గోదుమలు, యవలు, నీలి, ప్రత్తి, చెఱకు మున్నగునవి పండును. ముల్లంగి, దోస, గుమ్మడి మొదలుగాఁగల శాకములును పైరగును. టెయిఫ్ సమీపమునను, కొండలమీఁదను గులాబీలును మఱికొన్ని సుగంధద్రవ్యములును ఉత్పత్తి యగును. కాఫీ పుష్కలము. బెర్రీలను చిన్నపండ్ల నెండించి విదేశముల కంపుటయ కాక వానితొక్కల నూర్చి వానితో మధుద్రవమును చేయుచుందురు. ఈ ఫలములే కాదు; పానీయములను తయారు చేయ మఱికొన్ని మూలికలు, వనస్పతులును కలవు. హద్రామాత్ నందు పొగాకు విస్తారముగఁ బెరుఁగును. మారేళ్లు మొదలగు వృక్షములు కొన్ని జిగురులను దయారు చేయుట కుపయోగింపఁబడుచున్నవి. ఈ దేశమందు పెద్దపెద్దయడవులు లేవు.

**జనులు, జాతులు, మతములు :—** ఈ దేశమునఁ బ్రధానమైనది అరబ్బిజాతి. వీ రంత పొడుగుగఁ గాని పొట్టిగఁగాని యుండక మధ్యమ

sampath_Ebooks

దశయం దుందురు. మంచి పుష్టియు కండబలమును గలవారు. మొగము గోదుమరంగు కలిగియుండును. మంచి చురుకుదనము, స్వతంత్ర స్వభావము కలవారు. ధైర్యము, మితవ్యయము, విశ్వాసము, అతిథి సన్మానము వీరియందలి సుగుణములు. కాని వీరిపగమాత్రము పాముపగ. పగవానిని బాధింప నెట్టిదుష్కార్యము నైనఁ జేయుటకు వెనుకరు. స్త్రీలు గృహకార్యనిర్వహణమున సామర్థ్యము గలిగియుందురు.

ప్రస్తుత మీ దేశమందలి జనసంఖ్య ౭౦,౦౦,౦౦౦లు. వీరిలో ౩౦ లక్షలు అసీరు, యమను ప్రాంతములందును, ౧౦ లక్షలు హెజాజు నందును, ౧౦ లక్షలు ఉమ్మాన్, హద్రామాతులందును, ౨౦ లక్షలు అల్ నెజ్ద్, హాసా, డెజర్టా లను ఇలాకాలయందును గలరు. ప్రాచీన కాలమున నెడారులం దెవరు నివసించుచుండినదియు, వారెచ్చటనుండి వచ్చినదియు నెవరికిని దెలియదు. ప్రస్తుత ముత్తర ప్రాంతములందు అనైజా లని పిలువఁబడువారు యమనునుండి వచ్చియుందు రని యూహింపఁబడినది. అరబీగాథల ననుసరించి వీరు కహటానులనియు, ఇస్మాయేలు లనియు రెండు తెగలు. ఇందు కహటాను లనువారు షాం సంతతివా రనియు, సాంకర్యములేని యుత్తమజాతివా రనియు అరబ్బుల యభిప్రాయము. షామ్‌వంశీయుఁ డగు కహటానువలన నుత్పత్తియైనందున కహటాను లను పేరు వీరికిఁ గలిగెను. ఇస్మాయేలువలన వచ్చినవారు ముస్తర్బ లని పిలువఁబడుచుండిరి. ఈ రెండు తెగలును సెమిటిక్ జాతికిఁ జెందినవియే. వీరుకాక ఆఫ్రికానుండి క్రమముగా వచ్చి అరబ్బులలో లీనమైపోయిన నీగ్రోలు కలరు. వీ రిపుడు జబల్ షమ్మార్, ఖైబర్ హర్రా ప్రాంతములు మొదలుకొని వాడీ దవాసిర్ వఱకునుగల ఇలాకాయందు గానవచ్చుచుందురు. వీరు బానీ ఖదీరు లని పిలువఁబడుచుందురు. పూర్వభాగములందు సులాబా లను వేఱొకజాతివారు కలరు. వీరు క్రైస్తవు లని వాడుక. తక్కిన తెగలవా రందఱును వీరి నింటుక నీచముగఁ జూచుచుందురు. కాని వీరు మంచిపనివాండ్రు. వేఁటాడుటయందు వీరి కెక్కువ నేర్పరితనము కలదు. స్వదేశమున వీరు చేయుపనుల నన్నింటిని పశ్చిమప్రాంతమున యూదులు సలుపుచుందురు. ఇస్లాందీక్షను గైకొనని ముస్తరబాజాతి వారే ఈయూదు లని ప్రసిద్ధి కలదు. వీరు సానానగరసమీపమునం దెక్కువగ నుందురు. ఈసమస్తయరబ్బువాసు లందఱిలో హాడేసీ (స్థిరవాసు) లనియు, బదువీ (సంచారు) లనియు రెండు భేదములు కలవు. అరేబియారాజకుటుంబములకుఁ జెందినవా రందఱును అనాజా వంశీయులు. ఇప్పు డరేబియాను బాలించు ఇబ్న్ సౌదును ఈ వంశ జుఁడే. మహమ్మద్ ప్రవక్తయొక్క దేహసంబంధు లందఱును పశ్చిమ అరేబియాయందు నివసించుచుందురు. అందు అష్రాఫ్‌కులజులు ప్రముఖులు. యమన్, హద్రామాత్, ఉమ్మాన్ ప్రాంతములం దీమహమ్మదు బంధువు లిమాము లనుపేర నధికారముల సలుపుచువచ్చిరి. కాని వహాబీ లిపుడు వీరి యధికారమును నాశనము గావించిరి.

పరిశ్రమ, వ్యాపారములు, రాకపోకలమార్గములు:— ఈదేశము పరిశ్రమాభివృద్ధి కనుకూలమైనదికాదు. ప్రాచీనకాలమున అరబ్బులు సకలవ్యాపారములందును ఆరితేరియుండిరి కాని ప్రస్తుతము వీరును గాఢమగు అజ్ఞానాంధకారమునందే మునిఁగియున్నారు. తూర్పున హిందూదేశమును, పడమట ఈజిప్టులోనగుదేశములను ఔన్నత్యము నందియుండ మధ్యభాగమం దుండుటచే అరేబియాదేశమును మంచి దశ నందఁగలిగెను. బంగారము, సుగంధద్రవ్యములు ఇండియానుండి యీదేశముగుండా ఈజిప్టునకుఁ బోవుచుండెడివి. క్రీ. పూ. ౨,౬౦౦ ల ప్రాంతమున నిర్మింపఁబడిన లగ్గాస్ మందిరమునకు కలప మున్నగునవి ఈ దేశముననుండియే పోయినవి ; కాని ఇండియానుండి మిశ్రదేశమునకు వేఱొకమార్గ ముత్తరమునఁ గనిపట్టఁబడుటచే అరేబియా ప్రతిభ తగ్గిపోయెను. ఇందువలన వ్యాపారము మొదలంట నడుగంటుటచే ఆర్థికదశ బొత్తిగ క్షీణించిపోయెను.

ఇచట ప్రాచీనకాలపువ్యాపారమార్గములు తప్ప ఈకాలమున రాకపోకల కనుకూలములను గట్టిగా డ్లెవ్వియు లేవు. ఇటీవల డమాస్కస్ పట్టణముననుండి మదీనావఱకు నొకరైలుమార్గ మేర్పడినది. మక్కావఱకును దీనిని బెంపొందింప నాలోచనలు జరుగుచున్నవి. జర్మనీయుద్ధకాలమున ఏడెనునుండి లహేజ్ వఱకును రైలుమార్గ మొకటి నిర్మింపఁబడినది. మక్కా, జిడ్డానగరములమధ్య టెలిగ్రాఫ్, టెలిఫోనులుఁ గలవు. వీనికిని మదీనానగరమునకును క్రమముగ మోటారు రాకపోకలు కలవు. మదీనా యంబోపట్టణములమధ్యను రోడ్డు వేయఁబడుచున్నది. హెజాజ్ నుండి అల్ నెజ్ద్ ప్రాంతపు రాజధానియగు రియాద్ పట్టణమువఱకును మోటారులు నడచుటకనుకూలమగుమార్గము కలదు. సూయజ్ నగరముననుండి ఏడెన్ పట్టణమువఱకును క్రమము తప్పక నౌకలు నడచుచుండును. మక్కాయాత్రకాలమున చుట్టుప్రక్కలదేశములనుండి యాత్రికులు వేనవేలుగ వచ్చుచుందురు.

అరబీభాష :— అరబీ క్లాసికల్ భాషలలో నొకటి. హిందువులకు సంస్కృతమువలె ముసల్మానుల కిది పవిత్రమైనది. తక్కిన క్లాసికల్ భాషలందువలె నిందును కావ్య, వ్యాకరణ, గణిత, దర్శన గ్రంథములు కొంతవఱకు పరిపక్వదశను బొందినవి. ప్రస్తుతపుచరిత్రకారులయభిప్రాయము ననుసరించి ఈ వాఙ్మయాభివృద్ధి యంతయు మహమ్మదీయమత మున్నతదశయం దుండినసమయమందే కలిగినది. మహమ్మద్ జన్మించుటకుఁ బూర్వమందును విఖ్యాతులగు కవు లుండినట్లు ఇటీవల వెలువడిన యనేకనిదర్శనములవలన స్పష్టమగుచున్నది. ప్రాచీనులకవిత్వమును హృదయంగమమై మార్గదర్శకమైయుండెను. ఖలీల్ ఇబ్న్ అహమద్ అనునతఁడు ప్రాచీనులం దొకఁడు. ఇతఁడు బదువీలభాషలో కావ్యలక్షణాత్మక మగు గ్రంథము నొకదానిని రచించెను. కాలాంతరమున ఖురాన్ షరీఫ్ నందును ఈ భాషయే యుపయోగింపఁబడినందున నిది ప్రాధాన్యము వహించి అనంతరము వారికి ప్రమాణ మగు భాషగ పరిణమించెను.

మహమ్మదునకుఁ బూర్వ ముండినగ్రంథకారులు సాధారణముగా దేశమందలి భిన్నభిన్నజాతులవారిలో సంభవించు పరస్పర

sampath_Ebooks



కలహములనో లేక వీరులచరిత్రమునో లేక స్త్రీసౌందర్యమునో కైకొని వ్రాయుచువచ్చిరి. కొంతకాల మివి మౌఖికముగనే దేశ మంతట వ్యాపించుచుండెను. వీనిని వల్లించి జనులకు వినుపించు వారు రావీ లని పిలువఁబడుచుండిరి. కాలక్రమమున రావీలం దవినీతి జనింపఁగా, తత్ఫలితముగ గ్రంథములందు ప్రక్షిప్తములు చేరుటచే వ్రాతప్రసరణ మాఁగిపోయి లిఖితరూప మేర్పడెను. ఈప్రకారము లిఖితములై సంగృహీతము లైనగ్రంథములు దీవాను లనియు ముఅల్లకా లనియు ప్రసిద్ధి కెక్కెను. ఈ రెండువిధములగు రచనములను బఠికించుటవలన అమరుల్ కైస్, తరిఫా, జుహైర్, నాభిఘా, అల్కమా, అషా, లబీద్, అంతారా ఇబ్న్ సద్దాద్, అమ్రు ఇబ్న్ కుల్థూమ్, హారిథ్, ఇబ్న్ హిల్లిజా, అబిద్ ఇబ్న్ అబ్రష్ మున్నగు కవిపుంగవు లనేకులు పూర్వకాలమున నుండి రని విస్పష్టమగు చున్నది. ఈదీవానులవంటివి మహమ్మద్ సమకాలమున సమకూర్పఁబడినవియు కలవు. హసన్ ఇబ్న్ తాబిత్, కాబ్ బిన్ జుహేర్ అప్పటి వారిలో ప్రముఖులు.

ఇది యటులుండ మక్కా, బఖ్ నగరములందు గొప్పగొప్ప కవిసమ్మేళనము లగుచుండెడివి. అందు కవులు పోటీలు వైచికొని పద్య వృష్టిని గురియుచుండిరి. వానియం దుత్తమ మగుకవితను స్వర్ణాక్షరము లలో రాగిరేకులమీఁద చెక్కి మక్కాలోని కాబా యను-కోట శ్రేలాడఁదీయుచువచ్చిరి. మహమ్మదు జనించినతరువాత నిట్టిరేకు లెన్ని లక్షలు ధ్వంసము లైయుండెనో తెలియదు. కాని యావిలయమునుండి తప్పి బయటఁ బడినవియు కొన్ని గలవు. ఇవియే మహమ్మద్ పూర్వకాలపు అరేబియాచరిత్రమున కాధారములు. వీనివలనను, ముఅల్లకాలవలనను మహమ్మదునకు పూర్వపు అరబ్బులయాచారవ్యవహారములను తెలిసికొనవచ్చును.

మహమ్మద్ ప్రవక్త జనించినతరువాత నొకశతాబ్ది కడచునప్పటికి ఇస్లాముమత మమితముగ వ్యాప్తిని బొందెను. ఈజిప్టునం దుండి హిందూస్తానమువఱకును, పోర్చుగల్ నుండి సమర్కండ్ వఱకును గల భూభాగమంతయు ఇస్లాముమతముతో నిండిపోయెను. ఈకారణమున అరేబియాయందలి యాచారవ్యవహారములందును, రీతి నీతులందును పరివర్తనము గలిగెను. అరంభకాలమున మతవ్యాపనమే వీరిముఖ్యోద్దేశ మైయుండినందున విద్యావిషయిక మైనశ్రద్ధ లేదయ్యెను. అయి నప్పటికిని హిజ్రీ ప్రథమశతాబ్ది పూర్తియగునప్పటికి కవులు కొందఱు పైకి వచ్చిరి. వారిలో అఖ్తల్, ఫరజ్ దక్, జరీర్, ధూర్ రమ్మాక అనువారు ముఖ్యులు.

అబ్బాసీవంశపు ఖలీఫాలకాలమున అరబీ భాషాభివృద్ధియు, శాస్త్రాభివృద్ధియు నారంభమై వారిపరిపాలన మంత మందుసరికి నవియు నంత మందినవి. అల్మన్సూర్, హారూనుల్ రషీద్ నామక ఖలీఫాలు వాఙ్మయకళలను బోషించిరి. వారు దూరదూరదేశములనుండి విద్వాంసులను రావించి వారిచేత గ్రీకు, పురాతన పర్షియన్, సిరియన్ భాషలయందలి యుచ్ఛగ్రంథములను అనువాదము చేయించిరి. అల్ మామూన్ నామక ఖలీఫాతనకు విజ్ఞానము గఱపుటకై లియోనామక తత్త్వజ్ఞుని దనయొద్ద కొంతకాలము నిలుపుకొనుటకు ప్రతిఫలముగ గ్రీకుచక్రవర్తికి ౫ టన్నుల బంగారము నొసంగుటయే కాక అతనితో నెల్లకాలము స్నేహభావము గలిగియుందు నని సంధిపత్రము వ్రాసి యిచ్చెను. ఇతని రాజ్యకాలముననే బాగ్దాద్, బస్రా, కూఫా, బొఖారా మొదలగు పట్టణములందు ఉత్తమ విద్యాలయము లేర్పడినవి. అలెగ్జాండ్రా, కైయిరో, బాగ్దాదులందు మంచి గ్రంథాలయములు స్థాపితము లయ్యెను. ౧౦-వ శతాబ్దియం దరబ్బులు ప్రపంచమం దంతట జ్ఞానప్రసారకు లను పేరు గాంచిరి. యూరపునం దపు డంధకారమే వ్యాపించియుండెను. ఇటలీదేశమున మహావిద్వాంసుఁ డని ప్రసిద్ధికెక్కిన పోపు రెండవసిల్వెస్టర్ కార్డోవా యందలి అరబ్బులవలన విద్య గ్రహించెను. ఫ్రాన్సునుండియు, యూరపులోని ఇతరరాజ్యములనుండియు విద్యార్థులు స్పెయిన్ దేశమునకుఁ బోయి అరబ్బులయొద్ద గణిత, వైద్యశాస్త్రముల నభ్యసింపుచు వచ్చిరి. స్పెయిను దేశపుపాలకుఁ డగు రెండవహాకింయొక్క గ్రంథాలయమునం దాఱు లక్షలకంటె నెక్కువగ్రంథసంపుటము లుండెను. మఱియు వీరికి శాస్త్రవిషయకవిద్యయం దభిమాన మెక్కువగ నుండెను. అల్ కొహాల్, అల్ జెబ్రా, అజీముత్, జెనిత్ లోనగు అరబీశబ్దము లెన్నియో పాశ్చాత్యభాషలయందుఁ జూటి యూరపు వైజ్ఞానిక భాషా రచనకుఁ దోడ్పడెను.

వీరియందలి చరిత్రరచన మూఁడువిధములు. ఏదేని యొక విషయమునుగూర్చి వ్రాయవలసివచ్చినయెడల దానిని ప్రత్యక్షముగఁ జూచిన వానియొక్కయో లేక తత్సమకాలికునియొక్కయో వాక్యము లందే వ్రాయఁబడుచుండెను. ఇది యొకవిధమగు రచనము. వేలు వేలుగాథలు ఉన్నవి ఉన్నట్లు శృంఖలాబద్ధములుగఁ గూర్పఁబడును. ఇది రెండవప్రకార మగు రచనము. మూఁడవది సాధారణముగఁ జరిత్రకారు లందఱు నవలంబించుపద్ధతియే. మహమ్మదుతరువాతను స్వల్పకాలముననె ప్రపంచమందలి సగముభాగ మరబ్బులయధీనమునకు వచ్చుటచేత చరిత్రనిర్మాణమునకుఁ గావలసినంత సామగ్రి లభించెను. కాని హిజ్రీ రెండవశతాబ్దినుండి యసలైన చరిత్రరచన మారంభ మయ్యె నని చెప్పవచ్చును. వ్రాతరూపమున దొరకినకథలు, పురాతన విద్వాంసులకథనములు, ప్రమాణపత్రములు, సంధిపత్రములు, కావ్య సంగ్రహములు, వంశవృక్షములు మొదలగువాని యాధారమున చరిత్ర రచనము కావింపఁబడెను.

మహమ్మదీయవిజయము లని వాకిడీ యనునతఁడు వ్రాసిన గ్రంథము కొంతవఱకుఁ గల్పితమును, అలంకారయుక్తమును నై యుండినప్పటికిని ఇందు చరిత్ర కుపయోగించు సామగ్రియుఁ బుష్కలముగఁ గలదు. అబూమిఖ్నాఫ్, మదాలీ లనువారు నిష్పక్షపాత మగునితిహాసమును లిఖించిరి. ఉబైదా, అజ్రకీ లనువారు వ్రాసిన మక్కాచరిత్రము మిగుల మూల్యమైనది. రెండవ శతాబ్దియం

sampath_Ebooks

దరేబియాచరిత్రరచనయందు పర్షియనులుకూడ శ్రద్ధ వహించిరి. ఇబ్న్ ముకప్ఫా యనునతఁడు పర్షియన్ రాజు లను గ్రంథమును అరబీలోనికి మార్చెను. తొమ్మిదవశతాబ్దియందు యకూబీ, ఇబ్న్ కుతైబా లనువారు చరిత్రలేఖనమునఁ బ్రసిద్ధి గాంచిరి. తరువాత బలాధురీ యనునతఁ డరబ్ విజయమును రచించెను. వీరందఱికిమ్మిటను తబారీ యనునతఁడు వ్రాసినయితిహాసము నేఁటివఱకును ప్రమాణగ్రంథ మై యొప్పుచున్నది. ఇతనియనంతర మెందఱో చరిత్రల వ్రాసిరి కాని వారిలో మసూదీ, బిరూనీ, ఇబ్న్ అథీర్, అబుల్ ఫరజ్, ఇబ్న్ ఖల్-దూన్, మక్రిజే, సుయూతీ, మక్కరీ, హాజీ ఖలీఫా లనువారు ముఖ్యులు. హిలాల్ అస్సాబీనామకలేఖకుఁడు వజీరు లను పేరను చరిత్రాత్మక మైన గ్రంథమును వ్రాసెను. దీనినుండి ౯, ౧౦-వ శతాబ్దులలోని యరబ్బులసాంఘికవిషయములు దెలియును. ఉత్బీ యను నతఁడు మహమ్మదుచరిత్రమును వ్రాసెను. ఇది యొక కావ్యమును బోలియుండును.

అరబ్బీభాషయందు జీవనచరిత్రాత్మకము లైన కోశగ్రంథములు కొన్ని గలవు. వీనివలన విద్వాంసులయొక్కయు, వైద్యులయొక్కయు, వైయాకరణులయొక్కయు జీవితములు లోకమునకు వెల్లడి యగుటయేకాక అరేబియాదేశ మనేకపర్యాయములు నాశనోన్ముఖము కాఁగా, నీ మహామహు లందఱు నాయాసమయములం దేవిధమున దానిని రక్షించినదియు విశద మగును.

మహమ్మదుపైగంబరు నెడలఁ గల భక్తివిశ్వాసముల కారణమున అబీద్ ఇబ్న్ షర్యా వ్రాసినగాథ లన్నియు నితిహాసములలోని కెక్కి సత్యవృత్తాంతములుగఁ బరిణమించెను. అలీ విషయమునను ఇటులే జరగినది. వీని యాధారమున కట్టుకథ లెన్నియో బయలువెడలినవి. ఈ వ్రాఁతల నన్నింటిని ప్రమాణములుగఁ గైకొని రచించిన దగుటచే ఇబ్న్ అబ్దుల్ హాకింయొక్క 'ఈజిప్టు-పశ్చిమవిజయము' అను గ్రంథమున సత్యాసత్యము లన్నియుఁ గలసిపోయినవి. హసేన్ మరణము, సిరియావిజయము లను గ్రంథము లిట్టివే. వీనిలో కొన్ని కేవలము క్రైస్తవులమీఁద దండెత్తు నిమిత్తము ముసల్మానులను ప్రేరేపించుటకై వ్రాయఁబడినవి కలవు. అంతార్ కథ, బనీహిలార్ కథలు మొదలగున విట్టివే.

అరబ్బుల భూగోళశాస్త్రమునకు మూలాధారము గ్రీకుల గణితభూగోళము. అది యటులుండ మొదలుమొదలు అరేబియాయందలి వేర్వేఱు ప్రాంతములకుఁ బోవురాజమార్గముల వివరించు గ్రంథ మొకటి వ్రాయఁబడినది. దీని యాధారమున క్రమముగ భూగోళశాస్త్రము విస్తరిల్లుచుఁ బోయెను. అనంతరము యాత్రికులు ప్రయాణముల సలుపుచు వారియనుభవములను గ్రంథస్థము చేయుచుఁబోయిరి. ఈ యాత్రావృత్తాంతములను మఱికొన్ని వాగ్రూపక కథలను ఆధారములుగఁ జేసికొని అల్ ఇద్రిసీ, బక్ర్, యాకూత్ మొదలగు లేఖకులు విస్తృతరూపమున యాత్రాచరిత్రలను లిఖించిరి. ౧౪-వ శతాబ్దియందు ఇబ్న్ బతూతా ప్రసిద్ధిగాంచిన యాత్రికుఁడు. కాలక్రమమున నీశాస్త్రము విశ్వవివరణగ్రంథము (Cosmography) గఁ బరిణమించెను. కజవీనీ, దిమిష్కీ నామకులు వ్రాసిన విశ్వవివరణములు పఠనయోగ్యములు. అటుపిమ్మట నీదేశముయొక్క ఆర్థికస్థితి పాడగుటచేతను క్రమముగ భూగోళశాస్త్రవిచారమే యడుగంటిపోయినది.

అరబీవ్యాకరణము మొట్టమొదట ఈరాకునం దభివృద్ధి నొందెనని చెప్పవచ్చును. ఇచట బస్రా, కూఫా యను రెండుపట్టణములలో రెండుసంప్రదాయము లేర్పడెను. మఱియొక సంప్రదాయమునకు బాగ్దాద్ పట్టణము జన్మస్థానము. మొదట నీవిషయమున నియమబద్ధ మగు గ్రంథమును రచించినయతఁడు సీబవైహి యనుశాస్త్రజ్ఞుఁడు. అబూఉబైదా, అస్మాఈ, ముబర్రిద్ లోనగువా రితని సంప్రదాయులు. బాగ్దాద్ సంప్రదాయస్థాపకుఁడు ఇబ్న్ కుతైబా. అనంతరము కాలక్రమమున ననేకు లీవిషయమున వ్రాసిరి.

గణితశాస్త్రమునం దరబ్బులు హిందువులయొద్ద అంకలేఖనము, పఠనము, త్రికోణమితి, బీజగణితము మొదలగువానిని నేర్చుకొనియుండిరి. 'హిందువుల గణితశాస్త్రము', 'హిందువులు లెక్కించు పద్ధతి' యను పేరులుగల అరబీగ్రంథములు పైవిషయములను రూఢిపఱుచుచున్నవి. రసాయన, జ్యోతిశ్శాస్త్రములను వీ రభివృద్ధిపఱిచియుండిరి. టాలెమీకృత మగు జ్యోతిశ్శాస్త్రము ౮౧౨-వ సంవత్సరమునం దరబీలోని కనువదింపఁబడినది.

అరబ్బులధర్మశాస్త్ర, వేదాంతశాస్త్రములకు కురానులోని వాక్యములే యాధారములు. కాని అరిస్టాటలునితత్త్వశాస్త్రపఠనానంతరము కురానులోనిసూత్రముల నన్వయించుటయందు పండితులు భిన్నాభిప్రాయు లగుటచే ఇస్లామునందు హనఫీ, షాఫఈ, మాలికీ, హంబలీ యను నాలుగుసంప్రదాయము లేర్పడినవి. ఆరంభకాలమునఁ దూర్పుదేశములందు అల్ ఫరాబే, ఇబ్న్ సీనా, అల్ ఘజాలీ మొదలగువారీవిద్యను పైకిఁ దీసికొనివచ్చిరి. స్పెయినునందును, పశ్చిమమహమ్మదీయదేశములందును, ఇబ్న్ బాజ్జా, ఇబ్న్ తూఫైల్, ఇబ్న్ రష్ద్ లను తత్త్వవేత్త లీవిద్యను మహోన్నతస్థితికిఁ గొంపోయిరి. ఇస్లాంధర్మము దినదినాభివృద్ధి నందుచుండ వైద్యవిద్యలం దారితేరిన నిపుణులగు నెస్టోరియన్ తత్త్వజ్ఞులు బాగ్దాద్ ప్రాంతమున గ్రీకుదార్శనికవిద్యలఁ బ్రచారము సేయుచుండిరి. ౮, ౯-వ శతాబ్దులందు అరిస్టాటల్ యొక్క ప్రధానగ్రంథములపారాంశము సిరియన్ భాషలోనికిని, దానినుండి అరబీలోనికిని దీసికొనిరాఁబడినది. మీఁద వచించిన అల్ మామూన్ యొక్క రాజ్యకాలమున అరిస్టాటల్ యొక్క అసలు గ్రంథమంతయు నరబీలోనికి మార్పఁబడెను. మఱియు అల్ కిండియస్, అల్ ఫరబియస్, అవిసెన్నా, అల్ లజేల్ అనువా రీవిద్య నభివృద్ధిపఱిచినతత్త్వవేత్తలు. వీరు పూర్వదేశీయులు. ఇటులే పశ్చిమదేశములందు అవెంపస్, అబూబాసెర్, అవర్రోస్ అనువారు దార్శనికవిద్యల ననేకపథములఁ బ్రవర్తింపఁజేసిరి.

అరబీతత్త్వవేత్తలు వైద్యులుగఁగూడ నుండిరి. అందువలననే ఈభాషయందు హకీం అనుశబ్దము వైద్యునకును, తత్త్వవేదికిని గూడ వర్తించుచుండును. అతిప్రాచీనకాలమున హిందువులు కనిపట్టిన వైద్యరహస్యములను వారివలన గ్రహించినవారిలో ప్రథమ లరబ్బులే. మహమ్మదీయరాజ్యములోని ముఖ్యనగరములందు వైద్యవిద్యాలయములు, తాత్త్వికపాఠశాలలు నెలకొల్పఁబడియుండెను. ౮ మొదలు ౧౧-వ శతాబ్దివఱకు నరబ్బులీవైద్యము నభివృద్ధి పఱుచుటకై పాటుపడుచుండిరి. చనిపోయినవాని ప్రాణము పూర్తిగ శరీరమును వదలక ఎదురుజొమ్మునం దుండు ననియు, మున్కిర్ నకీరు లనుదేవదూతల కా ప్రాణములవలననే చచ్చినయతఁడు జవాబు నొసంగవలసి యుండు ననియు, నాకారణమున శరీరములఁ గోయరాదనియు మహమ్మద్ ప్రవక్త శాసించియుండుటవలన వీరు అస్థిపంజరశాస్త్రమును మాత్రము వదలుకొనవలసినవారైరి.

౧౭, ౧౮-వ శతాబ్దులందు ఈజిప్టు, సిరియా మున్నగు కొన్ని దేశములందు అరబీగ్రంథములు లిఖింపఁబడినవి కాని వానియందు మౌలికత కానరాదు. ౧౯-వ శతాబ్దినుండియు యూరోపుతో సంబంధము కలుగుటవలన అరబ్బుల రాజకీయ, సాంఘిక, ఆర్థిక, మానసిక విషయములందుఁ బరివర్తనము కలిగెను. ఇందువలన భాషారచనములందుసైతము మార్పుకలుగుట అవశ్యంభావి యయ్యెను. ఈనవీన లేఖకులందు రెండుతెగలు బయలుదేఱినవి. ఒకరు ప్రాఁత-అరబీయొక్క పద్ధతిని, వేఱొకరు పాశ్చాత్త్యపద్ధతిని అవలంబించిరి. మొదటి పద్ధతివారికంటె రెండవపద్ధతి నవలంబించినవారి కెక్కుడు ప్రోత్సాహము కలిగెను. దీనిని ప్రోత్సహించువారు కేవలము స్వదేశముననే కాక యునైటెడ్ స్టేట్సు, బ్రజిల్ మొదలగు అమెరికాఖండాంతర్గతదేశములందును ఉండిరి. ఈరెండుసంప్రదాయములను గలుపుటకై ఈజిప్టునం దొకప్రయత్నము జరిగియుండెను కాని ఫలిత మేమియుఁ దేలియుండలేదు. ప్రస్తుతము వ్రాయుగ్రంథములందు విషయగ్రహణవైఖరి పాశ్చాత్త్యరీతులను బోలియున్నను భాషాశైలిమాత్రము ప్రాచీన అరబీపద్ధతిని బోలియేయున్నది. లెబనన్, ఈజిప్టులందుముఖ్యముగఁ బ్రచారములో నున్న ఈనవీనపద్ధతి ముందు బాగుగ నభివృద్ధి నొందఁగల దని తోఁచుచున్నది.

ఇతిహాసము :— మహమ్మదునకుఁ బూర్వము అరేబియాయొక్కచరిత్రమును దెలిసికొనవలయు ననినఁ దగినయాధారములు లేవు. సాధ్యమగునంతవఱకు మహమ్మదీయు లట్టి యాధారములను సర్వనాశనము గావించిరి. ౧౯-వ శతాబ్ది మొదలుకొని జరుగుచున్న యన్వేషణములకు ఫలితముగ ప్రాచీనకాలపు శాసనములును, నాణెములును అనేకములు లభించినవి. వీనిద్వారా ఐతిహాసికయుగారంభమం దిచట సెమిటిక్ జాతు లుండినట్లు విదిత మయ్యెను. మహమ్మదు జనించుటకు వెయ్యిసంవత్సరములు పూర్వము అరేబియాయందు హిందూ-ఆర్యసభ్యత యుండినట్లు కొన్ని నిదర్శనములు కానవచ్చుచున్నవి. ఈ విషయము ముందు నిశ్చయము కావచ్చును. నాణెములు, శాసనములు మున్నగువానియాధారమున క్రీస్తుజననమునకు వెయ్యిసంవత్సరములు పూర్వము ఇచట మాయిన్, సాబా, హద్రామౌత్, కాటబానియా లను నాలుగురాజ్యము లుండె నని విదిత మగుచున్నది. వీనిలో చివరిరెండురాజ్యములవిషయమై యెక్కువ తెలియదు. సాబియులు క్రీ. పూ. ౯-వ శతాబ్దిమొదలు క్రీస్తుపూర్వము ౧౧౫ వఱకును రాజ్యము చేసియుండిరి. వీరికిఁ గొంతకాలము మారిబ్ పట్టణమును, మఱికొంతకాలము సరవాహ్ నగరమును రాజధానులుగ నుండెను. వీరికిని, హద్రామౌత్ కాటబానులకును పోరాటములు కలుగుచుండెడివి. ఈ కాలమున దక్షిణ-పశ్చిమ-అరేబియాభాగములు ధనధాన్యపూర్ణమై సంపదలఁతోఁ దులఁదూఁగుచుండెను. ఇందులకు కారణము 'ఇండో-మిశ్రవాణిజ్యము'. ఈ వ్యాపారము హిందూదేశమునుండి పర్షియన్ సింధుశాఖగుండా ఈజిప్టుతో జరుగుచుండెను. ఇందువలన దక్షిణ - పశ్చిమ - అరేబియాభాగములు మార్గమం దుండుటచే మంచిలాభమును బొందుచుండెను. కాలాంతరమున టాలెమీ యనునతఁ డిండియా, ఈజిప్టుల కుత్తరమార్గమును వేఱొకదానిని గనిపట్టుటచే దక్షిణమార్గపుప్రతిభ తగ్గిపోయెను. అనంతరము నబాటేనియనులతో జరిగినయుద్ధమున సాబియనులు పూర్తిగ నోడిపోయిరి. దానితో నీజాతియే నాశనమైపోయెను.

మాయిన్ రాజ్య మరేబియాదక్షిణమందలి జౌఫ్ ప్రాంతమున వ్యాపించియుండిన ట్లగపడుచున్నది. ఈ జాతివారగు ౨౫ గురురాజు లియిలాకాను పాలించినట్లు శాసనములవలనఁ దెలియును. కాని వీ రేకాలమున నుండినదియు నిశ్చయముగ తెలియదు. వీరుసాబియనులకంటెను పూర్వ ముండి రని కొందఱియభిప్రాయము కాని సాబియను శాసనములందు వీరిపేరైనను గానరాదు. క్రీ. పూ. ౧౧౫-వ ప్రాంతమున ఈదేశ మంతయు హిమ్యారైటులవశ మయ్యెను. ఇదేతరుణమున కాటబానులరాజ్యముగూడ నాశనమై పోయెను.

హిమ్యారైటులు సాబారెయ్‌దాన్ రాజు లనుపేరఁబరఁగుచు వచ్చిరి. రోమను లీకాలమున వీరిని జయింప నెంచిరి గాని కృతార్థులు కారైరి. తరువాత అబిసీనియనులకును, హిమ్యారైటులకును పోరాటములు కలిగెను. ఇందు మొదటివారు క్రైస్తవులు. చివరివారు యూదులు. ఈకారణమున వీరికలహములు సంప్రదాయయుద్ధములుగఁ బరిణమించెను. క్రైస్తవమతపక్షమున బిజంటైన్ సామ్రాజ్యమువారు అబిసీనియనులకుఁ దోడ్పడుటచే హిమ్యారైటులకు పరాజయము కలిగెను. అంత హిమ్యారైటులు ద్వేష మూని పర్షియనులసాయము నభిలషింప వారును సమయమును గనిపట్టి అబిసీనియనులను బరాభూతులను గావించుటయే కాక తుదకు హిమ్యారైటులఁ గూడ వశపఱుచుకొని వారియిలాకాను పర్షియారాజ్యమునఁ గలుపుకొనిరి.

sampath_Ebooks

యూఫ్రటీస్ నదికిని అరేబియాయెడారికిని మధ్యనున్న సస్యప్రదమైన దేశమందు హీరారాజ్యము నెలకొల్పఁబడియుండెను. దీని రాజధాని హీరాపట్టణము. ఇది ప్రస్తుతము కూఫాయున్నస్థానమునకు దక్షిణముగ నుండెను. తబారీ యనునతఁడు వ్రాసినదాని ననుసరించి తనుఖులు, ఇబాదైటులు, విదేశాగతులు నని యచట మూఁడువిధము లగుజనులు నివసించుచుండిరి. వీరిలో తనుఖు లనువారు అల్ నెజ్ద్, యెమామా ఇలాకాలకుఁ జెందిన అరబ్బులు. వీ రెల్లకాలము డేరాలలో నివసించుచుండిరి. బెహరిన్ వద్ద సమావేశమై వీరు మూఁడవశతాబ్దియందు హీరాకు ప్రయాణము గావించిరి. హీరానగరమున స్థిరముగ నెలకొనియుండినవారు ఇబాదైటులు. వీరు క్రైస్తవులు. వీరి ధార్మికభాష సిరియన్ వాణి. ఆకారణమున వీరు మతవిషయక కార్యములందు సిరియన్ భాషను, తక్కినయన్ని సమయములందు నరబీభాషను నుపయోగించుచువచ్చిరి. తరువాతను కాలాంతరమున వీరు నెస్టోరియనులుగ మాఱిరి. కారణాంతరములచే పరదేశములనుండి వచ్చి హీరారాజ్యమునందు తలదాఁచికొనినవారు విదేశాగతులు. వీరికిని మీఁద వచించిన రెండుతరగతులవారికిని సంబంధ మేమియు లేదు. అరేబియన్ సాహిత్యగ్రంథములందును, ఐతిహాసికగ్రంథములందును, వర్ణింపఁబడిన లఖ్మిదు లనుజాతివారు క్రీ. శ. మూఁడవ శతాబ్దినుండి ఏడవశతాబ్ది ఆరంభమువఱకు నీ ఇలాకాను పాలించియుండిరి. వీరి క్రిందఁ బాలితులుగ నున్నజనులు క్రైస్తవులు. కాని వీ రన్యమతావలంబులై యుండిరి. హీరాలు సామంతులుగను, పర్షియనులు సార్వభౌమపాలకులుగ నుండినట్లును కొన్ని నిదర్శనములు కలవు. అనేక పర్యాయములు వీరు పర్షియనులకుఁ దోడుగఁ బోయి రోమనులతోడను, ఘాసను లను మఱియొక తెగవారితోడను బోరాడి యుండిరి. తమ చుట్టుప్రక్కల నుండు బదువీలనుండియు, స్వజాతిజనులనుండియు పన్నుల గ్రహించుచుండిరి. ౬౦౨-వ సంవత్సరమున లఖ్మిద్ వంశమంతమొందఁ బర్షియాపాలకుఁడగు రెండవ ఖోస్రోజ్ అనునతఁడు తాయినామకజాతికిఁ జెందిన యరబ్బీప్రముఖు నొకని నచట గవర్నరుగ నియమించెను.

క్రీ. శ. ఆఱవశతాబ్దియొక్క ఆదియందు జఫ్నీదు లను వేఱొక తెగవారు అరేబియాయందు రాజ్యము నేయుచుండిరి. వీరి యధీనమందలి జనులు ఘాసనులు. అరేబియా వాయవ్యదిశయందలి జార్డన్ (Jordan) నదికి తూర్పుగ నున్న పెట్రానగరము మొదలుకొని రోఫ్‌సాలావఱకుఁగల యిలాకా వీరియధీనమున నుండెను. కేవలము దక్షిణమునుండి వచ్చినవా రని తప్ప వీరి పుట్టుపూర్వోత్తరములనుగూర్చి యేమియుఁ దెలియదు. మహమ్మదు కాలమున వీరి తెగయొకటి యథ్రీబ్ (మదీనా) పట్టణమున నుండెను. ఈవంశము యొక్క ఆదిమపురుషుఁడు హరిత్ ఇబ్నజాబాలా. క్రీ. శ. ౫౨౮-వ సంవత్సరమున నితఁడు హీరాయందలి మోన్‌ధిర్ అనునతని నోడించినట్లు జాన్‌మల్లాస్‌యొక్క లేఖలవలన తెలియుచున్నది. రోమన్ రాజ్యపు సరిహద్దులం దున్న ఘాసనిదులు పర్షియాసరిహద్దులం దున్న హీరాలకు వైరులు. ఆహేతువున ఘాసనిదులను దన పక్షమున నుంచుకొనవలయునను నభిప్రాయముతో ఆకాలపు రోమన్ శాసకుఁ డగు జస్టినియన్ హరిథుని రోమురాజ్యపు పెట్రీషియనుగను, పైని లిఖించిన అరేబియా ప్రాంతమునకు పాలకునిగను స్వీకరించెను. ఇట్లు రోమన్ పర్షియనులచేతి కీలుబొమ్మలుగ నేర్పడిన ఘాసనిదులు హీరాలు స్వార్థము నిమిత్తము కాకపోయినను పరార్థ మనేక పర్యాయములు కలహించుకొనుచు వచ్చిరి. క్రీ. శ. ౫౪౧-వ సంవత్సరమున ఘాసనిదులు బెలిసారియస్ అనునతనికిఁ దోడుగఁ బోయి మెసపొటోమియాయందు యుద్ధము గావించిరి. క్రీ. శ. ౫౭౩-వ సంవత్సరమున హరిథ్ మరణించెను. అంతవఱకు రోమనులు, ఘాసనిదులును గలసియే యుండిరి. కాని హరిథ్ మరణానంతర మీరాజ్య మనేకభాగములుగఁ జీలిపోయెను. కొందఱు రోమునధికారమును స్వీకరింప మఱికొందఱు పర్షియనులపక్ష మూనిరి. ఈరెండుపక్షములను స్వీకరింపనివారు స్వతంత్రులైరి.

క్రీ.శ. ౫-వ శతాబ్దియంతమున అరేబియామధ్యప్రదేశమునందు కిందా నామకజాతి యొకటి ప్రసిద్ధికెక్కియుండెను. వీరినేత అకిల్ ఉల్ మురార్. ఇతఁడును దక్షిణమునుండియే వచ్చె నని ప్రసిద్ధి. హీరాలు పర్షియనులకును, ఘాసనిదులు రోమనులకును సామంతులైయుండిన విధమున కిందాలు యమనురాజ్యమునకు సామంతులుగ నుండిరి. అబ్రహాం అనునతఁడు హెజాజును జయించునవసరమున నతనికిఁ దోడుగ కిందాప్రముఖులు నుండిరి. వీరినిగూర్చి సవిస్తరమగుసమాచార మేమియుఁ దెలియదు. ఒకపర్యాయము వీరు లఖ్మీదుల నోడించియుండిరి. బెహరిన్, యమామా ప్రాంతములు వీరియధికారమున నుండెను. షిజల్ అల్ జబాలాయుద్ధమువఱకును వీరి కెచ్చోటఁగాని పరాజయము కలుగలేదు. ఆటుతరువాత హీరాలచే నోటువడిపోయిరి. అమరుల్ కైస్ అనుకవి ఈకిందారాజవంశీయుఁడే యైయుండెను.

ఇంతవఱకు వ్రాసినదానినిబట్టి మహమ్మదు జన్మించునాఁటి కెన్నిభిన్నభిన్నజాతులు నివసించుచున్నదియు, వారికలహములను గూర్చియు, వారిరాజకీయములనుగూర్చియుఁ గొంతవఱకు గ్రహింప వచ్చును. మఱికొన్నిహేతువులవలనను ఈదేశ మాఱవశతాబ్దియందు రాజకీయాందోళనముచేఁ గలకరపడుచుండెను. బెహరిన్‌నందు బానీ అబ్ద్ కైస్ లనువారు నివసించుచుండిరి. దానితీరములందలి బానీ బక్ర్ జాతివారు పర్షియాసామంతులుగ నుండిరి. బెహరిన్ ముఖ్యనగరమగు హజారునందు సెబోక్ట్ అను పర్షియాగవర్నరు వాసము చేయుచుండెను. ఉమ్మాన్ ఇలాకాయందలి మత్స్యజీవులు పర్షియనులకు మిత్రులుగ నుండిరి. యమన్ దేశ మచటిపాలకుల బలాబలములపై నాధారపడియుండెను. హెజాజునందలి నగరము లన్నియు వేర్వేఱు రాజ్యములుగ నుండెను. ఈరాజ్యములకు వెలుపల నుండువారు ఘోరమగు అత్యాచారములకు లోనగుచువచ్చిరి. పాలెస్టైనునుండి యూదు లనేకు లేతెంచి అరేబియాయందు నివసించుచుండిరి. అదికాక దేశమందలి యరబ్బులలోఁగూడ ననేకులు యూదుమతమును

sampath_Ebooks

స్వీకరించియుండిరి. ఇట్లు భిన్నాభిప్రాయములు, భిన్నమతములు, భిన్నాచారవ్యవహారములు, రీతులు, నీతులు మున్నగువానిం గలిగి అనేకవిధజాతిసముదాయములమూలమున దేశమునందు వలుగడల అల్లకల్లోలము వ్యాపించియున్నతరుణమున మహమ్మద్ ప్రవక్త ప్రాదుర్భవించెను. దేశమందలి భిన్నత్వమును బాఁదోలి యైకమత్యమును స్థాపింపగలయు నని యితని దృఢసంకల్పము. అందుల కనుకూలమగురీతి నొకమతమును, దేశప్రేమను జను లందఱకు నితఁడు బోధింపసాగెను. దేశప్రేమ, ఐకమత్యము నీరెండే ఇస్లాంసిద్ధాంతమున గర్భితములై యున్నవి. ఇట్టి యుపదేశములవమూలమున వీరు మొదట దేశదేశాంతరములను సైతము జయింపఁగలిగిరి. పరదేశములనుండి వచ్చి యరేబియాయందు వాసము నుగుర్చుకొనిన వారి నందఱి నితఁడు హాజిరూన్ అను పేర నొకసంఘముగ నేకీభవింపఁజేసెను. అనసారు లను పేరుగల మఱికొందఱు సహాయకు లీసంఘమునందుఁ బ్రవేశించిరి. వీరిని వెంటఁగొని యితఁడు ఇస్లాంసిద్ధాంతములను దేశమంతటను బ్రచారము గావింప మొదలిడెను. హాజిరూన్, అనసారు లందుఁ జేరినజను లంతఱు నితనినే ధార్మికగురువుగఁ గైకొని యితని వెంట బయలుదేఱిరి నూతనధర్మానుయాయు లారంభకాలమునఁ గొలఁదిమంది మాత్రమే యుండిరి. కాని శత్రువు లగణితముగ నుండిరి. వైరుల యాక్రమణములను జయపూర్వకముగ నెదిరించునిమిత్తము తినవారలం గూడ సంసిద్ధులఁ జేయుట మహమ్మదునకు పరమావశ్యక మయ్యెను. మొట్టమొదట శత్రువు లేతెంచి యెదిరించినయెడల వారినుండి తమ్ము రక్షించుకొనుటకుమాత్రము సంసిద్ధు లగుచువచ్చిరి. క్రమముగ వైరిసమూహములు నధికముగ నుండుటచే అరబ్బులును నేవాధర్మముల స్వీకరింప బాధ్యులైరి. ఒకటిరెండుచోట్ల జరిగిన రణములందు మహమ్మదీయులకే జయము కలుగ జనులు గుంపులుగ వచ్చి నూతనమతమును స్వీకరింపసాగిరి. లోకులు భయమునకు లొంగినట్లు నయమునకు లొంగరుగదా! స్వల్పకాలమందె మహమ్మద్ పక్షమువా రెక్కువైరి. అనంతర మీజనసమూహములే జాతీయసేనలక్రిందఁ బరిణమించినవి. వీనితోడ్పాటున మక్కానగరము ప్రవక్తయధీన మయ్యెను.

మక్కాపట్టణము హస్తగత మగుటవలన మహమ్మదునకు మనుజులమాత్రమే కాదు; పుణ్యక్షేత్ర మని జనుల నాకర్షించుటకు మంచికేంద్రస్థానమును లభించెను. ఇతనిదేహావసానమగునప్పటికి అరేబియా యంతయు నూతనధర్మమున దీక్షిత మయ్యెను.

పైగంబర్ మరణానంతర మితని యుద్దేశములను నెఱవేర్చినది అబూబక్ర్. ఇతఁడు సాధుజీవనము, అచల మగునాత్మవిశ్వాసము కలవాఁడు. మహమ్మద్ కోరికల నన్నింటిని ఇతఁడు బాగుగ నుత్తేజిగియుండెను. ఆహేతువున మహమ్మద్ యొక్క స్థానము లభించినతోడనే అప్పటికి సంసిద్ధముగనున్న సేనను రోమునగరముపైని దండెత్తుటకంపెను. స్వదేశమందును అంతఃకలహములు జనింప వానిని జయపూర్వకముగ నడఁగఁద్రొక్కెను.

అబూబక్ర్ మరణానంతరము ఖలీఫాపదము నందినది ఓమరు. ఇతనికాలమునందే ఇస్లాముమతము దేశదేశాంతరములందు వ్యాపించెను. కడేషియా యనుచోట పర్షియనులకుఁ బూర్ణపరాజయము కలిగెను. ఈరాక్ దేశ మరబ్బుల పాలఁబడెను. కూఫా, బస్రానగరములు సంస్థాపితము లయ్యెను. డమాస్కసు వీరివశ మయ్యెను. ౬౩౮ లో జెరూసలేముపట్టణము జయింపఁబడెను. మూఁడేండ్ల తరువాత సిరియాదేశమంతయు ముసల్మానుల యధీన మయ్యెను. ౬౪౦-వ సంవత్సరమున అమ్ర్-ఇబ్న్-ఎల్-అస్ అనువతఁడీజిప్టును ముట్టడించి యామఱుసటిసంవత్సరమున అలెగ్జాండ్రానగరముతోపాటు మఱికొంత దేశమును లోఁబఱుచుకొని ఫోస్టాట్ పట్టణము ( ప్రస్తుతపు కెయిరో )నకు శంకుస్థాపనము గావించెను. ౬౪౧ లో నెహవెండ్ నామకనగరమునొద్ద జరిగిన పోరాటమందు పర్షియనులకుఁ గలిగిన ఘోరపరాజయకారణమున సాస్సనిక్ పాలకుఁడు పలాయితుఁడైపోయెను. అదేసంవత్సరముమరల రాయ్యుద్ధమున గెలుపొందుటవలన సమస్తపర్షియారాజ్యము మహమ్మదీయుల హస్తగతమయ్యెను. దీనితో ఇస్లామువిజయము మిన్నుముట్టె నని చెప్పవచ్చును. ఓమర్ రాజనీతికుశలుఁడు. కురానుగ్రంథమును సంగ్రహించి యొకయాకారము గలదానినిగఁ జేసిన దితఁడే. సామాన్యప్రజావర్గమునకును, సేనావర్గమునకును కొన్ని కట్టుదిట్టములను, నియమములను ఏర్పఱిచెను. అరేబియాయందు మహమ్మదీయమతము తప్ప వేఱొకమత మేదియు నుండరాదని పైగంబరుయొక్క ఆశయమైయుండెను. ఆ యభిప్రాయమును పూర్తిచేయించినది ఓమరు. ఇతఁడు ముసల్మానుధర్మమును స్వీకరింపనొల్లని నెజ్రాన్ నందలి క్రైస్తవులను, ఖైబరునందలి యూదులను పరదేశములకు వెడలఁగొట్టించెను.

మూఁడవఖలీఫా యగు ఒత్థోమన్ కాలమునం దరేబియాయందు గృహకలహము లుత్పన్న మయ్యెను. కాని నిపుణముగ నవన్నియు నణఁచివేయఁబడినవి. ఉత్తరమున ఆర్మీనియా, ఏషియామైనరుదేశములును, పశ్చిమమున ఆఫ్రికాఖండమందలి కార్తేజ్ వఱకునుగల దేశమును మహమ్మదీయపాదాక్రాంత మయ్యెను. అనంతరము ఒత్థోమన్ వధింపఁబడుటయు, అలీ ఖలీఫాగా నెన్నుకొనఁబడుటయు సంభవించినవి. కాని ఆయేండ్లమీఁద జరిగినసిఫిన్‌యుద్ధానంతరము అలీ రాజ్యభ్రష్టుఁ డగుటతోడనే ఒమయ్యాద్ వంశపుఖలీఫాలు రాజధానిని మదీనానుండి డమాస్కస్ పట్టణమునకు మార్చిరి.

మహమ్మదీయమత మభివృద్ధి నందసాగినయారంభకాలమున అరబ్బులు నాటుమార్గమున నేకాక నీటిమార్గమున సైతము దండయాత్రలఁ, బ్రయాణముల సలిపియుండిరి. క్రీ. శ. ౬౪౦-వ సంవత్సరమున అబిసీనియాతీరమున వసించు ముసల్మానుల రక్షణార్థము ఓమర్ ఖలీఫా నౌకాదళము నొకదానిని శోణసాగరముగుండా పంపెను. లెవాంట్, ఏషియామైనరులందు జరిగినయుద్ధములనిమిత్తము ఒత్థోమన్ ఖలీఫా ఆఫ్రికాఖండమునందండి నౌకాదళమును సమకూర్చెను. అబూకైసనతఁడు సైప్రస్‌దీవిని జలసేనతో ముట్టడించియుండెను.

sampath_Ebooks

విదేశము లెన్ని జయింపఁబడుచువచ్చినప్పటికిని ఆరంభకాలమున సామ్రాజ్యమునంతటియందు అరేబియాయందలి యైకమత్యము భగ్నము గాకుండునట్లు ప్రయత్నములు సలుపఁబడినవి. సేనలును, సైనికులును ఇప్పనితరులను అరబ్బు లెవరును విదేశములందు నివసించుటకు వీలు లేకుండునట్లు నియమములు గావింపఁబడెను. కూఫా, ఫోస్టాట్ నగరములు రెండును కేవలము సేనాస్థానములుగ నుండెను. కాలక్రమమున దక్షిణమున కూఫాపట్టణమును, ఉత్తరమున బస్రా పట్టణమును విఖ్యాతస్థానములుగఁ బరిణమించెను. ఆద్యము ఖలీఫాలకాలమున మదీనాపట్టణమే మహమ్మదీయ ప్రపంచమునకు రాజధానిగ నుండెను ఖలీఫాలు సామాన్యముగ నందే ఎన్నుకొనఁబడుచుండిరి. మహమ్మదీయలోకమునకుఁ గావలసిన నీతినియమములు చట్టములు నచటనే నిర్మింపఁబడుచువచ్చినవి. ప్రాంతాధికారులు నచటనుండియే పంపఁబడుచువచ్చిరి. కాని ఓమరుమరణానంతరము అరేబియామదీనాల ప్రాధాన్యము క్రమముగ క్షీణింపసాగెను. ఈసంగతి ఒథ్మాన్ కాలమున విస్పష్టమాయ్యెను. ఈ ఖలీఫాయొక్క పక్షపాతపూర్ణమైన పాలనమే ఇందులకు ముఖ్యకారణము. గవర్నరుల నియమించుట యందును, యుద్ధవిజయమున దొరకినధనమును బంచుకొనుటయందును ఈఖలీఫా తన ఖురైష్ తెగయెడలను అందునఁగూడ ఒమయ్యాద్ వంశమువారియెడలను మిక్కిలి పక్షపాతము చూపుచువచ్చెను. అందువలన అరేబియాయందలి ఇతరజాతులవా రందఱును ఖురైష్ జాతివారిని, ఖురైషులలోనే హాషిమైటులు ఒమయ్యాదులను గర్హింపసాగిరి. ఒమయ్యాదులు తక్కినయందఱికంటెను చిట్టచివర ముసల్మాన్ దీక్షను గ్రహించినవారు. ధార్మికనియమపాలనమున వీరి కంతగ పట్టుదలయును లేకుండెను. ఖలీఫా వధింపఁబడుటకు కివియే కారణములు. కాని ఈవిరోధకారణముల ప్రచారము బస్రా, కూఫా, ఫోస్టాట్ నగరములందు జరిగినంత తీవ్రముగ అరేబియాయందు జరిగియుండలేదు. ఈహత్యావిషయమున అరేబియా తూష్ణీంభావమూనెను. సిరియాప్రాంతాధికారి ఒకఁడు తప్ప తక్కిన జవాబుదారీగల వారెవరును దీనిని గమనించినట్లైన నుండలేదు. అనంతరము అలీనిమిత్తము ఎన్నికలు జరిగినకాలమున జనించినకలహములందుమాత్ర మరేబియా బాగుగ జోక్యము కలుగఁజేసికొనెను. ఇతఁ డాపదము నంది జీవించియున్నంతవఱకును మదీనానగరమే మహమ్మదీయలోకమునకు రాజధానిగ నుండెను కాని తరువాత మోవియాఖలీఫాకుఁ గలిగినవిజయముచేత డమాస్కస్ రాజధానిగ మాఱెను. ఇందుచే మదీనా ప్రభావము తగ్గిపోయెను. అనంతరము మోవియా తనకుమారుఁడగు యజ్దును యువరాజుగ నియమించుటచే మదీనాకుఁగల రాజనిర్వాచకపు హక్కు సైతము పోయెను. ఈవిధముగ మక్కా మదీనాలకుఁ గల రాజకీయపు హక్కు తగ్గిపోయినప్పటికిని ధార్మికాధికారము మాత్రము యథాపూర్వముగనే యుండెను.

అలీఖలీఫావధానంతర మితనికొడుకులు హసన్, హుసేనులనువారిద్దఱు డమాస్కస్ఖలీఫాకు విరుద్ధముగ కలహములాడ బయలుదేఱిరి. కాని వీరిలో హసన్ మోవియాతో సంధి గావించికొనెను. మోవియాతరువాత మహమ్మదీయరాజ్యమును ఏలినది అతని కొమారుఁడు యజీద్. ఇతఁడు రాజ్యమునకు వచ్చినపిదప మోవియారాజ్యమును నోడించుటకు సైనికులను గూర్పసాగెను. కాని ౬౮౦-వ సంవత్సరమున నితఁడు కర్బాలానగరమునొద్ద వధింపఁబడెను. అటుపిమ్మట అబ్దుల్లా ఇబ్న్ జోబైర్ అనునతఁడు అలీకుటుంబమునకు సంభవించిన దుర్దశకు ప్రతిగా పగ దీర్చుకొనవలయు నను తలఁపుతో మక్కానుండి డమాస్కస్ మీఁదికి దండువెడలెను. మక్కా మదీనావాసు లితనిపక్షమునే యవలంబించిరి. కాని అబ్దుల్లా ప్రతిన నెఱవేఱినట్లగపడదు. ౬౮౩ లో యజీద్ సేనలు మదీనాను జయించి కొల్లగొట్టి మఱుసటిసంవత్సరము మక్కామీఁదికి వచ్చినవి. కాబా ధ్వంసమొనరింపఁబడెను. ఇంతలో యజీద్ మరణింపఁగా, ముట్టడి యెత్తివేయఁబడెను. అబ్దుల్లా మక్కానగరమందే యుండెను. అరేబియా, ఈజిప్టు, సిరియాయందలి కొంతభాగమునకుఁ జెందిన ప్రజ లబ్దుల్లాను ఖలీఫాగా స్వీకరించిరి. ఇతఁ డొకపర్యాయము మెర్వాన్ అనునతని యధీనమం దుండిన శత్రుసేనలను పరాజయము నొందించెను. కాని ఖారిజైటు తెగవారియండ ఇతనికి దొరకదయ్యెను. అటు డమాస్కసునం దబ్దుల్ మలిక్ అనునతఁడు యజీద్ స్థానమును గైకొని ౬౯౧ లో అరేబియాయందలి అబ్దుల్లా నడఁగఁద్రొక్కుటకై తన సేనానాయకుని మక్కామీఁదికిఁ బంపెను. ఈయుద్ధమునం దబ్దుల్లా ప్రాణములను గోల్పోయెను. మక్కానగరము సంపూర్ణముగ డమాస్కసువశ మయ్యెను. మఱియు నీయుద్ధవిజయమువలన అబ్దుల్ మలిక్ అరేబియా, డమాస్కసులకే కాదు; సమస్తమహమ్మదీయ ప్రపంచమునకును ప్రముఖుఁడును, ఖలీఫాయు నయ్యెను. అది మొదలుకొని ఒమయ్యాదుల ప్రభుత్వమున్నంతకాలము అరేబియా యూరు పేరు లేక పడియుండెను. దేశదేశాంతరములందలి ముసల్మానులు తూర్పున అఫ్ఘానిస్థానాంతమువఱకును, పడమట స్పెయిన్ వఱకును జయించిరి కాని యందువలన అరేబియా కేవిధమైన లాభమును కలుగదయ్యెను. అనంతరము అబుల్ అబ్బాస్ రాజ్యసింహాసన మెక్కి రాజధానిని కూఫానగరమునకు మార్చెను. పిదప కొంతకాలమునకు బాగ్దాదు రాజధానిగ మాఱెను. అందువలన అరేబియాగౌరవము మఱింత తగ్గిపోయెను. మొట్టమొదటనుండి అబ్బాసీదులు పర్షియనుల మీఁదను తురుష్కులమీఁదను ఆధారపడియుండిరి. రాజ్యమందలి ముఖ్యపదము లన్నియు విదేశీయులచేత నింపఁబడుచువచ్చినవి. రాజకీయములం దిట్లు పరివర్తనములు కలిగినప్పటికిని భాషావిషయమునమాత్ర మరేబియా గౌరవము యథాపూర్వముగనే యుండెను. లేఖకారులు, వైయాకరణులు, కవులు అరబీభాషనే స్వీకరించి యభివృద్ధిపఱచిరి. కాని అరబ్బు లందఱు నేకీభవించి మతముకొఱకును, దేశముకొఱకును ప్రాణముల కాశింపక రణ మొనర్చుస్వభావము వీరియందు లోపించిపోయెను. ఈహేతువున వీరు ఒమయ్యాదులయెడల పక్షపాతము గలిగియు అబ్బాసీదుల నెదిరింపఁజాలరైరి. క్రమముగా మహమ్మదు

sampath Ebooks

ఆవిర్భవించుటకు పూర్వ ముండినగృహకలహములలోనికి వీరు మరల దిగిరి.

క్రీ. శ ౯-వ శతాబ్దిచివర కర్మథియను లను వేఱొకతెగ వారు ఖ్యాతిలోనికి వచ్చిరి. వీరు హమ్దన్‌కర్మత్ అనువతనియను యాయులు. ఈ సంప్రదాయము జనించిన నాలుగుసంవత్సరముల కాలమందే ప్రబలశక్తిసంపన్నులైరి. హమ్దన్‌చే ననుజ్ఞాతుఁడై అబూసైద్ అల్ జన్నాబి యనువతఁడు ౯౦౦ లలో బహరీన్ ప్రాంతమునకుఁ బోయి యచటి కటీఫ్ నామకనగరమును లోఁబఱుచుకొనెను. ఇందు సేవకులు యూదులు, పర్షియనులు నుండిరి. దేశమందలి బదువీలు ఇస్లాంసిద్ధాంతములకు వైరులు. ఈసిద్ధాంతములు నియమములు కష్టము లగుటచే వారు వీనిని పాలింపఁజాలకైరి. ఆకారణమున కఠిననియమములు లేని కర్మథియనులు పంపు సూత్రములను సలుపునప్పుడు వీరు వారి నెదిరించియుండరైరి. అందుచేత వారు క్రమముగా బహరీన్, యమామా, ఉమ్మాన్ ప్రాంతముల నాక్రమించుకొని ౯౦౮ నందు యమనును జయించి మక్కా మదీనాలపై దండెత్తి పోయిరి. అప్పు డీసమాచార మంతయు బాగ్దాదులోనియధికారివర్గమున కెఱుకపడ వీరు కర్మథియనులధాటిని శాంతినము కడఁచిపైచిరి. అబూసైద్ మరణానంతర మతనికుమారుఁడు కర్మథియన్‌రాజ్యసింహాసనమునకు రాఁగా నతనితమ్ముఁడగు అబూ టాహిర్ అతనిని తొలఁగించి తానే నేతృత్వమును వహించెను. ఇతఁ డత్యంతప్రతిభాశాలి. ప్రతియుద్ధ మందును జయలక్ష్మి యితనిని వరించుచునే యుండెను. ఇతడు బాగ్దాద్ ఖలీఫాను సైతము ఓడించెను. తూర్పున ఉమ్మానురాజ్యమును గైకొని యొక్కపెట్టున పశ్చిమమునకుఁ బోయి మక్కాను జయించి మహమ్మదీయలోకము కంపించునట్లుగ కాబాయందలి పూజ్యవస్తువగు కాలపాషాణమును బహరీన్‌కుఁ గొనిపోయెను. ౯౩౯ లో ఈ పాషాణమును మరల నిచ్చి తన లోకవిహమును పన్ను చెల్లించువరకు వీఁడు యాత్రికులు తీర్థయాత్రలఁ జేసికొనవచ్చునని యనుజ్ఞ నొసంగెను. ఇతఁడు జీవించియున్నంతకాలము అరేబియా కర్మథియనులవశమునందే యుండెను. ఇతనిమరణానంతరము వీరికిని ఈజిప్టునందలి ఫాతిమాపక్షపుప్రభువులకును కలహము కలుగుటచే వీరిప్రభావము క్షీణింపసాగెను. ౯౮౫ నందు ఈరాకుప్రాంతమున వీరికి పరాజయము సంభవించెను. దానివలన యాత్రికులపైని పన్నువిధించునధికారమును వీరు కోల్పోయిరి. ఇదేతరుణమున ఉమ్మాన్ విద్రోహ మొనరించి స్వతంత్ర మయ్యెను. మఱి నూఱుసంవత్సరములు కడచినవెనుక బదువీజాతికిఁ జెందినయొకషేక్ కటీఫ్ నగరమును జయింప దానితో కర్మథియనుల అధికార మున్నదికూడ నాశన మైపోయెను. వీరి కుండిన యధికారము లన్నింటిని బదువీలు వశపఱుచుకొనిరి. దేశమందంతట మరలఁ గల్లోలములు, కలహములు చెలరేఁగెను. చిన్నచిన్న స్వతంత్ర రాజ్యము లనేకము లేర్పడెను. మక్కా, మదీనాలకు యాత్రలఁ జేయువారికి తగినయేర్పాట్లేమియు లేవయ్యెను. ఒక్క హెజాజ్ దేశపుసమాచారములు దప్ప తక్కినదేశములవార్తలే తెలిసెడివి గావు. మక్కా, మదీనానగరములను ఇరువురు షరీఫులు పాలించుచుండిరి. వీరిద్దఱు నీజిప్టుఖలీఫా బలవంతుఁడైనపుడు నతనిపక్షమును లేక బాగ్దాద్ ఖలీఫా శక్తిమంతుఁడైనపుడు నతని పక్షమును వహించి పరస్పరము పోరాడుచుండిరి. ఈపట్టణముల సరిహద్దుల వెలుపల అరాజకపుదేవత తాండవమాడుచుండెను. నానాదోపిడిగాండ్రగు బదువీలకారణమున యాత్రికుల ధనప్రాణములు పోవుచుండెడివి. ౧౨౬౯-వ సంవత్సరమున నొకషరీఫు ఈజిప్టు అధికారమునకు లోఁబడి మక్కాను పాలించుచుండెను. ౧౫౧౭లో టర్కీ సుల్తాన్ సలీం అను నతఁ డీజిప్టును జయింప మక్కానగరము నతనికి వశమయ్యెను. అది మొదలుకొని టర్కీ సుల్తాన్ ఖలీఫాపదము నందెను. క్రమముగా యమన్ ప్రాంత మంతయు నితనికే లభించెను. కాని ౧౬౩౦-వ సంవత్సరమున యమన్ ప్రభు వొకఁడు టర్కీ యధికారమును దొలఁగించి స్వదేశీయు నొకని ఇమామునగ నేర్పాటు గావించెను. అటుతరువాత ౧౮౭౧ వఱకు ఇమాముల ప్రభుత్వమే సాగుచు వచ్చెను. అరేబియా ఆగ్నేయమందలి ఉమ్మాన్ ఏఖలీఫా యధీనమును గాక స్వతంత్రముగ నుండెను. ఒక నూఱుసంవత్సరములకాలము దీని హైనుసుర ఇమాములు పరిపాలించిరి. వీరందఱును అల్ అజ్ద్ అను తెగకుఁ జెందినవారు. నిజ్వాపట్టణము వీరి నివాసస్థానముగ నుండెను. తరువాతి బనీనభాన్ అనువతఁ డిచట మాలిక్ పరిపాలనమును నెలకొల్పెను. వీరు ౧౧౫౪ మొదలు ౧౪౦౬ వఱకును రాజ్య మేలిరి. ఈమధ్యకాలమున వీరిపై రెండుపర్షియన్ దండయాత్రలు జరిగినవి. హోర్మజ్‌తటమందలి ప్రభువులు సముద్రతీరభూమిని వశపఱచికొని ౧౬-వ శతాబ్ది పర్యంతముఁ బాలించిరి. ౧౫౦౭-వ సంవత్సరమున ఉమ్మాన్ యొక్క పూర్వతీరపు భూమిని పోర్చుగీసు లాక్రమించుకొనిరి. ఒకశతాబ్ది కడచిపోవ, అనఁగా ౧౬౨౪ తరువాత యారిబాజాతికిఁ జెందిన నాజిర్ ఇబ్న్ ముర్షిద్ అనువతఁడు ఉమ్మాన్ ఇలాకాకు ఇమామునగ నేర్పడెను. రుస్తక్ అనుపట్టణ మితనిరాజధానిగ నుండెను. ఇతఁ డచటిసామంతుల నందఱ నేకీభవింపఁజేసి వారిసాయమున పోర్చుగీసు లాక్రమించిన దేశమును వశపఱుచుకొనుటయు గాక మస్కట్‌నందు నివసించు వారి (పోర్చుగీసుల)నుండి పన్ను దీసికొనుట మొదలిడెను. ౧౬౫౧ లో పోర్చుగీసు లాయిలాకాను సంపూర్ణముగ వదిలవలసినవారైరి. ౧౬౯౮ లో ఆఫ్రికాఖండపుపూర్వతీరమున ఓమన్నైట్ ప్రదేశములం దుండిన పోర్చుగీసులనుగూడ అరబ్బులు వెడలఁగొట్టిరి.

వహాబీలు; ఆధునిక-అరేబియా చరిత్రము :— ఆధునిక-అరేబియాచరిత్రమున కారంభము వహాబీ యుద్యమము. ఇది ౧౮-వ శతాబ్దిమధ్యకాలమున నుదయమందెను. ఆసమయమున దేశ మనేక రాజ్యములుగ విభక్తమైయుండెను. క్రీ. శ. ౧౭౫౦ లో నీయుద్యమ జనకుఁడగు మహమ్మద్ ఇబ్న్ అబ్దుల్ వహ్హాబ్ అనువతఁడు దేశాటనమొనరించి స్వదేశమునకు మరలివచ్చునప్పటికి అల్ హాసా, మక్ఫూవా, అయైనా ప్రాంతములందుఁ గ్రమముగ అరైర్, ఇబ్న్ దఆస్, ఇబ్న్ ముఅమ్మార్ అనువారల వంశజులు పరిపాలనము సలుపుచుండిరి

sampath_Ebooks

వహ్హాబ్ ౧౮-వ శతాబ్ది ఆరంభమున అయీనాయందే జన్మించెను. చాలకాలము బస్రా, డమాస్కసులందు విద్య నేర్చి, మక్కాయాత్ర సలిపి స్వదేశీయు లందఱును మహమ్మద్ ఏర్పఱిచిన ధర్మమునుండి భ్రష్టులై యుండినట్లు కనుఁగొనెను. తనదేశీయు లందఱును పైగంబరుయొక్క అసలు సిద్ధాంతముల ననుసరించి నడచు కొనవలెనని కోరుచు నితఁ డొక సంస్కరణోద్యమమును మొదలిడెను. అయీనాశాసకుఁ డితని యభిప్రాయములతో నేకీభవించి యుండలేదు కాని దరియాపాలకుఁడుగ నుండిన ఇబ్న్‌సౌద్ చాలఁగ నాదరించి యితని కాశ్రయము నిచ్చెను. ఇబ్న్‌సౌద్ అప్పటికి ఒకగొప్పదేశమునకు ప్రభువు కాఁడు. వహ్హాబ్‌సలహాల ననుసరించి కార్యము లొనరింపఁగఁడఁగిన కొలఁదిసంవత్సరములందే బదువీలఁ దన యధీనమున నేకీభవించునట్లు చేసికొని వారిసాహాయ్యమున అరేబియా మధ్యభాగమగు అల్‌నెజ్ద్ నందును, పూర్వభాగమునను దనయాధి కారమును స్థాపించుకొనఁగల్గెను. ౧౭౬౫-వ సంవత్సరమునం దితని మరణానంతర మితనికుమారుఁడు అబ్దుల్ అజీజ్ అనునతఁడు అల్‌నెజ్ద్‌తో దానివెలుపలి చుట్టుప్రక్కలప్రాంతములనుగూడఁ గలిపికొని ౧౭౭౦ మొదలు యాత్రికులమీఁదఁగూడ దాడి వెడలసాగెను. అంత నితనియభివృద్ధి నడఁచివేయవలయు నని తురుష్కసామ్రాజ్యపు అధికారు లొకసేన నంపఁగా, నది వచ్చి తూర్పున నున్న హాసాప్రాంతమును ముట్టడించి లోఁబఱుచుకొనెను; కాని మూఁడుసంవత్సరములు కడచినవెనుక వహాబీలు షియాముసల్మానుల పవిత్రస్థానమగు కర్బాలాను నాశనముచేసి యామఱుసటిసంవత్సరము మక్కాను ముట్టడించుటచేత తురుష్కులు హాసాను వదలవలసినవారైరి. ఈ మక్కా, కర్బాలాయుద్ధములందు వహాబీలు ముసల్మానులగోరీలు మున్నగువానిని ధ్వంసముచేసి విలువగల యవశేషములను దోచికొనిపోయిరి. కర్బాలా నగరమును ధ్వంసముచేసి యపవిత్రపఱిచినందులకై పగ దీర్చుకొన షియాధర్మావలంబి యొకఁడు అబ్దుల్ అజీజ్ ఇబ్న్ సౌదును ౧౮౦౩-వ సంవత్సరమున దరియా యందలి మసీదులో హత్యగావించెను. వెంటనే యతనికుమారుఁడగు సౌదు రాజ్యభారమును వహించెను. ఇతఁ డనేక యుద్ధరంగములందు ఆదివఱకే ప్రసిద్ధికెక్కియుండెను. ౧౮౦౪ లో నితఁడు మదీనానగరమును వశముగావించికొని యచట రాజ్యాభిషేకమును సైతము చేయించుకొనెను. అనంతరము యమన్, ఉమ్మాన్ ప్రాంతములును ఇతనివశ మయ్యెను. ఈ ప్రకార మిచట వహాబీ రాజ్యము ప్రవర్ధమాన మగుచుండ అట్టోమన్‌సామ్రాజ్యమువారికి మిగుల భయముకలిగెను. అందువలనఁ దమయధీనుఁ డైయున్న ఈజిప్టు గవర్నర్ జనరలగు మహమ్మద్ అలీని వహాబీలపై దండెత్తుమని తురుష్కదొరతనము వారు నియోగించిరి. మహమ్మదలీ స్వయముగ యుద్ధమున కేఁగక అతఁడు టుస్సూన్ అను తనకుమారుని వందుల కాజ్ఞాపించెను. ౧౮౧౧-వ సంవత్సరమున సౌదు బాగ్దాద్‌పట్టణమునకుఁబోయియుండ టుస్సూన్ సేనాయుతముగ వచ్చి హెజాజునందు విడిసెను. ఈసంగతి తెలిసినతోడనే సౌదుపడమటికి మరలి వచ్చి టుస్సూనును అచటనుండి పాఱఁదోలెను.

కాని ౧౮౧౩-వ సంవత్సరమున మక్కామదీనాలను మరల తురుష్కులే గెలిచికొనిరి. పిదప ౧౮౧౫ నందు మరల యుద్ధమారంభముగాఁగా తండ్రికొడుకు లిరువురు నేతెంచిరి. వీ రిద్దఱకును పరాజయమే కలిగెను. ౧౮౧౪ నందు సౌదు మరణించెను. ఇతని కుమారుఁడు సంధిచేసికొన నెంచెను గాని పొసఁగదయ్యెను. ౧౮౧౫ లో తుర్కీరాజప్రతినిధి రాస్ అనుస్థానమును జయించెను. అటుతరువాత నీరెండుకక్షులవారికిని సంధి కుదిరెను. ఈజిప్షనులు అరేబియాను వదలిపోయిరి. వీరు పోయినపిదప సౌదుకుమారుఁ డగు అబ్దుల్లా సంధినియమముల సరిగఁ బాలింపకపోవుటచేత ౧౮౧౬-వ సంవత్సరమున మరలఁ బోరాటము లారంభమయ్యెను. ఈజిప్షనులు లంచమిచ్చి రెండుజాతుల అరబ్బులను దమపక్షము గావించుకొనిరి. వారి సాహాయ్యమున వీరు వియనామకస్థానమున అబ్దుల్లాను ఓడించి అల్‌నెజ్దు దేశమునఁ బ్రవేశించి రాస్‌పట్టణమును ముట్టడించిరి కాని యది స్వాధీనము కాఁదయ్యెను. మహమ్మదలీయొక్క స్వీకృతపుత్రుఁడగు ఇబ్రహీం ఈ పర్యాయము సేనానాయకుఁడుగ నుండెను. ఇతఁడు రాస్‌నగరపు ఆక్రమణమును వీడి ఫిరంగులతోడ్పాటున అనైజాను వశపఱిచికొని పిదప బురైదాను జయించెను. అనంతరము మఱికొన్ని తెగల లోఁబఱిచికొని వారిసాయముతో ఈజిప్షనులు మక్రా, హురైముల, దరియా లను ప్రదేశముల నాశన మొనరించి యబ్దుల్లాను కైదీగఁ బట్టుకొని కడునీచముగ నతనిని వధించిరి. ఈజిప్టుసేన లన్నియు అల్‌నెజ్దునందు నిలువ, వహాబీ రాజ్యము ఛిన్నభిన్నమైపోయెను.

క్రీ. శ. ౧౮౨౪ లో అబ్దుల్లాకుమారుఁ డగు తుర్కీ కొంత సేనను సమకూర్చుకొని రియాద్‌నగరము రాజధానిగ మరల వహాబీ రాజ్యమును స్థాపించెను. ఇతఁడు పైకి ఈజిప్టుదొరతనమును స్వీకరించి దానికిఁ గొంత కప్పముగూడఁ గట్టుచుండెను. ఇట్లు పదిసంవత్సరముల పర్యంతము మెలకువతోడ వర్తించుచు స్వస్థితిని బలపఱుచుకొనుచుండెను. కాని ఇతఁ డీప్రయత్నములం దుండఁగనే యొక సంబంధిచేత నిహతుఁ డయ్యెను. అంత నితనికుమారుఁడు ఫెయిజాల్ ౧౮౩౪ లో రియాద్ సింహాసన మెక్కెను. ఇతఁ డీజిప్టునకు కప్పము గట్టుట మానినందున ఆదేశపుసేనలు మరల అరేబియాయందు ప్రవేశించి యితనిని బంధించి స్వదేశమునకుఁ గొనిపోయినవి. ఫెయిజాల్ స్థానమున నతని దూరబంధువగు ఖాలిద్ అనునతఁ డమీ రయ్యెను. ఇంతలో సిరియాదేశమువిషయమై ఈజిప్టు, టుర్కీదేశములకు యుద్ధము కలుగ, మహమ్మదలీ, ఇబ్రహీములకుఁ దోఁపడుట కరేబియాయందలి ఈజిప్షన్‌సేన లన్నిఁగము నచ్చోటు విడిచిపోవలసివచ్చెను. అదే తరుణమున, నసఁగా ౧౮౪౩-వ సంవత్సరమున ఫెయిజాల్ కారాగారమునుండి తప్పించుకొని స్వదేశమునకు రాఁగా జను లందఱు నతనినే తమకు పాలకునిగ నెన్నుకొనిరి. సిరియాయందు యుద్ధ మెక్కుడుగాఁగా, నరేబియాయందు మిగిలియుండిన ఈజిప్షన్‌సేనలు కూడ వెడలిపోయెను. అంత ఫెయిజాల్ సంపూర్ణస్వతంత్రుఁ డయ్యెను. యమన్, హెజాజ్ ఉమ్మాన్‌ప్రాంతములు తప్ప పూర్వ మితని పూర్వుల యధీనమం

sampath_Ebooks


దున్నదేశము చాలవఱకు మరల నితని యధికారము క్రిందికి వచ్చెను. పై మూఁడు ప్రాంతములును బ్రిటిష్‌వారి నిరీక్షణమందే యుండిపోయెను. పిదప ఫెయిజాల్ నెమ్మదిగ తనస్థితిని బలపఱచుకొనుచుండే ముసలి వాఁడై యుండెను. ఇతని కిద్దఱు కుమారులు. వారియందును భేదభావము గనిపింపకుండులాగున నితఁడు జాగరూకుఁడైయుండెను.

అబ్దుల్లా ఇబ్నరషీద్ అను నతఁడు షమ్మారుప్రముఖులలో నొకఁడు. ఫైజల్ యొక్క తండ్రి వధింపఁబడె నని యిదివఱకే వ్రాయఁబడినది. పితృఘాతుకుని జంపి స్వరాజ్యమును రాఁబట్టుకొనవలయు నని ఫైజల్ కావించిన ప్రయత్నమున కీషమ్మార్ ప్రముఖుఁడు మంచి సాయము సలిపియుండెను. అందులకు కృతజ్ఞతాసూచకముగ ఫెయిజాల్ హె యిల్ పట్టణప్రాంతమును రషీదున కిచ్చి యతనిని ప్రభువును గావించెను. అనంతరము ఫెయిజాల్ ఈజిప్టువకు ఖైదీగఁ బట్టుకొనిపోఁబడినప్పటికిని రషీదుమాత్రము స్వదేశమున మిగుల జాగరూకుఁడై బదువీల నంపఱను ప్రేమానురాగములతోఁ బాలించుచు రాజ్యము వభివృద్ధి నొందించెను. ఫెయిజాల్ కారాగారమునుండి తప్పించుకొని వచ్చునప్పటికి రషీదు జబల్‌షమ్మారులోని చాలభాగమును వశపఱచుకొని రాజ్యమును మంచి వ్యవస్థతో పాలించుచుండెను.

క్రీ. శ. ౧౮౪౭ నందు రషీదు మరణించెను. అంత నితని కుమారుఁడు తలాల్ ఖైబరు జెయిమాలవఱకును దనరాజ్యమును విస్తృతము గావించుకొనెను. ౧౮౬౮ లో నితఁ డాత్మహత్య చేసికొనెను. ఇంతవఱకు వహాబీ, షమ్మార్ రాజ్యములు రెండును మైత్రి కలిగియే యుండెను. తలాల్ మృతినొందినపిదప నతనిసోదరులు, జామాతలు మొదలగువారిచేతులలోనుండి ప్రసరించుచు తుద కీరాజ్యము మహమ్మద్ అనునతనిచేతులందుఁ బడెను. ఇతఁడు రాజ్యమునకు హక్కుదారగు నని తోఁచినవానినెల్లఁ జంపించి నిష్కంటకుఁడై సింహాసన మధిరోహించెను

అనంతర మితఁడు తనరాజ్యముయొక్క ఉత్తర, పశ్చిమ సీమలను సుస్థిరము సలుపుకొని ౧౮౬౫-న దక్షిణమునకు మరలెను. ఫెయిజాల్ యొక్క కుమారులలో పెద్దవాఁడగు అబ్దుల్లా ౬ సంవత్సరములు రాజ్య మొనరించినపిదప నతనితమ్ముఁడగు సౌదుచే రాజ్యపదభ్రష్టుఁ డైపోయి షమ్మారుపాలకుని నాశ్రయించెను. మహమ్మద్ సౌదును బాఁదోలి అబ్దుల్లాకు రాజ్యము నిప్పించెను కాని ౧౮౭౮-వ సంవత్సరమున మరల రాజ్యచ్యుతుఁడై యితఁడు హెయిల్‌నగరమునకుఁ బరువెత్తి యచటనుండి బాగ్దాదున కేఁగి తురుష్కులసాహాయ్యము గోరెను. ఈ చిప్పతో విరోధ మూనినకారణమున తుర్కీకి అరేబియామీఁదఁగల యధికారము పూర్తిగ నశించియుండెను. ఇప్పుడు మరల అబ్దుల్లాకారణమున నాదేశమునఁ బ్రవేశము గలుగఁజేసికొను నభిలాషతో తురుష్కు లాంగ్లేయులు వల దనుచుండినను వినక ౧౮౭౫-వ సంవత్సరమున పాషాను బంపించి క్రొత్తగ నెజ్దు ఇలాకాను కల్పించి అబ్దుల్లాను దాని కధిపతిగఁ జేసిరి. ఈ నూతనప్రాంత సృష్టివలన అన్నదమ్ములకలహములు శాశ్వతము లయ్యెను. ఇదేసమయమున తురుష్కులు రషియనుయుద్ధములోఁ జేరుటవలన అటుపిమ్మట వారి కరేబియావిషయమున ప్రవేశము కలుగఁజేసికొనుటకు వీలు కలుగకుండెను. అట్టిసందర్భములందును బహరినును ముట్టడింపవలయు నని కొందఱు తురుష్క సేనాపతులు తలంచిరి కాని ఇంగ్లీషువారు వారిని బెదరించి తఱుమఁగొట్టిరి. వహాబీసోదరుల వైరకారణమున అల్‌నెజ్ద్ ప్రాంతమంతయుఁ గలహమున మునిగి తేలుచుండెను. ఆసమయమును గనిపెట్టి హెయిల్‌పాలకుఁడగు మహమ్మద్ నెజ్ద్‌ను హరింప నుపాయములను బన్నుచుండెను.

క్రీ.శ.౧౮౯౧-వ సంవత్సరమున ములైదాయొద్ద నొకయుద్ధము జరిగెను. అప్పుడు షమ్మార్‌హర్బ్‌జాతులు హెయిల్ పక్షమునను, ముతైర్, అతైబాతెగలు వహాబీలపక్షమును జేకొనెను. జయము షమ్మార్‌పాలకునకే కలిగెను. అది మొదలుకొని ఆఱుసంవత్సరముల పర్యంతము జౌఫ్ వాడీ దువాసీరులమధ్యఁగల ప్రదేశము మహమ్మద్ అధికారమునఁ జేరియుండెను. వహాబీవంశాధికారము నష్టప్రాయ మైపోయెను. చావఁగా మిగిలిన సౌదువంశజులు కువైట్, బహరీన్ లోనగు పర్షియన్ సింధుశాఖాతటమున నున్న సంస్థానములం దెక్కడనో తల దాఁచుకొనిరి. మహమ్మద్ ఇబ్నరషీద్ రాజ్యము స్థిరముగ నెలకొనె నని యందఱకును నిశ్చిత మైపోయెను. కాని మహమ్మద్ మరణానంతరము ౧౮౯౭-వ సంవత్సరమున ఇబ్నసౌదువంశము మరల విజృంభింప మహమ్మద్‌కుటుంబము పేరులేకుండఁ బోయెను. మహమ్మద్ సంతానహీనుఁ డగుటవలన నతనితమ్మునికొడు కగు అబ్దుల్ అజీజ్ రాజ్యమునకు వచ్చెను. మహమ్మదునం దుండిన రాజ్యకార్యనిర్వహణ సామర్థ్య మితనియందు లేదయ్యెను. ఈతరుణమున కువైటునందు షేక్ ముబారక్ అను విఖ్యాతపురుషుఁ డొకఁ డుండెను. ఫెయిజాల్ కనిష్ఠపుత్త్రుఁడగు అబ్దుల్‌రహమాన్ యొక్క కుమారుఁడు, అబ్దుల్ అజీజ్ ఇబ్నసౌదు ప్రవాసకాలమున నీ షేక్ ముబారక్ వద్ద నివసించియుండెను. ఈమహాపురుషుని యధీనమునందుండి సౌదు పొందిన రాజనీతిశిక్షణమే అరేబియాయొక్క భావి భాగ్యాభాగ్యములకు హేతుభూత మయ్యెను.

క్రీ. శ. ౧౯౦౦-వ సంవత్సరమందే అబ్దుల్ రహమాన్ తన హక్కును స్థాపించుకొనఁగోరి ప్రయత్నము సలిపియుండెను కాని యది నెఱవేఱియుండలేదు. మఱుసటిసంవత్సరమున నతనికుమారుఁడగు సౌదు అసలైన కార్యక్రమమునకు దిగెను. టర్కీవలన ప్రేరితమై హెయిల్ షేక్ ముబారక్‌నకు విరుద్ధముగఁ బనిచేయఁగడఁగెను. ౧౯౦౧ లో ముబారక్కును ఆక్రమించుటకై అహమద్ ఫైజీపాషా బసరాయందు సన్నాహముల సలుపసాగెను. ముబారక్ ఆంగ్లేయుల సాయము గోర వీరు తురుష్కప్రయత్నముల భంగము గావించిరి. ఇందులకు ప్రతిఫలముగా బ్రిటిషువారు కువైటుతీరమునంతట కొంత యధికారమును బొందిరి. తాము దప్ప నితరు లెవ్వరును పర్షియన్

sampath_Ebooks

సింధుశాఖాతీరమున నీప్రదేశమందును నెల వేర్పఱుచుకొనుటకు వీలు లేకుండఁ జేసికొనిరి. కువైటునందలి సమాచారము లిటులుండ ఇబ్న్ సౌద్ విశ్వాసపాత్రులగు కొందఱు అనుచరులను వెంటఁదీసికొని రాత్రి కాలమున రియాద్ నగరమునఁ బ్రవేశించి యచటి గవర్నరును దెగ టార్చెను. ఇట్లు రాజధాని వశమైనతోడనే దక్షిణమును, ఉత్తరమందలి వాషా, సుదైర్ నామకస్థానములను గోఁబఱుచుకొనఁ బ్రయత్నించెను. సరిగ నిదేసమయమున ముబారక్ షేకు ఈరాక్ మునతఫిక్ సమూహ పాషాలతోఁ గలసి తూర్పుదిక్కునుండి ఇబ్న్ రషీదును ముట్టడింప సాగెను. నీరి సాయము నొందియే ఇబ్న్ సౌద్ ౧౯౦౪ నందు రెండుపర్యాయములు షమ్మారుసేనల నోడించి కాసిం ప్రాంతమును వశపఱుచుకొనఁగలిగెను.

పిదప మదీనా, బసరాలనుండి తోడ్పాటు రాఁగా కాసిం మరల రషీదులయధీనములోనికిఁ బోయెను. మరల నదేసంవత్సరమున తురుష్క, షమ్మార్ సమ్మిళితసేనతో సౌదునాయకత్వమున వహాబీలకు ఘోరసంగ్రామము జరిగెను. ఇందు సౌదునకు బలమగు గాయము తగిలెను. ఈయుద్ధమువలన పరిష్కార మేమియు తేలియుండలేదు. కాని తురుష్కులు మధ్య-అరేబియాను వదలిపోవుటచేతను, కాసిం జిల్లా సౌదు అధికారమునందే యుండుటచేతను వహాబీలకే జయము కలిగె నని తలంపవచ్చును. ఈ నిర్ణయము ౧౯౦౬-వ సంవత్సరమున రౌధత్ అల్ ముహన్నా నామకస్థానమున ఈరెండుకక్షులవారికిని జరగిన వేఱొకయుద్ధమున స్పష్టమయ్యెను. ఇచట రషీద్ అపజయముతో పాటు ప్రాణములనైతము గోల్పోయెను. అది మొదలు షమ్మార్ సేనలు వహాబీలయిలాకాపై నెప్పుడును దండెత్తి వచ్చియుండలేదు.

రషీద్ మరణానంతరము రెండుమూఁడు సంవత్సరములవఱకును షమ్మారునం దొకవిధముగు అరాజకమే యుండెను. తుదైన్ వంశీయులనేకు లిచటిసింహాసనమునకై తగవులాడిరి. తుదకు అజీజ్ పుత్రుఁడైన సౌద్ అనునతనికి జయము కలుగ నతఁడు ౧౯౨౦-వఱకును గొంత స్థిమితముగ రాజ్యమేలెను కాని యాసంవత్సరమున నతఁడును నిహతుఁడయ్యెను. ౧౯౨౧ లో వహాబీనేత యగు ఇబ్న్ సౌద్ హాయిల్ నగరమును దనవశముచేసికొని రషీద్ వంశమున జీవించియున్నవారి నందఱను దనరాజధాని యగు రియాద్ నగరమునకుఁ బంపివైచెను. ఇంచుమించుగ ౮౦ సంవత్సరములు స్వతంత్రముగ నుండిన షమ్మార్ రాజ్య మంతటనుండియు వహాబీరాజ్యమం దొకభాగమై నేఁటివఱకు నటులే యున్నది. రౌధత్ అల్ ముహన్నాయొద్దఁ గలిగినజయమువలన ఇబ్న్ సౌద్ నెజ్ద్ ప్రాంతమున సంపూర్ణస్వాతంత్ర్యమును బొంది నిరాటంకముగఁ దనస్థితిని దృఢపఱుచుకొనసాగెను.

ఒకచోట నిల్లు వాకిలి యనునది లేక నిరంతరము దేశాటన మొనరించుచుండు బదువీల నందఱ నొక నూతనసిద్ధాంతమునకుఁ గట్టుబడఁజేసి వారి తోడ్పాటున మహాకార్యములఁ జేయవలయునని వహాబ్ సౌదులు ప్రయత్నము చేయఁగడఁగిన ఆరంభకాలమందు వారి చర్యల నన్నింటిని జూచి లోకులు భవిష్యత్తునుగూర్చి యాశాసహితులు కారైరి. కాని ఇప్పుడు వారికార్యములను స్తుతింపనివారు లేరు. ఒకచోట నిలుకడలేక, అందువలన నైకమత్యము లేక దేశమందంతట సంచరించుచుండు తెగల నన్నింటి నాయాప్రాంతములందు నిలుచునట్లును, అందులకు సదుపాయములను జేసి యనంతరము వారి నందఱ నొకకార్యమునిమిత్తము సంసిద్ధులఁ జేసి తన్మూలమున అరేబియాయందు స్వాతంత్ర్యము నెలకొల్పుటయే వహాబ్ యొక్కయు, నతని యనుయాయి యగు సౌదుయొక్కయు ప్రధానోద్దేశమై యుండెను. వీరికార్యములందు కృతకృత్యులగుటం జేసియే నేఁడు అరేబియాయందు పోయినవి పోఁగా మిగిలిన రాష్ట్రము లన్నియు నేకీభవించి స్వాతంత్ర్యము ననుభవించుచున్నవి. ఇదియే వహాబీ ఉద్యమమునకు ఫలము.

ఇబ్న్ సౌద్ తన ప్రభుత్వమును స్థిరపఱుచుకొను ప్రయత్నములం దుండ తురుష్కులు నెజ్దును హరింపవలెనని మున్ను కువైట్ ప్రాంతముపై నడవ ప్రయత్నించుచుండిరి. దీనిని గనిపట్టి ఇబ్న్ సౌద్ ౧౯౧౪-వ సంవత్సరమున నాకస్మికముగ హాసామీఁది కేఁగి స్వల్ప సేనతో హుఫూఫ్ పట్టణమును రాత్రికాలమున ముట్టడించెను. అక్కడ నుండిన తురుష్కసేన లితని నెదిరించుటకు మాఱుగ ఇబ్రహీం పాషామసీదునం దారాత్రి యంతయు దాఁగియుండి మఱునాఁ డితని శరణుచొచ్చెను. అంత నతఁ డా తురుష్కసేనను నడపించుకొని పోయి కటిఫ్, ఉకైర్ నామకస్థలములం దున్న మఱికొన్ని తురుష్కసేనలతోఁ గలిపి వారి నందఱను శాంతముగ స్వదేశమున కేఁగుఁడని యాజ్ఞాపించెను. ఇదేసమయమున తురుష్కులకు జర్మనీయుద్ధమందుఁ బ్రవేశింపవలసివచ్చుటచే అరబ్బుల నేమియుఁ జేయఁజాలరైరి. ఇందువలన వీరు హాసానే కాదు; అరేబియాయందలి తమ ఇలాకాల నన్నింటిని పోఁగొట్టుకొనిరి.

జర్మనీయుద్ధ మారంభమైనవెంటనే ఇబ్న్ సౌదును దమపక్షమున నుంచుకొను నభిప్రాయముతో బ్రిటిషువారు కెప్టెన్, డబ్లియు. హెచ్. ఐ. షేక్స్పియరును అతనియొద్దకు రాయబారిగ నంపిరి. వెంటనే యతఁడు తుర్కీపక్షము వహించిన జబల్ షమ్మార్ మీఁద దండెత్త, ౧౯౧౫ లో జర్రాబ్ వద్ద యుద్ధము జరగెను. దీనివలన నిశ్చితముగ విజయ మెవ్వరికిని గలుగలేదు. మీఁదుమిక్కిలి షేక్స్పియర్ మరణించెను. అంత నాంగ్లేయులు పరస్పరస్నేహభావము కలిగియుండులాగున సౌదుతో మైత్రిచేసి సంధి కుదుర్చుకొని యుద్ధమునమండి విరమించిరి.

ఈకాలమందే మక్కాయందలి ధనాఢ్యుఁ డగు షరీఫ్ హుస్సేన్ ఇబ్న్ అలీ యనునతఁడు తురుష్కుల నిరాకరించి అరేబియాకుఁ దానే రాజు నని ప్రకటించుకొనెను. ఇబ్న్ సౌదుని కీద్వైతాధిపత్యము గిట్టదు. అందుచే హుస్సేన్ మీఁద దండెత్తఁ దలఁచియు చాలకాలమువఱకు నాంగ్లేయుల మాధ్యస్థ్యమువలన నాగియుండెను. ౧౯౧౬-వ సంవత్సరమున హెజాజ్, నెజ్ద్ సరిహద్దులందు ఖుర్మ

sampath_Ebooks

ప్రదేశమువిషయమై షరీఫ్, సౌదులకు తగవు లుత్పత్తిల్లెను. ఖుర్మనులు షరీఫ్ ప్రభుత్వము నంగీకరింపక సౌదునెడల పక్షపాతము కలిగి యుండిరి. ఖుర్మా వీరుఁ డొకఁడు తన యిలాకాజనుల నందఱ నేకీభవింపఁజేసి మూఁడుపర్యాయములు హెజాజ్ సేనల నోడించి పాఱఁదోలెను. వహాబీలసాహాయ్య ముండుటచేతనే వా రిట్లు గావింపఁగలిగిరని షరీఫ్ ఆంగ్లేయులతో మొఱలిడెను. బ్రిటిష్‌వారు సౌదును బెదిరించి యట్టిపనిమండి దూరముగ నుండ బోధించిరి కాని నిష్ఫలమయ్యెను. ౧౯౧౮-వ సంవత్సరానంతరము హుస్సేన్ కుమారుఁ డగు అబ్దుల్లా హెజాజ్ సేనతో వచ్చి ఖుర్మ కెనుబది మైళ్ల దూరమున తురాబ యనుచోట విడిసియుండెను. వహాబీలు రాత్రికాలమున వారిం దాఁకి వారిసేనను నాశనముచేసి పాఱఁదోలిరి. అబ్దుల్లామాత్రము ప్రాణముల దక్కించుకొని పాఱిపోయెను. సౌదు తురాబాను తన రాజ్యమునఁ గలుపుకొని స్వనగరమునకు వెడలిపోయెను. ౧౯౨౦ లో ఇథనామక రాజధానీపట్టణముతో పాటు అసీరుదేశము సౌదురాజ్యమునందుఁ గలసెను. ఆ మఱుసటిసంవత్సరము హాయిల్ విజయముతో పాటు ఖైబర్, టెయిమా ఇలాకాలు వహాబీలపా లయ్యెను.

క్రీ. శ. ౧౯౨౨ లో జౌఫ్‌నగరవిజయముతో అరేబియామధ్యప్రదేశ మంతయు సౌదువశ మయ్యెను. హెజాజునందు షరీఫు నేర్పఱుచువిషయమున ౧౯౨౩-౧౯౨౪ లందు బ్రిటిష్‌రాజనీతిజ్ఞులు సౌదుతోఁ గలసి యాలోచించిరి కాని ఈప్రయత్నము సంపూర్ణముగ విఫలమయ్యెను. అంత ౧౯౨౪ నందు వహాబీలు టెయిఫ్‌నగరమును ముట్టడించి హెజాజు నాక్రమింపఁదలపెట్టిరి. దానితో పాటు మక్కా, మదీనా, జిడ్డానగరములను సైతము జయించి ౧౯౨౬ లో సౌదు తన్ను అరేబియాపాలకునిగ ఘోషణముచేసికొనెను. జిడ్డా నితఁడు ముట్టడించియున్నతరుణమందే సర్ గిల్‌బర్ట్ క్లేటన్ అను బ్రిటిష్‌రాయబారి సౌదును వాడీఫారిమాయందుఁ గలసికొని బహరిన్, హద్దాలసంఘులవిషయమున పరిష్కారములఁ గావించికొనెను. వీనివలన అల్ నెజ్డ్, జార్డన్ ప్రాంతముల సరిహద్దులు నియమితము లయ్యెను. అంతియు నదేసమయమున నెజ్డ్, ఈరాక్ సరిహద్దులవిషయమునఁగూడ పరిష్కారములు జరిగెను. హెజాజు మీఁదసైతము సంపూర్ణాధికారము లభించినపిమ్మట క్లేటను మఱియొకపర్యాయము సౌదును గలసికొని యప్పటివఱకును ఘటిల్లియుండిన సంఘుల నన్నిటిని పునర్విమర్శనపూర్వకముగ నిర్ణీతములఁ గావించుకొని యతనిని అరేబియాపాలకునిగ స్వీకరించి వచ్చెను.

అరేమాయిక్ — ఒకభాష. ఏసుక్రీస్తు మాతృభాష యిదియే. బహుశః ఇది బాబిలోనియాదేశమునఁ బ్రచారములో నుండ వచ్చును. ప్రస్తుతమున దీనికి సంబంధించిన వాఙ్మయ మేమియు లభించుటలేదు. బైబిలులోమాత్రము అరేమాయిక్ భాషలోని పదములు కొన్ని దొరలినవి.

అరైల్ — సంయుక్తప్రాంతములలో అలహాబాదుకోటకు సరిగా నెదుట యమునా గంగా సంగమస్థలమున, యమునానది కుడిగట్టుననున్న ప్రాచీనగ్రామము. ఇచ్చటఁ గడుపురాతనములైన వేణీమాధవ, సోమేశ్వరనాథదేవాలయము లున్నవి. అక్బరుచక్రవర్తి కట్టించిన మట్టికోట యొకటి కలదు. గంగాయమునల సంగమస్థానమున నుండుటచే యాత్రికు లనేకు లిచటికి వచ్చుచుందురు.

**అరోర్** — సింధుదేశమందలి సుకూర్ జిల్లాలోని యొక శీర్ణగ్రామము. ఇది పూర్వము సింధుదేశమునందు రాజ్యము చేసిన హిందూరాజులకు రాజధానిగ నుండె ననియెదరు. దానిని మహమ్మదీయులు క్రీ. శ. ౭౧౨ లో స్వాధీనపఱుచుకొనిరి. పూర్వ మీపట్టణమునొద్దనుండి సింధునది పాఱుచుండెను. ౯౬౨-వ సంవత్సరము ప్రాంతమున గొప్పభూకంపము కలిగి నదీప్రవాహము మాఱిపోయినది.

**అరోరా పోలారిస్** (ధ్రువజ్యోతి) — దక్షిణోత్తర ధ్రువములందు క్షితిజము (Horizon) న కించుక యెగువనఁ బ్రకటమగు దేదీప్యమానమైన ప్రాకృతిక దృశ్యము. ఉత్తరధ్రువమందలి దృశ్యమునకు అరోరా బోరియాలిస్ (Aurora Borealis) అనియు, దక్షిణధ్రువమునందల్లి దృశ్యమునకు అరోరా ఆస్ట్రాలిస్ (Aurora Australis) అనియుఁ బేరులు. ఈ రెండింటికిని సామాన్యముగ నామము అరోరా పోలారిస్; ఇది కేవలము ఒక్క రూపముతోఁగాక అనేకరూపములతోఁ బ్రకటన మగుచుండును. అందుఁ గొన్నిరూపములు చూచుట కత్యంతమనోహరములై యుండును.

వీనియందుఁ గలుగు నానావిధరూపముల ననేకు లనేకరీతుల వర్ణించియుండినను సర్వసమ్మతముగ స్వీకరింపఁబడినవి చాల తక్కువ. ధనుస్సులు, దళములు, కిరణములు, యవనికలు, ఛాయామండలములు, శకలములు, పరివ్యాప్తపుంజములు నని వీనియందుఁ గన్పించు రూపములఁ గొన్నింటిని నిరూపింపవచ్చును. క్షితిజము (Horizon) మీఁద నించుకయెత్తున మసకమసకగఁ గన్పించుస్థానమునుండి ప్రకాశరేఖ లూర్ధ్వాభిముఖముగ బయలువెడలిపోయి ఆకాశమధ్యమునుండి విప్పిన ఛత్రమువలెనో లేక తిరుగ వంచిన విల్లంబువలెనో క్షితిజముమీఁదికి వ్రాలియుండును. ఈజ్యోతిర్ధనుస్సుయొక్క రెండువివరలును క్షితిజమునకుఁ దగిలియో లేక మధ్యభాగమందే యంతరించియో యుండును. తలక్రిందుగ వంచిన ధనుస్సులయాకారము గలిగియుండుటచే వీనికి ధనుస్సు లని పేరు. ఇందలి కిరణసమూహము లన్నియు, జాజ్వల్యమానములై పరిభ్రమించుచుండును గాని నిలుకడగ నొక్కచోటైన నుండదు. మఱియు నొక్కచోసమయమున ననేకధనుస్సులు ప్రకటములగుటయుఁ గలదు. ఈ ధనురాకారజ్యోతియొక్క నతోదర (Concave) భాగము మిగుల స్ఫుటముగ నుండును. దానినంటుకొనియుండు ప్రదేశము దట్టమైన నలుపు గలిగి గాఢాంధకారబంధురమైయున్నట్లు గన్పించును. ఈభాగమునుండా నక్షత్రకాంతి ప్రసరింపఁగలదు. ఈయవకాశము వస్తుతః ఏమి యగునదియు శాస్త్రజ్ఞు

sampath_Ebooks

లింతవఱకు నిశ్చయించియుండలేదు. కొన్ని ధ్రువజ్యోతులు దళాకారముల నొప్పి వంకరటింకరగ నడచు సర్పాకృతి గలిగియుండును. ఈ ధనురాకార, ఒళాకారజ్యోతుల కాధారభూతము లైనవి కిరణములు. ఇవి పరస్పరము కలసియుండుటయు, విరళములుగ నుండుటయుఁ గలదు. వెండియు నివి నిట్టనిలువుగ సమాంతరములు గలిగి యుండును. మఱికొన్ని వేళల నీకిరణము లన్నియు నేదో యొకకేంద్రమునకే అభిముఖము లై పోవుటయుఁ గలదు. ఒక్కొక్క సమయమున నివి అనేకతాళవృంతములుగఁ బరివర్తితము లగుచుండును. వేఱొండుతఱి వీని పరిమాణములందు మార్పులు గలుగ నాకస్మికముగ క్షితిజము పైపునకు వచ్చుచున్నటులును, ఆకాశమున కెగురుచుండినటులును గోచర మగును. ఈ కారణముచేఁ బాశ్చాత్త్యులు వీని కానందనర్తకు (Merry dancers) లను నామకరణము గావించిరి.


కొన్ని ధ్రువజ్యోతులు వ్రేలాడఁగట్టిన తెరలవలెఁ గన్పించును. ఇట్టివి సాధారణముగ నుత్తరధ్రువమునందే కనుపడుచుండును గాని వేఱొకచోటఁ గానరావు. ఈ జ్యోతు లత్యంతాకర్షణీయములు. ఉపరిభాగమందలి కిరణము లించుక విరళములుగ నుండినను దిగువకు రానురాను దట్టములై ఏకీభావమును బొంది, యడుగున కుచ్చులు కుచ్చులుగ నేర్పడి వ్రేలాడుచుండు యవనికవలె మిగుల మనోహరములై కన్పడుచుండును. అధోభాగమునందు శోణవర్ణమును, ఊర్ధ్వమునందాకుపచ్చనిరంగును, మధ్య నీరెండింటిని గలుపు పసుపుపచ్చనిరంగును గల ఈయవనికాకారధ్రువజ్యోతి అనుపమానసౌందర్యమున నొప్పియుండును. తెరయందుఁగలుగు నానావిధములగు మడతలును వీనియందు గోచరము లగుచుండును. ఒక్కొక్కప్పు డిందలికిరణములు తిన్నగ నూర్ధ్వమున కేఁగి యచటఁ బ్రకాశవంత మగు నొకచేరేఖగఁ బరిణమించుచుండును. ఛాయామండలముయొక్క రూపమున దృగ్గోచర మగుజ్యోతులు కొన్ని కలవు. సంపూర్ణముగ వికాసమును బొంది దేదీప్యమాన మగు నీఛాయామండలాకారధ్రువకాంతి తక్కినరూపము లన్నింటికంటె నధికరమణీయమై కన్పించును. మధ్యభాగమున నలుపును దానికి నలుప్రక్కలను కిరీటాకారముగల కాంతిమండలమును విరాజమాన మగుచుండ నిది యెంతయు దర్శనీయ మైయుండును. ఇందలికాంతికిరణములు పరస్పరము గలసియో లేక లేకమాత్రము వేఱువేఱుగనో ఉండవచ్చును. కొన్నిసమయములందు ధ్రువజ్యోతి ఏకదేశమునఁగాక తునకలుతునకలుగ నాకసమునందంతట వ్యాపించియుండవచ్చును. అప్పు డివి సూర్యరశ్మిసంస్కృతము లగు మేఘఖండములవలెఁ గన్పించును. ఇదియే శకలాకారధ్రువజ్యోతి. వేఱొండు సమయమున నాకాశ మంతయు తెల్లనివెలుఁగుతో నావరించికొనియున్నటు లుండును. ఇందుఁ గొన్నిచోట్ల తక్కువప్రకాశమును మఱికొన్నితావులం దెక్కువప్రకాశమును ఉండును. వీనియందు విపక్షిత మగు ఆకార మేదియు నుండక జ్యోతిఃప్రసారిత మైయుండును. ఇంతపర్యంతము వివరించిన ఈవైవిధ్యరూపము లీప్రాకృతిక దృశ్యమందుఁ గన్పడు అనేకప్రకారములను నాకృతులను నిరూపించుటయందు లేశమాత్రమైనఁ దోడ్పడవచ్చును.

అక్షాంశ, రేఖాంశము (Latitudes & Longitudes)ల దూర సామీప్యములనుబట్టి ఈ ధ్రువజ్యోతిః ప్రాదుర్భావములందు హెచ్చు తగ్గులు కలుగుట అనుమానింపఁబడినది కాని ఇంకను నది నిశ్చితము కాలేదు. అధోభాగపు అక్షాంశము (Lower latitudes)లం దీజ్యోతులు బొత్తిగఁ గన్పించవు. దక్షిణార్ధపుగోళమందలి ఉన్నతాక్షాంశములందు (Higher latitudes) జనులు నివాసము చేయఁదగిన భూభాగ మేదియు లేకుండుటచే నటనుండి యీజ్యోతులఁ బరీక్షింప వలనులేకపోయెను. ఉత్తరార్ధగోళమందలి ఆర్కిటిక్ ప్రాంతములలోఁగూడ నీధ్రువజ్యోతు లగపడనిప్రదేశము లనేకములు గలవు. కావున నీ అక్షాంశ, రేఖాంశదూరసామీప్యముల ననుసరించి వీనియందు మార్పులు గలుగఁజేయు హేతువులను విమర్శింప వీలు లేకపోయెను. నిరక్షరేఖ (Equator)నుండి బయలువెడలి యుత్తరాభిముఖముగఁ బ్రయాణము సలుపుచో స్పెయినుదేశమునకుఁ జాల దక్షిణముగ పదిసంవత్సరములలో సగటున నొకధ్రువజ్యోతి కన్పించు నని తెలియవచ్చును. ఫ్రాన్సుదేశపు ఉత్తరభాగమున నీసగటుసంఖ్య సంవత్సరమున కయిదువఱకును పెరుఁగును. అయిర్లాండుదేశమున కుత్తరముగాఁ బోయినసంవత్సరమునకు ముప్పదిపర్యాయములు ధ్రువజ్యోతి గన్పించును. షెట్లాండ్ద్వీపములకుఁ గొంచె ముత్తరముగ సంవత్సరమునకు నూఱుపర్యాయము లగపడును. షెట్లాండ్, అయిస్లాండ్ద్వీపములమధ్య నివి అధికాధికముగఁ నొకానొకస్థానమునఁ గానవచ్చును. ఆస్థానమును దాఁటి యింకను ముందునకుఁ బోయిన నీప్రవర్తనములసంఖ్య మరలఁ దగ్గిపోవును. యూరాసియా (Eurasia)యందుకంటె నమెరికాయం దీజ్యోతు లెక్కువ దక్షిణమువఱకును గన్పించుచుండును, అనఁగా కనడాదేశమునకు దక్షిణముగను, సంయుక్తరాజ్యములలోని యక్షాంశములందును దృష్టిగోచరము లగు ధ్రువజ్యోతులు యూరపునందలి యవేయక్షాంశములందుఁ గన్పించవు.


ఈధ్రువసంబంధమైన తేజోరాశికిని విద్యుద్వికార ఘటనమునకును సన్నిహితసమానత గనుపడుటవలన నీ రెండింటికిని కారణములు గూడ సమానతనే కలిగియుండవచ్చును. విరళములగు వాయుతరంగములగుండా విద్యుద్రేఖలు ప్రవహించునపు డొకవిధమగు దీప్తిప్రవాహము జనించును. ధ్రువజ్యోతియందలి లక్షణము లీకృత్రిమ దీప్తిప్రవాహము నుండుటచేత వాతావరణముయొక్క ఉపరిభాగములగుండా విద్యుత్కణములు ప్రవహించుటవలననే ఇట్టి శోభాయమానమగు ప్రాకృతికదృశ్యము సంభవించు నని యూహింపవచ్చును. కాని యీవిద్యుత్కణములు వచ్చునది యెక్కడనుండి? సుమారు రెండువందలసంవత్సరములనుండి పాశ్చాత్త్యులు చేయుచు వచ్చిన యన్వేషణప్రయోగములవలన నేఁటి కీవిద్యుత్కణములు సూర్యబింబమునుండి వెలువడి వచ్చుచుండునట్లు సిద్ధాంతీకరింపఁబడినది; ఎందుచేత ననఁగా సూర్యభ్రమణము ననుసరించి ఉన్నత, మధ్యమాక్షాంశము

sampath_Ebooks

# అరోరా పోలారిస్



పటము ౧. రెండురకముల ధ్రువజ్యోతిర్ధనుస్సులు




పటము ౨. రెండురకముల ధ్రువజ్యోతికిరణములు

sampath_Ebooks


# అరోరా పోలారిస్



పటము ౩. ధ్రువజ్యోతి పరదములు



పటము ౪. సమాన్తర ధ్రువజ్యోతి యవనిక



పటము ౫. ధ్రువజ్యోతి ప్రభామండలము

sampath_Ebooks

( Higher and mean latitudes ) లందు గోచరము లగు ధ్రువజ్యోతులలో వ్యత్యాసము గలుగుచువచ్చెను. సూర్యుఁడు క్షితిజము క్రిందికిఁ బోయినకాలఁది ధ్రువజ్యోతి ప్రదర్శనము లెక్కువకాసాగెను. దినమందలి వెలుతురు కారణమున వీనియందు మార్పులు గలుగుచు వచ్చినవి. ధనుస్సులు, దళములు మున్నగునవి స్థిరాకార జ్యోతులు. రాత్రులం దివి కిరణ, శలాకాకారముల వానికంటె ముందుగఁ బ్రకటమగుచుండును.

క్రీ. శ. ౧౮౪౯ మొదలుకొని ౧౯౦౭ వఱకును గావింపఁబడిన యన్వేషణములవలన సూర్యబింబముపై మచ్చ లెక్కుడుగ నుండుసంవత్సరమున నీప్రదర్శనము లెక్కువగఁ గలుగునట్లును మచ్చలు డక్కువైన తక్కువగలుగునట్లును గనిపట్టఁబడినది. సూర్యుని ఉచ్ఛ్రాయరేఖ( Meridian ) కష్టముగా విశిష్టమగు నొక మచ్చ ప్రసరించి పోవుకాలమునందును ఈ ప్రదర్శనములు గలుగునని యిటీవలి యన్వేషణములవలన స్థిరపడినది. మఱియు భూగ్రహమునకుఁ జెందిన సూర్యభ్రమణకాల మగు ౨౭ దినములతరువాత వచ్చిన ప్రదర్శనములవంటివే మరల వచ్చునట్లు దేలినది. ఈ మీఁద వచించిన హేతువు లన్నింటివలన ధ్రువజ్యోతి సూర్యప్రభావముననే ఉత్తేజితమగునని నిశ్చయింపఁబడెను. సూర్యబింబమునుండి వెడలివచ్చు విద్యుత్కణపుంజములు వాతావరణము యొక్క ఉపరిభాగమునఁ గొట్టుకొనుటచే నిట్టి ప్రదర్శనము లుత్పన్నము లగుచుండును. ఈ విద్యుత్కణములు సూర్యుని విడనాడి వచ్చుచు భూగ్రహమును సమీపించు సమయమున ధ్రువప్రాంతమందలి చుంబకీయకేంద్రబలమున నాకృష్టములై తిన్నగ ధ్రువముపై పునకుఁబోవునుగాని వేఱొండు ప్రక్కకుఁబోవు.

ఈ ధ్రువజ్యోతులమీఁదను చంద్రకాంతిప్రభావముసైతము గలుగును కాని యది జ్యోతియొక్క బలాబలములమీఁద నాధారపడియుండును. మేఘములమూలమునను నీజ్యోతులందు హెచ్చుతగ్గులు కలుగుచుండు నని కొన్ని ప్రదేశములందుఁ గావించిన యన్వేషణముల ద్వారా కనుఁగొనఁబడినది.

ధ్రువజ్యోతిః ప్రదర్శనకాలమందే చుంబకీయసూచీ ( Magnetic needle ) సంచాలనములును గలుగుచుండును. మఱియు నుత్తరమునకు పడమరగా నుండుక్షితిజమందలి యొకస్థానమునుండి యుత్పన్నములగు కిరణములు గాని, మిణుఁగురులు గాని చుంబకీయ ఉచ్చరేఖయందే పరుగిడుచుండుట తఱచుగఁ గానవచ్చెను. ఇందువలన నీధ్రువజ్యోతికి చుంబకసంబంధ ముండుట నిశ్చయమైనది. చుంబకీయము లగు తుపానుల( Magnetic Storms )తోడను నీజ్యోతులకు సంబంధ ముండినట్లు ఈరెండు నొకటేపర్యాయము సంభవించుచుండుటవలన విదిత మయ్యెను. ఇదికాక సాధారణపు టెలిగ్రాఫ్ తీగెలందలి విద్యుత్ ప్రవాహములకును, వీనికిని సంబంధ ముండు ననియుఁ గనుఁగొనఁబడెను.

ఈ ధ్రువజ్యోతులపొడువును దెలిసికొనుటకై యనేక ప్రయోగములు కావింపఁబడినవి. సమశీతోష్ణాక్షాంశములందలిజ్యోతు లాకాశమధ్యభాగము( Zenith )న కంటకపోయినప్పటికిని మిగుల నెత్తు గలిగియుండును. ఉన్నతాక్షాంశములం దింతయెత్తు గలిగియుండవు. వీనిపరిమాణములు నిలుకడగ నుండక క్షణక్షణమునకును పరివర్తనమందుచుండును.

ఆర్కిటిక్ సీమలం దివి ౩౬ మైళ్లు మొదలుకొని ౧౪౧ మైళ్ల యెత్తువఱకు నుండు నని నిశ్చయింపఁబడెను.

వెండియు నీధ్రువజ్యోతులకాంతి చుట్టుప్రక్కల నుండు ప్రకాశమునుబట్టి మాఱుచుండును. దళములు, కిరణములును అధోభాగమున మిక్కిలి ప్రకాశవంతములై కన్పించును. ధనుస్సులు క్షితిజముదగ్గఱవలె శిఖరమున నంత ప్రకాశవంతముగఁ గన్పించవు. ఈ జ్యోతులసామాన్యవర్ణము తెలుపు. ఇందు తళతళ మెఱయు పసుపుపచ్చనిరంగుకూడ మిళితమైయుండును. పరిసరములందలి ప్రకాశము మందముగ నుండినయెడల ధ్రువజ్యోతి వెండికాంతి గలిగియుండును. గాఢ మగు వర్ణము గలిగి క్షణక్షణము మాఱుచుండినయెడల నధోభాగమున శోణవర్ణము గనిపించును. ఇట్టిపరిస్థితులందే శిరోభాగమున నాకుపచ్చనిరంగు వెల్వడును. ఇటు లీధ్రువజ్యోతిఃకిరణము లత్యంత ప్రకాశమానము లయి తళతళలీనుచు నడుమున నెఱుపును, మూర్ధమున ఆకుపచ్చనివర్ణమును, ఈరెండింటిని మేళవించుచు మధ్యభాగమున పసుపుపచ్చనివర్ణము గలిగియుండును. కొన్నివేళలందు ఊదారంగు కూడఁ గన్పించును. ఈ ధ్రువజ్యోతిః ప్రదర్శనకాలములం దొక ప్రకార మగు ధ్వనికూడ జనించుట కలదు. దీని ననేకు లనేకవిధముల వర్ణించిరి. పట్టుబట్టలు పరస్పరము రాచికొనినయెడల జనించు ధ్వనినిబోలి యుండు నని కొందఱును, మైనప్రవత్తిదీపముమీఁద గాలి తగులుటవలనఁ బుట్టుధ్వనినిబోలి యుండు నని మఱికొందఱును వచించియుండిరి.

సూర్యునిదక్షిణాయనకాలమున దీర్ఘరాత్రులు గలిగియుండు ఉత్తరమందలి యున్నతాక్షాంశముల నివసించువారి కొక మనోహరమగుకాంతిని బ్రసాదించుచు వారియుల్లాసమును బెంపొందఁజేయునవి ఈ ధ్రువజ్యోతిః ప్రకాశములే.

**అరోరూట్** — ఇది అమెరికాదేశములో పైరగు ఒక చెట్టుయొక్క వేరు. ఈపదమునకు బాణపువేరు అని యర్థము. అమెరికాదేశస్థులు దీని పచ్చివేరురసమును బాణపు అలుగువలనఁ గలిగినగాయమున కుపయోగించుచుండినందువలన ఈ వేరునకు అరోరూట్ అను పేరు వచ్చినది. ఇది అరఁటికుటుంబములోఁ జేరినది. ఈవేరునుండి వరిపిండివంటి యొకవిధమైన పిండిని ఇప్పుడు తయారుచేసి అమ్ముచున్నారు. మొట్టమొదట ఈయొక్కవేరువలననుండి చేయఁబడు పిండికే అరోరూట్ పిండి అని చెప్పఁబడుచువచ్చినను ఇప్పుడు తత్సంబంధమైన పిండు లన్నియు అరోరూట్ పిండులే యని బజారులో అమ్మక మగుచున్నవి. ఈ యరోరూట్ పిండిలో బంగాళాదుంపపిండి, వరిపిండి మొదలగునవి కల్తీ చేయుచున్నారు. ఈ పిండు లన్నియు రుచిని

బట్టియు, సులభముగ జీర్ణమగుటనుబట్టియు ధరలలో వ్యత్యాసము గలిగియుండుటచే చౌకరకములను విలువగలరకములలో కల్తీ చేయుచుందురు. అసలు ఆరోరూటుపిండిలోనే మరంటా, టులేమా,



ఆరోరూట్

కర్కుమా, కెసావా, టక్కా, పోర్ట్లెండు మొదలగు రకముల భేదములు, అవి యుత్పత్తియగు చెట్లనుబట్టి యేర్పడియున్నవి. సూక్ష్మదర్శినిలో నీపొడి నుంచి, శోధించినయెడల కల్తీలు తెలియఁగలవు గాని సామాన్యశోధనవలన తెలియుట కష్టము.

మనదేశములోకూడ తాటిటేగలు మొదలగు కొన్ని వేరులనుండి యిట్టిపిండిని తయారుచేయుపద్ధతులు శోధింపఁదగియున్నవి.

**అర్కాన్సస్** — ౧. అమెరికాసంయుక్తరాజ్యములలో నొకటి. ఇది చాలభాగము పర్వతములతోను, అడవులతోను నిండియుండును. శీతోష్ణస్థితులు సాధారణముగ నెప్పుడును అనుకూలముగ నుండవు. ప్రత్తి, మొక్కజొన్న యిందలి పంటలలో ముఖ్యమైనవి. ౧౭-వ శతాబ్దిలోనే ఫ్రెంచివారీప్రదేశమునకు వలసవచ్చి యాక్రమించుకొనిరి. తరువాత కొంతకాలమున కమెరికాప్రభుత్వము దానిని కొని ౧౮౩౬-వ సంవత్సరమున సంయుక్తరాజ్యములలోఁ జేర్చుకొనెను. అర్కాన్సస్ వైశాల్యము ౫౩,౩౩౫ చదరపుమైళ్లు. జనసంఖ్య ౧౯,౫౦,౯౯౫.

౨. అమెరికాలోని మిసిసిప్పినది యొక్క పెద్ద-ఉపనదులలో నిది యొకటి. దీనిపొడుగు ౨,౧౭౦ మైళ్లు. దీనిబట్టియే పైరాజ్యమునకు అర్కాన్సస్ అనుపేరు కలిగినది.

**అర్కపర్ణుఁడు** — కశ్యపునకు మునియను భార్యయందుఁ బుట్టిన దేవగంధర్వులలో నొకఁడు. ఈతనికి తృణకుఁ డను నామాంతరము గలదు.

**అర్కప్రియాగ** — సంపూర్ణ - షాడవరాగము. ౨౭-వ మేళకర్త యగు సరసాంగిరాగజన్యము. ఆరోహణము - స రి గ మ ప ధ ని స; అవరోహణము — స ధ ప మ గ రి స యని సంచారము కలది.

**అర్కల్గూడ్** — మైసూరుసంస్థానము, హాసన్‌జిల్లాలోని యొకతాలూకా. వైశాల్యము ౨౬౧ చదరపుమైళ్లు. జనసంఖ్య ౭౬,౭౭౫. ఇందు మూఁడు పట్టణములును, ౩౦౦ల గ్రామములును గలవు. శిస్తు ౧,౨౫,౦౦౦ రూపాయలు. ఈతాలూకా యుత్తరపు సరిహద్దునందు హేమావతీనది కలదు. దక్షిణపుభాగమునుండి కావేరీనది ప్రవహించును. ఇట్లు నీటియాధార మెక్కువ యుండుటచే నిచ్చటి భూములలో వరిపంట యెక్కువగను, నిశ్చయముగను పండును. పెద్దచెఱువులక్రింద వరి కోసినతోడనే ఉల్లిగడ్డలు నాఁటుదురు. దక్షిణభాగమునందు కొబ్బరితోఁటలు, పోఁకతోఁటలును విశేషముగ కలవు. ఇచ్చటిపోఁకలు శ్రేష్ఠమైనవి కావు.

**అర్కావతి** — కావేరీనదిలోఁ గలయు నుపనది. ఇది మైసూరుసంస్థానములో నున్నది. దీనిపొడువు ౧౨౦ మైళ్లు నందిదుర్గములోఁ బుట్టి బెంగుళూరుజిల్లాలో ఉత్తరమునుండి దక్షిణమువైపు ప్రవహించును. కుముద్వతి, వృషభావతి అను నుపనదు లిందుఁ గలయును. ఉత్తరమువైపున దీనివలన పెద్దపెద్దచెఱువులు నిండును. బెంగుళూరునకు నీరిచ్చెడి హెసరఘట్ట అనుచెఱువునకు నిదియే యాధారము.

**అర్కిటాస్** (క్రీ. పూ. ౪౦౦) — టెరెంటంవాఁడు. గ్రీకుసేనాని. గణితశాస్త్రవేత్త. ప్లేటోకు స్నేహితుఁడు. భూమితిని (Geometry) మొదట యంత్రశాస్త్రమునకై ఉపయోగించినవాఁడు.

**అర్కిలోకస్** — క్రీ. పూ. ౭-వ శతాబ్దివాఁడు, గ్రీకుకవి.

**అర్కుఁడు** — ౧. సూర్యునకు పేరు.

౨. (చం. వం.) నీలకంఠజుఁ డగు పురుజరాజపుత్త్రుఁడు. భద్రాశ్వుఁ డితనిపుత్త్రుఁడు.

౩. రామసేనలోని యొకవానరుఁడు.

**అర్కేక** — ఫ్రాన్సులోని యొకగ్రామము. ఆరోగ్యమునకై యిక్కడకు రోగులు వచ్చుచుండెదరు.

**అర్కేడియా** — గ్రీసురాజ్యమందలి మోరియా ప్రాంతమున నొకప్రదేశము. దీనివైశాల్యము ౨,౦౨౯ చదరపుమైళ్లు. జనసంఖ్య ౧,౬౨,౩౨౪.

 sampath_Ebooks 

**అర్ఘపద** — గంజాంజిల్లా బరహంపురముతాలూకాయందలి గ్రామము. ఇచ్చటి జనసంఖ్య ౪౩౧ (౧౯౩౧).

**అర్ఘపూర్** — గంజాంజిల్లా గుంసూరు తాలూకాలోని గ్రామము. జనసంఖ్య ౧,౬౭౦ (౧౯౩౧).

**అర్ఘాపురో** — గంజాంజిల్లా కొడలతాలూకాలోనిజమీన్దారీగ్రామము. జనసంఖ్య ౧,౬౩౫ (౧౯౩౧).

**అర్ఘాపొల్లి** — గంజాంజిల్లా గుంసూరుతాలూకాయందలి ఈనాంగ్రామము. జనసంఖ్య ౩౦౮ (౧౯౩౧).

---

**అర్గలము** — ఇది దేవీసంబంధమగు నొకస్తోత్రము. దేవీమాహాత్మ్యపాఠారంభసమయమున దీనిని బఠింపవలయును. ఈస్తోత్రపఠనమువలన దుర్గామాహాత్మ్యఫలము వెంటనే సిద్ధించును. దుర్గామాహాత్మ్యము నారంభించుసమయమున నర్గలకీలకములను ముందు పఠించి తరువాతను కవచము, ననంతరము సప్తశతిని జపింపవలె నని బ్రహ్మ మార్కండేయునితో వచించియుండెను. అర్గలము దురితమును హరించును. కీలకము ఫలము నిచ్చును. కవచము రక్షించును. చండిక ఈమూఁడుప్రకారముల కార్యములను జేయును. అర్గలము హృదయమందుఁగలవాఁడు నిరర్గలవాక్కుగలవాఁ డగును. కీలకముగలుగువాఁడు వశకీలితుఁడును, కవచముగలవాఁడు వజ్రహృదయుఁడు నగును.

"జయ త్వం దేవి! చాముండే! జయ భూతాపహారిణి,
జయ సర్వగతే దేవి! కాలరాత్రి నమోఽస్తు తే."

అని యీస్తోత్రపఠనానంతరము మహాస్తోత్రపఠనం బొనరించి తరువాత సప్తశతి నారాధించువాఁడు కావలసినసంపద నొందును.

**అర్గాం** — బరాడ్ ప్రాంతమందలి కోట్‌జిల్లాలోని ఒకపల్లె. ఇచ్చోట జనరల్ వెలస్లె ౧౮౦౩ నవంబరు ౨౯-వ తేదీని నాగపురసైన్యములను ఓడించెను. దీని తరువాత వెంటనే గావిల్‌గడము పట్టుకొనఁబడియెను.

**అర్గ్వెలిస్, అగస్టిన్** (౧౭౭౬-౧౮౪౪) — స్పెయినుదేశ రాజ్యకార్యకుశలుఁడు. ౧౮౧౨-వ సంవత్సరములో ప్రజలకు ప్రభుత్వములోఁ గొన్నిహక్కుల నిచ్చునట్టి రాజ్యాంగసంబంధమైన సనదు స్పెయినుదేశపు ప్రజలకు ఒసంగఁబడియెను. దానికీతఁడు చాలవఱకుఁ గారకుఁడు. ౧౮౧౪-౨౦ లో నీతఁడు చెఱసాలయం దుంచఁబడియెను. ౧౮౨౩-౩౨ వఱకును దేశాంతరగతుఁడు గావలసినవాఁ డయ్యెను. తరువాత నీతఁడు స్పెయినులోని మితవాదులకు నాయకుఁ డయ్యెను. ౧౮౪౧ లో నీతఁడు ఇసాబెలారాణికి సంరక్షకుఁడుగ నుండెను.

**అర్గెన్సోలా, బార్తలోమె లియోనార్డో.** (౧౫౬౨-౧౬౩౧) — ౧. స్పెయినుదేశమందలి కవి, చరిత్రకారుఁడు. ఇతఁడును, ఇతని అన్నయైన లుపర్షియో అనువాఁడును అరెగొనీస్ అనఁబడు క్రొత్తసాహిత్యసంప్రదాయమునకు నాయకు లైరి.

**అర్గెన్సోలా, లుపర్షియో లియొనార్డో** (౧౫౫౯-౧౬౧౩) — ౨. పైవాని సోదరుఁడు. స్పెనిషు వాఙ్మయమునందు మంచి గౌరవము గలదు. ఇతఁడు ఆస్ట్రియాదేశపు పూర్వపు చక్రవర్తిని యైన మేరియా యను నామెకు కార్యదర్శిగ నుండెను. నేపిల్సునం దుండురాజప్రతినిధికి రాజ్యాంగకార్యదర్శిగను ఉండెను.

**అర్గెలాండర్, ఫ్రెడ్రిచ్ విల్‌హెల్మ్** (౧౭౯౯-౧౮౭౫) ఆగస్టు జర్మనుదేశజుఁడు. జ్యోతిశ్శాస్త్రవేత్త. ౧౮౨౩-౧౮౨౭ వఱకు ఆబోలోనున్న నక్షత్రశాలకు నీతఁడు నాయకుఁడుగ నుండెను. బాన్‌విద్యాపీఠమున జ్యోతిశ్శాస్త్ర మహామహోపాధ్యాయుఁడుగ నుండెను. ఈతఁడు ౨౨,౦౦౦ల నక్షత్రముల స్థానములను నిర్ణయించెను. ఆకాశనక్షత్రపటముల సంగ్రహమును ప్రకటించెను.

**అర్ఘున్** — కాశ్మీరదేశములోని వర్తకమే ప్రధానవృత్తిగాఁగల ఒకముసల్మాను తెగ. వీరు మంగోలియనులకుఁ జెందిన ఒక మిశ్రజాతివా రని కొందఱును, లడ్డాఖ్ ప్రాంతమునందలి స్త్రీలకును యార్కండ్, కాశ్మీరము, పంజాబు మొదలగుదేశములలోని మహమ్మదీయపురుషులకును జనించిన సంకరజాతివా రని కొందఱును తలఁచుచున్నారు.

**అర్చనపురం** — గంజాంజిల్లా పర్లాకిమిడితాలూకాయందలి జమీన్దారీగ్రామము. జనసంఖ్య ౪౦ మాత్రమే (౧౯౩౧).

**అర్చి** — ౧. వేనరాజుదేహమును మథింపఁగాఁ బుట్టిన మిథునమందలి స్త్రీ. మిథునమందలి పురుషుఁడైన పృథురాజునకు భార్య యయ్యెను.

౨. ప్రశాస్వఋషి యొక్క పెద్ద భార్య, ధూమ్రకేశఋషియొక్క తల్లి.

**అర్చికపర్వతము** — సైమూర్య పర్వతము.

**అర్చిమాలి** — సీతను వెదకుటకుఁ బశ్చిమ దిక్కునకుఁ బోయిన వానరులలో నొకఁడు.

**అర్చిరాదిమార్గము** — సూర్యలోకమును దాఁటి చంద్రలోకమును దాఁటి విద్యుల్లోకమును దాఁటి సగుణబ్రహ్మోపాసకులు బ్రహ్మలోకమునకుఁ బోవుమార్గము.

**అర్చిష్మంతుఁడు** — రామసేనలోని యొకవానరుఁడు.

**అర్చిష్మతి** — బృహస్పతికి రెండవభార్యయైన శుభయను దానికిఁ బుట్టిన యేడ్గురుకన్యలలో నాల్గవది.

**అర్గార్** — సంయుక్తప్రాంతములోని ఏటా తహసీలులో నొకచిన్న గ్రామము. దీనికి సమీపమున నొక పెద్ద సరస్సు కలదు. దీనిని ఓర్ఛానివాసి యగు సుర్జనసింగు అనునతడు ౧౮౩౧-వ సంవత్సరము లోఁ గట్టించెనఁట. దీని వైశాల్యము ౫౪.౩ చ. మైళ్లు. ఇందలి నీరంత యు ౨ రాతికుంట్లలో నింపఁబడియుండును. ఈనీటితో ౭,౦౦౦ ల యెకరములు సాగు చేయవచ్చునఁట. ఈచెఱువుగుండానే జిల్లాసరిహద్దున్నది. అందుచే నిందు కొంతభాగము ఓర్ఛారాజునకును, మఱికొంత భాగ మింగ్లీషుదొరతనమువారికిని జెందియున్నది. ఇంత పెద్ద దయినను ఈచెఱువుమూలమున సరాసరి వ్యవసాయ మేమియు జరుగుట లేదు.

**అర్జునకుఁడు** — ఒక లుబ్ధకుఁడు. గౌతమి యనునొక వృద్ధబ్రాహ్మణిపుత్త్రుఁడు సర్పదంశనమున మరణ మొందఁగా నితఁడాసర్పమును దెచ్చి చంపఁబోవ గౌతమి నివారించెను.

**అర్జునగిరిఅగ్రహారం** — విశాఖపట్టణముజిల్లా వీరవల్లి తాలూకాలోని ఈనాంగ్రామము. ఇచటి జనసంఖ్య ౧,౪౫౫ (౧౯౩౧).

**అర్జునగీత** — గుజరాతీభాషలో ధనదాసకవిచే రచింపఁబడినకావ్యము. కృష్ణార్జునసంవాదరూపము.

**అర్జునతీర్థము** — భారతవర్షీయతీర్థము.

**అర్జునదేవు** — సిక్కులమతమును స్థాపించిన నానకుని సింహాసనముపైని గూర్చుండిన యైదవపురుషుఁడు. నాలుగవ సిక్కుగురువగు రామదాసునకును, అతనిభార్య బీబిభానికిని జన్మించెను. ఈతఁడు క్రీ. శ. ౧౫౮౧ లో సింహాసనము నధిష్ఠించెను. గురునానకు చేసినబోధలు ఎంతటి భావగర్భిత మయినవో, జీవితమునందలి యెట్టిపరిస్థితి కయినను, సంఘముయొక్క యేదశ కయినను అవి యెట్లు వర్తింపఁగలవో బాగుగఁ గనిపట్టినవాఁడు అర్జున గురువు. కావున వాని ప్రాముఖ్యమును గుర్తించి తనకు పూర్వపుగురువుల బోధలలో నుత్తమమయినవానిని సంకలితము కావించి, వానితోపాటు తనవి కూడ కొన్ని ప్రార్థనలను బోధలను జేర్చి యొకగ్రంథముగ నిబంధించి యదియే 'గ్రంథ'మని ప్రకటించెను. దీనికే యిప్పుడు 'ఆదిగ్రంథ' మని పేరు. సిక్కుమతస్థుల కిది వేదము వంటిది (చూడుఁడు: ఆదిగ్రంథము). సిక్కులు దీనిని 'గ్రంథ్ సాహెబ్' అని గౌరవింతురు. ఇంతియకాక అర్జునదేవు తనశిష్యులకు మతాచారప్రవర్తనముల విషయమున కొన్ని విధివిధానముల నేర్పాటుచేసెను. ఇందువలన, అంతవఱకు నొక సరియైనవ్యవస్థ లేకయుండిన సిక్కుసంప్రదాయ మిప్పుడొక మత మయి విలసిల్లెను.

ఇతఁడు అమృతసరమును సిక్కు మతమునకు ప్రధానపీఠముగ కావించెను. ఇందువలన, అంతవఱకు ఒకచిన్నసరస్సుతో పేరుప్రతిష్ఠలు లేక యున్న యాయూరు క్రమముగా పెరిఁగి జనాకీర్ణమయి గొప్ప నగరముగ పెంపుచెంది, సిక్కుమతస్థులకు ప్రధానపుణ్యక్షేత్రమయినది. అర్జునదేవు తనశిష్యులను విదేశములకుఁ బంపి వర్తకవ్యాపారమునుగూడ సాగించుటవలన అమృతసరము శీఘ్రకాలముననే నాఁడు భాగ్యవంతము లయిన నగరములలో నొకటియైనది. తుర్కిస్థానమున నుండి గుఱ్ఱములను గొనుట, విక్రయించుట ప్రధానవర్తకముగ నుండినప్పటికి నితరవ్యాపారములందుఁగూడ అర్జునదేవునకు గొప్పలాభము వచ్చుచుండెను. ఈరీతిని అర్జునదేవుకాలమున సిక్కులకుఁ దమమతమునం దెంతటి యభినివేశ ముండెనో వర్తకమునందును అంతటి యాసక్తియు, నుత్సాహము నుండెను.




అర్జునదేవు

అర్జునదేవుకాలమున సిక్కుమతము ప్రతి రాష్ట్రమునందును పల్లెలందును, పట్టణములందును బాగుగ వ్యాపించినది. ప్రతిపట్టణము నందును సిక్కుమతస్థులు కనఁబడుచుండిరి. వీ రంతవఱకును తమ గురువులను సందర్శించినపుడు కానుకలను, కట్నములను జెల్లించుచుండుట యొకయాచారముగ వచ్చుచుండెను. అర్జునదేవీయాచారము నొకవిధిగ నిర్ణయించి, గురుదర్శనమునకు రాకపోయినను శిష్యు లేఁటేఁట కానుకలను విధాయకముగ చెల్లించునట్లు కట్టడిచేసి, యీకానుకలకు 'పన్ను' రూపము నొసంగెను. అర్జునదేవు ప్రతినిధు లీ 'పన్ను' నూరూర సంచారముచేసి సిక్కుమతస్థులవలనఁ గైకొని, సాంవత్సరికసమావేశసమయమున గురునికి సమర్పించువారు. ఈరీతి నర్జునదేవుకాలమున సిక్కు లొకవిధముగ ఒకపరిపాలనవ్యవస్థ కలవాటుపడిరి. ఇట్లు మత, వర్తకములు కారణముగ అర్జునదేవునకు గొప్పరాబడియు,


sampath_Ebooks

పలుకుబడియుఁగూడ సిద్ధించినది. గొప్పపదవులయం దుండినవారు కూడ అర్జునదేవుతో నెయ్యమును, వియ్యమునుగూడఁ గోరుచుండిరి. లాహోరుపరగణాకు అధికపరిపాలకుఁడుగ నుండిన చందూషా తన



సువర్ణదేవాలయము, అమృతసరము

కూఁతును అర్జునదేవుకొడుకునకు పెండ్లి చేసికొనవలసిన దని కోరినను ఇతఁడు నిరాకరించెను. ఇందువలన చందూషాకు అర్జునదేవుమీఁదను క్రోధము జనించినది. ఇతఁడు అప్పుడు పాదుషాగా నుండినజహాంగీరున కర్జునదేవు నన్న నసిష్టము కలిగించి యతనిపైఁ బగ సాధింపవలె నని తరుణము వేచియుండ నంతలో నదియు వచ్చినది. జహాంగీరు కుమారుఁడయిన ఖుస్రూ తండ్రిమీఁద పితూరీ రేఁగి పంజాబును తాత్కాలికముగ వశపఱుచుకొనియున్న సందర్భమున అర్జునదేవు అతనిపక్షము నభిమానించి యతఁడు విజయము నొందవలె నని



అర్జునదేవు సమాధి

ప్రార్థనలు జరపినట్లును, ఈసమాచారము చందూషావలననో, మఱి యేవిధముననో పాదుషాకు తెలిసి, వెంటనే యతఁడు అర్జునదేవును దనసముఖమునకుఁ బిలువనంపించి— అతనివలన నెప్పటికయినను ముప్పు రాఁగల దని చందూషా పాదుషాకు నూఁదిపోసి, యతనిని ప్రోత్సహించినందువలన నని చెప్పుదురు — గురుదేవునకు జరిమానా విధించుటయే కాక యతనిని బందీకృతుని గావించె ననియు, అతఁడు చెఱయందే మరణించె ననియు చెప్పుదురు. క్రీ. శ. ౧౬౦౬ న అర్జునదేవు కాలధర్మము నొందెను. కాని రావీనదిలో స్నానము చేసి వచ్చుటకు అర్జునదేవు పాదుషాయంగీకారమును బడసి వెళ్లె ననియు, అతనికి కావలి కాచుచున్న వారికి భయాశ్చర్యములు కలుగునట్లు అతఁడు స్నానము చేయుచుండఁగనే అనదియం దంతర్ధానము నొందె ననియు సిక్కుమతస్థులు తెలిపెదరు. అర్జునగురునిసమాధి నిప్పటికిని రావీనదీతీరమున లాహోరునందు దర్శింపవచ్చును.

**అర్జునపాలుఁడు** — (చం. వం.) వసుదేవుని సవతి తమ్ముఁడైన శమీకునకు సుదామిని యనుభార్యవలనఁ బుట్టిన యిద్దఱు పుత్త్రులలో నొకఁడు.

**అర్జునపురం** — గంజాంజిల్లా సోంపేట తాలూకా జలంత్రా యెస్టేటునందలి ఈనాం గ్రామము. జనసంఖ్య ౧౯౬. (౧౯౩౧).

**అర్జునవలస** — విశాఖపట్టణముజిల్లా చీపురుపల్లి తాలూకాయందలి ఈనాం గ్రామము. జనసంఖ్య ౪౨౪ (౧౯౩౧).

**అర్జునసింగ్** — రాజా మానసింహుని ముగ్గురుకొమాళ్లలో నొకఁడు.

**అర్జునాపురము** — కర్నూలుజిల్లా కోయిలకుంట్లతాలూకాలోని గ్రామము. జనసంఖ్య ౩౮౮ (౧౯౩౧).

**అర్జుని** — ౧. బాణాసురునికూఁతురు.

౨. బహుళ యను నామాంతరము గల యొక స్త్రీ.


**అర్జునీజమీందారీ** — మద్రాసురాష్ట్రములలోని చాందాజిల్లాలో నొకజమీందారీ. దీనివైశాల్యము ౧౩,౯౯౦ చ. మైళ్లు. ఈజమీకిఁ జెందినవి ౧౦ యూళ్లు. ఇందు సగమంతయు నడవులమయము. ౧౯౦౬-౦౭-వ సంవత్సరములో ౨,౫౦౦ ఎకరములభూమి సాగుబడియైనది. ఈసంస్థానములోని దేవపీలీ యనునూరిలో నొక దేవాలయము కలదు. ఈదేవాలయమున కదృశ్యరూపమున రెండు పులులు పహరా కాయుచుండు ననియు, సంస్థానాధిపతియవసానకాలమున నవి కానవచ్చు ననియుఁ జెప్పుకొందురు. ఎస్టేటురాబడి మొత్తము మీఁద రు ౩,౧౦౦ లు.

**అర్జునీనక్షత్రములు** — ఈ నక్షత్రములను ఇటీవలి గ్రంథకారులు ఫల్గునీ నక్షత్రము లనుచున్నారు. ఇవి పూర్వఫల్గుని, ఉత్తరఫల్గుని అని రెండు. 'ద్వే ద్వే ఖట్వం' - మంచపు కోళ్లవలె

sampath_Ebooks



రెండు - రెండు నక్షత్రము లని చెప్పుచున్నారు. కాని ప్రాచీన ఋగ్వేదమునందలి దశమమండలము ఎనుబదియైదవ సూక్తమునందు ఇవి అర్జునీనక్షత్రము లని పేర్కొనఁబడినవి. ఖగోళములో నీ నక్షత్రముల స్థితిని బట్టి మహాభారతమునం దర్జునునిపాత్ర రచింపఁబడినట్టు స్ఫురింపఁగలదు. ఏల యనఁగా, పూర్వఫల్గుని, ఉత్తర ఫల్గుని సింహరాశిలో చేరియున్నవి. అర్జునుఁడు సింహపరాక్రముఁడు. ఫల్గునిలో నొకదానికి భగుఁ డను దేవత అధిదేవతగా వర్ణింపఁబడెను. భాగ్యము నొసఁగువాఁడు భగుఁడు. అర్జునుఁడు ధనంజయుఁడును. ఈ నక్షత్రములకు మీనము ప్రతిస్పర్థి, అనఁగా అర్జునుఁ డుదయింపఁగానే మీన మదృశ్య మగును. మీన మన్నను మత్స్య మన్నను



అర్జునీనక్షత్రములు : సింహరాశి

౧, ౨, ౩, ౪, ౫ - మఘ (౧ - మఘ అని కొండఱమతము)

౬, ౭ - పూర్వఫల్గుని

౮, ౯ - ఉత్తరఫల్గుని

ఒకటేకదా! ఆకాశముమీఁద గిరగిర తిరుగు నీ మీనరాశినే భారతము మత్స్యయంత్ర మని వర్ణించుచున్నది. దీనిని అర్జునుఁడు తప్ప మఱియొకరు కొట్టలేకపోయిరి. మీన మదృశ్యము కాఁగానే కన్యారాశి రంగములోనికి వచ్చును, అనఁగా ఉదయించుచుండును. ఈకన్య అగ్నికుండసముద్భవ ; అయోనిజ ; మత్స్యయంత్రభేదకుఁ డయిన అర్జునుని వెంటనే రంగములోనికి వచ్చినది. పితృదేవతాకమైనమఘ (ధర్మరాజు), వాయుదేవతాకమైన స్వాతి ( భీముఁడు ), అశ్వినీదేవతాత్మకములైన చుక్కలు (Centaurus) రెండు. ఈ అయిదు నక్షత్రములమధ్య— పంచపర్వతములమధ్య నదివలె కన్యారాశి యున్నది. ఇంద్రియములు విషయరతిఁ బరిగ్రహించినట్లు పాండవు లేవురు నీమెం గైకొనిరని భారతము తెలుపుచున్నది. ద్రౌపదీవివాహగాథ యిట్లు ఖగోళమున చిత్రింపఁబడినట్లు కనఁబడుచున్నది.

( గో. వేం. రా.)

**అర్జునుఁడు** — ౧. ( చం. వం ) యయాతిపుత్త్రుం డగు పూరునివంశమునందు అజమీఢవంశాంతర్గతం బగు జహ్నురాజకులంబునఁ బుట్టిన శంతనురాజునకు మనుమఁడగు పాండురాజునకు కుంతి యనుపెద్దభార్యయందు ఇంద్రుని ప్రసాదంబునఁ గలిగిన కుమారుఁడు. ఇతఁడు నరుఁ డను ఋషియొక్క యవతారము. యుధిష్ఠిరుఁడు భీముఁడు నితని కన్నలు, నకులసహదేవులు తమ్ములు. ఇట్లీతఁడు పాండవులలో నడిమివాఁడు. బాల్యమునం దీతఁడు ద్రోణాచార్యుల యొద్ద నస్త్రవిద్యను నేర్చి పాండవధార్తరాష్ట్రు లందఱిలోను అధిక ప్రవీణుఁ డని యనిపించుకొనుటయే కాక అప్పటిధనుర్ధరు లందఱిలోను శ్రేష్ఠత్వము నొందెను. ఇతఁడు ద్రోణాచార్యులకు గురుదక్షిణగా పాంచాలదేశపురాజయిన ద్రుపదుని, ఇతరశిష్యు లెవ్వరు నతనిని ఓడింపలేకపోఁగా, ఓడించి తనరథమునకుఁ గట్టి తెచ్చి యప్పగించెను( చూడుఁడు, ద్రోణాచార్యుఁడు ). తరువాత ధృతరాష్ట్రుఁడు దుర్యోధనుని ప్రేరణవలన పాండవులను వారణావతికిఁ బంపఁగా అర్జునుఁ డచ్చటికిఁబోయి లాక్షాగృహంబునుండి సురక్షితముగా నన్నదమ్ములతో వెడలి ద్రౌపదీస్వయంవరమునకై బ్రాహ్మణవేషమున వెళ్లుచుండెను. త్రోవలో రాత్రిపూఁట అంగారపర్ణుం డను గంధర్వుఁ డెదిరింపఁగా నర్జునుం డతని నోడించి స్నేహితునిఁ జేసికొనెను ( చూడుఁడు, అంగారపర్ణుఁడు ). ద్రౌపదీ స్వయంవరమునకు బ్రాహ్మణవేషమునఁ బోయి మత్స్యయంత్రమును భేదించి ద్రౌపదిని సంపాదించి తన నలుగురు భ్రాతలతోఁ గలసి యామెను వివాహమాడెను. ఈసమాచారముఁ దెలిసి ధృతరాష్ట్రుఁడు పాండవులను పిలిపించి ఇంద్రప్రస్థం బనుపురంబున మనిచెను. అచట నొకనాఁడు ద్రౌపదీయుధిష్ఠిరు లేకాంతంబున నుండ తనధనుస్సుకొఱ కర్జునుఁ డచ్చటికి పోవలసినవాఁ డాయెను. ఆ దోషము పోవుటకై యర్జునుఁడు తీర్థయాత్రకు వెడలెను. తీర్థయాత్ర చేయుకాలమున ఉలూపి యను నాగకన్యకను, మణిపుర రాజకన్యక యైన చిత్రాంగదను వివాహమాడి, ఉలూపియం దిరావంతుని, చిత్రాంగదయందు బభ్రువాహనుని తనయులుగాఁ బడసెను ( చూడుఁడు, ఉలూపి, చిత్రాంగద ). తరువాత నాగీతీర్థమునందు మొసళ్లరూపముఁ దాల్చి యున్న యైదుగురు అప్సరసలకును శాపవిమోచనము కలిగించెను. మాయసన్న్యాసివేషము దాల్చి ద్వారకకుం బోయి బలరామునియింటనుండి కృష్ణుని యనుమతిని సుభద్ర నెత్తికొనిపోయి వివాహమాడెను. ఇట్లు పండ్రెండుసంవత్సరంబులు తీర్థయాత్ర చేసి యింద్రప్రస్థమునకు రాఁగా నగ్నిభట్టారకుఁడు వచ్చి యింద్రునిది యగు ఖాండవవనమును తనకు భక్షణార్థమై యొసంగు మని వేఁడి యర్జునునకు గాండీవమును ధనుస్సును, రథంబును ఒసఁగెను. కృష్ణార్జును లిరువురును అగ్నికి సహాయులై యుద్ధమునకు వచ్చిన యింద్రాదుల నోడించి ఖాండవవన మంతయు నగ్నికి భక్షణముగా నొసఁగిరి. మయుం డను దానవశిల్పిమాత్రము రక్షించిరి. అర్జునుని శౌర్యంబునకు మెచ్చి యింద్రాదు లాతనికి వరంబు లిచ్చిరి. తనకుఁ జేసినయుపకారంబు స్మరించి మయాసురుఁడు దివ్యమైన సభను నిర్మించి యిచ్చెను. యుధిష్ఠిరుఁడు రాజసూయమును చేయఁదలఁచి ధనముఁ దెచ్చుటకై తననలుఁవురు తమ్ములను

sampath_Ebooks

నాల్గుదిక్కులకును బంపెను. అం దర్జునుం డుత్తరదిక్కునకుఁ బోయి క్రమముగా పుళిందము, ఉత్తరానర్తము, కాలకూటము, అపరోత్తర కుళిందము, సుమండలము, శాకలద్వీపము, ప్రాగ్జ్యోతిషపురి, అంతర్గిరి, బహిర్గిరి, ఉపగిరి, ఉలూకము, అపరోత్తరోలూకము, పంచగణదేశము, దేవప్రస్థము, పౌరవేశ్వరుఁడు, పర్వతవాసు లయిన దస్యురాజులు, కాశ్మీరము, లోహితము, త్రిగర్తము, దారువము, కోకనదము, అభిసారదేశము, ఉరగాపురి, సింహపురము, ఉత్తరసుహ్మము, ఉత్తరచోళము, బాహ్లీకము, కాంభోజము, దరదము, ఈశాన్యదిక్కునందలి దస్యురాజులు, లోహదేశము, పరమకాంభోజము, ఋషికదేశము[1], హిమవత్పర్వతముమీఁదిదేశములు మొదలగు దేశములను, రాజులను జయించి అపరిమితమైన ధనరూపకరభారముం గొనియెను. అచ్చటనుండి శ్వేతపర్వతమును దాఁటి కింపురుషవర్షమునం జొరఁబడి ద్రుమపుత్త్రు రాజును జయించి కరభారముం గొనియె. గుహ్యకరక్షిత మయిన హాటకదేశమునకుం బోయి సామోపాయముచే వారివలనఁ బన్ను రాఁబట్టుకొని మానససరోవరమును ఋషికుల్యానదిని దర్శించి, గంధర్వరక్షితమైన దేశమును జయించి వారియొద్దనుండి తిత్తిరిపక్షివలె వేలువేలువర్ణములుగల మండూకములను గుఱ్ఱములను కరముగఁ దీసికొని హరివర్షమునకుం బోయెను. అచ్చట మహాకాయులును, మహాబలవంతులును అయిన ద్వారపాలకులం గనఁగొనియె. వా రర్జునునిఁ జూచి మానవు లీదేశమునకు రాఁగూడ దని చెప్పఁగా నట్లయిన యుధిష్ఠిరునకు మీరు కరభార మిచ్చినయెడల నే నిచ్చటనుండియే పోఁగలవాఁడ నని చెప్పి వారివలన దివ్యాభరణాదిభూషణంబులం గైకొని యుత్తరదిగ్విజయంబు సమాప్తము గావించి తిరిగి యింద్రప్రస్థమునకు వచ్చెను (మహా. భా., సభా, అ ౨౮). రాజసూయయజ్ఞము పూర్తి యయినతరువాత, పాండవులు ద్యూతమునం దోడిపోయి వనవాసమునకు వెడలిపోయిరి. వారు ద్వైతవనమునుండి కామ్యకవనమునకుఁ బోయినతరువాత నర్జునుఁడు దివ్యాస్త్రముల సంపాదింపవలయు నని హిమాలయపర్వతమునకుఁ బోయి ఇంద్రకీల శిఖరముపైని దపస్సు చేసి శివుని మెప్పించి, కిరాతరూపధారియైన శివునితోఁ బోరాడి యతనికృపకుఁ బాత్రుఁ డయి, అతనివలన పాశుపతాస్త్రమును సంపాదించెను. అచ్చటనుండి యింద్రలోకమునకుఁ బోయి ఐదుసంవత్సరము లుండి, నివాతకవచులు కాలకేయులు అనురాక్షసులం జంపి, యింద్రునివలన పెక్కుశస్త్రాస్త్రములను బడసెను. అచ్చట నున్నకాలమున నతఁడు చిత్రసేనగంధర్వునియొద్ద నృత్యగానవిద్యలను నేర్చుకొనెను. ఒక్కతటి నూర్వశి యింద్రుపనుపున నితనియొద్దకు రాఁగా అప్సరస లందఱును తనకు తల్లు లన్నభావముగల యర్జునుఁడు దానిని నిరాకరించెను. అంత నది ‘నీవు షండుఁడ వగు’ మని శాపం బిచ్చెను. ఈశాప మజ్ఞాతవాసకాలమైన యొక సంవత్సరమునకే చెల్లు నని యింద్రుఁడు వరం బిచ్చెను. పాండవులు తీర్థయాత్రఁ జేయుచు గంధమాదనపర్వతమునకుఁ బోఁగా నర్జునుఁ డచ్చటికి వచ్చి వారిని గలసికొనెను. పాండవులు విరాటునిగృహమం దొకసంవత్సర మజ్ఞాతవాసము సలుపునప్పుడు పేడిరూపమును దాల్చి బృహన్నల యనునామంబుతో రాజకుమారి యైనయుత్తరకు సంగీతంబును నాట్యంబును నేర్పుచుండెను. సంవత్సరాంతంబున దుర్యోధనుఁడు తన సైన్యంబులతో వచ్చి విరాటరాజుయొక్క యుత్తరగోగ్రహణము సేయ రాజపుత్త్రుఁ డైనయుత్తరునకు సారథియై యర్జునుఁడు యుద్ధమునకుఁ బోయెను. శత్రుసైన్యముం జూచి ఉత్తరుఁడు రథంబు డిగ్గి పాఱిపోవ నాతనిం బట్టుకొనివచ్చి ధైర్యము చెప్పి తాను రథియై యాతని సారథిం జేసి కౌరవులతోఁ బోరాడి వారి నందఱను గెల్చి గోవుల మళ్లఁజేసెను. అజ్ఞాతవాసానంతరమున కౌరవపాండవులకు కురుక్షేత్రమున యుద్ధము సంప్రాప్త మయినప్పుడు, కృష్ణుఁడు తనకు సారథికాఁగా, యుద్ధసన్నద్ధుఁడై, ప్రథమదినమున ఉభయసైన్యములకును నడుమ నిల్చి వైరాగ్యము కలిగినవాఁడై మోహముచే యుద్ధము చేయనొల్లకయుండ శ్రీకృష్ణుని భగవద్గీతాబోధవలన నా మోహమును దొలఁగించెను. ఇతఁడు భారతయుద్ధమునందు శిఖండిని పేరునకుమాత్రము తనకు ముందుంచుకొని భీష్ముఁ బడవైచెను. అభిమన్యునకు సాయము పోనీయకుండ పాండవుల కడ్డపడినందున సైంధవునిమీఁదను కోపగించి వానిని సూర్యాస్తమయమునకు పూర్వము సంహరించెద నని ప్రతిజ్ఞ చేసి అట్లే వానితల దునిమెను. పదునేడవనాఁడు యుద్ధమున తన యద్భుతపరాక్రమమువలనఁ గర్ణుని వధించెను. అశ్వత్థామయొక్క శిరోరత్నమును హరించెను. యుధిష్ఠిరుఁ డశ్వమేధము చేయనెంచి శ్యామకర్ణాశ్వమును విడిచి దానిసంరక్షణమున నర్జునుని నియమించెను. ఇతనివెంట సాత్యకి ప్రద్యుమ్నానిరుద్ధాది వీరు లుండిరి. ఆ యశ్వము హస్తినాపురమునుండి దక్షిణదిక్కుగా వెళ్లి మాహిష్మతీనగరమునకుఁ బోఁగా అచ్చట నీలరాజు దానిని బట్టుకొనెను. అర్జునుఁడు దానిని గెల్చి వానిని వెంటఁ దీసికొనెను (జైమిని., అశ్వ., అ. ౧౫). అచ్చటనుండి ఉద్దాలకఋషియొక్క యాశ్రమముమీఁదుగా చంపానగరమునకుఁ బోయి అచ్చటిరాజైన హంసధ్వజుని గెలువ, నతఁ డర్జునునివెంట వచ్చెను. అంత నశ్వము స్త్రీరాజ్యమునందుఁ బ్రవేశింప నచ్చటిరాణి యైన ప్రమీల దానిం బట్టెను. అర్జునుఁ డామెను గెలిచి వివాహమాడి హస్తినాపురమునకుఁ బంపెను. కర్ణప్రావర్ణమను జనుల దేశముల నుల్లంఘించి భీషణరాక్షసునినగరముమీఁదుగా గుఱ్ఱము మణిపురముఁ జేరెను. అచ్చట కుమారుఁడైన బభ్రువాహనునితోఁ బోరాడి అర్జునుఁడు మడిసి మరల బ్రతికెను. అచ్చటనుండి మయూరధ్వజుఁడు, వీరవర్మ, చంద్రహాసుఁడు మొదలైన రాజుల దేశములమీఁదుగా గుఱ్ఱ ముత్తరదిక్కునకుఁ దిరిగెను. అచ్చట నర్జునుఁడు బకదాల్భ్యుఁ డనుఋషిని సందర్శించెను. సంవత్సరము గావచ్చినందున నర్జునుఁడు గుఱ్ఱమును సింధుదేశముమీఁదుగాఁ దీసికొని

1. ఈ ఋషికదేశము నే రష్యా యని కొంద ఱూహించుచున్నారు.

sampath_Ebooks

పోయి అచ్చటనున్న దుర్మలను, ఆమెపుత్త్రుని వెంట రమ్మని హస్తినాపురమునకు జేరి యుధిష్ఠిరునిచే నశ్వమేధమును జేయించెను.

శ్రీకృష్ణునినిధనానంతరము, అర్జునుడు ద్వారకకు బోయి బ్రదికియున్న కృష్ణస్త్రీలను కృష్ణుని ప్రపౌత్త్రుడైన వజ్రుని హస్తినాపురమునకు దీసికొనివచ్చెను. యుధిష్ఠిరుడు ముప్పదియాఱు సంవత్సరములు రాజ్యము చేసినతరువాత నర్జునునిమనుమడగు పరీక్షిన్నరేంద్రుని సింహాసనముపై గూర్చుండబెట్టి, పాండవులును ద్రౌపదియును తపస్సునకు బయలుదేఱి హిమాలయపర్వతమునకుం బోయిరి. అచ్చట ద్రౌపదియు సహదేవుడును నకులుడును బడిపోయినతరువాత నర్జునుడుకూడ దేహము చాలించెను.

అర్జునుడు వర్ణమునందు చామనచాయగలవాడు; దీర్ఘబాహుడు; విశాలవక్షుడు. ఇతనిరథమునకు విజయ మనియు, ఇతనిశంఖమునకు దేవదత్త మనియు, ధనుస్సునకు గాండీవ మనియు పేళ్లు. రథమునకు నాలుగు తెల్లనిగుఱ్ఱములు, కపిధ్వజమును ఉండెను. ఆకాలమునందలి ధనుర్ధరులలో నితడు శ్రేష్ఠుడని చెప్పవచ్చును. అభిమన్యుడు, సాత్యకి, ప్రద్యుమ్నుడు ధనుర్వేదమునం దితనికి శిష్యులు. ఇతనికి ద్రౌపదివలన శ్రుతకీర్తి, సుభద్రవలన అభిమన్యుడు, ఉలూపివలన ఇరావంతుడు, చిత్రాంగదవలన బభ్రువాహనుడు అను నల్గురుకుమారు లుండిరి.

౨. కృష్ణ, బలరాములయొక్క సఖుడగు నొకగోపుడు.

౩. ఐదవ రైవతమనువుయొక్క పుత్త్రులలో నొకడు.

**అర్జుమందుబానోబేగం** — ఈమెనే ముంతాజ్ మహల్ అనియెదరు. ఢిల్లీచక్రవర్తియైన షాహజహాన్ (౧౬౨౭-౧౬౫౮) అనువానికి ప్రియమైనభార్య. నూర్జహాన్ బేగం యొక్క సోదరుడైన ఆసఫ్‌ఖాన్‌వజీరునిబిడ్డ. ఈమె ౧౫౯౨ లో జన్మించెను. ౧౬౧౨ లో ఈమెవివాహ మయ్యెను. ఈమె ౧౬౩౧-వ యేట జూలై ౭-వ తేదీని దక్షిణమందలి బర్హాన్‌పురములో మరణము నొందెను. మొదట నామె శరీర మచ్చటనే సమాధి చేయబడెను. కాని తరువాత నాశరీరము నచ్చటనుండి తీసికొనిపోయి ఆగ్రాపట్టణమున పాతిపెట్టబడెను. ఆమె గోరీమీద ప్రపంచమం దెచ్చటను లేనట్టి యతిసుందరమైన మందిర మొకటి కట్టింపబడెను. దానినే తాజ్‌మహ లందురు (చూడుడు: తాజ్‌మహల్).

**అర్జెంటైన్ ప్రజాస్వామ్యము** — దక్షిణ-అమెరికాదేశములో నొకస్వతంత్రరాజ్యము. ఒకకాలమున దీనికి లాప్లాటా సంయుక్తరాజ్యములు అనుపే రుండెడిది. ఈ రాజ్యమునందు ౧౪ రాష్ట్రములు గలవు. ఇవికాక మఱి యితరవిభాగములును, ఒక స్వతంత్రమండలమును గలవు. పరానా యిందలి నదులలో పెద్దది. దీనిపొడుగు ౨,౦౦౦ల మైళ్లుండును. ఈదేశపు మధ్యప్రదేశము చాలభాగము నిస్సారమైనది. తీరభూములు మాత్రము మిక్కిలి సారవంతమైనవి. గోదుమలు, మొక్కజొన్నలు మొదలగునవి యిచ్చటిపంటలలో ముఖ్యమైనవి. బంగారము, వెండి మున్నగు లోహములును, పాలరాయి మున్నగు విలువగల రాలును ఇందలి పర్వతప్రదేశములలో బాగుగ లభించును. ఇవియున్నియు గాక పశువులను మేపుట యిచ్చటి ప్రజల ముఖ్యవృత్తిగా నున్నది. బీళ్లు విశేషముగ నుండుటచే నీవృత్తి మంచి యభివృద్ధిలో నున్నది. మొత్తముమీద నీప్రదేశమున జనసంఖ్య చాల తక్కువ. ఇచ్చటి ప్రజలలో చాలమంది యూరోపియనులు. అందును ఇటాలియనులు తక్కిన దేశములవారికన్న నెక్కువగ గలరు. అమెరికా ఆదిమనివాసులగు ఇండియనులసంఖ్య చాలతక్కువ. వర్తకవ్యాపారములలోను, తక్కిన విషయములలోను అర్జెంటైన్ శీఘ్రముగ నభివృద్ధిగాంచుచున్నది. ముఖ్యముగ నీదేశపువర్తకము ఇంగ్లండు ఫ్రాన్సుదేశములతో సంబంధించియుండును. ఇచ్చటి యెగుమతులలో చాలభాగము ముడివస్తువులు; దిగుమతులన్నియు చాలవఱకు తయారైనవస్తువులు (Manufactures). అర్జెంటైన్ ప్రభుత్వమునకు పెద్ద ఒకయధ్యక్షుడు. కార్యనిర్వహణాధికార మంతయు నితనిచేతులలో నుండును. పదునాల్గురాజ్యముల ప్రతినిధులును కలసి యీయధ్యక్షుని నెన్నుకొందురు. పరిపాలనవ్యవహారము నడపుట కొకసభ యున్నది. సెనెట్ అనియు, ప్రతినిధిసభ యనియు నిది రెండుభాగములుగ నుండును. అర్జెంటైన్ రాజ్యపు వైశాల్యము ౧౧,౫౩,౧౧౯ చ. మైళ్లు; జనసంఖ్య ౭౨,౭౪,౨౬౬.

**అర్తమూరు** — ౧. కృష్ణజిల్లా బందరు తాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౧,౩౪౩ (౧౯౩౧).

౨. పశ్చిమగోదావరిజిల్లా భీమవరం తాలూకాయందలి గ్రామము. ఇచటి జనసంఖ్య ౬౭౭ (౧౯౩౧).

౩. తూర్పుగోదావరిజిల్లా రామచంద్రపురంతాలూకాలోని గ్రామము. జనసంఖ్య ౪,౦౦౩ (౧౯౩౧).

౪. విశాఖపట్టణము జిల్లా చీపురుపల్లె తాలూకాకుచెందిన జమీందారీగ్రామము. ఇచటిజనసంఖ్య ౧,౦౭౪ (౧౯౩౧).

**అర్తాం** — విశాఖపట్టణముజిల్లా పార్వతీపురముతాలూకాయందలి జమీందారీగ్రామము. జనసంఖ్య ౫౩౪ (౧౯౩౧).

**అర్థపంచకనాటకము** — ఈనాటకములో నైదంకము లున్నవి. శివుని మూడవకంటి నిప్పుచే గాల్పబడిన మన్మథుడు తిరుక్కణ్ణపురమున (ఈయూరు తంజావూరుజిల్లాలోనిది) వెంచేసియున్న శౌరిరాజప్పెరుమాళ్ అను దేవునకు గొడుకుగ బుట్టెను. శిశువు పుట్టినపదిరోజులలోగానే శంబరుడను పేరి రాక్షసుడు దానిని గొనిపోయి సముద్రమున బాఱవైచినాడు. ఒకచేప

sampath_Ebooks

దానిని మ్రింగినది. అటుపైని శంబరుని సేవకులు కొందఱు చేపలకై వలవైవ నీచేప యందుఁ దగుల్కొన్నది. దానిని గోయఁగనే యా ముద్దులబాలుఁ డగపడెను. శంబరుని కూఁతురు చేపసంగతి యంతయుఁ దెలిసికొని యాశిశువును జాగ్రత్తగఁ బెంపవలయునని యాజ్ఞాపించెను. మన్మథునిభార్య యగు రతీదేవియే శంబరునికి కూఁతురుగ జన్మించినది. ఆబాలుఁడు పెరిగి పెద్దవాఁడై శంబరుని జంపి యతని కూఁతును బెండ్లియాడెను. ఇదియే యీనాటకమునందలి కథ.

ఇందలి యైదంకములలోను వరుసగ చింతాయోగము, సమారంభము, వ్యాపారము, హేతుదర్శనము, అభీష్టలాభము అను నైదు సంగతులు వర్ణింపఁబడుటచే దీని కర్థపంచక మని పేరు వచ్చినది. నాటకకారుని పేరు తెలియదు.

**అర్థపంచకము** — నారాయణ పరివ్రాట్కృత మగు గ్రంథము, పంచవిషయపద్ధతిని దెలుపును. పంచప్రధాన విషయములేవన: (౧) జీవము, (౨) ఈశ్వరుఁడు, (౩) ఉపాయము, (౪) ఫలము లేక పురుషార్థము, (౫) విరోధమును. మరల నివి యొక్కొక్కటి యైదుతెఱఁగులు. నిత్య, ముక్త, కేవల, ముముక్షు, బద్ధము లనునవి జీవమునందలి యైదుతెఱఁగులు. పర, వ్యూహ, విభవ, అంతర్యామి, అర్చలు ఈశ్వరునియందలి పంచప్రకారములు. కర్మయోగ, జ్ఞానయోగ, భక్తియోగ, ప్రపత్తియోగ, ఆచార్యాభిమానయోగములు పంచోపాయములు. ధర్మ, అర్థ, కామ, కైవల్య, మోక్షములు పంచవిధపురుషార్థములు. స్వస్వరూపవిరోధ, పరస్వరూపవిరోధ, ఉపాయవిరోధ, పురుషార్థవిరోధ, ప్రాప్తివిరోధములు పంచవిధవిరోధములు

**అర్థము** — అలంకారశాస్త్రమత ప్రకారము శబ్దమునకు మూఁడువిధములైన అర్థము లుండును: (౧) వాచ్యము, (౨) లక్ష్యము, (౩) వ్యంగ్యము నని. వాచ్యార్థ మభిధవలనను, లక్ష్యార్థము లక్షణవలనను, వ్యంగ్యార్థము వ్యంజనవలనను తెలియును. ఈమూఁటిని శబ్దశక్తు లందురు. 'గంగయందు గొల్లపల్లె' యన్న వాక్యమునందలి 'గంగా' శబ్దమునకు నదీవిశేష మని వాచ్యార్థము. కాని జలప్రవాహమునందుఁ బల్లె యుండుట యసంభవము కాన నిచ్చటి గంగాపదమునకు గంగయొడ్డని లక్ష్యార్థము. గంగానదియొడ్డున నున్నందున నాపల్లె పావనత్వ, శీతలత్వములు గలది యని వక్తయొక్క భావమేని యది గంగాపదమునకు వ్యంగ్యార్థము. 'ఇందునుగురించి యధికము 'ధ్వని' శబ్దముక్రిందఁ జూడనగును.'

**అర్థశాస్త్రము** — ఇది అర్థముపట్ల మనుష్యుని ప్రవర్తనమును దానిమూలమున మనుష్యులలో నేర్పడు పరస్పరసంబంధములను వివరించుశాస్త్రము. మనుష్యుని కోరికలను నెఱవేర్చు సాధనములలో మితముగ లభించువానికి అర్థ మని పేరు. విత్తము ధనము అనునవి దీనికి పర్యాయపదములు.

### అర్థశాస్త్ర స్వరూపము

మనుష్యుని కోరికలను నెఱవేర్పఁగల సాధనము లనేకము లున్నవి. అవి సూర్యుని వెల్తురు, గాలి, నీళ్లు, ధాన్యము, వస్త్రములు, ఇండ్లు, ఉప్పు, నెయ్యి, మొదలైనవి. వీనిలో వెల్తురు గాలి మొదలగునవి అమితముగ దొరకును; అందుచే నవి అర్థవర్గములో చేరనేరవు. ధాన్యము వస్త్రములు మొదలగునవి మితముగ దొరకును; అందుచే నవి అర్థవర్గమున చేరుచున్నవి.

ఆయావస్తువులు కావలసినవా రందఱకును ఎంతమట్టుకు కావలెనో అంతకంటె నెక్కువగ దొరకుటయే అమితత్వము. కావలసిన పరిమితికంటె తక్కువగ దొరకుటయే మితత్వము. అమితముగ లభించు పదార్థముయొక్క మొత్తములో నొకమాత్ర (అంశము = Unit) తగ్గినయెడల మనకోరికలు తక్కువగ నెఱవేఱుటయు, మొత్తమునకు మఱియొకమాత్ర చేర్చినయెడల మనకోరికలు అంతకు మునుపటికంటె నధికముగ నెఱవేఱుటయు జరగవు. ఊపిరితీయుటకు మనకు గాలి ఆవశ్యకము. కాని ఇప్పుడు మనల నావరించియుండు గాలి ఎంతో అధికముగ నుండుటచేత అందులో నొక వీసెడుగాలి తగ్గినను మన యూపిరికి నిరోధము కలుగఁజాలదు; దానియొక్క పరిమాణ మొకవీసెడు హెచ్చినను అంతకు మునుపటికంటె మఱింత ఎక్కువగ మన మూపిరి తీయనేరము. ధాన్యము విషయమున మన మిట్లు చెప్పుటకు వీలులేదు. ఆఁకలి తీర్చుకొనుటకై మనకు ధాన్య మావశ్యకము. ఇప్పుడు దొరకుచుండు ధాన్యము చాలకపోవుటచేత ఎందఱో తమ ఆఁకలిని తీర్చికొనలేక బాధపడుచున్నారు. కాన నేఁటి కున్న ధాన్యపుబస్తా లన్నియు మనకు ప్రయోజనకారులుగ నున్నవి. ఇప్పుడుండు ధాన్యపుమొత్తమునుండి ఒకబస్తాధాన్యము తగ్గినను ఆఁకలి వలన బాధపడువారిసంఖ్యయు, వారి ఆఁకలిబాధయు హెచ్చును; ఇప్పుడుండుమొత్తమునకంటె ఒకబస్తాధాన్యము అధికమైనను ఆఁకలి బాధ కొంత తగ్గును. గాలి మన కావశ్యక మైనను గాలియొక్క ప్రతిమాత్రయు మన కావశ్యకము కాదు. ధాన్యపుమొత్తమందు ప్రతిమాత్రయు (భాగము, బస్తా) మన కావశ్యకమై యున్నది. కాన ధాన్యము గాలివలె అమితము గాక మిత మైయున్న దని గ్రహింపనగును.

కోరికలను నెఱవేర్చుశక్తికి ఉపయోగము (ప్రయోజనము, ఉపయుక్తత, Utiltiy) అని పేరు. అందుచే అర్థమునకు (౧) ఉపయోగము, (౨) మితత్వము ప్రధానలక్షణము లని చెప్పుచున్నారు. కాని వీని నాశ్రయించుకొని మఱికొన్ని లక్షణములు నేర్పడుచున్నవి. వానిలో ముఖ్యములయినవి యీక్రిందివి: (౩) అర్థవర్గములో చేరిన పదార్థములు మితములుగ నుండుటచేత వీనిని క్రయమిచ్చి

sampath_Ebooks



కొనుట కెల్లప్పుడును ఎవరో యొకరు సిద్ధపడి యుందురు. వీనిలో నేదైన నొకదానిని పుచ్చుకొని దానికి బదులుగ మఱియొక దాని నిచ్చువా రుందురు. ఇట్టివ్యాపారమునకు వినిమయ మని పేరు. కావున అర్థమునకు మూల్యము — వినిమయార్హత, క్రయవిక్రయార్హత — అను గుణము లున్నవి. (౪) అర్థవర్గములో చేరిన పదార్థములపై సర్వస్వామ్య మెవరికో యొకరి కుండును. వీనివిషయమున 'తనది', 'పరునిది' అనువివేచన మేర్పడుచుండును. ఇట్టి పదార్థములసముదాయమే ఒకని ఆస్తి. (౫) అర్థములో చేరినది శ్రమపడక లభింపదు. దీనిని ఉత్పత్తి చేయుటకు మనుష్యునిపరిశ్రమ ఆవశ్యక మైయున్నది. కొన్నిటియుత్పత్తికి పరిశ్రమ నావశ్యకము కాకున్నను వానిని స్వాధీనపఱుచుకొనుటకైనను అది ఆవశ్యక మగుచున్నది. అర్థవర్గమున చేరిన సాధనములకు పైని పేర్కొనిన పంచలక్షణములు నున్న వని దీనిచే స్పష్ట మగుచున్నది.

అర్థములో చేరినవానిని పదార్థము లని వాడుటకన్న సాధనము లని వాడుట యుక్తతరము. మనకోరికలను నెఱవేర్చుసామర్థ్యము, రూపముగల పదార్థములకేకాక రూపము లేనికర్మములకును పరిశ్రమములకును కలదు. గాయకుని గానము, నటుని నాట్యము, బోధకుని శిక్ష, న్యాయాధిపతియొక్క తీర్పు, విదూషకుని నేర్పు మొదలగువానికి రూపము లేకున్నను నవి మనకోరికలను నెఱవేర్చుచున్నవి. అర్థమున కుండవలసిన లక్షణము లన్నియు వాని కున్నవి. అవి మితలభ్యములు; వినిమయార్హములు; మూల్యము గలవి; కష్టార్జితములు. పదార్థము లనుటకు బదులు సాధనము లని చెప్పినయెడల వీని నన్నిటిని అర్థవర్గములో చేర్చుటకు వీ లగును. ఇదియే సంప్రదాయము. కావున నొకదేశములో ఏటేట నుత్పత్తి యగు అర్థముయొక్క మొత్తమును లెక్కవేసి కనుఁగొనవలసినప్పుడు అందులో రూపసహితము లగు ధాన్యాదిపదార్థములనేకాక రూపరహితము లగు పైని పేర్కొనిన గానము లోనగుకర్మములను చేర్చుచుందురు (వివరములకు 'ఆదాయము' అనువ్యాసమును చదువునది).

అర్థమునుగుఱించినశాస్త్రము అర్థశాస్త్ర మని చెప్పక, అర్థవిషయమున మనుష్యునిప్రవర్తన మెట్టిదో తెలుపునది అర్థశాస్త్ర మని చెప్పుటకును హేతువు కలదు. ఈశాస్త్రములో విమర్శనీయ మగు విషయము మనుష్యునికి బాహ్యములుగ నుండు వస్తువుల స్వభావము కాదు. అట్టివస్తువులయెడ మనుష్యుఁ డెట్లు ప్రవర్తించుచున్నాఁడో, అతనివర్తనమున ఎట్టిమార్పులు కలుగుచున్నవో, ఎట్టిమార్పులు కలిగిన బాగుగ నుండునో అనువిషయములే ఇందు వివరింపఁబడుచున్నవి. ధాన్యము అర్థవర్గములో చేరియున్నంతమాత్రమున దానియొక్క రూపముగాని, అది యాహారపదార్థ మగుటకు కారణము గాని, అది పండుటకు కావలసిన పరిస్థితులు గాని అర్థశాస్త్రమునం దుండనేరవు. ఈవివరములు వ్యవసాయశాస్త్రమునందును, రసాయనశాస్త్రమునందును, ఆరోగ్యశాస్త్రమునందును నుండును. ధాన్యమునకు మితత్వ మనులక్షణ ముండుటచే దానిని సంపాదించుటయందును, వినిమయము చేయుటయందును, అనుభవించుటయందును మనుష్యప్రవర్తన మెట్టిది అనునదియే అర్థశాస్త్రమున వివరింపఁబడు విషయము. వర్ణనీయాంశము మనుష్యప్రవర్తనము గాని అర్థజాలము కాదు. అర్థశాస్త్రమువలె మనుష్యప్రవర్తనమును ప్రధానవిషయముగ చేసికొనినశాస్త్రములు మఱికొన్ని యున్నవి. అధికారము వహించినవారు అనధికారు లగు ప్రజలయెడల నెట్లు ప్రవర్తించుచున్నారో, అట్లే ప్రజలు అధికారులయెడల నెట్లు ప్రవర్తించుచున్నారో విమర్శించుశాస్త్రము రాజ్యాంగశాస్త్రము. నీతిశాస్త్రము, ధర్మశాస్త్రము, సాంఘికశాస్త్రము లోనగునవి యీవర్గములో చేరినశాస్త్రములు. వీనిలో నొక్కొకదానియందు నొక్కొకసందర్భమున మనుష్యుఁ డెట్లు ప్రవర్తించునో వివరింపఁబడును. ఈసందర్భభేదమునుబట్టియే ఈశాస్త్రములకు ప్రత్యేకత్వము కలుగుచున్నది.

### ౧. అర్థశాస్త్రము శాస్త్రమా? :

శాస్త్రముయొక్క ముఖ్యోద్దేశము సిద్ధాంతములను కొన్నిటిని ఏర్పఱుచుటయే. పూర్వాపరసంబంధమునుగాని కార్యకారణసంబంధమునుగాని తెలుపు సూత్రమునకు సిద్ధాంత మని పేరు. ఇట్టి సందర్భమునం దిట్టికార్యము సంభవించు ననియు, ఇట్టి పరిస్థితులయం దిట్టి ఫలితము కలుగు ననియు సిద్ధాంతములసాహాయ్యమున మనము తెలిసికొనఁగలిగియుందుము. ఈజ్ఞానము భావికాలమున జరుగఁగల కార్యముల స్వభావము నూహించుటయందు మన కుపకరించును. శాస్త్రము లన్నిటికిని గల యీసామాన్యధర్మము అర్థశాస్త్రమున కుండుటచేత శాస్త్ర మనుపేరు దీనికి తగియున్నది. ఇందులో సమర్థింపఁబడు సిద్ధాంతము లెన్నియో యున్నవి. 'పదార్థములయొక్క మితత్వమందు కలుగు తరతమభావములనుబట్టి వానిమూల్యమందు కలుగు భేదము లేర్పడుచున్నవి' అనునది యొకసిద్ధాంతము. 'మితముగ నుండు ద్రవ్యములో ననేకపదార్థములను కొనవలసివచ్చినపుడు అధికతమ ప్రయోజన మేవిధ మగు వినియోగమువలన కలుగునో ఆవిధమున నాద్రవ్యము పదార్థములను కొనుటకయి వినియోగింపఁబడును' అనునది మఱియొకసిద్ధాంతము. ఇట్టిసిద్ధాంతములయొక్కయు, వీని నుపపాదించుటకై కల్పింపఁబడిన వాదప్రతివాదములయొక్కయు సముదాయము అర్థశాస్త్రము.

కాని అర్థశాస్త్రసిద్ధాంతములవిషయమున ననేకు లాక్షేపణ చేయుచుందురు. 'మనుష్యుని ప్రవర్తన మిట్టి సందర్భములో నిట్టివిధముగ నుండు నని నిర్ధారణము చేయుటకు వీలు కలదా? ఒకఁడు ప్రవర్తించునట్లు మఱియొకఁడు ప్రవర్తించునా? దేశమును బట్టియు కాలమునుబట్టియు మనుష్యుని ప్రవర్తనము మాఱుచుండదా? మనుష్య స్వభావము చంచలము; ఒకరి స్వభావమువలె మఱియొకరిస్వభావ ముండదు. ఇంగ్లీషువారు ప్రవర్తించునట్లు భారతీయులు ప్రవర్తింపరు; దరిద్రులవలె ధనికులును, పల్లెటూరివారి వలె పట్టణవాసులును, పూర్వాచారపరాయణులవలె నవనాగరకులును ప్రవర్తింపరు. కావున మనుష్యు లందఱియెడ

sampath_Ebooks

చెల్లుసిద్ధాంతముల నేర్పఱుపఁడలఁచుట సాహసము. అందువలననే ఆంగ్లేయు లాంగ్లదేశపరిస్థితులను మనసున నుంచుకొని వ్రాసిన అర్థశాస్త్రములోని సిద్ధాంతములు మనదేశమునకు సరిపడుటలేదు.' ఈయాక్షేపణములోని సత్యాసత్యములను మనము పరిశీలింపవలసియున్నది:

(౧) ఈయాక్షేపణము సమంజసమైనయెడల నిది యొక్క అర్థశాస్త్రమునకే కాక మానవునిగుఱించి విమర్శించు రాజ్యాంగశాస్త్రాది మానవశాస్త్రము లన్నిటికిని తాఁకవలసియుండును. ఇది అర్థశాస్త్రముయొక్క ప్రత్యేకలోపము కాఁజాలదు. ఆలోచనయు స్వేచ్ఛాప్రవర్తనమును గల మనుష్యునిగుఱించి చెప్పుశాస్త్రములకును, నిర్జీవము లగువానినిగుఱించి విమర్శించు ప్రకృతిశాస్త్రములకును, జీవమున్నను ఆలోచన లేని తక్కినజీవవర్గమునుగుఱించి వివరించు జీవశాస్త్రములకును గలభేదమును సూచించుటకుమాత్రమే ఈ యాక్షేపణ ముపయోగించుచున్నది.

(౨) మనుష్యులనుగుఱించి మనము విమర్శించునపుడు మనకు గోచరించు సత్య మెట్టిది? ఒకనికిని, మఱియొకనికిని భేద మున్న దని తెలియుటమాత్రమే కాదు; కొన్ని విషయములందు భేదమున్నను మఱికొన్నిటియందు ఒకనికిని మఱియొకనికిని విస్తారమగుసామ్య మున్న దనియు మనకు తెలియఁగలదు. కనుపడుభేదము సామ్యముతోఁ గూడినభేదము గాని సామ్యవిరహిత మగుభేదము కాదు. మనుష్యు లందఱకును వాంఛ లున్నవి; వాంఛలను నెఱవేర్చుకొనుట కందఱకును అర్థము కావలసియున్నది. ఒకటేవస్తువును గాక పలువస్తువుల నపేక్షించుట అందఱకును సహజము; దేనినిగాని కొంతవఱ కనుభవించినతర్వాత దానిపై విరాగము కలుగుటయు, మఱియొకదానిపై రాగము కలుగుటయు మనుష్యు లందఱకును స్వభావము. కావలసినదానిని సంపాదించుటకై కష్టపడుట, కష్టమునకు తగిన ఫలమును సంపాదింపఁగోరుట, ఫలములేనపుడు కష్టపడుట కిష్టపడకపోవుట, బేర మాడుట, కొనఁదలఁచినపుడు చౌకధరను, అమ్మఁదలఁచినపుడు అధికమగుధరను కోరుట లోనగు విషయములందు ఒకనికిని, మఱియొకనికిని భేదము కనిపింపదు. ఇట్టి సామాన్యధర్మముల ననుసరించియే అర్థశాస్త్రకర్తలు తమసిద్ధాంతములను సమర్థించుచున్నారు.

(౩) ఇంగ్లీషువారి పరిస్థితుల కన్వయించెడి అర్థశాస్త్రసిద్ధాంతములు మనపరిస్థితుల కన్వయింపకపోవచ్చును. కాని పైని చెప్పినట్లు అన్నివిషయములందును మనము ఇంగ్లీషువారికంటెను పాశ్చాత్త్యులకంటెను భిన్నులము కాము. వారును మనమును మానవజాతిలో చేరినవార మగుటచే వారికిని మనకును సాదృశ్యముకూడ నున్నది. ఇట్టి సాదృశ్యము నాధారముగఁ జేసికొని ఏర్పఱుపఁబడిన సిద్ధాంతము లన్నియు ఆదేశములకువలె మనదేశమునకును వర్తించును. ఏసిద్ధాంతముల విషయమున ఇట్టి సాదృశ్యము లేదని మనము ఋజువు చేయఁగలమో, అట్టివానిని మనము విడనాడి మనపరిస్థితుల కన్వయించువానిని మన మేర్పఱుచుకొనవచ్చును. కావున పైని పేర్కొనిన ఆక్షేపణములోని లోపాలోపములను నిర్ణయించునపుడు అర్థశాస్త్రములోని సిద్ధాంతము లన్నియు నొక్కజాతిలో చేరినవి కావనియు, వానిలో ననేకములు మానవు లందఱిలోఁగల సాదృశ్యములమూలమున నేర్పడిన వనియు మనము తలంచుచుండవలయును.

(౪) ఇట్టి వివేచన చేయునిపక్షమున భరతఖండమున కంతకును వర్తించు అర్థశాస్త్ర మొకటి యున్న దని నిరూపించుటయు శక్యముకాదుగదా? భరతఖండమున ముప్పదిమూఁడుకోట్లమంది మనుష్యు లున్నారు. వీ రందఱుమాత్రము ఒక్కటే స్వభావము కలవారా? వీరిలో వర్ణము, జాతి, ఆచారము, నీతి లోనగు విషయములనుబట్టి పరస్పరభేదములు లేవా? ఒకరాష్ట్రములోని పరిస్థితులకును, మఱియొరాష్ట్రములోని పరిస్థితులకును వ్యత్యాస ముండుట లేదా? ఇట్టి సందర్భమున భారతదేశమున కంతకును వర్తించు అర్థశాస్త్రము సాధ్యమా? కావున మనుష్యులలో భేదములతోపాటు సాదృశ్యములును ఉన్నవి గనుక అందఱకును వర్తించు అర్థశాస్త్రసిద్ధాంతముల నేర్పఱుచుటకు వీలు కల దనుటలో విప్రతిపత్తి లేదు.

(౫) అర్థవిషయమున మనుష్యుని చర్యలయందు సామాన్యధర్మము లనేకము లున్న వని ఋజువుపఱుచుటకు సాధనము లనేకములు కలవు. మనుష్యునిస్వభావమును పరిశీలించు మానసికశాస్త్రము, అభిప్రాయభేదము లున్నప్పు డుండవలసిన సిద్ధాంతమును గ్రహింపఁజేయు తర్కశాస్త్రము, మన అందఱియొక్కయనుభవము లోనగు సాధనములు పెక్కు గలవు. ఇదిగాక ఇట్టివిషయములను నిర్ణయించుటకై ప్రత్యేకముగ లెక్క లనేకములు ( Statistics ) తయారుచేయఁబడుచున్నవి. ఎగుమతులు, దిగుమతులు, పదార్థముల ధరలు, ధరల ననుసరించి విక్రయముచేయు మొత్తములు, కూలివాండ్ర వేతనములు, వేతనములు మాఱినపుడు కూలివాండ్రసంఖ్యలో కలుగుచుండు మార్పులు, కుటుంబముల ఆదాయము, ఆదాయవినియోగము, గృహస్థుల జమాఖర్చులు — లోనగు లెక్కలను ప్రతిదేశమందును నీకాలమున సమకూర్చుచున్నారు. మనదేశమందుకూడ నిట్టిప్రయత్నములు జరుగుచున్నవి. వీనిని తగురీతిని విమర్శించినయెడల ఏయేప్రదేశములందలిమనుష్యు లెట్లెట్లు ప్రవర్తించుచున్నారో తెలిసికొనుటకు సాధ్య మగుచుండును. కావున అర్థశాస్త్రసిద్ధాంతములు నిరాధారములు కా వనియు, ఖచితముగ తూఁచి లెక్కించుటకు అనువైన విషయముల సాహాయ్యమున నేర్పడిన వనియు చెప్పవచ్చును.

(౬) దీనినిబట్టి అర్థశాస్త్రము సంపూర్ణతను చెందిన దనియు, అందులో లోపములు లే వనియు చెప్పుట కెవ్వరును సాహసింపరు. ఏశాస్త్రమునుగుఱించియు ఇట్లు చెప్పుటకు వీలు లేదు. మానవుని అనుభవమును ప్రజ్ఞయు పెరిఁగినకొలఁదియు ఒకప్పుడు గోచరింపని సత్యములు మఱియొకప్పు డతనికి గోచరించును. సాంఘికపరిస్థితులయందు మార్పులు కలుగుటచే నూతనసిద్ధాంతముల నేర్పఱుపవలసి

వచ్చును. కావున తక్కిన శాస్త్రములవలె అర్థశాస్త్రము సయితము కాలోచితముగ మార్పును పరిణామమును గాంచుచున్నది.

## మూలవ్యవస్థలు :

ప్రస్తుత కాలమునందు మనుష్యుని ఆర్థికచర్య కంతకును కొన్ని వ్యవస్థలు పునాదు లైయున్నవి. వీని ననుసరించియే అతఁడు తన ప్రవర్తనమును చక్కఁబెట్టుకొనుచున్నాఁడు. ఇవి కొందఱివిషయమునను కొన్ని పదార్థములవిషయమునను కొన్నిసంపర్కములందును మాత్రమే కాక అందఱివిషయమునను, అన్నిపదార్థములవిషయమునను, అన్ని సందర్భములందును వర్తించునట్టివి యగుటచేత ఆర్థికభవనమున కివి మూలాధారము లని చెప్పఁదగియున్నవి.

(౧) వీనిలో మొదటిది రాజ్యాంగవ్యవస్థ. రాజకీయముగ ప్రపంచ మంతయు నొక్క ప్రభుత్వముయొక్క అధీనమం దుండక పలుప్రభుత్వముల యధీనమం దున్నది. ఒక్క ప్రభుత్వమునకు లోఁబడియుండు భూభాగమునకు రాష్ట్రము (రాజ్యము) అని పేరు. అందు నివసించుజనులకు ప్రజాసముదాయము (Political Community) అని పేరు. మనుష్యులలో నొక్కొక్కఁడును అట్టిరాష్ట్రములలో నేదేని నొకదానికి చెంది, అట్టి ప్రజాసముదాయములో నొక వ్యక్తిగ నున్నాఁడు. ఈసంబంధము అతని ఆర్థికవ్యవహారములలో కొన్నిటికి సహకారిగను కొన్నిటికి ప్రతిబంధకముగను ఉన్నది. తనకుఁగల సామర్థ్యమును మూలధనమును వినియోగించి ఎక్కువ లాభమును తెచ్చుపదార్థములను మిక్కిలి యనుకూలమగు ప్రదేశమున నుత్పత్తి చేయుటకును, అనుకూలమగుచోట వానిని విక్రయించుటకును, తనకు వచ్చిన ఆదాయమును వినియోగించి మంచిపదార్థములను చౌకగ దొరకుచోట కొనుటకును ప్రతిమనుష్యుఁడును కోరుచుండును. ఆర్థికవిషయమున నిదియే తగినమార్గము. దీని కంతకును నతఁడు స్వేచ్ఛానుసారముగ విహరింపఁగల ప్రదేశ ముండవలెను. మనుష్యుఁ డేదియో యొకరాష్ట్రమునకు చెందినవాఁ డగుటచేత దానిలోని ప్రదేశమం దంతటను నట్టివ్యాపారములకై యతఁడు విచ్చలవిడిగ సంచరించుట కవకాశ మేర్పడుచుండును. భారతీయుల మగు మన మందఱమును ప్రస్తుతకాలమున నొక్క ప్రభుత్వమునకే లోఁబడి, ఒక్క రాష్ట్రమునందే నివసించువార మైనందున భరతఖండమం దెచ్చట నెక్కువవసతు లున్న వని మనకు తోఁచునో అచ్చటికి మనము వెళ్లి వ్యవసాయమునో వ్యాపారమునో మఱేదేని వృత్త్యంతరమునో స్వీకరించి విస్తారలాభము సంపాదింపవచ్చును ఆంధ్రదేశమునందే యుండవలె ననునిర్బంధము లేదు. మనము తయారుచేసిన సామానులను బొంబాయికో పంజాబునకో మఱియొకభాగమునకో పంపి వీలైనచోటులందు వానిని విక్రయించుట కవకాశ మున్నది. భారతీయు లనెడి ప్రజాసముదాయమున మనము చేరియుండుటచేత 'మన దేశమువారు మనసంబంధులు' నని చెప్పుకొనఁదగినవారు కొంద ఱుండుటయు, మన ముత్పత్తి చేసినవస్తువుల నభిమానముతో కొన సిద్ధపడువారు కొందఱు లభించుటయు సంభవించుచున్నది. ఆర్థికముగ మనము జరపువ్యవహారములం దితరు లెట్టియక్రమముల నైనను చేసినపుడు అట్టివానివలన నుండి మనల రక్షించుటకును మనకు కావలసిన సదుపాయములను మఱికొన్నిటిని చేయుటకును ప్రభుత్వమువా రున్నారు. రాష్ట్రములో కొందఱు ధనికులుగను కొందఱు దరిద్రులుగను ఉన్నను అందఱును ఒక్క ప్రజాసముదాయములోని వారే యగుటచేతను పరస్పరసాహాయ్యము గాంచుట కవకాశ మున్నది. ధనికులపైని హెచ్చుపన్నులను విధించి దరిద్రుల సౌఖ్యముకొఱకై ఆ ద్రవ్యమును ప్రభుత్వమువారు ఖర్చు పెట్టుచుందురు. ఏకాకి గాక సమష్టికుటుంబములో నుండుటచేత మనుష్యున కెట్లు సౌఖ్యము కలుగుచుండునో యట్లే ప్రత్యేకరాష్ట్రమున నుండుటచేత, ఆర్థికముగ నట్టిలాభము చేకూరుచుండును. ఇట్టిసదుపాయము లుండునను నమ్మకము గలిగియే ప్రతిమనుష్యుఁడును తనవ్యవహారములను చేసికొనుచున్నాఁడు. దేశమున కంతకును లాభము సమకూర్చుటకై ప్రభుత్వమువా రొకవిధమైన నిర్బంధమును కలిగించినయెడల అట్టినిర్బంధనముల నిరసింపక వాని ననుసరించియే యాతఁడు తనపనులను చక్కఁబెట్టుకొనుచున్నాఁడు. రాష్ట్రీయప్రజాసముదాయములో తా నొకవ్యక్తి యను విషయమును మనమునం దిడుకొని దానిమూలమున కలుగు లాభనష్టముల ననుభవింప సిద్ధపడి ప్రతిమనుష్యుఁడును మెలఁగవలసి యున్నది.

ప్రస్తుతకాలపు రాజ్యాంగవ్యవస్థ కొన్నివిధముల మన ఆర్థికప్రవృత్తిని నిరోధించునట్టిదిగ పరిణమించుచున్నది. గతించిన నూఱునూటయేఁబదిసంవత్సరములనుండి వేగముగ ప్రయాణము చేయుటకు వీలగు సాకర్యములు వృద్ధి యగుటచేత ఆర్థికముగ ప్రపంచ మంతయు నొక్కసమష్టికుటుంబముగ మాఱిన దని చెప్పవచ్చును. ఒకదేశమునకు మఱియొకదేశముతో వ్యాపారవిషయమున సన్నిహితసంబంధము కలిగినది. మనము పండించుప్రత్తి, నూనెగింజలు, జనుము, సుగంధద్రవ్యములు మొదలగువానిని అధికములను ఖరీదు లిచ్చి కొనువారు మనదేశములోనివారు కారు; జపాను, జర్మనీ, ఇంగ్లండు మొదలగు దేశములవారు వీనిని కొనినఁగాని మనరైతులకు తగులాభము రాఁజాలదు. మనకు కావలసినయంత్రపుసామానులు, వస్త్రములు, ఔషధములు లోనగునవి ఇతరదేశములనుండి రావలసియున్నది. నాణెమగు వస్త్రములను మనము తయారు చేయఁగోరినయెడల నందులకు కావలసిన ప్రత్తి మనదేశమున దొరకుటలేదు; ఈజిప్టు మొదలగు విదేశములనుండి రావలసియున్నది. ఈరాకపోకల కెట్టియాటంకము సంభవించినను ఆర్థికముగ మనకు నష్టము కలుగును. ప్రపంచ మంతయు నొక్క ప్రభుత్వమువారి యధీనమం దుండక భిన్నభిన్నరాష్ట్రములుగ విభక్త మైయుండుటవలన నిట్టియాటంకము లెన్నియో కలుగుచున్నవి. ప్రతిరాష్ట్రమందలివారును తమకు వచ్చు తాత్కాలికలాభమునే ప్రధానాంశముగ భావించుచు ఇతరరాష్ట్ర

sampath_Ebooks

ములకు కలుగునష్టమును పరిశీలింపకున్నారు. సుంకముల నధికము చేసియు, నాణెముల మారకపురేటును ప్రతిదినము మార్చియు, ఇతర దేశములనుండి తమదేశమునకు రాఁదలఁచుకూలివాండ్రకు నిరోధము కలిగించియు, తమరాష్ట్రమున నల్పజనసంఖ్య యున్నను శూన్య ప్రదేశము లనేకము లున్నను ఇతరరాష్ట్రవాసులు ఆప్రదేశములలో నివాసము లేర్పఱుచుకొని అర్థోత్పత్తిని జేయఁదలఁచినయెడల నట్టివారిని రాకుండఁజేసియు జనులు స్వలాభమును చూచికొనుట సర్వసాధారణ మైనది. ఇంతకంటె దారుణ మగుమహోపద్రవము మఱియొకటి కలదు. అనేకరాష్ట్రములు ప్రపంచమం దుండుటచేతను, వానికి పరస్పరద్వేషము విశేషముగ నుండుటచేతను, ప్రతిరాష్ట్రము యుద్ధసన్నాహము చేయవలసియున్నది. ఏఁటేఁట కష్టపడి ప్రజలు సంపాదించినధనములో చాలభాగము సైన్యములకును నౌకాదళములకును, ఆకాశవిమానములకును, మందుగుండుసామానులకును ఖర్చుపెట్టవలసి వచ్చుచున్నది. ఏదైన నొకయుద్ధము సంభవించినయెడల నొక్కనిమిషములో పట్టణములు పల్లెలు వినాశము గాంచుటయు, ఎంతకాలమునుండియో చేర్చియుంచిన ధనరాసు లన్నియు నదృశ్యము లగుటయు సంభవించుచున్నది. ఆర్థికస్థితిచే నొకటిగ నుండవలసిన ప్రపంచము రాజకీయస్థితిచే భిన్నభిన్న మగుటచేత అర్థవినాశము తప్పకున్నది. ఇట్టివిషమస్థితి అంతరించుసూచన లెవ్వియు లేవు. కావున ప్రతిరాష్ట్రమందలి ప్రజలును తమ పరిశ్రమముచే యుద్ధములం దుపయోగించుపదార్థముల నుత్పత్తి చేయవలసిన ఆవశ్యకము కలుగుచున్నది. రాజ్యాంగవ్యవస్థలు మాఱి, ఇట్టిచిక్కులు రూపుమాసినయెడల నీపరిశ్రమ మంతయు దారిద్ర్యబాధ తగ్గుటకును, ఇప్పటికంటె పదిరెట్లధికమగుసుఖమును సామాన్యజనులు సైత మనుభవించునట్లు చేయుటకును వినియోగింప వీలగును.

కావున మన ఆర్థికవ్యవహార మంతయు మన రాజ్యాంగవ్యవస్థల నాశ్రయించియున్న దనువిషయము స్పష్ట మగుచున్నది.

(౨) మూలవ్యవస్థలలో రెండవది 'ఆస్తిహక్కు'. ప్రతిమనుష్యుఁడును తాను సంపాదించినట్టిదియు క్రమమార్గమున తనకు లభ్యమైనట్టిదియు నగు ఆస్తిపైని 'స్వత్వము' ( లేక 'స్వామ్యము') కలిగియున్నాఁడు. దీనిమూలమున నతని కాయాస్తి విక్రయించుటకును, దానము చేయుటకును, అనుభవించుటకును, నింకెట్టివిధమైన వినియోగము నయినను చేయుటకును అధికారము కలదు. ఇంతకంటె నధికమగు ఆస్తిని ఎవఁడును సంపాదింపఁగూడదనునిర్బంధము లేదు. లక్షాధికారి కావచ్చును; కోటీశ్వరుఁడు కావచ్చును; శతకోటీశ్వరుఁడు కావచ్చును. ప్రభుత్వమువారు సంపాదించు ద్రవ్యముకంటెను నధికముగ నెవ్వఁడైన సంపాదించుట కెట్టి యాటంకమును లేదు. దరిద్రు లనేకు లుండఁగా ఒకరిద్దఱు కోటీశ్వరు లుండుట మంచిపద్ధతి కాదను ఆక్షేపము లేదు. ఈయాస్తిహక్కు ఏదియో కొన్నియంశములందు సంపూర్ణము కాక నియమబద్ధముగ నున్నను మొత్తముమీఁద దానికి నిర్బంధములు చాల తక్కువగ నుండుటచేత ప్రస్తుతకాలపు వ్యవస్థలలో నీహక్కు ప్రధాన మైన దని చెప్పవచ్చును.

కాని యిట్టి హక్కును నిరసించుమహనీయు లనేకు లున్నారు. ఆస్తిపై హక్కు వ్యక్తియందుఁగాక ప్రజాసముదాయమం దుండవలయు నని వాదించువా రున్నారు. పాశ్చాత్య ప్రపంచము నిప్పుడు ఊఁచుచున్న యుద్యమములకును విప్లవములకును నిదియే కారణము. పదునైదుకోట్లు ప్రజలుగల రష్యాదేశమం దిట్టిహక్కును రద్దుచేసి, సాముదాయిక ( సమష్టి ) మగు హక్కును స్థాపించి సమవాదిపక్షమువారు ( Communists ) తమ ప్రభుత్వమును నెలకొల్పి పరిపాలించుచున్నారు ( వివరములకు 'ఆస్తి', 'సమవాదిపక్షము' అను వ్యాసములను చూడనగును ).

(3) మూలవ్యవస్థలలో మూఁడవది 'ఆర్థిక స్వాతంత్ర్యము.' అర్థము నార్జించుటయందును, అందుకై వివిధవృత్తుల నవలంబించుటయందును, ఆర్జించినద్రవ్యమును ఖర్చుపెట్టుటయందును మనుష్యున కీకాలమున స్వాతంత్ర్య మున్నది. ఏవృత్తియందైనను ఎవ్వరైనను ప్రవేశింపవచ్చును. వర్ణభేదములనుబట్టికాని జాతిభేదములను బట్టికాని యిట్టివృత్తి నిట్టివారు స్వీకరింపవలయు ననునిర్బంధము లేదు. స్వశక్తి నాధారము చేసికొని ఇష్టము వచ్చినవృత్తిలో ఇష్టమువచ్చినవాఁడు ప్రవేశింపవచ్చును. దీనికి సంబంధించిన నియమములు కొన్ని యున్నను అవి దీనిని బలపఱుచునియమములు గాని నిరోధించు నియమములు కావు. ఆయాపరీక్షలలో కృతార్థులైనవారు తప్ప తక్కినవా రెవ్వరును న్యాయవాదివృత్తి వైద్యవృత్తి మొదలగువానియందు ప్రవేశింపఁగూడ దనునియమ మిట్టిదే. సామర్థ్య మున్నదో లేదో తెలిసికొనుట కిదియొక యుపాయము కాని సామర్థ్య మున్నవారిని నిరోధించునది కాదు. దీనిమూలమున మనుష్యుని తెలివితేటలు వికసించి వృద్ధి యగుట కవకాశ మేర్పడి ధనోత్పత్తి అధిక మగుచున్నది. ఆర్జనమందే కాక వ్యయము చేయుటయందును ప్రతి వ్యక్తికిని స్వాతంత్ర్య మున్నది. తన యాదాయము నేరీతిగ ఖర్చుపెట్టినను అడ్డుపెట్టువా రెవ్వరును లేరు. అన్నము మాని కాఫీ త్రాగినను, గ్రంథముల మాని వస్త్రములు కొనినను, పిల్లలను చదివించుట మాని సినీమాలను చూచినను ఎట్టినిరోధమును లేదు. పొరుగువాఁడు కట్టుకొనుటకు గుడ్డయు తినుట కన్నమును నిలుచుటకు నీడయు లేక రోదనము చేయుచున్నను తాను రాచకీవితో విశాలభవనములందు నివాసము చేయుచు బహువిధభక్ష్యభోజ్యముల ననుభవించుచు, ఎన్నికలయందు ద్రవ్యము ఖర్చుపెట్టుచు, మోటారుకారులం దూరేఁగుచు నుండవచ్చును. ఇదియే ఆర్థికస్వాతంత్ర్యము. ఇట్టివ్యక్తులు నివసించుప్రపంచమందలి పరిస్థితుల విమర్శించుటయే ప్రస్తుతకాలపు అర్థశాస్త్రకర్తలపని.

(౪) అర్థశాస్త్రము సాధనవినియోగశాస్త్రము :— కోరఁదగిన పురుషార్థము లనేకము లగుటంబట్టియు, వానిని సాధించుటకై కావలసినసాధనములు మితములుగ నుండుటంబట్టియు అర్థశాస్త్ర

sampath_Ebooks

మునకు ప్రాధాన్యము కలుగుచున్నది. ఉన్నసాధనములను వీలగు నంతవఱకు అర్థము లన్నియు సమహూరువిధమున వినియోగింపవలసి యున్నది. ఒక్కదానినిమిత్తము వానిని అధికముగ వాడినయెడల మఱియొకదానినిమిత్తము వాడుటకు సాధనములు చాలకపోవును. కొన్నిపట్టణములందు నీళ్లుసయితము అర్థవర్గమునందు చేరియున్నవి. చాల మితముగ నుండుటచేత డబ్బిచ్చినంగాని ఆనీళ్లు దొరకుటలేదు. నీళ్లు వంటకు, స్నానమునకు, బట్టలుతుకుటకు, గదులను కడుగుటకు, పెరటిలోని మొక్కలకు పెంచుటకు కావలసియున్నవి. నీళ్లవలనను సాధింపవలసిన అర్థము లనేకములు. స్నానమునకై అధికముగ నీళ్లను వాడినయెడల బట్టలుతుకుటకును గదులకును కావలసినన్నినీళ్లుండవు; బట్టలకై ఎక్కువగ నుపయోగించినయెడల స్నానమునకు మొక్కలకు పెంచుటకును కావలసినంతనీరు లేకపోవచ్చును. ఇట్టిసందర్భమున అన్నిపనులకును కావలసినవిధమున నీళ్లను వినియోగపఱుపవలసి యున్నది. అట్టివిధమును కనుగొనుటయే అర్థశాస్త్రమందు చేయఁ బడువిచారము. ఏట్టివినియోగమువలన సాధనములు వ్యర్థము గాక, అధికతమమగు ఫలము నిచ్చును? అనుసమస్యయే ఆర్థికసమస్య. అవసరమైనదానికంటె నధికముగ వాడుటయే వ్యర్థము చేయుట. కలుగఁగల ప్రయోజనము తక్కువమొత్తమును వినియోగించుటవలన కలుగనున్నను అందుకై ఎక్కువమొత్తమును వినియోగము చేయుటయే వ్యర్థతయొక్క లక్షణము. ఇందుమూలమున రెండువిధములగు నష్టములు సంభవించుచున్నవి. దేనికై ఖర్చుపెట్టుచున్నామో అది ఖర్చునకు తగినఫలము నియ్యకపోవుట, మఱియొకదానికై కావలసినంత ఖర్చు పెట్టుటకు వీలు లేకపోవుట అనునవియే యానష్టములు. రూపాయ ఖర్చుపెట్టవలసినచోట రెండురూపాయలను ఖర్చుపెట్టుటవలన కలుగు నష్టము లిట్టివి యని స్వానుభవముచే నందఱకును తెలియుచున్నది. మనము సాధింపవలసిన అర్థ మొక్కటియే యగునప్పుడును అందులకై కావలసిన సాధనము లమితములుగ నుండునప్పుడును అర్థశాస్త్ర ప్రసక్తియే యుండదు. అట్లు గాక సాధింపవలసినయర్థములు పెక్కులై యున్నప్పుడును, వానిని సాధించుటకు కావలసినసాధనములు మితములుగ నుండునప్పుడును వానిని వ్యర్థపుచ్చక వినియోగింపవలసిన క్రమమును తెలుపుశాస్త్ర మొకటి యావశ్యకమైనది. తాము వ్రాయు గ్రంథమునకు అర్థశాస్త్ర మని పేరుపెట్టి అందులో మనుష్యునికి సంబంధించినవివిధవిషయముల నన్నిటిని వివరించు గ్రంథకర్త లనేకు లున్నారు. ఇట్లు చేయుట పొరపాటు. అర్థశాస్త్రము సాధన వినియోగశాస్త్ర మనుసత్యమును మఱవఁగూడదు.

అర్థశాస్త్రమువలన కలుగు ప్రయోజన మిట్టిది యైనను అనేకులు దీనిని గ్రహింపక, ఈశాస్త్రమునందుండి ప్రయోజనాంతరముల నపేక్షించుచు అట్టివి లభింపనపుడు దీనిని ఖండించుచుందురు. మఱికొందఱు ఐహికసౌఖ్యమున కంతకును మూలాధారమగు ధనమును గుఱించి వివరించుశాస్త్ర మనియు, దీనికంటె నుత్కృష్టమగు శాస్త్రము వేఱొకటి లేదనియు దీని నతిమాత్రముగ ప్రశంసించుచుందురు. కాని ఇట్టి ఖండనమండనముల కెట్టి యవకాశమును లేదని మనము తెలిసికొనవలెను.

పురుషుఁడు సాధింపఁదగినయర్థము లివి యని నిర్ధారణము చేయుట అర్థశాస్త్రముయొక్క పని కాదు. అతఁడు స్వీకరించు ఆదర్శములలో నిట్టివి యుత్తమము లనియు, నిట్టివి యధమము లనియు విభాగము చేయుటయు నీశాస్త్రము నుద్దేశము కాదు. అర్థార్జనము మంచి దని కాని చెడ్డదనికాని చెప్పుటకు నీతద్శాస్త్రకారులు సాహసింపరు. మనుష్యుఁడు కోరఁదగినది అర్థమా? ధర్మమా? విశ్రాంతియా? పరిశ్రమమా? వస్తుసౌందర్యమా? వస్తువుల చౌకఁదనమా? పౌరుషోపేతమైనను హింసాత్మకముగుచున్న క్షాత్రమా? లేక సర్వమానవసౌభ్రాత్రమా? స్వారాజ్యమా? అధినివేశ స్వాతంత్ర్యమా? మానవసమత్వమా? అసమత్వమా? అను వివిధములగు వాంఛనీయముల లోని గుణదుర్గుణములను పరీక్షించి గమ్య మిది యని నిరూపించుటకు ఈశాస్త్ర మేర్పడలేదు. గమ్య మిది యని స్థిరపడినతర్వాత దానిని చెందుటకు కావలసినమార్గముల విచారమే అర్థశాస్త్ర మందుండును. ఇది 'గమ్యము'ల గుఱించియు, 'సాధ్యముల' గుఱించియు వివరించుశాస్త్రముగాక 'గతుల'ను గుఱించియు 'సాధనము'ల గుఱించియు విమర్శించునట్టిది. 'గమ్యము'ల గుఱించిన జ్ఞానమును సంపాదింపఁగోరువారి కీశాస్త్ర ముపచరింపదు.

అర్థశాస్త్రకారులు సాధనములను గుఱించిమాత్రము చెప్పుటకును, సాధింపవలసినట్టివియు సాధింపఁదగినట్టివియు నగు నాదర్శములనుగుఱించి చెప్పకపోవుటకును కారణములు కలవు. మంచిచెడ్డలను, పరమార్థములను నిర్ణయించుటకు అర్థశాస్త్రజ్ఞాన మొక్కటే చాలదు. ఇవి ఆర్థికసూత్రముల సాహాయ్యమున మాత్రమే పరిష్కరింపఁదగిన విషయములు కావు. వీనిమూలమున ఆర్థికనష్టము కలిగినను అట్టినష్టమును గమనింపక వీనిని సాధింపవలసియుండును. స్నానమునకు కావలసిన నీళ్లు తక్కువ యగు నని పెరటిలో మొక్కలు నాటుట మానువారు కొంద ఉందురు; మఱికొందఱు స్నానమును మానెదరు గాని మొక్కలను పెంచుట మానరు. కంటికి ఇంపగు పుష్పములతో నిండియుండు మొక్కలు ముఖ్యమా? రోజునకు రెండు పర్యాయములు స్నానము చేయుట ముఖ్యమా? రెండు దినముల కొకమాఱైన నింటిలోనిగదుల నెల్ల కడుగుట ముఖ్యమా? అని నిర్ణయించుటలో నొక్కొకరి మనోభావ మొక్కొకరీతిగ నుండును. ఇందులో నెవరిభావము ప్రశంసనీయమో చెప్పుటయందు జలము యొక్క మితత్వ మొక్కటి మాత్రమే పరిశీలింపఁదగినది కాదు. ఒక్కొక్క రొక్కొకటి వాంఛనీయ మని యనుకొనుట కిదియొక్కటియే కారణము కాదు. దీనినే కారణముగ చేసికొని శుభ్రత, సౌందర్యదృశ్యములందిచ్చ లోనగువానిని విడనాడుట తగదు. అందుచేతనే ఇట్టినిర్ణయమందు అర్థశాస్త్రసాహాయ్యము కోరఁదగినది కాదు. ఇదిగాక వీనినిగుఱించి అభిప్రాయభేదములు కలిగినప్పుడు ఈభేదముల లోని లోపాలోపముల నర్థశాస్త్రపద్ధతిచే నెన్నుటకు వీ లుండదు.

sampath_Ebooks

మూల్యమునుబట్టి తరతమభేదమును నిర్ణయించుట అర్థశాస్త్ర లక్షణము. మంచిచెడ్డలకుఁ గల భేదమును మూల్యమునుబట్టి నిర్ణయింపఁజాలము. వెలగలపదార్థములు మంచి వనియు, తక్కువవెలగలవి మంచివికా వనియు చెప్పరాదు. ఒకబిందెఁడు శుభ్రమగునీళ్లు కానీకి లభించుచుండ ఒకబిందెఁడు కల్లునకు గంటుమూఁడురూపాయల నియ్యవలెనుగదా ?

పరమార్థములు నిశ్చితములైనపిమ్మటనే అర్థశాస్త్రకారులపని ప్రారంభ మగుచున్నది. 'పరమార్థము లిట్టివిగ నున్నప్పుడు అర్థవర్గములోని సాధనములలో నెట్టిమార్పులు కలుగును? ఎట్టివాని నధికముగ నుత్పత్తి చేయుదురు? ఎట్టివానికి మూల్యము హెచ్చును? వేనికి తగ్గును? ఎవరి ఆదాయములు హెచ్చుపొందును? ఎవరివి క్షయ మొందును? ఎట్టిపదార్థములకై ప్రజలు ఖర్చుపెట్టుచుందురు? వేనికై ప్రభుత్వమువారు ఖర్చుపెట్టెదరు?' అను విషయములను అర్థశాస్త్రకర్తలు విమర్శింతురు. ప్రజలయందు పౌరుషమును, కార్యోత్సాహమును, స్వార్థత్యాగమును, దేశాభిమానమును వృద్ధి యగుటకు యుద్ధము లుండవలయు ననునమ్మకము దేశమందు నాటుకొనినప్పుడు ఇది ప్రశంసనీయమా గర్హ్యమా? అను వివాదములో అర్థశాస్త్రమునకు సంబంధము లేదు. యుద్ధరంగమందలి విజయ మను పరమార్థమును సాధించుటకు ఫిరంగులు, మందు, గుండ్లు, విమానయానములు, శస్త్రములు, నౌకలు, ఆకాశయానములు, జలాంతర్గాములు లోనగు సాధనము లనేకములు కావలసియున్నవి. ఇవి మితములుగ లభించు అర్థవర్గములో చేరినవి. వీనిని తయారుచేయుటకు మితముగ నుండు మూలధనము (Capital), మానవపరిశ్రమము (Labour) ఆవశ్యకములు. కాని ప్రజ లందఱకును కావలసిన ఆహారపదార్థములు, వస్త్రములు, ఇండ్లు, విద్యాలయములు, చిత్రకళలు లోనగునవి యుత్పత్తి యగుటకుకూడ ఈమూలధనము మానవపరిశ్రమము ఆవశ్యకములైయున్నవి. మితములగు మూలధనాదులచేత యోధులకు కావలసిన సామగ్రులును, సాధారణప్రజలకు కావలసిన సామగ్రులును ఉత్పత్తి కావలసియున్నవి. మొదటితరగతిలోని సామగ్రి యుత్పత్తి కావలసియుండుటచేత సామాన్యజనులకు కావలసినవాని నుత్పత్తి చేయుటకై వలయునట్టి మూలధనము మనుష్యపరిశ్రమము తగ్గి వీని మూలమున నుత్పత్తి యగుసామగ్రుల బాహుళ్యముకూడ తగ్గును. ఆహారపదార్థములు వస్త్రములు ఇండ్లు లోనగునవి విరివిగ దొరకఁజాలవు. వానిఖరీదులు హెచ్చగును. దరిద్రులగువారు వానిని కొనలేక బాధపడుచుందురు. విద్యాలయములకు ద్రవ్యవసతి తగ్గుటచే దేశమం దజ్ఞాన మధిక మగును. ఉపాధ్యాయులకుఁ గల గిరాకి తగ్గి వారికి దొరకువేతనములు హీన మగును. చిత్రకారులను పోషింప ధనము చాలకపోవుటచేతను వారిజీవనముసయితము దుర్భర మగును. అర్థోత్పత్తియందును, సాధనవినియోగమందును ఇట్టిమార్పులకు సిద్ధపడియే యుద్ధములో విజయమును గాంచుట పరమార్థ మని తీర్మానించుకొనవలెను. యుద్ధమందలి యుత్సాహము సరి యని కాని తప్పని కాని అర్థశాస్త్రము చెప్పఁజాలదు. సాధనవినియోగమందు యుద్ధములమూలమున నిట్టిమార్పులు కలుగు ననియు, ఇట్టిమార్పులు కలుగ వనియు చెప్పుటయే దానిపని. అది చేయవలసినపని మఱియొకటి కలదు. యుద్ధరంగమందలి విజయ మను పరమార్థమును సాధింపఁదగిన తక్కువ అర్థములను సాధించుటలో సాధనములు (మూలధనము, పరిశ్రమము, ప్రకృతిసంపదలు) వ్యర్థము కాకుండ వినియోగింపఁదగినపద్ధతిని అది సూచింపఁగలదు. ఇట్లే మన మాశించు తక్కినపురుషార్థములవిషయమునందును పరిశీలింపవలెను.

## అర్థశాస్త్ర విభజనము

అర్థశాస్త్రమును (అ) అనుభవకాండము, (ఆ) ఉత్పత్తికాండము, (ఇ) మూల్యనిర్ణయకాండము, (ఈ) ఆదాయవిభజనకాండము, (ఉ) చెలామణిద్రవ్యకాండము లని అయిదు భాగములుగ శాస్త్రకర్తలు విభజించియున్నారు. కాని అనేకులమతమున మూల్యనిర్ణయకాండ మొక్కటియే ప్రధాన మనియు, తక్కిన వన్నియు దాని కంగములవంటి వనియు నెంచఁబడుచున్నవి. "వస్తువులయొక్క మూల్యములందలి తారతమ్యమును బట్టియే ఆర్థికప్రపంచమందు వానికిఁగల ప్రాధాన్యాప్రాధాన్యములు నిర్ణయింపఁబడుచున్నవి. అనుభవకాండమున విమర్శింపఁబడు 'ఉపయుక్తత'నుగుఱించిన సిద్ధాంతములును, ఉత్పత్తికాండమున విమర్శింపఁబడు 'మితత్వము'నకు సంబంధించిన సిద్ధాంతములును మూల్యనిర్ణయము చేయుటకై యుపచరించునవే కాని ప్రత్యేక మగు మఱియొకప్రయోజనము కలవి కావు. ఆదాయవిభజనకాండమున పరిశ్రమములకు బదులుగ లభించువేతనములు ఆస్తిహక్కులమూలమున వచ్చు ఆదాయములును విమర్శింపఁబడుచున్నను, ఈవేతనములును, ఆదాయములును మూల్యనిర్ణయసిద్ధాంతముల ననుసరించి యేర్పడునట్టివే; అందుచే నీకాండము మూల్యనిర్ణయకాండమందలి యంతర్భాగమే కాని ప్రత్యేకకాండము కాదు. ఇట్లే చెలామణికాండమున వివరింపఁబడు 'ధరలు' చెలామణిద్రవ్యముయొక్క మూల్యమును నిర్ణయించుటే కాని వేఱొకటి కాదు. చెలామణి ద్రవ్యముయొక్క మూల్యము హెచ్చుటయే ధరలు తగ్గుట; ఆమూల్యము తగ్గుటయే ధరలు హెచ్చుట. కనుక మూల్యనిర్ణయము నొక్కదానినే ప్రధానభాగముగ నంగీకరించుట యుక్తము." ఇదియే అనేకుల వాదము. ఈవాదము సహేతుకముగ నున్నను పైని పేర్కొనఁబడిన కాండములకు ప్రత్యేకత్వము లేదనుట సమంజసము కాదు. వానిలో నొక్కొకదానియందును మూల్యనిర్ణయముతో దగ్గఱసంబంధము లేనివిషయము లనేకములు చర్చింపఁబడుచున్నవి. కావున కాండములైదని భావించుటయే మంచిది.

(ఈకాండములలో నొక్కొకదానినిగుఱించి ప్రత్యేకవ్యాసము లున్నవి. అందుచేత నొక్కొకదానియందు చర్చింపఁబడు ప్రధానవిషయమును మాత్ర మిచ్చుట సంగ్రహించి యున్నాము. అర్థశాస్త్రమందలి సిద్ధాంతము లెట్లుండునో తెలుపుటకు కొన్ని మచ్చునకై ఇచ్చుట వివరింపఁబడినవి.)

sampath_Ebooks

## (అ) అర్థానుభవకాండము:

ఆర్థికవ్యవహారమున కంతకును 'అనుభవము' పరమావధి. విపరీతబుద్ధిగల లోభితప్ప తక్కినవారందఱును అనుభవించుటకై అర్థము నుత్పత్తి చేయుచున్నారు. ఇందుకై మనుష్యుఁడు కోరుపదార్థములసంఖ్యకు మితి లేదు. నాగరకత వృద్ధియైనకొలఁదియు ఈసంఖ్య వృద్ధియగుచుండును.

కాని మనము కోరెడి ఒక్కొక్కవస్తువునకును మితి యున్నది. మామిడిపండ్లపై ఒకనికుండు కోరిక ఒకటిరెండు తినినతర్వాత కొంత తగ్గును; మఱియొకటి తినినతర్వాత మఱికొంత తగ్గును; నాలుగైదు తినినతర్వాత కోరిక లేకపోవుటయేకాక విసుగెత్తును. కోరికలను నెఱవేర్చుశక్తికి ఉపయోగమని పేరు. ఎక్కువ తీక్ష్ణతగల కోరికను నెఱవేర్చుపదార్థము ఎక్కువ ఉపయోగము గలదనియు, తక్కువ తీక్ష్ణతగల కోరికను నెఱవేర్చుపదార్థము తక్కువ ఉపయోగము కలదనియు చెప్పవచ్చును. దీనినిబట్టి మొదటి మామిడిపండు ఎక్కువ ఉపయోగము గలదనియు, రెండవదాని యుపయోగ మంతకంటె తక్కువయనియు, మూఁడవదానియుపయోగము మఱింత తక్కువ యనియు, ఇట్లే పూర్వపూర్వఫలములకంటె నుత్తరోత్తరఫలములయుపయోగము తక్కువ యనియు స్పష్టమగుచున్నది. మామిడిపండువిషయమున చెల్లునట్టి ఈన్యాయము మన మనుభవించు ప్రతిపదార్థము విషయమునను చెల్లుచున్నది. ఈ న్యాయమునకు క్షీణోపయోగ న్యాయము (సిద్ధాంతము — Law of Diminishing Utility) అని పేరు.

ఈసందర్భమున కొన్ని ముఖ్యములగు విషయములను మనము గమనింపవలసి యున్నది—

(౧) మనము 'ఈపదార్థము కావలెను; ఆపదార్థము కావలెను.' అని చెప్పునప్పుడు నిజముగ మనకు కావలసియుండునది ఆపదార్థ మంతయు కాదు. ఆ పదార్థములోని కొన్ని మాత్రలను (Units = అంశములు, భాగములు) మాత్రమే మనము కోరుచున్నాము. నెయ్యి కావలసియున్న దనినపుడు కొన్ని వీసెలో కొన్ని మణుఁగులో కొన్ని పలములో కావలసియున్న దనియే అర్థము, బియ్యము కావలసియున్న దనినపుడు కొన్ని సేర్లో, కొన్ని కుంచములో, కొన్ని బస్తాలో కావలసియున్న దనియే అర్థము. పదార్థముయొక్క స్వభావమును బట్టి మన మందులోని కొన్ని మాత్రలను (వీసెలు, కుంచములు, డజన్లు, గజములు) మాత్రమే కోరుచుందుము. మన మొక పదార్థమును వాడునపుడును, అనుభవించునపుడు, కొనునపుడును ఆ పదార్థమందలి కొన్నిమాత్రలను వాడుచున్నామనియు అనుభవించుచున్నా మనియు కొనుచున్నా మనియు గ్రహింపవలెను.

(౨) పదార్థమువలన మనకు కలుగు ఉపయోగము రెండు విధములుగ పరిగణింపఁబడవలసియున్నది. మొదటిది దానియొక్క మొత్తపు ఉపయోగము; రెండవది దాని 'తుది' యుపయోగము. మన మనుభవించు పదార్థమందలి మాత్రలన్నిటిమూలమునను మనకు లభించు ఉపయోగము మొత్తపు ఉపయోగము; అందులో 'తుది' మాత్రమూలమున మనకు లభించు ఉపయోగము 'తుది యుపయోగము'. రెండు మామిడిపండ్లలో రెండవది 'తుది'ది; దానినుండి లభించు ఉపయోగము 'తుది యుపయోగము'. మూఁడు పండ్లలో మూఁడవదానినుండి లభించు ఉపయోగము 'తుదియుపయోగము'. నాలుగుపండ్లుండునపుడు నాల్గవపండువలన లభించు ఉపయోగము 'తుది యుపయోగము'. రెండుపండ్లున్నప్పుడు మొదటిపండువలన లభించు ఉపయోగమును, రెండవపండువలన లభించు ఉపయోగమును కలుపుటచేత వచ్చుఫలితము రెండు పండ్లవలన లభించు 'మొత్తపు ఉపయోగము'. అట్లే మూఁడుపండ్లుండునపుడు మొదటిపండువలని ఉపయోగము, రెండవదానివలని ఉపయోగము, మూఁడవదానివలని ఉపయోగము — ఈమూఁటిని కలుపుటవలన లభించునదియే మూఁడుపండ్ల 'మొత్తపు ఉపయోగము'. ఇట్లే తక్కినపదార్థములవిషయమునఁగూడ గ్రహించునది.

(౩) 'క్షీణోపయోగన్యాయము' నందు క్షీణించుచున్న దని చెప్పఁబడిన 'ఉపయోగము' 'తుదియుపయోగము' గాని 'మొత్తపు ఉపయోగము' కాదు. ఒకనియొద్ద నుండు పదార్థపుమాత్రలు (పదార్థపుమొత్తము) అధికముకానుకాను రాశియొక్క తుదియుపయోగము క్షీణించుచువచ్చు ననియే ఈ న్యాయముయొక్క అర్థము; కాని మొత్తపు ఉపయోగము క్షీణించు నని కాదు. మొత్తపు ఉపయోగము వృద్ధి యగుచునే యుండును. ఈక్రింది యుదాహరణము దీనిని స్పష్టపఱుచుచున్నది.

| పండ్లమొత్తము (మాత్రలమొత్తము) | తుదిఉపయోగము | మొత్తపు ఉపయోగము |
|---|---|---|
| ౧ | ౨౦ అంశములు | ౨౦ అంశములు |
| ౨ | ౧౮ ,, | ౩౮ ,, |
| ౩ | ౧౫ ,, | ౫౩ ,, |
| ౪ | ౧౦ ,, | ౬౩ ,, |
| ౫ | ౫ ,, | ౬౮ ,, |
| ౬ | ౧ ,, | ౬౯ ,, |

(౪) 'తుదియుపయోగము' నకు మఱియొకవిధమున నిర్వచనము చేయవచ్చును. ఒకపదార్థముయొక్క మాత్రలు కొన్ని ఒకనియొద్ద నున్నపుడు వానిలోనుండి యొకమాత్ర లోపించినయెడల నతఁడు నష్టపడు నుపయోగమునకు 'తుదియుపయోగము' అని పేరు. రెండుపండ్లనుండి యొకపండు లోపించినయెడల నష్టమగు నుపయోగము ౧౮ అంశములు (రెండవపండు = తుదిపండువలన కలుగు ఉపయోగము). మూఁడుపండ్లనుండి యొకపండు లోపించినయెడల నష్టమగునుపయోగము ౧౫ అంశములు. 'తుదిమాత్రవలన లభించు ఉపయోగము తుదియుపయోగము' అనినను, 'ఉన్న మాత్రలలోనుండి యొకమాత్ర లోపించినపుడు నష్టమగు ఉపయోగము తుదియుపయోగము' అనినను ఒక్కటే.

sampath_Ebooks

(౫) ఒకపదార్థమునకు మన మిచ్చుక్రయము ( Price ) ఆ పదార్థముయొక్క 'తుదియుపయోగము'ను కొలతపెట్టుచుండును. ఒకనియొద్ద మామిడిపండ్లే లేనప్పుడు మొదటిపండున కతఁడు ఇరువది కానీలను ఇచ్చుటకుకూడ సిద్ధపడియుండవచ్చును; కాని అంతటిక్రయ మిచ్చి తక్కువ యుపయోగముగల రెండవపండును కొనఁజాలఁడు. రెండవపండువలన ౧౮ అంశముల ఉపయోగముమాత్రమే లభించుట చేత దానికి ౧౮ కానీల నిచ్చుటకు సిద్ధపడును; కాని మూఁడవ పండువలన ౧౫అంశముల యుపయోగము లభించుచుండుటచేత దానికి ౧౮ కానీలక్రయ మియ్యఁజాలఁడు; ౧౫ కానీలచొప్పున దొరకినయెడల మూఁడవ పండును కొనును; లేనియెడల రెండుపండ్లతోనే తృప్తి పొందియుండును. తక్కినపండ్ల కిచ్చుక్రయ మిదేవిధముగ తగ్గుచుండు నని గ్రహించునది.

| క్రయము | కొనుపండ్లసంఖ్య | పండ్ల 'తుదిఉపయోగము' |
|---|---|---|
| ౨౦ కానీలు | ౧ | ౨౦ అంశములు |
| ౧౮ ,, | ౨ | ౧౮ ,, |
| ౧౫ ,, | ౩ | ౧౫ ,, |
| ౧౦ ,, | ౪ | ౧౦ ,, |
| ౫ ,, | ౫ | ౫ ,, |
| ౧ ,, | ౬ | ౧ ,, |

పండ్లసంఖ్య హెచ్చు కానుకాను 'తుదిఉపయోగము' తగ్గుచుండుటచేత దాని కిచ్చుక్రయముకూడ తగ్గుచుండును.

(౬) బజారున మామిడిపండ్లను కొనువా రెందఱో ఉన్నారు. వారందఱి విషయమునను ఈ 'క్షీణోపయోగసిద్ధాంతము' వర్తించుచున్నది. కొనువారు వెయ్యిమంది ఉన్నారనియు, వా రందఱును సరాసరిని పైవిధముగ కొనుచుందురనియు అనుకొనినయెడల క్రయము ౨౦ కానీలుగ నున్నప్పుడు ౧,౦౦౦ పండ్లు ఖర్చగుననియు, ౧౮ కానీలుగ నున్నప్పుడు ౨,౦౦౦ పండ్లు ఖర్చగు ననియు, ౧ కానీగ నున్నప్పుడు ౬,౦౦౦ పండ్లు ఖర్చగుననియు చెప్పవచ్చును. క్రయమునకును, కొనబడియెడు మొత్తమునకును గల సంబంధమును తెలియఁజేయు సిద్ధాంతమునకు 'గిరాకి' సిద్ధాంత మని పేరు. తగ్గుక్రయమున నెక్కువ కొనెద రనియు, ఎక్కువక్రయ మున్నప్పుడు తక్కువ కొనెద రనియు ఈ సిద్ధాంతము చెప్పుచున్నది. అమ్మకమునకు లేఁబడు మొత్తము అధికము కానుకాను క్రేత లిచ్చుక్రయము తగ్గునని ఈసిద్ధాంతమువలన నేర్పడుచున్నది. పదార్థముయొక్క బాహుళ్యము ( Quantity-Supply ) నకును, దాని తుదియుపయోగమునకును ( Marginal utility ), దానిక్రయమునకును ( Price ) పూర్వాపరసంబంధ మున్నది.

(౭) అనుభవయోగ్య మగుపదార్థ మెంత ప్రశస్తమైనదైనను మన మెన్నడను నట్టిపదార్థము నొక్కదానినే అనంతముగ కూడఁబెట్టుటకు ప్రయత్నించుటలేదు. దానిని కొంతవఱకు సంపాదించిన తర్వాత మఱియొకదానిని సంపాదించుటకు మనము కోరుచుందుము. దీనికిఁ గల కారణమును 'క్షీణోపయోగసిద్ధాంతము' తెలుపుచున్నది.

క్షీణోపయోగసిద్ధాంతమువనుండి సమానోపయోగ సిద్ధాంతము ( Law of Equi-marginal returns ) అను మఱియొక సిద్ధాంతమూహింపఁబడుచున్నది. ఒకనియొద్ద మితముగ కొంత ద్రవ్య మున్నప్పుడు దానితో రెండుపదార్థముల నతఁడు కొనవలసియుండినయెడల ఒకపదార్థమునకై అతఁడు ఖర్చుపెట్టెడి తుది ద్రవ్యమాత్ర (తుది ద్రవ్యాంశము)వలన కలుగునుపయోగము రెండవ పదార్థమునకై అతఁడు ఖర్చుపెట్టెడి తుదిద్రవ్యమాత్రవలన కలుగునుపయోగముతో సమానముగ నుండును. తొమ్మిదిఅణాలు తనయొద్ద నున్నప్పుడు కొంత పంచదార కొన్నిపాలు కొనఁదలఁచినయెడల పంచదారకై ఎన్ని అణాలు ఖర్చుపెట్టవలయునో పాలకై ఎన్నిఅణాలు ఖర్చుపెట్టవలయునో తీర్మానము చేయవలసియున్నది. నాలుగణా లొకదానికిని ఐదణాలు మఱియొకదానికిని, లేదా ఐదణా లొకదానికిని నాలుగణాలు మఱియొకదానికిని నిట్లు వివిధభాగములుగ ఖర్చుపెట్టుట కవకాశ ముండును. ఈ యవకాశము లన్నిటిలో ననుసరింపఁదగిన అవకాశ మెద్ది? ఇట్టి సంశయము కలిగినపుడు సమానోపయోగ సిద్ధాంతమునుబట్టి మనము ప్రవర్తించుచుందుము. ప్రారంభమున పంచదారపై ఎక్కువ ఇష్ట ముండవచ్చును. మొదటిఅణాను పంచదారకై ఖర్చుపెట్టుటవలన కలుగు ఉపయోగము మొదటి అణాను పాలకై ఖర్చుపెట్టుటవలన కలుగు ఉపయోగమునకంటె నధికముగ నుండవచ్చును. కాని కొన్ని అణాలు పెట్టి కొంతపంచదారను కొనిన తర్వాత మఱియొక అణాను దానికై ఖర్చుపెట్టుటవలన కలుగు ఉపయోగమునకంటె ఆయణాను పాలకై ఖర్చుపెట్టుటవలన కలుగు ఉపయోగము అధికముగ నుండవచ్చును. అట్టిస్థితిలో ఆయణాను పంచదారకొఱకై ఖర్చుపెట్టుట మాని పాలకై ఖర్చుపెట్టి ఎక్కువ యుపయోగమును పొందుట బుద్ధిమంతుని లక్షణము. ఈక్రిందియుదాహరణములోని లెక్కలు ఈవిషయమును స్పష్టము చేయుచున్నవి.

| ఖర్చుపెట్టు అణా | పంచదారవలని ఉపయోగము | పాలవలని ఉపయోగము |
|---|---|---|
| ౧-వ అణా | ౧౦ అంశములు | ౯ అంశములు |
| ౨ ,, | ౮ ,, | ౭ ,, |
| ౩ ,, | ౬ ,, | ౪ ,, |
| ౪ ,, | ౫ ,, | ౩ ,, |
| ౫ ,, | ౩ ,, | ౨ ,, |
| ౬ ,, | ౨ ,, | ౧ ,, |

ఈసందర్భములో పంచదారకై ఆఱణాలను, పాలకై మూఁడణాలను ఖర్చుపెట్టుట యుక్తము కాదు. తుది (ఆఱవయణా) అణా పంచదారవలన రెండుఅంశముల ఉపయోగముమాత్రము లభించుచున్నది; తుది (మూఁడవయణా) అణాపాలవలన నాలుగంశముల ఉపయోగము లభించుచున్నది. కావున తుదిద్రవ్యమాత్రల యుపయోగములు సమానములుగ లేవు. ఆఱవయణాను పంచదారకుఁగాక పాలకై వినియోగించినయెడల రెండంశముల ఉపయోగమునకు బదు

sampath_Ebooks

లుగ మూఁడంశముల యుపయోగము లభించును. అప్పుడు పంచదారకై అయిదణాలును, పాలకై నాలుగణాలును ఖర్చగును. పంచదారకై ఖర్చుపెట్టినతుదిద్రవ్యమాత్ర (అయిదవయణా) వలన కలుగు నుపయోగము ౩ (అంశములు) పాలకై ఖర్చుపెట్టిన తుదిద్రవ్యమాత్ర (నాలుగవ యణా) వలన కలుగు నుపయోగముతో (౩ అంశములు) సమాన మగుచున్నది. కాన ఇదియే సరియైన వినియోగము. దీనికి భిన్నమగు మఱియేవినియోగము మూలమునను (లెక్కవేసి చూడవచ్చును) తుది యుపయోగము అసమాన మగును.

తుదియుపయోగము సమాన మగునట్లు ద్రవ్యమును వినియోగించినపుడే రెండుపదార్థములవలన లభించు మొత్తపు నుపయోగము (Total Utility) అధికతమముగ (Maximum) నుండును. అయిదణాల పంచదార మూలమున ౧౦ + ౮ + ౬ + ౫ + ౩ = ౩౨ అంశముల యుపయోగమును, నాలుగణాలపాలమూలమున ౯ + ౭ + ౪ + ౩ = ౨౩ అంశముల యుపయోగమును గల్గుటచేత మొత్తముమీఁద ౩౨ + ౨౩ = ౫౫ అంశముల యుపయోగము లభించినది. మఱియెట్టి వినియోగమువలనను ఇంత యధిక మగునుపయోగము కలుగఁజాలదు.

అర్థశాస్త్రసిద్ధాంతములలో పైని పేర్కొనఁబడిన క్షీణోపయోగసిద్ధాంతము, సమానోపయోగసిద్ధాంతము అనురెండును మిక్కిలి ముఖ్యము లైన వగుటచే వానిని గుఱించి కొంత విపులముగ చెప్పవలసి వచ్చినది. వానిలో సమానోపయోగసిద్ధాంతముయొక్క ప్రాధాన్యమును తెలుపుటకై మఱికొన్ని యుదాహరణము లావశ్యకము లగుచున్నవి. దినమున కిరువదినాలుగు గంటల కాలముమాత్రమే. ఇట్టి మితకాలమును ఆహారమునకును, విహారమునకును, ఉద్యోగమునకును, పెత్తనమునకును, నిద్రకును వినియోగింపవలసి యున్నది. ఒక్కొక్కదాని నిమిత్తమున ఎంతెంతకాలము వినియోగింపవలెనను విషయమును నిర్ణయించుట ప్రతి మనుష్యునకిని ముఖ్యమై యున్నది. వీనిలో దేనినైనను పూర్తిగ వదలుటకు వీలులేదు; అన్నియు కావలసినవియే; కాన ఒక్కదానికై — నిద్రకై — విశేషకాల ముపయోగించిన యెడల తక్కినవానికి కావలసినంత కాల ముండదు. ఒకనిస్వభావము మఱియొకని స్వభావమువలె నుండకుండుటచేతను, అందఱకును స్వాతంత్ర్య ముండుటచేతను ప్రతిమనుజుఁడును తనస్వభావము ననుసరించి సమానోపయోగసిద్ధాంతముచొప్పున తనకాలమును వినియోగించుచుండును. విహారమే అక్కఱలేదని యనుకొనఁజాలము గాని దానికొఱకు ఎక్కువకాలము ఖర్చగుచున్న దనియు, నిద్రకు కావలసినంత కాలము లేకున్న దనియు తలఁచుచు విహారమునకై ఖర్చగు కాలములోని యొకగంటనో అరగంటనో (ఒకమాత్రను) నిద్రాకాలములో చేర్చుట మనకు సహజము. కావున ప్రతిదానికిని మనము ఖర్చుపెట్టుగంటలలో తుదిమాత్రవలన సమానోపయోగము లభించుచున్నదా లేదా యని యాలోచించి యావశ్యకమునుబట్టి యాతుదిమాత్రల నొకదానినుండి మఱియొకదానిలోనికి మార్చుచుందుము. విద్యార్థులు పరీక్షలకు ముందు నిద్రాకాలములోని తుదిరెండుమూఁడుగంటలను చదువుకొనుకాలములోను, పరీక్షలు ముగిసినతర్వాత చదువుకొనుకాలములోని తుది గంటలను కొన్నిటిని నిద్రాకాలములోను, కొన్నిగంటలను విహారకాలములోను చేర్చుచుందురుగదా? అట్లే బుద్ధిమంతుఁడు తనజీవితకాలము నంతయు వినియోగించుచున్నాఁడు. విద్య కావలసియున్నను మితముగ నుండు తన ఆయువు నంతయు విద్యాభ్యాస మొక్కదానికే ఖర్చుపెట్టక — విద్యయం దంతటిరుచి కలవాఁడైనను — తక్కినధర్మములనుసైతము నిర్వర్తింపఁబూనుచున్నాఁడు.

బజారునకు వెళ్లినపుడు మనము కొనఁదగినవస్తువు లనేకము లుండును. వానిలో అనేకములు మన కావశ్యకములుగఁగూడ నుండును. బియ్యము, పప్పు, నెయ్యి, నూనె, కూరగాయలు, పండ్లు లోనగునవి యన్నియు కావలసినవే. దగ్గఱనుండు ద్రవ్యముమాత్రము మితముగ నుండును. కావున నట్టియావశ్యకములగు వస్తువులలోఁ గొన్నిటి నత్యధికముగఁ గొందమనియు, మఱికొన్నిటిని బొత్తిగ మానుదమనియు మన కాలోచనము కలుగదు. ఏయే వస్తువులను ఎంతెంత ద్రవ్యము పెట్టికొనిన బాగుగ నుండును? ఎందులో కొంచెము తగ్గించిన బాగుగ నుండును? ఎందులో కొంచెము పెంచిన బాగుగ నుండును? మఱియొక అణాపెట్టి కూరగాయలు కొనుట మంచిదా, లేదా పండ్లను కొనుట మంచిదా? అని యిట్లు కొంచెము హెచ్చుతక్కువలను (Marginal Units) గుఱించియే — అనఁగా తుదిమాత్రలగుఱించియే మన మాలోచించుచుందుము.

ఈసందర్భమున ప్రస్తుతకాలమందు పాశ్చాత్త్యదేశములలోని పరిస్థితులకును మనపరిస్థితులకును ఒకప్రధానవిషయమందుఁ గల భేదమును సూచింపవలసి యున్నది. కాలవినియోగములో ద్రవ్యార్జనమున కెంతకాలము వినియోగింపవలెను? ఆర్జించినద్రవ్యము ననుభవించుట కెంతకాలము వినియోగింపవలెను? అనువిషయము ముఖ్యము. యంత్రసాహాయ్యమువలన తక్కువ కాలములో ఎక్కువ ద్రవ్యార్జనము చేయుటకు వీలు కలుగుచుండుటచేతను, ప్రకృతిసంపదలను తగు విధమున నుపయోగించి ఐశ్వర్యమును వృద్ధిచేసికొనుటకు కావలసిన వసతుల నన్నిటిని వారు కల్పించుకొనినవా రగుటచేతను వా రుత్పత్తి చేయఁగలవస్తుజాల మెంతో అధికమైనది. వస్తువుల నుత్పత్తిచేయుట వాని ననుభవించుటకే కాని వానిని నిరుపయోగముగ కూడఁబెట్టుటకు కాదు. ఇట్టివివక్ష చేయనికారణముచేత ఆదేశములలోనివారి కాలములో చాలభాగము అయుక్తముగ పదార్థోత్పత్తియందే వినియుక్త మగుచున్నది. అర్థము ననుభవించుటకు కావలసిన తీరుబడి వారికి లేకున్నది. కావున కర్మాగారములలో (Factories) పనిచేయువారు ఆఱుగంటలకంటె నెక్కువగ పనిచేయఁగూడ దనియు, వారమున కైదురోజులకంటె నెక్కువగ పని చేయవలసినయావశ్యకము లే దనియు శాసనములమూలమున నిర్ణయింపఁదలఁచుచున్నారు. దీనిని బట్టి ప్రస్తుతము ఆదేశములలో జరుగుచుండు కాలవినియోగము పైని చెప్పినసమానోపయోగసిద్ధాంతమునకు విరుద్ధముగ నున్న దనియు,

sampath Ebooks

అందుచే వారికాలవినియోగము సార్థకము గాక వ్యర్థ మగుచున్న దనియు నిశ్చిత మగుచున్నది. మనపరిస్థితు లన్నియో మఱియొక విధముగ నున్నవి. విశ్రాంతికై ఖర్చగుకాలము అర్థోత్పత్తికై ఖర్చగుకాలము కంటె నధికముగ నున్నది. చేయుటకు పని లేనివా రెందఱో కలరు. సంవత్సరముపొడుగునను పని లేనివా రనేకు లున్నారు. అర్థోత్పత్తి తక్కువయగుటచే దాని ననుభవించుటకు కాల మధికముగ నున్నను అనుభవించుటకు కావలసిన పదార్థములు చాలకున్నవి. కావున మన కాల మిప్పటికంటె నధికముగ నర్థోత్పత్తికై వినియోగించుటకు తగిన వసతులను మనము కల్పించుకొనవలసియున్నాము.

ఒక దేశములోని పరిస్థితులకున్న మఱియొక దానియందలి పరిస్థితులకును భేద ముండుటచేత అన్ని దేశములకును సమానముగ వర్తించు ఆర్థికసిద్ధాంతముల నేర్పఱుపఁజాలఁచుట యుక్తము కాదనువాద మొకటి యున్న దని యీయవలిలో సూచింపఁబడెను. పైని ఉదాహరించినవిషయమునుబట్టి ఇట్టివాదము సరియైనది కాదని స్పష్టమగును. సమానోపయోగసిద్ధాంతము పాశ్చాత్త్యదేశములకును మన దేశమునకును సరిగ వర్తించునదియే. కాని అది యెట్లు వర్తించుచున్నదో, దాని సాహాయ్యమున మన మెట్టిమార్పులు చేసికొనవలయునో తీర్మానించుకొనుటయందు మనపరిస్థితులకును, పాశ్చాత్త్యపరిస్థితులకును గలభేదము పరిశీలింపవలసి యున్నది. వారికి ఎక్కువ విశ్రాంతి యావశ్యక మగుచున్నది గనుక మనకును నెక్కువవిశ్రాంతి కావలసియున్నదని యూహించుట తగదు. పరిస్థితుల భేదములను సిద్ధాంతములను మార్చుటయందుఁగాక సిద్ధాంతముల నాచరించుట యందు గణించుట యుక్త మని గ్రహింపవలెను.

క్షీణోపయోగ, సమానోపయోగసిద్ధాంతములవలన మితపదార్థము లనుభవించుటలో మనుష్యప్రవర్తనమందుఁ గల మఱియొక విశేషము విస్పష్టమగుచున్నది. పదార్థములవలన మన మపేక్షించునది ప్రస్తుతకాలోపయోగముఁ గాని, భావికాలోపయోగముఁ గాని యుండవచ్చును. ప్రస్తుతోపయోగముమాత్రమే కోరువాఁడు ఆర్జించినధనము నంతయు వెంటనే ఖర్చుపెట్టును. భావియుపయోగమును కోరువాఁ డట్లు చేయక కొంతధన ముందుకై కూడఁబెట్టును. ప్రస్తుతము ఖర్చుపెట్టక కొంతకాలమైనతర్వాత ఖర్చు పెట్టుటకు కూడఁబెట్టుట (Saving) యని పేరు. 'కూడఁబెట్టుట' యను దానికిఁగల కారణము పైసిద్ధాంతములవలన తెలియుచున్నది. నూఱు రూపాయల నెలజీతము తెచ్చుకొనువాఁడు ప్రతి మాసములోను పది రూపాయలు కూడఁబెట్టుచున్నాఁ డనుదానిలో అర్థ మేమి? ఈపది రూపాయ లిప్పుడు ఖర్చుపెట్టుటవలన కలుగు ఉపయోగమునకంటె కొంతకాల మైనతర్వాత దానిని ఖర్చుపెట్టినయెడల నెక్కువ యుపయోగము కలుగునని అతఁ డనుకొనుచున్నాఁ డనియేకదా దాని యర్థము. ఇట్లనుకొనుటకు కారణ మున్నది. నూఱురూపాయల జీతము వచ్చువాఁడు తనకుటుంబము పెద్దది కాఁగల దనియో, రాఁబోవు కాలమున తనఖర్చు లధికము కాఁగల వనియో, వార్ధకమున తనకు లభించు వేతనము తగ్గఁగల దనియో ప్రస్తుత కాలమున నెలకు పదేసి రూపాయల చొప్పున కూడఁబెట్టుచున్నాఁడు. ఈ పదేసి రూపాయలను ఇప్పుడు ఖర్చు పెట్టకపోవుటవలన నతనికి లభింపని యుపయోగము లెట్టివి? ఇంటి అద్దెకు, ఓయ్యమునకు, తక్కిన ఆహారపదార్థములకు, బట్టలకు, ముఖ్యములగు నితరవిషయములకు నతఁడు తక్కిన తొంబదిరూపాయలను ఖర్చుపెట్టి ఆటలు పాటలు మఱికొన్ని వినోదములు మున్నగు విస్తార ముపయోగము లేని మఱికొన్ని సాధనములకును ఆపదేసిరూపాయలను ఖర్చుపెట్టుటకు బదులుగఁగదా వానిని కూడఁబెట్టుచున్నాఁడు. అతఁ డిప్పుడు కోల్పోవునుపయోగము వినోదాదులమూలమున కలుగునట్టిదే కదా? కుటుంబము పెరిఁగినపుడు పెద్దయిల్లు, ఎక్కువబియ్యము, ఎక్కువగ నితరపదార్థములు, బట్టలు కావలసియుండును. ప్రస్తుతము వినోదముల ననుభవింపక కూడఁబెట్టినధనము రాఁబోవుకాలమున విశాల మగునింటికి, ఎక్కువబియ్యమునకు, ఇతరపదార్థములకును పనికివచ్చును. వీనిమూలమున కలుగునుపయోగము ఇప్పుడు కోల్పోవు ఉపయోగమునకన్న అధికముగనుండును. పంచదారకై ఖర్చుపెట్టు అణవయణాను పాలకై ఖర్చుపెట్టుటవలన నెక్కువయుపయోగము లభించునట్లు ప్రస్తుతోపయోగమునకై ఖర్చుపెట్టఁదలఁచిన తుది పదిరూపాయలను భావ్యుపయోగమునకై ఖర్చుపెట్టినయెడల మొత్తపు ఉపయోగ మధిక మగుచున్నది. మితముగ నుండుధనమును (నూఱురూపాయలను) ప్రస్తుతోపయోగమునకు భావ్యుపయోగమునకును వినియోగము చేయవలసివచ్చినపుడు తుది మాత్రల (తుది పదిరూపాయల) మూలమున ప్రస్తుతమునను భావికాలమునను లభించునుపయోగము సమాన మగునట్లు వినియోగము చేయవలెను.

సిద్ధాంతముల నాచరణములో పెట్టుటయందు ఆయాజనుల యొక్కయు, ఆయాదేశములయొక్కయు పరిస్థితులను పరిశీలింపవలయునని పైని చెప్పఁబడెను. ధనమునుకూడఁబెట్టువిషయములో నీసత్యము నాలోచింపవలసియున్నది. వందరూపాయల జీతము తెచ్చుకొనువాఁడు ధనము కూడఁబెట్టినట్లు ముప్పదిరూపాయలజీతము తెచ్చుకొనువాఁడు కూడఁబెట్ట యత్నించుట అపమార్గమే యగును. అతని ప్రస్తుతపు ఖర్చంతయు నెక్కువయుపయోగమును కలిగించు ఆహారపదార్థములకుఁగానే యుండును. అట్టివానిజీతములోనుండి ధనమును కూడఁబెట్టుట యనఁగా తనయొక్కయు తన పిల్లలయొక్కయు ఆరోగ్యము చెఱుచుకొని కూడఁబెట్టుట యని అర్థము. అట్టివాఁడు ప్రస్తుతము కోల్పోవు ఉపయోగము ఎంతో అధికమైనది. దానిని కోల్పోయి పదేసిరూపాయలచొప్పున కూడఁబెట్టినయెడల వార్ధకమురాకమునుపే మృతిఁజెందుట గాని, దాని ననుభవించుటకు కావలసిన శక్తిలేనివాఁ డగుటగాని సంభవించును. సమానోపయోగసిద్ధాంతమును బట్టి మనద్రవ్యమును ప్రస్తుతోపయోగములగు పదార్థములకు భావికాలోపయోగములగు పదార్థములకును వినియోగము చేయవలయునని చెప్పినవెంటనే అందఱును తమతమశక్తికిమించి కూడఁబెట్టవలయు

sampath_Ebooks

నను అర్థమును చేసికొనఁగూడదు. పాశ్చాత్త్యదేశములం దీకాలమున నీ విషయములో మనుష్యప్రవర్తనము విపరీతముగ నున్న దని అనేకులు తలఁచుచున్నారు. అప్పటివారిలో ననేకుల ఆదాయ మత్యధికముగ నుండుటచేత ధనమును కూడఁబెట్టుట చాల సుకరముగ నున్నది. కాని కూడఁబెట్టినదాని నంతయు భావికాలమం దనుభవించు నవసరము వారికి లేదు. కూడఁబెట్టినధనమును ఖర్చుపెట్టుటకు కావలసిన ఉపాయములను వారు వెదకుచున్నారు.

మితసాధనములనుండి అధికతమ మగు నుపయోగము(Maximum utility) లభించునట్లు వినియోగవిధానము చేర్పఱుచుటయే 'అనుభవకాండము' లోని ప్రధానవిషయ మని పెద్దలు గ్రహింతురుగాక.

## ఆ. ఉత్పత్తికాండము

ఉత్పత్తికాండమందలి విషయము లీవిధముగ నుండును: (౧) అర్థోత్పత్తి యనిన క్రొత్తయుపయోగముల నుత్పత్తి గావించుటయే కాని క్రొత్తపదార్థముల నుత్పత్తి చేయుట కాదు. కొయ్యను మంచముగఁ జేసినపుడు వడ్రంగి దానియొక్క రూపమును మార్చి అదివఱకు దానికి లేని ఉపయోగము నిప్పుడు కల్పించుచున్నాఁడు. వస్తువున కదివఱకు లేని యుపయోగమును క్రొత్తగ కల్పించుటయు, అదివఱ కుండిన అల్పోపయోగమును అధికోపయోగముగఁ జేయుటయు అర్థోత్పత్తి. వస్తువుల రూపమును మార్చియేకాక అవి దొరకుప్రదేశములను కాలములను సైతము మార్చి వానికిఁగల యుపయోగములను వృద్ధి చేయవచ్చును. వర్తకులు చేయుపని ఇట్టిది. కావున రూపములను మార్చు వడ్రంగులు, సాలెవాండ్రు, కుమ్మర్లు, కంసర్లు లోనగువారే కాక వర్తకులుకూడ అర్థోత్పత్తి చేయువారే. (౨) అర్థోత్పత్తిచేయువాఁడు మనుష్యుఁడు. అందులకు ప్రకృతిసంపదయు మూలధనమును సాహాయ్యము చేయుసాధనములు. భూమి, గనులు, అడవులు లోనగునవి ప్రకృతిసంపదలు; ఇవి మనుష్యుని పరిశ్రమమువలనఁగాక స్వతస్సిద్ధముగ నుండునవి. కర్షకరు లుపయోగించు నాఁగలి, గొడ్డలి, రాట్నము, మగ్గము, బండ్లు, యంత్రములు లోనగు పరికరములు మూలధనములోనివి. ఇవి స్వయముగ మనుష్యునికోరికలను నెఱవేర్పక కోరికలను నెఱవేర్చు ధాన్యాదుల నుత్పత్తిచేయుటయందు సాహాయ్యపడునవి యగుటచేత మూలధన మని యనిపించుకొనుచున్నవి. పురుషకారము(మనుష్యుఁడు), ప్రకృతిసంపద, మూలధనము లను నీమూఁడును అర్థోత్పత్తికి మూలసాధనములు. కావున వీనికి సాధనత్రయమను పేరు చెల్లుచున్నది. (౩) దేశమునం దుత్పత్తి యగు మొత్తపు-అర్థమును (Total Wealth) నిర్ణయించు అంశములు ఈసాధనత్రయమునకు సంబంధించి యున్నవి. దేశములోని మొత్తపు జనసంఖ్య, వారిలో అర్థోత్పత్తియందు పాటుపడువారి సంఖ్య, పాటుపడువారి శక్తిసామర్థ్యములు తెలివితేటలు, వారివారి కేవృత్తియందు నేర్పు గలదో ఆవృత్తులలో పని చేయుచుండుట — ఇవన్నియు కలసి ఒక అంశముగ నేర్పడుచున్నవి. ఇవి పురుషకారమునకు సంబంధించినవి. ప్రకృతిసంపదలు, వానియొక్క సారత రెండవ అంశములో చేరినవి. దేశములో నర్థోత్పత్తికై యుపయోగించు మూలధనముయొక్క బాహుళ్యము, అందులోచేరిన పరికరములసౌష్ఠవము — ఇవి మూఁడవ అంశముగ నేర్పడుచున్నవి. ఈ మూఁడు అంశములును గాక నాల్గవ అంశము మఱియొకటి యున్నది. సాధనత్రయసంయోగమువలన అర్థోత్పత్తి యగుటచేత సంయోగవిధానముయొక్క రీతినిబట్టి అర్థోత్పత్తియందలి అల్పానల్పములు నిర్ణీతము లగుచున్నవి. కొన్నివిధము లగుసంయోగములవలన అర్థోత్పత్తి అధిక మగును; మఱికొన్నిటివలన అల్ప మగును. (౪) జననమరణములకుఁగల భేదములను బట్టి దేశములోని జనసంఖ్య నిర్ణయింపఁబడుచున్నది. జననముల సంఖ్య అధికముగ నుండుదేశములలో మరణములసంఖ్యయు అధికముగ నుండును. ఈసంఖ్యలలో దేశదేశములయందలి భేదములకుఁగల కారణములు ఉత్పత్తికాండమున విమర్శింపఁబడును. జనసంఖ్యలో పాటుపడువారిసంఖ్య కొన్నిదేశములయం దధికముగను కొన్నిదేశములయం దల్పముగను ఉండును. అట్లే వారిశక్తిసామర్థ్యములందుఁగూడ భేదము లగపడుచున్నవి. కొన్నిదేశములలోనివారు వారార్జించినధనములో చాలభాగమును కూడఁబెట్టుచుందురు; మఱికొన్నిదేశములం దట్లు జరుగుట లేదు. ఈభేదములకుఁగల కారణములుకూడ ఉత్పత్తికాండమందు విమర్శింపఁబడును. (౫) అర్థోత్పత్తియం దొకదేశముకంటె మఱియొకదేశము ఉచ్చస్థితియం దున్నదో లేదో నిర్ణయించుటయందు పరిశీలింపవలసినవిషయము దేశోత్పత్తి యగు మొత్తపు అర్థము కాదు; సరాసరిని దేశమందలి యొక్కొక్క వ్యక్తియు నుత్పత్తిచేయు అర్థమే ఈసందర్భమున ముఖ్యమైనది. ఇట్లు లెక్క వేసినయెడల ఇంగ్లండు అమెరికాదేశములు ఉన్నతస్థితియం దున్నట్లును, మనదేశము హీనస్థితియం దున్నట్లును స్పష్టమగుచున్నది. దేశమందలి జనసంఖ్య హెచ్చుగ నున్నది యని కొందఱును, హెచ్చుగ లేదనియు మఱింత హెచ్చినప్పటికిని ప్రమాదము లేదనియు కొందఱును వాదించుచుందురు. ఈవాదములలో మనము గమనింపవలసినవిషయము మొత్తపు అర్థము కాదు; సరాసరిని ఒక్కొక్కవ్యక్తియు నుత్పత్తి చేయుచుండు అర్థము. ప్రస్తుతపు పరిస్థితులలో జనసంఖ్య కొంచెము తగ్గుటవలన ఈసరాసరి ఆదాయము (Average income) హెచ్చునట్లుండునెడల ఇప్పు డుండుజనసంఖ్య హెచ్చనియే చెప్పవలెను; అట్లుగాక జనసంఖ్య కొంచెము తగ్గుటవలన సరాసరి ఆదాయము తగ్గునెడల ఇప్పు డుండుజనసంఖ్య హెచ్చు కాదనియే చెప్పవలెను. (౬) సంయోగవిధానములందు ఒకదేశమునకును మఱియొకదేశమునకును ఎన్నియో భేదము లుండవచ్చును. వీనిలో వ్యవహారబాహుళ్యము, వ్యవహారమున పని చేయుచుండువారిలోఁగల పరస్పరసంబంధములు, వ్యవహారము నడపుటకు కావలసిన స్వాతంత్ర్యములు ననునీమూఁడును ముఖ్యములు. కొందఱు రైతులు రెండు మూఁడెకరములభూమిని సాగు చేయుచుందురు; మఱికొందఱు

sampath_Ebooks

వందలకొలఁది యెకరములను, కొందఱు వేలకొలఁదియెకరములను సాగు చేయుచుందురు. కావున కొందఱు రైతుల వ్యవహారము స్వల్పముగను, మఱికొందఱియొక్క వ్యవహారము బాహుళ్యముగను ఉన్నది. వ్యవహారము బాహుళ్యముగ నుండునపు డొక యజమానివశమం దుండు మూలధనము, ప్రకృతిసంపద, పనివాండ్రసంఖ్యయు, అతఁ డుత్పత్తి చేయుపదార్థముల సముదాయమును అధికముగ నుండును. మాయూరి నేతగాండ్రకును, మిల్లులఁ బెట్టి బట్టల నేయించుయజమానులకును ఇట్టి భేదము కలదు. వ్యవహార బాహుళ్యము సాహాయ్యకారియా కాదా? ఎట్టియుత్పత్తికి బాహుళ్య మావశ్యకము? బాహుళ్య మధికము కానుకాను కొన్నిపదార్థములవిషయమున నుత్పత్తి చేయుట కగు సరాసరిఖర్చు తగ్గి పదార్థము చౌక యగును; కొన్నిటియం దట్లుండదు. ఒకపదార్థమువిషయమునఁగూడ ఒకహద్దు దాఁటునంతకును బాహుళ్య మధికమగుట చౌకతనమునకు హేతు వగుటయు, అది దాఁటినతరువాత బాహుళ్యము మూలమున చౌకతనము లేకుండుటయు సంభవించుచున్నవి. సామాన్యముగ మనదేశమందలి వ్యవహారములు అల్పములుగ నున్నవి; పాశ్చాత్యదేశములలోని వ్యవహారములు బాహుళ్యములుగ నున్నవి. (౬) ఉత్పత్తికాండమందలి సిద్ధాంతములలో ముఖ్యము లైనవి వ్యవహార బాహుళ్యమునకు సంబంధించినవి. వ్యవహారము బాహుళ్యము కానుకాను ఉత్పత్తి యగు పదార్థము చౌకగ నుండినయెడల నట్టివ్యవహారము లధికవృద్ధిన్యాయము ననుసరించి యుండుననియు (Law of increasing returns), బాహుళ్యము అధికము కానుకాను ఉత్పత్తియగు పదార్థము గాయక మగుచుండినయెడల నట్టివ్యవహారములు క్షీణవృద్ధిన్యాయము (Law of Diminishing Returns) ననుసరించి యుండు ననియు, బాహుళ్యము కానుకాను ఉత్పత్తియగుపదార్థము చౌకయగుఁగాక గాయక మునుగాక యథాప్రకారముగ నుండునెడల నట్టివ్యవహారము సమవృద్ధి న్యాయము (Law of Constant returns) ననుసరించి యుండు ననియు చెప్పుచుందురు. ఈన్యాయములకును, అనుభవకాండమందలి క్షీణోపయోగన్యాయమునకును కొంత సాదృశ్యము కలదు. (౭) ప్రతివ్యవహారమందును నాలుగైదురకముల పనులు చేయవలసి యున్నవి. వ్యవహారమునం దుత్పత్తియగు పదార్థమును ఎంత అధికముగ నుత్పత్తి చేయవలసినదియు, దాని నెచట నెట్టి క్రయమునకు విక్రయింపవలసినదియు, అందులకు కావలసిన సాధనముల నేరీతిగ సమకూర్పవలసినదియు తీర్మానించుట మొదటి పని. ఈ తీర్మానములఁ బట్టియే వ్యవహారము మూలమున వచ్చు లాభనష్టములు నిర్ణయమగును. లాభనష్టములను భరించుపూఁచీ యెవరిదియో వారే వ్యవహారమునకు యజమాని యని చెప్పఁబడుచున్నారు. యజమాని ఒకఁడుగ నుండవచ్చును; లేదా ఇద్దఱుముగ్గురు భాగస్వాములు కలసి లాభనష్టములకు పూఁచీపడవచ్చును; లేక వందలకొలఁది మనుష్యు లందుకై కలయవచ్చును. ప్రస్తుతకాలమున కంపెనీవ్యవహారములలో (Joint-stock Companies) అనేకము లిట్టివి. లాభనష్టములను భరించు పూఁచీ వహించుటయేకాక, వ్యవహారమందలి వివరముల నన్నిటిని చక్కఁగ నడపువారు కొంద ఱుండవలెను. అట్టివారికి నియంత లని పేరు (Directors). వారియుత్తరవుల ననుసరించి నెలజీతములను పుచ్చుకొని పని చేయువా రనేకు లుందురు. విచారణదార్లు, గుమాస్తాలు, కూలివాండ్రు ఇందులో చేరినవారు. వీరుగాక, వ్యవహారమునకుఁ గావలసిన ప్రకృతిసంపదలను సన్నాహము చేయు భూస్వాములు కొందఱును, మూలధనమును ఋణముగ నిచ్చువారు కొందఱును ఉందురు. ఒకవ్యవహారము జయప్రదముగ జరగవలయు ననిన (౧) లాభనష్టముల ననుభవింప సిద్ధపడియుండుట, (౨) వివరముల నేర్పఱచుట, (౩) వాని ననుసరించి నిర్ణీతములగు పనులను చేయుట, (౪) కావలసిన భూమి మొదలగు ప్రకృతిసంపదలను సరఫరా చేయుట, (౫) ఋణము లిచ్చుట — అను విభిన్నములగు పనులను చేయవలసియున్నది. ఈపనుల నన్నింటిని ఒకఁడే చేయుచుండవచ్చును, లేక కొన్నిపనులను ఒకఁడును, మఱికొన్నింటిని మఱియొకఁడును చేయుచుండవచ్చును; అట్లుగాక ఒక్కొకవిధమగు పనిని ఒక్కొకఁడు చేయుచుండవచ్చును. సొంతభూమిని సొంతముగ (కూలివాండ్రను పెట్టుకొనక) సొంతపరికరములతో (ఒకరియొద్ద ఋణము తీయక, తాను కూడఁబెట్టినమూలధనముతో) సాగు చేయురైతు లనేకు లున్నారు; ఇతరులభూమిని సొంతముగ సొంతపరికరములతో సాగుచేయురైతులు మఱికొంద ఱున్నారు; భూమియు పరిశ్రమము సొంతములుగ నుండి, మూలధనముమాత్రము సాహుకార్ల యొద్ద ఋణము తీసి సాగు చేయురైతులు కొంద ఱున్నారు. సొంతముగ నేదియు లేక, ఇతరులభూమిని కూలివాండ్రసాయము చేతను, ఇతరులయొద్ద ఋణముగ తీసికొనిన మూలధనముచేతను సాగుచేయువా రెందఱో కలరు. ఇట్లే వ్యవసాయము కాక తక్కిన పరిశ్రమములందు రకరకములగు సంయోగవిధానము లున్నవి. గొప్పగొప్ప మిల్లులను బెట్టి వేలకొలఁది పనివాండ్రచే పని చేయించు యజమాను లున్నారు. కావున యజమానులకును నియంతలకును వేతనములను పుచ్చుకొని పనిచేయువారికిని, భూస్వాములకును, మూలధనము నిచ్చువారికిని ఎట్టిపరస్పరసంబంధ ముండినయెడల ఉత్పత్తియగుధనము అధికతమముగ నుండును? ఈకాలమున విస్తారమగు మూలధన ముండినఁ గాని ఏపరిశ్రమను స్థాపించుటకును వీలు కలుగుట లేదు. ధనోత్పత్తికి పురుషకారము కావలసియున్నను మూలధనము లేని పురుషకారము వ్యర్థ మగుచున్నది. మూలధన మున్నవాఁడు ఎట్టివ్యవహారము నైనను చేయఁగలిగియున్నాఁడు. అట్టివారే వ్యవహారముల కంతకును యజమానులుగ నుండి కూలివాండ్రచేత ఇష్టమువచ్చినపనిని ఇష్టము వచ్చినట్లు చేయింపఁగలిగియున్నారు. అందుచేతను ప్రస్తుతకాలమునకు ‘మూలధనప్రయుగము’ (Age of Capitalism) అనుపేరు సార్థకమగుచున్నది. వ్యవహారములో చేరి యుండువారికిఁ గల పరస్పర సంబంధము తృప్తికరముగ లేకపోవుటచేతనే పాశ్చాత్యదేశములం దప్పుడప్పుడు కూలివాండ్రు సమ్మెకట్టి పనిచేయుట మానుటయు, యజ

sampath_Ebooks

మానులు పనివారంత్ర నంపిఅను ఒకొకప్పుడు పనినుండి తొలఁగించు టయు సంభవించుచున్నది. జమీన్దారులకును రైతులకును అభిప్రాయభేదము లీకారణముచేతనే కలుగుచున్నవి. సొంతవారే భూమిని సాగుచేయుట మంచి దనియు, సాగుచేయువాఁడే భూస్వామిగ నుండవలెననియు కొందఱు వాదించుట కిదియే కారణము. (౯) వృత్తిస్వాతంత్ర్యము ప్రస్తుతకాలమునకు లక్షణ మని ఇదివఱలో సూచింపఁబడెను. కాని ఆర్థికముగ ముందంజవేయుచున్న అమెరికా, జర్మనీ, ఇంగ్లండుదేశములందు వృత్తిస్వాతంత్ర్యమును నిరోధించుటకై అనేకములగు నేర్పాటులు కావింపఁబడుచున్నవి. వీనిలో కొన్ని ప్రభుత్వమువారి శాసనసమ్మతములు; కొన్ని ప్రభుత్వమువారితో సంబంధము లేనివి. ఏదైనపదార్థము నొకదాని నుత్పత్తి చేయువారిలో ననేకులు ఒకవిధముగ తమలోతాము కట్టుగట్టి పైనుండువా రెవరైన నావృత్తిలో ప్రవేశింపఁదలఁచినపుడు వారికి అడ్డు తగిలి, వారిని ప్రవేశింపకుండఁ జేయుట సాధారణ మగుచున్నది. ఇందుమూలమున అనేకపదార్థములయుత్పత్తి 'బహుముఖము' గాక, 'ఏకముఖ' మగుచున్నది. 'బహుముఖము' అనఁగా ఒకపదార్థమును అనేకు లుత్పత్తి చేయుట. 'ఏకముఖము' (Monopoly), అనఁగా దానిని ఒకరే యుత్పత్తి చేయుట. అనేకులు ఉత్పత్తి చేయునపుడు వారిలో వారు పోటీపడుటయు, వారికిఁగల నైపుణ్యము చూపి పదార్థము చౌకగ దొరకునట్లు గావించుటయు సహజము. 'ఏకముఖము'గ నుత్పత్తి యగునపుడు వృత్తినిరోధము కలుగుటయేకాక పదార్థము గాయకముగ నుండుటయు కలదు. అయినను కొన్నిపదార్థములను 'ఏకముఖము'గ నుత్పత్తి చేయుటయే లాభకరముగ నుండును. ఎట్టిపదార్థములవిషయమున నట్టిలాభము కలుగునో పరిశీలింపవలసియున్నది. మనదేశమున ఉప్పు, నల్లమందు, కల్లు, సారాయి మొదలగునవి ప్రభుత్వమువారే యుత్పత్తి గావించుటయో, లేక వారిశాసనములకు బద్ధులైనవారుత్పత్తి గావించుటయో జరగుచున్నది. 'ఏకముఖోత్పత్తి' లాభకర మని స్పష్టమైనయెడల అట్టిపని ప్రభుత్వమువారే చేసిన బాగుగ నుండునా? లేక వ్యక్తులకు వదలిపెట్టుట మంచిదా? అనువిషయము ఆలోచింపవలసియున్నది. (౧౦) ప్రస్తుతకాలమందు అర్థోత్పత్తికి మఱియొకలక్షణము కలదు. అనేకులు వా రుత్పత్తి చేయువస్తువులను స్వానుభవమునకుఁ గాక పరులకు విక్రయించు నుద్దేశముతో నుత్పత్తి చేయుచున్నారు. ఇది క్రొత్తలక్షణము కాదుగాని పూర్వముకంటె నిప్పు డిది యెక్కువగ వ్యాపించియున్నది. వేరుసెనగ, జనుము, నీలి, ప్రత్తి, మిరెపకాయలు, నువ్వులు లోనగువానిని పండించురైతు లిట్టివారు; తక్కిన ధాన్యమును పండించు రైతులలో ననేకులు పండినదాని నంతయు స్వానుభవమునకుఁ బెట్టుకొనక, కొంతభాగమునైనను విక్రయించుచుందురు. వ్యావసాయిక వృత్తులు గాక పాటకపువృత్తుల (Manufactures) నవలంబించిన సాలెవాండ్రు, వడ్రంగులు లోనగువారు వారు తయారుగావించిన పదార్థముల నన్నింటిని విక్రయింపవలసి యున్నది. కావున క్రయవిక్రయములకు కావలసిన సదుపాయము లీకాలమున పూర్వముకంటె నెక్కువ ప్రాధాన్యమును గాంచియున్నవి. మన రైతులలో ననేకులు వ్యవసాయము చేయుటయం దెక్కువ నేర్పును చూపించువారైనను తా ముత్పత్తి గావించుసరకులను విక్రయించు విషయమున వెనుకఁబడియున్నారు. తాము తయారుచేసిన సామానులను విరివిగ విక్రయించుటకై కొట్లకొలఁది ద్రవ్యము నీ కాలమున ప్రకటనలకు (Advertisements) గాను అనేకులు ఖర్చుపెట్టవలసి యున్నది. సామానుల సుగుణములను లోకమునకు ప్రకటించుట ముఖ్యమగు కళలలో నొకటిగ నీకాలమునందున్నది. ఉత్పత్తి చేయువారికంటె వ్యాపారముచేయు వర్తకులసంఖ్య హెచ్చుటకుకూడ నిదియే కారణము. రోడ్లు, కాలువలు, ఇనుపదారులు, స్టీమర్లు, ఆకాశయానములు, తపాలాతంతియేర్పాటులు — ఇవి యన్నియు నత్యావశ్యకము లగుచున్నవి. (౧౧) మనకు కావలసిన పదార్థము లన్నియు మన దేశమం దుత్పత్తి యగుట లేదు; మన ముత్పత్తిచేయు పదార్థము లన్నిటికిని మనదేశమున గిరాకి యుండుట లేదు. కావున, విదేశములం దుత్పత్తి యగు వస్తువులను కొనవలసిన అవసరమును, మన వస్తువులను విదేశములందు అమ్మవలసిన అవసరమును కలుగుచున్నవి. ఇట్టి క్రయవిక్రయము లెప్పుడు లాభకరములో, ఎప్పుడు నష్టదాయకములో నిర్ణయింపవలెను. మనము విదేశవస్తువులను కొనుట మానినయెడల, విదేశములవారు మనవస్తువులను కొనుట మానెదరు. (౧౨) మనదేశమం దిప్పు డుత్పత్తి యగు ధన సముదాయము చాల తక్కువగ నున్నది. దారిద్ర్యబాధ హెచ్చుచున్నది. జనసంఖ్యయందును, పాటుపడువారిసంఖ్యయందును, పాటుపడువారి శక్తిసామర్థ్యములందును, మూలధనమును వృద్ధిచేసికొనుటకు కావలసిన యవకాశములందును, ప్రాచీనకాలపు పరికరములను మాని లాభకరములగు యంత్రముల నుపయోగించుటయందును, సాధనత్రయ సంయోగ విధానములందును మనము చేసికొనవలసిన మార్పు లనేకము లున్నవి. వీనిలో నెట్టివి వ్యక్తుల (Individuals) యుక్తాయుక్త పరిజ్ఞానమువలన జరగఁగలవో, ఎట్టివి జరగుటకు ప్రభుత్వమువారి సాహాయ్యము ఆవశ్యకమో నిర్ణయింపవలెను. మనకంటె నెంతయో వెనుకఁబడియున్న రషియాదేశము గడచిన పదిసంవత్సరములలో నెంతయో ముందునకు వచ్చుటకు ప్రభుత్వమువారి సాహాయ్యమే కారణము (పైని పేర్కొనిన పండ్రెండు విషయములను గుఱించి వివరములు తెలిసికొనఁగోరువారు 'ఉత్పత్తి', 'జనసంఖ్య', 'మూలధనము', 'ప్రకృతి సంపద', 'విదేశవ్యాపారము' లోనగు విషయములను గుఱించిన ప్రత్యేకవ్యాసములను చదువునది).

## ౩. మూల్యనిర్ణయకాండము

మూల్యనిర్ణయకాండమునందలి విషయము లీక్రిందివిధముగ నుండును: (౧) ఈకాలమున పదార్థములలో ననేకములు స్వానుభవమునకుఁగాక వినిమయమునకై యుత్పత్తి గావింపఁబడుచున్న వని తెలిసియున్నది. ప్రతిమనుష్యుఁడును తనకు కావలసినవస్తువుల

sampath_Ebooks



నన్నిటిని తానే యుత్పత్తి చేసికొనుట లేదు. ఏపదార్థ ముత్పత్తి చేయుటయందు తన కెక్కువగ నేర్పును, అభిరుచియును, వసతులును కలవో ఆపదార్థము నుత్పత్తి చేసి, దాని నితరుల కిచ్చి వారియొద్ద నుండి తనయనుభవమునకు కావలసినవస్తువులను సంపాదించుట ప్రస్తుత కాలపులక్షణ మని లోఁగడ చెప్పఁబడియున్నది. 'తా నిచ్చుపదార్థమునకు బదులుగ నితరవస్తువులు ఎంత బాహుళ్యముగ లభించును' అనునది ప్రతిమనుష్యునికిని చాల ముఖ్య మైనవిషయము. ఈ బాహుళ్య మధిక మైనయెడల అతనిస్థితి బాగుగ నుండును; లేనియెడల నది చాల విచారకరముగ నుండును. వినిమయము గావించినపుడు ఒక పదార్థమునకు బదులుగ లభించు మఱియొకపదార్థముయొక్క బాహుళ్యమే మొదటిదానిమూల్యము. ఒకసేరు బియ్యమునకు బదులు రెండుసేర్ల ఉప్పు దొరకినయెడల సేరుబియ్యపుమూల్యము రెండుసేర్ల ఉప్పు అని చెప్పుచుందుము. (౨) ఒకసేరు బియ్యముయొక్క మూల్యము రెండుసేర్ల ఉప్పుగను, ఒకసేరునెయ్యియొక్క మూల్యము ఇరువదిసేర్ల ఉప్పుగను, ఒక సేరు నూనెయొక్కమూల్యము పదిసేర్ల ఉప్పుగను ఉండును. అట్టిసందర్భములో బియ్యముయొక్క మూల్యము తక్కువ యనియు, నూనెయొక్కమూల్యము అంతకంటె నెక్కువ యనియు, నెయ్యియొక్కమూల్యము మఱింత యెక్కువ యనియు చెప్పుచుందుము. కొన్నివస్తువులమూల్యము ఎక్కువగ నుండుటకును, కొన్నిటియొక్కమూల్యము తక్కువగ నుండుటకును గలకారణములను విమర్శించుటయే మూల్యనిర్ణయకాండమం దర్థశాస్త్రకారులు చేయు పని. (౩) వినిమయముయొక్క యుద్దేశము మనదగ్గఱ నుండుపదార్థము నిచ్చి మనకు కావలసిన పదార్థములను సంపాదించుట యైనను ఈకాలమందు పదార్థములను పదార్థాంతరములకుఁగాక చెలామణి ద్రవ్యము(Money)నకై మనము వినిమయము చేయుచున్నాము. ధాన్యమును పండించురైతునకు కావలసినది ఉప్పు, మిరెపకాయలు, చింతపండు, నెయ్యి, నూనె, బట్టలు లోనగునవి; కాని, సాధారణముగ వీనిలో దేనినికూడ ధాన్యము నిచ్చి సంపాదించుట లేదు. తన దగ్గఱ నుండుధాన్యమును రూపాయలలోనికి మార్చుకొని, ఆరూపాయలతో తనకు కావలసిన వస్తువులను కొనుట సర్వసాధారణము. వినిమయముయొక్క యుద్దేశము సుకరముగ నెఱవేఱుటకై మనుష్యుఁడు కనుఁగొనినసాధనమే ఈచెలామణిద్రవ్య మగురూపాయ. వస్తువుయొక్క మూల్య మనఁగా దానికి బదులుగ లభించురూపాయ లనియే మనము మామూలుగ చెప్పుచుందుము. బదులుఁగలభించురూపాయలేకాక, అట్లు లభించు ప్రతివస్తువుయొక్క మొత్తమునకును 'మూల్యము' అనుపేరు సార్థక మగుచున్న దని పైని చెప్పఁబడియున్నది. కావున నొకవస్తువునకు బదులుగ వచ్చురూపాయలమొత్తమునకు వేఱొకపేరుండిన బాగుండు నని యెంచి, దానికి అర్థశాస్త్రకారులు 'క్రయము' అని నామకరణము చేసియున్నారు. 'క్రయము' కూడ 'మూల్యమే'; కాని చెలామణిద్రవ్యమూలమున వ్యక్త మగుమూల్యము క్రయమని చెప్పఁబడుచున్నది. మూల్యమునకును క్రయమునకును మఱియెట్టి విగమగు భేదము లేకపోవుటచేత 'మూల్యనిర్ణయము' అన్నను 'క్రయనిర్ణయము' అన్నను ఒక్కటి అనియే మనము గ్రహింపవచ్చును. ఒకవస్తువుయొక్క క్రయము అధికముగను, మఱియొకదానియొక్క క్రయము అల్పముగను ఉండుటకుఁగల కారణములను కనుఁగొనుటయే మనము చేయవలసినపని. పదిరూపాయ లిచ్చినయెడల బస్తాబియ్యము దొరకుచున్నవి. బియ్యము లభింపనియెడల మన ప్రాణములు నిలువఁజాలవు. కాని వందలకొలఁదిరూపాయల నిచ్చినఁగాని వజ్ర మొకటి లభింపదు. ప్రాణము నిలుచుట కావశ్యక మైన బియ్యముయొక్క క్రయ మంత తక్కువగ నుండుటకును, అంతటి గొప్ప యుపయోగము లేనట్టి వజ్రముయొక్క క్రయ మెంతో అధికముగ నుండుటకును కారణ మేమి? (౪) ప్రతి వినిమయమునకును రెండుపక్షములవా రుండవలెను. ఒకపక్షములోనివారు కొనువారు (క్రేతలు); రెండవ పక్షములోనివారు అమ్మువారు (విక్రేతలు). కొనువారు అమ్మువారును కలసి బేర మాడిన తర్వాత నిరుపక్షములవారును అంగీకరించిన మొత్తమే 'క్రయము'. కొనువాఁ డంతటి క్రయము నియ్య సిద్ధపడుటకు కారణములను, అమ్మువాఁ డంతటిక్రయమును తీసికొన సిద్ధపడుటకు కారణములను కనుఁగొనవలెను. బస్తాబియ్యమునకు పదిరూపాయలకంటె నెక్కువ యిచ్చుటకు కొనువాఁ డెందుల కంగీకరించుట లేదు? వజ్రమునకు నేనాలుగైదువందలరూపాయలనుగూడ నిచ్చుట కతఁ డేల అంగీకరించుచున్నాఁడు? అనుభవకాండమున ఈప్రశ్నకు సమాధాన మిదివఱకే చెప్పఁబడియున్నది. క్షీణోపయోగన్యాయము ప్రకారము వస్తువుయొక్క మితత్వమునుబట్టి దాని తుదియుపయోగము నిర్ణయింపఁబడునవియు, తుదియుపయోగమునుబట్టి దానిక్రయము నిర్ణయ మగుచున్నదనియు స్పష్ట మగుచున్నది. బియ్యపుబస్తాలు లక్షలకొలఁదిగ నుండుటవలన దానియొక్క తుదియుపయోగము చాల తక్కువ; అందుచే దాని క్రయముకూడ చాల తక్కువగ నున్నది. వజ్రములసంఖ్య — వజ్రములమొత్తము — మిక్కిలి మితతరముగ నుండుటచేత వాని 'తుదియుపయోగము' మిక్కిలి అధికముగ నున్నది; అందుచే దానిక్రయముకూడ హెచ్చుగ నుండుట సంభవించుచున్నది. బియ్యముయొక్కక్రయము పదిరూపాయలనుండి యెనిమిదిరూపాయ లైనయెడల దానికి కారణము బియ్యము యొక్క 'తుదియుపయోగము' తగ్గుటయే. ఇట్లు తగ్గుటకు ముఖ్యములగు కారణములు రెండు కలవు. అమ్మకమునకు సిద్ధముగ నుండు బియ్యము హెచ్చు కావచ్చును; లేక బియ్యమందు క్రేతలకుఁ గల యిష్టము తగ్గవచ్చును. బియ్యమునకు బదులుగ గోదుమలనో, రాగులనో, జొన్నలనో వాడుటకు ప్రజలు ప్రారంభించినయెడల బస్తాలసంఖ్య అధికము కాకున్నను ఉన్నబస్తాలయొక్క తుదియుపయోగము తగ్గును. బియ్యముయొక్క క్రయము పదిరూపాయలనుండి పండ్రెండురూపాయ లగునపుడు బస్తాలసంఖ్య తగ్గుటయో, క్రేతలకు బియ్యమందుఁగల ఇష్టము హెచ్చుటయో కారణము లగును. హెచ్చుటకును తగ్గుటకును గల కారణములను పరిశీ

sampath_Ebooks

లింపక, ఏదియో యొకసమయమున ఫలానిక్రయ ముండుటకు కారణము మనము విమర్శించినయెడల, ఆసమయమున అమ్మకమునకు సిద్ధముగ నుండు బస్తాలసంఖ్యయే ఆకారణ మని మనము చెప్పవచ్చును. క్రేత లిచ్చుక్రయము వస్తువుయొక్క బాహుళ్యము (దాని తుది యుపయోగము) ననుసరించి యుండు ననుట స్పష్టము.

| అమ్మకమున నుండు బస్తాలు | క్రేత లిచ్చునది |
|---|---|
| ౧౫,౦౦౦ లు | రు. ౧౫ లు |
| ౧౭,౦౦౦ లు | రు. ౧౪ లు |
| ౨౦,౦౦౦ లు | రు. ౧౩ లు |
| ౨౩,౦౦౦ లు | రు. ౧౨ లు |
| ౨౬,౦౦౦ లు | రు. ౧౧ లు |
| ౩౦,౦౦౦ లు | రు. ౧౦ లు. |

(౫) అమ్మకమునకు సిద్ధముగ నుండు బస్తాలనుబట్టి క్రయము నిర్ణయ మగుచుండ నగనా? కాని ఒక్కొక్క సమయమున అమ్మకమునకు ఎన్నియో కొన్ని బస్తాలే యుండుటకు కారణ మేమి? అంతకంటె హెచ్చుగగాని తక్కువగగాని లేకుండుట యేల? విక్రేతల యిష్టానిష్టములంబట్టి యిది నిర్ణయింపబడుచున్నది. మనుష్యుడు శ్రమపడినగాని బియ్యము మొదలగు పదార్థము లుత్పత్తి కాజాలవు; కాని ఎవడును విశేషకాలము కష్టపడుట కిచ్చగింపడు. విశ్రాంతి లేక, నిరంతరము పని చేయుటకు ప్రతి మనుష్యుడును సిద్ధపడునెడల నిప్పటికంటె నెన్నియోరెట్లధికముగ మన మనేక పదార్థముల నుత్పత్తిచేయగలవార మగుదుము. అప్పుడు వానిబాహుళ్య మధికమై వానిక్రయములు తగ్గును. కాని ప్రతిమనుష్యుడును కొంతకాలము మాత్రమే పని చేయగలిగియున్నాడు. అందులోను శ్రమ కనుగుణమగు ఫలము లభించునను నమ్మక మున్నప్పుడే అతడు పనిచేయ సిద్ధపడుచున్నాడు. శ్రమ కనుగుణమగు ఫలము లభించినదియు లేనిదియు తెలిసికొనుటకు పదార్థముయొక్క క్రయ మొక్కటియే మనకీకాలమున ఆధారము. ఎక్కువగ పదార్థము నుత్పత్తి చేసినయెడల దానిఖరీదు తగ్గు నని 'గిరాకి' సిద్ధాంతమునుబట్టి తెలియుచున్నది. కావున పదార్థముల నుత్పత్తిచేయువారు క్రయము తగ్గునేమో యని భయపడి వాని నత్యధికముగ తయారుచేయ సాహసింపరు. ఏమాత్రపు బాహుళ్యముగ తయారుచేసినయెడల వానికి వచ్చు క్రయము తమ శ్రమ కనుగుణముగ నుండు నని వా రనుకొనెదరో అంతటి బాహుళ్యముగ మాత్రము వారు దాని నుత్పత్తి చేయుదురు. ౧౫,౦౦౦ ల బస్తాల బియ్యము నుత్పత్తిచేసినపుడు ఒక్కొక్కబస్తా నుత్పత్తి చేయుట కగుఖర్చులు రు. ౧౧ లు అయినయెడల ఒక్కొక్క బస్తాయొక్క క్రయము రు. ౧౫ లగుటచే బస్తా ఒకటింటికి రు. ౪ ల లాభము వచ్చును. లాభము వచ్చుచున్నపుడు రైతులు మఱికొంత భూమిని సాగుచేసి ౧౭,౦౦౦ ల బస్తాల నుత్పత్తి చేయవచ్చును. కాని అప్పుడు వారిఖర్చులు బస్తా ఒకటింటికి రు. ౧౨ ల వఱకును పెరుగవచ్చును. ౧౭,౦౦౦ ల బస్తాలు అమ్మకమున నున్నప్పుడు క్రయము రు. ౧౪ లకు పడిపోవును. అప్పుడుకూడ రైతుల కొక్కొక్క బస్తాకు ఒకరూపాయ లాభము దొరకు చుండుటచేత వారు మఱింత శ్రమపడుట కిష్టము గలవారై ౨౦,౦౦౦ ల బస్తాల బియ్యము నుత్పత్తి చేసి అమ్మకమునకు తేగలరు. అప్పుడు బస్తా ఖరీదు రు. ౧౩ లకంటె నధికముగ నుండజాలదు. ౨౦,౦౦౦ ల బస్తాల నుత్పత్తి చేయుటలో నొక్కొక్కబస్తా కగుఖర్చులు రు. ౧౩ లు అయినయెడల వారిఖర్చును వారికి లభించు క్రయమును సమానముగ నుండును. వా రంతటితో నిలువక, ౨౩,౦౦౦ ల బస్తా లుత్పత్తి చేసినయెడల బస్తా ఒకటింటికి వారి కగుఖర్చు రు. ౧౪ లు కావచ్చును; కాని అన్ని బస్తాలను అమ్మకమునకు వచ్చినపుడు క్రయము రు. ౧౨ లగుటచేత వారిశ్రమకు తగినలాభము లేక రెండేసిరూపాయలచొప్పున నష్టము వచ్చును. ౩౦,౦౦౦ ల బస్తా లుత్పత్తి చేసినపుడు వారికి వచ్చునష్టము మఱింత యధిక మగును. ఇట్టిపరిస్థితులలో వ్యవసాయ మందలి కష్టసుఖముల నెఱిగినరైతులు ౨౦,౦౦౦ ల బస్తాలకంటె నెక్కువగ నుత్పత్తి చేయజాలరు. ఈయుదాహరణమునుబట్టి ఉత్పత్తి చేయబడు మొత్తములలో (౧౫,౦౦౦; ౧౭,౦౦౦; ౨౦,౦౦౦ లోనగునవి) ఒక్కొక్కమొత్తముసంపన్నమున కొకవిధమగు ఖర్చు లుండుట స్పష్ట మగుచున్నది. ఖర్చునకు తగినక్రయము దొరకినగాని ఉత్పాదకులు తమపనికి బూనరు గనుక, ఏయేక్రయము లున్నపుడు ఎంతెంత మొత్తములను వా రుత్పత్తి చేయుదురో మనము చెప్పగలిగియుందుము. క్రయమునకును, ఉత్పత్తియగు మొత్తమునకును గలసంబంధమును విశదపఱుచుసిద్ధాంతమునకు 'బాహుళ్యసిద్ధాంతము' (Law of Supply) అని పేరు. క్రయము హెచ్చు కానుకాను ఉత్పత్తి చేయబడుమొత్తము హెచ్చుచుండవచ్చును. ఉత్పాదకులను ప్రేరేపించునది క్రయమునకును ఖర్చులకును నుండు సంబంధమే. 'బాహుళ్యసిద్ధాంతము' ఈ క్రిందిపట్టికలమున స్పష్ట మగును.

| బస్తాక్రయము లేక బస్తా కగు ఖర్చు | ఉత్పత్తి యగు మొత్తము |
|---|---|
| రు. ౧౧ లు | ౧౫,౦౦౦ లు |
| రు. ౧౨ లు | ౧౭,౦౦౦ లు |
| రు. ౧౩ లు | ౨౦,౦౦౦ లు |
| రు. ౧౪ లు | ౨౩,౦౦౦ లు |
| రు. ౧౫ లు | ౨౬,౦౦౦ లు |
| రు. ౧౬ లు | ౩౦,౦౦౦ లు |

ఈపట్టిని, గిరాకిసిద్ధాంతమును సూచించుపట్టీతో సరిపోల్చి చూచినయెడల ౨౦,౦౦౦ ల బస్తాలకంటె నధికముగ నుత్పత్తి చేయుట లాభకారి కాదనుట స్పష్ట మగును. ఈ రెండుసిద్ధాంతములను సమన్వయించుటవలన 'క్రయసిద్ధాంతము' (Law of price) ఏర్పడుచున్నది. ఎంతటిబాహుళ్యమునకు (సరఫరా లేక Supply) క్రేత లియ్యదలచుక్రయము విక్రేతల కగుఖర్చుతో సమానముగ నుండునో అంతటి బాహుళ్యముగ పదార్థ ముత్పత్తి యగుచుండును.

sampath_Ebooks



ఉత్పత్తి చేయఁదగిన మొత్తము లనేకము లున్నను, ఒక్క మొత్తము (బాహుళ్యము, సరఫరా, Supply) విషయముననే గిరాకిక్రయమును (Demand price), ఉత్పత్తి చేయుట కగు ఖర్చులును (Expenses per unit) సమానముగా నుండును. పదార్థము యొక్క క్రయమును నిర్ణయించుసందర్భము లివియే. (౨) బాహుళ్యముయొక్క మితత్వమును నిర్ణయించునది 'ఖర్చులు' మాత్రమే కాదు. శ్రమకుఁ దగినక్రయము వచ్చునపుడుకూడ కొందఱు విస్తారముగ నుత్పత్తి చేయుట కిష్టపడరు. ఉత్పాదకు లందఱిలో పోటీ యున్నప్పుడే ఇట్టిది సంభవించును. పోటీ లేక వారందఱును కట్టుగట్టి యున్నప్పుడును, ఉత్పత్తి యేకముఖముగ నుండునపుడును ఖర్చులకు మించినక్రయమును సంపాదింపఁగోరి, దానికి తగినట్లుగ అమ్మకమున కుండు పదార్థబాహుళ్యమును ఉత్పాదకులు మార్చుచుందురు. (౩) కొన్నిపదార్థములయొక్క మితత్వమునకు కారణము 'ప్రకృతిలోపమే' వాని నుత్పత్తి చేయుటకు 'శ్రమము' అవసరముండదు. భూమి మొదలగు ప్రకృతిసంపద లిట్టివి. వీనియొక్క బాహుళ్యము తక్కువగ నుండును. ఎక్కువశ్రమ పడినను వానిని ఎక్కువగ నుత్పత్తి చేయుటకు వీలు లేదు. కావున వానివిషయమున గిరాకినిబట్టిమాత్రమే క్రయము నిర్ణయమగుచున్నది. వాని నధీనమందుంచుకొనువారు శ్రమపడ నక్కఱలేక విస్తారలాభము సంపాదించుచుందురు.

ప్రస్తుతకాలపు ఆర్థికప్రపంచచక్రమును త్రిప్పుశక్తియే ఈ 'క్రయము'. వస్తువుయొక్క యుపయోగమును 'క్రయము' కొలుచుచున్నది. వస్తువుయొక్క ఆవశ్యకతానవశ్యకతలను, అవసరానవసరములను కొలుచునదికూడ నిదియే. కట్టుకొనుటకు నూలుబట్టలు లేక, అవస్థపడుచుండువారనేకు లున్నను, పట్టుబట్టలను ధనికుల యుపయోగార్థము ఉత్పత్తిచేయువారెందఱో యున్నారు. నూలుబట్టలు కావలసినవారెక్కువక్రయము నిచ్చుకొనలేకపోవుటయు, పట్టుబట్టలు కొనఁదలఁచిన వారు ఎక్కువక్రయము నిచ్చుటకు సిద్ధపడియుండుటయు దీనికి కారణము. దేశములోని కూలివాండ్రును మూలధనమును ప్రకృతిసంపదలును ఏపదార్థములయొక్క క్రయమధికముగ నున్నదో వానిని ఉత్పత్తిగావించుటయందు వినియోగింపఁబడుచున్నవి. దేశమునకు ఏపదార్థములు ఎంతమట్టుకు అవసరములు అనువిషయమును తీర్మానించుటలో 'క్రయము' ఒక్కటియే మన మీకాలమున పరిశీలించుచున్నాము. అన్నము లేక అనేకులు పస్తుండినను ధాన్యమువిషయమున వారికిఁగల అవసరముకంటె మోటారుకార్ల విషయమున మఱికొందఱకుఁగల అవసరము ఎక్కువ యని తలఁచుచున్నాము. కావున సాధనక్రయము లేనియుత్పత్తికై వినియోగింపవలయునో నిర్ణయించునది 'క్రయము' అనుదానిని మనము మఱవఁగూడదు. ఉత్పత్తియైనపదార్థమును వారువారిచ్చు 'క్రయము'లఁబట్టి మన మీకాలమున దేశములోని ప్రజలకు పంచిపెట్టుచున్నాము. పదిమంది యొకవస్తువును కొనఁదలఁచినపుడు ఎవ రెక్కువ క్రయము నిచ్చునో వారి కావస్తువు లభించుచున్నది. వారి యవసరము ఎక్కువ యని మనము భావించుచున్నాము. దరిద్రుఁడుగ నుండువాఁడు బస్తాకు నాలుగురూపాయలకంటె నెక్కువగ నియ్యలేఁడు గనుక బియ్యము విషయమున వానికిఁగల అవసరము బస్తాకు పదిరూపాయల నియ్యఁగల ధనికుని యవసరమునకంటె తక్కువ యని మనము పరిగణించుచున్నాము. ఎట్టిక్రయమును నియ్యక బలాత్కరించి వస్తువులను తీసికొనిపోవుపద్ధతికన్న క్రయ మిచ్చి తీసికొనిపోవుట మంచి మార్గమే కాని, క్రయమునుబట్టియే అవసరానవసరములను తీర్మానించుట యుక్తమా యని అనేకులు సంశయించుచున్నారు. ఆఁకలి యొవరికధికమో వారి కెక్కువయన్నము పెట్టవలయును గాని అజీర్ణరోగముచే బాధపడుచుండువాఁడు ఎక్కువక్రయము నియ్యఁగలవాఁ డను నెపముచే అన్నము నంతయు వాని కిచ్చివేయుట న్యాయ్యము కాదని వీరి వాదము. ఏవస్తువు నుత్పత్తిచేసినయెడల లాభ మధికముగ వచ్చునో దానినే ఈకాలమున నుత్పత్తి చేయుచున్నారు, అనఁగా దేని క్రయము హెచ్చుగను, ఉత్పత్తిచేయుట కగు ఖర్చులు తక్కువగను నుండునో దానినే యుత్పత్తిచేయుట మామూలు. శరీరమునకు బలమును ఆరోగ్యమును సౌందర్యమును నియ్యఁగలపదార్థముల నుత్పత్తి చేయవలెనా, లేక ఉత్పాదకులకు లాభము నిచ్చుపదార్థముల నుత్పత్తి చేయవలెనా అనిన, లాభము నిచ్చుపదార్థములనే యుత్పత్తి చేయవలెనని ప్రస్తుతకాలపు ఆచారమునుబట్టి తెలియుచున్నది. క్రయమును బట్టి పదార్థముల విలువను తీర్మానించుపద్ధతి యనర్థ మని యెంచి రష్యాదేశమువారు ప్రస్తుతపు ఆర్థికపరిస్థితుల నన్నిటిని మార్చివేయుచున్నారు. ప్రస్తుతకాలపు నాగరకత న్యాయానుసారము కాదని వాదించువారిలో ననేకులు 'క్రయము' మూలమున పదార్థోత్పత్తిని, పదార్థవిభజనమును నిర్ణయము చేయుట అసంగత మని చెప్పుచుందురు (వివరములకై 'గిరాకి', 'క్రయము', 'ఏక ముఖోత్పత్తి', 'సముదాయవాదము' మొదలగు వ్యాసములను చదువునది).

### ఈ. అర్థవిభజనకాండము :

దేశమునం దేఁటేఁట నుత్పత్తియగు నర్థసముదాయమును దేశములోనివారందఱు నెట్టిపద్ధతుల ననుసరించి పంచుకొనుచున్నా రను విషయము 'అర్థవిభజనకాండము'న విమర్శింపఁబడుచున్నది. (౧) అర్థము నుత్పత్తి చేయుటయందు తోడ్పడువారు రెండుతరగతులుగ నున్నారు. ఒకతరగతిలోనివారు కాయకష్టము చేసి తోడ్పడుచున్నారు; రెండవతరగతిలోనివారు తమయధీనమం దుండు 'ఆస్తి', ప్రకృతిసంపదలు, మూలధనము — మూలమున తోడ్పడుచున్నారు. కావున ఉత్పత్తియగు అర్థ మంతయు మొత్తముమీఁద రెండుభాగము లగుచున్న దని చెప్పవచ్చును. కాయకష్టము చేయువారికి వెళ్లు భాగము మొదటిది; 'ఆస్తిహక్కు' గలవారికి వెళ్లుభాగము రెండవది. ఆస్తిగలవాఁడు కాయకష్టముకూడ చేయుచుండునెడల నతనికి రెండుభాగములలోనుండియు వంతు లభించుచుండును. నియంతలు, జీతములు పుచ్చుకొని పని చేయుఉద్యోగులు, కూలివాండ్రు మొదట్ల

తరగతిలో చేరియుందురు. భూస్వాములు, ఋణముల నిచ్చుసాహు కార్లు రెండవతరగతిలో చేరియుందురు. (౨) కాయకష్టము లేక అర్థోత్పత్తి కాఁజాలదు; ఆస్తిహక్కు గలవారియధీనమం దుండు ప్రకృతిసంపదలు మూలధనములు లోనగువానిసాహాయ్యము లేక అర్థోత్పత్తి కాదు. ఉత్పత్తియగు అర్థము ఈరెంటియొక్క 'అవసర తీవ్రతను'బట్టి పంపక మగుచున్నది. కాయకష్టముయొక్క అవసరము ఆస్తిహక్కుసాహాయ్యముయొక్క అవసరముకంటె నధికముగ నున్నప్పుడు ఆ యాధిక్యము ననుసరించి అర్థములో నెక్కువ భాగము కష్టము చేయువారికి వెళ్లును. అది తక్కువగ నున్నప్పుడు కాయకష్టము చేయువారికి తక్కువభాగమును, ఆస్తిహక్కుగలవారి కెక్కువభాగమును వెళ్లును. వెయ్యిపుట్లధాన్యము పండినపుడు ఇరువదియైదవవంతు కాయకష్టము చేయువారికి వెళ్లునా, లేక ఇరువదియైదవవంతు వెళ్లునా అనువిషయము తీర్మానించునది పైని జెప్పిన అవసరతీవ్రతయే. (౩) దేశమందలి జనసంఖ్య హెచ్చుగ నుండు నపుడును, అర్థోత్పత్తియందు జనులకు తోడ్పడవలసిన ప్రకృతిసంపదలబాహుళ్యమును మూలధనమును తక్కుగ నుండునప్పుడును కాయకష్టమమూలమున వచ్చు ఆదాయము తక్కువగను, భూస్వాములకు లభించు సిస్తులును, సాహుకార్లకు లభించువడ్డీలును అధికముగ నుండును. మనదేశ మిప్పు డిట్టిస్థితియం దున్నది. అట్లుగాక, జనసంఖ్య తక్కువగను, ప్రకృతిసంపదలు మూలధనము హెచ్చుగ నుండు ఇంగ్లండు, అమెరికా మున్నగుదేశములలో కాయకష్టము చేయువారికి వచ్చు ఆదాయము హెచ్చుగ నున్నది. (౪) ఒకపదార్థమువలన మనుష్యునికి కలుగునుపయోగమును దానికై అతఁ డిచ్చుక్రయమునుబట్టి కొలచుటకు వీలగునట్లు, సాధనత్రయములో నొక్కొకదానికిఁగల 'అవసరతీవ్రత'ను అది యుత్పత్తిచేయఁగల అర్థబాహుళ్యమును బట్టి కొలతఁబెట్టుటకు వీలగుచున్నది. ఏదేని యొకసాధనము (పురుషకారమో, ప్రకృతిసంపదయో, మూలధనమో) వృద్ధి కానుకాను దానిలోని తుదిమాత్ర (Marginal unit) యుత్పత్తి చేయఁగల అర్థము తగ్గుచుండును. కొంతహద్దు దాఁటినతర్వాత కూలివాండ్రసంఖ్య హెచ్చగుకొలఁది నొక్కొకకూలివాఁ డుత్పత్తి చేయఁగల ధనము తగ్గుచువచ్చును. దీనికి కారణము సులభగ్రాహ్యము. నూఱుమంది పని చేయుచుండునపుడు వేయిరూపాయల విలువకల పరికరములు వారికి సాహాయ్యముగ నున్నవి అని యూహింపుఁడు. అప్పుడు ఒక్కొకనికి పదిరూపాయల విలువగల పరికరములు సాహాయ్యపడుచుండును. కూలివాండ్రు నూటనుండి నూటయేఁబది యైనయెడల నొక్కొకనికి సాహాయ్యము చేయుపరికరములు సుమారు ఆఱురూపాయల విలువగలవి యగును; మూలధనసాహాయ్యము తగ్గును. తగ్గినపుడు కూలివాఁ డొక్కొకఁడు ఉత్పత్తి చేయఁగల ధనముకూడ తగ్గును. అట్టి సందర్భములో నొకకూలివాఁడు కూలిచేయక వెళ్లిపోయిన యెడల యజమానునికి వచ్చు నష్టము తక్కుగ నుండును. నూర్గురు కూలివాండ్రలో నొక్కఁడు వెళ్లిపోయినపుడు యజమానునికి వచ్చు నష్టముకంటె నూటయేఁబదిమంది కూలివాండ్రలో నొక్కఁడు వెళ్లిపోయినపుడు కలుగునష్టము తక్కువ యగును. కూలివాండ్ర యొక్క అవసర మొకప్పుడు ఎక్కువగను, మఱియొకప్పుడు తక్కువగను నున్నది యని చెప్పుటలో గ్రహింపవలసిన అర్థ మిదియే. ఏదేని యొకసాధనముయొక్క బాహుళ్యము వృద్ధి కానుకాను దానికిఁ గల యుత్పాదకశక్తి (Productivity) తగ్గుచుండు ననున్యాయమును 'క్షీణోత్పాదక న్యాయము' (Law of Diminishing Marginal Productivity) అని చెప్పెదరు. (౫) ఉత్పత్తిపద్ధతులలో కలుగుమార్పు లొక్కొకప్పుడు కాయకష్టముచేయువారి కనుకూలించునవిగను, ఒక్కొకప్పుడు 'ఆస్తిహక్కు' గలవారి కనుకూలించునవిగను, కొన్నివృత్తులలో నొక తరగతివారికిని మఱికొన్నివృత్తులలో రెండవతరగతివారికిని అనుకూలించునవిగ నుండును. తక్కువపనివాండ్రతో నెక్కువధనము నుత్పత్తిచేయుటకై సాధనములను కల్పించుయంత్రములు (Machinery) మూలధనము యొక్క అవసరతీవ్రతను వృద్ధిచేయును; కాయకష్టముయొక్క అవసరతీవ్రతను తగ్గించును. అందుచేత నట్టిమార్పుమూలమున కాయకష్టము చేయువారికి లభించుభాగము తగ్గి, సాహుకార్లకు వచ్చుభాగము వృద్ధి యగును. ఉత్పత్తి యైనదానిలో నాల్గవవంతు ఇదివఱకు కాయకష్టము చేయువారికి లభించుచుండినయెడల, ఈ మార్పుమూలమున ఆయిదవవంతు లభింపవచ్చును, అనఁగా వేయిరూపాయల విలువగల సరకులలో నిదివఱకు రు. ౨౫౦ లు లభించుచుండినయెడల నిప్పుడు రు. ౨౦౦ లే లభింపవచ్చును. కాని యంత్రసాహాయ్యమున నుత్పత్తియగు మొత్తపు అర్థము రు. ౧,౦౦౦ ల నుండి రు. ౧౫,౦౦౦ లకు వృద్ధియైనయెడల ఇందులో నైదవవంతగు రు. ౩౦౦ లు పూర్వపు నాల్గవవంతగు రు. ౨౫౦ లకంటె నధికమై కూలివాండ్రస్థితిని బాగు చేయఁ గలదు. యంత్రముల మూలమున కూలివాండ్రస్థితి బాగుపడునా బాగుపడదా యని తీర్మానించుటలో ఈభేదమును పరిశీలింపవలెను. (౬) కాయకష్టము చేయువారి కిట్టిభాగ మనియు, 'ఆస్తిహక్కు'లు గలవారి కిట్టి భాగ మనియు నిర్ణయించుట మొదటిపని. తర్వాత మఱియొకపని జరుగవలసి యున్నది. ఈ ఒక్కొకభాగమును ఆయాపనులను చేయువారందఱును పంచుకొనవలసియున్నది. కాయకష్టము చేయువారిలో వ్యవసాయదార్లు, నేఁతగాండ్రు, వడ్రంగులు, కంచరులు మొదలగువారెందఱో ఉన్నారు. వీరికి లభించు వేతనములలోకూడ తారతమ్యము లున్నవి. ఆతారతమ్యములకుఁ గల కారణములను విమర్శింపవలయును. అట్లే ఆస్తిహక్కుమూలమున నాదాయమును సంపాదించువారిలో సైతము తారతమ్యము లున్నవి. అందులకుఁగల కారణము తెలియంగవలయును. (౭) కాయకష్టము చేయువారివేతనములలోఁ గల తారతమ్యముల కంతకును ప్రధానకారణ మొక్కటియే. ఇష్టము వచ్చినవారు ఇష్టము వచ్చినవృత్తి నవలంబించుట కాటంకము లనేకము లుండుటచేత కొన్ని వృత్తులయం దుండువారి సంఖ్య అత్యధికముగను మఱికొన్ని వృత్తులయం దుండువారిసంఖ్య

sampath_Ebooks

అత్యల్పముగను ఉన్నది. అత్యధికముగ నొకవృత్తిలోనికి పనిచేయు వారు వెళ్లినయెడల వారికి లభించు వేతనము తక్కువగ నుండును. ‘అవసరతీవ్రత’ను గురించి యిదివఱకు చెప్పిన న్యాయమే ఈసందర్భమున వర్తించుచున్నది. అట్లుగాక యొకవృత్తియందు ప్రవేశించు వారిసంఖ్య అల్పమైనప్పుడు వారి ‘అవసరతీవ్రత’ అధికమై వారికి లభించువేతనములుకూడ అధికములుగ నుండును. కొన్ని వృత్తులయందత్యధికముగ ప్రవేశించుటకు రెండుమూడు బలవత్తరములగు హేతువు లున్నవి. సాధారణముగ తండ్రితాతల వృత్తినే పిల్లలుగూడ నవలంబించుచుందురు. జన్మమునుబట్టి వృత్తుల నెన్నుకొను నాచారము మన దేశమందొక్కదానియందే యున్నదని యెన్న మనుకొనుట పొరపాటు. ఇదిగాక కొన్నివృత్తులయందు ప్రవేశించుటకు ఎక్కువ తెలివితేటలు కావలసియున్నవి; అందఱకును అట్టి తెలివితేటలుండుటలేదు. విస్తారద్రవ్యము ఖర్చుపెట్టి విద్య నేర్చుకొనినఁగాని కొన్ని వృత్తులలో ప్రవేశించుటకు వీలులేదు. ఇంగ్లీషువిద్య నేర్చుకొనుటకును, అందులో వైద్యవిద్య, ఇంజనీరింగువిద్య, న్యాయవాదివిద్య లోనగు వానిని నేర్చుకొనుటకు వేలకొలఁది ద్రవ్యము కావలసియున్నది. ఈకారణము లన్నిటిమూలమున కాయకష్టము చేయువారిలో ననేకులు పేదఱికమువలన ఇట్టివిద్యల నభ్యసింపలేక తక్కువవేతనములు లభించు సామాన్యవృత్తులలోఁ బ్రవేశించుచున్నారు. వేతనములలో నిప్పు డుండు తారతమ్యములు తగ్గవలయు ననిన అర్హులందఱకు నున్నతవిద్యల సంపాదించుటకు వసతు లుండవలెను. అప్పటికైనను వేతనములు సమానము లగు నని అనుకొనుటకు వీలు లేదు. బుద్ధికుశలతయం దొకవ్యక్తికిని మఱియొకవ్యక్తికిని భేద ముండునంతవఱకు వేతనములందుఁగూడ భేదము లుండుట తప్పదు. వృత్తిస్వాతంత్ర్యమునకు నిరోధము గల్పించు ప్రస్తుతకాలమందలి సందర్భములను మార్చినయెడల వేతనభేదములలోని యిప్పటితారతమ్యములు చాల వఱకు తగ్గును. (౬) ఆస్తి గలవారిలో కొందఱు ఆస్తి ఎక్కువగను కొందఱు ఆస్తి తక్కువగను ఉండుటవలన దానిమూలమున వారికి లభించు ఆదాయములందుకూడ తారతమ్యము లున్నవి. ఆదాయము లెక్కువగ సంపాదించుచుండువారికి కూడఁబెట్టుటకూడ సుకరము నగుచున్నది. కొంతద్రవ్యము చేరినప్పటినుండి వడ్డీలమూలమున నది తనంతట తానే వృద్ధి యగుచుండును. ధనికులు మఱింత ధనికు లగుట కిదియే కారణము. దాయభాగమునుగుఱించిన చట్టముల (Laws of-inheritance)ను బట్టికూడ కొందఱు ఆస్తికిని మఱికొందఱు ఆస్తికిని భేదములు కలుగుచున్నవి. తండ్రియొక్క ఆస్తిని సమముగ పంచుకొను నాచార ముండుదేశములలో ఆస్తివిషయమైన విస్తారభేదము లుండఁజాలవు. తండ్రిసంపాదించిన ఆస్తి కొడుకులకు సంక్రమించు నాచార ముండుటఁబట్టి ఇట్టిభేదములు ప్రారంభమగుచున్నవి. ‘సమధర్మ’ మను సిద్ధాంతము ననుసరించువారు దాయభాగపుచట్టము లన్నియు రద్దు కావలయు ననియు, అప్పటికిఁగాని ఆస్తివిషయమున ఇప్పు డుండుభేదములు నశించి సమత్వము రాఁజాల దనియు చెప్పుచుందురు. (౭) అర్థోత్పత్తియందు తోడ్పక, ఉత్పత్తి యగునర్థమందు భాగము గలవా రనేకు లున్నారు. పని చేయనివృద్ధులు, బాలురు, బాలికలు నిట్టివారు. ఇంటివ్యవహారములను చక్కఁబెట్టు కొనుటయందు కాలము గడపుస్త్రీలు ఇట్టివారు. అనేకులు పని చేయుట కిష్టమున్నవారైనను పనులు దొరకక కాలక్షేపము చేయుచుందురు. అట్టి నిరుద్యోగులుకూడ దేశమం దుత్పత్తి యగునర్థములో భాగము కలవారై యున్నారు. దేశాచారములఁబట్టి ఇట్టివారిసంఖ్య యందు తారతమ్యము లగపడుచుండును. (౮) దేశమం దుత్పత్తి యగునర్థములో ప్రభుత్వముమూలమున భాగమును సంపాదించువా రనేకు లున్నారు. ప్రభుత్వమువారు ఖర్చుపెట్టి స్థాపించిన విద్యాలయములు, వైద్యశాలలు, ఉద్యానవనములు గ్రంథాలయములు లోనగువానిమూలమున సౌఖ్యము ననుభవించువా రందఱు నిట్టివారే. అభివృద్ధిపొందియుండు దేశము లన్నిటిలో దీనిమూలమున నీకాలమం దనేకులు విస్తారలాభమును పొందుచున్నారు. చేతిలో పడువేతనములు స్వల్పములైనను, ప్రభుత్వమువారు చేయుఖర్చులమూలమున నిట్టిసౌఖ్యమును సంపాదించువా రందఱుకూడ నిజముగ నెక్కువ వేతనముల ననుభవించుచున్నా రనియే మనము గ్రహింపవలెను. ధనికులఆదాయము హెచ్చుగ నున్నను అందులో చాలభాగమును పన్నుల మూలముగ ప్రభుత్వమువారు తీసికొని ఇట్టిపనులకై ఖర్చు పెట్టుచున్నయెడల దరిద్రులవేతనము లధికము లగుచున్న వనియే చెప్పవలసియుండును. ఎట్టియెట్టివారికి ఉత్పత్తి యగునర్థమం దెంతటి భాగము ముట్టుచున్న దని లెక్కవేయుటలో ఈవిషయము జ్ఞాపక ముంచుకొనవలెను. (౯) అర్థోత్పాదకశక్తియందుఁ గల భేదములను బట్టి ‘ధనికులు దరిద్రులు’ అను భేదము కలుగుచున్న దని పైని చెప్పిన కొన్నివిషయములనుబట్టి స్పష్టమగుచున్నది. స్వానుభవమున కెట్టియవసరమును లేనంతటిద్రవ్యము కొందఱు ధనికులయొద్ద నున్నది; ఆఁకలిబాధను పోఁగొట్టుకొనుటకు కావలసినంత ద్రవ్యముకూడ లేనట్టి దరిద్రు లెందఱో యున్నారు. ఒక వ్యక్తికిని మఱియొక వ్యక్తికిని ఇంతటి అంతరము లుండుట తగ దనియు, ఇట్టి అంతరములను కల్పించుచుండు ప్రస్తుతకాలపు ఆర్థికపద్ధతి దోషభూయిష్ఠమనియు, యంత్రసాహాయ్యమున నీకాలమం దుత్పత్తి యగునర్థ మనంతమైనను దానిని వ్యక్తు లందఱు యుపయోగమునకై విభజించుటకు కావలసిన మార్గము లిప్పటివారు కనుఁగొనఁజాలకున్నా రనియు, దేశమం దుత్పత్తి యగు మొత్తపు అర్థమును వృద్ధిచేసికొనుటకన్న దానిని న్యాయానుసారముగ విభజించుట యెక్కువ ప్రయోజనకారియనియు వాదించువా రెందఱో యున్నారు. ప్రతిమనుష్యుఁడును తన శక్తి కొలఁది పనిచేయుటయు, తనయవసరములు తీర్చుకొనుటకు కావలసినంత భాగమునకు అర్హుఁడుగ నుండుటయు ఉత్తమపద్ధతి యని వారు చెప్పుచుందురు. ఉత్పత్తిచేయుటయందు మనుష్యుఁడు చూపించు శక్తి, నేర్పు, బుద్ధికుశలత లోనగువాని ననుసరించి అతని యాదాయము నిర్ణయము కావలయునా? లేక అతని శరీరస్థితి, మానసికస్థితి,

sampath_Ebooks

అతఁడు చేయుపనియొక్క స్వభావము, అతనిసంతానము- వీనినిబట్టి అర్థము దతనికి రావలసినభాగము నిర్ణయము కావలయునా? అను సమస్య మిక్కిలి ముఖ్యమైనదిగ నున్నది. ఇది అర్థశాస్త్రముయొక్క దాని సాహాయ్యమున నన్వయింపఁబడినది కాదు. ఇట్టిసమస్య యొకటి యున్న దనిమాత్రము మనము గ్రహింపవలెను. ఫలము నుత్పత్తి చేయుటకు కావలసినశక్తిలో అసమానులుగ నుండువారు ఫలము నను భవించుటయందు సమానావకాశములు గలవారుగ నుండుట ధర్మమా?

## ఉ. చెలామణీకాండము :

చెలామణికాండమందలివిషయము లీక్రిందివిధముగ నుండును. (౧) ప్రతిదేశమందును 'చెలామణిద్రవ్యము' అనుపేరుగల సాధనములు కొన్ని యున్నవి. మనదేశమందలి రూపాయి, అర్ధరూపాయి, పావలా, బేడకాసు, అణా, కానీ, పైస, నోట్లు లోనగునవి అందులో చేరినవి. స్వయముగ మనకోరికలను నెఱవేర్చుశక్తి వీనికి లేదు గాని, అట్టిశక్తిగల ధాన్యము వస్త్రములు పుస్తకములు ఇండ్లు మొదలగు పదార్థములను వీనిమూలమున సంపాదింపవచ్చును. (౨) చెలామణిద్రవ్యము రెండు ముఖ్యము లగుపనులను నెఱవేర్చుచున్నది: ఇది వినిమయమును సులభ మగునట్లు చేయుచున్నది; పదార్థముల మూల్యమును కొలతఁబెట్టుచున్నది. ఈరెండుపనులను చేయఁగల ద్రవ్య మొకటి యుండినఁగాని ప్రస్తుతకాలపు ఆర్థికవిధాన మొకనిమిషము గూడ జరగఁజాలదు. ఈకాలమందు ప్రతిమనుష్యుఁడును తనయాను భవమునకు కావలసినపదార్థముల నన్నిటిని తానే యుత్పత్తి చేయక, తనకు దేని నుత్పత్తి చేయుటయం దెక్కువనేర్పు గలదో దానిని మాత్రము ఉత్పత్తిచేసి, తనకు కావలసినపదార్థము లెవరియొద్ద నున్నవో వారందఱకును తా నుత్పత్తి చేసినదాని నిచ్చి వారియొద్ద నున్నవానిని తీసికొనుచుండుట సాధారణధర్మముగ నున్నది. దీనికే వినిమయ మని పేరు. చెలామణిద్రవ్యము లేక వినిమయము జరుగుట చాలకష్టము. ఒకచీరను తయారుచేసిన సాలెవానికి కొంతబియ్యము కావలసియున్నయెడల బియ్య మున్నవానియొద్ద కతఁడు వెళ్లవలెను. బియ్యము కలవానికి కావలసినది చీర యగునెడల వీరిద్దఱకును వినిమయము జరగును. అట్లుగాక అతనికి కావలసినది యొకనాఁగలి యగునెడల వానియొద్దనుండు బియ్యమును చీరకై వినిమయము చేయుట కతఁ డిష్టపడఁడు. చీరకు బదులు బియ్యము నిచ్చుటకు సిద్ధపడి యుండువాఁ డొకఁడు దొరకువంతవఱకును సాలెవాఁడు పస్తుండవలసినదే. తనయొద్దనుండు పదార్థమును కావలసియున్నవాఁడును, తనకు కావలసినపదార్థమును కలవాఁడును దొరకినఁగాని వినిమయము జరగఁజాలదు. అట్టివాఁడు దొరకినను మఱియొకకష్టము సంభవింపవచ్చును. సాలెవానికి కావలసినవి నాలుగుసేర్లబియ్యముమాత్రమే యగునెడలను, చీరయొక్క మూల్యము నలువదిసేర్ల బియ్య మగునప్పుడును వినిమయము దుస్సాధ మగును. చీరలో పదియవవంతును చించి, దానికి బదులుగ నాలుగసేర్లబియ్యమును తీసికొనుటకు వీలు లేదు. చీరను భాగములుగఁ జేసినయెడల దానికిఁగల మూల్యము నాశ మగును. చెలామణిద్రవ్య మున్నయెడల నిట్టికష్టములు తొలఁగును. బియ్య మున్నవానిని వెదకుచు వెళ్లవలసినజరూరు లేదు. చీరను ఆద్రవ్యమునకు బదులుగ నిచ్చి, ఆద్రవ్యముతో తనకు కావలసినబియ్యమును కావలసినంతమట్టుకు కొనవచ్చును. ఆద్రవ్య మక్కఱలేనివాఁ డొకఁడుకూడ లేఁడు. దానిమూలమున సంపాదింపలేని పదార్థ మొక్కటికూడ లేదు. మన కక్కఱలేనిపదార్థములను అందులోనికి మార్చుకొనిన యెడల మనయవసరము ననుసరించి మనకు కావలసినపదార్థముల నన్నిటిని కొనుచుండవచ్చును. మనయొద్ద నుండుపదార్థములను మనకు కావలసినపదార్థములలోనికి మార్చుకొనుటయం దుపయోగపడుసాధనమే చెలామణిద్రవ్యము. (౩) మూల్యమును కొలచుట కొక 'మానము' (Standard) ఉన్నఁగాని వినిమయము జరగఁజాలదు. దేనిమూల్య మెక్కువయో, దేనిమూల్యము తక్కువయో తెలిసికొనుటకు 'మానమే' ఆధారము. సేరుబియ్యముమూల్యము రెండుసేర్ల ఉప్పు అనియు, ఒకవీసెచింతపండుమూల్యము సేరుమిరెపకాయ లనియు చెప్పి దీనిమూల్యము హెచ్చుగ నున్నది యని అడిగినయెడల జబాబు చెప్పుటకు వీలు లేదు. అన్నిపదార్థములయొక్క మూల్యములను నొకసామాన్యపదార్థమురూపమున వ్యక్తపఱచినప్పుడే ఇట్టి జబాబు సులభ మగును. ఏది చౌకయో ఏది గాయకమో మన కంద ఱకును తెలియఁగలదు. అట్టిమానమే చెలామణిద్రవ్యము. ప్రతిపదార్థముయొక్క మూల్యమును ఈద్రవ్యము కొలతఁబెట్టుచున్నది. సేరు బియ్యము పావలా, సేరు ఉప్పు రెండణాలు అని చెప్పఁగనే బియ్యము ఉప్పుకంటె రెండింతలు మూల్యము గల దని స్పష్ట మగుచున్నది. పొడువును కొలచుటకు గజముబద్దయు, బరువును కొలచుటకు వీసె యుండునట్లు మూల్యమును కొలచుటకు 'చెలామణిద్రవ్యము' ఉన్నది. (౪) బంగారు వెండి — ఈ రెండులోహములును చెలామణిద్రవ్యము చేయవలసిన మొదటిపనిని చక్కఁగ చేయఁగల వని అనుభవమునుబట్టి మనుష్యుఁడు తెలిసికొనఁగలిగెను. వీనిని ఒకచోటనుండి మఱియొకచోటికి సులభముగ మోసికొని పోవచ్చును. ప్రయాణములో విఱిగిపోవునని కాని చెడిపోవునని కాని భయము లేదు. విభాగము చేయుటవలన వీనిమూల్యము తగ్గదు. శీతోష్ణములు వీనియం దెట్టిమార్పును కలిగింపలేవు. ప్రాఁతవడుటవలన వీనియం దెట్టి దుర్గుణములును కనిపింపవు. ఇన్ని మంచిగుణములు వీనియం దుండుటఁబట్టి ఇవి 'వినిమయసాధనము'గ నుపయోగించుట కర్హమైయున్నవి. (౫) మూల్యమును కొలతఁబెట్టు ద్రవ్యముయొక్క మూల్య మెల్లప్పుడు నొకటేవిధముగ నున్నఁగాని దానిమూలమున లాభము కలుగక పోవుటయేకాక విస్తారమగు నష్టముకూడ సంభవించును. పొడువును కొలచు గజముబద్దయొక్క పొడువు ఎల్లప్పుడు నొక్కటిగనే యుండవలయు ననియు, బరువుకొలచు వీసెగుండుయొక్క బరువు ఎల్లప్పుడును ఒక్కటిగనే యుండవలయు ననియు అందఱును అంగీకరించుచున్నారు. ఇవి దినదినమునకు మాఱుచుండునెడల ఎట్టివ్యాపారమును లాభకరముగ జరగదు. చెలామణిద్రవ్యముయొక్క మూల్య మిట్టిదియని

sampath_Ebooks

మనము గ్రహింపవలెను. ఒకరూపాయకు బదులుగ లభించు ఇతర పదార్థముల మొత్తమే ఆరూపాయ యొక్క మూల్యము. రూపాయ యొక్క మూల్య మధికముగ నున్నది యనిన, దానికి బదులుగ లభించు పదార్థము లధికముగ లభించుచున్న వనియు; దానిమూల్య మల్పముగ నున్నది యనిన దానికి బదులుగ లభించుపదార్థము లల్పములుగ లభించుచున్న వనియు నర్థము. మూల్యమువిషయమున రూపాయకును పదార్థములకును గలసంబంధమునకే 'ధర' అని పేరు. 'ధరలు' ఎక్కువగ నున్నవి యనిన, ఎక్కువరూపాయ లిచ్చినఁగాని పదార్థములు దొరకుట లేదనియు, 'ధరలు' తక్కువగ నున్నవి యనిన తక్కువరూపాయలకే ఆపదార్థములు దొరకుచున్నవనియు గ్రహింపవలెను. 'ధరలు' హెచ్చిన వనిన 'రూపాయ' యొక్క మూల్యము తగ్గిన దనియు, 'ధరలు' తగ్గిన వనిన దాని మూల్యము హెచ్చిన దనియు స్పష్టమగుచున్నది. (౫) పొడవును, బరువును, వైశాల్యమును కొలచు గజము, వీసె, కుంచము మొదలగు మానములకును మూల్యమును కొలచు చెలామణిద్రవ్యమునకును గొప్ప భేదము పైని చెప్పఁబడినదానినుండి తెలియుచున్నది. తక్కినమానములచే స్ఫురించునట్టి యర్థ మెల్లప్పుడు నొకటే విధముగ నుండును. చెలామణిద్రవ్యమువిషయమున నట్లు చెప్పుటకు వీలులేదు. దానియొక్క మూల్య మొకప్పు డొకవిధముగను మఱియొకప్పుడు మఱియొక విధముగను నుండును. ఇట్టిమార్పులు కలుగుచుండుటవలన నార్థికవిషయములం దనేకములగు నష్టములు సంభవించుచున్నవి. ఆర్థికవ్యవహారము లన్నిటికిని 'కాలము' ముఖ్యవిషయమగుటచేత ఇట్టినష్టములు తప్పకున్నవి. పదార్థము నుత్పత్తిచేయుటకై మనము ప్రారంభించినప్పటికిని, అది తయారగునప్పటికిని ఎంతయో కొంతకాలము పట్టుచున్నది. ఒకొక్కప్పు డీకాలము కొన్ని నెలలుగనో లేక కొన్ని సంవత్సరములుగనో యుండును. పనిని ప్రారంభించినపు డుండుధరలనుబట్టి తా నుత్పత్తి చేసినపదార్థమును విక్రయము గావించినయెడల నెంతటి లాభము వచ్చునో ప్రతియుత్పాదకుఁడును 'అంచనా' వేయుచుండును. పని పూర్తియై, పదార్థమును విక్రయించువాఁటికి 'ధరలు' తగ్గిన యెడల నతనికి నష్టము వచ్చును; 'ధరలు' హెచ్చినయెడల దానిని కొనువారికి నష్టము వచ్చును. 'ఋణము' లేని మనుష్యుఁడు లేఁడు. భావికాలమున కొంతద్రవ్యము నియ్యవలసిన బాధ్యతకే 'ఋణము' అని పేరు. భూమిని సాగుచేసి సంవత్సరాంతమున వంద రూపాయలనిస్తు నని భూస్వామి కిచ్చుట కొడంబడిన రైతు భూస్వామికి వందరూపాయలఋణము నియ్యవలసియున్నాఁడు. కూలివానిచే నెలరోజులు పనిచేయించుకొని నెలాఖరున నతనికి వేతనము నియ్యవలసిన యజమానుఁ డానౌకరునకు ఋణపడియున్నాఁడనియే అర్థము. పదార్థముల నిప్పుడు కొని, వానిక్రయమును రెండుమూఁడునెల లైన తర్వాత నిచ్చుటకు ఖరారుచేయువాఁడు అమ్మినవానికి ఋణపడియున్నాఁ డనియే గ్రహింపవలెను. ఇదిగాక కొంతద్రవ్యము నొకప్పుడు బదులు తీసికొని, తర్వాత కొంతకాలమునకు దానిని తీర్పవలసినవా రందఱును ఋణపడియున్నవారే; కావున మామూలుగ 'ఋణము' అనుమాటను ఇతరులయొద్దనుండి మనము పుచ్చుకొను 'అప్పు'లవిషయముననే మనము వాడుచున్నను, ఆర్థికవ్యవహారము లన్నిటియందును 'కాలము' ముఖ్యమగువిషయ మనియు, అన్ని వ్యవహారములును 'ఋణము'తోఁ గూడిన వ్యవహారము లనియు తెలిసికొనవలెను. ఇట్టివ్యవహారములతో సంబంధము గల వివిధపక్షముల వారికిని న్యాయము జరగవలయు ననిన 'ఋణము' యొక్క మూల్యము వ్యవహారప్రారంభమందును వ్యవహారాంతమందు నొక్కటిగ నుండవలెను. సంవత్సర ప్రారంభమున నూఱు రూపాయలు ఋణము పుచ్చుకొని, సంవత్సరాంతమున దానిని మరల చెల్లించుటకు ఒప్పుకొనినవానికి న్యాయము జరగవలయు ననిన, సంవత్సరారంభమునను అంతమునను నూఱురూపాయలమూల్య మొకటిగనే యుండవలెను. అట్లుగాక దానిమూల్యము తగ్గినయెడల ఋణము నిచ్చినవానికి నష్టము కలుగును; ఎక్కువమూల్యముగల రూపాయల నతఁడు పుచ్చుకొనినవాఁ డగుచున్నాఁడు. దానిమూల్య మధికమగునెడల ఋణము చెల్లింపవలసినవానికి నష్టము కలుగుచున్నది. ఇట్టి నష్టములు కలుగకుండ, ధర లెల్లప్పుడు నొక్కటేవిధముగ నుండుటకు కావలసిన యేర్పాటులు జరగవలసియున్నవి. (౬) కాని, ఎట్టియేర్పాటులు చేసినయెడల నిట్టిసమానమూల్యము కలుగునో నిశ్చితముగ చెప్పుటకు వీలు లేకున్నది. బంగారము మానముగ నున్నయెడల కొంతవఱకైన నట్టిలాభము కలుగు నని కొందఱును, ప్రభుత్వములవా రందఱు నేకీభవించి క్రమపద్ధతిని 'నోట్లు' కల్పించినయెడల బాగుండు నని మఱికొందఱును, తక్కినవారు మఱికొన్ని యుపాయములను సూచించియున్నారు. చెలామణిద్రవ్యముయొక్క మూల్యము దానికిఁగల గిరాకినిబట్టియు, దానియొక్క మొత్తమునుబట్టియు నిర్ణయమగుచుండు నను విషయములో అభిప్రాయభేదము లేదు. చెలామణిద్రవ్యము — అనఁగా దేశములోని రూపాయలు, నోట్లు — అధికమైనపుడు ధరలు హెచ్చును; తగ్గినపుడు ధరలు తగ్గును. ౧౯౧౪ తర్వాత జరిగినయుద్ధకాలమందు ప్రభుత్వమువారు కోట్లకొలఁది నోట్లను చెలామణి చేయుటవలన ప్రతిదేశమందును ధరలు విపరీతముగ పెరిఁగెను. చెలామణిద్రవ్య మధికము కాకపోయినను, వినిమయము చేయవలసినపదార్థములు తగ్గినపుడుకూడ ధరలు పెరుఁగుచుండును. చెలామణిద్రవ్యపుమొత్తము తగ్గినపుడును, వినిమయము చేయవలసిన పదార్థములు హెచ్చగునపుడును ధరలు తగ్గుచుండును. (౭) చెలామణిద్రవ్యముయొక్క మొత్తమును, అనఁగా రూపాయలు, నోట్లు మొదలగువానియొక్క మొత్తమును — అధికము చేయుట మంచిది యని కొందఱు చెప్పుచుందురు. ఇది భ్రమ. గజముబద్దలను, వీసెగుండ్లను, కొలతకుంచములను వృద్ధిచేసినయెడల దేశమందు కొలవవలసినపదార్థములు వృద్ధికానట్లు చెలామణిద్రవ్యమును వృద్ధిచేసినంత మాత్రమున దేశమం దుత్పత్తియగు పదార్థములసముదాయము వృద్ధి కాఁజాలదు. కొబ్బరిచెట్లలోని కాయలను కోయుటకు నిచ్చెన

sampath_Ebooks

సాధనముగ నున్నది. నిచ్చవల నధికముగ తయారుచేసినంతమాత్రమున కొబ్బెరకాయలసంఖ్య వృద్ధి కాఁజాలదు. చెలామణీద్రవ్యము విషయమున గ్రహింపవలసినసత్య మిదియే. (౮) ఈకాలమున చెలామణీద్రవ్యమును తయారుచేయునధికారము అన్నిదేశములయం దొక్కరీతిగ నుండుటలేదు. మనదేశమున నిది ప్రభుత్వమువారికి మాత్రమే యున్నది. ప్రభుత్వమువారు స్వయముగ నోట్లను ముద్రించియు, రూపాయలు మొదలుగాఁగల నాణెములను తయారుచేసియు దేశమం దెన్నికోట్లరూపాయలు చెలామణి కావలయునో నిర్ణయించుచున్నారు. రూపాయయొక్క మూల్యము పదునెనిమిది పెన్సులుగ నుండవలయు నని వారిశాసనము. దేశమం దెన్నికోట్లరూపాయ లున్నయెడల నిట్టిమూల్యము రూపాయ కుండునో అన్నికోట్లరూపాయలను మాత్రమే వారు తయారు గావించుచుందురు. అంతకంటె హెచ్చుగ తయారు గావించినయెడల రూపాయయొక్క మూల్యము పదునెనిమిది పెన్సులకంటె తగ్గును. అంతకంటె తక్కువగ తయారు గావించినయెడల రూపాయయొక్క మూల్యము పదునెనిమిదిపెన్సులకంటె హెచ్చగును. ఇంగ్లండు దేశములో చెలామణి యగుచుండు నాణెములలో 'పెన్సు' అనునది యొకటి. ఇది పౌనులో ౧/౨౪౦-వవంతు. రూపాయ విలువ పదునెనిమిది పెన్సు లనఁగా, ౧౮ పెన్సులు ఇంగ్లండునం దెంతటిపదార్థములను కొనఁగలవో అంతటిపదార్థములను రూపాయ గూడ కొనునట్లు నిర్ణయము చేయుట యనియే అర్థము. మనప్రభుత్వమువారు మనదేశమందలి చెలామణీద్రవ్యపుమొత్తమును నిర్ణయించునట్లు ఇంగ్లండుదేశమున ఇంగ్లీషుప్రభుత్వమువారు చేయుచున్నారు. కొన్నిదేశములం దీపనిని ప్రభుత్వమువారు స్వయముగ చేయక బ్యాంకీలద్వారా చేయించుచుందురు. బ్యాంకీలమూలమున ప్రచారము గాంచు 'చెక్కులు' గూడ చెలామణీద్రవ్యములో చేరినవే. 'బంగారుమానము' (Gold Standard) గల దేశములందు వర్తకులే చెలామణీద్రవ్యపుమొత్త మింత యుండవలయు నని నిర్ణయించుకొనుచుందురు. ఎక్కువద్రవ్యము కావలసినపుడు వారు బంగారమును టంకసాలలోనికి తీసికొనివెళ్లి నాణెములుగ తయారుచేసికొనుచుందురు. తక్కువద్రవ్యము కావలసియున్నప్పుడు నాణెములను కరఁగించివేయుదురు. ఇటీవలికాలమున ప్రపంచమందలి దేశము లనేకములలో 'బంగారుమానము' తీసివేయఁబడుటచేత, చెలామణీద్రవ్యపుమొత్తమును నిర్ణయించునధికారము చాలవఱకు ప్రభుత్వములందు సంక్రమించినది. కాని, ప్రతిదేశమందును 'బ్యాంకీ' లనేకము లున్నవి. బ్యాంకీలు వ్యక్తులకు ఋణము లిచ్చి 'చెక్కు' లను ప్రచారమం దుంచుటకు కావలసినవసతులను కల్పించుచు, ధరలను హెచ్చించుటయందును తగ్గించుటయందును విస్తారము జోక్యమును కలిగియున్నవి. ధరలలోని మార్పులవలన నష్టము లనేకములు కలుగుచుండుటచేత, 'బ్యాంకీ'ల కింతటిజోక్య ముండఁగూడ దనియు, 'బ్యాంకీ' లపైని ప్రభుత్వమువారికి పరిపూర్ణమగు నధికార ముండవలయు ననియు ననేకులవాదము.

ప్రస్తుతకాలపు ఆర్థికవిధానమును ఖండించువా రనేకు లున్నారు; దానిస్థానమున నెలకొల్పఁదగిన విధానాంతరములను వారు సూచించుచుందురు. ఈసూచనల ననుసరించి దేశము లన్నిటియందును స్వల్పముగనో, విస్తారముగనో మార్పు లనేకములు జరగుచున్నవి. వ్యక్తిస్వాతంత్ర్యమునకు హద్దుల నేర్పఱచుటయందును, ఆ హద్దుల నేర్పఱచు ప్రభుత్వముయొక్క స్వరూపమును నిర్ణయించుటయందును ఒకదేశమునకును మఱియొకదేశమునకును భేదము లనేకములు కనిపించుచున్నవి. సమష్టివిధానము (Socialism), సమస్తవిధానము, ఫాసిస్టువిధానము లోనుగాఁగల పేర్లతో నచ్చటచ్చట నాఁటుకొనుచుండుపద్ధతు లన్నియును ప్రస్తుతకాలపు ఆర్థికవిధానమందలి లోపములయొక్క ఫలితము లని చెప్పవచ్చును.

ఇప్పటి ఆర్థికవిధానమును నడపుచుండు మహాశక్తి 'వ్యక్తులకుఁ గల లాభాపేక్షయే'. మనకు కావలసిన పదార్థములు కావలసినంత వఱకు కావలసినసమయములందును, ప్రదేశములందును లభించుచుండుటకు లాభాపేక్షయే కారణము. ఎట్టిపదార్థముల నుత్పత్తి చేయుటవలన లాభము దొరకునో అట్టివానినే ప్రతిమనుష్యుఁడు నుత్పత్తి చేయఁ బ్రయత్నించును; ఎచ్చట నుత్పత్తి చేసినయెడల నధికముగ లాభము వచ్చునో అట్టిప్రదేశమందును, ఏసమయమున నుత్పత్తి చేసిన లాభము వచ్చునో ఆసమయమందును అతఁ డుత్పత్తిచేయఁ జూచుచుండును. తనకు నష్టము కలిగించుపని నెవ్వరును చేయుటలేదు. లాభము వచ్చునా లేదా యని యూహించుటకు పదార్థములయొక్క క్రయమే ఆధారము. 'క్రయము' అను సత్తునుబట్టి సాధనత్రయసంయోగమార్గమున వెళ్లి లాభమును సంపాదించుటయే ఆర్థికవ్యవహారముల జరుపువారందఱియొక్క ప్రధానోద్దేశము.

ఇప్పటివిధానమును సంస్కరింపవలయునా? అను విషయమును తీర్మానించుటలో మనము పరిశీలింపవలసిన దీయుద్దేశమువలన కలుగుచుండు ఫలితములే. ఈఫలితము లుత్తమము లైన వని తోఁచునెడల ప్రస్తుతవిధానము మంచిది యనియు, అట్లుకానియెడల మంచిది కా దనియు మనము తీర్మానింపవలెను.

క్రయమునుబట్టియు, లాభాపేక్షనుబట్టియు నర్థోత్పత్తిచేయునపుడు ప్రతిమనుష్యుఁడును తనకుఁగల సామర్థ్యమును తెలివితేటలను సంపూర్ణముగ వినియోగించి, పదార్థముల నతిచౌకగను బాహుళ్యముగను తయారు చేయుటకు ప్రయత్నించుచుండును. ఇతరుల కగుఖర్చులకంటె తన కగుఖర్చులు తక్కువ యగునెడలఁ దనకు వచ్చు లాభ మధికముగ నుండు నని అతఁ డట్టి ప్రయత్నము చేయును. లాభము రా దని తోఁచినపు డాపదార్థము నుత్పత్తిచేయుట మానును. దేశమందలి సాధనత్రయమును లాభకరము లగు మార్గములందే వినియోగము చేయుచుండును; కావున వినియోగ మంతయు వ్యర్థముగాక సార్థక మగును.

కాని కొన్నిసందర్భములనుబట్టిచూడ లాభము నపేక్షించి వ్యవహారములఁ జేయుటమూలమున కొన్నినష్టములు కలుగవచ్చు ననియు,

sampath_Ebooks

ఒకొక్కప్పుడు సాధనములు దుర్వినియోగము కావచ్చు ననియు లోపకమానదు. ఈనష్టమును, ఈ దుర్వినియోగమును దేశములోని ప్రజాసముదాయమున కంతకును హానికరముగ నుండును. ఆ వ్యవహారములను జరపువ్యక్తులకు లాభకరములుగ నున్నను దేశమున కంతకును నష్టము కలుగఁజేయునట్టి వ్యవహారములకు నిరోధము కలిగింపవలసివచ్చును. లాభమును కోరువాఁడు తాను నడచునట్టిమార్గమువలన నితరులకు కలుగునష్టములను గమనింపకుండును. కూలివాండ్రకు తక్కువకూలి నిచ్చును; వారిచే సమస్తకష్టములను చేయించును; విశ్రాంతి యనునది లేకుండ వారికి పనులను కల్పించుచుండును. తానుతయారుచేయు పదార్థములయందు నిరుపయోగములయినట్టివియు, హానికరములయినట్టివియు నగువస్తువులను మిళితము చేయును. తన జీవితకాలముననే విశేషలాభము సంపాదింపఁగోరి, తర్వాతికాలమున దేశమునకు కలుగునష్టమును గమనింపక, తనయధీనమం దుండు ప్రకృతిసంపదలను – అరణ్యములు, గనులు లోనగువానిని – కడుశీఘ్రముగ ఖర్చుపెట్టును. ఇతరదేశములందు చౌకగ దొరకు నని తన వ్యాపారమునకు కావలసినపదార్థములను విదేశములందు కొని, తన దేశమం దుత్పత్తి యగువానిని కొనుట మాని, అందలి పరిశ్రమలకు నష్టము కలిగించును. తనకు లాభము వచ్చుచున్నదా లేదా యను విషయమునే ప్రతిమనుష్యుఁడు నాలోచించును గాని సముదాయముగ దేశమునకు లాభము వచ్చునా రాదా యనువిషయము నాలోచింపఁడు. తలపెట్టినవ్యవహారమునకు స్వదేశమున మూలధనము లభింపనియెడల విదేశములనుండి ఋణము దెచ్చి తాను లాభము సంపాదింపఁజూచును గాని దానిమూలమున వచ్చు రాజకీయనష్టములను పరిగణింపఁడు.

క్రయ యొక్కటియే ప్రస్తుతకాలపువిధానమున మార్గదర్శి యని పైని చెప్పఁబడెను. దేనిక్రయ మధికముగ నుండిన దాని నుత్పత్తి చేయుటయు, దేనిక్రయ మల్పముగ నుండిన దానియుత్పత్తి మానుటయు సహజము. కొనువారికి ఏపదార్థ మెక్కువయుపయోగకారియో తెలిసికొనుటకు క్రయ యొక్కటియే ఆధారము. కాని కొందఱు ధనికులుగను కొందఱు దరిద్రులుగను నుండుదేశములో క్రయమునుబట్టి పదార్థముల నుత్పత్తిచేయుటమూలమున కొన్ని యనర్థములు సంభవించును. దారిద్ర్యమువలన ఆహారపదార్థముల కెక్కువ ఖరీదు నిచ్చుట కనేకులకు శక్తి లేకపోవుటచేత వారికి కావలసినన్ని ఆహారపదార్థము లుత్పత్తి చేయుటకు బదులుగ ధనికు లెక్కువఖరీదిచ్చి కొనఁగలిగినట్టి 'విలాస పదార్థము' (Luxuries) లెన్నియో యుత్పత్తి చేయఁబడుచున్నవి. ఉత్పత్తి చేయఁబడినపదార్థములుసైతము ఎక్కువక్రయ మియ్యఁగల ధనికులకే లభించుచున్నవి గాని దరిద్రులకు లభించుటలేదు. కడుపునిండ అన్నములేక దరిద్రు లనేకులు బాధపడుచుండ, ధనికులయిండ్లలోని పిల్లులు, కుక్కలు మొదలగు జంతువులకు పుష్కలముగ నాహారము దొరకుచుండును. క్రయము నియ్యఁగల వా రున్నారని కల్లు సారాయి లోనగు హానికరము లగు పదార్థము లనేకము లుత్పత్తి చేయఁబడుచున్నవి. లాభ మొక్కదానినిమాత్రమే అపేక్షించుకాలమున క్రయ ముండుటయే ఉపయోగలక్షణ మనియు, క్రయములేనిపదార్థములు నిరుపయోగము లనియు నెంచఁబడును. విద్య యొక్క విలువను గ్రహింపక ధనికులుకూడ తమ పిల్లలకు విద్యను చెప్పించనియెడల పుస్తకముల వ్రాయువారు, వానిని ముద్రించువారు, వానిని చదివి బోధించువారు నుండఁజాలరు. పుస్తకములకు క్రయ ముండదు; ఉపాధ్యాయులకు గిరాకి యుండదు. అట్లే ఆరోగ్యము యొక్క విలువను గ్రహింపకపోవుటచేత, తగినక్రయము నిచ్చి దానికి కావలసిన పరికరములను కొనుట కనేకు లిష్టపడుటలేదు. గ్రామము లందలి వీథులను శుభ్రపఱుచుటకు 'పాకీ'వాం డ్రుండుట లేదు; చెఱువులలోనినీళ్లను శుభ్రముగ నుంచుటకు కావలివాం డ్రుండుట లేదు. ఇట్టివారికి వేతనము లిచ్చుట కిష్టపడువా రెవ్వరును లేరు. క్రయము కల దంతయు విలువగలదని యనియు, క్రయము లేనిదానికి విలువ లేదనియు నెంచఁబడుచున్నది.

ప్రస్తుతకాలపు ఆర్థికవిధానమున మఱియొక విశేష మున్నది. సొంతలాభము నపేక్షించియే ప్రతివ్యక్తియు తన వ్యవహారములు జరపుకొనుచుండుటచేత, అట్టిలాభము హెచ్చుటకై నూతన యంత్రములను, ఉపాయములను అతఁ డత్యధికముగ సృష్టిచేయుచుండును. దానిమూలమున కూలివాండ్రనేకులకు కూలిదొరకక వారు నిరుద్యోగులై యుండవలసి యున్నది. ప్రతి దేశమందును గొప్ప సమస్యలలో నిరుద్యోగసమస్య అగ్రస్థానమును వహించి యున్నది. నిరుద్యోగు లగువారు క్రయము నిచ్చి తమకు కావలసిన పదార్థములను కొనఁగలిగియుండరు. వికలాంగులు, వార్ధకమువలన పని చేయలేనివారు నీవిషయమున నిరుద్యోగులవంటివారే. ఇదిగాక, అప్పుడప్పుడు ఆర్థికవ్యవహారము లన్నిటికి నొకగొప్పదెబ్బ తగులుటయు, దానిమూలమున వ్యాపార మంతయు స్వల్ప మగుటయు సంభవించుచుండును. ఇట్టివిపరీతములకు లోనైన ప్రస్తుతకాలపు ఆర్థికవిధానమును సంస్కరించుట మిక్కిలి యవసర మని స్పష్టమగుచున్నది.

వ్యక్తిలాభాపేక్షమూలమునను క్రయముమూలమునను సముదాయముమీఁద దేశమున కంతకును నష్టము కలుగుచున్న దనికాని, దేశక్షేమమునకు కావలసినపదార్థము లుత్పత్తి యగుట లేదనికాని, దేశమునకు హానికరము లగుపదార్థము లుత్పత్తి యగుచున్నవి యనికాని, ఉత్పత్తియగు పదార్థములు కావలసినవా రందఱకును న్యాయానుసారముగ లభించుట లేదనికాని స్పష్ట మగునపుడు ఇట్టిలోపము లన్నిటిని ప్రభుత్వమువారు సవరణచేయుట యుక్త మని శాస్త్రకారు లందఱియొక్క అభిప్రాయము. వ్యక్తిలాభమునకన్న దేశమున కంతకును చెందునట్టిలాభము ఎక్కువ ప్రాధాన్యమును వహింపవలెను. వ్యక్తిస్వాతంత్ర్యము దేశక్షేమమున కెట్టిసందర్భములందు హానికరమగునో అట్టిసందర్భములలో ప్రభుత్వమువారు దానికి నిరోధము కలిగింపవలెను. వ్యక్తులు క్రయ మిచ్చి తమంతట తాము సంపా

sampath_Ebooks

దించుకొనలేని సాధనములను ప్రభుత్వమువారు తయారుచేయవలయును. ఈసూత్రముల ననుసరించియే ప్రస్తుతకాలమం దనేక దేశములలో ప్రభుత్వమువారు తమకార్యములను నిర్వహించుచున్నారు.

క్రయ మిచ్చి కొనుటకు వీలు లేని దేశసంరక్షణ, న్యాయాన్యాయములతీర్పు, దుష్టశిక్షణము లోనగువానిని సైన్యములను, పోలీసువారలను, కోర్టులను, కారాగృహములను నెలకొల్పి ప్రజలకు సమకూర్చుచున్నారు. క్రయ మిచ్చి కొనుటకు వీలున్నను అట్టిపని చేయుటకు ప్రజలయం దిష్టమును సామర్థ్యమును లేకపోవుటచేత, వలయునంతమట్టుకు లభింపకుండునట్టి విద్యాపరికరములు, ఆరోగ్యసాధనములు లోనగువానిని ప్రభుత్వమువారే కల్పించుచున్నారు. క్రయ మిచ్చి కొనుటకు ప్రజలు సిద్ధపడియున్నను అట్టిపద్ధతి మూలమున వ్యాపారాదులకు కొన్ని ఆటంకములు కలుగు నని తోచు వంతెనలు లోనగువానిని ప్రభుత్వమువారే నిర్మించుచున్నారు. ఏకముఖముగ నుత్పత్తి యగుచుండు పదార్థముల క్రయము అత్యధికముగ నుండకుండుటకై వాని క్రయములను ప్రభుత్వమువారు నిర్ణయించుచుందురు. రైలుచార్జీలు, విద్యుద్దీపములచార్జీలు లోనగునవి యిట్టివి. క్రయ మిచ్చి కొనుటకు ప్రజలు సిద్ధపడియుండు పదార్థములు కొన్ని హానికరము లని యెంచి అట్టివాని నుత్పత్తి చేయకుండుటకును, ఉత్పత్తి చేసినను అల్పమాత్రముగ నుత్పత్తి యగుటకును కావలసిన యేర్పాటులను ప్రభుత్వమువారు చేయుచుందురు. కల్లు, సారాయి, నల్లమందు మొదలగు పదార్థము లిట్టివి. ఏకముఖముగ నుత్పత్తి (Monopolistic production) చేసినయెడల బాగుగ నుత్పత్తి చేయవచ్చు నని యెంచఁబడు పదార్థములను కొన్నిటిని ప్రభుత్వమువారే తయారు చేయుచుందురు. తపాలా తంతిసౌకర్యము లన్నియు నీజాతిలో చేరినవి. విదేశవస్తువులపోటీవలన స్వదేశమునకు నిశ్చితముగ నష్టము సంభవించు నని స్పష్ట మగునపుడు అట్టిపోటీని నిలుపుదల చేయుటకు వా రనేకముల యేర్పాటులను గావించి, స్వదేశమున నేయేపరిశ్రమ లుండవలయునో తీర్మానించుచుందురు. నిరుద్యోగులకును వికలాంగులకును వృద్ధులకును తగుపనుల నేర్పఱిచి సొంతముగ క్రయ మిచ్చి పదార్థములను కొనుటకు వారికి శక్తిలేకున్నను, అట్టిశక్తిని వారికి కల్పించుట పాశ్చాత్త్యదేశములందలి ప్రభుత్వమువారి కాచార మైయున్నది. కొన్ని దేశములలో కూలివాండ్రకు యజమాను లిచ్చువేతనము లింతకంటె తక్కువగ నుండఁగూడదనియు, భూస్వాములు రైతులయొద్దనుండి తీసికొను సిస్తులును, సాహుకార్లు ఋణస్థులనుండి తీసికొనువడ్డీలును ఇంతకంటె నధికముగ నుండఁగూడ దనియు ప్రభుత్వమువారు నిర్ణయించుచుందురు.

ఈ సందర్భమున నాలోచింపవలసిన ప్రధాన విషయ మొక్కటి యున్నది. ప్రభుత్వ మనునది దేశమున కంతకును సాముదాయికమగు లాభమును సమకూర్చుటకై యేర్పడియుండు సంస్థ. వ్యక్తుల చర్యలవలన నిట్టిలాభమున కాటంకము కలుగునపు డట్టిచర్యలకు నిరోధము కలిగించుట దానియొక్క ముఖ్యమైనపని. ఈపని చేయుటలో దానికి 'దండనము' అను సాధన మున్నది. సామ దాన భేదములచే సాధింపలేని పనులను దండోపాయముచే సాధించుటకు ప్రభుత్వమువారు ప్రయత్నించుచుందురు. దీనినిబట్టి ప్రభుత్వమువారు వ్యక్తిస్వాతంత్ర్యమును నిరోధించుటలో నెంతవఱకు వెళ్లుట యుక్తమో స్పష్ట మగుచున్నది. దేశములో నుండు నొకపక్షమువారికే కాక దేశమున కంతకును లాభము చేకూరు ననియు, అట్టిలాభము చేకూరుటకు దండోపాయ మవసర మనియు నిశ్చితమగునప్పుడు ప్రభుత్వమువారు ఆర్థికవిషయములందు జోక్యము కలుగఁజేసికొనవలెను.

పైని వివరింపఁబడిన కార్యములలో ననేకములను గావించుటకు ప్రభుత్వమువారికి ధనము కావలసియున్నది. ధనము లేనియెడల సైన్యములను విద్యాలయములను ఆరోగ్యసాధనములను నిరుద్యోగులకు కావలసిన వసతుల నేర్పఱుచుటకు వీలుండదు. ఈధనములో చాల భాగమును పన్నుల మూలమున ప్రభుత్వమువారు సంపాదించుచున్నారు. పన్నులను విధించుటలో వారు పరిశీలింపవలసినసూత్రములనేకము లున్నవి. వ్యక్తుల యార్థికశక్తినిబట్టి పన్నులను వసూలు చేయుచుండవలెను. ధనికులయొద్దనుండి అధికముగను, దరిద్రులయొద్దనుండి తక్కువగను తీసికొను సంప్రదాయమున కిదియే కారణము. అర్థము నుత్పత్తిచేయువారికి నిరుత్సాహము కాకుండునట్లుగ పన్నులను విధించుచుండవలెను. స్వప్రయత్నమువలనను, సొంతపరిశ్రమువలనను గాక అదృష్టవశమునను అనుకూలసందర్భములమూలమునను ధనమును గడించువా రనేకు లున్నారు. గొప్ప భూస్వాములు, జమీన్దారులు, వడ్డీవ్యాపారము చేయుసాహుకార్లు, దానము మూలమునను వారసత్వముమూలమునను అర్థమును సంపాదించుచుండువారు ఈజాతిలో చేరినవారు. వారి యాదాయములు కష్టార్జితములు కావు. అట్టివారియొద్దనుండి ఎక్కువపన్నులను వసూలుచేయుట ధర్మము.

దేశమందుండు పన్నులపద్ధతి మంచిదియా కాదా యని నిర్ణయించుటలో విచారింపవలసిన విషయము మఱియొకటి యున్నది. వసూలగు పన్నుల నెందులకై ఖర్చుపెట్టుచున్నా రనుట చాల ముఖ్యమగు విషయము. దేశోపకారకమగు పనులను చేయుటకు ఖర్చుపెట్టుచుండుయెడలను, ఖర్చుపెట్టు ఉద్యోగస్థులు లంచగాండ్రుగాక న్యాయముగను నేర్పుతోడను తమ పనులను చేయువా రగునెడలను పన్నుల నిచ్చుట లాభకరము. మనలో నొక్కొక్కరము వేఱువేఱుగా ఖర్చుపెట్టుటకు బదులు ప్రభుత్వమువారు కొంతధనమును మనయొద్ద తీసికొని మొత్తముగ ఖర్చుపెట్టుటయే పన్నులపద్ధతిలోని ప్రధాన లక్షణము. మొత్తముగ ఖర్చుపెట్టుటవలన కొన్ని లాభములు చేకూరుచుండును.

లాభాపేక్షయు క్రయవిధానమును యుక్తము కా దని స్పష్టమగునపుడు ప్రభుత్వమువారు ఆర్థికవిషయములలో జోక్యము కలుగఁజేసికొనుట యుచిత మని శాస్త్రకారు లందఱు నంగీకరించుచున్నారు. కాని లాభాపేక్షతో జరుపఁబడు వ్యవహారము లెన్నటి

sampath Ebooks



కని యుక్తముగ నుండఁజాల దనియు, కొన్ని సందర్భములలో యుక్తముగ నుండు ననియు, కొన్ని సందర్భములలో యుక్తముగ నుండ దనియు వివేచన చేయుట పొరపాటనియు, కావున అట్టియపేక్షతో వ్యవహారములు జరపఁగూడ దనియు కొందఱిమతము. ఈమతము ననుసరించినవారు అర్థోత్పత్తియు, అర్థవిభజనము, మూల్యనిర్ణయము మొదలగు పను లన్నియు ప్రభుత్వమువారే చేయుట మంచి దని చెప్పెదరు. ఏయేపదార్థముల నుత్పత్తిచేయవలసినది నిర్ణయించి ఆయాపదార్థముల నుత్పత్తిచేయుట, చేసినవానిని దేశములోని ప్రజలకు పంచిపెట్టుట లోనగువ్యవహారము లన్నియు ప్రభుత్వమువారిచేతి నుండవలె నని వారివాదము. ప్రస్తుతము రష్యాయం దిట్టివిధాన మున్నది. ఇందులోని గుణదోషములను విమర్శించుట కిది సమయము కాదు. రాజ్యాంగవ్యవస్థలనుబట్టియు, రాజ్యాధికార మెవరిచేతిలో నుండునో దానినిబట్టియు నిట్టివిషయములు నిర్ణయమగుచుండవలెను. అర్థశాస్త్రమునుగుఱించినజ్ఞానము పరిపూర్ణమగుటకు తక్కిన సాంఘికశాస్త్రములపరిచయ మత్యావశ్యకము.

(మా. వేం. రం.)

## అర్థశాస్త్రములు — (హిందూదేశమునందలివి)

హిందూదేశమునందు వేదాంత మెక్కువ గనుక జనుల కర్థములయం దాసక్తి లేక వారర్థములనుగుఱించి విశేషప్రయత్నములను చేయలే దనియు, అందువలన నర్థశాస్త్రములు హిందూదేశమునందుఁ బుట్టలే దనియుఁ గొందఱు చెప్పెదరు. ఇట్లనువారిలోఁ గొందఱు హిందూదేశభక్తులు, కొందఱు హిందూదేశనిందకులు. భక్తు లిట్లు చెప్పెదరనఁగా, హిందూదేశమందు వేదాంతవైరాగ్యము లెక్కువ యని చెప్పినయెడల నది పాశ్చాత్యదేశములకంటె పారమార్థికవిషయవిచారమున నత్యధిక మైనదిగాఁ దేలు నని వీరి భావము. నిందకులను ఇట్లు చెప్పుటకుఁ గారణము హిందూదేశము కళాకౌశలముల యభివృద్ధికిఁ దగినదేశము కాదు; ఇతరదేశములవారి సరకులు కొనుచుండుటయే వీరిపని యని సూచించుటయే. కాని వీ రిద్దఱును జెప్పునది నిజమైన విషయము కాదు.

ఏ దేశమునందును ఏకాలమునందును పరమార్థవిచారమును జేయువారు కడు స్వల్పసంఖ్యాకులు. ఐహికార్థములనుగుఱించి విచారించువారసంఖ్యులు. ఈనియమమునకు హిందూదేశమాత్ర మపవాదము కాదు. సంస్కృతమునందు వేదాంతగ్రంథములు పెక్కు లున్న వనువారు శృంగారరసమును వర్ణించు నలంకారగ్రంథముల సంఖ్యయు, నాయికానాయకుల యపరిమిత శృంగారచేష్టలను వర్ణించు కావ్యములసంఖ్యయు, కామశాస్త్రములును మఱవఁగూడదు. శిల్పాది శాస్త్రంబులును పెక్కులు కలవు. ఇంగ్లీషుప్రభుత్వము ప్రారంభమగునంతకును, హిందూదేశమందలి కళాకౌశలములఖ్యాతి జగమంతయును వ్యాపించియుండెను. మనవా రైహికవిషయములను లక్ష్యపెట్టనివారు గాని, చేతఁగానివారుగాని అయినయెడల మనదేశ మిట్టి వైభవమునకు నెట్లు వచ్చియుండును? కావున గ్రీసు రోము మొదలయిన దేశములవారితోపాటు హిందువులలోఁ గొందఱుమాత్ర మధ్యాత్మవిద్య నభ్యసించిరి. మిగిలినవా రందఱును సంసారమున కుపయుక్తమైనపనులను జేసిరి. అందుచే మనదేశమందును కొన్ని అర్థశాస్త్రములు పుట్టెను.

పురుషార్థములనుబట్టి మనవారు శాస్త్రముల నన్నిటిని నాల్గువిధములుగ విభజించిరి — ధర్మశాస్త్రములు, అర్థశాస్త్రములు, కామశాస్త్రములు, మోక్షశాస్త్రములు. మన్వాదిస్మృతులు ధర్మశాస్త్రములు, శుక్రనీతి మొదలయినవి అర్థశాస్త్రములు, వాత్స్యాయనసూత్రములు కామశాస్త్రములు, బ్రహ్మసూత్రాదికములు మోక్షశాస్త్రములు. ఈనల్గురుశాస్త్రకారులలోఁ బరస్పరవిరోధములు వచ్చినప్పు డేశాస్త్రము ప్రమాణ మన్నవిషయమునం దభిప్రాయభేదములు కలవు[1]. ప్రస్తుతము మనకు నితరశాస్త్రములతోఁ బని లేదు. అర్థశాస్త్రముతోఁ బని కలదు. కావున దానినిగుఱించియే విచారింతము.

'ఎందు శ్రుతిస్మృతివిరోధము లేకుండ రాజధర్మములును, మంచికౌశలముచే ధనార్జనము చేయునుపాయములును ఉపదేశింపఁబడియుండునో యది అర్థశాస్త్రము' అని శుక్రనీతియందు[2] ఈశాస్త్రలక్షణము చెప్పఁబడియున్నది. ఇందువలన నీ శాస్త్రమునందు రాజధర్మములును, ధనార్జనచర్యయు నను రెండువిషయములును ఉండును అనుట స్పష్టము. కావుననే యీశాస్త్రమునకు 'నీతిశాస్త్రము', 'రాజనీతిశాస్త్రము', 'దండనీతిశాస్త్రము'[3] అన్న నామాంతరములుకూడఁ గలవు. అర్థశాస్త్ర మనుపేరుకంటె 'నీతిశాస్త్ర' మను పేరే యెక్కువగా సంస్కృతభాషయందు వాడుకలో నున్నది. ఇందుకుఁ గారణము లేకపోలేదు. ఈగ్రంథములలో నర్థ(ధన) విచారముకంటె, రాజధర్మములనుగుఱించియే యెక్కుడుచర్చ యుండును.

---

1. "అర్థశాస్త్రాత్తు బలవత్ ధర్మశాస్త్ర మితి స్థితిః" (యాజ్ఞ. స్మృ.); "అర్థ ఏవ ప్రధాన ఇతి కౌటిల్యః"; "అర్థమూలౌ హి ధర్మకామా వితి" (కౌటిల్యార్థశాస్త్రము).

2. శ్రుతిస్మృత్యవిరోధేన రాజవృత్తాదిశాసనమ్, సుయుక్త్యార్థార్జనం యత్ర హ్యర్థశాస్త్రం తదుచ్యతే" (౪. అ, 3. ప్ర, శ్లో. ౨౫).

3 అర్థశాస్త్రము, నీతిశాస్త్రము, రాజనీతిశాస్త్రము, దండనీతిశాస్త్రము అనుపదములు మన పూర్వగ్రంథములలో సమానార్థకములుగ వాడఁబడినను, ఇప్పటి శాస్త్రాభివృద్ధి ననుసరించి, యావశ్యకమును జూచి, 'పొలిటికల్ ఎకానమీ'కి (Political Economy) 'అర్థశాస్త్ర' మన్నమాటయు, ఎథిక్సు (Ethics) అన్నదానికి 'నీతిశాస్త్ర'మును, 'పొలిటిక్సు'నకు (Politics) 'రాజనీతిశాస్త్రము'ను, 'క్రిమినల్ లా'కు (Criminal Law) 'దండనీతి' యన్నమాటయు రూఢి చేయుట మంచిది.

sampath_Ebooks

గ్రీకుతత్త్వవేత్తలు వ్రాసిన రాజకీయవిషయక గ్రంథములయందుఁగూడ నిట్లే, యర్థవిచారము తక్కువగను, రాజ్యవిచార మెక్కువగనుండును. ఆకాలమునం దర్థవిచార మొక స్వతంత్రశాస్త్రముగఁ బరిగణింపఁ బడలేదు. కనుక దానిని రాజ్యవిచారమునకు సంబంధించిన యొకశాఖగా నెంచిరి. ఇప్పటివారును ఆర్థికశాస్త్రమునకు 'పొలిటికల్ ఎకానమీ' (Political Economy), అనఁగా రాజకీయార్థశాస్త్ర మని పేరు పెట్టుటయు మొదట నర్థశాస్త్రము రాజ్యతంత్రశాస్త్రమునకు శాఖగా నభివృద్ధిఁ జెందె నని సూచించుచున్నది.

ఇవియుఁగాక రాజు అభ్యసింపవలసిన శాస్త్రములలో ఆన్వీక్షికి, త్రయి, వార్త, దండనీతి అను నాల్గుశాస్త్రములు చెప్పఁబడినవి (శుక్ర., అ. ౧, శ్లో. ౧౫౨). వీనిలో ఆన్వీక్షకియందుఁ దర్కవేదాంతములును, త్రయియందు ధర్మాధర్మకామాకామములును, వార్తయం దర్థానర్థములును, దండనీతియందు న్యాయాన్యాయములును ఉండును (శ్లో. ౧౫౩-౪). వార్తాశాస్త్రమును గుఱించియు నింకను విచారింపఁగా నందు వడ్డీవ్యాపారము, వ్యవసాయము, వాణిజ్యము, గోరక్ష యనువిషయములు చర్చింపఁబడును అని తెలియుచున్నది (శ్లో. ౧౫౬). ఇది వృత్తులకు సంబంధించిన శాస్త్రము. అందుచే వార్త యనఁబడియె. ఇట్లు 'వార్తా' శాస్త్రము[1] యొక్క పేరేకాని, యానామము గల గ్రంథము లెచ్చటను గానరావు.

అర్థశాస్త్రములవిూఁది గ్రంథములను శోధింపఁగా బృహస్పతిసూత్రము లనియు, శుక్రసూత్రము లనియు రెండు సూత్రగ్రంథములు చిన్నవి కనఁబడుచున్నవి[2]. వీనిలో ధనమును గుఱించి కొలఁది సూత్రములే కలవు. బృహస్పతిసూత్రములలో అర్థ మనియు, అర్థాభాస మనియు ధనము రెండువిధము లని చెప్పఁబడినది. న్యాయమార్గమున సంపాదించినది అర్థము. అన్యాయమార్గమున గడించినది అర్థాభాసము[3]. సుఖమునకు మూలము ధర్మము, ధర్మమునకు మూల మర్థము అని చెప్పఁబడియున్నది[4]. శుక్రసూత్రములందు, దండము వలన వృత్తులు నిలుచును, వృత్తులవలననే అర్థము లభించును, అర్థమే ధర్మకామములకు మూలము, అర్థమే అన్నికార్యములకును మూలము, అర్థవంతుని సర్వలోకము సత్కరించును, అర్థము లేనియెడల నింద్రునైనను లోక మగౌరవించును, అజరామరునివలె నర్థము సంపాదింపవలె నని చెప్పఁబడియున్నది[5]. ఇందు 'నహి ధాన్యసమో ఽర్థః', అనఁగా ధాన్యముతో సమానమైన అర్థము లేదు అని ప్రతిపాదింపఁబడియున్నది. పాశ్చాత్త్యార్థశాస్త్రజ్ఞులలోని 'నిసర్గసంప్రదాయము' (Physiocrats) అనువారుగూడ నిట్టియభిప్రాయమునే చెప్పినారు. వ్యవసాయమువలనఁ బుట్టునదే నిజమైనధనము, కళాకౌశలములవలనఁ బదార్థములందు మార్పు గల్గునేకాని, క్రొత్తధనము పుట్ట దని వారి సిద్ధాంతము. ఇదియే శుక్రాచార్యునియభిప్రాయముగఁ గానవచ్చుచున్నది.

పై సూత్రగ్రంథము గాక 'శుక్రనీతి' యని యొక శ్లోకాత్మకగ్రంథము కలదు[6]. ఇతరనీతిశాస్త్రములందువలెనే యిందును రాజనీతియే యెక్కువ కలదు. ధనమును గుఱించి స్వల్పవిషయము లక్కడక్కడఁ జెప్పఁబడినవి. పశుధాన్యవస్త్రాదికములు గడ్డిపఱకవఱకును ధనము లనియు (౨.౩౫౭), వ్యవహారమునకై ముద్రవేయఁబడిన వెండి బంగారము రాగిధాతువులకును, గవ్వలు మొదలు కొని రత్నములవఱకును అన్నిటికిని ద్రవ్య మని పేరు గల దనియు (౨-౩౫౬), దేశమునుబట్టియు కాలమునుబట్టియు వస్తువులవెలలు కట్టవలయును, గుణహీన మైనట్టిదియు (Not useful) వ్యవహారాక్షమ మైనట్టిదియు (Not exchangable) నగు వస్తువునకు వెలయుండదు (౪-౨-౧౦౪-౫), వస్తువుల సులభాసులభత్వములను బట్టియు, గుణాగుణసంశ్రయమునుబట్టియు వస్తువులవెలలు హెచ్చుచుఁ దగ్గను నుండును (౨-౩౫౯) అను కొన్ని మూలసిద్ధాంతములు సూత్రరూపముగఁ జెప్పఁబడియున్నవి. రాజులు ప్రజలయొద్దనుండి తీసికొనవలసినపన్నులనుగుఱించియు, రాజుయొక్క ఖజానాను ఖర్చును గుఱించియు నెక్కువగఁ జెప్పఁబడియున్నది.

---

1. ఎకనమిక్సు, పొలిటికల్ ఎకానమీ అనుమాటలకు పైలక్షణముఁ జెప్పఁబడిన 'వార్తా' శాస్త్రము చాలవఱకు సమానము గాన, ఎకనమిక్సునకు 'వార్తాశాస్త్ర' మని పేరు మార్చవలె నని కొందఱ యభిప్రాయము. కాని 'వార్తా' శబ్ద మిప్పుడు సమాచారపరముగ రూఢమైయుండుటచే, ఈశబ్దము నిప్పుడు పెకలించి మఱియొకయర్థమును రూఢిచేయఁబోవుట చిక్కులకుఁ గారణ మగును. 'అర్థశాస్త్ర' మనుపదము 'ధనశాస్త్రము' అనునర్థమందు యోగముగను, రూఢముగను ఉన్నందున దానిని మార్చవలసినయావశ్యకము లేదు.

2. ఇవి అచ్చుపడలేదు. చెన్నపట్టణము, ప్రాచ్యలిఖితపుస్తకభాండాగారమునం దున్నవి.

3. న్యాయగతార్థాత్ విపరీతో ఽర్థాభాసః.

4. సుఖస్య మూలం ధర్మః, ధర్మస్య మూల మర్థః.

5. దండేన ప్రణీయతే వృత్తిః, వృత్తిమూల మర్థలాభః, అర్థమూలౌ ధర్మకామౌ, అర్థమూలాని కార్యాణి, అర్థవాన్ సర్వలోకబహుమతః, మహేంద్ర మప్యర్థహీన మవమన్యతే లోకః, అజరామరవ దర్థ మర్జయేత్.

6. దీనిని చెన్నపట్టమునందు గస్టవ్ ఆపర్ట్ అచ్చువేసెను. బ్ర. పురాణపండ మల్లయశాస్త్రిగారు దీనిని తెనుఁగులోనికి భాషాంతరీకరించిరి.

sampath Ebooks


మనపూర్వులు వ్రాసిన అర్థశాస్త్రము లన్నిటిలో కౌటిల్యుని అర్థశాస్త్రము[1] అగ్రస్థానము నలంకరించియున్నది. క్రీ. పూ. నాల్గవ శతాబ్దియందు మగధసామ్రాజ్యమును పరిపాలించిన చంద్రగుప్త చక్రవర్తికి కుడిభుజమై అతనియొద్ద కౌటిల్యుఁడు ప్రధానమంత్రిగ నుండెను. అందుచేత నతనిగ్రంథమందలి విషయము లనేకములు వ్యవహారానుభవజనితము లని చెప్పఁదగియున్నవి. ఈగ్రంథము మహాసముద్రమువంటిది. ప్రాచీనకాలమందలి లౌకికవ్యవహారములనుగూర్చి తెలిసికొనఁగోరువా రందఱును దీనిని తప్పక చదువవలెను. రాజ్యపరిపాలనక్రమ మిందలివిషయములలో ప్రధానమైనదైనను అప్పటి సాంఘికాచారములు, ఆర్థికసంప్రదాయములు లోనగువిషయము లెన్నియో ఇందు విపులముగ వివరింపఁబడియున్నవి. సామాన్యముగ నాకాలమందు రాజ్యము లన్నియు ఏకనాయకములుగ నుండెను. ప్రతి రాజునకు నమాత్యు లనేకు లుండిరి. అమాత్యు లనఁగా మంత్రు లని మాత్రమే అర్థము కాదు. పరిపాలనమందు రాజునకు సాహాయ్యము చేయుచున్నవా రందఱకు నీపే రుండెను. వీరిలో కొందఱు మంత్రులుగను, కొందఱు మంత్రిపరిషత్సభ్యులుగను, కొందఱు పరిపాలనశాఖాధ్యక్షులుగను ఉండిరి. గ్రామపరిపాలనవిధానము నగరపరిపాలనవిధానముకంటె భిన్నముగ నుండెను. పద్ధతిప్రకారము (Town-planning) నగరముల నిర్మించుట, జనాభాలెక్కల సిద్ధపఱుచుట, నగరపారిశుద్ధ్యమునకై తగినయేర్పాటులు చేయుట, శూన్యప్రదేశములలో ప్రజలను చేర్చుట (Colonisation), క్రొత్తగ జయించిన దేశములను పాలింపవలసినక్రమము మొదలగు విషయములనుగూర్చి కౌటిల్యునియభిప్రాయములు పరిశీలింపఁదగియున్నవి.

కామందకీయనీతిసార మనుగ్రంథ మొకటి గలదు. ఇది కౌటిలీయార్థశాస్త్రము ననుసరించి, దానికి సంగ్రహముగ వ్రాయఁబడినది. ఇది ౧౦-వ శతాబ్దినాఁటిగ్రంథ మైయుండును[2].

'నీతివాక్యామృతమ్' అనునొక చిన్నగ్రంథము కలదు. ఇది ౧౨-వ శతాబ్దియం దుండిన జైనపండితునిచే వ్రాయఁబడినది. ఇతర నీతిగ్రంథములవలెనే యిందును రాజనీతియే యెక్కువగఁ జెప్పఁబడినను, వార్తాసముద్దేశ మను చిన్న ప్రకరణమునందుఁ గృషి పశుపాలనము వాణిజ్యము అనునవి 'వార్త' యనియు, వార్తాసమృద్ధియుండనే రాజుయొక్క యన్నిసమృద్ధులును కల వనియు, వృద్ధబాలవ్యాధితక్షీణ పశువులను బంధువులను పోషించినట్లు పోషింపవలె ననియుఁ జెప్పఁబడియున్నది[3]. దేశాంతరములనుండి వచ్చెడి సరకులను గుఱించి యిందొక చిత్రమైనవాక్యము కలదు. 'శుల్కవృద్ధియు, బలవంతముగఁ బణ్యమును (అమ్ముఁగలవస్తువులను) తీసికొనుటయు దేశాంతరమునుండి మనదేశమునకు సరకులు రాకుండుటకుఁ గారణము'[4] అని చెప్పఁబడినది. ఇది యిప్పటి స్వేచ్ఛావ్యాపార (Free trade) తత్త్వముయొక్క బీజరూపమైన సూత్రముగఁ గాన వచ్చుచున్నది.

కామందకము, బద్దెనీతి, సుమతిశతకమును దప్ప తెలుఁగున నర్థశాస్త్రము లున్నట్టు తెలియదు. కామందకము తెలుఁగు పద్యకావ్యరూపమున నున్నది: అముద్రితము. భారతాదులయందు రాజనీతి కొంతవఱకు భాషాంతరీకరింపఁబడినది. తెలుఁగుభారతమందలి సభాపర్వము, ౧-వ ఆశ్వాసము, శాంతిపర్వము, 3-వ ఆశ్వాసము చూడఁదగును. అఱవమున తిరువళ్ళువరను మహాత్మునిచే రచింపఁబడిన కురళ్ అను మహాకావ్యము కలదు. దానిని తెనుఁగులోనికిఁ 'త్రివర్గప్రదీపిక' యను పేరుతో కనుపర్తి శ్రీ విద్యానందనాథులవారు భాషాంతరీకరించియున్నారు. అందు ధర్మము, అర్థము, కామము అను మూఁడు ప్రకరణములు కలవు. అందలి రెండవప్రకరణమునం దర్థమును గుఱించిన నీతి సవిస్తరముగఁ జెప్పఁబడియున్నది.

(కొ. వేం. ల.)

**అర్థస్వనుఁడు** — అత్రికులోత్పన్న బ్రహ్మర్షి.

**అర్థసాధకుఁడు** — నామాంతరము రాష్ట్రవర్ధనుఁడు, దశరథమహారాజుయొక్క యెనమండ్రు మంత్రులలో నొకఁడు.

**అర్థసిద్ధి** — సాధ్యనామక దేవతల పుత్త్రుఁడు.

**అర్థాపత్తి** — వేదాంతులచే నంగీకరింపఁబడిన ప్రమాణము. దీనిని నైయాయికు లంగీకరింపరు. సాధారణముగా నర్థాపత్తి యుదాహరణ మిట్లిచ్చెదరు. బలసిన దేవదత్తుఁడు పగలు భోజనము చేయఁడు: కావున రాత్రిభోజనము చేయును. బలసియుండుటయు, పగలు భోజనము చేయకపోవుటయుఁ జూడ రాత్రి భోజనము చేయుచుండవలె నని యూహింపవలసియున్నది. కాని యిది 'కేవలవ్యతిరేకి' యనఁబడు అనుమానముయొక్క యుదాహరణము. అందుచే నిది వేఱు ప్రమాణ మని తలంపరా దని న్యాయమతము. కాని కేవల

1. దీనిని మామిడిపూడి వేంకటరంగయ్య, ఆకుండి వేంకటశాస్త్రిగార్లు ౧౯౩౩ లో ఆంధ్రీకరించిరి.

2. తెలుఁగున కామందకనీతిశాస్త్ర మనుగ్రంథము కలదు. ఇది యెనిమిదాశ్వాసముల పద్యకావ్యము; జక్కరాజు వేంకటకవి కృతము, అముద్రితము. ౧౫౦౦-వ శాలివాహనశకమునకు సరియైన హూణశకము ౧౫౭౮ నఁ దెనిఁగింపఁబడినది. ఇది తంజావూరుగ్రంథాలయమున నున్నది. ప్రాయికముగ సంస్కృతకామందకమున కిది తెలుఁగుసేఁత కావచ్చును.

3. కృషిః పశుపాలనం వాణిజ్యం చేతి వార్తా. వార్తాసమృద్ధౌ హి సర్వాస్సమృద్ధయో రాజ్ఞామ్ ...... వృద్ధ బాల వ్యాధిత క్షీణాన్ పశూ న్బాంధవానివ పోషయేత్.

4. శుల్కవృద్ధి ర్బలాత్పణ్యగ్రహణంచ దేశాంతరభాండానా మప్రవేశే హేతుః.

sampath_Ebooks

వ్యతిరేకానుమానమును వేదాంతు లొప్పరు. వీరిమతమున అర్థాపత్తి ద్వివిధ మైయున్నది: (౧) దృష్టార్థాపత్తి, (౨) శ్రుతార్థాపత్తి. ఎచ్చట దృష్టమగు (చూడఁబడిన) ఉపపాద్యముయొక్క అనుపపత్తిజ్ఞానము చేత ఉపపాదకముయొక్క కల్పన మనుచున్నదో అచ్చట దృష్టార్థాపత్తి యనఁబడును. ఉదాహరణము: పగలు భోజనము చేయనివాని బలుపునందు రాత్రిభోజనము దృష్టార్థాపత్తి. స్థూలత్వము ఉపపాద్యము. అది దృష్టము (కనఁబడుచున్నది). శ్రుతమగు (వినఁబడిన) ఉపపాద్యముయొక్క అనుపపత్తిజ్ఞానముచేత ఉపపాదక కల్పన మెచ్చట ననుచున్నదో అచ్చట శ్రుతార్థాపత్తి యనఁబడును. 'ఇంట లేని దేవదత్తుఁడు బ్రతికియున్నాఁడు' అనువాక్యము విని, యింటికంటె నన్యప్రదేశమందు దేవదత్తునకు నునికి లేకయే ఇంట లేనిదేవదత్తునకు జీవనము సంభవింపదు గనుక నింటియందు లేనిదేవదత్తునిజీవనముయొక్క అనుపపత్తిచేత దేవదత్తునకు గృహముకంటె బాహ్యదేశమునందు సత్త (ఉనికి) కల్పింపఁబడుచున్నది. శ్రుతార్థాపత్తి ద్వివిధము: అభిధానానుపపత్తి, అభిహితానుపపత్తి. వాక్యము లోని యొకపదమునుబట్టి అధ్యాహృతము లగునన్యపదముల నూహించుట మొదటిది. 'తలుపు' అన్నమాట విని 'తీయుము' అని యూహించుట. ఎచ్చట వాక్యముయొక్క యర్థము అన్యార్థకల్పనము లేక సిద్ధింపకుండునో యచ్చట అభిహితానుపపత్తిరూప శ్రుతార్థాపత్తి యగును. ఉదాహరణము, స్వర్గకాముఁడు యజ్ఞము చేయవలెను - అన్న వాక్యము వినఁగనే మనకుఁ గాన్పించుయజ్ఞము కాన్పింపనిస్వర్గము నిచ్చుట యసంభవ మని తోఁచి యాయజ్ఞము వలన నొకయపూర్వము పుట్టు ననియు, నది స్వర్గము నిచ్చు ననియు మీమాంసకు లూహించెదరు.

**అర్థి** — పృథుచక్రవర్తికుమారుఁడు. శిఖండిని యనునామె వలన నితఁడు హవిర్ధానుఁ డనుకొడుకును బడసెను.

**అర్థుఁడు** — స్వాయంభువమన్వంతరమునం దుండిన ధర్మ ఋషికి బుద్ధి యనుభార్యవలనఁ బుట్టినకొడుకు.

**అర్ధలమిట్టపుత్తూరు** — చిత్తూరుజిల్లా కాళహస్తి తాలూకాలోని జమీన్‌దారీగ్రామము. జనసంఖ్య ౧,౯౯౮ (౧౯౩౧).

**అర్ధవీడు** — కర్నూలుజిల్లా కంబంతాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౨,౨౩౯ (౧౯౩౧).

**అర్దేషీర్ సాహెబ్ రాజ్** — ఈరాన్‌దేశీయుఁడగు నొకపురోహితుఁడు. క్రీ. శ. ౧౫౭౮–వ సంవత్సరమున అక్బరుచక్రవర్తి యితనిని భారతదేశమునకు రప్పించుకొని యితనియొద్దనుండి పారసీధర్మోపదేశములను బడసెను. దీనికి ఫలితముగ నక్బరుచక్రవర్తి మాంసాహారాదులను దాల్చెను; తనయంతఃపురమునం దగ్నిదేవునియాలయ మొకటి కట్టించెను. ఆలయమును అబుల్ ఫజలుఁన కప్పఁజెప్పుచు 'రాత్రిందివము నిరంతరముగ నీపవిత్రస్థానమున దీపము వెలుఁగుచునే యుండవలయును' అని యాజ్ఞాపించి కట్టుదిట్ట మొనర్చెను.

**అర్ధకీలకము** — ఒకసరోవరము. పశ్చిమవాహిని ఋషి యాజ్ఞవలన సప్తసముద్రములను గలిపి ఈసరోవరమును నిర్మించెను. ఈతీర్థమునందు స్నానము చేసినచో సప్తసముద్రములలోను స్నానము చేసినపుణ్యము లభించును (భార., అరణ్య., ౮౩).

**అర్ధనారీశ్వరి** — శివుని సగముశరీరమును సంపాదించిన పార్వతీదేవి. భృంగి యనుగణనాథుఁడు పార్వతిని సేవింపక కేవలము శివునినే సేవించుచున్నందులకుఁ బార్వతి భృంగిని నిలువ లేనంత బలహీనుం జేసెను. శివుఁడు వానిని నిలుచుటకు నూఁతగా కోలగా నిచ్చి నిలిపెను. తనమీఁదికన్న భర్తమీఁదనే యెక్కుడుప్రేమ కలదని, మాటి, పార్వతీదేవి గౌతమునిఁ జూచి తమమునొద్ద తప మొనరించి, శివునియర్ధాంగమును గైకొనెను.

**అర్ధనారీశ్వరుఁడు** — సగము పురుషాకృతిని సగము స్త్రీయొక్క యాకృతి నొప్పు శివపార్వతుల సమ్మిళితరూపము. నవమితోఁ గూడిన యష్టమి, అష్టమితోఁ గలసిన నవమియు నర్ధనారీశ్వర ప్రాయమగు నుమామహేశ్వరతిథి యని ప్రఖ్యాతి మైయున్నది.

> "అగ్నిసంవర్తకాదిత్యానిలా వహ్నిబిందుమత్,
> చింతామణిరితి ఖ్యాతం బీజం సర్వసమృద్ధిదమ్"

ఇది అర్ధనారీశ్వరదేవతాక మగు మంత్రము. దీనివివరము నీక్రింది విధానమున గ్రహింపవలయును. అగ్ని రేఫము, సంవర్తకము క్షకారము, ఆదిత్యుఁడు మకారము, ర రేఫము, అనిలము యకారము, జ్యో స్వరూపము, వహ్నిస్వర మగు ఊకారము. 'రం, క్షం, మం, రం, యం, జ్యోం, ఊం' ఇది బీజాక్షరమంత్రము. ఈ మంత్రమును ప్రాతఃకాలకార్యము లైనతరువాత శుచియై శైవోక్తపీఠ మన్వంతవిన్యాస మొనరించి పిదప ఋష్యాదిన్యాసము గావింపవలెను. 'శిరసి కశ్యపాయర్షయే నమః, ముఖే అనుష్టుప్ఛందసే నమః, హృది అర్ధనారీశ్వరదేవతాయై నమః' తరువాత కరన్యాసపూర్వకముగ నంగన్యాస మొనరింపవలయును. 'రం అంగుష్ఠాభ్యాం నమః, క్షం తర్జనీభ్యాం స్వాహా, మం మధ్యమాభ్యాం వషట్, మం అనామికాభ్యాం నమః, రం కనిష్ఠికాభ్యాం వౌషట్, యం కరతలపృష్ఠాభ్యాం ఫట్.' ఇదేవిధమువున హృదయాదులతో నంగవిన్యాసము చేయవలయును.

> "రేఫాదివ్యంజనైః షడ్భిః కుర్యాదంగాని షట్ క్రమాత్"

అని నిబంధము. అనంతరము ధ్యానము.

> "నీలప్రవాళరుచిరం విలసత్త్రినేత్రం
> పాశారుణోత్పల కపాలకశూలహస్తమ్,

sampath Ebooks

అర్ధాంబికేశ మనిశం ప్రవిభక్తభూషం
బాలేందుబద్ధముకుటం ప్రణమామి రూపమ్."

ఇట్లు ధ్యానించి మానసికసంపూజన మొనరించి, యర్ఘ్యస్థాపనము, శైవోక్తపీఠపూజనము, మరల ధ్యానము చేసి యావాహనాది పంచపుష్పాంజలిదానపర్యంతము సలిపి యావరణపూజన మారంభింపవలయును. కేసరములందును, అగ్న్యాదికోణములందును, మధ్యభాగమునందును, దిశలయందును రం మొదలగువానితో షడంగములఁ బూజింపవలెను. తరువాత నదేప్రకారము పత్రములయందు వృషభాదులను బూజింపవలెను. పత్రాగ్రములందుఁ బూర్వమునుండి యారంభించి బ్రాహ్మి, మాహేశ్వరి, కౌమారి, వైష్ణవి, వారాహి, ఇంద్రాణి, చాముండ, మహాలక్ష్మి మొదలగుదేవులను బూజింపవలయును. వారి వెలుపలిభాగములందు నింద్రాదులను, వజ్రాదులను బూజించి ధూపాది విసర్జనాంతముగల కర్మమును సమాప్తము చేయవలయును. దీని పురశ్చరణము లక్షజపము.

"లక్ష మేకం జపే న్మంత్ర మిత్థం మంత్రీ విచింతయన్"
అని తంత్రసారము.

అర్ధపణ్యుఁడు — అత్రికులోత్పన్న బ్రహ్మర్షి.

**అర్ధమాగధి** — ఒక ప్రాకృతభాషకుఁ బేరు. జైనమతస్థాపకుఁ డయిన మహావీరుఁడు తన మతమును బోధించిన భాష అర్ధమాగధి యందురు. మహావీరుఁడు ముఖ్యముగఁ దనమతమును మగధయందు బోధించెను. తనబోధలు సర్వసామాన్యముగ ప్రజలందఱకును సుబోధము కావలె ననుకోరికతో నతఁడు మాగధి (మగధదేశభాష) లోని కఠినభాషావిశేషాదులనుగూడఁ జేర్చుచువచ్చె ననియు, ఈరీతి నతఁడు తన బోధలకై స్వీకరించినభాష కేవలము మాగధి కాక 'అర్ధమాగధి' యయ్యెననియు చెప్పుదురు. కాని దీనికిని మాగధిభాషకు నంతగ పోలిక కానరా దనియు, నిది యెక్కువగ మహారాష్ట్రమును బోలియుండుననియు భాషావిదులు కొందఱియభిప్రాయము (చూడుఁడు: ప్రాకృతభాషలు).

అర్ధమాల — చిత్తూరుజిల్లా కాళహస్తితాలూకాయందలి జమీన్దారీగ్రామము. ఇచటిజనసంఖ్య ౩౭౫ (౧౯౩౧).

**అర్ధలక్ష్మీహరి** — లక్ష్మీవిష్ణువుల సమ్మిళితాకారము. గౌతమీయసూత్రముల ననుసరించి శ్రీబీజముతో షడంగక మగు నీహరిమంత్రమునకు ప్రజాపతి ఋషి, గాయత్త్రి ఛందము, అర్ధలక్ష్మీహరి దేవత. దీనిమంత్రము.

"తారం నమఃపదం బ్రూయా న్నరా దీర్ఘసమన్వితౌ,
వసనో ణాయ మంత్రోఽయం ప్రోక్తో వస్వక్షరః పరః"

ప్రాతఃకాలమున శేది కాల్యకరణీయంబులనుండి విముక్తుఁడై వైష్ణవుఁ డగువతఁడు స్నాన మొనరించి పూజామండపములోని కేఁగించి వైష్ణవాచమనము నీక్రిందివిధానమునఁ గావింపవలయును. కేశవాది నామత్రయముతో నాచమన మొనరించి రెండునామములతో హస్తప్రక్షాళనము చేసికొని రెండింటితోఁ బెదవులను దుడిచికొని మఱి రెండునామములతో ముఖస్పర్శము చేసికొనవలయును. మరల నొకదానితో హస్తములను, వేఱొకదానితోఁ బాదములను గడిగికొని పిదప నొకదానితో జలమును నెత్తిపైని జల్లుకొని యనంతరము సంకర్షణాదినామములతో ముఖ, నాసికాక్షికర్ణనాభిభుజకక్షములను స్పృశించుకొనవలయును. ఈప్రకారము నిష్ఠతో వైష్ణవాచమన మొనరించువాఁడు సాష్టాంగనారాయణాంశము నొందును.

'కేశవ, నారాయణ, మాధవ, గోవింద, విష్ణో, మధుసూదన, త్రివిక్రమ, వామన, శ్రీధర, హృషీకేశ, పద్మనాభ, దామోదర, సంకర్షణ, వాసుదేవ, ప్రద్యుమ్న, అనిరుద్ధ, పురుషోత్తమ, అధోక్షజ, నృసింహ, అచ్యుత, జనార్దన, ఉపేంద్ర, హరయే నమః, శ్రీకృష్ణాయ నమః.'

పైని వ్రాసినక్రమము ననుసరించి యీ కేశవాదినామములనుండి నామముల గ్రహించి తత్తన్నామములతో నాచమన ప్రక్షాళనాదులు గావించుకొనవలయును. అటుపిమ్మట సామాన్యార్ఘ్యాది మాతృకాన్యాసాంతము గల కర్మమును సలిపి కేశవకీర్త్యాదిన్యాసము గావింపవలయును. ఋష్యాదిన్యాసవిధాన మేలా గనిన 'శిరసి ప్రజాపతయే ఋషయే నమః, ముఖే గాయత్త్రీఛందసే నమః, హృది అర్ధలక్ష్మీహరయే దేవతాయై నమః.' తదనంతరము 'శ్రీం అంగుష్ఠాభ్యాం నమః, ఓం శ్రీం హృదయాయ నమః' అని యీవిధమునఁ గరాంగన్యాసములను జేసికొనవలయును. పిదప నీవిధమున ధ్యానము సలుపవలయును.

"ఉద్యత్ప్రద్యోతనశతరుచిం తప్తహేమావదాతం
పార్శ్వద్వంద్వే జలధిసుతయా విశ్వధాత్ర్యా చ జుష్టమ్,
నానారత్నోల్లసిత వివిధాకల్ప మాపీతవస్త్రం
విష్ణుం వందే దరకమలకౌమోదకీచక్రపాణిమ్."

అర్ధవరం — పశ్చిమ గోదావరిజిల్లా తాడేపల్లిగూడెం తాలూకాయందలి యొక జమీన్దారీగ్రామము. జనసంఖ్య ౨,౩౯౮ (౧౯౩౧).

అర్ధాన్నపాలెము — విశాఖపట్టణముజిల్లా శృంగవరపుకోటతాలూకాకు చెందిన ఈనాంగ్రామము. జనసంఖ్య ౫౦౫ (౧౯౩౧).

అర్నాడ — విశాఖపట్టణముజిల్లా పార్వతీపురముతాలూకాయందలి జమీన్దారీగ్రామము. జనసంఖ్య ౯౮౦ (౧౯౩౧).

అర్బాసిస్ — అస్సీరియాదేశపురాజగు సర్దనపాలస్ అనువానిమంత్రి. అర్బాసిస్ తిరుగఁబాటు గావించి, రాజ్యమును

sampath_Ebooks

రింతురు. సంస్కృతమునందు దానినే 'ప్రవిడ' మందురు. అట్టి భావమునుగురించియు, అట్టివారినిగురించియు, 'తమిళ' శబ్దము క్రిందఁ జూడనగును.

**అలంకారకౌస్తుభము** — ఇయ్యది సంస్కృతమున రచింపఁబడిన అలంకారగ్రంథము. లక్ష్మీధరునికుమారుఁడైన విశ్వేశ్వరపండితునిచే రచింపఁబడినది. ఇందు ౬౧ అర్థాలంకారములను గురించిమాత్రము సవిస్తరముగా వివరింపఁబడినది. సాహిత్యశాస్త్రమునుగురించిన యితరవిషయము లిందు లేవు. ఇతఁడు పండితరాయని రసగంగాధరమునుగూడ ఉదాహరించినాఁడు గనుక ౧౮-వ శతాబ్దివాఁడై యుండనోపు. ఇది బొంబాయిలోని కావ్యమాలలోఁ బ్రకటింపఁబడినది.

**అలంకారచూడామణి** — హేమచంద్రునిచే రచింపంబడిన కావ్యానుశాసన మను గ్రంథముమీఁద నాతనిచేతనే వ్రాయఁబడినవృత్తి.

**అలంకారతిలకము** — వాగ్భటునిచే సంస్కృతమునందు వ్రాయఁబడిన అలంకారగ్రంథము.

**అలంకారము** — చూడుఁడు: 'నగలు'.

**అలంకారముక్తావళి** — విశ్వేశ్వరకృతము.

## అలంకారములు

**అలంకారములు** — అలంకారములు భాషకు నగల వంటివి. నగలు శరీరశోభ నెట్లు హెచ్చించునో యట్లే యలంకారములు కావ్యశోభను హెచ్చించును.

అలంకారికుల వేఱువేఱు సంప్రదాయములు :— అలంకారముల స్వరూపమునుగురించియు, యోగ్యతనుగురించియు నాలంకారికులలో వేఱువేఱు అభిప్రాయములు కలవు. 'విశిష్టము లయిన (విశేషముగలవయిన) శబ్దార్థములు కావ్యము' అనినకావ్యలక్షణ మందఱు నొప్పుకొనినదే. కాని ఈవైశిష్ట్య మెట్టిది యన్నప్రశ్నమునకు నుత్తర మిచ్చునపు డాలంకారికులలో మూఁడు తెగలు పుట్టెను. ఆవైశిష్ట్యము కొందఱు ధర్మరూప మనియు, కొందఱు వ్యాపారరూప మనియు, కొందఱు వ్యంగ్యరూప మనియుఁ జెప్పిరి. ధర్మరూప మనువారిలో ౧. ఒకతెగవారు అలంకారములే ముఖ్యము లనియు, ౨. మఱియొకతెగవారు గుణములే ముఖ్యము లనియు, వ్యాపారరూప మనువారిలో 3. ఒకతెగవారు ఉక్తివైచిత్ర్యమే (మాటసొంపే) ప్రధాన మనియు, ౪. రెండవతెగవారు భోగకృత్యమే (రసవిషయకమైన వ్యంజనావ్యాపారము) ముఖ్య మనియు నిర్వచించిరి. ఇట్లు ౫. వ్యంగ్య (ధ్వని) వాదులతోఁ గూడి ప్రాచీనాలంకారికు లైదుతెగలుగ నున్నా రని చెప్పవచ్చును. ఇందు మొదటితెగవారు భామహోద్భటాదులు, రెండవతెగవారు వామనాదులు, మూఁడవతెగవారు వక్రోక్తిజీవితకారాదులు, నాల్గవతెగవారు భట్టనాయకాదులు, అయిదవతెగవారు ఆనందవర్ధనాదులు.[1] అలంకారికులచరిత్రము వ్రాయునపు డీభిన్నమతములకుఁ గల భేదములు సవిస్తరముగ వర్ణింపఁబడును. అలంకారస్వరూపమునకు సంబంధించినంతవఱకిచ్చటఁ జెప్పఁబడును. పైరెండింటిలోను ౧-వ దానిని, 3-వ దానిని కలిపి (క) అలంకారసంప్రదాయ మనియు, ౪-వ దానిని (చ) రససంప్రదాయ మనియు, ౨-వ దానిని (ట) రీతిసంప్రదాయ మనియు, ౫-వ దానిని (త) ధ్వనిసంప్రదాయ మనియు మఱియొక వర్గీకరణముఁ జేసి చెప్పవచ్చును.

అలంకారసంప్రదాయమువారు :— అలంకారసంప్రదాయమువారు కావ్యమున కలంకారములే ప్రధానము లని చెప్పుదురు. మిక్కిలి ప్రాచీనాలంకారికు లీమతమువారే[2]. ఇంతియ కాదు. రసమును ధ్వనియుఁగూడ నలంకారాంతర్గతములే యని వీరితాత్పర్యము. దండి తన కావ్యాదర్శమునందు రసములను అలంకారములలోఁ జేర్చెను[3]. భామహుఁడు గుణములకును, అలంకారములకును భేదము చేసినట్లు కనఁబడదు. ఎందు కనఁగా 'భావిక'మను అలంకారమును అతఁడు గుణ మనియుఁగూడఁ జెప్పెను[4]. భామహాలంకారముమీఁద వివరణము వ్రాయుచు నుద్భటుఁడు 'మానవునిశౌర్యాదిగుణములకును, కేయూరాదిభూషణములకును భేద మున్నట్టు కావ్యమునందలి యోజస్సు మొదలయిన గుణములకును, ఉపమాద్యలంకారములకును భేదము కల దని పరపక్షమువారు చెప్పఁగా, నట్లనుటకు వీలు లేదు, మానవుని శరీరమందు శౌర్యాదిగుణములు సమవాయ సంబంధముచేతను[5], కేయూరాదిభూషణములు సంయోగసంబంధముచేతను నిల

1. అలంకారసర్వస్వము - అనంతశయనసంస్కృతగ్రంథావళి, సముద్రబంధకృతవ్యాఖ్య, ౪-వ పుట.

2. తదేవ మలంకారా ఏవ కావ్యే ప్రధాన మితి ప్రాచ్యానాం మతమ్. [అ. స.]

3. కావ్యాదర్శము, 2. ౨౭౫; 2. ౨౮౦-౨౯౨.

4. భామహాలంకారము: బొంబాయి సంస్కృతగ్రంథములలోఁ బ్రకటింపఁబడిన ప్రతాపరుద్రయశోభూషణమునకు ౨-వ యనుబంధముగఁ బ్రకటింపఁబడినది. తృతీయపరిచ్ఛేదము, ౫౨-వశ్లోకము చూడుఁడు.

5. తర్కశాస్త్రమునందు పదార్థములయొక్క 'సంబంధము' రెండువిధములు, సమవాయసంబంధము, సంయోగసంబంధము. పుష్పమునకు వర్ణమునకు, వాసనకుఁ గలసంబంధము 'సమవాయ సంబంధము'; ఒకచెట్టుమీఁదఁ గోఁతి కూర్చుండినప్పుడు దానికిని చెట్టునకును గలసంబంధము 'సంయోగసంబంధము.'

sampath_Ebooks



కావ్య
గుణా
పరం
3మత
కార
ముస
రక
-వ
పము
ము )
కన్న
ప్రా
ంప
రికు
ధ్వని
త్తమ
ము,
ములు

ఓ.జ
కారములవంటివి; రసము అంగి; శబ్దార్థము లంగములు. మాధుర్యాది గుణము లెప్పుడును రసమును విడుచునవి కావు, అనఁగా రస మున్నచోట నవి యుండును; అవి యున్నచోట రసము పుట్టును. అలంకారము లట్టివి కావు. ఇవి యంగద్వారమునమాత్ర మొకప్పుడు రసమును అభివృద్ధిచేయును; ఒకప్పుడు చేయకపోవచ్చును. రసమును ఉత్కర్షింపఁజేయునపుడు అలంకారములు కేవలము ఉక్తివైచిత్ర్య పర్యవసాయులుగ నుండును.' ఇది కావ్యప్రకాశకర్త యైనమమ్మటుని (౧౨-వ శతాబ్ది) మతము (౮-వ ఉల్లాసము, ౧-౨ శ్లోకములు). దీనినే ఏకావలీకారుఁడు (౧3-వ శతాబ్ది), ప్రతాపరుద్రీయకారుఁడు (౧౪-వ శతాబ్ది), అప్పయ్యదీక్షితులు (౧౬-వ శతాబ్ది), పండితరాజజగన్నాథుఁడు (౧౬-వ శతాబ్ది) మొదలైనవా రంపఱును ఒప్పుకొనిరి. ఇదియే యాధునికాలంకారికులమత మని చెప్పవలసియున్నది.

వీరిమతముప్రకారము గుణాలంకారముల కీక్రిందివిధ మయిన భేదము కలదు :—

గుణములకు నలంకారములకును గల భేదము :— ౧. గుణములు రసముయొక్క ధర్మములు కావు. ౨. గుణములు రసము లేనిచోట నుండవు. అలంకారములు రసము లేక రసమును పుట్టింపకయుండవచ్చును. 3. గుణములు తప్పక రసమును పుట్టించును. అలంకారము లవశ్యముగ రసమును పుట్టించు నని లేదు. ౪. గుణములు రసమునకు సాక్షాదుపకారకములు. అలంకారములు అంగద్వారమున (శబ్దార్థములగుంగా) రసమున కుపకారకములు.

ఇట్లు ప్రాచీనాలంకారికులచే నలంకారములకు నీయఁబడిన గౌరవ మంతయు నాధునికులచేఁ దగ్గింపఁబడినది. వీరిమతమున అలంకారము లుండినను రసము పుట్టకపోవచ్చును; అలంకారములు లేకపోయినను రసము పుట్టవచ్చును. రస మదివఱకే యున్నయెడల నొకప్పు డలంకారములు దానిని అభివృద్ధిపఱుపవచ్చును. చక్కఁదనము లేని స్త్రీ నగలు పెట్టుకొనినఁ బ్రయోజనము లేదు. చక్కనిస్త్రీకి సాధారణముగ నగ లక్కఱలేదు. కాని ఒకప్పుడు నగలవలన నామె స్వాభావికసౌందర్యము హెచ్చు కావచ్చును.

ధ్వని యెద్ది? అలంకార మెద్ది? :— రస మనునది కావ్యమునకుఁ నాత్మగఁ దీసికొనవలయును. ఉత్తమకావ్యము ధ్వనిప్రధానము. ఎందు వాచ్యార్థమునకంటె వ్యంగ్యార్థ మెక్కువరమణీయముగ నుండునో యది యుత్తమకావ్యము. ఎందు వ్యంగ్యార్థము వాచ్యార్థమునకంటె నధికరమణీయముగ నుండదో యది మధ్యమకావ్యము. దీనినే గుణీభూతవ్యంగ్య మందురు. ఎందు వ్యంగ్యార్థ ముండదో, ఉండినను స్పష్టముగ నుండదో యది అధమకావ్యము. శబ్దార్థచిత్రాదు లిట్టివి. కావున నలంకారములలోఁ జేరినచిత్రకావ్యము వీరిమతమున నధమము. ఎందువలన? అందు ధ్వని లేదు గనుక. ఇది యి ట్లుండఁ గొన్నియలంకారములలో ధ్వని కనఁబడుచున్నది. కొన్నిధ్వనిభేదములలో నలంకారములు కానవచ్చుచున్నవి. కావున రెండుకక్షల వారికిని వాదవివాదములు జరగి తేలిన దేమనఁగా, వాచ్యార్థమును కొంతవఱకు పరిత్యజించుటయే 'ధ్వని' యొక్కవిశేషము; అది వస్తురసాలంకారధ్వనులు అని మూఁడువిధములు. ఈ మూఁడువిధములధ్వనికిని వాచ్యముతోఁ బని లేదు. వాచ్యార్థమువలన నలంకారము

1. ముందు నడచునట్టి మేక వెళ్లి బావిలో దుమికినయెడల వెనుకఁబోవు మేక లన్నియు నందే దుముకును. దీనిని గడ్డరికాప్రవాహ మందురు.

2. హేమచంద్రకృత 'కావ్యానుశాసనము' మీఁది స్వవృత్తిలో ఉద్భటునివాక్య ముదాహరింపఁబడినది (కావ్యమాలాప్రతి—పుట ౧౭).

3. ఇహహి తావద్ భామహోద్భటప్రభృతయ శ్చిరంతనాలంకారకారాః ప్రతీయమాన మర్థం వాచ్యోపస్కారకతయాలంకారపక్షే నిక్షిప్తం మన్యన్తే— (అ. స).

4. తదిత్థం త్రివిధమపి ప్రతీయమాన మలంకారతయా ప్రఖ్యాపితమేవ- (అ. స.).

sampath_Ebooks

సిద్ధించినా యది 'అలంకార'కోటిలోఁ జేరును, అనఁగా నది 'అలంకారధ్వని' కాదు, అలంకారమే; వ్యంగ్యార్థమున అలంకారము సిద్ధించినా అది 'ధ్వని' గాని అలంకారము కాదు. వలయునెడ దానిని 'అలంకారధ్వని' అనుఁడు, గాని అలంకారమనవలదు! ఉపమాద్యలంకారము లన్నియు వాచ్యార్థమువలన సిద్ధింపవచ్చును, వ్యంగ్యార్థమువలన సిద్ధింపవచ్చును. కాని ధ్వనివాదుల మతమున మొదటివానినిమాత్ర మలంకార మనవలెను, రెండవదానిని 'ధ్వని'[1] అనవలెను. ధ్వనినిగుఱించి యధికము తెలిసికొనఁగోరువారు 'ధ్వని' శబ్దముఁ జూడుఁడు.

అలంకారములచరిత్రము:— భాషతోఁగూడ నలంకారము పుట్టిన దనవచ్చును. వినువారికి రమ్యముగ నుండు నిమిత్తమును, చక్కఁగ బోధయగునిమిత్తమును అలంకారయుక్తమైన భాష మాటలాడుట మానవస్వభావము. నిండువెన్నెల కాయుచున్న దని చెప్పుటకు మాఱుగ 'పిండి యారఁబోసినట్లు వెన్నెల కాయుచున్నది' యనియు; ఆమె మిక్కిలి చక్కనిది యనుటకు 'ఆమె రంభ' యనియు, వాఁడు శూరుఁ డనుటకు 'వాఁడు సింహపుఁబిల్ల' యనియు, కార్యము సకాలమునందుఁ జేయక ప్రయోజనము పోయినతరువాతఁ జేసె ననుటకు 'దొంగలు పడిన ఆఱునెలలకుఁ గుక్కలు మొఱిఁగెను' అనియు నిత్యవ్యవహారమునందును జెప్పెదము. మనసులోనిభావ మత్యధిక మైనప్పుడును ఆలంకారికభాష వెలువడును. ఇందుకు మన భాషలోని కొన్నితిట్లు నిదర్శనములు. 'నీ కడుపు కాల', 'నీదుంప తెగ' ఇత్యాదులు వక్తయొక్క కోపోద్రేకమును చూపును. కావున వ్యాకరణశాస్త్రము పుట్టకపూర్వ మెట్లు భాషాప్రపంచ మభివృద్ధి చెందునో, యట్లే అలంకారశాస్త్రము పుట్టుటకుఁ బూర్వమే - చాల కాలమునకు పూర్వమే — భాషలో పామరజనవ్యవహారమందును అలంకారము లేర్పడును.

ఇఁక సంస్కృతవాఙ్మయమును జూచినచో ఋగ్వేదమునందుఁ బెక్కలంకారములు గల వర్ణనములు కలవు[2]. మహాభారతరామాయణములు కావ్యములే కనుక వానియందుఁ బెక్కు శబ్దార్థాలంకారములు కల వని వేఱుగఁ జెప్ప నక్కఱలేదు. పాణినీయమునందు 'ఉపమేయ', 'ఉపమాన', 'సామాన్య' పదములు ప్రయోగింపఁబడుటచేతను[3], వ్యాసరచితబ్రహ్మసూత్రములలో ఉపమారూపకాలంకారములపేళ్లు స్పష్టముగఁ గానవచ్చుటచేతను[4] ఆకాలములవఱకు నలంకారశాస్త్రము బీజరూపముగఁ బ్రారంభ మైన ట్లూహింపవచ్చును. నిరుక్తమునందు యాస్కాచార్యుఁడు ఉపమాలంకారముయొక్క లక్షణముకూడఁ జెప్పినాఁడు[5]. అశ్వినీదేవతాదులను దొంగలతోఁ బోల్చినందులకు నీచోపమ యని కొంచెము చింతించెను. అగ్నిపురాణమునందలి 3౪3-౪౫-వ అధ్యాయములందు శబ్దార్థాలంకారములు ఉదాహరణపూర్వకముగ వివరింపఁబడినవి. సాహిత్యచ్ఛందశ్శాస్త్రములకు సంబంధించినవిషయములుకూడ నీ పురాణంబునఁ గలవు. కాని దీనిరచనాకాలము నిశ్చయముగఁ దెలిసికొనుటకు వీలు లేదు. అందు ధ్వనివిషయమున నేమియు లేనందున నది ధ్వనికారునకు (౧౦ - వ శతాబ్దికి) పూర్వము వ్రాయఁబడె నని యూహింపఁబడుచున్నది. భరతుని నాట్యశాస్త్రము క్రీ. శ. ౧-వ శతాబ్దిలోనిది యని కొందఱి మతము. అందు (౧౬ - ౪౧) నాలు గలంకారములు చెప్పఁబడినవి. తరువాతివారు భామహాదులు. వారివిషయమున 'ఆలంకారికులు' అను వ్యాసమునందు వివరింపఁబడును.

అలంకారములసంఖ్య:— అలంకారముల సంఖ్య క్రమముగ హెచ్చుచువచ్చెను. శబ్దాలంకారముల సంఖ్యమాత్రము విశేషముగ పెరుఁగలేదు. భరతుఁడు[6] (౫-వ శతాబ్ది) నాట్యశాస్త్రమునందు (౧౬ - ౪౧) 'యమక' మను ఒక్కశబ్దాలంకారమునే చెప్పెను. వామనుఁడు (౮-వ శతాబ్ది) రెండు శబ్దాలంకారములను, మమ్మటుఁడు (౧౨-వ శతాబ్ది) ఆఱు శబ్దాలంకారములను చెప్పినారు.

అర్థాలంకారములవృద్ధి యత్యద్భుతము. భరతునిచే(౫-వశతాబ్ది) ఉపమా రూపక దీపకము లను మూఁడు అర్థాలంకారములు మాత్రము చెప్పఁబడినవి (౧౬ - ౪౧). ఆచార్యదండి 'సంకీర్ణము' గాక 3౪ అర్థాలంకారములను జెప్పెను. కావ్యప్రకాశకారుఁ డైన మమ్మటుఁడు సంకరసంసృష్టులు గాక ౫౮ వఱకును వీనిని

---

1. 'ధ్వని' శబ్దము 'ధ్వన్యాలోకము'నందును ఏతన్మతప్రవర్తకగ్రంథములలోను రెండర్థములందు వాడఁబడియున్నది. ఒకటి సామాన్యము, రెండవది విశేషము. 'ధ్వని' అనఁగా 'వ్యంగ్య' మని సామాన్యార్థము. 'ధ్వని' అనఁగా 'వాచ్యము' కంటె 'వ్యంగ్యము' ప్రధాన మైన కావ్య మని విశేషార్థము.

2. ఋగ్వే., ౧-౧౨౪-8. ఇందు నాల్గు ఉపమలు కలవు. ౧-౧౬౪-౨౦ - ఇందు రూపకము గలదు. ౪-౫౮-3 లో నతిశయోక్తి గలదు.

3. ఉపమానాని సామాన్యవచనైః (౨-౧-౫౫); ఉపమితం వ్యాఘ్రాదిభిస్సామాన్యాప్రయోగే (౨-౧-౫౬).

4. ఆనుమానిక మప్యేకేషా మితి చేన్న శరీరరూపకవిన్యస్తగృహీతే ర్దర్శయతి చ (౧. ౪. ౧).

5. అథైవ నీచోపమా సూర్యకాదివత్ (3. ౨. ౧౫). — ౨. 3. 3.

6. ఇప్పుడు ప్రకటింపఁబడిన భరతకృతనాట్యశాస్త్రము (కావ్యమాలాగ్రంథమాలలోనిది) క్రీ. శ. ౧-వ శతాబ్దినాటి యని కొందఱును, ౫-వ శతాబ్దినాటిది యని మఱికొందఱును చెప్పెదరు.

sampath_Ebooks

ఇంచెను. ప్రతాపరుద్రీయకారుఁ డైన విద్యానాథుఁడు ౬౫ అనియు, చంద్రాలోకకర్తయైన జయదేవుఁడు (౧౫-వ శతాబ్ది) ౧౦౦ అనియు, కువలయానందకారుఁ డైన అప్పయదీక్షితులు ౧౧౫ అనియు నర్థాలంకారములసంఖ్యను హెచ్చించిరి. ఇట్లీ సంఖ్య మొత్తముమీఁదఁ బెరుఁగుచుఁ బోయినను నడుమనడుమఁ గొందఱు వానిసంఖ్య తగ్గించుటకు యత్నించిరి. ౯-వ శతాబ్దివాఁడగు వామనుఁడును, ౧౨-వ శతాబ్దివాఁ డైన హేమచంద్రుఁడును అర్థాలంకారములు ౨౯ అనియే చెప్పిరి.

ఇట్లు అలంకారములసంఖ్య పెరుఁగుచుఁ బోయినందున, వాస్తవముగ నర్వాచీనులచే నుపయుక్తము లయినయలంకారములు పూర్వకవిప్రయుక్తము లయినయలంకారముల కంటె భిన్నములు ప్రయోగింపఁబడెనని తలఁపఁగూడదు. పూర్వకవు లుపయోగించినవానినే ఉత్తరకవు లుపయోగించిరి. ఇఁక నలంకారములసంఖ్య యెట్లు పెరిఁగె నని చదువరు లడుగవచ్చును. పూర్వలాక్షణికు లొక్కయలంకారముయొక్క శాఖలుగ నెంచినవానిని ఉత్తరలాక్షణికులు స్వతంత్రాలంకారములుగ నెన్నుటవలన నీసంఖ్య పెరుఁగుచుఁబోయెను. దండి చెప్పినట్టియుపమాలంకారభేదములలోఁ బ్రతీపము, ఉపమేయోపమ, అతిశయోక్తి, భ్రాంతిమంతము, సందేహము, అనన్వయము, ఉత్ప్రేక్ష, ప్రతివస్తూపమ అని యిటీవలివారిచేఁ జేర్పఁబడినయలంకారము లన్నియు నిమిడియున్నవి. ఇవన్నియు నిప్పుడు ఉపమకంటె భిన్నములును, స్వతంత్రములును అగునలంకారము లైయున్నవి[1].

అలంకారవిభజన :— అలంకారములసంఖ్యవలెనే, అలంకారములను ఏతత్త్వముపై విభజింపవలసినది యన్న విషయమునఁ గూడఁ బెక్కుమతభేదములు కలవు. ఒక యలంకారమునకును మఱియొక యలంకారమునకును గల భేదము వానిచమత్కారబీజము లయిన ధర్మములకుఁ గల భేదములను చక్కఁగఁ దెలిసికొన్నచో బోధపడఁగలదే కాని, అలంకారములజాబితాలును, ఉదాహరణములును ఇచ్చినందునఁ గాదు. చమత్కార[illegible]నిర్ణయమువలన లక్షణసిద్ధియుఁ జక్కఁగ నేర్పడును.

మొట్టమొదట స్ఫురించువిభజన శబ్దాలంకారములు, అర్థాలంకారములు అనునది. ఈభేదము మంచిదనియు నొప్పుకొనినదే. అయినను, భోజుఁడు తనసరస్వతీకంఠాభరణమునందు శబ్ద, అర్థ, ఉభయాలంకారము లని విభాగము కల్పించి, యొక్కొక్క తెగలో ౨౪ అలంకారములను చేర్చినాఁడు[2]. ఉభయాలంకారములలో నుపమాదు లీయఁబడినవి! కాని యీ విభాగమును మఱి యేలాక్షణికులును ఒప్పుకొనలేదు. అన్నియలంకారములును ఉభయాలంకారము లని చెప్పవచ్చును. శబ్దార్థములు రెండును లేనిది యేయలంకారమగును? కావున విభాగము చేయునప్పుడు చూపవలసినది, యొకానొకవాక్యమునకుఁ జక్కఁదనము

1. ఒక్కయుపమాలంకారమే నటునివలె వేఱువేఱు వేషముల వేసికొని భిన్నాలంకారములవలెఁ గానవచ్చును అని చెప్పి యప్పయ్య దీక్షితులు చిత్రమీమాంసలో నీ క్రింది యుదాహరణముల నిచ్చెను:—

౧. ఉపమ - చంద్రునివంటిముఖము. ౨. ఉపమేయోపమ - చంద్రునివంటిముఖము, ముఖమువంటి చంద్రుఁడు. 3. అనన్వయము - ముఖమువంటిముఖము. ౪. ప్రతీపము - ముఖమువంటిచంద్రుఁడు. ౫. స్మరణము - చంద్రునిఁ జూచి ముఖము జ్ఞప్తికి వచ్చెను. ౬. రూపకము - ముఖమను చంద్రుఁడు. ౭. పరిణామము - ముఖచంద్రునిచేఁ దాపము శమించును. ౮. సందేహము - ముఖమా? చంద్రుఁడా? ౯. భ్రాంతిమంతము - చంద్రుఁ డని చకోరములు నీముఖమువంకఁ జూచుచున్నవి. ౧౦. ఉల్లేఖము - చంద్రుఁ డని చకోరములు, కమల మని భృంగములు నీముఖము నాశించుచున్నవి. ౧౧. అపహ్నుతి - చంద్రుఁడే! ఇది ముఖము గాదు. ౧౨. ఉత్ప్రేక్ష - తప్పక చంద్రుఁడే. ౧3. అతిశయోక్తి - ఇతఁడు చంద్రుఁడే. ౧౪. తుల్యయోగిత - ముఖముచే చంద్రకమలములు నిర్జింపఁబడెను. ౧౫. దీపకము - రాత్రి చంద్రుఁడును, నీముఖమును ప్రకాశించును. ౧౬. ప్రతివస్తూపమ - నీముఖమునందు నేను రమించెదను, చంద్రునియందు చకోరము రమించును. ౧౭. దృష్టాంతము - ఆకాశమునందు చంద్రుఁడు, భూమిమీఁద నీముఖము. ౧౮. నిదర్శనము - ముఖము చంద్రకాంతి వహించును. ౧౯. వ్యతిరేకము - నిష్కళంకముఖము చంద్రుని మించెను. ౨౦. సహోక్తి - నీముఖముతోఁగూడఁ గలసి చంద్రుఁడు రాత్రి వికసించును. ౨౧. సమాసోక్తి - ముఖము నేత్రాంకరుచిరము, స్మితజ్యోత్స్నాశోభితము. ౨౨. శ్లేష - హరిణాహితసక్తి యగుకమలముతో ముఖము సమానము. ౨3. అప్రస్తుతప్రశంస - ముఖమునెదుట చంద్రుఁడు వెలవెలఁబాఱుచున్నాఁడు.

2. భోజరాజకృత 'సరస్వతీకంఠాభరణ' మందలి యలంకారవిభాగము: శబ్దాలంకారములు ౨౪:— జాతి, గతి, రీతి, వృత్తి, ఛాయ, ముద్ర, ఉక్తి, యుక్తి, భణితి, గుమ్ఫన, శయ్య, పఠితి, యమకము, శ్లేష, అనుప్రాస, చిత్రము, వాకోవాక్యము, ప్రహేళిక, గూఢము, ప్రశ్నోత్తరము, అధ్యేయము, శ్రవ్యము, ప్రేక్ష్యము, అభినీతి. అర్థాలంకారములు ౨౪:— జాతి, విభావన, హేతువు, అహేతువు, సూక్ష్మము, ఉత్తరము, విరోధము, సంభవము, అన్యోన్యము, పరివృత్తి, నిదర్శనము, భేదము, సమాహితము, భ్రాంతి, వితర్కము, మీలితము, స్మృతి, భావము, ప్రత్యక్షము, అనుమానము, ఆగమము, ఉపమానము, అర్థాపత్తి, అభావము. ఉభయాలంకారములు ౨౪:— ఉపమ, రూపకము, సామ్యము, సంశయోక్తి, అపహ్నుతి, సమాధ్యుక్తి, సమాసోక్తి, ఉత్ప్రేక్ష, అప్రస్తుతస్తుతి, తుల్యయోగిత, లేశము, సహోక్తి, సముచ్చయము, ఆక్షేపము, అర్థాన్తరన్యాసము, విశేషము, పరిష్కృతి, దీపకము, క్రమము, పర్యాయము, అతిశయము, శ్లేష, భావికము, సంసృష్టి.

sampath_Ebooks

కల్గుట శబ్దమూలముననా అర్థమూలముననా యని. శబ్దమూలవలనఁ గల్గినది శబ్దాలంకారము. అర్థమువలనఁ గల్గినది యర్థాలంకారము.

ఇది శబ్దాలంకారము, ఇది యర్థాలంకారము అని యలంకారములను విభజించుట కేది కర్త అన్న విషయమున లాక్షణికులలో భిన్నాభిప్రాయములు కలవు. అలంకార సర్వస్వకారునిమతంబున 'ఏది దేని నాశ్రయించి యుండునో యది ఆయలంకారము' (యోఽలంకారో యదాశ్రితః స తదలంకారః), అనఁగా నలంకారము శబ్దము నాశ్రయించియున్నయెడల శబ్దాలంకారము, అది అర్థము నాశ్రయించియున్నయెడల నర్థాలంకారము. కావ్యప్రకాశకారునిమతమున శబ్దముయొక్క అన్వయవ్యతిరేకముల ననుసరించునది శబ్దాలంకారము, అనఁగా ఒకానొకశబ్ద మున్నయెడల నుండునదియు, ఆశబ్దమును తీసివేసినయెడలఁ దానును లోపించునదియు నగు నలంకారము శబ్దాలంకారము. అట్లే అర్థముయొక్క యన్వయవ్యతిరేకముల ననుసరించునది యర్థాలంకారము. దీనికి తాత్పర్య మే మనఁగా, శబ్దపరివృత్తిని సహించునెడల, ననఁగా ఒకపదమును తీసి సమానార్థక మైన మఱుపదమును పెట్టినను అలంకారము మాఱనియెడల నది అర్థాలంకారము. శబ్దపరివృత్తిని సహింపనియెడల శబ్దాలంకారము. ఇట్లే యుభయమతములవారి యభిప్రాయభేదము నితరాలంకారములందు బాగుగఁ గానరాకున్నను శ్లేషాలంకారములందుఁ గానవచ్చును. వసుచరిత్రమునందలి యీక్రిందిపద్యమును దీసికొందము.

మ. 'మహిమ న్వాగనుశాసనుండు సృజియిం
పం గుండలీంద్రుండు ద
న్మహనీయస్థితిమూల మై నిలువ శ్రీ
నాథుండు ప్రోవ న్మహో
మహు లై సోముఁడు భాస్కరుండు వెలయిం
పఁగ సొంపు వాటించు నీ
బహుళాంధ్రోక్తిమయప్రపంచమునఁ దత్
ప్రాగల్భ్య మూహించెదన్.'

ఇందు శ్లేషాలంకారము గలదు. ఇది శబ్దశ్లేషయా యర్థశ్లేషయా యని నిర్ణయింపవలెను. ఇందు 'వాగనుశాసనుండు' (నన్నయభట్టు, బ్రహ్మదేవుఁడు), 'కుండలీంద్రుఁడు' (సోమయాజి, శేషుఁడు), 'శ్రీనాథుఁడు' (శ్రీనాథకవి, విష్ణువు), 'సోముఁడు' (నాచన సోముఁడు, చంద్రుఁడు), 'భాస్కరుండు' (భాస్కరకవి, సూర్యుఁడు) అనుపదములకు రెండురెండు అర్థము లున్నందున శ్లేష సంభవించినది. ఈ రెండర్థములలో నొకయర్థము లేకపోయినను ఈశ్లేష కాదు. ఈశ్లేష సభంగము కాదు, అనఁగా పదమును విఱిచినందున వచ్చినది కాదు గనుక నిది యర్థగతము. 'ఇది యర్థశ్లేష, అర్థాలంకారము' అని అలంకార సర్వస్వపక్షమువారిమతము. 'అట్లు కాదు. ఇందలి 'వాగనుశాసన' పదమునకు బదులుగ 'వాణీశ' మొదలయిన మఱియొకపదము గాని, 'శ్రీనాథ' పదమునకు మాఱుగ 'లక్ష్మీపతి' మొదలయిన పదములు గాని, ఇట్లే యితరపదములకుఁ బర్యాయపదములు గాని పెట్టినయెడల నిందలి 'శ్లేష' యెగిరిపోవును. కావున నిది శబ్దశ్లేష, అర్థశ్లేష కాదు' అని కావ్యప్రకాశపక్షమువారిమతము.

శబ్దార్థాలంకారముల యోగ్యత :— ఇఁకలి యాలంకారికుల మతమున నర్థాలంకారములయోగ్యత శబ్దాలంకారములకంటె నధికమని యున్నను పూర్వలాక్షణికులుమాత్ర మీరెంటిని సమానముగ నెంచిరి. వారిలోఁ గొందఱిమతమున శబ్దాలంకారములే యర్థాలంకారములకంటె నధికమైనవి. ఏల యన, మాట వినినతోడనే చిత్తము నాకర్షించునవి శబ్దాలంకారములు, అర్థప్రతీతియైనతరువాతఁ గాని అర్థాలంకారములు చిత్తము నాకర్షింపవు[1] కావ్యప్రకాశకారుఁ డీరెంటిని ఏకకక్ష్యయందే చేర్చెను. కావ్యమును ఉత్తమ, మధ్యమ, అధమము లన్న మూఁడు విభాగములుగ వర్ణించి, అర్థచిత్ర శబ్దచిత్రములు గలది యధమ మని చెప్పెను (౧. ౫). శబ్దచిత్రమునకు 'స్వచ్ఛందోచ్ఛలదచ్ఛకచ్ఛకుహరచ్ఛాతేతరాంబుచ్ఛటా' అను అనుప్రాసపద్యమును, అర్థచిత్రమునకు 'వినిర్గతం మానద మాత్మమన్దిరాత్' అన్న ఉత్ప్రేక్షాలంకారము గల పద్యమును ఉదాహరణముగ నిచ్చియున్నాఁడు. కాని శబ్దార్థాలంకారములను ఒక్కజతగాఁ జేయుట క్రమము గాదని తలఁచి జగన్నాథపండితుఁడు రసగంగాధరమునందుఁ గావ్యమును ఉత్తమోత్తమ, ఉత్తమ, మధ్యమ, అధమము లను నాల్గు తెగలుగ విభజించి, మమ్మటుఁడు ఉత్తమ మన్న వ్యంగ్య ప్రధానకావ్యమును ఉత్తమోత్తమ మనియు, మమ్మటుని మధ్యమ మగు గుణీభూతవ్యంగ్యమును ఉత్తమ మనియు, వ్యంగ్యమునకంటె వాచ్యచమత్కార మధికము కలది మధ్యమ మనియు, ఎందు అర్థచమత్కారమును అనుసరించిన శబ్దచమత్కారము ప్రధానమో యది అధమ మనియుఁ జెప్పెను. 'ఉత్తమ', 'మధ్యమ' కావ్యములందు 'అర్థాలంకారములు'ను, అధమకావ్యమందు 'శబ్దాలంకారములు'ను వచ్చునని యితని తాత్పర్యము. ఇతఁడు మమ్మటుని నిట్లాక్షేపించెను: "కొంద ఱీనాలుగు భేదములను పాటింపక, ఉత్తమ మధ్యమాధమము లను భేదములు మూఁడే యని చెప్పెదరు. కాని అర్థచిత్ర శబ్దచిత్రములకు భేదము చేయక వానిని రెంటిని అధమకావ్యముగ నెంచుట అయుక్తము. 'వినిర్గతం మానద మాత్మమన్దిరాత్' అనుపద్యమును, కేవల పామరజన శ్లాఘనీయ మైన 'స్వచ్ఛందోచ్ఛలద్' మొదలయిన పద్యములును, సమానములే యని యే సహృదయుఁడు చెప్పఁగలఁడు?... ఒకచో శబ్దార్థచమత్కారములు రెండును కలిగియుండవేని యందు

1. భామహాలంకారము ౧. ౧౪. సరస్వతీ కంఠాభరణకారుఁ డైన భోజరాజుకూడ నర్థాలంకారములకంటె శబ్దాలంకారములే యధిక మన్న మతమువాఁడు. 'ఉపమాదిభిరయుక్తాపి రాజతే కావ్యపద్ధతిః, యదనుప్రాసలేశోఽపి నాంత తత్ర నివేశ్యతే' (౩. పరి) అని చెప్పియున్నాఁడు.

sampath Ebooks

వాని గుణప్రాధాన్యమునుబట్టి లక్షణము ననుసరించి తగినకక్ష్యలోఁ జేర్పవలెను. శబ్దార్థములు రెండును సమప్రాధాన్యము కలవి యైన యెడల నది మధ్యమకావ్యమే". అర్థచమత్కారము లేని కేవల శబ్దచమత్కారమునుగురించి యిట్లు వ్రాసెను: "ఎందు సామాన్యముగా నర్థచమత్కారము శూన్యమై కేవలము శబ్దచమత్కృతి యుండునో, దాని నధమాధమకావ్య మని చెప్పుట యుచితము. ఏకాక్షరపద్యములు, అర్థావృత్తియమకము, పద్మబంధాదికములు నిట్టివి. కాని ప్రాచీనపరంపర ననుసరించి కొందఱు మహాకవులు వీనిని తమ కావ్యములలో నచ్చటచ్చటఁ బ్రయోగించినను కావ్యలక్షణ మైన 'రమణీయార్థప్రతిపాదకత్వ'ము వీనియందు లేనందున, వీనిని మేము కావ్యముగ నెంచనేలేదు[1]." కావున శబ్దార్థాలంకారములలో అర్థాలంకారములే శ్రేష్ఠములు, అర్థచమత్కారము లేని కేవలశబ్దాలంకారములు కావ్యమన్న పేరునకుఁగూడఁ దగ వని యీయాలంకారికసంప్రదాయము వారియభిప్రాయము. ఇది సరియైన యభిప్రాయము కా దని యెవరు చెప్పఁగలరు?

ఇఁక నర్థాలంకారములనుగురించి విచారింతము. ఒక్క యుపమాలంకారమే యన్నియలంకారములకును మూల మనియు, మిగిలిన వన్నియు దానిభేదములే యనియుఁ గొంద ఱందురు. కావ్యాలంకారసూత్రకారుఁ డైన వామనుఁడు మొదట నుపమాలంకారమును చర్చించి యింకను ౨౭ అలంకారములను 'ఉపమాప్రపంచాధికార' మను విభాగమునం దిచ్చి యిట్లనెను:—

'ఏభిర్నిదర్శనైః స్వీయైః పరకీయైశ్చ పుష్కలైః,
శబ్దవైచిత్ర్యగర్భేయ ముపమైవ ప్రపంచితా.[2]'

భామహుఁడును (౬-వ శతాబ్ది), వక్రోక్తిజీవితకారుఁడును[3] (౧౧-వ శతాబ్ది) అలంకారముల కన్నిటికిని వక్రోక్తియే మూల మనియు, నది లేనిది అలంకారమే లే దనియుఁ జెప్పియున్నారు. భామహాలంకారమున నిట్లున్నది:—

'వాచాం వక్రార్థశబ్దోక్తి రలంకారాయ కల్పతే-౧. ౩౬.

సైషా సర్వత్ర వక్రోక్తి రనయార్థో విభావ్యతే,
యత్నోఽస్యాం కవినా కార్యః కోఽలంకారోఽనయా వినా'
—౨. ౮౫.

అర్థము: వక్రోక్తి వాక్కున కలంకారత్వమును కల్పించును. ఈవక్రోక్తివలననే అంతటను అర్థము శోభావంత మగును. కవులు యత్నించి దీనిని సాధింపవలెను. ఇది లేనిచో యే యలంకారము సిద్ధించును?

ఇతరులచే నలంకారములుగా స్వీకరింపఁబడిన హేతు, సూక్ష్మ, లేశము లన్న అలంకారములలో వక్రోక్తి లేనందున నవి యలంకారములు కా వని భామహుఁడు చెప్పెను (౨. ౮౬).

వక్రోక్తియు, నతిశయోక్తియు నీరిమతమునందు సమానార్థకములు ఇచ్చట వేఱువేఱుపేరులుగ లక్షణము చెప్పఁబడిన 'అతిశయోక్తి' 'వక్రోక్తి' యను రూఢిశబ్దార్థముల గ్రహింపఁగూడదు. యౌగికార్థమును గ్రహింపవలెను. ఉన్నదానికంటె నెక్కువగఁ జెప్పుట యతిశయోక్తి; ఉన్నది యున్నట్టు చెప్పక మాఱువిధముగ వంకరటింకరగా చెప్పుట వక్రోక్తి. ఇట్టతిశయోక్తియే సర్వాలంకారమూల మని హేమచంద్రుఁడును[4] మమ్మటుఁడును[5] ఒప్పుకొని యున్నారు. ఈ సంప్రదాయమువారిమతమున ఉపమాలంకారమునందుఁ గూడ అతిశయోక్తి గలదు. వస్తుస్థితిని మించుటయే యతిశయోక్తి. ముఖము చంద్రునివలె నున్నది యన్న వస్తుస్థితియా? కాదు. కావున నందు అతిశయోక్తియు (వక్రోక్తియు) నున్నది.

రుద్రటుఁ డను మహాలాక్షణికుఁడు (౯-వ శతాబ్ది) అర్థాలంకారములు వాస్తవము (వస్తు విషయము), ఔపమ్యము, అతిశయము, శ్లేషము అనునవి నాలుగే యనియు, నలంకారములన్నియు ఈనాల్గింటి భేదములే యనియుఁ జెప్పినాఁడు. ఆ నాల్గింటిలక్షణము లిట్లు చెప్పెను:

ఏయర్థము నైనఁ బలపఱచి వస్తుస్వరూపమును ఉన్నది యున్నట్లు చెప్పునో యది వాస్తవము (స్వభావోక్తి). ఇందు విపరీతవర్ణనము గాని, పోలిక గాని, అతిశయవర్ణనము గాని, శ్లేష గాని యుండదు.

---

1. రసగంగాధరము. కావ్యమాలకూర్పు, ౨౦-వ పుట.

2. అర్థము: నాచే రచింపఁబడినట్టివియు, నితరుల వైనట్టివియు నగు పెక్కు ఉదాహరణములచే శబ్దచమత్కారముతో నిండియున్న ఉపమాలంకారమే విస్తరముగఁ జెప్పఁబడినది.

3. లాక్షణికు లందఱును ఈతనిపేరు చెప్పక ఈపేరనే వాడెదరు. ఈతనిపేరు కుంతకుఁ డైనట్లు కానవచ్చుచున్నది (వ్యక్తివివేకవిచారము, పుటలు ౧౬; ౩౨).

4. ఏవంవిధైవ సర్వత్ర విషయేఽతిశయోక్తిరేవ ప్రాణత్వేనావతిష్ఠతే, తాం వినా ప్రాయేణాలంకరణత్వాయోగా దితి న సామాన్యమాలిత్తైకావలీనిదర్శనావిశేషాద్యలంకారోపన్యాసః శ్రేయాన్-(కావ్యాను., అ. ౬).

5. సర్వత్ర ఏవంవిధవిషయే ఽతిశయోక్తిరేవ ప్రాణత్వేనావతిష్ఠతే, తాం వినా ప్రాయేణాలంకారత్వాయోగాత్-(కావ్యప్రకాశము., ౧౦-వ ఉల్లాసము).

# అలంకారములు

1. సాదృశ్యగర్భ
2. విరోధగర్భ
3. శృంఖలాబంధ
4. తర్క న్యాయమూల
5. వాక్య(కావ్య) న్యాయమూల
6. లోక న్యాయమూల
7. గూఢార్థ ప్రతీతిమూల
8. రసాది
9. సృష్టి
10. సంకరములు

## 1. సాదృశ్యగర్భాలంకారములు

- భేదాభేదప్రధాన
  - ౧. ఉపమ
  - ౨. అనన్వయము
  - 3. ఉపమేయోపమ
  - ౪. స్మరణము
- అభేదప్రధాన
  - ఆరోపగర్భ
    - ౫. రూపకము
    - ౬. పరిణామము
    - ౭. సందేహము
    - ౮. భ్రాంతిమంతము
    - ౯. ఉల్లేఖము
    - ౧౦. అపహ్నుతి
  - అధ్యవసాయగర్భ
    - ౧౧. ఉత్ప్రేక్ష
    - ౧౨. అతిశయోక్తి
- గమ్యౌపమ్యాశ్రయములు
  - పదార్థగత
    - ౧3. తుల్యయోగిత
    - ౧౪. దీపకము
  - వాక్యార్థగత
    - ౧౫. ప్రతివస్తూపమ
    - ౧౬. దృష్టాంతము
    - ౧౭. నిదర్శన
  - భేదప్రధాన
    - ౧౮. వ్యతిరేకము
    - ౧౯. సహోక్తి
  - ౨౦. వినోక్తి
  - విశేషణ విచ్ఛిత్త్యాశ్రయ
    - ౨౧. సమాసోక్తి
    - ౨౨. పరికరము
  - విశేషణవిశేష్యవిచ్ఛిత్త్యాశ్రయములు
    - ౨3. శ్లేష
  - ౨౪. అప్రస్తుతప్రశంస
  - ౨౫. అర్థాంతరన్యాసము
  - ౨౬. పర్యాయోక్తి
  - ౨౭. వ్యాజస్తుతి
  - ౨౮. ఆక్షేప

## 2. విరోధగర్భాలంకారములు

- ౨౯. విరోధము
- 3౦. విభావన
- 3౧. విశేషోక్తి
- ౧౨ అతిశయోక్తి[1]
- 3౨. అసంగతి
- 33. విషమము
- 3౪. సమము
- 3౫. విచిత్రము
- 3౬. అధికము
- 3౭. అన్యోన్యము
- 3౮. విశేషము
- 3౯. వ్యాఘాతము

1. ఇది రెండుసారులు చెప్పఁబడినది.

sampath_Ebooks

sampath_Ebooks

**3. శృంఖలాబంధాలంకారములు**

- ౪౦. కారణమాల
- ౪౧. ఏకావలి
- ౪౨. మాలాదీపకము
- ౪౩. ఉదారము(సారము)

**4. తర్క—న్యాయమూలాలంకారములు**

- ౪౪. కావ్యలింగము
- ౪౫. అనుమానము

**5. వాక్య(కావ్య)న్యాయమూలాలంకారములు**

- ౪౬. యథాసంఖ్యము
- ౪౭. పర్యాయము
- ౪౮. పరివృత్తి
- ౪౯. పరిసంఖ్య
- ౫౦. అర్థాపత్తి
- ౫౧. వికల్పము
- ౫౨. సముచ్చయము
- ౫౩. సమాధి

**6. లోకన్యాయమూలాలంకారములు**

- ౫౪. ప్రత్యనీకము
- ౫౫. ప్రతీపము
- ౫౬. మీలితము
- ౫౭. సామాన్యము
- ౫౮. తద్గుణము
- ౫౯. అతద్గుణము
- ౬౦. ఉత్తరము

**7. గూఢార్థప్రతీతిమూలాలంకారములు**

- ౬౧. సూక్ష్మము
- ౬౨. వ్యాజోక్తి
- ౬౩. వక్రోక్తి
- ౬౪. స్వభావోక్తి
- ౬౫. భావికము
- ౬౬. ఉదాత్తము

**8. రసవదాద్యలంకారములు**

- ౬౭. రసవత్
- ౬౮. ప్రేయస్
- ౬౯. ఊర్జస్వి
- ౭౦. సమాహిత

**9. పృథగలంకారములు**

- ౭౧. భావోదయ
- ౭౨. భావసంధి
- ౭౩. భావశబలత

**10. సంకరాలంకారములు**

- ౭౪. సంసృష్టి
- ౭౫. సంకరము

sampath_Ebooks

ఎందు వస్తుస్వరూపమును చక్కఁగఁ దెల్పునిమిత్తము దానితో సమానమైన మఱియొక వస్తువును వక్త చెప్పునో యది ఔపమ్యము (ఉపమ).

ఎందు వర్ణ్యము లోకములోనివాడుకను (ప్రసిద్ధికి) తలక్రిందుగను, లోకాతీతముగను వర్ణింపఁబడునో యది అతిశయము (అతిశయోక్తి).

ఎందు నేకార్థములు గల పదములచే నొక్కవాక్యమునకు నిశ్చయము లయిన రెండర్థములు కలుగునో అయ్యది శ్లేష.

ఇట్లు నాలుగు ముఖ్యాలంకారములను జెప్పి మొదటిదానిలో ౨౩ భేదములును, రెండవదానిలో ౨౧ భేదములును, మూఁడవదానిలో ౧౨ భేదములును, నాల్గవదానిలో ౧౦ భేదములును చెప్పియున్నాఁడు. ఇట్లు మొత్తముమీఁద నీతఁడు ౬౫ అలంకారములను ఈనాలుగుతెగలలో నమర్చెను. స్వభావోక్తి, అతిశయోక్తి, ఉపమ, శ్లేష – ఈనాల్గింటిలో నొక్కటియైనను, వాచ్యముగాఁగాని వ్యంగ్యముగాఁగాని లేనట్టియలంకార మొక్కటియైనను ఉండదు గనుక, రుద్రటుని యీవిభాగము మిక్కిలి సరస మైనదియు, స్వాభావిక మైనదియు నైయున్నది.

కాని యీవిభాగమును పాటింపక తరువాతిలాక్షణికులు వేఱు విధములయిన విభాగములను కల్పించిరి. అందు 'అలంకారసర్వస్వ' కారునిచేఁ జేయఁబడినవిభాగము పెక్కురాలంకారికులచే నంగీకరింపఁబడినది. అలంకారసర్వస్వకారుఁ డలంకారములను ౧౦ తెగలుగా విభాగించెను: ౧. సాదృశ్యగర్భములు, ౨. విరోధగర్భములు, 3. శృంఖలాబంధములు, ౪. తర్కన్యాయమూలములు, ౫. వాక్య (కావ్య) న్యాయమూలములు, ౬. లోకన్యాయమూలములు, ౭. గూఢార్థప్రతీతిమూలములు, ౮. రసవదాదికములు, ౯. పృథగలంకారములు, ౧౦. సంకరములు. వీనియన్నింటికిని మరలఁ బెక్కు లుపశాఖలఁ జెప్పి యీగ్రంథకర్త ౭౫ అలంకారములను ఈ ౧౦ తెగలలోఁ జేర్చెను. ఆ వివర మీప్రక్కపుటలలో నీయఁబడినది. ఏకావళీకారుఁడైన విద్యాధరుఁడును, ప్రతాపరుద్రీయకారుఁడైన విద్యానాథుఁడును1, రసగంగాధరకారుఁడైన జగన్నాథుఁడును స్వల్పభేదములతో నీ యలంకారకక్ష్యావిభాగమునే ఒప్పుకొనియున్నారు. కావున నేనును ఈ వ్యాసాంతమున అలంకారములను విడివిడిగా వర్ణించుచో మొదటి ౭౫ అర్థాలంకారములవఱకును అలంకారసర్వస్వకారుని కక్ష్యావిభాగము ననుసరించియే వర్ణించినాఁడను. కువలయానందములో నధికముగా నున్నవానిని దరువాత కక్ష్యావిభాగము లేకుండ వర్ణించినాఁడను.

## గ్రంథసంగ్రహము:

అలంకారశాస్త్రము సంస్కృతమునందు మిక్కుటముగ నభివృద్ధి నొందినది. ఆభాషయందు వందలకొలఁది సాహిత్యశాస్త్రగ్రంథములు కలవు. ఆంధ్రమున రెండుమూఁడు చిన్నగ్రంథములుమాత్ర మున్నవి. కావున సాహిత్యమీమాంసకు సంస్కృతగ్రంథములే గతి. ప్రతి సాహిత్యగ్రంథమునందును నివర అలంకారముల లక్షణోదాహరణము లీయఁబడును. అందును మమ్మటకృతమైన కావ్యప్రకాశము, విద్యాధరరచితమైన ఏకావళియు, విద్యానాథనిర్మితమైన ప్రతాపరుద్రీయమును, పండితరాజప్రణీతమైన రసగంగాధరమును విశేషప్రామాణికగ్రంథములుగ నెంచఁబడును. 'ఆలంకారికులు' అన్నవ్యాసమునందు సంస్కృతమున సాహిత్యగ్రంథములు వ్రాసిన ముఖ్యగ్రంథకర్తలచరిత్రలును, వారిగ్రంథవివరమును వ్రాయఁబడును. కావున నిచ్చట వ్రాయుటలేదు.

సాహిత్యశాస్త్రమందలి యితరవిషయముల నెత్తుకొనక కేవల మలంకారముల మీమాంసకొఱకే పుట్టిన గ్రంథములలో రాజానక రుయ్యకకృత మైన 'అలంకారసర్వస్వము' మిగుల ప్రామాణికముగ నెంచఁబడును. ఈగ్రంథము ౧౨ – వ శతాబ్దినాఁటి దైయుండనోపు. ఇందు సూత్రములు వృత్తియుఁ గలవు. సూత్రములుమాత్రము రుయ్యకుఁడు వ్రాసె ననియు, ఆతనిశిష్యుఁడైన మంఖకునిచే వృత్తి వ్రాయఁబడె ననియుఁ గొంద అందురు. రెండును రుయ్యకుఁడే వ్రాసె నని మఱికొందఱియభిప్రాయము. ఈగ్రంథమును జయరథుఁ డనువాని టీకతో బొంబయిలో కావ్యమాలవారును, సముద్రబంధుఁ డనువానిటీకతో అనంతశయనగ్రంథమాలవారును అచ్చొత్తించిరి.

అప్పయ్యదీక్షితరచిత మైన 'కువలయానందము' కూడ కేవల మలంకారములకై పుట్టినది. దక్షిణదేశమునందు దీని కధికప్రచారము కలదు. ఇది జయదేవుని చంద్రాలోకముపై వ్రాయఁబడినటీక. విద్యార్థులు దీనినే యెక్కువ పాఠము చేయుదురు.

విశ్వేశ్వరపండితరచిత మైన 'అలంకారకౌస్తుభ' మనునది గూడ కేవల మలంకారములనుగుఱించియే చర్చించును.

---

1. ప్రతాపరుద్రీయకారుఁ డీక్రిందివిభాగ మొకటి చెప్పినాఁడు:-

౧. ప్రతీయమానవస్తువు లగు నలంకారములు: సమాసోక్తి, పర్యాయోక్తి, ఆక్షేప, వ్యాజస్తుతి, ఉపమేయోపమా, అనన్వయ, అతిశయోక్తి, పరికర, అప్రస్తుతప్రశంసా, అనుక్త, నిమిత్త, విశేషోక్తులు. ౨. ప్రతీయమానౌపమ్యము లగునలంకారములు: రూపక, పరిణామ, సందేహ, భ్రాంతిమత్, ఉల్లేఖ, అపహ్నవ, ఉత్ప్రేక్షా స్మరణ, తుల్యయోగితా, దీపక, ప్రతివస్తూపమా, దృష్టాంత, సహోక్తి, వ్యతిరేక, నిదర్శనా, శ్లేషలు. 3. ప్రతీయమాన రసభావాద్యలంకారములు: రసవత్, ప్రేయస్, ఊర్జస్వి, సమాహిత, భావోదయ, భావసంధి, భావశబలతలు. ౪. అస్ఫుటప్రతీయమానములు: ఉపమాదు లయిన మిగిలిన యలంకారము లన్నియు నిందులోనివి.

sampath Ebooks

తెలుఁగులో మొదట సాహిత్యశాస్త్రమును వ్రాసినవాఁడు విన్నకోట పెద్దన. ఈతఁడు ౧౪ - వ శతాబ్దివాఁడు. ఈతనిచే రచింపఁబడిన గ్రంథము 'కావ్యాలంకారచూడామణి.' ఇది దండి కృత మైన 'కావ్యాదర్శము'నకుఁ దెలుఁగుసేఁతవలెఁ గానవచ్చు చున్నది. ఇందలి ౫ - వ, ౬ - వ ఉల్లాసములలో అర్థాలంకారములును, శబ్దాలంకారములును చెప్పఁబడియున్నవి. ఈపుస్తకమును గుఱించి యధికము తెలిసికొనఁగోరువారు 'కావ్యాలంకారచూడామణి' శబ్దముక్రిందఁ జూడనగును. తెలుఁగునందలి రెండవసాహిత్యగ్రంథము 'నరసభూపాలీయము.' ఇది ౧౬ - వ శతాబ్దివాఁడైన బట్టుమూర్తిచే రచితము ఇది ప్రతాపరుద్రీయమును అనుసరించియు, ఏకావళి ననుసరించియు వ్రాయఁబడినట్లు కానవచ్చుచున్నది. ఇందు ౪ - వ ఆశ్వాసాంతమున శబ్దాలంకారములును, ౫ - వ ఆశ్వాసమునందు అర్థాలంకారములును వివరింపఁబడినవి. ౧౮-వ శతాబ్దివాఁడగు అడిదము సూరకవి 'ఆంధ్రచంద్రాలోకము' అను గ్రంథమును రచించెను. సంస్కృతమునందు జయదేవునిచే రచింపఁబడిన 'చంద్రాలోక' మను గ్రంథములోని ౫ - వ మయూఖమును మాత్ర మిందు తెనిఁగించియున్నాఁడు. ఇందు ౧౦౦ అర్థాలంకారముల లక్షణములును, ఉదాహరణములును కలవు. 'కువలయానంద ప్రకాశిక' యను గ్రంథ మొకటి కటికనేని రామకవిచే రచింపఁబడినది కలదు. ఈతఁడు పద్మనాయకకులజుఁడు. కాలము తెలియదు. ఇది కువలయానందమునకు భాషాంతరము. ఇఁదు కారికోదాహరణములు పద్యరూపముగను, కారికావృత్తి వచనరూపముగను గలవు. మూఁడాశ్వాసముల గ్రంథము. ఇంకను అచ్చుపడలేదు. దీనిప్రతి యొకటి చెన్నపట్టణమున ప్రాచ్యలిఖితపుస్తకభాండాగారమునందుఁ గలదు. మనకుఁ దెలిసినంతవఱకు తెలుఁగులో నలంకారములనుగుఱించి యున్న పూర్వగ్రంథము లీనాల్గుమాత్రమే.

ఇటీవల శ్రీ వీరేశలింగముగారు 'అలంకారసంగ్రహము' అన్న గ్రంథము వ్రాసిరి. ఇది చంద్రాలోకమునకు నాంధ్రముగఁ గానవచ్చుచున్నది. టి. ఇ. శ్రీనివాసాచారియార్ అనువారు 'సాహిత్యచింతామణి' అను నామాంతరము గల 'అలంకారశాస్త్రసంగ్రహము' అను గ్రంథమును రచించిరి. పెక్కు లక్ష్యలక్షణ గ్రంథములను శోధించి యలంకారలక్షణములును, ఉదాహరణములును ఇందుఁ జెప్పఁబడినవి. చక్కని యుపోద్ఘాతమును కలదు. శ్రీయుత అక్కిరాజు ఉమాకాన్తముగారు చంద్రాలోకమున కాంధ్రంబున గద్యమున నర్థము వ్రాసి అడిదము సూరన యాంధ్రచంద్రాలోకమునకు ననుబంధముగఁ బ్రకటించియున్నారు. రామలింగారెడ్డిగారి కవిత్వతత్త్వవిచారమును, కురుగంటి సీతారామయ్యగారి యలంకారతత్త్వవిచారమును ఈసందర్భమునఁ జేర్కొనఁదగినవి.

ఇఁక వేఱువేఱు అలంకారములలక్షణములును, ఉదాహరణములును తెలియఁబడును. మొదట శబ్దాలంకారములు ౫ ను, తరువాత అర్థాలంకారములు ౧౧౭ యు వర్ణింపఁబడినవి. శబ్దాలంకారముల క్రమము అలంకారసర్వస్వకారుని ననుసరించి యీయఁబడినది. అర్థాలంకారములు కువలయానందమునందుఁ జూపఁబడిన వన్నియు నీయఁబడినవి. ౧ మొదలు ౭౫ వఱకును క్రమముమాత్రము అలంకారసర్వస్వమునందలిది గ్రహింపఁబడినది. ౭౬-వ అలంకారమునొద్దనుండి పిలగునంతవఱకుఁ గువలయానందమందలిక్రమ మంగీకరింపఁబడినది. లక్షణములు చాలవఱకు రసగంగాధర, కావ్యప్రకాశ, ప్రతాపరుద్రీయములనుండి గ్రహింపఁబడినవి. ఉదాహరణము లేయేగ్రంథమునుండి తీసికొనినది కుండలీకరణమునందుఁ జూపితిమి. చివర నీయలంకారముల కన్నింటికిని అకారాదిసూచి యొకటి యీయఁబడినది.

అలంకారలక్షణములనుగుఱించి యొకవిశేషము జ్ఞాపక ముంచుకొనవలెను. ప్రతియలంకారమందును సౌందర్య ముండవలయును. సౌందర్య మనఁగా చమత్కృత్యాధాయకత్వము; చమత్కృతిని గలుగఁజేయుసామర్థ్యము. చమత్కృతి యనఁగా నానందవిశేషము. సహృదయహృదయప్రమాణకము [ర. గం]. దీనినే అప్పయదీక్షితులవారు 'హృద్యత' యనిరి. ఇది సర్వాలంకారములకును సామాన్యము గనుకఁ బ్రతియలంకారముయొక్క లక్షణమందును చెప్పఁబడదు. అయినను బ్రతియలంకారలక్షణమునందును 'సౌందర్యము' అనునది యున్న ట్లెంచుకొనవలెను. ఈ 'సౌందర్యము' అనుదానిని ఉపమాదికముల లక్షణములలోఁ జేర్పనియెడల నీక్రిందియుదాహరణములను గూడ నాయా యలంకారము లనియె చెప్పవలసియుండును.

'కంచరగాడిద గాడిదవంటిది' అనుదానిని 'ఉపమ' యనియు, 'పశువాహనము' అనుదానిని 'రూపక' మనియు, 'స్థాణువా పురుషుఁడా' అనుదానిని 'సందేహ' మనియు, 'ఇది వెండి' యని ముత్యపుఁజిప్పను జూచి భ్రమపడి చెప్పినదానిని 'భ్రాంతిమంత' మనియు, 'బలిసినదేవదత్తుఁడు పగలు భోజనము చేయఁడు' అనునది 'పర్యాయోక్త' మనియు, 'వీఁడు ఆదేవదత్తుఁడు' అనునది 'స్మరణ' మనియు, 'వారువారు వారివారి యిండ్లకుఁ బోయిరి' యనునది 'యథాసంఖ్య' మనియు, 'కొడుకుతోఁ గలసి తండ్రి వచ్చెను' అనునది 'సహోక్తి' యనియు, 'వాఁడు లేకుండ వీఁడు వెళ్లెను' అనునది 'వినోక్తి' యనియు భ్రమ కలుగవచ్చును. కాని ఈవాక్యములను అలంకారము లని ఎవ్వఁడును అనఁడు. ఎందువలన? వీనిలోఁ జమత్కారము లేదు గనుక.

## శబ్దాలంకారములు ౫.

సాధారణముగ శబ్దాలంకారము లైదు. పునరుక్తవదాభాసము, ఛేకానుప్రాసము, వృత్త్యనుప్రాసము, లాటానుప్రాసము, యమకము. మమ్మటుఁడు 'వక్రోక్తి', 'శ్లేష'లను గూడ శబ్దాలంకారములలోఁ జేర్చెను. కాని యలంకారసర్వస్వకారునిమతము ననుసరించి మే మీరెండలంకారములను అర్థాలంకారములందుఁ జేర్తుము.

౧. పునరుక్తవదాభాసాలంకారము :— లక్ష : సమానార్థము గల వేఱువేఱుశబ్దములు వేఱువేఱు అర్థములందుఁ జెప్పఁబడినను,

sampath_Ebooks

వినఁగానే యవి సమానార్థమందుఁ జెప్పఁబడెనా యేమి యన్న ఆభాస గలుగునెడల 'పునరుక్తవదాభాస' మన్న యలంకార మగును.

ఉదా: కాకతీశ్వరుఁడు రాజులకు నింద్రుఁడు, జిష్ణువు, శ్రీపతి, పురుషోత్తముఁడు - (ప్రతాప).

ఇందు 'ఇంద్ర' 'జిష్ణు' పదములును, 'శ్రీపతి' 'పురుషోత్తమ' పదములును సమానార్థకములుగఁ జూడఁగానె తోఁచును. కాని జిష్ణు వనఁగా జయశీలుఁ డనియు, పురుషోత్తముఁ డనఁగా పురుషులలో శ్రేష్ఠుఁ డనియు నన్వయము చేసికొనునప్పు డర్థము స్ఫురించి నందున ఆభాస పోవును.

ఈ యలంకార మర్థపౌనరుక్త్యము నాశ్రయించి యుండును. కావున నిది యర్థాలంకార మని అలంకారసర్వస్వకారునిమతము. అయినను అతఁడు దీనిని శబ్దాలంకారములకు మొదట నిచ్చినాఁడు. ఇది శబ్దాలంకారము, ఉభయాలంకారముకూడ నగు నని కావ్యప్రకాశకారునిమతము.

అనుప్రాసము :— లక్ష : హల్లులసామ్యమును 'అనుప్రాస' మందురు, అనఁగా నచ్చులు వేఱుగ నున్నను, నచ్చినహల్లే మరల వచ్చునట్లు చెప్పినచో అనుప్రాస మగును. ఇయ్యది రెండువిధములు. ఛేకానుప్రాసము, వృత్త్యనుప్రాసము.

౨. ఛేకానుప్రాసాలంకారము :— లక్ష : పెక్కు హల్లుల యొక్క సామ్యము 'ఛేకానుప్రాసము', అనఁగా రెండుగాని అధికముగాని హల్లులు రెండుసారులుమాత్ర ముచ్చరింపఁబడినయెడల నీ యలంకార మగును. ఇది కావ్యప్రకాశకారుఁడైన మమ్మటుని మతము.

ఉదా: అమన్దానన్దము.

ఈయుదాహరణమునందు 'మన్దా', 'నన్ద' లలో 'న్ద' అను రెండుహల్లులును రెండుసారు లుచ్చరింపఁబడినవి. కావున ఛేకానుప్రాసము. ఛేకు లనఁగా విదగ్ధులు, నేర్పరులు. వారి కిష్టమైనది గాన దీని కీపేరు వచ్చెనఁట.

అలంకారసర్వస్వకారునిమతమున రెండు వ్యంజన సముదాయములు (హల్లులగుంపులు) పెక్కుసారులు పరస్పరసాదృశ్యమును పొందినయెడల ఛేకానుప్రాస మగును.

ఉదా: (౧). అమన్దానన్దకన్దలిత హృదయారవిన్దుఁడు.

ఇందు 'న్ద' అను హల్లులసముదాయము నాల్గుసారులు వచ్చినది.

ఉదా: (౨).

క. మెచ్చిన మచ్చిక గలిగిన
నిచ్చిన నీవచ్చుఁ గాక యిచ్చ కొరులకుం
జిచ్చుఁ గడిగొనఁగ వచ్చునె
చిచ్చఱమా పచ్చపడిన శివునకుఁ దక్కన్. (భాగ., ౮. ౨౮౬)

ఇందు 'చ్చ' అను ద్విత్వాక్షరము పెక్కుసారు లుచ్చరింపఁబడినది.

వీ రిద్దఱకును గలభేదమునుజూడ, సామ్యము (మరల నుచ్చరించుట) సకృత్ (ఒక్కసారి) యని మమ్మటుఁడు, అసకృత్ (పెక్కుసారులు) అని రుయ్యకుఁడును చెప్పుచున్నట్టు గానవచ్చుచున్నది. కొన్నిహల్లులను కలిపి రెండుసారు లుచ్చరించిన ఛేక మని యొకఁడు, రెంటికంటె నెక్కుడుసారు లుచ్చరించిన ఛేక మని మఱియొకఁడు. ఇంతియ భేదము. 'అమన్దానన్ద' మనఁగానే ఛేకానుప్రాస మగు నని కావ్యప్రకాశకారుఁడు; కాదు 'అమన్దానన్దకన్దలిత' అనినఁగాని ఛేకము కాలే దని సర్వస్వకారుఁడు. ఉద్భట విద్యానరులును సర్వస్వకారునితో నేకీభవించిరి.

3. వృత్త్యనుప్రాసాలంకారము :— లక్ష : ఒక్కహల్లు గాని పెక్కుహల్లులు గాని అసకృత్సామ్యము గల దయ్యేనేని, అనఁగా రెండుసారులకంటె నెక్కుడు పర్యాయము లుచ్చరింపఁబడునేని 'వృత్త్యనుప్రాస' మగును. ఇది మమ్మటమతము.

ఉదా: (౧). కమలాలోలుఁడు.

ఇందు లకారము మూఁడుపర్యాయము లుచ్చరింపఁబడినది.

ఉదా: (౨).

క. అడిగెద నని కడు వడిఁ జను
నడిగినఁ దను మగుడ నుడువఁ డని నడ యుడుగున్
వెడవెడ సిడిముడి తడఁబడ
నడు గిడు నడు గిడదు జడిమ నడు గిడునెడలన్.

(భాగ., ౮. ౧౦౩)

ఇందు 'డ' కార మెన్నిసారులో చెప్పఁబడినది.

'వృత్తి' యనఁగా నియమితవర్ణములయం దుండునట్టిదియు, రసవిషయక మైనట్టిదియు నగువ్యాపారము. అట్టి వర్ణరచనకు సంబంధించినది గనుక దీనికి వృత్త్యనుప్రాస మన్న పేరు వచ్చెను.

మాధుర్య[1] వ్యంజకము లైనవర్ణములు గల వృత్త్యనుప్రాసమును 'ఉపనాగరిక' యనియెదరు. వామనమతమున దీనికే 'వైదర్భీరీతి' యని పేరు.

---

1. మాధుర్యము, ఓజస్సు, ప్రసాదము అనునవి మూఁడును కావ్యగుణములు. వీనిలోఁ గొన్నింటికిఁ గొన్ని యక్షరము లనుకూలములని యాలంకారికుల యభిప్రాయము. ఏయే యక్షరము లేయే వృత్తికి వ్యంజకములో తెలిసికొనుటకు కావ్యప్రకాశము ౮-వ ఉల్లాసము, ౭౪-౭౬ శ్లోకములు చూడనగును.

sampath_Ebooks

ఓజఃప్రకాశకము లైన వర్ణములుగల వృత్త్యనుప్రాసమునకు 'పరుష' యని పేరు. దీనినే 'గౌడీరీతి' యందురు.

ఇతరవర్ణములుగల వృత్త్యనుప్రాసము 'కోమల' యనఁబడును. వామనుఁడు దీనినే 'పాంచాలీరీతి' యనెను. దీనినే కొందఱు 'గ్రామ్య' యందురు.

అలంకారసర్వస్వకారునిమతమున, ఒక్క యక్షరము రెంటికంటె నధికపర్యాయములు, పెక్కక్షరములు రెండుపర్యాయములును ఉచ్చరింపఁబడినయెడల వృత్త్యనుప్రాసము, అనఁగా ఏకాక్షరమును గుఱించి అసకృత్ సామ్యమును, అనేకాక్షరములను గుఱించి సకృత్ సామ్యమును ఉండవలెను.

వామనమతమున, సకృద్వర్ణావృత్తి ఛేకము, అసకృద్వర్ణావృత్తి వృత్త్యనుప్రాసము.[1]

అనుప్రాసముయొక్క యన్యభేదములు:— పైని ఈయఁబడిన యనుప్రాసభేదము లలంకారసర్వస్వ కావ్యప్రకాశముల ననుసరించి యీయఁబడినవి. సాహిత్య దర్పణకారుని మతంబున నీ యలంకారము ఛేక, వృత్తి, శ్రుతి, అంత్య, లాటభేదంబులచే నైదువిధములు; సరస్వతీకంఠాభరణకారునిమతంబున శ్రుతి, వృత్తి, వర్ణ, పద, నామ, లాటభేదంబులచే నాఱువిధములు. ఈభేదంబులకును పెక్కు ఉపభేదంబులు భోజుఁడు చెప్పియున్నాఁడు (చూడుఁడు, సర. కం, ౨-వ పరి).

తెనుఁగునందు ఛందోవిషయముగ నెంచఁబడు ప్రాస అనుప్రాసాంతర్గతమే. ప్రాస నాల్గుచరణంబులందును ఉండును కావున నది వృత్త్యనుప్రాసమే కాని రెంటికిని గొంచెము భేదము కలదు. వృత్త్యనుప్రాసమునందు వర్ణములయావృత్తి కొలఁదియంతరముననే వచ్చును. ప్రాసమునందుఁ జరణచరణాంతరమున వచ్చును. శార్దూలాది దీర్ఘవృత్తములలో ౧౯, ౨౦ అక్షరములకుఁ దరువాత వచ్చును.

మన కవులచే విశేషముగ గౌరవింపఁబడు నంత్యనియమము అనుప్రాసమే. దానిని పదాంతానుప్రాస మనవచ్చును. బమ్మెర పోతరాజకృతమగు ఆంధ్రభాగవతమం దీ శబ్దాలంకారము విశేషముగఁ గానవచ్చును.

ఉదా:

క. అనుదినసంతోషణములు
జనితశ్రమతాపదుఃఖసంశోషణముల్
తనయుల సంభాషణములు
జనకులకుం గర్ణయుగళసద్భూషణముల్. (భాగ., ౩.౧౪౦)

౪. లాటానుప్రాసాలంకారము:— లక్ష: ఒక్క యర్థము గల పదములను తాత్పర్యభేదము కలుగునట్లు మరల మరలఁ జెప్పినచో 'లాటానుప్రాస' మగును.

ఉదా:

'కమలాక్షు నర్చించుకరములు కరములు
శ్రీనాథు వర్ణించు జిహ్వ జిహ్వ' (భాగ, ౭.౧౬౯).

ఇచ్చట మొదటి 'కరము'నకు జాతివాచక మైన చేయి యని అర్థము. రెండవ 'కరము'నకు యోగ్యమైన చేయి యని యర్థము. ఇదియే తాత్పర్యభేదము. ఇట్లే రెండుజిహ్వలనుగుఱించి యెఱుఁగునది.

ఛేకవృత్త్యనుప్రాసములు వర్ణానుప్రాసము లనియు, నిది పదానుప్రాసము లేక శబ్దానుప్రాస మనియుఁ జెప్పెదరు.

అనన్వయాలంకారమునందును ఉపమేయము రెండుసారులు వచ్చును. రాముఁడు రాముఁడే. దీనికిని లాటానుప్రాసమునకును భేద మేమి? అనన్వయమునం దొకపదమే మరలఁ జెప్పుట యుద్దేశము కాదు. ఆ పదముచే సూచింపఁబడిన పదార్థముతోఁ బోల్చఁదగిన పదార్థము మఱియొకటి లే దని చెప్పుట కాపదమే మరలఁ జెప్పఁబడును. అచ్చట సమానార్థకపద ముంచినను అంత చింత లేదు. 'రాముఁడు రాముఁడె' అనుటకు బదులు 'రాముఁడు దాశరథియె' యన్నను అలంకారమునకు భంగము రాదు. కాని లాటానుప్రాసములో సమానార్థకపదము చెప్పుటయే యుద్దేశము గాక సమానోచ్చారణపదమును జెప్పుటయు నుద్దేశమే.

ఈయలంకారమును మమ్మటాదులు ౧. పదముల పునరావృత్తి కలది, ౨. నామముల పునరావృత్తి కలది యని రెండుగ చేసి, ౧ లో (అ) ఏకపదపునరావృత్తి కలది, (ఆ) అనేకపదపునరావృత్తి కలది అనియు, ౨ లో (అ) ఏకసమాసములోనివి, (ఆ) భిన్నసమాసములోనివి, (ఇ) ఒకటి సమాసములోనిది, మఱియొకటి సమాసములో లేనిది అని యైదువిభాగములు కల్పించిరి.

ఈ యలంకారమునందు శబ్దార్థములు రెండును ముఖ్యములు. కావున నిది ఉభయాలంకార మని కొందఱిమతము.

౫. యమకాలంకారము:— లక్ష: ౧. స్వరవ్యంజన (అచ్చుల హల్లుల) సముదాయపౌనరుక్త్యము 'యమకము'— (అ. స).

లక్ష: ౨. అసమానార్థకము లయిన సమానవర్ణముల యేకక్రమముగ నావృత్తి 'యమకము.'— (కా. ప్ర).

ఉదా: ఆ సైనికనికాయంబు కాయంబు మఱచి పోరుచున్నది.

ఇందు 'కాయంబు' అనువర్ణంబులు స్వరవ్యంజనసహితంబుగ ఏకక్రమముగ రెండుసారు లుచ్చరింపఁబడినవి. మొదటి 'కాయంబు' 'నికాయంబు'లోని యొకభాగము. దానికి స్వతంత్రముగ నర్థంబు లేదు.

ఛేకవృత్త్యనుప్రాసములందు హల్లులసామ్య ముండినఁ జాలును, అచ్చులసామ్య మానుషంగికము. ఉండిన నుండవచ్చును, లేకున్నను చింత లేదు. ఇచ్చట నచ్చుల హల్లుల రెంటిసామ్యము నావశ్యకము.

1. సకృద్వర్ణావృత్తిశ్ఛేకానుప్రాసః, అసకృద్వ్యావృత్త్యనుప్రాసః (కావ్యానుశాసనమ్, అ. ౪).

sampath_Ebooks

లాటానుప్రాసమందు ఏకపదము లేకార్థమునందే (భిన్న తాత్పర్యములతో) రావలెను. యమకమునందు, ఏకపదములే వచ్చిన యెడల భిన్నార్థములందు రావలెను. అర్థములేని అక్షరములు (ఒక పదముయొక్క భాగముగ) రావచ్చును. ఇది మమ్మటమతము. రుయ్యకమతమున, నిందు నేకార్థముగల పదములు, భిన్నార్థక పదములు, కొన్ని అర్థము కలవి, కొన్ని అర్థము లేనివి రావచ్చును.[1] ఏవి వచ్చినను ఇందు లాటానుప్రాసమువలె తాత్పర్యభేద మక్కఱలేదు.

దీనిని పూర్వలాక్షణికు లనేకవిధముల విభజించియున్నారు. ఇది ముఖ్యముగఁ బద్యములకు సంబంధించిన యలంకారము. పద్యమునకు నాలుగుపాదము లుండును. ప్రథమపాదము ౧ ద్వితీయపాదముతోడను, ౨ తృతీయపాదముతోడను, 3 చతుర్థపాదముతోడను, ౪ ద్వితీయపాదము తృతీయపాదముతోడను, ౫ చతుర్థపాదముతోడను, ౬ తృతీయపాదము చతుర్థపాదముతోడను, ౭ ప్రథమపాదము మిగిలిన మూఁడుపాదములతోడను, ౮ ప్రథమ ద్వితీయ పాదములును, తృతీయ చతుర్థపాదములును, ౯ ప్రథమ చతుర్థపాదములును, ద్వితీయ తృతీయ పాదములును ఒక్కవిధముగా (ఏకవర్ణాత్మకముగ) నున్న యెడల వేఱువేఱు యమకము లగును. ౧౦. అట్లే మొదటి రెండు చరణములును చివర రెండుచరణములుగ శ్లోకార్థము మరలఁ జెప్పఁబడుటయు, ౧౧ శ్లోక మంతయు భిన్నార్థమందు మరలఁ జెప్పఁబడుటయు యమకభేదంబులే. వీనికిఁ గ్రమంబుగ ౧ ముఖ, ౨ సందంశ, 3 ఆవృత్తి, ౪ గర్భ, ౫ సందష్టక, ౬ పుచ్ఛ, ౭ పంక్తి, ౮ యుగ్మక, ౯ పరివృత్తి, ౧౦ సముద్గ, ౧౧ మహాయమకము లని పేళ్లు గలవు.

వీని యన్నింటికి నుదాహరణంబు లిచ్చుట యనావశ్యకము. దిక్ప్రదర్శనంబుగ నొకటి రెండింటిని జూపెదను.

ఉదా:

క. ఔరా! సూబనృపాలకు
మారా మనుమడనసమరమాఘుర్యుఁడ వై
ధీరా నృసింహ కూడితి
మారామను మడనసమరమాఘుర్యుఁడవై. (న. భూ., ౪-౮౧).

ఇందు ద్వితీయపాదము చతుర్థపాదముతో సమానము. కావున నిది సందష్టయమకము.

తే. మతి వినాయకభరిత సమ్మదుఁ డనంగ
మతి వినాయకభరిత సమ్మదుఁ డనంగ
మతి వినాయకభరిత సమ్మదుఁ డనంగ
మతి వినాయకభరిత సమ్మదుఁ డనంగ. (అప్పక., ౪).

ఇది 'పంక్తియమకము'. 'సీ. రాజనందన రాజ రాజాత్మ జాలు సాటి తలఁప నన్నయవేమధరణిపతికి' అని నాల్గుచరణములును ఒకరీతిగాఁ జెప్పుచు మనవారు చదువుపద్య మిట్టిదే.

ఒక్కొకపాదమును రెండుగ విభజించి, యిట్లు వచ్చిన ౮ పాదార్థములకును పైని పాదములకుఁ జెప్పినట్లు పరస్పరయామక సామ్యమును జెప్పినయెడల నెన్నియో భేదంబు లుత్పన్నమగును. అట్లే యొక్కొకపాదమును 3, ౪, ౫ భాగములుగ విభజించినచో యమక భేదంబులు వేనవేలుగ నగును.

(౧) సీ. తన భవ్యధామంబు తన భవ్యధామంబు
కరణి మిత్రోన్నేమకరము గాఁగ (వసు., ౧-౨౮)

(౨). సీ. ఏరాజు భూరితేజోరుణాలోకంబు
లోకంబుతమము నిరాకరించి (వసు., ౧-౩౦)

(3). బాల బాలరసాల మిది పిక
పాలిపాలిటియమరసాలము
గేలి గేలికి స్రుచ్చుఁ గడు రా
గిల్లు గిల్లుము తత్ప్రవాళము (వసు., ౩-౧౪౯)

ఇందు 'లము', 'ళము' అను నంత్యయమకము సూడఁ గలదు.

(౪). ఉ. లింగనిషిద్ధుఁ గల్వలచె
లిం గని మేచకకంధరుం ద్రిశూ
లిం గని సంగతాళి లవ
లిం గని కర్దమనాషితక్ష మృణా
లిం గని కృష్ణచేలుని హ
లిం గని నీలకచక్ష విధాతృనా
లిం గని రామలింగకవి
లింగని కీర్తి హసించు దిక్కులన్. (చాటువు)

ముక్తపదగ్రస్త మనునది యమకములో నొకభేదము. దానిని తెలుఁగున నాంధ్రకవులు తమ గ్రంథములలో నాశ్వాసాంతగద్యము లందు వాడెదరు.

ఉదా:

మ. దృఢబాహాబలభీమ భీమసమర ప్రేంఖజ్జయ శ్రీపరి
బ్రఢిమాధాళితభూమ భూమహితతూర్యధ్వానదత్తేభ ధా
క్కఢమత్కారవిరామ రామకధన శ్లాఘ్యాన్వవాధిల్లికా
గఢరాడాద్యరిధామ ధామగరిమ గ్రస్తగ్రహాధీశ్వరా.
—(వసు, ౬-౧౦౧)

ఈ క్రిందిపద్యమునందు, పాదాది నముక్తపదగ్రస్తయమకమును, నాలుగుపాదములకును 'రసా' యను రెండక్షరముల యంత్య యమకమును కలదు:—

1. అత్ర క్వచిత్ భిన్నార్థకత్వం క్వచి దభిన్నార్థకత్వం క్వచిదేకస్యానర్థకత్వ మపరస్య సార్థకత్వ మితి సంక్షేపతః ప్రకారత్రయమ్—(అ. స).

sampath_Ebooks

సుగంధివృత్తము—

సారసాహితీ సదన్వవచారి భూరి ధీరసా
ధీరసాహసోరుదోరతిస్ఫురన్నహారసా
హారసానుమత్తటీసురాపగా సుధారసా
ధారసాధుకీర్తిహంసధారి సూరిసారసా. (వసు., ౬-౧౦౩)

ఇట్లు యమకప్రకారము లనేకములు గలవు. సంస్కృతంబున వీనికి వేఱువేఱు నామంబులుకూడఁ గలవు. మన యాంధ్రంబున ప్రాసమున్నట్లు, ఉత్తరహిందూదేశమందలి హిందీ, మరాటీ, బంగాలీ మొదలయినభాషలలోనికావ్యముల కంత్యయమక మత్యంతావశ్యకము. పద్యమందలి మొదటి రెండుచరణములకును, చివర రెండుచరణములకును అంతమున నొకేయక్షర ముండును. పెక్కు అక్షరములు కూడ సమానముగ నుండవచ్చును. కాని యొక్కటైనను సమానముగ నుండితీఱవలెను. దీనినే యింగ్లీషులో రైమ్ (Rhyme) అందురు.

'ప్రాయశో యమకే చిత్రే రసపుష్టి ర్న దృశ్యతే' (సాధారణముగ యమకమందును, చిత్రకావ్యమునందును రసపుష్టి కాన్పింపదు) అని ఏకావళీకారుఁడైన విద్యాధరుఁడు స్పష్టముగఁ జెప్పియున్నాఁడు.

చిత్రాలంకారములు:— 'చిత్ర'ములు శబ్దాలంకారాంతర్గతము లైనను, పూర్వలాక్షణికులు చిత్రమును ఒక కావ్యభేదముగ నెంచినందున ఈవిషయము 'చిత్రకావ్యము' అను శీర్షికక్రింద సవిస్తరముగ వివరింపఁబడును.

అర్థాలంకారములు ౧౧౮.

కువలయానందమునందు ౧౧౫ అలంకారము లీయఁబడినవి. రసగంగాధరములోనివి యగు 'ఉదాహరణము', 'అసమము', 'తిరస్కారము' అను నలంకారములు వీనిలోఁ గలుపఁగా ౧౧౮ సంఖ్య యేర్పడినది. వానివివరము:—

౧. ఉపమాలంకారము:— లక్ష: ఒకపదార్థమును మఱియొక పదార్థముతోఁ బోల్చి చెప్పుట 'ఉపమ'.

ఉదా: ఆబాలునిముఖము చంద్రునివలె నందముగ నున్నది.

ఏపదార్థము వర్ణనావిషయమో, అనఁగా దేనిని మనము వర్ణించుచున్నామో దానికి ఉపమేయము (లేక వర్ణ్యము, ప్రస్తుతము, ప్రకృతము, విషయము) అని పేరు. దేనితో నుపమేయమును పోల్చుచున్నామో దానికి ఉపమానము (అవర్ణ్యము, అప్రస్తుతము, అప్రకృతము, విషయి) అని పేరు. రెంటియందును గల యేగుణమునుబట్టి ఉపమేయోపమానములను పోల్చుచున్నామో ఆగుణమునకు 'సమానధర్మము' (పోలిక) అని పేరు. ఏశబ్దమువలన ఈ సమానధర్మమును సూచించుచున్నామో యది 'ఉపమావాచక'శబ్దము. పైయుదాహరణమునందు 'ముఖము' ఉపమేయము, 'చంద్రుఁడు' ఉపమానము, 'అందము' సమానధర్మము, 'వలె' అనుపదము ఉపమావాచకము.

ఉపమాప్రయోజనములు: (౧) స్తుతి, (౨) నింద, (౩) తత్త్వబోధ. ఇందుకుఁ గ్రమముగ నుదాహరణములు: (౧) ప్రేమతోఁగూడినభార్య అమృతమువంటిది. (౨) సంపద మద్యమువంటిది. (౩) ఆకాశమునందు బండివలెఁ గానఁబడుచున్న చుక్కలవరుసయే రోహిణీనక్షత్రము.

ఉపమాలంకారలక్షణము లనేకలాక్షణికు లనేకవిధములఁ జెప్పియున్నారు. కొన్ని యిందు నుదాహరించుచున్నాము:—

భామహుఁడు:— దేశకాల క్రియాదులచే వేఱైన ఉపమానముతో నుపమేయమునకు గుణలేశముచేతనైనను సామ్యము చెప్పఁబడినయెడల నుపమ యగును.

ఉద్భటుఁడు:— కాలాదికములచే భిన్నము లగు ఉపమానోపమేయము లను రెండుశబ్దములకుఁ గల మనోహరమైన సాధర్మ్యముపమ.

దండి:— ఎంతమాత్రమైనను సాధర్మ్యము కానఁబడిన నది యుపమ.

వామనుఁడు:— గుణలేశమువలనను ఉపమానముతో నుపమేయమునకు సామ్యము చెప్పుట ఉపమ.

మమ్మటుఁడు:— భేదముగల పదార్థములకు సాధర్మ్యము చెప్పఁబడినయెడల నుపమ.

రుయ్యకుఁడు:— ఉపమానోపమేయములసాధర్మ్యమునందు భేదాభేదములు సమానముగ నున్న నుపమ.

జగన్నాథుఁడు:— వాక్యార్థమునకు నుపస్కారకమును సుందరమును అయినసాదృశ్యము ఉపమ.

విద్యానాథుఁడు:— వర్ణింపఁదలఁచిన యొక పదార్థమునకు స్వతఃసిద్ధమైనట్టిదియు భిన్నమైనట్టిదియు రసికసమ్మతమైనట్టిదియు నగు మఱియొకపదార్థముతో ధర్మసంబంధమైన సామ్యమును వాచ్యముగ నొక్కసారి చెప్పుట ఉపమ.

విన్నకోట పెద్దన:—

క. గుణధర్మకర్మముల ను
ల్బణ మయ్యెడువస్తువునకుఁ బరువడిఁ దుల్య
ప్రణయమునఁ జేయు నెయ్యది
గణుతింతురు దాని నుపమగా బహువిధులన్.

భట్టుమూర్తి:—

సీ. ఉత్ప్రేక్షవలె నసిద్ధోపమ గాకన
న్వయమునకైవడి నభిన్నంబు గాక
హీనోపమయుఁ బోలె నిల నహృద్యము గాక
యుపమాన మనఘమై యుండెనేని
శ్లేషంబువలెఁ బదశ్లిష్టమాత్రము గాక
సార్థమై యల రూపకాదుల క్రియ

వ్యంగ్యంబు గాక సామ్యము వాచ్య మగు లేని
  నుపమ్యము ప్రతీప మట్లు దలఁపఁ
గ్రమవిపర్యాససహితంబు గాక యున్న
నలరు నుపమేయలోపమ యట్లు సామ్య
ధర్మ మిరువాఱు వరుసలఁ దిడవకున్న
నుపమ యగు దీనిభేదంబు లుగ్గడింతు.

విద్యానాథునిలక్షణమునందలి యన్నిపదములకును గలసార్థకత పట్టుమూర్తియొక్క పద్యమునందుఁ జూపఁబడినది.

ఈ లక్షణము లన్నియుఁ జూచి 'సాధర్మ్య ముపమా భేదే' (భేద మున్నవానికి సాధర్మ్య ముపమ) అను మమ్మటునిచిన్నిలక్షణమే సొంపుగఁ గానవచ్చుచున్నది. భిన్నము లయినరెండుపదార్థములకు సాదృశ్యము (పోలిక) చెప్పఁబడుటయే యుపమ. వానిలో వర్ణ్యము ఉపమేయము. రెండవది ఉపమానము. ఉపమ భేదాభేద ప్రధాన మని రుయ్యకుఁడు చెప్పినమాటకు నిదియే యర్థము. ఉపమానోపమేయములకు భేద ముండవలెను, సామ్య ముండవలెను.

'సాదృశ్యము', 'సాధర్మ్యము' అనునవి భిన్నపదార్థము లని ప్రాచీనాలంకారికులమతము; ఆ రెండును ఒక్కటియే యని నవీనుల మతము— (ప్రభా).

ఉపమానప్రతియోగికమును, ఉపమేయానుయోగికమును అగు సంబంధము సాదృశ్య మనియు, సాధారణధర్మప్రతియోగికమును, ఉపమానోపమేయోభయానుయోగికమును అగుసంబంధము సాధర్మ్య మనియు భేదవాదులయభిప్రాయము.

ఉపమాభేదములు :— ఉపమాలంకారముయొక్క భేదము లాలంకారికు లనేకవిధములఁ జెప్పిరి. సాదృశ్యగర్భములైన యలంకారము లన్నియు నుపమాభేదములే యని కొందఱిమతము. (మాఘుఁడు, వామనునికావ్యాలంకారసూత్రములు). దండి సమానధర్మ భేదములనుబట్టి ఉపమను ౩౨ విభాగములుగఁ జెప్పి యుదాహరణముల నిచ్చెను. వాని నీక్రింద నుదాహరించుచున్నాము :—

౧. ధర్మోపమ :— ముద్దరాల! నీ యఱచేయి పద్మమువలె నెఱ్ఱగ నున్నది.

౨. వస్తూపమ :— నీముఖము పద్మమువలె నున్నది (ఇందు ధర్మము ప్రతీయమానము).

౩. విపర్యాసోపమ :— నీ ముఖమువలె నరవిందము వికసించి యున్నది (ఇతరులు దీనిని ప్రతీపాలంకార మందురు).

౪. అన్యోన్యోపమ :— నీ ముఖము పద్మమువలెను, పద్మము నీముఖమువలెను ఉన్నది (దీనిని ఇతరులు ఉపమేయోపమయందురు).

౫. నియమోపమ :— నీ ముఖము కమలమునే పోలును, మఱి దేనిని పోలదు.

౬. అనియమోపమ :— నీముఖము పద్మమును అనుకరించుచున్నది. దానిని అనుకరించు మఱేదేనిపదార్థము ఉన్న నుండుఁగాక.

౭. సముచ్చయోపమ :— కాంతిచేతనే కాక అహ్లాదకరత్వము చేతఁగూడ నీముఖము చంద్రునిఁ బోలును.

౮. అతిశయోపమ :— నీ ముఖమును నీయందే చూచితిని. చంద్రుని ఆకాశమందే చూచితిని.

౯. ఉత్ప్రేక్షితోపమ:— ఈమెముఖశ్రీ నాయందే యున్నదని చంద్రుఁడు గర్వపడ నక్కఱలేదు; పద్మమునందుఁగూడ నది కలదు.

౧౦. అద్భుతోపమ :— పద్మము విభ్రాంతనయన మైనయెడల నీ ముఖశ్రీనిఁ బొందవచ్చును.

౧౧. మోహోపమ :— కృశాంగి! చంద్రునిఁ జూచి నీముఖమనుకొని దానిపై బ్రసరుఁ బోయితిని.

౧౨. సంశయోపమ :— ఇది లోపలఁ దిరుగుచున్న భ్రమరములు గల పద్మమా? లోలేక్షణములుగల నీముఖమా? యని నా చిత్తము డోలాయమాన మగుచున్నది.

౧౩. నిర్ణయోపమ :— చంద్రునిచేతను నిగ్రహింపఁబడిన పద్మముయొక్క కాంతి చంద్రునకు సిగ్గు కల్గించునదిగ నుండదు. ఇట్టి కాంతికలది గావున నిది నీ ముఖమే.

౧౪. శ్లేషోపమ :— నీ ముఖము పద్మమువలె శశాంకప్రతిస్పర్ధియు శ్రీగలదియు, సురభిగంధియు నగును.

౧౫. సమానోపమ :— ఈ యుద్యానమాల బాలికవలె సాలకాననశోభిని (సాలకాననశోభిని = సాలవృక్షములయరణ్యములతో శోభించునది, కురులతోఁ గూడి శోభించుచున్న ముఖముయొక్క చక్కఁదనము కలది).

౧౬. నిందోపమ :— కమలము పరాగపూర్ణము, చంద్రుఁడు క్షయి, నీ ముఖము వానితో సమాన మైనను, వానికంటె నుత్కర్షశాలి.

౧౭. ప్రశంసోపమ :— బ్రహ్మకుఁ బుట్టినిల్లయిన పద్మమును, శివునిచే శిరస్సున ధరింపఁబడిన చంద్రుఁడును నీ ముఖముతో సమానములు.

౧౮. ఆచిఖ్యాసోపమ :— నీముఖము చంద్రునితోడ సమానము అని నాయభిప్రాయమును చెప్పఁదలఁచుచున్నాఁడను. అది గుణమో దోషమో.

౧౯. విరోధోపమ :— శతపత్రము, శరచ్చంద్రుఁడు, నీ ముఖము - ఈమూఁడును పరస్పరము విరోధము కలవి.

౨౦. ప్రతిషేధోపమ :— కలంకియును, జడుఁడును అగు చంద్రునకు నెప్పుడును నీముఖముతోఁ బ్రతిస్పర్ధించుశక్తి లేదు.

sampath_Ebooks

౨౧. చటూపమ :— నీ ముఖము మృగాంకితము; చంద్రుఁడో, మృగాంకితుఁడు. అయినను నీతో సమానుఁడే కాని అధికుఁడు గాఁడు.

౨౨. తత్త్వాఖ్యానోపమ :— ఇది పద్మము కాదు, ముఖమే; ఇవి తుమ్మెదలు కావు, కన్నులే.

౨౩. అసాధారణోపమ :— చంద్రారవిందములకాంతి నతిక్రమించి నీముఖము తనకుఁ దానే సాటి యాయెను.

౨౪. అభూతోపమ :— నీముఖము, ఒకచోటను సంగ్రహించి రక్షింపఁబడిన అన్నిపద్మముల కాంతి పుంజమువలె శోభించుచున్నది (దీనిని కొందఱు ఉత్ప్రేక్ష యందురు).

౨౫. అసంభావితోపమ :— నీముఖముననుండి కఠినవాక్యములు వచ్చుట, చంద్రబింబముననుండి విషమువచ్చుటవలెను, చందనముననుండి యగ్నివచ్చుటవలెను ఉండును.

౨౬. బహూపమ :— చందనోదక చంద్రాంశు చంద్రకాంతాదికమువలె నీస్పర్శ అధికశీతలముగ నుండును.

౨౭. విక్రియోపమ :— తన్వంగి! నీముఖము చంద్రబింబముననుండి త్రవ్వి తీసినట్లును, పద్మముయొక్క గర్భముననుండి లాగి తీసినట్లును ఉన్నది.

౨౮. మాలోపమ :— సూర్యునియందు వెంటవలెను, పగటియందు సూర్యునివలెను, ఆకాశమునందుఁ బగటివలెను విక్రమము నీయందు లక్ష్మినిఁ గూర్చెను.

౨౯. వాక్యార్థోపమ :— ఒక వాక్యార్థమును మఱియొక వాక్యార్థములోఁ బోల్చినయెడల నది వాక్యార్థోపమ. ఇది యేకవశబ్దత్వ, అనేకవశబ్దత్వములచే రెండు తెఱఁగులు :—

ఉదా: (౧). చంచలనేత్రములు కలదియు, ఆవిర్భవించిన దంతకాంతి కలదియు నగునీముఖము, భ్రమద్భృంగము, ఈషల్లక్ష్యకేసరములు గలదియునగు పంకజమువలెఁ దోఁచుచున్నది.

ఉదా: (౨). తామరతీగవంటి యాతన్వంగియొక్క పద్మమువంటి మోము మధుకరమువంటినాచే మఱిమఱి త్రాగఁబడెను.

౩౦. ప్రతివస్తూపమ :— రాజులలో నీవంటివాఁడు లేఁడు; పారిజాతవృక్షము రెండవది లేనేలేదుగదా!

౩౧. తుల్యయోగోపమ :— ఓనృపా! ఇంద్రుఁడు స్వర్గరక్షణమునకును, నీవు భూమిరక్షణమునకును మేల్కొంచియుందురు. అతనిచే నసురులును, నీచే గర్వితనృపులును చంపఁబడుదురు.

౩౨. హేతూపమ :— రాజా! కాంతిచేఁ జంద్రుని, తేజస్సుచే సూర్యుని, ధైర్యముచే సముద్రుని ననుకరించుచున్నావు.

మమ్మటాదులచేఁ గల్పింపఁబడిన భేదములు :— ఈ భేదముల నన్నింటిని తరువాతిలాక్షణికు లొప్పుకొనలేదు. వారీయలంకారమును మఱియొకవిధముగ విభజించిరి. ఆవిభేదములు నిజముగ వ్యాకరణవిషయములు గాని అలంకారవిషయములు కావు.[1] అయినను మమ్మటాది పూర్వాచార్యులును, జగన్నాథాదులగు అర్వాచీనులును ఉదాహరించి నందున వాని నిచ్చట దిక్ప్రదర్శనముగఁ జూపెదను.

ఉపమ 'పూర్ణ' యనియు, 'లుప్త' యనియు రెండువిధములు. ఉపమానము, ఉపమేయము, సమానధర్మము, ఉపమావాచక శబ్దము — ఈనాలుగును స్పష్టముగ నెందుఁ జెప్పఁబడునో యది 'పూర్ణ'. ఈనాలుగింటిలో నొక్కటిగాని, రెండుగాని, మూఁడుగాని లోపించినచో 'లుప్త' యగును.

ఉదా: రామచంద్రునిముఖము చంద్రునివలెఁ జక్కఁగ నున్నది.

ఇది 'పూర్ణ'. ముఖము 'ఉపమేయము', చంద్రుఁడు 'ఉపమానము', చక్కఁదనము 'సమానధర్మము', 'వలె' ననునది 'ఉపమాసూచక' పదము.

ఉదా: రామచంద్రునిముఖము చంద్రునివలె నున్నది.

ఇది 'లుప్త'. ఇందు 'సమానధర్మము' లోపించినది.

'పూర్ణ' మరల రెండువిధములు :— 'శ్రౌతి', 'ఆర్థి'. శబ్దమువలననే 'ఉపమ' యని బోధ యయ్యెనేని 'శాబ్ది'; అర్థమువలన 'ఉపమ' యని బోధ యయ్యెనేని యది 'ఆర్థి'. సంస్కృతమున ఇవ యథాదిశబ్దములవలనను, ఇవార్థవిహితమైన వతి ప్రత్యయమువలనను 'ఉపమ' 'శాబ్ది' యగును. తుల్యసదృశాదిశబ్దములను ప్రయోగించినను తదర్థకవతిప్రత్యయమువలనను 'ఆర్థి' యగును. 'చంద్ర ఇవ సుందరం ముఖం' (చంద్రునివలెఁ జక్కనిముఖము) అనునది 'శ్రౌతి'; 'చంద్రేణ తుల్యం ముఖం' (చంద్రునితోఁ దుల్యమగు ముఖము) అనిన 'ఆర్థి'. ఇది కేవలము సంస్కృతవ్యాకరణము ననుసరించినభేదము గాని వేఱు కాదు. కావున తెలుఁగున ఈ భేద మంతగాఁ జెల్లదు. అయినను తెనుఁగున నాభేదము తెచ్చిపెట్టుకొనవలయు నన్న 'వలె', 'పోలె' అనుపదము లున్న 'శాబ్ది' యనియు, 'జోడు, పోలిక, సరి, సంగడి, ఉద్ది, ఈడు, సాటి, పగిది, కరణి' మొదలగునవి యున్న 'ఆర్థి' యనియుఁ జెప్పవచ్చును.

శ్రౌతి :— అధిపుఁడు కందర్పుఁడునుబోలె నలరుచుండును.

---

1. 'వస్తుతో ఒయం పూర్ణాలుప్తాదిభాగో వాక్యసమాసక్యచ్ క్యఙాదిప్రత్యయవిశేషగోచరతయా శబ్దశాస్త్ర వ్యుత్పత్తికౌశల పరత్వా దత్ర శాస్త్రే న ఉపయోగ్యత్వా దుపేక్షితవ్యః.' — [ఉద్యోత].

sampath_Ebooks

ఆర్థి :— అధిపుఁడు శౌర్యమునందు రఘురామ సన్నిభుఁడు — (వ. భూ).

ఈ రెండు భేదములును మరల వాక్యసమాసతద్ధితగతము లని యొక్కొక్కటి మూఁడువిధములై ఆఱు తెఱఁగు లయ్యెను.

ఉదాహరణములు :

వాక్యగత :— రాముఁడు చంద్రునివలె నాహ్లాదకరుఁడు.

ఇది పూర్ణ శ్రౌతి వాక్యగత.

సమాసగత :— ఆహ్లాదకరుం డగు రాముఁడు చంద్రోపముఁడు.

'చంద్రోపముఁడు' అను ఉపమానగర్భితపదము సమస్తము కావున నిది 'సమాసగత'. ఇది పూర్ణ ఆర్థి సమాసగత యని తెలిసి కొనవలసినది.

తద్ధితగత :— ఆహ్లాదకరుఁడగు రాముఁడు చంద్రకల్పుఁడు.

సంస్కృతమున 'వతి' ప్రత్యయంబుచేఁ దద్ధితం బగు. కాని తెలుఁగున నా యర్థమందు 'వతి' లేనందున 'కల్ప' ప్రత్యయమే యుపయోగింప నగు నని సరసభూపాలీయకారుని యభిప్రాయము[1]. కావున నియ్యది పూర్ణ ఆర్థి తద్ధితగత.

ఇట్లే 'పూర్ణ'లోని వేఱుఉదాహరణముల నెఱుంగునది.

ఇఁక 'లుప్త' యొక్క భేదముల విచారింతము. లుప్తలో, ఉపమయొక్క అవయవములు ఒక్కటిగాని, రెండుగాని, మూఁడు గాని లోపించును. నాల్గును లోపించిన నర్థమే యుండదు. కావున నాల్గును ఏకకాలమందు లోపింపవు. ఒక్కటి లోపించువిధమ మూఁడు: ౧. ఉపమానలుప్త, ౨. ధర్మలుప్త, ౩. వాచకలుప్త; 'ఉపమేయ లుప్త' చెప్పఁబడలేదు. రెండు లోపించువిధములు మూఁడు. ౪. ధర్మ వాచకలుప్త, ౫. ధర్మోపమానలుప్త, ౬. వాచకోపమేయ లుప్త. ఇవి తప్ప నితర సేవియు రెండురెండు లోపించుటకు వీలులేదు. మూఁడును లోపించువిధము ఒకటి: ౭. అది ధర్మోపమానవాచకలుప్త. ఇట్లు లుప్త యేడు విధములు.

ఉదా : (౧). లోకోత్తరములయిన వర్ణమును పరిమళమును గల కుసుమకులతిలకమవగు చంపకమా! నీవు దేనితోఁ దులతూఁగు దువో మే మెఱుఁగము. —(ర. ౯౦).

ఇందు నుపమాన మెద్దియో యెఱుంగ మని చెప్పఁబడినది. ఉపమానము లేనేలే దన్నయెడల 'అసమాలంకార' మైయుండును.

ఉదా : (౨). ముఖము చంద్రునివలె నున్నది. ఇందు సమాన ధర్మము చెప్పఁబడలేదు.

ఉదా : (౩). అతఁడు రామాభిరాముఁడు. ఇచట 'రామాభిరాముఁడు' అనఁగా రామునివలె నభిరాముఁడు అని యర్థగతము. ఇట్లు వాచకము (వలె ననుధర్మవాచకము) సమాసగతమై లోపించెను.

ఉదా : (౪). ధర్మవాచకలుప్త — శత్రురాజుల మనోరాజ్య శతముచేతఁగూడ దురాక్రముఁడైన యీ రాజకుంజరుఁడు యుద్ధ ప్రవృత్తుఁ డయ్యెను.

ఇందలి 'రాజకుంజర' శబ్దము ఉపమితసమాసము. కుంజరము వంటిరాజు అని యర్థము. ఇట్లు సమాసమునందు వాచకము లోపించి నది. రాజును కుంజరముతోఁ బోల్చుట దురాధర్షత్వపరసేనావిద్రా వకత్వాదిసాధారణధర్మములవలన అని స్పష్టముగఁ జెప్పఁబడియుండ లేదు. కావున నిది ధర్మవాచకలుప్త.

ఉదా : (౫). ధర్మోపమానలుప్త— మధుపము వనమంతయు గాలించినది. చెట్ల నన్నింటిని చూచినది. కాని యోసహకారమా! నీ వంటిచెట్టుమాత్రము దానికి దొరకలేదు — (ర. ౯౦).

ఇందు నుపమానము దొరకలే దని చెప్పఁబడినది; సమాన ధర్మము చెప్పఁబడలేదు.

ఉదా : (౬). వాచకోపమేయలుప్త — సంస్కృతంబున నిది 'క్యచ్' ప్రత్యయముతో నగును. తెలుఁగున నాప్రత్యయము సదృశ మన్యము లేదు.

ఉదా : (౭). ధర్మోపమానవాచకలుప్త—ఆమె మృగనయన.

ఇది సమాసమునందే సాధ్యము. ఇందలి సమాసమునకు మృగము కనులవంటి చంచలము లయిన నయనములు కలది యని యర్థము. ఇందు సమాసమువలన చంచలత్వము అను సమానధర్మమును 'వంటి' యను వాచకమును లోపించిన దనుట స్పష్టము. కాని ఉపమేయమైన మృగనయనపదము కానిపించుచుండఁగ నెట్లులోపించినదని కొందఱకు సంశయము కలుగవచ్చును. కాని సమాసములో నిలిచిన మృగనయన పదము ఉపమేయమైన స్త్రీసూచకము గాని ఉపమానపరము గాదు.

దీనికిఁ దెమఁగున నుదాహరణము కావలయు నన్న 'పూఁబోఁడి' వంటి సమాసపదము నుదాహరింపవచ్చును. 'మేమకు బోఁడి యగు' అను సూత్రప్రకారము ఈపదమునకు పూవువంటిసుకుమార ప్రమేను కలది యని యర్థము.

ఈ ౭ భేదములును ఈక్రింది విధముగ ౧౪ విధము లయ్యెను.

౨. ఉపమానలుప్తలు :— వాక్యగ, సమాసగ.

౫. ధర్మలుప్తలు :— వాక్యగతశ్రౌతి, వాక్యగతార్థి, సమాసగతశ్రౌతి, సమాసగతార్థి, తద్ధితగతార్థి.

1. క. అల తద్ధితములయందుం, దెలియ వతిప్రత్యయంబు తెలుఁగున లేఖం, గలిగిన కల్పప్రత్యయ, మలరుచు నయ్యర్థియంద యది గన్పట్టున్.— (శా. సం., ౫ అ).

sampath_Ebooks

౬. వాచకలుప్తలు :— సమాసగత, కర్మక్యజ్గత, ఆధారక్యజ్గత, క్యజ్గత, కర్మణముల్గత, కర్తృణముల్గత.

౨. ధర్మవాచకలుప్తలు :— క్విప్గత, సమాసగత.

౨. ధర్మోపమానలుప్తలు :— వాక్యగ, సమాసగ.

౧. వాచకోపమేయలుప్త :— క్యజ్గత.

౧. ధర్మోపమానవాచకలుప్త :— సమాసగ.

వీనికి వేఱువేఱు ఉదాహరణముల నూహించుకొనవలెను.

కావ్యప్రకాశకారునిమతమున పూర్ణాభేదములు ౬ ను, లుప్తాభేదములు ౧౯ యుఁ గలసి 'ఉపమ'కు ౨౫ భేదములు. ఇతరులు ౩౨ భేదము లని చెప్పిరి.

ఇంకొకవిధముగ విభజన:— పైని చెప్పఁబడిన ౨౫ లేక ౩౨ భేదములలో ఒక్కొక్కదానిని మరల ౫ విధముల విభజించి విభాగప్రియులు మొత్తమున, ౧౨౫ లేక ౧౬౦ భేదములు ఉపమకుఁ గల్పించిరి!!! ఈ ౫ భేదము లేవి యన :— ౧. వస్తు, ౨. అలంకార, ౩. రసరూపము లైన ప్రధానవ్యంగ్యమునకు నుపస్కారముగను, ౪ వస్తు, ౫ అలంకారరూపము లైన వాచ్యమున కుపస్కారముగను నుండునవి.

ఉదా: (౧). వ్యంగ్యవస్తూపస్కారిక :—

ఎల్లప్పుడును పరోపకారచింతయే కలిగి పరిశుద్ధమైన అంతఃకరణములుగల మహాత్ములవచనములు ఔషధములవలె మొదటఁ జేఁదుగఁ గానవచ్చును — (ర. గం).

ఇందలి 'ఔషధములవలె' నన్న యుపమవలన, మహాత్ముల వచనములు మొదటఁ జేఁదుగ నుండినను, వానిని విని అట్లాచరించిన యెడలఁ బరిణామమున నవి పరమసుఖప్రదము లగు నని ముఖ్యమైన వ్యంగ్యార్థము స్ఫురించుచున్నది.

ఉదా : (౨). వ్యంగ్యాలంకారోపస్కారిక :

మచ్చవలె నున్న కస్తూరిబొట్టుగల నీ ముఖమును జూచి చక్కని పిల్ల లుల్లాసముచే వికాసమును బొందిన తెక్కలలోనుండి చంచూపుటములు కదలించుచున్నవి — (ర. గం).

ఇందు, ప్రధానవ్యంగ్య మైనది ముఖమునందుఁ జంద్రారోపణముగల భ్రాంతిమదలంకారము. దానికి ముఖమందలి కస్తూరిబొట్టును చంద్రునితోఁ బోల్చిన ఉపమ ఉపస్కారకము.

ఉదా : (౩). వ్యంగ్యరసోపస్కారిక :—

నేను వెళ్లునప్పుడు పెద్ద లచ్చట నున్నందున సిగ్గుచే నన్నుఁ జక్కఁగఁ జూచుటకు వీలు లేక యాచెలి యోరగంటిచూపుతోఁ జూచెను. విచ్చీవిచ్చనికమలముల చక్కఁదనమును బోలియున్న యా కన్నులను నేను మఱవఁగలనా ? — (ర. గం).

ఇందు వ్యంగ్యముగ నున్న రసము విప్రలంభశృంగారము. 'విచ్చీవిచ్చనికమలముల చక్కఁదనమును బోలియున్న యాకన్నులు' అన్న యుపమ రసమునకు నుపస్కారకము.

ఉదా : (౪). వాచ్యవస్తూపస్కారిక :

శరత్కాలచంద్రునివంటి నీ ముఖము నాకమలను శిశిరములుగఁ జేయుఁగాతి! — (ర. గం).

ఇందలి కమలను శిశిరములుగఁ జేయుచున్నట్టి వాచ్యరూపమగు వస్తువునకు శరచ్చంద్రోపమ ఉపస్కారిక.

ఉదా : (౫). వాచ్యాలంకారోపస్కారిక :

శిశిరముచే సరోరుహమును, పగటిచేఁ జంద్రమండలమునువలె నెక్కని దైనను నీముఖము రోషముచే శోభించుటలేదు — (ర. గం).

ఇందు 'దీపకాలంకారము' వాచ్యము. దానికి 'ఉపమాలంకారము' ఉపస్కారకము.

వాచ్యమునందు రస ముండదు; కావున వాచ్యరసోపస్కారిక యగు ఉపమ యుండనేరదని ధ్వనిపక్షమువారి యభిప్రాయము.

౨. అనన్వయాలంకారము :— ఒక వస్తువునకు సాటి లే దని చెప్పుటకై దానిని దానితోనే పోల్చుట 'అనన్వయము'.

ఉదా : రామునివంటివాఁడు రాముఁడే.

పండితమతమున నిది యుపమాభేదము.

౩. ఉపమేయోపమాలంకారము:— లక్ష : రెండు వస్తువులను (వానిని బోలిన మూఁడవవస్తువు లే దని చెప్పుటకై) ఒకదానితో మఱియొకదానిని (పరస్పరము) పోల్చుట 'యుపమేయోపమ'.

ఉదా : సజ్జనులమనసు మేఘోదకమువంటిది ; మేఘోదకము సజ్జనులమనసువంటిది.

దండిమతమున నిది యుపమాభేదము.

౪. స్మరణాలంకారము:— లక్ష : ఒక పదార్థమును చూచినప్పుడు సాదృశ్యము (పోలిక) చేత మఱియొకటి స్మరణకు వచ్చినచో 'స్మరణము'.

ఉదా : ఈరాజు చేయుదానములను జూచినచో భారతమునందలి కర్ణుఁడు తలంపునకు వచ్చుచున్నాఁడు.

'స్మరణము' సాదృశ్యమూలకము కాదేని యీ యలంకారము కాదు. 'మిత్రునిఁ జూడఁగనే మేము చిన్నవాఁ డాడినయాటలు స్మరణమునకు వచ్చుచున్నవి' యన్న వాక్యమందలి స్మరణము సాదృశ్యోద్బోధకము కాదు. కావున నిది స్మరణాలంకారము కాదు.

౫. రూపకాలంకారము: — లక్ష : ఉపమేయమును కప్పిపుచ్చక దానియందు నుపమానము నారోపించినయెడల 'రూపకము'.

sampath_Ebooks

ఉదా: అనీతి యనువృక్షమును ఛేదించుటకు నింద్రియ నిగ్రహము గొడ్డలి.

ఉపమేయోపమానములకుఁ దాదాత్మ్యమే యీయలంకారము. కాని యీ యైక్యముచేత నుపమేయము కప్పఁబడదు. సందేహాప హ్నుతి భ్రాంతిమ దతిశయోక్త్యాదులందు నుపమేయము కప్పఁబడును. అట్లిచ్చట లేదు. ఇదియే వానికిని దీనికినిగలభేదము. ఈ యలంకార మందు ఉపమానము తనరూపమును ఉపమేయమునకు నొసంగును. కావున రూపక మయ్యె. 'ప్రబోధచంద్రోదయ' నాటక మంతయు రూపకోదాహరణ మనియె చెప్పవలెను.

భేదములు:— మొదట నిది వాక్యగత, సమాసగత యని ద్వివిధము. ముఖ మనుపద్మము, విద్య యనుధనము అను నుదాహరణ ములు వాక్యగతములు. ముఖపద్మము, విద్యాధనము అనునవి సమాస గతములు.

మమ్మటాదిమతంబున రూపకము మూఁడువిధములు: ౧. నిర వయవము, ౨. సావయవము, 3. పరంపరితము. వీని యుపభేదము లీ క్రిందిపట్టికవలనఁ దెలియఁగలవు:

- రూపకము
  - నిరవయవము
    - కేవలము
    - మాలారూపకము
  - సావయవము
    - సమస్తవస్తువిషయము
    - ఏకదేశవివర్తి
  - పరంపరితము
    - శ్లిష్టము
    - అశ్లిష్టము
      - కేవలము
      - మాలారూపకము

నిరవయవము:— ఒకవాక్యమునందలి రూపకములకు అవయ వావయవిభావము లేక దేని కది వేఱువేఱుగ నుండెనేని యది నిరవ యవరూపక మనిపించుకొనును. పరస్పరసాపేక్షత్వవిరహమే (ఒక దానితో మఱియొకదానికి సంబంధము లేకపోవుటయే) నిరవయ వత్వము.

ఉదా: (౧). బుద్ధి యనునది దీపము, దానిచే నంతయుఁ బ్రకాశవంత మగును; బుద్ధిలేమి చీకటిరాత్రి, అందు నేమియుఁ గానరాదు — (ర. గం).

ఇది 'కేవలనిరవయవరూపకము'న కుదాహరణము. ఇందు రెండురూపకము లున్నను, అవి సాపేక్షములు కావు. కావున నిరవ యవము. ఒకవిషయమునుగుఱించి చెప్పఁబడినవి కావు. కావున కేవలము.

ఉదా: (౧). ధర్మమునకు నాత్మ, భూమికి భాగ్యము, సృష్టికి సారము, సరస్వతీదేవిజీవితము, వేదమూర్తియైన సాక్షాద్బ్రహ్మదేవుని యాజ్ఞ యైన యీరాజు కల్పాంతమువఱకును వెలుంగుఁగాత! — (ర. గం).

ఇయ్యది నిరవయవమాలారూపకమున కుదాహరణము. ఇందు నాల్గు రూపకము లున్నను, ఒకదానితో మఱియొకదానికి సంబంధము లేదు. కాన నిరవయవము. ఒక్కనివిషయమున పెక్కుపదార్థము లారోపింపఁబడినవి గాన మాలారూపకము.

సావయవరూపకము:— పరస్పరసాపేక్షము లయిన రూపక ముల సముదాయము 'సావయవరూపకము'.

ఏ సావయవరూపకమునందు అవయవియొక్కయు, అవయవ ములయొక్కయు నిరూపణము పూర్తిగ నుండునో యది 'సమస్తవస్తు విషయము', అనఁగా నారోపింపఁబడిన వస్తువు లన్నియు నెందు శబ్దములచే స్పష్టముగఁ జెప్పఁబడునో యది 'సమస్తవస్తువిషయము'.

ఉదా: రాత్రి యను లేమ వెన్నెల యనుచీరను, చుక్క లన్న నగలను, చీకట్లన్న వెండ్రుకలను ధరించి శోభించుచున్నది.

ఇందు రాత్రిని లేమగను, వెన్నెలను చీరగాను, చుక్కలను నగలుగను, చీకట్లను వెండ్రుకలుగాను, చెప్పఁబడిన నాలుగురూపక ములును పరస్పరసాపేక్షకములు, ఒకదాని ననుసరించి మఱియొకటి వచ్చినవి. కావున నిది 'సావయవము'. అందును రాత్రిని స్త్రీగా నిరూపించుటచే నిది అవయవి. వెన్నెల యనుచీర మొదలయినవి దానియవయవములు. ఇవన్నియు నిందు స్పష్టముగఁ జెప్పఁబడి యున్నవి. కావున నిది 'సమస్తవస్తువిషయము'.

ఏ సావయవరూపకమునందు అవయవనిరూపణమువలన అవ యవినిరూపణ మూహింపఁబడునో అది 'ఏకదేశవివర్తి', అనఁగా నెందు నన్నిరూపకములును స్పష్టముగఁ జెప్పఁబడక కొన్నిమాత్రము చెప్పఁబడి, మిగిలినవి యూహింపఁబడునో యది 'ఏకదేశవివర్తి'. ఇందొకరూపకము తనసామర్థ్యముచేఁ జెప్పఁబడని యన్యరూపక మును స్ఫురింపఁజేయును.

ఉదా: ఓరాజా! నీఖడ్గము ఒఱ యనుపుట్టలోనుండి వెడలి శత్రురాజుల ప్రాణము లన్నగాలిని ద్రాగ్వును — (న. భూ).

ఇందు కత్తియొక్క ఒఱను పుట్ట యనుటచే, నందుండి వెడ లినకత్తి పా మన్నరూపకము స్ఫురించును. అట్లే శత్రురాజులప్రాణ ములను గాలితోఁ బోల్చుటచే దానిని భక్షించునది (కత్తి) పా మని స్ఫురించును. పాము గాలి తిని బ్రతుకు నని కవిసమయము.

పరంపరితము:— లక్ష: ఏరూపకమునం దొకయారోపమే మఱియొకయారోపమునకుఁ గారణముగా నుండునో యది 'పరం పరితము'.

ఉదా: అపత్సముద్రము దాఁటుటకు ధైర్య మనునది యొక పెద్దనావ.

sampath_Ebooks


ఇచ్చట మొదటియారోపము రెండవ యారోపమునకుఁ గారణము. ఆపత్తును సముద్ర మంటిమి గాన ధైర్యమును నావ యన వలసివచ్చెను.

'శ్లిష్ట' మనియు, 'అశ్లిష్ట'మనియు నిందు రెండుభేదములు కలవు. 'శ్లిష్ట'మనఁగ శ్లేషచే సాధింపఁబడినది యనియు, 'అశ్లిష్ట' మనఁగ శ్లేష లేకుండ సాధింపఁబడిన దనియు నర్థము. 'అశ్లిష్ట'మును 'శుద్ధ' మనియెదరు. ఇం దొక్కొక్కటి మరల 'కేవలము', 'మాలారూపము' అని విభక్తము. ఇందుకుఁ గ్రమముగ నుదాహరణములు.

ఉదా: (౧). ప్రతాపరుద్రునిఖడ్గ మనురాహువు శత్రురాజ మండలమును మ్రింగును — (ప్ర. రు).

ఇచ్చట 'రాజమండల'శబ్దము శ్లిష్టము. దానికి రాజుల సమూహ మనియు, చంద్రమండల మనియు రెండర్థములు.

ఉదా: (౨). కమలావాసకాసారుఁడును, క్షమాధృతిఫణీశ్వరుఁడును, కువలయేందుఁడును అగునీరాజు మానవులకు నానందమును కలుగఁజేయును —(ర. గం).

ఇది 'శ్లిష్టమాలాపరంపరితరూపకము'. ఒక్కని నుతించియే చెప్పఁబడిన మూఁడు శ్లిష్టకేవలపరంపరిత రూపకము లిందుఁ గలవు.

ఉదా: (౩). ప్రతాపరుద్రుఁడు కాకతీయదుగ్ధసముద్రము నందుఁ బుట్టినచంద్రుఁడు — (ప్ర. రు).

ఇది అశ్లిష్టకేవలపరంపరితరూపకమునకు నుదాహరణము.

ఉదా: హస్త మనుసర్పమునకుఁ గోఁతయు, శత్రువనశ్రేణికి సుడిగాలియు, శౌర్య మనుపెనుమంటకుఁ బొగయు, జయలక్ష్మి యొక్క విలాస మైనకనుబొమయు, సంతుష్ట దైనభూమి యను క్రీడామయూరి యుండునట్టివాసయష్టియు, ప్రపంచ మనుప్రాసాదమునకు గడియయు నగు కృపాణలతతోడి ప్రతాపరుద్రుఁడు విహరించుచున్నాఁడు — (ప్ర. రు).

ఇది అశ్లిష్టమాలాపరంపరితోదాహరణము.

చంద్రాలోకమతంబున రూపకము రెండువిధములు :— (అ) అభేదము, (ఆ) తాద్రూప్యము. ఇం దొక్కొక్కటి అధికము, న్యూనము, అనుభయము అను మూఁడుభేదములను చెందును. ఇట్లు రూపకము ఆఱువిధములు.

(అ) అభేదరూపకము:— ఉపమానోపమేయములకుఁ బూర్తిగ నభేదము చెప్పిన 'నభేదరూపక' మగును. అందును ఉపమానము కంటె నుపమేయమునందు నధికత చెప్పినచో నయ్యది 'అధికాభేద రూపకము' అగును.

ఉదా: (౧). ఈరాజు నిండుపౌరుషముగల శివుఁడు.

శివుఁ డర్ధనారీశ్వరుఁడు గనుక సగము పౌరుషము కలవాఁడు. రాజు నిండుపౌరుషము గలవాఁడు కావున శివునికంటె నధికుఁ డన్న భావము కనఁబడుచుటచే 'నధికాభేదరూపకము'.

ఉపమానముకంటె నుపమేయమునందు న్యూనత చెప్పినచో నది 'న్యూనాభేదరూపకము'.

ఉదా: (౨). ఈయోగి మూఁడుకన్నులు లేని శివుఁడు.

ఉపమానముకంటె నుపమేయమునందు నధికముగాని న్యూనముగాని చెప్పక రెంటికిని సమత్వము చెప్పినచో నది 'అనుభయాభేదరూపకము.'

ఉదా: (౩). ఈరాజు పురసంహారకుఁ డగునీశ్వరుఁడు.

(ఆ) తాద్రూప్యరూపకము :— ఉపమానోపమేయములకు భేదమగపడుచున్నను ఉపమానరూపముచేత నుపమేయమునకు రంజనము (రంగు) కలిగించినచో 'తాద్రూప్యరూపక' మగును.

ఉదా: ఈతఁడు రెండవయీశ్వరుఁడు.

ఇందు నీతనికిని, ఈశ్వరునకును 'రెండవ' పదముచేత భేదము కానవచ్చినను, ఈశ్వరునితో నతనికి తాద్రూప్యము చెప్పఁబడినది.

అభేదమునవలె దీనికిని అధిక న్యూనానుభయభేదంబులు కలవు. క్రమముగ నుదాహరణములు.

ఉదా: (౧). ఈమెముఖము కళంకరహిత మైనయపర చంద్రుఁడు.

ఉదా: (౨). ఈమె పాలసముద్రమునందుఁ బుట్టనియపరలక్ష్మి.

ఉదా: (౩). ఈతఁడు రెండవయింద్రుఁడు.

౬. పరిణామాలంకారము :— లక్ష: ఎందు విషయి(ఉపమానము)స్వతంత్రముగాఁ గాక విషయ(ఉపమేయ)స్వరూపమును బొందియే ప్రకృతోపయోగి యగునో యది 'పరిణామాలంకారము'.

ఉదా: ప్రసన్నములైన నేత్రకమలములతో నీనుఁడు నన్నుఁ జూడుఁగాత!

ఇందుఁ జూచునది కమలము. కాని దానికిఁ జూచుసామర్థ్యము లేదు. కావున నది చూచుసామర్థ్యముగల నేత్రముగాఁ బరిణమించె నని యర్థము. ఉపమానమైన కమలమునకుఁ బ్రస్తుతప్రయోజకత్వము (చూచుక్రియ) స్వతంత్రముగా లేదు; ఉపమేయ (నేత్ర) రూపముగనే యున్నది.

'రూపకము'నందు ఉపమానాభేదము ఉపమేయమునందుఁ జెప్పఁబడును; 'పరిణామము'నందు ఉపమేయాభేదము ఉపమానము నందుఁ జెప్పఁబడును. ఇదియే రెంటికిని భేదము. ఎచ్చట నుపమానము ఉదాసీనముగ నుండునో, లేక దానికి స్వతంత్రముగ ప్రకృతకార్యోపయోగిత్వ ముండునో యది రూపకమే యని యెఱుంగునది.

sampath_Ebooks

కొందఱిమతమున ఈయలంకారము స్వతంత్రము కాదు, రూపకాంతర్గతమే (మాఘుఁడు, రసగంగాధరము, పరిణామప్రకరణము). మమ్మటుఁడీయలంకారమును చెప్పలేదు. సామానాధికరణ్యవైయధికరణ్యములచే నిది ద్వివిధము.

౭. సందేహాలంకారము:— లక్ష: విషయివిషయములకుఁ (ఉపమానోపమేయములకుఁ) గల సాదృశ్యము వలన నిదియా యదియా యని కలిగినసమబలమైన సంశయమునకు 'సందేహాలంకార' మని పేరు. దీనినే భామహాదిప్రాచ్యులును జగన్నాథుఁడును 'ససందేహ' మనిరి.

ఉదా: రాకేందుబింబమో రాజీవమో మించు
టద్దమో లేక నెమ్మద్దుమొగమొ — (ఓల్గా).

ఇత్యాది శుద్ధ, నిశ్చయగర్భ, నిశ్చయాంత యని మూఁడువిధములు. పైని చూపఁబడినది శుద్ధ. మిగిలినవానికి నుదాహరణములు:

ఉదా: శ్రీరామునిశరీరకాంతిని జూచి యయోధ్యవాసు లిది యమునయా యేమి? కాదు; అది జలమయము. మరకతమణుల ప్రభయా యేమి? కాదు; దాని కింత మాధుర్య మెక్కడిది? అని సంశయగ్రస్తు లయిరి — (ర. గం).

ఇత్యాది నిశ్చయగర్భ.

ఉదా: ఇవి కల్పవృక్షమంజరులతోఁ గట్టఁబడిన హారములా? లేక కామధేనువుయొక్క పాలరాసులా? లేక ఉజ్జ్వలతరములయిన చింతామణిస్ఫూర్తులా? లేక సుధారసకల్లోలములా? అని కొంతసేపు సందేహించి తుద కవి కాకతీయప్రతాపరుద్రుని స్మితప్రధానము లయిన కటాక్షము లని నిశ్చయించిరి —(ప్ర. రు).

ఇది నిశ్చయాంతసందేహము.

౮. భ్రాంతిమదలంకారము:— లక్ష: సాదృశ్యమువలన నొకవస్తువును జూచి మఱియొకవస్తువుగా భ్రమించుట 'భ్రాంతిమంతము'.

ఉదా: పద్మ మను భ్రాంతిచేత నీమా ముఖము చుట్టును తుమ్మెదలు ముసరుచున్నవి.

ఈ సాదృశ్యము కవిసమ్మతిసాదృశ్యముగ నుండవలెను, లేదా ముత్యపుఁజిప్పను జూచి వెండి యని భ్రమపడుటయు 'భ్రాంతిమంత' మగును. సందేహమునందు నిదియా యదియా యన్న సంశయ ముండును; ఇందు భ్రాంతి తప్ప నిది యన్యవస్తువై యుండెనో యన్న సంశయమే కలుగదు. ఇదియే దీనికి భేదము. రూపకమందును నిందువలె నుపమేయమందు నుపమానారోప ముండును. కాని యచ్చట నది బుద్ధిపూర్వకము (ఆహార్యము), ఇందు అజ్ఞానజన్యము (అనాహార్యము).

౯. ఉల్లేఖాలంకారము:— లక్ష: ఒకవస్తువు నిమిత్తవశంబున వేఱువేఱుజనులచే వేఱువేఱువిధంబుగ గ్రహింపఁబడెనేని 'యుల్లేఖ' మగును.

ఉదా: రాజు లంపటులను లక్ష్మీనివాసగృహ మనియు, శత్రువర్గము పరాక్రమాతిశయమునకు గని యనియు, విద్వాంసులు విద్యావిలాసవైభవ మనియు శ్రీకాకతీంప్రనగరమును (ఏకశిలానగరమును) స్తుతింతురు — (ప్ర. రు).

౧౦. అపహ్నుత్యలంకారము:— లక్ష: విషయమును (ఉపమేయమును) నిషేధించుచు సామ్యముచే దానియందు మఱియొకవస్తువును (విషయిని లేక ఉపమానమును) ఆరోపించుట 'అపహ్నుతి'.

ఉదా: ఇది ముఖము కాదు, చంద్రబింబము.

ఇది మూఁడువిధములు: ౧. నిషేధించి ఆరోపించుట, ౨. ఆరోపించి నిషేధించుట, 3. ఛలము (నెపము) మొదలయిన శబ్దములచే నిషేధము స్ఫురించుట.

ఉదా: (౧). ఇది గంధుభిన్నని కాదు, త్రిపురములను జయించిన రుద్రుని కల్పాంతపుకొక్కరొక్క గళము — (ప్ర. రు).

ఉదా: (౨). ఇవి ఉప్పొంగెన నాల్గుసముద్రముల కలకలము గాని సైన్యరవము కాదు — (ప్ర. రు).

ఉదా: (3). ప్రతాపరుద్రుఁ డను నెపమున స్వయముగ రుద్రుఁడే భూలోకమును పాలించుచున్నాఁడు; లేనియెడల నాతఁడు చూచినంతమాత్రమున శత్రుపురము లెట్లు భస్మములగును?—(ప్ర. రు).

నిషేధము యుక్తిచేత సాధింపఁబడినయెడల నది హేత్వపహ్నుతి యనిపించుకొనును. పై 3 - వ ఉదాహరణ మిట్టిదియే.

౧౧. ఉత్ప్రేక్షాలంకారము:— లక్ష: అప్రకృత (ఉపమాన) గతములైన గుణక్రియాదులసంబంధముచే ప్రకృతమును (ఉపమేయమును) అప్రకృతముగ (ఉపమానముగ) సంభావించుట 'ఉత్ప్రేక్ష'.

ఉదా: ఈ చీకటిని జక్రవాకియొక్క విరహాగ్నినుండి పుట్టినపొగ యని తలంచెదను — (చంద్రా).

ఇచ్చటఁ జీకటి ప్రస్తుతము (విషయము), పొగ అప్రస్తుతము (విషయి). నీలముగ నుండుట, దృష్టిప్రతిరోధకముగ నుండుట అప్రస్తుతమయిన పొగయొక్క ధర్మములు. ఈధర్మములు ప్రస్తుతమునందు (విషయమందు, చీకటియందు) నున్నవి. కావున ప్రస్తుతము (చీకటి) అప్రస్తుతముగ (పొగగ) సంభావింపఁబడినది.

అధ్యవసాయము:— అభేదప్రాధాన్యాలంకారములలో రూపకాదు లారోపగర్భము లనియు, ఉత్ప్రేక్షాతిశయోక్తు లధ్యవసాయగర్భము లనియు 'అలంకారసర్వస్వ'కారుని మతము. విషయమును (ఉపమేయమును) దిగమ్రింగుటచే విషయికిని (ఉపమానమునకును) దానికిని గలిగిన అభేదప్రతిపత్తియే అధ్యవసాయము. (అ. స). అభిన్నముగఁ బ్రతిభాసించుట అధ్యవసాయము (ఏకావళి). సిద్ధమనియు, సాధ్య మనియు నిది రెండువిధములు. ఎచ్చట విషయి

sampath_Ebooks



యొక్క యసత్యప్రతీతి కలదో యది సాధ్యము. ఎచ్చట నిజముగ అసత్యమైన విషయి (అప్రస్తుతము) సత్యముగ ప్రతీతించునో (తోఁచునో) యది సిద్ధము. మొదటిది అతిశయోక్త్యలంకారము నందును, రెండవది ఉత్ప్రేక్షాలంకారమునందును కానవచ్చును.

ఉపమానము ప్రసిద్ధ మైనది యగునేని యది యుపమానాలంకార మనియు, అట్లుగాక యది యప్రసిద్ధము, కవికల్పితము అగునేని యుత్ప్రేక్ష యనియు ప్రతాపరుద్రీయకారాదుల యభిప్రాయము.

(అ) ఉత్ప్రేక్ష వాచ్య యనియు, గమ్య (ప్రతీయమాన) యనియు రెండువిధములు. ఉత్ప్రేక్షావాచకము లయిన అటులు, పోలె, తలఁచెద, ఒకో లోనగుపదములు వాక్యమునందుఁ బ్రయోగింపఁబడినపక్షమున వాచ్యోత్ప్రేక్షయు, లేనియెడల గమ్యోత్ప్రేక్షయు నగును.

(ఆ) ఉత్ప్రేక్ష స్వరూప, హేతు, ఫలోత్ప్రేక్ష లని మూఁడువిధములు. ప్రకృతమే యప్రకృతముగ (ఉపమానరూపముగఁ) జెప్పఁబడియె నేని స్వరూపోత్ప్రేక్ష. దీనినే వస్తూత్ప్రేక్ష యందురు. పైని ఈయఁబడినది దీనికే యుదాహరణము.

హేతువు కానిదానిని హేతువుగ గ్రహించుట హేతూత్ప్రేక్ష.

ఉదా: కమలినీసంతాపముచేతను జంద్రుఁడు క్షయించుచున్నాఁడు.

ఇచ్చటఁ జంద్రకళాక్షయమునకుఁ గమలినీసంతాపము కారణము గాకపోయినను కారణముగఁ జెప్పఁబడినది.

ఫలము కానిదానిని ఫలముగాఁ జెప్పిన ఫలోత్ప్రేక్ష యగును.

ఉదా:— సూర్యుఁడు తనరథమునకుఁ బూన్పఁబడిన ముసలి గుఱ్ఱములను మార్చుటకారాయేమి, గుఱ్ఱముల పుట్టినిల్లయిన ఉత్తరదిక్కునకుఁ బోయెను? — (అ. స).

సూర్యుఁ డుత్తరదిక్కునకుఁ బోయినయుద్దేశము గుఱ్ఱములను మార్చుటకుఁ గాదు. అయినను అది ఫలముగ వర్ణింపఁబడినందున ఫలోత్ప్రేక్ష.

(ఇ) ఈ యలంకారము మరల జాతిక్రియాగుణ ద్రవ్యభేదములచే నాల్గు విధములు.

ఉదా: (౧). శివునిజటలలో నున్నచంద్రుఁడు గంగాజలముచేతఁ బ్రతిదినమును తడుపఁబడిన మూఁడుడులోనుండి పైకి లేచిన తెల్లనిమొలకవలె నున్నాఁడు — (అ. స).

ఇందు నప్రకృత మైన ' మొలక ' యను జాతి ప్రకృతమైన చంద్రునియందు సద్భావింపఁబడినది. కావున నిది జాత్యుత్ప్రేక్ష.

ఉదా: (౨). చీకటి తనఅవయవములను పూయుచున్నట్టున్నది, ఆకాశము కాటుకను కురియుచున్నట్టున్నది — (మృచ్ఛకటికము).

ఇది గాఢాంధకారవర్ణనము. ఇచ్చటఁ బ్రకృతము తమోవ్యాపనక్రియ, అనఁగాఁ జీకట్లు క్రమ్ముట; పూయుట కురియుట యనుక్రియ లప్రకృతములు.

ఉదా: (౩). నీకాలినుండి యూడిపడి, నీచరణకమలవియోగదుఃఖముచేతఁ గాఁబోలు మౌనము ధరించినయందె, నీకొఱకు నేను వెదకుచుండఁగ నాకు కొరకిన స్థలమిది — (రఘు).

ఇది విమాన మెక్కి మరల నయోధ్యకుఁ బోవునపుడు రాముఁడు సీతతోఁ జెప్పినమాట. ఇందు అందెకు లేనట్టిదుఃఖము, మౌనము అనుగుణములు చెప్పఁబడినవి కావున గుణోత్ప్రేక్ష.

ఉదా: (౪) కళింద పర్వతమునుండి ప్రయాగవఱకు నెవ్వరిచేతనో యొకయగడ్త త్రవ్వఁబడెను. ఇందు నడుగంటనినీలవర్ణము గల యాకాశ మున్న దని తలంచెదను — (ర. ౧౦).

ఇచ్చట నీలత్వదీర్ఘత్వ నిమిత్తక మైన ఆకాశతాదాత్మ్య మున్నందున ఉత్ప్రేక్ష, రూపములేని ఆకాశమును స్వరూపాత్మకముగఁ జెప్పుటచే ద్రవ్యోత్ప్రేక్ష.

(ఈ) పైని చెప్పఁబడిన యుదాహరణములన్నియు భావరూపములయినవి. వాని కన్నిటికిని అభావరూపములుకూడఁ జెప్పవచ్చును. ఒక్కదాని నీక్రింద నిచ్చెదను; మిగిలినవాని నూహించుకొనవలయును.

ఉదా: సకలక్షత్రియలోకముయొక్క యభావము మూర్తీభవించిన ట్లున్నట్టు పరశురాముఁడు వెలసెను.

ఇది జాత్యభావోత్ప్రేక్ష. ఇట్లు గుణక్రియాద్రవ్యాభావములందున్నవానికి యుదాహరణము లూహించుకొనునది.


(ఉ) ఉపాత్తనిమిత్త మనియు, అనుపాత్తనిమిత్త మనియు మరల రెండువిధములు.

ఇట్లీ యలంకార మనేకవిధముల విభాగింపఁబడినది. పైభేదము లన్నియు నొకదానితో మఱియొకటి కలసి ౧౯౨ భేదము లయినవి. ఆ వివర మీక్రిందఁ జూపఁబడినది.


వాచ్యోత్ప్రేక్ష
├ జాతి, క్రియా, గుణ, ద్రవ్య = ౪
├ భావ, అభావ — ౪ × ౨ = ౮
├ గుణనిమిత్తము, క్రియానిమిత్తము — ౮ × ౨ = ౧౬
├ ఉపాత్తము, అనుపాత్తము — ౧౬ × ౨ = ౩౨
└ స్వరూప, హేతు, ఫల — ౩౨ × ౩ = ౯౬

sampath_Ebooks

ఇందు స్థలసంకోచముచే ఒకకక్ష్యలోని మొదటిభేదమునకుఁ గల విభేదములుమాత్రము చూపఁబడినవి. ఆకక్ష్యలోని మిగిలినభేదములకును అట్టివిభేదములే కల వని యెఱుంగునది. 'జాతి' యనుదానిని 'భావాభావ'ములుగ విభజించితిమి. అట్లే ఆకక్ష్యలోని 'క్రియాగుణద్రవ్యము'లకుఁగూడ నీరెండుభేదములును కలవని యెఱుంగునది.




ఇట్లు వాచ్యోత్ప్రేక్షలు ౯౬ ను, ప్రతీయమానోత్ప్రేక్షలు ౪౮ యును గలసి ౧౪౪ భేదములు కలవు. ౯౬ వాచ్యభేదములలో నీక్రిందఁ జూపఁబడిన ౫౬ మాత్రము చారుత్వము కలవి యని విద్యానాథుని యభిప్రాయము.




ఇట్లొక్క 'జాతి'లో ౧౪ భేదములు. అట్లే క్రియాగుణద్రవ్యములలోను కలవు, కావున మొత్తము ౧౪ × ౪ = ౫౬.

ఈ యలంకారలక్షణమునుగుఱించి ప్రాచీనులకు నర్వాచీనులకును జాల మతభేదములు కలవు. 'విషయివిషయముల యభేదసంసర్గము వలననే ఉత్ప్రేక్షాలంకారము సిద్ధించును, వేఱుసంబంధమువలన సిద్ధింపదు' అని ప్రాచీనులసిద్ధాంతము. 'భేదాదిసంసర్గముచేతఁ గూడ నీ యలంకారము కావచ్చు' నని నవీనులసిద్ధాంతము. ఇందునుగుఱించి యధికము తెలిసికొనఁగోరువారు రసగంగాధరము, అలంకారకౌస్తుభము అనుగ్రంథములలో ఉత్ప్రేక్షాప్రకరణమును జూడవలెను.

౧౨. అతిశయోక్త్యలంకారము :— లక్ష : లోకసిద్ధమై యున్నవస్తువుయొక్క స్థితిని అతిక్రమించి చెప్పుట 'అతిశయోక్తి' యనఁబడును. కవిప్రౌఢోక్తియే దీనికి జీవము కాని

ఉదా : ఈపురమునందలి స్త్రీలయొక్క గమనము...యున్నవి.

'విషయి'చే విషయము ప్రతిపాదింపబడి...క్తియనియుఁ జెప్పఁబడియున్నది — ( మా. ప. గు ).

ఈయలంకార మాఱువిధములు : ౧. భేదమున్నచో నభేదముగను, ౨. అభేద మున్నచోట భేదముగను, ౩. సంబంధ మున్నచోట సంబంధము లేనట్లును, ౪. సంబంధము లేనిచోట సంబంధ మున్నట్లును, ౫. కార్యకారణములఁ దలక్రిందుగను వర్ణించుట, ౬. ఒక యర్థమును ఆరోపించి మఱియొకయర్థమును కల్పించుట.

ఉదా :(౧). జలము లేనిచోటఁ గమలము, దానియందు రెండు నల్లగల్వలు, ఇవన్నియు నొకబంగారుతీగ కుండుటయు, నాతీగయు సుకుమారసుందరిగ నుండుట — ఏమి యీయుత్పాతపరంపర !— ( కా. ప్ర ).

ఇందు నొకస్త్రీయొక్క ముఖము కనులు, శరీరము అనునవి పద్మము నల్లగలువలు బంగారుతీగ యను ఉపమానములచేతనే సూచింపఁబడినవి. ముఖపద్మములకును, కనులకు నల్లగలువలకును, శరీరమునకు బంగారుతీగకును భేద మున్నను ఇచ్చట నభేదము చూపఁబడినది. దీనినే 'రూపకాతిశయోక్తి' యందురు.

ఉదా : (౨). లోకకల్యాణ మయ మైన యీ సంభాషణ విధమే వేఱు; ఏమో కాని యీమాటలపొంకమే వేఱు, చేయుపని లోకోత్తరము, ఆకృతియు అత్యద్భుతము; విద్యావంతులచరితమే వేఱు — ( ర. గం ).

విద్యావంతులుఁగూడ నితరమానవులవంటివారే. కావున మానవవ్యవహారసంభాషణాదికములలో వారికి నితరులకు భేదము లేకపోయినను, విద్యావంతుల యుత్కృష్టార్థమై యిచ్చట వారి ఆకారసంభాషణాదులకును, ఇతరుల యాకారాదిసంభాషణాదులకును భేదము కల్పింపఁబడినది. ఇది 'భేదకాతిశయోక్తి'.

sampath Ebooks

ఉదా: (౩). వేదాభ్యాసజడుఁడును, ముదుసలి వాఁడును అగు బ్రహ్మదేవుఁ డిట్టిచక్కఁదనము నిర్మింపలేఁడు — (విక్రమోర్వ).

అందుచేత బ్రహ్మయే సృజించును. కావున నిచ్చట సంబంధ మున్నను అసంబంధము చెప్పఁబడినది. ఇదియే 'అసంబంధాతిశయోక్తి'.

ఉదా: (౪). ఈపురి మేడలు మిన్నంటి యుండుటచే, సురాంగనలు వచ్చి పురాంగనలవాయనములఁ గొందురు—(శివతత్త్వసుధానిధి).

లేనిసంబంధ మిచ్చటఁ గల్పింపఁబడినది. కావున 'సంబంధాతిశయోక్తి.'

ఉదా: (౫). ముందుగనే శత్రువులప్రాణములు శరీరమునుండి వెడలెను, తరువాతనే యీరాజుయొక్క యమ్ములపొదినుండి బాణములు వెడలెను.

ఇందుఁ గార్యమైన ప్రాణవిమోచనము, దాని కారణమైన బాణవిమోచనమునకంటెఁ బూర్వము జరగినట్లు వర్ణింపఁబడినది. కార్యకారణము లేక కాలమందు జరగినట్లు వర్ణింపఁబడినను ఈ యాలంకార మగును.

ఉదా: (౬). రాకాచంద్రుఁడు కళంకమును వదలెనేని ఈ కామినీముఖమునకు సాటి యగును —(చంద్రా).

'ఏని' మొదలగుపదములచేత నొకయర్థమును ఆరోపించి మఱియొకయర్థమును కల్పించుటకు నిది యుదాహరణము.

౧౩. తుల్యయోగితాలంకారము :— ప్రకృతములకు మాత్రము గాని, అప్రకృతములకుమాత్రము గాని సుక్రియాది రూపమైన ఏకధర్మాన్వయము 'తుల్యయోగిత'. ఇందు ఔపమ్యము గమ్యము.

ఉదా: (౧) చంద్రోదయమువలనఁ జోరుల ముఖములును తామరపువ్వులును ముకుళితము లాయెను —(కువల).

ఇందలి 'చోరులముఖములు', 'తామరపువ్వులు' ఈ రెండును ప్రకృతములు, వర్ణింపఁదలంచినవిషయములు. వీనికి ముకుళనక్రియచే నేకాన్వయము సంభవించెను.

ఉదా: (౨) అమృతమును, చంద్రబింబమును, పద్మమును నీ ముఖమునకు నెదుట నిలువలేక ప్రతిహతము లయ్యెను.

౧౪. దీపకాలంకారము :— లక్ష: ప్రకృతములకును, అప్రకృతములకును ఒక్కసాధారణధర్మముచే నన్వయముకలిగిన నది 'దీపకము'. ఇందును ఔపమ్యము గమ్యమే.

ఉదా: (౧). సుజనులు పరోపకారమును, శూరులు శస్త్రమును, కృపణులు ధనమును, కులసతులు వినయమును ప్రాణాంతమందుఁగూడ వదలరు — (ర. గం).

ఇందు రాజుయొక్క పరోపకారవర్ణనము ప్రస్తుతము. దీనికిని, ఇతరవాక్యముల కన్నిటికిని ఒక్కటే క్రియ కలదు. ఇట్టే కర్త యొక్కఁడును క్రియ లనేకములును ఉన్నయెడల కారకదీపక మని పించుకొనును.

కారకదీపకము :— ఉదా: (౨). రాజా! ధన మొసంగుటకును, యశస్సును సంపాదించుటకును నీవు మిక్కిలి నిపుణుఁడవు— (ర. గం).

ఇందు ధన మొసంగుట, తన్ను రక్షించుట ప్రకృతవిషయములు, మిగిలినక్రియ లప్రకృతములు.

౧౫. ప్రతివస్తూపమాలంకారము:— లక్ష: ఉపమానోపమేయములకుఁ గల యొక్క సమానధర్మమునే (ఉపమానోపమేయరూపము లయిన) వేఱువేఱువాక్యములయందు వేఱువేఱుశబ్దములచేతఁ జెప్పినఁ 'బ్రతివస్తూపమ' యగును.

ఇం దౌపమ్యము (పోలిక) గమ్యము, అర్థి. తాత్పర్యము వలనఁ దెలిసికొనఁదగినది; కాని యుపమలోవలె 'వలె' మొదలయిన పదములవలన స్పష్టము కాదు.

ఉదా: గొప్పయుద్దేశములు గలసజ్జనులకు నాపత్తు సంభవించినను వారు పూర్వము చూపని యౌదార్యమునే వ్యాపింపఁజేయుదురు. తన్ను నిప్పంటుకొనినను కృష్ణచందనము లోకోత్తరమైనపరిమళమును చుట్టును ప్రకటించును — (ర. గం).

ఇందు 'వ్యాపింపఁజేయుట', 'ప్రకటించుట' యను భిన్నపదములచే వస్తుప్రతివస్తుభావమును జెందిన యొకసమానధర్మమే చెప్పఁబడినది.

దీనిని వైధర్మ్యరూపముగఁ గూడఁ జెప్పవచ్చును.

ఉదా: పండితులకష్టము పండితులకే తెలియును. ప్రసవవేదనను గొడ్రా లే మెఱుంగును?

౧౬. దృష్టాంతాలంకారము :— లక్ష: ఉపమానోపమేయవాక్యములందు భిన్నధర్మములు బింబప్రతిబింబభావమున సమానధర్మత్వమును జెందియున్నయెడల 'దృష్టాంతాలంకారము'.

ఉదా: సత్పురుషుఁ డెవ్వరును కోరకయే తనంతట తాను లోకమునకు మేలు చేసి యందఱను సంతోషింపఁజేయును. నల్లగలువలగుంపును వికసింపఁజేయు మని చంద్రుని నెవ్వరు కోరిరి?— (ర. గం).

ఈ యుదాహరణమునందు 'సంతోషింపఁజేయుట', 'వికసింపఁజేయుట' యనునవి ధర్మములు. వీనియందు బింబప్రతిబింబభావము కలదు.

దీనికిని ప్రతివస్తూపమకును భేద మే మన, ప్రతివస్తూపమయందు సాధారణధర్మము వస్తుప్రతివస్తుభావమును జెందియుండును. ఇందు బింబప్రతిబింబభావమును జెందియుండును. ఒకయర్థమును రెండు భిన్నశబ్దములచేఁ జెప్పుట వస్తుప్రతివస్తుభావము. సహజముగ భిన్నము

sampath_Ebooks

లయినను, సాదృశ్యముచే నభిన్నములుగను వేఱువేఱుగను చెప్పుట బింబప్రతిబింబభావము. ప్రతివస్తూపమయందు ధర్మ మొక్కటియే, భిన్నశబ్దములచేఁ జెప్పఁబడును. దృష్టాంతమునందు సదృశము లయిన రెండుధర్మము లుండును. దీపకమునందును, తుల్యయోగితయందును సమానధర్మ మొక్కవాక్యమునందే యుండును. దృష్టాంతమందును ప్రతివస్తూపమయందును రెండు వాక్యములందు చెప్పఁబడును. ఇవియు సాధర్మ్యవైధర్మ్యములచేఁ జెప్పఁబడును.

౧౭. నిదర్శనాలంకారము:— లక్ష: ( ప్రకృతాప్రకృతములను ) రెండు అర్థములకు నైక్యము చెప్పఁబడి, అన్వయలోపముచే వాని యైక్యము సాదృశ్యముగఁ ( బింబప్రతిబింబభావముగ ) బరిణమించెనేని యది 'నిదర్శన'.

ఉదా: (౧). ఓ మదనాంతక ! అంతరాత్మలోఁ బ్రకాశించుచున్న యనంతుఁడవైన నిన్ను తీర్థములందు వెదకువాఁడు కంఠమధ్యభాగమున వెలుఁగుచున్న చింతామణిని మఱచి దుమ్ములో వెదకువారే !— ( ర. గం ).

ఇచ్చట తీర్థములు తిరుగువారు దుమ్ములో వెదకువారొక్కరే యన్నయెడల నన్వయము పొసఁగదు. కావున శివునిఁ దీర్థములందు వెదకుట, మెడలోని చింతామణిని దుమ్ములో వెదకుటవంటిది అని సాదృశ్యము తేలుచున్నది. ఇది యేకవాక్యగత.

ఉదా: (౨). జగదంతరాత్మవైన ఓచంద్రశేఖరా ! ఇతరదేవతలతో నీవు సమానుఁడవని యేయజ్ఞులు చెప్పుదురో, వారు పారములేని యాకాశమును గవాక్షమునందు నిమిడియున్న యంతరాకాశములతో నేల పోల్చరు? ఇది భిన్నవాక్యగత — ( ర. గం ).

పై రెండు ఉదాహరణములకును వాక్యార్థనిదర్శన యని పేరు.

ఉపమేయవాక్యార్థమునకును ఉపమాన వాక్యార్థమునకును అభేదమును ప్రతిపాదించునపుడు అభేద మసంభవము గాన పర్యవసానమునందు బింబప్రతిబింబభావరూప మైన సాదృశ్య మేర్పడును. దానినే వాక్యార్థనిదర్శన, లేక వాక్యార్థవృత్తినిదర్శన యందురు. పై రెండు ఉదాహరణములు నట్టివి.

ఇఁక నుపమేయమునందు నుపమానధర్మసంబంధము చెప్పినచోట నుపమానధర్మసంబంధ ముపమేయమునకు నసంభవము గనుక, ఆధర్మమునకు సదృశమైన ధర్మ ముపమేయమునందు నున్న దని పర్యవసానము తేలును. దానిని పదార్థనిదర్శన, లేక పదార్థవృత్తినిదర్శన యందురు.

ఉదా: (౩). నీనేత్రములు నల్లగలువలలీలను దాల్చును.

'లీల' ఉపమానమైన నల్లగలువలధర్మము. వానిలీల కను లెట్లు దాల్పఁగలవు? కావున నల్లగలువల లీలవంటిలీలను నేత్రములు తాల్చుచున్న వని యర్థము.

ఇదివఱకు నిచ్చిన రెండువిధములైన నిదర్శనలలోను ఉపమానోపమేయములకు అసంభవద్ధర్మము నారోపించుటయే నిదర్శనగఁ జెప్పఁబడినది. ఇది మమ్మట విద్యానాథ జగన్నాథాదులమతము.

అలంకారసర్వస్వకారునిమతమున ఆరోపింపఁబడిన ధర్మము సంభవము గాని[1] అసంభవము గాని నిదర్శన యగును.

కాని యీలక్షణము నంగీకరించినయెడల దీనికి రూపకాతిశయోక్త్యాదులందు నతివ్యాప్తి కల్గు నని రసగంగాధరకారుఁడు చెప్పియున్నాఁడు.

ఈయలంకారమునందును, దృష్టాంతమందును బింబప్రతిబింబభావము కలదు. వీని కేమి భేద మని చదువరులకు సంశయము కలుగవచ్చును. నిదర్శనయందలి ఉపమానోపమేయములైన రెండువాక్యములును సాపేక్షములు, ఒకదానికి మఱియొకదానితో నన్వయసంబంధము కలదు. దృష్టాంతములోని యారెండువాక్యములును నిరపేక్షములు.

ఒకవస్తువునందుఁ గానవచ్చెడివ్యాపారమును జూచి, దానికారణమును దెలిసికొని, ఆకారణము కలిగినచోటనయిత మాకార్యమైన వ్యాపారము కలుగు నని చెప్పుట 'నిదర్శన' యని వామనాచార్యమతము.

ఉదా: (౪). సంపదలకు ఫలము చెలికాండ్ర నాదరించుటయే యని తెలుపుచు సూర్యుఁడు తా నుదయించుచుండఁగానే పద్మములకు లక్ష్మి నిచ్చును.

౧౮. వ్యతిరేకాలంకారము:— లక్ష: గుణవిశేషముచేత నుపమేయ ముపమానముకంటె నెక్కుడది యనిచెప్పిన 'వ్యతిరేకము'.

ఉదా: అతితీక్ష్ణమయిన బాణఘాతము హృదయమును క్షణకాలమే వేధించును; పరుషవచన మనెడి బల్లెముపోటు మనస్సును చిరకాలము బాధించును.

ఈ యలంకార ముపమేయగతోత్కర్షతచేతను, ఉపమానగతాపకర్షతచేతను, ఈరెంటిచేతను ఒకటియుఁ జెప్పకుండఁగను చెప్పవచ్చును. కాన నాల్గుభేదములు కలిగెను. ఇందొక్కొక్కటి అర్థశ్రౌతాక్షిప్తభేదములచేఁ బండ్రెండయ్యె. ఇవియు శ్లిష్టాశ్లిష్టభేదంబులచే నిరువదినాల్గు. ఉదాహరణము లూహింపనగును—(కా. ప్ర).

ఉపమేయమును ఉపమానముకంటె నెక్కువగ వర్ణించినఁ గూడ వ్యతిరేకాలంకార మగు నని అలంకారసర్వస్వకారుని యభిప్రాయము. కాని కావ్యప్రకాశకారుఁ డామతమును ఖండించెను.

౧౯. సహోక్త్యలంకారము :— లక్ష: రెండుప్రకృతములలో నొకదానికి నన్వయింపవలసినపదము సహార్థబలముచేత రెంటికి నన్వయించినచో 'సహోక్తి'.

1. సంభవతా అసంభవతావా వస్తుసంబంధేన గమ్యమాన మౌపమ్యం నిదర్శనా.

ఉదా : అతనిశత్రువులతోఁగూడ నతనికీర్తి దిగంతములయందు వ్యాపించెను — (చం).

ఇది కార్యకారణభావవైపరీత్య మనెడి యతిశయోక్తియనియే కొందఱిమతము.

౨౦. వినోక్త్యలంకారము :— లక్ష : ఒక వస్తువు లేమిచే మఱియొకవస్తువునకు రమ్యత్వము గాని, అరమ్యత్వము గాని కలిగిన దని చెప్పుట 'వినోక్తి'.

ఉదా : చంద్రుఁడు లేనిరాత్రి, వినయములేనిలక్ష్మి, రసము లేనికావ్యము వ్యర్థములు.

౨౧. సమాసోక్త్యలంకారము :— లక్ష : ఎచ్చటఁ బ్రకృతము విశేషణయుక్తముగఁ జెప్పఁబడఁగానే, చెప్పఁబడినట్టి యప్రకృతము కూడ విశేషణసామ్యమువలననే స్ఫురించునో యది 'సమాసోక్తి'.

ఉదా : ఓగంగ ! నీయొడిలోఁ గూర్చుండి అతిమనోహరతరమైన పయస్సు ద్రావిత్రావి, అఖిలశ్రమభారమును మఱచి నేనెప్పుడు శాశ్వతముగ నిద్రపోదును ? — (ర. గం).

ఇది గంగాదేవియొక్క స్తుతి. కాని 'ఒడిలోఁ గూర్చుండుట' 'పయస్సును ద్రావుట' అనుపదములవలన గంగ తల్లి యైనట్లును, తాను కుమారుఁ డైనట్లును స్ఫురించుచున్నది.

ఈ యలంకారమునందు 'విశేషణసామ్యము' అలంకారకారణము. అది మూఁడువిధములు : ౧. సాధారణము, ౨. ఔపమ్యగర్భము, ౩. శ్లిష్టము. మఱియు వ్యవహారసమారోపమే సమాసోక్తిజీవితము. అది నాల్గువిధములు : ౧. లౌకికవస్తువునందు లౌకికవ్యవహారసమారోపము, ౨. లౌకికవస్తువునందు శాస్త్రీయవస్తు వ్యవహారసమారోపము, ౩. శాస్త్రీయవస్తువునందు శాస్త్రీయవ్యవహారసమారోపము; ౪. శాస్త్రీయవస్తువునందు లౌకికవస్తువ్యవహారసమారోపము.

ఉదా : కాకతీశ్వరునియందు సాలంకారయు, లసద్వర్ణయు, సగుణయు, రసనిర్భరయు నగుభారతీదేవి భావానుబంధినిగా నున్నది — (ప్ర. రు).

ఇందు నలంకారశాస్త్రసంబంధమైన వస్తు వగు భారతికిఁ జెప్పఁబడిన శ్లిష్టవిశేషణములచే లౌకికనాయికావ్యవహారము స్ఫురింపఁ జేయఁబడినది.

ఇట్లే యితరభేదములకు నుదాహరణములను ఊహించుకొనునది.

౨౨ పరికరాలంకారము :— లక్ష : విశేషణములు సాభిప్రాయముగఁ జెప్పఁబడినచోఁ 'బరికరము'.

ఉదా : అంగరాజ ! సేనాపతి ! రాజవల్లభ ! ద్రోణాపహాసి ! కర్ణ ! ఈదుశ్శాసనుని భీమసేనునివలననుండి కాపాడుము—( వేణీసం. ).

కర్ణుని హేళనముచేయుచు నశ్వత్థామ చెప్పినమాట లివి. దుశ్శాసనునిఁ గాపాడలేనినీకు నీ విశేషణము లన్నియు వ్యర్థము లని యిచ్చట భావము.

ఈ యలంకారమునందుఁ బ్రకృతార్థోపపాదకంబును, చమత్కారియునగు వ్యంగార్థ ముండును (మాడుఁడు, పరికరాంకురాలంకారము)

౨౩. శ్లేషాలంకారము :— లక్ష : ఒక్కమాటచే ( శ్రుతిచే ) ననేకార్థంబులఁ బ్రతిపాదించుట 'శ్లేష'.

ఉదా : రాజు కువలయానందకరుఁడు.

'రాజు' అనఁగా ఱేఁడు, చంద్రుఁడు. 'కువలయ' మనఁగా భూమి, నల్లగలువ. కావునఁ బై యొక్కవాక్యమునకు ఱేఁడు భూమికి నానందము కలిగించువాఁ డనియు, చంద్రుఁడు నల్లగలువల కానందము కలిగించు ననియు రెండర్థములు కలుగుచున్నవి.

ఇయ్యది ౧. కేవలప్రకృతవిషయము, ౨. కేవలాప్రకృతవిషయము. ౩. ప్రకృతాప్రకృత విషయము అని మూఁడువిధములు. ౧-వ భేదమందు శ్లేషచేఁ జెప్పఁబడిన రెండర్థములును ప్రకృతవిషయములే, అనఁగాఁ జెప్పఁదలఁచుకొన్న విషయములే, ఉపమేయములే. ౨-వ భేదమందు రెండర్థములును అప్రకృతములే. ౩-వ భేదమునందు నొక్కటి ప్రకృతముగను, ఇంకొక్కటి యప్రకృతముగను ఉండును. మొదటి రెండుభేదములందును విశేషణవిశేష్యములకుఁగూడ రెండర్థము లుండును. మూఁడవభేదమునందు విశేషణములకుమాత్రము రెండర్థము లుండును. విశేష్యములకు నొక్కయర్థమే యుండును.

అట్లు గాక విశేష్యవిశేషణములకు రెంటికిని శ్లేష యున్న యెడల నది 'శబ్దశక్తిమూలధ్వని'.

ఉదా : (౧). శ్రీసతీమనోహరుఁ, డసమానబాణవైరి, యంధకక్షయకరుఁడు, శశిమచ్ఛిరోహరుఁడు, దివ్యగోపుఁ, డచ్ఛవిభూతిభూషణుఁడుమాధవుఁడు మమ్ము రక్షించుఁగాత[1].

ఇచ్చట శివకేశవుల నిద్దఱను స్తుతించుట యుద్దేశము. ఇట్లు ఆంధ్రభారతమునందు హరిహరనాథునకు సంబంధించిన ఆశ్వాసాది

1. శివపరము : శ్రీ సతీదేవికి భర్త, మదనవైరి, అంధకాసురుని చంపినవాఁడు, చంద్రుఁడు నెత్తిమీదఁగల వాఁడు, దేవత లను పశువులకుఁ బతి, తెల్లనిబూడిదచే శోభించువాఁడు, ఉమాధవుఁడు. విష్ణుపరము : లక్ష్మి యను పతివ్రతకుభర్త, సాటిలేని బాణాసురునకు వైరి, అంధకు లను యాదవులకు క్షయము ( పురము - ద్వారక ) కట్టించియిచ్చినవాఁడు, శశిమత్ ( చంద్రునివైరియైన రాహువు ) శిరస్సును త్రుంచినవాఁడు, దేవుఁడైన గొల్లవాఁడు, నిర్మలమైన వైభవముచే శోభించువాఁడు, మాధవుఁడు. ఇందు మొదటి చివరశబ్దములు సమానార్థకములు గనుక 'మాధవ', 'ఉమాధవ' పదములు విశేష్యములుగఁ దీసికొనవలెను.

sampath_Ebooks

ఆశ్వాసాంతపద్యములందును, నైషధమందలి పంచనళి యనుపద్యము లందును, రాఘవపాండవీయ హరిశ్చంద్రనలోపాఖ్యానాద్యనేకార్థ కావ్యములందును, అర్థము లన్నియుఁ బ్రకృతములే కనుక నవి కేవల ప్రకృతశ్లేష కుదాహరణములు.

ఉదా : (౨). శిరోగృహీతసన్మార్గులును, స్ఫురత్కటకసంపదు లును అను మహాకులమహీభృత్తుతో నీ కాకతీంద్రుఁడు సమానుఁడు —(ప్ర. రు.).

ఇందుఁ బ్రకృతము కాకతీంద్రుఁడు. కావున శ్లేషచే నాత నితోఁ బోల్పఁబడిన రెండు ఉపమానములును అప్రకృతములు. 'మహా కులమహీభృత్తు' లనఁగా గొప్పవంశమునందుఁ బుట్టినరాజులును, ఘన మైన కులపర్వతములును. ఇది విశేష్యశ్లేష. 'శిరోగృహీత సన్మార్గు' లనఁగా సజ్జను లవలంబింపవలసినసదాచారములను గౌరవించువారును, నక్షత్రమార్గమును (ఆకాశమును) తలమీఁద వహించునవియు, 'స్ఫుర త్కటకసంపద' యనఁగా వెలుఁగుచున్న కటక మనునట్టి నగలసంపద గలవారును, కొండ నడుమను భాగ్యముచే శోభిల్లుచున్నవియు నని యర్థము. ఇట్లివి శేష్యవిశేషణగత మైన యర్థద్వయముచేత కాకతి రాజు కులీనరాజులతోడను, కులపర్వతములతోడను పోల్పఁబడెను.

ఉదా : (౩). 'మహిమ న్వ్యాగమశాసనుండు వెలయింపన్.' అనుపద్యము ప్రకృతాప్రకృతశ్లేష కుదాహరణము. ఇందు ఆంధ్ర వాఙ్మయవర్ణనము ప్రకృతము. ప్రపంచవర్ణన మప్రకృతము.

ఈ మూఁడవభేదమును విద్యానాథ, జగన్నాథాదు లొప్పినను, మమ్మట విద్యాధరాదు లొప్పరేదు. వారిమతమున మొదటిరెండే యీ యలంకారమునకు భేదములు.

మరల శ్లేష రెండువిధములు. శబ్దశ్లేష, అర్థశ్లేష. ఉద్భట రుయ్యకమతంబున శబ్దశ్లేష సభంగకము, అర్థశ్లేష యభంగకము. శబ్దము నాశ్రయించునది శబ్దశ్లేష, అర్థము నాశ్రయించునది యర్థ శ్లేష. స్వరప్రయత్నాదులచేతఁ గాని, శబ్దమును విడఁగొట్టుటవలనఁగాని శ్లేషయై రెండర్థములు బయలుదేఱెనేని యది శబ్దశ్లేష (సభంగశ్లేష). 'ఇంద్రశత్రు' పదమునకు స్వరభేదములచే నింద్రునిఁ జంపువాఁ డనియు, నింద్రునిచే జచ్చువాఁ డనియు రెండర్థము లగును. అది శబ్దశ్లేష. అట్లే పదమును విఱిచిన రెండర్థము లగునేని యది శబ్ద శ్లేష. 'పార్వతీపరమేశ్వరౌ' అనుశబ్దమును 'పార్వతీప, రమేశ్వరౌ' శబ్దములుగ విఱిచి శివకేశవు లని రెండవయర్థము చేసిన నది శబ్దశ్లేష యగును. శబ్దార్థశ్లేషలు కలిగినచో నుభయశ్లేష యగును.

ఈమతము కావ్యప్రకాశకారుఁ డైన మమ్మటునకు సమ్మతము కాదు. ఆతనిమతమున, ఒకానొకశ్లేషలోనిపదమును తీసి దానికి బదు లుగ మఱియొకపర్యాయపదమును బెట్టిన శ్లేషకు భంగము వచ్చునేని యది శబ్దశ్లేష, శ్లేషకు భంగము రాదేని యది యర్థశ్లేష. (చూడుఁడు, ౧౫౬౧-వ పుట).

మమ్మటమతంబున సభంగశ్లేష, వర్ణ పద లింగ భాషా ప్రకృతి ప్రత్యయ విభక్తి వచనశ్లేష లని యెనిమిదివిధములు. ఇందుఁ గొన్నిటి కుదాహరణంబు లిచ్చెద :

వర్ణశ్లేష :— ఉదా : వాఁడుమాధవుఁడు.

ఈవాక్యమునకు వాఁడు మాధవుఁడు (విష్ణువు) అనియు, వాఁడు ఉమాధవుఁడు (శివుఁడు) అనియు రెండర్థములు చేసినయెడల నది 'వర్ణశ్లేష'. 'ఁడు'లోనుండి విడఁదీసిన 'ఉ' అను వర్ణము వలన నీశ్లేష కలిగెను.

పదశ్లేష :— ఉదా : పార్వతీపరమేశ్వరులు.

పార్వతీ + పరమేశ్వరులు = దుర్గాశివులు

పార్వతీప + రమేశ్వరులు = శివుఁడు, విష్ణువు.

లింగశ్లేష :— ఉదా : కృష్ణవదనంబు విని ధర్మజుం డిట్లనియె :

దీనిని సమాసముగా రెంచిన 'కృష్ణునివదనము అని యర్థము. వ్యస్తపదముగ రెంచిన కృష్ణయొక్క (ద్రౌపదియొక్క) వదన మని యర్థము. మొదటి 'కృష్ణ' పదము పుంలింగము, రెండవ 'కృష్ణ' పదము స్త్రీలింగము.

ఇట్లే అక్కడయ్యె కృష్ణమ్మ మొదలయినపదములు స్త్రీలింగ, పుం లింగములందు వాడి రెండర్థములు సాధించినయెడల లింగశ్లేష యగును.

వచనశ్లేష :— ఒక్కటేమాటను ఒకప్పుడేకవచనముగను, రెండవతూరి బహువచనంబుగను అన్వయించి రెండర్థంబుల సాధించిన నీశ్లేష యగును.

ఉదా : గోపాలబాలురు వచ్చిరి. గౌరవార్థమందు కృష్ణ పరము. రెండవయర్థమందు గొల్లపిల్లలు అని బహువచనము చేసిన క్రియ సరిపోవును.

భాషాశ్లేష :— సంస్కృతప్రాకృత భాషాపదములకును, లేక సంస్కృతాంధ్రభాషాపదములకును శ్లేష కల్గినయెడల దానిని భాషా శ్లేష యందురు.

ఉదా : క. వినియతనిందనపైకా నిను

కొని యేఁగినయమికిఁ దగనిఘోరార్తి యొన

ర్చినవాఁడ మాకు దండ్యుఁడ

నని తనుఁ దెలుపుచును వారి కప్పననేసెకా.

—(రా. పాం., ౧-౨౪)

ఈపైపద్యమందలి 'వినియతనిందనపైకా' అన్న పదములను రామాయణార్థమందు 'విని + అతని కా + తనపైకా' అని అన్ని తెలుఁగుపదములుగ విడఁదీసి యర్థము చేయవలెను. భారతార్థమందు 'వినియత + నిందనపైకా' అని కొన్ని సంస్కృతపదములుగ విడఁ దీసి, మిక్కిలి నియతమైన యపకీర్తినే యన్న యర్థము చేయవలెను.

ఇట్లు సంస్కృతపదములకును, ఆంధ్రపదములకును శ్లేష చేయఁబడినది. ఇతర శ్లేషలయుదాహరణము లూహింపనగును.

౨౪. అప్రస్తుతప్రశంసాలంకారము :— లక్ష : అప్రస్తుత విషయముఁ జెప్పుటచేతఁ బ్రస్తుతవిషయము స్ఫురించుట 'అప్రస్తుత ప్రశంస'. ప్రశంస యన కథనము, చెప్పుట.

ఇందుఁ బ్రస్తుతవిషయము స్ఫురించుట సామాన్యవిశేష భావము, కార్యకారణభావము, సారూప్యము అను మూఁడువిధము లగుసంబంధములచేఁ ఘటిల్లును : ౧. సామాన్యముచే విశేషము, ౨. విశేషముచే సామాన్యము, ౩. కార్యముచేఁ గారణము, ౪. కారణముచేఁ గార్యము, ౫. స్వసదృశము అని యిది మొత్తముమీఁద నైదువిధములు.

ఉదా : (౧). కఠినపాఠములను మరల మరలఁ జదివి పరీక్ష సాధించినవాఁడే పురుషుఁడు.

పరీక్ష తప్పినపిల్లవానిని పురికొల్పుటకై యీమాట చెప్పిన యెడల, సామాన్యముచే సూచింపఁబడినవిశేషము (నీవును సాధింపుము) అనుదానికి నుదాహరణము.

ఉదా : (౨). పిచ్చివాఁడు తామరాకుమీఁదిజలమును చూచి ముత్యమని భ్రమపడెను. చేతితోఁ బట్టుకొనఁబోఁగా నది పడిపోయెను. వాఁడు ముత్యము పోయె నని యేడ్వసాగెను—( కా. ప్ర ).

మూర్ఖులకు నయోగ్యపదార్థములందు మమత హెచ్చు అనిన సిద్ధాంత మీవిశేషోదాహరణమువలనఁ జెప్పఁబడెను. ఇట్లే యితరోదాహరణముల నూహించునది.

౨౫. అర్థాంతరన్యాసాలంకారము :— సామాన్యముచేత విశేషమును గాని, విశేషముచేత సామాన్యమును గాని సమర్థించుట 'అర్థాంతరన్యాసము'.

సమర్థించుట యనఁగా నిది సరియా సరికాదా యన్న సంశయమును బాపి 'యిది యట్లే' ( ఇదమిత్థం ) అన్న దృఢప్రత్యయమును ( నమ్మిక ) కల్గఁజేయుటయే.

ఉదా :

మ. జలజాతాసన వాసవాది సురపూజాభాజనంబై తన
ర్చు లతాంతాయుధుఁ గన్నతండ్రి శిరమచ్చో వామపాదంబునన్
దొలఁగంద్రోచె లతాంగి, యట్లయగు ; నాథుల్ నేరముల్ సేయఁబే
రలుకం జెందినయట్టికాంత లుచితవ్యాపారముల్ నేర్తురే ?
—( పా. హ., ఆ. ౧ ).

ఇందు సామాన్యముచేత విశేషము సమర్థింపఁబడినది. ఇయ్యది సాధర్మ్యవైధర్మ్యములచే ద్వివిధము.

'దృష్టాంత'మందు సామాన్యము సామాన్యముచేతను, విశేషము విశేషముచేతను సమర్థింపఁబడును. కాన దీనికిని దానికిని ఇదే భేద మని యెఱుంగునది.

౨౬. పర్యాయోక్తాలంకారము :— లక్ష : వివక్షితార్థము భంగ్యంతరముచేత ( ప్రకారాంతరముచేత ) ప్రతిపాదింపఁబడుట 'పర్యాయోక్తము.'

ఉదా : అచట రఘుమహారాజుయొక్క వ్యాపారము హూణ రాజస్త్రీలచెక్కిళ్లయందు ద్విగుణితాయను పుట్టించెను — ( రఘు ).

ఇచ్చట హూణస్త్రీలకు భర్తృవియోగము భంగ్యంతరముచేతఁ జెప్పఁబడెను.

భంగ్యంతరములు కవియొక్క తెలివినిపట్టి యనేకవిధములుగ నుండును. 'రండి' అని చెప్పుటకు, 'దయచేయుఁడు, ఈస్థల మలంకరింపుఁడు, మమ్ముఁ గృతార్థులఁ జేయుఁడు, సఫలజన్ములఁ గావింపుఁడు, ఈదేశముయొక్క భాగ్యమును ఉజ్జీవింపఁజేయుఁడు' అని యెన్నియో తెఱఁగులఁ జెప్పవచ్చును.

ఇందు వ్యంగ్య మున్నను అది వాచ్యమునకు లొంగియుండును. వాచ్యమే వ్యంగ్యముకంటెఁ జారుతరము.

౨౭. వ్యాజస్తుత్యలంకారము :— లక్ష : పైకి నిందగఁ గాన వచ్చి పర్యవసానము స్తుతిగను, పైకి స్తుతిగఁ గానవచ్చి పర్యవసానము నిందగను వ్యక్త మగునట్లు చెప్పినచో 'వ్యాజస్తుతి'.

ఉదా : (౧). పాపాత్ములకుఁగూడ స్వర్గ మొసంగుచున్నావు, గంగా ! నీకు వివేక మేది ? ( ర. గం. ).

ఇందు గంగను నిందించిన ట్లున్నను దానిమాహాత్మ్యాతిశయమును వర్ణించుటయే యుద్దేశము.

ఉదా : (౨). కుకవులు పరోపకారపరాయణులు. 'ఏ మహాత్ములు గల్గ భూమీశసభలలోఁ గవులకు మిగుల విఖ్యాతి గల్గె' —( నగస. ).

ఇది పైకి స్తుతిగ నున్నను ; నిజముగ నిందయే.

౨౮. ఆక్షేపాలంకారము :— లక్ష : చెప్పఁదలఁచుకొన్న విషయమునకు విశేషార్థ మేర్పడవలె నన్నకోర్కతో దానిని నిషేధించుట 'ఆక్షేపము'.

కట్టినిషేధ మాక్షేపము కాదు. అది వాస్తవము కానిది ( నిషేధాభాసము )గా నుండి యర్థాంతరమందుఁ బర్యవసించి, యొకవిశేషమును స్ఫురింపఁజేసినఁ గాని ఆక్షేపాలంకారత్వమును జెందదు.

ఉదా : శ్వాస మనుమానవేద్యము, కాళ్లు చేతులు చల్లఁబడినవి, చూపు నిశ్చలము. అయ్యో ! ఆమెకథ యిది. అసంగతి యెందుకు ? మఱియొకవిషయము మాటలాడుదము —( ర. గం. ).

ఇందు దూతిక నాయకునకు నాయికావిరహస్థితిని వర్ణించుచున్నది. ఆమెసమాచారమంతయుఁ జెప్పి 'అసంగతి యెందుకు' అని నిషేధించుట నాయికస్థితి అనిర్వచనీయ మని చెప్పుటకు. నిషేధము అవాస్తవము. నాయకునిజిజ్ఞాస యభివృద్ధి చేయుటయే యుద్దేశము.

ఇది ఉక్తవిషయము, వక్ష్యమాణవిషయము అని రెండువిధములు. ఒకసంగతి చెప్పి తరువాత దానిని నిషేధించుట ఉక్తవిషయము. మొదట నిషేధించి పిమ్మట సంగతి చెప్పుట వక్ష్యమాణము.

ఈయలంకారమునకుఁ బలువురు పలువిధములుగ లక్షణములు చెప్పియున్నారు. వామనునిలక్షణమును జూచిన నది 'ప్రదీపము'తో సరిపోవును.

౨౯. విరోధాలంకారము :— లక్ష : విరోధము లేకయే విరోధ మున్నట్టు చెప్పుట విరోధాలంకారము. దీనినే 'విరోధాభాస' మందురు.

ఉదా : దుర్మార్గులమాటలు కోమలములును శీతలములును అయినను సత్పురుషుల హృదయములను కోయును, కాల్చును —( ర. గం.).

ఇంవలివిరోధ మాభాసము గాని నిజము గాదు. నిజమైన వది యొకదోషము ; ఆభాస మైన వది యలంకారము.

జాతిగుణక్రియాద్రవ్యము లనఁబడు నాలుగింటికిని ఏమగోఁ బిమకును ఒకదానితో మఱియొకదానికిని గలుగు వైరముల వరుసను ఈయలంకారము పదివిధము లయ్యెను.

ఉదా : ప్రియవియోగమువలన నా మెడకుఁ గమలంబు లగ్ని యయ్యెను.

ఇందు 'కమల'జాతికిని 'అగ్ని' జాతికిని వైరము చెప్పఁబడినది. కమల మగ్ని యగుట యెట్లు? అసంభవము. కావున విరహిణీదుఃఖజనకత్వముచే నీవిరోధ మాభాసము. ఇట్లే వేఱుదాహరణంబుల నూహించుకొనునది.

౩౦. విభావనాలంకారము :— లక్ష : కారణము లేకయే కార్యోత్పత్తిని చెప్పుట 'విభావన'.

ఉదా : వనితా! లాక్షారసముచే పూయఁబడకపోయినను నీచరణము లెఱ్ఱగ నున్నవి.

లాక్షారసము పూయుట కారణము, కాళ్లెఱ్ఱబడుట కార్యము. ఇచ్చట నాస్త్రీయొక్క చరణములు స్వాభావికముగ నెఱ్ఱనివి. ఆకారణముచేఁ గవి కారణము లేకయ పుట్టినకార్యముగ వాని వర్ణించి యలంకారము సాధించెను.

అప్పయదీక్షితులవారు దీనికి నైదుభేదములు చెప్పిరి. కాని జగన్నాథుఁ డవి యనావశ్యకము లని సిద్ధాంతీకరించెను.

౩౧. విశేషోక్త్యలంకారము :— లక్ష : ప్రసిద్ధకారణకలాపము సిద్ధముగ నున్నను కార్యోత్పత్తి కాకపోవుట 'విశేషోక్తి'.

ఉదా : ఉపనిషత్తులయర్థమును దెలిసికొంటిని, భగవద్గీత పారాయణముం జేసితిని, బ్రహ్మసూత్రభాష్యమును వల్లించితిని, కాని విషయములనుండి మనస్సును త్రిప్పలేనైతిని! — ( ర. గం. ).

౩౨. అసంగత్యలంకారము :— లక్ష : కార్యకారణములు వేఱువేఱుస్థలములందుఁ గాని విరుద్ధస్థలములందుఁ గాని కానఁబడుట 'అసంగతి'.

ఉదా : ఎవ్వనికి వ్రణము కలదో వానికే వేదన యన్న మాట కల్ల. ఈచిన్నదానిచెక్కిలియందలి దంతక్షతము, సవతులకు వేదన కలిగించినది — ( చంద్రా. ).

౩౩. విషమాలంకారము :— లక్ష : అననురూప మైన సంసర్గమునకు 'విషమము' అని పేరు. ౧. విరూపకార్యోత్పత్తి, ౨. అనర్థోత్పత్తి, ౩. విరూపఘటన యని యివి మూఁడువిధములు.

కారణమునకు విరూప మైన కార్యము పుట్టుట విరూపకార్యోత్పత్తి.

ఉదా : (౧) నల్లగా నున్న యీకత్తి యీరాజుచేతఁ బట్టఁగానే తెల్లనికీర్తిని గనుచున్నది — ( కువల. ).

ఒక కార్యమును చేయఁబూనినపుడు దాని లభింపకపోఁగా మఱి యొక యనర్థము కలుగుట అనర్థోత్పత్తి.

ఉదా : (౨). రావణుఁడు హనుమంతునితోఁకను కాల్పఁదలఁచి దానికి నిప్పు ముట్టింపించెను, కాని తోడనే తనపట్టణము దగ్ధ మగుట అనుభవించెను — ( కువల. ).

అనురూపములు కాని రెంటికి చేరిక చెప్పుట విరూపఘటన.

ఉదా : (౩). నక్క యెక్కడ దేవలోక మెక్కడ?

౩౪. సమాలంకారము :— లక్ష : అనురూప సంసర్గము 'సమము'. అనురూపములైన రెండువస్తువులకు ( ఉత్పత్తిలక్షణము, సంయోగాదిలక్షణము లన్న ) సంబంధము వర్ణింపఁబడినయెడల నీ యలంకార మగును.

ఇది అభిరూపసంఘటన, అనభిరూపసంఘటన అని ద్వివిధము.

ఉదా : (౧). రాజా! చంద్రిక చంద్రునితోఁ జేరినట్లును, గంగ చంద్రశేఖరునిఁ బొందినట్లును, కీర్తి తనకు ననురూపుఁడవైన నిన్ను ఆశ్రయించెను — ( కువల. ).

ఉదా : (౨). పిశాచములవివాహములందు గర్దభములే గాయకులు.

౩౫. విచిత్రాలంకారము :— లక్ష : కోరుఫలమునకు విరుద్ధ మయిన ప్రయత్నముఁ జేయుట 'విచిత్రము'.

ఉదా : సత్పురుషులు మల్లోకములకంటెను ఔన్నత్యమును బొందుటకై నమ్రు లయ్యెదరు — ( చంద్రా. ).

౩౬. అధికాలంకారము :— లక్ష : ఆధారాధేయములలో నొక్కటి మిక్కిలి పెద్దదిగను మఱియొక్కటి మిక్కిలి చిన్నదిగను ఉన్నట్టు చెప్పుట 'అధికము'.

ఖువలెను.

sampath_Ebooks

ఉదా : విశ్వమునకు నాశ్రయుఁడైన హరి యొందు పోయిగఁ బరుండియున్నాఁడో యట్టి నీ హృదయముయొక్క విస్తారము చెప్పుటకు వీలు లేదు — (ర. గం.).

ప్రపంచమున కంతకును ఆధారమైన హరికంటె ఆధేయమైన హృదయము పెద్దది యని వర్ణింపఁబడినది.

౩౭. అన్యోన్యాలంకారము :— లక్ష : రెండువస్తువులలో దానిచేత నిదియు, దీనిచేత నదియు నుపకారమును చెందుచున్నట్లు చెప్పినచో 'అన్యోన్యము'.

ఉదా : రాత్రిచేఁ జంద్రుఁడు శోభించుచున్నాఁడు. చంద్రునిచే రాత్రి శోభించుచున్నది — (చంద్రా.).

౩౮. విశేషాలంకారము :— లక్ష : ప్రసిద్ధమైన యాధారము లేక యాధేయ ముండుటయు, అనేకములయిన యాధారములందు నాధేయ మొక్కటియే యేకకాలమందు నొక్కతీరుగా నుండుటయు, ఒక కార్యము ప్రారంభము కాఁగా దానిచేత అశక్యమయిన (కాఁదగని) మఱియొక కార్యముకూడ నగుటయు అని 'విశేషము' మూఁడు విధములు.

ఉదా : (౧). కవు లేల వంద్యులు కారు ? వారు దివి కేఁగినను వారియనల్పగుణగణములుగల వాక్కు లీలోకమును ఆకల్పాంతము గూడ రంజింపఁజేయును — (కా. ప్ర.).

ఉదా : (౨). ఆపె నీహృదయమునందును, కన్నులందును, వాక్కులందును నివసించియున్నందున, మావంటి పుణ్యహీనులకు తా నెక్కడ ? — (కా. ప్ర.).

ఇది ఒకపత్నీయందు దక్కువాదరముగల పతితో నితరసపత్నులన్న వాక్యము.

ఉదా : (౩). ఇల్లాలవు, మంత్రివి, ఏకాంతమునందు నెచ్చెలివి, లలితకళలలో శిష్యురాలవు. నిన్ను నెత్తుకొనిపోయిన కరుణారహితుఁడైన మృత్యువు, నావియైన యే (జిలగల) ద్రవ్యముల నెత్తుకొనిపోలేదు? (అన్నియు నెత్తుకొనిపోయె నని భావము)—(రఘు.).

ఇది భార్యమరణమునకు దుఃఖించుచున్న అజునివాక్యము. మృత్యువు ఇందుమతి నొక్కదానినే యెత్తుకొనిపోవ యత్నించెను. కాని యిందువలన విపరీతమైన సదివాది సర్వహరణరూపకార్యము సిద్ధించెను.

౩౯. వ్యాఘాతాలంకారము :— లక్ష : ఒకకర్త యొక్క కార్యమును ఒకయుపాయముచే సాధింపఁగ (లేక సాధింపఁబోవ) మఱియొకకర్తచే నాయుపాయముచేతనే తద్విరుద్ధకార్యము సాధింపనాకార్యము వ్యత్యస్త మగుట 'వ్యాఘాతము'.

ఉదా : దృష్టిచేతఁ గాల్పఁబడిన మన్మథుని దృష్టిచేతనే బ్రతికించి శివుని జయించినవారయిన స్త్రీలను కొనియాడెదను — (రాజశేఖరకవి).

ఒక్కకార్యసాధకమే విపరీతసాధకముగఁ బరిణమించుటయు వ్యాఘాతమే.

ఉదా : బాల్య మని యుద్ధమునకు రావల దని యనియెద వేల ? బాల్యముననే కదా విద్యల నభ్యసించుట ?

నీకు బాల్యము, యుద్ధమునకు రావల దని రాజు చెప్పఁగా యువరాజు చెప్పినజవా బిది. రాజుమతమున బాల్యము యుద్ధమునకు రాకుండుటకుఁ గారణము. యువరాజుమతమున నదియే యుద్ధమునకుఁ దాను పోవుటకుఁ గారణము.

శృంఖలాలంకారములు :— లక్ష : పంక్తిరూపముచే (వరుసగ) నిబద్ధము లయిన యర్థములలోఁ బూర్వపూర్వముల నుత్తరోత్తరములతోను, లేక ఉత్తరోత్తరములకుఁ బూర్వపూర్వములతోను లంకె వేసి చెప్పినయెడల నది 'శృంఖల' యగును. ఇయ్యది మూఁడు విధములు : కారణమాల, ఏకావలి, సారము.

౪౦. కారణమాలాలంకారము :— అనుగుణములయిన కార్యకారణములకుఁ గల శృంఖల 'కారణమాల' యనఁబడును.

ఇది, మొదటఁ గారణమును జెప్పి తరువాతను గార్యములను జెప్పునది యొకటియు, మొదటను గార్యమును జెప్పి పిదపఁ గారణమును జెప్పునది రెండవదియు నని రెండువిధములు.

ఉదా : జితేంద్రియత్వము వినయమునకుఁ గారణము, వినయము గుణప్రకర్షమునకుఁ గారణము, గుణప్రకర్షము జనానురంజకత్వమునకుఁ గారణము, జనానురంజకత్వము సంపదలకుఁ గారణము — (కా. ప్ర.).

ఉదా : (౨). నరకము పాపమువలనను, పాపము దారిద్ర్యము వలనను, దారిద్ర్యము దానము చేయమిచేతను ప్రాప్తించును. కావున దానము చేయవలయును — (కువల.).

౪౧. ఏకావల్యలంకారము :— లక్ష : విశేష్యవిశేషణభావములకు లంకె (సంసర్గము) గల శృంఖల 'ఏకావలి' యగును.

ఇది రెండువిధములు : విధిరూపము, నిషేధరూపము అని.

ఉదా : (౧). దేవా ! ధర్మముచే నీబుద్ధి పరిశుద్ధమయినది. బుద్ధిచే లక్ష్మి అరికట్టఁబడినది. లక్ష్మిచే లోకమందలి సకలజనులును సంతుష్టిని జెందిరి. జనులచే నీకీర్తి సకలభువనములకును గొనిపోఁబడియెను — (ర. గం.).

ఉదా : (౨). పెద్దలు లేనిది సభ కాదు, ధర్మము చెప్పనివారు పెద్దలు గారు, సత్యము లేనిది ధర్మము కాదు, కపటముతోఁ గూడినది సత్యము గాదు — (చాటు.).

పైని ఈయఁబడిన రెం డుదాహరణములును పూర్వపూర్వము ఉత్తరోత్తరమునకు విశేషణభావముగా నుండునట్టివి.

sampath_Ebooks

౮౨. మాలాదీపకాలంకారము :— పూర్వపూర్వమున కుత్తరోత్తరము విశేషణముగ నుండుట 'మాలాదీపక' మని ప్రాచీనుల మతము. కాని దీనికి దీపకముతో నేమియు సంబంధములే దనియు, నిదియు నేకావలియొక్క భేదమే అనియు జగన్నాథపండితుని సిద్ధాంతము.

౮౩. సారాలంకారము :— లక్ష : మొదటనుండి చివర వఱకు పూర్వపూర్వవస్తువులకంటెను ఉత్తరోత్తరవస్తువుల కుత్కర్షము చెప్పి చివరవస్తువునకుఁ బరమోత్కర్షముఁ జెప్పినది 'సారము'.

పూర్వవస్తువునకంటె నుత్తరవస్తువునకు నపకర్షము చెప్పినను ఈయలంకార మగును.

ఇది మూఁడువిధములు : ౧. గుణోత్కర్షకము, ౨ గుణాపకర్షకము, ౩. ఉభయము.

ఉదా : (౧). కావ్యములలో నాటకము రమ్యము, వాని లోను శాకుంతలము రమ్యము, అందును చతుర్థాంకము రమ్యము, అందును శ్లోకచతుష్టయము రమ్యము.

ఉదా : (౨). గడ్డిపఱకకంటె దూది చులకన ; దూదికంటె యాచకుఁడు చులకన.

ఉదా : (౩). కొండ గొప్పది, దానికంటె సముద్రము గొప్పది, అంతకంటె నాకాశము గొప్పది, అంతకంటెను ఆశ గొప్పది.

వేదమునందును ఈయలంకారము కలదు.

'మహతః పర మవ్యక్త మవ్యక్తాత్పురుషః పరః,
పురుషాన్న పరం కించి త్సా కాష్ఠా సా పరా గతిః.'

ప్రాచీనాలంకారికు లందఱును సార మనేకవిషయ మనియే చెప్పినారు. కాని జగన్నాథపండితుఁడుమాత్ర మిది యేకవిషయమై కూడ నుండవచ్చుననియు, అప్పుడు అవస్థాభేదంబులచే నా యేకవస్తువునకుఁ గలిగినయుత్కర్షత వర్ణింపఁబడు ననియు నీక్రింది యుదాహరణ మిచ్చినాఁడు :—

ఉదా : గజనిమ్మపండ్లత్రిని దాఁటి, లీలగనే చక్కని బంగారు కడవలగర్వమును భంగపఱచి, నీపాలిం డ్లిప్పుడు బంగారుకొండలతోఁ బోటీ పెట్టుకొన్నవి.

దీనినే కొందఱు 'వర్ధమాన' మను భిన్నాలంకారముగ గ్రహించిరఁట — (ర. గం.).

౮౪. కావ్యలింగాలంకారము :— లక్ష : ఒకవిషయమును సమర్థించుటకయి దానికిఁ గారణముగ మఱియొక విషయమును చెప్పుట 'కావ్యలింగము'.

ఉదా : నేను మన్మథుని గెల్చితిని, నామనస్సునందు శంకరుఁడు గలఁడు.

ఇందలి పూర్వవాక్యమున కుత్తరవాక్యము హేతువు(లింగము). ఇది కావ్యములోఁ జెప్పఁబడిన లింగము. తర్కములోఁ జెప్పఁబడినది కాదు. కావున 'కావ్యలింగము'.

ఈహేతుకథన మొక్కశబ్దములోఁ జెప్పవచ్చును, వాక్యముతోను జెప్పవచ్చును.

౮౫. అనుమానాలంకారము :— లక్ష : సాధనము (హేతువు)బట్టి సాధ్యమును నిశ్చయించుట 'అనుమానము'.

ఉదా : గూండ్లకు చేరుచున్న పక్షులవలనను, ముకుళితములగుచున్న తామరపువ్వులవలనను, పూచుచున్న జాజిపువ్వుల వలనను, వీచుచున్న చల్లనిగాలివలనను సూర్యుఁ డస్తమించుచున్నట్లు తెలియుచున్నది.

కావ్యలింగమునందు హేతువు (సాధనము) 'కారక'రూపకముగను, అనుమానమునందు 'జ్ఞాపన'రూపకముగను ఉండును. ఇదియే యీరెంటికిని భేదము.

హేతువునుబట్టి సాధ్యమును సాధించితి నని కవియే 'అనుమానము'నందుఁ జెప్పును. 'కావ్యలింగము'నందు సాధ్యహేతువులను జెప్పి అనుమానమును సాధించుకొనుపని చదువరులకే వదలివేయును. ఇదియే యీరెండు అలంకారములకును గల భేద మని కొందఱి యభిప్రాయము.

౮౬. యథాసంఖ్యాలంకారము :— లక్ష : మొదటఁ జెప్పిన వస్తువుల క్రమమునకు భంగము లేకుండఁగను అనుగుణముగను అర్థమన్వయించునట్లును వెనుకవరుసయందు వస్తువులక్రమమును చెప్పుట 'యథాసంఖ్యము.' దీనినే 'క్రమాలంకార' మందురు.

ఉదా : రాజా! విక్రమముచేతను, వినయముచేతను, విలాసముచేతను శత్రువులకును, విద్వాంసులకును, స్త్రీలకును, తాపమును, తనివిని, మోహమును పెంచుచు నీ వొక్కఁడవే ముత్తెఱఁగులవారి మనస్సునందు నున్నావు! — (కా. ప్ర.).

విపరీతముగఁ గానవచ్చెడిసమస్యలను పూర్తిచేయుటకై యీయలంకారమును విశేషముగ నుపయోగించెదరు.

౮౭. పర్యాయాలంకారము :— లక్ష : ఒక్కవస్తువున కనేకాధారములయందుఁగాని, అనేకవస్తువుల కొకయాధారమునందుఁ గాని, క్రమముగ ఉనికిని చెప్పుట 'పర్యాయము'.

ఉదా : (౧). రాజా! మొదట సముద్రగర్భమునందును, తరువాత దేవతలగృహమందును చాలకాల ముండి, యమృతము దోషరహిత మైననీముఖమునందు నివసించుచున్నది — (ర. గం.).

ఉదా : (౨). ఖలునిమాటలు మొదట అమృతమును ఒలుకును; పిదప విషమును గ్రక్కును.

sampath Ebooks

౪౮. పరివృత్త్యలంకారము :— లక్ష : తనవస్తువును పరుల కిచ్చి దానికి బదులుగ పరకీయవస్తువును పుచ్చుకొనుట 'పరివృత్తి'.

ఇచ్చినదియుఁ బుచ్చుకొన్నదియు సమముగ నున్న 'సమము'; ఇచ్చినది యెక్కువ పుచ్చుకొనునది తక్కువ యైనచో 'అధికము'; ఇచ్చినది తక్కువ, పుచ్చుకొనినది యెక్కువ యగునేని 'న్యూనము' అని యియ్యది ముత్తెఱంగులు.

ఉదా : (౧). రఘుమహారాజు యాగములతో (ఇంద్రాది దేవతలకొఱకు) భూమిని పితికెను. ఇంద్రుఁడు సస్యముకొఱకు (రఘుమహారాజు ప్రజలయుపయోగమునకై) ఆకాశమును పిండెను (వర్షమిచ్చెను) — (రఘు.).

ఉదా : (౨). వేయిమడుఁగులు (వర్షరూపమున) మరల నిచ్చుటకై సూర్యుఁడు రసమును గ్రహించును.

ఉదా : (౩). ఇతఁ డొక్కబాణమును వదలి శత్రురాజుల సంపదను నిశ్శేషముగ గ్రహించెను.

౪౯. పరిసంఖ్యాలంకారము :— లక్ష : అనేక వస్తువులకు సాధారణమైన ధర్మమును ఒక్కవస్తువునందే నియతము చేయుట 'పరిసంఖ్య'.

ఇది ద్వివిధము — శుద్ధ, ప్రశ్నపూర్విక. మరల నార్థీశాబ్దీ భేదంబులచే నాల్గు తెఱంగు లయ్యెను.

ఉదా : (౧). మహాపురుషులకు భక్తి శివునియందేకాని విభవమునందుఁ గాదు; చింత కీర్తియందుఁ గాని శరీరమునందుఁ గాదు. ఇది శుద్ధ, శాబ్దీ.

ఉదా : (౨) కౌటిల్యము వెంట్రుకలయందును, రాగము కరచరణాధరములందును, చపలత కనులయందును ఉండును.

ఇది శుద్ధ, ఆర్థి (ప్రతీయమాన). కౌటిల్యాదులకు నితరాధికరణత్వము వ్యంగ్యముచే నిషేధింపఁబడినది.

ఉదా : (౩). భూషణ మేది? యశస్సు గాని రత్నము కాదు.

ఇది ప్రశ్నపూర్విక శాబ్దీ.

ఉదా : (౪). పురుషులు సేవింపఁదగిన దేది? పావనం బయిన గంగాతీరము — (కా. ప్ర.).

ఇది ప్రశ్నపూర్విక ఆర్థి. ఇందు నితరక్షేత్రనిషేధము వ్యంగ్యము.

౫౦. అర్థాపత్త్యలంకారము :— లక్ష : ఒక యర్థము సిద్ధింపఁగా దానిచే తుల్యకారణమువలన నిస్సంశయముగను, సహజముగను నింకొకయర్థము సిద్ధించుట 'అర్థాపత్తి'.

ఉదా : నీముఖ మాచంద్రునినే జయించినది; కమలముమాట చెప్ప నేల?

ఈ యలంకారము 'కైముతికన్యాయము'చే నను నని యు, నదియే దండాపూపికాన్యాయ మనియు నందురు.

సిద్ధించునర్థము ప్రకృతముచేఁ బ్రకృతము, అప్రకృతముచే నప్రకృతము, ప్రకృతముచే నప్రకృతము, అప్రకృతముచేఁ బ్రకృతము అని నాల్గువిధములు. ఇం దొక్కొక్కటి అర్థాంతరము యొక్క సామన్యూనాధిక్యము లను మూఁడుభేదములచేఁ బండ్రెండయ్యెను. అవియు భావత్వాభావత్వములచే నిరువదినాల్గయ్యెను.

ఉదా : దిగంతవిఖ్యాతిగల మావంటి పండితులనే యీ వృత్తి లెదిరింప యత్నించిన, నేఁటినుండి నాగుఁబాములను శకుంతములును, ఏనుఁగులను కుందేళ్లును, సింహములను తోఁడేళ్లును తలవన్నఁగలవు —(ర. గం.).

ఇచ్చటఁ బ్రకృతముచే నప్రకృతార్థము సామ్యమువలన సిద్ధించినది.

ఉదా : పురుషసింహా! అనురక్తనైన నన్ను వదలి నీవే వెళ్లఁగా, వనలక్ష్మి ఈవనము నిచ్చటనే వదలినట్లుట చిత్రమా? — (ర. గం.).

అరణ్యములోఁ దన్ను విడిచి వెళ్లిన నలునిగూర్చి దమయంతి చెప్పినమాట యిది.

ఇందు వనవృత్తాంతముకూడ సన్నిహితమైనందునఁ బ్రస్తుతమే. పురుషసింహుఁడవైన నీవే పోఁగా (ప్రాణహీనము, నీకంటెఁ దక్కువది యగు) వనలక్ష్మి పోవుట యేమి ఆశ్చర్యము అని భావము. కనుక అర్థాపత్తి న్యూనతాద్యోతకము.

ఉదా : కాలుఁ డందఱగర్వమును భంగముచేయువాఁడు; బ్రహ్మాండములను మేడికాయలవలె భక్షించును. వానియెదుట మన మెట్టివారము? దోమలము — (ర. గం.).

ఇచ్చట నప్రస్తుతమైన బ్రహ్మాండభక్షణముచే సమస్తభూతముల యనిత్యత్వము కైముతికన్యాయము ననుసరించి చెప్పఁబడ్డది.

ఇతర భేదముల కుదాహరణము లూహ్యములు.

ఈయలంకారమును మమ్మటుఁడు స్వతంత్రాలంకారముగ నొప్పుకొనలేదు. కావ్యప్రకాశముమీఁద వ్యాఖ్యానము వ్రాసిన ఉద్ద్యోతనకారుఁడు 'అర్థాపత్తి' అనుమానాంతర్గతమే యనెను. అలంకారసర్వస్వకారుఁడు ఏకావలీకారుఁడు ప్రతాపరుద్రయశోభూషణకారుఁడు రసగంగాధరకారుఁడు మొదలయినవా రందఱును దీనిని స్వతంత్రాలంకారముగ నొప్పుకొనిరి.

౫౧. వికల్పాలంకారము :— లక్ష : విరుద్ధములయిన రెండు వస్తువులను ఒకదాని కొకటి మాఱుగ వికల్పించి చెప్పుట 'వికల్పము'.

ఉదా : ప్రాణములైనను విడువుము, సీతనైనను విడువుము; గ్రద్దలకైనను ద్విజులకైనను సంతుష్టి కావింపుము; యమునినైనను

భజింపుము, రామునినైనను భజింపుము. నీయిష్టము వచ్చినది చేయుము — (ర. గం.).

'ఉపమ'కు 'వ్యతిరేక' మెట్లో యిది 'సముచ్చయ' మునకుఁ బ్రతిపక్షభూతము. వికల్పింపఁబడిన యర్థములకుఁగల ఔపమ్యమే అలంకారబీజము. అది లేనియెడల కేవలవికల్ప మైన 'బ్రదుకనిమ్ము, చావనిమ్ము ధర్మము విడువను' అన్న వ్యవహారవాక్య మగును.

'హతో వా ప్రాప్స్యసి స్వర్గం జిత్వా వా భోక్ష్యసే మహీమ్' 'చచ్చినయెడల స్వర్గమును బొందుదువు, గెలిచినయెడల భూమి నేలుదువు' అన్న గీతావాక్య మీయలంకారమున కుదాహరణము.

౫౨. సముచ్చయాలంకారము :— లక్ష : పదార్థములకు (పదములయర్థములకు) యౌగపదన్వయము 'సముచ్చయము'.

'యౌగపత్' అనఁగా నొక్కసారి. ఇది వికల్పాలంకారమునకుఁ బ్రతిభటకల్పము.

ఇందు రెండు భేదములు కలవు.

(అ) గుణములుగాని క్రియలుగాని రెండునుగాని యేకకాలమందు సంభవించుట యొక 'సముచ్చయము'.

ఇది యేకధర్మవిషయము కావచ్చును, అనేకధర్మవిషయము కావచ్చును.

ఉదా : (౧). మేఘము పుట్టఁగనే యాకాశము కాటుకవలె నల్లగను, స్త్రీచెక్కిళ్లు తెల్లగను ఆయెను — (ర. గం.).

ఇందు భిన్నధర్ములయందలి భిన్నగుణములు 'అగు' ధాతువుతో యౌగపదన్వయింపఁబడినది.

ఉదా : (౨). రాజా! నీ చాపప్రతాపము దిగంతములను కౌఁగిలించుకొనుచున్నది, పోరాని దేవేంద్రపట్టణమునకుఁ బోవుచున్నది.

ఇందు భిన్నక్రియలకు నేకధర్మ్యన్వయము. ఇట్లే యితరోదాహరణముల నూహింపవలెను.

(ఆ) కార్యము సాధించుట కొక్కసాధనమే చాలియుండఁ బెక్కుసాధనములను గార్యమునందు నన్వయించుట మఱియొకవిధమైన 'సముచ్చయము'.

ఉదా : (౩). గొప్పకులము, చక్కని యాకారము, శాస్త్రజ్ఞానముచే నొప్పెడిబుద్ధి, బాహుబలము, నిండారిన సంపద, అఖండితమైనరాజ్యము చిక్కెనేని యెట్టిమానవునకైనను గర్వము కలుగును.

ఒక్కసారి చెప్పఁబడినకారణములలో రెండును చెడ్డవిగా నుండవచ్చును, ఒకటి మంచిది ఒకటి చెడ్డదిగ నుండవచ్చును.

ఉదా : (౪). పగలు తెలతెలఁబాఱుచున్న చంద్రుఁడు, కళ లేనికాంతయు, చదువు లేనిరూపసి, లుబ్ధుఁడగురాజు, దరిద్రులయిన సజ్జనులు, రాజసభలోఁ బలుకుబడిగల దుష్టులు — ఈ యేడును నాకు హృదయశల్యములు.

ఇందు నొకటి మంచిగుణమును, ఒకటి చెడ్డగుణమును చెప్పఁబడినవి.

౫౩. సమాధ్యలంకారము :— లక్ష : ఒక కారణముచేతఁ బ్రారంభము చేయఁబడినకార్యము ఆకస్మికమైన కారణాంతరముచే సుకర మగుట 'సమాధి'.

ఇందుఁ గారణాంతరము కాకతాళీయముగ సంభవించును.

ఉదా : దాని ప్రణయకోపమును పోఁగొట్టుటకై నేను దాని పాదములమీఁదను బడఁబోఁగా నాయదృష్టమువలన నా కుపకారముగ మేఘగర్జన మాయెను.

ఈయలంకారమునందు నొకకారణముచేతనే యనుకార్యము తనంతటను దానుగ సంభవించిన యన్యకారణముచే సుకరము చేయఁబడును. 'సముచ్చయము'నందు కార్యము చేయుటలో నన్నికారణములను ఖలేకపోత న్యాయముచే సమానములు. 'కావ్యలింగము'నందు హేతుత్వముమాత్రము వివక్షితము, హేతువులసంఖ్య గాని గుణప్రాధాన్యము గాని వివక్షితములు కావు. ఇది యీయలంకారములకుఁ గలభేదము లని తెలిసికొనవలయును.

౫౪. ప్రత్యనీకాలంకారము :— లక్ష : ప్రతిపక్షులమీఁది కసి తీర్చుకొనుటకై ప్రతిపక్షులకు సంబంధించినవారిని తిరస్కరించుట 'ప్రత్యనీకము'.

ఇందుఁ బగవాఁడు బలవంతుఁ డనియు, వానిని తిరస్కరించుట చేతఁగానందున వానికి సంబంధముగలవారిని తిరస్కరించుచున్నా రన్నయర్థము గమ్యము.

ఉదా : మనసా! మనోభవునిఁ జంపినశివునిమీఁద నీకున్న కోపముచే ఆశనిభక్తుఁడ నగు నన్ను సంసార మను బురదలో నేల ద్రోసెదవు? ఇట్లా నీవు పుత్రశోకమును కనఁబఱుపవలసినది?

(మనోభవుఁడు = మనస్సునల్లఁ బుట్టినవాఁడు; మన్మథుఁడు).

ఈ యలంకారమునకును హేతూత్ప్రేక్షకును భేదము లేదనియు, దాని కిది యొకభేద మనియుఁ గొందఱిమతము.

౫౫. ప్రతీపాలంకారము :— లక్ష : ఉపమేయోత్కర్ష ప్రయోజకమైన ఉపమానాపకర్షము 'ప్రతీపము'. ఈ యపకర్షమైదు విధములుగఁ జేయవచ్చును.

(అ) ఉపమానోపమేయములను ఉపమేయోపమానములుగఁ జెప్పుటవలన.

(ఆ) ఉపమానముయొక్క యద్వితీయతను పరిహరించుటకు రెండవసాదృశ్యమును చెప్పుటవలన.

sampath Ebooks

( ఇ ) ఉపమేయముయొక్క యద్వితీయతను పరిహరించుటకుఁ జెప్పినట్లు ఉపమానమును చెప్పుటవలన. ఇందు ఉపమానాపకర్షము వ్యంగ్యము.

( ఈ ) ఉపమానమును స్పష్టముగఁ దిరస్కరించుటవలన.

( ఉ ) సాదృశ్యవిఘటనము ( పోలిక లేదని చెప్పుట ) వలన. వీనికిఁ గ్రమముగ నుదాహరణములు :—

( అ ) బాలా! 'నాశరీరము బంగారమువంటి చాయగలది' యని చేలపై చెప్పెదవు. బంగారము సిరాశతో నిప్పులోఁ బడినఁగాని దానికి నీచాయ రానేరదు — ( ర. గం. )

( ఆ ) 'మాహాత్మ్యమునకు నెల్ల, గాంభీర్యమునకుఁ బుట్టినిల్లు, రత్నముల కన్నింటికిని తండ్రి అనువాఁడను నేనొక్కఁడనే, నాతో సాటివాఁడు మఱియొకఁడు లేఁడు' అని యోపాలసముద్రమా! తొందరపాటుతోఁ బలంపకుము. నీకు సమమైనవాఁడు ధిల్లీశ్వరావల్లభుఁ డున్నాఁడు — ( ర. గం. ).

( ఇ ) ముద్దరాలా! ఈ కన్నుఁగవచేత నేల యొక్కువగర్వము చెందెదవు? నీ కన్నులవంటి నల్లగలువ లొక్కొక్కకొలనిలో లెక్కకు మిక్కిలియున్నవి — ( కా. ప్ర. ).

( ఈ ) దీనిముఖ ముండఁగాఁ జంద్రుఁ డేల ?

( ఉ ) సుందరీ! వింటివా యీవిపరీతము? నీ ముఖముతోఁ జంద్రుఁడు సరిపోలు నని జనులు వాదుకొనియెదరఁట —(కా. ప్ర.).

ప్రతీపాలంకారభేదము లిట్లు ప్రాచీనాలంకారికులమతమునఁ జెప్పి యుండఁలి మొదటిమూఁడును ఉపమాలంకారములోనివే, నాల్గవది కొందఱిమతమున 'ఆక్షేపాలంకారము', అయిదవది 'అనుక్తవైధర్మ్యవ్యతిరేకము' అని రసగంగాధరకారుఁడు చెప్పినాఁడు.

౫౬. మీలితాలంకారము :— లక్ష : గుణాధిక మయిన యొకవస్తువునందు న్యూనగుణ మయినమఱియొకవస్తువు సమాన చిహ్నమువలన ( సాధారణధర్మమువలన ) మఱుఁగుపడుట 'మీలితము'.

ఇట్లొకవస్తువును మఱుఁగుపెట్టుసాధారణచిహ్నము (ధర్మము) సహజముగా వచ్చినది కావచ్చును, ఆగంతుకము కావచ్చును.

ఉదా : పగడమువంటి పెదవులుగల నీవు తాంబూలము వేసికొంటి వని తెలిసికొనుట యెట్లు? — ( ర. గం. ).

ఇచ్చటఁ బెదవులయెఱుపు సహజము.

ఉదా : రాజా! సురలు నీయొక్క యశస్సున మునిఁగిన హిమవత్పర్వతమును శీతముచేతఁ దెలిసికొందురు — ( ఉద్ద్యోతము ).

యశస్సు తెల్లనిది. అది వ్యాపించి ప్రపంచము నంతయు తెల్లగఁ జేసెను. కావున మంచువలనఁ దెల్లఁగ నుండు హిమవత్పర్వత మందు మఱుఁగుపడెను అని భావము.

ఇచ్చటఁ బ్రపంచమునకుఁ గల్గినధావళ్య మాగంతుకము. దీనిని గొందఱు ఉన్మీలితోదాహరణముగ నిచ్చెదరు ( చూడుఁడు : కువలయానందము ).

౫౭. సామాన్యాలంకారము :— లక్ష : అప్రకృతవస్తువులోఁ జేరిన ప్రకృతవస్తువు అత్యంతసాదృశ్యమువలన వేఱుగా గ్రహింపఁబడనియెడల 'సామాన్యము'.

ఉదా : పద్మాకరములోఁ జొచ్చిన సుందరులముఖములఁ దెలిసికొన వీలు లేకపోయెను — ( చంద్రా. ).

౫౮. తద్గుణాలంకారము :— లక్ష : స్వగుణత్యాగపూర్వకమైన స్వసన్నిహితవస్త్వంతరసంబంధిగుణగ్రహణము 'తద్గుణము'.

ఉదా : ఒకబంతియే యీ వనితయొక్క చేత నున్నప్పుడెఱుపువన్నెగను, దీనికాలిగోళ్లయొద్దకుఁ బోయినపుడు తెల్లఁగను, ఎగిరి కనులయొద్దకు వచ్చినపుడు నీలముగను కానఁబడుచున్నది.

౫౯. అతద్గుణాలంకారము :— లక్ష : సన్నిహితవస్త్వంతరగుణమును గ్రహింపక ప్రబల మగుటచే తనగుణమునే నిలుపుకొనుట 'అతద్గుణము'.

ఉదా : ఓ రాజహంసమ! తెల్లఁగానున్న గంగాజలములయందును, నల్లఁగానున్న యమునాజలములయందును నీవు మునుఁగుచున్నను నీశుభ్రతకుమాత్రము ఎక్కువయు లేదు, తక్కువయు లేదు — ( కా. ప్ర. ).

౬౦. ఉత్తరాలంకారము :— లక్ష : ప్రశ్నము లేకుండఁగనే యుత్తరము విన్నంతమాత్రమునఁ బ్రశ్న మూహింపఁదగియుండుటయు, ప్రశ్నయు దానికసంభావ్యప్రత్యుత్తరమును పలుసారులు చెప్పుటయు, ప్రశ్నమందే యుత్తర మిమిడియుండుటయు, రెండు ప్రశ్నముల కొకయుత్తరమే యుండుటయు 'ఉత్తరము' అను అలంకార మగును.

ఉదా : (౧). నేను బ్రతికియున్నదానను అని చెప్పుటకంటె నేను నాకుశల మిం కేమిచెప్పుదును ?

ఇచ్చట నొకఁడు కుశల మడిగె ననియు, దానికి నిది యుత్తర మనియు ఈయుత్తరమువలన నూహ్యము.

ఉదా : (౨). ఏది విషమము ? దైవగతి; ఏది సుఖము ? సుకళత్రము; ఏది దుఃఖము ? లోకులు ఖలులుగ నుండుట.

ఉదా : (౩). ప్ర. ఎద్దీశునకు ( ఎద్ది + ఈశునకు ) వాహనము ?

ఉ. ఎద్దీశునకు(ఎద్దు + ఈశునకు) వాహనము.

ఉదా : (౪). ప్ర. కృషికు లెద్దాని వాంఛింతు రెల్లయప్డు ?

ప్ర. విడెము నెద్దాన నొక్కంగఁగడఁగు నరుఁడు ?

sampath_Ebooks

ఉ. 'పంట' నని యుత్తరము — (ఆంధ్ర చంద్రా.).

చివర రెండు భేదములను 'చిత్రోత్తర' మనియెదరు. ఇవి శబ్ద శ్లేషమూలకములు.

౬౧. సూక్ష్మాలంకారము :— లక్ష : సూక్ష్మార్థమును, ఇంగితముచేతఁ గాని, ఆకారముచేతఁగాని, తాను దెలుపఁగోరినవారికి నితరులకుఁ దెలియకుండఁ దెలియఁజేయుట 'సూక్ష్మము'.

ఉదా : (సంకేతకాల మెప్పు డని తెలిసికొనఁ గోరుచున్న) జేను చూచుచుండఁగ నా వనిత తనసీమంతమణిని వనవెంద్రుకలలోఁ గప్పివేసెను (సూర్యుఁడ స్తమించినతరువాత నని తెల్పెను) - (కువల.).

సూక్ష్మార్థ మనఁగా తెలివిగలవారికి, (లేక సహృదయులకు) మాత్రము తెలియునట్టిసంగతి. 'ఇంగిత' మనఁగా చేష్టావిశేషము; 'ఆకార' మనఁగా నభిప్రాయ మూహింపఁదగినవ్యాపారము.

౬౨. వ్యాజోక్త్యలంకారము :— లక్ష : స్ఫుటమైన వస్తుస్వరూపమును కపటముచేఁ గప్పిపుచ్చుట 'వ్యాజోక్తి'.

ఉదా : హిమవంతుఁడు పార్వతిని తనచేతులలోఁ బెట్టఁగా నామె కరస్పర్శముచే శరీరమునందు కంపరోమాంచాదికములు పుట్ట 'అబ్బా! హిమవంతునిచేతు లెంత చల్లఁగ నున్నవి' యని శివుఁడనెను — (కా. ప్ర.).

తనకుఁ గల్గిన హర్షస్వేదరోమాంచాదులు పార్వతీస్పర్శము వల్లఁ గాక తనచేతిలో నామెను పెట్టుచున్న హిమవంతునిచేతుల చల్లఁదనమువలన నని శివుఁడు కప్పిపుచ్చుటకు యత్నించెను.

'అపహ్నుతి' యందుఁ బ్రకృతాప్రకృతములయందు సామ్యముండును; ఇచ్చట నుండదు. ఇదియే వీనికి భేదము.

౬౩. వక్రోక్త్యలంకారము :— లక్ష : శ్లేషచేతఁగాని కాకుస్వరముచేతఁగాని వాక్యమునకు నర్థాంతరము కల్పింపఁబడినచో 'వక్రోక్తి'.

ఉదా : (౧). ఆమె యేమి చేయుచున్నది? నీళ్లాడుచున్నది. ప్రతిదినమును నీళ్లాడినను ఒక్కకుమారునినైనను కనదే? యిది యేమి వింత?

ఇందు మొదటి 'నీళ్లాటకు' స్నాన మని యర్థము. దానిని శ్లేషచే 'ప్రసవించు' నన్న యర్థాంతరముగ మార్చి రెండవ 'నీళ్లాట' ప్రయోగింపఁబడినది.

ఉదా : (౨). కోర్టులో సాక్ష్యము చెప్పువారు 'దేవునియెదుట నంతయు నిజము చెప్పెదను' అన్నమాటలను ప్రశ్నపూర్వకస్వరముతోఁ జెప్పినయెడల వానికి విపరీతార్థము కలుగును.

ఇది శబ్దాలంకార మని మమ్మటమతము. ఇతర లాక్షణికులు (అలంకారసర్వస్వకారుఁడు, విద్యాధరుఁడు, విద్యానాథుఁడు, దీక్షితులు మొదలగువారు) అర్థాలంకార మనిరి.

౬౪. స్వభావోక్త్యలంకారము :— లక్ష : ఉన్నది యున్నట్టు స్వాభావికముగ వర్ణించుట 'స్వభావోక్తి'. దీనినే కొందఱు 'జాతి' యందురు.

ఉదా : 'ఇత్తెఱంగున మత్తగజంబులు వచ్చి సరోవరంబునఁ జొచ్చి మచ్చికలు హెచ్చుమీఱం గరంబుల జలంబులు పూరించి కరులు కరేణువులమీఁదను కరేణువులు కరులమీఁదను జల్లుచు...శుండాదండంబులం బుండరీకంబులు పెఱికి నించిన కుతూహలంబున గండు మిగిలి త్రెళ్లాడుచు నన్యోన్యాస్వాదనసౌరభంబు లాస్వాదించి మోదంబున బృంహితంబులు సేయుచు.....పుష్కరాగ్రంబుల జలంబులు పూరించి చిమ్మనఁగ్రోవులఁబోలె నొండొంటిపయిం జిమ్ముచు ననేకప్రకారంబులఁ గ్రీడించి మానంతులబలవంతంబున జలవిహారం బుజ్జగించి పురంబునకు మగుడునంత' — (ఆంధ్రజైమినిభారతము).

అలంకారసామాన్యమైన చమత్కృతిజనకత్వ మిందును ఉండవలయును. లేనియెడల గుఱ్ఱము గడ్డి తినెను, సకిలించెను, లద్దివేసెను, వెనుకకాలితోఁ దన్నెను అనువర్ణనమును 'స్వభావోక్తి' యనునెడ మనము దినమును మాటలాడునది యంతయు, వ్రాయునది యంతయు (కొద్దిగ తప్ప) 'స్వభావోక్తి' యనియే చెప్పవలసియుండును. కావున నందఱకును గోచర మగువస్తుస్థితి గాక, సూక్ష్మనిరీక్షణము గల కవికిమాత్రము గానవచ్చునట్టి సూక్ష్మస్వభావములు వర్ణింపఁబడినచో నది 'స్వభావోక్తి' యగునేకాని యన్యథా కా దని అలంకారసర్వస్వకారునిమతము. తాత్పర్య మేమన వస్తువులయొక్క సాధారణధర్మము గాక అసాధారణధర్మము ఉన్నది యున్నట్టు వర్ణింపఁబడెనేని అది 'స్వభావోక్తి' యనిపించుకొనును.

పాశ్చాత్యసాహిత్యమునందు 'స్వభావోక్తి'కి మిక్కిలి గౌరవము కలదు. అత్యుక్త్యాదులు లేకుండ, నున్నది యున్నయట్లు స్వాభావికముగను, సహృదయ హృదయాహ్లాదకరముగను వర్ణింపఁగల్గిన కవియొక్క ప్రతిభాశక్తి వెయ్యి యలంకారములతో నావిషయమునే వర్ణించునన్యకవికంటె, వేయిమడుంగు లధిక మని వారి యభిప్రాయము.

౬౫. భావికాలంకారము :— లక్ష : జరిగినది గాని జరగఁబోవునది గాని అత్యద్భుతార్థకథనమువలన నిప్పుడు జరుగుచున్నట్టు వర్ణింపఁబడెనేని 'భావికము'.

ఉదా : తనపుడిసిట దివ్యములయిన మత్స్యకచ్ఛపములఁ జూచినమునికులపతి యగు నగస్త్యఋషికి జయము అగుఁగాక — (అ. స.).

ఇయ్యది యీయలంకారమునకు నుదాహరణ మని పూర్వమునుండి పరంపరగా వచ్చుచున్నశ్లోకము. ఇచ్చట సముద్రపానముఁ జెప్పుట యుద్దేశము. సముద్రమునందుండు ఆదిమత్స్యకచ్ఛపావతారములను తనయంజలిలో నగస్త్యుఁడు చూచుచున్నాఁ డని చెప్పుటవలన సముద్రపానము ప్రత్యక్ష మగుచున్న దని యీ యుదాహరణము చెప్పువారితాత్పర్యము.

sampath Ebooks

కాని భామహాదులు దీనిని కావ్యగుణముగ నెంచిరి. వారి మతమునఁ గావ్యములోనిశాంత భాగము దీనికి నుదాహరణముగా నుండ వచ్చునేకాని ఒకటి రెండుపద్యములలో నిది కానఁబడదు. కవి తన మనసులోనిభాసమును దీనివలనఁ జదువరులకుఁ బ్రత్యక్షముగఁ జూపును. కావున నిది భావికము. ఇందుకు నాంధ్ర మహాభారతమందలి యుద్ధప్రకరణములు ఉదాహరణముగఁ జెప్పవచ్చును. అందును భీష్ముఁడు కృష్ణునిచేఁ జక్రము పట్టించిన ప్రకరణమును, అభిమన్యుని చివర యుద్ధమును, సైంధవవధ నాఁటియుద్ధంబును, దుశ్శాసన వధయు నీభావికాలంకారమున కుదాహరణంబులు. సంస్కృత వాఙ్మయంబునఁ గాదంబరిలోని మహాశ్వేతావర్ణనంబు, హర్ష చరితారంభమున నున్న వేదస్వరూపవర్ణనము, మునిక్రోధవర్ణనము, పుళింద వర్ణనము మొదలయినవి ఇందు కుదాహరణము లని తెలిసికొనవలెను.

దీనికిని స్వభావోక్తికిని భేదము కలదు. రెంటింటిలోను వర్ణింపఁబడినవిషయము ప్రత్యక్షముగఁ గానవచ్చుట కలదు కాని, వస్తుస్వభావవర్ణనము స్వభావోక్తికిఁ గారణము. ఇందు నద్భుతవర్ణనమందులకుఁ గారణము. ఇది రసవదలంకారము కాదు. అందు విభావానుభావముల ననుసరించి రసాదికములు భాసించును. అద్భుత వర్ణనమువలనఁ గాదు. ఇది భ్రాంతిమంతము గాదు. ఈభావనయందు భ్రాంతి లేదు.

౬౬. ఉదాత్తాలంకారము :— లక్ష : వస్తుసమృద్ధిని (సంపత్తును) గాని, ప్రకృతవిషయమునకు మహాపురుషచరితమును అంగముగాఁ (ఉపలక్షణముగా) గాని వర్ణించుట 'ఉదాత్తము'.

ఉదా : (౧). రత్నస్తంభములయందుఁ గానఁబడుచున్న ప్రతిబింబసమూహములచే నావరింపఁబడియున్న రావణుని హనుమంతుఁడు కష్టమునఁగాని తెలిసికొనెను — (ఆంధ్ర చంద్రా.).

ఇది వస్తుసమృద్ధికి (సంపదకు) నుదాహరణము.

ఉదా : (౨). శ్రీరామచంద్రుఁడు పితృవాక్యపరిపాలనమునందాసక్తుఁడై బాహుమాత్రసహాయుఁడగుచు నివసముచేయుచుండి రాక్షసకులమును నిర్మూలముచేసినస్థానము ఈ దండకారణ్యము (సా. చిం.).

ఇది మహాపురుషచరితము అంగముగ వర్ణింపఁబడిన 'ఉదాత్తము'.

౬౭. రసవదలంకారము :— లక్ష : శృంగారాది నవరసములలో నెయ్యదియైన మఱియొకరసమునకు నంగముగఁ బ్రతిపాదింపఁబడెనేని యది 'రసవదలంకార' మగును.

ఉదా : ఓ రాజా ! నీ శత్రుస్త్రీలు స్వప్నములయందుఁ గన్న ప్రియతముల కంఠాశ్లేషమును నిజ మనుకొని, 'ప్రియుఁడా ! పరిహాస మేల ? నాకంటికిఁ గనఁబడి మరల దేశాంతరమునకుఁ బోవుదువే ? ఓయి దయావిహీనుఁడా ! నీకుఁ బ్రవాసరుచి యేమిటికి ? నీ విట్లాని చేత దూరీకృతుఁడ వైతివి?' అని పలుకుచు మేల్కాంచి ప్రియుఁడు తమ బాహుబంధనమున లేకుండుటను జూచి యెలుంగెత్తి యేడ్చెదరు — (అ. స.).

ఇచ్చట వాక్యార్థభూతమును అంగియు ముఖ్యమైనదియు నగు రసము 'కరుణము'; అంగభూతరసము విప్రలంభశృంగారము.

పైని ఈయఁబడినలక్షణము ధ్వని నొప్పుకొనువారు చెప్పునది. వీరిమతమున అంగిగా నున్నరసము ధ్వని యనియు, అంగరసము అలంకార మనియు. కాని ధ్వని లే దనువారు రసము 'అంగ' రూపమున నున్నను 'అంగి' రూపమున నున్నను అలంకారమే యని యందురు.

౬౮. ప్రేయోలంకారము :— లక్ష : ఒకభావ మన్యభావమునకుఁ గాని, రసమునకుఁగాని అంగముగఁ జెప్పఁబడెనేని యది 'ప్రేయస్సు'. దీనినే 'భావాలంకార' మనియు ననియెదరు.

ఉదా : (౧). అంత్యకాలమందు యముఁడు నాగపాశము నా మెడకు వేసినను ఓ ఘణీంద్రహార ! నాకప్పుడు క్షణకాలమైనను నీ పోలిక కలుగుఁగావున నేను మరణమునందుఁ గూడ సంతోషముఁ జెందుదును.

ఇందు భగవద్విషయమైన 'రతి' భావము 'అంగి'; దానికి మరణవిషయ మైన 'రతి' అంగము.

ఉదా : (౨). కాశిలో దేవనదీతీరమునఁ గూర్చుండి గోచి పెట్టుకొని రెండుచేతుల జోడించి 'ఓ గౌరీపతీ ! త్రిపురహర ! శంభూ ! త్రినేత్ర ! నన్ను రక్షింపు' మని యఱచుచు నే నెప్పుడు దినములను నిమిషములవలెఁ గడపుదును ? (కువల.).

ఇందు శాంతరసము అంగి, దానికి 'ఎప్పుడు గడపుదును ?' అనుపదములచే సూచితమైన 'చింత' యను 'వ్యభిచారిభావము' అంగముగఁ జెప్పఁబడినది. కావున 'ప్రేయస్సు'.

౬౯. ఊర్జస్వి అలంకారము :— లక్ష : రసాభాసము గాని భావాభాసము గాని గుణీభూతత్వముఁ బొందెనేని (మఱియొకదానికి నంగముగఁ జెప్పఁబడెనేని) 'ఊర్జస్వి' యగును.

ఉదా : భయముచే నరణ్యములో దాఁగియున్న నీశత్రువుల చక్కని స్త్రీల యంగసౌందర్యమును సాభిలాషముగఁ దిలకింపని యొక చెంచువాఁడైనను అడవిలోఁ గలఁడా ?

ఇచ్చటఁ జెంచువాండ్రయొక్క పరదారవిషయకాభిలాష్యము అనౌచిత్య మైనది. కావున నిది 'శృంగారాభాసము'. ఇది రాజవిషయకరతికి అంగము కావున 'ఊర్జస్వి'.

౭౦. సమాహితాలంకారము :— లక్ష : భావశాంతి మఱియొకదానికి నంగముగఁ జెప్పఁబడినచో 'సమాహితము'.

ఉదా : ఇది యేమి చేయునో చూచెద మని నే నేమియు మాటలాడకుండ నుంటిని; వీఁడు నాతో మాటలాడకయున్నాఁడు

sampath_Ebooks

తమఁ దని తలఁచి యాఁడి కోపము నాశ్రయించెను; ఇట్లొకరిపై నొకరు విలక్షణదృష్టితోఁ జూచుచుండినమకోపావస్థ దాఁటిన తరువాత నేను సాక్షిప్రాయముగ నవ్వితిని. అది ధైర్యమును కరఁగించి నట్టిబాష్పమును విడిచెను'.

ఇచ్చట శృంగారరసము 'అంగి', 'కోపశాంతి' దాని కంగము (కువల.).

౭౧. భావోదయాలంకారము :— లక్ష : భావోదయము మఱి యొకదాని కంగముగ నుండెనేని అది 'భావోదయ' మనఁబడును.

ఉదా : సుహృదులతోఁ గలసి మధుపానముఁ జేయుచున్న నీవైరులు, ఎట్లో నీపేరు విని విషమదశను బొందిరి.

ఇందు రాజవిషయ రతిభావము అంగి; దానికి త్రాసాదిభావోదయము అంగముగఁ జెప్పఁబడినది.

౭౨. భావసంధ్యలంకారము :— లక్ష : భావసంధి మఱి యొకదాని కంగమైనచో 'భావసంధి' యను అలంకార మగును.

ఉదా : రాజా! నీ యుద్ధసన్నాహము విని బయలుదేరు చున్న నీవీరులు తమ యెడమచేతులతోఁ దమ ప్రియురాండ్ర బాష్ప ధారలను, కుడిచేతులతోఁ దమశస్త్రధారలను తుడుచుచుఁ జేయవలసిన కార్యమునందుఁ గొంతతడవు ముగ్ధులైరి— (అ. స.).

ఇచ్చట ప్రియాస్నేహము, రణౌత్సుక్యము అనెడి రెండుభావ ములకును 'సంధి' (ఒకవిధమైనపోటీ) చెప్పఁబడినది. అంగిభూత మైన ప్రభువిషయభావమునకు నీ 'భావసంధి' యంగము. కావున అలంకారము.

౭౩. భావశబలతాలంకారము :— లక్ష : 'భావశబలత' అంగముగ వర్ణింపఁబడినచో 'భావశబలత' యనునలంకారం బగును.

ఉదా : అకార్య మెక్కడ! చంద్రవంశ మెక్కడ? అది మరలఁ గనఁబడునా! మన శాస్త్రజ్ఞానము దోషములను తొలం గించుటకేకదా! దానిమోము కోపమునఁగూడ నెంత చక్కఁగ నుం డెను! ధర్మజ్ఞులయిన పెద్ద లే మందురు? అది కలలోనైన దొరకు నది కాదు. చిత్తమా! శాంతింపుము. ధన్యుఁడగు నేయువ దానియధ రమును గ్రోలునో! — (అ. స.).

ఇచట మొదట కార్యాకార్యములను విచారించుట 'వితర్క భావము'; రెండవవాక్యమున 'ఔత్సుక్యభావము'; మూఁడవ వాక్యమున 'మతి'; నాల్గవవాక్యమున 'స్మరణము'; అయిదవవాక్య మున అపవాదభయము, ఆఱవవాక్యమున 'శంక', 'దైన్యము'; ఏడవవాక్యమున 'ధృతి'; ఎనిమిదవవాక్యమున 'చింత' అనుభావ ము లన్నియు నిందుఁ గూడినవి. ఇది విప్రలంభశృంగారమున కంగము.

ఇది దేవయానినిగుఱించి యయాతి చెప్పె నని కొందఱును, ఊర్వశినిగుఱించి విక్రముఁడు చెప్పెనని యితరులును చెప్పియున్నారు.

౭౪. సంసృష్టి, ౭౫. సంకరము లను అలంకారములు :— లక్ష : రెండు గాని, ఎక్కువ గాని అలంకారము లొకవాక్యమునందుఁ గలసియుండుటకూడ లాక్షణికులచే వేఱు అలంకారముగ నెంచఁబడెను.

ఇట్టికలిమిడి రెండువిధముల నుండవచ్చును. ఒకటి తిలతండుల ముల( నువ్వులు బియ్యము )వలెను; మఱియొకటి క్షీరనీరన్యాయము నను (పాలునీరువలెను).

రెండు అలంకారములు తిలతండులములవలెఁ గలసియుండిన యెడల, నవఁగా నొకదానితో మఱియొకదానికి సంబంధము లేకుండె నేని, యాకలిమిడి 'సంసృష్టి' అనంబడును.

ఉదా : చీకటి తన యంగములను పూఁతపూయుచున్న ట్లున్నది; ఆకాశము కాటుకను కురియుచున్నది; అసత్పురుషసేవవలె చూపు నిష్ఫలమగుచున్నది — (మృచ్ఛకటికము).

ఇందు రెండుఉత్ప్రేక్షలకును, ఒక ఉపమకును 'సంసృష్టి'.

శబ్దాలంకారసంసృష్టి, అర్థాలంకారసంసృష్టి, ఉభయాలంకార సంసృష్టి అని మూఁడువిధములుగ నీయలంకార ముండవచ్చును.

క్షీరనీరములవలె, నవఁగా నొకదానిని మఱియొకటి యాశ్ర యించి అనేకాలంకారములు కలసియుండుట 'సంకరము'.

అంగాంగిభావసంకరము, సందేహసంకరము, ఏకవాచకాను ప్రవేశసంకరము అని 'సంకరము' మూఁడువిధములు.

ఒకయలంకారము ముఖ్యమై దానిపూర్తికై తక్కిన యలంకా రములు దానికి నవయవములుగాఁ జేరియుండుట 'అంగాంగిభావ సంకరము'.

ఉదా : ఓరాజా! నీశత్రుస్త్రీ లరణ్యమునందుఁ బరుగెత్తు చుండఁగాఁ గిరాతులు వారిమరకతమణులశిరోభూషణమును, బంగారు కర్ణభూషణములును, రత్నఘటితములైన నూపురద్వయమును తీసి కొని, బింబోష్ఠకాంతిచే నెఱ్ఱఁబాఱినహారమును గురివెందలదండ యని హరింపరైరి! — (కా. ప్ర.)

ఇచ్చట 'బింబోష్ఠకాంతి' (దొండపండు వంటి పెదవుల తేజస్సు)వలన ఆ హారమునకు నెఱుపురంగు వచ్చె నని చెప్పుటచే 'తద్గుణ'మను అలంకార మాయెను. గురివెందలదండ యని తలఁచి కిరాతులు హారమును హరింపరైరి అని చెప్పుటచే 'భ్రాంతిమంత' మను అలంకారమయ్యెను. ఇందుఁ దద్గుణము నపేక్షించి భ్రాంతిమం తము పుట్టినది కావున నీరెండు అలంకారములకును అంగాంగిభావము కలిగెను.

ఈ యంగాంగిభావరూపసంకరము శబ్దాలంకారములకు సంభ వింప దని 'అలంకారసర్వస్వ'కారుని మతము. కాని కావ్యప్రకాశ కారునకు నీమత మసమ్మతము.

ఒకవాక్యమునందు సంభవింపఁదగిన అలంకారములలో నేదా నిని చెప్పినను సాధకబాధకములు లేకుండుట 'సందేహసంకరము'.

sampath_Ebooks

ఉదా: బ్రహ్మదేవుఁ డీసముద్రమును గంభీరముగను రత్నపూర్ణముగను స్వచ్ఛకాంతిగలదిగను జేసి సరసపానీయముగఁ జేయక పోయెను గదా? — (కా. ప్ర.).

సముద్రము ప్రస్తుతవిషయ మనుకొన్నయెడల, నిందలిచెప్పిన గుణముల సామ్యమువలన, నన్నియు సద్గుణములు గలిగి యొక్కదుర్గుణము గలపురుషాదులనుగుఱించిన అప్రస్తుతార్థప్రతీతి కలుగుచున్నది. కావున దీనిని 'సమాసోక్తి' అనవచ్చును. సముద్ర మప్రస్తుత మని యనుకొన్నయెడల దానిసమగుణతవలన నేదియో ప్రస్తుతము స్ఫురించును గావున నిది 'యప్రస్తుతప్రశంస'. ఇచ్చట నిదియా యదియా యన్న సంశయము కలదు. కావున నిది 'సంశయసంకరము'.

ఒక్కవాచకశబ్దమునందు అలంకారములు స్ఫుటముగ నున్నయెడల 'ఏకవాచకానుప్రవేశసంకరము' అనును.

ఉదా: మురారివలన నిర్గతము లయి నరకనిరోధముచేయు చుండెడిచక్రధార గంగవలెనే నీతలయందుఁ బడును — (అం. ప్ర చంద్రా.).

ఇచ్చట 'మురారివలన నిర్గతము' అనునది చక్రధారకును, గంగకును సాధారణము.

కావున 'వలె' అనుపదమునందు 'ఉపమ' కలదు. 'నరక నిరోధము చేయు' అనుపదమునందు చక్రధారాపక్షమున నరకాసురునివధయు, గంగపక్షమున నరకలోకనివృత్తియు అని శ్లేషవలన రెండర్థము లేర్పడుచున్నవి. కావున 'వలె' అనుపదమువలన ప్రకృతాప్రకృతశ్లేషలు స్ఫురించుచున్నవి. ఇట్లు ఈ 'వలె' అనుఒకపదమునందు 'ఉపమ', 'శ్లేష' అను రెండలంకారములు నిమిడియున్నందున ఇది 'ఏకవాచకానుప్రవేశసంకరము'.

దీనినే కొందఱు ఏకప్రతిపాద్యసంకర మనియు, ఏకవ్యంజకానుప్రవేశసంకర మనియుఁ జెప్పెదరు.

౩౨. అసమము :— లక్ష : సర్వథా ఉపమానమును నిషేధించుట 'అసమము'.

ఉదా: సత్యసంధతయందు హరిశ్చంద్రునిఁ బోలినవాఁడు లేనేలేఁడు.

ఈ యలంకారము వ్యంగ్యముగ అనన్వయమునందు నుండును. కాని రూపకదీపకాదులందు వ్యంగ్యముగ నున్న యుపమవలె నచ్చట వేఱుపేరు వడయదు. కాని వాచ్యమునందు నిది స్వతంత్రచమత్కారము కలది గాన భిన్నాలంకారముగఁ జెప్పఁబడును. దీనినిగూడ పూర్ణలుప్త మొదలయినభాగములుగ నీ లయినంతవఱకు విభజింపవచ్చును.

మమ్మటాదిపూర్వు లెవ్వరును దీనిని స్వతంత్రాలంకారముగ నొప్పుకొనలేదు. కువలయానందమునందును గానరాదు. రసగంగాధరమందున్నది.

౩౩. ఉదాహరణాలంకారము :— లక్ష : సామాన్యముగఁ జెప్పఁబడినయర్థమును స్పష్టపఱచుటకు తదేకదేశమును నిరూపించి సామాన్యమునకును, ఏకదేశమునకును గల అవయవావయవిభావమును చెప్పినయెడల నది 'ఉదాహరణము'.

ఉదా: సద్గుణశాలి విపత్తులో నున్నను ఉపకారమే చేయును. మూర్ఛ చెందినదియుఁ, జచ్చినదియు నగు పాదరసమే యిందుకు నిదర్శనము (ర. గం.).

ఇందు అవయవావయవిభావబోధకము లగు 'వలె', 'నిదర్శనము', 'దృష్టాంతము' — ఇత్యాదిపదము లుండును; అర్థాంతరన్యాసమునం దుండవు. ఇది వీనికి భేదము.

ఇది స్వతంత్రాలంకారము కాదనియు, ఉపమాలంకారమే యనియుఁ బురాతనాలంకారికులమతము — (ర. గం.).

దీనిని అలంకారసర్వస్వకారుఁడు గాని, కావ్యప్రకాశకారుఁడు గాని, ప్రతాపరుద్రీయకారుఁడు గాని, కువలయానందకారుఁడు గాని స్వతంత్రాలంకారముగ నుదాహరించియుండలేదు. రసగంగాధరకారుఁడుమాత్ర మిచ్చియున్నాఁడు.

౩౪. ప్రౌఢోక్త్యలంకారము :— లక్ష : ఒకవస్తువుయొక్క యొకధర్మమును అతిశయముగఁ బ్రతిపాదించునిమిత్తము ఆవస్తువుతో సంబంధము లేనిదియు ఆధర్మము ప్రసిద్ధముగాఁ గలదియు నగు మఱియొకవస్తువుతో దానికి సంబంధము గలుగఁజేయుట 'ప్రౌఢోక్తి'.

ఉదా: నీవు కుంకుమునీళ్లు పోసి నీతోఁటలో పెంచిన లవలీలత యొకప్పుడు నీ శరీరపుఁజాయను పోలుచున్నది — (ర. గం.).

లవలీలత స్వభావముగ తెల్లనిది. అది యెఱ్ఱ నగుటకు కుంకుమనీళ్లు దానికిఁ బోయనక్కఱలేదు. కాని లతయొక్క రక్తిమను అధికముగఁ జెప్పి దానిని ఆస్త్రీయొక్క మేనిచాయతోఁ బోల్చుట కవియుద్దేశము.

౩౫. లలితాలంకారము :— లక్ష : ప్రకృతధర్మియందుఁ బ్రకృతవ్యవహారముఁ జెప్పక యప్రకృతవ్యవహారసంబంధముఁ జెప్పినయెడల 'లలితము'.

ఉదా: ప్రపంచమునందు నింకొక చక్కనిస్త్రీ లేదా? సీతయేనా నీకుఁ దగినది? రావణా! చందనవృక్షశాఖ లాగి నీవు ఫణీంద్రుని లేపితివి! — (ర. గం.).

ఇచ్చట, నీవు సీతను తెచ్చి రామునికోపమునకుఁ బాత్రుఁడ వైతి వని చెప్పుటకు మాఱుగా చందనవృక్షశాఖను లాగి ఫణీంద్రుని లేపితివి అని చెప్పఁబడినది.

పైలక్షణములో 'ప్రకృతధర్మియందు' అనుపదముచే నీయలంకారమునకును 'అప్రస్తుతప్రశంస'కును గలభేదమును, 'ప్రకృతవ్యవహారముఁ జెప్పక' యనుటచే దీనికిని 'నిదర్శన'కుఁ గలభేదమును

చెప్పఁబడినవి. ఇది 'శ్లేషమువంటి శ్లేష'మను 'అతిశయోక్తి' కంటెను భిన్నము. అందు పదార్థముచేఁ బదార్థముయొక్క అధ్యవసానముండును; ఇందు వ్యవహారముచే వ్యవహారాధ్యవసానము గలదు.

'లలితము' వేఱలంకారము కాదనియు, నిది 'నిదర్శన'యే యనియుఁ బెక్కురాలంకారికుల యభిప్రాయము.

౮౦. ప్రహర్షణాలంకారము :— లక్ష : సాక్షాదుద్దేశక ప్రయత్నము లేకయే యభీష్టార్థము లభించుట 'ప్రహర్షణము'.

ఇది మూఁడువిధములు : (౧) ఏప్రయత్నము లేకయే తనిచ్ఛగ నభీష్టము లభించుట. (౨) ప్రయత్నము చేయఁగా నభీష్టముకంటె నెక్కుడు లభించుట. (౩) ఫలసాధనమునకు ప్రయత్నము చేయుచుండఁగఁ బ్రయత్నముతో సంబంధము లేకయే ఫలమే లభించుట.

ఉదా : (౧). తాను వెదకఁబోవు తీగ కాళ్ళనే చుట్టుకొనెను.

(౨). చాతకము నాలుగైదు జలకణములు కోరఁగా మేఘము లోకమునంతయు నీళ్ళతో నింపెను.

(౩). ధనము నిచ్చునౌషధములకై త్రవ్వుచుండ నిధియే దొరకెను.

౮౧. విషాదాలంకారము :— లక్ష : అభీష్టార్థవిరుద్ధలాభము 'విషాదము'.

ఉదా : జను లందఱును తమతమపనులలో నిమగ్నులై దూరముగ నున్నపుడు 'నాముక్కుతో నీకమ్ములను విఱిచి యీపంజరమునుండి వెడలిపోయెదను' అని చిలుక మనోమయామృతమును రుచి చూచుచుండఁగా, ఏనుఁగుతొండమువంటి పెనుబాము ఒకటి దాని పంజరములోనికిఁ దూఱెను — (ర. ౫౦.).

ప్రయత్నము చేయక వచ్చినది, మంచిప్రయత్నము చేయఁగా దానికి వ్యతిరేకముగ అకస్మాత్తు వచ్చినది, ఏప్రయత్నము మంచి కని చేయఁబడినదో యదియే విరుద్ధఫలము నిచ్చునది యని దీనికి యెన్నో భేదములఁ జెప్పవచ్చును.

'ఇది విషమాలంకార'భేద మని కొందఱుమతము.

౮౨. ఉల్లాసాలంకారము :— లక్ష : ఒకవస్తువుయొక్క గుణదోషములచేత వస్త్వంతరమునకు గుణదోషములు కలిగినట్లు వర్ణించినచో 'ఉల్లాసము'.

ఇయ్యది ౧. గుణముచే గుణము, ౨. గుణముచే దోషము, ౩. దోషముచే దోషము, ౪. దోషముచే గుణము కలుగుట యని నాల్గు విధములు.

ఉదా : హింసాప్రధానులయిన రాక్షసులచే నెల్లప్పుడును అపవిత్రములుగఁ జేయఁబడిన వింధ్యాటవులు రామాంఘ్రిసంయోగముచే మునిభార్యవలె, ధన్యములుగఁ జేయఁబడెను — (ర. ౫౦.).

ఇందుఁ బూర్వార్ధమున దోషముచే దోషము, ఉత్తరార్ధమున గుణముచే గుణము కల్గుట చెప్పఁబడినది.

ఉదా : సజ్జనులను ఆశ్రయింపకుండుట ధనముయొక్క యభాగ్యము — (ఆంధ్రచంద్రా.).

ఇందు సజ్జనులగుణముచేత, వారి నాశ్రయింపనిధనమునకు అభాగ్యదోషము పట్టినది.

ఉదా : రాజసేవ కత్తిమీఁదిసామువంటిది. రాజసేవకులకు వధము లేకుండెనా యదియే వారికి లాభము.

రాజుయొక్క క్రౌర్యదోషముచేత వానిసేవకులకు ప్రాణములు దక్కుటయే యొకలాభ మని గుణముగ వర్ణింపఁబడినది.

ఇయ్యది 'కావ్యలింగాలంకారము'చే గతార్థ మగుటచే స్వతంత్రాలంకారము కానేర దని కొందఱును, లౌకికార్థమయ మగుటచే అలంకారమే కా దని మఱికొందఱును చెప్పుదురు.

౮౩. అవజ్ఞాలంకారము :— లక్ష : ఒకవస్తువుయొక్క గుణదోషములచేత నితరవస్తువులకు గుణదోషములు కలుగకుండుట 'అవజ్ఞ'.

ఉదా : మానికము సముద్రములో ముంచినను స్వల్పజలమునే గ్రహించును.

ఇయ్యది 'విశేషోక్తి'యే కాని వేఱు అలంకారము కా దని కొందఱ యభిప్రాయము.

౮౪. అనుజ్ఞాలంకారము :— లక్ష : చెడు వస్తువునందు నొక గుణముఁ జూచి యందుకై చెడువస్తువునే కోరుట 'అనుజ్ఞ'.

ఉదా : బ్రహ్మదేవుఁడా! చేతులు జోడించి నిన్నొకటి వేఁడెదను. దున్నకొని బ్రదుకువారికులములో జన్మ మిచ్చినను సరే కాని వారు విష్ణుభక్తిపరాయణులుగ నుండవలెను — (ర. ౫౦.).

౮౫. తిరస్కారాలంకారము :— లక్ష : గుణము గల వస్తువునుగూడ దోషవిశేషభయముచేతఁ దిరస్కరించుట 'తిరస్కారము'.

ఉదా: హరిచరణభజనచ్యుతిభయముచే రాజ్యసుఖము నేనొల్ల.

౮౬. లేశాలంకారము :— లక్ష : గుణమును అనిష్టసాధన మగుదోషముగను, దోషమును ఇష్టసాధన మగుగుణముగను వర్ణించుట 'లేశము'.

ఉదా : శుకమా! ఎల్ల పక్షులును విచ్చలవిడిగఁ దిరుగుచుండఁగా నీ తియ్యనిపలుకులకు ఫలము నీవు పంజరమునఁ గట్టుపడుట—(కువ.).

౮౭. పరికరాంకురము :— లక్ష : విశేష్యములను సాభిప్రాయముగ నుపయోగించినయెడల 'పరికరాంకుర' మగును.

ఉదా : నీ గుణములను వర్ణించుటకు ఫణీంద్రుఁడును, వ్రాయుటకు హైహయార్జునుఁడును, చూచుటకు నింద్రుఁడును కావలయును —(కువల.).

sampath_Ebooks

ఇందు 'ఫణీంద్రుఁడు', 'హైహయార్జునుఁడు', 'ఇంద్రుఁడు' అను విశేష్యములు సాభిప్రాయములు. ఫణీంద్రునకు వేయినాలుకలును, హైహయార్జునునకు వేయిచేతులును, ఇంద్రునకు వేయికన్నులును కలవు.

ఈ యలంకారము 'పరికరాలంకారము'లోనిదే కాని స్వతంత్రము కా దని కొందఱియభిప్రాయము. విశేష్యములసాభిప్రాయత్వముకూడ విశేషణాంశముయొక్క సాభిప్రాయత్వమే. నిరర్థకమైన విశేష్యమునకు సాభిప్రాయత్వము స్వప్నమందైనను కలుగనేరదు — (ఉద్ద్యోతము; సుధాసాగరము).

౭౮. ప్రస్తుతాంకురము :— లక్ష.: ఒక ప్రస్తుతమువలన మఱియొక ప్రస్తుతము ద్యోతించెనేని 'ప్రస్తుతాంకురము'.

ఉదా: ఓతుమ్మెదా! మాలతి యుండఁగా ముండ్లతో నిండి యున్న కేతకిని (మొగిలిపువ్వును) ఏల కాంక్షించెదవు? — (కువల.).

మాలతిని విడిచి కేతకిమీఁద వ్రాలుచున్న తుమ్మెదను జూచి ప్రియునితోఁగూడ నుద్యానవనములోఁ దిరుగుచున్న యొక స్త్రీ పై మాట చెప్పెను. నావంటిచక్కనిస్త్రీని విడిచి అసౌఖ్యకరమైన పరవనితాసంగతి నీ కేల యని పతితోఁ జెప్పుట యామె యుద్దేశము. ప్రత్యక్షముగాఁ జూచుచున్న తుమ్మెదవృత్తాంతమును ప్రస్తుతమే; పెనిమిటి యుండఁగ నాతనికి నర్థము కావలె నని చెప్పెను. కావున నదియు ప్రకృతమే యని భావము.

ఇది అప్రస్తుతప్రశంసాలంకారమే కాని స్వతంత్రము కా దని ప్రాచీనలాక్షణికులమతము — (ఉద్ద్యోతము.).

౭౯. వ్యాజనిందాలంకారము :— లక్ష : అప్రస్తుతవిషయపునిందవలన ప్రస్తుతవిషయపునింద స్ఫురించెనేని 'వ్యాజనింద'.

ఉదా: ఒక్కతల ద్రుంచిన శివుని నవలయును గాని బ్రహ్మ నని యేమిప్రయోజనము? — (కువల.).

ఇచ్చట లోకమునందు దుఃఖమును సృజించిన బ్రహ్మదేవుని నిందించుట ప్రస్తుతము. కాని అతనియన్నితలలును తెగఁగొట్టక ఒక్కతలనే తెగఁగొట్టినందుకు నప్రస్తుతుఁడైన శివుని నిందించి యిది సాధింపఁబడినది.

౮౦. అసంభవాలంకారము :— లక్ష : అర్థనిష్పత్తికి నసంభావ్యము చెప్పుట 'అసంభవము'.

ఉదా: గొల్లపిల్లవాఁడు కొండ నెత్తు నని యెవ రెఱుఁగుదురు?

ఇది స్వతంత్రాలంకారము కాదనియు, 'విరోధాలంకా'రాంతర్గత మనియుఁ బూర్వలాక్షణికులమతము (చూడుఁడు, ప్రదీపోద్ద్యోతములు).

౮౧. అల్పాలంకారము :— లక్ష : ఎందు సూక్ష్మమైన యాధేయముకంటె నధికమైనసూక్ష్మత యాధారమునకుఁ జెప్పఁబడునో యది 'అల్పము'.

ఉదా: కృశాంగి! ఉంగరము నీచేతియందు జపమాలవలె నున్నది — (కువల.).

చేయి యాధారము. ఉంగర మాధేయము. విరహముచేఁ జిక్కినందున, సూక్ష్మమైన యుంగరముకంటె నామెచేయి కడుసన్నముగా నున్న దని భావము. ఇది స్వతంత్రాలంకారము కాదు; అధికాలంకారవిభేదమే యని ఉద్ద్యోతకారుఁడు.

౮౨. వికస్వరాలంకారము :— లక్ష : ఒక విశేషమును జెప్పి, సామాన్యముతో దానిని సమర్థించి, అంతఁ దృప్తి నొందక మఱియొక విశేషమును, ఉపమానమూలమునఁ గాని యర్థాంతరన్యాసమూలమునఁ గాని చెప్పుట 'వికస్వరము'.

ఉదా: అనంతరత్నములకుఁ బుట్టినిల్లయిన హిమాలయమునకు మంచు చక్కఁదనమును బోఁగొట్టునది కాలేదు. పెక్కుగుణములసమూహములో నొక్కదోషము, చంద్రునికిరణములలో మచ్చవలెఁ గప్పఁబడును — (కువల.).

ఇది యర్థాంతరన్యాసాలంకారమే కాని వేఱు కాదు — (ఉద్ద్యోతము).

౮౩. సంభావనాలంకారము :— లక్ష : ఒకయర్థము సిద్ధించుట 'కిది యిట్లయినయెడ' నని వితర్కించినచో 'సంభావన'.

ఉదా: ఓ రాజా! శేషుఁడు వక్తయైనయెడల నీగుణము లెన్నఁబడును.

ఇది అతిశయోక్తిలోనిదే కాని స్వతంత్రాలంకారము కా దని కొందఱియభిప్రాయము.

౮౪. మిథ్యాధ్యవసత్యలంకారము :— లక్ష : ఒకదానియొక్క మిథ్యాత్వమును నిరూపించుటకై మఱియొక మిథ్యార్థమును కల్పించుట 'మిథ్యాధ్యవసతి'.

ఉదా: ఆకాశపుష్పమాలను ధరించి వేశ్యను వశీకరింపుము.

ఇది స్వతంత్రాలంకారము కా దనియు, అతిశయోక్తిలోనిదియే యనియుఁ గొందఱిమతము — (ఝళకీకరు1).

౮౫. ముద్రాలంకారము :— లక్ష : ప్రకృతార్థపరములయినపదములచే ప్రకృతమునకు సంబంధము లేని మఱియొకసూచ్యార్థమును సూచించుట 'ముద్ర'.

1. భట్టవామనాచార్యఝళకీకరు అనుపండితుఁడు కావ్యప్రకాశముపై మంచి టీక వ్రాసినాఁడు. దాని రెండవకూర్పు బొంబాయి నిర్ణయసాగరప్రెస్సులో అచ్చుపడినది. దానినిఁ జూడఁదగును.

sampath_Ebooks

ఉదా: తే. మిత్రుఁ డొక్కఁడు వీణియ మీటుచుండె
విబుధవరు లిద్ద ఱర్థంబు విప్పిచెప్ప
నినులు నిద్దఱు వినుచుండ నేకగతిని
దేటగీతంబు మూఁటను బాట మయ్యె. (అప్ప.)

ఇందు తేటగీతము (తేటపాట) ప్రకృతము. దానిని వర్ణించు పదములతోడనే తేటగీతిలక్షణము, పేరును సూచింపఁబడినవి. ఇది 'శ్లేష' కాదు. ఎందుకన 'వీణియ మీటుట' మొదలయిన క్రియలు గీతిలక్షణమున నన్వయింపవు.

ఇట్లే 'నవరత్నమాల' యను పేరుతోఁ బద్యములను వ్రాయుచు మాఱర్థమందు వేఱువేఱురత్నముల పేళ్లు చెప్పుటయు, సంగీతకృతు లందు రాగముల పేళ్లు సూచించుటకుఁ గృతులలో రెండవయర్థమునందు 'శంకరాభరణము' మొదలయినపదములను వాడుటయు ఈయలంకారమే యగును.

ఇది యలంకారమే కాదు. ఇందుఁ బ్రస్తుతోపస్కారక మేమియు లేదు. అని కొందఱియభిప్రాయము — (ఝళకీకరు).

౯౬. రత్నావళ్యలంకారము :— లక్ష: ప్రకృతార్థములను వరుసగఁ జెప్పినచో 'రత్నావళి' అనునలంకార మగును.

ఉదా: రాజా! నీవు చతురాస్యుఁడవు, లక్ష్మీపతివి, సర్వజ్ఞుఁడవు.

నీవు 'బ్రహ్మవు విష్ణువవు మహేశ్వరుఁడవు' నని భావము. ఇచ్చట వాడుకలో నున్న బ్రహ్మ విష్ణు రుద్రు లన్న క్రమముఁ దప్పక చెప్పఁబడినందున నీయలంకారము.

ఇది యలంకారమే కాదు. ఇచ్చట రూపకమే చమత్కారమును గలుగఁజేయుచున్నది గాని, క్రమముచేఁ గాదు (ఉద్ద్యోతము).

౯౭. పూర్వరూపాలంకారము :— లక్ష: స్వగుణమును విడిచి మరల స్వగుణమును గ్రహించినట్లు వర్ణించినచోఁ 'బూర్వరూపము'.

ఉదా: ఓరాజా! శివునికంఠమును చుట్టుకొన్నవాఁడయ్యును శేషుఁడు నీకీర్తిచేఁ దెల్లనివాఁ డయ్యెను.

మొదట శేషుఁడు తెల్లనివాఁడు, శివునినల్లనికంఠముయొక్క స్పర్శచే నల్లపడెను. మరల రాజుయొక్క కీర్తిచేఁ దెల్లపడెను!

ఇది 'సమాధి' లోనిది గాని స్వతంత్రాలంకారము కాదు — (ఉద్ద్యోతము).

౯౮. అనుగుణాలంకారము :— లక్ష: ఒక్క వస్తువు పూర్వము తనకు సిద్ధముగా నున్నగుణమునే పరసన్నిధివలన నెక్కువగాఁ బొందినట్లు చెప్పుట 'అనుగుణము'.

ఉదా: నీలోత్పలములు కామినియొక్క కటాక్షములచే నధికనీలిమను బొందెను.

ఇది 'తద్గుణమే; స్వతంత్రాలంకారము కాదు'– (ఉద్ద్యోతము).

౯౯. ఉన్మీలితాలంకారము :— లక్ష: భేదస్ఫూర్తి చెప్పఁబడెనేని 'ఉన్మీలితము'.

ఉదా: ఓరాజా! సురలు నీయొక్క యశస్సున మునిఁగిన హిమవత్పర్వతమును చలిచేఁ దెలిసికొందురు.

ఇది మీలితమునకు వ్యతిరేకము. ఇది స్వతంత్రాలంకారము కా దనియు, మీలితాంతర్గత మనియు నుద్ద్యోతకారునిమతము.

౧౦౦. విశేషకాలంకారము :— లక్ష: విశేషము కన్పట్టుచుండెనేని 'విశేషకము'.

ఉదా: చంద్రుఁ డుదయింపఁగాఁ గమలములును, ముఖములును కనుఁగొనఁబడెను (వేఱువేఱుగ నుర్తింపఁబడెను).

ఇది 'సామాన్యము'నకు వ్యతిరేకము. ఇది స్వతంత్రము కాదు. 'సామాన్య'ములోనిదే — (ఉద్ద్యోతము.).

౧౦౧. పిహితాలంకారము :— లక్ష: పరవృత్తాంత మెఱిఁగినవానియొక్క సాభిప్రాయచేష్టనము 'పిహితము'.

ఉదా: ప్రియుఁడు ప్రాతఃకాలమున నిల్లు చేరఁగానే భార్య ప్రక్కవేసెను.

రాత్రి యంతయు సపత్నితోఁ గూడి జాగరణము చేసితివి గాన నిఁక నిద్రింపుము అని భావము.

ఇది 'సూక్ష్మ' లంకారాంతర్గతము — (ఉద్ద్యోతము).

౧౦౨. గూఢోక్త్యలంకారము : — లక్ష: ఒక విషయ మొకరికిఁ జెప్పఁదలఁచి యది పగ్గఱఁ గాని, చుట్టుపట్టునఁగాని ఉండు వారికిఁ దెలియకుండునట్లుగను నన్యుని సంబోధించి గూఢముగాఁ జెప్పుట 'గూఢోక్తి'.

ఉదా: చక్రవాకకాంతా! రాత్రి సమీపించుచున్నది. ప్రియుని వీడ్కొలుపుము — (అభి.).

శకుంతలయు, దుష్యంతుఁడును లతాకుంజమునఁ గలసియుండ శకుంతలను జూడ గౌతమి యనునామె వచ్చెను. కాని యీసమాచారము శకుంతలకు, గౌతమికిఁ దెలియకుండఁ దెల్పి యామె దుష్యంతుని దాఁచునట్లు చేయవలె నని, సఖి యిట్లామెను హెచ్చరించెను.

ఇది యొకప్పుడు ధ్వనిరూపముగను, ఒకప్పుడు గుణీభూతవ్యంగ్యముగను నుండును — (ఝళకీకరు).

౧౦౩. వివృతోక్త్యలంకారము : — లక్ష: కవి యిది గూఢోక్తి యని తెల్పుపదముల నుపయోగించి గూఢోక్తి చెప్పిన యెడల నది 'వివృతోక్తి'.

ఉదా: పైగూఢోక్తి ఉదాహరణమునందు కవి 'ఇట్లు ప్రియంవద శకుంతలను హెచ్చరించెను' అని చెప్పియున్నయెడల నది వివృతోక్తి కుదాహరణ మగును.

ఇది అలంకారము కానేకాదు— (ఝళకీకరు).

sampath Ebooks

౧౦౪. లోకోక్త్యలంకారము :— లక్ష : లోకవ్యవహారమందలి సామెతలను జక్కఁగఁ జెప్పినచో 'లోకోక్తి'.

ఉదా : కొన్ని దినములు కన్నులు మూసికొని యుండుము.

ఇది అలంకారము కాదు — (ఝళకీకరు)

౧౦౫. ఛేకోక్త్యలంకారము :— లక్ష : లోకోక్తి యర్థాంతరగర్భిత మేని 'ఛేకోక్తి' యనఁబడును.

ఉదా : పాముకాళ్లు పామే యెఱుఁగును.

ఇదియు నలంకారము కాదు — (ఝళకీకరు).

౧౦౬. యుక్త్యలంకారము :— లక్ష : రహస్యమును గాఁచుటకై యేదో యొకయుక్తిచే నితరులను వంచించుట 'యుక్తి'.

ఉదా : ఒకస్త్రీ తన ప్రియునిపటము చిత్రించుచుండఁగ నన్యస్త్రీ వచ్చుటచే నా ప్రతిమయొక్క హస్తమున పూవింటిని చిత్రించెను.

తాను చిత్రించుచున్నది మన్మథునిపట మని యన్యస్త్రీ భావింపవలె నని తాత్పర్యము.

ఇది స్వతంత్రాలంకారము కాదు. 'వ్యాజోక్తి' లోనిదియే — (ఝళకీకరు).

౧౦౭. అత్యుక్త్యలంకారము :— లక్ష : ఆశ్చర్యకరములును, అసత్యములును అయిన శౌర్యాదులను వర్ణించుట 'అత్యుక్తి'.

ఉదా : రాజా ! నీప్రతాపాగ్నిచేత నెండిపోయిన సప్తసాగరములును నీశత్రురాజస్త్రీల కన్నీళ్లచేత నిండినవి — (కువల.).

సంపత్సంబంధియైన అత్యుక్తిని 'ఉదాత్త' మందురు. శౌర్యాదిసంబంధియైన అత్యుక్తిని 'అత్యుక్తి' యందురు. ఇది వీనికిఁ గలభేదము. 'అతిశయోక్తి' యందు సదుక్తి (నిజము) ఉండును. 'అత్యుక్తి' యందు అసదుక్తి (అసత్యము) ఉండును. ఇదియే వీనికి భేదమని అప్పయదీక్షితులవారిమతము.

ఇది 'ఉదాత్త' ములోనిదే యని కొందఱును, 'అతిశయోక్తి' లోనిదే యని మఱికొందఱును చెప్పెదరు — (ఉద్ద్యోతము).

౧౦౮. నిరుక్త్యలంకారము :— లక్ష : వ్యుత్పత్తివలన నామములకు నన్యార్థము కల్పించితి మేని 'నిరుక్తి'.

ఉదా : పూర్వము కవులను లెక్కవేయ నారంభించి, కనిష్ఠిక (చిటికెన) వ్రేలిమీఁద ఒకఁడు అని కాళిదాసునిపేరు చెప్పి బొటినవ్రేలు వంచఁబడెను. కాని యిప్పటివఱకును కాళిదాసునితో సమానుఁడైన కవి పుట్టనందున రెండవవ్రేలయిన 'అనామిక' కు అనామిక (పేరులేనిది) యన్న నామము సార్థకమాయెను.

ఇచ్చట 'అనామిక' యనువ్రేలికి కాళిదాసునితో సమానమైనవాఁడు పుట్టనందునఁ బేరు లేనిది యన్న మాఱర్థము చెప్పఁబడినది.

ఇది 'శ్లేష' లోనిది, వేఱు కాదు — (ఉద్ద్యోతము).

౧౦౯. ప్రతిషేధాలంకారము :— లక్ష : ప్రసిద్ధమైన నిషేధమునే క్రొత్తగాఁ జెప్పుట 'ప్రతిషేధము'.

ఉదా : ఓ జూదరి ! ఇది జూదము కాదు, ఘోరమైన యుద్ధము.

యుద్ధము జూదము కా దన్నసంగతి సుప్రసిద్ధమే. కాని నీకు జూదమమాత్రము చేత నగును, యుద్ధము చేతఁగా దని జూదరిని అధిక్షేపించుటకై మరలఁ జెప్పఁబడినది.

ఇది యలంకారమే కాదు. 'విధి' వలెనే ధ్వన్యంతర్గతము — (ఉద్ద్యోతము).

౧౧౦. విధ్యలంకారము :— లక్ష : సిద్ధమైనదానినే క్రొత్తగా విధించుట 'విధి'.

ఉదా : ఓ హస్తమా ! బ్రాహ్మణశిశువును బ్రతికించుటకై యీశూద్రమునిమీఁదఁ గత్తి వేయుము ; మోయలేనిదుఃఖముతో బాధపడుచున్న సీతను విడలఁగొట్టినరాముని అవయవమైన నీకు దయ యెక్కడిది ? — (ఉత్తరరామచరితము).

రామునిచేయి రామునియవయవ మన్నమాట యిదివఱకే సిద్ధము. ఇప్పుడు మరల నామాటఁ జెప్పుటవలన 'విధి' యయ్యెను.

ఇది అలంకారము కాదు. ఇట్టిచోట నొకప్పుడు ధ్వనివలనను, ఒకప్పుడు గుణీభూతవ్యంగ్యమువలనను గతార్థ మగుటచే వీనిని స్వతంత్రాలంకారము లనుటకు వీలు లేదు. గోవ్యాఘ్రమంతటి యలంకారమునందు గుణీభూతవ్యంగ్యప్రపంచ మంతయు నిముడ్చుట బ్రహ్మతరమైనను కాదు — (ఉద్ద్యోతము).

౧౧౧. హేత్వలంకారము :— లక్ష : హేతుమంతముతో (కార్యముతో) పాటు హేతువును (కారణమును) వర్ణించుటయు, హేతుహేతుమంతములకు నైక్యము వర్ణించుటయు 'హేతు' వనంబడును.

హేతుమంత మనఁగా హేతువువలన నగునది.

ఉదా : (౧). చంద్రుఁడు స్త్రీలమానమును భేదించుటకై ఉదయించుచున్నాఁడు.

ఉదా : (౨). ఈ ప్రభువుకటాక్షములు విద్వాంసులకు లక్ష్మీవిలాసములు.

ఇది అతిశయోక్త్యంతర్గతము ; భిన్నాలంకారము కాదు — (ఉద్ద్యోతము).

ప్రమాణాలంకారములు :— లక్ష : నైయాయికులకు నాల్గుప్రమాణములు, వేదాంతుల కాఱు, మీమాంసకులకు నెనిమిది. మీమాంసకులయొక్క యెనిమిదిప్రమాణములను దీసికొని అవి యే

sampath_Ebooks

యలంకారమునందుఁ గానవచ్చునో వానిని ఆ ప్రమాణము పేరిటియలంకార మనవలె నని కొందఱు లాక్షణికుల యభిప్రాయము. అవి యేవి యనిన ౧. ప్రత్యక్షము, ౨. అనుమానము, ౩. ఉపమానము, ౪. శబ్దము, ౫. ఐతిహ్యము, ౬. అర్థాపత్తి, ౭. అనుపలబ్ధి, ౮. సంభవము. వీనిలో 'అనుమానము'ను అందఱును (కావ్యప్రకాశకారుఁడు కూడ) ఒప్పుకొనిరి. ప్రత్యక్ష మనునది 'భావిక'ములోనిది, 'ఉపమానము' 'ఉపమ'యే. మిగిలిన ప్రమాణాలంకారము లలంకారములే కావనియు, ఆయా ప్రమాణములవలన నర్థమునకుఁ గల్గు చమత్కారము లేదనియు, ఆరూపమున స్వతంత్రాలంకారమున కుపస్కారకత్వము లేదనియు ఉద్ద్యోతకారునిమతము.

౧౧౨. ప్రత్యక్షాలంకారము :— లక్ష : ఇంద్రియజన్యజ్ఞానము ప్రత్యక్షము. ఆజ్ఞానమును అలంకారముగ వర్ణించినచో 'ప్రత్యక్షాలంకారము' అనఁబడును.

ఉదా : వేణిని విని, కనులఁ జూచి, తాఁకి, వాసన గొని మాటి జనులు సంతోషించెదరో, నేతిలో నుంచిన పుట్టఁగొక్కులను నీవు నమ్మించుకొనుచున్నాఁడవు.

ఇట్లు పంచేంద్రియములకుఁ బ్రత్యక్షమైన జ్ఞానము చక్కఁగను యోగ్యతను సూచించినది. ఇంద్రియము లైదు, మనస్సు ఒకటి కావున నివి యాఱువిధములు.

'అనుమాన' మిదివఱకే చెప్పఁబడినది.

౧౧౩. ఉపమానాలంకారము :— లక్ష : సాదృశ్యమువలన వస్తుజ్ఞానము కల్గుట 'ఉపమానాలంకారము'.

ఉదా : ఈనక్షత్రమండలమునందు చెయ్యది బంధించినది మంచునో యది రోహిణీనక్షత్రమని యెఱుఁగుము.

ఇది ఉపమాంతర్గతమే — (ఉద్ద్యోతము).

౧౧౪. శబ్దాలంకారము :— లక్ష : ప్రత్యాదివాక్యోపన్యాసముచే నర్థము నిశ్చయింపఁబడెనేని యది 'శబ్దాలంకార' మగును.

ఉదా : నిందించుముద్దేశముతోఁ జెప్పినను నీవు శివుని విషయమై అతనిపుట్టుక తెలియ దని యొక్కమంచిమాట చెప్పినావు. బ్రహ్మకుఁగూడ నెవ్వఁడు జన్మస్థల మని వేదములు ఘోషించునో వానిజన్మ మెవరు కనుఁగొనఁగలరు ? — (కు. సం.).

ఈ విధముగనే స్మృతిపురాణాగమలౌకికవాక్యరూపము లయిన శబ్దప్రమాణముల కుదాహరణములఁ జూపవచ్చును. ఆచారాత్మతుష్టులు కూడ శబ్దప్రమాణములోనివే. ఆత్మతుష్టి యనుప్రమాణమున కీక్రింది యుదాహరణము :

నాకు దీనిపై మనస్సు పోయెను గాన నిది క్షత్రియులచేఁ బరిగ్రహింపఁదగిన దనుటకు సందేహము లేదు. సజ్జనులకు సంశయము కలిగినప్పు డంతఃకరణప్రవృత్తియే ప్రమాణము — (అభి. శా.).

౧౧౫. ఐతిహ్యాలంకారము :— లక్ష : జనశ్రుతి (కింవదంతి) ప్రమాణముగాఁ జెప్పినయెడల 'ఐతిహ్యము'.

ఉదా : మంగళగిరిలో దేవుఁడు పానకము త్రాగు నని లోకవార్త గలదు.

అలంకారము కాదు — (ఉద్ద్యోతము).

౧౧౬. కావ్యార్థాపత్తి అలంకారము :— లక్ష : తర్కమందలి యర్థాపత్తిన్యాయమున నొకయర్థ మూహింపఁబడెనేని యది 'కావ్యార్థాపత్తి'.

ఉదా : నితంబినీ ! నీకు నడు మున్నది యని నిశ్చయించుటకు వీ లున్నది. లేనియెడలఁ బయోధరముల యునికి యెట్లు ?

ఇదివఱకు ౫౦ - వ అలంకారముగ ౫౦౩ - వ పుటలో 'అర్థాపత్తి' చెప్పఁబడినది. అదియే యిది. కువలయానందకారుఁడు దానికి 'కావ్యార్థాపత్తి' యని పేరు పెట్టి యీ విధియలంకార మైనట్లు వ్రాసెను. కాని యిది వేఱు కాదు.

౧౧౭. అనుపలబ్ధ్యలంకారము :— లక్ష : ప్రమాణముగ నొప్పుకొనిన అనుపలబ్ధి (అప్రాప్తి) అలంకారముగఁ జెప్పఁబడిన 'అనుపలబ్ధి'.

ఉదా : రాజా ! నీకు అయశస్సు లేనేలేదు. ఎక్కడను వినలేదు. ఉండినచో వినఁబడదా యని భావము.

అలంకారము కానేకాదు — (ఉద్ద్యోతము).

౧౧౮. సంభవాలంకారము :— లక్ష : ప్రమాణత్వమును జెందిన 'సంభవము'. అలంకారత్వమును చెందెనేని యది 'సంభవా' లంకార మగును.

ఉదా : నాకృతిని జూచి పరిహసించువారి ప్రయత్నము వారికొఱకుఁ గా దని తెలిసికొనవచ్చును. నావ్రాఁతలఁ జూచి సంతసించు నాసమానధర్ము యీలోకమం దున్నాఁడు, లేదా పుట్టఁగలఁడు. కాల మనంతము, భూమి విశాలము — (భవభూతి).

## అకారాదిసూచి

౧. ఉపోద్ఘాతసూచి — పుట


అలంకారములచరిత్రము ... ... ౪౭౪
అలంకారములనుగుఱించి ధ్వనిసంప్రదాయమువారి యభిప్రాయము ... ... ౪౭౩
అలంకారములపట్టిక (అలంకారసర్వస్వము ననుసరించి) ౪౭౮-౭౯
అలంకారముల విభజన ... ... ౪౭౫
అలంకారములసంఖ్య ... ... ౪౭౪
అలంకారసంప్రదాయమువారు ... ... ౪౭౨
అలంకారికుల వేఱువేఱుసంప్రదాయములు ... ౪౭౨
గుణములకు నంలంకారములకును గలభేదము ... ౪౭౩

sampath_Ebooks




| | | |
|---|---|---|
| | గ్రంథసంగ్రహము | ౪౮౦ |
| | ధ్వని యెద్ది? అలంకార మెద్ది? | ౪౬౩ |
| | శబ్దార్థాలంకారముల యోగ్యత | ౪౬౭ |


## ౨. అలంకారములసూచి


| | | |
|---|---|---|
| ≀ § | ♦ అతద్గుణము | ౫౦౫ |
| * ≀ § | ♦ అతిశయోక్తి | ౪౯౪ |
| | అత్యుక్తి | ౫౧౩ |
| ≀ § | ♦ అధికము | ౫౦౦ |
| ≀ § | ♦ అనన్వయము | ౪౮౯ |
| | అనుగుణము | ౫౧౨ |
| | ♦ అనుజ్ఞ | ౫౧౦ |
| | అనుపలబ్ధి | ౫౧౪ |
| ≀ § | అనుప్రాసము | ౪౮౨ |
| ≀ § | ♦ అనుమానము | ౫౦౨ |
| ≀ § | ♦ అన్యోన్యము | ౫౦౧ |
| * ≀ § | ♦ అపహ్నుతి | ౪౯౨ |
| * ≀ § | ♦ అప్రస్తుతప్రశంస | ౪౯౯ |
| § | ♦ అర్థాపత్తి | ౫౦౩ |
| * ≀ § | ♦ అర్థాంతరన్యాసము | ౪౯౯ |
| | అర్థాలంకారములు | ౪౮౫ |
| | అల్పము | ౫౧౧ |
| | ♦ అవజ్ఞ | ౫౧[illegible] |
| ≀ § | ♦ అసంగతి | ౫౦౦ |
| | అసంభవము | ౫౧౧ |
| | ♦ అసమము | ౫౦౯ |
| * ≀ § | ♦ ఆక్షేపము | ౪౯౯ |
| ≀ § | ♦ ఉత్తరము | ౫౦౫ |
| * ≀ § | ♦ ఉత్ప్రేక్ష | ౪౯౨ |
| * § | ఉదాత్తము | ౫౦౬ |
| | ♦ ఉదాహరణము | ౫౦౯ |
| | ఉన్మీలితము | ౫౧౨ |
| * ≀ § | ♦ ఉపమ | ౪౮౫ |
| | ఉపమానము | ౫౧౪ |
| ≀ § | ♦ ఉపమేయోపమ | ౪౮౯ |
| | ♦ ఉల్లాసము | ౫౧౦ |
| § | ♦ ఉల్లేఖము | ౪౯౨ |
| * | ఊర్జస్వి | ౫౦౬ |
| ≀ § | ♦ ఏకావలి | ౫౦౧ |
| | ఐతిహ్యము | ౫౧౪ |
| * ≀ § | క్రమము (యథాసంఖ్యము) | ౫౦౨ |
| | కారకదీపకము | ౪౯౫ |
| ≀ § | ♦ కారణమాల | ౫౦౧ |
| ≀ § | ♦ కావ్యలింగము | ౫౦౨ |
| | కావ్యార్థాపత్తి | ౫౧౪ |
| | గూఢోక్తి | ౫౧౨ |
| ≀ § | చిత్రము | ౪౮౫ |
| ≀ § | ఛేకానుప్రాసము | ౪౦౨ |
| | ఛేకోక్తి | ౫౧౩ |
| ≀ § | ♦ తద్గుణము | ౫౦౫ |
| | ♦ తిరస్కారము | ౫౧౨ |
| * ≀ § | ♦ తుల్యయోగిత | ౪౯౫ |
| ≀ § | ♦ దీపకము | ౪౯౫ |
| ≀ § | ♦ దృష్టాంతము | ౪౯౫ |
| * ≀ § | ♦ నిదర్శనము | ౪౯౭ |
| | నిరుక్తి | ౫౧౩ |
| ≀ § | ♦ పరికరము | ౪౯౬ |
| | పరికరాంకురము | ౫౧౦ |
| § | ♦ పరిణామము | ౪౯౧ |
| * ≀ § | ♦ పరివృత్తి | ౫౦౩ |
| ≀ § | ♦ పరిసంఖ్య | ౫౦౩ |
| ≀ § | ♦ పర్యాయము | ౫౦౨ |
| * ≀ | ♦ పర్యాయోక్తము | ౪౯౯ |
| | పిహితము | ౫౧౨ |
| ≀ § | పునరుక్తవదాభాసము | ౪౦౧ |
| | పూర్వరూపము | ౫౧౨ |
| ≀ § | ♦ ప్రతివస్తూపమ | ౪౯౫ |
| | ప్రతిషేధము | ౫౧౩ |
| ≀ § | ♦ ప్రతీపము | ౫౦౪ |
| | ప్రత్యనీకము | ౫౧౪ |


* ఈగుర్తుచేయఁబడిన యలంకారములు దండి యొక్క 'కావ్యాదర్శము' నందుఁ గలవు.

≀ ఈగుర్తుచేయఁబడిన యలంకారములు మమ్మటుని 'కావ్యప్రకాశము' నందుఁ గలవు.

§ ఈగుర్తుచేయఁబడిన యలంకారములు విద్యానాథుని 'ప్రతాపరుద్రీయము' నందుఁ గలవు.

♦ ఈగుర్తుగల అలంకారములు 'రసగంగాధరము' నందు ఈయఁబడినవి. రసగంగాధరము అసంపూర్ణమైన గ్రంథము గనుక ఇతరాలంకారములు జగన్నాథునకు సమ్మతము లని చెప్పుటకు వీలులేదు.

sampath_Ebooks


≀ § ◆ ప్రత్యనీకము ... ... ౫౦౪
ప్రమాణాలంకారములు ... ౫౧౩
ప్రస్తుతాంకురము ... ... ౫౧౧
◆ ప్రహర్షణము ... ... ౫౧౦
* ప్రేయోలంకారము ... ... ౫౦౭
◆ ప్రౌఢోక్తి ... ... ౫౦౯
భావశబలత ... ... ౫౦౮
భావసంధి ... ... ౫౦౮
* ≀ § భావికము ... ... ౫౦౬
భావోదయము ... ... ౫౦౮
≀ § ◆ భ్రాంతిమదలంకారము ... ౪౯౨
≀ § మాలాదీపకము ... ... ౫౦౨
మిథ్యాధ్యవసతి ... ... ౫౧౧
≀ § ◆ మీలితము ... ... ౫౦౫
ముద్రాలంకారము ... ... ౫౧౧
* ≀ § యమకము ... ... ౪౮౩
≀ § ◆ యథాసంఖ్యము ( క్రమము ) ... ౫౦౨
యుక్తి ... ... ౫౧౩
రత్నావళి ... ... ౫౧౨
* రసవదలంకారము ... ... ౫౦౭
* ≀ § ◆ రూపకము ... ... ౪౮౯
◆ లలితము ... ... ౫౦౯
≀ § లాటానుప్రాసము ... ... ౪౮౩
* ◆ లేశము ... ... ౫౧౦
లోకోక్తి ... ... ౫౧౩
≀ § ◆ వక్రోక్తి ... ... ౫౦౬
§ వికల్పము ... ... ౫౦౩
వికస్వరము ... ... ౫౧౧
§ ◆ విచిత్రము ... ... ౫౦౦
విధి ... ... ౫౧౩
* § ◆ వినోక్తి ... ... ౪౯౭
* ≀ § ◆ విభావన ... ... ౫౦౦
* ≀ § ◆ విరోధము ... ... ౫౦౦
వివృతోక్తి ... ... ౫౧౨
విశేషకము ... ... ౫౧౨
≀ § ◆ విశేషము ... ... ౫౦౧
* ≀ § ◆ విశేషోక్తి ... ... ౫౦౦
≀ § ◆ విషమము ... ... ౫౦౦
◆ విషాదము ... ... ౫౧౦
≀ § వృత్త్యనుప్రాసము ... ... ౪౮౨
* ≀ § ◆ వ్యతిరేకము ... ... ౪౯౬
≀ § ◆ వ్యాఘాతము ... ... ౫౦౧
వ్యాజనింద ... ... ౫౧౧
* ≀ § ◆ వ్యాజస్తుతి ... ... ౪౯౯
≀ § వ్యాజోక్తి ... ... ౫౦౬
శబ్దము ... ... ౫౧౪
శబ్దాలంకారములు ... ... ౪౮౧
శృంఖల ... ... ౫౦౧
* ≀ § ◆ శ్లేషము ... ... ౪౯౭
≀ § సంకరము ... ... ౫౦౮
≀ § ◆ సందేహము ... ... ౪౯౨
సంభవము ... ... ౫౧౪
సంభావన ... ... ౫౧౧
* ≀ § సంసృష్టి ... ... ౫౦౮
≀ § ◆ సమము ... ... ౫౦౦
≀ § ◆ సమాధి ... ... ౫౦౪
* ≀ § ◆ సమాసోక్తి ... ... ౪౯౭
* సమాహితము ... ... ౫౦౭
≀ § ◆ సముచ్చయము ... ... ౫౦౪
* ≀ § ◆ సహోక్తి ... ... ౪౯౬
≀ § ◆ సామాన్యము ... ... ౫౦౫
≀ § ◆ సారము ... ... ౫౦౨
* ≀ § ◆ సూక్ష్మము ... ... ౫౦౬
≀ § ◆ స్మరణము ( స్మృతి ) ... ... ౪౮౯
* ≀ § స్వభావోక్తి ( జాతి ) ... ౫౦౬
* హేతు ... ... ౫౧౩



సూచన :— ఈ మూలిలో నీయఁబడిన అర్థాలంకారము లన్నియు, 'అసమము', 'ఉదాహరణము', 'తిరస్కారము' అను నవి తప్ప, 'కువలయానందము'నందు గలవు.

( కొ. వేం. ల. )

**అలంకారములు** ( సంగీతశాస్త్రము ) — గాన క్రియాత్మకమైన వర్ణసందర్భవిశేషము. ఇవి అయిదువిధములు: ౧. స్థాయివర్ణగతము, ౨. ఆరోహివర్ణగతము, ౩. అవరోహివర్ణగతము, ౪. సంచారివర్ణగతము, ౫. అలంకారాంతరము. ౧. ఏకస్వరమాత్ర ఘటితము స్థాయివర్ణగతము. స్వర మొక్కటి యైనను దానియొక్క తారమంద్రభేద భిన్నముల విన్యాసవిశేషముచే నది విలక్షణముగఁ గానవచ్చును. ఉదా. సాసాసా - సాసాసా ఇత్యాది. దీనికి ౭ భేదములు కలవు. ౨. క్రమముగ స్వరముల ఆరోహణము కలది ఆరోహివర్ణగతము. ఉదా: సారీగామాపాధానీ, సస రిరి గగ మమ ధధ నిని ఇత్యాది. దీనికి ౧౨ భేదములు కలవు. ౩. క్రమముగ స్వరముల అవరోహణము కలది అవరోహివర్ణగతము. ఉదా: నీధాపామాగా రీసా - నిని ధధ పప మమ గగ రిరి సస. దీనికి ౧౨ భేదములుకలవు.

sampath_Ebooks





సంస్కృతమునందును, పాశ్చాత్యభాషలలోను విశేషముగ నభివృద్ధి జెందియున్నది. దీనిని ఈ విజ్ఞానసర్వస్వమునందు నీ క్రింది ౧౦ వ్యాసములలో జర్చించెదము: ౧. అలంకారములు (వ్యాస మిది యిటనే ప్రకటింపఁబడినది), ౨. ఆలంకారికులు (శాస్త్రచరిత్రము, వేఱువేఱు సంప్రదాయములవర్ణనము), కావ్యము (లక్షణవిభాగగుణదోషాదికములు), ౪. చిత్రకవిత్వము, ౫. ధ్వని, ౬. నాటకములు, ౭. నవలలు, ౮. పద్యకావ్యములు, ౯. పాటలు, ౧౦. గద్యకావ్యములు. కావునఁ జదువరు లాయాశీర్షికల క్రిందఁ జూచెదరుగాక.

**అలంకారసర్వస్వము** — రాజానక రుయ్యక కవిచే అలంకారములనుగుఱించిమాత్రము వ్రాయఁబడిన గ్రంథము. ఇందు సూత్రములును, వృత్తియు కలవు. సూత్రములుమాత్రము రుయ్యకునిచే వ్రాయఁబడె ననియు, అతని శిష్యుఁడైన మంఖకునిచే వృత్తి వ్రాయఁబడె ననియు కొందఱియభిప్రాయము. ఈ రుయ్యకుఁడు క్రీ. శ. ౧౨-వ శతాబ్దియందుండిన ట్లూహింపఁబడుచున్నది. ఆలంకారికులలో నీతనికి గొప్పగౌరవము కలదు. ఇయ్యది కావ్యమాలలోను, అనంతశయన సంస్కృతగ్రంథావళిలోను ప్రచురింపంబడియె.

**అలంకారుఁడు** — శా. శ. ౧౧-వ శతాబ్దియొక్క ఉత్తరార్ధమునందు కాశ్మీరదేశమును పాలించిన సుశలరాజుయొక్క మంత్రి. ఇతని తమ్ముఁడు మంఖకవి శ్రీకంఠచరిత్ర మనుకావ్యమును రచింపఁగా దానిని పరీక్షించునిమిత్త మీతఁడు ౩౦ పండితులసభఁ జేయించెను — (అర్వాచీనకోశము).

**అలంఖాన్ లోడీ** — బహలాల్ లోడికుమారుఁడు. ఢిల్లీ చక్రవర్తి యగు బహమాన్ షా క్రీ. శ. ౧౫౩౨-వ సంవత్సరమున నితనిని భిల్సా, చందేరీ, మాల్వాదేశములకు ఏలికగా నియమించెను.

**అలంగంజ్** — ఆగ్రానగరములో నొకభాగము. అలంగీరు (ఔరంగజేబు) పేరునుండి దీని కీపేరు వచ్చినది. ఇందాకాలమున నౌరంగజేబుచే నిర్మింపఁబడిన మసీదులో ప్రస్తుతమున గవర్నమెంటువారి ఆఫీసు ఉన్నది. ఇందలి పారసీశాసనమునుబట్టి ౧౬౭౧-వ సంవత్సరమున మహారాష్ట్రులతో యుద్ధ మొనరించుచున్న కాలమున నలంగీరు దీనిని గట్టించినట్లు తెలియవచ్చును.

**అలంగీరుగుట్ట** — కటక్ జిల్లాయందలి జయపురము సబ్ డివిజన్‌లోని యొకపర్వతము. ౨,౫౦౦ అడుగులయెత్తున ఈపర్వతముమీఁద తఖ్‌-ఈ-సులేమాన్ అనుమసీ దొకటి కలదు.

**అలండ్** — నైజామ్ హైద్రాబాద్ సంస్థానములోని గుల్‌బర్గాజిల్లాయందలి ఈ పేరుగల పాయగాతాలూకాకు ముఖ్యస్థలము. గుల్‌బర్గాపట్టణమునకు వాయవ్యమున ౨౦ మైళ్లదూరమున నుండును. ఇది వర్తకస్థలము.

**అలంపురము** — ౧. (ఇండూర్) ఇండూరుసంస్థానమువారి యొకపరగణా. ఇది ఇండూరుసంస్థానమునకు విడిగా మధ్యహిందూస్థానమందలి బుందేలుఖండ్ ఏజెన్సీలోఁ జేరియున్నది. దీని విస్తీర్ణము ౩౪ చదరపుమైళ్లు. గ్రామములు ౨౬. జనసంఖ్య ౧౬,౪౧౧. వసూలు రు. ౫౯,౦౦౦ లు. ఇండూరుసంస్థానాధిపతుల మూలపురుషుఁడైన మల్‌హార్‌రావు ౧౭౬౬లో అలంపురమునందు కీర్తిశేషుఁ డాయెను. అచ్చట నాతనికి సమాధి కట్టఁబడియె. దాని సంరక్షణనిమిత్తము గ్వాలియర్, డతియా, జాలన్, ఝూన్సీ అను సంస్థానములవారియొద్దనుండి ౨౪ గ్రామములు బలవంతముగఁ దీసికొని ఈపరగణా యేర్పఱుపఁబడినది. మల్‌హార్‌రావు జ్ఞాపకచిహ్నముగ నొకగద్దె కట్టింపఁగ, తమయొద్దనుండి గ్రామములు దీసికొనిరన్న కోపముచే రాజపుత్రరాజులు పలుమాఱు దానిని పాడుచేసిరి.

**అలంపురము** — ౨. (హైద్రాబాద్) నైజామ్ హైద్రాబాద్ రాజ్యమునందలి ఆగ్నేయపువైపు తాలూకా. జాగీరులతో కలసి వైశాల్యము ౧౫౪ చదరపుమైళ్లు. జనసంఖ్య ౩౦,౨౨౫. గ్రామములు ౪౩. కృష్ణానది ఈతాలూకాకును, మహబూబ్‌నగర్ జిల్లాకును సరిహద్దున నుండును. తుంగభద్రానది దీనికిని కర్నూలునకును హద్దుగ నుండును. ఈరెండునదులును ఈతాలూకాకు తూర్పుదిక్కున కలయును. వసూలు రు. ౧౨,౦౦,౦౦౦ లు.

**అలంపురము** — ౩. (కాఠియవాడ) బొంబయిరాజధానియందలి కాఠియవాడ (కాఠేవార్)లోని యొక చిన్నసంస్థానము.

**అలంపురము** — పశ్చిమగోదావరిజిల్లా తాడేపల్లిగూడెంతాలూకాలోని గ్రామము. దీనిజనసంఖ్య ౨,౧౯౪ (౧౯౩౧).

**అలంపూరు** — అనంతపురంజిల్లా కదిరితాలూకాలోని గ్రామము. జనసంఖ్య ౯౬ (౧౯౩౧).

**అలంబస** — ఇక్ష్వాకువంశస్థుఁడైన తృణబిందుని భార్య. కుమారుఁడు విశాలుఁడు.

**అలంబుధక్షేత్రము** — భారతవర్షీయ క్షేత్రము.

**అలంబుష** — ప్రాథకు పుట్టిన యప్సరసలలో నొకర్తె.

sampath_Ebooks

**అలంబుషుఁడు** — ౧. బకాసురునితమ్ముఁడు. భారతయుద్ధమునందు దుర్యోధనపక్షమునఁ బోరాడి, ఘటోత్కచునిచేఁ జచ్చెను.

౨. జటాసురుని పుత్త్రుఁడు. భారతయుద్ధమున నితఁడు దుర్యోధనపక్షమునఁ బోరాడి రాత్రి యుద్ధమునందు ఘటోత్కచునిచేఁ జచ్చెను.

౩. దుర్యోధనపక్షీయుఁడగు రాజు. భారతయుద్ధమునందు సాత్యకిచేఁ జచ్చెను.

**అల్ అరబీ** (క్రీ. శ. ౧౧౬౫ - ౧౨౪౦) — అరబ్బీ తత్త్వవేత్త. స్పెయినునందలి ముర్సియాదేశస్థుఁడు. ఈజిప్టు, అరేబియా, సిరియా, ఆసియామైనరులందు పర్యటనము కావించి తుదకు చనిపోవువఱకును డామస్కసునందు స్థిరముగ నివాసము చేసెను. ఇతఁడు ౨౮౯ తత్త్వగ్రంథములను రచియించె నని చెప్పుదురు. వానిలో సగమునకు పైఁగా నిప్పటికి నున్నవి. ఇతఁడు ఇస్లాము మతమునందలి గొప్పద్రష్ట (Mystics) లలో నొకఁడు. ఇతని సిద్ధాంతములే సూఫీసిద్ధాంతావిష్కారమునకు మూలకారణములు.

**అలకనంద** — ఇది భాగీరథిలోఁ గలియునది. ఈరెండును గలిసినతరువాతనుండియే యీనదికి గంగానది యన్న నామము కలిగినది. కుబేరునియొక్క అలకానగరికి వెలుపల నీనది ప్రవహించును.

**అలకాపురి** — కుబేరునిరాజధాని. మేరుశిఖరముమీఁద నుండును. నూఱుయోజనములపొడువును, డెబ్బదియోజనముల వెడల్పును కలిగియున్నది.

**అలకూరుపల్లె** — చిత్తూరుజిల్లా చిత్తూరుతాలూకాయందలి జమీన్‌దారీగ్రామము. ఇక్కడిజనసంఖ్య ౧౧౭ (౧౯౩౧).

**అలగనూరు** — కర్నూలుజిల్లా నందికొట్కూరు తాలూకాయందలి గ్రామము. దీనిజనసంఖ్య ౬౩౭ (౧౯౩౧).

**అలగానిపాడు** — నెల్లూరుజిల్లా కోవూరుతాలూకాలోని గ్రామము. జనసంఖ్య ౧,౫౭౭ (౧౯౩౧).

**అలచంద** — చూడుఁడు, బొబ్బర్లు.

**అలజంగి** — ౧. విశాఖపట్టణముజిల్లా బొబ్బిలితాలూకాయందలి జమీన్‌దారీగ్రామము. ఇందలిజనసంఖ్య ౩,౧౯౦.

౨. విశాఖపట్టణముజిల్లా, చీపురుపల్లి తాలూకాయందలి ఈనాంగ్రామము. ఇందలిజనసంఖ్య ౪౧౭ (౧౯౩౧).

**అలతి** — గంజాంజిల్లా పర్లాకిమిడితాలూకాలోని ఈనాంగ్రామము. జనసంఖ్య ౪౨౮ (౧౯౩౧).

**అలదేమా** — ఔధ్ రాష్ట్రమునఁగల సుల్తాన్‌పూర్ జిల్లాయం దొకపరగణా. మొదట నీపరగణా భారులయధికారములో నుండె ననియు, నావంశములోని అలదే యనురాజు గోమతీనదియొడ్డున దుర్గము గట్టించె ననియు, నాకారణముననే దీనికి అలదేమా అనుపేరు వచ్చిన దనియు చెప్పుకొందురు. ఇం దెన్నియో శిథిలములయియున్న నగరములు, ప్రాచీనదుర్గములు భారులనాఁటివి కలవు. జేరా, మేనాపుర్, నానామా, పారస్‌పత్తీ యను రాజపుత్రరాజ్యము లిందుఁ గలవు. ఈపరగణావైశాల్యము ౩౮౯ చదరపుమైళ్లు.

**అలప్పులై** — తిరువాన్కూరుసంస్థానమందలి ముఖ్యమైన రేవుపట్టణము. దీనినే అలప్పి అందురు. వచ్చినవారు (వలందులు) తన రాజ్యమందలి వర్తకమును స్వాధీనపఱుచుకొనుట మాని దానిని అభివృద్ధి చేయుటకై ౧౮-వ శతాబ్దిలో రామవర్మ యనురాజు ఈరేవును నిర్మించెను. ఇప్పుడు నిరువదిమైళ్ల దూరముగల దీపగృహము (Light House) కలదు. ఈరేవున నావలనిలుపుటకు విశేషముగ నుండును. తిరువాన్కూరుసంస్థానమునకు నీరేవువలన సంవత్సరమునకు ఎగుమతిమీఁద రు. ౧౨,౦౦౦ లును, దిగుమతిమీఁద రు. ౧,౯౫,౦౦౦ లును సుంకము వచ్చును.

**అలప్తగీన్** — బుఖారాలోని సరదారుఁడు. అప్పుట సామానీవంశజులు రాజ్యముచేయుచుండగ నితఁడు ఖురాసానుకు గవర్నరుగ నుండెను. క్రీ. శ. ౯౬౨ లో బుఖారారాజులతోఁ బోరాడి గజనీపట్టణమునకుఁ బోయి చిన్న స్వతంత్రరాజ్యమును స్థాపించెను. ౯౭౬ లో మరణించెను. ఈతనితరువాత నీతని కుమారుడైన అబూ-ఇస్-హాక్ అనువాఁడు రాజ్యమునకు వచ్చెను, గాని అతఁడు బలహీనుఁ డగుటచే అలప్తగీన్ వద్ద సరదారైన సబక్తగీన్ రాజు జయ్యెను.

**అలప్పి** — చూడుఁడు: అలప్పులై.

**అలబనూరు** — బళ్లారిజిల్లా సిరిగుప్పతాలూకాలోని గ్రామము. జనసంఖ్య ౨౦౩ (౧౯౩౧).

**అలబమా** — ౧. ఇది అమెరికాసంయుక్తరాజ్యములలో నొకటి. క్రీ. శ. ౧౮౧౯-వ సంవత్సరమున నిది ఆరాజ్యముల యూనియనునందు చేర్చుకొనఁబడినది. ఉత్తరమున టెనెస్సీ, తూర్పున జార్జియారాజ్యములును, దక్షిణమున ఫ్లోరిడారాజ్యమును, మెక్సికోసింధుశాఖయు, పడమట మిసిసిప్పిరాజ్యమును దీనిసరిహద్దులు. దీనివైశాల్యము ౫౧,౯౯౮ చదరపుమైళ్లు. జనసంఖ్య ౨౬,౪౬,౨౪౮. మెక్సికోసింధుశాఖాతీరమును, ఫ్లోరిడారాజ్యసీమను అంటియుండు ఈరాజ్యపుదక్షిణభాగ మంతయు పల్లము, సమతలమునై దేవదారు వృక్షములతో నిండి తత్కారణమున దేవదారువృక్షాటవీప్రదేశ మని ప్రసిద్ధి కెక్కియున్నది. మధ్యభాగము కొండలమయము. కాని చదునైన ఇసుకనేలలును, ప్రయిరీలును అందందు కలవు. ఉత్తర

sampath_Ebooks

భాగము నిమ్నోన్నతమై, పర్వతమయమై యుండును. అలబమా, టాంబిగ్‌బీ, మోబైల్, కూసా, టల్లపూసా, టెనెస్సీనదులు దీనికి ప్రధానమైనవి. వీనిలోఁ గొన్ని వందలకొలఁది మైళ్లదూరము పర్యంతము నౌకాప్రయాణములఁ గావింప ననుకూలము లైయుండును. ఈరాజ్యమందలి నేలలో ననేకభేదములు గలవు. కొన్ని చోట్ల, ముఖ్యముగా దక్షిణమున ఇసుకతోఁ గూడినబంజరుభూములు. కాని అనేకభాగములలో సారవంతమైన నేలలు గలవు. నదుల లోయలందును, మధ్యభాగమందును 'కార్పాసమండలము' (Cotton belt) అని ప్రసిద్ధి కెక్కిన ప్రత్తి అపరిమితముగఁ బండు సస్యవంతములైన నేలలు కలవు. ఇచట సాధారణముగా కాలమితి వేడిమి కలిగియుండును. నదులకు చుట్టుప్రక్కలనుండు భూములు అనారోగ్యకరములు. చలికాలమునఁ గలుగు సమశీతోష్ణము కలనను, ఎండకాలమున సింధుశాఖనుండి వీచువాయువులచే వేడిమి తగ్గుచుండుటవలనను, దేశములోని యున్నతప్రదేశము లన్నియు ఆరోగ్యకరములై రమ్యములై యుండును. ఇచట ముఖ్యముగ మధ్యదక్షిణభాగములందు ప్రధానోత్పత్తి ప్రత్తి; ధాన్యము, పంచదారయుఁ గూడ నుత్పత్తి యగును. ఉత్తరభాగమున ధాన్యములు — మొక్కజొన్న లన్నిటికంటె నెక్కువగ పండును. ఇందు బహువిస్తీర్ణములగు మంచి ఇనుపగనులును, బొగ్గుగనులును గలవు. పాలరాయి, నల్లరాయి మఱియు ననేకఖనిజములును లభించును. గనులను త్రవ్వితీయుటయు, లోహమును శుద్ధపఱుచుటయు నిచటి ప్రధానపరిశ్రమలు. వస్త్రముల నిర్మాణమును అపరిమితముగ సాగుచుండును. విదేశవ్యాపారమునకు కేంద్రము మోబైలుపట్టణము. ఇది ముఖ్యమైన రేవుపట్టణము. ఇచటనుండి ప్రత్తి విస్తారముగ నెగుమతి యగుచుండును. అమెరికన్ కాంగ్రెసున కీదేశమునుండి ఎనమండ్రు ప్రతినిధులు పోవుచుందురు. దీనిరాజధాని మాంటుగొమరీనగరము. మెథడిస్టు ఎపిస్కోపల్ సంఘమునకుఁ జెందిన రాజ్యపువిశ్వవిద్యాలయము టస్కలూసానగరమున నున్నది. రాజ్యమునకు చెందిన నార్మల్ కాలేజీలును, అనేకవృత్తి కళాశాలలును, పెద్దపట్టణములందుఁ గలవు. బర్మింగుహామునగరము లోహపుపనులకు ప్రఖ్యాతి గాంచినది.

౨. అలబమారాజ్యములోని ముఖ్యనదులలో నొక్కటి. పొడుగు ౪౨౦ మైళ్లు. సంవత్సరమంతయు పడవలు నడచుట కనుకూలమైనది. ప్రత్తి మున్నగుసరకు లీనదీమార్గముగ నిర్ణీతస్థలములఁ జేరుచున్నవి.

అలబాకా — తూర్పుగోదావరిజిల్లా నూగూరుతాలూకాలోని జమీన్‌దారీగ్రామము. ఇందలిజనసంఖ్య ౫౬౧ (౧౯౩౧).

అలబూరు — బళ్లారిజిల్లా హర్పనహళ్లి తాలూకాలోని గ్రామము. జనసంఖ్య ౧,౨౬౨ (౧౯౩౧).

అలబ్ధుఁడు — ఒక బ్రహ్మర్షి.

అలమండ — ౧. విశాఖపట్టణముజిల్లా పార్వతీపురము తాలూకాలోని జమీన్‌దారీగ్రామము. జనసంఖ్య ౭౭౪ (౧౯౩౧).

౨. విశాఖపట్టణముజిల్లా శృంగవరపుకోట తాలూకాలోని ఈనాం గ్రామము. ఇచటి జనసంఖ్య ౪,౦౧౪ (౧౯౩౧).

౩. విశాఖపట్టణముజిల్లా వీరవల్లి తాలూకాలోని జమీన్‌దారీగ్రామము. దీనిజనసంఖ్య ౨,౬౨౨ (౧౯౩౧).

౪. విశాఖపట్టణముజిల్లా పార్వతీపురము తాలూకాలోని యేజెన్సీగ్రామము. ఇక్కడిజనసంఖ్య ౭౭౬ (౧౯౩౧).

అలమన్, లూకస్ (౧౭౯౨ - ౧౮౫౩) — మెక్సికో దేశీయుఁడు, రాజకార్యధురంధరుఁడు, చరిత్రకారుఁడు. ఇతనిచే వ్రాయఁబడిన మెక్సికో దేశపుచరిత్ర ప్రమాణముగ నెంచఁబడును. ఇతఁడు మెక్సికోతరఫున స్పెయినుసభలో ప్రతినిధిగ నుండెను. మెక్సికోలో పరదేశసంబంధమంత్రిపదవిని వహించెను.

అలమేలుమంగతాయమ్మ అగ్రహారము — చిత్తూరుజిల్లా పుత్తూరుతాలూకాలోని జమీన్‌దారీ గ్రామము. ఇచటిజనసంఖ్య ౧౧౯ (౧౯౩౧).

అలమేలుమంగాపురము (స. నెం. ౧౫౭) — చిత్తూరుజిల్లా పుత్తూరుతాలూకాలోని జమీన్‌దారీగ్రామము. జనసంఖ్య ౫౬౫ (౧౯౩౧).

అలమేలుమంగాపురము లేక మంగాపురము — చిత్తూరుజిల్లా తిరుత్తనితాలూకాయందలి జమీందారీగ్రామము. ఇందలి జనసంఖ్య ౫౦౫ (౧౯౩౧).

అలమేలుమంగాపురము లేక వేంపగుంట (స. నెం. ౧౩) — చిత్తూరుజిల్లా పుత్తూరుతాలూకాయందలి జమీన్‌దారీగ్రామము. జనసంఖ్య ౧,౨౧౫ (౧౯౩౧).

అలయుఁడు — ఒక రాజర్షి.

అలరిక్ (క్రీ. శ. ౩౭౦ - ౪౧౦) — విసిగాథ్ అనువారిరాజు. వీనిబాల్యమున విసిగాథులు రోమువారికి లోఁబడియుండిరి. ౩౯౫ లో ఈతఁడు రోమకప్రభుత్వముపైనిఁ దిరుగఁబడి గాథులకు రాజాయెను. ౩౯౬ లో గ్రీసుమీఁదికి దండెత్తెను. ౩౯౭ లో ఇతఁడు ఎపిరస్‌కు తఱుమఁబడెను. అయినను ఈతఁడు ఇలిరికమునకు గవర్నరాయెను. క్రీ. శ. ౪౦౦ లో ఇటలీపై దాడి

sampath_Ebooks

పోయెను. కాని పరాభూతుఁ డయ్యెను. రోమకచక్రవర్తి యగు హానోరియస్‌తో ఈతఁడు సంధి చేసికొనెను. కాని చక్రవర్తి సంధిలోనివరతులను పాటింపనందున నీతఁడు రోముపట్టణమును ముట్టడించి ౪౧౦ లో దానిని దోచుకొనెను.

అలరిక్ (౪౮౪-౫౦౭) — విసిగాథుల యొకనిమిదవ రాజు. స్పెయినుదేశ మంతయు, ఫ్రాన్సుదేశములోని మధ్యభాగమును, దక్షిణభాగము చాలవఱకును ఈతనిరాజ్యములో చేరియుండెను. ఇతఁడు తెలివిగలవాఁడు, సహనశీలుఁడు. ఫ్రాంకులరాజైన క్లోవిస్ అనువాఁ డీతనిం జంపి ఈతనిరాజ్యముం దీసికొనెను.

అలరు — ఔడవ-ఔడవరాగము. ౩౭-వ మేళకర్త యగు సాలగ మనురాగముయొక్క జన్యము. ఆరోహణము - స గ మ ధ ని స; అవరోహణము - స ని ధ మ గ స యను సంచారము గలది.

**అలర్కుఁడు** — ౧. (చం. వం.) ఆయువుకులోత్పన్న కాశ్యవంశీయు దివోదాసుని ప్రతర్దనుఁ డను నామాంతరముగల పౌత్రుఁడు. కువలయాశ్వుని పెద్దకుమారుఁడు.

౨. ఒకరాజు. వంశము తెలియదు. తనమనస్సును వశపఱచుకొనునిమిత్తము దానిపై బాణములు వేయ, వది ప్రత్యక్షమై 'ఈబాణములు వేసిన నేను చావను. ఇందువలన నీకు నష్టమే కాని నాకు నష్టము లేదు; కావున నేను చావవలయు నన్న వేఱుబాణములు వేయుము' అని చెప్పెను. ఇతఁడు మదాలస యను బ్రహ్మనిష్ఠయొక్క కుమారుఁ డై యుండనోపు.

౩. ఒకరాజర్షి. ఇతఁ డంధ బ్రాహ్మణునకు తననేత్రము నిచ్చి ప్రసిద్ధికెక్కిన యొక మహానుభావుఁడు (వా. రా., అయోధ్యా, స. ౧౨).

అలవ — ఔడవ-ఔడవరాగము. ౪౨-వ మేళకర్త యగు రఘుప్రియ రాగజన్యము. ఆరోహణము - స గ మ ధ ని స; అవరోహణము - స ని ధ మ గ స యని సంచారము కలది.

అలవలపాడు — ౧. కడపజిల్లా పులివెందలతాలూకాలోని గ్రామము. జనసంఖ్య ౧,౫౭౯ (౧౯౩౧).

౨. నెల్లూరుజిల్లా దర్శితాలూకాకు చెందిన జమీందారీగ్రామము. జనసంఖ్య ౬౩౮ (౧౯౩౧).

౩. గుంటూరుజిల్లా ఒంగోలుతాలూకాలోని గ్రామము. జనసంఖ్య ౧,౪౫౪ (౧౯౩౧).

అలవాల — కర్నూలుజిల్లా పత్తికొండతాలూకాయందలి గ్రామము. జనులసంఖ్య ౧,౪౫౪ (౧౯౩౧).

అలసింగి — గంజాంజిల్లా పర్లాకిమిడితాలూకాయందలి ఏజెన్సీగ్రామము. జనసంఖ్య ౫౬౭ (౧౯౩౧).

అలహాబాద్ — ౧. దీని నిజమైన యుచ్చారణ ఇలహాబాద్. ఇంగ్లీషువారు దీనిని అలహాబాద్ అని వ్రాయుదురు. తురుష్కులు దీనిని ఇలహాబాద్ అందురు. మనవారు దీనిని 'ప్రయాగ' యందురు. దీనిసవిస్తరవర్ణనమునకై 'ఇలహాబాద్', 'ప్రయాగ' శబ్దములు చూడుఁడు.

౨. (భావల్‌పూర్) పంజాబులో భావల్‌పూర్ సంస్థానమునందు ఈపేరుగల తాలూకాకు ముఖ్యపట్టణము. జనసంఖ్య ౨,౮౬౮. భావల్‌పూర్ నవాబైన సాదిక్ మహమ్మద్ ఖాన్ అనువానిచే నీయది ౧౭౩౦ లో నిర్మింపఁబడెను. ఇచ్చట మ్యునిసిపాలిటీ కలదు.

అలాపుర్ — హైదరాబాదు రాష్ట్రములోని నిజాంరాజ్యమునం దొకపరగణా. ఒకకాలమున నిం దనేకదేవాలయములు విస్తారముగ నుండెడివి. వానిమూలమున పరగణా యభివృద్ధిని గాంచుటకవకాశము లేకుండెడిది. ఇప్పు డీమండలము మిగుల సారవంతమయినదిగ నున్నది. ఇందుండి హైదరాబాదునకు వన్నివిధాలకును ధాన్య మెగుమతి యగుచుండును.

అలాపురము — యునైటెడ్ ప్రావిన్సెస్‌లోని బులందిషహర్ జిల్లాయందలి యొక గ్రామము. ఇది అల్లాఉద్దీన్ ఆలంషాహ్ అనువానిచేఁ గట్టింపఁబడియె నందురు. ఇచ్చట ఔరంగజేబ్ ఒకమసీదు గట్టించెను. ఇచ్చట వారమునకు రెండుసారులు సంత జరగును.

అలాయుధుఁడు — ఒక రాక్షసుఁడు. ఇతనిరథమునకు నూఱశ్వము లుండెను. భారతయుద్ధమునందు నితఁడు ఘటోత్కచునిచే రాత్రియుద్ధమునఁ జచ్చెను.

అలార్కన్, పెడ్రో ఆంటోనియో డీ (౧౮౩౩-౯౧) — స్పెయిన్ దేశజుఁడు. నవలకారుఁడు. రాజకార్యనిపుణుఁడు. ప్రజాప్రతినిధిసభలో కేడిస్‌కు ప్రతినిధిగ నుండెను. రాయబారి మొదలైన పెక్కు ఉద్యోగములను జేసెను.

అలార్కన్, జువాన్ రూయిజ్ డీ (౧౫౮౧-౧౬౩౯) — స్పెనిషుభాషలో ఖ్యాతిఁ జెందినవాటకములను వ్రాసిన కవి. ఇతనినాటకములలో లా వెర్‌డాడ్ సోస్పెచోసా (La Verdad Sospechosa) అనునది మిక్కిలి ప్రసిద్ధము.

అలార్కన్, హెర్నాండో డె — స్పెయిన్ దేశజుఁడైన సముద్రనావికుఁడు. ఇతఁడు క్యాలిఫోర్ని యాద్వీపమును తిరిగివచ్చి అది దీవి కాదని ఋజువుచేసెను (౧౫౪౦).

**అలావర్‌పురము** — పంజాబునందలి జాలంధర్ జిల్లాలోని యొక గ్రామము. జనసంఖ్య ౪,౪౭౩. ఇచ్చట సూసీ, గబ్రూన్ అను బట్టలవర్తక మెక్కువ. ఇది ౧,౮౬౭ లో మ్యునిసిపాల్టీ చేయఁబడెను.

**అలాస్కా** — ఉత్తర-అమెరికాయం దత్యంత పశ్చిమోత్తరకోణమున నున్న ద్వీపకల్పమును, దాని నంటుకొని తూర్పు, పడమటిదిశలందుఁ జాలదూరమువఱకును వ్యాపించియున్న ద్వీపమాలికలను గలసి ఈ పేరునఁ బరఁగుచున్నవి. అలాస్కా, అల్యూషియన్ అలాస్కా, పాన్‌హాండిల్ అనునవి ఇందలిముఖ్య భాగములు. ౧౪౧-వ పశ్చిమాక్షాంశమునకుఁ బడమర బేరింగుజలసంధి వఱకును వ్యాపించియున్న స్థలభాగమును, బేరింగ్ జలసంధిలోని డియోమీడ్ ద్వీపపుపూర్వభాగమును, బేరింగుసముద్రములోని ద్వీపములును, అల్యూషియన్ ద్వీపములును, ముజాన్ అగ్రమునకుఁ దూర్పుగనున్న పోర్టులాండ్ కాలువపర్యంతము గల వెడల్పన ఉత్తరముగా చిల్‌కూట్‌కనుమువఱకును వ్యాపించియున్న ద్వీపసమూహమును ఈయలాస్కాయందుఁ జేరును. ౧౮౬౭ వఱకు నిది రషియా దేశముయొక్క అధీనమున నుండెను. ఆకాలమున నిది రషియన్-అమెరికా యనియుఁ బిలువఁబడుచుండెడిది. ద్వీపకల్ప మను అర్థము గల అలాస్కానామకరణము తరువాతఁ గలిగెను.

ఉత్తరమున ఆర్కిటిక్ మహాసాగరము, పడమట ఆర్కిటిక్ మహాసాగరము, బేరింగుజలసంధియు, దక్షిణమున అలాస్కాసింధుశాఖయు, పసిఫిక్ మహాసాగరమును, తూర్పున బ్రిటిష్ కొలంబియా, యూకాన్ ప్రాంతమును పరిహద్దులుగ నున్నవి. దీని వైశాల్యము ౫,౮౦,౮౮౪ లచదరపుమైళ్లు. జనసంఖ్య ౬౪ వేలకు పైగ నుండును. ప్రస్తుతపురాజధాని జూనివనగరము.


ఈదేశముయొక్క దక్షిణ, దక్షిణపూర్వదేశ మంతయు నక్రమై సమతల మనుమాట లేక నిట్టనిలువుగ నుండు పార్శ్వములతోఁ గూడియున్నది. ప్రధాన-అలాస్కాయందలి వాలు తూర్పున నుండి పశ్చిమమునకు. పడమటకుఁ బోయినకొలఁదియు నీరెత్తు తగ్గుచుఁ బోవును. ఉత్తరదిశయందలి తీరము అంత నిలువైన తటములుగలది కాదు. దక్షిణపూర్వమందలి పాన్‌హాండిల్‌నందు అలెగ్జాండర్ ద్వీపసమూహ మున్నది. దీనిలో పెద్దవి చిన్నవి కలసి మొత్తము ౧,౧౦౦ ల ద్వీపములవఱకును గలవు. అలాస్కాసింధుశాఖయందు కొడియక్ ద్వీపసమూహము గలదు. దీనికిఁ బశ్చిమోత్తరముగ అల్యూషియన్ ద్వీపమాలికయు, దానికిఁ బడమట బేరింగ్‌సాగరమున ప్రిబిలాఫ్, హోల్, మాథ్యూ, సెంట్‌లారెన్సు, నునివక్, డియోమేడ్ ద్వీపములును గలవు. ఈసమస్తద్వీపములయొక్క నానావృక్షసమాకీర్ణములైన శిఖరములను, నిలువునఁ జెక్కినగోడలవలె నుండు వీని పార్శ్వమును బరిశీలించి చూచినయెడల పూర్వ మిది యంతయు నొక మహోన్నత పర్వతప్రదేశముగ నుండి ప్రస్తుతము సముద్రమునందు మునిఁగిపోవ మునఁగక నిలిచినభాగము లన్నియు నిట్లు ద్వీపములుగ నేర్పడె నని విస్పష్ట మగును.

సెంట్ ఇలియాస్ అనుపర్వతశ్రేణి ఈదేశపు పూర్వభాగమం దున్నది. ఇందు చుగాచ్, కెనాయ్, స్కాలాయ్, నుత్‌జోటిన్ అను వేఱువేఱుపర్వతము లున్నవి. మఱియు నీపర్వతములలో క్రిల్లన్, ఫెయిర్‌వెదర్, వాంకోవర్ అను ప్రఖ్యాతశిఖరములును గలవు. మఱియు నిచటి రాంగల్ శిఖరము అగ్నిపర్వతము. సముద్రతీరమునకు కొంచెము దగ్గఱగ సెంట్ ఇలియాస్‌శిఖరము కలదు. ప్రధాన-అలాస్కాయందు అలాస్కా, అల్యూషియన్‌పర్వతశ్రేణులు వ్యాపించియున్నవి. వీనియం దొక డజనుకంటె నెక్కువ అగ్నిపర్వతములు గలవు. అది యటు లుండ నిరంతరము హిమాచ్ఛాదితములగు శిఖరములును ఈయలాస్కన్ శ్రేణియందుఁ గలవు. అందు ఫోరకర్, మెక్‌కిన్‌లేశృంగములు ముఖ్యమైనవి. ఈ రెండవశిఖరముయొక్క యెత్తు ౨౦,౩౦౦ల అడుగులు. ఉత్తర-అమెరికాయందలి శిఖరము లన్నింటిలో నిది యెత్తయినది. అల్యూషియన్‌ద్వీపసమూహము కేవలము అగ్నిపర్వతపదార్థములతోడ నేర్పడియున్నది.

అలెగ్జాండ్రియన్ ద్వీపసమూహమందు స్టికైన్, టకు, అలెస్క అను మూఁడు నదులు కలవు. పోర్ట్‌లాండ్, లిన్ అను పేరులుగల కాలువలు నిజమునకు సింధుశాఖలు. మఱియు నిచట హిమానీనదములు (Glaciers) పెక్కు లున్నవి. వానిలో మలస్పినా, మూర్, సీవార్డ్‌హిమనదములు ముఖ్యమైనవి. కాపర్ సుషీట్నా నామకనదులు అలాస్కా నుత్‌జోటిన్‌పర్వతములలోఁ బుట్టి, దక్షిణసముద్రమునఁ బడుచున్నవి. ఈ రెండునదులును ప్రవహించు లోయలు అతిమాల్యమును కలపకు ఉనికిపట్టులు.

ప్రధాన-అలాస్కా మధ్యభాగ మంతయు నొక పీఠభూమి. ౩,౦౦౦ మొదలుకొని ౫,౦౦౦ ల అడుగుల యెత్తువఱకును గలదు. యూకాన్ ఇందలి ముఖ్యనది. దీనిపొడుపు రెండువేలమైళ్లు. టనానా, కొయుకుక్ అనునవి దీని యుపనదులు. సర్కిల్‌సిటీ మొదలుకొని రాంపార్ట్‌వఱకును గల దీనితీరములు రెండుప్రక్కలఁ జాల దూరము వఱకును నీటిమయమై పోవును. యూకాన్‌నది కుత్తరమున తూర్పు పడమరలుగా ఎండికాట్‌పర్వతములు వ్యాపించియున్నవి. వీనికిని కెనడాదేశమందలి రాకీపర్వతములకును సంబంధము కలదు. ఇవి పడమటిభాగమున డిలాంగ్, బెర్డ్‌పర్వతము లనుపేర రెండుశాఖలుగఁ జీలిపోవును. ఎండికాట్‌పర్వతమాలకును, ఆర్కిటిక్ మహాసాగరమునకును మధ్య ౮౦ మైళ్లవెడల్పుగల అనక్‌టుక్‌సీతభూమి ఈకొండవరుసలకు సమాంతరముగ వ్యాపించియున్నది.

అలాస్కాయొక్క ప్రాకృతికస్థితి ననుసరించి యిందలి శీతోష్ణస్థితులును భిన్నభిన్నముగనే యుండును. దక్షిణభాగమున కుక్‌సింధుశాఖపర్యంతము సమశీతోష్ణము. ఇచటి మధ్యమతాపపరిమాణము ౫౪ మొదలు ౬౦ డిగ్రీలు. సముద్రతీరమందలి హిమానీనదములమీఁదను




పీచునట్టి బాష్పసంపూర్ణమగు వాయువు ప్రచండవర్షముగఁ బరిణమించి యాప్రాంత మంతయు నిరంతరము పొగమంచుతో నిండి యున్నట్లు గన్పడఁజేయుచుండును. సిట్కా నుండి క్లాండయిక్, అల్యూషియన్ పర్వతములవైపు పోయినచో మఱింత సమశీతోష్ణముగ నుండును. వారమునందు అయిదురోజులు కుంభవృష్టి గురియుచుండును. బేరింగ్ సాగర మంతయు సాధారణముగా నెల్లపుడును పొగమంచుతో నావరించికొనియుండును. ఉత్తరతీరమున వాన లంతగ కురియవు. శీతకాలమునఁ జలి భరింప నలవికాక యుండును. సెంట్-ఎలియాస్ శ్రేణులకుఁ దూర్పుప్రక్కను కాలమానము ౧౪ మొదలు ౯౨ డిగ్రీల వఱకు భిన్నభిన్న పరిమాణములలో నుండును. అలాస్కా మధ్యమందలి పీఠభూమిమీఁద వేసవికాలమున నత్యంతమగు వేఁడిమియు, చలికాలమున మిక్కుటమగు చలియు నుండును. యూకాన్ లోయలందును దానిలోఁ బ్రవహించు చిన్నచిన్న నదు లన్నియుఁ జలికాలమున గడ్డ కట్టిపోవును. నేల యంతయు హిమాచ్ఛాదిత మగును. అట్టి ప్రదేశము లందు మరల మేనెలలోఁగాని యేపని చేయుటకును వీ లుండదు. శీతకాలపుమధ్యభాగమున యూకాన్ నదియొక్క యూర్ధ్వప్రాంతము లందు సూర్యబింబము ఆకసముపైకిఁ గొంచెముగ లేచి ౪ లేక ౬ గంటలకాలముమాత్రము దర్శన మిచ్చి వెంటనే యస్తమించును. అటుగా నీస్వల్పకాలము సైతము గనుపడకపోవుటయుఁ గలదు. కాని యుత్తరాయణ మారంభమైనవెంటనే దినము లతిశీఘ్రముగ వృద్ధినొంద నారంభించి తుదకు మే, జూన్ నెలలందు సూర్యుఁడు ౧౮ లేక ౨౦ గంటలకాలము వెలుఁగుచుండుటయే కాక తక్కిన నాలుగు గంటలకాలముగూడ నొకవిధమగు ఉషఃకాంతి యంతటను బ్రసరించి యుండును. ఈసమయమునఁ బ్రకృతి యంతయుఁ బచ్చికతో నిండి మిక్కిలి మనోహరముగ నుండును. కాని యలాస్కాయందలి వేసవి నమ్మఁదగినది కాదు. ఒక్కొక్కప్పుడు జూలై నెలలో రాత్రులు అతిశీతలము లై యుండును. కొన్ని వేళల ఆగష్టుమాసపు మధ్యమందే మంచు గడ్డలు పడుట సంభవించును.

స్వేదజ, అండజ, జరాయుజములలో నిచట నసంఖ్యాకము లగు ప్రాణులు కన్పడుచున్నవి. సముద్రపుకోళ్లు, లేళ్లు - వీనివలన నిచటివారిజీవనము జరగుచుండును. రెయిన్ డీర్ అను పేరుగల లేడి ఇచటఁ జాలపనుల కుపయోగపడుచుండును. ఈజాతి యిచట నవసానదశను సమీపించియుండ దొరతనమువారు శ్రద్ధను వహించి సైబీరియా నుండి కొన్ని లేళ్లను దెప్పించి యలాస్కాయందు వృద్ధి నొందునుపాయములను గావించియున్నారు. ఆహారాదిపదార్థముల నొకచోట

sampath_Ebooks



నుండి వేఱొకచోటికిఁ గొనిపోవలయును నసిన మంచుచేఁ గప్పఁబడి యుండు నేలమీఁద రెయిన్ డీరులవలె సాయపడుజంతువులు వేఱొక విధముగునవి లేవు. కాని యీదేశముయొక్క యైశ్వర్యమునకు ముఖ్యకారణము చేఁపలు, ఉన్ని నుత్పాదనము చేయుజంతువులును. దక్షిణపూర్వపుకోణమునుండి బ్రిస్టల్ సింధుశాఖపర్యంతము (వ్యాపించియున్న) సముద్రతీర మంతయు, చేఁపలతో నిండియున్నది. హెర్రింగ్, కాడ్, సాల్మన్ అను పేరుల నొప్పుచేఁప లత్యంతముగఁ గలవు. తిమింగిలములు, దంతములకుఁ బనికివచ్చు వాల్రస్ లను జలచరములు, ఒత్తరులు, సీలులును అపరిమితములుగ నున్నవి.

సీలుజంతువులం దాఱువిధములగు వేఱువేఱుజాతులు కానవచ్చును. సముద్రసింహములు పర్యాప్త మగుసంఖ్యయందుఁ గలవు. ఫర్ (Fur) నామకకేశోత్పాదకజంతువులందు ౭ భిన్నజాతులున్నవి. పునుఁగుపిల్లులు సేబిలులు అని యివి వేఱువేఱు పేరులఁ బిలువఁబడుచుండును. మఱియు నైదుప్రకారములగు ఎలుఁగులు, బూడిదవర్ణపుతోఁడేళ్లు, అయిదురంగుల (నలుపు, ఎఱుపు, తెలుపు, నీలము, వెండిరంగులనొప్పు) నక్కలు క్రొత్తగఁ జూచువారికి మిగుల నానందమును గూర్చుచుండును.

దక్షిణపూర్వపుప్రాంతములందు- నానావిధములగువృక్షజాతులు పెంపొందును. దేవదారు, సాంబ్రాణి, భూర్జ, వేలసాదులు గాక యనేకారణ్యవృక్షము లింకను లెక్కకు మిక్కిలిగఁ గలవు. ఎచ్చటఁ బట్టినను గడ్డి పెరుఁగును కాని మంచు పడుటలోఁ దనే మాఁడిపోవును. అనుకూలమగు వాయువులు లేనికారణమున అల్యూషియన్ ద్వీపములందు బొత్తిగ వృక్షములు పెరుఁగవు. పచ్చికతో మాత్రము నిండియుండును. ఇచటినేల మంచి సారవంతమైనది. దక్షిణ-పూర్వమందలి ప్రాంతములలో ఒకలక్షచదరపుమైళ్ల వైశాల్యము గల భూమిమీఁద ముఖ్యమైనపంట లన్నియుఁ బండును. బేరింగు సముద్రతీరములందుఁ దక్క ఆర్కిటిక్ రేఖకు దక్షిణముగ నున్న నేల లన్నియు వ్యవసాయయోగ్యములే. పచ్చికగడ్డి పుష్కలముగ లభించుటవలన పశుపాలనము నిచ్చట బాగుగ జరగఁగలదు.

ఫర్ (Fur) నామకకేశముల నుత్పాదనము చేయుమృగముల కారణమునను, సీలుమత్స్యములవేఁటలవలనను నిచట విస్తారమగు వ్యాపారము జరుగుచుండెను. కాని కొన్నిసంవత్సరముల క్రిందటి వఱకు నీప్రాణులయొక్క అనావశ్యకమారణమువలన వానినాశనముతోపాటు దేశవాసుల నాశనముగూడ ప్రాప్తించు ననుభయముకలిగెను. అంత దొరతనమువారీజంతువుల వేఁటాడువిషయమున మంచి కట్టుఁబాట్లను గావించుటయేకాక బొత్తిగ జాతి నాశన మగు నని తోఁచిన జంతువులను సైబీరియా మొదలగు విదేశములనుండి తెప్పించి పాలించుచున్నారు. ఇట్లు గావించినవానిలో రెయిన్ డీరు ఒకటి.

ఈదేశమునందు ఖనిజములకును దక్కువలేదు. బంగారము, రాగి, వెండి, ప్లాటినము, పల్లాడియము, అంజనము, టంగస్టన్, పెట్రోలియం, సీసము, తగరము, గ్రాఫైట్, బారైట్, గంధకము, జిప్సము, పాలరాయి మున్నగునవి భూగర్భమునుండి లభించును. బొగ్గును పుష్కలముగఁ గలదు. కాని ఈపదార్థముల నన్నింటిని అవసరములగు స్థానములందుఁ జేర్చుటకుఁ దగిన వాహనాదిసౌకర్యములు లేవు. ఆకారణమున నీనిపరిశ్రమయు వెనుకఁబడియేయున్నది.

౧౮౯౮-వ సంవత్సరము మొదలుకొని పరదేశములతో వార్తాహరణసౌకర్యము లీదేశమునకుఁ గొన్ని కలిగెను. యునైటెడ్ స్టేట్సునుండి నియమపూర్వకముగఁ బ్రతివారము అలాస్కాకు టపాలు రవాణా యగుచుండును. ఆర్కిటిక్ రేఖ కుత్తరమం దున్న ప్రదేశములకును నిచటనుండి క్రమము దప్పక వార్త లేఁగుచుండును. దేశమందలి ముఖ్యపట్టణముల కన్నిటికిని మధ్య తంతిసంబంధము కలదు. అలాస్కాసింధుశాఖమీఁది సీవార్డ్ పట్టణము మొదలుకొని ఫెయిర్ బాంక్స్ నగరమువఱకును రైలుమార్గము నిర్మింపఁబడియున్నది. శాఖలతోపాటు ఈరైలుమార్గముపొడవు ౫౪౦ మైళ్లు. ౧౯౨౫-వ సంవత్సరమున విమానముల రాకపోకలకై ప్రయత్నములు జరిగెను. అంత నొకసంవత్సరము గడచునప్పటికి ౨౩ చోట్ల విమానవిశ్రమస్థానము లేర్పడినవి. సముద్రతీరములందలి పట్టణము లన్నింటికిని స్టీమరులు ప్రతిదినము వచ్చి పోవుచుండును.

ప్రస్తుత మిచటిజనసంఖ్య ౬౪,౩౫౬ మాత్రమే. ఇందు నూటికి ౪౫ మంది తెల్లవారు, ౪౬ గురు దేశీయులు, ఆగ్గురు చీనాజపానుదేశములకుఁ జెందినవారు. ఆసియాఖండవాసులు సాధారణముగ సాలమన్ చేఁపలను పట్టుకొనుటయందును, వానిని డబ్బాలలో నింపి పంపుకార్యములందును నెక్కువగ నియోగింపఁబడియున్నారు. ఇచటి అసలుదేశీయులలో నాలుగుభేదములు గలవు: (౧). ఎస్కిమోలు లేక ఇన్యుయిటులు; అల్యూషియనులును వీరికిఁ జెందినవారే, (౨). హెయిదాసులు లేక టింగిటనీలు; వీరు ముఖ్యముగ ప్రిన్స్ ఆఫ్ వేల్సుద్వీపమున వాసము చేయుచుందురు, (౩). కిల్లంకితులు వీరు అలెగ్జాండర్ ద్వీపసమూహమం దంతటను అక్కడక్కడ వ్యాపించియున్నారు, (౪). తెన్నెహులు లేక అథపస్కనులు. వీ రందఱిలో ఎస్కిమోలు దప్పఁ దక్కినజాతులవా రుత్తర-అమెరికాయందలి ఇండియనుల సంతతివా రని తెలియవచ్చినది. ఈసమస్తజాతులవారును తెల్లవారి యాచారవ్యవహారముల నవలంబించి క్రైస్తవమతమును స్వీకరించియున్నారు.

అలాస్కాయందలి కొన్నిపట్టణములపేర్లను జూచినయెడల మొట్టమొదట దీనిని గనిపట్టినవారు స్పెయినుదేశీయు లని స్పష్టమగును. కాని ఏకారణముచేతనో వా రిచట నిలుకడగ నివాసములఁ గుదుర్చుకొనియుండలేదు. రషియనులు సమీపమున నుండుటచేతను, అచటిశీతోష్ణస్థితులకు సహజముగ నలవాటుపడియున్నవా రగుటచేతను, నీదేశమునందు వాసము గుదుర్చుకొనిరి. ౧౭౨౮ లో విటస్ బేరింగ్ అనునతఁడు కొంతదూరమువఱకు నీ దేశము నన్వేషించి

sampath_Ebooks

పోయెను. అది మొదలుకొని యచటి జలసంధి యతనిపేర బేరింగ్ జలసంధి యని పిలువఁబడుచున్నది. ౧౭౪౧లో మరల నితఁడే యన్వేషణార్థము బయలుదేఱి కొంతవఱకును మనోభిలాషములను పూర్తిచేసికొనెను. కాని యీపర్యాయ మితఁ డపరిమితమైన చలివలన మృతినొందెను. తరువాత ౩౦ లేక ౩౫ సంవత్సరముల పర్యంతము రష్యనులే దీనిని స్వాధీనము చేసికొనియుండిరి. అటు పిమ్మట కుక్, వాంకోవర్, మెకంజీ లను ముగ్గు రాంగ్లేయులు దీనిని పరిశోధించిరి. ఈమధ్యకాలమున యూరోపియనులు కొంద ఱచట వాసములఁ నేర్పఱచుకొని నిరంకుశులై యచటి యాదిమనివాసు లగు ఎస్కిమోలు లోనగువారిపై నత్యాచారములఁ సలుపఁదొడఁగిరి. అంత వీరురంతముల నడఁచివేయవలయు నని రషియనులును, అమెరికనులును కలసి రషియన్ - అమెరికన్ కంపెనీ యనుపేర నొక సంఘమును స్థాపించికొనిరి. ఈకంపెనీవారు రషియా ప్రభుత్వమువారి యాజ్ఞను బొంది అలాస్కాయందలి వాణిజ్యవ్యాపారపరిపాలన కార్యముల నెఱవేర్చుకొనుచుండిరి. ఇట్లు చేయుటకై వీరికి రషియన్ దొరతనమువలననుండి ౨౦ యేండ్లవఱకును జెల్లునట్టి యొకచార్టరు (కౌలుపత్రము) దొరకుచుండెడిది. వీరు ఒక 'చార్టరు' గడువు ముగియుటతోడనే మఱియొక 'చార్టర్'ను దీసికొనుచుండిరి ఇట్లుండ ౧౮౨౧-వ సంవత్సరమున రషియను లన్యజాతులవారి నటకు రాకుండఁజేయవలయు నని ప్రయత్నించిరి. కాని వీరి మనోరథము కొనసాగకపోయెను. ౧౮౬౧-వ సంవత్సరమున పెనుకటి 'చార్టర్' పూర్తియగుటచే మఱియొకదానిని దీసికొనవలసి యుండెను. అదేతరుణమున నమెరికను లీభూమిని గొనవలె నని ప్రయత్నముచేసిరి కాని యంతఃకలహము లుప్పతిల్లుటచే నప్పటి కావిషయ మాఁగిపోయెను. తరువాత జాన్సన్ ప్రసిడెంటుగా నున్న కాలమున ౧౮౬౭-వ సంవత్సరము మార్చిలో నీసంగతి మరల ప్రస్తావమునకు వచ్చెను. అంత అక్టోబరు నెలలో దీని విక్రయము స్థిరపడిపోయెను.

అటుపిమ్మట బంగారపుగనులు, చేపలవేఁటలు, సీలుజంతువుల వ్యాపారము మున్నగువాని పరిపాలనవిషయమున కొన్ని పరివర్తనములు జరుగుచువచ్చెను. మద్యపాననిషేధమునకై యనేక ప్రయత్నములు సలుపఁబడినవి కాని యవి పూర్తిగ ఫలించి యుండలేదు. ప్రజలలో స్వయముగ నీతియొడల లక్ష్యము లేనిచో నెంత బలము గల, యెట్టిసభ్యతగల ప్రభుత్వమైనను స్వాభీష్టమును నెఱవేర్చుకొనఁజాలదు. ౧౯౦౬-వ సంవత్సరమున అలాస్కావాసులు స్టేట్స్ కాంగ్రెసునకు ఒక ప్రతినిధిని బంపునధికారమును బడసిరి. స్టేట్స్ ప్రభుత్వమువారి యధీనమున ఒకగవర్నరు గీదేశమును బాలించుచుండును. ఈతనకుఁ దోడ్పడుటకై ఒక 'లెజిస్లేటివ్ అసెంబ్లీ' కూడఁ గలదు. ఎనమండ్రు సెనేటర్లును, ౧౬ గురు ప్రతినిధులును ఈ యసెంబ్లీయందుఁ బని చేయుచుందురు. కాని ఈయసెంబ్లీవారు చేయు నియమములను; చట్టములను స్వీకరించుటకును, తిరస్కరించుటకును అధికారము యునైటెడ్ స్టేట్స్ కాంగ్రెసునకుఁ గలదు. మఱియు నిచటిపరిపాలనము రెండుసంఘములద్వారా జరుగుచున్నది: జాతీయసంస్థ (National Government); ప్రాంతికసంస్థ (Territorial Government). ఈ రెండుసంఘములద్వారా విద్యా, వ్యాపార, కృషి, శిల్పాది సమస్తకార్యములును నిర్వర్తింపఁబడుచుండును.

౧౮౯౬-వ సంవత్సరమువఱకు నలాస్కాయందలి మధ్యభాగమునుగుఱించి బొత్తిగఁ దెలియకుండెడిది. కాని యాసంవత్సరమున క్లోన్‌డైక్ ప్రాంతమునందు బంగారపుగనులు వెలువడుటచే నది మొదలుకొని యాప్రదేశము నంతను నన్వేషింప జనులకు ప్రోత్సాహము కలిగెను. తదాది సంయుక్తరాజ్యముల (United States) భూగర్భశోధకసమితియు, యుద్ధవిభాగమువారును ఈదేశమును బాగుగఁ బరిశోధించి యెక్కడెక్కడ నేయేపదార్థములు గలవో తెలిసికొని వెల్లడించిరి.

అముండ్‌సేన్ ఈదేశమునే ప్రధానస్థానముగ నేర్పఱుచుకొని ఉత్తరధ్రువసంచయాత్రలఁ గావించెను విల్‌కిన్స్ అను వైమానికుఁ డొకఁడు విమానములద్వారా చేసిన ధ్రువాన్వేషణముల కీదేశమందలి బారోపాయింటును ముఖ్యస్థానముగఁ బెట్టికొనెను.

౧౯౨౮-వ సంవత్సరమునం దీప్రదేశమునుండియే పెపలి విల్‌కిన్స్, ఎయిల్‌సన్ అనువారు ఆర్కిటిక్ ధ్రువము నష్టముగా విమానములతో దాఁటి సురక్షితముగ స్పిట్జ్‌బర్గన్ నగరమువఱకును బ్రయాణముల సలిపిరి.

**అలికాం** — గంజాంజిల్లా శ్రీకాకుళం తాలూకాలోని గ్రామము. ఇచటి జనసంఖ్య ౯౬౪ (౧౯౩౧).

**అలిగిలవాడ** — బళ్లారిజిల్లా హార్పనహళ్లి తాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౪౯౫ (౧౯౩౧).

**అలిగొండ** — గంజాంజిల్లా రామగిరి తాలూకాకు చెందిన యేజెన్సీగ్రామము. ౫౦౨ (౧౯౩౧).

**అలిదెన** — కడపజిల్లా కామలాపురముతాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౧,౦౫౪ (౧౯౩౧).

**అలిమిలి** — నెల్లూరుజిల్లా వెంకటగిరితాలూకాలోని జమీన్‌దారీగ్రామము. జనసంఖ్య ౬౩౯ (౧౯౩౧).

**అలిరెడ్డిపల్లె** — కడపజిల్లా పులివెందలతాలూకాయందలి గ్రామము. ఇందలి జనసంఖ్య ౬౦౫ (౧౯౩౧).

**అలివేరు** — తూర్పుగోదావరిజిల్లా పోలవరంతాలూకాయందలి యేజెన్సీగ్రామము. జనసంఖ్య ౬౮౬.

sampath_Ebooks



**అలివేలుమంగాపురము** — నెల్లూరుజిల్లా ఉదయగిరితాలూకాకు చెందిన ఈనాం గ్రామము. ఇందలి జనసంఖ్య ౧౬౨ (౧౯౩౧).

**అలీ** (క్రీ. శ. ౬౦౦ - ౬౬౧) — నాలుగవ ఖలీఫా, అబూతలిబ్ కుమారుడు. ఇతడు మహమ్మదు సాహెబ్ కూతురగు ఫతీమాను పెండ్లియాడెను. ఆమెయం దితనికి హాసన్, హుసేన్, మహాసిన్ అను ముగ్గురుకుమారులు కలిగిరి. ఒత్మాన్ పిమ్మట నితడు ౬౫౬ లో ఖలీఫాపదవి నందెను. మహమ్మదు భార్యయగు ఆయేషా యితని కాపదవి రాకుండజేయుటకు తీవ్రప్రయత్నము చేసి యితని నెదిరించెను. అలీ యామెను బస్రాయొద్ద జరిగిన యుద్ధమున ఖైదీగ బట్టుకొనెను. ఆయేషా యుష్ట్రవాహనయై యుద్ధముచేసిన కారణమున దీని కుష్ట్రయుద్ధమని పేరు కలిగెను. అలీ జీవితావశేషమంతయు నతనికి ప్రతిస్పర్ధిగ నేర్పడిన ఖలీఫా మోవియాతోడి సంతతయుద్ధము లందే కడచిపోయినది. ఇతని రాజధానియగు కూఫాయందు దీనిని ఇబ్న్ ముల్జాం అనునతడు విషదిగ్ధ మగు ఖడ్గముతో పొడిచి చంపెను. నెడ్ జెఫ్ నందున్న మెషెడ్ అలీ యను పేర బరగు నితని సమాధి ప్రసిద్ధికెక్కిన పుణ్యక్షేత్రమయి యాత్రాస్థల మయినది. ఇతని మరణానంతర మితడు గొప్పపండితుడని వార్త కెక్కెను. ఇతని యనుయాయులు షియా తెగమహమ్మదీయులు. ఫాతిమావంశీయులు తాము ఫతీమా - అలీసంతతివార మని చెప్పుకొందురు.

**అలీ ఆదిల్ షా** (ప్రథముడు) — విజాపురమును బరిపాలించిన సుల్తానులలో నొకడు; ఇబ్రాహిం ఆదిల్ షా కుమారుడు. ఇబ్రాహిం ఆదిల్ షాకు ఇస్మాయిల్, అలీ, అహమద్, తహమాస్ప అని నలుగురు కుమారులును, హిదాయత్ సుల్తానా, తసీబీబీ యను యిరువురు కూతులును గలిగిరి. కొడుకు లెవరి తరువాత నెవరు కలిగిరో స్పష్టము కాకపోయినను అలీకంటె ఇస్మాయిలే పెద్దవాడయినట్లు తెలియవచ్చుచున్నది. మొదటనుండియు ఇబ్రాహిమునకు, చులుకయినవాడును, తెలివితేటలుకలవాడు నయినను అలీ యన్న నయిష్టముగ నుండెడిది. ఇందులకు తండ్రికొడుకు లిరువురకు గలమతభేదములే కారణము. ఇబ్రాహిం సున్నీమతము నవలంబింప, కొడుకు అలీ షియామతావలంబి యయ్యెను. ఇందునుగురించి ఇబ్రాహిం కొడుకు నెంత మందలించినను తనతండ్రిమతమును వదలి యన్యమతమును స్వీకరించుట కతనికి యుక్తముగ దోచినప్పుడు తన యిచ్చవచ్చిన మతము నవలంబించుటకు తనకు నధికారము కల దని అలీ తండ్రికి జవా బిచ్చుచుండువాడు. ఈరీతిని తండ్రికొడుకు లిరువురకును పొరపులు జనించినవి. దీనికి దోడుగ దనయనంతరము సింహాసన మెక్కవలసిన ఇస్మాయిల్ మందుడు, నవివేకియు నయియుండెను. ప్రజాదృష్టిలో ఇస్మాయి లతని సోదరునికంటె తెలివి తక్కువవాడుగ గన్పించుట ఇబ్రాహిమున కిష్టము లేకపోయెను. ఈ కారణములవలన ఇబ్రాహిం తన రాజ్యకాలముననే అలీని మిరాజ్ దుర్గమున తొమ్మిదిసంవత్సరములకాలము ఖైదీగనుంచెను. అలీని తొలగించి అసద్ ఖాన్ లారీమనుమడయిన తహమాస్పను తన యనంతరమున సింహాసన మెక్కించుటకు ఇబ్రాహిం కొంతవరకు ప్రయత్నములు కావించినను విజాపురపు ఉమ్రావులును, సామంతులును అలీయందలి గౌరవాభిమానములచేత నట్టి ప్రయత్నములను విఫలము కావించినట్లు చెప్పుదురు. తుది కెట్లయిననేమి, కారాగారవిముక్తుడయి అలీ ఆదిల్ షాయే ౧౫౫౮ లో విజాపురపు సింహాసనము నధిష్ఠించెను. రాజ్యమునకు వచ్చినవెంటనే యాతని నభినందించుట కొక్క నిజాంషా తక్క ఇతరసుల్తానులు కానుకలతో తమ గౌరవప్రపత్తులను దెలుపుకొనుటకు దమతమరాయబారులను విజాపురమున కంపిరి.

సింహాసన మెక్కినవెంటనే అలీ ఆదిల్ షా తన రాజ్యమున సున్నీమతము నణచివైచి షియామతమును మరల ప్రవేశపెట్టి, తనపక్షమును బలపరచుకొనుటకు షియామతావలంబులను పెర్షియా మొదలగుదేశములనుండి తనరాజ్యమునకు రావలసినదని యాహ్వానించెను. ఇందుమీదట సున్నీమతావలంబు లాగ్రహావేశపరవశులై మతయుద్ధము ప్రకటింప నుద్యుక్తులైరి. రాజ్యమున నశాంతియు, సంక్షోభమును ప్రబలెను. కాని యాతరుణమున నతడు చాల వివేకముతో ప్రవర్తించి విచ్చలవిడిగ ధనమును వ్యయపరచి చాలమందిని లోబరచుకొనెను. తుదకతని న్యాయబుద్ధిచేత, ఔదార్యముచేత, దయచేతను విజాపురమునకు మూడుచుండినకీడు తొలగిపోయెను.

అలీ ఆదిల్ షా రాజ్యకాల మంతయు నొకవిధముగ నిజాంషాహతోడి యుద్ధములందే కడచిన దని చెప్పవచ్చును. అహమదునగరము సుల్తానయిన బుర్హాన్ నిజాంషామరణానంతరమున రాజ్యమునకు వచ్చిన హుసేన్ నిజాంషా తాను సింహాసన మెక్కినసంతనే జరపవలసిన గౌరవలాంఛనాదులు జరపలే దని అలీ ఆదిల్ షాకు మనస్సులో కొరకొరలాడుచునే యుండెను. అందువలన నతనిపై బగతీర్చుకొనవలె నని అలీ కృతనిశ్చయుడయ్యెను. ఇందుకు ముందుగ తనస్థితిని భద్రపరచుకొనుటకై విజయనగరమును బరిపాలించుచుండిన సదాశివరాయలతోను, అతనికి గార్యకర్తగ రాజకార్యములను జక్కబెట్టుచుండిన రామరాయలతోను స్నేహము కలిపికొని, దానిని ప్రోదిసేసెను. రామరాయలకుమారుడు చనిపోయినట్లు వార్త తెలిసినయంతనే అలీ ఆదిల్ షా యతనికి దనసానుభూతి నెఱిగించుటకయి విజయనగరమున కరిగి, యతని మన్ననలకు బాత్రుడయ్యెను. ఉభయపక్షములందు నొండొరులకు పారితోషికములు కురిసిపోయినవి. విజయనగరమున అలీ ఆదిల్ షా గౌరవార్థము వేడుకలు, విందులు జరిగినవి. విజయనగరమునుండి మరలి అలీ విజాపురమునకు వచ్చిన పిదప రామరాయల యాస్థానమునుండి ప్రతినిధులు విజాపురమున కరుదెంచి అలీ ఆదిల్ షాకు దమ గౌరవప్రపత్తులను దెలుపుకొనిరి. అలీ ఆదిల్ షాయొక్క అహమ్మదునగరదండయాత్రానాటకమున కిది పూర్వరంగము. ఇంతటనుండి అలీ ఆదిల్ షా అహమదునగరు

sampath_Ebooks

# అలీ ఆదిల్ షా

నిజాంషాహిసుల్తానులమీఁదికి దండెత్తి వెళ్లినప్పుడెల్ల రామరాయలే యతనికి బాసట.

రామరాయలతో నీవిధమున మైత్రి పాటించి యతని తోడ్పాటుతో నిజాంషాపై యుద్ధము ప్రకటించి రణభేరి మ్రోయించెను. అనతికాలముననే విజాపుర, విజయనగర సైన్యము లహమ్మదునగరరాజ్యమునఁ బ్రవేశించినవి. శత్రువును మార్కొనుట కష్టమని నిజాంషా దౌలతాబాదుదుర్గమునకు వెనుకంజవేసెను. అయిన నా సైన్యము లంతటితో నతనిని వదలక వెంబడించి తఱిమినవి. సాగిపోయినంత మేరయు విజయనగర సైన్యములు దేశమును కొల్లగొట్టి, పంటపైరులను విధ్వంసము కావించినవి. తమ సేనానివేశముల కుత్తమస్థానముల నన్నిటిని విజయనగరమువా రాక్రమించుకొనుటయే కాక విజాపురపు సేన లెన్నుకొనినయుత్తమస్థానములను గూడ, వానిని వెడలఁగొట్టి యాక్రమించుకొనుచువచ్చిరి. ఇవి యన్నియుఁ గనిపట్టుచుండిన అలీ ఆదిల్ షాకు హృదయము రగులుకొనిపోవుచుండెను. చేయునది లేక యప్పటికిమాత్ర మతఁ డేమియు ననక మిన్నకుండెను; కాని మనస్సునమాత్ర మది మఱచిపోలేదు. తుదకు కల్యాణిదుర్గము నిచ్చి నిజాంషా అలీ ఆదిల్ షాతో సంధి కావించుకొనెను. వచ్చినపని తీరి విజయనగర, విజాపుర సైన్యములు తమతమనగరములకు వెడలిపోయినవి.

నిజాంషా యీ యపజయమును మఱచినవాఁడు కాఁడు. అతఁడు తన సైన్యములను బలపఱుచుకొని మరల అలీ ఆదిల్ షాహతోడి పోరాటమునకుఁ దనస్థితిని కట్టుదిట్టముచేసికొనుటకు వ్యవధి చూచుకొనుచుండెను; తనకూఁతురు జమాల్ బీబీని కుతుబ్ షా కిచ్చి యతని మైత్రి సంపాదించెను. ఇది యంతయుఁ దెలిసి అలీ మరల రామరాజుసాయము నర్థించెను. అందుల కతఁ డెప్పుడును సర్వసిద్ధముగనే యుండెను. శత్రుపక్షములు రెంటికిని మరల సంగ్రామము సంఘటిల్లినది. ఇందుఁగూడ నిజాంషా పరాజయము నొంది పలాయితుఁ డయ్యెను. అహమదునగరు నిజాంషాహిసుల్తానుల కెంతో దర్పకారణములుగ నుండిన హరితకేతనములనుగూడ నిజాంషా యుద్ధరంగమున విడిపోవలసిన దుర్గతిపట్టినది. ఈకేతనములను నిజాంషాహి సుల్తానులు గుజరాత్ దేశపురాజులవలననుండి యుపాయనముగఁ బడసియుండిరి. వానిని చేపట్టి అలీ ఆదిల్ షా తన హరిద్రకేతనములను బరిత్యజించి విజయదర్పముతో నాబావుటాల నెగురవైచెను. అలీ ఆదిల్ షా సేనలను వీడ్కొని విజయనగరవాహిని తమరాజధాని కరుగుచు దారిలో పట్టణములను పాడొనరించి, దేశమును కొల్లగొట్టి, మసీదులను పాడుచేసి, అదివఱకు మహమ్మదీయులు హిందువులయెడలఁ గావించిన యత్యాచారములకుఁ బదుకసి తీరునట్లు మహమ్మదీయమతము నవమానించె నని చెప్పుదురు.

మరలిపోవుచు విజయనగర సైన్యము కావించిన యనుచిత కార్యము లన్నియు అలీ ఆదిల్ షాకుఁ దెలియవచ్చినవి. రామరాయల యౌద్ధత్యము, నత్కటగర్వమును అలీ ఆదిల్ షాకు దుస్సహమైనవి. నిజాంషా, కుతుబ్ షాల కదివఱకే రామరాయలచర్యలు దుర్భరములయి వారుకూడ నతనిమీఁదఁ బగ దీర్చుకొనఁ దరుణమున కెదురు చూచుచుండిరి. ఇప్పు డలీ ఆదిల్ షా తమప్రాఁతవైరమునుగూడఁ గట్టిపెట్టి విజయనగరమును గూల్ప తోడిసుల్తానులతో మైత్రి పాటింప సమకట్టెను. ఇందునిమిత్త మాదిల్ షా తనసోదరి హిదాయత్ సుల్తానాను నిజాంషా కుమారుఁడగు ముర్తజా కిచ్చి పరిణయము కావించెను. నిజాంషాకూడ తనకూఁతురు సుప్రసిద్ధురాలయిన చాంద్ బీబీని షోలాపురదుర్గముతోఁగూడ అలీ ఆదిల్ షా కిచ్చి తమస్నేహబంధమునకు వ్రేరి వోసెను. బీదరు అలీబరీదుకూడ నీసంఘమునఁ జేరెను. ఈసుల్తాను లందఱు తమతమ సేనలతో ౧౫౬౪ - వ డిసెంబరుమాసమున విజయనగరముపై జైత్రయాత్ర సాగించిరి. ఈవర్తమానము తెలిసి రామరాయలు సేనలను గూర్చుకొని కృష్ణానదీ దక్షిణతీరమున నున్న రక్కసతగిదిగొయ్యి శిబిరములు పన్ని రేవుల నన్నిటిని గాచుచు శత్రువులరాక కెదురు చూచుచుండెను. తుదకీయుభయుల బలములకు రక్కసతగిదియొద్ద నొకమహాఘోరసంగ్రామము ప్రవర్తిల్లినది (చూడుఁడు: రక్కసతగిదియుద్ధము) అందు విజయనగర సైన్యము లనేకములు త్రెళ్లినవి. రామరాయలు వధింపఁబడెను. విజయనగరసామ్రాజ్య మస్తమించినది. విజయులైన సుల్తానులు రణరంగమున కొన్ని దినముల వఱకు నాఁగి, పిదప విజయనగరమున కరిగి ఆనగరరాజమును కొన్ని నెలలపాటు దోచుకొని విధ్వంసముకావించిరి. జీవన్నగరముగ విజయనగరము కథావశేష మయినది.

ఈవిజయమువలన అలీ ఆదిల్ షాకు రాయచూరు, ముదుగల్లు దుర్గములు వశమయినవి. వానిని బలపఱిచి, తగిన దుర్గాధిపతుల యధీనమున నుంచి అలీ ఆదిల్ షా విజాపురమున కరిగి విజయనగరము దోఁపువలన దొరకినధనముతో విజాపురముచుట్టును గొప్ప ప్రాకారమును నిర్మించుటయే కాక దుర్గమునుగూడ కట్టుదిట్టపఱిచెను. అంతవఱకును రాజధానియందు సురక్షిత మయినభాగ మొకదుర్గమె. దానిచుట్టు, విజాపురపుసుల్తానుల ప్రథ హెచ్చినకొలఁదియు నొకగొప్పపట్టణము వెలసినది; కాని దానికి శత్రువులదాడినుండి తగినరక్షణ లేకయుండెను. ఈప్రాకారనిర్మాణము ౧౫౬౫ లో పూర్తి యయినది.

రామరాజపరాజయముతోఁ దనివిసనక అలీ ఆదిల్ షా ఇంకను దక్షిణరాజ్యములను సాధింప సైన్యముల నంపెను. నూతనరాజ్యసంపాదనమున ఆదిల్ షా మఱింత ప్రబలుఁ డగుచున్నాఁ డని యసూయ చెంది, అతఁ డింకను ప్రబలుఁడైనయెడల నతని నెదిరించి నిలుచుట కష్టమని రొంది నిజాంషా కుతుబ్ షానుగూడ నెట్లెట్లో లోఁబఱుచుకొని యతనితోఁ గలసి విజాపురముపై దండువెడలెను. కాని దక్షిణదేశవిజయమునకు సేనలను నడపించుకొనిపోయిన కిష్వారుఖాను ఆకస్మికముగ మరలివచ్చుటవలన వారి ప్రయత్నములు భగ్నము లయ్యెను. శత్రువులు చెల్లాచెదరైరి. నిజాంషా యప్పటికి వెనుకకు తగ్గినను శీఘ్రకాలముననే సైన్యములను గూర్చుకొని మరల విజాపురముపై యుద్ధము ప్రకటించెను. ఈయుద్ధమున కిష్వారుఖాను హతుఁ డయ్యెను. విజాపురపుసైన్యములు కాందిశీకము లైనవి.

sampath_Ebooks

అటుతరువాత ఆదిల్ షా పెనుగొండమీఁదఁగూడ దండెత్తెను కాని విజాపురమున కపజయమే కలిగినది. పోర్చుగీసువారి వశమునం దున్న గోవాదుర్గమును లోఁబఱచుకొనుతలంపుతో ఆదిల్ షా ౧,౦౦,౦౦౦ల సైనికులతోను, ౨,౧౪౦ల యేనుఁగులతోను వెళ్లి దానిని పదినెలలపాటు ముట్టడించెను. కాని తుదకు ప్రయోజనము లేకపోయెను; కాని యనతికాలముననే తోరగల్లు, ధార్వాడ, బంకాపురములను జయించి తన ప్రతిష్ఠను నిలుపుకొనెను.

క్రీ. శ. ౧౫౮౦ - వ సంవత్సరమున అలీ ఆదిల్ షా వధింపఁబడెను. విజాపుర ప్రాకారకుడ్యములు, గగనమహాలు, ఆనందమహాలు, జమీ మసీదు, చాంద్ బౌరీ యనునిర్మాణము లన్నియు నీతఁడు కట్టించినవి.

**అలీ ఆదిల్ షా** (ద్వితీయుఁడు) — విజాపురమును బరిపాలించిన సుల్తాను. మహమ్మదు ఆదిల్ షాకుమారుఁడు. మహమ్మదు ఆదిల్ షామరణానంతర మితఁడు ౧౬౫౬ లో విజాపురసింహాసనము నధిష్ఠించెను. మొగలాయిప్రభువులు విజాపురపు సుల్తానులతో నెట్టెటి సంధిషరతులను గావించుకొనుచువచ్చినను ఆరాజ్యమును సంపూర్ణముగ వశముగావించుకొని తమసామ్రాజ్యమునఁ గలుపుకొనుటకు తరుణమున కెదురుచూచుచుండిరి. ౧౬౫౭ - వ సంవత్సరపు సంధివలన విజాపురమునకు మొగలాయిచక్రవర్తులవలనియుపద్రవము తప్పినది. ఈయవకాశమును దీసికొని మహమ్మదు ఆదిల్ షా తనరాజ్యమును ప్రాక్పశ్చిమదక్షిణదిశల విస్తరింపఁజేసికొనెను. ౧౬౫౯ - వ సంవత్సరాంతమున దుస్సాధ్యమయిన దని పేరొందిన జింజీదుర్గముకూడ (దక్షిణార్కాటు మండలములోనిది) విజాపురమునకు వశమయినది. ఈవిధమున మహమ్మదు ఆదిల్ షా మరణించునాఁటికి విజాపురము గొప్ప భాగ్యవంతము లయినట్టియు, నధికారమహితము లయినట్టియు రాజ్యములలో నొక్కటి యయినది. మొగలాయిచక్రవర్తుల కీరాజ్యము కన్నెఱ్ఱగ నుండెను. మహమ్మదు ఆదిల్ షా సంధిషరతుల నెంతమాత్రము నతిక్రమింపక షాజహానుచక్రవర్తికి పరమవిధేయుఁడుగను, అతని పెద్ద కుమారుఁడగు దారాషికోకు విధేయమిత్రుఁడు నయి యుండుటచేత విజాపురపురాజకీయవ్యవహారములందు జోక్యము కలిగించుకొనుట కవకాశము లేకపోయెను. మహమ్మదుషా మరణానంతరము సింహాసన మెక్కిన అలీ ఆదిల్ షా పదునెనిమిదేండ్ల వయస్సుగల చిన్నవాఁడు. ఈకారణమున విజాపురమున మరల నంతఃకలహములు రేఁగినవి. అప్పటికి ఔరంగజేబునకు దారాపైఁగల వైరమున నతఁడు అతని మిత్రుఁడయిన అలీ ఆదిల్ షానుగూడ విరోధిగ నెంచి యతనిరాజ్యమును కబళింప నున్నగడ నున్నుచుండెను. మహమ్మదు ఆదిల్ షాకు పురుష సంతానము లే దనియు, అలీ ఆదిల్ షా మహమ్మదు ఔరసపుత్రుఁడు కాఁ డనియు, అందువలన నతనిని సరియైనవారసునిగ నంగీకరింపరా దనియు ఔరంగజేబు తండ్రియగు షాజహానుచక్రవర్తికి వ్రాసి విజాపురముపై దండెత్త నతని యనుమతిఁ బడసెను. పిదప గోలకొండ కుతుబ్ షాహి రాజ్యముపట్ల విద్రోహము కావించి మొగలాయీలతోఁ గలసిన మీర్ జుమ్లాతోఁగూడి ఔరంగజేబు విజాపురముపై దండెత్తి వచ్చెను. అప్పటికి విజాపురసైన్యమునఁ జాలభాగము చిన్న సంస్థానాధిపతులను తిరుగఁబాటు చేసినవారిని సాధింప దూరమున కర్ణాటదేశమునం దుండెను. అదియునుగాక రాజధానియందలి సైన్యములు యుద్ధమునకు సంసిద్ధమయి యుండలేదు. అయినను న్యాయ్యపద్ధతుల నవలంబించి యుండినచో ఔరంగజేబున కంతసుకరముగ విజయము లభింపకపోయియుండును. ఔరంగజేబు ఆదిల్ షాహిసుల్తాను కొలువునం దుండిన సేనాపతులు మొదలయిన యుద్యోగివర్గమును లంచ మిచ్చి తనవశము కావించుకొని అతిసుకరముగ బీదరు, కల్యాణిదుర్గములను సాధించెను. ఈవిజయములతో విజాపురపు ముట్టడికి త్రోవ దక్కఁబడినది. ఔరంగజేబు విజాపురపుముట్టడి నతితీవ్రముగ సాగించుచుండినకాలమున దారాషికోప్రేరణమున షాజహానునొద్దనుండి విజాపురయుద్ధము నాఁపవలసిన దని ఔరంగజేబున కాజ్ఞ వచ్చినది. దీనికితోడు ఔరంగజేబుపక్షపాతియు, షాజహానుకూఁతురు నగు రోషనారా గహస్యముగఁ దన సోదరునికి షాజహానుచక్రవర్తి వ్యాధిగ్రస్తుఁడయ్యెనని వర్తమాన మంపినది. ఒకవేళ చక్రవర్తి మరణించుటయే తటస్థించినచో సింహాసనమునకుఁ బ్రయత్నించుటకయి ఔరంగజేబు ఆకస్మికముగ యుద్ధ మాఁపి ముట్టడి లేపి, అలీ ఆదిల్ షాతో సంధి కావించుకొని, ఢిల్లీకి వెడలిపోయెను. ఈవర్తమానమే రాకపోయినచో ఔరంగజేబు విజాపురమును పూర్తిగ జయించి యారాజ్యమును ఢిల్లీసామ్రాజ్యమునఁ జేర్చియుండెడివాఁడే. కాని స్వతంత్రజీవనము గడపుట కింకను గొంతకాలము విజాపురమున కాయువుండెను. ఈసంధిప్రకారము ఆదిల్ షా గొప్ప నష్టపరిహారమునే కాక బీదరు, కల్యాణి, పరేందాలను, మఱికొన్ని యితరస్థలములను నొసంగుటకంగీకరించెను.

ఈవిధమున ఝంఝూమారుతమువలె వచ్చిన మొగలాయీదండయాత్ర యప్పటికిఁ గడచిపోయినది. ఇఁకఁ గొంతకాలము శాంతముగఁ గాలముఁ గడపవచ్చు నని యాలోచించుచుండిన ఆదిల్ షాకు మహారాష్ట్రులవలననుండి నూతనోపద్రవము సంభవించినది. ఒకస్వతంత్ర హిందూరాజ్యమును స్థాపింపవలె ననుకోరికతో అప్పటికే షాహాజీ కుమారుఁ డయినశివాజీ మహారాష్ట్రయువజనుల నందఱను జేరఁదీసి వారితోడ్పాటుతోఁ దనకార్యమును కొనసాగించుకొనుటకుఁ బ్రయత్నించుచుండెను. విజాపురమునకు మొగలాయీలయొత్తిడి కలుగుచుండినకాలమున దూరమున కొంకణదేశమునం దుండిన విజాపురరాజ్యమునకుఁ జెందినదుర్గముల నొక్కటొక్కటిగ శివాజీ వశపఱుచుకొనుచువచ్చెను. తుదకు సామంతదుర్గాధిపతులు విజాపురమునకుఁ బంపుచుండిన ధనమునుకూడ దోచుకొనెను. అంతటితో ఆదిల్ షా మేలుకాంచెను. వెంటనే శివాజీచర్యలను నిరోధించి యతనిని శిక్షించినఁగాని కార్యములే దని గొప్ప యనుభవశాలియైన అఫ్ జులు ఖానునినాయకత్వమున పదివేలసైన్యమును శివాజీపైకిఁ బంపెను. అంతటి గొప్పసైన్యమును బహిరంగముగ నెదుర్కొనుట కష్టమని

sampath_Ebooks

శివాజీ అఫ్జలుఖానునితో సంధిగాయుబారములు జరపెను. తత్కాలికముగ సంధిషరతులను నిర్ణయించుకొనుటకు అఫ్జలుఖాను, శివాజీలిరువురు నొంటరిగ ప్రతాపగడదుర్గముకడ సమావేశమగుటకు ఏర్పాటు జరిగెను. ఆయేకాంతసమావేశమున అఫ్జల్ ఖాను కుతంత్రమునకు దిగనుండెనని పసికట్టి వెంటనే శివాజీ యతనిని పెదపులిగోళ్లతోఁ బొడిచి చంపెను. అఫ్జలుఖాను వధింపఁబడినపిదప, చుట్టుప్రక్కల పర్వతారణ్యభూములందు డాగియుండినమహారాష్ట్ర సైన్యము వ్యాఘ్రముగ నొక్కమాఱు వెలువడి విజృంభించి అఫ్జలుఖాను సైన్యమునుఱుమాడెను. ఇట్లు చాలమాఱులు విజాపురమున కపజయములు కలిగినయనంతర మిఁకఁ జేయునది లేక, అలీ ఆదిల్ షా శివాజీతో సంధిచేసికొనెను. ఈసంధిప్రకారము అలీ ఆదిల్ షా శివాజీ కతఁడు జయించినదుర్గముల నన్నిటిని అతనికి స్థిరపఱిచెను. ఈవిధముగ కొంకణము అలీ ఆదిల్ షా హస్తచ్యుత మయినది.

శివాజీ యంతటఁ దనకుఁ గలిగినవిజయములతోఁ దృప్తినొందక మొగలాయిరాజ్యమునఁగూడ గోపును సాగించి పెక్కుగ్రామములను బాధించుటవలన మొగలాయిసైన్యములు రాజా జయసింగు నాయకత్వమున నతనిపై నడచినవి. మొగలుసైన్యములను జూచి వాని నెదిరించుట కార్యము గాదనుకొని శివాజీ మొగలులతో సంధి కావించుకొనెను. పిదప మొగలుసైన్యములను దీసికొని రాజా జయసింగు విజాపురమును ముట్టడించెను. కాని ఆదిల్ షా శత్రుసైన్యముల కాహారపదార్థములు దొరకకుండఁ జేయుటవలన జయసింగునకు విజాపురముముట్టడి లేపకతప్పినది కాదు. పరాజితుఁడై తన సైన్యములను దీసికొని జయసింగు ఔరంగాబాదునకు మరలిపోవుచుండ, ఆదిల్ షా గుఱ్ఱపుదళ మాతనిని వెంబడించి చాల నష్టము కలిగించెను. ఇటులయినప్పటికిఁగూడ విజాపురముపయి నెడపఁడడప మొగలులదాడి తప్పలేదు. విజాపురము ఢిల్లీకిఁ జెల్లింపవలసినకప్పము చాల బాకీపడెను. ఇప్పుడు ఢిల్లీ చక్రవర్తియైన ఔరంగజేబునకు విజాపురముపైఁ దఱచుగ దండెత్తుట కిది యొకసాకయ్యెను. అందువలన విసిగి, అలీ ఆదిల్ షా మొగలాయీలతో సంధి కావించుకొనెను. ఈ సంధివలన ఆదిల్ షా షోలాపురముతోఁగూడ విజాపురరాజ్యమునందలి దుర్గములనేకములను గోలుపోయెను. శివాజీ విజాపురరాజ్యముమీఁదఁ బడి చౌథాయిసూళ్లు వసూలు చేయుచుండుటవలన నీ యుపద్రవము తొలఁగించుకొనుటకయి ఆదిల్ షా మూఁడులక్షలరూప్యముల నొసంగి యతనితో రాజీపడెను.

మొగలాయీ, మహారాష్ట్రోపద్రవములవలననుండి యీగతిని తప్పించుకొనిన పిదప అలీఆదిల్ షా రాజ్యమును దన వజీరగు అబ్దుల్ మహమ్మదున కొప్పగించి, వ్యసనలంపటుఁ డయి, భోగప్రమత్తుఁ డయి తుదకు క్రీ. శ. ౧౬౭౨ లో కాలధర్మము నొందెను.

**అలీ ఇబ్రహీం ఖాన్ నవాబ్** — పాట్నానివాసి. వారన్ హేస్టింగ్సుకాలమునందు కాశీన్యాయస్థానమునందు ముఖ్యన్యాయాధిపతుఁడుగ నుండెను. ఇతఁడు హిందూస్థానీకవులచరిత్రమును గుల్జార్ - ఇ - ఇబ్రాహీం అను పేరిట వ్రాసెను. మఱి పెక్కుగ్రంథములను రచించెను. ౧౭౯౩ ప్రాంతమున మరణించెను.

**అలీ కులీ ఖాన్** — ఇతఁడు ఉజ్ బేగులవంశీయుఁడు. ఇతనికి ఖాన్ జామన్ అను వేఱొక పేరుగూడఁ గలదు. ఇది యొక బిరుదము. ఢిల్లీరాజ్యము పోయినతరువాత హుమాయూన్ అఫ్గానిస్థానమునఁ బ్రవేశించి యచట దండయాత్రల సలుపుచుండినసమయమున అలీకులీఖాన్ వతని సైన్యమునకుఁ బ్రధాననాయకుఁడుగ నుండెను. హుమాయూనునకుఁ బానిపట్టుయుద్ధములో జయము కలుగుటకును మరల ఢిల్లీ లభించుటకు నితఁడే ముఖ్యకారకుఁడు. ఇతఁడు రోహిల్ ఖండమునందు 'సంభాల్' అను జాగీరును బొంది యచటనే నివసించుచుండెను. బైరాంఖాను రాజప్రతినిధిగ నుండినకాలమున నితనికిని షేక్ మహమ్మదను మఱియొక ప్రముఖునకును వైరము సంభవించెను. ఈషేక్ మహమ్మద్ గూడ రాజ్యములో మంచి పేరుప్రతిష్ఠలు పలుకుబడి కలిగియుండెను. ఈషేక్ మహమ్మదునులవా సమసరించిరి యే కులీఖాన్ జౌనపురము, బేహారము మున్నగుప్రదేశములలోఁ దిరుగఁబాటు చేసినవారి నణఁచుటకుఁ బంపఁబడెను. ఇతఁ డాప్రదేశములను జయించి స్వాధీనము గావించుకొని వానిని బరిపాలించుచు స్వతంత్రుఁడైయుండి కొంతకాలమునకు దానుగూడ ఢిల్లీరాజ్యముపైఁ దిరుగఁబడెను. తత్కాలమున మాలవరాజ్యమును కులీఖాన్ వంశీయుఁడగు అబ్దుల్లా పాలించుచుండెను. ఇతఁడు ఢిల్లీ రాజ్యకోశమునకుఁ బంపవలసినద్రవ్యమును బంపక నిరోధించుటవలన నక్బరితని దేశమునుండి వెడలఁగొట్టెను. ఇతఁడు గుజరాతునకుఁ బాఱిపోవ నచటను నిలువ నీడ దొరకనందున జౌనపురమునకుఁ బోయి కులీఖాను నాశ్రయించెను. అతఁడు మొదలే యక్బరుతో వైరము బూనియున్నందున నితనికి వెంటనే సాయపడ వలసి వచ్చెను. కులీఖానుతమ్ముఁడైన బహదూరును, సికందర్ ఇబ్రాహీము లను నితనిసంబంధులు నీకుట్రలోఁ గలసిరి. శాంతముగ వీరల సమాధానపఱచుటకై యక్బరు తనమంత్రి నయోధ్యయందలి సికందరునొద్దకుఁ బంపెను. ఆతఁ డతని నిబ్రాహీంవద్దకుఁ గొంపోయెను. వీ రిరువురును గలసి జౌనపురమందలి కులీఖానుకడకుఁ గొంపోయిరి. అక్కడ వీరు మువ్వురును గలసి వచ్చినరాయబారిని బంధించిరి. అంత నక్బరు శీఘ్రముగ నీరాజద్రోహుల నడంపఁ దనసేనానియగు మునీంఖానుని ముందు పంపి యతనివెనువెంటఁ దానుగూడ వచ్చి శత్రువులఁ దాఁకెను. ఆసమయమున ఖాన్ జామనుయొక్క తల్లి యక్బరుపాదములపైఁ బడి ప్రార్థింప నతఁ డామెమనవి నంగీకరించి యెదురఁబాటు చేసినవారి నందఱను క్షమించి వారివారిరాజ్యములు వారి కిచ్చి వెడలిపోయెను. అక్బరు వెన్నుచూపినతోడనే వీరలు మరల నటులే కావించిరి. అంత క్రీ. శ. ౧౫౬౭ -వ సంవత్సరమున నక్బరు వీరల నందఱను మణిక్పురమునొద్దఁ గలసికొనెను. ఇరుపక్షములవారికిని ఘోరసంగ్రామ మైనది. అందులో బహదూర్ మొదట నోడిగఁ

పట్టుకొనఁబడి యనంతరము అమీరులచేఁ జంపఁబడెను. ఖానుజామునకు గాయము తగుల నొక యేనుఁగుకాళ్ల క్రిందఁ బడి మరణించెను. సికందరు పాఱిపోయెను. ఇట్లు హుమాయూనునకు కుడిభుజముగ నుండి యతని రాజ్యప్రాప్తికి హేతుభూతుఁడైన ఖాన్‌జామను అక్బరునకు ఘోరశత్రువై మరణించెను. అక్బరు ఖాన్‌జామన్, బహాదురుల శిరములలో మాది నెక్కించి వాని నాగ్రాకుఁ బంపెను.

**అలీగడ్** (జిల్లా) — యునైటెడ్ ప్రావిన్సెసలోని యొక జిల్లా. దీనికి వాయవ్యమున యమున, ఈశాన్యమున గంగ కలవు. వైశాల్యము ౧,౯౪౬ మైళ్లు. జనసంఖ్య ౧౦,౬౧,౭౮౫; వసూలు రు. ౨౨,౫౦,౦౦౦ లు; ఇందున్న ౩,౩౩౮ మహాల్లలో ౨,౧౯౯ జమీందారీ, ౮౭౬ భాయిచారా, ౬౬౯ పట్టీదారి అమరకపుపద్ధతుల మీఁద నీయఁబడినవి. ఇందుఁ గొన్ని తాలూకుదారీయెస్టేటులును కలవు. ఇందు నదులు విశేషముగ నున్నందున పంటలు సమృద్ధిగఁ బండును.

పూర్వచరిత్ర:— మొదట నీజిల్లాకు అలీగడ్ శివారైన కోయిల్ అను గ్రామము రాజధానిగ నుండెను. ఈజిల్లాలోని చాలభాగము రాజపుత్రులయధీనమం దుండెను. క్రీ. శ. ౧౧౯౪ లో దీనిని కుతుబుద్దీన్ పట్టుకొనెను, ఇచ్చటిపెక్కు ప్రజలను తురకలను జేసెను. ౧౭౫౭ లో సూరజమల్ జాటు వశపఱుచుకొనెను. ఇచ్చటనుండి మధుర, ఆగ్రా, ఢిల్లీ, రోహిల్‌ఖండ్ అనుస్థలములకు బాటలుండుటచే దీనికి యుద్ధసంబంధమైన ఘనత వచ్చెను. ౧౭౫౯ లో అఫ్గానులు జాటులను వెడలఁగొట్టిరి. తరువాత ౨౦ సంవత్సరముల వఱకు నీజిల్లా ఒకరిచేతనుండి మఱియొకరిచేతికిఁ బోవుచు ౧౭౮౪ లో సింధియాకు వశమయ్యెను. అచ్చట మరాఠావారు గొప్పసైన్యములఁ బ్రోగుచేసి ౨౦ సంవత్సరములవఱకును ఫ్రెంచిసేనానులచే తర్ఫీదు చేయించిరి. ౧౮౦౩ లో నిది యింగ్లీషువారి యధీన మయ్యెను. ౧౮౦౫, ౧౮౦౬, ౧౮౧౬ సంవత్సరములలో నిచ్చట జమీందార్లు తిరుగఁబడఁగా వారిని జయించి ప్రభుత్వమువారు వారికోటలను పడఁగొట్టించిరి. ౧౮౫౭ లో నీజిల్లా సిపాయీలతిరుగఁబాటువాయుకులకు వశమయ్యెను. జాట్‌వారు రాజపుత్రులు, తురకలు ఒకరితో నొకరు పోరాడి ప్రజలను మిక్కిలి బాధపెట్టిరి.

**అలీగడ్** (టోంకు) — రాజపుత్రస్థానములోని దగు టోంకుసంస్థానమందలి యొకపరగణా. వైశాల్యము ౧౫౭ చదరపు మైళ్లు. జనసంఖ్య ౧౭,౦౬౩. గ్రామములు ౫౬. వసూలు రు. ౩౬,౦౦౦. ౧౬౯౯ - ౧౭౮౪ వఱకు బుందీసంస్థానమువా రగు 'హార' శాఖ రాజపుత్రులు దీని నేలిరి. అప్పటనుండియు ౧౮-వ శతాబ్దియంతమువఱకు నిది ఒకప్పుడు హోల్కర్ చేతిలోను ఒకప్పుడు జయపురమువారిచేతిలోను ఉండెను. ౧౮౦౪ లో దీని నింగ్లీషువారు పట్టుకొనిరి. ౧౮౦౫ లో హోల్కరునకు ఇచ్చివేసిరి. ౧౮౧౮ లో హోల్కరు నోడించి బ్రిటిషుప్రభుత్వమువారు దీనిని స్వాధీనపఱుచుకొనిరి. ౧౮౧౯ లో అమీర్‌ఖానునకు దానపూర్వకముగ నిచ్చివేసిరి. ఇందలి సగభాగముకంటె నెక్కువ జాగీరుదారుల క్రింద నున్నది. ఇందు ౩౭ చదరపుమైళ్లు సాగుబడి, ౩ చదరపుమైళ్లు పల్లము.

**అలీగడ్** (పట్టణము) — యునైటెడ్ ప్రావిన్సెసులోని అలీగడ్ జిల్లాకు ముఖ్యపట్టణము. దీనికి పూర్వపుపేరు కోయిల్. జనసంఖ్య ౬౯,౯౬౩. వీరిలో నెక్కువమంది హిందువులు; మిగిలినవారిలో తురక లెక్కువ. మహమ్మదీయప్రభుత్వకాలమున నిది ఆగ్రాసుబాలో చేరిన ఒకసర్కారునకు ముఖ్యస్థలముగ నుండెను. లోడీల ప్రభుత్వకాలమున నిచ్చట మహమ్మదీయుఁడైన అధికారి యుండి, దీనికి మహమ్మద్‌గడ మని పేరుపెట్టెను. ఇట్లే ౧౭౧౭ లో దీనికి సాబిత్‌గడ మనునామము వచ్చెను. ౧౭౫౭ లో జాట్‌వారు దీనికి రామగడ మన్నపేరిడిరి. ఈస్థలమును జాట్‌వారియొద్దనుండి తీసికొన్న నజఫ్‌ఖాన్ దీనికి అలీగడ్ అన్నపేరు పెట్టెను. దీని నప్పుడప్పుడు స్వాధీనపఱుచుకొన్నవా రందఱును ఇచ్చటిదుర్గమును క్రమముగ బలపఱుచుచు వచ్చిరి. ఇది మరాఠావారియధీనమున నున్నప్పుడు, డి బోయిన్ (De Boigne), పెరాన్ (Perron) అను ఫ్రెంచి సేనాను లీదుర్గమును మరాఠావారినిమిత్తము మిక్కిలి బలపఱిచి దుర్భేద్యము గావించిరి. ఇచ్చట మిక్కిలి పురాతనములైన హిందూ, బౌద్ధదేవాలయములయవశేషములు భూమిలో దొరకును. ఇచ్చట ౧౮-వ శతాబ్దియందుఁ గట్టిన గొప్పమసీదొకటి గలదు. అలీగడమును, దానిశివారైన కోయిల్‌ను గలసి ౧౮౬౫ లో నొకమ్యునిసిపాలిటీగ నేర్పఱిచిరి. ఈపట్టణము కళాశాలలవిషయమున నభివృద్ధిని జెందుచున్నది. ఇచ్చట పోస్టల్ డిపార్టుమెంటువారికర్మాగార మొకటి గలదు; తాళములు చేయుమరలును, ప్రత్తిమరలును, పిండిమరలును చాల కలవు. ఈపట్టణము ముఖ్యముగ మహమ్మదీయులకొఱకు స్థాపింపఁబడిన ఉన్నతకళాశాలవలనఁ బ్రఖ్యాతిని జెందియున్నది. దీనిని సర్ సయ్యద్ అహమ్మదు అనునతఁడు మహమ్మదీయులవిద్యాభివృద్ధికై స్థాపించెను. ౧౯౨౦ లో నిది విశ్వవిద్యాలయగౌరవపదమును బడసినది. హిందూదేశమంతటనుండియు మహమ్మదీయవిద్యార్థు లిక్కడకు వచ్చెదరు.

**అలీపురపట్టణము** — బంగాళదేశమందలి ౨౪ పరగణా లనుజిల్లాకు ముఖ్యస్థలము. ఇది కలకత్తాపట్టణమునకు దక్షిణమువైపు శివారు; కలకత్తామ్యునిసిపాలిటీలో చేరియున్నది. పూర్వమిచ్చట బంగాళదేశపులెఫ్టినెంటుగవర్నరు ఉండెడివాఁడు. హైందవపటాలమున కిది యొకశిబిరము.

**అలీపురము** (గ్రామము) — బంగాళదేశము, జల్పాయిగుడి జిల్లాలోని అలీపురపు సబ్ డివిజన్‌కు ముఖ్యస్థలము. ఇది కుచ్‌బిహార్ స్టేట్ రైల్వేమీఁద నున్న మంచి వర్తకస్థలము. ఇచ్చట ప్రతిసంవత్సరమును ఫిబ్రవరినెలప్రాంతమున గొప్పసంత జరగును. అది ఒక నెలవఱకు నుండును. అది వ్యవసాయసంబంధమైన గొప్పప్రదర్శన మని చెప్పవచ్చును. మంచిసరకులు తెచ్చినవారికి బహుమతులు ముట్టును. 'నార్తరన్ బెంగాల్ మౌంటెడ్ రైఫిల్సు'నకు ఇది ముఖ్యస్థలము.

sampath_Ebooks

**అలీపురము** (సంస్థానము) — బుందేల్ ఖండ్ ఏజెన్సీలోని చిన్న సనదీసంస్థానము. వైశాల్యము ౭౩ చదరపుమైళ్లు. జనసంఖ్య ౧౪,౫౯౨. వసూలు రు. ౩౦,౦౦౦. ఇచ్చటి సంస్థానాధిపతికి దండనాధికారము (Criminal power) కలదు. ఇచ్చటిరాజు అగ్నికులరాజపుత్రులలోని పరిహారశాఖవాఁడు. వీరి మూలపురుషుఁడైన అచలసింగున కప్పటి పన్నారాజైన రాజా హిందూపత్ అను నతఁడు ౧౭౫౭ లో నీరాజ్యమొసంగెను. బుందేల్ ఖండమునకు బాందానవాబైన అలీబహాదుర్ అనునతఁడు ప్రభువైనప్పు డాతఁడీజాగీరుదారునకు సన్న దొసంగెను. అప్పు డీ సంస్థానపురాజు దివాన్ ప్రతాపసింహుఁ డనునతఁడు. అలీబహాదుర్ పేరిటనే ఈతఁడు తనరాజధానికి అలీపుర మని పేరుపెట్టెను. ౧౮౦౮ లో ఈస్టిండియా కంపెనీవా రీతనిహక్కు నొప్పుకొని సన్న దొసంగిరి. ప్రతాపసింహునకు నలుగురు పుత్రు లుండిరి. వారిలోఁ బెద్దవాఁడగు రావుపంచమ్ ౧౮౩౫ లో ప్రభుత్వమునకు వచ్చి రాజ్యమును నాలుగుభాగములుగఁ జేసెను. కాని ఈవిభాగములను కంపెనీవా రొప్పుకొనలేదు. ౧౮౫౭ లో దివాన్ హిందూపత్ అనునతఁడు రాజుగ నుండెను. ఆతఁడు సిపాయీల తిరుగఁబాటుకాలమున బ్రిటీషువారికి సాహాయ్యమొనర్చినందున వా రాతనికి రు. ౫,౦౦౦ ఖిల్లత్ బహుమతిచేసిరి. ఈసంస్థానాధీశ్వరు లిష్టమువచ్చినపిల్లవానిని దత్తత చేసికొనవచ్చునని ౧౮౬౨ లో వీరికి సన్నదు లొసంగఁబడెను. ఇప్పటిసంస్థానాధీశ్వరునిపేరు ఛత్రపతిసింగ్. ఈతనికి ౧౮౭౭ లో రావుబహద్దర్, ౧౮౭౭ లో సి. యస్. ఐ, ౧౯౦౩ లో రాజా అనుబిరుదు లొసంగఁబడెను. వీరికి వంశపరంపరగ 'రావు' అన్న బిరుదు గలదు.

ఈ సంస్థానమునకు ముఖ్యస్థలము అలీపుర మను గ్రామము. అచ్చటిజనసంఖ్య ౨,౪౯౩.

**అలీపురము** (సబ్ డివిజన్) — ౧. బంగాళదేశమండలి ౨౪ పరగణా లనఁబడుజిల్లాలోని యొక హెడ్ క్వార్టర్ సబ్ డివిజన్. విస్తీర్ణము ౧,౧౬౪ చదరపుమైళ్లు. ఇందు ౪౫౦ చదరపుమైళ్ల సుందరబన్ (సుందరవనము) అను అరణ్యము కలదు. జనసంఖ్య ౬,౭౧,౨౬౯. ఇందు ౧,౬౮౩ పల్లెలును, ౬ పట్టణములును కలవు.

౨. బంగాళదేశమండలి జల్ పైగుడి అనుజిల్లాలోని తూర్పువైపుది. వైశాల్యము ౧,౧౪౨ చదరపుమైళ్లు. జనసంఖ్య ౧,౧౯,౩౫౩. ఇందు ౧౭౮ పల్లెలును, ౧ మిలిటరీశిబిరమును కలవు. ఇది భూతాన్ దేశపురాజునొద్దనుండి తీసికొనఁబడియెను. ఇటీవల నిచ్చట తేయాకుతోఁటలు విస్తారముగ నభివృద్ధిని జెందుచున్నవి.

**అలీబరీదుషాహ** — బీదరును బరిపాలించిన సుల్తానులలో నొకఁడు. కాసింబరీదు మనుమఁడు. ఇతఁడు తన తండ్రిమరణానంతరము క్రీ. శ. ౧౫౪౯ లో సింహాసన మెక్కెను. బరీదువంశమున సాహబిరుదమును ధరించినవారిలో నితఁడే ప్రథముఁడు. ఇతని పితామహుఁ డగు కాసింబరీదు కిరీటాది రాజచిహ్నములనేకాని సాహ యను రాజబిరుదమును ధరించినవాఁడు కాఁడు. ఇతఁడు చాల నసమర్థుఁడు. ఈతని రాజ్యకాల మంతయు అహమదునగరు నిజాంసాహి సుల్తానులతోడి యుద్ధములందే కడచిపోయినది. నిజాంసాహి సుల్తానులతోడి మొదటియుద్ధమున అలీబరీదు పరాజయము నొందుటచేత నితనిరాజ్యమునఁ జాలభాగ మాసుల్తానుల వశమయినది. నిజాంసాహితోడి తరువాతియుద్ధమున ఆదిల్ సాహయొక్క తోడ్పాటువలన విజయమును గాంచినను బరీదునకు విశేషము ప్రయోజనము లేకపోయెను. ఈతఁడు నలువదిరెండేండ్లు రాజ్య మేలినట్లు చెప్పుదురు.

**అలీబహాదర్** — బాందాసంస్థానమునకు నవాబు. పూనా పేష్వా యైన మొదటిబాజీరావునకు మహమ్మదీయకుమారుఁడైన ౧-వ షంషేర్ బహాదురునకుఁ బెద్దకుమారుఁడు. ౧౭౯౦ లో నానా ఫడ్ నవీస్ ఈతనికి బుందేల్ ఖండ్ రాజ్యము పట్టముకట్టెను. ఈతఁడు తన తమ్ముఁడైన గాజీబహాదురును గొప్పసైన్యమును వెంటఁదీసికొని బుందేల్ ఖండముపై దాడి వెడలెను. నానాఅర్జున్ అనువానిని జంపి రాజా బఖ్తిసింగ్ అనువానిని చెఱఁబట్టి బాందారాజ్యమును పన్నారాజ్యమును వశపఱుచుకొనెను. ౧౨ సంవత్సరములు రాజ్యముచేసి ౧౮౦౨-వ ప్రాంతమున మరణించెను.

**అలీబహాదుర్ ఖాన్** — బాందాసంస్థానమునకు చివర నవాబు. జుల్ ఫికర్ అలీఖాన్ బహాదుర్ అనువాని కుమారుఁడు. ౧౮౫౭ లో నీతఁడు రాజద్రోహులతోఁ గలసె నన్న నెపముమీఁద బ్రిటిషు ప్రభుత్వమువా రీతనిని రాజ్యభ్రష్టునిఁ జేసి రాజ్యము తీసికొనిరి.

**అలీబాగ్** (పట్టణము) — బొంబయిరాజధానియందలి కొలాబాజిల్లాకును, అలీబాగ్ తాలూకాకును ముఖ్యస్థలము, రేవుస్థలము. బొంబాయికి దక్షిణమున ౧౯ మైళ్లమీఁద నుండును. జనసంఖ్య ౬,౦౫౫. సముద్రపుటొడ్డునుండి ఫర్లాంగుదూరమున సముద్రములో ఒక చిన్నరాతిదీవియు, దానిమీఁద కోటయుఁ గలవు. అది పూర్వము ఆంగ్రే (Angria) అనఁబడు మరాఠాసరదారుల కోట. ఈతఁడు మహారాష్ట్రులనావికాసైన్యమున కధిపతిగనుండెను. ఈరేవున ఎగుమతులు సుమారు రు ౬,౨౭,౦౦౦ విలువగలవియు, దిగుమతులు రు ౬,౬౧,౦౦౦ ల విలువగలవియు ప్రతిసంవత్సరము జరగును. ఇచ్చట ౧౮౬౪ లో మ్యునిసిపాలిటీ యేర్పడినది.

**అలీమర్దాన్ ఖాన్** — ఇతఁడు ఢిల్లీపాదుషా యగు షాజహానుయొక్క మిత్రుఁడు. షాజహాను రాజ్యమేలుచుండిన కాలమున నితఁడు పర్షియాప్రాంతమునకు గవర్నరుగనుండి కంధహారమునుగూడ నేలుచుండెను. కంధహారము మొదట మొంగలాయీల యధీనమం దుండెను కాని జహాంగీరుకాలమున దీనిని పర్షియనులు

sampath_Ebooks

గైకొనిరి. షాజహాను సింహాసన మెక్కినతరువాత నితఁడమూల్యము లగు బహుమతుల, ద్రవ్యసంచయముల నలీమర్దానునకుఁ బంపి యుతని సాహాయ్యమున కంగహారును మరలఁ దీసికొనెను. తరువాతఁ గొంత కాలమున కలీమర్దాను హిందూస్థానమునకు రాఁగా నొక గొప్పపదవి నొసంగి షాజహాను తనదగ్గఱ నుంచుకొనెను. లాహోరుపట్టణము నొద్దఁ బాఱుచున్న రావికాలువ అలీమర్దాను త్రవ్వించినదే.

అలీమస్జిద్ — వాయవ్యపు పొలిమేర పరగణాలోని ఖైబర్ కనుమలోనున్న ఒకపల్లె. ఇచ్చట కోట గలదు.

అలీమిర్జా — ఇతఁడు బాబరుయొక్క పితృవ్యుఁడు. తండ్రి గతించునప్పటికి బాబరు కేవలము ౧౨ ఏండ్లబాలుఁడు. ఆసమయమును గనిపట్టి అలీమిర్జా బాబరునకు సంబంధించిన ఫెర్ఘనా ప్రాంతమును ముట్టడించి తనయధీనము చేసికొనెను. ఇతఁ డెట్లు గావించినను బాబరుమాత్ర మితనిఁ దన జీవితములో నెక్కుడుగఁ బొగడియున్నాఁడు. అతని లేఖానుసార మితఁడు వ్యాయామశీలుఁడు. సామువిద్యలందు నేర్పరి. విద్యావంతుఁడు గాకపోయినను న్యాయవర్తి. ఇతనివంశీయులను జేసులసలహా ననుసరించుచుండువాఁడు. ముసల్మానుమతముపై నితని కమితభక్తి. ఖ్వాజాయుత్తరువు లేక యేకార్యమును జేయువాఁడు కాఁడు. చేసినవాగ్దానమును మఱవఁడు. యుద్ధమున వెన్ను జూపఁడు. ధనుర్విద్యానిపుణుఁడు.

అలీముబారక్ — బెంగాలుదేశము నేలిన నవాబు. క్రీ. శ. ౧౩౩౮-౯ సంవత్సరములో బంగాళదేశపు నవాబు చనిపోయినప్పుడు వెంటనే యతని కవచవాహకుఁ డొకఁడు ముబారక్‌షా యను పేరుతో తానే రాజు నని ప్రకటించెను. కాని యింతలో అలీముబారక్ అతనిని జంపి గౌర్‌లో రాజధాని నేర్పఱుచుకొని అలీషా అనుబిరుదుతో నవాబయ్యెను. ఆ కేండ్లపాటు రాజ్యమేలినపై నితనిని సవతితమ్ముఁ డగు హాజీ ఇలియాస్ అనునతఁడు బలవంతముగఁ జంపెను.

**అలీరాజ్‌పూర్** (సంస్థానము) — మధ్యహిందూదేశమందలి ఒక గ్యారంటీడ్ ప్రభుత్వము (Chiefship). ఇది భోపావర్ ఏజెన్సీలో చేరినది. విస్తీర్ణము ౮౩౬ చదరపు మైళ్లు; గ్రామములసంఖ్య ౩౦౭. జనసంఖ్య ౮౯,౩౬౪. వీరిలో భిల్లులు భిలాలులు అను ఆరణ్యకజాతివారెక్కువగఁ గలరు. ఈసంస్థానము ౫ పరగణాలుగ విభజింపఁబడినది. ఈ సంస్థానాధీశ్వరునకు శిక్షావిధానమునందు మొదటితరగతి మేజస్ట్రేటు అధికారము గలదు. వసూలు రు. ౧,౦౦,౦౦౦. వీరు ధార్ సంస్థానాధీశ్వరునకు సంవత్సరమునకు రు. ౮,౬౦౦ కప్పము కట్టవలయును. మాలవాభిల్లసైన్యము (Malwa Bhil corps) నకై బ్రిటిషుప్రభుత్వమువారికి రు. ౧,౨౭౧ ఇచ్చెదరు. సంస్థానమువారు ౭ ప్రాథమికహిందీపాఠశాలల నేర్పఱిచిరి.

జోధపురమురాజుల రాథోడ్‌వంశమందలి ఉదయదేవ్ లేక ఆనందదేవ్ అనువాఁ డొకఁడు తనదేశమును వదలి యిచ్చోట ౧౪౩౭ లో కోట గట్టెనట. ఉదయపురమువారు వీరిసంబంధము నొప్పుకొనరు. ఆనందదేవునకు ఖుగల్‌దేవ్, కేసర్‌దేవ్ అను మునిమనుమ లిద్దఱుండిరి. వారిలో మొదటివాఁడు అలీరాజ్‌పురమునకు రెండవవాఁడు జోబత్ సంస్థానమునకు నధిపతులైరి. ౧౮౧౮ లో రాణాప్రతాపసింగ్ అనునతఁ డిక్కడ రాజ్యము చేయుచుండెను. ఈతనికి ముసాఫిర్ మక్రాని అను తురక మంత్రిగ నుండెను. రాజు చనిపోయినప్పు డాతనిభార్య గర్భిణిగ నుండెను. ఆమెకు జస్వంత్‌సింగను కుమారుఁడు గలిగెను. వాఁడు ౧౮౬౨ లో చనిపోవుచు తన యిద్దఱుకుమారులకును రాజ్యము పంచిపెట్టుమని మృత్యుపత్రముల వ్రాసెను. కాని బ్రిటీషుప్రభుత్వమువారు దాని నొప్పుకొనక పెద్దకుమారుఁడైన గంగదేవునకు రాజ్యమిచ్చిరి. వాఁ డయోగ్యుఁ డని ౧౮౭౧ లో వానిని పదభ్రష్టునిఁ జేసి వాని తమ్ముఁడైన రూపదేవునకు రాజ్యమిచ్చిరి. వాఁ డపుత్రకుఁడై ౧౮౮౧ లో మరణము నొందెను. గవర్నమెంటువారు రాజ్యము స్వాధీనపఱుచుకొనక సోంద్వా ఠాకూర్ వంశమునుండి విజయసింహుఁ డనువానిని దెచ్చి గద్దె నెక్కించిరి. ఠాకూర్ చిత్‌సింగ్ అనువాఁడు తాను రాజ్యమునకు దగ్గఱివారసుఁడ నని కొందఱుభిల్లులను ప్రోగుచేసికొని అల్లరిచేయసాగెను. కాని మాల్వాభిల్లులసైన్యములసాయమునను, మధ్యహిందూస్థానపుగుఱ్ఱపుదళముల (Central India Horse) సాయమునను అతఁ డోడింపఁబడెను. విజయసింగ్ ౧౮౯౦ లో మృతుఁడయ్యెను. వానిజ్ఞాతియైన ప్రతాపసింగ్ అనువాఁ డిప్పుడు రాజ్యము చేయుచున్నవాఁడు. ఈరాజులకు రాణా అన్నపదవియు ౯ గుండ్ల గౌరవము గలదు.

**అలీవర్దీఖాన్** (౧౬౭౬-౧౭౫౬) — ఇతఁడు బెంగాల్, బీహార్, ఒరిస్సాలకు నవాబ్‌నజీము. తండ్రి పేరు మీర్జా మహమ్మద్. ఈతఁడు ఒరిస్సా గవర్నరైన నవాబ్‌షూజాఉద్దీన్‌యొక్క సేవానిగఁ బ్రవేశించెను. క్రీ. శ. ౧౭౨౬ లో జఫార్‌ఖాన్ చనిపోగా షూజాఉద్దీన్ నవాబ్‌నజీ మాయెను. అప్పుడు అలీవర్దీఖాన్ సామ్రాజ్యసైన్యమునకు జనరలుగ నియమింపఁబడెను; ౧౭౨౮ లో బీహారునకు గవర్నరుగఁ జేయఁబడెను; ౧౭౩౫ లో షూజాఉద్దీన్ చనిపోగా నాతనికుమారుఁడైన సరఫారజ్‌ఖాన్ రాజాయెను. ౧౭౪౦ లో అలీవర్దీఖాన్ సరఫారజ్‌ఖాన్‌తోఁ బోరాడి అతనిని జంపి నిజామతును స్వాధీనపఱుచుకొనెను. ఈతనిని బెంగాలులో ముహాబత్‌జంగ్ అని పిలిచెదరు. ౧౭౪౧ లో బెంగాలుపైకి మరాఠావారు దండెత్తి రాఁగా వారిసేనానియైన భాస్కర్‌పండితుని అలీవర్దీఖాన్ క్రూరముగఁ జంపెను. తుదకు మరాఠాదాడికిఁ దాళఁజాలక ౧౭౫౧ లో అలీవర్దీఖాన్ మరాఠావారికి, ఒరిస్సా యిచ్చుటకును సంవత్సరమునకు ౧౨ లక్షల రూపాయలు కప్పము కట్టుటకును ఒడంబడి, వారితో సంధి చేసికొనెను. ౧౭౪౨ లో మరాఠావారి వలననుండి సంరక్షించుకొనుటకు కందకము త్రవ్వకొనునిమిత్తము ఇంగ్లీషువారికి అలీవర్దీఖాన్ ఉత్తరువిచ్చెను. ౧౭౫౩ లో అలీవర్దీ

**అలీపురము** (సంస్థానము) — బుందేల్ ఖండ్ ఏజెన్సీ లోని చిన్న సనదీసంస్థానము. వైశాల్యము ౭౩ చదరపుమైళ్లు. జనసంఖ్య ౧౪,౫౯౨. వసూలు రు. ౩౦,౦౦౦. ఇచ్చటి సంస్థానాధిపతికి దండనాధికారము (Criminal power) కలదు. ఇచ్చటిరాజు అగ్నికులరాజపుత్రులలోని పరిహారశాఖవాఁడు. వీరి మూలపురుషుఁడైన అచలసింగున కప్పటి పన్నారాజైన రాజా హిందూపత్ అనునతఁడు ౧౭౫౭ లో నీరాజ్య మొసంగెను. బుందేల్ ఖండమునకు బాందానవాబైన అలీబహాదుర్ అనునతఁడు ప్రభు వైనప్పు డాతఁడీజాగీరుదారునకు సన్న దొసంగెను. అప్పు డీ సంస్థానపురాజు దివాన్ ప్రతాపసింహుఁ డనునతఁడు. అలీబహాదుర్ పేరిట నీ ఈతఁడు తనరాజధానికి అలీపుర మని పేరుపెట్టెను. ౧౮౦౮ లో ఈస్టిండియా కంపెనీవా రీతనిహక్కు నొప్పుకొని సన్న దొసంగిరి. ప్రతాపసింహునకు నలుగురు పుత్త్రు లుండిరి. వారిలోఁ బెద్దవాఁ డను రావుపంచమ్ ౧౮౩౫ లో ప్రభుత్వమునకు వచ్చి రాజ్యమును నాలుగుభాగములుగఁ జేసెను. కాని ఈవిభాగములను కంపెనీవారలబలము వ్యర్థముగ ౧౮౫౭ లో దివాన్ హిందూపత్ బాలక పాజీపోయిరి.

అతఁడు సిపాయీల తిరుగు బాటులో ఖుంద్రీయుద్ధమునుగూర్చి పంజాబులో మొనర్చినందున్నతానుచుందురు. నాఁటియాహవమునందు మరణించిన ఈస్నైన్యస్మరణచిహ్నముగ నెలకొల్పఁబడిన పెద్దస్తంభ మొకటి నేఁటికిని గలదు (ఖుంద్రీవగ్గఱ ?).

**అలుగుమల్లిపాడు** — గుంటూరుజిల్లా పల్నాడు తాలూకాలోని ఈనామగ్రామము. ఇచటిజనసంఖ్య ౨౬౨ (౧౯౩౧).

**అలుగుమానిపల్లె** — చిత్తూరుజిల్లా కుప్పముతాలూకాయందలి జమీన్ దారీగ్రామము. జనసంఖ్య ౯౭ (౧౯౩౧).

**అలుగోలు** — విశాఖపట్టణముజిల్లా విజయనగరము తాలూకాయందలి జమీన్ దారీగ్రామము. ఇందలిజనసంఖ్య ౨,౦౬౭ (౧౯౩౧).

**అలుదు** — గంజాంజిల్లా పర్లాకిమిడి తాలూకాయందలి జమీన్ దారీగ్రామము. ఇచటిజనసంఖ్య ౧,౦౬౭ (౧౯౩౧).

**అలెక్సియస్, కామ్నెనస్** (౧౦౪౮-౧౧౧౮) — బిజన్ టైన్ చక్రవర్తులలో మిక్కిలి సామర్థ్యముగలవాఁడు. ౧౦౮౧ లో సింహాసన మెక్కెను. ఇతని రాజ్యమునకు పెక్కు దిక్కులనుండి పెక్కుమంది శత్రువులు బాధ కలిగించుచున్నను, ౩౭ సంవత్సరముల ప్రభుత్వకాలమం దీతఁడు తన ఆదాయమును చక్కఁబఱచుకొని సైన్యములను బాగుపఱచి తనసామ్రాజ్యము నభివృద్ధి చేసికొనెను.

**అలెక్సియస్ పిట్రోవిచ్** (౧౬౯౦-౧౭౧౮) — పిటర్ ది-గ్రేట్ యొక్క పెద్దకుమారుఁడు. తండ్రిసంస్కరణములకు మున సాహాబిరుదమును గ్రహించినవారిలో నితఁడే ప్రథముఁడు. ఇతని పితామహుఁ డగు కాసింబరీదు కిరీటాది రాజచిహ్నములనేకాని షాహ యను రాజబిరుదమును గ్రహించినవాఁడు కాఁడు. ఇతఁడు చాల నసమర్థుఁడు. ఈతని రాజ్యకాల మంతయు అహమదునగరు నిజాంషాహి సుల్తానులతోడి యుద్ధములందే గడచిపోయినది. నిజాంషాహి సుల్తానులతోడి మొదటి యుద్ధమున అలీబరీదు పరాజయము నొందుటచేత నితనిరాజ్యమునఁ జాలభాగ మాసుల్తానుల వశమయినది. నిజాంషాహితోడి తరువాతి యుద్ధమున ఆదిల్ షాహయొక్క తోడ్పాటువలన విజయమును గాంచినను బరీదునకు విశేషము ప్రయోజనము లేకపోయెను. ఈతఁడు నలుబదిరెండేండ్లు రాజ్య మేలినట్లు చెప్పుదురు.

**అలీబహాదర్** — బాందాసంస్థానమునకు నవాబు. పూనాపేష్వా యైన మొదటిబాజీరావునకు మహమ్మదీయకుమారుఁడైన ౧-వ షంషేర్ బహాదురునకుఁ బెద్దకుమారుఁడు. ౧౭౯౦ లో నానా ఫడ్నవీస్ [illegible] సంస్థా[illegible] [illegible]చెను. ఈతఁడు రెండవ ఫిలిప్పుయొక్క కుమారుఁడు, జగజ్జేత. అప్పుడు తెలిసినంత ప్రపంచము నంతయు గెలిచినవాఁడు. కొన్ని యేండ్లవఱకును (౩౪౩-౩౬) తత్త్వవేత్తయైన అరిస్టాటలునొద్ద విద్యాభ్యాసము చేసెను. ఇరువదిసంవత్సరములవయస్సువచ్చినప్పుడు (౩౩౬) తండ్రి పోఁగా రాజయ్యెను. గ్రీసుదేశమందలి యితరరాజ్యముల నన్నింటిని వశపఱుచుకొనెను. పారసీకదేశముమీఁదికి దండెత్తిపోయి యచ్చట పెక్కురుశత్రువుల నోడించెను (౩౩౫, మే). ఫోయినిషియా, టైర్, గాజాపట్టణములను, ఈజిప్టును వశపఱుచుకొనెను (౩౩౨). పారసీకచక్రవర్తియైన దారా (డెరయస్)ను ౩౩౧-వ సంవత్సరము సెప్టెంబరునెలలోఁ బూర్తిగఁ బరాభవించెను. అంత బ్యాబిలోన్; సూసాదేశములు వశ మయ్యెను. పారసీకదేశమునకుఁ బురాతనరాజధానియైన పెర్సిపొలిస్ పట్టణమును దోచుకొని ౪౫ కోట్లధనమును సంగ్రహించెను. పారసీకచక్రవర్తి మోసగానిచేఁ జంపఁబడఁగా (౩౩౦, మే), అలెగ్జాండరు పారసీకమున కంతకును రా జయ్యెను. అఫ్ గానిస్తానము, బెలూచిస్తానములను ఆక్రమించెను (౩౨౯). హిందూకుశ పర్వతములను దాఁటి బ్యాక్ట్రియాలోనికిఁ బోయెను.

ఖైబర్ కనుమలోనుండి హిందూదేశమునకు వచ్చి ౩౨౬ లో సింధునది దాఁటి హైడాస్పస్ (సట్ లజ్) నదియొద్దను కూడునగు పోరసురాజు నోడించెను. అచ్చటనుండి హిఫాసిస్ (బియాస్) నది యొద్దువఱకును వచ్చెను. అచ్చట నతనిసైన్యములు ముందునకు వెళ్లమని తిరుగఁబాటు చేసినందున అతఁడు మరలి సింధునదీముఖమునొద్ద పడవలలో సముద్రముం జేరెను. ఆమార్గముగ బెలూచిస్తానమునకుఁ బోయి ౩౨౪ మేలో సూసాకుఁ జేరెను. అతఁడు హిందూదేశమునందు రమారమి ౩ సంవత్సరము లుండె నని చెప్పవచ్చును. అతఁడు హిందూకుశపర్వతమును దాఁటినది ౩౨౭-వ సంవత్సరమున. ౯ నెల లాతఁడు సింధునదికి తూర్పుభాగమం దుండెను. సూసాలో నాతఁ డిద్దఱు పారసీకకన్యలను వివాహమాడెను. గ్రీకువారికిని పారసీ

sampath_Ebooks

గైకొనిరి. షాజహాను సింహాసన మెక్కినతరువాత నితఁడనూల్యము లగు బహుమతుల, ద్రవ్యసంచయముల నలీమర్దానునకుఁ బంపి యతని సాహాయ్యమున కంగహారము మరలఁ దీసికొనెను. తరువాతఁ గొంత కాలమున కలీమర్దాను హిందూస్థానమునకు రాఁగా నొక గొప్పపదవి నొసంగి షాజహాను తనదగ్గఱ నుంచుకొనెను. లాహోరుపట్టణము నొద్దఁ బాఱుచున్న రావికాలువ అలీమర్దాను త్రవ్వించినదే.

**అలీమస్జిద్** — వాయవ్యపు పొలిమేర పరగణాలోని ఖైబర్ కనుమలోనున్న ఒకపల్లె. ఇచ్చట కోట గలదు.

**అలీమిర్జా** — ఇతఁడు బాబరుయొక్క పితృవ్యుఁడు. తండ్రి గతించునప్పటికి బాబరు కేవలము ౧౨ ఏండ్లబాలుఁడు. ఆసమయమును గనిపట్టి అలీమిర్జా బాబరునకు సంబంధించిన ఫర్ఘనా ప్రాంతమును ముట్టడించి తనయధీనము చేసికొనెను. ఇతఁ డెట్లు గావించినను బాబరుమాత్ర, మితనిఁ దన జీవితములో నెక్కడగాఁ [illegible] కొనవచ్చుచున్న[illegible] లో సికందర్ రూపమే వాడెదరు.

**అలెగ్జాండరు, అఫ్రొడిసియస్** — ఈతఁడు క్రీ. శ. ౨-వ శతాబ్దివాఁడు. ఈతనిని ౨-వ అరిస్టాటల్ అనియెదరు. ఈతఁడు ఏథెన్సుపట్టణమునందలి లీసియమ్ అనువిద్యాపీఠమునకు క్రీ. శ. ౨౦౦ లో మహామహోపాధ్యాయుఁడుగ నుండెను. అరిస్టాటలు గ్రంథములపై భాష్యములను వ్రాసెను. తత్త్వజ్ఞానమును స్వతంత్రగ్రంథములనుగూడ రచించెను.

**అలెగ్జాండరు, జాన్** (౧౮౬౦ - ౧౮౭౩) — రొమేనియాదేశపురాజపుత్త్రుఁడు. ౧౮౪౮ లో టర్కీకి వ్యతిరిక్తముగ జాతీయవాదులతోఁ గలసెను. ౧౮౫౯ లో మాల్డేవియా, వలాఛియా ప్రాంతములకు హోస్పొదారుగ నెన్నుకొనఁబడెను. కాని టర్కీవా రాతనిని ౧౮౭౧ వఱకు నధికారిగ నొప్పుకొనలేదు. చాల కాలమువఱకును లోకప్రియుఁడుగ నున్నను చివర కన్నికక్షులవారును అతనికి వ్యతిరేకము కాఁగ ౧౮౬౬ లో అతఁడు తన యధికారమును వదలుకొనెను.

**అలెగ్జాండరు, నెవ్స్కీ** (౧౨౧౯-౧౨౬౩) — రష్యా రాజవంశములోనివాఁడు. తార్తారులు రష్యాదేశముమీఁదికి దక్షిణమునుండియు, స్వీడన్, డెన్మార్కు, లొథీనియా దేశముల వాండ్రు ఉత్తరమునుండియు దండెత్తి రాఁగా ఈతఁడు వారిని నెవానదియొద్ద ౧౨౪౦ లో చెల్లాచెదరు చేసెను. అందువలన నితనికి నెవ్స్కీ అన్న బిరుదు వచ్చెను. ౪-వ ఇన్నొసెంట్ అనుపోపు పూర్వపశ్చిమ క్రైస్తవమత సంప్రదాయములను కలుపవలయునని ప్రయత్నము చేయఁగా నితఁడా ప్రయత్నము నెదిరించెను. ఈతఁడు జీవించియుండఁగా ప్రజ లితనిని మిక్కిలి గౌరవించుచుండిరి; చనిపోయినతరువాత దేవునిగ భావించిరి. ఈతనిగౌరవార్థము ౧౭౧౦ లో

౧౪౩౭ లో కోట కట్టెనట. ఉదయపురమువారు వీరిసంబంధము నొప్పుకొనరు. ఆనందదేవునకు బుగల్దేవ్, కేసర్దేవ్ అను మునిమనుమ లిద్దఱుండిరి. వారిలో మొదటివాఁడు అలీరాజ్పురమునకు రెండవవాఁడు జోబత్ సంస్థానమునకు నధిపతులైరి. ౧౮౧౮ లో రాణా ప్రతాపసింగ్ అనునతఁ డిక్కడ రాజ్యము చేయుచుండెను. ఈతనికి ముసాఫర్ మక్రాని అను తురక మంత్రిగ నుండెను. రాజు చనిపోయినప్పు డాతనిభార్య గర్భిణిగ నుండెను. ఆమెకు జస్వంత్సింగనుకుమారుఁడు గలిగెను. వాఁడు ౧౮౬౨ లో చనిపోవుచు తన యిద్దఱుకుమారులకును రాజ్యము పంచిపెట్టుమని మృత్యుపత్రముల వ్రాసెను. కాని బ్రిటిషుప్రభుత్వమువారు దాని నొప్పుకొనక పెద్దకుమారుఁడైన గంగదేవునకు రాజ్య మిచ్చిరి. వాఁడు దుర్మార్గుఁడని ౧౮౭౧ లో వానిని పదభ్రష్టునిఁ జేసి వాని తమ్ముఁడైన రూపదేవునకు రాజ్య మిచ్చిరి. వాఁ డపుత్త్రకుఁడై ౧౮౮౨ లో మరణము నొందెను. గవర్నమెంటువారు రాజ్యము స్వాధీనపఱుచుకొనక సోంద్వా ఠాకూర్ వంశమునందలి విజయసింహుఁ డనువానిని దెచ్చి గద్దె (౧౧౫౯-౮౧). యీ[illegible]సింగ్ అనువాఁడు తాను రాజ్యమునకు ( Middle ages )నం దీస్థానము నెలవును ప్రాపుచేసికొని అల్లరిచేయ జెంపినవాఁడు. ౧౧౫౯ లో పోపుపదవి [illegible]నను, మధ్యహిందూ ఫ్రెడరిక్ బర్బరోస్సా అను చక్రవర్తితోఁ [illegible]ను ౧౧౭౭ లో ఆతనిచే వేనిస్ సంధిమీఁద సంతకము చేయించెను. అందువలన ఇటలీదేశపు 'స్వాతంత్ర్య రక్షకుఁ' డన్న బిరుదము వహించెను: థామస్ బెకెట్ అనుమతాచార్యుని చంపినందునకై ఇంగ్లండుదేశపురాజైన రెండవహెన్రీకి పశ్చాత్తాపము గలుగునట్లు చేసెను. ౧౧౭౯ లో మతాచార్యుల సంఘమునుగూర్చి పోపును ఎన్నుకొనునట్టివిధానముల నేర్పఱిచెను. వాని ననుసరించియే ఇప్పటికిని పోపు లెన్నుకొనఁబడెదరు. చివరకు రోమునుండి వెళ్లఁగొట్టఁబడినందున దేశాంతరమునందు కాలముగడపవలసినవాఁ డాయెను.

**౩. ౬-వ అలెగ్జాండరు** (౧౪౯౨ - ౧౫౦౩). ఈతని పూర్వాశ్రమనామము రోడ్రిగో బోర్జియా. ఇతఁడు మిక్కిలి విషయాసక్తుఁడు. ౧౪౯౨ లో పోపయ్యెను. తన కొక యుంపుడుకత్తెవలన పుట్టిన పుత్త్రపుత్త్రికలకు రాజ్యాదుల సంపాదింపవలెనని యెన్నియో కుట్రలను జేసెను. తన కడ్డమువచ్చినవారిని రహస్యముగ పొడిపించియు, విషము పెట్టించియు చంపించెను. ఇతఁడు వ్యవహారచతురుఁడు; రాజకార్యకుశలుఁడు; కళాకౌశలప్రియుఁడు; శాస్త్రజ్ఞులపోషకుఁడు; లోకబాంధవుఁడు. ఇట్టి సద్గుణదుర్గుణము లితనియం దుండెను.

**౪. ౭-వ అలెగ్జాండరు** (౧౬౫౫ - ౧౬౬౭). ఈతఁడు ౧౫౯౯ లో జన్మించెను. ౧౬౫౫ లో పోపాయెను. ఇతఁడు పండితుల నాదరించెను. ల్యాటిన్ భాషలో కొన్ని కావ్యములు వ్రాసెను. ఈతఁడు రోముపట్టణము నభివృద్ధి నొందించెను. ఈతనికిని, ఫ్రాన్సుదేశపురాజైన ౧౪-వ లూయీ అను

sampath_Ebooks

ఖాన్ తనమనుమని పెంచుకొని రాజ్యమిచ్చి, ౧౭౫౬-వ సంవత్సరము ఏప్రియల్ నెల ౯-వ తేదీని మరణించెను.

**అలీవాల్** — పంజాబులోని లూధియానాజిల్లాలో జాగ్రాఁ తాలూకాకు సంబంధించిన ఒక గ్రామము: ఇచ్చటనే ఆంగ్లేయులు సిక్కులను జయించినారు (౨౮-వ జనవరి ౧౮౪౬-వ సంవత్సరమున). సిక్కులు అలీవాల్, భుంద్రీగ్రామముల రెంటిలోను తమ ౧౫,౦౦౦ సైనికులను రెండుసేనలుగ విభజించి యుంచి శత్రుసైన్యములరాక కెదురుచూచుచుండిరి. ఆంగ్లేయుల కీరహస్యము తెలిసిపోయినది. అందుచే వారు రెంటికిని నడుమనుండి రాక, మఱియొకదెసనుండి వచ్చి హఠాత్తుగ అలీవాల్ పైఁ బడిరి. సిక్కుసేనలలో ముఖ్యభాగము అలీవాల్ లోనే యున్నది. సిక్కు లోడిపోయిరి. అటుపై మరల భుంద్రీకడ యుద్ధము జరిగెను. ఈసారియు సిక్కులు గొప్పసాహసముతో నాంగ్లేయుల నెదుర్కొనిరి. శత్రువులు తమ సేనను మూఁడుమాఱులు చీల్చివైచినను సిక్కులు మరలమరలఁ గలసి పోరాడుచుండిరి. కుడ కాంగ్లేయులు తమఫిరంగులబలమును పూర్ణముగ నుపయోగించినపైని సిక్కులు నిలువఁజాలక పాఱిపోయిరి.

నేఁటికిని నాఁటి భుంద్రీయుద్ధమునుగూర్చి పంజాబులో కథలుగఁ జెప్పుకొనుచుందురు. నాఁటియాహవమునందు మరణించిన సిక్కులస్మరణచిహ్నముగ నెలకొల్పఁబడిన పెద్దస్తంభ మొకటి యిప్పటికిని అచ్చట నిలిచియున్నది ... రహస్యముగ ప...

...చెను. కుమారులు తల్లిదండ్రుల సరకులవలె అన్యాక్రాంతము చేయు నాచారము మార్చెను. మతాధికారులకును ప్రజలకును గల ద్వేషము మాన్పి వారికి స్నేహము కుదిర్చెను. మొదట నిట్టిమహాకార్యములను జేసినను చివరకుఁ గొంత సంస్కరణద్వేషి యయ్యెను.

౨. ౨-వ అలెగ్జాండరు, నికొలా విచ్ (క్రీ. శ. ౧౮౧౮ - ౧౮౮౧). ఈతఁడు ౧౮౫౫ లో రాజ్యమునకు వచ్చెను. ఇతనికాలములో క్రిమియన్ యుద్ధమును, టర్కీతో యుద్ధమును (౧౮౭౭) జరిగెను. క్రిమియన్ యుద్ధ మితఁడు రాజ్యమునకు వచ్చునప్పటికే జరుగుచుండెను. మధ్య ఆసియాలో నున్న తురుష్కుల గుంపులతో అప్పు డప్పుడు పోరాడి (౧౮౬౬-౧౮౮౧) ఈతఁడు రష్యాసామ్రాజ్యముయొక్క ఆగ్నేయదిక్కున నుండు పరిహద్దు చాలదూరము జరపెను. కకేసస్ప్రాంతమునందలి జనుల నందఱను స్వాధీనపఱుచుకొనెను. ౧౮౬౩ లో పోలెండుదేశస్థులు తిరుగఁబాటు చేయఁగా మిక్కిలి క్రూరుఁడై ఆ తిరుగఁబాటు నణఁచివేసెను. ౧౮౬౧ లో బానిసలను విముక్తులఁ జేయుటలో నీతఁడు ప్రాముఖ్యము వహించెను. రష్యాదేశమందలి సైన్యమును, న్యాయసభలను బాగుపఱుచుటకై యత్నించెను. ౧౮౭౨ లో ఈతఁ డాస్ట్రియా, జర్మనీలతో త్రిదేశసంధి (Triple Alliance) గావించెను. ఈతనిరాజ్యమునందు శూన్యవాదులు (Nihilists) అను అరాజకులు ప్రబలి ఇతనిని జంపుటకు ప్రయత్నించుటచే వారి నడంచుటకు మిక్కిలి క్రూరమార్గముల నవలంబింపవలసినవాఁ డయ్యెను. ఆ ప్రతీకారము వహించుటచే నీతనికి రాజ్యాగ్రహత లే కనిరి. ఇతఁడు దేశాంతరములకుం బోయి తిరిగివచ్చి చెఱసాలలలో చనిపోయెను. ఇతనికుమారుఁడు రెండవ పీటరను పేర రాజయ్యెను.

అలెక్సియుస్ మిఖలోవిచ్ (౧౬౨౯-౧౬౭౬) — రష్యాదేశమునకు రాజు. ౧౬౪౫ లో రాజ్యమునకు వచ్చెను. పోలండును గెలిచెను (౧౬౫౪ - ౧౬౬౭). స్వీడనుతో పోరాడి సైబీరియాకు తూర్పుదిక్కువఱకును రాజ్యవిస్తారము గావించెను. డాన్ కొసాక్కు లనువారు తిరుగఁబడిన, వారి నణఁచెను (౧౬౭౨). చట్టముల నన్నిటి నొక్కకోటికిం దెచ్చి స్మృతులుగ నేర్పఱిచెను. పశ్చిమయూరోపు ఖండమునకు రాకపోకల నేర్పఱిచెను.

**అలెగ్జాండరు** (క్రీ. పూ. ౩౫౬ - ౩౨౩) — ఈతనికి మహామహుఁడు (ది గ్రేటు) అన్న బిరుదు కలదు. గ్రీసుదేశమునందలి యొకచిన్నసంస్థానమైన మెసిడోనియారాజయిన రెండవ ఫిలిప్పుయొక్క కుమారుఁడు, జగజ్జేత. అప్పుడు తెలిసినంత ప్రపంచము నంతయు గెలిచినవాఁడు. కొన్ని యేండ్లవఱకును (౩౪౩-౩౪౦) తత్త్వవేత్తయైన అరిస్టాటలునొద్ద విద్యాభ్యాసము చేసెను. ఇరువదిసంవత్సరములవయస్సువచ్చినప్పుడు (౩౩౬) తండ్రి పోఁగా రాజయ్యెను ... ఇతఁడు ధీశాలి. విద్యాసక్తియు, న్యాయదృష్టియుఁ గలవాఁడు. తిరుగఁబడిన ప్రెటోరియన్సు వీనిని జంపిరి.

**అలెగ్జాండరు** (స్కాట్లండ్) — స్కాట్లండ్ దేశమునం దీపేరుగలరాజులు ముగ్గురు రాజ్యము చేసిరి.

౧. ౧-వ అలెగ్జాండరు (క్రీ. శ. ౧౦౭౮ - ౧౧౨౪) ఈతఁడు ౧౧౦౭ లో రాజ్యమునకు వచ్చెను. ఇతఁ డుత్తరదేశమునకుమాత్రము రాజుగ నుండెను. ఇతనితమ్ముఁడైన ౧-వ డేవిడ్ దక్షిణదేశమునకు రాజుగ నుండెను. ఇతఁడు మతసంబంధమైన పెక్కు సంస్కారములం జేసెను. రోమకసంప్రదాయమువంటి మతగురువుల సంప్రదాయమును (Episcopacy) స్థాపించెను. పెక్కుమఠములను నెలకొల్పెను.

౨. ౨-వ అలెగ్జాండరు (క్రీ. శ. ౧౧౯౮ - ౧౨౪౯) విలియం-ది లయన్ అనువానికుమారుఁడు; ౧౨౧౪ లో రాజ్యమునకు వచ్చెను. ఇంగ్లండురాజైన ౩-వ హెన్రీతో నార్తంబ్రియా, కంబ్రియా ప్రాంతములను గుఱించి ౧౨౩౭ లో సంధి చేసికొనియెను. ఇంగ్లీషురాజు సోదరి యగు జోన్ కుమారిని వివాహ మాడెను. తనకు సామంతుని గమ్మని హెన్రీ యీతని బలవంతపఱిచెను గాని ౧౨౪౪ లో న్యూకేసిల్ సంధితో నాతగాదా అణఁగిపోయెను. ఈతఁడు మతమును (Church) రక్షించెను. చట్టములను బాగుపఱిచెను. తన ధీసాహసములచే స్కాట్లండ్ దేశమునకు సంపద గలుగఁజేసెను.

sampath Ebooks

వీరులకును సన్మానము చేయవలయు ననుతలంపుతో నాతఁడట్లొనరించెను. 3౨౮ లో నాతనియొద్దకు ప్రపంచమందలి గొప్పగొప్ప చక్రవర్తులుగూడ తమ రాయబారుల నంపిరి. అరబ్బీదేశమును జయింపవలయునని యూహించుచుండ నీజగజ్జేత 3౨3 లోఁ గీర్తి శేషుఁడాయెను. ఈతఁడు రాజ్యము చేసినది ౧౨ సంవత్సరములయినను, మరణ సమయమున నీతనికి 3౨ సంవత్సరముల వయసుమాత్రముండినను, ఈతనిదిగ్విజయ యాత్ర లత్యద్భుతమైనవి. అప్పటికి మానవునకుఁ దెలిసినట్టి ప్రపంచము నంతయు నొకమూలనుండి మఱియొక మూలవఱకును జయించినవాఁ డీతఁ డొక్కఁడే కానవచ్చుచున్నాఁడు. దిగ్విజయము చేయుటయేకాక గ్రీకు దేశపు నాగరకతను ప్రపంచమునందంతటను వ్యాపింపఁజేసెను.

'అలెగ్జాండరు' శబ్దము అశోకునిశాసనమున 'అలకసుందర' రూపముగను, అరబ్బీపారసీకాదిభాషలలో 'సికందర్', 'ఇస్కందర్' అను రూపముగను కానవచ్చుచున్నది. మహారాష్ట్రాదిభాషలలో సికందర్ రూపమే వాడెదరు.

అలెగ్జాండరు, అఫ్రొడీసియన్ — ఈతఁడు క్రీ. శ. ౨-వ శతాబ్దివాఁడు. ఈతనిని ౨-వ అరిస్టాటల్ అనియెదరు. ఈతఁడు 'సెమ్యపట్టణమునందలి లీసియమ్' అను విద్యాపీఠమునకు



అలెగ్జాండ్రా

హముజరగినది. ఆ యేటనే యామె తండ్రి డెన్మార్కు రాజగుటయు, నతని రెండవకుమారుడు జార్జి గ్రీసు దేశపు రాజగుటయు తటస్థించెను. ఎడ్వర్డు చక్రవర్తికీమెయందు ముగ్గురు కుమారులును, ముగ్గురు కూఁతులును కలిగిరి. మొదటికుమారుఁడు ఆల్బర్ట్ విక్టర్ ౧౮౬౪ లో పుట్టెను. మిగిలిన యిరువురుకుమారులలో నొకఁడే అయిదవ జార్జిచక్రవర్తి. రెండవ కొడుకు పురిటిలోనే చనిపోయెను. విక్టోరియామహారాజ్ఞి మరణానంతర మెడ్వర్డు చక్రవర్తి యయినప్పుడీమె మహారాజ్ఞి యయినది (౧౯౦౨). ౧౯౧౦-వ సంవత్సరమున ఎడ్వర్డుచక్రవర్తి చనిపోయినపిదప నీమె సాండ్రింఘాముకు వెళ్లి, సంవత్సరమునకు 3౦,౦౦౦ ల రూపాయలయాదాయమును పొందుచు నచ్చటనే నివసించి తుదకు ౧౯౨౫-వ నవంబరు ౨౫-వ తేదీని అచ్చటనే కాలధర్మము నొందెను. ఈమె మరణానంతరమున, ఈమహారాజ్ఞియొక్క జాతీయ స్మారకనిధిగ ౨,3౦,౦౦౦ ల రూపాయలు వసూ లయినవి. ఈమొత్తము నామెపేరుతో ౧౯౦౨లో స్థాపితమయిన 'క్వీన్ అలెగ్జాండ్రాస్ ఇంపీరియల్ నర్సింగ్ సర్వీస్' అనుసంస్థకు వినియోగించుటకును ఒక స్మారకచిహ్నమును ప్రతిష్ఠించుటకును తీర్మానింపఁబడినది.

పీటర్-ది-గ్రేట్ అమరస్వ్యాచక్రవర్తి ఈతని దిగ్విజయస్థలమైన నేవా యొద్ద గొప్పమఠమును కట్టించెను. అందు ౧౨ దేవాలయములు గలవు. రష్యాదేశమున కంతకును మతాచార్యుఁడైన గురువు ఇచ్చట నివసించి యుండును. ఇచ్చట మతసంబంధమైన విద్యాపీఠమును, పెక్కు మహామహులసమాధులును కలవు.

**అలెగ్జాండరు** (పోపులు) — రోములో మతగురువులుగ నున్న పోపులపీఠము నధిష్ఠించినవారిలో నెనమండ్రు అలెగ్జాండరు నామధేయులు గలరు. వారిలో నీక్రిందివఱ్ఱుగును పేర్కొనఁదగినవారు:

౧. ౨-వ అలెగ్జాండరు

(౧౦౬౧-౭3) మిలన్ నివాసి. రోమన్ క్యాథలిక్ సంప్రదాయమును సంస్కరించుటకు కొంత ప్రయత్నించెను. విలియం 'ది-కాంకరర్' అనువాని కింగ్లండుమీఁదికి దండెత్తుటకు సెల విచ్చెను.

౨. 3-వ అలెగ్జాండరు

(౧౧౫౯-౮౧). యూరోపుఖండపు చరిత్రయందలి మధ్యయుగము (Middle ages)నందీస్థానము నలంకరించిన పోపులలో ఘనతఁ జెందినవాఁడు. ౧౧౫౯ లో పోపుపదవి వహించెను. ఈతఁడు ఫ్రెడరిక్ బర్బరోస్సా అను చక్రవర్తితోఁ బోరాడి గెలిచి ౧౧౭౭ లో ఆతనిచే వేనిస్ సంధిపత్రముపై సంతకము చేయించెను.

రషియాచక్రవర్తిని. ఈమె నాలుగవ లూయీమూఁడురు; విక్టోరియా మహారాజ్ఞి మనుమరాలు. ౧౮౭౨-వ సంవత్సరమున జననమొందెను. ఈమెఅసలుపేరు అలిక్స్. ఈమె ౧౮౯౪-వ సంవత్సరము నవంబరునెలలో రషియా జార్ (చక్రవర్తి) అయిన రెండవనికొలసును పరిణయమాడినపిదప అలిక్స్ నామమును తీసివైచి అలెగ్జాండ్రా యను పేరు పెట్టుకొనెను. ఈమె గొప్పసత్తకలది; అన్నమాట చెల్లించుకోఁ గల నేర్పుకలది; పతిని ఆత్మవశవర్తిని గావించుకొని, తన విరుద్ధాభిప్రాయముల (Reactionary views) నతఁడంగీకరించునట్లు చేసి తనకోర్కెలు సాగించుకొనుచు వచ్చినది. రాజులీశ్వర ప్రతినిధు



అలెగ్జాండ్రా

లనియు, వారేది యొనరించినను ధర్మమే యనియుఁ గల సిద్ధాంతమునం దీమెకు పరమవిశ్వాసము. ౧౯౦౪ నుండియు నీమెకు రస్పుటిన్ ఎంతచెప్పిన నంత. అతనిద్వారా యీమె ఈశ్వరసాహా

sampath_Ebooks

య్యాము వర్థించుచువచ్చెను. జా రెప్పుడు మంత్రివర్గము నేర్పఱుచు కొనఁదలఁచినను ఈమె జోక్యము కలిగించుకొని తనయిచ్ఛకువచ్చి నట్లు చేయించుచుండెను. ఈవిధమయిన జోక్యమువలన విప్లవమునకు కొద్దికాలమునకు పూర్వము ౧౯౧౬-వ నవంబరు మాసమున పరిస్థితులు విషమము లయ్యెను. ౧౯౧౬-వ డిసెంబరు మాసమున రస్పుటిన్ హత్యకావింపఁబడినపుడు అలెగ్జాండ్రా యతనిస్నేహము నొకనిదికిఁ గొనిపోయి యచ్చట శవమును పాతిపెట్టి యతనిసమాధివయి క్రమముగా ప్రార్థనలు జరపుచుండెడిది. ౧౯౧౭-వ మార్చినెలలో జారు రాజ్యపరిత్యాగముకావించినపుడీమెకూడ నతనివెంట నరిగెను. ఎకెటరిన్‌బర్గువొద్ద ౧౯౧౮-వ జూలైమాసమున భర్తతోపాటు అలెగ్జాండ్రాకూడ వధింపఁబడెను. అప్పుడే యామెకుమారుఁడు అలెక్సిస్ను, ఆమెనలుగురుకూఁతులునుకూడ వధింపఁబడిరి.

అలెగ్జాండ్రా (నైలు) — దీనికి మఱియొకపేరు కానొపా. ఇది నైలునదియొక్క పోషకనదులలో ముఖ్యమయినది, విక్టోరియా నయాంజాసరస్సుద్వారా ప్రవహించి నైలునదికి నీరము నొసంగుచున్నది.

అలెగ్జాండ్రియా — యూరపు దేశీయులు దీనిని ఇస్కందరియా యందురు. ఈజిప్టుదేశమందలి యొకసముద్రపు రేవుపట్టణము. ఇయ్యది క్రీ. పూ. ౩౩౨-వ యేఁట అలెగ్జాండరు ది గ్రేటు అనువాని యాజ్ఞవలన, మెరిసొటిస్ అనుకొలనికిని మెడిటరేనియన్ సముద్రమునకును నడుమ నుండు సన్ననిభూభాగముపైఁ గట్టఁబడియెను. అప్పటినుండియు రమారమి వేయిసంవత్సరములవఱకును ఈజిప్టుదేశపురాజధానిగను, ప్రపంచవర్తకమునకు ముఖ్యమయిన రేవుగను, విద్యాపీఠముగను ప్రఖ్యాతి చెందెను. టాలమీయను గృహనామముగల రాజులకాలమునందు (క్రీ. పూ. ౩౨౩-౩౦) ఇయ్యది మిగుల నున్నతావస్థ గాంచెను. ఈపట్టణమందలి ముఖ్య విశేషము భూగర్భజలాశయములు. ఇందుఁ బట్టణవాసుల కొకసంవత్సరమువఱకును జాలునంత జలము ఇండ్లక్రింద సంగ్రహము చేసి యుంచుటకు వీ లుండెనఁట! ఇది మంచి వైభవదశయం దున్నప్పుడిందు పేక్కులక్షలజను లుండిరి. వీరిలో ఈజిప్టువారు గ్రీకువారు యూదులు రోమనులు నుండిరి. యూరోపుఖండమునకును ఆశియాఖండమునకు మధ్య నుండుటచేఁ దూర్పుసరకులు పశ్చిమమునకును పడమటి సరకులు తూర్పునకును పంపుట వలన ఈరేవు మిక్కిలి ప్రాముఖ్యమును పొందెను. క్రీ. పూ. ౪౭ లో రోమక సేనాని యైన జూలియస్ సీజ రీపట్టణమును పట్టుకొనెను. అచ్చటిరాణియైన క్లియోపాట్రా క్రీ. పూ. ౩౦ లో మరణ మొందఁగ నియ్యది రోమువారికిఁ బూర్తిగ స్వాధీన మయ్యెను. క్రీ. శ. ౬౪౬ లో దీని నరబ్బుల నాయకుఁ డగు అమ్రు అనువాఁడు పట్టుకొనెను. అరబ్బుఖలీపు లిచ్చటనుండి కైరోకు రాజధానిని మార్చినందునను, మఱి వేఱు కారణములవలనను దీనిప్రభ క్రమముగ తగ్గి ౧౭-వ శతాబ్దిలో నిందు ఆఱువేలకంటెఁ నెక్కుడు ప్రజ లుండుట తటస్థించెను. ౧౭౯౮ లో దీనిని నెపోలియను పట్టుకొనెను. ౧౮౦౧ లో నింగ్లీషు వారు తీసికొనిరి. ౧౮౦౬ లో మహమ్మదల్లీ యనువాని ప్రభుత్వకాలమున నీపట్టణము మరల నభివృద్ధి నొందఁజొచ్చెను. ౧౮౮౨ లో నింగ్లీషువా రీరేవును ఫిరంగులతోఁ గాల్చిరి. ఆవివరము 'ఈజిప్టు' శబ్దముక్రిందఁ జూడుఁడు.

ఇప్పు డిచ్చట జనసంఖ్య ౫,౭౦,౩౬౧. రేవువర్తకమును విశేషముగ నుండును. ఈపట్టణ మిప్పుడు ఫిరంగీవారిపేట అరబ్బుల పేట, మహమ్మదీయుల పేట యని మూఁడువిభాగములుగ నుండును.

**అలెగ్జాండ్రియా గ్రంథాలయము** — అలెగ్జాండ్రియాపట్టణమందుఁ బ్రఖ్యాతి చెందిన గొప్పగ్రంథాలయ మొకటి యుండెను. అచ్చట రాజ్యము చేసిన టాలమీ లన్నరాజులు (క్రీ. పూ. ౩౦౪-౩౦) విద్యాప్రియులు. టాలమీ ఫీలాడెల్ఫస్ (క్రీ. పూ. ౩౦౯-౨౪౬) అనురాజు డెమిట్రియస్ అను విద్వాంసునిసలహా ననుసరించి క్రీ. పూ. ౨౮౪ లో నీగ్రంథాలయము స్థాపించెను. అరిస్టాటిలుమహాతత్త్వవేత్త యొక్క గ్రంథసంగ్రహమును కొని మొదట దానిని ప్రారంభించిరి. తరువాత డెమిట్రియస్ రోమ్, గ్రీకు, ఈజిప్టు, చాల్డియా, పారసీకము మొదలయిన దేశములవాఙ్మయమందలి గ్రంథముల సంగ్రహించి రాజు మరణమువఱకు నొక లక్షగ్రంథములను కూర్చెను! తరువాతిరాజులును క్రొత్తగ్రంథములను సంపాదించుచు గ్రంథములసంఖ్య ఏడులక్షలవఱకును జేసిరి. ముద్రణమునకుఁ బూర్వ మంత గ్రంథసంగ్రహము గల గ్రంథాలయము మఱియొకటి లేదు. జూలియస్ సీజరు వచ్చి యాగ్రామమును ముట్టడి చేసినపుడు (క్రీ. పూ. ౪౭) ఈగ్రంథాలయముయొక్క విశేషభాగము కాలిపోయెను. తరువాత మరల మార్కస్ అంటోని క్లియోపాత్రద్వారా కొన్నిగ్రంథముల నీయఁగా నీగ్రంథాలయము నాలుగుశతాబ్దములవఱకు నభివృద్ధిఁ జెందెను. ఈపుస్తకాలయ ముంచిన 'సిరాపెం' అను మందిరమును క్రీ. శ. ౩౯౦ లో క్రైస్తవమతగురు వైన థియోఫిలస్ అనువాఁడు నాశము చేయఁగా నందలిగ్రంథములు చెల్లాచెదరై పెక్కుతావులకుఁ దీసికొని పోఁబడియెను. మరల గ్రంథాలయము స్థాపింపఁబడెను. అది క్రీ. శ. ౬౪౦ లో అరబ్బు లీపట్టణమును పట్టుకొన్నప్పుడు పూర్తిగ దగ్ధము చేయఁబడెను. ఈగ్రంథాలయము మరల స్థాపింపఁబడలే దనియు, దాని నరబ్బులు కాల్చియుండ రనియుఁ గొందఱు చరిత్రకారుల యభిప్రాయము.

**అలెగ్జాండ్రియా వాఙ్మయము** — గ్రీసుదేశమునకు స్వాతంత్ర్యము పోయి, యచ్చట విద్వాంసుల కాశ్రయము లేకపోఁగా వా రలెగ్జాండ్రియారాజులయాశ్రయమునఁ జేరిరి. అచ్చటి టాలమీ లనఁబడురాజులు కడు విద్యాప్రియులు గాన

విద్వాంసుల నందఱను ఆదరించి, మ్యూసియమ్ అను విద్యాపీఠమును నిర్మించిరి. ఇచ్చట వేయియేండ్లవఱకును (క్రీ. పూ. ౩౨౩–క్రీ. శ. ౬౪౦) విద్వాంసులసహవాసంబున సరస్వతీదేవి యథేచ్ఛముగా విహరించుచుండెను. ఈవేయిసంవత్సరములకాలమును రెండు విభాగములుగ (యుగములుగ) పెంచవచ్చును: ౧. క్రీ. పూ. ౩౨౩ మొదలు క్రీ. పూ. ౩౦ వఱకు; ౨. క్రీ. పూ. ౩౦ మొదలు క్రీ. శ. ౬౪౦ వఱకు. మొదటియుగమందు వాఙ్మయము (సాహిత్యము)ను, భౌతికశాస్త్రములును అభివృద్ధిఁ జెందెను. రెండవయుగమునందుఁ దత్త్వజ్ఞానము (వేదాంతము) ఎక్కువగ నభ్యసింపఁబడెను.

పూర్వయుగమునందు సాహిత్యచర్చ, విమర్శనము, వ్యాకరణము, ఛందస్సు, పురాణములు, జ్యోతిషము, గణితము, వైద్యము అనువిషయములపై నలెగ్జాండ్రియావిద్యాలయమునందలిపండితులనేకులనేకగ్రంథములను నిర్మించిరి. ముఖ్యముగ వారు చేసినపని గ్రీకు మహాకవులకావ్యములపైని సర్వాత్మక మైనటీకలు వ్రాయుట. కొందఱు కొన్నికావ్యములుగూడ వ్రాసిరి. కాని గ్రీసుదేశపుఁగవుల కావ్యములందుఁ గానవచ్చు స్వతంత్రకల్పనావిహార మిందుఁ గానరాదు. శాస్త్రముల నభివృద్ధిపఱచినవారిలో, రేఖాగణితకర్తయైన యూక్లిడ్, పదార్థశాస్త్రసంబంధమైన పెక్కుసిద్ధాంతములఁ గనుఁగొనిన ఆర్కిమిడిస్, కోనరేఖాగణిత మను శాస్త్రమును వ్రాసిన పెర్గావాఁ డను అపాలోనియస్, విఖ్యాతజ్యోతిష్కుఁడు హిప్పార్కస్, గణితము, జ్యోతిషము, భూగోళము, తత్త్వజ్ఞానము, చరిత్రవిషయములనుగూర్చి గ్రంథములను వ్రాసిన ఎరటాస్థనీస్ అనువాఁడును ముఖ్యులు. వీరందఱు యూక్లిడ్ శిష్యులే.

అలెగ్జాండ్రియాలో యూదులును, గ్రీకులును కలయుటచేఁ బాశ్చాత్యపౌరస్త్యతత్త్వశాస్త్రములసమ్మేళన మిచ్చట జరగెను. నియోప్లేటోనిజమ్ అను నూతనప్లేటోసంప్రదాయ మిచ్చటనే పుట్టెను. ఇచ్చటఁ గ్రైస్తవమతము బాగుగ వ్యాపించెను. ఇప్పటికి నిచ్చట క్రైస్తవమతాచార్యునిపీఠము గలదు. ప్లేటోతత్త్వములకును, క్రైస్తవమతతత్త్వములకును లంకె పెట్టి కొందఱు క్రొత్తసంప్రదాయమును సృష్టించిరి. గ్నాస్టికు లను క్రైస్తవవేదాంతులసంప్రదాయ మిచ్చటనే యభివృద్ధి చెందెను.

**అలెప్పో** — సిరియాదేశములో నుత్తరభాగమున నుండు పురాతనపట్టణములలో నొకటి. ఆఫ్రికాఖండపుదక్షిణాగ్రమార్గము కనిపట్టఁబడకమున్ను ఐరోపా, ఆసియాఖండములవ్యాపారమునకీపట్టణమే పట్టు. ఇటలీదేశములోని వెనీసునగరమునకును ఈపట్టణమునకును సంబంధము కడుంగడు నెక్కువ. పదునైదవశతాబ్దియంతమున నవీనమార్గ మేర్పడినతోడనే ఈపట్టణపుఁబ్రాముఖ్యము తగ్గెను. ఇప్పటికిని ఇచ్చట తురకలు, ఆర్మీనియనులు, గ్రీకులు, యూదులు మున్నగు ననేకజాతులవారు నివాసము లేర్పఱిచికొనియున్నారు. వీరిలో సగమంట జాలఁగువంతులు మహమ్మదీయులు.

ఈపట్టణము చరిత్రమున పెక్కుపోకలం బోయినది. క్రీ. శ. ౬౩౬ సారసెనులు దీనిం గొనిరి. క్రీ. శ. ౧౪౦౨ లో తైమూరు దీనిం గొల్లగొట్టెను. క్రీ. శ. ౧౫౧౭ లో నియ్యది తురకవారి యధీన మయ్యెను. క్రీ. శ. ౧౧౭౦ లోను, ౧౮౨౨ లోను భూకంపము లీనగరమును నాశ మొనర్చెను. క్రీ. శ. ౧౮౨౭ లో బొబ్బల జాడ్యమును, ౧౮౩౨ లో కలరాయును దీనిం గలంచెను. జనసంఖ్య ౨,౦౦,౦౦౦. ఇప్పటికిని వ్యాపారము బాగుగ జరగుచున్నది.

**అలెస్సాండ్రియా** — ఇటలీదేశములో నదేపేరుగల మండలమునకు రాజధాని. ఇచ్చట నొక గొప్పదుర్గమును గలదు. ఇప్పటికి నిది బలవంత మయినదియే. ఇందు సైన్యములును గలవు. ఈపట్టణము రైలుమార్గముపయి చక్కనిపట్టున నుండి ప్రముఖతఁ గాంచియుండుటచేత వ్యాపారము నానాఁటికి వృద్ధి యగుచున్నది. జనసంఖ్య ౮౧,౦౨౧.

**అలేఖియా** — శైవు లయిన బైరాగుల సంప్రదాయము. గిర్నార్ పర్వతము, పూనా వీరి ముఖ్యస్థలములు. వీరు బిచ్చమెత్తుకొని జీవయాత్ర గడపెదరు. గణేశభక్తులు, భైరవభక్తులు, కాళీభక్తులు నని వీరిలో మూఁడుతెగలు గలవు. మొదటివారు దుపయమునను, రెండవవారు సాయంకాలమునను, మూఁడవవారు రగ్గరాత్రమందును బిచ్చ మడిగికొందురు. మొదటితెగవారుమాత్రము బిచ్చమున కిండ్లలోనికిఁ బోయెదరు. మిగిలిన రెండుతెగలవారు నిండ్లలోనికిఁ బోక వీథులలో నుండియే బిచ్చ మడుగవలయును. వీరికి 'అలఖ్ నామీ' లన్న మాఱుపేరుగూడఁ గలదు. వీరు తిరుగుచున్నపుడు 'అలఖ్', 'అలఖ్' అని అఱచుచు తిరుగుచుందురు. కాన వీరి కీపేరు వచ్చెను.

**అలేటిపాడుచిట్టమూరు** — నెల్లూరు జిల్లా గూడూరుతాలూకాలోని గ్రామము. జనసంఖ్య ౧౨౫ (౧౯౩౧).

**అలోపుఁడు** — ధృతరాష్ట్రుని నూర్గురు పుత్త్రులలో నొకఁడు.

**అలోలుఁడు** — దుర్యోధనునితమ్ములలో నొకఁడు.

**అలౌంగ్‌పయ** — బర్మాదేశమునందలి పెగూజిల్లాలోఁ గల 'మోక్‌సోబో' యను గ్రామమున కధిపతి. క్రీ. శ. ౧౭౫౩-వ సంవత్సరమున తలైంగులు తిరుగఁబాటు గావించినప్పుడు వారి నోడించి 'ఆవా' నగరమునఁ దనరాజ్యమును నెలకొల్పెను. ౧౭౫౫-వ సంవత్సరములో పెగూను వశపఱుచుకొని తలైంగులకుదియధిపతి యగు 'వ్యాహమైంగతీరజా' అను నతనిని జెఱయం దుంచెను. అలౌంగ్‌పయ తనపరాక్రమమువూలమున నెక్కువ ప్రఖ్యాతిని గడించెను.

**అల్‌కిండి అబూయూసుఫ్** — తత్త్వవేత్త, గణితశాస్త్రజ్ఞుఁడు. ౯-వ శతాబ్దివాఁడు. అరబ్బివా రీతని నందఱకంటె

గొప్పతత్త్వజ్ఞుని గ నెంచుదురు. ఆతనికాలమునం దుండిన యన్ని శాస్త్రములం గూర్చియు గ్రంథములు వ్రాసెను. ముఖ్యముగ తర్క గణిత శాస్త్రములను గురించి వ్రాసెను. అరిస్టాటిల్ గ్రంథములను భాషాంతరీకరించెను. వానిపైని భాష్యము వ్రాసెను.

**అల్ ఖ్వారిజ్మి** — ౯-వ శతాబ్దియం దుండిన అరబ్బీ గణితశాస్త్రవేత్త. ఖురాసాన్ పట్టణమున జన్మించెను. బాగ్దాద్ పట్టణములోని అల్‌మమున్ అను ఖలీఫానొద్ద గ్రంథాలయాధ్యక్షుడుగ నుండెను. 'సింద్‌హింద్' అను పేరిట జ్యోతిషగణితస్కంధసంబంధమైన రెండుపుస్తకములను వ్రాసెను. ఇది హిందూదేశమందలి సిద్ధాంతముల ననుసరించి గుణింపబడియెను. ఈతడు బ్రహ్మగుప్తుని గ్రంథము ననుసరించి బీజగణిత ( Algebra ) మొకదానిని రచించెను. యూరోపుఖండమందు తరువాత వ్రాయబడిన బీజగణితసంబంధమైన గ్రంథముల కన్నిటికి నిదియే ఆధారము. హిందూపద్ధతి ననుసరించి యంకెలు వ్రాయునట్టిదశాంశవిధమును తెలుపుచు నీతఁ డొకగణితగ్రంథము వ్రాసెను.

**అల్లగర్ కోవిల** — మధురజిల్లాయందలి మేలూరుతాలూకాలోని యొకగుడి. ఇది మధురపట్టణమున కీశాన్యమున ౧౨ మైళ్లదూరమునం దుండును. ఇది అల్లగర్‌గుట్టలమీఁద నున్నది. దేవునిపేరు అల్లగర్. ఈదేవాలయము మిక్కిలి పురాతనమైనది. కల్లరులను దొంగజాతివారిదేవు నారాధింతురు. గుడిచుట్టును కోటమాదిరి గోడ గలదు. ఆడినెల పూర్ణిమనాఁ డిక్కడ పెద్దయుత్సవము జరుగును.

**అల్జీయర్స్** — అల్జీరియా దేశమునకు ముఖ్యపట్టణము. దీని కీపేరు అల్జెర్ జెజైర్ ( Fr. Alger, Arab.Jazair ), అనఁగా దీవములు అను అరబ్బీపదమునుండి వచ్చినది. ఇది సుందరమైన పట్టణము. ఇక్కడ చాలమంది యూరోపియను లుందురు. ఇది సమశీతోష్ణముగ నుండుపట్టణము. జనసంఖ్య ౨,౨౬,౨౧౭ (౧౯౨౬). దీని నంటియున్న శివారుగ్రామములతోఁ గలిపి యీపట్టణము జనసంఖ్య ౨,౫౬,౪౯౫. వీరిలో యూరోపియనులు ౧,౭౬,౪౧౬ గురు; దేశీయులు ౭౯,౦౭౯ గురు.

**అల్జీరియా** — ఆఫ్రికాఖండమునం దుత్తరభాగమున నున్న యొకదేశము. ఇది యిప్పుడు ఫ్రెంచివారి ప్రభుత్వముక్రింద నున్నది. దీని విస్తీర్ణము ౩,౮౩,౫౦౦ల చదరపుమైళ్లు. ౧౯౨౬-వ సంవత్సరపు జనాభా ననుసరించి ఈదేశముయొక్క జనసంఖ్య ౬౦,౬౪,౮౯౬. సహారాప్రాంతపు అల్జీరియాయందు ౫,౪౨,౨౨౫ మంది గలరు. అల్జీయర్స్ అనునది రాజధాని. ఈదేశమున కుత్తరమున మధ్యధరాసముద్రమును, దక్షిణమున సహారా యెడారియుఁ గలవు. తూర్పున ట్యునీషియాయును, పడమట మొరాకోయును ఎల్లలు.

ఒరాన్ ( Oran ), అల్జీయర్స్, కాన్‌స్టెంటయిన్ అని ఇందు మూఁడు ముఖ్యవిభాగములు. ఇందు ఇంచుమించుగ ౫౫౦ మైళ్ల పొడువున వ్యాపించి, పాషాణమయమై నిలువు-నిట్రముగ నుండు సముద్రతీరము గలదు. తీరప్రదేశముపొడవునను గండ్లు ఎక్కువగఁ గలవు. అట్లయ్యు రేవు లుత్తరవాయువులకు లోనగుచుండును. దేశమం దంతట అట్లాసుపర్వతములు వ్యాపించియున్నవి. సహారా ఎడారికి సమీపములో పెద్ద అట్లాసుపర్వతమాలికలును, వీనికిని సముద్రతీరమునకును నడుమ, తటమునకు సమానాంతరముగ చిన్న అట్లాసుకొండలును గలవు. ఈరెండుమాలికలను గలుపుచు వడ్డముగ వ్యాపించి మఱియుఁ గొన్ని పర్వతములు గలవు. వీనివలన పీఠభూములును, నలుదిక్కుల పర్వతావృతములైన లోయలు నేర్పడియున్నవి. సహారా అట్లాసులలో ౭,౦౦౦ల అడుగుల యెత్తుగల పర్వతశిఖరములును గలవు. నదు లనేకములు గాని మిక్కిలి చిన్నవి. అన్నియు తీరమునకు దగ్గఱగ నుండుకొండలమీఁదఁ బుట్టినవాఁగులే. వీనిలో 'షెలిఫ్' అనునది కొంచెము పెద్దది. నదు లన్నియు వ్యవసాయకార్యముల కుపయోగకరములై యున్నవి. ఈకృషికార్యములకుఁ గాను కృత్రిమతటాకములును గలవు. ఈదేశపు తీరప్రదేశములందును, మధ్యభాగమందును సముద్రతలమునకంటెను నిమ్నములైన షాటు( Shotts )లని పిలువఁబడు ఉప్పునీటిపల్లపునేల లున్నవి. ఎండకాలమునం దివి చాలవఱకు ఎండిపోవుచుండును. సముద్రతటమును వదిలియుండుప్రదేశ మంతయు 'టెల్' ( Tell ) అనుపేరను వ్యవహరింపఁబడుచుండును. కొండలకును, సముద్రమునకును మధ్య సస్యవంతములైన, సమతలములుఁగల మైదానములు కలవు. ఈదేశము తూర్పువైపున నుండు 'షాటు'లలోనికి మధ్యధరాసముద్రపునీరు ప్రవేశపెట్టుట కాలోచనలు జరగినవి.

ప్రదేశముయొక్క ఎత్తునుబట్టియు, స్థానికవిశేషములను బట్టియు ఇచటికాలమితియందు హెచ్చుతగ్గులు కలుగుచుండును. ఈదేశమున ఋతువులు మూఁడు: నవంబరు మొదలు ఫిబ్రవరివఱకును చలికాలము; మార్చి మొదలు జూన్‌వఱకును వసంతకాలము; జూలై మొదలు అక్టోబరువఱకు ఎండకాలము. ఎండకాల మిచట కడుతీవ్రముగ నుండును. కాని సముద్రతీరమందు సమశీతోష్ణము. ఈ భాగముల కాలమితి ఆరోగ్యదాయకమైనదగుటచేత చలికాలమందు రోగుల కివి యాశ్రయ మగుచుండును.

ఈదేశము ముఖ్యముగ వ్యవసాయ జీవనము గలది. ఇచ్చట ద్రాక్షపంట విశేషము. ౩,౦౦,౦౦౦ల యెకరములకంటె నెక్కుడు భూమి ద్రాక్షపంటఁ బండించును. కావున నిచ్చటనుండి ద్రాక్షసవ మెక్కువగ నెగుమతి యగును. ద్రాక్షఁ విడప గోదుమలు, బార్లీ, ఓట్లు, పొగాకు, ప్రత్తి, పట్టు, ఖర్జూరములు ఇచటి ముఖ్యములైన యుత్పత్తులు. బటానీలు, బంగాళాదుంపలు నిచటనుండి ఇంగ్లండు, ఫ్రాన్సుదేశముల కెగుమతి యగుచుండును. పీఠభూములందు సహజముగ నుత్పత్తియగు 'అల్ఫా' యనుపేరుగల నార యిదేశమునుండి యెక్కువగఁ బోవుచుండును. ఈదేశమున వ్యవసాయమున నెక్కువనష్టము కలిగించునవి మిడుతలగుంపులు. పిడుగులు, దుమ్ములు, సిరంగులు, నక్కలు

నిచటివన్యజంతువులు; గుఱ్ఱములు, కంచరలు, పశువులు మొదలగునవి గృహ్యములు. అల్జీరియాయందు విలువగల ఖనిజములు కలవు. అందు ఇనుము, రాగి, సీసము, గంధకము, యశదము, అంజనము, తెలుపు ఎఱుపు రంగుల పాలరాయి, స్ఫురితములు ( Phosphates ), నాప రాలు ( Lethographic stone ) ముఖ్యమైనవి.

ఫ్రెంచి ప్రభుత్వము స్థిరమైనది మొదలుకొని ఇచటి వ్యాపార మమితముగఁ బెరిఁగిపోయినది. ఫ్రాన్సు, ఇంగ్లండు, స్పెయినులతో ముఖ్యవ్యాపారము జరుగుచుండెను. అందు నాలుగింట మూఁడువంతులు ఫ్రాన్సుతో జరగును. మీఁద వచించినపదార్థములు గాక యిదురు జువ్విమాను ( Olive Oil ), పదునుచేయనితోళ్లు, కలప, ఉన్ని, పొగాకు, నారింజలు నెగుమతి యగుచుండును. యంత్రనిర్మిత సామగ్రులు, సారాయములు, గ్రుగులు, కాఫీ ముఖ్యమైన దిగుమతులు. ఇచటి చేతిపను లేవియు అంత గణింపఁదగినవి కావు. కాని మొరాకోచర్మము, రత్నకంబలములు, మల్లినులు, పట్టులు కొంచెముగ తయారగుచుండును. ఫ్రాన్సుదేశమందలి నాణెములు, కొలతలు, ఎత్తులు ఇచట వాడుకలో నున్నవి. అల్జియర్స్, ఒరాన్, కాన్‌స్టెంటైన్, బోనా, ఫిలిప్‌విల్ అనునవి ప్రసిద్ధపట్టణములు. ౨,౮౦౦ల మైళ్ల రైల్వేమార్గములును, అంతకు మించిన పక్కారోడ్లును గలవు. టెలిగ్రాఫుతీగెలు జాలములవలె వ్యాపించియున్నవి. ప్రస్తుతము మోటారుబస్సులమూలమున వందలకొలఁది మైళ్లు సహారాయందుఁగూడ ప్రయాణములు సాగుచున్నవి.

ఇచ్చటి మూలనివాసులు బర్బరు లనువారు. వీరు బహుపత్నీకత్వము లేనిమహమ్మదీయులు. ఈదేశమందు పెక్కువందలయేండ్లనుండి యున్న అరబ్బులును, యూదులును పెక్కురు కలరు. అరబ్బులును, బర్బరులును గుడారములలో వసించుచు, ఊరూరఁ దిరుగుచు ప్రయాణముల సలుపుదేశాటులు ( Nomads ); కాని ఇప్పుడిప్పుడు వీరిలో పెక్కుమంది టెల్ నామక ప్రదేశమున నివాసములఁ గల్పించుకొని వ్యవసాయముచేయుచు గ్రామముల నభివృద్ధిపఱుచుచున్నారు. కబైలు ( Kabyles ) లని పిలువఁబడు బర్బరు లిచటి ఆదిమనివాసులు. ఇప్పటి జనులలో వీర ఎక్కువ. వీరు మాటాడునది బర్బరభాష; వ్రాయునదిమాత్రము అరబ్బీభాషాలిపి. యూదులు సంఖ్యయందు తక్కువైనను మంచిస్థితియం దున్నారు. ఈపైని వచించినవారు గాక ఇంకను అనేకజాతులవా రీదేశమునఁ గలరు. యూదులు తప్ప తక్కినవా రందఱును ముసల్మానులు. ఇప్పుడు చాల మంది ఫ్రెంచిదేశీయులును, అన్యదేశీయులును వచ్చి ఇచట వాసము గుదుర్చుకొని యున్నారు. ౨,౬౦,౦౦౦లకంటె ఎక్కువగ ఫ్రెంచి వారును, ౨,౦౦,౦౦౦లకు మించిన యూరోపియనులును ( వీరిలో ఇటాలియనులు, స్పెయినుదేశీయులును ఎక్కువ ) కలరు. ఫ్రెంచి ప్రభుత్వముచేత నియుక్తుఁ డగు గవర్నరుజనర లీదేశమును పాలించుచుండును. ఇతనికిఁ దోడ్పడుట కొకకౌన్సిలు కలదు. అల్జియర్స్, కాన్‌స్టెంటైన్, ఒరానులు – స్తిమితముగల విభాగములు – ఫ్రాన్సులోని భాగములుగనే గణింపఁబడుచున్నవి. ఇందలి ప్రతిభాగమునుండియు ఇద్దఱు డెప్యూటీలును, ఒక సెనేటరును, ఫ్రెంచిచేంబరునకు పంపఁబడుచుందురు. తక్కినదేశమునం దంతట సైనికపరిపాలనము. ఇందుమూలముననే ప్రతిసంవత్సరము ఫ్రాన్సున కమితమగు వ్యయము భరింపవలసి వచ్చుచున్నది.

పూర్వకాలమున రోమనులు దీనిని న్యూమిడియా అనుచుండిరి. ఇది వారియధీనమున మంచియభివృద్ధిని గాంచి చాలకాలమునకు ముందే క్రైస్తవమతమును స్వీకరించియుండెను. క్రీ. శ. ౪౩౦ లో వండలు లనువారు ఈదేశమును జయించిరి. క్రీ. శ. ౫౩౩ లో బెలిసారియస్ ( Belisarius ) అనునతఁడు దీనిని బిజంటైనుసామ్రాజ్యముతో జతఁగలిపెను. ఏడవశతాబ్ది మధ్యకాలమున సారసెనులు దీనిని గొల్లగొనిరి. క్రీ. శ. ౯౩౫లో అరబ్బీరాజపుత్రుఁడైన యూసెఫ్ ఇబ్న్ జేరి యనునతఁడు అల్జియర్స్‌పట్టణమును గట్టెను. అతనివంశమువారు ౧౧౪౮ వఱకును రాజ్యము చేసిరి. ౧౨౬౯ లో నిది చిన్నచిన్న సంస్థానము లయ్యెను. క్రీ. శ. ౧౫-వ శతాబ్దియందు స్పెయిన్ దేశమునుండి వెడలఁగొట్టఁబడిన మూరులు, యూదులు నీరాజ్యమునందుఁ గాఁపుర మేర్పఱుచుకొనిరి. వారు ఓడదొంగతనములఁ బ్రారంభించి, యూరోపీయవర్తకమున కపరిమితమైన నష్టమును కలిగించుచుండిరి. స్పెయినురాజయిన ఫర్డినండు ౧౫౦౯ లో నీదేశమునఁ జాలభాగము నాక్రమించుకొని వీరిని శిక్షించెను. తరువాత తుర్కీసరదారొకఁ డల్జీరియావారిసాయమునకు వచ్చి యీదేశము నాక్రమించుకొనెను; స్పెయిన్‌వారిని వెడలఁగొట్టెను. కాని స్వల్పకాలములోనే స్పానియార్డు లతనిని బట్టుకొని ఉరి దీసిరి. అతని యనంతరమున వచ్చిన యతనితమ్ముఁడు ౧౫౨౦ లో ఈ దేశమును టర్కీరాజ్యమున కొసఁగి ఓడదొంగతనములను బాగుగ నభివృద్ధిపఱిచెను. చాలకాలమువఱకు యూరోపియనులవ్యాపారమున కీదొంగతనములు మహాభయదాయకములై యుండెను. ఫ్రెంచివారు దీనిని లోఁబఱుచుకొని ౧౮౧౦ వఱకును నామమాత్రపాలకులుగ నుండిరి గాని దేశీయుల దొంగతనముల నరికట్టఁజాలకపోయిరి. ౧౮౧౫ లో అమెరికనులు వీరినాయకుని నోడించి తమవ్యాపారపు నౌకల కట్టి నష్టమును కలుగఁజేయకుండులాగున నతనిచే నొప్పందముఁ జేయించుకొనిరి. ౧౮౧౬ లో 'లార్డ్ ఎక్స్‌మూత్' అనునతఁడు ఇంగ్లీషునౌకాసేనతో అల్జియర్స్‌ను ముట్టడించి గెలిచి యచటి క్రైస్తవఖైదీల నంఁదఱను విముక్తులఁ జేయించెను. అది మొదలుకొని యుద్ధఖైదీల నంతను యూరోపియనుజాతుల నియమముల ననుసరించి యాదరించు చుండుట కేర్పాటులను గావించుకొనిరి. కాని అల్జీరియనుల దొంగదోపుళ్లు శాంతించక కొన్నాళ్లకు యథాపూర్వమే జరగసాగెను. అవశులై చిట్టచివఱకు ఫ్రెంచివారు కఠినపద్ధతులకు దొరఁకొనిరి. క్రీ. శ. ౧౮౩౦ లో ఫ్రెంచివారు ౪౦,౦౦౦ల మందిగలసేన నీదేశమును జయింపఁ బంపిరి. అల్జియర్స్‌పట్టణము శీఘ్రముగ వీరివశమయ్యెను. అల్జీరియనుసాయకుఁ డగు 'డే' రాజ్యమును వీడిపోవ దేశ

sampath_Ebooks

మగాజక మర్యోను. ఆసమయమున 'అబ్దుల్ కాదిర్' అను అరబ్బీ ప్రముఖుఁడు పైకి వచ్చి దేశీయుల సమకూర్చి ఫ్రెంచివారి నెదుర్కొనెను. ఇతఁడు ౧౮౩౨ లో ఒరానుఇలాకాను ముట్టడింప ఫ్రాన్సువారితో ఘోరయుద్ధ మర్యోను. చివరకు ౧౮౩౪ లో ఫ్రెంచివారితనితో సంధిచేసికొని 'మస్కరా అమీర్' అనుపేరుతో షెలిఫ్‌నదికి పడమట నున్న అరబ్ జాతుల నన్నింటిని పాలించుట కొప్పుకొనిరి. కాని వెంటనే మరల యుద్ధము లారంభము కాఁగా జయాపజయము లిరువురకును గలుగుచువచ్చెను. అందువలనను, ౧౮౩౬ లో కాన్‌స్టెంటైనుతో పోరాడవలసివచ్చుటచేతను, తీరమందలి కొన్ని పట్టణములకుఁ దక్క తక్కిన పడమటి అల్జీరియాకంతకు ఫ్రెంచివా రతనినే పాలకునిగ స్వీకరించిరి. ఫ్రెంచివారు కాన్‌స్టెంటైనును జయించి తక్కినఇలాకా నంతను గోఁబట్టుకొను ప్రయత్నములం దుండ అబ్దుల్ కాదిరు యుద్ధసన్నాహములఁ జేయుచు ౧౮౩౯ లో ఆకస్మికముగ ఫ్రెంచియిలాకాలో ప్రవేశించి దానిని తనవశము చేసికొన మొదలిడఁగాఁ గొంతకాలము ఫ్రెంచిప్రభుత్వము నష్టమైపోయినట్లే కన్పించెను. కాని ౧౮౪౧లో జనరల్ బ్యూగోడ్ (General Bugeaud) అనునతఁడు ఫ్రెంచివారిపక్షమున గవర్నరు-జనరలుగ ఆదేశమునకు వచ్చినదిమొదలు కొని వ్యవహారములు ఫ్రెంచివారిపక్షమునకుఁ దిరుగసాగెను. కొన్ని నెలలు పోరాటములు జరిగినపిదప ఆసంవత్సరాంతముననే అబ్దుల్ కాదిరుయొక్క అంతిమదుర్గముగూడ ఫ్రెంచివారివశ మయ్యెను. తరువాత నితఁడు మొరాకో నంటియున్న ప్రాంతమునం దుండి ఫ్రెంచివారి నెదిరించెను కాని మఱుసటిసంవత్సరము దానినిగూడఁ గోలుపోయి మొరాకోలోనికి పోయెను. అక్కడనుండి ఇతఁడు రెండుపర్యాయములు అల్జీరియామీఁద దండెత్తి రెండవమాఱు ఫ్రెంచివారిని రెండుచోట్ల నోడించి పోయి ౧౮౪౪-నాఁటికి మొరాకోలో నొకసేనను ప్రోగుచేసెను. బ్యూగేడు సరిహద్దును దాఁటి ఈతనిసేనల నాశనముచేయుచుండ నదేసమయమున ఫ్రెంచివారి నౌకాదళములు మొరాకోతీరపట్టణములమీఁద బాంబులను గురియసాగినవి. ఆకారణమున మొరాకోచక్రవర్తి సంధి కొప్పుకొనవలసినవాఁడై అబ్దుల్ కాదిరునకు సాయము చేయకుండుటయే కాక అతని నెదిరింప ఫ్రెంచివారికి సాయపడుటకు సమ్మతించెను. ఈప్రకారము సర్వవిఘ్నముల నిస్సహాయుఁడై తుదకు అబ్దుల్ కాదిరు ౧౮౪౭ లో ఫ్రెంచివారికి లోఁబడిపోవ వా రతనిని ఖైదీగ ఫ్రాన్సునకుఁ దీసికొనిపోయి ౫,౬ సంవత్సరములపాటుంచి తరువాత అల్జీరియాకు మరలిపోవనని యతనిచేత నొప్పందము చేయించుకొని వదలివైచిరి. కాని దేశమం దింకను అల్లరులు జరుగుచునేయుండెను. దక్షిణమందలి కబైలులును, అరబ్బులును విదేశీయులు తమమీఁద వేయుపరిపాలనవిధానభారమును మోయుటకు సహింపక పెక్కుమాఱు లెదురుతిరుగుచువచ్చిరి. ఇందువలన పెలిస్సిర్, కన్రోబర్ట్, సెంట్ఆర్‌నాడ్, మెక్‌మోహన్ మున్నగు ఫ్రెంచిసేనాపతులకు చక్కని యుద్ధశిక్షణము కలుగు నవకాశము లభించెను. ౧౮౬౪ నందు పెలిస్సిరుతరువాత గవర్నరుజనరల్ పదము నధిష్ఠించిన మెక్‌మోహన్ ఒకగొప్పరాజవిద్రోహము నణఁగఁద్రొక్కెను. ఇదేసమయమున మూఁడవ నెపోలియన్ చక్రవర్తి అల్జీరియాను సందర్శించి దేశీయులకు నిజమైన దుఃఖకారణములు కలవనియు, ఫ్రెంచిపరిపాలకులు వాని నుపేక్షించిరనియు గుర్తించి పరిపాలనవిధానమం దనేకపరివర్తనములను గావించెను. కాని ౧౮౭౧ వఱకు క్రొత్తక్రొత్తపోరాటములు కలుగుచునేవచ్చెను. ఆసంవత్సరము ఫ్రాంకో-ప్రష్యను యుద్ధము సంభవించుటచేత, అల్జీరియాలో ఫ్రెంచిసైనికులయభావము కాఁగా తత్పరిపాలనమును ద్రోసివేయుటకు ప్రబలప్రయత్నములు జరిగెను. కాని యవి సంపూర్ణముగ నణఁచివేయఁబడినవి. మఱియు నిన్నికలహములకును కారణభూతమైన మిలిటరీరాజ్యవిధానమునకు బదులుగ ఉత్తరభాగమున సివిల్ ప్రభుత్వమేర్పాటు కావింపఁబడినది. దేశాటులతో నిండియున్న దక్షిణభాగమం దిప్పటికిని సైనికప్రభుత్వమే కలదు. ౧౮౮౧ లో ఫ్రెంచివారు ట్యూనిస్‌నగరమును ముట్టడింప అల్జీరియాపడమటిభాగమున విద్రోహముత్పన్న-మయ్యెను. దీనివలన ఫ్రెంచివారికిఁ గాని, వలస వచ్చి నివసించినవిదేశీయులకుఁ గాని అధిక మగునష్ట మేమియు కలుగలేదు. అదిమొదలుకొని నేఁటివఱకు నచట శాంతియే విరాజిల్లుచున్నది. కాని ఫ్రెంచివారి కచట ఒకపెద్దసేనను నిలిపి దానిని పోషింపవలసిన భారమూమాత్రము తప్పలేదు. జర్మనీతో జరిగినయుద్ధమునందు అల్జీరియనులు చాలసాయముఁ గావించినందున ప్రభుత్వమునందు క్రొత్తమార్పు లనేకములు కలిగెను. ౧౯౧౯ లో కావింపఁబడిన చట్టము ననుసరించి అల్జీరియనుదేశీయుల కందఱకును కొన్నిషరతుల మీఁద ఫ్రెంచిపౌరులహక్కులు లభించినవి

అల్లా — బొంబాయి, కొల్హాపూర్ సంస్థానమందలి యొక గ్రామము. వరుణానదిమీఁద నున్నది. జనసంఖ్య ౪,౯౮౫. ఇచ్చట రమ్‌జాన్‌దర్గా అను మహమ్మదీయులమసీదును, సిదోబా, ధులాబా, అల్లమప్రభు, రామలింగదేవాలయములును కలవు. అల్లమప్రభువు దేవాలయమునకు ఔరంగజేబు మెట్లు కట్టించెనఁట! దీనియెదుట ౧౭౦౭ వఱకును భక్తులు కొండలు ప్రాణములతోనే సమాధిం జెందుచుండిరఁట. రామలింగదేవాలయము కొండలో తొలవఁబడినది.

అల్టెన్, సర్ చార్లెస్ (౧౭౭౦ - ౧౮౪౦) — ప్రష్యాదేశపు రాజనీతిజ్ఞుఁడు. ఇతఁడు మొదట రాజ్యమందలి ఆర్థికశాఖకు మంత్రిగను, తరువాత మతవిద్యాశాఖలకు మంత్రిగను ఉండెను. విద్యాపీఠములకు గొప్పయుపకార మొనరించెను. ఈతఁడు ౧౮౧౯ లో నొకవిద్యావిధానము నేర్పఱిచెను. దాని ననుసరించియే ప్రష్యాలో నిప్పటికిని విద్య చెప్పఁబడుచున్నది. యూరపుదేశము నందలి పెక్కుదేశములు దాని నవలంబించెను.

అల్లూర్తి — నెల్లూరుజిల్లా రాపూరుతాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౭౫౧ (౧౯౩౧).

అల్లూరుపాడు — నెల్లూరుజిల్లా వెంకటగిరితాలూకాయందలి జమీందారీగ్రామము. జనసంఖ్య ౧౪౭౨ (౧౯౩౧).

sampath_Ebooks

**అల్పగ్రహములు** — ఆకారము : అంగారకగ్రహమునకును బృహస్పతిగ్రహమునకును నడుమ చిన్నచిన్నగ్రహములసంఖ్యములు కలవు. వానికి నల్పగ్రహము లని పేరు. వీనిని ఇంగ్లీషులో మైనర్ ప్లానెట్స్ (Minor Planets) అనియెదరు. నేఁటివఱకు శాస్త్రజ్ఞులు రమారమి ౭౦౦ ల అల్పగ్రహములఁ గనుఁగొనిరి. మన నవగ్రహములతోఁ బోల్చిచూచినయెడల నివి మిక్కిలి చిన్నవి. గ్రహము లన్నింటిలోను బుధుఁడు చిన్నవాఁడు. ఈగ్రహముయొక్క వ్యాసము (Diameter) ౨,౯౭౬ మైళ్లు పొడవు. అల్పగ్రహములలోఁ బెద్దదానివ్యాసము ౪౮౫ మైళ్లు. ౨,౪ మైళ్లు వ్యాసముగలవి పెక్కులు కలవు. ౧౯౦౦ ల సంవత్సరమున డాక్టరు కలగు అను జ్యోతిషికునిచేఁ గనిపట్టఁబడిన యల్పగ్రహముయొక్క వ్యాసము ౫౫౦ గజములు పొడవు! ఇదివఱకుఁ గానిపించిన యేడువందల యల్పగ్రహముల నన్నింటినిఁ గలిపి యొకముద్ద చేసినయెడల నాముద్ద మనభూగోళమునకన్న నిరువదిరెట్లు చిన్నదిగ నుండును!

కనుఁగొనినవిధము :— పందొమ్మిదవశతాబ్ది యారంభమువఱకును ఈయల్పగ్రహములున్న సమాచారము శాస్త్రజ్ఞు లెఱుఁగనేయెఱుఁగరు. కాని అంగారకునకును బృహస్పతికిని నడుమ ముప్పదినాల్గుకోట్ల పదునేనులక్షలమైళ్ల యంతర మున్నందున, నీగొప్పయంతరములో నొకగ్రహము తప్పక యుండవచ్చు నని జ్యోతిషికు లాకాశమున వెతకఁ బొచ్చిరి. ఇటలీదేశజుఁ డయిన పియజ్జి యను జ్యోతిషికునకు ౧౯-వ శతాబ్ది ప్రారంభదినమున (౧-వ జనవరి, ౧౮౦౧) ఒక యల్పగ్రహము కానవచ్చెను. దీనికి సెరిస్ (Ceres) అని నామకరణము చేసిరి. ఇట్లే నేఁటివఱకును రమారమి ౭౦౦ ల అల్పగ్రహములు కానవచ్చినవి. ఇవన్నియు పెద్దగ్రహములవలెనే సూర్యునిచుట్టును తిరుగుచుండును. అన్నియు నంగారకబృహస్పతులకు నడుమనుండు ఆకాశమునం దున్నవి. ప్రతిసంవత్సరమునను క్రొత్తవి కానవచ్చుచున్నవి.

వీని యుత్పత్తి :— ఇట్లు వందలకొలఁది యత్యల్పగ్రహములు కుజబృహస్పతుల మధ్య నెట్లు పుట్టినవి ? అన్నప్రశ్నకుఁ బలువురు పలువిధముల జవాబు చెప్పెదరు. పూర్వ మొకప్పు డివి యన్నియుఁ గలసి యొకపెద్దగ్రహముగ నుండె ననియు, దానిపై మఱియొకగోళము పడుటవలననో మఱియేహేతువుచేతనో యది పగిలి శకలములై యన్నియల్పగ్రహము లైయుండు ననియు కొందఱు శాస్త్రజ్ఞుల యభిప్రాయము.

చదువరు లల్పగ్రహములకును, లఘుగ్రహములకును, ఉపగ్రహములకును గలభేదమును దెలిసికొనవలెను. తొమ్మిది అసలు గ్రహములలో బుధశుక్రభూకుజులకు లఘుగ్రహము లనియు, నితర గ్రహములకు గురుగ్రహము లనియుఁ బేళ్లు. ఆకారమునందుఁ గొంచెము చిన్నవి, కొంచెము పెద్దవి యని యర్థము. ఒకగ్రహము చుట్టును తిరుగు మఱియొకగ్రహమున కుపగ్రహ మని పేరు.

**అల్ప్ అర్స్లన్** (౧౦౨౯ - ౧౦౭౨) — పెరిషియాదేశపు సుల్తాను. ముస్లిముమతము నవలంబించి మహమ్మదునామమును ధరించెను. కప్పడోషియా, ఆర్మీనియా, జార్జియారాజ్యములను జయించెను. రోమనుచక్రవర్తి రోమేనస్‌నుకూడ జయించెను. తన పూర్వుల నివాసస్థలమయిన తుర్కీస్తానమును జయింపఁబోయినప్పుడు కైదీగఁ బట్టువడిన యొక దుర్గాధ్యక్షునిచేత నధింపఁబడెను.

**అల్ ఫరాబీ** (క్రీ. శ. ౯౦౦ - ౯౫౦) — అరబ్బీ తత్త్వవేత్త. తనకాలమందలి శాస్త్రము లన్నిటిని చేర్చి యీతఁ డొక విజ్ఞానసర్వస్వమును రచించెను. ఇతఁడు బాగ్దాద్, డెమాస్కస్‌పట్టణములందు నివసించుచుండెను. ఈతఁ డరిస్టాటిల్‌గ్రంథముల నరబ్బీవారికి నేర్పెను.

**అల్ఫాన్సో** (౧౮౫౭ - ౧౮౮౫) — ఇతనిని ౧౨-వ అల్ఫాన్సో అందురు. ఇతఁడు స్పెయిన్‌దేశపురాజు. ఇతఁడు ౧౮౫౭ లో జన్మించెను. తల్లి ఇసాబెల్లా. ఆమెను దేశమునుండి వెడలఁగొట్టిరి. అప్పుడు చిన్నవాఁడైన అల్ఫాన్సోగూడ ఆమెవెంట వెళ్లెను. ౧౮౭౪ లో ఈతనిని రాజుగ నెన్నుకొనిరి. ఈతఁడు మిక్కిలి తెలివిగలిగి రాజ్యపాలనము చేసెను.

**అల్ఫాన్సో** (ఆరగాన్) — స్పెయిన్‌దేశమునందు పూర్వము విడిప్రభుత్వముగా నుండిన ఆరగాన్ అనురాజ్యమును అల్ఫాన్సో అను పేరుగల అయిదుగురురాజులు పాలించిరి. వారిలో నిద్దఱు ముఖ్యులు :—

౧. ఈ పేరుగలవారిలో మొదటివానికి (క్రీ. శ. ౧౧౦౪ - ౧౧౩౪) విజయుఁ (The Victorious) డను బిరుద ముండెను. ఇతఁడు స్పెయిన్‌దేశజు లైన మూరులు అనంబడు మహమ్మదీయులతోఁ బోరాడి వారిని పెక్కు పర్యాయములు పరాభవించి శారగోసా, టెరాగోసా అనువానిని స్వాధీనపఱుచుకొనెను. ఈతఁడు ౨౯ యుద్ధములలో విజయి యయ్యెను.

౨. ఈతఁడు (౧౪౧౬ - ౧౪౫౮) ఈ పేరుగల ౫-వ యతఁడు. క్రీ. శ. ౧౩౯౫ లో జన్మించెను. ఈతనికి 'ఉదారుఁడు' అన్న బిరుదు గలదు. ఇతనితండ్రి ఫర్డినెండు. ౧౪౧౬ లో రాజ్యమునకు వచ్చెను. ఇతఁడు ఆరగాన్, సిసిలీ, నేపిల్సు అను మూఁడురాజ్యములపై ప్రభుత్వము చేసెను. ఇతఁడు విజ్ఞానవంతుఁడు, విద్యాప్రియుఁడు, విద్వత్పోషకుఁడు. విజ్ఞానపునరుజ్జీవనమని (Renaissance) యూరోపుదేశచరిత్రలో ప్రఖ్యాతిఁ జెందినయుగమునందు విద్యాభివృద్ధిఁ జేసిన రాజులలో నితఁ డొకఁడు. కాన్‌స్టాంటినోపిల్ పట్టణమును తురుష్కులు పట్టుకొనినతరువాత నచ్చటనుండి పాఱిపోయిన పండితవర్యుల కితఁ డాశ్రయ మిచ్చెను.

**అల్ఫాన్సో** (పోర్చుగల్) — పోర్చుగల్‌దేశమున నీ పేరుగలరాజు లాఱుగురు రాజ్య మేలిరి.

sampath_Ebooks

౧. ఇతఁడు (౧౦౯౪ - ౧౧౮౫) అంతవఱకు లియాన్ రాజ్యమునకు లోఁబడియున్న పోర్చుగల్‌ను స్వతంత్రముగఁ జేసెను. గొప్ప యోద్ధ. ఆజానుబాహుశరీరము గలవాఁడు. పెక్కు యుద్ధములలో మూరులతోఁ బోరాడి ఖ్యాతి నడసెను.

౨. ఇతఁడు (౧౧౮౫ - ౧౨౧౩) మతగురువులయధికారమును తగ్గించుటకు ప్రయత్నించెను. అందుచే నితనిని వెలివేసిరి.

౩. ఇతఁడు (౧౨౧౦ - ౧౨౭౯) తనకాలమును చాలవఱకు మూరులతో యుద్ధముచేయుటలోఁ గడపెను.

౪. ఇతఁడు (౧౨౯౦ - ౧౩౫౭) కేస్టిలే రాజులతోను, మూరులతోను పోరాడుటయందు తనకాలమును చాలవఱకుఁ గడపెను. ఇతనికుమారుఁడైన పేటరునకును, ఇతనికిని గృహకలహము సంభవించెను.

౫. ఇతఁడు (౧౪౩౨ - ౧౪౮౧) ఆఫ్రికాలోని మూరుల రాజ్యముమీఁదికి దండెత్తి వెడలినందున నీతనికి 'ఆఫ్రికేనో' అన్న బిరుదు వచ్చెను.

౬. ఇతఁడు (౧౬౪౩ - ౧౬౭౫) దుర్మార్గుఁడగుటచే ౧౬౬౭ లో రాజ్యపదభ్రష్టుఁడు కావలసివచ్చెను. తరువాత సెన్‌సిరా పట్టణములో కాలము గడపి ౧౬౭౫ లో మరణించెను.

అల్ఫాన్సో (లియాన్) — స్పెయిన్ దేశమునందు పూర్వము స్వతంత్రములుగ నుండిన లియాన్, కేస్టిలే అను రాజ్యములపై అల్ఫాన్సో అనుపేరుగల రాజులు ౧౧ గురు రాజ్యము చేసిరి.

౧, ౨. మొదటియిద్దఱనుగుఱించి విశేష మేమియు తెలియదు. వారి ప్రభుత్వకాలము క్రీ. శ. ౭౩౯ - ౮౪౨ వఱకును జరగిన శతాబ్దియందుండెననిమాత్రము తెలియుచున్నది.

౩, ౪, ౫. తరువాత ముగ్గురు అల్ఫాన్సోలు ౮౬౬ - ౧౦౨౮ కాలమునందు పాలనముఁ జేసిరి. దేశముమీఁది కెత్తివచ్చిన మూరులను మహమ్మదీయులతో వీరికాలమునఁ బోరాట మారంభ మయ్యెను.

౬. ఇతఁడు (౧౦౬౫ - ౧౧౦౯) మూరుల నెదిరించుటలో నాయకుఁడుగ నుండెను. స్పెయిన్‌దేశజులను పోపునకు పూర్తిగ లోఁబడునటులు చేసెను. స్పెయిన్‌వారికి ఫ్రాన్సువారి నాగరకత నేర్పెను.

౭. ఇతని (౧౧౨౬ - ౧౧౫౭) ఉభయమతముల ప్రజల రాజన్నబిరు దుండెను. క్రైస్తవులతోపాటు మూరు లనుమహమ్మదీయులనుగూడ న్యాయముగఁ బరిపాలించెను. మూరులతిరుగఁబాటు నణఁగఁగొట్టఁ బ్రయత్నించుచుండఁగఁ జంపఁబడియెను.

౮. ఈతఁ (౧౧౫౮ - ౧౨౧౪) డింగ్లాండురాజైన ౨-వ హెన్రీకొమార్తెను వివాహమాడెను. మూరులపై దండెత్తుటకు నేకమైన క్రైస్తవరాజులకూటము (Coalition) నకు నాయకుఁడుగ నుండి మూరులఁ బూర్తిగఁ బరాభవించెను.

౯. ఈతని (౧౧౮౮ - ౧౨౩౦) వివాహమునుగుఱించి పోపునకును ఇతనికిని వివాదము గలిగెను.

౧౦. ఇతఁడు (౧౨౫౨ - ౧౨౮౪) విద్యావంతుఁడు. బృహస్పతి (The wise) అన్న బిరుదు గాంచెను. జ్యోతిశ్శాస్త్రమందలి గణితస్కంధము నభివృద్ధిఁజేయుటకు సాయము చేసెను. తనసరదారులతో పెక్కు తగాదాలు పెట్టుకొనెను. జర్మనుసామ్రాజ్యము సంపాదింపవలయునని యత్నించుటకు ధనము గావలసివచ్చి ప్రజలపై నెక్కువగ పన్నులు విధించెను. అందుచే లోకద్వేషమును సంపాదించెను.

౧౧. ఇతఁడు (౧౩౧౨ - ౧౩౫౦) తిరుగఁబాటు చేసిన సరదారులను కఠినముగ శిక్షించెను. ఆఫ్రికాదేశమునుండి వచ్చిన మూరుల చివరదాడి నోడించెను.

అల్బతేనియస్ (౮౫౦ - ౯౨౯) — ఇతని పూర్ణమైన నామము మహమ్మద్ బెన్ జెబిర్ అల్‌బతాని. అరేబియా దేశజుఁడు. జ్యోతిశ్శాస్త్రవేత్త. మెసపొటేమియా దేశమునందలి అరక్టె యనుస్థలమున నీతఁడు నక్షత్రములవేధ కముంగొని జ్యోతిశ్శాస్త్రమునందు క్రొత్తపరిశోధనలను జేసెను. టాలెమిచే రచింపఁబడిన గ్రహపట్టికములు దృక్ప్రత్యయమునకు వచ్చుటలే దని ఈతఁడు తనవేధల ననుసరించి క్రొత్తపట్టికము లేర్పఱచెను. ఈతని మతమున అయనమునకు ౬౬ సంవత్సరములలో ఒక్క అంశము గతి కలదు; పరమక్రాంతి ౨౩°౩౫', సాయనసూర్యోచ్ఛము ౮౨°౧౭'. ఈతఁడు సాయనసంవత్సరప్రమితి ౩౬౫ దినములు ౫ గంటలు ౪౬ నిమిషములు ౨౪ సెకనులు అని నిర్ణయించెను. ఇది నిజమైనమితి కంటె ౨ నిమిషములు ౨౬ సెకనులుమాత్రము తక్కువగ నున్నది. ఇతఁడు గొప్ప గణితజ్ఞుఁడు. త్రికోణమితి (Trigonometry)లో నూతనాంశములను గనుఁగొనెను. జ్యోతిషవిషయమై పెక్కు గ్రంథములను వ్రాసెను. వానిని ౧౨-వ శతాబ్దివాఁడైన ప్లేటో టిబర్టినస్ అనునతఁడు ల్యాటిన్‌భాషలోనికి భాషాంతరీకరించెను.

**అల్బిరూని** (క్రీ. శ. ౯౭౩ - ౧౦౪౮) — ఇతని సంపూర్ణనామము అబూరైహాన్ మహమ్మద్ బిన్ అహమ్మద్ అల్ బిరూని. గజ్నీమహమ్మదునాస్థానవిద్వాంసుఁడు. జ్యోతిశ్స్కంధమందు మిక్కిలి ప్రజ్ఞ కలవాఁడట. రేఖాగణితము, తర్కము అనుశాస్త్రములందును మిక్కిలి ఖ్యాతి చెందెను. ఇతఁడు పెక్కుదేశములు చూచుటయేకాక హిందూదేశమునకు వచ్చి ఎన్నియోసంవత్సరములవఱకు నిచ్చట నుండి యనేకశాస్త్రముల నభ్యసించెను. 'తారిఖ్-ఉల్-హింద్' అను హిందూదేశచరిత్రగ్రంథము వ్రాసెను. పెక్కు గ్రీకు గ్రంథములను భాషాంతరీకరించెను. అఫ్‌గానిస్తానమున ౧౦౪౮ లో చనిపోయెను.

అల్బుమజార్ (౮౦౫ - ౮౮౫) — విఖ్యాతి చెందిన అరబ్బీజ్యోతిర్విదుఁడు. ఇతనిగ్రంథములు ల్యాటినులోనికి భాషాంతరీకరింపఁబడెను (౧౪౮౯).

sampath_Ebooks

**అల్బ్యుకర్కు, అల్ఫాన్సోడి** (క్రీ. శ. ౧౪౫౩ - ౧౫౧౫) — పోర్చుగీసు వైసురాయి. ౧౪౫౩-వ సంవత్సరమున లిస్బనుదగ్గఱ నున్న అలెగ్జాండ్రియాయందు జన్మించెను. అయిదవ అల్ఫాన్సోకొలువున విద్య గఱచెను. ౧౫౦౩ లో మొట్టమొదటి మాఱు ఆతఁడు ప్రాగ్దేశములకు నౌకాయాత్ర కావించెను; గుడ్‌హోపు అగ్రమును జుట్టివచ్చి హిందూదేశమునకుఁ జేరుకొనెను. హిందూదేశమునందలి కొచ్చినునందు 'పోర్చుగీసువారికోట' కట్టుకొనుటకు ఆ దేశపురాజునంగీకారమును బడసెను. ౧౫౦౪-వ జూలై మాసమున మరల పోర్చుగలుదేశమునకుఁ బోయెను. ౧౫౦౬ లో ట్రిస్టడకున్హా యాధిపత్యమున హిందూదేశమునకు బయలుదేఱిన ౧౬ నౌకలదళమున అయిదునౌకల కతనికి నాయకత్వ మొసంగఁబడినది. ఆఫ్రికాతూర్పు తీరమున అరబ్బులనగరములపై నెత్తివెళ్లి పెక్కుపోరాటములు జరపినపిదప అల్బ్యుకర్కు డకున్హానుండి విడిపోయి, పారసీకసింధుశాఖయందలి ఆర్మజ్ దీవిని ౧౫౦౭ లో వశపఱచుకొనెను. ఈదీవి యాకాలమున ప్రాగ్దేశవర్తకమునకు ప్రధానమయిన స్థానములలో నొకటి. కాని యది కొలఁదికాలమే యతనివశమున నుండెను.

మతిరొకమాఱు పడవలను చేర్చి తన నౌకలను వృద్ధి చేసి అల్బ్యుకర్కు ౧౫౦౯-వ సంవత్సరాంతమున మలబారు తీరమును జేరెను. ౧౫౧౦-వ సంవత్సరము జనవరి నెలలో కల్లికోటను ముట్టడించెను గాని, నెగ్గలేదు. పిదప నతఁడు గోవాను వశపఱచుకొనెను; అటుపిమ్మట మలాకాపై నెత్తివెళ్లి, తీవ్రముగఁ బోరాడిన



అల్బ్యుకర్కు

యనంతరమున విజయమును బడసెను. ౧౫౧౨ లో నితఁడు మలబారుదేశమునకు మరలిపోయెను. తనవిజయము లన్నిటియందును కొల్లగొన్న ధనముతో నితఁడు 'ఫ్లోర్ డి లామార్' అను నౌకమీఁద వచ్చుచుండఁగా అది పగిలిపోయినది. తుదకతఁడే ప్రాణములతోఁ దప్పించుకొనుట కష్టమయ్యెను. నౌకాపోకలకును, వర్తకమునకును ఎఱ్ఱసముద్రము ప్రత్యేకముగ పోర్చుగీసువారి యధీనమునందే యుండుటకై దానిని వశపఱచుకొనవలసిన దని పోర్చుగలుదేశపురాజాజ్ఞ ననుసరించి అల్బ్యుకర్కు తత్సముద్రాభిముఖముగ దండయాత్ర నడపి ౧౫౧౩ లో ఏడెనునగరమును ముట్టడించెను. కాని యతనికి పరాజయము కలిగెను. ౧౫౧౫ లో అల్బ్యుకర్కు ఆర్మజుదీవిపయి కెత్తి వెళ్లి మరల దానిని వశపఱచుకొనెను. అప్పటినుండి యాదీవి ౧౬౨౨ వఱకును పోర్చుగీసువారి యధీనమునందే యుండెను. పోర్చుగల్లురాజుకొలువున అల్బ్యుకర్కునకు శత్రువు లనేకు లుండిరి. వారి కుట్రలవలన నతఁడు పదభ్రష్టుఁ డయ్యెను. ఆర్మజును జయించి యతఁడు గోవానౌకాశ్రయస్థానమునఁ బ్రవేశించునప్పటికి, నతనికి బదులుగ నతనిశత్రు వయిన సోరెజు నతనిస్థానమున నియమించినట్లు పోర్చుగల్లురాజునొద్దనుండి వచ్చిన యుత్తరువు లతని కందినవి. అతఁడు ౧౫౧౫-వ సంవత్సరము డిసెంబరు ౧౬-వ తేదిని సముద్రముమీఁద నుండఁగనే చనిపోయెను. చనిపోవుటకు ముందతఁడు తనప్రవర్తనయం దెట్టిలోపమును లేదనియు, తన కన్యాయము జరిగిన దనియు తెలుపుకొనుచు రాజున కొకలేఖ వ్రాసి, యందు తనకు రావలసిన గౌరవసన్మానములను దనకుమారున కిచ్చుట న్యాయ్యమని విన్నవించుకొనెను. అతనిశరీరమును గోవాయందు సమాధి కావించిరి.

**అల్మగ్రో** (౧౪౭౫ - ౧౫౩౮) — స్పెయినుదేశజుఁడు. అమెరికాలోని పెరూ, చిల్లీ మొదలయినదేశములను సాధించుటలో పిజ్జారో అనువానికి సాయపడెను. కాని తుదకాతనితోఁ బోరాడి యోడి ఉరితీయఁబడెను.

**అల్లాజిపేఁట** — విశాఖపట్టణముజిల్లా చీపురుపల్లి తాలూకాలోని జమీన్దారీగ్రామము. ఇందలిజనసంఖ్య ౨౫౬ (౧౯౩౧).

**అల్మ్‌క్విస్ట్, కార్ల్ జోనస్ లడ్‌విగ్** (౧౭౯౩ - ౧౮౬౬) — స్వీడిష్ దేశజుఁడు. గ్రంథకర్త. ఇతఁడు నవలలు, నాటకములు, వైణికకావ్యములు, తత్త్వనీతి, భావ, విద్యాప్రతిపాదకములయిన పెక్కుగ్రంథములను వ్రాసెను.

**అల్మెయిడా - గ్యారెట్** (౧౭౯౯ - ౧౮౫౪) — పోర్చుగల్ దేశజుఁడు, కవి, నాటకకర్త, రాజ్యతంత్రజ్ఞుఁడు. ఈతనిచే రచింపఁబడిన నాటకములలోఁ గొన్ని ఆధునికపోర్చుగీస్ నాటకవాఙ్మయమునం దుత్తమోత్తమము లని యెంచఁబడుచున్నవి. ఆటో డి జిల్ విసెంటే అనునది పోర్చుగల్ దేశమునందలి జాతీయ నాటకములలో శ్రేష్ఠమైనదిగ పరిగణింపఁబడుచున్నది. దేశమందలి రాజకీయాందోళనములలోఁగూడ నీతఁడు శ్రద్ధ వహించెను.

**అల్మోడా** — సంయుక్తప్రాంతమందలి అల్మోడాజిల్లాకు ముఖ్యపట్టణము. సముద్రపుమట్టమునకు ౫,౪౯౪ అడుగుల యెత్తునఁ బర్వతశిఖరమున నున్నది. జనసంఖ్య ౮,౩౫౯ (౧౯౨౧). క్రీ. శ. ౧౭౪౪-వ సంవత్సరమున దీనిని మొట్టమొదట రోహిల్లాలు ముట్టడించి దోచుకొనిరి. కాని కొలఁదికాలములోనే అల్మోడాప్రాంతమునఁ గల

sampath_Ebooks

దారిద్ర్యమువలనను, నాతావరణము సరిపడకపోవుటచేతను అచ్చటి ప్రజలు మరణించిరి. క్రీ. శ. ౧౮౧౫-వ సంవత్సరమున జరిగినగూర్ఖాయుద్ధములోఁగూడ నీనగరము ప్రాముఖ్యము వహించెను. తుదకు ఏప్రిలు ౨౬-వ తేదీనాఁడు గొప్పయుద్ధము జరిగినతరువాత అల్మోడా యాంగ్లేయుల యధీన మైనది. అల్మోడాజిల్లా వైశాల్యము ౫,౩౮౯ చ. మైళ్లు. జనసంఖ్య ౫,౩౦,౩౩౮ (౧౯౨౧).

**అల్యాబాదో** — గంజాంజిల్లా ఛత్రపురంతాలూకా లోని గ్రామము. జనసంఖ్య ౧,౨౬౬ (౧౯౩౧).

**అల్యూమినా** — ఇది యొక్కటే అల్యూమినియము ధాతువుయొక్క అమ్లజిదము ( Oxide ). ప్రాకృతికావస్థయం దిది కురువింద ( Corundum ) మనియు, స్ఫాటిక దశయందు ( Crystal form ) కెంపు ( Ruby ) లేక నీల ( Saphire )మనియు, అష్టవిధస్ఫటికాకృతులకంటె భిన్నమైనస్థితియందు కురువింద వికార ( Emery ) మనియు పిలువఁబడుచుండును. కఠినత్వమందు వజ్రమునకుఁ దరువాత దీనిని మించినది లేదు. కావున అద్దములను గోయుట కిది బాగుగ నుపయోగపడుచుండును. శైలికము ( Silica )తోఁ గలసి ప్రపంచమునం దంతట విస్తారముగ వ్యాపించియుండు పదార్థములలో నిదియు నొకటి. నల్లఱాయి ( Granite ), నాపఱాయి ( Trapstone ), పలకఱాయి ( Slate stone ) లోనుగాఁగల శిలలలో నిది అమితముగ వ్యాపించియుండును. పింగాణీరేగడయందు సగముకంటె నెక్కువభాగము ఈ అల్యూమినాకు చెందియుండుట చేత అరేగడ కంతటి ప్రశస్తగుణధర్మములు కలుగుటకుఁ గారణ మైనది.

అల్యూమినాయు, ఉజ్జనయామ్లజిదము ( Hydroxide )ను వనస్పతివర్ణములతోఁ ( Vegetable colours ) గలసి 'లేకులు' ( Lakes ) అని పిలువఁబడునీళ్లలో కరఁగని సమ్మేళనములు ( Indis-soluble Compounds )గ నేర్పడు గుణధర్మములు గలిగియుండు టంజేసి అద్దకమునందును కాలికోముద్రణమందును వర్ణోపాధులుగ ( Mordants ) వాడఁబడుచుండును. వీని యుపాధుల సాయముతో వేయఁబడురంగులు వెలిసిపోక స్థిరముగ నిలచియుండును. పటికపు ద్రావణమునందు ( Alum solution ) ఎమ్మోనియాను గలుపుటవలన ఉజ్జనయామ్లజిదము ( Hydroxide ) తెలుపురంగుతో నడుగునకు దిగును. అదిగినదాని నెండఁబెట్టుటచేతఁగాని వేఁడిచేయుటచేతఁ గాని యందలి ఉజ్జనమును ( Hydrogen ) వేఱుచేయవచ్చును.

అల్యూమినాను శుష్కవిధానమున ( Dry Process ) తయారుచేయుటకుఁగాను నూఱింట మూఁడుపాళ్లకంటెఁగూడ తక్కువశైలికమును గలిగియుండు బోక్సైటును ( Bauxite ) సోడాసహితముగ బట్టీలో వేయించి అనంతరము నీటిద్వారా పిండుటవలన (Leaching) సోడియముస్ఫటికము వచ్చును. కాస్టిక్‌సోడా ద్రావణముతో బోక్సైటు నుడికించి అల్యూమినాను దీయుటకు వీలగు ఆర్ద్రపద్ధతి ( Wet Process ) యొకటి కలదు. ఈరెండువిధముల నేర్పడు ద్రావణముల నుండి రెండుభిన్నమార్గముల అల్యూమినాను దీయవచ్చును. అందొక విధ మెట్లన, కర్బనద్వ్యమ్లజిదపువాయువును ( Carbon dioxide gas ) ద్రావణమునందు పూరించుటవలన ఉజ్జనయామ్లజిదము (Hydroxide) అడుగునఁ జేరుకొనును. రెండవపద్ధతి ననుసరించి ఆద్రావణము నించుక జలమిళితము ( Dilute )గావించి ఉజ్జనయఅల్యూమినాను కొంచెము గలిపి కలయఁబెట్టినయెడల ద్రావణమందలి చాలభాగ మల్యూమినా అడుగునఁజేరుకొన మీఁద నొకద్రవము నిలిచిపోవును. ఆద్రవము నివిష్టమై ( Concentrated ) మరల బోక్సైటును గ్రసింపఁగలుగును. వేఱొండువిధానమున బోక్సైటు, కర్బనము ( బొగ్గు ) నత్రజనములను ౧౬-౧౯ నండల డిగ్రీలవేఁడిమిలో అంతఃప్రతిక్రియలకు ( Inter-re[illegible] ) గురిచేసి తన్మూలమున నుత్పన్నమగు స్ఫటనత్రజిదము [illegible] నందు సోడియం ఉజ్జనయామ్లజిదము [illegible] మైన నామము మహమ్మద్ బెన [illegible] పెనవేసినయెడల సోడియము స్ఫటికము దేశఁడు. జ్యోతిశ్శాస్త్రవేత్త. [illegible]ను. ఈసంసర్గమున ఎమ్మోనియా అప్రయత్నముగ ఉపఫలము ( By-product )గ లభించును. ఈ సోడియము స్ఫటికమునుండి అల్యూమినా తత్క్షణ ముత్పన్నమై అల్యూమినియము ధాతూత్పత్తినిమిత్తము విద్యుద్విశ్లేషణ నొందుటకు సర్వధా యోగ్యమై యుండును.

బోక్సైటునుండి అల్యూమినాను విడఁదీయుటకుఁగాను వేఱొక విశేషపద్ధతి నార్వేదేశమున వాడుకలో నున్నది. నూఱింట ౩౦ పాళ్ల నత్రికామ్లద్రావణము ( Nitric Acid Solution )ద్వారా బోక్సైటును నిష్కాసన మొనరించుట ( Leaching )చే ఆద్రావణము అందలి స్ఫటనమును ఖటికము ( Calcium )ను లోహములోని కొంత భాగమును కరఁగించుకొని మిగత లోహమును శైలికమును వదలివేయును; కరఁగనిపదార్థములను వేఱుచేసి ద్రావణమునందలి లోహమును సైతము విడఁదీసి యెండఁబెట్టఁగాఁ దేలినదానిని అందుఁగల స్ఫటక్షారము ( Aluminium Salt ) విడివడుట కెంతవేఁడి కావలయునో అంతయే వేఁడికావించి అసందర్భమున వెలువడునత్రజన, అమ్లజిదముల ( Nitrogen, Oxides )తో నత్రికామ్లమును దింపుకొని అల్యూమినాను ధాతూత్పత్తినిమిత్తము సంగ్రహపఱచుకొందురు.

శుద్ధమైన స్ఫటామ్లజిదమును దీయుటకు 'హాగ్‌లాండ్' ( Hagland ) విద్యుదుష్ణవిధాన ( Electro-thermic process )మను వేఱొకపద్ధతి కలదు. లోహామ్లజిదము ( Iron Oxide ) శైలికము లోనగు బోక్సైటునందలి మలినములను వేఱుచేయుటమీఁదనే ఇది యాధారపడియున్నది. అందునిమిత్తము బోక్సైటును విద్యుత్తు బట్టీలో కర్బనముద్వారా సంస్కరించి ౧౫, లేక ౨౦ పాళ్ల గంధకిదమును గలిగియుండుమలినయుక్తమైన ధాతువు నుత్పత్తిచేయుదురు. ఈగంధకిద, అమ్లజిదధాతుమాలిన్యము ద్రవరూపమున నుండును. దానిని జల్లార్పఁగాఁ గట్టిన గడ్డను మార్జనముచేసి నీటిలోఁ గలిపి

స్ఫ౨గ౩ + ౬ ఉ౨అ = ౨ స్ఫ (అఉ)౩ + ౩ ఉ౨గ ( $Al_2S_3$ + $6H_2O$ = 2 Al (OH)$_3$ + $3H_2S$ ) ల క్రింద వేఱుచేయుదురు. ఇంపలి ఉజ్జనగంధకిదము ( Hydrogen Sulphide ) బోక్సైటును గంధకీకృతము గావించుటకుఁగాని లేక క్లాస్ పద్ధతి ( Claus process ) ననుసరించి గంధకము చేయుటకుఁ గాని ఉపయోగపడును.

ప్రొఫెసర్ పిడర్సన్ ( Professor Pederson ) కనిపట్టిన నవీనపద్ధతిని బొగ్గునకు మాఱుగ ముడిఇనుము ( Iron Ore )తో బోక్సైటును శుద్ధిచేసి స్ఫటామ్లజనిద మృత్పన్నము చేయఁబడును. ఈయవసరమున ముతక ఇనుము ఉపఫలముగ లభించును.

రేగడ ( Clay ), అలూనైటు ( Alunite )ల నుండియు మఱియొకవిధానమున నీధాతుపూలమును దీయవచ్చును. రేగడను కాల్చి దానిని గంధకామ్లమేలనమున గంధకితముగ మార్చి దానిని ఎమ్మోనియా గంధకిత మేలనమున ఎమ్మోనియాపటిక క్రింద పరివర్తితముఁజేసి దానిని ౭౫ శతాంశ అంశముల ( Centigrade degrees ) వేఁడిమి యందు పొడిగ ( Dry ) నుండు ఎమ్మోనియాగాసుద్వారా స్ఫటఉజ్జమయామ్లజిదము ( Aluminium Hydroxide ) ఎమ్మోనియుముగంధకితముగను మార్పఁబడును. తరువాత ఉజ్జమయామ్లజిదమును గాల్చి అల్యూమినాను దీయుదురు.

**అల్యూమినియము** — ఇది యొక ధాతవమూలతత్త్వము ( Metallic Element ). లోహము, అల్యూమినియము గలసిన గంధకితము ( Mixed Sulphates of Iron & Aluminium ) లని ప్రస్తుతము తలంపఁబడుచున్న కొన్ని క్షారము ( Salts )లను ప్రాచీనకాలమున రోమనులు అల్యూమెన్ (Alumen) అను పేరుతోఁ బిలుచుచువచ్చిరి. ఈక్షారములు మధ్యధరాసముద్రతీరములందలి అగ్నిపర్వతమయములైన జిల్లాలలో దొరకుచుండెడివి. వారు దీనిని అద్దకపుఁబనులందును ఔషధములందును వాడుకొనుచుండువారు. ఇట్టివే యగుగుణధర్మములనుగలిగియుండు క్షారమును గంధకామ్లప్రయోగమున రేగడమట్టినుండియుఁ దీయవచ్చునని ౧౮-వ శతాబ్దియందు కనుఁగొనఁబడినది. ఈభస్మము( Base ) నకు వేఱువేఱు దేశములందు వేర్వేఱు పేళ్లు గలవు. రోమనుల అల్యూమెన్ శబ్దమునుబట్టి ఆంగ్లేయులు, అమెరికనులు ఈభస్మమునకు అల్యూమినా అను పేరిడిరి. దీనినుండి తీయఁబడునదే అల్యూమినియముధాతువు. సంస్కృతమున స్ఫట మని పేరుపడినది. అణవికసంఖ్య ( Atomic Number ) ౧౩. విశిష్టగురుత్వము ( Specific Gravity ) ౨.౭. అణవికభారము ( Atomic Weight ) ౨౭. ద్రవణాంకము ( Melting point ) ౬౫౮.౭ శతాంశఅంశములు.

ప్రకృతియం దీధాతువు ఇతరపదార్థములతోఁ గలసి సంయోగ ( Combination )రూపమున నపరిమితముగ దొరకును గాని అసలు ధాతురూపమున నెచటను లభింపదు. అమ్లజనము ( Oxygen )తో దీనికిఁగల మిక్కుటమగు రసాయనప్రీతి( Affinity )యే ఇది శుద్ధరూపమున దొరకకపోవుటకు ముఖ్యకారణము. భూపటలము ( Earth's Crust ) నందు అమ్లజన, శైలము ( Silicon )లే అమితములు. వానిలో నూటిలో ౧౩ పాళ్లు స్ఫటము ( Aluminium ) ఉండునని అంచనావేయఁబడినది. పర్వతములందలి మామూలు బండలు మొదలుకొని అపరూపములగు రత్నములపర్యంతముగల నానావిధ శిలారూపములం దిది ప్రసరించియుండును. వేవలైట్ (Wavellite), ఫిరోజామణి ( Turquoise ) అనునవి దీని స్ఫురితములు ( Phosphates ). కెంపులు ( Rubies ), నీలములు ( Saphires ), కురువిందములు ( Corundums ) దీని అమ్లజిదములు (Oxides). గిబ్సైట్ ( Gibbsite ), బోక్సైట్, ( Bauxite ), డియస్పోర్ ( Diaspore ) అనునవి దీని ఉజ్జమయామ్లజిదములు ( Hydrated Oxides ). అల్లోఫేన్ (Allophane), రేగడ (Clay), ల్యూసైట్ ( Leucite )లం దిది శైలితము( Silicate )తోఁ గలసియుండును.

క్రయోలైట్ ( Cryolite ) లేక హిమశిల ( Ice Stone ) నామకస్ఫటద్విప్లవిదము ( Double Fluoride of Aluminium ) గ్రీనులాండుదక్షిణభాగమున చలువరాయి నల్లరాయి ( Porphyritic granite ) గలసిన బృహదాకృతి నొప్పునట్టి ప్రబంధనము (Dyke)గ నేర్పడియున్నది. స్ఫటగంధకితము ( Aluminium Sulphate ) అగ్నిపర్వతమయమండలములందు దొరకును. క్షారధాతువుల (Alkali metals ), గంధకితము( Sulphates )లతోఁ గలసి ఇది స్వాభావికపుపటిక ( Alum ) యగును. అనేకనిసర్గజలములందును అల్యూమినా కలదు. అందు కొన్నితావులలో నిది అమితముగను లభించును. బహుప్రకారములగు చెట్లబూడిదయందును అల్యూమినా దొరకును.

అమెరికా సంయుక్తరాజ్యములలోఁ కెంటకీయందును, బ్రిటిష్‌గయానా, మాంటినీగ్రో దేశములందును విస్తృతములగు బోక్సైటుగనులు గలవు. ఆస్ట్రేలియాఖండములోని విక్టోరియాప్రాంతమందలి నర్రకగనులందు నూటింట ౫౨ మొదలు ౫౯ పాళ్లవఱకు అల్యూమినాపదార్థము గలదు.

ప్రకృతియం దింత విస్తారముగ వ్యాపించియున్నప్పటికిని ఎప్పుడో తప్ప ఇది తఱచుగ ఉజ్జితబోక్సైటునుండియే తీయఁబడుచుండును. బోక్సైటునందు పెక్కురకములు కలవు. అందులో నొకటి తెల్లనిది. ఇందు నూటింట ౬౦ పాళ్లు అల్యూమినాయును, స్వల్పముగ లోహము నుండును. దీనిలో నిసుక ఉండదు. ఇది స్ఫటక్షారములను ( Aluminium Salts ) నిర్మించుటకును, పటికను జేయుటకును బనికివచ్చును. వేఱొకటి ఎఱ్ఱనిరకము. ఇందును అల్యూమినా పైదానియందలి ప్రమాణముననే యుండును. కాని కొంచెము ఇసుకయు నుండును. అసలు అల్యూమినియము ధాతువును దీయుట కిది ఎక్కువగ నుపయోగింపఁబడుచుండును. ౮౫ పాళ్లే అల్యూమినాయు, నెక్కువ ఇసుకయుఁ గల వేఱొకవిధమగు తెల్లనిరకము గలదు. ఇది సాధారణపు వేఁడిమికి కరఁగని కఠినద్రవ్యనిర్మాణమునకై వినియోగమగుచుండును. ప్రపంచమం దిప్పు డీధాతువుయొక్క

sampath_Ebooks

అవసరము లమితముగఁ బెరిఁగిపోవుటంజేసి దీనియుత్పత్తికిఁ గావలసిన అల్యూమినా మొదలగు ముడిదినుసులు ప్రతిఖండమునందును అపరిమితముగ నిలువచేయఁబడి యుండుటయే కాక ఇంకను ఫెల్‌స్పార్, చీనారేగడ, ల్యూసైటు మున్నగు శైలితములు (Silicates) అల్యూమినా క్రింద పరివర్తితము లగుటకుఁగాను నిరంతరకృషి కావింపఁబడుచున్నది. ౧౯-వ శతాబ్ది ఆదిగ ఈధాతువును దీయుటనుగురించి యనేకప్రయత్నములు జరగి యనేకవిధానము లవలంబింపఁబడియుండెను. కాని 'డైనమో' (Dynomo) ఆవిష్కారానంతర మావిధానము లన్నియు లోహింపవిద్యుత్ ప్రయోగమునఁదీయుపద్ధతియేస్థిరముగనిలిచిపోయెను.

స్ఫటమును, సోడియమును కలసిన ద్విప్లవిదము (Double Flueride) క్రయోలైట్ అని పిలువఁబడుచుండును. ఇది గ్రీన్‌లాండులో నమితముగఁ గలదని ఇదివఱకే వ్రాయఁబడినది. అల్యూమినియమును తయారుచేయునిమిత్తము బోక్సైటువనుండి తీయఁబడిన అల్యూమినాను కరఁగిన క్రయొలైటులోఁ గలిపి యామిశ్రణమును లోపలివైపున కర్బనలేపనముగల ఇనుపతొట్లలోఁ బోసి వైద్యుతవిశ్లేషణమున (Electrolysis) కర్షీనము చేయుదురు. విద్యుత్తువలన స్ఫటామ్లజిదము (Alumina) విభిన్నమై తొట్ల యడుగున కరఁగిన ధాతువు చేరుకొని విద్యుత్ ప్రవాహకములగు కర్బనలిప్తములైన కడ్డీల ద్వారా అమ్లజదము విడిపడిపోవును. అత్యుష్ణమున కరగావించుట చేతను, కరఁగినదానినే మరలమరల కరఁగుటచేతను అల్యూమినియము పాడైపోవుట సంభవించును.

అతిప్రశస్తములైన ధాతికలక్షణములుకల స్ఫటము అలుడూరు (Aludur) అనుపేర జర్మనీదేశమునం దిప్పుడు తయారగుచున్నది. ఇది ౮౦-వ నెంబరు బ్రిన్నెలుకాఠిన్యమును ఉచ్చతాంతవతా (High ductility), ఆఘాత క్షైణ్యము (Shock, Corrosion)లను నిరోధించుశక్తి, శ్రేష్ఠమైన విద్యుద్వాహకత్వము లోనగు గుణములను గలిగియుండును.

హూపరు నామకవైజ్ఞానికుని విద్యుద్విశ్లేషవిధానానుసారము శుద్ధిచేయఁబడు అల్యూమినియమునందు ౯౯.౯౦ పాళ్లు స్వచ్ఛమైన స్ఫట ముండును. ఇది తక్కినవిధానములద్వారా తయారగు వివిధ స్ఫటములకంటె మృదువై అధికకాంతిమంతమై, అమ్లమును మఱింత ఎక్కువగఁ బ్రతిఘటింపఁజాలియుండును. దీని నిష్కాసన మెట్లనఁగా: మిక్కిలిస్వల్పముగ లోహము (Iron), తితేనియము (Titanium)ల యంశము గల ద్రవీభూతతామ్రస్ఫటమేలనము (Molten Copper - Aluminium Mixture)ను క్రయొలైటు, స్ఫటప్లవిదము భారియప్లవిదము (Barium Fluoride)ల మిశ్రణముకల తొట్టియడుగున వైద్యుత విశ్లేషణము(Electrolysis)న కరగావించుటవలన ఉపర్యుక్తగుణధర్మములుకల అల్యూమినియము లభించును. కాని ఈవిధానమునందు భారియప్లవిదముయొక్క గురుత్వమువలన అల్యూమినియము అడుగునఁ జేరక తొట్టిలో పైకిఁ దేలును.

ప్రయోజనమునుబట్టి అనేకప్రకారము లగు అల్యూమినియము సృష్టింపఁబడుచున్నది. కాని నిమ్నలిఖితానుసారము ధాత్వంశములు గలది శ్రేష్ఠమైనదిగ నెంచఁబడుచున్నది :—

| | |
|---|---|
| లోహము (Iron) | ౦ ౧౯౩ |
| శైలము (Silicon) | ౦.౧౫౪ |
| తామ్రము (Copper) | ౦.౦౨౬ |
| నత్రిజనము (Nitrogen) | ౦.౦౪౦ |
| యశదము (Zinc) | ౦ ౦౦౬ |
| సోడియము (Sodium) | |
| కర్బనము (Carbon) | అపరిమితము |
| అల్యూమినియము (Aluminium) | ౯౯.౫౯౧ |

లోహమున కుండుభారములో మూఁడవవంతు బరువును కలిగియుండుటచే అల్యూమినియము మిక్కిలి తేలిక యైనధాతువు. వంగ (Tin)వర్ణమును బోలిన వర్ణము. మంచి ఘనవర్ధనీయము; (Malleable), అనఁగా పలుచనిరేకుల క్రిందఁ గొట్టవచ్చును. తాంతవతాయుక్తము (Ductile). అందుచేత సన్ననితీగెలుగ సాగఁదీయవచ్చును; మంచి విద్యుద్వాహకము (Conductor of Electricity)

ఈధాతువునకుఁ గలుగు నుపద్రవములలో త్రుప్పుపట్టుట ప్రధానమైనది. ఉష్ణదేశములందు, అందును తేమగలచోట్ల తేమ గాలి తగులుటచేత త్రుప్పుపట్టును, కాని పొడిగాలివలన త్రుప్పు పట్టదు. అల్యూమినియమును ఈయుపద్రవమునుండి కాపాడుట కనేకోపాయములు పన్నఁబడి యున్నవి. ధాతూపరితలమున నేజెని పూఁత పూయుటచేతను, వార్నిషువేయుటచేతను వాతావరణమువలనఁ గలుగు త్రుప్పుపట్టదు. యశదపురేకులు లోహమునకు త్రుప్పుపట్టకుండ దాని నెట్లు కాపాడునో యట్లే శుద్ధమయిన అల్యూమినియమును సుకరముగఁ ద్రుప్పుపట్టునట్టి యేదేని దాని మిశ్రణముతోనే చేర్చినయెడల నీళ్లలో నున్నను దానికి త్రుప్పుపట్టదు. విమానాదులమీఁదఁ బట్టు త్రుప్పును మఱింతదట్టముగులాగు చేయుటవలన వానికి రక్షణము కలుగును. అందునిమిత్త మాయాభాగములు క్రోమికామ్లము (Chromic Acid)గల విద్యుద్విశ్లేషణపు తొట్టిలో (Electrolytic bath) విద్యుద్వాహకములు (Anodes)గఁ జేయఁబడుచుండును.

ఈధాతువువలన నిష్పన్నములగు మూఁడుప్రకారము లగు ఉజ్జితామ్లజిదములు (Hydrated Oxides) ప్రకృతియందు నైసర్గికావస్థయందును దొరకును. వానిలో డియాస్పోర్ అనునది ఏకోజ్జితము (Mono-hydrate), బోక్సైటు, ద్వ్యుజ్జితము (Di-hydrate) గిబ్సైటు మున్నగునవి కొన్ని త్ర్యుజ్జితములు (Trihydrates). ఈయుజ్జితములు అమ్లములతోఁ గలసి విలీనములై క్షారము లగుట కొఱకు భస్మము(Base)లుగ నేర్పడును. అదిగాక ధాలగాఢమైన భస్మములతోఁ గలసి స్ఫటికము లగుటకుఁగాను నీచామ్లములుగను (Weak Acids) పనికివచ్చును. స్వచ్ఛమైన అల్యూమినాను

sampath_Ebooks

సంసిద్ధముచేయుటకు తఱచుగా నవలంబింపఁబడువిధానమునకు ఉజ్జితములందలి ఈగుణధర్మమే యాధారము. లోహమును మఱికొన్ని మాలిన్యములను గలసియుండుబో క్సైటులను దాహకసోడా ద్రావణముల (Caustic Soda Solutions)లో కాఁచుదురు. అప్పుడు సోడియం స్ఫటిత (Sodium Aluminate) మేర్పడునిమిత్తము స్ఫట-ఉజ్జితము (Aluminium Hydrate) మాత్రమే యందు విలీనమగును. అనంతరము వడియఁబోసిన ద్రావణమునందు విశుద్ధమగు త్రుల్యజ్జితము అడుగున దిగులాగు చేయుట కనేకమార్గములు కలవు. వానిని వేడిచేయుటవలన స్ఫట-ఉజ్జితము నీటిని గోల్పోవ అల్యూమినా అడుగునకు దిగును.

స్ఫటికీభూతమైన త్రుల్యజ్జితము నీటిలో కరఁగదు కానివెంటనే ఒకవిధమగు కొల్లోడియపు ద్రావణ (Collodial Solution) మేర్పడును. ఇది యనేకపదార్థములను, ముఖ్యముగ రంగులను హరించును. ఇందువలన నిది అద్దకపుపనులందు వర్ణోపాధి (Mordant) గ నుపయుక్తమగుచున్నది. అద్దకము వేయునపుడు ముం దిది దారములకు బాగుగ పట్టినయెడల తరువాత వేయురంగు నిలుకడగ నిలుచును; అన్యథా రంగు వెలిసిపోవును.

జలము లేకుండ అల్యూమినియమును క్షారములు గ్రసింపఁజాలవు. కాని వాని దాహక ద్రావణము (Caustic Solutions) లందు కరఁగి స్ఫటితములుగ (Aluminates) నేర్పడుచుండును. అందలి ఉజ్జన మెగిరిపోవును. సోడియం ద్రావణములు (Sodium Solutions)ను పొటాసియము కర్బనితములును (Potassium Carbonates) ఈధాతువును శీఘ్రముగ హరించును. కాని సోడా శైలిత ద్రావణములు (Soda Silicate Solutions) దీనిని హరింపఁజాలకపోఁగా కర్బనితముల గ్రసనమును నిరోధించును. ఈ హేతువు చేత కర్బనితసోడా శైలిత మేలనములు — వ్యాపారయోగ్యములైనవి – గృహములలో వాడుకొను అల్యూమినియపుపాత్రలకు శోధకములుగ నుపయోగపడుచుండును.

ఎమ్మోనియా-ఉజ్జితము (Ammonia Hydrate) దీనిని స్థిరక్షారముల (Fixed Salts)కంటె కొంచెము తక్కువగ హరించును. కాని ఇందువలన కేవలము లభించునది స్ఫటోజ్జితముమాత్రమే (Aluminium Hydrate). ఎమ్మోనియా కర్బనితము (Ammonia Carbonate) ఈధాతువును బొత్తిగ హరింపఁజాలదు. ఉచ్చతాపపరిమాణములందు (High Temperatures) ఎమ్మోనియాగాసు (Gas) అల్యూమినియముతోఁ గలసి స్ఫటనత్రితము నుత్పాదించును. ఈపదార్థము అల్యూమినియము గాలిలో నుండునప్పుడు గూడ జనించును.

అల్యూమినియ మింత శక్తిమంతమైన దనుకొనినప్పటికిని దీనిని సమస్తఅమ్లములతోఁ గలసిపోవులాగునఁ జేయవచ్చును. ఉజ్జనహరినికామ్లము (Hydrochloric Acid)నకు పైత మిది సరళముగ లోఁబడని దయ్యెను ఎట్లయిన నేమి ఈయమ్లమును నైలాదిఉపధాతువులయమ్లములును (Halogen Acids) దీనిని శ్లోలావస్థలయందును హరింపఁగలవు. శీతలములైన, సంపూర్ణనివిష్టములైన (Fully concentrated) నత్రికామ్ల, గంధకామ్లములు దీనిని నెమ్మదిగ హరించుకొనును. కాని ఉష్ణ మెక్కుడయిన కొలఁదియు, అమ్లసారము తక్కువైనకొలఁదియు ముఖ్యముగ గంధకామ్లగ్రసన మెక్కువగుచుఁబోవును. జలమిలితఐంద్రికామ్లములు (Dilute Organic Acids) అల్యూమినియమును కడుమందముగ గ్రసించును. ఆహారపదార్థగత అమ్లగ్రసనము గోచరము కానంతటిమందముగ నుండును. విశుద్ధామ్లము దీనిని వెనువెంటనే గ్రసించును కాని అన్యవస్తుమిళితమైన – ఆహారపదార్థాంతర్గతమైన అదేఅమ్లమునకు ఈధాతు వట్లు సాధ్యము గాదు; ఎట్లనఁగా ౦.౨%ల వేడియైన దుగ్ధజామ్లద్రావణము (Lactic Acid Solution) అల్యూమినియమును వెంటనే గ్రసించును. కాని అంతే అమ్లముగల పాల కీధాతువు ఎంతమాత్రము లోఁబడదు. కాని స్వయముగ అల్యూమినియమును గ్రసింపఁగల అమ్లములు (Acids), క్షారములు (Salts) వానియం దుండినచో నప్పు డాయైంద్రికామ్లములును దీనిని గ్రసింపఁగలుగును. వట్టి వినీగరుకంటె ఉప్పు కలసినది ఎక్కువ తీక్ష్ణము. నివిష్టఐంద్రికామ్లములకు అల్యూమినియము సాధారణముగ లోఁబడదు. కాని బొత్తిగ నీరన్నమాట లేని ఉడుకుచుండెడు మేదోవసామ్లములు, వివిధఆల్కహోలులు, ఫెనోలులు ఎంతస్వచ్ఛమైన అల్యూమినియమునైనను గ్రసించును. కాని యందు నీటిపాడకువయున్న నట్లు జరగదు. ఇందులకు కారణ మింకను తెలియలేదు.

గంధకితఉజ్జనము (Sulphuretted hydrogen)నకును, ఎమ్మోనియముగంధకిదము (Ammonium Sulphide)నకును, గంధకద్వ్యమ్లజిదము (Sulphur Dioxide)నకును ఈధాతువు లోనుగాదు కాని ప్లవము (Fluorine), హరినము (Chlorine), బ్రమము (Bromine), నైలము (Iodine) మున్నగువానిలో సరాసరి లీనమై వానివానిక్షారేదములు (Halides)గ నేర్పడుచుండును.

ఈధాతువు అమ్లములతోఁ గలసి యనేకక్షారములుగ మాఱుచుండును. కాని జలీయద్రావణము (Aqueous Solution) ద్వారా కొలఁదిగమాత్రమే మాఱును. ఈక్షారములు అన్యధాతువులలోని స్వస్వోచితక్షారములతోఁ గలసి మిశ్రితక్షారములు (Mixed salts)గ నేర్పడుచుండును. వానిలో స్ఫటహరినిదము (Aluminium Chloride), స్ఫటసోడియంప్లవిదము (Aluminium Sodium Fluoride), స్ఫటగంధకితము (Aluminium Sulphate) మొదలగునవి ముఖ్యమైనవి. ఇవి క్రమముగ ఐంద్రికరసాయనశాస్త్రము (Organic Chemistry)నందు అల్యూమినియపు ఉత్పత్తియందును, అద్దకపుపనులందు నుపయుక్తము లగుచుండును.

ప్రస్తుతకాలమునం దీధాతువువలనఁ గలుగుచున్న ప్రయోజనము లసంఖ్యాకములు. తేలికయు, గట్టితనమును గావలసినచోట

వంతయు అల్యూమినియము ప్రవేశించినది. వివిధశిల్ప, పరిశ్రమ, కళాసాధననిర్మాణములకు, నిలవపదార్థముల నుంచుటకును గావలసిన నానావిధసామగ్రులకు, నితాంతశుద్ధస్థితియందు నత్రికామ్లమునకు స్థైతము లోఁబడని దగుటచేత రసాయనికద్రవ్యోత్పాదనసాధనీభూత భాండాదులకు యంత్రాలయములలోని యంత్రములకు నీ ధాతు వపరిమితముగ వాడఁబడుచున్నది. ఉతుకుసోడా (Washing Soda) వలన అల్యూమినియము పాత్రలమీఁదఁ గలుగు ద్రవణకారకకార్యము (Solvent Action)ను నీటియందు కరఁగుగాజు(Water Glass)ను నతిస్వల్పముగ కల్పుటవలన నిరోధింపవచ్చును. మానెతోఁ గలసిన అల్యూమినియపుమార్గము గాలి తగిలి లోహమునకు త్రుప్పుపట్టకుండఁ జేయుటకు లేపనముగ నుపయోగింపను. పెద్దపెద్ద పట్టణములలోని అలంకారభూతములైన వంతెనల లోహపుకెయిలింగుల పైఁ బూయుటకీచూర్ణము ప్రశస్తమైనది. లోహమును త్రుప్పుపట్టుటనుండి కాపాడుటయే కాక దానికి వెండివంటి శుభ్రవర్ణము నొసంగును. టెలిగ్రాపుస్తంభములు మొదలగువానికిని ఈచూర్ణలేపనమే. మఱియు దీనిచూర్ణము బాణసంచాలకు, ఉత్స్ఫోటనముల (Explosives) నిర్మాణములకు, థర్మైటువిధానములకు, అన్యధాతుశోధనములకు నుపయుక్తమగుచున్నది.

తామ్రముతోఁగలసి ఈధాతువు స్ఫటకాంస్య (Aluminium Bronze)మను మేల మేర్పరచును. ఈమేలము పోఁతపోయవలసిన సామానుల కుపయోగించును. ఇది కురువిందరూపమున (Corundum)నుండు అల్యూమినాను బొగ్గుతోడను, రవవంటి రాగిపొడితోడను గలిపి ఆమిశ్రణమును విద్యుత్తుబట్టీయందు వేఁడిచేసినయెడల తయారగును. వేఁడిచేయునప్పు డామిశ్రణమందలి కర్బనము స్ఫటము నందలి అమ్లజనమువాలమున తగులఁబడిపోవ అందులోని తామ్రము స్ఫటముతోఁ గలసి మేల మేర్పడును. అసలుకంచు లనిపిలువఁబడు వానియందు, నూఱింట 3 లేక ౫ పాళ్లు స్ఫట ముండును. స్ఫట తాలముల (Aluminium & Arsenic) మిశ్రణమును నీచభారమున (Low pressure) ౭౫౦ డిగ్రీలవఱకు వేఁడిచేయుచుఁ బోయిన స్ఫ₃ తా₂ నామకసమ్మేలన మేర్పడును. ౮౫ పాళ్లు స్ఫటము, ౧౨.౫ పాళ్లు యశదమును (Zinc), ౨.౫ పాళ్లు తామ్రము గలసిన మేలనము కొళాయిగొట్టాలు, పంపులు మున్నగు పోఁతసామానుల నిర్మాణము నిమిత్తము మిక్కిలి ప్రయోజనకారిగ నుండును.

౧౫ పాళ్లు స్ఫటలోహమేలన మొకటి జర్మనీయందు తయారగుచున్నది. దీనితో అత్యుష్ణమును సహించుటకుఁ గావలసిన వస్తువులు నిర్మింపఁబడుచుండును. దీని నెఱ్ఱగ కాఁచినయెడల ఉపరిభాగమున అపరిమితోష్ణమును నిరోధింపఁగల పలుచని స్ఫటామ్లజిదపుపొర యేర్పడును. ఇది రాలిపోవక పక్కాకట్టి నిలిచియుండి అనంతరమంతకు మించి అమ్లజనీకరణము గాకుండ ఆఁపును.

రైలుబండ్లు, స్వయంచలనవాహనములు, జలయాన వాయుయానములు మొదలగువాని నిర్మాణమం దీధాతువు మిక్కిలి యుపయోగపడును.

ప్రత్యేకముగ నిర్మింపఁబడు విద్యుత్ప్రయుక్తము లగుబట్టీలయందు పరిశుభ్రమైన అల్యూమినానుకరఁగించి నీలములు(Saphires), కెంపులు (Rubies) లోనగు ప్రశస్తమణు లిప్పుడు వ్యాపారార్థము నిర్మింపఁబడుచున్నవి. ఇవి ఘటనమునందును (Structure), గుణధర్మములందును అసలుమణులకు సమానములై సమస్తవిధముల వానివలెనే యుండును. క్రిందఁబడినను పగులకుండ గట్టిగ నుండులాగున ఈ ధాతువుతో నిప్పుడు అద్దములుఁగూడఁ జేయుట ఆరంభమైనది.

అల్యూమినియపుటంకము(Solder)నకుఁగాను వంగ (Tin), యశదముల(Zinc)యొక్కయు, వంగయశదస్ఫటముల యొక్కయు మిశ్రణములు చాల ఫలదాయకములు.

అల్యూమినియమును ఔషధములద్వారా కడుపులోనికిఁ దీసికొనవచ్చును. కాని దీనిక్షారములు ఇంజక్టుచేయఁబడినచో ఉపద్రవకరములగునట్లు దేలినది. కొన్నిక్షారములు రోగప్రతిక్రియ(Therapy)యందును, ప్రాతినాళిక క్రియలందును వినియోగపడుచుండును.

## పారిభాషిక పదములు

[ ఈవ్యాసమునందు వచ్చిన ఉపసర్గ (Prefix), ప్రత్యయముల (Suffix) వివరము. ప్రత్యయములను చేర్చునపుడు, ఉచ్చారణసౌకర్యమునకు అజంతములుగ వాడినశబ్దములను హలంతములుగనే గణింపవలెను.

ఉపసర్గలు :

| | | | | |
|---|---|---|---|---|
| Di | ద్వి. | ఉదా. | Di-sulphate | ద్విగంధకితము |
| Mono | ఏక. | ,, | Mono-hydrate | ఏకోజ్జితము |
| Tri | త్రి. | ,, | Tri-hydrate | త్ర్యుజ్జితము |

ప్రత్యయములు :

| | | | | |
|---|---|---|---|---|
| Ate | ఇతము. | ,, | Sulphate | గంధకితము |
| Et | ఏతము. | ,, | Sulphuret | గంధకేతము |
| Ide | ఇదము. | ,, | Sulphide | గంధకిదము |
| Ite | ఆయితము. | ,, | Sulphite | గంధకాయితము ] |

Affinity రసాయనప్రీతి

Alkali metals క్షారధాతువులు

Allophane అల్లోఫేనము

Alloy మిశ్రణము

Aludur అలుదూర్

Alum పటిక

Alum solution పటికద్రావణము

Alumina స్ఫటామ్లజిదము

Aluminium స్ఫటము

Aluminium Bronze స్ఫటకాంస్యము

Aluminium Chloride స్ఫటహరిదము

Aluminium Nitride స్ఫటనత్రజిదము

sampath Ebooks

Aluminium Salt స్ఫటక్షారము
Aluminium Sodium Fluoride స్ఫటసోడియంప్లవిదము
Aluminium sulphate స్ఫటగంధకితము
Alunite అలూనాయితము
Ammonia Carbonate ఎమ్మోనియాకర్బనితము
Ammonia gas ఎమ్మోనియాగాసు
Ammonia Hydrate ఎమ్మోనియా ఉజ్జితము
Amm›nia Sulphide ఎమ్మోనియాగంధకిదము
Ammonium sulphate ఎమ్మోనియముగంధకితము
Anodes అనోడులు
Aqueous Solution జలీయద్రావణము
Arsenic తాలము
Atomic number అణవికసంఖ్య
Atomic weight అణవికభారము
Barium Fluoride భారియప్లవిదము
Base భస్మము
Bauxite బాక్సైటు
Bromine బ్రమము
By-product ఉపఫలము
Calcium ఖటికము
Carbon కర్బనము
Carbon dioxide gas కర్బనద్విఆమ్లజిదపుగాసు
Caustic soda solution దాహకసోడాద్రావణము
Caustic solutions దాహకద్రావణములు
Centigrade degrees శతాంశిఅంశములు
Chlorine హరినము
Chromic Acid క్రోమికామ్లము
Claus Process క్లాజ్ విధానము
Clay రేగడ, బంకమట్టి
Collodial solution కొల్లోడియపుద్రావణము
Combination సంయోగము
Concentrated నివిష్టమైన
Conductor of Electricity విద్యుద్వాహకము
Copper తామ్రము
Corundum కురువిందము
Crude Iron ముతకఇనుము
Cryolite క్రయోలైట్
Crystal form స్ఫాటికదశ
Dihydrate ద్వ్యుజ్జితము
Dilute జలమిలితము
Dilute Organic Acids జలమిలిత ఐంద్రికామ్లములు
Double Fluoride of Aluminium స్ఫటద్విప్లవిదము

Dry process శుష్కవిధానము
Ductile తాంతవతాయుక్తము
Dyke బంధనము
Earth's Crust భూపటలము
Electrolysis వైద్యుతవిశ్లేషణము
Electro-thermic process విద్యుదుష్ణవిధానము
Emery కురువిందవికారము
Explosives ఉత్స్ఫోటనములు
Fixed salts స్థిరక్షారములు
Granite నల్లరాయి
Halides హారిదములు
Halogen Acids హైలాదిఉపధాత్వమ్లములు
High Ductility ఉచ్చతాంతవత
High Temperature ఉచ్చతాపపరిమాణము
Hydrochloric Acid ఉజ్జనహరినికామ్లము
Hydrogen ఉజ్జనము
Hydrogen sulphide ఉజ్జనగంధకిదము
Hydroxide ఉజ్జనమయామ్లజిదము
Ice stone హిమశిల
Indissoluble Compounds నీటకరగనిసమ్మేళనములు
Inter-reactions అంతఃప్రతిక్రియలు
Iodine నైలము లేక, అయోడిను
Iron ore ముడిఇనుము
Iron oxide లోహామ్లజిదము
Lactic Acid solution దుగ్ధామ్లద్రావణము
Leaching నిష్కాసనము లేక పిండుట
Low Pressure నీచభారము
Malleable ఘనవర్ధనీయము
Melting point ద్రవణాంకము
Metallic Element ధాతవమూలతత్వము
Mixed salts మిశ్రితక్షారములు
Mixed Sulphates of iron & Aluminium లోహము, స్ఫటము గలసిన గంధకితములు
Molten copper-Aluminium Mixture ద్రవీభూతతామ్రస్ఫటమేలనము
Monohydrate ఏకోజ్జితము
Mordants వర్ణోపాగ్రులు
Natural waters నిసర్గజలములు
Nitric Acid నత్రికామ్లము
Nitric Acid Solution నత్రికామ్లద్రావణము
Organic Chemistry ఐంద్రికరసాయనశాస్త్రము
Oxide అమ్లజిదము

sampath_Ebooks

Oxygen ఆమ్లజనము
Phosphates స్ఫురితములు
Porcelain Clay పింగాణీరేగడ
Porphyritic granite చలువరాయిగలసిన నల్లరాయి
Potassium Carbonates పొటాసియం కర్బనితములు
Ruby కెంపు
Salts క్షారములు
Saphire నీలము
Shock corrosions ఆఘాతశైథిల్యములు
Silica సికత
Silicate శైలితము
Silicon శైలము
Slate Stone పలకరాయి
Soda silicate solutions సోడాశైలిత ద్రావణములు
Sodium Aluminate సోడియంస్ఫటితము
Sodium Hydroxide సోడియం ఉజ్జమయామ్లజిదము
Solder టంకము
Solvent action ద్రవణకారకకార్యము
Specific gravity విశిష్టగురుత్వము
Sulphate గంధకితము
Sulphuretted Hydrogen గంధకితఉజ్జనము
Sulphur Dioxide గంధకద్వ్యామ్లజిదము
Sulphuric acid గంధకామ్లము
Structure ఘటనము
Therapy రోగప్రతిక్రియ
Tin వంగము
Trap stone నాపరాయి
Tri-hydrate త్ర్యుజ్జితము
Turquoise ఫీరోజామణి
Vegetable Colours కూరగాయరంగులు; వనస్పతివర్ణములు
Washing soda ఉతుకుసోడా
Water glass నీటిరేగుగాజు
Weak acid నీచామ్లము
Wet process ఆర్ద్రపద్ధతి
Zinc యశదము

**అల్యూషియను దీవులు** — అమెరికా ఖండపు వాయవ్యమూలనందు అలాస్కాకును ఆసియాఖండము నీశాన్యమునందు కామస్కాట్కాకును మధ్యగల సముద్రమున ౩,౫౦౦ల మైళ్ల విస్తీర్ణమున వెదచల్లఁబడియుండు చిన్నదీవుల గుంపు. ఇవి సంఖ్యకు రమారమి ౧౫౦ కలవు. వీనిలో నొక్కటైనను సారవంత మయినది కాదు. అన్నియుం గుట్టలతోను తిప్పలతోను నిండియున్నవి. వీనిలోఁ గొన్ని అగ్నిపర్వతముఖములు. ఈదీవులలో శైత్యము విపరీతము. ఎస్కిమోజాతికిఁ జేరిన అల్యూటులను తెగవారీదీవుల ప్రజలు. వా రిప్పుడు క్రైస్తవమతము పుచ్చుకొనినారు. జనసంఖ్య ౨,౦౦౦. తిమింగలములను చేపలను బట్టుట ఈదీవులలో ముఖ్యవృత్తి.

**అల్ - రజీ** (క్రీ. శ. ౮౬౫ - ౯౨౫) అరబ్బీ వైద్యుఁడు. పెరిషియాలో టెహరెన్ దగ్గఱనున్న రాయిగ్రామమున జననమొందె, బాగ్దాదుపట్టణమున విద్య గఱచెను. అక్కడ నున్నకాలమున నతఁడు గ్రీకు, పెరిషియను, హిందూ వైద్యశాస్త్రజ్ఞానమును బాగుగ సంపాదించెను. అచ్చటనే అతఁడు వైద్యము చేసికొనుచు జీవనము గడపెను. శీఘ్రకాలముననే అతఁడు సమర్థుఁడును, కడు నేర్పరియు నైన వైద్యుఁ డని ప్రఖ్యాతి గాంచెను. ఇతఁడు వైద్యమునకు, నితరశాస్త్రములకును సంబంధించినవి రెండువందల గ్రంథములు రచించెను. పొంగు, మశూచికములనుగుఱించి యితఁడు వ్రాసిన గ్రంథము ఈవిషయమునుగుఱించి వ్రాయబడిన గ్రంథములలోనెల్ల నుత్తమ మయిన దని చాలకాలము వాడుకయం దుండెను. ఇతని గ్రంథములలో నింతకంటెను ముఖ్యముగా నెన్నఁదగినది 'అల్ - హావీ' యను నిరువది సంపుటముల వైద్యగ్రంథము. అల్ - రజీ తనకాలము వఱకు అరబ్బులకుఁ దెలిసిన వైద్యవిషయములనేకాక గ్రీకులయొక్క సిరియాదేశస్థులయొక్క వైద్యవిజ్ఞానమునుగూడ పూర్వోక్త గ్రంథమున పొందుపఱిచెను. ఈగ్రంథ మిరువది సంపుటములలోను నిప్పుడు లభ్య మగునవి పదిసంపుటములుమాత్రమే. ఒక్క వైద్యముననేకాక యితఁడు తత్త్వశాస్త్రము, జ్యోతిశ్శాస్త్రము, గణితశాస్త్రము, పదార్థవిజ్ఞానశాస్త్రములందుకూడ గొప్పజ్ఞానము సంపాదించి, వీనియందుఁగూడ చాలగ్రంథములు వ్రాసెను. ఇస్లాము మతప్రపంచమున నితఁడు అద్వితీయుఁడయిన వైద్యశిరోభూషణ మని పేరు గాంచెను.

**అల్లంచెర్లరాజుపాలెము** — పశ్చిమగోదావరి జిల్లా చింతలపూఁడితాలూకాలోని జమీన్‌దారీగ్రామము. జనసంఖ్య ౩౫౪ (౧౯౩౧).

**అల్లంపాడు** — ౧. నెల్లూరుజిల్లా గూడూరుతాలూకా యందలి జమీన్‌దారీగ్రామము. జనసంఖ్య ౭౮౧ (౧౯౩౧).

౨. నెల్లూరుజిల్లా ఉదయగిరితాలూకాలోని గ్రామము. జనసంఖ్య ౨,౦౪౦ (౧౯౩౧).

**అల్లన్, డేవిడ్** (౧౭౪౪ - ౧౭౯౬) — స్కాటిష్ చిత్రకారుఁడు. అల్లోవాయందు జన్మించె, యితఁడు చిత్రకళను మొదట గ్లాస్గోయందును, పిదప ఇటలీయందు నభ్యసించెను. ౧౭౭౩ లో రోమునగరమునందు నివసించుచుండిన కాలములో ఒక చారిత్రకరచనమున కాతనికి పతకము పారితోషికముగ లభించెను.

sampath_Ebooks

చాలకాల మతఁ డానగరమునందే యుండి చిత్రరచనయందు కాలము గడపెను. పదునాలుగేండ్లు ఇటలీయందు నివసించిన యనంతరమున ౧౭౭౭ లో అతఁడు లండనునగరమునకు వెళ్లి, ౧౭౮౦ ప్రాంతమున ఎడింబరోనగరమున కరిగి యచ్చటనే స్థిరనివాసము నేర్పఱచుకొనెను. అచ్చట నతఁడు కళాపరిషత్తునకు డైరెక్టరుగను, ఆచార్యుఁడుగను నియమింపఁబడెను. ఎడింబరోయందు నివసించినకాలమునం దతఁ డనేకవిధము లగు చిత్రరచనములను గావించెను. వానిలో 'హైలాండ్ డాన్స్' (మెట్టదేశమువారి నృత్యము), 'స్కాచ్ వెడ్డింగ్' (స్కాట్లండుదేశజుల వివాహము) అనునవి ప్రసిద్ధికెక్కిన యాతని ప్రశస్తరచనలలోఁ గొన్ని. ఈ చిత్రకారుఁడు ౧౭౯౬ - వ సంవత్సర మాగస్టు ౬ - వ తేదిని ఎడింబరోనగరమున కాలధర్మము నొందెను.

**అల్లన్మియో (గ్రామము)** — బర్మా, తేయట్‌మియో జిల్లాలోని మైయుడ్ సబ్ డివిజనునకు ముఖ్యపట్టణము. జనసంఖ్య ౧౦,౨౦౪. ఇది వర్తకస్థలము. ఇది ఆదేశమందలి ప్రతివర్తకమునకును ముఖ్యస్థలము.

**అల్లపఱ్ఱు** — గుంటూరుజిల్లా రేపల్లె తాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౫,౬౪౩ (౧౯౩౧).

**అల్లమడుగు** — చిత్తూరుజిల్లా పుత్తూరుతాలూకాలోని జమీందారీగ్రామము. జనసంఖ్య ౧,౧౪౨ (౧౯౩౧).

**అల్లమప్రభువు** — సనాతన వైదికమతపరిణామమునందు ౧౧,౧౨,౧౩ శతాబ్దులు భక్తియోగపరిణామాబ్దములు. జైన బౌద్ధ మతములు వైదికమతమును శిథిలముచేసినను హిందూమతమును విశాలము చేసినవి. కర్మమార్గపరమైన వైదికమతము ధర్మపరమైన భక్తిమార్గపరమైనది. వేదవేదాంతములు, నిగమాగమములు, కర్మజ్ఞానములును భక్తిమార్గమునందు సమన్వయమును పొందవలసినయవసరము కలిగినది. శ్రీశంకరాచార్యులు జైనబౌద్ధమతములను ఖండించి వైదికమతోద్ధరణమును జేసినను ప్రజాహృదయమునందు జైన బౌద్ధ మతసంస్కారములు పల్లవించినవి. సిద్ధాంతములయందు సిద్ధార్థునిధర్మనిర్ణయములును, కర్మసూత్రములును వైదికమతమునందు సమన్వయమును పొంది ప్రజాజీవనమునందు సార్థకము లైనవి. ఉత్తరహిందూస్థానమునందువలెను దక్షిణహిందూస్థానమునందును జైన బౌద్ధ మతవిధ్వంసనము ప్రాచీన సంస్కారోద్ధరణమునకును, వైదికమతవికాసమునకును వినియోగపడినది. దేశమునందంతటను కర్మమార్గము క్షీణించి భక్తిమార్గము విజృంభించినది. కర్మయోగమును జ్ఞానయోగపరముగను, భక్తియోగపరముగను జేయుటకు వైదికమతసమన్వయ మవసరమైనది. వర్ణాశ్రమ ధర్మములకు నూతనలక్ష్యము గలిగినది. సన్న్యాసమునకు కాషాయాంబరములు ప్రమాణములు గాకను భగవదారాధనపరమైన కర్మారాధనము లక్ష్యమైనది. ఆదికాలమునుండియును కర్మకాండను జ్ఞానకాండయందు సమన్వయము చేయుటకు పండితులు చేసిన ప్రయత్నములు సామాన్యుల కందరానిఫలము లైనవి. దక్షిణదేశమునందు, కర్ణాటాంధ్రదేశములందు జైనబౌద్ధమతములకు స్థిరవాసములు గలిగినవి. ప్రజాసామాన్యమునందు ప్రవర్ధమానమైన జైనమతమును విధ్వంసము చేయుటకు శ్రీశంకరాచార్యుల విజయయాత్రలవలెను వీరశైవమును నవతరించినది. వీరశైవమునందు జైనబౌద్ధమతధర్మమార్గములు భక్తిమార్గమునను, 'గురులింగజంగమశరణు' రూపమునను సార్థకము లైనవి. జీవయాత్రను కేవలము దేహయాత్రను గాకను, ఆత్మయాత్రాపరమును జేయఁగలవిధమును వీరశైవాచారాగమసిద్ధాంతములు విశదము చేయుచున్నవి. వీరశైవబృందమునందు శివప్రాజ్ఞ జంగమరూపపరిణామమును పొంది జీవయాత్రయందు సార్థకమైనది. జంగమబృందావనమునందు లింగావరణములు, కులావరణములును నంతరించి సర్వమును జంగమలింగగురుపరిణామమును పొందినది. వీరశైవాచారమతసిద్ధాంతములకు అల్లమప్రభులీలలు ప్రత్యక్షప్రమాణముగ నున్నవి. ప్రభులింగలీలలం దీగహనవిషయము దివ్యముగను వర్ణింపఁబడినది.

అల్లమప్రభువు బసవేశ్వరునితో సమకాలికుఁడు; పండ్రెండవ శతాబ్దియందు కల్యాణపురప్రాంతములందు నివసించి కోల్హాపురమండలమునందలి అల్లాగ్రామమునందు సిద్ధిని పొందినటు లూహింపఁబడియున్నది. అల్లమప్రభువు జంగమగురువు, వీరశైవాచార్యుఁడు, యోగీంద్రుఁడు, సిద్ధుఁడు. అల్లమప్రభుని మాహాత్మ్యమును కన్నడకావ్యము ప్రభులింగలీలలు మనోహరముగను వివరించుచున్నవి. పిడుపర్తి సోమయదేవుఁ డాంధ్రమునందు రచియించిన ప్రభులింగలీలకావ్యము అల్లమప్రభుని దివ్యలీలను మనోహరముగను దెలుపుచున్నది. సోమయదేవుఁడు కొల్లూరి రామలింగయ్యప్రార్థన ననుసరించి ఆయనగురువైన శ్రీసిద్ధవీరదేశిక చక్రవర్తి కంకితముగను ప్రభులింగలీలలను ద్విపదకావ్యముగను రచియించెను. ప్రభులింగలీలలు జీవుఁడు ౨౫ గతులందును సంసారయాత్రయందు లింగకుల మతాధికారావరణముల నతిక్రమించి మాయావృతము లైన శివసాయుజ్యమును పొందఁగలవిధమును వివరించుచున్నవి. అక్కమదేవి, సిద్ధరామయ్య, మాచయ్య, కిన్నరయ్య, బసవేశ్వరుఁడు మొదలగు భక్తుల దివ్యచరిత్రరూపమునను శివసాయుజ్యమునకును ఆత్మసాక్షాత్కారమునకును భక్తిమార్గప్రాశస్త్యము సువ్యక్తము చేయఁబడినది.

వింటె మీవంటివివేకులచేతఁ - దొంటిముక్కంటిభక్తులకథలందు
ప్రభులింగలీలకుఁ బ్రతి చెప్ప నరిది - యభవుభక్తిస్థితి కది యాలవాల
మజ్ఞానతమమున కదియె దీపంబు - విజ్ఞానమున కది విహరణసీమ
అది షట్‌స్థలజ్ఞప్తి కావాసభూమి - అది శివయోగవిద్యానిధానంబు
సవమలసౌభాగ్యసదనంబు నదియు - చిదచిద్వివేకవిశేషంబు నదియు

* * * *

సృష్టిఁ బుట్టినయట్టిశిష్టజీవులకు - నిష్టలింగాంగసాహిత్యంబుఁజేసి
ప్రాణంబు పశ్చిమపథమునఁ జొనిపి-నాణెంపునాగకన్యక మేలుకొలిపి
కేవలకుంభకక్రియకీలుఁ జూపి - భావంబు లింగానుభవమందు నిలిపి
రతి నిజశిష్యుల రక్షించుకొఱకు - క్షితి మానవాకృతిఁ జేకొన్న యభవుఁ
డల్లమప్రభురాయఁ డతనిమహాత్మ్య - మెల్లయు నిరుపదిరెండుసద్గతుల

కన్నడభాషచేఁ గావ్యంబుఁ జేసె - సన్నుతసద్భక్తసభలందు వెలయ
నది దనిఁగింతు నే నందు నేమైన - గొదవగల్గినఁదీర్పుకొనుఁడు సజ్జనులు

*　　*　　*　　*

బసవన్న సేయింప భాసిల్లుచుండె - అసమానశూన్యసింహాసనంబునకు
తొలుతటివాకిళ్లు తొమ్మిదినడుమ - నలువొప్పుచుండును నాల్గువాకిళ్లు
ఆలోన గర్భగృహంబువాకిళ్లు - చాల నొప్పారుచు సంధిల్లు రెండు
నారెంటిపైవాకిలమరు నొక్కటియు- సారమైనట్టి మోక్షద్వారమనఁగ
నాధారలింగ నాభ్యంచిత హృదయ - బోధకృత్కంఠర భ్రూమధ్యచక్ర
ములను యథాక్రమమున నిల్పిమీఁద-నల బ్రహ్మచక్రంబు నమవుగా నిల్పి
భూజలాగ్న్యనిలనభోమండలంబు - పైశివపరములం బట్టియుండఁగ
భక్తాదికైక్యాంతభవ్యస్థలములు - యుక్తమై పీఠము దుండంగఁజేసి
నేలఁ గాతివ్యంబు నీట ద్రవంబు - కీలి నుష్ణము పరికింప వాయువునఁ
జలనంబు మింట నసద్రూప మాత్మ - నలరుశూన్యత్వంబునం దుండఁజేసి
ఇడయుపింగళయునునిలసుషుమ్నయును-నాడులమూఁడికనడుచక్రశిఖియు
హేళియుఁజరియింప నడమను నడిని - తాలుమూలాంతరద్వాదశస్థాన
మనఁదనువీథుల నండుండ బసవ - ఘనుఁడు గావించె నుత్కటసింహపీఠి
ఆశూన్యపీఠమధ్యంబున శ్రీస-దాశివవృక్షంబు డనరు దానికిని
ప్రణవంబెమూలంబుపంచాక్షరములె-గణుతింపఁదగినశాఖలుపర్ణపుష్ప
ములువర్ణములుపదంబులుఫలావళులు - గలిగి మహాముక్తికర మైనయట్టి
నాదంబె రసమునై నవకమై పొడలి - అద్భుతరత్నమయం బనుచుండ
నామహావృక్షంబు నల్లినయట్టి - కోమలలతికయొకో యన నొప్పు
శివతత్త్వపావకశిఖయునుంబోలె - సవిశేషఫణిమణిజ్వాలయుంబోలె
సాధనంబులుపెక్కు సమకూర్చుకొనియొ-నీగరబసవన్న యిదిచిత్రమనఁగ
పంచభూతంబుల పైనిల్వ బసవఁ - డంచితలోకంబు లాటునెన్నిదియు
అన్నితత్త్వములకు నవ్వలిబయలఁ - జెన్నొందఁజేయించె సింహాసనంబు

శుద్ధచైతన్యము సాత్త్వికకళాసంయోగమునను శివలింగైక్యమును బొందుమార్గమును అల్లమప్రభులీలలు వివరించుచున్నవి:—

పరవీరశైవంబువైభవం బెల్ల - వీరశైవ మనంగ వేదవేదాంత
సార మెట్లన్నను షడ్దర్శనములు - ధర్మార్థకామామృతంబులు నాల్గు
నర్మిలి సాధింపుఁ డని చెప్పు నిందు - కర్మఫలంబులఁ గడకుఁ బోనొత్తి
నిర్మలమోక్షంబు నిలుపంగఁజెప్పు-కర్మలంపటులు స్వర్గంబు దుర్గతియు
దుర్మదులై పొందుదురు మఱి వినుము - జీవహింసలు కర్మజీవులఁ దవులు
జీవహింసలకును శివుఁడు మెచ్చండు-శివుఁడు మెచ్చినఁగాని శివకృప లేదు
శివుకృప లేకున్నఁ జెందదు ముక్తి - కావున నిష్కర్మకాములై వీర
శైవులె మోక్షంబు సాధింతు రనిన

*　　*　　*　　*

భావమద్వైతమైపరఁగుసత్క్రియలు - పోవిడువక నన్నుఁబొందఁజేయు
ఫలమాసపడరొకపట్టుననాకు-నలవడనర్పింతు రఖిలసౌఖ్యములు [దురు
తనుమనోధనవాంఛఁ దవులక సతులఁ-దనయులఁదమ్ములందరినొసంగుదురు
పంచేంద్రియభ్రాంతిఁ బడరంతకునికి - కించిత్తు వెఱవరు గేలిసేయుదురు
ఏకపరబ్రహ్మ మే నని నమ్మి - కైకొరు తక్కిన గ్రామదైవముల [య
మత ముద్ధరించుసమయములయందు-శ్రుతిస్మృతులఁబ్రీతి మాపవో పుదు
వేసుక పూజఁ గావింతురుగాని - వేఱరు కలనైన వేఱొండు నన్ను
పట్టినవ్రతములు భంగంబునొంద - నట్టిలింగైక్యంబు నధిగమింపుదురు
పరవిత్తసతులఁజప్పకచూడరాస-పరమర్మకర్మముల్ పలుకరొక్కపుడు
పరపాకవస్తువుల్ భక్షింపనొల్ల - రోగులకు నుపకార మొనరఁజేయుదురు

*　　*　　*　　*

తనువులమూఁటను దగిలినమలము - లమ త్రిదీక్షలను దొలంగించి లింగ
ములమూఁటిశిష్యాంగములదాపుకొలిపి-యులవడఁబ్రాణంబులందులయించి
భక్తమాహేశాది భవ్యసోపాన - యుక్తిమార్గము మది కొప్పంగఁజేసి
అంగలింగంబులు నాస్యహస్తముల - సంగతి సద్భక్తశక్తులు దెలిసి
సర్వాంగలింగైక్యసరణి నైకొలిపి - నిర్వాణపదమందు నిలుకడఁజేసి
వనధిలోపలఁబడ్డ వడగండ్లయట్లు - ఘనపదంబున గూడుకరువలియట్లు
ఘనసారమగ్నిలోఁ గదిసినయట్లు-తనువులమూఁటిని తాదాత్మ్యమొంది
నిజగురుకృపచేత నెఱయంగఁజేసి-గతిభేదములను బాసి కాంచు నైక్యంబు

పురుషప్రకృతుల సంయోగసాహచర్యములు పురుషార్థమునకు సాధనము లయినటులు ప్రతిబంధకములుగను పరిణమించుచున్నవి. పురుషుఁడు మాయాజనితమైన విషయవాసనలను జయించి శివసాయుజ్యమును బడయఁగలవిధమును విషయవాసనల నారాధించి భ్రష్టుఁడు కాఁగలవిధమును అల్లమప్రభులింగలీలలు సామాన్యులకును కరతలామలకము చేయుచున్నవి. అల్లమప్రభువు కేవలము పరమశివుఁడే యని వీరశైవుల విశ్వాసము.

(కా. నా.)

అల్లమప్రభు శతకము — దెందులూరి పద్మనాభ కృతము. కవి కాశికసగోత్రుఁడు. ఈ శతకవిషయము అల్లమప్రభు స్తవము. భక్తిరసప్రధానము. భాషాలోపములు మెండు. అటనట వ్యావహారిక ప్రయోగములును కలవు. శైలిని దెలుపుటకై క్రింది పద్యము లుదాహృతములు:

శ్రీ రజతాద్రిధామ మదసింధురదానవభంగ దీనమం
దార ముకుందమిత్ర వరతాండవఖేలన కుంద చంద్రికా
శారదమోహనాంగ భవసంహర నిర్మలభూతిలేపనా
తారకరాజభూషణ సదాశివ శంకర యల్లమప్రభో.

భక్తియొసంగవయ్య భవబంధములం దెగఁబాపవయ్య న
న్ముక్తిని జేర్పవయ్య శుభ మొప్పఁ గృతార్థుని జేయవయ్య వే
దోక్తుల కందవయ్య నిను నొప్పుగఁ దల్పెద రాఁగదయ్య చి
ద్భక్తహృదీశ యయ్య శివ సాంబ దయానిధి యల్లమప్రభో.

గురుఁడును తల్లి దండ్రి యధికుండును ప్రాణసఖుండు దైవము
న్వర పరమేశ్వరుండు భగవంతుఁ డనంతుఁడు నప్రమేయుఁడుం
జిరతరమోక్షదాతయును సిద్ధము సర్వము నీ వటంచు నే
స్థిరముగ నమ్మినాఁడ సుమి శ్రీ కరుణానిధి యల్లమప్రభో.

sampath_Ebooks

**అల్లము** — ఇది అరఁటికుటుంబములోనిది. భూమి లోపల దుంపవలె పెరుఁగుభాగమే దీని ప్రకాండము. నిజమైన వేళ్లు ఆ ప్రకాండమువద్దనుండి క్రిందికి దిగును. అరఁటిచెట్టునందువలెనే దాని యాకులు తొడిమ లన్నియు దట్టముగ చేరి ప్రకాండముగా ఏర్పడుచున్నవి.

దీనిని హిందూదేశమునం దంతటను సాగు చేయుచున్నారు. ఒండుమట్టినేలలో శీఘ్రగా పెరుఁగును. వర్షాకాలమునందు దున్నిన పొలములో చిన్నచిన్న గోతులు తీసి ఎరువు వేసి అల్లముముక్కలు నాఁటెదరు. ముక్కలు పెద్దవి కాకపూర్వమే విస్తారముగ వర్షము కురిసి నీళ్లు నిలిచినయెడల అల్లము కుళ్లిపోవును. ఏడెనిమిదినెలల నాఁటికి దుంపలు త్రవ్వుటకు వీలగును. అల్లమునుండియే సొంటిని చేయుదురు. అల్లముముక్కలను నీళ్లలో నానఁబెట్టి మట్టిని కడిగివేసి గోనెసంచులమీఁద పెట్టి పొట్టును రాచివైచి ఎండలో నెండనిచ్చిన సొంటి యగును.

ఉపయోగములు :— సువాసననిమిత్తము కూరలలో వేయుదురు. మందుల కనుపానముగను సువాసన యిచ్చుటకును ఉపయోగింతురు. ఒకవిధమైన సారాయియు, మద్యమును దీనినుండి చేయుదురు. ఇది 'అగ్నిదీపనమును చేయును. శుక్లవృద్ధికారి. మలమును బంధించును. హృదయమునకు హితకరమైనది. కడుపునొప్పి తగ్గించును. రుచిగా, లఘువుగా, మధురపాకము కలదిగా, స్నిగ్ధముగ, ఉష్ణముగా నుండును. కఫవాతములను హరించును' (వాగ్భట సూత్ర., అ. ౬, ౧౬౧-౧౬౨). కడుపునొప్పి తగ్గించుటకై విరేచనకరము లగుమందులయందును, మలమును బంధించుశక్తిగల దగుటచేత అతిసారమునందును దీనిని ఉపయోగింతురు.

మనదేశమునుండి అల్లము సొంటి ఇతరదేశములకు నెగుమతి యగుచున్నది. మన మెగుమతిచేసిన అల్లము పంచదారపాకముతోను తేనెతోను కలసి అల్లముమురబ్బాగా మనదేశమునకు దిగుమతి యగుచున్నది.

**అల్లవరము** — తూర్పుగోదావరిజిల్లా అమలాపురము తాలూకాకు చెందిన గ్రామము. జనసంఖ్య ౫,౭౯౯ (౧౯౩౧).

**అల్లా** — మహమ్మదీయులదేవునికిఁ బేరు. ఇది అరబ్బీ మాట. దీనికిఁ బూజింపఁదగినవాఁ డని యర్థము. మహమ్మదీపదము నిజమైన యీశ్వరుని సూచించు నని నిర్ణయించినందున మహమ్మదీయులు దీనిని ఈశ్వరపరముగ నెక్కుడు భక్తితో వాడెదరు. వీరి ముఖ్యమంత్రములలో 'లా ఇలాహ్ ఇల్లల్లాహ్' అనునది యొకటి. దీనికి 'అల్లా తప్ప మఱి వేఱుదైవము లేదు' అని యర్థము. 'నారాయణునికన్న వేఱుదైవము లేదు' అని మనవైష్ణవులు చెప్పుదురు గదా! అట్టి దిది. సంస్కృతమునందు 'అల్లా' శబ్ద మొకటి, ఆకారాంతస్త్రీలింగము కలదు. దానికి తల్లి యనియు, సర్వజ్ఞ సర్వశక్తియైన పరమాత్మదేవత యనియును రెం డర్థములు, లిచ్చు. అమె 'అల్లెల్లె



త్యావ్యక్తవ్యసూక్తమునందుఁ బ్రసిద్ధ' యని వాచస్పత్యమునందు చెప్పఁబడినది. ఈసూక్తము బహుశః 'అల్లోపనిషత్తు' అనునదియే యైయుండును (చూడుఁడు : అల్లోపనిషత్తు).

**అల్లా ఉద్దీన్** — బహమనీసుల్తా నయిన అహమదుషా జ్యేష్ఠకుమారుఁడు. తండ్రిమరణానంతరమున క్రీ. శ. ౧౪౩౫ లో నితఁడు రాజ్యమునకు వచ్చెను. రాజ్యమునకు వచ్చినవాఁటనుండియు నితఁడు తన సోదరుఁ డయిన మహమ్మదుఖాను నెంతయో ప్రేమతో నాదరించెను కాని యతఁడు దుష్టుల దుర్బోధనలకుఁ జెవియొగ్గి తన యన్నను మారొకన సైన్యములను సమకూర్చుకొని రాయచూరు అంతర్వేది విజాపురము మొదలగుమండలములను ఆక్రమించుకొనెను. ఈరీతి నతిక్రాంతమార్గుఁ డయిన తనసోదరుని శిక్షింప సైన్యములను దీసికొని అల్లాయుద్దీను బయలుదేరెను. ఉభయుల బలములకును జరిగినమహాసంగ్రామమున పెక్కురు యోధులు ఉభయపక్షములందును మడిసినపిదప విజయలక్ష్మి అల్లాయుద్దీనును వరించెను. తన సోదరుఁడు తన్నెంతగ ప్రేమతో నాదరించుచుండినను తాను ద్రోహము తిరిగి నందులకుఁ జాల పశ్చాత్తాపమునొంది మహమ్మదుఖాను అల్లాయుద్దీనును శరణుచొచ్చి తన్ను క్షమింపవలసిన దని వేఁడుకొనెను. సుల్తాను కరుణాంతరంగుఁ డయి సోదరుని క్షమించుటయేకాక యతనికి గొప్ప యౌదార్యముతో రాయచూరుమండలమును జాగీరుగ నొసంగెను.

అల్లాయుద్దీను తనసోదరునితోఁ బోరాడుచుండినకాలమునందు విజయనగరాధిపతి సైన్యములను గూర్చుకొని బహమనీరాజ్యముపయి దండెత్తి వచ్చెను కాని విశేషనష్టముతో నోడి తుద కేఁటేఁట బహమనీరాజ్యమునకుఁ గప్పము చెల్లించుట కొడంబడి సంధి కావించుకొనె నని మహమ్మదీయచరిత్రకారులు వ్రాసియున్నారు. ఇందలి యాథార్థ్య మింకను పరిశోధింపవలసియున్నది.

సంగ్రామములందు అల్లాయుద్దీనున కీరీతిని విజయములు సంప్రాప్తించుచు వచ్చినను అతనిరాజ్యపరిపాలనము దక్కనీమహమ్మదీయుల పరస్పరకలహములవలనఁ జాల సంక్షోభముఁ జెందినది. దక్కనీమహమ్మదీయులలోఁ జాలమంది సున్నీమతావలంబులు. విదేశీయులగు అరబ్బులు, తుర్కీవారు, పెరిషియనులు, మొగలాయీలు షియామతస్థులు. ఈ యుభయపక్షములవారికిని గల విరోధము అల్లాయుద్దీను సుల్తాను కాలమున మఱింత ప్రబలినది. ఈవిషమస్థితియందు మద్యపానప్రమత్తుఁడయియున్న సుల్తా నొసంగిన యనుమతివలన నొక మహాదారుణకార్యము జరగినది. క్రీ. శ. ౧౪౫౩ లో విదేశీయమహమ్మదీయపక్షమునకుఁ జెందిన ఖాఫ్ మలిక్ ఉత్ తుజార్ గొప్పసైన్యమును దీసికొని సముద్రతీరస్థమయిన సంగమేశ్వరదుర్గమును సాధింప నరిగెను. అతఁడు మొదట సిర్కా యనుహిందూప్రభువుచే పరిపాలితమయినదుర్గమును వశపఱుచుకొని యాప్రభువునకు బలవంతముగ మహమ్మదీయమత మొసంగెను. పిదప తుజార్ సంగమేశ్వరముపై దండువిడలెను. సంగమేశ్వరము పర్వతారణ్యమధ్యస్థితమయి దుస్సాధ్య మని పేరొందినదుర్గము. తుజార్

sampath_Ebooks

సైన్యము లాపర్వతారణ్యమధ్యమునఁ జిక్కువడి చెదలఁ గుందుచుండిన సమయమున తుజారుపైఁ బగదీర్చుకొన నదియే తగినతరుణ మని మహమ్మదీయసైన్యముల దుస్థితినంతయు సిర్కా సంగమేశ్వరదుర్గాధిపతికి రహస్యముగ నెఱిఁగించెను. వెంటనే సంగమేశ్వరప్రభువు పర్వతప్రాంతసంగ్రామకుశలు లయిన ముప్పదివేలమంది సైనికులతో నెత్తివచ్చి యొకనాఁటిరాత్రి తుజారుసైన్యములపయిఁ బడి ఏడెనిమిది వేలమందినే కాక తుదకు సైన్యాధిపతినిగూడ హతమొనర్చెను. హతశేషులు పూనా కుత్తరమున నున్న చాకణదుర్గమునకుఁ బాఱిపోయి ప్రాణములను గాపాడుకొనిరి.

ఈపరాజయవృత్తాంతము రాజధానియందుఁ దెలిసినపిదప విదేశీయులపయిఁ దమపగ తీర్చుకొనుట కదె తగినతరుణ మని యెంచి, దక్కనీఅమీరులుఁ విదేశీయు లందఱును గలసి చాకణదుర్గమున రాజ్యవిప్లవము లేపఁ గుట్రచేయుచున్నా రని మద్యపానప్రమత్తుఁ డయియున్న తఱిని సుల్తానునకు దుర్బోధనలు కావించి వారి నందఱను గడతేర్చుటకు అతనివలననుండి యనుజ్ఞఁబడసి చాకణదుర్గమునకు సైన్యములతో బయలుదేఱి వెళ్లిరి. పిదప వారు దుర్గస్థు లయినవిదేశీయుల కెంతమాత్రము ననుమానము కలుగకుండ ప్రేమాదరములు నటించి, వారి నందఱను విందున కాహ్వానించి కత్తి కెరచేసిరి. ఈవిధమున ఆవిందుసందర్భమున నుత్తమవంశజు లయినసయ్యదులు పండ్రెండువందలమందియు, ఇతరవిదేశీయులు వేయిమందియు, పిల్ల లయిదాఱువేలును వధింపఁబడిరి. ఈదారుణవధానంతరము దక్కనీలు హతు లయినవారిభార్యలను, కూఁతులను, వస్తుసామగ్రిని పరిగ్రహించిరి. అనతికాలముననే అల్లాయుద్దీను జరిగినకపట మంతయుఁ దెలిసికొని చాల పశ్చాత్తాపమునొంది, ఈదారుణవధకుఁ గారణభూతు లయిననాయకుల నందఱను వధించుటయేకాక యితర దక్కనీనాయకులను గొప్పయుద్యోగములనుండి తొలఁగించి వారికుటుంబములకు భిక్షాపాత్రము చేతి కిచ్చెను. పిదప రాజ్యమునఁ గలయున్నతపదవులు విదేశీయులకు మరల లభించినవి. విదేశీయులు తా మదివఱకుఁ గోలుపోయిన గౌరవాధిక్యములను మరల సంపాదించిరి.

అల్లాయుద్దీను క్రీ. శ. ౧౪౫౮ లో చనిపోయెను.

**అల్లా ఉద్దీన్ అలమ్ షా** (౧౪౪౫ - ౧౪౭౮) — ఢిల్లీసుల్తాను. సయ్యదువంశమునందలి చివరవాఁడు; చాలనసమర్థుఁడు. ౧౪౫౧లో నీతఁడు ఢిల్లీలో లేనప్పుడు బహలాల్ లోడీ అనువాఁడు ఢిల్లీని స్వాధీనపఱుచుకొనెను. ఈతఁడు ఢిల్లీలో ౬ సంవత్సరముల వఱకు మాత్రము ప్రభుత్వము చేసెను; తర్వాత ౧౪౭౮ వఱకును బదావ్ అనుచోట నుండెను. బదావ్‌లోచుట్టుపట్టుప్రదేశముమీద ౨౭ సంవత్సరములవఱకు నధికారము చెల్లించుకొనెను.

**అల్లా ఉద్దీన్ ఖిల్జి** (౧౨౯౬ - ౧౩౧౬) — ఢిల్లీచక్రవర్తి. ఈతఁడు 'సికందర్ ఈ సాని' అను బిరుదు వహించెను. దీనికి ౨-వ అలెగ్జాండరని అర్థము. ఈతఁడు ఖిల్జీవంశస్థాపకుఁడైన జలాలుద్దీన్ ఫీరూజుషాహాఖిల్జీ అనుబాదుషాకు తమ్మునికుమారుఁడు; అల్లుఁడు. అతనిఁ జంపి రాజ్యమునకు వచ్చెను. రాజ్యమునకు రాకపూర్వ మీతఁడు ౧౨౯౩ - వ సంవత్సరమున దక్షిణమందలి దేవగిరికి మహారాష్ట్రరాజైన రామదేవరాజును జయించెను. జయపురరాజ్యములోని రణతంభోర్ అను బలిష్ఠమైన దుర్గమును ౧౨౯౯ లోను, చిత్తోడ్‌గడమును ౧౩౦౪ లోను జయించెను. తన సేనాని యైనమాలిక్కాఫర్ అనువానిని దక్షిణదేశముపైకి దండు పంపెను. ౧౩౦౩ లో వానిని ఓరుఁగంటి ప్రతాపరుద్రుఁ డోడించెను. కాని యాతఁడు మరల ౧౩౦౯ లో ఓరుఁగంటికిఁ బోయి ప్రతాపరుద్రు నోడించి యాతఁడు ఢిల్లీశ్వరునకుఁ గప్పము గట్టునట్లు చేసెను. ౧౩౧౦ లో ద్వారసముద్రపు బల్లాలరాజులను ఓడించెను. అచ్చటనుండి కాఫరు రామేశ్వరమునకుఁ బోయి అచ్చట నొకమసీదుఁ గట్టించెను. వాని నెదిరించువాఁడు లేఁడయ్యె! కాఫర్ ౧౩౧౨ లో దేవగిరిరాజును జంపి ఆరాజ్య మంతయు ఢిల్లీరాజ్యములోఁ గలిపెను. కాశీక్షేత్రమునందు వేయిదేవాలయముల కన్న నెక్కుడుగ పడఁగొట్టితి నని యాతఁడు గర్వముగఁ జెప్పుకొనెడివాఁడు. ఈతనికాలమున పెక్కురాజమందిరములు, మసీదులు, విద్యాపీఠములు, కోటలు, స్నానగృహములు విశేషముగఁ గట్టింపంబడియెను. అమీర్ ఖుస్రూ ఖ్వాజా హసన్ అనుకవిపుంగవు లీతనియాస్థానము నలంకరించిరి.

**అల్లా ఉద్దీన్ మసూద్ షా** (౧౨౪౨ - ౧౨౪౬) — ఢిల్లీసుల్తాను. ఈల్ తత్ మిష్ యొక్క మనుమఁడు. సుల్తానా రిజియా తమ్ముఁడైన బహరామ్‌షా అనువానితరువాత నీతఁడు రాజ్యమునకు వచ్చెను. ఈతనిరాజ్యకాలమందు మంగోలులు రెండుసారులు హిందూదేశముమీఁదికి దండెత్తి వచ్చిరి. కాని యమితనష్టముతో నోడింపఁబడిరి. ఈతని పరిపాలనము ప్రజలకు దుస్సహము కాఁగా ఈరాజును పదచ్యుతుని జేసి యీతనిపినతండ్రి యగు నాసిరుద్దీన్ మహమూద్ అనువాఁడు సుల్తా నయ్యెను.

**అల్లా ఉద్దీన్, హసన్ షా బహ్మనీ** — ఇతఁడు దక్కనుదేశమున బహ్మనీరాజ్యమును సంస్థాపించి యేలుబడి నెఱపిన మొదటిసుల్తాను; కైకా - ఊస్ - మహమ్మదుకుమారుఁడు. ఇతఁడు మొదట గంగూ యనుబ్రాహ్మణునియొద్ద నొకసేవకుఁడుగ నుండె నని, ఇతనికి రాజ్యము వచ్చినపిదప తన కంతకుపూర్వము యజమానుఁడుగ నుండినబ్రాహ్మణునియెడలఁ దన కృతజ్ఞతను దెలుపుటకయి గంగూ బహ్మని యన్నబిరుదమును వహించె నని ఫెరిస్తా యనుమహమ్మదీయ చరిత్రకారుఁడు వ్రాసినవృత్తాంతమువలనఁ దెలియుచున్నది. ఇది సరికా దనియు, కొంతవఱకు కల్పితపురుషుఁడుగనే పరిగణింపఁబడు ఇస్ఫందియారుకుమారుఁడు బహ్మన్ అను ప్రసిద్ధరాజునిసంతతివాఁ డయినందుననే అల్లా ఉద్దీన్ బహ్మన్ బిరుదమును ధరించె ననియు,

sampath_Ebooks

గంగూ అన్నది కైకా - ఊస్ - పదమునకు లేఖకప్రమాదజనిత మయినవికృతి యనియు కొందఱు చరిత్రకారులమతము.

అల్లాఉద్దీన్ ఢిల్లీకి వచ్చి సుల్తాను మహమ్మదు బిన్ తుఘ్లకు దయ సంపాదించి యతనికొలువునఁ గుదిరెను. కొంతకాలము గడచిన పిదప నతఁడు మెరికెలవంటి యోధులను వెంటఁదీసికొని తనయదృష్ట రేఖను వెదకికొన దక్కనుదేశమున కరిగెను. అప్పట సుల్తాను మహమ్మదునంత్యకాలమున దౌలతాబాదు ప్రాంతములందు రేఁగినవిప్లవమున పాల్గొనెను. విప్లవకారులు దౌలతాబాదుదుర్గాధిపతిని బాఁఱద్రోలి కోట నాక్రమించుకొని ఇస్మాయిల్ ముఖ్ అఫ్ఘా ననువృద్ధునిఁ దమకుఁ బ్రభువుగా నెన్నుకొనిరి. అల్లాఉద్దీనుకుఁ గల జఫర్ ఖాను బిరుద మీయఫ్ఘానుప్రభు వొసంగినట్లు చెప్పుదురు. ఈరాజ్యవిద్రోహ వార్త విని క్రోధియందు విడిసియున్న మహమ్మదు బిన్ తుఘ్లకు వెంటనే సైన్యసమేతుఁడయి దౌలతాబాదువకు బయలుదేఱివచ్చెను. విప్లవకారులసైన్యములు రాజసైన్యములను మధ్యమార్గముననే యెదుర్కొనెను గాని పూర్తిగ పరాభూతము లయినవి. విప్లవకారులు తమ కుటుంబములతో సుల్తానుమహమ్మదే దుస్సాధముగఁ గట్టుదిట్టము కావించినదౌలతాబాదుదుర్గము నాశ్రయించిరి. జఫర్ ఖానును, ఇస్మాయిల్ ముఖుసోదరులును దమస్థితిని కట్టుదిట్టము చేసికొనుటకు గుల్బర్గకు మరలిపోయిరి. రాజసైన్యములు వచ్చి దౌలతాబాదుపురవాసులను దోచుకొని మహమ్మదీయప్రజలను చెఱఁబట్టి ఢిల్లీకిఁ బంపినవి. పిదప సుల్తాను మహమ్మదు దుర్గమునకు ముట్టడివేసి ఇమాదుల్ ముల్కనునతనిని సైన్యముల నిచ్చి జఫరుఖానును సాధింపఁ బంపెను. మూఁడునెలలు ముట్టడి సాగినను దౌలతాబాదుదుర్గము వశము కాలేదు. ఇంతలో గుజరాత్ దేశమున మలిక్ తఘీ యనునతఁడు పితూరీలేచె నని విని సుల్తా నాగ్రహమహోదగ్రుఁడయి, దౌలతాబాదుముట్టడి సాగింపఁ గొంతసైన్యము నచ్చట దిగవిడిచి, తాను స్వయముగ తఘీని శిక్షింప గుజరాత్ దేశమున కరిగెను. ఈలోఁగా నంతవఱకు సుల్తానువశమునం దుండినయోరుఁగల్లు, కంపిలి మొదలయినరాజ్యములు స్వాతంత్ర్య పతాకలు విప్పినవి. ఓరుఁగంటిప్రభు వగుకాపయనాయకుఁడు పంపినట్టిదియు, దౌలతాబాదురాజ్యమునుండి వచ్చినట్టిదియు నగు సైన్యముల సాయమున జఫర్ ఖాన్ ఇమాదుల్ ముల్కను వధించి యతనిసైన్యముల నోడించి దౌలతాబాదున కరిగెను. జఫర్ ఖానువిజయములను, అతనిరాకను విని దౌలతాబాదుదుర్గమును ముట్టడించియున్న రాజసైన్యములు పలాయితము లయినవి. విజయోత్సవముతో జఫర్ ఖాను దౌలతాబాదునఁ బ్రవేశించెను. ఇస్మాయిల్ ముఖ్ కోట వదలి వచ్చి, తనయసమర్థతను గుర్తించి తనరాజత్వమును వదలుకొనఁగా విప్లవకారులు జఫరుఖాను నేకగ్రీవముగఁ దమప్రభువుగ నెన్నుకొనిరి. జఫర్ ఖాను అబుల్ ముజఫర్ అల్లాఉద్దీన్ హసన్ షా బహ్మనీ యన్న బిరుదముతో క్రీ. శ. ౧౩౪౭ - వ సంవత్సరమున సింహాసన మెక్కెను. క్రీ. శ. ౧౩౪౭ మొదలు ౧౫౨౬ వఱకు రమారమి రెండుశతాబ్దులకాలము దక్షిణహిందూదేశరాజకీయవ్యవహారములందు ప్రధానపాత్రము వినిపించిన బహ్మనీవంశమునకు అల్లాయుద్దీను మూలపురుషుఁడు. ఇతఁడు ప్రస్తుతము నిజాంరాజ్యమునం దున్న గుల్బర్గ (కలుబరిగి) నగరమును దన రాజధాని కావించుకొని దానికి హసనాబాదని నామకరణముఁ జేసెను.

సింహాసన మెక్కినవెంటనే అల్లాయుద్దీను తనరాజ్యమును సరియయినపద్ధతియం దుంచుటకు కట్టుదిట్టములు కావించెను. అతఁడు రాజ్యమునంతను నాలుగుతరఫులుగ విభజించెను. తనకు విజయరాజ్యములు చేపడుటకు విశేషముగఁ దోడ్పడిన అమీరులకు గొప్ప గౌరవబిరుదముల నొసంగి వారి నాతరఫుల కధికారులుగ నియమించెను. ఒక్కొక్క యమీరునకుఁ దనకు యుద్ధావసరమున సైనికసాహాయ్యమును జేయుటకై కొంతసైన్యమును బోషించు పద్ధతిమీఁద జాగీరుల నొసంగెను. ఈవిధమున అమీరులను, వజీరులను, సైన్యాధిపతులను వారివారియోగ్యతల ననుసరించి తగిన కితాబు లిచ్చి నియమించి తనరాజ్యస్థితిని భద్రపఱుచుకొనెను. కాని సుల్తాను తనమీఁదికెప్పుడు దండెత్తివచ్చునో యని అల్లాయుద్దీ నెప్పుడును మనస్సునఁ గలవరపడుచునే యుండెను. తుదకు ౧౩౫౧ లో సుల్తాను మహమ్మదు బిన్ తుఘ్లకు చనిపోయినపిదప, ఢిల్లీ నూతనచక్రవర్తి కట్టిదూరప్రదేశములను జయించుతలంపు గాని, శక్తి గాని లేనందున అల్లాయుద్దీను నాందోళనము తగ్గినది. పిదప నతఁడు దనయమీరులు మొదలయినవారి సాయమున దక్కనుదేశమునందలి చాలభాగమును జయించెను. గోవా, దాభోలు, కొల్లాపురము, తెలింగానాలు మహమ్మదీయులకు వశమయినవి.



అల్లా ఉద్దీన్ హసన్ షా గోరీ, గుల్బర్గ

అల్లాయుద్దీను గుల్బర్గయందు బహ్మనీరాజ్యమును స్థాపించునాఁటికే హరిహరబుక్కరాయాదులు తుంగభద్రానదీతీరమున విజయనగరసామ్రాజ్యమును స్థాపించిరి. సరిహద్దురాజ్య మగుటవలన విజయనగర, బహ్మనీరాజ్యములకు సంతతము పోరాటము జరగుచువచ్చెను. బహమనీ రాజ్యసంస్థాపనమునకుఁ బూర్వము రాయచూరు, ముదుగల్లు ప్రాంత

sampath_Ebooks

ములు హరిహరరాయలక్రింద నుండెను. ఈప్రాంత మంతయుఁ దరువాత బహమనీషాహు వశమయినది. నాఁటనుండి కృష్ణా, తుంగభద్రా నదులకు నడుమ నుండిన యంతర్వేది యుభయరాజ్యములకును గలహ కారణ మయినది. తత్ఫలముగ జరగినసంగ్రామములలో నీప్రాంతము తఱచుగఁ జేతులు మాఱుచువచ్చినది.

క్రీ. శ. ౧౩౫౮ లో అల్లాయుద్దీను కాలధర్మము నొందెను. అతఁడు చనిపోవునప్పటి కతనిరాజ్యము పశ్చిమమున సముద్రతీరము వఱకును, తూర్పున భోనగిరివఱకును, ఉత్తరమున పైనగంగ మొదలు కొని దక్షిణమున కృష్ణవఱకును వ్యాపించినది.

అల్లాఉద్దీన్ హుసేన్ (౧౧౫౭-౫౬) — ఘోర్ దేశపు సుల్తాను. ఇతనికి జహాన్‌సోజ్ అన్న బిరుదు కలదు. ఈపదమునకు ప్రపంచమును కాల్చువాఁ డని యర్థము. ఈతనిబావమఱఁది యైన బహరాంషాహా అనువాఁ డీతని యిద్దఱుసోదరులను చంపి గజినీ రాజ్యము నాక్రమించుకొనఁగ నీతఁ డాతని మీఁదికి దండెత్తిపోయి అతని నోడించి రాజ్య మాక్రమించుకొనెను (౧౧౫౭). ఆనగరమునందలి గొప్పమందిరములను, శాసనములను ధ్వంసము చేసెను.

అల్లాఉద్దీన్, హుస్సేన్ షా (౧౪౯౩-౧౫౧౯) — బంగాళ దేశపుసుల్తాను, మొదట ముజఫర్ షాహా అనువానికి వజీరుగ నుండెను. అతఁడు పదభ్రష్టుఁ డయి హతుఁ డయినపిదప సామంతు లితనిని దమ సుల్తానుగ నెన్నుకొనిరి. ఇతఁడు జనరంజకముగ ౨౬ సంవత్సరములు పాలించి గౌర్‌పట్టణమునఁ జనిపోయెను. ఈతని తరువాత నీతనికుమారుఁడైన నస్‌రత్‌షా రా జయ్యెను.

అల్లాడి — గంజాంజిల్లా శ్రీకాకుళంతాలూకాకు చెందిన గ్రామము. జనసంఖ్య ౧,౫౪౮ (౧౯౩౧).

**అల్లాడనాథుఁడు** — లక్ష్మణుని పుత్త్రుఁడు. యమునానదీతీరమునందలి ఏకచక్రనగరమును బాలించిన చౌహాణ వంశజుఁడగు సూర్యసేనునియాజ్ఞ ననుసరించి నిర్ణయామృత మనుధర్మ శాస్త్రగ్రంథమును రచియించెను. ఏతద్గ్రంథరచనమున నితఁడు తాను మనుస్మృతి, విష్ణుస్మృతి, పారాశరస్మృతి, ఆపస్తంబస్మృతి, మితాక్షర, అపరార్క, అర్ణవ, పారిజాత, స్మృత్యర్థసార, స్మృతిచంద్రిక, మాత్స్య, కౌర్మ, వారాహ, వైష్ణవ, వామన, మార్కండేయ, భవిష్యోత్తర, హేమాద్రిపరిశిష్ట, అనంతభట్టీయ, గృహ్యపరిశిష్ట, కాలాదర్శ, చింతామణి, త్రిదండి, కృత్యకల్పతరు, ధవల పురాణసముచ్చయ, దుర్గోత్సవ, రామకౌతుక, సంవత్సరప్రదీప, భోజరాజీయ, దేవదాసీయ, రూపనారాయణీయ, విద్యావేదపద్ధతి, మహాదేవీయ, విశ్వరూపకృత నిబంధగ్రంథముల నవలోకనము చేసినట్లు చెప్పుకొనినాఁడు. ఈనిర్ణయామృతము నిర్ణయసింధువునందును, రఘునందనునిచేతను, భట్టోజిదీక్షితకృతమగు తిథినిర్ణయమునందును ఉదాహృత మయినది. అల్లాడనాథుఁడు క్రీస్తుశకము ౧౩౭౫ నకుఁ దరువాతను, పదునాఱవశతాబ్దికిఁ బూర్వమునను ఉండియుండు నని చరిత్రకారుల మతము. నిర్ణయామృతప్రతి నొకదానిని ప్రొఫెసరు వీబరు తన బెర్లిన్ గ్రంథపట్టికయందు పరామర్శించియున్నాఁడు.

అల్లాడపల్లె — కడపజిల్లా ప్రొద్దుటూరుతాలూకాకు చెందిన గ్రామము. జనసంఖ్య ౧,౧౯౫ (౧౯౩౧).

అల్లాడపాలెము — విశాఖపట్టణముజిల్లా విజయనగరము తాలూకాలోని జమీన్‌దారీగ్రామము. జనసంఖ్య ౪౭౯ (౧౯౩౧)

అల్లాడపురము — గంజాంజిల్లా బరహంపురంతాలూకాలోని గ్రామము. ఇందలి జనసంఖ్య ౩౦౦ (౧౯౩౧).

అల్లాపల్లె — అనంతపురంజిల్లా కదిరితాలూకాకు చెందిన గ్రామము. జనసంఖ్య ౨,౫౦౬ (౧౯౩౧).

అల్లాపురము — కృష్ణాజిల్లా గన్నవరము తాలూకాలోని జమీన్‌దారీగ్రామము. ఇందలి జనసంఖ్య ౮౧౭ (౧౯౩౧).

అల్లార్డిస్, అలెగ్జాండర్ (౧౮౪౬-౯౬) — స్కాట్‌లండ్ దేశజుఁడు. ౧౮౭౫-౭౫ వఱకును కలకత్తాలోని 'ఫ్రెండ్ ఆఫ్ ఇండియా' అనుపత్రికకు ఉపసంపాదకుఁడుగ నుండెను. తరువాత కొంతకాలము సిలోన్ టైమ్సుపత్రికకు సంపాదకుఁడుగ నుండెను. ఇతఁడు పెక్కునవలలు వ్రాసెను. మఱియు పెక్కు గ్రంథములు వ్రాసెను.

అల్లికపని — ఇది రెండువిధములు: ఊలు అల్లిక, క్రోషా అల్లిక (Crocheting). ఈ రెండువిధములైన అల్లికలను ఆ యాశబ్దములక్రింద వివరింపఁబడును.

అల్లిగూడ — గంజాంజిల్లా సురడా తాలూకాలోని బోడోగోడో జమీన్‌దారీకిఁ జెందిన గ్రామము. ఇందలిజనసంఖ్య ౫౦ మాత్రమే.

అల్లిగూడెము — తూర్పుగోదావరిజిల్లా భద్రాచలము తాలూకాలోని ఏజెన్సీగ్రామము. జనసంఖ్య ౧౩౬ (౧౯౩౧).

అల్లినగరము — కర్నూలుజిల్లా కంబంతాలూకాలోని గ్రామము. జనసంఖ్య ౧,౦౮౫ (౧౯౩౧).

అల్లిపల్లె — పశ్చిమగోదావరిజిల్లా చింతలపూఁడితాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౧౭౦ (౧౯౩౧).

అల్లిపురం — విశాఖపట్టణముజిల్లా విశాఖపట్టణము తాలూకాకు చెందిన జమీన్‌దారీగ్రామము. ఇందలి జనసంఖ్య ౫౮౨ (౧౯౩౧).

**అల్లిపురము** — ౧. గంజాంజిల్లా బరహంపురం తాలూకాకు చెందిన గ్రామము. జనసంఖ్య ౫౫౮ (౧౯౩౧).

౨. నెల్లూరుజిల్లా నెల్లూరుతాలూకాయందలి గ్రామము. ఇందలిజనసంఖ్య ౨,౨౦౯ (౧౯౩౧).

**అల్లిపురో** — గంజాంజిల్లా ఆస్కాతాలూకా దేబోభూమి (దేవభూమి) మాలుక్దారీకి చెందిన గ్రామము. జనసంఖ్య ౪౯౪ (౧౯౩౧).

**అల్లిపూండి** — తూర్పుగోదావరిజిల్లా తునితాలూకాయందలి జమీందారీగ్రామము. దీనిజనసంఖ్య ౨,౫౧౮ (౧౯౩౧).

**అల్లిపూలగుంట** — చిత్తూరుజిల్లా తిరుత్తనితాలూకాలోని జమీందారీగ్రామము. జనసంఖ్య ౧౮౪ (౧౯౩౧).

**అల్లిపారో** — (స. సెం. ౧౫) గంజాంజిల్లా ఛత్రపురంతాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౭౧౫ (౧౯౩౧).

**అల్లిమడుగు** — ౧. చిత్తూరుజిల్లా కాళహస్తితాలూకాలోని ఈనాంగ్రామము. ఇందలిజనసంఖ్య ౧౧౮ (౧౯౩౧).

౨. నెల్లూరుజిల్లా కావలితాలూకాయందలిగ్రామము. జనసంఖ్య ౧,౮౫౯ (౧౯౩౧).

**అల్లిమేరక** — గంజాంజిల్లా సోంపేట తాలూకాయందలి మంచసారాయిస్టేటుకు చెందిన జమీందారీగ్రామము. జనసంఖ్య ౧౨౦ (౧౯౩౧).

**అల్లివీడు** — పశ్చిమగోదావరిజిల్లా ఏలూరుతాలూకాయందలి జమీందారీగ్రామము.

**అల్లీఖానుడుపాలెము** — విశాఖపట్టణముజిల్లా అనకాపల్లితాలూకాయందలి జమీందారీగ్రామము. ఇందలి జనసంఖ్య ౪౯౯ (౧౯౩౧).

**అల్లుఖోలా** — గంజాంజిల్లా టెక్కలి తాలూకాలోని జమీందారీగ్రామము. ఇందలి జనసంఖ్య ౪౪౯ (౧౯౩౧).

**అల్లుగుండు** — అనంతపురంజిల్లా కదిరితాలూకాలోని గ్రామము. ఇందలి జనసంఖ్య ౭౦౧ (౧౯౩౧).

**అల్లువాడ** — విశాఖపట్టణముజిల్లా పార్వతీపురంతాలూకాయందలి జమీందారీగ్రామము. జనసంఖ్య ౨౯౦ (౧౯౩౧).

**అల్లూరు** — ౧. కర్నూలుజిల్లా కోయిలకుంట్లతాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౧,౦౪౭ (౧౯౩౧).

౨. కర్నూలుజిల్లా నందికొట్కూరుతాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౭౫౪ (౧౯౩౧).

౩. కృష్ణజిల్లా కైకలూరుతాలూకాయందలి ఈనాంగ్రామము. దీనిజనసంఖ్య ౬౨౮ (౧౯౩౧).

౪. కృష్ణజిల్లా నందిగామ తాలూకాలోని గ్రామము. జనసంఖ్య ౧,౯౧౫ (౧౯౩౧).

౫. గుంటూరుజిల్లా రేపల్లె తాలూకాలోని గ్రామము. దీనిజనసంఖ్య ౧,౫౬౯ (౧౯౩౧).

౬. నెల్లూరుజిల్లా కోవూరుతాలూకాయందలి పట్టణము. ఇందు అల్లూరు, అల్లూరుపేట, సింగపేట యను మూడువిభాగములు గలవు. ఈమూడువిభాగములును అల్లూరను పేర వ్యవహరింపబడుచుండును. ఇందలిజనసంఖ్య ౧౦,౬౯౪ (౧౯౩౧).

**అల్లూరుకొత్తపట్టణము** — గుంటూరుజిల్లా ఒంగోలుతాలూకాయందలి గ్రామము. ఇందలి జనసంఖ్య ౮,౩౯౩ (౧౯౩౧).

**అల్లూరుగడ్డ** — తూర్పుగోదావరిజిల్లా ఎల్లవరం తాలూకాయందలి యేజెన్సీ జమీందారీగ్రామము. దీనిజనసంఖ్య ౨౧౩ (౧౯౩౧).

**అల్లెఘనిపట్టణము** — అమెరికా సంయుక్తరాజ్యములలోని పెన్సిల్వేనియా రాజ్యమందలి యొకపట్టణము. జనసంఖ్య ౧,౩౨,౨౭౩. ఇది అల్లెఘనినదియొడ్డున నున్నది; కర్మశాలలకు ప్రఖ్యాతిం జెందినది. ఇచ్చట ఇనుము, ఉక్కు కార్ఖానాలు, మోటారుబండ్లు, రైలుబండ్లు ఇతరయంత్రములుచేయు యంత్రశాలలు, పోతపోయు కర్మాగారములును, నూలుబట్టలు నేయు యంత్రశాలలు, పిండిమరలు మొదలైనవి పెక్కులు కలవు. ఇచ్చట విద్యావిషయకమైనవియును, పరోపకారసంబంధమైనవియు నగు సంస్థాపనములునూడం గలవు.

**అల్లేనా** — విశాఖపట్టణముజిల్లా పాలకొండతాలూకాకు చెందినగ్రామము. ఇందలిజనులసంఖ్య ౭౫౨ (౧౯౩౧).

**అల్లేయిస్ వాల్** (౧౮౦౦-౧౮౫౩) — ఫ్రాన్సుదేశజుండు. ప్రఖ్యాతుండైన నాటకకర్త.

**అల్లోపనిషత్తు** — సంస్కృతమునందు అల్లోపనిషత్తొకటి కలదు. ఇందు అల్లాయొక్క మాహాత్మ్యము వర్ణింపబడినది. ఇది అక్బరుచక్రవర్తి కాలమున రచింపబడె నని కొందఱమతము. ఇది అథర్వవేదాంతర్గత మనియుం జెప్పంబడినది. అష్టోత్తరశతోపనిషత్తులజాబితాలో నిది లేదు. కావున నిది మిక్కిలి యిటీవలిదై యుండనోపు. చిత్రమైన ఈయుపనిషత్తునుండి కొన్నివాక్యము లీదిగువ నుదాహృతములు :

sampath_Ebooks

ఓం అస్మల్లాం ఇల్లే మిత్రావరుణో దివ్యాని ధత్తే,
ఇల్లల్లే వరుణో రాజా పునర్దదుః,
హాలూమిమిలో ఇల్లాం ఇల్లల్లేతి

*　　*　　*

అల్లో జ్యేష్ఠం శ్రేష్ఠం పరమం పూర్ణం బ్రహ్మాణ మల్లాం,
అల్లోరసుర మహామదరకం వరస్య అల్లో,

*　　*　　*

ఇల్లాకబర ఇల్లాకబర ఇల్లల్లేతి
ఇల్లాలాః ఇల్లా ఇల్లాల్లా అనాది
స్వరూపా అథర్వణీ శాఖాం హ్రాం హ్రీమ్.

ఇది యక్బరుచక్రవర్తికాలమున సంస్కృత మెఱింగిన మహమ్మదీయునిచే రచింపఁబడియుండు ననుట కీక్రిందిగాథ సహాకారిగ నున్నది. అక్బరుకాలమున నాతనిసభలో అబ్దుల్ కాదిర్ బదౌని అను మహమ్మదీయపండితుఁ డుండెను. ఈతఁడు సంస్కృతమునఁగూడఁ బండితుఁడు. రామాయణ భారతాది గ్రంథములను ఫారసీలోనికి భాషాంతరీకరించెను. ఈతఁడు 'ముంతకబ్ ఉత్ తవారిఖ్' అను చరిత్రగ్రంథము వ్రాసెను. అందు నొకచోట నిట్లు వ్రాసియున్నాఁడు :

"ఈయేఁట (౯౮౩ హిజ్రా; క్రీ. శ. ౧౫౭౫) దక్షిణదేశమునుండి శేఖ్ భావన్ అనుపేరుగల విద్వాంసుఁ డైనబ్రాహ్మణుఁ డొకఁడు వచ్చియుండెను. అతఁడు మహమ్మదీయమతమునుగూడ బాగుగ నభ్యసించియుండెను. ఆసమయమందే చక్రవర్తి నాకు అథర్వవేదమును భాషాంతరీకరింపు మని యాజ్ఞాపించెను. మహమ్మదీయ ధర్మశాస్త్రమందలి కొన్నియుపదేశములకును, అథర్వవేదమందలి కొన్నియుపదేశములకును సామ్యము కలదు. భాషాంతరము చేయునపుడు పెక్కుతావులం దిట్టివాక్యములు రాఁగా శేఖ్ భావన్ వానిభావమును చక్కఁగఁ జెప్పలేకపోయెను. నే నీసంగతి చక్రవర్తికిఁ దెల్పితిని. అతఁ డథర్వవేదమున కనువాదము చేయు మని ఫైజీతోడను, హాజీ ఇబ్రాహింతోడను చెప్పెను[1]. ఈవేదమునం దొక్కచోట మన (కురాను లోని) 'లా ఇల్లాహ ఇల్లల్లాహ' అన్నమాట యుండెను. ఈవాక్యము నుపయోగించి శేఖ్ భావన్ అన్నవాఁడు పెక్కురు బ్రాహ్మణులతో వాదించి వారి నోడించెను. ఈమంత్రబలముచే సెందఱో హిందువులు మహమ్మదీయమతము నవలంబించిరి[2].

దీనినిబట్టి చూడఁగా నాకాలమందు, బదౌనియో, ఇస్లాయిలో లేక బ్రాహ్మణబ్రువుఁడైన శేఖ్ భావనుఁడో అల్లోపనిషత్తును రచించియుండు రని మన మూహింపవచ్చును. ఫైజీమాత్ర మీపని చేసియుండఁడు. అతనికి నేమతమునందును దురభిమానము లేకయుండెను. అన్నిమతములు నతనికి సమానములు. (కొ. వేం. ల.)

**అల్లోరి, క్రిస్టోఫానో** (౧౫౭౭ - ౧౬౨౧)— ఫ్లారెన్సుపట్టణమునఁ బుట్టిన విఖ్యాతచిత్రకారుఁడు. ఈతనిచే చిత్రింపఁబడి మిక్కిలి ప్రఖ్యాతిఁ జెందిన ఫ్లారెన్సు నారీమణి పటము (Portrait of a Florentine) అనునది లండన్‌పురమందలి నేషనల్ గేలరీలో (జాతీయచిత్రపటసంగ్రహమునందు) ఉన్నది.

**అల్వరెజ్ డొ ఓరియెంటె, ఫెర్నావో** (౧౫౪౦ - ౧౫౯౫) — పోర్చుగీస్ జాతివాఁడు. హిందూదేశమందలి గోవాలో జన్మించెను. క. వి. పశ్చిమసముద్రతీరమునకు పోర్చుగల్‌నుండి రెండుతడవలు వచ్చిననావికసైన్యములకు నాయకుఁడుగ నుండెను.

**అల్వారెజ్, లూయి** (౧౮౪౧ - ౧౯౦౧) — స్పెయిన్ దేశజుఁడు. చిత్రకారుఁడు. ఈతనిచే చిత్రింపఁబడిన పెక్కుపటములు మాడ్రిడ్‌రాజమందిరము నలంకరించుచున్నవి.

**అల్వారెడో, జాన్ బాటిస్టా** — కాలిఫోర్నియా దేశజుఁడు. మెక్సికో ప్రభుత్వమువారిమీఁద ౧౮౩౬ లో తిరుగఁబడి మెక్సికనుల నోడించెను. ౧౮౩౬ - ౪౨ వఱకును క్యాలిఫోర్నియా కధ్యక్షుఁడుగ నుండెను. అప్పు డాపదవినుండి తొలఁగింపఁబడెను.

**అల్వారెడో, పెడ్రో డీ** (౧౪౯౫ - ౧౫౪౧) — స్పెయిన్ దేశజుఁడు. మెక్సికో గెలుచుటలో కార్టెస్‌కు సహాయుఁడుగ నుండెను. ఈతఁడు మెక్సికోలోని స్వదేశపు సరదారులను పెక్కుమందిని చంపించెను. అందువలన నాదేశమునందు యూరోపియనులకు పెక్కుబాధలు కలిగెను. ఈతఁడు ౧౫౨౩ లో గాటెమాలాను జయించెను. దానికి గవర్నరుగ నియమింపఁబడెను.

**అల్వా** — బొంబాయి, రీవాకాంతలోని యొక చిన్న సంస్థానము.

**అల్వాయే** — తిరువాన్కూర్ సంస్థానమునందు అలెంగాడ్ తాలూకాకు ముఖ్యస్థలము. ఇది అల్వాయే అను నామాంతరము గల పెరియార్ అను నేటియొడ్డున నున్నది. ఈయేటియొడ్డుననే శంకరాచార్యులవారు పుట్టిరఁట. జనసంఖ్య ౩,౬౮౫. పోర్చుగీసువారీస్థలమును సముద్రస్థానమునకు యోగ్యమైనదిగ నెంచియుండిరి. ఇప్పటికిని ఆరోగ్యస్థల మని యెంచి పెక్కుజను లెండకాల మచ్చటికిఁ బోయెదరు. తాలూకా కంతకు నిచ్చట వారమునకు రెండుసారులు సంత జరగును.

**అల్వాలఅగ్రహారము** — గుంటూరుజిల్లా నర్సారావుపేటతాలూకాలోని ఈనాం గ్రామము. దీనిజనసంఖ్య ౧,౧౩౧ (౧౯౩౧).

1. సర్‌హింద్‌నివాసి యైన హాజీ ఇబ్రాహిం అథర్వవేదమును ఫారసీలోనికి భాషాంతరీకరించెను.
2. బదౌనిగ్రంథముయొక్క యింగ్లీషుభాషాంతరము నాకు దొరకలేదు. బంగాలీవిశ్వకోశమందలి భాషాంతరమునకు నిది తెలుఁగు.

sampath_Ebooks



**అల్‌స్టర్** — ఇది ఐర్లండ్ దేశములో నొకరాష్ట్రము. ఒకప్పుడు ఐర్లండ్ దేశము ఐదు స్వతంత్రరాజ్యములు గలదిగ నుండెడిది. ఈ యైదురాజ్యములలో ప్రధానమైనది అల్‌స్టర్ రాజ్యము. ఈ యైదురాజ్యములయధిపతులు నెవరికి వారే స్వతంత్రులు. ఎవరి మట్టుకు వారే ఐర్లాండుదేశము నంతయు జయించి యేలవలయు నని ప్రయత్నించుచుండిరి. అందుచే నైర్లాండ్ దేశము సర్వదా అంతః కలహములలోఁ బడియుండెడిది. వీనివల్లను, పోరాటములవల్లను విసిగిపోయి ప్రజలు దేశము విడిచి పోవ మొదలిడిరి. నేల యంతయు సాగుబడిలేక పాడుపడిపోవుచుండెను. తుదకీస్థితి యంతయు గమనించి రెండవహెన్రీ (ఇంగ్లండ్ దేశపురాజు) ఐర్లండ్ దేశము నాక్రమించుకొనుటకై ప్రయత్నించి సాఫల్యమును బొందెను. ముందు ఇంగ్లీషువారు అల్‌స్టర్ ప్రాంతము నాక్రమించుకొనిరి. పిదప నీప్రాంత మంతయు నొకనార్మను వీరునకు బహుమానముగ నీయఁబడెను. ఆప్రాంతపు వెనుకటిరాజులుమాత్రము యథాప్రకారముగ తమ వెనుకటియధికారముల నన్నిటిని పూర్తిగ ననుభవించుచునే యుండిరి. కాని వారు ఇంగ్లీషువారి నెట్లయిన తఱిమివేయవలయు ననియే ప్రయత్నించుచుండిరి. ఓనియల్, ఓడోనిల్ అనువారు మిగుల పట్టుదలతో ఆంగ్లేయులను ప్రతిఘటించి నిలిచిరి. ఎలిజబెత్ రాణి వారి నెట్లో లొంగఁదీసికొని తనయధికారమును వారంగీకరించునట్లు చేసెను. కాని యీలొంగుబాటు చాలకాలము నిలువలేదు. ఫ్రాన్సు, స్పెయిన్ దేశములతో కలసి పైయిరువురును ఇంగ్లీషువారిపై కుట్ర పన్నుచుండి, తుదకు ఐర్లండ్ దేశములో నుండుట తమ కనుకూలము కాదని, ఐగోపాకు పాఱిపోయిరి. ఇంతటితో అల్‌స్టర్ పూర్తిగ ఆంగ్లేయులవశమైనది. ౧౬౦౩-వ సంవత్సరములో ఇంగ్లండ్, స్కాట్లండు దేశములు రెండును ఏకపరిపాలనక్రిందికి వచ్చినవి. వెంటనే ఒకటవజేమ్సు (ఇంగ్లండ్, స్కాట్లండ్ దేశముల రాజు) చాలమంది స్కాట్లండ్ దేశీయులకును, కొంతమంది ఇంగ్లీషువారికిని అల్‌స్టర్‌లోని భూములను పంచి యిచ్చి, ఆభూముల నన్నింటిని బాగుపఱిచి సాగుబడికిఁ దెచ్చుటకును, వానిని వారే యనుభవించుచుండుటకును వరకు లేర్పఱిచి, వారి నందఱను అల్‌స్టర్ ప్రాంతమునకు వలస పంపెను. వారిసంతతివారికే యిప్పుడు 'అల్‌స్టర్ స్కాట్స్' అని పేరు.

ఈవిధముగ అల్‌స్టర్ ప్రాంత మంతయు సంపూర్ణముగ ఇంగ్లీషువారికి వశమైపోయినది. అందలిప్రజలలో చాలమంది స్కాట్లండ్ దేశీయులు. ఐర్లండులోని యితరప్రాంతములవా రీస్థితిని సహింపఁజాలరైరి. ఇంగ్లీషువారి నెట్లయిన నైర్లండ్ నుండి వెడలఁగొట్టవలయు నని వారు తీవ్రప్రయత్నము లొనర్చుచుండిరి. ఈప్రయత్నములలో అల్‌స్టర్ ప్రాంత మెల్లప్పుడును ఇంగ్లీషువారిపక్షముననే పోరాడెను. అచ్చట ప్రాబల్యముగల స్కాట్లండ్ దేశీయులు తమ కింగ్లీషువారైనను సరే, ఐర్లండ్ దేశీయులైనను సరే పరాయివారే యనియును, అందుచేత తా మింగ్లీషువారియధికారమును సహించినను ఐరిషువారియాధిపత్యము నంగీకరింపఁజాల మనియు పట్టుపట్టి ఐర్లండ్ స్వాతంత్ర్యప్రయత్నములకు విరుద్ధముగ సర్వదా ఆంగ్లేయులకు తోడుపడుచువచ్చిరి. నేఁటికిని – ఐర్లండ్ దేశమునకు స్వపరిపాలన మీయఁబడినతరువాతఁగూడ జాతీయస్వభావభేదములలో అల్‌స్టర్ తక్కిన ఐర్లండ్ దేశమునుండి వేఱుపడియేయున్నది. ఐర్లండ్ పార్లమెంటు వేఱు. అల్‌స్టర్ పార్లమెంటు వేఱు. ఐర్లండ్ ఏరవ్యాంత ఇంగ్లీషువారియధికారము పడలింప యత్నించినను, ఆయత్నములను భంగపఱుచుటకు అల్‌స్టర్ సంసిద్ధముగ నున్నది!

**అల్ సీరత్** — మహమ్మదీయుల విశ్వాసము ననుసరించి ఇది యొకవంతెన, అగాధ మగు నరకముమీఁదుగ నిది నిర్మింపఁబడియున్నది. స్వర్గమునఁ జేరుదారియిం దుండుటచేత నచటికి పోవలసినవా రందఱును దీనిమీఁదుగ దాఁటి పోవలయును. కాని ఇది వెండ్రుకకంటె సూక్ష్మమైనవంతెన; ఖడ్గధారకంటె పదునైనది. దీనికి రెండు ప్రక్కల ముండ్లు. ధర్మాత్ములైనవా రెట్టికష్టముగాని లేకుండ సులభముగను, శీఘ్రముగను దీనిపైనుండి నడచి స్వర్గమునఁ జేరుదురు. దుర్మార్గులైనవా రందఱు నధోలోకమునఁ గూలుదురు.

**అల్హాంబ్రా** — దీనికి ఎఱ్ఱదుర్గ మని పేరు. ఇది స్పెయిను దేశమందలి గ్రెనడారాజుల రాచనగరు. ప్రస్తుతపు కట్టడములలోని విస్తారభాగము గ్రెనడాలో రాజ్యముఁ జేసిన మూరు లనఁబడు మహమ్మదీయరాజులచే ౧౩-వ శతాబ్దిప్రథమార్ధభాగమున నిర్మింపఁబడినది. శతాబ్దములు గతించినకొలఁదియు ఉపేక్షవలననేమి, చక్రవర్తియైన




సింహహజారము

౫-వ చార్లెసు, ౧౮౧౨లో ఫ్రెంచిసేనానియైన బాస్టియా యను వతఁడును సలిపిన దుండగపు విధ్వంసనములవలననేమి ఈప్రాసాదపు సౌందర్యము చాలవఱకు పాడైనది. కాని దీనిని పునరుద్ధరించుకార్యము జోస్ కంట్రెరాస్ (Jose Contreras) నామకస్థపతిచేత క్రీ. శ. ౧౮౨౮-వ సంవత్సరమున ఆరంభింపఁబడి ౧౮౭౩-౧౮౯౦ పర్యంత

sampath_Ebooks

మతనిపుణుడగు రాఫేల్ (Rafael) వలన సాగింపఁబడెను. ముఖ్యముగా నిది రెండుదీర్ఘచతురస్రము(Oblong) లైనహజారముల చాను గాని నిర్మింపఁబడిన భవనములపుంజము. ఈహజారములం దొకటి మీన సరస్సాధము (Court of fishpond), ఉత్తరదక్షిణముల ౧౩౦ అడుగుల పొడవును, ౭౪ అడుగుల వెడల్పును గలిగియుండును. రెండవది తూర్పుపడమరలుగ నుండు సింహహజారము (Court of lions). చలువరాతినిర్మితము లైన ౧౨ సింహమూర్తులచే అలంకృత మగు జలధారాయంత్ర మిం దుండుటవలన దీని కీపేరు వచ్చినది. అల్‌హంబ్రాప్రాసాదము అందలి యన్నిభవనములతోపాటు స్పెయిను దేశపు అరేబియనుకళకు రత్నమనియు, అతిసుందరమైన అత్యంత పరిష్కృతమైన ఉదాహరణ మనియు పేరువడసియున్నది. దీని నమూనా మిక్కిలి పరిశ్రమమీఁద తయారైనది. కాంతిమంతములైన నానా విధవర్ణము లిందు చిత్రితములై అత్యంత సౌందర్యమును వెలిపుచ్చుచుండును. కాని పరిమాణమునందు చిన్న దగుటచే గాంభీర్యము తక్కువ. ప్రతిపార్శ్వమందు నున్న ముఖమంటపములు పదునొకండడుగులయెత్తున ఒక్కొకటిగను, అనేకములుగను నిర్మింపఁబడిన ౧౨౪ చలువరాతి స్తంభములమీఁద కట్టఁబడియున్నవి. ప్రతిచివరయందును మంటపములు హజారములోనికి ముందుకు త్రోసికొనివచ్చిన ట్లుండును.



సింహహజారమున కెదురుగ నున్న కట్టడములు

వానిలో నొకదానిమీఁది గుమ్మటమువంటి కప్పు పునరుద్ధరణము నొందినది. అల్‌హంబ్రాయందలి సుందరశాలలు కొన్ని ఈహజారములోనికి దారితీయును. దీని ప్రవేశద్వారముకడ మూరుల అవకాశములుగల చిత్రవస్తుశాల ఏర్పడియున్నది. సింహహజారమున కెదురుగా అబెన్‌సెర్రజస్ (Abencerrages) యొక్క శాల కలదు. అన్నిటికన్న పచ్చును, ప్లాస్టరుతో అలంకరణము దీనియందలి వైలక్షణ్యము.

1. అలంకరణము వ్రేలాడు తేనెపట్టులంబోలి యుండును. 'స్టాలెక్ట
2. మూను క్రింద పరిపూర్ణతను గాంచును, లతాపర్ణసదృశ

చిత్రములును అమోఘరీతిని లిఖింపఁబడియున్నవి. ఇందు రాతిచెక్కడపు పని మిక్కిలి చక్కఁగ నున్నది.



సింహహజారపు త్రోవయందున్న తోరణములు

**అల్హాకిమ్** (క్రీ. శ. ౭౯౬-౮౨౨) — కార్డోవాకు అమీరు. ఫ్రాంకువారిని (పరాసులను) పిరనీస్‌పర్వతముల వెలుపలికి తఱిమివేసెను.

**అల్హాకిమ్** (క్రీ. శ. ౯౬౧-౯౭౬) — కార్డోవాదేశమునకు ఖలీఫు. క్రైస్తవులయిన యూరోపియనులను పెక్కుమారులు లోడించి దిగ్విజయము గాంచెను. మహమ్మదీయ మతప్రచారము చేసెను. ఇతఁడు ప్రజారంజకముగ రాజ్య మేలెను. విద్యాభివృద్ధి చేసెను. ౬ లక్షల గ్రంథముల సంపాదించి గ్రంథాలయమును స్థాపించెను. అది కార్డోవావిశ్వవిద్యాలయమునకు మూలాధార మయ్యెను.

**అల్హాజక్** (క్రీ. శ. ౯౬౫-౧౦౩౯) — అరబ్బీ జ్యోతిషికుఁడు. నేత్రవైద్యుఁడు నేత్రములనుగురించి యతఁ డొక గ్రంథమును వ్రాసెను. దానిని యూరోపియనులు ౧౫౭౨ లో ల్యాటినుభాషలోనికి తర్జుమా చేసిరి. ఈతఁ డద్దములను గురించి వ్రాసినవారిలో మొదటివాఁడు. కంటికో డుపయుక్తమై మొదట వ్రాసినవాఁ డితఁ డని యందురు.

sampath_Ebooks

**అవంతి** — ఇది పూర్వకాలమందలి యొకదేశముపేరు. దాని రాజధాని యైన పట్టణమునకును ఈపేరే యుండెను. ఆ పట్టణము నిప్పు డుజ్జయిని యందురు. హేమచంద్రకోశమునందు అవంతి, ఉజ్జయిని, విశాల, పుష్పకండిని యను నామములు పర్యాయపదములుగ నీయఁబడినవి. ఇయ్యది యిప్పుడు మాళవదేశమున సింధియా రాజ్యమునం దున్నది. ఇయ్యది అవంతినదీతీరమునం దుండెను. అవంతి నదికి సిప్రానది యని నామాంతరము. ఇయ్యది మోక్షదాయకములయిన సప్తపురములలో నొకటి. 'అయోధ్యా మథురా మాయా కాశీ కాంచీ అవంతికా, పురీ ద్వారవతీ చైవ సప్తైతా మోక్షదాయికాః' అనుశ్లోకము సుప్రసిద్ధము. మహాభారతకాలమునం దిది నేక, అపర నేకలను నర్మదకును దక్షిణమున నుండెను (భార., సభా, అ. ౩౧).

ఇచ్చట సుందోపసుందు లనురాజు లుండిరి. వారు భారత యుద్ధమునందు దుర్యోధనపక్షమునఁ బోరి నాల్గవదినమున అర్జునునిచేఁ జచ్చిరి (ద్రోణప.). నిరక్షదేశమునుండి (Equator) అవంతివఱకును కొలచినయెడల నది భూపరిమాణమునకు ౧౬-వ వంతుండు ననియు, దానికి ౧౬ రెట్లు చేసినయెడల భూమిప్రమాణము వచ్చుననియు మనజ్యోతిష్కులసిద్ధాంతము.

> నిరక్షదేశాత్ క్షితిషోడశాంశే, భవే దవంతీ గణితేన యస్మాత్,
> తదంతరం షోడశసంగుణంస్యాత్, భూమాన మస్మాత్ బహు కిం తదుక్త్యా—(భాస్కరాచార్యుఁడు).

దీనినిబట్టి మనసిద్ధాంతులలెక్కప్రకార మవంతియొక్క ఉత్తరాక్షాంశము ౨౨½ అంశము లయియుండెను. ఇప్పటిలెక్కప్రకార ముజ్జయిని ౨౩ ఉత్తరాక్షాంశములమీఁద నున్నది. అంశ మనఁగా ౭౦ మైళ్లదూరము. ఈదేశమును ఈపట్టణమును హిందూదేశచరిత్రమునందును సంస్కృతప్రాకృతవాఙ్మయములందును మిక్కిలి ప్రసిద్ధిఁగాంచినవి. ఇందునుగురించి అధికము 'ఉజ్జయినీ' శబ్దమునఁ జూడనగును.

**అవంతిపురము** — కాశ్మీరదేశమందలి యొకపురాతనపట్టణము. వితస్తానదియొడ్డున అవంతివర్మ (క్రీ. శ. ౮౫౫-౮౮౩) యనురాజుచేఁ గట్టింపఁబడియెను. పూర్వకాలమున మిక్కిలి వైభవమనుభవించెను. ఇప్పుడు శిథిలమై యొకపల్లెగ నున్నది. దీని నిప్పుడు వంతిపుర మనియెదరు. భగ్నావశేషముల వైశాల్యముంబట్టి యీపట్టణము వైభవదశయం దున్నప్పుడు ౨ మైళ్లకంటె నెక్కుడుపొడువు కలది యని యూహింపఁబడుచున్నది. ఇచ్చట అవంతీశ్వరునిదేవాలయ ముండెను; జయసింహునికాలమున (క్రీ. శ. ౧౧౨౮) యుద్ధమునకై కోటగ నుపయోగింపఁబడెను.

**అవంతివర్మ** (క్రీ. శ. ౮౫౫-౮౮౩) — కాశ్మీరదేశపురాజు. సుఖవర్మకుమారుఁడు. ఉత్పలాపీడుఁడను రాజు రాజ్యము చేయుచుండఁగా శూరుఁ డనుమంత్రి యాతనిని పదభ్రష్టునిఁ జేసి ప్రజావిప్లవశాంతికొఱ కవంతివర్మను రాజును చేసెను (రాజతరంగిణి, ౪-వ తరంగము). అంతకుఁ బూర్వము విప్లవములచే బాధపడుచున్న ప్రజల కతఁడు శాంతియు, సుఖమును కలిగించెను. ఈతఁ డెన్నియో పట్టణములును, దేవాలయములును నిర్మించెను. సర్వస్వదానములఁ జేసెను. అగ్రహారముల నిచ్చెను. గొప్పగొప్పకవుల కాశ్రయ మిచ్చెను. ముక్తాకణుఁడు, శివస్వామి, ఆనందవర్ధనకవి, రత్నాకరుఁడు[1] అనువా రీతనియాస్థానమునం దుండుటయేకాక, రాజమంత్రులసత్కారమువలన నపరిమితధనవంతులై రాజులకుఁ దగిన వాహనము లెక్కి సభకు వెళ్లుచుండిరి! రాజువలెనే మంత్రియు రాజబంధువులును దేవాలయాదులు పెక్కులు కట్టించిరి. ఈతనిరాజ్యమునందు జరగినప్రజాహితకరమైన మహాకార్యములలో, నీటిపాఱుదలనుగురించి సింధువితస్తానదులకుఁ గట్టినయానకట్టలు ముఖ్యమైనవి. ఇవి విశ్వకర్మకు సంబంధించినమహాకార్యము (Great engineering works) లని చెప్పవలెను. ఇవి యన్నియుఁ జేసిన విశ్వకర్మ (Eugineer) సుయ్యుఁ డనువాఁడు వితస్తానదియొక్క పాత్ర సన్నదిగా నున్నచోట దానిని విశాలముగఁ జేసెను. నదు లుప్పొంగి దేశమును పాడుచేయుచుండఁ గ్రొత్తకాల్వలు త్రవ్వించి నీ గంతయు నుప్పొంగకుండఁ జేసెను. సింధువితస్తలు పూర్వము వైన్యస్వామి యొద్దఁ గలయుచుండెను. వానిమార్గమును మార్చి సుయ్యుఁ డవి శ్రీనగరమునొద్ద సంగమ మగునట్లు చేసెను. వితస్తానదికి శిలామయమైన యేడుయోజనములసేతువు (కట్ట) కట్టి మహాపద్మసరోవరమును నిర్మించెను. కుండలాకారముగ నడ్డకట్టలు కట్టి గ్రామాదులను నీటిబాధనుండి తప్పించెను. ఈప్రకారముగ బ్రహ్మాండమైన జలాధారనియామకమహాకార్యములు (Water-works) చేసి దేశమును అతివృష్ట్యనావృష్టిభయమునుండి తప్పించెను. ఇంతియకాదు. అన్నిగ్రామములకును నీరు పాఱునట్లు చేసి, ప్రతిగ్రామమునుండియు, భూమి (పొలములలోనిమన్ను) తీసికొని, అది యెంతకాలమున కారును, ఏకాలమందు దానికి నీరు కావలయును? అని నిర్ణయించి, యేగ్రామమున కెంతెంతనీరు కావలయునో అంతంతనీ రాయాగ్రామములకు సకాలమునందు పాఱులాగు చేసెను. ఇట్లు దేశ మంతయు వానతోఁ బనిలేకుండ సమృద్ధిగఁ బంటలు పండునట్లు చేసినందున, అంతకుఁ బూర్వము మహాసుభిక్షకాలమందుఁగూడ 'ఖారి' మానమునకు ౨౦౦ల దీనారములచొప్పున నమ్ముచుండినవడ్లు, ౩౬ దీనారములకు 'ఖారి' చొప్పున నమ్మఁజొచ్చిరి!! జీవహింస నెవ్వరును చేయఁగూడ దని యీరాజు శాసించెను. ఈతనినిగురించి యెక్కువ తెలిసికొనఁగోరువారు రాజతరంగిణి, ౫-వ తరంగము, ౧-౧౨౬ శ్లోకములు చూడనగును.

---

1. వీరిలో ఆనందవర్ధనుఁడు 'ధ్వన్యాలోక' మునకును, 'దేవీశతకము' నకును కర్త. రత్నాకరుఁడు 'హరవిజయ' కర్త.

sampath_Ebooks

**అవగాహనుఁడు** — వసుదేవునకు వృకదేవివలనఁ బుట్టినకుమారుఁడు.

**అవగాహుఁడు** — వృష్ణికులోత్పన్నుఁడైన యొక యాదవుఁడు.

**అవచ్ఛిన్నవాదము** — వేదాంతులలో జీవాత్మను గుఱించి రెండుమతములు కలవు. ఒకటి ప్రతిబింబవాదము. మఱియొకటి అవచ్ఛిన్నవాదము. అంతఃకరణమునందుఁ బ్రతిబింబించు చైతన్యము జీవుఁ డని మొదటివారిమతము. అట్లు కాదు; అంతఃకరణావచ్ఛిన్నమైన చైతన్యము జీవుఁడు అని రెండవవారిమతము. ఆకాశ మంతయు నొక్కటియైనను ఘటావచ్ఛిన్నమును ఘటాకాశ మనియు, మఠావచ్ఛిన్నమును మఠాకాశ మనియు నన్నట్లు చైతన్య మంతయు నేక మైనను, అంతఃకరణావచ్ఛిన్నచైతన్యమునకు గుర్తుకొఱకు జీవుఁ డన్నపేరే కాని యది చైతన్యమునకంటె వేఱుకాదు అని వీరిమతము.

**అవచ్ఛేదకము** — ఇది తర్కశాస్త్రమందలి పారిభాషికపదము. అవచ్ఛేదకము పదార్థముయొక్క ధర్మము. ఏధర్మమును బట్టి యొకపదార్థ మితరపదార్థములనుండి వేఱుగ భావింపఁబడునో యాధర్మమున కవచ్ఛేదక మని పేరు. 'జడలుగల సన్న్యాసి' యనునప్పుడు జడలు గలిగియుండుట సన్న్యాసియొక్క యవచ్ఛేదకము. జడ లాతనిని ఇతరులనుండి వేఱుచేయును. ఇట్లె యొక్కొక్క పదార్థమునందును గొన్నిధర్మములసమూహ మవచ్ఛేదకముగా నుండవచ్చును. 'ఘటము'యొక్క యవచ్ఛేదకములు విశిష్టాకారము మొదలయినవి. వీని నన్నిటిని గలిపి యొక్కటిగ ఘటముయొక్క అవచ్ఛేదమును చెప్పవలయు నన్న 'త్వ' ప్రత్యయము పెట్టి 'ఘటత్వము' ఘటముయొక్క అవచ్ఛేదక మని చెప్పుదుము. అట్లే 'గోత్వము' గోవునకును, 'మనుష్యత్వము' మనుష్యునకును, 'చక్కఁదనము' చక్కనివస్తువులకును అవచ్ఛేదకములు. ఒకపదార్థమును ఇతరమునుండి వేఱు విడఁదీసి చూపునది 'అవచ్ఛేదకము'. దేనిని విడఁదీయునో యది 'అవచ్ఛేద్యము'. ఈ యవచ్ఛేద్యావచ్ఛేదకభావము సామాన్యముగ రెండువిధములు: ౧. స్వరూపసంబంధరూపము. ౨. వ్యాప్యవ్యాపకభావము. ఇందు ఉదాహరణములు: ౧. (అ) ఇప్పుడు కొట్టములో గోవు లేదు, అనువాక్యమునందు నేతత్కాలమునకును (ఇక్కాలమునకును), గవాభావమునకును (ఆవులేమికిని) అవచ్ఛేద్యావచ్ఛేదకభావము కలదు. (ఆ) మూలావచ్ఛిన్నవృక్షము కపిసంయోగము కలది అనువాక్యమునందు మూలమునకును, సంయోగమునకును అవచ్ఛేద్యావచ్ఛేదకభావము కలదు. ఈరెండును స్వరూపసంబంధరూపమైన అవచ్ఛేద్యావచ్ఛేదకభావమునకు నుదాహరణములు. (౨.) పృథివి రూపవతి (రూపము కలది) అనువాక్యమందు రూపమునకును, పృథివీత్వమునకును అవచ్ఛేద్యావచ్ఛేదకభావము కలదు. ఇది వ్యాప్యవ్యాపకభావము గలదానికి నుదాహరణము;

అవచ్ఛేదకత్వ మనఁగా 'అనతిరిక్తవృత్తిత్వ' మనియు, అవచ్ఛిన్నత్వ మనఁగా 'అన్యూనవృత్తిత్వ' మనియు కొందఱిచే లక్షణము చెప్పఁబడినది. 'అనతిరిక్తవృత్తిత్వ' మనఁగా ఈవస్తువు నందుఁ దప్ప మఱియొచ్చటను ఉండనట్టిధర్మ మని యర్థము. 'అన్యూనవృత్తిత్వ' మనఁగా ఈవస్తువునం దంతటను, కొంతయైనను తక్కువ లేకుండ, ఉండుధర్మ మని యర్థము. పైని చెప్పఁబడిన స్వరూపసంబంధరూపమైన భేదమునందు విషయతావచ్ఛేదక, లక్ష్యతావచ్ఛేదక, ప్రతియోగితావచ్ఛేదక, కారణతావచ్ఛేదకాదు లను పెక్కు భేదములు కలవు.

**అవటనిరోధనము** — ఒకనరకము. జనులను గర్తమునఁ ద్రోసినవారి నిచ్చట శిక్షింతురు.

**అవటోద** — భారతవర్షీయనది.

**అవతారములు** — 'అవతార' మనఁగా దిగుట, పైనుండి క్రిందికి వచ్చుట. దేవుఁడు మనుష్యాదిరూపములను ఎత్తుట అవతార మనఁబడును. దేవుఁ డవతార మెత్తె ననఁగాఁ బైనుండు దేవుఁడు లోకక్షేమునకై క్రిందికి దిగి యీలోకమునకు వచ్చె నని భావము.

స్వరూపము :— ప్రపంచమునందు నధర్మ మధిక మైనప్పుడు దుష్టశిక్షణమునకును, శిష్టసంరక్షణమునకును భగవంతుఁడు పశుపక్షిమనుష్యాదిరూపములతో భూమిపై నవతరించు నని పెక్కు మతములవారిన మ్మిక. విష్ణువు మత్స్యకూర్మాద్యవతారముల నెత్తె నని హిందువులును, పరమవిజ్ఞానము బుద్ధుఁడుగను బోధిసత్త్వులుగను అవతరించు నని బౌద్ధులును, ఈశ్వరుని రెండవయంశమగు పుత్త్రుఁడు 'ఏసు' రూపమున నవతరించె నని క్రైస్తవులును తలంచెదరు. ఈ కల్పనల యన్నిటిలోను, ఈశ్వరుఁడు మానవుల కుపకారము చేయవలె నన్నయెడల నాతఁడు భౌతికరూపము ధరించుట యావశ్యక మన్నకల్పన కలదు. ఒకానొకరాజ్యమందలి యొకగ్రామములోని ప్రజలకు మృగములవలనఁ గాని, చోరులవలనఁ గాని బాధ కల్గినప్పుడు రాజు స్వయముగ నచ్చోటికిఁ బోయి వారియాపదను నివారించునట్లు, భగవంతుఁడు లోకోపకారమునకై భౌతికదేహములను ధరించు నను నమ్మికయే యీయవతారకల్పనకు మూలము. దుష్టులవలనను, దానవులవలనను బాధ కలిగినప్పుడు భూదేవి గాని, యింద్రాదిదేవతలు గాని పాలకడలికిఁ బోయి శేషశాయివిష్ణువుతో మొఱపెట్టుకొనుటయు, నాతఁడు వారికి నభయమిచ్చి పంపి, యోగ్యసమయము వచ్చినప్పు డొకయవతార మెత్తి దుష్టుల సంహరించుటయు ననునది యన్నియవతారములకును సామాన్యమైనకథ.

అవతార ప్రయోజనము :— అవతారములయొక్క స్వరూపకాలములనుగుఱించియుఁ, బ్రయోజనములనుగుఱించియు భగవద్గీతల

sampath Ebooks

లోని (౪-వ అధ్యాయమందలి) యీ క్రిందివాక్యములు ప్రమాణముగ నెంచఁబడుచున్నవి:—

(౧) అజోఽపి సన్నవ్యయాత్మా భూతానా మీశ్వరోఽపి సన్,
ప్రకృతిం స్వా మధిష్ఠాయ సంభవా మ్యాత్మమాయయా.

(౨) యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత,
అభ్యుత్థాన మధర్మస్య తదాఽత్మానం సృజామ్యహమ్.

(౩) పరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృతామ్,
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే.

(౧) అర్థము: పుట్టనివాఁడను, తఱుఁగనివాఁడను, సర్వభూతములకు నధిపతిని అయినను నా ప్రకృతిని (స్వభావమును) వశపఱుచుకొని నామాయచేతనే పుట్టెదను.[1]

(౨) ఓ భరతకులమునఁ బుట్టినవాఁడా! ఎప్పుడెప్పుడు ధర్మమునకు హానియు, అధర్మమునకు నభివృద్ధియుఁ గల్గునో అప్పుడప్పుడు నేను నన్నుఁ బుట్టించెదను.

(౩) సజ్జనులను రక్షించుటకును, చెడుపనులు చేయువారిని నాశముచేయుటకును, ధర్మమును చక్కఁగ నిల్పుటకును ప్రతియుగమునందును పుట్టుదును.

అసురాదుల యవతారములు:—ఇట్లు అవతారము లెత్తువాఁడు సర్వశక్తిమంతుఁడైన సర్వేశ్వరుఁడే యన్నకల్పన కల్గినను మానవుల శరీరము వేఱు ఆత్మ వేఱు, ఆత్మ మరలమరల వేఱువేఱుజన్మముల నెత్తుచుండు నన్ననమ్మికతో నీయవతారకల్పనను కల్పఁగా, నవతారము లెత్తువాఁ డొక్కసర్వేశ్వరుఁడే కాక, దేవతలు, రాక్షసులు, యక్షులు, అప్సరసలు, చివరకు మానవులుగూడ నవతార మెత్తుదురన్న నమ్మకము కల్గినది. మహాభారతమున ఆదిపర్వమునందు 'ఆదివంశావతరణపర్వ' మను ఒక ఉపపర్వము కలదు. దానిని 'అంశావతరణపర్వ' మనియు నందురు. అది ౫౯ మొదలు ౬౪-వ అధ్యాయమువఱకు నుండును. అందు కౌరవ పాండవ పాంచాలాదులలోని గొప్పగొప్పవా రందఱును ఎవరెవరియంశమునఁ బుట్టినదియు వివరముగఁ జెప్పఁబడియున్నది. భీష్ముఁడు వసువునంశమున, ద్రోణుఁడు బృహస్పతియంశమున, ధర్మరాజు యమునియంశమున, దుర్యోధనుఁడు కలియంశమున, శిశుపాలుడు రావణాంశమున, అశ్వత్థామ కామక్రోధాంశమున, కృష్ణుని షోడశసహస్రాంతఃపురవనితలు అప్సరసల యంశంబులఁ బుట్టిరి. ఇట్లే యితరులనుగుఱించి సవిస్తరంబుగఁ జెప్పఁబడియున్నది[2]. రామాయణమునందును శ్రీరామునితోఁ బుట్టిన వానరాదులయవతారంబులును ఇట్లే చెప్పఁబడియున్నవి (బాలకాండ., అధ్యా, ౧౭). ఇంతియకాదు. మానవులలో మానవులే యవతార మెత్తెద రని చెప్పఁదొడఁగిరి. తులసీదాసు వాల్మీకియొక్కయవతారము; కబీరుదాసు శుకర్షి యవతారము; ఉద్ధవుఁడే మొదట నామదేవుగఁ బుట్టి తరువాత తుకారాముగఁ బుట్టెను! ఇట్లు పోనుపోను 'అవతారము' అనఁగా కొంచెము హెచ్చుతక్కువగఁ 'బునర్జన్మము' అన్నభావ మేర్పడినది. ఈ రెంటికిని మిగిలిన స్వల్పభేద మేది యన, మానవేతర దేవదానవ యక్షాదియోనులవారు మానవజన్మ మెత్తినను 'అవతార' మందురు. సామాన్యజనులు మరలఁ బుట్టినచో పునర్జన్మ మందురు.

ఇట్లు 'అవతార' శబ్దముయొక్క యభివృద్ధి చెందిన యర్థమున టుండనిచ్చి, లోకోపకారమునకై ఆయాకాలములవారిచే సర్వేశ్వరునిగ భావింపఁబడిన, దేవత లెత్తిన అవతారములనుగుఱించి విచారింతము. ఈశ్వరుఁడు సగుణుఁడు, ఒకానొక పురుషవ్యక్తి, లేక స్త్రీవ్యక్తి యనియు, తనరూపమును ఇచ్ఛవచ్చినట్లు మార్చు శక్తికలవాఁడనియు నమ్మినతరువాత నాతఁ డవతారము లెత్తు నన్నమాట సహజముగనే సిద్ధించును. వేదమునందు సంహితాభాగములందును, బ్రాహ్మణభాగములందును కొన్ని యవతారములవర్ణనములు కానవచ్చుచున్నవి. ఇవి వేదమునందు ప్రజాపతియవతారములుగ నున్నను, తరువాతఁ బురాణములలో విష్ణువుయొక్క యవతారములుగఁ బరిణమించినవి. అందుఁ గొన్ని యిట దిక్ప్రదర్శనముగఁ జూపెదను.

## వేదములందలి యవతారములు:

మత్స్యావతారము: ప్రజాపతి మత్స్యరూపమును గ్రహించినట్లు శతపథబ్రాహ్మణమునందుఁ జెప్పఁబడినది (౧. ౮. ౧. ౧. ౬). ఒకదినమున మనువు చేయి కడుగుకొనుటకుఁ జేతిలో నీరు పోసికొనఁగాఁ జేతిలోనికి నొకచిన్నచేఁప వచ్చెను. దాని నేమిచేయవలయునని యాతఁ డాలోచించుచుండఁగా నాచేఁప యిట్లనెను: 'నన్ను నీవు పోషించిన యెడల నేను నిన్ను పోషింతును'. అందుపై నాశ్చర్యపడి 'నీవు నన్నెట్లు పోషించెదవు?' అని యతఁ డడుగఁగా 'జలప్రళయములో మనుష్యులందఱును జచ్చెదరు. అప్పుడు నేను నిన్ను రక్షించెదను' అని చెప్పెను. అంత నాతఁడు దానిని పెంచ నది క్రమముగా పెద్దదియై ఆతనిచే సముద్రమం దుంచఁబడెను. అంత ప్రళయము వచ్చి ప్రపంచము నంతయు ముంచఁగా మనువు తనపడవను ఈ చేఁపకొమ్మునకుఁ గట్టెను. అది యాతని ఓడను లాగికొనిపోయి కొండమీఁదఁ జేర్చెను. ఇచ్చట వేదముల రక్షించువిషయ మేమియు లేదు.

---

1. ఈ శ్లోకమునకు అర్థము చేయునపుడు శంకరాచార్యులవారు 'మాయా' శబ్దమునకు 'జగత్తును మోహింపఁజేయునట్టి యనాది వైష్ణవమాయ' యనియు, 'సంభవామి' యనఁగా పుట్టినట్టుగ నగుపడుదును 'పరమార్థతః కాదు' అనియు నర్థము చేసిరి. రామానుజాచార్యులవారు 'మాయా' శబ్దమునకు 'జ్ఞానము' అనియు, 'ఆత్మమాయయా' అనఁగా 'తనజ్ఞానముచే ఆత్మసంకల్పముచే' అనియు నర్థముచేసి, అవతారములదేహములయాథార్థ్యము చెప్పఁబడె నని తెల్పిరి.

2. చూడుఁడు, ఆంధ్రమహాభారతము., ఆది, ఆశ్వా. 3.

sampath_Ebooks

కూర్మావతారము: ప్రజాపతికి సృష్టిచేయవలె నన్నకోర్కి పుట్టె, తపస్సు చేసి యాతఁడు శరీరమును కదలించెను. అతని మాంసమునుండి అరుణాదిపురుషులును, నఖములనుండి వైఖానసులును, రోమములనుండి వాలఖిల్యులును పుట్టిరి. అతనిరసము నీటిలోఁబడెను. అది నీళ్లలోఁ గూర్మాకారమై తిరుగుచుండెను. ప్రజాపతి దానితో 'నీవు నాదానవు. నాశరీరమునుండి పుట్టితివి' అనెను. అందుపై 'లేదు. నేను పూర్వమునుండియు నిచ్చట నున్నాను' అని అది అనెను. 'పూర్వం అస' అన్నది గనుక నది పురుషుఁ డయ్యెను. అది సహస్రశీర్షుఁడును, సహస్రాక్షుఁడును, సహస్రపదములు గలవాఁడును అయి కూర్చుండెను. అప్పుడు ప్రజాపతి విరాట్పురుషునిఁ జూచి 'నీవే పూర్వము పుట్టితివి. పూర్వుఁడ వగునీవు ఈ సృష్టి చేయుము' మనెను. అతఁడు సర్వసృష్టినిఁ జేసెను (తైత్తిరీయ - ఆరణ్యకము, ౧. ౨౩. ౩)[1]. ఈవైదికకథను పురాణములలో సముద్రమథనము కథతోఁ గల్పి విష్ణువుయొక్క కూర్మావతారకథ కల్పింపఁబడెను.

వరాహావతారము: సృష్టికిఁ బూర్వ మంతటను జలమే యుండెను. అందుచేఁ బ్రజాపతి ఆఁగి యి దేమి యని యాలోచించెను. అతనికి పద్మ మొకటి నిలిచియుండఁగఁ గాన్పించెను. 'సరే. ఈపద్మము దేనిమీఁద నాధారపడియున్నదో అట్టిది యొకటి యున్నది' అని అతఁ డనుకొనెను. అతఁడు వరాహరూపము దాల్చి మునిఁగెను. ఆ పద్మమునొద్ద నున్నమృత్తికను దీసికొని యాపద్మపత్రము పర్ణమందుఁ బ్రసరింపఁజేసెను. అందువలన నది పృథ్వి యయ్యెను. ఇది అయెను (అభూత్) అని యనెను. అందుచే భూమి యయ్యెను. తడిగా నున్న యాభూమిని ఆఱునట్లు చేయుటకు గాలి వీవసాగెను. ఇట్లు దానిని చిన్నరాళ్లతో (శర్కరతో) గట్టిపఱిచెను (కృష్ణయజుర్వేదీయ తైత్తిరీయబ్రాహ్మణము, ౧-౩-౫-౭)[2].

వామనావతారము: 'విష్ణువు ఇదంతయు (ఈ ప్రపంచమంతయు) దాఁటెను. మూఁడువిధముల నాతఁడు అడుగు పెట్టెను. ఈతఁడు పాదము పెట్టినస్థలమందలి పాదధూళియందు జగత్తంతయు నంతర్భూత మాయెను. పరులచేఁ గీడు లేనివాఁడును గోపుఁడును (భూరక్షకుఁడును) అగు విష్ణువు ధర్మముల ధరించి మూఁడు అడుగులు పెట్టెను' (ఋగ్వేద. ౧. ౨౨. ౧౭. ౧౮). ఇట్లు ఋగ్వేదమం దున్నది.

ఇచ్చట విష్ణు వనఁగా సూర్యుఁ డనియు, అతఁ డుదయమున ఉదయగిరిమీఁదను, మధ్యాహ్నమున అంతరిక్షమందును, సాయంకాలమున అస్తగిరియందును పాదము పెట్టు నని ఔర్ణవాభఋషి యభిప్రాయ మనియు, పృథివిలో అగ్నిరూపమున, అంతరిక్షమందు విద్యుద్రూపమునను, స్వర్గమందు సూర్యరూపమునను ఉండునని శాకపూణి ఋషియొక్క తాత్పర్యమనియు నిరుక్తకారుఁడు వ్రాసియున్నాఁడు (౧౨. ౨. ౮). ఇట్లితఁడు వ్రాసియున్నను శతపథమునందు మూఁడు పాదములకథ యిట్లు వ్రాయఁబడినది.

ప్రజాపతిసంతానమైన దేవతలు, అసురులును పోరాడిరి. దేవతలోడిపోయిరి. అసురులు ప్రపంచమంతయు తమదే యని తలంచిరి. అప్పు డసురులు మనము భూమిని పంచుకొని జీవనము చేయుద మని తలంచి యెద్దుచర్మములతోఁ బశ్చిమమునుండి తూర్పువఱకును పంచుకొనసాగిరి. ఈసమాచారము దేవతలు వినిరి. 'మనముకూడ వారు పంచుకొనుచున్నచోటికిఁ బోవుదము; లేకపోయిన మన భాగము పోవును' అని తలఁచి దేవతలు యజ్ఞరూపియైనవిష్ణువును ముందుంచుకొని వెళ్లిరి. ఇందు మాకును కొంతభాగ మిం డని వారితో ననిరి. 'ఈవిష్ణువు పరుండుటకు నెంతిస్థలము కావలయునో అంత యిచ్చెదము, అధిక మీయము' మని అసురులు చెప్పిరి. విష్ణువు 'వామనుఁ' డుగ నుండెను. అందువలన దేవత లొప్పుకొనిరి. వారు తమతోఁ దాము 'మనకు యజ్ఞమంత స్థల మిచ్చిరి. అదియే యెక్కువ' అను కొనిరి. తరువాతి వారు విష్ణువును పూర్వదిక్కున స్థాపించి ఛందములచేఁ బరివృతునిఁ జేసిరి. నిన్ను దక్షిణదిక్కున గాయత్రీఛందస్సుచేతను, పశ్చిమదిక్కున త్రిష్టుప్ ఛందస్సుచేతను, ఉత్తరదిక్కున జగతీఛందస్సుచేతను పరివృతునిఁ జేయుదుము, అని యనిరి. ఇట్లు నాల్గుదిక్కులందును ఛందములతోఁ గప్పి అగ్నిని పూర్వదిక్కునఁ బ్రతిష్ఠించి అర్చించిరి. ఇట్లు పృథ్వి నంతను స్వాధీనపఱుచుకొనిరి (శతపథ బ్రా., ౧. ౨ ౫. ౧. ౭). ఈపైని ఈయఁబడిన ఋగ్వేదవాక్యమునుండి త్రిపాదకథయు, శతపథమునుండి దేవదానవుల పోరాటమును తీసికొని తరువాతివారు పౌరాణికవామనకథ వ్రాసిరి.

## పురాణావతారములు:

విష్ణ్వవతారములు: ఇఁకఁ బురాణావతారముల విచారింతము. పురాణాదులలో నితరదేవతల యవతారములకంటె విష్ణువుయొక్క యవతారములు విశేషముగఁ జెప్పఁబడియున్నవి. సాధారణముగఁ బదియవతారములు సుప్రసిద్ధములు. దశావతారములను తెలుపునట్టి యీశ్లోక మందఱకును దెలిసినట్టిదియే:

మత్స్యః కూర్మో వరాహశ్చ నారసింహశ్చ వామనః,
రామో రామశ్చ రామశ్చ బుద్ధః కల్కి రేవచ.

ఇందు ముగ్గురు రాములు చెప్పఁబడియున్నారు. పరశురాముఁడు, దాశరథిరాముఁడు, బలరాముఁడు అని యర్థము.

విష్ణువుయొక్క ముఖ్యావతారములు పది యన్నమాట పెక్కునాళ్లనుండి వచ్చుచున్నను, ఈపదియవతారము లేవి యన్న

1. శతపథబ్రాహ్మణమునందుఁ (౭. ౫. ౧. ౫) గూడ ప్రజాపతి కూర్మరూపము ధరించి సచేతనసృష్టిని పుట్టించె నని యున్నది.

2. శతపథబ్రాహ్మణమునందు (౧౪-౧-౨) ప్రజాపతియే ఏమూష యనువందియై భూమిని పైకెత్తె ననియు, భూమి ప్రజాపతికి భార్య యనియుఁ జెప్పఁబడినది.

sampath_Ebooks

విషయమునమాత్రము భిన్నభిన్నాభిప్రాయము లున్నట్లు కానవచ్చుచున్నది. పై శ్లోకమునందుఁ గృష్ణావతారము లేదు. ఇట్లేల? యని విచారింపఁగా, నివియన్నియు నంశావతారము లనియుఁ, గృష్ణుఁడు పూర్ణావతార మనియు, లేక అవతారమే కాదు, స్వయముగా విష్ణు వనియుఁ దాత్పర్య ముండుటచే నిందుఁ జెప్పఁబడనట్లు తోఁచెడిని. గీతగోవిందమునందు 'వేదా నుద్ధరతే' యన్న శ్లోకములో దశావతారములలో బలరాముని జెప్పి చివరకు 'దశాకృతికృతే కృష్ణాయ తుభ్యం నమః' అని యున్నది. దీనిమీఁద టీక వ్రాయుచు శంకరమిశ్రులు 'అంశావతారం స్తుత్వా సంప్రతి దశావతారిణం కృష్ణం స్తౌతి', 'తథాచ తత్తదవతారవానీశ్వర స్త్వమేవ న త్వదన్య ఇత్యర్థః' అని వ్రాసినాఁడు. భాగవతమునందు వేఱు అవతారములు చెప్పి చివరకు 'ఏతే చాంశకలా విష్ణోః కృష్ణస్తు భగవాన్ స్వయమ్' (స్కం. ౧, అ. ౩, శ్లో. ౨౮) అని యున్నది. కాని కొన్ని పురాణములలో 'రామో రామశ్చ కృష్ణశ్చ' అను పాఠముకూడఁ గలదు (వాయు., అధ్యా. ౪)[1]. హరివంశమునందు (పూర్వ. ౧. ౪౨) ౧. నారాయణ, ౨. విష్ణు, ౩. వరాహ, ౪. నారసింహ, ౫. వామన, ౬. దత్తాత్రేయ, ౭. జామదగ్న్య, ౮. రామ, ౯. కృష్ణ, ౧౦. కల్కి అనునవి పదిప్రాదుర్భావము లని చెప్పఁబడినది. ఇందు మత్స్య, కూర్మ, బుద్ధ, బలరామావతారములు లేవు. బలరామావతారమునకు బదులు కృష్ణావతారము చెప్పఁబడినది. ఇట్లే మహాభారతమునందు (శాంతి, అ. ౩౩౯) చెప్పఁబడినయవతారములలో బుద్ధావతారము లేదు. మత్స్యపురాణమునందు (అధ్యా. ౯౭, ౨౩౪-౨౫౪) ౧ ధర్మ, ౨. నరసింహ, ౩. వామనావతారములు సంభూత్యవతారము లనియు, ౪. దత్తాత్రేయ, ౫. మాంధాతృ, ౬. పరశురామ, ౭. రామ, ౮. వేదవ్యాస, ౯. బుద్ధ, ౧౦. కల్కి అవతారములు మానుషావతారము లనియు దశావతారములసంఖ్య యీయఁబడినది. దేవీభాగవతమునందు విష్ణునియొక్క యీ క్రింది పదియవతారములు చెప్పఁబడినవి: ధర్మ, నర, నారాయణ, దత్తాత్రేయ, నృసింహ, వామన, పరశురామ, రామ, అర్జున, కృష్ణ (౪-వ స్కం). ఇట్లు పదియవతారములవివరమునందును చాల భేదము కలదు. ఈ యవతారములేకాక విష్ణువుయొక్కయవతారములు పెక్కులు పురాణాదులందుఁ జెప్పఁబడినవి. శ్రీమద్భాగవతమునందు (స్కంధ. ౧, అధ్యా. ౩) విష్ణువుయొక్క అవతారము లనంతము లని చెప్పుచు ముఖ్యమైనయవతారములు ౨౨ ఈయఁబడినవి: ౧. సనత్కుమారుఁడు, ౨. వరాహుఁడు, ౩. నారదుఁడు, ౪. నరనారాయణులు, ౫. కపిలుఁడు, ౬. దత్తాత్రేయుఁడు, ౭. యజ్ఞుఁడు, ౮. ఋషభుఁడు, ౯. పృథుచక్రవర్తి, ౧౦. మత్స్యము, ౧౧. కూర్మము, ౧౨. ధన్వంతరి, ౧౩. మోహిని, ౧౪. నరసింహ, ౧౫. వామన, ౧౬. పరశురామ, ౧౭. వ్యాస, ౧౮. శ్రీరామ, ౧౯. బలరామ, ౨౦. కృష్ణ, ౨౧. బుద్ధ, ౨౨. కల్కి. ఈ యన్నియవతారములకథలును సవిస్తరముగ భాగవతమునందుఁ జెప్పఁబడినవి.

ఇట్లు విష్ణువుయొక్క యవతారములు పెక్కులు చెప్పఁబడినను వానిలో ౧౦ ముఖ్యము లయ్యెను. వానిలోను ఇప్పటికాలమున హిందువులభక్తిపూజలకు రామకృష్ణావతారములు రెండే పాత్రము లయినవి. పురాణములందు నీయవతారములమహిమయే యెక్కువగాఁ జెప్పఁబడినది. దేవాలయాదులును ఆ యవతారములకే కలవు.

విష్ణువువలెఁ బురాణములందు శివునియవతారములు విశేషముగఁ జెప్పఁబడియుండలేదు. శివుని కవతారములు లేక యాతఁ డెల్లప్పుడును ఒక్కవిధముగనే యుండుటయు, విష్ణువు అవతారము లెత్తి చచ్చుచుఁ బుట్టుచుండుటయు శివునియొక్క యాధిక్యమును జూపును అని శైవులు చెప్పెదరు. విష్ణువు లోకరక్షణార్థ మవతరించుటయు, శివుఁ డవతరింపకపోవుటయు విష్ణువుయొక్క యాధిక్యమును తెల్పునని వైష్ణవులు తలంచెదరు. అట్లు కాదు; త్రిమూర్తులలో నడిమివాఁడు (రెండవవాఁడు) అయిన విష్ణువుపని లోకరక్షణము గనుక, లోకమునకు బాధ కల్గినపు డాతఁ డవతార మెత్తుట సహజము; రుద్రునిపని యాపని కాదు గనుక నాతఁడు జన్మ మెత్తవలసినయావశ్యకము లేదు అని అద్వైతులు చెప్పెదరు. దీని కనుకూలముగ క్రైస్తవులలోఁ గూడ వారి త్రిమూర్తులలో నడిమివాఁ డైన పుత్రుఁడే అవతార మెత్తెను. మొదటివాఁడును, మూఁడవవాఁడును అగువారు జన్మ మెత్తలేదు అని థియాసఫిస్టులు చెప్పెదరు.[2] ఎట్లయిన నేమి, శివునియవతారములకు విశేషవిఖ్యాతి లేదు. విష్ణువుయొక్క యవతారములవలె నవి స్పష్టముగ స్వతంత్రవ్యక్తిత్వము కల్గినవికావు. ఇందుకుఁ గారణము శివభక్తులకు లింగమునందుఁగల యత్యాదరమే కారణ మైయుండవచ్చును. శివుని లింగాకారముగఁ బూజించుటయే వారి మతము. వేఱువేఱు ఆకారములందుఁ గాని విగ్రహములందుఁ గాని పూజించుట వారికి సమ్మతము గాదు. అర్చారాధకునకును లింగారాధకునకును చాల భేదము కల దనియు, లింగారాధకుఁడు సర్వశ్రేష్ఠుఁ డనియు శైవులమతము. ఈమతమే మహాభారతమునందుఁ (ద్రోణ, అ. ౨౦౧; ఆంధ్ర. మహా. ద్రోణ, ౫. ౪౦౭-౧౮) జెప్పఁబడినది. పూర్వజన్మమందుఁ గృష్ణార్జునులు శివలింగమును పూజించిరి. అశ్వత్థామ శివప్రతిమను పూజించెను. కావున వా రశ్వత్థామను

---

1. వాయుపురాణమును అచ్చువేసినవారు దానికి నొక పీఠిక వ్రాసి యందు భాగవతపురాణమునకును దీనికిని గలభేదము నిట్లు చూపిరి: 'విశేషస్తు భాగవతపురాణమతే కృష్ణస్య నావతారత్వం కింతు పూర్ణత్వమేవ, బలరామస్య తు దశావతారేషు గణనా కృతా. అత్ర దశావతారేషు కృష్ణనామ కృతం న బలరామస్య'— (వాయుపురాణము — Bicliotheca Indica, No. 83).

2. Mrs. Annie Besant's 'Avatars'.

sampath_Ebooks

గల్వఁగల్గి రని చెప్పఁబడియున్నది. పూజకు ననేకవిగ్రహములు కావలసివచ్చినపు డనేకావతారముల యావశ్యకము కల్గును.

ఇట్లు శివుని ప్రసిద్ధావతారములు చెప్పఁబడకపోయినను ఔపచారికావతారములు కొన్ని పురాణములలోఁ జెప్పఁబడినవి. వాయుపురాణము – వాయవీయసంహిత, ఉత్తరభాగము, ౧౦–వ అధ్యాయమునందు శివుని అవతారములు చెప్పఁబడినవి. అవి యోగాచార్యులయొక్కయు, వారిశిష్యులయొక్కయుఁ నామములు. అచ్చట ౧౧౨ పేర్ల జాబితాతప్ప వారినిగుఱించిన విశేషము లేవియు లేవు. శివుఁ డర్జునుని పరీక్షించుటకుఁ గిరాతవేషము వేసికొనెను. అది యొకయవతార మనవచ్చును. నరసింహమూర్తిని సంహరించుటకై శరభావతార మెత్తెను. శంకరాచార్యులవారు శివావతార మని పురాణములలోఁ జెప్పఁబడినది (భవిష్యత్పురాణము). ఉపపురాణాదులలోనికి దిగినయెడల శివునియవతారములు పెక్కులు కానవచ్చును. కన్నడమందలి లింగాయతులు కన్నడబసవపురాణాదికములలోను, ద్రావిడశైవుల 'తిరువిళయాడల్' అనుపురాణములలోను శివునిలీలావతారము లనేకములు చెప్పఁబడియున్నవి. శివుఁడు ముదుసలి జంగమువేషము వేసికొని కంచిలోని శిరియాళసెట్టియింటికిఁ బోయి యాతని కుమారుని వండిపెట్టవలసిన దని కోరినది యొకలీలావతారమున కుదాహరణము. ఇది శ్రీనాథునిహరవిలాసమందుఁగూడ వర్ణింపఁబడినది.

దేవ్యాదుల యవతారములు: దేవీపురాణాదులమతమున శక్తియే మూలాధారము. ఆమెయే త్రిమూర్తులుగను దశావతారములుగను ఆవిర్భవించెను. ముండమాల యనుతంత్రమునందు 'ప్రకృతి యను స్త్రీ విష్ణురూప, పురుషరూపుఁడు శివుఁడు. ఈప్రకృతి పదివిధములు. కాళిక కృష్ణరూప, తారిణి రామరూప, బగళ కూర్మరూప, ధూమవతి మీనరూప, ఛిన్నమస్త నృసింహరూప, భైరవి వరాహరూప, సుందరి జామదగ్న్యరూప, భువనేశ్వరి వామనరూప, కమల బౌద్ధరూప, మతంగ కల్కిరూప, భగవతి కాళి స్వయముగ భగవంతుఁడగు కృష్ణుఁడే' యని చెప్పఁబడియున్నది. ఇట్లే గణేశపురాణమునందు వినాయకుని యవతారములును, ఇతరదేవతల మాహాత్మ్యములం దాయాదేవతలయవతారములును చెప్పఁబడినవి.

అవతారములలో భేదములు: అవతారము లన్నియు సమానము లని తలంచినంతకాలము నేవిధములైన భేదములు నుండనేరవు. కాని యొకయవతార మెక్కువ, యొకటి తక్కువ యన్నభావము కల్గఁగా నిందు నెన్నియో భేదములు పుట్టుట సహజము. ఇట్లు మనవా రవతారములలోఁ బెక్కుభేదములఁ గల్పించిరి. అవతారముల సంఖ్యను గుఱించియు, వ్యక్తులనుగుఱించియు నభిప్రాయభేదము లెట్లున్నవో యట్లే, వేఱువేఱుఅవతారములయోగ్యతనుగుఱించియు మతభేదములుకలవు. కొన్నియవతారములు దివ్యము లనియు, మఱికొన్ని భౌమము లనియుఁ జెప్పిరి. దివ్యము లనఁగా దేవలోకమందలి యవతారములు. భౌమములనఁగా భూమిమీఁదివి. బ్రహ్మవిష్ణుమహేశ్వరు లనువారు పరబ్రహ్మ యొక్క దివ్యావతారము లని స్మార్తులు. శివుఁడుమాత్ర మసలు పరబ్రహ్మ మనియు, బ్రహ్మవిష్ణువులుమాత్ర మాతని యవతారము లనియు శైవులు. అట్లు కాదు, విష్ణువు అసలు పరబ్రహ్మము, బ్రహ్మశివులే యాతనియవతారము లని వైష్ణవులు. దశావతారములలో వామనావతారము దివ్యావతారము, మిగిలినవి భౌమావతారములు. కొన్ని పూర్ణావతారములు, కొన్ని అంశావతారములు. అంశావతారమందు దేవునికొంతయంశముమాత్రము దిగివచ్చి యవతార మెత్తును. మిగిలినయంశము మూలస్థానమున నుండును. పూర్ణావతారమందు నీశ్వరుఁ డంతయు వచ్చి యవతార మెత్తును. కావున నంశావతారమునకంటెఁ బూర్ణావతార మెక్కువ యనుట సహజము. ఎవ్వరి కేయవతారమునం దధికాదరమో యాయవతారము పూర్ణ మనికాని, అధికాంశము కలది యని కాని చెప్పుట తటస్థించును. పద్మపురాణమునందు (ఉత్తరఖండమున,) 'నృసింహ రామ కృష్ణేషు షాడ్గుణ్యం పరికీర్తితమ్' (౨౫౭–౪౨) అనియు, 'రామకృష్ణావతారా తు పరిపూర్ణా నిజైర్గుణైః' (౨౮౯–౮౧) అనియుఁ జెప్పఁబడియున్నది. శ్రీమద్భాగవతమునందు 'ఏతే చాంశకలాః పుంసః కృష్ణస్తు భగవాన్ స్వయమ్' (౧–౩–౨౮) అనియుఁ జెప్పఁబడినది. ఇట్లు రామకృష్ణులు పూర్ణావతారము లని యీ పురాణములం దున్నను, వాల్మీకిరామాయణమునందును, విష్ణుపురాణమునందును ఈయవతారములనుగుఱించియే మి చెప్పఁబడియున్నదో చూతము.

వాల్మీకిరామాయణమునందు బాలకాండములోని ౧౫–వ సర్గమున దేవతలు విష్ణునొద్దకుఁ బోయి జన్మ మెత్తు మని కోరుటలో 'విష్ణో! పుత్రత్వ మాగచ్ఛ కృత్వాత్మానం చతుర్విధమ్' (౨౦) (నిన్ను నీవు నాల్గువిధములుగఁ జేసికొని పుత్రత్వమును పొందుము) అని వేడినట్లు చెప్పఁబడినది. తరువాత ౧౮–వ సర్గమునందు దశరథునకు బుత్త్రులు పుట్టుట వర్ణించుటలో నిట్లు చెప్పఁబడియున్నది:—

కౌసల్యాఽజనయ ద్రామం సర్వలక్షణసంయుతమ్,
విష్ణోరర్ధం మహాభాగం పుత్త్ర మైక్ష్వాకవర్ధనమ్. ౧౦
భరతో నామ కైకేయ్యాం జజ్ఞే సత్యపరాక్రమః,
సాక్షాద్విష్ణో శ్చతుర్భాగ స్సర్వైస్సముదితో గుణైః.
అథ లక్ష్మణశత్రుఘ్నౌ సుమిత్రాఽజనయత్సుతౌ,
సర్వాస్త్రకుశలౌ వీరౌ విష్ణోరర్ధసమన్వితౌ. ౧౧

దీనినిబట్టి చూడ నీశ్లోకములు వ్రాసినకవి[1] యభిప్రాయము ప్రకారము విష్ణువుయొక్క సగముభాగము రామరూపమునను, నాల్గవ

1. ఈభాగములును, మఱికొన్ని భాగములును మొదట వాల్మీకిరామాయణమునందు లే వనియుఁ, బ్రక్షిప్తము లనియుఁ బెక్కుపండితుల యభిప్రాయము.

sampath_Ebooks


భాగము భరతరూపమునను, సగభాగము లక్ష్మణశత్రుఘ్నులరూప మునను అవతరించెను. నిజముగ విచారించినయెడల విష్ణువుయొక్క నాల్గవంతులును నల్గురుభ్రాతలుగ నవతరించె నని చెప్పవలసి యుండెను. కాని లేఖకునకు రామునియం దధికాదర ముండుటచే నాతఁ డితరభ్రాతలకంటె నధికదేవాంశము కలవాఁ డని చెప్పవలసి వచ్చెను. ఇట్లు సగభాగము రామునకుఁ బోఁగా మిగిలినసగభాగమును ముగ్గురకుఁ బంచిపెట్టిన నొక్కొక్కనికి షష్ఠాంశము (౧/౬) వచ్చును. ఈయపూర్ణాంకపు చిక్కులెక్క నెఱుఁగనికవి భరత లక్ష్మణ శత్రుఘ్నులలో నొక్కొక్కనికి నాల్గవవం (౧/౪) తిచ్చెను. అందుచే మొత్తము ఒకటి (౧) అగుటకు బదులు ఒకటింపావు (౧।) అయ్యెను! మూలవిష్ణువు పావు పెరిఁగెను.

విష్ణుపురాణమునందుఁ గృష్ణుఁ డంశావతార మనియు, విష్ణువు తనతెల్లవెండ్రుక యొకటియు నల్లవెండ్రుక యొకటియుఁ బంపె ననియు, నవియె బలరాముఁడుగను, కృష్ణుఁడుగను అవతరించె ననియుఁ జెప్పఁబడి యున్నది.[1]

ఈ యంశావతారభేదములనుగుఱించి పురాణాదులలోఁ గొలఁదిగా నున్నను టీకాకారాదు లనేకు లనేకవిధములను వ్రాసియున్నారు. అందు నొక్కటి స్మార్తసంప్రదాయమువారిమతము ననుసరించియు, ఇంకొకటి వైష్ణవమతము ననుసరించియు నిచ్చట నిచ్చెదను. 'వరద పూర్వతాపిని' యను నుపనిష త్తొకటి కలదు. దానిపై నారాయణుఁ డనుపండితుఁడు టీక వ్రాసియున్నాఁడు:

'సచ్చిదానందస్వరూప మగు పూర్ణబ్రహ్మ మొక్కటియే. దానిగుణావతా[రము]లు మూఁడు: బ్రహ్మ విష్ణు శివులు. ఆ ముగ్గురును మాయాపరిణామములు, ప్రాతిభాసికులు. ఆముగ్గురకును పూర్ణావతారములు, కళావతారములు, అంశావతారములు కలవు.

పూర్ణావతారములు: బ్రహ్మకుఁ జంద్రాదులు, విష్ణువునకు నారసింహాదులు, శివున కేకాదశరుద్రాదులు.

కళావతారములు: బ్రహ్మకుఁ గశ్యపాదులు, విష్ణువునకు దత్తాదులు, శివునకు వటకవృషభరాజాదులు.

అంశావతారములు: బ్రహ్మకు దక్షాదులు, విష్ణువునకుఁ బాండవేయార్జున కార్తవీర్యార్జునాదులు, శివునకు నశ్వత్థామ విఘ్నరాజ వ్యాసాదులు. వీరిలో నొకయంశము జీవత్వమును, ఒకయంశము దేవత్వమును పురాణాదులయం దుభయవిధములుగను గానవచ్చుచున్నందున వీరు అంశావతారములు. పాండుపుత్త్రుఁడైన అర్జునుఁ డింద్రాంశమును నరఋషియొక్క యంశమును కలవాఁడు'[2].

వైష్ణవగ్రంథ మైన 'యతీంద్రమతదీపిక' యందు నిట్లీయవతారములనుగుఱించి వ్రాయఁబడియున్నది[3].

'విభవ మనఁగా అయాసజాతీయరూపముతో నావిర్భవించుట. అది పదివిధములు — అవి మత్స్యాద్యవతారవిశేషములు... ఇందలి యొక్కొక్క అవతారములలో అనంతప్రకారములు కలవు. పద్మనాభాదులు ౩౬ కూడ నవతారములే. అట్లే దధిభక్తహయగ్రీవ నరనారాయణాదులుకూడ. ఇట్లు ముఖ్యగౌణపూర్ణాంశావేశాదికములని అవతారములు బహుప్రకారములు. అందు నుపాస్యానుపాస్య భేదముగూడఁ జూడఁదగినది. అవతారములకు హేతువు ఇచ్ఛయే, కర్మ కాదు.'

దీనిపై టీకాకారుఁ డిట్లు వ్రాసెను: 'విభవము ముఖ్యగౌణ భేదములచే ద్వివిధము. వానిలో ముఖ్యము సాక్షాదవతారము, గౌణము ఆవేశావతారము. ఆవేశము స్వరూపావేశము శక్త్యావేశము అని రెండువిధములు. తనరూపముతోడనే ఆవేశము గలిగియుండుట స్వరూపావేశము. అట్టిది చేతను లయిన పరశురామాదులశరీరమందు స్వసాధారణవిగ్రహముతోఁ బ్రవేశించెను. శక్త్యావేశ మనఁగా కార్యకాలమందు బ్రహ్మశివాదులకు శక్తిమాత్రముచే స్ఫురణము గల్గుట. ఇచ్చట గౌణత్వ మిచ్ఛచే వచ్చెఁ గాని స్వరూపముచేతఁ గాదు. అట్లే రామకృష్ణాదులకు మనుష్యత్వమును, మత్స్యాదులకుఁ దిర్యక్త్వమును ఇచ్ఛామాత్రముచేతనే వచ్చెను......'తత్త్వత్రయమున నిట్లు చెప్పఁబడినది. 'అందు ప్రాకృతవిగ్రహములును తనస్వభావమును విభవమును విడువనివియు, దీపముననుండి దీపము పుట్టిన ట్లున్నవియు నగునవి ముఖ్యప్రాదుర్భావములు. అవన్నియు ముముక్షువులచే నుపాస్యములు. బ్రహ్మ శివాగ్ని వ్యాస జామదగ్న్యార్జున విత్తేశాది రూపములు గౌణప్రాదుర్భావములు. ఇవి యన్నియు నహంకారయుక్తజీవుని నధిష్ఠాతగఁ జేసికొనినవి గనుక ముముక్షువు లుపాసింపఁదగినవి కావు'.

విగ్రహమునుగూడ నొకవిధమైన అవతారమే యని చెప్పఁబడినది. దీనిని అర్చావతార మందురు. దీనినిగుఱించి యతీంద్రమతదీపిక (౯-వ అ.) లో నిట్లున్నది:

1. మైత్రేయ ఉవాచ: అంశావతారో బ్రహ్మర్షే! యోఽయం యదుకులోద్భవః, విష్ణోస్తద్విస్తరేణాహం శ్రోతుమిచ్ఛామ్యశేషతః. ౨. పరాశర ఉవాచ: మైత్రేయ శ్రూయతా మేతత్ యత్ పృష్టోఽహ మిదం త్వయా, విష్ణోరంశాంశసంభూతచరితం జగతో హితమ్ (౫-వ అంశము; ౧-వ అధ్యా. ౨. 3). ఏవం సంస్తూయమానస్తు భగవాన్ పరమేశ్వరః, ఉజ్జహారాత్మనః కేశౌ సితకృష్ణౌ మహామునే! ఉవాచ చ సురానేతౌ మత్కేశౌ వసుధాతలే, అవతీర్య భువో భార క్లేశహానిః కరిష్యతః (౫. ౧. ౫౯-౬౦).

2. 'వరదపూర్వతాపిన్యుపనిషత్' నారాయణకృతదీపికా సహితా — Bombay Sanskrit Series, No. 40.

3. అభ్యంకరోపాహ్వ వాసుదేవశాస్త్రివిరచిత ప్రకాశాఖ్య వ్యాఖ్యానసహితా శ్రీనివాసదాసవిరచితా యతీంద్రమతదీపికా' ౯-వ అవ, — Anandasrama Series, No. 50.

'అర్చావతార మనఁగా దేశకాలనియమము లేకుండ ఆశ్రితుల కిష్టమైన ద్రవ్యమునే (సువర్ణరజతశిలాదికమునే) శరీరముగా గ్రహించి యందు అప్రాకృతశరీరవిశిష్టుండై యుండి స్నానభోజనాశనశయన స్థితులనుగురించి అర్చకపరాధీనుఁడై సర్వసహిష్ణుఁడై పరిపూర్ణుఁడై గృహ గ్రామనగరశైలాదిప్రదేశములం దుండు మూర్తివిశేషము. అది స్వయంసిద్ధ దైవ సైద్ధ మానవభేదములచేఁ జతుర్విధము'.[1]

కొన్ని యవతారముల విశేషములు: శ్రీరామావతారమును గురించి యొకవింత కలదు. రామునకు మొదటనుండియు రావణవధ వఱకును తాను విష్ణువుయొక్క యవతార మన్నమాటే తెలియదు. రావణవధానంతరము సీత అగ్నిలోఁ బ్రవేశించినపు డింద్రాదిదేవతలు వచ్చి నీవు దేవుఁడ వని చెప్పఁగా నతనికి వారికి నిట్లు సంభాషణము జరిగెను:

రాముఁడు: నేను దశరథునికుమారుఁడను, రాముఁడను, మానవుఁడను అని తలఁచుచున్నాఁడను. నేను ఎవఁడను? ఎవనివాఁడను? ఎచ్చటనుండి వచ్చితిని? భగవంతుఁడా! నాకుఁ జెప్పుము.

ఇంద్రుఁడు: సీత లక్ష్మి, నీవు విష్ణుఁడవు, దేవుఁడవు, కృష్ణుఁడవు, ప్రజాపతివి. రావణునిఁ జంపుటకీమానవశరీరమునందుఁ బ్రవేశించితివి.[2]

ఇట్లు తెలిసినతరువాతఁగూడ నాతఁడు మానవభావముతోఁ జరించినట్లే కానవచ్చుచున్నది; దేవుఁ డన్న పరిజ్ఞానముతో నటించినట్లు కానరాదు.

కృష్ణుఁ డట్లు కాదు. తాను భగవంతుఁడ నన్న పరిజ్ఞానము కలిగి బుద్ధిపూర్వకముగఁ జేయవలసినపను లన్నియుఁ జేసెను.

పరశురామావతార మొక వింతయైన యవతారముగఁ గానవచ్చుచున్నది. మానుషావతారములలో (ముందు రాఁబోవు కల్కి తప్ప) నిదియే బ్రాహ్మణావతారము. కాని చేసినది క్షత్రియోచిత కర్మ. కార్తవీర్యార్జునుఁడు, శ్రీరాముఁడు విష్ణువుయొక్క యవతారములని చెప్పఁబడుటచే రెండురెండు అవతారము లేకసమయావచ్ఛేదమున నుండుటయేకాక యొకరితో నొకరు కలహించుటయుఁ దటస్థించెను. పరశురాముఁడు కార్తవీర్యునిఁ జంపెను; శ్రీరాముఁడు పరశురాముని బలమును లాగుకొని హతవీర్యునిఁ జేసెను! పరశురాముఁడు చిరంజీవి, యనఁగా నేఁడును బ్రతికియున్నాఁ డన్నమాట మనము మఱవఁగూడదు.

## అవతారతత్త్వము:

అవతారశబ్దము భిన్నార్థములందుఁ బ్రయోగింపఁబడుచున్నను మనము వేఱువేఱు అర్థములను విడఁదీయయత్నింతము. అవతారశబ్దమునకు సామాన్యార్థ మీశ్వరుఁడు వైకుంఠాదికములనుండి దిగి వచ్చి మనుష్యాదిజన్మముల నెత్తి యీలోకమునందుఁ గొన్నిదినము లుండి మరల నీదేహము నిచ్చటనే చాలించిపోవుట. ఇది జనసామాన్యముయొక్క యూహ. ఇట్టి యూహ ననుసరించియే దశావతారకల్పనలు పుట్టినవి. వీరిమతమున ఈశ్వరుఁడు వైకుంఠాదికములం దుండు మహాశక్తిమంతుఁడైన పురుషవిశేషుఁడు. అతఁడు వేఱు, ప్రపంచము వేఱు. ప్రపంచమునకు మేలు చేయవలె నని యాతఁడు జన్మము లెత్తుచుండును. అవతారపురుషునియం దీశ్వరాంశ ముండును; ఆదేహమందలివాఁ డీశ్వరుఁడే. ఇతరజనుల దేహములందలివాఁడు జీవుఁడు. ఇదియే యితరపురుషులకును, అవతారపురుషులకును గల భేదము. దీనిని మనము భౌతికపురుషావతారకల్పన మనవచ్చును.

తత్త్వజ్ఞానాభివృద్ధి యైనకాలఁదియు నిట్టిపురుషావతారము లీశ్వరుని సర్వవ్యాపిత్వ, సర్వమయత్వ, సర్వశక్తిమత్త్వములకును, అజత్వావినాశిత్వములకును భంగము కల్గించునన్న యూహలు పొడమును. ఇచ్ఛామాత్రముచే నన్నియుఁ జేయఁగల్గినవానికిని, అంతటను ఉన్నవానికిని అవతారములవలన నేమిప్రయోజనము? సర్వమయుఁ డనువాఁడు కృష్ణునియం దుండుటయు, సాత్యకియందు లేకపోవుటయు నెట్లు? లేదా అపరిచ్ఛేద్యుఁ డనువాఁడు కృష్ణునియం దెక్కుడుగను, అర్జునునియందు తక్కువగను ఉండుటయు, భీమునియందు లేకపోవుటయు నెట్లు సంభవించును? ఇట్టియూహలుగల తత్త్వజ్ఞు లంతర్యామ్యవతారవాదము, లేక ఆవిర్భావావతారవాదమును ప్రతిపాదించుట సహజము. ప్రతివస్తువునందును ఈశ్వరుఁ డంతర్యామిగ నుండును. కావున విశ్వ మంతయు నీశ్వరాంశభవమే. కొంద ఱీశ్వరుఁడు సృష్టిరూపమున ఆవిర్భవించును గావునఁ బ్రపంచమందలి యన్నిపదార్థములును, అందఱుపురుషులును ఈశ్వరావతారములే అని చెప్పుదురు. వీరి మతమున ప్రత్యేకావతారముల యావశ్యకము లేదు.

ఇట్లు అవతారములనుగురించిన పామరజనుల కల్పనకును తత్త్వజ్ఞులకల్పనకును భేదము కలదు. కాని పామరజనులకు తత్త్వజ్ఞుల యూహ యర్థము కాదు. భౌతికపురుషావతారములే జనసామాన్యమునకుఁ దెలియును, అర్థమగును. వారిభక్తిని ఆకర్షించును. కావుననే పురాణాదులలో నిట్టి అవతారములే వర్ణింపఁబడినవి. తత్త్వజ్ఞులు వల దనినను సామాన్యజను లీయవతారములను విడువరు. కావునఁ గొందఱు తత్త్వజ్ఞు లీయవతారద్వయకల్పనలను మిశ్రము చేసి, కల్యాణగుణావతారవాదమును ప్రతిపాదించిరి. ఈశ్వరుఁ డసంఖ్య కల్యాణగుణములు కలవాఁడు. ప్రపంచమునందు నేయే పురుషులలో నిట్టిగుణములు కలవో వారాగుణములమట్టుకు ఈశ్వరాంశము కలవారు, అవతారపురుషులు అని తలంపవలె నని వీరి తాత్పర్యము. శ్రీమద్భాగవతములోని ప్రథమస్కంధమందలి (3-వ అధ్యా.) అవతా

---

1. ఇందలివిశేషభాగ మీ గ్రంథకారుఁడు 'తత్త్వత్రయము' అను గ్రంథమునుండి గ్రహించినట్లు కానవచ్చుచున్నది.

2. రామ ఉవాచ :— ఆత్మానం మానుషం మన్యే రామం దశరథాత్మజమ్, సోఽహం యశ్చ యతశ్చాహం భగవాం స్తద్ బ్రవీతు మే, సీతా లక్ష్మీ ర్భవా న్విష్ణు ర్దేవః కృష్ణః ప్రజాపతిః, వధార్థం రావణస్యేహ ప్రవిష్టో మానుషీం తనుమ్. (యుద్ధకాండము, సర్గ. ౧౨౦).

రములజాబితానుగుఱించి టీక వ్రాయుచు శ్రీవిశ్వనాథచక్రవర్తి 'అత్ర ప్రాచాం కారికాః' (ఇందును గుఱించి ప్రాచీనులకారికలు) అని చెప్పి కొన్నిశ్లోకముల నిచ్చినాఁడు. వానితాత్పర్యము: 'నృసింహరామపరశురామ కల్క్యవతారములు భగవంతుని ఐశ్వర్యమును ప్రకాశింపించును; నారద వ్యాస వరాహావతారములు ధర్మప్రకాశకములు; రామ ధన్వంతరి యజ్ఞ పృథు-అవతారములు కీర్తిప్రకాశకములు; బలరామ మోహినీ వామనావతారములు సౌందర్య ప్రధానకములు; దత్తాత్రేయ మత్స్య కుమారకపిలావతారములు జ్ఞానప్రదర్శకములు; నరనారాయణ కూర్మ ఋషభావతారములు వైరాగ్యదర్శకములు; కృష్ణుఁడు పూర్ణషడైశ్వర్యమాధుర్యములకు సముద్రము, సమస్తావతారములును తనలోఁ గలవాఁడు, సకలశక్తిమంతుఁడు'.

అవతార మాభాసముగాని నిజము కాదు: అజుఁడు మానవదేహముల నెత్తుట యసంగత మని యొప్పుకొనుచు, పురాణాదులలోఁ జెప్పఁబడిన విష్ణువుయొక్క యవతారములు ప్రాతిభాసికములే కాని (మాయచే భాసించునవి) పారమార్థికములు (నిజమైనవి) కావు అని ఈశ్వరునియొక్క యజత్వావతారత్వము లన్న పరస్పరవిరుద్ధధర్మములను సమన్వయించుటకు శ్రీశంకరాచార్యులవారు గీతాభాష్యమునందు యత్నించిరి. 'అజో౽పి సన్నవ్యయాత్మా' (౬.) అను శ్లోకముపై శంకరులభాష్యమును, దానికి ఆనందగిరియు, మధుసూదన సరస్వతియు వ్రాసినటీకయు నిచ్చుట వలసినంత యిచ్చుచున్నాను.

'అప్పుడు ధర్మాధర్మములు లేని నిత్యేశ్వరుండవగు నీకు జన్మమెట్లు కలుగును? అనఁగాఁ 'జెప్పెదము' జన్మరహితుఁడనే యైనను, అక్షయమైన జ్ఞానశక్తిస్వభావము గలవాఁడనే యైనను, బ్రహ్మాదిస్తంబపర్యంతభూతములకు నీశ్వరుఁడనే (నియామకుఁడనే) యైనను నాదైన వైష్ణవి యను త్రిగుణాత్మికను, దేనివశంబున సర్వజగంబును వర్తించుచున్నదో, దేనిచే మోహితంబై తనయాత్మను వాసుదేవుని ఎఱుంగదో ఆ నాదైనప్రకృతిని వశీకరించుకొని, దేహము గలవానివలె నగుచున్నాను. పుట్టినట్లు నాయొక్కమాయచేతనే, పరమార్థమునఁ (నిజముగఁ) గాదు, లోకమువలె' — (శంకరభాష్యము).

'ఈశ్వరునకు జన్మకారణము లేకపోవుటవలన జన్మమే యనుపపన్నము. ఇఁక ననేకజన్మములు కడచినవాఁ డనుట మఱియు ననుపపన్నము అని శంకించుచున్నాఁడు 'అప్పుడు' ఇత్యాదిచే. వాస్తవముగ జన్మము లేకున్నను మాయావశమున జన్మము సంభవించుచున్నదని యుత్తరము చెప్పుచున్నారు 'చెప్పెదము' అని. పారమార్థిక జన్మము సంభవింప దనుటకుఁ గారణమును బూర్వార్ధముచే అనువదించి ప్రాతిభాసికజన్మము సంభవించు ననుటకుఁ గారణమును చెప్పుచున్నాఁడు, ఉత్తరార్ధముచేత' — (ఆనందగిరి).

'అంచు సర్వజ్ఞునకు ఈశ్వరునకు సర్వకారణభూతునకు ఇట్టి దేహగ్రహణ ముపపన్నము కా దని యేది చెప్పఁబడినదో అది యట్లే (నిజమే); ఏల యనఁగా, అతనిశరీరము స్థూలభూతకార్య మగునేని అప్పుడు వ్యష్టిస్వరూప మైనచో జాగ్రదవస్థయును అస్మదాదులతో సమానతయు సంభవించును. సమష్టిరూప మైనచో విరాడ్జీవత్వము చెప్పవలయును, విరాట్టు సమష్టిస్థూలోపాధి యగుటవలన. ఇఁక సూక్ష్మభూతకార్య మగునేని అప్పుడు వ్యష్టిరూప మైనచో స్వప్నావస్థ అస్మదాదిసమానత్వము సంభవించును. సమష్టిరూప మైనచో హిరణ్యగర్భజీవత్వము చెప్పవలయును, హిరణ్యగర్భుఁడు సమష్టిసూక్ష్మోపాధి యగుటవలన. కావున భౌతికశరీరము జీవునిచే ఆవిష్టము కానిది పరమేశ్వరునకు సంభవింపనే సంభవింప దని సిద్ధము. ఇఁక జీవావిష్టమైన భౌతికశరీరమునం దీశ్వరుఁడు భూత మావేశించినట్లు ప్రవేశించు ననియుఁ జెప్పనొప్పదు; ఆశరీరముచే ఆజీవునకు భోగము నంగీకరింపవలసి యున్న, ఈశ్వరున కంతర్యామిరూపంబున సర్వశరీరప్రవేశము సిద్ధమైయుండఁగా, ఒకానొకశరీరమును బ్రవేశించినాఁ డనుట వ్యర్థ మగుటవలన. అందువలన, లేదు భౌతికశరీరమీశ్వరునకు అని పూర్వార్ధముచేత నంగీకరించుచున్నాఁడు 'అజో౽పి సన్' ఇత్యాదిచే.........అప్పుడు భౌతికదేహము లేనిచో భౌతికదేహధర్మము మనుష్యత్వము మొదలగునవి యెట్లు తోఁచుచున్నవి అనఁగా అందులకుఁ జెప్పుచున్నాఁడు 'ఆత్మమాయయా' అని. నామాయచేతనే నాయందు మనుష్యత్వాదులు తోఁచుచున్నవి, లోకానుగ్రహముకొఱకు; కాని వాస్తవము కా దని భావము' — (మధుసూదనసరస్వతి)[1].

రామానుజాచార్యులమతంబున 'అవతార' దేహములు ప్రాతిభాసికములు కావు; మనదేహములవలె సత్యములే. ఈశ్వరుఁ డజుఁడుగా నుండవచ్చును; పుట్టవచ్చును; ఆపుట్టుక నిజమైనది కావచ్చును. అతనియజత్వమునకు భంగము రాకపోఁగా నవతారపురుషుఁడుగా నున్నపుడును అతని ఈశ్వరత్వసంబంధమైన అజత్వాది గుణములకును లోపము లేదు! ఇది యుక్తికిఁ దగనిమాట యనియు, పరస్పరవిరుద్ధ మనియు శాంకరమతమువారియభిప్రాయము.

## మహాపురుషపూజ:

ఈయవతారవాదమునకు మహాపురుషుల జీవితము లెక్కువగ సహకారు లైనవి. మహాపురుషుల యలౌకిక గుణములను జూచి, యితరమానవులకు నట్టిగుణములు లేకపోవుటచే, నవి యమానుషములనియు, ఈశ్వరునియంశ మనియు జనులు తలఁచెదరు. అతని జీవితకాలమునందు జను లాతనిని మిక్కిలి గౌరవించెదరు. ఈశ్వరుఁ డన్నభావ మాకాలమునందు విశేషముగ నుండదు. ఇతరులను మించిన మహానుభావుఁ డని గౌరవించెదరు. అతని నిధనానంతరమునఁ గ్రమముగ నాతని యద్భుతచర్యలనుగుఱించిన గాథలు పెరుఁ

1. పరమార్థచంద్రిక, ౨-వ సంపుటము.

sampath_Ebooks

నను నాతఁడు దేవతాత్వమును చెందును. ఈవిధముననే పెక్కుమహాపురుషులు, మహారాజులు, తత్త్వవేత్తలు, శూరులును దేవతలయవతారములుగ మాఱిరి. శ్రీమద్భాగవతమందలి యవతారముల జాబితా చూడినచో (౧. ౩.). అచ్చట పృథుచక్రవర్తి, కపిలాచార్యుఁడు, వ్యాసుఁడు మొదలయినవా రవతారము లని చెప్పఁబడెను. దశావతారములనుగుఱించి విచారింపఁగా, సంహితాబ్రాహ్మణములలో రూపకాదులుగ నున్న మత్స్యాద్యవతారముల ననుసరించి పౌరాణిక కాలమందు విష్ణువుయొక్క మత్స్య, కూర్మ, వరాహ, వామనావతారములు కల్పింపఁబడిన వనియు, పరశురామ శ్రీరామ కృష్ణ బుద్ధావతారములకుఁ గారణ మాయానామములుగల మహాపురుషుల యద్భుతచర్యలే యనియు మన మూహింపవచ్చును. అవతారము లనఁబడు పురుషులు కేవల పురుషులుగ భావింపఁబడినకాల మొకప్పు డుండెననియు, తరువాత వారు క్రమముగ నవతారకోటిలోఁ జేరి రనియుఁ జెప్పుటకుఁ గొన్ని యాధారములు కలవు. ఏ రవతారపురుషు లన్న కల్పన పుట్టినతరువాత నంతకుఁ బూర్వము కేవలమనరులుగా వర్ణింపఁబడిన గ్రంథములలోఁ గూడ సాధ్యమైనంతవఱ కవతారసంబంధమైన శ్లోకములు చేర్పఁబడెను. పురాణాదులలోని పెక్కుతావులు వీరి యవతారపూర్వావస్థను తెల్పును. ఒక్కొక యవతారమును దీసికొందము.

**పరశురాముఁడు :** పరశురాముఁడు మొదట కేవలము ఋషిగా నెంచఁబడుచున్నట్టు కానవచ్చుచున్నది. వాల్మీకిరామాయణమునందు శ్రీరాముఁడు, పరశురాముఁడును కలసిన ప్రసంగ మొకటి కలదు. (బాలకాం, సర్గ ౭౫, ౭౬). ఆసందర్భమున నాతని మహాభయంకర ప్రభావము వర్ణింపఁబడినను అతఁడు ఋషిగనే వర్ణింపఁబడియెను, అవతార మని చెప్పఁబడలేదు. అతనికి భయపడి ప్రార్థించిన దశరథుఁడు గాని, విశ్వామిత్రాదులుగాని అతని నవతారముగఁ జెప్పలేదు. అతఁడు చివరవఱకును ఋషిగనే కాన్పించును; భారతమందును భీష్మకర్ణాదుల గురువుగను ఋషిగను కాన్పించును. భారతమునందు మూఁడుస్థలములందుఁ బరశురాముని పూర్వచరిత్రము - అతఁడు క్షత్త్రియుల నోడించిన కథ చెప్పఁబడినది (ఆది. అ ౨; వన[1]. అ ౧౧౫; శాంతి. అ ౪౯.); (ఆంధ్రమహాభా. ఆది. అ ౧; అరణ్య.అ. ౩; శాంతి. అ ౩). ఈ మూఁడు స్థలములలోను ఈతనిని మహామునిగా వర్ణించినారేకాని, విష్ణువుగ వర్ణింపలేదు. ఉద్యోగపర్వమునందు భీష్ముఁడు తనకును పరశురామునకును అంబానిమిత్తము జరిగినయుద్ధమును వర్ణించినాఁడు. అందుఁ బరశురాముని విష్ణువుగాఁ గాని విష్ణునియవతారముగఁగాని, అంశముగఁగాని ఎచ్చటను చెప్పలేదు. ఋషి, ముని, బ్రాహ్మణశబ్దములచేతనే సంబోధించెను. ఒకచోటఁ గోపము వచ్చి, 'బ్రాహ్మణబ్రువుఁ' డనియుఁ దిట్టెను! కావునఁ బరశురాముఁడు మొదట గొప్పఋషియై, యపరిమితక్షత్త్రతేజము చూపినవాఁ డగుటచేఁ దరువాత దశావతారములలోఁ జేరెను అని యూహింపవలసియున్నది.

**శ్రీరాముఁడు :** ఇఁక శ్రీరాముని గుఱించి విచారింతము. శ్రీరాముఁ డనఁగా దాశరథిరాముఁడు. ఈతఁడు మొదట నద్వితీయ రాజుగ ఖ్యాతిఁ జెంది క్రమముగ దేవత్వమును జెందినట్లు రామాయణమువలననే కానవచ్చుచున్నది. వాల్మీకిరామాయణముయొక్క బాలకాండమందలి ౧-వ సర్గము రామాయణముయొక్క సారాంశము, సంగ్రహము. దానినే మనవారు బాలరామాయణ మందురు. అందు రాముఁడు విష్ణ్వంశ మని యెచ్చటను చెప్పఁబడకపోవుటయే కాక, నరుఁ డనియును, అలౌకిక సద్గుణములుగల గొప్ప రాజనియును చెప్పఁబడెను. మొదట వాల్మీకి నారదుని జూచి యిట్టిసద్గుణసంపదగల నరుఁ డెవఁడైనను కలఁడా యని యడుగును. 'మహర్షే! త్వం సమర్థోఽసి జ్ఞాతు మేవంవిధం నరమ్' (౫) అని వాల్మీకి యడుగఁగా నారదుఁడు 'మునే! వక్ష్యా మ్యహం బుద్ధ్వా తైర్యుక్త శ్శ్రూయతాం నరః' (౭) అని ప్రత్యుత్తర మిచ్చెను. ఇందు రాముఁడు నరుఁ డని స్పష్టముగఁ జెప్పఁబడియున్నది. ఆకవియొక్క మనసులో నీరాముఁడు విష్ణువు అన్న యూహ లేనేలేకయుండె ననుటకు నీశ్లోకము కలదు.

విష్ణునా సదృశో వీర్యే సోమవత్ప్రియదర్శనః,
కాలాగ్నిసదృశః క్రోధే క్షమయా పృథివీసమః. ౧౮

విష్ణువైనవానిని విష్ణువుతోఁ బోల్చుట యెట్లు? ఈ బాలరామాయణమునందు రామునిచరిత్ర మంతయుఁ జెప్పి, చివరకు నాతని గుఱించి

గవాం కోట్యయుతం దత్త్వా బ్రహ్మలోకం ప్రయాస్యతి. ౯౪.

దశ వర్ష సహస్రాణి దశ వర్ష శతాని చ,
రామో రాజ్య ముపాసిత్వా బ్రహ్మలోకం స గచ్ఛతి.

అని చెప్పఁబడియున్నది. ఈ శ్లోకములు వ్రాసినకవికి దాశరథి

---

1. సంస్కృతభారతమందలి వనపర్వమునఁ జెప్పఁబడిన పరశురామకథలోఁ గొన్నిప్రతులలో నీశ్లోకములు కలవు: 'తతో దేవాస్సమేత్యాహు రృషయశ్చ మహావ్రతాః, దేవదేవం సురారిఘ్నం విష్ణుం సత్యపరాక్రమమ్, భగవన్ భూతరక్షార్థ మర్జునం జహి వై ప్రభో, తతశ్చ భగవాన్ దేవ శ్శక్రేణ సహిత స్తథా. కార్తవీర్యవినాశార్థం మంత్రయామాస భారత, యత్తద్భూతహితం కార్యం సురేంద్రేణ నివేదితః. స ప్రతిశ్రుత్య తత్సర్వం భగవాన్ లోకపూజితః, జగామ బదరీరమ్యాం స్వ మేవాశ్రమమండలమ్.' ఇందు విష్ణువు పరశురాముఁడుగ నవతరించె నని స్పష్టముగఁ జెప్పఁబడకపోయినను అకల్పన అస్పష్టముగ సూచింపఁబడినట్లు అభాస మగుచున్నది. ఈశ్లోకములు మూలములో లేవనుటయు, ప్రక్షిప్తము లనుటయు స్పష్టము. ఏల యన ఆంధ్రమహాభారతము తెనిఁగించిననాఁటి కిది యున్న యెడల దీని సంపూర్ణభాషాంతరము గాకపోయినను, ఛాయయైనను అందు వచ్చియుండును,

sampath_Ebooks

రాముఁడు విష్ణు వన్నయూహ యుండినపక్షమున 'విష్ణులోకం స గచ్ఛతి' యనునేకాని 'బ్రహ్మలోకం స గచ్ఛతి' అనుటకుఁ గారణము లేదు. నరుఁ డనియు, గొప్పరాజశ్రేష్ఠుఁ డనియుఁ దలఁచినందువనే గోదానాదులుచేసి బ్రహ్మలోకమునకుఁ బోవునని చెప్పెను. బాలకాండము ౨-వ సర్గమునందు బ్రహ్మదేవుఁడు వచ్చి, వాల్మీకిని రామచరితము వ్రాయు మని ప్రోత్సాహపఱుచును. రామ సీతా రాక్షసాదులు రహస్యముగఁ జేసిన పనులును వారిమనసులలోని యూహలును వాల్మీకికిఁ దెలియునట్లు వరంబిచ్చును. ఆసందర్భమునవైనను రాముఁడు విష్ణువుయొక్క యవతార మని చెప్పఁడు, రాముఁడు విష్ణువుయొక్క యవతార మని రామునకుఁ దెలియదు, నారదునకుఁ దెలియదు, బ్రహ్మదేవునకుఁ దెలియును. రామచరితము తప్పక వ్రాయు మని వాల్మీకిని ప్రోత్సాహపఱుచునప్పుడు కూడ వాఁడు ఈయవతారముసంగతి చెప్పఁడు. ఇట్లు వాల్మీకమునందలి మొదటిరెండుసర్గలు వ్రాయఁబడినకాలమున రాముఁడు సకలసద్గుణములు గల నరుఁ డని యెంచఁబడుచుండెననుట స్పష్టము. రామాయణమునందు రాముఁడు తన్నుఁగాని, అతనితో సంబంధము గలిగినమనుష్యు లెవరుగాని రాముని విష్ణు వని చెప్ప లేదు ఆచరణయందుఁ జూపలేదు. రాముఁడు విష్ణువుయొక్క అవతార మన్నకల్పన యుత్పన్న మైనతరువాత యుద్ధకాండమునకుఁ జివర, రాముఁడు చివరవఱకును తాను నరుఁడనే యని అనుకొనినట్లును, ఇంద్రాదులు వచ్చి నీవు విష్ణుఁడ వని చెప్పినట్లును కథ కల్పింపఁబడినది (౧౨౦-వ సర్గ). ఈభాగమును బాలకాండమందలి దేవతాదులు విష్ణువునొద్దకుఁ బోయి జన్మ మెత్త మన్నభాగమును (౧౫-౧౭ సర్గలు) వెనుకనుండి వ్రాయఁబడి కల్పఁబడిన ప్రక్షిప్తము లని విద్వాంసులయభిప్రాయము. అట్లే రామాయణమునం దింకను ప్రక్షిప్తములు కలవు. వానిని గుఱించి 'రామాయణ'శబ్దము క్రిందఁ జూడనగును.

దాశరథిరాముఁడును, పరశురాముఁడును కొంతకాలమువఱకును కేవలము రాజర్షి గను బ్రహ్మర్షి గను ఎంచఁబడుచుండి రనియు, వారి దేవతావతారము లన్నకల్పన వెనుకనుండి వచ్చినదనియుఁ జూపుటకు మహాభారతమునందును కొన్ని సూచనలు కలవు. సభాపర్వమునందు నారదుఁడు ధర్మరాజుతో దిక్పాలకులసభలనుగుఱించి చెప్పుచు, యమసభావర్ణన ప్రసంగమున అందు యముని సేవించుచుఁ కొందఱు రాజర్షులును, బ్రహ్మర్షులును ఉందురు అని చెప్పి, యయాతి, నహుషుఁడు, పూరువు, మాంధాత మొదలయిన ౩౦, ౪౦ రాజర్షులపేళ్లతోపాటు దాశరథిరామ పరశురాముల పేర్లను చెప్పెను (౮-వ అధ్యాయము)[1]. ఈశ్లోకములు వ్రాసినవానికి, విష్ణువు శ్రీరాముఁడుగ నవతరించి మరల విష్ణువునందు లయించె నన్నయూహ మనస్సులో నున్నయెడల నిట్లు వ్రాసియుండఁడుగదా! శ్రీరాముఁడు యయాతి నహుషాదులతోపాటు గొప్పరా జన్న యభిప్రాయ మున్నదినములలోనే యీ శ్లోకములు వ్రాయఁబడిన వనుటకు సందేహము లేదు.

కృష్ణుఁడు : పురాణాదులలో కృష్ణునిచరిత్రము మిశ్రముగనే యున్నది. సాధారణముగఁ బ్రతిచోటను ఈతని దేవత్వమును, నరత్వమును కలసివచ్చును. ఈ కథలలోనుండి మానవుని, దేవుని విడఁదీయుట కష్టము. భగవద్గీతాభాగమును విడిచినయెడల భాగవతమందలి కృష్ణునియందు దేవత్వ మెక్కువగను, భారతమందలి కృష్ణునియందు నరత్వ మధికముగను కానవచ్చుచున్నది. పురాణాదులలో నిట్లు దేవత్వము లేనికృష్ణుఁడు కనఁబడుట కష్ట మైనను, ఛాందోగ్యోపనిషత్తునందు (౩. ౧౭. ౬) దేవకీపుత్రుఁడైన కృష్ణుఁడు ఘోరాంగిరస ఋషివలన 'పురుషయజ్ఞదర్శన'మును నేర్చుకొనిన శిష్యుఁడుగఁ గానవచ్చుచున్నాఁడు, దేవుఁడుగ నెంతమాత్రమును అగపడుటలేదు. దీనినిబట్టిచూడ నుపనిషత్కాలమున కృష్ణుఁడు గౌరవింపఁదగు నొక తత్త్వవేత్తగను, రాజర్షి గను ఉండినటుల గానవచ్చుచున్నది. తరువాత నీతనిని భారతాదికములలో దేవునిగ మార్చియుండవచ్చును.

కృష్ణార్జునులు నరనారాయణు లన్న ఋషులయవతార మని చెప్పఁబడియున్నది. ఇందువలనను కృష్ణుఁడు మొదట నొకఋషిగ నెంచఁబడుచుండె ననియుఁ, దరువాత విష్ణువుగ నెంచఁబడుచుండె ననియు నూహింపవచ్చును.

బుద్ధుఁడు : దశావతారములజాబితాలలో బుద్ధునిపే రిటీవలఁ గల్పి రనుట స్పష్టము. మహాభారతమునందును (శాంతి, అ. ౩౩౯ శ్లో ౧౦౦), దేవీభాగవతమునందును (౪-వ స్కం అ ౧౬) దశావతారములందు బుద్ధునిపేరు లేదు. బౌద్ధమతము మిక్కిలి ప్రబలిన తరువాతఁగాని యాతనిని దేవునిగ వైదికమతస్థు లొప్పుకొనుట సంభవింపదు. (కో. వేం. ల.)

**అవతి** — బెంగుళూరుజిల్లాలోని యొకపల్లె. దీని మూల నామము ఆవాలి. ౧౪-వ శతాబ్దియంతమున మొరసు వొక్కల్ జాతివారైన ఏడ్గురువ్యవసాయదారులు వచ్చి యిచ్చట నివసించి, విజయనగరమువారికి సామంతులుగ మైసూరుదేశమునకుఁ దూర్పుభాగమందు రాజ్యములు స్థాపించిరి.

**అవదానము** — ఒకవిధ మగు బుద్ధవచనమునకును, ఒకవిధ మగు బౌద్ధరచనమునకునుగూడ అవదాన మనుపేరు చెల్లుచున్నది. సంస్కృతబౌద్ధమునందలి బుద్ధుని ద్వాదశధర్మ ప్రవచనము

1. తస్యాం రాజర్షయః పుణ్యాస్తథా బ్రహ్మర్షయోఽమలాః, యమం వైవస్వతం తాత ప్రహృష్టాః పర్యుపాసతే. ౧౭. యయాతి ర్నహుషః పూరు ర్మాంధాతా సోమకో నృగః, ......... రామో దాశరథిశ్చైవ లక్ష్మణోఽథ ప్రతర్దనః,...........జామదగ్న్యశ్చ రామశ్చ.........ఇక్ష్వాకుర్హంద్రో ర్వృషసుభి ర్మహద్యు ర్యారిదక్షితః, ఏతే రాజర్షయః పుణ్యాః కీర్తిమంతో బహుశ్రుతాః. ౩౦. తస్యాం సభాయాం రాజేంద్ర వైవస్వత ముపాసతే.

sampath_Ebooks

లలో అవదాన మేడవది. కాని యీపదము పూర్వజన్మ కర్మఫలమును దెలుపుటకుఁగాను పుట్టినబౌద్ధరచనమునకే రూఢ మయినది.

ఇట్టి రచనములలో అతిప్రాచీనములయినవి హీనయానమునకుఁ జెందినవి. ఒకప్రత్యేకవాఙ్మయశాఖగ పాళీయందివి కానరాకపోయినను పాళీ త్రిపిటకములందు 'అపదాన' మని యొక గ్రంథము మాత్రము కలదు. ఇందు బుద్ధునికాలమునందుండిన అర్హతుల (వీరిలో స్త్రీలును, పురుషులునుగూడఁ గలరు) జీవితకథలు వివరింపఁబడినవి. బుద్ధునికిఁ జాలకాలమునకుఁ దరువాత నీ 'అపదానము' త్రిపిటకములలోఁ జేరిన దని పరిశోధకుల యభిప్రాయము. చారిత్రకబుద్ధుని పూర్వజన్మము లే వని 'దీఘనికాయము' తెలుపుచుండ తరువాతికాలమున విరచింపఁబడిన బుద్ధవంశమున నీసంఖ్య ఇరువదినాలుగువఱకును బెరిఁగినది. మఱియొక పదునొకండింటిని గలిపి 'అపదాన' మీసంఖ్యను ముప్పదియైదు చేసినది. ఈకారణమున నిందలికథలు వేఱువేఱుకాలములందు విరచితములయి, యిందుఁ జేరుచు వచ్చిన వని పరిశోధకు లందురు. 'సుమంగలవిలాసిని' ననుసరించి 'దీఘనికాయ' ప్రవాచకులు 'అపదానము'ను 'అభిధమ్మ పిటకము'లోనిదిగ గ్రహింప, 'మజ్ఝిమనికాయ' ప్రవాచకులు దానిని 'సుత్తాంతపిటకము'లోనిదిగ నెంచి రని తెలియుచున్నది. ఇది యర్వాచీన మనుట కిది యొకకారణము. 'అపదానము'నకు 'విశుద్ధజనవిలాసిని' యని యొకటీక కలదు. 'గంధవంశము'ననుసరించి యది బుద్ధఘోషవిరచిత మని తెలియుచున్నది.

క్రీస్తుశకము మొదటిశతాబ్దిని బౌద్ధులు సంస్కృతమున గ్రంథరచనమున కుపక్రమించినపుడు అపదాన మవదాన మయినది. అవదానము లనేకములు సంస్కృతముననో, తిబెత్తు చీనాభాషానువాదములందో యున్నవి.

[illegible]

ప్రతి[illegible]

వర్తమ[illegible]

కృతకర్మ[illegible]

అందువలన, అవదానము జాతకకథవలెనే భూతవర్తమానజీవితగాథలను దెలుపుకథ. రెండునుగూడ ధార్మికనియమములను, నీతిని బోధించుటకు పుట్టినవే. ప్రతిజీవికిని గ్రాంతిసెఱుఁగని అతివిస్తృతమును, అపారము నగుసంసారచక్రమునందలి యాతనిజీవితములగతి, భాగ్యములను నిర్ణయించుటలో కర్మకు దుర్నివారమును, సర్వవ్యాపకమునయినశక్తి కల దని తెలుపుట యొకటి, మంచిపనులు చేయుటవలన భావిభాగ్యోదయమునకు హేతుభూత మయినపుణ్యము లభించు నని, దానిని కూడఁబెట్టుకొనుటకు ప్రతిజీవికిని ప్రత్యేకశక్తి కల దని శ్రోతలకు, పాఠకులకును, ప్రత్యయము కలిగించుట యొకటి - ఇవి పూర్వోక్త మయినరెండువిధము లగురచనములయాశయము. ఇఁక వీరెండిటికిని గలభేద మే మన, జాతక మెల్లప్పుడును బుద్ధ, బోధిసత్త్వుల పూర్వజన్మకథలనే తెలుపుచుండ అవదాన మెప్పుడును కాకపోయినను సాధారణముగ తదితరుల పూర్వజన్మాదికములనుగూర్చి తెలుపుచుండును. అయినను చాలఅవదానములు బుద్ధునిగూర్చి తెలుపునవియుఁ గలవు. అందువలన నొకవిధముగ ప్రతిజాతకము నవదానమనవచ్చును కాని, అవదానమున్మాత్రము జాతకము కానేరదు. సరిగా చూచినయెడల బోధిసత్త్వుని ఆత్మత్యాగమును, అతని దానవీరచరితమును దెలుపునట్టిజాతకములు బోధిసత్త్వావదానములే. జాతకమాల ఈపేరఁ బరఁగుచుండుటయుఁ గలదు. క్షేమేంద్రుఁడు బుద్ధభగవానుని శతాధికము లయినప్రశస్తకార్యముల నభివర్ణించుచు వ్రాసిన తనకావ్యమునకు బోధిసత్త్వావదానకల్పలత యనియే పేరు పెట్టెను. అందువలన అవదానకథలలో జాతకకథలు గానవచ్చినను ఆశ్చర్యపడఁబని లేదు. అవదానశతకము చతుర్థదశకమునందలికథ లన్నియు జాతకకథలే.

అవదానములలో గొప్పబౌద్ధమతతత్త్వప్రతిపాదన ముండదు కాని జనసామాన్యమునకుఁగూడ సుగ్రహము లగునట్లు తన్మతమునందలి ప్రధానవిషయముల నవి కథారూపమునఁ దెలియఁజేయును. మతవ్యాపనమున కీవిధమయిన యుపదేశాత్మకకథ లెక్కువగఁ దోడ్పడును. జనసామాన్యమునకుఁ జేయఁబడుధర్మోపదేశములననుమఁ జొప్పింపఁబడున వగుటచేత నీకథలు మతాభిమానము నుద్దీపింపఁజేసి దానికి పుష్టి యొసంగుచుండెడివి.

అవదానము లన్నియు చేసినమంచిపని ఎంత చిన్న దయినను అమరూపఫలము నొసంగు నని బోధించునట్టి కల్పితకథలే. ఇట్టి తరగతికథలు జాతకములం దగుదుఁగఁ గానవచ్చును. అవదానాచరణమునకు, అనఁగా సత్కర్మాచరణమునకు జనసామాన్యము జాతక కథలయందలి బోధిసత్త్వులవలె ఆఁకలిగొన్న పెద్దపులి క్షుద్బాధను నివారించుటకుఁ దమశరీరమును దాని కాహారముగ నొసంగనక్కఱయు లేదు, బ్రాహ్మణులు మొదలగువారికి భార్యాపుత్రాదులను, అవసర[illegible]ల రక్తమాంసములను, శిరస్సును ధారపోయనక్కఱయు[illegible]నకుఁగాని, బుద్ధునికిఁగాని, బుద్ధశిష్యులకుఁగాని పుష్ప[illegible]లు, సువర్ణ, రజత, భూ[illegible] దాన మొసంగి[illegible]దినిర్మాణములు కావించినను — ఇంతే యొందుకు,[illegible]మునకుఁగాని, భిక్షువులకుఁగాని యుపకరించునట్టి,[illegible]కార్యము చేసినను అవదాన మే యయి యది యవ[illegible]మే యగును. ఇట్లే ధర్మవిరోధక, అధర్మాత్మక[illegible]లవఁ గలుగుదుష్ఫలములను దెలుపునట్టి యవదాన[illegible]

[illegible]కావదానమాల, ద్వావింశత్యవదానమాల, [illegible]మొదలగు నవదానగ్రంథము లెన్నియో కలవు. అ[illegible]లో సుప్రసిద్ధమయిన వని పేరుపడినవి అవదాన[illegible]లు, అర్వాచీనము లగు నీ గ్రంథములు సాధార[illegible]దాన'కథల నెత్తికొనవు.

sampath_Ebooks

**అవధానము** — నిర్వచనము : ఏదియైన నొక విషయమున, అనఁగా నొకవస్తువునందుఁగాని, భావమునందుఁగాని మనస్సు లగ్నమైయుండుట అవధాన (Attention) మనఁబడును. ఇట్లనుటచే మన మొకవిషయమున నిలిచియున్నపు డితరసమీపవిషయములు బొత్తిగ గోచరములుగాఁ బోవని యూహింపరాదు. మనసు నిలిచియుండినవిషయములవలె నంత స్పష్టముగ దానిచుట్టు నున్న యితరవిషయములు మనస్సునకు గోచరములుగాలే దని యర్థము. ఒక దీపమునొద్ద మన మొకకాగితమును జదువుచున్నపుడు మనమనస్సు దానియందుఁ బ్రవేశించియుండినంతమాత్రమున, దీపము దానిచుట్టు నున్న యితరవస్తువులును మనసమీపమునఁ గల వని యైన మనము తెలిసికొనకపోము. కాని మనయవధానశక్తి కాగితమునుగూర్చి యాలోచించుటలో వినియోగపడుచుండుటచే దానిని గూర్చి గ్రహింపఁగలిగినంతగ నితరవస్తువులనుగూర్చి మనము గ్రహింపఁజాలము. ఇట్లే కాగితముయొక్క వివిధభాగములనుగూర్చి మన మెఱుంగవలయును. మనము చదువుచున్న వాక్యమునుగూర్చి తెలియునంతగ నితరవాక్యములనుగూర్చి మనకుఁ దెలియుటలేదు. కాని మనము చదువుచున్న వాక్యము కాక మఱికొన్ని వాక్యములు గూడ నాకాగితముపై వ్రాయఁబడియున్న వనిమాత్రము మనము గ్రహింపఁగలము. ఇట్లే ఆకాగితమునందలి పదములను గూర్చియు, అక్షరములనుగూర్చియు మనము తెలిసికొనవలయును. మనస్సు తాను ప్రవేశించియుండినవిషయమునం దవధానరూపకమగు సంపూర్ణప్రవేశము గలిగియున్నది. దానిచుట్టు ప్రక్కలనున్న యితరవిషయములయందు సామీప్యభేదము ననుసరించి యీమనఃప్రవేశము, లేక మనోవ్యాప్తి క్రమముగా క్షీణించుచుఁబోయిపోయి కడు దూరమునం దున్న విషయములయం దంతరించుచున్నది.

**వ్యక్తమగుకాలము, ప్రయోజనము :** అవధానశక్తి మనజీవితమునం దెట్టిసమయములయందు వ్యక్తమగుచున్నదియు విచారించితిమేని, అది యెట్టిపనిని జేయుచున్నదియు, తన్మూలమున జీవితమున కెట్లు తోడ్పడుచున్నదియు మనము తెలిసికొనఁగలము. మనము జన్మించినవెంటనే తాత్కాలికశరీరపోషణమునకుఁ గావలసిన స్తన్యపానాదిముఖ్యావసరకార్యములను మనస్సుయొక్క సాయము లేకయే నిర్వర్తించుటకుఁగాను మనకర్మేంద్రియములు కొన్ని చలనములను జేయుటకు సమర్థములై యున్నవి. స్తనమును నోటికడకుఁ దీసికొనివచ్చినవెంటనే శిశువు దానిని గబళించి స్తన్యపానము చేయుటయు, మనయొంటిమీఁద ఈఁగ వ్రాలినతోడనే మనమనస్సునకుఁ దెలియకుండఁగనే దానిని చేతితో విసరుకొనుటయు ఇట్టిస్వతఃప్రవర్తితము లగు (**Automatic or reflex movements**) ఇంద్రియసంచలనముల కుదాహరణములు. ఇట్టియవయవచలనములు స్వల్పసంఖ్యాకము లగుటచే వీనితో మన జీవితమునఁ జాలకాలమును గడపలేకున్నాము. మనస్సుయొక్క సాయమక్కఱలేకయే మనయవయవములు మన కవసరము లగుకార్యములను చేయుట కెప్పు డశక్తము లగుచున్నవో అట్టిసమయమున, క్రొత్తరీతుల నాకార్యములను నెఱవేర్పుటకై వీనియందు మనమనస్సు ప్రవేశింపవలసివచ్చుచున్నది. ఒకసాలెవాఁడు మగ్గమును నేయుచున్నపుడు పోఁగు చిక్కుపడకుండ నున్నంతవఱకుఁగాని, కండె క్రిందఁ బడకుండ నున్నంతవఱకుఁగాని వానిమనస్సుయొక్క సాహాయ్యమక్కఱలేకయే వానిచేతులు నేతపనిని జేయుచుండును. అతనిపనికి రెండువిధముల నెట్లు భంగము వచ్చినను, అతనిమనస్సు నేతవంకకుఁ దిరిగి యవధానకార్యమును జేయవలసియున్నది. కావున మన కవరోధములు కలిగినపు డెల్ల వానిని నివారించునిమిత్తము మనమనస్సు వానియందు నిలుచుచున్నది. మన మొకవిషయమునందుఁ బ్రవేశించినపు డెల్ల నవధానకార్యము జరుగుచున్నది. అవరోధములు కలిగినపు డెల్ల నవధానరూపమున మనఃప్రవేశము కలుగును. ఆయవరోధస్వభావమును తెలియఁజేయుటయే అవధానశక్తియొక్క ప్రయోజనము.

**అవధానస్వభావము :** పైని జెప్పినదానినిబట్టియే మన మవధానస్వభావమును గ్రహింపఁగలము. ప్రపంచమునందలి యన్నివిషయములతో నొకటేసారి యవధానశక్తికిఁ బని లేదు. కావుననే వానియన్నిటివంకకు నొకటేసారి పోక యేక్షణమున నేవిషయమును గ్రహించుట జీవితమున కత్యవసరమో మనమనస్సు దానియందు నిలుచుచున్నది. ఈరీతిగ ననవసరము లైనవిషయములనుండి యవసరము లైనవానిని వేఱుపఱిచి కావలసినవానినిమాత్రమే తనకు లక్ష్యములుగ నొనర్చుకొనుటయే యవధానశక్తియొక్క స్వభావము. ఇట్టి అవధానశక్తి పసితనమునందు స్వల్పముగ నుండి క్రమక్రమముగ నభివృద్ధి నొందుచున్నది. అవధానము కొన్నిక్షణములుమాత్రమే యొకవిషయమునందు నిలువఁగలదు. దానిని గ్రహించినవెంటనే, అవధానశక్తి యింకొకవిషయమునకుఁ బరుగెత్తుచున్నది. అది యట్లు పరుగెత్తక యొకటేవిషయమునందు నిలిచియున్నట్లు కనఁబడినను, ఆవిషయమునందు క్రొత్తక్రొత్తభాగములను కనుఁగొని విచారించుచున్న దనియే మనము గ్రహింపవలసియున్నది. ఒకటేమాటయందు చాలకాలము మనమనస్సు నిలిచియున్నట్లు కనఁబడునప్పు డామాటయొక్క వివిధాక్షరములనుగూర్చి ప్రత్యేకముగ నాలోచించుచున్న దని యర్థము. ఇట్లే యొకటేయక్షరమునం దవధానశక్తి చాలకాలము నిలిచినట్లు కనఁబడునప్పుడు దానియందు క్రొత్తక్రొత్తభాగములను క్షణక్షణమును కనుఁగొనుచున్న దని మనము గ్రహింపవలయును. కావున నతిత్వరితముగ మాఱుట అవధానశక్తియొక్క మఱియొక ముఖ్యలక్షణము.

**అవధానభేదములు, సంకల్పపూర్వకావధానము :** అవధానము సంకల్పపూర్వకము, సంకల్పరహితము, సంకల్పవ్యతిరేకము అని మూఁడువిధములు. మన మేదియో యొకవిషయమునందు మనస్సును నిలుపవలయు నని యుద్దేశించి యత్నపూర్వకముగ మనస్సు నందుఁ బ్రవేశింపఁజేసితిమేని, మన మనస్సు నావిషయమునందు వర్తింపఁజేయఁబడుట సంకల్పపూర్వకావధాన మనఁబడును. ఒకబడిపిల్లవాఁ డాటల

sampath_Ebooks

వంకకుఁ బరుగెత్తుచున్న తనమనస్సును వానినుండి మరలించి తనపుస్తకములయందు నిలుపఁ జూచెనేని యాతఁడు సంకల్పపూర్వకావధానకార్యమును జేయుచున్నాఁడు. ఒకశతావధాని పృచ్ఛకులు తన కొసఁగినవిషయములను జ్ఞప్తియం దుంచుకొనుటకై వానియందు తనమనస్సును నిలిపినప్పుడుకూడ నిట్టియవధానకార్యమే జరుగుచున్నది. సామాన్యముగ మనము సంకల్పించినవిషయమునందు మనమనస్సును నిలుపఁజూచినను అది యావిషయముచుట్టుప్రక్కల నున్నవానికిని సహజముగ వ్యాపించు నని చెప్పియేయున్నాము. సంపూర్ణైకాగ్రత కలవడినవారలమనస్సున కీసమీపవిషయవ్యాప్తి చాల తక్కువ. కొన్నిసమయములయం దది లే దని చెప్పినను దోషము లేదు. ఇందులకు బాహ్యప్రపంచమునెల్ల మఱచి మత్స్యయంత్రమునందే తనమనస్సును నిలుపఁగలిగినయర్జునుఁడే తార్కాణము. ఇట్టిశక్తి సామాన్యులగు మనయందుఁగూడ కొన్నిసమయములయందుఁ గానవచ్చుచున్నది. మన మేదియేని యొకవిషయము నాలోచించునప్పు డితరవిషయములను చాలవఱకు సంపూర్ణముగ మఱచియుండుట కొన్నిసారులు తటస్థించు నని మన మెఱిఁగినవిషయమే.

సంకల్పరహితావధానము : మన ప్రయత్న మేమియు లేకయే మనమనస్సు తన కిష్టమగునేదియే నొకవిషయమునందుఁ బ్రవేశించుట సంకల్పరహితావధాన మనఁబడును. ఇచ్చట మనమనస్సు నట్టివిషయమునందుఁ బ్రవేశపెట్టవలయు నని యెట్టిప్రయత్నము గాని, సంకల్పము గాని లేదు. మనమనస్సు తా నాలోచించుచున్నవిషయమును వీడి తన కెక్కువగ రుచించు నితరవిషయములవంకకుఁ బోవుట మన కనుభవవేద్యము. ఒకగదిలో మనము చదువుకొనుచుండ ప్రక్కగదిలో సంగీతము వినఁబడెనేని మనమనస్సు నటు ద్రిప్పి మనము సంగీతము నాలకించుట సహజము. ఇట్లే క్రొత్తవిషయమునందు మనమనస్సును ప్రవేశపెట్టుటకు మాఱుగ నచ్చటనుండి దానిని మరలించుటకే కొంతయత్నము కావలసియున్నది. గాఢమగు ఆలోచనయందు మనస్సు మగ్నమైయున్నను, మనపేరు మనచెవులఁ బడెనేని వెంటనే మనమనస్సు దానివంకకుఁ దిరుగుట సంకల్పరహితావధానమునకు చక్కని యుదాహరణము. ప్రతివానికిని కొన్నివిషయములందుకంటె మఱికొన్నిటియందు సహజాభిలాష యెక్కువ. ఒకనికి సంగీతమును, మఱియొకనికి చిత్రలేఖనమును, ఇంకొకని కింకొకకళయు రుచించును. మనకు రుచింపనివిషయములను నేర్చుకొనవలయు ననిన మనస్సును వానియందు నిలుపుటకై కొంతశక్తిని వినియోగింపవలసియున్నది. మన కభిరుచి గలవిషయములను నేర్చుకొనవలయు ననిన మనస్సు అట్టి ప్రయత్న మక్కఱలేకయే వానియందు నిలుచుచున్నది. ఇందువలన వానిని త్వరగ నేర్చుకొనుటకును, సంపూర్ణజ్ఞాన మలవఱచుకొనుటకును అవకాశము గలుగుచున్నది. ఇందువలననే ఒకబాలున కేవిషయమునందు సహజానురక్తి యెక్కువగ నుండునో అతనికి దానియందే శిక్ష నొసఁగుట మే లని మనవారు చెప్పుచున్నారు.

సంకల్పవ్యతిరేకావధానము : మన మేదియే నొకవిషయమున లగ్నమైయుండి దాని నచ్చటనుండి మన మెంత మరలింపఁజూచినను మరలకుండుట సంకల్పవ్యతిరేకావధాన మనఁబడును. పైని జెప్పినయుదాహరణములే కొంచెము మార్చఁబడినయెడల ఈవిధమగునవధానమునకుఁగూడ నుదాహరణము లగును. పైని చెప్పినట్లు మనమనస్సు, చదువుచున్నపుస్తకమును వీడి సంగీతమువంకకు తిరిగినపిమ్మట మనము దానిని మగల పుస్తకపఠనమునందు ప్రవేశింపఁజేయ యత్నించినప్పుడు అది యట్లు మరలకుండెనేని మనమనస్సు సంగీతమునం దట్లు మన కిష్టము లేకయే బద్ధమైయుండుట సంకల్పవ్యతిరేకావధానము. ఇట్లే ఆటలవంకకుఁ బఱుగెత్తి పుస్తకములవంక కెంత త్రిప్పఁజూచినను తిరుగనిబాలునిమానసికావస్థయు సంకల్పవ్యతిరేకావధానము.

అవధానరాహిత్యము : అవధానశూన్య మగుస్థితి మనమనస్సునకు సుషుప్తియం దున్నను జాగ్రదవస్థయం దెప్పుడును లేదు. ఇతరుఁ డేదియైన నొకసంగతిఁ జెప్పుచున్నప్పుడు మనము చెవులతో వినుచున్నను దానిని గ్రహింపకుండినయెడల మన మవధానరహితులముగ నున్నా మని సామాన్యముగఁ జెప్పుదురు. కాని మనము వినుచున్నసంగతులకంటె నెక్కువప్రీతికరము లగువిషయములయందు మనమనస్సు బద్ధమైయున్న దనియే మన మూహింపవలయును.

వ్యక్తమగుటలో కాలవ్యత్యయము : ఈ మూఁడువిధములగు అవధానములలో మనుష్యశిశువునందు ప్రథమముగఁ గానవచ్చునది సంకల్పరహితావధానము. శిశువున కెట్టిసంకల్పమును లేకయే వాని జ్ఞానేంద్రియము లగు కన్నులు, చెవులు మొదలగువానిమూలమున నాతనికి వ్యక్త మగుచున్నబాహ్యప్రపంచమునందలి వివిధవిషయములయందు నాతనిమనస్సు నిలుచుచున్నది. అతనియింద్రియము లాతని నెటు పట్టి లాగిన నావంక కాతనిమనస్సు తిరుగుచున్నది. ఇట్లు కొన్నివిషయములయం దాతనిమనస్సు సంకల్పరహితావధానరూపమున వర్తించునప్పు డాకస్మికముగ నొకగొప్పధ్వని గాని, కనులకు మిఱుమిట్లుగొల్పు వెలుతురు గాని అతనికి గోచర మయ్యెనేని, అతనిమనస్సు వీనివంకకుఁ దిరుగవలసివచ్చుచున్నది. మన స్సిట్లు సంకల్ప మేమియు లేక బలవంతముగ నొకదానియందు ప్రవేశపెట్టఁబడుట సంకల్పవ్యతిరేకావధాన మని కొందఱు చెప్పుచున్నారు. కావున ప్రథమమున నీరెండును, ముఖ్యముగ సంకల్పరహితావధానమును, సంకల్పములు, వాంఛలు మొదలగునవి యేర్పడినపిమ్మట కొంత యాలస్యముగ సంకల్పపూర్వకావధానమును బయల్పడి క్రమవృద్ధిని బొందుచున్నది.

వీని పరస్పరసంబంధము : అవధానము మూఁడువిధము లగుటచే, ఈమూఁడింటియొక్క స్వభావము గాని, ముఖ్యలక్షణములు గాని, ప్రయోజనములు గాని వేఱుకావు. ఈమూఁడును ఒకశక్తి యగు మనస్సంబంధమైన యవధానముయొక్క రూపభేదములే కాని, ఎట్టి

sampath_Ebooks

సంబంధమును లేని స్వతంత్రములగు మూఁడువిధములయిన భిన్న శక్తులు కావు. మనజీవయాత్రయందు క్షణక్షణము నుద్భవిల్లుచున్న వాంఛాప్రతిబంధములను, సంకల్పావరోధములను, ప్రాణోపద్రవములను, వానివాని స్వభావములను మన మెఱిఁగించుటచే మనము వానిబారిఁ బడకుండ మనజీవితముయొక్క గమ్యస్థానమును జేరునట్లు చేయుటయే ఈమూఁడింటియొక్క స్వభావము. మన జీవితమునకు, తాత్కాలికముగ నవసరము లైనవిషయములనుండి యనవసరము లైనవానిని వేఱుపఱిచి, మన యవధానశక్తికి అవసరము లైనవానినే గుఱిచేయుస్వభావ మీమూఁడువిధములగు అవధానములయందును గానవచ్చుచున్నది. ఈయవధానశక్తి ప్రారంభమునుండియును, పిదప వర్ధిల్లుటలోను మూఁడుతీరులుగ వర్తించుటచే, దీని మూఁడువిధము లగురూపములకు మూఁడుపేరులు పెట్టి వానిస్వభావమును దెలిసికొనుచున్నామే కాని, ఈమూఁటికిని పైని కనఁబడునంత భేదము లేదు.

ఎన్నివిషయములం దేకకాలమున అవధానము నిలుచునదియు: ఇఁక, తడవ కెన్నివిషయము లవధానశక్తికి నొకశేసారి లక్ష్యములు కాఁగల వనువిషయమును విచారింతము. ఈప్రశ్నయును, తడవ కెన్నిపనులను మన మొక్కటేసారి చేయఁగల మను ప్రశ్నయును వేఱని మనము మొట్టమొదట గమనింపవలయును. తడవ కనేకములగుపనులను మన మొకటేసారి యభ్యాసవశమున చేయఁగలిగినను, ఒక్కసారియొక్క విషయమునందుమాత్రమే మన యవధానమును నిలుపఁగలమని ప్రస్తుత మానసశాస్త్రవేత్తలయభిప్రాయము. ఒకకుట్టుపనివాఁ డొకటేసారి తనయంత్రముయొక్క అడుగుభాగమును కాలితోఁ ద్రొక్కుచు, గుడ్డలను కడువేగముగ తనచేతితో తన యంత్రసాహాయ్యమున కుట్టుచు, ఇతరులతో మాటలాడుట లేక దేనినైనఁగూర్చి యాలోచించుట అనుపనినికూడ చేయఁగలుగుచున్నాఁడు. ఇట్లతఁడు మూఁడుపనుల నొకటేసారి చేయుచున్నాఁడు. ఈవిధముననే అభ్యాసవశమున కర్మేంద్రియము లొకటేసారి యెన్నిపనులను జేయునట్లు వాని నొకఁడు వశపఱచుకొనిన వాఁడు దన్నిపనుల నొకటేసారి చేయఁగలఁడు. అయినను అతనిమనస్సు తడవ కొకవిషయమునందు మాత్రమే అవధానరూపమున నిలువఁగలుగుచున్నది. మిగిలినపనుల నవాలోచితముగ మనస్సాహాయ్య మక్కఱలేకయే వానియవయవములు చేయుచున్నవి. కావుననే అభ్యాసవశమున నింద్రియములు తమంతట తామే చేయుచున్న పనులలో నేవిధమైన లోపము వచ్చినను వాని మనస్సు తన ప్రస్తుతవిషయమును వీడి ఆ లోపమును నివారించు నిమిత్త మాపనులవంకకుఁ దిరుగుచున్నది. కుట్టుపనివానియంత్రమున నేదేనిలోపము వచ్చి ఆయంత్రము కుట్టుపనిని మానినను దారము పూర్తియై కుట్టుపని సాగకున్నను, తాను మొదలుపెట్టిన కుట్టు పాంతమై రెండవకుట్టు వాఁ డారంభింపవలసియున్నను, లేక మఱి యేవిధముగనైని తనపనికి భంగము కలిగినను, ఆకుట్టుపనివాఁ డాలోచించుట కాని, మాటలాడుట కాని కొంతకాలము మాని తనమనస్సును తాను చేయుచున్నపనియందు నిలుపవలసినవాఁ డగుచున్నాఁడు. ఈవిషయ మింతసేపటినుండియు వానిమనస్సు కుట్టుపనియందు ప్రవేశించియుండలే దని చక్కఁగ సూచించుచున్నది. తడవ కొకటే విషయమున మనమనస్సు నిలువఁగల దనినప్పుడు మనస్సుపక్షమున నొకవిషయ మని మాయర్థము. చిత్రలేఖకుఁ డొకఁడు తన రెండు చేతులతో నొకటేసారి రెండుకాగితములపై రెండు భిన్నరూపములను చిత్రింపఁగలిగినను, అతనిమనస్సును దృష్టియం దుంచుకొని చూచితిమేని అతఁ డొక్కపనిని జేయుచున్నాఁ డనియే మనము చెప్పవలసియున్నది. ఒక అష్టావధాని తనపృచ్ఛకుని కొకనికి పద్యమును చెప్పుచున్నప్పుడే, అతనివీపుపై పూవులను వేయుటయు, వెనుకనుండి గంటలను కొట్టుటయు, అతఁడు వానిని సరిగ లెక్క పెట్టఁగలుగుటయు మనము పైనిఁ జెప్పినదానికి కొంచెము వ్యతిరేకముగఁ దోఁపవచ్చును. ఒకగంటకును మఱియొకగంటకును, ఒకసారి పూవును వేయుటకును ఇంకొకసారి పూవును వేయుటకును కొంతవ్యవధి కలదనియును, అట్లు వ్యవధిలేక అదేపనిగ నొకదానితరువాత నొకటిగ పూవులను వేసినను గంటలను కొట్టినను పైమూఁడుపనుల నొకటేసారి యెట్టి అవధానియు చేయఁజాలఁడు. వసిగ లెక్క పెట్టుటకుమాత్రమే కూర్చుండినవానికి కావలసినదానికంటె నేమాత్రమైన నధికముగు వ్యవధి మూఁడుపనుల నొకటేసారి చేసినట్లు కనఁబడుటకు కావలసియున్నది. ఈవ్యవధికాల మేమాత్రమైన నుండుటచేతనే, ఆ అష్టావధానియొక్క మన స్సొకవిషయమునుండి యింకొకవిషయమునకును, అచ్చటనుండి మఱియొకవిషయమునకును, దానినుండి మరల స్వస్థానమునకును కనుమూసి కనుదెఱచునంతలో మనస్సునకు సహజమగువేగముతోఁ బరుగెత్తుచుండుటచే పృచ్ఛకులు ప్రేక్షకులును అవధాని యొకటేసారి యనేకము లగుపనులను చేయుచున్నాఁ డని యనుకొనవచ్చును.

తడవ కొకవిషయముమాత్రమే మనయొక్క యవధానశక్తికి లక్ష్యము కాఁగల దనినప్పు డావిషయము భాగసమన్వితమైయుండవచ్చునా లేక భాగరహితమైయుండవలెనా యని మనము విచారింపవలసియున్నది. దీనికిఁ బ్రత్యుత్తరమే మన, ఆ విషయమునే కొంతభాగములు కలదిగ నుండవచ్చును కాని దానిని మన మనస్సు గ్రహించునప్పు డొక్కొక్కభాగమును గ్రహించి వాని నన్నిటిని కలుపుటచే ఆవిషయమును గ్రహింపక, దానినంతయు నొకటేసారి యొకటేవిషయముగ ప్రప్రథమమున గ్రహించుచున్నది.

అవధానమందలి విభజనమును సమ్మేళనమును: మన మొకధూమశకటయంత్రమును (Railway Engine) చూచి అదియొకయంత్రమని కనుఁగొనినప్పుడు, దానిలోని వేఱువేఱు భాగములను విడివిడిగ మొదట గ్రహించినపిమ్మట నది యొకయంత్ర మని తెలిసికొనక వాని నన్నిటి నొకటేసారి యొకటేయంత్రముగఁ దెలిసికొనుచున్నాము. అట్లే యొకమాటను గ్రహించునప్పుడు, మొట్టమొదట, దానిలోని భాగము లగు వివిధాక్షరములను గాని, ఒక వాక్యముయొక్క భావమును దెలిసికొనవలయు నన్న వేఱువేఱుమాటలయొక్క ప్రత్యేకార్థ

sampath_Ebooks

ముసుగాని మనము తెలిసికొనఁ బ్రయత్నింపము. ఇందువలననే యొక బాలున కొకభావము నేర్పుచున్నప్పుడు, మొట్టమొదట పిల్లి, కుక్క, మనుష్యుఁడు, కొట్టెను అను ప్రత్యేకప్రత్యేకము విడివిడిపదములను నేర్పక వాక్యరూపమున భావ మతఁడు నేర్చుకొన మొదలిడునట్లు చేయవలయు నని మన విద్యాధికారులు చెప్పుచున్నారు. ఒకవిషయముసుగూర్చి సామాన్యమగుజ్ఞానము కొంచె మేర్పడినపిమ్మటనే వేఱు వేఱుభాగములనుగూర్చి స్పష్టమగు జ్ఞానము మన కేర్పడుచున్నది. కాని ఆవిషయమునుగూర్చిన సామాన్యజ్ఞానము మొట్టమొదట మనకు కలుగునప్పుడు కూడ, అది మనకు విశదము కాని కొన్ని భాగములను కలిగియున్న దనియు, ఆభాగము లన్నియును కలసి యొక్కటియే యనియుమాత్రము మనము తప్పక తెలిసికొందుము. కావున మనము తెలిసికొను ప్రతివిషయమును భాగసమన్విత మైయున్నది. ప్రతి యవధాన కార్యమందును, అవధానమునకు గుఱి యైన ప్రతివిషయమును వేఱువేఱుభాగములుగ విభజించుశక్తియు (Discrimination or analysis), ఈభాగము లన్నియు నొకదానిలోనిభాగము లని గ్రహించుశక్తియు (Association or Synthesis) ఇయుల్పడు చున్నవి.

అవధానఫలితములు: ఒకవస్తువును మాదియు మాడనట్లుగ నుందుమేని అది కొన్నియంతర్భాగములను కలిగియున్న దనువిషయమును గ్రహించుటయు దానిస్వభావమునుగూర్చి యించుకస్వల్ప జ్ఞానము కలుగుటయుమాత్రమే తటస్థించును. అట్లు గాక ఆవస్తువును మనయవధానశక్తికి లక్ష్యముగఁ జేసితిమేని దానినిగూర్చి సంపూర్ణ జ్ఞాన మలవడుటకు మన కవకాశము కలుగుచున్నది. ఏవిషయమును మనమనస్సును గాఢముగ లగ్న మొనరింతుమో, ఆవిషయము చక్కఁగ జ్ఞప్తియం దుండఁగలదు. కావున మన మాలోచించు విషయములయొక్క స్వభావమును చక్కఁగఁ దెలిసికొనునట్లు చేయుటయు, ధారణాశక్తికి చాల తోడ్పడుటయు అవధానశక్తి యొక్క ముఖ్యఫలితములు. (గో. సు.)

అవధానములు, అవధానులు: మనదేశమునం దష్టావధానము లనియు, శతావధానము లనియుఁ గొందఱు చేయుచుందురు. వారిని మనవారు అష్టావధాను లనియు, శతావధాను లనియుఁ బిలుచు చుందురు. ఇట్టియవధానములను గుఱించి గ్రంథములు సంస్కృతమునం దున్నట్టు కానరాదు. అవధానులును స్పష్టముగఁ జెప్పరు. ఉచ్ఛిష్ట గణపతి మొదలైనదేవతల యుపాసనవలన నిట్టిశక్తి వచ్చు ననియు, నిది యభ్యాసమువలన రానేర దనియుఁ గొందఱు చెప్పుచున్నను, అభ్యాసమువలన నితరవిద్యలవలెనే దీనినిగూడ నేర్చుకొనవచ్చును[1] అని యిప్పుడు విద్వాంసులు నమ్ముచున్నారు. చిత్తైకాగ్ర్యముఁ జేయుశక్తియు, ధారణాశక్తియు నెక్కుడుగఁ గలవారి కవధానము సులభసాధ్యము; అన్యులకుఁ గొంతకష్టసాధ్యము.

అవధానమునుగుఱించిన వైవ్యాసము చదువువారికి, నొక్కసారి (ఏకసమయావచ్ఛేదమున) ఎనిమిదివిషయములను గాని, నూఱు విషయములను గాని మన సెట్లు గ్రహించు నన్నసందేహము గలుగ వచ్చును. కాని అష్టావధానమందుఁ గాని శతావధానమందుఁ గాని అవధాని అన్నివిషయములను ఏకకాలమందు గ్రహించుచున్నాఁ డనుట నిజము గాదు. ఒకవిషయము మనస్మృతిపథమునకు రాఁగా, అది యని మొదటఁ దెలిసి యొదుట మాచుచున్నపుడా విషయమును గ్రహించుటకు మనసునకు ౭౬ మానముల కాలముకంటె నెక్కుడుపట్టదు[2]. మాన కాల మనఁగా నొకసెకనులో ౧౦౦౦-వ వంతు. ఆయా అవధాని యొక్క గ్రహణశక్తిని బట్టి ఈకాలము హెచ్చుచుండును, తగ్గుచుండు ను. కావున నతిసూక్ష్మకాలములో గ్రహింపఁబడువిషయము లన్నియు మనకు నేకకాలమందు జరిగినట్లు కానవచ్చినను భిన్నభిన్న కాలము లందే మనస్సుచేత గ్రహింపఁబడును. ఇదియుఁ గాక యీ యవధానము లలో నవధానకార్యమునకంటె 'ధారణ' (Retention), 'స్మృతి' (Reproduction, memory) అను మానసక్రియలపనియే యెక్కుడుండును. ప్రథమ పృచ్ఛకుని ప్రశ్నయు, ద్వితీయపృచ్ఛకుని ప్రశ్నయు నేకకాలమందు నడుగఁబడవు. ప్రత్యుత్తరములును ఏకకాలమందు నీయఁబడవు. కావునఁ గ్రమముగాఁ జెప్పఁబడినప్రశ్న లన్నియు జ్ఞాపక ముంచుకొని, మఱల నావరుస వచ్చినప్పుడు గాని, నడుమ నడిగినప్పుడు గాని ప్రతిపృచ్ఛకునిప్రశ్నలకును తగినజవాబు చెప్పుటకు ధారణాశక్తియు, స్మృతియు నెక్కుడు గావలయును. అవధానము, ధారణ, స్మృతి యనునవి వేఱువేఱు మానసవ్యాపారము లయినను వీనికిఁ బరస్పరసంబంధము కలదు. లక్ష్యపూర్వకముగ (అవధానపూర్వకముగ) గమనించినవిషయము చక్కఁగ ధరింపఁ బడును, అనఁగా బాగుగ మనస్సులో నాఁటును. అట్లు నాఁటినది మరల వలయునెడ శీఘ్రముగ జ్ఞాపకము వచ్చును.

ఇఁక నష్టావధాన శతావధానవిధానములును, వానిని జేయఁబడు నుపాయములును సంగ్రహముగఁ జెప్పెదను.

## అష్టావధానము:

అష్టావధాన మనఁగా నేకకాలమునందు నెనిమిదివిషయములను మనస్సుచే గ్రహించి ధరించుట. ఏకకాల మనఁగా మిక్కిలి యల్పావధిగలకాలము. శాస్త్రీయరీతిచేత నది భిన్న కాలములే యైనను వ్యావహారికమున నేకకాలముగనే కానవచ్చును. సాధారణముగ, ౧. కవిత్వము, ౨. వ్యస్తాక్షరి, ౩. గణితము, ౪. సమస్య, ౫. పురాణము, ౬. కావ్యపాఠము, ౭. చదరంగము, ౮. సంభాషణము నను నెనిమిది కార్యముల నవధాని యేకకాలమునందే చేయుచుండును. అష్టావధానమునకు నీయెనిమిదియే యుండవలయు నని నియమము లేదు. ఇందుఁ గొన్ని మార్పుచేసి కొందఱు చెప్పెదరు.

---

[1] కందుకూరి వీరేశలింగముగారి స్వీయచరిత్రము., ౧-వ భాగము, ౩-వ ప్రకరణము.

[2] Ribot's Psychology of Attention, P. 74.

మరియు 'కవిత్వము', 'సమస్య' అనునవి నిజముగా ఆశుక విత్వవిషయములు. ఆశుకవిత్వమునందుఁగూడ నవధాన మెక్కువగ నుండవలయును. ఇందునుగుఱించి 'ఆశుకవిత్వము' క్రింద నధికముగ వ్రాయఁబడును.

వ్యస్తాక్షరి: ఒక్క వాక్యమునందలిపదము లొక్కొక్కటిగఁ బృచ్ఛకునియిష్టము వచ్చినక్రమముగ నిన్నవయక్షర మిది యని చెప్పినయెడల నన్నియు విని చివరకు మూలవాక్య మిది యని యవధాని చదివి చెప్పును; లేదా యెవరికిని దెలియకుండఁ గాగితముపైని వాక్యము వ్రాసి అక్షరముల కంకెలు వేసి అక్షరములను కత్తిరించి అందు నిష్టము వచ్చినక్రమమున నొక్కొక్కటి యవధానికిఁ జూపుచుందురు. అర్థయుక్తమైన వాక్యమైనయెడల నక్షరములసహాయము కొంతవఱకు జ్ఞాపకశక్తికి సాయము చేయునుగాని, పెక్కుసారులు పృచ్ఛకుఁడు వాక్యమందలిపదముల నీయక, అర్థము లేనియక్షర సమూహ మొకటి కల్పించుకొని యందలియక్షరములను జెప్పును; లేదా అవధానికిఁ దెలియనిభాషలోనివాక్యమందలి అక్షరములనైనను చెప్పును. అప్పు డీయవధానము కొంచెము కష్టము. దీనికి శతావధానమునందుఁ జెప్పఁబడిన నూఱుస్థిరశబ్దములసాయము తీసికొనవలెను (దీనితరువాత రచింపఁబడిన శతావధానవిధానమును జమవుఁడు). స్థిరనామములకును ఈయక్షరములకును స్థిరసంబంధము కలుగఁజేసి కొనవలెను. వీలునంతవఱకు పృచ్ఛకుఁ డిచ్చిన అక్షర మొకశబ్దము యొక్క ప్రథమాక్షరముగ నుండునట్లుగఁ జూచి యాశబ్దమునకును, అవధానిమనస్సులోని ధ్రువశబ్దమునకును సంబంధము కల్పుకొనవలెను. ౯-వ అక్షరము 'చ', అవధానియొక్క ౯-వ ధ్రువశబ్దము 'పాము' అనుకొనుఁడు. అప్పుడు అవధాని 'పాము చలిచీమలచేతఁ జిక్కి చావదె సుమతీ' అని యొకవాక్యమును కల్పించుకొనును. మరల నతఁడు వరుసగ నక్షరములను జెప్పునపుడు ౯-వ సంఖ్య అతనికి మనసులోనికి రాఁగానే, 'పాము' అను ధ్రువశబ్దమును దానితోపాటు 'పాము చలిచీమలచేతఁ జిక్కి చావదె సుమతీ' అన్నమాటయుఁ దోఁచి ౯-వ యక్షరము 'చ' యని స్పష్టపడును. ఈక్రియ యంతయు నభ్యాసముచే నొకసెకనుకంటె నెంతో తక్కువకాలములో జరగును. ఇష్టాక్షరము శబ్దమునకు మొదట నుండుటకు వీలు లేనియెడల శబ్దమునకు మధ్యను, చివర నుండునట్లు ఏర్పఱుచుకొనవచ్చును. మూఁడు నాల్గు హల్లులు గలసిన సంయుక్తాక్షర మైనయెడల నాయక్షరములు విడఁదీసి వేఱు పదముగనో పదములుగనో యేర్పాటు చేసికొనవలయును. 'స్గ్య' అనునక్షర మిచ్చినయెడల నిది గలశబ్దము దొరకుట దుర్లభము. కావున దానికి సుర్తుగ 'సంగయ్య' అను శబ్దమును కల్పించుకొని ధ్రువశబ్దములోఁ గల్పుకొనవలెను. ఈ శబ్దమందలి మొదటి అక్షరము 'స్' కును, రెండవయక్షరము 'గ్' కును, మూఁడవయక్షరము 'య్' కును ఉద్బోధకములుగ నుండును. అభ్యాసమువలన నీకల్పనాశక్తి దిన దినాభివృద్ధిం బొందును.

'నిషిద్ధాక్షరి' యని యొకవిధము కలదు. వర్ణనములో నీ యక్షరములు రాఁగూడ దని పృచ్ఛకుఁడు షరతు పెట్టును. దానికిని నేకాక్షరకోశాదిజ్ఞానమును, సంస్కృతాంధ్రపాండిత్యమును బాగుగ నున్నయెడల సహకారిగ నుండును.

గణితము: ఒకఁడు గంటలు కొట్టుచుండును. అవధాని యిత రావధానములఁ జేయుచు నాగంటలను లెక్కపెట్టి చివరకు నిన్నిగంట లయ్యె నని చెప్పును; లేదా ఒకఁడు అవధానివీపుపైని ఒకొక్క పూవును వేయుచుండును. ఎన్నిపూవులు వేసినదియు చివర కవధాని చెప్పవలెను. వీనియందు నవధానియొక్క దృష్టి కొంచెము శ్రద్ధగ నుండవలెను. ఒకప్పు డితరము లగునవధానములను ఇదియు నొక్క సారి తటస్థింపవచ్చును. అప్పుడు పొరపాటు పడవచ్చును. ఇదియుఁ గాక, వీనిని లెక్కపెట్టునప్పుడు ౧,౨,౩,౪ అని లెక్కపెట్టుకొను చున్నయెడల నెక్కడనైనను అంకెలు పొరపడవచ్చును. క్రిందటి తడవ లెక్కించినది మూఁడా, నాలుగా అని సంశయము రావచ్చును. కావున ౧టి కాఁగానే పరబ్రహ్మ మనియు, ౨ కాఁగానే ద్వైత మనియు, ౩ కాఁగానే త్రిమూర్తు లనియు, ౪ కాఁగానే వేదము లనియు మనసులో నీ ప్రకారము మొదటి ౧౦ సంఖ్యలకో ౨౦ సంఖ్యలకో ఒకనామక్రమమును, తరువాత ౧౦ సంఖ్యలకో ౨౦ సంఖ్యలకో మఱియొకనామక్రమమును ఏర్పాటు చేసికొన్నయెడల సంఖ్యలు తప్పకుండఁ దేలఁగలవు.

గణితవిషయమునందు లెక్కలుచేయుటయుఁ గలదు. కొందఱు కూడికలు గుణకారభాగహారములను చేయుదురు. కొందఱు ఇంగ్లీషు తారీకిచ్చినయెడల మనసులో లెక్కవేసికొని వారము చెప్పుదురు. ఇందుకై వీరు గణితశాస్త్రమునందు నిట్టిలెక్కలు చేయుటకై కల సులభపద్ధతులను నేర్పుకొందురు.

శతావధానము:

శతావధానమందు నూర్గురు పృచ్ఛకులు వరుసగఁ గూర్చుండి అవధానిని క్రమముగ నూఱువిషయములను గుఱించి తమకు నిష్టము వచ్చినవృత్తమునందు వర్ణింపు మని యడుగుదురు. అవధాని మొదటివానియొద్దనుండి చివరవానివఱకును వరుసగ నొక్కొక్కనికి వాఁడు గోరినవిషయమును గుఱించినవర్ణనము వాఁడు గోరిన వృత్తమున మొదటిచరణము చెప్పుకొనుచుఁ బోవును. నూఱవవానికి ప్రథమచరణము చెప్పినతరువాత మరల మొదటిపృచ్ఛకుని యొద్దకు వచ్చి యచ్చటనుండి క్రమముగ నూఱుమందికిని వారివారి రెండవ చరణమును జెప్పును. ఇట్లు క్రమముగ నాల్గుచరణములును పూర్తి చేయును. తరువాత మొదటనుండి చివరవానివఱకు నొక్కొక్కనిఁ జూచి వారిపద్యముఁ బూర్తిగ నాల్గుచరణములును చదువును.

కొన్నియవధానములందు నన్నియు వర్ణనములే పెట్టక, కొన్ని సమస్యలును, కొన్ని లెక్కలును (ఇంగ్లీషు తేదీ యిచ్చి వారము చెప్పమనుట మొదలయినవి), అష్టావధానములవలె గంటలు కొట్టుట, పూలు

sampath_Ebooks

వేయుట మొదలయినవియుఁ బెట్టుదురు. కాని వర్ణనములు, సమస్యలే యెక్కువగ నుండును. కావునఁ గవిత్వము చెప్పఁగల్గినవారే సాధారణముగ శతావధానము చేయఁగలరు. వారివారి భాషాజ్ఞానమునుబట్టి వర్ణనలు సమస్యలు సంస్కృతము, తెలుఁగు, పారసీ మొదలయినభాషలలోఁ జెప్పెదరు.

పూర్తిగ శతావధానము చేయుటకుఁ గాలము ౧౬ గంటలు మొదలు ౨౪ గంటలవఱకును పట్టును. ఇన్నిగంట లొకటేసారి సభ చేయుచుండుట కష్టము గనుక, దినమునకు ౫, ౬ గంటలచొప్పున సభ చేసి మూఁడునాల్గుదినములలోఁ బూర్తి చేయుదురు. ఇది యాంధ్రదేశాచారము. ఉత్తరహిందూదేశమం దేయవధానమైనను ఒక్కసభలోఁ బూర్తికావలసినదే. అట్లు కానిదానిని వారు అవధానమని యొవ్వరు. కావున నచ్చట శతావధానము లరిది. అష్ట, షోడశ, పంచవింశతి అవధానములే జరుగుచుండును. శతావధానము మిక్కిలి శ్రమప్రదము గనుక సాధారణముగ నొక్కసారి చెప్పినవానికి 'శతావధాని' యన్నబిరుదు వచ్చును. అట్టివారు మిక్కిలి తక్కువ. శతావధాను లన్నపేళ్లు పెట్టుకొనినవారు సాధారణముగ నిరువది ముప్పది యవధానములనుమాత్రము చేయుచుందురు.

శతావధానమునందు నూర్గురుపృచ్ఛకు లడిగినవర్ణనవిషయములను వృత్తములను ప్రాసాక్షరమును జ్ఞాపక ముంచవలయును. ఇంతియ కాదు. ఏపృచ్ఛకునియొద్దకు వచ్చినప్పు డా పృచ్ఛకునివిషయము, వృత్తము, అదివఱకుఁ జెప్పినచరణముయొక్క ప్రాసాక్షరము జ్ఞాపక మున్నఁగాని తరువాతిచరణము చెప్పుటకు వీలులేదు. కావున నవధానియొక్క అవధానధారణాజ్ఞాపకశక్తు లితరజనుల యాయా శక్తులకంటె నెక్కుడు తీవ్రముగ నుండవలె ననుటకు సందేహము లేదు. కాని యీ మానసశక్తు లెంత తీవ్రముగ నున్నను, కేవలము వానిసాహాయ్యముననే అవధానములు చేయఁగల్గుట యసంభవము. కావున నామానసికశక్తులకుఁ దోడుపడుటకై కొన్ని యుపాయములను పన్నవలెను. ఈయుపాయములు 'జ్ఞాపక సిద్ధాంతము' ( Law of Association ) అను మానసికసిద్ధాంతము ననుసరించి పన్నఁబడును. విడివిడిశబ్దములను జ్ఞాపక ముంచుకొనుటకంటె నా విడివిడిశబ్దములే యొకకథారూపముగఁ జెప్పఁబడినయెడల జ్ఞాపక ముంచుకొనుట సుకరము. ఆకథలోని ప్రతిశబ్దమునకును ఇతరశబ్దములతో కథారూపసాహచర్యము ( సహవాసము ) కలిగినందున, నది యితరశబ్దములకు జ్ఞాపకముగఁ ( Reminder ) బని చేయును. 'పుట్టె కట్టె కొట్టె తెచ్చె' ననుమాటలు అర్థము లేనివిగఁ జెప్పి జ్ఞాపక ముంచుకొనుమనినఁ గష్టముగ నుండును. కాని, 'పుట్టె' ననఁగా రాముఁడుపుట్టెను, 'కట్టె' ననఁగా సేతువు కట్టెను, 'కొట్టె' ననఁగా రావణునిఁ గొట్టెను, 'తెచ్చె' ననఁగా సీతను తెచ్చెను అని రామాయణకథతో సంబంధము కలిపి యీమాటలు చెప్పినయెడల నవి జ్ఞాపకముండుటయే కాక వానిక్రమముగూడ జ్ఞాపక ముండును. అట్లే పిల్లవాఁడు, చెప్పులు, కఱ్ఱ, చెవి, ఈఁకె, కరణము, కప్ప, కాలు, మామిడిపండు, జల్లెడ అను పదిమాటలు మరలఁ జెప్పు మన్నయెడలఁ గ్రమముగఁ జెప్పుట కష్టము. ఈపదములనే యొక కథగ నల్లి ఒకపిల్లవాఁడు చెప్పులు తొడుగుకొని, కఱ్ఱ పట్టుకొని, చెవిలో నీఁకెలను దూర్చుకొని కరణమును వెక్కిరించుచు నడవఁగా నాతనికా లొకకప్పపైఁ బడి చేతిలోనిమామిడిపండు జాతి క్రిందఁ బడి జల్లెడవలె నంతటను చిల్లులు పడిపోయెను అని చెప్పినయెడల నీపదము లన్నియు సులభముగ జ్ఞాపకముండుటయేకాక వానిక్రమముకూడ జ్ఞప్తిలో నుండును. ఇట్టి కొన్ని యుక్తులనే అవధాను లుపయోగించెదరు. వానివిధము కొంచెముగ వివరించెదను.

అవధానములు చేయుట నేర్చుకొనునప్పుడు మొదట నవధాని నూఱుపేళ్లు క్రమము దప్పక వల్లె వేయును. ఈ పేళ్లజాబితా ఒక్కొకయవధానికి నొక్కొకవిధముగ నుండును. ఒకటే విధముగ నుండవలయు నని లేదు. కాని యిద్దఱు అవధానులు కలసి అవధానము చేయునెడల వారిజాబితా యొకటిగనే యుండవలయును, లేనియెడల నవధానము తప్పును. ఈపేళ్లజాబితాలో నేపేరు చెప్పినను అవధాని దానిసంఖ్య వెంటనే చెప్పునట్లును, సంఖ్య చెప్పినయెడల నాపేరు చెప్పునట్లును ఆజాబితాను వల్లించి యలవాటు చేసికొనియుండును. అవధాని జాబితాలో ౧-వ శబ్దము 'శంకరుఁడు' ౩౮-వ శబ్దము 'చీఁపురుకట్ట', ౪౫-వ శబ్దము 'గుఱ్ఱము', ౯౮-వ శబ్దము 'ఉయ్యాల' అని అనుకొందము. బాగుగ వల్లించినందునను, అదేపనిగ అసకృదావృత్తిచే నలవాటు చేసికొన్నందునను అవధానిగారికి ౧ అనఁగనే 'శంకర' పదమును, 'శంకరుఁడు' అనఁగనే ౧-వ సంఖ్యయు జ్ఞాపకము వచ్చును. ఇట్లే అన్నియంకెలను గుర్తించియు, శబ్దములనుగుర్తించియు నని తెలిసికొనవలెను. ఇది అవధానములమొదటి పాఠము.

ఇట్లు శబ్దములతో సంసిద్ధుఁడైనయవధాని, తనశబ్దములకును పృచ్ఛకుని ప్రశ్నవిషయమునకును సంబంధము కల్పుకథలను అల్లుట నేర్చుకొనవలెను. అవధాని ౧-వ పృచ్ఛకునియొద్దకు రాఁగా నాతఁడు నాకు పరీక్షాఫలితమునకై యెదురు చూచుచున్నపిల్లవానిమానసికావస్థను వర్ణింపు మని అడుగును అని అనుకొందము. అవధాని ౧-వ అంకె 'శంకరుఁడు'; కావున శంకరునకును పరీక్షపిల్లవానికిని సంబంధము గలకథ నొకటి అవధాని వెంటనే కల్పించుకొనును. 'పరీక్షాఫలితమునకై యెదురు చూచుపిల్లవాఁడు తన్ను శంకరుఁడు ప్యాసు చేసినయెడల రెండుకొబ్బరికాయలు కొట్టెద నని మ్రొక్కును' అని యొకకథ తనమనసులో వెంటనే అల్లుకొనును. దీని కెంతయో కాలము పట్టదు. అభ్యాస మధికమైనకొలఁదియు ఒకసెకనులో నర పాలుకూడఁ బట్టదు. ఇట్లు కథ కల్పించుకొనుటవలన ఈశంకరపదము ద్వారా ౧-వ సంఖ్యకును, ౧-వ పృచ్ఛకునివిషయమునకును అవధాని మనసులో లంకె కూడి, మరలఁ గావలసివచ్చినప్పు డెల్ల జ్ఞాపకముగ నుండును. అన్నిపదములకును పృచ్ఛకునివిషయములతో సంబంధము కుదురకపోవచ్చు నని చదువరులు తలఁపవచ్చును. కాని అభ్యాసము

sampath_Ebooks

వలన, నెట్టి విపరీతములైన రెండు విషయములకును, లంకె పెట్టునల వాటు అవధానికి సమకూడును. పరీక్షపిల్లవానికిని ఇతర శబ్దములకును సంబంధ మెట్లు కుదురునో చూతము. ౧-వ పృచ్ఛకుఁడు గాక ౩౦-వ పృచ్ఛకుఁడు ఈ (పరీక్షపిల్లవాని) విషయమును వర్ణింపు మని కోర వచ్చును. అవధానుల ౩౦-వ శబ్దము 'చీఁపురుకట్ట'. పిల్లవానికి దీనికి సంబంధము కల్పుట యెట్లు? 'పరీక్షాఫలితమునకై యెదురుచూచుచున్న పిల్లవాఁడు తాను తప్పిపోయినయెడలఁ దన్ను తనతల్లి చీఁపురుకట్ట తీసికొని కొట్టును అని భయపడుచుండెను' అని కథ కల్పించుకొనవచ్చును; మఱియొకవిధముగనైనను గల్పవచ్చును. ఇట్లు 'చీఁపురుకట్ట' శబ్దసాహచర్యముచేత నవధానిమనసులో ౩౦-వ సంఖ్యకును పరీక్షపిల్లవానికిని (అయవధానము పూర్తియగువఱకు) నెడతెగనిసంబంధము కలుగును. మరల నవధాని యాపృచ్ఛకుని యొద్దకు వచ్చి రెండవచరణము చెప్పవలసివచ్చినప్పుడు గాని, ననుమ నెవరైనను ౩౦-వ ప్రశ్నకు జవాబు చెప్పుఁ డని యడిగినప్పుడు గాని అవధానికి ఈ కల్పితకథ వర్ణనీయవిషయమును జ్ఞప్తికిఁ దెచ్చి యిదివఱకుఁ జెప్పినచరణములను అందిచ్చును. ఇట్లే ౪౫-వ పృచ్ఛకుఁడు ఈ విషయమును వర్ణింపు మని కోరినయెడల, ౪౫-వ శబ్దము 'గుఱ్ఱము' తో పరీక్షాబాలకుని గల్ప 'నా కిప్పుడు పెద్దగుఱ్ఱమున్నయెడల నెక్కి సినెటుహౌసునకు వెళ్లి పరీక్షాఫలితమును కనుఁగొని వత్తు' నని విద్యార్థి యనుకొనెను అని కథ కల్పించుకొనవచ్చును. ౯౦-వ పృచ్ఛకుఁ డడిగినయెడల 'నా బాలునిమనస్సు ఉయ్యాలవలె నూఁగులాడుచుండె' నని యల్లవచ్చును. ఇట్లు కొంచెము ఆలోచన చేసినయెడల నెట్టిశబ్దము నైనను ఎట్టివిషయముతో నైనను కల్పవచ్చును. కల్పించుకొనుకథలు, సందర్భములు వినుటకు సొంపుగ నుండవలె నని లేదు. ఎట్టి అవకతవకలుగ నున్నవిగను, ఎట్టివిచిత్రమయినఊహలు గలవిగ నైనను ఉండవచ్చును. అవి అవధానిమనసునందే యుండును. ఇతరులకుఁ జెప్పఁబడవు. ఆయన మనస్సులో రెండువిషయములకు సంబంధము కలుగుటయే యుద్దేశము. స్థిరనామములకును వర్ణనవిషయములకును సాధారణముఁగఁ బొసఁగ నప్పుడు, స్థిరనామములకు సంబంధించిన లేక పోలిన యితరనామములతో సంబంధపఱిచి, భయంకరకృత్యములు, విపరీతకార్యములు, అద్భుతచర్యలు కల్పించుకొన్నయెడల మనఃపటమునందు నవి దృఢముగ నాటుకొనును. ౭౫-వ పృచ్ఛకుఁడు సెటిల్‌మెంటునుగుఱించి యడిగ వచ్చును. అవధానులవారి ౭౫-వ శబ్దము 'శ్రీరాముఁడు' అనుకొందము. శ్రీరామునితోఁ గథ కల్పించుకొనుటకు వీలు లేనప్పుడు బలరాముఁడు, పరశురాముఁడు, రాముఁడు మొదలయినపేళ్లతో నైనను కల్పవచ్చును. అవధానులు మాననీయులగు మోచర్ల రామచంద్రరావుగారి నెఱుఁగుదురేని, మాననీయులగు రామచంద్రరావుగారు లెజిస్లేటివ్ కౌన్సిలులో 'సెటిల్‌మెంటును' గుఱించి ప్రతికక్షులగుండె లదరునట్లు సంభాషించిరి అని కల్పించుకొందురు.

ఈ ప్రకారము పృచ్ఛకసంఖ్య జ్ఞాపకము వచ్చినతోనే దానికి సంబంధించినవిషయము జ్ఞాపకము వచ్చునుపాయము చెప్పఁబడినది. ఇఁక వృత్తము, ప్రాసమును జ్ఞాపక ముండు నుపాయ మెద్దియో విచారింతము. పది యిరువది యవధానములుమాత్రము చేయు నప్పుడు, విషయము జ్ఞాపకము రాఁగానే, దానిని గుఱించి యంతకుఁబూర్వము చెప్పినచరణము జ్ఞాపకమునకు వచ్చును. కాని నూఱు అవధానములు చేయవలసివచ్చినపుడు ఏవియైనను గుర్తులు పెట్టుకొననియెడల నొకప్పు డవధానులు పొరపడవచ్చును; కావున నట్టిసంశయము వచ్చినపుడు నిశ్చయబుద్ధి కల్గుటకై వృత్తమునుగూడ నంతకుఁబూర్వము కల్పించుకొన్నకథతో లంకె పెట్టెదరు. శార్దూలము, మత్తేభము, ఉత్పలమాల, చంపకమాల, సీసము, కందము, తేటగీత, ఆటవెలఁది మొదలయిన వృత్తములపేళ్లుగాని, గుర్తులుగాని కథలోఁ గలయునట్లుగ నల్లుకొందురు. ౧-వ పృచ్ఛకుఁడు పరీక్షపిల్లవానినిగుఱించి శార్దూలముతో వర్ణింపు మని యడుగఁగా 'పిల్లవాఁడు శంకరుని ధ్యానించి కొబ్బరికాయ కొట్టెద నని మ్రొక్కెను' అని కథ కల్పించుకొను నని యిదివఱకుఁ జెప్పితిమి. ఇందు వృత్తముసంగతికూడఁ గలసియుండవలయు నన్న, 'పిల్లవాఁడు శంకరుని శార్దూలాంబరునిగా ధ్యానించి కొబ్బరికాయ కొట్టెద నని మ్రొక్కెను' అని కథ కల్పించుకొందురు. 'మత్తేభము' చెప్పుమన్న 'గజచర్మధరుని ధ్యానించెను' అని అనుకొందురు. ఉత్పలమాలకు 'పెద్దదండ' అనియు, చంపకమాలకు 'చిన్నదండ' అనియు, కందమునకు కందపెండలములు మొదలయినపదములును, సీసమునకు వెండి బంగారము సీసము మొదలయినపదములును గుర్తుగ నుంచుకొని వీలుప్రకారము కథలోఁ గల్పుచుందురు. కొందఱొక మార్గము నవలంబింతురు. అకారము మత్తేభమునకును, ఆకారము శార్దూలమునకును, ఉకారము చంపకమాలకును, ఊకారము ఉత్పలమాలకును ఇట్లే మిగతగుర్తులు పెట్టుకొందురు. ఈగుర్తుప్రకారము ౧-వ పృచ్ఛకుఁ డడిగినప్రశ్నకు 'పరీక్షపిల్లవాఁడు పరీక్ష ప్యాసు అయినయెడల శంకరునకు నూఱుమామిడికాయలు సమర్పించెదను' అని మ్రొక్కె నని కథ కల్పించుకొందురు. 'మామిడి' శబ్దములోని మొదటిఅక్షరమైన 'మా' లో 'ఆ' ఉన్నది గనుక నది శార్దూలవృత్తమునకు జ్ఞాపకము. ఇట్లే ప్రాసములనుగుఱించియుఁ గథ కల్పించెదరు. పై ప్రశ్నమునకు నుత్తరముగ మొదటిచరణము చెప్పఁగ 'ద్ర' ప్రాసము పడినయెడల పైకథలోఁ జివర 'అని మ్రొక్కుచు వాఁడు నిద్రించెను' అని కలుపుకొనును.

## వైదికావధానము:

'అవధాన' శబ్దము మొదట వేదాధ్యయనమునుగుఱించి వాడుకలోనికి వచ్చినది. అడిగిన పన్నముగాని పనసగాని తప్పక చెప్పుటకు తదేకదృష్టి కావలయును. అదియే యవధానము. 'ఘ', 'చ' తప్పకుండఁ బనస చెప్పినవానిని 'అవధాని' యందురు. పనస చెప్పుటలో పదము, క్రమము, జట, ఘన, రథ, పంచసంధి అని వివిధ

sampath_Ebooks

ములు కలవు. ఇవన్నియుఁ దప్పక చెప్పుటకు వద్భుతధారణాశక్తి యుండవలయును. మొదటఁ బదిపండ్రెండుసంవత్సరములవఱకును సంథ వల్లించి తరువాత నభ్యసించిన్నచో నిది యన్నియు సిద్ధించును. ఇందులో ననేకవిధములయిన చిత్రములు చేయుచుందురు. పదిపనసలఁ దీసికొని, మొదట నన్నింటి మొదటిపదములను, తరువాత నన్నింటి రెండవపదములును, తరువాత నాల్గవపదములును ఇట్లు క్రమముగఁ జెప్పుదురు! ఒకపనసఁ దీసికొని మొదటి చివరపదము లొక్కసారియు, తరువాత మొదటనుండి రెండవపదమును చివరనుండి రెండవ పదమును, తరువాత మొదటినుండి మూఁడవపదమును చివరనుండి మూఁడవపదమును ఇట్లు గబగబ చెప్పుదురు.

## స్వరావధానము :

వైదికావధానమునందే స్వరావధానమన్న యొకభేదము కలదు. వేదమంత్రములకు ఉదాత్తానుదాత్తస్వరితప్రచయము లను నాల్గువిధములస్వరములు కలవు. ఈ నాల్గుస్వరములకును నాల్గువేళ్లు గుర్తుపెట్టుకొని పృచ్ఛకుఁడు దూరముగఁ గూర్చుండి యొకపనస మనసులో ననుకొని[1] వ్రేళ్లమీఁద బొటనవ్రేలితో స్వరములుమాత్రము చూపును. ఆ వ్రేళ్లగుర్తును చూచి అవధాని ఆపనసను గుర్తించి చదువును. ఇందుకు స్వరావధాన మను నొకగ్రంథము కలదు. అందు ఉదాత్తము మొదటఁ గల పనస లివి, అనుదాత్తములు మొదటఁ గలవి యివి యని విడఁదీసి చెప్పఁబడియుండును. అవధాని వానిని పాఠము చేసియుంచును.

## నేత్రావధానము :

ఇందు నిద్దఱవధానులు పనిచేయుదురు. ఒకఁడు దూరముగఁ గూర్చుండి మనము కాగితముమీఁదను వ్రాసియిచ్చినమాటలు గదల్పక, కేవలము కనులను కదల్చి రెండవయవధానికిఁ దెల్పును. అతఁ డా కనులచలనముఁ జూచి, యామాటలు నోటఁ జెప్పును. వీ రిద్దఱును మొదట నక్షరములకుఁ గనుసంజ్ఞ లేర్పఱుచుకొందు రనుట స్పష్టము. ఆ లేర్పఱుచుకొనినను, అవధాని సావధానముగ నేత్రచలనమును అనుసరించినఁగాని వాక్యమును కనుఁగొనలేఁడు.

## అవధానము, యోగము :

ఇటీవల మన తెనుఁగుదేశమందు నవధానములెచ్చియు, ఆశుకవిత్వములెచ్చియు హెచ్చినది. ఏ పిల్లవాఁడును అష్టావధానియే, నాల్గుపద్యము లల్లనేర్చిన ప్రతివాఁడును శతావధానియే. అవధానశక్తి నెంతవఱకు నభివృద్ధి చేయవచ్చు నన్నవిషయమును జూపుటకెవ్వఁడేనియు నొక్కఁ డిట్టియవధానములవెంటఁదగిలినను తగులవచ్చును కాని, ఎక్కుడుజను లవధానములు చేసినయెడలఁ బ్రయోజనము లేదు. ఎక్కుడు శ్రమచేసినయెడల విద్యార్థులకును, సామాన్యజనులకును బుద్ధిభ్రంశముకలుగవచ్చును. పదివిషయములందు నొక్కకాలమున లక్ష్యము పెట్టుటకు యత్నించుటకంటె నొకకాలమున నొకవిషయమునందు నిశ్చలముగ దృష్టినిగాని మనస్సునుగాని నిల్పి, తదేకనిష్ఠతో ననుసంధానము చేయు సామర్థ్యమునకై పాటుపడుట మనవిద్యార్థులకును, ఇతరజనులకును ఉపయోగకరము. దీనినే యోగ మందురు. కావున శతావధానమునకంటెఁ బ్రపంచమునందు నేకావధానమే ముఖ్యముగ విద్యార్థులకు నావశ్యకము. ఇతరవిషయము లన్నింటిని మఱచి యేకవిషయమునందుఁ గొంచెముకాలమైనను పూర్తిగ మనసు నిలుపఁగల్గినచో నొకవిషయమును వేయిసారులు వల్లించినవానికంటె నెక్కుడు గట్టిగను, స్పష్టముగను, అచలముగను ఆవిషయ మలవడును.

## గ్రంథ సంగ్రహము :

అవధానమునుగుఱించి సంస్కృతమునందు గ్రంథ మున్నట్టు కానరాదు. ఇటీవల శ్రీయుత నందగిరి వేంకటగిరిరావుగారు 'అవధానదర్పణము' అను తెనుఁగుగ్రంథమును ప్రకటించినారు. అవధానమును గుఱించిన రహస్యములను ఇతరులు దాఁచి యుంచుచుండఁగ వీరు తమ యనుభవములను పుస్తకరూపముగఁ బ్రకటించి ప్రపంచమునకుఁ దెల్పుట యెంతయు శ్లాఘాపాత్రము.

(కొ. వేం. ల.)

**అవధూత** — బాలోన్మత్తపిశాచవృత్తితోఁ దిరుగుచుండిన దత్తాత్రేయుఁ డను బ్రాహ్మణుఁడు. ఇతనికిని, ప్రహ్లాదునకును సంవాదము జరిగెను (మహాభా., శాంతి, అ. ౧౭౯). యదువునకును, ఈతనికిని సంవాదము జరిగెను (భాగ., స్కం. ౧౧, అ. ౭-౯).

**అవధూతగీత** — ౧. శ్రీమద్భాగవతమందలి యేకాదశస్కంధంబున నున్న 'అవధూతయదుసంవాదం' బను వేదాంతప్రకరణమునకు 'అవధూతగీత' యని పేరు కలదు.

౨. గోరక్షనాథునిచే రచింపఁబడిన దన్న సంస్కృతగ్రంథము. ఇందు దత్తాత్రేయునకును, గోరక్షనాథునకును జరిగినసంవాదము కలదు.

**అవధూతలు** — సన్న్యాసులలో నొకభేదము. ఈ సంప్రదాయమువారిలో శైవులు గలరు, వైష్ణవులు కలరు. శైవులయిన అవధూతలనుగుఱించి మహానిర్వాణతంత్రమందును, శంకరదిగ్విజయమునందును చెప్పఁబడినది. మహానిర్వాణ తంత్రప్రకారము బ్రహ్మావధూత, శైవావధూత, వీరావధూత, కులావధూత లని అవధూతలు నాల్గువిధములు గలరు. వీరిలో మొదటివారు ద్విజులు. మిగిలినవారు శూద్రులు. వీరావధూతలు గంజాయి మద్యములను సేవింతురు. శంకరదిగ్విజయప్రకారము వీరిశాఖలు పది: తీర్థ, ఆశ్రమ, వన, అరణ్య, గిరి, పర్వత, సాగర, సరస్వతి, భారతి, పురి. వైష్ణవావధూతలు రామానందులశిష్యులు. వీరు బంగాళదేశమందుఁ బెక్కురు కలరు. వీరు భిక్షాటనము చేయుదురు.

1. పృచ్ఛకునకుఁ బనసపాఠము రానియెడలఁ బనసగల కాగితము అవధానికిఁ గానరాకుండఁ దనయెదుటఁ బెట్టుకొని వ్రేళ్లపై స్వరము చూపవచ్చును.

sampath_Ebooks



**అవధూతోపనిషత్తు** — కృష్ణ యజుర్వేదాంతర్గతమైన యొక యుపనిషత్తు. ఇది అష్టోత్తరశతోపనిషదంతర్గతము.

**అవని** — మైసూరుసంస్థానము, కోలారుజిల్లా, ముల్‌బాగల్ తాలూకాలోని యొకగుట్ట, దానిసమీపమందలిపల్లె; క్షేత్రము. దీనిని అవాంతిక క్షేత్ర మందురు. రాముఁడు లంకనుండి తిరిగివచ్చునపు డిచ్చట ఆఁగెనఁట. ఇచ్చటఁ బెక్కు దేవాలయములు, శాసనములును కలవు. ఇచ్చట స్మార్తగురుపీఠ మొకటి కలదు.

**అవనిగడ్డ** — కృష్ణాజిల్లా దివితాలూకా యందలి గ్రామము. ఇచటి జనసంఖ్య ౭౩౬౯ (౧౯౩౧).

**అవభృథము** — ౧. ముఖ్యయజ్ఞము సమాప్తమగునపుడు చేయవలసిన శేషకర్మము.

౨. యజ్ఞమైనతరువాతఁ జేయవలసినదియు, యజ్ఞాంగభూతమును అగు స్నానవిశేషము. అవభృథస్నానవిధి తైత్తిరీయ బ్రాహ్మణమునందుఁ జెప్పఁబడియున్నది (౨. అష్ట. ౬. అ. అను).

**అవరోధనుఁడు** — గయునకు గయంతివలనఁ గల్గిన ముగ్గురుపుత్త్రులలోఁ గడగొట్టువాఁడు (స్వాయంభూ మనువు వంశము).

**అవర్నొ సరస్సు** — ఇటలీలోని నేపిల్సు పట్టణ సమీపమందలి యొకసరస్సు. ఇది చల్లారిపోయిన యొకయగ్నిపర్వతముయొక్క ముఖము. అందు నీళ్లు చేరి సరస్సాయెను. దీనిచుట్టుకొలత ౨ మైళ్లు; ౨౧౦ అడుగుల లోఁతు.

**అవలంగి** — విశాఖపట్టణము జిల్లా పాలకొండ తాలూకాకు చెందిన గ్రామము. జనసంఖ్య ౬౬౮ (౧౯౩౧).

**అవలింగి** — ౧. గంజాంజిల్లా పర్లాకిమిడితాలూకాయందలి జమీాందారీగ్రామము. జనసంఖ్య ౨౯౬ (౧౯౩౧).

౨. గంజాంజిల్లా పర్లాకిమిడితాలూకాకు చెందిన ఈనాంగ్రామము. ఇందలిజనసంఖ్య ౨౬౯ (౧౯౩౧).

**అవలోకితేశ్వరుఁడు** — మహాయానబౌద్ధమున విఖ్యాతి చెందిన బోధిసత్త్వదేవతలలో నొకఁడు. ధ్యానిబుద్ధుఁ డయిన అమితాభునివలననుండియు, అతనిశక్తి పాండరవలననుండియు నావిర్భవించినవాఁడు. భద్రకల్ప మను పేరఁబరఁగు వర్తమానకల్పమునకు అమితాభ, పాండరలు అధిష్ఠానధ్యానిబుద్ధ, బుద్ధశక్తు లయినందున నశ్వరబుద్ధుఁ డయినశాక్యసింహుని తిరోధానమునకు, భవిష్యద్బుద్ధుఁ డయిన మైత్రేయుని ఆగమనమునకును మధ్యఁగలకాలమున నితఁడే బోధిసత్త్వుఁడని చెప్పుదురు. గుణకారండవ్యూహ మను గ్రంథ మితనిస్వభావమునుగురించి, నయబోధనుగురించి, యద్భుతదివ్యకర్మములనుగురించి తెలుపును. దాని ప్రకారము, జగత్తునందలి ప్రతిజీవికిని బోధివిజ్ఞానము కలుగునంతవఱకు నితఁడు తనకు నిర్వాణమును నిరాకరించె నని, తనసంకల్పసాఫల్యమునకు నితఁడు నిరంతరము కృషిసలుపుచు, ప్రతిజీవియందు నాధ్యాత్మికవిజ్ఞానమును పరిపోషించుచున్నాఁ డని తెలియుచున్నది. ఆపూర్వోక్తగ్రంథము ననుసరించి, యితఁడు గుణమునందును, ప్రజ్ఞయందును, ప్రభావమునందును బుద్ధు లందఱికంటెను జాల గొప్పవాఁడు. అందఱకును తల్లియుఁ, దండ్రియు నతఁడే. అతని నామోచ్చారణము చేయు భక్తుని కే బాధయు నుండదు. ఏకైకపుష్పమాత్రమున నతనిని బూజించినను స్త్రీకిఁగాని, పురుషునికిఁగాని దేవత్వము లభించును. అతఁ డెవరికి విజ్ఞానమును బ్రసాదింపఁడలఁచునో యట్టివారికి — వా రేమతమువా రయినను, ఏదేవుని గొలుచువా రయినను — వారియిష్టదైవముల, తుదకు మాతాపితరుల రూపమునుగూడఁ దాల్చుచుండు నని కారండవ్యూహమునఁ గలదు. నెమ్మదిగాను, క్రమముగాను ఇట్లతఁడు చేయుకృషికి ఫలముగ ముందు జనులు, పిదప జంతువులు, అటుతరువాత నితరజీవులు నిర్వాణోపలబ్ధికి ఆధ్యాత్మికముగ నున్నతిని బడయుచుందురు. ఈకారణములనుబట్టి అవలోకితేశ్వరుఁడు సంఘమున నుత్తముఁ డని, బౌద్ధసంఘరత్న మని పరికీర్తితుఁ డయ్యెను.

సాధనమాల అవలోకితేశ్వరుని వేలువేలురూపముల నభివర్ణించు ముప్పదియొక్క సాధనలనుగూర్చి తెలుపును. అవలోకితేశ్వరునిరూపములు నూటయెనిమిదివఱకును గలవు. నేపాళదేశమునందలి ఖట్మండూనగరమున నున్న విహారములలో నొక్కటియగు 'మచ్ఛందర్ వహల్'నందు ఆలయము మూఁడువైపులందును గల దారుఫలకముల మీఁదివిభాగములందు (Panels) ఈ బోధిసత్త్వుని అష్టోత్తరశతరూపములును వేలువేలురంగులతో చిత్రింపఁబడియున్నవి. ఇవి యిప్పటికి రెండువందలయేండ్ల నాఁటి వయిన నగునని తద్‌జ్ఞుల యభిప్రాయము. ఇతనికి లోకనాథుఁ డని, లోకేశ్వరుఁ డని ప్రసిద్ధములయిన నామాంతరములు కలవు.

అవలోకితేశ్వరుఁడు అసలు మధ్యఆసియాఖండవాసుల సూర్యదేవత యని కొందఱు పరిశోధకుల యభిప్రాయము.

టిబెత్తుదేశపుబౌద్ధులలో నీ దేవతయొక్క భక్తి యెక్కువ. ఇతఁడే సర్వేశ్వరుఁ డని వారితలంపు. ఆదేశమందలి మతగురువు లయిన లామా లనువా రీదేవతయొక్క యవతారమే యని యచ్చటివారి తలంపు. ఈ దేవతావిగ్రహములు పెక్కులు హిందూదేశమందును కానవచ్చుచున్నవి.

**అవసర్పిణి** — జైనశాస్త్రప్రకారము కాలవిభాగము. కాలము ఉత్సర్పిణి, అవసర్పిణి యని రెండువిధము లని వీరు చెప్పుదురు. 'ఉత్సర్పిణి' అభివృద్ధిఁ జెందుచుఁ బోవుచుండుయుగము; 'అవసర్పిణి' క్షీణించుచుఁ బోవుకాలము. ఈరెండును మరల నాఱువిధములుగ విభాగింపఁబడెను. ఉత్సర్పిణీయుగమందు అత్యశుభ, అశుభ, అశుభాశుభ, శుభాశుభ, శుభ, అతిశుభకాలంబు లుండును,

sampath_Ebooks

అవసర్పిణీయుగమందు దీనికి వ్యతిరేకక్రమముగఁ గాలంబు లుండును. ఉత్సర్పిణీయుగమందు మానవులవయస్సును ఆకారములును ఎక్కుచుచేయుండును; అవసర్పిణీయుగమునందు తగ్గుచుండును. ఇప్పుడు అవసర్పిణీయుగము, అందును అశుభ మను ౫-వ కాలము.

**అవస్థలు** — ఏదేని పదార్థముయొక్కకాని, ప్రాణియొక్కకాని సంపూర్ణజీవితమునకో లేక దానియందలి కొన్ని విభాగములకో చెందినకాలపరిమాణము లీపేరను బిలువఁబడుచున్నవి. వీనిని ౧. దేహావస్థలనియు, ౨. నైతికావస్థలనియు, ౩. మన్మథావస్థలనియు, ౪. కాలికావస్థలనియు కొన్నివిభాగములుగఁ జేసికొనవచ్చును. అందు మానవులవయోవృద్ధిక్షయముల ననుసరించి కలుగునట్టివి దేహావస్థలు. యాస్కాచార్యమతప్రకార మవి ఆఱువిధములు: 'జాయతే, అస్తి, వర్ధతే, విపరిణమతే, అపక్షీయతే, నశ్యతి' అని. యోగశాస్త్రమునం దవస్థలయందు అవిద్య, అస్మిత, రాగము, ద్వేషము, అభినివేశము, అభిప్రాయము అనునవి చెప్పఁబడినవి. సాంఖ్యమతప్రకారము కార్యమునకు నవస్థలు మూఁడు. వారిమతప్రకారము కార్యము కారణాత్మకమై సూక్ష్మరూపమున కారణమునందే యుండును. కావున కార్యము పుట్టుటకు పూర్వము దానికి ప్రాగభావస్థానీయమైన యవస్థ యొద్ది గలదో దానికి అనాగతావస్థ యని పేరు. తరువాత కారకవ్యాపారముచేఁ గార్యము వ్యక్తమగునపుడు అభివ్యక్తావస్థ యనఁబడును. తరువాత కారణలయరూపమగు ధ్వంసస్థానీయమైన యవస్థకు తిరోభావావస్థ యని పేరు. వేదాంతులమతమున జాగ్రత్, స్వప్న, సుషుప్తి, మోక్షము లను నాలుగవస్థలు జీవునకుం గలవు. ధర్మశాస్త్రములప్రకార మవస్థ లాఱువిధములు: పుట్టినది మొదలుకొని ౫ సంవత్సరములపర్యంతము కౌమారము; పదివఱకును పౌగండము; ౧౫ వఱకు కైశోరము; అటుపిమ్మట యౌవనము లేక తారుణ్యము; ౭౦ సంవత్సరములు మొదలుకొని ౯౦ వఱకును వృద్ధత్వము; అనంతరము వర్షీయ మనునాఱవ యవస్థ కలుగును. వైద్యశాస్త్రమతమునుబట్టి ఇదేకాలము నాలుగుభాగములుగఁ జేయఁబడియున్నది: ఎట్లనఁగా, జన్మతః పదునైదు సంవత్సరములవఱకు బాల్యము, తదాది ముప్పదివఱకు కౌమారము, పిదప ౫౦ వఱకు యౌవనము, అనంతరము వృద్ధత్వము. గర్భవాసము మొదలు అంతమువఱకు దశదేహావస్థలను మోక్షధర్మవ్యాఖ్యానమందు నీలకంఠుఁడు వచించియున్నాఁడు. తదనుసారము గర్భవాసము, జన్మము, బాల్యము, కౌమారము, పౌగండము, యౌవనము, స్థావిర్యము, జర, ప్రాణరోధము, నాశము నని దేహావస్థలు పది. ఇదేవడువున పాశ్చాత్త్యులును వ్యవస్థను గావించుకొనియున్నారు: ఎట్లనఁగా, పుట్టినది మొదలుకొని ౭ సంవత్సరములవఱకు శైశవము (Infancy), ౭ మొదలు ౧౪ వఱకు బాల్యము (Childhood), ౧౪ మొదలుకొని ౨౧ వఱకు యౌవనము (Youth), తదాది ఏఁబదివఱకు స్థావిర్యము (Adult age), అటుపిమ్మట వృద్ధత్వము.

వివాహాదిధార్మికకార్యములందును, ధనసంపత్తుల వినిమయవ్యవహారములందును ప్రవేశమును గలిగించుకొనుటకు స్త్రీపురుషులకు రాజశాసనముల ననుసరించి యోగ్యావస్థలు ప్రాపించి యుండవలయును. ఇవియే నైతికావస్థలు. ఏదేనికార్యము నొనరించుటకై అర్హతానర్హతలను గలుగఁజేయునవి గాన నీ రెండవతరగతికిఁ జెందినయవస్థలే ప్రధానమైనవి. చట్టములప్రకారము పురుషుఁడు ౧౨-వ యేఁట మిత్రామిత్రత్వములపూర్వకముగా శపథము గావించుటకు కర్తయగును. ౧౪ ఏండ్ల ఈడున మంచిచెడుగుల వివేకము కలుగుటం జేసి పురుషుఁడు తన పోషణకర్త (గార్డియను) నేర్పఱచుకొనుటకో లేక స్వయముగ కార్యకర్తృత్వమును వహించుటకో యోగ్యుఁడగును. స్త్రీకి నిదే యవస్థయం దీయధికారము లభించును. ౨౧ దాఁటినతరువాత స్త్రీపురుషులు సర్వస్వతంత్రు లగుదురు.

ఇంగ్లండునందలి నియమములప్రకారము ౧౨, ౧౪ సంవత్సరముల ఈడున బాలికాబాలకులు తమ వివాహాదికార్యములవిషయమై ఇష్టానిష్టములను దెలిపఱుపవచ్చును. కాని స్వాతంత్ర్యావస్థ (౨౧ సంవత్సరములు) వచ్చువఱకును తలిదండ్రులయొక్క సమ్మతి లేనిది వివాహ మాడఁజాలరు. బ్రిటిషుసామ్రాజ్యమునం దంతటను సామాన్యముగ వ్యవహారయోగ్యవశ ౨౧ వత్సరములప్రాయమే. ఛానెల్ దీవులందు వివాహయోగ్యావస్థ ౨౦ సంవత్సరములు. న్యూబ్రన్స్విక్, ఒంటారియోలందు ౧౮, పశ్చిమోత్తరదేశములలో ౧౮, ఫిజీదీవులందు దేశీయులకు ౧౫, బెల్జియం, ఫ్రాన్సుదేశములలో వ్యవహారయోగ్యావస్థ ౨౧ ఏండ్లకే. పెండ్లియాడు స్త్రీపురుషులకుఁ గ్రమముగా ౧౫, ౧౮ సంవత్సరములు. కాని ౨౫ కు తక్కువ యీడునఁ బెండ్లికి తలిదండ్రు లంగీకరింపవలయును. వ్యవహారయోగ్యావస్థ అర్జెంటినాలో ౨౨ ఏండ్లు. చిలీ, స్పెయిన్, ఆస్ట్రియాలందు ౨౪. చీనాలో ౨౦. బ్రెజిల్, డెన్మార్కు, హాలెండ్, జర్మనీ, గ్రీస్, ఇటలీ, మెక్సికో, నార్వే, పెరూ, ఫిలిప్పైనుదీవులు, పోలాండ్, పోర్చుగల్, రుమానియా, స్వీడన్, స్విట్జర్లాండ్, ట్యూనిస్ దేశములందు ౨౧ సంవత్సరములు. డెన్మార్కులో పెండ్లియాడు స్త్రీపురుషులకుఁ గ్రమముగా ౧౬, ౧౮. జర్మనీయందు ౧౬, ౨౦ లు పెండ్లియాడు. తలిదండ్రుల సమ్మతిని నీయీడునఁ బెండ్లాడవచ్చును. స్వయముగఁ జేసికొనఁ దలఁచిన స్త్రీపురుషులకుఁ గ్రమముగా ౨౪, ౨౫ ఏండ్లు ఉండవలయును. కాని కోర్టువారు ౧౮ సంవత్సరముల వయసునఁగూడ నిండుతీడని స్వీకరింపవచ్చును. స్పెయిను దేశమునఁ బెండ్లియాడు ౧౬, ౧౮, గ్రీసునందు ౧౪, ౧౬. హాలెండున ౧౬, ౧౮. ఇటలీయందు ౧౫, ౧౮. స్విట్జర్లాండులో ౧౯, ౨౧. కాని కొన్నివిశేషవిషయములందు కాలూకా (Canton) అధికారు లీయీడు ౧౮, ౧౯ గ మార్చవచ్చును. అన్నిదేశములందును మైనరు అవస్థలోఁ బెండ్లాడవలసినయెడల తలిదండ్రులయొక్కకాని, గార్డియనులయొక్కగాని అంగీకార ముండవలయును. హిందూదేశమున ౧౯ సంవత్సరములకే వ్యవహారయోగ్యదశ వచ్చును. ౧౪,

sampath_Ebooks



౧౮ ఏండ్లు పెండ్లియాఁడు. సంయుక్తరాష్ట్రములందు సామాన్యముగా స్త్రీపురుషులకు ౨౧ ఏండ్లమీఁద వ్యవహారయోగ్యావస్థ కలుగును. కాని అర్కాన్సస్, కాలిఫోర్నియా, కొలరేడో, డకోటా, ఇడాహో, ఇల్లినోయిస్, అయోవా, కాన్సస్, మేరీలాండ్, మిన్నెసోటా, మిసోరీ, నెబ్రస్కా, నెవేడా, ఓహియో, ఆరిగన్, వెర్మాంట్, వాషింగ్టన్ ప్రాంతములందు స్త్రీలకు ౧౮-వ యేఁటనే వ్యవహారయోగ్యదశ (Majority)గ స్వీకరింపఁబడినది. మఱియు మేరీలాండ్, ఆరిగన్, టెక్సాసులందు పెండ్లి ఎప్పుడైన నప్పుడే వ్యవహారయోగ్యదశ కలుగును. అయోవా, టెక్సాస్, లూయిసియానాలందు పురుషులకు సైతము ఇదేనియమము. వాషింగ్టను నందు మైనరుపిల్ల, మేజరుపిల్లవానిని పెండ్లియాడినయెడల నామెయు మేజరుగనే గణింపఁబడును.

వివాహమునకే కాక మఱికొన్ని విధములగు కార్యముల నాచరింపవలసివచ్చినను స్త్రీపురుషులకు యోగ్యావస్థ రావలసియున్నది. ౨౧ సంవత్సరములు దాఁటిననేకాని పార్లమెంటులో సభ్యుఁడగుటకు వీలు లేదు. చర్చిలో డీకన్ పదవికి ౨౩ ఏండ్లకు తక్కువ పనికిరాదు. రోమను క్యాథలిక్కులలో ౨౨ ఏండ్లు సరిపోవును. గురువు(Priest)పదమునకు ౨౪ ఏండ్లు. ౩౦ సంవత్సరములు రానిది బిషప్పుపదమును పొందనేరఁడు. ఫ్రాన్సుదేశమునందలి చేంబర్ ఆఫ్ డెప్యూటీస్ (Chamber of Deputis) నందు స్థానము (Seat) వడయుటకు ౨౫ నిండవలయును. సెనేట్‌సభ్యుఁడగుటకు ౪౦ ఏండ్ల యీడు కావలయును. అమెరికాసంయుక్తరాష్ట్రములందు ప్రెసిడెంటుపదవికై ౩౫ సంవత్సరములు నిండవలయును. సెనేటర్ కావలయు ననిన ౩౦ సంవత్సరములు. ప్రతినిధి(Representative) పదములకు ౨౫ ఏండ్లకుఁ దక్కువ కాఁగూడదు.

విరహోత్కంఠులగు స్త్రీపురుషులకు మోహానురాగములన్యూనతాధిక్యములనుబట్టి పదివిధములగు అవస్థలు కలుగుట అలంకారశాస్త్రమున వచింపఁబడియున్నది. కొందఱు పండ్రెండువిధములగు అవస్థాభేదములను పేర్కొనియుండిరి: ఎట్లనఁగా, చక్షుఃప్రీతి మనస్సంగము, సంకల్పము, ప్రలాపము, జాగరణము, తనుకార్శ్యము, విషయద్వేషము, లజ్జాత్యాగము, సంజ్వరము, ఉన్మాదము, మూర్ఛ, మరణము నని పండ్రెండువిధములు.

జీవునిసప్తావస్థలు: అజ్ఞానము, ఆవరణము, విక్షేపము, పరోక్షము, అపరోక్షము, శోకనివృత్తి, ఆనందము.

**అవాచీనుఁడు** — ఇతఁడు జయత్సేనునికుమారుఁడు. మర్యాద యనునామె యితనిభార్య. ఇతనికుమారుఁ డరిహుఁడు.

**అవాన్గడము** — మధ్యయిండియాలోని బర్వానిసంస్థానమునకు మాఱుపేరు.

**అవింధ్యుఁడు** — లంకలోని యొకవృద్ధరాక్షసుఁడు. ఇతఁడు పరమనీతిశాలి, సదాచరణపరాయణుఁడు, సీతను రామునకు నిచ్చివేయు మని రావణునితో నెన్నిసారులో చెప్పెను (వాల్మీ. రా., సుందర, స. ౩౭). ఇతఁడు రాముని క్షేమసమాచారము తెలిసికొనుచు, త్రిజటమూలమున సీతకుఁ దెల్పుచుండెను (మహా భా., వన. అ. ౨౮౦).

**అవికంపనుఁడు** — ఒక బ్రాహ్మణుఁడు, జ్యేష్ఠఋషియొక్క శిష్యుఁడు.

**అవికారివాదిమతము** — ఇది శైవసంప్రదాయములలో నొక్కటి.

స్వరూపలక్షణము: అవికార నిత్యేశ్వరుఁ డొక్కఁడు గలఁడు. ఆత్మలు అజ్ఞానమయిన ఆణవమలతమస్సులోఁబడి అనేకప్రాణులై యుందురు. పతి, పశు, పాశము లను నీమూఁడును అనాది.

తటస్థలక్షణము: పతి — శీతోష్ణజలములవలె ఐక్యమును చేయును; పశు — అధికారి జ్ఞానముచేత సర్వమును తెలుపును; పాశము — మఱుఁగుననుండి శివరూపమును ధరించును.

వేషము, నరకపాలభిక్షాటనము. కర్తృత్వమే సంహారము. కనుక దీనిని తొలఁగించి, శివునియందే జ్ఞప్తి నుంచుట మోక్షము, (సకలార్థసాగరము).

**అవిజ్ఞాతవర్షము** — శాల్మలీద్వీపమందలి ౭-వవర్షము.

**అవిజ్ఞాతుఁడు** — ప్రియవ్రతరాజర్షి పౌత్రుఁడు; యజ్ఞబాహుని ఏడ్గురు పుత్త్రులలోఁ గనిష్ఠుఁడు. అవిజ్ఞాతవర్షమీతనిదే.

**అవిటస్, మార్కస్ మెసిలి అస్** (క్రీ. శ. ౪౫౫ - ౪౫౬) — రోమకసామ్రాజ్యమునయొక్క పశ్చిమఖండమునకుఁ జక్రవర్తి. మొదట నొకసరదారువంశములోనివాఁడు. గాల్ దేశమునకు ప్రిఫెక్టు (ప్రాంతాధికారి)గా నుండి హూణులను (Huns), గాలులను ఓడించెను. విసిగాథులరా జయిన థియోడొరికునొద్ద రోమురాయబారిగ నుండెను. అతనిసాయమువలననే ౪౫౫ లోఁ జక్రవర్తి యయ్యెను. ౧౪ నెలలు రాజ్యము చేసినతరువాత పదభ్రష్టుఁడై ప్లెశెంటాకు బిషప్ (మతగురువు) అయ్యెను. ౪౫౬ లోఁ జచ్చెను.

**అవిడి** — తూర్పుగోదావరిజిల్లా రాజోలుతాలూకాయందలి జమీన్దారీగ్రామము. ఇచటిజనసంఖ్య ౪౩౨౮ (౧౯౩౧).

**అవిభాజ్యము** — ధర్మశాస్త్రీయపదము. తండ్రిసంపాదించిన యాస్తిని అతని పుత్త్రులందఱునుసమానముగఁ బంచుకొనుట కధికారముగలిగియుందురు. కావున నట్టిది విభాజ్యమే యగును. కానికొన్నిసందర్భములందుమాత్ర మందఱును సమానముగఁ బంచుకొనుటకు హక్కు గలిగియుండరు. మన పూర్వశాస్త్రానుసారము పిత్రుద్రవ్యమునుండి యేవిధమైన సాహాయ్యమును దీసికొనక స్వసామర్థ్యమువలన

sampath_Ebooks

నార్జించిన ద్రవ్యము, విద్యాధనము లోనగునవి యవిభాజ్యము లని వ్యాసుఁడు లిఖించియున్నాఁడు. అందులో విద్యాధన మనేక ప్రకారములు. ఉత్తమ మైనరీతి నుపన్యాస మొనరించెదవేని నీ కీధన మియ్యఁబడునని పణముగ నిడిన ద్రవ్యము నటులే యుపన్యసించి గెలిచినచో నది విద్యాధన మగును. మఱియు శిష్యునకు విద్య చెప్పి సంపాదించిన ద్రవ్యము, వేతనరూప మైన ప్రతిగ్రహధనము గాక యజమానునికడనుండి దక్షిణారూపముగఁ గైకొనినధనము, విద్యావిషయక ప్రశ్నయం దుత్తీర్ణుఁడై తీసికొనిన ద్రవ్యము; ఏదేని శాస్త్రార్థములో సందేహము కలుగ దానిని దీర్చి గెలిచినధనము, శాస్త్రార్థములందు వాదిప్రతివాదులకు మాధ్యస్థ్యస్థాన మధిరోహించి యార్జించినవిత్తము, స్వకీయశాస్త్రజ్ఞానమునకు బహుమానముగ దొరకినధనము, విపత్తిసమయమున వెనుదీయక దృఢముగ నిలిచియుండినచో సంతుష్టులగుచుఁ బ్రసన్నులై జను లొసంగుధనము, శిల్పకార, చిత్రకార, స్వర్ణకారాదుల వ్యాపారము నవలంబించి యార్జించినధనము మున్నగున వన్నియు విద్యాధనము లనియు, నట్లగుటచే నవిభాజ్యము లనియు బృహస్పతికాత్యాయనులు వచించియున్నారు. ఇందువలన పిత్రార్జితద్రవ్యమునుండి యెట్టి సాహాయ్యమును గైకొనక స్వయముగ నేదో యొక విద్యవలన సంపాదించినధనమును సంపాదించినయతఁడే యనుభవింపవచ్చును. అట్టి దానిపై నెవ్వరికి నధికారము లేదు. కాని పితృభ్రాతృకులక్రమాగత విద్యలవలన నార్జించినధనమున కందఱువారసులును గూడ హక్కు గలిగియుందురు. మఱియుఁ దండ్రియొక్క ద్రవ్య మేమియు సాహాయ్యభూతము కానియెడల పుత్త్రుఁడు సంపాదించుదానిలోఁ దండ్రికి రెండంశములహక్కు గలదు. తండ్రిద్రవ్యము గూడఁ గలసి యుండిన యెడలఁ బుత్త్రుఁ డతనికి సగభాగ మిచ్చితీఱవలయును. ఒకవంశమందలి నలుగురైదుగు రన్నదమ్ములు వేర్వేఱుగ భిన్నభిన్నప్రదేశములలోఁ దోఁటలు మొదలగువాని నిర్మాణము గావించుకొందురేని ఎవరి తోఁటలు వారికే చెందును. కాని యాతోఁటలనిర్మాణమందు పిత్రార్జిత ద్రవ్యసాహాయ్య మెంతమాత్రము గైకొనఁగూడదు. వంశపరంపరగా వచ్చుద్రవ్యమునుండి యేదేని కొంతభాగము హరింపఁబడినయెడల దానిని మరల నెవఁడు గెలిచి తీసికొనునో యతఁడే దాని కధికారి. ఇతరులకుఁ బంచి యియ్యవలసిన యావసరము లేదు. కాని యట్టిది భూసంబంధ మైనచో దానిలో గెలిచినవానికి నాల్గవవంతు భాగ మిచ్చి తక్కినదానిని వారసు లందఱును పంచుకొనవలయును.

**అవిముక్తక్షేత్రము** — కాశీక్షేత్రమునకు మాఱుపేరు. కురుక్షేత్రమునకును ఈపేరు కలదు (మహా. భా., వన, అ. ౮౩, శ్లో. ౨౪).

**అవిలాల** — చిత్తూరుజిల్లా చంద్రగిరితాలూకా యందలి గ్రామము. ఇక్కడి జనసంఖ్య ౫౮౭ (౧౯౩౧).

**అవివాహ్య** — పురుషుఁడు పెండ్లియాడుటకు వీలుగానికన్య. తలిదండ్రులకు సంబంధించిన యేడుతరముల పర్యంతముగల కన్యకలను పెండ్లియాడరా దని సుమంతుమతము. అయిదుతరముల వఱకే యీ నియమ మని మఱికొందఱియభిప్రాయము. ఏడుతరముల పర్యంతమును తండ్రికి సంబంధించినవారిని, అయిదుతరములవఱకును దల్లికి సంబంధించినవారిని, సగోత్రులకన్యకలను, సమానప్రవరలు గల వారిబాలికలను పెండ్లి చేసికొనరా దని నారదుఁడు. ఇందులకు విరుద్ధముగ వివాహముచేసికొన్నవారు పతితులై శూద్రభావము నొందుదురు.

**అవిసెనవారిపాలెం** — నెల్లూరుజిల్లా దర్శితాలూకాయందలి జమీన్దారీగ్రామము. జనసంఖ్య ౯౯ (౧౯౩౧).

**అవిసెన్న** — అరేబియాదేశపు తత్త్వజ్ఞుఁడు; వైద్యుఁడు. బొఖారారాజ్యములోని ఖర్మెయిథేన్ నందు క్రీ. శ. ౯౮౦-న జన్మించెను. కొంతకాలము వైద్యవృత్తి నవలంబించినపిదప నితఁడు ఇరువదిరెండేండ్ల ప్రాయమున బొఖారా వదలి చాలసంవత్సరములు దేశాటనజీవనము గడపి తుదకు హమదానునందు స్థిరనివాసము కుదుర్చుకొని అటుపిదప ఎమీరువజీ రయ్యెను. తనయాశ్రయదాత మరణానంతరమున నితఁడు హమదానునుండి దేశాంతజీవనము గడపెను కాని ఇస్పహానుసుల్తానును గొలిచెద నని రహస్యముగ నితఁడు విన్నవించుకొనినట్లు తెలిసి క్రొత్తయమీ రితనిని చెఱయందుంచెను. కాని శీఘ్రకాలముననే యితఁడు కైదునుండి తప్పించుకొని ఇస్పహానునకుఁ బాఱిపోయెను. అచ్చట సుల్తా నితని నెంతయో గౌరవించి యాదరించెను. అచటనే యితఁడు తనకడపటి పదునాలుగు సంవత్సరములజీవితమును వైద్యము, తర్కము, వేదాంతము, జ్యోతిషము, రేఖాగణితములనుగుఱించి గ్రంథములు రచియించుటయందుఁ గడపెను. డాంటిమీఁదను, ఇతర ఈశ్వరదర్శనవాదుల (Mystics) మీఁదను ఇతని ప్రభావము మెండు. ఇతఁడు క్రీ. శ. ౧౦౩౭-వ సంవత్సరమున పెరిషియాయందలి హమదానునందు చనిపోయెను. ఇతఁడు వ్రాసినగ్రంథములలో ముఖ్యముగా అరిస్టాటిలుమీఁద వ్రాసినవ్యాఖ్యానము లెక్కకు.

**అవిస్థలము** — భారతవర్షీయనగరము.

**అవీక్షిత్తు** — (సూ. వం.) దిష్టకులోత్పన్న కరంధమ రాజర్షికి పుత్త్రుఁడు. వీనికి కారంధముఁ డన్నది మాఱుపేరు. ఇతని కొడుకు 'మరుత్త' రాజు (మహా. భా., అశ్వమే., అ. ౪, శ్లో. ౧౬).

**అవీచి** — ఇది యొక నరకవిశేషము. కూటసాక్ష్యము లిచ్చువా రిచ్చట శిక్షింపఁబడుదురు. ద్రవ్యవినిమయమందు, దానమందు, సాక్ష్యమందు ననృతమాడువానిని నూఱుయోజనముల యెత్తుగల శిఖరముమీఁదనుండి యమదూతలు తలక్రిందుగఁ ద్రోయుదురు. క్రిందను పాషాణమయమగు కఠినస్థలము జలమువలెఁ గనుపడుచుండును. ఇదియే యవీచీనరకము. శిఖరముమీఁదనుండి తలక్రిందుగఁ ద్రోయఁబడినపాపి యాస్థలముపైఁబడి విశీర్ణశరీరుఁ డయ్యుఁ జావక మరల నావిధముననే త్రోయఁబడుటనిమిత్తము యమదూతలచే శిఖరముమీఁదికిఁ గొనిపోఁబడుచుండును.

sampath_Ebooks


**అవుకువారు** — అవుకు లేక ఔకు అనుగ్రామము కర్నూలుజిల్లాలో నున్నది. ఇచ్చటిపాళెగార్లు పూర్వము మంచిదశ ననుభవించిరి. వీరు విజయనగరరాజులకాలమున, క్రీ. శ. ౧౪౫౦ లో యాడకిపరగణాను జాగీరుగ సంపాదించిరి. సంవత్సరమునకు ౧౦,౫౧౪ కంఠీరాయవరహాలు సార్వభౌములకుఁ జెల్లించుచుండిరి. కృష్ణ రాయనియభిషేకకాలమందు వీరు హాజరుండి రని కుమారధూర్జటి యొక్క యీక్రిందిపద్యమువలనఁ దెలియుచున్నది:—

... . ... ... ... ... ...

సాకల్యముగఁ గీర్తి సర్వది క్తటులంగుఁ
బ్రాకటస్థితి నిల్పునౌకువారు,

... ... ... ... ... ...

కొలువఁ బట్టాభిషిక్తుఁడై చెలువు మీఱె
రమ్యగుణపాళి శ్రీకృష్ణరాయమౌళి. (కృ. వి. ౨. ౪౮)

ఈ దేశము గోలకొండవారియధీన మైనతరువాతను, వీరికి నీజాగీరు జరుగుటయేకాక ౧౮౦౦ల సైనికులను యుద్ధకాలమందు నిచ్చునట్టిషరతుపై ౩౩ క్రొత్తగ్రామములుకూడ నీయఁబడెను. అవు రంగజేబుకాలమున నీజాగీరు జప్తు చేయఁబడెను. కాని యితరపరగ ణాలతోఁగూడఁ గలిపి ౨౦,౦౦౦ల రూపాయలకు నిజారాకు నీయఁ బడెను. ఈ యిజారాపరగణాలు ౨౭,౬౮౨ వరహాలు చెల్లుచుండె నఁట. ౧౦,౨౫౮ వరహాలు చెల్లుచుండిన ఔకుమాత్రము ౧,౦౦౦ సైనికుల నుంచునిమిత్త మీయఁబడెను. ౧౭౧౨ లో జాగీరుదారు ఢిల్లీకిఁ బోయి, చక్రవర్తికి రు ౫౦,౦౦౦ల నజరానా సమర్పించి, సైనికుల నుంచుబాధ తప్పించుకొనెను. ౧౭౧౯ లో యాడకిపరగ ణాను లాగికొనిరి. మిగిలిన పరగణాలపేష్కషు రు ౪౫,౦౦౦లు చేసిరి. హైదరుకాలమునఁ గొన్ని పరగణాలు తీసికొనఁబడెను. జాగీరు దారు హైదరుతో కర్ణాటకయుద్ధములకుఁ బోయి యచ్చటనే మృతి నొందెను. టిప్పూ జాగీరు జప్తు చేసెను. చిన్నవాఁడుగ నున్న పాళెగారు, రామకృష్ణరాజు అనువాఁడు షోలాపురమునకుఁ బాఱి పోయెను. ౧౭౯౨లో మరల వచ్చెను. రు ౪౫,౦౦౦ల పేష్కషిచ్చుషరతుమీఁదఁ దన జాగీరుల సంపాదించెను. కాని పేష్కషు సరిగఁ జెల్లింపనందున ౧౭౯౬ లో వెళ్లఁగొట్టఁబడెను. ౧౭౯౮ లో మరల మెట్టూర్ అనుపరగణాను ఇజారాకుఁ దీసికొనెను. ఇంతలో నాప్రాంత మింగ్లీషువారియధీన మయ్యెను. పాళెగారు సైన్యము ప్రోగుచేయుచున్నందున మన్రో అతనిఁ దొలఁగించి పెన్షను ఇప్పించెను. అతఁడు పోయినతరువాత నాపెన్షన్ ఆఁపఁబడెను. ఇప్పటి అవుకురెడ్డి ఈతనివంశజుఁడే.

**అవురుపూఁడి** — కృష్ణజిల్లా దివితాలూకాకు చెందిన ఖుష్కీజారీగ్రామము. ఇచటి జనసంఖ్య ౯౭౩ (౧౯౩౧).

**అవెంటినస్** (౧౪౭౭-౧౫౩౪) — ఇతని అసలు పేరు జోహాన్ టుర్మైయిర్. ఇతఁడు జర్మనీదేశజుఁడు. ఇతఁడు వ్రాసిన జర్మనుదేశపుచరిత్ర మిక్కిలి ప్రామాణికముగ నెంచఁబడును.

**అవెంపెస్,** (ఇబ్న్ బాజ్జ) — అరబ్బీతత్త్వవేత్త, వైద్యుఁడు, జ్యోతిర్విదుఁడు, కవి. ఇతఁడు అరిస్టాటల్, వైద్యము, సంగీతము, తర్కము అనువిషయములపైని గ్రంథములను వ్రాసెను, క్రీ. శ. ౧౧౩౮ లో మరణించెను.

**అవెర్రోస్** (౧౧౨౬-౧౧౯౮) — అరబ్బీతత్త్వవేత్త. ఇతని నిజమైనపేరు అబుల్-ఇబ్న్-రోషిద్. స్పెయినులోని కార్డోవాలో జన్మించెను. మొరాకో నవాబైన యూసఫ్-అల్-మన్సూర్ యొద్ద నీతఁడు వైద్యుఁడుగ నుండెను. అరిస్టాటలు గ్రంథములపై నీతఁడు భాష్యములను వ్రాసి యొకసంప్రదాయ మునకు జనకుఁడయ్యెను. ఇతని సంప్రదాయము గ్రంథములు పెడువా (ఇటలీ)లో ౧౭-వ శతాబ్దివఱకు నభ్యసింపఁబడుచుండెను. ఇంగ్లండులోని రోగర్ బేకన్ ఈసంప్రదాయమువాఁడు. సృష్టిలో లీనమై యుండి పరమాత్మ వ్యక్తిరూపముగా నావిర్భూత మగుచుండు నని యీతని ముఖ్యసిద్ధాంతము.

**అవెల్లానెడా, గెర్ట్రూడిస్ గోమెజ్ డి** (౧౮౧౬-౧౮౭౩) — స్పెయిన్‌దేశజురాలయిన కవయిత్రి.

**అవెస్తా** — పారసీవారివేదము. మహమ్మదీయులబారికిఁ దాళలేక పాఱిపోయి వేయేండ్లక్రిందట హిందూదేశమునకు వచ్చిన పారసీకులను పారసీవా రందురు. వారు వచ్చునప్పుడు తమవేదము యొక్క కొంతభాగమును వెంటఁ దీసికొనివచ్చిరి. పారసీక మంతయు మహమ్మదీయమతము వ్యాపించినను ఇంకను అచ్చట పదివేలమంది 'అవెస్తా' మతస్థు లున్నారఁట!

ఇప్పు డున్నంతవఱకు 'అవెస్తా' రెండుభాగములుగ నున్నది. మొదటిభాగమునందు 'వెందీదాద్', 'వీస్పెరెద్', 'యస్న' అను మూఁడువిభాగములు (మండలములు) కలవు. 'వెందీదాదు' లో మతనియమములు, పౌరాణికకథలును, 'వీస్పెరెద్' లో హోమమంత్రములును, 'యస్న' లో నిట్టిమంత్రములును 'గాథ' లనఁబడు ప్రార్థనలును కలవు. ఈగాథ లితరభాగమునకంటెఁ బురాతనము లని పండితులయభిప్రాయము. ఈ మూఁడువిభాగములును రెండువిధములఁ గానవచ్చుచున్నవి. కొన్నిప్రతులలో నీమూఁడును విడివిడిగా నుండును. అట్లు విడిగా నున్నప్పుడు వానివెంటను, పహ్లవీభాషలో వానికి భాషాంతరముకూడ నుండును. కొన్నిప్రతులలో నీమూఁడు విభాగములలోని బుక్కులు, కర్మకుఁ గావలసినవిధమునఁ గలుపఁ బడియుండును, అనఁగా నిత్యనైమిత్తికాదికర్మలపు డేయేమంత్రము లెప్పుడెప్పు డుచ్చరింపవలయునో ఆయాక్రమమున కొన్ని 'వెందీదాదు' లోనివి, కొన్ని 'వీస్పెరెదు' లోనివి, కొన్ని 'యస్న'

sampath_Ebooks

లోనివియును కలుపఁబడియుండును. ఇట్టిదానిని 'వందిదాన్‌సాదా' అందురు. ఇందులో పహ్లవీభాషాంతర ముండదు.

రెండవభాగమును 'ఖోర్దఅవెస్తా' (చిన్నఅవెస్తా) అనియందురు. ఇందు పురోహితులు చదువవలసినమంత్రములే కాక, సామాన్యజనులుగూడఁ బ్రతిదినమును, నెల కొక్కసారియు, సంవత్సరమున కొక్కసారియుఁ జదువవలసిన మంత్రములుగూడఁ గలవు. ఇవి నాల్గువిధములు: ౧. 'గాహ' అనఁబడు అయిదు ప్రార్థనలు, ౨. 'సీరోజా' ముప్పదిమంత్రములు, ౩. 'ఆఫ్రీనగాన్' అనఁబడు మూఁడుసూక్తములు, ౪. 'న్యాయిషీ' లనఁబడు ఆఱుపనసలు.

ఇప్పుడు 'అవెస్తా' యింత చిన్నదిగా నున్నను, ఒకప్పు డిది మిక్కిలి పెద్దదిగ నుండెను. మొదట నిందు ౨౧ మండలములును, ౧,౨౦౦ల సూక్తములును, ౨౦,౦౦,౦౦౦ల ఋక్కులునుండెనఁట. ఇవన్నియు ౧౨,౦౦౦ల గోవులతోళ్లమీఁద వ్రాయఁబడియుండెనఁట. ఇయ్యది పారసీకదేశముమీఁద 'అకిమీనియను' లనఁబడు రాజులు రాజ్యము చేయుచుండఁగ రచింపఁబడె నని యందురు. దీనికి జరతుష్టుఁ డనుఋషి కర్త. ఈతనిశిష్యుఁడైన విష్టాస్పుఁ డను రాజీ పవిత్రగ్రంథమును బంగారురేకులపై వ్రాయించెనఁట. అలెగ్జాండరు పారసీకముమీఁదికి దాడివచ్చి క్రీ. పూ. 330 లో రాజధానిని గాల్చినప్పు డీవేదముకూడఁ గాలిపోయెను. కావున 'ఇస్కందర్' నామమును పారసీకు లెంతయు ద్వేషించెదరు. తరువాతిపారసీకరాజులు మరల నీవేదమును సంపాదించుటకు యత్నించిరి. తమ రాజ్యములో నున్న మతగురువులఁ బిలిపించి వారికి వచ్చినంతవఱకు వ్రాయించిరి. ౨-వ షాహపురాహర్ అనురాజుకాలమున (క్రీ. శ. 309 - 380) ఈవేదమునకు మరలఁ గొంత వ్యవస్థితస్వరూపము ప్రాప్తించెను. కాని తరువాత మహమ్మదీయమత ముద్భవించి అరబ్బీవారు ౬౪౧ లోఁ బారసీకుల నోడించి దేశ మంతయు నాక్రమించుకొనుటయేకాక యచ్చటివారి నందఱను బలవంతముగ మహమ్మదీయులఁ జేసిరి. ఆకాలమునందు మతభ్రష్టులు కానొల్లనివారు కొందఱచ్చటనుండి పాఱిపోయి హిందూదేశమునకు వచ్చిరి. వారితో వారివేదములోఁ గొంతభాగముఁ దెచ్చిరి.

'అవెస్తా'లోని కొన్నిభాగములు మిక్కిలి పురాతనములనియు, కొన్ని తరువాతికాలమున వ్రాయఁబడిన వనియు, మిక్కిలి పురాతనవువి క్రీ. పూ. ౧,౫౦౦ కాలముననుు, ఇటీవలివి క్రీ. శ. 300 ల కాలమువఱకును, మిగిలిన వన్నియు నీకాలము నడుమను వ్రాయఁబడియుండవచ్చు ననియు తజ్జ్ఞులయభిప్రాయము.

ఇందలి కొన్నివిశేషములు: 'అవెస్తా' యొక్క భాష మన వేదముల సంస్కృతభాషకు మిక్కిలి దగ్గఱగ నుండును. ఈ రెండు భాషలును ఇంతకంటెఁ బూర్వ ముండిన యొకభాషలోనుండి పుట్టిన అక్కచెలియండ్రు అని విద్వాంసులయభిప్రాయము. సంస్కృతమునందలి 'స'కారము 'అవెస్తా' లో 'హ' కారముగ మాఱును. 'అసుర', 'సప్తసింధు', 'సోమ' శబ్దము లాభాషలో 'అహుర' 'హప్తహిందు', 'హోమ' శబ్దములుగ మాఱినవి. హిందూదేశమందలి ఆర్యులును పారసీకమందలి ఆర్యులును మొదట నొక్కచోట నుండినవారనియుఁ దరువాతఁ బోరాడి చీలి రనియుఁ గొందఱయభిప్రాయము. దీనికిఁ దగినట్లు, మనవేదమునందు 'సుర' లనువారు, అనఁగా హిందూ ఆర్యులకు దేవతలు; అసురులు పారసీకులకు దేవతలు. వారిముఖ్యదేవుఁడు అహురమజ్ద అనువాఁడు. మనకు దేవరాజయిన 'ఇంద్రుఁడు' వారివేదమునందు దైత్యుఁ డయ్యెను. ఇట్లు కొందఱు దేవతలు దైత్యులుగ మాఱినను కొందఱు వైదికదేవతలు 'అవెస్తా'లోఁగూడ దేవతలుగనే యున్నారు. ఇదియుఁగాక పెక్కుగాథలును, యజ్ఞయాగాదివిధానములును ఈరెండువేదములలోను కొంతవఱకు నొక్కవిధముగనే యున్నవి. పారసీకు లగ్నిపూజకులు. ఒకొక్కరి యింటఁ దరతరములుగ నగ్ని చల్లారక యుండును. వీరికి సన్న నవారు (పేపు)తోఁ జేయఁబడినజందెము లుండును. వానిని నడుమునకుఁ జుట్టుకొనియుందురు. వీరిమతమును గుఱించి అధికము తెలిసికొనఁగోరువారు 'పారసీవారు', 'జరతుష్టుఁడు' అనుశబ్దములఁ జూడనగును.

**అవ్యంగము** — ఒకవస్తువిశేషము. శాకద్వీపమునకుఁ జెందిన సౌరబ్రాహ్మణులకు యజ్ఞోపవీత మెంతపవిత్రమో వారికవ్యంగ మంత పవిత్రమయినది. ఉత్తమమయిన యవ్యంగము ౨౦౦ల అంగుళములపొడువు గలిగియుండవలయును. రెండవపక్షము ౧౨౦ అంగుళము లుండవలయును. దీనిని ధరించి సూర్యుని బూజించినచో విశేషముగుపుణ్యము లభించునఁట. వాసుకి యొకనాఁడు సూర్యోదయము కాఁగానే వచ్చి భక్తితో నమస్కరించి యవ్యంగము నర్పించెనఁట. వాసుకికి సంతసము గలుగఁజేయుటకై సూర్యుఁడు దానిని కటిభాగమున ధరించెనఁట. ఇట్లు సూర్యుఁడు ధరించినాఁడు కాఁబట్టియే సూర్యోపాసకు లెల్లరు నవ్యంగమును విధిగ ధరింతురు. మనదేశమున బ్రాహ్మణులకు యజ్ఞోపవీతధారణ మయిననేకాని యెట్లు కర్మాధికారము రాదో, యట్లే సౌరబ్రాహ్మణుల కవ్యంగధారణముననే కాని సూర్యోపాసనాధికారము లేదు.

**అవ్యక్తోపనిషత్తు** — సామవేదోపనిషత్తు.

**అవ్యయుఁడు** — పంద్రెండుగురు భార్గవదేవతలలో నొక్కఁడు.

**అవ్యవహార్యుఁడు** — ధర్మశాస్త్రీయపదము. దొంగతనము, హత్య మున్నగు దోషములను గావించినవాఁడు ఆదోషమునకుఁ దగు ప్రాయశ్చిత్తము గావించుకొనువఱకును వేదాధ్యయనాదికర్మలకుఁ గాని, పంక్తిభోజనమునకుఁగాని యర్హుఁడు కాఁజాలఁ డని హిందూధర్మశాస్త్రములు చెప్పుచున్నవి. ఇట్లు సాంఘికవ్యవహారములకుఁ దగనివాఁ డగుటచే నట్టివాఁ డవ్యవహార్యుఁ డనఁబడును. ప్రాయశ్చిత్తము జరగిన తరువాతమాత్రము మరల నావ్యక్తి సంఘమునఁ దనకునుకట్టిస్థాన మాక్ర

sampath_Ebooks



మించుకొనుట కధికారము గలిగియుండును. యాజ్ఞవల్క్యసంహిత యీసందర్భమున నిట్లు నిర్ణయించుచున్నది: 'అజ్ఞానముచే చేసిన దోషమయినచో ప్రాయశ్చిత్తము జరిగినతరువాత నది నశించిపోవును. అట్లు కాక యెఱిఁగియుండి చేసినదోషమే యయిన నాదోషి యైహిక వ్యవహారమున సాంఘికమగు తనపూర్వస్థితిని బడయుట కధికారమును బొందినను, వానిపాపమూమాత్రము నశింపదు'.

**అవ్వయార్** — ౧. అఱవకవయిత్రి. లోకప్రఖ్యాతి చెందిన 'కురళ్' అను ద్రావిడకావ్యమునకుఁ గర్తయైన తిరువళ్లువర్ అనుకవికి అక్క. ఈమె కావ్యమునకు ద్రావిడవాఙ్మయమునం దధికాదరము కలదు. ఈమెయు, నీమెసోదరులును భగవన్ అనునొక బ్రాహ్మణునకును, ఆది యనుచండాలస్త్రీకిని పుట్టినవా రని చెప్పెదరు. చోళరాజ్యమునకు రాజధాని యైన ఒరయూరిలో నొకసత్రమునం దీమె జన్మించెను. ఈమెతలిదండ్రు లీమె నచ్చటనే విడిచి వెళ్లఁగా 'బాణరులు' అను నొకజాతివా రీమెను తీసికొనిపోయి పెంచిరి. ఈమె చివరవఱకు నవివాహితగనే యుండెను. ఈమెను పెంచినతలిదండ్రు లీమెకు వయసురాఁగానే, వివాహప్రయత్నములఁ జేసిరఁట. కాని యీమె వివాహమునకుఁ బూర్వము పెండ్లికుమారునకు ముదుసలితిగఁ గానవచ్చెనఁట. అంత నాతఁ డీమెను వివాహమాడనని పాఱిపోయెనఁట. అందుకే యీమెకు 'అవ్వ' యన్న పేరు వచ్చెనఁట. ఈమెయద్భుతకృత్యములనుగుఱించి పెక్కు కథలను జెప్పెదరు.

ఈమె మధురలోని చివర (మూఁడవ) 'సంఘము'నాఁటిది. ఈ 'సంఘము'యొక్క కాలమునుగుఱించి అభిప్రాయభేదములు పెక్కులు కలవు. కాని క్రీ. శ. ౨-వ శతాబ్దిలోనిది యైయుండునని పెక్కుమంది పండితుల యభిప్రాయము. ఈమెచే రచింపఁబడిన కావ్యములు :

(౧) ఆత్తిశూడి: చిన్నచిన్న నీతివాక్యములు. మన సుమతిశతకమువలెఁ జక్కనినీతులతో నిండియుండును. ఇందలివాక్యముల క్రమ మకారాదిగ నున్నది. పూర్వకాలమునుండియుఁ బాఠశాలలలోని పిల్లలు దీనిని పాఠముచేయుదురు.

(౨) నాల్ పజ్జి: నాలుగుచరణముల పద్యములు గలకావ్యము.

(౩) జ్ఞానకురళ్: యోగమునుగుఱించిన తత్త్వగ్రంథము.

(౪) కొన్ఱై వేందన్: ఇందుఁ బద్యములలో నీతి బోధింపఁబడినది.

ఈమె వినాయకునిభక్తురాలు. ఈమెసరస్వత్యవతారమనియు, చివరకు బొందితోఁ గైలాసమునకుఁ బోయె ననియుఁ జెప్పుదురు.

౨. ఒక్క 'యవ్వయారే' వందలకొలఁది సంవత్సరములు బ్రతికియున్న దని కొందఱు చెప్పినను, ఈ పేరుగల కవయిత్రు లిద్దఱుండి రనియు, రెండవ అవ్వయార్ కులోత్తుంగచోళదేవుని పట్టాభిషేకకాలమున క్రీ. శ. ౧౦౭౦ న నుండెననియు నందురు. అఱవమున రామాయణము వ్రాసి ప్రఖ్యాతి చెందిన 'కంబన్' అనుకవితో నీమె సమకాలిక. ఈమెయు కల్వియొఴుక్కం, ఆళదికోవై, నన్నూఱ్కోవై, నాన్మణిక్కోవై, అరుంతమిళ్‌మాలై, దర్శనపత్తు, పంతనందాది, పదగనిఘంటు అను గ్రంథముల రచించెను. ఈకావ్యములలో నేవి మొదటియవ్వవి, ఏవి రెండవయవ్వవి యన్నవిషయమున అభిప్రాయభేదము కలదు.

**అశన** — బలిచక్రవర్తి భార్య. ఈమె కుమారుఁడు బాణుఁడు.

**అశని** — ౧. పిడుగు. ఇంద్రునివజ్రాయుధమునకుఁ బేరు. గ్రామమునకు నడుమఁగాని, ఇంటిమీఁదఁగాని పిడుగు పడినయెడల శాంతి చేయవలయును.

౨. మంత్రశాస్త్రమందు ముద్రావిశేషము. 'టట్ట టట్టేతి, టిట్టి టిట్టీతి హహహహేతి లలలేతి' అని స్మరించి, ముష్టిప్రహరణము చేసినచో నది 'అశనిముద్ర' యగును. ఇందుచే శత్రువశీకరణాదుల సాధింపవచ్చునఁట.

౩. విషచికిత్సయందు నొకయౌషధవిశేషము.

**అశరీరము** — పరబ్రహ్మము. అలంకారశాస్త్రమందు వాక్యదోషము. అనన్వయము, క్రియాపదరహితము అగువాక్యమున కీపేరు గలదు.

**అశిర** — ఒకరాక్షసి.

**అశిరుఁడు** — ఒక రాక్షసుఁడు.

**అశూన్యశయనవ్రతము** — ఇది హిందువుల యొకవ్రతము. శ్రావణకృష్ణవిదియనాఁడు చేయవలయును. దీని ననుష్ఠింపవలసినవారు దంపతులు. పురుషుఁ డొనరించినచో స్త్రీతోడను, స్త్రీ గావించినచోఁ బురుషునితోడను వియోగ మెన్నఁటికిని జేకూరదు. గీత వాదిత్రనిర్ఘోషపూర్వకముగ, నంగులకు శక్తిలేనిచో ఘంటికానిక్వాణములతో విష్ణుసంపూజనము చేయవలయును. తదవసరమునఁ బఠింపవలసిన మంత్రములు.

"శ్రీవత్సధారిన్! శ్రీకాంత! శ్రీధామన్! శ్రీపతే! ఽవ్యయ!
గార్హస్థ్యం మా ప్రణాశం మే యాతు ధర్మార్థకామద!
అగ్నయో మా ప్రణశ్యంతు దేవతాః పురుషోత్తమ!
పితరో మా ప్రణశ్యంతు మత్తో దాంపత్యభేదతః;
లక్ష్మ్యా వియుజ్యతే దేవో న కదాచిద్యథా భవాన్,
తథా కళత్రసంబంధో దేవ! మా మే వియుజ్యతు;
లక్ష్మ్యా న శూన్యం వరద! యథా తే శయనం సదా,
శయ్యా మమాప్యశూన్యాస్తు తథైవ మధుసూదన!"

sampath_Ebooks

అర్చనానంతరము తైలవర్జితమైన యాహారము నారగించి రాత్రికాలమున హవిష్యాన్నమును భుజింపవలయును. ఈ లాగున నాలుగు రాత్రులు కడచినపిదపఁ దెల్లవాఱినతోడనే లేచి కాల్యకృత్యములఁ దీర్చికొని, సుస్నాతులై శుచితోడ శయ్యాదాన మొనరింపవలయును. అది లక్ష్మీపతియుక్తము, దీపాన్నభాజనసంయుతము, పాదుకోపానచ్ఛత్రచామరాసన సమేతంబును, నభీష్టాలంకార మండితమును, శ్వేతపుష్పాంబరావృతంబును, నుపధానయుతంబును, నానావిధ ఫలసహితంబును, శక్త్యనుసారము సమకూర్చిన యాభరణధాన్య సమన్వితంబును నై యుండవలయును. దానిని సకలాంగ సంపన్నుఁడు కుటుంబి, వైష్ణవుఁడు నగు బ్రాహ్మణునకు దాన మియ్యవలయును. ఆశయ్యమీఁద దంపతులను గూరుచుండఁబెట్టి విధానపూర్వకముగ నలంకృతులఁ గావించి భక్ష్యభోజ్యసంకలిత మగు భాజనమును పట్టికిని, సువర్ణభూషణయుత మైన దేవదేవుని ప్రతిమను జలకుంభసమేతముగ విప్రునకును దాన మియ్యవలెను. ఈ ప్రకార మశూన్యశయనవ్రతమును విత్తగర్వితులు గాక శ్రద్ధతోఁ జేయువారలు నిరంతరము సౌఖ్యము ననుభవించి చివరకు విష్ణులోకముం జేరి సుఖింతురు.

అశోకత్రిరాత్రము — హేమాద్రి వ్రతఖండము నందుఁ జెప్పఁబడినయొక వ్రతము.

అశోకతీర్థము — కాశియొద్ద నున్న యొకతీర్థము. దక్షిణదేశమందుఁగూడ నీపేరుగల తీర్థ మొకటి యున్నట్లు కానవచ్చుచున్నది (మహాభా., వన, అ. ౮౮).

అశోకపూర్ణిమ — ఫాల్గునపూర్ణిమ. ఈ దినమున అశోకవ్రతము చేయుదురు. హేమాద్రిఖండమునఁ జెప్పిన యొక వ్రతవిశేషము.

అశోకవనిక — ౧. యయాతి దేవయానితో నున్న తోఁట.

౨. రావణుఁడు సీతను లంకలో నుంచినతోఁట.

౩. రాముఁడు సీతతో నయోధ్యలో విహరించినతోఁట.

**అశోకవర్ధనుఁడు** (క్రీ. పూ. ౨౭౨-౨౩౧) — హిందూదేశపుఁజక్రవర్తి, మగధదేశముపై రాజ్యముచేసిన మౌర్యవంశమువాఁడు. చంద్రగుప్త చక్రవర్తికిఁ (క్రీ. పూ. ౩౨౨-౨౯౭) బౌత్రుఁడు. బిందుసారునికిఁ (క్రీ. పూ. ౨౯౭-౨౭౨) గుమారుఁడు. ఈతనిని సాధారణముగ 'అశోకుఁడు' అనియెదరు. ఈతఁడు భారతవర్ష చక్రవర్తులలోను, బౌద్ధరాజులలోను మిక్కిలి ఖ్యాతి చెందినవాఁడు. ఈతనిరాజధాని పాటలీపుత్రము.

అశోకుఁడు తండ్రికాలమున యువరాజుగా నుండి, తక్షశిలోజ్జయినీప్రాంతములకు రాజప్రతినిధి (Viceroy)గాఁ బంపఁబడెను. ఆప్రాంతములలోను తండ్రియొద్ద నీతఁడు రాజ్యపరిపాలనక్రమము నేర్చెను. ఈతఁడు క్రీ. పూ. ౨౭౨ లో రాజ్యమునకు వచ్చెను, మూఁడుసంవత్సరములతరువాత (క్రీ. పూ. ౨౬౯ లో) నితనికి రాజ్యాభిషేకము జరిగెను. ఈతనియన్నదమ్ము లనేకు లుండి వారితనితో రాజ్యమునకై పోరాడుచుండి రనియు, నందువలన నీ మూఁడేండ్లవఱకును బట్టాభిషేకము చేసికొనక యంతఃకలహములు తీరినతరువాత నశోకుఁడు పట్టాభిషిక్తుఁ డయ్యె ననియుఁ జరిత్రకారు లూహించుచున్నారు.

కళింగ దిగ్విజయము :— క్రీ. పూ. ౨౬౧ లో ననఁగాఁ దాను రాజ్యమునకు వచ్చిన పండ్రెండవయేఁట నీతఁడు కళింగదేశముపై దండు వెడలెను. కళింగదేశ మనఁగా గోదావరీ మహానదులకు నడుమనున్న సముద్రతీరప్రాంతము. అప్పటికిఁ గాళింగులు బలవంతు లయియుండిరి. అఱువదివేలకాల్బలమును, వేయిస్వారులును, ఏడువందలయేనుఁగులును గలిగియుండిరి. కావున వారును స్వస్వాతంత్ర్యమునకై ఘోరముగాఁ బోరాడిరి. తుదకు నశోకుఁడే కాళింగులను గెల్చెను. కాని యాయుద్ధమం దుభయసైన్యములలోను మొత్తము లక్షజనులకంటె నధికముగా హతులయిరి; లక్షయేఁబదివేలజనము శత్రువులచేఁ జెఱపట్టఁబడిరి; ఇంక నెందఱో యుద్ధమువలనఁ గలిగిన రోగదుర్భిక్షాదుల వలన నశించిరి! ఇట్టి యసంఖ్యనిరపరాధజనవినాశంబుఁ జూచి హృదయము కరఁగినవాఁ డయి, తనరాజ్యతృష్ణయే దీని యంతటికిని గారణ మని తలఁచి దయానిధి యగునశోకుఁ డటుతరువాతఁ దానయి యితరులరాజ్యములమీఁదికి దండువెడల నని ప్రతిజ్ఞ చేసికొని, తన నలుబదిసంవత్సరముల ప్రభుత్వకాలములోఁ దత్ప్రతిజ్ఞానువర్తియైయుండెను.

ఇంతియకాక యీరాజు బౌద్ధధర్మమునందు మిక్కిలి శ్రద్ధగలవాఁ డయి 'యితరరాజులను శస్త్రములతో గెలుచుటయే తమ ధర్మ మని రాజులు తలఁచుట తప్పు, ధర్మమువలన సంపాదించినజయమే నిజమైనజయము' అని శాసించెను. తాను క్రొత్తగా సంపాదించిన కళింగదేశములోని ప్రజలకు నేమియు నిబ్బంది లేకుండఁ బాలించుట కధికారుల నియమించి, ప్రజలను బీడించునధికారులకుఁ గఠినముగా దండనలు విధించుచుండెను.

బౌద్ధమతావలంబనము :— ఈరాజు మొదట హిందూధర్మమునందు శ్రద్ధగలవాఁ డయి తరువాత నుపగుప్తుఁ డనుబౌద్ధాచార్యుని బోధవలన బౌద్ధమతావలంబి యయ్యెను. అప్పటినుండియు నారాజు రాజసప్రవృత్తిని బూర్తిగాఁ బరిత్యజించి సాత్త్వికుఁ డయి తనరాజ్యమునందును, ఇతరదేశములందును ధర్మాభివృద్ధి చేయుటయే తన పరమకర్తవ్య మని నిశ్చయించెను. ఈరాజు హిందువైయుండగ నున్నప్పుడు మిక్కిలి దుర్మార్గవృత్తి కలవాఁ డనియు, రాజ్యమునకు వచ్చినప్పుడుఁ దనయన్నదమ్ములలో ౯౯ మందిని జంపె ననియు, బౌద్ధుఁ డైనతరువాత సజ్జనుఁ డయ్యె ననియు సింహళదేశపు బౌద్ధగ్రంథములలో

sampath_Ebooks

వ్రాసియున్నది. కాని బౌద్ధమతమాహాత్మ్యమును హెచ్చించుటకు బౌద్ధులు వ్రాసిన యసత్యకల్పనలు గాని, ఇవి నిజమైనచరిత్రాంశములు కా వని పండితులయభిప్రాయము.

తాను రాజ్యమునకు వచ్చిన పదునాలవ, పదునేడవయేండ్లలో (క్రీ. పూ. ౨౫౭ - ౨౫౬) నశోకుఁడు తన స్వర్మమతములను లోకులకుఁ దెలుపుటకై దేశమం దంతటను బదునాల్గుశిలాశాసనములఁ జెక్కించెను.

యాత్రలు :— ఇరువదినాలుగేండ్లు రాజ్యము చేసినతరువాత నశోకుఁడు క్రీ. పూ. ౨౪౯ లో బౌద్ధులకుఁ బవిత్రమైనస్థలములను సందర్శించుటకు యాత్ర వెడలెను. ఉత్తరదిశను ప్రస్తుతము ముజఫర్‌పూర్, చంపారన్ అనఁబడు జిల్లాలలోనుండి హిమాలయము యొక్క దిగువపల్లపుప్రాంతమునకుఁ బోయెను. అచ్చటనుండి పశ్చిమమునకుఁ దిరిగి నేపాల్ టెరాయ్‌యొద్ద బుద్ధునిజననస్థానమగు లుంబినీవనము చూచి యచ్చట నొకశాసనము వేయించెను. అది యిప్పటికి నచ్చటఁ గానవచ్చుచున్నది. ఇదిగాక, బుద్ధునితండ్రి యొక్క రాజధానియగు కపిలవస్తునగరము, కాశియొద్ద బుద్ధుఁడు ప్రథమమున బోధచేసినస్థలమగు సారనాథము, బుద్ధుఁ డనేకసంవత్సరములు నివసించియున్న శ్రావస్తి, బుద్ధుఁడు బుద్ధత్వమును జెందిన గయలోని బోధివృక్షము, బుద్ధుఁడు నిర్వాణముఁ జెందిన కుశినగరము మొదలయిన బౌద్ధపవిత్రక్షేత్రములఁ జూచి యచ్చట దానధర్మములు చేసి శాసనముల వేయించెను.

ఈరాజు నేపాళదేశమునకు (క్రీ. పూ. ౨౪౯-లో) యాత్ర వెడలినపు డచ్చట లలితపట్టణ మను నొక రాజధానిని గట్టించెను. ఇది ప్రస్తుతపురాజధాని యగు ఖాట్మండూనగరమున కాగ్నేయమున మూఁడుమైళ్లదూరమున నున్నది. ఈ లలితపట్టణమునకే బౌద్ధగ్రంథము లందు లలితపాటన్, పాటన్, లలితపూర్ అను నామాంతరములు కలవు. ఈ లలితపట్టణమును మిక్కిలి పవిత్రమైనస్థలముగా భావించి యశోకుఁ డచ్చట నైదుస్తూపములఁ గట్టించెను. అందుఁ బట్టణమునకు మధ్య నొక్కటియుఁ, బట్టణముయొక్క నాలుగువైపుల నాలుగును నిర్మింపఁబడియెను. అవి యిప్పుడును గానవచ్చుచున్నవి.

అశోకుఁడు నేపాళమునకు వెళ్లినపు డాతనికూఁతు రగు చారుమతీదేవి యాతనివెంట నుండెను. ఆమెభర్త పేరు దేవపాల క్షత్రియుఁడు. వారు బహుకుటుంబీకులు. వా రిరువురును నేపాళము నందే యుండఁదలఁచి, పశుపతినాథునిదేవాలయమునొద్ద దేవపట్టణమును కట్టించిరి. భిక్షుభిక్షుణీల కాశ్రమములు కట్టించెద మని వా రిరువురును నిశ్చయించుకొనిరఁట. చారుమతీదేవి పశుపతినాథ్ అను గ్రామమునం దుత్తరమువైపు భిక్షుణీలకు నొకయాశ్రమము కట్టించెను. అది యిప్పటికిని ఉన్నది. ఆమె యందే కీర్తిశేషురాలయ్యెను. ఆమెభర్త మాత్రము తనకోర్కె నెఱవేర్చుకొనలేకపోయెను. అతఁ డాచింతతోడనే మరణము నొందెనఁట.

క్రీ. పూ. ౨౪౨ లో అశోకమహారాజు సప్తస్తంభశాసనముల వేయించి యందుఁ దాను ధర్మాభివృద్ధికై చేసినప్రయత్నములను సింహావలోకనము (Review) చేయుచుఁ బశువధ చేయఁగూడ దని శాసించెను.

క్రీ. పూ. ౨౪౦ లో అశోకుఁడు సన్న్యాసి యయ్యెను. భిక్షు వయినఁగాని ముక్తి లేదని బౌద్ధసిద్ధాంత మయినందున నీతఁడు వైరాగ్యము గలవాఁ డగుటచే భిక్షు వయి రాజ్యముయొక్క పాలనాంశములను యువరాజునకును, మంత్రులకును వదలెను. కాని రాజ్యములోని ముఖ్యవిషయములను దానే విచారించుచునుండెను. రాజ్యమును పూర్తిగ వదలి వెడలిపోయినవాఁడు కాఁడు. శాసనము లన్నియు నితని పేరిటనే వ్రాయుచుండిరి.

బౌద్ధభిక్షువులపరిషత్తు :— క్రీ. పూ. ౨౫౧ లో అశోకమహారాజు తనరాజధాని యగు పాటలీపుత్రమందు బౌద్ధాచార్యుల మూఁడవపరిషత్తును చేయించెను. బౌద్ధుల మని చెప్పెడి కొందఱు మోసగాండ్రచే ధర్మగ్రంథములలోఁ గలుపఁబడిన ప్రక్షిప్తభాగములీపరిషత్తునందు విషదీయఁబడినవి. ఈపరిషత్తునుగుఱించి సింహళగ్రంథములు చెప్పినను అశోకునిశాసనములలో స్పష్టముగ నేమియుఁ జెప్పఁబడియుండలేదు. ఈపరిషత్తు రాజునిధనమునకుఁ బూర్వము పదియేండ్లలోపల జరిగియుండు ననియు, నది జరిగినతరువాతనే అందు నొప్పుకొనఁబడిన సిద్ధాంతములనే తెల్పుచు రాజు సారనాథ శిలాశాసనము వేయించె ననియుఁ బెద్దలు యూహించెదరు.[1]

అశోకుని రాజ్యవిస్తారము :— వాయవ్యదిక్కున హిందూకుశ పర్వతమువఱకు నీతనిరాజ్యము వ్యాపించియుండెను, అనఁగా ప్రస్తుతపు అఫ్గానిస్తాన్‌రాజ్య మంతయు, బలూచిస్తాన్, సింధు ప్రాంతములును ఆరాజ్యములోనివే యైయుండెను. స్వాత్, బాజౌర్ అను కొండకనుమలప్రదేశమును, కాశ్మీరనేపాళదేశములును అశోకునికి లోఁబడియుండెను. కాశ్మీరమున నీతఁడు శ్రీనగర మను పట్టణము కట్టించెను. అది యాదేశమున కిప్పుడు రాజధానియై యొప్పుచున్నది.

తూర్పున గంగానదిముఖమునొద్దనున్న తామ్రలిప్తి (ప్రస్తుతపు తామ్లూక్) వఱకును బంగాళ మంతయు నీతనితాతకాలముననే స్వాధీనపడెను. క్రీ. పూ. ౨౬౧ లో నీతఁడు కళింగమును జయించెను. ఆంధ్రదేశముకూడ నశోకునికి సామంతరాజ్యముగా నున్నట్లు ఎఱ్ఱగుడిశాసనములవలనఁ దెలియవచ్చెడిని.

దక్షిణమున మైసూరురాజ్యమువఱకు నశోకునిరాజ్య మున్నట్లు అచ్చటియాతనిశాసనములవలనఁ దోఁచుచున్నది. అంతకు దక్షిణమున నున్న పాండ్య, చేర, చోళ, కేరళదేశములు స్వతంత్రము లయి

1. Smith's Early History., 3rd ed, p. 161.

యుండెను. వానిపై నశోకునికి నేమియు నధికారము లేకయుండె నని చెప్పవచ్చును.

ఇట్లశోకుని రాజ్యవిస్తార మంతయు లెక్క చేయఁగా దక్షిణములోని కొన్నిచిన్నిరాజ్యములు తప్ప ప్రస్తుత మింగ్లీషువారి యధీనమం దున్న హిందూదేశ మంతయును, బలూచిస్థానమును, అఫ్గానిస్థాన్ నేపాళదేశములును అశోకచక్రవర్తికి లోఁబడియుండి యాతని 'చక్రవర్తి' బిరుదును సార్థకపఱిచె నని చెప్పవచ్చును.

పాటలీపుత్రరాజధానియం దుండి మధ్యదేశమును రాజే స్వయముగాఁ బాలించుచుండెను. దూరప్రదేశముల నేలుటకై రాజవంశము వారు రాజప్రతినిధులుగాఁ బంపఁబడుచుండిరి. అశోకునికాలమున నిట్టిరాజప్రతినిధులు నలుగు రుండిరి. వాయవ్యప్రాంతమును బాలించు రాజప్రతినిధికి తక్షశిల రాజధానిగా నుండెను. పంజాబు, సింధు, కాశ్మీరము, సింధునదమునకు నావలిదేశములును ఈప్రతినిధిపాలన లోనివి. పూర్వప్రాంతము నేలుట కొకప్రతినిధి తోసలిలో నుండెను. తోసలి యెచ్చట నుండెనో యిప్పుడు నిశ్చయముగాఁ జెప్పుటకు వీలు లేదు. ఈ తోసల్యధిపతియే కళింగదేశమునుగూడఁ బాలించుచుండెను. పశ్చిమప్రాంతములగు మాలవ, గుజరాత్, కాఠియవాడదేశములఁ బాలింప నొకప్రతినిధి యుజ్జయినిలో నుండెను. నర్మదానదికి దక్షిణమునం దుండుప్రాంతములఁ బరిపాలింప నొక ప్రతినిధి యుండెను. ఇట్లు నలుగురు రాజప్రతినిధు లుండిరి.

శిలాశాసనములు :— అశోకమహారాజు తనప్రజలను రాజువలెఁ బాలింపక ధర్మగురువువలెఁ బాలించెను. ప్రజలధర్మాభివృద్ధికై యాతఁడు ధర్మశాసనములను జెక్కించి తనరాజ్యమునం దంతటను, ప్రజలబాటలలోను, సంతలనిమిత్తముకాని, యాత్రలనిమిత్తముకాని ప్రజలు విశేషముగా గుంపుగ గూడుచోట్లను వేయించెను. అశోకుని శాసనము లీదేశములోని మిక్కిలి పురాతనశాసనములు. మహంజోదరో, హరప్పగ్రామప్రాంతములం దటీవల బయలుపడిన ముద్రికాశాసనములు మినహాయించినచో ఇంతకంటెఁ బురాతనశాసనములు మఱి యేవియు లేవు. ఈ శాసనములవలన నశోకునిచరిత్ర మనకుఁ దెలియుచున్నది. ఈశాసనము లతనిరాజ్యమం దంతటను, అనఁగా హిమాలయము మొదలుకొని మైసూరురాజ్యములోని షిమోగావఱకును పూర్వసముద్రము మొదలుకొని పశ్చిమసముద్రమువఱకును వ్యాపించి యున్నవి.

ఈశాసనములు ప్రాకృతభాష, ననఁగా నప్పటిజనులు మాటలాడెడుభాషలో వ్రాయఁబడినవి. ఇందలియక్షరములు రెండువిధము లయినవి. హిందూదేశముయొక్క వాయవ్యపుసరిహద్దుమీఁదిశాసనము లన్నియు ఖరోష్ఠీలిపిలో వ్రాయఁబడినవి. ప్రస్తుతపు అరబ్బీ, పారసీభాషలకీ లిపియే మూలము. ఇది కుడివైపునుండి యెడమవైపునకు, ననఁగా నపసవ్యముగా వ్రాయఁబడును. కడమశాసనము లన్నియు బ్రాహ్మీలిపిలో వ్రాయఁబడినవి. ఇది యెడమవైపునుండి కుడివైపునకు వ్రాయఁబడును. ప్రస్తుతపుదేవనాగరియక్షరములకును, తెలుఁగు, కన్నడముల యక్షరములకును ఈబ్రాహ్మీలిపియే మాతృక. అశోకునిశాసనములలోనిలిపి సామాన్యజనుల కిప్పుడు తెలియదు. పాశ్చాత్త్యపండితు లెంతో శ్రమపడి యాయక్షరముల నన్నిటిని గమనించిరి. అశోకునిచే వేయింపఁబడిన శాసనముల నన్నింటిని మనకుఁ దెలిసినంతవఱకు నీక్రింది యెనిమిదివిధములుగా విభజింప వచ్చును.

౧. లఘుశిలాశాసనములు :— ఇవి క్రీ. పూ. ౨౫౭ లోనో ౨౫౬ లోనో యనఁగా నశోకుఁడు రాజ్యమునకు వచ్చినతరువాత ౧౪ సంవత్సరములకు వేయింపఁబడియెను. ఇందలి ౧-వ శాసనము ప్రతులు మూఁడు మైసూరురాజ్యమునం దున్నవి; ఒకటి నైజాము రాజ్యమం దున్నది.

౨. భాబ్రాశాసనము :— ఇదియుఁ బైశాసనములు చెక్కించిన సంవత్సరముననే వేయింపఁబడియె. ఇందు సన్న్యాసియైన రాజు, బౌద్ధభిక్షులకును, భిక్షుకీజనమునకును, ఇతరజనులకును బుద్ధునిభాషణము లన్నియు సుభాషితము లయినప్పటికి నందు నేరుపవచనములు విశేషశ్రద్ధతోఁ జదువుటకు, ననుష్ఠించుటకును బోధించెను.

౩. పదునాల్గుశిలాశాసనములు :— ఇవి క్రీ. పూ. ౨౫౭, ౨౫౬ లో వేయింపఁబడియె. ఇందు ధర్మసిద్ధాంతములు బోధింపఁబడినవి. ఈ పదునాలుగుశాసనములు నేడుస్థలములలో నున్నవి.

౪. రెండు కళింగశాసనములు :— క్రొత్తగా జయింపఁబడిన కళింగదేశములోనివి. క్రీ. పూ. ౨౫౬ లో వేయింపఁబడియె.

౫. మూఁడు గుహాశాసనములు :— ఇవి గయయొద్ద బరాబరు అనుచోట, క్రీ. పూ. ౨౫౭ లోను, క్రీ. పూ. ౨౫౦ లోను, ఆజీవికు లను జైనమతస్థులకొఱకుఁ గట్టఁబడిన మహావిహారములోఁ జెక్కఁబడినవి. ఈశాసనములు రాజుయొక్క దానమును వర్ణించును.

౬. రెండు టెరాయిస్తంభశాసనములు :— ఇవి క్రీ. పూ. ౨౪౯ లో రాజు నేపాళమునకు వెళ్లినపుడు వేయించినవి.

౭. ఏడు స్తంభశాసనములు :— ఇవి రాతిస్తంభములమీఁదఁ జెక్కఁబడినందున వీని కీపేరు పెట్టఁబడియెను. ఈశాసనములు క్రీ. పూ. ౨౪౩, ౨౪౨ లో వేయింపఁబడి యాఱుచోట్ల వీనిప్రతులు గలవు. మొదటి పదునాల్గుశాసనములలో వర్ణించినధర్మమునే యీశాసనములలో విపులముగా విశదీకరించి యేడవశాసనములో ధర్మాభివృద్ధికై యశోకుఁడు చేసినప్రయత్నము లన్నియు వర్ణింపఁబడినవి.

౮. పరిశిష్టస్తంభశాసనములు :— ఇవి క్రీ. పూ. ౨౪౦ లో వేయింపఁబడియె.

ఇట్లశోకమహారాజుచే జనోపయోగమునకై క్రీ. పూ. ౨౫౭ నుండి క్రీ. పూ. ౨౪౦ వఱకును శాసనములు చెక్కింపఁబడినట్లు గానవచ్చుచున్నది.

sampath_Ebooks


# అశోకవర్ధనుఁడు

నైజామురాజ్యమునందు రాయచూరుజిల్లాలో మాస్కి యనుచోట నొకబండపైని, చెక్కఁబడిన అశోకశాసన మొకటి కానవచ్చినది[1]. ఇది లఘుశిలాశాసనములలో ౧-వ దానికి నకలు. ఇతరశాసనములలో లేనివిశేష మిం దొకటి కలదు. ఇతరశాసనము లన్నింటిలోను 'దేవానాంపియ' (దేవానాంప్రియ), 'పియదశి' (ప్రియదర్శి) అన్ననామములు తప్ప 'అశోక' నామము లేదు. కాని యీశాసనమునందు 'అశోకు'ని పేరుకూడఁ గలదు. ఇఁక మీఁద 'అశోక', 'ప్రియదర్శి' లొకఁడేనా యన్నసంశయ మక్కఱలేదు.

మాస్కి శాసన మటుండ, కర్నూలుజిల్లా గుత్తిసమీపమున నున్న ఎఱ్ఱగుడిగ్రామముదగ్గర కొండరాలమీఁదఁ జెక్కిన అశోకశాసనములు కొన్ని ఇటీవల కానవచ్చినవి. ఇవి యింకను బ్రకటింపఁ బడకపోవుటచేత వీనియందలి విశేషము లింకను దెలియరాలేదు.

ఈశాసనములలో ధర్మముయొక్క స్వరూపమును, ధర్మప్రచారమునుగుఱించి చేసినయేర్పాటులును వర్ణింపఁబడినవి. తర్కవితర్కములుగాని, యుక్తివాదముగాని చేయక ధర్మస్వరూపము స్పష్టముగా వర్ణింపఁబడినది. సత్ప్రవర్తనమును, భూతదయయు ముఖ్యముగా ధర్మస్వరూప మని చెప్పఁబడినది. ఈశాసనమందలి కొన్నివిశేషాంశము లీక్రింద నిచ్చెదము.

భూతదయ :— పిపీలికాది సకలభూతములను దయతోఁ జూడవలయు ననియు, నేజీవమును జంపఁగూడ దనియు నమ్మిక కలవాఁడు గావునఁ దనసువారములో నంతకుఁ బూర్వము భోజనమునకై జరగుచున్న పశువధ నాఁపివేసెను[2]. అశోకుని తాతయైన చంద్రగుప్తుని కాలమునుండియు మృగయావినోదము రాజుల కత్యంతప్రియమై యుండెను. కాని యన్యాయముగా నిరపరాధములగు వన్యమృగములఁ జంపుట తగదని యశోకుఁడు వేఁటాడుట చాలించెను. వేఁటకు బదులుగా రాజ్యములోని ప్రజల కష్టములను గనుఁగొనుటకును, పవిత్రమైన స్థలములను, జనులను చూచుటకును, ధర్మబోధచేయుటకును దేశయాత్రచేయుట మంచిదని శాసించెను[3]. రాజమందిరమునఁ బాకశాలలో మొదటఁ బ్రతిదినమును, సువారమునకై వేలకొలఁది మృగములు, పక్షులును తెగుచుండెను. కొంతకాలము తరువాత రాజు అప్రాణివధను ఆఁపి, దినము రెండునెమిళ్లు, ఒకజింకకంటె నెక్కుడు ప్రాణులఁ జంపఁగూడ దని యాజ్ఞాపించెను. "ఇఁకముందు నీమూఁడు ప్రాణులనుగూడఁ జంపఁగూడదు" అని శాసించి యీధర్మమూర్తి తాను రాజ్యమునకు వచ్చిన ౧౩-వ యేఁట (క్రీ. పూ. ౨౫౯) బూర్తిగ మాంసాహారమును మానివేసెను. తనరాజ్యములోని ప్రజలు కొన్నిమృగముల నెన్నఁడును జంపనేకూడ దనియు, మాంసాహారు లయిన శూద్రాదులుగూడ సంవత్సరములో నేఁబదియాఱు విశిష్ట దినములందు నెట్టిప్రాణులను జంపఁగూడ దనియు నాజ్ఞాపించెను[4]. (క్రీ. పూ. ౨౪౩). దయామయుఁడగు నీరాజు పశువులరోగ చికిత్సకై పశువైద్యశాలల నిర్మించెను[5]. భూతదయ యింతకు మించ నేరదుగదా ?

తలిదండ్రుల గౌరవించుట :— అశోకుఁడు చేసిన రెండవ బోధ కుమారులు తమ తలిదండ్రులను గురువులను పెద్దలను మిక్కిలి గౌరవముతోఁ జూడవలసిన దని. అట్లె పెద్దవారును తమకుమారులను, సేవకులను దయతోను వారికిఁ దగిన మర్యాదతోను జూడవలె నని యాజ్ఞాపించెను. బంధువులను, భిక్షువులను (సన్న్యాసులను), బ్రాహ్మణులను గౌరవముతోఁ జూచి వారివిషయమై యౌదార్యముఁ గనఁబఱుపవలెను.

సత్యప్రియత్వము :— అశోకుఁడు బోధించిన మూఁడవ ధర్మము సత్యము. ఈమూఁడుతత్త్వములను నీక్రింది ౨-వ శిలాశాసనమునందు సంగ్రహముగాఁ జెప్పఁబడినవి. ఆశాసనముయొక్క భాషాంతర మిందు నిచ్చుచున్నారము :—

"పియదశి[6] యిట్లని శాసించె : తలిదండ్రులమాట వినవలయును. అట్లే భూతదయను బాటింపవలయును ; సత్యము మాటాడవలయును. ఇవి యనుష్ఠింపవలసిన ధర్మముయొక్క లక్షణములు. గురువును గౌరవింపవలెను. బంధువుల మన్నింపవలెను. ఇది దీర్ఘాయుః ప్రదమగు పురాతనధర్మమర్యాద. మానవులు దీని నమష్ఠింపవలయును."

పరమతసహిష్ణుత :— తాను బౌద్ధధర్మాభిమాని యయ్యును అశోకుఁడు పరమతములయెడ ద్వేషము లేనివాఁడయి యన్నింటిని సమభావముతోఁ జూచుచుండెను. బౌద్ధభిక్షువులకు నాశ్రమములు కట్టియిచ్చినట్లే ఆజీవికు లనఁబడు జైనులకును గట్టియిచ్చెను. బౌద్ధాచార్యులను గౌరవించినట్లే బ్రాహ్మణులను గౌరవించుచుండెను. ఇది యీమహాత్ముని యందుండిన గొప్పగుణములలోని గొప్పగుణము. తాను నమ్మిన ధర్మము నాచరింపవలసినదే కాని యితరుల మతములను నిందచేయఁగూడ దనియు, నన్నిధర్మములలోను నింద్రియనిగ్రహము, పవిత్రాచరణము ముఖ్యము లని చెప్పఁబడినందున నన్నిధర్మముల ముఖ్యసిద్ధాంత మొకటియే యనియు, భేద మముఖ్యమైన విషయ

1. Hyderabad Archaeological Series, No 1- The new Asokan edict of Maski.
2. ౧౪ శిలాశాసనములలో ౧-వ శాసనము.
3. ౮-వ శిలాశాసనము.
4. ౫-వ స్తంభశాసనము.
5. ౨-వ శిలాశాసనము.
6. పియదశి (ప్రియదర్శి) యనునది యశోకుని బిరుదునామము.

sampath_Ebooks

ములను గుఱించిన దని తెలిసికొనవలయు ననియు, మతసంబంధమైన చర్చలలోఁ బరస్పర నిందావ్యంజకశబ్దముల నుపయోగింపఁగూడ దనియు శాసించెను[1]. ఇప్పుడు మామత మెక్కువ, మామత మెక్కువ యని పోరాడువా రశోకునిశాసనములు చదివిరేని పరమతసహిష్ణుత ( Religious toleration ) నేర్చికొనియెదరుగాత.

బాటసారులకు వసతులు :— ఒక దేశమునుండి మఱియొక దేశమునకు నడచివెళ్లెడి బాటసారులకు వీలుగా నుండుటకు నచ్చటచ్చట స్తంభములు వేయించి వానిపైఁ గ్రోశములసంఖ్య వేయించు నాచారము అశోకుని తాతయగు చంద్రగుప్తుని కాలమునుండియుఁ గలదు. అశోకుని ప్రభుత్వమున మనుష్యులకును, పశువులకును నీడనిమిత్తము త్రోవప్రక్కలను మఱ్ఱిచెట్లును, మామిడితోఁపులును వేయింపఁబడియెను ; క్రోశక్రోశమునకును బావి యొకటి త్రవ్వింపఁబడియె ! చావడులు కట్టింపఁబడియె ; జలపానప్రదేశములు మనుజులకొఱకును, పశువులకొఱకును నిర్మింపఁబడియెను[2].

ఔషధశాలలు :— రోగార్తు లెవ్వరైనను వారి కౌషధంబు లిచ్చుటకై యద్వితీయకరుణామూర్తి యగు నీయశోకచక్రవర్తి, తనరాజ్యమునం దంతటను ఔషధాలయముల నేర్పఱిచెను. సర్వజీవుల యందును గరుణగలవాఁడు గావున నీవైద్యశాలలోఁ బశువులకుఁగూడ నౌషధంబు లిచ్చున ట్లేర్పాట్లు చేసెను. అంతటితోఁ దృప్తిఁజెందక తనకు స్నేహితులుగానున్న యితరరాజుల రాజ్యములలోను తన ధనముపెట్టి యట్టియౌషధశాలలను గట్టించెను. ఉత్తరమున హెలెనిస్టిక్ ఏషియా ( Hellenistic Asia ) యనఁబడు దేశములలోఁ గూడ నశోకునియౌషధశాల లుండెను ! ఈశాలలకుఁ గావలసిన యౌషధులను దోఁటలలో వేయించుచు,నితరస్థలములనుండి తెప్పించుచు నౌషధసంగ్రహము చేయుచుండిరి[3].

ధర్మాధికారులు :— తన శాసనముల ననుసరించి ప్రజలు ప్రవర్తించుచున్నారో లేదో కనుఁగొనుటకును, అపరాధులను దండించుటకును ఈరాజు ధర్మాధికారుల నేర్పఱిచెను. ప్రజలనీతిని గాపాడుటయు వీరిలోఁ గొందఱపని యైయుండెను. వీరుగాక సాధారణ రాజకీయాధికారు లనఁగాఁ బ్రస్తుతము గవర్నర్, కమిషనర్, కలెక్టర్ అనఁబడువారివంటి యధికారులు సంచారమునకు వెడలినపుడు జనులను గుంపులుగాఁ జేర్చి వారికి ధర్మోపదేశము చేయుచుండవలె నని రాజు శాసించెను[4].

పరరాజ్యములకు ధర్మోపదేశకుల నంపుట :— తనరాజ్యములో ధర్మాభివృద్ధి పైని వర్ణించినప్రకారము చేసి యంతటితోఁ దృప్తినొందక, తాను నమ్మినమతమును నీతికల్పనలును జగత్తంతయుఁ బ్రసరించునట్లు చేయుటకై యనన్యసామాన్యుఁడగు నశోకుఁడు యత్నింపసాగెను. అందునిమిత్తము ధర్మోపదేశకులను నియమించి,తనకు లోఁబడిన సామంతరాజులయొక్క రాజ్యములకును, తనకు లోఁబడక పోయినను స్నేహితులుగా నుండు రాజుల దేశములకును వారిని బోధనిమిత్తము పంపెను. ఈధర్మోపదేశకులు ఏయేదేశములకుఁ బంపఁబడిరో మన మశోకునిశాసనములవలనఁ దెలిసికొనవచ్చును[5].

క్రీ. పూ. ౨౫౬ నకుఁ బూర్వ, మనఁగా శిలాశాసనములు వేయునపుడు టిబ్బెతుదేశములోని కాంభోజుల దేశమునకు, హిమాలయప్రాంతమందలి రాజ్యములకు, కాబూలు కనుమలలోని గాంధార యవన దేశములకు, వింధ్యపర్వతములోను, పడమటికనుమలలోను ఉన్న పుళిందపిటెనికు లనువారి ప్రాంతములకు, కృష్ణాగోదావరీ మధ్యమున్న యాంధ్రదేశమునకు నీరాజుయొక్క ధర్మోపదేశకులు వెళ్లియుండిరి.

మిక్కిలి దక్షిణమునందలి చోళ పాండ్య కేరళ సత్యపుత్ర రాజ్యములు స్వతంత్రముగా నుండెను. ఆరాజ్యములలోని కశోకుని ధర్మోపదేశకులు పంపఁబడిరి. సత్యపుత్రదేశ మనఁగా నందునేఁడు మధ్యగాఁగలిగియున్న తుళువభాషమాటలాడుదేశ మని కొందఱ యభిప్రాయ మైయున్నది.

మహేంద్రుఁ డను తన కుమారుని, సంఘమిత్ర యను తన కూఁతును నశోకుఁడు సింహళమునకు ధర్మోపదేశార్థము పంపెను. వా రచ్చట నాఁటినధర్మబీజమే నేఁటికిని అచ్చటఁ బ్రబలియున్నది. ఈ కథ మహావంశ మను సింహళచరిత్రలో నున్నది. కాని మహేంద్రుఁ డనువాఁ డశోకునికుమారుఁడు కాఁ డనియుఁ, దమ్ముఁ డనియుఁ గొందఱు వ్రాసియున్నారు. ‘సంఘమిత్ర’ కల్పితనామ మనియుఁ జెప్పెదరు.

బర్మాదేశములోని పెగుప్రాంతమునకును ధర్మోపదేశకులు పోయినట్లు మహావంశకారుఁడు వ్రాసియున్నాఁడు. కాని యీ యంశము శాసనములలోఁ జెప్పఁబడలేదు.

పైని వర్ణించినదేశము లన్నియు హిందూదేశమునకుఁ జుట్టుప్రక్కలవి. ఇవిగాక అప్పుడు ఆంటియోకస్ థియోస్‌రాజుచేఁ బాలింపఁబడుచున్న సిరియా, టాలెమీ ఫిలాడెల్ఫసుచే నేలఁబడుచున్న యీజిప్టు ( మిసర్ ), మాగాసుచేఁ బరిపాలింపఁబడుచున్న సిరీన్, అంటిగోనోస్ గొనాటస్‌చే దొరతనముచేయఁబడుచున్న మ్యాసిడోనియా, అలెగ్జాండరుచేఁ బ్రభుత్వము చేయఁబడుచున్న యెపిరస్

1. 3-వ శిలాశాసనము,౧౨-వ శిలాశాసనము జూడవలయును.
2. 2-వ స్తంభశాసనము ; ౨-వ శిలాశాసనము.
3. ౪-వ శిలాశాసనము.
4. ౫-వ ౧౨-వ శిలాశాసనములు ; 8-వ స్తంభశాసనము.
5. 3-వ శిలాశాసనము ; కళింగశాసనము.

sampath_Ebooks



అనుదేశముల కన్నిటికిని హిందూదేశమునుండి మతాచార్యులు ధర్మోపదేశమునకై వెళ్లియుండిరి. ఈదేశములం దశోకునిచేఁ బశువుల యుపయోగార్థమును, మనుష్యుల యుపయోగార్థమును చికిత్సాశాల లేర్పఱుపఁబడియెను, అనఁగా నశోకునిబోధకులు ( మిషనరీలు ) ఏషియా, యూరోపు, ఆఫ్రికాఖండములలోని గొప్పగొప్ప రాజ్యములలో ధర్మోపదేశము చేయుచుండిరి!

ఇట్లు బౌద్ధధర్మమును జగత్తంతటను వ్యాపింపఁజేయ నశోకుఁడన్ని దేశములకును ధర్మోపదేశకులను బంపినందున బౌద్ధధర్మ మత్యంతముగా నభివృద్ధినొంది క్రమక్రమముగా నితరమతముల మ్రింగివేసెను. తరువాత రెండువందలసంవత్సరములకుఁ బుట్టిన క్రైస్తవధర్మము రాజాశ్రయముచేతను, ప్రజలయాశ్రయముచేతను నభివృద్ధిఁ జెందినను నేఁటివఱకును జగత్తులో బౌద్ధమతమును మించలేక యున్నది. నేఁడు క్రైస్తవులసంఖ్యకంటెను బౌద్ధులసంఖ్యయే యెక్కుడుగా నున్నది. దీని కంతకును అశోకుని మతబోధకసంఘమే ముఖ్యకారణము. కాన నశోకుఁడు జగత్తున కంతకు నవీనధర్మము నేర్పినమహానుభావుఁ డని చెప్పవలసియున్నది.

ప్రస్తుతము క్రైస్తవధర్మబోధనిమిత్త మమెరికా యూరోపు దేశములనుండి బోధకులు వచ్చుట మనము చూచుచున్నాము. ఇటులు మతబోధనిమిత్తము పరదేశములకు బోధకులను బంపుపద్ధతి జగత్తునకు మొదట నేర్పినవాఁడు బుద్ధుఁడు. తరువాత నుదాహరణపూర్వకముగా నభివృద్ధి నొందించినవాఁ డశోకుఁడు. బుద్ధునియుపదేశకు లీదేశముననే బోధచేసిరి. అశోకునియుపదేశకులు జగత్తంతయుఁ బ్రసరించిరి. ఇట్లు పరదేశములకు నుపదేశకులను బంపియు, నౌషధశాలాదులను గట్టించి లోకుల కుపకారము చేసియు, ధర్మమభివృద్ధి నొందించుమార్గములను బౌద్ధులవలననే క్రైస్తవులు నేర్చికొని రనుటకు సందేహము లేదు. ఇదియుఁ గాక బౌద్ధధర్మతత్త్వము లనేకములు తీసికొని పురాతన క్రైస్తవులు తమ ధర్మగ్రంథముల నిర్మించుకొనిరని కొందఱి యభిప్రాయ మైయున్నది.

కట్టడములు :— అశోకుఁడు మిగుల భవ్యమైనవియు, దివ్యమైనవియు నగుమందిరములను గట్టించెను. ఆకాలమందు రాతిపని పరిపూర్ణాభివృద్ధిని చెందినట్లు కానవచ్చుచున్నది. అది యేదేశమందలి యేకాలపురాతిపనికిని తీసిపోదు. కట్టడములు మిక్కిలి పెద్దవియు, పనితనము మిక్కిలి చక్కనిదియు నగుటచేత నవి రాక్షసులచేతనో యక్షులచేతనో చేయఁబడియె నని జనులు తలంచిరి.

పాటలీపుత్రమునం దున్న యీరాజమందిర మిప్పుడు భూమిలోఁ బూర్తిగఁ బూడి, భగ్నమై కానరాకున్నను, ఇటీవల నిందలి కొన్ని భాగములు త్రవ్వి తీసిరి. ఆయవశేషములు మందిరముల ఘనతకుఁ దగిన ట్లున్నవి. చీనాపరివ్రాజకుఁడు హూయెన్‌త్సాంగ్ వచ్చినప్పుడు ( క్రీ. శ. ౬౩౦ ) ఈతఁ డశోకునిచేఁ గట్టఁబడిన నూఱడుగులయెత్తుస్తూప మొక్కటి కాఫిరిస్థానమందు కపిశ యనుచోటను, మూఁడువందలయడుగుల స్తూప మొకటి జలాలాబాదునొద్ద నగ్రహారములోను చూచెను. కాశ్మీరమునందు నతఁడు సన్యాసిశాశ్రమములు ౫౦౦లు నిర్మించె నని వదంతి కలదు. కాని అది అతిశయోక్తి యైనను కొన్నిగుహలు త్రవ్వించి ఆశ్రమములు నిర్మించె ననుట సత్యము. కాశ్మీరదేశమునకు రాజధానిగా నుండిన సుందరమైన శ్రీనగరపట్టణమును అశోకుఁడే కట్టించెను. నేపాళమునందు లలితపట్టణమును కట్టించెను. ఆపట్టణ మిప్పటివఱకు నున్నది. అచ్చటి కొన్నిమందిరము లిప్పటివఱకును అశోకునినామమును సూచించుచున్నవి. భోపాల్ సంస్థానమునందు కనుఁగొనఁబడిన సాంచిస్తూపము నీతఁడు క్రీ. పూ. ౨౫౦ ప్రాంతమున నిర్మించె నందురు. ఇందలి చెక్కడపుపని యత్యద్భుత మని పాశ్చాత్త్యులు పొగడియున్నారు. అందలి ద్వారశిలలపై నతిసుందరమైన పనితనము కలదు. అట్టిశిల యొకటి తనకు పంపు మని ఫ్రాన్సుదేశపు చక్రవర్తి యైన మూఁడవ నెపోలియన్ ౧౮౬౮ లో భోపాలసంస్థానపుబేగమును అడిగెను. కాని ఇండియాగవర్నమెంటువా రాశిలను పోకుండ నడ్డగించి ప్లాస్టరుతో చేయఁబడిన దానియొక్క పోఁతను మాత్రము పారిస్‌పట్టణమునకు పంపిరి. ప్రయాగప్రాంతమందలి భర్‌హూత్ స్తూపముకూడ అశోకునినాఁటిదే యని యందురు.

అశోకునిశాసనస్తంభములుకూడ పనితనమునకై కొనియాడఁదగినవియే. వీనిలోఁ గొన్ని ఏఁబదియడుగులయెత్తును, ఏఁబదిటన్నుల బరువును కలవి. ఇంత పెద్దస్తంభములు పర్వతములలోనుండి విడఁదీసి వందలకొలఁదిమైళ్లదూర మాదినములలో నెట్లు కొనిపోయిరో? అది యటుంగాక వీనిని రుద్ది యద్దములవలె నున్నగ చేయుటయు మిక్కిలి ఆశ్చర్యకరము. అశోకుఁ డాజీవికులను సన్యాసులకొఱకు గయయొద్ద బరాబర్ నాగార్జునకొండలలో త్రవ్వించినగుహలును అప్పటి రాతిపనితనముయొక్క సామర్థ్యమును చూపును. ఆగుహలలో గోపికాగుహ యనునది నలుబదియేడున్నర అడుగులపొడుగును, పదితొమ్మిది అడుగులపొడుగుకంటె కొంచె మధికపువెడల్పును, పదున్నర యడుగులయెత్తును కలది. దీనిపైకప్పు గుండ్రముగను ప్రతిబింబము కానవచ్చునద్దమువలె నున్నగను ఉండును.

అశోకునిస్వభావము :— పరమసాధువుయొక్క సాత్త్వికసద్గుణములును, అసాధారణచక్రవర్తియొక్క రాజ్యధురంధరత్వమును ఒక్కచోటఁ గలిపి యీ యశోకుఁడు చేయఁబడినట్లు గానవచ్చెడిని. అహింసామాహాత్మ్యమెఱిఁగినతోడనే మాంసాహారమును మానుటయు, మృగయావినోదమును వదలుకొనుటయు, యుద్ధములవలనఁ బ్రజాక్షయ మగు నని పరరాజ్యములను గెలుచుట మాని 'కళింగయుద్ధములో జరిగినప్రజాక్షయములో వేయవపాలు ప్రజాక్షయమయినను నేను సహింపలే' నని శాసించుటయుఁ జూడ నీతనిసాధుత్వము పదునాఱువన్నెలు కలది యని చెప్పకతప్పదు. రాజ్యతృష్ణచే లక్షలకొలఁదిజనులను నాశ మందించెడి ప్రస్తుతపురాజు లీయశోకుని

చరిత్రను చదివియైనను బ్రజాక్షయకరకృత్యములను మానుదురుగాక. 'పరు లెంతయపకారము చేసినను పియదసి శాంతముగా సహించు' నని చెప్పెడిరాజుయొక్క సత్త్వగుణము మనము వినుచున్న సాక్రటీస్, తుకారామ్, వేమన మొదలగు సాధువులగుణమును బోలినది యని చెప్పుట కేమిసందేహము? అశోకుని ప్రభుత్వములో నున్న రాజ్యముయొక్క సువ్యవస్థయే యాతనిరాజ్యధురంధరత్వమును వేనోళ్లఁ గొనియాడుచున్నది. అతఁడు తనప్రజలకష్టములను వినుటకు నెప్పుడును సిద్ధముగా నుండెను. రేయింబవళ్లు ప్రజాసుఖమునకై పాటుపడుచు నంతటితో సంతుష్టి చెందక తాను సోమరి నని నిందించుకొనును. ఇట్లు తనరాజ్యమును రక్షించుకొనుచు దూరదూర దేశములందుండు విఖ్యాతరాజులతో స్నేహము చేయుచు వారిరాజ్యముల లోనికిఁ దనధర్మోపదేశకులను బంపుట చూడఁగా నశోకుఁడు ప్రస్తుతము ఇంగ్లండ్, జర్మనీ, అమెరికాదేశములలోని ప్రభుత్వము వారికిఁ గలసామర్థ్యంబును, దూరదృష్టియు, రాజకార్యధురంధరత్వమును గలిగియుండె నని చెప్పుటకు సందేహము లేదు.

ఇట్టియద్వితీయచక్రవర్తి యగునశోకమహారాజు క్రీ. పూ. ౨౩౧ లో నిర్యాణము చెందినట్లు గానవచ్చుచున్నది[1].

[పైని వ్రాయఁబడిన అశోకచరిత్ర మంతయు నశోకుని శాసనములు, సింహళ, టిబెత్తు దేశమందలి గ్రంథములు, మనపురాణములు అనునాధారములనుబట్టి వ్రాయఁబడినది. కాని మహారాష్ట్రమునందు 'భరతఖండాచా అర్వాచీనకోశ' అను గ్రంథము కలదు. ఆ గ్రంథకారుఁడు జైనగ్రంథముల ననుసరించి అశోకచరిత్ర వ్రాయుచున్నా నని చెప్పి, ఈక్రిందివిశేషములను వ్రాసినాఁడు. కాని జైనగ్రంథము పేరు వ్రాసినవాఁడు కాఁడు. కాన దీనిని నమ్ముటకు వీలు లేదు. అయినను పండితులచే విమర్శింపఁబడుటకుఁ దగిన విషయము గాన నిందు నిచ్చుచున్నాము. 'అశోకుఁడు వారిసారునికుమారుఁడు; చంద్రగుప్తుని మనుమఁడు. ఇతని రాజ్యాభిషేకము యుధిష్ఠిరశకము పదునేడువందల నలువదియయిదు (క్రీ. పూ. ౧౩౫౭) ప్రజాపతినామ సంవత్సరములో జరిగెను. ఇతఁడు ౪౫ ఏండ్లు రాజ్యముచేసి యుధిష్ఠిరశకము ౧౭౯౧ (క్రీ. పూ. ౧౩౧౧) పింగళనామ సంవత్సర ఫాల్గునబహుళ ౧౦ దశమీ మంగళవారమునాఁడు బహార్ప్రాంతములోని ముంగేరిపట్టణమునఁ గీర్తిశేషుఁ డయ్యెను. ఇతఁడు జైనుఁడు. ధనముగలవాఁడు. జైనమతము నీక్రిందివిధముగ నభివృద్ధి చేసెను. ౬౪,౦౦౦ల బౌద్ధపురోహితులకు(?) నాశ్రయమిచ్చి హిందూదేశము నందంతటను ఇతఁడు పెక్కురాజ్యములను గెలిచి తన రాజ్యములోఁ గలుపుకొనెను. ఢిల్లీలో రాజ్యముచేయుచున్న వీరసేనప్రధానుని వంశము నంతము నొందించెను. మేవాడ, మార్వాడ, భాటియా ప్రాంతముల గెల్చి అచ్చటివారికి తన మతదీక్ష నొసంగెను. ఈతఁడు దక్షిణదేశమును గెల్చుటకై సైన్యయుక్తుఁడై బయలుదేరి నర్మదానది దాఁటి ఇప్పుడు నైజామువారి రాజ్యములో నున్న దేవగిరియొద్దకు వచ్చి యాగిరిదుర్గమును నిర్మించెను. మహారాష్ట్రదేశముమీఁదరాజ్యము చేయు సుపర్ణుఁ డనురాజును సేనాసునొద్దఁ జంపి యాతనిపుత్త్రుని నంకితుని చేసికొనెను. తగర్ అనుచోట తనరాజధానిని స్థాపించి వీరబాహుఁ డనుజైనుని అచ్చట నునిచి దేవగిరికిఁ బోయెను. అచ్చటనుండి తనసరదారులను బంపి వరాడ్ (బీరారు), బంగాళము, తెలుఁగుదేశము పాండ్య కేరళ తోరళ దేశములను జయించెను. అచ్చట జైనుల నధికారులుగా నియమించెను. ఎల్లోరాగుహలను త్రవ్వించుటకు యుధిష్ఠిరశకము ౧౭౫౧ (క్రీ. పూ. ౧౨౬౧) ప్రారంభించి ౧౭౬౩ లోఁ (క్రీ. పూ. ౧౨౪౯లోఁ) పూర్తిచేయించెను. ఈపండ్రెండేండ్లాతఁడు దేవగిరిలోనే యుండెను. తరువాత ఘృష్ణేశ్వరుఁ డనుజ్యోతిర్లింగమును సేవించి వెడలిపోయెను'].

అశోకునిజీవితమందలి విశేషాంశము లీక్రింద పట్టికగాఁ జూపఁబడినవి:—

క్రీ. పూ.

౨౭౩ అశోకుఁడు రాజ్యమునకు వచ్చెను.

౨౬౯ అభిషేకము.

౨౬౧ కళింగదిగ్విజయము.

౨౬౦ బౌద్ధుఁడుగా మారెను.

౨౫౯ వేఁటాడుట మానెను; మతవ్యాప్తికై దేశసంచారము చేయనిశ్చయించెను; మతబోధకులను దేశదేశములకుఁ బంపెను.

౨౫౭ ౧-వ లఘుశిలాశాసనము; ౧౪ శిలాశాసనములలో ౩-వది, ౪-వది వేయించెను. ఆజీవికులకు బరాబర్ అనుచోట గుహలు త్రవ్వించెను.

౨౫౬ పదునాల్గుశాసనములు, కళింగశాసనములును వేయించెను. 'ధర్మమహామాత్రు'లను ఏర్పాటు చేసెను.

౨౫౫ కపిలవస్తునొద్ద కోనాకమను బుద్ధస్తూపమును విశాలముగఁ గట్టించెను.

౨౫౫ కళింగశాసనములలో నొక్కటి వేయించెను.

౨౫౧ బౌద్ధపరిషత్తు.

౨౫౦ ఆజీవికులకు మఱియొకగుహ నిర్మించెను.

౨౪౯ నేపాళాదిదేశములకు యాత్ర. కూఁతురు చారుమతి సన్యాసిని అయ్యెను.

1. విజ్ఞానచంద్రికా గ్రంథమాలయందలి ౨-వ కుసుమము 'హిందూమహాయుగము'లోని అశోకచరిత్రమునఁ గొంత చేర్చియుఁ గొంత మార్చియుఁ గొంత తగ్గించియు నీవ్యాసము వ్రాయఁబడినది—[ము. సం.]

sampath_Ebooks

sampath_Ebooks


౨౪౩ ౬-వ స్తంభశాసనము. పశుహింస మాన్పెను.

౨౪౨ స్తంభశాసనములు ఏడింటిని ప్రకటించెను.

౨౪౦-౨౩౨ లఘు స్తంభశాసనములు.

౨౩౨ అశోకుని నిర్యాణము.

గ్రంథసంగ్రహము :

తెనుగునందు ఆంధ్రభాషాభివర్ధనీ గ్రంథమాలలో నొక 'అశోకచరిత్రము' ప్రకటింపఁబడినది. ఇంగ్లీషునం దశోకుని గురించియు, నశోకునిశాసనములను గురించియుఁ బెక్కు పుస్తకములు కలవు. వానిలో నీక్రిందివి ముఖ్యమైనవి :

1. Sir A. Cunningham's Inscriptions of Asoka [Calcutta].

2 V.A. Smith's, Asoka, the emperor of India.

3. The Early History of India.

4. The Heritage of India Series, Asoka by T. M. Macphail.

5 R. Otto Franke's Pali and Sanskrit, Strassburg, 1902.

6 Smith's Translation of Asoka's Inscriptions.

7. Articles about Asoka's Inscriptions by Buhler, Rice, Fleet, Thomas, Hultzsch, Bhandarkar, Burgess, Hardy, Vogel & Smith in Indian Antiquary, Epigraphia Indica and Jour Roy. As. Soc

8. Radhakumud Mookerjee's Asoka.

9. Inscriptions of Asoka — E. Hultssch.

10. Inscriptions of Asoka — D. R. Bhandarkar and Surendranath Majumdar.

(కో. వేం. ల.)

**అశోకవృక్షము** — ఈవృక్షము సంస్కృత కావ్యములలో విశేషముగ వర్ణింపఁబడును. దీనిని స్త్రీలు కాలితోఁ దన్నిన నిది పుష్పించునఁట. దీనికిఁ దెలుఁగుకోశములలో కటురోహిణి, కంకెళి యను రెండువృక్షములపే ళ్లీయఁబడినవి. వీనిలో కంకెళికి దోహదక్రియ పాదతాడనమఁట! తెనుఁగుదేశమున దీనిని నరమామిడి అందురు. నరమామిడి అసలు అశోకము కా దనియు, అశోకమునకు బదులుగ మనవైద్యులు దీనిని వాడుచున్నా రనియుఁ గొంద ఱందురు. ఇందు రెండువిధములు: ఒకదానిపూలు రక్తముగ నుండును. దీనిని రక్తాశోక మందురు. మఱియొకదానిపూలు పీతముగ నుండును. దానిని పీతాశోక మందురు.

**అశోకాష్టమీ వ్రతము** — ఇది హిందువుల వ్రతము లలో నొకటి. దీనియొక్క ప్రతిఫలము శోకవిధ్వంసము. చైత్రమాస శుక్లాష్టమినాఁడు దీనిని జేయవలయును. ఇందలి ముఖ్యకార్య మాదిన మున మంత్రపూతముచేసి యెనిమిదియశోకకలికలతోఁ గూడిన జలమును త్రాగవలయును.

**అశోకుఁడు** — ౧. దశరథరాజుయొక్క అష్టప్రధానులలోనివాఁ డగు 'అశోఫుఁ' డనువానికి నామాంతరము.

౨. దుర్యోధనపక్షీయుఁ డగురాజు.

**అశౌచము** — శుచిత్వము లేకపోవుట. ఈ శబ్దమునకు 'ఆశౌచము' అనురూపముకూడఁ గలదు. ఈశబ్దము సాధారణముగ నిప్పుడు, పుత్త్రాదులజన్మమువలనఁ గాని, పిత్రాదులమరణమువలనఁ గాని కల్గునట్టి 'అశౌచము'నకు నుపయోగించెదరు. దీనిని సాధారణముగ మనవారు 'సూతకము', 'మైల' యందురు. జన్మమువలనఁ గల్గిన యశౌచమునకు 'జాతాశౌచ'మని మనవారును, 'వృద్ధి' యని మరాటీవారును, 'శుభాశౌచ' మని బంగాళీవారును అందురు. అశౌచమునకు గుర్తులు రెండు. ఇతరులను తాఁకుటకు వీలు లేకపోవుట, నిత్యనైమిత్తికకర్మములను చేయయోగ్యత లేకపోవుట. మృతాశౌచమునకు నీరెండులక్షణములును చెల్లును. కాని జాతాశౌచమునకు మొదటిలక్షణ మంతగా వర్తింపదు. జాతాశౌచము కలవా రితరులను తాఁకినందున నితరులు మైలపడరు. కాని వారిచేత నితరు లాయశౌచకాలమందు భోజనము చేయరు. ఉభయాశౌచకాలమునందును సంధ్యావందనముకూడఁ జేయుటకు వీలు లేదు. తరములనుబట్టియు, రక్తసంబంధమునుబట్టియు, ఆత్మబంధుత్వమునుబట్టియు, జాతినిబట్టియు అశౌచకాలపరిమాణము మాఱుచుండును. సాధారణముగ అశౌచము బ్రాహ్మణులకుఁ బదిదినములు, క్షత్త్రియులకు పండ్రెండు దినములు, వైశ్యులకుఁ బదునైదుదినములు, శూద్రులకు నెలదినములు. ఈ నియమము జాతాశౌచమృతాశౌచములు రెంటిని గురించియు నేడు తరములవఱకును చెల్లును. ఎనిమిదవతరమునుండి పదియవతరమువఱకును అన్నిజాతులవారికిని మూఁడుదినములే. చతుర్దశపురుషపర్యంతము పక్షిణి (మూఁడుపూఁటలు). మూలపురుషుని పేరు జ్ఞాపక మున్నంతవఱకు నొక్కదినము; తరువాత స్నానము మాత్రము. దేశకాలములను బట్టియు నీదినప్రమాణములు మాఱుచుండును. శిశువు పుట్టినవెంటనే లేక జ్ఞాతి చచ్చినవెంటనే తెలిసినయెడలఁ బూర్తిగ, ననఁగాఁ బైనిచెప్పఁబడినన్నిదినము లశౌచము పట్టవలెను. అట్లుగాక కొంతకాలముతరువాత నశౌచకాలమితిలోపలఁ దెలిసినయెడల మిగిలిన దినములకాలము పట్టవలెను. విదేశమునందు నశౌచోత్తరకాలమునఁ దెలిసినయెడల జ్ఞాతిజననాశౌచము లేనేలేదు. స్వపుత్త్రజననమునకు స్నానము. మరణమువార్త సంవత్సరములోపలఁ దెలిసినచో మూఁడు దినములతో శుద్ధి. ఇట్టినియమములు పెక్కులు ప్రతిస్మృతియందును ఇచ్చియుండును. కాని వాని నన్నిటిని చూచుట దుష్కర మని కొందఱు పండి

sampath_Ebooks

గులు సంగ్రహములను జేసియున్నారు. 'అభినవషడశీతి' యనునది యట్టిగ్రంథములలో నొక్కటి. తెనుఁగుదేశమునందు నశౌచమును గుఱించి సంశయము కలిగినప్పుడు దీని ననుసరింతురు. నిర్ణయసింధు, ధర్మసింధు అను గ్రంథములుకూడఁ బ్రమాణముగఁ దీసికొందురు.

అశౌచకాలమున, తెల్లనివస్త్రములను ధరింపవలెను, చెప్పులు తొడుగు వేసికొనఁగూడదు, బొట్టు పెట్టుకొనఁగూడదు, తీపి తినఁగూడదు, స్త్రీసంభోగము లుండరాదు.

ఉపనయనవివాహాదిశుభకార్యములలోఁ గంకణము కట్టుకొనిన తరువాతను, యజ్ఞయాగాదికములలో దీక్ష వహించియున్నకాలమందును అశౌచము వచ్చినయెడల దానిని పాటింపనక్కఱలేదు. లింగాయతు లను కన్నడులును 'అశౌచములు' పాటింపరు. వారికి నశౌచము వచ్చినను వారినిత్యకర్మములు యథావిధిగ జరుగుచుండును. ఆంధ్రదేశమందలి ఆరాధ్యు లను బ్రాహ్మణులు కొంతవఱకు నశౌచమువిషయమున లింగాయతులయాచారమునే అనుసరింతురు. వీరికి సూతకము వచ్చినప్పుడును వీరు సంధ్యయు, శివపూజయు నెప్పటివలెనే సాంగోపాంగముగఁ జేసెదరు. స్త్రీలు ముట్టయినను, నీళ్లాడినను శివపూజ చేసికొందురు. అశౌచము కలవారిచేత మాత్ర మితరులు భోజనము చేయరు.

ఒక యశౌచములో నింకొకయశౌచము వచ్చుట 'అశౌచ సంకరము' అని యనిపించుకొనును.

ఇతరదేశములవారు జాతాశౌచమును పాటించుచున్నట్టు కానరాదు. మృతాశౌచమునుమాత్రము పాటించెదరు. వేఱువేఱు దేశములవారు సూతకచిహ్నములను వేఱువేఱువిధముగ ధరించెదరు. ఇప్పుడు పాశ్చాత్యులు అశౌచమును సూచించుటకై నల్లగుడ్డయొకటి బుజమునకుఁ గట్టుకొందురు. పూర్వకాలపుయూదులు (Jews)లలో నశౌచకాలము ౭ దినము లుండెను. కొందఱు ౩౦ దినములవఱకును సూతకము పట్టుచుండిరి. అశౌచకాలమందు తలకు నూనె రాచుకొనుట, చెప్పులు తొడుగుకొనుట, స్నానము చేయుట లేదు. అందఱును గలసి యొకచోట నేలపైఁ బండుదురు. గ్రీసుదేశవాసులు ౩౦ దినములవఱకు సూతకము పట్టుచుండిరి. వారిలో స్పార్టను లనువారు ౧౦ దినములు మాత్రమే గ్రహించిరి. అశౌచకాలమందు వెండ్రుకలు తీసి, నల్లబట్ట కట్టుకొందురు, వెలుపలఁ దిరుగువారు కారు. రోమదేశమందు పతి పోయినచో నాతని స్త్రీలకు నొక సంవత్సరము సూతక ముండెను. పురుషులకుమాత్రము కాల మల్పము. సూతకకాలమునందుఁ బురుషులు నల్లబట్టలను, స్త్రీలు తెల్లబట్టలను కట్టుకొందురు.

అశ్మకదేశము — మహాభారతమునుబట్టి చూడ నిది భారతవర్షమందలి దక్షిణదేశ మనియు (భీష్మ, అధ్యా. ౩౮), బృహత్సంహితమతమున వాయవ్యదిక్కున నుండు దేశ మనియు, కొందఱి మతమున నిది మధ్యదేశ మనియుఁ (విశ్వ.) దెలియుచున్నది. ఈదేశనామము పాణినియొక్క అష్టాధ్యాయిలో నున్నది (౪.౧.౧౭౩).

**అశ్మకుఁడు** — ౧. ఒకబ్రాహ్మణుఁడు, జనకరాజుతో సుఖదుఃఖనివృత్తినిగుఱించి మాటాడెను (మహాభార., శాంతి, అ. ౨౮).

౨. (సూ. వం.) ఇక్ష్వాకుకులోత్పన్నుఁడును, కల్మాషపాదనామాంతరము కలవాఁడును అగు మిత్రసహరాజుయొక్క పుత్త్రుఁడు. ఇతనియుత్పత్తికథ యెట్లన, మిత్రసహునకు బ్రాహ్మణీశాపమువలన, భార్యాసమాగమమునకు వీలు లేనందున, నాతఁడు మదయంతి యను తనభార్యయందు వసిష్ఠఋషిచే గర్భము స్థాపింపఁజేసెను. ఏడేండ్లయినను ఆగర్భము వెలుపలికి రానందున అశ్మము(రాయి)తో కడుపును కొట్టుకొని మదయంతి దానిని వెలుపలికిఁ దీసెను. అందుచే నాతనికి అశ్మకుఁ డన్న పేరు వచ్చెను (భాగ., ౯. స్కం. ౯ అ). ఇతఁడు పైదన్యపురమును స్థాపించెను. ఇతనిభార్య ఉత్తర. నారీకవచుఁ డను నామాంతరముగల మూలకుఁ డీతనిపుత్త్రుఁడు.

౩. దుర్యోధనపక్షీయుఁ డగురాజు. అభిమన్యునిచే జచ్చెను (మహాభా., ద్రోణ. అ. ౩౮).

**అశ్లీలము** — పెద్దమనుష్యులు మాటలాడఁదగనిప్రసంగమును అశ్లీల మందురు. ఇది మనయాలంకారికులచేఁ గావ్యదోషముగ నెంచఁబడినది. 'అశ్లీలము' శబ్దదోషముగను, అర్థదోషముగనుగూడఁ జెప్పఁబడియున్నది. వ్రీడాకరము, జుగుప్సాకరము, అమంగళకరము అని యియ్యది మూఁడువిధములు (కా., ప్ర. ౭). వ్రీడ యనఁగ సిగ్గు, లజ్జ; జుగుప్స యనఁగ రోఁత; అమంగళ మనఁగా నశుభము. కావునఁ గావ్యములు చదువునప్పుడు చదువువారికి, వినువారికి సిగ్గుగాని, లజ్జగాని కల్గునట్టిమాటలు, వర్ణనములు కావ్యములోఁ జెప్పఁగూడదు. అట్లే రోఁతపుట్టించు వర్ణనములను, అశుభమును సూచించుమాటలను వ్రాయఁగూడదు. సంస్కృతలక్షణగ్రంథములలో నీమూఁడువిధముల యశ్లీలమునకు నీక్రిందియుదాహరణము లీయఁబడినవి: —

(౧) 'ఓ రాజా! శత్రువినాశమునకై నీయొద్ద గొప్ప 'సాధనము' కలదు.' 'సాధన' శబ్దమునకు పురుషలింగ మని మాఱర్థము గలదు. కావున వ్రీడాకరము.

(౨) 'సుకుమారీ! 'వినాశ' మప్పుడు నీ 'వాయువు' మెల్లఁగా నాడెను.' ఇందు 'వాయు' పదము ఊపిరి యన్నయర్థమందు వాడినను దానికి 'అపానవాయువు' అన్న మాఱర్థము కలదు గావున నిది జుగుప్సకు నుదాహరణము.

(౩) పైవాక్యమునందే 'వినాశ' పదము విరహార్థమునందు నుపయోగింపఁబడినను దానికి 'మరణ' మను అర్థము కలదు. కావున నది యమంగళవ్యంజకము.

నరసభూపాలీయమునందు శబ్దదోషములలో మూఁడువిధముల యశ్లీలమునకు నీక్రిందియుదాహరణ మీయఁబడినది.

sampath_Ebooks

క. వసుదేవ 'యోని', గోపీ
'విసరమహా పీనకుచ'నవీనాశ్లేషో
ల్లసితుం డనఁ గాళిందీ
రస 'విహరణ' కరణనిత్య రసికుం డనఁగన్. (ర. ౧౮.)

అర్థదోషములలో నశ్లీలమున కీ క్రిందియుదాహరణ మిచ్చియున్నాఁడు:—

క. .......... ..................లజ్జా
కర మశ్లీలము పద్మిని
వర'సాంగజగృహము' పద్మసౌరభ మనఁగన్. (ర-౫౨)

ఇందు 'అంగజగృహ' మనుపదమునకు బూతు అర్థము కలదు కావున లజ్జాకర మైనయశ్లీల మాయెను.

ఇట్లు బూతు అర్థ మిచ్చుపదములను మాఱర్థమందుఁగూడ వాడుట లజ్జాకరము, అశ్లీలము అని లక్షణవేత్తలు చెప్పుచున్నందున, బూతుపదములను స్వార్థమునందె వాడుట తప్పని వేఱుగఁ జెప్పవలెనా?

అశ్లీలమునకు నుదాహరణములు వలయు నన్న శ్రీనాథుని వీథినాటకమునందును, కూచిమంచి జగ్గకవియొక్క చంద్రరేఖావిలాపమునందును పెక్కు ఉదాహరణములు దొరకఁగలవు. ఆంతరంగిక మైనస్త్రీపురుష సంభోగంబును వ్రీడాజుగుప్సాకరంబు గనుక నట్టి వర్ణనములును అశ్లీలముక్రింద వచ్చును. ఇందునుగూర్చి అధికము 'ఔచిత్య'శబ్దముక్రిందఁ జర్చింపఁబడును.

**అశ్వఘోషుఁడు** — బౌద్ధపండితుఁడు; కవి. ఇతఁడు 'బుద్ధచరిత్ర' మను సంస్కృతకావ్యము వ్రాసెను. ఈ కావ్యమును తిరుపతి వేంకటేశ్వరకవులు తెనిఁగించిరి; సరస్వతీ పత్రికాధిపతులు ప్రకటించిరి. ఈతఁడు కనిష్కచక్రవర్తితో సమకాలికుఁ డనియు, క్రీ. శ. ౧-వ శతాబ్దమునం దుండెననియు నందురు. ఈతఁడు సాకేతపురనివాసి. మొదట బ్రాహ్మణుఁడు, పట్టుదల గలవాఁడు, పండితుఁడు. పూర్ణయశస్కుఁ డను బౌద్ధపండితునితో వాదము చేసి, సర్వశూన్య మన్న సిద్ధాంతమునందు నమ్మకము పుట్టినవాఁడై బౌద్ధుఁడై యామతాభివృద్ధికి పాటలీపట్టణమునందు పెక్కుడు ప్రయత్నములను జేసెను. ఎన్నియో గ్రంథములను వ్రాసెను. వజ్రసూచికోపనిషత్తు తనిచేత నే వ్రాయఁబడిన దని యనియెదరు. ఇందు జాతిభేదము ఖండింపఁబడినది. కాబూలుదేశపురాతనైన కాత్యాయనీపుత్రుఁ డనువాఁ డీతనిని పిలిపించుకొని 'అభిధమ్మ' మను సంహితపై 'మహావిభాష' యను భాష్యము వ్రాయుటలో నతని సాయమును దీసికొనియెనఁట. ఈతనిచే రచింపఁబడిన వన్న గ్రంథములు పెక్కులు కలవు. కాని అన్నియు నీతని వని చెప్పుటకు వీలులేదు.

**అశ్వతీర్థము** — ౧. నైమిశారణ్యమందలి భారతవర్షీయతీర్థము.

౨. గంగయొద్దనఁ గాన్యకుబ్జసమీపమందలి క్షేత్రము. ఇచ్చటనే ఋచీకునకు గాధినిమిత్తము వరుణుఁడు ౧,౦౦౦ గుఱ్ఱము లిచ్చెను (మహాభా., వన, అ. ౯౩, ౩ ; అ. ౧౧౬, ౨౪).

**అశ్వత్థామ** — ౧. భరద్వాజునిపుత్త్రుఁడైన ద్రోణాచార్యునకు శరద్వద్ఋషికన్య యైన కృపియనువామెయందుఁ బుట్టిన కుమారుఁడు. ఈతఁడు పుట్టినప్పు డుచ్చైశ్శ్రవాశ్వమువలె శబ్దము చేసినందున ఈతనికి 'అశ్వత్థామ' యన్న పేరు వచ్చెను. కామక్రోధములయంశమున నీతఁడు జన్మించెనఁట. ఈతఁడు వేదవేదాంగపారగుఁడై సరహస్యధనుర్వేదమును తండ్రియొద్ద నేర్చెను. ఈతఁడు మిక్కిలి కోపము కలవాఁడు, అవివేకి. స్వాభావికముగ దుర్మార్గప్రవృత్తి లేదు, కాని మఱియొకఁడు చూపినఁ జెడుమార్గమునం బోవును. తండ్రియందు గౌరవమును, ఆత్మగౌరవమును మెండు. భారతయుద్ధమునఁ దండ్రితోపాటు దుర్యోధనపక్షమున యుద్ధము చేసెను. ధృష్టద్యుమ్నుఁడు తనతండ్రిని అన్యాయముగఁ జంపినాఁ డన్న కోపముచేత నీతఁడు పదునైదవనాఁడు పాండవబలముమీఁద నారాయణాస్త్రము వేసెను. కాని కృష్ణునిసలహా ననుసరించి, పాండవసైనికు లందఱును, రథంబులు దిగినందున నాయస్త్రము వ్యర్థము కాఁగా నీతఁడు ఖిన్నుఁడై యుద్ధమునుండి తిరిగి వెళ్లఁబోవుచుండెను. అప్పుడు వేదవ్యాసుఁ డెదురు కాఁగా, 'నాయస్త్రంబు వృథ యయ్యె. కారణం బేమి?' యని యడుగ వ్యాసుండు నరనారాయణుల మహిమ చెప్పి 'మీరు ముగ్గురును తొలిజన్మంబున శివునిఁ బూజించినవారే. అయినను నీవు శివుని విగ్రహము చేసి పూజించితివి; వారు శివుని లింగాధిష్ఠానారూఢుం జేసి కొల్చిరి. లింగంబునందుఁ బూజించుట యర్చ్యుం డారాధించుకంటె ననేకగుణంబు లెక్కుడు గావున లింగార్చనపరు లగువారల నర్చ్యారాధకుండ వగు నీకు నెట్లు జయింప వచ్చును? మీమీ పూర్వజన్మంబులయర్చనంబుల ఫలంబులు దారతమ్యంబులతో ననుభవింపవలదే'యని చెప్పెను (మహాభా., ద్రోణ, అ. ౨౦౧) (ఆంధ్రమహాభారతము., ద్రోణ, ఆ. ౫). యుద్ధము మాని పాండవులతో సంధి చేసికొనవలయు నని యీతఁడు భీష్మద్రోణులు పడిపోయినతరువాత దుర్యోధనునకు నుపదేశించెను. కాని యతఁడు వినలేదు (కర్ణ. అ. ౭౭).

భారతయుద్ధము పూర్తియై దుర్యోధనుఁడు తొడలు విఱిగి యుద్ధభూమిలోఁ బడియున్నపుడు రాత్రి యీతఁడును, కృపకృతవర్మలును అతనియొద్దకుఁ బోయిరి. ఈతని యుపదేశముచేత దుర్యోధనుఁ డీతనికి సేనాధిపత్యము కట్టి పాండవ పాంచాలురఁ జంపి రమ్మని పంపెను. వారు ముగ్గురును ఆరాత్రి యేమి చేయవలయు నని యాలోచించుచు నొకవటవృక్షముక్రిందఁ బడుండిరి. కృపకృతవర్మలు నిద్రపోయిరి. అశ్వత్థామమాత్రము మేల్కొనియుండె నప్పు డొకగ్రుడ్లగూబ వచ్చి, చెట్టుమీఁదిగూఁటిలో నిద్రించుచున్న

sampath_Ebooks

కాపులను జంపెను. అది చూచి తానును అట్లే, రాత్రివేళ పాండవ శిబిరములో నందఱును నిద్రించియుందురు కావున, నెవరికిని దెలియకుండ వెళ్లి యందఱను జంపవలె నని నిశ్చయించుకొని, కృపకృతవర్మల లేపి వారికిఁ దనయుద్దేశమును దెల్పెను. కాని వారు సమ్మతింపరైరి. అందుమీఁదఁ దా నొక్కఁడే వెళ్లుటకు సిద్ధపడఁగ వారును విధిలేక అతనిని వెంబడించిరి. అశ్వత్థామ శిబిరద్వారమునొద్దకుఁ బోఁగా నాతని కచ్చట నొకదివ్యపురుషుఁడు కాన్పించెను. అతనిపై నశ్వత్థామ బాణములు వేయ నవి యాతనిలో మాయమైపోయెను. తుద కతఁడు రుద్రుఁ డని తెలిసికొని ప్రార్థింపఁగాఁ బ్రసన్నుఁడై అశ్వత్థామ కొకఖడ్గ మిచ్చి లోనికిఁ బోనిచ్చెను. కృపకృతవర్మలు లోపలనుండి వచ్చువారి నడ్డగించుటకై ద్వారముకడ నిల్చియుండిరి. లోపలికిఁ బోయి, తనతండ్రికి ద్రోహియైనధృష్టద్యుమ్నుని మొదటఁ జంపి, అయిదుగురు ఉపపాండవులను, శిబిరములోని మిగిలినవారి నందఱను, గుఱ్ఱములను, ఏనుఁగులను ఒక్కప్రాణి లేకుండ సంహరించెను. తప్పించుకొని వచ్చినవారిని ద్వారముకడ కృపకృతవర్మలు చంపిరి. పంచపాండవులును, కృష్ణసాత్యకులునుమాత్ర మారాత్రి యాశిబిరమునందు లేక మఱియొకశిబిరమునందు నిద్రించినందున బ్రతికిరి. అశ్వత్థామ ఈవార్త దుర్యోధనునికిఁ దెలిపి యరణ్యములోనికిఁ బోయెను (మహాభా., సౌప్తిక, అ. ౯).

తనకుమారులను రాత్రి అశ్వత్థామ చంపినాఁ డని తెలిసి ద్రౌపది మిగుల దుఃఖింపఁగా, భీమార్జునులు వెదకుకొని పోయి, అశ్వత్థామను పట్టుకొని పెడరెక్కలు కట్టి రథముమీఁదఁ బెట్టుకొని ద్రౌపదియొద్దకుఁ దెచ్చిరి. కాని బ్రాహ్మణుఁ డనియు, గురుపుత్త్రుఁ డనియు దయదలఁచి కృష్ణుఁడు, ద్రౌపది వల దన్నందున అతనిప్రాణములు తీయుట మాని, అర్జునుఁ డాతనిశిరస్సుపైని పుట్టినప్పటినుండియు నున్నదివ్యమణిని తీసికొని శిబిరమునుండి వెడలఁగొట్టెను. ఆయగౌరవమునకై మిక్కిలి కోపించి, జగత్తు అపాండవ మగుఁగాక యని యాతఁడు బ్రహ్మశిరోనామకాస్త్రమును బ్రయోగించిన నది యుత్తరగర్భమందలిపరీక్షిత్తును బాధింపఁగాఁ గృష్ణుఁడు తనప్రభావముచే వానిని రక్షించెను (మహాభా., సౌప్తిక, అ. ౧౩; ౧౬; అశ్వ. ౬౯, ౨౫).

ఈతనికిఁ దాను మిక్కిలిబలవంతుఁడ నని యెక్కుడు గర్వము. ఒకసారి కృష్ణునియొద్దకుఁ బోయి 'ఈచక్రము నీకు శోభింపదు. నావంటిబలవంతునకుఁ దగును. నా కి'మ్మని యడిగెను. అంతఁ గృష్ణుఁ డాచక్రము నచ్చట నునిచి తీసికొని పొ మ్మని చెప్పఁగా నతఁడు దాని నెత్తనైనను లేక గర్వభంగము కలిగి వెడలిపోయెను.

ఇతఁడు చిరంజీవి. ఇప్పుడును ఉన్నవాఁడు. మరల ద్వాపరయుగము వచ్చునప్పు డీతఁడు వ్యాసుఁ డగును. ఎనిమిదవ సావర్ణిమన్వంతరమునందు నీతఁడు సప్తర్షులలో నొక్కఁ డగును (చూడుఁడు: 'వ్యాస' శబ్దము, మత్స్యపురాణము, అ. ౯).

౨. అక్రూరుఁ డన్నయాదవునికుమారులలో నొకఁడు.

౩. మాలవదేశాధీశుఁ డైన యింద్రవర్మ యనురాజుయొక్క ప్రఖ్యాతిఁ జెందిన యేనుఁగుపేరు. ఈయేనుఁగు పదునైదవదినమున భారతయుద్ధమునందు భీమునిచేఁ జచ్చెను. 'అశ్వత్థామా హతః నరో వా కుంజరో వా' యని ధర్మరాజు ద్రోణవధార్థ మసత్యమాడినది యీగజముయొక్క చావునుగుఱించియే.

అశ్వపతి — ౧. మద్రదేశపురాజు, సావిత్రికిఁ దండ్రి.

౨. కేకయదేశపురాజు. ఈతనికి యుధాజిత్తు అను కుమారుఁడును, కైకేయి యనుకన్యయు నుండిరి. ఈకైకేయియే దశరథరాజుభార్య. ఈతనిభార్య యనఁగ కైకేయితల్లి మిక్కిలి సాహసికురాలు. పక్షులభాష నెఱింగిన అశ్వపతి యొకదినమున కొన్ని పక్షులభాషణములను విని నవ్వఁగ నాతనిభార్య 'మీ రేల నవ్వసరు చెప్పుఁ' డని పట్టుపట్టెను. 'పక్షులభాష చెప్పినయెడల నేను చత్తు' నని యాతఁడు ప్రత్యుత్తర మీయ నామె 'మీరు చచ్చినను సరే, చెప్పక తప్ప' దనెను. అంత రాజునకుఁ గోపమువచ్చి యామెను ఇంటినుండి వెడలఁగొట్టెను (వా. రా., అయో., స. ౩౫).

అశ్వమేధకుఁడు — (సో. వం) పురుకులోత్పన్న సహస్రానీకరాజునకుఁ బుత్త్రుఁడు; అసీమకృష్ణునకుఁ దండ్రి. ఇతఁడు యుధిష్ఠిర వంశజుఁడు. ఈతఁడు ౮౧ సంవత్సరములు రాజ్యము చేసెను. అప్పటికిఁ గలియుగవర్షంబులు ౪౩౧, అనఁగా క్రీ. పూ. ౨౬౭౧ అని పౌరాణికమతము. ఇందు వేయి తగ్గించిన యెడల సరాసరికాలము వచ్చు నని ఆధునికులమతము.

అశ్వమేధపురి — పూర్వదశార్ణదేశమునకుఁ దూర్పున నున్ననగరి. పాండవులకాలమున నిచ్చట రోచమానుఁ డన్నరాజు రాజ్యము చేయుచుండెను (మహాభా., సభా, అ. ౩౦).

**అశ్వమేధము** — అశ్వమును ప్రధానముగ గ్రహించి చేయునట్టి యజ్ఞవిశేషము. ఈయజ్ఞమునం దశ్వముమాత్రమే కాక ఆరణ్యములును, గ్రామ్యములును అగు పశువు లనేకములు చంపఁబడుచున్నవి. ఈయశ్వమేధమును సార్వభౌముఁ డగునట్టిరా జాచరించుట కధికారి యగుచున్నాఁడు. రాజు అశ్వమేధయాగమును సలుపుచున్నప్పు డవభృథస్నానము చేయునంతవఱకు నధ్వర్యుఁడే రా జగును.

శ్రవణమాత్రముచేతనే పుణ్యస్థలములని తలంపఁబడునట్టి కురుక్షేత్రము, వారణాసి, నైమిశారణ్యము మున్నగు పుణ్యస్థలములందు యజ్ఞమంటపమును నిర్మించి అశ్వమేధసంకల్పము నొనర్పవలయును.

యాగారంభము :— చైత్రశుద్ధపూర్ణిమయందు సాంగ్రహణి యనెడి ఇష్టిని సలుపవలయును. ఆ యమావాస్యయందు సంజ్ఞాని

sampath Ebooks



ష్టియు, వైశాఖపూర్ణిమయందు ప్రాజాపత్యపశ్వాలంభమును కల్పసూత్రములందుఁ జెప్పఁబడినవిధముగా ఆచరింపవలయును. అశ్వమేధయజ్ఞమునిమిత్తము పిలువఁబడు ఋత్విక్కులను దీక్షాంతమువఱకు నేనుఁగులపయి నెక్కించిగాని గుఱ్ఱములపై నెక్కించిగాని గౌరవపూర్వకముగ పిలుచుకొనిరావలయును. యజమానుఁడు దేవయజనమున ప్రవేశించి కేశశ్మశ్రువులవపనాదినియమసమన్వితుఁడయి ఉపవసించి ఆ రాత్రి యంతయు మేల్కొనియుండవలయును. పార్శ్వమునందున్న వారలారాత్రి యంతయు వినోదకరములగు నానావిధకథలను చెప్పుచు మేల్కొని యుండవలయును. మఱునాఁ డగ్నిహోత్రమయినపిదప వర్షోదకములు (వానలో పట్టిన ఉదకములు), కూప్యములు (బావినీరు), స్థావరములు (చెఱువునీరు), వహంతులు (నదీజలములు) అగుజలములచేత చతుశ్శరావ మను బ్రహ్మౌదనమును వండి నల్గురు మహర్త్విజులకు పెట్టవలయును. వారికి నాలుగువేల సువర్ణనిష్కములను, నాల్గు అశ్వములను దక్షిణగా నొసంగవలయును.

అశ్వమేధీయాశ్వమును స్నానార్థము జలాశయమునకు తీసికొనిపోవునప్పుడు యజమానునియొక్క మేనత్తకొడుకు అశ్వమునకు ముందుగాను, పినతల్లికొడుకు గుఱ్ఱమునకు వెనుకను నడచిపోవలయును.

౧. నూర్గురు రాజపుత్త్రులతోడ నధ్వర్యుఁడు ప్రాగ్దిశయందు పశ్చిమాభిముఖుఁడయి నిలువంబడి 'ఈసార్వభౌముఁ డీ పవిత్రాశ్వముతో యాగము నొనర్చి శత్రువుల జయించుఁగాక' అని ప్రోక్షించును.

౨. రాజ్యములేని క్షత్త్రియులగు శూరులు నూర్గురతోడ బ్రహ్మ దక్షిణదిశయందు ఉత్తరాభిముఖుఁడయి నిలువంబడి 'ఈసార్వభౌముఁ డీపవిత్రాశ్వముతో యాగము నొనర్చి యితరుల కజేయుఁ డగుఁగాక' అని ప్రోక్షించును.

౩. నూర్గురు సూతగ్రామణులతోడ హోత పశ్చిమదిశయందు ప్రాగభిముఖుఁడయి నిలువంబడి 'ఈ సార్వభౌముఁ డీ పవిత్రాశ్వముతో యాగము నొనర్చి అనేకములగు గోవులు, అశ్వములు, ఏనుఁగులు, మేఁకలు కలిగియున్నవారును, బహువిధవ్రీహియవమాషతిలాది ధాన్యములు గలిగియున్నవారును, బంగారు కలిగియున్నవారును, సేవకులు కలిగియున్నవారును, ధనము పుష్టికలిగియున్నవారునగు ప్రజల కధిపతి యగుఁగాక' అని ప్రోక్షించును.

౪. నూర్గురు సూతగ్రామణీపుత్త్రులతోడ ఉద్గాత ఉత్తరపుదిశయందు దక్షిణాభిముఖుఁడయి నిలువంబడి 'ఈసార్వభౌముఁ డీ పవిత్రాశ్వముతో యాగము నొనర్చి సంపూర్ణమయిన ఆయుస్సు గలవాఁ డగుఁగాక' అని ప్రోక్షించును. తరువాత కల్పసూత్రోక్తములగు హోమములు మున్నగునవి చేసి గుఱ్ఱమును విడువవలయును. ఆ గుఱ్ఱమును సంరక్షించుటకుఁగాను దానివెంట ౧. రాజ్యార్హులగు రాజపుత్త్రులు ౧౦౦ గురును, ౨. క్షత్త్రియ కుమారకులు ౧౦౦ గురును, ౩. వైశ్యకుమారకులు ౧౦౦ గురును, ౪. సైనికులగు శూద్రకుమారకులు ౧౦౦ గురును మొత్తము ౪౦౦ లమంది బయలువెడలవలయును.

ఆ యశ్వమును సాయంకాలమునందు రథకారునిగృహమునం దుంచి దానిపాదములందు ధృతిహోమములను సలుపవలయును.

ఈ విధముగా అశ్వమేధీయాశ్వ మశ్వపాలకులగు రాజపుత్త్రాదులు ౪౦౦ లమందిచేత సంరక్షింపఁబడుచు స్వేచ్ఛగా ఒక సంవత్సరకాలము తిరుగవలయును. ఈ సంవత్సరకాలము దేవయజనమునందు ప్రతినిత్యము ౧. ప్రాతఃకాలమునందు అష్టాకపాలసమన్వితమగు సావిత్రేష్టిని, ౨. మధ్యాహ్నకాలమునందు ఏకాదశకపాలసమన్వితమగు ప్రసవితృసవితృదేవతాకమగు ఇష్టిని, ౩. అపరాహ్ణకాలమునందు ద్వాదశకపాలసమన్వితమగు ఆసవితృసవితృదేవతాకమగు ఇష్టిని ఋత్విజు లాచరించుచుందురు. సాయంకాలమునం దాహవనీయాగ్నియందు ధృతిహోమముల నాచరించుచుందురు.

ఇష్టికాలమునందు పగలు బ్రాహ్మణుఁడును, రాత్రియందు క్షత్త్రియుఁడును వీణాగానము నొనర్తురు.

'ఓ మహాప్రభూ! నీ వీవిధముగా గోభూహిరణ్యాదిదానముల నొసంగుచు రాజసూయాదిమహాక్రతువుల నాచరించుచు షడ్రసోపేతముగ బ్రాహ్మణుల కన్నము పెట్టితివిగదా!' యని బ్రాహ్మణుఁడు సలుపు గానముయొక్క భావము.

'ఓ మహాప్రభూ! నీవు పృథుభగీరథాదినృపపుంగవులవలె శత్రువుల జయించినవాఁడవయి గొప్పగొప్ప శూరపుంగవులతోడ పోరాడి వారిని సంహరించినాఁడవు గదా' యని క్షత్త్రియుఁడు సలుపు గానముయొక్క భావము.

ఈవిధముగా గాన మొనర్చినయిరువురకు నిన్నూరు గోవులు, బండియందు కట్టివేసిన రెండు ఎద్దులును దానము నొసంగవలయును.

అశ్వమేధీయాశ్వము దేశసంచారము చేయునపుడు దేవయజనమునందు ఋత్విజులు, యజమానుఁడును కలసి ఇట్టు లాచరించుచుందురు. మఱుసటి సంవత్సరము వైశాఖబహుళ అమావాస్యయందు దీక్షణీయేష్టి సలిపినతరువాత నశ్వమేధదీక్ష మూఁడుదినములు జరగును.

అశ్వమేధయాగమునం దిరువదియొక్క అరత్నుల (మూరల) ప్రమాణముగల ఇరువదియొక్క యూపము లుండును. అశ్వమేధయాగమునందు ప్రధానపశువు అశ్వ (సంఘ) మయినను ఆరణ్యములును, గ్రామ్యములును, జలచరములును, సర్పములును, పక్షులును అగుపశువులు యూపములకు ౬౧౯ బంధింపఁబడును. పర్యగ్నికరణమయినపిదప ఆరణ్యపశువులను వదలివేయుదురు. పిదప అశ్వసంజ్ఞపనము (చంపుట), ఇతరపశుసంజ్ఞపనము మున్నగునవియు హోమములును అగ్నిష్టోమము జరగును (అగ్నిష్టోమ మనఁగా సోమలతను తెచ్చి అభిషవ మొనర్చి ఆయాదేవతల కొసంగి యజమానుఁడు ఋత్విజులతో కలసి సోమపాన మొనర్చుట). హోతయు, బ్రహ్మయు బ్రహ్మోద్యసంభాషణ మొనర్తురు (బ్రహ్మోద్య మనఁగా అధ్యాత్మవిషయకమగు ప్రశ్నప్రతివచనము). పిదప ప్రధానఋత్విక్కులు

sampath_Ebooks

రాజపత్నులతోడ ప్రశ్నప్రతివచనరూపసంభాషణ మొనర్తురు[1]. తరువాత అశ్వావయవహోమాదికము సలుపఁబడును.

మూఁడవనాఁడు అవభృథస్నానము. ఈ యవభృథస్నాన సమయమునందు బ్రహ్మహత్యాదిమహాపాతకముల నాచరించినవాఁడెవఁడేని వచ్చి నే నిట్టిపాతకము నాచరించితి నని ప్రకాశ మొనర్చి ఆ యవభృథస్నానసమయమునందు తాను స్నాన మొనర్చునెడల తత్పాపవిముక్తుఁ డగును.

ఋత్విజులకు రా జనివఱకు జయించియున్న భూమి నంతయు దక్షిణగా నొసంగుటయేకాక రాజపత్నులనుసైతము వారికి దక్షిణగా నొసంగును. వారు మరల రాజపత్నులను రాజున కొసంగి తత్ప్రత్యామ్నాయముగ కొంతధనమును రాజుదగ్గఱ గ్రహించెదరు.

దిగ్విజయ మొనర్చినట్టిక్షత్రియపుంగవులు సకలవిధపాపసంహారక మగు నీయశ్వమేధయాగము నొనర్తురు. ఇది మహాక్రతువు. ఈ యాగమునుగుఱించి చెప్పునపుడు మహాభిషేక మనియు అచ్చటచ్చట గ్రంథములందు చెప్పఁబడి యున్నది.

ఇట్టి మహాక్రతువు నొనర్చినట్టియు, క్రతు మాహాత్మ్యము నెఱింగినట్టియు పుణ్యాత్ములనామములు ఐతరేయబ్రాహ్మణమునం దీవిధముగఁ జెప్పఁబడియున్నవి: ౧. పరీక్షిన్మహారాజుపుత్త్రుఁడగు జనమేజయుఁడు; ౨. మనుపుత్త్రుఁ డగు శార్యాతుఁడు; ౩. సాత్రాజిత్తుఁ డగు శతానీకుఁడు; ౪. అంబష్ఠ్యుఁడు; ౫. ఉగ్రసేనునిపుత్త్రుఁడగు యుధాంశ్రౌష్ఠి; ౬. భువనుఁ డనువాని పుత్త్రుఁడగు విశ్వకర్మ; ౭. పిజవనుని పుత్త్రుఁడగు సుదాసుఁడు; ౮. అవీక్షితునిపుత్త్రుఁడగు మరుత్తుఁడు; ౯. అంగభూపాలుఁడు; ౧౦. దుష్యంతునిపుత్త్రుఁడగు భరతుఁడు; ౧౧. పాంచాలభూపాలుఁ డగుదుర్ముఖుఁడు; ౧౨. జనంతపుని పుత్త్రుఁ డగు అరాతి.

వీరలేకాక శ్రీమద్రామాయణమునందు ౧. దశరథ భూపాలుఁడు, ౨. దశరథభూపాలుని ప్రపితామహుఁడగు దిలీపుఁడు, ౩. శ్రీరామచంద్రుఁడును, ౪. శ్రీమహాభారతయుద్ధానంతరము, యుధిష్ఠిరుఁడును, ౫. మాలవికాగ్నిమిత్రమునందు పుష్యమిత్రుఁడును అశ్వమేధయాగము నొనర్చినటులు చెప్పఁబడియున్నది.

[ అశ్వమేధయాగీయపశువుల సంఖ్యావిషయ మయి తైత్తిరీయశాఖయం దొకవిధముగను, వాజసనేయశాఖయం దొకవిధముగను గలదు. తైత్తిరీయశాఖా కల్పసూత్ర మగు ఆపస్తంబశ్రౌతసూత్రము యొక్క అశ్వమేధభాగమునకు భాష్యాదికము లభింపనందువలన ఇం దిచ్చిన పశుసంఖ్య భట్టభాస్కరభాష్యవాక్యము ననుసరించి ఇయ్యఁబడిన దని గ్రహించునది].

ఈయశ్వమేధవిషయమును బోధించు గ్రంథసముదాయము :

౧. సంహితలు :

తైత్తిరీయసంహిత, ౭, ౧, ౧౧-౨౦; ౭, ౨, ౧౧-౨౦; ౭, ౩, ౧౧-౨౦; ౭, ౪, ౧౨-౨౨; ౭, ౫, ౧౧-౨౫; ౫, ౭, ౧౧-౨౬; ౧, ౪, ౩౫-౩౬; ౪, ౪, ౧౨; ౪, ౬, ౬-౯; ౪, ౭, ౧౫; ౫, ౫, ౧౧-౨౪; ౫, ౬, ౧౧-౨౩; ౫, ౧, ౧౧; ౫, ౨, ౧౧-౧౨; ౫, ౩, ౧౨; ౫, ౪, ౧౨; ౫, ౭, ౨౫; వాజసనేయసంహిత, ౨౩-వ అధ్యాయము.

౨. బ్రాహ్మణములు :

తైత్తిరీయబ్రాహ్మణము, మూఁడవ అష్టకము, ౮, ౯ ప్రశ్నలు; శతపథబ్రాహ్మణము, ౧౩, ౧-౫; ఐతరేయబ్రాహ్మణము, ౭. ౨౧.

౩. కల్పసూత్రములు :

ఆపస్తంబశ్రౌతసూత్రము, ౨౦-వ ప్రశ్నము. కాత్యాయన శ్రౌతసూత్రము, ౨౦-వ ప్రశ్నము; ఆశ్వలాయన శ్రౌతసూత్రము ౧౦-౬-వ ప్రశ్నము; శాంఖ్యాయన శ్రౌతసూత్రము ౧౬-వ ప్రశ్నము. ఇతరశ్రౌతసూత్రములందును గలదు.

దశరథుఁడు చేసినయశ్వమేధము వాల్మీకి రామాయణము బాలకాండమునందును, శ్రీరాముని యశ్వమేధము ఉత్తరకాండములోను, జైమినియశ్వమేధపర్వమందును, ధర్మజునియశ్వమేధము మహాభారతమున అశ్వమేధపర్వమునందును, జైమినియశ్వమేధపర్వమందును సవిస్తరముగ వర్ణింపఁబడినది.

(క. మా.)

**అశ్వరేవంతపురము** — చిత్తూరుజిల్లా తిరుత్తని తాలూకాయందలి జమీందారీగ్రామము. ఇచటి జనసంఖ్య ౧౮౭౯ (౧౯౩౧).

**అశ్వసేనుఁడు** — ౧. తక్షకునిపుత్త్రుఁడు, సర్పము. అర్జునుఁడు ఖాండవవనమును గాల్చినప్పుడు వీఁడు తల్లితో నుండెను. వీఁ డప్పుడు బాలుఁ డగుటచేఁ దల్లి వీనిని నోటఁ గఱచుకొని

1. వాజసనేయసంహితయు దానిపై మహీధరాదులు వ్రాసిన భాష్యమును, తైత్తిరీయమును దానిపై సాయణాచార్యులు వ్రాసిన భాష్యమును బట్టి చూడఁగా గుఱ్ఱము చంపఁబడినతరువాత, సార్వభౌమునిపట్టమహిషి యాగుఱ్ఱమునొద్ద శయనించి క్రీడ సల్పవలెను, ప్రధానఋత్విజులు యజమానుని పత్నులతో బూతుప్రసంగములు చేయవలెను (వాజసనేయసంహిత, ౨౩-వ అధ్యాయముమీఁదిమహీధరభాష్యము చూడనగును. తైత్తిరీయసంహిత, ౭-వ కాండముమీఁది సాయణభాష్యము చూడనగును). కాని వేదముయొక్క యాభాగమునకు ఈయశ్లీలార్థముచేయుట తప్పనియు, దానికి మంచియర్థము వేఱొకటి యున్న దనియు దయానందసరస్వతిభావము (చూడుఁడు 'ఋగ్వేదాదిభాష్య భూమిక').

(ము. సం.)

sampath_Ebooks

పాండవ యత్నింపఁగా నర్జునుఁడు వీనితల్లిని తెగనఱికెను. వీఁడు మాత్ర మెట్లో తప్పించుకొని, ఆకసిచేఁ గర్ణునియొద్దకుఁబోయి యాతని బాణమున నుండెను. భారతయుద్ధంబునఁ జివరదినమునఁ గర్ణుఁడు ఈ బాణమును ప్రయోగింపఁ గృష్ణుఁడు రథమును భూమిలోనికి నొత్తెను. అందుచే నాబాణము అర్జునునికంఠము నంటక దగులుటకు బదులు కిరీటము నంటఁ దగిలి దానిని భస్మము చేసెను (ఆంధ్రమహాభా., కర్ణ, అ. 3).

౨. సత్యభామకుఁ గృష్ణునివలనఁ బుట్టిన పుత్త్రుఁడు, మహారథుఁడు.

**అశ్వాయుర్వేదము** — గుఱ్ఱముల యాయువునుగూర్చియు, రోగచికిత్సాదులనుగూర్చియు దెలుపు శాస్త్రము. మొదట శాలిహోత్రుఁడు తనకుమారుఁడగు సుశ్రుతునకు దీని నుపదేశించెను. అటుపై నీవిద్యను జయదత్తుఁడు సంపాదించెను. గర్గఋషి మున్నగువారు అశ్వాయుర్వేదము రచించిరి.

**అశ్వారావుపాలెము** — కృష్ణాజిల్లా దివితాలూకాయందలి గ్రామము. జనసంఖ్య ౧౦౧౯ (౧౯౩౧).

**అశ్విని** — ౨౭ నక్షత్రములలోను మొదటిది. ఇందు మూఁడునక్షత్రము లుండును. ఇవి మూఁడును గుఱ్ఱపుమూతివలెఁ గాన వచ్చుటచే దీని కీపేరు వచ్చెను.

## అశ్వినీకుమారదత్తు

**అశ్వినీకుమారదత్తు** — వంగదేశీయ మహాపురుషులలో నొకఁడు. బాబు వ్రజమోహనదత్తుకుమారుఁడు. అశ్వినీకుమారదత్తు ౧౮౫౬-వ సంవత్సరమున, జనవరి ౨౬-వ తేదీని వంగరాష్ట్రమునందలి బేకర్‌గంజ్ జిల్లాయందలి పట్వకాలీ యను గ్రామమున జన్మించెను.

అశ్వినీకుమారదత్తు పదుమూఁడేండ్ల వయస్సునందే ౧౮౬౯-వ యేఁట ప్రవేశపరీక్షయం దుత్తీర్ణుఁ డయ్యెను. కాని విద్యాశాఖవారి నియమముల ననుసరించి యీ వయస్సు ౧౬ ఏండ్లుండిననే కాని చాలదు. అయినను దీని నెట్లో కప్పిపుచ్చి, పెద్దలు ఎఫ్. ఏ. వఱకు నితనిచదువు సాగించిరి. ఈపరీక్షయందుఁగూడ నితఁడు ౧౮౭౨ లో నుత్తీర్ణత నందెను. కాని యటుపైని తన వయసునకు సంబంధించిన రహస్య మతనికిఁ దెలిసినది. అతనికి నీతినియమములయెడల పట్టుదల యెక్కువ. అందువలన నతఁ డసత్యమాడి మఱిరెండేండ్లలో పట్టపరీక్షకు వెళ్లుట కిష్టపడక కొంతకాలము చదువు కట్టిపెట్టి మరల ౧౮౭౮ లో ఆపరీక్షకు వెళ్లెను. అశ్వినీకుమారదత్తు విద్యావిషయములయం దెక్కువయాసక్తి కలవాఁ డగుటచేత ౧౮౭౯ లో నతఁడు సెరాంపూరుచాత్రవిద్యాలయమున నుపాధ్యాయుఁడుగఁ బ్రవేశించి తద్విద్యాలయము ననేకవిధముల నభివృద్ధికిఁ దెచ్చెను. పిదప ౧౮౮౦ లో న్యాయశాస్త్రపరీక్షయం దుత్తీర్ణుఁడయి బారిసాలులో న్యాయవాదిగఁ బ్రవేశించెను. కాని యాతని కావృత్తి యంత హితవుగ లేనందున దానిని వదలి, బారిసాలులో విద్యాశాఖవారి ప్రోత్సాహమునఁ దనతండ్రి స్థాపించిన వ్రజమోహన విద్యాలయమునందు మరల నుపాధ్యాయుఁడుగఁ బ్రవేశించి, వేతన మేమియుఁ గైకొనకయే యందు ౧౭ సంవత్సరములకాలము పనిచేసెను. ఈతఁ డందు పనిచేసిన కాలముననే యావిద్యాలయము కళాశాలయగుటయే కాక యందు న్యాయశాస్త్రాధ్యయనమునకుఁగూడ ౧౮౯౮ లో నేర్పాటుకావింపఁబడెను. ఈకళాశాల నభివృద్ధికిఁ దెచ్చుటకొఱకు అశ్వినీకుమారదత్తు తన సొంతము రు ౩౫,౦౦౦ ల రూపాయలను వెచ్చించెను. స్వార్థరహితముగ నిజముపేదలసాహాయ్యార్థము పనిచేయుటకై అశ్వినీకుమారుఁ డీ కళాశాలయందు 'ది లిటిల్ బ్రదర్స్ ఆఫ్ ది పూర్' అను పేర నొకవిద్యార్థిసంఘము నేర్పాటుచేసెను. ఆయా కష్టసమయముల యందుఁ గావించిన సేవకు గొప్పగొప్ప ప్రభుత్వోద్యోగియులుఁ గూడ నీసంఘమువారిని ప్రశంసించియుండిరి. కొంతకాల మయినతరువాత ఆకళాశాలను నిర్వహించుభార మంతయు నతఁ డొకసంఘము నేర్పఱిచి యాసంఘమువారి కప్పఁజెప్పెను. ప్రభుత్వ ధనసాహాయ్యము లేకుండ ఈకళాశాలను నడపవలెనని అశ్వినీకుమారదత్తు ఎన్నెన్నివిధములనో ప్రయత్నించెను కాని యతని ప్రయత్నములు సఫలము కాలేదు. ప్రభుత్వమువా రిప్పటికి నీకళాశాలకు ధనసాహాయ్యము చేయుచున్నారు.

వ్రజమోహనకళాశాలతోనే కాక అశ్వినీకుమారుని కింక ననేకసార్వజనికసంస్థలతో సంబంధ ముండెను. ౧౯౦౬ - వ సంవత్సరమున బంగాళదేశమున భయంకరమయిన కఱవు సంభవించిన కాలమున బారిసాల్ ప్రజాసంఘమునకు కార్యదర్శిగ నుండి క్షామపీడితులవిషయమునఁ జేసినసేవకు ఇతనిని వీరువా రను భేదములేక యెల్లరును బ్రశంసించిరి. అప్పు డీతఁడు ౧౫౫ క్షామనివారణసంస్థల నేర్పాటుచేసి, ఆసంస్థలద్వారా ప్రతివారము దాదాపు రు. ౬,౦౦౦ లను క్షామబాధితులకు పంచిపెట్టుచుండువాఁడు. ఈరీతిని ౧౯౦౬-వ జూన్ నెలలో మొదలుపెట్టి ఆసంవత్సరమునంతము నాఱునెల పాటు పనుచునే యుండెను. అందువలననే యతనికి 'ఫాదర్ ఆఫ్ ది పీపిల్' ప్రజల కందఱకును దండ్రి, యని బిరుదుపేరు వచ్చినది.

కర్జనుప్రభువు కావించిన బంగాళదేశవిభజనముసందర్భమున వంగరాష్ట్రమున రేఁగినప్రచండమయిన సంక్షోభమున అశ్వినీకుమారుఁడుకూడ పాల్గొని విభజనమునకు వ్యతిరేకముగఁ బనిచేసెను. ఇది యొక సాకుచేసికొని ప్రభుత్వమువా రితనిని మితవాది యని తెలిసియుండియు కాంగ్రెసుతో సంబంధము కలిగియుండుటచేతను, స్వదేశీ ఉద్యమమున కృషిచేయుచుండుటచేతను అతనిని బంధించి, యతనిపై రాజద్రోహపునేరము మోపి యతనికి ప్రవాసశిక్ష విధించిరి. అతని విద్యాసంస్థ విద్యార్థులందు రాజద్రోహమును పురికొల్పుచున్న దని ప్రభుత్వమువారు దానిని చిక్కులలోఁ బెట్టిరి. క్షామకాలమున పలువుర ప్రశంసలకు పాత్రముగఁ బనిచేసినయాతని విద్యార్థిసంఘము నణఁచివేసిరి. కాని తమ నిందారోపణముల కాధారములే దనియు, తమ యనుమానము లన్నియు భ్రాంతు లనియు ప్రభుత్వమువారికిఁ దరువాత తెలిసివచ్చినది. వాలంటీన్ షిరోల్ మున్నగు నాంగ్లేయ

sampath_Ebooks



ప్రముఖులైన అశ్వినీకుమారునికి ప్రవాసశిక్ష విధించుట అన్యాయమని యభిప్రాయపడిరి. ఇట్టిసంఘర్షములలో ప్రభుత్వమువారి కతనిని తప్పనిసరిగ విడుదలచేయవలసివచ్చెను.

అశ్వినీకుమారుఁ డితివఱలో నుడివినట్లు మితవాది. ఇతఁడు కాంగ్రెసువిషయమునను, స్వదేశీఉద్యమము విషయమునను ఎక్కువ యభిమానముతో పనిచేసెను. ౧౯౦౬ - వ సంవత్సరమున సమావేశమయిన వంగరాష్ట్రసభ కతఁడాహ్వానసంఘాధ్యక్షుఁడుగ నుండెను. అటుపిమ్మట ౧౯౧౩ లో ఢక్కాలో జరిగిన వంగరాష్ట్రమహాసభ కతఁ డధ్యక్షుఁ డయ్యెను. ఇతఁడు మితవాదియయినను తనయభిప్రాయమును పైకి స్పష్టముగఁ జెప్పుట కెప్పుడును వెనుదీసినవాఁడు కాఁడు.

అశ్వినీకుమారదత్తు అనేకభాషల నభ్యసించెను. హిందీ, మరాఠీ మున్నగు దేశభాషలను బాగుగ నభ్యసించి ఆయాభాషలయందలి మతగ్రంథములను జదువవలయు నని యాతనియాశయము. సంస్కృతమునందును, పార్శీయందునుగూడ నతఁడు మంచిపాండిత్యము సంపాదించెను. అతఁడు వ్రాసిన 'భక్తియోగము' అను గ్రంథము చాల విఖ్యాతమయినది. దేశభాషలయందును ఆంగ్లభాషయందునుగూడ నీగ్రంథమున కనువాదములు కలవు. దీనిని శ్రీయుత కాశా శ్రీరామశాస్త్రిగారు ఆంధ్రీకరించి యాయుద్గ్రంథమును తెలుఁగువారికి సులభము చేసినారు. భక్తియోగమును భారతీయ పండితులును పాశ్చాత్త్య పండితులునుగూడ నత్యధికముగఁ బ్రశంసించినారు.

పల్లెటూళ్లలో విద్యాభివృద్ధిని గూర్చియు, పారిశుద్ధ్యమును గూర్చియు, కృషిప్రచారములను గావించుటకై అశ్వినీకుమారదత్తు ప్రత్యేకముగ నొకసంఘమును స్థాపించి, యాసంస్థకు వీఁచేఁట నుఁడు వండలరూపాయలరాబడి గలయాస్తి నొసంగెను. నాటకప్రదర్శనములద్వారా సాంఘికదురాచారములను ప్రజలకు వెల్లడించుటకై అతఁడు కొన్నియాత్రానాటక సంఘములను స్థాపించి పట్టణములకుఁ బంపుచుండువాఁడు. కలకత్తాలో నిట్టిసంఘములు నాటకములను ప్రదర్శించినప్పుడు అశుతోషముఖర్జీ మున్నగు విద్యాధికులు కూడ వాని నెక్కువగఁ బ్రశంసించియుండిరి. ఈ మహాశయుఁడు ౧౯౨౩-వ సంవత్సరము, నవంబరు ౪-వ తేదీని కలకత్తాయందు పరమపదించెను.

**అశ్వినీకుమారులు** — దేవతలకు వైద్యులు, ఋగ్వేదమందును, ఇతరవేదములందును ఈదేవతలను స్తుతించినసూక్తములు పెక్కులు గలవు. దేవశిల్పియైనత్వష్ట తనకూఁతురైన సరణ్యును సూర్యున కిచ్చి వివాహము చేసెను. ఆమె సూర్యతాపమును భరింపలేక తనరూపమువంటిరూపముగల మఱియొకస్త్రీని సూర్యునియొద్ద నుంచి తాను ఆఁడుగుఱ్ఱపు రూపమును ధరించి వెడలిపోయెను. సూర్యుఁడు కొన్నిదినములకు వామోసము కనుఁగొని తాను మగగుఱ్ఱపురూపము గరించి ఆఁడుగుఱ్ఱమువెంటఁ దగిలెను. వారియిద్దఱకు నశ్వినీకుమారులు పుట్టిరి. వీరు కవలు (ఋగ్వే., ౧౦. ౧౭. ౧-౨). ఎచ్చటవచ్చినను ఇద్దఱును కలసివచ్చెదరు. ఋగ్వేదమునందుఁ బెక్కుసూక్తములలో వీరు చేసినట్టివైద్యసంబంధమైన యద్భుతకృత్యములు వర్ణింపఁబడినవి. వంచనుఁ డన్నవానిని, రేభుని కూపమునుండి తీసిరి; భౌజ్యుని సముద్రమునుండి రక్షించిరి; ముసలియు బలహీనుఁడును అయిన చ్యవనుని పడుచువానినిగఁ జేసిరి; అగ్నిలోఁ గాలిన అత్రికి సుఖము కలుగఁజేసిరి; కావికిఁ గణ్వునకుఁ గన్నులు, తోడపోయిన విశ్పలకు నినుపతొడ, శయువఋషియొక్క యొండి, పోయినయావునకుఁ బాలు నిచ్చిరి; అథర్వణుఁడైన దధ్యఙ్ఋషికి గుఱ్ఱపుఁదల పెట్టి వానియొద్దనుండి మధువిద్య నేర్చిరి; శ్యావుఁ డను ఋషి మూఁడుతునుకలు కాఁగా బ్రతికించిరి (ఋగ్వే., మం. ౧ సూక్త. ౪౬, ౪౭, ౧౧౨, ౧౧౬-౧౨౦).

అశ్వినీకుమారులకు మొదట హవిర్భాగము లేదు. వీరు చ్యవనునకు యౌవన మొసఁగఁగా నాతఁడు తనతపోబలముచే నింద్రుని మెప్పించి వీరికి హవిర్భాగ మిప్పించెను[1]. ఇట్లు మహాభారతమునందు (వన, అ. ౧౨౧-౧౨౫; ఆంధ్రభా., ౩. ౩) జెప్పఁబడినను, ఋగ్వేదము ౧-వ మండలమునందే అశ్వినీదేవతలను హవిర్భాగమునకుఁ బిల్చినమంత్రములు కానవచ్చుచున్నవి ౧. ౩; ౧. ౨౨; ౧. ౩౪).

వేదమునందుఁ జెప్పఁబడిన యశ్వినీదేవత లెవ్వరన్నవిషయమై చర్చించుచు యాస్కాచార్యుఁ డిట్లు వ్రాసియున్నాఁడు:—

'అశ్వను లనఁగా అశ్వములుగల పుణ్యవంతులైన గొప్పరాజు లని ఔర్ణభావఋషియొక్క యభిప్రాయము.............. ... అశ్వను లెవరు? భూమ్యాకాశము లని కొందఱు; అహోరాత్రము లని కొందఱు; సూర్యచంద్రు లని కొందఱు; పుణ్యము చేసినయిద్దఱు రాజు లని ఐతిహాసికులు చెప్పెదరు' (నిరుక్తము, ౧౨-౧).

దీనినిబట్టి చూడ సృష్టిచమత్కారములను జూచి వైదికకవులు రూపకముగ దేవత లని వర్ణించి రనియుఁ, దరువాతివారు వానిని నిజముగ దేవత లని నమ్మి కథల కల్పించి రనియుఁ దోఁచుచున్నది.

అశ్వినీదేవతలు గుఱ్ఱముయొక్క నాసికనుండి పుట్టిరి గనుక నాసత్యు లనియుఁ బేరు. వీరు మిక్కిలి చక్కనివారు. చక్కనిపురుషులకు వీరిని ఉపమానముగఁ దీసికొందురు. వీరియిద్దఱకు నశ్వినా, నాసత్యౌ, దస్రౌ అన్నపే ళ్లున్నను పెద్దవానికి నాసత్యుఁ డనియు, జిన్నవానికి దస్రుఁ డనియు విడిగఁ బే ళ్లున్నట్టు కానవచ్చెడిని (మహాభా., అనుశా., అ. ౧౫౦, శ్లో. ౧౭). పాండురాజుపత్నికి మాద్రికి వీరివలన నకుల సహదేవులు కలిగిరి.

---

1. 'యజ్ఞము' యొక్క తల పోఁగా నశ్వను లింకొకతలపెట్టి బ్రతికించి రనియు, నందుచే నశ్వినీదేవతలకును వైద్యులకును గౌరవము కలిగె ననియు, అప్పటినుండి యీదేవతలకు హవిర్భాగము కలిగె ననియు ధన్వంతరి సుశ్రుతమునందు వ్రాసినాఁడు (సూత్రస్థానము, అ. ౧). ఈవిషయమే తైత్తిరీయసంహిత ౬, ౪. ౯. ౧ ; శతపథబ్రాహ్మణము, ఐతరేయబ్రాహ్మణము, ౧. ౧౮ లలోఁగూడఁ జెప్పఁబడియున్నది.